
కరుణామయుడు, కృపాసాగరుడయిన అల్లాహ్ పేరుతో



నేను మీ దగ్గర రెండు వస్తువులు వదలిపెట్టి పోతున్నాను. ఈ రెండిటిని దృఢంగా పట్టుకొని ఆచరించేవారు ఎన్నిటికీ దారి తప్పరు. వాటిలో ఒకటి, దైవగ్రంథం (ఖుర్ఆన్). రెండు నా ప్రవచనాలు, సంప్రదాయాలు (హదీస్).

-మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం)

The Meaning of Holy Qur'an-Telugu)



# ఖుర్ఆన్ భావామృతం


భావానువాదం: అబుల్ ఇర్ఫాన్

ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్, సందేశ్ భవన్, ఛత్తాబజార్,
హైదరాబాద్-2, ✆ +91-40-66710795, +91-9441515414

# మానవాళికి వెలుగుబాట

**ఖు**రాన్ ఇస్లాంమత ప్రామాణిక గ్రంథం. దివ్యఖురాన్ ముహమ్మద్ ప్రవక్త ద్వారా వెలువడిన భగవంతుని వాణి అని ఇస్లాంమతస్తుల విశ్వాసం. ఖలీఫా అబూబకర్ కాలంలో ముహమ్మద్ ప్రవక్త ప్రవచనాలన్నీ గ్రంథస్తమయ్యాయి. ఖురాన్ మత గ్రంథమే కాదు, న్యాయశాస్త్రగ్రంథం కూడా. ఇందులో జీవనపద్ధతి, ఆచారవ్యవహారాలను క్రమబద్ధీకరించారు. జూదాన్ని, మద్యాన్ని నిషేధించారు. శిశుహత్యను నిరసించారు. బానిసల పట్ల మరింత దయతో ప్రవర్తించవలెనని చెప్పారు.

ఖురాన్ బహుభార్యాత్వాన్ని అనుమతించడమే కాకుండా సమర్థించడం వెనుక ఆనాటి ఆర్థిక సామాజిక పరిణామాల విశ్లేషణ కనబడుతుంది. ఆనాటి అరబ్‌తెగలలో స్త్రీలస్థాయిని పెంచడానికి ఇస్లాం ప్రయత్నించిన వైనం ఇందులో గుర్తించవచ్చు. పాశ్చాత్యుల దృష్టితో ఖురాన్‌ను విశ్లేషించడంగాని, ఒకఅంచనాకు రావడం గాని కష్టమే. ఖురాన్‌ను బాగా అర్థం చేసుకోవాలంటే శ్రద్ధగా, పూర్తిగా చదవాలి.




**ఖురాన్ భావామృతం**
భావానువాదం: **అబుల్ ఇర్ఫాన్**
ప్రతులకు
ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్
ఛత్తాబజార్, హైదరాబాద్-2
వెల: రూ. 250/-లు

ఖురాన్ అందరికీ అందుబాటులోలేని కాలంలో కొంతమంది స్వార్థపరులు ఖురాన్ బోధనలను వక్రీకరించిన సంఘటనలు చరిత్రలో ఎన్నో కనబడతాయి. ప్రపంచంలోని మారుమూల ప్రాంతాలకు కూడా బైబిల్ అనువాదాలు చొరబడి నంత సులభంగా, వేగంగా ఖురాన్ చేరకపోవడం వల్ల చాలానష్టమే జరిగింది. ప్రాంతీయ భాషలలో ఖురాన్ అనువాదాలు వెలువడకపోవడం వెనుక కొంతమంది స్వార్థపరుల ఆంక్షలు, అనవసర భయాలుకూడా ఒక కారణమనే చెప్పాలి. ఈ ప్రయత్నాల్లో భాగంగా వచ్చిన ప్రాంతీయ అనువాదాల్లో ముఖ్యంగా తెలుగులో గతంలో వచ్చిన అనువాదాలు కూడా సమగ్రంగా లేకపోవడం, గ్రాంథికంలో ఉండడంవల్ల ఎవరూ అంతగా పట్టించుకోలేదు.

ఇన్నాళ్ళకి తెలుగులో సులభ సుందరశైలిలో, అందరికీ అర్థమయ్యే విధంగా అనువదించడంలో అత్యంతప్రతిభ కనబరచిన అబుల్‌ఇర్ఫాన్ అభినందనీయుడు. ఖురాన్ అనువాదంలో ఎదురయ్యే ఇబ్బందులను, క్లిష్టతలను వివరించిన ముందు మాటల ద్వారా అనువాదకర్త నిజాయితీని, నిబద్ధతను గుర్తించగలం. ఈ పుస్తకాన్ని అరబిక్ లిపితో, దాని అనువాదంతో పాటు ఇచ్చిన పాదపీఠికలు విషయాన్ని సులభంగా వివరిస్తాయి. ఈ కృషి విజ్ఞానదాయకమైనది.

**-కె.పి. అశోక్ కుమార్ ('వార్త' దినపత్రిక-22.5.2005)**




| | |
|---|---|
| Name of the Title: Translation of the Text | Qur'an Bhavamrutham (Telugu) (Meaning of the Holy Qur'an) |
| Translation of the Text meaning with foot notes : | Abul Irfan |
| Checking of Text Translation with Original Text: | (1) Moulana Mohammed Omeri Abu Abdullah, Hyderabad M.A., M.Phil<br>(2) S.M. Quadri, HeadMaster (Kalloor (Kammam Dt.)<br>(3) Hafiz, Moulvi S.M.Rasool Jamiatul Qur'an, Hyderabad |
| Checking of Arabic Text with Original Script: | Qaari Muhammed Aarifuddin Quraishi, Hyderabad |
| Editing and Proof reading: (Telugu) | (1) Abdul Wahed (Sub-Editor, Geeturai Weekly) |
| Opinion On Over all Translation: | (1) S.M. Mallick, Editor Geeturai Weekly, Hyderabad<br>(2) Moulana Qalid Saifullah Rahmani, Hyderabad |


All rights reserved with: Islamic Resource Centre


| | |
|---|---|
| First Edition- (1000 Copies): | January, 2004 |
| Second Edition- (1000 Copies): | August, 2004 |
| Third Edition- (1000 Copies): | April, 2005 |
| Fourth Edition- (2000 Copies): | March, 2006 |
| Published by: | Islamic Resource Centre Lakkadkot, Chatta Bazar, Hyderabad-2, Ph: 66710795 |
| Type set by: | Alifain, Geeturai Graphics Lakkadkot, Chatta Bazar, Hyderabad-500002 |
| Printed at: | Cosmic Printers, Lakkad kot, Chatta Bazar, Hyderabad-2 |
| Price: | Rs. 250/- |

## గీటురాయి వారపత్రిక సంపాదకుని అభిప్రాయం

(Opinion of S.M. Mallick, Editor Geeturai weekly)

మహాగ్రంథం పవిత్ర ఖుర్‌ఆన్‌ని చదవడం, అర్థం చేసుకోవడం, దాని ఆదేశాలకు అనుగుణంగా ఆచరించడం, మానవజీవిత పరమార్థం కాగలిగితే ఈ ప్రపంచంలో అంత కన్నా గొప్ప సౌభాగ్యం మరొకటి కాజాలదు. దీనికి తోడుగా తోటి మానవ సోదరులు దాన్ని అర్థం చేసుకోగలిగేలా వారి భాషల్లోకి దాన్ని అనువాదం చెయ్యడం ఎనలేని మహాభాగ్యం అనడంలో ఎటువంటి సందేహం లేదు. మిత్రులు అబుల్ ఇర్ఫాన్ అటు వంటి మహత్తరమయిన పుణ్యకార్యానికి నడుంకట్టారు, అభినందనీయులు.

ఇప్పటికే ఖుర్‌ఆన్ ఉద్గ్రంథానికి రెండు మూడు తెలుగు అనువాదాలు మార్కెట్ లో ఉన్నాయి. అయితే కేవలం పుణ్యఫలాపేక్షతో మాత్రమే కాక సులభగ్రాహ్యమయిన, అందరికీ సుబోధకమయిన సరళమయిన తెలుగుభాషలో ఖుర్‌ఆన్‌ని ప్రజాసామాన్యానికి అందజేసే అభిలాషతో మిత్రులు అబుల్ ఇర్ఫాన్ సరికొత్త అనువాదం తనదయిన శైలిలో చేసి తెలుగుప్రజలకు అందజేయాలని తలపెట్టడం శ్లాఘనీయం.

అబుల్ ఇర్ఫాన్ గారు తెలుగు ముస్లిములకు చిరపరిచిత రచయిత. ఎంతో కాలం గీటురాయి వారప్రతిక, మాసపత్రికలతో ముడిపడి ఉన్న అనుభవం ఆయనది. మరో అనువాదం దేన్నీ అనుసరించకుండా ఆయన స్వయంగా చేసిన ఖుర్‌ఆన్ అను వాదాన్ని పరిశీలించి అందులోని బాగోగుల్ని ఎత్తిచూపగల జ్ఞానం నాకు లేకపోయి నప్పటికీ మిత్రులు అబుల్ ఇర్ఫాన్‌తో నాకున్న సాన్నిహిత్యం దృష్ట్యా ఆయన కృషి ఏడు కోట్ల ఆంధ్రుల మన్నన పొందగలదన్న నమ్మకం నాకుంది.

దైవం నా మిత్రుని సేవలను దయతో స్వీకరించి తగిన ప్రతిఫలాన్ని ప్రసాదించా లని వినమ్ర హృదయంతో వేడుకుంటున్నాను.

(సం)- **మలిక్**
(ఎస్. ఎమ్. మలిక్)
తేది: 24-12-03

### Opinions of Famous Scholars:

(1) Moulana Qalid Saifullah Rahmani, Chairman, Al-Mahadul Ali Al-Islami, Hyderabad (A.P.) ...........See page 767

(2) Moulana Muhammad Al-Omeri Abu Abdullah, President, Darul Imam Ibne Hajr, Hyderabad (A.P.) ........See page 768



## విషయసూచిక


| నెం. | విషయం | సూక్తులు | పేజి |
|---|---|---|---|
| 1. | ముందుమాట | | 10 |
| 2. | ఉపోద్ఘాతం | | 13 |
| 3. | అధ్యాయం (సూరా) | సూక్తులు | |
| 1. | ప్రారంభం (ఫాతిహా) | 7 | 21 |
| 2. | గోవు (బఖరా) | 286 | 23 |
| 3. | ఇమ్రాన్ కుటుంబం (ఆలి ఇమ్రాన్) | 200 | 87 |
| 4. | స్త్రీలు (నిసా) | 176 | 123 |
| 5. | వడ్డించిన విస్తరి (మాయిదా) | 120 | 163 |
| 6. | పశువులు (అన్‌ఆమ్) | 165 | 190 |
| 7. | శిఖరాలు (ఆరాఫ్) | 206 | 216 |
| 8. | సమర సొత్తు (అన్ఫాల్) | 75 | 250 |
| 9. | పశ్చాత్తాపం (తౌబా) | 129 | 264 |
| 10. | యూనుస్ (యూనుస్) | 109 | 290 |
| 11. | హూద్ (హూద్) | 123 | 307 |
| 12. | యూసుఫ్ (యూసుఫ్) | 111 | 324 |
| 13. | మేఘగర్జన (రాద్) | 43 | 340 |
| 14. | ఇబ్రాహీం (ఇబ్రాహీం) | 52 | 348 |
| 15. | హిజ్ర్ వాసులు (హిజ్ర్) | 99 | 357 |
| 16. | తేనెటీగ (నహల్) | 128 | 364 |
| 17. | ఇస్రాయీల్ సంతతి (బనీ ఇస్రాయీల్) | 111 | 381 |
| 18. | మహాబిలం (కహఫ్) | 110 | 397 |
| 19. | మర్యం (మర్యం) | 98 | 412 |
| 20. | తాహా (తాహా) | 135 | 421 |
| 21. | దైవప్రవక్తలు (అంబియా) | 112 | 433 |
| 22. | హజ్‌యాత్ర (హజ్) | 78 | 446 |
| 23. | విశ్వాసులు (మోమినీన్) | 118 | 458 |

| | | | |
|---|---|---|---|
| 24. | జ్యోతి (నూర్) | 64 | 470 |
| 25. | గీటురాయి (ఫుర్ఖాన్) | 77 | 486 |
| 26. | కవులు (షుఅరా) | 227 | 494 |
| 27. | చీమలు (నమల్) | 93 | 507 |
| 28. | గాథలు (ఖసస్) | 88 | 519 |
| 29. | సాలెపురుగు (అన్కబూత్) | 69 | 531 |
| 30. | రోమ్ వాసులు (రూమ్) | 60 | 540 |
| 31. | లుఖ్మాన్ (లుఖ్మాన్) | 34 | 548 |
| 32. | సాష్టాంగ ప్రణామం (సజ్దా) | 30 | 553 |
| 33. | సైనిక దళాలు (అహ్జాబ్) | 73 | 557 |
| 34. | సబా జాతి (సబా) | 54 | 573 |
| 35. | సృష్టికర్త (ఫాతిర్) | 45 | 581 |
| 36. | యాసీన్ (యాసీన్) | 83 | 587 |
| 37. | పంక్తులు తీరినవారు (సాఫ్ఫాత్) | 182 | 594 |
| 38. | సాద్ (సాద్) | 88 | 602 |
| 39. | బృందాలు (జుమర్) | 75 | 609 |
| 40. | విశ్వాసి (మోమిన్) | 85 | 620 |
| 41. | హామీమ్ (హామీమ్) | 54 | 630 |
| 42. | సలహా సంప్రదింపులు (షూరా) | 53 | 639 |
| 43. | బంగారు నగలు (జుఖ్రుఫ్) | 89 | 647 |
| 44. | పొగ (దుఖాన్) | 59 | 655 |
| 45. | కూలబడినవాడు (జాసియా) | 37 | 659 |
| 46. | ఇసుకకొండల నేల (అహ్ఖాఫ్) | 35 | 663 |
| 47. | ముహమ్మద్-సల్లం (ముహమ్మద్) | 38 | 670 |
| 48. | విజయం (ఫతహ్) | 29 | 675 |
| 49. | నివాస గృహాలు (హుజురాత్) | 18 | 682 |
| 50. | ఖాఫ్ (ఖాఫ్) | 45 | 688 |





| | | | |
|---|---|---|---|
| 51. | గాలిదుమారం (జారియా) | 60 | 693 |
| 52. | తూర్ పర్వతం (తూర్) | 49 | 698 |
| 53. | నక్షత్రం (నజ్మ్) | 62 | 701 |
| 54. | చంద్రుడు (ఖమర్) | 55 | 706 |
| 55. | కరుణామయుడు (రహ్మాన్) | 78 | 710 |
| 56. | సంఘటన (వాఖియా) | 96 | 715 |
| 57. | ఇనుము (హదీద్) | 29 | 720 |
| 58. | వాదిస్తున్న స్త్రీ (ముజాదలా) | 22 | 728 |
| 59. | దండయాత్ర (హష్ర్) | 24 | 733 |
| 60. | పరీక్షిత మహిళ (ముమ్తహినా) | 13 | 741 |
| 61. | సైనిక పంక్తి (సఫ్) | 14 | 745 |
| 62. | సప్తాహ సమావేశం (జుముఅ) | 11 | 751 |
| 63. | కపటవిశ్వాసులు (మునాఫిఖూన్) | 11 | 754 |
| 64. | జయాపజయాలు (తగాబున్) | 18 | 757 |
| 65. | విడాకులు (తలాఖ్) | 12 | 760 |
| 66. | నిషేధం (తహ్రీం) | 12 | 764 |
| 67. | విశ్వసార్వభౌమత్వం (ముల్క్) | 30 | 767 |
| 68. | కలం (ఖలం) | 52 | 770 |
| 69. | పరమయదార్థం (హాఖ్ఖా) | 52 | 773 |
| 70. | ఆరోహణాసోపానాలు (మఆరిజ్) | 44 | 776 |
| 71. | నూహ్ ప్రవక్త (నూహ్) | 28 | 778 |
| 72. | భూతము (జిన్) | 28 | 781 |
| 73. | దుప్పట్లో నిద్రించేవాడు (ముజమ్మిల్) | 20 | 783 |
| 74. | దుప్పట్లో పడుకున్నవాడు (ముదస్సిర్) | 56 | 785 |
| 75. | ప్రళయం (ఖియామా) | 40 | 789 |
| 76. | సమయం (దహర్) | 31 | 790 |
| 77. | (రుతు)పవనాలు (ముర్సలాత్) | 50 | 793 |

| | | |
|---|---|---|
| 78. సంచలనాత్మక వార్త (నబా) | 40 | 795 |
| 79. దూరిలాగేవారు (నాజిఆత్) | 46 | 797 |
| 80. భృకుటి ముడిచాడు (అబస) | 42 | 800 |
| 81. చాపచుట్టలా (తక్వీర్) | 29 | 802 |
| 82. బీటలు (ఇన్ఫితార్) | 19 | 803 |
| 83. హస్తలాఘవం (ముతఫ్ఫిఫీన్) | 36 | 804 |
| 84. ఖండన (ఇన్షిఖాఖ్) | 25 | 807 |
| 85. ఆకాశబురుజులు (బురూజ్) | 22 | 809 |
| 86. ప్రభాత నక్షత్రం (తారిఖ్) | 17 | 811 |
| 87. మహోన్నతుడు (ఆలా) | 19 | 812 |
| 88. ముంచుకొస్తున్న ముప్పు (గాషియా) | 26 | 813 |
| 89. ప్రాతఃకాలం (ఫజ్ర్) | 30 | 814 |
| 90. పట్టణం (బలద్) | 20 | 818 |
| 91. సూర్యుడు (షమ్స్) | 15 | 820 |
| 92. రాత్రి (లైల్) | 21 | 821 |
| 93. పగటి వెల్తురు (జుహా) | 11 | 822 |
| 94. మనశ్శాంతి (అలమ్‌నష్రహ్) | 8 | 822 |
| 95. అంజూరం (తీన్) | 8 | 823 |
| 96. గడ్డకట్టిన రక్తం (అలఖ్) | 19 | 824 |
| 97. ఘనత (ఖద్ర్) | 5 | 826 |
| 98. విస్పష్ట ప్రమాణం (బయ్యిన) | 8 | 827 |
| 99. భూకంపం (జిల్‌జాల్) | 8 | 828 |
| 100. తురంగం (ఆదియాత్) | 11 | 829 |
| 101. మహోపద్రవం (ఖారిఆ) | 11 | 830 |
| 102. ప్రాపంచిక వ్యామోహం (తకాసుర్) | 8 | 831 |
| 103. కాలచక్రం (అస్ర్) | 3 | 832 |
| 104. నిందించేవాడు (హుమజా) | 8 | 833 |
| 105. ఏనుగు (ఫీల్) | 5 | 834 |





| | | | |
|---|---|---|---|
| | 106. ఖురైషీయులు (ఖురైష్) | 4 | 836 |
| | 107. సాధారణ వినియోగ వస్తువులు (మాఊన్) | 7 | 837 |
| | 108. శుభాల సరోవరం (కౌసర్) | 3 | 838 |
| | 109. అవిశ్వాసులు (కాఫిరూన్) | 6 | 839 |
| | 110. సహాయం (నస్ర్) | 3 | 840 |
| | 111. అగ్నిజ్వాల (లహబ్) | 5 | 840 |
| | 112. ఏకేశ్వరత్వం (ఇఖ్లాస్) | 4 | 841 |
| | 113. అరుణోదయం (ఫలఖ్) | 5 | 842 |
| | 114. మానవాళి (నాస్) | 6 | 844 |
| 4. | (1) సంక్షిప్త సమాచారం-1 | -- | 847 |
| | (2) సంక్షిప్త సమాచారం-2 | -- | 851 |
| 5. | (1) విషయ దర్శిని-1 | -- | 882 |
| | (2) విషయ దర్శిని-2 | -- | 898 |
| 6. | (1) సంక్షిప్తాలు (Abbreviations) | -- | 020 |
| | (2) విరామ చిహ్నాలు (రమూజ్) | -- | 846 |
| | (3) హదీసు దర్పణంలో ఖుర్‌ఆన్ | -- | 881 |

# ముందుమాట

కొన్నేళ్ళ క్రితం వరకూ మదిలో సైతం మెదలని ఓ విషయానికి నేడు ఆలోచన కల్పించి, సంకల్ప బలమిచ్చి అక్షరరూపం ఇచ్చిన సర్వేశ్వరునికి సహస్ర కోటి కృతజ్ఞతలు సమర్పించు కుంటూ, ఈ సరికొత్త అక్షరరూపం గురించి పాఠకుల ముందు రెండు మూడు మాటలు ఉంచుతున్నాను.

మానవాళి మార్గదర్శనం కోసం అవతరించిన అంతిమ దైవగ్రంథం- దివ్యఖుర్‌ఆన్‌ని ప్రజలకు పరిచయం చేసేందుకు అనేకమంది అనేక విధాల పాటుపడ్డారు. దాన్ని వివిధ భాషలలో వివిధ కోణాల ద్వారా సుబోధకం చేయడానికి కృషి జరిగింది. అయితే అనువాద విషయానికొస్తే ఒక భాష నుండి మరొక భాషలోకి అనువాదం చేయడమంటే కఠోర తపస్సుతో కూడిన వ్యవహారం. మూలభాషలోని పదజాలాన్ని, జాతీయాలను రెండవ భాషలోకి మార్చడం అనుకున్నంత తేలికైన పని కాదు. మూలభాషలోని భావజాలాన్ని, దాని స్పిరిట్‌ని పూర్తిగా తీసుకు రావాలంటే ఒక్కోసారి కొన్ని పదాలను త్యాగం చేయవలసి ఉంటుంది. మరికొన్ని పదాలతో విషయాన్ని విశదీకరించ వలసి వస్తుంది. అందులో మతగ్రంథాలను, ప్రత్యేకించి దివ్య ఖుర్‌ఆన్‌ని కర్మణీ ప్రయోగాలు, కాంప్లెక్స్ వాక్యాల సంప్రదాయం లేని మన తెలుగు భాషలోకి అనువ దించడమంటే కత్తి మీద సాము చేయడమే.

మతగ్రంథాలను అనువదించడమంటే సహజంగా ఎవరికైనా భయమే. దివ్యఖుర్‌ఆన్‌ని తొలుత ఉర్దూలో అనువదించినవారు భావస్పష్టీకరణకు తగిన స్వేచ్ఛ తీసుకోవడానికి ఎంతో భయపడ్డారు. ఇలాంటి పవిత్ర కార్యంలో దేవునికి భయపడవలసిందే. కాని అలా అనువదించబడిన భాష ద్వారా ప్రజలు ఖుర్‌ఆన్ స్పిరిట్‌ని, దాని లక్ష్యాన్ని అర్థం చేసుకోవడానికి చాలా ప్రయాస పడవలసి వస్తుంది. ఇలాంటి అనువాదం సాధారణంగా జనసామాన్యాన్ని అంతగా ఆకట్టుకో జాలదు. తత్ఫలితంగా దైవవాణి ధార్మికుల్లో, ఉన్నత విద్యావంతుల్లో మాత్రమే పరిమితమయి ఉంటుంది. అలా ఉండిపోయింది కూడా.

అయితే కాలానుగుణంగా అనువాద ప్రక్రియలు కూడా ప్రగతి సాధించాయి. ఉర్దూలో సామాన్య ప్రజలకు సయితం అర్థమయ్యే రీతిలో అనువాదాలు ప్రచురించబడ్డాయి. ఇక తెలుగు అనువాదాల విషయానికొస్తే ఇవింకా శైశవ దశలోనే ఉన్నాయని చెప్పవచ్చు. అంతిమ దైవవాణిని మొట్టమొదట తెలుగు భాషలో అనువదించిన మహాభాగ్యం ఒక హైందవ సోదరునికి లభించింది. డాక్టర్ చిలుకూరి నారాయణరావు గారు "కురాను షరీఫ్" పేరుతో ఈ మహాకార్యాన్ని 1925లో సాధించారు. ఆ తరువాత అయిదేండ్లకు ముహమ్మద్ ఖాసిమ్‌ఖాన్ గారు చిలుకూరివారి అనువాదం దోషభూయిష్ఠంగా వుందని, సంప్రదాయశూన్యంగా వుందని 14-7-1930 నాటి ఆంధ్ర (దిన)పత్రికలో ఒక విమర్శన వ్యాసం రాసి, దానిపై మాడపాటి హనుమంతరావు గారిచ్చిన ప్రోత్సాహంతో 1941లో "ఖుర్‌ఆన్‌షరీఫ్" పేరిట మరొక అనువాదం చేశారు. అయితే ఆయన తొమ్మిది అధ్యాయాలు (తౌబాసూరా వరకు) మాత్రమే అనువదించారు. గ్రాంథిక భాషలో వున్న ఈ రెండు అనువాదాలు ప్రస్తుతం మార్కెట్‌లో లభించడం లేదు.

ఆ తరువాత మౌల్వీ అబ్దుల్‌గఫూర్ గారు 1948లో "ఖుర్‌ఆనె మజీద్" పేర సంక్షిప్త వ్యాఖ్యానంతో కూడిన ఒక అనువాదం రెండు సంపుటాలలో వెలువరించారు. ఇది కూడా



గ్రాంథిక భాషలోనే వుంది. కాకపోతే పై రెండు అనువాదాలతో పోల్చితే ఈ అనువాదం కాస్త మెరుగైనదిగా, సమగ్రమైనదిగా ఉందనడంలో సందేహం లేదు. ఆ తరువాత తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్, హైదరాబాద్ వారి తరపున షేఖ్ హమీదుల్లా షరీఫ్ గారు ఈ దైవగ్రంథాన్ని వ్యావహారిక భాషలో అనువదించడానికి పూనుకున్నారు. ఈ అనువాదం 1995లో పూర్తయి మార్కెట్‌లోకి వచ్చింది. ఇది మౌలానా అబుల్‌ఆలా మౌదూది గారి ఉర్దూ అనువాదం ఆధారంగా అనువదించబడిన మొట్ట మొదటి వ్యావహారికభాషా గ్రంథం.

ఈ విధంగా మన తెలుగు భాషలో కూడా దివ్య ఖుర్‌ఆన్‌ని విభిన్న కోణాల నుండి సుబోధకం చేయడానికి కృషి జరిగింది. అయితే ఉర్దూభాషలో జరిగిన కృషితో పోల్చితే తెలుగు భాషలో జరిగిన కృషి నామమాత్రమే. అదీగాక అరబీభాషలో వున్న ఈ విశిష్ఠ గ్రంథరాజానికి ఇతర భాషలలో ఎంత సేవ చేసినా తక్కువే. ఎన్ని కోణాల నుండి అనువదించినా మరికొన్ని కోణాలు మిగిలిపోతూనే వుంటాయి. నేను గీటురాయి పత్రికలో సేవచేసిన 20 యేండ్ల కాలంలో ఈ వాస్తవాన్నే గమనించాను. దీన్ని గురించి నా మిత్రులతో కూడా తరచుగా చర్చిస్తూ ఉండేవాడ్ని. కాని ప్రత్యామ్నాయ మార్గం కానరాక మౌనంగా వుండిపోవలసి వచ్చింది.

అయితే కొన్నాళ్ళకు ఆ మిత్రులే జనసామాన్యాన్ని దృష్టిలో పెట్టుకొని మరో అనువాదానికి శ్రీకారం చుట్టమని నన్ను ప్రేరేపించారు. నేనీ మాట విని పునరాలోచనలో పడిపోయాను. ఏ విధంగా చూసినా అర్హతలేని ఈ అల్పుడు అంతటి సాహసం చేయగలడా అని నన్ను నేను ఎన్నో సార్లు ప్రశ్నించుకున్నాను. మరో కవైపు దైవప్రవక్త (సల్లం) ప్రవచనాలు కూడా నన్ను నా బాధ్యతను గుర్తుచేస్తూ కలవర పరచసాగాయి. ఇలా కొంత కాలం నాలో నేను సతమతమయి, చివరికి ఎలాగో దేవుని మీద భారంవేసి పని మొదలుపెట్టాను. ఆ ప్రభువు దయ వల్లే మూడేండ్లలో ఈ పవిత్ర కార్యం ముగిసింది.

నేను సామాన్య ప్రజానీకాన్ని దృష్టిలో పెట్టుకొని భావజాలం దెబ్బతినకుండా వీలైనంత వరకు తేటతెలుగులో స్వేచ్ఛానువాదం చేశాను. స్వేచ్ఛానువాదమని చెబుతున్నప్పటికీ ఇందు లోనూ పాఠకులకు అక్కడక్కడ కొన్ని అపరిచితమైన పదాలు, వాక్యాలు కనిపిస్తాయి. కాని స్వేచ్ఛానువాదంలో నేను ఇంతకంటే ఎక్కువ సాహసించలేక పోయాను. ఈ అనువాదంలో నేను భావానికే అత్యధిక ప్రాధాన్యం ఇచ్చాను. అందువల్ల దీన్ని భావానువాదమని చెప్పడమే ఎక్కువ సమంజసంగా వుంటుంది. ఈ కారణంగానే నేను మీ చేతులలో వున్న ఈ దివ్య గ్రంథానికి "ఖుర్‌ఆన్ భావామృతం" అని పేరు పెట్టాను.

ఈ అనువాదానికి పాఠకులే న్యాయ నిర్ణేతలు. భావపరంగానూ, భాషాపరంగానూ ఏవైనా పొరపాట్లు జరిగివుంటే మలి ముద్రణలో సవరించడానికి వీలుగా ఈ అల్పుడి దృష్టికి తీసుకు రావలసిందిగా పాఠక మహాశయులకు సవినయంగా మనవి చేసుకుంటున్నాను. ఈ పనిలో నాకు వివిధ రూపాల్లో సహాయసహకారాలు అందజేసిన స్నేహితులకు, శ్రేయోభిలాషులకు నిండు మనస్సుతో కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాను.

అబుల్ ఇర్ఫాన్
(అనువాదకుడు)
హైదరాబాద్, 22-8-2003

## గ్రంథ రచనకు తోడ్పడిన ఇతర పుస్తకాలు

I (1) ఖుర్ఆనె మజీద్ (ఉర్దూ) ................ మౌలానా ఫతెహ్ ముహమ్మద్ జాలంధరీ
(2) ఖుర్ఆనె మజీద్ (ఉర్దూ) ................ మౌలానా అష్రఫ్ అలి థానవి
(3) తఫ్‌హీముల్ ఖుర్ఆన్ (ఉర్దూ) ........ మౌలానా అబుల్ ఆలా మౌదూది
(4) ఖుర్ఆనె షరీఫ్ (ఉర్దూ) .................. మౌలానా షాహ్ అబ్దుల్ ఖాదర్
(5) ఖుర్ఆనె మజీద్ (ఉర్దూ) ................ మౌలానా షాహ్ రఫియుద్దీన్
(6) దావతుల్ ఖుర్ఆన్ (ఉర్దూ) ............ మౌలానా షమ్స్ పీర్జాదా
(7) ఆసాన్ తర్జుమాయె ఖుర్ఆన్ .......... మౌలానా ముహమ్మద్ ఫారూఖ్ ఖాన్
(8) తదబ్బురుల్ ఖుర్ఆన్ (ఉర్దూ) ......... మౌలానా అమీన్ అహ్సన్ ఇస్లాహి
(9) ఖుర్ఆనెకరీం (అనువాదం) .............. మౌలానా ముహమ్మద్ జూనాగఢి
(సౌదీ ప్రచురణ)...(వ్యాఖ్యానం) ............. మౌలానా సలాహుద్దీన్ యూసుఫి
(10) ఖుర్ఆనెకరీం...(అనువాదం) ............ మౌలానా మహ్మూదుల్ హసన్
(సౌదీ ప్రచురణ)...(వ్యాఖ్యానం) ............. మౌలానా షబ్బీర్ అహ్మద్ ఉస్మాని
(11) అహ్కాముల్ ఖుర్ఆన్ (ఉర్దూ)........... (కూర్పు): జాహెద్ మలిక్
(అనువాదం) ....................................... ఫతెహ్ ముహమ్మద్ జాలంధరీ
(12) ఉలూముల్ ఖుర్ఆన్ ............. మౌలానా జస్టిస్ ముహమ్మద్ తఖీ ఉస్మానీ
(13) ఖుర్ఆనె మజీద్ కా తారుఫ్ (ఉర్దూ).... (రచన) మౌలానా సద్రుద్దీన్ ఇస్లాహి

II (14) ది మీనింగ్ ఆఫ్‌ది ఖుర్ఆన్ (ఇంగ్లీషు)....ముహమ్మద్ మార్మడూక్ పిక్థాల్
(15) ది హోలీ ఖుర్ఆన్ (ఇంగ్లీషు) .................. మౌలానా అబ్దుల్లా యూసుఫ్ అలి
(16) ది మీనింగ్ ఆఫ్ ది ఖుర్ఆన్ (ఇంగ్లీషు)....యం.ఎ.కె. పఠాన్

III (17) ఖుర్ఆన్ షరీఫ్ (తెలుగు) ................... ముహమ్మద్ ఖాసిం ఖాన్
(18) ఖుర్ఆనె మజీద్ (తెలుగు) ................. మౌల్వీ ముహమ్మద్ అబ్దుల్ గఫూర్
(19) దివ్య ఖుర్ఆన్ (తెలుగు) .......................షేఖ్ హమీదుల్లా షరీఫ్



# ఉపోద్ఘాతం

"నేను" అంటే ఎవరు? నా శరీరమా? నా శరీరంలోని ఆత్మా? నా వ్యక్తిత్వమా? నా శక్తిసామర్థ్యాలా? నా అభిరుచులా? నా శరీరమయితే ఆ శరీరాన్ని నేను ఇతర శక్తుల నుండి ఎందుకు కాపాడుకోలేక పోతున్నాను? నా ఆత్మ అయితే ఆ ఆత్మను దేహం నుండి బయటికి వెడలకుండా ఎందుకు నిరోధించలేక పోతున్నాను? నా వ్యక్తిత్వం అయితే ఆ వ్యక్తిత్వానికి విఘాతం కలగకుండా ఎందుకు రక్షించుకోలేక పోతున్నాను? నా శక్తిసామర్థ్యాలయితే అవి నిర్వీర్యం కాకుండా వాటికి రక్షణ ఎందుకు కల్పించలేక పోతున్నాను? నా అభిరుచులయితే వాటిని నేనెందుకు పూర్తిగా నెరవేర్చుకోలేక పోతున్నాను? అనంతకోటి జీవరాసులు, గ్రహాలు, నక్షత్రాలతో నిండిన ఈ సువిశాల విశ్వంలో నా స్థానం ఏమిటి? నేనెక్కడ్నుంచి వచ్చాను? తిరిగి ఎక్కడికి వెళ్ళాలి? అక్కడ నా పరిస్థితి ఏమిటి? నన్ను కంట్రోల్ చేసే రిమోట్ కంట్రోల్ ఏదయినా వుందా ఈ ప్రపంచంలో?

ఇలా ప్రశ్నించుకుంటూ పోతే ఎడతెగని ఈ ప్రశ్నలకు అత్యల్ప ఆశాకిరణంగా మినుకు మినుకు మంటూ ఓ అస్పష్టమైన సమాధానం లభిస్తుంది మనకు. అదే "దేవుడు." ఈ నిఖిల జగతిని, అందులోని సమస్త వస్తువుల్ని దేవుడే సృష్టించాడా? యావత్తు సృష్టిరాసుల్ని ఆయనే కంట్రోల్ చేస్తున్నాడా? మన కష్టసుఖాలకు ఆయనే మూలకారకుడా? మన జీవన్మరణాలు ఆయన అధీనంలోనే వున్నాయా? అప్పుడప్పుడు సంభవిస్తున్న కరువుకాటకాలు, పెనుతుఫానులు, భూకంపాల వెనుక ఆయన అదృశ్య హస్తమే వుందా? ఆయన మన మొరల్ని ఆలకించగలడా? వాటికి ప్రతిస్పందించగలడా?

## మహర్షులే మనకు మార్గదర్శులు

ఈ ప్రశ్నలన్నిటికీ మన బుద్ధీ, అంతరాత్మలు సహజంగానే "ఔను" అని సమాధాన మిస్తాయి. అంతేకాదు, ఆ విశ్వకర్తకు, మనకు మధ్య ఏదో అవినాభాన సంబంధం కూడా ఉండి వుంటుందని మన అంతరంగం ఘోషిస్తుంది. అయితే ఆ సంబంధం ఏమిటి? దాన్ని మనకు తెలిపే వారెవరు? నీతిమంతులు, నిజాయితీపరులు, సాత్వికులు, సదాచార సంపన్నులయిన మహనీయులు, మహర్షులు మాత్రమే ఈ సంబంధం గురించి మానవాళికి తెలియ జేయగలరని, తెలియ జేశారని మతచరిత్ర మనకు తెలియజేస్తోంది. ఆ మహనీయుల్ని, మహర్షుల్ని గుర్తించి, వారి బోధామృతాన్ని ఆస్వాదించ గలిగేవారే ధన్యులు!

ఆయా మహర్షులు తమతమ కాలాల్లో తమకు విశ్వప్రభువు పంపిన అమృత కలశాన్ని అశాంతితో అలమటిస్తున్న మానవుల హృదయ ఫలకాలపై చిలికించి వారికి సేదతీర్చారు. అలాంటి మహర్షుల్లోని అంతిమ మహర్షియే మహనీయ ముహమ్మద్ (ఆయనపై శాంతీ శుభాలు వర్షించుగాక). ఆ అమృత కలశాల్లోని అంతిమ అమృత

భాండమే దివ్యఖుర్‌ఆన్. ముహమ్మద్ మహనీయుని (సల్లం)పై అవతరించిన ఈ దైవవాణి అజ్ఞానాంధకారంలో తచ్చాడుతుండిన అసంఖ్యాకమైన మానవులకు జ్ఞాన కాంతి ప్రసాదించి వారి జీవితాలు సమూలంగా సంస్కరించింది; నేటికీ సంస్కరిస్తోంది. ఇకముందు ప్రళయం వరకూ సంస్కరించగల ఏకైక కరదీపిక కూడా ఇదే. అందువల్ల అత్యంతాసక్తికరమైన ఈ గ్రంథం గురించి కొద్దో గొప్పో తెలుసుకోవలసిన ఆవశ్యకత నేడు ఎంతయినా వుంది.

## గత గ్రంథాలు

ఈ గ్రంథం గురించి తెలుసుకునే ముందు దీనికి పూర్వం అవతరించిన దైవగ్రంథాల మాటేమిటి అనే ప్రశ్న కొందరిలో ఉదయిస్తుంది. దీనికి దివ్యఖుర్‌ఆనే సమాధాన మిస్తుంది. ఈ గ్రంథం అందజేసిన సమాచారం ప్రకారం దాదాపు ప్రతి యుగంలో, ప్రతి దేశంలో, ప్రతి జాతిలో మానవులకు రుజుమార్గం చూపడానికి, జీవిత సత్యాలను బోధించడానికి నిస్వార్థపరులు, నిష్కల్మషులైన మహర్షులు ప్రభవించారు. వారిని దైవప్రవక్తలు, దైవసందేశహరులు అంటారు. వారిపై దివి నుండి దైవగ్రంథాలు అవతరించాయి. జబ్బూర్, తౌరాత్, ఇంజీల్ వగైరా ఈ కోవకు చెందినవే. (ఇవి ప్రస్తుతం బైబిల్‌గా రూపాంతరం చెందివున్నాయి.) ఖుర్‌ఆన్‌లో ప్రస్తావించబడని మతగ్రంథాలు కూడా ప్రారంభకాలంలో దైవప్రోక్త గ్రంథాలే అయివుండవచ్చు. కాదని నిర్ద్వంద్వంగా ఖండించడానికి ఆస్కారమేదీ కన్పించదు.

అయితే పూర్వం దైవగ్రంథం అవతరించిన కొంతకాలం వరకే వాటి బోధనలు సురక్షితంగా వుండేవి. ఆ తరువాత స్వార్థపరులు, దురభిమానులు వాటిని మార్పులకు, చేర్పులకు గురిచేసి అందులో దైవప్రోక్తమేదో, మానవ మేధాజనితమేదో అర్థం కాకుండా చేసేవారు. తిరిగి దేవుడు మానవుల్ని అంధకారం నుండి తీసి వెలుగుబాటపై నడిపించ డానికి మరో దివ్యగ్రంథాన్ని అవతరింప జేసేవాడు. ఇలా గతగ్రంథం మార్పులకు, చేర్పులకు గురయి ప్రజలు రుజుమార్గం తప్పిపోయినప్పుడల్లా దేవుడు మరో గ్రంథం అవతరింపజేస్తూ, అనాది నుండి నేటి వరకు లక్షా ఇరవై నాలుగు వేల మంది ప్రవక్తల ద్వారా ఎన్నో గ్రంథాలను అవతరింపజేసాడు. చివరిసారిగా ముహమ్మద్ ప్రవక్త (సల్లం) ద్వారా దివ్యఖుర్‌ఆన్‌ని అవతరింపజేశాడు.

ఈ గ్రంథాలన్నిటి సారాంశం ఒక్కటే. ఇవన్నీ ఒకే విషయాన్ని బోధించాయి, సృష్టికర్త, స్వామి, సర్వేశ్వరుడు, ప్రభువు, పోషకుడు, పర్యవేక్షకుడు, ఆపద్బాంధవుడు, ఆపదమొక్కులవాడు, ఆదిమధ్యాంతరహితుడు అయిన దేవుడు మాత్రమే ఆరాధనకు అర్హుడు. ఆయన తప్ప మరో ఆరాధ్యుడు లేడు; సమస్త జీవనరంగాల్లో ఆయన ఆజ్ఞల్నే శిరసావహించాలి; ఆయన దైవత్వంలో, గుణగణాల్లో, శక్తిసామర్థ్యాలలో ఇతరుల్ని భాగస్వాములుగా చేయకూడదు. ఈ ప్రపంచం ఓ ప్రయాణ మజిలీ, పరీక్షా వేదిక, తాత్కాలికాశ్రయం. మరణానంతరం ప్రతి మనిషీ తన కర్మలను గురించి దేవుని న్యాయస్థానంలో లెక్క చెప్పవలసి వుంటుంది. కర్మల విచారణ తరువాత స్వర్గం లేదా



నరకం రూపంలో అతనికి శాశ్వత ప్రతిఫలం లభిస్తుంది.

ఇవీ ఆ గ్రంథాల్లోని మౌలిక బోధనలు. ఈ బోధనలతో కూడిన ధర్మాన్నే "ఇస్లాం" అంటారు. అంటే తొట్టతొలి దైవప్రవక్త (ఆదిమానవుడు) అయిన హజ్రత్ ఆదం (అలైహి) నుండి చిట్టచివరి దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సల్లం) వరకు దైవప్రవక్తలంతా ఇస్లాం ధర్మాన్నే మానవులకు బోధిస్తూ వచ్చారన్నమాట

కాని ఈ బోధనలు ఈనాడు ఒక్క ఖుర్‌ఆన్‌లో తప్ప మరేఇతర మతగ్రంథాల్లో స్పష్టంగా, సంపూర్ణంగా కానరావు. ఈ గ్రంథాలలో ఏక దైవారాధనతో పాటు త్రిత్వం, బహుదైవారాధనలు కూడా చోటు చేసుకున్నాయి. పరమ పవిత్రుడు, అసాధారణ శక్తి సంపన్నుడయిన దేవునికి మానవ బలహీనతలు ఆపాదించబడ్డాయి, ఆరాధనా భావం దేవాలయాలకు, ధ్యానమందిరాలకు పరిమితం చేయబడింది. సమానత్వం, సాంఘిక న్యాయాలకు తూట్లు పడ్డాయి. పునర్జీవం పునర్జన్మగా మారిపోయింది. మరణానంతరపు జవాబుదారీ భావన మటు మాయమై పోయింది. దైవప్రోక్త విషయాలు మానవ కల్పితాలతో కలుషితమై పోయాయి.

## కారుచీకటిలో కాంతిరేఖ

ఈ కారణంగానే కరుణామయుడైన దేవుడు ఈ కలియుగంలో కట్టకడపటి మార్గదర్శినిగా దివ్యఖుర్‌ఆన్‌ని అవతరింపజేశాడు. దీన్ని మానవాళికి అందజేసిన మహర్షి ముహమ్మద్ (సల్లం) చిట్టచివరి దైవప్రవక్త. నలభై ఏళ్ళ ప్రాయంలో ఆయన్ని దేవుడు తన ప్రవక్తగా నియమించాడు. దానికి పూర్వం అవినీతి, అశ్లీలం, మద్యసేవనం, వ్యభిచారం, అన్యాయం, దగా, మోసం, దోపిడి, దౌర్జన్యాలతో నిండిన ఆనాటి అరబ్బు సమాజంలో ఆ మహనీయుడు రాళ్ళకుప్పలో రత్నంలా, కారుచీకటిలో కాంతిరేఖలా ఎంతో పవిత్ర జీవితం గడిపారు. వ్యాపారలావాదేవీలతో పాటు సమస్త వ్యవహారాల్లో ఆయన అసామాన్య నీతీనిజాయితీలను ప్రదర్శించి అరబ్బుప్రజలలో "అమీన్" (నిజాయితీపరుడు)గా, "సాదిఖ్" (సత్యసంధుడు)గా ప్రసిద్ధి చెందారు.

అందువల్లనే మహనీయ ముహమ్మద్ (సల్లం) దేవుడు తనను దైవప్రవక్తగా నియమించి తన దగ్గరికి దివ్యసందేశం పంపుతున్నాడని ప్రకటించినప్పుడు ఆయన గతచరిత్ర ఎరిగినవారిలో మంచిని ప్రేమించేవారంతా సహజంగానే ఆయన మాటల్ని నమ్మారు. ఆయనకు సహచరులైపోయి తమ జీవితాలను సంస్కరించుకున్నారు. ఆ మహనీయుని అడుగుజాడలలో నడచుకుంటూ వారు యావత్తు అరేబియాను నైతిక నందనవనంగా తీర్చిదిద్దారు. ఆయనపై అవతరించిన దివ్యఖుర్‌ఆన్ అజ్ఞానాంధకారాన్ని పటాపంచలు చేసింది. చివరికి ఒక స్త్రీ ఆపాదమస్తకం విలువైన ఆభరణాలు ధరించి రెండు చేతులతో బంగారాన్ని ఎగరేస్తూ, ఒక్క దేవుని భయం తప్ప మరెవరి భయం లేకుండా ఒంటరిగా సనా నుండి హజ్రమౌత్‌కు ప్రయాణం చేయగల్గిందంటే అది ఖుర్‌ఆన్ మహత్యమే.

## దైవవాణియా, మానవవిరచితమా?

ఇంతకూ దివ్యఖుర్ఆన్ సాక్షాత్తు దైవవాణియా లేక దైవికప్రేరణ ద్వారా ఉనికి లోకి వచ్చిన మానవ విరచితమా? దైవవాణి అయితే అది నేడు మనదాకా సురక్షితంగా చేరిందా లేక ఏవైనా మార్పులకు, చేర్పులకు లోనయిందా? ఈ అనుమానాలు నివృత్తి అయి, ఖుర్ఆన్ సాక్షాత్తు దైవవాక్కే అని, అది తన అసలు రూపంలో సురక్షితంగా మనకు చేరిందని ధృవపడినప్పుడే మనకు దాని మీద నమ్మకం కుదురుతుంది. న్యాయబద్ధంగా ఆలోచించినా, చారిత్రక దృష్టితో వీక్షించినా ఖుర్ఆన్ విషయంలో లభించేటంతటి గట్టి ప్రామాణికత, చారిత్రక ఆధారాలు మరే మతగ్రంథం విషయంలో మనకు లభించవు. ఖుర్ఆన్ విషయంలోనే కాదు, ముహమ్మద్ ప్రవక్త (సల్లం) జీవిత విశేషాలను గురించి కూడా పటిష్ఠమైన చారిత్రక ఆధారాలు వున్నాయి. ఆయన జీవిత విశేషాలను ప్రత్యక్షంగా చూసి, ఆయన అమృత ప్రవచనాలను ఆస్వాదించిన అనుచరుల జీవిత విశేషాలను గురించి, ఆ అనుచరుల్ని ప్రత్యక్షంగా కలుసుకొని వారి ద్వారా ప్రవక్త జీవితవిశేషాలను సేకరించిన వ్యక్తుల జ్ఞాపకశక్తి, గుణగణాలను గురించి కూడా గట్టి ఆధారాలు ఉన్నాయి.

ఖుర్ఆన్ దైవవాణియా, మానవకల్పితమా అనే విషయంలో మచ్చుకు దైవప్రవక్త (సల్లం) జీవితకాలంలోని రెండు సంఘటనల్ని గురించి మనమిక్కడ ముందుగా తెలుసుకుందాం.

ప్రతి యుగంలోనూ దైవప్రవక్తలు సత్యం తెచ్చినప్పుడల్లా వారిని అడ్డుకోవడానికి సత్యవిరోధులు కూడా తయారయ్యేవారు. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం)ను కూడా నిరోధించడానికి ఆనాడు అరేబియాలో సత్యవిరోధులు తయారయ్యారు. యమన్‌కు చెందిన గొప్ప మేధావి, ప్రముఖ కవి, దౌసీతెగ నాయకుడు తుఫైల్ దౌసీ హజ్‌యాత్ర కోసం మక్కా పట్నం వస్తున్నాడని ఓసారి ఈ సత్యవిరోధులకు తెలిసిపోయింది. వెంటనే వారు పట్నం వెలుపలే తుఫైల్ దౌసీని కలుసుకొని, ముహమ్మద్ మహనీయుని (సల్లం)కి, దివ్యఖుర్ఆన్‌కు వ్యతిరేకంగా అతనికి బాగా నూరి పోశారు. ముహమ్మద్ (సల్లం) చెప్పే మాయమాటలు వింటే మనిషి మార్గ భ్రష్టుడవుతాడని బెదరగొట్టారు.

వారి దుర్బోధ విన్న దౌసీ నిజమే కాబోలు అనుకొని ముహమ్మద్ ప్రవక్త (సల్లం) వైపు కన్నెత్తి కూడా చూసేందుకు సాహసించ లేదు. కాబామందిరంలో ముహమ్మద్ ప్రవక్త (సల్లం) ఖుర్ఆన్ పఠిస్తుంటే, దౌసీ కాబాప్రదక్షిణ చేస్తూ ఆ వాణి తన చెవులకు సోకకుండా ఉండేందుకు చెవుల్లో దూది పెట్టుకున్నాడు. అయితే ఎలాగో ఖుర్ఆన్ వాక్యమొకటి అతని చెవిలో పడనే పడింది. కాని అందులో మక్కానాయకులు చెప్పి నట్లు చెడేమీ లేదు. అందువల్ల అతను రెండు క్షణాలు ఆగి ఆ వాణిని కాస్త జాగ్రత్తగా ఆలకించాడు. దాంతో అతని హృదయం మీది అపోహ పొరలు క్రమంగా తొలగి పోయాయి. అతను పునరాలోచనలో పడిపోయాడు.



తాను మేధావి, కవి. తనకు మంచిచెడులు, సత్యాసత్యాలను విచక్షణచేసే జ్ఞానం, ఉన్నతంగా ఆలోచించే మేధ వున్నాయి. అలాంటప్పుడు ఆయన మాటలు ఎందుకు వినకూడదు? మంచి మాటలయితే సరే, మంచివి కాకపోతే త్రోసిపుచ్చవచ్చు. ఈ ఆలోచనతో తుఫైల్ దౌసి దైవప్రవక్త(సల్లం) ఖుర్ఆన్ పారాయణం ముగించి వెళ్ళిపోయాక ఆయన వెనకాలే నడచి ఆయన ఇంటికి చేరుకున్నాడు. అక్కడ తనను తాను పరిచయం చేసుకొని తానొచ్చిన ఉద్దేశాన్ని తెలిపాడు. దైవప్రవక్త (సల్లం) అతడ్ని ఆదరించి ఖుర్ఆన్‌లోని కొన్ని సూక్తులు విన్పించారు. అంతే, అతని మానసాకాశం ప్రకాశవంతమయింది. మనసారా సత్యధర్మం స్వీకరించి సంతోషంగా వెళ్ళిపోయాడు.

మరొక మేధావి (ఉతబా) బహుదైవారాధకుల ప్రతినిధిగా సత్యధర్మాన్ని నిరోధించడానికి దైవప్రవక్త (సల్లం) దగ్గరికెళ్ళి, అయన నోట ఖుర్ఆన్ వాణి విని, ఇది కవులుచెప్పే కవితావాణి కాదని, మాంత్రికులు పలికే మంత్రపలుకులు కూడా కాదని; ఇది తానింతకు పూర్వం ఎన్నడూ ఎరగని అద్భుతవాణి అని గ్రహించాడు. ఈ విషయాన్నే అతను మక్కా నాయకులతో అన్నాడు.

అలాగే ఇస్లాం గురించి నిజానిజాలు తెలుసుకోవడానికి అబిసీనియా నుండి వచ్చిన ఓ క్రైస్తవ పండితవర్గం ప్రవక్త నోట ఈవాణి విన్నంతనే అశ్రుపూరిత నయనాలతో సత్యాన్ని స్వీకరించింది. నజ్రాన్ నుండి వచ్చిన మరొక క్రైస్తవవర్గం యదార్థం ముందుకు వచ్చినప్పటికీ కేవలం ప్రాపంచిక ప్రయోజనాలు వదలుకోలేక సత్యాన్ని స్వీకరించలేదు. అయితే తమ మతగ్రంథంలో అంతిమ దైవప్రవక్త గురించిన భవిష్యత్ ప్రకటనలు చదివి వున్నందున ముహమ్మద్ (సల్లం) దైవప్రవక్తేనని, గ్రహించింది. "మన ఉభయుల్లో అసత్యవాదులెవరో వాళ్ళను దేవుడు నాశనం చేయుగాక అని మనం మన భార్యాపిల్లల్ని తీసుకొని ప్రమాణంచేద్దాం రండి" అని మహనీయ ముహమ్మద్ (సల్లం) పిలిచినపుడు ఈ కారణంగానే వారు ప్రమాణం చేయడానికి వెనుకంజ వేశారు.

## ఖుర్ఆన్ ఛాలెంజ్!

దివ్యఖుర్ఆన్‌లోని భాషాశైలిని, విషయతీరును గమనిస్తే, ఇది తప్పకుండా దైవవాణేనని మన అంతరాత్మ అప్రయత్నంగా ఘోషిస్తుంది. అందువల్ల ఖుర్ఆన్‌లోని సూక్తుల్ని, వాటి శైలిని పరిశీలించి ప్రశాంతంగా ఆలోచించమని దేవుడు మానవుల్ని కోరుతున్నాడు.

"వారు ఖుర్ఆన్ గురించి ఆలోచించరా? ఇది అల్లాహ్ వద్దనుండి గాక మరెవరి వద్ద నుండో వచ్చి వుంటే ఇందులో ఎంతో భావవైరుధ్యం ఉండేది కదా!" (4:82)

దైవభీతి, పరలోక చింతనల ప్రవృత్తి గలవారిని కదలించడానికి ఇలాంటి సూక్తులెన్నో ఉన్నాయి ఈ గ్రంథంలో. ప్రపంచపూజారులను గురించి, అంతరాత్మ ప్రబోధనను నొక్కిపెట్టినవారిని గురించి మాత్రం మనం ఏమీ అనలేము. అలాంటివారి ముందు ఎన్ని ప్రమాణాలు వచ్చినా చెవిటివాడి ముందు శంఖం ఊదినట్లే అవుతుంది.

కాకపోతే ఈ గ్రంథం దైవవాణియా కాదా అని అనుమానంలో పడేవారికి స్వయంగా ఖుర్‌ఆన్ ఇలా ఒక సవాలు విసరుతోంది:

"ఒకవేళ మా దాసునిపై అవతరింపజేసిన ఈగ్రంథం పట్ల మీకేదైనా అనుమానం వుంటే, ఇందులో ఉన్నటువంటి ఓ అధ్యాయం రచించి తీసుకు రండి. ఈపని కోసం ఒక్క దేవుడ్ని వదలి మీ సహాయకులందర్నీ పిలుచుకోండి. మీరు సత్యమంతులైతే ఈ పని చేసి చూపండి. మీరీ పని చేయలేకపోతే----ఎంతమాత్రం చేయలేరు---మనుషులు, పాషాణాలు ఇంధనం కాగల నరకాగ్నికి భయపడండి. సత్యతిరస్కారుల కోసం అది సిద్ధపరచబడి వుంది." (2;23)

ఈ సవాలును ఈనాటివరకూ ఎవరూ ఎదుర్కోలేక పోయారు. దైవప్రవక్త (స) కాలంలో గొప్పగొప్ప కవులు, రచయితలు ఈ సవాలును ఎదుర్కోలేక చేతులెత్తేశారు. ఒకసారి కావ్యపూర్ణం కోసం "కౌసర్" అధ్యాయంలోని మొదటి సూక్తిని ఓ చర్మపు పొరపై రాసి కాబాగోడకు వ్రేలాడ దీయడం జరిగింది. దాన్ని పూరించడానికి చాలామంది కవులు ప్రయత్నించారు. కాని ఒక్కరూ కావ్యపూర్ణం చేయలేక పోయారు. ఆ తరువాత ఆ అధ్యాయం పూర్తిగా అవతరించింది. దాన్ని చూసి ఆ కవులు సిగ్గుతో తలలు దించుకొని, ఇది మానవరచన ఎంతమాత్రం కాదని గ్రహించారు.

క్రీ.శ.727లో జరిగిన మరో సంఘటన గమనించండి. ప్రజల్ని అమితంగా ప్రభావితం చేస్తున్న ఖుర్‌ఆన్‌ని చూసి కొందరు సత్యవ్యతిరేకులు ఇలాంటిదే మరో గ్రంథం రచించాలని ఓ పథకం వేశారు. ఈపనికి వారు ఆ కాలంలో గొప్ప పండితుడిగా ప్రసిద్ధిచెందిన ఇబ్నుల్ మఖ్ఫా అనే వ్యక్తిని సంప్రదించారు. అతను ఓ సంవత్సరంలోనే తానీ పని పూర్తి చేస్తానని వారికి హామీనిచ్చి రచనా కార్యానికి ఉపక్రమించాడు. ఆరు మాసాల తరువాత వారు పని ఎంత వరకు వచ్చిందోనని చూడటానికి అతని దగ్గరకు వెళ్ళారు. ఆ సమయంలో అతను చేతిలో కలం, కాగితాలు పట్టుకొని దీర్ఘాలోచనలో మునిగి ఉన్నాడు. అతని ముందు రాసి చించేసిన కాగితాలు గుట్టలు గుట్టలుగా పడివున్నాయి. కాని ఆ మహారచయిత ఖుర్‌ఆన్‌ని పోలిన ఒక్క వాక్యం కూడా రాయలేక పోయాడు. అతను తన అసమర్థతకు సిగ్గుపడుతూ ఓటమి అంగీకరించి ఆ రచనాబాధ్యత నుండి తప్పుకున్నాడు. (Mohammad, His life and Doctrine P.143, by Wollaston)

## సజీవభాషలో నేటికీ సురక్షితం

ఖుర్‌ఆన్ సూక్తులు మొత్తం ఒకేసారి అవతరించలేదు. సందర్భానుసారం 23 సంవత్సరాల్లో అవతరించాయి. దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) తనపై ఖుర్‌ఆన్ సూక్తులు అవతరించినప్పుడల్లా ఒక లేఖకుడ్ని పిలిపించి అతనిచే వాటిని అప్పటికప్పుడు రాయించేవారు. రాసిన తరువాత లేఖకుడు దాన్ని ఆయనకు వినిపించేవాడు. లేఖకుడు సరిగా రాశాడని నిర్ధారించుకున్న తరువాత ఆయన ఆ సూక్తుల్ని ఒకచోట భద్రపరిచేవారు.



అదీగాక ఇస్లాం ప్రారంభకాలం నుంచే నమాజ్‌లో ఖుర్‌ఆన్ సూక్తులు తప్పకుండా పఠించాలన్న ఆదేశం వుండటంవల్ల దైవప్రవక్త ప్రత్యక్ష అనుచరులు ఖుర్‌ఆన్ సూక్తుల్ని వీలైనంత ఎక్కువగా కంఠస్తం చేసుకునేవారు. ఇక చదవడం, రాయడం వచ్చిన అనేక మంది సహాబీలు (ప్రవక్త ప్రత్యక్ష అనుచరులు) ఖుర్‌ఆన్‌లోని వివిధ భాగాలను స్వయంగా రాసుకొని దాచుకునేవారు. ఇలా దైవప్రవక్త (సల్లం) కాలంలోనే ఖుర్‌ఆన్ భద్రపరచబడింది.

ఆ మహనీయుని నిర్యాణం తర్వాత ఆయన మొదటి ప్రతినిధి (ఖలీఫా) హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ (రజి) వివిధ ప్రాంతాల్లో వున్న హాఫిజ్‌ల (ఖుర్‌ఆన్ స్మర్తల)నందర్నీ రాజధానికి రప్పించి, మొత్తం వ్రాతప్రతుల్ని సేకరించి, ప్రమాణబద్ధమైన ఒక సంపూర్ణ ఖుర్‌ఆన్ ప్రతిని గ్రంథం రూపంలో రాయించారు. ఆ తరువాత మూడవ ఖలీఫా హజ్రత్ ఉస్మాన్ (రజి) పాలనాకాలంలో దాని ప్రతులు తీయించి అధికారికంగా ముస్లిం జగత్తులోని యావత్తు కీలక ప్రాంతాలకు పంపించారు. వాటిలో రెండు వ్రాతప్రతులు ఈనాడు కూడా యధాతథ స్థితిలో వున్నాయి. కావాలంటే ఎవరైనా ఖుర్‌ఆన్ ముద్రిత ప్రతినొక దాన్ని తీసికెళ్ళి ఆ వ్రాత ప్రతులతో పోల్చి చూసుకోవచ్చు. అందులో వారికి ఒక్క సూక్తి, ఒక్క వాక్యం, ఒక్క పదం కాదుకదా చివరికి ఒక్క అక్షరం కూడా తేడా కనపడదు.

గత శతాబ్ది చివరిలో జర్మనీలోని మ్యూనిచ్ యూనివర్సిటీకి చెందిన ఒక సంస్థ ముస్లిం జగత్తులోని వివిధప్రాంతాల నుండి హిజ్రీ ఒకటోశతాబ్ది నుండి 14వ శతాబ్ది వరకు వివిధ కాలాల్లో రాయబడిన 42వేల వ్రాత, ముద్రిత ప్రతుల్ని సేకరించింది. వాటిపై యాభై ఏళ్ళపాటు సుదీర్ఘ పరిశోధన జరిపి, చివరికి ఈ ప్రతుల్లో అచ్చుతప్పులు తప్ప ఎలాంటి తేడా లేదని తన నివేదికలో ప్రకటించింది. ఈ సంస్థ రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో బాంబుదాడులకు గురయి నాశనమై నప్పటికీ దీని పరిశోధనా ఫలితాలు మాత్రం నేటికీ ప్రపంచం నుండి చెరిగి పోలేదు.

పోతే ఖుర్‌ఆన్ అవతరించిన అరబీభాష ఇరాఖ్ నుండి మొరాకో వరకు దాదాపు యాభై కోట్లమంది ప్రజలకు ఈనాటికీ మాతృభాషగా ఉంది. అరబీభాష వ్యాకరణం, దాని పదకోశం, ఉచ్ఛారణ, నుడికారాలు 1400 సంవత్సారాల నుండి నేటికీ అలాగే వున్నాయి. ఆనాటి అరబ్బులు ఈ గ్రంథాన్ని చదివి ఎలా అర్థం చేసుకునేవారో ఈనాడు కూడా అరబీభాష ఎరిగినవారు దీన్ని చదివి అలాగే అర్థం చేసుకోగలుగుతారు.

ఈ విధంగా దివ్యఖుర్‌ఆన్ దాని మూలభాషలో, దాని అసలు పదాలతో ఎలాంటి మార్పులకు, చేర్పులకు గురికాకుండా ఈనాటికీ నూరుశాతం సురక్షితంగా ఉంది. దేవుడు స్వయంగా దీని రక్షణ బాధ్యత తీసుకోవడం వల్ల దీనికి ఇన్ని విధాలుగా భద్రతా యేర్పాట్లు జరిగాయి. (15:9, 75:16-19 సూక్తులు చూడండి.) ఈ కారణంగానే ఖుర్‌ఆన్ ఎలాంటి ప్రక్షిప్తాలు, నిక్షిప్తాలకైనా గురయిందని విమర్శించడానికి ఎవరూ సాహసించలేక పోతున్నారు.

## శైలి-సంకలనం

ఖుర్‌ఆన్‌లోని సూక్తులు, అధ్యాయాలు అవి అవతరించిన క్రమంలో కాకుండా ఓ ప్రత్యేక క్రమంలో వాటి కూర్పు జరిగింది. స్వయంగా దైవప్రవక్తే (సల్లం) దేవుని ఆదేశంతో ఈవిధంగా సంకలనం చేయించారు. దైవసందేశం అవతరించిన ప్రతిసారీ ఆయన లేఖకుణ్ణి పిలిపించి దాన్ని ఏ అధ్యాయం (సూరా)లో, ఏ సూక్తి తరువాత పొందుపరచాలో అతనికి వివరించేవారు. అలాగే ఏఅధ్యాయం ఏఅధ్యాయానికి ముందు లేక తరువాత ఉండాలో కూడా లేఖకుడికి చెప్పి రాయించేవారు. ఇలా ఖుర్‌ఆన్ కూర్పు ఆయన జీవితకాలంలోనే పూర్తయింది. ఆ క్రమంలోనే నేటికీ ప్రజలు ఖుర్‌ఆన్ సూక్తుల్ని కంఠస్థం చేసుకోవడం, వాటిని నమాజులో పఠించడం జరుగుతూ వస్తోంది.

ఖుర్‌ఆన్ భాషా శైలి అద్భుతమయింది. దీన్ని ఫలానా శైలి అని నిర్దిష్టంగా పేర్కొనలేము. ఖుర్‌ఆన్‌లోని భాషా ఉరవడి, వాడి, వేడి అద్వితీయమైనవి. అందువల్ల కొందరు భాషాకోవిదులు ఇది ప్రాసయుక్తమైన గద్యమని, గద్యరూపంలో వున్న పద్య మని అభిప్రాయపడ్డారు. ఇందులో పద్యానికి ఉండవలసిన లాక్షణిక నియతి ఏదీ లేక పోయినా భావగర్భితమైన పదబంధాలు, కవితా సృష్టిలోని నుడికారపు వంపు సొంపులు, పదాలంకరణలు మాత్రం వున్నాయి. అలాగే మరొకవైపు గద్యానికి వుండవలసిన భావ గాంభీర్యం, భావసమగ్రత, విషయానుశీలనం, వాక్యాల పటుత్వం మనకు కొట్టవచ్చి నట్లు కన్పిస్తాయి. అయినా ఖుర్‌ఆన్ శైలి గ్రంథరచనలా వుండదు. ఇది పూర్తిగా ప్రసంగ ధోరణిలో సాగుతుంది. ఓ నిరంతర ప్రసంగం! అనర్గళంగా సాగే వచనామృత ధార!

## దివ్యావిష్కృతి-అవతరణ తీరు

దైవదౌత్యం (Prophethood) ప్రారంభానికి పూర్వం మహనీయ ముహమ్మద్ (స) తరచుగా మక్కాపట్నం వెలుపలున్న హిరా గుహకు వెళ్ళి అక్కడ దైవచింతనలో నిమగ్నులయి ఉండేవారు. ఓరోజు ఉన్నట్టుండి గుహలో ఆయన ముందు హఠాత్తుగా ఒక వ్యక్తి ప్రత్యక్షమయి "చదువు" అన్నాడు. మహనీయ ముహమ్మద్ (సల్లం) కంగారుపడుతూ "నాకు చదువు రాదు, నేను చదువురానివాణ్ణి" అన్నారు. ఆ వ్యక్తి ఆయన్ని గట్టిగా అదిమి వదలి, చదువు అన్నాడు. ఆయన మళ్ళీ తనకు చదవను రాదన్నారు. ఇలా మూడుసార్లు జరిగింది. తరువాత ఆ వ్యక్తి అదృశ్యమై పోయాడు. ఆవ్యక్తి గతంలో ప్రవక్తలందరికీ దైవసందేశం అందజేసిన దైవదూత జిబ్రీల్ (అలైహి).

ఈ సంఘటనతో ముహమ్మద్ (స) భయపడి ఇంటికి వచ్చి వాలారు. భయాం దోళనలు తగ్గిన తర్వాత ఆయన తన భార్య ఖదీజా (రజి)కు విషయం తెలియజేశారు. ఆమె ఆయనకు ధైర్యంచెప్పి తన బంధువు వరఖా బిన్‌నౌఫల్ దగ్గరకు పిలుచుకెళ్ళారు.

వరఖా క్రైస్తవ, యూద మతగ్రంథాలను కాసివడబోసిన గొప్ప పండితుడు. ఆయన జరిగిన వృత్తాంతం విని, ఆ వ్యక్తి తప్పకుండా గతంలో మూసా ప్రవక్త (అలైహి)కు దైవసందేశం అందజేయడానికి వస్తుండిన దైవదూత జిబ్రీల్‌యేనని తెలియజేశాడు.



ఇలా ప్రారంభమయింది దైవసందేశావతరణ (దివ్యావిష్కృతి). ఆ తరువాత దైవదూత జిబ్రీల్ (అలైహి) ఒక్కోసారి మానవాకారంలో, మరొక్కోసారి తన నిజ రూపంలో వచ్చి ముహమ్మద్ మహనీయుని (సల్లం)కి తరుచుగా దైవసందేశం అంద జేస్తుండేవారు. ఈ దివ్యసందేశం సృష్టికర్త నుండి దైవదూత జిబ్రీల్ ద్వారా ముహమ్మద్ ప్రవక్త (సల్లం) హృదయ ఫలకంపై అవతరిస్తుంది. అప్పుడు ఆయన ఒక విధమైన విచిత్రానుభూతికి లోనయ్యేవారు.

ఒకసారి ఆయన ఒంటె మీద ప్రయాణం చేస్తుంటే దైవసందేశం అవతరించింది. ఈ దివ్యావిష్కృతి (Revelation) కలగజేసిన భారాన్ని ఒంటె భరించలేక అణగిపోతూ అతికష్టంగా నిలదొక్కుకో గలిగింది. ఒక్కోసారి దివ్యావిష్కృతి గణగణ మంటూ గంట మోతలా విన్పిస్తూ అవతరిస్తుంది. అది దైవప్రవక్త (సల్లం)కు అత్యంత బాధాకరంగా ఉంటుంది. ఆ తరువాత దైవప్రోక్త సూక్తులు ఆయన స్మృతిపథంలో నిలిచిపోతాయి.

దైవప్రవక్త సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) కథనం ప్రకారం ఓసారి దైవసందేశం అవతరిస్తున్న సమయంలో ఆమె ఆయన పరిస్థితి గమనించారు. అప్పుడు అపరిమిత మైన చలి ఉండింది. అయినప్పటికీ ఆయన ఫాలభాగంపై ముచ్చెమటలు పోశాయి.

## ఇతివృత్తం

ఈ గ్రంథం మనిషిని దైనందిన జీవిత వ్యవహారాల నుండి సదా ఏకాంత కుహరాల్లోకి తీసికెళ్ళి తాత్త్విక చింతనను నూరిపోసే తత్వశాస్త్రం కాదు. ఇది దేవునికి, దాసునికి మధ్య వుండవలసిన వాస్తవిక సంబంధాన్ని ప్రధాన ఇతివృత్తంగా తీసుకొని, దానికి బలం చేకూర్చేందుకు కావలసిన ఇతర అంశాలను ఉపవిషయాలుగా పేర్కొంటుంది. అందువల్ల ఇందులో జీవిత సమస్యలకు సంబంధించిన సమస్త విషయాలు మనకు కనిపిస్తాయి.

ఇది సామాజిక శాస్త్రం కాకపోయినా, ఇందులో సత్సమాజస్థాపనకు అవసరమైన సాంఘిక న్యాయం, సభ్యతాసంస్కృతులు, కౌటుంబిక, వైవాహిక విషయాలు ఉన్నాయి. ఇది నీతులు వల్లించే నీతిశాస్త్రం కాకపోయినా ఇందులో మానవుల్ని నీతిమంతులుగా, దైవభీతిపరులుగా తీర్చిదిద్దడానికి కావలసిన ఉన్నత నైతిక నియమావళి ఉంది.

ఇది ఆర్థిక సమస్యల్ని పరిష్కరించే అర్థశాస్త్రం కాకపోయినా ఇందులో ధనార్జన, ధన విని యోగాలను గురించి చర్చించి ఆర్థిక న్యాయానికి రాచబాట నిర్మిస్తుంది. ఈ గ్రంథం రాజకీయ వ్యవహారాలను తెలిపే రాజకీయశాస్త్రం కాకపోయినా రాజనీతి, పరిపాలన, యుద్ధం, సంధి, జాతీయ, అంతర్జాతీయ సంబంధాలు మొదలైన రాజకీయవ్యవహారాలను కూడా స్పృశిస్తుంది.

ఒక్కమాటలో చెప్పాలంటే ఇది జీవితానికి సంబంధించిన సకల రంగాల్లో దేవుని హితవుల్ని మానవుల ముందు పెట్టి, వాటి విషయంలో మరణానంతరం దేవుని ముందు బాధ్యత వహించవలసి వుంటుందని అడుగడుగునా అతణ్ణి హెచ్చరించే,

ఉపదేశించే ఓ విశిష్ఠ గ్రంథరాజం.

కనుక ఈ ఆశయం నెరవేరాలంటే, విద్యార్థి తన పాఠ్యగ్రంథాన్ని పఠిస్తున్నట్లు ఈ గ్రంథాన్ని నిత్యం పఠిస్తూ ఉండాలి. ఈ కారణంగానే దీనికి "ఖుర్ఆన్" అని పేరొచ్చింది. అంటే పాఠ్యగ్రంథం, పఠనపుస్తకం, పారాయణ గ్రంథం అన్నమాట. ఈ భావంలో దీన్ని పఠణవేదమని కూడా చెప్పవచ్చు. హిందూమత గ్రంథాల్లోని కొన్ని భవిష్యత్ ప్రకటనల్ని పరిశీలిస్తే, వాటిలో ప్రస్తావించబడిన పఠణవేదం ఖుర్ఆనే అయి ఉండవచ్చన్న అనుమానం కూడా కలుగుతుంది.

ఏమైనప్పటికీ ఖుర్ఆన్ యావత్తు మానవాళి కోసం అవతరించిన అంతిమ దైవ గ్రంథం. ఇది ప్రపంచ మానవులందరి ఉమ్మడిసొత్తు. దీనిపై ఏ ఒక్క జాతికీ, వర్గానికీ గుత్తాధిపత్యం లేదు. గాలి, నీరు, సూర్యరశ్మి మొదలైన ప్రకృతి వనరుల్ని మానవుడు ఎలా వినియోగించుకొని ప్రయోజనం పొందుతున్నాడో ఖుర్ఆన్ వల్ల కూడా అలాగే ప్రయోజనం పొందవచ్చు. ఇది ఇహలోకంలో మానవుల మార్గదర్శనం కోసం, పరలోకంలో వారి ముక్తి మోక్షాల కోసం సర్వేశ్వరుడు పంపిన ఏకైక హితవాణి. ఇందులో సత్యాన్వేషకులకు ఆసక్తికరమైన అనేక విషయాలు ఉన్నాయి. అందువల్ల సత్యాన్ని ప్రేమించి, మోక్షాన్ని కోరుకునే ప్రతి ఒక్కరూ కనీసం ఒక్కసారైనా ప్రశాంతంగా ఆలోచించి దీన్ని అధ్యయనం చేయవలసిన అవసరం ఎంతయినా వుంది.

**అబుల్ ఇర్ఫాన్**
(అనువాదకుడు)

---

## సంక్షిప్తాలు (Abbreviations)

- ✤ సల్లం (సల్లల్లాహు అలైహి వసల్లం)= ఆయనపై శాంతీసౌభాగ్యాలు వర్షించుగాక.
- ✤ అలైహి (అలైహిస్సలాం)= ఆయనకు శాంతి కలుగుగాక.
- ✤ రజి (రజియల్లాహుఅన్హు)= ఆయన పట్ల దేవుడు ప్రసన్నుడవుగాక.
- ✤ రహ్మలై (రహ్మతుల్లాహి అలైహి)= ఆయన్ని దేవుడు కరుణించుగాక.
- ✤ న.శ. (నబవీ శకం)= దైవప్రవక్త (సల్లం) మదీనాకు వలసపోక ముందు మక్కాలో గడిపిన పదమూడేండ్ల కాలం
- ✤ హి.శ. (హిజ్రీ శకం)=దైవప్రవక్త (సల్లం) మక్కా నుండి మదీనాకు వలస (హిజ్రత్ చేసి) వచ్చినప్పటి నుండి ప్రారంభమయి కొనసాగుతున్న కాలం.



అవతరణ: మక్కా

# 1.ప్రారంభం(ఫాతిహా)

సూక్తులు: 7

ఈ అధ్యాయాన్ని "ఫాతిహా" (ప్రారంభం) అంటారు. అంటే దివ్యఖుర్ఆన్‌కు ఇది ప్రారంభ అధ్యాయం అని అర్థం. ఇది మహనీయ ముహమ్మద్ (సల్లం) దైవప్రవక్తగా నియమించబడిన ప్రారంభ కాలంలో అవతరించింది. ఈ అధ్యాయంలో భక్తుడు తన ప్రభువును స్తుతించి తనకు రుజుమార్గం చూపమని వేడుకుంటాడు. దానికి సమాధానం గా దేవుడు, నీవు కోరుతున్న రుజుమార్గం ఇదేనంటూ మొత్తం ఖుర్ఆన్‌ని భక్తుని ముందు ఉంచుతాడు.

**కరుణామయుడు, కృపాసాగరుడయిన అల్లాహ్ పేరుతో ప్రారంభం.**

సమస్త లోకాలకు స్వామి, ప్రభువు అయిన అల్లాహ్‌కే సకల విధాల ప్రశంసలు శోభిస్తాయి. ఆయన కరుణామయుడు, కృపాసాగరుడు. పరలోక విచారణ దినానికి అధిపతి కూడా ఆయనే. (1-3)

దేవా! మేము నిన్నే ఆరాధిస్తున్నాము. నీ సహాయమే అర్థిస్తున్నాము. మాకు రుజు మార్గం చూపు.[1] నీ ఆగ్రహానికి గురయి దారితప్పినవారి మార్గం కాకుండా, నీ అనుగ్రహా నికి పాత్రులయినవారి మార్గమే మాకు చూపించు. (4-7) ✪

---

1. యావత్తు మానవాళిని సృష్టించి, పోషించి, పాలించే దేవుడు మాత్రమే మానవులకు సరైన రుజుమార్గం (జీవిత విధానం) చూపగల్గుతాడు. అందువల్ల ఆయన మాత్రమే ఆరాధనకు అర్హుడు. మిగిలిన వారంతా సృష్టితాలు, దాసులు, పాలితులు మాత్రమే. అలాగే మానవులు పరస్పరం సహాయ సహకారాలు అందజేసుకుంటున్నప్పటికీ అసలు సహాయం చేసేవాడు దేవుడు మాత్రమే. కనుక మానవులు తమ అవసరాల కోసం ఆయన్ని మాత్రమే అర్థించాలి.

ఏకేశ్వర భావం ప్రతి మానవుని నైజంలోనే వేళ్ళూని ఉంది. అయితే ఆచరణలోనే అనేక మంది ఈ సత్యానికి కట్టుబడి ఉండలేక పోతున్నారు. ఒకే దేవుడ్ని ఆరాధిస్తున్నామని చెబుతూనే కొన్ని చేష్టల ద్వారా బహుదైవోపాసనకు పాల్పడుతున్నారు. దీనికంతటికీ కారణం దివ్యావిష్కృతి (Revelation)ని పొందిన దైవప్రవక్తలను గుర్తించకపోవడం; గుర్తించినా వారి బోధనలను మార్చి వేయడం, పెడర్థాలు తీయడం; ఆయా మార్పులకు, పెడర్థాలకు "సహేతుకమైన" సాకులు చూపి తమ వాదనలే నిజమని నిరూపించడానికి వృథా ప్రయాసపడటం జరుగుతోంది.

దేవుళ్ళు అనేకమంది ఉన్నారని భావించినప్పుడు "కస్మై దేవాయ హవిషా విధేమ?" (ఏ దేవునికి మా హవిస్సుల నివ్వవలెను?) అనే ప్రశ్న ఉదయిస్తుంది. ఈ ప్రపంచానికి, ఇక్కడి సుఖ దుఃఖాల వ్యవస్థకు కారణం "ఏకోబ్రహ్మమే" అని నిర్ధారించుకున్నప్పుడు "ఆబ్రహ్మ లక్షణాలు ఏవి?" అనే మరో ప్రశ్న ఉద్భవిస్తుంది. ఆ బ్రహ్మ లక్షణాలన్నీ కలిగివున్న సమగ్ర పదమే "అల్లాహ్". 'అల్+ఇలాహ్' అనే రెండుపదాలు కలసి ఒకే దేవుడు, The God అనే భావం స్ఫురించేలా 'అల్లాహ్' అనే పదం ఏర్పడింది. ఈ పదమే ఆ శుద్ధ ఏక బ్రహ్మకు నామవాచకమైపోయింది.

"ఇలాహ్" అంటే ఆపద సమయంలో ఆదుకునేవాడు, భయాందోళనలు కలిగినప్పుడు శాంతి స్థిమితాలు ప్రసాదించేవాడు, కష్టాలను కడతేర్చి సుఖాన్నిచ్చేవాడు, శరణుగోరినవారికి ఆశ్రయ మిచ్చేవాడు, కోరికలను తీర్చేవాడు అని నానార్థాలు ఉన్నాయి. అరబీభాషలో ఈ పదాలలో ఆధిక్యతా భావం (Supremacy) కూడా ఇమిడి ఉంది.

ఆధిక్యత ఉన్న చోటికే అవసరార్థులు గుమికూడటం సహజం. కనుక ఆధిక్యత కలిగి ఉన్నవాడు అర్థులకు ఆరాధ్యుడయి పోతాడు. ఈ విధంగా 'ఇలాహ్' అనే పదంలో అర్థించదగిన వాడు, ఆరాధించదగినవాడు, ఆశ్రయమిచ్చేవాడు, ఆపదల మొక్కులవాడు అనే అర్థాలు ఉన్నాయి. బహుదైవారాధ్య భావం కలిగిన వారంతా ఈ అర్థాలలోనే అసాధారణ శక్తి ఉందని భావించిన ప్రతి సృష్టితాన్ని (Creature) పూజించడం ప్రారంభించారు. చివరికి ఏకేశ్వర వాదులమని చెప్పుకునేవారు సైతం ఏకాగ్రత కోసమనో, లేదా దేవునికి ప్రతిరూపాలనో భావించి సృష్టిపూజకు అలవాటుపడ్డారు.

అయితే ఇస్లాం ఏకేశ్వరవాదానికి సంబంధించి విశ్వాసానికి, ఆచరణకు మధ్య ఉన్న ఈ వైరుధ్యాన్ని ఖండించింది. ఆ 'ఇలాహ్' (ఆరాధ్యుడు) ఒక్కడేనని, ఆయన తప్ప వేరే ఆరాధ్యుడు పూజనీయుడు లేడని, ఆయనే 'అల్లాహ్' అని నమ్మడంతో పాటు ఆచరణ రీత్యా కూడా ఆ ఒక్కడినే ఆరాధించాలని, ఆయన్నే వేడుకోవాలని, జీవితంలోని ప్రతి వ్యవహారంలోనూ ఆయన ఆజ్ఞలను మాత్రమే శిరసావహించాలని చెబుతోంది.

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఒక హదీసులో దేవుని మాటలు ఇలా తెలిపారు:

"నా దాసులారా! నేను మార్గం చూపినవాడు తప్ప మీలో ప్రతి ఒక్కడూ మార్గవిహీనుడే. అందువల్ల సన్మార్గం చూపమని నన్ను వేడుకోండి, నేను మీకు సన్మార్గావలంబన బుద్ధి ప్రసాదిస్తాను. నా దాసులారా! నేను ఉపాధి ప్రసాదించినవాడు తప్ప మీలో ప్రతి ఒక్కడూ క్షుత్బాధితుడే. కనుక ఉపాధి ప్రసాదించమని నన్ను మొరపెట్టుకోండి, నేను మీకు ఉపాధినిస్తాను. నా దాసులారా! నేను వస్త్రాలు ప్రసాదించినవాడు తప్ప మీలో ప్రతిఒక్కడూ వస్త్రవిహీనుడే. కావున వస్త్రాలు ప్రసాదించ మని నన్ను అర్థించండి, నేను మీకు వస్త్రాలు ప్రసాదిస్తాను. నా దాసులారా! మీలో ప్రతి ఒక్కడూ రేయింబవళ్ళు పాపాలు చేస్తున్నవాడే. నేను మీ పాపాలన్నీ క్షమిస్తాను. కనుక మీరు పాపక్షమాపణ కోసం నన్ను ప్రార్థించండి, నేను మీ పాపాలు క్షమిస్తాను." (ముస్లిం)

దైవారాధనల్లో నమాజ్ ఎంతో ముఖ్యమైన ఆరాధన. నిజదైవాన్ని గుర్తించిన తరువాత దాని క్రియాత్మక రూపంలోని మొట్టమొదటి అంశం నమాజ్ మాత్రమే. దేవుడు తన ప్రవక్తలకు కూడా ఈ విషయాన్నే బోధించాడు. ఆయన మూసా ప్రవక్త (అలైహి)ని సంబోధిస్తూ ఇలా ఆదేశించాడు:

"నేనే దేవుణ్ణి, నేను తప్ప మరో ఆరాధ్యుడు లేడు. కనుక నీవు నన్నే ఆరాధించు. నన్ను స్మరించడానికి నమాజ్ స్థాపించు." (ఖుర్‌ఆన్-2:14)

దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) కూడా నమాజ్ ప్రాముఖ్యాన్ని వివరిస్తూ ఇలా అన్నారు:

"విశ్వాసికి, అవిశ్వాసికి మధ్య వారిద్దరిని వేరుచేసే హద్దు నమాజే." (ముస్లిం) ✪



అవతరణ: మదీనా

# 2. గోవు (బఖరా)

సూక్తులు: 286

ఈ అధ్యాయాన్ని "బఖరా" (గోవు) అంటారు. ఇందులోని అత్యధిక సూక్తులు దైవప్రవక్త (సల్లం) మక్కా నుండి మదీనాకు వలస వచ్చిన ప్రారంభ కాలంలో విభిన్న సందర్భాలలో అవతరించాయి. మిగిలిన సూక్తులు ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) జీవితపు చివరి కాలంలో అవతరించాయి.

దైవప్రవక్త (సల్లం) మదీనా వచ్చిన తర్వాత అక్కడి యూదులు సత్యమార్గంలో ఆయనకు అవరోధకులుగా నిలిచారు. అదీగాక ప్రాపంచిక వ్యామోహం, స్వార్థప్రయో జనాల ఊబి నుండి బయటపడలేక పోయిన కపట విశ్వాసులు కూడా సత్యమార్గాన్ని నిరోధించడానికి ముస్లిం వేషధారణలో రకరకాల కుట్రలు పన్నడంలో నిమగ్నులై పోయారు. అంచేత ఇలాంటి యూదులు, కపట విశ్వాసుల్ని దారికి తీసుకురావడానికి ఈ సూక్తులు అవతరించాయి. అదే సమయంలో విశ్వాసులకు సముచిత సూచనలు, సందర్భోచితమైన హితవులు కూడా ఇవ్వబడ్డాయి.

మరోవైపు మక్కా బహుదైవారాధకులు యూదుల ప్రోత్సాహంతో ముస్లింలపై మాటి మాటికి కాలుదువ్వడానికి ప్రయత్నించేవారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ముస్లింలకు ధైర్యం కలిగించి, వారిని దుష్టశక్తులకు వ్యతిరేకంగా ధర్మపోరాటానికి సమాయత్త పరచ వలసి వచ్చింది. వేరొకవైపు నూతన సమాజావిష్కరణకు అవసరమైన ఆదేశాలు కూడా ఇందులో ఇవ్వబడ్డాయి.

### కరుణామయుడు, కృపాసాగరుడయిన దేవుని పేరుతో ప్రారంభం

అలిఫ్-లామ్-మీమ్.[1] ఇది ఎలాంటి సందేహానికి ఆస్కారంలేని (దైవదత్త) గ్రంథం. ఈ గ్రంథం భయభక్తులు కలవారికి రుజుమార్గం చూపుతుంది. వారు అగోచరాలు, అతీంద్రి యాలను విశ్వసిస్తారు;[2] ప్రార్థన (వ్యవస్థ)ను స్థాపిస్తారు; మేము ప్రసాదించిన సంపద నుండి (మా మార్గంలో) ఖర్చుపెడతారు; నీపై అవతరించిన ఈ గ్రంథాన్ని, నీకు పూర్వం గతప్రవక్తలపై అవతరించిన గ్రంథాలను[3] విశ్వసిస్తారు. పైగా వారు పరలోకాన్ని

---

1. ఇవి కొన్ని అధ్యాయలకు ప్రారంభంలో ఉండే బీజాక్షరాలు. పూర్వం అరబ్బీ సాహిత్యంలో కూడా ఇలాంటి సంప్రదాయం ఉండేది. కాలక్రమేణా ఇది కనుమరుగై పోయింది. అందువల్ల భాష్యకారులు దీని భావాన్ని ఇదమిత్థంగా నిర్దేశించలేకపోయారు. అయితే అంతమాత్రాన ఖుర్‌ఆన్‌ని అర్థం చేసుకోవడంలో ఎలాంటి లోటురాదు. ఈ బీజాక్షరాలు 29 అధ్యాయాలలో ఉన్నాయి. (2, 3, 7, 10-15, 19, 20, 26-32, 36, 38, 40-46, 50, 68 అధ్యాయాలు చూడండి.)

2. అగోచరాలు అంటే ఇక్కడ మానవ జ్ఞానేంద్రియాలకు అతీతమైన విషయాలని అర్థం. ఉదాహరణకు: దేవుడు, ఆయన గుణగణాలు, దైవదూతలు, దివ్యావిష్కృతి (Revelation) పిత్రులోకం, స్వర్గనరకాలు మొదలైనవి. వీటిని గురించి దివ్యావిష్కృతి ద్వారా ప్రేరణ పొందిన దైవప్రవక్తలకు మాత్రమే తెలుసు. అందువల్ల మానవులు దైవప్రవక్తలపై నమ్మకంతో వీటిని విశ్వ సించవలసి ఉంటుంది.

3. అంటే ఖుర్‌ఆన్‌లో తెలియజేయబడిన తౌరాత్, ఇన్జీల్ మొదలైన గ్రంథాలతో పాటు ఖుర్‌ఆన్‌లో ప్రస్తావించబడని ఇతర మతగ్రంథాలు కూడా అని అర్థం. దేవుడు ప్రతి యుగంలో,

కూడా విశ్వసిస్తారు.[4] అలాంటి దైవభీతిపరులే తమ ప్రభువు నుండి వచ్చిన రుజుమార్గంలో నడిచేవారు.[5] అలాంటివారే సాఫల్యం చెందేవారు; మోక్షం పొందేవారు. (1-5)

కనుక నీవు సత్యతిరస్కారులను హెచ్చరించినా, హెచ్చరించక పోయినా ఒకటే. వారు ఎన్నటికీ విశ్వసించరు. దేవుడు వారి హృదయ కవాటాలు మూసివేశాడు. వారి చెవులకు సీలు వేశాడు. వారి కళ్ళపై పొరలు కమ్మాయి. ఇక వారికి తీవ్రమైన (నరక) యాతన తప్పదు. (6,7)

కొందరు దైవాన్ని, పరలోకాన్ని విశ్వసించామని చెప్పుకుంటారు.[6] కాని వారు నిజమైన విశ్వాసులు కారు. వారు దేవుణ్ణి, విశ్వాసులను మోసగింపజూస్తున్నారు. నిజానికి వారు తమను తామే మోసగించుకుంటున్నారు. ఆ సంగతి వారు గ్రహించడం లేదు. వారి హృదయాలలో ఒక విధమైన రోగం వుంది. దేవుడు దాన్ని మరింత ముదిరేలా చేశాడు. వారి అసత్య ప్రేలాపనలకుగాను వారి కోసం (నరకంలో) దుర్భర యాతన కాచుకొని వుంది.

---

ప్రతి జాతిలోనూ దైవప్రవక్తలను ప్రభవింపజేశాడని ఖుర్‌ఆన్ మరొక చోట తెలియజేస్తోంది. అంటే ఆయా దేశాల్లో, జాతుల్లో కూడా దివ్యగ్రంథాలు అవతరించి ఉండవచ్చు. కాకపోతే గతంలో అవతరించిన గ్రంథాలు భావపరంగా తారుమారయ్యాయని, ప్రక్షిప్తాలకు, నిక్షిప్తాలకు లోనయ్యాయని ఖుర్‌ఆన్ ద్వారా తెలుస్తోంది.

అందువల్ల ముస్లింలు ఖుర్‌ఆన్‌లో ప్రస్తావించబడని మత గ్రంథాలను అసలు దైవ గ్రంథాలు కావని మొండిగా నిరాకరించడానికి వీల్లేదు. వివిధ కాలాల్లో, వివిధ జాతుల్లో యావత్తు మతగ్రంథాలను దేవుడే అవతరింపజేశాడు గనక, వాటిలో ఏ ఒక్క మతగ్రంథాన్ని నిరాకరించినా దేవుణ్ణి నిరాకరించినట్లే. (2:136,285; 3:83,84 సూక్తులు కూడా చూడండి.)

4. పరలోకవిశ్వాసంలో అనేక విశ్వాసాలు మిళితమై ఉన్నాయి. ఉదాహరణకు: (1) దేవుడు మానవుణ్ణి ఈ ప్రపంచంలో బాధ్యతారహితుడిగా సృష్టించలేదు. అతను ఆచరించే కర్మలన్నిటికీ దేవుని ముందు సమాధానం చెప్పుకోవలసి ఉంటుంది. (2) ఇహలోకం కర్మలు ఆచరించే క్రియాలోకం. పరలోకం కర్మఫలం పొందే స్థానం. ఇహలోకం మానవునికి పరీక్షావేదిక. ఒక నిర్ణీత కాలం వరకు ఉండే తాత్కాలిక నివాసం. ఆ తర్వాత అంతమొందించ బడుతుంది. ఆ నిర్ణీత సమయం దేవునికి మాత్రమే తెలుసు. (3) ఇహలోకం నిర్ణీతకాలం ముగిసి అంతమైపోయిన తర్వాత కొత్తగా మరో విశ్వవ్యవస్థ ఆవిర్భవిస్తుంది. అప్పుడు యావత్తు మానవులు ఒకేసారి పునర్జీవింప బడతారు. దేవుడు వారందర్నీ సమావేశపరచి వారి కర్మలలెక్క తీసుకుంటాడు. కర్మలను బట్టి తగిన ప్రతిఫలం ఇస్తాడు. పుణ్యాత్ములను స్వర్గానికి, పాపాత్ములను నరకానికి పంపుతాడు.

5. ఇలాంటి స్వభావం, సుగుణాలు కలవారికే ఈగ్రంథం సన్మార్గం చూపుతుందన్నమాట.

6. ఇక్కడ్నుంచి 20వ సూక్తి వరకు కపట విశ్వాసుల్ని గురించి ప్రస్తావించబడింది. వీరు ముస్లింలుగా నటిస్తూ ముస్లిం సమాజాన్ని లోపలినుంచి తొలచివేయడానికి పూనుకున్న గోముఖ వ్యాఘ్రాలు. ఇలాంటి కపటులు, వంచకులు ప్రతి యుగంలోనూ ఉంటూ ఇస్లాంకు, ముస్లిం సమాజానికి నష్టం కలిగిస్తూ వచ్చారు. కనుక వీరిపట్ల అప్రమత్తంగా ఉండాలని దేవుడు ఈ సూక్తుల్లో ముస్లింలను పరోక్షంగా హెచ్చరిస్తున్నాడు.



ఎప్పుడైనా వారితో, ప్రపంచంలో కలహాలు రేకెత్తించకండని అంటే, “మేము సంఘ సంస్కర్తలం, శాంతికాముకులం” అంటారు. తస్మాత్ జాగ్రత్త! వారే అసలైన కలహకారులు, శాంతివిఘాతకులు. వారా సంగతి గ్రహించడం లేదు. మరెప్పుడైనా వారితో, ఇతరులు విశ్వసించినట్లు మీరూ విశ్వసించండని అంటే “ఏమిటీ! బుద్ధిహీనుల్లా మేము కూడా విశ్వసించాలా?” అంటారు వారు. గుర్తుంచుకోండి, వారే అసలు బుద్ధిహీనులు. వారా సంగతి తెలుసుకోవడం లేదు. (8-13)

ఈ కపటులు విశ్వాసుల్ని కలుసుకున్నప్పుడు తాము విశ్వసించామని అంటారు. కాని విడిగా తమ పిశాచ మిత్రమూకను కలుసుకున్నప్పుడు మాత్రం “మేమేదో పరిహాసానికి అలా అన్నాం గాని, మేమసలు మీతోనే వున్నాం” అంటారు. వినండి, నిజానికి దేవుడే వారితో పరి హాసమాడుతున్నాడు. ఆయన వారిని చూసీచూడనట్లు వదిలేస్తున్నాడు. కాని వారు గర్వాంధకారంలో పడి అంధుల్లా తచ్చాడుతూ తిరుగుతున్నారు. వారే మార్గదర్శనానికి బదులు మార్గవిహీనత కొనితెచ్చుకున్న దౌర్భాగ్యులు. కనుక వారు చేపట్టిన ఈ వ్యాపారం వారికి ఏమాత్రం లాభదాయకంగా లేదు. వారసలు సరైన మార్గంలో నడవడం లేదు. (14-16)

వారినిలా పోల్చవచ్చు: “ఒక వ్యక్తి అగ్ని రాజేసి పరిసరాలు ప్రకాశవంతం చేశాడు. అప్పుడు దేవుడు వారి కంటిచూపు పోగొట్టి చీకటిలో తచ్చాడేలా వదలిపెట్టాడు.” అలా వుంది వీరి పరిస్థితి. వీరు బధిరులు, అంధులు, మూగలు.[7] ఇక వీరు ఎన్నటికీ దారికిరారు. (17,18)

వారిని ఈ విధంగా కూడా పోల్చవచ్చు: “ఆకాశం నుండి కుండపోతగా వర్షం కురుస్తోంది. దానికితోడు కారుమేఘాలు కూడా దట్టంగా కమ్ముకున్నాయి. ఉరుములు, మెరుపులు కూడా వున్నాయి. అలాంటి భయానక వాతావరణంలో ఈ కపటుల స్థితి చూడండి. వీరు గుండెలను అదరగొట్టే ఉరుములు విని, ప్రాణభీతితో చెవులలో వ్రేళ్ళు దూర్చుకుంటారు. దేవుడు సత్యతిరస్కారులకు నలువైపుల నుండి ఉచ్చు బిగిస్తున్నాడు. ఆకాశం మెరిసినప్పుడల్లా ఆ మెరుపు తమ చూపును పోగొడ్తుందా అన్నట్లు వారు తల్లడిల్లి పోతారు. అయితే ఆకాశం మెరిసినప్పుడు కాస్త వెలుగు కనిపించగానే వారు రెండు మూడడుగులు ముందుకు నడుస్తారు. కాని అంతలోనే చీకటి ఆవరించడంతో తక్కున ఆగిపోతారు.” దేవుడు తలచుకుంటే వారి దృష్టిని, వినికిడి శక్తిని పూర్తిగా హరించివేయ గలడు. నిస్సందేహంగా ఆయన సమస్త విషయాలపై అదుపు, అధికారం కలిగిన సమర్థుడు, సర్వ శక్తిమంతుడు. (19,20)

మానవులారా! మిమ్మల్ని, మీ పూర్వీకుల్ని సృష్టించిన మీ ప్రభువును ఆరాధించండి. అప్పుడే మీరు రక్షించబడతారని ఆశించగలరు. ఆయనే మీ కోసం నేలను పాన్పుగా,

---

7. ఇక్కడ రుజుమార్గం చూపుతూ మానవుల జీవితాన్ని సంస్కరించ బూనుకున్న దైవప్రవక్త (సల్లం)ను అగ్ని రాజేసి పరిసరాలను ప్రకాశవంతం చేసే వ్యక్తిగా, రుజుమార్గం వదలి అపమార్గంలోనే పడి ఉండదలచిన కపటవిశ్వాసుల్ని ప్రకాశం చూడలేని అంధులుగా పోల్చడం జరిగింది.

నింగిని కప్పుగా చేశాడు. పైనుండి వర్షాన్ని కురిపించేవాడు కూడా ఆయనే. ఆ వర్షం ద్వారా ఆయన రకరకాల పండ్లూ, పంటలు పండించి మీకు ఆహారం సమకూర్చి పెడ్తున్నాడు. కనుక ఈ యదార్థాలు తెలిసిన తర్వాత మీరు ఇతర శక్తుల్ని దేవునికి సాటి కల్పించకండి. (21,22)

ఒకవేళ మా దాసునిపై అవతరింపజేసిన ఈ గ్రంథం గురించి మీకేదయినా అనుమానముంటే ఇందులోని అధ్యాయంలాంటి ఓ అధ్యాయం రచించి తీసుకురండి. ఈ పని కోసం ఒక్క దేవుడ్ని వదలి మీ మద్దతుదారులందర్నీ పిలుచుకోండి. మీరు సత్య వంతులయితే ఈ పని చేసిచూపండి. మీరీ పని చేయలేకపోతే.... ఎంతమాత్రం చేయలేరు.... మనుషులు, రాళ్ళు[8] ఇంధనం కాగల నరకాగ్నికి భయపడండి. సత్య తిరస్కారుల కోసం అది సిద్ధపరచబడి ఉంది. (23,24)

(ముహమ్మద్!) సత్యాన్ని విశ్వసించి తదనుగుణంగా సత్కార్యాలు చేసేవారికి సెలయేళ్ళు ప్రవహించే స్వర్గవనాలు ఉన్నాయని శుభవార్త విన్పించు. ఆ స్వర్గవనాల్లోని పండ్లు చూడటానికి ఇహలోకంలోని పండ్లు మాదిరిగా ఉంటాయి. వారికి ఏవైనా పండ్లు తినడానికి ఇచ్చినప్పుడు, ఇలాంటి పండ్లే తమకు ప్రపంచంలో కూడా ఇవ్వబడేవని అంటారు వారు. వారికి ఈడు-జోడు, తోడు-నీడగా అక్కడ పవిత్ర సహచరులు[9] కూడా వుంటారు. ఆ స్వర్గవనాల్లో వారు శాశ్వతంగా వుంటారు. (25)

దేవుడు (సత్యనిరూపణకు) ఎలాంటి ఉపమానం ఇవ్వడానికైనా సిగ్గుపడడు. చివరికి దోమ లేదా అంతకంటే అల్పజీవికి సంబంధించిన ఉపమానమయినా సరే.[10]

---

8. పరలోకంలో సత్యతిరస్కారులే కాదు, వారు ఆరాధిస్తూ వచ్చిన విగ్రహాలు కూడా నరకాగ్నికి సమిధలయి పోతాయని ఈ సూక్తిలో దేవుడు పరోక్షంగా హెచ్చరిస్తున్నాడు. అప్పుడు సత్య తిరస్కారుల ముందు తాము ఇంత కాలంగా పూజిస్తూ వచ్చిన విగ్రహాలు మిథ్యాదైవాలన్న సత్యం బట్టబయలవుతుంది.

9. ఇక్కడ మూల భాషలో "అజ్వాజుమ్ముతహ్హారా" అనే పదం వాడబడింది. ఇందులో అజ్వాజ్ బహువచనంలో ఉంది. దాని ఏకవచనం 'జౌజ్' లేక 'జౌజా' అవుతుంది. అంటే జత, జోడు, జంట, తోడు నీడ అని అర్థం. పురుషునికి స్త్రీ జోడు, జతది (భార్య) అయితే, స్త్రీకి పురుషుడు తోడు, జత (భర్త) అవుతాడు.

అజ్వాజుమ్ముతహ్హారా అంటే పవిత్రమయిన జంట అని అర్థం. ఇహలోకంలో సజ్జనుడు, పవిత్రుడైన పురుషునికి దుర్జనురాలు, అపవిత్రురాలైన భార్యఉంటే పరలోకంలో వారి వివాహబంధం తెగిపోతుంది. పవిత్ర పురుషునికి అక్కడ వేరే పవిత్ర భార్య ప్రసాదించబడుతుంది. అలాగే ఇహలోకంలో సజ్జనురాలు, పవిత్రురాలు అయిన స్త్రీకి దుర్జనుడు, అపవిత్రుడయిన భర్త ఉంటే పరలోకంలో వారి వివాహబంధం విచ్ఛేదమవుతుంది. పవిత్ర స్త్రీకి అక్కడ వేరే పవిత్ర పురుషుడ్ని భర్తగా ఇవ్వడం జరుగుతుంది. ఇహలోకంలో భార్యాభర్తలిద్దరూ సజ్జనులు, పవిత్రులయి ఉంటే పరలోకంలో వీరి వివాహబంధం కొనసాగుతుంది. (56:36 సూక్తికి రాసిన పాదసూచిక కూడా చూడండి.)

10. దోమల కంటే అల్పజీవులు ప్రపంచంలో ఉన్నాయోలేవో బహుశా ప్రాచీనులకు తెలిసి ఉండదు. కాని నేటి వైజ్ఞానికయుగంలో దోమలకంటే కూడా ఎంతో అల్పమయిన సూక్ష్మజీవులు



సత్యాన్ని విశ్వసించినవారు (ఇలాంటి ఉదాహరణల ద్వారా) ఇది తమ ప్రభువు నుండి వచ్చిన సత్యమని నమ్ముతారు. కాని సత్యతిరస్కారులు వీటిని చూసి, ఇలాంటి ఉదాహరణలు ఇవ్వడంలో దేవుని ఆంతర్యం ఏమిటో! అంటారు. ఈ విధంగా దేవుడు ఒకే విషయం ద్వారా కొందరిని దారితప్పిస్తే, మరి కొందరికి దారి చూపిస్తాడు. (26)

దేవునితో చేసిన పటిష్ఠమయిన ప్రమాణాలను ఉల్లంఘించే, కలపమని దేవుడు ఆదేశించిన దాన్ని త్రెంచివేసే, ప్రపంచంలో కలహాలు రేకెత్తించే దుర్మార్గులను మాత్రమే దేవుడు మార్గభ్రష్టత్వంలో పడవేస్తాడు. అలాంటివారే నష్టపోయేవారు. (27)

అసలు మీరు దేవుని పట్ల అవిశ్వాసవైఖరి ఎలా అవలంబిస్తారు? మీరు నిర్జీవులుగా ఉన్నప్పుడు అయన మీకు జీవం పోశాడు. చివరికి ఆయనే మీ ప్రాణాలు తీసేవాడు. (పునరుత్థాన దినాన) మీకు తిరిగి ప్రాణంపోసి లేపేవాడు కూడా ఆయనే. చివరికి ఆయన సన్నిధికే మీరు మరలి పోవలసివుంది. ఆయనే మీ కోసం ప్రపంచంలోని వస్తువులన్నిటినీ సృష్టించాడు. తరువాత ఆయన ఆకాశం వైపు దృష్టిసారించి, దాన్ని సప్తాకాశాలుగా రూపొందించాడు. ఆయన సమస్త విషయాలు తెలిసినవాడు. (28,29)

నీ ప్రభువు దైవదూతలతో "భూలోకంలో నేనొక ఖలీఫా[11] (ప్రతినిధి)ని నియమించబోతున్నా"నని అన్నప్పుడు దైవదూతలు ఏమన్నారో తెలుసా? "ఏమిటీ...! మీరు ప్రపంచ

---

ఉన్నాయని సామాన్యజనం సైతం నమ్ముతున్నారు. ఇవి అత్యంత శక్తిమంతమైన మైక్రోస్కోపు ద్వారా తప్ప సాధారణ సూక్ష్మదర్శినిలో కన్పించనంత సూక్ష్మాతిసూక్ష్మంగా ఉంటాయి. ఒక టీచెమ్చా నీళ్ళలో సుమారు 125 కోట్ల సూక్ష్మజీవులు ఉన్నట్లు బెర్జన్ యూనివర్శిటీ ప్రొఫెసర్ గున్నార్ బ్రాట్‌బేక్ కనుగొన్నారు. ఎక్కడో ఎందుకు, మన శరీరం మీది ఒక స్వేదగ్రంధిలో కొన్ని వేల సూక్ష్మజీవులు ఉంటాయంటే అతిశయోక్తి కాదు. పైగా మన శరీరాన్ని రిన్ సబ్బుతో రుద్ది కడిగినా ఇవి తొలగిపోవట!

ఈ జీవులు ప్రతి చోటా ఉన్నాయి. ప్రాణికోటి మనుగడకు ఆధారభూతమయిన ప్రాణ వాయువు లేని చోట్ల కూడా ఉంటాయి. భూమి పొరల క్రింద, సముద్రజలాల అట్టడుగు బురదలోనూ ఉంటాయి. చివరికి గగనం శూన్యం అనబడే రోదసిలో సైతం ఈ ప్రాణులు ఉండే అవకాశాలు ఉన్నాయని జపాన్ శస్త్రవేత్తలు ఏనాడో చెప్పారు.

ఈ సూక్ష్మజీవుల్లో మనకు మేలు చేసేవి కూడా అనేకం ఉన్నాయి. మనం రోజూ త్రాగే స్వచ్ఛమయిన నీటిలో, మన దేహం మీదుండే సూక్ష్మక్రిములు మనకు మేలు చేసేవే అయి ఉంటాయని ప్రొఫెసర్ బ్రాట్ బేక్ అభిప్రాయపడ్డారు. దేవుడు యావత్తు సృష్టిరాసుల్ని మానవుల ఉపయోగార్థమే సృష్టించాడు. హానికరమైనవని చెప్పబడే ఒక జీవి మనకు మరోరకంగా ఉపయోగపడవచ్చు. ప్రకృతి రహస్యాలను ఛేదిస్తూపోతే ఈవాస్తవాలు ఈరోజు కాకపోతే మరో రోజు ఎప్పుడైనా బయటపడే అవకాశం ఉంది. అందువల్ల ఎంతటి అల్పజీవి అయినా నిరుపయోగమయినదని, తుచ్ఛమయినదని భావించి తీసిపారెయ్యలేము.

11. ఇక్కడ ఖలీఫా (ప్రతినిధి) అనే పదం ప్రపంచంలో మానవుని నిజస్థానం, అతని జీవిత లక్ష్యం ఏమిటో తెలియజేస్తోంది. ఈ ప్రపంచంలో మానవుడు దేవుని ప్రతినిధిగా, దేవుడు పంపిన ఆజ్ఞలను పాటిస్తూ ఆయనకు పూర్తి విధేయుడయి జీవించాలి. జీవితంలోని ప్రతి రంగంలోనూ ఆయన ఆదేశాలను, హితవులనే పాటించాలి. అంతేగాని, మానవుడు స్వయంగా యజమాని అయి,

వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసి, రక్తపాతానికి వడిగట్టేవాడ్ని భూలోకంలో నియమిస్తారా? మేము మిమ్మల్ని అనుక్షణం స్తుతిస్తూ, మీ పవిత్రతను కొనియాడుతూనే వున్నాంకదా?" అన్నారు. దానికి దేవుడు "మీకు తెలియని విషయాలెన్నో నాకు తెలుసు" అన్నాడు. (30)

ఆ తరువాత ఆయన ఆదంకు సమస్త వస్తువుల పేర్లు తెలియజేశాడు.[12] ఆపై వాటిని దైవదూతల ముందు ప్రవేశపెట్టి "మీ అభిప్రాయం సరైనదయితే కాస్త ఈ వస్తువుల పేర్లేమిటో చెప్పండి" అని అడిగాడు. (31)

"మీరు పరిశుద్ధులు, మీరు మాకు తెలియజేసినంత మేరకే మాకు తెలుసు. దానికి మించి ఒక్క విషయం కూడా మాకు తెలియదు. వాస్తవానికి మీరే అన్నీ తెలిసినవారు, వివేకవంతులు" అన్నారు దైవదూతలు. (32)

ఆ తర్వాత దేవుడు ఆదంతో "ఈ వస్తువుల పేర్లేమిటో చెప్పు" అన్నాడు. ఆదం వాటి పేర్లన్నీ చెప్పాడు. అప్పుడు దేవుడు దైవదూతలతో ఇలా అన్నాడు: "భూమ్యాకాశాల్లో గుప్తంగా వున్న సమస్త విషయాలు నాకు తెలుసని నేను ముందే మీతో అనలేదా? మీరు పైకి వెలిబుచ్చే విషయాలు, లోన దాచే విషయాలు సైతం నాకు తెలుసు." (33)

ఆ తర్వాత మేము ఆదంకు గౌరవసూచకంగా అభివాదం చెయ్యండని దైవదూతలను ఆదేశించాం.[13] అప్పుడు ఇబ్లీసు తప్ప అందరూ అభివాదం చేశారు. ఇబ్లీసు తనేదో గొప్పవాణ్ణన్న అహంకారంతో విర్రవీగుతూ, తిరస్కరించి అవిధేయుడై పోయాడు.[14] (34)

---

ఇష్టారాజ్యంగా విశృంఖల జీవితం గడపడానికి వీల్లేదు. ఖలీఫా అనే పదాన్ని మన దేశంలో బ్రిటిష్ పాలకులకుల కోసం వాడిన వైస్రాయ్ (Viceroy) అనే ఇంగ్లీషు పదంతో పోల్చవచ్చు.

12. వస్తువుల పేర్లంటే కేవలం వాటి పేర్లే కాదు, కొందరు భాష్యకారుల అభిప్రాయం ప్రకారం వాటి గుణగణాలు, ధర్మాలు, వాటి పనితీరు, వాటి వల్ల కలిగే లాభనష్టాలు మొదలైన సమాచారమంతా అని కూడా అర్థం.

13. దీన్ని బట్టి విశ్వవ్యవహారాలు నిర్వహించడానికి నియుక్తులైన యావత్తు దైవదూతలపై మానవునికి దేవుడు ఆధిక్యత ప్రసాదించాడు. అంటే మానవుడ్ని యావత్తు సృష్టిరాసుల్లో ఉత్కృష్ట జీవిగా, ఖలీఫాగా చేసి ప్రపంచంలో అతను చేసే ప్రతి పనిలో దైవదూతలు అతనికి సహకరించాలని ఆదేశించాడన్నమాట. మానవునికి ప్రసాదించబడిన ఈ ఆధిక్యత, ఉత్కృష్టతల కారణంగానే అతనికి గౌరవసూచకంగా అభివాదం చేయాలని దైవదూతల్ని ఆజ్ఞాపించడం జరిగింది.

ఇక్కడ మూలభాషలో సజ్దా అనే పదం వాడబడింది. సజ్దా అంటే సాష్టాంగప్రణామం, గౌరవసూచకంగా వంగడం, అభివాదం చేయడం అనే అర్థాలున్నాయి. దేవునికి తప్ప ఇతరులకు సాష్టాంగప్రణామం చేయడాన్ని ఇస్లాం నిషేధించింది. కొందరు వ్యాఖ్యానకర్తలు గతప్రవక్తలు తెచ్చిన ధర్మశాస్త్రాల్లో మహనీయులకు, గొప్పవాళ్ళకు గౌరవ సూచకంగా సజ్దా చేయడం ధర్మసమ్మతంగా ఉండేదని, ముహమ్మద్ ప్రవక్త (సల్లం) తెచ్చిన ధర్మశాస్త్రంలో దైవేతరులకు ఇలాంటి సజ్దా చేయడం కూడా నిషేధించబడిందని అభిప్రాయపడ్డారు. (12:100వ సూక్తి చూడండి.)

14. దేవుని పట్ల ఇబ్లీసు ధిక్కార వైఖరికి కారణం, దాని పూర్వాపరాలను గురించి 7:11,12 సూక్తులు, వాటి పాదసూచికలు చూడండి.



ఆర్వాత మేము ఆదంకు ఇలా చెప్పాము: "నీవు, నీభార్య స్వర్గంలో నివసించండి. ఇక్కడ మీరు కోరుకున్నదల్లా తింటూ హాయిగా ఉండండి. అయితే అదిగో...! ఆ చెట్టు దరిదాపులకు మాత్రం వెళ్ళకండి. వెళ్తే మీరు కూడా దుర్మార్గులై పోతారు." (35)

అయితే షైతాన్ (వారుభయుల్ని నిషేధిత వృక్షం గురించి లేనిపోని ఆశలు కల్పించి) వారిని పూర్వస్థితి నుండి దిగజార్చి స్వర్గసౌఖ్యాలకు దూరంచేశాడు.[15] అప్పుడు మేము వారితో "మీరంతా ఇక్కడ్నుంచి దిగిపోండి. మీరు ఒకరికొకరు శత్రువులు. ఒక నిర్ణీతకాలం వరకు మీరు భూలోకంలో జీవితం గడపవలసివుంది" అన్నాము. (36)

తర్వాత ఆదం తనప్రభువు నుండి కొన్ని మాటలు గ్రహించి, పశ్చాత్తాపంతో క్షమాపణ వేడుకున్నాడు. దాన్ని అతని ప్రభువు స్వీకరించాడు. ఆయన గొప్ప క్షమాశీలి, అమిత దయా మయుడు. మేమిలా అన్నాం: "మీరంతా ఇక్కడ్నుంచి దిగిపోండి. మానుండి మీ దగ్గరికి ఏదైనా మార్గదర్శకత్వం వస్తే దాన్ని అనుసరించాలి. దాన్ని అనుసరించేవారికి ఎలాంటి భయం గాని, దుఃఖంగాని ఉండదు. దీనికి భిన్నంగా మా మార్గదర్శకత్వాన్ని నిరాకరించి, మా సూక్తులు ధిక్కరించేవారు నరకానికి పోతారు. అక్కడే వారు ఎల్లకాలం పడి వుంటారు. (37-39)

ఇస్రాయీల్ సంతతి ప్రజలారా! నేను మీకు చేసిన మేళ్ళను గుర్తుకుతెచ్చుకొని, మీరు నా విషయంలో చేసిన ప్రమాణాన్ని పాటించండి. నేను మీకు చేసిన వాగ్దానం నెరవేరుస్తాను. మీరు నాకు మాత్రమే భయపడి నేను పంపిన ఈగ్రంథాన్ని విశ్వసించండి. మీ దగ్గర పూర్వం నుంచే ఉన్న (తౌరాత్) గ్రంథాన్ని ఇది ధృవీకరిస్తోంది. కనుక అందరి కంటే ముందు మీరే దీన్ని తిరస్కరించినవారు కాకూడదు. స్వల్పమూల్యానికి నా సూక్తులు అమ్ముకోకండి. నా ఆగ్రహం నుండి తప్పించుకోండి. సత్యాన్ని అసత్యంతో కలగాపులగం చేయకండి. తెలిసి కూడా సత్యాన్ని దాచకండి. (40-42)

ప్రార్థనా (నమాజ్) వ్యవస్థ నెలకొల్పండి. పేదల ఆర్థికహక్కు (జకాత్) చెల్లిస్తూ ఉండండి.[16] నాముందు మోకరిల్లేవారితో పాటు మీరు కూడా నాముందు మోకరిల్లండి. ఏమిటీ, మీరు మంచిపనులు చేయమని ఇతరులకైతే హితబోధ చేస్తారు. కాని మిమ్మల్ని మీరు మరచిపోతున్నారే! మీరు గ్రంథపఠనం కూడా చేస్తున్నారు కదా! (ఇలా ఎందుకు ప్రవర్తిస్తున్నారు?). మీరు బుద్ధి ఉపయోగించరా? (43,44)

---

15. వివరాలకు 7:22,23: 20:120,121 సూక్తులు చూడండి.

16. జకాత్ అంటే పవిత్రత, పరిశుద్ధత అని శాబ్దిక అర్థాలున్నాయి. ఇక్కడ ప్రత్యేక పారిభాషలో, ధనికుడు పవిత్రుడయ్యే ఉద్దేశ్యంతో యేడాదికొకసారి తన సంపద నుండి రెండున్నర శాతం చొప్పున నిరుపేదలకు, ధర్మ సంస్థాపనా కార్యాలకు దానం చేయవలసిన ధనకనక వస్తువుల్ని జకాత్ అంటారు. ఈ విషయాన్ని గురించి మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఇలా ప్రవచించారు:

"దేవుడు జకాత్ చెల్లింపును ముస్లింలకు విధిగా చేశాడు. ఇది వారి ధనికుల నుండి వసూలుచేసి, వారి నిరుపేదలకు అందజేయబడుతుంది." (బుఖారి,) "ఏ సంపద నుండి జకాత్ తీయకుండా అందులోనే కలసి ఉంటుందో ఆ సంపదను ఇది నాశనం చేస్తుంది." (మిష్కాత్)

(సరే, మీకేవైనా ఇబ్బందులుంటే) సహనం, ప్రార్థనల ద్వారా (నా) సహాయాన్ని అర్థించండి. ప్రార్థన (నమాజ్) కాస్త కష్టమైన పనే. సందేహం లేదు. కాని ఒకరోజు తమ

---

జకాత్ దాదాపు ప్రతి దైవప్రవక్త అనుచర సమాజానికి విధిగా నిర్ణయించబడింది. మూసా ప్రవక్త (అలైహి) అనుచర సమాజానికి కూడా ఇది విధించబడింది. కాని యూదులు పేదలకు జకాత్ ఇవ్వడానికి బదులు, వారి నుండి వడ్డీ వసూలుచేసి తినడం ప్రారంభించారు.

"ఎవరు తన ధనం నుండి జకాత్ చెల్లించడో అతని ధనాన్ని ప్రళయదినాన అగ్నిపలకలుగా మార్చి వాటితో అతని ప్రక్కలమీద, నుదుటిమీద, నడుంమీద వాతలు పెట్టడం జరుగుతుంది. ఆ దినం యాభై వేల సంవత్సరాలంత సుదీర్ఘంగా ఉంటుంది. ప్రజల తీర్పులన్నీ ముగిసే వరకు (అంటే యాభైవేల ఏండ్ల వరకు) అతని పరిస్థితి అలాగే కొనసాగుతుంది. ఆ తర్వాత (అతని కర్మల్ని బట్టి) అతడ్ని నరకానికో లేక స్వర్గానికో పంపి వేయడం జరుగుతుంది." (ముస్లిం)

ముస్లింలకు నమాజ్ చేయడం ఎంత విధి (Obligatary duty)యో జకాత్ చెల్లించడం కూడా అంతే విధి. జకాత్ చెల్లించని వ్యక్తి పాలిట అతని డబ్బు పరలోకంలో విషసర్పంగా మారు తుందని కొన్ని హదీసులు హెచ్చరిస్తున్నాయి. జకాత్ చెల్లించనివాడు చేసే నమాజ్‌ని దేవుడు స్వీకరించడని మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) స్పష్టంగా తెలియజేశారు.

ఆర్థిక స్తోమత కలిగిన ముస్లింలు తమ సంపద నుండి రెండున్నర శాతం జకాత్ తీసి ఇస్లామీయ ప్రభుత్వానికి విధిగా చెల్లించాలి. ఇస్లామీయ ప్రభుత్వం లేని చోట్ల ముస్లింలు వ్యక్తిగతం గాగాని, లేదా ఏదైనా సంఘం ద్వారాగాని ఈ జకాత్‌ని అర్హులైనవారికి దానం చేయాలి. జకాత్ చెల్లించడానికి నిరాకరించేవారు దేవుని దృష్టిలో ఘోరమైన పాపాత్ములై నరకశిక్ష అనుభవించవలసి వస్తుంది. ఇస్లామీయ ప్రభుత్వం దృష్టిలో వారు ఆర్థిక నేరస్థులుగా పరిగణించబడతారు. అలాంటి ముస్లింల నుండి బలవంతంగా జకాత్ వసూలు చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది.

హజ్రత్ అబూబకర్ (రజి) ఖలీఫా అయిన తరువాత కొన్ని తెగలు జకాత్ చెల్లించడానికి నిరాకరించాయి. అప్పుడు హజ్రత్ అబూబకర్ (రజి) ఆ తెగలతో యుద్ధంచేసి వాటి నుండి బలవంతంగా జకాత్ వసూలు చేయడానికి నిర్ణయించుకున్నారు. హజ్రత్ ఉమర్ (రజి) ఈ నిర్ణయం పట్ల అభ్యంతరం లేవదీసినప్పుడు ఆయన ఈ విధంగా సమాధానమిచ్చారు:

"దైవసాక్షి! నమాజ్, జకాత్‌ల మధ్య విచక్షణ చేసే ప్రతి వ్యక్తితో నేను యుద్ధం చేస్తాను. జకాత్ సంపద హక్కు. (అంటే సంపద కలిగినవారు పేదల ఆర్థిక హక్కు అయిన జకాత్‌ని విధిగా చెల్లించాలి.) దైవసాక్షి! వారు గనక దైవప్రవక్త (సల్లం) కాలంలో ఇస్తూ ఉండిన సంపద నుండి ఒంటె తాడయినా సరే ఇవ్వడానికి నిరాకరిస్తే నేను వారితో తప్పకుండా పోరాడుతాను".

ఆ తరువాత హజ్రత్ ఉమర్ (రజి) మాట్లాడుతూ "దైవసాక్షి! దేవుడు సత్యావగాహన కోసం అబూబకర్ హృదయకవాటాలు తెరిచాడు. అబూబకర్ దృక్పథమే సరైనదని నేను ఆ తరువాత గ్రహించాను" అని అన్నారు. (సహీ బుఖారి)

(1). జకాత్ నిరాకరణ విషయమై ప్రవక్త (సల్లం) కాలంలో జరిగిన ఒక సంఘటన గురించి 49:6 సూక్తికి రాసిన పాదసూచిక చూడండి; (2). జకాత్ చెల్లింపు మొత్తం 8 రకాల పద్దులలో విభ జించబడింది. 9:60 సూక్తి చూడండి; (3). ఇతర వివరాలకు 2:267-274 సూక్తులు చూడండి.

(జకాత్ గురించి పూర్తి వివరాల కోసం 'ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్' నుంచి వెలువడిన "ధన వికేంద్రీకరణ" అనే పుస్తకం చదవండి. పేజీలు: 224, వెల: రూ.75/-లు.)



ప్రభువును కలుసుకోవలసిఉందని, ఆయన సన్నిధికే మరలిపోవలసి ఉందని భావించే దైవభీతిపరులకు మాత్రం ప్రార్థన (నమాజ్) చేయడం కష్టమేమీ కాదు. (45,46)

ఇస్రాయీల్[17] సంతతిప్రజలారా! నేను మీకు చేసిన ఉపకారం గుర్తుకుతెచ్చు కోండి. ప్రపంచజాతులన్నిటిపై మీకు ప్రసాదించిన ప్రత్యేక గౌరవోన్నతుల్ని కూడా జ్ఞాపకం తెచ్చుకోండి. ఒకరికొకరు ఏవిధంగానూ తోడ్పడలేని (ప్రళయ) దినం గురించి భయ పడండి. ఆరోజు ఎవరి సిఫారసు చెల్లదు. ఏ ఒక్కర్నీ పాపపరిహారం తీసుకొని వదలి పెట్టడం జరగదు. అసలారోజు పాపాత్ములకు ఎలాంటి సహాయం లభించదు. (47,48)

మేము మిమ్మల్ని ఫిరౌనీయుల బానిసత్వం నుండి విముక్తి కలిగించిన రోజులు కూడా కాస్త గుర్తుకు తెచ్చుకోండి. ఆనాడు మిమ్మల్ని వారు తీవ్రయాతనలకు గురిచేస్తూ ఉండేవారు. మీ మగపిల్లలను హతమార్చి, ఆడపిల్లలను (మాత్రమే) బ్రతకనిస్తుండేవారు. అది మీకు మీ ప్రభువు నుండి ఎదురైన అత్యంత కఠినపరీక్ష. (49)

మీకోసం మేము సముద్రం చీల్చి, దారి ఏర్పరచి మిమ్మల్ని క్షేమంగా దరికి చేర్చాం. ఆ తర్వాత మేము మీ కళ్ళముందే ఫిరౌనీయులను (సముద్రంలో) ముంచి వేశాం. (50)

మేము మూసాను నలభై రోజుల గడువుపై (తూర్ పర్వతం దగ్గరకు) పిలిపించాము. ఆ తరువాత అతను మీ మధ్య లేకపోవడం చూసి మీరు ఆవుదూడ (విగ్రహం)ను దైవంగా చేసుకున్నారు. మీరు దుర్మార్గంలో చాలా హద్దుమీరి పోయారు. అయితే ఆ తరువాతయినా మీరు కృతజ్ఞులయి వుంటారేమోనన్న ఉద్దేశ్యంతో అంతటి ఘోరపాపాన్ని సయితం ఉపేక్షించి మిమ్మల్ని క్షమించివేశాము. (51,52)

మీరు సన్మార్గం పొందడానికి మూసాకు దివ్యగ్రంథాన్ని, మంచీ చెడుల్ని వేరుచేసి చూపే గీటురాయిని ప్రసాదించాము. ఆ సంగతి కూడా గుర్తు చేసుకోండి. (53)

మూసా (ఈ మహాభాగ్యం తీసుకొని) తన జాతిప్రజల దగ్గరికి తిరిగొచ్చినప్పుడు వారి దుస్థితి చూసి ఇలా అన్నాడు: "ప్రజలారా! మీరు ఆవుదూడను దైవంగా చేసుకొని మీ ఆత్మ లకు చాలా అన్యాయం చేసుకున్నారు. కనుక (తక్షణమే) పశ్చాత్తాపంచెంది మీ సృష్టికర్తను క్షమాపణ కోరుకోండి. తర్వాత మీ(లో భ్రష్టులైపోయినవారి) ప్రాణాలను హతమార్చండి. మీ సృష్టికర్త దృష్టిలో అదే మీకు శ్రేష్ఠమయినది." ఆ తర్వాత మీ ప్రభువు మిమ్మల్ని క్షమించాడు. ఆయన ఎంతో గొప్ప క్షమాశీలి, అపార కృపాశీలుడు. (54)

మరో సంఘటన. మీరు మూసాతో "మేము మా కళ్ళతో దేవుడ్ని ప్రత్యక్షంగా చూడ నంతవరకు నీ మాటలు నమ్మం" అన్నారు. అప్పుడు మీరు చూస్తుండగానే ఓ భయంకరమైన పిడుగు మీపై వచ్చిపడింది. దాంతో మీరంతా మృత్యువాత పడ్డారు.

---

17. ఇస్రాయీల్ అంటే దైవదాసుడు అని అర్థం. ఇది యాఖూబ్ ప్రవక్త (అలైహి)కు దేవుడు ప్రదానంచేసిన బిరుదు. ఈయన తండ్రి ఇస్‌హాఖ్ (అలైహి), తాత ఇబ్రాహీం (అలైహి) కూడా దైవప్రవక్తలే. యాఖూబ్ (అలైహి) సంతనాన్నే బనీఇస్రాయీల్ (ఇస్రాయీల్ సంతతి) అంటారు.

అయితే మేము చేసిన మేలుకు మాపట్ల కృతజ్ఞులై ఉంటారని మిమ్మల్ని మళ్ళీ బ్రతికించాము. (55,56)

మేము మీపై (ఎండ నుండి కాపాడడానికి) మేఘచ్ఛాయ కల్పించాం. ఆహారంగా మీకు మన్న, సల్వాలు[18] సమకూర్చి, "మేము ప్రసాదించిన ఈ పరిశుద్ధ వస్తువులు తినండి"అన్నాం. (కాని మీపూర్వీకులు వాటికి విలువనివ్వలేదు. ఇలాంటి తలబిరుసుతో) వారు మాకేమీ నష్టం కలిగించలేదు. వారు తమకుతామే నష్టం కలిగించుకున్నారు. (57)

వేరొక సంఘటన. అప్పుడు మేము మీతో ఇలా అన్నాము:"ఈ పట్టణంలో ప్రవేశించి ఇక్కడి ఆహారపదార్థాలను మీకిష్టమైనట్లు హాయిగా తినండి. అయితే పట్టణ ప్రధానద్వారం గుండా ప్రవేశిస్తున్నప్పుడు సాష్టాంగపడి 'క్షమాభిక్ష, క్షమాభిక్ష' అంటూ నడవండి. మేము మీ తప్పులు మన్నిస్తాం. మంచివారికి మరింత (భాగ్యం) అనుగ్రహిస్తాం." కాని దుర్మార్గులు మేము సూచించిన మాట మార్చివేశారు. చివరికి మేము ఆ దుర్మార్గులపై ఆకాశం నుండి ఘోరమైన విపత్తు తెచ్చిపడవేశాము. ఇది వారు చేసిన దౌష్ట్యాలకు తగిన శిక్ష. (58,59)

(దీనికి ముందు) మూసా తన జాతి కోసం మంచినీటికై మమ్మల్ని ప్రార్థించాడు. అప్పుడు మేమతనితో "నీ చేతిలో ఉన్న కర్రతో చట్టుబండ మీద ఓ దెబ్బ వెయ్యి" అన్నాం. అతనలా చేయగానే ఆ రాతి నుండి పన్నెండు నీటిఊటలు పెల్లుబికాయి. అప్పుడు (పన్నెండు తెగల) ప్రజలు తమతమ నీటిపట్టును గుర్తించి వాడుకోనారంభించారు. "దేవుడు ప్రసాదించిన వస్తువులు తినండి, త్రాగండి. అయితే ప్రపంచంలో కల్లోలాన్ని మాత్రం సృష్టించకండి" (అని ఆదేశించాము). (60)

(కాని ఆ తరువాత కొన్నాళ్ళకే) మీరు (కష్టపడకుండా లభిస్తున్న ఎంతో శ్రేష్ఠమయిన ఆహారం పట్ల అసంతృప్తిచెంది) మూసాతో ఇలా అన్నారు: "మూసా! మేమిక ఒకే విధమైన ఈ తిండి తింటూ వుండలేము. మాకోసం నేల నుండి ఉత్పత్తి అయ్యే కూరగాయలు, దోసకాయలు, వెల్లుల్లి, గోధుమలు, పప్పు ధాన్యాలు, ఉల్లిపాయలు మొదలైన ఆహార పదార్థాలు పండింపజేయమని నీ ప్రభువును ప్రార్థించు."

దానికి మూసా "ఎంతో శ్రేష్ఠమైన పదార్థాలు వుండగా వాటిని వదలి హీనమైన పదార్థాలు కోరుతున్నారా! అలాగయితే ఏదైనా జనావాసంలోకి పదండి. అక్కడ మీరు కోరిన వస్తువులు దొరుకుతాయి" అన్నాడు.

చివరికి వారు అవమానం, అప్రతిష్ఠలకు గురయి దౌర్భాగ్యం, దుర్భర దారిద్ర్యాలలో కూరుకుపోయారు. వారు దేవుని సూక్తులు తిరస్కరిస్తుండేవారు. దైవప్రవక్తల్ని అన్యాయంగా హతమార్చుతుండేవారు. దేవునికి అవిధేయులయిపోయి హద్దుమీరి

18. మన్న అంటే ఒక విధమైన ఖాద్యవస్తువు. ఇది ఆకాశం నుండి మంచులా కురిసి నేల మీద పేరుకుంటుంది. సల్వా అంటే ఓ రకమైన పక్షులు. ఇవి గాలిలో ఎగురుతూ యూదులకు సులభంగా దొరికిపోయేయి. ఇవి రెండూ యూదులకు నలభై యేండ్ల పాటు ప్రసాదించబడ్డాయి.



ప్రవరిస్తుండేవారు. అందువల్లనే ఇలా దేవుని ఆగ్రహం వారిపై విరుచుకుపడింది. (61)

ముస్లింలుగాని, యూదులుగాని, క్రైస్తవులుగాని, సాబీలుగాని, మరే మతానికి, వర్గానికి, జాతికి చెందినవారైనా సరే అల్లాహ్‌ను, ప్రళయదినాన్ని విశ్వసించి తదనుగుణంగా సత్కార్యాలు చేస్తుంటే, అలాంటివారికి వారి ప్రభువు వద్ద తప్పకుండా మంచి ప్రతిఫలం లభిస్తుంది. వారికి ఎలాంటి భయంగాని, దుఃఖంగాని ఉండదు. (62)

మీ మీద తూర్‌పర్వతం ఎత్తిపట్టి మీచేత ప్రమాణం చేయించిన సందర్భం గుర్తుకు తెచ్చుకోండి. అప్పుడు మేమిలా ఆదేశించాము: "మేము మీకిచ్చిన గ్రంథాన్ని దృఢంగా పట్టుకోండి. అందులోని ఆజ్ఞల్ని, హితవుల్ని గుర్తుంచుకోండి. అలాచేస్తే మీరు భయభక్తుల జీవితం గడుపుతారు." (దీన్ని మీరు అంగీకరించారు కూడా.) కాని తరువాత మీరా ప్రమాణం ఉల్లంఘించారు. (ఆ విషయాన్ని కూడా దేవుడు ఉపేక్షించాడు.) మీపై దేవుని కరుణా కటాక్షాలే గనక లేనట్లయితే మీరు (ఎప్పుడో) సర్వనాశనమయి పోయేవారు. (63,64)

శనివారం నియమం[19] ఉల్లంఘించినవారి సంగతి మీకు తెలిసిందే. మేము వారిని "కోతులుగా మారిపోయి, తుచ్ఛమైన బ్రతుకు బ్రతకండ"ని శపించాము. ఈ విధంగా మేము వారి దుష్పరిణామాన్ని ఆనాటి ప్రజలకు, రాబోవు తరాలకు గుణపాఠంగా, దైవభీతిపరులకు హితబోధినిగా చేశాము. (65,66)

మూసా తన జాతితో "దేవుడు మిమ్మల్ని ఒక ఆవును బలివ్వమని ఆదేశిస్తున్నాడ"ని అన్నాడు. ఆ సంఘటన కూడా గుర్తుకు తెచ్చుకోండి. అప్పుడు వారు "ఏమిటీ, నీవు మాతో పరిహాసమాడుతున్నావా?" అన్నారు. దానికి మూసా "మూర్ఖులు పలికే ఇలాంటి విషయాల బారి నుండి నేను దేవుని శరణు కోరుతున్నాను" అన్నాడు (67)

"అయితే ఆ ఆవు గురించిన వివరాలు ఏమిటో నీ ప్రభువుని అడిగి చెప్పు" అన్నారు వారు. "ఆ ఆవు ఇటు ముసలిదిగాని, అటు లేతదిగాని కాకుండా మధ్య వయస్సుదయి ఉండాలని దేవుడు ఆదేశిస్తున్నాడు. కనుక మీకివ్వబడిన ఆదేశం ప్రకారం పని చేయండి" అన్నాడు మూసా. (68)

"సరే, దానిరంగు ఎలావుండాలో కూడా నీ ప్రభువుని అడిగి తెలియజేయి" అన్నారు వారు మళ్ళీ. "దాని రంగు పసుపుపచ్చగా, చూపరులకు సంతోషం కలిగేలా

19. శనివారంనాడు ఎలాంటి ప్రాపంచిక పనులు చేపట్టకుండా, చివరికి వంటపని సైతం చేయకుండా పూర్తి సెలవు తీసుకొని దైవారాధనలో గడపాలని దేవుడు యూదులకు ఒక నియమం విధించాడు. దీన్ని ఉల్లంఘించినవారు దైవాగ్రహానికి గురవుతారని హెచ్చరించడం కూడా జరిగింది. అయితే శనివారం రోజే చేపలు సముద్రపు ఉపరితలంపై తీరాన వారి ముందుకు వస్తుండేవి. అందువల్ల వారు ఒకరోజు ముందు (అంటే శుక్రవారంనాడు) సముద్ర తీరాన గుంటలు త్రవ్వి వాటిని నీటితో నింపిపెట్టేవారు. శనివారంరోజు ఆ గుంటల్లోకి చేపలు వచ్చాక వాటిని పట్టుకునేవారు. ఈ విధంగా వారు శనివారం నియమం ఉల్లంఘించి దైవాగ్రహానికి గురయ్యారు. (ఈ సూక్తితో పాటు 4:154; 7:163 సూక్తులు కూడా చూడండి.)

మెరిసిపోతూ వుండాలని మీ ప్రభువు ఆదేశిస్తున్నాడ”ని అన్నాడు మూసా. (69)

“చాలా ఆవులు చూడటానికి ఒకేవిధంగా ఉన్నట్లు కన్పిస్తాయి. అందువల్ల ఆ ఆవు ఇంకా ఏఏ లక్షణాలు కలిగినదయి ఉండాలో నీ ప్రభువుని ప్రార్థించి మాకు చెప్పు. దైవం తలిస్తే మేము దాన్ని కనుగొంటాము” అన్నారు వారు మళ్ళీ. (70)

“మీ ప్రభువు ఆదేశిస్తున్నాడు- అది ఎలాంటి పనులకు ఉపయోగించ బడనిదయి ఉండాలి. నేలను దున్నినదిగాని, మోటబావికి వాడబడినదిగాని కాకూడదు. అదీగాక అది ఎలాంటి లోపం లేనిదయి ఉండాలి. దాని వంటిమీద ఎలాంటి కృత్రిమ మచ్చలు కూడా ఉండకూడదు” అన్నాడు మూసా. దానికి వారు “ఇప్పుడు నీవు అన్ని విషయాలు కచ్చితంగా తెలియజేశావు” అన్నారు. చివరికి వారు (ఎంతో శ్రమపడి సంపాదించి ఎలాగో) దాన్ని బలిచ్చారు. నిజానికి వారు అలా చేసేవారిలా అన్పించలేదు. (71)

మీకీ సంఘటన కూడా గుర్తుండి ఉంటుంది: మీరొక వ్యక్తిని చంపి, ఆ విషయంలో పరస్పరం పోట్లాడుకుంటూ హత్యానిందను ఒకరి మీద మరొకరు రుద్దడానికి ప్రయత్నించారు. కాని మీరు దాచుతున్న విషయాన్ని దేవుడు బట్టబయలు చేయదలిచాడు. ఆవు మృత కళేబరంలోని కొంత భాగంతో హతుని భౌతిక కాయంపై చరచండని మేము ఆజ్ఞాపించాం. మేమా సందర్భంలో “ఈవిధంగా దేవుడు మృతులను (పునరుత్థాన దినాన) తిరిగి బ్రతికిస్తాడు. మీరు విషయాన్ని అర్థం చేసుకోవడానికి ఆయన తన మహిమలను ఇలా చూపిస్తాడు” అన్నాము వారితో. (72, 73)

అయితే అంతటి గొప్ప మహిమ చూసినా మీలో ఎలాంటి మార్పు రాలేదు. పైగా మీ హృదయాలు పాషాణాల్లా కఠినమయిపోయాయి. కాదు, అంతకంటే కూడా కఠినమయి పోయాయి. పాషాణాలలో కొన్నిటి నుంచి నీటిఊటలు ఉబికి వస్తాయి. మరికొన్ని పగిలిపోయి వాటి నుంచి కూడా నీళ్ళు వస్తాయి. ఇంకా కొన్ని రాళ్ళయితే దైవభీతితో కంపించి క్రింద పడిపోతాయి. దేవుడు మీ చేష్టలను గమనించడంలేదని భావించకండి. (74)

ముస్లిములారా! వీరు మీ మాటలు విని సత్యాన్ని విశ్వసిస్తారని ఇంకా మీరు ఆశలు పెట్టుకున్నారా? వారిలో కొందరు దైవవాణి (తౌరాత్)ని చదివి బాగా అర్థం చేసుకున్నప్పటికీ, దాన్ని ఉద్దేశ్యపూర్వకంగా తారుమారు చేస్తుంటారు. (75)

వారు విశ్వాసుల్ని కలసినప్పుడు తాము (ముహమ్మద్ ప్రవక్తను) విశ్వసించామని చెప్పుకుంటారు. కాని వారు ఏకాంతంలో పరస్పరం ఒకర్నొకరు కలుసుకున్నప్పుడు మాత్రం, “ఏమిటీ, దేవుడు మనకు తెలియజేసిన దాన్ని వారిముందు బహిర్గతం చేస్తారూ? దాని ఆధారంగా వారు (రేపు ప్రళయదినాన) మన ప్రభువు ముందు మనపై నింద మోపడానికా? మీకా మాత్రం జ్ఞానంలేదా?” అని అంటారు. వారు తాము దాచుతున్నదేమిటో, బహిర్గతం చేస్తున్నదేమిటో దేవునికి తెలియదనుకుంటున్నారా? ఆయనకు అంతా తెలుసు. (76,77)



వారిలో కొందరు నిరక్షరాస్యులు కూడా ఉన్నారు. వారికి గ్రంథజ్ఞానం బొత్తిగా లేదు. అయినా వారు లేనిపోని ఆశలు కల్పించుకొని ఊహాకెరటాలపై తేలిపోతుంటారు.

మరికొందరున్నారు. వారు స్వయంగా తమ చేజేతులా గ్రంథం వ్రాసుకొని, దానికి ప్రతిఫలంగా అత్యల్ప (ప్రాపంచిక) ప్రయోజనాలు పొందడానికి, ఇది దేవుని వద్ద నుండి వచ్చిన గ్రంథమని అంటారు. అలాంటివారికి వినాశం (రాసిపెట్టి) ఉంది. వారు కల్పించి వ్రాసుకున్నది వారి వినాశానికే కారణభూతమౌతుంది. తద్వారా వారు సంపాదించుకున్న ప్రాపంచిక సొత్తు కూడా వారికి వినాశమే తెచ్చిపెడుతుంది. (78,79)

పైగా వారు “ఈ నరకాగ్ని మమ్మల్ని తాకనైనా తాకదు. కాకపోతే కొన్నాళ్ళు కాస్తంత బాధ కలిగిస్తుందేమో!” అంటారు. అలాగైతే “మీరు దేవునితో ఏదైనా ఒడంబడిక చేసు కున్నారా, దాన్ని ఆయన ఉల్లంఘించక పోవడానికి? లేక మీరు దేవుని విషయంలో మీకు ఏమాత్రం తెలియని మాటలు అంటున్నారా?” అని అడగండి వారిని. (80)

దుష్టకార్యాలు చేసేవారు చివరికి, ఆ పాపపంకిలంలో పూర్తిగా కూరుకుపోతారు. అలాంటివారే నరకవాసులు. అక్కడే వారు ఎల్లకాలం పడిఉంటారు. (దీనికి భిన్నంగా) సత్యాన్ని విశ్వసించి, తదనుగుణంగా సత్కార్యాలు చేసేవారు స్వర్గవాసులవుతారు. స్వర్గంలోనే వారు కలకాలం (హాయిగా) ఉంటారు. (81-82)

వేరొక సంఘటన కూడా గుర్తుకు తెచ్చుకోండి: అల్లాహ్‌ను తప్ప మరెవర్నీ ఆరాధించ రాదని; తల్లిదండ్రులకు, బంధువులకు, అనాధలకు, నిరుపేదలకు మేలు చేయాలని; ప్రజలతో చిరునవ్వు మోముతో మంచి మాటలు పలకాలని; ప్రార్థనా వ్యవస్థ (నమాజ్)ను స్థాపించాలని; (పేదల ఆర్థికహక్కు) జకాత్ చెల్లిస్తూ ఉండాలని మేము ఇస్రాయీల్ సంతతి చేత ప్రమాణం చేయించాము. (కాని ఆ తరువాత) మీలో కొందరు తప్ప అంతా దానికి విముఖులై పోయారు. ప్రమాణంచేసి ఉల్లంఘించడం మీకు అలవాటేగా! (83)

పరస్పరం రక్తపాతం జరుపుకోరాదని, ఒకర్నొకరు ఇండ్లనుండి గెంటివేసుకోరాదని మేము మీచేత (మరో) ప్రమాణం చేయించాము. ఆ సందర్భం కూడా జ్ఞాపకం చేసుకోండి. అప్పుడు మీరు ఆ ప్రమాణాన్ని ఒప్పుకున్నారు కూడా. దానికి మీరే సాక్షులు. అయినప్పటికీ మీరు తిరిగి అవే (తప్పుడు)పనులు చేయసాగారు. మీ సొంత మనుషులనే హతమార్చారు.

మీలోనే ఒక వర్గాన్ని అన్యాయంగా వారి ఇండ్ల నుంచి వెడలగొట్టారు. దౌర్జన్యం, పాపకార్యాల్లో మీరు వారికి వ్యతిరేకంగా ఇతరులకు మద్దతు కూడా ఇచ్చారు. అంతే కాకుండా, యుద్ధఖైదీలుగా మీ దగ్గరికి వచ్చినప్పుడు నష్టపరిహారం తీసుకొని వారిని విడుదల చేసేవారు. అసలు వారిని వారి ఇండ్ల నుండి వెడలగొట్టడమే పెద్ద తప్పు, నిషిద్ధకార్యం. (పైపెచ్చు వారి విడుదల కోసం నష్టపరిహారం తీసుకోవడం కూడానా?)

ఏమిటీ, మీరు గ్రంథంలోని కొంత భాగం విశ్వసించి మరికొంత భాగం తిరస్క

రిస్తారా? అయితే మీలో అలాంటి దుశ్చర్యలకు పాల్పడేవారికి శిక్షగా ఇహలోక జీవితంలో వారు అవమానం, అప్రతిష్ఠలపాలవుతారు; అటు పరలోకంలో తీవ్రమైన (నరక) యాతనలకు గురవుతారు. దేవుడు మీ చర్యలను గమనించడం లేదని భావించకండి. (84, 85)

పరలోక జీవితం అమ్ముకొని ఇహలోక జీవితం కొనుక్కున్నవారు వీరే. కనుక వీరి శిక్ష ఏమాత్రం తగ్గించడం జరగదు. వారికి ఎలాంటి సహాయం కూడా లభించదు. (86)

మూసాకు మేము గ్రంథం ప్రసాదించాము. అతని తరువాత ఒకరి తరువాత ఒకరు అనేకమంది ప్రవక్తలను పంపుతూ వచ్చాము. మర్యం కుమారుడు ఈసాకు స్పష్టమైన నిదర్శ నాలు ఇచ్చి పంపాము. పరిశుద్ధాత్మ (జిబ్రయీల్ దూత) ద్వారా కూడా అతనికి సహాయం చేశాము. కాని ఏ దైవప్రవక్తయినా మీ మనోవాంఛలకు వ్యతిరేకంగా వుండే విషయాలు తెచ్చినప్పుడల్లా మీరు తలబిరుసుతో వ్యవహరించేవారు. దైవప్రవక్త లలో కొందరిని తిరస్క రించారు; మరికొందరిని హతమార్చి వేశారు. (87)

(ఇన్ని దారుణాలకు వడిగట్టి కూడా పశ్చాత్తాపం చెందడానికి బదులు) వారు "మా హృదయాలు సురక్షితంగా (నిర్మలంగా) ఉన్నాయి" అంటారు. కాదు, అసలు విషయం అదికాదు. వారి తలబిరుసు, తిరస్కారాల వైఖరి కారణంగా వారిపై దేవుని అభిశాపం పడింది. అందుకే వారిలో బహుకొద్దిమంది మాత్రమే సత్యాన్ని విశ్వసిస్తున్నారు. (88)

దేవుని దగ్గర్నుంచి వారి వద్దకు ఇప్పుడు వారి దగ్గరున్న గ్రంథాన్ని ధృవీకరించే మరొక గ్రంథం (ఖుర్‌ఆన్) వచ్చినా వారి ధోరణి మారలేదు. గతంలో వారు బహుదైవారా ధకులపై తమకు విజయం ప్రసాదించమని మమ్మల్ని వేడుకుంటూ వుండేవారు. చివరికి వారు కోరిన సహాయం (ఖుర్‌ఆన్ రూపంలో) వచ్చింది; వారు దీన్ని గుర్తించారు కూడా. అయినా వారు దీన్ని తిరస్కరించారు.[20] ఇలాంటి తిరస్కారులపై దేవుని అభిశాపం పడుగాక! (89)

20. మహాప్రవక్త (స) భార్యలలో హజ్రత్ సఫియా(రజి) ఒకరు. ఆమె ఓ యూదనాయకుని కుమార్తె. ఇస్లాం స్వీకరణకు పూర్వం ఆమె తమ ఇంట్లో జరిగిన ఓ సంఘటన ఇలా వివరిస్తున్నారు: "మానాన్న, చిన్నాయన ఓరోజు దైవప్రవక్తను కలుసుకోవడానికి వెళ్ళారు. ఆయనతో చాలాసేపు మాట్లాడి ఇంటికి తిరిగొచ్చారు. అప్పుడు వారిద్దరు ఈ విధంగా మాట్లాడుకుంటుంటే విన్నాను:

మొదట మా చిన్నాయన "మన గ్రంథాలలో భవిష్యత్ ప్రకటనగా తెలియజేయబడిన దైవ ప్రవక్త ఇతనే నంటావా?" అని అడిగాడు. దానికి మా నాన్న "ఆ...దైవసాక్షి! ఆ ప్రవక్త ఇతనే" అని సమాధానమిచ్చాడు. మా చిన్నాయన "ఈ విషయం పట్ల నీకు నమ్మకముందా?" అని ప్రశ్నించాడు. మా నాన్న ఉందన్నాడు. మా చిన్నాయన "అయితే మరి నీ ఉద్దేశ్యం ఏమిటీ?" అని అడిగాడు. అప్పుడు మానాన్న "నా బొందిలో ప్రాణమున్నంత వరకూ నేనితడ్ని విరోధిస్తూనే ఉంటాను. అతని మాట చెలామణి కానివ్వను" అని అన్నాడు." (ఇబ్నెహిషామ్, రెండవభాగం)

యూదులు తమ ప్రవక్తలు అందజేసిన భవిష్యత్ సమాచారం ప్రకారం అంతిమ దైవప్రవక్త (సల్లం) కోసం అనేక సంవత్సరాల నుండి ఎదురు చూస్తున్నారు. అంతిమ దైవప్రవక్తను గుర్తించ



దేనికి బదులుగా వారు తమ అంతరాత్మలను అమ్ముకున్నారో అది పరమ నీచమైన విషయం. దేవుడు (వారి జాతికి చెందిన వ్యక్తికి గాకుండా) తాను తలచుకున్న దాసునికి తన కటాక్షం (దైవదౌత్యం) ప్రసాదించాడన్న అక్కసుతో వారు దేవుడు అవత రింపజేసిన దాన్ని (ఖుర్‌ఆన్‌ని) మొండిగా తిరస్కరిస్తున్నారు. కనుక వారు (దేవుని) ఆగ్రహానికి గురయ్యారు. ఇలాంటి తిరస్కారులకు అత్యంత అవమానకరమైన శిక్ష ఎదురుచూస్తోంది. (90)

దేవుడు అవతరింపజేసిన దాన్ని విశ్వసించండని చెబితే, వారు (తలబిరుసుతో) "మా వద్దకు అవతరించిన దాన్ని మాత్రమే మేము విశ్వసిస్తాము" అంటారు. అంటే వారు తమ దగ్గరున్న గ్రంథం తప్ప బయట మరేగ్రంథం అవతరించినా, అది పూర్తిగా సత్యమైనదైనా, వారి దగ్గరున్న గ్రంథాన్ని ధృవీకరిస్తున్నా దాన్ని నమ్మరన్న మాట! సరే, "మీరు (సత్యాన్ని) విశ్వ సించినవారైతే ఇంతకు పూర్వం (మీ జాతిలోనే ఆవిర్భవించిన) దైవప్రవక్తలను ఎందుకు సంహరించారు?" అని అడగండి వారిని. (91)

మూసా మీ దగ్గరకు ఎన్నెన్నో అద్భుతమైన మహిమలు, స్పష్టమైన ప్రమాణాలు తీసుకువచ్చాడు. కాని అతను, కాస్త అటు (తూర్‌కొండకు) వెళ్ళగానే మీరు ఆవుదూడను దైవంగా చేసుకొని ఆరాధించసాగారే! మీరెంత దుర్మార్గులు!! (92)

మేము మీ మీద తూర్ పర్వతం ఎత్తిపట్టి వుంచి మీచేత ప్రమాణం చేయించిన సంఘటన గుర్తుకు తెచ్చుకోండి. అప్పుడు మేము మీకందజేస్తున్న బోధనలను గట్టిగా పాటించాలని, వినాలని ఆదేశించాము. దానికి మీ పూర్వీకులు "మేము విన్నాం, కాని వాటిని పాటించం" అన్నారు. ఈ తిరస్కార వైఖరికి కారణం, వారి హృదయాల్లో ఆవు దూడ(భక్తి) తిష్ఠవేసుకొని వుండటమే. వారితో అనండి: "మీరసలు విశ్వాసులేనా! అయితే మీరు అవలంబించిన ఈ విశ్వాసవైఖరి ఎలాంటి అకృత్యాలకు ప్రేరేపిస్తోంది!!" (93)

వారిని అడుగు: "ప్రపంచ ప్రజలందర్నీ కాదని పరలోకగృహం దేవుని వద్ద మీకొక్కరికే ప్రత్యేకించబడిందని భావిస్తున్నారా? మీ అభిప్రాయం నిజమైతే మీరు చావును కోరుకోవాలి." కాని వారు చేజేతులా చేసుకొని పంపుకున్న (పాప) కార్యాల కారణంగా చావును ఎన్నటికీ కోరుకోరు. దుర్మార్గుల వైఖరి ఏమిటో దేవునికి బాగా తెలుసు. నీవు వారి వైఖరి గమనిస్తే అందరికంటే అత్యాశ వారికే ఉందని గ్రహిస్తావు. ఈ విషయంలో వారు బహుదైవారాధకుల్ని కూడా మించిపోయారు. వారిలో ప్రతి ఒక్కడూ వెయ్యేండ్ల పాటు జీవించి ఉండాలని కోరు కుంటాడు. అంతటి దీర్ఘాయుష్షు

డానికి వీలుగా ఆయన గుణగణాలు, రూపురేఖలను గురించి కూడా వారు వర్ణించారు. అయితే ఆ మహాప్రవక్త తమ జాతిలో ప్రభవిస్తాడని యూదులు భావిస్తుండేవారు. కాని తాము ఇంతకాలంగా ఎదురుచూసిన అంతిమ దైవప్రవక్త తమ జాతిలో ప్రభవించకుండా తాము అనాగరిక జాతిగా పరగణించిన అరబ్బు జాతిలో ప్రభవించినందుకు వారు ఆయన్ని విశ్వసించడానికి నిరాకరించారు. వారు మహనీయ ముహమ్మద్ (సల్లం)ని అంతిమ దైవప్రవక్తగా గుర్తించినప్పటికీ కేవలం జాత్యహంకారం కారణంగా ఆయన్ని నిరాకరించి దైవానుగ్రహానికి దూరమైపోయారు.

పొందినా అది వారిని (నరక) శిక్ష నుండి మాత్రం తప్పించ లేదు. వారు చేస్తున్న పనులేమిటో దేవుడు గమనిస్తూనే ఉన్నాడు. (94-95)

వారికి చెప్పు: "జిబ్రీల్ పట్ల విరోధభావం ఉన్నవారు ఒక విషయం తెలుసుకోవాలి. జిబ్రీల్ దేవుని ఆజ్ఞతోనే ఈ గ్రంథం నీ మీద అవతరింపజేశాడు. ఇది గతంలో అవతరించిన గ్రంథాలను ధృవీకరిస్తోంది; విశ్వసించేవారికి సన్మార్గం చూపి, సాఫల్య శుభవార్త నందజేస్తుంది. కనుక (వినండి) దేవునికి, ఆయన దూతలకు, ఆయన ప్రవక్తలకు, జిబ్రీల్‌కు, మీకాయిల్‌కు ఎవరు శత్రువులవుతారో అలాంటి దుర్మార్గులకు దేవుడు శత్రువవుతాడు." (96-98)

మేము మీ దగ్గరకు స్పష్టంగా సత్యాన్ని తెలిపే సూక్తులు పంపాము. దుర్జనులు తప్ప ఎవరూ వాటిని నిరాకరించరు. వారు ఏదైనా ప్రమాణం చేసినప్పుడు వారిలో ఒక వర్గం దాన్ని పూచికపుల్లలా విసరిపారేస్తూ వచ్చింది. అసలు వారిలో చాలామంది చిత్తశుద్ధితో సత్యాన్ని విశ్వసించేవారే కాదు. వారి వద్దకు దేవుని వైపునుంచి ఏ ప్రవక్తయినా వారి గ్రంథాన్ని ధృవీక రిస్తూ వచ్చినప్పుడు ఆ గ్రంథప్రజల్లో ఒక వర్గం తనకసలు ఏమీ తెలియనట్లు దైవగ్రంథాన్ని అటక మీద ఎత్తిపెట్టింది. (99-101)

పైగా వారు, సులైమాన్ పాలనాకాలం పేరుతో దయ్యాలు చెప్పే విషయాల్ని పాటించనారంభించారు. కాని సులైమాన్ ఎన్నడూ సత్యతిరస్కారం జోలికే పోలేదు. జనానికి భూతవిద్య నేర్పుతుండిన ఆ దయ్యాలే సత్యతిరస్కారానికి పాల్పడ్డాయి.

అంతేకాదు, బాబిల్‌లో హారూత్, మారూత్ అనే ఇద్దరు (మానవాకారంలో వచ్చిన) దైవదూతలపై అవతరించిన విషయాల్ని కూడా వారు పట్టుకువ్రేలాడారు. కాని ఆ దైవ దూతలు జనానికి ఆ విషయాలు నేర్పేముందు "మేము ప్రజల్ని పరీక్షించడానికి పంపబడిన వాళ్ళం మాత్రమే. అందువల్ల మీరు అవిశ్వాసానికి (అంటే సత్య తిరస్కారానికి) పాల్పడకండి" అని వారికి స్పష్టంగా చెప్పేవారు. అయినా వారు భార్యాభర్తల్ని విడదీసే ఆ క్షుద్రవిద్యనే నేర్చుకోవడానికి ఉబలాటపడేవారు.[21]

---

21. దాంపత్యజీవితం మానవసంస్కృతికి మూలాధారం. భార్యాభర్తల మధ్య దాంపత్య జీవితం సవ్యంగా సాగితే సమాజంలో కూడా మంచి సభ్యతా సంస్కృతులు ఏర్పడతాయి. అందులో అపసవ్యత, అపశృతులు చోటు చేసుకుంటే సభ్యతా సంస్కృతులు కూడా వికటిస్తాయి. అందువల్ల అపోహలు, అపార్థాలు, మాయమాటలు, మంత్రతంత్రాలు లేదా మరే అక్రమ పద్ధతుల ద్వారా నయినా సరే భార్యాభర్తల్ని విడదీయడాన్ని ఇక్కడ అవిశ్వాసం (కుఫ్ర్)తో పోల్చడం జరిగింది.

యూదులు తమకు దైవం ప్రసాదించిన తౌరాత్ విద్యను వదిలేసి భార్యాభర్తలను విడదీసే క్షుద్రవిద్యను నేర్చుకోవడానికి ఒడిగట్టారు. ఈ మంత్రవిద్య ద్వారా వారు తాము కోరుకున్న స్త్రీని ఆమె భర్త నుండి విడదీసి తమవైపు తిప్పుకునేవారు. ఈ విద్య అవిశ్వాసానికి దారితీసే ఘోరపాప మని తెలిసి కూడా దాన్ని నేర్చుకోవడానికే ఉబలాటపడేవారంటే వారు నైతికంగా ఎంత దిగజారి పోయారో ఊహించవచ్చు. వారి నైతిక పతనాన్ని బట్టబయలు చేయడానికే దేవుడు తన దూతల ద్వారా యూదులకు ఈ పరీక్ష పెట్టాడు.



దైవాజ్ఞ లేనిదే ఆ చేతబడి వల్ల కూడా ఎవరికీ ఎలాంటి నష్టం వాటిల్లేదికాదు. దాన్ని కొన్నవాడికి పరలోక (స్వర్గ)ంలో ఎలాంటి చోటు లేదని వారికి బాగా తెలుసు. అయినా వారు లాభానికి బదులు తమకు నష్టం కలిగించే దానినే నేర్చుకోవడానికి ఉత్సాహపడ్డారు. వారు తమ అంతరాత్మలను అమ్ముకొని ఎంతటి నీచమైన సరుకు కొన్నారు! వారికీ విషయం తెలిసి ఉంటే ఎంత బాగుండేది! వారు గనక విశ్వసించి భయభక్తుల వైఖరి అవలంబించి వుంటే, వారికి దేవుని వద్ద ఎంతో మంచి ప్రతిఫలం లభించి వుండేది. వారికీ విషయం తెలిసివుంటే ఎంత బాగుండేది! (102-103)

విశ్వాసులారా! మీరు (దైవప్రవక్త ముందు యూదుల్లా) "కాస్త మా మాటలు వినండ"ని అనకండి. దానికి బదులు "కాస్త మమ్మల్ని అర్థం చేసుకోనివ్వండ"ని పలకండి. విషయం శ్రద్ధగా వినండి.[22] సత్యతిరస్కారులకు దుర్భరయాతన కాచుకొని ఉంది. (104)

సత్యాన్ని నిరాకరించేవారు గ్రంథప్రజలైనా, బహుదైవారాధకులైనా, నీ ప్రభువు నుంచి నీదగ్గరికొచ్చే ఏ మంచివిషయమూ వారికి నచ్చదు. కాని దేవుడు తన కారుణ్యం కోసం తాను కోరుకున్న వారిని ఎంచుకుంటాడు. ఆయన గొప్ప అనుగ్రహశీలి. (105)

మేమేదైనా సూక్తిని రద్దుచేస్తే లేదా మరపింపజేస్తే దాని స్థానంలో అంతకంటే మంచి సూక్తి జారీచేస్తాము. లేదా అలాంటిదే మరో సూక్తి జారీచేస్తాము. దేవుడు ప్రతి విషయంపై అధికారం కలవాడని మీరెరుగరా? భూమ్యాకాశాల సార్వభౌమత్వం అల్లాహ్‌దేనని, ఆయన తప్ప మీకెవరూ శ్రేయోభిలాషిగాని, సహాయకుడుగాని లేరని మీకు తెలియదా? (106-107)

---

ఈ పరీక్ష విభిన్న రూపాలలో మానవుల మధ్య ఇప్పటికీ సాగుతోంది. మానవ బద్ధవిరోధి షైతాన్ తన అనుచరమూక ద్వారా ఇలాంటి ఉపద్రవాన్ని సృష్టిస్తూ ఉంటాడు. ఒక హదీసు ప్రకారం ఇబ్లీస్ (షైతాన్) తన కేంద్రకార్యాలయం నుండి నేల నాలుగు చెరగులా తన అనుచరమూకను పంపిస్తాడు. వారు తిరిగొచ్చి తమ తమ నివేదికలను అతని ముందు సమర్పిస్తారు. తాను ఫలానా ఉపద్రవాన్ని సృష్టించానని ఒకడు అంటే, తాను ఫలానా ఘనకార్యం చేసి వచ్చానని మరొకడు చెబుతాడు. కాని ఇబ్లీస్ ప్రతివాడితో "నువ్వు చేసిందేమీ లేదు" అంటాడు. చివరికి ఒకడు వచ్చి తాను ఒకచోట భార్యాభర్తలను విడదీయించానని అంటాడు. ఇబ్లీస్ ఈమాట విని సంతోషంతో అతడ్ని గుండెలకు హత్తుకుంటూ "శభాష్, నువ్వు నిజంగా ఘనకార్యమే చేసివచ్చావు" అనంటాడు. (ఇబ్నెకసీర్) దీన్ని బట్టి భార్యాభర్తలను అన్యాయంగా విడదీయడం ఎంతటి ఘోరమైన పాపమో మనకు అర్థమవుతోంది.

22. ఇక్కడ ఖుర్‌అన్‌లో 'రాయినా' అనే పదం వాడబడింది. దీనికి అరబీ భాషలో 'కాస్త మా మాటలు వినండి' అని ఒక అర్థం ఉంది. మూర్ఖుడని మరొక అర్థం ఉంది. దీన్నే కొంచెం నాలుక తిప్పి రాయీనా అంటే 'మా పశువుల కాపరి' అని అర్థం వస్తుంది. ఇంచుమించు రాయినా అనే ఉచ్చారణతోనే హిబ్రూ భాషలో ఒక పదం ఉంది. దానికి 'విను, నీవు చెవిటివాడవు' అని అర్థం ఉంది. యూదులు దైవప్రవక్త (సల్లం) దగ్గరకొచ్చి ఇలాంటి ద్వంద్వార్థాలు, పెడర్థాలు వచ్చే పదాలను వాడేవారు.

పూర్వం మూసాను (యూదులు) అడిగినటువంటి (పనికిమాలిన) ప్రశ్నలు, కోరికలు మీరు కూడా మీ ప్రవక్తను అడగదలిచారా? ఎవరు విశ్వాసవైఖరికి బదులు అవిశ్వాసవైఖరి అవలంబిస్తాడో అతను రుజుమార్గం తప్పినట్లేనని తెలుసుకోవాలి. గ్రంథప్రజల్లో చాలామంది మిమ్మల్ని ఏవిధంగానైనా విశ్వాసం నుండి తప్పించి అవిశ్వాసం వైపు లాగాలని చూస్తున్నారు. సత్యం వారిముందు స్పష్టంగా వెల్లడైనప్పటికీ వారు అసూయతో మండిపోతూ మిమ్మల్ని అవిశ్వాసులుగా మార్చదలిచారు. కాబట్టి దేవుడు స్వయంగా వారి విషయంలో ఒక నిర్ణయం తీసుకునేవరకు వారిని క్షమించి, చూసీ చూడనట్లు వదిలేయండి. నిస్సందేహంగా దేవుడు ప్రతిపనీ చేయగల సమర్థుడు, సర్వశక్తిమంతుడు. (108-109)

(కనుక మీరు దైవధర్మంపై పూర్తిగా దృష్టి కేంద్రీకరించి) నమాజ్ (ప్రార్థనా) వ్యవస్థ నెలకొల్పండి. (పేదల ఆర్థిక హక్కయిన) జకాత్ చెల్లిస్తూ ఉండండి. మీ పరలోక శ్రేయస్సు కోసం మీరు ఏ సత్కార్యం చేసినా అది దేవుని వద్ద మీకు లభిస్తుంది. మీరు చేస్తున్న పనుల న్నిటినీ దేవుడు గమనిస్తూనే ఉన్నాడు. (110)

యూదుడుగా లేక క్రైస్తవుడుగా మారనంతవరకు ఏ ఒక్కడూ స్వర్గానికి పోలేడని అంటారు వారు. ఇవి వారి భ్రమలు మాత్రమే. "మీమాట నిజమైతే దానికి ప్రమాణం ఏమిటో తీసుకురండి"అని అడుగు. కాదు, ఎవరైనా సరే తననుతాను దేవునికి సమ ర్పించుకొని సదాచారసంపన్నుడై వుంటే అతనికా ప్రతిఫలం అతని ప్రభువు దగ్గర లభిస్తుంది. అలాంటివారికి ప్రళయదినాన ఎలాంటి భయం, దుఃఖం ఉండవు. (111,112)

క్రైస్తవులు సన్మార్గంలో లేరని యూదులు అంటారు. అలాగే యూదులు సన్మార్గంలో లేరని క్రైస్తవులు అంటారు. నిజానికి వారుభయులూ దైవగ్రంథం పఠిస్తున్నవారే. గ్రంథజ్ఞానం లేని ప్రజలు (బహుదైవారాధకులు) కూడా ఇలాంటి ప్రగల్భాలే పలుకుతారు. వారుభయుల మధ్య ఏర్పడిన ఈ విభేదాలను గురించి రేపు ప్రళయదినాన దేవుడు తీర్పుచేస్తాడు. (అప్పుడు తెలుస్తాయి నిజానిజాలు). (113)

దేవుని ఆరాధనాలయాల్లో ఆయన పేరు స్మరించనీయకుండా (ప్రజలను) నిరోధిస్తూ వాటి వినాశానికి పాల్పడేవాడి కంటే పరమదుర్మార్గుడు ఎవరుంటారు? అలాంటి దుర్మార్గులు దేవుని ఆరాధనాలయాల్లో అడుగుపెట్టడానికే అర్హులుకారు. ఒకవేళ వారందులో ప్రవేశించినా భయపడుతూ ప్రవేశిస్తారు. వారికి ఇహలోకంలో పరాభవం, పరాజయాలే ఎదురవుతాయి. ఇక పరలోకంలోనైతే వారు ఘోరమైన (నరక) యాతనలు చవిచూస్తారు. (114)

తూర్పు, పడమరలు అన్నీ అల్లాహ్‌కు చెందినవే. (ప్రార్థన చేయడానికి) మీరు ఏ దిక్కుకు మరలితే ఆ దిక్కుకే ఆయన ఉంటాడు. నిస్సందేహంగా దేవుడు సర్వోపగతుడు, సర్వజ్ఞుడు. (115)

దేవుడు ఒకర్ని తన కుమారుడిగా చేసుకున్నాడని అంటారు వారు. (లేదు) ఆయన ఎంతో పరిశుద్ధుడు, పవిత్రుడు. భూమ్యాకాశాలలోని సమస్తం ఆయనవే. సర్వ



సృష్టిరాసులు ఆయన పట్ల విధేయత కలిగివున్నాయి. భూమ్యాకాశాలను (అందులోని సమస్త సృష్టితాలను) ఆయనే సృష్టించాడు. (ఏ ఒక్కర్నీ కుమారుడిగా చేసుకోవాల్సిన అగత్యం ఆయనకు ఎంత మాత్రం లేదు.) ఆయన ఏదైనా చేయదలచుకుంటే "అయిపో" అంటే చాలు, అది ఇట్టే అయి తృటిలో ఉనికిలోకి వస్తుంది. (116-117)

"దేవుడు మాతో ఎందుకు మాట్లాడడు?" అంటారు అజ్ఞానులు. లేక "మా దగ్గరకు దేవుడు ఏదైనా మహిమను ఎందుకు పంపడు?" అంటారు. వారికి పూర్వం కూడా కొందరు ఇలాంటి మాటలే అన్నారు. వారందరి మనస్తత్వం ఒకే విధంగా ఉంది. నమ్మేవారికి మేము స్పష్టమైన మహిమలు చూపే ఉన్నాము. (ప్రవక్తా!) మేము నిన్ను సత్యపూరిత జ్ఞానంతో శుభవార్త అందజేసేవానిగా, హెచ్చరించేవానిగా నియమించి పంపాము. (ఇంతకంటే గొప్ప మహిమ వారికి ఇంకేం కావాలట!) నరకవాసుల విషయంలో నీవు జవాబుదారుడవు కావు. వారి స్వయంకృతాపరాధానికి నీవు ఏమాత్రం బాధ్యుడవు కావు. (118-119)

యూదులుగాని, క్రైస్తవులుగాని వారి ఆచార వ్యవహారాలను నీవు పాటించనంత వరకూ నీతో ఎన్నటికీ రాజీపడరు. కనుక దేవుడు చూపిన మార్గమే సన్మార్గమని, అది తప్ప మరో ముక్తిమార్గం లేదని వారికి స్పష్టంగా చెప్పు. ఒకవేళ నీకు (మాగ్రంథ) జ్ఞానం అందిన తర్వాత కూడా నీవు వారి మనోకాంక్షల్ని అనుసరిస్తే మాత్రం నిన్ను దేవుని బారినుండి కాపాడేవాడే ఉండడు. ఏ స్నేహితుడూ, సహాయకుడూ మాపట్టు నుంచి నిన్ను కాపాడలేడు. మేము గ్రంథం ప్రసాదించినవారు దాన్ని పఠించవలసిన విధంగా పఠిస్తారు. వారు మనస్ఫూర్తిగానే దాన్ని విశ్వసిస్తారు. దాన్ని నిరాకరించేవారు మాత్రమే నష్టపోయేవారు. (120-121)

ఇస్రాయీల్ సంతతి ప్రజలారా! నేను చేసిన మహోపకారాలు జ్ఞాపకం చేసుకోండి. నేను మీకు యావత్ప్రపంచజాతులపై గౌరవం, ఔన్నత్యాలు ప్రసాదించాను. కనుక ఎవరూ ఎవరికీ ఏవిధంగానూ సహాయపడలేని (ప్రళయ)దినానికి భయపడండి. ఆరోజు ఎవరి నుండీ ఎలాంటి పాపపరిహారం స్వీకరించబడదు. ఎవరి సిఫారసు కూడా చెల్లదు. నేరస్థులకు ఎలాంటి సహాయమూ లభించదు. (122,123)

ఇబ్రాహీంప్రభువు కొన్ని విషయాల్లో ఇబ్రాహీంని పరీక్షించగా అందులో అతను కృతార్థుడయ్యాడు. అప్పుడు దేవుడు అతనితో "నేను నిన్ను యావత్తు మానవజాతికి నాయకుడిగా నియమించబోతున్నాను" అన్నాడు. దానికతను "ప్రభూ! మరి నా సంతానంలో కూడా (ఎవరికైనా ప్రపంచ నాయకత్వం ప్రసాదిస్తావా?)" అని అడిగాడు. దానికి దేవుడు "మా ఈ వాగ్దానం దుర్మార్గులకు వర్తించదు" అన్నాడు. (124)

మేము కాబాగృహాన్ని ప్రజల కోసం (ఆరాధనా) కేంద్రంగాను, శాంతి నిలయం గాను చేసి, ఇబ్రాహీం నిలబడిన చోటును ప్రార్థనా స్థలంగా చేసుకోవలసిందిగా ప్రజలను ఆదేశించాము. మరోవైపు "నా ఈ ఆలయాన్ని ప్రజలు ప్రదక్షిణ చేయడానికి,

అందులో ధ్యానించడానికి, మోకరిల్లడానికి, సాష్టాంగపడటానికి పవిత్రంగా, పరిశుద్ధంగా ఉంచాల"ని ఇబ్రాహీంని, ఇస్మాయీల్‌ని కూడా ఆజ్ఞాపించాము. (125)

ఇబ్రాహీం దేవుడ్ని ప్రార్థిస్తూ "ప్రభూ! ఈ పట్టణాన్ని శాంతినగరంగా చెయ్యి. ఇక్కడ నివసించే ప్రజల్లో దైవాన్ని, పరలోకాన్ని విశ్వసించేవారికి తినేందుకు అన్ని విధాల పండ్లు ఫలాలు ప్రసాదించు" అని అన్నాడు. దానికి సమాధానంగా "(ఈ మూన్నాళ్ళ ప్రపంచ జీవితంలో) నేను విశ్వసించనివారికి కూడా ఎంతో కొంత ఉపాధి నిస్తాను. అయితే ఆ తరువాత వారిని నరకాగ్ని వైపు ఈడుస్తాను. అది అత్యంత ఘోరమయిన ప్రదేశం" అని చెప్పాడు దేవుడు. (126)

ఇబ్రాహీం, ఇస్మాయీల్ ఇద్దరూ కలసి దైవగృహానికి పునాదులు తీసి గోడలు నిర్మిస్తూ ఇలా వేడుకున్నారు:"ప్రభూ! మాఈ సేవను స్వీకరించు. నీవే (అందరి మొరల్ని) ఆలకించే వాడవు, సమస్తం తెలిసినవాడవు. ప్రభూ! మా ఇద్దర్నీ నీ విశ్వసనీయ దాసులుగా చెయ్యి. మాసంతతి నుండి నీకు విధేయులైవుండే ఒక జాతిని ఆవిర్భవింప జేయి. నిన్ను ఆరాధించే విధానం ఏమిటో మాకు తెలియజేయి. మా పొరపాట్లు మన్నించు. నిస్సందేహంగా నీవు మన్నించేవాడవు, కరుణించేవాడవు. ప్రభూ! ఆ జాతిప్రజలకు నీసూక్తులు విన్పించే, నీ గ్రంథజ్ఞానాన్ని, వివేకాన్ని నేర్పి వారి జీవితాలను సంస్కరించే ఒక ప్రవక్తను ఆ జాతిలో పుట్టించు. నీవు ఎంతో శక్తిమంతుడవు, వివేకవంతుడవు." (127-129)

(ఇదీ ఇబ్రాహీం గాథ. అలాంటి) ఇబ్రాహీం పాటించిన జీవనసరళిని మూర్ఖులు తప్ప ఎవరు ద్వేషిస్తారు? మేము ప్రపంచంలో (మా కార్యసాధనకై) ప్రత్యేకంగా ఇబ్రాహీంను ఎన్నుకున్నాం. పరలోకంలో కూడా అతను పుణ్యాత్ములలో చేర్చబడతాడు. (130)

ఇబ్రాహీంని అతని ప్రభువు "నిన్ను నీవు (మాకు) సమర్పించుకో"అని ఆదేశించ గానే అతను (ఏమాత్రం తటపటాయించకుండా) "నన్ను నేను సర్వలోక ప్రభువుకు సమర్పించుకుంటున్నా"నని అన్నాడు. తరువాత అతను తన కుమారులక్కూడా ఈ (స్వయం సమర్పణ) విధానాన్నే ఉపదేశించాడు. యాఖూబ్ కూడా తన కొడుకులకు హితవు చేస్తూ "దేవుడు మీకోసం ఈ జీవనవిధానాన్నే నిర్ణయించాడు. కనుక చనిపోయే వరకూ దైవవిధేయులు (ముస్లిములు)[23]గానే జీవించాలి" అన్నాడు. (131-132)

మరి యాఖూబ్ ఇహలోకం వీడిపోతున్నప్పుడు (అక్కడ) మీరున్నారా? అతను తుది శ్వాస వదలుతున్నప్పుడు తన కొడుకులను పిలిచి "నేను వెళ్ళిపోయిన తరువాత మీరు ఎవరిని ఆరాధిస్తారు?" అని అడిగాడు. దానికి వారంతా "మీరు, మీ తాత

23. ఇక్కడ వాడబడిన పదంలోని 'సలం' అనే ధాతువుకు శాంతి, సమర్పణ, విధేయత, ఆజ్ఞాపాలన అనే అర్థాలున్నాయి. అందులో నుంచే ముస్లిం, ఇస్లాం అనే పదాలు పుట్టాయి. ముస్లిం అంటే దేవునికి తనను తాను పూర్తిగా సమర్పించుకొని ఆయనకు విధేయుడయి, జీవితంలోని సమస్త రంగాల్లో ఆయన ఆజ్ఞలను పాటించేవాడని అర్థం. అలాంటి జీవిత నియమావళినే ఇస్లాం అంటారు. దాన్ని అవలంబించడం వల్లనే మనిషికి శాంతి, సాఫల్యాలు లభిస్తాయి.



ముత్తాలయిన ఇబ్రాహీం ఇస్మాయీల్, ఇస్‌హాఖ్ (అలైహి)లు ఆరాధించిన ఏకేశ్వరుడ్ని మాత్రమే మేము ఆరాధిస్తాము. ఆయనకే మేము విధేయులయి (ముస్లిములయి) ఉంటాము" అని సమాధానమిచ్చారు. (133)

ఇవి గతించిన సమాజాలు. వారు చేసుకున్న కర్మలు వారికే, మీరు చేసుకున్న కర్మలు మీకే. అంతేగాని వారు చేసినదాన్ని గురించి మిమ్మల్ని ప్రశ్నించడం జరగదు.

యూదులైపోతే సన్మార్గంలో ఉంటారని యూదులు, క్రైస్తవులుగా మారితేనే రుజుమార్గం లభిస్తుందని క్రైస్తవులు అంటారు. వారికి చెప్పు: "ఇబ్రాహీం అనుచర సముదాయమే సన్మార్గం లో ఉంది. ఇబ్రాహీం స్వచ్ఛమైన ఏకదైవారాధకుడు, బహుదైవారాధకుడు కాదు." (134,135)

ముస్లిములారా! ఇలా అనండి: "మేము అల్లాహ్‌ను విశ్వసించాము; మా దగ్గరకు అవతరించినదాన్ని; ఇబ్రాహీం, ఇస్మాయీల్, ఇస్‌హాఖ్, యాఖూబ్, యాఖూబ్ సంతతిపై అవతరించినదాన్ని; మూసా, ఈసా తదితర దైవప్రవక్తలందరికీ వారి ప్రభువు నుండి లభించిన దాన్ని కూడా మేము విశ్వసించాము. వారి మధ్య మేము ఎలాంటి విచక్షణ చేయము.[24] మేము దేవునికే విధేయులం (ముస్లిములం)." (136)

మీరు ఎలా విశ్వసించారో అలా విశ్వసిస్తేనే వారు సన్మార్గం పొందగలరు. మీలా విశ్వసించకుండా ముఖం తిప్పుకుంటే వారు మొండిపట్టుదలకు పోయి మీతో విభేదిస్తున్నారన్న మాట. ఏమైనప్పటికీ వారికి వ్యతిరేకంగా మీకు సహాయం చేయడానికి దేవుడే చాలు. ఆయన సమస్తం వింటున్నాడు. ఆయనకు సర్వం తెలుసు. (137)

చెప్పండి: "దేవుని రంగు అవలంబించండి. దేవుని రంగు కన్నా మరెవరి రంగు శ్రేష్ఠమయినది? మేము ఆయన్నే ఆరాధిస్తాము." (138)

ముహమ్మద్! వారితో ఇలా అను: "మీరు దేవుని విషయంలో మాతో పోట్లాడుతారెందుకు? ఆయన మీకూ ప్రభువే, మాకూ ప్రభువే కదా! మీ కర్మలు మీవెంట, మా

24. "దైవప్రవక్తలలో కొందరు సత్యాన్ని, మరికొందరు అసత్యాన్ని గాకుండా అందరూ తమ తమ కాలాల్లో ఆయా సమాజాలకు సత్యాన్నే (అంటే ఇస్లాం ధర్మాన్నే) బోధించారని, అందువల్ల వారందరి పట్ల విధేయత కలిగి ఉండటం, వారి ఆజ్ఞల్ని శిరసావహించడం ఆయా ప్రజల విధ్యుక్త ధర్మమని మేము భావిస్తున్నాం" అని అర్థం. కనుక ముస్లింలు దైవప్రవక్తలలో కొందర్ని విశ్వసించి, మరికొందరిని నిరాకరించరు. వారిలో ఏ ఒక్కరిని నిరాకరించినా దేవుడ్ని నిరాకరించినట్లు అవుతుంది. (వివరాలకు 2:4,285; 3:83,84 సూక్తులు చూడండి.)

దైవప్రవక్తల విషయంలో కొందరు హద్దుమీరిన అభిమానానికి పోయి, అందరికంటే తమ ప్రవక్త గొప్ప, తమ ప్రవక్త గొప్ప అని చెప్పుకుంటారు. అంతిమ దైవప్రవక్త (సల్లం) ముహమ్మద్ (సల్లం) ఈ విషయాన్ని కూడా ఖండించారు. పునరుత్థాన దినాన ఆయన నేల (సమాధి)లో నుండి బయటికి వచ్చి చూస్తే మూసా ప్రవక్త (అలైహి) దైవసింహాసనం కాలు పట్టుకొని ఉండటం కన్పిస్తుంది. దాన్ని ప్రస్తావిస్తూ "మీరు దైవప్రవక్తలలో ఒకరిపై ఒకరికి ప్రాధాన్యం ఇవ్వకండి" అన్నారు సహచరులతో. (బుఖారి, ముస్లిం)

కర్మలు మావెంట ఉంటాయి. మేము మాత్రం పూర్తిగా ఆయనకే అంకితమై పోయాం." లేదా వారిని ఇలా అడుగు: "మీరు ఇబ్రాహీం, ఇస్మాయీల్, ఇస్‌హాఖ్, యాఖూబ్, యాఖూబ్ సంతానం- వీరంతా యూదులని అంటున్నారా? లేక క్రైస్తవులని అంటున్నారా?"

వారికి చెప్పు: "ఈ విషయం గురించి మీకు బాగా తెలుసా లేక దేవునికా? దేవుని దగ్గర్నుండి వచ్చిన సాక్ష్యం వెల్లడించకుండా దాచిపెట్టేవాడి కంటే పరమ దుర్మార్గుడు మరెవరు ఉంటారు? మీ చర్యలను దేవుడు గమనించడం లేదని భావించకండి." ఆ సమాజం గతించి పోయింది. వారు చేసుకున్న కర్మలు వారికే; మీరు చేసుకున్న కర్మలు మీకే. వారు చేసినదాన్ని గురించి మిమ్మల్ని విచారించడం జరగదు. (139-141)

"ఏమయింది వీరికి, నిన్నటిదాకా ఒక దిక్కుకు తిరిగి ప్రార్థన చేస్తూవుండిన వీరు ఈరోజు హఠాత్తుగా మరో దిక్కుకు తిరిగారు?" అనంటారు మూఢులు. ప్రవక్తా! చెప్పు: "తూర్పుపడమరలన్నీ దేవుని దిక్కులే. ఆయన తాను కోరినవారికి సన్మార్గం చూపుతాడు." ఈవిధంగా మేము మిమ్మల్ని మధ్యస్థ సమాజంగా చేశాము.[25] మీరు ప్రపంచప్రజలకు సాక్షులుగా ఉండాలని, ప్రవక్త మీకు సాక్షిగా ఉండాలని ఇలా చేశాం.

---

25. అంటే నీతి, న్యాయం, నిష్పక్షపాతాలకు కట్టుబడి ఉంటూ, ఎలాంటి అతివాదానికి పోకుండా ప్రతి విషయంలోనూ సమతూలనం పాటించే సమాజం అని అర్థం. ప్రళయ దినాన యావత్తు మానవులు పునర్జీవులయి హష్ర్ మైదానంలో గుమికూడుతారు. దైవన్యాయస్థానంలో కర్మల విచారణ ప్రారంభమవుతుంది. దైవప్రవక్తలంతా తమకు అందజేయబడిన ధర్మబోధనలను ప్రజలకు అందజేశామని దేవుని ముందు సాక్ష్యమిస్తారు. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) కూడా తనకు అందజేయబడిన బోధనలను ప్రజలకు చేరవేశానని సాక్ష్యమిస్తారు. ఆయన అను చరులు (ముస్లింలు) దాన్ని ధృవీకరిస్తారు. దాంతో దైవప్రవక్త బాధ్యత తీరినట్లవుతుంది.

ఆ తరువాత ఈ బాధ్యతను మీరెంతవరకు నిర్వహించారని దేవుడు ముస్లింలను అడుగుతాడు. ముస్లింలు తమకు దైవప్రవక్త (సల్లం) ద్వారా అందిన ఇస్లాం బోధనలను వాక్క్రియల ద్వారా ఇతర మానవులకు అందజేశామని సమాధానం ఇచ్చుకోవలసి ఉంటుంది. ఈ విషయాన్నే ఈ సూక్తిలో సాక్ష్యం ఇవ్వడమని పేర్కొనబడింది. వారు తోటి మానవులకు ఇస్లాం బోధనలను పరిచయం చేయడమేగాక, స్వయంగా వాటిని ఆచరించి కూడా చూపాల్సిన అవసరముంది. అంటే వారి మాటలకు చేతలకు మధ్య పొంతన ఉండాలి. భక్తిపరాయణత అంటే ఇలా ఉంటుంది; నీతీనిజాయతీలు అంటే ఇలా ఉంటాయి; న్యాయం ధర్మం అంటే ఇలా ఉంటాయి అని ప్రజలు భావించేలా వారు పూర్తిగా ధార్మిక జీవితం గడపాలి. ముస్లింలు ఓ సైద్ధాంతిక సమాజానికి చెందిన సభ్యులు. బాధ్యతాయుతమయిన జాతి ప్రజలు. వారు అంతిమ దైవసందేశహరుని (సల్లం) ప్రతినిధులుగా మసలుకుంటూ ప్రపంచాన్ని నీతి మార్గాన నడిపించవలసి ఉంటుంది. చెడుగుల్ని అరికట్టాలి. అన్యాయం, అధర్మాలను అంతమొందించాలి. నీతి న్యాయాలను, శాంతి సుహృద్భావాల వాతావరణాన్ని నెలకొల్పాలి. దేవుని భూమి హింసా దౌర్జన్యాలు, అన్యాయం, అక్రమాలు, అశ్లీలం, అరాచకాలతో నిండిపోతే దానికి దైవం ఎదుట ముందుగా ముస్లింలే బాధ్యులవుతారు. 'నా భూమ్మీద ఇన్ని ఘోరాలు, దురంతాలు జరుగుతుంటే మీరేం చేస్తుండేవార'ని దేవుడు వారిని నిలదీస్తాడు. వారు తమవంతు కృషి ఏమేరకు చేశారని



దైవప్రవక్తను ఎవరు అనుసరిస్తారు, ఎవరు విముఖులవుతారు అని పరీక్షించ డానికి మేము మొదట మీరు (ప్రార్థనకై) మరలే దిక్కును ఆరాధనా కేంద్రంగా నిర్ణ యించాము. ఇది ప్రజలకు చాలాకష్టం అన్పించింది. కాని దేవుని మార్గదర్శకత్వం లభించినవారికి ఇది ఏమాత్రం కష్టమన్పించలేదు. దేవుడు మీ విశ్వాసాన్ని అనవసరంగా వృధాచేయడు. ఆయన మానవుల పాలిట అపారకృపాశీలుడు, అమిత దయామయుడు. (142,143)

ముహమ్మద్! నీవు మాటిమాటికి ముఖం పైకెత్తి ఆకాశం వైపు చూడటాన్ని మేము గమనిస్తూనే ఉన్నాము. కనుక నీకు ప్రియమైన దిశకే (ప్రార్థనకై) మేము నిన్ను మరలిస్తున్నాం. ఇక నుంచి మీరు ప్రతిష్ఠాలయం (కాబాగృహం)[26] వైపు తిరగండి. మీరు

---

ప్రశ్నిస్తాడు. సత్యానికి సాక్షులుగా నియమించ బడిన ముస్లింలు పరలోక న్యాయస్థానంలో ఈ ప్రశ్నలకు సమాధానం ఇచ్చుకోవలసి ఉంటుంది. (ఇతర వివరాల కోసం 3:104,110 సూక్తులు, వాటి పాదసూచికలు చూడండి.)

26. ఇక్కడ మూల భాషలో కాబా మందిరానికి "మస్జిదుల్ హరాం" అని పిలువడం జరిగింది. అంటే పవిత్రమైన, ప్రతిష్ఠాత్మకమైన ప్రార్థనామందిరం అని అర్థం.

ప్రారంభంలో ముహమ్మద్ ప్రవక్త (సల్లం), ఆయన అనుచరులు జెరూసలేంలోని బైతిల్ మఖ్దిస్"కు అభిముఖంగా తిరిగి ప్రార్థన (నమాజ్) చేస్తుండేవారు. ఆనాడు ముస్లింల కోసం దేవుడు నిర్ణయించిన ఖిబ్లా (ఆరాధనా కేంద్రం) అదే. బైతిల్ మఖ్దిస్‌ని ఆరాధనా కేంద్రంగా నిర్ణయించడానికి కారణం 2:143 సూక్తిలో పేర్కొనబడింది. అరబ్బులు తమ జాతీయ దురభిమానం కారణంగా అరేబియా బయట మరో దేవాలయాన్ని ఆరాధనా కేంద్రంగా అంగీకరించేవారు కాదు. ఇస్లాం ఈ దురభిమానం, జాత్యహంకారాల్ని అంతమొందించడానికి, ముస్లింలు బైతిల్‌మఖ్దిస్‌ని ఆరాధనా కేంద్రంగా చేసుకొని ప్రార్థనలు చేయాలని ఆదేశించింది. ముస్లింలు ఈ ఆదేశాన్ని పాటించారు.

ఈ విధంగా ముస్లింలు మదీనాలో 16 నెలల పాటు ఈ ఆదేశాన్ని పాటించడం ద్వారా ఖిబ్లా విషయమయి దేవుడు పెట్టిన పరీక్షలో నెగ్గారు. ఆ తరువాత దేవుడు ఖిబ్లా దిశను మార్చి యూదులకు, క్రైస్తవులక్కూడా అలాంటి పరీక్షే పెట్టాడు. హి.శ. 2వ యేట రజబ్ లేక షాబాన్ నెలలో కాబా గృహాన్ని ఖిబ్లాగా చేసుకోవాలన్న దైవాజ్ఞ అవతరించింది. అయితే యూదులు ఈ ఆజ్ఞను వ్యతిరేకించడమే గాకుండా దాన్ని పాటిస్తున్న ముస్లింలను విమర్శించారు. అరబ్ బహుదైవారాధకులు భావిస్తున్నట్లు దేవుడు కాబా దిశకో, యూదులు-క్రైస్తవులు భావిస్తున్నట్లు బైతిల్‌మఖ్దిస్ దిశకో పరిమితమయి ఉండలేదని, ఆయన ప్రతిచోటా ఉన్నాడని, ఆయన ఆజ్ఞల్ని శిరసావహించడమే అసలు దైవారాధన అని ప్రజలకు తెలియజేయడమే ఈ ఆజ్ఞల ఉద్దేశ్యం.

కాబా గృహాన్ని ఇబ్రాహీం ప్రవక్త (అలైహి) నిర్మించారు. ఆ తరువాత 1200 సంవత్సరాలకు బైతిల్‌మఖ్దిస్‌ని సులైమాన్ ప్రవక్త (అలైహి) నిర్మించారు. అప్పటి నుండి హి.శ. 2వ యేట వరకు అదే ఆరాధనా కేంద్రంగా ఉండేది. తిరిగి ఇప్పుడు ప్రాచీన దేవాలయమైన 'కాబా' ఆరాధనా కేంద్రం అయింది. యూదులు ఈ వాస్తవం తెలిసినా కాబాను ఖిబ్లాగా గుర్తించడానికి సిద్ధంగా లేరు. జాతీయ దురభిమానం, ప్రాంతీయతత్వం సత్యాంగీకార మార్గంలో వారికి అడ్డుగోడలుగా నిలిచాయి.

యూదులు, క్రైస్తవులు మొదట్లో బైతిల్‌మఖ్దిస్ వైపే తిరిగి ప్రార్థనలు చేస్తుండేవారు. కాని తరువాత వారుభయులు సులైమాన్ ప్రవక్త సంప్రదాయానికి తిలోదకాలిచ్చి తమ ఆరాధనా దిశలను

ఎక్కడున్నా సరే దాని వైపుకే తిరిగి ప్రార్థన చేయండి. (ప్రార్థనాదిశ మార్పుకు సంబంధించిన) ఈ ఆదేశం నీ ప్రభువు నుండి వచ్చిన సత్యమని గ్రంథప్రజలకు బాగా తెలుసు. (అయినా వారు తమ పంతం మానలేకపోతున్నారు.) వీరి చర్యల్ని దేవుడు ఓకంట గమనిస్తూనే ఉన్నాడు. (144)

గ్రంథప్రజలకు[27] నీవు ఎన్ని నిదర్శనాలు చూపినా వారు మీ ప్రార్థనాదిశను అనుసరించరు. మీరూ వారి ప్రార్థనాదిశను అనుసరించలేరు. స్వయంగా వారిలో కూడా ఒక వర్గంవారు అనుసరించే ప్రార్థనాదిశను మరొక వర్గంవారు అనుసరించరు. ఒకవేళ (మా గ్రంథ) జ్ఞానం అందిన తరువాత కూడా వారి కోరికలను అనుసరిస్తే మాత్రం నీవు దుర్మార్గులలో చేరినట్లు పరిగణించబడతావు. (145)

మేము గ్రంథం ప్రసాదించినవారు తమ కన్నకొడుకుల్ని గుర్తిస్తున్నట్లు దీన్ని (ఎలాంటి సంకోచం లేకుండా) గుర్తిస్తున్నారు. కాని వారిలో ఒకవర్గం వాస్తవాన్ని బుద్ధి పూర్వకంగా కప్పిపుచ్చుతోంది. నిస్సందేహంగా ఇది నీ ప్రభువు నుండి వచ్చిన పరమ సత్యం. కనుక నీవు ఎలాంటి అనుమానానికి ఆస్కారమివ్వకు. (146,147)

ప్రతి వర్గానికీ ఒక ప్రార్థనాదిశ ఉంది. వారా వైపుకు తిరుగుతారు. కనుక మీరు (దీన్నిగురించి అట్టే ఆలోచిస్తూ సమయం వృధాచేయకుండా) సత్కార్యాలు చేయటంలో ఒకర్నొకరు మించిపోవడానికి ప్రయత్నించండి. మీరు ఎక్కడున్నా దేవుడు మిమ్మల్నందర్నీ ఒకచోటికి చేరుస్తాడు. ఆయన ప్రతిపనీ చేయగల సమర్థుడు, సర్వశక్తిమంతుడు. (148)

---

మార్చుకున్నారు. హజ్రత్ మర్యం (అలైహి) బైతిల్‌మఖ్దిస్‌కు తూర్పువైపు భాగంలో తపోనిష్ఠ (ఏతికాఫ్) పాటించినందున క్రైస్తవులు తూర్పు దిక్కును తమ ఆరాధనా దిశ (ఖిబ్లా)గా నిర్ణయించుకున్నారు. యూదులు బహుశా వారికి వ్యతిరేకంగా మంకుతనానికి పోయి పడమటి దిక్కును తమ ఆరాధనా దిశగా చేసుకున్నారు. ముస్లింలు మాత్రం దైవాజ్ఞ అవతరించిన నాటినుండి ఇప్పటికీ కాబా గృహాన్నే ఆరాధనా దిశగా చేసుకొని నమాజు చేస్తున్నారు.

ఈ ఆజ్ఞ అవతరించిన సమయంలో దైవప్రవక్త (సల్లం), ఆయన వెనుక ముస్లింలు జుహర్ నమాజ్ చేస్తున్నారు. రెండు రకాతులు అయి మూడవ రకాతులో ప్రవేశించగానే దైవప్రవక్త (సల్లం)పై దివ్యావిష్కృతి (వహీ) ద్వారా ఈ సూక్తి అవతరించింది. దైవప్రవక్త (సల్లం) తక్షణమే కాబా దిక్కుకు తిరిగారు. ఆయన నేతృత్వంలో నమాజు చేస్తున్నవారు కూడా కాబా వైపు తిరిగారు. ఇలా వారు జుహర్ నమాజ్‌లో మొదటిరెండు రకాతులు బైతిల్‌మఖ్దిస్‌కు అభిముఖంగా, చివరిరెండు రకాతులు కాబాగృహానికి అభిముఖంగా నిలబడి నెరవేర్చారు. బహిరంగ ప్రకటన ద్వారా ఈ ఆదేశం విన్న ఇతరులు కూడా నమాజుస్థితిలో ఉన్నప్పటికీ వెంటనే కాబాగృహం ఉన్న దిశకు తిరిగారు.

ఇప్పుడు ముస్లింలు ప్రపంచంలో ఎక్కడున్నా, ఏ స్థితిలో ఉన్నా కాబా ఉన్న దిక్కుకే తిరిగి నమాజు చేయవలసి ఉంటుంది. రైళ్ళు, విమానాల్లో ప్రయాణం చేస్తున్నప్పుడు కాబా దిశకు తిరిగి నమాజు చేయడానికి వీలుకాకపోతే వీలున్న దిశకు తిరిగి నమాజు చేయడంలో తప్పు లేదు.

27. గ్రంథప్రజలు అంటే, గతంలో దైవప్రవక్తల ద్వారా దివ్యగ్రంథాలు పొందినవారని అర్థం. ప్రత్యేకంగా యూదులు, క్రైస్తవులు అని అర్థం.



మీరు ఏప్రాంతానికి వెళ్ళినా అక్కడ్నుంచి మీరు ప్రతిష్ఠాలయం (కాబా) వైపుకే తిరిగి ప్రార్థన చేయండి. నిస్సందేహంగా ఇది మీ ప్రభువు నుండి వచ్చిన సత్యం. మీరు చేసే పనులన్నిటినీ దేవుడు గమనిస్తూనే ఉంటాడు. మీరు ఎక్కడున్నా, ఏ ప్రాంతానికి వెళ్ళినా అక్కడ నుంచి మీరు ప్రతిష్ఠాలయం వైపుకే అభిముఖులుకండి. మీకు వ్యతిరేకంగా ఇతరులు ఎలాంటి మాట అనడానికైనా ఆస్కారమివ్వకుండా మీరు దాని వైపుకే తిరిగి ప్రార్థన చేయండి. ఇక దుర్మార్గుల విషయానికొస్తే, వారు ఎల్లప్పుడూ మీకు వ్యతిరేకంగా ఏదో ఒకటి వాగుతూనే ఉంటారు. కనుక మీరు వారికి భయపడకూడదు, నాకే భయపడాలి.

మీకు నా సూక్తులు వినిపిస్తూ, గ్రంథాన్ని, వివేకాన్ని బోధించడంతో పాటు మీకు తెలియని విషయాలు నేర్పి, మీ జీవితాలను తీర్చిదిద్దే ఒక ప్రవక్తను నేను మీ జాతి నుండే మీలో ప్రభవింపజేశాను. అలాగే మీకు నా అనుగ్రహాలు ప్రసాదించడానికి, మీరు సన్మార్గంలో నడవడానికి ఆజ్ఞలు ఇస్తున్నాను. కనుక మీరు నన్ను స్మరిస్తూ ఉండండి, నేను మిమ్మల్ని గుర్తుంచుకుంటాను. నాకు కృతజ్ఞులయి ఉండండి, కృతఘ్నులు కాకండి. (149-152)

విశ్వాసులారా! సహనం వహించి, ప్రార్థన చేస్తూ (మా) సహాయం అర్థిస్తూ ఉండండి. దేవుడు సహనం వహించేవారికే తోడుగా ఉంటాడు. (153)

దైవమార్గంలో చంపబడినవారిని గురించి, వారు చనిపోయారని అనకండి. వారు సజీవంగానే ఉన్నారు. మీరా విషయం గ్రహించలేరు. (154)

భయం, ఆకలి, ధనప్రాణ,పంటల నష్టాలు కలిగించి మిమ్మల్ని మేము తప్పనిసరిగా పరీక్షిస్తాము.[28] అలాంటి స్థితిలో సహనం వహించి, ఆపద వచ్చినప్పుడు

---

28. దైవధర్మాన్ని విశ్వసించామని ప్రకటించినవారికి ఆ ధర్మంపై ఏమేరకు విశ్వాసం ఉందో పరీక్షించడం అవసరమని ఈ సూక్తి చెబుతోంది.

దేవుడ్ని, దైవప్రవక్త (సల్లం)ను విశ్వాసించామని చెప్పుకున్నంత మాత్రాన ఏ మనిషీ పరలోక సాఫల్యానికి అర్హుడు కాలేడు. దైవప్రసన్నత, ఆయన దివ్యదర్శనం, స్వర్గ సుఖాలు అనేవి అంత తేలిగ్గా లభించే వస్తువులు కావు. వాటికోసం అతను అనేక పరీక్షలు ఎదుర్కోవలసి వస్తుంది. కష్ట నష్టాలు భరించవలసి వస్తుంది. ధనప్రాణాల త్యాగానికి సయితం సిద్ధపడవలసి వస్తుంది. భయ ప్రలోభాల ద్వారా కూడా విశ్వాసులు పరీక్షించబడతారు. ఈ పరీక్షలన్నిటికీ తట్టుకొని దైవధర్మంలో స్థిరంగా నిలబడగలిగినవాడే దేవుని దృష్టిలో నిజమైన ముస్లిం.

“మీ (విశ్వాస) పరిస్థితి ఏమిటో పరిశీలించి మీలో యోధులు, స్థిరచిత్తులెవరో తెలుసుకోవడానికి మేము మిమ్మల్ని తప్పకుండా పరీక్షిస్తాము.” (ఖుర్ఆన్- 47:31)

“మేము విశ్వసించామని అన్నంతమాత్రాన తమను పరీక్షించకుండా వదలిపెట్టడం జరుగుతుందని వారు భావిస్తున్నారా? నిజానికి వారికి పూర్వం గతించిన వారందర్నీ మేము పరీక్షించాము. (వారిలో) సత్యవాదులెవరో, అసత్యవాదులెవరో తప్పనిసరిగా పరీక్షించి తెలుసుకోవలసిన బాధ్యత దేవునిపై ఉంది.” (ఖుర్ఆన్- 29:2,3)

"స్వర్గప్రవేశం ఊరికే లభిస్తుందని మీరు భావిస్తున్నారా? నిజానికి మీకు పూర్వం విశ్వాసులకు సంభవించిన (కష్టనష్టాలు) వన్నీ ఇంకా మీకు సంభవించలేదే! వారిపై అనేక కష్టాలు, కడగండ్లు విరుచుకు పడ్డాయి." (ఖుర్‌ఆన్- 2:214)

"ముస్లిములారా! (భవిష్యత్తులో) మీరు ధన ప్రాణాలు రెండిటి విషయంలోనూ అనేక కఠిన పరీక్షలకు గురికావలసివస్తుంది. అంతేకాకుండా మీరు గ్రంథప్రజల నుండి, బహుదైవారాధకుల నుండి కూడా మనస్సు నొప్పించే మాటలు అనేకం వినవలసివస్తుంది. కనుక అలాంటి స్థితిలో మీరు సహనం వహించి, భయభక్తులతో కూడిన జీవితం గడుపుతూ ధర్మమార్గంలో స్థిరంగా ఉండాలి. నిజంగా ఇది ఎంతో సాహసోపేతమైన కార్యం." (ఖుర్‌ఆన్- 3:186)

ఒక విశ్వాసిపై కష్టాలు వచ్చిపడ్డాయి అంటే దేవుడు అతనికి ఏదో మేలు చేయదలిచాడని తెలుసుకోవాలి. దీన్ని గురించి దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా తెలియజేశారు:

"దేవుడు ఎవరికైనా మేలు చేయదలచుకుంటే అతడ్ని కష్టాలకు గురిచేస్తాడు." (బుఖారి)

"దేవుడు తన దాసునికి మేలు చేయదలచినప్పుడు అతని పాపాలకు గాను త్వరలో ప్రపంచంలోనే అతనికి (ఆపదల రూపంలో) శిక్ష విధిస్తాడు. ఒకవేళ దేవుడు ఎవరికైనా కీడు చేయదలిస్తే అతని పాపాలకు (ప్రపంచంలో) శిక్ష విధించకుండా ఆపి ఉంచుతాడు. ఇలా ప్రళయ దినం వరకు ఆపివుంచి ఆరోజు అతనికి పూర్తి శిక్ష విధిస్తాడు." (తిర్మిజి, మిష్కాత్)

"విశ్వసించిన స్త్రీపురుషులు తమ ధనప్రాణాలు, సంతానం విషయంలో నిరంతరం పరీక్షించబడుతుంటారు. ఈవిధంగా పరీక్షించబడుతూ చివరికి వారు అంతిమదినాన (పరలోకంలో) తమ పాపాలలో ఏఒక్కటీ మిగిలిఉండని (పవిత్ర) స్థితిలో దేవుడ్ని కలుసుకుంటారు." (తిర్మిజి)

"విశ్వాసి అయిన దైవదాసుడు, జబ్బుపడితే లేదా అతనికేదైనా ఆపద వచ్చిపడితే- అది ఎలాంటి ఆపదైనా సరే. ఉదాహరణకు అతని జేబునుంచి డబ్బేమైనా పోతే- ఇవన్నీ విశ్వాసి పాలిట పుణ్యఫలానికి కారణమవుతాయి. బంగారం స్వర్ణకారుడి కొలిమిలో కాలి స్వచ్ఛమయి బయటికి వచ్చినట్లు కష్టాలు విశ్వాసి పాపాలను హరించివేసి అతడ్ని పునీతుడ్ని చేస్తాయి." (మిష్కాత్)

"ముస్లింకు ఎప్పుడైనా ఏదైనా వ్యాధిగాని, కష్టంగాని వస్తే దేవుడు దాని ద్వారా చెట్టు నుండి ఆకులు రాలినట్లు అతని పాపాలను అంతమొందిస్తాడు." (ముస్లిం)

"కష్టాలకు గురైన కారణంగా విశ్వాసి ఎప్పుడైనా లోగడ చేస్తూ వస్తున్న ఏదైనా సత్కార్యాన్ని గత్యంతరంలేని పరిస్థితిలో చేయలేకపోతే, ఆ పుణ్యఫలాన్ని కూడా (అతని కర్మపత్రంలో) రాయండని దేవుడు తన దూతలను ఆదేశిస్తాడు." (మిష్కాత్)

"కష్టాలు, కడగండ్ల పరీక్ష ఎదురైనప్పుడు విశ్వాసి సహనం వహించి దైవస్తోత్రం చేస్తుంటే, అతను తల్లి గర్భం నుంచి ఈరోజే పుట్టిన బిడ్డలా ఏ పాపంలేని పరమ పవిత్రుడయి పోతాడు. అప్పుడు దేవుడు తన దూతలను ఉద్దేశించి 'నేనే నా దాసుడ్ని (పరీక్షకు గురికాకుండా) ఆపాను. నేనే అతడ్ని పరీక్షకు గురిచేశాను. కనుక అతని కోసం మీరు అతను ఆరోగ్యంగా ఉన్నప్పుడు రాస్తుండిన పుణ్యమే (ఇప్పుడూ) రాయండి' అని ఆజ్ఞాపిస్తాడు." (మిష్కాత్)

విశ్వాసానికి, పరీక్షకు నడుమ అవినాభావ సంబంధం ఉంది. విశ్వాసం ఉన్నచోట పరీక్ష తప్పనిసరిగా ఉంటుంది. పరీక్షకు లోనుకాని విశ్వాసం గీటురాయి తాకని కల్తీ బంగారం లాంటిది. పరీక్షకు గురయినప్పుడే విశ్వాసి నిజస్వరూపం బయట పడుతుంది. ఈ యదార్థాన్ని విశ్వాసి ఎంతగా అర్థం చేసుకుంటే అంతగా అతను తనపై విరుచుకుపడే ఆపదలను సహించగలడు.



"మేము దేవుని ఆస్తులం. దేవుని వైపుకే మరలి పోవలసినవాళ్ళం" అని పలికేవారికి వారి ప్రభువు కారుణ్య కటాక్షాలు లభిస్తాయని శుభవార్త విన్పించు. అలాంటివారే సన్మార్గగాములు. (155-157)

సఫా, మర్వా (కొండ)లు (కూడా) దేవుని సూచనలే. కనుక ఆ రెండుకొండల మధ్య తిరగడంలో ఎలాంటి తప్పులేదు. (పైగా అది పుణ్యకార్యం కూడా.) పుణ్యకార్యం చేసేవారిని దేవుడు (తప్పక) ఆదరిస్తాడు. ఆయన సమస్తం తెలిసినవాడు. (158)

మేము మాగ్రంథంలో యావత్తు మానవుల మార్గదర్శనం కొరకు స్పష్టమైన ఆజ్ఞలను, హితవులను జారీచేశాము. అలాంటి ఆజ్ఞలు, హితవులను (ప్రజల ముందు వెల్లడించకుండా) దాచేవారిని దేవుడు శపిస్తున్నాడు. శపించేవారు కూడా వారిని శపిస్తున్నారు. అయితే జరిగిన దానికి పశ్చాత్తాపంచెంది, వ్యవహారశైలిని సరిదిద్దుకొని, దాచిన దైవాజ్ఞలను ప్రజలకు వెల్లడించే వారిని నేను క్షమిస్తాను. నేను క్షమాశీలిని, కరుణామయుడ్ని. (159-160)

అయితే అవిశ్వాసులైపోయి,[29] అవిశ్వాసస్థితిలోనే అంతిమశ్వాస విడిచేవారిని దేవుడు, దైవదూతలు, యావత్తు మానవులు శపిస్తారు. వారు ఎల్లప్పుడూ శాపగ్రస్తులుగానే ఉంటారు. అలాంటివారికి నరక యాతనలు తగ్గించడంగాని, మరొక అవకాశం ఇవ్వడంగాని ఎట్టి పరిస్థితిలోనూ జరగదు. (161-162)

మానవులారా! మీ ఆరాధ్యదైవం ఒక్కడే. కరుణామయుడు, కృపాసాగరుడయిన ఆ దేవుడు తప్ప (మీకు) మరో దేవుడు లేనేలేడు. భూమ్యాకాశాల సృజనలో, రేయింబవళ్ళ చక్రభ్రమణంలో, సముద్రాలలో పయనిస్తూ మానవులకు ప్రయోజనం చేకూర్చే ఓడలలో, దేవుడు పైనుంచి కురిపించే వర్షపునీటిలో, తద్వారా ఆయన మృతభూమికి జీవంపోసే (చెట్లూ చామల్నీ పచ్చదనంచేసే) పనిలో, పుడమిపై పలువిధాల జీవరాసుల్ని విస్తరింపజేసే ఆయన సృష్టి నైపుణ్యంలో, గాలుల సంచారంలో, నేలకు నింగికి మధ్య నియమబద్ధంగా సంచరించే మేఘాలలో బుద్ధి మంతులకు (దేవుని ఆస్తిత్వాన్ని, ఆయన ఏకత్వాన్ని తెలిపే) అనేకనేక నిదర్శనాలు ఉన్నాయి. (163-164)

---

ఏమైనప్పటికీ విశ్వాసులకు కష్టాలు రావడం ఆశ్చర్యకరమైన విషయమేమీ కాదు. నిజానికి కష్టాలు రాకపోవడమే ఆశ్చర్యకరమైన విషయం. ప్రతి కష్టం, ప్రతి నష్టం విశ్వాసికి ప్రయోజనకరమైన విషయమే. అలా అని కష్టాలు రావాలని కోరుకోకూడదు. ఎల్లప్పుడూ శాంతిశ్రేయాలు ప్రసాదించమనే దైవాన్ని వేడుకోవాలి. కష్టాలు ఎదురైతే మాత్రం సహనం పాటించాలి. అప్పుడు అతను దేవుని దృష్టిలో నిజమైన విశ్వాసిగా పరిగణించబడతాడు.

29. ఇక్కడ మూలభాషలో "కుఫ్ర్" అనే పదం ఉంది. కుఫ్ర్ అంటే శాబ్దిక భావం 'దాచడం'. అందులోనుంచే తిరస్కారం అనే అర్థం కూడా పుడ్తుంది. మానవుని అంతరాత్మ సత్యాన్ని సహజంగానే అంగీకరిస్తుంది. కాని అతను అనేక కారణాలవల్ల అంతరాత్మ ప్రబోధనను నొక్కిపట్టి సత్యాన్ని తిరస్కరిస్తాడు. అలాంటి వ్యక్తిని ఇస్లాం "కాఫిర్" అంటుంది. అంటే సత్యాన్ని తిరస్కరించినవాడు, దాచినవాడు అని అర్థం. దాచినవాడనే అర్థంలో విత్తనాలను నేలలో దాచే రైతును కూడా కాఫిర్ అంటారు. దీనికోసం 57వ అధ్యాయం (హదీద్)లోని 20వ సూక్తి చూడండి.

అయితే (సృష్టి నిర్వహణలో దేవుని ఏకత్వాన్ని తెలిపే ఎన్నో నిదర్శనాలు కళ్ళెదుట స్పష్టంగా కన్పిస్తున్నా బుద్ధినుపయోగించి వాటిని గమనించని) కొందరు నిజదేవుణ్ణి వదలి, మిధ్యాదైవాలను పట్టుకు వ్రేలాడుతున్నారు. పైగా వారు వాటిని నిజదేవుణ్ణి అభిమానిస్తున్నట్లు అమితంగా అభిమానిస్తున్నారు. విశ్వాసులు మాత్రం అందరికన్నా (నిజదేవుడైన) అల్లాహ్‌నే అత్యధికంగా అభిమానిస్తున్నారు. దుర్మార్గులు (నరక) యాతన చూసినప్పుడు 'సర్వశక్తులు సర్వాధికారాలు అల్లాహ్‌కే ఉన్నాయని, ఆయన అతి కఠినంగా శిక్షించేవాడని' తెలుసుకుంటారు. ఆ విషయం వారు (ఈనాడే) తెలుసుకుంటే ఎంత బాగుంటుంది! (165)

(సత్యతిరస్కారులైన) నాయకులు ఆరోజు తమ అనుయాయుల్ని అసహ్యించుకుంటూ, వారితోతమకు ఎలాంటి సంబంధంలేదన్నట్లు ప్రవర్తిస్తారు. అయితే (వారంతా) శిక్ష మాత్రం చవిచూస్తారు. వారి మధ్య (నాయకానుచరుల) సంబంధాలు పూర్తిగా తెగిపోతాయి. అప్పుడు వారి అనుయాయులు పశ్చాత్తాపంతో కుమిలిపోతూ, తమకు మరొకసారి (ఇహలోకానికి) తిరిగివెళ్ళే అవకాశం లభిస్తే, ఇప్పుడు వీరు తమల్ని అసహ్యించుకున్నట్లు తాము వీరిని అసహ్యించుకుంటాం అంటారు. ఈవిధంగా దేవుడు, వారు ఇహలోకంలో చేసిన దుర్మార్గం, దుష్టకార్యాలను వారి పశ్చాత్తాపానికి కారణ భూతంగా చేసిచూపిస్తాడు. వారిక నరకాగ్ని నుండి ఏవిధంగానూ బయటపడలేరు. (166-167)

మానవులారా! మీరు లోకంలో దొరికే ధర్మసమ్మతమైన పరిశుద్ధపదార్థాలే తినండి. షైతాన్ అడుగుజాడలలో నడవకండి. వాడు మీకు ఆగర్భశత్రువు. మిమ్మల్ని వాడు దుష్టకార్యాలకు, అశ్లీలచేష్టలకు పురిగొల్పుతాడు. దేవుని విషయంలో మీకేమాత్రం తెలియని విషయాల్ని గురించి దేవునిపేర పలకమని మిమ్మల్ని పురిగొల్పుతాడు. (168,169)

దేవుడు అవతరింపజేసిన దాన్ని అనుసరించండని అంటే "కాదు, మా తాత ముత్తాతలు అనుసరించినదాన్నే అనుసరిస్తాం" అంటారు వారు. మరి వారి తాత ముత్తాతలు తెలివిహీనులయినా, వారు సన్మార్గంలో లేకపోయినా (వారినే వీరు గుడ్డిగా అనుసరిస్తారా)?[30] కాపరి పిలుపు తప్ప మరే పిలుపూ వినలేని పశువుల్లా వుంది (ఈ)

---

30. అనుకరణ సహజ విషయమే. కాని అంధానుకరణ మానవునిలో ఉన్న ఓ పెద్ద బలహీనత. తాతముత్తాతల ఆచారాలు, సంప్రదాయాలు సమంజసమయినంత వరకు వాటిని పాటించవచ్చు. కాని సమంజసం, సముచితం కాకపోతేనే చిక్కు. వాటిని పాటించడం వల్ల ప్రపంచంలోనేగాక, పరలోకంలోనూ నష్టదాయకమే.

ఈనాటి ముస్లింలలో కూడా అనేక మంది అమాయకులు, అజ్ఞానులు ధర్మశాస్త్రంలో లేని ఆచారాలు ఎన్నో కల్పించుకున్నారు. తాము కల్పించుకున్న ఈ ఆచారలకు ఖుర్‌ఆన్, హదీసుల్లో ఏమైనా ఆధారాలు ఉన్నాయా అని కూడా ఆలోచించరు. సరైన దైవజ్ఞానం కలవారు ఎవరైనా "ఇలాంటి ఆధారంలేని ఆచారాలు పాటించడం మీకు తగదు, దైవక్రోధానికి గురికావలసివస్తుంద"ని అంటే..."ఓ యబ్బో! మీరేదో ఈరోజు కొత్తగా చెబుతున్నారుగాని, ఇవి మా పూర్వీకుల నుండి వస్తున్న ఆచారాలే. వీటిలో తప్పులేదు. వీటినే మేము అంటిపెట్టుకొని ఉంటాం" అనంటారు. ఇలాంటి అంధానుకరణనే ఈ సూక్తిలో విమర్శించడం జరిగింది. (5:104 సూక్తి కూడా చూడండి.)



తిరస్కారుల ధోరణి. వారు (సత్యం వినలేని) బధిరులు, (సత్యం పలకలేని) మూగలు, (సత్యం కానలేని) అంధులు. అంచేత వారికిక ఏ విషయమూ తలకెక్కదు. (170-171)

విశ్వాసులారా! మీరు దేవుణ్ణి మాత్రమే ఆరాధించేవారైతే మేము ప్రసాదించిన పరిశుద్ధ పదార్థాలనే తిని (దేవునికి) కృతజ్ఞులయి ఉండండి. ఆయన మీకు చచ్చిన పశువుల్ని, రక్తాన్ని, పందిమాంసాన్ని, దైవేతరులకు నైవేద్యం పెట్టిన పదార్థాలను, (అక్కడి మాంసాహారాన్ని) నిషేధించాడు.[31] అయితే దైవాజ్ఞలు ఉల్లంఘించే ఉద్దేశ్యం లేకుండా, హద్దుమీరకుండా గత్యంతరంలేని పరిస్థితిలో మాత్రం (ఈ నిషేధితాలు) తినవచ్చు. అందులో తప్పులేదు. దేవుడు క్షమించేవాడు, కరుణించేవాడు. (172-173)

అత్యల్ప ప్రాపంచిక ప్రయోజనాలు ఆశించి, దేవుడు అవతరింపజేసిన విషయాలను దాచిపెట్టేవారు వాస్తవానికి తమ పొట్టలను అగ్నితో నింపుకుంటున్నారు. అలాంటివారితో దేవుడు ప్రళయదినాన మాట్లాడడు. వారిని పరిశుద్ధపరచడు. వారికోసం దుర్భరమైన (నరక) యాతన (సిద్ధంచేయబడి) ఉంది. వీరే రుజుమార్గానికి బదులు మార్గభ్రష్టత్వాన్ని, మన్నింపుకు బదులు (నరక) యాతనను కొని తెచ్చుకున్నవారు. ఎంత ధైర్యం వీరికి, నరకాగ్నిని సైతం భరించడానికి సిద్ధమయ్యారు! (174-175)

దేవుడు సత్యపూరిత గ్రంథం అవతరింపజేసినప్పటికీ దాన్ని గురించి వారు విభేదాలు సృష్టించుకొని, పంతానికిపోయి నిజధర్మానికి దూరమైపోయారు. (176)

---

కొందరు అనుకరణ విషయంలో అతివాదానికి పోయి, అనుకరణ అంటేనే అంధానుకరణ అని వాదిస్తారు. కాని ఒక విషయం వీరు మరచిపోతున్నారు. ఇదే అధ్యాయం 133వ సూక్తిలో యాఖూబ్ ప్రవక్త (అలైహి) ఇహలోకం వీడిపోతూ "నా తరువాత మీరు ఎవరిని ఆరాధిస్తార"ని తన సంతానాన్ని అడిగినప్పుడు "మేము మీ తాత ముత్తాతలయిన ఇబ్రాహీం, ఇస్‌హాఖ్‌లు ఆరాధించిన ఏకేశ్వరుడ్నే ఆరాధిస్తాం" అని సమాధానమిచ్చారు వారు. ఈ సూక్తిలో "మీ తాత ముత్తాతలు ఆరాధించిన ఏకేశ్వరుడ్ని" అని ఉంటే, పై సూక్తిలో "మా తాత ముత్తాతలు అనుసరించిన మార్గం" అని ఉంది. ఈ రెండిటిలోనూ అనుకరణ భావం ఉంది. అయితే మొదటిది సరైన అనుకరణ, ధర్మసమ్మతమైన వ్యవహారం క్రిందికి వస్తుంది. రెండవది అంధానుకరణ, ధర్మసమ్మతంకాని వ్యవహారం క్రిందికి వస్తుంది.

31. ఈ నాలుగు మాత్రమే గాకుండా మరికొన్ని ప్రాణుల మాంసం కూడా నిషేధించ బడింది. నిషేధం గురించి హదీసుల్లో రెండు సూత్రాలు చెప్పబడ్డాయి. వాటి ప్రకారం కోరలు, గోళ్ళతో ఇతర పశుపక్షుల్ని వేటాడే క్రూరమైన జంతువులు, పక్షులు నిషేధించబడ్డాయి. మరికొన్ని హదీసుల ప్రకారం కుక్క, గాడిదల మాంసం కూడా నిషిద్ధమే. మరికొన్నిటిని జిబహ్ చేయకుండానే తినవచ్చని హదీసులు తెలియజేస్తున్నాయి. అవి చేపలు, మిడతలు.

పోతే రక్తం నిషిద్ధమని ఈ సూక్తి చెబుతోంది. అంటే జిబహ్ చేసేటప్పుడు స్రవించే రక్తం అన్నమాట. మాంసానికి అంటుకొని ఉండే రక్తం మటుకు నిషిద్ధం కాదు. అలాగే దైవేతర శక్తులను ఆరాధించడం, వారిని వేడుకోవడం ఎంతటి పాపకార్యమో, వారి సమాధులు, దర్గాల దగ్గర 'జబహ్' చేసే పశువుల మాంసం, ఇతర నైవేద్య పదార్థాలు తినడం కూడా అంతే పాపకార్యం. (ఈ సూక్తితో పాటు 5:3, 6:145, 16:115 సూక్తులు కూడా చూడండి.)

మీ ముఖాలు తూర్పు లేక పడమరకు తిప్పుకోవడమే పుణ్యకార్యం కాదు. దేవుడ్ని, అంతిమ దినాన్ని, దైవదూతలను, దేవుడు పంపిన (అంతిమ) గ్రంథాన్ని, ఆయన ప్రవక్తలను హృదయపూర్వకంగా విశ్వసించి, దేవుని మీది ప్రేమాభిమానాలతో మీకత్యంత ప్రియమయిన ధనాన్ని బంధువుల కోసం, అనాథల కోసం, నిరుపేదల కోసం, బాటసారుల కోసం, సహాయార్థుల కోసం, బానిసల విముక్తి కోసం ఖర్చు చేయాలి; నమాజ్ (ప్రార్థనా) వ్యవస్థ నెలకొల్పాలి; జకాత్ చెల్లించాలి; ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి; కష్టకాలంలో, (సత్యాసత్యాల మధ్య జరిగే) పోరాటంలో సహనం వహించాలి. ఇలాంటి సత్కార్యాలు చేసేవారే సన్మార్గగాములు. వారే (దేవునిపట్ల) భయభక్తులు కలిగినవారు. (177)

విశ్వాసులారా! మీకోసం హత్యవ్యవహారాలకు సంబంధించిన ఆజ్ఞ జారీచేస్తున్నాం. స్వేచ్ఛాపరునికి బదులు స్వేచ్ఛాపరుడ్ని, బానిసకు బదులు బానిసను, స్త్రీకి బదులు స్త్రీని మాత్రమే (హతమార్చాలి). ఒకవేళ హంతకుని పట్ల అతని (మానవతా) సోదరుడు (హతుని బంధువు) కొంత మృదువైఖరి అవలంబించడానికి సిద్ధపడితే, రక్తపరిహార సమస్య సామరస్యంగా పరిష్కారమవ్వాలి. దానిప్రకారం హంతకుడు నిర్ణీత రక్తపరిహారాన్ని సంతోషంగా ఇచ్చివేయాలి. ఇది మీప్రభువు నుండి లభిస్తున్న సౌలభ్యం, దైవానుగ్రహం. ఆపై కూడా ఎవరైనా హద్దుమీరితే అతనికి (పరలోకంలో) దుర్భరశిక్ష పడుతుంది. కనుక బుద్ధిమంతులారా! (ఇలాంటి) ప్రతిక్రియలోనే మానవ జీవితానికి భద్రత ఉందని తెలుసుకోండి. తద్వారా మాత్రమే మీరు హత్యా రక్తపాతాలకు దూరంగా ఉండగలుగుతారు. (178-179)

మీపై (మరో) బాధ్యత మోపబడుతోంది (వినండి). మీలో ఎవరికైనా మరణ కాలం ఆసన్నమయితే, అతను ఆస్తి కూడా వదలిపోతున్న పక్షంలో తల్లిదండ్రులకు, బంధువులకు ఆస్తి పంపిణీ విషయమయి తగిన వీలునామా రాసిపోవాలి.[32] ఇది (దేవుని పట్ల) భయ భక్తులు వున్నవారు నెరవేర్చవలసిన విధ్యుక్త ధర్మం. (180)

---

32. వారసత్వపు ఆస్తి పంపకం విషయంలో ఇంకా ఎలాంటి దైవచట్టం నిర్ణయించకబడక ముందు ఈ ఆజ్ఞ ఇవ్వబడింది. ఆనాడు వారసుల్లో ఎలాంటి గొడవలు రాకుండా ఉండేందుకు ప్రతి వ్యక్తీ (తన మరణానికి ముందుగా) వీలునామా ద్వారా విధిగా తన వారసుల వాటాలను నిర్ణయించాలని ఈ సూక్తిలో చెప్పబడింది. ఆ తరువాత కొన్నాళ్ళకు దేవుడు స్వయంగా వారసుల వాటాలను నిర్ణయించడంతో ఈ సూక్తిలో పేర్కొనబడిన ఆజ్ఞ రద్దయిపోయింది. (ఈ విషయం నిసా (స్త్రీలు) 4వ అధ్యాయంలో వస్తుంది.)

దాని ప్రకారం దేవుడు నిర్ణయించిన వాటాలలో ఏ విధంగానూ ఎక్కువ తక్కువలు చేయ కూడదని, వారసులుకానివారికి ఏదయినా సహాయం చేయదలచుకుంటే మొత్తం ఆస్తిలో మూడో వంతుకు లోపుగా మాత్రమే (అలాంటి వారి వాటాలను నిర్ణయిస్తూ) వీలునామా రాయాలని దైవప్రవక్త (సల్లం) బోధించారు. మూడో వంతుకు మించి వీలునామా రాయించడానికి ఎవరికీ ఎలాంటి అధికారం లేదు. అలాగే విశ్వాసి, అవిశ్వాసులు ఒకరి ఆస్తులకు మరొకరు వారసులు కాజాలరని కూడా దైవప్రవక్త (సల్లం) చెప్పారు.



ఒకవేళ వీలునామాలోని విషయాలు విన్న తరువాత వాటిని ఎవరైనా మార్చివేస్తే మాత్రం ఆపాపం వారినే చుట్టుకుంటుంది. నిస్సందేహంగా దేవుడు సర్వం వినేవాడు, సమస్తం తెలిసినవాడు.

వీలునామా రాసిన వ్యక్తి పక్షపాతానికి పాల్పడ్డాడనిగాని, లేదా ఎవరి హక్కైనా హరించి వేశాడనిగాని (వారసుల్లో) ఎవరికైనా అనుమానం వస్తే, అతను (వీలునామాను మార్చి వేసి) వారసుల మధ్య రాజీ కుదుర్చవచ్చు. అందులో ఎలాంటి దోషం లేదు. దేవుడు క్షమించేవాడు, కరుణించేవాడు. (181-182)

విశ్వాసులారా! గతప్రవక్తల అనుయాయులకు ఏవిధంగా ఉపవాసాలు విధించ బడ్డాయో అదేవిధంగా (ఇప్పుడు)మీరు కూడా ఉపవాసాలు పాటించాలని నిర్ణయించాం. దీనివల్ల మీలో భయభక్తులు జనించే అవకాశముంది. ఈ ఉపవాసాలు కొన్నాళ్ళపాటు మాత్రమే. ఒకవేళ మీలో ఎవరైనా వ్యాధిగ్రస్తుడయితే లేదా ప్రయాణావస్థలో ఉంటే అలాంటి వ్యక్తి తప్పిపోయిన ఆ ఉపవాసాలను ఇతర దినాలలో పాటించి (నెల ఉపవాసాలు) పూర్తిచేయాలి. ఉపవాసం పాటించే శక్తి ఉండి కూడా దానిని పాటించని వారు మాత్రం పాపపరిహారం చెల్లించవలసి ఉంటుంది.[33] ఒక ఉపవాస దినానికి పరిహారంగా ఒక నిరుపేదకు భోజనం పెట్టాలి. (ఈ విషయంలో) ఎవరైనా తమంతటతాము సంతోషంగా మరింత పుణ్యం చేయదలచుకుంటే అది వారికే మేలు చేకూర్చుతుంది. ఏమైనప్పటికీ) మీరు విషయం గ్రహించగలిగితే ఉపవాసం పాటించడమే మీకు శ్రేయస్కరం. (183-184)

రమజాన్ ఖుర్ఆన్ అవతరించిన నెల. ఈగ్రంథం మానవాళికి మార్గదర్శిని. ఇందులో రుజుమార్గం తెలిపే, సత్యాసత్యాలను, మంచీచెడులను వేరుపరచి చూపే స్పష్టమైన బోధనలు ఉన్నాయి, కనుక ఇకనుండి మీలో రమజాన్ నెలను పొందేవారు ఆ నెలంతా విధిగా ఉపవాసం పాటించాలి. అయితే రోగగ్రస్తులు, ప్రయాణీకులు (రమజాన్ నెలలో తప్పిపోయిన) ఉపవాసాలను ఇతర దినాలలో పాటించి (ఆ సంఖ్యను) పూర్తిచేయాలి. దేవుడు మీకు సౌలభ్యం చేకూర్చదలిచాడుగాని, మిమ్మల్ని ఇబ్బంది పాల్జేయాలని భావించడంలేదు. మీరు ఉపవాసాల సంఖ్యను పూర్తిచేసుకోవడానికి, దేవుడు మీకు సన్మార్గం చూపినందుకు ఆయన ఔన్నత్యాన్ని కొనియాడటానికి, ఆయనకు కృతజ్ఞులయి ఉండటానికిగాను ఈ సౌలభ్యం ప్రసాదించాడు. (185)

(ప్రవక్తా!) నాదాసులు నాగురించి అడిగితే నేను వారికి చేరువలోనే ఉన్నానని చెప్పు. మొరపెట్టుకునేవాడు నన్ను మొరపెట్టుకుంటున్నప్పుడు నేనతని మొరాలకించి, దానికి సమాధాన మిస్తానని కూడా తెలియజెయ్యి. అయితే వారు నాసందేశం స్వీకరించి నాపట్ల పూర్తివిశ్వాసం కలిగివుండాలి. అప్పుడే వారు సన్మార్గం పొందగలరు. (186)

---

33. ఇది ఉపవాస విషయంలో అవతరించిన మొదటి ఆజ్ఞ. ఇందులో శక్తి ఉండి కూడా ఉపవాసం పాటించని వ్యక్తి నిరుపేదలకు అన్నదానం చేస్తే సరిపోతుందని చెప్పబడింది. అయితే ఆ తరువాత సూక్తిలో రమజాన్ ఉపవాసాలు శక్తి కలిగినవారు విధిగా పాటించాలని ఆజ్ఞయింది.

ఉపవాసకాలం రాత్రివేళల్లో మీరు మీ భార్యల దగ్గరకు పోవడం ధర్మసమ్మతం చేయబడింది. వారు మీకు, మీరు వారికి దుస్తుల్లాంటివారు.[34] మీరు (మీ భార్యల చెంతకు పోవడానికి సంకోచిస్తూ) ఆత్మద్రోహం చేసుకుంటున్న సంగతి దేవునికి తెలుసు. అందువల్ల ఆయన మిమ్మల్ని కనికరించి మీ పొరపాట్లు మన్నిస్తున్నాడు. ఇప్పుడిక మీరు మీభార్యలతో నిస్సంకోచంగా రాత్రులు గడపవచ్చు. దేవుడు మీకు ధర్మసమ్మతం చేసినదాన్ని (దాంపత్యసుఖాన్ని) అనుభవించండి. మీరు (ఉపవాస కాలంలో) కడరేయి నలుపు(చీకటి) తగ్గి తొలిజాము తెలుపు (ఉషోదయకాంతి) కనపడేవరకు హాయిగా తినండి, త్రాగండి. ఆ తర్వాత (వీటన్నిటినీ త్యజించి) సూర్యాస్తమయమై చీకటి పడేవరకు ఉపవాసం పాటించాలి. అయితే మీరు మసీదుల్లో ఎతెకాఫ్ (తపోనిష్ఠ) పాటిస్తున్నప్పుడు మాత్రం మీ భార్యలను కలుసుకోకూడదు. ఇవి దేవుడు నిర్ణయించిన హద్దులు. వాటి దరిదాపులకు వెళ్ళకండి.[35] ప్రజలు (పెడత్రోవ తొక్కకుండా) భయభక్తులతో మెలిగేందుకే దేవుడు ఈవిధంగా తన ఆదేశాలను విడమరచి తెలియజేస్తున్నాడు. (187)

మీరు ఒకరి ధనాన్ని మరొకరు అక్రమంగా కబళించకండి. అలాగే ఇతరుల సొత్తును అన్యాయంగా కాజేసే ఉద్దేశ్యంతో ఆ వ్యవహారాన్ని అధికారుల దగ్గరకు తీసికెళ్ళకండి. (188)

(ప్రవక్తా!) ప్రజలు నిన్ను నెలవంక గురించి (ఈ తరిగే పెరిగే చంద్రకళల సంగతేమిటని) అడుగుతున్నారు. ఇవి ప్రజల అవసరాలకు, హజ్‌యాత్ర తేదీల నిర్ణయానికి సంకేతాలని చెప్పు. వారికింకా ఇలా తెలియజెయ్యి: "మీరు మీ ఇండ్లలోకి దొడ్డిదారిన ప్రవేశించడం ఏమాత్రం పుణ్యకార్యం కాదు. (అంధవిశ్వాసాలకు, అక్రమ పద్ధతులకు దూరంగా మసలుకుంటూ) దేవుని పట్ల భయభక్తులు కలిగి ఉండటమే అసలైన పుణ్యకార్యం. కనుక మీరు మీఇండ్లలోకి వాటి ముఖద్వారం గుండానే ప్రవేశించండి. మీరు (ఇహలోకంలోనూ, పరలోకంలోనూ) సఫలం కావడానికి ఎల్లప్పుడూ దేవునికి భయపడుతూ ఉండండి. (189)

మీతో పోరాడే వారితో మీరు (ఆత్మ రక్షణార్థం) దైవమార్గంలో పోరాడండి. అయితే హద్దుమీరకూడదు. హద్దుమీరి ప్రవర్తించేవారిని దేవుడు ఎన్నటికీ ప్రేమించడు.[36](యుద్ధ

---

34. దేహానికి దుస్తులకు మధ్య ఎలాంటి అవినాభావ సంబంధముంటుందో భార్యాభర్తల మధ్య కూడా అలాంటి సంబంధమే ఉందని, అందువల్ల రమజాన్ నెల రాత్రివేళల్లో పురుషులు తమ భార్యాలను ఎలాంటి సంకోచం లేకుండా కలుసుకోవచ్చని దేవుడు తెలియజేస్తున్నాడు.

35. ఇక్కడ హద్దులు అతిక్రమించ కూడదని చెప్పలేదు; హద్దుల దరిదాపులకు వెళ్ళకండి అని చెప్పడం జరిగింది. అంటే హద్దులలోపే ఉండాలన్న మాట. హద్దులు దరిదాపులకు వెళ్తే ఆ తర్వాత ఏదో ఓరోజు వాటిని కూడా దాటిపోయి పాపపంకిలంలో పడే ప్రమాదం ఉంటుంది.

36. మక్కాలో అవిశ్వాసులు ముస్లింల జీవితాలను దుర్భరం చేసి వారిని మక్కా వదలి మదీనా వలసపోయేలా చేశారు. కాని అక్కడా వారిని ప్రశాంతంగా ఉండనివ్వకుండా రకరకాల కుట్రలు పన్నుతూ చివరికి మదీనాపై దాడి చేయడానికి సిద్ధమయ్యారు. అప్పుడు మానవ



భూమిలో) వారు మీకు ఎక్కడ ఎదురైనా సరే వారితో పోరాడండి. వారు మిమ్మల్ని ఎక్కడ (మక్కా) నుండి వెళ్ళగొట్టారో అక్కడ నుండి మీరూ వారిని వెళ్ళగొట్టండి. హత్య తీవ్రమైన విషయమే కాని, హింసా పీడనలు అంతకన్నా తీవ్రమైన విషయాలు.[37]వారు ప్రతిష్ఠాలయం (కాబాగృహం) దగ్గర (మీతో) పోరాడనంతవరకూ మీరు కూడా వారితో పోరాడకండి. అయితే వారు అక్కడా కయ్యానికి కాలుదువ్వితే మీరు కూడా వారిని నిస్సంకోచంగా ఎదుర్కొని హతమార్చండి. సత్యతిరస్కారులకు ఇదే తగినశిక్ష. (190-191)

ఒకవేళ వారు యుద్ధం మానుకొని తిరుగుబాటు వైఖరికి స్వస్తిచెబితే, దేవుడు ఎంతో క్షమాశీలి, కరుణామయుడు. (వారి తిరుగుబాటు వైఖరిని ఆయన క్షమించ వచ్చు.) అయితే (వారు యుద్ధవిరమణ చేయని పక్షంలో) మీరు అధర్మం, అరాచకం పూర్తిగా సమసిపోయి, దేవుడు నిర్దేశించిన ధర్మపథం మాత్రమే నిలిచి పోయేవరకు వారితో పోరాడాలి. తరువాత వారు తమ ఆగడాలు మానుకుంటే, మీరు దౌర్జన్యపరుల్ని తప్ప మరెవరినీ అణచి వేయకండి. (192-193)

నిషిద్ధమాసానికి బదులు నిషిద్ధమాసమే సరిపోతుంది. నిషేధితాలన్నిటినీ అందరూ సమానంగా గౌరవించవలసిందే. అయితే ఎవరైనా (నిషిద్ధమాసంలో లేదా పవిత్ర స్థలం దగ్గర) మీపై దాడిచేస్తే మీరుకూడా వారిపై దాడిచేయండి.[38]అయితే దేవునికి భయ పడుతూ మసలుకోవాలి. దేవునికి భయపడేవారికే ఆయన అండగా నిలుస్తాడు. (194)

దైవమార్గంలో ఖర్చుపెట్టండి. చేజేతులా నాశనం కొనితెచ్చుకోకండి. సత్కార్యాలు చేస్తూవుండండి. సత్కార్యాలు చేసేవారిని దేవుడు తప్పకుండా ప్రేమిస్తాడు. (195)

దైవప్రసన్నత కోసం హజ్‌యాత్ర చేయండి. ఉమ్రా ఆచారం కూడా పాటించండి. మార్గమధ్యలో మీకేదైనా అవరోధం ఎదురైతే, మీకు అందుబాటులో ఉన్న బలిదానాన్నే దేవునికి సమర్పించుకోండి. అయితే బలి(పశువు) దానం, దాని స్థానానికి చేరుకోనంత వరకు మీరు శిరోముండనం చేయించుకోకండి. ఒకవేళ మీలో ఎవరైనా వ్యాధిగ్రస్తు లయితే లేదా శిరోబాధకు లోనయి (బలిపశువు నిర్ణీత స్థలానికి చేరుకోకముందే) శిరోముండనం చేయించుకోవలసి వస్తే అలాంటివారు దానికి పరిహారంగా ఉపవాసం పాటించాలి; లేదా దానధర్మాలు చేయాలి; లేదా బలిదానం (ఖుర్బాని) ఇవ్వాలి.

---

సంస్కరణోద్యమానికి అడుగడునా ఆటంకాలు సృష్టిస్తూ, సాయుధపోరాటానికి దిగిన సత్యవిరోధు లతో మీరు సాయుధలయి పోరాడండని ముస్లింలకు ఆజ్ఞ ఇవ్వబడింది.

అయితే హద్దు మీరకూడదు. హదీసుల్లోని వివరాల ప్రకారం ముస్లింలు అలాంటి వారితో తప్ప తమ మార్గానికి అవరోధం కల్పించనివారితో పోరాడకూడదు. స్త్రీలు, పిల్లలు, వృద్ధులు, క్షత గాత్రులపై కూడా చేయి చేసుకోరాదు. పంటలు, పశువులను నాశనం చేయకూడదు. వెన్నుజూపి పారిపోయేవారిని వెంటాడి చంపకూడదు. అవసరమైన మేరకే సైనికశక్తిని వినియోగించాలి.

37. ఇక్కడ మూలభాషలో వచ్చిన "ఫిత్నా" అనే పదానికి ఇంగ్లీషులో (Persecution) అనే పదం కొంతవరకు సమానార్థాన్ని ఇస్తుంది. (2: 217 సూక్తి చూడండి.)

38. వివరాలకు 9:36 సూక్తికి రాసిన పాదసూచిక చూడండి.

తర్వాత (అవరోధం తొలగిపోయి లేదా) ప్రశాంత పరిస్థితి ఏర్పడినప్పుడు మీలో ఎవరైనా హజ్‌దినాలు రాకముందే యాత్రాస్థలానికి చేరుకొని ఉమ్రా ఆచారం పాటిస్తే, అలాంటివారు తమ స్తోమతను బట్టి బలిదానం ఇవ్వాలి. బలిదానం ఇవ్వలేనివారు హజ్ కాలంలో మూడురోజులు, ఇంటికి తిరిగొచ్చిన తరువాత ఏడురోజులు చొప్పున మొత్తం పదిరోజులు ఉపవాసం పాటించాలి. ప్రతిష్ఠాలయం సమీపంలో ఇల్లూ వాకిలి లేనివారికి మాత్రమే ఈ సౌలభ్యం వర్తిస్తుంది. దేవుని పట్ల భయభక్తులు కలిగిఉండండి. ఆయన (ఆజ్ఞోల్లంఘనకు పాల్పడేవారిని) కఠినంగా శిక్షిస్తాడని గుర్తుంచుకోండి. (196)

హజ్ నెలలు మీకు తెలిసినవే. అ నెలల్లో హజ్ చేయడానికి సంకల్పించుకున్న వారు హజ్‌నియమాలు పాటించే రోజులలో లైంగికచేష్టలకు, చెడుపనులకు, ఘర్షణ లకు దూరంగా ఉండాలి. మీరు చేసే ప్రతి సత్కార్యం దేవునికి తెలుసు. హజ్‌యాత్రకు బయలుదేరినప్పుడు ప్రయాణసామగ్రి వెంట తీసికెళ్ళండి. అన్నిటికంటే శ్రేష్ఠమైన ప్రయాణసామగ్రి దైవభీతే. కనుక విజ్ఞులారా! నాపట్ల భయభక్తులు కలిగివుండండి.

హజ్ దినాలలో మీరు దేవుని అనుగ్రహం (ఉపాధి) అన్వేషించదలచుకుంటే నిరభ్యంతరంగా అన్వేషించవచ్చు. అందులో ఎలాంటి తప్పు లేదు. అరఫాత్ నుండి తిరిగివస్తూ మష్అరిల్‌హరాం (ముజ్దల్ఫా)లో ఆగి అల్లాహ్‌ను ఆయన నేర్పిన విధంగా స్మరించండి. దీనికి పూర్వం మీరు దారితప్పి నడుస్తుండేవారు. (197,198)

ఆ తరువాత ప్రజలు ఏ స్థలం నుండి వెనక్కి మరలి వస్తారో మీరు కూడా అదే స్థలం నుండి వెనక్కి మరలండి. దేవుడ్ని క్షమాపణ కోరుకోండి. దేవుడే మీ పొరపాట్లను క్షమించేవాడు. ఆయన ఎంతో దయామయుడు. హజ్ నియమాలు నెరవేర్చిన తర్వాత మీరు పూర్వం మీ తాతముత్తాతలను ఏవిధంగా జ్ఞాపకం చేసుకునేవారో అదేవిధంగా లేదా అంతకంటే మరింత అధికంగానే ఇప్పుడు దేవుడ్ని స్మరించండి.

కొందరు ప్రజలు దేవుడ్ని ప్రార్థిస్తూ " ప్రభూ! మాకు (నీవు ప్రసాదించేవన్నీ) ప్రపంచం లోనే ప్రసాదించు" అంటారు. అలాంటివారికి (ప్రపంచంలోనే తప్ప) పరలోక (స్వర్గ)ంలో ఎలాంటి వాటా లభించదు. (199-200)

మరికొందరున్నారు. వారు "ప్రభూ! మాకు ఇహలోకంలోనూ, పరలోకంలోనూ మంచిని ప్రసాదించు. మమ్మల్ని నరకయాతనల నుండి రక్షించు" అని వేడుకుంటారు. ఇలాంటివారికి వారి సంపాదనను బట్టి ఉభయలోకాల్లోనూ తగిన వాటా (ప్రతిఫలం) లభిస్తుంది. దేవుడు త్వరలోనే (కర్మల) లెక్క తీసుకుంటాడు. (201-202)

మీరు కొన్నాళ్ళే (అక్కడ) దైవనామ స్మరణలో గడపవలసి ఉంటుంది. ఎవరైనా రెండు రోజుల్లోనే త్వరగా అక్కడ నుండి వెళ్ళిపోయినా లేదా ఆలస్యంగా వెళ్ళినా ఎలాంటి దోషం లేదు. ఏమైనా మీరక్కడ ఉన్నంతకాలం భయభక్తులతో ఉండాలి. దేవుని పట్ల భయభక్తులు కలిగివుండండి. చివరికి మీరంతా ఆయన సన్నిధికే చేరుకోవలసి వుంటుంది. (203)



కొందరు ఇహలోక జీవితాన్ని గురించి చెప్పేమాటలు నిన్నెంతో ఆకట్టుకుంటాయి. వారు తమ అంతరంగాల్లో వున్న భావాలు పరమ పవిత్రమైనవని తెలిపేందుకు మాటి మాటికి దేవుడ్ని సాక్షిగా తీసుకువస్తారు. కాని వారు సత్యానికి బద్ధవిరోధులు. (204)

అలాంటివారికి అధికారం లభించగానే ప్రపంచంలో కల్లోలాల వ్యాప్తికి, పంట పొలాల విధ్వంసానికి, మానవ వినాశానికే వారు సదా ప్రయత్నిస్తారు. దేవుడు కలహాలు, కల్లోలాలు, విధ్వంసం, వినాశాలను ఎంతమాత్రం సహించడు. దేవునికి భయపడండని అంటే (మరీ పెట్రేగిపోతారు.) వారి అహంకారం వారిని మరింత పాపకూపంలోకి నెట్టి వేస్తుంది. అలాంటివారికి నరకమే తగిన శిక్షాస్థలం. అది పరమచెడ్డస్థలం. (205,206)

మరికొందరున్నారు. వారు దేవుని ప్రసన్నత కోసం తమ ప్రాణాలను సైతం ధార పోస్తారు. అటువంటి దాసులను దేవుడు ఎంతో ప్రేమిస్తాడు, అనుగ్రహిస్తాడు. (207)

విశ్వసించిన ప్రజలారా! ఇస్లాంలో పూర్తిగా ప్రవేశించండి. షైతాన్ అడుగు జాడలలో నడవకండి. అతను మీకు ఆగర్భ శత్రువు. స్పష్టమైన బోధనలు అందినప్పటికీ మీరు తిరిగి తప్పటడుగులు వేస్తే మటుకు, బాగా తెలుసుకోండి! దేవుడు సర్వశక్తి మంతుడు, సర్వం తెలిసిన మహావివేకి. (208-209)

(ఎన్ని విధాల ఉపదేశించినా ప్రజలు తమ నడవడికను మార్చుకోకపోతే ఇక దేని కొరకు ఎదురుచూస్తున్నట్లు?) దైవదూతలు వెంటరాగా మేఘచ్ఛాయల క్రింద దేవుడు స్వయంగా దివినుండి దిగివచ్చి తమనుగురించి అటోఇటో తేల్చిచెప్పే సమయం కోసం వారు ఎదురుచూస్తున్నారా? చివరికి సమస్త వ్యవహారాలు దేవునివద్దకే చేరుతాయి. ముహమ్మద్! మేము ఇస్రాయిలీయులకు ఎన్ని స్పష్టమైన నిదర్శనాలు చూపామో అడుగు. దైవానుగ్రహం లభించిన తర్వాత దాన్ని (ఆచరించడానికి బదులు) దౌర్భాగ్యం గా మార్చుకున్న జాతిని ఎంత కఠినంగా శిక్షించాడో కూడా వారినే అడుగు. (210,211)

అవిశ్వాసవైఖరి అవలంబించినవారికి ఇహలోక జీవితం ఎంతో ఆకర్షణీయంగా కనిపించేలా చేయబడింది. వారు విశ్వాసుల్ని హేళనచేస్తున్నారు. అయితే అలా హేళన చేసినవారి కంటే దైవభీతిపరులే ప్రళయదినాన ఉన్నత స్థానంలో ఉంటారు. ప్రపంచం లో దేవుడు తాను తలచిన వారికి విస్తృతంగా సిరిసంపదలు ప్రసాదిస్తాడు. (212)

ప్రారంభంలో మానవులంతా ఒకే ధర్మాన్ని అనుసరిస్తూ ఒకే దారిన నడుస్తుండే వారు. (ఆ తరువాత వారిలో విభేదాలు వచ్చాయి.) తరువాత దేవుడు వారి దగ్గరకు (సన్మార్గం అవలంబించేవారికి) శుభవార్తలు తెలిపే, (అపమార్గంలోనే పడివుండేవారిని) హెచ్చరించే ప్రవక్తలను పంపుతూ వచ్చాడు. సత్యం గురించి ప్రజలలో వచ్చిన విభేదా లను పరిష్కరించడానికి ఆయన ప్రవక్తలపై సత్యపూరిత గ్రంథాలను కూడా అవతరింప జేశాడు. ఈ విభేదాలు సృష్టించినవారు సత్యజ్ఞానం ప్రసాదించబడినవారే. స్పష్టమైన హితోక్తులు లభించిన తరువాత కూడా వారు మూర్ఖత్వంతో సత్యాన్ని వదిలేసి విభిన్న పద్ధతులు సృష్టించుకున్నారు. ఏ సత్యం గురించి వారు విభేదాలు సృష్టించారో ఆ

సత్యాన్ని పొందే మార్గం దేవుడు దయతో (ఇప్పుడీ) విశ్వాసులకు చూపాడు. దేవుడు తాను తలచుకున్న వారికి సన్మార్గం చూపుతాడు. (213)

విశ్వాసులారా! మీకు పూర్వం విశ్వాసులకు వచ్చిన (కష్టాల)న్నీ మీపై రాకముందే మీకు ఇట్టే స్వర్గప్రవేశం లభిస్తుందని భావిస్తున్నారా? ఆనాటి విశ్వాసులపై ఎన్నో కష్టాలు, కడగండ్లు విరుచుకు పడ్డాయి. వారు తీవ్ర ఆందోళన చెందారు. చివరికి అప్పటి దైవప్రవక్త, ఆయన సహచరులైన విశ్వాసులు (ఆ కష్టాలకు తట్టుకోలేక) "దైవసహాయం ఎప్పుడు వస్తుంది?" అని అరిచారు. అప్పుడు వారికి "ఇదిగో దైవసహాయం సమీపంలోనే ఉంది" (అని ధైర్యం చెప్పడం జరిగింది).[39] (214)

వారు (దైవమార్గంలో) సంపద ఏ విధంగా ఖర్చుచేయాలని అడుగుతున్నారు. వారికి ఇలా చెప్పు: "మీరు ఖర్చుచేయ దలచుకున్నది మీ తల్లిదండ్రులు, బంధువులు, అనాథలు, అగత్యపరులు, బాటసారుల శ్రేయస్సు కోసం ఖర్చుచేయండి. ఎవరు ఏ సత్కార్యం చేసినా దాన్ని గురించి దేవునికి బాగా తెలుసు. (215)

మీరు (దైవమార్గంలో) విధిగా యుద్ధం చేయాలని ఆజ్ఞ అయింది. కాని అది మీకు రుచించడంలేదు. ఒక విషయం మీకు నచ్చక పోవచ్చు. కాని అందులోనే మీ శ్రేయస్సు ఉండవచ్చు. అలాగే ఒక విషయం మీకు నచ్చవచ్చు. కాని అందులోనే మీకు హాని ఉండవచ్చు. (మంచీచెడులు) దేవునికే బాగా తెలుసు, మీకు తెలియదు. (216)

ప్రజలు నిన్ను పవిత్ర మాసాలలో యుద్ధం చేయడం గురించి అడుగుతున్నారు. వారికి ఇలా తెలియజెయ్యి: "ఆ మాసాలలో యుద్ధం చేయడం ఘోరమైన విషయం. అయితే దైవమార్గంలో అవరోధాలు సృష్టించడం, దేవుడు పంపిన సందేశాన్ని నిరాకరించడం, దైవభక్తుల్ని ప్రతిష్ఠాలయం (కాబాగృహం)లో ప్రవేశించనీయకుండా నిరోధించడం, అక్కడ ఉండేవారిని బయటికి గెంటివేయడం- ఇవన్నీ దేవుని దృష్టిలో అంతకన్నా ఘోరమైన చర్యలు. హింసా పీడనలు హత్యా రక్తపాతాల కన్నా చాలా ఘోరమైనవి. వారికి సాధ్యపడితే మిమ్మల్ని మీ ధర్మం నుండి మరలించేవరకు మీతో పోరాడుతూనే ఉంటారు. అప్పుడు మీలో గనక ఎవరైనా ఈ ధర్మాన్ని వదలి సత్యతిరస్కారిగా మారి, చివరికి అదే స్థితిలో చనిపోతే మాత్రం అతని ఇహపర కర్మలన్నీ వ్యర్థమైపోతాయి. ఇలాంటి ఉభయభ్రష్టులే నరకవాసులు. నరకంలోనే వారు (నానా యాతనలు అనుభవిస్తూ) ఎల్లకాలం పడివుంటారు. (217)

దీనికి భిన్నంగా ఎవరు (సత్యాన్ని) విశ్వసించి, (దేవుని ప్రసన్నత కోసం) ఊరూ, వాడా వదలి వలసపోయి దైవమార్గంలో నిరంతరం పోరాటం[40] సలుపుతారో వారు

39. వివరాలకు 2:155-157, 29:1-3 సూక్తులు, వాటి పాదసూచికలు చూడండి.

40. మూలభాషలో "జిహాద్" అనే పదం వచ్చింది. జిహాద్ అంటే లక్ష్యసాధన కోసం సర్వ శక్తులు, ఒనరులు వినియోగించి తీవ్రంగా కృషిచేయడం, పోరాడటం (Struggle) అని అర్థం. ఈ విస్తృత భావంలో సాయుధ పోరాటం కూడా ఉంది. అయితే కేవలం సాయుధ పోరాటం కోసం



మాత్రమే దైవానుగ్రహాన్ని ఆశించగలుగుతారు. దేవుడు గొప్ప క్షమాశీలి, అపార దయామయుడు. (218)

వారు నిన్ను మద్యం, జూదాలను గురించి అడుగుతున్నారు. ఈ రెండిటిలోనూ ఎంతో నష్టముందని చెప్పు. వీటిలో ప్రజలకు కొన్ని ప్రయోజనాలున్నా, ఆ ప్రయోజనాల కన్నా నష్టాలే ఎక్కువగా ఉన్నాయి.[41] ఇంకా దైవమార్గంలో ఏం ఖర్చు పెట్టాలని కూడా వారు నిన్నడుగుతున్నారు. తమ అవసరాలకు పోగా మిగిలింది ఖర్చుచేయాలని చెప్పు వారికి. మీరు ఇటు ప్రపంచం గురించి, అటు పరలోకం గురించి యోచిస్తారని దేవుడు ఈ విధంగా తన ఆజ్ఞలను మీకు స్పష్టంగా వివరిస్తున్నాడు. (219)

వారు నిన్ను అనాథ బాలలను గురించి కూడా అడుగుతున్నారు. వారికిలా తెలియ జేయి: "వారిని తీర్చిదిద్దగల ఏ పనైనా మంచిదే. వారితో మీరు కలసిమెలసి ఉండదలిస్తే తప్పులేదు. వారు మీ సహోదరులే. కీడుచేసే వారెవరో, మేలుచేసే వారెవరో దేవునికి తెలుసు. దేవుడు తలుచుకుంటే ఈ విషయంలో మీపట్ల కఠినంగా వ్యవహరించేవాడే. కాని ఆయన సర్వ శక్తిమంతుడు కావడంతోపాటు ఎంతో వివేచనాపరుడు కూడా." (220)

బహుదైవారాధకురాలైన స్త్రీలు (సత్యాన్ని) విశ్వసించనంత వరకు వారిని మీరు ఎలాంటి పరిస్థితిలోనూ వివాహమాడకండి. బహుదైవారాధకురాలైన స్త్రీ మీకు ఎంత నచ్చినా, ఆమెకంటే (సత్యాన్ని) విశ్వసించిన బానిసమహిళే ఎంతో మేలు. అలాగే బహుదైవారాధకులైన పురుషులు (సత్యాన్ని) విశ్వసించనంతవరకు వారితో మీ స్త్రీల వివాహం చేయకండి. బహుదైవారాధకుడైన పురుషుడు మీకు ఎంత నచ్చినా, అతనికంటే (సత్యాన్ని) విశ్వసించిన బానిస పురుషుడే ఎంతో శ్రేష్ఠుడు. బహుదైవారాధకులు మిమ్మల్ని నరకాగ్ని వైపు పిలుస్తారు. దేవుడు మిమ్మల్ని దయతో స్వర్గం వైపు, క్షమాభిక్ష వైపు పిలుస్తున్నాడు. ప్రజలు దారికి వచ్చేందుకు దేవుడు తన ఆజ్ఞలను ఇలా విడమరచి తెలియజేస్తున్నాడు. (221)

వారు నిన్ను రుతుస్రావం గురించి ఆజ్ఞ ఏమిటని అడుగుతున్నారు. వారికిలా చెప్పు: "అది అపరిశుద్ధావస్థ. ఆ స్థితిలో మీరు స్త్రీల (పడకల)కు దూరంగా ఉండండి. వారు పరిశుద్ధులు కానంతవరకు వారి దగ్గరకు వెళ్ళకండి. వారు పరిశుద్ధులయిన తరువాత దేవుడు మిమ్మల్ని ఆదేశించిన రీతిలో వారి దగ్గరకు యథాప్రకారం వెళ్ళవచ్చు. దేవుడు తన వైపు మరలేవారిని, పవిత్రంగా పరిశుభ్రంగా ఉండేవారిని మాత్రమే ప్రేమిస్తాడు. (222)

ఖుర్‌ఆన్‌లో "ఖితాల్" అనే పదం వాడబడింది. కనుక లక్ష్యసాధనకై కలం ద్వారా, వాక్కు ద్వారా ప్రచారం చేసే వ్యక్తి కూడా "ముజాహిద్" (యోధుడు)గానే పరిగణించబడతాడు. ఆ మార్గంలో నడవడం, శ్రమించడం, ధన కనక వస్తువులు వినియోగించడం, కష్టాలను సహించడం, సవాళ్ళను ఎదుర్కోవడం, సమస్యలను అధికమించడం మొదలైనవన్నీ జిహాద్ పరిధిలోకే వస్తాయి.

41. వివరాల కోసం 4:43, 5:90 సూక్తులు, వాటి పాదసూచికలు చూడండి.

మీభార్యలు మీకు వ్యవసాయ క్షేత్రాల్లాంటివారు. మీరు మీ వ్యవసాయ క్షేత్రాలకు మీకిష్టమైన రీతిలో వెళ్ళవచ్చు.[42] కాకపోతే మీరు మీభవిష్యత్ (పరలోకం) గురించి జాగ్రత్త వహించండి. దేవునిపట్ల సదా భయభక్తులు కలిగిఉండాలి. ఒకరోజు మీరంతా ఆయన సన్నిధికే పోవలసిఉంది. ప్రవక్తా! సత్యస్వీకారులకు (స్వర్గ) శుభవార్త వినిపించు. (223)

మంచికి, దైవభీతికి, ప్రజల మధ్య రాజీ కుదర్చడానికి సంబంధించిన పనులు మానుకునే విషయంలో మీరు ప్రమాణం చేయవలసివస్తే, అలాంటి పనులను గురించి దేవుని పేరుతో ప్రమాణం చేయకండి. దేవుడు అన్నీ వింటున్నాడు. ఆయనకు సమస్త విషయాలు తెలుసు. మీరు అసంకల్పితంగా, ఆషామాషిగా చేసే అర్థంపర్థంలేని ప్రమాణాలను గురించి దేవుడు మిమ్మల్ని ప్రశ్నించడు. మీరు మనస్ఫూర్తిగా కావాలని చేసే ప్రమాణాలను గురించే ఆయన మిమ్మల్ని నిలదీస్తాడు. (జరిగిందేదో జరిగింది) దేవుడు ఎంతో క్షమాశీలి, అపార కృపాశీలుడు. (224-225)

తమ భార్యలను కలుసుకోమని ప్రమాణం చేసేవారికి నాలుగు నెలల గడువు ఉంటుంది.[43] ఒకవేళ వారు (ఈ గడువులోగా) దాన్ని ఉపసంహరించుకుంటే దేవుడు క్షమించే వాడు, కరుణించేవాడు (అని తెలుసుకోండి). దానికి బదులు వారు విడాకులు ఇవ్వడానికే నిర్ణయించుకుంటే గుర్తుంచుకోండి; దేవుడు అన్నీ వింటున్నాడు, ఆయనకు సమస్త విషయాలు తెలుసు. (226-227)

విడాకులు పొందిన స్త్రీలు తమంతటతాము మూడు రుతువుల దాకా వేచి వుండాలి. దేవుడు వారి గర్భాలలో సృజించిన దాన్ని దాచడం వారికి భావ్యంకాదు.

---

42. ఇక్కడ భార్యాభర్తల సంబంధాన్ని వ్యవసాయ క్షేత్రానికి, రైతుకు ఉండే సంబంధంతో పోల్చడం జరిగింది. రైతు తన వ్యవసాయ క్షేత్రంలో మంచి పంట పండించుకోవడానికి ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటాడు. పొలాన్ని దున్ని అదను చూసి విత్తనం నాటుతాడు. ఎరువు వేస్తాడు. కలుపు మొక్కలు పీకేస్తాడు. చీడ పురుగులు పట్టకుండా మందు చల్లుతాడు. పండిన పంట నాశనం కాకుండా అనేక విధాలుగా రక్షణ కల్పిస్తాడు.

అదేవిధంగా భర్త కూడా లైంగికానందం కోసమేగాక సంతానోత్పత్తి లక్ష్యంతో కూడా భార్య పట్ల తగిన విధంగా మసలుకుంటాడని ఈసూక్తి తెలుపుతోంది. అంతేగాని, భార్యను విలాస వస్తువుగా పరిగణించి ఆమె పట్ల విశృంఖలంగా వ్యవహరించడానికి ఎంతమాత్రం వీల్లేదు.

ఇంతకూ ఈ సూక్తి ఏ సందర్భంలో అవతరించిందో ఆ విషయాన్ని కూడా తెలుసుకోవడం చాలా అవసరం. హజ్రత్ జాబిర్ (రజి) కథనం ప్రకారం “భార్యతో వెనుక వైపునుండి సంభోగిస్తే మెల్లకండ్లుగల పిల్లలు పుడ్తారని యూదులు అంటుండేవారు. దానికి సమాధానంగా ఈ సూక్తి అవతరించింది.” (బుఖారి, ముస్లిం)

43. భార్యాభర్తల మధ్య పొరపొచ్చాలు రావడం, దానివల్ల తాత్కాలికంగా దాంపత్యప్రక్రియ కు దూరంగా ఉండటం సహజం. అయితే ఈ అలుగుడు, కోపతాపాలతో దాంపత్య ప్రక్రియకు దూరంగా ఉండవలసిన గడువు నాలుగు నెలలు మాత్రమే. ఈలోగా వారుభయులు పొరపొచ్చాలు దూరం చేసుకొని ఏకమవ్వాలి. ఈ గడువు దాటిపోతే ఇద్దరి మధ్య వివాహబంధం తెగిపోతుంది. అయితే భార్యాభర్తలు రాజీపడితే తిరిగి వివాహం చేసుకోవచ్చు. దీన్ని “ఈలా” అంటారు.



అల్లాహ్‌ను, అంతిమదినాన్ని విశ్వసించేవారైతే వారీ విషయాన్ని బహిర్గతం చేయాలి. వారి భర్తలు గనక పూర్వసంబంధాలను పునరుద్ధరించుకోదలిస్తే ఈ గడువు లోగా తమ భార్యలను తిరిగి దాంపత్యంలోకి తీసుకునేందుకు వారికి పూర్తి హక్కుంది.[44]

సాధారణంగా స్త్రీలపై పురుషులకు ఎలాంటి హక్కులున్నాయో న్యాయపరంగా పురుషులపై స్త్రీలకు కూడా అలాంటి హక్కులే ఉన్నాయి. కాకపోతే పురుషులకు స్త్రీలపై ఒక మెట్టు ఆధిక్యత ఉంది.[45] దేవుడు శక్తిమంతుడు, వివేచనాపరుడు. (228)

---

44. భర్త భార్య నుండి శాశ్వతంగా వేరయిపోవడానికి విడాకులిస్తున్నానని మొత్తం జీవిత కాలంలో మూడుసార్లు మాత్రమే ప్రకటించవలసి ఉంటుంది. ఒకవేళ అతను రెండుసార్లు మాత్రమే తలాఖ్ ప్రకటన చేసి, భార్యతో రాజీపడి సంసారం సాగిస్తూ, ఆ తరువాత మరెప్పుడైనా ఇద్దరి మధ్య మళ్ళీ పొరపొచ్చాలు వస్తే అప్పుడతను భార్య నుండి శాశ్వతంగా విడిపోవడానికి తలాఖ్ ప్రకటన ఒక్కసారి మాత్రమే చేయవలసి ఉంటుంది.

శాస్త్రప్రకారం ఏకకాలంలో మూడుసార్లు తలాఖ్ ఇస్తున్నానని చెప్పకూడదు. ఒకవేళ ఎవరైనా అజ్ఞానంతో తన భార్యకు ఒకేసారి మూడు తలాఖులు ఇవ్వడం జరిగితే ఆమె అతని నుండి శాశ్వతంగా వేరయిపోతుందికాని, ఇది షరీఅత్ దృష్ట్యా ఘోరమైన పాపకార్యం. ఈ వైఖరిని దైవప్రవక్త (సల్లం) తీవ్రంగా గర్హించారు. హజ్రత్ ఉమర్ (రజి) తన పాలనాకాలంలో ఇలాంటి భర్తలను కర్రతో కొట్టేవారు. భార్య రుతుస్రావం ఆగిపోయి స్నానం చేసిన తరువాత అతనామెకు ఒకసారి తలాఖ్ ఇస్తున్నట్లు చెప్పాలి. తర్వాత రెండవసారి రుతుస్రావం ఆగి స్నానం చేసిన పిదప రెండవసారి తలాఖ్ ఇవ్వాలి. ఆ తర్వాత మూడవసారి రుతుస్రావం ఆగి స్నానం చేసేవరకు ఆగాలి.

ఈ మూడు రుతుక్రమాల కాలాన్ని ఇద్దత్ (గడువు) అంటారు. ఈ గడువు దాటక ముందే (అంటే మొదటిసారి తలాఖ్ తరువాతగాని, లేదా రెండవసారి తలాఖ్ తరువాతగాని) భర్త విడాకుల ఉద్దేశ్యం మానుకుంటే యధాప్రకారం భార్యతో తిరిగి కాపురం చేయవచ్చు. ఒకవేళ గడువు కాలం దాటిపోతే (అంటే మూడవసారి రుతుస్రావం కలిగిన తరువాత) అతను తన భార్యతో కాపురం చేయడానికి ఆమెను కొత్తగా మరోసారి వివాహం (నికాహ్) చేసుకోవలసి ఉంటుంది. అయితే ఆమె మూడవసారి రుతుస్రావం ఆగిపోయి స్నానం చేశాక అతను మూడవసారి కూడా తలాఖ్ ఇస్తున్నానని ప్రకటిస్తే మాత్రం ఇక ఆమె అతనికి శాశ్వతంగా దూరమైపోతుంది. పునర్వివాహానికి అవకాశం లేదు. (దీని తర్వాత 230వ సూక్తి చూడండి. 65:1 సూక్తి, దాని పాదసూచిక కూడా చూడండి.)

45. శారీరకం, మానసికం స్త్రీ పురుషుల మధ్యఉన్న సహజవ్యత్యాసాల కారణంగా ఇస్లాం స్త్రీపై పురుషునికి కొంత ఆధిక్యతనిచ్చి, వారిరువురి కార్యాచరణ పరిధుల్ని వేరుచేసింది. ఇంటి లోపలి బాధ్యతల్ని స్త్రీకి, బయటి బాధ్యతల్ని పురుషునికి అప్పగించింది. ఈ బాధ్యతల పంపిణీ స్త్రీ పురుషుల సమానత్వానికి వ్యతిరేకం కాదు. స్త్రీ పురుషులు ఇద్దరినీ ఒకే పరిధిలో బంధించిపెట్టే పాశ్చాత్యతరహా సమానత్వాన్ని ఇస్లాం అంగీకరించదు. వారిరువురిని వారి సహజస్థానాల్లో ఉంచి, ఎవరి హక్కులు వారికి న్యాయసమ్మతంగా ఇప్పించడమే నిజమైన సమానత్వమని చెబుతోంది.

పూర్వకాలంలో స్త్రీ ఘోరమైన అతివాదాలకు గురయింది. ఒకప్పుడు ఆమెను అతిగా పైకెత్తి దేవతామూర్తి అని పొగిడి పూజిస్తే, మరొకప్పుడు కట్టుబానిసగా, చరణదాసిగా మారే వరకు ఆమె స్థాయిని దిగజార్చారు. అదేవిధంగా నేటి నాగరిక యుగంలో కూడా స్త్రీ స్వేచ్ఛ పేరిట, పురుషులతో సమాన హక్కులన్న నినాదం చాటున స్త్రీని రచ్చకీడ్చి పురుషుల సరసన నిలబెట్టారు. అన్ని

విడకులు ఇస్తున్నానని రెండుసార్లు మాత్రమే చెప్పాలి. ఆ తరువాత (నిర్ణయం మార్చుకుంటే) సముచిత రీతిలో (భార్యను) వివాహబంధంలో కొనసాగించాలి; లేదా (అంటే నిర్ణయం మార్చుకోకపోతే విడాకులిస్తున్నానని మూడవసారి కూడా చెప్పేసి ఆమెను) ఉత్తమ రీతిలో వదిలేయాలి.

అప్పుడు మీరామెకు (మహర్ లేదా కానుకల రూపంలో) ఇచ్చిన వస్తువులలో కొంతయినా సరే, వాపసు తీసుకోవడం మీకు ధర్మసమ్మతం కాదు. ఒకవేళ దంపతులు దైవనిర్ణీత పరిమితులకు కట్టుబడి ఉండలేమని అనుకుంటే, అది వేరే విషయం.

దంపతులిద్దరు దైవనిర్ణీత పరిమితులకు కట్టుబడి ఉండలేమని భయపడినప్పుడు స్త్రీ తన భర్తకు ఏమైనా ఇచ్చేసి అతని నుండి వేరుపడ దలచుకుంటే వారిద్దరి మధ్య ఏదైనా ఒప్పందం కుదరడంలో తప్పు లేదు. ఇవి దేవుడు నిర్ణయించిన పరిమితులు. వాటిని అతిక్రమించకండి. దైవ పరిమితుల్ని అతిక్రమించేవారే దుర్మార్గులు. (229)

(మూడవసారి కూడా) విడాకులిస్తే, ఇక ఆస్త్రీని దాంపత్యబంధంలోకి తీసుకోవడం అతనికి ధర్మం కాదు, ఆమె మరోవ్యక్తిని వివాహమాడి అతనామెకు విడాకులిస్తే తప్ప.

---

రంగాల్లోను పురుషులతో భుజం భుజం కలిపి పనిచేయడంలోనే స్త్రీ మనుగడ, గౌరవ ప్రతిష్ఠలు ఉన్నాయని చెబుతూ, ఆమెను కుటుంబ బాధ్యతల నుండి తప్పించారు. తత్ఫలితంగా ఆమె సహజ స్త్రీదనం, సౌకుమార్యం, శీలం, మాన మర్యాదలు ప్రమాదంలో పడిపోయాయి.

ఈ అమాయకురాలు స్త్రీస్వేచ్ఛా ధ్వజవాహకులైన పురుషపుంగవుల పొగడ్తలకు ఉబ్బిపోయి, తన అంగసౌష్ఠవంతో, అందాల్ని విరజిమ్మే ఆధునిక అలంకరణలతో, అర్ధనగ్న వస్త్రధారణలతో పురుషులుండే ప్రతి వేదికపై, ప్రతి రంగంలో కనిపించడానికి ప్రయత్నిస్తోంది. స్త్రీలు (ముఖ్యంగా శీలవతులు) వాటి చేదు అనుభవాలు కూడా అనుదినం చవిచూస్తున్నారు.

ఇస్లాం కుటుంబం అనే సంస్థకు పురుషుడ్ని చైర్మన్‌గా, స్త్రీని సెక్రటరీగా నియమించి ఎవరి బాధ్యతల్ని, హక్కుల్ని వారికి న్యాయవంతంగా కేటాయించింది. అంతేగాక ఆ చైర్మన్, సెక్రటరీలు ఎవరి విధులు వారు సక్రమంగా నిర్వహిస్తున్నప్పుడే కుటుంబం అనే సంస్థ సవ్యంగా, సాఫీగా, సజావుగా సాగుతుందని చెబుతోంది.

ఏ దేశంలోను ఇద్దరు అధ్యక్షులు లేదా ఇద్దరు ప్రధానులు ఉండరు. ఏ సైనిక దళంలోను ఇద్దరు సేనాపతులు ఇమడలేరు. ఏ కార్యాలయంలోను సమానస్థాయిగల ఇద్దరు అధికారులు పనిచేయలేరు. ఏ సంఘాన్నీ ఇద్దరు నాయకులు నడపలేరు. అలాగే కుటుంబం అనే సమాజ వ్యవస్థ కేంద్రకార్యాలయం సవ్యం సాగాలంటే భార్యాభర్తల్లో ఒక్కరే అధికారిగా ఉండాలి. శారీరక, మానసిక సామర్థ్యాల్లో స్త్రీ కన్నా పురుషుడు కొంత ఆధిక్యత కలిగి ఉన్నందున కుటుంబవ్యవస్థకు ఇస్లాం పురుషుడ్ని నాయకునిగా నిర్ణయించింది. భార్య అతని సహాయకురాలు మాత్రమే.

కనుక చైర్మన్ పురుషుడు, సెక్రటరీ స్త్రీ సమానత్వం పేరుతో రచ్చకెక్కి సంసారంలో చిచ్చు రగుల్చుకోవలసిన పనిలేదు. హక్కులు, బాధ్యతలు సంస్థ నిబంధనావళి (ఖుర్ఆన్)లో స్పష్టంగా పేర్కొనబడ్డాయి. ఈ బాధ్యతల్ని విస్మరిస్తే ఆ కుటుంబంలో మిగిలేది అశాంతి, అలజడులే.

(స్త్రీల హక్కులు, బాధ్యతలు, సమస్యలను గురించిన వివరాల కోసం 'ఇస్లామ్ రిసోర్స్ సెంటర్' నుండి వెలువడిన "ముస్లిం మహిళ" అనే పుస్తకం చదవండి. పేజీలు: 240)



ఒకవేళ మొదటి భర్త, ఈస్త్రీ, ఇద్దరూ తాము దైవనిర్ణీత పరిమితులకు కట్టుబడి ఉండ గలమనుకుంటే (ఇలా) వారు పరస్పరం తిరిగి ఏకమవడంలో తప్పులేదు. ఇవి దేవుడు నిర్ణయించిన పరిమితులు. వీటిని ఆయన విజ్ఞుల కోసం వివరిస్తున్నాడు. (230)

మీరు స్త్రీలకు (రెండుసార్లు) విడాకులిచ్చిన సందర్భంలో వారి గడువు పూర్తి కావస్తున్నప్పుడు వారిని సక్రమంగా (మీ ఇంట) ఉండనివ్వండి. లేదా (మూడవసారి కూడా విడాకులిస్తున్నట్లు ప్రకటించి) సహృదయంతో సాగనంపండి. అంతేగాని, చీటికి మాటికి వేధిస్తూ అన్యాయం తలపెట్టే ఉద్దేశ్యంతో వారిని ఆపి ఉంచకండి. ఇలా ప్రవర్తించేవాడు నిజానికి తనకుతానే అన్యాయం చేసుకుంటున్నాడు.

దేవుని ఆజ్ఞల్ని నవ్వులాటగా చేసుకోకండి. ఆయన మీకు ప్రసాదించిన మహా భాగ్యాలను ఓసారి గుర్తుకు తెచ్చుకోండి. మీ శ్రేయస్సు కోసం అవతరింపజేసిన దివ్య గ్రంథాన్ని, (అందులోని) వివేకవంతమైన విషయాలను గౌరవించడం నేర్చుకోవలసిందిగా ఆయన మీకు ఉపదేశిస్తున్నాడు. (ప్రతి విషయంలోనూ) దేవుని పట్ల భయభక్తులు కలిగి ఉండండి. ఆయన సర్వం ఎరిగినవాడని తెలుసుకోండి. (231)

మీరు మీ స్త్రీలకు విడాకులు ఇచ్చివేయడం, వారి గడువు (ఇద్దత్) తీరిపోవడం జరిగిన తరువాత, వారు తమ పూర్వపు భర్తలను లేదా ఇతర పురుషులను వివాహమాడ దలచిన పక్షంలో, అందుకు వారుభయుల మధ్య ధర్మయుక్తంగా పరస్పరం అంగీకారం కుదిరితే, మీరు వారి వివాహాన్ని అడ్డుకోకండి, దైవాన్ని, అంతిమదినాన్ని విశ్వసించేవారికి ఈఆదేశం ద్వారా హితోపదేశం చేయబడుతోంది. ఇది మీకోసం ఎంతో సంస్కారవంత మైన పవిత్రవిషయం. అన్ని విషయాలు దేవునికే తెలుసు, మీకు తెలియవు. (232)

తల్లులు తమ బిడ్డలకు గడువుకాలం పూర్తయ్యేవరకు పాలు పట్టదలచుకుంటే పూర్తిగా రెండు సంవత్సరాలు పాలుపట్టాలి. అప్పుడు బిడ్డతండ్రి ఆమెకు తగిన రీతిలో తిండి, బట్ట సమకూర్చవలసి ఉంటుంది. అయితే వారుభయుల్లో ఏ ఒక్కరిపైనా శక్తికి మించిన భారం మోపకూడదు. బిడ్డను కన్నందుకు ఇటు తల్లినీ కష్టపెట్ట కూడదు; బిడ్డజన్మకు కారకుడయినందుకు అటు తండ్రినీ వేధించకూడదు.

బిడ్డకు పాలుపట్టే తల్లి పట్ల బిడ్డతండ్రికి ఎంత బాధ్యత ఉందో అతని వారసుల క్కూడా అంతే బాధ్యత ఉంది. ఒకవేళ తల్లిదండ్రులు ఒకర్నొకరు సంప్రదించుకొని పరస్పరా మోదంతో బిడ్డకు పాలు మాన్పించదలచుకుంటే తప్పులేదు. అలాగే మీరు మీ పిల్లలకు వేరే స్త్రీలచేత పాలు పట్టించాలనుకున్నా తప్పులేదు. కాకపోతే పాలుపట్టే వారికి తగిన ప్రతిఫలం ముట్టజెప్పాలి. మీరు దేవునిపట్ల భయభక్తులతో వ్యవహరించాలి. గుర్తుంచుకోండి! మీరు చేస్తున్న పనులన్నిటినీ ఆయన గమనిస్తూనే ఉన్నాడు. (233)

మీలో ఎవరైనా చనిపోయి, వారి భార్యలు బ్రతికివుంటే అలాంటి స్త్రీలు నాలుగు నెలల పదిరోజులు తమనుతాము నిగ్రహించుకోవాలి.[46] ఈ విధంగా గడువుకాలం

---

46. ఈ నాలుగు నెలల గడువు కాలంలో ఆ స్త్రీ పునర్వివాహానికేగాక, అలంకరణకు కూడా దూరంగా ఉంటూ భర్త ఇంట్లోనే ఉండిపోవాలి. ప్రవక్త ప్రవచనాలను బట్టి అలాంటి స్త్రీ గడువు

(ఇద్దత్) ముగిశాక వారు తమకు నచ్చినపని (పునర్వివాహం) తగినరీతిలో చేసుకోవచ్చు. దానికి మీపై ఎలాంటి బాధ్యతలేదు. మీరు చేసే పనులన్నీ దేవునికి తెలుసు. (234)

గడువుకాలంలో మీరు ఆ వితంతు స్త్రీని వివాహమాడ దలచినట్లు సూచన ప్రాయంగా తెలియజేసినా లేదా మీ ఉద్దేశ్యాన్ని మీ మనసులోనే దాచివుంచినా సరే తప్పు లేదు. మీరీ విషయాన్ని ఆమె దగ్గర ప్రస్తావిస్తారని దేవునికి తెలుసు. అయితే ఒక విషయం గుర్తుపెట్టుకోండి- మీరు చాటుమాటుగా ఎలాంటి ఒప్పందం చేసుకోకండి. ఏది చేసినా ధర్మయుక్తంగానే చేయాలి. గడువుకాలం తీరనంతవరకు మీరు పెళ్ళి విషయంలో గట్టినిర్ణయం తీసుకోకూడదు. మీ హృదయాల్లో మెదిలే ప్రతి విషయం దేవునికి తెలుసు. కనుక ఆయనకు భయపడుతూ ఉండండి. అదీగాక దేవుడు (మీ చిన్న చిన్న పొరపాట్లను) మన్నించేవాడని, సహించేవాడని కూడా తెలుసుకోండి. (235)

మీరు మీ భార్యలను కలుసుకోవడానికి ముందు వారి మహర్ నిర్ణయంకాని పక్షంలో వారికి విడాకులిస్తే తప్పులేదు. అలాంటి స్థితిలో వారికి ఎంతో కొంత (సొమ్ము) తప్పనిసరిగా ముట్టజెప్పాలి. ధనికుడైనా, పేదవాడైనా తమతమ శక్తి మేరకు తగిన రీతిలో దీన్ని అందజేయాలి. ఇది సత్పురుషులు నెరవేర్చవలసిన విధి. (236)

మీరు మీభార్యలను కలుసుకోడానికి ముందే వారికి విడాకులు ఇవ్వవలసివస్తే, నిర్ణీత మహర్‌లో సగం సొమ్ము చెల్లించవలసి ఉంటుంది. అయితే స్త్రీ మృదువైఖరి అవలంబించి (మహర్ అసలు తీసుకోకపోయి)తే, లేదా వివాహబంధం తన అధీనంలో వున్న పురుషుడు మృదువైఖరి అవలంబించి (మహర్ పూర్తిగా ఇచ్చివేసి)తే అది వేరే విషయం. మీరే (అంటే పురుషులే) సహృదయంతో మీ హక్కును వదలుకుంటే మరీ మంచిది. ఇది దైవభీతికి చాలా దగ్గరిమార్గం. పరస్పరం ఉదార స్వభావంతో మసలు కోవడం మరచిపోకండి. మీరు చేసే పనులన్నీ దేవునికి బాగా తెలుసు. (237)

మీరు మీ ప్రార్థన (నమాజు)లన్నిటినీ, ముఖ్యంగా మధ్యస్థ ప్రార్థనను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ జాగ్రత్తగా కాపాడుకోండి. దేవుని సన్నిధిలో వినయ విధేయత లతో నిలబడండి. మీరొకవేళ ఏదైనా ప్రమాదంలో చిక్కుకుంటే నడుస్తూవున్నా, వాహనం ఎక్కివున్నా ఎలా సాధ్యమైతే అలా ప్రార్థన చేయండి. తరువాత మీ భయాందోళనలు తొలగి మనసు కుదుటపడితే దేవుడు నేర్పిన పద్ధతి ప్రకారం ఆయన్ని ధ్యానించండి. నిజానికి ఈ పద్ధతి మీరు ఇదివరకు ఎన్నడూ ఎరగరు. (238-239)

మీలో ఎవరికైనా మరణకాలం ఆసన్నమైనప్పుడు వారి భార్యలు జీవించివుంటే, ఒక సంవత్సరంపాటు వారి (పోషణ) ఖర్చులు భరించాలని, ఇంటినుండి వెడలగొట్ట

---

కాలంలో నగలు, రంగు వస్త్రాలు ధరించకూడదని, సాదా వస్త్రాలే ధరించాలని; గోరింటాకు, సుర్మా, కాటుక పెట్టుకోకూడదని, కేశాలంకరణ కూడా చేసుకోకూడదని తెలుస్తోంది. ఒకవేళ భర్త చనిపోయే సమయంలో ఆ స్త్రీ గర్భం ధరించి ఉంటే, ఆమె గడువుకాలం ప్రసవించే వరకు ఉంటుంది; ప్రసవించగానే ఆమె గడువు తీరిపోతుంది. (65:4 సూక్తి చూడండి.)



రాదని వారు (తమ వారసులకు) విల్లు రాసిపోవాలి. ఆ స్త్రీలు తమంతట తాము ఇంటి నుండి వెళ్ళిపోయి తమకు నచ్చిన పని (పునర్వివాహం) ధర్మసమ్మతంగా చేసుకోదలిస్తే దానికి మీపై ఎలాంటి బాధ్యత ఉండదు. దేవుడు సర్వశక్తిమంతుడు, ఎంతో వివేచనా పరుడు. విడాకులు పొందిన మహిళలకు కూడా సముచిత రీతిలో జీవనభృతి ఇచ్చి పంపాలి. ఇది దైవభీతిపరులు నెరవేర్చవలసిన విధ్యుక్తధర్మం. మీరు విషయాన్ని అర్థం చేసుకుంటారని దేవుడు ఇలా తన ఆజ్ఞల్ని మీకు విడమరచి బోధిస్తున్నాడు. (240-242)

ముహమ్మద్! కేవలం చావుకు భయపడి తమ ఇండ్లనుండి పారిపోయిన వేలాది మంది జనాన్ని నీవు చూడలేదా? దేవుడు వారిని చావమని ఆదేశించాడు; ఆ తరువాత వారిని మళ్ళీ బ్రతికించాడు కూడా. నిస్సందేహంగా దేవుడు మానవుల పట్ల ఎంతో దయా మయుడు. కాని చాలామంది ఆయనకు కృతజ్ఞత చూపరు. (243)

విశ్వాసులారా! దైవమార్గంలో పోరాడండి. దేవుడు ప్రతి విషయం వింటున్నాడని, సమస్తం ఎరిగినవాడని బాగా తెలుసుకోండి. (244)

మీలో ఎవరయినా దేవునికి శ్రేష్ఠమైన రుణదానం అందజేసేవారు ఉన్నారా?[47] ప్రతిఫలంగా ఆయన దాన్ని అనేక రెట్లు పెంచి తిరిగి మీకు అందజేస్తాడు. దేవుడే మీ ఉపాధిని తగ్గించేవాడు. దాన్ని వృద్ధి చేసేవాడు కూడా ఆయనే. చివరికి ఆయన సన్నిధికే మీరంతా మరలి పోవలసి ఉంది. (245)

మూసా (నిర్యాణం) తరువాత ఇస్రాయీల్ సంతతి నాయకులకు ఎదురయిన పరిస్థితుల్ని గురించి నీకు తెలుసా? వారు (అప్పటి) తమ ప్రవక్త దగ్గరకెళ్ళి "మేము దైవ మార్గంలో యుద్ధం చేయడానికి వీలుగా మాకు సారథ్యం వహించేందుకు ఒక రాజును నియమించు" అని విన్నవించుకున్నారు.

దానికి దైవప్రవక్త "(సరే, అలాగే నియమిస్తా.) కాని తీరా మిమ్మల్ని యుద్ధం చేయమని ఆదేశిస్తే మీరు నిరాకరిస్తారేమో!" అన్నాడు.

"అదెలా! మమ్మల్ని మా ఇండ్లనుండి వెళ్ళగొట్టారు. మా పిల్లాజెల్లలను మాకు దక్కకుండా చేశారు. అలాంటప్పుడు మేము దైవమార్గంలో యుద్ధం ఎందుకు చేయం?" అన్నారు వారు. కాని తీరా యుద్ధం చేయమని ఆజ్ఞ కాగానే వారిలో కొందరు తప్ప అందరూ వెన్నుజూపి పారిపోయారు. దుర్మార్గుల సంగతి దేవునికి బాగా తెలుసు. (246)

(సరే,) దైవప్రవక్త (వారి కోరికను మన్నించి) "దేవుడు మీకు తాలూత్‌ని రాజుగా నియమించాడు" అని తెలియజేశాడు. అది విని వారు (ధనగర్వంతో విర్రవీగుతూ) "రాచరికం చేయడానికి మేము ఎక్కువ అర్హులం, హక్కుదారులం గాని, అతనెలా అవుతాడు? అతను ఏమంత స్థితిపరుడు కూడా కాదే?" అన్నారు.

---

47. శ్రేష్ఠమైన రుణదానం అంటే కేవలం దైవప్రసన్నత కోసం పుణ్యఫలాపేక్షతో ఇచ్చే రుణం అన్నమాట. ఇలా దాసుడు ధర్మసంస్థాపనా కృషికి, ఇచ్చే ధనాన్ని దేవుడు అప్పుగా పరిగణించి, దానికి అనేక రెట్ల ప్రతిఫలం ఇచ్చే బాధ్యతను స్వయంగా తీసుకున్నాడు.

అప్పుడు దైవప్రవక్త ఇలా అన్నాడు: "దేవుడు మీకు బదులు అతడ్నే (ఈ పనికోసం) ఎంచుకున్నాడు. ఆయన అతనికి (కార్యసాధనకు కావలసిన) బుద్ధిబలాన్ని, కండబలాన్ని కూడా పుష్కలంగా ప్రసాదించాడు. దేవుడు తాను తలచుకున్న వారికి రాజ్యాధికారం ప్రసాదిస్తాడు. ఆయన విశాలదృష్టి కలవాడు, సర్వం తెలిసినవాడు. (247)

దైవప్రవక్త (వివరంగా తెలియజేస్తూ) ఇలాఅన్నాడు: "దేవుడు మీపై అతడ్ని రాజుగా నియమించడానికి నిదర్శనంగా (లోగడ మీరు కోల్పోయిన పవిత్ర) పేటిక మీకు తిరిగి లభిస్తుంది. అందులో మీ ప్రభువు వైపున మీకు శాంతీ సంతృప్తులు కలిగించే సామగ్రి ఉంది. అదీగాక అందులో మూసా, హారూన్‌ల కుటుంబీకులు వదలివెళ్ళిన పవిత్ర అవశేషాలు కూడాఉన్నాయి. ఆపేటికను ప్రస్తుతం దైవదూతలు కాపాడుతున్నారు. మీరు నిజంగా విశ్వసించినవారైతే (దీన్ని నమ్మండి) మీకిది గొప్ప నిదర్శనం." (248)

ఆ తరువాత తాలూత్ సైన్యం తీసుకొని యుద్ధానికి బయలుదేరుతూ వారితో ఇలా అన్నాడు: "దేవుడు (దారిలో) ఒక నది ద్వారా మిమ్మల్ని పరీక్షించబోతున్నాడు. ఆ నదిలో నీరు త్రాగేవాడు నావాడు కాదు; త్రాగనివాడే నావాడు. అయితే (ప్రాణం కాపాడుకోవడానికి) దోసిలితో కొంచెం నీళ్ళు త్రాగితే పర్వాలేదు." కాని (తీరా నది దగ్గరకు చేరుకోగానే) కొందరు తప్ప అందరూ (కడుపారా) త్రాగారు.

ఆ తరువాత తాలూత్, విశ్వాసులయిన అతని సహచరులు నది దాటి ఆవలకు చేరుకున్నప్పుడు వారిలో చాలామంది "ఈరోజు జాలూత్‌ని, అతని సైన్యాన్ని ఎదుర్కొనే శక్తి మాలో లేదు" అన్నారు. అయితే ఒకరోజు దేవునికి ముఖం చూపించవలసి ఉందని నమ్ముతున్నవారు మాత్రం (శత్రుసైన్యానికి ఏమాత్రం భయపడకుండా) "గతంలో కొద్ది సంఖ్యలో వున్న సైన్యం కూడా దైవానుగ్రహంతో అత్యధిక సంఖ్యలో వున్న (శత్రు) సైన్యాన్ని మట్టి కరిపించింది. దేవుడు స్థిరంగా నిలబడి ధైర్యంగా పోరాడేవారికే అండగా ఉంటాడు" అని అన్నారు. (249)

వారు యుద్ధమైదానంలో జాలూత్‌కు, అతని సైనికులకు ఎదురుగా వచ్చినప్పుడు "ప్రభూ! మాకు సహనం, స్థయిర్యం ప్రసాదించు. (యుద్ధంలో) మా కాళ్ళకు నిలకడ చేకూర్చి అవిశ్వాసులపై మాకు విజయం ప్రసాదించు" అని వేడుకున్నారు. (250)

అప్పుడు వారు దేవుని అనుగ్రహంతో జాలూత్ సైన్యాన్ని చిత్తుగా ఓడించారు. జాలూత్‌ని దావూద్ వధించాడు. (ఆ తరువాత) దేవుడు దావూద్‌కు రాజ్యాధికారం, బుద్ధి కౌశల్యం ప్రసాదించాడు. ఇంకా కావలసినవన్నీ అతనికి నేర్పాడు. ఈవిధంగా దేవుడు కొందరి ద్వారా కొందరిని నిర్మూలించకపోతే ప్రపంచం అరాచకం, అల్లకల్లోలాలతో నిండి పోతుంది. దేవుడు ప్రపంచ మానవుల పట్ల ఎంతో దయామయుడు. (అందుకే ఆయన ఈ విధంగా అశాంతి, అరాచకాలు నిర్మూలించే ఏర్పాట్లు చేస్తూఉంటాడు.) (251)

ఇవన్నీ దేవుని సూక్తులు. వీటిని మేము నీకు యథాతథాంగా వినిపిస్తున్నాము. నిస్సందేహంగా నీవు మా ప్రవక్తలలో ఒక ప్రవక్తవు. (252)



ఈ దైవప్రవక్తలలో మేము కొందరికి ఉన్నతస్థానాలు ప్రసాదించాం. వారిలో కొందరితో దేవుడు ప్రత్యక్షంగా మాట్లాడాడు. మరి కొందరికి ఇతర విషయాల్లో ఔన్నత్యం ఇచ్చి ఆదరించాడు. అలాగే మర్యంకుమారుడయిన ఈసాకు కూడా మేము స్పష్టమైన మహిమలు ప్రసాదించాము. పరిశుద్ధాత్మ[48]ను పంపి అతనికి సహాయం చేశాము.

దేవుడు తలచుకుంటే స్పష్టమైన సూచనలు, నిదర్శనాలను చూసిన ప్రజలు ప్రవక్తల(నిర్యాణం) తర్వాత పరస్పరం కలహించుకునేవారు కాదు. (అయితే మానవులు తమకు లభించిన స్వేచ్ఛాస్వాతంత్ర్యాలతో విభేదాలకు లోనుకాకుండా వారిని బల వంతంగా ఆపడం దేవుని అభిమతం కాదు. అందువల్ల) వారు పరస్పరం విభేదాలకు గురైపోయారు. కొందరు సత్యాన్ని విశ్వసించారు; మరికొందరు తిరస్కరించారు. దేవుడు తలిస్తే వారు పరస్పరం కలహించుకునేవారు కాదు.[49] కాని దేవుడు తాను తలచుకున్నది చేసితీరుతాడు. (253)

విశ్వాసులారా! ఎలాంటి క్రయ విక్రయాలు జరగని, స్నేహసహకారాలు ఉపయోగ పడని, ఎవరి సిఫారసు కూడా చెల్లని (పరలోక తీర్పు) దినం రాకముందే మేము మీకు ప్రసాదించిన సంపద నుండి (కొంత దైవమార్గంలో కూడా) ఖర్చుపెట్టండి. (మామాటలు నమ్మని) సత్యతిరస్కారులే పరమ దుర్మార్గులు. (254)

(అసలైన ఆరాధ్యనీయుడు) అల్లాహ్‌యే. ఆయన తప్ప మరో ఆరాధ్యదైవం లేడు. ఆయన నిత్యసజీవుడు; ఎన్నటికీ నిద్రించనివాడు; కనీసం కునుకుపాట్లు కూడా పడనివాడు. భూమ్యాకాశాలలో వున్న సమస్తం ఆయనదే. ఎవరి విషయంలోనైనా సరే, ఆయన అనుమతి లేకుండా ఆయన సన్నిధిలో ఎవరు సిఫారసు చేయగల్గుతారు? వారి ముందున్న దేమిటో, వారికి గోచరించకుండా రహస్యంగా ఉన్నదేమిటో అంతా ఆయనకు తెలుసు. ఆయన తలచుకుంటే తప్ప ఆయనకున్న జ్ఞానసంపదలోని ఏ విషయం కూడా ఎవరికీ తెలియదు. ఆయన రాజ్యాధికారం భూమ్యాకాశాలను పరి వేష్ఠించి ఉంది. వాటి రక్షణ ఆయనకు ఏమాత్రం కష్టమైన పనికాదు. ఆయన సర్వాధికారి, సర్వోన్నతుడు. (255)

---

48. ఇక్కడ పరిశుద్ధాత్మ అంటే దైవదూత హజ్రత్ జిబ్రీల్ (అలైహి) అని అర్థం. ఈయన దేవుని దగ్గర్నుండి దైవప్రవక్తలకు దైవసందేశం చేరవేసే దైవదూత. తొలి దైవప్రవక్త హజ్రత్ ఆదం (అలైహి) నుండి అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) వరకు యావన్మంది ప్రవక్తలకు ఈయనే దైవసందేశం అందజేసేవారు.

49. ఇహలోకం మానవులకు ఒక పరీక్షా స్థలం. కనుక దేవుడు వారిని పరీక్షించడానికి రుజు మార్గమేదో, అపమార్గలేవో వారికి స్పష్టంగా తెలియజేస్తూ, వాటిని అవలంబించే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కూడా ప్రసాదించాడు. వీటిని వినియోగించి కొందరు రుజుమార్గంలో నడుస్తూ పరలోక సాఫల్యం ఆశిస్తుంటే, మరికొందరు అపమార్గాలు పట్టి పాపంచిక వ్యామోహంలో పడిపోయారు. దేవుడు ప్రసాదించిన ఈ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను వెనక్కి తీసుకొని వారందర్నీ ఒకే దారిన నడిపిస్తే ఇక ఈ పరీక్షకు అర్థమే లేదు.

ధర్మస్వీకరణలో ఎలాంటి బలవంతం, బలాత్కారాలు లేవు. సత్యం అసత్యం నుండి స్పష్టంగా వేరుచేయబడింది. కనుక ఇకనుండి మిథ్యాదైవాలను నిరాకరించి అల్లాహ్‌ను విశ్వసించినవాడు ఎన్నటికీ ఏమాత్రం చెక్కుచెదరని దృఢమైన ఆశ్రయం పొందినట్లే. (ఆ) దేవుడు సర్వం వింటాడు, సమస్తం తెలిసినవాడు. (256)

విశ్వసించినవారికి దేవుడే సహాయకుడు, శ్రేయోభిలాషి. ఆయన వారిని చీకటి నుండి తీసి వెలుగులోకి ప్రవేశపెడ్తాడు. సత్యాన్ని తిరస్కరించేవారికి పిశాచ శక్తులే నేస్తాలు.[50] వారిని ఈ పిశాచశక్తులు వెలుగు నుండి తీసి చీకటిలోకి తీసికెళ్తాయి. వారే నరకవాసులు. నరకంలోనే వారు ఎల్లకాలం (నానా యాతనలు అనుభవిస్తూ) పడి వుంటారు. (257)

ఇబ్రాహీంతో అతని ప్రభువు విషయంలో వాదనకు దిగిన వ్యక్తి గురించి నీవు ఆలోచించావా? దేవుడు అతనికి రాజ్యాధికారం ప్రసాదించాడు.[51] అందువల్ల అతను (అధికారగర్వంతో విర్రవీగుతో దేవుని విషయంలో వాదనకు దిగాడు.) "ఎవరి అధీనంలో జీవన్మరణాలున్నాయో ఆయనే నాప్రభువు" అని ఇబ్రాహీం అన్నప్పుడు, "చావు బ్రతుకులు నాఅధీనంలో కూడా ఉన్నాయ"ని అన్నాడతను. "అయితే దేవుడు సూర్యుడ్ని తూర్పునుండి ఉదయింపజేస్తున్నాడు కదా, నీవు కాస్త అతడ్ని పడమర నుండి ఉద యింపజెయ్యి చూద్దాం" అని అడిగాడు ఇబ్రాహీం. దానికి ఆ దైవతిరస్కారి సమాధానం ఇవ్వలేక తెల్లమొహంవేశాడు. దేవుడు దుర్మార్గులకు ఎన్నటికీ సన్మార్గంచూపడు. (258)

సరే, ఒక వ్యక్తి ఉదంతం గురించి ఆలోచించావా? అతను ఒక గ్రామం మీదుగా ప్రయాణం చేయసాగాడు. ఆ గ్రామం ఇండ్ల కప్పులు కూలిపోయి సర్వనాశనమయి

---

50. ఇక్కడ పిశాచ శక్తులంటే దైవదాస్యపు హద్దులు మీరి, తామే దేవుళ్ళుగా, ప్రభువులుగా ప్రవర్తించేవారని అర్థం. ఈ అర్థంలో మానవుల్ని సన్మార్గం నుండి తప్పించడానికి అనుక్షణం పొంచి ఉండే ఇబ్లీస్ ముఖ్యుడు. తరువాత మనిషి మనోవాంఛల్ని పేర్కొనాలి. ఆ తర్వాత భార్యాపిల్లలు, బంధుమిత్రులు, సమాజం, నాయకులు, పాలకులు, మతగురువులు, బాబాలు, సిద్ధాంతకర్తలు మొదలయిన వారంతా వస్తారు. సొంతకళ్ళతో, సొంత మేధతో సత్యాన్ని కానలేని మనిషి వీరందరికీ బానిసయి, వారి స్వార్థలక్ష్యాలకు పావుగా మారి జీవితాంతం ఏమరుపాటులో పడిఉంటాడు.

51. ప్రతి యుగంలోను బహుదైవారాధకులు దేవుని దైవత్వాన్ని రెండు భాగాలుగా విభజించారు. ఒకటి, అతీంద్రియ శక్తులకు సంబంధించిన దైవత్వం. ఈ భాగాన్ని వారు ప్రకృతి శక్తులకు, భూతప్రేతాలకు, దైవదూతలకు ఆపాదించి వాటిని ఆరాధిస్తూ ఉంటారు. వాటికే తమ మొక్కుబడులు చెల్లిస్తూ ఉంటారు.

రెండు, సాంస్కృతిక, రాజకీయ వ్యవహారాలకు సంబంధించిన దైవత్వం. దీన్ని వారు రాజులకు, మత గురువులకు, సంఘంలోని ప్రముఖులకు సంక్రమింపజేశారు. ఈ కారణంగానే చాలామంది రాజులు తమను తాము దైవాంశ సంభూతులమని ప్రకటించుకొని ఇష్టారాజ్యం చేస్తుండే వారు. ఈ రంగంలో దేవునికి ఎలాంటి అధికారం లేదని వారి భావన. స్వార్థపరులైన మత గురువులు, పురోహితులు, ధర్మకర్తలు కూడా వారికి కొమ్ము కాస్తుండేవారు. ఇక్కడ ఇబ్రాహీం ప్రవక్త (అలైహి)తో నమ్రూద్ చక్రవర్తి కూడా అదే భావనతో వాదనకు దిగాడు.



ఉంది. అతను (సంభ్రమాశ్చర్యాలతో చూస్తూ) "చచ్చిపోయిన ఈ ఊరిజనాన్ని దేవుడు మళ్ళీ ఎలా బ్రతికిస్తాడో!" అనుకున్నాడు (తనలోతాను). అప్పుడు దేవుడు (వెంటనే) అతని ప్రాణం తీశాడు. ఆవిధంగా అతను (నిర్జీవ స్థితిలో) వందేళ్ళపాటు పడివున్నాడు.

ఆ తరువాత దేవుడు అతనికి మళ్ళీ ప్రాణం పోసి లేపాడు. అప్పుడతనితో "నీవీ స్థితిలో ఎంతకాలం ఉన్నావో చెప్పగలవా?"అని అడిగాడు. దానికా వ్యక్తి "ఒక రోజో లేక అంతకంటే తక్కువ కాలమో ఉన్నాననుకుంటాను" అని అన్నాడు.

అప్పుడు దేవుడు ఇలా చెప్పాడు:"కాదు, నీవు వందేళ్ళు (ఇలా) ఉన్నావు. సరే, నీవు వెంట తెచ్చుకున్న అన్నపానీయాల వైపు చూడు, (ఇన్నేళ్ళు గడచినా) అవి ఏమాత్రం చెడిపోలేదు. నీ గాడిద వైపు కూడా చూడు (దాని ఎముకలు సైతం ఎలా జీర్ణమయి పోయాయో). మేము నీఉదంతం ద్వారా ప్రజలకు గుణపాఠం గరపడానికే ఇలా చేశాం. ఈ ఎముకలగూడు సరిచేసి దానిపై తిరిగి మాంసం సృష్టించి ఎలా లేపుతామో చూడు."

ఈవిధంగా అతను యదార్థం కళ్ళారా చూసి "దేవుడు ప్రతిపనీ చేయగల సమర్థుడు, సర్వశక్తిమంతుడని నాకు తెలుసు" అన్నాడు. (259)

మరో సంఘటన. అప్పుడు ఇబ్రాహీం"ప్రభూ! నీవు మృతుల్ని ఎలా బ్రతికిస్తావో ఓసారి నాకు చూపు" అన్నాడు. దానికి దేవుడు" నీకు (మామీద) నమ్మకం లేదా?" అని అడిగాడు. "ఎందుకు లేదూ, ఉంది. కాని నా మనోతృప్తి కోసం అడుగుతున్నాను" అన్నాడు ఇబ్రాహీం.

"అయితే నాలుగు పక్షుల్ని తీసుకో. వాటిని (పోషించి) మచ్చిక చేసుకో. తరువాత (వాటిని కోసి) వాటిభాగాలు ఒక్కోదాన్ని ఒక్కో కొండపై ఉంచి వాటిని పిలువు. వెంటనే అవి ఎగిరి నీదగ్గరకు వచ్చేస్తాయి. (ఈ సందర్భంగా) దేవుడు సర్వశక్తిమంతుడు, అత్యంత వివేచనా పరుడన్న విషయం బాగా గుర్తుంచుకో" అన్నాడు దేవుడు. (260)

దైవమార్గంలో సంపద ఖర్చుచేసేవారి (ఖర్చు) పోలిక, ఒక విత్తనం నాటగా అది ఏడు వెన్నులు ఈని ప్రతి వెన్నులో వందేసి గింజలున్నట్లు ఉంటుంది. అదే విధంగా దేవుడు తాను తలచుకున్న వారి కర్మఫలాన్ని అనేక రెట్లు పెంచుతాడు. దేవుడు ఎంతో ఉదార స్వభావుడు, సర్వం తెలిసినవాడు. (261)

దైవమార్గంలో ధనాన్ని ఖర్చుచేయడంతో పాటు, చేసిన మేలు గుర్తుచేసి (దానగ్రహీత) మనస్సు నొప్పించనివారి కోసం వారి ప్రతిఫలం వారి ప్రభువు దగ్గర సిద్ధంగా ఉంది. వారికి (పరలోకంలో) ఎలాంటి భయంగాని, దుఃఖంగాని ఉండదు. దానంచేసి (దానగ్రహీత) మనస్సు నొప్పించే పని కన్నా మృదువుగా మాట్లాడటం, క్షమించడం అనేవి ఎంతో శ్రేష్ఠమైన పనులు. దేవుడు నిరపేక్షాపరుడు, విశాలహృదయం కలవాడు. (262-263)

(కనుక) విశ్వాసులారా! లోకుల మెప్పు కోసం ప్రదర్శనా బుద్ధితో దానధర్మాలుచేసే వాడిలా, మీరు మీ దానధర్మాలను ఎత్తిపొడుపు మాటలద్వారా, (గ్రహీత) మనస్సు

నొప్పించి వృధా చేసుకోకండి. అతనికి దేవునిమీద, పరలోకమ్మీద నమ్మకం లేదు. అలాంటి వ్యక్తి (చేసే దానధర్మాలు) భారీవర్షం కురవగానే పైనున్న పల్చటి మట్టిపొర కాస్తా తుడిచిపెట్టుకుపోయి నున్నగా మిగిలిపోయే రాతి (ప్రదేశం)తో సమానం. అలాంటివారు సత్కార్యాలు చేసి ఎలాంటి పుణ్యఫలం పొందలేరు. సత్యతిరస్కారులకు దేవుడు ఎన్నటికీ సన్మార్గం చూపడు. (264)

(దీనికి భిన్నంగా) కేవలం దైవప్రసన్నత కోసం చిత్తశుద్ధితో తమ సంపదను ఖర్చుచేసే వారు మెరకప్రాంతంలో ఉండే తోట లాంటివారు. ఆతోట వర్షాలు బాగా ఉంటే రెండింతలు ఫలసాయాన్నిస్తుంది. అంతగా వర్షాలు లేకుండా సన్నటి జల్లులు పడినా దానికి సరిపోతుంది. మీరు చేసే పనులన్నీ దేవుడు గమనిస్తూనే ఉన్నాడు. (265)

మీలో ఎవరికైనా ఒక పండ్లతోట ఉందనుకోండి. అందులో కాలువలు కూడా ప్రవహిస్తుంటాయి. తోటలో అతని కోసం రకరకాల పండ్లు ఫలాలు పుష్కలంగా పండి సిద్ధంగా ఉంటాయి. అతనికి వృద్ధాప్యం కూడా వస్తుంది. అయితే అతని పిల్లలు ఇంకా పిన్నవయస్సు లోనే ఉంటారు. అలాంటి స్థితిలో ఓరోజు హఠాత్తుగా తీవ్రమైన వడగాల్పులకు తోట మొత్తం మాడి మసయిపోతుంది. ఇలా సంభవించడాన్ని అతను ఇష్టపడతాడా? మీరు (సత్యాన్ని) అర్థం చేసుకోవడానికి దేవుడు ఇలా తన సూక్తుల్ని మీముందు వివరిస్తున్నాడు. (266)

(కాబట్టి) విశ్వాసులారా! మీరు సంపాదించిన దానిలోనూ, మేము నేలనుండి మీ కోసం ఉత్పత్తిచేసిన దానిలోనూ శ్రేష్ఠమైనదాన్ని దైమార్గంలో ఖర్చుచేయండి.[52] దైవమార్గంలో ఖర్చు చేయడానికి నాసిరకం వస్తువుల్ని ఏరితీసే ప్రయత్నం చేయకండి. అలాంటి వస్తువుల్ని మీకే గనక ఎవరయినా ఇస్తే మీరు తీసుకోవడానికి ఇష్టపడతారా? కళ్ళు మూసుకొని స్వీకరిస్తారేకాని, మనస్ఫూర్తిగా మీరు ఎన్నటికీ వాటిని స్వీకరించరు. దేవుడు నిరపేక్షాపరుడు, స్వతహాగా ప్రశంసనీయుడని తెలుసుకోండి. (267)

షైతాన్ మిమ్మల్ని పేదరికంగురించి భయపెట్టి సిగ్గుమాలిన పనులకు పాల్పడేలా ప్రేరేపిస్తాడు. కాని దేవుడు మిమ్మల్ని క్షమిస్తానని, అనుగ్రహిస్తానని వాగ్దానం చేస్తున్నాడు.

52. దేవుడు మానవునికి అతని మనుగడ కోసం ఈ ప్రపంచంలో అనేక రకాల సంపదల్ని ప్రసాదించాడు. అందుకుగాను అతడు దేవునికి కృతజ్ఞుడై ఉండటంతో పాటు, ఆ సంపదలో కొంత భాగం నిరుపేదలైన తోటి మానవులక్కూడా అందజేయాలి. స్తోమత కలిగినవారు తమ ధన, కనక, వస్తు, పశు సంపదల నుండి ప్రతి ఏడు రెండున్నర శాతం చొప్పున తీసి పేదలకు దానం చేయాలి. దీన్ని జకాత్ అంటారు. (2:43, 9:60 సూక్తులు, వాటి పాదసూచికలు, చూడండి.)

అంతేకాకుండా వారు ధాన్యం, అపరాలు, పండ్లు, కూరగాయలు తదితర భూఉత్పత్తుల నుండి కూడా జకాత్ తీయవలసి ఉంటుంది. దీన్ని "ఉష్ర్" అంటారు. అయితే ఉష్ర్ యేడాదికి ఒకసారి మాత్రమే గాక, సంవత్సరానికి ఎన్నిసార్లు పండిస్తే అన్నిసార్లు తీసి పేదలకు దానం చేయాలి. వర్షం వల్ల పండే పంట నుండి పది శాతం, ఖర్చుతో కూడిన నీటిపారుదల సౌకర్యం వల్ల పండే పంట నుండి అయిదు శాతం చొప్పున ఉష్ర్ తీసి పేదలకు విధిగా అందజేయాలి.



ఆయన ఎంతో ఉదారస్వభావుడు, సర్వం తెలిసినవాడు. తాను తలచుకున్న వారికి వివేకం, విచక్షణ జ్ఞానం ప్రసాదిస్తాడు. వివేకం, విచక్షణల జ్ఞానం లభించినవాడు ఎంతో అదృష్ట వంతుడు. నిజంగా అతనికి అపార సంపదలు లభించినట్లే. బుద్ధిమంతులు మాత్రమే (మా) హితోపదేశం గ్రహిస్తారు. (268-269)

మీరు (దైవమార్గంలో) ఖర్చు చేసిందయినా, లేక మీరు మొక్కుబడి చేసుకున్నదైనా సరే, అంతా దేవునికి తెలుసు. దుర్మార్గులకు ఎవరూ సహాయం చేయరు. మీరు దానధర్మాలు బహిరంగంగా చేసినా మంచిదే; ఒకవేళ మీరు ఇతరుల కంట పడకుండా రహస్యంగా అగత్యపరులకు దానం చేస్తే అది మరీ మంచిది. అలాంటి దానం మీ పాపాలను కడిగివేస్తుంది. మీరు చేసేదంతా దేవునికి తెలుసు. (270-271)

(ముహమ్మద్!) ప్రజలను సన్మార్గానికి తీసుకొచ్చే బాధ్యత నీమీద లేదు. దేవుడు మాత్రమే తాను తలచిన వారిని దారికి తెస్తాడు.

మీసంపద నుండి మీరు ఏది ఖర్చుచేసినా అది మీకే లాభ దాయకం. మీరు చేసేదంతా దైవప్రసన్నత కోసమే కదా! దైవప్రసన్నత కోసం మీరు ఏది ఖర్చుచేసినా దాని పుణ్యఫలం మీకు పూర్తిగా లభిస్తుంది. మీకేమాత్రం అన్యాయం జరగదు. (272)

ముఖ్యంగా దైవకార్యాల్లో నిమగ్నులయిపోయి, జీవనోపాధి కోసం ధరణిపై తిరిగే అవకాశం లేని నిరుపేదలకు (ఆర్థికసహాయం చేయండి). వారి స్థితిగతులు ఎరగనివారు వారి ఆత్మాభిమానం చూసి వారు స్థితిపరులేనని భావిస్తారు. కాని వారి ముఖాలు చూస్తే మీరు వారి వాస్తవ పరిస్థితి గ్రహిస్తారు. వారు (సిగ్గు వదలి) ప్రజల వెంటబడి అర్థించే (యాచకుల్లాంటి) వారుకాదు. వారి సహాయం కోసం మీరు చేసే ఏఖర్చయినా దేవునికి తెలియకుండా ఉండదు. (273)

రాత్రింబవళ్ళు బహిరంగంగానూ, గోప్యంగానూ (దైవమార్గంలో) తమ సంపదను ఖర్చు చేసేవారి కోసం తగిన ప్రతిఫలం వారి ప్రభువు దగ్గర సిద్ధంగా ఉంది. వారికి (అక్కడ) ఎలాంటి భయంగాని, దుఃఖంగాని ఉండదు. (274)

పోతే వడ్డీ తినేవాడు పిశాచం పట్టిన పిచ్చివాడిలా (బిత్తర చూపులతో సమాధి నుండి) లేస్తాడు. ఈ దుస్థితికి కారణం, వారు వ్యాపారం కూడా వడ్డీ లాంటిదే కదా అని అంటారు. కాని దేవుడు వ్యాపారాన్ని ధర్మసమ్మతం చేశాడు. వడ్డీని అధర్మకార్యంగా నిర్ణయించాడు.[53] కనుక ఈ హితబోధ అందినవారు ఇకముందు వడ్డీ తినటాన్ని

53. ఈనాడు కూడా కొంతమంది 'వ్యాపారం కూడా వడ్డీ లాంటిదే కదా!' అని అనడం మనం వింటున్నాం. కాని వడ్డీ వ్యవస్థను దేవుడు పూర్తిగా నిషేధించాడు. వడ్డీ తినే (తీసుకునే) వాడ్ని, తినిపించే (ఇచ్చే) వాడ్ని, దానికి సాక్షులుగా ఉండేవారిని, వడ్డీ పత్రం రాసేవాడ్ని- అందర్నీ దేవుడు శపించాడని దైవప్రవక్త (సల్లం) తెలిపారు. (అబూదావూద్, ఇబ్నె మాజ, నసాయి.)

మరొక హదీసులో దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "అధర్మకార్యకలాపాలతో సత్యాన్ని అణచివేసే ఉద్దేశ్యంతో అన్యాయపరుడికి అండగా నిలిచిన వ్యక్తి దేవుని రక్షణ నుండి, దైవప్రవక్త

మానుకోవాలి. జరిగిందేదో జరిగింది. ఇకనుండి మాత్రం మానుకోవాలి. ఆలాంటివారి వ్యవహారం (రేపు) దేవుడు పరిష్కరిస్తాడు. ఒకవేళ ఈ ఆదేశం అందిన తరువాత కూడా మళ్ళీ ఎవరైనా ఈ పాపకార్యానికి పాల్పడితే వారు నరకం పాలవుతారు. నరకంలోనే ఎల్లకాలం (నానా యాతనలు అనుభవిస్తూ) పడిఉంటారు. (275)

దేవుడు వడ్డీని తుదముట్టిస్తాడు. దానధర్మాలకు వృద్ధివికాసాలు కలిగిస్తాడు. కృతఘ్నుడు, పాపాత్ముడయినవాడ్ని దేవుడు ఎన్నటికీ ప్రేమించడు. అయితే (సత్యాన్ని) విశ్వసించి సదాచార సంపన్నులయి నమాజు (విధి) నిర్వహిస్తూ, (పేదల ఆర్థికహక్కు) జకాత్ నెరవేరుస్తూ ఉండేవారికి వారిప్రతిఫలం వారిప్రభువు వద్ద సిద్ధంగా ఉంది. వారికి (పరలోకంలో) ఎలాంటి భయంగాని, దుఃఖంగాని ఉండదు. (276-277)

విశ్వాసులారా! దేవునికి భయపడండి. మీరు నిజంగా విశ్వసించిన వారయితే మీకు రావలసిన వడ్డీని వదిలేయండి. మీరిలా చేయకపోయారా, జాగ్రత్త! దేవుని తరఫున, ఆయన ప్రవక్త తరఫున మీకు వ్యతిరేకంగా యుద్ధప్రకటన వెలువడినట్లేనని తెలుసుకోండి.[54] కనుక ఇకనయినా పశ్చాత్తాపం చెంది (వడ్డీ తీసుకోవడాన్ని మానేసి) నట్లయితే మీకు మీ మూల ధనం తీసుకునే హక్కు ఉంటుంది. దానివల్ల మీకూ నష్టం ఉండదు; ఇతరులకూ నష్టం ఉండదు. (278-279)

---

రక్షణ నుండి బయటికి పోయినట్లే. ఒక్క దిర్హం (రూపాయి) కూడా వడ్డీ తిన్నవాడి పాపం 33 సార్లు వ్యభిచారం చేసిన పాపంతో సమానం. అధర్మ సంపాదనతో పోషించబడిన శరీరానికి (నరకా)అగ్నే తగిన శిక్ష". (తబ్రానీ)

వేరొక హదీసులో ఆయన ఇలా బోధించారు: "మీలో ఎవరయినా వేరొకరికి అప్పు ఇచ్చి నట్లయితే (అప్పు తీసుకున్న) అతను ఆ వ్యక్తికి కానుకలు పంపినప్పుడు లేదా తన వాహనం మీద కూర్చోబెట్టుకోవడానికి ముందుకొచ్చినప్పుడు (రుణదాత) ఆ కానుకను స్వీకరించడంగాని, అతని వాహనం మీద ఎక్కడంగాని చేయకూడదు. అయితే ఈపనులు ముందునుంచీ సాగుతూ వస్తుంటే అలా చేయడంలో తప్పలేదు". (ఇబ్నెమాజా, మిష్కాత్)

54. ఇస్లామీయ పాలనలో ఉండేవారు ముస్లిములైనా, ముస్లిమేతరులైనాసరే వడ్డీవ్యాపారం చేయడం నేరం. హజ్రత్ ఇబ్నెఅబ్బాస్, హసన్ బస్రీ, ఇబ్నెసీరీన్ లాంటి ప్రముఖ షరీఅత్‌వేత్తలు ఈసూక్తిని బట్టి వడ్డీ తీసుకునే వ్యక్తిపై వత్తిడితెచ్చి ఆపని మాన్పింపజేయాలని, మానుకోకపోతే అతడ్ని వధించాలని అభిప్రాయపడ్డారు. అయితే మరికొందరు షరీఅత్ వేత్తలు, అలాంటి వ్యక్తిని వడ్డీ తీసు కోవడం మానేవరకు జైల్లో పెడ్తే చాలని అభిప్రాయపడ్డారు. 3, 4 అధ్యాయాల్లో వడ్డీ తీసుకోవడాన్ని వారించడం జరిగింది. (3:130, 30:39 సూక్తులు చూడండి.)

ఆర్థిక చెడుగులన్నిటికీ వడ్డీయే మూలకారణమని పూర్వం ఆర్థిక శాస్త్రవేత్తలందరూ అంగీక రించారు. వెనుకటి మతాలు కూడా వడ్డీని దాదాపు నిషేధించాయి. ప్రఖ్యాత గ్రీకు తత్వవేత్తలు ప్లేటో, అరిస్టాటిల్ వడ్డీని నిరసించారు. ప్లేటో Laws అనే తన గ్రంథంలో ఒక ఆదర్శ నగరాన్ని వర్ణిస్తూ అందులో వడ్డీని నిషేధించాడు. అరిస్టాటిల్ "పాలిటిక్స్" అనే తన గ్రంథంలో "డబ్బు సంపాదించే పద్ధతులలో వడ్డీ అత్యంత నీచమైన పద్ధతి" అన్నాడు. మరొక చోట "ధనార్జన విధానాలలోకెల్లా వడ్డీ ఎంతో ప్రకృతి విరుద్ధమైన పని" అని పేర్కొన్నాడు.



ఒకవేళ రుణగ్రస్తుడు ఇబ్బందులతో సతమతమౌతుంటే పరిస్థితి చక్కబడే వరకు అతనికి అవకాశమివ్వండి. రుణం మాఫీచేస్తే మరీమంచిది. మీరు (విషయం) గ్రహించ గల్గితే ఇది మీకు ఎంతో శ్రేయస్కరమైనది. మీరంతా చివరికి దేవుని సన్నిధికి చేరుకో వలసిన దినం గురించి భయపడండి. (ఆరోజు) ప్రతివ్యక్తికీ అతను చేసుకున్న కర్మలకు పూర్తి ప్రతిఫలం లభిస్తుంది. ఎవరికీ ఎలాంటి అన్యాయం జరగదు. (280-281)

విశ్వాసులారా! మీరు ఏదైనా ఒక నిర్ణీత కాలానికిగాను అప్పు ఇచ్చిపుచ్చుకోవడం గురించి పరస్పరం మాట్లాడుకుంటే ఆ విషయాన్ని వ్రాతపూర్వకంగా నమోదు చేసుకోండి.[55] అయితే రుణపత్రం రాసేవ్యక్తి ఎవరికీ ఎలాంటి నష్టం కలగనీయకుండా

---

బైబిల్ పాత నిబంధనలో వడ్డీ నిషేధం గురించిన కొన్ని వాక్యాలు చూడండి:

"నా ప్రజలలో నీయొద్ద నుండు ఒక బీదవానికి సొమ్ము అప్పిచ్చిన యెడల వడ్డీకిచ్చు వాని వలె వానియెడల ప్రవర్తించకూడదు; వానికడ వడ్డీ తీసుకొనకూడదు." (నిర్గమ కాండము-22:25)

"అప్పిచ్చి వడ్డీ పుచ్చుకొనుటయు, లాభము చేపట్టుటయు మున్నగు పనులు చేయువాడు బ్రతుకునా? బ్రతుకడు. ఈ హేయ కార్యములు చేసెను గనగ ఆవశ్యముగ వానికి మరణ శిక్ష విధించవలెను." (యెహెజ్కేలు- 18:13)

క్రైస్తవ మతసంస్కర్తల్లో అగ్రగణ్యుడైన మార్టిన్ లూథర్ వడ్డీని గురించి రాసిన విషయాన్ని కారల్ మార్క్స్ ఇలా పేర్కొన్నాడు: "వడ్డీ ఒక పెద్ద రాక్షసి. ఇది సర్వనాశనం చేస్తుంది. మనం దోపిడీ గాండ్రను, హంతకులను, దొంగలను చంపుతాము కదా! మరి ఈ వడ్డీ తీసుకునే వారిని ఏం చెయ్యాలి? వారిని వేటాడి తలకాయలు నరికివేయాలి." (క్యాపిటల్ 2వ భాగం-పే.652)

వడ్డీ నిషేధం గురించి బైబిల్‌లో ఇంత స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ నేటి క్రైస్తవులు, అది సలహా మాత్రమేనని, ఆజ్ఞ కాదని చెబుతున్నారు.

మనుస్మృతిలో కూడా వడ్డీ నిషేధించబడింది. మనువు వడ్డీ జీవితం ఆపదలందు జీవికగా చెబుతూ బ్రాహ్మణులు, క్షత్రియులు మాత్రం ఆపదలందు సైతం వడ్డీకిచ్చి జీవనం చేయరాదని అన్నాడు. (IV- 220)

మరొక చోట "నిష్ఠాహర్థుషిక స్యాన్నం" (వడ్డీ వ్యాపారి అన్నం మలంతో సమానం) అని పేర్కొన్నాడు. అయితే ఆ తరువాత ధర్మశాస్త్రకారులు వైశ్యుల కోసం వడ్డీ వృత్తిని ధర్మసమ్మతం చేశారు. పైగా ఆర్య ధర్మకారులు ఎవరెవరి వద్ద ఎంతెంత వడ్డీ తీసుకోవాలో కూడా నిర్ణయించారు.

ఈనాడు ప్రాచీన మతవిలువలన్నీ రాతలకు మాత్రమే పరిమితమయి పోయాయి. ఇస్లాం వీటన్నిటికీ భిన్నంగా రాతలకు, చేతలకు పొంతనలేని వైఖరిని గర్హిస్తుంది. "ఆదేశం అందిన తర్వాత మళ్ళీ ఎవరైనా పాపకార్యానికి పాల్పడితే వారు నరకం పాలవుతారని" తీవ్రంగా హెచ్చరిస్తోంది.

55. రుణదాతకు రుణగ్రస్తులపై ఎంత నమ్మకం ఉన్నప్పటికీ ముందుజాగ్రత్త కోసం దస్తావేజు రాయించుకోవడం చాలా మంచిది. దస్తావేజులో సాక్షుల్ని కూడా పెట్టుకోవాలి. దీనివల్ల ఉభయుల మధ్య సంబంధాలు సవ్యంగా ఉంటాయి. దస్తావేజు రాయించుకోకుండా అప్పిచ్చి నప్పుడు విధివశాత్తు రుణగ్రస్తుడు అప్పు చెల్లించకుండా ఎగవేస్తే రుణదాతకు జరిగిన ఈ నష్టానికి దేవుడు కూడా బాధ్యత తీసుకోడు. ఈ సందర్భంగా దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు:

న్యాయంగా, నిష్పక్షపాతంగా వ్రాయాలి. దేవుడు తనకు నేర్పినవిధంగా వ్రాయాలి. అతను దస్తావేజు వ్రాయడానికి నిరాకరించకూడదు. బాధ్యత పైనబడిన వ్యక్తి (రుణగ్రస్తుడు) మాత్రమే ఆ విషయం చెప్పి వ్రాయించాలి. అతను తన నిజప్రభువయిన దేవునికి భయపడుతూ నిర్ణీత వ్యవహారంలో ఎలాంటి తగ్గింపు చేయకుండా వ్రాయించాలి.

ఒకవేళ అప్పు తీసుకునే వ్యక్తి బుద్ధిమాంద్యం కలవాడో, బలహీనుడో అయి నట్లయితే లేదా చెప్పి వ్రాయించే శక్తి లేనివాడైతే అతని సంరక్షకుడు చెప్పి న్యాయంగా వ్రాయించాలి. (ఈ వ్యవహారం గురించి) మీలో ఇద్దరు పురుషుల్ని సాక్షులుగా పెట్టు కోండి. పురుషులు ఇద్దరు లభించకపోతే ఒక పురుషుడు, ఇద్దరు స్త్రీలయినా చాలు. వారిలో ఒకస్త్రీ మరచి పోతే రెండోస్త్రీ అయినా గుర్తుచేస్తుంది. సాక్షులు మీకు ఆమోద యోగ్యమైనవారుగా ఉండాలి. సాక్ష్యంకోసం పిలిచినప్పుడు సాక్షులు నిరాకరించకూడదు.

గడువు నిర్ణయించబడిన రుణవ్యవహారం చిన్నదైనాపెద్దదైనా దస్తావేజుగా రాయడంలో అశ్రద్ధ చేయకండి. ఇది దేవుని దృష్టిలో ఎంతో న్యాయమైన పద్ధతి. సాక్ష్యమివ్వడానికి కూడా చాలా మంచిపద్ధతి. దానివల్ల మీరు ఎలాంటి అనుమానాలకు లోనయ్యే తావుండదు.

పోతే మీరు పరస్పరం ఎప్పటికప్పుడు అక్కడికక్కడ జరుపుకునే క్రయవిక్రయాల విషయంలో దస్తావేజు వ్రాసుకోకపోయినా పర్వాలేదు. మీరు పరస్పరం వ్యాపార ఒప్పందాలు కుదుర్చుకునేటప్పుడు సాక్ష్యం పెట్టుకోండి. దస్తావేజు వ్రాసే వ్యక్తికిగాని, సాక్షులుగా ఉండే వారికిగాని నష్టం వాటిల్లరాదు. అలాంటి నష్టం ఏదైనా జరిగితే మీకది పాపకార్యంగా పరిణమిస్తుంది. దేవునికి భయపడుతూ మసలుకోండి. చూడండి, ఆయన మీకు ఎలాంటి మంచి విషయాలు నేర్పుతున్నాడో! దేవుడు సమస్త విషయాలు ఎరిగినవాడు. (282)

---

“మూడు విధాల వ్యక్తులు దేవుడ్ని మొరపెట్టుకుంటారు. కాని దేవుడు వారి మొరల్ని ఆల కించడు. ఒకడు, భార్య శీలంలేని స్త్రీ అని తెలిసినప్పటికీ ఆమెకు విడాకులివ్వని వ్యక్తి. రెండోవాడు, (తన అధీనంలో ఉన్న) అనాథ బాలుడు యుక్త వయస్సుకు చేరుకోక ముందే అతని ఆస్తిని అతనికి అప్పగించిన వ్యక్తి. మూడోవాడు, ఎవరికైనా అప్పిచ్చి దానికి సాక్షుల్ని పెట్టుకోని వ్యక్తి.”

ఎంతో అవసరమయితే తప్ప అప్పు చేయడాన్ని దైవప్రవక్త (సల్లం) ఇష్టపడేవారు కాదు. ఒక వ్యక్తి ధర్మ సంస్థాపనా మార్గంలో అమరగతి (షహాదత్) పొందినప్పటికీ చేసిన అప్పు తీర్చకపోతే మాత్రం దేవుడు అతడ్ని క్షమించడని తెలుస్తోంది.

“దైవమార్గంలో ప్రాణాలర్పించిన వ్యక్తి పాపాలన్నీ క్షమించబడతాయి, ఒక్క అప్పు తప్ప” అని దైవప్రవక్త (సల్లం) తెలిపారు. (ముస్లిం)

ఆయన ఒకసారి “దేవా! నేను పాపం, రుణం (బారి) నుండి నీ శరణు కోరుతున్నా”నని అన్నారు. అప్పుడు ఒక అనుచరుడు “దైవప్రవక్తా! మీరు తరచుగా రుణం నుండి శరణు కోరుతున్నా రేమిటీ?” అని అడిగాడు. దానికి దైవప్రవక్త (సల్లం) సమాధానమిస్తూ “మనిషి అప్పుల పాలైనప్పుడు మాట్లాడితే అబద్ధమాడుతాడు; వాగ్దానం చేస్తే దాన్ని నిలబెట్టుకోలేడు” అన్నారు. (బుఖారి)



మీరు ప్రయాణావస్థలో ఉన్నప్పుడు దస్తావేజు వ్రాసేవారు లభించకపోతే ఏదైనా వస్తువు తాకట్టుపెట్టి అప్పు తీసుకోండి.[56] అప్పిచ్చేవాడు అప్పు తీసుకునే వ్యక్తిని నిజాయితీ పరుడని భావించి తాకట్టు లేకుండానే అప్పు ఇస్తే రుణగ్రహీత నిజాయితీగా దాన్ని (గడువు తీరగానే) రుణదాతకు తిరిగి చెల్లించాలి. అతను తన నిజప్రభువయిన దేవునికి భయపడాలి. సాక్ష్యాన్ని దాచకూడదు. సాక్ష్యం దాచేవాడి అంతర్యం పాప పంకిలంతో నిండిపోతుంది. మీరు చేసేదంతా దేవుడు గమనిస్తూనే ఉంటాడు. (283)

భూమ్యాకాశాలలో ఉన్న సమస్తం దేవునిదే. మీరు మీహృదయాల్లో ఉన్న దాన్ని బహిర్గతం చేసినా, దాచినా ఎట్టి పరిస్థితిలోనూ దాన్ని గురించి దేవుడు మీనుండి లెక్క తీసుకుంటాడు. ఆతర్వాత ఆయన తాను తలచిన విధంగా కొందరిని క్షమిస్తాడు. మరి కొందరిని శిక్షిస్తాడు. దేవుడు ప్రతిపనీ చేయగల సమర్థుడు, సర్వశక్తిమంతుడు. (284)

దైవప్రవక్త తన ప్రభువు నుండి తనపై అవతరించిన దివ్యగ్రంథాన్ని విశ్వసించాడు. అలాగే విశ్వాసులు కూడా. వారంతా దేవుడ్ని, ఆయన దూతలను, ఆయన గ్రంథాలను, ఆయన ప్రవక్తలను విశ్వసిస్తున్నారు. వారిలా అంటారు:

“మేము ఆయన ప్రవక్తలలో ఎవరినీ భేదభావంతో చూడము. (మా దృష్టిలో అందరూ సత్యవంతులైన ప్రవక్తలే.[57] మేము (దైవాజ్ఞ) విన్నాము. దాన్ని పాటిస్తున్నాము. ప్రభూ! మాకు క్షమాభిక్ష ప్రసాదించు. (చివరికి) మేము నీ సన్నిధికే తిరిగి రావలసిన వాళ్ళము.” (285)

దేవుడు ఏ మనిషిపై కూడా అతని శక్తికి మించిన భారం వేయడు. ప్రతివ్యక్తి సంపాదించే సుకృతఫలం ఆ వ్యక్తికే లభిస్తుంది. అతని దుష్కార్య పర్యవసానం కూడా అతనే చవిచూడవలసి ఉంటుంది.

(విశ్వాసులారా! ఇలా ప్రార్థించండి:) “ప్రభూ! మేము మరచి ఏదైనా పొరపాటు చేసివుంటే దాన్ని పట్టకు. మాకు పూర్వం గతప్రజలపై మోపిన భారం మాపై మోపకు. ప్రభూ! మేము మోయలేని భారం మామీద వేయకు. మాపట్ల మృదువుగా ప్రవర్తించు. మా పొర పాట్లు పట్టించుకోకు. మమ్మల్ని క్షమించు, కనికరించు. నీవే మాస్వామివి, సంరక్షకుడివి. అవిశ్వాసులకు వ్యతిరేకంగా మాకు సహాయం చెయ్యి.” (286) ✪

---

56. వడ్డీ ఎలాంటి పరిస్థితిలోనైనా నిషిద్ధమే (హరాం). చివరికి తాకట్టుగా పెట్టిన వస్తువు ద్వారా ప్రయోజనం పొందడం కూడా నిషిద్ధమే. ఉదాహరణకు- ఎవరైనా ఇల్లు తాకట్టు పెట్టి అప్పు తీసుకుంటే రుణదాత ఆ ఇంటికి వచ్చే అద్దె పైకాన్ని తింటే వడ్డీ తిన్నట్లే అవుతుంది. అయితే తాకట్టు వస్తువు కోసం ఖర్చుపెట్టవలసిన అవసరమున్నప్పుడు అలాంటి వ్యవహారాలకు ఈ షరతు నుండి మినహాయింపు ఉంది. ఉదా/కు- ఎవరైనా గేదెను తాకట్టు పెడ్తే రుణదాత ఆ గేదెను మేపడానికి, పోషించడానికి డబ్బు ఖర్చుచేయవలసి వస్తుంది గనక అతను దాని పాలను వాడుకోవచ్చు.

57. వివరాలకు 2:4, 2:136, 3:83-84 సూక్తులు చూడండి. ✪

# 3. ఇమ్రాన్ కుటుంబం (ఆలిఇమ్రాన్)

**అవతరణ: మదీనా** **సూక్తులు: 200**

ఈ అధ్యాయాన్ని "ఆలి ఇమ్రాన్" (ఇమ్రాన్ కుటుంబం) అంటారు. ఇందులో నాలుగు ప్రసంగాలున్నాయి. 1-32 సూక్తులు గల మొదటి ప్రసంగం బహుశా బద్ర్ యుద్ధం తర్వాత సమీప కాలంలోనే అవతరించింది. 33-63 సూక్తులు గల రెండవ ప్రసంగం హిజ్రీశకం 9వ ఏట, నజ్రాన్ ప్రతినిధి వర్గం మదీనా వచ్చిన సందర్భంలో అవతరించింది. 64-120 సూక్తులుగల మూడవ ప్రసంగం మొదటిప్రసంగం వెలువడిన కొన్నాళ్ళకే అవతరించినట్లు గోచరిస్తోంది. 120 నుంచి చివరి సూక్తి వరకుగల నాల్గవ ప్రసంగం ఉహుద్ యుద్ధం తరువాత అవతరించింది.

దైవప్రవక్త (సల్లం) తన సహచరులతో మక్కానుండి మదీనా వలసవచ్చిన తర్వాత మదీనా ముస్లింల మధ్య ఆర్థిక సమతులనం లేకుండాపోయింది. ముహాజిర్ ముస్లింలకు, అన్సార్ ముస్లింలకు మధ్య సోదరసంబంధాల్ని ఏర్పరచి దీన్ని కొంతమేరకు అధిగమించినప్పటికీ ఇస్లాం వ్యతిరేకశక్తుల కార్యకలాపాలు ముస్లింలకు పెద్ద తలనొప్పిగా పరిణమించాయి. దైవప్రవక్త (స) మదీనా రాగానే దాని పరిసర ప్రాంతాల్లోని యూద తెగలతో స్నేహఒప్పందం చేసుకున్నారు. కాని బద్ర్ యుద్ధంలో మక్కా అవిశ్వాసులు ఓడిపోయిన తర్వాత ఆ యూదతెగలు స్నేహఒప్పందాన్ని గౌరవించకుండా ముస్లింలకు వ్యతిరేకంగా రకరకాల కుట్రలు పన్నడం ప్రారంభించారు.

ముఖ్యంగా బనీఖైనుఖా తెగ ఈ విషయంలో హద్దుమీరి పోయింది. ఆ తెగవాళ్ళు దైవప్రవక్త (సల్లం)ను హతమార్చడానిక్కూడా కుట్రపన్నారు. దాంతో దైవప్రవక్త (సల్లం) ఆ తెగపై దాడిచేసి దాన్ని అణచివేశారు. చివరికి వారు సంధి చేసుకొని దాని ప్రకారం మదీనా వదలిపెట్టి పోయారు. అయితే బనీనజీర్ అనే మరో యూదతెగ మక్కా బహుదైవారాధకులతో చేతులు కలిపి ముస్లింలతో చేసుకున్న మైత్రీ ఒప్పందాన్ని ఉల్లంఘించడానికి పాల్పడింది. వారిని ముస్లింలకు వ్యతిరేకంగా ఉసిగొల్పింది. దాంతో ఉహుద్ యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో యూదులేగాక, కపటవిశ్వాసులు కూడా ముస్లింలకు వ్యతిరేకంగా దుష్టపన్నాగాలు పన్నారు. మరోవైపు కొందరు ముస్లింలలోని కొన్ని బలహీనతల వల్ల ఉహుద్ యుద్ధంలో మొదట ఇస్లాంవ్యతిరేక శక్తులవైపు విజయం మొగ్గింది. ఇలాంటి పరిస్థితిలో ఈ అధ్యాయం (సూరా) అవతరించింది.

**కరుణామయుడు, కృపాసాగరుడయిన దేవుని పేరుతో ప్రారంభం**

అలిఫ్-లామ్ -మీమ్. అల్లాహ్ (మాత్రమే అసలైన ఆరాధ్యదైవం). ఆయన తప్ప మరోదేవుడు లేడు. ఆయన సజీవుడు, శాశ్వితుడు, సకలసృష్టికి ఆధారభూతుడు. (1,2)

ఆయనే నీపై సత్యపూరితమైన ఈ గ్రంథాన్ని అవతరింపజేశాడు. ఇది గత గ్రంథాలను ధృవీకరిస్తోంది. దీనికి పూర్వం మానవాళికి సన్మార్గం చూపేందుకు వచ్చిన తౌరాత్, ఇన్జీల్ గ్రంథాలను కూడా ఆయనే అవతరింపజేశాడు. ఆ తరువాత ఆయన (సత్యాసత్యాలను వేరుచేసి చూపే ఈ గీటురాయి (ఫుర్ఖాన్)ని అవతరింపజేశాడు. కనుక దేవుడు పంపిన సూక్తులు విశ్వసించేందుకు నిరాకరించేవారికి అత్యంత కఠినశిక్ష



తప్పదు. దేవుడు అపార శక్తిసంపన్నుడు, దుష్పర్యవసానం చవిచూపేవాడూను. భూమ్యాకాశాల్లోని ఏవస్తువూ దేవునికి కానరాకుండా మరుగుగాలేదు. ఆయనే (స్త్రీల)గర్భాల్లో మీ రూపురేఖల్ని తాను తలచిన విధంగా రూపొందించేవాడు. అపార శక్తిసంపన్నుడు, అద్భుత వివేచనాపరుడైన ఆ స్వామి తప్ప (మీకు) మరో ఆరాధ్యుడు లేడు. (3-6)

(ప్రవక్తా!) ఆయనే నీ (హృదయఫలకం)పై ఈ గ్రంథాన్ని అవతరింప జేసినవాడు. ఇందులో రెండురకాల సూక్తులున్నాయి. ఒకటి, (ఏమాత్రం సందిగ్ధానికి ఆస్కారం లేని) స్పష్టమైన సూక్తులు. ఇవి గ్రంథానికి మాతృకలు వంటివి. (అంటే గ్రంథ సారాంశాలు). రెండు, అస్పష్టమైనవి. వక్రబుద్ధికలవారు కలహాలు సృష్టించే ఉద్దేశ్యంతో ఎల్లప్పుడూ అస్పష్టమైన సూక్తుల వెంటే పడతారు. వాటికి లేనిపోని అర్థాలు ఆపాదించడానికి ప్రయత్నిస్తారు. నిజానికి వాటి అసలు భావం దేవునికి తప్ప మరెవరికీ తెలియదు. దీనికి భిన్నంగా విషయ పరిజ్ఞానంలో స్థితప్రజ్ఞులైనవారు "మేము వీటిని నమ్ముతున్నాము. ఇవన్నీ మా ప్రభువు నుండి వచ్చినవే" అని అంటారు. నిజానికి ఏ విషయం ద్వారానైనా బుద్ధిమంతులే గుణపాఠం నేర్చుకుంటారు. (7)

(వారిలా వేడుకుంటారు:) "ప్రభూ! నీవు మాకు (ఒకసారి) సన్మార్గం చూపిన తరువాత తిరిగి మా హృదయాల్ని వక్రమార్గం వైపు పోనివ్వకు. నీ సన్నిధి నుండి మాకు కారుణ్యం ప్రసాదించు. నీవే గొప్ప (కారుణ్య) ప్రదాతవు. ప్రభూ! ఒక రోజు నీవు మానవులందర్నీ సమావేశ పరచనున్నావు. ఆరోజు తప్పకుండా వస్తుంది. దేవుడు తన వాగ్దానాన్ని ఎన్నటికీ మీరడు." (8,9)

సత్యాన్ని తిరస్కరించేవారికి (ఆరోజు) దేవుని సమక్షంలో వారి సంతానం, సిరిసంపదలు ఎంతమాత్రం ఉపయోగపడవు. వారు నరకాగ్నికి సమిధలయి పోతారు. ఫిరౌనీయులకు, వారికి పూర్వం గత సత్య తిరస్కారులకు ఎలాంటి గతి పట్టిందో వీరికి కూడా అదే గతి పడ్తుంది. వారు మా సూక్తులను, సూచనలను తిరస్కరించారు. తత్ఫలితంగా దేవుడు వారిని వారి అకృత్యాల కారణంగా పట్టుకున్నాడు. దేవుడు అత్యంత కఠినంగా శిక్షించేవాడు. (10-11)

(ముహమ్మద్!) వారికిలా చెప్పెయ్యి: "మీరు త్వరలోనే పరాధీనులయి (పశువులకన్నా నికృష్టంగా) నరకం వైపు తోలబడతారు. నరకం అతి చెడ్డ నివాసస్థలం. (12)

పరస్పరం తలపడిన రెండు వర్గాలలో గుణపాఠం గరిపే చిహ్నాలు మీకు ఇదివరకే (బద్ర్ యుద్ధంలో) గోచరించాయి. అందులో ఒకవర్గం దైవమార్గంలో పోరాడేవారిది. రెండోవర్గం సత్యతిరస్కారులది. చూసేవారు తమ కళ్ళారా ఆ దృశ్యాన్ని చూశారు.[1]

---

1. బద్ర్ యుద్ధంలో శత్రు సైనికులు వేయిమంది ఉంటే, ముస్లిం యోధులు 313 మంది మాత్రమే ఉన్నారు. శత్రు సైనికులందరికీ సరిపడ వాహనాలు ఉన్నాయి. ముస్లిం యోధులకు రెండు గుర్రాలు, డెబ్భయి ఒంటెలు మాత్రమే ఉన్నాయి. ఒక్కొక్క ఒంటెపై ముగ్గురు, నల్గురు చొప్పున కూర్చొని ప్రయాణం చేయవలసి వచ్చింది. అప్పటికీ కొందరు కాలినడక సాగించవలసి వచ్చింది. శత్రువులు ఖరీదైన శిరస్త్రాణాలు, యుద్ధకవచాలు ధరించి ఉంటే, ముస్లిం యోధులకు

అప్పుడు అవిశ్వాసుల వర్గం విశ్వాసుల వర్గానికి రెట్టింపు సంఖ్యలో ఉందని వారు గ్రహించారు. దేవుడు తాను తలచుకున్నవారిని తన సహాయ సహకారాల ద్వారా బలోపేతం చేస్తాడు. కళ్ళున్నవారికి ఈ సంఘటనలో గొప్ప గుణపాఠం ఉంది. (13)

స్త్రీలు, సంతానం, వెండి బంగారం రాశులు, మేలుజాతి గుర్రాలు, పశుసంపద, సేద్యభూములు (వగైరా) వ్యామోహవస్తువులు మానవులకు మనోహరమైనవిగా చేయబడ్డాయి కాని ఇదంతా ఇహలోకంలో మూన్నాళ్ళ ముచ్చటగా ఇవ్వబడిన జీవన సామగ్రి మాత్రమే. శ్రేష్ఠమైన (శాశ్వత) నివాసం దేవుని దగ్గరే లభిస్తుంది. (14)

వారికిలా చెప్పు: "వీటికంటే ఎంతో శ్రేష్ఠమైన వస్తువులేమిటో మీకు చెప్పనా? భయభక్తులుకలవారి కోసం (చల్లటి) సెలయేరులు ప్రవహించే స్వర్గవనాలు సిద్ధంగా ఉన్నాయి. అక్కడే వారు శాశ్వత జీవితం గడుపుతారు. పైగా వారికక్కడ ఈడు-జోడు, తోడు-నీడగా పవిత్రసహచరులు[2] కూడా ఉంటారు. అన్నిటికన్నా మించి దేవుని ప్రసన్నతా భాగ్యం ప్రాప్తమవుతుంది. దేవుడు తన దాసుల వైఖరిని ఓ కంట గమనిస్తున్నాడు. (15)

వారు ఈవిధంగా వేడుకుంటారు: "ప్రభూ! మేము (నిన్ను, నీ ప్రవక్తను) విశ్వసించాం. మా తప్పులు మన్నించు. మమ్మల్ని నరకాగ్ని నుండి రక్షించు." వీరు సహనశీలురు, స్థిరచిత్తులు, సత్యమంతులు, రుజువర్తనులు, వినమ్రులు, దానశీలురు, రాత్రి చివరి ఘడియల్లో దేవుడ్ని క్షమాభిక్ష వేడుకునేవారు. (16-17)

తాను తప్ప మరో ఆరాధ్యనీయుడు లేడని స్వయంగా దేవుడే సాక్ష్యమిస్తున్నాడు. సర్వశక్తిమంతుడు, మహావివేకి అయిన ఆయన తప్ప మరోదేవుడు లేడని దైవదూతలు, నీతిమంతులైన జ్ఞానసంపన్నులు కూడా సాక్ష్యమిస్తున్నారు. (18)

దేవుని దగ్గర (ఆమోదిత) ధర్మం ఇస్లాం మాత్రమే.[3] కాని గ్రంథప్రజలు తమకు జ్ఞానసంపద లభించినప్పటికీ, పరస్పరం విభేదాలలో పడి మంకుతనంతో ఇలాంటి

---

చాలీచాలని ఆయుధాలతో రణ రంగంలోకి దిగవలసి వచ్చింది. శత్రు సైనికులు కండలు తిరిగిన బలాఢ్యులు కాగా, ముస్లిం యోధులు దారిద్ర్యం వల్ల నకనకలాడే కడుపులతో, బక్కచిక్కిన శరీరాలతో ఉన్నారు. శత్రు సైనికులు తమ సైనికసంఖ్యను, ఆయుధ శక్తిని చూసుకొని విర్రవీగుతూ, హుంకరిస్తూ, ఈలలు వేస్తూ, సారా సేవిస్తూ, పడతుల చేత పాటలు పాడించుకుంటూ, ప్రతీకారంతో ఉడికిపోతూ రంగంలోకి దిగారు. ముస్లిం యోధులు ధర్మ సంస్థాపనా లక్ష్యంతో, దేవుని మీద భారం వేసి, ఆయన్ని అనుక్షణం స్మరిస్తూ, ప్రార్థనలు చేస్తూ, ఉపవాసాలు పాటిస్తూ యుద్ధమైదానంలోకి అడుగుపెట్టారు. దీన్నిబట్టి ఈ రెండు పక్షాలలో ఏ పక్షం సన్మార్గంలో ఉందో; న్యాయం, ధర్మం ఎవరి పక్షాన ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

2. రెండవ అధ్యాయంలో 25వ సూక్తికి చెందిన పాద సూచిక చూడండి.

3. దేవుడు ఒక్కడే అయినప్పుడు మానవుల ఇహపర సాఫల్యాల కోసం ఆయన చూపే జీవన ధర్మం కూడా ఒక్కటే అయిఉండాలి. అంతేగాని కొందరికి ఒక ధర్మం, మరికొందరికి దానికి విరుద్ధంగా ఉండే విషయాలతో కూడిన మరొక ధర్మం నిర్దేశించడు. పరస్పర విరుద్ధ విషయాలతో కూడిన విభిన్న మార్గాలను నిర్దేశించడం అనేది మానవ ఇంగిత జ్ఞానానికి కూడా విరుద్ధమే.



ధర్మాన్ని కాదని విభిన్నమార్గాలు అవలంబించారు. దైవసూక్తులను తిరస్కరించినవారిని దేవుడు త్వరలోనే నిలదీసి లెక్క తీసుకుంటాడు. (19)

(ముహమ్మద్!) వీరుగనక నీతో వాదనకు దిగితే "నేను, నా అనుచరులు దేవునికి విధేయులై పోయాము." అని స్పష్టంగా చెప్పు. గ్రంథప్రజలను, నిరక్షరాస్యులను "మరి మీరు కూడా ఇస్లాం స్వీకరించి (దేవునికి) విధేయులైపోతారా?" అనిఅడుగు. వీరు గనక ఇస్లాం స్వీకరిస్తే తప్పకుండా సన్మార్గం పొందుతారు. (ఈమాట) అంగీకరించకపోతే (పోనీ), దైవసందేశం అందజేయడమే నీపని. దేవుడు ప్రజల (చర్యల)ను (ఓ కంట) గమనిస్తూనేఉన్నాడు. ఆయనే తనదాసుల తదుపరి వ్యవహారం చూసుకుంటాడు. (20)

కొందరు దేవుని ఆజ్ఞల్ని ధిక్కరించడమే గాక, ఆయన ప్రవక్తలను, నీతి న్యాయాల్ని గురించి మాట్లాడేవారిని కూడా అన్యాయంగా చంపుతున్నారు. అలాంటి దుర్మార్గులకు బాధాకరమైన నరకశిక్ష ఉందని శుభవార్త విన్పించు! వారే ప్రపంచంలో, పరలోకంలో కర్మలన్నీ వ్యర్థపరచుకున్న మూర్ఖులు. వారికిక ఎవరూ సహాయ పడలేరు. (21-22)

గ్రంథ (జ్ఞాన)ంలో కొంత భాగం ఇవ్వబడినవారిని చూడు. వారిమధ్య ఏర్పడిన వివాదాలను పరిష్కరించేందుకు దైవగ్రంథం (ఖుర్ఆన్) వైపు పిలుస్తుంటే, వారిలో ఒక వర్గం తిరస్కారభావంతో ఎలా ముఖం తిప్పుకుంటుందో చూడు; దీనిక్కారణం వారు, నరకాగ్ని తమను ఒకటి రెండు రోజులు తప్ప తాకనైనా తాకదని భావించడమే. ధర్మం విషయంలో వారు కల్పించుకున్న మూఢనమ్మకాలే వారిని ఇలా మోసానికి గురి చేస్తున్నాయి. తప్పనిసరిగా వచ్చితీరే (ప్రళయ) దినాన వారిని సమావేశ పరచినప్పుడు వారి గతి ఏమవుతుందో! ఆ రోజు ప్రతి మనిషికీ అతని సంపాదనకు తగిన ప్రతిఫలమే లభిస్తుంది. ఎవరికీ ఎలాంటి అన్యాయం జరగదు. (23-25)

(విశ్వాసులారా!) ఇలా ప్రార్థించండి: "దేవా! (విశ్వ) సామ్రాజ్యాధిపతీ! నీవు తలచుకున్న వారికి రాజ్యాన్ని ప్రసాదిస్తావు: తలచుకున్న వారి నుండి రాజ్యాన్ని ఊడ బెరుకుతావు. అలాగే నీవు కోరిన విధంగా కొందరికి గౌరవప్రతిష్ఠలు అనుగ్రహిస్తావు; మరికొందరిని పరాభవం పాల్జేస్తావు. అన్ని విధాల మేళ్ళు నీ చేతిలోనే ఉన్నాయి. నిస్సందేహంగా నీవు ప్రతి పనీ చేయగల సమర్థుడవు, సర్వ శక్తిమంతుడవు. నీవే రాత్రిని పగటిలోకి, పగటిని రాత్రిలోకి ప్రవేశపెడుతున్నావు. అలాగే నీవు నిర్జీవ మయినదాన్నుండి సజీవమయినదాన్ని, సజీవమయిన దాన్నుండి నిర్జీవమయినదాన్ని వెలికితీస్తావు. నీవే తలుచుకున్న వారికి ఇతోధికంగా ఉపాధినిస్తావు. (26-27)

---

దేవుడు మానవాళికి ప్రతి యుగంలోనూ నిర్ణయించిన రుజుమార్గం "ఇస్లాం" మాత్రమే. గత దైవప్రవక్తలు బోధించిన ధర్మం కూడా ఇస్లాం ధర్మమే. దీన్నే సన్మార్గం, శాంతిమార్గం, దైవ విధేయతా మార్గం అనంటారు. రెండు బిందువుల్ని కలిపే సరళరేఖ ఒక్క రేఖ మాత్రమే అవుతుంది. అలాగే దాసుడు దైవాన్ని చేరుకోవడానికి ఉండే అతి దగ్గరి దారి, రుజుమార్గం కూడా ఒక్కటే. మిగిలిన రేఖలన్నీ వక్రరేఖలు, మిగిలిన మార్గాలన్నీ అపమార్గాలు అవుతాయి. వాటిని అనుసరించే వారు పరలోకంలో ఘోరంగా నష్టపోతారు. (3:85 సూక్తి చూడండి.)

విశ్వాసులారా! మీరు తోటివిశ్వాసుల్ని కాదని (ఇస్లాంకు బద్ధవిరోధులైన) అవిశ్వాసులతో స్నేహం చేయకండి. అలా చేసేవారితో దేవునికి ఎలాంటి సంబంధం ఉండదు. అయితే హింసావేధింపుల నుండి తప్పించుకోవడానికి పైకి అలాంటి వైఖరి అవలంబిస్తే అందులో తప్పులేదు. దేవుడు మిమ్మల్ని తనను గురించి భయపెడ్తున్నాడు. చివరికి మీరంతా ఆయన సన్నిధికే మరలి పోవలసివుంది. (28)

(ప్రవక్తా! వారితో) ఇలా అను: "మీరు ఏ విషయమైనా సరే మీ అంతరంగాల్లో దాచుకున్నా, లేక బయటికి వెలిబుచ్చినా దేవుడు దాన్ని తప్పకుండా తెలుసుకుంటాడు. భూమ్యాకాశాల్లోని సమస్తం ఏది ఎక్కడుందో అంతా ఆయనకు తెలుసు. ఆయన సకల విషయాలపై అధికారం కలిగిన అపార శక్తిసంపన్నుడు. (29)

ప్రతి మనిషీ తాను చేసుకున్న పాపపుణ్యాల (ఫలితాల)ను ప్రత్యక్షంగా తన ముందు చూసుకునే రోజు "తనకూ, ఈ పాపానికీ మధ్య ఆమడ దూరం ఉంటే బాగుండు!" అని భావిస్తాడు. దేవుడు తనను గురించి మిమ్మల్ని భయపెడ్తున్నాడు. ఆయన తన దాసుల విషయంలో అమిత దయామయుడు. (30)

వారికిలా చెప్పు: "మీరు నిజంగా దేవుడ్ని అభిమానిస్తుంటే నన్ను అనుసరించండి; దేవుడు మిమ్మల్ని అభిమానిస్తాడు; మీ పాపాలు క్షమిస్తాడు. దేవుడు ఎంతో క్షమించేవాడు, కరుణించేవాడు." చెప్పు: "దేవుని ఆజ్ఞల్ని, ప్రవక్త హితవుల్ని పాటించండి. వీటిని తిరస్కరిస్తే గుర్తుంచుకోండి, సత్యతిరస్కారుల్ని దేవుడు ఎన్నటికీ ప్రేమించడు." (31,32)

[4]దేవుడు యావత్ప్రపంచం నుండి ఆదంను, నూహ్‌ను, ఇబ్రాహీం కుటుంబాన్ని, ఇమ్రాన్ కుటుంబాన్ని (దైవదౌత్యం కోసం) ప్రత్యేకంగా ఎన్నుకున్నాడు. వారిలో కొందరు కొందరి సంతానం. దేవుడు సమస్తం వినేవాడు, సర్వం ఎరిగినవాడు. (33-34)

(ఈ సంఘటన గుర్తుచేసుకో) ఇమ్రాన్ (వంశపు) స్త్రీ దేవుడ్ని వేడుకుంటూ "ప్రభూ! నా గర్భంలోఉన్న శిశువును నీకు అంకితం చేస్తున్నాను. ప్రాపంచిక వ్యవహారాలకు ఈ శిశువును దూరంగా ఉంచుతాను. నానుండి దీన్ని స్వీకరించు. నీవే (అందరి మొరలు) ఆలకించేవాడవు అన్నీ ఎరిగినవాడవు" అని అన్నది. (35)

ఆమె ఆడపిల్లను ప్రసవించిన తర్వాత "ప్రభూ! (నేను మగ పిల్లవాడనుకుంటే) ఆడపిల్ల పుట్టిందే!"అన్నది. ఆమె కన్నదేమిటో దేవునికి బాగాతెలుసు. మగపిల్లవాడు ఆడపిల్ల వంటివాడు కాలేడు. "నేనీ పాపకు మర్యం అని పేరుపెట్టాను. ఈమెను, ఈమె సంతానాన్ని శాపగ్రస్తుడైన షైతాన్ బారిన పడకుండా నీ రక్షణలో ఇస్తున్నాను" అన్నది ఆమె. (36)

---

4. ఇక్కడ్నుంచి రెండవ ప్రసంగం ప్రారంభమయి 63వ సూక్తి వరకు సాగుతుంది. ఇస్లాం అరేబియా అంతటా వ్యాపించే సూచనలు కన్పించడంతో నజ్రాన్ నుండి 60 మంది క్రైస్తవ మత నాయకులు దైవప్రవక్త (సల్లం)ను కలుసుకోవడానికి మదీనా వచ్చారు. ఆ సందర్భంలో వారికి హితబోధ చేయడానికి దేవుడు 33 నుండి 60 వరకు గల సూక్తులను అవతరింపజేశాడు.



ఆతర్వాత దేవుడు ఆ బాలికను సంతోషంగా స్వీకరించి, చక్కగా పెంచి పోషించాడు. (కొన్నాళ్ళకు) జకరియ్యాను ఆమెకు సంరక్షకునిగా నియమించాడు. జకరియ్యా ఆమె ప్రార్థనగదిలోకి ప్రవేశించినప్పుడల్లా అక్కడ ఆహారపదార్థాలు ప్రత్యక్షమై ఉండేవి. అది చూసి (ఓరోజు) "మర్యం! నీకీ ఆహారం ఎక్కడ్నుంచి వస్తోంది?"అనడిగాడు అతను (ఆశ్చర్యంగా చూస్తూ). దానికామె "దేవుని దగ్గర్నుంచి వస్తోంది. ఆయన తాను తలచుకున్నవారికి ఇతోధికంగా ఆహారం ప్రసాదిస్తాడు" అని సమాధాన మిచ్చింది. (37)

అప్పుడు జకరియ్యా తన ప్రభువును వేడుకుంటూ "ప్రభూ! నీ సన్నిధి నుండి నాకు ఉత్తమ సంతానం ప్రసాదించు. నీవే (నా) మొరాలకించేవాడివి" అన్నాడు. అతనలా ప్రార్థనగదిలో నిలబడి ప్రార్థన చేస్తుండగానే దైవదూతలు వచ్చి అతడ్ని పిలిచారు: "జకరియ్యా! దేవుడు నీకు యహ్యా (పుడతాడని) శుభవార్త తెలియజేస్తున్నాడు. అతను దేవుని నుండి వెలువడే ఒక వాణి (ఈసా ప్రవక్త)ని ధృవపరుస్తాడు. పైగా అతను నాయకత్వపు లక్షణాలతో భాసిల్లుతూ ఎంతో నిగ్రహశక్తి కలవాడై ఉంటాడు; దైవప్రవక్త అవుతాడు; సజ్జనులలో పరిగణించబడతాడు" అని చెప్పారు వారు. (38-39)

అప్పుడు జకరియ్యా "ప్రభూ! నాకు పిల్లవాడు ఎలా పుడ్తాడు? నేను ముసలివాణ్ణయ్యాను. నాభార్య చూస్తే గొడ్రాలు!!" అన్నాడు. దానికి "అలాగే ఇది జరుగుతుంది. దేవుడు తాను తలచిన పని చేసి తీరుతాడు" అని సమాధానం వచ్చింది. (40)

"అయితే ప్రభూ! ఈ విషయంలో నాకేదయినా సూచన నిర్ణయించు" అన్నాడు జకరియ్యా. "నీవు మూడు రోజులదాకా సైగలతో తప్ప ప్రజలతో మాట్లాడలేవు. (ఆ మూడు రోజులు) నీవు నీప్రభువును వీలైనంత ఎక్కువగా స్మరిస్తూ ఉండు. (ముఖ్యంగా) ఉదయం, సాయంత్రం ఆయన పవిత్రతను కొనియాడుతూ ఉండు"అని (దూతలు) చెప్పారు. (41)

ఆ తరువాత దైవదూతలు మర్యంతో "మర్యం! దేవుడు నిన్ను (ఓ ముఖ్యమైన పని కోసం) ఎన్నుకున్నాడు. నిన్ను పరిశుద్ధపరిచాడు. యావత్ప్రపంచ మహిళలలో నీకు అత్యధిక ప్రాధాన్యమిచ్చి తన సేవ కోసం నియమించాడు. కనుక మర్యం! నీవిక నీ ప్రభువుకు విధేయురాలివయి ఉండు. ఆయన సన్నిధిలో సాష్టాంగపడుతూ ఉండు. మోకరిల్లేవారితో పాటు నీవూ మోకరిల్లి ధ్యానం చేస్తూవుండు" అని అన్నారు. (42-43)

ప్రవక్తా! ఇదంతా మేము నీకు దివ్యావిష్కృతి (వహీ) ద్వారా అందజేస్తున్న రహస్య సమాచారం. మేమిలా తెలియజేయకపోతే నీకు వాస్తవం ఎలా తెలుస్తుంది? మర్యంకు సంరక్షకుడిగా ఎవరు ఉండాలనే విషయాన్ని నిర్ణయించేందుకు ధర్మకర్తలు తమతమ కలాలు విసరినప్పుడు, వారి మధ్య వివాదం చెలరేగినప్పుడు నీవక్కడ లేవు. (44)

దైవదూతలు ఇలా అన్నారు: "మర్యం! దేవుడు నీకు తన వైపునుండి ఒక'వాణి'కి సంబంధించిన శుభవార్త విన్పిస్తున్నాడు. అతని పేరు మర్యం కుమారుడైన మసీహ్ఈసా. అతను ఇహలోకంలోనూ, పరలోకంలోనూ గౌరవనీయుడవుతాడు. దైవసాన్నిధ్యం పొందినవారిలో ఒకడై పోతాడు. పైగా తల్లిఒడిలో ఉన్నప్పుడూ, ఆతర్వాత పెరిగి పెద్దవాడై

నప్పుడూ అతను ప్రజలతో మాట్లాడుతాడు, సత్పురుషుడిగా వర్థిల్లుతాడు." (45-46)

మర్యం ఈమాట విని (కంగారుపడుతూ) "ప్రభూ! నాకు పిల్లవాడు ఎలా పుడ్తాడు? నన్ను ఏ పురుషుడూ తాకనైనా తాకలేదే!!" అన్నది. "అలాగే ఇది జరిగి తీరుతుంది. దేవుడు తాను తలచిన దాన్ని సృష్టించగలడు. ఆయన ఒక పని చేయదలచుకున్నప్పుడు 'అయిపో' అంటే చాలు, ఆపని జరిగిపోతుంది. దేవుడు అతనికి గ్రంథజ్ఞానాన్ని, వివేకాన్ని, తౌరాత్, ఇన్జీల్ గ్రంథాల జ్ఞానాన్ని కూడా నేర్పుతాడు" అన్నారు దైవదూతలు. (47-48)

దేవుడు అతడ్ని తన ప్రవక్తగా నియమించి ఇస్రాయీల్ సంతతి ప్రజల దగ్గరకు పంపిస్తాడు. (అతను దైవప్రవక్తగా వారి దగ్గరకు వెళ్ళి ఇలా అంటాడు:) "నేను మీ ప్రభువు నుండి మీకోసం కొన్ని సూచనలు తెచ్చాను. ఇప్పుడు మీ ముందు మట్టితో పక్షి ఆకారం గల బొమ్మ చేసి అందులో గాలి ఊదుతాను. అది దైవాజ్ఞతో సజీవపక్షిగా మారుతుంది. నేను దేవుని ఆజ్ఞతో పుట్టుగుడ్డిని, కుష్ఠురోగిని నయం చేస్తాను; మృతుల్ని కూడా బ్రతికిస్తాను. మీరు ఏమేమి తింటారో, మీ ఇండ్లలో ఏమేమి నిలువచేసి ఉంచుతారో అంతా మీకు తెలియజేస్తాను. మీరు విశ్వసించేవారైతే వీటిలో మీ కోసం గొప్ప నిదర్శనాలున్నాయి." (49)

"నాకు పూర్వం వచ్చిన తౌరాత్ గ్రంథాన్ని ధృవపరుస్తున్నాను. గతంలో మీకు నిషేధించబడిన కొన్ని వుస్తువుల్ని ధర్మసమ్మతం చేయడానిక్కూడా వచ్చాను. నేను మీ దగ్గరికి మీ ప్రభువుకు సంబంధించిన స్పష్టమైన నిదర్శనాలు తీసుకొచ్చాను. కనుక అల్లాహ్‌కు భయపడండి. నన్ను అనుసరించండి. అల్లాహ్ నాకూ ప్రభువే, మీకూ ప్రభువే. కనుక ఆయన్ని మాత్రమే ఆరాధించండి. ఇదే (సాఫల్యానికి) సరైనమార్గం." (50-51)

ఈసా (ప్రవక్త) వారిలో అవిధేయత, అవిశ్వాసాల ధోరణి చూసి "దైవమార్గంలో నాకు తోడుగా నిల్చేవారు ఎవరైనా ఉన్నారా మీలో?" అని అడిగాడు. దానికి హవారీలు (శిష్యులు) ఇలా అన్నారు: "మేము దేవుని (మార్గంలో మీకు తోడుగా నిలిచే) సహాయ కులం. మేము దేవుడ్ని విశ్వసిస్తున్నాము. ఆయనకు విధేయులయి (ముస్లిములయి) పోయాము. దీనికి మీరే సాక్షి. ప్రభూ! నీవు అవతరింపజేసిన దాన్ని (దివ్యగ్రంథాన్ని) విశ్వసిస్తున్నాం. నీ సందేశ హరుడ్ని అనుసరించడానిక్కూడా మేము సిద్ధంగా ఉన్నాం. మా పేర్లు (సత్య)సాక్షుల జాబితాలో వ్రాయి." (52-53)

సత్యాన్ని తిరస్కరించినవారు (ఈసాను చంపడానికి) ఒక యుక్తి పన్నారు. దేవుడు మరోయుక్తి పన్నాడు. దేవుడు అందరికన్నా గొప్ప యుక్తి పరుడు. (54)

అప్పుడు దేవుడు (ఈసాతో) ఇలా అన్నాడు: "ఈసా! నేనిప్పుడు నిన్ను నా దగ్గరికి రప్పించుకుంటాను. నా వైపునకు ఎత్తుకుంటాను.[5] నిన్ను ధిక్కరించినవారి (దుష్ట

---

5. ఇక్కడ మూలభాష అరబీలో "ముతవప్ఫీ" అనే పదం వచ్చింది. 'తవప్ఫీ' అంటే సేకరించడం, వెనక్కి తీసుకోవడం, వసూలు చేయడం అని శాబ్దిక అర్థాలున్నాయి. ఈ పదాన్ని ఉపమానంగా తీసుకొని అరబీ, ఉర్దూ భాషలలో చనిపోవడం అని కూడా వాడతారు. మన



పరిసరాల) నుండి (తీసి) నిన్ను పావనం చేస్తాను. నిన్ను తిరస్కరించిన వారిపై నిన్ను అనుసరించిన వారికి ప్రళయం వరకు ఆధిక్యత నిస్తాను. చివరికి మీరంతా నా దగ్గరికే తిరిగివస్తారు. అప్పుడు నేను మీమధ్య ఏర్పడిన విభేదాలను గురించి తీర్పు చెబుతాను. అవిశ్వాస వైఖరి అవలంబించిన సత్యతిరస్కారుల్ని ఇటు ప్రపంచంలోనూ, అటు పరలోకంలోనూ కఠినంగా శిక్షిస్తాను. ఇక వారు ఎలాంటి సహాయం పొందలేరు.

---

తెలుగు నాట కూడా కన్నుమూయడం అనే పదాన్ని ఉపమానంగా తీసుకొని చనిపోవడం అనే అర్థంలో వాడతాము. అంతేగాని శాబ్దిక అర్థంలో కన్ను మూయడం అంటే చనిపోవడం కాదు. అలాగే ముతవప్ఫీ విషయంలో కూడా ఇక్కడ దాన్ని శాబ్దిక భావమే తీసుకోవడం జరిగింది. అంటే ఈ పదాన్ని ఇంగ్లీషు పదమైన Recall అనే అర్థంలో ప్రయోగించడం జరిగిందన్నమాట. ప్రముఖ ఖుర్ఆన్ అనువాదకులు ఈ పదానికి చేసిన అనువాదాలు గమనించండి:

- "ఈసా! నేను నిన్ను పూర్తిగా తీసుకుంటాను, నిన్ను నా వైపునకు ఎత్తుకుంటాను." (అల్లామా ఇబ్నె కసీర్)
- "ఈసా! నిశ్చయంగా నేను నిన్ను తీసుకుంటాను, నా వైపునకు ఎత్తుకుంటాను." (మౌలానా షాహ్ రఫియుద్దీన్)
- "ఈసా! నేను నిన్ను తీసుకుంటాను. నా వైపునకు ఎత్తుకుంటాను."(మౌలానాఅబ్దుల్‌హఖ్)
- "ఈసా! నేను నీకు మరణం ఇస్తాను. (ప్రస్తుతం) నిన్ను నా వైపునకు ఎత్తుకుంటాను." (మౌలానా అష్రఫ్ అలి థానవి)
- "ఈసా! నేను నీ కాలాన్ని పూర్తిచేశాను. నిన్ను నా వైపునకు ఎత్తుకుంటాను." (మౌలానా అబుల్ కలాం ఆజాద్)
- "ఈసా! నేను నిన్ను తీసుకుంటాను. నా వైపునకు ఎత్తుకుంటాను." (మౌలానా ముఫ్తి ముహమ్మద్ షఫి)
- "ఈసా! నేనిప్పుడు నిన్ను వెనక్కి తీసుకుంటాను. నిన్ను నా వైపునకు ఎత్తుకుంటాను." (మౌలానా అబుల్ ఆలా మౌదూది)
- "ఈసా! నేను నిన్ను స్వాధీనం చేసుకుంటాను, నా వైపునకు ఎత్తుకుంటాను." (మౌలానా అమీన్ అహ్సన్ ఇస్లాహి)
- "జీసస్! చూడు నేను నిన్ను సేకరిస్తాను, నా వైపునకు నిన్ను పైకెత్తుకుంటాను." (యం.యం. పిఖ్తాల్)
- "జీసస్! నేను నిన్ను తీసుకుంటాను, నా వైపునకు నిన్ను ఎత్తుకుంటాను." (మౌలానా అబ్దుల్లా యూసుఫ్ అలి)

ఈ అనువాదకుల్లో మౌలానా అష్రఫ్ అలి థానవి తప్ప ఏ ఒక్కరూ 'తవప్ఫీ' అనే పదాన్ని మరణం అని అనువదించలేదు. అయితే అది ఇస్లాం మౌలిక విశ్వాసానికి వ్యతిరేకం గనక ఆయన బ్రాకెట్‌లో 'ప్రస్తుతం' అని రాశారు. ఈవిధంగా ఆయన ఈసా (అలైహి) ఆకాశం నుండి తిరిగొచ్చిన తర్వాతే సహజమరణం పొందుతారన్న భావాన్ని స్ఫురింపజేశారు. మొత్తంమీద అనువాదకులంతా ఈసా (అలైహి)ని దేవుడు సజీవంగా, సశరీరంగా పైకి ఎత్తుకున్నాడన్న అర్థంలోనే అనువదించారని స్పష్టమవుతోంది. (వివరాలకు 4:157,158 సూక్తులు, వాటి పాదసూచికలు చూడండి.)

విశ్వసించి సత్కార్యాలు చేసినవారికి వారిప్రతిఫలం పూర్తిగా లభిస్తుంది. దుర్మార్గుల్ని దేవుడు ఎన్నటికీ ప్రేమించడు. (55-57)

మేము మీముందు పఠిస్తున్న ఈ సూక్తులలో అనేక సూచనలు, (కళ్ళు తెరిపించే) ప్రస్తావనలూ ఉన్నాయి. దేవుని దృష్టిలో ఈసా జన్మ ఆదం జన్మ లాంటిదే. దేవుడు ఆదమ్‌ను మట్టితో సృజించి 'అయిపో' అని ఆదేశించగానే అతను రూపొంది ఉనికిలోకి వచ్చాడు. (ముహమ్మద్!) ఇది నీ ప్రభువు వైపునుండి మీకు తెలియజేయబడుతున్న సత్యం. కనుక నీవు శంకించేవారిలో చేరకు. (58-60)

వాస్తవం గురించిన జ్ఞానం నీ దగ్గరికి వచ్చిన తర్వాత కూడా నీతో ఎవరైనా వాదనకు దిగితే వారికిలా చెప్పు: "రండి (ప్రమాణం చేద్దాం), మేము మా భార్యాపిల్లల్ని పిలుస్తాం. మీరు కూడా మీ భార్యాపిల్లల్ని పిలుచుకోండి. ఆ తరువాత మనమందరం కలసి, అసత్యం పలికే వారిపై దేవుని అభిశాపం (ఆగ్రహం విరుచుకు) పడుగాక అని ప్రార్థిద్దాం."[6] (61)

ఇవన్నీ యదార్థగాథలు. అల్లాహ్ తప్ప మరోదేవుడు లేడు. ఆయన అపార శక్తి సంపన్నుడు, అమిత యుక్తిపరుడు. వారు గనక (ఈ షరతుపై ప్రమాణం చేయడానికి) అంగీకరించకపోతే (పోనీ), నీతిలేనివారి సంగతి దేవునికి బాగా తెలుసు. (62-63)

వారికి చెప్పు[7]: "గ్రంథప్రజలారా! మీకూ మాకూ మధ్య ఉమ్మడిగా ఉన్న ఒక మంచి విషయాన్ని అంగీకరిద్దాం రండి, మనం అల్లాహ్‌ను తప్ప మరెవరినీ ఆరాధించ కూడదు. ఆయనకు సాటి కల్పించకూడదు. మనలో ఎవరూ అల్లాహ్‌ను తప్ప ఇతరుల్ని ప్రభువుగా, పోషకుడుగా స్వీకరించకూడదు." దీన్నికూడా వారంగీకరించకపోతే "మేము ముస్లింలం (అల్లాహ్‌కు విధేయులం). దీనికి మీరే సాక్షులు"అని వారికి చెప్పు. (64)

గ్రంథప్రజలారా! మీరు ఇబ్రాహీం విషయంలో ఎందుకు వాదిస్తారు? తౌరాత్, ఇన్జీల్ గ్రంథాలు ఆయన వెళ్ళి తరువాతే అవతరించాయి కదా! మీకా మాత్రం జ్ఞానం లేదా? మీకు తెలిసిన విషయాలను గురించి ఎటూ మీరు వాదిస్తూనే ఉన్నారు. ఇక ఏమాత్రం మీకు తెలియని విషయాన్ని గురించి అనవసరంగా ఎందుకు వాదిస్తారు? (వాస్తవం ఏమిటో) దేవునికి మాత్రమే తెలుసు, మీకు తెలియదు. (65-66)

ఇబ్రాహీం యూదుడూ కాదు, క్రైస్తవుడూ కాదు. అతను అందర్నీ వదలి ఒక్క దేవునికి మాత్రమే అంకితమైపోయిన రుజువర్తనుడు. బహుదైవారాధకుడు కాదు.

ఇబ్రాహీం సన్నిహితులమని చెప్పుకునే హక్కు అతడ్ని అనుసరించేవారికి మాత్రమే

6. నజ్రాన్ నుంచి వచ్చిన క్రైస్తవ ప్రతినిధి వర్గం ఈ సవాలును ఎదుర్కోలేక పోయింది. వారు తమ భార్యాపిల్లలను తీసుకొని ప్రమాణం చేయడానికి భయపడ్డారు. దీన్ని బట్టి యావత్తు క్రైస్తవ జగత్తులోనే ప్రసిద్ధిచెందిన ఈ మతనాయకులకు తమ మతం మీదే నమ్మకం లేదని అరబ్బుల ముందు రూఢి అయిపోయింది.

7. ఇక్కడ్నుంచి యూదులను ఉద్దేశించి అవతరించిన సూక్తులు ప్రారంభమవుతాయి.



ఉంది. అంటే ఈప్రవక్తకు, (ఇతడ్ని) విశ్వసించినవారికి మాత్రమే ఇబ్రాహీంతో సంబంధం ఉండే హక్కుంది. విశ్వసించినవారికే దేవుని రక్షణ, సహాయం లభిస్తాయి. (67-68)

(ముస్లింలారా!) గ్రంథప్రజలలో (అంటే యూదుల్లో) కొందరు మిమ్మల్ని రుజు మార్గం నుండి తప్పించగోరుతున్నారు. నిజానికి వారు తమను తాము తప్ప మరెవరినీ దారి తప్పించలేరు. కాని ఆ సంగతి వారు గ్రహించలేకపోతున్నారు. (69)

గ్రంథప్రజలారా! మీరు దేవుని సూక్తులు, సూచనలను స్వయంగా గుర్తించి నప్పటికీ వాటిని ఎందుకు నిరాకరిస్తున్నారు? గ్రంథప్రజలారా! మీరు సత్యాసత్యాలను కలగాపులగం చేసి సత్యాన్ని ఎందుకు అనుమానాస్పదం చేస్తున్నారు? వాస్తవం తెలిసి కూడా సత్యాన్ని ఎందుకు దాచుతున్నారు? (70-71)

గ్రంథప్రజలలో కొందరు పరస్పరం కూడబలుక్కుంటూ "విశ్వాసులపై అవత రించిన దాన్ని మీరు ఉదయం విశ్వసించి(నట్లు నటించి) సాయంత్రానికల్లా తిరస్క రించండి. ఈవిధంగా వారిని మనం మార్గభ్రష్టులయ్యేలా చేయగలం" అని చెప్పు కుంటారు. (72)

అంతేకాదు, "మన మతస్థుల్ని తప్ప మరెవరినీ మనం నమ్మకూడదు" అని కూడా వారు పరస్పరం చెప్పుకుంటారు. (ముహమ్మద్!) వారికి చెప్పు: "మార్గదర్శకత్వమంటే అసలు దేవుని మార్గదర్శకత్వమే. అయన చూపేదే రుజుమార్గం. గతంలో మీకు ఇవ్వ బడిన (తౌరాత్, ఇన్జీల్) వంటిదే (ఇప్పుడు) ఇతరులక్కూడా ఇవ్వబడిందంటే అది దేవుని అనుగ్రహం. మీకు వ్యతిరేకంగా మీ ప్రభువు సన్నిధిలో సమర్పించడానికి ఇతరులకు బలమైన సాక్ష్యం (ఖుర్‌ఆన్) లభించిందంటే అదీ దేవుని అనుగ్రహమే."

ఈ విషయం కూడా చెప్పు: "ఘనత, గౌరవాలు దేవుని చేతిలోనే ఉన్నాయి. ఆయన వాటిని తాను తలచిన వారికి అనుగ్రహిస్తాడు. దేవుడు సర్వోపగతుడు, సర్వం ఎరిగినవాడు. ఆయన తాను కోరినవారిని తన కారుణ్యం కొరకు ప్రత్యేకించుకుంటాడు. దేవుడు గొప్ప అనుగ్రహశీలి." (73-74)

గ్రంథప్రజలలో కొందరు నిజాయితీపరులు కూడా ఉన్నారు. వారి దగ్గర మీరు భద్ర పరచడానికి ఎంతపెద్ద ధనరాశి ఉంచినా వారు దాన్ని యథాతథంగా తిరిగిస్తారు. అలాగే వారిలో కొందరు మొండిఘటాలు కూడా ఉన్నారు. వారిదగ్గర మీరు నమ్మి ఒక్క రూపాయి దాచి పెట్టినాసరే, నెత్తిమీద కూర్చుంటే తప్ప వారు దాన్ని తిరిగివ్వరు. ఈ నైతిక దిగజారుడికి కారణం, నిరక్షరాస్యుల (యూదేతరుల) వ్యవహారంలో (దేవుడు) తమల్ని పట్టుకోవడం జరగదని వారు చెప్పడమే. కాని వాస్తవం తెలిసి కూడా వారు పచ్చిఅబద్ధం చెబుతూ దేవుని మీద లేనిపోని నిందలు మోపుతున్నారు. (75)

చేసిన ప్రమాణాలను నెరవేర్చేవారు, భయభక్తులు కలిగివుండేవారు మాత్రమే దేవునికి ప్రీతిపాత్రులవుతారు. కాని కొందరు తమ వాగ్దానాలను, దేవుని విషయంలో చేసిన ప్రమాణాలను అతిస్వల్ప మూల్యానికి అమ్ముకుంటారు. అలాంటి (అమ్ముడు

బోయిన) వారికి పరలోకంలో ఎలాంటి వాటా లభించదు. వారితో దేవుడు మాట్లాడడు. చివరికి ప్రళయదినాన వారి వైపు కన్నెత్తి కూడా చూడడు. వారిని పరిశుద్ధపరిచే ప్రసక్తి అంతకన్నా లేదు. వారికి (నరకంలో) వ్యధాభరితమైన ఘోరశిక్ష పడుతుంది. (76,77)

గ్రంథప్రజలలో కొందరు తాము పఠిస్తున్నది (దైవ) గ్రంథంలోనిదేనని మిమ్మల్ని నమ్మించడానికి నాలుకలు పలు మెలికలు తిప్పి పఠిస్తారు. కాని వారు పఠించేది (దైవ) గ్రంథంలోని విషయాలు కావు. వారవి దేవుడు అవతరింప జేసినవని చెబుతారు. నిజానికి అవి దేవుడు అవతరింప జేసినవి కావు. వారు వాస్తవం తెలిసి కూడా దేవుని మీద అబద్ధాలు మోపుతున్నారు. (78)

దేవుడు ఒక మనిషికి గ్రంథం, రాజ్యాధికారం, దైవదౌత్యం ప్రసాదించినప్పుడు, ఆ వ్యక్తి ప్రజలతో మీరు దేవుడ్ని వదలి తనకు భక్తులుగా మారమని అనడం తగదు. దానికి బదులు "మీరు (దైవ) గ్రంథాన్ని (ప్రజలకు) బోధిస్తున్నారు, స్వయంగా పఠిస్తున్నారు కూడా. అందువల్ల మీరు (మీ) ప్రభువుకు విశ్వసనీయులయిన దాసులుగా రూపొందండి" అని అంటాడు అతను. (79)

అంతేకాకుండా మీరు దైవదూతలను, దైవప్రవక్తలను దేవుళ్ళుగా చేసుకొని ఆరాధించండని కూడా అతను ప్రజలతో అనడు. మీరొకసారి ముస్లింలైపోయిన తరువాత తిరిగి అవిశ్వాసవైఖరి అవలంబించమని అతనెలా చెప్పగలడు? (80)

దేవుడు తన ప్రవక్తల నుండి తీసుకున్న ఈవాగ్దానం గురించి ఆలోచించండి. ఆయన ఇలా అన్నాడు: "నేను మీకు గ్రంథాన్ని, వివేకాన్ని ప్రసాదిస్తున్నాను. ఆ తరువాత మీకివ్వబడిన గ్రంథాన్ని ధృవీకరిస్తూ రేపు మరో ప్రవక్త వస్తే అతడ్ని మీరు విశ్వసించి అతనికి సహాయం చేయవలసి ఉంటుంది." ఇలా అన్న తర్వాత "మరి దీన్ని మీరు అంగీకరిస్తున్నారా? నేను మీపై మోపిన ఈ ప్రమాణబాధ్యతను మీరు స్వీకరిస్తున్నారా?" అని అడిగాడు దేవుడు.[8]

దానికి దైవప్రవక్తలు "ఆ..మేము అంగీకరిస్తున్నాం, స్వీకరిస్తున్నాం" అన్నారు. అప్పుడు దేవుడిలా అన్నాడు:"దీనికి మీరు సాక్షులుగా ఉండండి. మీతోపాటు నేనూ సాక్షిగా ఉంటాను. ఇకపై ఎవరు తమ వాగ్దానాన్ని భంగపరుస్తారో వారే నీతిలేని దుర్మార్గులు" (81-82)

భూమ్యాకాశాలలోని సమస్త చరాచరాలు ఇష్టమున్నా లేకపోయినా దేవునికి లొంగి ఆయన ధర్మానికి కట్టుబడి ఉన్నాయి. చివరికి అందరూ ఆయన దగ్గరికే చేరుకోవలసి ఉంది. అలాంటప్పుడు వీరు దేవుడు పంపిన ధర్మం కాదని మరో ధర్మాన్ని కోరు

8. దేవుడు తన ప్రవక్తల నుండి తీసుకున్న ఈవాగ్దానం వారి అనుచరులక్కూడా వర్తిస్తుంది. దీని ప్రకారం యూదులు, క్రైస్తవులు తమప్రవక్తలపై అవతరించిన గ్రంథాల్ని ధృవీకరిస్తూ వచ్చిన అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స)ను విశ్వసించవలసి ఉంది. విశ్వసించకపోతే రేపు పరలోక న్యాయస్థానంలో విశ్వప్రభువు ముందు నేరస్థులుగా నిలబడవలసిన దుస్థితి ఏర్పడుతుంది.



తున్నారా? వారికి చెప్పు: "మేము అల్లాహ్‌ను విశ్వసించాం. మాపై అవతరించిన గ్రంథాన్ని; ఇబ్రాహీం, ఇస్మాయీల్, ఇస్‌హాఖ్, యాఖూబ్‌లపై, వారి సంతానంపై అవతరించిన బోధనలను; మూసా, ఈసా, ఇంకా ఇతర ప్రవక్తలందరికీ వారి ప్రభువు నుండి లభించిన వాటిని కూడా మేము విశ్వసించాం. మేమీ దైవప్రవక్తలలో ఎవరినీ భేదభావంతో చూడము. (మాదృష్టిలో వారంతా సత్యవంతులైన దైవప్రవక్తలే.[9] మేము ఆయనకే ముస్లింలు (విధేయులు) అయ్యాము." (83-84)

ఎవరు (ఇలాంటి) దైవవిధేయతామార్గం (ఇస్లాం) కాదని ఇతర జీవిత విధానాలను (అంటే ఇస్లామేతర పద్ధతులను) అవలంబించగోరుతారో వాటిని ఎన్నటికీ ఆమోదించడం జరగదు. అలాంటివారు పరలోకంలో ఘోరంగా నష్టపోతారు. (85)

(సత్యాన్ని) ఒకసారి విశ్వసించిన తరువాత, తిరిగి అవిశ్వాస వైఖరి అవలంబించే తిరస్కారులకు దేవుడు సన్మార్గం ఎలా చూపుతాడు? వీరు ఈయన్ని సత్యప్రవక్త అని సాక్ష్యం కూడా ఇచ్చి ఉన్నారు. వారి ముందుకు తగిన ఆధారాలు, ప్రమాణాలు కూడా వచ్చాయి. (అయినా వారు తమ తలబిరుసు ధోరణి మానుకోలేదు.) అలాంటి దుర్మార్గులకు దేవుడు ఎన్నటికీ సన్మార్గం చూపడు. దేవుని అభిశాపం, యావత్తు దైవదూతల, మానవుల ఛీత్కారం వారిపై పడుతుంది. ఇదే వారికి తగిన ప్రతిఫలం. (86,87)

వారు ఎల్లప్పుడూ శాపం, ఛీత్కారాలకే గురయి ఉంటారు. వారికి విధించే శిక్షను తగ్గించడంగాని, కాస్తంత అవకాశం ఇవ్వడంగాని జరగదు. అయితే ఆ తర్వాతయినా వారు పశ్చాత్తాపం చెంది తమ నడవడిక సరిదిద్దుకుంటే (మంచిది). దేవుడు క్షమించేవాడు, కరుణించేవాడు. దీనికి భిన్నంగా విశ్వసించిన తరువాత అవిశ్వాస వైఖరి అవలంబించి ఆ అవిశ్వాసంలోనే పడికొట్టుకుపోయేవారిని దేవుడు ఎన్నటికీ క్షమించడు. వారి పశ్చాత్తాపం స్వీకరించబడదు. వారు పరమ మార్గభ్రష్టులు. (88-90)

అవిశ్వాసవైఖరి అవలంబించి, అవిశ్వాసస్థితిలోనే ఊపిరి వదిలేవారు నరకశిక్ష నుండి కాపాడుకోవడానికి (పరిహారంగా) భూమండలమంత బంగారమిచ్చినా స్వీకరించబడదు. వారికి వ్యధాభరితమైన శిక్ష పడుతుంది. ఇక వారిని ఎవరూ ఆదుకోలేరు. (91)

(విశ్వాసులారా!) మీరు అమితంగా ప్రేమించేవాటిని సైతం (దైవమార్గంలో) వినియోగించనంత వరకూ మీరు ధర్మపరాయణులు కాలేరు.[10] మీరు (దైవమార్గంలో) ఏది విని యోగించినా అది దేవునికి తెలుసు. (92)

9. వివరాలకు 2:4,136,285 సూక్తులు, వాటి పాదసూచికలు చూడండి.

10. సాధారణంగా ప్రజలు ప్రార్థన, ధ్యానం, దైవనామ స్మరణ, గ్రంథపారాయణం, ఉపవాస వ్రతం, పరిమిత స్థాయిలో దాన ధర్మాలు, ఓ ప్రత్యేక పంథాలో బాహ్యవేషధారణ మొదలైన వాటిని మాత్రమే గొప్ప పుణ్యకార్యాలుగా, ధర్మపరాయణతకు ప్రబల నిదర్శనాలుగా పరిగణిస్తున్నారు. కాని ఖుర్‌ఆన్ ఈ అపోహను దూరం చేస్తూ, దేవుని ప్రసన్నత కోసం అవసరమయితే ఎంతటి ప్రియమైన వస్తువునయినా త్యాగం చేయాలని, అప్పుడే మనిషి దేవుని దృష్టిలో నిజమైన ధర్మపరాయణుడుగా పరిగణించ బడతాడని చెబుతోంది.

తౌరాత్ గ్రంథం అవతరణకు పూర్వం ఇస్రాయీల్ (యాఖూబ్ ప్రవక్త) తనకుతాను కొన్ని వస్తువుల్ని నిషేధించుకున్నాడు. అవి తప్ప (ముహమ్మద్ షరీఅత్‌లో ధర్మసమ్మత మైన) ఈ ఆహారపదార్థాలన్నీ గతంలో ఇస్రాయీల్ సంతతికి కూడా ధర్మసమ్మతంగా ఉండేవి. వారిని ఇలా అడుగు: "మీరు నిజాయితీపరులైతే తౌరాత్ తీసుకొచ్చి అందులో ఏదైనా విషయాన్ని (ఆధారంగా) చూపండి." (93)

(మీరు ఎలాంటి ఆధారం చూపలేరు. అంటే మీ వాదన నిరాధారమయినదని తేలిపోయింది.) ఆ తరువాత కూడా ఎవరయినా అబద్ధం కల్పించి దాన్ని దేవునికి ఆపాదించినట్లయితే వారే అసలు దుర్మార్గులు. (94)

ముహమ్మద్! వారికీ మాట చెప్పు: "దేవుడు చెప్పిందే నిజం. కనుక మీరు ఏకాగ్ర చిత్తులయి ఇబ్రాహీం విధానాన్ని అనుసరించాలి. ఇబ్రాహీం దేవునికి సాటికల్పించేవారి కోవకు చెందినవాడు కాదు." (95)

మానవులకోసం నిర్మించబడిన మొట్టమొదటి ఆరాధనాలయం మక్కాలో ఉన్నదే. (కాబాగృహం.) అది ఎంతో శుభప్రదమయినది, యావత్తు మానవాళికి మార్గదర్శక మయినది. (96)

అందులో (కళ్ళున్నవారికి) అనేక సూచనలు ఉన్నాయి. ఆ సూచనల్లో ఇబ్రాహీం (ప్రార్థన కోసం నిలబడే) చోటొకటి. అందులో (కాబాగృహంలో) ప్రవేశించే ప్రతి మనిషికీ శాంతీ, రక్షణా లభిస్తాయి. అక్కడకు చేరుకోగలిగేవారు దాన్ని విధిగా సందర్శించాలి. (అంటే హజ్ చేయాలి.) ఇది ప్రజలపై దేవునికున్న హక్కు. ఈ ఆజ్ఞను శిరసావ హించడానికి నిరాకరించేవాడు దేవుడు నిరపేక్షాపరుడని తెలుసుకోవాలి. (97)

గ్రంథప్రజలారా! మీరు దేవుని సూక్తుల్ని ఎందుకు తిరస్కరిస్తున్నారు? దేవుడు మీ చేష్టలన్నిటిని గమనిస్తూనే ఉన్నాడు. వారిని అడుగు: "గ్రంథప్రజలారా! మీరు విశ్వాసుల్ని దైవమార్గంలో నడవనీయకుండా ఎందుకు ఆటంకాలు సృష్టిస్తున్నారు? వారు సన్మార్గం లో ఉన్నారని తెలిసి కూడా మీరు వారిని దారి తప్పించ జూస్తున్నారెందుకు? దేవుడు మీ చర్యల్ని గమనిస్తూనే ఉన్నాడు." (98-99)

విశ్వాసులారా! గ్రంథప్రజలలో ఒక వర్గం చెప్పే మాటలు గనక వింటే వారు మిమ్మల్ని అవిశ్వాసులుగా మార్చివేస్తారు. మీకు దేవుని సూక్తులు మాటిమాటికి చదివి విన్పించడం జరుగుతున్నది. మీ మధ్య దైవప్రవక్త కూడా ఉన్నాడు. అలాంటప్పుడు మీరు అవిశ్వాసవైఖరి ఎలా అవలంబించగలరు? అల్లాహ్ (గ్రంథం)ను గట్టిగా పట్టుకునే (అంటే నమ్ముకునే) వారు తప్పకుండా సన్మార్గంలో ఉంటారు (100-101)

విశ్వసించిన ప్రజలారా! మీరు దేవునికి భయపడవలసిన విధంగా భయపడండి. (దేవునికి పూర్తిగా అంకితమైన) ముస్లింలుగా ఉన్న స్థితిలో తప్ప (మరే ఇతర స్థితిలో) చనిపోకండి. (102)



మీరంతా కలసి దైవత్రాటిని (అంటే దైవధర్మాన్ని) దృఢంగా పట్టుకోండి. విభేదా లలో పడి చీలిపోకండి.[11] దేవుడు చేసిన మేళ్ళను ఓసారి జ్ఞాపకం చేసుకోండి. మీరు

---

11. ఒకప్పుడు విభిన్న వర్గాలుగా, తెగలుగా, కులాలుగా చీలిపోయి అనైక్యతతో, అంతఃకలహా లతో సతమతమవుతుండిన అరబ్బుల్ని ఇస్లాం సమైక్యపరచింది. కులం, గోత్రం, జాతి, ప్రాంతం, వర్ణం, వర్గం లాంటి కృత్రిమ విచక్షణా గోడలను కూలగొట్టి దేవుని ఏకత్వం, దైవప్రవక్త విధేయతల ప్రాతిపదికలపై వారందర్నీ ఒక గొడుగు క్రిందికి చేర్చింది. అందువల్ల ముస్లింలు ఇస్లాం సేవలో, దాని సంస్థాపనా కృషిలో నిరంతరం నిమగ్నులైఉండాలి. అదే వారి జీవన ధ్యేయం. ఈ ధ్యేయాన్ని గనక విస్మరించి ధర్మంలో అంతగా ప్రాముఖ్యంలేని అత్యల్ప విషయాల్ని గురించి వాదించు కోవడంలో కాలం గడిపితే వారిలో సమైక్యత సన్నగిల్లి తిరిగి విభేదాలు పొడసూపుతాయి.

"మీరు పరస్పరం కలహించుకోకండి. అలా చేస్తే మీలో అధైర్యం, బలహీనతలు చోటు చేసుకుంటాయి; మీ ప్రాబల్యం (క్షీణించి) పోతుంది." (ఖుర్‌ఆన్-8:46), (8:73 కూడా చూడండి.)

దైవప్రవక్త (సల్లం) వీడ్కోలుహజ్ సందర్భంలో ఇలా అన్నారు: "జాగ్రత్త! మీరు ముస్లిములై ఉండి కూడా నా తదనంతరం మెడలు నరుక్కునే అవిశ్వాసులుగా మారకండి." (బుఖారి)

ఒక ముస్లిం తోటి ముస్లింని దూషించడమంటే దేవునికి అవిధేయత చూపడమే (ఫిస్ఖ్) అని, అతనితో యుద్ధం చేయడమంటే దేవుడ్ని ధిక్కరించడమే (కుఫ్ర్) అని అనేక హదీసుల్లో ఉంది.

"ఎవరైనా ఒక ముస్లిం తోటి ముస్లింని హతమారిస్తే దాని పర్యవసానం నరకమవుతుంది. అతను (హంతకుడు) అందులోనే పడి ఉంటాడు. దేవుడు అతడ్ని ఆగ్రహిస్తాడు, శపిస్తాడు. అతని కోసం దుర్భరశిక్ష సిద్ధం చేయబడిఉంటుంది." (దివ్యఖుర్‌ఆన్- 4:98)

ఒక పార్టీకి లేదా సంస్థకు బయటి దాడుల కన్నా అంతర్గత కలహాలే అత్యంత ప్రమాదకర మైనవి. బయటి నుంచి ఎన్ని సవాళ్ళు ఎదురైనా, అంతర్గతంగా పటిష్ఠంగా ఉన్నప్పుడే ఆ పార్టీ లేదా సంస్థ విజయపథంలో పురోగమిస్తుంది. దీనికోసం పార్టీ కార్యకర్తలకు తమ పార్టీ నిబంధనావళిపై దృఢమైన విశ్వాసం, దాని లక్ష్యం పట్ల అమిత శ్రద్ధాసక్తులు ఉండటంతో పాటు, కార్యకర్తల మధ్య పరస్పరం ప్రేమాభిమానాలు, స్నేహ సోదర భావాలు కూడా ఉండటం ఎంతో అవసరం.

దేవుడ్ని, ఆయన అంతిమ ప్రవక్త (సల్లం)ను విశ్వసించినవారి పార్టీ "ఇస్లాం." వారి పార్టీ నిబంధనావళి "ఖుర్‌ఆన్." దాని కార్యాచరణ విధానం "హదీస్." పార్టీ లక్ష్యం "ధర్మ సంస్థాపనం", తద్వారా దైవప్రసన్నత, పరలోకసాఫల్యం పొందడం. ఈ ఉన్నతలక్ష్యం కోసం పనిచేసేవారి భావాలు కూడా ఎంతో ఉన్నతంగా ఉండాలని, పార్టీ (ధర్మం)లో అంతగా ప్రాముఖ్యంలేని అత్యల్ప విషయా లపై రేకెత్తే విభేదాలకు అతీతంగా వారు విశాల దృక్పథం అలవరచుకోవాలని ఇస్లాం బోధిస్తోంది. పార్టీ నిబంధనావళిని, దాని కార్యాచరణ విధానాన్ని, దాని ఆశయాలను ఎంత గట్టిగా ప్రేమిస్తే అంతగా వారి మధ్య ప్రేమాభిమానాలు జనిస్తాయని చెబుతోంది.

పార్టీ నిబంధనావళిలో, దాని కార్యాచరణ విధానంలో విషయాలన్నీ స్పష్టంగా ఉన్నాయి. కనుక కార్యకర్తలు పరస్పరం కలహించుకొని, ముఠాలుగా చీలిపోయి తన్నుకు చచ్చే అగత్యం లేదు. ఒకవేళ స్వార్థం, సంకుచితభావాలతో ఎవరయినా అలా చేస్తే వారికి కఠిన శిక్ష పడుతుందని పార్టీ నిబంధనావళి (ఖుర్‌ఆన్)లోని ఒక అధికరణ (3:105) కార్యకర్తల్ని హెచ్చరిస్తోంది.

అయితే ఈనాటి కార్యకర్తలు (ముస్లింలు) పార్టీ మౌలిక సూత్రాలకు దూరమయి, విభిన్న వర్గాలుగా, ముఠాలుగా చీలిపోయి ఒకర్నొకరు నరుక్కునే దుస్థితికి దిగజారిపోయారు. తోటి కార్య

పరస్పరం శత్రువులుగా ఉన్నప్పుడు దేవుడు మీ హృదయాలను కలిపాడు. ఆయన అనుగ్రహం వల్లనే మీరు పరస్పరం అన్నదమ్ములై పోయారు. మీరు అగ్నిగుండం అంచుకు చేరినప్పుడు ఆయన మిమ్మల్ని కాపాడాడు. ఈవిధంగా దేవుడు మిమ్మల్ని సన్మార్గంలో నడిపేందుకు తన సూక్తులు విడమరచి బోధిస్తున్నాడు. (103)

మీలో ఒకవర్గం (ప్రజల్ని) మంచి వైపుకు పిలిచేవారు, సత్కార్యాలు చేయమని ఆజ్ఞాపించేవారు, చెడుల నుండి వారించేవారు తప్పకుండా ఉండాలి.[12] అలాంటివారే

---

కర్తలను గౌరవించడం అలా ఉంచి, వారిపై బురద చల్లడానికి, వారిని అన్ని విధాలా అణగద్రొక్కి తమ ఆధిక్యత చాటుకోవడానికి సైతం ప్రయత్నిస్తున్నారు. దీనిక్కారణం వారికి పార్టీ నిబంధనావళిపై, దాని కార్యాచరణ విధానంపై గట్టి నమ్మకం, పూర్తి అవగాహన లేకపోవడమే.

మహాప్రవక్త (సల్లం) తన పార్టీ కార్యకర్తలలో సమైక్యత, సోదర భావాలను పెంపొందింప జేయడానికి ఎన్నో సూచనలు ఇచ్చారు. కొన్ని సూచనలు ఇక్కడ ఉదాహరిస్తున్నాం:

"ముస్లింలు పరస్పరం ఒకరితో నొకరు కలిసి పటిష్ఠమైన కట్టడంలా రూపొందుతారు. అందులోని ఒక భాగం మరొక భాగానికి బలం చేకూర్చుతుంది." (బుఖారి)

"యావత్తు ముస్లింల స్థితి దేహం లాంటిది. ఆ దేహంలో ఒక కంటికి బాధ కలిగితే, ఆ బాధను మొత్తం దేహం పాలుపంచుకుంటుంది. దాంతో శరీరమంతా తల్లడిల్లి పోతుంది." (ముస్లిం)

"మీరు ఒకరిపై నొకరు అసూయా ద్వేషాలు పెంచుకోకండి. ఒకరికొకరు పరోక్ష నిందకు కూడా పాల్పడకండి. దైవదాసులారా! మీరంతా పరస్పరం అన్నదమ్ములుగా (సోదర భావంతో) జీవించండి. తోటి ముస్లిం సోదరునితో మూడు రోజులకన్నా మించి మాట్లాడకుండా ఉండటం ఏ వ్యక్తికీ ధర్మసమ్మతం కాదు." (బుఖారి)

"నీవు నీ ముస్లిం సోదరుడ్ని కలుసుకుంటే అతనికి సలాం చెయ్యి. అతను విందుకు ఆహ్వానిస్తే ఆ ఆహ్వానాన్ని స్వీకరించు. అతను నీ ద్వారా ఏదైనా సహాయం కోరితే అతనికి సహాయం చెయ్యి. అతను తుమ్మి 'అల్ హమ్దులిల్లాహ్' (సకల ప్రశంసలకు దేవుడే అర్హుడు) అనంటే, నీవు 'యర్‌రహ్మకుల్లాహ్' (దేవుడు నిన్ను కరుణించుగాక) అని బదులు పలుకు. అతడు వ్యాధిగ్రస్తు డయితే వెళ్ళి పరామర్శించు. చనిపోతే అతని జనాజా (శవాని)కి తోడుగా వెళ్ళు." (ముస్లిం)

"తన కోసం ఇష్టపడిన దాన్నే తన (ముస్లిం) సోదరుని కోసం కూడా ఇష్టపడనంత వరకూ ఏ వ్యక్తీ నిజమైన విశ్వాసి కాలేడు." (బుఖారి, ముస్లిం)

"ఒక ముస్లిం తోటి ముస్లింకు సోదరుడు (లాంటివాడు). ఒక సోదరుడు తన సోదరునిపై (ఎన్నటికీ) దౌర్జన్యం చేయడు; అతడ్ని దౌర్జన్యపరునికి అప్పగించడు కూడా. ఎవరు తన సోదరుని అవసరాలు తీర్చే పనుల్లో నిమగ్నుడయి ఉంటాడో, దేవుడు అతని అవసరాలు తీర్చే బాధ్యత తీసు కుంటాడు. ఎవరు (తోటి)ముస్లింకు వచ్చిన కష్టాల్లో ఒక కష్టాన్ని దూరంచేస్తాడో ప్రళయదినాన దేవుడు అతని కష్టాలలో ఒక కష్టాన్ని దూరంచేస్తాడు. మరెవరు (తోటి) ముస్లిం పొరపాట్లను కప్పి పుచ్చుతాడో, ప్రళయదినాన దేవుడు అతని పొరపాట్లను (పాపాలను) కప్పిపుచ్చుతాడు." (బుఖారి, ముస్లిం) (దీంతోపాటు 49:10 సూక్తి, దాని పాదసూచిక కూడా చూడండి.)

12. ఈ సూక్తిలో ముస్లిం జీవిత లక్ష్యం ఏమిటో స్పష్టంగా చెప్పబడింది. దీన్నిబట్టి ప్రతి ముస్లిం తన శక్తి సామర్థ్యాల మేరకు సమాజంలో ప్రబలి ఉన్న చెడుగుల్ని అరికడ్తూ మంచిని



(ఇహపరలోకాల్లో) సాఫల్యం చెందేవారు. స్పష్టమైన సూచనలు, ప్రమాణాలు వచ్చినప్ప టికీ పరస్పరం విభేదించుకొని విభిన్న వర్గాలుగా చీలిపోయినవారిలా మీరూ కాకండి. అలాంటి వారికి ఘోరమైన (నరక)యాతనలు కాచుకొని ఉన్నాయి. (104-105)

కొందరి ముఖాలు (ఆనందోత్సాహాలతో) ప్రకాశిస్తూ ఉండగా, మరికొందరి ముఖాలు (పుట్టెడు దుఃఖంతో) నల్లబడిపోయే (ప్రళయ) దినాన దేవుడు మాడిపోయిన ముఖాలవారిని ఉద్దేశించి "ఏమిటీ, మీరు విశ్వసించిన తర్వాత మళ్ళీ అవిశ్వాసులయి పోయారా? అయితే మీ అవిశ్వాసానికి పర్యవసానంగా (నరక)యాతనలు చవిచూడండి" అని అంటాడు. అయితే ప్రకాశవంతమైన ముఖాలవారు దేవుని అనుగ్రహభాగ్యం (స్వర్గం) పొందుతారు. వారక్కడ కలకాలం (సుఖసంతోషాలతో) ఉంటారు. (106-107)

ఇవి దైవసూక్తులు. వీటిని నీకు యథాతథంగా వినిపిస్తున్నాము. దేవుడు ప్రపంచ మానవులకు ఎన్నటికీ అన్యాయం చేయడు. భూమ్యాకాశాల్లో ఉన్న సర్వం దేవునిదే. సమస్త వ్యవహారాలు చివరికి ఆయన సమక్షంలోనే ప్రవేశపెట్టబడతాయి. (108-109)

---

వ్యాపింపజేస్తూ ప్రజలను సంస్కరించడానికి కృషి చేయాలని అర్థమవుతోంది. అంతేకాకుండా దైవధర్మాన్ని గురించి ప్రచారం చేస్తూ వారిలో దైవభీతి, పరలోకపు జవాబుదారీ భావన కలిగించ డానికి కూడా ప్రయత్నించాలి. ఈ విషయంలో మహాప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు:

"దైవాజ్ఞలను ఉల్లంఘిస్తున్నవారిని, ఆ ఉల్లంఘనపై వారిని విమర్శించనివారిని ఇలా రెండస్థుల ఓడలోని ప్రయాణీకులతో పోల్చవచ్చు- చీటి వేయడం ద్వారా కొందరు పైఅంతస్థులో, కొందరు క్రింది అంతస్థులో కూర్చున్నారు. క్రింది అంతస్థువాళ్ళు బొక్కెనతో సముద్రం నుండి నీళ్ళు తోడుకోవడానికి పైఅంతస్థుకు వెళ్తున్నప్పుడల్లా పైఅంతస్థువాళ్ళకు ఇబ్బంది కలిగేది. దాంతో వాళ్ళు క్రింది అంతస్థువాళ్ళను విసుక్కునే వాళ్ళు.

అప్పుడు క్రింది అంతస్థువాళ్ళు ఓ గొడ్డలి తీసుకొని ఓడ అడుగున ఉన్న పలకలను ఊడ బెరకడం ప్రారంభించారు. పై అంతస్థువాళ్ళు (విస్తుబోయి) 'ఇదేమిటీ ఇలా చేస్తున్నారు?' అని అడిగారు. దానికి క్రింది అంతస్థువాళ్ళు 'మాకు నీళ్ళు కావాలి. నీళ్ళ కోసం మేము మాటిమాటికి పైకి వస్తుంటే మీకు బాధ కలుగుతోంది కదా! అందుకని మేము ఓడ పలకలను ఊడబెరికి నీళ్ళు తీసుకోదలిచాము' అని చెప్పారు.

పైఅంతస్థు వాళ్ళు గనక క్రింది అంతస్థువాళ్ళను ఆ పని నుండి అడ్డుకుంటే వారిని కూడా కాపాడగలరు, తమను కూడా కాపాడుకుంటారు. అలా అడ్డుకోకపోతే వారిని కూడా ముంచివేస్తారు, తాము కూడా మునిగిపోతారు." (బుఖారి)

మీలో ఎవరయినా సమాజంలో ఏదయినా చెడ్డ పని చూసినప్పుడు దాన్ని అతను చేత్తో (బలప్రయోగంతో) నిరోధిస్తే, దేవుని దగ్గర జవాబుదారీ బాధ్యత నుండి తప్పించుకుంటాడు. అంతటి శక్తి లేనివాడు ఆ చెడుకు వ్యతిరేకంగా గళం విప్పి అరికట్టేందుకు ప్రయత్నిస్తే అతను కూడా ఆ బాధ్యత నుండి తప్పించుకుంటాడు. చెడుకు వ్యతిరేకంగా గళంవిప్పి నిరోధించే శక్తి కూడా లేనివాడు కనీసం మనసులోనైనా ఆ చెడు విషయాన్ని ద్వేషిస్తే అతను కూడా జవాబుదారీ బాధ్యత నుండి తప్పించుకుంటాడు. ఈ (చివరి) వైఖరి అన్నిటికంటే అత్యల్పస్థాయి విశ్వాసం (ఈమాన్) క్రిందికి వస్తుంది." (నిసాయి) (ఇతర వివరాలకు 3:110 సూక్తికి రాసిన పాదసూచిక చూడండి.)

విశ్వాసులారా! ఇకనుండి ప్రపంచ మానవులకు మార్గదర్శనం చేస్తూ వారిని సంస్క రించడానికి రంగంలోకి తీసుకురాబడిన శ్రేష్ఠసమాజం[13] మీరే. మీరు మంచి

13. ఖుర్ఆన్ ప్రజలలో దైవభీతి, పరలోకచింతన జనింపజేసి తద్వారా వారిని నీతిమంతు లుగా, సత్పౌరులుగా తీర్చిదిద్దగోరుతోంది. అంధవిశ్వాసాలు, దురాచారాలతో సహా లోకంలోని వివిధ చెడుల్ని నిర్మూలించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నెలకొల్పదలచింది. ఈ లక్ష్యం కోసం ఖుర్ఆన్ ముస్లింలపై మంచినిపెంచే, చెడును త్రుంచే పని నిర్బంధం చేసింది. దీని కోసం ముస్లింలలో ఒక వర్గం వ్యవస్థీకృత సంఘంగా ఏర్పడాల్సిన ఆవశ్యకత ఉందని నొక్కి చెబుతోంది.

ఈ ఆశయం, అవసరాల దృష్ట్యానే దైవప్రవక్త (సల్లం) కాలంలో, ఆ తరువాత సద్వర్తును లైన ఖలీఫాల కాలంలో ముస్లింలు ధర్మసంస్థాపన కోసం తమ సర్వస్వాన్ని ధారపోసి కృషి చేశారు. సమాజంలో ఏ కొద్ది చెడు కన్పించినా వారు ప్రశాంతంగా నిద్రపోయేవారు కాదు. ప్రజలలో దైవభీతి కలిగిస్తూ వారిని దుష్కార్యాలకు దూరంగా ఉంచడానికి ప్రయత్నించేవారు. తత్ఫలితంగా ఆనాడు సమాజంలో సర్వత్రా నీతి, న్యాయం, సౌశీల్యం, సౌభ్రాత్రతలు వెల్లివిరిశాయి. భక్తిపరాయణత, బాధ్యతాభావం, పరస్పర గౌరవాభిమానాలు ఎల్లడెల్లడలా విస్తరించాయి.

అదొక స్వర్ణయుగం. ముస్లిమేతర మేధావులు సైతం కీర్తించిన కాంతియుగం. కాని ఆ యుగం అంతరించింది. ఆ కాంతి కనుమరుగయి పోయింది. ఈనాడు ప్రపంచంలో ఎటు చూసినా అరాచకమే గోచరిస్తోంది. అవినీతి, అన్యాయం. అశ్లీలం, అత్యాచారాలు సర్వసామాన్యమైపోయాయి. ప్రజల వ్యక్తిగత జీవితాల్లోనేగాక వారి సామూహిక జీవితాల్లో కూడా ఈ చెడులు చేరాయి. చివరికి రాజకీయ వ్యవహారాలు, చట్టసభలు సైతం వివిధ చెడులతో దుర్గంధ భూయిష్టమయి పోయాయి.

అంతకంటే విచారకరమైన విషయం- ధర్మసంస్థాపనా బాధ్యత నిర్వహించవలసిన ముస్లిం సమాజం కూడా ఈ చెడులలో కూరుకుపోయింది. ఇలాంటి పరిస్థితిలో ధార్మిక, సామాజిక స్పృహ కలిగిన ముస్లింలపై చెడును త్రుంచే, మంచిని పెంచే బాధ్యత మరింత అధికమయింది. ఈ పనిని గనగ నిర్వహించకపోతే సమాజ పతనానికి దేవుని సమక్షంలో ప్రధాన బాధ్యులు వారే అవుతారు. (2:142 సూక్తి, దాని పాదసూచిక కూడా చూడండి.)

మహనీయ ముహమ్మద్ (సల్లం) ఈ విషయాన్ని ఓ తార్కాణం ద్వారా ఇలా వివరించారు:

"దేవుడు, ఒక ఊరిని ఆ ఊరిప్రజలతో సహా తల్లక్రిందులు చేయమని జిబ్రీల్ (అలైహి)ని ఆజ్ఞాపించాడు. హజ్రత్ జిబ్రీల్ (అలైహి) ఆ ఊరిని చూసివచ్చి 'ప్రభూ! అక్కడ ఒక్క క్షణం కూడా నీకు అవిధేయత చూపని నీ దాసుడు కూడా ఒకడున్నాడు కదా (నేనెలా ఆ ఊరిని శిక్షించను)?' అని అన్నారు. 'కాని నా ధర్మం అగౌరవం, అపచారాలకు గురవుతుంటే అతని ముఖం ఏనాడూ (ఆగ్రహంతో కాస్తయినా) జేవురించలేదు. కనుక ఇతరులతో పాటు అతడ్ని కూడా కలిపి మొత్తం ఊరిని తల్లక్రిందులు చేసెయ్యి' అని దేవుడు మళ్ళీ ఆదేశించాడు." (మిష్కాత్)

సమాజమంతా భ్రష్టుపట్టి పోయినప్పుడు, దాన్ని సంస్కరించే ప్రయత్నం చేయకుండా వ్యక్తి గత సత్కార్యాల వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని ఈ హదీసు వివరిస్తోంది. అంతేకాదు, అలాంటి భ్రష్టసమాజంపై విరుచుకుపడే దైవశిక్ష నుండి వ్యక్తిగత సత్కార్యాలతో తృప్తిపడే ముస్లింలు కూడా తప్పించుకోలేరని ఇది ప్రస్ఫుటం చేస్తోంది. (7:164-165, 8:25 సూక్తులు కూడా చూడండి.)

నైతికంగా పతనం చెందిన సమాజంలో మనిషి వ్యక్తిగత సత్కార్యాల్లో కూడా ఎంతోకాలం స్థిరంగా ఉండలేడు. చుట్టూ స్వైరవిహారం చేసే చెడుగులు క్రమేణా అతడ్ని కూడా తమలో



ఇముడ్చుకుంటాయి. ఏమైనప్పటికీ దేవుడు మానవుల నుండి వారి వ్యక్తిగత సదాచరణను మాత్రమే కోరడంలేదు. ఆయన కోరుతున్న అసలు విషయం- సంఘసంస్కరణకై నిరంతర కృషి, ధర్మ సంస్థా పనకై ఎడతెగని పోరాటం. ఇలా చేస్తున్నప్పుడే ముస్లిం సమాజం శ్రేష్ఠసమాజం అనబడుతుంది.

దైవప్రవక్త (సల్లం) సంఘసంస్కరణ ప్రాముఖ్యం తెలుపుతూ పలికిన పలుకులు చూడండి:

"నా ప్రాణం ఏ శక్తి స్వరూపుని అధీనంలో ఉందో ఆ దేవుని సాక్షి! మీరు (ప్రజలను) సత్కార్యాలు చేయమని ఆదేశించే, దుష్కార్యాల నుంచి వారించే పనయినా చేయాలి. లేదా దేవుడు మీపై శిక్షనయినా దించుతాడు. అప్పుడు మీరు ఎంత మొరపెట్టుకున్నా ఆయన మీ మొరలు ఆలకించడు." (మిష్కాత్)

"ఏ జాతిలో చెడులు ప్రబలుతాయో ఆ జాతిలో ఉండే సంస్కరణాసామర్థ్యం కలవారు దాన్ని సంస్కరించకపోతే దేవుడు ఆ జాతి ప్రజలందరిపై ఏదయినా శిక్ష దించే సమయం ఆసన్న మయిందని వారు తెలుసుకోవాలి." (మిష్కాత్)

ఈ రెండు హదీసులు సమాజ సంస్కరణ ఆవశ్యకతను మరింత నొక్కి చెబుతున్నాయి. సమాజ సంస్కరణ ధర్మసంస్థాపనా బాధ్యతలోని భాగమే. అందువల్ల ముస్లింలు సమాజంలో ప్రబలి పోతున్న చెడుల్ని చూస్తూ చేతులు ముడుచుకొని కూర్చోవడానికి వీల్లేదు.

దైవప్రవక్తలు ఏకదైవారాధన నినాదమిస్తూ మొట్టమొదట ప్రారంభించిన కార్యం ఇదే. సమాజాన్ని పట్టి పీడించే ముఖ్యమైన చెడులకు వ్యతిరేకంగా వారు ఉద్యమం లేవదీసి ఆ చెడుల్ని అవలంబించే, వ్యాపింపజేసే వారిని తీవ్రంగా విమర్శించేవారు. పూర్వం లూత్ జాతిలో స్వజాతి సంపర్కం, దారిదోపిడీలు వంటి రుగ్మతలు ఉండేవి. దైవప్రవక్త హజ్రత్ లూత్ (అలైహి) వాటికి వ్యతిరేకంగా ఈ విధంగా గళం విప్పుతారు:

"మీరెలాంటి అశ్లీల చేష్టలకు పాల్పడుతున్నారు! మీకు పూర్వం లోకంలో ఎవరూ చేయన టువంటి సిగ్గుమాలిన పని చేస్తున్నారే!! మీరు కోర్కెలను తీర్చుకోవడానికి స్త్రీలను వదలి పురుషుల వెంటపడ్డారా? (ఎంత సిగ్గుచేటు!) మీరసలు పూర్తిగా హద్దుమీరి పోయారు." (ఖుర్ఆన్-7:80,81)

"మీరెంత సిగ్గుమాలిన పనికి పాల్పడుతున్నారు! మీకు పూర్వం లోకంలో ఎవరూ ఇలాంటి పని చేయలేదే!! మీరు (స్త్రీలను వదలి) పురుషుల వెంటపడ్డారా? దారిదోపిడీలు కూడా చేస్తున్నారు. నిండుసభలలో సైతం (సిగ్గువిడిచి ఈ) పాడుపని చేస్తున్నారేమిటీ?" (ఖుర్ఆన్- 29:28,29)

మద్యన్ జాతిప్రజలకు వారి దైవప్రవక్త హజ్రత్ షుఐబ్ (అలైహి) ఇలా ఉపదేశించారు:

"మీరు తూనికలు, కొలతలు పూర్తిగా పాటించండి. ప్రజలకు రావలసిన సరుకులు తగ్గించి ఇవ్వకండి. ధరణిలో శాంతి సామరస్యాలు ఏర్పడిన తరువాత అనవసరంగా అరాచకం, అల్ల కల్లోలాలు సృష్టించకండి." (ఖుర్ఆన్- 7:85)

"తూనికల్లో, కొలతల్లో న్యాయం పాటించండి. ఎవరికీ నష్టం కలగజేయకండి. సరైన త్రాసు తో తూచివ్వండి. ప్రజలకు రావలసిన సరుకులు తగ్గించి ఇవ్వకండి. ధరణిలో అల్లర్లు, అలజడులు రేపుతూ తిరగకండి." (ఖుర్ఆన్- 26:181-183)

సమూద్ జాతిప్రజలకు వారి దైవప్రవక్త సాలిహ్ (అలైహి) ఇలా ఉపదేశించారు:

"మీరు కొండలను తొలచి బడాయి కోసం పెద్దపెద్ద కట్టడాలు నిర్మిస్తున్నారా! కాస్త దేవునికి భయపడండి, నాకు విధేయత చూపండి. హద్దుమీరి ధరణిలో ఎలాంటి సంస్కరణలు చేయకుండా,

పనులు చేయమని ప్రజలను ఆదేశిస్తారు. చెడుల నుండి వారిస్తారు. దేవుణ్ణి ప్రగాఢంగా విశ్వసిస్తారు. గ్రంథప్రజలు (కూడా) విశ్వసించిఉంటే వారికెంతో మేలు జరిగేది. వారిలో విశ్వసించినవారు కూడా కొందరున్నారు. కాని చాలామంది అవిధేయులున్నారు. (110)

వారు మిమ్మల్ని కొంచెం బాధించడం తప్ప పెద్దగా హాని కలిగించలేరు. వారొక వేళ మీతో పోరాడినా (మీధాటికి నిలువలేక) వెన్నుజూపి పారిపోతారు. వారికి సహాయం కూడా లభించదు, దేవుని శరణులోనో మానవుల రక్షణలోనో ఆశ్రయం లభిస్తే తప్ప. వారెక్కడున్నా అవమానం, అప్రతిష్ఠలే వారిని వెన్నంటి ఉంటాయి. వారు దైవాగ్రహంలో చిక్కుకున్నారు. వారిని దౌర్భాగ్యం వెంటాడుతోంది. దీనిక్కారణం వారు దేవుని సూక్తుల్ని, ఆయన మహిమల్ని నిరాకరిస్తూ వచ్చారు. ఆయన పంపిన ప్రవక్తలను అన్యాయంగా హతమార్చి వేశారు. అదీగాక వారు మహా తలబిరుసుతో దేవునికి అవిధేయులై హద్దు మీరిపోయారు. (111-112)

అయితే గ్రంథప్రజలంతా అలాంటివారు కాదు. వారిలో సన్మార్గగాములు కూడా ఉన్నారు. వారు రాత్రివేళల్లో దేవుని సూక్తులు పఠిస్తూ ఆయన ముందు సాష్టాంగ పడతారు. దేవుణ్ణి, పరలోకాన్ని విశ్వసిస్తారు. ప్రజలకు మంచిని బోధిస్తారు. చెడుల నుండి వారిస్తారు. సత్కార్యాలు చేయడంలో పరస్పరం పోటీపడతారు. ఇలాంటివారే సజ్జనులు. (113,114)

వారు ఏ సత్కార్యం చేసినా దాన్ని విస్మరించడం జరగదు. దేవునికి భక్తిపరాయణులు ఎవరో బాగా తెలుసు. దేవుని వ్యతిరేకంగా అవిశ్వాసులకు (పరలోకంలో) వారి సంతానం, సిరిసంపదలు ఏమాత్రం పనికిరావు. వారే నరకవాసులు. అందులోనే వారు (నానాయాతనలు అనుభవిస్తూ) ఎల్లకాలం పడిఉంటారు. (115-116)

వారు ఐహికజీవితంలో చేసే ధనవ్యయం మంచుతో కూడిన తీవ్రమైన గాలి వంటిది. అది ఆత్మద్రోహం చేసుకున్నవారి పంటపొలాలపై వీచి సర్వనాశనం చేస్తుంది. దేవుడు వారికి అన్యాయం చేయడం లేదు. వారు తమకుతామే అన్యాయం చేసుకుంటున్నారు. (117)

విశ్వాసులారా! మీ వారిని తప్ప ఇతరుల్ని ఆంతరంగికులుగా చేసుకోకండి. వారు మీకు హాని తలపెట్టడంలో ఎలాంటి అవకాశాన్నీ జారవిడుచుకోరు. ఏ విధంగానయినా

---

అలజడులు రేకెత్తిస్తూ తిరిగేవారికి విధేయత చూపకండి.'' (ఖుర్‌ఆన్- 26:149-152)

''దేవుని శక్తి యుక్తులను విస్మరించకండి. ప్రపంచంలో అరాచకం, అల్లకల్లోలాలు సృష్టించకండి.'' (ఖుర్‌ఆన్- 7:74)

ఆద్ జాతిప్రజలకు వారి దైవప్రవక్త హజ్రత్ హూద్ (అలైహి) ఇలా ఉపదేశించారు:

''మీరు ఎత్తయిన ప్రతి చోటా పనికిమాలిన స్మారక భవనాన్ని నిర్మిస్తున్నారేమిటీ? ఇక్కడే శాశ్వతంగా ఉండాలన్నట్లు మీరు పెద్దపెద్ద మేడలు కడ్తున్నారు. మీరు ఎవరినైనా పట్టుకుంటే వారి పట్ల చాలా క్రూరంగా ప్రవర్తిస్తారు.'' (ఖుర్‌ఆన్- 26:128-130)



మిమ్మల్ని బాధించాలనే వారు కాచుకొని ఉంటారు. వారి మాటల్లో వైరం ఎప్పుడో బయటపడింది. ఇక వారి హృదయాల్లోనయితే అంతకన్నా ఎన్నోరెట్లు ద్వేషం నిండి ఉంది. మీరు వివేచనాపరులయితే విషయాన్ని గ్రహించండి; మేము మా సూక్తుల్ని స్పష్టంగా విడమరచి చెబుతున్నాము. (118)

మీరు వారిని ప్రేమిస్తారుగాని, వారికి మీరంటే ఏమాత్రం అభిమానం లేదు. మీరు (దైవ)గ్రంథాలన్నీ విశ్వసిస్తారు. (కాని వారు మీగ్రంథాన్ని విశ్వసించరు.) వారు మిమ్మల్ని కలసి నప్పుడు ''మేము కూడా (మీగ్రంథాన్ని, మీప్రవక్తను) విశ్వసిస్తున్నాం'' అంటారు. అయితే మీ దగ్గర్నుండి వెళ్ళిపోగానే మీ మీద పెంచుకున్న కసితో వారు పళ్ళు పటపట నూరుతారు. (దౌర్భాగ్యులారా!) మీరు పెంచుకున్న కసిలోనే మాడి చావండి. దేవునికి మీ అంతరంగాల్లో దాగివున్న ప్రతి విషయమూ తెలుసు. (119)

మీకేదైనా మేలు జరిగితే వారు విలవిల్లాడి పోతారు. కీడు జరిగితే మాత్రం తెగ సంబరపడి పోతారు. ఏమైనప్పటికీ మీరు సహనం వహించి దేవుని పట్ల భయభక్తులతో మసలుకుంటే, మీ మీద వారి కుట్రలు, కుయుక్తులేవీ పనిచేయవు. వారి చేష్టలన్నీ దేవునికి బాగా తెలుసు.(120)

(ముహమ్మద్! ఓరోజు) నీవు ఉదయం ఇంటి నుండి బయలుదేరి విశ్వాసుల్ని యుద్ధానికి సమాయత్త పరచడం ప్రారంభించావు.[14] ఆ సందర్భం గుర్తుచేసుకో. దేవుడు సమస్తం వింటాడు, ఆయన సర్వం ఎరిగినవాడు. అప్పుడు మీలో రెండు వర్గాలు ధైర్యం కోల్పోయి (యుద్ధరంగం నుంచి) దాదాపు పారిపోజూశాయి. కాని దేవుడు వారిని ఆదు కున్నాడు. అసలు దేవుడే వారి రక్షకుడు, సహాయకుడు. కనుక విశ్వాసులు ఎల్లప్పుడూ ఆయన్నే నమ్ముకొని ఉండాలి. (121-122)

దేవుడు మిమ్మల్ని బద్ర్ యుద్ధంలో కూడా ఆదుకున్నాడు. అప్పుడు కూడా మీకు సర్యన ఆయుధాలు, సరిపడ వనరులు లేవు. (అయినా మీకు మేము విజయం ప్రసాదించాము.) అందువల్ల మీరు దేవునికి భయపడండి; ఆయనకు కృతజ్ఞులయి ఉండండి. (123)

---

14. ఇది ఉహుద్ యుద్ధానికి సంబంధించిన సంఘటన. మక్కా ఖురైషీయులు బద్ర్ యుద్ధంలో ఓడిపోయినందున ప్రతీకారేచ్ఛతో ఇప్పుడు మదీనాపై దాడిచేయడానికి 3000 సైన్యంతో వచ్చారు. ముస్లింలు వేయిమంది సైన్యంతో బయలుదేరగా వారిలో 300 మంది కపటవిశ్వాసులు మెల్లగా జారుకున్నారు. మిగిలిన 700 మంది ముస్లింలకు, మక్కా ఖురైషీయులకు మదీనా నుంచి దాదాపు నాలగు మైళ్ళ దూరంలో ఉన్న ఉహుద్ కొండ దగ్గర యుద్ధం జరిగింది.

ఈ యుద్ధంలో మొదట ముస్లింలకే విజయం లభించినా, దైవప్రవక్త (సల్లం) ఒక కీలక స్థానంలో నిలబెట్టిన విలుకాండ్రు శత్రువులు ఓడి పారిపోతుండటం చూసి, ఆస్థానం వదలి సమరసొత్తు సేకరణలో మునిగిపోయారు. శత్రువులు దీన్ని గమనించి కొండ వెనుక వైపు నుంచి తిరిగొచ్చి మెరుపుదాడి చేశారు. ముస్లింలకు చాలా నష్టం జరిగింది. అయితే ఆ తరువాత వెంటనే సంబాళించుకొని ఎదురుదాడి చేయడం వల్ల అంతిమవిజయం ముస్లింలనే వరించింది.

నీవు విశ్వాసులలో ధైర్యం కలిగించడానికి వారితో అన్న మాటలు జ్ఞాపకంతెచ్చుకో. అప్పుడు నీవు “(మన) ప్రభువు మూడువేలమంది దైవదూతల్ని దించి మనల్ని ఆదుకోవడం చాలదా మీకు?”అన్నావు. మీరు గనక సహనం వహించి దేవుని పట్ల భయభక్తులతో మసలుకుంటే, శత్రువులు మీపై మెరుపుదాడి చేసినప్పుడు ఆయన మీకు ప్రత్యేక చిహ్నాలుగల ఐదువేలమంది దూతల్ని పంపి తప్పకుండా ఆదుకుంటాడు.[15] మీకు ధైర్యం వచ్చి మీ మనస్సు కుదుటపడేందుకే దేవుడిలా చేశాడు. నిజానికి ఏ సహాయమైనా దేవునినుండే లభిస్తుంది. ఆయన సర్వశక్తిమంతుడు, ఎంతో వివేచనాపరుడు. అవిశ్వాసులలో ఒక వర్గాన్ని తుడిచిపెట్టే ఉద్దేశ్యంతో లేదా వారి పీచమణచి పరాజయం, పరాభవాలతో పారిపోయేలా చేయడానికి ఆయన మీకీ సహాయం చేశాడు. (124-127)

(ప్రవక్తా!) దేవుడు వారిని క్షమించనైనా క్షమిస్తాడు. లేదా దుర్మార్గులైనందున వారిని శిక్షించనైనా శిక్షిస్తాడు. ఈ వ్యవహారంలో నిర్ణయం తీసుకోవడానికి నీకెలాంటి అధికారం లేదు. భూమ్యాకాశాల్లో ఉన్న సమస్తం దేవునిదే. ఆయన తానుతలచిన విధంగా కొందర్ని క్షమిస్తాడు, కొందర్ని శిక్షిస్తాడు కూడా. ఆయన గొప్ప క్షమాశీలి, అపార కృపాశీలుడు. (128-129)

విశ్వాసులారా! రెండింతలు, నాల్గింతలు పెరిగే ఈ వడ్డీని తినడం ఇకనైనా మానుకోండి.[16] దేవునికి భయపడండి, మీ జీవితాలు సార్థకమవుతాయి. సత్యతిరస్కారుల కోసం సిద్ధం చేయబడిన నరకాగ్ని నుండి తప్పించుకోండి. దేవునికి, ఆయన ప్రవక్తకు విధేయులయి ఉండండి, మీరు కరుణించబడతారు. మీ ప్రభువు క్షమాభిక్ష వైపు పరుగెత్తండి. అలాగే భూమ్యాకాశాలంత విశాలమైన స్వర్గసీమ వైపుక్కూడా పరుగెత్తండి. అది భయభక్తులు కలవారి కోసం సిద్ధం చేయబడి ఉంది. (130-133)

వారు కలిమిలోనూ, లేమిలోనూ తమ సంపదను (దైవమార్గంలో) ఖర్చుపెడతారు. కోపోద్రేకాలు దిగమింగుతారు.[17] ఇతరుల తప్పులు క్షమిస్తారు. ఇలాంటి

---

15. దేవుడు బద్ర్ యుద్ధంలో దైవదూతలను పంపి ముస్లింలకు సహాయం చేశాడు. ఆ సమయంలో మదీనా బహుదైవారాధకులు కొందరు బద్ర్ కొండ మీద నిలబడి యుద్ధం తీరును చూడసాగారు. వారి కథనం ప్రకారం యుద్ధం జరుగుతున్నప్పుడు వారి పైనుండి ఒక మబ్బుతునక గుర్రాల సకిలింపులు, గిట్టల చప్పుళ్ళతో రివ్వున యుద్ధమైదానం వైపు దూసుకుపోయింది. అందులో నుండి “తొందరగా ముందుకు సాగండి” అనే ఓ కంఠస్వరం కూడా వారికి విన్పించింది. ఈ విచిత్ర ధ్వనులు విని వారు భీతావహులయ్యారు. (8:9,10 సూక్తులు చూడండి.)

16. వివరాలకు 2:275-281, 30:38-39 సూక్తులు చూడండి.

17. కోపోద్రేకాలను గురించి దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు:

“మల్ల యుద్ధంలో తన ప్రత్యర్థిని చిత్తు చేసేవాడు నిజమైన పరాక్రమశాలి కాదు. ఆగ్రహం కలిగినప్పుడు నిగ్రహించుకునేవాడే అసలైన పరాక్రమశాలి.” (బుఖారి, అహ్మద్)

“కోపం షైతాన్ ప్రేరణ వల్ల జనిస్తుంది. షైతాన్ నిప్పుతో సృజించబడ్డాడు. నిప్పు నీటితో చల్లారుతుంది. కనుక మీరు కోపం వచ్చినప్పుడు వెంటనే ఉజూ చేయండి.” (అబూదావూద్)



సద్వర్తనులనే దేవుడు ప్రేమిస్తాడు. అదీగాక దేవుడు తప్ప మరెవరూ పాపాలు క్షమించేవారు లేరు గనక తమ వల్ల ఏదయినా నీతిమాలిన పని గాని, లేదా మరేదయినా పాపకార్యం గాని జరిగిపోతే వెంటనే వారు దేవుడ్ని స్మరించి క్షమాపణ చెప్పుకుంటారు. అంతేగాని, తాము చేసిన దానిపై మంకుపట్టు పట్టరు. అలాంటివారికి ప్రతిఫలంగా వారి ప్రభువు నుండి మన్నింపుతో పాటు సెలయేరులు ప్రవహించే స్వర్గవనాలు లభిస్తాయి. అక్కడే వారు కలకాలం (హాయిగా) ఉంటారు. మంచి పనులకు ఎంత మంచి ప్రతిఫలం లభిస్తుంది! (134-136)

మీకు పూర్వంకూడా అనేక పరిణామాలు సంభవించాయి నేలనాలుగు చెరగులా తిరిగిచూడండి, తిరస్కరించినవారికి ఏం గతి పట్టిందో! ఇది (ఖుర్‌ఆన్) ప్రజలకు ఓ బహిరంగ ప్రకటన; భయభక్తులుకలవారికి హితబోధిని, మార్గదర్శిని. (137,138)

(విశ్వాసులారా!) బాధపడకండి. అధైర్యంతో క్రుంగిపోకండి. మీరు నిజమైన విశ్వాసులయితే చివరికి మీరే విజయం సాధిస్తారు. (సత్యాసత్యాల సమరంలో) మీరేకాదు, వారు కూడా మీలాగే దెబ్బతిన్నారు. (అంతమాత్రానికే ధైర్యం కోల్పోవడమా!)

ఇవన్నీ మేము ప్రజల మధ్య తిప్పే కాలపు మిట్టపల్లాలు మాత్రమే. ఆయన మీలో నిజమయిన విశ్వాసులెవరో పరీక్షించడానికి, కొందరిని సత్యానికి సాక్షులు (అమరగతులు)గా చేయడానికి ఈ విధంగా చేశాడు. దేవుడు దుర్మార్గుల్ని ఎన్నటికీ ప్రేమించడు. ఆయన ఇలాంటి పరీక్ష ద్వారా నిజమయిన విశ్వాసులు ఎవరో ఏరివేసి, అవిశ్వాసుల్ని అణచి వేయదలిచాడు. (139-141)

మీరు ఇట్టే స్వర్గంలో ప్రవేశిస్తామనుకుంటున్నారా? మీలో దైవమార్గంలో పోరాడేవారిని దేవుడు ఇంకా సరిగా పరీక్షించనే లేదు. వారు ఏమేరకు సహనం వహించి ధ్యేయపథంలో స్థిరంగా ఉంటారో ఆయన చూడదలిచాడు.[18] ఇదివరకు (దైవమార్గంలో పోరాడి) మరణించే అవకాశం రాకముందు మీరు దాన్ని కోరుతుండేవారు. ఇప్పుడది మీముందుకు వచ్చింది. మీరు దాన్ని కళ్ళారా చూసుకున్నారు కూడా. (కనుక మీరు ప్రాణాలకు తెగించి పోరాడాలిగాని, ధైర్యం కోల్పోయి ఢీలాపడిపోకూడదు.)- (142-143)

ముహమ్మద్ ఒక దైవప్రవక్త మాత్రమే. ఇతనికి పూర్వం కూడా అనేకమంది దైవప్రవక్తలు వచ్చిపోయారు. మరి ఇతనిప్పుడు చనిపోతే లేక చంపబడితే మీరు (ధర్మపథం నుండి) వెనుదిరిగిపోతారా?[19] గుర్తుంచుకోండి, అలా వెనుదిరిగిపోయేవాడు దేవునికి

---

“నిలబడి ఉన్నప్పుడు కోపం వస్తే తక్షణమే కూర్చోవాలి. దానివల్ల కోపం చల్లారితే సరి; లేకపోతే పడుకోవాలి.” (మిష్కాత్)

“మీరు ఇతరులపై దయజూపండి; దేవుడు మీపై దయజూపుతాడు. మీరు ఇతరుల తప్పులు క్షమించండి; దేవుడు మీ తప్పులు క్షమిస్తాడు.” (ముస్నద్ అహ్మద్)

18. వివరాలకు 2: 155, 29: 1-3 సూక్తులు, వాటి పాదసూచికలు చూడండి.

19. ఉహుద్ యుద్ధంలో దైవప్రవక్త (సల్లం) క్షతగాత్రులైనప్పుడు ఆయన చంపబడ్డారని

ఎలాంటి నష్టం కల్గించలేడు. దేవుడు తనకు కృతజ్ఞత చూపేవారికే తగిన బహుమానం ఇస్తాడు. (144)

దేవుని అనుజ్ఞ లేనిదే నిర్ణీత సమయానికి ముందు ఏ ప్రాణికీ చావురాదు. ప్రతి ప్రాణికీ మరణకాలం వ్రాయబడి ఉంది. కేవలం ప్రాపంచిక ప్రతిఫలాపేక్షతో పనిచేసే వారికి మేము ప్రపంచంలోనే వారి ప్రతిఫలం ఇచ్చివేస్తాము. పరలోక ప్రతిఫలాపేక్షతో పనిచేసేవారికి పరలోకంలో వారికి రావలసిన ప్రతిఫలం అనుగ్రహిస్తాము. కృతజ్ఞులై ఉండేవారికి మేము తప్పకుండా తగిన బహుమానం ప్రసాదిస్తాము. (145)

ఇంతకు పూర్వం ఎంతోమంది దైవప్రవక్తలు గతించారు. వారితో కలసి దైవభక్తులు ప్రాణాలొడ్డి పోరాడారు. అప్పుడు దైవమార్గంలో ఎదురైన కష్టాలవల్ల వారు ధైర్యం కోల్పో లేదు. పిరికిచర్యలకు పాల్పడి అధర్మానికి తలవంచనూ లేదు. అలాంటి స్థిరచిత్తులనే దేవుడు ప్రేమిస్తాడు. పైగా వారు (దైవాన్ని వీడకుండా) "ప్రభూ! మా తప్పులు మన్నించు. నీ మార్గంలో మేమేదైనా హద్దుమీరి ఉంటే దాన్ని కూడా క్షమించు. మా కాళ్ళకు స్థిరత్వం చేకూర్చి అవిశ్వాసులపై మాకు విజయం ప్రసాదించు"అని వేడుకున్నారు. కనుక దేవుడు వారికి ప్రపంచంలో తగినప్రతిఫలం ఇచ్చాడు; పరలోకంలో అంతకంటే ఎంతో శ్రేష్ఠమైన ప్రతిఫలం ప్రసాదిస్తాడు. అలాంటి సద్వర్తనులనే దేవుడు అభిమానిస్తాడు. (146-148)

విశ్వాసులారా! మీరు గనక అవిశ్వాసులు చేప్పే మాటలు వింటే వారు మిమ్మల్ని తిరిగి అవిశ్వాసం వైపు తీసికెళ్తారు. అప్పుడు మీరు ఘోరంగా నష్టపోతారు. (వారు మీ శ్రేయోభిలాషులు కాదు.) దేవుడే మీ శ్రేయోభిలాషి, సహాయకుడు. ఆయనే అందరికన్నా గొప్ప సహాయకుడు. త్వరలోనే మేము సత్యతిరస్కారుల హృదయాల్లో మీపట్ల భయోత్పాతం కలిగిస్తాము. దేవుడు ఎలాంటి ప్రమాణం పంపకపోయినా, వారాయనకు (దైవత్వంలో) సాటి కల్పించారు. కనుక వారి అంతిమ నివాసం నరకమవుతుంది. అది దుర్మార్గుల కోసం తయారయి ఉన్న పరమ చెడ్డ నివాసం. (149-151)

దేవుడు మీకు చేసిన (సహాయ) వాగ్దానాన్ని నెరవేర్చాడు. ప్రారంభంలో మీరే దేవుని ఆజ్ఞతో అవిశ్వాసుల్ని వధిస్తుండేవారు. కాని ఆ తరువాత మీరు కోరుకున్నదాన్ని (సమర సొత్తును) దేవుడు చూపగానే మీరు ధైర్యం కోల్పోయారు. (ప్రవక్త ఇచ్చిన) ఆజ్ఞ విషయం లో మీరు పరస్పరం విభేదాలకు లోనయి అవిధేయత చూపారు. మీలో కొందరు ప్రాపంచిక సంపదను ఆశించారు. మరికొందరు పరలోక ప్రతిఫలం కోరుకున్నారు. అప్పుడు దేవుడు మిమ్మల్ని పరీక్షించడానికి శత్రువుల నుండి మీ దృష్టిని (వేరే వైపునకు) మరల్చి పారిపోయేలా చేశాడు. అయితే మీరలా పారిపోయినప్పటికీ దేవుడు మిమ్మల్ని క్షమించాడు. ఆయన విశ్వాసుల పాలిట అత్యంత దయామయుడు. (152)

---

వదంతి పుట్టింది. ఇది విని చాలామంది ముస్లింలు ధైర్యం కోల్పోయి ఢీలా పడిపోయారు. కొందరు అయితే యుద్ధం చేయడమే మానేశారు. మరోవైపు కపటులు మరింత క్రుంగదీసే మాటలతో ముస్లింలను ఇస్లాం నుండి మరలించడానికి ప్రయత్నించారు. ఆ సందర్భంగా ఈ సూక్తులు అవతరించాయి.



(ఉహుద్‌కు సంబంధించిన) మరో సంఘటన గుర్తుకుతెచ్చుకోండి. అప్పుడు మీరు వెనుదిరిగి చూడనయినా చూడకుండా పారిపోసాగారు. వెనకాల దైవప్రవక్త మిమ్మల్ని పిలుస్తున్నా మీరు విన్పించుకునే స్థితిలో లేకపోయారు. ఈవైఖరికి శాస్తిగా దేవుడు మీకు పుట్టెడు దుఃఖం కలిగించాడు. భవిష్యత్తులో మీనుండి ఏదైనా వస్తువు చేజారిపోయినా లేక మరేదైనా ఆపద వచ్చిపడినా మీరు చింతించకుండా ఉండేందుకు ఇలా దేవుడు మీకొక గుణపాఠం నేర్పాడు. మీరు చేసే పనులన్నీ దేవునికి బాగా తెలుసు. (153)

ఈ బాధ, దుఃఖం తర్వాత దేవుడు మీలో కొందరిపై ప్రశాంతిని అవతరింపజేశాడు. తత్ఫలితంగా వారు ఒక విధమైన కునుకుపాటుకు లోనయ్యారు.

అయితే స్వప్రయోజనాలు ఆశిస్తుండినవారు దేవుని విషయంలో అజ్ఞానంతో కూడిన అనుమానంతో "ఈ విషయంలో మాకేమీ అధికారం లేదా?" అని అడిగారు. "అన్ని విషయాల్లోనూ దేవుడే సర్వాధికారి" అని చెప్పు. వారు కొన్ని విషయాలు నీ ముందు వెలిబుచ్చకుండా మనసులోనే దాచుకున్నారు. పైగా "మాకే గనక అధికారం ఉంటే మేమిక్కడికి వచ్చి వధించబడేవారం కాదు" అంటారు. చావు మీ నొసట రాసి ఉంటే, మీరు మీఇండ్లలో ఉన్నా సరే మీమీ వధ్య స్థలాలకు తప్పకుండా తరలివస్తారు. మీ అంతరంగాల్లో దాగివున్నదాన్ని పరీక్షించి దాని కాపట్యాన్ని కడిగివేయాలనే దేవుడిలా చేశాడు. అంతరంగాల స్థితి అందరికన్నా ఆయనకే బాగా తెలుసు. (154)

మీలో కొందరు (ఉహుద్ యుద్ధంలో) శత్రువుల్ని ఎదుర్కొనేటప్పుడు వెన్నుజూపి పారిపోయారు. వారిలోని కొన్ని బలహీనతల కారణంగానే షైతాన్ వారి మనో స్థయిర్యాన్ని దెబ్బతీసి పారిపోయేలా చేశాడు. అయినప్పటికీ దేవుడు వారిని క్షమించాడు. దేవుడు గొప్ప క్షమాశీలి, అత్యంత ఉదారుడు. (155)

విశ్వాసులారా! మీరు అవిశ్వాసుల మాదిరిగా మాట్లాడకండి. వారి (ముస్లిం) బంధుమిత్రులు ఎప్పుడైనా ప్రయాణావస్థలోనో, యుద్ధరంగంలోనో ఉండి ఏదైనా ప్రమాదానికి గురైతే, "వారు తమతోపాటు ఉండినట్లయితే చనిపోవడంగాని, చంప బడటంగాని జరిగి ఉండేది కాదు" అని అంటారు వారు. వారు పలికిన ఈ పలుకులకు దేవుడు వారిని తీవ్ర పశ్చాత్తాపం, నిస్పృహలకు గురిచేస్తాడు. నిజానికి జీవన్మరణాలు దేవుని చేతిలోనే ఉన్నాయి. ఆయన మీ చర్యల్ని గమనిస్తూనే ఉన్నాడు. (156)

మీరొకవేళ దైవమార్గంలో చనిపోయినా లేక చంపబడినా దేవుని నుండి మీకు లభించే క్షమాభిక్ష, కారుణ్యాలు వారు కూడబెడ్తున్న ఐహిక సంపదలకన్నా ఎంతో శ్రేష్ఠమైనవి. మీరు చనిపోయినా, చంపబడినా (రేపు ప్రళయదినాన) దేవుని సన్నిధిలో మీరంతా తప్పకుండా సమీకరించబడతారు. (157-158)

(ముహమ్మద్!) దైవానుగ్రహంవల్లనే నీవు వారి విషయంలో ఎంతో మృదుహృదయుడవయ్యావు. దీనికి భిన్నంగా నీవు కోపిష్టి, కఠిన హృదయుడవయి ఉంటే వారంతా నీకు దూరమయ్యేవారు. ఒక్కడూ నీ చెంతకు చేరేవాడు కాదు. కనుక నీవు వారిని

క్షమించు. వారి పొరపాట్ల కోసం (దేవుని) మన్నింపు అర్థించు. నీవు తలపెట్టే పనుల విషయంలో వారిని సంప్రదిస్తూ ఉండు. ఏదైనా పని గురించి నిర్ణయం తీసుకున్నప్పుడు దేవుని మీద భారం వెయ్యి. దేవుడు తనను నమ్ముకున్నవారినే ప్రేమిస్తాడు. (159)

దేవుడు సహాయం చేయదలిస్తే ఇక ఏశక్తీ మీపై ఆధిక్యత వహించదు. ఒకవేళ ఆయన మిమ్మల్ని మీ మానాన వదిలేస్తే, ఆ తర్వాత మీకు ఎవరు సహాయం చేయగలరు? కనుక నిజమైన విశ్వాసులు దేవుడ్నే నమ్ముకొని ఉండాలి. (160)

ఏ దైవప్రవక్త కూడా ఎలాంటి పరిస్థితిలోనూ నమ్మకద్రోహానికి పాల్పడడు.[20] నమ్మక ద్రోహం చేసినవాడు ఆ నమ్మకద్రోహం (పాపభారం)తో ప్రళయదినాన (దైవ న్యాయస్థానంలో) హాజరవుతాడు. అప్పుడు ప్రతి వ్యక్తికీ అతను చేసుకున్న కర్మల ప్రకారమే ప్రతిఫలం ఇవ్వబడుతుంది. ఎవరికీ ఎలాంటి అన్యాయం జరగదు. (161)

ఎల్లప్పుడూ దేవుని అభీష్టం ప్రకారం నడచుకునే వ్యక్తి దైవాగ్రహానికి గురైనవాడిలా ఎలా ప్రవర్తించగలడు? దైవాగ్రహానికి గురైనవాడికి నరకమే తగిన నివాసం. అది పరమ చెడ్డ నివాసం. దేవుని దృష్టిలో వారిద్దరి మధ్య అనేక రెట్ల వ్యత్యాసముంది. దేవుడు వారి పనుల్ని గమనిస్తూనే ఉన్నాడు. (162-163)

దేవుడు విశ్వసించినవారిలో వారి జాతికి చెందిన ఒక ప్రవక్తను ప్రభవింపజేసి వారికి గొప్ప మేలు చేశాడు. ఆ ప్రవక్త వారికి దేవుని సూక్తులు వినిపిస్తూ వారి జీవితాల్ని తీర్చిదిద్దుతున్నాడు. వారికి గ్రంథజ్ఞానం, వివేకాలు బోధిస్తున్నాడు. ఇదివరకు వారు పూర్తిగా అపమార్గంలో పడిఉండేవారు. (164)

ఇప్పుడు మీ పరిస్థితి ఇలా అయ్యిందేమిటీ? (దైవమార్గంలో) మీపై కాస్తంత ఆపద వచ్చిపడగానే ఇదెక్కడ్నుంచి దాపురించింది అంటారేమిటీ? (బద్ర్ యుద్ధంలో) మీ చేతుల మీదుగా దీనికి రెండింతల ఆపద (మీ ప్రత్యర్థి వర్గంపై) విరుచుకుపడింది కదా! (ఆ సంగతి మరచిపోయారా?) ప్రవక్తా! "ఈఆపద మీరు చేజేతులా కొనితెచ్చుకున్న దేనని" వారికి చెప్పు. దేవుడు ప్రతిపనీ చేయగల సమర్థుడు, సర్వశక్తిమంతుడు. (165)

---

20. ఉహుద్ యుద్ధ సమయంలో దైవప్రవక్త (సల్లం) కొందరు విలుకాండ్రను ఓ కీలక ప్రదేశంలో నిలబెట్టి తన దగ్గర్నుంచి తిరిగి ఉత్తర్వు రానంతవరకు ఆ ప్రదేశాన్ని వదలిపెట్టి పోకూడదని ఆజ్ఞాపించారు. అయితే యుద్ధంలో శత్రువులు పారిపోవడం చూసి ముస్లిం యోధులు వారు వదలిపోయిన యుద్ధసొత్తును సేకరించుకోవడం ప్రారంభించారు. నిర్ణీత కీలకప్రదేశంలో నియమించబడిన విలుకాండ్రు కూడా ఒకరిద్దరు మినహా అందరూ తమతమ స్థానాలు వదలి యుద్ధసొత్తు సేకరించుకోవడానికి వెళ్ళిపోయారు.

యుద్ధం ముగిసిన తరువాత దైవప్రవక్త (సల్లం) తాను ఆదేశించక ముందే ఆ ప్రదేశాన్ని ఎందుకు వదలిపెట్టారని వారిని అడిగారు. వారు తప్పించుకునే ధోరణిలో ఏదో సంజాయిషీ ఇచ్చుకున్నారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) "మీకసలు నామీద నమ్మకం కలగలేదు. నేను మీకు రావలసిన యుద్ధసొత్తు వాటా ఇవ్వకుండా ద్రోహం చేస్తానని మీరు భావించారు" అని అన్నారు. ఈ వ్యవహారం గురించే ఈ సూక్తి అవతరించింది.



(ఉహుద్) యుద్ధంలో మీకు జరిగిన నష్టం దేవుని అనుజ్ఞతోనే జరిగింది. మీలో నిజమైన ముస్లిములెవరో, కపట ముస్లిములెవరో పరీక్షించడానికే దేవుడిలా చేశాడు. ఆ కపటులతో "రండి, దైవమార్గంలో పోరాడండి. (శత్రు)దాడిని తిప్పికొట్టి (మీనగరాన్ని) కాపాడుకోండి"అని చెప్పినప్పుడు "యుద్ధంసంగతి మాకు తెలిసుంటే మేము తప్పకుండా మీతో చేరేవాళ్ళం" అన్నారు. ఈమాటలు అంటున్నప్పుడు వారు విశ్వాసంకన్నా అవిశ్వాసానికే ఎక్కువ చేరువగా ఉన్నారు. వారు తమ హృదయాల్లోలేని మాటలు పైకి చెబుతున్నారు. వారు తమ హృదయాల్లో దాచినదేమిటో దేవునికి బాగా తెలుసు. (166-167)

వారు (యుద్ధానికి బయలుదేరకుండా ఇంట్లో) కూర్చొని (దైవమార్గంలో ప్రాణత్యాగం చేయడానికి వెళ్ళిన) తమ బంధుమిత్రుల్ని గురించి "వారు మామాట విని ఉంటే ఇలా వధించబడి ఉండేవారుకాదు" అని చెప్పారు. ప్రవక్తా! వారినిలా అడుగు: "మీ అభిప్రాయం నిజమైతే మీకు దాపురించే మృత్యువుని అడ్డుకోండి చూద్దాం." (168)

(దైవమార్గంలో వధించబడిన వారిని) మృతులని భావించకండి. నిజానికి వారు (చని పోలేదు.) దేవుని దృష్టిలో బ్రతికే ఉన్నారు. అదీగాక వారు తమ ప్రభువు దగ్గర ఆహారం కూడా పొందుతున్నారు. వారు తమకు దేవుడు దయతో ప్రసాదించిన దానిపట్ల ఎంతో సంతోషంగా ఉన్నారు. అంతేకాదు, తమతో చేరకుండా ఇంకా ఇహలోకంలోనే ఉండిపోయిన వారిక్కూడా ఎలాంటి భయంగాని, విచారంగాని ఉండదని తెలుసుకొని వారు నిశ్చింతగా ఉన్నారు. వారు దేవుని కరుణాకటాక్షాల పట్ల ఎంతో ఆనందిస్తున్నారు. దేవుడు విశ్వాసుల పుణ్యఫలాన్ని ఎన్నటికీ వృధాచేయడని వారికి తెలుసు. (169-171)

(యుద్ధంలో) గాయపడిన తరువాత కూడా చాలామంది దేవుడు, ఆయన ప్రవక్త ఇచ్చిన పిలుపునకు వెంటనే స్పందించారు. వారిలో సజ్జనులు, దైవభీతిపరులైనవారి కోసం (దేవుని దగ్గర) గొప్ప ప్రతిఫలం ఉంది. "మీపై దాడిచేయడానికి అవిశ్వాసులు పెద్దఎత్తున సైన్యాలు సమీకరిస్తున్నారు, వారికి భయపడండి" అని జనం అన్నప్పుడు వారు ద్విగుణీకృత విశ్వాసంతో "మాకు దేవుడే చాలు, ఆయన గొప్ప కార్యసాధకుడు" అని సమాధానమిచ్చారు. చివరికి వారు దేవుని అనుగ్రహంతో, బహుమానాలతో తిరిగి వచ్చారు. వారికి ఎలాంటి నష్టం జరగలేదు. వారు దేవుని అభీష్టం ప్రకారం నడుచుకున్నారు. దేవుడు (ఇలాంటివారికే) అపారంగా అనుగ్రహించేవాడు. (172-174)

అసలు షైతానే తన మిత్రమూకను గురించి ప్రజలను భయపెట్టేవాడు. జాగ్రత్త! మీరు నిజమైన విశ్వాసులైతే ఈ పిశాచ మిత్రమూకకు ఎన్నటికీ భయపడకూడదు. నాకే భయపడాలి. అవిశ్వాసం వైపు పరుగెత్తేవారి చేష్టల పట్ల నీవు బాధపడకు. వారు దేవునికి ఎలాంటి నష్టం కలగజేయలేరు. దేవుడు వారికి పరలోకంలో ఎలాంటి ప్రతిఫలం ఇవ్వదలచుకోలేదు. వారికి ఘోరమైన (నరక)యాతన రాసిపెట్టి ఉంది. (175-176)

విశ్వాసానికి బదులు అవిశ్వాసం కొని తెచ్చుకున్నవారు దేవునికి ఎలాంటి నష్టం కలి గించలేరు. వారికోసం అతి బాధాకరమైన శిక్ష కాచుకొని ఉంది. కనుక మేము అవిశ్వాసుల్ని చూసీచూడనట్లు వదిలేస్తున్నామని, ఇది తమకెంతో మంచిదని వారు

భావించకూడదు. వారు మరిన్ని పాపాలు చేసుకోవడానికే మేమిలా ఉపేక్షించి అవకాశమిస్తున్నాము. చివరికి (ఓరోజు) వారు అత్యంత హేయమైన యాతనకు గురికావలసి ఉంటుంది. (177,178)

దేవుడు విశ్వాసుల్ని ప్రస్తుతం వారున్న స్థితిలో ఎంతోకాలం ఉండనివ్వడు. ఆయన అపవిత్రుల నుండి పవిత్రుల్ని తప్పకుండా వేరుచేస్తాడు. అయితే (ముందు జరగబోయే) అగోచరవిషయాల్ని గురించి మీకు తెలియజేయడం దేవుని అభిమతం కాదు. దీనికోసం ఆయన తన ప్రవక్తల నుండి తాను కోరినవారిని ఎన్నుకుంటాడు. కనుక మీరు దేవుడ్ని, ఆయన ప్రవక్తల్ని విశ్వసించండి. మీరు సత్యాన్ని విశ్వసించి భయభక్తులతో నడచుకుంటే మీకు గొప్ప ప్రతిఫలం లభిస్తుంది. (179)

దేవుడు తన అనుగ్రహంతో ప్రసాదించిన సంపద విషయంలో పిసినారితనం వహించేవారు ఆ పిసినారితనం తమకు మేలు చేకూరుస్తుందని భావించకూడదు. అది వారికి హాని కలిగిస్తుంది. వారు ఏ ధనం విషయంలో పిసినారితనం వహిస్తున్నారో అది రేపు ప్రళయదినాన వారి మెడకు గుదిబండగా మారుతుంది. యావత్తు భూమ్యాకాశాలకు దేవుడే వారసుడు. మీరు చేస్తున్నదంతా దేవునికి బాగా తెలుసు. (180)

“దేవుడు దరిద్రుడు, మేమే ధనికులం” అన్నవారి ఆమాటలు దేవుడు విన్నాడు.[21] వారి కారుకూతల్ని మేము (వారి కర్మలచిట్టాలో) వ్రాస్తున్నాం. వారు దైవప్రవక్తల్ని అన్యాయంగా హతమార్చిన విషయాన్ని కూడా మేము వ్రాశాము. మేము ప్రళయదినాన వారితో “మీరు చేజేతులా చేసుకున్న కర్మలకు ఫలితంగా ఇప్పుడిక నరకయాతనలు చవిచూడండ”ని అంటాం. దేవుడు తనదాసులపై ఎన్నటికీ దౌర్జన్యం చేయడు.(181,182)

వారిలా అంటారు: “మేము ఏ దైవప్రవక్తను విశ్వసించాలన్నా అతను మాముందు ఏదైనా (పశువుని) బలివ్వాలి. దాన్ని ఆకాశం నుండి అగ్నిజ్వాల వచ్చి కాల్చివేయాలి. అలాంటి బలి ఇవ్వనంతవరకు ఏ దైవప్రవక్తనూ విశ్వసించరాదని దేవుడు మాకు ఆజ్ఞాపించాడు.” వారినిలా అడుగు: “నాకు పూర్వం ఎందరో ప్రవక్తలు మీ దగ్గరకు స్పష్టమైన సూచనలు, నిదర్శనాలు తెచ్చారు. ఇప్పుడు మీరు ప్రస్తావిస్తున్న నిదర్శనాలు కూడా తెచ్చారు. మరి మీరు నీతిమంతులైతే వారిని ఎందుకు హతమార్చారు?” (183)

(ముహమ్మద్!) వారు నిన్ను తిరస్కరిస్తే (తిరస్కరించనీ, దానివల్ల నీకు, దైవానికి కలిగే నష్టమేమీ లేదు.) నీకు పూర్వం కూడా స్పష్టమయిన ప్రమాణాలు, నిదర్శనాలు, దైవాదేశ ఫలకాలు, తేజోమయ గ్రంథాలు తీసుకువచ్చినా అనేకమంది ప్రవక్తలు తిరస్కరించబడ్డారు. చివరికి ప్రతి మనిషీ ఓ రోజు చావాల్సిందే. మీ కర్మలకు ప్రళయదినాన పూర్తి ప్రతిఫలం లభిస్తుంది. నరకానికి దూరంగా స్వర్గానికి పంపబడేవాడే నిజమైన కృతార్థుడు. ఐహికజీవితం, (దాని సౌఖ్యాలు) వట్టి మోసపూరితమైన పైపై మెరుగులు మాత్రమే. (184,185)

21. వివరాలకు 5:64 సూక్తి, దాని పాదసూచిక చూడండి.



ముస్లిములారా! (భవిష్యత్తులో) మీరు ధనప్రాణాల విషయంలో అనేక కఠిన పరీక్షలకు గురికావాల్సి వస్తుంది. అదీగాక మీరు గ్రంథప్రజల నుండి, బహుదైవారాధకుల నుండి కూడా మనస్సు నొప్పించే మాటలు అనేకం వినవలసి వస్తుంది. కనుక అలాంటి స్థితిలో మీరు సహనం వహించి, భయభక్తులతో కూడిన జీవితం గడుపుతూ ధర్మమార్గంలో స్థిరంగా ఉండాలి.[22] నిజంగా ఇది ఎంతో సాహసోపేతమైన కార్యం. (186)

గ్రంథప్రజలకు గుర్తు చెయ్యి: “మీకు ప్రసాదించబడిన గ్రంథంలోని విషయాలు దాచకుండా (యధాతథంగా) ప్రజలకు బోధించాలి” అని దేవుడు వారిచేత ప్రమాణం చేయించాడు. కాని ఆతర్వాత వారు దాన్ని అటకాకెక్కించారు.[23] అతిస్వల్ప మూల్యానికి అమ్మివేశారు. ఇలా వారు అతినీచమైన సంపాదనకు పాల్పడ్డారు. వారు తమ నిర్వాకాలు చూసుకొని మురిసిపోతున్నారు. తామసలు చేయని పనుల గురించి ప్రశంసలు పొందగోరుతున్నారు.[24] అలాంటివారు నరకయాతనలు తప్పించుకుంటారని భావించకు. వారు తప్పకుండా దుర్భరమైన నరకయాతనలు చవిచూస్తారు. (187,188)

దేవుడే భూమ్యాకాశాల సామ్రాజ్యానికి అధిపతి. ఆయన ప్రతిపనీ చేయగల సమర్థుడు, సర్వశక్తిమంతుడు. భూమ్యాకాశాల నిర్మాణంలో, రాత్రింబవళ్ళ చక్రభ్రమణంలో యోచించేవారికి ఎన్నో నిదర్శనాలున్నాయి. ఆ యోచనాపరులు నిల్చొని, కూర్చొని, పడుకొని- ఏ స్థితిలో ఉన్నాసరే ఎల్లప్పుడూ దేవుడ్ని స్మరిస్తూ ఉంటారు. అంతేకాకుండా వారు భూమ్యాకాశాల నిర్మాణం గురించి పరిశీలిస్తూ ఇలా ప్రార్థిస్తారు:

22. వివరాలకు 2:155-157, 29:3 సూక్తులు, వాటి పాదసూచికలు చూడండి.

23. తౌరాత్ బోధనలు ప్రజలకు అందజేయాలని దేవుడు యూదుల చేత చేయించిన ప్రమాణం గురించి బైబిల్ పాత నిబంధనలోని ద్వితీయోపదేశకాండంలో స్పష్టంగా ఉంది. ఉదా: “మోషే ఈ ధర్మశాస్త్రమును వ్రాసి యెహోవా నిబంధన మందసమును మోయు యాజకులైన లేవీయులకును ఇశ్రాయేలీయుల పెద్దలందరికిని దానినప్పగించి వారితో ఇట్లనెను- ప్రతి యేడవ సంవత్సరాంతమున, అనగా నియమింపబడిన గడువు సంవత్సరమున నీ దేవుడైన యెహోవా ఏర్పరచుకొను స్థలమందు ఇశ్రాయేలీయులందరు ఆయన సన్నిధిని కనబడి పర్ణశాల పండుగను ఆదరించునప్పుడు ఇశ్రాయేలీయులందరి యెదుట ఈ ధర్మశాస్త్రమును ప్రకటించి వారికి వినిపింపవలెను. మీదేవుడైన యెహోవాకు భయపడి ఈ ధర్మశాస్త్ర వాక్యము లన్నిటిని అనుసరించి నడుచుకొనునట్లు పురుషులేమి స్త్రీలేమి పిల్లలేమి నీ పురములోనున్న పరదేశులేమి వాటిని విని నేర్చుకొనుటకై అందరిని పోగుచేయవలెను.” (31:9-13). ఈనాడు ముస్లింలలో కూడా చాలామంది ఖుర్ఆన్ బోధనల్ని ఇతరులకు అందజేసే పని మానేసి దాన్ని అటకాకెక్కించారు.

24. దైవప్రవక్త (సల్లం) యుద్ధానికి బయలుదేరినప్పుడు కపట విశ్వాసులు (ఇతర ముస్లింలతో పాటు) వెళ్ళేవారు కాదు. వారు ప్రవక్త ఆజ్ఞలు ఉల్లంఘించి ఇండ్లలోనే ఉండిపోయేవారు. (పైగా తామేదో ఘనకార్యం వెలగ బెట్టినట్లు) దానిపై తెగ సంబరపడి పోయేవారు. అయితే దైవప్రవక్త (సల్లం) యుద్ధం నుండి తిరిగి రాగానే ప్రమాణం చేసి మరీ రకరకాల సాకులు చెప్పేవారు. వారు తాము, నెరవేర్చని పనులను గురించి ప్రశంసలు పొందాలని కోరుకునేవారు. వారి వైఖరినే ఎండగడ్తూ ఈ సూక్తి అవతరించింది. (బుఖారి, ముస్లిం)

"ప్రభూ! నీవు ఈ విశ్వాన్ని నిష్ప్రయోజనంగా, లక్ష్యరహితంగా సృజించలేదు. నీవు పరమ పవిత్రుడవు. మమ్మల్ని నరకయాతనల నుండి కాపాడు. నీవు ఎవరినైతే నరకంలో పడవేస్తావో అతడ్ని ఘోరమైన అవమానికి గురిచేసినట్లే. అలాంటి దుర్మార్గులకు ఎవరూ సహాయపడలేరు. ప్రభూ! మేము విశ్వాసం వైపు పిలిచేవాని పిలుపు విన్నాం. మీ ప్రభువుని విశ్వసించండని ఆయన మమ్మల్ని అడగ్గానే మేము నిన్ను విశ్వసించాము. కనుక ప్రభూ! మా తప్పులు క్షమించు. మాలో ఉన్న చెడుల్ని మా నుండి తొలగించు. మాకు పుణ్యాత్ముల మరణంలాంటి మంచి మరణం కలిగించు.[25] ప్రభూ! నీవు నీ ప్రవక్తల ద్వారా వాగ్దానం చేసిన వాటిని మాకు ప్రసాదించు. నీవు ఎట్టి పరిస్థితిలోనూ వాగ్దానభంగం చేయవని మాకు తెలుసు. కనుక ప్రళయ దినాన మమ్మల్ని నలుగురిలో పరాభవం పాల్జేయకు." (189-194)

అప్పుడు వారిప్రభువు వారి మొరాలకించి ఇలా అన్నాడు: "నేను మీలో ఎవరి కర్మల్నీ వృథాచేయను. పురుషులైనా, స్త్రీలైనా మీరంతా పరస్పరం ఒకే సృష్టిరాసికి చెందినవారు. నా కోసం ఎవరెవరు తమ స్వస్థలాలు వదలి వచ్చారో, ఎవరెవరు తమ ఇండ్ల నుండి వెడల గొట్టబడ్డారో, ఎవరెవరు వేధించబడ్డారో, ఎవరెవరు పోరాడారో, (ఆ పోరాటంలో ఎవరెవరు) హతమార్చబడ్డారో వారందరి పొరపాట్లు మన్నించి వారిని సెలయేరులు ప్రవహించే స్వర్గ వనాలలో ప్రవేశింపజేస్తాను." ఇదీ దేవుని దగ్గర (వారికి) లభించే ప్రతిఫలం. దేవుని దగ్గరే శ్రేష్ఠమైన ప్రతిఫలం ఉంది. (195)

ప్రవక్తా! ప్రపంచ దేశాలలో సత్యతిరస్కారుల తిరుగుళ్ళు, తీరుతెన్నుల్ని చూసి నీవు మోసపోకు. ఇది మూన్నాళ్ళ ముచ్చట మాత్రమే. తరువాత వారి శాశ్వత నివాసం నరకం అవుతుంది. అది పరమ చెడ్డనివాసం. అయితే తమ ప్రభువు పట్ల భయభక్తులతో మసలుకుంటూ నీతిమంతమైన జీవితం గడిపేవారి కోసం సెలయేరులు ప్రవహించే స్వర్గవనాలు ఉన్నాయి. అక్కడే వారు కలకాలం (హాయిగా)ఉంటారు. ఇదీ దైవసన్నిధిలో వారికి లభించే ఆతిథ్యం. పుణ్యాత్ములకు దేవుని దగ్గర (స్వర్గంలో) ఉన్నదే అన్నిటికంటే ఎంతో శ్రేష్ఠమైనది. (196-198)

---

25. అంటే, జీవితాంతం నీకు విధేయులై ఉండి సాత్విక జీవితం గడుపుతూ మరణించిన వారిలా, మాకూ అలాంటి సాత్విక జీవితం గడుపుతూ అదే స్థితిలో మేము మరణించే భాగ్యం ప్రసాదించు అని అర్థం.

కొందరు అనేక సంవత్సరాలు దేవుని పట్ల భయభక్తులతో సాత్విక జీవితం గడుపుతారు. కాని జీవిత చరమదశలో రుజుమార్గం తప్పిపోతారు. లేదా తమ మాటల ద్వారా, చేతల ద్వారా అవిశ్వాస వైఖరి వ్యక్తపరుస్తారు. లేదా ప్రాపంచిక వ్యామోహంలో పడిపోయ్యో లేక కష్టాల వల్ల నిరాశానిస్పృహలకు గురయ్యో దేవుడు నిర్దేశించిన ఆరాధనలు, సత్కార్యాలు చేయడం మానేస్తారు. చివరికి అదే స్థితిలో చనిపోతారు. ఇక్కడ భక్తులు అలాంటి దుర్మరణానికి గురికాకుండా, తుదిశ్వాస వరకు నిర్దేశిత ధర్మంలో స్థిరంగా ఉండి, సత్కర్మలు ఆచరించేలా మంచి మరణాన్ని ప్రసాదించమని దేవుడ్ని వేడుకుంటున్నారు. అంతేగాకుండా షైతన్ పెట్టే భయప్రలోభాలకు గురికాకుండా వాడి కీడు నుండి తరచుగా దైవాన్ని శరణు కూడా కోరుకుంటూ ఉండాలి.



గ్రంథప్రజలలో కూడా కొందరు సదాచారసంపన్నులు ఉన్నారు. వారు అల్లాహ్‌ను విశ్వసిస్తారు. నీపై అవతరింపజేసిన (ఖుర్ఆన్) గ్రంథాన్ని, దీనికి పూర్వం తమ వద్దకు పంపబడిన గ్రంథాన్ని కూడా విశ్వసిస్తారు. అదీగాక వారు దేవుని ముందు వినమ్రులయి మోకరిల్లుతారు. దేవుని సూక్తులను (ప్రాపంచిక ప్రయోజనాలకు ఆశపడి) అత్యల్ప మూల్యానికి అమ్ముకునేవారు కాదు. వారికి లభించవలసిన ప్రతిఫలం వారి ప్రభువు దగ్గర సురక్షితంగా ఉంది.

దేవుడు (కర్మల) విచారణ జరపడంలో ఏమాత్రం ఆలస్యం చేయడు. (199)

విశ్వాసులారా! సహనం పాటించండి. మిథ్యావాదుల ముందు ధైర్యసాహసాలు ప్రదర్శించండి. ధర్మసేవ కోసం నడుం బిగించండి. దేవుని పట్ల భయభక్తులు కలిగి ఉండండి. అప్పుడే మీరు (ఇహపరాల్లో) కృతార్థులవుతారని ఆశించగలరు. (200) ✪


## Our Publications So far

1. Meening of the Holy Qur'an : (Part-30)
2. Life of the Prophet (Cradle to Cave)
3. Promissed Messaiah (Qadiyan) : P-50
4. Meening of the Holy Qur'an (full-V) : P-904
   ***(Released by Moulana Abdul Azeez, JIH on14.3.04)***
5. Ideal life of the Prophet (p) : P-504
   ***(Released by Justice Sardar Ali Khan on 14-3-04)***
6. Journey of the Hear after life : P-224
7. Muslim Woman : P-240
8. Decentralisation of Wealth : P-224
9. The Message of "Kaaba" : P-224
10. Holy Qur'an-1 & 36 And Duvaas : P-40

ISLAMIC RESOURCE CENTRE
Chatta Bazar, Hyderabad-2, India.
✆+91-40-66710795, +91-9441515414

అవతరణ : మదీనా

# 4. స్త్రీలు (నిసా)

సూక్తులు : 176

ఈ అధ్యాయాన్ని “నిసా” (స్త్రీలు) అంటారు. ఇది అనేక ప్రసంగాలతో కూడిఉంది. ఇవన్నీ హిజ్రీ శకం మూడవ సంవత్సరం నుండి నాల్గవ సంవత్సరం చివరిదాకా లేక ఐదవ సంవత్సరం ప్రారంభందాకా వివిధ సందర్భాలలో అవతరించాయి.

ముస్లిం సమాజాన్ని ఇస్లాం పునాదులపై సంఘటితపరచడానికి ఈ అధ్యాయంలో అనేక ఆజ్ఞలు ఇవ్వబడ్డాయి. ముఖ్యంగా స్త్రీ స్థానం, ఆమె హక్కులు, కుటుంబవ్యవస్థకు సంబంధించిన సూత్రాలు, ఆస్తి పంపిణీ వివరాలు, ఆర్థిక వ్యవహారాలు, మద్యనిషేధం, శిక్షాస్మృతి, నైతిక ప్రవర్తనావళి, క్రమశిక్షణ, సామూహిక జీవనవిధానం మొదలైన అంశాలు ఇందులో ఉన్నాయి. వీటితోపాటు దైవసందేశ వ్యాప్తిలో భాగంగా గ్రంథప్రజలకు, కపటవిశ్వాసులకు, బహుదైవారాధకులకు వారి ధార్మిక, నైతిక వైఖరిని ఖండిస్తూ కొన్ని హితవులు చేయబడ్డాయి. వేరొక వైపు వారి విషయంలో ముస్లింలు అవలంబించవలసిన వైఖరి కూడా తెలియజేయబడింది.

### కరుణామయుడు, కృపాసాగరుడయిన దేవుని పేరుతో ప్రారంభం

మానవులారా! మీ ప్రభువుకు భయపడండి. ఆయన మిమ్మల్ని ఒకే ప్రాణి ద్వారా సృష్టించాడు. అదేప్రాణి నుండి దాని జతను కూడా సృష్టించాడు. తిరిగి వారిరువురి నుండి కోటానుకోట్ల మంది స్త్రీపురుషుల్ని ప్రపంచంలో విస్తరింపజేశాడు. మీరు ఒకరిద్వారా మరొకరు తమ అవసరాలు గడుపుకోవడానికి దేవుని పేరును ఒక సాధనంగా చేసుకుంటారు. అలాంటి దేవునికి భయపడండి. రక్త సంబంధీకులతో మీకేర్పడివున్న సహజ బాంధవ్యాన్ని తెంచకండి. దేవుడు మీ చర్యల్ని ఓకంట గమనిస్తున్నాడన్న సంగతి మరచిపోకండి. (1)

అనాథలకు రావలసిన ఆస్తులు వారికి ఇచ్చివేయండి. వారికి దక్కవలసిన మంచి సొమ్ముకు బదులు నాసిరకం సొమ్ము అప్పగించకండి. వారి ధనాన్ని మీధనంతో కలిపేసి (లెక్కాపత్రం లేకుండా) తినకండి. అలా చేయడం ఘోరమైన పాపం. (2)

ఒకవేళ మీరు అనాథ బాలికలను వివాహమాడే పక్షంలో వారికి న్యాయం చేయలేమని భయపడితే (వారిని వదలి) మీకు నచ్చిన (ఇతర) స్త్రీలలో ఇద్దర్నిగాని, ముగ్గుర్నిగాని, నల్గుర్నిగాని పెళ్ళి చేసుకోవచ్చు.[1] అయితే వారిమధ్య కూడా మీరు న్యాయంగా వ్యవహరించలేమని భావిస్తే ఒక్కర్నే వివాహమాడండి; లేదా మీ అధీనంలోకి వచ్చిన

1. పూర్వం అరబ్బులు అనేక మంది స్త్రీలను వివాహమాడేవారు. ఒక్కొక్కరి దగ్గర పదేసి మంది భార్యలు కూడా ఉండేవారు. తమ సంరక్షణలో ఉండే అనాథ బాలికల్ని కూడా చేసుకొని వారి ఆస్తుల్ని హరించేవారు. అదీగాక భార్యలందరి పట్ల సమానత్వం పాటించేవారు కాదు. కొందర్ని వేధించేవారు. ఈ స్థితిలో దేవుడు భార్యల సంఖ్యను నాలుగుకు పరిమితం చేశాడు. అదైనా భార్యలందరినీ భరించగల స్తోమత, వారి మధ్య న్యాయం పాటించగలమన్న ధీమా ఉన్నప్పుడే నలుగురిదాకా వివాహమాడవచ్చని, లేకుంటే ఒకరితోనే సరిపెట్టుకోవాలని షరతు విధించాడు. ఈ అధ్యాయంలోనే 129, 130 సూక్తులు, వాటి పాదసూచికలు కూడా చూడండి.)



(బానిస) స్త్రీలను వివాహమాడండి. ఈ విధంగా న్యాయం చేయలేమన్న భయం మీకిక ఉండదు. (3)

స్త్రీలకు లభించవలసిన మహర్ (వధు కట్నం)ను (విధిగా భావించి) వారికి సంతోషంగా ఇచ్చివేయండి. అయితే వారు గనక సంతోషంగా కొంత మహర్ మాఫీచేస్తే దాన్ని మీరు నిరభ్యంతరంగా అనుభవించవచ్చు. (4)

దేవుడు మీకు జీవనాధారంగా చేసిన సంపదను మూఢులకు అప్పగించకండి. అయితే వారికి తిండీ, బట్టా (లాంటి జీవితావసరాలు) సమకూర్చండి. వారికి హితబోధ చేస్తూ ఉండండి. (5)

అనాథ బాలలకు పెళ్ళీడు వచ్చే వరకు వారి స్థితిగతులు గమనిస్తూ ఉండండి. ఆ తరువాత వారిలో తగిన యోగ్యతార్హతలు ఉన్నాయని మీకు అన్పిస్తే వారి ఆస్తిని వారికి అప్పగించండి. అంతేగాని, వారు పెద్దవారయిన తరువాత తమ (ఆస్తి) హక్కు అడుగుతారన్న భయంతో ముందుగానే వారి సొమ్మును (దుబారా చేస్తూ) త్వరత్వరగా తిని హరించివేయకండి. (అనాథ) సంరక్షకుడు స్థితిపరుడయితే అలాంటి సొమ్ము జోలికే పోకూడదు. ఒకవేళ అతను పేదవాడయితే సముచిత రీతిలో కొంత సొమ్ము వాడుకోవచ్చు. వారి ఆస్తి వారికి అప్పగించవలసి వచ్చినప్పుడు కొందరు సాక్షుల్ని కూడా పెట్టుకోండి. లెక్క తీసుకోవడానికి దేవుడు ఒక్కడే చాలు. (6)

---

లైంగికపరంగా, స్త్రీలో కంటే పురుషునిలో సామర్థ్యం, దుడుకు స్వభావం (Aggressive nature) ఎక్కువగా ఉంటాయి. అందువల్ల స్త్రీ ఒకే భర్త కలిగి ఉండేలా, పురుషుని భార్యలు పూర్వం నుండి వస్తున్న మితిమీరిన బహుభార్యత్వాన్ని కొన్ని షరుతులతో గరిష్టంగా నలుగురికి పరిమితం అయ్యేలా ఇస్లాం చట్టాలు రూపొందాయి. అదీగాక బహుభార్యత్వం ఒక నైతిక, సాంస్కృతిక అవసరం కూడా. వైద్యకారణంతో లేదా మరేదైనా కారణంతో ఉన్నఒక భార్య ద్వారా సుఖం పొందలేని పురుషునికి రెండవ వివాహం చేసుకునే అవకాశం లేకపోతే అతను జీవితం మీద విరక్తి చెంది ఆత్మహత్య చేసుకోవచ్చు. లేదా వ్యభిచారానికి పాల్పడవచ్చు. లేదా ఉన్నఒక్క భార్యను శాశ్వతంగా కడతేర్చి మరో స్త్రీని వివాహమాడవచ్చు.

బహుభార్యత్వాన్ని నిషేధించి దాన్ని కఠినంగా అమలుపరుస్తున్న నేటి సమాజంలో ఇలాంటి వ్యభిచారం, హత్యలు, ఆత్మహత్యలు సర్వసాధారణమవుతున్నాయి. మరోవైపు కట్నకానుకల వల్ల పెళ్ళికాకుండా ఏండ్లతరబడి కూర్చునే యువతులు కూడా ఆత్మహత్యలకో, అక్రమపద్ధతులకో పాల్పడే ప్రమాదం ఉంది. ఏకపత్నీ వ్రతాన్ని బోధించే సమాజాల్లోనూ అధికశాతం ప్రజలు క్రియా జీవితంలో బహుభార్యత్వాన్ని దోషబుద్ధి (Guilty conscience)తో అమలుచేస్తున్నారు. కాని బహుభార్యత్వాన్ని వ్యతిరేకించే బడామనుషులు కూడా దీన్ని ఆక్షేపించకపోవడమే చాలా ఆశ్చర్యకరం!

అభ్యుదయ వాదులమని చెప్పుకునే కొందరు స్త్రీలు- “పురుషులు మాత్రమే నలుగురు భార్యలను ఎందుకు చేసుకోవాలి? స్త్రీకి నలుగురు భర్తల్ని చేసుకునే హక్కెందుకు ఉండకూడదు?” అని ప్రశ్నిస్తారు. స్త్రీలకు వ్యభిచారం చేసే హక్కు కూడా కావాలని నినాదాలు మార్మోగుతున్న నేటి నవసమాజంలో బహుభర్తృత్వ హక్కు కావాలని డిమాండు చేయడంలో ఆశ్చర్యం లేదు. కాని అలా డిమాండుచేసే స్త్రీలలో కనీసం ఇద్దరు భర్తలున్న వారెవరూ ఇంతవరకు నా దృష్టికి రాలేదు.

తల్లిదండ్రులు, ఇతర బంధువులు వదలివెళ్ళిన ఆస్తి కొద్దిగా ఉన్నా, ఎక్కువగా ఉన్నా అందులో పురుషులకూ వాటా ఉంది; స్త్రీలకూ వాటా ఉంది. ఇవి (దైవ)నిర్ణీత వాటాలు. (వాటిని తగ్గించడానికిగాని, పెంచడానికిగాని ఎవరికీ అధికారం లేదు.) ఆస్తి పంపకం జరుగుతున్న సమయంలో వారసులుకాని (నిరుపేద) బంధువులు, అనాథలు, అగత్యపరులు ఎవరైనా వస్తే వారికి కూడా మీరు ఎంతో కొంత ఇచ్చి పంపండి. వారితో మృదువుగా మాట్లాడండి. (7-8)

ప్రజలు చనిపోతూ తమ పసి పిల్లలను నిస్సహాయ స్థితిలో వదలి వెళ్ళవలసి వస్తే, ఆ తరువాత వారి పరిస్థితి ఏమిటీ అని ఆలోచించి భయపడాలి. కనుక వారు (ఇతరుల అనాథ బాలల విషయంలో కూడా) దేవునికి భయపడుతూ సవ్యమైన మాటనే పలకాలి. అన్యాయంగా అనాథ బాలల ఆస్తుల్ని తింటున్నవారు నిజానికి తమ పొట్టలను అగ్నితో నింపుకుంటున్నారు.[2] వారు తప్పకుండా భగభగ మండే అగ్నిగుండంలో విసరి వేయ బడతారు. (9-10)

మీ సంతానం విషయంలో దేవుడు మిమ్మల్ని ఇలా ఆదేశిస్తున్నాడు:

- ♦ ఒక పురుషుని వాటా ఇద్దరు స్త్రీల వాటాలతో సమానం.[3]
- ♦ (మృతునికి) ఇద్దరు లేక ఇద్దరికన్నా ఎక్కువమంది కుమార్తెలు ఉంటే, వారికి
- ♦ అతని ఆస్తిలో మూడింట రెండు వంతులు లభించాలి. ఒకవేళ ఒకే కుమార్తె ఉంటే, ఆమెకు ఆస్తిలో అర్ధభాగం లభించాలి.

---

2. ఉహుద్ యుద్ధం తరువాత హజ్రత్ సాద్ బిన్ రుబై (రజి) భార్య తన కుమార్తెలిద్దర్ని వెంటబెట్టుకొని దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చారు. ఆమె తనకు జరిగిన అన్యాయాన్ని ఏకరువు పెడ్తూ ఇలా అన్నారు: "దైవప్రవక్తా! వీళ్ళిద్దరూ సాద్ కుమార్తెలు. సాద్ మీతోపాటు ఉహుద్ యుద్ధంలో పాల్గొని అమరగతులయ్యారు. ఆ తరువాత ఈ బాలికల పినతండ్రి మా ఆస్తినంతటినీ స్వాధీనం చేసుకున్నాడు. వీరికోసం ఒక్క పైసా వదలిపెట్ట లేదు. ఇలాంటి స్థితిలో ఈ బాలికల్ని ఎవరు పెళ్ళి చేసుకుంటారు?" దీన్ని గురించే ఈ సూక్తులు అవతరించాయి.

3. పురుషునికి లభించే వాటాలో స్త్రీకి సగం అన్నమాట. దేవుని దృష్టిలో స్త్రీపురుషులిద్దరూ సమానల,నా ఈ ఆర్థిక వ్యత్యాసానికి రెండు కారణాలున్నాయి. ఒకటి, కుటుంబపోషణ భారాన్ని ఇస్లాం పురుషుడి మీదనే మోపింది. భర్త సంపాదించకుండా సోమరిపోతులా తిరిగి లేదా సంపాద నంతా స్వార్థానికో, వ్యసనాలకో ఖర్చుచేసి భార్యాపిల్లలను నిర్లక్ష్యంచేస్తే ఇస్లామీయ ప్రభుత్వం అతని మీద చట్టపరమైన చర్య తీసుకుంటుంది. పరలోకంలోనూ దైవశిక్షకు గురికావలసి వస్తుంది.

రెండు, వివాహ సందర్భంలో స్త్రీకి వరుడి నుంచి మహర్ రూపంలో కొంతఆస్తి లభిస్తుంది. నేడు మన దేశంలో ముస్లింలు అతి ముఖ్యమైన ఈ దైవాజ్ఞను నిర్లక్ష్యం చేసి, సహవాస దోషంతో కట్న కానుకల రూపంలో వేలాది, కాదు లక్షలాది రూపాయలు నిలువు దోపిడి చేస్తున్నారు. ఇది తీవ్రమైన నేరం, ఘోరమైన పాపం.

ఈ విధంగా ఇస్లాం తండ్రి నుండి ఆస్తివాటా ద్వారా, భర్త నుండి మహర్ ద్వారా స్త్రీకి మొత్తం మీద పురుషునితో పాటు ఆర్థిక సమానత్వం ప్రసాదించింది.



- ♦ మృతుడు సంతానం కలిగివున్నవాడైతే అతని తల్లిదండ్రులలో ప్రతి ఒక్కరికీ అతని ఆస్తిలో ఆరోవంతు లభించాలి.[4]
- ♦ అతనికి సంతానం లేకుండా తల్లిదండ్రులే అతని వారసులైతే, తల్లికి మూడింట ఒక భాగం ఇవ్వాలి.[5]
- ♦ మృతునికి అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు కూడా ఉంటే, తల్లికి ఆరవభాగం రావాలి.[6]
- ♦ మృతుడు రాసిపోయిన వీలునామా[7] (లోని విషయాలు) నెరవేర్చడంతో పాటు, అతను చేసిన అప్పులన్నీ[8] తీర్చిన తరువాతనే ఈ వాటాలన్నీ పంచాలి.
- ♦ మీ తల్లిదండ్రులలో, మీ సంతానంలో ప్రయోజనం రీత్యా ఎవరెక్కువ సన్నిహితులో మీకు తెలియదు. ఇవి దేవుడు నిర్ణయించిన వాటాలు. దేవుడు సమస్త విషయాలు ఎరిగినవాడు, ఎంతో వివేచనాపరుడు. (11)
- ♦ మీ భార్యలకు సంతానం లేనప్పుడు వారు వదలివెళ్ళిన ఆస్తిలో మీకు అర్ధభాగం లభిస్తుంది. సంతానం ఉంటే, నాల్గింట ఒకభాగమే దక్కుతుంది. అయితే వారు రాసిన వీలునామా నెరవేర్చి, చేసిన అప్పులన్నీ తీర్చిన తర్వాతే ఇలా జరగాలి.
- ♦ మీకు సంతానం లేకపోతే మీరు వదలిన ఆస్తిలో మీ భార్యలకు నాల్గోవంతు వాటా లభిస్తుంది. సంతానముంటే ఎనిమిదోవంతు మాత్రమే దక్కుతుంది. మీరు రాసిన వీలునామా నెరవేర్చి, అప్పులన్నీ తీర్చడం జరిగిన తరువాతే ఈవాటాలు లభిస్తాయి.
- ♦ పురుషునికి లేక స్త్రీకి సంతానం గాని, తల్లిదండ్రులు గాని లేకుండా ఒక సోదరుడో, ఒక సోదరియో ఉంటే వారిద్దరిలో ఒక్కొక్కరికి ఆరోవంతు లభిస్తుంది. సోదరులు, సోదరీలు ఒకరికంటే ఎక్కువమంది ఉంటే మొత్తం ఆస్తిలో మూడింట ఒకభాగం వారికి లభిస్తుంది.[9] అదైనా రాసిన వీలునామా

---

4. మిగిలిన 2/3 భాగం ఇతర వారసులకు లభించాలి. మృతునికి ఒక్క కొడుకు మాత్రమే ఉంటే, ఇతర వారసులకు పోగా మిగిలిన ఆస్తి అంతా అతనికి దక్కుతుంది. ఇతర వారసులెవరూ లేకపోతే మొత్తం ఆస్తి అతనికే లభిస్తుంది. 1-(1/6+1/6)=2/3 ఆస్తి ఇతర వారసులకు లభించాలి.

5. మిగిలిన 2/3 భాగం తండ్రికి లభిస్తుంది.

6. మిగిలిన 5/6 భాగం తండ్రికి లభిస్తుంది.

7,8. ముందుగా అప్పులన్నీ తీర్చాలి. తరువాత మిగిలిన ఆస్తిలో 1/3 భాగం మేరకు మాత్రమే వీలునామా వర్తిస్తుంది.

9. మిగిలిన 5/6 లేదా 2/3 భాగం ఇతర వారసులకు లభిస్తుంది. ఇతర వారసులు లేనప్పుడు మిగిలిన ఆస్తి నంతటిని గురించి వీలునామా రాసే అధికారం మృతునికి ఉంది. (నిర్వారసుని ఆస్తి పంపకం గురించి 4:176 సూక్తి చూడండి.)

నెరవేర్చి, అప్పులు తీర్చిన తర్వాతనే లభిస్తుంది. అయితే వీలునామా (ఎవరికీ) బాధాకరంగా ఉండరాదు. ఇది దేవుడు జారీచేస్తున్న ఆజ్ఞ. దేవుడు సర్వజ్ఞుడు; ఎంతో మృదుహృదయుడు. (12)

ఇవి దేవుడు నిర్ణయించిన పరిమితులు. (వీటిని అతిక్రమించే అధికారం ఎవరికీ లేదు.) దేవునికి, ఆయన ప్రవక్తకు విధేయులయి నడచుకునేవారిని దేవుడు సెలయేరులు ప్రవహించే స్వర్గవనాలలో ప్రవేశింపజేస్తాడు. అక్కడే వారు కలకాలం (సుఖంగా) ఉంటారు. ఇదే అసలు ఘనవిజయం. దీనికి భిన్నంగా దేవునికి, ఆయన ప్రవక్తకు అవిధేయులయి, దేవుడు నిర్దేశించిన పరిమితుల్ని అతిక్రమించేవారిని ఆయన నరకాగ్నిలో పడవేస్తాడు. అక్కడే వారు ఎల్లకాలం పడిఉంటారు. వారికి అత్యంత అవమానకరమైన శిక్ష సిద్ధంగా ఉంది. (13-14)

మీ స్త్రీలలో ఎవరైనా సిగ్గుమాలిన పనికి పాల్పడితే, అందుకు మీలో నలుగురిని సాక్షులుగా తీసుకురావాలి. ఆ నలుగురూ సాక్ష్యమిస్తే, అప్పుడా స్త్రీలను వారి ఇండ్లలో నిర్బంధించాలి. వారికి (సహజ) మరణం వచ్చేదాకా లేదా దేవుడు వారికేదైనా దారిచూపే దాకా ఇలా నిర్బంధంలో ఉంచాలి. మీలో ఎవరైనా (స్త్రీపురుషులు) ఈ దుశ్చర్యకు వడిగడ్తే వారిద్దర్నీ శిక్షించాలి.[10] వారు పశ్చాత్తాపం చెంది తమనుతాము సంస్కరించుకుంటే వారిని వదలిపెట్టాలి. దేవుడు అమిత క్షమాశీలి, అపార కృపాశీలుడు. (15-16)

అజ్ఞానం వల్ల కాలుజారి, ఆ తరువాతైనా పశ్చాత్తాపం చెంది, తమ నడవడికను సరిదిద్దుకునే వారిని మాత్రమే దేవుడు క్షమిస్తాడు. అలాంటివారినే ఆయన కనికరిస్తాడు. దేవుడు సమస్తం ఎరిగినవాడు, ఎంతో వివేచనాపరుడు. అయితే జీవితాంతం చెడ్డ పనులు చేస్తూ, చెడుతిరుగుళ్ళు తిరుగుతూ, చావు దగ్గరపడగానే "నేనిప్పుడు పశ్చాత్తాప పడుతున్నా, లెంపలు వేసుకుంటున్నా"అని అనేవారిని దేవుడు మన్నించడు. అలాగే అవిశ్వాసస్థితిలో చనిపోయేవారి క్షమాపణను కూడా దేవుడు స్వీకరించడు. అలాంటి వారికి మేము అత్యంత బాధాకరమైన యాతన సిద్ధపరచి ఉంచాం. (17,18)

విశ్వాసులారా! బలవంతంగా స్త్రీల(ఆస్తి)కి వారసులై పోవడం మీకు ధర్మసమ్మతం కాదు. అలాగే మీరు మీ భార్యలకిచ్చిన మహర్ ధనంలో కొంత కాజేసే ఉద్దేశ్యంతో వారిని వేధించడం కూడా మీకు భావ్యంకాదు. అయితే వారేదైనా చెడ్డపనికి పాల్పడినట్లు స్పష్టంగా తెలిస్తే (వారిని శిక్షించడానికి మీకధికారం ఉంది). వారిపట్ల మంచితనం కలిగివుంటూ సంసారంచేయండి. ఒకవేళ వారు మీకు (ఒక విషయంలో) నచ్చకపోతే, నచ్చని విషయంలోనే దేవుడు మీకు ఎంతో శ్రేయస్సు, మేలు పెట్టి ఉండవచ్చు.[11] (19)

---

10. ఇది వ్యభిచార నేరానికి ప్రారంభంలో సూచించబడిన శిక్ష. ఆ తరువాత కొంత కాలానికి వంద కొరడా దెబ్బల శిక్ష నిర్ణయించబడింది. దాన్ని గురించి 24:2 సూక్తి చూడండి.

11. మనిషి తన భార్యలో ఏదో విషయం నచ్చలేదని తొందరపడి వివాహబంధాన్ని త్రెంచుకోకూడదు. అనివార్య పరిస్థితులు ఏర్పడినప్పుడు మాత్రమే విడాకులిచ్చే అనుమతి వినియోగించుకోవాలి. దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు:



మీరు గనక ఒకభార్య స్థానంలో మరొక భార్యను చేసుకోవడానికి నిర్ణయించుకుంటే, మొదటి భార్యకు మీరు (మహర్‌గా) ఎంతపెద్ద ధనరాసి ఇచ్చివున్నా దాన్ని ఎలాంటి పరిస్థితిలోనూ మళ్ళీ తీసుకోరాదు. మీరామెపై నీలాపనిందలు వేసి, మరీ అంత అన్యాయంగా దాన్ని తిరిగి తీసుకుంటారా? (ఎంత సిగ్గుచేటు!) మీరిద్దరు ఒకరి ద్వారా మరొకరు సుఖం అనుభవించారు. ఆమె మీ దగ్గర (వివాహం ద్వారా) గట్టి వాగ్దానం తీసుకుంది. అలాంటప్పుడు మీరామె ధనాన్ని బలవంతంగా ఎలా తీసుకుంటారు? (20-21)

మీ తండ్రులు వివాహమాడిన స్త్రీలను (వారి మరణానంతరం) మీరు ఎన్నటికీ వివాహమాడకండి. లోగడ జరిగిందేదో జరిగింది. (ఇకముందు అలాంటి ఘోరాలకు పాల్పడకండి.) ఇది నీతిబాహ్యమైన పని, అవాంఛనీయమైన దుష్టసంప్రదాయం. (22)

మీ తల్లులు, కుమార్తెలు, అక్కాచెల్లెళ్ళు, మేనత్తలు, పినతల్లులు, పెత్తల్లులు, మేనకోడళ్ళు, సోదరకుమార్తెలు, మీకు పాలుపట్టిన స్తన్యసంబంధ తల్లులు, మీరు పాలు పంచుకున్న స్తన్యసంబంధ సోదరీలు, మీ భార్యల తల్లులు, మీతో లైంగిక సంబంధం ఏర్పడిన మీ భార్యలకు (గత భర్తల ద్వారా) పుట్టి మీ సంరక్షణలో పెరిగిన కుమార్తెలు- మీకు నిషేధించబడ్డారు. (వీరిని మీరు వివాహమాడరాదు.) పోతే, మీతో లైంగిక సంబంధం ఇంకా ఏర్పడకుండా (పెళ్ళి మాత్రమే జరిగి) ఉంటే (అలాంటి భార్యల్ని వదలి వారి కుమార్తెల్ని చేసుకోవడంలో) ఎలాంటి తప్పులేదు. ఇక కన్నకొడుకుల (వితంతువులైన లేక విడాకులు పొందిన) భార్యలు (అంటే కోడళ్ళు) కూడా మీకు నిషేధించబడ్డారు. అంతేకాదు, ఒక వివాహబంధంలో (ఏకకాలంలో) ఇద్దరు అక్కాచెల్లెళ్ళను ఉంచడం కూడా నిషిద్ధమే.[12] లోగడ జరిగిందేదో జరిగిపోయింది. దేవుడు అమిత క్షమాశీలి, అపార కృపాశీలుడు. (23)

---

"ధర్మ సమ్మతమైన పనులలో దేవునికి అన్నిటికంటే తలాఖ్ ఎంతో అప్రియమైన పని."

"రకరకాల పూవుల మాధుర్యాన్ని ఆస్వాదిస్తూ తిరిగే తుమ్మెదల్లాంటి స్త్రీ పురుషులను దేవుడు అభిమానించడు. కనుక మీరు వివాహం చేసుకోండి, విడాకులివ్వకండి."

12. ఈ సూక్తిలో పురుషుని వివాహానికి నిషేధించబడిన స్త్రీలతో పాటు కొన్ని హదీసుల్ని బట్టి ఈ క్రింది స్త్రీలు కూడా నిషేధించబడ్డారు:

మారు (సవతి) తల్లులు, మారు కుమార్తెలు, మనుమరాళ్ళు, మారుతల్లి కుమార్తెలు మారు సోదరీలు), మారుతండ్రి కుమార్తెలు (మారు సోదరీలు), మారు మేనత్తలు, మారు పినతల్లులు, మారు పెత్తల్లులు, మారు మేనకోడళ్ళు, మారుసోదర కుమార్తెలు. మారుసోదరి కుమార్తెలు.

అదే విధంగా పురుషుడు ఏ స్త్రీ పాలు త్రాగాడో ఆ స్త్రీ కుమార్తెలు, తన తల్లితో పాటు పాలు త్రాగిన ఇతర స్త్రీలు కూడా అతనికి నిషేధించబడ్డారు. అలాగే ఒక భార్య ఉండగానే ఆమె సోదరీని వివాహమాడటం కూడా నిషిద్ధమే.

ఇక్కడ సూత్రప్రాయమైన ఒక విషయాన్ని గుర్తుంచుకోవడం ఎంతో అవసరం. ఈ సూక్తిలో పురుషుని వివాహానికి నిషేధించబడిన స్త్రీలలో రక్తసంబంధ స్త్రీలు, సవతి సంబంధ స్త్రీలు, స్తన్య

ఇక (యుద్ధంలో) మీ చేతికి చిక్కిన స్త్రీలు తప్ప ఇతరులు వివాహమాడిన స్త్రీలు కూడా మీకు నిషేధించబడ్డారు. ఇది దైవశాసనం. దాన్ని పాటించడం మీ విధ్యుక్తధర్మం.

వీరు తప్ప ఇతర స్త్రీలందర్నీ ధన వినియోగం ద్వారా మీరు వివాహమాడవచ్చు. అయితే వివాహలక్ష్యం శీలరక్షణయి ఉండాలిగాని, స్త్రీలోలత్వమై ఉండకూడదు. మీరు వారివల్ల అనుభవించే దాంపత్య సుఖానికిగాను వారికి చెల్లించవలసిన నిర్ణీత మహర్ ధనాన్ని విధిగా భావించి చెల్లించాలి. కాకపోతే మహర్ నిర్ణయం జరిగిన తరువాత మీరిద్దరు ఆ విషయంలో పరస్పరం ఇష్టపూర్వకంగా ఏదైనా చేయదలచుకుంటే చేయవచ్చు. అందులో ఎలాంటి తప్పు లేదు. దేవుడు సమస్తం ఎరిగినవాడు; ఎంతో వివేచనాపరుడు. (24)

మీలో ఎవరికైనా విశ్వసించిన స్వతంత్ర స్త్రీలను వివాహమాడే స్తోమత లేకపోతే అలాంటివారు తమ అధీనంలోకి వచ్చిన ముస్లిం బానిస స్త్రీలను వివాహమాడాలి.[13] దేవునికి మీ విశ్వాసస్థితి బాగా తెలుసు. మీరంతా పరస్పరం ఒకే సృష్టిరాశికి చెందినవారు. కనుక బానిస స్త్రీలను వారి యజమానుల అనుమతి తీసుకొని వివాహమాడండి. చట్టం ప్రకారం వారికి చెల్లించవలసిన మహర్ధనం కూడా చెల్లించాలి. అయితే వారిని వివాహ బంధంలో సురక్షితంగా ఉంచండి. విచ్చలవిడిగా చెడుతిరుగుళ్ళు తిరగనివ్వకండి. దొంగచాటుగా ప్రేమకలాపాలకు పాల్పడనీయకండి.

ఒకవేళ వారు వివాహబంధంలోకి వచ్చి భద్రత పొందిన తర్వాత దుర్నడతకు పాల్పడితే అలాంటివారికి స్వతంత్ర స్త్రీలకు విధించే శిక్షలో సగం శిక్ష విధించాలి. పెళ్లి చేసుకోని కారణంగా తమ ధర్మనిష్ఠకు భంగం కలుగుతుందని భయపడేవారికి మాత్రమే ఈసౌకర్యం ఉంది. అయితే మీరు (అలాంటి స్థితిలో పెళ్ళి చేసుకోకుండా) సహనం వహిస్తే మీకెంతో శ్రేయస్కరం. దేవుడు గొప్ప క్షమాశీలి, అమిత దయామయుడు. (25)

దేవుడు తన సూక్తులు వివరిస్తూ మీకు పూర్వం సజ్జనులు నడచిన బాటలోనే మిమ్మల్ని నడప గోరుతున్నాడు. ఆయన మిమ్మల్ని కటాక్షించదలిచాడు. దేవుడు గొప్ప జ్ఞాన సంపన్నుడు, ఎంతో వివేకవంతుడు. ఆయన మిమ్మల్ని కటాక్షించదలిచాడు. అయితే మనో వాంఛలకు బానిసలయినవారు మిమ్మల్ని సన్మార్గం నుంచి తప్పించి దూరంగా ఉంచగోరు తున్నారు. మానవుడు (సహజంగానే) బలహీనుడుగా పుట్టాడు. అందువల్ల దేవుడు మీపై ఉన్న ఆంక్షల భారాన్ని తగ్గించదలిచాడు.[14] (26-28)

---

సంబంధ స్త్రీలు అని మూడురకాల సంబంధాలున్నాయి. పురుషుడు వివాహానికి ముందు ఈ మూడు సంబంధాలను పరిశీలించి, వాటి పరిధిలోకి రాని స్త్రీని మాత్రమే వివాహమాడాలి.

13. స్వతంత్ర స్త్రీని వివాహమాడే స్తోమతలేని (పేద)వాడు బానిస స్త్రీని ఆమె యజమాని అనుమతితో వివాహమాడవచ్చు.

14. ఇస్లాం మూఢాచారాలు, అన్యాయంతో కూడిన కఠోరనియమాల్ని సమూలంగా తుడిచి పెట్టదలచింది. తల్లిదండ్రుల ఆస్తిలో కుమార్తెలకు వాటా ఇవ్వకపోవడం, వితంతువుని అత్తవారి ఆంక్షల నుండి బయటపడకుండా అణచిపెట్టడం, (గడువు తీరినా స్త్రీకి రెండవ పెళ్ళికి స్వేచ్ఛ



విశ్వాసులారా! మీరు ఒకరి సొమ్మును మరొకరు అన్యాయంగా కబళించకండి. పరస్పరామోదంతో వ్యాపారలావాదేవీలు, ఇచ్చిపుచ్చుకోవడాలు జరుపుకోవచ్చు. (అన్యాయం, అక్రమం, హత్య, ఆత్మహత్యల ద్వారా) మిమ్మల్ని మీరు హతమార్చు కోకండి.[15] దేవుడు మీ విషయంలో ఎంతో దయామయుడని తెలుసుకోండి. (29)

అన్యాయం, అక్రమాలతో ఇలా చేసేవాడ్ని మేము త్వరలోనే నరకాగ్నిలో విసరి పడవేస్తాం. ఇది దేవునికి కష్టంకాదు. మిమ్మల్ని వారిస్తున్న ఘోరమైన పాపాలను[16] గనక మీరు మానుకుంటే మేము మీ చిన్నచిన్న పాపాల్ని మీ కర్మలచిట్టా నుండి తొలగిస్తాం. పైగా మిమ్మల్ని ప్రతిష్ఠాకరమైన (స్వర్గ)ధామంలో ప్రవేశింపజేస్తాము. (30-31)

మేము మీలో కొందరికి ఇతరులకన్నా ఎక్కువగా ప్రసాదించిన దాన్ని మీరు ఆశించకండి.[17] పురుషులకు వారు సంపాదించుకున్న దానికి తగిన ప్రతిఫలం ఉంది.

---

నివ్వక పోవడం, బహిష్టుస్త్రీని అంటరానిదిగా చేసి ఆమెపై అనేకఆంక్షలు విధించడం, సవతితల్లిని పెండ్లాడటం, ఏకకాలంలో ఇద్దరు అక్కాచెల్లెళ్ళను వివాహబంధంలో ఉంచడం, ధన వికేంద్రీకరణను నిరోధించే దత్తస్వీకార విధానం, పెంపుడుకొడుకును కన్నకొడుకుగా పరిగణించి రక్తసంబంధాలు ఏర్పరచడం మొదలైన దురాచారాలను ఇస్లాం నిర్మూలించ పూనుకుంది. కాని మూఢులైన సనాతనవాదులు, కపటులు, యూదులు, స్వార్థపరులు ఈ సంస్కరణలను చూసి గగ్గోలుపెడ్తూ సంస్కరణ మార్గంలో అవరోధాలు సృష్టించడానికి, దుష్ప్రచారం చేయడానికి ప్రయత్నించారు. అయినప్పటికీ ఇస్లాం తన సంస్కరణోద్యమాన్ని విజయవంతంగా ముందుకు తీసికెళ్ళింది.

15. వివరాలకు 83:1-5 సూక్తులు, వాటి పాదసూచిక చూడండి.

16. హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ అబూబకర్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం) మమ్మల్ని ఉద్దేశించి "నేను మీకు అన్నిటికంటే ఘోరమైన పాపాలను గురించి తెలుపనా?" అని అడిగారు. ఈమాట ఆయన మూడుసార్లు అన్నారు. దానికి మేము "తప్పకుండా తెలపండి దైవప్రవక్తా!" అన్నాం. అప్పుడాయన "దేవునికి ఇతరులను సాటికల్పించడం, తల్లిదండ్రుల మాట వినకపోవడం" అని చెప్పారు. తర్వాత ఆయన (గోడకు)ఆనుకొని కూర్చున్నవారల్లా ఒక్కసారిగా లేచి నిటారుగా కూర్చొని "జాగ్రత్త! అబద్ధమాడటం (అన్నిటికంటే ఘోరపాపం)" అన్నారు. ఇలా మాటి మాటికి చెబుతూ పోయారు. చివరికి మేము మనసులో "అయ్యో! ఈయాన ఈమాటలు ఇక చాలిస్తే బాగుండు" అనుకున్నాం. (బుఖారి, ముస్లిం) (45:7 సూక్తి పాదసూచిక చూడండి.)

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం) అనుచరుల్ని ఉద్దేశించి "మిమ్మల్ని సర్వనాశనం చేసే పనులకు దూరంగా ఉండండ"ని హెచ్చరించారు. దానికి అనుచరులు "ఆ పనులేమిటి దైవప్రవక్తా!" అని అడిగారు. అప్పుడాయన ఇలా సెలవిచ్చారు: "(1) దేవునికి సాటి కల్పించడం (షిర్క్), (2) చేతబడి చేయడం, (3) ధర్మయుక్తంగా తప్ప దేవుడు హతమార్చకూడదని నిషేధించిన ప్రాణిని హతమార్చడం, (4) వడ్డీసొమ్ము తినడం, (5) అనాథ సొమ్ము హరించివేయడం (6) ధర్మయుద్ధంలో వెన్నుజూపి పారిపోవడం, (7) ఏ పాపం ఎరగని అమాయక ముస్లిం మహిళపై అపనిందలు వేయడం." (బుఖారి) (వివరాలకు 25:70 సూక్తి, దాని పాదసూచిక చూడండి.)

17. దేవుడు మానవులందరినీ ఒకే స్థాయిగా పుట్టించలేదు. శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా అనేక వ్యత్యాసాలు ఉంచాడు. కొందరిని అందగాళ్ళుగా, కొందరిని అందవిహీనులుగా,

అలాగే స్త్రీలకు కూడా వారు సంపాదించుకున్న దానికి తగినట్లే ప్రతిఫలం లభిస్తుంది. అయితే మీరు దేవుని అనుగ్రహం వేడుకోండి. నిస్సందేహంగా ఆయన ప్రతి విషయం ఎరిగినవాడు. (32)

తల్లిదండ్రులు, బంధువులు వదలివెళ్ళిన ఆస్తికి మేము (ఇదివరకే) వారసుల్ని నిర్ణయించాము. ఇక మీరు వాగ్దానం చేసిన వారికి కూడా (మీ జీవితంలోనే) వారి భాగం ఇచ్చి వేయండి. దేవుడు సర్వసాక్షిగా ప్రతి విషయాన్ని గమనిస్తున్నాడు. (33)

దేవుడు స్త్రీలపై పురుషులకు కొంతఆధిక్యత ప్రసాదించడం వల్ల, పురుషులు తమ సంపదను స్త్రీల కోసం ఖర్చుపెడ్తున్నందు వల్ల పురుషులు స్త్రీలపై వ్యవహారకర్తలు అవుతారు. కనుక సుగుణవతులైన స్త్రీలు తమ భర్తలకు విధేయత చూపుతూ వారి కనుసన్నలలో నడచుకుంటారు. పురుషులు (ఇంటి పట్టున) లేనప్పుడు దేవునిరక్షణలో వారి హక్కులు కాపాడుతుంటారు. మీ మాటలకు ఎదురు చెప్పి తిరగబడతారని భయమున్న స్త్రీలకు (నయాన భయాన) నచ్చజెప్పండి. (అలా దారికి రాకపోతే) వారిని మీ పడకల నుండి వేరుచేయండి. (అప్పటికీ మీమాట వినకపోతే) కొట్టండి.[18] ఆతర్వాత వారు మీకు విధేయులయిపోతే ఇక వారిని అనవసరంగా వేధించడానికి సాకులు వెతకకండి. పైన అందరికంటే అధికుడు, అత్యున్నతుడైన దేవుడు ఉన్నాడని గుర్తుంచుకోండి. (34)

---

కొందరిని బలవంతులుగా, కొందర్ని బలహీనులుగా, కొందరిని పొడుగువాళ్ళుగా, కొందర్ని పొట్టి వాళ్ళుగా, కొందరిని ఎక్కువ తెలివిగలవారిగా, కొందర్ని తక్కువ తెలివి గలవారిగా, కొందరిని ధనవంతులుగా, మరికొందర్ని పేదవాళ్ళుగా పుట్టించాడు. ఈ సూక్తిలో దేవుడు అందవిహీనుడు అందాన్ని, బలహీనుడు బలాన్ని, పేదవాడు ధనాన్ని కోరుకోవడం తప్పని చెప్పలేదు. అందగాళ్ళను, బలవంతుల్ని, ధనికుల్ని చూసి అసూయచెందడం; లేనిదాన్ని పొందడానికి అసహజమార్గాల గుండా, అక్రమ పద్ధతుల ద్వారా ప్రయత్నించడం మాత్రమే తప్పని చెబుతున్నాడు.

అలా జరిగినప్పుడల్లా సమాజంలో అశాంతి, అరాచకాలే చెలరేగుతాయిగాని, ఆశించిన ప్రయోజనాలు సాధించలేము. నేడు స్త్రీ-పురుషుల మధ్య, ధనిక-పేదల మధ్య కృత్రిమ సమానత్వం కోసం జరుగుతున్న అక్రమవిధానాలు ఎన్ని అనర్థాలు సృష్టిస్తున్నాయో చెప్పనవసరం లేదు.

18. స్త్రీపై పురుషునికి ఆధిక్యత నివ్వడానికి రెండు కారణాలున్నాయి. ఒకటి, శారీరకంగా, మానసికంగా స్త్రీ కన్నా పురుషుడు ఎక్కువ శక్తిమంతుడు, సమర్థుడు. రెండు, భార్యాపిల్లల పోషణ బాధ్యత పురుషుని మీదే మోపడం జరిగింది. స్త్రీలోని సుకుమారత్వం, సున్నితత్వం, లజ్జ, బిడియంల పరిరక్షణ దృష్ట్యా ఆమె ఇంటి పట్టున ఉండటంలోనే ఆమె శ్రేయస్సు ఉంది. సమాజ శ్రేయస్సు కూడా అందులోనే ఉంది. స్త్రీ ఇల్లు దాటి బయట పురుషులతో కలసి పని చేయడం వల్ల అనేక సామాజికరుగ్మతలు వ్యాపించే ప్రమాదముంటుంది. అందుకే "ఏజాతి తన వ్యవహారాల నిర్వహణ బాధ్యతను స్త్రీకి అప్పగిస్తుందో ఆ జాతి ఎన్నటికీ బాగుపడదు" అన్నారు దైవప్రవక్త (స)- (బుఖారి) స్త్రీలపై పురుషుల ఆధిక్యతను గురించి 2:228 సూక్తి, దాని పాదసూచిక కూడా చూడండి.

కొందరు స్త్రీలు చేయిచేసుకోనిదే దారికి రారు. అలాంటి పరిస్థితిలో భార్య ముఖం మీద కొట్టకూడదని, శరీరం కందిపోయే వస్తువులతో కొట్టకూడదని, నిర్దయగా కొట్టకూడదని దైవప్రవక్త (సల్లం) అన్నారు. ఏమైనా ఆయన భార్యల్ని కొట్టేవారిని అభిమానించేవారు కాదు.



భార్యాభర్తల మధ్య సంబంధాలు చెడిపోతాయని భయముంటే భర్త బంధువుల నుండి ఒక మధ్యవర్తిని, భార్య బంధువుల నుండి ఒక మధ్యవర్తిని పెట్టుకోండి. వారిద్దరు కలసి పరిస్థితి చక్కదిద్దదలచుకుంటే దేవుడు దంపతుల మధ్య సానుకూలత కలిగిస్తాడు. దేవుడు సర్వజ్ఞాని, సమస్తం ఎరిగినవాడు. (35)

మీరు అల్లాహ్‌నే ఆరాధించండి. ఆయనకు (దైవత్వంలో) ఎవరినీ సాటి కల్పించకండి. తల్లిదండ్రుల పట్ల సద్వర్తనంతో వ్యవహరించండి. బంధువులు, అనాథలు, నిరుపేదలతో మంచిగా మసలుకోండి. ఇరుగుపొరుగు బంధువులకు, పరిచయంలేని పొరుగువారికి, (మీ దైనందిన కార్యకలాపాలలో) తారసపడే మిత్రులకు, బాటసారులకు, మీ అధీనంలో వున్న బానిసలకు మేలు చేయండి. దేవుడు అహంకారుల్ని, ప్రగల్భాలు పలికేవారిని ఎన్నటికీ ప్రేమించడు. (36)

అలాగే తాము పిసినారితనం వహించడమేగాక ఇతరులక్కూడా పిసినారితనం నూరి పోసేవారిని సైతం దేవుడు ప్రేమించడు. వారు తమకు దేవుడు ప్రసాదించిన అనుగ్రహాన్ని (ధనాన్ని) కూడబెడ్తారు. ఇలాంటి కృతఘ్నుల కోసం మేము నీచమైన (నరక) యాతనను సిద్ధపరచివుంచాము. వారొకవేళ ఏదైనా ఖర్చుపెట్టినా లోకుల మెప్పు కోసం మాత్రమే ఖర్చు పెడ్తారు. వారు దేవుడ్నీ విశ్వసించరు, పరలోకాన్నీ విశ్వసించరు. కారణం, అలాంటివారికి షైతాన్ సహచరుడై పోయాడు. షైతాన్ సహచర్యం అత్యంత దుష్టసహచర్యం. (37,38)

వారు గనక దేవుడ్ని, ప్రళయదినాన్ని విశ్వసించి, తమకు దైవం ప్రసాదించినదాన్ని సద్వినియోగం చేస్తే వారికి వచ్చే నష్టం ఏమిటీ? వారి సంగతి దేవునికి బాగా తెలుసు. దేవుడు ఎవరికీ ఎలాంటి అన్యాయం చేయడు. ఎవరైనా ఒక సత్కార్యం చేస్తే దేవుడు దానికి రెట్టింపు పుణ్యఫలం ప్రసాదిస్తాడు. అంతేకాకుండా, ఆయన తన (ప్రత్యేక) అనుగ్రహనిక్షేపాల నుండి కూడా అమితమైన ప్రతిఫలం ప్రసాదిస్తాడు. (39-40)

(ముహమ్మద్!) మేము (పరలోక న్యాయస్థానంలో) ప్రతి సమాజం నుండి ఒక సాక్షిని తెచ్చి, ఆ సాక్షులపై నిన్ను సాక్షిగా నిలబెట్టే రోజున వీరి పరిస్థితి ఏమవుతుంది? అప్పుడు దైవప్రవక్తను నిరాకరించి, అతనికి అవిధేయులైపోయిన అవిశ్వాసులు (పశ్చాత్తాపంతో) "అయ్యయ్యో! భూమి బ్రద్దలయి తామందులో కూరుకుపోతే ఎంత బాగుండు!!" అనివాపోతారు. కాని వారు దేవుని దగ్గర ఏవిషయాన్నీ దాచలేరు. (41,42)

విశ్వాసులారా! మీరు మైకంలో ఉన్నప్పుడు ప్రార్థన దరిదాపులకు పోకండి. ప్రార్థనలో మీరు పఠిస్తున్నదేమిటో మీకు తెలుస్తున్నప్పుడే ప్రార్థన చేయాలి.[19] అలాగే

---

19. దివ్య ఖుర్ఆన్ మూడుసార్లు ఆదేశాలిస్తూ మద్యం, మత్తు పదార్థాలను అంచెలవారిగా నిషేధించింది. మొదటి ఆదేశం 2:219 సూక్తిలో వచ్చింది. అందులో మద్యం నష్టదాయకమైనదని, దేవునికి అయిష్టమైనదని మాత్రమే చెప్పబడింది. ఆనాటి నుంచే కొందరు ముస్లింలు మద్య సేవనం మానుకున్నారు. అయితే చాలామంది మానుకోలేదు. వారు ఒక్కొక్క సారి మద్యం మత్తులో ఉండే నమాజు చేస్తుండేవారు. దానివల్ల నమాజులో ఏకాగ్రతకు భంగం కలిగి వారు ఒక దానికి బదులు

(సంభోగం, వీర్య స్ఖలనాలతో) అశుద్ధావస్థలో ఉన్నప్పుడు కూడా స్నానంచేసేవరకు నమాజు దరిదాపులకు పోకూడదు, (మసీదు) దారిగుండా పోవడం అనివార్యమైతే తప్ప. ఇక వ్యాధిగ్రస్తులైనప్పుడు, ప్రయాణావస్థలో ఉన్నప్పుడు, మలమూత్ర విసర్జనకు వెళ్ళి నప్పుడు లేదా స్త్రీని కలసినప్పుడు నీరు లభించకపోతే శుభ్రమైన మట్టి ఉపయోగించండి. దాన్ని ముఖాల మీద, చేతుల మీద రుద్దుకోండి.[20] నిస్సందేహంగా దేవుడు అమిత క్షమాశీలి, అపార కృపాశీలుడు. (43)

గ్రంథంలో కొంతభాగం ఇవ్వబడినవారిని నీవు చూడలేదా? వారు స్వయంగా మార్గ భ్రష్టత్వం కొనితెచ్చుకోవడమేగాక, మిమ్మల్ని కూడా భ్రష్టుల్ని చేయజూస్తున్నారు. మీ శత్రువుల సంగతి దేవునికి బాగా తెలుసు. మీ సంరక్షణకు, సహాయానికి దేవుడే చాలు. (44-45)

యూదులైనవారిలో కొందరు పదాలను వాటి సందర్భాన్నుండి మార్చివేస్తారు. నిజ ధర్మానికి హాని కలిగించే ఉద్దేశ్యంతో వారు నాలుకలు మెలితిప్పుతూ "మేము విన్నాం-త్రోసి పుచ్చాం, వినండి- విన్పించకండి, మా మాట వినండి" అని అంటారు. (అలా అనడానికి బదులు) వారు "మేము విన్నాం, విధేయులై పోయాము; వినండి, కాస్త మావైపు చూడండి" అని అంటే వారికి శ్రేయస్కరంగా ఉండేది. అది సవ్యంగా కూడా ఉండేది. కాని దేవుడు వారి తలబిరుసు, తిరస్కారాల కారణంగా వారిని శపించాడు. అందువల్ల వారిలో చాలా కొద్దిమంది తప్ప ఎవరూ సత్యాన్ని విశ్వసించరు. (46)

గ్రంథప్రజలారా! మేము (సత్యతిరస్కారుల) ముఖాలు చెడగొట్టి వెనక్కి తిప్పివేయక ముందే, లేదా శనివారనియమం ఉల్లంఘించినవారిని శపించినట్లు వారిని శపించక ముందే మేము అవతరింపజేసిన ఈ గ్రంథాన్ని విశ్వసించండి. ఇది మీ దగ్గరున్న గ్రంథాన్ని కూడా ధృవీకరిస్తోంది. గుర్తుంచుకోండి, దైవాజ్ఞ అమలు జరిగి తీరుతుంది. (47)

దేవుడు తనకు సాటి కల్పించడాన్ని ఎట్టి పరిస్థితిలోనూ క్షమించడు. అది తప్ప ఇతర పాపాలను ఆయన తలచుకుంటే క్షమిస్తాడు. దేవునికి (ఆయన దైవత్వంలో, శక్తిసామర్థ్యాల్లో) సాటి కల్పించడమంటే ఘోరమైన పాపం మూట కట్టుకున్నట్లే. (48)

---

మరొకటి పఠిస్తుండేవారు. అందువల్ల మైకంలో ఉన్నప్పుడు నమాజ్ చేయకూడదని ఈ సూక్తిలో ఆదేశించబడింది. ఈ ఆదేశంతో చాలామంది మద్యసేవనం మానుకున్నారు. అలవాటు మానుకోలేక పోయిన కొందరు నమాజు వేళలు తప్పించి మద్యం సేవిస్తుండేవారు. ఆ తరువాత కొంత కాలానికి 5:90,91 సూక్తులలో మద్యాన్ని పూర్తిగా నిషేధించడం జరిగింది. దీంతోపాటు ఇతర మత్తు పదార్థా లన్నీ నిషేధించబడ్డాయి. (వివరాలకు 5:90 సూక్తి పాదసూచిక చూడండి.)

20. మట్టితో ముఖం రుద్దుకోవడమంటే ముఖమంతా మట్టి పూసుకోవడం కాదు. శుభ్రమైన మట్టినేలపై లేదా మట్టిగోడపై లేదా సున్నపుగోడపై లేదా దుమ్ముపడిన వస్తువుల మీద చేతులు తట్టి వాటిని ఓసారి విదిలించి ఆ చేతులతో ముఖం, చేతులు తుడుచుకోవాలని దైవప్రవక్త (సల్లం) బోధనలు తెలుపుతున్నాయి. (వివరాలకు 5:6 సూక్తి, దాని పాదసూచిక చూడండి.)



(ముహమ్మద్!) నీవు ఆత్మశుద్ధి గురించి గొప్పలు చెప్పుకునే వారిని చూడలేదా? నిజానికి దేవుడు తాను తలచుకున్న వారిని మాత్రమే శుద్ధిచేస్తాడు. వారికి అణుమాత్రం కూడా అన్యాయం జరగదు. చూడు, వారు దేవుడ్ని గురించి ఎలాంటి దారుణమైన అబద్ధాలు కల్పిస్తున్నారో! ఘోరమైనపాపం కావడానికి ఇదొక్క నిర్వాకంచాలు. (49,50)

నీవు గ్రంథజ్ఞానంలో కొంతభాగం ఇవ్వబడినవారిని చూడలేదా? వారు భ్రష్టాచారా లను, మిథ్యాదైవాలను నమ్ముతున్నారు. పైగా వారు, విశ్వాసులకంటే (మక్కా బహు దైవారాధకులైన) అవిశ్వాసులే కాస్త సన్మార్గంలో ఉన్నారని అంటున్నారు. అలాంటివారే దైవశాపగ్రస్తులు, దైవశాపగ్రస్తులకు ఇక ఎవరూ సహాయం చేయలేరు. పోనీ, రాజ్యాధి కారంలో వారికేమైనా వాటా ఉందా? ఉంటే వారు ప్రజలకు చిల్లిగవ్వ కూడా ఇవ్వరు. లేక, దేవుడు దయతో వారికి (దైవదౌత్య) మహాభాగ్యం ప్రసాదించాడని అసూయపడు తున్నారా? మేము ఇబ్రాహీం సంతానానికి గ్రంథం, వివేకం ప్రసాదించాము. అదీగాక అతనికి మేము ఎంతో శక్తిమంతమైన సామ్రాజ్యం కూడా ఇచ్చాము. (51-54)

అయితే వారిలో కొందరు విశ్వసించారు; మరికొందరు విశ్వసించకుండా ముఖం చాటేశారు. అలాంటివారికి భగభగమండే నరకాగ్నే తగినశిక్ష. మాసూక్తులు నిరాకరించిన వారిని మేము తప్పకుండా నరకాగ్నిలోకి విసరేస్తాం. అక్కడ వారి చర్మాలు కాలిపోయి నప్పుడల్లా (నిరంతర) యాతనల్ని చవిచూసేందుకు మళ్ళీమళ్ళీ కొత్తచర్మాలు సృజిస్తాం. గుర్తుంచుకోండి, దేవుడు సర్వశక్తిమంతుడు; అత్యంత వివేచనాపరుడు. (55-56)

ఇక సత్యాన్ని విశ్వసించి సదాచారసంపన్నులైన వారిని మేము సెలయేర్లు ప్రవహించే స్వర్గవనాలకు పంపుతాం. అక్కడ వారు శాశ్వతంగా ఉంటారు. వారికక్కడ పరిశుద్ధ పత్నులు లభిస్తారు. వారిని మేము దట్టమైన చల్లనినీడలలో ఉంచుతాం. (57)

ముస్లింలారా! దేవుడు మిమ్మల్ని ఆదేశిస్తున్నాడు: ఎవరైనా మిమ్మల్ని నమ్మి ఏదైనా వస్తువుని మీ దగ్గర భద్రపరిస్తే తిరిగి వారికి సురక్షితంగా అప్పగించండి. ప్రజల మధ్య ఏదైనా వ్యవహారం తీర్చవలసివస్తే న్యాయంగా తీర్చండి. దేవుడు మీకు ఎంత మంచి హితోపదేశం చేస్తున్నాడో చూడండి! అయన సమస్తం వింటున్నాడు, చూస్తున్నాడు. (58)

విశ్వాసులారా! దేవునిపట్ల, ఆయన ప్రవక్త పట్ల విధేయత కలిగి ఉండండి. మీలో వ్యవహారకర్తలైన అధికారుల పట్ల కూడా. అయితే ఏదైనా వ్యవహారంలో మీ మధ్య వివాదం తలెత్తితే దాన్ని తిరిగి దేవుని వైపునకు, ఆయనప్రవక్త వైపునకు మరల్చండి.[21]

---

21. ముస్లింలు ఐకమత్యంతో సామూహిక జీవితం గడపాలని, జీవితంలోని ప్రతి రంగంలో ఖుర్‌ఆన్, హదీసుల ఆజ్ఞలను శిరసావహించాలని; దాంతోపాటు ఖుర్‌ఆన్, హదీసుల వెలుగులో వారి పైఅధికారులు లేక నాయకులు ఇచ్చే ఆజ్ఞలను కూడా తప్పకుండా పాటించాలని ఈ సూక్తి తెలియజేస్తోంది. ఈ సూక్తిలో "దేవుని పట్ల విధేయత కలిగి ఉండండి" అంటే ఖుర్‌ఆన్ ఆజ్ఞలను పాటించాలని; "ప్రవక్త (సల్లం) పట్ల విధేయత కలిగి ఉండండి" అంటే హదీసు బోధనలను అనుస రించాలని అర్థం. అధికారులిచ్చే ఆజ్ఞలు మాత్రం ఈ రెండిటి వెలుగులోనే ఉండాలి.

ఖుర్‌ఆన్, హదీసులే ఇస్లాం బోధనలకు మూలాధారాలు. కనుక ముస్లింలు ఈ రెండిటిని దృఢంగా పట్టుకోవాలి. మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఈ రెండిటి ఆవశ్యకతను గురించి నొక్కి చెబుతూ "నేను మీ దగ్గర రెండు వస్తువులు వదలి వెళ్తున్నాను. వాటిని దృఢంగా పట్టుకొని (ఆచరిస్తూ) ఉన్నంతకాలం మీరెన్నటికీ దారి తప్పరు. వాటిలో ఒకటి, దైవగ్రంథం (ఖుర్‌ఆన్). రెండు, నా సంప్రదాయాలు (హదీస్)" అని అన్నారు. (ముఅత్తా)

ముస్లింలు సంఘజీవితం గడపాలని, ఇస్లామీయ సంఘవ్యవస్థను అంటిపెట్టుకొని ఉండాలని కూడా ఈసూక్తి సూచిస్తోంది. మహాప్రవక్త (సల్లం) బోధించిన ఈక్రింది మహితోక్తులు చూడండి:

"ఒంటరి మనిషికి షైతాన్ చేరువవుతాడు. మనుషులు ఒకరికి ఇద్దరయినప్పుడు వాడు దూరమయి పోతాడు. అందువల్ల ఎవరు తమ గృహాన్ని స్వర్గం మధ్య నిర్మించుకో దలుచుకుంటారో వారు ఇస్లామీయ సాంఘిక వ్యవస్థను అంటిపెట్టుకొని ఉండాలి." (మిష్కాత్)

"కేవలం ముగ్గురు వ్యక్తులు ప్రయాణమైనా సరే, వారు తమలో ఒకడ్ని నాయకుడిగా నియమించుకోవాలి." (అబూదావూద్)

"ముస్లింలు తమకిష్టమున్నా, లేకపోయినా తమ పైఅధికారి (లేదా నాయకుడు) చెప్పే మంచి మాటను విధిగా వినాలి. ఒకవేళ అతను చెడుమాట గురించి చెబితే అప్పుడతనికి విధేయత చూపకూడదు." (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (సల్లం) ఓ సైనికదళానికి ఒక అన్సారీముస్లింని సేనాపతిగా నియమించి పంపారు. అప్పుడాయన సేనాపతికి విధేయులై మసలుకోవాలని సైనికుల్ని ఆజ్ఞాపించారు. అయితే ఆ సేనాపతి (ఒక సందర్భంలో) వారి మీద ఆగ్రహం వెలిబుచ్చుతూ "మీరంతా నాకు విధేయులయి ఉండాలని దైవప్రవక్త మిమ్మల్ని ఆదేశించలేదా?" అని అడిగాడు. దానికి వారంతా "నిజమే, ఆదేశించారు" అన్నారు. "అయితే నేనొక నిర్ణయం తీసుకున్నాను. దాని ప్రకారం మీరు కట్టెలు తెచ్చి ఒకచోట పేర్చండి. తరువాత దానికి నిప్పు పెట్టి అందులోకి దూకండి" అన్నాడు సేనాపతి.

సైనికులు అతని ఆజ్ఞను పాటిస్తూ కట్టెలు తెచ్చి పేర్చారు. దానికి నిప్పు కూడా పెట్టారు. కాని అందులోకి దూకాలనుకున్నప్పుడు వారు (అయోమయంగా) ఒకరి ముఖాలు మరొకరు చూసు కోసాగారు. వారిలో కొందరు మాట్లాడుతూ "మనం (నరకా)అగ్ని నుండి తప్పించుకోవడానికే కదా దైవప్రవక్త (సల్లం)కు విధేయులయి పోయాము! అలాంటిది ఇప్పుడు మనం అగ్నిలో దూకడం ఏమిటీ?" అన్నారు. ఈ విధంగా వారు ఆలోచిస్తూ మాట్లాడుకుంటుండగా ఆ నిప్పు కాస్తా ఆరి పోయింది. అటు సేనాపతి కోపం కూడా చల్లారిపోయింది.

ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) ముందు ఈ సంఘటన గురించిన ప్రస్తావన వచ్చింది. దైవప్రవక్త (సల్లం) అది విని "వారు గనక అప్పుడు అగ్నిలో దూకి ఉంటే ఇక ఎన్నటికీ అగ్ని నుంచి బయటపడేవారు కాదు. శాశ్వతంగా నరకాగ్నిలోనే కాలిపోతూ ఉండేవారు. ధర్మసమ్మతమైన వ్యవహారాల్లో మాత్రమే అధికారులకు విధేయత చూపాలి" అని అన్నారు. (బుఖారి, ముస్లిం)

అయితే ధర్మసమ్మతమైన వ్యవహారాల్లోనూ ఒక్కోసారి విషయావగాహనా విభేదం వల్లగాని, లేదా మరేదైనా బలమైన కారణం వల్లగాని అనుచరులు నాయకుని ఆదేశానికి కొంచెం భిన్నంగా ప్రవర్తించే అవకాశం ఉండవచ్చు. అలాంటి సందర్భాలలో నాయకుడు తన అనుచరుల చిత్తశుద్ధిని, కార్యదీక్షను లెక్కలోకి తీసుకోవాలి, దీని విషయంలో ఈక్రింది హదీసులు గమనార్హమైనవి.

(1) దైవప్రవక్త (సల్లం) కందకం యుద్ధం ముగిసిన తరువాత అక్కడ్నుంచి తిరిగొచ్చి "బనీ



ఖురైజా (యూదుల) వాడకు చేరుకోనంత వరకు ఎవరూ అసర్ నమాజు చేయకూడదు" అని ఆదేశిస్తూ ఒక ప్రకటన చేయించారు. ఈ ప్రకటన వినగానే ప్రవక్త అనుచరులంతా (జట్లు జట్లుగా) బయలుదేరారు. కొందరు కొంతదూరం నడిచిన తరువాత దారిలోనే అసర్ వేళ అయింది. అప్పుడు వారిలో కొందరు "మనం బనూఖురైజా వాడకు చేరుకోనంతవరకు అసర్ నమాజు చేయకూడదు" అన్నారు. మరికొందరు దీన్ని వ్యతిరేకిస్తూ "కాదు, మనం ఇక్కడే నమాజ్ చేయాలి. దైవప్రవక్త (సల్లం) ఆదేశానికి అర్థం అసర్ నమాజు 'ఖజా' చేయాలని కాదుకదా?" అన్నారు.

(కొన్ని ఉల్లేఖనాల ప్రకారం మొదటి అభిప్రాయంతో ఏకీభవించినవారిలో కొందరు సూర్యాస్తమయిన తరువాత, మరికొందరు ఇషావేళకు బనీఖురైజా వాడకు చేరుకొని అసర్ నమాజ్ చేశారు.) చివరికి ఈ వ్యవహారం దైవప్రవక్త (సల్లం) దృష్టికి తీసికెళ్ళారు. ఆయన అంతా విని ఆ ఉభయవర్గాలలో ఎవరినీ కోపగించుకోలేదు. ---(బుఖారి, ముస్లిం)

(2) దైవప్రవక్త (సల్లం) ఓసారి కొందరు అనుచరుల్ని వెంటబెట్టుకొని బనీఉమర్ బిన్ ఔఫ్ తెగప్రజల మధ్య రాజీ కుదర్చడానికి వారి దగ్గరకు వెళ్ళారు. ఆ సందర్భంలో నమాజువేళయింది. అప్పుడు (మసీదులో) ముఅజ్జిన్, హజ్రత్ అబూబకర్ (రజి)తో "నేను తక్బీర్ (ఇఖామత్) చెబుతాను, మీరు (నాయకత్వం వహించి) నమాజు చేయిస్తారా?" అని అడిగాడు. దానికి అబూబకర్ (రజి) "సరే, చేయిస్తాను" అన్నారు. ఆ తరువాత ఆయన నమాజు చేయించడం ప్రారంభించారు. నమాజు ఇంకా పూర్తికాలేదు. అంతలో దైవప్రవక్త (సల్లం) వచ్చి జనాన్ని దాటుకుంటూ వెళ్ళి మొదటి వరుసలో నిలబడ్డారు. ఆయన్ని చూసి ప్రజలు (ముఖ్తదీలు) చప్పట్లు చరస్తూ, అబూబకర్ (రజి)ని సైగ చేయడానికి ప్రయత్నించారు.

హజ్రత్ అబూబకర్ (రజి) నమాజ్ చేస్తున్నప్పుడు ఇతర విషయాలపై మనస్సుని పోనివ్వరు. అందువల్ల ఆయన ఆ విషయాన్ని పట్టించుకోలేదు. చివరికి ప్రజలు మరింత గట్టిగా చప్పట్లు చరచడంతో ఆయన విషయం గమనించారు. దైవప్రవక్త (స)ను చూడగానే ఆయన (ఇమామత్ స్థానం నుంచి) వెనక్కి జరగడానికి ప్రయత్నించారు. అయితే దైవప్రవక్త (సల్లం) ఆయన్ని (కదలకుండా) తన స్థానంలోనే నిలబడి ఉండమని ఆదేశించారు. కాని అబూబకర్ (రజి) దైవప్రవక్త (సల్లం) ఆజ్ఞ విని (ఆయన తనను అంతటి యోగ్యుడిగా గుర్తించినందుకు) రెండు చేతులెత్తి కృతజ్ఞతగా దేవుడ్ని స్తుతించారు. ఆ తరువాత వెనక్కి జరిగి అందరితోపాటు సమానంగా పంక్తిలో నిల్చున్నారు.

అప్పుడు దైవప్రవక్త (సల్లం) ముందుకు వెళ్ళి నమాజు చేయించారు. నమాజు ముగిసిన తరువాత "అబూబకర్! నీ స్థానంలోనే నిలబడమని నేను ఆజ్ఞాపించినా నీవు అలా ఎందుకు చేయలేదు?" అని ప్రశ్నించారు ఆయన. దానికి అబూబకర్ (రజి) "అబూఖహాఫా కొడుక్కి దైవప్రవక్త (సల్లం) ముందు నిలబడేటంత శక్తి, సాహసం ఎక్కడున్నాయి?" అని అన్నారు. ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) ప్రజల వైపు తిరిగి "మీరు (అనవసరంగా) చాలా సార్లు చప్పట్లు కొట్టారు. అసలీ (చప్పట్లు) చేత్తో శబ్దం చేయడం అనేది స్త్రీల పని. నమాజులో ఏదయినా ఊహించని విషయం జరిగితే మీరు 'సుబ్‌హానల్లాహ్' అనంటే చాలు. సుబ్‌హానల్లాహ్ అనగానే ఇమామ్ మీ ఉద్దేశ్యాన్ని గ్రహిస్తాడు" అని అన్నారు. -(బుఖారి, ముస్లిం)

పోతే పాలకుల ఆజ్ఞలను ఏ మేరకు పాటించాలి, వారు ఇస్లాంవ్యతిరేక ఆజ్ఞలు జారీ చేసినప్పుడు ఎలా వ్యవహరించాలి అనే ప్రశ్నలు కూడా రావచ్చు. వీటికి సమాధానం కూడా ఈ క్రింది హదీసులో పేర్కొనబడింది:

"భవిష్యత్తులో మీ మీద కొందరు పాలకులవుతారు. వారి పాలనలో మీకు కొన్ని మంచి విషయాలు, మరికొన్ని చెడువిషయాలు గోచరిస్తాయి. అప్పుడు చెడువిషయాల పట్ల తన నిరసన

మీరు వాస్తవంగా దేవుడ్ని, అంతిమదినాన్ని విశ్వసిస్తున్నట్లయితే ఇదే మీకోసం సరైన పద్ధతి. పర్యవసానం రీత్యా కూడా ఇదే ఉత్తమ విధానం. (59)

ప్రవక్తా! బూటకాలు పలికేవారిని చూడలేదా? వారు నీపై అవతరించిన గ్రంథాన్ని, నీకు పూర్వం అవతరించిన గ్రంథాలను విశ్వసించామని పైకి గొప్పలు చెప్పుకుంటారు. కాని తమ వ్యవహారాలు పరిష్కరింప జేసుకోవడానికి మాత్రం వారు దైవ(శాసన) ధిక్కారులను[22] ఆశ్రయిస్తారు. కాని దైవ(శాసన) ధిక్కారులను తిరస్కరించాలని వారిని ఆదేశించడం జరిగింది. షైతాన్ వారిని దారితప్పించి బహుదూరంగా తీసికెళ్ళగోరుతున్నాడు. (60)

చూశావా? కపటవిశ్వాసులతో "దేవుడు అవతరింపజేసిన దాని వైపు రండి, ప్రవక్త (హితవుల) వైపు రండి" అని పిలిచినప్పుడు వారు నీదగ్గరకు రాకుండా తప్పుకోజూస్తారు. కాని చేజేతులా కొనితెచ్చుకున్న ఆపద వచ్చినప్పుడు వారు నీ దగ్గరకు పరుగెత్తుకు వచ్చి "దైవసాక్షి! మేము మంచినే కోరుకుంటున్నాం. ఎలాగైనా ఇరుపక్షాల మధ్య సయోధ్య కుదరాలన్నదే మా ఉద్దేశ్యం" అని కల్లబొల్లి ప్రమాణాలు చేస్తారు. (61-62)

వారి హృదయాలలో ఏమున్నదో దేవునికి బాగా తెలుసు. కనుక వారి మాటలు పట్టించుకోకు. వారికి మనస్సులో నాటుకునేలా నచ్చజెప్పు. మేము ఏ ప్రవక్తను పంపినా దైవాజ్ఞ ననుసరించి ప్రజలు అతనికి విధేయులై పోవాలనే పంపించాము. వారు తమకు తాము అన్యాయం చేసుకున్నప్పుడు నీదగ్గరకు వచ్చి దైవాన్ని క్షమాభిక్ష వేడుకొనిఉంటే, దైవప్రవక్త కూడా వారికోసం దేవుడ్ని ప్రార్థించిఉంటే, దేవుడు గొప్ప క్షమాశీలి అని, ఎంతో దయామయుడని వారు తెలుసుకునేవారు. (63-64)

నీ ప్రభువు సాక్షి! వారు తమ వివాదాల పరిష్కారం కోసం నిన్ను న్యాయనిర్ణేతగా అంగీకరించి, వాటిపై నీవిచ్చే తీర్పుపట్ల ఏమాత్రం తటపటాయించకుండా ఆసాంతం స్వీకరించనంతవరకూ వారు నిజమైన విశ్వాసులు కాలేరు.[23] (65)

---

వెలిబుచ్చేవాడిపై (దానికి సంబంధించిన) ఎలాంటి బాధ్యత ఉండదు. అలాగే ఆ చెడు విషయాల్ని ఇష్టపడనివాడు కూడా తప్పించుకుంటాడు. అయితే ఆ చెడువిషయాలను అంగీకరించి వాటిని అను సరించేవాడ్ని మాత్రం (పరలోకంలో) ప్రశ్నించడం జరుగుతుంది" అన్నారు దైవప్రవక్త (సల్లం).

అప్పుడు సహాబీలు (అనుచరులు) "అలాంటి ఆజ్ఞలు జారీఅయ్యే కాలం వస్తే మేము వారితో (పాలకులతో) యుద్ధం చేయవచ్చా?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) "చేయ కూడదు. వారు నమాజు చేస్తున్నంత కాలం (వారికి వ్యతిరేకంగా తిరుగుబాటు) చేయకూడదు" అని చెప్పారు. (ముస్లిం)

22. ఇక్కడ మూలభాషలో ఉన్న 'తాగూత్' అనే పదాన్ని నేను "దైవశాసన ధిక్కారి" అని అనువదించాను. తాగూత్ అంటే హద్దు మీరినవాడని శాబ్దిక భావం. ఖుర్ఆన్ పరిభాషలో తాగూత్ అంటే దైవదాస్యపు హద్దులు అతిక్రమించి స్వయంగా తానే దేవుడు, ప్రభువు, యజమాని అయి దైవదాసుల చేత సేవారాధనలు చేయించుకునేవాడని అర్థం. ఈ సూక్తిలో తాగూత్ అంటే దైవ చట్టానికి బదులు దైవేతర చట్టాల ప్రకారం వ్యవహారాలు పరిష్కరించే పాలకుడు లేక న్యాయవ్యవస్థ



"మిమ్మల్ని మీరు చంపుకోండి లేదా మీ ఇండ్లు వదలి వెళ్ళిపోండ"[24] ని ఆదేశిస్తే వారిలో కొద్దిమంది మాత్రమే దాన్ని పాటిస్తారు. మా హితబోధ ప్రకారం నడుచుకుంటే వారికెంతో శ్రేయస్కరంగా ఉండేది. పైగా అది(ధర్మంలో) వారికి స్థిరత్వాన్నిచ్చేది. అప్పుడు మేము వారికి గొప్ప ప్రతిఫలం ప్రసాదించి సన్మార్గం చూపేవారము. (66-68)

దేవునికి, ఆయన ప్రవక్తకు పూర్తిగా విధేయులై వారి ఆజ్ఞలను పాటించేవారు (రేపు ప్రళయదినాన) దేవుడు కటాక్షించిన ప్రవక్తలతో, సత్యసంధులతో, అమరవీరులతో, సదాచార సంపన్నులతో కలసి ఉంటారు. అలాంటివారి సహచర్యమే సహచర్యం. ఇది దేవుని అనుగ్రహం దేవుడే సర్వం తెలిసినవాడు. (69-70)

విశ్వాసులారా! మీరు పోరాటానికి సర్వసన్నద్ధులయి ఉండండి.[25] అవసరాన్నిబట్టి వేర్వేరు దళాలుగానో లేదా అంతాకలసి ఒకే దళంగానో బయలుదేరండి. మీలో కొందరు కావాలని ఆలస్యం చేస్తూ తప్పించుకొని తిరిగేవారు కూడా ఉన్నారు. ఒకవేళ మీపై ఏదైనా ఆపద వచ్చిపడితే "దేవుని దయవల్ల నేను వారివెంట పోలేదు" అంటాడు అలాంటి వ్యక్తి. అలా కాకుండా దేవుడు మీకు (విజయం) అనుగ్రహిస్తే, మీకూ తనకూ మధ్య ఎలాంటి మైత్రీబంధం లేనట్లు "నేను కూడా వారి వెంట వెళ్ళివుంటే ఎంత బాగుండేది, నాక్కూడా గొప్ప విజయ(ధన)ం లభించివుండేది" అంటాడతను. (71-73)

పరలోక జీవితం కోసం ప్రాపంచిక జీవితం అమ్మదలచుకున్నవారు దైవమార్గంలో పోరాడాలి. దైవమార్గంలో పోరాడి అమరగతినొందినా లేక విజయం సాధించినా

---

అని అర్థం. కనుక దేవుడ్ని సర్వోన్నతాధికారిగా, ఆయన గ్రంథాన్ని అంతిమ ప్రమాణం (Final authority)గా విశ్వసించేవారు తమ వ్యవహారాలు పరిష్కరించుకోవడానికి 'తాగూత్'ని ఆశ్రయించ కూడదు. ఏక కాలంలో ఇటు దేవునికి, అటు తాగూత్‌కు విధేయత చూపడం ద్వంద్వస్వభావానికి, కపటవిశ్వాసానికి నిదర్శనం అవుతుంది.

23. జీవిత వ్యవహారాలకు సంబంధించిన సమస్యలన్నింటినీ దైవప్రవక్త (సల్లం) చూపిన విధానం ప్రకారం పరిష్కరించుకోవాలని ఈ సూక్తిలో దేవుడు ముస్లింలను ఆదేశిస్తున్నాడు. అలాంటి వారే నిజమైన విశ్వాసులని చెబుతున్నాడు. "మీలో ఏ మనిషీ నేను తీసుకొచ్చిన విధానానికి అతని మనోభీష్టం లోబడి ఉండనంతవరకు విశ్వాసి కాలేడు" అని దైవప్రవక్త (స) స్పష్టంగా చెప్పారు.

24. అంటే ధర్మసంస్థాపనకై జరిగే కృషిలో ప్రాణత్యాగం చేయండని, అవసరం వచ్చినప్పుడు స్వస్థలం వదలి ప్రవక్త (సల్లం) సూచించిన ప్రాంతానికి వలస వెళ్ళాలని అర్థం.

25. ఉహుద్ యుద్ధంలో ముస్లింలకు అంతిమవిజయం లభించినప్పటికీ వారి పరిస్థితి చావుతప్పి కన్నులొట్ట పోయినట్లయింది. ఎంతో నష్టపోయారు. ఒక దశలో దైవప్రవక్త (సల్లం) చని పోయారన్న పుకారు కూడా పుట్టింది. దాంతో మదీనా చుట్టుప్రక్కల ఉండే ముస్లిమేతర తెగలకు ధైర్యం వచ్చింది. ఫలానా తెగవాళ్ళు దాడి చేయడానికి సన్నాహాలు చేస్తున్నారని, ఫలానా తెగవాళ్ళు శాంతిఒప్పందం ఉల్లంఘించారని, ఫలానా తెగవాళ్ళు ముస్లిం ప్రచారకుల్ని మోసగించి హత మార్చారని వార్తలు రాసాగాయి. ఈ విధంగా ముస్లింల ధన మాన ప్రాణాలకు నలువైపుల నుండి ముప్పు ఏర్పడింది. మరోవైపు కపటవిశ్వాసుల బెడద కూడా ఎక్కువయింది. అలాంటి స్థితిలో ఈ సూక్తులు అవతరించాయి.

అలాంటి వ్యక్తికి మేము గొప్ప ప్రతిఫలం ప్రసాదిస్తాము. దిక్కులేక పోవడం చూసి అణచి వేయబడ్డ స్త్రీలు, పురుషులు, పిల్లలను రక్షించడానికి మీరు దైవమార్గంలో ఎందుకు పోరాడరు? వారు (బాధలు భరించలేక) "దేవా! దుర్మార్గులు నివసిస్తున్న ఈ నగరం నుండి మమ్మల్ని బయటికి తీసి కాపాడు. మాకు రక్షణ కల్పించి అండగా నిలిచేవారి నెవరినైనా నీ వైపు నుండి మా దగ్గరికి పంపు" అని మొరపెట్టుకుంటున్నారే! అలాంటి పీడిత ప్రజల రక్షణ కోసం ఎందుకు పోరాడరు మీరు?[26] (74-75)

విశ్వాసులు దైవమార్గంలో పోరాడుతారు. తిరస్కారవైఖరి అవలంబించినవారు షైతాన్ మార్గంలో పోరాడుతారు. కనుక మీరు షైతాన్ అనుచరమూకతో పోరాడండి. షైతాన్ పన్నే కుటిలపన్నాగాలన్నీ చాలా బలహీనమైనవని తెలుసుకోండి. (76)

"మీ చేతుల్ని (యుద్ధం చేయకుండా) కాస్త ఆపివుంచండి, నమాజ్ (ప్రార్థనా) వ్యవస్థని స్థాపించండి, జకాత్ చెల్లించండి" అని (లోగడ) ఆదేశించినవారిని నీవు గమనించావా? ఇప్పుడు వారిని (దైవమార్గంలో) పోరాడమని ఆజ్ఞాపిస్తే వారిలో కొందరు దేవునికి భయపడినట్లు (శత్రు)జనాన్ని చూసి భయంతో వణికిపోతున్నారు. అంతకంటే ఎక్కువే భయపడిపోతున్నారు. పైగా వారు "దేవా! (అప్పుడే) ఈ యుద్ధాజ్ఞను మాపై ఎందుకు విధించావు? మరికొంత అవకాశం ఎందుకివ్వలేదు?" అని వాపోయారు.

వారికి చెప్పు: ఈ ప్రాపంచిక సౌఖ్యాలు క్షణభంగురం, బుద్బుదం. భక్తిపరాయణు లకు పరలోక జీవితమే అత్యంత శ్రేష్ఠమైనది, శాశ్వతమైనది. (అక్కడ) మీకు అణు మాత్రం కూడా అన్యాయం జరగదు. (77)

ఇక మృత్యు విషయానికొస్తే, అది మీరు ఎక్కడున్నా, ఎట్టి పరిస్థితిలో వున్నా, చివరికి మీరు పటిష్ఠమైన భవనాల్లో వున్నాసరే వచ్చి తీరుతుంది. దాన్ని ఎవరూ అడ్డుకో లేరు. వారికేదైనా ప్రయోజనం చేకూరితే "ఇది దేవుని దయవల్ల లభించింది" అంటారు. నష్టం జరిగితే "ఇది నీ మూలంగా జరిగింది" అంటారు. వారికి చెప్పు, అంతా దేవుని వల్లనే జరుగుతుందని. అసలు వారికేమయింది, ఏ మాటా అర్థం చేసుకోరు? (78)

మానవా! నీకు ఏ మేలు జరిగినా అది దేవుని దయవల్లనే జరుగుతుంది. ఒకవేళ నీకేదైనా కీడు జరిగితే అది నీ చేజేతులా చేసుకున్నదాని ఫలితమని తెలుసుకో. మేము ముహమ్మద్ (స)ని యావత్తు మానవాళి కోసం దైవప్రవక్తగా నియమించాం. దీనికి దేవుని సాక్ష్యమే చాలు. కనుక ఎవరు దైవప్రవక్తకు విధేయులై నడచుకుంటారో, వారు దేవునికి విధేయులై నడచుకున్నట్లే. అలాచేయకుండా ముఖం తిప్పుకుంటే తిప్పుకోని. అలాంటివారి కోసం మేము నిన్ను పర్యవేక్షకునిగా నియమించి పంపలేదు. (79-80)

---

26. మక్కా, దాని పరిసర ప్రాంతాల్లో ఇస్లాం స్వీకరించి మదీనాకు వలసవెళ్ళలేక పోయిన పీడిత ముస్లింల దుస్థితి ఈ సూక్తిలో పేర్కొనబడింది. అలాంటి పీడిత ప్రజలను దౌర్జన్యపరుల కబంధహస్తాల నుండి కాపాడేందుకు ముస్లింలు యుద్ధం చేయాలని దేవుడు ఆదేశిస్తున్నాడు. ఇది ధర్మయుద్ధమని, దేవుని ప్రసన్నత కోసం జరిపే పోరాటమని ఖుర్ఆన్ తెలియజేస్తోంది.



వారు పైకి మాత్రం "మేము మీకు విధేయులం" అంటారు. కాని నీ దగ్గర్నుంచి వెళ్ళిపోగానే వారిలో కొందరు రాత్రివేళ ఒక చోట గుమిగూడి నీకు వ్యతిరేకంగా రహస్య మంతనాలు జరుపుతారు. వారు జరుపుతున్న రహస్య మంతనాలన్నిటినీ దేవుడు వారి కర్మలచిట్టాలో నమోదుచేస్తున్నాడు. కనుక నీవు వారిని గురించి పట్టించుకోకు. దేవునిపై భారం వేసి, ఆయన్నే నమ్ముకొని ఉండు. నమ్ముకునేవారికి దేవుడే చాలు. (81)

వారు ఖుర్ఆన్ గురించి ఆలోచించరా? ఇది అల్లాహ్ నుండి గాక మరెవరి నుండో వచ్చివుంటే ఇందులో ఎంతో భావవైరుధ్యం ఉండేది కదా! (82)

వారేదైనా సంతోషకరమైన వార్తగాని లేదా భయాందోళనలు కలిగించే వార్తగాని వింటే దాన్ని నలువైపులా వ్యాపింపజేస్తారు. అలా చేయకుండా వారా వార్తను దైవప్రవక్త కుగాని, తమ నాయకులకుగాని చేరవేస్తే దాన్నిగురించి వారు నిజానిజాలు తెలుసుకొని సరైన నిర్ణయం తీసుకోగలుతారు. మీపై దేవుని అనుగ్రహం, ఆయన కారుణ్యం గనక లేకపోయివుంటే మీలో కొందరు తప్ప అందరూ షైతాన్‌ని అనుసరించేవారు. (83)

కనుక ప్రవక్తా! దైవమార్గంలో పోరాడుతూ ఉండు. నీవు నీ విషయంలో తప్ప మరెవరి విషయంలోనూ బాధ్యుడవు కావు. అయితే విశ్వాసుల్ని పోరాటానికి ప్రేరేపిస్తూ ఉండాలి. త్వరలోనే దేవుడు సత్యతిరస్కారుల శక్తిని నిర్వీర్యం చేస్తాడు. దేవుడే అందరి కంటే శక్తిమంతుడు. ఆయన విధించే శిక్షే అన్నిటికంటే కఠినమైనది. (84)

ఎవరు ఒక మంచి విషయాన్ని ప్రోత్సహిస్తాడో అతనికి దాని పుణ్యఫలం లభిస్తుంది. అలాగే ఎవరు ఒక చెడు విషయాన్ని ప్రేరేపిస్తాడో అతను దాని పాపఫలితం అనుభవిస్తాడు. దేవుడు ప్రతిపనీ చేయగల సమర్థుడు, సర్వశక్తిమంతుడు. (85)

మిమ్మల్ని ఎవరైనా గౌరవసూచకంగా సలాం చేస్తే, మీరు అంతకంటే శ్రేష్ఠంగా వారికి ప్రతిసలాం చేయండి. లేదా అదేవిధంగానైనా చేయండి. దేవుడు ప్రతి విషయం లోనూ మీ నుండి లెక్క తీసుకుంటాడు. ఆయన తప్ప మరో ఆరాధ్యదైవం లేడు. ఆయనే అల్లాహ్. ఆయన మిమ్మల్నందర్నీ ప్రళయదినాన సమావేశపరుస్తాడు. అందులో సందేహం లేదు. దేవుని మాటకన్నా నిజమైనమాట మరెవరిది కాగల్గుతుంది? (86-87)

ఏమిటి, కపటుల్ని గురించి మీలో రెండు అభిప్రాయాలు[27] ఏర్పడ్డాయి? దేవుడు వారిని వారిచేష్టల మూలంగా (అవిశ్వాసం వైపు) వెనక్కి తిప్పివేశాడు. దేవుడు దారి తప్పించిన వాడ్ని నీవు దారికి తీసుకురాదలిచావా? అలా ఎన్నటికీ తీసుకురాలేవు. (88)

---

27. ఇస్లాం స్వీకరించినప్పటికీ ఇస్లాం కేంద్రమైన మదీనాకు వలసపోకుండా మక్కాలో, ఇతర అరేబియాప్రాంతాల్లోని బహుదైవారాధకుల మధ్య నివసిస్తూ, వారు సాగిస్తున్న ఇస్లాంవ్యతిరేక కార్యకాలాపాల్లో పాలుపంచుకునే కపటముస్లింలను గురించి ఇక్కడ ప్రస్తావించడం జరిగింది.

దైవప్రవక్త (సల్లం) ఉహుద్ యుద్ధానికి బయలుదేరినప్పుడు ఆయన అనుచరుల్లో కొందరు (కపటులు దారిలోనే వెనక్కి) తిరిగి వెళ్ళిపోయారు. అప్పుడు కొందరు ముస్లింలు మేము వాళ్ళను హతమారుస్తాం అనంటే, మరికొందరు మేము వాళ్ళను హతమార్చం అన్నారు. ఆ సందర్భంలో ఈ సూక్తి అవతరించింది. (బుఖారి, ముస్లిం)

వారు ఎలా అవిశ్వాసులైపోయారో అలా మీరుకూడా అవిశ్వాసులైపోయి అందరూ ఒకేవిధంగా ఉండాలని వారు కోరుకుంటున్నారు. కనుక ఇస్లాం కోసం స్వస్థలం వదలి రానంతవరకు వారిలో ఎవరితోనూ మీరు స్నేహంచేయకండి. స్వస్థలం వదలి రావడానికి అంగీకరించకపోతే వారిని (యుద్ధరంగంలో) ఎక్కడ కనిపిస్తే అక్కడ పట్టుకొని హత మార్చండి.[28] వారిలో ఏ ఒక్కరితోనూ స్నేహసంబంధాలు పెట్టుకోకండి. (89)

అయితే మీతో యుద్ధ ఒడంబడిక కుదిరిన జాతి వద్దకు వెళ్ళి, అక్కడ ఆశ్రయం పొందిన కపటులు మాత్రం ఈ ఆజ్ఞ నుండి మినహాయించబడ్డారు. అలాగే యుద్ధాలతో విసిగిపోయి ఇటు మీతోనూ, అటు తమజాతి వారితోనూ పోరాడకుండా మీదగ్గరకు వస్తూ పోయే కపటులు కూడా ఈ ఆజ్ఞ నుండి మినహాయించబడ్డారు.

దేవుడు తలచుకుంటే వారికి మీపై ఆధిక్యత నిచ్చేవాడే. అప్పుడు వారు మీతో తప్పకుండా పోరాడేవారు. కనుక వారు రంగం నుంచి తప్పుకొని మీతో యుద్ధం చేయకుండా రాజీకి వస్తే (మీరిక అనవసరంగా కయ్యానికి కాలు దువ్వకండి.) వారిని వేధించడానికి దేవుడు మీకు ఎలాంటి కారణం చూపలేదు. (90)

పోతే మరికొందరు కపటులు ఉన్నారు. వారు ఇటు మీతోనూ, అటు తమజాతి వారి తోనూ శాంతీ సఖ్యతలతో ఉండాలని భావిస్తారు. అయితే వీలుచిక్కితే చాలు, కలహం, కల్లోలాలలోకి ఒక్కసారిగా దూకుతారు. అలాంటివారు మీతో పోరాడటాన్ని మానుకొని రాజీకి రాక పోతే, వారు యుద్ధంచేయడం మానకపోతే వారిని ఎక్కడ కన్పిస్తే అక్కడ పట్టుకొని హత మార్చండి. అలాంటివారి పీచం అణచడానికి మేము మీకు పూర్తిస్వేచ్ఛ నిస్తున్నాము. (91)

పొరపాటున తప్ప తోటి విశ్వాసిని హతమార్చడం ఏ విశ్వాసికీ శోభించదు. ఒకవేళ పొరపాటున హతమార్చడం జరిగితే అందుకు ఒక బానిసముస్లింకు స్వేచ్ఛనివ్వాలి. మరో వైపు హతుని వారసులకు రక్తపరిహారం కూడా చెల్లించాలి.[29] ఒకవేళ వారు క్షమించివేస్తే అది వేరే విషయం. అయితే హతుడు మీ శత్రువర్గానికి చెందినవాడయి, అతను విశ్వాసి కూడా అయి ఉంటే, ఒక ముస్లిం బానిసకు స్వేచ్ఛనిస్తే చాలు. అలాకాకుండా హతుడు మీరు శాంతి ఒడంబడిక చేసుకున్న జాతికి చెందినవాడై ఉంటే, మీరు హతుని వారసులకు రక్త పరిహారంతో పాటు ఒక బానిసముస్లింకు స్వేచ్ఛ కూడా ఇవ్వాలి. స్వేచ్ఛనివ్వడానికి బానిస లేకపోతే హంతకుడు వరుసగా రెండు నెలలపాటు ఉపవాసవ్రతం పాటించాలి. ఇది చేసిన తప్పును పశ్చాత్తాపంతో సరిదిద్దుకోవడానికి

28. వీరు కపటవిశ్వాసులు. అవిశ్వాసులతో కుమ్మక్కయి విశ్వాసుల్ని కూడా అవిశ్వాసులుగా మార్చడానికి రకరకాల కుట్రలు పన్నుతున్న పచ్చి మోసకారులు. ఇస్లామీయ రాజ్యంలో అశాంతి అలజడులు సృష్టించడానికి పాల్పడిన కలహకారులు. అంచేత దైవాజ్ఞలను పాటించకుండా ఇలాగే అరాచకం, అల్లర్లు సృష్టిస్తుంటే వారిని హతమార్చాలని ఇక్కడ దేవుడు ముస్లింలను ఆదేశిస్తున్నాడు.

29. రక్తపరిహారంగా 100 ఒంటెలు లేదా 200 ఆవులు లేదా 2000 మేకలు చెల్లించాలని దైవప్రవక్త (స) నిర్ణయించారు. తర్వాతి కాలంలోను ఇవే కొలమానాలుగా పరిగణించబడ్డాయి.



దేవుడు నిర్ణయించిన నిష్కృతీ విధానం. దేవుడు సమస్తం తెలిసినవాడు, ఎంతో వివేచనా పరుడు. తోటివిశ్వాసిని బుద్ధిపూర్వకంగా హతమార్చినవారికి మాత్రం నరకమే తగిన శిక్ష. అక్కడే అతను ఎల్లకాలం పడిఉంటాడు. అతనిపై దైవాగ్రహం, అభిశాపం విరుచుకు పడతాయి. దేవుడు అతనికోసం ఘోరమైన యాతన సిద్ధపరచి ఉంచాడు. (92,93)

విశ్వాసులారా! మీరు దైవమార్గంలో యుద్ధానికి బయలుదేరితే మీ శత్రువులెవరో, మిత్రులెవరో విచక్షణ చేసి చూడండి. (శత్రువర్గానికి చెందిన వ్యక్తి) ఎవరైనా ముందుకు వచ్చి మీకు సలాం చేస్తే మీరు తొందరపడి నీవు ముస్లిం కాదని అనకండి. దాని ద్వారా ప్రాపంచిక ప్రయోజనం పొందడమే మీ ఉద్దేశ్యమయి ఉంటే, దేవుని దగ్గర ఎన్నటికీ తరగని అనేక నిక్షేపాలు ఉన్నాయని తెలుసుకోండి. ఒకప్పుడు మీరు కూడా అలాంటి వారేకదా! ఆ తర్వాత దేవుడు మీకు ఎంతో మేలు చేశాడు. కాబట్టి ఇక నుంచి ఏదైనా చేయబోయేటప్పుడు కాస్త వెనుకాముందూ ఆలోచించి మరీచేయండి. మీరు చేసే ప్రతి పనినీ దేవుడు గమనిస్తూనే ఉంటాడన్న సంగతి విస్మరించకండి. (94)

విశ్వాసుల్లో ఎలాంటి కారణం లేకుండా ఇంట్లో ఉండిపోయేవారు, దైవమార్గంలో ధన ప్రాణాలు త్యజించి పోరాడేవారు- ఉభయులూ సమానులు కాలేరు. ఇంట్లో ఉండి పోయేవారి కన్నా ధనప్రాణాలతో పోరాడేవారికి దేవుడు గొప్ప హోదా, ఔన్నత్యాలు ప్రసాదిస్తాడు. శ్రేయో శుభాలకు సంబంధించిన దైవవాగ్దానం మటుకు అందరికీ వర్తిస్తుంది. కాని ప్రతిఫలంరీత్యా ఇంట్లో ఉండిపోయేవారికన్నా దైవమార్గంలో పోరాడే వారికి దేవుడు ఎక్కువ ఔన్నత్యభాగ్యం ప్రసాదిస్తాడు.[30] (అంటే) దేవుని దగ్గర అంతస్తులలో, మన్నింపులో, (దైవ)కారుణ్యంలో ఔన్నత్యం లభిస్తుందన్నమాట. దేవుడు గొప్ప క్షమాశీలి, అమిత దయామయుడు. (95,96)

30. తగిన శక్తి, అధికారాలతో పాటు, ప్రజలకు నేతృత్వం వహించగల నాయకుడు కూడా ఉన్నప్పుడు అధర్మం, అన్యాయాలను అంతమొందించడానికి అంతిమ సాధనం యుద్ధమేనని 74 నుండి 100 వరకుగల సూక్తులు ప్రస్ఫుటం చేస్తున్నాయి. అదీగాక ఇలాంటి పరిస్థితుల్లో ధర్మయుద్ధా నికి మించిన పుణ్యకార్యం మరేదీ లేదని కూడా ఈ క్రింది హదీసుల ద్వారా తెలుస్తోంది.

ఒకతను దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి "ధర్మయుద్ధానికి (జిహాద్‌కు) ప్రత్యామ్నాయం కాగల సత్కార్యం ఏదైనాఉంటే నాకు చెప్పండి" అన్నాడు. దానికి దైవప్రవక్త (సల్లం) "ధర్మయుద్ధానికి సమానమైన సత్కార్యం ఉన్నట్లు నాకు కన్పించడం లేదు" అన్నారు. ఆతర్వాత కాస్సేపటికి ఆయన ఇలా అన్నారు: "అయితే నువ్వొక పనిచెయ్యి. యోధులు వెళ్ళిపోయిన తర్వాత నీవు మసీదుకు వెళ్ళి ఎడతెగకుండా నమాజులు చేస్తూ ఉండు. అలాగే మధ్యలో ఒక్కసారి కూడా విరమించకుండా నిరంతరాయంగా ఉపవాసవ్రతాలు కూడా పాటిస్తూ ఉండు. మరి నువ్విలా చేయగలవా?" దానికా వ్యక్తి "ఇలా ఎవరు చేయగలరండీ?" అన్నాడు. (బుఖారి, ముస్లిం)

మరొక హదీసులో దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "అమరగతుడయిన ఒక్క వీర యోధుడు (షహీద్) తప్ప స్వర్గంలో ప్రవేశించిన ఏ వ్యక్తి కూడా ప్రపంచసంపదలన్నీ ఇచ్చినా సరే, తిరిగి ఇహలోకానికి పోవడానికి ససేమిరా ఇష్టపడడు. అమరగతుడయిన వీరయోధుడు అమరగతి (షహాదత్)కి సంబంధించిన గౌరవోన్నతులు చూసివుంటాడు గనక, అతను మళ్ళీ ఇహలోకానికెళ్ళి పదిసార్లయినా (యుద్ధంచేసి) వీరమరణం పొందాలని కోరుకుంటాడు." (బుఖారి, ముస్లిం)

దైవదూతలు తమకుతాము అన్యాయం చేసుకున్నవారి[31] ప్రాణాలు తీస్తూ “మీరిప్పుడు ఏస్థితిలో ఉన్నారు?” అని ప్రశ్నిస్తారు. దానికి వారు “మేము దేశంలో చాలా బలహీనులుగా, పీడితులుగా ఉండేవాళ్ళం” అనంటారు. అప్పుడు దైవదూతలు “దేవుని భూమి విశాలంగాలేదా మీరు ఉన్నచోటు నుంచి మరోచోటికి వలస పోవడానికి?” అని అడుగుతారు. అలాంటి వారికి నరక నివాసమే తగినశిక్ష. అది పరమ చెడ్డనివాసం. (97)

అయితే ఎటూ వెళ్ళలేని, ఎలాంటి దారీ తెన్నూ కానరాని బలహీనులు, పీడితులైన స్త్రీలు, పిల్లలు, పురుషులు మాత్రం (ఈశిక్ష నుంచి మినహాయించబడ్డారు). దేవుడు వారిని త్వరలోనే క్షమిస్తాడు. దేవుడు ఎంతోక్షమాశీలి, అమిత దయామయుడు. (98,99)

దైవమార్గంలో ఇల్లూవాకిలి వదలి వలస పోయేవారు పుడమిపై మంచి ఆశ్రయం, విశాలమైన చోటు, జీవనోపాధి పొందడానికి ఎంతో అవకాశం ఉంది. దేవుని వైపునకు, ఆయనప్రవక్త వైపునకు తన ఇంటి నుండి వలసపోయే వ్యక్తి దారిలో గనక మృత్యువాత పడితే, అతనికి ప్రతిఫలం ప్రసాదించే బాధ్యత దేవునిపై ఉంది. దేవుడు ఎంతో క్షమాశీలి, అమిత దయామయుడు. (100)

మీరు ఎక్కడికైనా ప్రయాణమై వెళ్తే నమాజ్‌ను తగ్గించి చేసుకోడంలో ఎలాంటి తప్పు లేదు.[32] ముఖ్యంగా అవిశ్వాసులు మిమ్మల్ని వేధిస్తారని భయముంటే అలా చేయవచ్చు. ఎందుకంటే వారు బహిరంగంగా మీతో విరోధానికి పాల్పడ్డారు. (101)

ప్రవక్తా! నీవు (యుద్ధ రంగంలో) ముస్లింల దగ్గరుండి వారికి నాయకత్వం వహించి నమాజు చేయడానికి ఉపక్రమించినప్పుడు వారిలో ఒక వర్గం ఆయుధాలు ధరించి నీతో పాటు నిలబడాలి. వారు సాష్టాంగప్రణామం చేసి ప్రార్థన ముగించగానే వెనక్కి వెళ్ళిపోవాలి. ఆ తరువాత ఇంకా ప్రార్థన చేయని రెండవ వర్గం వచ్చి నీతో కలసి ప్రార్థన చేయాలి. వారు కూడా ఆయుధాలు ధరించి అప్రమత్తులయి ఉండాలి. ఎందుకంటే మీరు గనక మీ ఆయుధాలు, ఇతర సామగ్రి విషయంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా వారు ఒక్కసారిగా మీపై విరుచుకుపడేందుకు కాచుకొని ఉంటారు.

---

31. వీరు ముస్లిములయినవారే. అయితే దైవప్రవక్త (సల్లం) ఆజ్ఞ ప్రకారం ఇస్లాం కేంద్రమైన మదీనాకు వలసపోకుండా తమ స్వస్థలంలోనే ఇస్లాం సంప్రదాయాలతో పాటు, బహుదైవారాధకుల ఆచారాలను కూడా పాటిస్తూ బహుదైవారాధకుల మధ్య అర్థముస్లింలుగా జీవిస్తూ ఉండేవారు.

32. శాంతి భద్రతలు నెలకొన్న సాధారణ పరిస్థితుల్లో ఒక ప్రయాణీకుడు ఒంటరిగాగాని, లేదా ఒకరికంటే ఎక్కువమంది ప్రయాణీకులు సామూహికంగాగాని నమాజు చేయవలసి వచ్చినప్పుడు నాలుగు రకాత్‌ల ఫర్జ్ నమాజ్‌లో రెండు రకాత్‌లు మాత్రమే చేయాలి. దీన్ని “ఖస్ర్ నమాజ్” అంటారు. అంటే జుహర్, అస్ర్, ఇషా వేళల్లో నాలుగు రకాత్‌లకు బదులు రెండు రకాత్‌లు మాత్రమే ఫర్జ్ నమాజ్ చేయాలి. సున్నత్, నఫిల్ నమాజులు చేయకపోయినా పరవాలేదు. చేస్తే మంచిదే. అయితే ఫజ్ర్ వేళలోని సున్నత్ నమాజ్, ఇషా వేళలోని విత్ర్ నమాజ్ మాత్రం వదలి పెట్టకూడదు. పోతే సామూహిక నమాజ్‌కు స్థానిక వ్యక్తి నాయకత్వం (ఇమామత్) వహించినప్పుడు అతని వెనుక నమాజ్ చేసే ప్రయాణీకుడు నాలుగు రకాత్‌ల ఫర్జ్ నమాజ్‌ని తగ్గించకూడదు. నాలుగు రకాత్‌లు పూర్తిగా పాటించాలి.



ఒకవేళ వర్షం వల్ల మీకేమైనా అసౌకర్యంగా ఉంటే, లేదా మీరు వ్యాధిగ్రస్తులయి ఉంటే ఆయుధాలు తీసి పక్కన పెట్టడంలో ఎలాంటి తప్పులేదు. అయినప్పటికీ మీ జాగ్రత్తలో మీరుండటం చాలా అవసరం. దేవుడు అవిశ్వాసుల కోసం అత్యంత అవమానకరమయిన యాతన సిద్ధపరచి ఉంచాడు. (102)

ఆవిధంగా (ప్రార్థన) ముగిసిన తరువాత మీరు నిల్చొని, కూర్చొని, పడుకొని ఎలాంటి స్థితిలో ఉన్నా దేవుణ్ణి స్మరిస్తూ ఉండండి. శాంతియుత వాతావరణం నెలకొనడం జరిగితే పూర్తి నమాజు చేయాలి. నిజానికి నమాజ్ విశ్వాసులు నియమం తప్పకుండా వేళకు విధిగా పాటించవలసిన విధ్యుక్తధర్మం. (103)

శత్రువర్గాన్ని వెంబడించడంలో ఏమాత్రం అలసత్వం ప్రదర్శించకండి. మీకు కష్టంగా ఉందంటే మీలాగే మీ శత్రువులు కూడా కష్టపడుతున్నారు. అయితే వారు ఆశించనిదాన్ని మీరు దేవునినుండి ఆశిస్తున్నారు. దేవుడు సర్వం ఎరిగినవాడు, ఎంతో వివేకవంతుడు. (104)

ముహమ్మద్! దేవుడు నీకు చూపిన మార్గం అనుసరించి నీవు ప్రజల వ్యవహారాలు పరిష్కరించడానికి మేము సత్యపూరితమైన గ్రంథాన్ని నీపై అవతరింపజేశాము. కనుక నీవు నీతిలేనివారి వైపు నిలబడి వాదించకు.[33] దేవుణ్ణి క్షమాభిక్ష అర్థిస్తూ ఉండు. ఆయన గొప్పక్షమాశీలి, అమిత దయామయుడు. ఆత్మద్రోహానికి పాల్పడేవాడిని ఎన్నటికీ సమర్థించకు. పాపాత్ముల్ని, విశ్వాసఘాతకుల్ని దేవుడు ఎన్నటికీ ప్రేమించడు. (105-107)

---

ఖస్ర్ నమాజ్ చేయడానికి బాటసారి తాను నివసించే ఊరి నుండి చేరుకునే ప్రాంతం కనీసం 77 కిలోమీటర్ల దూరం ఉండాలి. దానికి లోపుంటే ఖస్ర్ (తగ్గింపు) చేసే అనుమతి లేదు. అలాగే ఆ ప్రాంతంలో 15 రోజులకంటే తక్కువ కాలం గడిపే ఉద్దేశ్యమయి ఉండాలి. అంతకంటే ఎక్కువ రోజులుండే ఉద్దేశ్యమయితే ఖస్ర్ చేయకూడదు. పూర్తి నమాజ్ చేయాలి.

అలజడి, అల్లర్లతో యుద్ధవాతావరణం నెలకొని ఉన్న అసాధారణ పరిస్థితుల్లో కూడా ఫర్జ్ నమాజ్‌ని ఖస్ర్ (తగ్గించి) చేసుకోవచ్చు. అయితే ఆ స్థితిలో ఫర్జ్‌నమాజ్ రెండు రకాత్‌లు తప్పనిసరిగా చేయాలన్న నియమం లేదు. పరిస్థితిని బట్టి ఒక్క రకాత్ అయినా చేయవచ్చు. నమాజ్‌లో, ఇతర అంశాలలో కూడా సడలింపుకు అనుమతి ఉంది.

33. ఈ సూక్తిలో రెండు ముఖ్య విషయాలు చెప్పబడ్డాయి. (1) ఖుర్ఆన్ పూజా పురస్కారాలు, పెళ్ళిపేటాకులు, కర్మకాండలలో మాత్రమే మానవునికి మార్గం చూపడానికి రాలేదు. ఇది మానవాళికి సమస్త జీవనరంగాల్లో మార్గదర్శనం చేయడానికి అవతరించింది. ఇది సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యల్ని కూడా పరిష్కరించగోరుతున్నది. (2) పాలకులు, నాయకులు, న్యాయాధికారులు సమస్యల్ని పరిష్కరించడంలో తమవారు-పరాయివారు, ముస్లింలు-ముస్లిమేతరులు అన్న వివక్ష చూపకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలి.

మదీనాలో బషీర్ అనే ముస్లిం మరో ముస్లింకు చెందిన యుద్ధకవచం దొంగిలించాడు. అధికారులు దాన్ని ఆరాతీయడానికి ప్రయత్నించినప్పుడు బషీర్ ఆ దొంగసొత్తును ఒక యూదుని ఇంట్లో దాచిపెట్టాడు. కవచం యజమాని బషీర్ మీద అనుమానం వెలిబుచ్చాడు. అప్పుడు దైవ ప్రవక్త (సల్లం) కవచం సంగతి అడిగితే బషీర్, అతని బంధువులు కూడబలుక్కొని దొంగతనాన్ని

వీరు తమ చేష్టల్ని ప్రజల కంటబడకుండా దాచగలరుగాని దేవుని కంటబడకుండా దాచలేరు. వారు రాత్రివేళల్లో దేవుని అభీష్టానికి వ్యతిరేకంగా రహస్యమంతనాలు జరుపుతారు. కాని అప్పుడు కూడా దేవుడు తమను వెన్నంటి ఉంటాడన్న సంగతి మరచిపోతున్నారు. దేవుడు వారి చర్యలన్నిటినీ పరివేష్టించి ఉన్నాడు. (108)

(ముస్లింలారా!) ప్రపంచ జీవితంలో మాత్రం మీరు వారి పక్షాన వాదించగలరు. కాని ప్రళయదినాన వారిపక్షాన దేవుని ముందు ఎవరు వాదించగలరు? అసలక్కడ వారిని కాపాడే నాథుడెవరు? ఎవరైనా ఏదైనా పాపకార్యానికి పాల్పడటమో లేదా తనకు తాను అన్యాయం చేసుకోవడమో జరిగి ఆ తర్వాత దేవుని సన్నిధిలో క్షమాపణ చెప్పుకుంటే, దేవుడు గొప్పక్షమాశీలి, అపార దయామయుడని అతను తెలుసుకుంటాడు. దానికిబదులు ఎవరైనా పాపకార్యానికి పాల్పడితే ఆపాప దుష్ఫలితం అతడ్నే చుట్టుకుంటుంది. దేవుడు సమస్తవిషయాలు ఎరిగినవాడు, ఎంతో వివేకవంతుడు. (109-111)

ఎవరైనా ఏదైనా నేరం చేసి దాన్ని ఏపాపం ఎరగని అమాయకునిపై మోపితే, ఇక అతను ఘోరమైన అపనిందను, స్పష్టమైన పాపాన్ని మూటకట్టుకున్నట్లే. (112)

ముహమ్మద్! నీపై దేవుని కారుణ్యకటాక్షాలే గనక లేకుంటే (నీ పరిస్థితి ఏమై ఉండేదో), వారిలో ఒకవర్గం నిన్ను తప్పుత్రోవ పట్టించడానికి కంకణం కట్టుకుంది. కాని వారు తమనుతాము తప్ప ఎవరినీ తప్పుత్రోవ పట్టించలేరు. వారసలు నీకు వీసమెత్తు నష్టం కూడా కలిగించలేరు. దేవుడు నీపై దివ్యగ్రంథాన్ని, వివేకాన్ని అవతరింపజేసి నీకు తెలియని విషయాలెన్నో తెలియజేశాడు. ఆయన దయ నీపై ఎంతగానో ఉంది. (113)

---

ఆ యూదునిపైకి నెట్టివేశారు. యూదుడ్ని విచారిస్తే తానేపాపం ఎరగనని అన్నాడు.

అయితే బషీర్ బంధువులంతా బషీర్ వైపున వకాల్తా పుచ్చుకొని ఆ యూదుడు దైవప్రవక్త (స)ను నిరాకరించిన అవిశ్వాసి అయినందున అతని మాటలు నమ్మకూడదని, తాము చెబుతున్నదే నిజమని గట్టిగా వాదించారు. ఈ వాదన విన్న దైవప్రవక్త (స) బషీర్‌కు అనుకూలంగా తీర్పివ్వడానికి సిద్ధమయ్యారు. సరిగ్గా ఆ సమయంలో ఈ సూక్తులు(105-113) అవతరించాయి. అప్పుడు దైవప్రవక్త (స) ఆ ముస్లింకు వ్యతిరేకంగా, యూదునికి అనుకూలంగా తీర్పిచ్చారు.

కోర్టుకు కళ్ళుండవన్న సంగతి అందరికీ తెలిసిందే. న్యాయాధికారి వ్యవహార పరిష్కారంలో ఎంత సమర్థుడైనప్పటికీ తన ముందుకు వచ్చిన సాక్ష్యాలు, వాదనలను బట్టే తీర్పివ్వగలడు. మతం ముసుగు కప్పుకున్న దుర్మార్గులను గుర్తించడం చాలా కష్టమైన పని. అందువల్ల ఇస్లామీయ పాలనలో ఒక్కోసారి అమాయకులైన ముస్లిమేతరులు సైతం శిక్షకు గురయ్యే ప్రమాదం ఉంటుంది. అలాంటి స్థితిలో దైవప్రవక్త (సల్లం) ముస్లిమేతరుల పట్ల అన్యాయానికి పాల్పడే ముస్లింలను హెచ్చరిస్తూ ఇలా అన్నారు:

“ఎవరైనా ఒక ముస్లిం (ఇస్లామీయ రాజ్యంలో) ఒడంబడికదారుడైన ముస్లిమేతర పౌరునిపై దౌర్జన్యం చేసినా, అతని హక్కు కాజేసినా, అతని శక్తికి మించిన (రక్షణరుసుం) భారం వేసినా, లేదా అతని వస్తువేదైనా బలవంతంగా తీసుకున్నా ప్రళయదినాన దైవన్యాయస్థానంలో జరిగే విచారణలో నేను ఆ ముస్లిమేతరుని తరపున న్యాయవాదిగా నిలబడతాను.” (అబూదావూద్)



సాధారణంగా ప్రజలు జరిపే రహస్యమంతనాలలో ఎలాంటి శ్రేయస్సు ఉండదు. అయితే దానధర్మాలను గురించి రహస్యంగా ఏదైనా హితోపదేశం చేస్తే లేదా మరేదైనా సత్కార్యం చేయడానికో లేక ప్రజల వ్యవహారాలు చక్కదిద్దడానికో ఎవరితో ఏదైనా అంటే అందులో ఎలాంటి అభ్యంతరం లేదు. అది మంచి విషయమే. ఎవరైనా దేవుని ప్రసన్నత కోసం ఇలా చేస్తే అతనికి మేము గొప్ప ప్రతిఫలం ప్రసాదిస్తాము. (114)

సన్మార్గం ఏమిటో స్పష్టమైపోయినా దైవప్రవక్తను ధిక్కరిస్తూ విశ్వాసులు నడిచే దారి కాదని వేరే (పెడ)దారి పట్టి నడిచేవాడ్ని మేము అతను నడిచే దారినే నడిపిస్తాం. (చివరికి) మేము అతడ్ని నరకంలోకి త్రోసివేస్తాము.[34] అది పరమ చెడ్డస్థలం. దేవుడు తనకు సాటి కల్పించడాన్ని ఎట్టి పరిస్థితిలోనూ క్షమించడు. అది తప్ప మరే పాపాన్నయినా తాను తలచుకుంటే క్షమించగలడు. దేవునికి సాటికల్పించినవాడు సన్మార్గానికి బహుదూరం పోయి పడినట్లే. వారు నిజదేవుడ్ని వదలి దేవతలనబడే స్త్రీ (విగ్రహా)లను పూజిస్తున్నారు. వారసలు స్వామిద్రోహి అయిన షైతాన్‌ని ఆరాధిస్తున్నారు. (115-117)

షైతాన్‌ని దేవుడు శపించాడు. అతను దేవునితో ఇలా అన్నాడు: “నేను నీ దాసులలో ఓ నిర్ణీత వర్గాన్ని తప్పకుండా మార్గభ్రష్టుల్ని చేస్తాను. నేను వారిలో అనేక భ్రమలు కల్పిస్తాను. నేనిచ్చే ఆదేశంతో వారు పశువుల చెవులు చీల్చివేస్తారు; దైవసృష్టిని తారుమారు చేస్తారు.”

దేవుడ్ని వదలి ఇలాంటి షైతాన్‌ని సంరక్షకునిగా చేసుకున్నవారు ఘోరంగా నష్టపోతారు. వాడు మానవులకు (నోరూరించే) వాగ్దానాలు చేసి వారిలో (లేనిపోని) ఆశలు రేకెత్తిస్తాడు. కాని షైతాన్ వాగ్దానాలన్నీ వట్టి బూటకం, మోసం మాత్రమే. (118-120)

అలాంటి వారికి నరకమే (అంతిమ) నివాసం అవుతుంది. అక్కడ్నుంచి వారు ఏ విధంగానూ బయటపడలేరు. దీనికిభిన్నంగా సత్యాన్ని విశ్వసించి సదాచార సంపన్నులైన వారిని మేము సెలయేరులు ప్రవహించే (స్వర్గ) వనాలలో ప్రవేశింపజేస్తాము. అక్కడే వారు కలకాలం (హాయిగా) ఉంటారు. ఇది దేవుడు చేస్తున్న నిజమైన వాగ్దానం. దేవుని మాటకన్నా ఎవరిమాట ఎక్కువ నిజమవుతుంది? (121-122)

ఫలితం మీ కోరికలపైగాని, గ్రంథప్రజల కోరికలపైగాని ఆధారపడి ఉండదు. ఎవరైనా సరే చెడ్డ పని చేస్తే అతను దాని పర్యవసానం అనుభవిస్తాడు. ఇక దైవాభీష్టానికి

---

34. నిసా (స్త్రీలు) అధ్యాయంలోని 105,106 సూక్తులకు రాసిన పాదసూచికలో బషీర్ అనే కపటముస్లిం దొంగతనంచేసి దాన్ని ఏ పాపమెరుగని ఒక యూదునికి అంటగట్టిన సంగతి చదివే ఉంటారు. ఆ వ్యవహారంలోని నిజానిజాలేమిటో దేవుడు తెలియజేసిన తరువాత దైవప్రవక్త (సల్లం) ఆ కపటిముస్లింకు వ్యతిరేకంగా తీర్పిచ్చిన సంగతి కూడా తెలిసిందే. ఈ తీర్పుతో ఖంగుతిన్న ఆ దుర్మార్గుడు ఇస్లాంకు విముఖుడయి పోయాడు. అంతటితో ఆగకుండా అతను మక్కా వెళ్ళి అవిశ్వాసులతో కలసి ఇస్లాంకు, దైవప్రవక్త (సల్లం)కు బద్ధశత్రువై పోయాడు. అతను అవలంబించిన ఈ దుష్ట వైఖరినే ఈ సూక్తిలో ఎండగట్టడం జరిగింది.

వ్యతిరేకంగా అతనికి ఎలాంటి సహాయం, సమర్థింపులు లభించవు.[35] స్త్రీలయినా పురుషులయినా విశ్వసించినవారయి ఉండి సత్కార్యాలు చేస్తే తప్పకుండా స్వర్గంలో ప్రవేశిస్తారు. వారికి ఏమాత్రం అన్యాయం జరగదు. (123-124)

ఒక వ్యక్తి తనను తాను దేవునికి పూర్తిగా సమర్పించుకొని తదనుగుణంగా తన నడవడికను సరిదిద్దుకున్నాడు. అతను ఇబ్రాహీం సంప్రదాయాన్ని కూడా పాటిస్తున్నాడు, దేవుడు తన మిత్రుడిగా చేసుకున్న ఇబ్రాహీం సంప్రదాయాన్ని. ఇలాంటి వ్యక్తి జీవితం కంటే మరెవరి జీవితవిధానం శ్రేష్ఠమైనదవుతుంది? భూమ్యాకాశాల్లో వున్న సమస్తం దేవునివే. ఆయన ప్రతి వస్తువునీ పరివేష్ఠించి ఉన్నాడు. (125-126)

ప్రజలు నిన్ను స్త్రీల విషయంలో (దేవుని) ఆజ్ఞ ఏమిటని అడుగుతున్నారు. వారికిలా సమాధానమివ్వు: "దేవుడు మీకీ విషయంలో తన ఆజ్ఞ తెలియజేస్తున్నాడు. దాంతోపాటు ఈ గ్రంథంలో ఇదివరకు మీకు తెలిపిన ఆజ్ఞలు కూడా గుర్తుచేస్తున్నాము. అంటే (మీ సంరక్షణలో వుండే) అనాథ బాలికల గురించిన ఆజ్ఞలు. వారి హక్కులు మీరు నెరవేర్చరు; వారికి పెళ్ళిళ్ళు చేసి పంపరు. (లేదా పేరాశతో స్వయంగా మీరే వారిని పెళ్ళాడగోరుతారు.) అలాగే బలహీనులైన పసిపిల్లలకు సంబంధించిన ఆజ్ఞలు కూడా. అనాథబాలల విషయంలో న్యాయంగా వ్యవహరించాలని దేవుడు మిమ్మల్ని ఉపదేశిస్తున్నాడు. మీరు ఏ మంచిపని చేసినా అది దేవునికి తెలుస్తుంది. (127)

ఏ స్త్రీ అయినా భర్త తనను వేధిస్తున్నాడని లేదా సరిగా ఆదరించడంలేదని భావించి నప్పుడు భార్యాభర్తలు పరస్పరం సంప్రదించుకొని సర్దుకుపోతే అందులో

---

35. షాహ్ అబ్దుల్‌ఖాదర్ ముహద్దిస్ (రహ్మలై) దీన్ని గురించి ఇలా వ్యాఖ్యానించారు:

"గ్రంథప్రజలు తాము దేవుని దాసులమని, ఇతరులు ఏ పాపాలకు దేవుని దగ్గర పట్టుబడతారో తామా పాపాలకు పట్టుబడమని, తమ ప్రవక్తలు తమను ఆదుకుంటారని భావిస్తున్నారు. ముస్లింలలో కూడా అజ్ఞానులు తమను గురించి ఇలాగే భావిస్తున్నారు. కాని చెడ్డపని ఎవరు చేసినా శిక్ష అనుభవిస్తాడని, అతనికి ఎవరి సహాయం లభించదని దేవుడు తెలియజేస్తున్నాడు."

యూదులు తమల్ని తాము అందరికన్నా ఎంతో పవిత్రులమని చెప్పుకోవడమేగాక, తాము ఏం చేసినా స్వర్గం తమకు తప్పకుండా లభిస్తుందని భావిస్తారు. హిందువుల్లో కూడా ఒకవర్గం అందరికంటే ముందు తమకే బ్రహ్మత్వం ప్రాప్తమవుతుందని భావిస్తోంది. క్రైస్తవుల్లో అత్యధిక మంది తాము ఎన్ని పాపాలు చేసినా ఏసు ప్రభువు తమను రక్షిస్తాడని తలుస్తున్నారు.

దురదృష్టవశాత్తు నేటి ముస్లింలలో కూడా ఒక వర్గం దాదాపు ఇలాంటి భ్రమలకే లోనయి ఉంది. ముఖ్యంగా అజ్ఞానులు, స్వార్థపరులు, సత్కర్మలు ఆచరించడానికి బద్ధకించేవారు తాము ఎన్ని చెడుగులలో కూరుకుపోయినా తమ ప్రవక్త (సల్లం) తమను ఆదుకుంటారని, దేవుని దగ్గర తమను గురించి సిఫారసు చేస్తారని భావిస్తున్నారు. ఈ భావనే వారిని మరిన్ని చెడులలోకి నెట్టి వేస్తోంది. మరోవైపు ఈ తప్పుడు భావనతో వారు దైవప్రవక్త (సల్లం)ను దేవుని స్థాయికి చేర్చారు. వీరి హృదయాల్లో దైవప్రేమ, దైవభీతులకన్నా ప్రవక్తాభిమానమే ఎక్కువగా పరవళ్ళు తొక్కుతుంది. అందుకే దైవాజ్ఞలు బహిరంగంగా కాలరాయబడుతున్నా వీరికి చీమకుట్టినట్లు కూడా ఉండదు.



తప్పులేదు. అసలు వారు సర్దుకుపోవడమే సర్వదా శ్రేయస్కరం. హృదయాలు సంకుచితత్వం వైపు ఎక్కువగా మొగ్గుతాయి. అయితే మీరు పరస్పరం శ్రేయోభిలాషతో, దైవభీతిపరాయణతతో వ్యవహరిస్తూ ఉండండి. మీరు చేసే పనులన్నిటినీ దేవుడు గమనిస్తూనే ఉన్నాడు. (128)

భార్యలందరి పట్ల సమాన దృష్టితో మసలుకుంటూ వారికి పూర్తిన్యాయం చేకూర్చడం మీ శక్తికి మించిన పని. మీరు తలచినా అలా చేయలేరు. అయినా మీరు ఒక భార్య వైపు పూర్తిగా మొగ్గి మరొకామెను డోలాయమాన స్థితిలో పడవేయకండి.[36] మీ వైఖరి సరిదిద్దుకొని దేవునికి భయపడుతూ మసలుకోండి. దేవుడు గొప్ప క్షమాశీలి, అమిత దయామయుడు. ఒకవేళ దంపతులిరువురూ విడిపోవడానికే నిర్ణయించుకుంటే దేవుడు తన అపార శక్తియుక్తులతో వారిని ఒకరిపై మరొకరు ఏమాత్రం ఆధారపడని వారిగా చేయగలడు. దేవుడు సర్వోపగతుడు, ఎంతో వివేచనాపరుడు. (129,130)

భూమ్యాకాశాల్లో ఉన్న సమస్తం దేవునిదే. నీకు, నీకుపూర్వం గ్రంథం ఇవ్వబడిన వారికి కూడా మేము దేవునిపట్ల భయభక్తులు కలిగిఉండాలనే ఆదేశించాం. ఒకవేళ మీరు (మా) ఆదేశాన్ని అంగీకరించకపోతే పోనివ్వండి. భూమ్యాకాశాల్లో ఉన్న సమస్తం దేవునిదే. ఆయన నిరపేక్షాపరుడు, ఎంతో ప్రశంసనీయుడు. దేవుడే భూమ్యాకాశాల్లోవున్న సమస్తానికి యజమాని. కార్యసఫలతకు ఆయన ఒక్కడే చాలు. (131-132)

దేవుడు తలచుకుంటే మిమ్మల్ని తొలగించి మీ స్థానంలో ఇతరుల్ని తీసుకు రాగలడు. అలా చేయడం ఆయనకు పెద్ద కష్టమేమీ కాదు. కేవలం ఐహిక ప్రతిఫలం కోరుకునేవాడు, దేవుని దగ్గర ఐహిక ప్రతిఫలంతో పాటు పరలోక ప్రతిఫలం కూడా ఉందని తెలుసుకోవాలి. దేవుడు సమస్తం వింటున్నాడు, చూస్తున్నాడు. (133-134)

విశ్వాసులారా! న్యాయానికి కట్టుబడి ఉండండి. స్వయంగా మీకుగాని, మీ తల్లి దండ్రులకుగాని లేదా మీ బంధువులకుగాని నష్టం వాటిల్లినాసరే దేవుని కోసం నిజమైన సాక్ష్యం ఇవ్వండి. కక్షిదారుడు ధనికుడైనా, పేదవాడైనా వారి విషయంలో మీకంటే దేవుడే ఎక్కువ శ్రేయోభిలాషి. కనుక మీరు మీ మనోవాంఛల్ని అనుసరిస్తూ న్యాయానికి తిలోదకాలు ఇవ్వకండి. ఒకవేళ మీరు విషయాన్ని వక్రీకరిస్తే లేదా నిజాన్ని దాటవేస్తే మీరు చేసేదంతా దేవుడు గమనిస్తుంటాడని తెలుసుకోండి. (135)

విశ్వాసులారా! అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను, ఆయన తన ప్రవక్తపై అవతరింపజేసిన దానిని (ఖుర్ఆన్‌ని), అంతకు పూర్వం అవతరింపజేసిన (తౌరాత్, ఇన్జీల్ మొదలైన) వాటిని (మనస్ఫూర్తిగా) విశ్వసించండి. దేవుడ్ని, ఆయన దూతల్ని, ఆయన గ్రంథాల్ని, ఆయన ప్రవక్తల్ని, ప్రళయదినాన్ని విశ్వసించడానికి నిరాకరించిన వాడు మార్గభ్రష్టత్వంలో పడి బహుదూరం కొట్టుకుపోయినట్లే.

సత్యాన్ని విశ్వసించిన తర్వాత తిరస్కరించి, మళ్ళీవిశ్వసించి, తిరిగి తిరస్కరించి, చివరికి ఆ తిరస్కార ప్రవాహంలోనే కొట్టుకుపోయే వారిని దేవుడు ఎన్నటికీ క్షమించడు.

వారికిక సన్మార్గం చూపడం కూడా జరగదు. (136-137)

ప్రవక్తా! విశ్వాసుల్ని వదలి అవిశ్వాసులతో స్నేహంచేసే కపటులకు దుర్భరమయిన (నరక) శిక్ష పడుతుందని శుభవార్త విన్పించు! వీరు గౌరవమర్యాదల కోసం వారి దగ్గరకు వెళ్తున్నారా? కాని గౌరవమర్యాదలన్నీ దేవుని చేతిలోనే ఉన్నాయి. (138-139)

ఎక్కడైనా దేవుని సూక్తులు నిరాకరిస్తూ, వాటిని అపహాస్యం చేయడం చూస్తే, జనం ఆ విషయం మార్చి వేరే విషయం మాట్లాడనంతవరకూ మీరు వారి చెంత కూర్చోకండి. దీన్ని గురించి ఈ గ్రంథంలో మీకు ఇదివరకే ఆజ్ఞ ఇవ్వబడింది. (ఈ విషయం విస్మరించి) మీరిలా చేస్తే మీరు కూడా వారి మాదిరిగానే అయిపోతారు. త్వరలోనే దేవుడు కపటుల్ని, అవి శ్వాసుల్ని నరకంలో ఒకచోట సమీకరిస్తాడు. (140)

ఈ కపటవిశ్వాసులు మీపరిస్థితి గమనిస్తూ అవకాశంకోసం ఎదురుచూస్తున్నారు. దేవుని దయవల్ల మీకు విజయం లభిస్తే "మేము మీతోపాటు లేమా?" అంటారు వారు. సత్యతిరస్కారులకు విజయం లభించే సూచనలు కన్పిస్తే వారితో "మీకు వ్యతిరేకంగా పోరాడే శక్తి మాకు లేదా? అయినప్పటికీ మేమలా చేయకుండా ముస్లింల నుండి మిమ్మల్ని కాపాడాము" అని అంటారు. వీరందరి వ్యవహారాల్ని గురించి దేవుడు స్వయంగా (రేపు) ప్రళయదినాన తీర్పు నిస్తాడు. దేవుడు విశ్వాసులపై (సత్యతిరస్కారులయిన) అవిశ్వాసులకు ఎన్నటికీ ఆధిక్యత నివ్వడు. (141)

ఈ కపటులు దేవుణ్ణి మోసగింప జూస్తున్నారు. కాని దేవుడే వారిని మోసగిస్తున్నాడు. (ఆ సంగతి వారు గ్రహించడం లేదు.) వారు ప్రార్థన చేయడానికి నిల్చుంటే బద్ధకం చేస్తూ కేవలం లోకుల మెప్పుకోసం నిలబడతారు. పైగా దేవుణ్ణి చాలాతక్కువగా స్మరిస్తారు.[37]వారు అటూఇటూ కాకుండా విశ్వాసం, అవిశ్వాసాల మధ్య ఊగిసలాడుతున్నారు. కనుక (ప్రవక్తా!) దేవుడు దారి తప్పించినవాడికి నీవు ఏమాత్రం దారి చూపలేవు. (142-143)

---

36. ఇద్దరు లేక అంతకన్నా ఎక్కువమంది భార్యలు ఉన్నప్పుడు పురుషుడు వారి మధ్య అన్ని విధాలా సమానత్వం పాటించలేడు. భార్యల మధ్య ఉండే అందం, వయస్సు, స్వభావం, ఆరోగ్యం మొదలైన వ్యత్యాసాల కారణంగా అతను వారందర్నీ సమాన దృష్టితో చూడటం, ఒకే విధంగా ప్రేమించడం సహజంగానే సాధ్యం కాదు. అయితే అంతమాత్రాన ఆకర్షణ లేని భార్యను పూర్తిగా విస్మరించి ఆకర్షణగల భార్యవైపు మొగ్గడం భావ్యం కాదు. ఇతర వ్యవహాలలో భార్యగా ఆమె హక్కులు గౌరవించాలి. లైంగిక వ్యవహారంలో పూర్తిగా సమానత్వం పాటించకపోయినా ఇతర వ్యవహారాల్లో మటుకు సంపూర్ణ సమానత్వం పాటించాలి.

"ఎవరికైనా ఇద్దరు భార్యలుండి, వారిద్దరి హక్కుల్ని న్యాయంగా, సమానంగా, సమంజసంగా నిర్వర్తించకపోతే, తీర్పుదినాన అతను సగం శరీరం కోల్పోతాడు. ఆ స్థితిలోనే (అర్ధ శరీరంతో సమాధి నుండి) లేచివస్తాడు" అన్నారు మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం). (తిర్మిజి)

37. కపటుల్ని గురించి ఇతర వివరాలకు 107:4-7సూక్తులు, వాటి పాదసూచిక చూడండి.



విశ్వాసులారా! మీరు తోటి విశ్వాసుల్ని కాదని అవిశ్వాసులతో స్నేహం చేయకండి. మీరు దేవుని సన్నిధిలో స్వయంగా మీ మీదనే నింద మోపుకోదలిచారా? వినండి, కపటులు నరకంలో అందరికంటే అట్టడుగు భాగాన ఉంటారు. వారికిక సహాయంచేసే వారెవరూ మీకు కన్పించరు. అయితే వారు (ఇహలోకంలోనే) పశ్చాత్తాపంచెంది తమ నడవడికను సరిదిద్దు కొని, దేవుడినే గట్టిగా నమ్ముకొని, దేవుని కోసమే తమ ధర్మాన్ని ప్రత్యేకించుకుంటే- అలాంటి వారు తిరిగి విశ్వాసులుగా పరిగణించబడతారు. త్వరలోనే దేవుడు విశ్వాసులకు మహోన్నత ప్రతిఫలం ప్రసాదిస్తాడు. మీరు గనగ కృతజ్ఞులయి విశ్వాసవైఖరి అవలంబిస్తే దేవుడు మిమ్మల్ని అనవసరంగా ఎందుకు శిక్షిస్తాడు? దేవుడు ఎంతో ఆదరించేవాడు, సర్వం తెలిసినవాడు కూడా. (144-147)

మనిషి తనకు అన్యాయం జరిగితే తప్ప ఎవరి విషయంలోనూ దుర్భాషకు దిగడాన్ని దేవుడు మెచ్చుడు.[38] దేవుడు సమస్తం వినేవాడు, సర్వం ఎరిగినవాడు. (అన్యాయం జరిగినప్పుడు నిరసన తెలివచ్చు) అయితే మీరు బహిరంగంగానూ, రహస్యంగానూ మంచినే చేస్తూ ఉండండి. లేదా కనీసం చెడు (పలికేవారి)ని క్షమాభావంతో ఉపేక్షించండి. అప్పుడు దేవుడు కూడా (మిమ్మల్ని) క్షమిస్తాడు. ఆయన ఎంతో శక్తిమంతుడు. (అయినప్పటికీ మీబలహీనతల్ని ఉపేక్షిస్తున్నాడని తెలుసుకోండి.) (148,149)

కొందరు దేవుణ్ణి, ఆయన ప్రవక్తల్ని విశ్వసించడానికి నిరాకరిస్తారు. దేవునికి, ఆయన ప్రవక్తలకు మధ్య తారతమ్యాలు సృష్టించగోరుతూ "మేము కొందరిని నమ్ముతాం, కొందరిని నమ్మం" అంటారు. పైగా విశ్వాసం, అవిశ్వాసాల మధ్య ఓ

---

38. నోరు మంచిదైయితే ఊరు మంచిదవుతుందంటారు. నోరు ఎన్నెన్నో మంచి పనులు చేస్తుంది. మనిషి గౌరవమర్యాదల్ని పెంచి, సంఘంలో అతనికి మంచి స్థానం సమకూర్చి పెడ్తుంది. అయితే అదుపుతప్పితే ఈనోరే మనిషికి ఇహపరాల్లో ఎన్నో ఆపదలు తెచ్చిపెడ్తుంది. దేవుని దృష్టిలో నోటిదురుసు, దుర్భాష, అశ్లీలం తీవ్రమైన నేరాలు. వీటికి పరలోకంలో మనిషి నరకశిక్ష అనుభవించవలసి వస్తుంది. వీటిని గురించి దైవప్రవక్త(సల్లం) ఇలా ప్రవచించారు:

"ప్రళయదినాన విశ్వాసి త్రాసులో ఉంచబడే అత్యంత బరువైన వస్తువు అతని సత్ప్రవర్తనే. నోటితో అశ్లీల మాటలు పలికేవాణ్ణి, దుర్భాషలాడేవాణ్ణి దేవుడు అసహ్యించుకుంటాడు." (తిర్మిజి)

కొందరు పైకి ఎంతో భక్తిపరాయణులుగా కన్పించినా, వారు తమ నోటితో ఇతరుల్ని తరచుగా బాధిస్తుంటారు. అలాంటివారికి ఈ క్రింది హదీసు చక్కని గుణపాఠం.

ఒక వ్యక్తి దైవప్రవక్త (సల్లం) దగ్గరకు వచ్చి "ఫలానా స్త్రీ ఎన్నో నఫిల్ (ఐచ్ఛిక) నమాజులు చేస్తుంది. మరెన్నో నఫిల్ ఉపవాసాలు పాటిస్తుంది. (పెద్దఎత్తున) దానధర్మాలు కూడా చేస్తుంది. ఈ సత్కార్యాలలో ఆమె పేరుపొందింది. కాని ఆమె తరచుగా నోటితో ఇరుగుపొరుగువారిని బాధిస్తుంది"అన్నాడు. దానికి దైవప్రవక్త (సల్లం) "అయితే ఆమె నరకానికి పోతుంది"అన్నారు. తిరిగి ఆవ్యక్తి ఇలా అన్నాడు: "దైవప్రవక్తా! ఫలానా స్త్రీ నఫిల్ ఉపవాసాలు చాలా అరుదుగా పాటిస్తుంది. నఫిల్ నమాజులు కూడా చాలా తక్కువగానే ఆచరిస్తుంది. అప్పుడప్పుడు కొన్ని జున్ను గడ్డల్ని దానం చేస్తుందని ప్రతీతి. అయితే ఆమె తన నోటితో ఇరుగుపొరుగువారిని బాధించదని జనం చెప్పుకుంటారు." దైవప్రవక్త ఈమాట విని "ఆమె స్వర్గనివాసి అవుతుంద"ని చెప్పారు. (మిష్కాత్)

(కొత్త) మార్గం కనిపెట్ట దలిచారు. ఇలాంటివారే కరుడుగట్టిన అవిశ్వాసులు. అవిశ్వాసుల కోసం మేము అత్యంత అవమాన కరమైన యాతన సిద్ధపరచి ఉంచాము. (150-151)

దీనికి భిన్నంగా దేవుడ్ని, ఆయన ప్రవక్తలను విశ్వసించి, వారి మధ్య ఎలాంటి తార తమ్యాలు సృష్టించనివారికి మేము తప్పకుండా తగిన ప్రతిఫలం ప్రసాదిస్తాము. దేవుడు గొప్ప క్షమాశీలి, అమిత దయామయుడు. (152)

(ముహమ్మద్!) ఈ గ్రంథప్రజలు తమపై ఆకాశం నుండి నేరుగా ఒక గ్రంథాన్నే అవతరింపజేయమని నిన్ను అడుగుతున్నారు. కాని వీరు గతంలో మూసాను ఇంత కంటే దారుణమైన కోర్కెలనే కోరారు. వారు తమకు దేవుడ్నే ప్రత్యక్షంగా చూపమని మూసాను అడిగారు. ఆ తలబిరుసు వైఖరి కారణంగానే వారిపై హఠాత్తుగా పిడుగు పడింది. (కాని దానివల్ల కూడా వారు గుణపాఠం నేర్చుకోలేదు.)

ఆ తర్వాత వారు (తమ ప్రవక్త హితవుల్ని పెడచెవినపెట్టి) ఆవుదూడను దైవంగా చేసుకొని పూజించడం ప్రారంభించారు. వారు ఇంతకు ముందు ఎన్నో మహిమలు చూసివున్నారు. (అయినా వారు మళ్ళీ అపమార్గంలోనే పడిపోయారు.) సరే, అంతటి ఘోరానికి పాల్పడినా మేము వారి తప్పుల్ని ఉపేక్షించాం. మేము మూసాకు స్పష్టమైన ఆజ్ఞావళిని (అంటే రాతిపలకలపై రాయబడిన పది ఆజ్ఞలను) ప్రసాదించాము. (153)

ఆ తరువాత (ఈ ఆజ్ఞావళిని శిరసావహించే విషయంలో) వారిపె తూర్ పర్వతాన్ని ఎత్తిపట్టి వారిచేత ప్రమాణం చేయించాము. (మరొకసారి) మేము వారిని, నగరద్వారం గుండా సాష్టాంగపడుతూ లోపలికి ప్రవేశించమని ఆదేశించాము. (వేరొకసారి) మేము వారికి సబ్బత్ (శనివారం)నియమం ఉల్లంఘించవద్దని చెప్పాము.[39] ఈ విషయం లోనూ వారిచేత ప్రమాణం చేయించాము. (కాని దానికీ వారు కట్టుబడి ఉండలేదు.)

ఈవిధంగా వారు (ఎన్నో) ప్రమాణాలు ఉల్లంఘించారు. వారు దేవుని సూక్తులు తిరస్కరించారు. అనేక మంది దైవప్రవక్తల్ని అన్యాయంగా హతమార్చారు. ఇంతచేసి కూడా (వారు తమ ఆత్మశుద్ధిని పొగడుకుంటూ) తమ హృదయాలు గలేబులలో భద్రంగా ఉన్నాయని చెప్పుకున్నారు. వీటన్నిటి కారణంగానే (దేవుడు వారిని శపించాడు). నిజానికి వారి తిరస్కారం, తలబిరుసుతనాల మూలంగా దేవుడు వారి హృదయ కవాటాలు మూసివేశాడు. అందువల్లనే వారు చాలా తక్కువగా విశ్వసిస్తారు. (154-155)

అంతేకాదు, వారు తమ అవిశ్వాస వైఖరిలో మరింత ముందుకుపోయి మర్యం మీద ఘోరమైన అపనింద కూడా మోపారు. పైగా వారు (సిగ్గు విడిచి) "మేము మర్యం కుమారుడు ఈసా మసీహ్ దైవప్రవక్తను చంపేశాం" అని చెప్పసాగారు. కాని వారసలు ఆయన్ని చంపలేదు. సిలువపై ఎక్కించనూ లేదు. ఆ విషయంలో వారు అనుమానాలకు గురిచేయబడ్డారు. దానిపై విభిన్న అభిప్రాయాలు వెలిబుచ్చినవారు కూడా అనుమానంలోనే పడిపోయారు. దాన్ని గురించి వారి దగ్గర ఎలాంటి జ్ఞానం

39. వివరాలకు 2:65 సూక్తి, దాని పాదసూచిక చూడండి.



లేదు. ఊహాగానాలు మాత్రమే చేస్తున్నారు. నిస్సందేహంగా వారు మసీహ్‌ని చంపలేదు; దేవుడు ఆయన్ని తన వైపు ఎత్తు కున్నాడు.[40] దేవుడు సర్వశక్తిమంతుడు, అత్యంత వివేకవంతుడు. (156-158)

గ్రంథప్రజలలో ఏ ఒక్కడూ ఈసా మరణానికి పూర్వం విశ్వసించకుండా ఉండడు. ప్రళయదినాన అతను వారికి వ్యతిరేకంగా (దేవుని ముందు) సాక్ష్యమిస్తాడు. (159)

యూదులుగా మారినవారు (ఈవిధంగా) ఎన్నో అన్యాయాలు, అక్రమాలకు పాల్పడ్డారు. వారు దైవమార్గంలో ఆటంకాలు సృష్టిస్తారు. వడ్డీ నిషేధించబడినప్పటికీ వారు దాన్ని (నిస్సంకోచంగా) తీసుకుంటారు. ప్రజల సొమ్మును అక్రమపద్ధతుల ద్వారా కాజేస్తారు. ఈ కారణాల వల్ల మేము గతంలో ధర్మసమ్మతం చేయబడిన అనేక పరిశుద్ధ వస్తువుల్ని వారికి నిషేధించాము. వారిలో అవిశ్వాసులైనవారి కోసం మేము దుర్భరమైన (నరక) యాతనల్ని సిద్ధపరచి ఉంచాము. (160-161)

అయితే వారిలో పరిపూర్ణజ్ఞానం కలవారు, విశ్వసనీయులు నీపై అవతరించిన దాన్ని, నీకు పూర్వం అవతరించినవాటిని విశ్వసిస్తున్నారు. ఇలాంటి విశ్వాసులకు, నమాజ్ జకాత్ విధుల్ని పాటించేవారికి; దేవుడ్ని, అంతిమ దినాన్ని దృఢంగా నమ్మేవారికి మేము తప్పకుండా గొప్ప ప్రతిఫలం ప్రసాదిస్తాము. (162)

(ముహమ్మద్!) మేము నూహ్‌కు, అతని తర్వాత వచ్చిన ప్రవక్తలకు ఏవిధంగా దివ్యజ్ఞానం అందజేశామో నీకూ అలాగే అందజేస్తున్నాము. మేము ఇబ్రాహీం, ఇస్మాయిల్, ఇస్‌హాఖ్, యాఖూబ్, యాఖూబ్ సంతానం, ఈసా, అయ్యూబ్, యూనుస్, హారూన్, సులైమాన్ (అలై)లకు దివ్యజ్ఞానం అందజేశాము. దావూద్ (అలై)కు జబ్బూర్ ప్రసాదించాం. నీకు పూర్వం వచ్చిన ప్రవక్తలలో కొందరి వృత్తాంతాలు నీకు తెలిపాము. అనేకమంది వృత్తాంతాలు తెలియజేయ లేదు. మేము మూసా (అలై)తో నయితే (ప్రత్యక్షంగా) సంభాషించాము. (163-164)

40. దీన్నిబట్టి ఈసాప్రవక్త (అలైహి)ను యూదులు సిలువపై చంపలేదని, ఆయన్ని పోలిన వేరే వ్యక్తిని చంపిఉంటారని తెలుస్తోంది. స్ట్రావుస్ అనే క్రైస్తవ పండితుడు "ఎ న్యూ లైఫ్ ఆఫ్ క్రైస్ట్" అనే గ్రంథంలో ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ "ఏసుక్రీస్తు అసలు సిలువ పైన్నే ఎక్కించబడలేదని, ఏసుకు బదులు సైమన్ అనే వ్యక్తి సిలువపై ఎక్కించబడ్డాడని" పేర్కొన్నట్లు ముహమ్మద్ ఖాసిం ఖాన్‌గారు తన వ్యాఖ్యాన సహిత ఖుర్ఆన్ అనువాదంలో తెలియజేశారు. అంతేకాదు, ఈ సూక్తిని బట్టి ఈసాప్రవక్త సహజ మరణం కూడా పొందలేదని, దేవుడు ఆయన్ని సజీవంగా, సశరీరంగా తన వైపు ఎత్తుకున్నాడని తెలుస్తోంది. (3:55 సూక్తి, దాని పాదసూచిక చూడండి.)

కొన్ని హదీసుల ప్రకారం ప్రళయానికి ముందు హజ్రత్ ఈసా (అలైహి) తిరిగి ప్రపంచం లోకి వస్తారని, ఆయన యూదుల నాయకుడయిన దజ్జాల్‌ని సంహరిస్తారని తెలుస్తోంది. అంటే దేవుడు ఏవిధంగా ఆయన్ని లోగడ సశరీరంగా తన వైపు ఎత్తుకున్నాడో, అదేవిధంగా ప్రళయానికి ముందు మళ్ళీ ఆయన్ని సశరీరంగా భూమిపై దించుతాడన్నమాట. ఒకహదీసు ప్రకారం ఆయన (సిరియాలోని) డెమాస్కస్ తూర్పు భూభాగాన ఒక తెల్లమినార్ వద్ద దిగుతారని తెలుస్తోంది.

ఈ ప్రవక్తలందరూ శుభవార్త నందజేసేవారిగా, హెచ్చరించేవారిగా చేసి పంపబడ్డారు. ఇలా దైవప్రవక్తలు వచ్చిన తర్వాత ప్రజలకు ఇక దేవుని దగ్గర సాకులు చెప్పడానికి ఆస్కారం ఉండదు. దేవుడు అసాధారణ శక్తిసంపన్నుడు, అత్యంత వివేకవంతుడు. కాని దేవుడు నీపై అవతరింపజేసినదానిని తన జ్ఞానసంపత్తితోనే అవతరింపజేశానని సాక్ష్యమిస్తున్నాడు. అందుకు దైవదూతలు కూడా సాక్షులుగా ఉన్నారు. అసలు ఒక్క దేవుని సాక్ష్యమే చాలు. (165,166)

కనుక దీన్ని నిరాకరించి, ఇతరుల్ని కూడా దైవమార్గంలోకి రాకుండా నిరోధించేవారు నిస్సందేహంగా మార్గభ్రష్టులై సత్యానికి బహుదూరం వెళ్ళిపోయారు. ఈవిధంగా తలబిరుసు, తిరుగుబాటు వైఖరి అవలంబించి అన్యాయం, అక్రమాలకు పాల్పడే వారిని దేవుడు ఎన్నటికీ క్షమించడు. ఆయన వారికిక నరకానికిపోయే దారితప్ప మరే దారీ చూపడు. నరకంలోనే వారు (నానాయాతనలు అనుభవిస్తూ) ఎల్లకాలం పడి ఉంటారు. ఇలా చేయడం దేవునికి ఏమంత కష్టమేమీ కాదు. (167-169)

మానవులారా! ఈ ప్రవక్త మీ ప్రభువు నుండి మీ దగ్గరకు సత్యాన్ని తీసుకొచ్చాడు. దాన్ని విశ్వసించండి, మీకు మేలు జరుగుతుంది. దాన్ని విశ్వసించడానికి నిరాకరిస్తే గుర్తుంచుకోండి, భూమ్యాకాశాల్లో వున్న సమస్తం దేవునిదే. ఆయన సమస్తం తెలిసినవాడు. ఎంతో వివేకవంతుడు. (కనుక మీరు ఆయన పట్టునుండి తప్పించుకోలేరు.) -(170)

గ్రంథప్రజలారా! మీరు మీధర్మం విషయంలో అతిశయానికి పోయి హద్దులు మీరకండి. సత్యం తప్ప దేవునికి మరే విషయాన్నీ ఆపాదించకండి. మర్యం కుమారుడు ఈసా మసీహ్ దేవుని ప్రవక్తలలో ఒక ప్రవక్త తప్ప మరేమీ కాదు. కాకపోతే ఆయన "మర్యం దగ్గరకు దేవుడు పంపిన ఒక ఆజ్ఞ; దేవుని దగ్గరనుండి (మర్యంకు) పంపబడిన ఒక ఆత్మ మాత్రమే."[41] (ఈ ఆజ్ఞ, ఆత్మలే మర్యం గర్భంలో బిడ్డరూపం సంతరించు

---

41. ఇక్కడ ఈసా ప్రవక్త (అలైహి)ను దేవుని ఆజ్ఞతో, ఆయన వైపునుండి పంపబడిన ఆత్మ (రూహుమ్మినల్లాహ్)తో పోల్చడం జరిగింది. అయితే క్రైస్తవులు అతిశయానికిపోయి ఈపదాన్ని దేవుని ఆత్మ (రూహుల్లాహ్)గా అర్థం తీసుకున్నారు. అలాగే ప్రవక్తలకు దైవసందేశం చేరవేసే దైవదూతను దేవుడు తన గ్రంథాల్లో "పరిశుద్ధాత్మ" అని వర్ణిస్తే, క్రైస్తవులు దీన్ని ఈసా (అలైహి)లో అంతర్లీనం చేయబడిన పవిత్రాత్మగా పరిగణించారు. ఈ విధంగా వారు భక్తి విశ్వాసాలలో హద్దు మీరిపోయి, తమ స్వయంకృత త్రిత్వం (Trinity)లో ఈసాప్రవక్త (అలైహి)ను కూడా ఒక దేవుడిగా చేసుకున్నారు. (ఇతర వివరాలకు 21:91, 32:9 సూక్తులు, వాటి పాదసూచికలు చూడండి.)

దైవప్రవక్తలను, మహాపురుషులను వారి నిష్క్రమణ తర్వాత ప్రజలు హద్దుమీరిన ప్రశంసలతో ఆకాశానికి ఎత్తడం, వారికి లేనిపోని అతీంద్రియ శక్తుల్ని ఆపాదించడం, చివరికి వారిని దేవుని స్థాయికి చేర్చడం అనాది నుంచి వస్తున్న అజ్ఞాన చర్యలే. అలాంటి పోకడలకు పోవద్దని దేవుడు ఈ సూక్తిలో క్రైస్తవులకు హితవుచేస్తూ, ఇటు ముస్లింలను కూడా పరోక్షంగా హెచ్చరిస్తున్నాడు.

కాని ఈనాడు కొందరు ముస్లింలలో కూడా ఈవ్యాధి చొచ్చుకువచ్చింది. వారు మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం)ని దాదాపు దేవుని స్థాయికి చేర్చారు. దేవునికి లాగే ఆయనకూ అగోచర జ్ఞానం



కున్నాయి.) కనుక మీరు దేవుణ్ణి, ఆయన ప్రవక్తల్ని విశ్వసించండి. ముగ్గురు (దేవుళ్ళు) అనకండి. అలా అనడం మానేస్తే మీకే క్షేమం. వాస్తవానికి దేవుడు ఒక్కడే. ఆయనకు కుమారుడు ఉన్నాడని అనడం తగదు. అలాంటి బలహీనతలకు దేవుడు అతీతుడు, ఎంతో పరిశుద్ధుడు. భూమ్యాకాశాల్లో ఉన్న సమస్తం దేవునిదే. అన్నిటికీ ఆయనే స్వామి, యజమాని. వాటిసంరక్షణ, నిర్వహణలకు ఆయన ఒక్కడే చాలు. (171)

మసీహ్ తాను దేవుని దాసులలో ఒక దాసుణ్ణని చెప్పుకోవడానికి ఎన్నడూ సిగ్గుపడలేదు. అత్యంత సన్నిహితులైన దైవదూతలు కూడా దాన్ని సిగ్గుచేటుగా భావించలేదు. ఒకవేళ ఎవరైనా దేవునికి దాస్యం చేయడం తనకు సిగ్గుచేటయిన విషయమని భావించి అహంకారం వహిస్తుంటే (అలాంటి వ్యక్తి ఒక విషయం తెలుసుకోవాలి), దేవుడు యావన్మందిని ఓ రోజు సమావేశపరచి తన ముందు నిలబెట్టుకుంటాడు. (172)

అప్పుడు విశ్వసించి సత్కార్యాలు చేసివున్నవారు తమకు రావలసిన ప్రతిఫలాన్ని పూర్తిగా పొందుతారు. దేవుడు తన ప్రత్యేక అనుగ్రహంతో వారికి మరింత సుకృతఫలం కూడా ప్రసాదిస్తాడు. పోతే దైవదాస్యాన్ని తమకు అవమానకరమయిన విషయంగా భావించి అహంకారం వహించినవారికి మటుకు దేవుడు దుర్భరమయిన (నరక) శిక్ష విధిస్తాడు. దేవుణ్ణి కాదని సహాయ సంరక్షణల కోసం వారు ఎవరెవరిని నమ్ముకున్నారో వారిలో ఏఒక్కరూ ఆరోజు వారిని ఆదుకోవడానికి ముందుకు రారు. (ఇలా నమ్ముకున్న వాళ్ళందర్నీ వారు నట్టేట ముంచుతారు.) (173)

---

ఉందని, ఆయనసలు మాననజాతికి చెందినవారే కాదని వాదిస్తున్నారు. అలాంటివారు ఖుర్ఆన్ లోని ఈ సూక్తుల్ని గురించి ఆలోచించాలి:

"యావత్తు భూమ్యాకాశాల్లో దేవుడు తప్ప మరెవరూ అగోచర జ్ఞానం (అతీంద్రియ జ్ఞానం) కలవారు లేరు." (27:65)

"దేవుడు మాత్రమే గోచర, అగోచరాలు ఎరిగినవాడు. వారు చేస్తున్న బహుదైవారాధన (షిర్క్)కు ఆయన ఎంతో అతీతుడు." (23: 92)

"ముహమ్మద్ (సల్లం) వారితో ఇలా అను:- నా దగ్గర దేవుని నిక్షేపాలు ఉన్నాయనిగాని, నేను అగోచర జ్ఞానం కలవాడిననిగాని నేను మీతో అనడం లేదు. నేను దైవదూతనని కూడా చెప్పుకోవడం లేదు." (6: 50)

"ప్రవక్తా! చెప్పు:- నేను మీలాంటి మానవుడ్నే. కాకపోతే మీ ఆరాధ్య దేవుడు ఒక్కడే అని నాకు దివ్యావిష్కృతి (వహీ) ద్వారా తెలియజేయబడుతోంది." (18: 110)

దైవప్రవక్త (సల్లం) ఓసారి రైతులతో "మీరు తోటలో అంటుకట్టడం వదిలేస్తే మంచిదేమో చూడండి" అన్నారు. దాంతో వారు అంటుకట్టడం మానేశారు. దానివల్ల ఆయేడు ఫలసాయం తగ్గిపోయింది. అప్పుడు దైవప్రవక్త (సల్లం) "నేను మానవుణ్ణి మాత్రమే. అంచేత నేను ధర్మవ్యవహారాలలో ఏదైనా ఆజ్ఞాపిస్తే దాన్ని పాటించండి. (ఇతర వ్యవహారాల్లో) నా సొంత అభిప్రాయంతో ఏదైనా చెబితే, (అందులో పొరపాటుండవచ్చు) నేను మానవుణ్ణి మాత్రమే" అన్నారు. (ముస్లిం)

మానవులారా! మీ ప్రభువు వైపు నుండి మీ దగ్గరికి స్పష్టమైన ప్రమాణం వచ్చింది. మేము (మీ అజ్ఞానాంధకారం దూరంచేసి రుజుమార్గం చూపడానికి) మీ దగ్గరకు స్పష్టమైన జ్యోతి పంపాము.

కనుక దేవుని సూక్తులు విశ్వసించి ఆయన చూపిన ధర్మాన్ని గట్టిగా ఆశ్రయించిన వారిని ఆయన తన కారుణ్యానుగ్రహాల (స్వర్గం)లోకి ప్రవేశింపజేస్తాడు. అంతేకాకుండా తన దగ్గరకు చేరుకోవడానికి తిన్నని మార్గం కూడా చూపుతాడు. (174-175)

ప్రజలు నిన్ను నిర్వారసుడి విషయంలో దైవాజ్ఞ ఏమిటని అడుగుతున్నారు. వారికి చెప్పు: దేవుడు మీకిలా తన ఆజ్ఞ విన్పిస్తున్నాడు-

ఎవరైనా సంతానరహితుడుగా చనిపోతే, అతనికి ఒక సోదరి మాత్రం ఉన్న పక్షంలో అతని ఆస్తిలో ఆమెకు అర్ధభాగం లభిస్తుంది. సోదరి గనక సంతానం లేకుండా చనిపోతే ఆమె సోదరుడే ఆమె ఆస్తికి వారసుడవుతాడు.

మృతునికి వారసులుగా ఇద్దరు సోదరీలు ఉన్నప్పుడు వారిద్దరికి అతని ఆస్తిలో మూడింట రెండు వంతుల ఆస్తి లభిస్తుంది. అనేకమంది అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు గనక ఉంటే స్త్రీలకు ఒకవాటా, పురుషులకు దానికి రెట్టింపు వాటా లభిస్తుంది.

మీరు దారితప్పి తిరగకుండా ఉండేందుకే దేవుడు ఈవిధంగా మీకు తన ఆజ్ఞల్ని విడమరచి తెలియజేస్తున్నాడు. ఆయన సమస్త విషయాలు ఎరిగినవాడు. (176) ✪

# 5. వడ్డించిన విస్తరి (మాయిదా)

**అవతరణ: మదీనా** **సూక్తులు: 120**

ఈ అధ్యాయాన్ని "మాయిదా" అంటారు (ఆహారపదార్థాలతో కూడిన విస్తరి). ఇది హుదైబియా ఒప్పందం తర్వాత హిజ్రీశకం ఆరో ఏట చివరి దినాల్లో లేక హిజ్రీ ఏడో ఏట ప్రారంభ దినాల్లో అవతరించింది. దీని ఇతివృత్తం గమనిస్తే మొత్తం అధ్యాయం ఒకేసారి అవతరించి ఉండవచ్చని తెలుస్తోంది. లేదా సందర్భానుసారం కొన్ని విషయాలు ఒకసారి, మరికొన్ని విషయాలు మరొకసారి కూడా అవతరించిఉండవచ్చు. తర్వాత ఇతివృత్తం రీత్యా వాటన్నిటినీ ఒకే అధ్యాయం క్రింద చేర్చబడ్డాయి. దీన్ని మూడు ప్రసంగాల సముదాయంగా పరిగణించవచ్చు.

మొదటి ప్రసంగంలో ముస్లింల ధార్మిక, సాంస్కృతిక, రాజకీయ రంగాలలో కొన్ని ఆజ్ఞలు పేర్కొనబడ్డాయి. రెండవ ప్రసంగంలో ముస్లింలు నీతినియమాలు పాటిస్తూ దైవధర్మంలో స్థిరంగా ఉండాలని, ఇస్లామేతర పద్ధతుల్ని, ద్వంద్వ ప్రమాణాలను వదలి వారు తమ వ్యవహారాలన్నిటినీ దైవాజ్ఞల ప్రకారమే పరిష్కరించుకోవాలని చెప్పడం జరిగింది. మూడవ ప్రసంగంలో యూదులు, క్రైస్తవులు తమ తప్పుడు మతవిశ్వాసాలు వదలి, అంతిమ దైవప్రవక్త (సల్లం)ను విశ్వసించి, ఆయన చూపే రుజుమార్గాన్ని అనుసరించాలని బోధించడం జరిగింది.



**కరుణామయుడు, కృపాసాగరుడయిన దేవుని పేరుతో ప్రారంభం**

విశ్వాసులారా! నియమ నిబంధనలను పూర్తిగా పాటించండి. ఇకముందు మీకు తెలియ జేయబోయేవి తప్ప పశువుల్ని పోలిన చతుష్పాదాలన్నీ మీ కోసం ధర్మసమ్మతం చేయబడ్డాయి. అయితే ఇహ్రాం (కాబాయాత్ర దీక్ష)లో ఉన్నప్పుడు మాత్రం వేటాడటాన్ని ధర్మసమ్మతం చేసుకోకండి. దేవుడు తానుతలచుకున్న ఆదేశం జారీచేస్తాడు. (1)

విశ్వాసులారా! దేవునికి సంబంధించిన (ధర్మ) చిహ్నాలను అగౌరపరచకండి. నిషిద్ధ మాసాల్లో ఏ మాసాన్ని ధర్మసమ్మతం చేసుకోకండి. బలిపశువుల్ని కొట్టకండి. దేవునికి అర్పించ డానికి మొక్కుబడి సూచనగా మెడలలో పట్టెడలు కట్టిన పశువుల్ని కూడా బాధించకండి. అలాగే తమ ప్రభువు అనుగ్రహం, ప్రసన్నతలను పొందే ఉద్దేశ్యంతో ప్రతిష్ఠాలయానికి (అంటే కాబాగృహానికి) పోయేవారి జోలికి కూడా పోకండి. ఇహ్రాం (దీక్ష) ముగిసిన తరువాత మీరు నిరభ్యంతరంగా (పశుపక్షాదులను) వేటాడవచ్చు.

జాగ్రత్త! కొందరు మిమ్మల్ని ప్రతిష్ఠాలయానికి పోకుండా నిరోధించారన్న ఆగ్రహంతో మితిమీరి వారిపై దౌర్జన్యం చేయకూడదు సుమా!! సత్కార్యాల్లో, దైవభక్తికి సంబంధించిన పనుల్లో పరస్పరం సహకరించుకోండి. అంతేగాని, పాపకార్యాల్లో, హింసాదౌర్జన్యాల్లో మాత్రం ఎవరితోనూ సహకరించకూడదు. దేవునికి భయపడండి. ఆయన (నేరస్థుల్ని) చాలా కఠినంగా శిక్షిస్తాడని తెలుసుకోండి. (2)

తమంతట తాము చచ్చిన పశుపక్షులు, రక్తం, పందిమాంసం, దైవేతరుల పేరుతో కోయబడిన పశుపక్షులు, ఊపిరాడక లేదా దెబ్బతిని లేదా ఎత్తు ప్రదేశం నుండి పడి చచ్చిన జంతువులు మీకు నిషేధించబడ్డాయి. సజీవంగా ఉండగానే మీరు దేవుని పేరుతో కోసినవి తప్ప కుమ్మడం వల్ల చచ్చిన జంతువులు, క్రూరమృగం దాడితో మృతి చెందిన పశువులు కూడా నిషేధించబడ్డాయి. ఇంకా విగ్రహాల ముందు (ఇతర దైవేతర చిహ్నాల ముందు) బలివ్వబడిన పశువులు కూడా నిషేధించబడ్డాయి.[1] అలాగే పాచికల ద్వారా జాతకం తెలుసుకునే పద్ధతి కూడా నిషేధించబడింది. ఇవన్నీ పాపకార్యాలు.

సత్యతిరస్కారులు మీ ధర్మం గురించి ఇప్పుడు పూర్తిగా ఆశలు వదులుకున్నారు. కనుక మీరు వారికి ఏమాత్రం భయపడకండి. నాకే భయపడండి. నేనీ రోజు మీకోసం మీ ధర్మాన్ని (సమగ్ర జీవన వ్యవస్థగా) పరిపూర్ణం చేశాను. మీ కోసం నా అనుగ్రహాన్ని పూర్తిగా నెరవేర్చాను. మీ శ్రేయస్సు కోసం ఇస్లాంను మీ జీవనధర్మంగా ఆమోదించాను. (కనుక ఇక నుంచి ఈ నిషేధితాల జోలికి పోకండి.) అయితే తీవ్రమైన ఆకలితో ఉండి మరోదారి లేనప్పుడు, వీటిలో దేన్నయినా పాపం చేసే ఉద్దేశ్యం లేకుండా కొద్దిగా తింటే పరవాలేదు. దేవుడు క్షమించేవాడు, కరుణించేవాడు. (3)

ప్రజలు తమకు ఏఏ వస్తువులు ధర్మసమ్మతం చేయబడ్డాయని అడుగుతున్నారు. వారికి చెప్పు, మీ కోసం పరిశుద్ధ వస్తువులన్నీ ధర్మసమ్మతం చేయబడ్డాయి. దేవుడు

---

1. ఈ సూక్తితో పాటు 2:173, 6:145, 16:115 సూక్తులు కూడా చూడండి.

మీకు ప్రసాదించిన జ్ఞానంతో మీరు శిక్షణ ఇచ్చిన వేటజంతువులు మీ కోసం పట్టిచ్చే జీవాలను కూడా మీరు తినవచ్చు. అయితే వేట కోసం వేటజంతువుల్ని వదిలేటప్పుడు దేవుని పేరు స్మరించి వదలిపెట్టండి. దేవునికి ఎల్లప్పుడూ భయపడుతూ ఉండండి. దేవుడు త్వరలోనే (కర్మలను గురించి) విచారణ జరుపుతాడు. (4)

ఈరోజు మీకు పరిశుద్ధ వస్తువులన్నీ ధర్మసమ్మతం చేయబడ్డాయి. గ్రంథప్రజల ఆహారం మీకు, మీ ఆహారం గ్రంథప్రజలకు ధర్మసమ్మతం చేయబడింది. శీలవతులైన ముస్లిం స్త్రీలు, గ్రంథప్రజలకు చెందిన శీలవతులు కూడా (వివాహానికి) మీకు ధర్మ సమ్మతం చేయబడ్డారు. కాకపోతే వారికి చెల్లించవలసిన మహర్‌సొమ్ము చెల్లించి, వారిని వివాహబంధంలో సురక్షితంగా ఉంచాలి. అంతేగాని, వారితో విచ్చలవిడిగా కామక్రీడలకు పాల్పడటంగాని, దొంగచాటుగా అక్రమ సంబంధాలు పెట్టుకోవడంగాని చేయకూడదు. సత్యాన్ని విశ్వసించడానికి నిరాకరిస్తే మనిషి తన జీవితంలో సాధించినదంతా వ్యర్థమవు తుంది. చివరికి అతను పరలోకంలో ఘోరంగా నష్టపోతాడు. (5)

విశ్వాసులారా! ప్రార్థన చేయడానికి సిద్ధమైనప్పుడు ముందుగా మీరు ముఖాన్ని, మోచేతులదాకా చేతుల్ని కడుక్కోండి; తలను తడిచేత్తో స్పర్శించండి; కాళ్ళు చీలమండల దాకా కడుక్కోండి. (వీర్యస్ఖలనం వల్ల) అశుద్ధావస్థ ఏర్పడితే పరిశుభ్రంగా తలంటు స్నానం చేయండి. ఒకవేళ మీరు వ్యాధిగ్రస్తులైతే, లేదా ప్రయాణావస్థలో ఉంటే, లేదా మల మూత్ర విసర్జనచేస్తే, లేదా స్త్రీని కలుసుకుంటే- అప్పుడు నీళ్ళు దొరకని పక్షంలో పరిశుభ్రమైన మట్టి ఉపయోగించండి. అంటే మట్టిపై చేతులుతట్టి వాటితో ముఖం, చేతులు రుద్దుకోండి.[2] దేవుడు మీ జీవితాన్ని దుర్భరం చేయగోరడం లేదు. మీరు కృతజ్ఞులై ఉండేందుకు ఆయన మిమ్మల్ని పరిశుద్ధపరచి, మీకు తన అనుగ్రహాలను పూర్తిగా ప్రసాదించదలిచాడు.(6)

---

2. నీళ్ళు లభించనప్పుడు లేదా వ్యాధిగ్రస్త స్థితిలో నీళ్ళు వాడటం వల్ల ఆరోగ్యం మరింత క్షీణిస్తుందన్న భయమున్నప్పుడు ఉజూ లేక గుసుల్ (స్నానం)కు బదులు తయమ్ముమ్ చేయాలి. అంటే పరిశుభ్రమైన మట్టిమీద రెండు చేతులు తట్టి (తరువాత విదిలించి) వాటితో ముఖాన్ని స్పర్శించాలి. ఆ తర్వాత మరోసారి చేతుల్ని మట్టిమీద తట్టి చేతివ్రేళ్ళ నుంచి మోచేతుల దాకా రెండు చేతుల్ని రుద్దాలి. ఇంద్రియ స్ఖలనం జరిగినప్పుడు కూడా నీళ్ళు లభించకపోతే ఇదే విధంగా తయమ్ముమ్ చేసుకోవచ్చు. (ఇతర వివరాలకు 4:43 సూక్తి, దాని పాదసూచిక చూడండి.)

విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ ఆయిషా (రజి) ఇలా తెలియజేస్తున్నారు:- మేమొక సారి దైవప్రవక్త (సల్లం)తో కలసి ప్రయాణం చేస్తున్నాం. బైదా (లేక జాతుల్‌జైష్) అనే ప్రాంతానికి చేరుకునే సరికి నా కంఠహారం తెగి ఎక్కడో పడిపోయింది. దైవప్రవక్త (సల్లం) దాన్ని వెతకడానికి అక్కడ ఆగి పోయారు. ఆయనతో పాటు మిగిలినవాళ్ళు కూడా ఆగిపోయారు. ఆ ప్రదేశంలో ఎక్కడా నీటిచుక్క లేదు. జనం హజ్రత్ అబూబకర్ (రజి) దగ్గరకు వెళ్ళి "మీ అమ్మాయి ఆయిషా (రజి) ఏం చేసిందో చూశారా? ఆమె మూలంగా దైవప్రవక్త (సల్లం) ఇక్కడ ఆగిపోవలసి వచ్చింది. ఆయనతో పాటు ప్రజలంతా ఆగిపోయారు. కాని ఈ ప్రదేశంలో చూస్తే (కనుచూపు మేరలో) ఒక్క నీటిచుక్క కూడా లేదు. జనం దగ్గరున్న నీళ్ళు కాస్తా అయిపోయాయి" అని అన్నారు.



దేవుడు చేసిన మేలు గుర్తుంచుకోండి. ఆయన మీచేత చేయించిన వాగ్దానం, ప్రమాణాలు కూడా మరచిపోకండి. అంటే "మేము విన్నాం, విధేయులయ్యాం" అని మీరు మాటిచ్చారు. దాన్ని నిలబెట్టుకోండి. దేవునికి భయపడుతూ మసలుకోండి. మీ అంతరంగాల్లో దాగివుండే రహస్యాలు సైతం ఆయనకు తెలుసు. (7)

విశ్వసించిన ప్రజలారా! దేవుని కోసం నీతి నిజాయితీలకు కట్టుబడిఉంటూ, న్యాయమైన సాక్ష్యం ఇవ్వండి. ఇతరులపట్ల విరోధం ఉన్నాసరే మీరు న్యాయానికి తిలోదకాలు ఇవ్వకూడదు. ఎల్లప్పుడూ న్యాయంగానే వ్యవహరించాలి. దైవభీతిపరా యణత అంటే అదే. ప్రతి విషయంలోనూ దేవుని పట్ల భయభక్తులతో మసలుకోవాలి. మీరు చేసేదంతా దేవునికి తెలుసు. విశ్వసించి సత్కార్యాలు చేసేవారికి, వారి పొరపాట్లు మన్నించబడతాయని, వారికి గొప్ప ప్రతిఫలం లభిస్తుందని దేవుడు వాగ్దానం చేస్తున్నాడు. అవిశ్వాసులయి దేవుని సూక్తులు తిరస్కరించేవారు మాత్రం నరకానికి పోతారు. (8-10)

విశ్వాసులారా! (ఇటీవల) మీకు దేవుడు చేసిన మేలు ఓసారి జ్ఞాపకం చేసుకోండి. అప్పుడు ఒక వర్గం మీపై దౌర్జన్యం చేయడానికి నిశ్చయించుకుంది. కాని దేవుడు వారి చేతుల్ని మీపైకి లేవకుండా నిరోధించాడు.[3] కనుక దేవునికి భయపడుతూ మసలుకోండి. (ఆయన్నే నమ్ముకోండి.) విశ్వాసులు దేవుడినే నమ్ముకోవాలి. (11)

దేవుడు ఇస్రాయీల్ సంతతి చేత ప్రమాణం చేయించాడు. వారిలో (ఉన్న పన్నెండు తెగలకు) మేము పన్నెండుమంది నాయకుల్ని నియమించాము. తరువాత దేవుడు ఇలా అన్నాడు: "నేను మీకు తోడుగా ఉంటాను. అయితే మీరు నమాజు

---

హజ్రత్ అబూబకర్ (రజి) ఈ మాటలు విని నాదగ్గరకు వచ్చారు. ఆ సమయంలో దైవ ప్రవక్త నావడిలో తలపెట్టి నిద్రపోతున్నారు. అబూబకర్ (రజి) వచ్చిరాగానే "నీమూలంగా దైవప్రవక్త (సల్లం) ఇక్కడ ఆగిపోవలసి వచ్చింది. ఆయనతో పాటు ప్రజలు కూడా ఆగిపోయారు. ఇక్కడ చూస్తే చుక్క నీరులేదు. జనం దగ్గర కూడా నీళ్ళులేవు" అని మండిపడ్డారు నామీద. ఆయన చేత్తో నావీపు మీద కొడ్తూ అనదలచిన మాటలన్నీ అన్నారు. దైవప్రవక్త (సల్లం) నా తొడల మీద తలపెట్టి పడుకోవడం వల్ల నేను (దెబ్బలు సహిస్తూ) కదలకుండా అలాగే ఉండవలసి వచ్చింది.

మరునాడు తెల్లవారుజామున దైవప్రవక్త (సల్లం) మేల్కొంటే (ఉజూ చేయడానికి) నీళ్ళే లేవు. అప్పుడు దేవుడు "తయమ్ముమ్" ఆజ్ఞలు అవతరింపజేశాడు. దాంతో అందరూ తయమ్ముమ్ చేశారు. ఆ సందర్భంలో ఉసైద్ బిన్ హుజైర్ (రజి) మాట్లాడుతూ "అబూబకర్ సంతానమా! మీ మూలంగా (ముస్లింలకు) శుభం కలగడం ఇది మొదటిసారి కాదు" అన్నారు. ఆ తర్వాత నేను కూర్చున్న ఒంటెను లేపారు. దానిక్రింద నా కంఠహారం దొరికింది." (బుఖారి, ముస్లిం)

3. యూదులలో ఒక వర్గం దైవప్రవక్త (సల్లం)ను, ఆయన ముఖ్య అనుచరులు కొందరిని కుట్రపన్ని హతమార్చే ఉద్దేశ్యంతో ఓరోజు విందు భోజనానికి ఆహ్వానించి వారి రాకకోసం ఎదురు చూడసాగింది. అయితే దేవుడు ఈకుట్ర సంగతి దైవప్రవక్త (సల్లం)కు దివ్యావిష్కృతి ద్వారా తెలియ జేసి హెచ్చరించాడు. దాంతో దైవప్రవక్త (సల్లం) ఆ విందుకు పోవడం మానేశారు. ఈ మేలు విషయమే దేవుడు ఈ సూక్తిలో ముస్లింలకు గుర్తుచేశాడు.

చేస్తుండాలి. (పేదల ఆర్థికహక్కు) జకాత్ చెల్లించాలి. నేను పంపే ప్రవక్తలను విశ్వసించి వారికి సహకరించాలి. దేవునికి శ్రేష్ఠమైన రుణం ఇవ్వాలి. ఇలా నడచుకుంటే నేను మీలో ఉన్న చెడుల్ని తొలగించి మిమ్మల్ని సెలయేరులు ప్రవహించే (స్వర్గ)వనాలలో ప్రవేశింపజేస్తాను. అయితే ఆ తరువాత మీలో ఎవరైనా అవిశ్వాసవైఖరి అవలంబిస్తే మాత్రం అతను సన్మార్గం తప్పినట్లే.'' (12)

అసలు వారు తమ ప్రమాణం ఉల్లంఘించిన కారణంగానే మేము వారిని మా కారుణ్యానికి దూరంగా విసిరివేసి, వారి హృదయాలను కఠినం చేశాము. చివరికి వారిప్పుడు దైవవాక్కుల్ని తారుమారు చేసే స్థితికి దిగిజారిపోయారు. తమకు బోధించిన ఉపదేశాల్లో అత్యధిక భాగం విస్మరించారు. వారు పాల్పడుతున్న మోసాల్లో ఏదో ఒకటి ఈనాడు కూడా నీ దృష్టికి వస్తూనేఉంది. వారిలో బహు కొద్దిమంది మాత్రమే ఈ బలహీనతకు దూరంగా ఉన్నారు. కనుక వారిని క్షమించు. వారి చేష్టలను గురించి అంతగా పట్టించుకోకు. దేవుడు సహృదయులనే ప్రేమిస్తాడు. (13)

అలాగే ''మేము సహాయకులం''[4] అన్నవారి చేత కూడా మేము ప్రమాణం చేయించాము. వారు కూడా మేము బోధించిన ఉపదేశాల్లో అత్యధిక భాగం విస్మరించారు. చివరికి మేము వారి మధ్య ప్రళయం దాకా విరోధభావం ఉండేలా వారి హృదయాలలో పరస్పరం విద్వేషబీజాలు నాటాము. వారు ఇహలోకంలో ఏం చేస్తుండేవారో దేవుడు ఒక రోజు తప్పకుండా వారిదృష్టికి తీసుకువస్తాడు. (14)

గ్రంథప్రజలారా! మాప్రవక్త మీ దగ్గరకు వచ్చాడు. మీరు దైవగ్రంథంలో (లేకుండా) దాచిన అనేక విషయాలు అతను మీముందు వెల్లడిస్తున్నాడు. కొన్ని విషయాల్ని గురించి మిమ్మల్ని ఉపేక్షిస్తున్నాడు కూడా. దేవుని వైపునుండి మీ దగ్గరకు (అజ్ఞానాంధ కారం దూరంచేసే) జ్యోతి వచ్చింది. (సన్మార్గం చూపే) దేదీప్యమానమైన దివ్యగ్రంథం కూడా వచ్చింది. దీనిద్వారా దేవుడు తన ప్రసన్నతా భాగ్యం కోరుకునేవారికి ముక్తిమార్గం చూపుతాడు. పైగా ఆయన తన అనుగ్రహంతో వారిని కారుచీకట్ల నుండి కాంతి వైపు తీసుకువెళ్తాడు; (అపమార్గంనుండి తీసి) రుజుమార్గంలో నడిపిస్తాడు. (15,16)

మర్యం కుమారుడు మసీహ్‌యే దేవుడు అన్నవారు నిస్సందేహంగా అవిశ్వాసులై పోయారు. ముహమ్మద్ (సల్లం)! ''దేవుడు గనక మర్యం కుమారుడు మసీహ్‌ని, అతని

4. ఇక్కడ మూలభాషలో ''నసారా'' అనే, 3:52 సూక్తిలో ''అన్సార్'' అనే పదాలు వచ్చాయి. ఈ రెండు పదాలకు సహాయకులు అనే అర్థం. ఈసాప్రవక్త (అలైహి) అనుచరుల్ని ఖుర్ఆన్ క్రైస్తవులు, నస్రానీలు అని గాకుండా 'నసారా' అని పేర్కొన్నది. నేను విధిలేక పాఠకుల సౌలభ్యం కోసం నసారా అనే పదాన్ని క్రైస్తవులు అని అనువాదం చేయవలసి వచ్చింది.

ఆది ప్రవక్త నుండి అంతిమ ప్రవక్త వరకు ప్రతి దైవప్రవక్తా మానవాళికి ఇస్లాం ధర్మాన్నే బోధిస్తూ వచ్చాడు. అందువల్ల ఆయా ప్రవక్తల అనుచరుల పేర్లు దాని ప్రకారం ముస్లింలని పిలవ బడ్డాయి. కాని యూదులు, క్రైస్తవులు ఈ వాస్తవాన్ని విస్మరించి తమను తాము యూదులని, క్రైస్తవులని పేర్లు పెట్టుకున్నారు.



తల్లిని, భూలోకంలో ఉన్న వారందర్నీ చంపదలచుకుంటే ఆయన నిర్ణయాన్ని అడ్డుకోగల ధైర్యం ఎవరికయినా ఉందా?'' అని అడుగు. భూమ్యాకాశాలకు, భూమిపై ఉన్నవాటికి, ఆకాశంలో ఉన్నవాటికి దేవుడే యజమాని. ఆయన తాను కోరినదాన్ని సృష్టిస్తాడు. ఆయన ప్రతిపనీ చేయగల సమర్థుడు, సర్వ శక్తిమంతుడు. (17)

యూదులు, క్రైస్తవులు తాము దేవుని బిడ్డలమని, ఆయనకు ప్రియమైన వారమని అంటారు. ''మరి ఆయన మీరు చేసే పాపాలకు మిమ్మల్ని ఎందుకు శిక్షిస్తున్నాడు?'' అని వారిని అడుగు. నిజానికి మీరు కూడా దేవుడు సృష్టించిన ఇతర మానవుల్లాంటి మానవులే. దేవుడు తానుతలచిన విధంగా కొందరిని క్షమిస్తాడు; మరికొందరిని శిక్షిస్తాడు. భూమ్యాకాశాలు, వాటికి సంబంధించిన సమస్తం దేవునివే. చివరికి అందరూ (ఓరోజు) ఆయన సన్నిధికే మరలి పోవలసి ఉంది. (18)

గ్రంథప్రజలారా! దైవప్రవక్తల ఆగమనం ఆగిపోయి ఓ సుదీర్ఘకాలం గడచి పోయింది. అలాంటి పరిస్థితిలో మా ఈ ప్రవక్త ఇప్పుడు మీ దగ్గరకు వచ్చి నిజధర్మం గురించిన విషయాలు మీకు బోధిస్తున్నాడు. ఇక మీరు శుభవార్త అందజేసే, హెచ్చరించే ప్రవక్త ఎవరూ రాలేదే అని సాకులు చెప్పడానికి ఎలాంటి ఆస్కారం లేదు. శుభవార్త అందజేసే, హెచ్చరించే వాడు వచ్చేశాడు. (మా బాధ్యత తీరిపోయింది.) దేవుడు ప్రతి విషయంపై అధికారంగల అసాధారణ శక్తిసంపన్నుడు. (19)

మూసా (అలైహి) తన జాతిప్రజలకు చేసిన హితబోధ గుర్తుకుతెచ్చుకో. అతను తన జాతివారితో ఇలా అన్నాడు: ''నా జాతిప్రజలారా! మీకు దేవుడు చేసిన మేళ్ళు జ్ఞాపకం తెచ్చుకోండి. ఆయన మీలో ఒక ప్రవక్తను ప్రభవింపజేసి, మిమ్మల్ని రాజ్యాధి నేతలుగా చేశాడు. ఆయన మీకు ప్రపంచంలో ఏ జాతికీ ప్రసాదించనిదాన్ని (అంటే వైభవోన్నతుల్ని) ప్రసాదించాడు. కనుక సోదరులారా! దేవుడు మీకు రాసిపెట్టిన ఈ పవిత్ర భూభాగం (పాలస్తీనా)లో ప్రవేశించండి. వెనక్కి మరలకండి. అలా చేస్తే మీరు ఘోరంగా నష్టపోతారు.'' (20-21)

దానికి వారిలా జవాబిచ్చారు: ''మూసా! అక్కడ భయంకరమైన మనుషులు ఉన్నారు. వారా ప్రాంతం నుండి వెళ్ళిపోనంత వరకూ మేమక్కడికి ఎట్టి పరిస్థితిలోనూ వెళ్ళం. వారక్కడ్నుంచి వెళ్ళిపోతే మేము పోవడానికి సిద్ధమే.'' (22)

అలా భయపడిన వారిలోనే దైవానుగ్రహం పొందిన ఇద్దరు వ్యక్తులున్నారు. అప్పుడు వారు ''ఆ భయంకరుల్ని ఎదుర్కోవడానికి మీరు ప్రధానద్వారం గుండా ప్రవే శించండి. మీరు లోపలికి ప్రవేశిస్తే చాలు, విజయం మిమ్మల్ని వరించినట్లే. మీరు విశ్వాసులే అయితే దేవుని మీద భారంవేసి ముందుకు సాగండి'' అని అన్నారు. (23)

కాని వారు (దానికి అంగీకరించకుండా) ''మూసా! వారక్కడ ఉన్నంతవరకు మేము ఎన్నటికీ వెళ్ళము. కావాలంటే నీవు, నీప్రభువు ఇద్దరూ వెళ్ళి (వారితో) తల పడండి. మేము మాత్రం ఇక్కడే ఉండిపోతాం'' అన్నారు (తలబిరుసుతో). (24)

అప్పుడు మూసా (అలైహి) దేవుణ్ణి ప్రార్థిస్తూ "ప్రభూ! నా చేతిలో ఏమీ లేదు. నాపై, నా సోదరునిపై మాత్రమే నాకు అధికారం ఉంది. అందువల్ల దేవా! మమ్మల్ని ద్దరినీ ఈ దుర్మార్గుల నుండి వేరుచెయ్యి" అని అన్నాడు. దానికి దేవుడు "సరే, వారికీ దేశాన్ని నలభై యేండ్లపాటు నిషేధించాను. ఇక వారు ప్రపంచంలో ఏ ఒక్కచోటా నిలువ నీడ దొరక్క కాళ్ళు కొట్టుకుంటూ తిరుగుతుంటారు. ఈ దుర్మార్గుల దుస్థితి పట్ల నీవు ఏమాత్రం విచారపడకు" అని చెప్పాడు. (25,26)

ముహమ్మద్! వీరికి కాస్త ఆదం కొడుకులిద్దరి గాథ కూడా విన్పించు. వారిద్దరు (ఒక పశువుని) బలిచ్చారు. అప్పుడు వారిలో ఒకని బలి మాత్రమే స్వీకరించబడింది. రెండోవాని బలి స్వీకరించబడలేదు. దాంతో అతను (చిర్రెత్తిపోయి) "నేను నిన్ను చంపేస్తాను" అన్నాడు.

దానికి రెండోవాడు ఇలా అన్నాడు: "దేవుడు భయభక్తులు కలవారి మొక్కుబడినే స్వీకరిస్తాడు. నీవు నన్ను చంపడానికి చెయ్యెత్తితే నేను మాత్రం నిన్ను చంపడానికి చెయ్యెత్తను. నేను సర్వలోక ప్రభువయిన దేవునికి భయపడుతున్నాను. నా పాపం, నీ పాపం అంతా నువ్వే మూటకట్టుకొని నరకంలోకి పోయిపడు. అదే దుర్మార్గులకు తగిన ప్రతిఫలం. నేను కోరేది కూడా అదే." (27-29)

చివరికి అతని (దుష్ట) మనస్సు అతని సోదరుణ్ణి వధించడానికి ప్రేరేపించింది. అతను తన సోదరుణ్ణి హతమార్చివేశాడు. ఈ విధంగా అతను నష్టపోయినవారిలో చేరిపోయాడు. ఆతర్వాత దేవుడు ఓ కాకిని పంపాడు. ఆ కాకి అతనికి అతని సోదరుడి శవాన్ని ఎలా పూడ్చి పెట్టాలో చూపడానికి నేలను త్రవ్వడం ప్రారంభించింది. అది చూసి అతను "అయ్యయ్యో! నా సోదరుడి శవాన్ని ఎలా పూడ్చిపెట్టాలో తెలియలేదే! నాకు ఆ కాకికున్నంత జ్ఞానం కూడా లేకపోయిందే!!" అని బాధపడ్డాడు. ఆ తరువాత అతను తాను చేసిన పనికి ఎంతో పశ్చా త్తాపంతో కుమిలిపోయాడు. (30-31)

ఈ (హత్య) కారణంగానే మేము ఇస్రాయీల్ సంతతివారికి ఇలా ఒక ఉత్తర్వు జారీ చేశాం:"ఎవరైనా ప్రతీకార హత్య(శిక్ష)గా లేక ధరణిపై కల్లోలం రేకెత్తించినందుకు శిక్షగా తప్ప ఏ మనిషినైనా చంపితే అతను యావత్తు మానవాళిని చంపినట్లే. అలాగే ఎవరైనా ఒక మనిషి ప్రాణం కాపాడితే అతను యావత్తు మానవాళిని కాపాడినట్లే." (ఈ ఆజ్ఞ జారీ చేసినప్పటికీ వారి పరిస్థితి మారలేదు) మా ప్రవక్తలు ఒకరి తరువాత ఒకరు అనేకమంది వారి దగ్గరకు స్పష్టమైన హితోక్తులు తీసుకొచ్చారు. అయినా వారిలో ఇప్పటికీ అత్యధికమంది ప్రపంచంలో హద్దుమీరి ప్రవర్తించేవారే ఉన్నారు. (32)

దేవునికి ఆయనప్రవక్తకు వ్యతిరేకంగా పోరాడేవారికి, ధరణిలో కలహాలు రేకెత్తిస్తూ తిరిగేవారికి శిక్షగా వారిని హతమార్చాలి; లేదా ఉరికంబం ఎక్కించాలి; లేదా ఒక చేయి, దానికి అభిముఖంగా వున్న ఒక కాలు నరికివేయాలి; లేదా దేశబహిష్కరణ చేయాలి. ఇవి ఇహలోకంలో వారికి లభించే అవమానం, అప్రతిష్ఠలు. పరలోకంలో ఇంతకంటే ఘోరమైన శిక్ష ఉంటుంది. అయితే మీ స్వాధీనంలోకి రాకముందే వారు తాము చేసిన



నిర్వాకానికి పశ్చాత్తాపం చెంది తమ నడవడికను సరిదిద్దుకుంటే (ఇక వారి జోలికి పోకూడదు.)[5] దేవుడు క్షమించేవాడని, కరుణించేవాడని తెలుసుకోండి. (33-34)

విశ్వాసులారా! దేవుని పట్ల భయభక్తులు కలిగి ఉండండి. ఆయన సాన్నిధ్యం పొందే మార్గం అన్వేషించండి. ఆయన మార్గంలో (సత్యవ్యతిరేక శక్తులతో) నిరంతరం పోరాడుతూ ఉండండి, మీ జీవితం సార్థకమవుతుంది. (35)

సత్యాన్ని తిరస్కరించినవారు తమ దగ్గర భూమండలమంత సిరిసంపదలుండి, ఇంకా అంతకు రెట్టింపు సంపదలు ఉండి, ప్రళయదినం శిక్ష నుండి తప్పించుకోవడానికి దాన్నంతా పాపపరిహారంగా ఇచ్చివేయ దలచుకున్నా సరే, దాన్ని స్వీకరించడం జరగదు. వారికి వ్యధాభరితమయిన శిక్ష పడితీరుతుంది. వారు నరకాగ్ని నుండి బయటపడాలని ఎంత గింజుకున్నా దాన్నుండి బయటపడలేరు. వారా నరక యాతలోనే మగ్గుతూ శాశ్వతంగా పడి వుండవలసి ఉంటుంది. (36-37)

స్త్రీ అయినా, పురుషుడైనా దొంగతనం చేస్తే ఇద్దరికీ చెయ్యి నరికివేయండి.[6] ఇది వారు సంపాదించుకున్న దానికి ప్రతిఫలం. దేవుని తరపున కనువిప్పు కలిగించే శిక్ష ఇది. దేవుడు సర్వాధికారి, సర్వశక్తిమంతుడు. ఆయన ఎంతో వివేకవంతుడు కూడా. అయితే

---

5. ఇస్లాం నెలకొల్పిన శ్రేయోరాజ్యానికి వ్యతిరేకంగా తిరుగుబాటు జరిపి, శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన కల్లోలకారకులు ప్రభుత్వానికి పట్టుబడితే వారిని ఈ విధంగా శిక్షించాలి. ఒకవేళ అలాంటి వ్యక్తులు ప్రభుత్వానికి పట్టుబడక ముందే పశ్చాత్తాపంచెంది తమ నడవడికను సరిదిద్దు కుంటే వారిని శిక్షించేందుకు ప్రభుత్వానికి అధికారం లేదు. కాకపోతే ఆ వ్యక్తులు తమ తిరుగుబాటు వైఖరి పూర్తిగా విడనాడి సాధారణ పౌరజీవితం గడుపుతున్నట్లు వారి దైనందిన జీవిత వ్యవహారాలు నిరూపించాలి. ఆ తరువాత వారు తిరుగుబాటు చేసినట్లు, కల్లోలం సృష్టించినట్లు తన దృష్టికి వచ్చినా ప్రభుత్వం వారిని పనిగట్టుకొని శిక్షించడానికి సాకులు వెతకదు.

అయితే వారీ తిరుగుబాటు, కల్లోలాల సందర్భంగా మానవ హక్కులు ఉల్లంఘించడం జరిగితే దానికి శిక్ష ఉంది. ఉదా:- వారు ఎవరినైనా హత్యచేస్తే హతుని వారసులకు హంతకుడిపై ప్రతీకారం తీర్చుకునే హక్కుంది. అంటే హతుని వారసుల డిమాండ్ ప్రకారం ప్రభుత్వం హంతకుడికి మరణశిక్ష విధించవచ్చు; లేదా హతుని వారసులు విశాల హృదయంతో క్షమిస్తే ప్రభుత్వం అతడ్ని విడిచిపెట్టవచ్చు. తిరుగుబాటు సందర్భంగా వారు ఎవరి సొమ్మయినా కొల్లగొట్టి తింటే చట్ట ప్రకారం వారికి హస్తఖండన వగైరా శిక్షలు పడవచ్చు. ఒకవేళ వారు కొల్లగొట్టిన సొమ్ము తినకుండా దాన్ని యథాతథంగా తిరిగి దాని యజమానికి అప్పగిస్తే వారికి శిక్ష విధించడం జరగదు.

6. దొంగకు శిక్షగా ఒక చేయి మాత్రమే నరకవలసి ఉంటుంది. ఇస్లామీయ రాజ్యంలో సర్వత్రా "ఆర్థికన్యాయం" నెలకొన్న తరువాతనే హస్త ఖండన శిక్షలు అమలు జరపాలి. అయితే (యుద్ధంలో వాడే) ఒక డాలు విలువకు లోపు వస్తువుని దొంగిలిస్తే చేతిని నరక కూడదని దైవప్రవక్త (సల్లం) అన్నారు. అలాగే పండ్లు, కూరగాయలు, ఆహారవస్తువుల్ని (పరిమిత స్థాయిలో) దొంగిలించి నా హస్తఖండన శిక్ష ఉండదని చెప్పారు. ఇమామ్ అబూహనీఫా (రహ్మాలై) ప్రకారం పండ్లు, కూర గాయలు, మాంసం, వండిన ఆహారం, నూర్పిడికాని ధాన్యం, ఆట వస్తువులు, వాయిద్య పరికరాలు వగైరా విషయంలో హస్తఖండన శిక్ష లేదు. అయితే వీటికి తేలికపాటి శిక్షలు ఉంటాయి.

తప్పు చేసిన తరువాతయినా పశ్చాత్తాపం చెంది తమ నడవడిక సరిదిద్దుకుంటే, దేవుడు గొప్ప క్షమాశీలి, అపార కృపాశీలుడని తెలుసుకోండి. భూమ్యాకాశాల సామ్రాజ్యానికి దేవుడే అధిపతి అని మీకు తెలియదా? ఆయన తాను తలచిన విధంగా కొందరిని శిక్షిస్తాడు, మరికొందరిని క్షమిస్తాడు. ఆయన ప్రతిపనీ చేయగల సమర్థుడు, సర్వశక్తిమంతుడు. (38-40)

ప్రవక్తా! సత్యతిరస్కారంలో కొట్టుకుపోయేవారిని గురించి నీవు చింతించకు. వారు పైకి తాము విశ్వసించామని చెప్పుకుంటారు. కాని వారి హృదయాల్లో విశ్వాసం నాటుకోలేదు. అలాంటివారు కొందరు యూదుల్లో కూడా ఉన్నారు. వారు అసత్య విషయాలంటే చెవి కోసు కుంటారు. నీదగ్గరకు ఎప్పుడూ రానివారిని పెడత్రోవ పట్టించే ఉద్దేశ్యంతో వారు దొంగచాటుగా నీ మాటలు వింటారు. దైవగ్రంథంలో విషయాలు సందర్భానుసారం ఉన్నప్పటికీ వారు వాటి అసలు అర్థాన్ని మార్చివేస్తారు.

వారు (అమాయక) జనంతో "ఈవిధమైన ఆజ్ఞ ఇస్తే అంగీకరించండి, లేకపోతే అంగీక రించకండి" అంటారు. ఒక వ్యక్తిని స్వయంగా దేవుడే పరీక్షకు గురిచేసి దారి తప్పించదలచు కుంటే, ఇక అతడ్ని దేవుని పట్టు నుండి తప్పించడానికి నీవు ఏం చేసినా ప్రయోజనం లేదు. దేవుడు వారి హృదయాల్ని పరిశుద్ధం చేయదలచుకో లేదు. వారికి ఇహలోకంలో పరాభవం, పరలోకంలో ఘోర యాతనలు తప్పవు. (41)

వీరు అసత్య విషయాలు వినడానికి చెవికోసుకుంటారు. అక్రమార్జనకోసం వెంప ర్లాడుతారు. కనుక వీరు నీదగ్గరకు వస్తే వారి వ్యవహారాన్ని నీకిష్టమైతే పరిష్కరించు లేదా తిరస్కరించు. ఆమేరకు నీకు అధికారం ఇస్తున్నాం. వ్యతిరేకిస్తే వారు నీకేమాత్రం నష్టం కలిగించలేరు. ఒకవేళ పరిష్కారం చేయాలనుకుంటే న్యాయంగా, నిష్పక్షపాతంగా పరిష్కరించు.[7] దేవుడు న్యాయంగా వ్యవహరించేవారినే ప్రేమిస్తాడు. (42)

---

7. ఖైబర్ ప్రాంతపు అగ్రవర్ణ యూదులకు చెందిన ఒక పురుషునికి, ఒక స్త్రీకి మధ్య అక్రమ సంబంధం ఏర్పడింది. తౌరాత్ గ్రంథం ప్రకారం ఇలాంటి నేరానికి రాళ్ళువిసిరి చంపే శిక్ష విధించాలి. కాని యూదులు తౌరాత్ ఆజ్ఞ పాటించకుండా పరస్పరం సంప్రదించుకొని, ముహమ్మద్ (సల్లం)ను మధ్యవర్తిగా స్వీకరించి ఆయన శిలాశిక్ష కాకుండా వేరే శిక్ష చెబితే ఒప్పుకోవాలని, శిలాశిక్షే చెబితే ఒప్పుకోకూడదని నిర్ణయించుకున్నారు.

వారు దైవప్రవక్త (సల్లం) దగ్గరకెళ్ళి తీర్పుచేయమని అడిగారు. దైవప్రవక్త (సల్లం) శిలాశిక్ష విధించాలని చెప్పారు. కాని వారు దానికి ఒప్పుకోలేదు. "మరి మీమతంలో ఈ నేరానికి శిక్షేమిటీ?" అని అడిగారాయన. "కొరడా దెబ్బలు కొట్టడం, ముఖానికి మసిబూసి గాడిద మీద ఊరేగించడం" అన్నారు వారు. "మీరు ప్రమాణంచేసి, వివాహిత వ్యభిచారులకు తౌరాత్‌లో ఉన్న శిక్షేమిటో చెప్పండ"ని దైవప్రవక్త (సల్లం) అడిగారు. యూదులు మళ్ళీ అదే శిక్ష గురించి చెప్పారు.

అయితే దైవప్రవక్త (సల్లం) వారిలో ఒక ప్రముఖ ధర్మవేత్త మౌనంగా ఉండటం చూసి "మిమ్మల్ని ఫిరౌన్ బారినుండి కాపాడి, మీకు తూర్ (కొండ) దగ్గర ధర్మశాస్త్రం ప్రసాదించిన దేవుడ్ని సాక్షిగా చేసి అడుగుతున్నాను. తౌరాత్‌లో వ్యభిచారికి ఈ శిక్షే ఉందా?" అని అడిగారు.



అయినా వారు నిన్ను న్యాయనిర్ణేతగా ఎలా చేసుకుంటారు? స్వయంగా వారి దగ్గర తౌరాత్ గ్రంథం ఉందికదా! అందులో దైవాజ్ఞలు ఉన్నాయి. వాటికి విముఖులయి నీ దగ్గరకు రావలసిన పనేమిటీ? అసలు వారిలో (సత్యంపట్ల) విశ్వాసమే లేదు. (43)

మేము కాంతి, సన్మార్గం గల తౌరాత్ గ్రంథం అవతరింపజేశాము. దేవునికి విధేయు లైన ప్రవక్తలందరూ దాని ప్రకారమే యూదుల వ్యవహారాలు పరిష్కరిస్తుండే వారు. అలాగే ధర్మవేత్తలు, ధర్మశాస్త్ర నిపుణులు కూడా. వారికే దైవగ్రంథ పరిరక్షణ బాధ్యత ఇవ్వబడింది. దానికి వారే సాక్షులుగా ఉన్నారు. కనుక (యూదులారా!) మీరు ప్రజలకు భయపడకండి. నాకే భయపడండి. నా సూక్తుల్ని స్వల్ప మూల్యానికి అమ్ము కోవడం మానేయండి. వినండి, దేవుడు నిర్దేశించిన చట్టం ప్రకారం పరిష్కారం చేయని వారే సత్యతిరస్కారులు.[8] (44)

తౌరాత్‌లో మేము యూదులకు ఇలా ఒక ఉత్తర్వు జారీ చేశాము: "ప్రాణానికి బదులు ప్రాణం, కంటికి బదులు కన్ను, ముక్కుకు బదులు ముక్కు, చెవికి బదులు చెవి, పంటికి బదులు పన్ను, అదేవిధంగా సమస్తగాయాలకు బదులు అలాంటి గాయాలే. అయితే ఎవరైనా ప్రతీకారం చేయకుండా క్షమిస్తే, అది అతని పాపాలకు పరిహారమవుతుంది." వినండి, దేవుడు నిర్దేశించిన చట్టం ప్రకారం పరిష్కారం చేయని వారే దుర్మార్గులు. (45)

ఆ ప్రవక్తల తర్వాత మేము మర్యం కుమారుడు ఈసాను పంపాము. అతను తనకు పూర్వం నుండీ వున్న తౌరాత్‌ను ధృవీకరించేవాడు. అతనికి మేము కాంతి, సన్మార్గం గల ఇన్జీల్‌ని ప్రసాదించాము. అది కూడా గతంలో అవతరించిన తౌరాత్‌ను ధృవీకరిస్తుంది. అది దైవభీతిపరుల పాలిట వెలుగుబాట, హితోపదేశం. ఇన్జీల్ ప్రజలు అందులో దేవుడు నిర్దేశించిన చట్టం ప్రకారమే (వ్యవహారాలు) పరిష్కరించుకోవాలని మేము ఆదేశించాము. కనుక దేవుడు నిర్దేశించిన చట్టం ప్రకారం పరిష్కారం చేయని వారే దుర్జనులు. (46-47)

---

అప్పుడా ధర్మవేత్త ఇలా సమాధానమిచ్చాడు:"వ్యభిచారికి శిక్ష రాళ్ళు విసిరి చంపడమే. కాని మా ప్రజలలో వ్యభిచారం ఎక్కువయి పోవడంతో మా పాలకులు గొప్పవాళ్ళు వ్యభిచారం చేస్తే వదలిపెడ్తూ, చిన్నవాళ్ళు వ్యభిచారం చేస్తే శిలాశిక్ష విధించడం ప్రారంభించారు. అయితే ఈ పద్ధతి వల్ల ప్రజలలో నిరసన వ్యక్తమయింది. అప్పుడు మేము తౌరాత్ చట్టాన్ని మార్చివేసి వ్యభిచారులకు కొరడా దెబ్బలు కొట్టి, ముఖానికి మసి బూసి గాడిద మీద ఊరేగించే విధానం ప్రవేశపెట్టాము."

ఈ మాట విని ఇతర ధర్మవేత్తలు నోరు మూసుకున్నారు. చివరికి దైవప్రవక్త (సల్లం) తీర్పు ప్రకారమే వ్యభిచారం చేసిన ఆ ఇద్దరు స్త్రీ పురుషులకు రాళ్ళు విసిరి హతమార్చడం జరిగింది.

8. దేవుడు నిర్దేశించిన చట్టం ప్రకారం పరిష్కారం చేయనివారే "సత్యతిరస్కారుల"ని 44వ సూక్తిలో, "దుర్మార్గుల"ని 45వ సూక్తిలో, "దుర్జనుల"ని 47వ సూక్తిలో చెప్పబడింది. జీవితంలోని ఏ రంగంలోనయినా దైవాజ్ఞలు, దైవచట్టాల ప్రకారమే మనిషి తన వ్యవహారాలు పరిష్కరించు కోవాలి. అలా చేయనివారిని ఈ సూక్తులలో తీవ్రంగా హెచ్చరించడం జరిగింది.

చివరికి మేము సత్యపూరితమైన ఈగ్రంథం నీపై అవతరింపజేశాం. ఇది ఇంతకు పూర్వం వచ్చిన దివ్యగ్రంథాలను ధృవీకరిస్తోంది. వాటన్నిటి సారాంశం కలిగి ఉంది. కనుక నీవు దేవుడు నిర్దేశించిన చట్టంప్రకారమే ప్రజల వ్యవహారాలు పరిష్కరించు. నీ దగ్గరకు వచ్చిన సత్యాన్ని వదిలేసి వారి మనోకాంక్షలను అనుసరించకు.

మేము మీలో ప్రతి సముదాయానికి ఒక ప్రత్యేక ధర్మశాస్త్రాన్ని, ఒక ప్రత్యేక ఆచరణ విధానాన్ని నిర్ణయించాము. దేవుడు తలచుకుంటే మిమ్మల్నందర్నీ ఒకే సముదాయంగా కూడా రూపొందించగలడు. కాని ఆయన మిమ్మల్ని పరీక్షించడానికి విభిన్న సముదాయాలుగా రూపొందించాడు. కనుక మీరు సత్కార్యాల్లో ఒకర్నొకరు మించిపోవడానికి ప్రయత్నించండి. చివరికి మీరంతా దేవుని సన్నిధికే చేరుకోవలసి ఉంది. తరువాత మీరు ఏ విషయాల్లో పరస్పరం విభేదించుకున్నారో వాటి వాస్తవికతను ఆయన మీకు తెలియజేస్తాడు. (48)

కనుక ప్రవక్తా! నీవు దేవుడు నిర్దేశించిన చట్టం ప్రకారమే వారి వ్యవహారాలు పరిష్కరించు. వారి మనోకాంక్షల్ని అనుసరించకు. జాగ్రత్త! దేవుడు నీపై అవతరింప జేసిన సంవిధానం నుండి తప్పించడానికి వారు నిన్ను రకరకాలుగా ప్రలోభపెట్టవచ్చు. వారి కుయుక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. వారు గనక (నీకు) విముఖులయితే, ఒక విషయం తెలుసుకో, వారు చేసిన కొన్ని ఘోర పాపాలకుగాను దేవుడు వారిపై ఆపద తెచ్చి పడవేయాలని ఎప్పుడో నిర్ణయించుకున్నాడు. వారిలో చాలామంది దుర్జనులే ఉన్నారు. వీరు (దైవచట్టం కాదని) మూఢకాలంనాటి అనాగరిక పద్ధతులు కోరుతున్నారా? దేవుడ్ని విశ్వసించినవారి దృష్టిలో దేవుని చట్టం తప్ప మరెవరి చట్టం శ్రేష్ఠమైనదవుతుంది? (49-50)

విశ్వాసులారా! యూదుల్ని, క్రైస్తవుల్ని స్నేహితులుగా చేసుకోకండి.[9] వారు పరస్పరం స్నేహితులు. మీలో ఎవరైనా వారితో స్నేహంచేస్తే అతను కూడా వారిలో

---

ఈ సూక్తులను యూదులకు, క్రైస్తవులకు మాత్రమే వర్తింపజేయడానికి కొందరు ముస్లింలు ప్రయత్నించారు. కాని ప్రముఖ సహాబీ హజ్రత్ హుజైఫా (రజి) దీనికి చక్కని సమాధానమిచ్చారు. ఆయనతో ఒకతను "ఈ మూడు సూక్తులు ఇస్రాయీలీలకు సంబంధించినవికదా?" అన్నాడు. దానికి హజ్రత్ హుజైఫా (రజి) ఇలా అన్నారు: "ఈ ఇస్రాయీలీలు మీకోసం ఎంత మంచి సోదరులు! చేదు విషయలన్నీ వారి కొరకునూ, తియ్యటి విషయాలన్నీ మీ కొరకునా!! అలా ఎన్నటికీ కాదు. దైవసాక్షి! మీరు వారి అడుగుజాడల్లోనే నడుస్తున్నారు."

9. యావత్తు అరేబియాలో సరైన మత విశ్వాసాలకు సంబంధించిన ఉద్యమం సాగుతున్న రోజులవి. సమస్త జీవన రంగాల్లో దేవుని ఆజ్ఞలు, దైవప్రవక్త (సల్లం) బోధనలు మాత్రమే అనుస రించాలని ముస్లింలకు హితోపదేశం చేయబడుతున్న సందర్భం అది. ఆనాడు దేవుని ఏకత్వం, దైవప్రవక్తలు, దివ్యావిష్కృతి (వహీ), పునరుత్థాన దినం, పరలోక తీర్పు లాంటి విషయాల్ని గురించి యూదులకు, క్రైస్తవులకు మాత్రమే తెలుసు. బహుదైవారాధకులైన అరబ్బులకు వీటిని గురించి పూర్తిగా తెలియదు. అలాంటి అరబ్బులలో కొత్తగా ఇస్లాం స్వీకరించి ముస్లిములయిన వారిని యూదులు, క్రైస్తవులు పెడదారి పట్టించే ప్రమాదం ఏర్పడింది.



ఒకడిగా పరిగణించబడతాడు. హద్దుమీరిన దుర్మార్గులకు దేవుడు ఎన్నటికీ సన్మార్గం చూపడు. (51)

హృదయాల్లో (కాపట్య) రోగం ఉన్నవారు పరుగు పరుగున వెళ్ళి వారితో కలసి పోవడాన్ని నీవు చూస్తూనే ఉన్నావు. వారంటారు: "ఖర్మకాలి మనమేదైనా ఆపదలో చిక్కుకోబోవడం లేదుకదా!" అని. దేవుడు మీకు త్వరలోనే విజయభాగ్యం ప్రసాదించ వచ్చు; లేదా తన దగ్గర్నుంచి ఏదైనా ఆజ్ఞనయినా (పంపవచ్చు). అప్పుడు వీరు తమ మనసుల్లో దాచిన విషయం పట్ల పశ్చాత్తాపపడతారు. విశ్వాసులు (వారి నిజస్వరూపం చూసి ఆశ్చర్యపోతూ) "దేవునిపేర పెద్దపెద్ద ప్రమాణాలు చేసి 'మేము మీతోనే ఉన్నాం' అని ఎంతో నమ్మకంగా చెప్పినవారు వీరేనా?"అని అంటారు. ఇలా కపటవిశ్వాసుల కర్మలన్నీ కాలిపోయి చివరికి వారు రిక్తహస్తాలతో మిగిలిపోతారు. (52-53)

విశ్వాసులారా! మీలో ఎవరైనా తామిప్పుడు అనుసరిస్తున్న ధర్మం నుండి వెనక్కి మరలితే (మరలి పోనివ్వండి), దేవుడు (అంతకంటే మంచివాళ్ళు) చాలామందిని పుట్టిస్తాడు. వారు దేవుడ్ని ఎంతగానో ప్రేమిస్తారు. దేవుడు కూడా వారిని ప్రేమిస్తాడు. అదీగాక వారు తోటివిశ్వాసుల విషయంలో మృదువుగా, అవిశ్వాసుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తారు. దైవమార్గంలో నిరంతరం పోరాటం జరుపుతారు. నిందించే వారి నిందలకు ఏమాత్రం బెదిరిపోరు. ఇది దేవుని అనుగ్రహం, తాను కోరినవారికి అనుగ్రహిస్తాడు. ఆయన విశాలహృద యుడు, సర్వజ్ఞాన సంపన్నుడు. (54)

మీకు మిత్రులంటూ ఎవరైనా ఉంటే వారు దేవుడు, దైవప్రవక్త, ఆ తరువాత నమాజ్ నెలగొల్పే, జకాత్ చెల్లించే, దేవుని ముందు మోకరిల్లే విశ్వాసులు మాత్రమే. దేవుడ్ని, ఆయన ప్రవక్తను, విశ్వాసుల్ని మిత్రులుగా చేసుకునేవారు దేవుని పక్షానికే విజయం వరిస్తుంద'ని తెలుసుకోవాలి. (55-56)

విశ్వాసులారా! మీకు పూర్వం దివ్యగ్రంథాలు ప్రసాదించబడిన వారిలో మీ ధర్మాన్ని ఆటగా, వినోదంగా చేసుకున్నవారిని, ఇతర అవిశ్వాసుల్ని మీరు స్నేహితులుగా చేసుకోకండి. మీరు నిజంగా విశ్వసించిన వారయితే దేవునికి భయపడి, ఆయన ఆజ్ఞల్ని పాటించండి. మీరు నమాజు కోసం (అజాన్) పిలుపు నిస్తే వారు దాన్ని వెక్కిరింపులతో హేళన చేస్తారు. దానికి కారణం వారికి ఇంగిత జ్ఞానం లేకపోవడమే. (57-58)

---

అదీగాక ఆనాడు ఇస్లాంకు, ఇస్లాంవ్యతిరేక శక్తులకు మధ్య తీవ్ర సంఘర్షణ జరుగుతుండేది. ఈ సంఘర్షణలో యూదులు, క్రైస్తవులు ఇస్లాంవ్యతిరేక శక్తులతో కుమ్మక్కయి, ఇస్లాంను తుడిచి పెట్టేందుకు దొరికిన ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవడానికి కాచుకొని కూర్చున్నారు.

అంచేత అలాంటి యూదులతో, క్రైస్తవులతో చనువుగా మసలుకుంటే వారు మీ అమాయ కత్వాన్ని ఆసరాగా చేసుకొని మిమ్మల్ని రుజుమార్గం నుండి తప్పిస్తారని, ఇస్లామీయ ఉద్యమానికి వ్యతిరేకంగా కుట్రలు పన్నవచ్చని ఈ సూక్తిలో ముస్లింలను హెచ్చరించడం జరిగింది. అంతేగాని ప్రతికాలంలో, ప్రతివిషయంలో వారితో అసలు స్నేహమే చేయకూడదని దీని అర్థం కాదు.

(ఇతర వివరాలకు ఇదే అధ్యాయంలోని 82వ సూక్తి, దాని పాదసూచిక చూడండి.)

వారిని అడుగు: "గ్రంథప్రజలారా! మేము (సర్వలోక ప్రభువయిన) దేవుణ్ణి, మా ముందిప్పుడు అవతరించినదాన్ని (అంటే ఖుర్ఆన్ని), మాకు పూర్వం అవతరించిన వాటిని విశ్వసించామనేకదా మీరు మా మీద మండిపడుతున్నారు? (మరి మీ సంగతేమిటి?) మీలో ఉన్నది చాలామంది దుర్జనులే కదా?" (59)

ఈ సంగతి కూడా అడుగు: "దేవుని దగ్గర అంతకంటే కూడా అధముల్ని, అత్యంత దారుణఫలితం పొందేవారిని మీకు చూపనా? వారే దైవశాపగ్రస్తులు. దైవాగ్రహం వారిపై విరుచుకుపడింది. వారిలో అనేకమంది కోతులుగా, పందులుగా మార్చబడ్డారు. షైతాన్కు బానిసలయి (వాడి చేతిలో కీలుబొమ్మలుగా మారి)న వారు అంతకంటే నీచంగా దిగజారి పోయారు. వారు సన్మార్గానికి బహుదూరంగా పోయి తచ్చాడుతున్నారు." (60)

వారు నీ దగ్గరికి వచ్చినప్పుడు, తాము విశ్వసించామని అంటారు. కాని వారు తమ అంతరంగాల్లో అవిశ్వాసం నింపుకువచ్చారు. అవిశ్వాసాన్నే తిరిగి తీసుకొని వెళ్ళారు. వారు ఎంతో రహస్యంగా ఉంచామనుకున్న విషయాలు కూడా దేవునికి తెలుసు. (61)

నీవు చూస్తూనే ఉన్నావు, వారిలో చాలామంది పాపకార్యాలు, హింసాదౌర్జన్యాలు, అన్యాయం, అక్రమాలు చేయడానికే అనుక్షణం పరుగులు పెడతారు. అక్రమ సంపాదనతో కడుపు నింపుకుంటారు. వీరు ఎంతటి ఘోరమైన వికృతచేష్టలకు పాల్పడుతున్నారు! వారి పండితులు, ధర్మవేత్తలు వారిని పాపకార్యాల నుండి, అక్రమ సంపాదనల నుండి ఎందుకు వారించరు? వీరు చేస్తున్నది కూడా చాలా చెడ్డపనే. (62-63)

యూదులు "దేవుని చేతులు కట్టివేయబడ్డాయి" అంటారు. వారి చేతులే కట్టివేయబడ్డాయి. ఇలాంటి కారుకూతల వల్లే వారిపై (దైవ)శాపం విరుచుకుపడింది. దేవుని చేతులు నిక్షేపంగా తెరిచేఉన్నాయి. ఆయన తాను తలచినవారికి తలచుకున్నంత అనుగ్రహిస్తాడు.[10]

---

10. ధర్మసంస్థాపనా పోరాటానికి నిధులు కావలసి వచ్చినప్పుడు దేవుడు ముస్లింలను ఉద్దేశించి "దేవునికి శ్రేష్ఠమైన రుణదానం అందజేసేవారు మీలో ఎవరైనా ఉన్నారా...." (2:245) అంటూ వారిని విరాళాల కోసం ప్రేరేపించాడు. ఇది విన్న యూదులు దాన్ని గేలిచేస్తూ "పాపం దేవుడు దరిద్రుడయి పోయాడు. (పాపం క్షమించుగాక) ఇప్పుడాయనగారు తన దాసుల దగ్గర అప్పు కూడా అడుక్కుంటున్నాడు" అని చెప్పసాగారు. "దేవుడు దరిద్రుడు, మేము ధనికులం" (3:181) అని కూడా చెప్పుకుంటూ విర్రవీగిపోయారు.

అయితే కొంతకాలానికి పరిస్థితులు మారిపోయాయి. దైవమార్గంలో సాధించిన అనేక విజయాలతో ముస్లింలు స్థితిపరులయ్యారు. అటు సత్యతిరస్కారం వల్ల యూదులు పేదవాళ్ళయి పోయారు. అప్పుడు యూదులు "దేవుడు ధనికుడు, మేమే పేదవాళ్ళం" అనడానికి బదులు, "దేవుని చేతులు కట్టివేయబడ్డాయి" అని చెప్పడం ప్రారంభించారు. అంటే, దేవుడు తమకు చేస్తూ ఉండిన సహాయాన్ని పిసినారితనంతో నిలిపివేశాడని అర్థం. దేవుడు ఈ సూక్తిలో వారికి సమాధానం ఇస్తూ, తన చేతులు యథాతథంగా తెరిచే ఉన్నాయని, తాను కోరినవారికి కోరినంత అనుగ్రహిస్తూనే ఉన్నానని అన్నాడు.



నీ ప్రభువు నుండి నీపై అవతరించిన ఈ వాణి వారిలో చాలామంది ప్రజల అవిశ్వాసం, తలబిరుసుతనాలు మరింత ముదిరిపోవడానికే కారణభూతమయింది. అందువల్లనే మేము ప్రళయందాకా ఉండేలా వారి మధ్య విరోధం, విద్వేషాలు నాటాము. వారు (ప్రపంచంలో) యుద్ధజ్వాలలు రగిల్చినప్పుడల్లా దేవుడు వాటిని చల్లార్చవలసి వస్తున్నది. వారు ఎల్లప్పుడూ ధరణిపై ఏదో ఒక ఉపద్రవం సృష్టించడానికే ప్రయత్నిస్తుంటారు. దేవుడు ఇలాంటి కలహకారుల్ని ఎన్నటికీ ప్రేమించడు. (64)

గ్రంథప్రజలు (మీలాగే) సత్యాన్ని విశ్వసించి, భయభక్తుల వైఖరి అవలంబిస్తే మేము వారి పాపాలు క్షమించి, వారిని సుఖసంతోషాలతో కూడిన స్వర్గవనాల్లో ప్రవేశింపజేస్తాం కదా! వారు తౌరాత్ని, ఇన్జీల్ని, వారి దగ్గరకు వారిప్రభువు నుండి వచ్చిన ఇతర గ్రంథాలను పాటించివుంటే ఎంత బాగుండేది!! అలా చేసివుంటే వారికోసం ఆహారం పైనుండి వర్షించి ఉండేది, క్రిందినుండీ ఉప్పొంగి ఉండేది. వారిలో కొందరు సజ్జనులు లేకపోలేదు. కాని వారిలో అత్యధికమంది దుర్జనులే ఉన్నారు. (65-66)

ప్రవక్తా! ఏమైనప్పటికీ నీ ప్రభువు నుండి నీపై అవతరించే బోధనలు వారికి అందజేస్తూ ఉండు. నీవలా చేయకపోతే దౌత్యబాధ్యతను నెరవేర్చని వాడవవుతావు. (ఈ పనిలో నీవు ఎలాంటి భయాందోళనలకు గురికానవసరం లేదు.) దేవుడే నిన్ను ప్రజల కీడు నుండి కాపాడుతాడు. దేవుడు సత్యతిరస్కారులకు ఎన్నటికీ సన్మార్గం చూపడు. వారికిలా చెప్పేసేయి: "గ్రంథప్రజలారా! తౌరాత్ని, ఇన్జీల్ని, మీ ప్రభువు నుండి మీ దగ్గరకు అవతరించిన ఇతర గ్రంథాలను అనుసరించనంతవరకూ మీరు ఏవిధంగానూ సన్మార్గంలో ఉన్నట్లు పరిగణించబడరు." నీ ప్రభువు నుండి నీపై అవతరించిన ఈవాణి వారిలో చాలామంది అవిశ్వాసం, తలబిరుసుతనాలు మరింత ముదిరిపోవడానికే కారణభూతమయింది. కనుక నీవు అవిశ్వాసుల వైఖరిపట్ల విచారపడకు. (67,68)

ముస్లింలయినా, యూదులైనా, క్రైస్తవులైనా, నక్షత్రారాధకులైనా, మరెవరైనా సరే దేవుణ్ణి, అంతిమదినాన్ని విశ్వసించి తదనుగుణంగా సత్కార్యాలు చేస్తుంటే, అలాంటి వారికి (ప్రళయదినాన) ఎలాంటి భయంగాని, దుఃఖంగాని ఉండదు. (69)

మేము ఇస్రాయీల్ సంతతివారి చేత ప్రమాణం చేయించాము. వారి దగ్గరకు ప్రవక్తలను కూడా పంపాము. అయితే వారి దగ్గరకు దైవప్రవక్తలు వారికి నచ్చని విషయాలు తెచ్చినప్పుడు వారు కొందరు ప్రవక్తల్ని తిరస్కరించేవారు, మరికొందరు ప్రవక్తల్ని హతమార్చేవారు. వారు (తాము ఏం చేసినా) ఎలాంటి ఆపదలు వచ్చిపడవని భావించారు. అందుకే వారు అంధులు, బధిరులయి పోయారు. తర్వాత దేవుడు వారిని క్షమించాడు. కానివారిలో చాలామంది ఇంకా పెట్రేగిపోయి మరింత అంధులు, బధిరులయిపోయారు. దేవుడు వారి చర్యల్ని ఓకంట గమనిస్తూనే ఉన్నాడు. (70-71)

'మర్యం కుమారుడు మసీహ్ (కూడా) దేవుడే' అంటున్నవారు నిస్సందేహంగా అవిశ్వాసులై పోయారు. మసీహ్ (తనను తాను దేవుడని ఎన్నడూ చెప్పుకోలేదు.) ఇలా బోధిస్తూ ఉండేవాడు: "ఇస్రాయీల్ సంతతి ప్రజలారా! దేవుణ్ణి మాత్రమే ఆరాధించండి.

ఆయన నాకూ ప్రభువే, మీకూ ప్రభువే. దేవునికి ఇతరులను సాటి కల్పించేవారికి దేవుడు స్వర్గప్రవేశం నిషేధించాడు. వారి నివాసం నరకమవుతుంది. అలాంటి దుర్మార్గులకు ఎవరూ సహాయం చేయలేరు.'' (72)

'దేవుడు ముగ్గురిలో ఒకడు' అని పలికినవారు కూడా నిస్సందేహంగా సత్య తిరస్కారులుగానే పరిగణించబడతారు. వాస్తవానికి దేవుడు ఒక్కడే. ఆయన తప్ప మరే దేవుడూ లేడు. వారు ఇలాంటి మాటలు మానుకోకపోతే వారిలో (ఈవిధంగా) సత్యాన్ని తిరస్కరించినవారికి అత్యంత బాధాకరమైన శిక్ష పడుతుంది. మరి ఇప్పటికైనా వారు పశ్చాత్తాపం చెంది దేవుడ్ని క్షమాపణ కోరుకుంటారా? దేవుడు ఎంతో క్షమాశీలి, అమిత కరుణామయుడు. (73-74)

మర్యం కుమారుడు మసీహ్ (ఏసు) దైవప్రవక్త తప్ప మరేమీ కాదు. అతనికి పూర్వం కూడా అనేకమంది దైవప్రవక్తలు వచ్చిపోయారు. అతని తల్లి సౌశీల్యమూర్తి అయిన స్త్రీ. వారిద్దరూ (అందరిలాగే) అన్నం తినే మనుషులే. చూడు, మేము వారి ముందు మా సూక్తుల్ని ఎలా విడమరచి తెలుపుతున్నామో. అయినా వారు (ముఖం చాటేసి) ఎలా వెనక్కి మరలి పోతున్నారో చూడు! (75)

వారిని అడుగు: "మీరు దేవుడ్ని వదలి ఎలాంటి లాభనష్టాలు కలిగించలేని వాటిని ఎందుకు ఆరాధిస్తున్నారు? అందరి మొరలు ఆలకించేవాడు, అన్ని విషయాలు ఎరిగినవాడు దేవుడు మాత్రమే.'' ఇలా చెప్పు: "గ్రంథప్రజలారా! మీరు మీధర్మంలో సత్యానికి వ్యతిరేకంగా హద్దుమీరి ప్రవర్తించకండి. మీకు పూర్వం స్వయంగా మార్గభ్రష్టులయి, ఇతరుల్ని కూడా అనేకమందిని మార్గభ్రష్టులుగా చేసినవారి అడుగుజాడల్లో నడవకండి. వారు రుజుమార్గం నుండి పూర్తిగా తప్పిపోయారు.''[11] (76,77)

ఇస్రాయీల్ సంతతిలో సత్యాన్ని తిరస్కరించినవారు దావూద్ నోట, మర్యం కుమారుడు ఈసా నోట శపించబడ్డారు. దానిక్కారణం వారు అవిధేయులయి హద్దుమీరి ప్రవరిస్తూ ఉండటమే. అదీగాక వారు ఒకర్నొకరు చెడుల నుండి వారించుకునే వారు కాదు. నిస్సందేహంగా వారు చేసింది చాలా చెడ్డ పనే. (78-79)

ఈనాడు కూడా అలాంటివారు నీకు చాలామంది కనిపిస్తారు. వారు (విశ్వాసుల కంటే) అవిశ్వాసులతోనే ఎక్కువ స్నేహసంబంధాలు పెట్టుకుంటారు. వారు ముందుగా పంపుకున్నది చాలా చెడ్డ విషయం (అంటే దుష్కర్మలు). వారిపై దేవుని ఆగ్రహం విరుచుకు పడింది. వారిక శాశ్వతంగా (నరక) యాతనల్లో చిక్కుకొని ఉంటారు. (80)

---

11. క్రీ.శ. మూడవ శతాబ్దాంతం వరకు క్రైస్తవుల మత విశ్వాసాలు చాలా వరకు వారి ప్రవక్త తెచ్చిన బోధనలకు అనుగుణంగానే ఉండేవి. ఆ తరువాత నాల్గవ శతాబ్దం నుండి క్రైస్తవ మత పండితులు గ్రీకుల మూఢ నమ్మకాలకు, వారి తత్వవిచారానికి ప్రభావితులయి, స్వమత విషయంలో అతిశయోక్తికి పోయి తమ మతబోధనల్లో బహుదైవ భావనను, త్రిత్వాన్ని సృష్టించుకున్నారు. ఈ విషయాన్నే దివ్యఖుర్ఆన్ ఇక్కడ ప్రస్తావించింది.



వారు గనక దేవుడ్ని, దైవప్రవక్తను, వారి దగ్గరకు పంపబడిన గ్రంథాన్ని విశ్వసించి వుంటే (ఈవిధంగా) వారు అవిశ్వాసుల్ని స్నేహితులుగా చేసుకునేవారు కాదు. కాని వారిలో చాలామంది దుర్జనులే ఉన్నారు. (81)

విశ్వాసుల పట్ల అందరికన్నా ఎక్కువ శత్రువైఖరి అవలంబించేవారు యూదులు, బహుదైవారాధకులే. అది నీకూ తెలుసు. స్నేహసంబంధాల విషయంలో "మేము నసారా (సహాయకులం)'' అన్నవారు[12] విశ్వాసులకు చాలా దగ్గరగా ఉన్నారని కూడా నీకు తెలుసు. దానిక్కారణం వారిలో భక్తిపరులయిన పండితులు, వైరాగ్యులయిన సాధువులు కూడా ఉన్నారు. వారిలో ఏమాత్రం అహంకారం లేదు. (82)

వారు దైవప్రవక్తపై అవతరించిన (ఈ) వాణి విన్నప్పుడు దాని ప్రభావంతో వారి కళ్లు అశ్రుపూరితాలవుతాయి. వారు అప్రయత్నంగా "ప్రభూ! మేము విశ్వసించాము. మా పేరు సాక్షుల జాబితాలో వ్రాయి'' అనంటారు. వారింకా ఇలా అంటారు: "అసలు మేము దేవుడ్ని ఎందుకు విశ్వసించము? మా ప్రభువు మమ్మల్ని సజ్జనులలో పరిగణిస్తాడని మేము ఆశిస్తు న్నాము. అలాంటప్పుడు మా దగ్గరకు వచ్చిన సత్యాన్ని మేము ఎందుకు విశ్వసించము? (తప్పకుండా విశ్వసిస్తాము.)'' (83-84)

ఈ పలుకుల కారణంగానే దేవుడు వారికి సెలయేరులు ప్రవహించే స్వర్గవనాలు ప్రసాదిస్తాడు. వారక్కడ శాశ్వతంగా ఉంటారు. సదాచారసంపన్నులకు మేము ఇలాంటి ప్రతిఫలమే ప్రసాదిస్తాము. ఇక అవిశ్వాసవైఖరి అవలంబించి మా సూక్తుల్ని నిరాకరించే వారు నరకాగ్నికి సమిధలయి పోతారు. (85-86)

విశ్వాసులారా! దేవుడు మీ కోసం ధర్మసమ్మతం చేసిన వస్తువుల్ని నిషేధించు కోకండి. హద్దుమీరి వ్యవహరించకండి. హద్దుమీరేవారిని దేవుడు ఎన్నటికీ ప్రేమించడు.[13]

---

12. ఖుర్ఆన్ క్రైస్తవులను "నసారా'' అనే పేరుతో ప్రస్తావించింది. జాత్యహంకారం, మత దురభిమానాల కారణంగా యూదులు ఇస్లాంకు, ముస్లింలకు బద్ధశత్రువులైపోతే; రాజకీయ, ఆర్థిక కారణాల వల్ల బహుదైవారాధకులు ముస్లింలకు విరోధులయి పోయారు. పైరెండు వర్గాలతో పోల్చితే మూడోవర్గమైన క్రైస్తవులు ఇస్లాంపట్ల, ముస్లింలపట్ల కొంచెం తక్కువ ద్వేషం, దురభిమానాలు కలిగి ఉండేవారు. కారణం వారు తమ మతగ్రంథాల్లో అంతిమ దైవప్రవక్త రాకగురించి భవిష్యత్ ప్రకటనలు చదివి ఆయన కోసం నిరీక్షిస్తుండేవారు. వారిలో చాలామంది సాధువులు, భక్తిపరులు ఉండేవారు. అలాంటి సాధువులు, భక్తిపరులంతా ఆ తరువాత ఇస్లాం స్వీకరించారు.

కాని ఈనాటి క్రైస్తవుల్లో అత్యధికమంది, హజ్రత్ మర్యం (అలై)పై తీవ్రమైన అపనిందలు మోపి, ఈసా ప్రవక్త (అలై)ను చంపడానికి సైతం కుట్రలు పన్నిన యూదులతో చేతులు కలిపి ముస్లింల పట్ల, ఇస్లాంపట్ల శత్రుభావంతో ప్రవర్తించడం శోచనీయం! (51వ సూక్తి పాదసూచిక చూడండి.)

13. దేవుడు ధర్మసమ్మతం చేసిన వస్తువుల్ని, విషయాల్ని నిషేధించుకునే అధికారం ఎవరికీ లేదని ఈ సూక్తి స్పష్టం చేస్తోంది. ధార్మికులలో కొందరు ఈనాటికీ ఆత్మవికాసం కొరకు దేవుడు అనుమతించిన కొన్ని ఆహారపదార్థాలు, దాంపత్యసుఖం మొదలైన ప్రాపంచిక సౌఖ్యాలను పరిత్యజించి వైరాగ్యభావంతో శరీరాలను కృశింపజేసుకుంటున్నారు. ఖుర్ఆన్ దీన్ని ఖండిస్తోంది.

దేవుడు మీకు ధర్మసమ్మతం చేసి ప్రసాదించిన పరిశుద్ధ వస్తువులు నిస్సంకోచంగా తినండి, త్రాగండి. దాంతోపాటు మీరు విశ్వసిస్తున్న దేవునిపట్ల భయభక్తులు కూడా కలిగివుండండి. (87-88)

మీరు చేసే అర్థం పర్థంలేని ఉత్తుత్తి ప్రతిజ్ఞా, ప్రమాణాలను గురించి దేవుడు మిమ్మల్ని పట్టుకోడు. కాని బుద్ధిపూర్వకంగా చేసే ప్రతిజ్ఞా, ప్రమాణాల విషయంలో మాత్రం ఆయన మిమ్మల్ని తప్పకుండా నిలదీస్తాడు. (అలా బుద్ధిపూర్వకంగా ఏదైనా తప్పుడు ప్రమాణం చేసివుంటే) దానికి నిష్కృతి- మీరు మీ భార్యాపిల్లలకు పెట్టేటటు వంటి సగటురకం భోజనం పదిమంది నిరుపేదలకు పెట్టాలి, లేదా బట్టలు ఇవ్వాలి, లేదా ఒక బానిసకు స్వేచ్ఛ కలిగించాలి. ఇవేమీ లేనివారు మూడు రోజులు ఉపవాస వ్రతం పాటించాలి.

మీరు ప్రమాణం చేసి భంగపరిస్తే దానికిదే నిష్కృతి. అందువల్ల మీరు మీ ప్రమాణాలను కాపాడుకోండి. మీరు దేవుని పట్ల కృతజ్ఞులయి ఉండేందుకు ఈ విధంగా ఆయన తన సూక్తులు మీకు విడమరచి బోధిస్తున్నాడు. (89)

విశ్వాసులారా! మద్యం, జూదం, దైవేతరాలయాలు, పాచికల జోస్యం- ఇవన్నీ అసహ్యకరమైన పైశాచిక విషయాలు. వాటికి దూరంగా ఉండండి, మీ జీవితం

---

పూర్వం కొందరు ప్రవక్తఅనుచరుల్లో కూడా ఇలాంటి వైఖరి తలెత్తింది. ఎల్లప్పుడూ ఉపవాసాలు పాటిస్తామని; రాత్రుళ్ళలో నిద్రపోకుండా ఆరాధనలోనే గడుపుతామని; మాంసం, నెయ్యి, నూనెలు వాడమని; భార్యలకు దూరంగా ఉంటామని వారు ప్రతిజ్ఞ చేశారు. దైవప్రవక్త (సల్లం)కు ఈ సంగతి తెలిసి ఒక ప్రసంగంలో ఇలా అన్నారు:

"ఇలాంటి పనులు చేయమని నాకు ఆజ్ఞ లేదు. మీపై మీ ఆత్మల హక్కు కూడా ఉంది. కనుక ఉపవాసాలు పాటించండి, తినడం త్రాగడం కూడా చేయండి. రాత్రుళ్ళలో ఆరాధన కూడా చేయండి, నిద్ర కూడా పోతూఉండండి. నన్ను చూడండి, నేను నిద్రపోతాను, జాగరణ చేస్తాను. ఉపవాసాలు పాటిస్తాను, వాటిని విరమిస్తాను కూడా. మాంసం తింటాను, నెయ్యి కూడా తింటాను. నా విధానం, సంప్రదాయాలను ఇష్టపడని (పాటించని) వాడు నావాడు కాదు."

ఆ తర్వాత ఆయన ఇలా అన్నారు: "వీరికేమయింది స్త్రీలను, మంచి ఆహార పదార్థాలను, సువాసనలను, నిద్రను, (ఇతర) ప్రాపంచిక సౌఖ్యాలను నిషేధించుకున్నారు? నేను మీకు విరాగులుగా, సన్యాసులుగా మారమని బోధించలేదు. నాధర్మంలో స్త్రీలను, మాంసాహారాన్ని త్యజించాలని లేదు. అలాగే బైరాగులయి ఏకాంత కుహురాల్లో తిష్ఠవేయాలని కూడా లేదు. ఆత్మనిగ్రహం కొరకు నాధర్మంలో ఉపవాసవ్రతముంది. వైరాగ్య ప్రయోజనాలన్నీ ఇక్కడ జిహాద్ ద్వారా సమకూరుతాయి. (కనుక) అల్లాహ్‌ను ఆరాధించండి. ఆయనకు మరెవరినీ సాటికల్పించకండి. హజ్, ఉమ్రా (విధు)లు నిర్వహించండి. నమాజ్ స్థాపించండి. జకాత్ చెల్లించండి. రమజాన్ ఉపవాసాలు పాటించండి. మీకు పూర్వం గతించిన ప్రజలు తమపై లేనిపోని భారం, కాఠిన్యాలు మోపుకోవడం వల్లనే సర్వనాశనం అయ్యారు. వారు తమ మీద లేనిపోని బరువులు, కాఠిన్యాలు మోపుకున్నప్పుడు దేవుడు కూడా వారిపై బరువులు, కాఠిన్యాలు మోపాడు. మీకు మఠాలలో, ఆశ్రమాల్లో, ఏకాంతకుహరాల్లో కన్పిస్తున్న అవశేషాలు వారు వదలిపెట్టి పోయినవే." (బుఖారి, ముస్లిం)



సార్థకమవుతుంది.[14] మద్యం, జూదాల ద్వారా షైతాన్ మీమధ్య విరోధం, విద్వేష బీజాలు నాటి మిమ్మల్ని దైవధ్యానం, ప్రార్థనల నుండి నిరోధించగోరుతున్నాడు. కనుక ఇకనైనా మీరు వాటిని మానుకోండి. దైవాజ్ఞలను, ఆయన ప్రవక్త హితవుల్ని పాటించండి. వాటిని పాటించకుండా ముఖం తిప్పుకుంటే మాత్రం (మీకే నష్టం), ఆదేశాన్ని యధాతథంగా అందజేయడమే మా ప్రవక్త బాధ్యత. (90-92)

విశ్వసించి సదాచార వైఖరి అవలంబించినవారు గతంలో ఏదైనా తిని ఉంటే (అంటే పాపకార్యానికి పాల్పడిఉంటే) దాన్ని గురించి వారిని నిలదీయడం జరగదు.

---

14. ఈ ఆదేశం వెలువడిన తరువాత మద్యం నిషేధించబడిందని, ఇకనుండి ఎవరూ మద్యం ముట్టడంగాని, అమ్మడంగాని చేయకూడదని దైవప్రవక్త (సల్లం) ఒక బహిరంగ ప్రకటన చేయించారు. ఈ ప్రకటన వినగానే ముస్లింలంతా తమ తమ ఇండ్లలో ఉన్న మద్యాన్నంతటినీ వీధుల్లోకి తెచ్చి పారబోశారు. ఆరోజు మదీనా వీధుల్లో మద్యం ఏరులై ప్రవహించింది. సారా అంగళ్ళు శాశ్వతంగా కనుమరుగై పోయాయి.

కొందరు మద్యం గురించి దైవప్రవక్త (సల్లం) ముందు ప్రస్తావిస్తూ "దీన్ని యూదులకు కానుకగా ఇవ్వచ్చా?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) "మద్యాన్ని నిషేధించినవాడు (దేవుడు) దాన్ని ఇతరులకు కానుకగా ఇవ్వడాన్ని కూడా నిషేధించాడు" అన్నారు. మరొకతను దీన్ని మందుగా వాడుకోవడానికి అనుమతివ్వమని అడిగాడు. దైవప్రవక్త (సల్లం) అనుమతి నిరాకరిస్తూ "అది మందు కాదు, వ్యాధి" అన్నారు. (ఇతర వివరాలకు 4:43, 2:29 సూక్తులు చూడండి.)

వేరొకతను వచ్చి "దైవప్రవక్తా! మేము తీవ్రమైన చలి ఉండే ప్రాంతంలో ఉంటున్నాం. కాయకష్టం కూడా ఎక్కువగా చేయవలసి వస్తుంది. మద్యం వల్ల మాకు కాస్త సేద తీరుతుంది. చలికి తట్టుకునే శక్తి కూడా వస్తుంది" అన్నాడు. దైవప్రవక్త (సల్లం) ఈమాట విని "మీరు తాగే ఆ పానీయం వల్ల మత్తు కలుగుతుందా?"అని అడిగారు. దానికావ్యక్తి "కలుగుతుంది" అన్నాడు. "అయితే దాన్ని మానుకోవాల్సిందే" అన్నారు దైవప్రవక్త (స). "కాని మాప్రాంతం జనం ఒప్పుకోరే ఎలా?"అన్నాడా వ్యక్తి. "ఒప్పుకోకపోతే వారితో యుద్ధం చేయండి" అన్నారు దైవప్రవక్త (సల్లం).

దైవప్రవక్త (సల్లం) కాలంలో మద్యం సేవించినవాడికి శిక్షగా గరిష్ఠ స్థాయిలో నలభై వరకు కొరడా దెబ్బలు కొట్టడం జరిగేది. హజ్రత్ అబూబకర్ (రజి) పాలనాకాలంలో నలభై కొరడా దెబ్బల శిక్షే ఉండేది. హజ్రత్ ఉమర్ (రజి) పాలనాకాలం తొలిరోజుల్లో కూడా నలభై కొరడా దెబ్బల శిక్షే ఉండేది. కాని దానివల్ల సారాయి త్రాగేవారు తమ అలవాటు మానుకోలేక పోయారు. అప్పుడు హజ్రత్ ఉమర్ (రజి) ఇతర నాయకులతో సంప్రదించి ఈశిక్షను ఎనభై కొరడా దెబ్బలకు పెంచారు. ఇమామ్ మాలిక్ (రహ్మలై), ఇమామ్ అబూహనీఫా (రహ్మలై)లు ఎనభై కొరడా దెబ్బల శిక్షనే నిర్ణయించారు. హజ్రత్ ఉమర్ (రజి) పాలనలో రూయషిద్ అనే వ్యక్తి రహస్యంగా సారాయి అమ్ముతున్న కారణంగా అతని దుకాణాన్ని కాల్చివేయడం జరిగింది.

పోతే జూదం కూడా ఘోరమైన పాపకార్యమే. ఇందులో అనేకమంది వ్యక్తుల డబ్బు ఎలాంటి శ్రమ లేకుండానే ఒక వ్యక్తికి లభిస్తుంది. ఈనాటి మట్కా, లాటరీలు కూడా ఈ కోవకు చెందినవే. వ్యాపారస్థులు నడిపే కొన్ని రకాల స్కీములు కూడా జూదం క్రిందికే వస్తాయి.

పాచికల ద్వారా జోస్యం చెప్పడమనేది అజ్ఞానకాలం అరబ్బుల్లో ఉండే మూఢ నమ్మకం. జాతకం, జోతిష్యం, వారఫలాల పేరుతో ఈనాడు కూడా అనేకమంది ఈ జాడ్యానికి గురవుతున్నారు.

అయితే వారు నిషిద్ధ విషయాల జోలికి పోకుండా ఉండాలి. విశ్వాసంలో స్థిరంగా ఉండాలి. మంచిపనులు చేస్తుండాలి. ఏ విషయాల నుండి వారిస్తే ఆ విషయాలకు దూరంగా ఉండాలి. దైవాజ్ఞల పరిధిలో ఉన్నవాటినే పాటిస్తూ ఉండాలి. దైవభీతి కలిగి సద్వర్తనులై మసలుకోవాలి. దేవుడు (ఇలాంటి) సద్వర్తనులనే ప్రేమిస్తాడు. (93)

విశ్వాసులారా! మీరు చేతులతో, ఈటెలతో చేసే వేట ద్వారా దేవుడు మిమ్మల్ని కఠిన పరీక్షకు గురిచేయనున్నాడు. మీలో ఎవరు దేవుణ్ణి చూడకుండానే ఆయనకు భయపడతారో చూసేందుకే ఆయన మీకిలా పరీక్ష పెడ్తున్నాడు. (కనుక హజ్‌దీక్షలో ఉండి వేటాడటం నిషిద్ధం అన్న సంగతి గుర్తుంచుకోండి.) ఈహెచ్చరిక విన్న తరువాత కూడా హద్దుమీరితే అలాంటివారికి బాధాకరమైన (నరక) యాతన తప్పదు. (94)

విశ్వాసులారా! మీరు హజ్‌దీక్ష (ఇహ్రాం)లో ఉన్నప్పుడు వేటాడకండి. ఒకవేళ ఎవరైనా కావాలని ఇలా చేస్తే అతను తాను వేటాడిన జంతువుకు సమానమైన మరో జంతువును సమర్పించి మొక్కుబడి చెల్లించవలసి ఉంటుంది. దీన్ని గురించి మీలో ఇద్దరు నిజాయితీ పరులు నిర్ణయం తీసుకోవాలి. తరువాత ఈ (బలిపశువు) కానుకను కాబాగృహానికి చేర్చాలి. అలాంటి మొక్కుబడి చెల్లించే స్తోమత లేనివారు తమపాపానికి నిష్కృతిగా కొందరు పేదలకు అన్నదానం చేయాలి. లేదా దానికి సమానమయిన ఉపవాసాలు పాటించాలి. ఈవిధంగా వారు తాము చేసిన నేరానికి శిక్ష అనుభవించాలి. గతంలో చేసినదాన్ని దేవుడు క్షమిస్తాడు. అయితే మళ్ళీ అలాంటి పనికి పాల్పడితే మాత్రం దేవుడు దానికి ప్రతీకారం చేస్తాడని తెలుసుకోండి. దేవుడు సర్వశక్తిమంతుడు, ప్రతీకారం చేయగల సమర్థుడు కూడా. (95)

దేవుడు మీకు సముద్రజీవాలను వేటాడటాన్ని, తినడాన్ని ధర్మసమ్మతం చేశాడు. దానివల్ల మీకూ, తోటి ప్రయాణీకులకూ ప్రయోజనం ఉంది. అయితే మీరు ఇహ్రాంలో ఉన్నంతవరకు నేలపై వేటాడకూడదు. కనుక దేవునికి భయపడండి. ఆయన మిమ్మల్నం దరినీ (తీర్పుదినాన) సమీకరించి తనముందు సమావేశపరచుకుంటాడు. (96)

దేవుడు కాబా ప్రతిష్ఠాలయాన్ని మానవుల కోసం శాంతిభద్రతల నిలయంగా చేశాడు. పవిత్ర (హజ్)మాసాలను, బలిపశువులను, వాటిమెడ పట్టడాలను కూడా (ఈ లక్ష్యానికి దోహదపడేవిగా చేశాడు). దేవుడు భూమ్యాకాశాల్లోని సమస్తం ఎరిగినవాడని, ఏదీ ఆయన జ్ఞానపరిధికి అతీతంగా లేదని మీరు తెలుసుకోవడానికే ఇలా చేశాడు.(97)

గుర్తుంచుకోండి, దేవుడు శిక్షించదలచుకుంటే అత్యంత కఠినంగా శిక్షిస్తాడు. అయితే దాంతోపాటు ఆయన గొప్ప క్షమాశీలి, అపార దయామయుడు కూడా. (మా) సందేశాన్ని (మీకు) అందజేయడమే దైవప్రవక్తపై ఉన్న బాధ్యత. ఆ తర్వాత మీ అంతర్ బాహ్యాల స్థితి గతులను గమనించే దేవుడున్నాడు. (98-99)

ప్రవక్తా! ప్రజలకు చెప్పు: "అత్యధిక సంఖ్యలో ఉండే అపరిశుద్ధ వస్తువులు మిమ్మల్ని ఎంతగా ఆకట్టుకున్నా (అవి అపరిశుద్ధ వస్తువులేగాని పరిశుద్ధ వస్తువులు కాజాలవు) పరిశుద్ధం, అపరిశుద్ధం ఎన్నటికీ ఒకటి కాజాలవు. కనుక బుద్ధిమంతులారా! దేవునికి భయపడుతూ మసలుకోండి, మీ జీవితం సార్థకమవుతుంది." (100)



విశ్వాసులారా! మీ ముందు వెల్లడిచేస్తే మీకు బాధ కలిగేటటువంటి విషయాలను గురించి (దైవప్రవక్తను) అడగకండి.[15] కావాలంటే ఖుర్‌ఆన్ సూక్తులు అవతరించే సందర్భంలో అడగండి, వాటిని గురించి మీకు విడమరచి చెప్పడం జరుగుతుంది. ఇప్పటివరకు మీవల్ల జరిగినవాటి విషయంలో దేవుడు మిమ్మల్ని క్షమిస్తున్నాడు. ఆయన గొప్ప క్షమాశీలి, జాలికలవాడు. మీకు పూర్వం కూడా కొందరు ఇలాంటి (పనికి మాలిన) ప్రశ్నలే అడిగి అవిశ్వాసులయి పోయారు. (101-102)

దేవుడు బహీరా, సాయిబా, వసీలా, హామ్ (పశువు)లను నియమించ లేదు. కాని ఈ తిరస్కారులు దేవుని మీద అపనింద మోపుతున్నారు. వారిలో చాలామంది బుద్ధి హీనులే ఉన్నారు. దేవుడు అవతరింపజేసిన దాని వైపు, దైవప్రవక్త వైపు రండని చెబితే, "మా తాతముత్తాతల నుండి వస్తున్న ఆచారాలే మాకు చాలు" అంటారు వారు. మరి వీరి తాతముత్తాతలు ఏమీ ఎరగకపోయినా, వారికి సన్మార్గం ఏమిటో తెలియకపోయినా వీరు తమ తాతముత్తాతలనే గుడ్డిగా అనుసరిస్తారా?[16] (103-104)

విశ్వాసులారా! మీరు మీగురించి ఆలోచించండి. మీరు గనక సన్మార్గంలో ఉంటే ఇతరుల మార్గభ్రష్టత వల్ల మీకెలాంటి నష్టం జరగదు.[17] మీరంతా చివరికి దేవుని దగ్గరికే పోవలసి ఉంది. అప్పుడు ఆయన (ఇహలోక జీవితంలో) మీరు ఏమేమి చేస్తుండేవారో మీకు తెలియజేస్తాడు. (105)

విశ్వాసులారా! మీలో ఎవరికైనా మరణ సమయం ఆసన్నమయినప్పుడు అతను వీలునామా రాయదలిస్తే, అందుకు మీలో ఇద్దరు నిజాయితీపరులు సాక్షులుగా

---

15. దైవప్రవక్త (సల్లం)ను కొందరు అనవసరమైన విషయాలను గురించి అడిగేవారు. ఖుర్‌ఆన్‌లో హజ్‌యాత్ర విధిగా చేయబడిందని అవతరించిన సూక్తి విని ఒకతను "ప్రతి యేడూ (హజ్) విధిగా చేయాలా?" అని అడిగాడు. దానికి ఆయన సమాధానమివ్వలేదు. అతను మళ్ళీ అడిగాడు. దానికీ ఆయన సమాధానమివ్వలేదు. ఆ వ్యక్తి మూడోసారి అడిగినప్పుడు దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు: "మీ ధోరణి చాలా శోచనీయం. నేను గనక ఔనంటే హజ్ ప్రతి యేడూ విధి అవుతుంది. అప్పుడు మీరే దాన్ని పాటించలేక అవిధేయతకు పాల్పడతారు." (ముస్లిం)

16. వివరాలకు 2:170 సూక్తి, దాని పాదసూచిక చూడండి.

17. మనిషి ఇతరుల లోపాలను గురించి ఆలోచించడానికి బదులు ముందుగా తనలో ఉన్న లోపాలేమిటో ఆత్మావలోకన చేసుకోవాలని ఈసూక్తి తెలియజేస్తోంది. అయితే ఇతరుల్ని సంస్కరించే విషయాన్ని వదిలెయ్యాలని దీని అర్థం ఎంతమాత్రం కాదు. హజ్రత్ అబూబకర్ (రజి) ఈ అపోహను ఖండిస్తూ దైవప్రవక్త (సల్లం) చేసిన ఒక హితువును ఇలా విన్పించారు:

"ప్రజలు చెడు విషయం చూసి దాన్ని నిరోధించడానికి ప్రయత్నించకపోతే, దుర్మార్గుణ్ణి దౌర్జన్యం చేస్తుండగా చూసి అడ్డుకోకపోతే త్వరలోనే వారందరిపై దైవశిక్ష విరుచుకుపడే ప్రమాదం లేకపోలేదు. కనుక దైవసాక్షిగా చెబుతున్నాను. (ప్రజలకు) మంచిని బోధించడం, వారిని చెడుల నుండి వారించడం మీ విధ్యుక్త ధర్మం. ఈపని చేయకపోతే దేవుడు మీమీద పరమ దుర్మార్గు లను (పాలకులుగా) రుద్దుతాడు. వారు మిమ్మల్ని ఘోరమైన కష్టాలకు గురిచేస్తారు. అప్పుడు మీలోని సజ్జనులు దేవుణ్ణి (ఎంత దీనంగా) వేడుకున్నా వారి వేడుకోలు స్వీకరించబడదు."

ఉండాలి. ఒకవేళ మీరు ప్రయాణంలో ఉన్నప్పుడు అక్కడ మరణ సమయం ఆసన్న మయితే ముస్లిమేతరుల నుండయినా సరే ఇద్దర్ని సాక్షులుగా పెట్టుకోండి.

ఒకవేళ వారి నిజాయితీపట్ల మీకేదైనా అనుమానం వస్తే, ప్రార్థన తర్వాత వారిద్దరి చేత (మసీదులో) ప్రమాణం చేయించాలి. వారు దేవుని మీద ప్రమాణం చేస్తూ ఇలా పలకాలి: "మేము ఎలాంటి స్వార్థప్రయోజనాల కోసం ఈ సాక్ష్యాన్ని వాడుకోము, మా బంధువులయినా సరే (మేము పక్షపాతం చూపము). దేవుని కోసం చెప్పే సాక్ష్యాన్ని మేము ఎన్నటికీ దాచము. అలా చేస్తే మేము పాపాత్ములలో చేరిపోతాము." (106)

అయితే అలా ప్రమాణం చేసి కూడా వారు అన్యాయం, పక్షపాతాలకు పాల్పడితే వారి స్థానంలో వారికంటే కొంచెం యోగ్యులైన మరో ఇద్దరు సాక్షులుగా ముందుకు రావాలి. ఈ సాక్షులు అన్యాయానికి గురైనవారైవుండాలి. మృతునికి సన్నిహితులయి కూడా ఉండాలి. వారు (మసీదులో నిలబడి) దేవుని మీద ప్రమాణం చేసి "వారి సాక్ష్యం కంటే మా సాక్ష్యం నిజమయినది; మేము మా సాక్ష్యంలో ఎలాంటి హద్దు మీరలేదు. అలాచేస్తే మేము దుర్మార్గులలో చేరినవారమవుతాము" అని పలకాలి. (107)

ఇలాంటి పద్ధతి వల్ల ప్రజలు సరైన సాక్ష్యమిస్తారని ఆశ ఉంటుంది. లేదా వారు తాము ప్రమాణం చేసిన తరువాత రెండో వర్గం చేసే ప్రమాణం తమకు వ్యతిరేకంగా ఉంటుందేమోనని భావించయినా భయపడతారు. దేవునికి భయపడండి. వినండి, నీతిలేని వారికి దేవుడు ఎన్నటికీ సన్మార్గం చూపడు. (108)

దేవుడు ప్రవక్తలందర్నీ సమావేశపరచే (ప్రళయ)దినం గురించి ఆలోచించు. అప్పుడు దేవుడు "(ప్రజలు) మీకు ఏం సమాధానమిచ్చారు?" అని అడుగుతాడు. దానికి వారు "మాకేమీ తెలియదు. అగోచర విషయాలన్నీ మీకే తెలుసు" అంటారు. (109)

అప్పుడు దేవుడు ఈసా (అలై)ను ఇలా అడుగుతాడు: "మర్యం కుమారుడ వయిన ఈసా! నేను నీకు, నీ తల్లికి చేసిన మేళ్ళను కాస్త గుర్తుకు తెచ్చుకో. నేను పరిశుద్ధాత్మ ద్వారా నీకు సహాయం చేశాను. నీవు ఊయలలో (పసిపిల్లవాడిగా) ఉన్నప్పుడు కూడా ప్రజలతో మాట్లాడేవాడివి; పెద్దవాడైన తరువాత కూడా. నేను నీకు గ్రంథం, వివేకం ప్రసాదించాను. తౌరాత్, ఇన్జీల్ బోధనలు కూడా అందజేశాను. నా ఆజ్ఞతో నీవు మట్టితో పక్షి బొమ్మలు చేసి అందులో గాలి ఊదినప్పుడు అవి నా ఆజ్ఞతో (నిజమైన) పక్షులుగా తయారయ్యేవి. నీవు పుట్టుగుడ్డిని, కుష్టురోగిని నా అనుజ్ఞతోనే బాగుచేసే వాడివి. మృతులను కూడా నా ఆజ్ఞతోనే బ్రతికించేవాడివి.

నీవు (ఇలాంటి) స్పష్టమైన నిదర్శనాలతో ఇస్రాయీల్‌సంతతి ప్రజల దగ్గరికి పోయి నప్పుడు వారిలోని సత్యతిరస్కారులు "ఇదంతా మంత్రజాలం తప్ప మరేమీ కాదు" అని నిరాకరిస్తే, నేనే నిన్ను వారి బారినుండి కాపాడాను. నన్ను, నా ప్రవక్తను విశ్వ సించండని నేను హవారీలను సూచించిన మీదటే వారు 'మేము విశ్వసించాము. విధేయులై పోయాము. దీనికి నీవే సాక్షి' అని పలికారు." (110)



ఆ తరువాత సంఘటన- హవారీలు ఓసారి తమ ప్రవక్తతో "మర్యం కుమారుడ వయిన ఈసా! మా ముందు నీ ప్రభువు ఆకాశం నుండి వడ్డించిన విస్తరి నొకదాన్ని దించగలడా?" అని అడిగారు. దానికి ఈసా (అలై) "మీరు విశ్వసించినవారైతే దేవునికి భయపడండి" అన్నాడు. (111)

"మేము విస్తరిలోనివి తిని అవి మా హృదయాలకు తృప్తి కల్గించాలని మాత్రమే మేము కోరుతున్నాం. ఈవిధంగా నీవు చెప్పినదంతా యదార్థమని తెలుసుకొని అందుకు సాక్షులుగా ఉంటాము" అన్నారు మళ్ళీ వారు. (111-113)

అప్పుడు మర్యం కుమారుడు ఈసా ఇలా ప్రార్థించాడు: "దేవా! మా ప్రభువా!! మా ముందు వడ్డించిన విస్తరి నొకదాన్ని ఆకాశం నుండి దించు. ఇది మాకూ, మా పూర్వీకులకూ, రాబోయే తరాలకూ పండుగరోజు అవుతుంది. నీ తరఫున ఒక నిదర్శనంగా (అద్భుత మహిమగా) ఉంటుంది. (ప్రభూ!) మాకు ఆహారం ప్రసాదించు. నీవే అందరికన్నా మంచి అన్నదాతవు." (114)

దానికి దేవుడు ఇలా అన్నాడు: "సరే, నేను దాన్ని మీ ముందు దించుతాను. అయితే ఆ తరువాత మీలో ఎవడైనా అవిశ్వాసవైఖరి అవలంబిస్తే మాత్రం నేనతనికి ప్రపంచంలో ఎవరికీ విధించనటువంటి ఘోరమైన శిక్ష విధిస్తాను." (115)

ఆ తరువాత దేవుడు (ప్రళయ దినాన) ఈసాను నిలబెట్టి "మర్యం కుమారుడ వయిన ఈసా! నన్నుకాదని నిన్ను, నీ తల్లిని దేవుళ్ళుగా చేసుకొని ఆరాధించాలని నీవు ప్రజలకు బోధించావా?" అని అడుగుతాడు.[18]

దానికి ఈసా ఇలా చెబుతాడు: "మీరు ఎంతో పవిత్రులు, పరిశుద్ధులు. నాకు అధికారంలేని విషయం గురించి నేనెలా అనగలను? నేనలాంటి మాటేదయినా అని ఉంటే అది తప్పకుండా మీ దృష్టికి వచ్చేది. నా అంతరంగంలో ఏముందో మీకు బాగా తెలుసు. కాని మీ అంతరంగంలో ఏముందో నాకేమాత్రం తెలియదు. మీరు సమస్త అగోచర విషయాలు ఎరిగినవారు." (116-117)

---

18. క్రైస్తవులు హజ్రత్ ఈసా (ఏసు)ను, పరిశుద్ధాత్మ (Holy ghost) ను మాత్రమే దేవుళ్ళుగా చేసుకొని తృప్తిపడలేదు. ఈసాప్రవక్త (అలైహి) తల్లి మర్యం (అలైహి)ని కూడా దైవంగా చేసు కున్నారు. క్రీ.శ. 3 వ శతాబ్దాంతం వరకు క్రైస్తవులు మర్యం (అలైహి)ని దైవంగా కొలిచేవారు కాదు. ఆ తర్వాత అలెగ్జాండరియాకు చెందిన కొందరు మతవేత్తలు మొదటిసారిగా మర్యం (అలైహి)కోసం దేవుని మాతృమూర్తి అనే పదం ఉపయోగించారు. ఇది క్రమంగా ప్రజల్లో వ్యాపిస్తూ మర్యం ఆరాధన వైపు దారితీసింది. చర్చీ మొదట్లో ఈకొత్త విశ్వాసాన్ని ఆమోదించలేదు.

అయితే క్రైస్తవ ప్రపంచంలో ఈ విషయం పెద్ద చర్చనీయాంశంగా తయారయి చివరికి క్రీ.శ. 431 లో చర్చీ దీన్ని అధికారపూర్వకంగా ఆమోదించింది. దాంతో ఈ విశ్వాసం ప్రజలలో సర్వ సామాన్యమైపోయింది. అనేకచోట్ల చర్చీలలో మర్యం చిత్రపటాలు, మర్యం విగ్రహాలు ప్రతిష్ఠించ బడి పూజలందుకోవడం ప్రారంభించాయి. దీనికి వ్యతిరేకంగా సంస్కరణవాదులు, ప్రొటెస్టెంట్ క్రైస్తవులు ఎంత గగ్గోలు పెట్టినా ప్రయోజనం లేకపోయింది.

"మీరు ఆదేశించిన విషయాలే నేను వారికి బోధించాను. నా ప్రభువు, మీ ప్రభువు కూడా అయిన దేవుడ్ని మాత్రమే ఆరాధించండని నేను వారికి చెప్పాను. వారి మధ్య జీవించి ఉన్నంతవరకే నేను వారిని కనిపెట్టుకొని ఉన్నాను. మీరు నన్ను పైకెత్తుకున్న తరువాత వారిని మీరే కనిపెట్టుకొని ఉన్నారు. మీరు అందర్నీ, అన్ని విషయాల్ని (అన్ని వేళలా) కనిపెడ్తూ ఉంటారు. ఇప్పుడు మీరు వారిని శిక్షిస్తే వారు మీ దాసులే. ఒకవేళ క్షమిస్తే మీరు ఎంతో శక్తిమంతులు, మహా వివేకవంతులు." (118)

అది విని దేవుడు ఇలా అన్నాడు: "సత్యవ్రతులకు వారి సత్యసంధత ప్రయోజనం చేకూర్చే (ప్రళయ) దినం సంభవిస్తుంది. అలాంటి వారికి (ఆరోజు) సెలయేరులు ప్రవహించే స్వర్గవనాలు లభిస్తాయి. అక్కడ వారు కలకాలం (సుఖంగా) ఉంటారు. దేవుడు వారి పట్ల ప్రసన్నుడవుతాడు, వారు దేవుని పట్ల సంతోషిస్తారు. ఇదే ఘన విజయం." (119)

భూమ్యాకాశాలలో, వాటి మధ్య, సర్వత్రా దేవుని రాజ్యమే సాగుతోంది. ఆయన సమస్త విషయాలపై అధికారంగల సమర్థుడు, సర్వశక్తిమంతుడు. (120) ✪

## అవతరణ: మక్కా **6. పశువులు (అన్ఆమ్)** సూక్తులు: 165

ఈ అధ్యాయాన్ని "అన్ఆమ్" (పశువులు) అంటారు. ఇందులో కొన్ని పశువుల్ని నిషేధిస్తూ, మరికొన్ని పశువుల్ని ధర్మసమ్మతం చేస్తూ వెలువడిన సూక్తులున్నాయి. దాంతో పాటు ఆనాటి అరబ్బుల మూఢ నమ్మకాలను ఖండిస్తూ అవతరించిన సూక్తులు కూడా ఉన్నాయి.

ఇస్లామీయఉద్యమం పదమూడవ యేటలో అడుగిడింది. సత్యతిరస్కారులు విశ్వాసుల్ని రకరకాలుగా వేధిస్తున్న క్లిష్టకాలం అది. అలాంటి పరిస్థితిలో దైవప్రవక్త (సల్లం) ఓ రోజు రాత్రివేళ మక్కా నుండి ఎక్కడికో వెళ్ళడానికి ఒంటెనెక్కారు. అప్పుడు ఈ అధ్యాయం ఆయన హృదయ ఫలకంపై అవతరించింది. దైవవాణి అవతరిస్తున్నంత సేపు ఒంటె అమితమైన భారం వీపుమీద పడి ప్రక్కటెముకలు విరిగిపోతాయా అన్నంత పరిస్థితికి గురయింది.

### కరుణామయుడు, కృపాసాగరుడయిన దేవుని పేరుతో ప్రారంభం

భూమ్యాకాశాలను, చీకటివెలుగులను సృష్టించిన దేవునికే సకలవిధాల ప్రశంసలు శోభిస్తాయి. అయినప్పటికీ సత్యతిరస్కారులు అంతటి శక్తిస్వరూపుడ్ని వదలి ఇతరులను ఆయనకు సాటికల్పిస్తూ దైవాలుగా చేసుకున్నారు. (1)

నిజానికి ఆయనే మిమ్మల్ని మట్టితో సృజించి మీ మనుగడ కోసం ఒక గడువు నిర్ణ యించాడు. (ప్రళయంకోసం) మరో గడువు కూడా ఆయన దగ్గర నిర్ణయించబడి ఉంది. కాని మీరేమో ఇంకా సందేహంలోనే పడిఉన్నారు. ఆయనే ఇటు భూమిపై, అటు ఆకాశంలోనూ ఉన్న ఏకైక దేవుడు. మీ అంతర్బాహ్య స్థితిగతులు ఎరిగినవాడు కూడా ఆయనే. మీరు చేసే ప్రతిపనీ, పలికే ప్రతిపలుకూ ఆయనకు తెలుసు. (2,3)



ప్రజలు తమ ప్రభువు నుండి వచ్చిన ఏ సూచననూ అంగీకరించకుండా ముఖం తిప్పుకుంటున్నారు. ఇప్పుడు వారి దగ్గరకు సత్యం వస్తే దాన్ని కూడా నిరాకరించారు. సరే, ఇప్పటివరకు వారు ఏ విషయాన్ని గురించి హేళన చేస్తూ వచ్చారో ఆ విషయాన్ని గురించి వాస్తవం ఏమిటో వారికి త్వరంలోనే తెలిసిపోతుంది. (4-5)

వారికి పూర్వం మేము ఎన్ని జాతుల్ని నిర్మూలించామో వారికి తెలియదా? ఆ జాతులు తమ తమ కాలాల్లో ఎంతో వైభవోపేతంగా వెలిగాయి. వారికి మేము ప్రపంచంలో మీకు ప్రసాదించనటువంటి గొప్ప సామ్రాజ్యాలు ప్రసాదించాము. వారి కోసం ఆకాశం నుండి పుష్కలంగా వర్షం కురిపించాం. నేలపై ఎన్నో నదులు ప్రవహింపజేశాం. (కాని వారు మాకు కృతజ్ఞత చూపడానికి బదులు కృతఘ్నులై పోయారు.) చివరికి మేము వారు చేసిన పాపాలకు వారిని సమూలంగా తుడిచిపెట్టాం. వారి స్థానంలో ఇతర జాతులను తెచ్చాం. (6)

ప్రవక్తా! మేము కాగితాలపై రాసిన గ్రంథాన్ని నీపై అవతరింపజేసినా, దాన్ని ఈ తిరస్కారులు చేత్తో తాకిచూసి కూడా విశ్వసించరు. పైగా వారు ఇదంతా ఏదో మంత్ర జాలం తప్ప మరేమీకాదని వాదిస్తారు. పైగా ఈ ప్రవక్తతోపాటు (అతని ప్రవక్తృత్వాన్ని ధృవపరిచేందుకు) ఒక దైవదూతను ఎందుకు దించలేదు? అని కూడా అంటారు.

ఒకవేళ మేము దైవదూతల్ని దించివుంటే ఈపాటికి ఎప్పుడో (వారి)వ్యవహారం తేలి పోయిఉండేది. వారికి ఎలాంటి అవకాశమిచ్చేవారం కాము. మేము దైవదూతను అవత రింపజేయవలసివస్తే అతడ్ని మానవాకారంలోనే అవతరింపజేస్తాము. వారిప్పుడు ఎలా అనుమానంలో పడిఉన్నారో అప్పుడు కూడా అనుమానంలోనే పడిపోతారు. (7-9)

ప్రవక్తా! నీకు పూర్వం కూడా (ఈలోకం) అనేకమంది ప్రవక్తలను ఎగతాళి చేసింది. అయితే చివరికి వారు ఎగతాళిచేసిన విషయమే వారిని ముంచివేసింది. వారిని కాస్త ప్రపంచంలో పర్యటించి చూడమని చెప్పు, అవిశ్వాసులకు ఏం గతి పట్టిందో. (10-11)

భూమ్యాకాశాల్లో ఉన్నదంతా ఎవరిదని అడుగు. అంతా దేవునిదేనని చెప్పు. ఆయన (మానవాళిని) కరుణించడం తన కర్తవ్యంగా చేసుకున్నాడు. (కనుకనే ఆయన మీరు చేసే అకృత్యాలకు మిమ్మల్ని వెంటనే శిక్షించడం లేదు.) ఆయన మిమ్మల్ని ప్రళయదినాన తప్పకుండా సమావేశపరుస్తాడు. అందులో సందేహంలేదు. కాని ఆత్మ వినాశానికి పాల్పడినవారు దాన్ని నమ్మలేకపోతున్నారు. రాత్రిచీకటిలో, పగటివెల్తురులో మనుగడ సాగిస్తున్న ప్రతి సృష్టిరాసీ దేవునిదే. ఆయన సమస్తం వినేవాడు, సర్వం ఎరిగినవాడు. (12,13)

చెప్పు: "దేవుడు భూమ్యాకాశాలకు సృష్టికర్త. ఆయనే అందరికీ ఆహారమిచ్చేవాడు. ఆయన మాత్రం ఎవరినీ ఆహారం అడగడు. అలాంటి మహోన్నతుడైన దేవుడ్ని వదలి నేను మరొకడ్ని సంరక్షకునిగా చేసుకోవాల్నా?" చెప్పు: "నేను అందరికంటే ముందు ఆయనకు విధేయుణ్ణయి పోవాలని నాకు ఆజ్ఞయింది. నేను ఎలాంటి పరిస్థితిలోనూ బహుదైవా రాధకుల్లో చేరిపోకూడదని కూడా నాకు తాకీదు చేయబడింది." (14)

చెప్పు: “ఒకవేళ నేను నా ప్రభువు మాట వినకుండా అవిధేయుణ్ణయిపోతే ఓ గొప్ప (భయంకర) దినాన (నరక) శిక్షకు గురికావలసి వస్తుందని భయపడుతున్నాను. ఆ రోజు శిక్ష నుండి తప్పించుకున్నవాడు (నిజంగా ఎంతో అదృష్టవంతుడు.)- అతడ్ని దేవుడు ఎంతగానో కరుణించినట్లే. అదే సాఫల్యం, స్పష్టమైన మోక్షం.” (15-16)

దేవుడు మీకేదైనా కీడు చేయదలచుకుంటే ఏశక్తీ మిమ్మల్ని ఆ కీడు నుండి కాపాడ లేదు. అలాగే ఆయన మీకేదైనా మేలు చేయగోరితే ఆయన్ని ఎవరూ అడ్డుకోలేరు. ఆయన ప్రతిపనీ చేయగల సమర్థుడు, సర్వశక్తిమంతుడు. ఆయన తన దాసులపై సర్వాధికారాలు కలిగిఉన్నాడు. పైగా ఆయన ఎంతో వివేకవంతుడు, సర్వం తెలిసినవాడు.” (17,18)

అందరికంటే బలమైన సాక్ష్యం ఎవరిదో వారిని అడుగు. ఇంకా ఇలా చెప్పు: “నాకూ, మీకూ మధ్య దేవుడే సాక్షి. ఈ ఖుర్ఆన్ మిమ్మల్నీ, మరెవరికిది చేరుతుందో వారందర్నీ హెచ్చరించడానికి దివ్యావిష్కృతి ద్వారా నాకు ప్రసాదించబడింది. మరి మీరు దేవుడు మాత్రమే గాక మరికొందరు కూడా దేవుళ్ళున్నారని చెప్పగలరా? నేను మాత్రం అలా ఎన్నటికీ చెప్పను. వారికిలా చెప్పు: “నిజానికి దేవుడు ఒక్కడే. మీరు చేస్తున్న బహుదైవారాధనతో నేను పూర్తిగా విసుగెత్తి పోయాను.” (19)

మేము గ్రంథం ప్రసాదించినవారు తమ కన్నకొడుకుల్ని ఏవిధంగా గుర్తిస్తున్నారో అదే విధంగా ఇతడ్ని (అంతిమ దైవప్రవక్త ముహమ్మద్‌ని) కూడా ఎలాంటి సందేహం లేకుండా గుర్తిస్తున్నారు. కాని ఆత్మవినాశానికి పాల్పడినవారు మాత్రం ఈ నిజాన్ని నమ్మలేకపోతున్నారు. దేవునిపై అసత్యం మోపి ఆయన సూక్తులు తిరస్కరించిన వాడికంటే పరమ దుర్మార్గుడు మరెవరుంటారు? అలాంటి దుర్మార్గులు ఎన్నటికీ సఫలీకృతులు కాలేరు. (20,21)

మేము మానవులందర్నీ సమావేశపరచినప్పుడు బహుదైవారాధకులతో “మీరు కల్పించుకొని దేవుళ్ళుగా నమ్ముతుండిన వారంతా ఇప్పుడు ఎటు పోయారు?” అని అడుగుతాము. అప్పుడు వారు తమను రక్షించుకోవడానికి “దైవసాక్షి! మేము ఎన్నడూ బహుదైవారాధకులుగా ఉండలేదు” అంటారు (పచ్చి అబద్ధమాడుతూ). అంతకుమించి వారికి మరొక సాకు దొరకదు. చూడు, వారు తమపై ఎలాంటి అబద్ధం కల్పించు కుంటారో! అక్కడ వారి కల్పితదైవాలంతా మటుమాయమై పోతాయి. (22-24)

వారిలో కొందరు నీ మాటలు చెవియొగ్గి వినేవారు కూడా ఉన్నారు. కాని మేము వారి హృదయకవాటాలు మూసివేయడం వల్ల వారు ఏ విషయాన్నీ అర్థం చేసుకోలేరు. వారి చెవుల్ని మొద్దుబారేలా చేశాము. (అందువల్ల వారసలు ఏ మంచి విషయం వినలేరు.) వారు ఏ సూచన (మహిమ) చూసినా విశ్వసించరు. పైగా వారు నీ దగ్గరకు వచ్చి వాదిస్తారు. వారిలో నీమాటల్ని వ్యతిరేకించాలని ముందే నిర్ణయించుకున్నవారు (అంతా విని) “ఇది పాతపురాణం తప్ప మరేమీ కాదు” అంటారు. (25)



వారు స్వయంగా సత్యాన్నుండి పారిపోవడమే గాక, ప్రజలను కూడా సత్యాన్ని స్వీకరించనీయకుండా నిరోధిస్తున్నారు. ఆవిధంగా చేసి వారు (సాధిస్తున్నదేమీ లేకపోగా) తమనుతామే నాశనం చేసుకుంటున్నారు. ఆ సంగతి వారు గ్రహించడం లేదు. (26)

వారిని నరకం అంచుమీద నిలబెట్టినప్పుడు నీవు వారి పరిస్థితి చూస్తే బాగుండు! అప్పుడు వారు (తల బాదుకుంటూ) “అయ్యయ్యో! ఎలాంటి దుస్థితి దాపురించింది మాకు!! మమ్మల్ని మరోసారి ఇహలోకానికి పంపితే బాగుండు. అప్పుడు మేము మా ప్రభువు సూక్తులు నిరాకరించకుండా విశ్వాసులలో చేరిపోతాం” అనంటారు. (27)

వారు ఇంతకు పూర్వం దాస్తూ ఉండినది ఈ రోజు వారిముందు బట్టబయలయి పోవడం వల్లనే అలా అంటారు. వారిని (ఇహలోకానికి) తిరిగి పంపినా, చేయవద్దన్న పనులే మళ్ళీ చేస్తారు. వారు పరమ అబద్ధీకులు. (28)

వారిలా అంటారు: “జీవితమంటే ఈ ప్రాపంచిక జీవితమే. (ఇది తప్ప మరో జీవితం లేదు.) మేము చనిపోయాక మళ్ళీ బ్రతికించబడటమనే ప్రశ్నే తలెత్తదు.” వారు తమ ప్రభువు ముందు ప్రవేశపెట్టబడినప్పుడు నీవు వారి పరిస్థితి చూస్తే బాగుండు! అప్పుడు వారి ప్రభువు “ఇది యదార్థం కాదా?” అని అడిగితే “ఔను ప్రభూ! ఇది యదార్థమే” అంటారు వారు (గత్యంతరంలేక). “అయితే సత్యనిరాకరణకు పర్యవ సానంగా ఇప్పుడు (నరక)యాతన చవిచూడండి” అంటాడు దేవుడు. (29-30)

దేవుడ్ని కలుసుకోవలసి ఉంటుందన్న సమాచారాన్ని అసత్య విషయంగా భావించినవారు ఘోరంగా నష్టపోతారు. వారా ఘడియ అకస్మాత్తుగా వచ్చినప్పుడు “అయ్యయ్యో! ఈ విషయంలో మేమెంత పొరబడ్డాము!!” అని వాపోతారు. అప్పుడు వారు తమ పాపభారం వీపులపై మోకొస్తారు. చూడు, ఎంత నీచమైన భారమో అది! ఇహలోక జీవితం ఒక ఆట, తమాషా మాత్రమే. (నిజానికి పరలోక జీవితమే అసలు జీవితం.) భయభక్తులు కలవారికి పరలోక (స్వర్గ)ధామమే శ్రేష్ఠమైనది. ఆ మాత్రం జ్ఞానం లేదా మీకు? (31-32)

ముహమ్మద్! వారి మాటలవల్ల నీకు బాధ కలుగుతుందని మాకు తెలుసు. కాని ఈ దుర్మార్గులు నిజానికి నిన్ను నిరాకరించడం లేదు. వారసలు దేవుని సూక్తులు నిరాకరిస్తున్నారు.[1] నీకు పూర్వం కూడా అనేకమంది ప్రవక్తలు నిరాకరించబడ్డారు.

---

1. మహనీయ ముహమ్మద్ (సల్లం) దైవప్రవక్త కాకపూర్వం నుంచే ప్రజల్లో సత్యసంధుడిగా, నిజాయితీపరుడిగా పేరుపడ్డారు. ఆ తరువాత దైవప్రవక్తగా ప్రజల ముందుకొచ్చి సత్యబోధ ప్రారంభించగానే ఖురైష్ నాయకులు ఆయన్ని తిరస్కరించారు. వారసలు ఆయన వ్యక్తిత్వం, గుణగణాల పట్లగాక ఆయన తెచ్చిన సత్యం పట్ల మాత్రమే తిరస్కారవైఖరి అవలంబించారు.

ఈ విషయాన్ని ఇక్కడ ఖుర్ఆన్ మాత్రమే కాదు, కరుడుగట్టిన సత్యవిరోధి, ఖురైష్‌జాతి అగ్రనాయకుడయిన అబూజహల్ కూడా వ్యక్తపరిచాడు. అతను ఒకసారి దైవప్రవక్త (సల్లం)తో మాట్లాడుతూ “మేము నిన్ను అసత్యవాదని అనడం లేదు; నీవు ప్రచారం చేస్తున్న దాన్ని మాత్రమే మేము అసత్యంగా పరిగణిస్తున్నాం” అన్నాడు.

అయితే వారు లోకుల తిరస్కారవైఖరి పట్ల, వారు పెట్టిన బాధల పట్ల సహనం వహించారు. చివరికి మా సహాయం వారికి లభించింది. దేవుని మాటలను ఎవరూ మార్చలేరు. గత ప్రవక్తలకు ఎదురైనవన్నీ నీకు చేరాయి. (కనుక నీవు సహనంతో పరిస్థితుల్ని ఎదుర్కో). (33-34)

ఒకవేళ వారి నిరాకరణ, నిరాదరణలను నీవు సహించలేకపోతే, నీలో శక్తి ఉంటే భూమిలో సొరంగం చేసిగాని, లేదా ఆకాశానికి నిచ్చెన వేసిగాని వెళ్ళి వారికోసం ఏదైనా మహిమ తీసుకురావడానికి ప్రయత్నించు. దేవుడు తలచుకుంటే వారందర్నీ దారికి తీసుకు రాగలడు. (కాని మానవులకు ఇవ్వబడిన స్వేచ్ఛను హరించి వారిని బలవంతంగా దారిలో పెట్టడం దేవుని అభిమతం కాదు.) కనుక నీవు అజ్ఞానిలా ప్రవర్తించకు. (మనస్ఫూర్తిగా) వినేవాళ్ళే సత్యం స్వీకరిస్తారు. (సత్యం కానలేని) మృతుల్ని దేవుడు (ప్రళయదినానే) లేపుతాడు.[2] ఆ తర్వాత వారిని దైవన్యాయస్థానానికి తీసుకుపోవడం జరుగుతుంది. (35-36)

ఈ ప్రవక్తపై అతని ప్రభువు నుండి ఏదైనా మహిమ ఎందుకు అవతరించలేదని వారు అడుగుతున్నారు. మహిమల్ని అవతరింపజేయగల శక్తి దేవునికి పూర్తిగా ఉందని చెప్పు. కాని వారిలో చాలామంది మహిమలను అర్థం చేసుకునే స్థితిలో లేరు. నేలపై సంచరించే జంతువుల్ని, రెక్కలతో గాలిలో ఎగిరే పక్షుల్ని కాస్త గమనించండి. అవి కూడా మీలాంటి జీవరాసులే. మేము విధివ్రాతలో ఏ విషయాన్నీ వదలిపెట్టలేదు. చివరకు అవన్నీ తమ ప్రభువు వద్దకే సమీకరించబడతాయి. మా సూక్తుల్ని అంధులు, బధిరులే నిరాకరిస్తారు. వారు అజ్ఞానాంధకారంలో పడిఉన్నారు. దేవుడు తానుతలచిన విధంగా కొందరికి దారి చూపుతాడు; మరికొందరిని దారి తప్పిస్తాడు. (37-39)

ఇంకా ఇలా చెప్పు: "ఒకవేళ మీపై దేవుని వైపునుండి ఏదైనా ఆపద వచ్చిపడితే, లేదా అంతిమ ఘడియలు సమీపిస్తే మీరు దేవుణ్ణి వదలి ఇతరుల్ని వేడుకుంటారా?

---

ఇంతకూ ఖురైష్ నాయకులు సత్యాన్ని ఎందుకు నిరాకరిస్తున్నారో చూడండి. బద్ర్ యుద్ధ సమయంలో అఖ్నస్ బిన్ షరీఖ్ అనే ఓ నాయకుడు అబూజహల్‌తో రహస్య సమాలోచనలు జరుపుతూ "ఇక్కడ మనిద్దరం తప్ప మూడో వ్యక్తి లేడు. ఒక విషయం అడుగుతున్నా, నిజం చెప్పు. ముహమ్మద్‌ని నీవు సత్యసంధుడుగా భావిస్తున్నావా లేక అబద్ధీకుడుగా భావిస్తున్నావా?" అని అడిగాడు. దానికి అబూజహల్ ఇచ్చిన సమాధానం చూడండి. "దైవసాక్షి! ముహమ్మద్ (సల్లం) సత్యసంధుడనడంలో ఎలాంటి సందేహం లేదు. అతను ఇంతవరకు ఒక్కసారి కూడా అబద్ధం పలకలేదు. కాని రాజ్యాధికారం, సైనికి ప్రాబల్యం, దైవదౌత్యం, పేరుప్రతిష్ఠలు అన్నీ ఖుసయ్యి సంతతికి లభిస్తే, ఇక ఇతర ఖురైషీయులకు దక్కేదేముంది?" అన్నాడా సత్యతిరస్కారి.

2. స్వార్థం, జాత్యహంకారం, దురభిమానాలతో కొందరు సత్యాన్ని కళ్ళున్నా చూడలేరు, చెవులున్నా వినలేరు, హృదయమున్నా అర్థం చేసుకోలేరు. అలాంటివారిని మృతులతో పోల్చి, ప్రళయదినాన లేపినప్పుడే వారికి ప్రాపంచికమైకం వదలి సత్యం కళ్ళకు కట్టినట్లు కన్పిస్తుందని చెప్పబడింది. కాని అప్పుడు కలిగే జ్ఞానోదయం వల్ల పశ్చాత్తాపం తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదు.



మీరు సత్యవంతులైతే దీనికి సమాధానమివ్వండి. అలాంటి విపత్కర స్థితిలో మీరు కల్పించుకున్న మిథ్యాదైవాలన్నిటిని మరచిపోయి నిజదేవుణ్ణి మాత్రమే వేడుకుంటారు.[3] ఆయన తలచుకుంటే మీపై వచ్చిన ఆపదను తప్పకుండా దూరంచేస్తాడు." (40,41)

మీకు పూర్వం మేము అనేకజాతుల దగ్గరకు ప్రవక్తలను పంపాము. ఆ జాతులు (తలబిరుసుతనం వహించినప్పుడల్లా) మేము వాటిని కష్టాలకు కడగండ్లకు గురిచేశాం, దాని ద్వారానైనా వారు దీనంగా మాముందు తలవంచుతారన్న ఉద్దేశ్యంతో. ఈ విధంగా మేము వారిని కఠినపరీక్షలకు గురిచేసినప్పుడు వారు మా ముందు ఎందుకు దీనంగా తలవంచ లేదు? అసలు వారి హృదయాలు పాషాణాల్లా కఠినమైపోయాయి. వారు చేస్తున్న దుష్కార్యాల్ని షైతాన్ వారికి మనోహరమైనవిగా చేసి చూపాడు. (42-43)

(మా ప్రవక్తలు) చేసిన ఉపదేశాలను వారు పూర్తిగా విస్మరించారు. అప్పుడు మేము వారికోసం సుఖసంతోషాలు అవతరించే ద్వారాలన్నీ తెరచి పెట్టాము. వారు మేము ప్రసాదించిన అనుగ్రహాలు ఆస్వాదిస్తూ అందులో పూర్తిగా మునిగిపోయారు. అలాంటి స్థితిలో మేము హఠాత్తుగా వారిని పట్టుకున్నాము. దాంతో వారిక చేసేదిలేక పూర్తిగా నిరాశచెందారు. ఆ విధంగా మేము దుర్మార్గానికి పాల్పడినవారిని సమూలంగా తుడిచిపెట్టాం. సకల ప్రశంసలు సర్వలోక ప్రభువైన దేవునికే శోభిస్తాయి. (44-45)

వారినిలా అడుగు: "దేవుడు గనక మీ దృష్టి, వినికిడి శక్తుల్ని పోగొట్టి మీ హృదయ కవాటాలు మూసేస్తే ఆ తర్వాత దేవుడు తప్ప మరెవరు వాటిని తిరిగి రప్పించగలరు? దీన్నిగురించి మీరెప్పుడైనా ఆలోచించారా?" చూడు, వారికి మా నిదర్శనాలు మాటి మాటికి ఎలా చూపుతున్నామో! అయినా వారు అంధులుగానే ప్రవర్తిస్తున్నారు. (46)

వారిని అడుగు: "సరే, ఈ విషయమైనా ఆలోచించారా మీరు ఎప్పుడైనా? దేవుని వైపునుండి అకస్మాత్తుగాగాని, లేదా బహిరంగంగాగాని మీపై శిక్ష(గా ప్రకృతి విపత్తు)

---

3. మృత్యువు కండ్లముందు తాండవిస్తున్నప్పుడు బహుదైవారాధకులు మిథ్యాదైవాలన్నిటిని వదిలేసి ఒక్క నిజదేవుణ్ణి మాత్రమే వేడుకుంటారు. ఈ యదార్థాన్నే ఇక్కడ ప్రస్తావించబడింది.

దైవప్రవక్త (స) మక్కా జయించిన తర్వాత అబూజహల్ కొడుకు ఇక్రమా జిద్దాకు పారిపోయి, అక్కడ ఓడెక్కి అబిసీనియా దారిపట్టాడు. అయితే దారిలో తుఫాన్ వచ్చి ఓడ మునిగిపోయే ప్రమాదం ఏర్పడింది. ప్రయాణీకులు మొదట్లో తమ తమ ఇష్ట దేవతల్ని ప్రార్థించారు. కాని తుఫాన్ తగ్గక పోగా మరింత ఉధృతమయింది. దాంతో జనం భయపడి "దేవుణ్ణి తప్ప మరెవర్నీ వేడుకునే సమయం కాదిది. ఆయన తలచుకుంటేనే మనం ఈ ఆపద నుండి గట్టెక్కుతాం" అన్నారు.

ఈ మాట ఇక్రామాకు కనువిప్పు కలిగించింది. "ఇక్కడ దేవుడు తప్ప మరెవరూ సహాయం చేసేవారు లేరా? మరి ఈ విషయాన్నేకదా ఆ పుణ్యాత్ముడు ఇరవైయేండ్ల నుంచి చెబుతున్నది. మనం అనవసరంగా ఆయనతో పోరాడుతున్నాం" అనుకున్నాడతను. వెంటనే అతను "ఈ తుఫాన్ నుంచి బయటపడితే తాను నేరుగా ముహమ్మద్ (సల్లం) దగ్గరికెళ్ళి ఆయన చేతిలో చేయివేసి కలుపుతాను" అని నిర్ణయించుకున్నాడు. దాని ప్రకారం ఇక్రమా (రజి) దైవప్రవక్త (స) సన్నిధికెళ్ళి ఇస్లాం స్వీకరించారు. (దీంతోపాటు 10:22, 17:67, 29:66,31:32 సూక్తులు కూడా చూడండి.)

విరుచుకు పడితే, అప్పుడు దుర్మార్గులు కాక మరెవరు నాశనమవుతారు?" మేము ఏ ప్రవక్తను పంపినా (స్వర్గ) శుభవార్త అందజేయడానికి, దైవశిక్ష గురించి హెచ్చరించడానికి మాత్రమే పంపుతాము. వారి మాటలు విశ్వసించి, తదనుగుణంగా జీవితాన్ని సరిదిద్దుకునే వారికి (పరలోకంలో) ఎలాంటి భయంగాని, దుంఖఃగాని ఉండదు. అయితే మా సూక్తులు నిరాకరించినవారు తమ దుష్కార్యాలకు పర్యవసానంగా తగిన శిక్ష చవిచూడవలసి వస్తుంది. (47-49)

ముహమ్మద్ (సల్లం)! వారితో ఇలా అను: "నా దగ్గర దేవుడు ప్రసాదించిన నిధి నిక్షేపాలున్నాయని నేను మీతో అనడంలేదు. నాకు అగోచర జ్ఞానం ఉందని, (అతీంద్రియ శక్తులున్నాయని), నేను సాక్షాత్తు దైవదూతనని కూడా చెప్పుకోవడం లేదు. నాపై అవతరిస్తున్న దివ్యావిష్కృతిని మాత్రమే నేను అనుసరిస్తున్నా." ఇంకా అడుగు: "గుడ్డివాడు, కళ్ళున్నవాడు ఒకటేనా? దీన్ని గురించి మీరు ఆలోచించరా?" (50)

కొందరు తాము ఓరోజు దేవుని సన్నిధికి పోవలసి ఉందని గ్రహించి ఆయనకు భయపడుతూ ఉంటారు. అక్కడ దేవుడు తప్ప తమకు సహాయం, సిఫారసు చేసేవారు ఎవరూ ఉండరని కూడా వారికి తెలుసు. అలాంటివారికి దీని (ఖుర్‌ఆన్) ద్వారా హితోపదేశం చెయ్యి. దానివల్ల వారు భయభక్తుల వైఖరి అవలంబించవచ్చు. (51)

మరికొందరు రేయింబవళ్ళు తమ ప్రభువునే వేడుకుంటూ ఆయన ప్రసన్నతను అర్థిస్తూ ఉంటారు. అలాంటివారిని నీ నుండి దూరంచేయకు. వారి (కర్మల) లెక్క విషయమై నీపై ఎలాంటి బాధ్యత లేదు. అలాగే నీ (కర్మల) లెక్క విషయమై వారిపై ఎలాంటి బాధ్యత లేదు. ఈ విషయం తెలుసుకున్న తరువాత కూడా నీవు వారిని నీ దగ్గర్నుండి తొలిగిస్తే నీవు దుర్మార్గునిగా పరిగణించబడతావు. (52)

(ధనికులు పేదలను చూసి) "మాలో దైవానుగ్రహం పొందినవారు వీరేనా?" అని అనడానికి వారిలో కొందరిని మేము కొందరి ద్వారా పరీక్షకు గురిచేశాము. మరి దేవుడు కృతజ్ఞులైన తన దాసులను గురించి ఎరగడా? కాబట్టి మా సూక్తుల్ని విశ్వసించినవారు నీ దగ్గరకు వస్తే "మీకు శాంతి కలుగుగాక!" అని దీవించు. నీ ప్రభువు దయాదాక్షిణ్యాలను (విశ్వసించిన దాసులపై కురిపించడాన్ని) తన కర్తవ్యంగా చేసుకున్నాడు.

మీలో ఎవరైనా అజ్ఞానంతో ఏదైనా పాపకార్యం చేసి, ఆ తరువాత పశ్చాత్తాపంతో (దేవుడ్ని) మన్నింపు వేడుకొని తనను తాను సరిదిద్దుకుంటే దేవుడు అతడ్ని క్షమిస్తాడు. ఆయన గొప్ప క్షమాశీలి, అమిత దయామయుడు. (53-54)

పాపాత్ముల వైఖరి స్పష్టంగా వెల్లడి కావడానికి మేమీ విధంగా మా సూక్తులు విడమరచి తెలియజేస్తున్నాము. (55)

చెప్పు: "నిజదేవుడ్ని వదలి మీరు వేడుకుంటున్న మిథ్యాదైవాలను ఆరాధించరాదని నన్ను వారించడం జరిగింది." చెప్పు: "నేను మీ మనోకాంక్షలను అనుసరించను. అలా చేస్తే నేనూ మార్గభ్రష్టుణ్ణయి పోతాను; సన్మార్గం పొందినవారిలో ఇక ఉండను." (56)



చెప్పు: నేనొక స్పష్టమమైన ప్రమాణాన్ని నమ్ముతూ దానిపై స్థిరంగా ఉన్నాను. కాని మీరేమో దాన్ని తిరస్కరించారు. ఇక మీరు తొందరపెడ్తున్న (దైవశిక్ష) విషయం నా చేతిలో లేదు. నిర్ణయాధికారాలన్నీ దేవుని చేతిలోనే ఉన్నాయి. ఆయన వాస్తవం వివరిస్తున్నాడు. ఆయనే అందరికన్నా మంచి నిర్ణయం తీసుకునేవాడు." (57)

చెప్పు: మీరు తొందరపెడ్తున్న (శిక్ష) విషయం నా చేతిలో ఉంటే మీకూ, నాకూ మధ్య వివాదం ఎప్పుడో సమసిపోయి ఉండేది. కాని దుర్మార్గుల పట్ల ఎలా వ్యవహరించాలో దేవునికి బాగా తెలుసు." అగోచర విషయాలకు సంబంధించిన నిగూఢ రహస్యాలన్నీ ఆయనకు మాత్రమే తెలుసు. ఆయనకు తప్ప వాటిని గురించి మరెవరికీ తెలియదు. నదీ నదాల్లో, కీకారణ్యాల్లో ఏముందో ఆయనకే తెలుసు. చెట్టునుండి రాలే ఏఆకూ ఆయన దృష్టిపథం నుండి తప్పించుకోజాలదు. చివరికి భూపొరలలో నిక్షిప్తమై ఉండే విత్తనం సైతం ఆయన జ్ఞానపరిధిలో ఉంటుంది. పచ్చి వస్తువులు, ఎండు వస్తువులు సైతం ఆయన దగ్గర స్పష్టంగా గ్రంథస్తం చేయబడి ఉన్నాయి. (58-59)

రాత్రివేళ మీ ఆత్మలను స్వాధీనం చేసుకునేవాడు, పగటివేళ మీరు చేసే పనులు గమనించేవాడు కూడా ఆయనే. మీనిర్ణీత జీవితకాలం సాగడానికి మరునాడు మిమ్మల్ని దైనందిన ప్రపంచంలోకి పంపుతున్నవాడు కూడా ఆయనే. చివరికి ఓరోజు మీరంతా ఆయన సన్నిధికే మరలిపోవలసి ఉంది. అప్పుడు ఆయన మీరు (ఇహలోకంలో ఉండగా) ఏమేమి చేస్తుండేవారో మీకు తెలియజేస్తాడు. (60)

ఆయనకు తన దాసులపై పూర్తి అదుపు, అధికారాలు ఉన్నాయి. ఆయన మిమ్మల్ని పర్యవేక్షించేవారిని నియమించి పంపుతున్నాడు. మీలో ఎవరికైనా మరణ సమయం ఆసన్నమైనప్పుడు ఆయన పంపే దూతలే అతని ప్రాణం తీసికెళ్తారు. వారు కర్తవ్యనిర్వహణలో ఎలాంటి లోటు రానివ్వరు. చివరికి అందరూ తమ అసలు యజమాని అయిన దేవుని దగ్గరికే తీసుకురాబడతారు. గుర్తుంచుకోండి, నిర్ణయాధికారాలన్నీ ఆయనకే హస్తగతమయి ఉన్నాయి. (మీ) లెక్క తేల్చడానికి ఆయనకు ఎంతో సేపు పట్టదు. (61-62)

ముహమ్మద్ (సల్లం)! వారిని అడుగు: "మీరు అడవుల్లో, సముద్రాల్లో చిక్కుకున్నప్పుడు ఆ చీకటికూపాల నుండి మిమ్మల్ని కాపాడేదెవరు? (ఆపద సమయంలో) మీరు ఘోరంగా విలపిస్తూ దీనంగా మొరపెట్టుకునేది ఎవరిని? 'ఈ ఆపద నుండి మమ్మల్ని గట్టెక్కిస్తే మేము తప్పకుండా నీకు కృతజ్ఞులై ఉంటామ'ని మీరు ఎవరిని వేడుకుంటారు?" చెప్పు: "దేవుడే మిమ్మల్ని ప్రతి ఆపద నుండి కాపాడుతున్నాడు. మరి మీరు ఆయనకు ఇతరులను ఎలా సాటికల్పిస్తున్నారు?" (63-64)

వారికీ సంగతి కూడా చెప్పు: "ఆయన తలచుకుంటే మీ మీదికి పైనుండిగాని, లేదా మీకాళ్ళ కింద నుండిగాని శిక్ష రప్పించగలడు. లేదా మిమ్మల్ని విభిన్న వర్గాలుగా చీల్చి ఒకవర్గం శక్తిని మరొక వర్గానికి చవిచూపించగలడు." చూడు, వారు వాస్తవం తెలుసుకోవడానికి మేము వివిధ రకాలుగా మా సూక్తులు వారి ముందు ఎలా

వివరిస్తున్నామో. కాని నీ జాతిప్రజలు దీన్ని వ్యతిరేకిస్తున్నారు. చెప్పు: "మీ (తిరస్కార) వైఖరికి నేనెలాంటి బాధ్యుడ్ని కాను. ప్రతి సంఘటన దాని నిర్ణీత సమయంలోనే సంభవిస్తుంది. త్వరలోనే వాస్తవం ఏమిటో మీకే తెలుస్తుంది." (65-67)

ప్రజలు మా సూక్తుల్ని గురించి కువిమర్శలు చేస్తూ అపహాస్యం చేస్తుంటే నీవు వారి దగ్గర కూర్చోకు. అక్కడ్నుంచి లేచిపో. వారా విషయం మానేసి మరో విషయం మాట్లాడుకునేదాకా వారి చెంతకు వెళ్ళకు. ఎప్పుడయినా షైతాన్ నిన్ను మరిపింపజేస్తే జ్ఞాపకం వచ్చిన వెంటనే అలాంటి దుర్మార్గుల దగ్గర్నుంచి లేచి వెళ్ళిపో. వారి లెక్క గురించి దైవభీతిపరులపై ఎలాంటి బాధ్యత లేదు. అయితే తప్పుడు వైఖరి విడనాడిన వారికి మాత్రం హితోపదేశం తప్పనిసరిగా చేస్తూఉండాలి. (68-69)

తమ ధర్మాన్ని ఆటగా, వినోదంగా చేసుకున్నవారిని వదిలెయ్. వారిని ఐహిక జీవితం మోసగించింది. అయితే వారికి ఖుర్ఆన్ సూక్తులు విన్పించి హితోపదేశం చేస్తూఉండు. మనిషి తన దుష్కార్యాలకు పర్యసానంగా పరలోకంలో పట్టుబడకుండా ఉండేందుకు వారిని ఖుర్ఆన్ బోధనల ద్వారా హెచ్చరించు. పట్టుబడితే మాత్రం ఇక అతడ్ని దేవుని పట్టు నుండి ఎవరూ కాపాడలేరు. అతని కోసం సిఫారసు చేసేవారు కూడా ఎవరూ ఉండరు.

అంతేకాదు, అతను తనకు వీలైన వస్తు సంపదలన్నీ పాపపరిహారంగా ఇవ్వడానికి సిద్ధపడినా సరే, వాటిని స్వీకరించి అతడ్ని రక్షించడం ఎన్నటికీ జరగదు. వీరసలు తమ (దుష్)కర్మలకు పర్యవసానంగా పట్టుబడనున్న పరమ దుర్మార్గులు. సత్యనిరాకరణకు ప్రతిఫలంగా వారికి త్రాగేందుకు సలసల కాగే నీళ్ళు ఇవ్వబడతాయి. ఆపై వ్యధాభరితమైన (నరక) యాతనలు చవిచూడవలసి ఉంటుంది. (70)

ముహమ్మద్ (సల్లం)! వారిని ఇలా అడుగు: "మేము దేవుడ్ని వదలి మాకు ఎలాంటి లాభంగాని, నష్టంగాని కలిగించలేని వాటిని ఆరాధించాలా? దేవుడు మాకు ఒకసారి సన్మార్గం చూపిన తరువాత మేము మళ్ళీ వెనక్కి తిరిగిపోవాలా? అలాగయితే మా పరిస్థితి కూడా కీకారణ్యంలో షైతాన్ మూకలు దారి తప్పించగా దిక్కుతోచని స్థితిలో పడిపోయే వ్యక్తిలా అవుతుంది. మరోవైపు వాడి సహచరులు అతడ్ని ఇటు వచ్చేయి, సరైన దారి ఇక్కడుంది అని పిలుస్తున్నారే!"

చెప్పు: "నిజానికి దేవుడు చూపే మార్గమే సరయిన మార్గం. ఆయన వైపునుండి మాకు ఈ విధంగా ఆదేశం లభించింది- సకలలోక ప్రభువుకు విధేయులై ఉండండి. ప్రార్థనా (నమాజ్) వ్యవస్థ నెలకొల్పండి. ఆయన ఆగ్రహం నుండి తప్పించుకోండి. ఆయన సన్నిధికే మీరంతా మరలిపోవలసి ఉంది". (71-72)

ఆయనే భూమ్యాకాశాలను సత్యం ప్రాతిపదికపై (ఒక మహోన్నత లక్ష్యం కోసం) సృష్టించాడు. ఆయన ఏరోజయితే 'అయిపో' అని అంటాడో ఆరోజు (పునరుత్థానం) సంభ విస్తుంది. ఆయన ఆజ్ఞ సత్యమైనది. (ప్రళయ) శంఖం పూరించే రోజున ఇక



రాజ్యాధికారమంతా ఆయనదే అవుతుంది (అని మీకు తెలిసిపోతుంది). ఆయనే గోచర, అగోచర విషయాలన్నీ ఎరిగినవాడు, వివేకవంతుడు, సర్వం తెలిసినవాడు. (73)

ఇబ్రాహీం తనతండ్రి ఆజర్‌తో అన్న మాటలు గుర్తుకుతెచ్చుకో. అతను తన తండ్రితో "ఏమిటీ, మీరు విగ్రహాలను దేవుళ్ళుగా చేసుకున్నారు? మీరు, మీజాతి ప్రజలు పూర్తిగా అపమార్గంలో పడిపోయారు" అని అన్నాడు. ఇబ్రాహీం నమ్మేవారిలో చేరడానికి మేమతనికి ఇలా భూమ్యాకాశాల సామ్రాజ్య వ్యవస్థను చూపించాము. (74-75)

ఒకరోజు అతనిపై చీకటి కమ్ముకోగానే అతనొక నక్షత్రం చూసి "ఇతను నా ప్రభువు" అన్నాడు. కాని ఆ నక్షత్రం అస్తమించగానే "ఇలాంటి అస్తమించేవాటిని నేను ప్రేమించను" అన్నాడు. తర్వాత చంద్రుడు ప్రకాశిస్తూ కన్పించగానే ఇతనే నాప్రభువు" అన్నాడు. కాని ఆ చంద్రుడు కూడా (కాస్సేపటికి) అస్తమించడంతో "(ఇతను కూడా నా ప్రభువు కాలేడు.) నా ప్రభువు నాకు మార్గం చూపకపోతే నేను మార్గభ్రష్టుణ్ణయి పోతాను" అన్నాడు. (76-77)

ఆ తర్వాత (మరునాడుదయం) సూర్యుడు దేదీప్యమానంగా వెలిగిపోతూ కన్పించాడు, అప్పుడు ఇబ్రాహీం "ఇతనే నా ప్రభువు, అందరికంటే గొప్ప ప్రభువు" అన్నాడు. అయితే సూర్యుడు కూడా అస్తమించిపోవడంతో (అతనికి జ్ఞానోదయం అయింది.) అతను తన జాతి ప్రజల్ని ఉద్దేశించి "నాజాతి సోదరులారా! మీరు దేవునికి సాటికల్పిస్తున్న మిథ్యాదైవాలతో నేను విసిగిపోయాను. నేనిప్పుడు పూర్తి ఏకాగ్రతతో భూమ్యాకాశాల్ని సృష్టించినవాని వైపు మరలాను. నేను ఏమాత్రం బహుదైవారాధకుడ్ని కాను" అని అన్నాడు. (78-79)

ఈ విషయంలో ఇబ్రాహీంజాతి ప్రజలు అతనితో వాదనకు దిగారు. అప్పుడతను వారితో ఇలా అన్నాడు: "ఏమిటీ, మీరు దేవుని విషయంలో నాతో వాదనకు దిగారు? అసలు ఆయనే నాకు రుజుమార్గం చూపింది. ఏమైనా మీరు దేవునికి సాటికల్పించిన మిథ్యాదైవాలకు నేను ఏమాత్రం భయపడను. ఏదైనా సరే నాప్రభువు తలచుకుంటేనే జరుగుతుంది. నా ప్రభువు జ్ఞానం ప్రతిదాన్నీ పరివేష్ఠించిఉంది. మీరు ఇప్పుడైనా స్పృహలోకి వస్తారా?" (80)

బహుదైవారాధన గురించి మీ దగ్గరికి దేవుడు ఎలాంటి ప్రమాణం పంపక పోయినా, మీరు ఆయన దైవత్వంలో ఇతరుల్ని భాగస్వాములు చేశారు. అలాంటి పని చేసికూడా మీరు దేవునికి భయపడనప్పుడు, మీరు కల్పించుకున్న మిథ్యాదైవాలకు నేనెందుకు భయపడాలి? మన ఉభయుల్లో నిర్భయం, నిశ్చింతలకు ఎవరెక్కువ అర్హులో మీరే చెప్పండి తెలిస్తే. సత్యాన్ని విశ్వసించి, అందులో బహుదైవారాధనా భావానికి ఏమాత్రం ఆస్కారం ఇవ్వనివారికే శాంతి, స్థిమితాలు ప్రాప్తమవుతాయి. అలాంటివారే సన్మార్గంలో ఉంటారు. (81-82)

ఇదీ మా వాదన. దీన్ని మేము ఇబ్రాహీంకు అతని జాతిప్రజలపై ప్రయోగించడానికి ప్రసాదించాము. మేము తలచుకున్నవారికి ఉన్నత స్థానాలు ప్రసాదించి, వారి

అంతస్తులు పెంచుతాం. నిస్సందేహంగా నీప్రభువు ఎంతో వివేకవంతుడు, జ్ఞాన సంపన్నుడు. (83)

ఆ తర్వాత మేము ఇబ్రాహీం (అలైహి)కు ఇస్హాఖ్ (లాంటి కొడుకు)ను, యాఖూబ్ (లాంటి మనవడి)ని అనుగ్రహించాము. వారందరికీ సన్మార్గం చూపాం. దీనికి పూర్వం నూహ్ (అలైహి)కు కూడా సన్మార్గం చూపాం. అతని సంతతి నుండి మేము దావూద్, సులైమాన్, అయ్యూబ్, యూసుఫ్, మూసా, హారూన్ (అలైహి)లను (సన్మార్గగాములుగా) ప్రభవింపజేశాం. ఇలా మేము సజ్జనులకు వారి సద్వర్తనకు (తగిన)ప్రతిఫలం ప్రసాదిస్తున్నాం. (అతని సంతతి నుండే) మేము జకరియ్యా, యహ్యా, ఈసా, ఇల్యాస్ (అలైహి)లను కూడా ప్రభవింపజేశాం. వారిలో ప్రతిఒక్కడూ సజ్జనుడే. (అతని సంతతినుండే) ఇస్మాయీల్, అల్యసఅ, యూనుస్, లూత్ (అలైహి)లను (సన్మార్గగాములుగా) ప్రభవింపజేశాం. వారిలో ప్రతి ఒక్కరికీ ప్రపంచ మానవులందరిలో కెల్లా ఎక్కువ గౌరవం, ఔన్నత్యాలను ప్రసాదించాము. (84-86)

అంతేకాదు, వారి తాతముత్తాతలు, సంతానం, సోదరులలో కూడా చాలామందికి మేము (ఎంతగానో) అనుగ్రహించాం. వారిని ప్రత్యేకంగా మా సేవకోసం ఎన్నుకొని సన్మార్గం వైపు నడిపించాం. ఇది దేవుని మార్గదర్శకత్వం. ఆయన తన దాసులలో తాను కోరిన వారికి మార్గదర్శనం చేస్తాడు. వారు గనక దేవునికి సాటికల్పించిఉంటే వారి పుణ్యకార్యాలన్నీ వృధా అయిపోయేవి. వారికి మేము గ్రంథాన్ని, వివేకాన్ని, ప్రవక్తృత్వాన్ని ప్రసాదించాము.

ఇప్పుడు వీరు ఈ విషయాల్ని విశ్వసించడానికి నిరాకరిస్తే (నిరాకరించనీ), మేమీ (విశ్వాస) భాగ్యం దాన్ని నిరాకరించనివారికి ప్రసాదించాం. ముహమ్మద్! గుర్తుంచుకో. దేవుని నుండి సన్మార్గభాగ్యం పొందినవారు వీరే. కనుక నీవు వారు నడచిన బాటనే నడు. వారికి చెప్పు: “నేనీ (సందేశప్రచార) కార్యం కోసం మీనుండి ఎలాంటి ప్రతిఫలం ఆశించడం లేదు. ఇది యావత్తు మానవాళి కోసం అవతరించిన సార్వజనీన హితోపదేశం.” (87-90)

వారు తమ తప్పుడు అంచనాలతో దేవుని విషయంలో చాలా పొరబడ్డారు. దేవుడు ఏ మానవమాత్రుడిపై ఎలాంటి విషయాన్నీ అవతరింప జేయలేదని అంటున్నారు. వారిని అడుగు: “ఇంతకూ మూసా తెచ్చిన గ్రంథాన్ని ఎవరు అవతరింప జేశారనుకుంటున్నారు మీరు? అది మానవులకు (జ్ఞాన)కాంతినిచ్చి సన్మార్గంచూపే దివ్యగ్రంథం. అలాంటి గ్రంథాన్ని మీరు అనేక భాగాలుగా విడదీసి పెట్టారు. వాటిలో కొన్నిటిని మాత్రమే వెల్లడిచేస్తూ మిగిలిన వాటిని దాచిపెట్టారు. మీరు, మీ తాత ముత్తాతలు ఎరగని ఎన్నో విషయాలను మేము (ఈగ్రంథం ద్వారా) మీకు తెలియజేశాం.” వారికి చెప్పు (దాన్ని) దేవుడు (అవతరింపజేశాడు) అని. ఆ తరువాత వారిని వారి పనికిమాలిన వాదనల్లోనే పడి ఉండనివ్వు. (91)

(ఆ గ్రంథంలాగే) ఈ గ్రంథాన్ని కూడా మేమే అవతరింపజేశాము. ఇది ఎంతో శుభ దాయకమైన గ్రంథం. నీకు పూర్వం అవతరించిన గ్రంథాలను ధృవీకరిస్తోంది. ఈ



గ్రంథంలోని బోధనల ద్వారా నీవు రాజధాని (మక్కా) నగరవాసుల్ని, దాని పరిసర ప్రాంతాల్లో నివసించేవారిని హెచ్చరించడానికి దీన్ని అవతరింపజేశాము. పరలోకాన్ని నమ్మేవారు ఈ గ్రంథాన్ని విశ్వసిస్తున్నారు. పైగా వారు తమ ప్రార్థన (నమాజ్) పట్ల ఎంతో జాగ్రత్త వహిస్తూ అత్యంత శ్రద్ధాసక్తులతో దాన్ని ఆచరిస్తున్నారు. (92)

దేవుని మీద అసత్యం మోపేవాడి కంటే పరమ దుర్మార్గుడు ఎవరుంటారు? అతనిపై ఎలాంటి దైవసందేశం అవతరించకపోయినా తనపై కూడా దైవసందేశం అవతరిస్తోందని లేదా దేవుడు అవతరింపజేసి నటువంటి వాటిని తాను కూడా అవతరింపజేసి చూపుతానని అతను కారుకూతలు కూస్తున్నాడు.

ఈ దుర్మార్గులు మరణావస్థలో దుర్భరయాతనతో ఎంత తల్లడిల్లిపోతారో నీవు చూస్తే బాగుండు. అప్పుడు దైవదూతలు చేతులు ముందుకు చాపుతూ ఇలాఅంటారు: “తీయండిక మీ ప్రాణాలు బయటికి. మీరు దేవుని మీద అసత్యవిషయాలు మోపి అన్యాయంగా కారు కూతలు కూశారు. తలబిరుసుతనంతో ఆయన సూక్తులపై కువిమర్శలు చేస్తుండేవారు. అందుకు ఈరోజు మీరు అత్యంత అవమానకరమైన యాతన చవిచూడండి.” (93)

“మేము మిమ్మల్ని మొదటిసారి ఎలా ఒంటరిగా పుట్టించామో అలాగే ఈరోజు మీరు మా దగ్గరికి ఒంటరిగా వచ్చారు. మేము మీకు ఇహలోకంలో ప్రసాదించినదంతా అక్కడే వదిలేసి వచ్చారు. మిమ్మల్ని ఏదో ఉద్ధరిస్తారని మీరు భావించిన మీ సిఫారసు కర్తలు కూడా ఈరోజు మీ దగ్గర లేకుండాపోయారు. మీ పరస్పర సంబంధాలన్నీ తెగి పోయాయి. మీరు ఎంతో ఆశపెట్టుకున్న వారంతా ఈరోజు మీ నుండి కనుమరుగయి పోయారు.” (94)

దేవుడే విత్తనాన్ని, టెంకను చీల్చి తీసేవాడు. ఆయనే నిర్జీవ పదార్థం నుండి జీవిని, జీవి నుండి నిర్జీవ పదార్థాన్ని తీసేవాడు. ఈ పనులన్నీ చేసేవాడు దేవుడే కదా! అలాంటప్పుడు మీరు దారితప్పి ఎటు పోతున్నారు? రాత్రి చీకటితెరలను చీల్చి ఉదయాన్ని తెస్తున్నవాడు కూడా ఆ దేవుడే. ఆయనే రాత్రిని విశ్రాంతి సమయంగా చేశాడు. ఆయనే సూర్యచంద్రుల ఉదయాస్తమయాలకు తగిన వేళల్ని నిర్ణయించిన వాడు. ఇదంతా అసామాన్య శక్తిమంతుడు, అపార జ్ఞానసంపన్నుడైన దేవుడు నిర్దేశించిన అద్భుతనియమావళి. (95-96)

ఆయనే మీకోసం కీకారణ్యంలో, భీకర సముద్రాలలోని కారుచీకట్లలో దారి తెలుసుకునేందుకు నక్షత్రాలను సాధనాలుగా చేసినవాడు. బుద్ధిమంతుల కోసం మా సూచనల్ని ఎలా విశదీకరిస్తున్నామో చూడు! ఆయనే మిమ్మల్ని ఏకజీవి నుండి పుట్టించాడు. తర్వాత మీలో ప్రతిఒక్కరికీ నివసించడానికి ఒకచోటు, అప్పగించ బడేందుకు ఒక (సమాధి)స్థలం నిర్ణయించబడ్డాయి. ఈసూచనలు విజ్ఞులు కోసం మేము విడమరచి తెలుపుతున్నాము. (97-98)

ఆయనే ఆకాశం నుండి వర్షం కురిపించి రకరకాల మొక్కలు మొలకెత్తిస్తున్నాడు. తిరిగి ఆ మొక్కల నుండి పచ్చటి పొలాలు, వృక్షాలు పైకి తీస్తున్నాడు. వాటిద్వారా పొరలు పొరలుగా ఒకదాని మీద మరొకటి పడివుండే ధాన్యం, గింజలు, కాయలు పండిస్తున్నాడు. ఖర్జూరమొగ్గల నుండి బరువుతో వ్రేలాడే పండ్లగుత్తులు సృజిస్తున్నాడు. ఆయనే ద్రాక్ష, ఆలివ్, దానిమ్మ తోటలు ఉద్భవింపజేస్తున్నాడు. ఆలివ్, దానిమ్మ పండ్లు ఆకారంలో దాదాపు ఒకే విధంగా ఉన్నా దేని ప్రత్యేకత దానికే ఉంటుంది. ఈ చెట్లు పుష్పించి, పండ్లుకాసి పండే తీరు పరికించిచూడు. విశ్వసించేవారికి వాటిలో (అనేక) సూచనలు, నిదర్శనాలున్నాయి. (99)

అయినా మానవులు తమ సృష్టికర్తయిన దేవునికి భూతపిశాచాలను సాటికల్పించి పూజిస్తున్నారు. పైగా వారు తెలిసో తెలియకో ఆయనకు కొడుకుల్ని, కూతుళ్ళను కూడా అంటగడ్తున్నారు. కాని దేవుడు ఎంతో పరిశుద్ధుడు. వారు కల్పిత మాటలకు ఆయన ఎంతో అతీతుడు. ఆయన యావత్తు భూమ్యాకాశాలనే సృష్టించిన అద్భుత శక్తి సంపన్నుడు. ఆయనకసలు భార్యే లేనప్పుడు సంతానం ఎలా కలుగుతుంది? ఆయనే ప్రతిదాన్నీ సృష్టించేవాడు. ప్రతి విషయం తెలిసినవాడు కూడా ఆయనే. (100-101)

అలాంటి దేవుడే మీ ప్రభువు. ఆయనతప్ప మరోదేవుడు లేడు. ఆయనే సర్వసృష్టి కర్త. కనుక మీరు ఆయన్నే ఆరాధించండి. ఆయనే అందరికీ సంరక్షకుడు. ఎవరి చూపులూ ఆయన్ని అందుకోలేవు. ఆయన మాత్రం అందరి చూపుల్నీ అందుకోగలడు. ఆయన ఎంతో సునిశితదృష్టి కలవాడు, ప్రతిదాన్నీ తెలుసుకోగలవాడు. (102,103)

“ఇప్పుడు మీ ప్రభువు నుండి మీదగ్గరికి స్పష్టమైన ఆధారాలు వచ్చాయి. కనుక కళ్ళుతెరచి చూసేవాడే ప్రయోజనం పొందగలడు. (కళ్ళుండీ చూడలేని) గుడ్డివాడు తననే నష్టపరచుకుంటాడు. నేను మీమీద పర్యవేక్షకుడ్ని కాను” (అని చెప్పు). (104)

ఈ విధంగా మేము మాసూక్తుల్ని మాటిమాటికి విభిన్న రీతులలో విశదీకరిస్తున్నాం. నీవు ఎవరి వద్దనో విని (ఈ సూక్తులు) చెబుతున్నావని వీరు ఆరోపిస్తున్నందున, బుద్ధీ జ్ఞానం కలవారి ముందు యదార్థాన్ని ఈవిధంగా బట్టబయలు చేస్తున్నాము. (105)

ముహమ్మద్! నీవు నీ ప్రభువు నుండి నీపై అవతరించిన దివ్యావిష్కృతి (వహీ)ని అనుసరిస్తూఉండు. ఆ ప్రభువు తప్ప మరొక దేవుడు లేడు. బహుదైవారాధకుల్ని ఎన్నటికీ అనుసరించకు. దేవుడు తలచుకుంటే వారిని బహుదైవారాధన చేయకుండా ఆపగలడు. మేము నిన్ను వారిపై పర్యవేక్షకునిగా నియమించలేదు. అలాగే వారిపై నీవు రక్షక భటుడి పాత్ర వహించనవసరం లేదు. (106-107)

(విశ్వాసులారా!) వారు నిజదేవుడ్ని వదలి ప్రార్థించే మిధ్యాదైవాలను మీరు దూషించకండి. అలాచేస్తే వారు బహుదైవారాధనను కూడా మించిపోయి, అజ్ఞానంతో నిజదేవుడ్నే దూషించడానికి సిద్ధపడతారు. మేము ప్రతివర్గానికీ వారు చేసున్న పనులనే ఆకర్షణీయమైనవిగా చేశాం. చివరికి వారు తమ ప్రభువు సన్నిధికే మరలిపోవలసి ఉంది. అప్పుడాయన గతంలో వారు చేస్తుండిన పనులేమిటో వారికి తెలియజేస్తాడు. (108)



వారు పెద్దపెద్ద ఒట్లు వేసుకుంటూ, తమ ముందు ఏదయినా మహిమ వస్తే తాము తప్పకుండా దాన్ని విశ్వసిస్తామని అంటారు. ముహమ్మద్ (సల్లం)! మహిమల్ని చూపించే శక్తి దేవునికి మాత్రమే ఉందని చెప్పు.

ముస్లిములారా! వారి సంగతి మీకు తెలియదు. ఒకవేళ మేము మహిమలను చూపించినా వారు విశ్వసించే మనుషులు కారు. వారసలు (ఈ ఖుర్ఆన్ని) ఒక్క సారైనా విశ్వసించని విధంగా మేము వారి హృదయాలను, దృష్టిని మార్చివేస్తున్నాము. ఈ విధంగా మేము వారిని వారి తిరస్కారం, తలబిరుసుతనాల్లోనే (ఎల్లప్పుడూ) పడిఉండేలా వదలి పెడ్తున్నాము. (109-110)

ఒకవేళ వారిముందు మేము దైవదూతల్ని ప్రత్యక్షపరచినా, మృతులు లేచివచ్చి వారితో మాట్లాడినా, చివరికి ప్రపంచంలోని వస్తువులన్నీ వారి దగ్గరకు తీసుకువచ్చినా సరే, వారు ఏమాత్రం విశ్వసించరు, విశ్వసించాలని దేవుడు వారి నొసట రాసిపెడ్తే తప్ప. వారిలో చాలామంది మూఢుల్లా మాట్లాడుతారు. (111)

అలాగే మేము పైశాచిక (స్వభావంగల) మానవుల్ని, జిన్నుల్ని ప్రతి దైవప్రవక్తకు శత్రువులుగా చేశాం. వారు ఆత్మవంచనతో పరస్పరం మనోహరమైన మాటలు చెప్పు కుంటారు. అలా చేయకూడదని ముందే నీప్రభువు నిర్ణయించిఉంటే వారలా ఎన్నటికీ చేయరు. కనుక వారు అలాగే తియ్యటి మాటలతో ఒకర్నొకరు మోసగించుకునేలా వారి మానాన వారిని వదలిపెట్టు. పరలోకాన్ని విశ్వసించనివారి హృదయాలు సహజం గానే తియ్యటి మాటలవైపు మొగ్గుతాయి. అవంటేనే వారికి ఇష్టం. (యదార్థం వారికి ఇప్పుడు చేదుగానే ఉంటుంది.) అందువల్ల వారు (యదార్థం తెలిసినప్పటికీ) లోగడ చేస్తూ వచ్చిన (దుష్ట)కార్యాలే ఇప్పుడూ చేస్తున్నారు. (112-113)

(వారిని అడుగు:) “నేను దేవుడ్ని వదలి వేరే మరొక తీర్పరిని అన్వేషించాలా? అసలు ఆయనే కదా పూర్తి వివరాలతో ఈ గ్రంథాన్ని మీ దగ్గరకు పంపినవాడు.” నీకు పూర్వం గ్రంథం ప్రసాదించబడినవారికి నీ ప్రభువు నుండే సత్యపూరితమైన ఈ గ్రంథం కూడా వచ్చిందని తెలుసు. కనుక నీవు అనుమానించేవారిలో చేరిపోకు. నీ ప్రభువు వాక్కు సత్యం, న్యాయాల దృష్ట్యా స్వచ్ఛమైనది, సమగ్రమైనది. ఆయన వచనాలను ఎవరూ మార్చలేరు. ఆయన సమస్తం వింటున్నాడు, సర్వం ఎరిగినవాడు. (114-115)

ముహమ్మద్ (సల్లం)! నీవు భూవాసుల్లోని అధిక సంఖ్యాకులు చెప్పే మాటలు గనక వింటే వారు నిన్ను దైవమార్గం నుండి తప్పిస్తారు. వారు కేవలం ఊహాలోకంలో విహరిస్తూ నిరాధారమైన విషయాలు అనుసరిస్తారు. నిజానికి ఎవరు నీప్రభువు మార్గం తప్పివున్నారో, ఎవరు సరైన మార్గంలో ఉన్నారో నీప్రభువుకు బాగాతెలుసు. (116,117)

(ముస్లింలారా!) మీరు దేవుని సూక్తులు విశ్వసించినవారయితే దేవుని పేరు స్మరించ బడిన పశువు మాంసమే తినాలి. దేవుడు కొన్ని పశువుల్ని మీకు గత్యంతరం లేనప్పుడు తప్ప సాధారణ పరిస్థితుల్లో తినడాన్ని నిషేధించాడు. వాటి వివరాలు కూడా

మీకు తెలియజేశాడు. అలాంటప్పుడు మీరు దేవుని పేరు స్మరించబడిన పశువుల్ని ఎందుకు తినరు? చాలామంది సరైన జ్ఞానం లేకుండా మనోవాంఛలకు బానిసలయి (మాయమాటలతో) జనాన్ని దారి తప్పిస్తారు. అలాంటి హద్దుమీరినవారి సంగతి నీ ప్రభువుకు బాగా తెలుసు. (118,119)

మీరు మాత్రం బహిరంగ పాపాలక్కూడా దూరంగా ఉండండి, రహస్య పాపాలకు కూడా దూరంగా ఉండండి. పాపకృత్యాలకు పాల్పడుతున్నవారు త్వరలోనే తమ పాపాలకు తగిన శిక్ష అనుభవిస్తారు. దేవుని పేరు స్మరించకుండా కోసిన పశువును తినకండి. అలా తినడం పాపం. పైశాచిక శక్తులు తమ అనుచరుల హృదయాల్లో లేనిపోని అనుమానాలు రేకెత్తించి వారిని మీపై ఉసిగొల్పుతాయి. వారి మాటలు విని నడచుకుంటే మీరు కూడా బహుదైవారాధకులయి పోతారు. (120,121)

మరణించిన ఒక మనిషికి మేము ప్రాణంపోసి (జ్ఞాన) జ్యోతి ప్రసాదించగా అతను దాని వెలుగులో సవ్యమయిన జీవితం సాగిస్తుంటాడు. దానికి భిన్నంగా మరొక మనిషి అంధకారంలో పడిపోయి ఇక ఏ విధంగానూ అందులో నుంచి బయట పడలేడు. ఆ ఇద్దరు వ్యక్తులు సమానులవుతారా? (చీకటి వెలుగులు ఎన్నటికీ ఒకటి కాజాలవు. అలాగే విశ్వాసులు, అవిశ్వాసులు కూడా.) అదేవిధంగా అవిశ్వాసులకు వారు చేస్తున్న (చెడు) పనులు మంచివిగానే తోచేటట్లు చేయబడ్డాయి. మేము ప్రతి ఊళ్ళో కుట్రలు, కుయుక్తులు పన్నే పరమ దుర్మార్గులను కూడా పుట్టించాము. అయితే వారు పన్నే కుట్రల వలలో చివరికి వారే చిక్కుకుంటారు. కాని వారా సంగతి గ్రహించడం లేదు. (122,123)

వారు తమ ముందుకు ఏదైనా దైవసూక్తి వస్తే "దైవప్రవక్తకు ఇవ్వబడిన ప్రవక్త హోదా మాకూ ఇవ్వబడనంతవరకు మేము దీన్ని విశ్వసించము" అంటారు. ప్రవక్త పదవి ఎవరికి అప్పగించాలో దేవునికి బాగా తెలుసు. త్వరలోనే ఈ నేరస్థులు తమ కుట్రల పర్యవసానంగా దేవుని వద్ద ఘోర పరాభవం, దుర్భర శిక్ష చవిచూస్తారు. (124)

దేవుడు ఎవరికి సన్మార్గం చూపదలచుకుంటాడో అతని హృదయ కవాటాలను ఇస్లాం కోసం తెరచి ఉంచుతాడు. అలాగే ఎవరిని అపమార్గం పట్టించదలచుకుంటాడో అతని హృదయకవాటాలు మూసేసి, అతడ్ని సంకుచిత మనస్కుడిగా చేస్తాడు. దాంతో అతను (ఇస్లాం ప్రస్తావన వస్తే చాలు) తనప్రాణం అనంతవాయువుల్లో కలసిపోయి ఆకాశానికి ఎగబ్రాకి పోతున్నదా అన్నట్లు తల్లడిల్లిపోతాడు. ఈ విధంగా దేవుడు సత్యాన్ని విశ్వసించనివారి మీద నైచ్యం, నికృష్టతలను రుద్దుతాడు. (125)

ఇదే నీ ప్రభువు మార్గం, (ఏకైక) రుజుమార్గం. మేము యోచించేవారికి మా సూక్తుల్ని ఎంతో విడమరచి తెలియజేశాం. అలాంటివారికి వారిప్రభువు వద్ద ప్రశాంత నిలయం ఉంది. వారు అవలంబించిన సదాచారవైఖరి కారణంగా దేవుడు వారిని ప్రేమిస్తున్నాడు. (126-127)



దేవుడు వారందరినీ చుట్టుముట్టి సమీకరించే రోజు జిన్నులను ఉద్దేశించి "జిన్ను లారా![4] మీరు మానవజాతి నుండి ఎన్నో లాభాలు పొందారు, (కదూ?)" అని అడుగుతాడు. దానికి వారి మానవమిత్రులు "ప్రభూ! మాలో ప్రతిఒక్కడూ ఇతరుల్ని బాగా వాడుకున్నాడు. చివరికి మేము మాకోసం నీవు నిర్ణయించిన సమయానికి చేరుకున్నాం" అని అంటారు.

---

4. జిన్నులంటే అగ్నిజ్వాలతో సృష్టించబడి మానవులకు గోచరించకుండా ఈ ప్రపంచం లోనే మనుగడ సాగిస్తున్న ఒక విధమైన బుద్ధిజీవులు. మానవుల్లో మాదిరిగానే వీరిలో కూడా సజ్జనులు-దుర్జనులు, విశ్వాసులు-అవిశ్వాసులు ఉంటారు. వీరు కూడా మరణానంతరం పరలోక న్యాయస్థానంలో తమ కర్మలకు లెక్క చెప్పుకోవలసి ఉంటుంది. కర్మవిచారణ తరువాత వీరికీ స్వర్గనరకాలు ఉంటాయి. (ఇతర వివరాలకు 7:12 సూక్తికి రాసిన పాదసూచిక చూడండి.)

సైన్సు పరిశోధన ద్వారా మన ముందుకురాని వస్తువులు ఇంకా అనేకం ఉన్నాయి. ఒక వస్తువు శక్తిమంతమైన పరికరాల ద్వారా సైతం మనకు గోచరించనంత మాత్రాన దాని ఉనికిని ఖండించలేము. ఆ వస్తువు వ్యక్తపరిచే ప్రభావాన్ని బట్టి కొన్ని లెక్కలు, అంచనాలతో దాని ఉనికిని నిర్ధారిస్తారు శాస్త్రవేత్తలు. అలాంటి వాటిలో జిన్నుల ఉనికి కూడా ఒకటని చెప్పవచ్చు.

"మానవులు ఏ విధంగా మట్టి, గాలి, నీటితో సృజించబడ్డారో అదేవిధంగా జిన్నులు మట్టికి బదులు సల్ఫర్, సిలికాన్‌లతో, సాధారణ గాలికి బదులు ఉష్ణవాయువు (హాట్ ఎయిర్)తో, నీటికి బదులు ఫ్లోరిన్‌గ్యాస్‌తో సృజించబడ్డారని కాస్సేపు ఊహిస్తే జిన్నుల ఉనికికి సంబంధించిన సమస్య చాలావరకు అర్థమవుతుంది. ఉష్ణవాయువుకు ఎక్స్‌రేకిరణాల్లా ఘనపదార్థాల గుండా చొచ్చుకుపోయే గుణం ఉంది. జిన్నుల (భూతాల) సృష్టికి కావలసిన మూలపదార్థాలలో కూడా ఈ ఉష్ణవాయువు ఉంది గనగ, ఆ జాతికి ఘనపదార్థాల గుండా చొచ్చుకుపోయే లక్షణం ఉంటుంది.

"సల్ఫర్ (గంధకం), ఫ్లోరిన్‌గ్యాస్‌ల సమ్మేళనం ద్వారా అగ్ని నైజంగల జీవి ఉనికిలోకి వచ్చే అవకాశం ఉంది. అలాంటి జీవి 800 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత వరకు తన అసలు రూపంలోనే ఉంటుంది. సిలికాన్, సల్ఫర్, ఫ్లోరిన్ గ్యాస్‌ల సమ్మేళనంతో సృజించబడే జీవులు వాతావరణం, కాలాన్ని బట్టి తమ ఆకారం, రూపాలు మార్చుకునే శక్తి కలిగిఉంటాయి. దీన్నిబట్టి జిన్నులు ఇలాంటి పదార్థాల సమ్మేళనం ద్వారానే ఉనికిలోకి వచ్చి ఉంటాయని చెప్పవచ్చు.

"ప్రఖ్యాత విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ హెరాల్డ్ సియెర్ (అమెరికా) 'ది కెమికల్ వరల్డ్' అనే తన గ్రంథంలో ఈవిధంగా పేర్కొన్నాడు: 'ఒకవేళ మనం సిలికాన్, సల్ఫర్, ఫ్లోరిన్‌గ్యాస్‌ల సమ్మేళనం ద్వారా ఏదైనా ప్రాణిని సృష్టించగలిగితే ఆ ప్రాణికి ఎలాంటి ఆహారం అవసరముండదు. దానికి తన ఆకారాన్ని మార్చుకోగల శక్తి కూడా ఉంటుంది. సిలికాన్‌తో సృజించబడే ఈ ప్రాణులు నివశించ డానికి శుక్ర, బృహస్పతి గ్రహాలు అనువైన ప్రదేశాలు. అవి ఆ ప్రదేశాల నుంచి నేరుగా శక్తి గ్రహిస్తాయి.' (ఉష్ణవాయువు గురించి 15:27 సూక్తి చూడండి.)

"అమెరికాకే చెందిన శాస్త్రవేత్తలు డాక్టర్ సర్‌లాజ్, డాక్టర్ సర్‌జేమ్స్, ప్రొఫెసర్ జోడ్ ఇలా అంటున్నారు: 'మన సూర్యకుటుంబంలోని ఓ గ్రహం నుండి గ్రహాంతరజీవులు మన భూమిపైకి వచ్చి భూవాసుల్ని ప్రభావితంచేసి, వారిని లోబరుచుకొని మానవ మేధకందని కొన్ని పనులు చేయి స్తుంటాయి. దీన్నే మనం భూతప్రభావం అంటున్నాం. వస్తువులు ఉన్నట్లుండి కదలడం, గాలిలో తేలడం కూడా అందులోని భాగమే." ('దావత్' త్రైదిన పత్రిక సౌజన్యంతో)

అప్పుడు దేవుడు "అయితే మీ నివాసం ఇక నరకమే. అందులోనే మీరు శాశ్వతంగా పడివుంటారు." అనంటాడు. అయితే దేవుడు కాపాడ దలచినవారు మాత్రం దాన్నుండి తప్పించుకుంటారు. నిస్సందేహంగా నీప్రభువు ఎంతో వివేకవంతుడు, సర్వజ్ఞాని. దుర్మార్గులు (ప్రపంచంలో) చేసిన దుష్కర్మల ఫలితంగా ఈ విధంగా మేము వారిని (నరకంలో) ఒకరికొకరు స్నేహితులుగా చేస్తాము. (128-129)

(దేవుడు వారిని ఈవిషయం కూడా అడుగుతాడు:) "జిన్నులారా! మానవులారా!! మీ దగ్గరికి మీలో నుండే దైవప్రవక్తలు రాలేదా? వారు నా సూక్తులు విన్పిస్తూ ఈ దినం గురించి మిమ్మల్ని హెచ్చరించలేదా?" దానికి వారు "ఔను (ప్రభూ! కాని మేమే పెడచెవిన పెట్టాం). మాకు వ్యతిరేకంగా మేమే సాక్ష్యమిస్తున్నాం" అంటారు. ఈనాడు ఇహిక జీవితం వారిని మోసగించింది. కాని తాము తిరస్కారవైఖరి అవలంబించామని రేపటిరోజు స్వయంగా వారే తమకు వ్యతిరేకంగా (ఇలా) సాక్ష్యం చెబుతారు.

ప్రజలు సత్యం ఏమిటో తెలియని స్థితిలో ఉన్నప్పుడు దేవుడు వారి జనావాసాలను అన్యాయంగా తుడిచి పెట్టేవాడు కాదు. ఈ విషయం తెలియడానికే (వారినుండి ఈవిధంగా సాక్ష్యం తీసుకోవడం జరుగుతుంది). (130-131)

ప్రతివ్యక్తీ తను చేసుకున్న కర్మల్ని బట్టే (పరలోకంలో) అతని హోదా, అంతస్తులు ఉంటాయి. నీప్రభువు మానవులు చేస్తున్న కర్మల్ని ఓకంట గమనిస్తూనే ఉన్నాడు. నీ ప్రభువు నిరపేక్షాపరుడు, కరుణామయుడు. ఆయన గతంలో వేరే జాతుల్ని తొలగించి వారి స్థానంలో మిమ్మల్ని ఎలా వారసులుగా చేశాడో ఇప్పుడు కూడా ఆయన తలచుకుంటే మిమ్మల్ని తొలగించి మీ స్థానంలో ఇతరుల్ని తీసుకురాగలడు. మీకు వాగ్దానం చేయబడుతున్నది (ప్రళయం) తప్పకుండా వస్తుంది. దాన్ని మీరు ఏవిధంగానూ అడ్డుకోలేరు. (132-134)

ముహమ్మద్! వారికిలా చెప్పు: "ప్రజలారా! మీరు మీస్థానంలో ఉండి పనిచేస్తూ ఉండండి. నేను నాస్థానంలో ఉండి పనిచేస్తాను. ఎవరి పర్యవసానం బాగుంటుందో త్వరలోనే మీకు తెలుస్తుంది. దుర్మార్గులు ఎన్నటికీ సఫలీకృతులు కాలేరు." (135)

వారు దేవుడు సృష్టించిన పొలాలు, పశువుల నుండే ఆయనకోసం కొంత భాగం కేటాయించి 'అది దేవుని భాగమని, ఇది తమ దేవతల భాగమని' అంటారు. అయితే వారు తమ దేవతల కోసం నిర్ణయించిన భాగం దేవుని దగ్గరకు చేరుకోదుగాని, దేవుని కోసం నిర్ణయించిన భాగం మాత్రం వారి (కల్పిత) దైవాలకు చేరుతుందా! వారు ఎలాంటి దుష్ట నిర్ణయాలకు పాల్పడుతున్నారు!! (136)

అలాగే వారి మిథ్యాదైవాలు వారిని వినాశపుఊబిలో నెట్టివేసి వారిమతాన్ని వారికి అనుమానాస్పదం చేయడానికి శిశుహత్యను సైతం పుణ్యకార్యంగా చేసి చూపించాయి. దేవుడు తలచుకుంటే వారలా చేసేవారు కాదు. కనుక వారిని వారిమానాన వదిలెయ్యి. వారి అసత్యాలు, అభూత కల్పనల్లోనే వారిని పడిఉండనీ. (137)



(వారింకా ఎన్నెన్ని దురాచారాలు సృష్టించుకున్నారో చూడు:) "ఈ పశువులు, ఈ పంటలు నిషేధించబడ్డాయి. మేము ఎవరికి ఇవ్వగోరుతామో వారు మాత్రమే వీటిని తినవచ్చు" అని అంటారు వారు. ఈ ఆంక్షలు వారు సృష్టించుకున్నవే. అలాగే కొన్ని జంతువుల మీద స్వారీ చేయకూడదని, వాటిచేత సామగ్రి మోయించకూడదని ఆంక్షలు విధించుకున్నారు. మరికొన్ని జంతువుల్ని కోసేటప్పుడు దేవుని పేరే స్మరించరు. ఇవన్నీ వారు దేవుని మీద వేసిన అభాండాలు మాత్రమే. ఈ అభాండాలు, అభూత కల్పనలకు త్వరలోనే దేవుడు వారికి వాటి పర్యవసానం చవిచూపిస్తాడు. (138)

వారింకా ఇలాఅంటారు: "ఈపశువుల గర్భాలలో ఉన్నవి మా పురుషులకు మాత్రమే ప్రత్యేకించబడ్డాయి, మా స్త్రీలకు నిషేధించబడ్డాయి. అయితే అవి మృత్యువాత పడినవయితే వాటిని ఉభయులూ తినవచ్చు."ఈ అభూతకల్పనలకు దేవుడు వారిని తప్పకుండా శిక్షిస్తాడు. ఆయన మహా వివేకవంతుడు, సర్వజ్ఞాని. (139)

అజ్ఞానంలో పడి తమ సంతానాన్ని చంపుకున్నవారు, దేవుడు ప్రసాదించిన ఆహార వస్తువుల్ని దేవుని మీద అబద్ధాలుమోపి నిషేధించుకున్నవారు ఘోరంగా నష్టపోతారు.[5] వారు పూర్తిగా మార్గభ్రష్టులై పోయారు. ఇక వారు ఎన్నటికీ దారికి రారు. (140)

(మీకోసం) పందిళ్ళమీద ప్రాకే, ప్రాకని చెట్లతో సహా రకరకాల తోటలు, తోపులను సృష్టించినవాడు ఆ దేవుడే. వివిధ రకాల ఆహార పదార్థాలు ఉత్పత్తి చేసే పొలాలు, ఖర్జూరపు చెట్లను సృష్టించినవాడు కూడా ఆయనే. ఆయనే ఆలివ్, దానిమ్మ వృక్షాలను సృజిస్తున్నాడు. వాటి పండ్లు చూడటానికి ఆకారంలో ఇంచుమించు ఒకేలా ఉన్నప్పటికీ రుచిలో వ్యత్యాసం ఉంటుంది. అవి పంటకు వచ్చినప్పుడు వాటి పండ్లు హాయిగా తినండి. దాంతోపాటు పంట కోతకు వచ్చినప్పుడు అందులో నుంచి దేవుని హక్కు (పేదల ఆర్థికహక్కు) కూడా నెరవేర్చండి. దుబారా చేయకండి. దుబారా చేసేవారిని దేవుడు ప్రేమించడు. (141)

మీరు స్వారీచేయడానికి, సామగ్రి రవాణాచేయడానికి ఉపయోగించే జంతువుల్ని, తినడానికి, (చర్మం) పరచుకోవడానికి ఉపయోగపడే పశువుల్ని కూడా ఆయనే సృష్టించాడు. కనుక వాటిలో దేవుడు ధర్మసమ్మతం చేసిన పశువుల్ని నిరభ్యంతరంగా తినండి. అయితే షైతాన్ అడుగుజాడల్లో నడవకండి. షైతాన్ మీకు బహిరంగ శత్రువు. (142)

ఇవి పెంటి, పోతూ కలసి మొత్తం ఎనిమిది రకాల పశువులు; రెండు గొర్రెజాతికి, రెండు మేకజాతికి చెందినవి. వారిని అడుగు: "దేవుడు వాటిలో పోతుజాతిని నిషేధించాడా? లేక పెంటిజాతినా? లేక గొర్రె, మేకల గర్భాలలో ఉన్న పిల్లలను నిషేధించాడా? మీరు సత్యవంతులైతే సరైన ఆధారాలతో నాకు సమాధానం ఇవ్వండి." (143)

అలాగే రెండు ఒంటెజాతికి చెందినవి, రెండు ఆవుజాతికి చెందినవి ఉన్నాయి. వారిని అడుగు:"దేవుడు వాటిలో పోతుజాతిని నిషేధించాడా లేక పెంటిజాతినా? లేక

5. సంతాన నిరోధం గురించి 17:31 సూక్తి, దాని పాదసూచిక చూడండి.

ఒంటె, ఆవుల గర్భాలలో ఉన్న పిల్లలను నిషేధించాడా? వాటిని నిషేధించినట్లు దేవుడు మీకేమైనా ఆజ్ఞ జారీ చేశాడా? అప్పుడు మీరున్నారా? సరైన జ్ఞానం లేకుండా ప్రజలను పెడదారి పట్టించడానికి ఇలా దేవుని మీద అబద్ధాలు మోపేవాడి కంటే పరమ దుర్మార్గుడు మరెవరు ఉంటారు?" అలాంటి దుర్మార్గులకు దేవుడు ఎన్నటికీ సన్మార్గం చూపడు. (144)

ప్రవక్తా! వారిని అడుగు: "చచ్చిన జంతువు, స్రవించిన రక్తం, అపవిత్రమైన పంది మాంసం, లేదా పాపభూయిష్టమైన జంతువు, అంటే దైవేతరుల పేరుతో కోయబడిన జంతువు తప్ప మరేదీ తినడం నిషేధించబడినట్లు నా దగ్గరకు పంపబడిన దివ్యావిష్కృతిలో లేదు.[6] కాకపోతే గత్యంతరంలేని పరిస్థితిలో మాత్రం ఈ నిషేధితాలు తినవచ్చు. అయితే అలా తినే వ్యక్తి కూడా అవిధేయతకు ఒడిగట్టకుండా మితిమీరిపోయే ఉద్దేశ్యం లేకుండా మసలుకోవాలి. నిస్సందేహంగా నీ ప్రభువు గొప్ప క్షమాశీలి, అపార దయామయుడు. (145)

యూదులైనవారికి మేము గోళ్ళుగల జంతువుల్ని నిషేధించాం. అలాగే ఆవు, మేకల కొవ్వుని కూడా నిషేధించాం- వాటి వీపు, పేగులు, ఎముకలకు అంటి వుండే కొవ్వు తప్ప. ఈ నిషేధం వారి తిరస్కారం, తలబిరుసుతనాలకు శిక్షగా విధించాం. మేము చెబుతున్నది ముమ్మాటికీ నిజం. వారిప్పుడు నిన్ను నిరాకరిస్తే, నీప్రభువు అపార కరుణామయుడు, దాంతో పాటు ఆయన శిక్ష నుండి నేరస్థుల్ని ఎవరూ తప్పించలేరని వారికి చెప్పు. (146,147)

బహుదైవారాధకులు "దేవుడు తలచివుంటే మేముగాని, మా తాతముత్తాతలుగాని బహుదైవారాధన చేసేవారము కాము; ఏ వస్తువునీ నిషేధించుకునే వారమూ కాము" అని అంటారు. వారికి పూర్వం కూడా బహుదైవారాధకులు ఇలాంటి మాటలే పలికి సత్యాన్ని నిరాకరించారు. చివరికి మాశిక్ష చవిచూశారు. వారిని అడుగు: "దీనికి మీదగ్గర ఏదైనా సాక్ష్యం ఉందా? ఉంటే మాకు చూపండి. ఇవన్నీ కేవలం మీ అనుమానాలు, అభూతకల్పనలే. మీరు ఊహాగానాలు మాత్రమే చేస్తారు". (148)

వారికి చెప్పు: "సరైన బలమైన సాక్ష్యాధారం దేవునిదగ్గరే ఉంది. ఆయనే తలచుకుంటే మీకందరికీ సన్మార్గావలంబన బుద్ధి ప్రసాదించేవాడు". దేవుడే వాటిని నిషేధించాడని అంటే దానికి సాక్ష్యం తీసుకురండని చెప్పు. ఆ విధంగా వారొకవేళ సాక్ష్యమిస్తే నీవుమాత్రం వారితోపాటు సాక్ష్యం ఇవ్వకూడదు. వారి కోరికల్ని నీవు ఎన్నటికీ అనుసరించకు. వారు మా సూక్తులు తిరస్కరించారు. పరలోకాన్ని విశ్వసించ లేదు. పైగా నీ ప్రభువుకు ఇతరులను సాటి కల్పిస్తున్నారు. (149-150)

"మీ ప్రభువు మీపై ఎలాంటి ఆంక్షలు విధించాడో తెలుపనా" అని వారికిలా తెవియజెయ్యి:

6. ఈ సూక్తితో పాటు 2:173, 5:3, 16:115 సూక్తులు కూడా చూడండి.



- ఆయనకు ఎవరినీ సాటి కల్పించకూడదు.
- తల్లిదండ్రుల పట్ల సద్భావనతో మసలుకోవాలి.
- దారిద్ర్యభయంతో మీ సంతానాన్ని (చేజేతులా) హతమార్చుకోకండి. మేము మీకూ ఆహారమిస్తున్నాము, వారికీ ఆహారమిస్తున్నాము.
- నీతిబాహ్యమైన పనుల దరిదాపులక్కూడా వెళ్ళకండి- రహస్యంగానైనా, బహిరంగంగానైనా సరే.
- న్యాయప్రాతిపదికపై తప్ప దేవుడు నిషేధించిన ఏ ప్రాణినీ హతమార్చకండి.[7]

మీరు అర్థంచేసుకొని మసలుకుంటారని దేవుడు మీకీ విషయాలు బోధిస్తున్నాడు.

- అనాథ బాలలు యుక్త వయస్సుకు చేరుకోనంతవరకు సక్రమ పద్ధతి ద్వారా తప్ప వారి సొమ్ము సమీపానికి పోకండి.[8]
- తూనికల్లో, కొలతల్లో పూర్తిగా న్యాయం పాటించండి. ప్రతి వ్యక్తిపై మేము అతను మోయగలిగినంత బాధ్యతా భారమే మోపుతాము.
- వ్యవహారం మీబంధువులకు సంబంధించినదైనా సరే న్యాయంగా మాట్లాడండి.
- దేవుని విషయంలో మీరు చేసిన ప్రమాణాన్ని నిలబెట్టుకోండి.

మీరు విషయాన్ని గుర్తుంచుకుంటారని దేవుడు మీకిలా ఉపదేశిస్తున్నాడు.

- ఇదే తాను నిర్దేశించిన రుజుమార్గమని, కనుక మీరు ఈ మార్గాన్నే నడవాలని ఆయన మీకు ఉపదేశిస్తున్నాడు. ఇతరులు చూపే మార్గాలు అనుసరించకూడదని, అలా అనుసరిస్తే వారు ఆయన మార్గం నుండి మిమ్మల్ని తప్పిస్తారని నచ్చజెపుతున్నాడు.

మీరు చెడుల జోలికి పోకుండా భయభక్తులతో మసలుకుంటారని దేవుడు ఈ విధంగా మీకు హితోపదేశం చేస్తున్నాడు. (151-153)

సద్వర్తనులకు మా వరాలు ప్రసాదించడానికి మేము మూసాకు (తౌరాత్) గ్రంథం ఇచ్చాము. అందులో ప్రతి విషయానికీ సంబంధించిన వివరాలు ఉన్నాయి. అది పూర్తిగా మార్గదర్శక గ్రంథం, కారుణ్యప్రదాయిని. ప్రజలు తమ ప్రభువుని కలుసుకునే విషయం విశ్వసిస్తారన్న ఉద్దేశ్యంతో దాన్ని అవతరింపజేశాము. (154)

అదేవిధంగా మేము ఈగ్రంథాన్ని కూడా అవతరింపజేశాము. ఇది ఎంతో శుభదాయక మైన గ్రంథం. కనుక మీరు దీన్ని అనుసరిస్తూ భయభక్తుల వైఖరి

7. ఏ పాపమెరుగని వ్యక్తిని హతమార్చడం ఘోరమైన పాపం. ఇస్లామీయ శిక్షాస్మృతి పరిధిలోకి వచ్చే నేరాలకు తప్ప మరే నేరానికీ మరణ శిక్ష విధించకూడదు. ఉదా: అమాయకుడ్ని హత్య చేయడం, ధర్మసంస్థాపన మార్గంలో ఆటంకాలు సృష్టించడం, ఇస్లామీయ రాజ్యంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం, వివాహితులు వ్యభిచారానికి పాల్పడటం మొదలైనవి.

8. ఈ సూక్తితో పాటు 4:2,6 సూక్తులు కూడా చూడండి.

అవలంబించండి; మీరు కరుణించబడతారు. ఇక మీరు “మాకు పూర్వం రెండువర్గాలకు (యూదులకు, క్రైస్తవులకు) గ్రంథాలు ఇవ్వబడ్డాయిగాని, వారేమి చదివేవారో మాకేమీ తెలియదు” అని సాకులు చెప్పలేరు. అలాగే “మాపై గ్రంథం అవతరించివుంటే మేము వారికన్నా ఎక్కువ సన్మార్గగాములుగా ఉండేవారం” అని కూడా సాకు చెప్పలేరు.

మీ ప్రభువు నుండి ఇప్పుడు మీ దగ్గరకు తిరుగులేని ప్రమాణం వచ్చింది. ఇది గొప్ప మార్గదర్శక గ్రంథం. మీపాలిట దైవకారుణ్యం. (ఇలాంటి) దైవవాణిని తిరస్కరించి తలబిరుసుతనంతో ముఖం తిప్పుకునేవాడి కంటే పరమ దుర్మార్గుడు మరెవరుంటాడు? మా సూక్తుల్ని విశ్వసించకుండా ముఖం చాటేసేవారికి మేము అత్యంత కఠినశిక్ష విధిస్తాం. (155-157)

ఇక వారు దేనికోసం ఎదురుచూస్తున్నారు? వారి ముందు దైవదూతలు ప్రత్యక్షం కావాలని లేక నీ ప్రభువు దిగిరావాలని చూస్తున్నారా? లేక నీ ప్రభువు సూచనలు కొన్ని బహిర్గతమయ్యే సమయం కోసం నిరీక్షిస్తున్నారా? నీప్రభువు సూచనలు బహిర్గతమయ్యే రోజు, అసలు సత్యాన్నే విశ్వసించనివాడు దాన్ని విశ్వసించినా ఆ విశ్వాసంవల్ల అతనికి ఎలాంటి ప్రయోజనం ఉండదు. అలాగే సత్యాన్ని విశ్వసించి ఆ తరూవత ఎలాంటి సత్కార్యం చేయనివాడికి సయితం అతని విశ్వాసం ఆరోజు ఎలాంటి ప్రయోజనం చేకూర్చదు.[9] ముహమ్మద్ (స)! “సరే అలాగే ఎదురుచూడండి, మేమూ ఎదురుచూస్తాం” అని వారికి చెప్పెయ్యి. (158)

తమ ధర్మాన్ని చీలికలు పేలికలుగా చేసుకొని విభిన్న వర్గాలుగా విడిపోయిన వారితో నీకెలాంటి సంబంధం లేదు. వారి వ్యవహారం దేవుడే చూసుకుంటాడు. వారు చేసిందేమిటో ఆయనే వారికి తెలియజేస్తాడు. ఒక సత్కార్యం చేసిన వ్యక్తికి దేవుని దగ్గర పదిరెట్ల పుణ్యఫలం లభిస్తుంది. అయితే ఒక దుష్కార్యం చేసినవాడికి ఆ ఒక్క పాప కార్యం ఫలమే లభిస్తుంది. అక్కడ ఎవరికీ ఎలాంటి అన్యాయం జరగదు. (159-160)

---

9. షాహ్ అబ్దుల్ ఖాదర్ ముహద్దిస్ (రహ్మలై) వ్యాఖ్యానం ప్రకారం ఇక్కడ సూచనలంటే ప్రళయ సూచనలని అర్థం. ఆ సూచనల్లో ఒకటి- ఓరోజు ఉన్నట్లుండి సుదీర్ఘ (కాళ) రాత్రి గడచిన తర్వాత సూర్యుడు పడమటి దిక్కు నుంచి ఉదయిస్తాడు. అప్పుడు అవిశ్వాసులు సత్యాన్ని విశ్వసించినా ప్రయోజనం ఉండదు. అదే విధంగా సత్యాన్ని విశ్యసించి, తదనుగుణంగా సత్కర్మలు ఆచరించనివారు ఆరోజు ఎన్ని సత్కార్యాలు చేసినా లాభంలేదు. సమయం మించి పోయింది. క్షమాద్వారం మూయబడింది. పాపుల పశ్చాత్తాపం స్వీకరించబడదు.

సూచనలు అంటే ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాలు, వ్యాధులు, యుద్ధాలు లాంటి శిక్షల ద్వారా మనిషి మృత్యువాత పడటం కూడ కావచ్చు. మృత్యుదూత ముంగిట వాలినప్పుడు అవిశ్వాసి భయపడిపోయి, “ఇప్పుడు నేను దేవుడ్ని, ఆయన ప్రవక్త (సల్లం)ను విశ్వసిస్తున్నాన”ని ఎన్నిసార్లు పలికినా, సత్కర్మలు ఆచరించకుండా ప్రాపంచిక వ్యామోహంలో పడిపోయిన నామమాత్రపు ముస్లిం, ఇప్పటినుంచి నేను క్రమం తప్పకుండా నమాజ్, రోజాలు పాటిస్తాను, దైవమార్గంలో నా సర్వస్వం ధారపోస్తాను” అని ఎంత మొత్తుకున్నా లాభం లేదు. పరీక్షా సమయం గడిచి పోయింది. ఆన్సర్ షీటు చేజారిపోయింది. ఇక రిజల్ట్స్ కోసమే ఎదురుచూడవలసి ఉంటుంది.



ప్రవక్తా! ఇలా చెప్పు: “నాప్రభువు నాకు రుజుమార్గం చూపించాడు- ఎలాంటి వంకలు, వ్యత్యాసాలు లేని సరయిన జీవనధర్మం. బహుదైవారాధనతో ఎలాంటి సంబంధం లేకుండా పూర్తి ఏకాగ్రతతో ఇబ్రాహీం అవలంబించిన ధర్మం ఇది.” వారికి స్పష్టంగా చెప్పు: “నా ప్రార్థన-ఆరాధనలు, నా జీవన్మరణాలు సమస్తం సర్వలోక ప్రభువయిన అల్లాహ్‌కే సమర్పితం. ఆయనకు ఎలాంటి భాగస్వాములు లేరు. దీన్ని గురించే నాకు ఆజ్ఞ లభించింది. అందుకే నేను అందరికన్నా ముందు ఆయనకు విధేయుణ్ణయి పోయాను.” (161-163)

చెప్పు: “దేవుడే సకల సృష్టిరాసులకు ప్రభువు, పోషకుడు. అలాంటి దేవుడ్ని వదలి నేను వేరే ప్రభువుని అన్వేషించాలా?” ప్రతిమనిషీ తనకర్మలకు తానేబాధ్యుడు. ఒకరి బరువు మరొకరు మోయలేరు. మీరంతా మీ నిజప్రభువు సన్నిధికే చేరుకోవలసి ఉంది. అప్పుడాయన మీమధ్య ఏర్పడిన విభేదాలలో నిజానిజాలేమిటో మీకు తెలియజేస్తాడు. (164)

ఆయనే మిమ్మల్ని ధరణిపై దైవప్రతినిధిగా నియమించాడు. మీకు ప్రసాదించిన దాని విషయమై మిమ్మల్ని పరీక్షించడానికి ఆయన మీలో కొందరికి కొందరికన్నా ఎక్కువ హోదా, అంతస్తులు ప్రసాదించాడు. నీ ప్రభువు తప్పకుండా (నేరస్థుల్ని) కఠినంగా శిక్షిస్తాడు. దాంతో పాటు ఆయన (సజ్జనులపట్ల) గొప్పక్షమాశీలి, అపార దయామయుడు కూడా. (165) ✪

అవతరణ: మక్కా

## 7. శిఖరాలు (ఆరాఫ్)

సూక్తులు: 206

ఈ అధ్యాయాన్ని “ఆరాఫ్” (శిఖరాలు) అంటారు. ఇది దాదాపు “పశువులు” అనే అధ్యాయం అవతరించిన కాలంలోనే అవతరించింది. దేవుని ఏకత్వం, ప్రవక్త దౌత్యం, పరలోక పరిమాణాలను గురించి చెబుతూ మక్కా బహుదైవారాధకులకు రుజుమార్గం గురించి ఈ అధ్యాయంలో బోధించబడింది. ప్రసంగం మధ్యలో ఒకచోట గ్రంథప్రజల్ని ఉద్దేశించి, మరొకచోట యావత్తు మానవాళిని ఉద్దేశించి బోధ చేయబడింది. చివరిలో దైవప్రవక్త (సల్లం)కు, ఆయన అనుచరులకు ధర్మప్రచార విధానం, దాని బాధ్యతల్ని గురించి వివరించడం జరిగింది.

### కరుణామయుడు, కృపాసాగరుడయిన దేవుని పేరుతో ప్రారంభం

అలిఫ్-లామ్-మీమ్-సాద్. ముహమ్మద్ (సల్లం)! ఈ గ్రంథం ద్వారా నీవు (ప్రజల్ని) హెచ్చరించడానికే దీన్ని నీ వద్దకు పంపడం జరిగింది. కనుక (సందేశ ప్రచారం గురించి) నీవు ఏమాత్రం సంకోచించకు. ఇది విశ్వసించినవారి కోసం ఒక హితబోధ. (1-2)

మానవులారా! మీ ప్రభువు నుండి మీ దగ్గరకు అవతరించినదాన్ని అనుసరించండి. మీ ప్రభువుని వదలి (ఆయన ఆజ్ఞలకు వ్యతిరేకంగా) ఇతరులను అనుసరించకండి. కాని మీరు (మా) హితోపదేశం పట్ల చాలా తక్కువగా శ్రద్ధ చూపుతున్నారు. (3)

మేము ఎన్నో జనపదాలు తుడిచిపెట్టాము. వారిపై మాశిక్ష రాత్రివేళ హఠాత్తుగా వచ్చిపడింది. లేదా పట్టపగలు వారు విశ్రాంతి తీసుకునే వేళ వచ్చింది. మాశిక్ష వచ్చినప్పుడు వారు (పశ్చాత్తాపంతో) "మేము నిజంగా చాలా దుర్మార్గులం" అని మాత్రమే అన్నారు. (4,5)

ఏమైనప్పటికీ, మేము ఎవరి దగ్గరకు దైవప్రవక్తలను పంపామో వారిని తప్పకుండా (వారి కర్మల్ని గురించి) ప్రశ్నిస్తాము.[1] (మా సందేశం అందజేసే బాధ్యతను మీరు ఏమేరకు నెరవేర్చారు, దానికి ప్రజల నుండి ఎలాంటి ప్రతిస్పందన వచ్చింది? అని) మేము ప్రవక్తలను కూడా అడుగుతాం. ఆ తర్వాత మేము జరిగినదంతా మా జ్ఞానంతో వారిముందు పెడ్తాము. (వారి స్థితిగతులు తెలియకపోవడానికి) మేము అదృశ్యమై ఎక్కడికీ పోలేదు. ఆ రోజు (కర్మల త్రాసులో) బరువైనదే సత్యమవుతుంది. ఎవరి త్రాసుపళ్ళెం బరువుగా ఉంటుందో వారికే మోక్షం లభిస్తుంది. మరెవరి త్రాసుపళ్ళెం తేలికగా ఉంటుందో వారు ఘోరంగా నష్టపోతారు. వారు మా సూక్తుల పట్ల అన్యాయంగా ప్రవరిస్తుండేవారు. (6-9)

మేము ధరణిలో మీకు పూర్తి అధికారాలిచ్చి వసింపజేశాము. మీకోసం ఇక్కడ జీవన సామగ్రి కూడా సమకూర్చాము. కాని మీరు చాలా తక్కువగా కృతజ్ఞత చూపుతున్నారు. మేము మిమ్మల్ని సృష్టించి మీకు రూపురేఖలను కల్పించాం. తర్వాత ఆదంకు గౌరవసూచకంగా అభివాదం చేయండని దైవదూతల్ని ఆదేశించాం. మా ఆదేశం పాటిస్తూ అందరూ అభివాదం చేశారు[2] ఒక్క ఇబ్లీసు తప్ప. అతను అభివాదం చేసేవారిలో చేరలేదు. (10,11)

---

1. ఎవరెవరి దగ్గరకు ప్రవక్తల సందేశం చేరిందో వారిని తప్పకుండా ప్రశ్నించడం జరుగుతుందని ఖుర్‌ఆన్ చెబుతోంది. అలాంటి వారు తమ అవిశ్వాస వైఖరికి కారణంగా ఎలాంటి సాకులు చెప్పలేరన్నమాట. వారికిక నరకమే గతి. అయితే ప్రవక్తల సందేశం చేరనివారిని గురించి దేవుడు ఎలాంటి నిర్ణయం తీసుకుంటాడో ఖుర్‌ఆన్ చెప్పలేదు. వారి అదృష్టంలో స్వర్గముందో, నరకముందో దేవునికే తెలియాలి. కనుక మనం వారి విషయంలో మౌనం వహించడమే మంచిది. (దీంతోపాటు 17:15 సూక్తి, దాని పాదసూచిక కూడా చూడండి.)

2. ఇక్కడ గౌరవసూచకంగా ఆదంకు అభివాదం చేయండని అంటే ఆదం (అలైహి)కు మాత్రమే ఒక వ్యక్తిగా అభివాదం చేయమని అర్థం కాదు. యావత్ మానవాళికి ప్రాతినిధ్యం వహించే మానవుడిగా ఆదంకు అభివాదం చేయమని అర్థం. దేవుడు మానవుడ్ని సర్వోత్కృష్టజీవిగా సృష్టించి, తన వైపున ఆజ్ఞలు పాలిస్తూ జీవితవ్యవహారాలు చక్కబరిచే ప్రతినిధిగా నియమించడంతో పాటు, ప్రాతినిధ్య బాధ్యతలు నిర్వహించడానికి కావలసిన సంపూర్ణ జ్ఞానసంపత్తి కూడా అతనికి ప్రసాదించాడు. కనుక అలాంటి సర్వోత్కృష్ట జీవికి గౌరవ సూచకంగా మీరంతా అతని ముందు తలవంచి లొంగిపొమ్మని దీని అర్థం.

దీన్నిబట్టి మానవుడు తనపై దేవుడు మోపిన ప్రాతినిధ్య బాధ్యతల్ని సక్రమంగా, సంపూర్తిగా, జీవితాంతం నిర్వహిస్తే అతను నిజంగా సర్వోత్కృష్టుడిగా, దైవదూతల కంటే ఉన్నతుడిగా భాసిల్లగలడు. ఆ బాధ్యతలు నిర్వహించకుండా, మనోవాంఛలకు బానిసయి విశృంఖల జీవితం



"(ఇబ్లీస్!) నేను ఆజ్ఞాపించినా (నువ్వెందుకు అభివాదం చేయలేదు?) ఏ విషయం నిన్ను అభివాదం చేయకుండా నిరోధించింది?" అని మేము ప్రశ్నించాము.

దానికి వాడు "నేను ఇతని కంటే శ్రేష్ఠుడ్ని. నీవు నన్ను అగ్నితో[3] సృష్టించావు. అతడ్ని (ఎలాంటి విలువలేని) మట్టితో సృజించావు" అన్నాడు. (12)

"అలాగానా! అయితే నీవిక్కడ్నుంచి దిగిపో. ఇక్కడ అహంకారంతో విర్రవీగడానికి నీకెలాంటి హక్కులేదు. వెళ్ళిపో ఇక్కడ్నుంచి. నీవు (మా ఆదేశాన్ని ధిక్కరించి) పరమ నీచుడవయి పోయావు" అన్నాము మేము. (13)

"అయితే (దేవా!) మానవులు మళ్ళీ బ్రతికించబడే వరకు నాకు గడువునివ్వు" అన్నాడు (ఇబ్లీసు). (14)

"అలాగే ఇస్తున్నాం వెళ్ళు" అన్నాము (మేము). (15)

"సరే, నీవు నన్ను ఏవిధంగా మార్గభ్రష్టుడ్ని చేశావో, నేను కూడా మానవ జాతిని

---

గడిపితే అతనికన్నా నికృష్ట జీవి ప్రపంచంలో మరొకటి ఉండదు. చివరికి చీమలు, దోమలకన్నా అధోగతి పాలవుతాడు. చీమలు, దోమలు, పశువులు, పక్షులు మొదలైన జీవరాసులపై ఇలాంటి బాధ్యతలు లేవు. వాటిని కూడా దేవుడు మానవుని సేవకోసమే సృష్టించాడు. మరణానంతరం వాటికి స్వర్గ నరకాలు ఉండవు. అందువల్ల ప్రాతినిధ్య బాధ్యతలు నిర్వహించకుండా నేరస్థుడిగా మారిన మానవుడి కన్నా ఈ అల్పజీవులే మిన్న. (ఇతర వివరాలకు 2:34 సూక్తి చూడండి.)

3. మానవుల్లాగే మంచి లేక చెడు అవలంబించే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు పొందిన మరొక జాతి కూడా ఈ ప్రపంచంలో ఉంది. అది జిన్‌జాతి. ఈ జిన్నులు (భూతాలు) అగ్నిజ్వాలతో సృష్టించబడి మానవులకు కనపడకుండా ఉంటారు. వారు మానవుల్ని చూడగలుగుతారు, కాని మానవులు వారిని చూడలేరు. మౌలానా షబ్బీర్ అహ్మద్ ఉస్మానీ (రహ్మాలై) గారి వ్యాఖ్యానం ప్రకారం, ఈ జిన్నులు మానవుని పుట్టుకకు ముందు కొన్నివేల ఏండ్ల నుండి భూలోకంలో మనుగడ సాగిస్తూ ఉండేవారు. అప్పుడు వారు ఆకాశంపైకి కూడా పోతుండేవారు. అయితే భూలోకంలో రక్తపాతం, హింసాదౌర్జన్యాలు జరపడంలో హద్దుమీరి పోవడంతో విశ్వప్రభువు ఆదేశంతో దైవదూతలు అనేక మంది జిన్నులను సంహరించారు. మిగిలిన జిన్నులు కొండల్లోకి, అడవుల్లోకి పారిపోయారు. (జిన్నుల సృష్టి గురించిన వివరాలకు 6:128 సూక్తి పాదసూచిక చూడండి.)

ఈ జిన్నుల్లో ఇబ్లీస్ గొప్ప భక్తుడిగా, పండితుడిగా పేరు తెచ్చుకున్నాడు. అందువల్ల అతను ఈ సామూహిక సంహారానికి గురికాకుండా దైవదూతలతో కలసి ఉండసాగాడు. అత్యధిక మంది జిన్నులు హతమార్చబడిన తరువాత ఇబ్లీస్ తన భక్తి పరాయణత, పాండిత్యాలను చూసుకొని ఇక భూలోకంలో తానొక్కడే గొప్పవాణ్ణని, తనను దేవుడు ఖలీఫాగా నియమించి ఇక్కడ పెత్తనం చెలాయించే అధికారం ఇస్తాడని భావించసాగాడు. అయితే దేవుడు ఆదం (మానవుడి)ని ఖలీఫాగా నియమించానని ప్రకటించడంతో అతను నిరాశచెందాడు. అసూయతో మండిపోతూ ఆదంకు బద్ధ శత్రువయి పోయాడు. అంతేగాక తాను మట్టి కన్నా విలువైన అగ్నితో సృజించబడ్డానని చెబుతూ వర్ణ ద్వేషంతో, జాత్యహంకారంతో విర్రవీగుతూ దైవాజ్ఞను ధిక్కరించాడు. తత్ఫలితంగా అతను శాశ్వత శాపగ్రస్తుడయి పోయాడు. అందువల్ల మీరు కూడా అలాంటి వైఖరి అవలంబించి కృతఘ్నులు కాకండని దేవుడు మానవుల్ని హెచ్చరిస్తున్నాడు.

దారి తప్పించడానికి నీ రుజుమార్గంలో మాటువేసి కూర్చుంటాను. వీరిని ముందు నుంచి, వెనుక నుంచి, కుడి నుంచి, ఎడమ నుంచి అన్నివైపుల నుంచీ చుట్టుముట్టుతాను. వీరిలో చాలా మందిని నీవు విశ్వసనీయులుగా, కృతజ్ఞులుగా చూడలేవు" అన్నాడు ఇబ్లీసు. (16-17)

"ఓరి నీచుడా! శాపగ్రస్తుడవయి ఇక్కడ్నుంచి వెళ్ళిపో. (బాగా విను,) నీతో సహా నిన్ను అనుసరించే వారందర్నీ నరకంలోకి విసరివేస్తాను"--- "ఆదం! నీవు, నీ భార్యా ఇద్దరూ స్వర్గంలో నివసించండి. ఇక్కడ మీరు కోరిందల్లా తింటూ హాయిగా ఉండండి. అయితే (అదిగో) ఆ చెట్టు దగ్గరికి మాత్రం వెళ్ళకండి. వెళ్ళారా, మీరు దుర్మార్గులలో చేరిపోతారు" అన్నాము మేము. (18,19)

ఆ తర్వాత షైతాన్ వారి ఆచ్ఛాదిత మర్మావయవాలను పరస్పరం వారి ముందు బహిర్గతం చేయడానికి మాయమాటలతో వారిని మభ్యపెట్టాడు. వాడు (వారిద్దరి దగ్గరకు వెళ్ళి) "మీ ప్రభువు మిమ్మల్ని ఆ చెట్టు దగ్గరికి పోవద్దని ఎందుకన్నాడో తెలుసా? మీరు దైవదూతలైపోతారని, లేదా శాశ్వత (స్వర్గ) జీవితం లభిస్తుందని దాని దగ్గరకు పోనివ్వకుండా మిమ్మల్ని వారించాడు" అని చెప్పాడు. పైగా వాడు ప్రమాణం చేసి మరీ "నేను మీకు నిజమైన శ్రేయోభిలాషిని (నామాట నమ్మండి)" అని నమ్మబలికాడు. (20-21)

ఈ విధంగా వాడు మోసపుటెత్తుగడలతో వారిద్దర్నీ తన వలలో వేసుకున్నాడు. చివరికి వారిరువురు (నిషేధిత) వృక్షాన్ని రుచిచూశారు. దాంతో వెంటనే వారి మర్మావయవాలు ఒకరి ముందు మరొకరివి బహిర్గతమై పోయాయి. వారు (సిగ్గుతో బిక్కచచ్చిపోయి) స్వర్గంలోని ఆకులతో తమ దేహాలను కప్పుకోవడానికి ప్రయత్నించారు.

అప్పుడు వారి ప్రభువు "నేను మిమ్మల్ని ఆ చెట్టు వద్దకు పోవద్దని వారించలేదా? షైతాన్ మీకు బద్ధవిరోధి అని చెప్పలేదా?" అని అడిగాడు.

"ప్రభూ! (మేము ఆత్మవంచనకు పాల్పడి) మాకు మేమే అన్యాయంచ చేసుకున్నాం.[4] (ఇక నీవే దిక్కు.) నీవు మమ్మల్ని కనికరించి క్షమించకపోతే మేము సర్వనాశనమైపోతాము" అన్నారు వారిద్దరూ (పశ్చాత్తాపంతో కుమిలిపోతూ). (22-23)

4. షైతాన్ మొట్టమొదట హజ్రత్ హవ్వా (అలైహి)ను మోసగించి ఆమెకు ఆచెట్టు పండు తినిపించాడని, ఆ తరువాత హజ్రత్ ఆదం (అలైహి)ను తన వలలో వేసుకోవడానికి ఆమెను ఒక పనిముట్టుగా వాడుకున్నాడని ప్రపంచంలో ప్రతీతి. దీంతో ప్రపంచంలోని ఓ పెద్ద వర్గం స్త్రీ స్థాయిని దిగజార్చడానికి ప్రయత్నించింది. కాని ఖుర్ఆన్ ఈ భావాన్ని ఖండిస్తూ ఇక్కడ షైతాన్ వారిద్దర్నీ మోసగించాడని, ఇద్దరూ వాడి మోసానికి గురయి నిషేధిత వస్తువు తిన్నారని చెబుతోంది. (ఇతర వివరాలకు 20:120,121 సూక్తులు, వాటి పాదసూచిక చూడండి.)

మానవుడు షైతాన్ చేసే మోసాలకు, వాడి ప్రలోభాలకు గురికాకుండా ఉండాలంటే దేవుడు తనప్రవక్తల ద్వారా పంపే ఆజ్ఞలు పాటిస్తూ తదనుగుణంగా నీతిమంతమైన జీవితం గడప వలసి ఉంటుంది. ఈవిధంగా మానవుడు జీవితాంతం ప్రాతినిధ్య బాధ్యతలు నిర్వహించడం ద్వారా సర్వోత్కృష్ట జీవిఅయి దైవప్రసన్నతను, తన అసలు నివాసమైన స్వర్గధామాన్ని పొందగలడు.



"దిగిపోండి. మీరంతా ఒకరికొకరు శత్రువులు. మీరు ఒక నిర్ణీతకాలం వరకు భూలోకంలో గడపవలసి ఉంది. అక్కడ మీకు నివాసం, జీవనోపాధి (వగైరా) సదుపాయాలున్నాయి. అక్కడే మీరు జీవించాలి, అక్కడే చనిపోవాలి. చివరికి అక్కడ్నుంచే మిమ్మల్ని పునర్జీవంతో తిరిగి లేపడం జరుగుతుంది" అన్నాము మేము. (24-25)

"ఆదం సంతానమా! మీరు మీ మర్మావయవాలను కప్పుకోవడానికి, మీ దేహానికి రక్షణగా, అలంకరణగా ఉపయోగపడటానికి మేము మీకు దుస్తులు ప్రసాదించాము. అయితే అన్నిటికంటే భయభక్తుల దుస్తులే ఎంతోశ్రేష్ఠమైనవి. ఇది (వస్త్రధారణ) దేవుని సూచనల్లో ఒక సూచన. మీరు విషయం గ్రహిస్తారని (ఇలా తెలుపుతున్నాము)". (26)

ఆదం సంతానమా! (షైతాన్ చేష్టలపట్ల అనుక్షణం అప్రమత్తంగా ఉండండి.) వాడు మీ తల్లిదండ్రుల్ని మభ్యపెట్టి స్వర్గంనుండి తీసివేయించాడు. ఒకరి మర్మావయవాలు మరొకరి ముందు బహిర్గతం కావడానికి వారి దుస్తులు తొలగించాడు. జాగ్రత్త! ఆ విధంగా వాడు మిమ్మల్ని కూడా మాయమాటలతో మభ్యపెట్టవచ్చు. వాడు, వాడి అనుచరమూకలు మిమ్మల్ని మీరు చూడని వైపు నుండి చూస్తారు. ఈ పిశాచమూకలను మేము విశ్వసించనివారికి (మాత్రమే) సహచరులుగా, సంరక్షకులుగా చేశాము. (27)

వారేదైనా సిగ్గుమాలిన పని చేస్తూ, తమ తాత ముత్తాతలు కూడా ఇలాగే చేస్తుండేవారని అంటారు. పైగా దేవుడే అలా చేయమని తమను ఆజ్ఞాపించాడని చెబుతారు.[5] వారికి చెప్పు: "నీతిబాహ్యమైన పనులు చేయమని దేవుడు ఎన్నటికీ ఆజ్ఞాపించడు. మీరు దేవుని పేరుచెప్పి మీకు తెలియని విషయాల్ని గురించి దేవుడే బోధిస్తున్నాడని అంటారా?" చెప్పు:" నాప్రభువు ఇలా ఆజ్ఞాపించాడు-మీరు న్యాయాంగా వ్యహరించండి. ప్రార్థన చేస్తున్నప్పుడు మీ మనస్సును ఒక్కదేవుని మీదే లగ్నంచేయండి. ఆయన్నే వేడుకోండి. మీ జీవనధర్మాన్ని ఆయన కోసమే ప్రత్యేకించుకోండి. ఆయన ఈరోజు మిమ్మల్ని ఏవిధంగా సృష్టించాడో రేపు (ప్రళయదినాన) కూడా అదే విధంగా మిమ్మల్ని పునఃసృష్టిస్తాడు. (28,29)

ఒక వర్గానికి ఆయన సన్మార్గం చూపాడు. రెండో వర్గం నొసట మార్గభ్రష్టత్వమే రాసిపెట్టి ఉంది. దానిక్కారణం వారు దేవునికి బదులు భూతపిశాచాలను రక్షకులుగా చేసుకొని తాము సన్మార్గంలో ఉన్నామని భావిస్తుండేవారు. (30)

ఆదం సంతానమా! ప్రార్థన చేసే ప్రతిసారీ పూర్తి వస్త్రధారణతో మిమ్మల్ని మీరు అలంకరించుకోండి. తినండి, త్రాగండి. (హాయిగా ఉండండి.) కాని హద్దులు మాత్రం మీరకండి. హద్దులు మీరేవారిని దేవుడు ఎన్నటికీ ప్రేమించడు. (31)

ముహమ్మద్ (సల్లం)! వారిని అడుగు: "దేవుడు తన దాసుల కోసం సమ్మతించిన ఈ అలంకరణలను ఎవరు నిషేధించారు? ఎవరు దేవుడు ప్రసాదించిన పరిశుద్ధ

5. ఖుర్ఆన్ అవతరణకు పూర్వం అరబ్బులు కాబా గృహాన్ని నగ్నంగా ప్రదక్షిణ చేసేవారు. అది దేవుడు ఆదేశించిన మతాచారమని భావించేవారు. ఖుర్ఆన్ ఈ దురాచారాన్ని నిషేధించింది.

వస్తువుల్ని నిషేధించినది?" చెప్పు: "ఇవన్నీ ఇటు ప్రపంచ జీవితంలోనూ విశ్వాసుల కోసమే ఉన్నాయి; అటు ప్రళయదినాన కూడా ప్రత్యేకంగా వారికే లభిస్తాయి." ఇలా మేము విషయం గ్రహించే వారికోసం మాసూక్తులు విడమరచి తెలియజేస్తున్నాం. (32)

ముహమ్మద్ (స)! వారికిలా చెప్పు: "నాప్రభువు ఈ విషయాలు నిషేధించాడు:

- సిగ్గుమాలిన పనులు- అవి బహిరంగమైనవయినా, రహస్యమైనవయినా సరే.
- పాపకార్యాలు,
- సత్యానికి వ్యతిరేకంగా హద్దుమీరి ప్రవర్తించడం,
- దేవుడు ఎలాంటి ప్రమాణం పంపకపోయినా ఆయనకు సాటికల్పించడం,
- దేవుడే ఆదేశించాడని ఆయన పేరుమీద మీకు తెలియని విషయాలు చెప్పడం."

ప్రతిజాతికీ (నైతిక నియమావళి విషయంలో) ఒక గడువు నిర్ణయించబడింది. ఆ గడువు ముగిస్తే ఇక ఒక్కక్షణం కూడా ఆలస్యం చేయడంగాని, వాయిదా వేయడం గాని జరగదు. (ఆతర్వాత ఆజాతి కాలగర్భంలో కలిపి వేయబడుతుంది.) (33,34)

(సృష్టిప్రారంభంలోనే దేవుడిలా చెప్పాడు:) ఆదం సంతానమా! మీ నుండే మీ దగ్గరికి మాసూక్తులు విన్పించే ప్రవక్తలు వచ్చినప్పుడు భయభక్తులతో దుష్కార్యాలు మానుకొని తమవైఖరి సరిదిద్దుకున్నవారికి ఎలాంటి భయంగాని, దుఃఖంగాని ఉండదు. మాసూక్తులు తిరస్కరించి, ప్రవక్తల పట్ల తిరుగుబాటువైఖరి అవలంబించేవారు మాత్రం నరకానికిపోతారు. అక్కడే వారిక శాశ్వతంగాఉంటారు. (35-36)

అసత్య విషయాలు కల్పించి వాటిని దేవునికి ఆపాదించే వాడికంటే, లేదా దేవుని సూక్తులు తిరస్కరించిన వాడికంటే పరమ దుర్మార్గుడు ఎవరుంటారు? అలాంటివారికి వారి విధివ్రాతలో రాయబడినది మాత్రమే (కొన్నాళ్ళపాటు) లభిస్తుంది. చివరికి మేము పంపే దూతలు వారి ప్రాణాలు తీయడానికి వస్తారు. అప్పుడా దూతలు "ఏరి, దేవుడ్ని వదలి మీరు వేడుకున్న మీ మిథ్యాదైవాలు ఇప్పుడెక్కడికి పోయారు?" అని ప్రశ్నిస్తారు. దానికి వారు "వారంతా మానుండి కనుమరుగైపోయారు" అంటారు. "మేము నిజంగా సత్యతిరస్కారులం" అని వారు తమకుతామే వ్యతిరేకంగా సాక్ష్యం చెబుతారు. (37)

"అయితే మీకు పూర్వం మానవుల, జిన్నుల వర్గం(ఒకటి) ఎలా నరకంలోకి పోయిపడిందో మీరు కూడా నరకంలోకి పోయిపడండి" అని దేవుడు సెలవిస్తాడు. ప్రతి గుంపూ నరకంలో ప్రవేశించేటప్పుడు తనకుముందు ప్రవేశించిన గుంపును దూషిస్తుంది.

ఇలా అందరూ నరకంలో చేరి గుమిగూడిన తర్వాత ముందు చేరిన వర్గాన్ని తర్వాత చేరిన వర్గం నిందిస్తూ "ప్రభూ! వీరే మమ్మల్ని దారి తప్పించినవారు, కనుక వీరికి రెట్టింపు శిక్ష విధించు" అంటుంది. దానికి "ప్రతి ఒక్కరికీ రెట్టింపు శిక్షే విధించ బడింది. ఆ సంగతి మీరు గ్రహించలేక పోతున్నారు" అని సమాధానం లభిస్తుంది.



ఆ తరువాత మొదటి వర్గం రెండవ వర్గంతో "(మమ్మల్నెందుకు అనవసరంగా నిందిస్తారు?) మా కంటే మీరేం తక్కువ తిన్నారా? ఇక (మాటలు చాలించి) మీరు చేజేతులా సంపాదించుకున్నదానికి ఫలితంగా నరకయాతనలు చవిచూడండి" అంటుంది. (38-39)

మా సూక్తులు తిరస్కరించి వాటిపట్ల తలబిరుసుతనంతో వ్యవహరించినవారి కోసం ఆకాశ ద్వారాలు ఎన్నటికీ తెరవబడవు.[6] సూది బెజ్జం గుండా ఒంటె దూరడం

---

6. విశ్వాసులు, అవిశ్వాసుల మరణానంతర పర్యవసానాలను గురించి దైవప్రవక్త (సల్లం) వివరంగా తెలిపిన విశేషాలు సంక్షిప్తంగానైనా ఇక్కడ పేర్కొనడం సందర్భోచితంగా ఉంటుంది:

విశ్వాసి ప్రాణం తీయడానికి వచ్చే దైవదూతలు అందమైన ముఖవర్చస్సుతో స్వర్గవస్త్రాలు, స్వర్గసువాసనలు తీసుకొచ్చి "శాంతినొందిన ఆత్మా! నీ ప్రభువు ప్రసన్నతాభాగ్యం వైపునకు బయలుదేరు" అంటారు. అప్పుడా ఆత్మ సంతోషంతో దేహం నుండి వెలువడుతుంది. దైవదూతలు దాన్ని సువాసనగల వస్త్రంలో చుట్టుకొని తీసికెళ్తారు. ఆకాశంలోని దైవదూతలు ఆకాశ ద్వారాలు తెరచి ఆ శుభాత్మకు స్వాగతం చెబుతారు. ఇలా దాన్ని ఏడవ ఆకాశంలోకి తీసికెళ్ళి సృష్టికర్త సన్నిధిలో ప్రవేశపెడతారు. అప్పుడు సృష్టికర్త "ఈ దాసుని పేరు ఇల్లియ్యీన్ (సత్కర్మల చిట్టా)లో రాసి అతడ్ని తిరిగి భూలోకం వైపు తీసికెళ్ళండ"ని ఆజ్ఞాపిస్తాడు. మరణదూతలు ఆ ఆత్మను సమాధిలోని ఆ విశ్వాసి దేహంలో తిరిగి ప్రవేశపెడతారు.

సమాధిలో ఇద్దరు దైవదూతలు వచ్చి "నీ ప్రభువు ఎవరు; నీ ధర్మం ఏమిటీ; మీకు రుజుమార్గం చూపడానికి వచ్చిన వ్యక్తి గురించి నీ అభిప్రాయం ఏమిటీ?" అంటూ ప్రశ్నిస్తారు. దానికి విశ్వాసి సరైన సమాధానాలు చెబుతాడు. అప్పుడు ఆకాశం నుండి "నా దాసుడు నిజం చెప్పాడు. అతనికి స్వర్గవస్త్రాలు ధరింపజేసి, స్వర్గపరుపు పరచండి; (సమాధిలో) స్వర్గం వైపుండే కిటికీ తెరచి పెట్టండి" అనే మాటలు విన్పిస్తాయి. ఆ విశ్వాసికి సమాధిలో ప్రళయదినం వరకు శాంతీసౌఖ్యాల ఏర్పాటు జరుగుతుంది. అతని సమాధి అతని కనుచూపు మేరకు విశాలమవుతుంది.

అవిశ్వాసి ప్రాణం తీయడానికి నల్లని దైవదూతలు ఓ గోనెపట్టా తీసుకొని వచ్చి "దురాత్మా! దైవాగ్రహం వైపుకు బయలుదేరు" అంటారు. ఆ దురాత్మ తీవ్రమైన భయంతో శరీరం నుండి బయటికి రాకుండా లోపలే అటుఇటు తిరుగుతుంది. అప్పుడు దైవదూతలు ముళ్ళకంపపై నుంచి తడిసిన గుడ్డ లాగినట్లు అతని దేహం నుంచి ఆత్మను బలవంతంగా లాగితీసి గోనెపట్టాలో చుట్టి ఆకాశం వైపు తీసికెళ్తారు. ఆ దురాత్మ నుంచి కుళ్ళిపోయిన శవం నుంచి వెలువడేటువంటి అమిత దుర్గంధం వెలువడుతుంది. దాంతో ఆకాశంలోని దైవదూతలు ఆకాశద్వారాలు తెరవరు.

దైవప్రవక్త (సల్లం) ఇలా చెబుతూ ఈ సూక్తినే పఠిస్తారు: "మా సూక్తులు తిరస్కరించి వాటిపట్ల తలబిరుసుతో వ్యవహరించినవారి కోసం ఆకాశ ద్వారాలు.........." (7:40)

ఆ తరువాత సృష్టికర్త "ఈ దాసుని పేరు యావత్తు భూలోకాల కంటే అథఃపాతాళంలో ఉండే 'సిజ్జీన్' (దుష్కర్మల చిట్టా)లో రాసి, అతని ఆత్మను భూమి వైపు తీసికెళ్ళండి" అని ఆజ్ఞా పిస్తాడు. మరణదూతలు ఆ దురాత్మను సమాధిలో పూడ్చబడిన దాని దేహంలోకి విసిరిపడ వేస్తారు. దైవప్రవక్త (సల్లం) ఈ సంగతి చెబుతూ దివ్యఖుర్‌ఆన్‌లోని ఈ సూక్తిని పఠిస్తారు: "దేవునికి సాటి కల్పించినవాడు ఆకాశం నుండి అమాంతం అథఃపాతాళంలోకి పడిపోయినట్లే. ఇక అతడ్ని పక్షులైనా పొడుచుకు తింటాయి, లేదా గాలి అయినా ఎత్తి దూరంగా విసిరి పడవేస్తుంది." (22:31)

ఎంత అసాధ్యమో వారు స్వర్గంలో ప్రవేశించడం కూడా అంతే అసాధ్యం. నేరస్థులకు మా దగ్గర ఇలాంటి దుప్పలమే లభిస్తుంది. వారి పడక కూడా నరకాగ్నిపడకే; దుప్పటి కూడా నరకాగ్ని దుప్పటే అవుతాయి. ఇదే దుర్మార్గులకు మేమిచ్చే ప్రతిఫలం. (40-41)

మాసూక్తుల్ని విశ్వసించి మంచిపనులు చేసేవారు (ఎంతో అదృష్టవంతులు.)- మేము ఏ మనిషిపైనా అతని శక్తికి మించిన బాధ్యత మోపము- (వారు) స్వర్గవాసులవుతారు. అక్కడే వారిక శాశ్వతంగా (సుఖసంతోషాలతో హాయిగా) ఉంటారు. (42)

వారి హృదయాల్లో ఒకరికి వ్యతిరేకంగా మరొకరి విషయంలో ఏదైనా ద్వేషభావం ఉంటే దాన్ని మేము తీసివేస్తాం. వారి (మేడల) మధ్య సెలయేరులు ప్రవహిస్తుంటాయి. వారు(ఈ వైభవాలు చూసి) "సకల స్తోత్రాలు దేవునికే శోభిస్తాయి. ఆయనే మాకీ మార్గం చూపించాడు. ఆయన గనక మాకు సన్మార్గం చూపకపోయి ఉంటే మాఅంతట మేమీ మార్గం పొందగలిగేవారం కాము. మా ప్రభువు పంపిన ప్రవక్తలు నిజంగా సత్యాన్నే తెచ్చారు" అనంటారు. ఆ సమయంలో "మీరీ స్వర్గానికి వారసులయ్యారు. మీరు చేసుకున్న కర్మలకు ప్రతిఫలంగా ఈ స్వర్గం మీకు లభించింది" అని అశరీరవాణి విన్పిస్తుంది వారికి. (43)

ఆ తరువాత స్వర్గవాసులు నరకవాసుల్ని పిలిచి "మా ప్రభువు మాకు చేసిన వాగ్దానాలన్నీ నెరవేరాయి. మరి మీరు కూడా మీప్రభువు చేసిన వాగ్దానాలు నెరవేరాయని తెలుసుకున్నారా?" అని అడుగుతారు. దానికి వారు "ఆ...తెలుసుకున్నాం" అని సమాధానమిస్తారు. అప్పుడు ఒక ప్రకటనకర్త వారి మధ్యకు వచ్చి "దేవుని మార్గంలోకి రాకుండా ప్రజల్ని నిరోధించిన దుర్మార్గులపై దైవశాపం విరుచుకుపడుగాక! వారు దైవ మార్గాన్ని వక్రీకరించ దలిచారు, పరలోకాన్ని తిరస్కరించారు" అని అంటాడు. (44-45)

ఆ రెండువర్గాల మధ్య ఒక అడ్డుగోడ ఉంటుంది. దాని శిఖరాలపై మరికొందరు ఉంటారు. వారు (స్వర్గ, నరకాల్లోని) అందర్నీ వారి ముఖచిహ్నాలను బట్టి గుర్తిస్తారు. అప్పుడు వారు స్వర్గవాసుల్ని ఉద్దేశించి "మీకు శాంతి కలుగుగాక!" అంటారు. వారింకా

---

ఆ తర్వాత అతని దగ్గరకు ఇద్దరు దైవదూతలు వచ్చి విశ్వాసిని ప్రశ్నించినట్లే ప్రశ్నిస్తారు. దానికి అతను జవాబివ్వలేక "అయ్యయ్యో, నాకేమీ తెలియదే!" అంటాడు. అప్పుడు ఆకాశం నుండి "అతను అబద్ధమాడాడు. అతనికి అగ్నివస్త్రాలు కట్టబెట్టి, అగ్ని(కణాల) పడక మీద పండబెట్టండి. అతని కోసం సమాధిలో నరకం వైపుండే కిటికీ తెరచిపెట్టండి" అనే మాటలు విన్పిస్తాయి. దాని ప్రకారం ఆ తిరస్కారికి ప్రళయందాకా దుర్భరబాధలు కలిగేలా ఏర్పాటవుతుంది. అతని పక్కటెముకలు విరిగి ఒక వైపు నుంచి మరొక వైపునకు పొడుచుకు వచ్చేటంతగా సమాధి కుంచించుకు పోతుంది. ఆ తర్వాత అత్యంత దుర్వాసనతో కూడిన మురికిబట్టలు ధరించిన ఓ కురూపిఆకారంలో అతని 'దుష్కర్మల రాసి' ప్రత్యక్షమయి అతనికి నరక యాతనలకు సంబంధించిన దుర్వార్త విన్పిస్తుంది. దాంతో అతను తీవ్రంగా పశ్చాత్తాపపడతాడు. (అహ్మద్, అబూదావూద్)

ఇతర వివరాలకు 8:51 సూక్తి చూడండి. మరణానంతర జీవితం గురించి పూర్తి విశేషాలు తెలుసుకోవడానికి 'ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్' నుండి వెలువడిన "పరలోక ప్రస్థానం" అనే పుస్తకం చదవండి. పేజీలు: 224.)



స్వర్గంలో ప్రవేశించలేదు. కాని ప్రవేశించగలమని ఆశిస్తున్నారు. తర్వాత వారి దృష్టి నరక వాసులపై పడగానే "ప్రభూ! మమ్మల్ని ఈదుర్మార్గుల్లో చేర్చకు"అని ప్రార్థిస్తారు. (46,47)

ఆ తర్వాత శిఖరాలపై ఉన్నవారు నరకంలోని కొందరు వ్యక్తుల్ని వారి ముఖ చిహ్నాల్నిబట్టి గుర్తించి పిలిచి ఇలా అంటారు: "చూసుకున్నారుగా, ఈరోజు మీ ముఠాలు గాని, మీరు ఘనమైనవని భావించిన మీ వస్తుసామగ్రిగాని మీకు ఏమాత్రం ఉపయోగ పడలేదు. స్వర్గంలో ఉన్న వీరిని చూడండి. మీరు ఎన్నో ప్రమాణాలుచేసి, వీరిపై దేవుడు దయచూపడని అన్నారే!" అని అంటారు. అప్పుడు వారికి "స్వర్గంలో ప్రవేశించండి. ఇక మీకు ఎలాంటి భయంగాని, దుఃఖంగాని ఉండదు" అని చెప్పబడుతుంది. (48,49)

నరకవాసులు స్వర్గవాసుల్ని కేకవేసి పిలిచి "(మేమిక్కడ మాడి చస్తున్నాం) మామీద కొంచెం నీళ్ళు చల్లండి. లేదా మీకు దేవుడు ప్రసాదించిన దాన్నయినా కాస్త మావైపు విసిరేయండి" అని అంటారు. దానికి స్వర్గవాసులు "దేవుడు ఈ రెండిటినీ సత్యతిరస్కారులకు నిషేధించాడు. వారు తమ ధర్మాన్ని ఆటగా, వినోదంగా చేసుకున్నారు. ప్రాపంచిక జీవితం వారిని మోసగించింది" అని సమాధానమిస్తారు. (అప్పుడు) దేవుడిలా అంటాడు: "వీరు మాసూక్తులు తిరస్కరిస్తూ ఈదినాన్ని గురించి పట్టించుకోకుండా ఎలా వదిలేశారో మేము కూడా ఈరోజు వీరిని పట్టించుకోకుండా వదిలేస్తున్నాం." (50-51)

మేము వారి దగ్గరకు గ్రంథం పంపాము. అందులో మేము (జీవిత విధానానికి సంబంధించిన) విషయాలన్నీ వివరంగా తెలియజేశాము. ఇది విశ్వసించేవారికి హితోపదేశం, కారుణ్య ప్రదాయిని. ఇక వీరు దేని కోసం ఎదురు చూస్తున్నారు? ఈ గ్రంథం తెలియజేసిన (పరలోక) పరిణామం కోసమేనా? ఆ పరిణామం సంభవించే రోజు, దాన్ని గతంలో విస్మరించినవారే (వాస్తవం కళ్ళారా చూసి) ఇలా అంటారు:

"నిజంగా మన ప్రభువు పంపిన ప్రవక్తలు సత్యాన్నే తెచ్చారు. (కాని మనమే దాన్ని విశ్వసించలేదు.) ఇప్పుడు మన కోసం సిఫారసు చేసేవారు ఎవరైనా ఉన్నారా? పోని, మనల్ని మరొకసారి ఇహలోకానికి పంపించడమైనా జరుగుతుందా? అలా జరిగితే మనం ఇదివరకు చేస్తుండిన (చెడ్డ) పనులు మానేసి వేరే (మంచి) పనులు చేసి చూపెడదాం."

వారు చేజేతులా నష్టం కొని తెచ్చుకున్నారు. వారి అభూత కల్పనలన్నీ వారినుండి కనుమరుగై పోతాయి. (వారు కట్టుకున్న పేకమేడలు కుప్పకూలి పోతాయి). (52-53)

వాస్తవానికి అల్లాహ్‌యే మీ ప్రభువు, పోషకుడు. ఆయనే భూమ్యాకాశాలను ఆరు దినాలలో సృష్టించాడు.[7] తరువాత తన అధికార సింహాసనం అధిష్ఠించాడు. ఆయనే

---

7. ఇక్కడ దినం అంటే మనం చెప్పుకునే 24గంటల దినమైనా కావచ్చు. లేదా 22:47 సూక్తిలో "నీ ప్రభువు దృష్టిలో ఒకరోజు మీరు లెక్కించే వేయి సంవత్సరాలకు సమానంగా ఉంటుంది" అని పేర్కొన్నట్లు వేయి సంవత్సరాలైనా కావచ్చు. లేదా 70:4 సూక్తిలో "పరిశుద్ధాత్మ, దైవదూతలు దేవుని సన్నిధికి యాభైవేల సంవత్సరాలకు సమానమైన ఒక సుదీర్ఘ దినంలో ఎక్కి పోతారు"అని పేర్కొన్నట్లు యాభైవేల సంవత్సరాలైనా కావచ్చు. అసలు అర్థం దేవునికే తెలుసు.

రాత్రిని పగటిపై కప్పుతున్నాడు. తిరిగి పగటి వెనుక రాత్రి పరుగెడుతూ వస్తుంది. ఆయనే సూర్య చంద్ర నక్షత్రాలను సృష్టించినవాడు. సకల సృష్టిరాసులూ ఆయన ఆజ్ఞే[8] శిరసావహిస్తున్నాయి. వినండి! సృష్టి ఆయనదే, ఆజ్ఞ (అధికారం) కూడా ఆయనదే. సకలలోక ప్రభువయిన ఆ దేవుడు ఎంతో శుభదాయకుడు. (54)

కనుక (మానవులారా!) మీ ప్రభువుని దీనంగా, దయనీయంగా, రహస్యంగా వేడుకోండి. (గుర్తుంచుకోండి) ఆయన హద్దుమీరేవారిని ఎన్నటికీ ప్రేమించడు. ప్రపంచంలో శాంతి, సామరస్యాలు ఏర్పడిన తర్వాత (లేనిపోని) అరాచకం, అలజడులు సృష్టించకండి. భయంతో, ఆశతో మీరు దేవుడ్ని మాత్రమే వేడుకోండి. నిస్సందేహంగా ఆయన కారుణ్యం సద్వర్తునులకు అతి చేరువలోనే ఉంది. (55-56)

దేవుడే తన అనుగ్రహ(వర్షా)నికి ముందు చల్లటి గాలిని శుభసూచకంగా పంపుతున్నాడు. తరువాత ఆ గాలి నీటితో నిండిన మేఘాలను ఏదయినా మృతభూభాగం వైపు మోసుకెళ్లేలా చేస్తున్నాడు. అక్కడ వర్షం కురిపించి రకరకాల పండ్లు పండిస్తున్నాడు. అదే విధంగా మేము మృతులను కూడా (ప్రళయదినాన) బ్రతికించి లేపుతాము. మీరు హితబోధ గ్రహించడానికే మేము ఇలాంటి దృష్టాంతాలను ఇస్తున్నాము. సారవంతమైన నేల తన ప్రభువు అనుజ్ఞతో పుష్కలంగా మంచి పంటనిస్తుంది. సారంలేని చవిటినేల నాసిరకాన్నే ఉత్పత్తి చేస్తుంది. అదేవిధంగా మేము కృతజ్ఞులైనవారి కోసం మా సూక్తులు, సూచనలను మాటిమాటికి విశదీకరిస్తున్నాము. (57,58)

మేము నూహ్‌ను అతని జాతిప్రజల వద్దకు పంపించాము. అప్పుడతను వారితో "నా జాతి సోదరులారా! దేవుడ్ని ఆరాధించండి. ఆయన తప్ప మీకు మరో ఆరాధ్యదైవం లేడు. మీ విషయంలో నేనొక భయంకరదినాన సంభవించే ఆపద గురించి భయపడుతున్నాను" అన్నాడు. దానికి అతని జాతినాయకులు (ఆ ఆపద సంగతేమోగాని) నీవు మాత్రం స్పష్టంగా మార్గభ్రష్టుడై పోయినట్లు మాకు కన్పిస్తున్నావు" అన్నారు. (59-60)

నూహ్ ఇలా అన్నాడు: "సోదరులారా! నేనెలాంటి మార్గభ్రష్టత్వానికి గురికాలేదు. నేను సర్వలోక ప్రభువు వైపున ప్రవక్తగా వచ్చాను. మీకు మీ ప్రభువు సందేశం

---

దేవుడు భూమ్యాకాశాల్ని ఆరురోజుల్లో సృష్టించిన తర్వాత క్రైస్తవులు చెబుతున్నట్లు ఏడవ రోజు విశ్రాంతి తీసుకోలేదు. ఆయన భూమ్యాకాశాల్ని సృష్టించిన తర్వాత విశ్వవ్యవస్థను సక్రమంగా నిర్వహిస్తూ, సజావుగా పాలించడానికి ఏడవ రోజు అధికార సింహాసనం అధిష్టించాడు.

8. దేవుడు విశ్వాన్ని సృష్టించిన సృష్టికర్త మాత్రమే కాదు, ఆయన ఈ విశ్వానికి పాలకుడు, ప్రభువు, సర్వాధికారి, శాసనకర్త కూడా. సూర్యచంద్ర నక్షత్రాలు ఆయన నిర్దేశించిన నియమావళి ప్రకారమే తమ విధులు నిర్వహిస్తున్నాయి. పశువులు, పక్షులు, వృక్షాలు, ఇతర అనేక సృష్టితాలు ఆయన శాసనాల ప్రకారమే తమ తమ భౌతిక ధర్మాలు నెరవేరుస్తున్నాయి. స్వయంగా మానవుని అవయవాలు కూడా దేవుడు నిర్దేశించిన నిబంధనల మేరకే తమ సహజకార్యాలు నిర్వహిస్తున్నాయి. అందువల్ల దేవుడు మానవునికి పరీక్ష నిమిత్తం ప్రసాదించబడిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను సద్వినియోగం చేసుకుంటూ, దేవుని అభీష్టం ప్రకారమే జీవితం గడపాలని ఖుర్ఆన్ చెబుతోంది. అందులోనే అతని ఇహపరాల సాఫల్యం ఉందని తెలియజేస్తోంది.



అందజేస్తున్నాను. మీ శ్రేయోభిలాషిని. మీకు తెలియని విషయాలు దేవుని వైపు నుండి నేను తెలుసుకున్నాను. స్వయంగా మీజాతికి చెందిన మనిషి ద్వారా మీ వద్దకు మీ ప్రభువు సందేశం వచ్చినందుకు ఆశ్చర్యంగా ఉందా మీకు? మిమ్మల్ని హెచ్చరించడానికి, మీరు దుష్కార్యాలకు దూరంగా ఉండటానికి, మీరు కరుణించబడటానికే ఈ సందేశం వచ్చింది." (61-63)

అయితే వారు (ఈ హితబోధ వినకుండా) అతడ్ని తిరస్కరించారు. చివరికి మేము నూహ్‌ని, అతని అనుచరుల్ని ఒక ఓడలో ఎక్కించి కాపాడాం. మా సూక్తులు తిరస్కరించిన వారిని మాత్రం ముంచి వేశాం. వారు (సత్యం కానలేని) అంధులు. (64)

మేము ఆద్‌జాతి వద్దకు వారిసోదరుడు హూద్ (అలై)ని పంపాం. అతను వారిని సంబోధిస్తూ "నాజాతి ప్రజలారా! దేవుడ్ని ఆరాధించండి. ఆయన తప్ప మీకు మరో ఆరాధ్యదైవం లేడు. మరి మీరిప్పుడైనా తప్పుడు వైఖరి నుండి బయటపడరా?"అన్నాడు. కాని అతని జాతినాయకులు ఈమాటలు విశ్వసించడానికి నిరాకరిస్తూ "నీవు వట్టి వెర్రివాడిలా ఉన్నావు నీవసలు అబద్ధాల రాయుడవని మా ఉద్దేశం" అన్నారు. (65,66)

అప్పుడు హూద్ ఇలా అన్నాడు: "నాజాతి ప్రజలారా! నేను వెర్రివాణ్ణేమీ కాను. సకలలోక ప్రభువు తరపున నియమించబడ్డ దైవప్రవక్తను. నేను మీకు మీప్రభువు సందేశం అందజేస్తున్నాను. మీ శ్రేయోభిలాషిని, నమ్మకస్తుడ్ని. స్వయంగా మీజాతి మనిషి ద్వారా మీదగ్గరికి మీప్రభువు సందేశం వచ్చినందుకు మీకు ఆశ్చర్యంగా ఉందా? మిమ్మల్ని హెచ్చరించడానికే ఈ సందేశం వచ్చింది. జ్ఞాపకం తెచ్చుకోండి; మీప్రభువు నూహ్‌జాతి తర్వాత మిమ్మల్ని వారికి వారసులుగా చేశాడు. ఆయన మీకు అన్నివిధాలా ప్రగతి కలిగించాడు. దేవుని అనుగ్రహాలు, ఆయన శక్తియుక్తులను గుర్తుకుతెచ్చుకోండి, మీ జీవితం సార్థకమవుతుంది." (67-69)

దానికి వారిలా అన్నారు:"మా తాతముత్తాతలు పూజిస్తూవచ్చిన దైవాల్ని వదలి ఒక్క దేవుడ్ని ఆరాధించాలా? ఈసంగతి చెప్పడానికేనా నీవు వచ్చింది? సరే, నీవు మమ్మల్ని బెదిరిస్తున్న ఆశిక్ష ఏమిటో తీసుకురా. నీవు సత్యవంతుడవైతే ఈపని చేసి చూపించు." (70)

దానిక హూద్ ఇలా అన్నాడు: "అయితే కాచుకోండి, మీ మీద మీప్రభువు దెబ్బ పడబోతోంది. ఆయన ఆగ్రహం మీపై విరుచుకుపడింది. మీరు, మీ తాతముత్తాతలు పెట్టుకున్న (మిథ్యాదైవాల) పేర్ల విషయంలో నాతో వాదిస్తున్నారా? వాటికి దేవుడు ఎలాంటి ప్రమాణం పంపకపోయినా వితండవాదం చేస్తారా? అలాగయితే (ఆశిక్ష కోసమే) ఎదురు చూడండి. మీతోపాటు నేనూ ఎదురుచూస్తాను." (71)

చివరికి మేము మాకారుణ్యంతో హూద్‌ని, అతని అనుచరుల్ని కాపాడాము. మా సూక్తులు తిరస్కరించినవారిని తుడిచిపెట్టాం. వారు సత్యాన్ని నమ్మేవారే కాదు. (72)

మేము సమూద్ జాతిప్రజల దగ్గరకు వారి సోదరుడు సాలిహ్‌ని పంపాము. అతను వారితో ఇలా అన్నాడు:

"నాజాతి ప్రజలారా! దేవుడ్ని ఆరాధించండి. ఆయన తప్ప మీకు మరో ఆరాధ్య దైవం లేడు. మీ దగ్గరకు మీ ప్రభువు నుండి స్పష్టమైన ప్రమాణం వచ్చింది. ఇదిగో, దేవుని ఒంటె. మీకోసం ఇదొక నిదర్శనం. కనుక దీన్ని దేవుని నేలపై స్వేచ్ఛగా మేయడానికి వదలిపెట్టండి. ఎలాంటి దురుద్దేశ్యంతో నయినా దీన్ని తాకకూడదు. అలా చేస్తే మీపై దుర్భరమైన ఆపద వచ్చిపడుతుంది. ఆద్‌జాతి తరువాత మీ ప్రభువు ఆ జాతికి మిమ్మల్ని వారసులుగా చేసిన విషయం జ్ఞాపకం తెచ్చుకోండి. ఆయన మీకు ఎంతో ఔన్నత్యం ప్రసాదించాడు. తద్వారా ఈనాడు మీరు చదునైన మైదానాల్లో అద్భుత మైన మేడల కడ్తున్నారు. కొండలు చెక్కి ఇండ్లు నిర్మిస్తున్నారు. కనుక దేవుని అనుగ్ర హాలు విస్మరించకండి. ధరణిలో అరాచకం, అలజడులు సృష్టించకండి." (73-74)

అతని జాతిలో అహంకారులైన నాయకులు సత్యాన్ని విశ్వసించిన బలహీనవర్గాల వారిని "సాలిహ్ తనప్రభువు వైపున నియమించబడిన దైవప్రవక్తని మీకు తెలుసా?" అని అడిగారు. దానికి వారు "తప్పకుండా దైవప్రవక్తే. ఆయన తీసుకొచ్చిన సందేశాన్ని కూడా మేము విశ్వసించాము" అని సమాధానమిచ్చారు. అప్పుడా గర్విష్ఠులు "అయితే మీరు విశ్వసించినదాన్ని మేము తిరస్కరిస్తున్నాం" అన్నారు. (75-76)

ఆతర్వాత వారు తలబిరుసుతో తమప్రభువాజ్ఞ ఉల్లంఘించి ఒంటెను చంపేశారు. పైగా "సాలిహ్! నీవు మమ్మల్ని బెదరగొడ్తున్న ఆ శిక్ష ఏమిటో ఇక తీసుకురా చూద్దాం. నీవు నిజంగా దైవప్రవక్త వయితే ఈపని చేసి చూపు" అని సవాలు విసిరారు. (77)

చివరికి ఆసాంతం ఊపివేసే మహోపద్రవం వారిపై విరుచుకుపడింది. దాంతో వారు తమ ఇండ్లలోనే బోర్లాపడిపోయి ఊపిరివిడిచారు. సాలిహ్ ఈ భయానక దృశ్యం చూసి "నా జాతిప్రజలారా! నేను మీకు నాప్రభువు సందేశం అందజేశాను. మీశ్రేయస్సు కోరి ఎంతగానో నచ్చజెప్పాను. కాని నేనేం చేయగలను? మీరు మీ శ్రేయోభిలాషినే అభిమానించలేక పోయారు" అని పలుకుతూ అక్కడ్నుంచి (బాధాతప్త హృదయంతో) వెళ్ళిపోయాడు. (78,79)

మేము లూత్‌ని ప్రవక్తగా నియమించి (అతని జాతి వద్దకు) పంపాము. అతను తన జాతిప్రజలతో అన్న మాటలు గుర్తుకు తెచ్చుకో, "మీరెలాంటి అశ్లీల చేష్టలకు పాల్పడు తున్నారు! మీకు పూర్వం ప్రపంచంలో ఎవరూ చేయనటువంటి సిగ్గుమాలిన పని చేస్తున్నారే!! మీరు కోర్కెల్ని తీర్చుకోవడానికి స్త్రీలను వదలి పురుషుల వెంట పడ్డారా? (ఎంత సిగ్గుచేటు!)[9] మీరసలు పూర్తిగా హద్దుమీరి పోయారు" అని అన్నాడతను. (80,81)

9. ఈ అసహజ మైథునం (Sodomy, Paederastry) ఘోరపాపం క్రిందికి వస్తుంది. దీనికి శిక్షగా "చేసినవాడ్ని చేయించుకున్నవాడ్ని హతమార్చండి; పైవాడ్ని, క్రిందివాడ్ని ఇద్దర్నీ రాళ్లతో కొట్టి చంపండి" అని హదీసుల్లో వచ్చింది. హజ్రత్ అలి (రజి) ప్రకారం ఇలాంటి నేరస్థుడ్ని చంపి అతని శవాన్ని కాల్చివేయాలి. ఈ అభిప్రాయంతో హజ్రత్ అబూబకర్ (రజి) కూడా ఏకీభవించారు. ఇమాం అబూహనీఫా (రహ్మాలై) ప్రకారం దేశ, కాల పరిస్థితుల్ని బట్టి ఏదైనా కఠినశిక్ష విధించాలి.



కాని అతని జాతిప్రజలు (తలబిరుసుతో) "గెంటేయండి వీరిని మన ఊళ్ళో నుంచి. పేద్ద పవిత్రులట!" అన్నారు. అంతకుమించి ఎలాంటి సమాధానం ఇవ్వలేక పోయారు. చివరికి మేము వెనకుండిపోయినవారిలో చేరిన అతనిభార్యని తప్ప లూత్‌ని, అతని కుటుంబసభ్యుల్ని అక్కడ్నుంచి తీసి కాపాడాము. తర్వాత ఆ జాతిపై మేము (రాళ్ళ)వర్షం కురిపించాం. చూడు ఆ పాపాత్ములకు ఎలాంటి దుర్గతి పట్టిందో! (82-84)

మేము మద్యన్ ప్రజల దగ్గరకు వారి సోదరుడు షుఐబ్‌ను పంపాము. అతను తన జాతిప్రజలతో ఇలా అన్నాడు: "నా జాతిప్రజలారా! దేవుడ్ని ఆరాధించండి. ఆయన తప్ప వేరే ఆరాధ్యుడు లేడు. మీ వద్దకు మీప్రభువు నుండి స్పష్టమైన నిదర్శనం వచ్చింది కనుక మీరు తూనికలు, కొలతలు పూర్తిగా పాటించండి. ప్రజలకు రావలసిన సరుకు తగ్గించి ఇవ్వకండి. ధరణిలో శాంతీసామరస్యాలు ఏర్పడ్డాక అరాచకం, అలజడులు సృష్టించకండి. మీరు విశ్వాసులయితే (విషయం గ్రహించండి), అందులోనే మీ శ్రేయస్సు ఉంది." (85)

"(జీవితానికి సంబంధించిన) ప్రతి మార్గంలో అడ్డుగోడలై కూర్చోకండి. అలా ప్రజలను బెదరగొట్టి 'విశ్వసించేవారిని' దైవమార్గంలోకి రాకుండా నిరోధించకండి. ఆ మార్గాన్ని చెడగొట్టే చేష్టలకు వడిగట్టకండి. మీరు అల్పసంఖ్యాకులుగా ఉన్న రోజులు గుర్తుకు తెచ్చుకోండి. ఆ తరువాత దేవుడు మీ జనాభాను పెంచాడు. లోకంలో దుర్మార్గులకు ఎలాంటి గతి పట్టిందో కళ్ళుతెరచి చూడండి. మీలో కొందరు నేను తెచ్చిన బోధనలు నమ్ముతున్నారు. మరికొందరు నమ్మడంలేదు. కనుక మనల్ని గురించి దేవుడు ఎలాంటి నిర్ణయం తీసుకుంటాడో కాస్త ఓపిక పట్టి చూడండి, ఆయనే అందరికంటే మంచినిర్ణయం తీసుకునేవాడు." (86-87)

అతని జాతినాయకులు అధికార గర్వంతో విర్రవీగుతూ "షుఐబ్! నీవు, నిన్ను విశ్వ సించినవారు (మర్యాదగా) మా మతంలోకి తిరిగి వచ్చేయండి. లేదంటారా, మిమ్మల్నం దరినీ మేము మా పట్నం నుంచి గెంటివేస్తాం (తెలుసా?)" అన్నారు.

అప్పుడు షుఐబ్ ఇలా అన్నాడు: "ఏమిటీ బలాత్కారం! మాకు ఇష్టం లేకపోయినా మమ్మల్ని బలవంతంగా వెనక్కి మరలింపజేస్తారా? దేవుడు మమ్మల్ని మీ (మతం)

ఈ అసహజ మైథునం పురుషుడు తన భార్యతో జరిపినా ఘోరమైనపాపమే. తిర్మిజీ గ్రంథంలో దైవప్రవక్త (సల్లం) ప్రవచనం ఇలా ఉంది: 'రుతుమతితో సంగమించినవాడు, స్త్రీతో లూత్‌జాతి నిర్వాకానికి పాల్పడినవాడు, లేక జ్యోతిష్కుడి దగ్గరకెళ్ళి అతను చెప్పిన జోస్యం నమ్మిన వాడు ముహమ్మద్ (సల్లం)పై అవతరించిన బోధనలు తిరస్కరించిన వాడవుతాడు."

ఎంతో నాగరికులమని చెప్పుకునే పాశ్చాత్య ప్రజలలో స్వజాతిసంపర్కం నేడు ఒక అంటు వ్యాధిలా అతివేగంగా ప్రబలుతోంది. ఈ వ్యాధిగ్రస్తులు దీన్ని తమ ప్రాథమిక హక్కుగా ప్రకటించు కున్నారు. వీరి డిమాండ్లకు తలవొగ్గి కొన్ని దేశాల ప్రభుత్వాలు దీన్ని చట్టసమ్మతం చేయడం కూడా జరిగింది. ఎయిడ్స్ వంటి భయంకరమైన వ్యాధికి కారణం వ్యభిచారం, స్వజాతిసంపర్కాలేనని తెలిసి కూడా వీటిని నిరోధించడం గురించి నేటి మానవుడు ఆలోచించడం లేదు.

నుండి విముక్తి కలిగించాడు. మేము మళ్ళీ మీ మతంలోకి వస్తే మేము దేవునికి అబద్ధం ఆపాదించిన వారమవుతాం. మా ప్రభువైన దేవుడు తలిస్తే తప్ప మేము మీ మతంలోకి మళ్ళీ అడుగుపెట్టడం అసంభవం. మా ప్రభువు జ్ఞానం ప్రతి వస్తువునీ పరివేష్టించి ఉంది. ఆయన మీదే మేము భారం వేశాం. ప్రభూ! మాకూ, మాజాతి ప్రజలకు మధ్య సరైన తీర్పుచెయ్యి. నీవే అందరికంటే మంచితీర్పరివి." (88-89)

అతని జాతిలో సత్యాన్ని తిరస్కరించిన నాయకులు (ఒకరోజు సమావేశమయి) "మనం గనక షుఐబ్‌ని అనుసరిస్తే నాశనమైపోతాం" అని పరస్పరం చెప్పుకున్నారు. అయితే చివరికి ఆసాంతం ఊపివేసే భయంకరమయిన ఉపద్రవం వారిని చుట్టు ముట్టింది. దాంతో వారు తమ ఇండ్లలో బోర్లాపడిపోయి ఊపిరి విడిచారు. (90-91)

షుఐబ్‌ను తిరస్కరించినవారు తమ ఇండ్లలో అసలు నివసించనే లేదన్నట్లు నామ రూపాల్లేకుండా తుడిచిపెట్టుకు పోయారు. ఈవిధంగా షుఐబ్‌ని తిరస్కరించిన వారే చివరికి సర్వనాశనమయ్యారు. షుఐబ్ (ఈ భయానక దృశ్యం చూసి) "నా జాతిప్రజలారా! నేను నా ప్రభువు పంపిన సందేశం మీకు అందజేశాను నేను చివరిదాకా మీ శ్రేయస్సునే కోరుకున్నాను. ఇప్పుడిక సత్యాన్ని నిరాకరించిన ఈ జాతి (దుర్గతి) పట్ల నేనెందుకు విచారించాలి?" అని అంటూ ఆ పట్నం నుంచి నిష్క్రమించాడు. (92-93)

మేము ఏ పట్టణానికి దైవప్రవక్తను పంపినా ఆపట్టణవాసులు వినయ వినమ్రత లకు దిగివచ్చేందుకు వీలుగా మొదట వారిని లేమికి, కష్టాలకు గురిచేస్తుంటాము. అలా లేమికి, కష్టాలకు గురిచేయకుండా ఉండటమన్నది ఎన్నడూ జరగలేదు. తర్వాత ఆ దుస్థితిని మార్చి వారికి మంచిస్థితి కలిగించాం. అలా వారు బాగా అభివృద్ధిచెంది (ఆ అభివృద్ధికి మూలకారకుడైన సృష్టికర్తను విస్మరించి) "మంచిరోజులు, చెడ్డరోజులు మన పూర్వీకులకూ కూడా వచ్చాయి" అని పలకసాగారు.[10] చివరికి మేము హఠాత్తుగా వారిని పట్టుకున్నాం. వారప్పుడు పూర్తిగా ప్రాపంచిక మైకంలో పడిఉన్నారు. (94-95)

---

10. సాధారణంగా ఇహలోక వ్యామోహపరులు ఆపద వచ్చినప్పుడు వాటినుంచి గుణపాఠం గ్రహించి తమ నడవడికను సంస్కరించుకోవడానికి బదులు, ఇలాంటి మాటలు పలుకుతారు.

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఎంత బోధించినా మక్కా బహుదైవారాధకులు రుజు మార్గానికి రాకపోగా ఆయనకు వ్యతిరేకంగా మరింత కఠినవైఖరి అవలంబించారు. అప్పుడు దైవ ప్రవక్త (సల్లం) వీరిపై కరువు తెప్పించి తనకు సహాయం చేయమని దైవాన్ని వేడుకున్నారు. దాని ప్రకారం తీవ్రమైన కరువు వచ్చి జనం మృతపశువుల్ని, తోళ్ళను సైతం తినాల్సిన దుస్థితి ఏర్పడింది. మక్కా బహుదైవారాధకులు ఇక భరించలేక దైవప్రవక్త (సల్లం) దగ్గరికెళ్ళి ఈ గడ్డు పరిస్థితిని దూరం చేయవలసిందిగా దేవుణ్ణి ప్రార్థించమని అడిగారు.

కాని దైవప్రవక్త (స) దేవుణ్ణి ప్రార్థించి గడ్డు పరిస్థితి తొలగింపజేసిన తర్వాత వారు మరింత పెట్రేగి పోయారు. కొందరు దీన్ని ప్రవక్త మహిమగా భావించి ఆయన బోధనల వైపు మొగ్గుతుంటే, వారిని కూడా ఈ దుర్మార్గులు నిరోధిస్తూ "ఇవన్నీ కాలపు మిట్టపల్లాలు. ఇంతకు పూర్వం కూడా కరువుకాటకాలు వచ్చాయి. ఈనాడు కొత్తేమీ కాదు. కాకపోతే ఈసారి సుదీర్ఘకరువు ఏర్పడింది కనుక మీరు ముహమ్మద్ చెప్పే మాయమాటలు విని అతని వలలో పడకండి" అని చెప్పసాగారు.



పట్టణవాసులు గనక సత్యాన్ని విశ్వసించి దేవుని పట్ల భయభక్తులు కలిగిఉంటే, మేము వారి కోసం భూమ్యాకాశాల శుభాల (ద్వారాల)ను తెరచి పెట్టేవారము. కాని వారు సత్యాన్ని విశ్వసించడానికి నిరాకరించారు. అందువల్ల వారు చేసుకున్న కర్మలకు శిక్షగా మేము (ఉపద్రవం తెచ్చి) వారిని పట్టుకున్నాము. (96)

మరి ఈ పట్టణవాసులు కూడా అలాగే ఏమరపాటులో పడివున్నారా? రాత్రివేళ గాఢనిద్రలో ఉన్నప్పుడు వారిపై మా శిక్ష అకస్మాత్తుగా విరుచుకుపడదని తలచి గుండెల మీద చేతులు వేసుకొని ఉన్నారా? లేక పగటివేళ ఆడుతూ పాడుతూ (ప్రాపంచిక వ్యామోహంలో మునిగి) ఉన్నప్పుడు మా ఉక్కుపిడికిలి వారిమెడలు పట్టుకోబోదని నిర్భయంగా ఉన్నారా? దేవుని ఎత్తుగడలంటే వారికి ఏమాత్రం భయంలేదా? సర్వనాశన మయ్యే జాతి మాత్రమే ఇలా దేవుని ఎత్తుగడల పట్ల భయమూ, భక్తీ లేకుండా మనుగడ సాగిస్తుంది. (97-99)

గత భూవాసుల (మరణం) తరువాత ఇప్పుడు భూమికి వారసులైనవారు, మేము తలచుకుంటే వారిపై ఆపద తెచ్చిపెడతామని, ఏ మంచి విషయం వినకుండా వారి హృదయ కవాటాలు మూసివేస్తామని గ్రహించరా? ఇలా మేము కొన్ని జాతుల గాథలను నీకు విన్పిస్తున్నాము. వారి దగ్గరకు వారి ప్రవక్తలు స్పష్టమైన నిదర్శనాలు తీసుకొని వచ్చారు. కాని ఒకసారి తిరస్కరించినదాన్ని వారు మళ్ళీ విశ్వసించే మనుషులు కాదు. చూశావా! ఈవిధంగా మేము సత్యతిరస్కారుల హృదయ కవాటాలు మూసివేస్తున్నాము. వారిలో చాలామంది వాగ్దానభంగం చేసేవారినే మేము చూశాము. అలాగే వారిలో అనేక మంది నీతిలేనివారిని కూడా మేము చూశాము. (100-102)

వారి తరువాత మేము మూసా (ప్రవక్త)కు నిదర్శనాలిచ్చి ఫిరౌన్, అతని రాజ్యాధి కారుల దగ్గరకు పంపాము. అయితే వారు కూడా మా నిదర్శనాల పట్ల అన్యాయంగానే ప్రవర్తించారు. చూడు, ఆ దుర్మార్గులకు (చివరికి) ఎలాంటి గతి పట్టిందో. (103)

మూసా ఇలా అన్నాడు: "ఫిరౌన్! నేను విశ్వప్రభువు వైపున వచ్చిన ప్రవక్తను. నేను దేవుని పేరుతో ఏది మాట్లాడినా సత్యమే మాట్లాడటం నా విధ్యుక్త ధర్మం. నేను మీ దగ్గరికి మీ ప్రభువు నుండి స్పష్టమైన నిదర్శనం తీసుకొచ్చాను. కనుక నీవు ఇస్రాయీల్ సంతతి ప్రజలను నా వెంట పంపించు." (104-105)

దానికి ఫిరౌన్ "నీవేదైనా నిదర్శనం తీసుకొని వస్తే, నీవు చెప్పేది నిజమయితే దాన్ని మా ముందు ప్రదర్శించు" అన్నాడు. (106)

అప్పుడు మూసా తన చేతికర్ర క్రింద పడవేశాడు. వెంటనే ఆ కర్ర సర్పంగా మారి పోయింది. (తరువాత) అతను తన చేతిని (చంకలో పెట్టి) బయటికి తీశాడు. అది చూపరులకు ధగధగ మెరిసిపోతూ కన్పించింది. (107-108)

అయితే ఫిరౌన్‌జాతికి చెందిన కొందరు నాయకులు (మూసా వల్ల ఏదో ప్రమాదం ముంచుకొస్తున్నట్లు భయపడి) "ఇతను తప్పకుండా పెద్ద మాంత్రికుడయి ఉంటాడు.

ఇతను (తన మంత్రబలంతో) మిమ్మల్ని మీరాజ్యం నుండి వెడలగొట్ట జూస్తున్నాడు. ఇప్పుడు మీరేం చేయదలచుకున్నారో చెప్పండి" అన్నారు ఫిరౌన్‌తో. (109-110)

తరువాత వారంతా ఫిరౌన్‌కు సలహా ఇస్తూ "ఇతడ్ని, ఇతని సోదరుడ్ని కొన్నాళ్ళు ఆపి ఉంచండి. ఈలోగా అన్ని పట్టణాలకు మన దూతల్ని పంపి మంత్రవిద్యలో ఆరితేరినవారిని మీ దగ్గరకు పిలిపించుకోండి" అని చెప్పారు. (111-112)

దాని ప్రకారం ఆరితేరిన మాంత్రికులు ఫిరౌన్ దగ్గరికి వచ్చారు. అప్పుడా మాంత్రికులు "ఒకవేళ మేము గెలిస్తే అందుకు మాకేదైనా ప్రతిఫలం ఇప్పిస్తారా?"అని అడిగారు. (113)

"తప్పకుండా. మీరు మా సన్నిహితులలో చేరుతారు" చెప్పాడు ఫిరౌన్. (114)

ఆ తరువాత మాంత్రికులు మూసాను ఉద్దేశించి "మొదట నీవు (నీ కర్రను) పడ వేస్తావా లేక మమ్మల్ని (మా తాళ్ళను) పడవేయమంటావా?" అని అడిగారు. దానికి మూసా "మీరే పడవేయండి" అన్నాడు.

అప్పుడు మాంత్రికులు (తమ దగ్గరున్న త్రాళ్ళను నేలమీద) పడవేశారు. (తక్షణమే) అవి ప్రేక్షకులకు కనికట్టు కలిగించి భీతావం సృష్టించాయి. ఆవిధంగా వారు అద్భుత మైన తాంత్రికవిద్య ప్రదర్శించారు. (115,116)

సరిగ్గా అదే సమయంలో మేము మూసాకు, అతని కర్ర క్రింద పడవేయమని చెప్పాము. అతనలా (కర్ర) క్రింద పడవేశాడో లేదో తృటిలో అది విజృంభించి, వారి అభూత కల్పనలన్నిటినీ చకచకా స్వాహా చేస్తూ పోయింది. (117)

ఈ విధంగా సత్యం సత్యంగా రుజువయింది. వారు కల్పించినవన్నీ అసత్యమని తేలిపోయింది. ఫిరౌన్, అతని అనుయాయులు ఈ పోటీలో ఘోరంగా పరాజితులయి పరాభవం పాలయ్యారు. మాంత్రికులు ఈ అద్భుత మహిమ చూసి అప్రయత్నంగా సాష్టాంగపడి "మేము సర్వలోక ప్రభువును విశ్వసించాం. మూసా, హారూన్‌లు విశ్వసించిన ప్రభువును మేమూ విశ్వసించాం" అని బిగ్గరగా అన్నారు. (118-122)

అప్పుడు ఫిరౌన్ (మండిపడుతూ)ఇలా అన్నాడు: "ఏమిటీ, నేను అనుమతి ఇవ్వక ముందే మీరితడ్ని విశ్వసిస్తారా? ఇదంతా ఈపట్నం నుంచి ఇక్కడి పౌరుల్ని వెళ్ళగొట్టడా నికి మీరంతా కలసి పన్నినపన్నాగం. ఉండండి, త్వరలోనే (దాని పర్యవసానం) మీకు తెలుస్తుంది. మొదట నేను ఒకవైపున్న మీ చేతుల్ని, (వాటికి అభిముఖంగా) రెండో వైపున్న మీకాళ్ళను నరికిస్తాను. తర్వాత మిమ్మల్ని ఉరికంబం ఎక్కిస్తాను." (123-124)

దానికి వారిలా అన్నారు: "మా ముందుకు మాప్రభువు నిదర్శనాలు వచ్చాయి. మేము వాటిని విశ్వసించాము. అదేకదా నీవు మాపై పగ సాధించడానికి కారణం? మేము ఎటూ మా ప్రభువు సన్నిధికి పోవలసిన వాళ్ళమే- దేవా! మాకు సహన స్థయిర్యాలు ప్రసాదించు. మేము నీకు విధేయులమై ఉన్న స్థితిలోనే మాకు మరణం కలిగించు." (125-126)



ఫిరౌన్‌జాతి నాయకులు ఫిరౌన్‌ని మరింత ఎగదోస్తూ "మీరు మూసాను, అతని జాతివాళ్ళను దేశంలో అరాచకం సృష్టించడానికి అలాగే వదలిపెడ్తారా? వారు మిమ్మల్ని, మీ దైవాలను ఆరాధించడం మానేస్తే మీరు చూస్తూ ఊరుకుంటారా?" అని అడిగారు. దానికి ఫిరౌన్ "నేను వారి కొడుకుల్ని హతమార్చి, వారి కూతుళ్ళను మాత్రమే బ్రతక నిస్తాను. వారి మీద మాకు పూర్తి అధికారం ఉంది" అని చెప్పాడు. (127)

మూసా తన జాతిని ఓదార్చుతూ "దేవుని సహాయం వేడుకోండి. సహనం వహించండి. ఈ భూమి దేవునిది. దేవుడు తన దాసులలో తాను కోరినవారిని దానికి వారసులుగా చేస్తాడు. దేవుని పట్ల భయభక్తులతో మసలుకునేవారిదే అంతిమ విజయం అవుతుంది." అన్నాడు. (128)

అప్పుడు అతనిజాతి ప్రజలు "నీవు రాక ముందు కూడా మేము పీడించబడుతూ ఉండేవాళ్ళం. ఇప్పుడు నీవు వచ్చిన తరువాత కూడా పీడించబడుతున్నాం" అన్నారు.

మూసా (వారికి ధైర్యం చెబుతూ) "మీప్రభువు త్వరలోనే మీ శత్రువుల్ని తుద ముట్టించి వారి స్థానంలో మిమ్మల్ని పుడమిపై (తన) ప్రతినిధులుగా నియమిస్తాడు. అప్పుడు మీరెలా నడుచుకుంటారో చూస్తాడు" అని అన్నాడు. (129)

ఫిరౌనీయులలో (సత్యధర్మం పట్ల) స్పృహ రావడానికి మేము కొన్నేళ్ళపాటు వారిని దుర్భిక్షానికి, పంటల కొరతకు గురిచేశాము. (కాని వారి పరిస్థితి మారలేదు.) మంచిరోజులు వచ్చినప్పుడు తామందుకు అర్హులమని అంటారు; దుర్దినాలు దాపు రించినప్పుడు మూసాని, అతని అనుచరుల్ని దుశ్శకునాలుగా పరిగణిస్తారు. నిజానికి వారి దుశ్శకునం దేవుని చేతిలో ఉంది. కాని వారిలో చాలామంది ఆ సంగతి గ్రహించడం లేదు. వారు మూసాతో "నీవు మాపై మంత్రతంత్రాలు ప్రయోగిస్తూ మా ముందు ఎన్ని చమత్కారాలు ప్రదర్శించినా మేము నిన్ను ఎన్నటికీ విశ్వసించం" అని తెగేసి చెప్పారు. (130-132)

చివరికి మేము వారిపైకి తుఫాను పంపించాము; మిడతల దండును వదిలాము; పేలు, పురుగుల్ని పంపాము; కప్పలను వదిలాము; నెత్తుటి వర్షం కురిపించాము. ఈ మహిమలన్నిటినీ మేము విడివిడిగా చేసి చూపాం. కాని వారు తిరస్కారం, తలబిరుసు తనాలనే ప్రదర్శించారు. వారసలు పరమ దుర్మార్గులు. (133)

ఏదైనా ఆపద వచ్చిపడితే వారు మూసా దగ్గరికెళ్ళి ఇలా బ్రతిమాలుతారు: "మూసా! నీకు నీప్రభువు నుండి లభించిన (ప్రవక్త) పదవి సహాయంతో ఈ ఆపద నుండి మమ్మల్ని గట్టెక్కించమని దేవుడ్ని ప్రార్థించు. ఈసారి గనక నీవు మానుండి ఈ ఆపదను తొలిగిస్తే మేము నీమాట వింటాము; ఇస్రాయీల్ సంతతిని నీ వెంట పంపుతాము." (134)

అయితే వారిపై విరుచుకుపడనున్న శిక్షను మేము కొంతకాలం పాటు తొలగించ గానే వారు ఆడినమాట తప్పేవారు. ఈవిధంగా వారు మా మహిమలు తిరస్కరించారు.

వాటిని ఏమాత్రం ఖాతరు చేయలేదు. చివరికి మేము వారిపై ప్రతీకారం తీర్చుకున్నాం. వారిని నడిసముద్రంలో ముంచివేశాము. 135-136)

ఆ తరువాత మేము వారి స్థానంలో అణచివేతకు గురైన బలహీనవర్గం ప్రజల్ని తెచ్చి పెట్టాము. తూర్పు నుండి పడమర వరకు మేము ఎన్నో శుభాలు కలిగించిన భూభాగానికి వారిని వారసులుగా చేశాము. ఈవిధంగా ఇస్రాయీల్ సంతతివారి విషయంలో నీ ప్రభువు చేసిన వాగ్దానం నెరవేరింది. దీనికి కారణం వారు సహనం వహించడమే. ఫిరౌన్, అతని తాబేదార్లు కట్టించిన వాటిని (అంటే మేడలను), ఎక్కించిన వాటిని (అంటే పందిళ్ళపై ద్రాక్ష తోటల్ని) మేము సర్వనాశనం చేశాము. (137)

ఇస్రాయీల్ సంతతివారిని మేము సముద్రం దాటించి ఆవలకు చేర్చాము. అక్కడ నుండి వారు మరోచోటికి ప్రయాణం సాగించారు. దారిలో వారికి విగ్రహాలు పట్టుకొని కూర్చున్న ఒకజాతి తారసపడింది. అప్పుడు వారు "మూసా! వారు పూజిస్తున్న దైవం లాంటిది మాక్కూడా ఏదైనా దైవాన్ని చేసివ్వు" అన్నారు.

దానికి మూసా "మీరు మరీ మూఢుల్లా మాట్లాడుతున్నారు. వారు అవలంబించిన ఆరాధన నాశనమవుతుంది. వారు చేస్తున్నది పనికిమాలిన పని" అన్నాడు. ఇంకా "దేవుడు మిమ్మల్ని యావత్తు మానవాళిపై ఔన్నత్యం ప్రసాదించాడు. అలాంటి దేవుడ్ని వదలి నేను మీకోసం వేరే దైవాన్ని వెదకిపెట్టాలా?" అని అన్నాడతను. (138-140)

జ్ఞాపకం తెచ్చుకోండి. మేము ఫిరౌనీయుల బారినుండి మిమ్మల్ని విముక్తం చేశాము. వారు మిమ్మల్ని ఘోరంగా పీడిస్తుండేవారు. మీ కొడుకుల్ని హతమారుస్తూ మీ కుమార్తెల్ని మాత్రమే బ్రతకనిస్తుండేవారు. మీ ప్రభువు తరపున మీకది కఠిన పరీక్షగా ఉండింది. (141)

మేము ముప్ఫయి రోజుల గడువు కోసం మూసాను పిలిపించాం. ఆ తరువాత ఈగడువును మరో పదిరోజులు పొడిగించాం. ఇలా అతని ప్రభువు నిర్ణయించిన గడువు నలభై రోజులయింది. మూసా (మా దగ్గరకు) బయలుదేరే ముందు తన సోదరునితో "నేను వెళ్ళిన తర్వాత నీవు నాతరపున మన జాతిప్రజలకు నాయకత్వం వహించి సరైన రీతిలో పనిచేస్తూ ఉండాలి. విచ్ఛిన్నకారుల త్రోవ నడవకు" అని అన్నాడు. (142)

ఆ తర్వాత మూసా మా నిర్ణీత సమయానికి (కొండ దగ్గరకు) చేరుకున్నప్పుడు అతని ప్రభువు అతనితో ప్రత్యక్ష సంభాషణ జరిపాడు. (ఆ సందర్భంలో) మూసా తన ప్రభువును వేడుకుంటూ "ప్రభూ! నా కళ్ళకు శక్తి ప్రసాదించి నీ దర్శనభాగ్యం కలిగించు" అన్నాడు. దానికి దేవుడు "నీవు నన్ను (ఇహలోకంలో) చూడలేవు. సరే, ఈ కొండ వైపు కాస్త దృష్టిసారించు. అది తన స్థానంలో యథాతథంగా ఉంటే నీవు నన్ను చూడగలవు" అన్నాడు.

ఆ తరువాత అతని ప్రభువు తన దివ్య తేజస్సును ఆ కొండపై ప్రసరింప జేయగానే అది మరుక్షణం తునాతునకలయ పోయింది. దాంతో మూసా స్పృహతప్పి



పడిపోయాడు.[11] కాస్సేపటికి స్పృహ రాగా "ప్రభూ! నీవు ఎంతో పరిశుద్ధుడవు. జరిగిన పొరపాటుకు పశ్చాత్తాప పడుతూ నిన్ను క్షమాపణ వేడుకుంటున్నాను. (నన్ను క్షమించు.) అందరికంటే ముందు నేనే నిన్ను విశ్వసిస్తున్నాను" అని ప్రార్థించాడు మూసా. (143)

అప్పుడు దేవుడు "మూసా! నేను నీకు ప్రవక్త పదవినిచ్చాను. నీతో ప్రత్యక్ష సంభాషణ జరిపాను. ఈ విధంగా నీకు యావత్తు మానవాళిపై ప్రాధాన్యత నిచ్చాను. కనుక నేను ప్రసాదించేదాన్ని స్వీకరించి నాకు కృతజ్ఞుడవయిఉండు" అని ఉపదేశించాడు. (144)

ఆ తరువాత మేము జీవిత సమస్త రంగాలకు సంబంధించిన హితవులు, ప్రతి విషయానికి సంబంధించిన మార్గదర్శక సూత్రాలు (రాతి) పలకలపై రాసి మూసాకు ప్రసాదించాము. ఆ సందర్భంలో మేము ఇలా ఉపదేశించాము:

"ఈ హితోక్తులను దృఢంగా పట్టుకొని ఉండాలి. ఇందులోని విషయాలను (మార్చకుండా) సక్రమరీతిలో అనుసరించమని నీ జాతిప్రజలను ఆదేశించు. సమీపకాలంలోనే నేను మీకు దుష్టజనుల గృహాల (అవశేషాల)ను చూపిస్తాను. ఎలాంటి నీతి, నియమం లేకుండా ధరణిలో పెద్దలుగా చలామణి అయ్యే గర్వపోతులు నా మహిమలు చూడకుండా వారి దృష్టిని మార్చివేస్తాను. ఇక వారు ఏ మహిమ చూసినా (సత్యాన్ని) విశ్వసించలేరు. వారి కళ్ళెదుటకు సన్మార్గం వచ్చినా వారు దాన్ని అవలంబించలేరు.

---

11. ఊహకే అందని విశ్వవ్యాప్త శక్తి స్వరూపుడైన దేవుడ్ని మానవుడు చర్మచక్షువులతో చూడటం అంటే మోక్షం పొందడమే. కాని మరణానంతరం స్వర్గంలో మాత్రమే 'విశ్వాసులకు' ఈ మోక్షం సిద్ధిస్తుంది. అక్కడే దైవదర్శనభాగ్యం ప్రాప్తమవుతుంది. ఇది ఇహలోకంలో సాధ్యంకాదు.

అందువల్లనే మూసా ప్రవక్త (అలైహి) దేవుడ్ని చూడ గోరినప్పుడు, నీవు నన్ను చూడలేవు అన్నాడు దేవుడు. పర్వతం లాంటి మహా బలిష్ఠమైన ఓపెద్ద ఆకారం సైతం దేవుని అస్తిత్వం నుండి వెలువడిన ఓ చిన్న కిరణానికే తృటిలో భస్మీపటలం అయినప్పుడు ఈ బలహీన మానవుడు దైవ దర్శన ప్రభావానికి తట్టుకోగలడా? ఎంతమాత్రం తట్టుకోలేడని మూసా ప్రవక్త స్పృహ కోల్పోయిన సంఘటన రుజువు చేస్తోంది.

భగవద్గీతలో కూడా అర్జునుడు "యతో వాచో నివర్తంతే అప్రావ్యమనసాసహ" అని వాక్కునకు, మనస్సునకు సైతం అందడని అభివర్ణించబడిన దేవుడ్ని చూడగోరితే "నతుమాం శక్యసే ద్రష్టుమ నేనైవ స్వచక్షుషా" (11:8)- (ఈ నీ మాంసమయ నేత్రములతో నీవు నా విశ్వ రూపమును గాంచజాలవు" అన్నాడు శ్రీకృష్ణుడు. (గీతామకరందం- పేజి.758)

అయితే ప్రత్యక్ష దైవాన్నే చూసి సంతృప్తపడగోరిన పౌరాణిక మనస్తత్వాన్ని తృప్తి పరిచేందుకు "దివ్యందదామితే చక్షుః పశ్యమే యోగమైశ్వరమ్"(11:8)- (కావున నీకు దివ్యదృష్టిని ప్రసాదించుచున్నాను. దానిచే ఈశ్వర సంబంధమైన నా యోగమహిమను జూడుము)" అన్నది భగవద్గీత.

దివ్య ఖుర్‌ఆన్ మరోచోట "ఎవరి చూపులూ ఆయన్ని అందుకోజాలవు; ఆయన మాత్రం అందరి చూపులనూ అందుకోగలడు" (6:103) అని స్పష్టంగా చెబుతోంది. కనుక ప్రపంచంలో ఏ జీవి కూడా సృష్టికర్తను చూడలేదు. స్వయంగా మానవోత్తములైన దైవప్రవక్తలకు కూడా ప్రపంచంలో దేవుని దర్శనం లభించలేదు. (ఇతర వివరాలకు 53:13 సూక్తి పాదసూచిక చూడండి.)

వక్రమార్గం కనిపిస్తే మాత్రం దానివైపు పరుగెత్తుతారు. దీనిక్కారణం వారు మా సూక్తుల్ని నిరాకరించి వాటిని నిర్లక్ష్యం చేస్తుండేవారు. మాసూక్తుల్ని, పరలోక ఉనికిని తిరస్కరించినవారి కర్మలన్నీ వ్యర్థమయ్యాయి. వారికి వారి కర్మల్ని బట్టే తగిన శిక్ష విధించబడుతుంది. (145-147)

మూసా వెళ్ళిన తరువాత అతని జాతిప్రజలు తమ దగ్గరున్న ఆభరణాలతో ఒక ఆవుదూడ విగ్రహం తయారు చేసుకున్నారు. అందులోనుంచి దూడ అరుపులాంటి ధ్వని వస్తుండేది. కాని అది తమతో మాట్లాడదని, ఏవిషయంలోనూ తమకు దారి చూపదని వారికి తెలియదా? (తెలుసు.) అయినా వారు దాన్ని దైవంగా చేసుకొని పూజించసాగారు.[12] వారసలు పరమదుర్మార్గులు. (148)

వారు తమ ఆత్మవంచన మైకం వదలగానే తాము నిజంగా దారితప్పామని తెలుసుకున్నారు. అప్పుడు వారు “మా ప్రభువు మమ్మల్ని కనికరించి క్షమించకపోతే మేము సర్వనాశనమయి పోతాం” అని పలికారు. (149)

అటునుండి మూసా విచారం, ఆగ్రహం కలగలిపిన భావోద్రేకాలతో తన జాతి ప్రజల దగ్గరకు తిరిగొచ్చాడు. వచ్చిరాగానే “నేను వెళ్ళిన తరువాత మీరు చాలా దుర్మార్గానికి పాల్పడ్డారు. మీ ప్రభువాజ్ఞ కోసం ఎదురుచూసే అంత ఓపిక కూడా మీకు లేకపోయిందా?” అని విరుచుకుపడ్డాడు. (ఆ కోపంలో) అతను (తౌరాత్) రాతి పలకలను విసిరిపారేశాడు; సోదరుడి తల (వెంట్రుకలు) పట్టి లాగాడు.

హారూన్ అన్నాడు: “నాతల్లి కుమారుడా! వీరు నన్ను బలహీనుడిగా భావించి నానోరు నొక్కేశారు. ఇంకాస్తయితే నన్ను చంపేసేవారే. అంచేత (నన్నర్థం చేసుకో.) ప్రత్యర్థులు నన్ను చూసి హేళనచేసే అవకాశం కల్పించకు. ఈ దుర్మార్గులతో నన్ను కలిపేయకు.” ఈ మాటలు విని మూసా (కొంచెం మెత్తబడ్డాడు.) “ప్రభూ! నన్ను, నా సోదరుడ్ని క్షమించు. మమ్మల్నిద్దర్నీ నీ కారుణ్యాశ్రయంలో చోటివ్వు. నీవు అందరికంటే గొప్ప కరుణా మయుడవు” అని దైవాన్ని వేడుకున్నాడు. (150,151)

(దేవుడిలా సెలవిచ్చాడు:) “ఆవుదూడను దైవంగా చేసుకున్నవారు తమ ప్రభువు ఆగ్రహానికి తప్పకుండా గురవుతారు. వారు ప్రపంచ జీవితంలో అవమానం, అప్రతిష్ఠల పాలౌతారు. అభూతకల్పనలకు పాల్పడేవారికి మేము ఇలాంటి శిక్షే విధిస్తాం. దుష్కార్యాలు చేసినవారు తర్వాత పశ్చాత్తాపంచెంది సత్యాన్ని విశ్వసిస్తే, అప్పుడు నీ ప్రభువు (వారిపాలిట) గొప్ప క్షమాశీలి, అపార దయామయుడు (అవుతాడు).” (152-153)

---

12. ఏకేశ్వరునిపై పూర్తి విశ్వాసం లేని ప్రజలు, ముఖ్యంగా బహుదైవారాధకులు అతీంద్రియ శక్తులు, అసాధారణ విషయాలున్న ప్రతి జీవి లేదా వస్తువులో దైవత్వాన్ని చూడటానికి ప్రయత్నిస్తారు. తరువాత అసలు దైవాన్ని వదలి దీన్నే దైవంగా పూజిస్తారు. ఇస్రాయీల్ ప్రజలు (యూదులు) కూడా ఇక్కడ ఆవుదూడ విగ్రహంలో దూడ అరుపు లాంటి శబ్దం విని దాన్ని దైవంగా కొలవడానికి సిద్ధమయ్యారు. ఆ విగ్రహంలో ఏదో ఓరకంగా గాలి దూరడం వల్ల దూడ అరుపులాంటి శబ్దం విన్పించి ఉండవచ్చని ప్రాచీన భాష్యకారుడు ఇబ్నెకసీర్ అభిప్రాయపడ్డారు.



చివరికి మూసా కోపం చల్లారింది. అప్పుడతను (రాతి) పలకలను ఎత్తి చేతుల్లోకి తీసుకున్నాడు. వాటిపై తమ ప్రభువుకు భయపడేవారి కోసం మార్గదర్శనం, కారుణ్యం ఉన్నాయని వ్రాయబడి ఉంది. (154)

మేము నిర్ణయించిన సమయానికి రావడానికి అతను తన జాతి ప్రజల్లో డెబ్భై మందిని ఎన్నుకున్నాడు. (వారు తూర్‌కొండ దగ్గరకు చేరుకున్నారు. కాని దేవునికి అవిధేయులై పోవడంతో) వారిని తీవ్రమైన భూకంపం కుదిపేసింది. అప్పుడు మూసా ఇలా ప్రార్థించాడు:

స్వామీ! నీవు తలచుకొనివుంటే నన్ను, వీరిని ఎప్పుడో చంపేవాడివి. కాని(ఇప్పుడు) మాలోకొందరు బుద్ధిహీనులు చేసిన ఈపనికి మమ్మల్నందర్నీ చంపుతావా? ఇది నీవు పెట్టిన పరీక్షే. దీనిద్వారా నీవు తలచిన విధంగా కొందరిని దారి తప్పిస్తావు; మరికొందరికి సన్మార్గబుద్ధి ప్రసాదిస్తావు. (దేవా!) నీవే మా రక్షకుడివి. మమ్మల్ని క్షమించు, కనికరించు. నీవే అందరికంటే గొప్ప క్షమాశీలివి. (ప్రభూ!) మాకు ఇహలోకంలోనూ, పరలోకంలోనూ మేలు రాసిపెట్టు. మేము నీ వైపు మరిలాము. (ఇక నీవే మాకు దిక్కు).”

దానికి (విశ్వప్రభువు ఇలా) అన్నాడు: “శిక్ష విషయంలో నేను తలచుకున్న వారిని శిక్షిస్తాను. కాని నా కారుణ్యం యావత్తు సృష్టిని ఆవరించిఉంది. అలాగే దుష్కార్యాలు మానేసి, నా సూక్తులు విశ్వసించి (పేదల ఆర్థిక హక్కయిన) జకాత్ విధి నెరవేర్చేవారికి మాత్రమే నేను మేలు రాసిపెడ్తాను.” (155-156)

దైవసందేశహరుడు, నిరక్షరాస్యుడైన ఈ (ముహమ్మద్) ప్రవక్తను అనుసరించే వారికి (నేడీ మేలు రాయబడింది). ఇతని ప్రస్తావన వారి దగ్గరున్న తౌరాత్, ఇన్జీల్

---

ప్రకృతి మార్పుల వల్ల అప్పుడప్పుడు ఇలాంటి అసాధారణ విషయాలు సంభవించడంలో విశేషమేమీ లేదు. 1974లో నేను అనంతపురం జిల్లా పెనుకొండలో ఉన్నప్పుడు ఓ విచిత్ర సంఘటన జరిగింది. ఓ సాయిబుగారు పెద్దలపండుగ రోజు తన ఇంట్లో పాయసం ఉంచిన కంచంపై ఏవో మంత్రాలు చదివి, సాంబ్రాణి పొగవేసి హిందూఆచారం ఫక్కీలో దాన్ని ‘పితృదేవతల’కు నైవేద్యం పెట్టాడు. పితృదేవతలు ఆరగించేందుకని పాయసపు కంచాన్ని ఒంటిగా వదలి అందరూ బయటికొచ్చి కూర్చున్నారు. కాస్సేపటి తరువాత వెళ్ళి చూస్తే వారికి ఓ అద్భుతం కన్పించింది. పాయసంలో మిలమిల మెరిసే ఓ నెలవంక ప్రత్యక్షమయింది. దాని మధ్యలో తెల్లని ఓ నక్షత్రం కూడా పుట్టుకొచ్చింది. ఇంకేముంది, జనం అదేదో మహిమ (కరామత్) అనుకొని గుంపులు గుంపులుగా వచ్చి కానుకలు సమర్పించుకోవడం ప్రారంభించారు.

నిజానికి అందులో మహిమేమీ లేదు. పాయసం మీద వేసిన నెయ్యి పాయసాన్ని చదును చేసి కొంత నెయ్యి, లోపల గాలి దూరడం వల్ల అర్ధచంద్రాకారంలో పైకి ఉబ్బింది. ఈ అర్ధచంద్రాకారం మధ్యన త్రిభుజాకారంలో కోయబడిన ఓ తెల్లటి కొబ్బెర ముక్క పెకొచ్చి నిలబడింది. ఇలాంటి సంఘటనల్ని ఎన్నయినా పేర్కొనవచ్చు. ఆవుదూడ విగ్రహంలో దూడఅరుపు కూడా ఇలాంటి బాపతే కావచ్చు. ఒకవేళ ఆ విగ్రహం నిజంగా ఆవుదూడగా మారినా దానికి దైవత్వాన్ని ఆపాదించ వలసిన అవసరం లేదు. విగ్రహాన్ని ఆవుదూడగా మార్చగల శక్తి కూడా సృష్టికర్తదే. సృష్టిపూజను వదలి సృష్టికర్తను ఆరాధించడమే సత్యం, సరైన ధర్మం, ముక్తిమార్గం.

గ్రంథాలలో కూడా ఉంది.[13] అతను మంచిపనులు చేయమని (ప్రజలను) ఆదేశిస్తాడు. (వారిని) చెడుల నుండి వారిస్తాడు. వారి కోసం పరిశుద్ధ వస్తువుల్ని ధర్మసమ్మతం చేస్తాడు. అశుద్ధ వస్తువుల్ని నిషేధిస్తాడు. వారిమీద పడిన (ఆంక్షల)భారాన్ని తొలగిస్తాడు. వారు చిక్కుకున్న (దురాచార) బంధనాలనుండి వారికి విముక్తి కల్గిస్తాడు. కనుక ఎవరు అతడ్ని విశ్వసించి సమర్థించి అతనితో సహకరిస్తూ, అతనిపై అవతరించిన (ఖుర్‌ఆన్) జ్యోతిని అనుసరిస్తారో వారే సార్థకజీవులు. వారినే విజయం వరిస్తుంది. (157)

ముహమ్మద్ (స)! చెప్పు: ప్రజలారా! "నేను మీఅందరి కోసం వచ్చిన దైవప్రవక్తను. భూమ్యాకాశాల సామ్రాజ్యాధిపతిచే నియమించబడిన సందేశహరుడ్ని. ఆయన తప్ప మరోదేవుడు లేడు. ఆయనే జీవన్మరణాలకు మూలకారకుడు. కనుక అలాంటి దేవుడ్ని, ఆయన పంపిన నిరక్షరాస్య ప్రవక్తను విశ్వసించండి. దేవుడ్ని, ఆయన ఆజ్ఞల్ని నమ్ముతున్న ఈ ప్రవక్తను అనుసరించండి. అప్పుడే మీరు సన్మార్గగాములవుతారు." (158)

మూసా జాతిలో సత్యానికి అనుగుణంగా (ప్రజలకు) మార్గం చూపిస్తూ, సత్యం ప్రాదిపదికపైన్నే న్యాయం, నిర్ణయాలు చేసే వర్గం కూడా ఒకటుంది. మేము ఆ జాతిని పన్నెండు కుటుంబాలుగా విభజించి శాశ్వత వర్గాలుగా రూపొందించాము. మూసాను అతని జాతి ప్రజలు నీరు కావాలని అడిగితే, మేము ఒక చట్టుబండపై తన చేతి కర్రతో కొట్టమని అతడ్ని ఆదేశించాము. (అప్పుడు మూసా తన చేతి కర్రతో చట్టుబండపై కొట్టగానే) ఆ చట్టుబండ నుండి ఒక్కసారిగా పన్నెండు ఊటలు పెల్లుబికాయి. ప్రతివర్గం తన త్రాగునీటి స్థలాన్ని గుర్తించింది.

మేము వారిపై (ఎండనుండి కాపాడుకోవడానికి) మేఘచ్ఛాయ కల్పించాం. వారికి (ఆహారంగా) మన్న, సల్వాలను[14] అవతరింపజేశాం. "మేము మీకు ప్రసాదించిన ఈ పరిశుద్ధ పదార్థాలు తినండి" (అని చెప్పాం). అయితే ఆ తర్వాత వారు చేసిన నిర్వాకం మాకెలాంటి నష్టం కలిగించలేదు. వారే తమకుతాము నష్టపరచుకున్నారు. (159-160)

మేమిలా చెప్పాము: "ఆ పట్టణానికి వెళ్ళి నివసించండి. అక్కడ లభించే వాటిలో మీకిష్టమైనవి తినండి. అయితే క్షమాభిక్ష కోరుతూ, సాష్టాంగపడుతూ పట్టణ ప్రధాన ద్వారం గుండా ప్రశించాలి. అప్పుడే మేము మీ పొరపాట్లను క్షమిస్తాము. సదాచార

13. ప్రక్షిప్తాలకు, నిక్షిప్తాలకు గురైన నేటి బైబిల్‌లో కూడా ముహమ్మద్ ప్రవక్త (సల్లం) గురించిన ప్రస్తావనలు ఉన్నాయి. బైబిల్ కొత్త నిబంధనలోని యోహాను సువార్తలో 1:19-21, 14:15-17, 14:25-30, 15:26-27, 16:7-15 సూక్తులు చూడండి. ఈ సూక్తులలో ముహమ్మద్ (సల్లం)కు "ఆదరణకర్త" అనే పేరుంది. వివరాలకు ఖుర్‌ఆన్‌లో 61:6 సూక్తి, దాని పాదసూచిక చూడండి. హిందూమత గ్రంథాలలో కూడా ముహమ్మద్ (స) ప్రస్తావన ఉన్నట్లు పరిశోధకులు చెబుతున్నారు. ఉదా: తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్, హైదరాబాద్-2 ప్రచురించిన "నేను ఆరాధించే ఇస్లాం" పుస్తకం చదవండి. ప్రముఖ పాత్రికేయుడు రాజకీయ నాయకుడు అడియార్ గారు దీన్ని తమిళంలో రచించగా, ప్రఖ్యాత రచయిత్రి మాలతీ చందూర్‌గారు దాన్ని తెలుగులో అనువదించారు.

14. వివరాలకు 2:57 సూక్తి, దాని పాదసూచిక చూడండి.



సంపన్నులకు మరింతభాగ్యం అనుగ్రహిస్తాం." కాని ఆ దుర్మార్గులు మేము ఆదేశించిన విషయాన్ని మార్చివేశారు. అప్పుడు మేము వారి విద్రోహచర్యలకు శిక్షగా ఆకాశం నుండి వారిపై ఆపద తెచ్చి పడవేశాం. (161,162)

కాస్త వారిని సముద్రతీరాన వున్న పట్టణం గురించి అడుగు. ఆ పట్టణప్రజలు శనివారపు నియమాన్ని ఉల్లంఘిస్తుండేవారు. శనివారం రోజే చేపలు సముద్రపు ఉపరితలంపై వారి ముందుకు వస్తుండేవి. శనివారం తప్ప మరే దినాలలో అవి పైకి వచ్చేవికావు.[15] వారి దుశ్చర్య లను బట్టబయలు చేయడానికే మేమిలా వారికి పరీక్ష పెట్టాము. (163)

వారిలో కొందరు (సత్యసందేశ ప్రచారం చేస్తున్నవారిని విమర్శిస్తూ) "దేవుడు అంతమొందించనున్న లేక తీవ్రంగా శిక్షించనున్న వారికి మీరు అనవసరంగా ఎందుకు హితబోధ చేస్తారు?" అని అడిగారు. దానికి వారు "మీ ప్రభువు సన్నిధిలో మా పాప మన్నింపుకు కారణభూతమవుతుందన్న ఉద్దేశ్యంతో, వారాయన అవిధేయతకు దూరంగా ఉంటారన్న ఆశతో మేమిలా చెబుతున్నాము" అని సమాధానమిచ్చారు. (164)

అయితే వారు తమకు బోధించిన విషయాలన్నీ మరచిపోయారు. అప్పుడు మేము చెడులను నివారిస్తుండేవారిని రక్షించి, అవిధేయతకు పాల్పడిన దుర్మార్గుల్ని పట్టుకొని తీవ్రంగా శిక్షించాం.[16] అయినా వారు మరింత బరితెగించి చేయవద్దన్న పనులే మళ్ళీ చేయసాగారు. అప్పుడు మేము వారిని నీచమయిన కోతులుగా మారిపోండని శపించాం. (165-166)

"నేను ఇస్రాయీల్ సంతతివారిని తీవ్ర యాతనలకు గురిచేసే ప్రజలను వారిపై ప్రళయదినం వరకూ పెత్తనం చలాయించేలా చేస్తాను" అని నీ ప్రభువు ప్రకటించాడు. నీ ప్రభువు (దుర్మార్గుల్ని) శిక్షించడంలో ఏమాత్రం ఆలస్యం చేయడు. అలాగే ఆయన సజ్జనుల పాలిట గొప్ప క్షమాశీలి, అమిత దయాదయుడు కూడా. (167)

మేము వారిని అనేక జాతులుగా చీల్చి ప్రపంచంలో చెల్లాచెదురుగా చేశాం. వారిలో కొందరు సజ్జనులుంటే మరికొందరు వేరేవారున్నారు. వారు మంచి వైపుకు తిరిగొస్తారేమోనని మేము వారిని మంచి స్థితి ద్వారా, దుస్థితి ద్వారా కూడా పరీక్షకు గురిచేశాము. పూర్వతరాలు గతించిన తర్వాత అంతకంటే దిగజారిన తరాలు వారికి ప్రాతినిధ్యం వహించాయి. వీరు దైవగ్రంథానికి వారసులై కూడా తుచ్ఛమైన ప్రాపంచిక ప్రయోజనాల వెంటపడ్డారు.

వారు (చెడ్డపని చేసినప్పుడల్లా) 'మేము క్షమించబడతామని ఆశిస్తున్నాం' అంటారు. అందువల్లనే వారి ముందుకు ఏదైనా ఐహికసంపద వస్తే చాలు, దాని మీదికి లంఘిస్తారు. దేవునిపేరు మీద ఏంమాట్లాడినా సత్యం, న్యాయమే మాట్లాడాలని

15. వివరాలకు 2:65 సూక్తి, దాని పాదసూచిక చూడండి.

16. వివరాలకు 8:25 సూక్తి, దాని పాదసూచిక చూడండి.

దైవగ్రంథం గురించి వారి చేత ప్రమాణం చేయించడం జరగలేదా? వారు గ్రంథంలోని విషయాలు చదివిఉన్నారు. (అయినా పాపకార్యాలు చేస్తూ దేవుడు తమను క్షమిస్తాడని భ్రమపడుతున్నారు. కాని) దేవునికి భయపడుతూ దుష్కార్యాలకు దూరంగా మసలుకునే వారికే పరలోక (స్వర్గ)ధామం శోభిస్తుంది. ఆమాత్రం మీరు గ్రహించలేరా? దైవగ్రంథాన్ని పాటిస్తూ నమాజు (వ్యవస్థ) స్థాపించే సాత్వికుల ప్రతిఫలాన్ని మేము ఎన్నటికీ వృధా చేయము. (168-170)

మేము కొండ పెకలించి వారిపై గొడుగుగా ఎత్తిపట్టిన సంఘటన వారికి గుర్తుందా, అప్పుడు వారు కొండ తమపై వచ్చి పడుతుందేమోనని భయపడసాగారు. అలాంటి స్థితిలో "మేము ప్రసాదించిన గ్రంథాన్ని దృఢంగా పట్టుకోండి. అందులో వ్రాయబడిన విషయాలు జ్ఞాపకం పెట్టుకోండి, మీరు దుష్కార్యాలకు దూరంగా ఉండ గలరు" అని చెప్పాము. (171)

నీ ప్రభువు ఆదం సంతతి వీపుల నుండి వారి భావితరాల్ని తీసి ప్రమాణం చేయించిన సందర్భం. అప్పుడు మేము వారికి వారినే సాక్షులుగా పెడుతూ 'నేను మీ ప్రభువుని కానా'అని అడిగాము. దానికి వారు "మీరే మా ప్రభువు. అందుకు మేమే సాక్షులం" అన్నారు.[17]

---

17. సకల చరాచరాలకు సృష్టికర్త, దేవుడు ఒకడున్నాడని, ఆయనే అందరి ప్రభువు, పోషకుడని ప్రతి మానవుని అంతరాత్మ ప్రబోధిస్తుంది. ఈ భావన అతని ఆంతర్యంలో సహజంగానే వేళ్ళూనుకొని ఉంది. దానిక్కారణం మానవుడ్ని సృష్టించే సమయంలోనే దేవుడు ప్రళయం వరకు పుట్టబోయే మానవులందరి ఆత్మలను సమావేశపరచి, ఈ విషయం గురించి వారిచేత ప్రమాణం చేయించడమే. కనుక ఏ మానవుడు కూడా తనకు ఏక దైవారాధనను గురించి తెలియదని; తన తాత ముత్తాతల మతాచారాలు, తన చుట్టూ ఉండిన పరిస్థితులు, పరిసరాల ప్రభావం వల్ల తాను దేవుని ఏకత్వాన్ని గుర్తించలేక పోయానని, అందువల్ల తన మార్గభ్రష్టతకు తాను బాధ్యుడ్ని కానని, దైవన్యాయస్థానంలో చెప్పలేడు. ఏకదైవారాధనాభావం ప్రతి మానవుని అంతఃచేతనలో నిక్షిప్తమయి ఉంది. దౌర్జన్యం, అబద్ధం, వ్యభిచారం, పాపకార్యాలన్న భావన మానవుని నైజంలో ఎలా వేరుగొని ఉందో, బహుదైవారాధన కూడా పాపకార్యమన్న భావన అతని నైజంలో ఉంది. హజ్రత్ ఉబై బిన్ కాబ్ (రజి) దైవప్రవక్త (సల్లం) ద్వారా తెలుసుకున్న ఒక విషయాన్ని ఈ విధంగా పేర్కొన్నారు:

"దేవుడు అందర్నీ సమావేశపరచి ఒక్కొక్క విధానానికి లేక ఒక్కొక్క యుగానికి చెందిన వారిని వేర్వేరు వర్గాలుగా చేసి, వారికి రూపం, మాట్లాడే శక్తి ప్రసాదించాడు. తరువాత వారిచేత ప్రమాణం చేయించాడు. వారిని సాక్షులుగా చేసి 'నేను మీ ప్రభువును కానా?' అనడిగాడు. దానికి మానవులు 'మీరు తప్పకుండా మా ప్రభువే' అన్నారు. అప్పుడు దేవుడు ఇలా అన్నాడు:

"దీనికి నేను భూమ్యాకాశాలను, మీ తండ్రి (ఆదం)ని సాక్షులుగా చేస్తున్నాను. రేపు ప్రళయ దినాన మాకీ సంగతి తెలియదని చెప్పడానికి మీకు ఆస్కారం లేకుండా ఉండేందుకే (మీచేత నేనీ ప్రమాణం చేయిస్తున్నాను). బాగా గుర్తుంచుకోండి. నేను తప్ప మరో ఆరాధ్యుడు లేడు; నేను తప్ప మరో ప్రభువు, పోషకుడు లేడు; కనుక మీరు ఎట్టి పరిస్థితిలోనూ ఎవరినీ నాకు సాటికల్పించ కూడదు. మీరు నా ముందు చేసిన ఈ ప్రమాణాన్ని మీకు జ్ఞాపకం చేయడానికి నేను మీ దగ్గరకు ప్రవక్తలను పంపిస్తూ ఉంటాను. నేను మీ కోసం దివ్యగ్రంథాలను కూడా అవతరింపజేస్తాను."



మేమిలా చేయడానికి కారణం, రేపు ప్రళయదినాన మీరు "మాకీ విషయం తెలియద"ని చెప్పవచ్చు. లేదా "బహుదైవారాధన మాకు పూర్వం మా తాతముత్తాతలు ప్రారంభిం చారు. మేము ఆ తరువాత వారి సంతతి నుండి పుట్టాము. అలాంటప్పుడు దుర్జనులు చేసిన ఈ తప్పుకు మమ్మల్ని పట్టుకుంటారా?" అని చెప్పవచ్చు. వారు సన్మార్గం వైపు మరలుతారన్న ఉద్దేశ్యంతో మేమిలా మా సూక్తులు విడమరచి తెలుపుతున్నాము. (172-174)

ప్రవక్తా! కాస్త ఈ మనిషి గాథ కూడా వారికి విన్పించు: మేమతనికి మా సూక్తుల జ్ఞానం ప్రసాదించాము. కాని అతను వాటిని ఆచరించకుండా పారిపోయాడు. షైతాన్ అతని వెంటపడ్డాడు. ఈ విధంగా అతను చివరికి దారితప్పినవారిలో కలసిపోయాడు. మేము తలచుకుంటే అతనికి ఆ సూక్తుల ద్వారా ఉన్నతిని ప్రసాదించి ఉండేవారం. కాని అతను ప్రపంచవ్యామోహం వైపుకే మొగ్గి మనోవాంఛలకు బానిసయి పోయాడు. కుక్కను కొట్టినా కొట్టకపోయినా అది తన నాలుకను చాచిపెట్టే ఉంచుతుంది. ఇలా తయారయింది ఆ మనిషి పరిస్థితి. మా సూక్తులు తిరస్కరించేవారికి కూడా ఈ దృష్టాంతమే వర్తిస్తుంది. నీవీ గాథ వారికి విన్పిస్తూ ఉండు, (సత్యం గురించి) ఆలో చిస్తారేమో. (175-176)

మా సూక్తులు తిరస్కరించి ఆత్మవినాశానికి పాల్పడినవారి దృష్టాంతం చాలా హేయ మైనది. దేవుడు ఎవరికి సద్బుద్ధి ప్రసాదిస్తాడో వారే సన్మార్గం అవలంబిస్తారు. దేవుని మార్గ దర్శకత్వానికి నోచుకోనివారు ఘోరంగా నష్టపోతారు. (177-178)

మేము అనేకమంది మానవులను, జిన్నులను నరకం కోసమే పుట్టించాము. వారికి హృదయాలున్నాయిగాని, వాటితో అర్థం చేసుకోరు; వారికి కళ్ళున్నాయిగాని, వాటితో చూడరు; వారికి చెవులున్నాయిగాని, వాటితో వినరు. వారు పశువుల్లాంటివారు. వారసలు అంతకంటే కూడా దిగజారిపోయారు.[18] వారు పూర్తిగా ఏమరుపాటుకు లోనయ్యారు. (179)

---

మానవులంతా ఈమాట విని మేమిందుకు సాక్షులం. మీరే మాప్రభువు. మీరే మా ఆరాధ్య దైవం. మీరు తప్ప మాకు మరో ప్రభువుగాని, ఆరాధ్యదైవంగాని ఎవరూ లేరు' అని అన్నారు"

18. హృదయముండి ఆలోచించనివారు, కళ్ళుండి చూడనివారు, చెవులుండి విననివారు ఎవరూ ఉండరు. కాని ఖుర్ఆన్ ఇలా ఆరోపిస్తుందంటే దానిక్కారణం, వారు పరలోక విషయంలో మాత్రమే ఇలా ప్రవర్తిస్తారు. విశ్వవ్యవస్థ వెనుక ఉన్న సృష్టికర్త హస్తాన్ని గురించి ప్రశాంతంగా ఆలోచించరు. సృష్టి వ్యవస్థలో ఆయన ఏకత్వాన్ని, ఔన్నత్యాన్ని చాటుతున్న అసంఖ్యాక నిదర్శనా లను గమనించరు. దైవం, పరలోకం గురించిన సత్యవాక్కులు వీరి చెవులకెక్కవు.

ఈ వైఖరి కారణంగానే వారు మానవస్థాయి నుంచి దిగజారి పశువులకన్నా నికృష్టులయ్యా రని ఖుర్ఆన్ అంటోంది. ఇలాంటివారికి ప్రపంచమే సర్వస్వం. ఎలాగైనా వీలైనన్ని ప్రాపంచిక సుఖాలు జుర్రుకోవాలన్నదే వీరి ధ్యేయం. మంచి చెడులతో, ధర్మాధర్మాలతో నిమిత్తం లేదు. వీరి దృష్టిలో దగా, మోసం, అవినీతి, అన్యాయం, అన్నీ ధర్మసమ్మతమే. నీటిబుడగలాంటి ఇహికజీవితం కోసం శాశ్వత పరలోకజీవితాన్ని విస్మరించడంకంటే మించిన ఆత్మవంచన మరేదైనా ఉందా?

దేవుడు మంచిపేర్లకే అర్హుడు. ఆయన్ని మంచి పేర్లతోనే వేడుకోండి. దేవునికి పేర్లు ప్రతిపాదించడంలో తప్పుడు వైఖరి అవలంబించేవారిని వదలిపెట్టండి. వారు చేస్తున్నదానికి పర్యవసానం అనుభవించి తీరుతారు. మేము సృష్టించినవారిలో ఒకవర్గం (ఎల్లప్పుడూ ప్రజలకు) సత్యం వైపుకే దారి చూపుతుంది; సత్యానికి అనుగుణంగానే నిర్ణయాలు చేస్తుంది. మా సూక్తులు తిరస్కరించినవారిని మేము వారు గ్రహించలేని రీతిలో క్రమంగా పతనానికి చేర్చుతాము. నేను వారిని చూసీచూడనట్లు వదిలేస్తున్నాను. (నేను తలచుకుంటే మాత్రం) నా పన్నాగానికి తిరుగే ఉండదు. (180-183)

వారెప్పుడైనా (ప్రశాంత మనస్సుతో) ఆలోచించారా? వారి సహచరునికి ఎలాంటి పిచ్చి పట్టలేదు. అతను (పరలోకంలో ఎదురయ్యే దుష్పరిణామాలను గురించి) ఎలాంటి అరమరికలు లేకుండా హెచ్చరిస్తున్న దైవసందేశరుడు. (184)

వారు భూమ్యాకాశాల వ్యవస్థ గురించి ఎప్పుడూ యోచించలేదా? దేవుడు సృష్టించిన ఏవస్తువుని కూడా కళ్ళుతెరచి చూడలేదా?వారు తమ జీవితవ్యవధి ముగిసే సమయం ఆసన్నమైందేమోనని కూడా ఆలోచించరా? (ఇన్ని నిదర్శనాలు వారి ముందు కొచ్చినా సత్యాన్ని నమ్మకపోతే) ఇక ఏ విషయాన్ని వారు నమ్ముతారు? (దేవుడు దారి తప్పించదలచుకున్న వ్యక్తికి ఎవరూ దారి చూపలేరు. అలాంటివారిని దేవుడు వారి తిరస్కారం, తలబిరుసుతనాల్లోనే పడి కొట్టుకుపోయేలా వదలిపెడ్తాడు. (185,186)

వారు నిన్ను ప్రళయం ఎప్పుడు సంభవిస్తుందని అడుగుతున్నారు. వారికిలా చెప్పు: "దాని సంగతి నాప్రభువుకు మాత్రమే తెలుసు. దాన్ని దాని నిర్ణీత సమయానికి ఆయనే బహిర్గతం చేస్తాడు. అది యావత్తు భూమ్యాకాశాల్లో (గుండెలను అదరగొట్టే) భయంకర దినం. అది మీపై హఠాత్తుగా విరుచుకుపడుతుంది." దాన్ని గురించి నీకేదో తెలియ జేయబడినట్లు వారు నిన్ను గుచ్చి గుచ్చి అడుగుతున్నారు. "దాన్ని గురించి దేవునికి మాత్రమే తెలుసు. ఈ వాస్తవం చాలామందికి తెలియదు" అని చెప్పు వారికి. (187)

ముహమ్మద్ (స)! వారికిలా స్పష్టంగా చెప్పు: "నేను స్వయంగా నాకోసం ఎలాంటి లాభంగాని, నష్టంగాని కలిగించుకునే శక్తి లేదు నాలో. ఏదైనా జరగాలంటే దేవుడు తలిస్తేనే జరుగుతుంది. నాకే గనక అతీంద్రియ శక్తులు ఉంటే నాకు కావాల్సిన ప్రయోజనాలను సమకూర్చుకునేవాడ్ని; నాకు ఎన్నడూ ఎలాంటి నష్టం వాటిల్లదు. నేను (పరలోక దుష్పరిణా మాలను గురించి ప్రజలను) హెచ్చరిస్తూ, నా బోధనలను విశ్వసించేవారికి (స్వర్గ) శుభవార్త అందజేసేవాడ్ని మాత్రమే." (188)

దేవుడే మిమ్మల్ని ఏకైక ఆత్మ నుండి సృష్టించాడు. అదే జీవి నుండి దాని జతను కూడా సృష్టించాడు, దాని దగ్గర సౌఖ్యం పొందడానికి. పురుషుడు స్త్రీని కప్పివేసు కున్నప్పుడు ఆమె ఒక తేలికపాటి భారం ధరిస్తుంది. దాన్ని తీసుకొని తిరుగుతుందామె. అది (కొంత కాలానికి) మరింత భారంగా తయారయిన తరువాత వారుభయులు "(దేవా!) నీవు గనక మాకు మంచి పిల్లవాడ్ని అనుగ్రహిస్తే మేము నీపట్ల కృతజ్ఞులయి ఉంటాము" అని తమ ప్రభువయిన దేవుడ్ని వేడుకుంటారు. (189)



అయితే దేవుడు ఎలాంటి లోపంలేని చక్కటి పిల్లవాడ్ని ప్రసాదించగానే వారు (దేవుడ్ని మరచిపోయి) ఆయన అనుగ్రహించిన ఈ భాగ్యంలో ఇతరుల్ని ఆయనకు సాటికల్పిస్తారు.[19] వారి బహుదైవారాధనా చేష్టలకు దేవుడు ఎంతో అతీతుడు, ఉన్నతుడు. ఎంత మూఢులు వీరు, ఎలాంటి వస్తువుని కూడా సృజించలేని వాటిని దేవునికి సాటి కల్పిస్తున్నారు! అవి స్వయంగా సృజించబడ్డాయి. అంతేకాదు, అవి వారికి ఏవిధమైన సహాయం చేయలేవు. అసలవి తమకుతామే సహాయం చేసుకోలేవు. మీరు వాటిని సన్మార్గం వైపునకు పిలిస్తే అవి మీ పిలుపుకు స్పందించలేవు. మీరు అరిచిగీపెట్టినా లేక మౌనంగాఉన్నాసరే, అవి మీ మాటలు ససేమిరా ఆలకించలేవు. (190-193)

మీరు నిజదేవుడ్ని వదలి ఎవరిని ప్రార్థిస్తున్నారో అవి మీలాంటి దాసులే. మీ నమ్మిక నిజమైతే వాటిని మొరపెట్టుకోండి, అవి మీమొరలు ఆలకిస్తాయేమో చూద్దాం. నడవడానికి వాటికేమైనా (సహజసిద్ధమైన) కాళ్లున్నాయా? పట్టుకోవడానికి ఏమైనా చేతు లున్నాయా? పోని చూడటానికేమైనా కళ్లున్నాయా? వినడానికేమైనా చెవులున్నాయా?

వారికిచెప్పు: "మీరు కల్పించుకున్న భాగస్వాములందర్నీ పిలుచుకొని నాకు వ్యతిరేకంగా ఏదైనా పన్నాగం పన్నదలచుకుంటే పన్నండి. నాకు ఎలాంటి అవకాశం ఇవ్వనవసరం లేదు. దేవుడే నాకు సహాయం చేసేవాడు. ఆయనే ఈగ్రంథం అవతరింప జేసినవాడు. సజ్జనులకు శ్రేయోభిలాషి కూడా ఆయనే. దీనికి భిన్నంగా మీరు దేవుడ్ని వదలి ప్రార్థిస్తున్న మిథ్యాదైవాలు మీకు ఏమాత్రం సహాయపడలేవు. అసలవి తమకు తామే సహాయం చేసుకోలేవు. పైగా, మీరు వాటిని సన్మార్గంవైపు పిలిస్తే అవి మీ

19. ఇక్కడ బహుదైవారాధకుల అజ్ఞాన వైఖరిని ఎత్తి చూపి విమర్శించడం జరిగింది. ఆనాడు అరబ్ బహుదైవారాధకులు సంతానం కోసం దేవుడ్నే ప్రార్థించేవారు. అయితే బిడ్డ పుట్టిన తరువాత వారు దేవుని అనుగ్రహంలో (విగ్రహ) దేవతలకు భాగస్వామ్యం కల్పిస్తారు.

ఇదీ బహుదైవారాధకుల ధోరణి. ఇది ఘోరమైన పాపం. కాని ఏకేశ్వరోపాసకులం అని చెప్పు కునే నేటిముస్లింలలో కొందరు ఆనాటిఅరబ్ బహుదైవారాధకులకన్నా మించిపోయారు. వీరు సంతానం కోసం దైవేతరులనే (వలీలను) వేడుకుంటున్నారు. బిడ్డపుట్టిన తర్వాత వారి సమాధుల దగ్గరకెళ్ళి మొక్కుబడులు తీర్చుకుంటున్నారు. అయినా వీరి ఏకేశ్వరోపాసనా విశ్వాసానికి ఏమాత్రం భంగంరాదట! ఈ వైఖరినే ప్రముఖ తత్వవేత్త మౌలానా హాలి ఇలా పేర్కొన్నారు:

విగ్రహపూజ చేస్తే అవిశ్వాసం - దైవపుత్ర విశ్వాసమూ అవిశ్వాసమే
అగ్నిముందు యజ్ఞం పరమ అవిశ్వాసం - తారాబల నమ్మకం అంతకన్నా ఘోరం
విశ్వాసమంటే అసలు విశ్వాసులదే - వారి విశ్వాసం విశ్వమంత సువిశాలం
తలచిన వారికెల్లా తలవంచడమే - తాతల నుండి వస్తున్న సంప్రదాయం
ప్రవక్తను పొగిడి పరమాత్మతో కలుపు - మహాప్రవక్త(స) కన్నా మహనీయులే మిన్న
సమాధుల మీదే సదా సాష్టాంగపడు - అమరవీరులే మనకు శరణాగతులు
ఐనా ఏకదైవారాధనకు రాదు లోపం - విశ్వజనీన ఇస్లాం కదా మన దైనందిన విశ్వాసం
నిత్య జీవనసరళే సత్యవచనానికి సాక్ష్యం - మచ్చలేనివారు కదా ముస్లింసముదాయం!

మాటలు ఆలకించలేవు. అవి మీవైపు చూస్తున్నట్లు పైకి కన్పిస్తాయి. నిజానికి అవి దేన్నీ చూడటం లేదు." (194-198)

ముహమ్మద్ (సల్లం)! క్షమ, మృదు వైఖరులతో మసలుకో. ప్రజలకు మంచిని గురించి ఉపదేశిస్తూ ఉండు. మూఢుల జోలికి పోకు. ఎప్పుడయినా షైతాన్ నిన్ను (చెడు వైపునకు) ఉసిగొల్పితే వెంటనే దేవుని శరణువేడుకో.[20] ఆయన సమస్తం వినేవాడు, సర్వం తెలిసినవాడు. దైవభీతిపరుల మదిలో ఎప్పుడయినా షైతాన్ ప్రేరణ వల్ల ఏదైనా దురాలోచన జనిస్తే వెంటనే వారు అప్రమత్తులయి పోతారు. ఆతర్వాత అనుసరించాల్సిన విధానం ఏమిటో వారికి తెలిసిపోతుంది. షైతాన్, వాడి (దుష్ట)పరివారం తమ (మానవ) సోదరుల్ని (అనుక్షణం) మార్గభ్రష్టత్వం వైపునకు లాగుతుంటారు. ఈ పనిలో వారు ఎలాంటి కొరతా చేయరు. (199-202)

వారి ముందు నీవు ఏ మహిమనూ ప్రదర్శించకపోతే "నీవు నీకోసమైనా ఏదైనా మహిమను ఎందుకు రప్పించుకోవు?" అని అడుగుతారు. వారికిలా చెప్పు: "నేను నా దగ్గరికి నాప్రభువు పంపిన దివ్యావిష్కృతి (వహీ)ని మాత్రమే అనుసరిస్తాను. ఇది (ఖుర్ఆన్) మీ ప్రభువు నుండి వచ్చిన దివ్యతేజం; దాన్ని స్వీకరించేవారి పాలిట అద్భుత మార్గదర్శిని, గొప్ప కారుణ్యప్రదాయిని." (కనుక) మీముందు ఖుర్ఆన్ పఠిస్తున్నప్పుడు నిశ్శబ్దంగా ఉండి దాన్ని శ్రద్ధగా వినండి,[21] మీరు కరుణించబడతారు. (203,204)

ముహమ్మద్ (స)! నీవు నీ ప్రభువును భయభక్తులతో, వినయ వినమ్రతలతో ఉదయం, సాయంత్రం మనస్సులో స్మరిస్తూ ఉండు. నోటితో కూడా మెల్లిగా స్మరిస్తూ ఉండు. నీవు ఏమరపాటుకు లోనైనవారిలో చేరకు. నీ ప్రభువు వద్ద ఎంతో గౌరవ ప్రతిష్ఠలు కలిగివున్న దైవదూతలు సైతం ఎన్నడూ అహంకారంతో ఆయన్ని ఆరాధించకుండా ముఖం తిప్పకోరు. వారసలు ఎంతో గౌరవభావంతో, భయభక్తులతో ఆయన్ని (సదా) స్తుతిస్తూ ఆయన ముందు మోకరిల్లుతో ఉంటారు. (205-206) ✪

---

20. ఇస్లామీయ ఉద్యమసారథి ఎల్లప్పుడూ విశాలహృదయునిగా, క్షమాశీలిగా, నిష్పక్షపాతిగా, సహనశీలిగా, మృదుభాషిగా ఉండాలి. ఈ విషయాన్నే దైవప్రవక్త (సల్లం) ఇలా వివరించారు:

"కోపోద్రేకాల్లో ఉన్నా, ప్రశాంతంగా ఉన్నా ఎల్లప్పుడూ న్యాయమే పలకాలని, నాకు దూరమైపోయిన వారితో నేను సన్నిహితమవ్వాలని, నా హక్కు కాజేసినవానికి నేనతని హక్కు నెరవేర్చాలని, నాపై దౌర్జన్యం చేసినవాడ్ని నేను క్షమించాలని నా ప్రభువు నన్ను ఆదేశించాడు."

21. ఇమాం అబూహనీఫా (రహ్మ), ఆయన అనుయాయులు ఈసూక్తిని ప్రమాణంగా తీసుకొని సామూహిక నమాజులో ఇమామ్ ఖుర్ఆన్ బిగ్గరగానైనా, మెల్లిగానైనా పఠిస్తున్నప్పుడు ముఖ్తదీలు మౌనంగా ఉండాలని అన్నారు. ఇమామ్ మాలిక్, అహ్మద్ (రహ్మ)లు మాత్రం ఇమామ్ బిగ్గరగా పఠించే నమాజుల్లో మాత్రమే ముఖ్తదీలు మౌనంగా ఉండాలన్నారు. అయితే ఇమామ్ షాఫయి (రహ్మ), కొన్ని హదీసుల్లో ఫాతిహా సూరా పఠించనిదే నమాజు నెరవేరదని ఉన్నందున, "ఇమామ్ ఖుర్ఆన్ బిగ్గరగా పఠించినా, మెల్లిగా పఠించినా ముఖ్తదీలు కూడా ఇమామ్‌తో పాటు ఫాతిహా సూరా పఠించాలి" అని అభిప్రాయపడ్డారు



## అవతరణ: మదీనా 8. సమరసొత్తు (అన్ఫాల్) సూక్తులు: 75

ఈ అధ్యాయాన్ని "అన్ఫాల్" (సమర సొత్తు) అంటారు. అంటే విజయానంతరం యుద్ధ రంగంలో శత్రువులనుండి లభించే సొత్తు అని అర్థం. ఇది హిజ్రీ రెండవ యేట బద్ర్‌యుద్ధం తర్వాత అవతరించింది. ఇందులో బద్ర్ యుద్ధం గురించే సమీక్షించడం జరిగింది.

ముస్లింలు మక్కా వదలి మదీనాకు వలసపోయినా మక్కా బహుదైవారాధకులు వారిని విరోధించడం మానుకోలేదు. దీనికితోడు మదీనాలోని ఔస్, ఖజ్రజ్ తెగలు మక్కా నుంచి వచ్చిన ముస్లింలకు ఆశ్రయం ఇవ్వడంతో వారి ఆగ్రహానికి ఆజ్యం పోసినట్లయింది. ఇలాంటి పరిస్థితిలో మదీనా నుండి సాద్ బిన్ ముఆజ్ (రజి) అనే ఓ ముస్లిం కాబా సందర్శనం కోసం మక్కా వెళ్ళి ఉమయ్య బిన్ ఖలఫ్ ఇంట్లో అతిథిగా బసచేశారు. ఆయన కాబాగృహంలో ప్రవేశిస్తున్నప్పుడు సత్యతిరస్కారి అబూజహల్ కాబాద్వారం దగ్గర నిలబడి "నీవు గనక ఉమయ్యాకు అతిథి కాక పోయివుంటే మేము నిన్ను ఇక్కడ్నుంచి ప్రాణాలతో బయటపడ నిచ్చేవారం కాము" అని బెదిరించాడు. అప్పుడు సాద్ (ర) "మీరు నన్ను కాబాదర్శనం చేయనీకుండా నిరోధిస్తే సిరియా నుండి మదీనా మీదుగా వచ్చే మీ వర్తకబిడారాలను నేను అడ్డుకుంటాను" అని హెచ్చరించారు.

ఆ తర్వాత మక్కా ఖురైషీయులు చిన్న చిన్న దళాలను మదీనా పరిసర ప్రాంతాలకు పంపి ముస్లింలను కవ్వించడం ప్రారంభించారు. ఒకసారి వారు మదీనా వెలుపల పశువుల కాపర్లపై దాడి చేసి వారి పశువుల్ని దోచుకుపోయారు. ఆ రోజుల్లోనే అబూసుఫ్యాన్ నాయకత్వంలో మక్కావారి వర్తకబిడారం ఒకటి పెద్దఎత్తున వ్యాపార సామగ్రితో సిరియా నుంచి బయలుదేరింది. అబూసుఫ్యాన్ వర్తకబిడారాన్ని ముస్లింలు అడ్డుకుంటారేమోనని భయపడి, సహాయం కోసం ఒక మనిషిని మక్కా పంపాడు. అతను మక్కా వచ్చి బిడారంపై ముస్లింములు దాడిచేయడానికి వస్తున్నారని, వెంటనే సహాయం చేయడానికి బయలుదేరాలని ఖురైష్ నాయకుల్ని ఉసిగొల్పాడు.

అప్పుడు అబూజహల్ వేయిమంది సైనికులతో మక్కా నుండి బయలుదేరాడు. ఈ సంగతి తెలిసి దైవప్రవక్త (సల్లం) కూడా 312 మంది యోధులతో మదీనా నుండి బయలుదేరారు. అబూసుఫ్యాన్ ముస్లింల దాడి నుంచి తప్పించుకోవడానికి మదీనా సమీపం నుండి వెళ్ళే సాధారణ మార్గం తప్పించి వేరేమార్గం గుండా సురక్షితంగా మక్కా చేరుకున్నాడు. వర్తకబిడారం సురక్షితంగా మక్కా చేరుకున్నదని, కనుక సైన్యాన్నిక మక్కాకు తిప్పి తీసికెళ్ళమని అతను అబూజహల్‌కు కబురు పంపాడు. కాని అబూజహల్ తన సైనికసంఖ్యను, ఆయుధశక్తిని చూసుకొని విర్రవీగుతూ అతని మాటలు ఖాతరుచేయకుండా ముందుకుసాగాడు. ముస్లింలు మక్కావారి వ్యాపార బిడారాన్ని అడ్డుకోవడానికి పాల్పడకపోయినా, మక్కాఖురైషీయులు ఇలా ముస్లింలపై దాడిచేసి ఇస్లాంను శాశ్వతంగా అంతమొందించాలన్న లక్ష్యంతో 1000 మంది సైనికులతో మదీనా దిశగా బయలుదేరారు. చివరికి ఈ సైన్యం బద్ర్ ప్రాంతంలో హిజ్రీ 2వ సంవత్సరం రమజాన్ నెల 17వ తేదీన ముస్లింసైన్యాన్ని ఢీకొని చిత్తుగా ఓడిపోయింది.

ఈ అధ్యాయంలో ముస్లింల బలహీనతలను ఎత్తిచూపుతూ వారి నైతిక సంస్కరణ కోసం ఆజ్ఞలు ఇవ్వబడ్డాయి. యుద్ధంలో ప్రత్యర్థుల సైనిక, ఆయుధ, సంఖ్యాబలం చూసి భయపడకుండా దైవసహాయంపై నమ్మకముంచి పోరాడాలని బోధించబడింది. మరోవైపు బహుదైవారాధకుల, కపటవిశ్వాసుల, యూదుల ఇస్లాంవ్యతిరేక ధోరణిని నిశితంగా విమర్శించడం జరిగింది. వేరొకవైపు యుద్ధఖైదీల సమస్య, సమరసొత్తు పంపిణీ గురించి తగిన ఆదేశాలు ఇవ్వబడ్డాయి.

## కరుణామయుడు, కృపాసాగరుడయిన దేవుని పేరుతో ప్రారంభం

ముహమ్మద్ (సల్లం)! వారు నిన్ను సమర సొత్తు[1] గురించి అడుగుతున్నారు. వారికి చెప్పు: ఈ సమరసొత్తు దేవునికి, ఆయన ప్రవక్తకు మాత్రమే చెందుతుంది. కనుక మీరు నిజమైన విశ్వాసులైతే (అన్నిటికన్నా ముందు) దేవునికి భయపడి మీ పరస్పర సంబంధాలు మెరుగుపరచుకోండి; దేవునికి, ఆయన ప్రవక్తకు పూర్తిగా విధేయులయి మసలుకోండి. (1)

నిజమైన విశ్వాసుల హృదయాలు దేవుని ప్రస్తావన వస్తే చాలు కంపించిపోతాయి. వారి ముందు దేవుని సూక్తులు పఠిస్తుంటే వారి విశ్వాసం ద్విగుణీకృతమవుతుంది. వారు తమ ప్రభువు మీదే భారం వేస్తారు. ఇంకా ప్రార్థనా (నమాజు) వ్యవస్థను స్థాపిస్తారు. మేము ప్రసాదించిన సంపద నుండి (దైవమార్గంలో కూడా) ఖర్చుపెడతారు. అలాంటి వారే మాదృష్టిలో నిజమైన విశ్వాసులుగా పరిగణించబడతారు. వారికోసం వారిప్రభువు వద్ద హోదా, అంతస్తులు ఉన్నాయి; పాపాల మన్నింపు ఉంది; అత్యంత శ్రేష్ఠమయిన ఉపాధి కూడా ఉంది. (2-4)

నీ ప్రభువు నిన్ను ఇంటినుండి (యుద్ధానికి) బయలుదేరతీసినప్పుడు, కొందరు విశ్వా సులకు ఇది నచ్చలేదు. వాస్తవం స్పష్టంగా ఉన్నా వారా విషయంలో నీతో వాదనకు దిగారు. పైగా తామేదో మృత్యుముఖంలోకి పంపబడుతున్నట్లు ఆందోళన చెందసాగారు. (5,6)

రెండు వర్గాలలో[2] ఒకవర్గం మీకు చేజిక్కుతుందని దేవుడు మీకు వాగ్దానం చేశాడు. ఆ సందర్భం గుర్తుకుతెచ్చుకోండి. అప్పుడు మీరు (ఆయుధాలు లేని) బలహీన (వ్యాపార) వర్గం మీకు చిక్కితే బాగుంటుందని భావించసాగారు. కాని దేవుడు తన ఆదేశాలతో సత్యాన్ని సత్యంగా నిరూపించదలిచాడు. అంతేకాకుండా నేరస్థులకు ఎంత వెగటు అన్పించినా సత్యం సత్యంగా, అసత్యం అసత్యంగా రుజువుకావడానికి ఆయన అవిశ్వాసుల్ని పూర్తిగా తుడిచిపెట్టాలని కూడా సంకల్పించుకున్నాడు. (7-8)

మీరు మీ ప్రభువుని వేడుకుంటున్నప్పటి సందర్భం- దానికి సమాధానంగా ఆయన "నేను మీకు సహాయంగా ఒకరి తరువాత మరొకరు చొప్పున వేయిమంది దైవదూతల్ని పంపిస్తున్నాను" అని అన్నాడు.[3] మీ మనస్సులు కుదుటపడేందుకు దేవుడు

1. యుద్ధంలో శత్రువులు ఓడిపోయిచావడమో, పారిపోవడమో జరిగిన తర్వాత వారు వదలి వెళ్ళిన సామగ్రిని విజేతలు హస్తగతం చేసుకుంటారు. దీన్నే సమరసొత్తు (మాలె గనీమత్) అంటారు. ఇందులో ఆయుధాలు, ఆహార వస్తువులు, వాహనాలు, వస్త్రాలు తదితర సామగ్రితో పాటు యుద్ధ ఖైదీలు కూడా ఉంటారు. ఇదంతా సమరసొత్తుగా విజేత వర్గానికి దక్కుతుంది.

2. రెండు వర్గాలు అంటే- ఒకటి, అబూసుఫ్యాన్ నేతృత్వంలో సిరియా నుంచి వ్యాపార సామగ్రితో వస్తున్న వర్తక బిడారం. రెండోది, అబూజహల్ నాయకత్వంలో ముస్లింలపై దాడి చేయడానికి మక్కా నుండి వస్తున్న సైనిక దళం.

3. వివరాలకు 3:124,125 సూక్తులు, వాటి పాదసూచిక చూడండి.



ఈ విషయాన్ని మీకు శుభవార్తగా తెలియజేశాడు. సహాయం ఎప్పుడు లభించినా, ఏ రూపంలో లభించినా అది దేవుని దగ్గర్నుండే లభిస్తుంది. నిస్సందేహంగా దేవుడు అత్యంత శక్తిమంతుడు, మహా వివేకవంతుడు. (9-10)

మీరు నిర్భయంగా, నిశ్చింతగా ఉండేందుకు దేవుడు మీపై ఒకవిధమైన మైకం ఆవహింప జేసినప్పటి సందర్భం: మీ మీద షైతాన్ పడవేసిన మాలిన్యం తొలగించి మిమ్మల్ని పరిశుద్ధ పరచడానికి, మీలో ధైర్యసాహసాలు జనింపజేసి మీ కాళ్ళకు స్థిరత్వం కలిగించడానికి ఆయన ఆకాశం నుండి మీ మీద వర్షం కురిపించాడు.[4] (11)

నీ ప్రభువు తన దూతలకు ప్రత్యేక సూచనలు ఇచ్చినప్పటి సందర్భం- అప్పుడు ఆయన వారితో "నేను మీ వెంట ఉంటాను. మీరు విశ్వాసుల్ని (యుద్ధరంగంలో) స్థిరంగా ఉంచండి. నేను కూడా అటు అవిశ్వాసుల గుండెల్లో బెదురు పుట్టిస్తుంటాను. కనుక మీరు వారి మెడలపై, కీళ్ళపై వ్రేటు వేస్తూ ఉండండి" అని అన్నాడు. (12)

కారణం, వారు దేవునిపై, ఆయన ప్రవక్తపై తిరగబడ్డారు. దేవునిపై, ఆయన ప్రవక్తపై తిరగబడినవారి పట్ల దేవుడు చాలా కఠినంగా వ్యవహరిస్తాడు- "ఇదే మీకు (ఇహలోకంలో) శిక్ష. ఇక దీన్ని చవిచూడండి. సత్యాన్ని తిరస్కరించేవారికి (పరలోకంలో) నరకశిక్ష పడు తుందన్న సంగతి తెలిసిందే." (13-14)

విశ్వాసులారా! మీరు యుద్ధరంగంలో అవిశ్వాసుల్ని ఎదుర్కొంటున్నప్పుడు వారికి వెన్నుజూపి పారిపోకండి. అలా పారిపోయేవారు దైవాగ్రహానికి గురవుతారు. చివరికి వారి నివాసం నరకమవుతుంది. అది చాలా చెడ్డనివాసం. అయితే యుద్ధతంత్రంగాగాని, మరేదైనా సైనికదళాన్ని చేరుకునే ఉద్దేశ్యంతోగాని అలా చేస్తే తప్పు లేదు. (15,16)

వాస్తవానికి వారిని వధించింది మీరు కాదు; దేవుడే వారిని వధించాడు. అలాగే వారిపై (ఇసుక మంత్రించి) విసిరేసింది నీవు కాదు; దేవుడే విసిరేశాడు. విశ్వాసుల్ని ఒక మంచి పరీక్ష నుండి విజయవంతంగా గట్టెక్కించడానికే దేవుడు ఈవిధంగా చేశాడు. నిస్సందే హంగా దేవుడు సమస్తం వింటున్నాడు, సర్వం ఎరిగినవాడు. (17)

ఇది దేవుడు మీపట్ల వ్యవహరించిన తీరు. ఇక అవిశ్వాసులపట్ల- దేవుడు వారి పథకాలను పూర్తిగా వమ్ముచేశాడు. (వారికీ సంగతి చెప్పు:) "మీరు (మా)తీర్పు కోరుతుంటే ఇదిగో, తీర్పు మీ ముందుకు వచ్చింది. కనుక ఇకనైనా తిరుగుబాటు ధోరణి మానుకోండి. అందులోనే మీ శ్రేయస్సు ఉంది. దానికి బదులు మీరు అదే

4. బద్ర్ యుద్ధం ప్రారంభం కావడానికి ఒక రోజు ముందు రాత్రివేళ వర్షం కురిసింది. ఈ వర్షం వల్ల ముస్లిం యోధులకు మూడు ప్రయోజనాలు చేకూరాయి. ఒకటి, నీటికి కటకట లాడుతుండిన ముస్లింలకు వర్షం వల్ల చాలినంత నీరు లభించింది. రెండు, యుద్ధమైదానంలో వారికి దొరికిన ఇసుక ప్రదేశం వర్షం పడటంతో గట్టిపడి, వారు అటు ఇటు సులభంగా తిరగడానికి, స్థిరంగా నిలబడి యుద్ధం చేయడానికి అనుకూలంగా మారింది. మూడు, అవిశ్వాసులు ముందుగా వచ్చి ఆక్రమించుకున్న మెరక మట్టి ప్రదేశం వర్షం వల్ల బురదమయమయి పోయి వారి కాళ్ళు జారిపడేలా తయారయింది.

మూర్ఖత్వాన్ని మళ్ళీ ప్రదర్శిస్తే మేము కూడా అదే శిక్షను పునరావృతం చేస్తాము. మీ సంఖ్యాబలం ఎంత అధికంగా ఉన్నా అది మీకేమాత్రం ఉపయోగ పడదు. దేవుడు విశ్వాసుల పక్షం ఉన్నాడు.'' (18-19)

విశ్వాసులారా! దేవునికి, ఆయన ప్రవక్తకు విధేయులయి ఉండండి. (వారి) ఆజ్ఞ విన్న తర్వాత దానికి విముఖులై పోకండి. మనస్ఫూర్తిగా వినకుండా 'మేమువిన్నాం' అని పలికినవారిలా మీరు తయారవకండి. బుద్ధినుపయోగించని బధిరులు, మూగలు దేవుని దృష్టిలో పశువులకన్నా నికృష్టులు. వారిలో కాస్తయినా మంచితనముంటే దేవుడు వారికి (సత్యాన్ని) అర్థంచేసుకునే సద్బుద్ధి తప్పకుండా ప్రసాదించేవాడు. మంచితనం లేదు గనకనే మంచివిషయం చెప్పినా వారు నిర్లక్ష్యంతో ముఖం తిప్పుకుంటున్నారు.(20-23)

విశ్వాసులారా! ప్రవక్త మీకు మంచి జీవితం ప్రసాదించే విషయం వైపు పిలిచి నప్పుడు మీరతని పిలుపునకు స్పందించి దేవునికి, ఆయన ప్రవక్తకు విధేయులైపోండి. వినండి, దేవుడు మనిషికి, అతని హృదయానికి మధ్యవుండి అతని అంతరంగంలో మెదిలే విషయాల్ని సైతం పసిగడ్తాడు. చివరికి మీరు ఆయన వైపుకే సమీకరించ బడతారు. మీలో పాపాలు చేసినవారికే పరిమితమైపోని ఉపద్రవం నుండి మిమ్మల్ని మీరు కాపాడుకోండి.[5] దేవుడు అతి కఠినంగా శిక్షించేవాడని తెలుసుకోండి. (24-25)

మీరు చాలా అల్పసంఖ్యలో ఉన్నప్పటి పరిస్థితిని ఓసారి గుర్తుచేసుకోండి. అప్పుడు మీరు దేశంలో చాలా బలహీనులుగా ఉండేవారు. ప్రజలు మిమ్మల్ని పూర్తిగా అంతమొంది స్తారేమోనని మీరు భయపడుతుండేవారు. అలాంటి స్థితిలో దేవుడు మీకు మంచి ఆశ్రయం కల్పించాడు. ఆయన తన సహాయసహకారాలతో మీకు శక్తి ప్రసాదించాడు. మంచి ఉపాధి కూడా అనుగ్రహించాడు. మీరు కృతజ్ఞులై ఉంటారనే ఆయన ఇదంతా చేశాడు. (26)

విశ్వాసులారా! (వాస్తవం తెలిసికూడా) మీరు దేవునికి, ఆయన ప్రవక్తకు ద్రోహం తలపెట్టకండి. మీకప్పగించబడే బాధ్యతల విషయంలోనూ ద్రోహబుద్ధితో వ్యవహరించ కండి. వాస్తవానికి మీ సంతానం, సిరిసంపదలు మీపాలిట పరీక్షా సాధనాలని గుర్తుంచు కోండి.[6] మీ కోసం దేవుని దగ్గర ఇంతకంటే ఎంతో గొప్ప ప్రతిఫలం ఉంది. (27-28)

---

5. దైవశిక్షగా యుద్ధం, అంటువ్యాధులు, ప్రకృతి వైపరీత్యాలు విరుచుకుపడినప్పుడు పాపాత్ములేగాక, పుణ్యాత్ములు కూడా వాటి వాతన పడతారు. అందువల్ల సంఘంలో ధర్మరాహిత్యం, అశ్లీలం, అవినీతి మొదలైన చెడులు ప్రబలినప్పుడు సంఘశ్రేయోభిలాషులు వాటిని దూరం చేయ డానికి, వారిలో దైవభీతి, పరలోకపు జవాబుదారీభావన కలిగించడానికి ప్రయత్నించాలి. అప్పటికీ ఆ సంఘంలో మార్పు రాకపోతే వారు అక్కడ్నుంచి చెడులులేని వేరే చోటికి తరలిపోవాలి. అలా చేయకుండా దుర్జనులతో కలసిమెలసిఉంటే, సామూహిక ఉపద్రవరూపంలో దైవాగ్రహానికి దుర్జను లతో పాటు వారు కూడా గురవుతారు. (ఇతర వివరాలకు 7:164,165 సూక్తులు చూడండి.)

6. వివరాలకు 64:14,15 సూక్తులు, వాటి పాదసూచిక చూడండి.



విశ్వాసులారా! మీరు గనక భయభక్తుల వైఖరి అవలంబిస్తే దేవుడు మీకు మంచీ చెడుల విచక్షణాజ్ఞానం ప్రసాదిస్తాడు; మీలో ఉన్న చెడుగులు తొలగిస్తాడు; మీ తప్పులు మన్నిస్తాడు. దేవుడు అపార దయామయుడు. (29)

ముహమ్మద్ (సల్లం)! సత్యతిరస్కారులు నీకు వ్యతిరేకంగా కుట్ర పన్నుతుండిన సందర్భం గుర్తుకుతెచ్చుకో. వారు నిన్ను బంధించి ఉంచలా, లేక హతమార్చివేయాలా, లేక దేశబహిష్కరణ చేయాలా అని రకరకాలుగా ఆలోచిస్తూ పన్నాగాలు పన్నసాగారు. ఆ విధంగా వారు పన్నాగాలు పన్నుతుంటే, దేవుడు కూడా (తనదైన రీతిలో) పన్నాగాలు పన్నుతుండే వాడు. దేవుడే అందరికంటే గొప్ప పన్నాగం పన్నేవాడు. (30)

వారికి మా సూక్తులు విన్పిస్తున్నప్పుడు "ఆ...విన్నాంలే. తలచుకుంటే మేము కూడా ఇలాంటి మాటలు సృష్టించగలం. ఇవి పూర్వం నుండీ జనం చెప్పుకుంటూ వస్తున్న పుక్కిటి పురాణాలే కదా! ఈనాడు కొత్తేముంది?'' అని పలికేవారు. (31)

వారన్న మరో మాట కూడా గమనార్హమైనదే, "దేవా! ఇది నిజంగా సత్యధర్మం అయితే, నీ దగ్గర నుండే వచ్చినదైతే (మా తిరస్కార వైఖరికి) మాపై రాళ్ళ వర్షం కురిపించు, లేదా మరేదైనా ఘోర ఉపద్రవం తెచ్చిపడెయ్యి'' అని వారు ప్రార్థించారు. ఆ సమయంలో దేవుడు వారిపై శిక్ష తెచ్చి పడేసేవాడే. కాని నీవు వారి మధ్య ఉన్నావు. అదీగాక కొందరు ప్రజలు తమ పాపాల పట్ల పశ్చాత్తాపం చెంది దేవుడ్ని క్షమాపణ వేడు కుంటున్నారు. అలాంటివారిని శిక్షించడం దేవుని అభిమతం కాదు. (32-33)

అయితే (ఇప్పుడు పరిస్థితి మారింది). వారు ప్రతిష్ఠాలయానికి న్యాయసమ్మతమైన ధర్మకర్తలు కానప్పటికీ ప్రజల్ని అక్కడకు రానివ్వకుండా నిరోధిస్తున్నారు. అలాంటివారిని ఇప్పుడు ఎందుకు శిక్షించకూడదు? ప్రతిష్ఠాలయానికి న్యాయసమ్మతమైన ధర్మకర్తలు దైవభీతిపరాయణులే అవుతారు. కాని చాలామంది ఈ విషయాన్ని ఎరగరు. దైవగృహం లో ఈలలు వేయడం, చప్పట్లు కొట్టడం మినహా వారు చేసే ప్రార్థన మరేముంది? "కనుక మీ సత్యతిరస్కారానికి ప్రతిఫలంగా (మా) శిక్ష[7] చవిచూడండి.'' (34-35)

సత్యాన్ని నిరాకరించినవారు దైవమార్గం నుండి (ప్రజలను) నిరోధించే కార్య కలాపాల కోసం తమ ధనాన్ని వెచ్చిస్తున్నారు. ఇకముందు కూడా మరింత వెచ్చిస్తారు. అయితే చివరికి ఈ(పైశాచిక) కార్యకలాపాలే వారి పశ్చాత్తాపానికి కారణమవుతాయి. ఆ తరువాత వారు (మాకు) లొంగిపోతారు. ఆపై ఈ తిరస్కారులు నరకం వైపు తోలబడతారు. పరిశుభ్రత నుండి మాలిన్యాన్ని వేరుచేసి, ఆ మాలిన్యాలన్నిటిని ఒక దానిపై ఒకటి కుప్పగాపోసి, ఆ కుప్పను నరకంలో పడవేయడానికే దేవుడు ఇలా చేస్తున్నాడు. ఇలాంటివారే నష్టపోయేవారు. (36-37)

ముహమ్మద్ (సల్లం)! సత్యతిరస్కారులకు ఇలా చెప్పెయ్యి: "ఇప్పటికైనా మీరు (మీ తిరుగుబాటు ధోరణి) మానుకుంటే గతంలో జరిగిన దాన్ని క్షమించడం

---

7. యుద్ధంలో ఓడి పెద్దఎత్తున ధనప్రాణ నష్టాలు వాటిల్లడం కంటే మించిన శిక్ష లేదు.

జరుగుతుంది.” ఒకవేళ వారు తమ పూర్వవైఖరినే పునరావృతం చేస్తే మాత్రం, గత జాతులకు పట్టిన దుర్గతి అందరికీ తెలిసిందే. (అలాంటి దుర్గతే వారికీ పడ్తుంది). (38)

విశ్వాసులారా! అరాచకం పూర్తిగా సమసిపోయి సర్వత్రా దైవధర్మం నెలకొనే వరకు అవిశ్వాసులతో పోరాడండి. వారు తమవైఖరి మార్చుకుంటే (ఇక వారి జోలికి పోకండి.) వారి వ్యవహారం దేవుడే చూసుకుంటాడు. ఒకవేళ మార్చుకోకపోతే మీ సంరక్షకుడు దేవుడేనని తెలుసుకోండి. ఆయన అందరికంటే మంచి సంరక్షకుడు, సహాయకుడు. (39-40)

మీకు లభించిన సమరసొత్తులో అయిదోవంతు దేవునికి, ఆయన ప్రవక్తకు, బంధువులకు, అనాథబాలలకు, నిరుపేదలకు, బాటసారులకు చెందినదని తెలుసుకోండి. మీరు దేవుణ్ణి, (సత్యాసత్యాలను) వేరుచేసిన రోజు, అంటే రెండుసైన్యాలు పరస్పరం ఢీకొన్న రోజు మేము మా దాసునిపై అవతరింపజేసినదాన్ని[8] విశ్వసించిన వారైతే (ఈ అయిదోవంతు సమరసొత్తు సంతోషంగా ఇచ్చేయండి). దేవుడు ప్రతి దానిపై అధికారంగల సమర్థుడు. (41)

లోయకు ఒకవైపున మీరు, రెండోవైపున వారు, మీ వెనుకవైపు (తీరమైదానంలో) వర్తకబిడారాలు ఉన్న సందర్భం జ్ఞాపకం చేసుకోండి. మీకూ వారికీ మధ్య ముందుగానే చర్చలు జరిగివుంటే, మీరు నిర్ణీత స్థలానికి చేరుకోవడంలో తప్పకుండా తాత్సారం చేసేవారు. అయితే జరిగిందేదో దేవుడు తీసుకున్న నిర్ణయం అమల్లోకి రావడానికే జరిగింది. ఆ నిర్ణయం ప్రకారం వధించబడవలసిన వాడు సహేతుకంగా స్పష్టమైన ప్రమాణంతో వధించబడ్డాడు. సజీవంగా ఉండవలసినవాడు కూడా సహేతుకంగా, స్పష్టమయిన ప్రమాణంతోనే సజీవంగా ఉన్నాడు. నిస్సందేహంగా దేవుడు సమస్తం వింటున్నాడు, సర్వం ఎరిగినవాడు. (42)

ముహమ్మద్ (సల్లం)! దేవుడు వారిని నీ కలలో తక్కువ సంఖ్యలో ఉన్నట్లు చూపిన సందర్భం గుర్తుకు తెచ్చుకో. ఆయన వారిని నీకు అధిక సంఖ్యలో గనక చూపి ఉంటే మీరు తప్పకుండా ధైర్యం కోల్పోయి యుద్ధ వ్యవహారంలో పరస్పరం పోట్లాడుకునేవారు. కాని దేవుడే మిమ్మల్ని ఆ వివాదం నుండి కాపాడాడు. ఆయన (మానవ) హృదయాల్లో మెదిలే రహస్య విషయాలు సైతం ఎరిగినవాడు. (43)

దేవుడు తలచుకున్న కార్యం నెరవేరవలసి ఉన్నందున యుద్ధ సమయంలో కూడా ఆయన మీకళ్ళకు శత్రువుల్ని తక్కువసంఖ్యలో, వారికళ్ళకు మీరు తక్కువ సంఖ్యలో ఉన్నట్లు చూపించాడు. సమస్త వ్యవహారాలు చివరికి దేవుని వైపుకే చేరుకోవలసిఉంది. (44)

విశ్వాసులారా! మీరేదయినా వర్గాన్ని ఎదుర్కోవలసి వచ్చినప్పుడు స్థిరంగా నిలబడి ధైర్యంగా పోరాడండి; దేవుణ్ణి ఎక్కువగా స్మరిస్తూ ఉండండి; మీకు విజయం సిద్ధిస్తుంది.

8. వర్షాన్ని, దైవదూతలను, మనోస్థిమితాన్ని ప్రసాదించి దేవుడు చేసిన సహాయం.



దేవునికి, ఆయన ప్రవక్తకు విధేయులయి ఉండండి. పరస్పరం కలహించుకోకండి. అలాచేస్తే మీలో ధైర్యం సన్నగిల్లి మీ శక్తి నిర్వీర్యమయి పోతుంది.[9] సహనం, సంయమనాలతో వ్యవహరించండి. సహనం వహించేవారికి దేవుడు తప్పకుండా తోడుగా ఉంటాడు. (45-46)

కొందరు అహంకారంతో విర్రవీగుతూ, పటాటోపం ప్రదర్శిస్తూ తమ ఇండ్ల నుండి (యుద్ధానికి) బయలుదేరుతారు. అలాంటి (అవిశ్వాసుల)వైఖరి మీరు ఎన్నటికీ అవలంబించకండి. వారు (ప్రజలను) దైవమార్గం నుండి నిరోధిస్తుంటారు. వారి కార్యకలాపాలను దేవుడు ఓ కంట గమనిస్తూనే ఉన్నాడు. (47)

వారి చేష్టల్ని షైతాన్ వారి కళ్ళకు అద్భుతమైన పనులుగా చేసి చూపిన సందర్భం కూడా గుర్తుకుతెచ్చుకో. అప్పుడు షైతాన్ వారితో “ఈరోజు మీపై ఎవరూ విజయం సాధించలేరు. నేను మీకు తోడున్నాను” అన్నాడు. అయితే రెండువర్గాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు వాడు గుండెలు బాదుకుంటూ పిక్కబలంకొద్దీ పారిపోయాడు. అలా పారిపోతూ “మీతో నాకెలాంటి సంబంధం లేదు. మీరు చూడలేనివాటిని నేను చూస్తున్నాను. దేవుడంటే నాకు చాలా భయంగా ఉంది. ఆయనశిక్ష చాలా తీవ్రంగా, కఠినంగా ఉంటుంది” అన్నాడు. (48)

కపటులు, హృదయాల్లో (అవిశ్వాస) జాడ్యమున్నవారు (విశ్వాసుల్ని గురించి) “వారి ధర్మం వారిని గర్వపోతులుగా చేసింద”ని అంటున్నారు. దేవుని మీద భారం వేసేవారు దేవుడు ఎంతో శక్తిమంతుడు, అసామాన్య వివేకవంతుడని తెలుసుకోవాలి. దైవదూతలు అవిశ్వాసుల ప్రాణాలు తీస్తున్నప్పటి స్థితి నీవు చూస్తే బాగుండు! వారప్పుడు అవిశ్వాసుల ముఖాలపై, పిరుదులపై కొడుతూ “ఇక దహన యాతన చవిచూడండి.[10]

9. అంతర్విభేదాల వల్ల అనైక్యత, పిరికితనాలు సహజంగానే చోటుచేసుకుంటాయి. వాటి వల్ల ప్రత్యర్థుల్ని ఎదుర్కోవడం సాధ్యం కాదు. అందువల్ల దేవునికి, ఆయన ప్రవక్త (సల్లం)కు ఎల్లప్పుడూ విధేయులయి ఉండాలని ఈ సూక్తి ముస్లింలకు తెలియజేస్తోంది. అంటే వారు ప్రతి వ్యవహారంలోనూ దైవగ్రంథం, ప్రవక్త సంప్రదాయాలనే దృష్టిలో పెట్టుకొని మసలుకోవాలన్నమాట. ఆ తరువాత ఎలాంటి కఠిన పరిస్థితులు ఎదురైనా సరే సహనం, స్థైర్యాలను ప్రదర్శించాలని ఖుర్‌ఆన్ బోధిస్తోంది. దైవప్రవక్త (సల్లం) ఒక హదీసులో ఇలా ప్రవచించారు:

“ప్రజలారా! శత్రువుతో తలపడేందుకు ఉవ్విళ్ళూరకండి. మీరు (ఎల్లప్పుడూ) శాంతి సామరస్యాల కోసం దైవాన్ని ప్రార్థిస్తూ ఉండండి. ఒకవేళ శత్రువుతో (తప్పనిసరిగా) పోరాడవలసిన పరిస్థితి వస్తే మటుకు సహనం వహించండి. (అంటే స్థిరంగా నిలబడి ధైర్యంగా పోరాడండి.) స్వర్గం ఖడ్గచ్ఛాయల క్రింద ఉంటుందనే విషయం బాగా తెలుసుకోండి.” (బుఖారి, ముస్లిం)

(ఇతర వివరాలకు 3:103, 49:10 సూక్తులు, వాటి పాదసూచికలు చూడండి.)

10. పరలోక శిక్ష అంటే ప్రళయం రావాలి, తుదిదినం తీర్పు జరగాలి, ఆ తరువాత కదా ఈ శిక్షా అనుకుంటారు కొందరు. కాని పాపాత్ముడు నరక శిక్ష చవిచూడటానికి ముందు యమ కింకరులతో నడ్డి విరగ్గొట్టించుకొని తీర్పుదినం వరకు సమాధిలో దుర్భర జీవితం గడపవలసి ఉంటుంది. ఇలాంటి పరిస్థితినే దైవతిరస్కారులు మరణావస్థలో ఎదుర్కొంటారని ఈ సూక్తులు

తెలియజేస్తున్నాయి. మరణావస్థ నుండి ప్రళయం వరకుండే స్థితిని "బర్జఖ్" అంటారు. పాపాత్ములు ప్రళయం వరకు బర్జఖ్ శిక్షలు అనుభవిస్తారు.

హత్యా, దోపిళ్ళు చేసిన నేరస్థుడు పోలీసులకు పట్టుబడాగానే "బాబోయ్! నన్ను వదలండి, నేనిక ముందు ఏ నేరం చేయకుండా సాధారణ పౌరజీవితం గడుపుతా"నంటే పోలీసులు దయదలచి అతడ్ని వదలిపెడతారా? ఎన్నటికీ వదలిపెట్టరు.

"చివరికి వారిలో ఎవరికైనా చావు మూడినప్పుడు అతను (పశ్చాత్తాపంతో) 'ప్రభూ! నేను వదలివచ్చిన ప్రపంచంలోకి నన్ను మరోసారి పంపించు. నేనిప్పుడు (నా ప్రవర్తన మార్చుకొని) సత్కార్యాలు చేస్తాను' అంటాడు. అలా ఎన్నటికీ జరగదు. అతను పనికిమాలిన మాటలు వదరు తున్నాడు. (చనిపోయిన) వారందరి వెనుక ఇప్పుడొక అడ్డుతెర (బర్జఖ్) ఏర్పడింది. పునరుత్థాన దినం వరకు వారు ఆ స్థితిలోనే ఉంటారు." (ఖుర్‌ఆన్- 23:99,100)

బర్జఖ్ (పిత్రులోక) జీవితం కోసం మనిషికి సమాధే ఉండనవసరం లేదు. ఏవిధంగా ఖననం చేసినా అతను చేసుకున్న కర్మలను బట్టి బర్జఖ్ జీవితం అనుభవించాల్సి ఉంటుంది.

"(సత్య తిరస్కారులు) దైవదూతలకు పట్టుబడినప్పుడు వారు వెంటనే (తమ తిరస్కారం, తలబిరుసుతనాలు వదలి) పూర్తిగా లొంగిపోతూ 'మేము ఏ పాపం ఎరగం' అంటారు. దానికి దైవ దూతలు 'ఎందుకు ఎరగరు, మీ చేష్టలన్నీ దేవునికి తెలుసు. మీరిప్పుడు నరకంలోకి పోయిపడండి. అక్కడే మీరిక శాశ్వతంగా ఉండవలసి ఉంది' అని సమాధానమిస్తారు." (16:28,29)

"దైవభీతిపరుల పవిత్రాత్మలను దైవదూతలు స్వాధీనం చేసుకుంటూ 'మీకు శాంతి కలులు గాక! మీరు చేసుకున్న (సత్)కర్మలకు ప్రతిఫలంగా స్వర్గంలో ప్రవేశించండి' అంటారు." (16:32)

దేవుడ్ని విశ్వసించి ఆయన ఆజ్ఞల్ని పూర్తిగా పాటించని ముస్లింలు సైతం పిత్రులోక (బర్జఖ్) శిక్ష అనుభవించక తప్పదు. మహాప్రవక్త (సల్లం) మదీనాను దారుల్‌ఇస్లాంగా ప్రకటించి ముస్లిలంతా మదీనాకు వలసపోవాలని ఆదేశించారు. కాని మక్కాలో కొందరు ముస్లింలు కేవలం ఐహిక కష్ట నష్టాలకు భయపడి, సత్యతిరస్కారుల మధ్య సహజీవనం గడుపుతూ స్వస్థలంలోనే ఉండిపోయారు. అలాంటి వారిని ప్రస్తావిస్తూ ఖుర్‌ఆన్ ఇలా పేర్కొన్నది:

"దైవదూతలు తమకుతాము అన్యాయం చేసుకున్నవారి ప్రాణాలుతీస్తూ, మీరిప్పుడు ఏ స్థితో ఉన్నారని ప్రశ్నిస్తారు. దానికి వారు 'మేము దేశంలో చాలా బలహీనులుగా, పీడితులుగా ఉండే వాళ్ళం' అనంటారు. అప్పుడు దైవదూతలు 'దేవునిభూమి విశాలంగా లేదా, మీరున్న చోటు నుంచి మరోచోటికి వలసపోవడానికి?' అంటారు. అలాంటి వారికి నరకమే తగినశిక్ష." (4:97)

మహాప్రవక్త (సల్లం) పిత్రులోకంలో సంభవించే పరిణామాలను గురించి ఇలా అన్నారు:

మీరు సమాధులలో పరీక్షించబడతారు. విశ్వాసిని సమాధిలో ఉంచినప్పుడు అతని కర్మలు (భౌతిక రూపంలో వచ్చి) అతని చుట్టూ చేరుతాయి. పరీక్ష (నరక)దూతలు ఎటునుండి రావడానికి ప్రయత్నించినా ఆ కర్మలు వారిని నిరోధిస్తాయి. తరువాత ఒక దైవదూత వచ్చి, 'ఆ వ్యక్తి గురించి నీ అభిప్రాయం ఏమిటీ?' అని అడుగుతాడు. దానికా విశ్వాసి 'ఎవర్ని గురించి?' అని అడుగుతాడు. 'ముహమ్మద్ (సల్లం)ని గురించి' అనంటాడు దైవదూత. అప్పుడు విశ్వాసి 'ఆయన నిస్సందేహంగా దేవుని ప్రవక్తని నేను సాక్ష్యమిస్తున్నాను' అంటాడు. 'అయితే ఆయన దేవుని ప్రవక్తని నీకెలా తెలుసు?' అని దైవదూత మళ్ళీ ప్రశ్నిస్తాడు. దానికి విశ్వాసి 'ఆయన దైవప్రవక్తని నేను సాక్ష్య మిస్తున్నాను' అనంటాడు. అప్పుడతనికి స్వర్గ శుభవార్త విన్పించడం జరుగుతుంది.



ఇది మీరు చేజేతులా కొని తెచ్చుకున్నదాని పర్యవసానమే. అంతేగాని దేవుడు తన దాసులకు ఎలాంటి అన్యాయం చేసేవాడు కాదు" అంటారు. (49-51)

ఫిరౌనీయులకు, వారికి పూర్వం గతించిన (దుర్మార్గపు) ప్రజలకు ఎలాంటి గతి పట్టిందో (ఈనాడు) వీరికీ అదే గతి పడుతుంది. వారు దేవుని సూక్తులు, (మహిమలు) తిరస్కరించారు. దేవుడు వారిని వారిపాపాల ఫలితంగా శిక్షించాడు. దేవుడు అత్యంత శక్తిమంతుడు, కఠినంగా శిక్షించేవాడు.

ఏ జాతి అయినా స్వయంగా తన ఆచరణ తీరు మార్చుకోనంత వరకూ దేవుడు ఆ జాతికి ప్రసాదించిన మహాభాగ్యాన్ని ఎన్నటికీ మార్చి వేయడు. ఇది దేవుని సంప్రదాయం. దేవుడు సమస్తం వినేవాడు, సర్వం ఎరిగినవాడు. (52-53)

ఫిరౌనీయులకు, వారికి పూర్వం గతించినవారికి ఏగతి పట్టిందో అది ఈ సంప్రదా యం ప్రకారమే పట్టింది. వారు తమ ప్రభువు సూక్తులు నిరాకరించారు. అప్పుడు మేము వారి పాపాలకు పర్యవసానంగా వారిని తుదముట్టించాము. ఫిరౌనీయులను మేము (నడి సముద్రంలో) ముంచివేశాము. వారంతా పరమ దుర్మార్గులు. (54)

దేవుని దృష్టిలో సత్యాన్ని నిరాకరించి ఇక దాన్ని (ఎన్నటికీ) స్వీకరించని అవిశ్వాసులే యావత్తు సృష్టిలో అత్యంత నీచులు. వారిలో (ముఖ్యంగా) నీతో (స్నేహ) ఒప్పందం చేసుకొని, దైవభీతి కాస్తయినా లేకుండా దాన్ని మాటిమాటికి ఉల్లంఘించే వారున్నారు. వారు గనక యుద్ధంలో మీ ఎదుటికి వస్తే, వారి అడుగుజాడల్లో నడిచే ఇతరులు వారిని చూసి భీతావహులయి పారిపోయేలా వారిని కఠినంగా శిక్షించండి. ఇలా (స్నేహ) ఒప్పందం అతిక్రమించేవారి పర్యవసానం చూసయినా వారికి కనువిప్పు కలుగుతుంది. (55-57)

ఏ జాతి (లేక దేశం) అయినా మీరు చేసుకున్న ఒప్పందం ఎప్పుడయినా ఉల్లంఘిస్తుందని మీరు భయపడితే ఆ ఒప్పందాన్ని దాని ముందు విసరిపడేయండి. నమ్మకద్రోహం చేసినవారిని దేవుడు ఎన్నటికీ ప్రేమించడు. సత్యతిరస్కారులు (ఏదో చమత్కారం చేసి) తాము తప్పించుకున్నామని భావించరాదు. వారు మా పట్టు నుండి ఎన్నటికీ తప్పించుకోలేరు. (58,59)

---

కాని సత్యతిరస్కారిని సమాధిలో ఉంచినప్పుడు అతడ్ని పరీక్షదూతల నుండి కాపాడే ఏ సత్కర్మా అతనిదగ్గర ఉండదు. దైవదూత అడిగిన ప్రశ్నలకు అతను సరైన సమాధానాలు ఇవ్వలేడు. అప్పుడు తలపై అగ్నికణం ఉండే ఒక చతుష్పాదం ప్రత్యక్షమయి, అతడ్ని కొరడాతో కొట్టడం ప్రారంభిస్తుంది. అతను ఎంత అరిచి గీపెట్టినా దానిపై ఎలాంటి ప్రభావం ఉండదు. (అహ్మద్)

ఇది ఉదాహరణకు పేర్కొనబడిన శిక్ష మాత్రమే. ఇదేకాకుండా ఇంకా అనేక రకాల శిక్షలు సమాధిలో దుర్జనులు అనుభవిస్తారు. పరలోక ప్రయాణంలోని ఈతొలి మజిలీ శిక్ష నుండి తప్పించు కున్నవాడే నిజానికి కృతార్థుడు. దానికోసం సన్నాహాలు చేసుకోవాల్సిన చోటు ఇహలోకమే. (దీంతో పాటు 7:40, 40:45-46 సూక్తులు, వాటి పాదసూచికలు కూడా చూడండి.)

మీరు సత్యతిరస్కారులతో పోరాడేందుకు కట్టివేసి (సిద్ధంగా ఉంచి)న గుర్రాలతో సహా వీలయినంత ఎక్కువ (సైనిక, ఆయుధ) శక్తిని సమకూర్చుకొని సర్వసన్నద్ధంగా ఉండండి. ఆవిధంగా మీరు మీకు, దేవునికి ఉమ్మడి శత్రువులయినవారి గుండెల్లో గుబులు పుట్టించండి. అలాగే మీకు తెలియని ఇతరుల హృదయాల్లో కూడా భయోత్పాతం సృష్టించండి. వారి సంగతి మీకు తెలియకపోయినా దేవునికి తెలుసు. (గుర్తుంచుకోండి,) మీరు దైవమార్గంలో (ధర్మసంస్థాపనా కృషి కోసం) ఖర్చుపెట్టినదానికి పూర్తి ప్రతిఫలం (పరలోకంలో) మీకు తప్పకుండా లభిస్తుంది. మీకు ఏ విధమయిన అన్యాయం జరగదు. (60)

ప్రవక్తా! శత్రువులు సంధి వైపు మొగ్గితే మీరు కూడా అందుకు సిద్ధపడండి. దేవుని మీద భారం వేయండి. ఆయనే అన్ని విషయాలు వినేవాడు, సర్వం ఎరిగినవాడు. ఒకవేళ వారు ద్రోహబుద్ధితో ఒప్పందం ఉల్లంఘిస్తే, మీకు దేవుడే చాలు. ఆయనే తన సహాయ సహకారాల ద్వారా, విశ్వాసుల ద్వారా నిన్ను సమర్థించాడు. (61-62)

ముఖ్యంగా ఆయన విశ్వాసుల హృదయాలను పరస్పరం కలిపి నీకు కొండంత ధైర్యాన్నిచ్చాడు. నీవు ప్రపంచంలోని సంపద మొత్తం ఖర్చుపెట్టినా వారి హృదయాలను కలపలేవు. వారి హృదయాలను కలిపేవాడు దేవుడు మాత్రమే. నిస్సందేహంగా ఆయన అపార శక్తిసంపన్నుడు, అత్యంత వివేకవంతుడు. ప్రవక్తా! నిన్ను, నీ అనుచరులైన విశ్వాసుల్ని ఆదుకోవడానికి ఆ ఒక్క దేవుడే చాలు. (63-64)

ప్రవక్తా! విశ్వాసుల్ని యుద్ధానికి ప్రేరేపించు. మీలో ఇరవైమంది స్థిరంగా నిలబడే వారుంటే వారు రెండొందల మందిని జయించగలరు. అలాంటి యోధులు వందమంది ఉంటే వారు వేయిమంది సత్యతిరస్కారుల్ని జయించగలరు. దీనిక్కారణం సత్య తిరస్కారులకు అవగాహనా శక్తి కొరవడటమే. (65)

ప్రస్తుతం దేవుడు మీభారాన్ని తేలికగా చేశాడు. మీలో ఇంకా బలహీనత ఉందని ఆయనకు తెలుసు. కనుక మీలో స్థిరంగా నిలబడేవారు వందమంది ఉంటే వారు రెండువందల మందిని, వేయిమంది ఉంటే రెండువేల మందిని దైవాజ్ఞతో జయించ గలుగుతారు. అయితే (యుద్ధరంగంలో) స్థిరంగా నిలబడి ధైర్యంగా పోరాడేవారికే దేవుడు తోడుగా ఉంటాడు. (66)

దేశంలో శత్రువుల్ని పూర్తిగా అణచివేయనంత వరకు ఖైదీలను తన అధీనంలో ఉంచుకోవడం ఏ దైవప్రవక్తకూ శోభించదు. మీరు ప్రాపంచిక ప్రయోజనాలు ఆశిస్తున్నారు. కాని దేవుని దృష్టిలో పరలోక ప్రయోజనాలే ఎంతో విలువైనవి. ఆయన అపార శక్తిసంపన్నుడు, అత్యంత వివేకవంతుడు.

దేవుడు (మీ అదృష్టంలో) ముందే రాసి ఉండకపోతే, మీరు (ఖైదీల విడుదల కోసం) తీసుకున్నదానికి (అంటే నష్టపరిహారానికి) ఆయన మిమ్మల్ని కఠినంగా శిక్షించేవాడు. సరే, మీరు పొందిన ధనాన్ని (నిస్సంకోచంగా) అనుభవించండి. అది



ధర్మసమ్మతమయినది, పరిశుద్ధమయినది. దేవునికి భయపడుతూ ఉండండి. దేవుడు గొప్ప క్షమాశీలి, అమిత దయామయుడు. (67-69)

ప్రవక్తా! నీ అధీనంలో ఉన్న ఖైదీలకు ఇలా చెప్పు: "మీ హృదయాల్లో మంచి అనేది ఉందని తెలిస్తే దేవుడు మీకు మీ నుండి తీసుకోబడిన దానికంటే ఎన్నో రెట్లు (అధికంగా) ప్రసాదిస్తాడు. పైగా మీ పాపాలు క్షమిస్తాడు. దేవుడు క్షమించేవాడు, కరుణించేవాడు. ఒకవేళ వారు నీకు నమ్మకద్రోహం తలపెట్ట జూస్తుంటే, ఇదివరకు కూడా వారు దేవుని పట్ల నమ్మకద్రోహంతో వ్యవహరించారు. కనుకనే దేవుడు శిక్షగా వారిని నీ అధీనంలోకి బందీలై వచ్చేలా చేశాడు. దేవుడు సర్వం ఎరిగినవాడు, ఎంతో వివేకవంతుడు. (70,71)

సత్యాన్ని స్వీకరించి (సత్యంకోసం) వలస పోవడంతో పాటు దైవమార్గంలో ధన ప్రాణాలొడ్డి (దుష్టశక్తులతో) పోరాడేవారు; వలస వచ్చినవారికి ఆశ్రయమిచ్చి ఆదుకున్న వారు ఒకరికొకరు స్నేహితులు, శ్రేయోభిలాషులు.

ఇక సత్యాన్ని విశ్వసించిన తరువాత వలసపోనివారు (ఇస్లాం నిలయమైన మదీనాకు) వలస రానంతవరకు వారితో మీకు ఎలాంటి స్నేహసంబంధం లేదు. అయితే ధార్మిక వ్యవహారాల్లో సహాయం కోరితే మీరు వారికి తప్పకుండా సహాయం చేయాలి. కాని మీతో ఒప్పందం కుదిరిన జాతికి వ్యతిరేకంగా మాత్రం కాదు.[11] మీరు చేస్తున్నదంతా దేవుడు గమనిస్తూనే ఉన్నాడు. (72)

సత్యతిరస్కారులు ఒకరికొకరు సమర్థించుకొని సహకరించుకుంటున్నారు. మీరు (విశ్వాసులై ఉండి కూడా) అలా పరస్పరం సహకరించుకోకపోతే లోకంలో అరాచకం ఏర్పడి పెద్ద అల్లకల్లోలం చెలరేగుతుంది. (73)

సత్యాన్ని విశ్వసించి, దైవమార్గంలో ఇల్లూ వాకిలి వదలి పోరాడేవారు, (వారికి) ఆశ్రయం ఇచ్చి సహాయసహకారాలు అందజేసినవారు మాత్రమే నిజమైన విశ్వాసులు. వారి పొరపాట్లు మన్నించబడతాయి. వారికి శ్రేష్ఠమయిన ఉపాధి లభిస్తుంది.

సత్యాన్ని ఆ తరువాత విశ్వసించి, ఇల్లూ వాకిలి వదలి (మదీనాకు) వలస వచ్చి, మీతో కలసి (ధర్మ సంస్థాపనకై) పోరాడేవారు కూడా మీ వర్గానికే చెందుతారు. అయితే దైవగ్రంథం ప్రకారం రక్తసంబంధీకులు మాత్రమే ఒకరికొకరు ఎక్కువ హక్కుదారులు. నిస్సందేహంగా దేవుడు ప్రతి విషయాన్నీ ఎరిగినవాడు. (74-75) ✪

---

11. కొందరు ముస్లింలు ప్రవక్తతో పాటు దారుల్‌ఇస్లాం (మదీనా)కు వలస పోకుండా మక్కాలో, దాని చుట్టుప్రక్క ప్రాంతాల్లోనే ఉండిపోయారు. అలాంటివారితో సంబంధాలు పెట్టుకోకూడదని, ఒకవేళ వారిపై దౌర్జన్యం జరిగితే తోటిముస్లిం సోదరులుగా వారిని ఆదుకోవాలని ఆజ్ఞయింది. అయితే ఆ ప్రాంతాల ముస్లిమేతరులతో ఏదైనా స్నేహఒప్పందం చేసుకొని ఉంటే, ఆ ఒప్పందానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తూ అక్కడి పీడిత ముస్లింలకు సహాయం చేయకూడదు.

అవతరణ: మదీనా

# 9. పశ్చాత్తాపం (తౌబా)

సూక్తులు: 129

ఈ అధ్యాయాన్ని "తౌబా" (పశ్చాత్తాపం) అంటారు. ఈ అధ్యాయం ప్రారంభంలో 'బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీం' (కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో) అనే పదాలు లేవు. దైవప్రవక్త (సల్లం) దీని ప్రారంభంలో ఈ పదాలను పేర్కొనకుండా వదలి పెట్టారు. ఇందులో మూడు ప్రసంగాలు ఉన్నాయి. ఇది హిజ్రీశకం 9లో మూడు భాగాలుగా అవతరించింది. మొదటి ప్రసంగంలోని 1 నుంచి 37 వరకుగల సూక్తులు హి.శ. 9లో అవతరించాయి. వీటిని హజ్రత్ అబూబకర్ (రజి) హజ్ కోసం మక్కా వెళ్ళి అక్కడి బహుదైవారాధకులకు విన్పించారు. రెండవ ప్రసంగంలోని 38 నుంచి 72 వరకు గల సూక్తులు హి.శ. 9లోనే తబూక్ దండయాత్రకు సన్నాహాలు చేస్తున్నప్పుడు అవతరించాయి. మూడవ ప్రసంగంలోని 73 నుంచి చివరి వరకుగల సూక్తులు తబూక్ నుంచి తిరిగొచ్చినప్పుడు అవతరించాయి.

ముస్లింలకు మక్కా బహుదైవారాధకులకు మధ్య (హుదైబియా) శాంతిఒప్పందం జరిగిన తరువాత ఇస్లాం అతివేగంగా విస్తరించసాగింది. దాంతో మక్కా ఖురైషీయులు బెంబేలెత్తి పోయి హుదైబియా ఒప్పందం అతిక్రమించారు. మక్కాలో ఖురైషీయుల మిత్రపక్షమైన బనూబకర్ తెగ ఖురైషీయుల సహకారంతో ముస్లింల మిత్రపక్షమైన ఖుజాఅ తెగపై దాడిచేసి వారిని ఊచకోత కోసింది. దాంతో దైవప్రవక్త (స) హి.శ. 8లో మక్కాపై దాడిచేసి ఖురైషీయుల పీచం అణచివేశారు. ఆ తరువాత యావత్తు అరబ్ తెగలు ఏకమయి దైవప్రవక్త (సల్లం) నిర్వహిస్తున్న సమాజ సంస్కరణోద్యమాన్ని తుదముట్టించడానికి చివరిసారిగా ప్రయత్నించి (హునైన్ యుద్ధంలో) ఘోర పరాజయం చవిచూశాయి. ఈ సంఘటన గురించి మొదటి ప్రసంగం అవతరించింది.

మక్కా ఖురైషీయులు, ఇతర అరబ్‌తెగల బెడద తీరిందనుకుంటే అటు రోమన్లు విజృంభించారు. వారు మదీనాపై దాడి చేయడానికి యుద్ధ సన్నాహాలు ప్రారంభించారని తెలిసి దైవప్రవక్త (సల్లం) వారిని ఎదుర్కోవడానికి బయలుదేరారు. ఆ సందర్భంలో ముస్లింలను యుద్ధానికి ప్రేరేపించేందుకు రెండవ ప్రసంగం అవతరించింది.

మూడవ ప్రసంగంలో కపటవిశ్వాసుల ఆగడాలను ఖండించడం జరిగింది.

మక్కా, హునైన్ యుద్ధాల తరువాత యావత్తు అరేబియాలో ఇస్లాంకు ఎదురు లేకుండా పోయింది. దీంతో ఇస్లామే సత్యధర్మమని గ్రహించిన అరబ్బులు అనేకమంది ఇస్లాం స్వీకరించి ముస్లింలయి పోయారు. అయితే అరేబియా మారుమూల ప్రాంతాల్లో అక్కడక్కడ ఇంకా మిగిలిఉన్న ఇస్లాంవ్యతిరేక శక్తులు రోమన్లతో కుమ్మక్కయి మరోసారి విజృంభించాయి.

మక్కావిజయం తర్వాత దైవప్రవక్త (స) వివిధ రాజులకు ఇస్లాం వైపు ఆహ్వానిస్తూ లేఖలు పంపారు. సిరియా సరిహద్దు దగ్గర రోమ్‌రాజ్య అనుకూల క్రైస్తవ తెగల దగ్గరకు కూడా ఒక లేఖ పంప్యారు. అయితే వారు దౌత్యనీతిని ఉల్లంఘించి లేఖ తీసికెళ్ళిన ప్రతినిధివర్గాన్ని దారుణంగా హతమార్చారు. ప్రతినిధివర్గం నాయకుడు కాబ్ బిన్ ఉమైర్ (రజి) మాత్రమే ఎలాగో తప్పించుకొనివచ్చి ఈసంగతి దైవప్రవక్త (స)కు తెలియజేశారు.



దైవప్రవక్త (సల్లం) మరో లేఖ హజ్రత్ హారిస్ బిన్ ఉమైర్ (రజి)కు ఇచ్చి బస్రా రాజ్యాధినేత షుర్జీల్ బిన్ అమ్ర్ దగ్గరక్కూడా పంపించారు. అయితే అతను కూడా ప్రవక్త రాయబారిని అన్యాయంగా చంపేశాడు. అలాంటి పరిస్థితిలో దైవప్రవక్త (సల్లం) హి.శ. 8లో మూడువేల మంది సైన్యంతో సిరియా సరిహద్దులకు బయలుదేరారు. అటు నుంచి షుర్జీల్ లక్షమంది సైన్యంతో వచ్చాడు. వేరొక వైపు రోమ్‌రాజ్యాధినేత ఖైసర్ చక్రవర్తి తన సోదరుని నాయకత్వంలో మరో లక్షమంది సైన్యాన్నిచ్చి అతని సహాయం కోసం పంపాడు. అయితే ఆ సైన్యం వచ్చి చేరుకోక ముందే షుర్జీల్ సైన్యం మూతా వద్ద ముస్లిం సైన్యాన్ని ఢీకొని ఘోర పరాజయం పాలై పారిపోయింది. ఈ సంఘటన తరువాత కూడా అనేక తెగలు ఇస్లాం స్వీకరించాయి.

మరుసటి సంవత్సరం ఖైసర్ చక్రవర్తి ముస్లింల మీద ప్రతీకారం తీర్చుకోవడానికి సిరియా సరిహద్దులపై పెద్దఎత్తున సైన్యాన్ని మోహరింపజేసి యుద్ధానికి సమాయత్తమయ్యాడు. ఆనాడు రోమ్, ఈరాన్‌లు యావత్తు ప్రపంచంలో అగ్రరాజ్యాలుగా ఉండేవి. అలాంటి అగ్రరాజ్యాలలో ఒక దాంతో ఢీకొనడానికి దైవప్రవక్త (సల్లం) 30 వేల సైన్యంతో బయలుదేరారు. అది ఇస్లాంకు ఎదురైన అత్యంత క్లిష్టపరిస్థితి. నడి ఎండాకాలం, చాలీచాలని వనరులు. మరొక వైపు కపట విశ్వాసులు రకరకాల కుట్రలతో పక్కలో బల్లెమయి కూర్చున్నారు. ఈ స్థితిలో ముస్లింలు రోమ్ రాజ్యంతో తలపడటానికి బయలుదేరడం అంటే వారు మృత్యు కుహరంలోకి వెళ్తున్నట్లేనని అవిశ్వాసులంతా భావించారు. అయితే ముస్లిం సైన్యం తబూక్ ప్రాంతానికి చేరుకునేటప్పటికి, రోమ్ సేనలు యుద్ధం మానుకొని సిరియా సరిహద్దు వదలి వెనక్కివెళ్ళిపోయినట్లు తెలిసింది. దాంతో ముస్లింలు కూడా చల్లగా ఊపిరి పీల్చుకొని వెనుదిరిగారు.

ఈ విజయం తరువాత ఇస్లాం మరింత బలం పుంజుకుంది. దేశం నలుమూలల నుండి ప్రజలు తండోపతండలుగా మదీనా వచ్చి ఇస్లాం స్వీకరించసాగారు. ఇలాంటి స్థితిలో కాబాగృహాన్ని బహుదైవారాధకుల నుండి పూర్తిగా విముక్తం చేయడం, పాతకాలం నాటి దురాచారాలను నిర్మూలించడం, ముస్లింలను మరింత ఉత్తేజపరచడం, కపట విశ్వాసుల దురాగతాలను ఎండగట్టడం ఎంతో అవసరమయ్యాయి. వీటిని గురించే ఈ అధ్యాయంలో ఎక్కువగా పేర్కొనడం జరిగింది.

+++++++

**మీరు ఒడంబడిక చేసుకున్న బహుదైవారాధకులకు దేవుని తరపున, ఆయన** ప్రవక్త తరపున ఒప్పందం నుండి (ఇలా) విముక్తి ప్రకటన (విన్పించు): "మీరిక దేశంలో నాలుగు నెలలు మాత్రమే (మీ ఇష్టానుసారం) సంచరించగలరు. గుర్తుంచుకోండి, మీరు దేవుని పట్టు నుండి ఏమాత్రం తప్పించుకోలేరు. సత్యతిరస్కారుల్ని దేవుడు తప్పని సరిగా పరాభవం పాల్జేస్తాడు." (1,2)

దేవుని వైపున, ఆయనప్రవక్త వైపున మహాహజ్ దినాన ప్రజలందరికీ ఓ బహిరంగ ప్రకటన: "దేవుడు, ఆయనప్రవక్త (సల్లం) బహుదైవారాధకుల పట్ల విసుగెత్తి పోయారు. ఇప్పుడైనా మీరు పశ్చాత్తాపపడి క్షమాపణ కోరితే మీకే మంచిది. ఒకవేళ ముఖం తిప్పుకుంటే గుర్తుంచుకోండి, మీరు దేవుని పట్టునుండి ఏమాత్రం తప్పించుకోలేరు."

ప్రవక్తా! సత్యతిరస్కారులకు అత్యంత కఠినశిక్ష పడుతుందని శుభవార్త వినిపించు! అయితే మీతో ఒడంబడిక చేసుకొని దాన్ని పాటించడంలో ఎలాంటి కొరత చేయక పోవడమే గాకుండా, మీకు వ్యతిరేకంగా మరెవరికీ ఎలాంటి సహాయం చేయని బహు దైవారాధకులకు ఈ హెచ్చరిక వర్తించదు. అలాంటివారి పట్ల మీరు కూడా ఒప్పందం గడువు ముగిసే వరకు నిజాయితీగా వ్యవహరించండి. దేవుడు (నిజాయితీతో మసలుకునే) దైవభీతిపరాయణులనే ప్రేమిస్తాడు. (3-4)

పవిత్రమాసాలు (అంటే ప్రకటనలో పేర్కొనబడిన నాలుగు నెలల గడువుకాలం) ముగిసిపోగానే బహుదైవారాధకులను (యుద్ధంలో) ఎక్కడ ఎదురైతే అక్కడ వధించండి. వారిని పట్టుకోండి. చుట్టుముట్టండి. వారికోసం అనువైన ప్రతి చోటా మాటువేసి కూర్చోండి. ఒకవేళ వారు క్షమాపణ చెప్పుకొని నమాజ్, జకాత్ విధులు పాటించడం ప్రారంభిస్తే వారిని వదలిపెట్టండి. దేవుడు గొప్పక్షమాశీలి, అపార దయామయుడు. బహుదైవారాధకుల్లో ఎవరైనా (దైవవాణి వినేందుకు) మీ దగ్గరికి రాదలచుకుంటే దైవవాణి వినేవరకు అతనికి ఆశ్రయం ఇవ్వండి. ఆ తరువాత అతడ్ని అతని భద్రతా స్థలానికి సురక్షితంగా చేర్చండి. వారు (సత్యం ఎరగని) జ్ఞానశూన్యులు. అందువల్ల మీరిలా చేయవలసి ఉంటుంది. (5-6)

ఈ బహుదైవారాధకుల ఒడంబడిక దేవుని దగ్గర, ఆయనప్రవక్త దగ్గర ఎలా నిలుస్తుంది? కాని మీరు ప్రతిష్ఠాలయం (కాబాగృహం) వద్ద ఒప్పందం చేసుకున్న బహుదైవారాధకుల సంగతి వేరు. వారు మీపట్ల సవ్యంగా ఉన్నంతవరకు మీరు కూడా వారిపట్ల సవ్యంగానే ఉండండి. దేవుడు (ఇలాంటి) భయభక్తులు కలవారినే ప్రేమిస్తాడు. వారు తప్ప ఇతర బహుదైవారాధకులతో ఒప్పందం ఎలా సాధ్యమవుతుంది? మీమీద వారు పైచేయిగా ఉంటే మీ విషయంలో ఎలాంటి బంధుత్వాన్నీ ఖాతరుచేయరు. ఒప్పందాన్ని కూడా ఖాతరుచేయరు. వారు కేవలం మాటలతో మిమ్మల్ని తృప్తిపరచడానికి ప్రయత్నిస్తారు. వారి హృదయాలు మాత్రం వాటిని నిరాకరిస్తాయి. వారిలో చాలా మంది దుర్జనులే ఉన్నారు. (7-8)

వారు దేవుని సూక్తులు స్వల్పమూల్యానికి అమ్ముకొని, ప్రజలను దైవమార్గం వైపు రాకుండా నిరోధిస్తూ చాలా చెడ్డపని చేస్తున్నారు. వారు విశ్వాసుల విషయంలో ఎలాంటి బంధుత్వాన్నిగాని, ఒప్పందాన్నిగాని ఖాతరుచేయరు. అన్యాయం, అతిక్రమణలు ఎల్లప్పుడూ వారివైపు నుండే మొదలవుతాయి. ఇప్పటికైనా వారు పశ్చాత్తాపం చెంది నమాజ్, జకాత్ విధులు పాటించడం ప్రారంభిస్తే వారు మీ ధార్మిక సోదరులవుతారు. వాస్తవికతను అర్థంచేసుకునేవారి కోసం మేము మా ఆజ్ఞల్ని వివరిస్తున్నాం. (9-11)

ఒకవేళ వారు (దైవాజ్ఞల పాటింపు విషయంలో) ప్రమాణం చేసిన తరువాత, తమ ప్రమాణాలు భంగపరచి మీ ధర్మంపై దాడిచేయడానికి పూనుకుంటే, అలాంటి అధర్మ ధ్వజవాహకులతో యుద్ధం చేయండి. వారి ప్రమాణాలు ఇక ఎంతమాత్రం నమ్మదగినవి కావు. వారు బహుశా (ఖడ్గశక్తి ద్వారానే) దారికి వస్తారు. (12)



మరి మీరు ప్రమాణాలు భంగపరిచే వారితో పోరాడరా? వారు దైవప్రవక్తను దేశం నుండి తరిమి వేశారే! అన్యాయం, అతిక్రమణలు కూడా వారే మొదట ప్రారంభించారు కదా! అలాంటి వారికి మీరు భయపడుతున్నారా? మీరు నిజమైన విశ్వాసులైతే దేవునికి మాత్రమే భయపడాలి. అందుకు ఆయనే అందరికన్నా ఎక్కువ అర్హుడు. కనుక వారితో పోరాడండి. దేవుడు మీ చేతులతో వారిని శిక్షించి అవమానం, అప్రతిష్ఠల పాల్జేస్తాడు. వారికి వ్యతిరేకంగా మీకు సహాయం చేస్తాడు. అంతేకాదు, విశ్వాసుల గుండెలలో మండుతున్న (ప్రతీకార) జ్వాలల్ని చల్లబరచి వారి హృదయాలకు శాంతీ సంతృప్తులు చేకూర్చుతాడు. ఇంకా తాను తలచినవారికి పశ్చాత్తాపం చెందే సద్బుద్ధి కూడా ప్రసాదిస్తాడు. దేవుడు సర్వజ్ఞాన సంపన్నుడు, మహా వివేకవంతుడు. (13-15)

ఏమిటీ, మిమ్మల్ని (పరీక్షించకుండా) ఇట్టే వదిలెయ్యడం జరుగుతుందని భావిస్తున్నారా మీరు? మీలో (సత్యంకోసం) ప్రాణాలొడ్డి పోరాడే వారెవరో; దేవుడ్ని, దైవప్రవక్తను, విశ్వాసుల్ని తప్ప మరెవరినీ ప్రాణమిత్రులుగా చేసుకోని వారెవరో దేవుడు ఇంకా పరీక్షించనే లేదు. మీరు చేసేదంతా దేవుడు గమనిస్తూనే ఉన్నాడు. (16)

అవిశ్వాసులు (తమ చేష్టల ద్వారా) సత్యతిరస్కారానికి వ్యతిరేకంగా తమకు తామే సాక్ష్యం ఇచ్చుకున్నారు. వారు (గతంలో) చేసుకున్న సత్కార్యాలన్నీ వ్యర్థమయి పోయాయి. వారిక నరకంలోనే శాశ్వతంగా పడిఉంటారు. అలాంటివారు దైవగృహాలకు ధర్మకర్తలయి కూర్చోవడం ఎంతమాత్రం తగదు. దేవుడ్ని, పరలోకాన్ని విశ్వసించినవారే దైవగృహాలకు సేవ చేయడానికి అర్హులవుతారు. వారు నమాజ్ స్థాపిస్తారు; జకాత్ చెల్లిస్తారు; దేవునికి తప్ప మరెవరికీ భయపడరు. అలాంటివారే సన్మార్గంలో నడుస్తారని ఆశ ఉంటుంది. (17-18)

హజ్ యాత్రికులకు నీళ్ళు సరఫరా చేసి, ప్రతిష్ఠాలయానికి సేవచేసే వ్యక్తీ; దేవుడ్ని, పరలోకాన్ని విశ్వసించి దైవమార్గంలో ప్రాణాలొడ్డి పోరాడే వ్యక్తీ- వీళ్ళిద్దరు ఒకటేనని మీరు భావిస్తున్నారా? దేవుని దృష్టిలో వారుభయులు సమానులు కారు. దేవుడు దుర్మార్గులకు ఎన్నటికీ సన్మార్గం చూపడు. (19)

సత్యాన్ని విశ్వసించి దైవమార్గంలో ఇల్లూవాకిలి వదలి, (సత్యం కోసం) ధనప్రాణాలొడ్డి పోరాడేవారి స్థాయి మాత్రమే దేవుని దృష్టిలో విలువయినది. అలాంటివారి జీవితమే సార్థకమవుతుంది. వారి ప్రభువు వారికి తన కారుణ్యం, ప్రసన్నతా భాగ్యాలతో పాటు శాశ్వత సౌఖ్యాలతో కూడిన స్వర్గవనాలు ప్రసాదిస్తాడని శుభవార్త వినిపిస్తున్నాడు. ఆ స్వర్గవనాల్లోనే వారు కలకాలం (హాయిగా) ఉంటారు. (సన్మార్గగాములకు) ప్రతిఫలం ఇవ్వడానికి దేవుని దగ్గర అపార నిక్షేపాలు ఉన్నాయి. (20-22)

విశ్వాసులారా! మీ తండ్రులు, సోదరులు విశ్వాసానికి బదులు అవిశ్వాసానికే ప్రాధాన్యమిస్తే అలాంటివారిని కూడా స్నేహితులుగా (సన్నిహితులుగా) చేసుకోకండి. అలాంటి వారిని స్నేహితులుగా చేసుకున్నవారే దుర్మార్గులు. (23)

ప్రవక్తా! వారికిలా చెప్పు: "మీ తండ్రులు, కొడుకులు, సోదరులు, భార్యలు, బంధుమిత్రులే గాక మీరు కూడబెట్టుకున్న ఆస్తులు, (సత్యాన్ని విశ్వసిస్తే) మందగించి పోతాయేమోనని మీరు భయపడుతున్న మీ వ్యాపారాలు, మీకు ప్రీతికరమైన మీ ఇండ్లు- ఇవన్నీ మీకు దేవుని కంటే, ఆయన ప్రవక్త కంటే, ఆయన మార్గంలో జరిపే పోరాటం కంటే ఎక్కువ ప్రియమైనవయితే మీ విషయంలో దేవుని నిర్ణయం వచ్చేదాకా ఎదురుచూడండి. (అలాంటి) దుర్జనులకు దేవుడు ఎన్నటికీ సన్మార్గావలంబన బుద్ధి ప్రసాదించడు." (24)

ఇంతకుపూర్వం దేవుడు మీకు అనేక సందర్భాల్లో సహాయం చేసివున్నాడు. ఈ మధ్య నే జరిగిన హునైన్ యుద్ధంలో కూడా చేశాడు. ఆరోజు మీరు మీ సంఖ్యాబలం చూసుకొని విర్రవీగారు. కాని మీ సంఖ్యాబలం మీకు ఎలాంటి ప్రయోజనం చేకూర్చలేక పోయింది. ఎంతో విశాలమయినభూమి మీకు ఇరుకయి పోయింది. మీరు వెన్నుజూపి పారిపోసాగారు. (25)

అప్పుడు దేవుడు తన ప్రవక్తకు, విశ్వాసులకు మనోనిబ్బరం ప్రసాదించాడు. మరోవైపు మీకు కన్పించని (దైవదూతల) సైన్యాన్ని కూడా దించి సత్యతిరస్కారుల్ని శిక్షించాడు. సత్యాన్ని తిరస్కరించేవారికి తగిన శాస్తి అదే. ఈ విధంగా సత్యతిరస్కారుల్ని శిక్షించిన తరువాత దేవుడు తాను తలచినవారికి పశ్చాత్తాపంచెందే సద్బుద్ధి కూడా ప్రసాదించాడు. దేవుడు గొప్ప క్షమాశీలి, అమిత దయామయుడు. (26-27)

విశ్వాసులారా! బహుదైవారాధకులు అపవిత్రులు గనక ఈ సంవత్సరం తర్వాత వారిని ప్రతిష్ఠాలయం(కాబాగృహం) దరిదాపులకు రానివ్వకండి.[1] ఒకవేళ (మీ వ్యాపారం మందగించి) మీరు లేమికి గురవుతారని భయపడితే (అలా భయపడనవసరం లేదు.) దేవుడు తలిస్తే తన ప్రత్యేక అనుగ్రహంతో మిమ్మల్ని ధనికులుగా చేస్తాడు. దేవుడు సర్వజ్ఞాని, మహా వివేకవంతుడు. (28)

గ్రంథప్రజల్లో కూడా దేవుడ్ని, అంతిమదినాన్ని విశ్వసించనివారితో యుద్ధం చేయండి. దేవుడు, ఆయనప్రవక్త నిషేధించినవాటిని వారు నిషేధితాలుగా పరిగణించడం లేదు. సత్యధర్మాన్ని తమ జీవన ధర్మంగా చేసుకోవడం లేదు. కనుక వారు మీకు పూర్తిగా లొంగిపోయి తమ చేతులారా జిజ్యా (భద్రతారుసుం)[2] చెల్లించనంత వరకూ వారితో పోరాడండి. (29)

---

1. ఇక్కడ అపవిత్రులంటే ఏకేశ్వరరాధనకు వ్యతిరేకమైన విశ్వాసం, ఆచారాలు, నడవడికలు కలవారని అర్థం. కాబాగృహం యావత్తు ప్రపంచంలోనే ఏక దైవరాధనా కేంద్రం గనక ఇక నుంచి అలాంటి అంధవిశ్వాసాలు, మూఢాచారాలు ఇక్కడ కొనసాగడానికి వీల్లేదని దైవాజ్ఞ అయింది.

2. జిజ్యా అంటే, ఇస్లామీయ రాజ్యంలోని ముస్లిమేతరులు తమ మతాచారాలు పాటించ డానికి పొందే స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకు, విదేశీ శక్తుల దాడుల నుంచి ప్రభుత్వం కల్పించే రక్షణకు ప్రతిఫలంగా ఇస్లామీయ ప్రభుత్వానికి ప్రతియేటా చెల్లించవలసిన "భద్రతా రుసుం" అన్నమాట. ఇమాం అబూ యూసుఫ్ (రహ్మాలై) ప్రకారం ముస్లిమేతరుల్లో స్తోమత కలిగిన పురుషులు మాత్రమే



యూదులు ఉజైర్‌ని దేవుని కుమారుడంటారు. అలాగే క్రైస్తవులు కూడా మసీహ్‌ని దేవుని కుమారుడంటారు. ఇవన్నీ వారు తమ నోటికొచ్చినట్లు పలుకుతున్న నిరాధారమయిన మాటలు మాత్రమే. గతంలో సత్యాన్ని తిరస్కరించినవారు ఎలాంటి పలుకులు పలికేవారో, వీరు కూడా వారిని (గుడ్డిగా) అనుకరిస్తూ అలాంటి నిరాధారమయిన పలుకులే పలుకుతున్నారు. దేవుడు వారిని నాశనం చెయ్య, ఎలా మోస పోతున్నారు వారు! (30)

వారు నిజదేవుడ్ని వదలి తమ ధర్మవేత్తలు, సాధువులను దేవుళ్ళుగా, ప్రభువులుగా చేసుకున్నారు.[3] అలాగే మర్యం కుమారుడు మసీహ్‌ని కూడా. కాని ఏకైక దేవుడ్ని తప్ప

---

జిజ్యా చెల్లించవలసి ఉంటుంది. స్త్రీలు, పిల్లలు, వృద్ధులు, అంధులు, సన్యాసులు, దేవాలయాల్లో పనిచేసే ఉద్యోగులు జిజ్యా చెల్లింపు నుండి మినహాయించబడ్డారు.

దీనికి భిన్నంగా జకాత్‌ను ఆర్థిక స్తోమత కలిగిన ప్రతి ముస్లిం తప్పని సరిగా ప్రభుత్వానికి చెల్లించవలసి ఉంటుంది. స్త్రీలయినా, పిల్లలైనా, వృద్ధులైనా, వికలాంగులైనా, మరెవరైనా సరే ధనికులయి ఉంటే చాలు, వారు విధిగా జకాత్ చెల్లించవలసిందే. అంతేకాదు, విదేశీ శక్తుల నుండి ప్రమాదం ఎదురైనప్పుడు శారీరకశక్తి ఉండే ప్రతి ముస్లిం పురుషుడు తప్పని సరిగా యుద్ధంలో పాల్గొనవలసి ఉంటుంది. ముస్లిమేతరులు ఆ యుద్ధంలో పాల్గొనవసరం లేదు. ముస్లిమేతరులు జిజ్యా చెల్లిస్తున్నందున వారికి రక్షణ చేకూర్చడానికి ముస్లింలే విదేశీశక్తులతో పోరాడుతారు.

ప్రఖ్యాత యూద పండితుడు జర్జి జైదాన్ "ఇస్లామీయ సంస్కృతీ చరిత్ర" అనే తన గ్రంథంలో 'జిజ్యా' ను గురించి రాస్తూ ఇలా పేర్కొన్నాడు:

"ముస్లింలు యర్మూక్ యుద్ధంలో శత్రువులతో తలపడవలసిన పరిస్థితి రాకముందు వరకూ హమాస్ పట్టణం ముస్లింల అధీనంలోనే ఉండేది. అయితే వారు పరిస్థితి గమనించి హమాస్‌వాసుల నుండి లోగడ వసూలు చేసిన జిజ్యా (భద్రతా రుసుం) హమాస్ వాసులకు తిరిగి ఇచ్చివేస్తూ- 'మేమిప్పుడు ఓ పెద్ద సమస్య (యుద్ధం)లో చిక్కుకున్నాము. ఈ పరిస్థితిలో మేము మీకు రక్షణ కల్పించలేం. అందువల్ల మీకు ఇష్టమైన రీతిలో మీరంతట మీరే స్వీయరక్షణ ఏర్పాట్లు చేసుకోండి' అన్నారు. హమాస్‌వాసులు ఈ మాటలు విని 'మేమింతకు ముందు అనుభవించిన దౌర్జన్యాలకన్నా మీ రాజ్యం, మీ న్యాయదృష్టే మాకెంతో ప్రియమైనవి. మేము మీ యోధులతో కలసి హమాస్ పట్టణాన్ని హెర్క్యులస్ సేనల నుండి కాపాడుతాం' అని చెప్పారు."

3. పూర్వం క్రైస్తవమతంలో ఉండి ఆ తర్వాత ఇస్లాం స్వీకరించిన హజ్రత్ అదీ బిన్ హాతిం (రజి) దైవప్రవక్త (సల్లం) ముందు ఈ సూక్తిని ప్రస్తావిస్తూ "ఈ సూక్తిలో మేము మా ధర్మవేత్తలను, సాధువులను దేవుళ్ళుగా చేసుకున్నామనే అభియోగం మామీద మోపబడింది. (నిజానికి మేము మా ధర్మవేత్తల్ని, సాధువుల్ని ఆరాధించడం లేదు కదా! (మరి దీని గూఢార్థం ఏమిటీ?)" అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) "వారు నిషేధించిన వాటిని మీరు నిషేధితాలుగా, వారు ధర్మసమ్మతం (హలాల్) చేసిన వాటిని మీరు ధర్మసమ్మతమైనవిగా ఒప్పుకోవడం లేదా?" అని అడిగారు. అది విని హజ్రత్ అదీ (రజి) "నిజమే, మేము ఆవిధంగానే చేస్తున్నాం" అని చెప్పారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) "వారిని దేవుళ్ళుగా, ప్రభువులుగా ఆరాధించడమంటే ఇదే" అన్నారు. (ఇబ్నె కసీర్)

దీన్నిబట్టి ఎవరైనా దైవగ్రంథంలో ప్రమాణం లేకపోయినా" ఇది ధర్మం, అది అధర్మం" అని హద్దులు నిర్ణయిస్తే నిజానికి వారు దేవుని స్థానంలో దేవుళ్ళయి కూర్చున్నారన్నమాట. వారి ఆజ్ఞలను ధర్మశాస్త్రం ఆజ్ఞలుగా పరిగణించి పాటించేవారు నిజానికి వారిని దేవుళ్ళుగా ఆరాధిస్తున్నారన్నమాట.

మరెవరినీ ఆరాధించకూడదని వారికి ఆజ్ఞ ఇవ్వబడింది. ఆయన తప్ప మరెవరూ ఆరాధనకు, దాస్యానికి అర్హులు కారు. వారు కల్పించుకున్న బహుదైవారాధనాభావాలకు, పలుకులకు ఆయన ఎంతో అతీతుడు, పవిత్రుడు. (31)

వారు తమ నోటితో దేవుని జ్యోతి (సత్యధర్మం) ఆర్పివేయ గోరుతున్నారు. కాని సత్యతిరస్కారులకు ఎంత వెగటు కలిగినా దేవుడు మాత్రం తన జ్యోతిని నేల నాలుగు చెరగులా ప్రసరింపజేయనిదే వదలిపెట్టడు. సత్యధర్మం బహుదైవారాధకులకు ఏమాత్రం నచ్చకపోయినాసరే ఇది యావత్తు జీవనవ్యవస్థలపై ఆధిక్యత పొందడానికి ఆ దేవుడే తన (అంతిమ)ప్రవక్తకు సత్యాన్ని, హితబోధను ఇచ్చి పంపాడు. (32-33)

విశ్వాసులారా! గ్రంథప్రజలకు చెందిన ధర్మవేత్తలు, సాధువులలో అనేకమంది అక్రమ పద్ధతుల ద్వారా ప్రజల ధనాన్ని కాజేస్తున్నారు. పైగా వారిని దైవమార్గంలోకి రాకుండా నిరోధిస్తున్నారు. వెండిబంగారాలు కూడబెట్టి వాటిని దైవమార్గంలో విని యోగించని పిసినారులకు దుర్భర యాతన కాచుకొని ఉందని శుభవార్త వినిపించు! ఆ వెండిబంగారాలనే నరకాగ్నిలో బాగా కాల్చి వారి నుదుళ్ళపై, పక్కలపై, వీపులపై వాతలుపెట్టే రోజు (త్వరలోనే) వస్తుంది. "ఇవే మీరు కూడ బెట్టుకున్న సిరిసంపదలు, ఇక వీటిని చవిచూడండి" (అని అప్పుడు వారికి చెప్పబడుతుంది). (34,35)

దేవుడు భూమ్యాకాశాలను సృష్టించిన నాటినుండి నెలలసంఖ్య ఆయన నిర్దే శించిన నియామకం (అదృష్టం) ప్రకారం పన్నెండు మాత్రమే. వాటిలో నాలుగు పవిత్ర మాసాలు. ఇదే సరైన పద్ధతి. కనుక ఈ నాలుగు నెలలు మీరు ఆత్మవంచనకు పాల్పడ కుండా అందరూ కలసి బహుదైవారాధకులతో పోరాడండి. వారు కలసికట్టుగా మీతో ఎలా పోరాడుతున్నారో మీరూ సమైక్యమయి సంఘటితశక్తితో వారిని ఎదుర్కోండి.[4] గుర్తుంచుకోండి, భయభక్తులు కలవారినే దేవుడు ప్రేమిస్తాడు. (36)

మాసమార్పిడి పద్ధతి[5] అవిశ్వాసానికి అదనంగా మరొక అవిశ్వాస చేష్టవుతుంది. దానిద్వారా బహుదైవారాధకులు (మరింత) మార్గభ్రష్టత్వంలో పడిపోతున్నారు. ఒక

---

4. చాంద్రమానం ప్రకారం అనాది నుండి సంవత్సరానికి పన్నెండు నెలలే. 'అధికమాసం' లేదు. ఈ పన్నెండు నెలల్లో నాలుగు (అంటే జీఖాదా, జిల్‌హజ్జ, ముహర్రం, రజబ్) నెలలు పవిత్ర మాసాలు. ప్రాచీనకాలం నుండే అరబ్బులు ఈ నాలుగు నెలల కాలంలో యుద్ధం, రక్తపాతాలు లేకుండా ప్రశాంతంగా హజ్‌యాత్ర జరుపుకోవడానికి, వ్యాపారం చేసుకోవడానికి వీలుగా వాటిని నిషిద్ధ మాసాలుగా (అంటే పవిత్ర మాసాలుగా) పరిగణిస్తూ వస్తున్నారు. ఇస్లాం కూడా ఈ పద్ధతిని ఆమోదించింది. అయితే మక్కా బహుదైవారాధకులు ఇస్లాం ఉద్యమాన్ని అణచివేసే ఉద్దేశ్యంతో నిషిద్ధ మాసాల్లో సైతం ముస్లింలపై దాడులు ప్రారంభించారు. దేశంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించారు. అందువల్ల ముస్లింలు కూడా యుద్ధభేరి మోగించి వారి దాడులను ఎదుర్కోవాలని ఇక్కడ ఆదేశించబడింది. (ఇతర వివరాలకు 2:194 సూక్తి చూడండి.)

5. పూర్వం అరేబియాలో ఈ 'మాసమార్పిడి' పద్ధతి రెండు రకాలుగా ఉండేది. ఒకటి, ప్రతీకార యుద్ధాల కోసం ఒక నిషిద్ధ మాసాన్ని ధర్మసమ్మతం చేసుకొని ఆ తరువాత సంవత్సరంలో



యేడు వారు ఒక నెలను ధర్మసమ్మతం చేసుకొని మరొక యేడు దాన్ని నిషేధించు కుంటారు. దేవుడు నిషేధించిన నెలల సంఖ్యను పూర్తిచేయడానికి, ఆ నెలలు ధర్మ సమ్మతం కావడానిక్కూడా ఈ విధంగా చేస్తారు. (ఇలా) వారి దుష్కృత్యాలు వారికి పుణ్యకార్యాలుగా తోచేటట్లు చేయబడ్డాయి. దేవుడు (అలాంటి) సత్యతిరస్కారులకు ఎన్నటికీ సన్మార్గం చూపడు. (37)

విశ్వాసులారా! ఏమయింది మీకు, దైవమార్గంలో (పోరాడేందుకు) బయలుదేర మంటే నేలకు అతుక్కుపోతున్నారు? మీరు పరలోకానికి బదులు ప్రాపంచిక జీవితాన్నే ఎక్కువగా ప్రేమిస్తున్నారా? కాని పరలోక (సుఖ)జీవనం ముందు ఈప్రాపంచిక జీవిత సౌఖ్యం మూన్నాళ్ళ ముచ్చట మాత్రమే. ఏమైనప్పటికీ ఈపనికి మీరు ఉపక్రమించకపోతే దేవుడు మీకు వ్యధాభరితమైన శిక్ష విధిస్తాడు. ఆ తర్వాత మీ స్థానంలో మరోజాతిని (ఈపని కోసం) ఆవిర్భజేస్తాడు. మీరు దేవునికి ఎలాంటి నష్టం కలగజేయలేరు. ఆయన ప్రతిపనీ చేయగల సమర్థుడు, సర్వశక్తిమంతుడు. (38-39)

మీరు దైవప్రవక్తకు తోడ్పడనంత మాత్రాన ముంచుకొచ్చే ప్రమాదమేదీ లేదు. సత్య తిరస్కారులు అతడ్ని (మక్కానుండి) వెళ్ళగొట్టిన కిష్టపరిస్థితిలో సైతం దేవుడు అతడ్ని ఆదుకున్నాడు. అప్పుడతను కేవలం ఇద్దరిలో ఒకడిగా ఉన్నాడు. వారిద్దరు కొండగుహలో దాక్కున్నప్పుడు అతను తన సహచరునితో "విచారపడకు, దేవుడు మనకు తోడున్నాడ"ని అన్నాడు.[6] అప్పుడు దేవుడు అతనికి మనోనిబ్బరం ప్రసాదించాడు. అంతేకాదు, మీకు

---

నిషిద్ధమాసాల సంఖ్యను పూర్తిచేయడానికి ధర్మసమ్మతమైన ఒక నెలను నిషిద్ధమాసంగా చేసుకునే వారు. రెండవ రకం, హజ్‌యాత్ర ఎల్లప్పుడూ ఒకే సీజన్‌లో వచ్చేవిధంగా చాంద్రమాన సంవత్సరా నికి ఒక నెల అధికంగా చేర్చి దాన్ని సూర్యమాన సంవత్సరంగా చేసేవారు. చాంద్రమానం ప్రకార మయితే హజ్ సీజన్ ఎముకలు కొరికే చలికాలంలో, తీవ్రమైన వేసవికాలంలో కూడా వస్తుంది. ఈ ఇబ్బందిని అధికమించడానికి పైవిధంగా చాంద్రమాన సంవత్సరానికి ఒక నెలను అదనంగా చేర్చేవారు. ఈ రెండు పద్ధతుల్ని ఇస్లాం నిషేధించింది.

6. మక్కా బహుదైవారాధకులు దైవప్రవక్త (సల్లం)ను హతమార్చడానికి నిర్ణయించుకొని ఓరోజు రాత్రివేళ ఆయన ఇంటి ముందు కాపుకాశారు. ఆయన బయటికి రాగానే ఒక్కసారిగా అందరూ మీదపడి చంపివేయాలని అనుకున్నారు. అయితే అదే రాత్రి దైవప్రవక్త (సల్లం) వారి కళ్ళు గప్పి బయటికి వెళ్ళిపోయారు. ఇంట్లో, తన పక్కమీద హజ్రత్ అలి (రజి)ని పడుకోమని, తరువాత తన దగ్గర ప్రజలు భద్రపరచుక్ను ధనకనక వస్తువుల్ని ఎవరివి వారికి అప్పగించి మదీనా వచ్చేయ మని చెప్పి, హజ్రత్ అబూబకర్ (రజి) ఇంటికి వెళ్ళారు. అక్కడ ఆయన్ని వెంట బెట్టుకొని వెళ్ళి పట్టణం పొలిమేరల్లోని సౌర్ గుహలో మూడురోజులు తలదాచుకున్నారు.

దైవప్రవక్త (సల్లం) ఇంటి నుండి వెళ్ళిపోయారని తెలుసుకున్న శత్రువులు పట్టణం నలు దిక్కులా వెతకడానికి బయలుదేరారు. వారిలో కొందరు సౌర్ గుహ సమీపానికి చేరుకున్నారు. కాని దేవుడు గుహ ముఖద్వారానికి సాలెగూడు కల్పించడంతో శత్రువులు నిరాశతో వెనుదిరిగి వెళ్ళి పోయారు. అప్పుడు హజ్రత్ అబూబకర్ (రజి) ఆందోళనపడుతూ "వారిలో ఎవరైనా మరికాస్త ముందుకు వచ్చి గుహలోకి తొంగి చూస్తే మనం కన్పిస్తాము" అన్నారు. దానికి దైవప్రవక్త (సల్లం) ఆయనకీ విధంగా ధైర్యం చెప్పారు.

కన్పించని సైన్యాల ద్వారా కూడా అతనికి సహాయం చేసి అవిశ్వాసుల వాణిని (ప్రయత్నాలను) వమ్ముచేశాడు. దేవుని వాణి మాత్రం సర్వదా సర్వోన్నతమయినదే. దేవుడు మహా శక్తిమంతుడు, అత్యంత వివేకవంతుడు. కనుక (ఇకనయినా) బయలు దేరండి తేలికగానైనా, భారంగానైనా[7] దైవమార్గంలో ధనప్రాణాలొడ్డి పోరాడండి. మీరు విషయం గ్రహిస్తే అందులోనే మీ శ్రేయస్సు ఉంది. (40,41)

ముహమ్మద్ (సల్లం)! ప్రయోజనం సులభసాధ్యమయి, ప్రయాణం తేలిగ్గా ఉంటే కపటవిశ్వాసులు తప్పకుండా నీ వెంట రావడానికి అంగీకరించి ఉండేవారు. కాని వారికా మార్గం చాలా కఠినమైపోయింది. ఇప్పుడు వారు దేవుని మీద ప్రమాణం చేస్తూ, తాము రాగల స్థితిలో ఉంటే తప్పకుండా మీ వెంట వచ్చేవాళ్ళమని చెబుతారు. (ఈవిధంగా) వారు ఆత్మవంచనకు పాల్పడుతున్నారు. వారు పచ్చి అబద్ధాలకోరులని దేవునికి బాగా తెలుసు. (42)

ప్రవక్తా! దేవుడు నిన్ను క్షమించుగాక. నీవు వారికి ఎందుకు అనుమతి నిచ్చావు? (అనుమతి ఇవ్వకుండా ఉంటే) ఎవరు సత్యవంతులో, ఎవరు అబద్ధాలకోరులో స్వయంగా నీకూ తెలిసిఉండేది.

దేవుడ్ని, అంతిమదినాన్ని విశ్వసించేవారు తమ ధనప్రాణాలతో పోరాడకుండా (ఇంట్లో కూర్చోనీయవలసిందిగా) ఎన్నడూ నిన్ను సెలవు అడగరు. దైవభీతిపరాయ ణులు ఎలాంటి వారో దేవునికి బాగా తెలుసు. దేవుడ్ని, అంతిమదినాన్ని మనస్ఫూర్తిగా నమ్మనివారే ఇలాంటి విజ్ఞప్తులు చేసుకుంటారు. వారి హృదయాల్లో అనుమాన రోగం ఉంది. ఆ అనుమానంతోనే వారు సతమతమయి పోతున్నారు. (43-45)

వారికి నిజంగా (యుద్ధానికి) బయలుదేరాలన్న ఉద్దేశ్యమే ఉంటే దానికోసం వారు తగిన సన్నాహాలు చేసుకునేవారు. కాని వారు బయలుదేరడం దేవునికి ఇష్టం లేదు. అందుకే ఆయన వారిని బద్ధకస్తులుగా చేశాడు. "(ఇంట్లో) కూర్చుండి పోయేవారి తోపాటు మీరూ కూర్చోండి" అని వారికి చెప్పడం జరిగింది.

ఒకవేళ వారు మీతోపాటు బయలుదేరి ఉంటే మీకు లేనిపోని ఇబ్బందులు తెచ్చి పెట్టేవారు. పైగా వారు మీమధ్య కలహాలు సృష్టించడానికి సైతం తీవ్రంగా ప్రయత్నించే వారు. మీలో ఇప్పటికీ కొందరు వారి మాటలు చెవియొగ్గి వినే వారున్నారు. దేవునికి దుర్మార్గుల సంగతి బాగా తెలుసు. (46-47)

ఇంతకు పూర్వం కూడా వారు కలహాలు సృష్టించాడానికి ప్రయత్నించారు. నీ పని విఫలం చేయడానికి వారు రకరకాల పన్నాగాలు పన్ని చూసుకున్నారు. చివరికి వారి అభిమతా నికి వ్యతిరేకంగా సత్యం వచ్చి దేవుని పనే నెరవేరింది. (48)

---

7. తేలికగానైనా, భారంగానైనా అంటే - ఇస్లామీయ రాజ్యానికి శత్రువుల నుండి ప్రమాదం ముంచుకొచ్చినప్పుడు పరిస్థితులు ఎంత క్లిష్టంగా ఉన్నా, ఒనరులు ఎంత తక్కువగా ఉన్నా, మరే ఆటంకాలు ఉన్నా ఎట్టి పరిస్థితుల్లోనూ యుద్ధానికి బయలుదేరాలని అర్థం.



వారిలో ఒకడు "నాకు (ఇంట్లో ఉండిపోవడానికి) అనుమతివ్వండి. నన్ను (అనవసరంగా) మనోవికారానికి గురిచేయకండి" అంటాడు.[8] విను, వారు మనోవికారం లోనే పడిఉన్నారు. ఇలాంటి అవిశ్వాసులకు నరకం చుట్టిముట్టి ఉంది. (49)

మీకు మేలు జరిగితే అది వారికి బాధగా పరిణమిస్తుంది. మీకేదయినా ఆపద వచ్చి పడితే వారు తెగ సంబరపడిపోతూ "మనం ముందే జాగ్రత్త పడటం చాలా మంచిదయి పోయింది" అంటూ వెళ్ళిపోతారు. (ప్రవక్తా!) వారికి చెప్పు: "దేవుడు మా అదృష్టంలో రాసింది తప్ప (కీడుగాని, మేలుగాని) మాకేదీ జరగదు. ఆయనే మా సంరక్షకుడు, సహాయకుడు. విశ్వాసులు ఆయన్నే నమ్ముకుంటారు." (50-51)

వారిని ఇలా అడుగు: 'రెండు మేళ్ళలో ఒక మేలును గురించే కదా మీరు మా విషయంలో ఎదురుచూస్తున్నది? కాని మీ విషయంలో మేము ఎదురుచూస్తున్న సంగతి (వేరు). మిమ్మల్ని స్వయంగా దేవుడయినా శిక్షించాలి లేదా మా చేతనయినా శిక్షింపజేయాలి. దీన్ని గురించే మేము ఎదురుచూస్తున్నాము. కనుక (ఆ సమయం కోసం) మీరూ ఎదురు చూడండి, మీతోపాటు మేమూ ఎదురుచూస్తాము." (52)

చెప్పు: "మీరు మీ ధనాన్ని (దైవమార్గంలో) సంతోషంగా ఇచ్చినా, లేక అయిష్టంగా ఇచ్చినా ఎట్టి పరిస్థితిలోనూ దాన్ని స్వీకరించడం జరగదు. మీరు పరమదుర్మార్గులు." వారిచ్చే ధనం స్వీకరించకపోవడానికి కారణం- వారు దేవునిపట్ల, ప్రవక్తపట్ల తిరస్కార వైఖరి అవలంబించారు. ప్రార్థన చేయడానికి లేస్తే వళ్ళు విరుచుకుంటూ చాలా బద్ధకంతో లేస్తారు. దైవమార్గంలో డబ్బు ఖర్చుపెట్ట వలసివస్తే ఏడ్పుగొట్టు ముఖంతో చాలా అయిష్టంగా ఖర్చుపెడతారు. కనుక (విశ్వాసులారా!) వారి సంతానం, సిరిసంప దలు చూసి ఆశ్చర్యపోకండి. వాటిద్వారా దేవుడు వారిని ఇహలోక జీవితంలోనే శిక్షించ గోరుతున్నాడు. వారు ప్రాణాలు వదలినా అవిశ్వాసస్థితిలోనే వదలుతారు. (53-55)

వారు దేవునిపేరుతో ప్రమాణాలు చేస్తూ తాము మీలోని వాళ్ళమేనంటారు. కాని వారు మీలోని వాళ్లు కానేకారు. వారసలు పిరికిపందలు, భయస్తులు. (బాధ్యతల నుండి తప్పించుకోవడానికి) వారికేదయినా ఆశ్రయంగాని, కొండగుహగాని, లేదా దూరి కూర్చునే ఓ చిన్న బిలంగాని దొరికితే చాలు, వెంటనే వారు పరుగెత్తికెళ్ళి అందులో దాక్కుంటారు. (56-57)

ముహమ్మద్ (సల్లం)! వారిలో (కపటవిశ్వాసులు) కొందరు (జకాత్) దానధర్మాల విషయంలో నీ మీద లేనిపోని నిందారోపణలు మోపుతున్నారు. అందులో కొంత ధనం

---

8. జుద్దా బిన్ ఖైస్ అనే ఓ కపట విశ్వాసి దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి "మహాశయా! నన్ను ఇక్కడే ఉండిపోనివ్వండి. రోమ్ స్త్రీలు చాలా అందంగా ఉంటారు. వాళ్ళను చూస్తే నేను నిగ్రహించుకోలేను. అంచేత అక్కడకు పంపి నన్ను మనోవికారానికి గురిచేయకండి" అని అన్నాడు. యుద్ధానికి వెళ్ళకుండా తప్పించుకోవడానికి కొందరు కపటులు ఈవిధంగా కూడా సాకులు చెప్పి దైవప్రవక్త (సల్లం) దగ్గర అనుమతి తీసుకున్నారు.

ఇస్తే సంతోషిస్తారు. ఇవ్వకపోతే ముఖం మాడ్చుకుంటారు.[9] దేవుడు, దైవప్రవక్త ఇచ్చిన దాంతో వారు సంతృప్తిపడి "మాకు దేవుడే చాలు, ఆయన తన అనుగ్రహంతో మాకు మరింత భాగ్యం ప్రసాదిస్తాడు. ఆయన ప్రవక్త కూడా మాకు ప్రసాదిస్తాడు. మేము దేవుని మీదే మాదృష్టి కేంద్రీకరించి ఉన్నాము" అని అంటే ఎంత బాగుంటుంది! (58-59)

అసలీ దానధర్మాలు (జకాత్) అగత్యపరులకు-1, ఆత్మాభిమానులైన నిరుపేదలకు-2, వాటిని వసూలుచేసే ఉద్యోగుల కోసం-3, హృదయాలు చూరగొనడానికి-4, బానిసల విముక్తికి-5, రుణగ్రస్తుల రుణభారం తగ్గించడానికి-6, దైవమార్గంలో[10] వినియోగించడానికి-7, (నిర్ధనులైన) బాటసారులకు-8 మాత్రమే కేటాయించబడ్డాయి. ఇది దేవుడు నిర్ణయించిన విధి. దేవుడు సర్వం ఎరిగినవాడు, మహావివేకవంతుడు. (60)

వారిలో కొందరు దైవప్రవక్త మనస్సు నొప్పించేవారు కూడా ఉన్నారు. వారు (ఆయన్ని గురించి) "ఈ మనిషి ప్రతిఒక్కడూ చెప్పే మాటలు వింటాడు" అనంటారు. అతను మీ శ్రేయస్సు కోసం ఇలా చేస్తున్నాడు. ఇంకా దేవుడ్ని విశ్వసిస్తున్నాడు. విశ్వసించినవారి పట్ల నమ్మకం ఉంచుతున్నాడు. మీలో విశ్వసించినవారి పాలిట అతను కారుణ్యమూర్తి. (అలాంటి) దైవప్రవక్తను బాధించేవారికి దుర్భరశిక్ష తప్పదు. (61)

వారు మిమ్మల్ని సంతృప్త పరచడానికి ఏవేవో ప్రమాణాలు చేస్తారు. కాని వారు (చిత్తశుద్ధిగల) విశ్వాసులైతే సంతృప్త పరచడానికి దేవుడు, దైవప్రవక్తలే ఎక్కువ అర్హులు. దేవుడ్ని, ఆయన ప్రవక్తను వ్యతిరేకించేవారికి నరకాగ్నే గతని వారికి తెలియదా? అందులోనే వారు శాశ్వతంగా పడివుంటారు. ఇది అత్యంత అవమానకరమైన శిక్ష. (62-63)

ఈ కపటులు తమ మనసులో దాగిన రహస్యాల్ని బట్టబయలుచేసే అధ్యాయం ఏదైనా అవతరిస్తుందేమోనని భయపడుతున్నారు. ప్రవక్తా! వారికిలా చెప్పు: "మీరు అలాగే అపహాస్యం చేస్తూ ఉండండి. మీరు భయపడుతున్న విషయాలను దేవుడు త్వరలోనే బట్టబయలు చేస్తాడు." (64)

మీరు మాట్లాడుతున్నదేమిటని అడిగితే "మేమేదో పరిహాసంగా అంటున్నాము" అంటారు వారు. చెప్పు: "మీరు దేవునితో, ఆయన సూక్తులతో, ఆయన ప్రవక్తతోనా పరిహాసమాడేది? ఇకనైనా సాకులు చెప్పడం మానుకోండి. మీరు సత్యాన్ని విశ్వసించిన తర్వాత తిరస్కారవైఖరి అవలంబించారు. మేము మీలో కొందరిని క్షమించినా మిగిలిన వారిని మాత్రం తప్పకుండా శిక్షిస్తాం. వారు పరమదుర్మార్గులు. (65-66)

కపటపురుషులు, కపటస్త్రీలు అంతా ఒకే కోవకు చెందిన తోడుదొంగలు. వారు

9. కపటుల్ని గురించి మరిన్నివివరాలకు 107:4-7సూక్తులు, వాటిపాదసూచిక చూడండి.

10. ఈ ఎనిమిది పద్దులలో ఒకటి "దైవమార్గంలో" (ఫీ సబీలిల్లాహ్) అని ఉంది. అంటే దైవమార్గంలో జరిపే పోరాటం (జిహాద్) అని అర్థం. (జిహాద్ వివరణ 866వ పేజీలో చూడండి.) ధర్మసంస్థాపన కోసం, ధర్మప్రచారం కోసం చేసే ప్రతి పనీ "ఫీ సబీలిల్లాహ్" పద్దు క్రిందికే వస్తుంది. జకాత్ ప్రాముఖ్యం గురించి 2:43, 2:267 సూక్తులు, వాటి పాదసూచికలు చూడండి.



(ప్రజలకు) చెడును గురించి ఆదేశిస్తారు. మంచివిషయాల నుంచి నిరోధిస్తారు. వారు సత్కార్యాలు చేయకుండా చేతులు కట్టివేసుకున్నారు. వారసలు దేవుడ్నే విస్మరించారు. అంచేత దేవుడు కూడా వారిని విస్మరించాడు. నిస్సందేహంగా కపటులు పరమ దుర్మార్గులు. కపట స్త్రీపురుషులకు, అవిశ్వాసులకు నరకాగ్ని సిద్ధపరచి ఉంచానని, అందులో వారు ఎల్లకాలం పడిఉంటారని దేవుడు వారికి వాగ్దానం చేశాడు. అదే వారికి తగినశిక్ష. దేవుడు వారిని నాశనంచేయ! వారికిక శాశ్వతయాతన తప్పదు. (67,68)

(కపటులారా!) మీ తీరుతెన్నులన్నీ అచ్చం మీకు పూర్వముండిన కపటుల తీరుతెన్నుల్లాగే ఉన్నాయి. వారు మీకంటే ఎక్కువ బలవంతులు, ఎక్కువ సంతానం సిరిసంపదలు కలవారు. కాని వారు (మా ఆజ్ఞలు పెడచెవిన పెట్టి) తమవంతు సౌఖ్యాలు బాగా జుర్రుకున్నారు. వారిలాగే ఇప్పుడు మీరు కూడా మీవంతు సౌఖ్యాలు జుర్రుకోండి. గతంలో వారు ఎలా పనికిమాలిన వాదనల్లో పడిపోయారో మీరు కూడా అలాగే పనికిమాలిన వాదనల్లో పడిపోయారు. చివరికి వారు చేసుకున్న కర్మలన్నీ ఇటు ఇహలోకంలోనూ, అటు పరలోకంలోనూ వ్యర్థమైపోయాయి. అలాంటివారే నష్టపోయేవారు. (69)

ఈ కపటులకు వారి పూర్వీకుల చరిత్ర తెలియదా? నూహ్, ఆద్, సమూద్, ఇబ్రాహీం జాతులు, మద్యన్ ప్రజలు, తలక్రిందులుగా కుదిపేసి ధ్వంసం చేయబడిన పట్టణవాసులు? వారి ప్రవక్తలు వారిదగ్గరకు స్పష్టమైన సూచనలు తీసుకొచ్చారు. (కాని వారు పెడమార్గమే పట్టిపోయారు.) దేవుడు వారికి అన్యాయం చేయలేదు. ఆయన అలాంటివాడు కాదు. వారే తమ ఆత్మలకు అన్యాయం చేసుకున్నారు. (70)

విశ్వసించిన స్త్రీలు, పురుషులంతా ఒకరికొకరు స్నేహితులు, శ్రేయోభిలాషులు. వారు (ప్రజలకు) మంచివిషయాలు బోధిస్తారు. చెడువిషయాల నుండి వారిస్తారు. నమాజ్ (వ్యవస్థ)ను స్థాపిస్తారు. (పేదల ఆర్థికహక్కు) జకాత్ నెరవేరుస్తారు. దేవుని పట్ల, ఆయన ప్రవక్తపట్ల వినయవిధేయతలతో మసలుకుంటారు. వీరిపైన్నే దైవకారుణ్యం వర్షిస్తుంది. నిస్సందేహంగా దేవుడు సర్వశక్తిమంతుడు, మహా వివేకవంతుడు. (71)

విశ్వాసులైన ఈ స్త్రీపురుషుల కోసం సెలయేరులు ప్రవహించే స్వర్గవనాలున్నాయని దేవుడు వాగ్దానం చేస్తున్నాడు. అక్కడే వారు కలకాలం(సుఖసంతోషాలతో) ఉంటారు. నిత్యం కళకళలాడే ఆ స్వర్గవనాలలో వారికోసం అందమైన గృహాలు కూడా ఉంటాయి. అన్నిటికీ మించి దైవప్రసన్నతా భాగ్యం లభిస్తుంది. అదే గొప్పవిజయం, పరమమోక్షం. (72)

ప్రవక్తా[(స)]! అవిశ్వాసులతో, కపటులతో పోరాడండి. వారిపట్ల కఠినంగా వ్యవహరించండి. వారి నివాసం నరకమవుతుంది. అది పరమ చెడ్డస్థలం. వారు దేవుని మీద ప్రమాణం చేస్తూ తామా మాట[11] అనలేదని అంటున్నారు. కాని వారా అవిశ్వాసపు మాటన్నారు. ఇస్లాం స్వీకరించిన తర్వాత (ఇలాంటి వికృతచేష్టలతో) తిరిగి అవిశ్వాస

11. ఇస్లాంను, దైవప్రవక్త (సల్లం)ను కించపరిచే మాటలు.

వైఖరికి పాల్పడ్డారు. వారు (ప్రవక్తకు వ్యతిరేకంగా) ఏదో చేయాలనుకున్నారు. కాని చేయలేకపోయారు.

అసలు వారి కసి, కోపం అంతా దేవుడు, ఆయనప్రవక్త తమ అనుగ్రహంతో వారిని ఐశ్వర్యవంతులుగా చేశారనేనా? ఇప్పటికయినా వారు తమవైఖరి మార్చుకుంటే (మంచిది). అందులోనే వారి శ్రేయస్సుంది. వారు తమవైఖరి మార్చుకోకపోతే మాత్రం దేవుడు వారికి అతి బాధాకరమైన శిక్ష విధిస్తాడు- ఇహంలోనూ, పరంలోనూ. యావత్ప్రపంచంలో వారికి మద్దతిచ్చేవారు, సహాయం చేసేవారు ఎవరూ ఉండరు. (73-74)

వారిలో కొందరు "దేవుడు తన అనుగ్రహంతో తమకు సిరిసంపదలు ప్రసాదిస్తే తాము (ఉదారంగా) దానధర్మాలు చేస్తామని, సజ్జనులయి ఉంటామ"ని ప్రమాణం చేశారు. కాని దేవుడు తన అనుగ్రహంతో వారిని ధనికులుగా చేయగానే వారు పిసినారి తనం వహించారు. వారు తమ ప్రమాణాన్ని ఏమాత్రం ఖాతరు చేయకుండా భంగ పరిచారు. ఇలా వారు దేవుని విషయంలో వాగ్దానభంగానికి పాల్పడటం వల్ల, వారు పలుకుతున్న అబద్ధాల వల్ల దేవుడు వారి హృదయాల్లో కాపట్యం జనింపజేశాడు. వారు దేవుని సన్నిధిలో ప్రవేశపెట్టబడేవరకు ఈ కాపట్యజాడ్యం వారిని వదలదు. (75-77)

వారి గుసగుసలు, రహస్య సమాలోచనలు, చివరికి వారి హృదయాల్లో మెదిలే ఊహలు సైతం దేవునికి తెలియవని వారు భావిస్తున్నారా? ఆయనకు అగోచర విషయాలు తెలియవని అనుకుంటున్నారా?

(ఈ పిసినారులు) మనస్ఫూర్తిగా విశ్వాసులు చేస్తున్న ధన త్యాగాల్ని గురించి ఎత్తి పొడుస్తూ మాట్లాడుతున్నారు. కష్టపడి చెమటోడ్చి ఎంతోకొంత దైవమార్గంలో దానమిస్తున్న (నిరుపేద) విశ్వాసుల్ని ఎగతాళిచేస్తున్నారు. (అలా ఎకసక్కెం, ఎగతాళిచేస్తున్న ఈ పిసినారుల సంగతి దేవునికి బాగాతెలుసు.) అసలు దేవుడే వారిని ఎగతాళి చేస్తున్నాడు. వారికోసం దుర్భరమైన యాతన కాచుకొని ఉంది. (78-79)

ప్రవక్తా! ఇలాంటి వారిని క్షమించమని నీవు విజ్ఞప్తి చేసినా, చేయకపోయినా ఒకటే. పైగా నీవు వారిని క్షమించమని డెబ్భైసార్లు మొరపెట్టుకున్నా దేవుడు వారిని ఎన్నటికీ క్షమించడు. వారు దేవుడ్ని, ఆయన ప్రవక్తను తిరస్కరించారు. అలాంటి దుర్మార్గులకు దేవుడు ఎన్నటికీ సన్మార్గం చూపడు. (80)

(యుద్ధానికి పోకుండా) వెనకుండిపోయినవారు దైవప్రవక్తకు సహకరించకుండా ఇంట్లో ఉండి పోయామనుకుంటూ సంబరపడ్డారు. దైవమార్గంలో ధనప్రాణాలొడ్డి పోరాడటం వారికి ఇష్టం లేదు. పైగా వారు ప్రజలతో "ఇంత తీవ్రమైన వేసవివేడిలో బయలుదేరకండి" అన్నారు. "నరకాగ్ని వేడి ఇంతకంటే తీవ్రంగా ఉంటుంద"ని చెప్పు. వారీ విషయం గ్రహిస్తే ఎంత బాగుంటుంది! ఇప్పుడు వారు (తమ నిర్వాకం పట్ల) నవ్వుకుంటే నవ్వుకోని. చివరకు వారు తమ దుష్కార్యాల ఫలితంగా పరలోకంలో హృదయవిదారకంగా రోదిస్తారు. (81-82)



దేవుడు నిన్ను (యుద్ధరంగం నుండి) తిరిగి వారి దగ్గరకు తీసుకొచ్చినప్పుడు, వారు నిన్ను యుద్ధానికి బయలుదేరేందుకు అనుమతి అడిగితే వారికి స్పష్టంగా ఇలా చెప్పెయ్యి: "మీరు నా వెంట బయలుదేరడానికి ఎంతమాత్రం వీల్లేదు. నాతో కలసి శత్రువులతో పోరాడటానికి కూడా వీల్లేదు. మీరు ఇంతకు ముందు కూర్చుండి పోవడానికి ఇష్టపడ్డారు. ఇప్పుడు కూడా మీరు ఇంట్లో కూర్చుండిపోయే (ఆడ)వారితో కలసి కూర్చొనే ఉండండి." (83)

ఇకముందు వారిలో ఎవరైనా చనిపోతే, నీవు వారికోసం శవప్రార్థన చేయకూడదు. అంతేకాదు వారి సమాధుల వద్ద కూడా నిల్చోవద్దు.[12] వారు దేవుడ్ని, ఆయన ప్రవక్తను తిరస్కరించారు. వారు చనిపోయినా దుర్మార్గపు స్థితిలోనే చనిపోతారు. వారి సంతానం, సిరిసంపదలు నిన్ను మోసగించకూడదు సుమా! సంతానం, సిరిసంపదల ద్వారా దేవుడు వారిని ఇహలోకంలో శిక్షించాలని, అవిశ్వాస స్థితిలోనే వారి ప్రాణాలు పోవాలని నిర్ణయించాడు. (84.85)

దేవుడ్ని విశ్వసించి ఆయనప్రవక్తతో కలసి దైవమార్గంలో పోరాడండని ఆదేశించే అధ్యాయం ఏదైనా అవతరిస్తే, ఇకచూడు వారి పరిస్థితి! వారిలో శక్తిసామర్థ్యాలు ఉన్న వారుకూడా నీదగ్గరకు వచ్చి యుద్ధంలో పాల్గొనకుండా ఉండేందుకు తమకు అనుమతి ఇవ్వమని మనవి చేసుకుంటారు. పైగా వారు (సిగ్గువిడిచి) "మమ్మల్ని వదలిపెట్టండి, మేము ఇంట్లో ఉండిపోయేవారితో పాటు ఉంటాం" అంటారు. ఇలా వారు (గాజులు తొడుక్కొని) ఇంట్లో కూర్చునే ఆడవాళ్ళతో పాటు ఉండటానికే ఇష్టపడ్డారు. వారి హృదయ కవాటాలు మూసివేయబడ్డాయి. అంచేత ఇక వారికి ఏదిచెప్పినా తలకెక్కదు. (86-87)

దీనికి భిన్నంగా దైవప్రవక్త, అతనితోపాటు విశ్వాసులు తమ ధనప్రాణాలు ధార పోసి దైవమార్గంలో పోరాడారు. కనుక సమస్త శ్రేయాలు ఇప్పుడు వారికే లభిస్తాయి.

---

12. కపటవిశ్వాసుల నాయకుడు అబ్దుల్లా బిన్ ఉబై చనిపోయినప్పుడు అతని (ముస్లిం) కొడుకు అబ్దుల్లా (రజి) తన తండ్రి వస్త్రసంస్కారం కోసం దైవప్రవక్త (సల్లం)ను ఆయన చొక్కా ఇవ్వమని అడిగారు. దైవప్రవక్త (సల్లం) సంతోషంగా చొక్కా ఇచ్చేశారు. తర్వాత అబ్దుల్లా (రజి) తన తండ్రి కోసం శవప్రార్థన చేయవలసిందిగా మనవి చేశారు. దైవప్రవక్త (సల్లం) దానిక్కూడా ఒప్పు కున్నారు. కాని హజ్రత్ ఉమర్ (రజి) అభ్యంతరం చెబుతూ "మీరు ఇలాంటి వ్యక్తి కోసం శవప్రార్థన చేస్తారా?" అన్నారు. దానికి దైవప్రవక్త (సల్లం) చిరునవ్వు నవ్వారు. ఇదే అధ్యాయంలోని 80వ సూక్తిలో "నీవు ఇలాంటి కపటవిశ్వాసుల్ని క్షమించమని డెబ్బయి సార్లు మొరపెట్టుకున్నా దేవుడు వారిని ఎన్నటికీ క్షమించడ"ని ఉంది. అంచేత దైవప్రవక్త (సల్లం) "నేను డెబ్బయి కంటే ఎక్కువ సార్లు పాపమన్నింపు కోసం దైవాన్ని ప్రార్థిస్తాన"న్నారు ఉమర్ (రజి)తో. (బుఖారి, ముస్లిం)

ఆ తరువాత ఆయన శవప్రార్థన చేయడానికి సిద్ధమైనప్పుడు ఈసూక్తి అవతరించింది. అప్పటినుండి దైవప్రవక్త (సల్లం) కపటులు, దుర్మార్గులైన ముస్లింలు చనిపోతే వారి జనాజానమాజ్ చేసేవారు కాదు. దీన్నిబట్టి ముస్లింసమాజంలో కపటవైఖరిని ప్రోత్సహించకూడదని తెలుస్తోంది. ఈ కారణంగానే ముస్లిం నాయకులు, ధర్మవేత్తలు అలాంటి కాపట్యం, దుర్నడతగల ముస్లింలు చనిపోయినప్పుడు వారికి శవప్రార్థన చేయకూడదని ఒక నిబంధన పెట్టడం జరిగింది.

వారే ముక్తీ, మోక్షాలు పొందేవారు. దేవుడు వారికోసం (చల్లటి)సెలయేరులు ప్రవహించే (అందమైన) స్వర్గవనాలు సిద్ధపరచిఉంచాడు. ఆ స్వర్గవనాల్లో వారు కలకాలం (హాయిగా) ఉంటారు. ఇదే అద్భుతమైన సాఫల్యం, సంసిద్ధి అంటే. (88-89)

పల్లెవాసుల్లో కూడా చాలామంది తమను ఇంట్లో ఉండిపోవడానికి అనుమతించమని సాకులు చెప్పడానికి వచ్చారు. ఈవిధంగా దేవుడ్ని, ఆయన ప్రవక్తను విశ్వసించామని అసత్య ప్రమాణం చేసినవారంతా ఇంట్లో కూర్చుండిపోయారు. ఈ పల్లెవాసుల్లో సత్యాన్ని తిరస్కరించినవారు త్వరలోనే దుర్భర శిక్షకు గురవుతారు. (90)

వృద్ధులు, వ్యాధిగ్రస్తులు, యుద్ధంలో పాల్గొనేందుకు తగిన సాధనసంపత్తి లేనివారు ఇండ్లలో ఉండిపోతే తప్పులేదు. అయితే వారు చిత్తశుద్ధితో పాటు దేవునిపట్ల, ఆయనప్రవక్త పట్ల నిజాయితి, నమ్మకం కలిగినవారయిఉండాలి. అలాంటి సజ్జనుల విషయంలో ఎలాంటి అభ్యంతరంలేదు. దేవుడు క్షమించేవాడు, కరుణించేవాడు. (91)

అలాగే నీ దగ్గరకు వచ్చి వాహన సౌకర్యం కల్పించమని మనవి చేసుకున్నవారి విషయంలో కూడా ఎలాంటి ఆక్షేపణ లేదు. వారి విజ్ఞప్తికి సమాధానంగా "మీకు నేను వాహన సౌకర్యాలు కల్పించలేను" అన్నావు నీవు. అప్పుడు వారు గత్యంతరంలేక అశ్రుపూరిత నయనాలతో వెళ్ళిపోయారు. సొంత ఒనరులతో ధర్మపోరాటంలో పాల్గొనే భాగ్యం తమకు లేకపోయిందే అని వారు ఎంతగానో బాధపడ్డారు. (92)

కాని ధనికులయి ఉండికూడా తాము యుద్ధంలో పాల్గోలేమని, తమను క్షమించి విడిచిపెట్టమని నిన్ను మనవి చేసుకున్నవారి విషయంలోనే ఆక్షేపణ ఉంది. వారు ఇంట్లో కూర్చున్న ఆడవాళ్ళతో పాటు ఉండిపోవడానికి ఇష్టపడ్డారు. వారి హృదయ కవాటాలు మూసి వేయబడ్డాయి. అందువల్ల వారికిక ఏది చెప్పినా తలకెక్కదు. (93)

మీరు (యుద్ధం నుండి) తిరిగొచ్చిన తర్వాత వారు రకరకాల సాకులు చెబుతారు. నీవు వారికిలా స్పష్టంగా చెప్పు: "సాకులు చెప్పకండి. మేమిప్పుడు మీరు చెప్పే ఏమాటా నమ్మలేము. మీసంగతి మాకు దేవుడు తెలియజేశాడు. (మీ అసలురంగు బయటపడింది) దేవుడు, ఆయనప్రవక్త మీ తీరుతెన్నుల్ని (మరికొంత కాలం) గమనిస్తారు. ఆ తర్వాత మీరు అంతర్బాహ్యాలన్నీ ఎరిగిన దేవుని వైపు మరలించబడతారు. అప్పుడాయన మీరు (ఇహ లోకంలో) ఏమేమి చేస్తుండేవారో మీకు తెలియజేస్తాడు." (94)

మీరు (యుద్ధం నుండి) తిరిగొచ్చిన తరువాత వారు నీ దగ్గరకు వచ్చి, నీవు దయ దలచి క్షమిస్తావని దేవుని మీద ప్రమాణం చేసి మరీ రకరకాల సాకులు చెబుతారు. అయితే నీవు వారి వైపు కన్నెత్తి కూడా చూడకు. వారు అపవిత్రులు. వారి అసలు స్థానం నరకం. వారి దుష్ట సంపాదనకు ప్రతిఫలంగా అదే వారికి లభించే మహాభాగ్యం! నీవు వారి పట్ల తృప్తిపడతావని వారు నీ దగ్గరకొచ్చి ప్రమాణాలు చేస్తారు. కాని నీవు వారిపట్ల తృప్తిచెందినా దేవుడు మాత్రం అలాంటి దుర్మార్గుల పట్ల ఎన్నటికీ తృప్తి చెందడు. (95,96)



గ్రామీణులు అవిశ్వాసం, కాపట్యాలలో చాలా కఠినులు. దేవుడు తన ప్రవక్తపై అవతరింపజేసిన ధర్మం గురించి, దాని పరిధుల్ని గురించి వారికి బొత్తిగా తెలియదనే చెప్పాలి. దేవుడు సర్వజ్ఞాని, మహా వివేకవంతుడు. (97)

ఆ గ్రామీణులలో కొందరు దైవమార్గంలో కొంత ఖర్చుపెట్టేవారు ఉన్నప్పటికీ, దాన్ని వారు తమపై బలవంతంగా రుద్దిన (సుంకం) వ్యవహారంగా భావిస్తున్నారు. అదీగాక నీ విషయంలో వారు పరిస్థితుల మార్పుకోసం నిరీక్షిస్తున్నారు. (నీవేదయినా ఆపదలో చిక్కుకుంటే సత్యాన్ని వదలి ఇష్టారాజ్యంగా వ్యవహరించవచ్చని వారు సమయం కోసం కాచుకొని కూర్చున్నారు.) కాని వారు స్వయంగా పాపపంకిలమనే ఘోరమైన ఆపదలో చిక్కుకొని ఉన్నారు. దేవుడు సమస్త విషయాలు వింటున్నాడు, ఆయన సర్వం ఎరిగినవాడు. (98)

ఆ గ్రామీణులలోనే మరికొందరున్నారు. వారు దేవుడ్ని, అంతిమదినాన్ని మనస్ఫూర్తిగా విశ్వసిస్తున్నారు. తాము ఖర్చుపెట్టే ధనంవల్ల దైవసాన్నిధ్యం లభిస్తుందని, తమ శ్రేయస్సు కోసం దైవప్రవక్త ప్రార్థన చేస్తాడని భావిస్తున్నారు. నిజమే, అది వారికోసం తప్పకుండా (దైవ) సాన్నిధ్యానికి కారణభూతమవుతుంది. దేవుడు తప్పకుండా వారిని తన కారుణ్యఛాయలోకి తీసుకుంటాడు. ఆయన గొప్ప క్షమాశీలి, అనంత కరుణామయుడు. (99)

అందరికంటే ముందు (ఇస్లాం స్వీకారంలో) ముందంజవేసిన ముహాజిర్లు, అన్సారుల పట్ల, ఆ తర్వాత చిత్తశుద్ధితో వారిని అనుసరించిన ఇతరుల పట్ల దేవుడు ప్రసన్నుడయ్యాడు. వారు దేవునిపట్ల సంతసించారు. వారికోసం దేవుడు సెలయేరులు ప్రవహించే తోటలు సిద్ధ పరచిఉంచాడు. వారక్కడ శాశ్వతంగా ఉంటారు. ఇదే మహోన్నత విజయం. (100)

నీ చుట్టుపక్కల ఉండే పల్లెవాసుల్లో చాలామంది కపటులే ఉన్నారు. అలాగే మదీనావాసుల్లో కూడా కపటులు ఉన్నారు. వారు కాపట్యపు ఊబిలో పూర్తిగా కూరుకుపోయారు. వారి సంగతి నీకు తెలియదు. మాకు తెలుసు వారెలాంటివారో. త్వరలోనే దేవుడు వారికి రెట్టింపు శిక్ష విధిస్తాడు. ఆ తరువాత వారు భయంకరమైన (నరక) శిక్షను చవిచూసేందుకు (మా సన్నిధికి) తీసుకురాబడతారు. (101)

ఇంకా కొందరున్నారు. వారు తమతప్పు ఒప్పుకున్నారు. వారిది మిశ్రమఆచరణ. కొన్ని పుణ్యకార్యాలు, కొన్ని పాపకార్యాలు చేశారు. త్వరలోనే దేవుడు వారిపై తన కటాక్ష వీక్షణలు ప్రసరింపజేస్తాడు.[13] నిస్సందేహంగా దేవుడు గొప్ప క్షమాశీలి, అపార దయానిధి.

13. ఈ సూక్తులు హజ్రత్ అబూలుబాన్ బిన్ అబ్దుల్ మన్జిర్ (రజి), ఆయన సహచరులు ఆరుగురి విషయంలో అవతరించినట్లు హదీసువేత్తలు తెలిపారు. ఈ ఏడుగురు బద్ర్, ఉహుద్, తదితర యుద్ధాలలో పాల్గొన్నారు. కాని తబూక్ దండయాత్రలో బద్ధకం, అలసత్వాల కారణంగా పాల్గొనలేకపోయారు. అయితే దైవప్రవక్త (సల్లం) తబూక్ దండయాత్ర నుంచి తిరిగొచ్చిన తర్వాత అందులో పాల్గొనని వారిని గురించి విచారణ జరపనారంభించగానే వారు తప్పు తెలుసుకొని

కనుక ప్రవక్తా! వారి సంపద నుండి దానం స్వీకరించి తద్వారా వారిని పరిశుద్ధపరచు. పుణ్యమార్గంలో వారిని పురోగమింపజేయి. వారికోసం ప్రార్థనచేయి. నీప్రార్థన వారి మనస్సుకు తృప్తినిస్తుంది. దేవుడు సమస్త విషయాలు వింటున్నాడు. ఆయన సర్వం ఎరిగినవాడు. (102,103)

దేవుడే తనదాసుల పశ్చాత్తాపాన్ని, దానధర్మాలను స్వీకరిస్తాడని వారికి తెలియదా? ఆయన గొప్ప క్షమాశీలి, దయామయుడని వారెరుగరా? వారికిలా చెప్పు: "మీరు (కర్మలు) ఆచరించండి. మీ ఆచరణవైఖరి ఇప్పుడెలా ఉంటుందో దేవుడు, ఆయన ప్రవక్త, విశ్వాసులు చూస్తారు. ఆతర్వాత మీరు అంతర్‌బాహ్యాలు ఎరిగిన దేవుని వైపు మరలించబడతారు. అప్పుడాయన మీరు ప్రపంచంలో ఏమేమి చేస్తుండేవారో మీకు తెలియజేస్తాడు. (104-105)

మరికొందరున్నారు. వారి వ్యవహారం (ఇంకా పరిష్కారం కాలేదు.) దేవుని ఆజ్ఞ కోసం ఆపి ఉంచబడింది. దేవుడు తలచుకుంటే వారిని శిక్షించవచ్చు లేదా క్షమించవచ్చు. దేవుడు సర్వం తెలిసినవాడు, మహా వివేకవంతుడు. (106)

ఇంకా కొందరున్నారు. వారు(ఇస్లాంకు) విఘాతం కలిగించే ఉద్దేశ్యంతో ఒక మసీదు నిర్మించారు. వారక్కడ సత్యవ్యతిరేక కార్యకలాపాలు సాగించడానికి, విశ్వాసుల ఐక్యతను చెడగొట్టి వారిలో చీలికలు సృష్టించడానికి నిర్ణయించుకున్నారు. అంతేకాదు, ఇంతకుముందు దేవునితో, ఆయనప్రవక్తతో యుద్ధంచేసి (పరాజయంపాలై) ఉన్నవారికి (రహస్య) స్థావరంగా ఉంటుందన్న ఉద్దేశ్యంతో కూడా ఈ మసీదు నిర్మించారు.

వారు (నీ దగ్గరకొచ్చి) మంచి తప్ప తమకు మరో ఉద్దేశ్యం లేదని ప్రమాణంచేసి మరీ చెబుతారు. కాని వారు పచ్చిఅబద్ధాలకోరులని దేవుడు సాక్ష్యమిస్తున్నాడు. కనుక నీవు ఎన్నటికీ ఆ మసీదులో అడుగుపెట్టకు.[14] మొదటినుండీ దైవభీతి పునాదిపై నిర్మించిన మసీదు మాత్రమే ప్రార్థన చేయడానికి నీకు యోగ్యమయినది. అక్కడ

---

తీవ్రంగా పశ్చాత్తాపపడ్డారు. దైవప్రవక్త (సల్లం) విచారణకు ముందే వారు తమను తాము ఒక స్తంభానికి కట్టుకొని (దేవుడు) తమను క్షమించే వరకూ లేదా తాము చనిపోయే వరకూ నిద్రాహారాలు మానేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

ఆవిధంగా వారు అనేక రోజులు గడిపి బలహీనమైపోయి స్పృహతప్పారు. చివరికి దేవుడు, క్షమించాడని తెలియగానే వారు ఆనందభరితులయ్యారు. ఆ సంతోషంతో వారు దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వెళ్ళి తమను ఏమరుపాటుకు గురిచేసిన సిరిసంపదలన్నీ దైవమార్గంలో దానం చేస్తామని అన్నారు. కాని దైవప్రవక్త (సల్లం) అందులో మూడోవంతు దానంచేస్తే చాలని అన్నారు. దాని ప్రకారం వారు తమ సంపదలో మూడోవంతును దైవప్రవక్త (సల్లం)కు సమర్పించారు.

14. దైవప్రవక్త (సల్లం) మదీనాకు వలస రావడానికి పూర్వం మదీనాలోని ఖజ్రజ్ తెగలో 'అబూఆమిర్' అనే ఒక క్రైస్తవ సన్యాసి ఉండేవాడు. అతను తన విద్యాజ్ఞానాలతో, వైరాగ్య దర్పంతో మదీనా, దాని చుట్టుప్రక్కల ప్రాంతాల్లో ఉండే అరబ్ బహుదైవారాధకుల్ని ఆకట్టుకుంటూ ఎంతో ఖ్యాతి గడించాడు. అయితే దైవప్రవక్త (స) మదీనా వచ్చిన తర్వాత అతను తన వైరాగ్యవ్యాపారం క్రమంగా మందగించడం గమనించి దైవప్రవక్త (సల్లం)కు, ఇస్లాంకు బద్ధశత్రువయి పోయాడు.



ఇస్లాం ధర్మాన్ని అంతమొందించడానికి మక్కా బహుదైవారాధకుల శక్తే సరిపోతుందని భావించి రెండేళ్ళపాటు ఎదురుచూశాడు. కాని బద్ర్ యుద్ధంలో బహుదైవారాధకులు ఘోరంగా ఓడిపోవడంతో అతను మదీనా విడిచిపెట్టి అరబ్‌తెగలలో ఇస్లాంవ్యతిరేక ప్రచార కార్యకలాపాలు ప్రారంభించాడు. ఉహుద్ యుద్ధానికి కారకులయినవారిలో ఇతను కూడా ఉన్నాడు. ఉహుద్ యుద్ధమైదానంలో అగడ్తలు త్రవ్వించి, ఒక అగడ్తలో దైవప్రవక్త (స) పడిపోవడానికి కూడా ఇతనే కారకుడయ్యాడని తెలుస్తోంది. అహ్జాబ్ యుద్ధంలో వివిధతెగలను మదీనాపై దాడిచేయడానికి పురిగొల్పినవాడు కూడా ఇతనే.

ఈ విధంగా అబూఆమిర్ ముస్లింలకు, బహుదైవారాధకులకు మధ్య జరిగిన అనేక యుద్ధాలలో ప్రముఖ పాత్ర వహించి దైవప్రవక్త (సల్లం)పై ప్రతీకారం తీర్చుకోవడానికి ప్రయత్నించాడు. కాని అరబ్ తెగలన్నీ ఏకమైనా ఇస్లాం అంతం కాకపోవడంతో అతను రోమ్ రాజ్యానికి వెళ్ళి రోమ్ చక్రవర్తి ముందు ఇస్లాం ప్రమాదం గురించి హెచ్చరించాడు. ఆ తర్వాతే ఖైసర్‌చక్రవర్తి అరేబియాపై దాడిచేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు దైవప్రవక్త (సల్లం)కు వార్తలందాయి. అప్పుడాయన రోమ్‌సైన్యాలను నిలువరించడానికి 'తబూక్' దండయాత్రకు బయలుదేరారు.

అబూఆమిర్ సాగిస్తున్న ఇస్లాంవ్యతిరేక కార్యకలాపాలలో మదీనాలోని కపటవిశ్వాసులు కూడా చేరిపోయారు. అతను తన మతపరమైన పలుకుబడిని ఉపయోగించి ఇస్లాంకు వ్యతిరేకంగా రోమ్ సైన్యాలను, ఉత్తర అరేబియాలోని క్రైస్తవ రాజ్యాల సైన్యాలను కూడగట్టేందుకు రోమ్‌కు బయలుదేరాడు. ఆ సమయంలో కపటవిశ్వాసులు అబూఆమిర్‌తో మంతనాలు జరిపి తమ రహస్య కార్యకలాపాలు సాగించడానికి మదీనాలో ఒక మసీదు నిర్మించాలని నిర్ణయించారు. ఇస్లాం తెర చాటున ఇస్లాంవ్యతిరేక కార్యకలాపాలు సాగించడానికి మసీదు ఎంతో అనువైన కేంద్రం. అందుకే వారీ నిర్ణయం తీసుకొని మసీదు నిర్మించారు. ఇక్కడ రోమ్‌గూఢచారులు, అబూఆమిర్ ఏజెంట్లు కూడా కపట విశ్వాసుల్ని నిస్సంకోచంగా కలుసుకొని తగిన పన్నాగాలు పన్నవచ్చని కూడా వారుభయుల మధ్య ఒక అంగీకారం కుదిరింది.

మదీనాలో ఇంతకుముందే రెండు మసీదులు ఉన్నాయి. మూడో మసీదు నిర్మించాల్సిన అవసరమే లేదు. కాని కపటవిశ్వాసులు వానాకాలంలో, చలికాలంలో వృద్ధులు, బలహీనులు నమాజు కోసం అంతదూరం పోలేరన్న సాకు చెప్పి ఈ మూడో మసీదు నిర్మించుకున్నారు. అంతటితో ఆగకుండా తమ మతముసుగును మరింత పటిష్ఠపరచుకోవడానికి వారు ప్రవక్త (స) సన్నిధికి వచ్చి "తమరు ఒక సారి ఈ మసీదులో నమాజు చేయించి దీనికి ప్రారంభోత్సవం చేయండి" అన్నారు అతివినయం ఒలకబోస్తూ. కాని దైవప్రవక్త (సల్లం) దాన్ని దాటవేస్తూ "నేనిప్పుడు యుద్ధసన్నాహాల్లో నిమగ్నమయి ఉన్నాను. తబూక్ దండయాత్రకు వెళ్తున్నాను. తిరిగొచ్చాక దాని సంగతి చూస్తాను" అన్నారు.

దైవప్రవక్త (సల్లం) తబూక్ వెళ్ళిన తర్వాత కపటవిశ్వాసులు ఈ (జిరార్) మసీదులో తమ కుట్రలు ప్రారంభించారు. అటు రోమ్‌సైన్యాలు ముస్లింలను తుడిచిపెట్టిన తక్షణమే ఇటు (కపటాగ్రేసరుడు) ఇబ్నె ఉబయికి కిరీటంపెట్టి అందలమెక్కించాలని కూడా పథకం వేసుకున్నారు. కాని వారి ప్లాను పారలేదు. తబూక్‌లో జరిగిన సంఘటనతో వారి ఆశలు అడియాశలయ్యాయి.

దైవప్రవక్త (సల్లం) తబూక్ నుండి తిరిగొస్తుంటే దారిలో ఈ సూక్తులు అవతరించాయి. ఆయన వెంటనే కొందరు అనుచరుల్ని త్వరగా మదీనా పంపిస్తూ, తాను నగరంలో ప్రవేశించక ముందే జిరార్ మసీదును కూలగొట్టాలని ఆదేశించారు. ఈ విధంగా దురుద్దేశ్యంతో నిర్మించబడిన జిరార్ మసీదు శాశ్వతంగా నేలమట్టమయి పోయింది. (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ నుండి)

పరిశుద్ధంగా (పవిత్రంగా) ఉండగోరే వారు కూడా ఉన్నారు. దేవుడు పరిశుద్ధత పాటించే వారినే ప్రేమిస్తాడు. (107,108)

ఇద్దరు వ్యక్తులు ఉన్నారు. వారిలో ఒకడు తన కట్టడాన్ని దైవభీతి, దైవప్రసన్నత లనే పునాదులపై నిర్మించాడు. రెండోవాడు తన కట్టడాన్ని నీటి ప్రవాహానికి లోతట్టు భాగం మట్టి కొట్టుకుపోయి డొల్లగామారిన నదీతీరంపై నిర్మించాడు. ఆ తరువాత అది కాస్తా అతడ్ని తీసుకొని నేరుగా నరకాగ్నిలో పడిపోయింది. మరి ఈ ఇద్దరిలో ఎవరు శ్రేష్ఠులు? మీరే ఆలోచించండి. అలాంటి దుర్మార్గులకు దేవుడు ఎన్నటికీ సన్మార్గం చూపడు. వారు నిర్మించిన ఈ (పునాదులులేని) కట్టడం వారిహృదయాల్లో ఎల్లప్పుడూ అపనమ్మకాన్నే పెంచిపోషిస్తుంది; వారి హృదయాలు ముక్కలుముక్కలుగా పగిలిపోతే తప్ప (ఈ అపనమ్మకపు జాడ్యం వారిని ఓ పట్టాన వదలిపెట్టదు). దేవుడు సర్వజ్ఞాని, మహావివేకవంతుడు. (109,110)

దేవుడు విశ్వాసుల నుండి వారి ధనప్రాణాలను కొనుగోలుచేశాడు. వాటికి బదులుగా వారికోసం స్వర్గం సిద్ధపరచిఉంచాడు. వారు దైవమార్గంలో పోరాడుతూ హత మార్చుతారు. లేక హతమార్చబడతారు. (వారికి స్వర్గం లభిస్తుందని) తౌరాత్‌లో, ఇన్జీల్ లో, ఖుర్ఆన్‌లో వాగ్దానంఉంది. దాన్ని నెరవేర్చేబాధ్యత దేవునిపై ఉంది. వాగ్దానం నెర వేర్చడంలో దేవుడ్ని మించిన వారెవరుంటారు? కనుక దేవునితో మీరు చేసుకున్న ఈ వ్యాపార ఒప్పందం పట్ల ఆనందోత్సవాలు జరుపుకోండి. ఇదే ఘనవిజయం, గొప్ప సాఫల్యం. (111)

వారు పాపక్షమాపణ కోసం మాటిమాటికి దేవునివైపు మరలుతారు. ఆయన్నే ఆరా ధిస్తారు. ఆయన స్తుతిగానాలు చేస్తారు. దేవుని(ప్రసన్నత) కోసం లోకంలో సంచరిస్తారు. ఆయన ముందు తలవంచుతారు, సాష్టాంగపడతారు. (ప్రజలకు మంచిని బోధిస్తారు. (వారిని) చెడుల నుండి నివారిస్తారు. దేవుడు నిర్ణయించిన హద్దులు కాపాడుతారు. కనుక ప్రవక్తా! (దేవునితో పరలోక వ్యాపార ఒప్పందం చేసుకున్న) ఇలాంటి విశ్వాసులకు (స్వర్గ) శుభవార్త విన్పించు. (112)

బహుదైవారాధకులు నరకానికి అర్హులయ్యారని స్పష్టంగా తెలిసిన తరువాత వారు తమ దగ్గరి బంధువులైనాసరే, వారి పాపమన్నింపు కోసం దేవుడ్ని ప్రార్థించడం దైవ ప్రవక్తకు, విశ్వాసులకు ఏమాత్రం శోభించదు. ఇబ్రాహీం తనతండ్రి కోసం పాపమన్నింపు ప్రార్థన చేశాడంటే ఆ విషయంలో అతను తన తండ్రికి వాగ్దానం చేసిఉండటమే. అయితే అతను దైవవిరోధి అని తెలిసినతర్వాత ఇబ్రాహీం అతడ్ని అసహ్యించుకున్నాడు. ఇబ్రాహీం ఎంతో దయార్ద్ర హృదయుడు, సహనశీలి, సాధుస్వభావి. (113-114)

ప్రజలకు సన్మార్గం చూపి, వారు ఏ విషయాలు మానుకోవాలో వాటన్నిటినీ స్పష్టంగా తెలియజేసిన తర్వాత, తిరిగి వారిని మార్గభ్రష్టత్వానికి గురిచేయడం దేవుని అభిమతం కాదు. నిస్సందేహంగా దేవుడు సమస్త విషయాలు తెలిసినవాడు.



భూమ్యాకాశాల సామ్రాజ్యమంతా దేవుని అధీనంలోనే ఉంది. జీవన్మరణాలు ఆయన చేతిలోనే ఉన్నాయి. ఆయన (పట్టు) నుండి మిమ్మల్ని కాపాడగల ఏ సహాయకుడూ, సంరక్షకుడూ లేడు. (115,116)

దేవుడు (తన) ప్రవక్తను కరుణించాడు. కష్టకాలంలో ఆదుకొని అతనికి తోడుగా నిల్చిన ముహాజిర్‌లను, అన్సారులను కూడా కరుణించాడు. వారిలో కొందరి హృదయాలు అపమార్గంవైపు మొగ్గినప్పటికీ వారిని కూడా దేవుడు కరుణించాడు. నిస్సందేహంగా దేవుడు వారి విషయంలో అపార వాత్సల్యంతో, అమితమైన దయతో వ్యవహరిస్తాడు. (117)

ఇక వ్యవహారం వాయిదావేయబడిన ఆ ముగ్గురిని కూడా కరుణించాడు. భూమి విశాలంగాఉన్నా అదివారికి ఇరుకైపోయింది. చివరికి వారిప్రాణాలే వారికి భారమైపోయాయి. దేవుని పట్టునుండి తప్పించుకోడానికి ఆయన కరుణాశ్రయం తప్ప ఎలాంటి ఆశ్రయం లేదని వారు గ్రహించారు.[15] అప్పుడు దేవుడు దయతో వారివైపు

---

15. ఈ ముగ్గురు సహాబీల (ప్రవక్త అనుచరుల) పేర్లు: 1. కాబ్ బిన్ మాలిక్, 2. హిలాల్ బిన్ ఉమయ్య, 3. మురారా బిన్ రుబయి. వీరు ముగ్గురు కూడా చిత్తశుద్ధిగల విశ్వాసులే. లోగడ ఇస్లాం కోసం అనేక త్యాగాలు చేసినవారే. కాని తబూక్ దండయాత్ర సమయంలో బద్ధకం వారిని గడప దాటనివ్వలేదు. దైవప్రవక్త (సల్లం) విచారణ జరిపినప్పుడు కపటవిశ్వాసుల్లా అబద్ధాలు చెప్పి తప్పించుకోవడానికి బదులు వారు నిజాన్ని చెప్పేశారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) అందుకు శిక్షగా వారితో ఎవరూ మాట్లాడకూడదని ముస్లింలందరికీ తాకీదు చేశారు.

దైవప్రవక్త ఆజ్ఞతో ముస్లింలందరూ ఆ ముగ్గురితో మాట్లాడకుండా సంఘబహిష్కణ చేశారు. ఆ ముగ్గురిలో ఇద్దరు బయటికి పోకుండా ఇంట్లోనే గడపసాగారు. హజ్రత్ కాబ్ బిన్ మాలిక్ (రజి) మటుకు బయట వీధుల్లో తిరిగేవారు. ప్రతివేళా మస్జిద్‌కు కూడా వెళ్ళి వస్తుండేవారు. కాని ఆయనతో ఏ ఒక్కరూ మాట్లాడేవారు కాదు. సలాం చేసినా సమాధానమిచ్చేవారు కాదు. మస్జిద్‌లో ఆయన నమాజ్ చేస్తున్నప్పుడు దైవప్రవక్త (సల్లం) అప్పుడప్పుడు ఆయన వైపు ఓరగా చూసేవారు. కాని నమాజ్ ముగించగానే వేరే వైపు ముఖం తిప్పుకునేవారు. దాంతో హజ్రత్ కాబ్ మరింత దిగాలుపడేవారు.

ఒకరోజు ఆయన తన చిన్ననాటి స్నేహితుడు అబూ ఖతాదా (రజి) దగ్గరికెళ్ళి అతని తోట ప్రహరీగోడ ఎక్కి సలాం చేశారు. కాని అతను సమాధానమైనా ఇవ్వలేదు. అప్పుడు కాబ్ (రజి) దేవుడ్ని సాక్షిగా చేస్తూ, “అబూ ఖతాదా! నాకు దైవం పట్ల, దైవప్రవక్త పట్ల ప్రేమాభిమానాలు లేవా?” అని అడిగారు. దానికీ అతను సమాధానమివ్వలేదు. కాబ్ అలా రెండుసార్లు అడిగారు. మూడోసారి అడిగిన మీదట “ఆసంగతి దేవునికి, దైవప్రవక్తకు మాత్రమే తెలుస”ని ముక్తసరిగా జవాబిచ్చాడు. ఈ మాటలు విని కాబ్ (రజి)కు దుఃఖం పొర్లుకు వచ్చింది.

ఆ రోజుల్లోనే హజ్రత్ కాబ్ బిన్ మాలిక్ (రజి) బజారున పోతుంటే సిరియా నుండి ఒకతను వచ్చి గస్తాన్ రాజు రాసిన ఒక లేఖను ఆయనకు అందించాడు. అందులో గస్తాన్ రాజు హజ్రత్ కాబ్‌ని సంబోధిస్తూ “మీ మనిషి మీ మీద దుర్భర దౌర్జన్యం సాగిస్తున్నట్లు మేము విన్నాం. మీరు ఆ అవమానం సహించేటంత అధములు కారు. అప్రయోజకునిగా భావించి వదిలెయ్యాల్సిన మనిషి కూడా కాదు. అందువల్ల మీరు మా దగ్గరకు వచ్చేయండి. మేము మిమ్మల్ని ఘనంగా

మరలాడు, వారు తనవైపు మరలి వచ్చేందుకు. నిజంగా దేవుడు గొప్ప క్షమాశీలి, అమిత దయామయుడు. (118)

విశ్వాసులారా! దేవునికి భయపడండి. నిజాయితీపరులకు తోడ్పడండి. దైవప్రవక్తను వదిలేసి, ఇంట్లో కూర్చొని తమ స్వప్రయోజనాలకు ప్రాధాన్యతనివ్వడం మదీనావాసులకు, దాని చుట్టుప్రక్కల నివసించే గ్రామీణులకు ఏమాత్రం తగదు. దైవమార్గంలో శారీరక శ్రమ, ఆకలిదప్పులు సహిస్తే, సత్యతిరస్కారులకు వెగటు కలిగించే వ్యవహారంలో ఏదయినా చర్య తీసుకుంటే, (ధర్మవ్యవహారంలో) ఏదయినా శత్రువర్గానికి ప్రతీకారంచేస్తే, వాటికి ప్రతిఫలంగా వారి అదృష్టంలో పుణ్యం వ్రాయకుండా ఉండటమనేది ఎన్నటికీ జరగదు. సద్వర్తనులకు లభించవలసిన ప్రతిఫలాన్ని దేవుడు ఎన్నటికీ వృధాచేయడు. (119-120)

అలాగే (దైవమార్గంలో) కొద్దో గొప్పో ఖర్చుచేస్తే లేదా ఏవైనా గుట్టలు మిట్టలు దాటి పురోగమిస్తే ఆ సత్కార్యాలు కూడా (కర్మపత్రంలో) వ్రాయకుండా ఉండటమనేది జరగదు. వారు చేసిన సత్కార్యాలకు దేవుడు వారికి తగినప్రతిఫలం తప్పకుండా ప్రసాదిస్తాడు. (121)

విశ్వాసులందరూ (ధర్మయుద్ధానికి) మూకుమ్మడిగా బయలుదేరవలసిన అవసరం లేదు. ధర్మావగాహన పెంపొందించుకోవడానికి (కూడా) ప్రతిగ్రామం, ప్రతితెగ నుండి కొందరు చొప్పున ఎందుకు బయల్దేరలేదు? ఆ విధంగా వెళ్ళివచ్చి తమప్రజలు (సత్యవ్యతిరేక వైఖరి) మానేందుకు వారిని హెచ్చరించివుంటే బాగుండేది కదా! అలా ఎందుకు జరగలేదు? (122)

విశ్వాసులారా! మీ సమీపంలో (గోముఖవ్యాఘ్రాల్లా) ఉన్న సత్యతిరస్కారులతో పోరాడండి. (మీరు మెతక మనుషులు కాదని,) మీలో కాఠిన్యం ఉందని వారు తెలుసు కోవాలి. దేవుడు సదా భయభక్తులుకలవారికే తోడుగా ఉంటాడని తెలుసుకోండి. (123)

---

గౌరవిస్తాం" అని రాశాడు. హజ్రత్ కాబ్ (రజి) దాన్ని చదివి మరో విపత్తు వచ్చి పడిందనుకుంటూ అప్పటికప్పుడు దాన్ని పొయ్యిలోకి విసిరి కాల్చివేశారు.

ఈవిధంగా నలభై రోజులు గడచిపోయాయి. ఆ తరువాత ఆయన తన భార్యకు కూడా దూరంగా ఉండాలని దైవప్రవక్త (సల్లం) ఆదేశించారు. అప్పుడు హజ్రత్ కాబ్ (రజి) తన భార్యను పుట్టింటికి పంపివేశారు. అలా మరో పదిరోజులు గడచిపోయాయి. చివరికి ఓరోజు ఫజ్రినమాజ్ ముగిసిన తరువాత ఇంటికప్పు మీద విచారంతో కూర్చొని ఉంటే ఒకతను వచ్చి "కాబ్! నీకు శుభం కలుగుగాక!" అన్నాడు. ఈమాట వినగానే హజ్రత్ కాబ్ (రజి) అప్రయత్నంగా సాష్టాంగపడ్డారు. ఆ తరువాత ఒకరి తర్వాత మరొకరు చొప్పున అనేకమంది "నీ క్షమాపణ స్వీకరించబడింది" అంటూ ఆయనకు అభినందనలు తెలియజేయడం ప్రారంభించారు. హజ్రత్ కాబ్ (రజి) వెంటనే మస్జిద్‌కు వెళ్ళి చిరునవ్వుతో కన్పిస్తున్న దైవప్రవక్త (సల్లం)కు సలాం చేశారు. దైవప్రవక్త (సల్లం) ప్రతిసలాం చేసి ఆయన్ని అభినందించారు. అప్పుడు హజ్రత్ కాబ్ (రజి) దేవునికి కృతజ్ఞతగా తన వాటాకు వచ్చిన ఖైబర్‌భూమి ఉంచుకొని మిగిలిన ఆస్తినంతా దైవమార్గంలో దానంచేశారు.



కొత్తగా ఏదైనా అధ్యాయం అవతరించినప్పుడల్లా వారిలో కొందరు (ముస్లింలను అవహేళనచేస్తూ) "ఈ అధ్యాయం (సూరా) వల్ల మీలో ఎవరి విశ్వాసం పెరిగింద"ని అడుగుతారు. విశ్వసించినవారి విశ్వాసాన్ని ప్రతి అధ్యాయం అధికమే చేసింది. దానిపట్ల వారు సంతోషమే వెలిబుచ్చుతున్నారు. కాని హృదయాల్లో కాపట్య రోగమున్నవారికి మాత్రం కొత్తగా అవతరించే ప్రతి అధ్యాయం వారి (హృదయ) మాలిన్యాన్ని మరింత అధికమే చేస్తూపోయింది. దాంతో వారు ఇక చచ్చేదాకా అవిశ్వాస తిమిరంలోనే పడి కొట్టుమిట్టాడుతుంటారు. (124,125)

ప్రతి సంవత్సరం వారు ఒకటి రెండు సార్లు పరీక్షకు గురిచేయబడుతున్నారని వారికి తెలియదా? అయినా వారు పశ్చాత్తాపం చెంది దేవునికి క్షమాపణ చెప్పుకోవడం లేదు. (ఈ పరీక్షల ద్వారా) ఎలాంటి గుణపాఠం కూడా నేర్చుకోవడంలేదు. కొత్తగా ఏదైనా అధ్యాయం అవతరించినప్పుడు తమను ఇతరులు చూస్తారేమోనని కళ్ళతోనే వారు పరస్పరం సైగలు చేసుకుంటూ నిశ్శబ్దంగా లేచి వెళ్ళిపోతారు. వారసలు మందబుద్ధులు. అందుకే దేవుడు వారి హృదయాలను (వారి పైశాచిక ప్రవృత్తికి అనుగుణంగా) మలచివేశాడు. (126-127)

(ప్రజలారా!) మీ (జాతి)లో నుండే మీ దగ్గరకు దైవప్రవక్త వచ్చాడు. మీరు నష్టపోవడం అతనికి ఎంతో బాధగా ఉంటుంది. మీ శ్రేయస్సునే అతను ఎక్కువగా కోరుకుంటున్నాడు. సత్యాన్ని (అంటే ఇస్లాంధర్మాన్ని) విశ్వసించినవారి పాలిట అతను ఎంతో ప్రేమమూర్తి, దయామయుడు. (128)

(ప్రవక్తా! నీవు ఇంతగా నచ్చజెప్పినా వినకుండా) వారు ముఖం తిప్పుకుంటే వారికి ఈవిధంగా చెప్పెయ్యి: "నాకు దేవుడొక్కడే చాలు. ఆయన తప్ప (మానవులకు) మరో ఆరాధ్యనీయుడు లేడు. ఆయన్నే నేను నమ్ముకున్నాను. ఆయనే మహోన్నత సింహాసనానికి అధిపతి." (129)

## 10. యూనుస్

**అవతరణ: మక్కా** **సూక్తులు: 109**

ఈ అధ్యాయంలో ఒకచోట దైవప్రవక్త యూనుస్ (అలైహి) ప్రస్తావన వచ్చింది. అందువల్ల దీనికి 'యూనుస్' పేరు వచ్చింది. ఇందులోని విషయాలు పరిశీలిస్తే ఇది అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) మక్కాలో గడిపిన 13 ఏండ్ల కాలంలో 13వ సంవత్సరం అవతరించి ఉండవచ్చని తెలుస్తోంది. ఒక సాధారణ మానవుడు దైవప్రవక్తగా వచ్చి పరలోకం గురించి చిత్ర విచిత్ర విషయాలు మాట్లాడటం పట్ల మక్కా బహుదైవారాధకులు ఆశ్చర్యం వెలిబుచ్చుతుండేవారు పైగా ఆయన్ని అపహాస్యం కూడా చేసేవారు. మరొక వైపు ఇస్లాం వ్యతిరేక ప్రచారం సాగిస్తూ దైవప్రవక్త (సల్లం)కు, ఆయన అనుచరులకు బద్ధశత్రువులయ్యారు. అలాంటివారికి ఈ అధ్యాయంలో అనేక విధాలుగా నచ్చజెపుతూ రుజుమార్గం గురించి బోధించడం జరిగింది. అంతేకాదు, గత ప్రవక్తల సంఘటలు కూడా ప్రస్తావించి వాటి నుండి గుణపాఠం నేర్చుకోమని హెచ్చరించడం కూడా జరిగింది.

## కరుణామయుడు, కృపాసాగరుడయిన దేవుని పేరుతో ప్రారంభం

అలిఫ్-లామ్-రా. ఈ సూక్తులు విజ్ఞతావివేచనాలతో నిండిన (అద్భుత) గ్రంథానికి సంబంధించినవి. (ఏమరుపాటుకు గురయిన) ప్రజలను జాగృతపరచమని, (సత్యాన్ని) విశ్వసించినవారికి వారిప్రభువు దగ్గర నిజమైన గౌరవప్రతిష్ఠలు ఉన్నాయన్న శుభవార్త విన్పించమని మేము మానవుల్లోనే ఒక మనిషికి సూచించాము. ఈ విషయం వారికి విచిత్రంగా ఉందా? పైగా సత్యతిరస్కారులు "ఇతను పచ్చి మాంత్రికుడు" అని చెబుతున్నారు. (1,2)

మీ ప్రభువు అల్లాహ్ మాత్రమే. ఆయనే భూమ్యాకాశాల్ని ఆరు రోజుల్లో సృష్టించాడు. తర్వాత ఆయన అధికార సింహాసనం అధిష్ఠించి యావత్తు విశ్వవ్యవస్థను నిర్వహిస్తున్నాడు. ఆయన అనుమతి లేకుండా ఎవరూ ఎలాంటి సిఫారసు చేయలేడు. ఆ దేవుడే మీ ప్రభువు. కనుక మీరు ఆయన్ని మాత్రమే ఆరాధించండి. మరి ఇప్పటికైనా స్పృహలోకి వస్తారా? (3)

మీరంతా (కర్మవిచారణకోసం) ఆయన దగ్గరికే పోవలసిఉంది. ఇది దేవుడు చేస్తున్న తిరుగులేని వాగ్దానం. నిస్సందేహంగా సృష్టి ప్రక్రియను ప్రారంభించేవాడు, ఆ తర్వాత ప్రళయ దినాన (ప్రాణికోటిని) తిరిగి బ్రతికించి లేపేవాడు కూడా ఆయనే. విశ్వసించి సత్కార్యాలు చేసేవారికి ఆయన న్యాయంగా తగిన ప్రతిఫలం ప్రసాదిస్తాడు. అవిశ్వాస వైఖరి అవలంబించిన వారికి త్రాగేందుకు సలసల మరిగే నీటిని ఇస్తాడు. అంతేకాదు, వారు తమ దుష్కర్మలకు (నరకంలో) దుర్భరయాతనలు కూడా అనుభవించవలసి వస్తుంది. (4)

ఆయనే సూర్యుడ్ని తేజోవంతంగా, చంద్రుడ్ని కాంతిమంతంగా చేసినవాడు. మీరు తేదీలు, సంవత్సరాల లెక్క తెలుసుకోవడానికి చంద్రకళల్ని నిర్దేశించినవాడు కూడా ఆయనే.[1] ఇదంతా దేవుడు ఒక మహోన్నత లక్ష్యం కోసం సృష్టించాడు. ఆయన

---

1. చంద్రుడి నుండి వెలువడే వెలుగు సూర్యుడి నుండి గ్రహించిన అరువు వెల్తురని ఈ సూక్తి ద్వారా తెలుస్తోంది. చంద్రుడ్ని గురించి ఖుర్ఆన్‌లో ఇతర చోట్ల ఇలా ఉంది:

"(ప్రవక్తా!) ప్రజలు నిన్ను నెలవంక గురించి (చంద్రకళల సంగతేమిటని) అడుగుతున్నారు. ఇవి ప్రజల అవసరాలకు, హజ్‌యాత్ర తేదీల నిర్ణయానికి సంకేతాలని చెప్పు." (2:189)

దేవుడే రేయింబవళ్ళను సృష్టించినవాడు. సూర్యచంద్రులను కూడా ఆయనే సృజించాడు. అవన్నీ తమతమ నిర్ణీత కక్ష్యల్లో తేలియాడుతున్నాయి." (21: 33)

"ఆయన మీ శ్రేయస్సు కోసం రేయింబవళ్ళను, సూర్యచంద్రులను అదుపులో ఉంచాడు. నక్షత్రాలు కూడా ఆయన అదుపాజ్ఞలలోనే ఉన్నాయి. విజ్ఞతా వివేచనలు కలవారికి ఇందులో అనేక నిదర్శనాలు ఉన్నాయి." (16:12)

"వారికోసం మరొక సూచనగా రాత్రి ఉంది. మేము దానిపై నుండి పగటిని తొలగి స్తున్నాం. అప్పుడు వారిపై చీకటి ఆవరిస్తుంది. సూర్యుడు తన నిర్ణీత కక్ష్యలో సంచరిస్తున్నాడు. ఇది మహా శక్తిమంతుడైన దేవుడు రూపొందించిన పథకం. చంద్రుని కోసం మేము మజిలీలు (చంద్ర కళలు)



గ్రహించే వారికోసం తన నిదర్శనాలు విడమరచి తెలియజేస్తున్నాడు. దేవునికి భయపడే వారి కోసం రేయింబవళ్ళ చక్రభ్రమణంలో అనేక నిదర్శనాలు ఉన్నాయి. అసలు భూమ్యాకాశాల్లో ఆయన సృష్టించిన ప్రతి వస్తువులోనూ (ఆయన ఉనికిని, ఏకత్వాన్ని చాటే అనేక) నిదర్శనాలున్నాయి. (5,6)

మా దర్శనభాగ్యం ఆశించకుండా ప్రాపంచిక జీవితంతోనే తృప్తిచెంది మా సూక్తుల పట్ల ఏమరుపాటు వహించినవారికి నరకమే అంతిమ నివాసం అవుతుంది, వారి దుష్కర్మలకు పర్యవసానంగా (తగిన శాస్తి అదే). (7,8)

---

నిర్ణయించాం. అతను వాటిని దాటుకుంటూ చివరికి ఎండిపోయిన ఖర్జూరపు మట్టలా మారిపోతాడు. చంద్రుడ్ని పట్టుకునే శక్తి సూర్యునికి లేదు. అలాగే రాత్రి పగటిని దాటిపోలేదు. సమస్తం ఒక్కొక్క కక్ష్యలో సంచరిస్తున్నాయి." (36: 38-40)

"ఆయన సూర్యచంద్రుల్ని (ఒక నియమావళికి కట్టుబడి ఉండేలా) అదుపులో ఉంచాడు. ఇవన్నీ ఒక నిర్ణీత కాలం వరకు నడుస్తూ ఉంటాయి. మీరు చేసే ప్రతి పనీ దేవునికి తెలుసన్న సంగతి మీకు తెలియదా? దీనికి కారణం దేవుడే సత్యం. అందువల్లనే ఇవన్నీ ఒక నియంత్రణకు లోబడి సాగుతున్నాయి. ఆయన్ని వదలి వారు ప్రార్థిస్తున్నవన్నీ మిథ్యాదైవాలే. దేవుడే మహోన్నతుడు, మహిమాన్వితుడు." (31:29,30)

"రాత్రి, పగలు, సూర్యుడు, చంద్రుడు (మొదలైన ప్రకృతిశక్తులన్నీ) దేవుని (ఏకత్వానికి, ఆయన శక్తిసామర్థ్యాలకు) నిదర్శనాలే. కనుక సూర్యచంద్రులకు సాష్టాంగపడకండి. మీరు నిజంగా దేవుడ్ని ఆరాధించేవారయితే, వాటిని సృష్టించిన దేవునికే సాష్టాంగపడండి." (41:37)

ఖుర్ఆన్ సూర్యచంద్రుల సంచారం, రేయింబవళ్ళ మార్పిడులు మొదలైన ఖగోళశాస్త్ర విషయాలు తెలియజేశాక సృష్టి రహస్యాలను గురించి ఆలోచించే బుద్ధిమంతులకు ఇందులో అనేక సూచనలున్నాయని చెబుతోంది. ముఖ్యంగా రెండు సూచనలను గురించి నొక్కి చెప్పింది.

ఒకటి, ఈ విశ్వం దానంతటది ఉనికిలోకి రాలేదని, అలాగే దానంతటది ఇష్టారాజ్యంగా నడవడం లేదని, దాని వెనుక ఓ మహోన్నత అగోచర శక్తిసంపన్నుడు ఉన్నాడని, ఆయనే దాన్ని సృష్టించి మానవుల శ్రేయస్సు కోసం గతి తప్పకుండా ఓ నిర్దిష్ట మార్గాన నియమబద్ధంగా నిర్వహిస్తున్నాడని కాస్త ఆలోచిస్తే అర్థమవుతుంది.

రెండు, ఈ విశ్వవ్యవస్థలో ఏ ఒక్కటీ తనంతట తాను మానవులకు లాభంగాని, నష్టంగాని కలిగించలేదని, కాబట్టి వాటిని ఆరాధించడం అవివేకమని, వాటిని సృష్టించి నియమబద్ధంగా నిర్వహిస్తున్న విశ్వప్రభువునే ఆరాధించాలని ఖుర్ఆన్ మానవాళికి మాటిమాటికి బోధిస్తోంది.

పూర్వం మానవుడు సూర్యచంద్ర నక్షత్రాల వెనుక ఉన్న సృష్టి రహస్యాలు తెలుసుకోలేక వాటిపట్ల అనవసరమైన భయాన్ని, లేనిపోని ఆశలను కల్పించుకొని వాటిని పూజించేవాడట! కాని ఈనాటి నాగరిక మానవుడు చంద్రుని మీద కాలుమోపి వచ్చాడు. మానవరహిత వ్యోమానౌకను పంపి అంగారక గ్రహం నుండి మన్ను తెప్పించాడు. శక్తిమంతమైన అంతరిక్షనౌకలు నిర్మించి సౌర వ్యవస్థను సైతం దాటి సుదూర విశ్వాంతరాళంలోకి పంపాడు. అయితే ఈమాత్రం లభించిన మిడిమిడి జ్ఞానానికే ప్రకృతి మీద విజయం సాధించానని విర్రవీగిపోతూ, సృష్టికర్తనే విస్మరిస్తున్నాడు.

ఖుర్ఆన్ ఈ రెండు ధోరణుల్ని ఖండిస్తూ విశ్వరహస్యాల పరిశోధనకు మానవుడ్ని ప్రోత్సహిస్తోంది. వాటిని తెలుసుకున్నాక కృతజ్ఞతగా విశ్వనిర్వాహకుడ్ని ఆరాధించాలని చెబుతోంది.

ఇక సత్యాన్ని విశ్వసించి సత్కార్యాలు చేస్తున్నవారిని వారి ప్రభువు వారి విశ్వాసం కారణంగా సన్మార్గాన నడిపిస్తాడు. వారికోసం సెలయేరులు ప్రవహించే స్వర్గవనాలు ఉన్నాయి. వారక్కడ "దేవా! నీవు పరిశుద్ధుడవు" అని స్తుతిస్తూ ఉంటారు. అదీగాక వారు శాంతి చేకూరుగాక! అని ప్రార్థిస్తారు. వారు మాట్లాడే ప్రతిమాట చివర్లో "సకల స్తోత్రాలు సర్వలోక ప్రభువుకే శోభిస్తాయి" అని కూడా ఉంటుంది. (9,10)

ప్రజలు ప్రాపంచిక ప్రయోజనాలు అర్థించడంలో ఎంత తొందరపడుతున్నారో, దేవుడు వారికి కీడుచేసే విషయంలో కూడ అంత తొందరపడితే వారి జీవితకాలం ఎప్పుడో సమాప్తమై ఉండేది. (కాని అలా చేయడం మా అభిమతం కాదు.) అందువల్ల మేము మా దర్శనభాగ్యం ఆశించనివారిని వారి తిరస్కారం, తలబిరుసుతనాల్లోనే పడి వుండేలా వదిలేస్తున్నాం. కష్టకాలం వచ్చినప్పుడు మానవుడు నిలబడి, కూర్చొని, పడుకొని (అనుక్షణం) మమ్మల్ని మొరపెట్టుకుంటాడు. కాని ఆ కష్టాన్ని కాస్తా మేము తొలగించగానే అతను (మమ్మల్ని పూర్తిగా మరచిపోయి) ఎలాంటి కష్టంలో కూడా మమ్మల్ని మొరపెట్టుకో లేదన్నట్లు ముఖం చాటేస్తాడు. ఇలా హద్దులు మీరేవారికి మేము వారి (అ)కృత్యాలను ఆకర్షవంతంగా చేస్తాము. (11,12)

మానవులారా! మీకు పూర్వం (హద్దు మీరిపోయి) దౌర్జన్యవైఖరి అవలంబించిన జాతుల్ని మేము సర్వనాశనం చేశాం. వారి దగ్గరకు వారి ప్రవక్తలు స్పష్టమయిన నిదర్శనాలు తెచ్చినప్పటికీ వారు (సత్యాన్ని) విశ్వసించలేదు. ఈ విధంగా మేము నేరస్థులకు వారి నేరాల పర్యవసానం చవి చూపిస్తున్నాము. వారి తరువాత ఇప్పుడు మీరెలా ప్రవర్తిస్తారో చూసేందుకు మేము మిమ్మల్ని ధరణిలో (మా) ప్రతినిధులుగా నియమించాము. (13,14)

మా దర్శనభాగ్యం ఆశించని వారికి స్పష్టమైన మా సూక్తులు విన్పిస్తున్నప్పుడు "దీనికి బదులు మరో ఖుర్ఆన్ తీసుకురా, లేదా ఇందులో మార్పుచెయ్యి" అంటారు వారు. ప్రవక్తా! వారికిలా చెప్పు: "ఇందులో మార్పుచేయడానికి నాకెలాంటి అధికారం లేదు. నేను నా దగ్గరకు పంపబడుతున్న దివ్యావిష్కృతిని అనుసరించేవాడ్ని మాత్రమే. నేను గనక నా ప్రభువుకు అవిధేయత చూపితే ఓ భయంకర దినాన పడే శిక్షకు భయపడుతున్నాను." (15)

ఇంకా ఇలా చెప్పు: "దేవుడు ఇలా నిర్ణయించివుంటే నేనీ ఖుర్ఆన్ని మీకు ఎన్నటికీ విన్పించేవాడ్ని కాదు. దేవుడు కూడా మీకు దీన్ని గురించి ఏమాత్రం తెలియ జేసేవాడుకాదు. దీని (అవతరణ)కు పూర్వం నేను మీమధ్య ఓ సుదీర్ఘకాలం గడిపాను. (నా నీతి, నిజాయితీలను గురించి మీకు బాగా తెలుసు. అలాంటి వ్యక్తి దేవుని విషయంలో అబద్ధాలు ఎలా చెప్పగలడు?) మీరీ మాత్రం గ్రహించరా? అసత్య విషయం కల్పించి దాన్ని దేవుని మీద నెట్టివేసే వాడికంటే పరమ దుర్మార్గుడు ఎవడైనా ఉంటాడా? లేక దేవుని సూక్తుల్ని అసత్య విషయాలుగా పరిగణించే వాడికంటే పరమ దుర్మార్గుడెవరు? నేరస్థులు ఎట్టి పరిస్థితిలోనూ సాఫల్యం పొందలేరు. (16-17)



వారు దేవుడ్ని వదలి తమకు ఎలాంటి లాభంగాని, నష్టంగాని కలిగించని మిథ్యా దైవాలను పూజిస్తూ అవి తమను గురించి దేవుని దగ్గర సిఫారసు చేస్తాయని అంటారు. "ఏమిటి, మీరు భూమ్యాకాశాల్లో దేవుడు ఎరగని విషయం గురించి ఆయనకు కొత్తగా తెలుపుతున్నారా?" అని అడుగు వారిని. దేవుడు పరిశుద్ధుడు. వారు చేసే బహుదైవా రాధనకు ఆయన ఎంతో అతీతుడు. (18)

ప్రారంభంలో మానవులంతా ఒకే సముదాయంగా (ఒకే జాతిగా) ఉండేవారు. తర్వాత వారు విభిన్న విశ్వాసాలు, ఆచారాలు కల్పించుకొని చీలిపోయారు. నీ ప్రభువు వైపున ముందే ఒకమాట నిర్ణయించబడి ఉండకపోతే, వారు పరస్పరం విభేదించు కుంటున్న విషయాలు ఎప్పుడో పరిష్కరించబడి ఉండేవి. (19)

వారింకా "ఈ ప్రవక్తపై అతని ప్రభువు దగ్గర్నుండి ఏదైనా మహిమ ఎందుకు అవతరించదు?" అంటారు. వారికిలా చెప్పు: "అగోచరజ్ఞానం, అతీంద్రియశక్తులు దేవుని అధీనంలో ఉన్నాయి. (ఆయన ఆజ్ఞలేనిదే ఏదీ అవతరించదు.) మీరు (దాని కోసమే) ఎదురుచూస్తూ ఉండండి. నేను కూడా (మీ మూర్ఖపు కోరిక ఎలా నెరవేరుతుందో) ఎదురుచూస్తాను." (20)

ప్రజలు ఏదైనా ఆపద వచ్చినప్పుడు మేము వారికి (మా) కారుణ్యాన్ని చవిచూపితే ఆ తరువాత వెంటనే వారు మా సూక్తులకు వ్యతిరేకంగా పన్నాగాలు పన్నడం ప్రారంభిస్తారు. "పన్నాగాలు పన్నడంలో దేవుడు మీకంటే మిన్న. ఆయన దూతలు మీ పన్నాగాలన్నిటిని నమోదుచేస్తూనే ఉన్నారు" అని చెప్పు. (21)

మిమ్మల్ని నేలమీద, నీటిమీద నడిపించేవాడు దేవుడే. మీరు ఓడలలో ఎక్కి నప్పుడు చల్లటి వాతావరణం మధ్య ఆ ఓడలు గాలివాటుకు చక్కగా ముందుకు సాగి పోతుంటే మీరు హాయిగా ప్రయాణం చేస్తారు. (అయితే ఒక్కోసారి) కొంతదూరం పోయిన తర్వాత హఠాత్తుగా వాతావరణం మారిపోతుంది. గాలి ఉధృతంగా వీస్తుంది. ఓడ నలువైపుల నుండి అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతూ బీభత్సం సృష్టిస్తాయి. దాంతో ప్రయాణీకులు తాము తుఫానులో చిక్కుకున్నామని తెలిసి భయపడిపోతారు. అప్పుడు వారంతా (తమ తమ మిథ్యాదైవాలు మరచిపోయి) ఒక్క దేవుని మీదే విశ్వాసం ఉంచుతూ "దేవా! నీవు మమ్మల్ని ఈ ఆపద నుండి గట్టెక్కిస్తే మేము నీపట్ల కృతజ్ఞులై ఉంటాం" అని మొరపెట్టుకుంటారు.[2] (22)

అయితే దేవుడు వారిని ఆపదనుండి గట్టెక్కించగానే వారు మళ్ళీ సత్యవిముఖులై ధరణిలో తిరుగుబాటుకు ఒడిగడ్తారు. మానవులారా! (తెలుసుకోండి) "ఈ తిరుగుబాటువైఖరి వికటించి స్వయంగా మీకే వ్యతిరేకంగా పరిణమిస్తుంది. ప్రాపంచిక సుఖాలు కొన్నాళ్ల ముచ్చట మాత్రమే. చివరికి మీరు మా దగ్గరికే రావలసి ఉంటుంది. అప్పుడు మేము మీరు ప్రపంచంలో ఉండగా ఏమేమి చేసున్తుడేవారో మీకు తెలియజేస్తాము. (23)

---

2. వివరాలకు 6:41 సూక్తి, దాని పాదసూచిక చూడండి. 17:67 సూక్తి కూడా చూడండి.

ప్రాపంచిక జీవితాన్ని ఈవిధంగా పోల్చవచ్చు:- ఆకాశం నుండి మేము వర్షం కురిపించినప్పుడు నేల సస్యశ్యామలమై మానవులు, పశువులు తినే పంటలు, పచ్చిక లతో కనులపండువుగా తయారవుతుంది. చివరికి పుష్కలమైన పంటలతో పొలాలు శోభిల్లుతుంటాయి. ఆ పొలాలు కోతకు వచ్చినప్పుడు వాటి యజమానులు చూసి "ఇక మనకివి ఎంతో లాభం చేకూర్చుతాయి" అని భావిస్తారు. కాని అంతలో ఓరోజు రాత్రి వేళో, పగటి వేళో అకస్మాత్తుగా మాఆజ్ఞ వస్తుంది. మేమా పొలాలను నాశనంచేసి, నిన్న అక్కడ అసలు ఏమీ లేదన్నట్లు పూర్తిగా తుడిచిపెడ్తాము. ఇలా మేము యోచించేవారి కోసం మా నిదర్శనాలు విడమరచి తెలియజేస్తున్నాము. (24)

(కనుక క్షణభంగురం లాంటి ఈ ప్రాపంచిక జీవితంలోని పైపై మెరుగులకు మీరు మోసపోకండి.) దేవుడు మిమ్మల్ని (స్వర్గమనే) శాంతినిలయం వైపు ఆహ్వాని స్తున్నాడు. ఆయన తాను కోరినవారికి సన్మార్గం చూపుతాడు. (25)

సత్కార్యాలు చేసేవారికి సత్ఫలం ఉంది, అంతకు మించి కూడా ఉంది. వారి ముఖాలు దుమ్ము కొట్టుకొని నల్లగా మారడంగాని, అవమానభారంతో ముడుచుకు పోవడంగాని జరగదు. వారు స్వర్గానికి అర్హులవుతారు. స్వర్గంలోనే వారు కలకాలం ఉంటారు. దుష్కార్యాలు చేసేవారికి వారి దుష్కార్యాలకు తగినట్లే దుష్ఫలం ఉంది. వారిని అవమానం, అప్రతిష్ఠలు చుట్టుముడ్తాయి. దేవుని పట్టు నుండి వారిని కాపాడే నాథుడే ఉండడు. వారి ముఖాలు కారుచీకటిలా నల్లగా మాడిపోయి ఉంటాయి. వారే నరకానికి పోయేవారు. నరకంలోనే వారు ఎల్లకాలం పడి ఉంటారు. (26,27)

వారందర్నీ మేము ఒకేసారి సమావేశపరచినప్పుడు, దేవునికి సాటికల్పించినవారితో "ఆగండి మీరూ, దేవునికి మీరు సాటికల్పించిన మీ మిధ్యాదైవాలు" అంటూ వారిని మేము నిలదీస్తాము. తరువాత వారుభయుల మధ్య ఉన్న అపరిచిత తెరని తొలగిస్తాము. అప్పుడు వారు కల్పించుకున్న మిధ్యాదైవాలు వారితో "మీరు మమ్మల్ని ఎన్నడూ ఆరాధించలేదు.[3] ఈ విషయంలో మనకు దేవుడే సాక్షి. (ఒకవేళ మీరు

3. నిజదేవుడ్ని వదలి బహుదైవారాధకులు ఆరాధించే మిధ్యాదైవాలు వారి ఆరాధనను ఖండిస్తాయని ఖుర్ఆన్ చెబుతున్నది. ఇలా బహుదైవారాధకులు చేసిన తప్పు వారి కళ్ళముందే బట్టబయలౌతుంది. భగవద్గీత కూడా కొన్ని చోట్ల బహుదైవారాధనను ఖండిస్తూ ఇలా అన్నది:

శ్లో:- కామై స్తై స్తై ర్హృత జ్ఞానాః - ప్రపద్యంతే 2 న్యదేవతాః
తంతం నియమ మాస్థాయ - ప్రకృత్యా నియతాః స్వయా. (7:20)
శ్లో:- అంతవత్తు ఫలం తేషాం - తత్భవత్సల్ప మేధసామ్
దేవాన్ దేవయ జోయాంతి - మద్భక్తాయాంతి మామపి. (7:23)

(తమతమ ప్రకృతులచే నియమితులై ఆయా కోరికలచే వివేకము గోల్పోయి, వాటి కను గుణమగు నియమముల నాశ్రయించి పరమాత్మకు భిన్నమైన ఇతర దేవతలను పొందుచున్నారు. (ఆ కోరికలను కోరునట్టి అల్పబుద్ధుల కర్మఫలము నశించు స్వభావముకలది. శాశ్వతమైనది కాదు. ఇట్టి దేవతల నారాధించువారు ఆ దేవతలనే పొందుదురు. నా భక్తులు నన్నే పొందుదురు.)

(మరిన్ని వివరాలకు ఖుర్ఆన్‌లో 16:86, 39:3 సూక్తులు, వాటి పాదసూచికలు చూడండి.)



మమ్మల్ని ఎప్పుడైనా ఆరాధించి ఉంటే) మీ ఆరాధనను గురించి మాకసలు తెలియనే తెలియదు" అని అంటాయి. (28-29)

అప్పుడు ప్రతివాడూ తాను చేజేతులా చేసుకున్న కర్మల పర్యవసానం చవి చూస్తాడు. వారందరినీ వారి అసలు యజమాని దగ్గరికి తీసుకుపోవడం జరుగుతుంది. అక్కడ వారి అబద్ధాలు, అభూతకల్పనలన్నీ పటాపంచలైపోతాయి. (30)

ముహమ్మద్ (సల్లం)! వారిని ఇలా అడుగు: "మీకు భూమ్యాకాశాల నుండి ఉపాధి నిస్తున్నదెవరు? మీరు వినే, చూసే శక్తులు మీకసలు ఎవరు ప్రసాదించారు? నిర్జీవ పదార్థం నుండి జీవిని, జీవినుండి నిర్జీవ పదార్థాన్ని వెలికి తీస్తున్నదెవరు? బ్రహ్మాండమైన ఈ విశ్వ వ్యవస్థను (నియమబద్ధంగా) నిర్వహిస్తున్న శక్తిస్వరూపుడు ఎవరు?" వారు తప్పకుండా దేవుడే అంటారు. వారిని ఇంకా అడుగు: "మరి ఆ దేవుడే మీ నిజప్రభువు అయినప్పుడు మీరు (వాస్తవికతకు విరుద్ధంగా నడవడాన్ని) ఎందుకు మానుకోరు?" (31)

సత్యాన్ని త్రోసిపుచ్చిన తరువాత మార్గభ్రష్టత్వం తప్ప ఇక మిగిలేదేముంటుంది? అసలు మీరెలా మోసపోతున్నారు? (ప్రవక్తా!) ఈవిధంగా అవిధేయుల విషయంలో, వారు సత్యాన్ని విశ్వసించరన్న దైవవాక్కు నిజమని తేలిపోయింది. వారిని అడుగు: "మీరు కల్పించుకున్న మిధ్యాదైవాలలో ప్రారంభసృష్టిని, ఆ తరువాత పునఃసృష్టిని చేసేవారు ఉన్నారా?" అని. మళ్ళీ ఇలా చెప్పు: "దేవుడే ప్రారంభ సృష్టిని, ఆ తరువాత పునఃసృష్టిని కూడా చేస్తున్నాడు. అలాంటప్పుడు మీరెలా మోసపోతున్నారు?" (32-34)

వారిని అడుగు: "సరే, మీరు కల్పించుకున్న మిధ్యాదైవాలలో ఏవైనా మీకు సత్యం వైపు మార్గదర్శనం చేస్తున్నాయా?" వారికి స్పష్టంగా చెప్పెయ్యి: "దేవుడు మాత్రమే సత్యం వైపు మార్గదర్శనం చేసేవాడు. మరి మీరు అనుసరించడానికి అర్హుడైనవాడు సత్యం వైపు మార్గదర్శనం చేసేవాడా లేక మరొకరు మార్గదర్శనం చేస్తే తప్ప మార్గం పొందనివాడా? అసలు మీకేమయింది, ఇంత అన్యాయంగా ప్రవర్తిస్తున్నారు? (35)

వారిలో చాలామంది ఊహాగానాలు చేస్తూ వాటినే అనుసరిస్తున్నారు. కాని ఊహాగానాలు (ఎన్నిటికీ) సత్యానికి ప్రత్యామ్నాయం కాలేవు. వారు చేస్తున్నదంతా దేవుడు గమనిస్తూనే ఉన్నాడు.

ఈ ఖుర్ఆన్ దేవుని దగ్గరనుండి దివ్యావిష్కృతి లేకుండా మానవులు తమంతట తాము రచించుకోగల గ్రంథం కాదు. ఇది పూర్వం అవతరించిన దైవగ్రంథాల్ని ధృవీకరిస్తున్న దివ్యగ్రంథం, (వాటన్నిటి మౌలిక బోధనలను) విపులీకరించే సమగ్ర గ్రంథం. ఇది సర్వలోక ప్రభువు నుండి అవతరించిన గ్రంథం. ఇందులో ఎలాంటి సందేహం లేదు. (36,37)

దీన్ని దైవప్రవక్త స్వయంగా రచించుకున్నాడని అంటున్నారా వారు? వారికిలా చెప్పు: "మీ ఆరోపణ నిజమయితే ఇలాంటి ఒక అధ్యాయం రచించి తీసుకురండి.

(కావాలంటే) ఈ పనికోసం ఒక్క దేవుణ్ణి వదలి మీరు ఎవరెవరిని పిలుచుకోగలరో వారందర్నీ పిలుచుకొండి."[4] అసలు వారు తమకు తెలియని విషయాన్ని (మూర్ఖంగా) తిరస్కరిస్తున్నారు. దాని వాస్తవికత ఏమిటో వారికింకా తెలియదు. వారికి పూర్వముండిన ప్రజలు కూడా ఇలాగే నిరాకరించారు. ఇక చూడు, ఆ దుర్మార్గులకు ఎలాంటి గతి పట్టిందో! (38-39)

వారిలో కొందరు (సత్యాన్ని) విశ్వసిస్తారు; కొందరు విశ్వసించరు. ఆ దుర్మార్గుల సంగతి దేవునికి బాగా తెలుసు. వారు నిన్ను నిరాకరిస్తే ఇలా చెప్పు: "నా కర్మలు నావెంట వస్తాయి. మీ కర్మలు మీ వెంట వస్తాయి. నేను చేసే పనులకు మీరు బాధ్యులు కాలేరు. మీరు చేసే పనులకు నేను బాధ్యుణ్ణి కాను." వారిలో కొందరు నీ మాటలు చెవియొగ్గి వింటారు. కాని ఏమాత్రం తలకెక్కించుకోని ఈ తలబిరుసు మనుషులకు నీవు విన్పించగలవా? వారిలో చాలామంది (ఎంతో ఆసక్తి ఉన్నట్లు) నీవైపు చూస్తారు. మరి నీవు ఏమాత్రం (సత్యం) కానలేని ఈ అంధులకు (రుజు)మార్గం చూపగలవా? దేవుడు మానవులకు ఎన్నటికీ అన్యాయం చేయడు. స్వయంగా వారే ఆత్మవంచనకు పాల్పడుతున్నారు. (40-44)

దేవుడు వారందర్నీ సమావేశపరచే రోజున (భూలోకంలో) తాము కొన్ని క్షణాల కంటే ఎక్కువ కాలం గడపలేదని వారు భావిస్తారు. ఒకర్నొకరు గుర్తుపట్టడం జరుగుతుంది. అయితే దేవుణ్ణి కలుసుకునే విషయాన్ని నిరాకరించినవారు నిజంగా (ఆరోజు) ఘోరంగా నష్టపోతారు. వారసలు ఏమాత్రం సన్మార్గంలో నడవలేదు. ఏ దుష్పరిణామాలను గురించి మేము వారిని హెచ్చరిస్తున్నామో వాటిలో కొన్నిటిని నీ జీవిత కాలంలో వారికి చూపించినా, లేదా దానికి పూర్వమే మేము నిన్ను మా దగ్గరకు పిలిపించుకున్నా మొత్తంమీద వారు మా దగ్గరికే రావలసి ఉంటుంది. వారు చేస్తున్న పనులకు దేవుడే సాక్షి. (45,46)

ప్రతి జాతికీ ఒక ప్రవక్త ఉన్నాడు. ఒక జాతి దగ్గరకు దాని ప్రవక్త వచ్చినప్పుడు ఆ జాతి గురించి న్యాయంగా తగిన నిర్ణయం తీసుకోబడుతుంది. దానికి అణుమాత్రం కూడా అన్యాయం జరగదు. (47)

"నీ బెదిరింపు నిజమైతే అదసలు ఎప్పుడు నెరవేరుతుంది?" అంటారు వారు. వారికి చెప్పు: "నా చేతిలో ఏమీలేదు. లాభంగాని, నష్టంగాని అంతా దేవుని నిర్ణయం మీదనే ఆధారపడి ఉంది. ప్రతి జాతికీ ఒక నిర్ణీత గడువుకాలం ఉంది. ఆ గడువు ముగిసిపోగానే ఇక ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయడంగాని, నిర్ణీత గడువుకు ముందు ఒక్క క్షణం తొందర చేయడంగాని జరగదు." (48-49)

వారినిలా అడుగు: "దేవుని శిక్ష ఓరోజు రాత్రివేళో పగటివేళో అకస్మాత్తుగా వచ్చిపడితే (మీరేం చేయగలరు?) దాన్ని గురించి మీరెప్పుడైనా ఆలోచించారా? నేరస్థులు దానికోసం అంత తొందరపడతారేమిటీ? అలా చేయడం ఏమంత గొప్ప

4. ఇతర వివరాలకు 2:23, 24; 11:13,14 సూక్తులు కూడా చూడండి.



పనని? అది వచ్చి మీమీద విరుచుకుపడినప్పుడే మీరు (సత్యాన్ని) విశ్వసిస్తారా?" ఇప్పుడా మీరు బయటపడాలను కుంటున్నది? దాని కోసం మీరే కదా తొందరపడింది! అప్పుడా దుర్మార్గులకు "ఇక శాశ్వత (నరక) యాతనలు చవిచూడండి, మీరు సంపాదించుకున్న వాటికి ఫలితంగా. అంతకంటే వేరే శిక్ష ఏముంటుంది మీకు?" అని చెప్పడం జరుగుతుంది. (50-52)

వారు నిన్ను "ఇది నిజంగా సంభవిస్తుందా?" అని అడుగుతున్నారు. వారికి చెప్పు: "నా ప్రభువు సాక్షి! తప్పకుండా సంభవిస్తుంది. మీరు ఎట్టి పరిస్థితిలోనూ దాన్ని అడ్డుకోలేరు." దుర్మార్గం, దౌర్జన్యాలకు పాల్పడినవాడు ఆ యాతన నుండి విముక్తి పొందడానికి భూమండలమంత సిరిసంపదలున్నా అదంతా పాపపరిహారం క్రింద ఇవ్వడా నికి సిద్ధమౌతాడు. ఆ నరక యాతనలు చూసి వారు పశ్చాత్తాపంతో కుమిలిపోతారు. కాని వారి విషయంలో న్యాయంగానే నిర్ణయం చేయబడుతుంది. వారికి ఎలాంటి అన్యాయం జరగదు. (53,54)

వినండి! భూమ్యాకాశాల్లో ఉన్నదంతా దేవునిదే. వినండి! దేవుని వాగ్దానం పూర్తిగా నిజమయినది. కాని చాలామంది జనం (ఈ సత్యం) గ్రహించడం లేదు. దేవుడే (మీ) జీవన్మరణాలకు మూలకారకుడు. చివరికి మీరంతా ఆయన దగ్గరికే చేరుకోవలసి ఉంటుంది. (55,56)

మానవులారా! మీ ప్రభువు నుండి మీ దగ్గరకు హితోపదేశం వచ్చింది. ఇది మీ హృదయరుగ్మతలకు నివారిణి. దీన్ని స్వీకరించేవారికి ఇది మార్గదర్శిని, కారుణ్య ప్రదాయిని. ప్రవక్తా! వారికిలా తెలియజెయ్యి: "ఈ మహాభాగ్యాన్ని దేవుడు మీ కోసం పంపాడంటే ఇది ఆయన అనుగ్రహం, దాతృత్వాలే. దానిపై వారు ఆనందోత్సవాలు జరుపుకోవాలి. ఇది ప్రజలు కూడబెడ్తున్న దానికంటే ఎంతో శ్రేష్ఠమైనది. (57,58)

వారిని ఇలా అడుగు: "మీకు దేవుడు ప్రసాదించిన సంపదలలో[5] మీరు కొన్నిటిని నిషేధించుకొని, మరికొన్నిటిని ధర్మసమ్మతం చేసుకున్నారే! దాన్ని గురించి మీరెప్పుడయినా ఆలోచించారా?" ఇంకా అడుగు: "అలా చేయడానికి దేవుడు మీకు అనుమతించాడా? లేక మీరంతట మీరే కల్పించుకొని ఆ అబద్ధాన్ని దేవునికి ఆపాదిస్తున్నారా?"

దేవుని మీద అసత్య ఆరోపణలు మోపుతున్నవారు ప్రళయ దినాన తమ పట్ల ఆయన ఎలా వ్యవహరిస్తాడని భావిస్తున్నారు? దేవుడు (ఇహలోకంలో) మానవుల్ని

5. ఇక్కడ మూలభాషలో "రిజ్ఖ్" అనే పదం ప్రయోగించబడింది. ఇది ఎంతో విస్తృతార్థంతో కూడిన పదం. దేవుడు మనకు ప్రసాదించిన ప్రతి సంపద, వస్తువు, భాగ్యం, ఆహారం, పశువులు, సంతానం, సైన్సు, సద్బుద్ధి మొదలైనవన్నీ 'రిజ్ఖ్' క్రిందికే వస్తాయి. కొందరు ధర్మవేత్తలు 6:119,136, 138,139,140 సూక్తుల్ని దృష్టిలో పెట్టుకొని, ఇక్కడ రిజ్ఖ్ అంటే పశువులు అని వ్యాఖ్యానించారు. 2:3 సూక్తిలో రిజ్ఖ్ అంటే ధనం, ఆహారం, ధాన్యం, పండ్లచెట్లు, సేద్యభూములు, పశువులు, వెండి, బంగారాలు మొదలైన సంపదలని అర్థం.

ఎల్లప్పుడూ కటాక్ష వీక్షణలతోనే చూస్తాడు. కాని మానవులే చాలామంది ఆయనకు కృతజ్ఞత చూపడం లేదు. (59,60)

ప్రవక్తా! నీవు ఏఏ కార్యకలాపాలలో నిమగ్నమయి ఉన్నావో, ఖుర్‌ఆన్‌లో నీవు ఏఏ విషయాలు (ప్రజలకు) విన్పిస్తున్నావో అవన్నీ మా దృష్టిపథంలో ఉన్నాయి. అలాగే ప్రజలారా! మీరు ఎలాంటి పనులు చేస్తున్నారో వాటిని కూడా మేము గమనిస్తున్నాం. భూమ్యాకాశాల్లోని ఏ వస్తువూ చిన్నదైనా, పెద్దదైనా సరే నీ ప్రభువుకు కనబడకుండా మరుగున లేదు. అలాగే అది ఒక స్పష్టమైన గ్రంథంలో వ్రాయబడకుండా లేదు. (61)

వినండి! సత్యాన్ని విశ్వసించి భయభక్తులు కలిగివున్న దేవుని ప్రియభక్తులకు ఎలాంటి భయంగాని, దుఃఖంగాని ఉండదు. వారిటు ప్రపంచంలో, అటు పరలోకం లోనూ సంతోషంగా ఉంటారు. దేవుని మాటలు ఎన్నటికీ మారవు. ఇదే గొప్పవిజయం. ముహమ్మద్ (స)! వారి మాటలకు నీవు బాధపడకు. గౌరవప్రతిష్ఠలన్నీ దేవుని చేతిలోనే ఉన్నాయి. ఆయన అన్నీ వింటున్నాడు, సమస్తం ఎరిగినవాడు. (62-65)

వినండి! భూమ్యాకాశాల్లో ఉన్న సమస్త సృష్టిరాసులూ దేవుని సొత్తే. (అలాంటి) దేవుడ్ని కాదని మిథ్యాదైవాలను ప్రార్థిస్తున్నవారు కేవలం ఊహాగానాలుచేస్తూ, వాటినే అనుసరిస్తున్నారు. మీరు విశ్రాంతి తీసుకోవడానికి దేవుడే రాత్రిని సృష్టించాడు. (పనులు చేసుకోవడానికి వీలుగా) పగటిని ప్రకాశవంతంగా చేసినవాడు కూడా ఆయనే. (ప్రవక్త సందేశం) వినేవారికి అందులో (అనేక) సూచనలు ఉన్నాయి. (66-67)

కొందరు "దేవుడు ఒకడ్ని కుమారుడిగా చేసుకున్నాడ"ని అంటున్నారు. దేవుడు పరిశుద్ధుడు, నిరపేక్షాపరుడు. భూమ్యాకాశాల్లో ఉన్న సమస్తం ఆయన సొత్తే. ఆ మాటకు మీ దగ్గర ఏదైనా ఆధారం ఉందా? దేవుడ్ని గురించి మీకేమాత్రం తెలియని విషయాలు మాట్లాడుతున్నారా! "దేవుని మీద అసత్యారోపణలు చేసేవారు ఎన్నటికీ సఫలీకృతులు కాలేర"ని చెప్పు. క్షణభంగురంలాంటి ఐహికజీవితంలో కొన్నాళ్ళపాటు వారిని తనివితీరా సుఖాలు జుర్రుకోనీ. ఆతర్వాత వారు మాదగ్గరికే రావలసి ఉంటుంది. అప్పుడు మేము వారికి సత్యతిరస్కారానికి ప్రతిఫలంగా తీవ్ర యాతనలు చవిచూపిస్తాము. (68-70)

వారికి కాస్త నూహ్ గాథ విన్పించు. అప్పుడతను తన జాతి ప్రజలతో ఇలా అన్నాడు: "సోదరులారా! నేను మీమధ్య ఉండి దేవుని సూక్తులు విన్పిస్తూ మిమ్మల్ని ఏమరుపాటు నుండి జాగృతపరచడం మీరు సహించకపోతే (పోనివ్వండి) నేను మాత్రం దేవుడ్నే నమ్ముకొని ఆయన మీద ఆధారపడ్డాను. మీరు మీ కల్పితదైవాలు తీసుకొని ఓ నిర్ణయానికి రండి. మీరు పన్నే వ్యూహంలో ఏ అంశమూ తప్పిపోకుండా ఉండేలా ఓసారి దాన్ని క్షుణ్ణంగా పరిశీలించుకోండి. ఆ తర్వాత దాన్ని నాకు వ్యతిరేకంగా అమలు పరచండి. నాకెలాంటి అవకాశం ఇవ్వకండి. మీరు నా హితబోధ వినకుండా ముఖం తిప్పుకున్నారు. (దానివల్ల నాకొచ్చే నష్టమేమీ లేదు.) నేను మీనుండి ఎలాంటి ప్రతిఫలం కోరలేదు. నాకు ప్రతిఫలమిచ్చే బాధ్యత దేవునిపై ఉంది. నేను మాత్రం ముస్లింనయి ఉండాలని నాకు ఆదేశం ఇవ్వబడింది." (71,72)



వారు (దీన్ని కూడా ఖాతరుచేయకుండా) అతడ్ని నిరాకరించారు. అప్పుడు మేము అతడ్ని, అతనితోపాటు ఓడలో ఎక్కినవారిని రక్షించాము. వారిని మాత్రమే ప్రపంచంలో జీవించిఉండేలా చేశాము. మా సూక్తులు నిరాకరించిన వారందర్నీ ముంచివేశాము. చూడండి, హెచ్చరించబడినవారికి ఎలాంటి దుర్గతి పట్టిందో. (73)

నూహ్ తర్వాత మేము వివిధ ప్రవక్తలను వారి వారి జాతుల దగ్గరకు పంపాము. ఆ ప్రవక్తలు వారి దగ్గరకు స్పష్టమైన నిదర్శనాలు తీసుకువెళ్ళారు. కాని వారు (సత్యాన్ని నిరాకరించారు.) ఒకసారి నిరాకరించినదాన్ని మళ్ళీ అంగీకరించే మనుషులు కాదు. ఈ విధంగా హద్దుమీరేవారి హృదయకవాటాలను మేము మూసివేస్తున్నాము. (74)

ఆ తర్వాత మేము మూసాకు, హారూన్‌కు మా నిదర్శనాలిచ్చి ఫిరౌన్ దగ్గరకు, అతని అధికారుల దగ్గరకు పంపాము. కాని వారు అహంకారంతో విర్రవీగిపోయారు. వారసలు పరమ దుర్మార్గులు. మా దగ్గర నుండి వారి ముందుకు సత్యం వచ్చినప్పుడు, అది వట్టి మంత్రజాలం మాత్రమేనని అన్నారు. (75,76)

అప్పుడు మూసా "సత్యం మీ ముందుకు వస్తే దాన్ని మంత్రజాలం అంటారా? మాంత్రికులు ఎన్నటికీ సఫలం కాలేరు" అని అన్నాడు. (77)

దానికి వారు "నీవు మా తాతముత్తాతల మార్గం నుండి మమ్మల్ని మరలించడా నికి వచ్చావా? ఇలా మీరిద్దరు (మా) దేశంలో పెత్తనం చెలాయింపజూస్తున్నారా? నీ మాటల్ని మేము ఎన్నటికీ అంగీకరించం" అన్నారు. ఆతర్వాత ఫిరౌన్ (తన అధికారు లతో) "ఆరితేరిన మాంత్రికులందర్నీ మాముందు ప్రవేశపెట్టండి" అన్నాడు. (78,79)

మాంత్రికులు వచ్చిన తరువాత మూసా వారినుద్దేశించి "మీరు పడేయదలచుకున్న దేమిటో పడేయండి" అన్నాడు. వారు తమ మంత్రసాధనాలను (నేలమీద) పడవేశారు.

అప్పుడు మూసా ఇలా అన్నాడు: "మీరు పడవేసింది మంత్రజాలం మాత్రమే. చూడండి ఇప్పుడు దేవుడు దాన్ని ఎలా విచ్ఛిన్నం చేస్తాడో. ఆయన దుర్మార్గుల పనిని నెరవేర నీయడు. దురాత్ములకు ఎంత వెగటుకలిగినా దేవుడు తన నిదర్శనాలతో సత్యాన్ని సత్యంగా నిరూపించి తీరుతాడు." (80-82)

ఫిరౌన్, అతని అధికారులు ఏ కష్టాలు తెచ్చిపెడ్తారోనని భయపడి, ఆ జాతిలో కొందరు యువకులు[6] తప్ప మరెవరూ మూసాను విశ్వసించలేదు. ఫిరౌన్ దేశంలో అతి క్రూరుడైన నియంతలా తయారయి (అధికార గర్వంతో) హద్దుమీరి పోయాడు. (83)

6. ప్రతి ఉద్యమం ప్రారంభంలో సాధారణంగా యువకులే అందులో చేరుతారు. దానికి కారణం ప్రతికూల వాతావరణానికి ఎదురీదగల శక్తి, సాహసం వయసుమీరినవారి కంటే యువకుల్లోనే ఎక్కువగా ఉంటాయి. కొత్త విషయాన్ని త్వరగా గ్రహించగల శక్తి కూడా యువకులకే ఎక్కువగా ఉంటుంది. అందుకే మూసాప్రవక్త (అలైహి)ను మొదట యువకులే విశ్వసించారు.

అలాగే అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం)ను కూడా ప్రారంభంలో యువకులే విశ్వసించి ఆయన ప్రారంభించిన మానవ సంస్కరణోద్యమంలో చేరిపోయారు. అలి బిన్

మూసా తన జాతిప్రజల్ని ఉద్దేశించి "ప్రజలారా! మీరు నిజంగా దేవుడ్ని విశ్వసిస్తే ఆయన మీదే భారం వేయండి. మీరు (చిత్తశుద్ధి కలిగిన) ముస్లింలు (దైవవిధేయులు) అయితే (నా హితవులు పాటించండి)." (84)

దానికి వారు సమాధానమిస్తూ "మేము దేవుని మీదే భారంవేశాం. దేవా! మమ్మల్ని దుర్మార్గుల కోసం పరీక్షగా చేయకు. నీ కారుణ్య కటాక్షాలతో మమ్మల్ని అవిశ్వాసుల బారి నుండి రక్షించు" అని అన్నారు. (85-86)

మేము మూసాని, అతని సోదరుడ్ని ప్రేరేపిస్తూ "మీ జాతిప్రజల కోసం ఈజిప్టులో కొన్ని ఇండ్లు సిద్ధం చేసుకోండి. వాటిని ఆరాధనా కేంద్రంగా చేసుకొని (సామూహిక) ప్రార్థనా వ్యవస్థ నెలకొల్పండి. విశ్వాసులకు శుభవార్త విన్పించండి" అని అన్నాం. (87)

మూసా ఇలా ప్రార్థించాడు: "ప్రభూ! నీవు ఫిరౌన్‌కు, అతని అధికారులకు ఐహిక జీవితంలో ఐశ్వర్యం, సకలసాధనసంపత్తులు ప్రసాదించావు. ప్రభూ! ప్రజల్ని నీమార్గం లోకి రాకుండా నిరోధించడానికా ఇవన్నీ ఇచ్చింది? ప్రభూ! వారి సిరిసంపదలు నాశనం చెయ్యి. దుర్భరశిక్ష చూడనంతవరకు (సత్యాన్ని) విశ్వసించనీయకుండా వారి హృదయ కవాటాలు మూసెయ్యి." దానికి దేవుడు జవాబిస్తూ "మీఇద్దరి వేడుకోలు స్వీకరించ బడింది. (ధర్మంలో) స్థిరంగా ఉండండి. జ్ఞానశూన్యుల మార్గం ఎన్నటికీ అనుసరించ కండి" అన్నాడు. (88,89)

మేము ఇస్రాయీల్ సంతతిని సముద్రం దాటించి ఆవల ఒడ్డుకు చేర్చాము. ఫిరౌన్, అతని సైనికులు హింసా, ప్రతీకారేచ్ఛలతో వారి వెంటపడ్డారు. చివరికి ఫిరౌన్ సముద్రంలో మునిగిపోతూ "నేను ఇస్రాయీలీలు విశ్వసించిన దేవుడ్ని విశ్వసించాను. ఆయన తప్ప మరోదేవుడు లేడు. నేనిప్పుడు దైవవిధేయుల్లో చేరిపోయాను" అని పలికాడు. (90)

"ఇప్పుడా నీవు విశ్వసించేది? ఇంతకు పూర్వం నీవు అవిధేయుడవయి దుర్మార్గపు పనులు చేస్తుండేవాడివి. ఇప్పుడు నీవు భావితరాలకు గుణపాఠంగా మిగిలిపోవడానికి నీ శవాన్ని మాత్రమే మేము కాపాడుతాం"[7] (అని సమాధానం వచ్చింది). చాలామంది మా నిదర్శనాల విషయంలో అజాగ్రత్త, ఏమరుపాటులకు లోనయి ఉన్నారు. (91,92)

---

అబీతాలిబ్, జాఫర్ తయ్యార్, జుబైర్, తల్హా, సాద్ బిన్ అబీవఖ్ఖాస్, ముస్అబ్ బిన్ ఉమైర్, అబ్దుల్లా బిన్ మస్‌వూద్ మొదలైన వారంతా ఇరవైయేళ్ళ లోపువారే. అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్, బిలాల్, సుహైబ్‌ల వయస్సు ఇరవై ముప్ఫయి యేండ్ల మధ్య ఉండేది. అబూ ఉబైదా బిన్ జిరాహ్, జైద్ బిన్ హారిసా, ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్, ఉమర్ బిన్ ఖత్తాబ్‌ల వయస్సు ముప్ఫయి, ముప్ఫయి ఐదు మధ్య ఉండేది. అబూబకర్ సిద్దీఖ్ (రజి) వయస్సు కూడా 38 కి మించి లేదు. దానికి పైబడిన వయస్సు కలవారు ఒకరిద్దరు మాత్రమే ఉండేవారు.

7. మూడువేల ఏళ్ళ క్రితం సముద్రంలో మునిగిన ఫిరౌన్ శవం ఈనాటికీ సురక్షితంగా ఉంది. క్రీ.శ. 1907లో సర్‌గ్రాస్టన్ ఎలైట్ స్మిత్ ఆ శవాన్ని పరీక్షిస్తే, దానిపై ఉప్పుపొర పేరుకుపోయి ఉంది. ప్రస్తుతం ఈ శవం(మమ్మి) ఈజిప్టులోని జాతీయ పురావస్తు ప్రదర్శనశాలలో ఉంది.



మేము ఇస్రాయీల్ సంతతివారికి ఎంతో ఆహ్లాదకరమైన ప్రదేశంలో పునరావాసం, అత్యంత శ్రేష్టమైన జీవనోపాధి కల్పించాము. వారు తమ దగ్గరకు (ధర్మ) జ్ఞానం వచ్చిన తరువాతే పరస్పరం విభేదాలలో పడిపోయారు. నీ ప్రభువు ప్రళయదినాన వారిముందు వారు విభేదించుకున్న విషయాలను గురించి తప్పకుండా తీర్పుచేస్తాడు. (93)

మేము నీపై అవతరింపజేసినదాని విషయంలో నీకేమైనా అనుమానముంటే పూర్వం నుంచీ (దివ్య) గ్రంథం పఠిస్తూ వస్తున్నవారిని అడిగి తెలుసుకో. ఇది నిస్సందేహంగా నీప్రభువు దగ్గర్నుండి వచ్చిన పరమసత్యం. కనుక నీవు శంకించేవారిలో చేరిపోకు. అలాగే మాసూక్తులు  నిరాకరించినవారిలో కూడా చేరిపోకు. అలాచేస్తే నీవు ఘోరంగా నష్టపోతావు. (94,95)

ఎవరి విషయంలో నీ ప్రభువుమాట స్థిరపడిపోయిందో వారి ముందు నీవు ఎలాంటి నిదర్శనం ప్రదర్శించినా, దుర్భరశిక్ష కళ్ళారా చూడనంతవరకూ వారు (సత్యాన్ని) విశ్వసించరు. ఏదైనా పట్నంలోని ప్రజలు (దైవ)శిక్ష వచ్చిపడటం చూసి విశ్వసించి నప్పుడు, ఆ విశ్వాసం వారికి ప్రయోజనం చేకూర్చినట్లు ఒక్క ఉదంతమైనా సంభవిం చిందా యూనుస్‌జాతి తప్ప? (యూనుస్‌జాతి సంగతి వేరు) ఆ జాతిప్రజలు (సత్యాన్ని) విశ్వసించగానే మేము ప్రపంచ జీవితంలో వారిపై పడనున్న అవమానకరమైన శిక్ష తొలగించాం. ఆతర్వాత ఆ జాతికి కొంత కాలందాకా జీవితసుఖాలు అనుభవించేందుకు అవకాశమిచ్చాం.[8] (96-98)

నీ ప్రభువు తలచుకుంటే భూవాసులంతా (సత్యాన్ని) విశ్వసించేవారు. కాని నీవు ప్రజల్ని బలవంతంగా విశ్వాసులుగా మార్చదలిచావా? దైవాజ్ఞ లేనిదే ఏ ఒక్కడూ (సత్యాన్ని) విశ్వసించలేడు. బుద్ధిహీనులపై దేవుడు (అవిశ్వాస) మలినాన్ని పడవేస్తాడు. భూమ్యాకాశాల్లో ఉన్నవాటిని ఓసారి కళ్ళుతెరచి చూడండని చెప్పు వారికి. సత్యాన్ని విశ్వసించాలన్న ఉద్దేశ్యమే  లేనివారికి ఎన్ని నిదర్శనాలు చూపినా, ఎన్ని హెచ్చరికలు చేసినా లాభం లేదు. (99-101)

---

ప్రాచీన ఈజిప్టు చక్రవర్తుల్ని ఫిరౌన్‌లు అంటారు. వీరిలో అనేక వంశాలుండేవి. మూసా ప్రవక్త (అలైహి)కు కొన్నేండ్ల పూర్వం నుండి ఫిరౌన్‌ల వంశం "రామ్సెస్-1"తో ప్రారంభమయింది. అతని కుమారుడు 'సెతి' రెండవ ఫిరౌన్‌గా ప్రసిద్ధిచెందాడు. సెతి కుమారుడు "రామ్సెస్-2". ఇతని కాలంలోనే మూసాప్రవక్త (అలైహి) జన్మించారు. ఇతని పోషణలోనే పెరిగి పెద్దవారయ్యారు.

క్రీ.శ. 1886లో పురావస్తు శాఖ చేపట్టిన త్రవ్వకాల్లో ఒక పిరమిడ్ నుండి ఓ శవం బయల్ప డింది. దానిపై వున్న వస్త్రాలు తీసి చూస్తే శరీరానికి చుట్టబడిన ఆఖరి వస్త్రంపై "రామ్సెస్-2" అని రాయబడి ఉంది. ఇతని పరిపాలనా కాలం క్రీ.పూ. 1304లో ప్రారంభమయి ఉంటుందని పురావస్తు శాస్త్రవేత్తల అభిప్రాయం. రామ్సెస్-2 చనిపోయిన తర్వాత అతని కొడుకు "మిన్ఫతాహ్" అధికారం లోకి వచ్చాడు. ఇతనే మూసాప్రవక్త అందజేసిన దైవసందేశాన్ని తిరస్కరించి, ఎర్ర సముద్రంలో మునిగి చనిపోయిన ఫిరౌన్ చక్రవర్తి. (ఎన్‌సైక్లోపీడియా ఆఫ్ రెలీజియన్, భాగం-5)

8. వివరాలకు 37:139-148 సూక్తులు, వాటి పాదసూచిక చూడండి.

పూర్వం ప్రజలు ఏ దుర్దినాలు చూశారో ఆ దుర్దినాలకోసం ఎదురుచూస్తున్నారా వీరు? "అయితే ఎదురుచూడండి, నేనూ మీతోపాటు ఎదురుచూస్తాను" అని చెప్పు వారికి. (అలాంటి కష్టకాలం వస్తే) మేము మా ప్రవక్తలను, విశ్వసించినవారిని కాపాడు కుంటాం. విశ్వాసుల్ని కాపాడుకోవడం మా బాధ్యత. (102,103)

ముహమ్మద్ (సల్లం)! వారితో ఇలా చెప్పెయ్యి: "ప్రజలారా! నా ధర్మం గురించి మీకేదయినా అనుమానం ఉంటే ఒక విషయం తెలుసుకోండి. మీరు దేవుణ్ణి వదలి ఎవరిని ఆరాధిస్తున్నారో వారిని నేను ఎన్నటికీ ఆరాధించను. ఎవరి అధీనంలో మీ ప్రాణాలున్నాయో ఆ దేవుణ్ణి మాత్రమే నేను ఆరాధిస్తాను. నేను దృఢమయిన విశ్వాసిగా ఉండాలని నాకు ఆజ్ఞయింది. (104)

నాకీ ఆదేశం కూడా ఇవ్వబడింది: "నీవు ఏకాగ్ర చిత్తుడవయి ఈ ధర్మంలోనే స్థిరంగా ఉండు. బహుదైవారాధకుల్లో చేరిపోకు. దేవుణ్ణి వదలి నీకు ఎలాంటి లాభం గాని, నష్టంగాని కలిగించలేని మిధ్యాదైవాలను ఎన్నటికీ ప్రార్థించకు. అలా చేస్తే నీవు దుర్మార్గుడవై పోతావు. దేవుడు నిన్ను ఏదయినా కష్టానికి గురిచేయదలిస్తే ఆయన తప్ప ఆ కష్టం నుండి నిన్ను గట్టెక్కించేవారు మరెవరూ ఉండరు. అలాగే దేవుడు నీకేదయినా మేలు చేయగోరితే ఆయన అనుగ్రహాన్ని అడ్డుకోగలవారు కూడా ఎవరూ ఉండరు. ఆయన తన దాసులలో తాను తలచుకున్న వారికి తన అనుగ్రహభాగ్యం ప్రసాదిస్తాడు. ఆయన గొప్ప క్షమాశీలి, అమిత దయామయుడు." (105-107)

ప్రవక్తా! వారికీ విషయం తెలియజెయ్యి: "ప్రజాలారా! మీ ప్రభువు నుండి మీదగ్గరకు సత్యం వచ్చింది. ఇక ఎవరు సన్మార్గం అవలంబిస్తారో ఆ సన్మార్గం వారికే మేలు చేకూర్చు తుంది. అలాగే ఎవరు మార్గభ్రష్టత్వంలోనే పడివుంటారో ఆ మార్గభ్రష్టత్వం వారికే చేటు తెస్తుంది. నేను మీపై పర్యవేక్షకునిగా లేను." (108)

ప్రవక్తా! దివ్యావిష్కృతి (వహీ) ద్వారా నీదగ్గరకు పంపబడిన హితోపదేశం అనుసరిస్తూ ఉండు. దేవుడు (తుది) నిర్ణయం చేసేవరకు సహనం వహించు. ఆయనే అందరికన్నా మంచి నిర్ణయంచేసేవాడు. (109) ✪

ఖుర్ఆన్‌ని సరిగా, పూర్తిగా అర్థం చేసుకోవడానికి వ్యాఖ్యాన సహిత ఖుర్ఆన్‌తో పాటు, ఇది దివి నుండి నేరుగా ఏ మహనీయుని హృదయ ఫలకంపై అవత రించిందో ఆ మహనీయుని సచ్చరితను గురించి తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఆ మహనీయుడే అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స). ఈ దృష్టితోనే "మహనీయ ముహమ్మద్ ఆదర్శజీవితం" పేరుతో తేటతెలుగులో "ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్" నుండి ఒక పుస్తకం వెలువడింది. 504 పేజీలు గల ఈ పుస్తకాన్ని సత్యాన్వేషకులే గాక నవలా ప్రియులు, భాషాభిమానులు సయితం ఒకసారి చదవడం మొదలు పెడితే ముగించేదాక వదలి పెట్టలేరు.



అవతరణ: మక్కా

# 11. హూద్

సూక్తులు: 123

ఈ అధ్యాయంలోని విషయాలు గమనిస్తే ఇది కూడా యూనుస్ అధ్యాయం కాలంలోనే అవతరించినట్లు అన్పిస్తోంది. ఇందులోనూ బహుదైవారాధకులకు హితవులు, హెచ్చరికలు చేయబడ్డాయి. గతంలో దైవసందేశం తిరస్కరించి దుర్గతిపాలైన హూద్, ఆద్, లూత్ తదితర జాతుల వృత్తాంతాలు పేర్కొంటూ వారిని రుజుమార్గం వైపు ఆహ్వానించడం జరిగింది.

## కరుణామయుడు, కృపాసాగరుడయిన దేవుని పేరుతో ప్రారంభం

అలిఫ్-లామ్-రా. ఇది స్థిరమయిన, స్పష్టమయిన సూక్తులతో సర్వజ్ఞుడు, మహా వివేకవంతుడయిన శక్తిస్వరూపుని దగ్గరనుండి అవతరించిన గ్రంథం. దీని ఆదేశం ప్రకారం మీరు దేవుణ్ణి తప్ప మరెవరినీ ఆరాధించకూడదు. నేను ఆయన వైపున మిమ్మల్ని హెచ్చరించే, శుభవార్త అందజేసేవాణ్ణి. (1,2)

మీరు మీ ప్రభువును క్షమాపణ కోరుకోండి. ఆయనవైపు మరలండి. అలాచేస్తే ఆయన మీకు ఓ నిర్ణీతకాలం వరకు మంచి జీవనసామగ్రి అనుగ్రహిస్తాడు. ప్రతి సహృదయునికీ తన సౌహార్దత, సౌభాగ్యాలను ప్రసాదిస్తాడు. అయితే మీరు (నా హితోపదేశం వినకుండా) ముఖం తిప్పుకుంటే (నాకొచ్చే నష్టమేమీ లేదు.) మీ విషయంలో నేను భయంకర (ప్రళయ) దినాన సంభవించే (నరక) యాతనను గురించి భయపడుతున్నాను. మీరంతా (చనిపోయిన తరువాత) దేవుని సన్నిధికే చేరుకోవలసి ఉంది. ఆయన ప్రతిపనీ చేయగల సమర్థుడు, సర్వశక్తిమంతుడు. (3,4)

చూడు, వారు (తమ దుష్టాలోచనల్ని) ఆయనకు తెలియకుండా దాచడానికి వృథా ప్రయత్నంచేస్తూ ఎలా ముఖం చాటేస్తున్నారో. జాగ్రత్త! వారు తమముఖాలను వస్త్రాలలో దాచుకుంటున్నారుగాని, దేవునికి వారి అంతర్‌బాహ్య విషయాలన్నీ తెలుసు. ఆయనకు మానవుల హృదయాంతరాళాల్లో మెదిలే రహస్య విషయాలు సైతం తెలుసు. (5)

భూమండలంపై సంచరించే ప్రతిప్రాణికీ ఉపాధినిచ్చే బాధ్యత దేవునిపైనే ఉంది. అలాగే ఏప్రాణి ఎక్కడ నివసిస్తుందో, ఎక్కడ (దానిప్రాణం) భద్రపరచబడుతుందో కూడా దేవునికి తెలుసు. సమస్త విషయాలు స్పష్టంగా గ్రంథంలో వ్రాయబడి ఉన్నాయి. (6)

ఆయనే భూమ్యాకాశాల్ని ఆరు రోజుల్లో సృష్టించినవాడు. దీనికి పూర్వం ఆయన (అధికార) సింహాసనం నీటిమీద ఉండేది. మీలో ఎవరు నీతిగా నడుచుకుంటారో పరీక్షించడానికే ఆయన ఇదంతా సృష్టించాడు. (ప్రవక్తా!) నీవు సత్యతిరస్కారులకు "మరణానంతరం మీరు తిరిగిబ్రతికించి లేపబడతారు" అని చెబుతుంటే వారు వెంటనే "ఇది పూర్తిగా మంత్రజాలం తప్ప మరేమీ కాద"ని అంటున్నారు. (7)

మేము వారిని వెంటనే శిక్షించకుండా ఒక నిర్ణీతకాలం వరకు వదలిపెడ్తుంటే "ఏ విషయం దాన్ని నిరోధించింది?" అంటున్నారు వారు. వినండి, వారికి శిక్ష సమయం సమీపించినప్పుడు ఇక దాన్ని ఎవరూ అడ్డుకోలేరు. వారు హేళన చేస్తున్న విషయమే వారిని చుట్టుముడ్తుంది. (8)

ఎప్పుడైనా మేము మానవునికి మా కారుణ్యం చవిచూపిన తరువాత తిరిగి తీసుకుంటే (వెంటనే) అతను నిరాశచెంది కృతఘ్నుడుగా మారిపోతాడు. ఒకవేళ అతనికి వచ్చిన ఆపదను దూరంచేసి మేము సౌఖ్యం కలిగిస్తే అతను (తెగ సంబరపడిపోతూ) "నా కష్టాలన్నీ తీరి పోయాయి" అంటాడు. పైగా అతను మితిమీరిన సంతోషంతో గర్విష్ఠుడయి పోతాడు. అయితే సజ్జనులు, సహనశీలురు మాత్రం ఇలాంటి బలహీనతలను దరికి చేరనివ్వరు. అలాంటివారికే (దేవునిదగ్గర) మన్నింపు, గొప్ప ప్రతిఫలమూ లభిస్తాయి.(9-11)

కనుక నీపై అవతరిస్తున్న విషయాల్లో కొన్నిటిని (ప్రచారం చేయకుండా) వదిలేస్తావేమో (అలా వదిలేయకూడదు సుమా!) అలాగే వారు "ఈ మనిషిపై ఏదైనా ఒక నిధి ఎందుకు అవతరించలేదూ, లేదా ఇతని వెంట దైవదూతయినా ఎందుకు రాలేదూ?" అని అంటారు. దానికి బాధపడకు. నీవు హెచ్చరించేవాడివి మాత్రమే. ఆ తరువాత విషయాలన్నీ దేవుడే చూసుకుంటాడు. ఆయనే ప్రతి దానికీ పర్యవేక్షకుడు. (12)

వారు ఈగ్రంథాన్ని స్వయంగా అతనే కల్పించుకున్నాడని అంటున్నారా? అయితే వారినిలా అడుగు: "సరే, ఇలాంటి పదిఅధ్యాయాలు రచించి తీసుకురండి. (కావాలంటే) ఈ పనిలో మీకు సహాయపడేందుకు ఒక్క దేవుడ్ని వదలి మీరు ఎవరెవర్ని పిలుచుకోగలరో వారందర్నీ పిలుచుకోండి. మీరు నిజాయితీపరులైతే (ఈపని చేసి చూపండి). వారు గనక మీ సహాయానికి రాకపోతే ఈ గ్రంథం (మానవమేధా జనితం కాదని,) దైవజ్ఞానంతో అవతరించిందని, ఆ దేవుడు తప్ప మరోఆరాధ్యుడు లేడని తెలుసుకోండి. మరి మీరు (ఇప్పటికైనా ఈ సత్యానికి) తలవొగ్గుతారా?" (13,14)

కేవలం ప్రాపంచిక జీవితాన్ని, దాని తళుకు బెళుకుల్ని కోరుకునేవారికి వారి కర్మఫలాన్ని పూర్తిగా ఇక్కడే ఇచ్చివేస్తాము. అందులో వారికి ఎలాంటి కొరత చేయము. అయితే పరలోకంలో అలాంటివారికి నరకాగ్ని తప్ప మరేమీ ఉండదు. వారు ప్రపంచంలో సమకూర్చుకున్నదంతా నిరర్థకమైపోయింది; వారు చేసినదంతా మిథ్యే (అని అప్పుడు తెలుస్తుంది వారికి). (15,16)

ఒకవ్యక్తి తనప్రభువు నుండి స్పష్టమైన నిదర్శనం కలిగిఉన్నాడు. ఆ తర్వాత (ఆ నిదర్శనాన్ని సమర్థిస్తూ) మరో నిదర్శనం కూడా అతని ప్రభువు నుండి వచ్చింది. దీనికి పూర్వం మార్గదర్శినిగా, (దైవ)కారుణ్యంగా అవతరించిన మూసా గ్రంథం కూడా ఉంది. మరి (ఈవ్యక్తి ప్రపంచపూజారిలా ముహమ్మద్ తెచ్చిన సత్యాన్ని తిరస్కరించగలడా)? అలాంటివారు దీన్ని తప్పకుండా విశ్వసిస్తారు. యావత్ మానవజాతుల్లో ఏజాతైనా దీన్ని తిరస్కరిస్తే దాని నివాసస్థలం నరకమవుతుందని వాగ్దానం చేయబడుతోంది. కనుక ముహమ్మద్ (స)! ఈ విషయంలో నీవు ఎలాంటి సందేహానికి ఆస్కారమివ్వకు. ఇది నీ ప్రభువు నుండి వచ్చిన సత్యం. కాని చాలామంది దీన్ని విశ్వసించడంలేదు. (17)

దేవునికి అబద్ధం ఆపాదించేవాడి కంటే పరమ దుర్మార్గుడెవరుంటారు? అలాంటి వారిని దేవుని ముందు ప్రవేశపెట్టడం జరుగుతుంది. అప్పుడు సాక్షులు తమ ప్రభువుకు



అసత్యం ఆపాదించినవారు వీరేనని సాక్ష్యమిస్తారు. వినండి. దేవుని మార్గం నుండి ప్రజల్ని నిరోధించే దుర్మార్గులపై దైవశాపం విరుచుకుపడుతుంది. (18)

ఈ దుర్మార్గులు దేవుడు నిర్దేశించిన మార్గాన్ని వక్రీకరింపజూస్తూ పరలోకాన్ని తిరస్క రిస్తున్నారు. వారు యావత్తు భూమండలంలో దేవుడ్ని ఏమాత్రం అశక్తుడిగా చేయలేరు. దేవునికి వ్యతిరేకంగా వారికి సహాయం చేసేవాడు కూడా ఉండడు. వారికి రెట్టింపు శిక్ష పడుతుంది. వారిప్పుడు ఎవరి (హిత)వచనాలు వినే స్థితిలోలేరు. స్వయంగా వారికీ ఎలాంటి (మంచి)విషయం తట్టదు. తమకుతాము నష్టం కలిగించుకున్న ఆత్మ వినాశకులు వీరే. వారి అభూతకల్పనలన్నీ వారినుండి కనుమరుగై పోతాయి. నిస్సందేహంగా వారే పరలోకంలో అందరికన్నా ఘోరంగా నష్టపోయేవారు. (19-22)

ఇక సత్యాన్ని విశ్వసించి సదాచార సంపన్నులైనవారు మాత్రం (తుదిశ్వాస వరకు) తమ ప్రభువుకే అంకితమయి ఉంటారు. వారు తప్పకుండా స్వర్గనివాసులవుతారు. స్వర్గంలోనే కలకాలం (హాయిగా) ఉంటారు. ఈ ఉభయవర్గాలను ఇలా పోల్చవచ్చు. ఒకడు అంధుడు, బధిరుడు. మరొకడు కళ్ళూ, చెవులూ ఉన్నవాడు. వీరిరువురు సమానమేనా? మీరు విషయం గ్రహించరా? (23,24)

మేము నూహ్‌ను అతని జాతిప్రజల దగ్గరకు పంపాము. అప్పుడతను (వారికి హితోపదేశం చేస్తూ) "నేను మిమ్మల్ని స్పష్టంగా హెచ్చరించడానికి వచ్చాను. (ఏకైక) దేవుడ్ని తప్ప మీరు ఎవరినీ ఆరాధించకండి. ఇలా చేయకపోతే మీపై ఘోరమైన శిక్ష విరుచుకుపడుతుందని నేను భయపడుతున్నాను" అని అన్నాడు. (25,26)

అతని జాతిలో సత్యాన్ని తిరస్కరించిన నాయకులు దానికిలా సమాధానమిచ్చారు: "మా దృష్టిలో నీవు మాలాంటి ఒక మానవమాత్రుడివే. (అంతకుమించి మరేమీ కావు.) ముందుచూపు లేకుండా నీమాటలు విని నిన్ను (గుడ్డిగా) అనుసరిస్తున్నవారు ఎలాంటివారో మేము చూస్తూనేఉన్నాం. (విజ్ఞత, వివేచనల్లేని) అధములు, తుచ్ఛులే గదా నిన్ను అనుసరిస్తున్నది[1]? మీరు మాకంటే ఏ విషయంలోనూ మించిపోయినట్లు మాకగపడటం లేదు. అసలు నువ్వొట్టి అబద్ధాలరాయుడవని మేము భావిస్తున్నాం." (27)

(అప్పుడు) నూహ్ ఇలా అన్నాడు: "నా జాతిప్రజలారా! కాస్త ఆలోచించండి. నాప్రభువు అనుగ్రహం వల్ల (ఇంతకు పూర్వం నుంచే) నేనొక నిదర్శనం (అంతరాత్మ

1. హజ్రత్ నూహ్ (అలైహి) పేదలు-ధనికులు, అధములు-అధికులు, సామాన్యులు-ప్రముఖులు, పాలకులు-పాలితులు అన్న వివక్ష చేయకుండా తన జాతివారందరికీ దైవసందేశం అందజేశారు. కాని వారిలో చిన్నచిన్న వృత్తిపనులు చేసుకునే పేదలు, దళితులే దాన్ని విశ్వసించారు. ఇది ధనికులకు, అగ్రవర్ణాలకు నచ్చలేదు. "నీవు ప్రచారం చేస్తున్నది నిజంగా సత్యధర్మమయితే ముందుగా మేమే విశ్వసించేవాళ్ళం. నిష్టదరిద్రులు, నీచకులస్తులకు అందులో మంచీచెడులు, సత్యా సత్యాలను విచక్షణ చేసేటంత బుద్ధిజ్ఞానాలు ఎక్కడున్నాయి?" అన్నదే వారి వాదన. ప్రతి యుగంలోనూ ధనికులు, అగ్రవర్ణాల కన్నా ముందుగా, అధికంగా పేదలు, దళితులే సత్యాన్ని విశ్వసిస్తూ వచ్చారు. (దీంతోపాటు 18:28, 26:111,112 సూక్తులు కూడా చూడండి.)

ప్రబోధనా జ్యోతి) కలిగివున్నాను. ఆ తరువాత ఆయన నాకు తన విశేషకారుణ్యం (దివ్యావిష్కృతి) ప్రసాదించాడు. అది మీకు కన్పించకపోతే (నేనేం చేయను?) విశ్వసించడానికి మీకిష్టం లేకపోతే దాన్ని బలవంతంగా మీ మీద రుద్దడానికి నాదగ్గర ఎలాంటి సాధనం లేదుగదా! (28)

నా జాతిప్రజలారా! నేనీ పని కోసం మీనుండి ఎలాంటి ప్రతిఫలం ఆశించడం లేదు. నాకు ప్రతిఫలమిచ్చే బాధ్యత దేవుడే తీసుకున్నాడు. నా మాటలు విశ్వసించిన వారిని నేను గెంటివేయలేను. వారు కూడా తమ ప్రభువు సన్నిధికి చేరుకోవలసినవాళ్ళే. సోదరులారా! నేనొకవేళ వారిని నా దగ్గర్నుంచి గెంటివేస్తే దేవుని పట్టునుండి నన్నెవరు కాపాడతారు? మీరామాత్రం అర్థం చేసుకోలేరా? నాదగ్గర నిధులు, నిక్షేపాలున్నాయని నేను మీతో అనడం లేదు. నాకు అతీంద్రియ శక్తులున్నాయని, నేను దైవదూతని కూడా చెప్పుకోవడం లేదు. మీ కళ్ళకు నీచులుగా కన్పిస్తున్న వీరికి దేవుడు ఎలాంటి మేలు చేయడని నేను చెప్పలేను. వారి అంతరంగాల స్థితి దేవునికే బాగా తెలుసు. ఒకవేళ వారిని గురించి అలా చెబితే నేను దుర్మార్గుణ్ణయి పోతాను." (29-31)

వారప్పుడు "నూహ్! నువ్వు మాతో వాదనకు దిగి బాగానే వాదించావు. సరే, నీవు సత్యవంతుడవైతే మమ్మల్ని బెదిరిస్తున్న ఆశిక్ష ఏమిటో ఇక తీసుకురా" అన్నారు. (32)

దానికి నూహ్ ఇలా అన్నాడు: "దాన్ని దేవుడే తలచుకుంటే తీసుకువస్తాడు. అప్పుడు మీరు దాన్ని ఏవిధంగానూ అడ్డుకోలేరు. దేవుడు మిమ్మల్ని మార్గభ్రష్టత్వంలోనే పడి వుండనివ్వ దలచుకుంటే, నేనిక మీ శ్రేయస్సు కోసం ఏది చేయాలనుకున్నా అది మీకెలాంటి ప్రయోజనం చేకూర్చదు. అలాంటి శక్తిసంపన్నుడే మీ ప్రభువు. మీరు (మరణానంతరం) ఆయన సన్నిధికే చేరుకోవలసి ఉంది. (33,34)

ముహమ్మద్ (సల్లం)! వారు "ఇదంతా అతనే కల్పించుకున్నాడ"ని అంటున్నారా? అయితే వారికిలా చెప్పు: "ఒకవేళ నేను దీన్ని స్వయంగా కల్పించుకుంటే, ఆ నేరం నాదే. కాని మీరు చేస్తున్న నేరాలకు నేను ఎలాంటి బాధ్యుణ్ణి కాను." (35)

నూహ్‌కు దివ్యావిష్కృతి ద్వారా ఇలా సూచించబడింది: "నీ జాతిప్రజల్లో విశ్వసించవలసిన వారంతా విశ్వసించారు. ఇక కొత్తగా విశ్వసించేవారెవరూ లేరు. కనుక వారి అకృత్యాలను గురించి నీవు బాధపడనవసరం లేదు. ఇప్పుడు మా పర్యవేక్షణలో మా ప్రోత్సాహంతో ఒక ఓడ తయారుచేసుకో. అయితే దుర్మార్గుల్ని గురించి నా దగ్గర సిఫారసు చేయకూడదు సుమా! వారంతా ఇప్పుడు మునిగి పోనున్నారు." (36,37)

నూహ్ ఓడ నిర్మాణంలో నిమగ్నుడైపోయాడు. అతని జాతి నాయకులు అతని ముందు నుంచి పోతూ అతణ్ని అపహాస్యం చేసేవారు. దానికి నూహ్ ఇలా అన్నాడు: "మీరు మమ్మల్ని చూసి నవ్వుతున్నారా? అయితే మేము కూడా మిమ్మల్ని చూసి నవ్వుకుంటున్నాం. అవమానకరమయిన శిక్ష ఎవరిపై వచ్చి పడుతుందో, తిరుగులేని ఉపద్రవం ఎవరిని చుట్టుముడ్తుందో త్వరలోనే మీకు తెలిసిపోతుంది." (38,39)



చివరికి మాఆజ్ఞ రానేవచ్చింది. (మహోపద్రవం) కుంపటి పొంగిపొరలింది. అప్పుడు మేమిలా ఆదేశించాం: "ప్రతి జాతికి చెందిన ప్రాణులలో ఒక్కొక్క జతను నౌకలోకి తీసుకో. అలాగే ఎవరెవరిని గురించి నీకు ఇంతకు ముందే తెలియజేశామో వారిని వదలి (మిగిలిన) నీ కుటుంబసభ్యుల్ని, విశ్వాసుల్ని కూడా నౌకలో ఎక్కించుకో."

నూహ్‌తో పాటు విశ్వాసులు కొద్దిమందే ఉన్నారు. నూహ్ (తన అనుచరులతో) "దేవుని పేరుతో ఓడలోఎక్కండి. అది నడవడం, ఆగిపోవడం అన్నీ (దేవుని చేతిలో ఉన్నాయి). నాప్రభువు గొప్ప క్షమాశీలి, అమిత దయామయుడు"అని అన్నాడు. (40,41)

ఓడ వారిని తీసుకొని ముందుకు సాగింది. సముద్రకెరటాలు కొండల్లా ఎగిసి పడుతున్నాయి. నూహ్ దూరానవున్న తన కుమారుణ్ని పిలిచి "బాబూ! (ఇటు వచ్చేయి.) మాతోపాటు ఓడలోకి ఎక్కు. అవిశ్వాసులతో కలసి ఉండకు" అని అన్నాడు. (42)

దానికి అతను (హూంకరిస్తూ) "ఇదిగో చూడు, నేనిప్పుడు ఓ కొండ ఎక్కుతాను. అది నన్ను నీటి (ప్రవాహం) నుండి కాపాడుతుంది" అన్నాడు.

"దేవుడు స్వయంగా కరుణిస్తే తప్ప ఈరోజు ఆయన ఆజ్ఞ (శిక్ష) నుండి ఏ శక్తీ కాపాడలేదు"అన్నాడు నూహ్. అంతలో వారిరువురి మధ్య ఓ(పెద్ద) కెరటం అడ్డుగా వచ్చింది. దాంతో అతను కూడా మునిగిపోయేవారిలో చేరిపోయాడు. (43)

"భూమండలమా! నీ నీటినంతటినీ మింగెయ్యి. ఆకాశమా! ఇక ఆగిపో" అని ఆజ్ఞ అయింది. అప్పుడు నీరంతా నేలలోకి ఇంకిపోయింది. జరగవలసింది జరిగిపోయింది. ఓడ జూదీ పర్వతం[2] మీద నిలిచిపోయింది. దాంతో 'దుర్మార్గుల పీడ విరగడయి పోయింద'ని ప్రకటన వెలువడింది. (44)

(అయితే) నూహ్ దైవాన్ని వేడుకుంటూ "ప్రభూ! నా కొడుకు, నా కుటుంబానికి చెందినవాడు. నీ వాగ్దానం నిజమయినది. నీవు పరిపాలకులలో కెల్లా గొప్ప పరిపాలకుడివి. అధికారులలో కెల్లా మంచి అధికారివి" అన్నాడు. (45)

(దేవుడిలా) అన్నాడు: "నూహ్! అతను నీ కుటుంబానికి చెందినవాడు కాదు. అతను (నీ కడుపున చెడబుట్టిన) పరమ అప్రయోజకుడు. నీకు వాస్తవం ఏమిటో తెలియనిదాన్ని గురించి నన్నర్థించకు. నేను నీకు ఉపదేశిస్తున్నాను. నీవు అజ్ఞానిగా ప్రవర్తించకు." (46)

(ఈ మాటలు వినగానే) నూహ్ (భయపడిపోయి) "ప్రభూ! నాకు తెలియనిదాన్ని గురించి నిన్నర్థించడం (అనేకీడు) నుండి నేను నీశరణు కోరుతున్నాను. (నన్ను

2. ఆర్మేనియా నుండి కుర్దిస్థాన్ వరకు వ్యాపించివున్న అరారాత్ అనే పర్వత శ్రేణులలో "జూదీ" పేరుతో నేటికీ ఒక పర్వతం ఉంది. అరిస్టాటిల్ అనుచరుడు ఎబడినస్ కూడా ఈపర్వతంపై నూహ్ (ప్రవక్త) ఓడ దిగిన విషయాన్ని ధృవీకరించాడు. ఇరాఖ్‌లో అనేకమంది ప్రజలు ఈ ఓడ శిథిలాలకు చెందిన (చెక్క) ముక్కలు భద్రపరచుకొని వాటిని అరగదీసి వ్యాధిగ్రస్తులకు మందుగా వాడుతున్నారని అతను తన చరిత్ర గ్రంథంలో రాసినట్లు తెలుస్తోంది.

క్షమించు) నీవు నన్ను కనికరించి క్షమించకపోతే నేను నాశనమయిపోతాను” అని వేడుకున్నాడు. (47)

ఆజ్ఞ జారీ అయింది: “నూహ్! (ఓడ నుండి) దిగు. నీకు, నీతోపాటున్న వర్గాలకు మా నుండి శాంతీశుభాలు కలుగుగాక! (మీ సంతతి నుండి వచ్చే) మరికొన్ని వర్గాలు కూడా ఉన్నాయి. వారికి మేము కొంతకాలం (ప్రపంచంలో) ప్రయోజనం కలిగిస్తాం. తరువాత (వారి దుష్కర్మలకు) వారికి మా తరఫున దుర్భరశిక్ష పడుతుంది.” (48)

ముహమ్మద్ (సల్లం)! ఇవన్నీ అగోచర విషయాలు. వీటిని మేము నీకు దివ్యావిష్కృతి ద్వారా తెలియజేస్తున్నాము. దీనికి పూర్వం నీవుగాని, నీజాతి ప్రజలుగాని ఈ విషయాల్ని ఏమాత్రం ఎరుగరు. అందువల్ల నీవు సహనంతో వ్యవహరించు. పర్యవసానం భయభక్తులు కలవారికే అనుకూలంగా ఉంటుంది. (49)

ఆద్ జాతిప్రజల వద్దకు మేము వారి సోదరుడు హూద్‌ని (ప్రవక్తగా నియమించి) పంపాము. అతనిలా అన్నాడు: “నా జాతిప్రజలారా! దేవుడ్ని (మాత్రమే) ఆరాధించండి. ఆయన తప్ప మీకు మరో ఆరాధ్యుడు లేడు. మీవన్నీ అభూతకల్పనలు తప్ప మరేమీ కావు. (అలాంటి మిథ్యాదైవాలను ఇకనైనా వదలిపెట్టండి).” (50)

“ప్రజలారా! నేనీ పనికోసం మీనుండి ఎలాంటి ప్రతిఫలం కోరడం లేదు. నాకు ప్రతిఫలమిచ్చే బాధ్యత నన్ను సృష్టించినవాడే తీసుకున్నాడు. మీరు విషయాన్ని అర్థం చేసుకోరా?” “నా జాతిప్రజలారా! మీ ప్రభువుకు క్షమాపణ చెప్పుకొని ఆయనవైపు మరలండి. ఆయన మీకోసం ఆకాశం నుండి పుష్కలంగా వర్షం కురిపిస్తాడు. మీ శక్తిని పెంచి మిమ్మల్ని మరింత బలోపేతం చేస్తాడు. కనుక నేరస్థుల మాదిరిగా ముఖం చాటు చేసుకోకండి.” (51,52)

దానికి వారిలా అన్నారు: “హూద్! నీవు మాదగ్గరకు స్పష్టమైన ప్రమాణం తీసుకురా లేదు. నీమాటలు విని మా దేవతలను ఎన్నటికీ వదలుకోం. నిన్ను విశ్వసించే ప్రసక్తి కూడా లేదు. మేమసలు మా దేవతల్లో ఏదైనా నీకు కీడు తలపెట్టిందేమోనని భావిస్తున్నాం.”

హూద్ ఇలా అన్నాడు: “నేను దేవుడ్ని సాక్షిగా పెడ్తున్నా. మీరు కూడా సాక్షులుగా ఉండండి. దేవుడ్ని వదలి మీరు కల్పించుకున్న మిథ్యాదైవాలతో నేను విసుగెత్తి పోయాను. మీరంతా కలసి నాకు వ్యతిరేకంగా ఏదైనా చేయదలచుకుంటే చేసేయండి. అందులో ఎలాంటి కొరత చేయకండి. నాకేమాత్రం అవకాశం ఇవ్వకండి. నేను దేవుడ్నే నమ్ముకున్నాను. ఆయన నాకూ ప్రభువే, మీకూ ప్రభువే. ప్రతిప్రాణి జుట్టు దేవుని చేతి లోనే ఉంది. నిస్సందేహంగా నా ప్రభువు చూపే మార్గమే అసలైన రుజుమార్గం. మీరు ముఖం తిప్పుకుంటే తిప్పుకోండి. (నాకొచ్చే నష్టమేమీ లేదు.) నాకిచ్చి పంపిన సందేశాన్ని నేను మీకందజేశాను. (నాబాధ్యత తీరిపోయింది.) ఇప్పుడిక నా ప్రభువు (మిమ్మల్ని నిర్మూలించి) మీ స్థానంలో మరో జాతిని ఉద్ధరిస్తాడు. అప్పుడు మీరాయనకు ఎలాంటి నష్టం కల్గించలేరు. నా ప్రభువు ప్రతిదాన్నీ ఓకంట కనిపెట్టి చూస్తున్నాడు.” (53-57)



ఆ తరువాత మా ఆజ్ఞ వచ్చేసింది. (వారిపై భయంకరమైన ఉపద్రవం విరుచుకు పడింది.) అప్పుడు మేము మా అనుగ్రహంతో హూద్‌ని, అతనితోపాటు విశ్వసించిన వారిని రక్షించాము. మేము వారిని ఘోరమైన శిక్షనుండి కాపాడాము. (58)

వారే ఆద్ జాతిప్రజలు. వారు తమప్రభువు సూక్తులు, సూచనలు తిరస్కరించారు. ఆయనప్రవక్తల హితవులు నమ్మలేదు. వారు సత్యవిరోధి అయిన ప్రతి అహంకారికీ విధేయులయి పోయారు. చివరికి వారు ఇటు ఇహలోకంలోనూ శపించబడ్డారు, అటు ప్రళయదినాన (పరలోకంలో) కూడా వారు శాపగ్రస్తులుగానే ఉంటారు. (59)

వినండి, ఆద్ ప్రజలు తమ ప్రభువుని తిరస్కరించారు. బాగా వినండి, హూద్‌జాతి అయిన ఆద్ ప్రజలు దూరంగా విసరివేయబడ్డారు. (60)

మేము సమూద్ జాతిప్రజల దగ్గరకు వారి సోదరుడు సాలిహ్‌ను పంపాము. అతనిలా అన్నాడు: “నా జాతిప్రజలారా! ఏకైక దేవుడ్ని (మాత్రమే) ఆరాధించండి. ఆయన తప్ప మీకు మరో ఆరాధ్యుడు లేడు. ఆయనే మిమ్మల్ని నేల నుండి పుట్టించి ఇక్కడ మీకు వసతి సౌకర్యం కల్పించాడు. కనుక మీరు ఆయన్నే క్షమాపణ కోరుకోండి. ఆయన వైపు మరలండి. నిస్సందేహంగా నా ప్రభువు అతి సమీపంలోనే ఉన్నాడు. ఆయనే (మన) మొరలను ఆలకించేవాడు.” (61)

దానికి వారిలా అన్నారు: “సాలిహ్! గతంలో నీవు మా మధ్య ఎంతో మంచివాడివి గా ఉన్నావు. నీ మీద మేము ఎన్నో ఆశలు పెట్టుకున్నాము. (ఇప్పుడేమయింది నీకు?) మా తాతముత్తాతల కాలం నుండి వస్తున్న ఈ దైవాలను పూజించుకోనీయకుండా మమ్మల్ని వారిస్తున్నావు? నీవు బోధిస్తున్న విషయం పట్ల మాకు చాలా అనుమానంగా ఉంది. అది మమ్మల్ని తీవ్ర సందిగ్ధంలో పడవేసింది.” (62)

అప్పుడు సాలిహ్ ఇలా అన్నాడు: “నా జాతిప్రజలారా! నేను నా ప్రభువు దయవల్ల (ఇంతకు ముందునుంచే) ఒక నిదర్శనం (అంతరాత్మ ప్రబోధనా జ్యోతి) కలిగిఉన్నాను. ఆతర్వాత ఆయన నాకు తన విశేషకారుణ్యాన్ని (దివ్యావిష్కృతిని) కూడా ప్రసాదించాడు. దీన్ని గురించి యోచించరా? ఇవన్నీ లభించిన తర్వాత కూడా నేను దేవునికి అవిధేయు ణ్ణయిపోతే ఆయన పట్టునుండి నన్నెవరు కాపాడుతారు? మీరు నన్ను నష్టపరచడం తప్ప నాకు ఏవిధంగా ఉపయోగపడతారు?” (63)

“నా జాతిప్రజలారా! ఇదిగో. ఇది దేవుని ఒంటె. మీకోసం ఇదొక సూచన. దీన్ని దేవుని నేలపై స్వేచ్ఛగా మేయడానికి వదలిపెట్టండి. ఏమాత్రం దీని జోలికి పోకూడదు. పోతే మాత్రం మీపై దేవుని శిక్ష విరుచుకుపడేందుకు అట్టే ఎంతోసేపు పట్టదు.” (64)

అయితే వారు (ఈ హెచ్చరికను ఖాతరుచేయకుండా) ఒంటెను చంపేశారు. అప్పుడు సాలిహ్ (ఆగ్రహం వెలిబుచ్చుతూ) “ఇప్పుడిక మీరు మూడురోజులు మాత్రమే మీ ఇండ్లలో గడప గలుగుతారు. ఇది ఏమాత్రం అసత్యంగా మారని తిరుగులేని మాట” అన్నాడు. (65)

చివరికి మా ఆజ్ఞ రానేవచ్చింది. (భయంకరమైన విపత్తు వారిపై వచ్చిపడింది.) అప్పుడు మేము మా అనుగ్రహంతో సాలిహ్ని, అతనితోపాటు విశ్వసించినవారిని రక్షించాం. ఆనాటి అవమానం నుండి వారిని కాపాడాము. నిజానికి నీ ప్రభువే అత్యంత శక్తిమంతుడు, సర్వాధికారి. (66)

ఇక దౌర్జన్యపరుల విషయానికి వస్తే, అతి తీవ్రమయిన విస్ఫోటం వారిని కుదిపేసింది. దాంతో వారు తమఇండ్లలో ఎలాంటి చలనం లేకుండా, అసలు వారక్కడ లేనే లేరన్నట్లు నిస్తేజంగా పడిపోయారు. వినండి, సమూద్ జాతిప్రజలు తమ ప్రభువుని విశ్వసించడానికి నిరాకరించారు. బాగా వినండి, సమూద్ జాతిప్రజలు దూరంగా విసరి వేయబడ్డారు. (67,68)

పోతే ఇబ్రాహీం దగ్గరకు మా దూతలు శుభవార్త తీసికెళ్ళి "మీకు శాంతిశ్రేయాలు కలుగు గాక!" అన్నారు. దానికి ఇబ్రాహీం "మీక్కూడా శాంతి కలుగుగాక!" అన్నాడు. ఆతర్వాత కాస్సేపటికి ఇబ్రాహీం ఆవుదూడ కాల్చితెచ్చాడు. కాని వారి చేతులు భోజనం మీదికి పోవడంలేదు. దాంతో అనుమానమొచ్చి అతను లోలోన భయపడసాగాడు. వారు "భయపడకు. మేము లూత్జాతి వైపుకు పంపబడ్డాం" అన్నారు. (69,70)

అప్పుడు ఇబ్రాహీం భార్య కూడా అక్కడే నిలబడి ఉంది. ఆమె ఈ మాటలు విని (తమ పట్నానికి ప్రమాదం తప్పినందుకు) నవ్వింది. ఆ తర్వాత మేమామెకు ఇస్హాఖ్ పుట్టుక గురించి, ఇస్హాఖ్ తర్వాత యాఖూబ్ పుట్టుక గురించి శుభవార్త చెప్పాము. దానికామె "అయ్యో, నా పాడుగాను! ఈ వయస్సులోనా నాకు సంతానం? నేను పండు ముసలిదాన్నయి పోయానే! నా భర్త కూడా ముసలివాడయి పోయాడే!! (సంతానం ఎలా కలుగుతుంది?) చాలా విచిత్రంగా ఉందే!!!" అన్నది (ఆశ్చర్యంతో)- (71,72)

"దైవాజ్ఞ విని ఆశ్చర్యపోతున్నావా నీవు? ఇబ్రాహీం కుటుంబ సభ్యులారా! (వినండి) మీపై దేవుని కారుణ్యం, ఆయన శుభాలు ఉన్నాయి. నిస్సందేహంగా దేవుడు ఎంతో ప్రశంస నీయుడు, మహోన్నతుడు" అన్నారు దైవదూతలు. (73)

ఇబ్రాహీంలోని భయం పోయి (శుభవార్త వల్ల) మనస్సు కుదుటపడిన తర్వాత అతను మాతో జగడానికి దిగాడు.[3] నిజానికి ఇబ్రాహీం ఎంతో సహనశీలుడు, మృదు హృదయుడు, దేవుని వైపు మరలేవాడు. "ఇబ్రాహీం! ఇక దాన్ని వదిలెయ్యి. నీ ప్రభువాజ్ఞ అయింది. వారిపై తప్పనిసరిగా శిక్ష వచ్చిపడుతుంది. దానికి తిరుగులేదు." (74-76)

(అక్కడ్నుంచి) మా దూతలు లూత్ దగ్గరికి చేరుకున్నారు. వారిని చూసి అతను చాలా ఆందోళన పడసాగాడు. అతని హృదయం కుంచించుకు పోయింది. "ఈరోజు పెద్ద ఆపదే వచ్చిపడింది" అన్నాడతను. (77)

---

3. జగడం అంటే ఇక్కడ నిజంగా జగడమని అర్థం కాదు. దేవునికి, దాసునికి మధ్య సన్ని హిత సంబంధం, దాసునిపై దేవునికున్న ప్రేమ, వాత్సల్యాలను పరోక్షంగా ప్రకటిస్తున్న ప్రత్యేక పదం ఇది. హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) లూత్జాతిని శిక్షించకుండా దారికి వచ్చేందుకు దానికి మరికొంత గడువివ్వమని మాటిమాటికి ప్రాధేయపడ్డారు. ఈ వైఖరినే ఇక్కడ జగడంతో పోల్చడం జరిగింది.



(లూత్ ఇంటికి అతిథులు రాగానే) అతని జాతిప్రజలు అతని దగ్గరకి పరుగెత్తారు. వారు మొదటినుంచీ అశ్లీలచేష్టలకు అలవాటుపడ్డారు.[4] లూత్ (వారికి నచ్చజెప్తూ) "సోదరులారా! (ఈ చేష్టలు మానేయండి.) కావాలంటే నా కుమార్తెలున్నారు చూడండి. వీరు మీకోసం పరిశుద్ధ స్త్రీలు. దేవునికి భయపడండి. నా అతిథుల విషయంలో నన్ను అవమానపర్చకండి. ఏమిటీ! మీలో మంచివాడు ఒక్కడూ లేడా?" అని అన్నాడు. (78)

"నీకు తెలుసుకదా, నీ కుమార్తెలతో మాకు పనిలేదని. మాకు కావలసిందేమిటో కూడా నీకు తెలుసు" అన్నారు వారు. "అయ్యయ్యో! నాకు మిమ్మల్ని అదుపులోఉంచే శక్తి ఉంటే ఎంతబాగుండు! లేదా ఆశ్రయం పొందడానికి ఏదైనా దృఢమైన కోట దొరికినా బాగుండు" అన్నాడు లూత్ (79,80)

అప్పుడు దైవదూతలు ఇలా అన్నారు: "లూత్! మేము నీ ప్రభువు పంపిన దూతలం. వీరు నిన్నేమీ చేయలేరు. కొంత రాత్రి గడిచిన తరువాత నీ కుటుంబాన్ని తీసుకొని ఇక్కడ్నుంచి బయలుదేరి (వేరే చోటికి) వెళ్ళు. జాగ్రత్త! మీలో ఏ ఒక్కరూ వెనక్కి తిరిగి చూడకూడదు. అయితే నీభార్య మాత్రం (నీవెంట రాకూడదు). వారి మీద సంభవించేదే నీభార్య మీద కూడా సంభవిస్తుంది. వారి వినాశకాలం నిర్ణయమైపోయింది. (రేపు) ఉదయమే. ఇక ఎంతో సమయం లేదు." (81)

ఆ తరువాత మా ఆజ్ఞ వచ్చేసింది. అప్పుడు మేమా పట్టణాన్ని అమాంతం కుదిపేసి తల్లక్రిందులు చేశాం. ఆపై మండుతున్న మట్టిరాళ్ళు దాని మీద ఉధృతంగా కురిపించాము. అందులోని ప్రతి రాయీ నీ ప్రభువు దగ్గర గుర్తు వేయబడింది. ఇలాంటి శిక్ష దుర్మార్గవైఖరి అవలంబించినవారికి ఎంతో దూరం లేదు. (82,83)

మద్యన్జాతి ప్రజల దగ్గరకు వారి సోదరుడు షుఐబ్ని (ప్రవక్తగా నియమించి) పంపాం. అతను (వారిని దైవమార్గం వైపు పిలుస్తూ) ఇలా అన్నాడు: "నా జాతిప్రజలారా! ఏకైక దేవుణ్ణి (మాత్రమే) ఆరాధించండి. ఆయన తప్ప మీకు మరోఆరాధ్య దైవం లేడు. తూనికల్లో, కొలతల్లో (సరుకులు) తగ్గించి ఇవ్వకండి. నేనీ రోజు మీరు మంచి స్థితిలో ఉండటం చూస్తున్నాను. కాని (మీ వైఖరి ఇలాగే కొనసాగితే) రేపు మీ మీద అందర్నీ చుట్టు ముట్టే ఆపద విరుచుకు పడవచ్చని భయపడుతున్నాను. (84)

కనుక న్యాయంగా సరయిన కొలమానాలతో పూర్తిగా తూచి, కొలిచి ఇవ్వండి. ప్రజలకు రావలసిన సరుకులు తగ్గించి వారికి నష్టం కలిగించకండి. లోకంలో కలహాలు, కల్లోలాలు రేకెత్తిస్తూ తిరగకండి. (అక్రమ లాభార్జనకన్నా) దేవుడు ప్రసాదించే (సక్రమ) ఆదాయమే మీకు శ్రేష్ఠమైనది, మీరు నిజాయితీపరులయితే (దాంతోనే తృప్తిచెందాలి). ఏమైనప్పటికీ నేను మీమీద కావలివాడుగా కనిపెట్టుకొని ఉండలేను." (85,86)

---

4. ఇక్కడ అశ్లీల చేష్టలంటే స్వజాతిసంపర్కం అని అర్థం. లూత్జాతి స్వజాతిసంపర్కానికి అలవాటు పడింది. వారు స్త్రీలను వదలి పురుషుల వెంట పడేవారు. వారి పట్టణానికి అందమైన యువకులు ఎవరైనా వస్తే చాలు, వారి దగ్గరికి పరుగెత్తేవారు. వారిని ఈ చేష్టల నుండి కాపాడడానికి లూత్ (అలై) చేసిన ప్రయత్నాలు ఫలించ లేదు. చివరికి దేవుడు ఆ జాతిని శిక్షించడానికి తన దూతలను పంపాడు. వారు మానవాకారంలో లూత్ (అలై) ఇంటికి అతిథులుగా వచ్చారు.

దానికి వారిలా అన్నారు: “షుఐబ్! మా తాత ముత్తాతల కాలం నుండి వస్తున్న ఈ దైవాలను ఆరాధించడం మేము మానుకోవాలా? మా ధనాన్ని మా ఇష్టమొచ్చినట్లు ఖర్చు పెట్టుకునే అధికారం కూడాలేదా మాకు? ఇదేనా నీప్రార్థన నీకు నేర్పుతున్నది? (మా అందరిలో) సాధుస్వభావి, సన్మార్గగామివి నీవొక్కడివే మిగిలావు కాబోలు!” (87)

“సోదరులారా! కాస్త ఆలోచించండి. నేను నా ప్రభువు దయవల్ల (ఇంతకు ముందు నుంచే) ఒక నిదర్శనం (అంతరాత్మ ప్రబోధనా జ్యోతి) కలిగి ఉన్నాను. ఆపై ఆయన నాకు మంచి ఉపాధి[5] కూడా అనుగ్రహించాడు. అలాంటప్పుడు నేను మీ మార్గ విహీనత, అవినీతి పనుల్లో ఎలా పాల్గొనగలను? నేను మిమ్మల్ని ఏ చెడుల నుంచి వారిస్తున్నానో ఆ చెడులకు స్వయంగా నేను పాల్పడనా? అది ఎన్నటికీ సాధ్యం కాదు. నేను నాకు చేతనైనంత వరకు పరిస్థితి చక్కదిద్దాలని భావిస్తున్నాను. అయితే నేను చేయదలచుకున్నదంతా దేవుని దయాదాక్షిణ్యాల మీదే ఆధారపడి ఉంది. ఆయన్నే నేను నమ్ముకున్నాను. ప్రతి వ్యవహారంలోనూ నేను ఆయన వైపుకే మరలుతాను. (88)

నా జాతిప్రజలారా! నాకు వ్యతిరేకంగా మీరు అవలంబించిన ఈ మూర్ఖత్వం, మొండి వైఖరుల్ని చూస్తుంటే చివరికి నూహ్, హూద్, సాలిహ్ జాతులపై వచ్చి పడినటువంటి శిక్షలు (ఉపద్రవాలు) మీపై కూడా విరుచుకుపడతాయేమో అనిపిస్తోంది. అలాంటి దుర్గతి పట్ట కూడదు సుమా! లూత్‌జాతి(కి పట్టిన దుర్గతి) మీకెంతో దూరం లేదు. (ఈ మధ్యకాలంలోనే ఆ భయంకర సంఘటన సంభవించింది.) కనుక మీరు (ఇప్పటికైనా) దేవుడ్ని క్షమాపణ కోరుకొని ఆయన వైపు మరలండి. నిస్సందేహంగా నా ప్రభువు ఎంతో దయామయుడు. ఆయనకు తన దాసుల పట్ల అపార ప్రేమాభిమానాలున్నాయి”[6] అంటూ షుఐబ్ వారికి హితోపదేశం చేశాడు. (89,90)

“షుఐబ్! నీవు చెప్పేవాటిలో చాలా మాటలు మాకసలు అర్థమే కావడం లేదు. నీవు మాకు బలహీనుడివిగా కన్పిస్తున్నావు. (నీకు మద్దతుగా) నీ బంధువర్గమే గనక లేకపోయి నట్లయితే మేము ఎప్పుడో నిన్ను రాళ్ళతో కొట్టి చంపేసేవాళ్ళం. మమ్మల్ని ఎదుర్కొనే అంత శక్తి నీకు లేదు” అన్నారు వారు. (91)

---

5. ఉపాధి అనే పదం ఇక్కడ జీవనోపాధి, ఆహారం, సత్యజ్ఞానం, దివ్యావిష్కృతి (వహీ) అని విస్తృతార్థంలో ఉపయోగించబడింది.

6. హజ్రత్ ఉమర్ (రజి) కథనం ప్రకారం ఒకసారి దైవప్రవక్త (సల్లం) సన్నిధికి కొందరు యుద్ధ ఖైదీలు తేబడ్డారు. వారిలో ఒక స్త్రీ కూడా ఉంది. ఆ స్త్రీ తన పసిబిడ్డ తప్పిపోవడంతో తీవ్ర ఆందోళనపడుతూ ఎనలేని మాతృమమకారంతో, కన్పించిన ప్రతి చంటిపిల్లవాడ్ని గుండెలకు హత్తుకొని పాలు త్రాగిస్తుండేది. దైవప్రవక్త (స) ఆమెను అనుచరులకు చూపిస్తూ “ఈ తల్లి తన బిడ్డను తన స్వహస్తాలతో నిప్పులోకి విసరేయగలదా?” అని అడిగారు. దానికి వారు “అలా ఎన్నటికీ చేయదు. పైగా నిప్పులో పడిపోతుంటే చూసి ఆమె పిల్లవాడ్ని కాపాడేందుకే ప్రయత్నిస్తుంది” అన్నారు. అప్పుడు దైవప్రవక్త (స) “దేవుడు తన దాసులపై కనబరిచే దయ, జాలి ఈ స్త్రీ తన బిడ్డపై కరబరిచే దయ, జాలి కన్నా ఎంతో ఎక్కువగా ఉంటాయి” అని తెలిపారు. (బుఖారి, ముస్లిం)



“సోదరులారా! మీ కళ్ళకు దేవుని కంటే నా బంధువర్గమే శక్తిమంతమైనదిగా కన్పిస్తున్నదా? (నా బంధువులకైతే భయపడ్డారు గాని) దేవుడ్ని మాత్రం పూర్తిగా వదిలేశారు! ఒక విషయం గుర్తుంచుకోండి, మీరు చేస్తున్న పనులను నా ప్రభువు గమనిస్తూనే ఉన్నాడు. (ఆయన పట్టు నుండి మీరెన్నడూ తప్పించుకోలేరు.) (92)

సోదరులారా! (సరే), మీరు మీపద్ధతి ప్రకారం నడుచుకోండి. నేను నాపద్ధతి ప్రకారం నడుచుకుంటాను. ఎవరిపై అవమానకరమైన శిక్ష వచ్చిపడుతుందో, ఎవరు అసత్యవాదులో త్వరలోనే మీకు తెలిసిపోతుంది. (దానికోసం) మీరూ ఎదురుచూడండి, మీతోపాటు నేనూ ఎదురుచూస్తాను” అన్నాడు షుఐబ్ (తుది హెచ్చరిక చేస్తూ). (93)

చివరికి మా ఆజ్ఞ వచ్చేసింది. అప్పుడు మేము మా అనుగ్రహంతో షుఐబ్‌ని, అతనితో పాటు విశ్వసించినవారిని రక్షించాము. అన్యాయం, అక్రమాలకు పాల్పడిన దుర్మార్గులపై అతి తీవ్రమైన విస్ఫోటం విరుచుకుపడింది. దాంతో వారు తమ ఇండ్లలోనే పడి సర్వనాశనమయ్యారు. అసలు వారక్కడ ఎన్నడూ నివసించనే లేదన్నట్లు తెల్లవారు జామున ఎలాంటి చలనం లేకుండా నిస్తేజంగా పడిఉండిపోయారు. వినండి, సమూద్ ప్రజలు విసరేయబడినట్లు మద్యన్‌ప్రజలు కూడా దూరంగా విసరేయబడ్డారు. (94,95)

మేము మూసాకు (ప్రవక్త నియామకానికి సంబంధించిన) స్పష్టమైన ప్రమాణాలు, నిదర్శనాలిచ్చి ఫిరౌన్ వద్దకు, అతని అధికారుల వద్దకు పంపించాం. కాని ఫిరౌన్ ఆదేశం సమంజసంగా లేకపోయినా అతని జాతిప్రజలు అతని ఆదేశాన్నే పాటించారు. ప్రళయ దినాన అతను తన జాతిప్రజలకు (నాయకత్వంవహించి) ముందుముందుగా ఉంటాడు. ఆవిధంగా అతను తననేతృత్వంలో వారిని నరకానికి తీసికెళ్తాడు. వారు చేరుకునే ప్రదేశం ఎంత చెడ్డ ప్రదేశం! వారిటు ప్రపంచంలోనూ శపించబడ్డారు; అటు పరలోకంలోనూ శపించబడతారు. వారికి లభించే ప్రతిఫలం ఎంత దుష్ట ప్రతిఫలం!! (96-99)

ఇవి కొన్ని జనపదాల చారిత్రకగాథలు. వీటిని మేము నీకు విన్పిస్తున్నాం. అ జన పదాలలో కొన్ని ఇప్పటికీ (జరిగిన ఘటనలకు సాక్షీభూతంగా) నిలిచిఉన్నాయి. మరి కొన్ని సమూలంగా తుడిచి పెట్టుకుపోయాయి. మేము వారికి అన్యాయం చేయలేదు. వారే ఆత్మవంచనకు పాల్పడి ఆపద కొనితెచ్చుకున్నారు. దేవుని ఆజ్ఞ వచ్చినప్పుడు, దేవుడ్ని వదలి వారు పూజిస్తూ వచ్చిన మిథ్యాదైవాలు వారికి ఏమాత్రం ఉపయోగపడ లేదు. అవి వారికి వినాశం, విధ్వంసాలే తెచ్చిపెట్టాయి. (100,101)

నీ ప్రభువు ఏదైనా దుర్మార్గపు పట్టణాన్ని పట్టదలచుకుంటే ఆయన పట్టు ఇలాగే ఉంటుంది. నిజంగా ఆయనపట్టు చాలా కఠినంగా, బాధాకరంగా ఉంటుంది. పరలోక శిక్ష గురించి భయపడేవారికి ఇందులో ఎంతో గుణపాఠం ఉంది. అదొక (నిర్ణీత) దినం. ఆరోజు మానవులంతా సమావేశమవుతారు. ఆరోజు జరిగే విశేషాలన్నీ అందరి కళ్ళ ముందు ఉంటాయి. దాన్ని తీసుకురావడానికి మేమెంతో ఆలస్యం చేయడం లేదు. అతిస్వల్ప వ్యవధి మాత్రమే దానికోసం నిర్ణయించబడింది. (102-104)

ఆరోజు ఏ ఒక్కరికీ నోరుమెదిపే ధైర్యం కూడా ఉండదు, దేవుని అనుమతితో

ఏదైనా కొంచెం మనవి చేసుకోవడం తప్ప. ఆరోజు కొందరు దౌర్భాగ్యులు ఉంటారు. మరికొందరు సౌభాగ్యవంతులు ఉంటారు. (105)

దౌర్భాగ్యులు నరకానికి పోతారు. (అక్కడ తీవ్రమైన వేడి, దాహం వల్ల) వారు రొప్పుతూ, రోజుతూ ఏడ్పులు, పెడబొబ్బలు పెడుతుంటారు. నీ ప్రభువు మరేదయినా తలిస్తే తప్ప వారు ఆ స్థితిలోనే భూమ్యాకాశాలున్నంత వరకు పడివుంటారు. నిస్సం దేహంగా నీ ప్రభువు తాను తలచుకున్న ప్రతిపనీ చేయగల సమర్థుడు, సర్వశక్తి మంతుడు. పోతే, సౌభాగ్యవంతులు మాత్రం స్వర్గానికి వెళ్తారు. నీ ప్రభువు మరేదయినా తలిస్తే తప్ప వారు స్వర్గంలోనే భూమ్యాకాశాలున్నంత వరకు (సుఖంగా) ఉంటారు. వారికక్కడ ఎన్నటికీ ఎడతెగని బహుమానాలు లభిస్తాయి. (106-108)

కనుక ప్రవక్తా! వారు ఆరాధిస్తున్న వాటిని గురించి నీవు ఏమాత్రం సందేహించకు. పూర్వం తమ తాతముత్తాతలు ఎలా (గుడ్డిగా మిధ్యాదైవాలను) ఆరాధిస్తూ ఉండేవారో వీరు కూడా అలాగే ఆరాధిస్తున్నారు. మేము వారికి రావలసిన కర్మఫలం వారికి పూర్తిగా ఇచ్చి వేస్తాం. అందులో ఎలాంటి కొరత చేయము. (109)

మేము దీనికి పూర్వం మూసాకు కూడా (దివ్య)గ్రంథం ప్రసాదించాం. (ఈ గ్రంథం విషయంలో లాగే) దాని విషయంలో కూడా (సత్యతిరస్కారులు) అభ్యంతరాలు లేవ దీశారు. నీ ప్రభువు వైపున ఒకమాట ముందే నిర్ణయించబడకఉంటే (ఇలా) అభ్యంత రాలు లేవదీసే వారి సంగతి ఎప్పుడో తేల్చివేయబడి ఉండేది. వారసలు దాన్ని గురించి సందేహం, సందిగ్ధాలలో పడిపోయారు. నీ ప్రభువు వారికి తప్పకుండా వారి కర్మఫలం ఇచ్చివేస్తాడు. నిస్సందేహంగా ఆయన వారి చర్యలన్నిటినీ గమనిస్తున్నాడు. (110,111)

కనుక నీవు, అపమార్గం వదలి వచ్చిన నీ అనుచరులు మీకివ్వబడిన ఆజ్ఞ ప్రకారం సన్మార్గంలో స్థిరంగా ఉండండి. హద్దుమీరి ప్రవర్తించకండి. మీరు చేస్తున్న దంతా మీ ప్రభువు ఓ కంట గమనిస్తూనే ఉన్నాడు. ఆ దుర్మార్గులవైపు ఏమాత్రం మొగ్గకండి. అలా చేస్తే మీరు (కూడా) నరకాగ్నికి సమిధలైపోతారు. దేవుని పట్టు నుండి కాపాడేందుకు మీకు ఎలాంటి స్నేహితుడుగాని, సంరక్షకుడుగాని, సహాయకుడుగాని లభించడు. (112,113)

ఇంకా వినండి. పగటివేళ ఆద్యంతాలలో (ఉదయం, సాయంత్రం), రాత్రివేళ కొంచెం సమయం గడచిన తర్వాత ప్రార్థన చేయండి. నిస్సందేహంగా సత్కార్యాలు దుష్కార్యాలను నిర్మూలిస్తాయి. అనుసరించేవారి కోసం ఇదొక హితబోధ. (కష్టకాలంలో) సహనం వహించండి. సదాచారుల ప్రతిఫలం దేవుడు ఎన్నటికీ వృధాచేయడు. (114,115)

మరి మీకు పూర్వముండిన జాతులలో ప్రజల్ని ప్రపంచంలో కల్లోలాలు రేకెత్తించ కుండా నిరోధించే సంఘ శ్రేయోభిలాషులు ఎందుకు లేరు? ఒకవేళ అలాంటి వారున్నా బహుకొద్దిమంది మాత్రమే ఉన్నారు. వారిని మేము ఆజాతుల బారి నుండి కాపాడాం. దుర్మార్గులు మాత్రం భోగభాగ్యాలలో తేలియాడుతూ పాపపంకిలంలో కూరుకు పోయారు. ప్రజలు సంస్కర్తలయి మంచి పనులు చేస్తుంటే దేవుడు వారి పట్టణాలను



ఎన్నటికీ అన్యాయంగా నాశనం చేయడు.[7] దేవుడు అలాంటివాడు కాదు. (116,117)

నీ ప్రభువు తలచుకుంటే యావత్తు మానవాళిని ఒకే జాతిగా, ఒకే సముదాయం గా చేసేవాడు. కాని వారిప్పుడు విభిన్న పద్ధతులు అనుసరిస్తున్నారు. వారిలో నీ ప్రభువు కరుణించినవారు మాత్రమే అపమార్గానికి దూరంగా మసలుకుంటారు. ఈ పని (భావాచరణల స్వేచ్ఛనిచ్చి పరీక్షించడం) కోసమే ఆయన మానవుల్ని సృష్టించాడు. మానవులతో, జిన్నులతో నరకం నింపేస్తానని నీ ప్రభువు అన్నమాట (ఈవిధంగా) నెర వేరుతుంది. (118,119)

ముహమ్మద్ (సల్లం)! ఇవి దైవప్రవక్తల గాథలు. నీకు మనోబలం చేకూర్చడానికి వీటిని వివరిస్తున్నాం. ఈ గాథల ద్వారా నీకు వాస్తవమయిన విషయజ్ఞానం లభించింది. అటు విశ్వాసులకు హితోపదేశం, గుణపాఠాలు కూడా ఉన్నాయి. విశ్వసించనివారికి ఇలా చెప్పెయ్యి: "మీరు మీ పద్ధతుల ప్రకారమే నడచుకోండి. మేము మా పద్ధతుల ప్రకారం నడచుకుంటాము. పర్యవసానం కోసం మీరూ ఎదురు చూడండి; మేమూ ఎదురుచూస్తుంటాము." (120,121)

భూమ్యాకాశాల్లో నిక్షిప్తమయి ఉన్న సమస్తం దేవుని అధీనంలోనే ఉంది. సకల వ్యవహారాలు చివరికి ఆయన దగ్గరికే చేరుకోవలసి ఉంటుంది. కనుక ముహమ్మద్ (సల్లం)! నీవు ఆయన్నే ఆరాధించు. ఆయన మీదే భారం వెయ్యి. మీరు చేస్తున్నదంతా దేవుడు గమనిస్తూనే ఉన్నాడు. (122,123) ✪

---

7. చెడుల్ని అరికట్టడం, మంచిని పెంచడం, సంఘసంస్కరణ కార్యక్రమాలు చేపట్టడం ముస్లింల విధి. ముస్లింలు ఈపనులు చేయకుండా పాపకార్యాల్లో పడిపోతే వారు కూడా ప్రపంచం లో దైవశిక్ష చవిచూడవలసి వస్తుంది. దీన్ని గురించి దైవప్రవక్త (సల్లం) ఇలా బోధించారు:

"నా అనుచర సమాజంలో ఎప్పుడైతే పదిహేను (దుర్)లక్షణాలు చోటుచేసుకుంటాయో అప్పుడు దానిపై ఆపదలు రావడం మొదలవుతాయి. (కొందరు ఈమాట విని) 'అయితే దైవప్రవక్తా! ఆ లక్షణాలు ఏమిటీ?' అనడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) ఈవిధంగా సెలవిచ్చారు:

(1) ప్రభుత్వ ఆస్తులను సొంత ఆస్తులుగా పరిగణించడం. (2) అమానత్ (భద్రపరచడానికి అప్పగించిన సొత్తు)ను సమరసొత్తు (మాలెగనీమత్)గా తలచడం. (3) (పేదల ఆర్థిక హక్కయిన) జకాత్ ధనాన్ని జరిమానాగా భావించడం. (4) భర్త తనభార్యకు విధేయుడయి పోవడం. (5) కొడుకు తన తల్లిపట్ల అవిధేయుడయి ప్రవర్తించడం. (6) మనిషి తన స్నేహితులకు మాత్రమే మేలు చేసి, (7) తన తండ్రిపై దౌర్జన్యం చేయడం. (8) మసీదులో అల్లరి చేయడం. (9) ఒక జాతిలోని అత్యంత నీచుడు ఆజాతికి నాయకుడయి పోవడం. (10) వ్యక్తిలోని చెడుకు భయపడి జనం అతడ్ని గౌరవించడం. (11) మత్తు పదార్థాలను బహిరంగంగా వినియోగించడం. (12) పురుషులు పట్టు వస్త్రాలు ధరించడం. (13) సంగీత వాయిద్యాలను అవలంబించడం. (14) గాయకురాళ్ళను సమావేశ పరచడం. (15) అప్పటి ప్రజలు తమ పూర్వీకులను నిందించడం, దూషించడం.

కనుక ఈ లక్షణాలు చోటుచేసుకో నారంభించగానే ప్రజలు ఇక ఎల్లవేళలా దైవశిక్ష కోసం ఎదురుచూడాల్సి వస్తుంది. ఈ శిక్ష ఎర్రటి గాలిదుమారం రూపంలోనయినా రావచ్చు, లేదా భూకంపం రూపేణయినా రావచ్చు, లేదా సబ్బత్ (శనివారం) వాళ్ళకు వచ్చినట్లు ముఖాలు వికృతంగా మార్చి వేసే శిక్షయినా రావచ్చు." (తిర్మిజి) ✪

# 12. యూసుఫ్

అవతరణ: మక్కా — సూక్తులు: 111

ఈ అధ్యాయంలో పూర్తిగా యూసుఫ్ ప్రవక్త (అలైహి) గాథ ఉన్నందున దీనికీ పేరు వచ్చింది. ఇది కూడా నబవీశకం చివరి సంవత్సరంలో అవతరించినట్లు తెలుస్తోంది. ఆనాడు మక్కా బహుదైవారాధకులు బహుశా యూదుల ప్రోద్బలంతో దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం)ను పరీక్షించ డానికి యూసుఫ్ (అలైహి) వృత్తాంతం తెలియజేయమని అడిగారు.

ఈ కథలో హజ్రత్ యూసుఫ్ (అలైహి)ని ఆయన సవతిసోదరులు చంపడానికి కుట్ర పన్నుతారు. దేవుడు ఆ కుట్రను భగ్నంచేసి చివరికి యూసుఫ్‌ని ఈజిప్టు రాజుగా చేస్తాడు. అలాగే హజ్రత్ ముహమ్మద్ (సల్లం)ని కూడా ఆయన బంధువులే చంపడానికి ప్రయత్నిస్తారు. దేవుడు వారి ప్రయత్నాలను వమ్ముచేసి ముహమ్మద్ (సల్లం)ను చివరికి యావత్తు అరేబియాకు రాజ్యాధినేతగా చేస్తాడు. యూసుఫ్ (అలైహి) రాజ్యాధినేత అయిన తరువాత తన సోదరులను క్షమిస్తారు. అలాగే మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) కూడా మక్కా విజయం తరువాత ఖైదీలుగా పట్టుబడిన బద్ధ విరోధుల్ని సైతం క్షమిస్తారు. అందువల్ల మక్కా ఖురైషీయులు యూసుఫ్ గాథ నుంచయినా గుణపాఠం గ్రహించి ఇస్లాంవ్యతిరేక కార్యకలాపాలు మానుకుంటారేమోనని దేవుడు ఈ అధ్యాయంలో యూసుఫ్ (అలైహి) వృత్తాంతాన్ని ఎంతో వివరంగా తెలియజేశాడు.

అదీగాక మహనీయ ముహమ్మద్ (సల్లం) నిరక్షరాసి కావడంతో పాటు పాలస్తీనా, ఈజిప్టు దేశాల్లో జరిగిన చారిత్రక సంఘటనల్ని గురించి ఏమాత్రం తెలియనివారు. అలాంటి వ్యక్తి నోట ఈ చారిత్రకగాథ ఇంత వివరంగా వెలువడిందంటే ఆయన దైవప్రవక్తేనని బహుదైవారాధకులు ఒప్పుకోవాలి. ఈ విధంగా మహనీయ ముహమ్మద్ (సల్లం)ని దైవప్రవక్తగా నిరూపించడానిక్కూడా యూసుఫ్ గాథను ప్రస్తావించవలసిన అవసరం ఏర్పడింది.

## కరుణామయుడు, కృపాసాగరుడయిన దేవుని పేరుతో ప్రారంభం

అలిఫ్-లాం-రా. ఇవి సత్యాన్ని స్పష్టంగా తెలియజేసే గ్రంథానికి చెందిన సూక్తులు. మేము దీన్ని పఠన గ్రంథంగా చేసి, విషయాన్ని అర్థం చేసుకోవడానికి వీలుగా అరబీ భాషలో అవతరింపజేశాము. (1,2)

ముహమ్మద్ (సల్లం)! నీ దగ్గరకు పంపుతున్న ఈ పఠన గ్రంథం (ఖుర్ఆన్) ద్వారా మేము చక్కటి శైలిలో నీకొక యదార్థ గాథ విన్పించబోతున్నాం. దీనికిపూర్వం (ఈగాథ) నీకేమాత్రం తెలియదు. (3)

యూసుఫ్ (తన స్వప్నం గురించి ప్రస్తావిస్తూ) మాట్లాడిన సందర్భం: అప్పుడతను తన తండ్రితో "నాన్నా! నేనొక కలగన్నాను. అందులో పదకొండు నక్షత్రాలు, సూర్యుడు, చంద్రుడు నాకు సాష్టాంగప్రణామం చేస్తున్నట్లు కన్పించాయి" అన్నాడు. (4)

"అయితే బాబూ! ఈ కల గురించి నీ అన్నల దగ్గర మాత్రం ప్రస్తావించకు. అలా చేస్తే వారు నీకు వ్యతిరేకంగా ఏదైనా కుట్ర పన్నవచ్చు. నిస్సందేహంగా షైతాన్ మానవుని బహిరంగ శత్రువు. సరే, (నీవు కలగన్నట్లు) ఆవిధంగానే జరుగుతుంది. నీ ప్రభువు (ఒక మహాకార్యం కోసం) నిన్ను ఎంచుకున్నాడు. అందుకు ఆయన నీకు విషయలోతుపాతుల్ని తరచి చూడగల విశేష జ్ఞానం ప్రసాదిస్తాడు. గతంలో మన



పెద్దలైన ఇబ్రాహీం, ఇస్హాఖ్‌లకు నీ ప్రభువు ఎలా మహాభాగ్యాలు అనుగ్రహించాడో అలాగే ఇప్పుడు నీకూ, యాఖూబ్ సంతానానికి కూడా మహాభాగ్యాలు అనుగ్రహిస్తాడు. నిస్సందేహంగా నీ ప్రభువు సర్వజ్ఞాని, మహా వివేకవంతుడు" అన్నాడు యాఖూబ్. (5,6)

ప్రశ్నించేవారికి యూసుఫ్, అతని సోదరుల గాథలో గొప్ప సూచనలున్నాయి. (7)

అప్పుడతని సోదరులు పరస్పరం ఇలా కూడబలుక్కున్నారు:

"మనమంతా ఒక జట్టుగా ఉన్నా (ఏం లాభం?) మన తండ్రికి మనమీద కంటే యూసుఫ్ మీద, అతని తమ్ముడి మీదనే ఎక్కువ మమకారం ఉంది. అసలు మన నాన్నకు (వయస్సు బాగా మీదపడటం వల్ల) మతి భ్రమించింది. (అంచేత మనం ఏదో ఒకటి తేల్చు కోవాలి.) పదండి, యూసుఫ్‌ని చంపివేద్దాం, లేదా ఎక్కడయినా తీసికెళ్ళి పారేద్దాం గుట్టు చప్పుడు కాకుండా. అప్పుడే మీ తండ్రి మీ వైపు మరలుతాడు. ఈ పనికాస్తా ముగిశాక మనం (ఏమీ ఎరగనట్టు) మంచివాళ్ళుగా కన్పించాలి." (8,9)

ఈ మాటలు విని వారిలో ఒకడు ఇలా అన్నాడు: "యూసుఫ్‌ని చంపవద్దు. దానికి బదులు అతడ్ని పిలిచికెళ్ళి ఏదైనా పాడుబడ్డ బావిలో పడవేద్దాం. అటుగా బాటసారులు ఎవరైనా వస్తే, వారే అతడ్ని బయటికి లాగి తీసికెళ్తారు." (10)

ఈవిధంగా తీర్మానించుకున్న తర్వాత వారు తమ తండ్రి దగ్గరకెళ్ళి ఇలా అన్నారు:

"నాన్నా! మీరు యూసుఫ్ విషయంలో మమ్మల్ని నమ్మరేమిటీ? నిజంగా మేము అతని శ్రేయోభిలాషులమని చెబుతున్నాంగా! రేపు మా వెంట పంపండి అతడ్ని. అవీ ఇవీ బొక్కి కాస్సేపు హాయిగా ఆడుకుంటాడు. అతడ్ని భద్రంగా చూసుకోవడానికి మేము దగ్గరే ఉంటాం కదా!" (11,12)

(అయినా యాఖూబ్‌కు వారి మీద నమ్మకం కుదరలేదు.) "మీరితడ్ని తీసికెళ్ళడం నాకు చాలా బాధగా ఉంది. మీరు మీ పనిలో పడి అజాగ్రత్తగా ఉంటే వీడ్ని ఏ తోడేలో తినేస్తుందేమోనని నాకు భయంగా ఉంది" అన్నాడతను. (13)

"మేమంతా కలసి జట్టుగా దగ్గరున్నప్పటికీ అతడ్ని తోడేలు తినేస్తుందంటే ఇక మేము ఎందుకూ పనికిరాని దద్దమ్మలన్న మాట" అన్నారు వారు. (14)

ఇలా వారు పట్టుబట్టి అతడ్ని తమవెంట తీసికెళ్ళారు. వారతడ్ని పాడుబడ్డ బావిలో పడవేయాలని ముందే నిర్ణయించుకున్నారు. కనుక మేమతనికి దివ్యావిష్కృతి ద్వారా "వీరికి తమ చేష్టల పర్యవసానం ఏమిటో బొత్తిగా తెలియదు. కాని నీవు వారికి వారి నిర్వాకం గురించి ఎత్తిచూపే రోజొకటి తప్పకుండా వస్తుంద"ని తెలియజేశాం. (15)

ఆరోజు సాయంత్రం వారు లబోదిబోమంటూ తమ తండ్రి దగ్గరికొచ్చి ఇలా అన్నారు: "నాన్నా! మేము పరుగుపందెంలో ఉండి, యూసుఫ్‌ని మా సామాను దగ్గర వదలిపెట్టాం. అంతలో ఎక్కడ్నుంచో ఒక తోడేలు వచ్చి అతడ్ని చీల్చి తినేసింది. ఔను నాన్నా! మేము నిజం చెప్పినా మీరు మా మాటలు నమ్మేటట్లు లేరు." (16,17)

వారు యూసుఫ్ చొక్కా మీద బూటకపు నెత్తుటిమరకలు పూసి తీసుకొచ్చారు. యాఖూబ్ వారి మాటలు విని "కాదు, (అసలుసంగతి అదికాదు.) మీరేదో కథఅల్లి చెబుతున్నారు. సరే కానివ్వండి. నేను దీన్ని మౌనంగా భరిస్తాను. మీరల్లిన ఈ కట్టుకథ చిక్కు ముడి నుంచి బయటపడాలంటే దేవుని సహాయమే అర్థించాలి" అన్నాడు. (18)

అటు కొందరు బాటసారులు వచ్చారు. వారు తమ నీటి నౌకర్‌ని నీళ్ళ కోసం పంపించారు. నీటి నౌకరు బావిలో చేద వదలగానే "ఎంత అదృష్టం! ఇక్కడ ఒక అబ్బాయి దొరికాడు (మనకు)" అన్నాడు సంతోషంతో బిగ్గరగా. (ఆ తరువాత) యూసుఫ్‌ని వారు వ్యాపార సామగ్రిగా భావించి దాచుకున్నారు. వారు చేస్తున్నదేమిటో దేవునికి బాగా తెలుసు. చివరికి వారు కొన్ని కాసుల కోసం అతడ్ని అతి స్వల్పధరకు అమ్మివేశారు. అతని ధర విషయంలో వారు పెద్దగా ఆశలు పెట్టుకోలేదు. (19,20)

ఈజిప్టులో అతడ్ని కొన్న వ్యక్తి (ఇంటికెళ్ళి) తన భార్యతో "ఈ అబ్బాయిని మనం బాగా చూసుకోవాలి. ఇతను మనకు (భవిష్యత్తులో) ఉపయోగపడవచ్చు. లేదా మనం ఇతడ్ని కొడుకుగా నైనా చేసుకుందాం" అన్నాడు. ఈ విధంగా మేము యూసుఫ్‌కు (ఆ) దేశంలో స్థిరపడే పరిస్థితి కల్పించి, అతనికి వ్యవహారదక్షత గురించిన శిక్షణ యేర్పాటు చేశాం. దేవుడు తానుతలచిన పని చేసితీరుతాడు. కాని చాలామందికి ఈ విషయం తెలియదు. యూసుఫ్ యుక్తవయస్సుకు చేరుకున్నాక మేమతనికి నిర్ణయశక్తిని, జ్ఞానాన్ని ప్రసాదించాం. ఇలా మేము సహృదయులకు ప్రతిఫలం అనుగ్రహిస్తాం. (21,22)

అతను నివసిస్తున్న ఇంట్లో ఆ ఇంటావిడ అతడ్ని మరులుగొల్పుతూ తనవైపు ఆకట్టుకోవడానికి ప్రయత్నించసాగింది. ఓరోజు ఆమె తలుపులు మూసేసి 'రా, వచ్చేయి' అన్నది. "అపచారం! అపచారం!! నేను దేవుని శరణు కోరుతున్నాను. నా ప్రభువు[1] నాకు మంచిస్థితి కల్పించాడు. (నేనీ పాపానికి ఎలా పాల్పడగలను?) అలాంటి దుర్మార్గులు ఎన్నటికీ సఫలం కాలేరు" అన్నాడు యూసుఫ్. (23)

అయినప్పటికీ ఆమె తీవ్రమైన కోరికతో అతని వైపు రాసాగింది. యూసుఫ్ తన ప్రభువు చూపిన హేతువు చూడకపోతే అతను కూడా తీవ్రమైన కోరికతో ఆమె వైపు కదిలేవాడు. మేమతడ్ని చెడుకు, అశ్లీలానికి దూరం ఉంచదలిచాం. కనుకఅతనా చేష్టకు వడిగట్టలేదు. నిస్సందేహంగా అతను మేము ప్రత్యేకంగా ఎంచుకున్న దాసుడు. (24)

చివరికి యూసుఫ్, అతని వెనుక ఆ స్త్రీ ఇద్దరూ పరుగిడుతూ తలుపు దగ్గరకు చేరుకున్నారు. ఆమె యూసుఫ్ వెనకాలపడి అతని చొక్కా (లాగి) చింపేసింది. అంతలో తలుపు దగ్గర వారిద్దరూ (హఠాత్తుగా) ఆమె భర్త కంటపడ్డారు.

ఆమె తన భర్తను చూడగానే "దుష్టసంకల్పంతో నీ ఇల్లాలి వెంటపడే వాడికి శిక్ష ఏమిటీ? అలాంటి వాడ్ని జైల్లో పడవేయడమో లేక కఠిన యాతనలకు గురిచేయడమో తప్ప మరే శిక్ష కాగల్గుతుంది?" అని అన్నది (తానేపాపం ఎరగనట్టు నటిస్తూ). (25)

1. ఇక్కడ నా ప్రభువంటే నా నిజప్రభువు, పోషకుడు, యజమాని అయిన దేవుడని అర్థం.



దానికి యూసుఫ్ వెంటనే సమాధానమిస్తూ "అసలు ఈమే నన్ను వలలో వేసుకోవడానికి ప్రయత్నించింది" అన్నాడు.

అప్పుడు ఆ స్త్రీకుటుంబ సభ్యులలో ఒకతను (మధ్యవర్తిగా) ముందుకు వచ్చి "యూసుఫ్ చొక్కా గనక ముందు భాగం చినిగివుంటే ఈమె చెప్పేది నిజం, అతను చెప్పేది అబద్ధం. ఒకవేళ అతని చొక్కా వెనుక భాగం చినిగివుంటే మాత్రం ఈమె చెప్పేది అబద్ధం. అతను చెప్పేది నిజం అవుతుంది" అని తీర్పిచ్చాడు. (26)

ఆమె భర్త చూస్తే యూసుఫ్ చొక్కా వెనుక భాగమే చినిగి ఉంది. దాంతో అతను (మండిపడుతూ) "ఇవన్నీ మీఆడవాళ్ళ పన్నాగాలు. నిజంగా మీపన్నాగాలు చాలా భయంకరంగా ఉంటాయి. యూసుఫ్! ఈ విషయాన్ని నీవింతటితో మరచిపో. ఇక నీసంగతి-నువ్వే అసలు దోషివి. సరే చేసిన తప్పుకు క్షమాపణైనా చెప్పుకో" అన్నాడు. (27-29)

(ఈ వార్త స్త్రీలలో కార్చిచ్చులా వ్యాపించిపోయింది.) నగరంలోని (గొప్పింటి) స్త్రీలు ఈ విషయమయి పరస్పరం చర్చించుకుంటూ "(మన) మంత్రిగారి భార్య తన బానిస కుర్రోడి వెంట పడిందట! (పాపం) మోహావేశం ఆమెను అదుపు తప్పేలా చేసింది. కాని మన దృష్టిలో మటుకు ఆవిడ పెద్ద తప్పే చేస్తోంది" అని చెప్పుకోసాగారు. (30)

ఈ టక్కరిమాటలు (ఆనోటా ఈనోటా ప్రాకి) చివరికి ఆ స్త్రీ చెవిలో కూడా పడ్డాయి. ఆమె వారిని పిలిపించి ఆనుడుదిండ్లతో ఒక సమావేశం ఏర్పాటు చేసింది. విందులో (పండ్లు పలహారాలతో పాటు) ప్రతి ఒక్కరి ముందు ఓ కత్తి కూడా ఉంచింది.

(వారు తిందామని సరిగ్గా పండ్లు కోస్తున్న సమయంలో) ఆమె యూసుఫ్‌ని వారి ముందుకు రమ్మని సైగ చేసింది. (యూసుఫ్ పక్క గదినుంచి హఠాత్తుగా వారి ముందుకు వచ్చి నిలబడ్డాడు.) అతని మీద దృష్టి పడగానే ఆ స్త్రీలు (అతని అసాధారణ సౌందర్యానికి) మంత్రముగ్ధులై పోయారు. ఆ స్థితిలో వారు తమను తాము మరచిపోయి చేతులు కోసు కున్నారు. (ఆశ్చర్యం నుంచి తేరుకొని) "దేవ దేవ! (ఏమి సౌందర్యం!) ఇతను మానవుడు కాదు, మహోత్కృష్టుడైన ఏ దైవదూతో అయివుంటాడు" అన్నారు అప్రయత్నంగా. (31)

వెంటనే మంత్రిభార్య ఇలా అన్నది: "చూశారుగా! నా గురించి మీరు ఏవేవో చెప్పుకున్నారు. ఆవ్యక్తి ఇతనే. నేను నిజంగానే ఇతడ్ని నావైపు తిప్పుకోవడానికి ప్రయత్నించా. కాని తప్పించుకొని బయటపడ్డాడు. (ఏమైనా సరే) ఇతను నామాట వినకపోతే మాత్రం జైలు పాలయి ఘోర అవమానం చవిచూడవలసి వస్తుంది." (32)

అప్పుడు యూసుఫ్ (దైవాన్ని వేడుకుంటూ) "ప్రభూ! వీరు నానుండి కోరుతున్న దానికంటే నాకు జైలుశిక్షే ఇష్టం. నీవు నన్ను వీరి పన్నాగాల నుండి తప్పించకపోతే నేను వీరి వలలో చిక్కుకొని మూఢుల్లో చేరిపోయే ప్రమాదముంది" అని అన్నాడు. (33)

అతని ప్రభువు అతని మొరాలకించి అతడ్ని ఆ స్త్రీల కుట్రల నుండి కాపాడాడు. నిస్సందేహంగా ఆయనే మొరల్ని ఆలకించేవాడు, సమస్తం ఎరిగినవాడు. (34)

వారు (యూసుఫ్ ఎలాంటి సచ్ఛీలుడో, తమ స్త్రీలు ఎలాంటి దుర్నడత కలవారో వాటికి చెందిన) స్పష్టమైన నిదర్శనాలు చూశారు. అయినా వారతడ్ని కొంతకాలం జైల్లో ఉంచాలన్న నిర్ణయానికే వచ్చారు. (ఆవిధంగా యూసుఫ్ జైలు పాలయ్యాడు.) (35)

జైల్లో అతనితోపాటు మరోఇద్దరు బానిసలు చేరారు. ఓరోజు వారిద్దరిలో ఒకడు "నేను రాత్రి సారాయి పిండుతున్నట్లు కలగన్నాను" అన్నాడు. రెండోవాడు "నేనూ కల గన్నాను. ఆకలలో నా తలమీద కొన్ని రొట్టెలు ఉన్నాయి. వాటిని పక్షులు తినసాగాయి" అన్నాడు. ఆ తర్వాత వారిద్దరు (యూసుఫ్‌ని ఉద్దేశించి) "చూస్తే మీరు ధర్మాత్ములుగా కన్పిస్తున్నారు. కాస్త మా కలల గూఢార్థం ఏమిటో చెప్పండి" అని అడిగారు. (36)

"మీకిక్కడ లభించే భోజనం రాకముందే నేను మీ కలల గూఢార్థం చెబుతాను. ఇది నాకు నాప్రభువు నేర్పిన విద్య. నేను దేవుడ్ని, పరలోకాన్ని విశ్వసించని తిరస్కారుల పద్ధతులు వదలి మన పెద్దలైన ఇబ్రాహీం, ఇస్‌హాఖ్, యాఖూబ్‌ల మార్గం అనుసరిస్తు న్నాను. దేవునికి ఇతరుల్ని సాటికల్పించడం నావిధానం కాదు. (మనల్ని తనకు తప్ప మరెవరికీ దాసులుగా చేయలేదంటే) ఇది నిజంగా మనపై, యావత్తు మానవాళిపై దైవానుగ్రహమే. కాని చాలామంది కృతజ్ఞత చూపడంలేదు"అన్నాడు యూసుఫ్. (37,38)

"నా సహఖైదీలారా! కాస్త ఆలోచించండి. మనకు చాలామంది (చిల్లర) దేవుళ్ళు ఉండటం మంచిదా లేక అందరిపై ఆధిక్యత కలిగివున్న ఒక్క అల్లాహ్ ఉండటం మంచిదా? ఆయన్ని వదలి మీరు ఏఏ దైవాలను ఆరాధిస్తున్నారో అవన్నీ మీరు, మీ తాతముత్తాతలు పెట్టుకున్న కొన్ని పేర్లు మాత్రమే. వాటి కోసం దేవుడు ఎలాంటి ప్రమాణం పంపలేదు. పాలానాధికారం దేవునికి తప్ప మరెవ్వరికీ లేదు. ఆయన తనను తప్ప మరెవరినీ ఆరాధించకూడదని శాసించాడు. ఇదే సరయిన జీవనమార్గం. కాని చాలామంది (ఈ యదార్థాన్ని) గ్రహించడం లేదు." (39.40)

"నా సోదర ఖైదీలారా! ఇప్పుడు మీ కలల గూఢార్థం చెబుతా వినండి. మీలో ఒకడు తన ప్రభువుకు (అంటే ఈజిప్టు చక్రవర్తికి) సారాయి తాగిస్తాడు. రెండోవాడ్ని ఉరికంబం ఎక్కిస్తారు. పక్షులు అతని తలను పొడిచి పొడిచి తింటాయి. (అంతే) మీరడిగిన ప్రశ్నలకు సమాధానాలు లభించాయి." (41)

ఆ తరువాత యూసుఫ్ వారిద్దరిలో జైలు నుంచి విడుదల కాబోతున్నాడని తెలిసిన వ్యక్తితో "నీ ప్రభువు (ఈజిప్టు చక్రవర్తి) దగ్గర నా గురించి కాస్త ప్రస్తావించు" అన్నాడు. కాని షైతాన్ అతడ్ని మరపింపజేశాడు. అతనా విషయం తన ప్రభువు దగ్గర ప్రస్తావించడం మరచిపోయాడు. దాంతో యూసుఫ్ అనేక సంవత్సరాలు జైల్లోనే ఉండిపోవలసి వచ్చింది. (42)

ఒక రోజు చక్రవర్తి (తన సభాసదులతో) ఇలా అన్నాడు: "రాత్రి నేనొక కల గన్నాను. అందులో ఏడు బలిసిన ఆవులను ఏడు బక్కచిక్కిన ఆవులు తినేస్తున్నాయి. అలాగే ధాన్య సంబంధమైన ఏడు పచ్చటివెన్నులు, ఏడు ఎండినవెన్నులు ఉన్నాయి.



కనుక సభాసదులారా! మీకు స్వప్నభావం తెలిస్తే నా స్వప్నంలోని గూఢార్థం ఏమిటో కాస్త వివరించండి." దానికి సభాసదులు "ఇవి పీడకలలకు సంబంధించిన విషయాలు. ఇలాంటి కలల గూఢార్థం మాకు తెలియదు" అని సమాధానమిచ్చారు. (43,44)

అప్పుడా ఇద్దరు ఖైదీలలో విడుదలయిన వ్యక్తికి చాలా కాలం తర్వాత (యూసుఫ్) సంగతి గుర్తుకొచ్చింది. అతను సభను ఉద్దేశించి "నేనుమీకు దానిగూఢార్థం చెబుతాను. నన్ను కాస్త జైలు దగ్గరకు వెళ్ళడానికి అనుమతించండి" అన్నాడు. (45)

(రాజుగారి అనుమతి లభించాక) అతను వెళ్ళి "యూసుఫ్! సత్యం మూర్తీ భవించిన మహానుభావా!! నాకీ కల గురించిన గూఢార్థం ఏమిటో కాస్త చెప్పు. ఏడు బలిసిన ఆవులను ఏడు బక్కచిక్కిన ఆవులు తినేస్తున్నాయి. ఏడు పచ్చటి వెన్నులు, ఏడు ఎండినవెన్నులు ఉన్నాయి. దీనిఅర్థం ఏమిటో చెబితే నేను వెళ్ళి వారికి తెలియ జేస్తాను. దానివల్ల వారు నిన్ను (నీ విలువను) గుర్తించవచ్చు" అని అన్నాడు. (46)

అప్పుడు యూసుఫ్ (స్వప్న భావం వివరిస్తూ) ఇలా అన్నాడు: "మీరు ఏడేండ్లపాటు నిరంతరాయంగా వ్యవసాయం చేస్తారు. ఆ కాలంలో పండే పంటలో కొంత పంటను మీరు తిండికోసం వాడుకొని మిగతా పంటను వాటి వెన్నులలోనే ఉంచండి. ఆతర్వాత మరో ఏడేండ్లపాటు పరిస్థితి చాలా దారుణంగా ఉంటుంది. ఆ స్థితిలో మీరు కూడ బెట్టుకున్న ధాన్యం (హాయిగా) తినవచ్చు. ఒకవేళ ఏదైనా మిగిలితే మీరు భద్రపరుచు కున్నదే మిగులుతుంది. ఆ తరువాత పుష్కలంగా వర్షాలు కురిసే సంవత్సరం వస్తుంది. ఆ సంవత్సరం ప్రజలు (పాలు, పండ్లరసం) బాగా పిండుతారు." (47-49)

చక్రవర్తి ఈ కల గూఢార్థం విన్న తరువాత అతడ్ని తన దగ్గరకు తీసుకురమ్మని ఆదేశించాడు. కాని రాజదూత యూసుఫ్ దగ్గరకు వెళ్తే అతనిలా అన్నాడు: "ముందు నీవు నీ ప్రభువు దగ్గరికెళ్ళి చేతులు కోసుకున్న స్త్రీల సంగతేమిటో కాస్త అడిగిరా. నా ప్రభువుకు మాత్రం ఆ జిత్తులమారి స్త్రీల సంగతి బాగా తెలుసు." (50)

చక్రవర్తి ఈ మాటలు విని (ఆ స్త్రీలను పిలిపించాడు.) వారితో "మీరు యూసుఫ్‌ని మరులు గొల్పడానికి ప్రయత్నించినప్పుడు మీ అనుభవం ఏమిటి?" అని అడిగాడు. దానికి ఆ స్త్రీలంతా "దేవ దేవ! అతనిలో మేము చెడుకు సంబంధించిన ఛాయ కూడా చూడలేదు" అని ముక్తకంఠంతో పలికారు.

అప్పుడు మంత్రిభార్య (ముందుకు వచ్చి) "ఇప్పుడు నిజం బయటపడింది. అతడ్ని వలలో వేసుకోవడానికి ప్రయత్నించిన దాన్ని నేనే. అతను మాత్రం సచ్ఛీలుడే. అందులో ఎలాంటి సందేహం లేదు" అని చెప్పింది. (51)

యూసుఫ్ (రాజదూత ద్వారా ఈ వృత్తాంతం విని) ఇలా అన్నాడు: "ఈ ప్రశ్న అడగ డంలో నా ఉద్దేశ్యం ఒక్కటే. మంత్రిగారు ఇంట్లో లేనప్పుడు నేనాయనకు నమ్మక ద్రోహం తలపెట్టలేదని ఆయనకు తెలియాలి. నిజానికి ఆస్త్రీలే నమ్మక ద్రోహానికి పాల్పడ్డారు. వారి కుట్రలను దేవుడు ఏమాత్రం సాగనివ్వడని వారూ తెలుసుకోవాలి.

నేను నా ఆత్మశుద్ధిని గురించి గొప్పలు చెప్పుకోవడం లేదు. నా ప్రభువు కారుణ్య భాగ్యం లభిస్తే తప్ప మనస్సు ఎల్లప్పుడూ చెడు వైపుకే పురిగొల్పుతుంది.[2] నిస్సందేహంగా నా ప్రభువు గొప్ప క్షమాశీలి, అమిత దయామయుడు." (52,53)

చక్రవర్తి (రాజదూతను ఆదేశిస్తూ) "అతడ్ని నా దగ్గరకు పిలుచుకు రా. నేనతడ్ని (ఆంతరంగిక కార్యదర్శిగా) నాకోసం ప్రత్యేకించుకుంటాను" అన్నాడు.

(రాజదూత యూసుఫ్‌ని పిలుచుకొచ్చాడు.) అతనితో చక్రవర్తి మాట్లాడిన తర్వాత "ఇప్పుడు మీకు మాదగ్గర హోదా, గౌరవప్రతిష్ఠలున్నాయి. మీ నిజాయితీపై మాకు నమ్మకముంది" అన్నాడు. "అయితే దేశ ఒనరులన్నీ నాకప్పగించండి. నేను వాటిని కాపాడుతాను. నాదగ్గర తగిన జ్ఞానసంపత్తి కూడా ఉంది" అన్నాడు యూసుఫ్. (54,55)

ఈవిధంగా మేము ఆ దేశంలో యూసుఫ్ పాలనకోసం మార్గం సుగమం చేశాం. అతనిప్పుడు సర్వాధికారి. ఆ దేశంలో అతను తాను కోరుకున్న చోటల్లా స్థావరం ఏర్పరుచు కోగలడు. మేము తలచుకున్నవారికి మా కారుణ్యభాగ్యం ప్రసాదిస్తాం. మా దగ్గర సజ్జనుల సత్కార్యఫలం హరించడం జరగదు. సత్యాన్ని విశ్వసించి దేవుని పట్ల భయభక్తులతో జీవితం గడిపేవారికి పరలోక ప్రతిఫలం (ఇంతకంటే) ఎంతో శ్రేష్ఠమైనది.

(ఆ తరువాత కొన్నాళ్ళకు) యూసుఫ్ సోదరులు ఈజిప్టు దేశానికి వచ్చారు. వారు (తమ కార్యసిద్ధి కోసం) అతని దగ్గరకు వెళ్ళారు. అతను వారిని వెంటనే గుర్తుపట్టాడు. వారు మాత్రం అతడ్ని గుర్తుపట్టలేక పోయారు. (56-58)

వారికోసం యూసుఫ్ వారిసామగ్రి ఏర్పాటుచేయించిన తర్వాత, వారిని సాగనంపుతూ "(మరోసారి ఎప్పుడైనా వస్తే) మీ మారు సోదరుడ్ని నా దగ్గరకు తీసుకురండి. చూశారు కదా, నేనెంత న్యాయంగా (ధాన్యం) కొలిచి ఇచ్చానో, ఎంత మంచి ఆతిథ్యం ఇచ్చానో? మీరు గనక అతడ్ని తీసుకురాకపోతే మాత్రం మీకు నాదగ్గర ఎలాంటి ధాన్యం లభించదు. అదీగాక మీరు నా దరిదాపులక్కూడా రాలేరు" అని అన్నాడు. "సరే, మా ప్రయత్నం మేము చేస్తాము. మా నాన్నగారు అతడ్ని పంపడానికి ఒప్పు కుంటే మేము తప్పకుండా తీసుకొస్తాము" అన్నారు వారు. (59-61)

యూసుఫ్ తన సేవకుల్ని పిలిచి "వారు ధాన్యం తీసుకొని మనకిచ్చిన ధనాన్ని రహస్యంగా వారి సామగ్రి ఉన్న గోతంలో పెట్టేయండి" అని సూచించాడు. ఇలా చేయడానికి కారణం వారు ఇంటికి వెళ్ళి, ధాన్యం తీసుకొని తమకిచ్చిన ధనాన్ని గుర్తుపడ్తారని, దాంతో వారు మళ్ళీ (ఈజిప్టుకు) రావచ్చని యూసుఫ్ ఆశించాడు. (62)

యూసుఫ్ సోదరులు (స్వదేశం చేరుకొని) తమ తండ్రి దగ్గరికెళ్ళి "నాన్నా! ఇక ముందు మనకు వారు ధాన్యం ఇవ్వమని చెప్పేశారు. అందువల్ల మీరు మా తమ్ముడ్ని మావెంట పంపండి. మేము (మళ్ళీ) ధాన్యం తీసుకొస్తాము. అతడ్ని మేము భద్రంగా చూసుకుంటాం" అని అన్నారు. (63)

2. వివరాలకు 89:27 సూక్తి పాదసూచికలోని 2వ పేరా చూడండి.



"ఇతని విషయంలో నేను మిమ్మల్ని ఎలా నమ్మాలి? ఇంతకు ముందు ఇతని అన్న విషయంలో నమ్మినట్లు నమ్మాల్నా? దేవుడు మాత్రమే మంచి రక్షకుడు. ఆయన అందరి కన్నా ఎంతో కరుణామయుడు కూడా" అన్నాడు వారి తండ్రి. (64)

ఆ తరువాత వారు తమ సామగ్రిగోతాలు విప్పిచూశారు. అందులో ఉన్న ధనం చూసి, తమ ధనాన్ని తిరిగి ఇచ్చివేసినట్లు కనుగొన్నారు. దాన్ని చూడగానే వారు (ఎంతో సంబరపడిపోతూ) "నాన్నా! ఇదిగో చూడండి! మా (మూల)ధనం కూడా మాకు తిరిగిచ్చారు. అంతకంటే మనకేం కావాలి!! ఈసారి మేము మళ్ళీపోయి మన కుటుంబానికి (సరిపడ్డ) ధాన్యం తెస్తాం. మా తమ్ముడ్ని కూడా జాగ్రత్తగా చూసుకుంటాం. అదనంగా మేము మరొక ఒంటె (మోసే) ధాన్యాన్ని కూడా తెచ్చుకోగలం. అదనంగా అంత ధాన్యం మనకు సులభంగా లభిస్తుంది" అని అన్నారు. (65)

"మీరు తప్పకుండా (సురక్షితంగా) నా దగ్గరకు తిరిగి తీసుకొస్తామని దేవుని మీద ప్రమాణం చేయనంతవరకు నేను ఇతడ్ని మీ వెంట పంపను. దురదృష్టవశాత్తు మీరెక్కడైనా చిక్కుకుంటే, అది వేరే విషయం" అన్నాడు వారి తండ్రి.

దాంతో వారంతా దేవునిమీద ప్రమాణంచేసి అలాగే వాగ్దానంచేశారు. అప్పుడతను "(గుర్తుంచుకోండి) మనం చెప్పుకున్న ఈ విషయానికి దేవుడే సాక్షి" అన్నాడు. (66)

ఆ తర్వాత అతను ఈ విధంగా ఉపదేశించాడు: " బిడ్డలారా! ఈజిప్టు రాజధానిలో ఒక ద్వారం గుండా కాకుండా విభిన్న ద్వారాల గుండా ప్రవేశించండి. అయితే విధి నిర్ణయం (ఎలా ఉందోగాని దాని) నుంచి మాత్రం నేను మిమ్మల్ని కాపాడలేను. (యావత్తు విశ్వంలో) దేవుని ఆజ్ఞ తప్ప మరెవరి ఆజ్ఞా పనిచేయదు. ఆయన్నే నేను నమ్ముకున్నాను. నమ్ముకో వలసినవారు ఆయన్నే నమ్ముకోవాలి." (67)

తండ్రి ఉపదేశం ప్రకారమే వారు (ఈజిప్టు వెళ్ళి) విభిన్న ద్వారాల గుండా నగరంలో ప్రవేశించారు. అయితే (ముందు జాగ్రత్త కోసం) అతను సూచించిన యుక్తి విధినిర్ణయం ముందు ఎందుకూ పనికిరాకుండా పోయింది. కాకపోతే యాఖూబ్ తన హృదయంలో మెదలుతున్న సంకోచాన్ని దూరం చేసుకోవడానికి తనవంతు ప్రయత్నం చేశాడు. ఏమైనా అతను గొప్ప జ్ఞానసంపన్నుడు. మేమతనికి విశేషజ్ఞానం ప్రసాదించాం. కాని చాలామంది (యదార్థాన్ని) గ్రహించరు. (68)

వారు (మొత్తంమీద) యూసుఫ్ దగ్గరికి చేరుకున్నారు. యూసుఫ్ వారిలో తన (సొంత)తమ్ముడ్ని చాటుగా తన దగ్గరకు పిలిపించుకొని "నేను నీ(తప్పిపోయిన) అన్నయ్యను. ఇప్పుడు నీవు వారి చేష్టలను గురించి బాధపడనవసరం లేదు" అని ధైర్యం చెప్పాడు. (69)

ఆ తర్వాత యూసుఫ్ వారికోసం (ధాన్యం, తదితర) సామగ్రి ఏర్పాట్లు చేయించాడు. ఆ సమయంలో అతను తన గిన్నె నొకదాన్ని తన తమ్ముడి సామాను ఉన్న గోతంలో పెట్టించాడు రహస్యంగా.

కాస్సేపటికి అరిచేవాడొకడు (రాజభటుడు) హఠాత్తుగా “బాటసారులారా! (ఆగండి) మీరు దొంగలు” అని అరిచాడు. (70)

వారు వెనక్కి తిరిగి “మీ వస్తువు ఏదైనా పోయిందా?” అని అడిగారు. (71)

“రాజుగారి గిన్నె ఒకటి మాకు కన్పించడం లేదు” అన్నారు రాజోద్యోగులు.

“దాన్ని తెచ్చిచ్చేవానికి ఒక ఒంటె (మోసే) బహుమానం ఇస్తాము. అలా ఇప్పించే బాధ్యత నాది” (అన్నాడు వారిలో ప్రధాన రాజోద్యోగి). (72)

“దైవసాక్షి! మేమీ దేశంలో అలజడి సృష్టించడానికి రాలేదు. మేము దొంగతనాలు చేసేవాళ్ళం కాము. ఈసంగతి మీక్కూడా బాగా తెలుసు” అన్నారు వారన్నదమ్ములు.

“సరే, మీమాట అబద్ధమని తేలితే దొంగకు శిక్షేమిటి?” రాజోద్యోగులు అడిగారు.

“(పోయిన) వస్తువు ఎవరి సామగ్రిలో దొరుకుతుందో అతడ్ని శిక్షగా మీ దగ్గర (బానిసగా చేసుకొని) పెట్టుకోండి. అలాంటి దుర్మార్గులకు మా రాజ్యంలో విధించే శిక్ష ఇదే” అన్నారు వారు. (73-75)

అప్పుడు యూసుఫ్ తన తమ్ముడి సామగ్రి సంచి వెతకడానికి ముందుగా వారి సామగ్రి సంచులు వెతికాడు. తరువాత తన తమ్ముడి సంచి వెతికి అందులో నుంచి పోయిన వస్తువుని బయటికి తీశాడు.

ఈ విధంగా మేము మా యుక్తితో యూసుఫ్‌కు సహాయం చేశాము. రాజధర్మం (రాచరికపు చట్టం) ప్రకారం తన తమ్ముడ్ని పట్టుకోవడం యూసుఫ్ (వంటి దైవభక్తుని)కి శోభించదు. ఒకవేళ ఆ విధంగా జరగాలని దేవుడు నిర్ణయిస్తే అది వేరే విషయం. మేము తలచుకున్న వారికి వారిస్థాయి, అంతస్తులను ఉన్నతం చేస్తాం. జ్ఞానసంపత్తిలో అందరినీ మించిన ఒక (అద్భుత) జ్ఞానసంపన్నుడు ఉన్నాడు. (76)

అప్పుడు యూసుఫ్ సవతిసోదరులు (పోయిన రాజవస్తువు తమ మారుతమ్ముడి సంచి నుండి బయల్పడటం చూసి) “ఇతను దొంగతనానికి పాల్పడ్డాడంటే అందులో ఆశ్చర్యం ఏమీ లేదు. ఇంతకు ముందు ఇతని అన్న (యూసుఫ్) కూడా ఇలాగే దొంగతనానికి ఒడిగట్టాడు” అని అన్నారు (అసూయతో).

ఈమాట విని యూసుఫ్ వస్తున్న కోపాన్ని లోలోనే దిగమింగాడు. వాస్తవం వారి ముందు పెట్టకుండా “మీరెంత చెడ్డవాళ్ళు! (నాముందే) నాపై ఈఅపనింద మోపుతున్నారా? దాని నిజానిజాలేమిటో దేవునికి బాగా తెలుసు” అన్నాడు. (మెల్లిగా) (77)

రాజ్యాధిపతీ! అతని తండ్రి చాలా వృద్ధుడైపోయాడు. అందువల్ల మీరు అతనికి బదులు మాలో ఒకడ్ని ఉంచుకోండి. చూస్తే మీరు చాలా పరోపకారిలా, దయామయుడిలా కన్పిస్తున్నారు” అన్నారు వారు యూసుఫ్‌తో. (78)

“(అలాంటి అక్రమపద్ధతి నుండి) మేము దేవుని శరణుకోరుతున్నాం. ఎవరి దగ్గర



మా వస్తువు దొరికిందో అతడ్ని వదలి మరొకడ్ని ఎలా ఉంచుకుంటాం? అలా చేస్తే మేము దుర్మార్గుల్లో చేరినట్లవుతుంది” అన్నాడు యూసుఫ్. (79)

దాంతో వారు నిరాశచెంది ఒక మూలకు వెళ్ళి పరస్పరం సంప్రదించుకోసాగారు. అప్పుడు వారిలో అందరికంటే పెద్దవాడు తన అభిప్రాయాన్ని ఇలా వెలిబుచ్చాడు:

“మీ తండ్రి మీచేత దేవుని పేరుతో ప్రమాణం చేయించిన సంగతి మీకు తెలిసిందే. ఇంతకుపూర్వం యూసుఫ్ విషయంలో మీరు చేసిన దౌర్జన్యాలు కూడా గుర్తుండేఉంటాయి. నేను నాతండ్రి అనుమతి ఇవ్వనంతవరకు ఇక్కడ్నుంచి రానేరాను. లేదా నావిషయంలో దేవుడే ఏదైనా పరిష్కారం చేయాలి. ఆయన అందరికంటే మిన్నగా పరిష్కారం చేసేవాడు. కాబట్టి మీరు వెళ్ళిపోయి మీ నాన్నగారికి ఇలా చెప్పండి:

“నాన్నగారూ! మీ (ముద్దుల) కొడుకు దొంగతనం చేశాడు. మేము మాత్రం అతను దొంగతనం చేస్తుండగా చూడలేదు. మేము చెబుతున్నదే మాకు తెలిసినసంగతి. అగోచర విషయాలు మేము గమనించలేము కదా! కావాలంటే మేము వెళ్ళొచ్చిన నగరంలోని ప్రజల్ని అడగండి. మాతోపాటు వచ్చిన బాటసారుల్ని కూడా అడిగి చూడండి. మేము చెబుతున్నది ముమ్మాటికీ నిజం.” (80-82)

(ఆ తరువాత వారు స్వదేశానికి తిరిగి వెళ్ళి తమ తండ్రికి జరిగిన వృత్తాంతం వివరించారు.) అది విని యాఖూబ్ (తీవ్ర మనస్తాపానికి గురయి) ఇలా అన్నాడు: “కాదు, (అసలు సంగతి అదికాదు.) మళ్ళీ మీరేదో కథ అల్లి చెబుతున్నారు. సరే కానివ్వండి. దీన్ని కూడా నేను మౌనంగా భరిస్తాను. దేవుడు వారందర్నీ నా దగ్గరకు తీసుకురావచ్చు. అందులో ఆశ్చర్యమేమీ లేదు. ఆయన సర్వం ఎరిగినవాడు, మహాయుక్తిపరుడు.” (83)

ఈ విధంగా చెప్పి అతను వారివైపు నుండి ముఖం తిప్పుకొని “అయ్యో యూసుఫ్!” అంటూ బాధపడసాగాడు. (పాపం!) అతను లోలోనే కుమిలిపోతూ క్రుంగిపోసాగాడు. దానివల్ల అతని కళ్ళు జీవకళ కోల్పోయి పాలిపోయాయి. (84)

కొడుకులు (అతని పరిస్థితి చూసి) “అయ్యో దేవా! మీరు ఇలాగే ఎప్పుడూ యూసుఫ్‌నే తలచుకుంటూ బాధపడుతుంటే జబ్బుపడతారు. లేదా (ఆ జబ్బుతో చివరికి) ప్రాణాలు కూడా కోల్పోవచ్చు” అన్నారు. (85)

“నేను నా బాధ గురించి దేవునితో తప్ప ఎవరితోనూ చెప్పుకోవడం లేదు. దేవుడ్ని గురించి నాకు తెలిసినంత మీకు తెలియదు. నాయనలారా! వెళ్ళి యూసుఫ్ గురించి, అతని తమ్ముడ్ని గురించి ఆరాతీయండి. దేవునికారుణ్యం పట్ల నిరాశచెందకండి. దేవుని కారుణ్యంపట్ల అవిశ్వాసులు మాత్రమే నిరాశచెందుతారు” అన్నాడు యాఖూబ్. (86,87)

వారు మళ్ళీ యూసుఫ్ దగ్గరకు వెళ్ళారు.

“రాజ్యాధిపతీ! మేమూ, మా భార్యాపిల్లలు పెద్ద ఆపదలో చిక్కుకున్నాం. మా దగ్గర పెట్టుబడి తక్కువగా ఉంది. (ఎలాగైనా ఈసారి కూడా) మాకు ధాన్యం (కోటా)

పూర్తిగా ఇప్పించండి. (మమ్మల్ని కనికరించి) దానం చేయండి. దానం చేసేవారికి దేవుడు మంచి ప్రతిఫలం ప్రసాదిస్తాడు" అన్నారు వారు (పరిపరి విధాల మనవి చేసుకుంటూ). (88)

యూసుఫ్ (ఇక ఉండబట్టలేక) "మీరు అజ్ఞానాంధకారంలో పడి యూసుఫ్ పట్ల, అతని తమ్ముడి పట్ల ఎలా ప్రవర్తించారో మీకేమైనా గుర్తుందా?" అని అడిగాడు. (89)

ఈ మాట విని వారు ఉలిక్కిపడి "ఏమిటీ! నువ్వు యూసుఫ్‌వా!?" అన్నారు.

"ఔను, నేను యూసుఫ్‌నే. ఇతను నా తమ్ముడు. దేవుడు మాకెంతో మేలు చేశాడు. పాపకార్యాలకు దూరంగాఉంటూ, (కష్టకాలంలో) సహనం వహించే సజ్జనులకు దేవుని దగ్గర అన్యాయం జరగదు. వారి ప్రతిఫలం ఎన్నటికీ వృథాపోదు" అన్నాడు యూసుఫ్. అప్పుడు వారు "దైవసాక్షి! దేవుడు మీకు మాకంటే ఎక్కువ ఔన్నత్యం ప్రసాదించాడు. మేము నిజంగా పాపాత్ములం" అన్నారు. (90,91)

"ఈరోజు మీగురించి ఎలాంటి ఆరోపణలు, ఆక్షేపణలు లేవు. దేవుడు మిమ్మల్ని క్షమించుగాక! ఆయన ఎంతో దయామయుడు. ఇక వెళ్ళండి. ఇదిగో నాచొక్కా తీసికెళ్ళి నా తండ్రి ముఖంపై వేయండి. ఆయనకు చూపు తిరిగొస్తుంది. మీ భార్యాపిల్లలు మొత్తం కుటుంబాన్ని నా దగ్గరకు పిలుచుకురండి" అన్నాడు యూసుఫ్. 92,93)

బాటసారుల బృందం (ఈజిప్టు నుంచి) బయలుదేరింది. అప్పుడు (కనాన్‌లో ఉన్న) వారి తండ్రి (అనిర్వచనీయమయిన ఉత్సాహం వెలిబుచ్చుతూ) "నాకు యూసుఫ్‌కు సంబంధించిన సువాసన ఏదో వస్తున్నట్లనిపిస్తోంది. నేను ముసలితనంలో మతిభ్రమించి ఇలా అంటున్నానని మీరనుకోవచ్చు. (కాని ఇది నిజం)" అన్నాడు. (94)

"అయ్యో దేవా! మీరింకా అదే పిచ్చిలో ఉన్నారు" అన్నారతని కుటుంబసభ్యులు

ఆతర్వాత కొన్నాళ్ళకు శుభవార్త తెచ్చేవాడు వచ్చాడు. రాగానే అతను యూసుఫ్ చొక్కా తీసి యాఖూబ్ ముఖంపై వేశాడు. అంతే, యాఖూబ్‌కు చూపు వచ్చేసింది.

అప్పుడతను (సంతోషిస్తూ) "నేను చెప్పలేదూ, (యూసుఫ్ దగ్గర్నుంచి సువాసన వస్తోందని)? మీకు తెలియని విషయాలెన్నో దేవుని తరపున నాకు తెలుసు" అన్నాడు.

"నాన్నగారూ! మేము నిజంగా పాపాత్ములం. మా పాపాల మన్నింపు కోసం దేవుడ్ని ప్రార్థించండి" అన్నారు వారన్నదమ్ములంతా ముక్తకంఠంతో. (95-97)

"మీ క్షమాపణ కోసం నేను నా ప్రభువు సన్నిధిలో (తప్పకుండా) వేడుకుంటాను. ఆయన గొప్ప క్షమాశీలి, అమిత దయామయుడు" అన్నాడు యాఖూబ్. (98)

ఆ తరువాత (కొన్నాళ్ళకు) వారంతా (ఈజిప్టులో) యూసుఫ్ దగ్గరకు చేరుకున్నారు. అప్పుడు యూసుఫ్ తన తల్లిదండ్రులను (ఘనంగా స్వాగతించాడు.) దగ్గర కూర్చోబెట్టుకొని (అన్నదమ్ములు, ఇతర బంధువులతో) "పదండి, నగరంలో



ప్రవేశించండి. దైవచిత్తమయితే (ఇకనుంచి) మీరంతా శాంతిసుఖాలతో జీవితం గడుపుతారు" అని చెప్పాడు. (99)

(ఇలా ఆబాలగోపాలం వెంటరాగా ఆనందోత్సాహాలతో వారు నగరంలో ప్రవేశించారు.) తరువాత యూసుఫ్ తల్లిదండ్రుల్ని సింహాసనంపై తనపక్కన కూర్చోబెట్టుకున్నాడు. అప్పుడందరూ అప్రయత్నంగా అతనికి గౌరవసూచకంగా అభివాదం చేశారు.[3]

"నాన్నా! నేనా రోజు చూసిన కలలోని గూఢార్థం ఇదే. నాప్రభువు దాన్ని (ఈరోజు) ఇలా నిజం చేసి చూపాడు. ఆయన తన అనుగ్రహంతో నన్ను జైలు నుంచి విడుదల చేయించాడు. అంతేకాదు, మిమ్మల్నందర్నీ ఎడారిప్రాంతం నుండి తీసుకొచ్చి నాతో కలిపాడు. అంతకు ముందు షైతాన్ నాకు, నాసోదరులకు మధ్య కలహం సృష్టించాడు. (దేవుడు దాన్ని తిప్పికొట్టాడు.) వాస్తవం ఏమిటంటే నా ప్రభువు ఇతరులెవరూ గ్రహించ లేని అద్భుతమైన యుక్తులతో తన పథకాన్ని అమలుపరుస్తాడు. నిస్సందేహంగా ఆయన సమస్తం ఎరిగినవాడు, మహా వివేకవంతుడు." (100)

"ప్రభూ! నీవు నాకు రాజ్యాధికారం ప్రసాదించావు, విషయ లోతుపాతుల్ని తరచి చూడగల అసాధారణజ్ఞానం కూడా అనుగ్రహించావు. భూమ్యాకాశాల సృష్టికర్తా! నీవే ఇహపర లోకాల్లో నా సంరక్షకుడివి. (ఇహలోకంలో) నన్ను ఇస్లామీయ స్థితిలోనే అంత మొందించు. పరలోకంలో సత్పురుషులలో చేర్చు" అన్నాడు యూసుఫ్. (101)

ముహమ్మద్ (సల్లం)! మేము నీకు దివ్యావిష్కృతి ద్వారా తెలుపుతున్న ఈ (చారిత్రక) గాథ రహస్య సమాచారానికి సంబంధించిన విషయం. యూసుఫ్ సోదరులు పరస్పరం కూడబలుక్కొని కుట్ర పన్నుతున్నప్పుడు నీవక్కడ లేవు. కాని నీవు ఎంత కోరుకున్నా వారిలో చాలామంది (నీవు బోధించే) సత్యాన్ని విశ్వసించరు. ఈ పని కోసం నీవు వారిని ఎలాంటి ప్రతిఫలం అడగకపోయినా వారు నమ్మేరకంకాదు. ఇది యావత్తు ప్రపంచ మానవాళి కోసం పంపబడిన హితబోధ. (102-104)

---

3. ఇక్కడ సజ్దా అనే పదం ప్రయోగించబడింది. ఇస్లామీయ పరిభాషలో సజ్దా అంటే సాష్టాంగప్రణామం అని అర్థం. సాష్టాంగప్రణామం దేవునికి తప్ప ఇతరులకు చేయడం నిషిద్ధం. అందువల్ల ఈ సూక్తిలో సజ్దా పదాన్ని శాబ్దిక భావంలో తీసుకొని "గౌరవ సూచకంగా అభివాదం చేయడం" అని అనువదించవలసి వచ్చింది. కొందరు భాష్యకారులు ఇక్కడ సజ్దా పదాన్ని పారిభాషికార్థంలో తీసుకొని గత ప్రవక్తలు తెచ్చిన ధర్మశాస్త్రాల్లో దైవేతరులకు (పెద్దలకు, మహనీయులకు) భక్తిభావం లేకుండా సాష్టాంగ ప్రణామం చేయడం ధర్మసమ్మతంగా ఉండేదని అభిప్రాయపడ్డారు. కాని మరికొందరు భాష్యకారులు ఈ అభిప్రాయంతో ఏకీభవించ లేదు.

(పారిభాషికార్థంలో) సజ్దా దేవునికి తప్ప ఇతరులక్కూడా చేయడం ధర్మసమ్మతమై ఉంటే తాను స్త్రీలను తమ భర్తలకు సజ్దా చేయమని ఆదేశించేవాణ్ణని, కాని దేవునికి తప్ప ఇతరులకు సజ్దా చేయడం నిషిద్ధమని మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) స్పష్టంగా చెప్పారు. కనుక ఈ సూక్తిలో సజ్దా అంటే పారిభాషికార్థం ప్రకారం సాష్టాంగప్రణామం కాదని, కేవలం గౌరవసూచకంగా అభివాదం చేయడమని మనం అర్థం చేసుకోవాలి. (2:34 సూక్తి, దాని పాదసూచికి కూడా చూడండి.)

భూమ్యాకాశాల్లో (కనువిప్పు కలిగించే) ఎన్నో నిదర్శనాలు వారికి (అనుదినం) తారస పడుతున్నాయి. అయినా వారు ఏమాత్రం వాటి వైపు దృష్టి సారించడంలేదు. వారిలో చాలామంది (నిజ) దేవుణ్ణి నమ్మేవారు ఉన్నారు; కాని ఆ (ఏకైక) దేవునికి వారు (మిధ్యాదైవాల్ని) సాటి కల్పిస్తున్నారు.

(సరే) వారు దేవుని వైపు నుండి ఎలాంటి శిక్ష (ఉపద్రవం) వచ్చినా అది తమను తుదముట్టించదని నిర్భయంగా ఉన్నారా? లేక ఏమరుపాటులో ఉన్నప్పుడయినా హఠాత్తుగా తమపై ప్రళయం విరుచుకు పడదని నిశ్చింతగా ఉన్నారా? (105-107)

ముహమ్మద్ (సల్లం)! వారికి స్పష్టంగా ఇలా చెప్పెయ్యి: "నా మార్గం మటుకు ఇదే. నేను, నాతోపాటు నా సహచరులు ప్రమాణబద్ధంగా, పరిపూర్ణ జ్ఞానంతో (ప్రజల్ని) దేవుని (మార్గం) వైపు పిలుస్తున్నాము. దేవుడు పరిశుద్ధుడు, సమస్త బలహీనతలకు అతీతుడు. మిధ్యాదైవాలను పూజించేవారితో నాకెలాంటి సంబంధం లేదు." (108)

నీకు పూర్వం మేము పంపిన ప్రవక్తలందరూ మానవులే. వారు మానవులుండే ఊళ్ళకు చెందినవారే. వారి దగ్గరికే మేము మా సందేశాన్ని పంపుతూ వచ్చాము. మరి వారు ప్రపంచంలో తిరిగి గతజాతులు ఎటువంటి పర్యవసానం చవిచూశారో గమనించరా?

(దైవప్రవక్తల మాట విని) దేవుని పట్ల భయభక్తులతో నడుచుకునేవారికే పరలోక గృహం ఎంతో ప్రయోజనకారిగా ఉంటుంది. మరి మీరు ఇప్పటికయినా విషయాన్ని అర్థం చేసుకుంటారా లేదా? (109)

(పూర్వం కూడా ప్రవక్తలు ఏళ్ళ తరబడి బోధించినా ప్రజలు దారికి రాలేదు.) చివరికి ప్రవక్తలు ప్రజల పట్ల నిరాశచెందారు. ప్రజలు కూడా తమకు అభూతకల్పనలు విన్పించడం జరిగిందని భావించారు.

అప్పుడు అకస్మాత్తుగా ప్రవక్తల దగ్గరకు మా సహాయం వచ్చింది. (అది ప్రవక్తల బోధ విశ్వసించని సత్యతిరస్కారుల పాలిట మహోపద్రవమే.) అప్పుడు మేము తలచుకున్న వారిని రక్షించాము. నేరస్థులపై విరుచుకుపడే మా శిక్ష ఎట్టి పరిస్థితిలోనూ తొలగిపోదు. (110)

బుద్ధిజ్ఞానం కలవారికి వీరి చారిత్రకగాథలలో ఎంతో గుణపాఠం ఉంది.

(ఖుర్ఆన్‌లో వివరించబడిన) ఈవిషయం పుక్కిటిపురాణం కాదు (ఈ చెవిన విని ఆ చెవిన వదలివేయడానికి). ఇది గతగ్రంథాలను ధృవీకరిస్తున్న (అంతిమదైవ) గ్రంథం. ప్రతి విషయాన్నీ విపులీకరించి చెప్పే దివ్యవాణి. విశ్వసించేవారికి ఇదొక హితోపదేశం, కారుణ్యప్రదాయిని. (111)



అవతరణ: మక్కా

# 13. మేఘగర్జన (రాద్)

సూక్తులు:43

ఈ అధ్యాయాన్ని "రాద్" (మేఘగర్జన) అంటారు. ఇది నబవీశకం చివరి రోజుల్లో అవతరించింది. ఇందులో దేవుని ఏకత్వాన్ని, ప్రవక్త దౌత్యాన్ని నిరూపించే సాక్ష్యాధారాలతో పాటు ప్రత్యర్థుల ఆరోపణలకు సమాధానమిస్తూ ఇస్లాంను విశ్వసిస్తే కలిగే ఆధ్యాత్మిక, నైతిక ప్రయోజ నాల్ని గురించి చెప్పబడింది. తర్వాత విశ్వాసులకు సహనం వహించాలని బోధించడం జరిగింది.

## కరుణామయుడు, కృపాసాగరుడయిన దేవుని పేరుతో ప్రారంభం

అలిఫ్-లామ్-మీమ్-రా. ఇవి దైవగ్రంథం సూక్తులు. నీ ప్రభువు నుండి నీపై అవతరించిన పరమసత్యం. కాని చాలామంది దీన్ని విశ్వసించలేక పోతున్నారు. (1)

మీకు ఏవిధంగానూ గోచరించని ఆధారాలతో ఆకాశాన్ని నిలబెట్టినవాడే అల్లాహ్. ఆ తర్వాత ఆయన తన (అధికార)సింహాసనం అధిష్టించాడు. ఆయన సూర్య చంద్రుల్ని ఒక నిర్దిష్ట నియమావళికి కట్టుబడి నడిచేలా చేశాడు. యావత్తు విశ్వవ్యవస్థలోని సమస్త సృష్టి రాసులు ఒక నిర్ణీతకాలం వరకు మనగలిగేలా ఏర్పాటు చేయబడింది. ఈ ఏర్పాటంతా దేవుడే చేసి నిరంతరాయంగా నిర్వహిస్తున్నాడు. మీరు మీప్రభువుని (ఒకరోజు) కలుసుకోవలసి ఉంటుందన్న విషయంపై మీకు నమ్మకం కుదరాడానికే (ఈవిధంగా) ఆయన (ప్రకృతి) నిదర్శనాలను విడమరచి తెలియజేస్తున్నాడు. (2)

ఆయనే ఈ భూమండలాన్ని పరచి అందులో పర్వతాలను, నదులను నెలకొల్పాడు. ఆయనే సమస్త జాతుల పండ్లలో రెండేసి రకాలను సృష్టించాడు. ఆయనే పగటిపై రాత్రిని ఆవరింప జేస్తున్నాడు. వీటన్నిటిలోనూ జాగ్రత్తగా పరిశీలించి ప్రశాంత మనస్సుతో యోచించే వారికోసం గొప్ప నిదర్శనాలు ఉన్నాయి. (3)

ధరణిలో విభిన్నరకాలు కలిగిన వేర్వేరు నేలలు ఉన్నాయి. అయితే అవన్నీ పక్క పక్కన ఒకదానికొకటి కలిసే ఉన్నాయి. (ఆయా నేలల్లో) ద్రాక్షతోటలు, పంటపొలాలు, ఖర్జూ రపు చెట్లు (వగైరా) ఉన్నాయి. తిరిగి వీటిలో కొన్ని బహుళ శాఖవృక్షాలు, మరికొన్ని వేరే రకమైనవి కూడా ఉన్నాయి. వాటన్నిటికీ ఒకే నీరు సరఫరా అవుతుంది. అయితే వాటిలో కొన్నిటిని మేము ఎక్కువ రుచికరమైనవిగా, మరికొన్నిటిని తక్కువ రుచికరమైనవిగా చేశాము. వీటిలో కూడా బుద్ధి వివేచనలు కలవారి కోసం ఎన్నో నిదర్శనాలు ఉన్నాయి. (4)

నీకు ఆశ్చర్యం కలిగించే మాటేదైనా కావాలంటే కొందరిమాటలు నీకు ఆశ్చర్యం కలిగిస్తాయి. "ఏమిటీ, మేము చచ్చి మట్టిలో మట్టయిపోయిన తర్వాత కొత్తగా మళ్ళీ సృష్టించ బడతామా?" అంటారు వారు (తెగ ఆశ్చర్యపోతూ. ఆశ్చర్యంగా లేవూ నీకీ మాటలు?) వారసలు తమ ప్రభువును నిరాకరించిన పచ్చి అవిశ్వాసులు. వారు మెడలలో (భావదాస్యపు) పట్టాలు పడిన (అంధ) మనుషులు. వారే నరకవాసులు. నరకంలోనే వారు (నానాయాతనలు అనుభవిస్తూ) ఎల్లకాలం పడిఉంటారు. (5)

వారు మేలుకు బదులు కీడు కోసం తొందరపడుతున్నారు. వారికి పూర్వం కనువిప్పు కల్గించే సంఘటనలు (ఎన్నో) జరిగాయి. ప్రజలు హద్దుమీరి వ్యవహరించినప్పటికీ నీ ప్రభువు వారిని ఉపేక్షిస్తున్నాడు. అయితే నీ ప్రభువు అతి కఠినశిక్ష కూడా విధిస్తాడు. (6)

నీ మాటలు నిరాకరిస్తున్నవారు "ఈ మనిషి దగ్గరకు ఇతని ప్రభువు నుండి ఏదైనా మహిమ ఎందుకు రాలేదు?" అని అంటున్నారు. కాని నీవు (దుష్పరిణామాలను గురించి) హెచ్చరించేవాడివి మాత్రమే. ప్రతి జాతికీ ఒక మార్గదర్శి ఉన్నాడు. (6,7)

దేవునికి ప్రతి గర్భిణీ గర్భంలో రూపుదిద్దుకునే పిండం గురించి తెలుసు. ఆ పిండంలో జరిగే మార్పులు, లోపాలు కూడా ఆయనకు తెలుసు. ప్రతి వస్తువుకూ ఆయన దగ్గర ఒక నిర్ణీత పరిమాణం ఉంది. ఆయన ప్రతి విషయానికీ సంబంధించిన అంతర్ బాహ్యాల జ్ఞానం తెలిసినవాడు. ఆయన మహోన్నతుడు, సర్వాధికుడు. మీలో ఎవరైనా మెల్లిగా మాట్లాడినా, బిగ్గరగా మాట్లాడినా లేక రాత్రివేళ చీకటిలో దాగినా, పగటి వెల్తురులో తిరుగుతున్నా సరే ఆయనకు ఒకటే. (8-10)

ప్రతి మనిషికీ ముందూ వెనుకా దేవుడు నియమించిన (అదృశ్య) గూఢచారులు ఉన్నారు. ఆయన ఆజ్ఞతో వారతడ్ని పర్యవేక్షిస్తుంటారు. అయితే ఏజాతి అయినా తనను తాను సంస్కరించుకోనంత వరకూ దేవుడు దాని పరిస్థితి మార్చడు. ఇదొక యదార్థం. అలాగే ఏదైనా జాతికి దేవుడు కీడు తలపెట్ట దలచుకుంటే ఇక దానికి తిరుగేఉండదు. దేవుని నిర్ణయానికి వ్యతిరేకంగా అలాంటి జాతిని ఏ శక్తీ ఆదుకోజాలదు. (11)

ఆయనే మీ ముందు మేఘ మెరుపుల్ని మెరిపిస్తున్నాడు. వాటిని చూసి మీరు ఆందోళన కూడా చెందుతారు; ఆశలు కూడా పెట్టుకుంటారు. ఆయనే నీటితో నిండిన మేఘాలను సృజిస్తున్నాడు. ఆ మేఘాలు అద్భుత గర్జనలతో ఆయన్ని స్తుతిస్తూ, ఆయన పవిత్రతను కొనియాడుతుంటాయి. దైవదూతలు భయకంపితులయి ఆయన్ని జపిస్తూ స్తోత్రగానం చేస్తుంటారు.

ఆయనే భయంకరమైన పిడుగులను కూడా పంపుతున్నాడు. ప్రజలు దేవుని విషయంలో పరస్పరం వాదించుకుంటున్నప్పుడు ఒక్కోసారి ఆయన తాను తలచుకున్న వారిపై వాటిని తెచ్చి హఠాత్తుగా పడవేస్తాడు. నిజంగా ఆయన అద్భుత యుక్తిపరుడు, అసాధారణ శక్తిసంపన్నుడు. (12,13)

(కనుక ఆపద సమయంలో) ఆయన్నే మొరపెట్టుకోవడం మీధర్మం. ఆయన్ని వదలి వారు మొరపెట్టుకుంటున్న మిథ్యాదైవాలు వారి మొరలకు ఎలాంటి సమాధానమివ్వలేవు. ఒకవ్యక్తి నీటి వైపు చేతులు చాచి "నీవు నానోటి దగ్గరకు వచ్చెయ్యి" అనంటే ఆ నీరు అతని నోటి దగ్గరకు వస్తుందా? ఎన్నటికీ రాదు. మిథ్యాదైవాలను మొరపెట్టుకునేవారి పరిస్థితి కూడా అంతే. అలాగే అవిశ్వాసుల మొరలు కూడా గురితప్పిన బాణాలు వంటివే. (14)



ఆయనే (పరమోన్నతుడయిన) అల్లాహ్. భూమ్యాకాశాల్లోని అణువణువూ తన ఇష్టాయిష్టాలతో ప్రమేయంలేకుండా ఆయనకే సాష్టాంగపడుతోంది.[1] ఉదయం, సాయంత్రం సమస్త వస్తువుల ఛాయలు కూడా ఆయనకే మోకరిల్లుతున్నాయి. (15)

వారిని భూమ్యాకాశాల ప్రభువు ఎవరని అడుగు. దేవుడే అని చెప్పు. "మరి ఈ యదార్థం అంగీకరిస్తున్నప్పుడు, ఆ దేవుడ్ని వదలి మీరు తమకు తాము కూడా ఎలాంటి లాభనష్టాలు కలిగించుకోలేని మిథ్యాదైవాలను ఎందుకు రక్షకులుగా చేసుకున్నారు?" అని ప్రశ్నించు. "గుడ్డివాడు, కళ్ళున్నవాడు ఒకటేనా? చీకటి వెలుగులు సమానమవుతాయా?" అని అడుగు వారిని. అలా కాకపోతే వారు కల్పించుకున్న మిథ్యాదైవాలు కూడా దేవుని మాదిరిగా దేన్నయినా సృష్టించాయా? ఈ కారణంగా వారు సృష్టినిర్వహణ గురించి సందేహంలో పడిపోయారా? వారికి స్పష్టంగా చెప్పు: "ప్రతిదానికీ దేవుడు మాత్రమే సృష్టికర్త. ఆయన ఒక్కడే, అద్వితీయ శక్తిసంపన్నుడు, సర్వోన్నతుడు." (16)

ఆ దేవుడే ఆకాశం నుంచి వర్షం కురిపిస్తున్నాడు. దాన్ని యావత్తు నదీనదాలు తమ తమ పరిమాణాలకు సరిపడేలా (నీటిని) తీసుకొని ప్రవహిస్తున్నాయి. ఆ వర్ష

1. ఇక్కడ మూలభాషలో సజ్దా అనే పదం వచ్చింది. సజ్దా చేయడమంటే సాష్టాంగ పడటం, సాగిలబడటం, శిరసావహించడం, వినయపూర్వకంగా తలవంచడం. విధేయత చూపడం అని నానార్థాలున్నాయి. దీన్నిబట్టి విశ్వంలోని సమస్త సృష్టిరాసులు, చరాచరాలు దేవునికి విధేయత చూపుతూ, ఆయన నిర్దేశించిన ఆజ్ఞలకు కట్టుబడి పని చేస్తున్నాయి. దేవుడు నిర్దేశించిన ఈ ప్రకృతి శాసనాలను ఏ సృష్టిరాసి కూడా ధిక్కరించలేదు.

సూర్యచంద్ర నక్షత్రాలన్నీ తమకు నిర్దేశించిన ప్రకృతి చట్టాలకు కట్టుబడి ఉంటూ దేవునికి విధేయత చూపుతున్నాయి. యావత్తు నభోమండలంలోని రోదసీ వస్తువులన్నీ తమతమ నిర్ణీత కక్ష్యల్లో, నిర్దేశిత వేగాలతో సంచరిస్తున్నాయి. వాటిలో ఏ ఒక్కటీ దైవశాసనాన్ని ధిక్కరించి తన ఇష్టానుసారం సంచరించలేదు. సూర్యుడు, సముద్రం, గాలి, మేఘాలు కూడా దైవచట్టం ప్రకారమే పని చేస్తూ వృక్ష జాతికి, జీవరాసులకు కావలసిన వర్షం, శీతోష్ణ స్థితులు సమకూర్చుతున్నాయి.

మానవుడు కూడా తనకు స్వాతంత్ర్యాధికారాలులేని కార్యరంగాల్లో దేవుడు నిర్దేశించిన ఈ ప్రకృతి చట్టానికే తలవొగ్గి వ్యవహరిస్తున్నాడు. దాన్ని అతను ఎట్టి పరిస్థితుల్లోనూ ధిక్కరించలేడు. ఉదా:- మానవుడు కాళ్ళకు బదులు చేతులతో నడవలేడు. కళ్ళకు బదులు చెవులతో చూడలేడు. నోటికి బదులు ముక్కుతో మాట్లాడలేడు. తనకు స్వేచ్ఛాధికారాలు ఇవ్వబడిన కార్యరంగంలోనే దేవుడు నిర్దేశించిన చట్టాలను నిరాకరించగలడు. ఉదా:- అతను దేవుడు నిర్దేశించిన ఆరాధనా పద్ధతులు, సామాజిక ఆర్థిక రాజకీయ విధానాలు తిరస్కరించి దేవునికి అవిధేయుడైపోగలడు.

అయితే తనకు స్వేచ్ఛ ఇవ్వబడిన ఈ కార్యరంగాల్లో కూడా దేవునికి విధేయుడయి ఆయన శాసనాలు శిరసావహించాలని ఖుర్‌ఆన్ చెబుతోంది. ఈ శాసనాలను ధిక్కరిస్తే అతను ఇహలోకంలో అశాంతికి గురయిపోతాడని, పరలోకంలో నరక యాతనలు అనుభవిస్తాడని హెచ్చరిస్తోంది. అంచేత స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు ప్రసాదించబడిన కార్యరంగాల్లో కూడా దేవునికి విధేయుడై, ఆయన నిర్దేశించిన శాసనాలు శిరసావహిస్తే ఇహలోకంలో శాంతీ, పరలోకంలో దేవుని ప్రసన్నతాభాగ్యం, స్వర్గసౌఖ్యాలు లభిస్తాయని చెబుతోంది. (22:18 సూక్తి, దాని పాదసూచిక కూడా చూడండి.)

సమయంలో వరదలొచ్చినప్పుడు వాటి ఉపరితలంపై నురుగులు కూడా ఏర్పడుతాయి. ప్రజలు నగలు, పాత్రలు తయారు చేయడానికి అగ్నిలో కరిగించే లోహాలపై కూడా ఇలాంటి నురుగులే ఏర్పడుతాయి. ఈ ఉపమానం ద్వారా దేవుడు సత్యాసత్యాల వ్యవహారాన్ని స్పష్టంగా వివరిస్తున్నాడు. పైన ఏర్పడిన నురుగు ఇగిరిపోతుంది. ప్రజలకు ప్రయోజనం చేకూర్చే వస్తువు అడుగున మిగిలిపోతుంది. ఈ విధంగా (రకరకాల) ఉపమానాల ద్వారా దేవుడు మీకు విషయాన్ని విశదీకరించి బోధిస్తున్నాడు. (17)

(కనుక) దేవుడు పంపిన సందేశం స్వీకరించేవారికే మేలు జరుగుతుంది. దాన్ని స్వీకరించనివారు దేవుని పట్టు నుండి బయటపడేందుకు తమ అధీనంలో యావత్తు ప్రపంచ సంపదలున్నా, ఇంకా వాటికి రెట్టింపు సిరిసంపదలు సమకూర్చుకున్నా వాటన్నిటినీ పాపపరిహారం క్రింద ఇవ్వడానికి సిద్ధమవుతారు. (అయినా వారికి విముక్తి లభించదు.) అలాంటి వారిని నిలదీసి కఠినంగా (కర్మల్ని గురించి) విచారించడం జరుగుతుంది.[2] చివరికి వారి నివాసం నరకమవుతుంది. అది పరమ చెడ్డనివాసం. (18)

నీప్రభువు నీపై అవతరింపజేసిన వాణి సత్యమని గుర్తించినవాడు, దాన్ని గుర్తించని అంధుడు ఒకటే అవుతారా? విజ్ఞులే (మా) హితోపదేశాన్ని గ్రహిస్తారు. (19)

ఆ విజ్ఞుల జీవనసరళి ఇలా ఉంటుంది: వారు దేవునితో చేసిన ప్రమాణాన్ని నెరవేరు స్తారు. దాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ భంగపరచరు. స్థిరంగా ఉంచాలని దేవుడు ఆదేశించిన సంబంధాలను స్థిరంగా ఉంచుతారు. వారు తమ ప్రభువుకు ఎల్లప్పుడూ భయపడుతూ ఉంటారు. కఠినంగా (కర్మ)విచారణ జరుగుతుందేమోనని భయపడు తుంటారు. తమ ప్రభువు ప్రసన్నతను ఆశిస్తూ సహనంతో వ్యవహరిస్తారు. అదీగాక, వారు ప్రార్థనా (నమాజు) వ్యవస్థను స్థాపిస్తారు. మేము ప్రసాదించిన ఉపాధి నుండి (సత్కార్యాలకోసం) రహస్యంగాను, బహిరంగం గాను ఖర్చుపెడతారు. చెడుని మంచి

2. వీరు సత్యాన్ని నిరాకరించిన అవిశ్వాసులు. దేవుడు ఇలాంటి దాసుల నుండి కఠినంగా లెక్క తీసుకొని నరకశిక్ష విధిస్తాడు. దీనికి భిన్నంగా దేవుడ్ని విశ్వసించి, సమస్త రంగాల్లో ఆయనకు పూర్తిగా విధేయులయి పవిత్రజీవితం గడిపిన దాసుల్ని తేలిగ్గా విచారించి వదలిపెడ్తాడు.

హజ్రత్ ఆయిషా (రజి) దైవప్రవక్త (సల్లం) ముందు ఖుర్‌ఆన్‌లోని "ఎవరైనా చెడ్డపని చేస్తే అతను దాని దుష్ఫలితం అనుభవిస్తాడు" (4:123) అనే సూక్తిని ప్రస్తావిస్తూ "నా దృష్టిలో ఇది అన్నిటి కంటే భయంకరమైన సూక్తి" అన్నారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఇలా చెప్పారు:

"ఆయిషా! నీకు తెలియదా? దేవుని ప్రియభక్తులకు ప్రపంచంలో ఎలాంటి బాధ కలిగినా, చివరికి ఒక ముల్లు గుచ్చుకున్నా సరే, దాన్ని దేవుడు అతను చేసిన పొరపాటుకు శిక్షగా పరిగణించి ఇహలోకంలోనే అతని లెక్క ముగిస్తాడు. పరలోకంలో ఎవరి నుండి లెక్క తీసుకోవడం జరిగినా అతను తప్పకుండా (నరక) శిక్షకు గురవుతాడు."

హజ్రత్ ఆయిషా (రజి) మళ్ళీ ఖుర్‌ఆన్‌లోని "ఎవరి కర్మపత్రం వారి కుడిచేతికి ఇవ్వబడు తుందో వారినుండి తేలికగా లెక్క తీసుకోబడుతుంది" (84:7,8) అనే సూక్తిని ప్రస్తావించి "మరి దీనర్థం ఏమిటీ?" అని అడిగారు. దానికి దైవప్రవక్త(సల్లం) ఇలా చెప్పారు: " దానర్థం ప్రవేశపెట్టడం అన్నమాట. (వారి సత్కర్మలతో పాటు దుష్కర్మలు దేవుని ముందు ప్రవేశపెట్టబడతాయి.) అయితే ఎవరి నుండి లెక్క తీసుకోవడం జరుగుతుందో అతనిక నాశనమైనట్లే అనుకో." (అబూదావూద్)



ద్వారా నిర్మూలిస్తారు.[3]

అలాంటి వారికే పరలోక (స్వర్గ) సీమ ఉంది. (అంటే) శాశ్వత నిలయాలుగా లభించే స్వర్గవనాలలో వారు ప్రవేశిస్తారు. వారి తాతముత్తాతలు, తల్లిదండ్రులు, భార్యాపిల్లల్లో సజ్జనులైనవారుకూడా స్వర్గప్రవేశం చేస్తారు. అప్పుడు నలువైపుల నుండి ఎందరో దైవదూతలు వారికి స్వాగతించడానికి వస్తారు. ఆ దూతలు వారికి స్వాగతం చెబుతూ "మీకు శాంతి కలుగుగాక! మీరు ఇహలోకంలో సహనంతో వ్యవహరిస్తూ (సాత్విక) జీవితం గడిపినందుకు ఈరోజు దీనికి అర్హులైపోయారు" అనంటారు. ఆహా! ఎంత శ్రేష్ఠమైనది ఈ పరలోక (స్వర్గ) సీమ!! (20-24)

ఇక దేవునితో గట్టి ప్రమాణం చేసి దాన్ని ఉల్లంఘించేవారు, దేవుడు స్థిరంగా ఉంచాలని ఆదేశించిన సంబంధాలను విచ్ఛిన్నంచేసేవారు, ప్రపంచంలో కల్లోలాలు సృష్టించేవారు శాపగ్రస్తులవుతారు. వారికోసం పరలోకంలో పరమ చెడ్డనివాసం ఎదురు చూస్తోంది. దేవుడు తానుకోరిన విధంగా కొందరికి ఇతోధికంగా, మరికొందరికి పరిమితంగా ఉపాధి నిస్తాడు. వారు ప్రాపంచిక జీవితంలో మునిగి తేలుతున్నారు. కాని పరలోక జీవితం ముందు ప్రాపంచిక జీవితం మూన్నాళ్ళ ముచ్చట మాత్రమే. (25,26)

ముహమ్మద్ (సల్లం)! నీ మాట నిరాకరిస్తున్నవారు "ఈ మనిషి దగ్గరికి అతని ప్రభువు నుండి ఏదైనా నిదర్శనం ఎందుకు అవతరించదు?" అని అంటున్నారు. ఎచెప్పు: దేవుడు తాను తలచుకున్న వారిని మార్గభ్రష్టత్వంలోనే పడిఉండేలా చేస్తాడు. ఆయన తనవైపు మరలేవారికి మాత్రమే తన వైపుకు వచ్చే మార్గం చూపిస్తాడు. (27)

సత్యాన్ని విశ్వసించినవారి హృదయాలే దైవస్మరణ వల్ల తృప్తి చెందుతాయి. గుర్తుంచుకోండి, దైవస్మరణ వల్లనే మానవులకు మనశ్శాంతి లభిస్తుంది. సత్యాన్ని

3. ఎవరైనా మనకు కీడు తలపెడితే తిరిగి మనం వారికి కీడు చేయకూడదని, వారి పట్ల సత్ప్రవర్తనతో మెలగాలని ఈ సూక్తి తెలియజేస్తోంది. దైవప్రవక్త (సల్లం) ఇలా వివరించారు: "మీరు మీ ప్రవర్తనా వైఖరిని లోకుల ప్రవర్తనా వైఖరికి అనుగుణంగా మార్చుకోకండి. ఇతరులు మంచిపని చేస్తే తామూ మంచిపని చేస్తామని, ఇతరులు దౌర్జన్యంచేస్తే తామూ దౌర్జన్యం చేస్తామని చెప్పడం సరికాదు. మీరు మిమ్మల్ని ఒక నియమావళికి కట్టుబడి ఉండేలా రూపొందించు కోండి. ఇతరులు మేలు చేస్తే మీరూ మేలు చేయండి. కాని ఇతరులు మీకేమైనా అపకారం తలపెడ్తే మీరు మాత్రం వారికి అపకారం తలపెట్టకండి."

మరో సందర్భంలో ఆయన "నిన్నెవరైనా మోసగిస్తే నీవు తిరిగి వారిని మోసగించకు" అని ప్రవచించారు. ఆయన "నా ప్రభువు నన్ను తొమ్మిది విషయాల్ని గురించి ఆజ్ఞాపించాడ"ని తెలియ జేసిన తొమ్మిది విషయాలలో నాలుగు విషయాలు ఇలా ఉన్నాయి: "(1) నేను ఎవరి పట్లయినా సంతోషంగావున్నా, అయిష్టంగావున్నా ఎట్టి పరిస్థితిలోనైనా సరే న్యాయంగా మాట్లాడాలి (2) ఎవరైనా నాపట్ల నెరవేర్చవలసిన బాధ్యత నెరవేర్చకపోయినా, నేను మాత్రం వారిపట్ల నెరవేర్చవలసిన నా బాధ్యతను నెరవేర్చాలి. (3) ఎవరైనా నాకు (సహాయ సహకారాలు) ఇవ్వకపోయినా నేను మటుకు వారికివ్వాలి. (4) ఎవరైనా నామీద దౌర్జన్యం చేస్తే నేను వారిని క్షమించాలి."

హజ్రత్ ఉమర్ (రజి) ఇలా అన్నారు: "ఎవరైనా నీపట్ల వ్యవహరించడంలో దేవునికి భయ పడక పోతే, నీవు మాత్రం దేవునికి భయపడ్తూ అతనిపట్ల వ్యవహరించు. ఇదే అతనికి తగినశిక్ష."

విశ్వసించి సదాచార సంపన్నులయినవారు నిజంగా ఎంతో అదృష్టవంతులు. వారికి (పరలోకంలో) ఎంతో శ్రేష్ఠమైన ప్రతిఫలం లభిస్తుంది. (28,29)

ముహమ్మద్ (స)! పూర్వం అనేక జాతులు గతించాయి. (ఆయా జాతుల కోసం మేము ఎందరో ప్రవక్తలను ప్రభవింపజేసాము.) అదేవిధంగా ఇప్పుడు మేము ఈ జాతి ప్రజలకు మా సందేశం అందజేయడానికి నిన్ను ప్రవక్తగా నియమించి పంపాము. ఈ ప్రజలు కరుణామయుడైన దేవుడ్ని మరచి సత్యతిరస్కారంలో పడివున్నారు. వారికిలా చెప్పు: "ఆయనే నాప్రభువు. ఆయన తప్ప మరో ఆరాధ్యుడు లేడు. ఆయన్నే నేను నమ్ముకున్నాను. (ప్రతి వ్యవహారంలోనూ) నేను ఆయన వైపుకే మరలుతాను." (30)

భూమిని బ్రద్దలుచేసే, పర్వతాలను పెకలించి నడిపే, లేదా మృతుల్ని లేపి మాట్లాడ జేసే శక్తిగల ఏదైనా ఖుర్ఆన్ని ఒకవేళ అవతరింపజేసినా లాభం ఏమిటీ? సమస్త కార్యాలు దేవుని అధీనంలోనే ఉన్నాయి. దేవుడు తలచుకుంటే మానవులందర్నీ సన్మార్గంలో నడిపించ గలడు. విశ్వాసులు తృప్తిచెందడానికి ఇదొక్క మాట చాలదా? తిరస్కారవైఖరి అవలంబించిన వారిపై వారి దుష్టకార్యాల మూలంగా (ఎప్పుడూ)ఏదో ఒక ఆపద వచ్చిపడుతూనే ఉంటుంది. ఆ విపత్తు వారి ఇళ్ళ సమీపంలో కూడా పడవచ్చు. దేవుని వాగ్దానం (ప్రళయం) నెరవేరేదాకా ఇలా సంభవిస్తూనే ఉంటుంది. దేవుడు తన వాగ్దానాన్ని భంగపరచే ప్రసక్తే లేదు. (31)

నీకు పూర్వం కూడా (ఈ తిరస్కారులు) దైవప్రవక్తలను హేళనచేశారు. అయితే మేము తిరస్కారులను చూసీ చూడనట్లు (కొంతకాలం పాటు) వదిలేశాము. ఆ తరువాత వారిని పట్టుకున్నాము. చూడు, నాశిక్ష ఎంత కఠినంగా ఉండిందో. (32)

ప్రతి ప్రాణినీ ఓకంట కనిపెట్టిఉన్న దేవుడు వారి దుశ్చర్యల్ని గమనించడా? వారు దేవునికి సాటికల్పించారు. (అలా చేయమని దేవుడు నిజంగా చెప్పివుంటే) వాటి పేర్లేమిటో, వాటి పుట్టుపూర్వోత్తరాలు ఏమిటో అడిగి చూడు. ఇంకా వారిని ఇలా అడుగు: "మీరు దేవునికి కొత్త విషయాన్ని నేర్పుతున్నారా? ఆయనకు తన ధరణిలోని విషయాలు తెలియవనా? లేక మీ బుర్రకు ఏది తట్టితే దాన్నే గుడ్డిగా అనుసరిస్తున్నారా?

సత్యసందేశం నిరాకరించినవారికి వారి దుష్టపన్నాగాలు ఆకర్షనీయమైనవిగా చేయబడ్డాయి. వారు సన్మార్గంలోకి రాకుండా నిరోధించబడ్డారు. దేవుడు దారి తప్పించిన వాడికి మరెవరూ దారి చూపలేరు. అలాంటివారికి ఇహలోక జీవితంలో యాతనలు తప్పవు. పరలోక జీవితంలో అంతకంటే కఠినమైన (నరక) యాతనలు చవిచూడవలసి ఉంటుంది. దేవుని శిక్ష నుంచి వారిని ఇక ఎవరూ కాపాడ లేరు. (33,34)

దేవుని పట్ల భయభక్తులు కలిగి (సాత్విక) జీవితం గడిపినవారికి దేవుడు స్వర్గప్రవేశం గురించిన వాగ్దానం చేశాడు. ఆ స్వర్గంలో సెలయేరులు ప్రవహిస్తూ ఉంటాయి. అక్కడ ఎన్నటికీ తరగని ఫలాలు ఉంటాయి. అక్కడి వృక్షచ్ఛాయలక్కూడా అంతం లేదు. దైవభీతిపరాయణుల జీవిత పర్యవసానం ఇలాగే ఉంటుంది. మరి సత్యతిరస్కారుల జీవిత పర్యవసానం? వారికోసం నరకాగ్ని కాచుకొని ఉంటుంది. (35)



ప్రవక్తా! గతంలో గ్రంథం ఇవ్వబడినవారు మేము నీపై దించిన ఈగ్రంథం పట్ల సంతోషంగా ఉన్నారు. కాని వారిలో కొన్నివర్గాలు ఇందులోని కొన్ని విషయాల్ని విశ్వసించడం లేదు. వారికిలా చెప్పు: "ఒక్క దేవుడ్నే ఆరాధించాలని, ఆయన దైవత్వంలో ఎవరినీ భాగస్వాములుగా చేయరాదని నాకు ఆజ్ఞయింది. కనుక నేనీ విషయం వైపుకే ప్రజల్ని పిలుస్తున్నాను. ఈ విషయాన్నే నేను అనుసరిస్తున్నాను." దీన్నే బోధిస్తూ అరబీభాషలో మేమీ ఉత్తర్వుని నీపై అవతరింపజేశాం. ఈ యదార్థం నీదగ్గరకు వచ్చినా నీవు ప్రజల కోరికల్ని అనుసరిస్తే దేవుని పట్టు నుండి నిన్నెవరూ కాపాడలేరు. నీకు సహాయపడేవారు కూడా ఎవరూ ఉండరు. (36,37)

నీకు పూర్వం మేము అనేకమంది ప్రవక్తల్ని పంపించాము. వారు కూడా భార్యా పిల్లలు కలవారే. దైవాజ్ఞ లేకుండా ఏ ప్రవక్తా తనంతటతాను ఏ నిదర్శనం చూపలేడు. ప్రతి యుగానికి ఓ గ్రంథం ఉంది. దేవుడు తాను కోరినట్లు కొన్ని విషయాల్ని తుడిచి పెట్టి కొన్నిటిని యథాతథంగా ఉంచుతాడు. అన్నిటికీ మూలమైన మాతృగ్రంథం[4] ఆయన దగ్గరే ఉంది. (38,39)

ప్రవక్తా! మేము వారిని హెచ్చరిస్తున్న దుష్పరిణామంలో కొంతభాగం వారికి నీ జీవితకాలంలో చవిచూపినా, లేదా అది సంభవించకముందే మేము నిన్ను మా దగ్గరకు పిలుచుకున్నా మొత్తం మీద మా సందేశాన్ని ప్రజలకు చేరవేయడమే నీ కర్తవ్యం. ఆపై లెక్క తీసుకోవడం మా బాధ్యత. మేమీ భూభాగాన్ని నలువైపుల నుంచి నరుక్కుంటూ ఎలా నడిచివస్తున్నామో వారు గమనించడం లేదా?[5] దేవుడు (వివిధ వ్యవహారాలకు సంబంధించిన) ఆజ్ఞలు జారీ చేస్తున్నాడు. ఆయన ఆజ్ఞల్ని ఎవరూ అడ్డుకోలేరు. (కర్మలను గురించి) లెక్క తీసుకోవడం ఆయనకు ఎంతో సేపు పట్టదు. (40,41)

వారికి పూర్వం ఉండిన (తలబిరుసు) మనుషులు కూడా అనేక పన్నాగాలు పన్నారు. కాని తిరుగులేని పన్నాగం దేవుని చేతిలోనే ఉంది. ఎవరెలాంటి పనులు చేస్తున్నారో ఆయన గమనిస్తూనే ఉన్నాడు. పరలోక (స్వర్గ) సదనం ఎవరి అదృష్టంలో ఉందో త్వరలోనే సత్య తిరస్కారులు తెలుసుకుంటారు. నీవు దేవుని చేత పంపబడిన ప్రవక్త కాదని అంటున్నారు ఈ తిరస్కారులు. వారికిలా చెప్పు: "నాకూ, మీకూ మధ్య దేవుడే సాక్షి. ఆ తరువాత దివ్య గ్రంథజ్ఞానం కలిగిన ప్రతివ్యక్తీ దీనికి సాక్షిగా ఉన్నాడు." (42,43) ✪

---

4. ఇక్కడ మూలభాషలోని "ఉమ్ముల్‌కితాబ్" అంటే మాతృగ్రంథమని అర్థం. ఖుర్ఆన్‌తో పాటు గతంలో వచ్చిన తౌరాత్, జబ్బూర్, ఇన్జీల్; అంతకు పూర్వపు గ్రంథాలన్నీ ఈ మాతృగ్రంథం నుంచే వెలువడ్డాయి. అయితే గతంలో వచ్చిన గ్రంథాలన్నీ మార్పులకు గురైపోవడంతో దేవుడు తన అంతిమ ప్రవక్త ముహమ్మద్ (స) ద్వారా ఖుర్ఆన్ని అవతరింపజేశాడు. ఇదే ఇపుడు ప్రళయం వరకు మానవాళికి మార్గదర్శనం చేయగల ఏకైక దైవగ్రంథం.

5. అంటే అరేబియాలో ఒకవైపు ఇస్లాం అతివేగంగా వ్యాపిస్తూ ముస్లింల సంఖ్య నానాటికి అధికమవుతుంటే, మరోవైపు బహుదైవారాధకుల సంఖ్య క్రమంగా తగ్గిపోతోందని అర్థం. ✪

అవతరణ: మక్కా

# 14. ఇబ్రాహీం

సూక్తులు: 52

ఈ అధ్యాయంలో ఇబ్రాహీం ప్రవక్త (అలైహి) వృత్తాంతాన్ని నామమాత్రంగా ప్రస్తావించి సత్యతిరస్కారులకు ఎదురయ్యే దుష్పరిణామాలను గురించి హెచ్చరించడం జరిగింది. అయినా అవిశ్వాసులు తమ ఆగడాలు మానుకోవడానికి బదులు మరింత పెట్రేగిపోయారు.

**కరుణామయుడు, కృపాసాగరుడయిన దేవుని పేరుతో ప్రారంభం**

అలిఫ్-లామ్-రా. ముహమ్మద్ (సల్లం)! ఇది మేము నీ (హృదయ ఫలకం)పై అవతరింపజేసినన దివ్యగ్రంథం. ప్రజల్ని నీవు చీకటి నుండి వెలుగులోకి తీసుకురావడానికే దీన్ని అవతరింప జేశాము.[1] అంటే వారి ప్రభువు ఆజ్ఞతో సర్వశక్తిమంతుడు, సకల ప్రశంసలకు అర్హుడైన దేవుని మార్గంలోకి అన్నమాట.

---

1. ఖుర్ఆన్ వివిధ జీవన రంగాలలో ఆవరించిన అజ్ఞానాంధకారాన్ని తొలగించి యావత్తు మానవాళికి వెలుగుబాట చూపదలచింది. 1400 ఏండ్ల క్రితం అజ్ఞానాంధకారంలో తచ్చాడుతూ, అనేక దురాచారాలకు గురయి, అసంఖ్యాకమైన చెడుగుల్లో కూరుకుపోయిన అరబ్బులు ఖుర్ఆన్ సందేశం స్వీకరించగానే వారి జీవనసరళి పూర్తిగా మారిపోయింది. వారు ఆధ్యాత్మిక, నైతిక రంగాల్లోనే గాకుండా, సామాజిక, ఆర్థిక, రాజకీయ, సైనిక రంగాల్లో సైతం అత్యున్నత ప్రమాణాలు నెలగొల్పారు. ఆనాడు వారి జీవన సరళిని చూడగానే ప్రతివ్యక్తీ, ఖుర్ఆన్‌లో అంతటి విప్లవాత్మక శక్తి ఉందని, అలాంటి ఉన్నత సమగ్ర జీవనవిధానం ఉందని భావించేవాడు.

అయితే మానవాళికి ఖుర్ఆన్ తెచ్చిన ఈ శుభాలను మానవతా వ్యతిరేక శక్తులు ఎలా సహిస్తాయి? మహాప్రవక్త (సల్లం) ఇహలోకం వీడిన కొన్ని దశాబ్దాలకే ఈ దుష్టశక్తులు ముస్లింలను ఖుర్ఆన్ నిజధ్యేయానికి, దాని ముఖ్యబోధనలకు దూరంచేయడానికి ప్రయత్నాలు ఆరంభించాయి. ఇస్లాంలో ప్రధాన భాగమైన రాజకీయ రంగాన్ని వేరుచేయడానికి, ఖుర్ఆన్ పూజా పురస్కారాలు, కర్మకాండలకు పనికొచ్చే మతగ్రంథం తప్ప మరేమీకాదని నమ్మించడానికి అనేక కుట్రలు పన్నాయి. వాటి కుట్రల ప్రభావం క్రమేణా ముస్లింలపై కూడా పడింది. దాంతో వారు ఖుర్ఆన్ లక్ష్యానికి, దాని నిజభావాలకు దూరమైపోయారు. ఖుర్ఆన్‌ని తమకు తెలిసిన భాషలో అధ్యయనం చేసి, అది మానవాళికిచ్చే సందేశాన్ని అర్థం చేసుకోవడానికి నేటికీ ప్రయత్నించడం లేదు. ముస్లింల ఈ అజ్ఞాన వైఖరినే ఎత్తిచూపిస్తూ అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఇలా అన్నారు:

"వారు ఖుర్ఆన్‌ని అధికంగానే పఠిస్తారు. కాని అది వారి కంఠాల నుండి క్రిందికి దిగదు. నాలుక మీదనే ఉండిపోతుంది. దాని జ్ఞానం, భావం వారి హృదయాల్లో లేశమైనా ఉండదు."

ఒకప్పుడు మన దేశంలో ముస్లింలు ఖుర్ఆన్‌ని ఇతర భాషల్లో అనువదించడమే పాపంగా భావించేవారు. చివరికి ఎలాగో ఢిల్లీలో షాహ్ వలియుల్లా (రహ్మలై) ధైర్యం చేసి ఖుర్ఆన్‌ని ఫార్సీ భాషలో అనువదించారు. ఈ సంగతి తెలియగానే యాభై మంది వ్యక్తులు కర్రలు, కత్తులతో వచ్చి ఢిల్లీ జామియా మసీదు మెట్లమీద కూర్చున్నారు. అక్కడ కూర్చొని వచ్చే పోయేవారు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ "షాహ్ వలియుల్లా ఖుర్ఆన్‌ని అనువాదం చేసి దైవమర్మాలు బయటపెట్టారు. అంచేత మా మౌల్వీలు ఆయన అంతుచూడమని చెప్పారు" అని పలికేవారు.

ఇస్లాం వ్యతిరేక శక్తుల కుట్రలకు కొందరు మతవేత్తల స్వార్థం, సంకుచిత భావాలు కూడా తోడయ్యాయి. ఇతరమతాల పండితులు తమమత గ్రంథాలను సామాన్య జనానికి ఎలా దూరంగా



ఉంచారో, ముస్లింనాయకుల్లో కూడా ఒక వర్గం సామాన్య ప్రజల్ని ఖుర్ఆన్‌కు దూరంగా ఉంచుతోంది. ఖుర్ఆన్‌ని సామాన్యులు అర్థం చేసుకోలేరని, అంచేత దాని జోలికిపోకుండా తాము చెప్పిందే "ఖుర్ఆన్‌వాక్యం"గా భావించి నడుచుకోవాలని వీరు ప్రజలను శాసిస్తున్నారు. ఎవరైనా ఖుర్ఆన్ పట్ల ఆసక్తి కలిగి దాన్ని తమకు తెలిసిన భాషలో వ్యాఖ్యాన సమేతంగా అధ్యయనం చేయడానికి ప్రయత్నిస్తే ఆ ప్రయత్నాన్ని వీరు నిరోధించడానికి కూడా వెనకాడటం లేదు.

తత్ఫలితంగా అనేకమంది ముస్లింలు ఖుర్ఆన్ అధ్యయనం చేయడం మానేసి ఈ 'పెద్ద మనుషులు' చెప్పిన ప్రకారం తమ ధార్మికతను నమాజ్, రోజా, హజ్, ధ్యానం లాంటి కొన్ని ఆరాధనలకు పరిమితం చేసుకున్నారు. పండితులు, ధర్మవేత్తలు తప్ప ఇతరులు ఖుర్ఆన్‌ని నిజంగా అర్థం చేసుకోలేరన్న అపోహ ప్రజల్లో బలంగా నాటుకుపోయింది.

ఈ అపోహ వల్ల ఖుర్ఆన్‌తో ముస్లింల సంబంధం నామమాత్రంగా ఉండిపోయింది. తీరిక దొరికినప్పుడు అర్థం చేసుకోకుండా దాని అరబ్బీమూలాన్ని చిలక పలుకుల్లా పారాయణం చేయడం, అత్తరు పన్నీరు పూసి కళ్ళకు అద్దుకోవడం, ప్రమాణం చేయవలసి వచ్చినప్పుడు దాన్ని తీసుకొని తల మీద పెట్టుకోవడం, కంఠస్తం చేసి మసీదుల్లో ఇమామత్ లేక ఉపాధ్యాయ వృత్తి చేపట్టడం వరకే వారి సంబంధం పరిమితమయి పోయింది. 1869లో బ్రిటిష్ ప్రభుత్వం భారత దేశంలోని ముస్లింల పరిస్థితి ఎలా ఉందో, ప్రత్యేకంగా ఆంగ్లేయులకు వ్యతిరేకంగా వారి మనస్తత్వం ఏమిటో తెలుసుకొని రమ్మని ఒక కమీషన్‌ని పంపింది. ఈ కమీషన్ మన దేశంలో ఓ ఏడాది పాటుండి ముస్లింల మనోభావాలు, వారి మతవిశ్వాసాలు, రాజకీయ, సాంస్కృతిక స్థితిగతులన్నీ పరిశీలించి తిరిగొచ్చింది. రాగానే 1870లో లండన్‌లో ఓ చారిత్రక సమావేశం జరిగింది. ఆ సమావేశంలో కమీషన్ సభ్యులతో పాటు భారతదేశంలో పనిచేసిన క్రైస్తవ మిషనరీ ఫాదరీలు కూడా కొందరున్నారు. ఆ సందర్భంలో కమీషన్ అధ్యక్షుడు సర్ విలియం హైండ్ సమర్పించిన నివేదిక చూడండి:

"ముస్లింల మతవిశ్వాసం ప్రకారం వారు ఏ పరదేశ ప్రభుత్వ పంచనా ఉండలేరు. పరదేశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడటం వారికి చాల అవసరం. ఈ ఆలోచనే వారి హృదయాల్లో ఓ నూతన ఉత్సాహాన్ని, ఉద్రేకాన్ని జనింపజేస్తుంది. వారా పోరాటానికి అనుక్షణం సిద్ధంగా ఉంటారు. ఈస్థితి వారిని పరదేశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏ సమయంలోనైనా ఉద్రేక పరచగల్గుతుంది."

క్రైస్తవ మిషనరీ ఫాదరీల నివేదికను కూడా చూడండి:

"ఇక్కడి ప్రజల్లో ఒక వర్గం వైరాగ్యభావాలు, పీరీ-మురీది (మతగురు పీఠం) తత్వం గల ముస్లింలు కూడా ఉన్నారు. కనుక ఇప్పుడు మనం తాను దైవప్రవక్తనని ప్రకటించుకోగల ఓ ద్రోహిని అన్వేషించగలిగితే అమితమైన ఉత్సాహంతో వేలాదిమంది ప్రజలు అతని నకిలీ దైవదౌత్య పరిధిలోకి వస్తారు. ముస్లింలలో అలాంటి వ్యక్తిని తయారుచేయడం చాలా కష్టం. కష్టతరమైన ఈ పనిని సాధించగలిగితే ఆ వ్యక్తిని ప్రభుత్వం తరఫున ఆశ్రయం, అండదండలు ఇచ్చి మన పనిని సులువుగా నెరవేర్చుకోవచ్చు...."

(వైట్‌హౌస్ కాన్ఫరెన్స్ రిపోర్ట్- "ది ఎరైవల్ ఆఫ్ బ్రిటిష్ ఎంపైర్ ఆఫ్ ఇండియా")

ఆ రోజుల్లోనే బ్రిటిష్ పార్లమెంటులో హౌస్ ఆఫ్ కామన్స్ అధ్యక్షుడు గామెండ్ ఐసన్ చేతిలో ఖుర్ఆన్ ప్రతి పట్టుకొని "ముస్లింల మధ్య ఈ పుస్తకం ఉన్నంతవరకూ మనం ప్రశాంతంగా పరిపాలన చేయలేం" అని చెబుతూ ఆ దైవగ్రంథాన్ని విసిరి నేలకేసి కొట్టాడు.

ఇలా ఆంగ్లేయుల దుష్టనీతి కారణంగా ముస్లింలు ఖుర్ఆన్ ఇచ్చే నిజమయిన శిక్షణకు దూరమయి పోయారు. సమాజ సంస్కరణకు ఉపకరించని కొన్ని వ్యక్తిగత మతాచారాలు పట్టుకొని,

భూమ్యాకాశాలలోని అణువణువూ ఆయనకు చెందినదే. పరలోక జీవితానికి బదులు ప్రాపంచిక జీవితానికి ప్రాధాన్యమిచ్చే సత్యతిరస్కారుల కోసం సర్వనాశనంచేసే కఠిన శిక్ష కాచుకొని ఉంది. వారు ప్రజలను దైవమార్గంలోకి రాకుండా నిరోధిస్తున్నారు. వారు దైవమార్గాన్ని (తమ మనోవాంఛలకు అనుగుణంగా) వక్రీకరింప గోరుతున్నారు. వారసలు మార్గభ్రష్టత్వంలో చాలా దూరం కొట్టుకుపోయారు. (1-3)

మేము పంపిన ప్రతి ప్రవక్త విషయం విడమరచి చెప్పడానికి వీలుగా తన జాతి ప్రజలు మాట్లాడే భాషలోనే మా సందేశం (ప్రజలకు) అందజేశాడు. ఆ తర్వాత దేవుడు తాను తలచిన విధంగా కొందరికి దారి చూపాడు: మరికొందరిని దారి తప్పించాడు. ఆయన సర్వాధికారి, ఎంతో వివేచనాపరుడు. (4)

మేము ఇంతకుపూర్వం మా నిదర్శనాలిచ్చి మూసాను కూడా పంపాము. ప్రజల్ని చీకటినుండి వెలుగులోకి తీసుకురావాలని, వారికి దైవచరిత్రకు సంబంధించిన సంఘటనలు విన్పిస్తూ హితోపదేశం చేయాలని మేము అతడ్ని కూడా ఆదేశించాం. ఈ సంఘటనల్లో సహనం వహించి కృతజ్ఞత చూపేవారికి గొప్ప నిదర్శనాలున్నాయి. (5)

మూసా వృత్తాంతం కాస్త గుర్తుకు తెచ్చుకో. అప్పుడతను తన జాతి ప్రజలతో ఇలా అన్నాడు: "మీకు దేవుడు చేసిన ఉపకారాలు జ్ఞాపకం తెచ్చుకోండి. మీకు తీవ్ర యాతనలు పెడ్తుండిన ఫిరౌనీయుల బారి నుండి ఆయన మిమ్మల్ని కాపాడాడు. వారు మీ కొడుకుల్ని హతమార్చుతుండేవారు. మీ కూతుళ్ళను మాత్రమే సజీవంగా ఉండనిచ్చేవారు. అది మీకు మీ ప్రభువు తరఫున కఠిన పరీక్షా కాలం. మరొక విషయం కూడా జ్ఞాపకం తెచ్చుకోండి. కృతజ్ఞులయి ఉంటే మీకు మరిన్ని వరాలు అనుగ్రహిస్తానని, కృతఘ్నులయిపోతే తన శిక్ష అత్యంత కఠినంగా ఉంటుందని మీ ప్రభువు మిమ్మల్ని హెచ్చరించాడు. (6,7)

"మీరు సత్యాన్ని తిరస్కరిస్తే, (మీరే కాదు) ప్రపంచంలోని యావత్తు మానవులు సత్యతిరస్కారులైపోయినా సరే (దానివల్ల దేవుని దైవత్వానికి వాటిల్లే నష్టమేమీ లేదు). ఆయన నిరపేక్షాపరుడు,[2] స్వతహాగానే ఎంతో ప్రశంసనీయుడు." (8)

---

అదే అసలైన ఖుర్ఆన్ శిక్షణ అని భావిస్తున్నారు. ఇలాంటి ముస్లింలనే దృష్టిలో పెట్టుకొని ఓసారి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ "ముస్లింలు తమ ఖురాన్‌ని గురించి మహాగొప్పలు చెప్పుకుంటారు. కాని వారి దగ్గర ఓ ప్రత్యేక వేషధారణ, జపమాల, ఉజూచెంబు తప్ప మరేదైనా ఉందా?" అని ఎత్తిపొడిస్తే ఈ మత పండితులు చేతకాని రోషంతో కుతకుత లాడిపోయారు.

20వ శతాబ్దం మూడో దశకం నుండి పరిస్థితి క్రమంగా మారసాగింది. ప్రఖ్యాత తత్వవేత్త మౌలానా అబుల్ఆలా మౌదూదీ (రహ్మాలై) తెచ్చిన విప్లవం భారతఉపఖండంలోని మేధావుల భావ జగత్తునే మార్చివేసింది. ఆ మహనీయుడు రాసిన అద్భుత ఖుర్ఆన్‌వ్యాఖ్యానం, ఆయన సృజించిన విప్లవాత్మక సాహిత్యం కారణంగా ఇస్లాం సార్వకాలిక సమగ్ర జీవనవ్యవస్థ అన్న వాస్తవం ప్రజలకు తెలిసిపోయింది. ఖుర్ఆన్ వాస్తవికత ప్రాంతీయభాషల్లో కూడా వెలువడ నారంభించింది.

2. వివరాలకు 27:40 సూక్తి, దాని పాదసూచిక చూడండి.



గత జాతుల వృత్తాంతం మీకు చేరలేదా? నూహ్‌జాతి, ఆద్‌జాతి, సమూద్ జాతి, ఆ తర్వాత కూడా అనేక జాతులు వచ్చాయి. వాటి సంఖ్య దేవునికి మాత్రమే తెలుసు. వారి ప్రవక్తలు స్పష్టమైన నిదర్శనాలు తెచ్చినప్పుడు వారు తమ చేతివ్రేళ్ళు చెవుల్లో దూర్చుకుంటూ "నీవు తెచ్చిన సందేశాన్ని మేము ససేమిరా అంగీకరించము. నీవు ప్రచారం చేస్తున్న ధర్మం గురించి మేము తీవ్రమయిన సందిగ్ధం, సంశయాలలో పడిపోయాం" అని అన్నారు. (9)

"ఏమిటీ, మీరు భూమ్యాకాశాల్ని సృష్టించిన దేవుడ్ని గురించి సందేహిస్తున్నారా?[3] ఆయన మీ పొరపాట్లు క్షమించి, ఒక నిర్ణీతకాలం వరకు మీకు అవకాశం ఇవ్వడానికే మిమ్మల్ని తన (ధర్మం) వైపు పిలుస్తున్నాడు" అన్నారు దైవప్రవక్తలు.

"మీరు మాలాంటి మనుషులే. అంతకుమించి మరేమీ కాదు. మా తాతముత్తాతల కాలంనుంచీ వస్తున్న ఈదైవాలను ఆరాధించవద్దని మమ్మల్ని వారిస్తున్నారా? సరే (మీరు నిజంగా దైవప్రవక్తలైతే) ఏదైనా నిదర్శనం తీసుకురండి" అన్నారు ఆ ప్రజలు. (10)

"నిజమే, మేము మీలాంటి మనుషులమే గాని, మరేమీ కాము. అయితే దేవుడు తన దాసులలో తాను కోరుకున్న వారిని అనుగ్రహిస్తాడు. నిదర్శనాలు (మహిమలు) తెచ్చే శక్తి మాకు లేదు. దేవుని అనుమతి అయితేనే అవి వస్తాయి. విశ్వసించినవారు దేవుడ్నే నమ్ముకోవాలి. ఆ దేవుడే కదా మాకు జీవితపరమార్థం తెలిపి, మేము నడవాల్సిన (రుజు)మార్గం ఏమిటో చూపింది! అలాంటప్పుడు ఆయన్ని మేము ఎందుకు నమ్ముకొని ఉండము? మీ వేధింపుల పట్ల మేము సహనం వహిస్తాము. నమ్ముకోవాల్సినవారు దేవుడ్ని మాత్రమే నమ్ముకోవాలి" అన్నారు దైవప్రవక్తలు. (11,12)

చివరికి అవిశ్వాసులు తమ ప్రవక్తలను బెదిరిస్తూ "(మర్యాదగా) మీరు మామతం లోకి తిరిగి వచ్చేయండి. లేదంటారా, మిమ్మల్ని దేశం నుండే వెళ్ళగొడ్తాం" అన్నారు.

అప్పుడు వారి ప్రభువు దివ్యావిష్కృతి ద్వారా వారి దగ్గరకు ఈ విధంగా సందేశం పంపాడు: "ఆ దుర్మార్గుల్ని మేము నాశనం చేయబోతున్నాం. వారి (పతనం) తరువాత ధరణిలో మిమ్మల్ని, (మీ అనుచరుల్ని) వశింపజేస్తాం. నా సన్నిధిలో సమాధానం చెప్పుకోవలసి ఉందన్న బాధ్యతా భావంతో భయపడుతూ, నా హెచ్చరిక పట్ల అప్రమత్తులయి మసలుకునేవారికి ఈ బహుమానం లభిస్తుంది." (13,14)

---

3. ప్రతి యుగంలోనూ బహుదైవారాధకులు దేవుడు ఒక్కడేనని ఒప్పుకుంటారు. ఆయన భూమ్యాకాశాల సృష్టికర్త అని కూడా అంగీకరిస్తారు. దైవప్రవక్తలు ఈ విషయాన్నే ఆధారంగా తీసుకొని "ఇక మీరు ఏ విషయం గురించి సందిగ్ధంలో పడిపోయారు?" అని అడిగేవారు. కాని ఆచరణలో మాత్రం ఈ బహుదైవారాధకులు భూమ్యాకాశాల సృష్టికర్తయిన ఆ ఏకైక దేవుడ్ని మాత్రమే ఆరాధించ డానికి బదులు ఆయన శక్తి సూచనలయిన ప్రకృతి శక్తుల్ని, విగ్రహాలను, తోటి మానవులను పూజిస్తుంటారు. దైవప్రవక్తలు ఎల్లప్పుడూ సృష్టికర్తను మాత్రమే ఆరాధించాలని బోధిస్తుంటే వీరు మాత్రం సృష్టిపూజ వైపు పరుగెత్తుతారు.

ఆ ప్రవక్తలు విజయం అర్థించారు. (అది ఈవిధంగా లభించింది.) తలబిరుసుతో హూంకరించిన ప్రతి తిరస్కారీ సర్వనాశనమయ్యాడు. ఆ తర్వాత అతనికోసం నరకం కాచుకొని ఉంటుంది. అతనికి అక్కడ త్రాగడానికి చీము, నెత్తురు కలిసిన (పరమ జుగుప్సాకరమైన) నీరు ఇవ్వబడుతుంది. దాన్ని అతడు బలవంతంగా గొంతులోకి దించడానికి ప్రయత్నిస్తాడు. (కాని అది ఓ పట్టాన అతని గొంతులోకి దిగదు.) చివరికి ఎలాగో అతికష్టం మీద దించుతాడు. నలువైపుల నుండి మృత్యువు అతడ్ని చుట్టు ముడ్తుంది. కాని అతను చావడు. దానికి ముందు అతడ్ని చంపుకుతినే మరో ఘోర యాతన పొంచి ఉంటుంది. (15-17)

దేవుని పట్ల సత్యతిరస్కార వైఖరి అవలంబించినవారి ఆచరణ, పెనుతుఫానుకు త్రుటిలో ఎగిరిపోయే బూడిద కుప్ప లాంటిది. వారు తమ కర్మలకు ఎలాంటి ప్రతిఫలం పొందలేరు. అదే అన్నిటికంటే ఘోరమైన వైఫల్యం. (18)

దేవుడు భూమ్యాకాశాలను ఎలా నియమబద్ధంగా నెలకొల్పాడో మీరు గమనించ లేదా? ఆయన తలచుకుంటే మిమ్మల్ని తుడిచిపెట్టి మీస్థానంలో మరో కొత్త సృష్టి తీసుకు రాగలడు. అలా చేయడం ఆయనకు ఏమాత్రం కష్టం కాదు. (19,20)

వారంతా (ప్రళయ దినాన) దేవుని ముందు (దోషులుగా) నిలబడతారు. అప్పుడు వారిలో (శక్తిసామర్థ్యాలు, ప్రేరుప్రతిష్ఠలు అంతగా లేని) బలహీనులు తమపై పెత్తందారులయి కూర్చున్న నాయకులతో "ప్రపంచంలో మేము మీకు విధేయులయి మీ వెనుక నడిచాం కదా; ఇప్పుడు మమ్మల్ని దైవశిక్ష నుండి కాపాడేందుకు ఏమైనా చేయగలరా?" అని అడుగుతారు.

దానికి వారు సమాధానమిస్తూ "దేవుడు గనక మా విముక్తి కోసం ఏదయినా దారి చూపిస్తే మీక్కూడా (ఆ దారి) తప్పకుండా చూపిస్తాము. కాని ఇప్పుడు మనం ఎంత ఏడ్చి మొత్తుకున్నా, ఓర్పు వహించినా ప్రయోజనం లేదు. మనమిక (ఈ నరకకూపం నుంచి) బయటపడే ప్రసక్తే లేదు" అని అంటారు. (21)

తీర్పు ముగిసిన తరువాత షైతాన్ వారితో ఇలా అంటాడు:

"మీకు దేవుడు చేసిన వాగ్దానాలన్నీ నిజమయ్యాయి. కాని నేను చేసిన వాగ్దానా లలో ఒక్కటీ నిజం కాలేదు. అసలు మీచేత బలవంతంగా ఏదైనా చేయించడానికి మీమీద నాకేదయినా శక్తి ఉంటేకదా! నేను మిమ్మల్ని నామార్గం వైపు పిలిచాను. అంతే, మరేమీ చేయలేదు. మీరే నా పిలుపునకు స్పందించి వచ్చారు. కనుక మీరిప్పుడు అనవసరంగా నన్ను నిందించకండి. మిమ్మల్ని మీరే నిందించుకోండి. ఇక్కడ మీ గోడు నేను ఆలకించలేను; నా గోడు మీరు ఆలకించలేరు. ఇంతకుముందు (ఇహలోకంలో) మీరు నన్ను దేవునికి సాటికల్పించారు. (నాక్కూడా దైవత్వం ఆపాదించారు. అది మీపనే గాని, నాపని ఎంతమాత్రం కాదు.) నేను దీన్ని ఖండిస్తున్నాను. అలాంటి దుర్మార్గులకు తప్పకుండా ఘోరమైన శిక్ష పడుతుంది." (22)



పోతే సత్యాన్ని విశ్వసించి, (తదనుగుణంగా) సత్కార్యాలు చేసి ఉన్నవారు సెలయేరులు ప్రవహించే స్వర్గవనాలకు పంపబడతారు. దేవుని అనుమతితో వారక్కడ కలకాలం (సుఖసంతోషాలతో) ఉంటారు. వారికక్కడ శాంతి శుభాల దీవెనలతో ఘనమైన స్వాగతం లభిస్తుంది. (23)

దేవుడు శిష్టవచనాన్ని ఏ వస్తువుతో పోల్చాడో మీరు గమనించారా? ఒక మేలు జాతి వృక్షం ఉంది. దాని వేళ్ళు నేలలో బాగా లోతుకు దృఢంగా పాతుకుపోయాయి. దాని శాఖలు ఆకాశం దాకా విస్తరించి ఉన్నాయి. అనుక్షణం అది తన ప్రభువాజ్ఞతో సుమధుర ఫలాలు అందజేస్తోంది. ప్రజలు గుణపాఠం నేర్చుకోవడానికే దేవుడు ఇలాంటి ఉదాహరణలు ఇస్తున్నాడు. (24,25)

దీనికి భిన్నంగా దుష్టవచనాన్ని నేల ఉపరితలం నుండి పెరికివేసే నాసిరకం చెట్టుతో పోల్చవచ్చు. దానికి ఎలాంటి స్థిరత్వమూ, దృఢత్వమూ ఉండవు. (26)

దేవుడు విశ్వాసులకు ఓ దృఢవచనం ప్రాతిపదికపై ఇటు ఇహలోకంలోనూ, అటు పరలోకంలోనూ స్థిరత్వం ప్రసాదిస్తాడు. దుర్మార్గుల్ని ఆయన మార్గభ్రష్టత్వంలో పడ వేస్తాడు. దేవునికి తాను తలచిన ప్రతిపనీ చేయగల శక్తిసామర్థ్యాలు ఉన్నాయి. (27)

దేవుని అనుగ్రహాలు పొంది కూడా కృతఘ్నులై పోయినవారిని మీరు చూడలేదా? వారు తమతోపాటు తమ జాతిప్రజలను కూడా వినాశాగాధంలోకి నెట్టివేశారు. అంటే నరకంలోకి. వారు నరకంలో ప్రవేశిస్తారు. అది పరమనీచమైన నివాసస్థలం. ప్రజలను దైవమార్గం నుండి తప్పించడానికి వారు కొన్ని మిధ్యాదైవాలను దేవునికి సాటి కల్పించారు. వారికిలా చెప్పెయ్యి: "సరే, కొన్నాళ్ళపాటు భోగభాగ్యాలు అనుభవించండి. చివరికి మీరు నరకానికే పోవలసి ఉంటుంది." (28-30)

ప్రవక్తా! విశ్వసించిన నా దాసులకు ఎలాంటి క్రయవిక్రయాలు, స్నేహసహకారాలు జరగని రోజు రాకముందే ప్రార్థనా వ్యవస్థ నెలకొల్పాలని, మేము ప్రసాదించిన సంపద నుండి రహస్యంగానూ, బహిరంగంగానూ దానధర్మాలు చేయాలని చెప్పు. (31)

దేవుడే భూమ్యాకాశాలను సృష్టించాడు. ఆయనే ఆకాశం నుండి వర్షం కురిపించి మీ ఉపాధి కోసం వివిధ రకాల పండ్లు (పంటలు) పండిస్తున్నాడు. ఆయనే సముద్ర యానం కోసం మీకు ఓడలు అధీనం చేసినవాడు. ఆయన ఆదేశంతోనే అవి సముద్రం లో సవ్యంగా సాగిపోతున్నాయి. నదుల్ని కూడా ఆయనే మీ కోసం అదుపులో ఉంచాడు. ఆయనే సూర్యచంద్రుల్ని మీకోసం ఒక నియమావళికి కట్టుబడి నిరంతరాయంగా సాగిపోయేలా చేశాడు. మీకోసం రాత్రిని, పగటిని సృష్టించినవాడు కూడా ఆయనే. ఇలా మీరు కోరినదంతా ఆయన మీకు ప్రసాదించాడు. అనంతమైన దైవానుగ్రహాలను మీరు లెక్కించాలనుకున్నా లెక్కించలేరు. అయితే (ఇన్ని అనుగ్రహాలు పొందినప్పటికీ) మానవుడు చాలా కృతఘ్నుడుగా, అన్యాయపరుడుగా తయారయ్యాడు. (32-34)

ఇబ్రాహీం ఇలా వేడుకున్నాడు: "ప్రభూ! ఈ (మక్కా) నగరాన్ని శాంతి నగరంగా చెయ్యి. నన్ను, నాసంతానాన్ని విగ్రహారాధనా బారినుండి కాపాడు. ప్రభూ! ఈ విగ్రహాలు

అనేకమందిని దారి తప్పించాయి. (నా సంతానాన్ని కూడా దారితప్పించే ప్రమాదం ఉంది. కనుక) నా విధానాన్ని అనుసరించేవారు నా వారవుతారు. నా విధానానికి వ్యతిరేకంగా నడిచేవారికి (నీవే దిక్కు.) నీవు క్షమించేవాడవు, కరుణించే వాడవు. (35,36)

ప్రభూ! నేను నా సంతానాన్ని ఎలాంటి చెట్టూ, పుట్టా లేని ఎడారి ప్రాంతంలో నీ ప్రతి ష్ఠాలయం దగ్గరకు తీసుకొచ్చి వశింపజేశాను. వీరు (భవిష్యత్తులో) ఇక్కడ ప్రార్థనా వ్యవస్థ నెలకొల్పుతారన్న ఆశతో నేనిలా చేశాను. కనుక వీరి పట్ల నీవు ప్రజల హృదయాల్లో ఆసక్తి అభిమానాలు కలిగించు. వీరికి తినడానికి పండ్లు ఫలాలు ప్రసాదించు, బహుశా అందుకు కృతజ్ఞులై ఉంటారు. ప్రభూ! మేము దాస్తున్నదీ, బహిర్గతం చేస్తున్నదీ అంతా నీకు తెలుసు." నిస్సందేహంగా దేవునికి భూమ్యాకాశాల్లో ఏదీ కనుమరుగుగా లేదు." (37,38)

"ఈ వృద్ధాప్యంలో నాకు ఇస్మాయీల్, ఇస్‌హాఖ్‌ల వంటి సంతానం ప్రసాదించిన దేవునికి కృతజ్ఞతలు. నాప్రభువు తప్పకుండా (నా)మొరాలకిస్తాడు. ప్రభూ! నన్ను ప్రార్థనా వ్యవస్థ నెలకొల్పేవానిగా చెయ్యి. నాసంతానాన్ని కూడా. ప్రభూ! నావిజ్ఞప్తి స్వీకరించు. నా తల్లిదండ్రుల్ని, యావత్తు విశ్వాసుల్ని కర్మవిచారణ రోజు క్షమించు." (39-41)

ఈ దుర్మార్గులు చేస్తున్న పనుల పట్ల దేవుడు అజాగ్రత్తగా ఉన్నాడని భావించకు. కాకపోతే వారిని ఆయన ఒక నిర్ణీత దినం వరకు ఉపేక్షిస్తున్నాడు. ఆ రోజు (ప్రళయ బీభత్సంతో) ప్రజలు కళ్ళు తేలవేసి, తల పైకెత్తి పరుగిడుతుంటారు. పై చూపులు పైనే ఉండిపోతాయి. గుండెలు దడదడలాడి పోతుంటాయి. (42,43)

ప్రవక్తా! ఆ దినం గురించి జనాన్ని భయపెట్టు. అప్పుడు దుర్మార్గులు (ప్రాపంచిక మత్తు వదలిపోయి) "ప్రభూ! మాకు మరో అవకాశం ఇవ్వు. మేము నీ పిలుపునకు (వెంటనే) స్పందించి, నీ ప్రవక్తల అడుగుజాడల్లో నడుస్తాం" అని మొరపెట్టుకుంటారు. (దానికిలా సమాధానం వస్తుంది:) "దీనికి పూర్వం మీరు ప్రమాణాలు చేసిమరీ మీ కసలు వినాశకాలమే రాదని చెబుతుండేవారు కదూ? నిజానికి మీరు (ఆనాడు) ఆత్మ వినాశానికి పాల్పడినవారి నివాసప్రాంతాల్లోనే జీవితం గడిపారు. మేము వారిపట్ల ఎలా వ్యవహరించామో చూశారు. వారిగాథలు ఉదాహరిస్తూ మీకు హితోపదేశం కూడా చేశాం. (అయినా మీకు బుద్ధి రాలేదు.) ఇప్పుడు సమయం మించిపోయింది." (44,45)

వారు తమ పన్నాగాలన్నీ పన్ని చూసుకున్నారు. పర్వతాలు సైతం కంపించే అంతటి భయంకరమైన పన్నాగాలు పన్నినా వాటన్నిటికీ విరుగుడు దేవుని దగ్గర ఉంది.

కనుక ప్రవక్తా! దేవుడు తన ప్రవక్తలకు చేసిన వాగ్దానాలకు వ్యతిరేకంగా చేస్తాడని నీవు ఎన్నటికీ భావించకు. దేవుడు సర్వశక్తిమంతుడు; ప్రతీకారం చేసేవాడు కూడా. భూమ్యా కాశాల స్వరూపస్వభావాలు మారిపోయే (ప్రళయ)దినం గురించి వారిని భయపెట్టు. ఆరోజు యావన్మందినీ (ప్రళయ) రౌద్రుడైన ఏకేశ్వరుని ముందు ప్రవేశపెడ్తారు. ఆరోజు నేరస్థుల పరిస్థితి ఎలా ఉంటుందో నీవు చూస్తావు. వారి కాళ్ళు,



చేతులు సంకెళ్ళతో బిగించి కట్టి వేయబడి ఉంటాయి. గంధకపు వస్త్రాలు ధరించి ఉంటారు. వారి ముఖాలపై అగ్ని జ్వాలలు ఆవరిస్తుంటాయి. ప్రతి మనిషికీ అతను చేసిన కర్మలకు ప్రతిఫలం ఇవ్వడానికే ఇలా సంభవిస్తుంది. కర్మవిచారణ జరపడానికి దేవునికి ఎంతోసేపు పట్టదు. (46-51)

ఇది యావత్తు మానవుల కోసం వచ్చిన విశ్వజనీన సందేశం. (పరలోక) పరిణామా లను గురించి ప్రజలను హెచ్చరించడానికి, వారు దేవుడు ఒక్కడేనని తెలుసుకోవడా నికి, బుద్ధిజ్ఞానం కలవారు స్పృహలోకి రావడానికి ఈసందేశం పంపబడింది. (52) ✪

## అవతరణ: మక్కా 15. హిజ్ర్‌వాసులు (హిజ్ర్) సూక్తులు:99

అరేబియాలో పూర్వం హిజ్ర్ అనే పట్టణం ఉండేది. ఆ పట్టణవాసుల్ని సంస్క రించడానికి ఒక దైవప్రవక్త వస్తే వారాయన్ని తిరస్కరించి, దైవశిక్షకు గురయ్యారు. ఈ అధ్యాయంలో వీరి సంక్షిప్త చరిత్రతో పాటు ఆదిమానవుడు ఆదం, ఇబ్రాహీం (అలైహి)ల గాథలు కూడా పేర్కొంటూ మక్కా బహుదైవారాధకుల్ని రుజుమార్గంలోకి తీసుకురావడా నికి ప్రయత్నం జరిగింది.

**కరుణామయుడు, కృపాసాగరుడయిన దేవుని పేరుతో ప్రారంభం**

అలిఫ్-లామ్-రా. ఇవి దైవగ్రంథమైన విస్పష్ట ఖుర్‌ఆన్‌కు సంబంధించిన సూక్తులు. (1)

ఈరోజు (సత్యాన్ని) నిరాకరించినవారే రేపు తీవ్రపశ్చాత్తాపంతో "అయ్యయ్యో! మనం విధేయులైపోతే ఎంత బాగుండేది!!"అని వాపోతారు. వారిని వదిలెయ్యి. మస్తుగా తింటూత్రాగుతూ భోగభాగ్యాలు అనుభవించనీ. లేనిపోని ఆశలు వారిని ఏమరుపాటు లో పడవేశాయి. త్వరలోనే వారికి తెలుస్తుంది (దీని పర్యవసానం ఏమిటో). (2,3)

ఇంతకు పూర్వం మేము ఏ పట్నాన్ని నాశనం చేసినా ఆ పట్నం ప్రజల కోసం ఓప్రత్యేక ఆచరణ వ్యవధి రాసి ఉంచాం. అందువల్ల ఏ జాతి కూడా తనకు నిర్ణయించ బడిన గడువుకు ముందుగాని, వెనకగాని నాశనం కాజాలదు. (4,5)

వారు (మా ప్రవక్తతో) "ఖుర్‌ఆన్ అవతరించబడినవాడా! నీవు నిజంగా పిచ్చి వాడవు. నీవు సత్యవంతుడవయితే మా దగ్గరికి దైవదూతల్ని ఎందుకు తీసుకురావు?" అని అంటారు. కాని మేము దైవదూతల్ని ఇట్టే దించము. వారు దిగితే దైవాజ్ఞ తీసుకొని దిగుతారు. ఆతర్వాత ప్రజలకు ఏమాత్రం వ్యవధినివ్వడం జరగదు. ఖుర్‌ఆన్ విషయానికి వస్తే, దాన్ని మేమే అవతరింపజేశాం. దాన్ని పరిరక్షించేవాళ్ళము కూడా మేమే. (6-9)

ముహమ్మద్ (స)! నీకుపూర్వం కూడా మేము అనేకజాతులలో ప్రవక్తల్ని ప్రభవింప జేశాం. అయితే ఏజాతి దగ్గరకు ఏప్రవక్త వచ్చినా ఆజాతి ప్రజలు ఆప్రవక్తను హేళన చేయకుండా ఉండటమన్నది ఎన్నడూ జరగలేదు. అలాగే మేమీ హితబోధను నేరస్థుల గుండెల్లోకి (గునపంలా) దించుతాం. దాంతో వారు (రెచ్చిపోయి) దాన్నిక విశ్వసించరు. పూర్వం నుండీ ఇలాంటి ప్రవృత్తికలవారి వైఖరి ఇలాగే సాగుతూవస్తోంది. (10-13)

వారికోసం ఆకాశంలో ఏదైనా ద్వారం తెరచిపెట్టి, వారక్కడికి పట్టపగలు ఎక్కి చూసినా "మా కళ్ళకు ఏదోఅయింది, మాకెవరో చేతబడిచేశారు"అనే అంటారు. (14,15)

విశ్వాంతరాళంలో పటిష్ఠమైన కోటలు నిర్మించినది మేమే. చూపరుల కోసం మేము వాటిని అందంగా రూపొందించాం. శాపగ్రస్తుడైన ప్రతిషైతాన్ బారినుండి వాటిని సురక్షితంగా ఉంచాం. ఇక ఏషైతాన్ వాటి దరిదాపులకు పోలేడు. కాకపోతే చాటు మాటుగా ఒకటి, రెండు విషయాలు వినడానికి ప్రయత్నిస్తాడు. అయితే అలా వినడానికి ప్రయత్నించినప్పుడల్లా ఒక అగ్నిజ్వాల వాడ్ని వెంటాడి తరిమేస్తుంది. (16-18)

మేము భూమిని పరచి దానిమీద పర్వతాలు పాతాము. ప్రతి వృక్షజాతిని ఒక నిర్ణీత పరిమాణంలో సృజించాము. మీకోసం, మీరు పోషించని జీవరాసులకోసం అందులో ఉపాధి ఒనరుల్ని కూడా సమకూర్చాం. మా దగ్గర లేని వస్తువేదీ లేదు. సమస్త వస్తుసంపదలు ఉన్నాయి. మేము ఏ వస్తువుని దించినా ఒక నిర్ణీత పరిమాణంలో దించుతాం. మేము ప్రయోజనకరమైన గాలులు పంపుతున్నాము. ఆపై మీరు త్రాగడానికి, (ఇతరత్రా ఉపయోగాల కోసం) ఆకాశంనుండి వర్షం కురిపిస్తున్నాం. ఈ జలసంపదకు యజమానులు (మేమే కాని,) మీరు కాదు. (19-22)

జీవన్మరణాలకు మేమే మూలకారకులం. మీరు కొన్నాళ్ళు మాత్రమే ఉండి వట్టి చేతులతో ఈలోకం నుండి వెళ్ళిపోయేవారు. (మేమే శాశ్వతంగా ఉండేవాళ్ళము గనక) మేమే అందరికీ వారసులం. పూర్వం గతించినవారిని కూడా మేము చూశాం. ఇక ముందు వచ్చేవారు కూడా మా దృష్టిపథంలో ఉన్నారు. నీప్రభువు వారందర్నీ (ప్రళయదినాన) తప్పకుండా సమావేశపరుస్తాడు. ఆయన ఎంతో వివేకవంతుడు, అపార జ్ఞానసంపన్నుడు. (23-25)

మేము మానవుడ్ని కుళ్ళి ఎండిపోయిన మట్టితో సృజించాము. అంతకుముందు మేము జిన్నులను ఉష్ణవాయువుతో కూడిన అగ్నిజ్వాలతో సృజించాము. (26,27)

ఆ సందర్భంలో నీ ప్రభువు దైవదూతలతో అన్న మాటలు గుర్తుచేసుకో: "నేను కుళ్ళి ఎండిపోయిన మట్టితో ఒక మానవుడ్ని సృజిస్తున్నాను. మానవుడ్ని సృష్టించడం పూర్తయిన తర్వాత అతని (దేహం)లో నాఆత్మ (నొకదాని)ని ఊదుతాను.[1] అప్పుడు మీరంతా అతనికి గౌరవసూచకంగా అభివాదం చేయాలి" అన్నాడు నీప్రభువు. (28,29)

దాని ప్రకారం దైవదూతలంతా (మానవునికి) అభివాదం చేశారు, ఇబ్లీస్ తప్ప. ఇబ్లీస్ వారందరితోపాటు అభివాదం చేయడానికి నిరాకరించాడు. (30,31)

"ఇబ్లీస్! ఏమయింది నీకు, అందరితో పాటు అభివాదం చేయలేదు?" అడిగాడు దేవుడు. (32)

"కుళ్ళి ఎండిపోయిన మట్టితో సృజించిన మానవుడికి అభివాదం చేయడం నావల్ల కాని పని" అన్నాడు ఇబ్లీస్. (33)

1. వివరాలకు 2:30-39, 7:11-25, 17:61-65 సూక్తులు, వాటి పాదసూచికలు చూడండి.



"అయితే నీవిక్కడ్నుంచి వెళ్ళిపో. నీవు శాపగ్రస్తుడివి. తీర్పుదినం వరకు నీపై (ఈ) శాపం ఉంటుంది" అన్నాడు దేవుడు. (34,35)

"ప్రభూ! అలాగైతే మానవులంతా తిరిగి బ్రతికించి లేపబడేరోజు వరకు నాకు గడువు నివ్వు" అన్నాడు ఇబ్లీస్. (36)

"సరే, నిర్ణీతకాలం వరకు నీకు గడువిస్తున్నాము" అన్నాడు దేవుడు. (37,38)

"ప్రభూ! నీవు నన్ను ఏవిధంగా దారి తప్పించావో అదేవిధంగా నేను భూలోకంలో మానవులకు ఎన్నో మనోహరమైన వస్తువుల్ని చూపి వారిని దారి తప్పిస్తాను. అయితే నీవు ప్రత్యేకించుకున్న నీ దాసుల్ని మాత్రం అలా చేయను" అన్నాడు ఇబ్లీస్. (39,40)

"నా దగ్గరకు చేరుకోవడానికి ఇదే రుజుమార్గం. (ఈమార్గంలో నడిచే) నా (ప్రియ) దాసులపై నీఅధికారం చెల్లదు. నీఅధికారం నిన్ను అనుసరించే భ్రష్టుల మీదనే చెల్లుతుంది. వారందరికీ నరకమే (గతి, ఇది) మా వాగ్దానం" అన్నాడు దేవుడు. (41-43)

ఆ నరకానికి ఏడు ద్వారాలు ఉన్నాయి. వారిలో ప్రతి వర్గానికి ఒక్కొక్క ద్వారం కేటాయించబడింది. (44)

ఇక దైవభీతిపరులు స్వర్గవనాలలో (చల్లటి) సెలయేరుల మధ్య ఉంటారు. ఎలాంటి భయం లేకుండా ప్రశాంతంగా, సురక్షితంగా (స్వర్గంలో) ప్రవేశించండని వారితో చెబుతాము. వారి హృదయాల్లో రాగద్వేషాలు ఏవైనా మిగిలివుంటే వాటిని మేము తీసేస్తాము. వారు పరస్పరం అన్నదమ్ముల్లా మారి ఆసనాల మీద ఎదురెదురుగా కూర్చుంటారు. వారికక్కడ ఎలాంటి శ్రమ ఉండదు. అక్కడ్నుంచి వారిని తీసివేయడం కూడా జరగదు. (45-48)

ప్రవక్తా! నేను గొప్ప క్షమాశీలినని, అమిత దయామయుణ్ణని నా దాసులకు చెప్పు. దాంతోపాటు నాశిక్ష చాలా కఠినంగా, దుర్భరంగా ఉంటుందని కూడా చెప్పు. (49,50)

వారికి ఇబ్రాహీం అతిథుల గాథ విన్పించు. వారతని దగ్గరకు వచ్చి "నీకు శాంతి కలుగుగాక" అన్నారు.

అప్పుడతను "మిమ్మల్ని చూస్తుంటే నాకేదో భయంగా ఉంది" అన్నాడు. (51,52)

"భయపడకు. నీకు (త్వరలోనే) బుద్ధికుశలతగల కొడుకు పుడ్తాడని మేము శుభవార్త అందజేస్తున్నాం" అన్నారు వారు. (53)

"ఏమిటీ! ఈ ముసలితనంలో నాకు పిల్లలు పుడ్తారని శుభవార్త విన్పిస్తున్నారా మీరు!! కాస్త ఆలోచించండి, ఎలాంటి వార్త విన్పిస్తున్నారో నాకు మీరు" అన్నాడు ఇబ్రాహీం. (54)

"మేము నీకు సత్యంతో కూడిన శుభవార్తే విన్పిస్తున్నాము. నీవు (అనవసరంగా) నిరాశచెందకు" అన్నారు దైవదూతలు. (55)

"మార్గభ్రష్టులే తమ ప్రభువు కారుణ్యం పట్ల నిరాశచెందుతారు" అన్నాడు

ఇబ్రాహీం. తర్వాత అతను "దైవసందేశహరులారా! ఇంతకూ మీరు వచ్చిన పనేమిటీ?" అని అడిగాడు. (56,57)

"మేమొక నేరజాతి దగ్గరకు పంపబడ్డాము. ఒక్క లూత్ కుటుంబానికి మాత్రమే (దైవశిక్ష నుండి) మినహాయింపు ఉంది. వారిని మేము కాపాడుతాము. అయితే అతని భార్యను మాత్రం కాపాడము. ఆమె వెనుక ఉండిపోయేవారిలో చేరిపోతుందని మేము ముందుగానే నిర్ణయించాము" (అన్నారు దైవదూతలు). (58-60)

ఆ తర్వాత ఈ దూతలు లూత్ దగ్గరకు వెళ్ళారు. వారిని చూసి అతను "మీరెవరో కొత్తవాళ్ళుగా ఉన్నారే!" అన్నాడు. (61,62)

"కాదు, మేము వీరు అనుమానిస్తున్న విషయాన్ని తీసుకొచ్చాము. మేము నీతో నిజమే చెబుతున్నాము. మేము నీ దగ్గరకు సత్యం తీసుకొచ్చాము. కనుక నీవిప్పుడు కొంతరాత్రి గడిచిన తరువాత నీ కుటుంబసభ్యుల్ని తీసుకొని ఇక్కడ్నుంచి బయలుదేరి (వేరే చోటికి) వెళ్ళు. నీవు వారి వెనకాల నడు. (జాగ్రత్త!) మీలో ఏ ఒక్కరూ వెనక్కి తిరిగి చూడకూడదు. మిమ్మల్ని ఎటు వెళ్ళమని ఆజ్ఞాపిస్తే అటువైపే (ముఖం తిప్పి) నేరుగా నడవాలి" అన్నారు దైవదూతలు. (63-65)

(ఈ విధంగా) తెల్లవారేటప్పటికి (ఆ పట్టణంలో ఉండే) వారిని సమూలంగా తుడిచి పెట్టామన్న మా నిర్ణయాన్ని అతనికి ముందే తెలియజేశాము. (66)

అంతలో పట్టణవాసులు సంతోషంతో గంతులేస్తూ (లూత్ ఇంటికి) వచ్చారు. లూత్ (కంగారుపడ్తూ) "సోదరులారా! వీరు నాఅతిథులు. నన్ను నవ్వులపాలు చేయకండి. దేవునికి భయపడండి. నాపరువు మంటగలపకండి" అని బ్రతిమాలాడు. (67-69)

"ఏమిటీ, లోకంలోని జనమందరి వైపున వకాల్తా పుచ్చుకో వద్దని మేము నిన్ను వారించలేదా?" అన్నారు వారు. (70)

"(కాస్త నామాట కూడా వినండి.) మీరు (అలా) చేయాలని పట్టుపడ్తుంటే, ఇదిగో నా కుమార్తెలున్నారు. (వీళ్ళను చేసుకోండి)" అన్నాడు లూత్. (71)

ముహమ్మద్ (సల్లం)! నీ ఆత్మసాక్షి! ఆ సమయంలో వారు కళ్ళుకానని కైపుతో బలిసి కొట్టుకోసాగారు. (72)

చివరికి (మరునాడు) సూర్యుడు ఉదయించీ ఉదయించగానే భయంకరమైన విస్ఫోటం వారిమీద విరుచుకుపడింది. మేమా పట్టణాన్ని అమాంతం ఎత్తి కుదిపేశాము. వారి మీద కాలిన మట్టిరాళ్ళ వర్షం కురిపించాము.[2] (73-74)

2. ఒకప్పుడు ఈ ప్రాంతం పచ్చని పొలాలతో, దట్టమైన తోటలతో కళకళ లాడుతూ గుళ్ళు గోపురాలతో అప్పటి నాగరికతను ప్రతిబింబింప జేస్తుండేది. కాని ఈనాడది భయంకరమైన ఓ పెద్ద జలాశయం. అదే ఇస్రాయీల్, జోర్డాన్‌ల మధ్య ఉన్న మృత సముద్రం.

అయిదువేల సంవత్సరాల క్రితం మృతసముద్రం అనేది ప్రపంచంలోనే లేదంటారు శాస్త్ర వేత్తలు. వారిమాటల ప్రకారం ఐదువేల సంవత్సరాల క్రితం ఈ ప్రాంతంలో ఓ పెద్ద భూకంపం



ఈ ఘటనలో యోచించేవారికి గొప్ప సూచనలున్నాయి. ఆప్రాంతం (వారునడిచే) రహదారి సమీపంలోనే ఉంది. విశ్వాసులకు ఇందులో గుణపాఠం ఉంది. (75-77)

అయికాప్రజలు కూడా దుర్మార్గులే. మేము వారిమీద ప్రతీకారం తీర్చుకున్నాం. ఆ రెండుజాతుల శిథిలప్రాంతాలు సాధారణ రహదారుల్లోనే ఉన్నాయి. (78,79)

హిజ్ర్‌వాసులు కూడా ప్రవక్తలను తిరస్కరించారు. మేము వారి దగ్గరికి మా సూక్తులు పంపి మా నిదర్శనాలు కూడా చూపాము. కాని వారు వాటిని విస్మరిస్తూనే పోయారు. వారు కొండల్ని తొలిచి ఇండ్లు నిర్మిస్తుండేవారు. చివరికి ఒకరోజు సూర్యోదయం కాగానే భయంకరమైన విస్ఫోటం వారిని మట్టుబెట్టింది. వారు సంపాదించుకున్నది వారికి ఏమాత్రం పనికిరాకుండా పోయింది. (80-84)

మేము భూమ్యాకాశాల్ని, వాటిలోఉన్న సమస్తాన్ని సత్యం తప్ప మరే ప్రాతిపదికపై సృజించలేదు. ప్రళయఘడియ తప్పకుండా వస్తుంది. నీవు (వారి కుచేష్టల్ని) సహృదయంతో క్షమించు. నిస్సందేహంగా నీప్రభువు సర్వజ్ఞుడు, సర్వసృష్టికర్త. (85,86)

వచ్చింది. తీవ్రమైన దాని ప్రకంపనాలకు భూపొరల్లో ఉన్న పెట్రోలు, అస్ఫాల్ట్, విషవాయువులు, ఇతర ఖనిజాలు ఒక్కసారిగా పైకి వెదజల్లబడ్డాయి. నీళ్ళు కూడా పొంగివచ్చాయి. ఇలా పెట్రోలు, విషవాయువులు, ఇతర ఖనిజాలతో కలిసిపోయిన ఈ నీరే మృతసముద్రంగా పేరుపడింది.

ఈ సముద్రంలో చేపలు, మొసళ్ళు లేవు. విషఖనిజాలు పెల్లుబికిరావడం వల్ల దాని చుట్టుప్రక్కల ప్రాంతాలు కూడా నిరుపయోగమయ్యాయి. జోర్డాన్‌కు చెందిన అల్‌కరూక్ పట్నం లోని ఏదైనా ఎత్తు ప్రదేశం ఎక్కిచూస్తే, మృతసముద్రానికి దక్షిణదిక్కు వైపున్న ప్రాంతం అక్కడక్కడ నల్లని పిచ్చిచెట్లతో, బండరాళ్ళతో ఎంతో భయోత్పాతం కలిగిస్తుంది. ఇక్కడ ఒక విధమైన నల్లని ఈగలు కన్పిస్తాయి. ఇవి మనిషికి కుట్టితే కాల్చిన ఇనుపకడ్డీ అంటినట్లు శరీరం మంటెక్కి పోతుంది. ఈ సముద్రంలో నీటిసాంద్రత ఎక్కువగా ఉండటం వల్ల ఇందులో మనిషి మునగడు.

లూత్ ప్రవక్త (అలైహి)ను తిరస్కరించడం వల్ల విశ్వప్రభువు నుండి లూత్‌జాతి ప్రజలపై విరుచుకుపడిన భీకర శిక్ష ఇది. ఈ శిక్షకు ఇతర కారణాలేమిటో కూడా ఖుర్ఆన్ వివరించింది. ఆ ప్రజలు లైంగిక తృప్తి కోసం స్త్రీలను వదలి పురుషుల వెంట పడ్డారు. (26:165,166; 7:81). అసహజమైన, పరమ అసహ్యకరమైన ఈ చేష్టలతో పాటు వారిలో మరో రెండు చెడులు కూడా చోటుచేసుకున్నాయి. వారు దారులు కొడ్తూ బాటసారుల్ని దోచుకునేవారు. తమ సమావేశాల్లో పూర్తిగా సిగ్గువిడిచి తోటి సభికుల ముందే వ్యభిచారం చేసేవారు. (29:29)

హజ్రత్ లూత్ (అలైహి) వారిలో దైవభీతి కలిగించి వారి అవినీతి, అశ్లీల చేష్టలను అరికట్టేందుకు ఎంతో ప్రయత్నించారు. కాని కొందరు తప్ప ఎవరూ దారికి రాలేదు. అప్పుడు దేవుడు హజ్రత్ లూత్‌ని, ఆయన అనుచరుల్ని వేరేచోటికి తరలించి ఆ ప్రదేశంపై శిక్ష దించాడు. బ్రహ్మాండమైన ప్రేలుడుతో భూమి బ్రద్దలైపోయి తీవ్రమైన పెనుగాలులతో కూడిన రాళ్ళవర్షం కురిసింది. అదే సమయంలో భూప్రకంపనాల వల్ల ఎక్కడికక్కడ పగుళ్ళు ఏర్పడి, విషపదార్థాలతో కూడిన వేడినీరు ఒక్కసారిగా పెకి ఎగజిమ్మి మొత్తం పట్టణం క్షణాల్లో పెద్ద శ్మశానంగా మారిపోయింది.

ఈ సముద్రం పరిసరాల్లో ఇప్పటికీ ఆ పట్టణం అవశేషాలుగా గోడ శిథిలాలు, కుండ పెంకులు, ఎముకలు మనకు కన్పిస్తాయి. బుద్ధిమంతులకు ఇందులో గుణపాఠం ఉంది.

మేము నీకు మాటిమాటికి ఉచ్చరించదగిన ఏడు సూక్తులు ప్రసాదించాం. మేము నీకు మహోన్నతమైన ఖుర్‌ఆన్ (పాఠ్యగ్రంథం) అనుగ్రహించాం. కనుక నీవు (క్షణికమైన) ప్రాపంచిక సంపద వైపు కన్నెత్తి కూడా చూడకు. వాటిని మేము వారిలో వివిధవర్గాల ప్రజలకు (పరీక్ష నిమిత్తం) ఇచ్చాము. వారి పరిస్థితి పట్ల నీవు విచారపడకు. వారిని వారిమానాన వదిలేసి విశ్వసించినవారిపై దృష్టి కేంద్రీకరించు. (87-89)

వారికి నీవు స్పష్టంగా హెచ్చరించేవాడివి మాత్రమేనని చెప్పు. ఈహెచ్చరిక వర్గ భేదాలు సృష్టించుకున్నవారి దగ్గరకు పంపిన హెచ్చరిక లాంటిదే. వారు తమ ఖుర్‌ఆన్‌ని ముక్కలు ముక్కలుగా చేసుకున్నారు.[3] ప్రవక్తా! నీప్రభువు సాక్షి! (వారి కర్మల్ని గురించి ప్రళయదినాన) మీరేమి చేస్తుండేవారని మేము వారిని తప్పకుండా ప్రశ్నిస్తాం. (90-93)

కనుక నీకు ఆదేశిస్తున్న విషయాన్ని ఎలాంటి దాపరికం లేకుండా ప్రజలకు చేరవేయి. బహుదైవారాధన చేసేవారిని ఖాతరు చేయకు. హేళనచేసేవారికి సమాధానం ఇచ్చేందుకు నీ తరపున మేము చాలు. వారు దేవునితో పాటు ఇతరుల్ని దైవాలుగా చేసుకున్నారు. త్వరలోనే వారికి (దాని పర్యవసానం ఏమిటో) తెలిసిపోతుంది. (94-96)

నీ గురించి వారు కల్పించి చెబుతున్న మాటలేమిటో, దానివల్ల నీ మనసు ఎంత నొచ్చుకుంటున్నదో మాకు తెలుసు. (దీనికి పరిష్కారం ఒక్కటే.) నీవు నీ ప్రభువును స్తుతిస్తూ ఆయన ఔన్నత్యం ప్రశంసించు. ఆయన సన్నిధిలో సాష్టాంగపడుతూ ఉండు. (ఇలా) అంతిమశ్వాస వరకూ నీ ప్రభువుని ఆరాధిస్తూ ఉండు. (97-99) ✪

---

3. ఖుర్‌ఆన్ అంటే పఠించబడేదని, పఠనగ్రంథమని అర్థం. మరోమాటలో చెప్పాలంటే నిత్య పఠనానికి, దాని ప్రకారం ఆచరించడానికి ఇవ్వబడిన పాఠ్యగ్రంథం అన్నమాట. ఈవిధంగా దావూద్ ప్రవక్త (అలై)పై అవతరించిన జబ్బూర్, మూసాప్రవక్త (అలై)పై అవతరించిన తౌరాత్, ఈసా ప్రవక్త (అలై)పై అవతరించిన ఇన్జీల్ గ్రంథాలు కూడా ఆయా కాలాల ప్రజలు పఠించడానికి, ఆచరించడానికి పంపబడిన ఖుర్‌ఆన్‌లే. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం)పై అవతరించిన ఖుర్‌ఆన్ ఈనాటి ప్రజలు పఠించడానికి, ఆచరించడానికి పంపబడిన కలియుగ పాఠ్యగ్రంథం.

యూదులు తౌరాత్ గ్రంథంలో ఇచ్చిన ఆజ్ఞలలో కొన్నిటిని విశ్వసించి, మరి కొన్నిటిని తిరస్కరించారు (2:85). అందువల్ల వారు తమ ఖుర్‌ఆన్ (పాఠ్యగ్రంథా)న్ని ముక్కలు ముక్కలుగా చేసుకున్నారని దేవుడు ఈ సూక్తిలో తెలియజేస్తూ "మీరు కూడా యూదుల వైఖరి అవలంబించి నా ఆగ్రహానికి గురికాకండ"ని ముస్లింలను హెచ్చరిస్తున్నాడు. ✪

పైన పేర్కొనబడిన దైవ హెచ్చరిక నేటి ముస్లింలకు పూర్తిగా వర్తిస్తున్నట్లు గోచరిస్తోంది. ఖుర్‌ఆన్ రూపంలో తమకు సృష్టికర్త ప్రసాదించిన పాఠ్యగ్రంథాన్ని వారు బైబిల్, తల్మూద్ గ్రంథాల్లా తారుమారు చేసి భౌతికంగా ముక్కలు ముక్కలుగా చేయకపోయినా భావపరంగా తమ ఖుర్‌ఆన్‌ని ముక్కలు ముక్కలుగా చేసుకొని విభిన్న వర్గాలుగా విడిపోయారు. యూదుల కుతంత్ర జాలంలో చిక్కుకొని తమ జీవిత పరమార్థాన్ని, అసలు బాధ్యల్ని మరచిపోయారు. ఈ విషవలయం నుంచి బయట పడటానికి ఒక్కటే మార్గం. వారు ఖుర్‌ఆన్ సూక్తుల అనువాదాన్ని, వాటి అవతరణ విశేషాలను ప్రతిరోజూ శ్రద్ధగా పఠిస్తూ ఉండాలి.



# 16. తేనెటీగ (నహల్)

అవతరణ: మక్కా — సూక్తులు: 128

ఈ అధ్యాయాన్ని "నహల్" (తేనెటీగ) అంటారు. ముస్లింలపై మక్కా బహుదైవారాధకుల వేధింపులు, ఆగడాలు మితిమీరి పోయిన తరుణంలో దైవప్రవక్త (సల్లం) కొందరు ముస్లింలకు అబిసీనియాకు వలసపోవడానికి అనుమతించారు. అలాంటి పరిస్థితిలో దేవుడు ఈ అధ్యాయంలో మక్కా అవిశ్వాసుల సత్యవ్యతిరేక కార్యకలాపాల్ని ఖండిస్తూ, వారి మూఢనమ్మకాలను విమర్శిస్తూ సరైన ధర్మపథం వైపు వారిని పిలిచాడు. రెండోవైపు ముస్లింలకు ధైర్యం చెబుతూ సహనం వహించాలని ఉపదేశించాడు.

## కరుణామయుడు, కృపాసాగరుడయిన దేవుని పేరుతో ప్రారంభం

దేవుని ఆజ్ఞ వచ్చింది. దానికోసం తొందరపడకు. వారు చేస్తున్న బహుదైవారాధనకు దేవుడు ఎంతో అతీతుడు, పవిత్రుడు, మహోన్నతుడు. ఆయనే ఈసందేశాన్ని తన ఆజ్ఞతో దైవదూతల ద్వారా తాను కోరిన దాసులపై అవతరింపజేస్తున్నాడు. కనుక నేను తప్ప మీకు మరోఆరాధ్యుడు లేడని, కనుక మీరు నాకే భయపడాలని చెప్పు. (1,2)

ఆయన భూమ్యాకాశాలను సత్యం ప్రాతిపదికపై సృష్టించాడు. వారు చేస్తున్న బహుదైవారాధనకు ఆయన ఎంతో అతీతుడు, మహోన్నతుడు. ఆయన మానవుడ్ని వీర్యబిందువుతో పుట్టించాడు. అలాంటి మానవుడు చూస్తుండగానే (పెద్దవాడయి) జగడాలమారిగా తయారయ్యాడు. (3,4)

ఆయన జంతుజాలాన్ని సృష్టించాడు. వాటిలో మీకోసం ఆహారం, దుస్తులు ఉన్నాయి. ఇంకా వివిధ రకాల ప్రయోజనాలు కూడా ఉన్నాయి. వాటిని మీరు ఉదయం మేపడానికి తీసికెళ్తున్నప్పుడు, సాయంత్రం (ఇండ్లకు) తోలుకొస్తున్నప్పుడు వాటిని చూస్తూ మీరెంతో ఆనందిస్తారు. అదీగాక, మీరెంతో శ్రమపడనిదే చేరుకోలేని ప్రదేశాలకు సైతం అవి మిమ్మల్ని మోసుకొని సునాయాసంగా వెళ్తాయి. నిస్సందేహంగా మీ ప్రభువు దయామయుడు, ఎంతో వాత్సల్యం కలవాడు. (5-7)

మీరు స్వారీ చేయడానికి, మీ జీవితానికి శోభ చేకూర్చడానికి ఆయన గుర్రాలు, గాడిదలు, కంచరగాడిదలను కూడా సృష్టించాడు. ఆయన మీకోసం మీకు తెలియని ఎన్నో వస్తువుల్ని సృష్టించాడు. (ప్రపంచంలో) ఎన్నో వక్రమార్గాలు ఉన్నందున రుజుమార్గమేదో చూపవలసిన బాధ్యత కూడా ఆయనదే. ఆయన తలచుకుంటే మీకందరికీ సన్మార్గావలంబన బుద్ధి ప్రసాదించేవాడు. (8,9)

ఆయనే మీకోసం ఆకాశం నుండి వర్షం కురిపిస్తున్నాడు. దాన్ని మీరూ తాగుతారు; మీ పశువులక్కూడా అది మేత సమకూరుస్తుంది. ఈ వర్షం ద్వారా ఆయన పంటలు పండిస్తున్నాడు. ఆలివ్, ద్రాక్ష, ఖర్జూర పండ్లు, ఇంకా ఇతర అనేక రకాల పండ్లు పండిస్తున్నాడు. యోచించేవారికి ఇందులో గొప్ప సూచనలు ఉన్నాయి. (10,11)

ఆయన మీ శ్రేయస్సుకోసం రేయింబవళ్ళను, సూర్యచంద్రుల్ని అదుపులో ఉంచాడు. నక్షత్రాలు కూడా ఆయన అదుపాజ్ఞల్లోనే ఉన్నాయి. విజ్ఞులకు ఇందులో

ఎన్నో నిదర్శనాలున్నాయి. లోకంలోని రంగురంగుల అనేక వుస్తువుల్ని కూడా ఆయనే మీకోసం సృష్టించాడు. వాటిలో కూడా గుణపాఠం, గ్రహించేవారికి నిదర్శనాలు ఉన్నాయి. ఆయనే మీకోసం సముద్రాన్ని అదుపులో ఉంచాడు. అందులో నుంచి మీరు తినడానికి మాంసం, ధరించడానికి నగలు తీస్తారు. సముద్రంలో ఓడలు నీటిని చీల్చి వేస్తూ ఎలా ముందుకు సాగుతాయో మీరు చూస్తూనే ఉన్నారు. మీరు మీ ప్రభువు అనుగ్రహం (ఉపాధి) అన్వేషిస్తూ, ఆయనకు కృతజ్ఞులయి ఉండటానికే ఇదంతా సృష్టించబడింది. (12-14)

భూమండలం మిమ్మల్ని తీసుకొని దొర్లకుండా ఉండేందుకు ఆయన దానిమీద పర్వతాలను మేకులుగా పాతాడు. ఆయన (మీ కోసమే) నదులు కూడా ప్రవహింపజేశాడు. మీరు దారి తెలుసుకోవడానికి వీలుగా సహజ మార్గాలు, ఇతర అనేక చిహ్నాలు కూడా ఏర్పరిచాడు. నక్షత్రాల ద్వారా కూడా మీరు దారి తెలుసుకుంటున్నారు. (15,16)

(వివిధ సృష్టిరాసుల్ని) సృష్టించేవాడు, ఏ వస్తువునూ సృష్టించలేనివాడు (ఇద్దరూ) సమానులవుతారా? మీరు ఆమాత్రం అర్థం చేసుకోలేరా? మీరు దేవుని అనుగ్రహాలను లెక్కించదలచుకుంటే ఎన్నటికీ లెక్కించలేరు. నిస్సందేహంగా ఆయన గొప్ప క్షమాశీలి, పరమ దయామయుడు. ఆయనకు మీ అంతర్‌బాహ్యాలన్నీ తెలుసు. (17-19)

వారు నిజదేవుణ్ణి వదలి ఆరాధిస్తున్న మిథ్యాదైవాలు ఏఒక్క వస్తువుకూ సృష్టికర్తలు కారు. వారు స్వతహాగా సృష్టితాలు, నిర్జీవులు; సజీవులు కాదు.[1] వారికి తాము ఎప్పుడు (బ్రతికించి) లేపబడతారో కూడా తెలియదు. (20,21)

మీ దేవుడు ఒక్కడే. పరలోకాన్ని నమ్మనివారి హృదయాల్లో (సత్య) తిరస్కారం గూడు కట్టుకొని ఉంది. వారు అహంకారంతో విర్రవీగిపోతున్నారు. వారి అంతర్ బాహ్య చేష్టలన్నీ దేవునికి తెలుసు. గర్వపోతుల్ని ఆయన ఎన్నటికీ ప్రేమించడు. (22,23)

వారిని ఎవరైనా మీప్రభువు ఏం అవతరింపజేశాడని అడిగితే "అదా, అవేవో పూర్వీకుల పుక్కిటిపురాణాలు లెండి" అని అంటారు. ప్రళయదినాన వారు తమ (పాప) భారంతో పాటు, తమ అజ్ఞానం అభూతకల్పనలతో ఎవరెవరిని అపమార్గం పట్టించారో వారందరి (పాప) భారం కూడా మూట కట్టుకుంటారు. చూడు, వారు ఎంత నీచమైన భారం తలకెక్కించుకుంటున్నారో! (24,25)

వారికి పూర్వం కూడా అనేకమంది (సత్యానికి వ్యతిరేకంగా) ఇలాంటి దుష్ట పన్నాగాలే పన్నారు. చూడు, దేవుడు వారి దుష్టపన్నాగాల కట్టడాన్ని ఎలా సమూలంగా కూల్చివేశాడో. అప్పుడు పైనుండి దాని కప్పు వారి నెత్తిమీద హఠాత్తుగా విరుచుకు

1. ఇక్కడ మరణించిన మానవుల్ని గురించి ప్రస్తావించబడింది. ప్రవక్తలు, పుణ్యపురుషులు చనిపోయిన తర్వాత మూఢజనం వారి విగ్రహాలు తయారుచేసి పూజిస్తారు. కొందరు వారి సమాధుల్ని ఆరాధిస్తారు, అలంకరిస్తారు. వాటిని మొరపెట్టుకుంటారు; మొక్కుబడులు చేసుకుంటారు. ఏకేశ్వరో  పాసనకు వ్యతిరేకమైన ఈ వైఖరిని ఖుర్ఆన్ తీవ్రంగా ఖండిస్తోంది.



పడింది. ఇలా వారి ఊహకు సైతం తట్టని వైపునుండి వారి పైకి శిక్ష వచ్చిపడింది. (26)

ఇక ప్రళయం రోజయితే దేవుడు వారిని ఘోరాతిఘోరంగా అవమానం, అప్రతిష్ఠల పాలుజేస్తాడు. "ఏరి నాభాగస్వాములు? వారిని గురించి మీరు జగడమాడుతుండేవారే! వారిప్పుడు ఎటు పోయారు?" అని దేవుడు వారిని ప్రశ్నిస్తాడు. సత్యజ్ఞానం పొందినవారు వారిని చూసి "ఈ రోజు సత్యతిరస్కారులకు అవమానం,  దౌర్భాగ్యాలు తప్పవు" అనంటారు. (26,27)

ఔను, ఆత్మవంచనకు పాల్పడి దైవదూతలకు పట్టుబడిన సత్యతిరస్కారులకే (ఈ ఘోరం). దైవదూతలకు పట్టుబడినప్పుడు వారు వెంటనే (తమ తిరస్కారం, తలబిరుసుతనాలు వదలి) పూర్తిగా లొంగిపోతూ "మేము ఏపాపం ఎరగం" అనంటారు. దానికి దైవదూతలు "ఎందుకు ఎరగరు? మీ చేష్టలన్నీ దేవునికి బాగా తెలుసు. మీరిప్పుడు నరకంలోకి పోయిపడండి. అక్కడే మీరిక శాశ్వతంగా ఉండాలి" అని సమాధానమిస్తారు. నిజంగా ఇది గర్విష్ఠుల పాలిట పరమ చెడ్డనివాసం. (28,29)

ఇక దైవభీతిపరుల సంగతి: వారిని ఎవరైనా "మీ ప్రభువు నుండి (మీ దగ్గరకు) ఏం అవతరించింది" అని అడిగితే "మంచి విషయమే అవతరించింది" అని చెబుతారు వారు. ఇలాంటి సజ్జనులకు ఇటు ఇహలోకంలోనూ మేలు చేకూరుతుంది; అటు పరలోకంలోనైతే (చెప్పనవసరం లేదు.)- పరలోకగృహం వారిపాలిట అత్యంత శ్రేష్ఠమైన బహుమానం. దైవభీతిపరులకు లభించే ఈగృహం ఎంతో శుభదాయకమైనది. (30)

వారు ప్రవేశించే శాశ్వత స్వర్గవనాలలో (చల్లటి) సెలయేరులు ప్రవహిస్తూ ఉంటాయి. వారి కోరికలకు పూర్తి అనుగుణంగా అక్కడ సమస్త వస్తువులు లభిస్తాయి. దైవభీతిపరులకు దేవుడు ఇలాంటి ప్రతిఫలమే ప్రసాదిస్తాడు. దైవదూతలు వారి ఆత్మలను పవిత్రంగా ఉన్నప్పుడు స్వాధీనంచేసుకుంటూ "మీకు శాంతి కలుగుగాక! మీరు చేసుకున్న (సత్)కర్మలకు ప్రతిఫలంగా స్వర్గంలో ప్రవేశించండి" అని అంటారు. (31,32)

ముహమ్మద్ (స)! వీరిప్పుడు దేనికోసం ఎదురుచూస్తున్నారు? (మరణ) దూతల రాకకోసం ఎదురుచూస్తున్నారా? లేక నీ ప్రభువు పంపే ఆజ్ఞ(శిక్ష) కోసమా? ఇలాంటి తలబిరుసు చేష్టలు వీరికి పూర్వం కూడా అనేకమంది చేశారు. (ఆతర్వాత జరగవలసిన శాస్తి జరిగిపోయింది). దేవుడు వారికి ఎలాంటి అన్యాయం చేయలేదు. వారే ఆత్మవంచనకు పాల్పడ్డారు. చివరికి వారి చేష్టల దుష్ఫలమే వారిని చుట్టుకుంది. ఏ విషయం గురించి వారు హేళన చేస్తుండేవారో అదే వారిపై విరుచుకుపడింది. (33,34)

"దేవుడు కోరితే మేమూ, మా తాతముత్తాతలు ఆయన్ని తప్ప మరెవరినీ ఆరాధించే  వాళ్ళము కాము. అలాగే ఆయన అదేశించనిదే ఏ వస్తువుని కూడా మా అంతట మేము నిషేధించుకునేవాళ్ళము కాము" అంటారు ఈ బహుదైవారాధకులు. ఇలాంటి సాకులు వారికి పూర్వం కూడా అనేక మంది చెప్పారు. అయితే విషయాన్ని (ప్రజలకు) స్పష్టంగా చేరవేయడం తప్ప దైవప్రవక్తలపై మరొక బాధ్యత లేదు. (35)

మేము ప్రతి జాతిలోనూ ప్రవక్తలను ప్రభవింపజేశాము.[2] వారి ద్వారా "దేవుణ్ణి ఆరాధించండి. దుష్టశక్తిని ఆరాధించకండి" అని అందరికీ బోధపర్చాము. తరువాత వారిలో కొందరికి దేవుడు సన్మార్గావలంబన బుద్ధి ప్రసాదించాడు. మరికొందరిపై అజ్ఞానపు కారుచీకట్లు ముసురుకున్నాయి. సత్యతిరస్కారులు ఎలాంటి దుష్పర్యవసానం చవిచూశారో కాస్త ప్రపంచంలో తిరిగి చూడండి. (36)

ముహమ్మద్! వారిని దారికి తీసుకురావాలని నీవు ఎంత కోరుకున్నా (ప్రయోజనం లేదు.) దేవుడు దారి తప్పించగోరిన వారికి మరెవరూ దారి చూపించలేరు. అలాంటి వారిని ఎవరూ ఆదుకోలేరు. (37)

వారు దేవుని పేరుతో గట్టిగా ప్రమాణాలు చేస్తూ "దేవుడు చనిపోయిన వారెవరినీ తిరిగి బ్రతికించలేడు" అనంటారు. ఎందుకు లేపడు? అదొక తిరుగులేని వాగ్దానం. దాన్ని తప్పకుండా నెరవేర్చాలని దేవుడు నిర్ణయించుకున్నాడు. కాని చాలామందికి తెలియదు. వారు విభేదిస్తున్న విషయం గురించి వారి ముందు వాస్తవం బట్టబయలు చేయాల్సిన అవసరముంది. అంతేకాదు, సత్యతిరస్కారులకు తాము అసత్యవాదులమని కూడా తెలియాలి. కనుక ఇది జరిగితీరుతుంది. మేమేదైనా వస్తువుని ఉనికిలోకి తీసుకు రాదలచుకుంటే "అయిపో" అంటే చాలు, ఆ పని తృటిలో జరిగిపోతుంది. (38-40)

దౌర్జన్యం సహించిన తర్వాత చివరికి దైవప్రసన్నత కోసం వలసపోయే వారికి మేము ప్రపంచంలో మంచి ఆశ్రయం ప్రసాదిస్తాం; పరలోకంలో అంతకంటే గొప్ప ప్రతిఫలం ఉంది. సహనం వహిస్తూ తమ ప్రభువు మీద భారంవేసి పనిచేసే ఈ పీడితులు (పరలోకంలో ఎంతమంచి బహుమానముందో) తెలుసుకుంటే బాగుండు.[3] (41,42)

ప్రవక్తా! నీకు పూర్వం కూడా మేము వారి దగ్గరకు మా సందేశాన్నిచ్చి మానవుల్నే ప్రవక్తలుగా పంపాము. మీకు తెలియకపోతే తెలిసినవారిని అడిగి తెలుసుకోండి. గత ప్రవక్తలక్కూడా మేము స్పష్టమైన సాక్ష్యాధారాలు, దివ్యగ్రంథాలు ఇచ్చి పంపాము. ఇప్పుడీ జ్ఞాపిక (ఖుర్‌ఆన్)ను నీపై అవతరింపజేశాం. ప్రజలకోసం పంపినదాన్ని ప్రజలకు వివరించడానికి, స్వయంగా వారు కూడా యోచించడానికి ఇలా చేశాము. (43,44)

దుష్టపన్నాగాలు పన్నుతున్నవారు తమను దేవుడు భూమిలోకి అణగద్రొక్కడని లేదా వారు ఏమాత్రం ఊహించని వైపునుండి తమపైకి ఆపద రాదని నిశ్చింతగా ఉన్నారా? లేక వారు అటూఇటూ తిరుగుతున్నప్పుడైనా తమను దేవుడు పట్టుకోడని నిర్భయంగా ఉన్నారా? లేక వారేదయినా ఆపద వస్తుందని భయపడి దాని పట్ల

---

2. దీన్ని బట్టి ప్రతి జాతిలో, ప్రతి యుగంలో ప్రజలకు రుజుమార్గం చూపడానికి దైవ ప్రవక్తలు ప్రభవించారని తెలుస్తోంది. అందువల్ల భారత దేశంలో కూడా దైవప్రవక్తలు ప్రభవించి ఉండవచ్చని చెప్పవచ్చు.

3. మక్కా అవిశ్వాసులు పెట్టే బాధలు భరించలేక తమ విశ్వాసాన్ని కాపాడుకోవడానికి మక్కా నుండి అబిసీనియాకు వలసపోయిన ముస్లింలను గురించి ఇక్కడ ప్రస్తావించబడింది.



అప్రమత్తులై ఉన్న స్థితిలోనైనా దేవుడు తమను పట్టుకోడని భావిస్తున్నారా? దేవుడు చేయదలచుకున్నదాన్ని మీరు ఏవిధంగానూ అడ్డుకోలేరు. నిజంగా నీప్రభువు ఎంతో దయామయుడు, దాక్షిణ్యమూర్తి. (45-47)

వారు దేవుడు సృష్టించిన ఏ వస్తువునీ పరికించి చూడలేదా? ఆ వస్తువుల నీడలు కుడి ఎడమల వైపు పడుతూ దేవుని ముందు ఎలా సాష్టాంగపడుతున్నాయో గమనించరా? ఇలా సృష్టిలోని అణువణువూ (దేవుని పట్ల) తన వినమ్రత వ్యక్తపరుస్తోంది. భూమ్యాకాశాల్లోని సమస్త జీవకోటి,[4] దైవదూతలు దేవుని ముందు వినమ్రులై తలవంచుతున్నారు. వారు ఎలాంటి అహంకారం చూపకుండా పైనున్న తమ ప్రభువుకు భయపడుతుంటారు; తమకు జారీచేసే ఆజ్ఞ ప్రకారమే నడుచుకుంటారు. (48-50)

"ఇద్దరు దేవుళ్ళను చేసుకోకండి. దేవుడు అసలు ఒక్కడే. కనుక మీరు నాకే భయపడండి" అని దేవుడు స్పష్టంగా చెబుతున్నాడు. భూమ్యాకాశాల్లో ఉన్న సమస్తం ఆయన సొత్తే. (యావత్తు విశ్వంలో) ఆయన నిర్దేశించిన జీవనవిధానమే నడుస్తోంది. అలాంటప్పుడు మీరు దేవుణ్ణి కాదని ఇతరులకు ఎలా భయపడతారు? (51,52)

మీకు లభించిన భాగ్యాలన్నీ దేవుడు ప్రసాదించినవే. మీపై ఏదైనా ఆపద వచ్చి పడితే మీరు ఆయన్నే మొరపెట్టుకుంటారు. కాని దేవుడు ఆ కష్టాన్ని దూరంచేయగానే మీలో కొందరు ఆయనకు ఇతరుల్ని సాటికల్పిస్తారు. ఈవిధంగా వారు, చేసినమేలు మరచి తమ ప్రభువు పట్ల కృతఘ్నులైపోతారు. సరే (కొన్నాళ్ళపాటు) ఐహిక సుఖాలు జుర్రుకోండి, త్వరలోనే (దాని పర్యవసానం ఏమిటో) మీకు తెలిసిపోతుంది. (53-55)

మేము ప్రసాదించిన ఉపాధిలో వారు తమకు తెలియనివాటి (మిధ్యాదైవాల) కోసం కొంత (నైవేద్యంగా) నిర్ణయిస్తున్నారు. "(అవిశ్వాసులారా!) దైవసాక్షి! ఈ అభూతకల్పనలను గురించి మిమ్మల్ని తప్పకుండా నిలదీసి ప్రశ్నించడం జరుగుతుంది." వారు తమ కోసమైతే తమకిష్టమైనవారిని (అంటే కుమారుల్ని) ఎంచుకుంటారు! కాని దేవుని కోసం కుమార్తెల్ని ప్రతిపాదిస్తున్నారు. ఎంతటి అపచారానికి పాల్పడ్డారు! (56,57)

వారిలో ఎవరికైనా కూతురు పుట్టిందని శుభవార్త విన్పిస్తే చాలు, వెంటనే అతని మొహం మాడి ముడుచుకు పోతుంది. అతను లోలోన తెగ బాధపడిపోతాడు. "ఈ దుర్వార్త విన్నాక ఇక నామొహం జనానికి ఎలా చూపించను?" అని భావిస్తూ ప్రజల నుండి తప్పించుకుంటూ తిరుగుతాడు. అంతేకాదు. ఈ అవమానభారంతో కూతుర్ని అలాగే అట్టిపెట్టుకోవాలా లేక మట్టిలో పూడ్చిపెట్టాలా? అని తీవ్రంగా ఆలోచిస్తాడు.[5] చూడు, (దేవుని విషయంలో) వీరు ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారో! (58,59)

పరలోకాన్ని విశ్వసించనివారికే (ఇలాంటి) దుర్గుణాలు, దుర్లక్షణాలు శోభిస్తాయి.

---

4. ఈసూక్తిని బట్టి మనం నివసించే భూమండలంలోనేగాక ఆకాశంలోని ఇతర గ్రహాలలో కూడా జీవరాసులున్నాయని తెలుస్తోంది. (42:29, 65:12 సూక్తులు, పాదసూచిక చూడండి.)

5. వివరాలకు 43:18, 53:22, 81:8 సూక్తులు, వాటి పాదసూచికలు చూడండి.

దేవుని విషయానికొస్తే ఆయన అత్యున్నత సుగుణాలు కలవాడు. ఆయనే అందర్నీ మించిన శక్తిమంతుడు, మహా వివేకవంతుడు. (60)

ప్రజలు పాల్పడుతున్న దౌర్జన్యాలు, దౌష్ట్యాలకు దేవుడు వారిని వెంటనే పట్టుకో దలిస్తే భూమిపై ఒక్కడూ మిగలడు. ఆయన వారికి నిర్ణీతకాలం వరకు గడువిస్తున్నాడు. ఆ గడువు తీరగానే ఇక ఒక్కఘడియ కూడా వెనుకాముందూ కాజాలదు. వారు తమ కోసం ఇష్టపడనివాటిని దేవుని కోసం ప్రతిపాదిస్తున్నారు. పైగా తమకంతా మేలే జరుగు తుందని అబద్ధాలు పేలుతున్నారు. వారికి ఒక్కటే రాసిపెట్టి ఉంది. అదే నరకాగ్ని. అందరికంటే ముందు వారినే అందులోకి త్రోయడం జరుగుతుంది. (61,62)

ప్రవక్తా! దైవసాక్షి! పూర్వం కూడా మేము అనేకజాతుల వద్దకు ప్రవక్తల్ని పంపాము. షైతాన్ వారి చేష్టల్ని మనోహరమైనవిగాచేసి వారికి చూపాడు. ఆ షైతానే ఈనాడు వీరికి కూడా సంరక్షకుడయ్యాడు. వీరికోసం దుర్భరయాతన ఉంది. వారు కల్పించుకున్న విభేదాలను గురించి నిజానిజాలు వెల్లడిచేయడానికే మేమీ గ్రంథం నీపై దించాము. విశ్వసించేవారికి ఈగ్రంథం మార్గదర్శినిగా, కారుణ్యప్రదాయనిగా వచ్చింది. (63,64)

దేవుడే ఆకాశం నుండి వర్షం కురిపిస్తున్నాడు. ఆయనే దానిద్వారా మృతభూమికి జీవం పోస్తున్నాడు. (సత్యబోధ) ఆలకించేవారికి ఇందులో గొప్పసూచన ఉంది. మీకోసం పశువుల్లో కూడా గుణపాఠం ఉంది. వాటి పొట్టలోని పేడకు, రక్తానికి మధ్య నుండి మేమొక (సుమధుర) పానీయం తీసి మీకు త్రాగడానికి ప్రసాదిస్తున్నాము. అంటే స్వచ్ఛమైన పాలు. త్రాగేవారికి ఇవి ఎంతో కమ్మగా ఉంటాయి. (65,66)

అలాగే ఖర్జూరపండ్లు, ద్రాక్షపండ్ల నుండి కూడా మేమొక విధమైన పానీయం తీసి మీకు త్రాగడానికి ఇస్తున్నాము. దాన్ని మీరు మత్తుపానీయంగా, పరిశుద్ధ ఆహారంగా తయారుచేస్తారు. బుద్ధిమంతులకు ఇందులో కూడా గొప్ప సూచన ఉంది. (67)

నీ ప్రభువు తేనెటీగకు సందేశం పంపుతూ "కొండల్లో, చెట్లలో, పందిళ్ళపై ఎక్కించిన లతల మధ్య తేనెతెట్లు నిర్మించుకో. రకరకాల పండ్లరసాన్ని (పుష్పమ కరందాన్ని) ఆస్వాదిస్తూ నీప్రభువు సుగమంచేసిన మార్గాలలో నడు" అని ఆదేశించాడు. ఈ తేనెటీగ నుంచి ఒక విధమైన రంగురంగుల పానకం వెలువడుతుంది. ఇందులో ప్రజలకు స్వస్థత కూడా ఉంది.[6] ప్రశాంతమనస్సుతో యోచించేవారికి ఈ విషయంలో గొప్ప సూచన ఉంది. (68,69)

దేవుడు మిమ్మల్ని పుట్టించాడు. ఆ తరువాత మీప్రాణాలు కూడా ఆయనే తీస్తున్నాడు. మీలో కొందరు అన్నీ తెలిసికూడా ఏమీ తెలియనంత సుదీర్ఘ (వృద్ధాప్య) వయస్సుకు చేరుకుంటున్నారు. నిస్సందేహంగా దేవుడే సంపూర్ణ జ్ఞానసంపన్నుడు, సర్వశక్తిమంతుడు. (70)

---

6. వైద్యపరంగా తేనెలో అనేక ప్రయోజనాలున్నాయని చాలామందికి తెలుసు. యునాని వైద్య విధానంలో తేనెను ప్రధాన వస్తువుగా వాడటానికి కారణం ఇదే.



ఉపాధి విషయంలో దేవుడే మీలో కొందరికి కొందరిపై ఆధిక్యత నిచ్చాడు. ఇలా అధిక్యత పొందినవారు తమ బానిసలతో సమానులయ్యే విధంగా వారికి తమ ఉపాధిని పంచివ్వరు కదా! అలాంటప్పుడు వారు దేవుడు చేసిన మేలును ఎలా మరచి ఆయన్ని నిరాకరిస్తున్నారు? (71)

దేవుడే మీకోసం మీ జాతినుండి స్త్రీలను సృష్టించాడు. ఆయనే ఆ స్త్రీలద్వారా మీకు కొడుకులు, మనవళ్ళను ప్రసాదిస్తున్నాడు. అంతేకాకుండా తినడానికి మీకు ఎన్నో మంచి మంచి పదార్థాలు కూడా ఇస్తున్నాడు. మరి (ఇదంతా తెలిసి కూడా) వీరు మిథ్యా విషయాలనే నమ్ముతున్నారా? దేవుడు చేసిన మేళ్ళను మరచి కృతఘ్నులై పోతున్నారా? వారు నిజదేవుణ్ణి వదలి, భూమ్యాకాశాల నుండి తమకు ఏమాత్రం ఉపాధి నిచ్చే శక్తిలేని మిథ్యాదైవాలను ఆరాధిస్తున్నారు. అసలా దైవాలు ఈ పని చేయలేవు కూడా. కనుక దేవుని విషయంలో (ఆయన్ని ఇతరులతో పోల్చుతూ తప్పుడు) ఉదాహరణలు ఇవ్వకండి. దేవునికి మాత్రమే తెలుసు, మీకు తెలియదు.[7] (72-74)

దేవుడు ఒక ఉదాహరణ ఇస్తున్నాడు (చూడండి): ఒక బానిస ఉన్నాడు ఇతరుల అధీనంలో. తనంతట తాను ఏపనీ చేయడానికి అతనికి అధికారం లేదు. (స్వేచ్ఛాపరు డయిన) మరొక వ్యక్తి ఉన్నాడు. మేమతనికి మంచి ఉపాధి ప్రసాదించాం. అందులో కొంత అతను రహస్యంగాను, బహిరంగంగానూ (మా మార్గంలో) ఖర్చుపెడ్తున్నాడు. ఇప్పుడు చెప్పండి. వీరిద్దరూ ఒకటేనా? (కాదని చెప్పక తప్పదు.) దేవుడే ప్రశంసనీయుడు. కాని చాలామంది (ఈ ముక్కుసూటి మాట కూడా) అర్థం చేసుకోలేక పోతున్నారు. (75)

దేవుడు మరొక ఉదాహరణ ఇస్తున్నాడు: ఇద్దరు మనుషులున్నారు. వారిలో ఒకడు మూగవాడు. పైగా ఏపనీ చేయలేని అసమర్థుడు. అందువల్ల అతను తన యజమానికి భారమైఉన్నాడు. యజమాని అతణ్ణి ఎక్కడికి పంపినా ఎలాంటి లాభం తీసుకురాలేడు. అయితే రెండవ వ్యక్తి (ప్రజలకు) మంచిని బోధిస్తూ ఉంటాడు. స్వయంగా అతను కూడా సన్మార్గంలో నడుచుకుంటాడు. చెప్పండి, వీరిద్దరు ఒకటేనా? (76)

---

7. బహుదైవారాధకులు తమ సృష్టికర్త, స్వామి, ప్రభువు, పోషకుడు అయిన దేవుడు ఒక్కడే అని నమ్ముతారు. అయితే ప్రకృతి శక్తులు, విగ్రహాలు, తాము కల్పించుకున్న ఇతర మిథ్యాదైవాలు ఆ మహాదేవుని ప్రభుత్వంలో పనిచేస్తున్న అధికారులని, ఆయన కొలువులో వాటి సిఫారసు చెల్లు తుందని భావించి వారు మిథ్యాదైవాలను ఆరాధిస్తారు. వారు దేవుణ్ణి ప్రాపంచిక చక్రవర్తులతో పోల్చుతూ, చక్రవర్తి దగ్గరకు నేరుగా వెళ్ళడం, అతణ్ణి ఒప్పించడం కష్టం గనక, అతని ఆస్థానంలో ఉండే ఉద్యోగుల్ని ప్రసన్నం చేసుకుంటే వారతని దగ్గర తమను గురించి సిఫారసు చేస్తారని, అలాగే తాము పూజించే ఈ దేవతలు కూడా దేవుని దగ్గర సిఫారసు చేస్తారని అంటారు.

ఖుర్‌ఆన్ ఈ అభిప్రాయాన్ని ఖండిస్తోంది. తప్పుడు తార్కాణాల ద్వారా దేవుణ్ణి ప్రాపంచిక రాజులతో పోల్చుతూ, ఆయనకు మానవ బలహీనతల్ని ఆపాదించకూడదని, ఈవిషయంలో దేవుడు మాత్రమే సరైన తార్కాణాలు ఇచ్చి వాస్తవం తెలియజేయగలడని చెబుతోంది. ఆ తరువాత 75,76 సూక్తులలో సరైన తార్కాణాలు రెండిటిని పేర్కొంటూ, సత్యాన్ని వివరించింది.

భూమ్యాకాశాల్లో ఉన్న సమస్త అగోచరాలు దేవునికి మాత్రమే తెలుసు. ప్రళయం రావడానికి ఎంతోసేపు పట్టదు. రెప్పపాటులో అది వచ్చిపడుతుంది. అంతకంటే తక్కువ కాలంలోనే రావచ్చు. నిస్సందేహంగా దేవునికి అణువణుపై అధికారం ఉంది. దేవుడు మిమ్మల్ని మీకేమీ తెలియని స్థితిలో మీతల్లుల గర్భాల నుండి తీశాడు. ఆయన మీకు చూడటానికి కళ్ళిచ్చాడు, వినడానికి చెవులిచ్చాడు, ఆలోచించడానికి హృదయాన్నిచ్చాడు. మీరు కృతజ్ఞత చూపుతారనే ఆయన ఇవన్నీ మీకు ప్రసాదించాడు. (77,78)

వారు ఆకాశంలో ఎగిరే పక్షుల్ని పరికించి చూడలేదా?[8] వాటిని (శూన్యంలో) దేవుడు తప్ప మరెవరైనా నిలిపివుంచగలరా? విశ్వసించేవారికి ఇందులో గొప్ప సూచనలున్నాయి. (79)

దేవుడు మీకోసం మీ గృహాలను ప్రశాంత నిలయాలుగా చేశాడు. ఆయన మీ కోసం పశు చర్మాలతో తేలికపాటి గుడారాలు (కూడా) నిర్మించాడు. మీరు ప్రయాణం లో ఉన్నా, ఒకచోట బసచేసినా అవి (మోసుకెళ్ళడానికి) తేలిగ్గా ఉంటాయి. ఆ పశువుల రోమాలతో, ఉన్నితో, వెంట్రుకలతో మీరు ధరించే, వాడుకునే వివిధ వస్తువులు తయారుచేస్తారు. అవి కొంతకాలం వరకు మీకు ఉపయోగపడుతున్నాయి. (80)

ఇంకా దేవుడు తాను సృష్టించిన అనేక వస్తువుల ద్వారా మీకోసం నీడ ఏర్పాటు చేశాడు. పర్వతాలలో ఆశ్రయం పొందడానికి గుహలు నిర్మించాడు. ఎండవేడిమి నుండి కాపాడే దుస్తులు సృజించాడు. యుద్ధంలో మీకు రక్షణ కవచాలుగా ఉపయోగపడే దుస్తులు కూడా సృజించాడు. మీరు విధేయులై ఉంటారనే దేవుడు ఈవిధంగా మీకు అనేక ప్రయోజనాలు చేకూర్చి మేలుచేశాడు. ముహమ్మద్ (స)! (ఇంత నచ్చజెప్పినా) వీరు విముఖులైపోతే (పోని), సందేశాన్ని స్పష్టంగా అందజేయడమే నీ పని. దేవుడు చేసిన మేళ్ళేమిటో వారికి తెలుసు. అయినా వారు సత్యాన్ని నిరాకరిస్తున్నారు. వారిలో చాలామంది కృతఘ్నులే ఉన్నారు. (81-83)

మేము (తీర్పుదినాన) ప్రతి అనుచర సముదాయం నుండి ఒక సాక్షి (ప్రవక్త)ని తెచ్చి నిలబెట్టినప్పుడు అవిశ్వాసులకు (తమ గోడు వెళ్ళబోసుకోవడానికి) అనుమతి లభించదు.[9] క్షమాపణ కోరుకోమని కూడా వారికి చెప్పడం జరగదు. ఈ దుర్మార్గులు (నరక)యాతనను ఓసారి (చవి)చూసుకుంటే ఇక ఆయాతన తీవ్రత ఏమాత్రం తగ్గించ బడదు. (తప్పించుకోవడానికి) ఎలాంటి అవకాశం కూడా ఇవ్వబడదు. (84,85)

---

8. పక్షుల్లో 14 వేల జాతులున్నాయి. కొన్ని రకాల పక్షులు ఆకాశంలో 8 కిలోమీటర్ల ఎత్తు వరకు ఎగరగలవు. మరికొన్ని నేలపై వాలకుండా ఏకధాటిగా రెండువారాల దాకా ఎగరగలవు.

9. పునరుత్థాన దినాన విచారణకోసం మానవులందర్నీ తిరిగి బ్రతికించడం జరుగుతుంది. అప్పుడు ప్రతి జాతికి లేక అనుచర సమాజానికి చెందిన దైవప్రవక్త, లేదా ఆ ప్రవక్త అనంతరం ఆయన బోధనలు ప్రచారం చేసి ప్రజలకు పరలోకపరిణామాలను గురించి హెచ్చరించిన బోధకులు తాము తమజాతి ప్రజలకు దైవసందేశం అందజేశామని విశ్వప్రభువు ముందు సాక్ష్యం చెబుతారు. దాంతో సత్యతిరస్కారులకు ఎలాంటి సాకులు చెప్పుకునే అవకాశం ఏమాత్రం లభించదు. (ఇదే అధ్యాయంలోని 89 వ సూక్తి కూడా చూడండి.)



బహుదైవారాధకులు (తాము కల్పించుకున్న) మిధ్యాదైవాల్ని చూసినప్పుడు "ప్రభూ! నిన్ను వదలి మేము ప్రార్థించిన మా భాగస్వాములు (మిధ్యాదైవాలు) వీరే" అంటారు. కాని ఆ మిధ్యాదైవాలు వారి మాటలు ఖండిస్తూ "మీరు అసత్యవాదులు" అని స్పష్టంగా చెప్పేస్తాయి.[10] అప్పుడు వారు దేవుని ముందు పూర్తిగా లొంగిపోతారు. వారి అభూత కల్పనలన్నీ వారినుండి కనుమరుగైపోతాయి. (86,87)

స్వయంగా తాము సత్యాన్ని తిరస్కరించడమేగాక (ఇతరుల్ని కూడా) దైవమార్గం లోకి రాకుండా నిరోధించినవారికి వారి దుర్మార్గానికి ప్రతిఫలంగా మేము శిక్షపై శిక్ష విధిస్తాము. (ఇలా వారిని నరకంలో నానా యాతనలకు గురిచేస్తాము.) (88)

(ప్రవక్తా!) మేము ప్రతి అనుచర సముదాయంలో ఆ సముదాయానికే చెందిన ఒక సాక్షి (ప్రవక్త)ని తెచ్చి నిలబెడ్తాము. అతనా సముదాయానికి ప్రతికూలంగా సాక్ష్యమిస్తాడు. అప్పుడు వీరికి ప్రతికూలంగా సాక్ష్యమివ్వడానికి మేము నిన్ను తీసుకొచ్చి నిలబెడ్తాం. (దీని కోసమే) మేము ప్రతివిషయాన్నీ స్పష్టంగా విశదీకరించే (ఖుర్ఆన్) గ్రంథాన్ని నీపై అవతరింపజేశాం. ఈ గ్రంథం (మాకు) విధేయులైనవారి కోసం చక్కటి మార్గదర్శినిగా, కారుణ్యప్రదాయినిగా, శుభవార్త ప్రకటనగా అవతరించింది. (89)

దేవుడు మిమ్మల్ని న్యాయంగా వ్యవహరించాలని, మేలు చేయాలని, బంధువుల పట్ల దయతో మెలగాలని ఆదేశిస్తున్నాడు. చెడు, అశ్లీలం, దౌర్జన్యాల జోలికి పోకూడదని వారిస్తున్నాడు. మీరు విషయం గ్రహించడానికి దేవుడు మీకీ విధంగా ఉపదేశిస్తున్నాడు. దేవుని పేరుమీద మీరేదైనా వాగ్దానం చేసివుంటే దాన్ని నెరవేర్చండి. అలాగే దేవుడ్ని సాక్షిగా చేసి మీరేదైనా ప్రమాణం చేసివుంటే దాన్ని భంగపరచకండి. దేవుడు మీ చర్యలన్నిటినీ గమనిస్తున్నాడు. (90,91)

కష్టపడి నూలు వడికి దాన్ని చేజేతులా ముక్కలు ముక్కలుగా త్రెంచివేసిన స్త్రీలా మీ పరిస్థితి మారకూడదు. ఒకజాతి మరొకజాతి కంటే ఎక్కువ ప్రయోజనాలు పొందే దురుద్దేశ్యంతో మీరు పరస్పరం మోసగించుకోవడానికి మీ ప్రమాణాలను పనిముట్లుగా వాడుతున్నారు. కాని దేవుడు ఈ ప్రమాణాలు, వాగ్దానాల ద్వారా మిమ్మల్ని పరీక్షకు గురిచేస్తున్నాడు. మీరు పరస్పరం విభేదించుకున్న విషయాల్లోని నిజానిజాలేమిటో ప్రళయదినాన దేవుడు తప్పకుండా మీముందు వెల్లడిస్తాడు. (92)

---

10. ఇక్కడ మిధ్యదైవాలు, మీరు మమ్మల్ని అసలు ఆరాధించ లేదంటూ బహుదైవారాధకు లను తిరస్కరిస్తారని అర్థం కాదు. మేమసలు దేవుడ్ని వదలి మమ్మల్ని ప్రార్థించమని మీకు ఎన్నడూ చెప్పలేదని, అసలు మీ ప్రార్థనల్ని గురించే మాకు తెలియదని అంటారు. మీరు మమ్మల్ని కోరికలు తీర్చేవారిగా, ఆపదల మొక్కులవారిగా భావించారంటే అది మీతప్పేగాని, దానికి మేము బాధ్యులం కామని కూడా చెబుతారు. ఈవిధంగా బహుదైవారాధకులు దేవుని ముందు చెప్పే అసత్యాన్ని వారు ఖండిస్తారు. దీన్నిబట్టి ప్రజలు దేవుని విషయంలో సరైన ఆధారాలు, గట్టి ప్రమాణాలేవీ లేకుండా మతనాయకులనేబడే వారిలో ఎవర్ని బడితే వారిని గుడ్డిగా అనుసరించకూడదని, ప్రతి మనిషీ తన జీవితవిధానానికి, నడవడికకు వ్యక్తిగతంగా దేవుని ముందు బాధ్యుడవుతాడని తెలుస్తోంది. (ఇతర వివరాలకు 10:28,29; 39:3 సూక్తులు, వాటి పాదసూచికలు చూడండి.)

(మీలో ఎలాంటి విభేదాలు లేకుండా ఉండాలని) దేవుడు సంకల్పించుకుంటే ఆయన మిమ్మల్నందర్నీ ఒకే జాతిగా, ఒకే సమాజంగా చేసేవాడు. కాని దేవుడు తాను తలచిన విధంగా కొందరిని మార్గభ్రష్టత్వంలో పడవేస్తాడు; మరికొందరికి రుజుమార్గం చూపిస్తాడు. (తీర్పుదినాన) మీకర్మల్ని గురించి తప్పక విచారణ జరుగుతుంది. (93)

(ముస్లిములారా!) మీరు పరస్పరం మోసగించుకోవడానికి మీ ప్రమాణాలను పని ముట్లుగా వాడకండి. అలా చేస్తే (ధర్మంలో) స్థిరంగా ఉన్న (నవముస్లింల) పాదాలు తడబడవచ్చు. (ఇలా) దైవమార్గంలో అవరోధం సృష్టించిన నేరానికి మీరు దుష్ఫలితం చవిచూడవలసి వస్తుంది; కఠినాతి కఠినశిక్ష అనుభవించవలసి వస్తుంది. (94)

దేవుని పేరుతో మీరు చేసిన ప్రమాణం, ఒప్పందాలను స్వల్పమూల్యానికి అమ్మకండి. మీరు గ్రహించగలిగితే దేవుని దగ్గర ఉన్న (పరలోక సంప)దే మీ కోసం ఎంతో శ్రేష్ఠమయినది. మీ దగ్గరున్న (ఐహిక) సంపద ఖర్చయి (అంతమయి) పోయేదే. దేవుని దగ్గరున్న (పరలోక) సంపద మాత్రమే ఎన్నటికీ తరగకుండా శాశ్వతంగా ఉంటుంది. సహనం వహించినవారికి మేము వారి సత్కర్మలకు తప్పకుండా శ్రేష్ఠమైన ప్రతిఫలం ప్రసాదిస్తాము. (95,96)

పురుషుడయినా, స్త్రీ అయినా విశ్వాసి అయివుండి సత్కార్యాలు చేస్తే, వారికి మేము పరిశుద్ధ జీవితం గడిపేలా చేస్తాము. వారి సత్కర్మలకు అతిశ్రేష్ఠమైన ప్రతిఫలం ప్రసాదిస్తాం. (97)

మీరు ఖుర్ఆన్ పఠించబోతునప్పుడు (ముందుగా) శాపగ్రస్తుడయిన షైతాన్ బారి నుండి దేవుణ్ణి శరణు వేడుకోండి. విశ్వప్రభువును నమ్ముకున్న విశ్వాసులపై వాడి పాచిక పారదు. వాణ్ణి సంరక్షకుడిగా చేసుకొని (వాడు ఆడించినట్లు ఆడుతూ) మిథ్యా దైవాల్ని ఆరాధించేవారిపై మాత్రమే వాడి ఆటలు సాగుతాయి. (98-100)

ఏసూక్తిని అవతరింపజేయాలో, (ఏసూక్తిని రద్దుచేయాలో) దేవునికి బాగా తెలుసు. (అయితే) మేము ఒక సూక్తిని రద్దుచేసి దాని స్థానంలో మరొక సూక్తిని అవతరింపజేసి నప్పుడు ఈతిరస్కారులు (ముఖం చిట్లిస్తూ)"నీవే ఈ ఖుర్ఆన్ని కల్పించి తెస్తున్నావ"ని అంటారు. అసలు వారిలో చాలామంది. అజ్ఞానులు, మూర్ఖులే ఉన్నారు. (101)

వారికిలా చెప్పు: "దీన్ని పరిశుద్ధాత్మ[11] యథాతథంగా మీ ప్రభువు దగ్గర నుండి అవతరింపజేశాడు. విశ్వాసుల విశ్వాసాన్ని మరింత పటిష్ఠం చేయడానికి, విధేయులైన వారికి సన్మార్గం చూపి, శుభవార్త అందజేయడానికి (ఈగ్రంథం అవతరించింది)." (102)

నీగురించి వారు, ఒకవ్యక్తి ఇతనికి (ఖుర్ఆన్) నేర్పుతున్నాడని చెబుతున్న సంగతి మాకు తెలుసు. కాని వారు ఏ మనిషిని ఉద్దేశించి ఈ మాటలు అంటున్నారో అతను అరబ్బేతరుడు. ఇదేమో స్పష్టమైన అరబీ భాషలో అవతరించింది. (103)

---

11. దేవుని దగ్గర్నుంచి ఆయన ప్రవక్తలకు దివ్యావిష్కృతి (వహీ)ని చేరవేసే దైవదూత హజ్రత్ జిబ్రీల్ (అలైహి)ని ఇక్కడ పరిశుద్ధాత్మ అని పేర్కొనబడింది.



దేవుని సూక్తులు విశ్వసించని వారికి దేవుడు ఎన్నటికీ సన్మార్గబుద్ధి ప్రసాదించడు. అలాంటివారికి దుర్భరయాతన తప్పదు. దేవుని సూక్తులు విశ్వసించనివారే (ఇలాంటి) అబద్ధాలు పలుకుతారు. వారే అసలు అసత్యవాదులు. (104,105)

ఎవరైనా దేవుణ్ణి, (ఆయన ప్రవక్తను) విశ్వసించాక వత్తిడి బలప్రయోగాల వల్ల అవిశ్వాస ధోరణి వ్యక్తం చేస్తే, అప్పుడతని హృదయం మాత్రం విశ్వాసస్థితిలోనే ఉంటే అలాంటి వ్యక్తిపై దోషంలేదు.[12] అలాగాకుండా ఎవరైనా ఉద్దేశ్యపూర్వకంగానే తిరస్కార వైఖరి అవలంబిస్తే అతనిపై దైవాగ్రహం విరుచుకు పడుతుంది. అలాంటివారికి ఘోరమైన (నరక)యాతన ఉంది. (106)

---

12. హింసాదౌర్జన్యాలు జరుగుతున్నప్పుడు మనిషి ప్రాణభయంతో మనస్ఫూర్తిగా అవిశ్వాస (కుఫ్ర్) పలుకులు పలకకూడదు. పూర్తిగా విశ్వాస (ఈమాన్) స్థితిలో ఉన్నప్పుడు మాత్రమే అవిశ్వాస (కుఫ్ర్) పలుకులు పలకడానికి ఈసూక్తిలో అనుమతి ఇవ్వబడింది. అయితే విశ్వాసాన్ని కాపాడు కోవడానికి ప్రాణం పోయినా సరే, సహనం వహించడం గొప్ప త్యాగం అన్పించుకుంటుంది. ప్రవక్త అనుచరుల్లో ఈ రెండు వైఖరులు మనకు గోచరిస్తాయి.

హజ్రత్ ఖబ్బాబ్ బిన్ అరత్ (రజి)ని మక్కా బహుదైవారాధకులు అగ్నికణాల మీద పడవేసి అదిమి పట్టి ఉంచుతారు. దాంతో ఆయన వీపుమీది చర్మం కాలి కొవ్వు కరిగిపోతుంది. ఆ కరిగిన కొవ్వుతోనే నిప్పుకణాలు చల్లబడి పోతాయి. అయినా ఆ సహనశీలి తన నోట ఎలాంటి అవిశ్వాస పలుకులు రానివ్వకుండా ఇస్లాం ధర్మంలో స్థిరంగా ఉంటారు.

హజ్రత్ బిలాల్ (రజి)ని అవిశ్వాసులు ఇనుప కవచం తొడిగించి మలమలమాడే ఎండలో గంటల తరబడి నిలబెట్టేవారు. తరువాత ఎండకు తీవ్రంగా కాలుతున్న ఇసుక మీద పడవేసి ఈడ్చేవారు. అయినప్పటికీ ఆయన సహనం వహించి ఒక్కడే, (దేవుడొక్కడే) అని పలికేవారు.

హజ్రత్ హబీబ్ బిన్ జైద్ (రజి)కు బూటకపు ప్రవక్త ముసైలిమా దుర్భర యాతనలు పెడతాడు. ఒక్కొక్క అవయవాన్ని నరికి వేస్తూ తనను దైవప్రవక్తగా అంగీకరించమని హింసించేవాడు. అయితే హజ్రత్ హబీబ్ (రజి) ఇలా తన అవయవాలు అనేకం తెగిపోయి చివరికి ప్రాణం విడుస్తారు. కాని ఆ దుర్మార్గుణ్ణి దైవప్రవక్తగా అంగీకరించరు. పైగా తన అవయవం తెగిపోయిన ప్రతిసారీ ఆయన అతని మాటను గట్టిగా తిరస్కరిస్తుండేవారు.

హజ్రత్ అమ్మార్ బిన్ యాసిర్ (రజి) కళ్ళెదుటే ఆయన తల్లిదండ్రుల్ని సత్యతిరస్కారులు చిత్రహింసలు పెట్టి చంపేశారు. ఆ తరువాత ఆయన్ని కూడ ఆ దుర్మార్గులు నానా యాతనలు పెడ్తూ, తాము చెప్పినట్లు ముహమ్మద్ (సల్లం)ని దూషించి, తమ దేవతలను పొగడవలసిందిగా బలవంతం చేశారు. చివరికి హజ్రత్ అమ్మార్ (రజి) ఈ బాధలకు తాళలేక వారు పలకమని ఆదేశించిన మాటలన్నీ పలికారు.

ఆ తరువాత ఆయన రోదిస్తూ దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి "దైవప్రవక్తా! నేను మిమ్మల్ని గురించి చెడుగా, వారి దేవతలను గురించి మంచిగా పలకనంతవరకు వారు నన్ను వదలి పెట్టలేదు" అని అన్నారు. దైవప్రవక్త (సల్లం) ఈ మాటలు విని "అప్పుడు నీ హృదయస్థితి ఎలా ఉండింది?" అని అడిగారు. దానికి ఆయన "నేనప్పుడు పూర్తి విశ్వాస (ఈమాన్) స్థితిలోనే ఉన్నాను" అని సమాధానమిచ్చారు. "అయితే వారు మరెప్పుడైనా ఇలా దౌర్జన్యం చేస్తే, నీవు మళ్ళీ అలాంటి మాటలే పలుకు" అన్నారు దైవప్రవక్త (సల్లం) (ఇబ్నెకసీర్)

వారసలు పరలోక జీవితానికి బదులు ప్రాపంచిక జీవితాన్నే కోరుకున్నారు. అలాంటి అవిశ్వాసులకు దేవుడు ఎన్నటికీ సన్మార్గం చూపడు. దేవుడు వారి హృదయ కవాటాలు మూసివేశాడు. వారి చెవులకు, కళ్ళకు సీలువేశాడు. వారు పూర్తిగా ఏమరుపాటుకు గురయ్యారు. వారే పరలోకంలో ఘోరంగా నష్టపోయేవారు. అందులో ఇక ఎలాంటి అనుమానానికి ఆస్కారం లేదు. (107-109)

దీనికి భిన్నంగా (సత్యాన్ని విశ్వసించిన కారణంగా) పీడించబడి, చివరికి స్వస్థలం వదలి వలసపోయినవారు; ఆ తర్వాత దైవమార్గంలో పోరాడుతూ అనేక ఒడిదుడుకులు ఎదుర్కొన్నవారు; సహనంతో వ్యవహరించినవారు- అలాంటివారి పట్ల నీప్రభువు గొప్ప క్షమాశీలి, అమిత దయామయుడు. మానవులంతా తమను తాము కాపాడుకునే ప్రయత్నంలో మునిగి ఉండే (ప్రళయ)దినాన ప్రతి మనిషికీ అతను చేసుకున్న కర్మలకు పూర్తి ప్రతిఫలం లభిస్తుంది. ఎవరికీ ఎలాంటి అన్యాయం జరగదు. (110,111)

దేవుడు ఒక పట్టణం గురించిన ఉదాహరణ ఇస్తున్నాడు (గమనించండి): ఆ పట్టణవాసులు ఎంతో ప్రశాంత జీవితం గడుపుతున్నారు. నలువైపుల నుండి వారికి హాయిగా ఉపాధి లభిస్తోంది. కాని ఆ ప్రజలు దేవుడు చేసిన ఈ మేళ్ళను విస్మరించి ఆయనకు కృతఘ్నులైపోయారు. అప్పుడు దేవుడు వారికి వారి దుష్కర్మల పర్యవసానం చవిచూపించాడు. ఆకలి, భయాందోళనల మహోపద్రవం వారిపై వచ్చిపడింది. వారి దగ్గరికి వారి జాతికి చెందిన ఒక ప్రవక్త వచ్చినప్పటికీ వారతని మాటలు వినకుండా నిరాకరించారు. చివరికి ఆ దుర్మార్గులపై (దైవ)శిక్ష విరుచుకుపడింది. (112,113)

కాబట్టి మానవులారా! దేవుడు ప్రసాదించిన ధర్మసమ్మతమైన పరిశుద్ధ ఉపాధిని తింటూ ఆయనకు కృతజ్ఞులయి ఉండండి. మీరు నిజంగా దేవుడ్ని ఆరాధించేవారయితే ఇలా చేయండి. ఆయన మీకు మృత జంతువుని, రక్తాన్ని, పందిమాంసాన్ని, దైవేతరులకు నివేదించబడినదాన్ని నిషేధించాడు.[13] అయితే ఎవరైనా ఆకలికి తాళలేక గత్యంతరంలేని పరిస్థితిలో ఈ నిషేధితాలు తింటే అందులో తప్పు లేదు. కాకపోతే అతను దైవాజ్ఞను ఉల్లంఘించే, హద్దుమీరిపోయేవాడై ఉండకూడదు. (అలాంటివారి విషయంలో) దేవుడు క్షమించేవాడు, కరుణించేవాడు. (114,115)

---

13. ఈ విషయాన్ని ఇంతకు పూర్వం మూడు చోట్ల ప్రస్తావించడం జరిగింది. 2:173, 5:3, 6:145 సూక్తులు చూడండి. దైవేతరశక్తుల పేర్లతో జిబహ్ చేయబడిన పశుపక్షుల మాంసం తినడం నిషిద్ధం (హరాం) అనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే కొందరు ముస్లింలు దర్గాల దగ్గర, వలీల (దైవప్రియుల) సమాధుల దగ్గర తమ మొక్కుబడులు తీర్చుకోవడానికి దేవునిపేరుతో జిబహ్ చేసే పశువుల మాంసం తినడంలో తప్పులేదని భావిస్తారు. కాని ఆ పశువుల్ని దేవునిపేరు ఉచ్చరించి జిబహ్‌చేసినా వారి అసలు ఉద్దేశ్యం ఆ దైవప్రియుల్ని ప్రసన్నం చేసుకోవడమే గనక వారి సమాధుల దగ్గర జిబహ్ చేసే పశువులు కూడా నిషిద్ధమే.

"జిబహ్ చేసేటప్పుడు దేవుని పేరు ఉచ్చరించినప్పటికీ, దైవేతరుల పేరు ప్రస్తావించబడిన ప్రతి జంతువూ నిషిద్ధమే" అని సుప్రసిద్ధ గ్రంథం బైజావీలో పేర్కొనబడింది. అలాగే "ఎవరైనా పాలకుడు, ప్రభుత్వాధికారి, లేదా గొప్పవ్యక్తి రాకపట్ల ఆయన్ని గౌరవించి ప్రసన్నం చేసుకోవడానికి జంతువును దేవుని పేరుతో జిబహ్ చేసినప్పటికీ అది హరాం అవుతుంది" అని హనఫీ ఫిఖ్హా గ్రంథం దుర్రెముఖ్తార్‌లో కూడా ఉంది.



మీరు ఇట్టే నోటికొచ్చినట్లు "ఇది ధర్మసమ్మతమైనది, అది అధర్మమైనది" అని అబద్ధాలు పలుకుతున్నారు. ఇలాంటి ఆజ్ఞలు జారీచేస్తూ దేవుని మీద అసత్యాన్ని మోపకండి. దేవుని మీద అసత్యారోపణలు చేసేవారు ఎన్నటికీ సాఫల్యం చెందలేరు. (అసత్యాల ద్వారా) కొన్నాళ్ళు మాత్రమే ప్రయోజనం పొందగల్గుతారు. కాని చివరికి వారు (పరలోకంలో) దుర్భర శిక్ష చవిచూడవలసి వస్తుంది. (116,117)

దీనికి పూర్వం మేము నీకు తెలియజేసినవాటిని యూదులకు నిషేధించాము. మేము వారికి అన్యాయం చేయలేదు. వారే తమకుతాము అన్యాయం చేసుకునేవారు. అయితే ఎవరైనా అజ్ఞానం వల్ల పాపకార్యం చేసి ఆ తరువాత పశ్చాత్తాపంచెంది తమ నడవడికను సరిదిద్దుకుంటే, అలాంటివారి పాలిట నీప్రభువు అపార క్షమాశీలి, అమిత దయామయుడు అవుతాడు. (118,119)

ఇబ్రాహీం (యావత్సమాజానికి) గొప్ప నాయకుడు. దేవుని పట్ల పూర్తి విధేయతతో కూడిన అంకితభావంగల భక్తుడు. అతను ఏనాడూ దైవేతరశక్తుల్ని ఆరాధించినవాడు కాదు. దేవుడు చేసిన మహోపకారాల పట్ల ఆయనకు సదా కృతజ్ఞుడయి ఉండేవాడు. (అంచేత) దేవుడు అతడ్ని ప్రత్యేకంగా ఎన్నుకొని రుజుమార్గం చూపాడు. పైగా ప్రపంచంలో అతనికి మంచిని ప్రసాదించాడు. పరలోకంలో అతను తప్పకుండా సజ్జనులలో పరి గణించబడతాడు. అందువల్ల నీవు ఏకాగ్రచిత్తుడవై బహుదైవారాధకుడు కాని ఇబ్రహీం (జీవన) విధానాన్ని అనుసరించమని మేము నీదగ్గరకు దివ్యావిష్కృతి (వహీ) అవతరింపజేశాము. (120-123)

శనివారం నియమంతో విభేదించినవారి పైన్నే మేము దాన్ని విధించాం. వారు విభేదించినవాటి గురించి నీప్రభువు తప్పకుండా ప్రళయదినాన తీర్పుచేస్తాడు. (124)

ప్రవక్తా! ప్రజలను వివేకంతో, చక్కని ఉపదేశంతో నీ ప్రభువు మార్గం వైపునకు పిలువు. ఉత్తమోత్తమ రీతిలో విషయాన్ని వారితో చర్చించు. ఎవరు సన్మార్గంలో ఉన్నారో, ఎవరు ఆ మార్గం తప్పారో నీ ప్రభువుకు బాగా తెలుసు. (125)

మీరు ప్రతీకారం తీర్చుకోదలచుకుంటే మీపై ఏమేరకు దౌర్జన్యం జరిగిందో ఆమేరకే ప్రతీకారం తీర్చుకోండి. అయితే మీరు సహనం వహిస్తే (మంచిది), ఆ సహనం సహనశీలురకు ఎంతో ప్రయోజనకరమవుతుంది. ప్రవక్తా! సహనం వహించు. ఈ సహన గుణం నీకు దైవానుగ్రహం వల్లనే అబ్బింది. (కనుక) వారి చేష్టల పట్ల బాధపడకు. వారి దుష్టపన్నాగాలకు మనస్సు చిన్నబుచ్చుకోకు. దేవుడు పరోపకారులు, దైవభీతిపరాయణుల పక్షానే ఉంటాడు. (126-128) ✪

---

ఒక హదీసు ప్రకారం ఒకతను దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి "నేను 'బవానా' ప్రదేశంలో (మొక్కుబడి) ఒంటెను జిబహ్ చేయదలిచాను" అని అన్నాడు. దైవప్రవక్త (సల్లం) ఈమాట విని "అక్కడ మూఢకాలంలో ప్రజలు పూజిస్తూ ఉండిన విగ్రహం ఏదైనా ఉందా?" అని అడిగారు. దానికి ప్రజలు లేదన్నారు. "మరి అక్కడివారు తమ (గత)ఉత్సవాలలో ఏదైనా ఉత్సవాన్ని జరుపుకునేవారా?" అని అడిగారు దైవప్రవక్త (సల్లం) మళ్ళీ. దానికి ప్రజలు అలాంటిదేమీ లేదన్నారు. అప్పుడాయన ఆ ప్రదేశంలో మొక్కుబడి తీర్చుకోవడానికి ఆ వ్యక్తికి అనుమతి ఇచ్చారు. ✪

# 17. ఇస్రాయీల్ సంతతి (బనీ ఇస్రాయీల్)

**అవతరణ: మక్కా** **సూక్తులు: 111**

ఈ అధ్యాయాన్ని “బనీ ఇస్రాయీల్” (ఇస్రాయీల్ సంతతి) అంటారు. అయితే ఇందులో ఇస్రాయీల్ సంతతి గురించి చాలా తక్కువగా ప్రస్తావించబడింది. ఇది దైవప్రవక్త (సల్లం) గగన పర్యటన (మేరాజ్) సందర్భంగా హిజ్రీ శకారంభానికి ఒక సంవత్సరం ముందు అవతరించినట్లు అనేక ఉల్లేఖనాలను బట్టి తెలుస్తోంది.

ఇస్రాయీల్ సంతతితో పాటు అనేక ఇతరజాతులు సత్యానికి విముఖులయి చవిచూసిన దుష్పర్యవసానాల నుండి గుణపాఠం గ్రహించి, ముహమ్మద్ ప్రవక్త (స) అందజేసే సందేశం స్వీకరించవలసిందిగా దేవుడు ఈ అధ్యాయంలో బహుదైవారాధకులకు హితవుచేశాడు.

అంతేగాక ఇందులో మానవతా విలువల్ని గురించిన మౌలిక విషయాల్ని కూడా ప్రస్తావించడం జరిగింది. అంటే, మానవుల ప్రాథమిక హక్కులేమిటో తెలుసుకొని, వాటిని నెరవేర్చాలని నొక్కి చెప్పడం జరిగింది. ఆ తరువాత అవిశ్వాసుల వేధింపులకు గురయి దుర్భరజీవితం గడుపుతున్న ముస్లింలకు సహనం వహించాలని, దైవమార్గంలో స్థిరచిత్తులయి ఉండాలని హితోపదేశం చేయబడింది.

### కరుణామయుడు, కృపాసాగరుడయిన దేవుని పేరుతో ప్రారంభం

దేవుడు ఎంతో పరిశుద్ధుడు. ఆయన తన నిదర్శనాలు చూపడానికి ఒకరోజు రాత్రి వేళ తన దాసుణ్ణి కాబామసీదు నుండి దూరాన ఉన్న అఖ్సామసీదు దగ్గరకు తీసి కెళ్ళాడు.[1] ఆ మసీదు పరిసరాలను ఆయన శుభవంతం చేశాడు. నిస్సందేహంగా ఆయన సమస్తం వింటున్నాడు. ప్రత్యక్షంగా ప్రతిదాన్నీ చూస్తున్నాడు. (1)

---

1. ఇది మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం)గారి గగన పర్యటనకు సంబంధించిన సంఘటన. దీన్నే మేరాజ్ అంటారు. వివిధ హదీసుల ప్రకారం మహాప్రవక్త (సల్లం) ఓరోజు రాత్రి నిద్రపోతుంటే దైవదూత జిబ్రీల్ (అలైహి) వచ్చి ఆయన్ని బురాఖ్ అనే దివ్యవాహనం మీద (జెరూసలేం) బైతుల్ మఖ్దిస్ (అఖ్సా) మస్జిద్‌కు తీసికెళ్ళారు. అక్కడ (గత) దైవప్రవక్తలతో కలసి నమాజ్ చేశారు. అక్కడ నుంచి ప్రత్యేక సోపానం ఎక్కి కాంతిని మించిన వేగంతో ఊర్ధ్వలోకాలకు వెళ్ళారు. ఆయా లోకాలలో కొందరు ప్రముఖ దైవప్రవక్తలను కలుసుకున్నారు. అక్కడ్నుంచి ఆయన ఒంటరిగా రఫ్‌రఫ్ అనే మరో విశేష మాధ్యమం ద్వారా బురాఖ్‌ని మించిన వేగంతో దేవునికి చాలా దగ్గరగా వెళ్ళారు. ఆయనతో ప్రత్యక్షంగా మాట్లాడారు. ఆ సందర్భంలో దేవుడు “ముస్లింలు ప్రతిరోజూ అయిదు వేళలు విధిగా నమాజ్ చేయాలి” అన్న ఆజ్ఞ జారీచేశాడు.

మరికొన్ని ఉల్లేఖనాల ప్రకారం దైవప్రవక్త (సల్లం) సప్తాకాశాల పర్యటన సందర్భంగా స్వర్గ నరకాలు, అక్కడి విశేషాలను కూడా కళ్ళారా చూసినట్లు తెలుస్తోంది. అంతటి సుదీర్ఘ పర్యటన కేవలం కొన్ని నిమిషాలలో పూర్తికావడం విశేషం. మరునాడు ఉదయం మేరాజ్ వృత్తాంతం గురించి దైవప్రవక్త (సల్లం) జనానికి తెలిపితే అవిశ్వాసులు ఆయన్ని హేళన చేశారు. అదొక అత్యంతాసక్తికరమైన ఉదంతం. (ఈ సంఘటన గురించి వివరంగా తెలుసుకోడానికి ‘ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్’ నుండి వెలువడిన “మహనీయ ముహమ్మద్ (స) ఆదర్శజీవితం” పుస్తకం చదవండి.)



మేము ఇదివరకు మూసాకు కూడా దివ్యగ్రంథం ప్రసాదించాము. నన్ను తప్ప మరెవరినీ సంరక్షకుడిగా చేసుకోవద్దని ఉపదేశిస్తూ ఆ గ్రంథాన్ని మేము ఇస్రాయీల్ సంతతికి మార్గదర్శినిగా చేశాము. నూహ్‌తో పాటు మేము ఓడలో ఎక్కించినవారి సంతానమా! (వినండి) నూహ్ దేవుని పట్ల కృతజ్ఞుడయిన భక్తుడు. (2,3)

మేము మాగ్రంథంలో ఇస్రాయీల్ సంతతివారిని హెచ్చరిస్తూ, మీరు ప్రపంచంలో రెండుసార్లు సంక్షోభం సృష్టిస్తారని, మితిమీరిన దురహంకారం ప్రదర్శిస్తారని పేర్కొన్నాం. ఆ రెండిటిలో మొదటిసారి దురంహంకారం ప్రదర్శించే సమయం ఆసన్నమైనప్పుడు మేము మీకు వ్యతిరేకంగా అత్యంత శక్తిమంతులైన మా దాసుల్ని తీసుకొచ్చాము. వారు మీ దేశంలో చొచ్చుకుపోయి నలుమూలలా వ్యాపించారు. అదొక వాగ్దానం. అది ఈ విధంగా నెరవేరింది. తరువాత మీకు వారిపై ఆధిక్యత పొందే అవకాశమిచ్చాము. సంతానం, సిరిసంపదలతో మీకు సహాయం చేశాం. మీ జనాభాను అధికం చేశాం. వినండి! మీరేదైనా మంచిపని చేస్తే అది మీశ్రేయస్సుకే దోహదపడుతుంది. చెడుపని చేస్తే అది మీకీడుకే దారితీస్తుంది.

ఆ తరువాత రెండవ వాగ్దాన సమయం వచ్చినప్పుడు మీకు వ్యతిరేకంగా మేము మరొక శత్రువర్గాన్ని తెచ్చిపెట్టాము. వారు మీ రూపురేఖలను వికృతంగా మార్చివేయడానికి, ఇదివరకటి శత్రువర్గంలాగే (బైతుల్ మఖ్దిస్) మసీదులోకి చొచ్చుకు పోవడానికి, వారు ఆక్రమించిన ప్రతిదాన్నీ సర్వనాశనం చేయడానికి మేమిలా చేశాము. (4-7)

ఇప్పుడు మీ ప్రభువు మిమ్మల్ని కరుణించే అవకాశం లేకపోలేదు. అయితే మీరు మళ్ళీ గతంలో చేసినటువంటి చేష్టలే చేస్తే మాత్రం, మేము కూడా మీకు తిరిగి అదే శాస్తి చేస్తాం. సత్యతిరస్కారుల కోసం మేము నరకాన్ని కారాగారంగా చేసిఉంచాం. (8)

నిస్సందేహంగా ఈ ఖుర్ఆన్ పూర్తిగా రుజుమార్గం చూపుతుంది. సత్యాన్ని విశ్వసించి సత్కర్మలు ఆచరించేవారికి గొప్పప్రతిఫలం లభిస్తుందని శుభవార్త అందజేస్తోంది. పరలోకాన్ని విశ్వసించనివారికి మేము దుర్భర యాతన సిద్ధపరచి ఉంచామని కూడా ఇది హెచ్చరిస్తోంది. మానవుడు (ముందుచూపు లేకుండా) మేలుకు బదులు కీడు కోరుకుంటున్నాడు. అతను నిజంగా చాలా తొందరపాటు కలవాడు. (9-11)

మేము రాత్రిని, పగటిని రెండు సూచనలుగా చేశాము. రాత్రి సూచనను (మీ విశ్రాంతి కోసం) చీకటిమయంగా చేశాం. అలాగే మీరు మీప్రభువు అనుగ్రహం (ఉపాధి) అన్వేషించడానికి; నెలలు, సంవత్సరాల లెక్క తెలుసుకోవడానికి వీలుగా మేము పగటిని ప్రకాశవంతంగా చేశాం. ఈ విధంగా మేము ప్రతి విషయాన్నీ స్పష్టంగా విశదీకరిస్తున్నాం. (12)

మేము ప్రతి మానవుడి జాతకాన్ని అతని మెడలోనే వ్రేలాడదీశాం. ప్రళయదినాన ఒక చిట్టా తీసి అతనిముందు పెడ్తాము. అతను దాన్ని తెరచిన పుస్తకంలా చూస్తాడు- “ఇదిగో చదువుకో నీకర్మల చిట్టా. ఈరోజు నీ కర్మలలెక్క చూడటానికి నీవే చాలు.” (13,14)

ఏమనిషి సన్మార్గం అవలంబిస్తాడో ఆ సన్మార్గం అతనికే లాభదాయకమవుతుంది. అలాగే ఎవడు మార్గభ్రష్టుడై పోతాడో ఆ మార్గభ్రష్టత్వం అతనికే చేటు తెచ్చిపెడ్తుంది. (పాప)భారం మోసే వాడెవడూ ఇతరుల (పాప)భారం మోయలేడు. (ప్రజలకు ధర్మం ఏమిటో, అధర్మం ఏమిటో వివరించడానికి) ఒక సందేశహరుణ్ణి పంపనంతవరకు మేము ఎవరినీ ఎన్నటికీ శిక్షించము.[2] (15)

మేమేదైనా జనపదం నాశనం చేయదలచుకుంటే ముందుగా అక్కడి ధనికులకు ఒక ఆజ్ఞ జారీచేస్తాము. దాన్ని వారు పెడచెవినపెట్టి దుర్మార్గాలకు పాల్పడతారు. దాంతో ఆ జనపదం శిక్షార్హురాలై పోతుంది. మేము దాన్ని సమూలంగా తుడిచిపెడ్తాం.[3] (ఇలా)

---

2. ఖుర్ఆన్‌లోనే కొన్నిచోట్ల దేవుడు అవిశ్వాసుల్ని విచారిస్తూ "మీ దగ్గరికి నా ప్రవక్తలు రాలేదా?"అని ప్రశ్నిస్తాడు. దానికి వారు వచ్చారని చెబుతారు. దైవప్రవక్తలు-దివ్యగ్రంథాలు చేరని వారు, బధిరులు, ఉన్మాదులు, మనోవ్యాధిగ్రస్తులు, ఇద్దరుప్రవక్తల మధ్యకాలంలో చనిపోయినవారి గురించి కూడా దేవుడు ప్రళయదినాన తీర్పుచేస్తాడు. వారికి ఎలాంటి అన్యాయం జరగదు.

ఆరోజు ఆయన "నరకంలో ప్రవేశించండ"ని ఆజ్ఞాపిస్తాడు వారిని (తన దూతల ద్వారా). అప్పుడు వారిలో కొందరు దైవాజ్ఞ శిరసావహిస్తూ వెంటనే నరకంలో ప్రవేశిస్తారు. అయితే నరకం వారిని కాల్చదు. (ఎలాంటి బాధా ఉండదు.) ఆ తరువాత వారిని స్వర్గానికి పంపడం జరుగుతుంది. మరికొందరు ఈ ఆజ్ఞను పాటించడానికి సిద్ధపడరు. దైవదూతలు అలాంటివారిని ఈడ్చికెళ్ళి నరకంలో విసరి పడేస్తారు. (ముస్నద్ అహ్మద్)

ఏమయినప్పటికీ దైవధర్మం అంటే ఏమిటో తెలియని వ్యక్తికి అది ఎవరి ద్వారానైనా, ఏ రూపంలోనైనా చేరిన తరువాత ఇక అతనే తన కర్మలకు బాధ్యుడవుతాడు. అంటే తనకు చేరిన సత్యాన్ని విశ్వసించి తదనుగుణంగా జీవితాంతం సాత్విక జీవితం గడిపితే పరలోకంలో అతను దైవ ప్రసన్నతకు, స్వర్గసౌఖ్యాలకు అర్హుడవుతాడు. అలా చేయకుండా తన ముందుకు వచ్చిన సత్యాన్ని తిరస్కరిస్తే దైవాగ్రహానికి గురయి నరకం పాలవుతాడు. తన దగ్గరకు సత్యం చేరలేదని సాకులు చెప్పడానికి ఇక అతనికెలాంటి అవకాశం లభించదు.

ఆ సత్యం అతనికి ఎవరిద్వారా ఏ రూపంలో చేరుతుందో, ఎలా చేరుతుందో దేవునికి మాత్రమే తెలుసు. అందువల్ల సత్యం చేరని వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించడం మాని, అలాంటి వారికి తాము సత్యాన్ని ఏ మేరకు చేరవేశామని ఆత్మపరిశీలన చేసుకోవడం విజ్ఞుల పని.

దైవసందేశం అందజేసే బాధ్యత దైవప్రవక్తలపై మాత్రమే లేదు. వారి అనుచరులయిన ముస్లింలపై కూడా ఉంది. ప్రవక్తలు తమ బాధ్యత నిర్వహించి నిష్క్రమించారు. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) కూడా తన బాధ్యత నెరవేర్చి వెళ్ళిపోయారు. ఇప్పుడా బాధ్యతను ఆయన అనుచరులైన ముస్లింలే నిర్వహించవలసి ఉంది. వారు తమ పొరుగున ఉండే, తమతో కలసి పనిచేసే, ప్రాపంచిక వ్యవహారాల్లో తరచుగా తమకు తారసపడే ముస్లిమేతరులకు దైవసందేశం అందజేయకపోతే మరణానంతరం దైవ న్యాయస్థానంలో ఈ ముస్లిమేతరులే వారిపై అభియోగం మోపుతారు. అప్పుడు విశ్వప్రభువు ముస్లిమేతరుల్ని వదలి ప్రచారబాధ్యత విస్మరించిన ముస్లింలను నిలదీసే ప్రమాదముంది. (ఇతర వివరాలకు 7:6 సూక్తి, దాని పాదసూచిక చూడండి.)

3. ఏదైనా జాతి లేక జనపదం పాపకార్యాలు చేయడంలో హద్దుమీరినప్పుడు దాన్ని హెచ్చ రించడానికి దేవుడు చిన్న చిన్న ప్రకృతి వైపరీత్యాలు తెచ్చిపెడ్తాడు. దాంతోపాటు దైవప్రవక్తల ద్వారా



మేము నూహ్(ప్రవక్త) తరువాత అనేక తరాలను నాశనం చేశాం. నీ ప్రభువుకు తన దాసుల పాపకార్యాలేమిటో బాగా తెలుసు. ఆయన అన్నిటినీ గమనిస్తున్నాడు. (16,17)

సత్వరం లభించే ప్రాపంచిక వస్తువులు కోరుకునేవారిలో మేము తలచిన వానికి తలచినది ఇహలోకంలోనే ఇచ్చివేస్తాం. తర్వాత అతనికి నరకం రాసిపెడ్తాం. చివరికి అతను నిరాశానిస్పృహలతో క్రుంగిపోయి నరకంలో కాలి మాడిపోతుంటాడు. (18)

ఇక పరలోకభాగ్యం కోరుకుంటూ దానికోసం తగిన కృషిచేసేవారైతే, దాంతోపాటు వారు విశ్వాసులు కూడా అయివుంటే, వారి కృషికి తప్పకుండా ఆదరణ లభిస్తుంది. ఈ ఉభయులకు మేము (ప్రపంచంలో ఎంతోకొంత) జీవనసామగ్రి ఇస్తుంటాము. ఇది నీప్రభువు అనుగ్రహం నీప్రభువు అనుగ్రహాన్ని ఎవరూ అడ్డుకోలేరు. (19,20)

మేము ప్రపంచంలో ఒకరిపై మరొకరికి ఎలా ఔన్నత్యం ప్రసాదించామో చూడండి.[4] పరలోకంలోనైతే వారి హోదా అంతస్తులు మరింత పెరుగుతాయి. (21)

కనుక మీరు దేవునితో పాటు మరోశక్తిని ఆరాధ్యదైవంగా చేసుకొని పూజించకండి. అలా చేస్తే మీరు నిందితులై, నిస్సహాయులై కూలబడి పోతారు. (22)

నీ ప్రభువు తన ఆజ్ఞలు ఇలా జారీ చేస్తున్నాడు:

- ♦ మీరు ఒక్క (నిజ) దేవుణ్ణి తప్ప మరెవరినీ ఆరాధించకండి.
- ♦ తల్లిదండ్రుల పట్ల సద్భావంతో మసలుకోండి. మీ ముందు వారిద్దరిలో ఎవరైనా వృద్ధులైఉంటే వారిని"ఉఫ్"అని కూడా విసుక్కోకండి. కసురుకుంటూ విదిలించి మాట్లాడకండి. వారితో గౌరవంగా మాట్లాడండి; దయార్ద్రహృదయంతో, వినయంతో వారి ముందు తలవంచిఉండండి. (వారిపట్ల గౌరవాదరణలతో) "ప్రభూ! వీరునన్ను చిన్నతనంలో ఎలా కరుణతో, వాత్సల్యంతో పెంచిపోషించారో అలా నీవు వీరిని కరుణించు" అని ప్రార్థించండి. (23,24)

మీ హృదయంలో ఏముందో మీ ప్రభువుకు బాగా తెలుసు. మీరు గనక సజ్జను లైఉంటే, (పశ్చాత్తాపంతో) తనవైపు మరలేవారందర్నీ ఆయన క్షమిస్తాడు. (25)

---

లేదా ప్రవక్తల అనుచరుల ద్వారా రుజుమార్గం వైపు పిలుస్తాడు. బహుశా ఈ విషయాన్నే ఇక్కడ"ఒక ఆజ్ఞ జారీ చేస్తాము"ని చెప్పబడింది. ముఖ్యంగా ఆ జాతి లేక జనపదంలోని పేరుపలుకుబడులు గల ధనికులకు, అధికారులకు ధర్మపథం వైపు పిలవడం జరుగుతుంది. అప్పటికీ ఆ జాతి దైవ సందేశాన్ని పెడచెవినబెట్టి చెడులలో పూర్తిగా కూరుకుపోతే, భూకంపాలు, వరద ముంపులు వగైరా విపత్తుల ద్వారా దేవుడు దాన్ని తుడిచిపెడ్తాడు. (26:208,209 సూక్తులు కూడా చూడండి.)

4. ఇక్కడ ఒకరిపై మరొకరికి ఔన్నత్యం ప్రసాదించడమంటే, అవిశ్వాసులపై విశ్వాసులకు ఔన్నత్యం ప్రసాదించడమని అర్థం. ఔన్నత్యం అంటే ఆర్థికంగా, అధికారం రీత్యా ఔన్నత్యమని అర్థం కాదు. దైవభీతి, పరలోక చింతనలతో పాటు నీతి నిజాయితీలతో కూడిన గౌరవప్రదమైన జీవితం గడపడమే ఔన్నత్యం. అలాంటి విశ్వాసులే పరలోకంలో అత్యున్నత స్వర్గసౌఖ్యాలు పొందగలరు.

♦ బంధువులు, నిరుపేదలు, బాటసారుల హక్కులు నెరవేర్చండి.

♦ దుబారాఖర్చు చేయకండి. దుబారాఖర్చు చేసేవారు షైతాన్ సోదరులుగా పరిగణించబడతారు. షైతాన్ తన ప్రభువుకు కృతఘ్నుడైపోయాడు. (26,27)

♦ మీరు దైవానుగ్రహం ఆశించి దానికోసం నిరీక్షిస్తూ (పేదలకు సహాయం చేయ లేక) వారినుండి తప్పించుకోవలసివస్తే, వారికి మృదువుగా జవాబివ్వండి. (28)

♦ మీరు మీచేతిని (ఏమాత్రం దానంచేయకుండా) మెడకేసి కట్టి ఉంచకండి. అలాగే దాన్ని పూర్తిగా తెరచి ఉంచడం కూడా సరికాదు. అలాచేస్తే మీరు నిందితులై, నిస్సహాయులై పోతారు. నీ ప్రభువు తానుకోరిన విధంగా కొందరికి ఇతోధికంగా ఉపాధినిస్తే, మరి కొందరిని లేమికి గురిచేస్తాడు. ఆయనకు తన దాసుల స్థితిగతులు బాగాతెలుసు. ఆయన వారిని చూస్తూనే ఉన్నాడు.(29,30)

♦ దారిద్ర్యభయంతో మీ సంతానాన్ని చంపుకోకండి. మేము వారికీ ఆహారమిస్తు న్నాం, మీకూ ఇస్తున్నాము. వారిని చంపడం ఘోరమైన పాపం.[5] (31)

---

5. దేవుడు సృష్టికర్త, ఆరాధ్యుడు మాత్రమే కాదు; ఆయన శాసనకర్త, పోషకుడు కూడా. ప్రాణికోటిని పోషించే బాధ్యతను ఆయనే తీసుకున్నాడు. ఉపాధి సముపార్జనకు మానవులు కృషి మాత్రమే చేయగలరు. ఉపాధి ప్రదాత నిజానికి దేవుడే. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆయన ఆహారోత్పత్తి కుడా పెంచుతున్నాడు. అధికోత్పత్తి కోసం నేడు వ్యవసాయరంగంలో అద్భుత విధానాలు, అసాధారణ సాంకేతిక పద్ధతుల్ని మానవులకు అనుగ్రహించినవాడు ఆ ప్రభువే.

మనదేశంలో యాభైఏళ్ళ క్రితంనాటి 45కోట్ల జనాభా జీవనప్రమాణం కంటే నేడు 100కోట్ల జనాభా జీవనప్రమాణం మెరుగ్గాఉంది. ఇతరదేశాల్లో కూడా అంతే. ఎక్కడో కొన్నిచోట్ల మాత్రమే కొందరు కనీసావసరాలు దొరక్క బాధపడ్తున్నారు. దీనిక్కారణం భూమిపై ఆహారోత్పత్తి తగ్గిపోయిం దని అర్థం కాదు. మానవులు దైవబోధనలు వదలి అనుసరిస్తున్న అసహజ ఆర్థికవిధానాలే ఉపాధి పంపిణిలో అపసవ్యత, సమతులనారాహిత్యాలను సృష్టిస్తున్నాయి. తత్ఫలితంగా లక్షలాది టన్నుల ఆహారధాన్యాలు గిడ్డంగులలో ఏళ్ల తరబడి పంపిణీకి నోచుకోలేక ముక్కిపోతున్నాయి. కొన్ని దేశాల్లో నయితే అదనంగా పండిన ఆహారోత్పత్తులను పెద్దఎత్తున తగలబెట్టడమో, సముద్రంలో పారవెయ్య డమో జరుగుతోంది. ఈ నిర్వాకం కోసం ఆ దేశాలు కోట్లాది డాలర్లు ఖర్చుపెడుతున్నాయి.

నేటి పాలకులు, ఆర్థికవేత్తలు సరయిన ఆర్థిక విధానాలతో ఆహారోత్పత్తులు సక్రమంగా పంపిణీ చేయలేక ఏకంగా సంతానోత్పత్తినే అరికట్టే చర్యలకు పాల్పడుతున్నారు. అంటే తోటి మానవసంతతినే హతమార్చుతున్నారన్నమాట. ఇంతకంటే ఆత్మహత్యా సదృశం మరొకటి ఉండదు. (41:10 సూక్తి, దాని పాదసూచిక చూడండి.) ఖుర్‌ఆన్ ఇది పూర్తిగా అజ్ఞానం, మూర్ఖత్వాలతో కూడిన చర్య అంటోంది. దీనివల్ల వారు ఘోరంగా నష్టపోతారని హెచ్చరిస్తోంది.

“దారిద్ర్య భయంతో మీ సంతానాన్ని (చేజేతులా) హతమార్చుకోకండి. మేము వారికీ ఆహారమిస్తున్నాం, మీకూ ఇస్తున్నాం.” (6:151, 17:31) “అజ్ఞానం, మూర్ఖత్వాలతో తమ సంతానాన్ని చంపుకునేవారు,.. ఘోరంగా నష్టపోతారు.” (6:140)

ఇలాంటి అజ్ఞానులు ప్రతి యుగంలో, ప్రతి జాతిలోనూ దారిద్ర్య భయంతో తమ సంతా నాన్ని హతమార్చుతున్నారు. కుటుంబ నియంత్రణ పేరుతో నేడు నాగరికులమని చెప్పుకునేవారు



♦ వ్యభిచారం దరిదాపులకు పోకండి. అది చాలా హేయమైనది, పరమచెడ్డదారి.

♦ న్యాయసమ్మతంగా తప్ప దేవుడు నిషేధించిన ఏ ప్రాణినీ హతమార్చకండి. ఎవరైనా అన్యాయంగా హతమార్చబడితే అతని వారసులకు మేము బదులు తీర్చుకునే అధికారం ఇచ్చాము.[6] అయితే వారసుడు (హంతకుడ్ని) వధించ డంలో హద్దుమీరకూడదు. అప్పుడే అతనికి సహాయం చేయబడుతుంది. (32,33)

♦ అనాధపిల్లలు యుక్త వయస్సుకు చేరుకునే వరకు న్యాయసమ్మతంగా తప్ప వారి సొమ్ము దరిదాపులకు వెళ్ళకండి.

♦ (వాగ్దానం) ఒప్పందం నెరవేర్చండి. (వాగ్దానం) ఒప్పందం గురించి మీరు తప్పని సరిగా (దేవుని ముందు) సమాధానం చెప్పుకోవలసి ఉంటుంది. (34)

♦ సరైన పాత్రతో పూర్తిగా కొలచి ఇవ్వండి. తూచవలసివస్తే సరైన త్రాసుతో తూచి ఇవ్వండి.[7] ఇదే సరైన పద్ధతి. ఫలితం రీత్యా కూడా ఈ పద్ధతే మంచిది. (35)

♦ మీకు తెలియనిదాని వెంటపడకండి. కళ్ళు, చెవులు, హృదయం వగైరా సమస్త అవయవాల్ని గురించి (దేవునికి) జవాబు చెప్పుకోవలసి ఉంటుంది.[8] (36)

---

మానవజాతిని ప్రపంచంలోకే రాకుండా మాతృగర్భంలోనే మట్టుపెడ్తున్నారు. టుబెక్టమీ-వేసక్టమీ ఆపరేషన్ల ద్వారా, మందులు-కండోమ్‌ల ద్వారా పిండోత్పత్తిని అరికడ్తున్నారు. దైవం ప్రసాదించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగపరుస్తూ భ్రూణహత్యలకు సైతం పాల్పడుతున్నారు.

పూర్వం అరబ్బులు సంతానోత్పత్తిని అరికట్టేందుకు సంపర్క సమయంలోనే వీర్యం స్త్రీ గర్భంలోకి పోకుండా నిరోధించేవారు. దైవప్రవక్త (సల్లం) ఈ చర్య పట్ల అయిష్టత వెలిబుచ్చుతూ “ప్రళయం వరకు పుట్టవలసిన పిల్లలు ఎట్టి పరిస్థితిలోనూ పుట్టి తీరుతారు” అన్నారు.

చైనా పౌరులకు ఒక్కబిడ్డ కన్నా ఎక్కువమందిని కనే హక్కు లేదు. అయినా అక్కడ జనాభా తామరతంపరగా పెరిగిపోతూనే ఉంది. చైనాప్రజలు ఆ ఒక్క బిడ్డ మగబిడ్డయితే బాగుంటుందని భావించి ఆడ శిశువుల్ని నిర్దాక్షిణ్యంగా చంపేస్తున్నారు. ఈ పరిస్థితి ఎంత తీవ్రరూపం దాల్చింది అంటే ఈనాడు కొన్ని రాష్ట్రాల్లో స్త్రీ జనాభా విపరీతంగా తగ్గిపోయి మగపిల్లలకు పెళ్ళిళ్ళు కావడమే గగనమయి పోయింది. ఇలాంటివే ఇంకా అనేక సమస్యలు అక్కడ ఎదురవుతున్నాయి.

6. హత్య రుజువయిన తరువాత న్యాయస్థానం ద్వారా హతుని వారసులకు ఈ అధికారం లభిస్తుంది. వారు కోరిన విధంగా హంతకుడికి మరణదండన విధించమని చెప్పవచ్చు లేదా రక్తపరిహారం క్రింద హంతకుడి నుంచి కొంత సొమ్ము తీసుకొనయినా తృప్తి పడవచ్చు. లేదా హంతకుడ్ని క్షమించవచ్చు. అంతా వారసుల ఇష్టం మీద ఆధారపడి ఉంటుంది.

7. వివరాలకు 83:1-5 సూక్తులు, వాటి పాదసూచిక చూడండి.

8. సరైన జ్ఞానం, నిరూపణలు, ప్రమాణాలు లేకుండా ఊహాగానాలతో ఒక విషయాన్ని కల్పించి దాన్ని అనుసరించడాన్ని ఖుర్‌ఆన్ నిరసిస్తుంది. నిజానిజాలు తెలుసుకోకుండా ఇతరులపై నిందారోపణలు మోపడం, వదంతులు వ్యాపింపజేయడం, కేవలం అనుమానంతో ఒక వ్యక్తికి వ్యతిరేకంగా చర్య తీసుకోవడం, అతడ్ని బాధించడం, శాస్త్రీయ ప్రమాణంలేని ఊహాజనిత సిద్ధాంతా లను కళ్ళు మూసుకొని నమ్మడం, దేవుని విషయంలో అంధవిశ్వాసాలకు మనసులో చోటివ్వడం మొదలైన వాటిని ఖుర్‌ఆన్ ఈ సూక్తి ద్వారా నిషేధిస్తోంది.

♦ భూమిపై నిక్కుతూ, నీల్గుతూ నడవకండి. (ఈ అహంకారంతో) మీరు భూమిని చీల్చి వేయలేరు. పర్వతాల ఎత్తుకు ఎదగనూ లేరు. (37)

ఇవన్నీ దుష్కార్యాలు. మీ ప్రభువు దృష్టిలో ఎంతో హేయమైనవి. ఇవి వివేకంతో కూడిన విషయాలు. వీటిని నీ ప్రభువు నీ హృదయఫలకంపై అవతరింపజేశాడు.

వినండి! దేవునితో పాటు మరో ఆరాధ్యదైవాన్ని చేసుకోకండి. అలాచేస్తే మీరు నిందితులై, సమస్త శ్రేయోశుభాలకు దూరమై నరకంలో వేయబడతారు. (38,39)

ఏమిటీ, మీ ప్రభువు మీకు కుమారుల్ని అనుగ్రహించి తనకోసం దైవదూతల్ని కుమార్తెలుగా చేసుకున్నాడా? ఎంత విచిత్రం! మీరు మీనోట పలుకుతున్న ఈ మాటలు పచ్చి అబద్ధాలు, నిరాధారమైనవి. (40)

మేమీ ఖుర్ఆన్‌లో సత్యాన్ని అర్థం చేసుకోవలసిందిగా ప్రజలకు రకరకాలుగా నచ్చ జెప్పాము. కాని వారు దానికి మరింత దూరమయి పోతున్నారు. (41)

వారికిలా చెప్పు: వారన్నట్లు దేవునితో పాటు ఇతర దైవాలు కూడా ఉంటే ఆ దైవాలు సింహాసనాధీశుని స్థాయికి చేరుకోవడానికి తప్పకుండా ప్రయత్నిస్తాయి. దేవుడు పరిశుద్ధుడు. వారు పలుకుతున్న ఈ పలుకులకు దేవుడు అతీతుడు, ఎంతో ఉన్నతుడు. సప్తాకాశాలు, భూమి, భూమ్యాకాశాల్లోని యావత్తు సృష్టిరాసులు ఆయన పవిత్రతను కొనియాడుతున్నాయి. ఆయన ఔన్నత్యంతో పాటు ఆయన పవిత్రతను ప్రశంసించని సృష్టి అంటూ ఏదీ లేదు. కాని అవి చేసే దైవస్మరణను మీరు గ్రహించలేరు. నిస్సందేహంగా ఆయన ఎంతో ఉదారుడు, గొప్ప క్షమాశీలి. (42-44)

ముహమ్మద్ (సల్లం)! నీవు ఖుర్ఆన్ పఠిస్తున్నప్పుడు మేము నీకూ, పరలోకం నమ్మని వారికీ మధ్య అడ్డుతెర ఉంచి వారి హృదయకవాటాలు మూసేస్తాము. దాంతో ఏ విషయాన్నీ గ్రహించలేరు. వారి చెవులకు చెవుడు కల్పిస్తాము. ఖుర్ఆన్‌లో నీవు మాటిమాటికి నీ ప్రభువు ఒక్కడ్ని గురించే ప్రస్తావిస్తుంటే వారు ఏవగింపుతో ముఖం తిప్పుకుంటున్నారు. (45,46)

ఎప్పుడైనా వారు నీమాటలు చెవియొగ్గి వింటే వారసలు ఏంవిన్నారో, ఆ తర్వాత వారు ఏకాంతంలో కలుసుకొని పరస్పరం ఏం గుసగుసలాడుకున్నారో అన్నీ మాకు తెలుసు. ఆ దుర్మార్గులు నీగురించి "ఈ మనిషి చేతబడికి గురైన పిచ్చివాడు. అలాంటి పిచ్చివాడి వెంటపడ్డారు మీరు" అంటారు (ముస్లింలతో). చూడు, నీ గురించి ఎలాంటి మాటలు చెబుతున్నారో. వీరసలు మార్గభ్రష్టులైపోయారు. వీరిక దారికి రారు. (47,48)

వారు (ఆశ్చర్యంతో) "మేము (చచ్చి) ఎముకలుగా, మట్టిగా మారిపోయాక మళ్ళీ బ్రతికించి లేపబడతామా?" అని అంటారు. వారికిలా స్పష్టంగా చెప్పెయ్యి: "మీరు (చచ్చి) రాళ్ళయిపోయినా, ఇనుమైపోయినా సరే (తప్పకుండా లేపబడతారు)." (49,50)

ఆ తరువాత వారు "మమ్మల్ని మళ్ళీ బ్రతికించి లేపే వాడెవడు?" అని తప్పకుండా అడుగుతారు. "మిమ్మల్ని మొదటిసారి పుట్టించినవాడే" అని చెప్పు. వారు



(ఆశ్చర్యంతో) తలలూపుతూ "అయితే అది ఎప్పుడు సంభవిస్తుందంటావు?" అని మళ్ళీ అడుగుతారు. చెప్పు: "అది ఎంతో దూరం లేదు, త్వరలోనే సంభవించవచ్చు." (51)

ఏరోజు ఆయన మిమ్మల్ని కేకవేసి పిలుస్తాడో ఆరోజు మీరు ఆయన పిలుపునకు వెంటనే స్పందించి ఆయన్ని స్తుతిస్తూ (బిలబిల పరుగెత్తుకు) వస్తారు. అప్పుడు మీరు మనసులో "మనమీ స్థితిలో కొద్దిసేపే ఉన్నాం" అని అనుకుంటారు. (52)

ముహమ్మద్ (స)! నాదాసులతో "మీరు మంచిమాటనే మీనోట వెలువరించాల"ని చెప్పు. అయితే మానవుల్లో షైతాన్ కలహాలు సృష్టించడానికి ప్రయత్నిస్తాడు. షైతాన్ మానవులకు బహిరంగ శత్రువు. మీ పరిస్థితి గురించి మీ ప్రభువుకు బాగా తెలుసు. ఆయన తలచుకుంటే మిమ్మల్ని కరుణిస్తాడు లేదా శిక్షిస్తాడు. మేము నిన్ను ప్రజల మీద పర్యవేక్షకునిగా పంపలేదు. భూమ్యాకాశాలలోని సమస్త సృష్టిరాసుల్ని గురించి నీప్రభువుకు బాగా తెలుసు. మేము ప్రవక్తలలో కొందరికి కొందరికన్నా ఉన్నత హోదాలు కల్పించాము. మేమే దావూద్‌కు జబ్బూర్ గ్రంథం ఇచ్చింది. (53-55)

చెప్పు: "మీరు దేవుడ్ని కాదని ఆరాధిస్తున్న మీ మిథ్యాదైవాలను వేడుకొని చూడండి. అవి మీకష్టాలను ఏమాత్రం దూరంచేయలేవు. ఆ స్థితిని మార్చలేవు కూడా. స్వయంగా అవి తమ ప్రభువు సాన్నిధ్యాన్ని అన్వేషిస్తున్నాయి. తమలో దేవునికి ఎవరెక్కువ సన్నిహితులో అని ఆలోచిస్తున్నాయి. ఆయన అనుగ్రహం ఆశిస్తూ, ఆయన శిక్షకు భయపడుతున్నాయి. నిజానికి నీ ప్రభువు శిక్ష భయపడవలసిన విషయమే. (56,57)

మేము ప్రళయదినానికి పూర్వం ప్రతిపట్టణాన్ని, జనపదాన్ని సర్వనాశనం చేయడమో లేక కఠినంగా శిక్షించడమో చేస్తాము. ఇది విధివ్రాతలో రాయబడిఉంది. (58)

వీరికి పూర్వం ప్రజలు మా నిదర్శనాలు తిరస్కరించారు. ఈ విషయం తప్ప మరేదీ మమ్మల్ని నిదర్శనాలు పంపకుండా నిరోధించలేదు.[9] మేము సమూద్‌జాతి

9. మక్కా అవిశ్వాసులు సఫా కొండను బంగారుకొండగా మార్పించమని, ప్రజలు వ్యవసాయం చేసుకోవడానికి వీలుగా మక్కా పర్వతాలను వాటి స్థానాల నుండి తొలగింపజేయమని దైవప్రవక్త (సల్లం)ను అడిగారు. దీనికి దేవుడు సమాధానమిస్తూ "వారి కోర్కెలను నెరవేర్చడానికి మేము సిద్ధంగా ఉన్నాం. అయితే ఆ తర్వాత కూడా వారు విశ్వసించకపోతే సర్వనాశనమవుతారు" అని అన్నాడు. కాని దైవప్రవక్త (సల్లం) అవిశ్వాసుల్ని వినాశం నుండి తప్పించడానికి వారి కోరికల్ని నెరవేరనీయ దలచుకోలేదు. ఆ సందర్భంగా ఈసూక్తి అవతరించింది. (ముస్నద్ అహ్మద్)

ఇలాంటి మహిమలు చూపడం దేవునికి కష్టమేమీ కాదు. కాని ఆ మహిమలు చూసిన తరువాత కూడా వారికి కనువిప్పు కలగకపోతే దేవుడు వారిని ప్రకృతి విపత్తుల ద్వారా ఇహలోకంలోనే సర్వనాశనం చేస్తాడు. వారికి ఇక ఏమాత్రం విశ్వసించే అవకాశం లభించదు. తార్కాణం కోసం దేవుడు తరువాతి సూక్తిలో సమూద్‌జాతి ప్రజల వినాశం గురించి ప్రస్తావించాడు. సమూద్ జాతి ప్రజల కోరికపై దేవుడు చట్టుబండ నుండి ఒక ఒంటెను వెలికితీశాడు. అయితే వారు తమ ప్రవక్తను విశ్వసించడానికి బదులు ఆయన ఆజ్ఞ ధిక్కరించి దాన్ని చంపేశారు. తత్ఫలితంగా వారిపై దైవశిక్ష విరుచుకుపడి సర్వనాశనమయ్యారు. ఇలాంటి సంఘటనల ద్వారా గుణపాఠం గ్రహించమని దేవుడు మక్కా బహుదైవారాధకుల్ని ఈ సూక్తిలో పరోక్షంగా హెచ్చరిస్తున్నాడు.

వద్దకు నిదర్శనంగా ఒక ఒంటె తెచ్చాం. దానిపై వారు దౌర్జన్యం చేశారు. ప్రజలు మా నిదర్శనాలు చూసి భయపడి (సత్యాన్ని) విశ్వసిస్తారనే మేము వాటిని పంపాము. (59)

ముహమ్మద్ (స)! నీ ప్రభువు వారిని పరివేష్టించి ఉన్నాడని మేము నీకు తెలియజేశాం. మేమిప్పుడు నీకు చూపిన దాన్ని,[10] ఖుర్ఆన్‌లో పేర్కొనబడిన శాపగ్రస్త వృక్షాన్ని వారికోసం కఠినపరీక్షగా చేశాం. మేము వారిని మాటిమాటికి హెచ్చరిస్తూనే ఉన్నాం. కాని మా హెచ్చరికలు వారి తలబిరుసుతనాన్ని మరింత అధికమే చేస్తున్నాయి. (60)

మేము దైవదూతలను ఆదంకు గౌరవసూచకంగా అభివాదం చేయమని ఆదేశించినప్పుడు, ఇబ్లీస్ తప్ప అందరూ అభివాదం చేశారు. ఇబ్లీస్ "నీవు మట్టితో సృజించిన వాడికి నేను అభివాదం చేయాల్నా?"అన్నాడు. "కాస్త నీవే ఆలోచించు. నీవితనికి నాకంటే ఎక్కువ ఔన్నత్యాన్నిచ్చావు. అంతటి యోగ్యుడా ఇతను? (సరే) ప్రళయందాకా నాక్కాస్త గడువిచ్చావంటే, నేనితని సంతతిని పూర్తిగా దారి తప్పించి నా అధీనం చేసుకుంటాను. బహుతక్కువ మంది మాత్రమే నాబారి నుండి బయటపడతారు" అన్నాడతను. (61,62)

దానికి సృష్టికర్త ఇలా అన్నాడు: "సరే వెళ్ళిపో (ఇక్కడ్నుంచి) నిన్ను, నిన్ను అనుసరించిన వారందరినీ నరకంలో పడవేస్తాను. అదే మీకు తగిన శాస్తి. వారిలో నీవు ఎవరెవరిని పిలిచి ప్రలోభపెడ్తావో ప్రలోభపెట్టుకో. (కావాలంటే) వారిపై నీ వాహనబలాన్ని, పదాతిదళాన్ని (కూడా) ప్రయోగించుకో. వారి సంతానం, సిరిసంపదల్లో కూడా భాగస్వామిగా చేరిపో. వారిని వాగ్దానాలతో ఊరించి నీవలలో పడవేసుకో."

(మానవులారా! గుర్తుంచుకోండి) షైతాన్ చేసే వాగ్దానాలు ఉత్త మోసపు వాగ్దానాలు తప్ప మరేమీ కావు- "ఏమైనప్పటికీ నా ప్రియదాసులపై నీ అధికారం చెల్లదు (నీజిత్తులు పారవు)." నమ్ముకునేవారికి నీ ప్రభువే చాలు. (63-65)

సముద్రాలలో మీ శ్రేయస్సు కోసం నౌకలు నడిపేవాడు మీ ప్రభువే. ఆయన అనుగ్రహం అన్వేషించడానికి మీరు సముద్రయానం చేస్తారు. నిజంగా ఆయన మీపట్ల ఎంతో దయామయుడు. సముద్రయానం చేస్తున్నప్పుడు మీకేదైనా ఆపద వస్తే (మీరు నిజదేవుడ్నే వేడుకుంటారు.) ఆయన తప్ప మీరు (రోజూ) వేడుకునే మిథ్యాదైవాలన్నీ అప్పుడు కనుమరుగైపోతాయి. కాని ఆయన మిమ్మల్ని ఆపద నుండి కాపాడిన తర్వాత మీరు (చేసిన మేలు మరచి) ఆయనకు విముఖులైపోతారు.[11] నిజంగా మానవుడు చాలాకృతఘ్నుడు. (66,67)

దేవుడు మిమ్మల్ని (తీరానికి చేర్చిన తర్వాత) భూమిలోకి అణగద్రొక్కడని నిర్భయంగా ఉన్నారా? లేక మీపైకి రాళ్లవర్షంతో కూడిన పెనుతుఫాను పంపడని నిశ్చింతగా ఉన్నారా? అప్పుడా దుస్థితి నుండి మిమ్మల్ని కాపాడేవారే ఉండరు. దేవుడు మళ్ళీ ఎప్పుడైనా మిమ్మల్ని సముద్రంలోకి తీసికెళ్ళి మీరు చూపిన కృతఘ్నతకు

10. అంటే దివ్యలోకాల పర్యటనా విశేషాలు. ఈ పర్యటనను 'మేరాజ్' అంటారు.

11. వివరాలకు 6:41 సూక్తి, దాని పాదసూచికతో పాటు, 10:22 సూక్తి కూడా చూడండి.



ప్రతీకారంగా మీపైకి భయంకరమైన పెనుగాలులు పంపి మిమ్మల్ని సముద్రంలో ముంచివేయడని నిర్భయంగా ఉన్నారా? ఒకవేళ అలా జరిగితే మమ్మల్ని ప్రశ్నించేవాడు ఎవడూ ఉండడు. (68,69)

మేము ఆదం సంతతికి గౌరవప్రతిష్ఠలు ప్రసాదించాము. వారికి నేలపై, నీటిపై ప్రయాణంచేయడానికి వాహనాలు, తినడానికి పరిశుద్ధమైన ఆహారపదార్థాలు ఇచ్చాం. మేము సృష్టించిన అనేక సృష్టితాలపై వారికి ఎంతో ఆధిక్యం, ఔన్నత్యం ప్రసాదించాం.

మేము ప్రతి మానవవర్గాన్ని దాని నాయకుడితో పాటు పిలిచే రోజొకటి వస్తుంది. ఆరోజు కుడిచేతికి కర్మలపత్రం ఇవ్వబడినవారు అందులో తాము చేసిన ఘనకార్యాలేమిటో చూసుకుంటారు. వారికక్కడ ఏమాత్రం అన్యాయం జరగదు. ఇక ఇహలోకంలో అంధుడయి జీవితం గడిపినవాడు పరలోకంలో కూడా అంధుడుగానే ఉంటాడు. సన్మార్గం పొందడంలో అతను అంధుడికన్నా ఘోరంగా విఫలమయ్యాడు. (70-72)

ప్రవక్తా! మేము నీదగ్గరకు పంపిన సందేశం నుండి వారు నిన్ను తప్పించడానికి ప్రయత్నిస్తున్నారు. ఇలా వారు నిన్ను భయప్రలోభాలతో లొంగదీసుకొని, మా పేరుతో నీవు మరేవిషయాలైనా కల్పించేలా చేయడానికి పడరానిపాట్లు పడ్డారు. ఒకవేళ నీవలా చేసివుంటే వారు నిన్ను తమ మిత్రుడిగా చేసుకునేవారు. మేము గనక నిన్ను స్థిరంగా ఉంచనట్లయితే వారి వైపు కొద్దోగొప్పో మొగ్గేవాడివి. అయితే వారి వైపు మొగ్గితే మాత్రం మేము నీకు ఇటు ఇహలోకంలో, అటు పరలోకంలో రెట్టింపు శిక్ష చవిచూపించేవారం. అప్పుడు మాకు వ్యతిరేకంగా నీకు ఎలాంటి సహాయం లభించేది కాదు. (73-75)

వారు నిన్ను ఈ నేలపై నిలువ నీడలేకుండా చేయడానికి, అసలు నిన్నిక్కడ నుండి గెంటివేయడానికి ప్రయత్నిస్తున్నారు. వారలా చేస్తే ఆ తర్వాత వారుకూడా ఇక్కడ ఎంతోకాలం ఉండలేరు. ఇది మావిధానం. గతప్రవక్తల విషయంలో కూడా మేము ఈ విధానాన్నే అవలంబించాం. మావిధానంలో నీవు ఎలాంటి మార్పు చూడలేవు. (76,77)

సూర్యుడు వాలినప్పటి నుండి రాత్రి పొద్దుపోయే వరకు నమాజ్ (వ్యవస్థ)ను స్థాపించు. వేకువజామున కూడా ఖుర్ఆన్ పఠనం చేస్తూఉండు. వేకువజాము ఖుర్ఆన్ పఠనం (దైవదూతల) సాక్ష్యానికి కారణభూతమవుతుంది. రాత్రివేళ తహజ్జుద్ నమాజు కూడా చేస్తూఉండు. ఇది నీకోసం అదనపు (నఫిల్) నమాజుగా నిర్ణయించబడింది. నీ ప్రభువు నిన్ను త్వరలోనే అత్యున్నతమయిన స్తుతిస్థానం మీద అధిష్ఠింపజేయవచ్చు.[12] ఇలా వేడుకో: "ప్రభూ! నీవు నన్ను ఎక్కడికి తీసికెళ్ళినా మంచి స్థితిలో తీసికెళ్ళు. ఎక్కడ నుండి తీసినా మంచి స్థితిలోనే తీసెయ్యి. నీ దగ్గర్నుండి సహాయంగా నాకో అధికార శక్తి[13] ప్రసాదించు." (78-80)

12. అంటే, నీ కీర్తి భూమ్యాకాశాలంతటా విస్తరిస్తుందని భావం. పరలోకంలో ఆయనకు లభించే సాధారణ సిఫారసు హోదా కూడా ఈ భావంలోనే ఇమిడి ఉంది.

13. 'ప్రభుత్వం లేక రాజ్యాధికారం ద్వారా నాకు సహాయం చెయ్యి' అని భావం.

ఇలా ప్రకటించు: "సత్యం వచ్చింది. అసత్యం తుడిచి పెట్టుకుపోయింది. అసత్యం (ఏనాటికైనా) తుడిచి పెట్టుకుపోయేదే." (81)

మేమీ ఖుర్ఆన్‌లో విశ్వాసులకు స్వస్థత, కారుణ్యాలు చేకూర్చే విషయాలు అందజేస్తున్నాం. అయితే దుర్మార్గులకు మాత్రం ఇది మరింత నష్టాన్నే కలిగిస్తుంది. (82)

మానవునికి మేమేదయినా భాగ్యం ప్రసాదించినప్పుడు అతను (మాకు కృతజ్ఞత చూపడానికి బదులు మిడిసిపడుతూ) ముఖం తిప్పుకొని వెళ్ళిపోతాడు. అదే కాస్తంత కష్టం వచ్చిపడితే తల్లడిల్లిపోతూ నిరాశచెందుతాడు. వారికి చెప్పు: "ప్రతి ఒక్కడూ తనకుతోచిన విధంగా పని చేస్తున్నాడు. ఎవరు సన్మార్గంలో ఉన్నారో నీప్రభువుకు బాగా తెలుసు." (83,84)

వారు ఆత్మను[14] గురించి ప్రశ్నిస్తున్నారు. "ఈ ఆత్మ నా ప్రభువు ఆజ్ఞతో వస్తుంది. (దీన్ని మీరు గ్రహించలేరని,) మీకు పరిమిత జ్ఞానం ప్రసాదించబడింద"ని చెప్పు. (85)

ముహమ్మద్ (స)! మేము తలచుకుంటే దివ్యావిష్కృతి ద్వారా నీకు ప్రసాదించిన విషయాలన్నిటినీ వెనక్కి తీసుకోగలం. అప్పుడు నీవు మాకు వ్యతిరేకంగా ఎలాంటి సహాయం పొందలేవు. కాని (అలా జరగలేదంటే) అదంతా నీ ప్రభువు అనుగ్రహం. ఆయన కారుణ్య కటాక్షాలు నీపై ఎంతగానో ఉన్నాయి. (86,87)

వారికి చెప్పు: "యావత్తు మానవులు, జిన్నులు ఏకమయి కఠోర తపస్సు చేసినా, పరస్పరం సహకరించుకున్నా, ఖుర్ఆన్ లాంటి గ్రంథాన్ని ఎన్నటికీ రచించలేరు." (88)

---

14. ఇక్కడ 'ఆత్మ' అంటే కొందరు వ్యాఖ్యానకర్తలు 'పరిశుద్ధాత్మ' అని భావించారు. అంటే ప్రవక్తలకు దైవసందేశం చేరవేసే దైవదూత జిబ్రీల్ (అలై) అన్నమాట. లేక 'దివ్యావిష్కృతి' (వహీ-Revelation) అంటారు. మరికొందరు వ్యాఖ్యానకర్తలు జీవుల్లో ఉండే ప్రాణం అనే అర్థంలో ఆత్మ అంటే 'జీవాత్మ' అని అభిప్రాయపడ్డారు. ఏమైనప్పటికీ ఈ రెండు రకాల ఆత్మలు మానవమేధకు అతీతమైన విషయాలు గనక వీటిని గురించి తలబాదుకోవడం వృధాశ్రమ, కాలహరణం తప్ప ఎలాంటి ప్రయోజనం లేదు. అగోచరాలు, అతీంద్రియ విషయాలను గురించి ఆరా తీయకుండా వాటిని విశ్వసించడమే బుద్ధిమంతుల లక్షణం.

హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్వూద్ (రజి) కథనం: నేను దైవప్రవక్త (సల్లం) వెంట మదీనా పొలాల గుండా నడచి వెళ్తున్నాను. దైవప్రవక్త (సల్లం) ఖర్జూరపు కర్ర పట్టుకొని దాని ఊతంతో నడవసాగారు. మేమలా వెళ్తుంటే దారిలో కొందరు యూదులు తారసపడ్డారు. అప్పుడు వారిలో కొందరు "ఆత్మను గురించి ఆయన్ని అడుగుదాం" అన్నారు. మరికొందరు "వద్దు, మనకు నచ్చని విషయం ఏదైనా ఆయన మనకు విన్పించవచ్చు" అన్నారు. అయితే కొందరు ఆయన్ని ఆత్మను గురించి అడగవలసిందేనని తీర్మానించారు. దాని ప్రకారం వారిలో ఒక వక్తి వచ్చి "అబుల్ ఖాసిం! ఆత్మ అంటే ఏమిటసలు?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (సల్లం) తక్షణమే సమాధానం ఇవ్వకుండా క్షణంపాటు మౌనంగా ఉండిపోయారు. దాంతో నేను ఆయనపై దివ్యావిష్కృతి (వహీ) అవతరిస్తోందని భావించి నిలబడ్డాను. దివ్యావిష్కృతి అవతరణ సమయంలో ఆవహించే పరిస్థితి దూరమయిన తరువాత ఆయన ఈసూక్తి (17:85) పఠించారు. (బుఖారి, ముస్లిం)

(ఆత్మ, ప్రాణం, మనస్సు- వీటిని గురించి వివరంగా తెలుసుకోవడానికి 'ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్' నుండి వెలువడిన "పరలోక ప్రస్థానం" అనే పుస్తకం చదవండి.)



మేము ఖుర్ఆన్‌లో ప్రజలకు అనేక విధాలుగా నచ్చజెప్పాం. కాని చాలామంది తిరస్కారవైఖరే ప్రదర్శించారు. (వారి తిరస్కారం చూడు:)

"నీవు మాకోసం భూమిని చీల్చి ఒక నీటిబుగ్గ తీయనంతవరకు మేము నీ మాటలు నమ్మం. లేదా నీ కోసమే ఖర్జూరాలు, ద్రాక్షపండ్లు గల ఒక తోట తెప్పించు. ఆ తోటలో కాలువలు కూడా ప్రవహిస్తూ ఉండాలి. లేదా నీవు చెబుతున్నట్లు ఆకాశాన్ని తునాతునకలుగా చేసి మామీద పడెయ్యి. లేదా దేవుణ్ణి, దైవదూతల్ని మాముందు ప్రత్యక్షపరచు. అదీకాకపోతే నీకోసం ఒక స్వర్ణగృహం రప్పించుకో. పోనీ నీవు ఆకాశం పైకయినా ఎక్కిపోవాలి. అయితే మేము చదవగలిగే పత్రం ఏదైనా మాముందు దించనంతవరకు నీవు ఆకాశం పైకెక్కిన విషయాన్ని కూడా మేము నమ్మలేము" అంటారు వారు.

వారికిలా చెప్పు: "నా ప్రభువు పరిశుద్ధుడు. నేను కేవలం మానవమాత్రుణ్ణి. ప్రజలకు దైవసందేశం అందజేసే సందేశహరుణ్ణి మాత్రమే." (89-93)

ప్రజల దగ్గరకు (మా) హితబోధ వచ్చినప్పుడు దాన్ని విశ్వసించనీయకుండా వారిని ఒక్క విషయం తప్ప ఏదీ నిరోధించలేదు. "దేవుడు మానవుణ్ణి సందేశహరుడిగా పంపాడా?"అన్న విషయమే వారిని నిరోధించింది. వారికిలా చెప్పు: "ఒకవేళ దైవదూతలు ప్రపంచంలో (మానవుల్లా జీవితం గడుపుతూ) ప్రశాంతంగా తిరగ్గలిగితే మేము వారి దగ్గరకు తప్పకుండా దైవదూతనే ప్రవక్తాగా నియమించి పంపేవారం."

ఇంకా చెప్పు: "నాకూ, మీకూ మధ్య ఒక్క దేవుని సాక్ష్యమే చాలు. అయనకు తనదాసుల స్థితిగతులు బాగా తెలుసు. ఆయన సమస్తం చూస్తున్నాడు." (94-96)

దేవుడు ఎవరికి సద్బుద్ధి ప్రసాదిస్తాడో అతనే సన్మార్గం పొందగలడు. దేవుడు దారి తప్పించినవారిని దేవుడు తప్ప మరెవరూ ఆదుకోలేరు. అలాంటివారిని మేము ప్రళయ దినాన బోర్లాపడేసి ఈడ్చుకొస్తాము. వారు అంధులు, బధిరులు, మూగలు. నరకమే వారి నివాసమవుతుంది. దాని అగ్నిజ్వాలలు మందగించినప్పుడల్లా మేము మళ్ళీ మళ్ళీ ప్రజ్వరిల్లజేస్తాము. (97)

వారు మాసూక్తులు తిరస్కరించారు. పైగా"మేము ఎముకలుగా, తునాతునకలుగా మారిపోయాక మళ్ళీ బ్రతికించి లేపబడతామా?" అని అనేవారు. అందుకే వారికీ శిక్ష విధించబడింది. భూమ్యాకాశాల్ని సృష్టించగలిగిన దేవుడు వారిలాంటి మానవుల్ని సునాయాసంగా బ్రతికించి లేపగలడని వారు గ్రహించలేరా? వారి పునరుత్థానం కొరకు ఆయన సమయం నిర్ణయించాడు. ఆ ఘడియ తప్పకుండా వస్తుంది. దుర్మార్గులు దాన్ని విశ్వసించకుండా మూర్ఖంగా నిరాకరిస్తున్నారు. (98-99)

వారితో ఇలా అను: "ఒకవేళ మీ అధీనంలో నా ప్రభువు కారుణ్యనిక్షేపాలు ఉంటే వాటిని మీరు ఖర్చయిపోతాయన్న భయంతో తప్పకుండా దాచివుంచేవారు. మానవుడు నిజంగా చాలా సంకుచిత మనస్కుడయి పోయాడు." (100)

మేము మూసాకు స్పష్టమైన తొమ్మిది నిదర్శనాలు[15] ప్రసాదించాం. (కావాలంటే) వాటిని గురించి ఇస్రాయీల్ సంతతివారిని అడుగు. అవి వారిముందు ప్రదర్శించబడి నప్పుడు, ఫిరౌన్ (వాటిని చూసి) "మూసా! (నీ వ్యవహారం చూస్తుంటే) నీవు తప్పకుండా చేతబడికి గురయినట్లు అన్పిస్తోంది నాకు" అన్నాడు. (101)

దానికి మూసా "ఈ నిదర్శనాలను భూమ్యాకాశాల ప్రభువు తప్ప మరెవరూ అవత రింపజేయలేదని (అవతరింపజేయలేరని) నీకు తెలుసు. ఫిరౌన్! (నీ మూర్ఖత్వం, మంకు తనాలు చూస్తుంటే) నీకేదో కీడు మూడిందని అన్పిస్తోంది నాకు" అని అన్నాడు. (102)

చివరికి ఫిరౌన్ ఎలాగైనా మూసాను, ఇస్రాయీల్ సంతతివారిని దేశంలో పూర్తిగా తుడిచిపెట్టాలని నిర్ణయానికి వచ్చాడు. అయితే మేము ఫిరౌన్‌ని, అతని అనుచర మూకను కట్టగలిపి (నడి సముద్రంలో) ముంచివేశాము. (103)

ఆ తర్వాత మేము ఇస్రాయీల్ సంతతివారితో "మీరిప్పుడు ప్రపంచంలో హాయిగా జీవించండి. చివరికి పరలోక వాగ్దానం నెరవేరే సమయం వచ్చినపుడు మేము మిమ్మల్ని ఒక సమూహంగా చేసి (మాముందు) సమావేశపరుస్తాం" అని చెప్పాం. (104)

మేమీ ఖుర్‌ఆన్‌ని సత్యప్రాతిపదికపై అవతరింపజేశాము. ఇది సత్యంతోనే అవత రించింది. ముహమ్మద్! మేము నిన్ను (విశ్వసించేవారికి) శుభవార్త అందజేసేవానిగా, (తిరస్కరించేవారిని) హెచ్చరించేవానిగా నియమించి పంపాము. (105)

మేమీ ఖుర్‌ఆన్‌ని కొద్దికొద్దిగా చేసి అవతరింపజేశాము. అందువల్ల నీవు కూడా దీన్ని విడతలవారిగా ఆగి ఆగి ప్రజలకు విన్పించు. దీన్ని మేము (సందర్భోచితంగా) క్రమక్రమంగా అవతరింపజేశాము. (106)

వారికిలా చెప్పు: "మీరు దీన్ని విశ్వసించండి, విశ్వసించకపోండి. పూర్వం (గ్రంథ) జ్ఞానం ప్రసాదించబడినవారి ముందు దీన్ని పఠిస్తే, వారు అప్రయత్నంగా సాష్టాంగపడి 'మా ప్రభువు ఎంతో పరిశుద్ధుడు. ఆయన వాగ్దానం తప్పకుండా నెరవేరుతుంది' అని అంటారు. అంతేకాదు, వారు కంటతడి పెడ్తూ బోర్లాపడి సాష్టాంగపడతారు. అది విన్న తరువాత వారిలోని అణుకువ, భక్తిభావలు ద్విగుణీ కృతమైపోతాయి." (107-109)

చెప్పు: "మీరు (దేవుడ్ని) అల్లాహ్ అని పిలవండి లేదా రహ్మాన్ అని పిలవండి. ఏ పేరుతో పిలిచినా అవన్నీ ఆయనకు మంచిపేర్లే" మీరు నమాజులో (ఖుర్‌ఆన్‌ని) బిగ్గరగా లేక మరీమెల్లగా పఠించకుండా మధ్యేమార్గం అవలంబించండి. (110)

ఇంకా ఇలా అనండి: "స్తుతిస్తోత్రాలకు దేవుడే అర్హుడు. ఆయన ఎవర్నీ కొడుకుగా చేసుకోలేదు. విశ్వసార్వభౌమత్వంలో ఆయనకు ఎవరూ భాగస్వాములు లేరు. ఒకరి సహాయసహకారాలపై ఆధారపడటానికి ఆయన ఎంతమాత్రం అశక్తుడు, అసమర్థుడు కాదు." ఆయన ఔన్నత్యాన్ని, అద్భుత శక్తిసామర్థ్యాల్ని ఘనంగా కీర్తించండి. (111) ✪

15. వివరాలకు 27:12 సూక్తి, దాని పాదసూచిక చూడండి.



అవతరణ: మక్కా

# 18. మహాబిలం (కహఫ్)

సూక్తులు: 110

ఈ అధ్యాయాన్ని "కహఫ్" (మహాబిలం) అంటారు. ఇది హిజ్రీ శకారంభానికి మూడేళ్ళ క్రితం అవతరించింది. మక్కా బహుదైవారాధకులు గ్రంథప్రజల ప్రోద్బలంతో దైవప్రవక్త (సల్లం)ను పరీక్షించడానికి మూడు ప్రశ్నలు అడిగారు: (1)మహాబిలం వారెవరు? (2)ఖిజర్ అంటే ఎవరు, ఆయన వృత్తాంతం ఏమిటి? (3)జుల్ఖర్ నైన్ గాథ ఏమిటి? ఈమూడు ప్రశ్నలకు ఈ అధ్యాయంలో వివరంగా సమాధానాలు ఇవ్వబడ్డాయి. ఆ తరువాత బహుదైవారాధకులకు విరోధ చర్యలు మానుకొని రుజుమార్గం అవలం బించమని చెప్పడం జరిగింది.

## కరుణామయుడు, కృపాసాగరుడయిన దేవుని పేరుతో ప్రారంభం

సమస్త ప్రశంసలు దేవునికే శోభిస్తాయి. ఆయనే తన దాసునిపై ఈగ్రంథాన్ని అవత రింపజేశాడు. ఈ గ్రంథంలో ఆయన ఎలాంటి వక్ర విషయాలు ఉంచలేదు. ఇందులో అన్ని విషయాలు సవ్యంగా, సమంజసంగా, సహేతుకంగానే ఉన్నాయి. ఇది దేవుడు విధించే అత్యంత కఠినశిక్ష గురించి ప్రజల్ని హెచ్చరిస్తోంది. విశ్వసించి సత్కార్యాలు చేసే వారికి (స్వర్గంరూపేణ) మంచి ప్రతిఫలం లభిస్తుందని, అందులో వారు కలకాలం సుఖంగా ఉంటారని శుభవార్త తెలియజేస్తోంది. ఇదే దీని అవతరణ ఉద్దేశ్యం. (1-3)

దేవునికి సంతానం ఉందని చెప్పేవారిని ఇది హెచ్చరిస్తోంది. దాన్ని గురించి వారికిగాని, వారి పూర్వీకులకుగాని వాస్తవం ఏమిటో తెలియదు. వారినోట వెలువడు తున్న ఈమాట చాలా తీవ్రమైన విషయం. వారు పచ్చి అబద్ధాలు పేలుతున్నారు. (4,5)

ప్రవక్తా! వారీ గ్రంథాన్ని నమ్మకపోతే, నీవు వారి వెంటబడి పుట్టెడు దుఃఖంతో ప్రాణం పోగొట్టుకునేలా ఉన్నావు. ప్రజలలో ఎవరు సత్కార్యాలు చేస్తూ సదాచార సంపన్నులవుతారో పరీక్షించడానికే, మేము సకల వస్తుసామగ్రితో భూమిని శోభాయ మానంగా తీర్చిదిద్దాము. చివరికి మేము దాన్నంతటినీ (తుడిచిపెట్టి) బంజరుభూమిగా మార్చివేస్తాము. (6-8)

మహాబిలంవాళ్ళను, శిలాశాసనంవాళ్ళను మా సూచలలో కొన్ని వింత సూచనలని భావిస్తున్నావా నీవు? ఆ యువకులు ఆశ్రయం పొందడానికి ఒక గుహలో ప్రవేశించి "ప్రభూ! మాపై నీ విశేష కారుణ్యం వర్షింపజెయ్యి. మా వ్యవహారం చక్కబెట్టు" అని ప్రార్థించారు. అప్పుడు మేమా యువకుల్ని ఆగుహలో పరుండబెట్టి సంవత్సరాల తరబడి ప్రగాఢ నిద్రావస్థలో ఉంచాం. ఆ తర్వాత వారిలో ఎవరు తమ నిద్రావస్థ కాలాన్ని కచ్చి తంగా లెక్కగడ్తారో తెలుసుకోవడానికి మేము వారిని (నిద్రనుండి) లేపాము. (9-12)

మేము వారి అసలుగాథ విన్పిస్తున్నాం: వారు కొందరు యువకులు. ఆ యువకులు తమ ప్రభువును విశ్వసించారు. మేము వారి మార్గాన్ని సుగమం చేశాము. వారు లేచి నిలబడి "భూమ్యాకాశాల ప్రభువే మా ప్రభువు. ఆయన్ని వదలి మేము మరే దైవాన్నీ ప్రార్థించము. ఒకవేళ మేమలా చేస్తే అదిచాలా బుద్ధిహీనమైన పని అవుతుంది"

అని ప్రకటించారు. అప్పుడు మేము వారికి మరింత మనోబలం ప్రసాదించాం. (13,14)

(తరువాత వారిలా మాట్లాడుకున్నారు:) "మనజాతి ప్రజలు విశ్వప్రభువుని వదలి ఇతరులను ఆరాధ్యదైవాలుగా చేసుకున్నారు. అవి నిజంగా ఆరాధ్యదైవాలైతే అందుకు వారు సరైన ప్రమాణం ఎందుకు చూపరు? దేవుని మీద అబద్ధాలు మోపేవాడి కంటే పరమ దుర్మార్గుడు ఎవడైనా ఉంటాడా? (15)

సరే, మనమిప్పుడు వారితో, దేవుడ్ని కాదని వారు పూజిస్తున్న మిథ్యాదైవాలతో సంబంధాలు తెంచివేసుకున్నాము. (ఇక ఇక్కడుండటం మనకు శ్రేయస్కరం కాదు) పదండి, ఏదైనా గుహలోకి వెళ్ళి దాక్కుందాం. మన ప్రభువు మనపై తన కారుణ్య ఛాయను విస్తృతం చేస్తాడు. మన పనులకు కావలసిన సౌలభ్యాలు సమకూర్చుతాడు."

ప్రవక్తా! నీవు గనక ఆగుహలో వారిని చూస్తే ఆ దృశ్యం నీకీ విధంగా కన్పిస్తుంది: సూర్యుడు ఉదయిస్తున్నప్పుడు అతను వారి గుహ(ముఖద్వారం) వదలి కుడివైపుగా పైకెక్కిపోతాడు. అస్తమిస్తున్నప్పుడు వారిని తప్పించి ఎడమవైపుగా క్రిందికి దిగిపోతాడు. (ఇలా ఆ గుహలోకి సూర్యకిరణాలు చొచ్చుకురాకుండా ఎల్లప్పుడూ చీకటిగానే ఉండేది.)

వారా గుహలో ఒక విశాలమైన స్థలంలో పడి ఉన్నారు. ఇది దేవుని సూచనల్లో ఒక సూచన. దేవుడు ఎవరికి దారి చూపదలచుకుంటాడో అతనే దారిలోకి వస్తాడు; ఎవరిని దారి తప్పించదలచుకుంటాడో అతనికి ఏమార్గదర్శీ, కార్యసాధకుడూ లభించడు.

నీవు వారిని చూసి మేల్కొనివున్నారని భావిస్తావు. కాని వారు నిద్రపోతున్నారు. మేము వారిని కుడిప్రక్కకు, ఎడమప్రక్కకు తిరుగుతూ పడుకునేలా చేశాం. వారి కుక్క గుహ ముఖ ద్వారంలో ముందుకాళ్ళు చాచి కూర్చున్నది. నీవు గనక కాస్త ఆ గుహలోకి తొంగిచూశావంటే చాలు, గిర్రున వెనక్కి తిరిగి పరుగు లంకించుకుంటావు. అక్కడి భయంకర దృశ్యానికి[1] నీ గుండెలు తారెత్తిపోతాయి. (16-18)

వారు పరస్పరం (తమ పరిస్థితిని గురించి) చర్చించుకోవడానికి మేము వారిని తిరిగి అదేవిధంగా లేపి కూర్చోబెట్టాము. వారిలో ఒకడు "మనం ఈ స్థితిలో ఎంత సేపున్నాం?" అని అడిగాడు. దానికి రెండోవాడు "బహుశా (మనమీ స్థితిలో) ఒకరోజో లేక అంతకంటే కొంచెం తక్కువ సేపో ఉండి ఉంటాము" అన్నాడు.

ఆ తర్వాత వారిలో కొందరిలా అన్నారు: "మనమీ స్థితిలో ఎంతసేపు ఉన్నామో దేవునికే బాగా తెలుసు. సరే, మనలో ఒకనికి ఒక వెండినాణెం ఇచ్చి నగరంలోకి పంపుదాం. అతను మన కోసం మంచి భోజనం ఎక్కడ దొరుకుతుందో చూసి తెస్తాడు. అయితే అతను కాస్త జాగ్రత్తగా ఉండాలి. మనమిక్కడ ఉన్నట్లు అతని అజాగ్రత్త వల్ల ఎవరికైనా తెలిస్తే ప్రమాదం ముంచుకొస్తుంది. విధివశాత్తు మనం వారి చేతుల్లో పడితే మాత్రం వదలరు. రాళ్ళతో కొట్టి చంపేస్తారు. లేదా బలవంతంగా మనల్ని తమ మతం లోకి లాక్కుంటారు. అలా జరిగితే మనం ఇక ఎన్నటికీ మోక్షం పొందలేము." (19,20)

1. అంటే అక్కడ భయంకరమైన బందిపోటు దొంగలు ఉన్నట్లు ఆ దృశ్యం కన్పిస్తోంది.



ఈ విధంగా మేము వారి పరిస్థితి గురించి నగరవాసులకు తెలియజేశాము. దేవుని వాగ్దానం నిజమైనదని, ప్రళయం తప్పకుండా వస్తుందని ప్రజలు తెలుసుకోవ డానికే ఇలా చేశాము.[2] (అయితే ఈ విషయం విస్మరించి) వారా సమయంలో గుహ వాసుల విషయమయి ఎలా వ్యవహరించాలన్న మాటపై వాదులాడుకోసాగారు. వారి లో (దైవధర్మం పట్ల సరైన అవగాహన కలిగిన) కొందరు "వారి (గుహ)మీద (స్మారక చిహ్నంగా) ఒక గోడ కట్టండి. వారి వ్యవహారం గురించి వారి ప్రభువుకే బాగా తెలుసు" అన్నారు. అయితే వారి వ్యవహారంపై అధికారం కలిగివున్నవారు (ప్రభుత్వాధికారులు, క్రైస్తవ మతనాయకులు) "మేము వారిపై ప్రార్థనా మందిరం నిర్మిస్తాం" అన్నారు.[3] (21)

(కొంతకాలానికి యువకుల సంఖ్య, వారి నిద్రావస్థకాలం గురించి ప్రజల్లో భిన్నాభి ప్రాయాలు ఏర్పడ్డాయి.) కొందరు "వారు ముగ్గురు, నాలుగోది వారి కుక్క" అన్నారు.

2. ఆ యువకుల్లో ఒకతను భోజనం కొని తీసుకురావడానికి పట్నంలో ప్రవేశించి చూస్తే, అంతా కొత్త కొత్తగా కన్పించింది. రోమ్ విగ్రహారాధకులు క్రైస్తవులుగా మారి అనేక దశాబ్దాలు గడచి పోయాయి. భాష, సంస్కృతి, వస్త్రధారణ ఒకటేమిటీ మొత్తంపరిస్థితి మారిపోయింది. ఆ యువకుడు ఒక దుకాణం దగ్గరికెళ్ళి ఆహారపదార్థాల కోసం రెండొందల యేళ్ళ క్రితంనాటి వెండినాణెం చూపగానే దుకాణదారుడు సంభ్రమాశ్చర్యాలతో అతడ్ని చూడసాగాడు. అతను సైగచేసి దరిదాపుల్లో ఉన్న జనాన్ని పోగుచేశాడు. భాషా, వస్త్రధారణ, రూపురేఖల్లో ఎంతో తేడా ఉన్న ఆ యువకుడ్ని జనం వింతగా చూశారు. చివరికి అతడ్ని ప్రభుత్వాధికారుల ముందు ప్రవేశపెట్టడం జరిగింది. వారతనితో మాట్లాడిన తరువాత, రెండొందల సంవత్సరాలకు పూర్వం తమ మతవిశ్వాసాన్ని కాపాడుకోవడానికి పారిపోయిన క్రైస్తవ యువకుల్లో ఇతనొకడని నిర్ధారించారు. వెంటనే ఈవార్త నగర క్రైస్తవుల్లో కార్చిచ్చులా వ్యాపించింది. అధికారులతో పాటు ఓ పెద్ద జనసమూహం కొండగుహ దగ్గరకు చేరు కుంది. ఆ యువకులు కూడా తాము రెండొందల సంవత్సరాల తర్వాత నిద్రనుండి మేల్కొన్నామని గ్రహించారు. వారు తమ మతస్థులైన క్రైస్తవ సోదరులకు సలాంచేసి పడుకున్నారు. పడుకోగానే వారి ఆత్మలు అనంతవాయువుల్లో కలసిపోయాయి. (తఫీముల్ ఖుర్ఆన్ నుండి)

3. సాధారణంగా బహుదైవారాధకులు చనిపోయిన మహనీయుల సమాధులను, స్మారక చిహ్నాలను ఆరాధించడం, అక్కడ మొక్కుబడులు చెల్లించుకోవడం అందరికీ తెలిసిందే. కాని మహా ప్రవక్త ముహమ్మద్ (సల్లం) దివంగతులైన కొన్నేళ్ళకు ఈ వ్యాధి ముస్లింసమాజానికి కూడా సోకింది. కనుక ఈసందర్భంగా ఆ మహనీయుని మహితోక్తులు కాస్త మననం చేసుకుందాం.

"సమాధుల్ని సందర్శించే స్త్రీలను, సమాధులపై ఆరాధనాలయాలు (దర్గాలు) నిర్మించే వారిని, అక్కడ దీపాలంకరణ చేసేవారిని దేవుడు శపించాడు." (తిర్మిజి, అబూదావూద్, నసాయి)

"జాగ్రత్త! మీకు పూర్వం గతించిన ప్రజలు తమ ప్రవక్తల సమాధుల్ని ఆరాధనాలయాలుగా చేసుకునేవారు. ఈ (దుష్ట)చర్య నుండి నేను మిమ్మల్ని వారిస్తున్నాను." (ముస్లిం)

"యూదులు, క్రైస్తవులు తమ ప్రవక్తల సమాధుల్ని ఆరాధనాలయాలుగా చేసుకున్నారు. అందువల్ల దేవుడు వారిని శపించాడు." (ముస్లిం, నసాయి)

"వారిలో ఎవరయినా సత్పురుషుడు చనిపోయిన తర్వాత వారతని సమాధిని ఆరాధనా లయంగా చేసివేస్తారు. అతని చిత్రాలను (విగ్రహాలను) తయారుచేస్తారు. ప్రళయదినాన వీరు యావత్తు సృష్టిలో పరమ నికృష్టులవుతారు." (అహ్మద్, బుఖారి, ముస్లిం, నసాయి)

మరికొందరు "వారు అయిదుగురు, ఆరవది వారి కుక్క" అన్నారు. ఇంకా కొందరు "వారు ఏడుగురు, ఎనిమిదోది వారి కుక్క" అన్నారు. ఇవన్నీ వారి ఊహాగానాలు, వ్యర్థ ప్రేలాపనలు మాత్రమే. "వారెంతమందో నా ప్రభువుకే బాగా తెలుసు" అని చెప్పు

వారి కచ్చితమైన సంఖ్యను గురించి చాలా తక్కువమందికే తెలుసు. కనుక నీవు ముక్తసరిగా సమాధానం ఇవ్వడం తప్ప వారి సంఖ్యను గురించి ప్రజలతో వాదించకు. దాన్ని గురించి ఇతరుల్ని అడగటానిక్కూడా ప్రయత్నించకు. (22)

ఒక విషయం గుర్తుంచుకో. ఏవిషయం గురించయినా 'నేనీ పని రేపు చేస్తాన'ని అనకు. దేవుడు తలిస్తే తప్ప (నీవేమీ చేయలేవు). ఒకవేళ మరచిపోయి ఇలాంటి మాట నీనోట వెలువడితే వెంటనే నీ ప్రభువుని జ్ఞాపకం చేసుకొని 'ఈ విషయంలో నా ప్రభువు ఇంతకంటే దగ్గరిమాట వైపు నాకు దారిచూపుతాడని ఆశిస్తున్నాన'ని చెప్పు. (23,24)

(నిద్రావస్థ కాలం గురించి కొందరు) "గుహలో వారు మూడొందల సంవత్సరాలు ఉన్నారు" (అన్నారు. మరికొందరు ఈ సంఖ్యలో) తొమ్మిది సంవత్సరాలు (ముందుకు పోయారు). "వారెంత కాలం (ఆ స్థితిలో) ఉన్నారో దేవునికే బాగాతెలుసు" అని చెప్పు.

భూమ్యాకాశాల్లోని రహస్యాలన్నీ ఆయనకే తెలుసు. ఆ చూసేవాడు, వినేవాడు ఎంత అద్భుత శక్తిసంపన్నుడు! యావత్తువిశ్వంలో ఆయనతప్ప వారికి మరోరక్షకుడు, సహాయకుడూ లేడు. ఆయన తన రాజ్యాధికారంలో ఇతరులకెవరికీ భాగస్వామ్యం కల్పించడు. (25,26)

ముహమ్మద్ (స)! నీప్రభువు గ్రంథం నుంచి నీపై అవతరించిన విషయాలన్నిటినీ యథాతథంగా (ప్రజలకు) విన్పించు. అందులో ఏదైనా మార్చడానికి ఎవరికీ అధికారం లేదు. (ఒకవేళ నీవు ఎవరి కోసమైనా ఏదైనా మార్చడానికి సాహసిస్తే గుర్తుంచుకో,) నీ ప్రభువు బారినుండి తప్పించుకోవడానికి నీకు ఎక్కడా ఆశ్రయం లభించదు. (27)

నీ ప్రభువు ప్రసన్నతా భాగ్యం ఆశిస్తూ ఉదయం, సాయంత్రం ఆయన్ని వేడుకునే వారితో కలసిమెలసి ఉండు. వారి వైపు నుండి ఎన్నటికీ దృష్టి మరల్చుకోకు.[4] నీవు ప్రాపంచిక వైభవం కోరుకుంటున్నావా? (ఇహలోకంలోని తళుకు బెళుకులన్నీ మూన్నాళ్ళ ముచ్చట మాత్రమే. కనుక) మేము మా జ్ఞాపకాన్ని విస్మరింపజేసి (ప్రాపంచిక వ్యామో

4. ఖురైష్ నాయకులు (దైవప్రవక్త సందేశాన్ని అందుకోవడానికి నిరాకరిస్తూ) "ఈ బిలాల్, సుహైల్, అమ్మార్, ఖబ్బాబ్, ఇబ్నె మస్‌వూద్ వంటి దరిద్రులు నీ చుట్టూ చేరారు. అలాంటి సమావేశానికి మేము రాలేం. వాళ్ళను తీసివేస్తే మేము నీ సమావేశానికి వచ్చి, నీవు చెప్పదలచు కున్నదేమిటో విని ఆలోచిస్తాం" అన్నారు. ఆ సందర్భంలో ఈ సూక్తి అవతరించింది.

ధర్మప్రచారం తొలిరోజుల్లో ఎక్కువగా పేదలు, బానిసలు, దళితులే ఇస్లాం స్వీకరించేవారు. ధనికులు, నాయకులు, అగ్రవర్ణాలవారు తాము స్వయంగా ఇస్లాం స్వీకరించక పోవడమేగాక ఇతరుల్ని కూడా నిరోధిస్తూ దైవమార్గంలో ఆటంకాలు సృష్టిస్తుండేవారు. నూహ్‌ప్రవక్త (అలైహి) కాలంలో కూడా పేదలు, దళితులే ఎక్కువగా ఇస్లాం ధర్మం స్వీకరించారు. (వివరాలకు 11:27 సూక్తి, దాని పాదసూచిక; 26:111 సూక్తి చూడండి.)



హానికి గురిచేసి)న వ్యక్తిని నీవు ఎన్నటికీ విధేయించకు. (అతని ఆజ్ఞలు పాటించకు.) అతను మనోవాంఛలకు బానిసైపోయి విశృంఖలజీవితానికి అలవాటుపడ్డాడు. (28)

వారికిలా చెప్పు: ఇది మీ ప్రభువు దగ్గర్నుండి వచ్చిన పరమసత్యం. దీన్ని ఇష్టమైన వారు విశ్వసించవచ్చు, ఇష్టంలేనివారు తిరస్కరించవచ్చు. (మీకా స్వేచ్ఛ ఉంది.)

అయితే (సత్యాన్ని తిరస్కరించే) దుర్మార్గుల కోసం మేము నరకాగ్ని సిద్ధపరచి ఉంచాము. భయంకరమైన దాని జ్వాలలు వారిని చుట్టుముట్టి దహించివేస్తాయి. వారక్కడ త్రాగడానికి నీళ్ళు అడిగినప్పుడల్లా సలసలకాగే చమురుతెట్టు లాంటి నీటితో వారికి ఆతిథ్యం ఇవ్వబడుతుంది. అది వారి ముఖాలను తీవ్రంగా మాడ్చివేస్తుంది. అత్యంత హేయమైన నీరది! మహాచెడ్డ విశ్రాంతి స్థలమది!! (29)

ఇక సత్యాన్ని విశ్వసించి సత్కార్యాలు చేసేవారి విషయానికొస్తే, అలాంటి సదా చారసంపన్నులకు లభించవలసిన ప్రతిఫలాన్ని మేము ఎన్నటికీ వృథా చేయం. వారి కోసం సెలయేరులు ప్రవహించే నిత్యహరిత స్వర్గవనాలున్నాయి. వారికక్కడ బంగారపు మురుగులతో ముస్తాబు చేస్తారు. వారు బంగారు జరీతో కూడిన పచ్చటి పట్టువస్త్రాలు ధరిస్తారు. అద్భుతమైన ఉన్నతాసనాలపై మెత్తటి దిండ్లకానుకొని కూర్చుంటారు. ఎంత మంచి ప్రతిఫలం అది! అత్యున్నత శ్రేణికి చెందిన నివాసస్థలమది!! (30,31)

ప్రవక్తా! వారికి ఇద్దరు వ్యక్తుల ఉపమానం విన్పించు. వారిద్దరిలో ఒకనికి మేము రెండు ద్రాక్షతోటలు ఇచ్చాం. వాటి చుట్టు ఖర్జూరపు చెట్లను కంచెలా పెట్టాం. మధ్యలో సేద్యభూమి ఉంచాం. రెండు తోటలు పుష్కలంగా పండాయి. ఫలోత్పాదనలో మేము ఏకొరత చేయలేదు. ఆ తోటలలో ఓకాలువ కూడా ఉంచాం. (ఆఏడు) అతనికి మంచి లాభం వచ్చింది. దాంతో అతను ఓరోజు తన పొరుగింటి మిత్రునితో "నేను నీకంటే పెద్ద ధనికుడ్ని. నీకంటే ఎక్కువ మందీమార్బలం గలవాడ్ని" అన్నాడు. (32-34)

ఆ తర్వాత అతను తన తోటలో ప్రవేశించి, ఆత్మవంచితుడై "ఈ సిరిసంపదలు ఇక నాశనమవుతాయని నేను అనుకోను. (జనంఏదో ప్రళయం గిళయం అంటున్నారు గాని) నాకు (మాత్రం) ప్రళయమ్మీద నమ్మకం లేదు. ఒకవేళ నేను నాప్రభువు దగ్గరికి పంపబడినా, అక్కడ నాకు ఇంతకంటే గొప్ప స్థానం లభిస్తుంది" అని అన్నాడు. (35,36)

అతని పొరుగింటి స్నేహితుడు అతనితో ఇలా అన్నాడు: "ఏమిటీ, నిన్ను మట్టితో నీచమైన బిందువుతో పుట్టించి పరిపూర్ణ మానవునిగా రూపొందించిన శక్తిస్వరూపుడ్నే తిరస్కరిస్తున్నావా? నా విషయానికి వస్తే, నేను మాత్రం దేవుడ్నే నా ప్రభువుగా స్వీకరించాను. ఆయన దైవత్వంలో మరెవరికీ భాగస్వామ్యం కల్పించను." (37,38)

"నీవు నీతోటలో ప్రవేశిస్తున్నప్పుడు దేవుడు తలచినదే అవుతుందని; దేవునికి తప్ప మరెవరికీ ఎలాంటి శక్తిలేదని ఎందుకనలేదు? సంతానం సిరిసంపదల విషయంలో నీవు నన్ను నీకంటే తక్కువవాణ్ణని భావిస్తుంటే భావించు. నాప్రభువు నాకు నీ తోటకంటే శ్రేష్ఠమైన తోట ప్రసాదించవచ్చు. అటు నీ తోటపైకి ఆకాశంనుండి ఏదైనా విపత్తు

పంపవచ్చు. దాంతో ఆ తోట కాస్తా తుడిచిపెట్టుకుపోయి ఉత్త మైదానంగా మారవచ్చు. లేదా ఆ తోటలోని నీరంతా భూమిలోకి ఇంకిపోవచ్చు. ఇక దాన్ని తీయడం నీతరం కాకపోవచ్చు.'' (39-41)

చివరికి (అతనన్నట్లే జరిగింది.) అతని పండ్లతోటపై విపత్తు వచ్చిపడి పూర్తిగా తుడిచి పెట్టుకుపోయింది. అతను తన పెట్టుబడి అంతా వృధా అయిపోయినందుకు చేతులు నులుపుకుంటూ ''అయ్యయ్యో! నేను నా ప్రభువుకు సాటికల్పించకుండా ఉంటే ఎంత బాగుండేది!'' అని బాధపడ్డాడు. (42)

అప్పుడు దేవునికి వ్యతిరేకంగా అతడ్ని ఏ మందీమార్బలం ఆదుకోలేక పోయింది. తనంతట తాను కూడా కాపాడుకోలేక పోయాడు. అప్పుడు తెలిసిందతనికి పనులు నెరవేర్చే శక్తి, అధికారం సత్యస్వరూపుడైన దేవునికే ఉన్నాయని; ఆయన ప్రసాదించే బహుమానమే మేలైనదని; ఆయన చూపే పర్యవసానమే శ్రేష్ఠమైనదని. (43,44)

ప్రవక్తా! మరో ఉదాహరణ ద్వారా వారికి ప్రాపంచిక జీవితం గురించి చెప్పు. ఈరోజు మేము  ఆకాశం నుండి వర్షం కురిపిస్తుంటే భూమి సస్యశామలమవుతుంది. రేపు ఈ చెట్లు, చేమలే నుగ్గునుగ్గయి గాలికి ఎగిరిపోతాయి. దేవునికి అణువణువుపై అధికారం ఉంది. (45)

ఈ సంతానం, సిరిసంపదలు ప్రాపంచిక జీవితపు పైపై మెరుగులు మాత్రమే. నీ ప్రభువు దృష్టిలో ఫలితం రీత్యా ఎంతో శ్రేష్ఠమయినవి, శాశ్వతంగా ఉండేవి సత్కార్యాలు మాత్రమే. వాటి ద్వారానే మేలు ఆశించడానికి ఆస్కారముంది. (46)

కనుక మేము పర్వతాలను పెకలించి నడిపించే దినం గురించి మీరు యోచించాలి. ఆరోజు భూమి చదునైన మైదానంగా మారిపోవడం నీకు కన్పిస్తుంది. మేము యావత్తు మానవుల్ని చుట్టుముట్టి సమీకరిస్తాము. ఒక్కడ్ని కూడా వదలి పెట్టము. అందర్నీ వరుసలు తీర్చి నీ ప్రభువు సమక్షంలో ప్రవేశపెట్టడం జరుగుతుంది.

ఇక చూడండి, వచ్చేశారుగా మా దగ్గరకు మీరు! మేము మిమ్మల్ని మొదటిసారి ఎలా పుట్టించామో అలాగే మీరు (బ్రతికించబడి) మా దగ్గరకు వచ్చారు. మేము మీకు ఎలాంటి సమయం నిర్ణయించలేదని మీరు భావిస్తుండేవారు. (47,48)

కర్మపత్రాలు తీసి ముందుంచబడతాయి. అప్పుడు నీవు పాపాత్ముల పరిస్థితి ఎలా ఉంటుందో చూస్తావు. వారా కర్మపత్రాల్లోని విషయాలు చూసుకొని భయపడు తుంటారు. (తమ అకృత్యాలకు బాధపడిపోతూ) ''అయ్యయ్యో, ఎంతటి దౌర్భాగ్యం దాపురించింది! ఈ కర్మల చిట్టా ఏమిటోగాని, మేము చేసిన చిన్నాపెద్దా కర్మల్లో ఒక్కటి కూడా ఇందులో రాయకుండా వదలి పెట్టలేదే!!'' అనంటారు. వారు తమ కర్మలన్నీ ప్రత్యక్షంగా చూసుకుంటారు. నీప్రభువు ఎవరికీ ఎలాంటి అన్యాయం చేయడు. (49)

మేము (తొలిమానవుడు) ఆదంకు గౌరవసూచకంగా అభివాదం చేయమని దైవ దూతల్ని ఆదేశించినప్పుడు అందరూ అభివాదం చేశారు. కాని ఇబ్లీస్ మాత్రం అలా



చేయలేదు. వాడు జిన్నుల జాతికి చెందినవాడు. అందువల్ల వాడు తన ప్రభువాజ్ఞను జవదాటి పోయాడు. అలాంటప్పుడు మీరు నన్ను వదలి వాడ్ని, వాడి సంతతిని సంరక్ష కులుగా ఎలా చేసుకుంటారు? వారు మీకు విరోధులు కదా? దుర్మార్గులు అనుస రిస్తున్న ఈ ప్రత్యామ్నాయ మార్గం ఎంతో హేయమైనది! (50)

నేను భూమ్యాకాశాలు సృష్టిస్తున్నప్పుడు వారిని పిలువలేదు. స్వయంగా వారిని సృష్టించే కార్యంలో కూడా వారి పాత్రను తీసుకోలేదు. అపమార్గం పట్టించేవారిని సహాయకులుగా తీసుకోవడం నా పనికాదు. (51)

''నా దైవత్వంలో భాగస్థులని మీరు భావించిన మిథ్యాదైవాల్ని మొరపెట్టుకోండి'' అని (ప్రళయదినాన) వారి ప్రభువు అంటాడు. అప్పుడు వారి పరిస్థితి ఎలా ఉంటుంది? వారా మిథ్యాదైవాల్ని మొరపెట్టుకుంటారు. కాని ఆ దైవాలేవీ వారికి సహాయం చేయ డానికి రావు. మేము వారి వినాశం కోసం ఒకే ఒక ఉమ్మడి గొయ్యి ఏర్పాటు చేస్తాము. పాపాత్ములంతా ఆరోజు నరకాగ్నిని చూస్తూ, తామిక ఆ గొయ్యిలో పడక తప్పదని భావిస్తారు. దాన్నుండి తప్పించుకునే దారేదీ వారికి కన్పించదు. (52,53)

మేమీ ఖుర్‌ఆన్‌లో ప్రజలకు అనేక నిదర్శనాలు చూపుతూ రకరకాలుగా నచ్చజెప్పి చూశాం. కాని ఈ మానవుడు జగడాలమారిగా తయారయ్యాడు. వారి ముందుకు హిత బోధ వచ్చినప్పుడు దాన్ని విశ్వసించకుండా, తమ ప్రభువు సన్నిధిలో క్షమాపణ కోరుకో కుండా వారిని ఏ విషయం నిరోధించింది? వారసలు గత జాతులకు ఏగతి పట్టిందో ఆగతి తమకూ పట్టాలని ఎదురుచూస్తున్నారు. ఈ విషయమే వారిని నిరోధించింది. లేక ఏదైనా ఆపద తమపై విరుచుకుపడితే గాని వారు విశ్వసించేటట్లు లేదు! (54,55)

మేము ఏ ప్రవక్తను పంపినా (స్వర్గ) శుభవార్తలు విన్పించడానికి, (నరక యాతనల్ని గురించి) హెచ్చరించడానికి మాత్రమే పంపుతాము. అది తప్ప మరే లక్ష్యం కోసం పంపము. కాని సత్యతిరస్కారులు ఎల్లప్పుడూ అధర్మం, అసత్యవాదనలతో సత్యాన్ని పక్కదారి పట్టించడానికే ప్రయత్నిస్తున్నారు. వారు నా సూక్తులను, వారికి నేను చేస్తున్న హెచ్చరికలను పరిహాస విషయాలుగా చేసుకున్నారు. (56)

దేవుని సూక్తులు విన్పించి నచ్చజెప్పినా వాటిని పెడచెవిన పెట్టి, చేజేతులా చేసుకున్న (దుష్)కర్మల పర్యవసానం విస్మరించే వాడికంటే పరమ దుర్మార్గుడు మరెవ రుంటారు? అ దుర్మార్గుల హృదయ కవాటాలను మేము మూసివేశాము. దాంతో వారు ఖుర్‌ఆన్‌కు సంబంధించిన ఏ విషయాన్నీ అర్థం చేసుకోలేరు. అంతేకాదు, వారి చెవులకు మేము చెవుడు కల్పించాము. కనుక నీవు వారిని సన్మార్గం వైపు ఎంత పిలిచినా వారా స్థితిలో ఎన్నటికీ సన్మార్గం పొందలేరు. (57)

నీ ప్రభువు ఎంతో క్షమాగుణం కలవాడు. ఆయన వారి అకృత్యాలకు వారిని వెంటనే పట్టుకో దలచుకుంటే శిక్ష (ఆపద) పంపేవాడు. కాని వారికోసం ఒక నిర్ణీత సమయం ఉంది. ఆ సమయం వస్తే ఇక ఆయన శిక్ష నుండి తప్పించుకునే దారేదీ వారికి లభించదు. (58)

ఈ శిక్షకు గురయి (సర్వనాశనమై)న జనపదాలు (మీరు ప్రయాణించే దారిలోనే ఉన్నాయి). వారు అన్యాయం, అక్రమాలకు పాల్పడినందువల్లనే వారిని మేము నాశనం చేశాం. వారి వినాశం కోసం ఒక సమయం నిర్ణయించాము. (59)

(వారికి మూసా వృత్తాంతం విన్పించు.)[5] అప్పుడు మూసా తన సేవకునితో "రెండునదుల సంగమానికి చేరుకోనంత వరకూ నేనీ ప్రయాణం ముగించను. అప్పటిదాకా నేను ఓసుదీర్ఘకాలం పాటు ఇలా నడుస్తూనే ఉంటాను" అన్నాడు. చివరికి వారు ఆనదీ సంగమానికి చేరుకున్నారు. అయితే వారు తమ చేప సంగతి మరచి పోయారు. అది (వారి దగ్గర్నుంచి) జారి నదిలో ఈదుకుంటూ పారిపోయింది. (60,61)

మూసా అక్కడ్నుంచి ముందుకు కొద్దిదూరం నడిచాక తన సేవకునితో "ఇక తీసుకు రా మా భోజనం. మేమీ ప్రయాణంలో చాలా అలసిపోయాం" అన్నాడు. (62)

అప్పుడు సేవకుడు (చేప సంగతి గుర్తుకొచ్చి ఇలా అన్నాడు:) "అది సరేగాని, అసలు ఏం జరిగిందో చూశారా? మనం ఆ చట్టుబండ దగ్గర కూర్చున్నామా...అప్పుడు నాకు చేప సంగతే గుర్తుకు రాలేదు. షైతాన్ నన్ను ఏమరుపాటుకు గురిచేశాడు. నేనా సంగతి మీకు చెప్పడం మరచిపోయాను. చేప భలే విచిత్రంగా నదిలోకి దూకి పారి పోయింది." (63)

మూసా (ఈమాట విని) "(అయ్యయ్యో!) దాన్ని గురించే కదరా బాబూ! నా అన్వేషణ. (పదపద)" అన్నాడు. అలా వారుభయులు తమ అడుగుజాడల్లో నడుచు కుంటూ వెనక్కి వెళ్ళారు. అక్కడ మా దాసులలో ఒక (ప్రత్యేక) దాసుడ్ని చూశారు. మేమా దాసునికి[6] మా కారుణ్యభాగ్యం ప్రసాదించాం. మా దగ్గర నుండి విశేష జ్ఞానం కూడా నేర్పాము. (64,65)

మూసా అతనితో "మీకు (దేవుడు) నేర్పిన దివ్యజ్ఞానం నాక్కూడా నేర్పుతారా? దాని కోసం నేను మీ దగ్గర శిష్యరికం చేయవచ్చా?" అని అడిగాడు. (66)

దానికి ఆదాసుడు "మీరు నాదగ్గర సహనంగా ఉండలేరు. అయినా మీకు తెలియని విషయాలను గురించి మీరెలా సహనం వహించగలరు?" అన్నాడు. (67,68)

---

5. హజ్రత్ మూసా (అలైహి) ఓసారి ఇస్రాయీలీల ముందు ప్రసంగిస్తుంటే ఒకతను లేచి "అందరికంటే గొప్పపండితుడు ఎవర"ని అడిగాడు. దానికి మూసా (అలైహి) నేనే అన్నారు. ఈ మాటకు దేవుడు ఆగ్రహించి, "మజ్మయిల్ బహ్రైన్ (నదీ సంగమం) వద్ద నా దాసుడొకడున్నాడు. అతను నీకంటే గొప్పపండితుడు" అన్నాడు. "అయితే ప్రభూ! నేనాయన వద్దకు ఎలా చేరుకోవాలి?" అడిగారు మూసా. "నీవొక చేపను తోలుతిత్తిలో పెట్టుకొని తీసికెళ్ళు. ఎక్కడైతే నీకు చేప కన్పించదో ఆ ప్రదేశంలోనే నీవా మనిషిని కలుసుకోగలవు" తెలియజేశాడు దేవుడు. అప్పుడు మూసా(అలైహి) సేవకుడు యూషె బిన్‌నూన్‌ని తీసుకొని బయలుదేరారు. (బుఖారి, ముస్లిం)

6. ఈ దాసుడు మానవ రూపంలో వచ్చిన ఓ ప్రత్యేక దైవదూత అయి వుండవచ్చుని, అతని పేరు ఖిజర్ అని కొందరు భాష్యకారులు వ్రాశారు.



"దైవచిత్తమయితే మీరు నన్ను సహనశీలిగా చూడగలరు. నేను ఏ విషయంలోనూ మీకు వ్యతిరేకంగా వ్యవహరించను" అన్నాడు మూసా. (69)

"సరే, మీరు నావెంట రాదలచుకుంటే ఏ విషయమైనా నేను స్వయంగా మీకు చెప్ప నంతవరకు దాన్ని గురించి మీరు నన్నడగ వద్దు" అన్నాడు ఆ దాసుడు. (70)

(ఇలా మాట్లాడుకున్న తర్వాత) వాళ్ళిద్దరూ అక్కడ్నుంచి బయలుదేరారు. (కొంత దూరం నడిచి) చివరికి ఒక పడవ ఎక్కారు.[7] (కాస్సేపటికి) అతనా పడవ అడుగున ఒక రంధ్రం వేశాడు. అది చూసి మూసా "ఏమిటీ మీరిందులో రంధ్రం వేశారు? పడవ లోని వారందర్నీ ముంచివేయదలిచారా? చాలా ఘోరమైన పని చేశారు" అన్నాడు.

"నేను చెప్పలేదా, నీవు నాతోపాటు సహనంగా ఉండలేవని" అన్నాడతను.

"మరచిపోయాను. మతిమరుపు గురించి నన్ను పట్టుకోకండి. (దయచేసి) నా విషయంలో కఠినంగా వ్యవహరించకండి" అన్నాడు మూసా (71-73)

వాళ్ళిద్దరు తిరిగి ప్రయాణం సాగించారు. కొంత దూరం పోయాక వారికొక అబ్బాయి కన్పించాడు. అప్పుడావ్యక్తి (ముందుకుపోయి) ఆ పిల్లవాడ్ని హతమార్చివేశాడు.

"మీరు ఏపాపం ఎరగని ఒక అమాయకుడ్ని దారుణంగా చంపేశారు! పాపం అతను ఎవర్నీ హత్య చేయలేదే!! మీరు చాలా చెడ్డపని చేశారు" అన్నాడు మూసా.

"నేను చెప్పలేదూ నీవు నాతోపాటు సహనంగా ఉండలేవని?" అన్నాడా వ్యక్తి.

"(పొరపాటయింది.) ఇకముందు నేనేదైనా మీకు ఎదురుచెప్తే నన్ను మీతోపాటు ఉంచకండి. ఇప్పుడు మాత్రం నావైపున మీకు సాకు దొరికింది" అన్నాడు మూసా.

అక్కడ్నుంచి వారు ముందుకుసాగి ఓ ఊరికి చేరుకున్నారు. ఆ ఊరి ప్రజల్ని భోజనం అడిగారు. కాని ఊరిప్రజలు వారిద్దరికి ఆతిథ్యమివ్వడానికి నిరాకరించారు. తరువాత వారా ఊళ్ళో పడిపోవడానికి సిద్ధంగా ఉన్న ఒక గోడ చూశారు. అప్పుడా వ్యక్తి వెంటనే ఆ గోడకు మరమ్మత్తు చేశాడు. మూసా (ఉండబట్టలేక) "మీరు కావాలను కుంటే ఈ పనికి ప్రతిఫలం అడిగి తీసుకోవచ్చు కదా?" అన్నాడు. (74-77)

ఇకచాలు, నాతో నీ శిష్యరికం ముగిసిపోయింది. ఇప్పుడు నీవు సహనం వహించ లేకపోయిన వ్యవహారాలను గురించి వాస్తవం ఏమిటో చెబుతా విను: (78)

పడవ సంగతి: ఆ పడవ కొందరు పేదవాళ్ళది. వారు జీవనోపాధి కోసం నదిలో ఆ పడవ నడుపుకుంటున్నారు. నది ఆవల బలవంతంగా పడవలను స్వాధీనం

---

7. కాస్సేపటికి ఒక పిట్ట వచ్చి పడవ అంచుమీద కూర్చున్నది. అది నదిలోని నీటిని ఒకటి లేక రెండు చుక్కలు ముక్కుతో పీల్చుకున్నది. అప్పుడు హజ్రత్ ఖిజర్ (అలైహి) మాట్లాడుతూ "నీకు, నాకు లభించిన జ్ఞానాన్ని దేవునికున్న జ్ఞానంతో పోల్చితే అది ఈపిట్ట నదిలో నుంచి నీటిని తన ముక్కుతో పీల్చుకున్నంత కూడా లేదు" అని అన్నారు. (బుఖారి, ముస్లిం)

చేసుకునే ఒక రాజు ఉన్నాడు. (అతను మంచి పడవలను మాత్రమే స్వాధీనం చేసుకుంటాడు.) అందువల్ల నేనా పడవకు ఏదైనా లోపం కలిగించాలనుకున్నాను. (79)

పోతే బాలుడి విషయం- ఆ బాలుడి తల్లిదండ్రులు విశ్వాసులైన దైవభక్తులు. అయితే ఆ బాలుడు (పెద్దవాడై) తన తిరస్కారం, తలబిరుసుతనాలతో వారిని వేధిస్తాడని మేము భయపడ్డాం. అందువల్ల వారి ప్రభువు గుణగణాలలో, దయాభిమానలలో ఆ బాలుడికన్నా మంచిసంతానం వారికి ప్రసాదించాలని మేము కోరుకున్నాం. (80,81)

ఇక గోడ వ్యవహారం గురించి చెప్పాలంటే, ఆ గోడ ఆఊళ్ళో వుండే ఇద్దరు అనాథ బాలలది. దాని క్రింద ఆపిల్లల కోసం ఒక నిధి పాతిపెట్టబడిఉంది. వారి తండ్రి చాలా పుణ్యాత్ముడు. అందువల్ల ఈ పిల్లలిద్దరూ పెద్దవారయిన తరువాత ఆ గోడ క్రింద ఉన్న తమ నిధిని తీసుకోవాలని నీ ప్రభువు నిర్ణయించాడు.

ఇదంతా నీ ప్రభువు కారుణ్యకటాక్షాల ఫలితమేగాని, నాఅంతట నేనేదీ చేయలేదు. నీవు సహించలేకపోయిన విషయాల వెనక ఉన్న మర్మహేతువు ఇదే.'' (82)

ముహమ్మద్ (సల్లం)! వారు నిన్ను 'జుల్ఖర్నైన్' గురించి అడుగుతున్నారు. వారికి చెప్పు: ''నేను వారి వృత్తాంతం గురించి కాస్త చెబుతాన''ని. (83)

మేమతనికి ధరణిలో రాజ్యాధికారమిచ్చాము. అన్నిరకాల ఒనరులు, సాధన సంపత్తులు అనుగ్రహించాము. అతను (మొట్టమొదట పశ్చిమదేశాల పర్యటన కోసం) ప్రయాణ సామగ్రి ఏర్పాటు చేసుకున్నాడు. (అతను ప్రయాణంచేస్తూ) సూర్యాస్తమయమయ్యే హద్దుకు చేరుకొని సూర్యుడు బురదనీటిలో అస్తమించడం చూశాడు. అతనికి అక్కడ ఒక జాతి కన్పించింది.

అప్పుడు మేమతనితో ''జుల్ఖర్నైన్! నీవు వారికి బాధ కల్గించవచ్చు; మేలు చేకూర్చవచ్చు. అంతా నీఇష్టం'' అన్నాం. దానికి జుల్ఖర్నైన్ ''వారిలో దౌర్జన్యం చేసినవాడ్ని నేను శిక్షిస్తా. తర్వాత అతను తన ప్రభువు వైపు మరలించబడినప్పుడు అతడ్ని ఆయన మరింత కఠినంగా శిక్షిస్తాడు. వారిలో సత్యాన్ని విశ్వసించి సత్కార్యాలు చేసేవానికి మంచి ప్రతిఫలం లభిస్తుంది. నేనతని పట్ల మృదువుగా వ్యవహరిస్తాను'' అని అన్నాడు. (84-88)

తర్వాత అతను మరోదిక్కు పర్యటనకు) సిద్ధమయ్యాడు. అతను (ప్రయాణిస్తూ) సూర్యోదయమయ్యే హద్దుకు చేరుకున్నాడు. అక్కడ ఓజాతిని చూశాడు. ఆ జాతిపై సూర్యుడు ఉదయిస్తుంటే అది ఎండనుండి కాపాడుకోవడానికి మేమెలాంటి సౌకర్యం కల్పించలేదు. ఇదీ వారి పరిస్థితి. జుల్ఖర్నైన్ విషయాలన్నీ మాకు తెలుసు. (89-91)

ఆ తర్వాత అతను (మరోదిక్కు పర్యటనకు) సిద్ధమయ్యాడు. అతను (ప్రయాణం చేస్తూ) చివరికి రెండుకొండల మధ్యకు చేరుకున్నాడు. అక్కడ అతనికొక జాతి కన్పించింది. ఆ జాతిప్రజలు అతి కష్టంమీద (అతని) మాట గ్రహిస్తారు. (92,93)

వారతనితో ''జుల్ఖర్నైన్! (మా) ఈ భూభాగంపై యాజూజ్, మాజూజ్ (అనే ఆటవిక జాతు)లు విధ్వంసకాండ సాగిస్తున్నాయి. మరి నీవు మాకు, వారికి మధ్య ఒక అడ్డుగోడ



నిర్మించగలవా? అందుకు మేమేదైనా నీకు పన్ను చెల్లించాలా?'' అని అన్నారు. (94)

దానికతను సమాధానమిస్తూ ''నాకు నాప్రభువు ఇచ్చిన (సంప)దే ఎంతో ఉంది. మీరు శారీరక శ్రమతో నాకు సహాయపడండి చాలు. నేను మీకూ, వారికీ మధ్య అడ్డుగోడ నిర్మిస్తాను. నాక్కాస్త ఉక్కు పలకలు తెచ్చిపెట్టండి'' అని అన్నాడు.

(గోడనిర్మాణం ప్రారంభమై శరవేగంతో సాగిపోతోంది.) అతను రెండుకొండల మధ్య ఉన్న ఖాళీస్థలాన్ని పూరించాడు. అప్పుడు కొందరు అగ్ని రాజెయ్యండని అన్నారు. చివరికి (ఉక్కుగోడ) అగ్నిగోళంలా ఎర్రగా మారిపోయింది. అప్పుడు జుల్ఖర్నైన్ ''దీనిపై నేనిప్పుడు కరిగినరాగి కుమ్మరిస్తా తీసుకురండి'' అన్నాడు. (ఇలా గోడనిర్మాణం పూర్తయింది)- (95,96)

దాంతో ఇక (ఆ జాతుల)వారికి ఆగోడ ఎక్కివచ్చే శక్తి లేకుండా పోయింది. దానికి కన్నం వేయడం కూడా వారికి సాధ్యంకాదు. (అప్పుడు) జుల్ఖర్నైన్ ఇలా అన్నాడు: ''ఇది నా ప్రభువు అనుగ్రహం. అయితే నాప్రభువు చేసిన వాగ్దానం నెరవేరే సమయం వచ్చినప్పుడు ఆయన దీన్ని నేలమట్టం చేస్తాడు. నా ప్రభువు వాగ్దానం నిజమైనది. (97,98)

ఆ (ప్రళయం)రోజు మేము జనాన్ని (స్వేచ్ఛగా) వదలిపెడ్తాం. వారు (సముద్ర కెరటాల్లా) ఒకరిమీద ఒకరు పడిపోతారు. (తీవ్రమైన తొక్కిసలాట ఏర్పడుతుంది.)[8] శంఖం పూరించబడుతుంది. మేము మానవులందరినీ సమావేశపరుస్తాము. ఆ రోజు మేము నరకాన్ని తిరస్కారుల ముందు తెచ్చిపెడ్తాము. ఆ తిరస్కారులు (ఐహిక జీవితంలో) మా హితబోధ ఖాతరుచేయకుండా అంధులైపోయారు. ఒక్కమాటా వినడానికి సిద్ధపడలేదు. (99-101)

---

8. యాజూజ్ (తాతారీ), మాజూజ్ (మంగోలీ) జాతుల్ని నిరోధించడానికి జుల్ఖర్నైన్ కట్టిన ఈ గోడ నల్లసముద్రానికి, కాస్పియన్ సముద్రానికి మధ్య ఉన్న రష్యా భూభాగంలో ఉందని తెలుస్తోంది. ప్రళయానికి సమీపకాలంలో హజ్రత్ ఈసా(అలైహి) పునరాగమనం తరువాత ఆయన జీవితకాలంలో ఈ ఆటవిక జాతులు దాన్ని ఛేదించి ప్రపంచంలో వినాశం, విధ్వంసాలు సృష్టిస్తాయి. వాటిని నిలువరించడం ఎవరితరమూ కాదు.

వారు గుట్టలు, మిట్టలు దాటి ఉరుకులు, పరుగులు పెడ్తూ వస్తున్నట్లు కన్పిస్తారు. ముస్లింలు వారి దౌర్జన్య ధాటికి నిలువలేక గగ్గోలు పెడతారు. హజ్రత్ ఈసా (అలైహి) సైతం వారి ముందు నిలువలేక ముస్లింలను వెంట బెట్టుకొని తూర్ పర్వతమెక్కి ఆశ్రయం పొందుతారు. ఆ తరువాత ఆయన యాజూజ్, మాజూజ్ల వినాశం కోసం దైవాన్ని ప్రార్థిస్తారు. దాంతో ఆ ఆటవిక జాతులు దైవాగ్రహానికి గురయి, దేహాలలో పురుగులు పడి గుట్టలు గుట్టలుగా పడిచస్తారు.

వారి శవాలు కుళ్ళిపోయి దుర్వాసన నలుదిక్కులా వ్యాపిస్తుంది. చివరికి దేవుడు వాటి నిర్మూలన కోసం రాకాసి పక్షుల్ని పంపుతాడు. ఆ పక్షులు ఈ శవాలను తమ పంజాలతో పట్టుకెళ్ళి సముద్రంలో పారవేస్తాయి. ఆ తర్వాత భారీవర్షం కురుస్తుంది. దాంతో భూమి పరిశుభ్రమై పోతుంది. (సంక్షిప్తం- బుఖారి, ముస్లిం. ఇతర వివరాలకు 21:95 సూక్తి, దాని పాదసూచిక చూడండి.)

సత్యతిరస్కారులు నన్ను వదలి నా దాసుల్ని తమ రక్షకులుగా చేసుకోవాలని భావిస్తున్నారా? అలాంటి తిరస్కారులకు ఆతిథ్యం ఇవ్వడానికి మేము నరకాన్ని సిద్ధపరచి ఉంచాము. వారికీ విషయం చెప్పు: "ఆచరణ రీత్యా అందరికంటే ఎక్కువ నష్టపోయేవారెవరో నేను మీకు తెలుపనా? ప్రపంచ జీవితంలో తమ కృషి, శక్తిసామర్థ్యాలన్నీ సన్మార్గం తప్పి వృధా అవుతున్నా సరే, తాము అంతా మంచే చేస్తున్నామని భావించేవారే ఎక్కువ నష్ట పోయేవారు. (102-104)

వారే తమ ప్రభువు సూక్తులు విశ్వసించడానికి నిరాకరించినవారు. (ఒక రోజు) తాము ఆయన సన్నిధికి చేరుకోవలసి ఉందన్న విషయాన్ని వారు నమ్మడం లేదు. అందువల్లనే వారి కర్మలన్నీ వ్యర్థమైపోయాయి. ప్రళయదినాన వారికి మేము ఎలాంటి విలువనివ్వము. సత్యం పట్ల వారి తిరస్కారానికి, నా సూక్తులు నా ప్రవక్తలను గురించి వారు చేస్తుండిన పరిహాసం, పరాచికాలకు ప్రతిఫలం నరకమే. (105,106)

పోతే సత్యాన్ని విశ్వసించి సదాచార సంపన్నులైనవారికి ఆతిథ్యంగా అత్యున్నత స్వర్గ వనాలున్నాయి. అక్కడ వారు కలకాలం (హాయిగా) ఉంటారు. ఇక ఎన్నటికీ అక్కడ్నుంచి వేరే చోటికి పోవడానికి వారికి మనస్కరించదు. (107,108)

వారికి తెలియజేయి: "నా ప్రభువు మాటలను వర్ణించడానికి సముద్రంలోని నీరంతా సిరాగా మార్చి రాసినా, ఆ సిరా మొత్తం అయిపోతుంది గాని, నా ప్రభువు మాటలు మాత్రం పూర్తికావు. అంతేకాదు, ఇంకా అంతటి సిరా తీసుకొచ్చినా సరే అదీ సరిపోదు." (109)

వారికీ ఈ విషయం కూడా చెప్పు: "నేను మీలాంటి మానవుడ్నే. కాకపోతే మీ దేవుడు ఒక్కడేనని నా దగ్గరకు సందేశం వస్తోంది. కనుక తమ ప్రభువు దర్శనభాగ్యం ఆశిస్తున్నవారు సత్కార్యాలు చేస్తూ ఉండాలి. అదీగాక తమ ప్రభువు ఆరాధనలో ఇతరులకు ఎలాంటి చోటివ్వ కూడదు." (110) ✪

అవతరణ: మక్కా

# 19. మర్యం

సూక్తులు:98

ఈ అధ్యాయంలో ఈసా ప్రవక్త (అలైహి) తల్లి హజ్రత్ మర్యం (అలైహి) ప్రస్తావన వచ్చింది. ఇది కూడా హిజ్రీ శకారంభానికి మూడేళ్ళ క్రితం మక్కాలో ముస్లింలపై అవిశ్వాసుల ఆగడాలు, అణచివేత చర్యలు పరాకాష్ఠకు చేరిన కాలంలో అవతరించింది.

మక్కాలో ముస్లింల పరిస్థితి దుర్భరం కావడంతో వారిని దైవప్రవక్త (సల్లం) అబిసీనియాకు వలస పోవడానికి అనుమతించారు. అబిసీనియాలో క్రైస్తవరాజు నజాషీ వారికి ఆశ్రయం ఇచ్చాడు. మక్కా ఖురైషీయులు వారిని వెంబడిస్తూ అబిసీనియా చేరుకొని, మతభ్రష్టులై వచ్చిన తమ జాతివారిని తమకు అప్పగించవలసిందిగా నజాషీని అర్థించారు. నజాషీ రాజు నిండుసభలో నూతన ధర్మాన్ని గురించి విచారించగా ముస్లింలు ఈ అధ్యాయాన్నే అతని ముందు పఠించారు. దానికి నజాషీ రాజు ఎంతో ప్రభావితుడయి మక్కా ఖురైషీయుల కోర్కెను త్రోసిపుచ్చాడు.



ఈ అధ్యాయంలో ఈసా, మర్యం (అలైహి)లను గురించి క్రైస్తవుల్లో చోటుచేసుకున్న తప్పుడు విశ్వాసాలకు భిన్నంగా వాస్తవాలు పేర్కోబడ్డాయి. ఆ తరువాత ఇబ్రాహీం ప్రవక్త (అలైహి) వృత్తాంతం వస్తుంది. ఆపై దైవప్రవక్తలందరూ తెచ్చిన ధర్మం ఒక్కటేనని, వారి నిష్క్రమణ తర్వాత మానవులు అసలు ధర్మం రూపురేఖలు మార్చి విభిన్న మత వర్గాలుగా చీలిపోయారని తెలియ జేయబడింది. చివర్లో మక్కా అవిశ్వాసుల భ్రష్టాచారాలను తీవ్రంగా ఖండించడం జరిగింది.

## కరుణామయుడు, కృపాసాగరుడయిన దేవుని పేరుతో ప్రారంభం

కాఫ్-హా-యా-ఐన్-సాద్. ఇది నీ ప్రభువు తన దాసుడు జకరియ్యాపై చిలికించిన కరుణామృతానికి సంబంధించిన ప్రస్తావన. అతను ఏకాంతంలో తన ప్రభువును వేడుకున్నప్పటి విషయం. (1-3)

అతనిలా వేడుకున్నాడు: "ప్రభూ! వృద్ధాప్యం వల్ల నాఎముకలు సైతం చితికి మెత్తబడిపోయాయి. నాతల నెరసిన వెంట్రుకలతో తెల్లగా మెరసిపోతోంది. ప్రభూ! నిన్ను వేడుకొని నేను ఏనాడూ విఫలం కాలేదు. నా తదనంతరం నా సోదరులు, బంధువులు ఎలా వ్యవహరిస్తారోనని నాకు భయంగా ఉంది. నాభార్య గొడ్రాలు. అందువల్ల నాకూ, యాఖూబ్ సంతానానికీ వారసుడయ్యేలా నీ ప్రత్యేక అనుగ్రహంతో నాకొక వారసుడ్ని ప్రసాదించు. ప్రభూ! అతడ్ని ఆమోదయోగ్యునిగా కూడా రూపొందించు." (4-6)

"జకరియ్యా! మేము నీకు కుమారుడు పుడతాడని శుభవార్త విన్పిస్తున్నాం. అతని పేరు యహ్యా అవుతుంది. మేమీ పేరుగల ఏ మనిషినీ ఇదివరకు పుట్టించలేదు." (7)

"ప్రభూ! నాకు కొడుకు ఎలా పుడ్తాడు? నాభార్య గొడ్రాలు కదా! ఇటు నేను కూడా పండు ముసలివాణ్ణయి పోయానే!!" అన్నాడతను. (8)

"అలాగే పుడ్తాడు. నీ ప్రభువు చెబుతున్నాడు- నాకిది చాలా సులువైన పని. నీకు ఒక ఉనికి అన్నదే లేనప్పుడు నేను నిన్ను పుట్టించలేదా?" (9)

"అయితే ప్రభూ! నాకోసం ఏదైనా సూచన నిర్ణయించు" అన్నాడు జకరియ్యా.

"నీవు వరుసగా మూడు రోజులు దాకా ప్రజలతో మాట్లాడలేవు. ఇదే నీకోసం సూచన" అన్నాడు దేవుడు. (10)

ఆ తర్వాత జకరియ్యా ప్రార్థనగది నుండి బయలెడి తనజాతి ప్రజల ముందుకొచ్చి వారికి ఉదయం, సాయంత్రం దైవస్మరణ చేస్తుండాలని సైగలతో ఉపదేశించాడు.

"యహ్యా! దైవగ్రంథాన్ని దృఢంగా పట్టుకో"--- మేమతనికి బాల్యంలోనే విజ్ఞత, వివేకాలను ప్రసాదించాము. అదీగాక మా దగ్గర నుండి అతనికి వాత్సల్యాన్ని, పరిశుద్ధతను కూడా అనుగ్రహించాం. అతను గొప్ప దైవభీతిపరుడు; తల్లిదండ్రులపట్ల వినయవిధేయతలు కలవాడు. అతనిలో అహంకారంగాని, తలబిరుసుతనంగాని మచ్చుకైనా లేవు. (11-14)

అతను పుట్టిన రోజున, చనిపోయే రోజున, తిరిగి అతను బ్రతికించి లేపబడే రోజున అతనికి శాంతి కలుగుగాక! (15)

ముహమ్మద్ (సల్లం)! ఈ గ్రంథంలో మర్యం వృత్తాంతం ప్రస్తావించు. ఆమె ప్రజల నుండి వేరయి, తూర్పు వైపున ఏకాంత కుహరంలోకి వెళ్ళి తెరవేసుకొని కూర్చున్నది. అప్పుడు మేము ఆమె దగ్గరికి మా ఆత్మ (దైవదూత)ను పంపాము. అతను పరిపూర్ణ మానవాకారంలో ఆమె ముందు ప్రత్యక్షమయ్యాడు. (16,17)

మర్యం (అతడ్ని చూడగానే) "నేను నీబారి నుండి కరుణామయుని శరణు కోరుతున్నాను. నీవు దేవునికి భయపడే వాడివయితే (నాదగ్గరకు రాకు)" అన్నది. (18)

"నేను నీ ప్రభువు దగ్గర్నుండి వచ్చిన దూతను. నీకొక పరిశుద్ధ బాలుడ్ని ఇచ్చే ఉద్దేశ్యంతో పంపబడ్డాను" అన్నాడతను. (19)

"ఏమిటీ, నాకు కొడుకు ఎలా కలుగుతాడు? నన్ను ఏ మానవుడూ తాకనైనా తాకలేదే! నేను శీలంలేని స్త్రీని కూడా కాదే!!" అన్నది మర్యం (కంగారుపడుతూ). (20)

"అలాగే కలుగుతాడు. స్వయంగా నీ ప్రభువే ఇలా సెలవిస్తున్నాడు: 'ఇలా చేయడం నాకు చాలా తేలిక. ఈ బాలుడ్ని మేము ప్రజల కోసం ఒక సూచనగా చేయాలని, మావైపున కారుణ్యమూర్తిగా రూపొందించాలని నిర్ణయించాము. అందుకే ఇలా చేయబోతున్నాం. ఈ పని జరిగి తీరవలసి ఉంది" అన్నాడు దైవదూత. (21)

మర్యం ఆ బాలుడికి సంబంధించిన గర్భం దాల్చింది. ఆమె గర్భస్తపిండం తీసుకొని దూరాన ఉన్న ఒక స్థలానికి చేరుకుంది. ప్రసవవేదన ఆమెను ఒక ఖర్జూరపు చెట్టు క్రిందికి చేర్చింది. ఆమె (లోలోన బాధపడుతూ) "అయ్యో! (ఏమిటి నాకీ పరీక్ష) నేనీ ప్రసవానికి ముందే చనిపోయి నామరూపాల్లేకుండా పోతే బాగుండు!!" అన్నది.

అప్పుడు దైవదూత ఆమె క్రిందివైపు నుండి పిలుస్తూ ఇలా అన్నాడు: "మర్యం! విచారించకు. నీ ప్రభువు నీ క్రింద ఒక మంచినీటి ఊటను సృష్టించాడు. కాస్త ఈ చెట్టు మొదలు పట్టుకొని ఊపు, నీ ముందు తాజా ఖర్జూర పండ్లు రాలిపడతాయి. వీటిని తింటూ, త్రాగుతూ హాయిగా ఉండు. మనుషులెవరైనా కన్పిస్తే 'నేను కరుణామయుని (ప్రసన్నత) కోసం ఉపవాసముంటానని మొక్కుకున్నాను, అందువల్ల నేనీ రోజు ఎవరితోనూ మాట్లాడను' అని చెప్పెయ్యి." (22-26)

ఆ తరువాత ఆమె ఆ పిల్లవాడ్ని తీసుకొని తనజాతి ప్రజల దగ్గరకు వెళ్ళింది. ప్రజలు (ఆమెను చూడగానే) "మర్యం! నీవు చాలా ఘోరమైన పాపం చేశావు. హారూన్ సోదరీ! నీ తండ్రి చెడ్డవాడు కాదు. నీ తల్లి కూడా శీలం చెడిన స్త్రీ కాదే! (నువ్విలా ఎందుకు తయారయ్యావు?)" అని అడిగారు. (27,28)

మర్యం (నోటితో సమాధానమివ్వకుండా ఒడిలో ఉన్న) పిల్లవాడి వైపు చూపింది. ప్రజలు (ఆశ్చర్యపోతూ) "మేమీ చంటిపిల్లవాడితో ఎలా మాట్లాడుతాం?" అన్నారు. (29)



(వెంటనే) ఆ చంటిపిల్లవాడు ఇలా మాట్లాడటం మొదలెట్టాడు:

"నేను దేవుని దాసుడ్ని. ఆయన నాకు దివ్యగ్రంథం ప్రసాదించాడు. దైవప్రవక్తగా నియమించాడు. నేను ఎక్కడున్నా నన్ను శుభప్రదమైన వాణ్ణిగా చేశాడు. నేను బ్రతికున్నంత కాలం నమాజ్, జకాత్ విధులు పాటిస్తూ ఉండాలని ఆదేశించాడు. నాతల్లి పట్ల నేను వినయ విధేయతలు కలవాడ్నిగా చేశాడు. ఆయన నన్ను దుర్మార్గుడిగా, దౌర్భాగ్యుడిగా చేయలేదు. నేను పుట్టినప్పుడు, చనిపోయేటప్పుడు, తిరిగి బ్రతికించి లేపబడేటప్పుడు నాపై శాంతి అవతరించుగాక! " (30-33)

ఈ పిల్లవాడే మర్యం కుమారుడు ఈసా. ఇతడ్ని గురించి ప్రజల్లో ఉన్న అపార్థాలకు భిన్నంగా అసలు వృత్తాంతం ఇది. ఒకర్ని కొడుకుగా చేసుకోవడం దేవునికి ఏ మాత్రం శోభించదు. ఆయన ఎంతో పరిశుద్ధుడు. ఆయన ఏదైనా చేయదలచుకుంటే 'అయిపో' అంటే చాలు, ఆ పని ఇట్టే చిటికలో జరిగిపోతుంది. (34,35)

(ఈసా ప్రజలకు హితబోధ చేస్తూ) "దేవుడే నా ప్రభువు. మీ ప్రభువు కూడా ఆయనే. కనుక మీరు ఆయన్నే ఆరాధించండి. ఇదే సరైన మార్గం" అన్నాడు. (36)

కాని వారిలో విభిన్న వర్గాలు పరస్పరం విభేదించుకోసాగాయి. భయంకరమైన (ప్రళయ) దినం సమీపించినప్పుడు అవిశ్వాసులకది వినాశకారిగా పరిణమిస్తుంది. వారు మా సన్నిధికి చేరుకునే రోజు వారి వినికిడి శక్తి బాగానే ఉంటుంది. వారి దృష్టి కూడా బాగానే ఉంటుంది. ఈరోజు మాత్రం ఈ దుర్మార్గులు పూర్తిగా మార్గభ్రష్టత్వంలో పడివున్నారు. (37,38)

ముహమ్మద్ (స)! వారిప్పుడు ఏమరుపాటుకు లోనై సత్యాన్ని విశ్వసించే స్థితిలో లేరు. (ఏమైనా) తుదితీర్పు జరిగి పశ్చాత్తాపం తప్ప మరేమీ మిగలని రోజు[1] గురించి వారిని భయపెట్టు. చివరికి మేమే భూమికి, దానికి సంబంధించిన సమస్త వస్తువులకు వారసులవుతాము. అందరూ చివరికి మా సన్నిధికే తిరిగి రావలసి ఉంది. (39,40)

---

1. ఈ సూక్తిలో ప్రళయదినాన్ని పశ్చాత్తాప దినమని చెప్పడం జరిగింది. అంటే ఆరోజు దుర్జనులే కాదు, సజ్జనులు కూడా పశ్చాత్తాపం చెందుతారన్నమాట. దుర్జనులు తామీ దుర్మార్గాలు చేసి ఉండకపోతే బాగుండేదని పశ్చాత్తాపపడతారు. సజ్జనులు తాము మరిన్ని సత్కార్యాలు చేసి ఉంటే బాగుండేదని పశ్చాత్తాపపడతారు. కర్మవిచారణ ముగిసి స్వర్గవాసుల్ని స్వర్గానికి, నరకవాసుల్ని నరకానికి పంపడం జరుగుతుంది.

ఆ తరువాత దైవదూతలు మృత్యువుని పొటేలు రూపంలో తీసుకొచ్చి స్వర్గనరకాల మధ్య నిలబెడతారు. వారు స్వర్గనరక వాసుల్ని ఎలుగెత్తి పిలుస్తూ "దీన్ని మీరు గుర్తించారా?" అని అడుగుతారు. దానికి వారు "ఆ... ఇది మృత్యువు" అంటారు. అప్పుడు దైవదూతలు ఆ పొటేలును నరికి చంపుతారు. ఆ తర్వాత వారు స్వర్గవాసులతో "స్వర్గవాసులారా! మీరిక స్వర్గంలోనే శాశ్వత జీవితం గడుపుతారు. మీకు మరణం అనేదే రాదు" అంటారు. అలాగే వారు నరకవాసుల వైపు తిరిగి "నరకవాసులారా! మీరిక నుంచి నరకంలోనే ఎల్లకాలం పడివుండి దుర్భర యాతనలు అనుభవిస్తూ ఉంటారు. మీకు చావు అనేదే రాదు" అంటారు. (సహీబుఖారి)

ఈ గ్రంథంలో ఇబ్రాహీం గాథ ప్రస్తావించు. అతను ఎంతో సత్యసంధుడు; గొప్ప దైవప్రవక్త కూడా. అతను (తన తండ్రికి హితోపదేశం చేస్తూ) ఇలా అన్నాడు:

“నాన్నా! మీరు వినలేని, చూడలేని వాటిని పూజిస్తున్నారేమిటీ? అవి మీకు ఏవిధంగాను తోడ్పడలేవుకదా? నాన్నా! మీ దగ్గర లేనటువంటి (దివ్య) జ్ఞానం నా దగ్గరుంది. కనుక మీరు నన్ను అనుసరించండి; నేను మీకు రుజుమార్గం చూపుతాను. నాన్నా! మీరు షైతాన్‌ని ఆరాధించకండి. షైతాన్ కరుణామయుడ్ని తిరస్కరించిన అహంకారి.[2] నాన్నా! (మీ ధోరణి చూస్తుంటే) మీరు కరుణామయుని శిక్షకు గురయి, ఆ తరువాత షైతాన్‌కు సహచరులయి పోతారేమోనని నాకు భయంగా ఉంది.” (41-45)

దానికి తండ్రి (మండిపడుతూ) “ఇబ్రాహీం! నీవు మన దేవతలకు విముఖుడై పోయావా? నీ వైఖరి గనక మార్చుకోకపోతే నేను నిన్ను రాళ్ళతో కొట్టి చంపేస్తాను. (వెళ్ళిపో) నానుండి శాశ్వతంగా వేరయిపో” అన్నాడు. (46)

“మీకు శాంతి కలుగుగాక! మిమ్మల్ని క్షమించమని నేను నా ప్రభువును ప్రార్థిస్తాను. ఆయన నాపట్ల అమిత దయగలవాడు. నేను మిమ్మల్ని, దేవుడ్ని కాదని మీరు ప్రార్థిస్తున్న మిథ్యాదైవాల్ని వదిలేసి వెళ్తున్నాను. నేను నాప్రభువునే ప్రార్థిస్తాను. నా ప్రభువుని ప్రార్థించి నేను వైఫల్యం చెందనని ఆశిస్తున్నాను” అన్నాడు ఇబ్రహీం. (ఇలా) ఇబ్రాహీం ఆ ప్రజలను, వారి దైవేతరశక్తుల్ని వదలి వెళ్ళిపోయాడు. అప్పుడు మేమతనికి ఇస్‌హాఖ్, యాఖూబ్ వంటి సంతానం ప్రసాదించాం. వారిద్దర్ని ప్రవక్తలుగా చేశాం. వారందరిపై నా కరుణామృతం చిలికించి వారి కీర్తిప్రతిష్ఠల్ని ఉన్నతం చేశాం. (47-50)

ఈ గ్రంథంలో మూసా గాథను ప్రస్తావించు. అతనొక సత్పురుషుడు, సందేశహరుడైన దైవప్రవక్త.[3] మేమతడ్ని తూర్‌పర్వతం కుడివైపు నుండి పిలిచి రహస్య సంభాషణ

2. ఇబ్రాహీం(అలైహి) తండ్రి, అతని జాతిప్రజలు విగ్రహాలను పూజించేవారు. అంటే వారు షైతాన్‌కు విధేయులై, వాడు చెప్పినట్లు విగ్రహాలను పూజిస్తుండేవారన్నమాట. షైతాన్‌ని ఎవరూ ఆరాధించరు. కాని మనిషి తన మనస్సులో తిష్ఠవేసిన షైతాన్‌కు విధేయుడయి వాడు ఆడించినట్లు ఆడతాడు. జీవితంలోని ప్రతి వ్యవహారాల్లో అతను షైతాన్‌కు దాసుడై దైవాజ్ఞలకు భిన్నంగా నడచుకుంటాడు. అంటే ఆ వ్యక్తి ఆయా రంగాలన్నిటిలోనూ షైతాన్‌ని ఆరాధిస్తున్నాడని అర్థం.

3. ఇక్కడ మూలభాషలో నబి, రసూల్ అనే పదాలు వాడబడ్డాయి. నబీకి, రసూల్‌కి శాబ్దిక భావంలో పెద్దతేడా లేదు. ఈ రెండిటికీ వార్తాహరుడు, సందేశహరుడు, దూత అనే అర్థాలు వస్తాయి. ప్రత్యేక పరిభాషలో మనం దైవప్రవక్త అంటున్నాం. ఈ సూక్తిలో నేను ఈరెండు పదాలను విడివిడిగా తెలియజేయడానికి సందేశహరుడైన దైవప్రవక్త అని అనువాదం చేశాను.

కొందరు ధర్మవేత్తలు దివ్యగ్రంథం ఇవ్వబడిన ప్రవక్తను రసూల్‌అని, దివ్యగ్రంథం ఇవ్వబడని ప్రవక్తను నబి అని అభిప్రాయపడ్డారు. దీనికి ఖుర్‌ఆన్, హదీసుల్లో స్పష్టమైన ఆధారం లేదు. అయితే హోదా, అంతస్తు, బాధ్యతలరీత్యా నబీ కంటే రసూల్ గొప్పప్రవక్త అని ఒక హదీసు ద్వారా స్ఫురిస్తోంది. హజ్రత్ అబూజర్(రజి) ప్రకారం ప్రవక్తల సంఖ్య అడిగినప్పుడు “రసూల్‌లు 313 లేక 315 మంది అని, నబీలు 1,24,000 మంది” అని మహాప్రవక్త (సల్లం) తెలియజేశారు. దీన్నిబట్టి ప్రతి నబీ రసూల్ కాదని, అయితే ప్రతి రసూల్ మాత్రం నబీయేనని తెలుస్తోంది.



ద్వారా మా సాన్నిధ్యం ప్రసాదించాం. మా అనుగ్రహంతో అతని సోదరుడు హారూన్‌ని (కూడా) ప్రవక్తగా నియమించి అతనికి (సహాయకునిగా) ఇచ్చాము. (51-53)

ఈ గ్రంథంలో ఇస్మాయీల్ గాథను కూడా ప్రస్తావించు. అతను మంచి వాగ్దాన పాలకుడు, సందేశహరుడయిన దైవప్రవక్త. అతను తన కుటుంబసభ్యులకు నమాజ్, జకాత్ విధుల్ని గురించి ఆజ్ఞాపిస్తుండేవాడు. అతను తన ప్రభువు దృష్టిలో ఆమోద యోగ్యుడయిన మనిషి. (54,55)

ఈ గ్రంథంలో ఇద్రీస్‌ని గురించి ప్రస్తావించు. అతను (కూడా) సత్యసంధుడు, దైవప్రవక్త. అతడ్ని మేము ఉన్నత స్థాయికి చేర్చాము. (56,57)

ఆదం సంతానంలో, నూహ్‌తో పాటు ఓడలో ఎక్కినవారి సంతతిలో, ఇబ్రాహీం సంతతిలో, ఇస్రాయీల్ (యాఖూబ్) సంతతిలో వీరు దేవుని విశేషానుగ్రహం పొందిన దైవప్రవక్తలు. మేము సన్మార్గం చూపి ప్రత్యేకంగా ఎన్నుకున్న సత్పురుషుల్లోనివారు. వారి ముందు కరుణామయుని సూక్తులు పఠిస్తుంటే వారు కన్నీటిధారలతో (అప్రయత్నంగా దేవుని సన్నిధిలో) సాష్టాంగ పడుతుండేవారు. (58)

ఆ తరువాత అనర్హులు, అయోగ్యులు వారికి వారసులయి పోయాలు. వారు నమాజ్‌ని వదిలేసి మనోవాంఛలకు బానిసలై పోయారు. త్వరలోనే వారు తమ మార్గభ్రష్టత్వా నికి తగిన శిక్ష అనుభవిస్తారు. (59)

అయితే పశ్చాత్తాపం చెంది, సత్యాన్ని విశ్వసించి సదాచారవైఖరి అవలంబించే వారు మాత్రం స్వర్గంలో ప్రవేశిస్తారు. వారికి ఏమాత్రం అన్యాయం జరగదు. వారికోసం శాశ్వతంగా ఉండే స్వర్గవనాలున్నాయి. వారు కళ్ళారా చూడకపోయినా అవి లభిస్తాయని దేవుడు వారికి వాగ్దానం చేశాడు. ఆ వాగ్దానం తప్పకుండా నెరవేరుతుంది. వారక్కడ ఎలాంటి పనికిమాలిన మాటలు వినరు. అన్నీ సమంజసమైన మాటలే వింటారు. వారికక్కడ రోజూ ఉదయం, సాయంత్రం ఆహారం లభిస్తుంది ఇలాంటి స్వర్గానికే మేము మా దాసులలో భయభక్తులు కలవారిని వారసులుగా చేస్తాము. (60-63)

“ముహమ్మద్ (సల్లం)! మేము (దైవదూతలం) నీ ప్రభువు అనుమతి లేకుండా అవతరించలేము. మా ముందున్నదానికి, వెనుకున్నదానికి, ఆ రెండిటి మధ్య ఉన్న దానికి, సమస్తానికీ ఆయనే యజమాని. నీ ప్రభువు (ఏవిషయమూ) మరచిపోయేవాడు కాదు. ఆయన భూమ్యాకాశాలకు, వాటి మధ్య వున్న సమస్త సృష్టితాలకే ప్రభువు. కనుక నీవు ఆయన్నే ఆరాధించు. ఆయన ఆరాధనలోనే (జీవితాంతం) స్థిరంగా ఉండు. నీ దృష్టిలో ఆయనకు సమానుడైనవాడు ఎవడైనా ఉన్నాడా?” (64,65)

నబీ అంటే వార్తాహరుడు, ఉన్నతస్థానం కలవాడు, మార్గదర్శి అని శాబ్దిక అర్థాలున్నాయి. రసూల్ అంటే పంపబడినవాడు, దూత, ప్రతినిధి, సందేశహరుడు అని అర్థాలున్నాయి. పంపబడినవాడు, దూత అనే అర్థాల్లో దైవదూతల్ని కూడా ఖుర్‌ఆన్ కొన్నిచోట్ల రసూల్ అని పేర్కొన్నది.

మానవుడు (ఏమంటాడో చూడు,) "నేను చనిపోయిన తరువాత నిజంగా నన్ను బ్రతికించి లేపడం జరుగుతుందా?" అంటాడు. అతనికసలు ఉనికి అన్నదే లేనప్పుడు మేమతడ్ని మొదటిసారిగా పుట్టించిన సంగతి అతనికి గుర్తులేదా? (66,67)

నీ ప్రభువు సాక్షి! మేము వారందర్నీ, వారితోపాటు పిశాచాలను కూడా తప్పకుండా చుట్టుముట్టి తీసుకొస్తాం. తర్వాత వారిని నరకం చుట్టు మోకాళ్ళ మీద వంగబెడ్తాం. ఆ తర్వాత ప్రతి వర్గం నుండి కరుణామయుని విషయంలో తలబిరుసుతో వ్యహరించిన విద్రోహులందర్నీ ఏరివేస్తాం. నరకంలో విసరాడానికి ఎవరెక్కువ అర్హులో మాకు బాగాతెలుసు. (68-70)

(వినండి!) మీలో ఎవరూ నరకం మీదుగా పోనివారంటూ ఉండరు. ఇదొక నిర్ణీత విషయం. ఈ పని నెరవేర్చవలసిన బాధ్యత నీప్రభువు మీద ఉంది. ఆ సందర్భంలో మేము దైవభీతిపరాయణులను (నరకంలో పడకుండా) రక్షిస్తాం.[4] (దైవనిర్ణీత హద్దులు మీరిన) దుర్మార్గుల్ని మాత్రం అందులో పడిపోవడానికి వదిలేస్తాం. (71,72)

అవిశ్వాసులకు మా విస్పష్ట సూక్తులు విన్పిస్తున్నప్పుడు వారు విశ్వాసులతో "చెప్పండి మన ఉభయవర్గాల్లో ఎవరు మంచిస్థితిలో ఉన్నారు, ఎవరి సభలు వైభవోపేతంగా ఉన్నాయి?" అని అడుగుతారు. కాని పూర్వం మేము వీరికంటే ఎక్కువ ఆస్తిపాస్తులు, బాహ్యపటాటోపం కలిగివున్న ఎన్నో జాతులను నాశనం చేశాం. (73,74)

వారికీ విషయం చెప్పు: "మార్గభ్రష్టత్వంలోనే పడివుండేవారిని కరుణామయుడు చూసీచూడనట్లు వదిలేస్తున్నాడు. చివరికి వారు తమకు వాగ్దానం చేయబడినదాన్ని అది

---

4. నరకం మీద ఒక వంతెన (పుల్ సిరాత్) ఉంటుంది. ఆ వంతెనకు ఆవల స్వర్గం ఉంటుంది. కర్మవిచారణ తరువాత మానవులంతా ఈ వంతెన మీదుగా తమ తమ గమ్యాలకు చేరుకోవలసి ఉంటుంది. దీన్ని గురించి దైవప్రవక్త (సల్లం) ఇలా తెలియజేశారు:

"నరకం మీద (పుల్ సిరాత్) వంతెన ఏర్పాటు చేయబడుతుంది. దైవప్రవక్తలలో అందరి కన్నా ముందు నేను నా అనుచర సమాజాన్ని తీసుకొని దానిని దాటుతాను. ఆరోజు దైవప్రవక్తలు మాత్రమే మాట్లాడుతారు. వారయినా 'దేవా! (మమ్మల్ని) క్షేమంగా ఉంచు' అని మాత్రమే అంటారు. నరకంలో సాదాన్ (అనే ఒక విధమైన ముండ్ల చెట్టు) ముండ్లులా వంకర్లు తిరిగిన పొడవాటి మేకులు ఉంటాయి. వాటి పొడవు దేవునికి మాత్రమే తెలుసు. ఆ మేకులు వంతెన మీద నడిచే వారిలో కొందర్ని వారి దుష్కర్మల కారణంగా పట్టి నరకంలోకి లాగి పడవేసేందుకు ప్రయత్నిస్తాయి. దాంతో కొందరు హతమయి నరకంలో పడిపోతారు. (ఇక ఎన్నటికీ అందులో నుంచి బయట పడలేరు.) మరి కొందరు తెగి నరకంలో పడిపోతారు. ఆ తర్వాత కొంత కాలానికి అందులో నుంచి విముక్తి పొందుతారు."

కొన్ని ఉల్లేఖనాల ప్రకారం "విశ్వాసులలో కొందరు రెప్పపాటులో ఆ వంతెన దాటి వెళ్తారు. కొందరు మెరుపు వేగంతో దాటుతారు. కొందరు వాయు వేగంతో, మరికొందరు అశ్వ వేగంతో, ఇంకా కొందరు ఒంటె వేగంతో దాటుతారు. ఇలా విభిన్న వేగాలతో దాటేవారిలో కొందరు క్షేమంగా దాటి మోక్షం పొందుతారు. కొందరు మేకులతో తెగి (నరకంలో) పడిపోతారు. మరికొందరు నరకంలో బోర్లా పడిపోతారు." (బుఖారి, ముస్లిం)



దైవశిక్ష అయినా, ప్రళయఘడియ అయినా (కళ్ళారా) చూసుకుంటారు. అప్పుడు వారికి తెలుస్తుంది, ఎవరి పరిస్థితి అధ్వాన్నంగా, ఎవరి బలగం బలహీనంగా ఉందో." (75)

దీనికి భిన్నంగా రుజుమార్గం అవలంబించిన వారికి దేవుడు మరింత సద్బుద్ధి ప్రసాదిస్తాడు. నీ ప్రభువు దృష్టిలో శాశ్వతంగా ఉండే సత్కార్యాలే పర్యవసానం రీత్యా, ఫలితం రీత్యా ఎంతో శ్రేష్ఠమైనవి. (76)

ప్రవక్తా! మా సూక్తులు తిరస్కరించినవాడ్ని చూశావా నీవు? అతను (తన ప్రస్తుత స్థితి చూసుకొని మిడిసిపడుతూ" మీరు నన్ను దైవశిక్ష గురించి ఎంత బెదిరిస్తున్నా) నాకు మాత్రం సంతానం, సిరిసంపదలు ఇంకా లభిస్తూనే ఉంటాయి" అని అంటున్నాడు. అతనికి ఏదైనా అగోర విషయం తెలిసిపోయిందా? లేక కరుణామయునితో ఏదైనా ఒప్పందం చేసుకున్నాడా? (77,78)

అదేమీ కాదు. అతను వాగుతున్నదంతా మేము (అతని కర్మలచిట్టాలో) నమోదు చేస్తున్నాం. అతనికి విధించే శిక్షను మరింత తీవ్రతరం చేస్తాం. అతను ప్రస్తావిస్తున్న సిరులూ గిరులూ, మందీమార్బలం అన్నీ చివరికి మాదగ్గరే ఉండిపోతాయి. (అన్నిటినీ ప్రపంచంలోనే వదిలేసి) అతను ఒంటరిగా మాసన్నిధికి రావలసి ఉంటుంది.[5] (79,80)

వారు దేవుడ్ని వదిలేసి తమకు అండగా నిలువడానికి కొన్ని (మిధ్యా)దైవాలను తయారుచేసుకున్నారు. నిజానికి ఎవరూవారికి అండగా నిలువరు. అవి (ప్రళయదినాన) వారి పూజాపురస్కారాలను నిరాకరిస్తాయి. పైగా వారికి ప్రత్యర్థులైపోతాయి. (81,82)

మేము సత్యతిరస్కారుల పైకి పిశాచశక్తుల్ని ఎలా వదలిపెట్టామో చూడలేదా? అవి వారిని (సత్యతిరస్కారం గురించి) బాగా రెచ్చగొడ్తున్నాయి. సరే, నీవు వారి శిక్ష విషయంలో తొందరపడకు. వారికి ఎటూ రోజులు దగ్గరపడ్డాయి. (83,84)

ఆరోజు ఎంతో దూరంలేదు. అప్పుడు మేము దైవభీతిపరుల్ని అతిథుల్లా (గౌరవిస్తూ) కరుణామయుని సన్నిధిలో ప్రవేశపెడ్తాము. పాపాత్ముల్ని దప్పికగొన్న జంతువుల మాదిరిగా నరకం వైపు తోలుకొని తీసికెళ్తాము. (85,86)

ఆరోజు ప్రజలు ఎలాంటి సిఫారసు చేయలేరు. ఏదైనా చేస్తే కరుణామయుడి నుండి అనుమతి పొందినవారు మాత్రమే సిఫారసు చేయగలరు. (87)

---

5. హజ్రత్ ఖబ్బాబ్ బిన్ అరత్ (రజి) కథనం: పూర్వం అజ్ఞానకాలంలో నేను కమ్మరి పని చేస్తుండేవాడ్ని. ఆరోజుల్లో ఆస్ బిన్ వాయిల్ అనే వ్యక్తి నాక్కొంత బాకీపడ్డాడు. తర్వాత నేనొక రోజు వెళ్ళి బాకీ అడిగితే అతను (ఒక షరతు పెడ్తూ) "నువ్వు ముహమ్మద్ (సల్లం) ప్రవక్తృత్వాన్ని నిరాకరించనంత వరకు నేను నీ బాకీ డబ్బులు ఇవ్వను" అన్నాడు. నేనప్పుడు "నీవు చచ్చినా, తిరిగి బ్రతికించబడినా సరే, నేనాయన ప్రవక్తృత్వాన్ని ఎంతమాత్రం నిరాకరించను" అన్నాను. అతనీ మాటలు విని "సరే నేను చనిపోయి, తిరిగి బ్రతికించబడనంత వరకు నీ బాకీ నన్నడగకు. నేను తిరిగి బ్రతికించబడితే నాకు నా ధనమూ లభిస్తుంది, సంతానం కూడా. అప్పుడు నీ బాకీ తీరుస్తాలే" అన్నాడు. దీన్ని గురించే ఈ సూక్తులు అవతరించాయి. (బుఖారి, ముస్లిం)

కరుణామయుడు ఒకడ్ని తన కొడుకుగా చేసుకున్నాడని అంటున్నారు వారు. “మీరు చాలా ఘోరసమైన మాట కల్పించి చెబుతున్నారు. కరుణామయునికి సంతానం ఉందని చెప్పటం ఎంత తీవ్రమైన విషయమంటే దానివల్ల మిన్ను విరిగి పడవచ్చు; భూమి బ్రద్దలై పోవచ్చు; పర్వతాలు పగిలి ముక్కలై పోవచ్చు. సంతానం కలిగి ఉండటం కరుణామయునికి ఎంతమాత్రం శోభించదు. (88-92)

భూమ్యాకాశాల్లో ఉన్న సమస్త సృష్టిరాసులు కట్టు బానిసలై ఆయన ముందుకు వస్తాయి. ఆయన అందర్నీ పరివేష్ఠించి ఉన్నాడు. ప్రతి ఒక్కర్నీ లెక్కపెట్టి ఉంచాడు. చివరికి యావన్మంది ప్రళయదినాన ఒంటరిగా ఆయన ముందు సమావేశమవుతారు.

విశ్వసించి సత్కార్యాలు చేస్తున్నవారి పట్ల కరుణామయుడు త్వరలోనే ప్రజల హృదయాలలో ప్రేమాభిమానాలు జనింపజేస్తాడు. ఇది తప్పకుండా జరుగుతుంది.

ప్రవక్తా! ఈగ్రంథం ద్వారా దైవభీతిపరులకు (స్వర్గ)శుభవార్త విన్పించు. పెడసరిగా మాట్లాడే మొండిఘటాలను (దైవశిక్ష గురించి) భయపెట్టు. ఈపని కోసమే మేమీ వాణిని సులభతరంచేసి నీనోట వెలువరిస్తున్నాం. వారికి పూర్వం మేము (తలబిరుసు తనం వహించిన) ఎన్నో జాతుల్ని తుడిచిపెట్టాము. ఈరోజు వారి నామరూపాలు ఎక్కడైనా నీకు కన్పిస్తున్నాయా? లేక వారి అవశేషాలకు సంబంధించిన చిన్న శబ్దమైనా నీకు విన్పిస్తుందా? (93-98) ✪

## 20. తాహా

**అవతరణ: మక్కా** **సూక్తులు: 135**

ఈ అధ్యాయం తాహా అనే రెండు బీజాక్షరాలతో ప్రారంభమయింది. ఇది హిజ్రీ శకారంభా నికి మూడు నాలుగేండ్ల పూర్వం మక్కాలో అవతరించింది. అవిశ్వాసుల మొండి వైఖరిని ఖాతరు చేయవద్దని దైవప్రవక్త (సల్లం)కు బోధించిన తరువాత మూసా ప్రవక్త (అలైహి) గాథ ఇందులో ప్రస్తావించబడింది. ఆ తర్వాత హజ్రత్ ఆదం (అలైహి) వృత్తాంతం తెలిపి అవిశ్వాసులకు గుణపాఠం చెప్పబడింది. చివర్లో విశ్వాసులకు కొన్ని సూచనలు, సలహాలు ఇవ్వబడ్డాయి.

### కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

తా-హా. మేమీ ఖుర్ఆన్ని నీవు కష్టాలలో పడాలని నీపై అవతరింపజేయలేదు. ఇది (దేవునికి) భయపడే ప్రతివ్యక్తి కోసం వచ్చిన జ్ఞాపిక. భూమండలంతో పాటు అత్యున్నతమైన యావత్ నభోమండలాన్ని సృష్టించిన శక్తిస్వరూపుని వైపునుండి ఇది అవతరించింది. (1-4)

(విశ్వప్రభువైన) ఆ కరుణామయుడు అధికార సింహాసనంపై అధిష్ఠించి ఉన్నాడు. భూమ్యాకాశాలకు, వాటి మధ్య వున్న వాటికి, నేల క్రింద నిక్షిప్తమై ఉన్నవాటికి ఆయనే యజమాని. నీవు బిగ్గరగా మాట్లాడినా, మెల్లిగా మాట్లాడినా లేక అంతకంటే ఎక్కువ నిగూఢ విషయమైనా సరే, ఆయనకు తెలుసు. ఆయనే అల్లాహ్. ఆయన తప్ప మరో ఆరాధ్యుడు లేడు. ఆయనకు ఎంతో మంచి పేర్లున్నాయి. (5-8)



నీకు మూసా వృత్తాంతం ఏమయినా చేరిందా? అతనొక అగ్ని (మంట) చూశాడు. అప్పుడతను తన కుటుంబీకులతో “మీరు ఇక్కడే ఉండండి. అక్కడేదో అగ్ని కన్పిస్తోంది. వెళ్ళి మీకోసం కొంచెం నిప్పు తీసుకొస్తాను. లేదా అక్కడ (మనకు) దారి చూపే వారెవరైనా దొరకవచ్చు” అని అన్నాడు. (9,10)

మూసా ఆ ప్రదేశానికి చేరుకోగానే అక్కడ ఓ (అదృశ్య)వాణి విన్పించింది: “మూసా! నేనే నీ ప్రభువును. చెప్పులు విడిచిపెట్టు.[1] నీవిప్పుడు పవిత్రమైన తువా (లోయ)లో ఉన్నావు. నేను నిన్ను (ఓ మహాకార్యం కోసం) ఎన్నుకున్నాను. నీకు అందజేస్తున్న విషయాన్ని శ్రద్ధగా విను. నేనే దేవుణ్ని. నేనుతప్ప మరో ఆరాధ్యుడు లేడు. కనుక నీవు నన్నే ఆరాధించు. నన్ను స్మరించడానికి నమాజ్ స్థాపించు. (11-14)

ప్రళయం (ఓరోజు) తప్పకుండా రానున్నది. ప్రతి మానవుడూ తన కృషికి తగిన ప్రతిఫలం పొందడానికి నేను దాని సమయాన్ని రహస్యంగా ఉంచదలిచాను. కనుక ప్రళయదినాన్ని విశ్వసించకుండా మనోవాంఛలకు బానిసలైపోయేవారి విషయంలో దాన్ని గురించిన ఆలోచన నిన్ను (మాసందేశ ప్రచారంనుండి) నిరోధించకూడదు సుమా! అలా జరిగితే నీవు నాశనమైపోతావు. సరే, మూసా! నీ చేతిలో ఉన్నదేమిటీ?” (15-17)

దానికి మూసా “ఇది నా చేతికర్ర. దీన్ని నేను ఊతగా చేసుకొని నడుస్తాను. దీంతో నా మేకల కోసం చెట్ల నుండి ఆకులు రాల్చుతాను. ఇంకా దీంతో నేను ఎన్నో పనులు చేస్తాను” అన్నాడు. “మూసా! దాన్ని క్రింద పడవెయ్యి” అన్నాడు దేవుడు. మూసా దాన్ని క్రింద పడవేశాడు. అంతే, అది ఎకాఎకిన పాముగా మారి పరుగెత్త సాగింది. (18-20)

“దాన్ని పట్టుకో. భయపడకు. మేము దాన్ని తిరిగి పూర్వస్థితికి మార్చుతాము. కాస్త నీ చేతిని చంకలో అదిమిపెట్టి తీసెయ్యి. ఎలాంటి బాధ లేకుండా అది మెరిసిపోతూ బయటికి వస్తుంది. ఇది రెండో నిదర్శనం. మేమింకా నీకు గొప్ప గొప్ప నిదర్శనాలు చూపిస్తాము. ఇప్పుడు నీవు ఫిరౌన్ దగ్గరికెళ్ళు. అతను హద్దు మీరిపోయాడు” అన్నాడు దేవుడు. (21-24)

“ప్రభూ! నాకు మనోస్థయిర్యం ప్రసాదించు. నా పనులు సులభంగా నెరవేరేలా చెయ్యి. ప్రజలు నా మాట గ్రహించడానికి వీలుగా నాకు వాక్పటిమ ప్రసాదించు. (ఈ మహాకార్యంలో) నాకు సాయంగా నా కుటుంబంలో ఒకరిని మంత్రిగా నియమించు. (అంటే) నా సోదరుడు హారూన్ ద్వారా నాకు బలం చేకూర్చు. అతడ్ని నా పనిలో భాగస్వామిగా చెయ్యి. మేమిద్దరం నీ పవిత్రతను ఘనంగా కొనియాడుతాము. నీ గురించి విస్తృతంగా ప్రచారం చేస్తాం. నీవు ఎల్లప్పుడూ మమ్మల్ని కనిపెట్టుకొని ఉంటున్నావు” అన్నాడు మూసా. (25-35)

---

1. యూదులు ఈ కారణంగానే చెప్పులు తొడగకుండా ప్రార్థన చేస్తారు. అయితే అంతిమ దైవప్రవక్త (సల్లం) షరీఅత్‌లో (శుభ్రమైన) చెప్పులు తొడిగి నమాజ్ చేయడంలో తప్పు లేదు.

“మూసా! నీవు కోరినవన్నీ ఇచ్చేశాము. మేము నీకు మరోసారి మేలు చేశాము. (నీబాల్యం సంగతి) గుర్తుకు తెచ్చుకో. మేము నీ తల్లికి ప్రత్యేక సూచన చేశాం. ‘వహీ’ ద్వారా మాత్రమే ఇలాంటి సూచన చేయడం సాధ్యమవుతుంది. (మేమిలా సూచించాం:) “ఈ పిల్లవాడ్ని ఒక పెట్టెలో పెట్టి నదిలో వదలిపెట్టు. నది ఆ పెట్టెను ఒడ్డుకు చేర్చుతుంది. నాకూ, ఈపిల్లవాడికి విరోధి అయినవాడు దాన్ని తీసేసుకుంటాడు.”

(మూసా! నీవు ప్రేమపాత్రుడయ్యేందుకు) నేను నావైపు నుండి నీ మీద మమతా మమకారాలు ఆవరింపజేశాను. నీవు నా పర్యవేక్షణలో పోషించబడేలా ప్రత్యేక ఏర్పాటు చేశాను. నీ సోదరి (ఫిరౌన్ దగ్గరకు) వెళ్ళిన సంగతి కూడా జ్ఞాపకం తెచ్చుకో. ఆమె (ఫిరౌన్ దగ్గరకు) వెళ్ళి “నేనీ పిల్లవాడ్ని బాగా పోషించే వారెవరో మీకు చూపనా?” అన్నది. ఈవిధంగా మేము నిన్ను మళ్ళీ నీతల్లి దగ్గరకు చేర్చాం. ఆమె సంతోషించాలని, దిగులు చెందకూడదని ఇలా చేశాం.

(మరో సంఘటన) “నీవొక వ్యక్తిని చంపావు. మేము నిన్ను ఆ ఇరకాటం నుండి బయటపడవేశాము. ఎన్నో సార్లు నిన్ను పరీక్షకు గురిచేశాము. నీవు మద్యన్ (జాతి) ప్రజల్లో అనేక సంవత్సరాలు గడిపావు. ఇప్పుడు నీవు తగిన సమయానికి వచ్చావు. మూసా! నేను నిన్ను నా పని కోసం యోగ్యుడిగా చేశాను. ఇక నీవు, నీ సోదరుడు నా(ఈ) నిదర్శనాలు తీసుకొని వెళ్ళండి. ఒక విషయం గుర్తుంచుకోండి. ఎట్టి పరిస్థితి లోనూ నన్ను స్మరించడంలో అలసత్వం చేయకూడదు. మీరిద్దరు ఇప్పుడు ఫిరౌన్ దగ్గరకు వెళ్ళండి. అతను గర్విష్ఠుడయి హద్దుమీరి పోయాడు. అతనితో మృదువుగా మాట్లాడండి. దానివల్ల అతను (మా) హితవుల్ని పాటించవచ్చు, లేదా (మా శిక్షకు) భయపడవచ్చు” అన్నాడు దేవుడు. (36-44)

“ప్రభూ! అతను మా మీద దౌర్జన్యం చేస్తాడేమోనని లేదా తిరగబడతాడేమోనని భయంగా ఉంది” అన్నారు వారిద్దరూ. (45)

“భయపడకండి. నేను మీకు తోడుగా ఉన్నాను. నేను సమస్తం వింటున్నాను, చూస్తున్నాను. ఇక వెళ్ళండి అతని దగ్గరకు. వెళ్ళి అతనికిలా చెప్పండి: “మేము నీ ప్రభువు తరఫున వచ్చిన దూతలం, ఇస్రాయీల్ సంతతివారిని మావెంట రావడానికి వదలిపెట్టు. వారిని వేధించకు. మేము నీ దగ్గరకు నీ ప్రభువు నిదర్శనాలు తీసుకొచ్చాము. సన్మార్గం అవలంబించేవారికి శాంతి కలుగుగాక! సత్యాన్ని తిరస్కరించి ముఖం తిప్పుకునేవారికి (ఇహపరలోకాల్లో) శిక్ష ఉందని మాకు దివ్యావిష్కృతి (వహీ) ద్వారా తెలియజేయబడింది” అన్నాడు దేవుడు. (46-48)

(వారు) ఫిరౌన్ (దగ్గరకెళ్ళి ఈమాటలు చెప్పగా అతను విని) “అయితే మూసా! మరి మీరిద్దరి ప్రభువు ఎవరంటా?” అని అడిగాడు. (49)

“ప్రతి వస్తువునూ తగిన విధంగా సృష్టించి, దానికి ఒక (నిర్దిష్ట) మార్గం చూపినవాడే మా ప్రభువు” అన్నాడు మూసా. (50)

“అయితే ఇంతకుపూర్వం గతించిన తరాల సంగతేమిటీ?” అడిగాడు ఫిరౌన్. (51)



“వారి సంగతేమిటో అంతా నాప్రభువు దగ్గర ఓగ్రంథంలో నమోదయి సురక్షితంగా ఉంది. నా ప్రభువు ఎలాంటి పొరపాటు చేయడు, మరచిపోడు” అన్నాడు మూసా.

ఆయనే మీకోసం భూమిని పాన్పుగా పరచి దానిపై నడవడానికి దారులు ఏర్పరి చాడు. పైనుండి వర్షం కురిపిస్తున్నాడు. ఆ వర్షం ద్వారా రకరకాల ఉత్పత్తులు వెలికి తీస్తున్నాడు. మీరూ తినండి, మీ పశువుల్నీ మేపుకోండి. నిస్సందేహంగా ఇందులో బుద్ధి మంతులకు నిదర్శనాలున్నాయి. ఈ భూమి నుండే మేము మిమ్మల్ని పుట్టించాము. చివరికి ఇందులోకే మిమ్మల్ని తీసికెళ్తాము. ఇందులోనుంచే మళ్ళీబ్రతికించి లేపుతాం.

మేము ఫిరౌన్‌కు మా నిదర్శనాలన్నీ చూపాము. కాని అతను (వాటిని) విశ్వసించ కుండా (కడదాకా) తిరస్కరిస్తూనే పోయాడు. (52-56)

అతను (ఎదురుతిరిగి మాట్లాడుతూ) “మూసా! నీ మంత్రశక్తితో మమ్మల్ని మా దేశం నుండి వెళ్ళగొట్టడానికి వచ్చావా మా దగ్గరికి? అలాగైతే మేము కూడా నీకు పోటీగా అలాంటి మంత్రశక్తినే తీసుకొస్తాము. ఈ పోటీ ఎప్పుడు ఎక్కడ జరగాలో నిర్ణయించుకో. మేమీ మాట నుండి వెనక్కి మరలము. నీవు కూడా మరలకూడదు. రా! బహిరంగ మైదానంలోకి (మా) ముందుకు రా!” అని సవాలు విసిరాడు. (57,58)

“అయితే జాతర దినాన పెట్టుకుందాం. పొద్దెక్కిన తరువాత జనం గుమికూడాలి” అన్నాడు మూసా. (59)

ఫిరౌన్ వెళ్ళి తనబలగాన్నంతా కూడగట్టుకొని వచ్చి (నిర్ణీతదినాన) పోటీకి దిగాడు.

మూసా (పోటీకి ముందు పాలకవర్గాన్ని ఉద్దేశించి) “దౌర్భాగ్యులారా! దేవునిపై అసత్యాలు మోపకండి. అలా చేస్తే ఒక మహోపద్రవం ద్వారా ఆయన మిమ్మల్ని సర్వనాశనం చేస్తాడు. అబద్ధం ఎవడు కల్పించినా వాడికి రోజులు మూడినట్లే” అని హెచ్చరించాడు. (60,61)

ఈ మాటలు వినగానే వారిలో భేదాభిప్రాయాలు పొడసూపాయి. వారు రహస్య సమాలోచనలు జరుపుకున్నారు. చివరికి వారిలో కొందరు ఇలా అన్నారు: “వీరిద్దరు మాంత్రికులు మాత్రమే, వారు తమ మంత్రబలంతో మిమ్మల్ని మీ దేశం నుండి వెళ్లగొట్టా లని, మీ మతాన్ని, మీ ఉదాత్త సంస్కృతిని, తుడిచిపెట్టాలని భావిస్తున్నారు. కనుక ఈరోజు మీ శక్తియుక్తులన్నీ సమీకరించుకొని, సేనావాహినిగా బరిలోకి దిగండి. గుర్తుంచుకోండి, ఈరోజు ఎవరిది పైచేయి అవుతుందో వారిదే గెలుపు.” (62-64)

(ఫిరౌన్ తరఫున పోటీకి దిగిన) మాంత్రికులు (ప్రత్యర్థిని సంబోధిస్తూ) “మూసా! ముందు నువ్వు పడవేస్తావా లేక మమ్మల్ని పడవేయమంటావా?” అని అడిగారు. (65)

“కాదు, మీరే పడవేయండి” అన్నాడు మూసా.

(మాంత్రికులు తమ మంత్ర సాధనాలు నేలమీద పడవేశారు.) మరుక్షణమే వారి త్రాళ్ళు, కర్రలు వారి మంత్రబలంతో మూసా కళ్ళకు (పాములుగా మారి) పరుగెత్తు తున్నట్లు కన్పించాయి. వాటిని చూసి అతను మనసులో కాస్త భయపడ్డాడు. (66,67)

అప్పుడు మేము "మూసా! భయపడకు. నీవే గెలుస్తావు. నీ చేతిలో ఉన్నదాన్ని క్రింద పడెయ్యి. ఇప్పుడే అది వారి అభూతకల్పనలన్నిటినీ తృటిలో మింగేస్తుంది. వీరు చేసినదంతా మంత్రజాలమే. మాంత్రికులు ఎంత అట్టహాసంగా వచ్చినా వారు ఎన్నటికీ విజయం సాధించలేరు" అన్నాము. చివరికి అదే జరిగింది. మాంత్రికులంతా సాష్టాంగ పడుతూ "మేము మూసా, హారూన్‌ల ప్రభువును విశ్వసించాం" అన్నారు. (68-70)

"ఏమిటీ, నేను అనుమతి ఇవ్వక ముందే మీరితడ్ని విశ్వసించారా? అసలితను మీకు మంత్రవిద్య నేర్పిన గురువయి ఉంటాడు. సరే కానివ్వండి. నేనిప్పుడే మీకాళ్ళు, చేతులు పరస్పరం వ్యతిరేక దిశలో నరికించి[2] మిమ్మల్ని ఖర్జూరపు చెట్లమొదళ్ళ మీద ఉరి తీయిస్తాను. అప్పుడు తెలుస్తుంది మీకు, మా ఇద్దరిలో ఎవరి శిక్ష కఠినంగా, చాలా సేపటిదాకా ఉంటుందో" అన్నాడు ఫిరౌన్ మండిపడుతూ. (71)

"మమ్మల్ని పుట్టించిన సృష్టికర్త సాక్షి! మా ముందుకు స్పష్టమైన నిదర్శనాలు వచ్చిన తరువాత కూడా (సత్యాన్ని విశ్వసించకుండా) నీకు ప్రాధాన్యం ఇవ్వడం మావల్ల కాదు. నీవు చేయదలచుకున్నదేమిటో చేసుకో. నీవు మహాఅయితే ఇహలోక జీవితంలో మాత్రమే ఏదైనా చేస్తావు. మేము మా ప్రభువును విశ్వసించాం. ఆయన మా తప్పులు మన్నిస్తాడు. నీ వత్తిడి వల్ల మేము ప్రయోగించిన ఈ మంత్రజాలాన్ని కూడా క్షమిస్తాడు. దేవుడే శ్రేష్ఠుడు, శాశ్వతంగా ఉండేవాడు" అన్నారు మాంత్రికులు నిర్భయంగా. (72,73)

నేరస్థుడయి తన ప్రభువు సన్నిధికి వచ్చిన ప్రతివాడికీ నరకమే గతి. అతనందులో చావడూ, బ్రతకడు. సత్యాన్ని విశ్వసించడంతో పాటు సత్కార్యాలు కూడా చేసిఉండి, తమ ప్రభువు సన్నిధికి వచ్చినవారి కోసం ఉన్నత స్థానాలు, సెలయేరులు ప్రవహించే శాశ్వత స్వర్గవనాలు ఉన్నాయి. ఆ వనాలలో వారు కలకాలం (సుఖంగా) ఉంటారు. పవిత్ర జీవితం గడిపేవారికి లభించే ప్రతిఫలం ఇలాగే ఉంటుంది. (74-76)

"ఇప్పుడిక రాత్రికి రాత్రి నా దాసుల్ని తీసుకొని బయలుదేరు. వారికోసం సముద్రంలో నిర్జలమైన దారి ఏర్పరచుకో. మిమ్మల్ని ఎవరూ వెంబడిస్తారన్న భయం ఉండదు. మరెలాంటి భయం కూడా ఉండదు" అని మేము మూసాకు దివ్యావిష్కృతి (వహీ) ద్వారా సూచించాము." (77)

వెనుకనుంచి ఫిరౌన్ సైన్యాన్ని తీసుకొని (సముద్ర తీరానికి) చేరుకున్నాడు. అప్పుడు సముద్రం వారందర్నీ తనలో లీనం చేసుకొని కలిసిపోయింది. ఫిరౌన్ తన జాతి ప్రజలను అపమార్గం పట్టించాడు; సరయిన మార్గదర్శనం చేయలేదు. (78,79)

ఇస్రాయీల్ సంతానమా! మేము మిమ్మల్ని మీశత్రువుల నుండి విముక్తి కలిగించాం. తూర్ పర్వతం కుడివైపున మీ రాక కోసం సమయం నిర్ణయించాము. మీ కోసం మన్న, సల్వాలను[3] దించాము. "మేము ప్రసాదించిన పరిశుద్ధ ఆహారం తినండి.

2. అంటే కుడికాలు నరికితే, దానికి అభిముఖంగా ఉన్న ఎడమచేయి నరకాలన్న మాట.

3. వివరాలకు 2:57 సూక్తి, దాని పాదసూచిక చూడండి.



అయితే తిని తిరుగుబాటు వైఖరి అవలంబించకండి. అలా చేస్తే మీపై నా ఆగ్రహం విరుచుకు పడుతుంది. నా ఆగ్రహానికి గురయిన వాడికిక రోజులు మూడినట్లే. అయితే పశ్చాత్తాపంతో క్షమాపణ కోరుకొని, సత్యాన్ని విశ్వసించి సదాచారసంపన్నుడై, సన్మార్గం లోనే (జీవితాంతం) నడిచేవాడ్ని నేను తప్పకుండా క్షమిస్తాను" (అన్నాం). (80-82)

"మూసా! నిన్ను ఏ విషయం నీజాతి ప్రజల కంటే ముందుగా తీసుకొచ్చింది?" అడిగాడు దేవుడు. (83)

"వారు నావెనకాల వస్తున్నారు. ప్రభూ! నీవు నాపట్ల ప్రసన్నుడవుతావన్న ఉద్దేశ్యం తో నేను తొందరచేసి నీ సన్నిధికి చేరుకున్నాను" మనవి చేసుకున్నాడు మూసా. (84)

"సరే, నీ వెనుక (అంటే నీవిక్కడికి వచ్చిన తర్వాత) మేము నీ జాతిని పరీక్షకు గురిచేశాం. సామిరీ (అనేవాడు) వాళ్ళను పెడదారి పట్టించాడు" అన్నాడు దేవుడు. (85)

(ఈ దుర్వార్త వినగానే) మూసా ఆగ్రహం, విచారంతో కూడిన భావోద్రేకాలతో తన జాతి దగ్గరకు తిరిగొచ్చాడు. వచ్చీరాగానే "నాజాతి ప్రజలారా! మీ ప్రభువు మీకు మంచి వాగ్దానాలు చేయలేదా? అది మీకు ఆలస్యమైనట్లు అన్పించిందా (సహనం కోల్పోయి ఈ నిర్వాకానికి పాల్పడ్డారు)? లేక నాకు మీరు చేసిన వాగ్దానభంగానికి స్వయంగా మీరే మీ ప్రభువు ఆగ్రహాన్ని ఆహ్వానించదలిచారా?" అని అడిగాడు. (86)

"మాఅంతట మేము వాగ్దానభంగం చేయలేదు. అసలేం జరిగిందంటే మేము నగల బరువు మోయలేక చస్తున్నాం. అంచేత వాటిని కాస్తా తీసిపారేశాం, అంతే" అన్నారు వారు.

ఆ తర్వాత సామిరీ తన పాత్ర నిర్వహించాడు. అతను వారికోసం ఒక ఆవుదూడ విగ్రహం తయారుచేశాడు. అందులో నుంచి దూడ అరుపులాంటి ధ్వని వినవస్తుండేది. జనం (ఆ చోద్యం చూసి) "ఇదే మన దైవం. మూసా దైవం కూడా ఇదే. మూసా దీన్ని మరచిపోయాడు" అని అరిచారు. (కాని) అది తమకు సమాధానమివ్వదని, ఎలాంటి లాభనష్టాలు కలిగించలేదని వారు గమనించడం లేదా? (87-89)

హారూన్ (మూసా రాకకు) ముందే (వారికి నచ్చజెబుతూ) "సోదరులారా! దీనిద్వారా మీరు పరీక్షకు గురయ్యారు. మీ ప్రభువు మాత్రం కరుణామయుడే. కనుక మీరు నన్ను అనుసరించండి. నామాట వినండి" అన్నాడు. (90)

కాని వారు (అతని మాటలు పెడచెవిన పెడ్తూ) "మూసా తిరిగి రానంతవరకు మేము దీన్నే పూజిస్తూ ఉంటాం" అని చెప్పేశారు. (91)

మూసా (హారూన్ వైపు తిరిగి) "హారూన్! వీరు మార్గభ్రష్టులయి పోతుంటే చూసి (నీవు మౌనంగా ఎందుకుండి పోయావు?) వారిని వారించకుండా ఏ విషయం నిన్ను నిరోధించింది? నీవు నా ఆదేశం ఎందుకు ఉల్లంఘించావు?" అని అడిగాడు. (92,93)

"నా తల్లికుమారుడా! నా గడ్డాన్ని, తలవెండ్రుకల్ని పట్టి లాగకు. నేను ఇస్రాయీల్

సంతతిలో చీలికలు తెచ్చిపెట్టానని, నీమాట ఖాతరు చేయలేదని అంటావేమోనని నేను భయపడ్డాను. (దేవుని దయవల్ల అలా అనలేదు నీవు)" అన్నాడు హారూన్. (94)

"సామిరీ! ఇక నీ సంగతేమిటీ?" అడిగాడు మూసా. (95)

"నేను ప్రజలకు కనపడని ఒక (విచిత్ర) వస్తువుని చూశాను. నేను సందేశహరుని అడుగుజాడల నుంచి ఒక పిడికెడు (మట్టి) తీసుకొని (విగ్రహంలో) పోశాను.[4] అలా చేయాలని నా మనస్సుకు అన్పించింది" అన్నాడు సామిరి. (96)

"సరే వెళ్ళు (ఇక్కడ్నుంచి). ఇకనుండి నీవు జీవితాంతం 'నన్ను తాకకండి' అని చెబుతూ తిరుగుతుంటావు. నీకోసం (మరణానంతరం) వాగ్దాన సమయమొకటి నిర్ణయమై ఉంది. అది ఎట్టి పరిస్థితిలోనూ తప్పిపోదు. చూడు, ఇప్పుడు నీ ఇష్టదేవత గతి ఏమౌతుందో! దీన్ని మేము కాల్చి, ముక్కలు ముక్కలు చేసి సముద్రంలో విసిరి పారేస్తాం... ప్రజలారా! మీ దేవుడు అల్లాహ్ మాత్రమే. ఆయన తప్ప మరో ఆరాధ్యుడు లేడు. ఆయన జ్ఞానం ప్రతి వస్తువునూ పరివేష్ఠించి ఉంది" అన్నాడు మూసా. (97,98)

ముహమ్మద్ (స)! ఈ విధంగా మేము గతంలో జరిగిన విశేషాలను గురించి నీకు తెలియజేస్తున్నాము. మేము ప్రత్యేకంగా మాదగ్గర నుంచి ఒక జ్ఞాపిక (ఖుర్ఆన్)ను తీసి నీకు ప్రసాదిస్తున్నాము. దాన్ని విశ్వసించకుండా ముఖం తిప్పుకునేవాడు ప్రళయదినాన అతి దారుణమైన పాపభారం మోయవలసి వస్తుంది. (99,100)

ఆ పాపభారాన్ని అతడు ఎల్లకాలం మోస్తుంటాడు. ప్రళయదినాన (ఈ పాపపు కొండ) అతనికి అతి బాధాకరమైన భారంగా పరిణమిస్తుంది. శంఖం పూరించబడే రోజు మేము నేరస్థుల్ని చుట్టుముట్టి (ఒకచోట) చేర్చుతాము. అప్పుడు వారు (భీతావహంతో) నిలువుగుడ్లు వేసి చూస్తారు. తరువాత వారు పరస్పరం మెల్లిగా మాట్లాడుకుంటూ "మీరు ప్రపంచంలో మహాఅయితే పదిరోజులు గడిపారేమో" అంటారు. (101-103)

వారు మాట్లాడుకుంటున్నదేమిటో మాకు బాగా తెలుసు. వారిలో కాస్త తెలివిగల వాడు "కాదు, మీరసలు ప్రపంచంలో ఒక్కరోజు మాత్రమే గడిపారు" అనంటాడు.[5]

ఆరోజు పర్వతాలు ఏమవుతాయని వారు నిన్ను అడుగుతున్నారు. వారికిలా చెప్పు: "నా ప్రభువు వాటిని ఇసుక రేణువులుగా మార్చి ఎగరేస్తాడు. భూమిని చదునైన మైదానంగా మార్చివేస్తాడు. దానిమీద మీకెలాంటి మిట్టపల్లాలు కన్పించవు." (104-107)

ఆరోజు ప్రకటనకర్త పిలుపుతో మానవులు కిమ్మనకుండా అతనివెంట నడుస్తారు. ఏ ఒక్కడూ తోక జాడించలేడు. కరుణామయుని సమక్షంలో ధ్వనులన్నీ మూగబోతాయి. తేలికపాటి (అడుగుల) చప్పుడు మాత్రమే కాస్త విన్పిస్తుంది. (108)

---

4. అంటే 'మీ అడుగుజాడల నుండి సేకరించిన మట్టినే నేను విగ్రహంలో పోస్తే ఇలా జరిగింది; ఇది మీ పాదధూళి మహిమే' అని టక్కరి మాటలు చెప్పి నిందారోపణ నుండి తప్పించు కోవడానికి ప్రయత్నించాడు సామిరి. (7:148 సూక్తి కూడా చూడండి.)

5. ఇతర వివరాలకు 23:112 సూక్తి; 79:46 సూక్తి, దాని పాదసూచిక చూడండి.



ఆరోజు కరుణామయుడు ఎవరికైనా అనుమతి ఇచ్చి, అతని మాటలు వినడానికి ఇష్టపడితే తప్ప ఏఒక్కరి సిఫారసూ చెల్లదు.[6] ప్రజల ముందున్నదేమిటో, వారి వెనుకున్నదేమిటో దేవునికి తెలుసు. ఇతరులకు దాన్ని గురించి పూర్తిగా తెలియదు. (109,110)

(ఆరోజు) మానవులు సజీవుడు, శాశ్వితుడైన దేవుని ముందు తలలు వంచి నిలబడతారు. దుర్మార్గం, దౌర్జన్యాల పాపభారం మోసుకొచ్చినవాడు ఆరోజు సర్వనాశనమైనట్లే. సత్కార్యాలు చేసివుండటంతో పాటు విశ్వాసి కూడా అయివుండినవాడికి ఎలాంటి నష్టంగాని, అన్యాయంగాని జరుగుతుందన్న భయమే ఉండదు. (111,112)

ఈవిధంగా మేము దీన్ని అరబీ భాషలో పాఠ్యగ్రంథంగా చేసి అవతరింపజేశాము. మానవులు చెడులు మానేసి నీతిమంతులుగా మారడానికి, లేదా ఏమరుపాటు వదలి స్పృహలోకి రావడానికి మేమిందులో రకరకాల హెచ్చరికలు చేశాము. (113)

కనుక ఆ దేవుడు సర్వోన్నతుడు, సహజ చక్రవర్తి.

ప్రవక్తా! నీదగ్గరకు ఖుర్ఆన్ పూర్తిగా అవతరించనంతవరకు నీవు దాన్ని పఠించడానికి తొందరపడకు. "ప్రభూ! నాకు మరింత జ్ఞానం ప్రసాదించు" అని వేడుకో. (114)

పూర్వం మేము ఆదంకు ఒక సందేశం ఇచ్చాము. కాని అతను దాన్ని మరచిపోయాడు. అతనిలో మాకు స్థిరత్వం, సంకల్పబలం కానరాలేదు. (115)

ఆదంకు గౌరవసూచకంగా అభివాదం చేయమని మేము దైవదూతల్ని ఆజ్ఞాపించాం. అప్పుడు వారంతా అభివాదంచేశారు. కాని ఇబ్లీస్ అలా చేయడానికి నిరాకరించాడు. మేము ఆదంకు ఇలా ఉపదేశించాము: "ఆదం! ఇతను నీకు, నీ భార్యకు (బద్ధ)విరోధి. (కనుక ఇతని పట్ల అప్రమత్తంగా ఉండాలి.) ఇతను మీరిద్దర్నీ స్వర్గం నుండి బయటికి తీయడం, దానివల్ల మీరు కష్టాలలో పడిపోవడం జరగకూడదు సుమా! ఇక్కడ మీక్కావలసిన సౌకార్యాలన్నీ ఉన్నాయి. ఎలాంటి ఆకలి బాధగాని, కట్టుబట్టల కొరతగాని ఉండదు. అలాగే ఇక్కడ దప్పికగాని, ఎండబాధగాని ఉండదు." (116-119)

కాని షైతాన్ అతడ్ని మభ్యపెట్టాడు. వాడు అతని దగ్గరకెళ్ళి "ఆదం! నేను నీకు శాశ్వత జీవితం, ఎన్నటికీ పతనంకాని రాజ్యాధికారం ప్రసాదించే ఓ కల్పవృక్షాన్ని చూపనా?" అన్నాడు. చివరికి వారిద్దరూ (వాడి టక్కరిమాటలకు మోసపోయి) ఆ చెట్టు పండ్లు తిన్నారు. దాంతో తక్షణమే వారి మర్మావయవాలు ఒకరి ముందు ఒకరివి బహిర్గతమైపోయాయి. అప్పుడు వారిద్దరూ స్వర్గవృక్షాల ఆకులతో తమశరీరాలు కప్పుకోసాగారు. ఆదం తనప్రభువు (మాట)ను జవదాటి సన్మార్గం తప్పిపోయాడు.[7] (120,121)

---

6. ఈ విషయం గురించి 2:255, 21:28, 53:26 సూక్తులు చూడండి.

7. 2:36, 7:20-22 సూక్తులలో హజ్రత్ ఆదం (అలైహి), ఆయన భార్య హజ్రత్ హవ్వా (అలైహి) ఇద్దర్నీ షైతాన్ మభ్యపెట్టి మోసగించినట్లు ఉంది. అయితే ఇక్కడ (120 సూక్తిలో) హజ్రత్ ఆదం (అలైహి)ని షైతాన్ మభ్యపెట్టినట్లు స్పష్టంగా ఉంది. అంతేకాదు, (121 సూక్తిలో) ఆదం తన ప్రభువాజ్ఞను జవదాటినట్లు కూడా పేర్కొనబడింది.

ఆతర్వాత అతని ప్రభువు అతణ్ణి పునీతం చేశాడు. అతని పశ్చాత్తాపాన్ని స్వీకరించి అతనికి సన్మార్గభాగ్యం ప్రసాదించాడు. (అయితే ఆదంకు) దేవుడిలా ఆదేశించాడు:

“మీరిక్కడ్నుంచి దిగిపోండి. మీరంతా ఒకరికొకరు శత్రువులు. ఇకముందు నానుండి మీదగ్గరికి ఏదైనా హితోపదేశం వస్తే దాన్ని అనుసరించేవాడు దారితప్పడు; దౌర్భాగ్య స్థితికీ గురికాడు. అయితే నా హితబోధను పెడచెవినపెట్టి ముఖం తిప్పుకునే వాడు ప్రపంచంలో (మనశ్శాంతికి దూరమయి) దుర్భర జీవితం గడుపుతాడు. ప్రళయ దినాన మేమతణ్ణి అంధుడిగా చేసి లేపుతాము.” (122-124)

---

అయితే దీనికి భిన్నంగా క్రైస్తవులు హజ్రత్ హవ్వా (అలైహి)యే హజ్రత్ ఆదం (అలైహి)కు నిషిద్ధఫలం తినిపించినట్లు ప్రచారం చేశారు. పదకొండవ శతాబ్దంలో బిషప్ మార్బత్ అనే ఓ క్రైస్త వాచార్యుడు “స్త్రీయే మన ప్రథమ పితకు నిషిద్ధఫలం తినిపించింద”ని పేర్కొన్నాడు. టెర్‌టూలియన్ అనే మరో క్రైస్తవ పండితుడు స్త్రీ జాతినే కించపరుస్తూ “స్త్రీ నరకానికి ద్వారం, అన్ని చెడుగులకు తల్లి (మూలం), తాను స్త్రీ అయినందుకు ఆమె సిగ్గుపడాలి” అన్నాడు. ఈ భావనే పూర్వం క్రైస్తవ ప్రపంచంలో స్త్రీ జాతిని అధమ శ్రేణికి దిగజార్చింది. వారి హక్కులను అన్యాయంగా కాల రాయడం జరిగింది. వారిపై దుర్భర దౌర్జన్యాలు జరిగాయి.

ఖుర్‌ఆన్ షైతాన్‌మోసానికి గురయినది హజ్రత్ ఆదం (అలైహి) అని పేర్కొన్నప్పటికీ, స్త్రీ పురుషుల మధ్య వివక్ష చూపుతూ పురుషుణ్ణి నిందించలేదు. ఇక్కడ స్త్రీ అయినా, పురుషుడైనా గమనార్హమైన విషయం మానవుడి వల్ల పొరపాటు జరిగిందన్నదే. మరో విషయం వినండి:

మహాప్రవక్త (సల్లం) ఇలా తెలియజేశారు: మూసా, ఆదం (అలైహి)ల మధ్య సంభాషణ జరిగింది. మూసా(అలై) ఆదం (అలైహి)తో మాట్లాడుతూ “ఆదం! మీరు మా పితామహులు. కాని మీరు మమ్మల్ని (మానవుల్ని) నిరర్థకం చేశారు. మమ్మల్ని స్వర్గంనుంచి తీసివేయించారు” అన్నారు. దానికి ఆదం ఇలా జవాబిచ్చారు: “మూసా! దేవుడు నిన్ను ప్రత్యక్షసంభాషణ కోసం ఎన్నుకున్నాడు. ఆయన నీకు తన స్వహస్తాలతో (తౌరాత్ పలకలు) రాసిచ్చాడు. అలాంటి (ఉన్నతస్థానం పొందిన) నీవు, నన్ను సృష్టించడానికి నలభై యేళ్ళకు పూర్వమే దేవుడు నా అదృష్టంలో రాసిన విధివ్రాత పట్ల నన్ను నిందిస్తున్నావా?” ఈవిధంగా ఆదం ఈ ప్రమాణం ద్వారా మూసాపై విజయం సాధించారు. మహాప్రవక్త (సల్లం) ఈ చివరి వాక్యాన్ని మూడుసార్లు అన్నారు. (బుఖారి, ముస్లిం)

ఇహలోకం కర్మభూమి. మానవుడు ఇహలోకంలో చేసుకున్న కర్మలను బట్టి పరలోకంలో ప్రతిఫలం అనుభవిస్తాడు. హజ్రత్ ఆదం (అలై) ఇహలోకానికి వచ్చి కర్మలు ఆచరించి పరలోకానికి వెళ్ళిన తర్వాతనే మూసా (అలై)కు ఈవిధంగా సమాధానమిచ్చారు. దేవుడు ఆయన పొరపాట్లను క్షమించాడు. ఇక ఆయనపై ఎలాంటి నింద మిగలలేదు. కనుక పాపం చేసిన ఏ వ్యక్తి కూడా హజ్రత్ ఆదం (అలైహి) ఇచ్చినట్లు సమాధానమిచ్చి శిక్ష నుండి తప్పించుకోలేడు.

ఒకవేళ ఎవరైనా పిడివాదం చేస్తూ “నా అదృష్టంలో పాపాలు చేయాలని రాసిపెట్టి ఉంది గనక నేను పాపాలు చేస్తున్నా; నన్ను నిందించకూడద”ని అంటే, “నీ అదృష్టంలో ఆపాపాలకు నీవు నరకశిక్ష అనుభవిస్తావని కూడ రాసిపెట్టి ఉంది గనక, నరకశిక్ష అనుభవించు” అని సమాధానం వస్తుంది. ఎవరి అదృష్టంలో ఏం రాసిపెట్టిఉందో మానవులకు తెలియదు. అంచేత పైశాచిక ఆలోచనలకు తావీయకుండా శక్తిమేరకు సత్కర్మలు ఆచరించడమే బుద్ధిమంతుల పని.



అప్పుడతను “ప్రభూ! ప్రపంచంలో నేను కళ్ళున్న వాడినే, ఇక్కడ నన్ను ఎందుకు అంధుడిగా చేసి లేపావు?” అని అడుగుతాడు. దానికి దేవుడు “నీదగ్గరకి మాసూక్తులు వచ్చినప్పుడు నీవు ఇలాగే (అంధుడైపోయి) వాటిని విస్మరించావు. అందువల్ల ఈరోజు మేము నిన్ను (అంధుడిగా చేసి) విస్మరిస్తున్నాం” అని సమాధానమిస్తాడు. (125,126)

అలాగే హద్దుమీరే, తమప్రభువు సూక్తులు తిరస్కరించేవారికి (ఇహలోకంలో వాటి) పర్యవసానం చవిచూపిస్తాం. పరలోకశిక్ష ఇంకా కఠినంగా, సుదీర్ఘంగా ఉంటుంది.

పూర్వం మేము (సత్యాన్ని తిరస్కరించిన) ఎన్నో జాతుల్ని నాశనం చేశాము. వాటి అవశేషాల మధ్య ఈరోజు వీరు తిరుగుతున్నారు కదా, మరి వాటి(చరిత్ర) నుండి గుణ పాఠం నేర్చుకోరా? నిస్సందేహంగా ఇందులో బుద్ధిమంతులకు ఎన్నో నిదర్శనాలున్నాయి.

నీ ప్రభువు నుండి ముందుగానే ఒక మాట, నిర్ణీతగడువు లేకుంటే వారి వ్యవ హారం ఎప్పుడో తేల్చబడిఉండేది. కనుక వారి మాటలకు నీవు (మనస్తాపం చెందకు.) సహనం వహించు.

నీ ప్రభువు ఔన్నత్యాన్ని ఘనంగా కీర్తిస్తూ ఆయన్ని స్మరిస్తూ ఉండు. సూర్యో దయానికి పూర్వం, సూర్యాస్తమయానికి ముందు, రాత్రి సమయాల్లో, పగటి వేళల్లో కూడా దైవస్మరణ చేస్తూ ఉండు. దానివల్ల నీవు బహూశా (సమీప భవిష్యత్తులో) సంతోషిస్తావు. (127-130)

మేము ప్రాపంచిక జీవితాన్ని, దాని వైభవం, పటాటోపాలను వారిలో వివిధ ప్రజలకు ఇచ్చాము. నీవు వాటి వైపు కన్నెత్తి కూడా చూడకు. వాటిని మేము వారిని పరీక్షించడానికి ఇచ్చాము. నీ ప్రభువు ప్రసాదించే ధర్మయుక్తమయిన ఉపాధి మాత్రమే నాణ్యమయినది, మన్నికయినది.

నీ భార్యాపిల్లలకు నమాజును గురించి బోధించు. నీవుకూడా దాన్ని క్రమం తప్పకుండా ఆచరించు. మేము మిమ్మల్ని ఆహారం ఇవ్వమని అడగటం లేదు. మేమే మీకు ఆహారం ప్రసాదిస్తున్నాం. సత్ఫలం దైవభీతిపరాయణతకే లభిస్తుంది. (131,132)

వారు (నీగురించి) “ఈమనిషి తనప్రభువు వైపునుండి నిదర్శనం (మహిమ) ఎందుకు తీసుకురాడు?” అని అడుగుతారు. వారి దగ్గరకు గతగ్రంథాల బోధనల్లోని సారం చేరలేదా? ఒకవేళ మేము దాని రాకకుముందే ఏదైనా శిక్షద్వారా వారిని నాశనంచేస్తే “ప్రభూ! నీవు మా దగ్గరకు దైవప్రవక్తను ఎందుకు పంపలేదు? పంపితే నీచులయి పరాభవంపాలు కాకముందే మేము నీ సూక్తులు పాటించేవాళ్ళం కదా?” అనంటారు వారు.

వారికిలా చెప్పు: పర్యవసానం కోసం ప్రతివ్యక్తీ ఎదురుచూస్తున్నాడు. ఇప్పుడు మీరూ ఎదురుచూస్తూ కూర్చోండి. ఎవరు సన్మార్గగాములో, ఎవరు సహృదయులో త్వరలోనే మీకు తెలుస్తుంది. (133-135)

# 21. దైవప్రవక్తలు (అంబియా)

అవతరణ: మక్కా సూక్తులు: 112

ఈ అధ్యాయాన్ని "అంబియా" (దైవప్రవక్తలు) అంటారు. ఇది హిజ్రీ శకారంభానికి అయిదారేండ్లకు పూర్వం అవతరించింది. ఇందులో వివిధ దైవప్రవక్తల సంక్షిప్త వృత్తాంతాలను స్పృశిస్తూ అవిశ్వాసులు నిజధర్మం వైపు పిలువబడ్డారు. వారి అనుమానాలు, ఆరోపణలకు హేతుబద్ధంగా సమాధానాలు కూడా ఇవ్వబడ్డాయి. వారి ప్రాపంచిక వ్యామోహం, ఏమరుపాటుల్ని ఎండగడ్తూ తత్ఫలితంగా ఎదురయ్యే దుష్పరిణామాల్ని గురించి హెచ్చరించడం జరిగింది.

## కరుణామయుడు, కృపాసాగరుడయిన దేవుని పేరుతో ప్రారంభం

మానవుల (కర్మ) విచారణ సమయం సమీపంలోనే ఉంది. కాని వీరేమో ఏమరుపాటులో పడి, దానికి విముఖులై పోతున్నారు. వారిముందు వారి ప్రభువు నుండి ఏకొత్త హితోపదేశం అవతరిస్తున్నా దాన్ని వారు నిర్లక్ష్యంతో వింటూ ఆటాడుకుంటున్నారు. (1,2)

వారి హృదయాలు (ఐహిక వ్యామోహంలో) మునిగిపోయాయి. దుర్మార్గులు (నీ గురించి "ఈవ్యక్తి మీలాంటి మనిషే. అలాంటప్పుడు మీరు చూస్తూ చూస్తూ అతని మాయాజాలంలో ఎందుకు పడతారు?" అని[1] గుసగుసలాడుకుంటారు. (3)

అప్పుడు దైవప్రవక్త "భూమ్యాకాశాలలో జరిగే సమస్త విషయాలు నా ప్రభువుకు తెలుసు. ఆయన అన్నీ వింటున్నాడు, తెలుసుకుంటున్నాడు" అన్నాడు. (4)

"ఇవన్నీ అస్పష్టమైన కలలకు సంబంధించిన విషయాలు; అతని స్వీయకల్పనలు. అసలితను (గొప్ప)కవి.[2] అలా కాకపోతే గతప్రవక్తల మాదిరిగా ఇతనుకూడా మనకు

1. కొందరు తమ ఠీవి, దర్పం, ముఖవర్చస్సు, మాటలతో ఇతరుల్ని మంత్రముగ్ధుల్ని చేసి వారిని తమ అభిప్రాయం మార్చుకునేలా చేస్తారు. అదేవిధంగా మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) తన అసాధారణమైన వ్యక్తిత్వం, అపార సద్గుణసంపత్తి, అమోఘమయిన సూక్తులతో ప్రజలను ఆకట్టుకొని వారికి రుజుమార్గం చూపేవారు. కాని ఇస్లాంవ్యతిరేక శక్తులు మాత్రం ముహమ్మద్ పెద్ద మాంత్రికుడని, అతని మంత్రజాలంలో పడవద్దని పనిగట్టుకొని మరీ ప్రచారం చేసేవారు. నిజానికి ముహమ్మద్ మహనీయు (సల్లం)ని వ్యక్తిత్వం, ఆయన నోట వెలువడే దివ్యసూక్తులే ఆయన బద్ధ శత్రువుల్ని సైతం ప్రభావితం చేసేవి. ఉదాహరణకు: దైవప్రవక్త (సల్లం)ను కలసి మాట్లాడిన తర్వాత ఉత్బా బిన్ రబియాలో వచ్చిన మార్పు ఓ మచ్చుతునకగా పేర్కొనవచ్చు. (ఈ సంఘటన గురించి వివరాలకు 41వ అధ్యాయం (హా-మీమ్-సజ్దా) ఉపోద్ఘాతం చూడండి.)

2. మక్కా ఖురైషీయులు ఇస్లామీయ ఉద్యమాన్ని నిరోధించడానికి ప్రయోగించిన ప్రచారాస్త్రాలలో 'ఖుర్ఆన్ మానవ విరచితం, ముహమ్మద్ ఓ గొప్ప కవి' అన్నది కూడా ఉంది. యావత్తు అరేబియాలో ప్రముఖ కవిగా పేరుగాంచిన తుఫైల్ బిన్ దౌసి ఓసారి ఏదో పని మీద మక్కా వచ్చాడు. ఆయన దౌస్‌తెగ నాయకుడు కూడా. అందువల్ల తుఫైల్ పట్నంలోకి అడుగు పెట్టగానే ఖురైష్ నాయకులు ఆయన్ని చుట్టిముట్టి దైవప్రవక్త (సల్లం)కు వ్యతిరేకంగా ఆయనకు బాగా నూరిపోశారు. దాంతో ఆయన భయపడి దైవప్రవక్త (సల్లం)కు దూరంగా మసలుకోసాగాడు.



ఏదైనా నిదర్శనం చూపాలి. గత ప్రవక్తలందరూ నిదర్శనాలిచ్చే కదా పంపబడ్డారు" అంటారు వారు. కాని ఇంతకు పూర్వం మేము నాశనం చేసిన పట్టణాలలోని ప్రజలు సత్యాన్ని విశ్వసించలేదు. మరి వీరు విశ్వసించడానికి సిద్ధంగా ఉన్నారా? (5,6)

ముహమ్మద్ (స)! పూర్వం కూడా మేము మానవుల్నే ప్రవక్తలుగా నియమించి వారిద్వారా మా సందేశం అందజేస్తూ వచ్చాం. (అవిశ్వాసులారా!) మీకు తెలియకపోతే గ్రంథప్రజల్ని అడిగి తెలుసుకోండి. ఆ ప్రవక్తలక్కూడా మేము కూడు తినకుండా ఉండగలిగే దేహాలు ఇవ్వలేదు. వారు శాశ్వతంగా ఉండే మనుషులు కూడా కాదు. (7,8)

వారిగురించి మేము చేసిన వాగ్దానాలు నెరవేర్చాం. మేము ప్రవక్తలను, (ప్రజల్లో) మేము తలచుకున్న వారిని రక్షించాం. హద్దులుమీరిన వారిని అంతమొందించాం. మానవులారా! మేము మీదగ్గరికి ఎంతో ప్రయోజనకరమైన గ్రంథం పంపాము. అందులో మీ గురించిన ప్రస్తావనే ఉంది. మరి మీరు విషయాన్ని అర్థం చేసుకోరా? (9,10)

మేము ఎన్నో దుర్మార్గ (ప్రజలున్న) పట్టణాలను తుడిచిపెట్టాం. వారి తరువాత మరో జాతిని తెచ్చాం. వారు మాశిక్ష వచ్చే సూచనలు కన్పించగానే అక్కడ్నుంచి పారిపోవడానికి ఉపక్రమించారు..... "పారిపోకండి. వెనక్కి తిరగండి, మీరు సుఖంగా ఉంటున్న మీ ఇండ్లు, మీరు అనుభవిస్తున్న మీ భోగభాగ్యాల వైపుకే మరలండి; బహుశా మిమ్మల్ని (ఈవిషయం గురించి) ఎవరైనా సమాచారం అడగవచ్చు"... వారు (బెంబేలెత్తిపోతూ) "అయ్యయ్యో! మా తలరాత మండిపోను!! నిజంగా మేము చాలా దుర్మార్గులం" అని అరవసాగారు. వారలాగే అరుస్తూ ఉంటే, మేము వారిని పంటపైరు మాదిరిగా కోసి ఆర్పి తుడిచిపెట్టాం. (11-15)

మేము భూమ్యాకాశాలను, వాటిలో ఉన్నవాటిని ఏదో ఆట (తమాషా) కోసం సృష్టించ లేదు. మేమేదైనా ఆటవస్తువును తయారు చేసుకోదలచుకుంటే, ఈవిధంగానే చేయాలనుకుంటే మా దగ్గర ఉన్నవాటితోనే తయారు చేసుకునేవారం. కాని మేము (ఇక్కడ) సత్యం ద్వారా అసత్యంపై దెబ్బతీస్తున్నాము. ఇలా సత్యం అసత్యం తలను పగలగొడ్తుంది. చూస్తుండగానే అసత్యం అంతిమశ్వాస విడుస్తుంది. కనుక మీ అభూత కల్పనలకు మీకు వినాశం తప్పదు. (16-18)

భూమ్యాకాశాల్లో ఉన్న సమస్త సృష్టిరాసులు దేవుని సొత్తే. ఆయన దగ్గర ఉన్నవారు (అంటే దైవదూతలు) తామేదో గొప్పవారన్న అహంభావంతో ఆయన్ని ఆరాధించడానికి

ఓరోజు దైవప్రవక్త (సల్లం) కాబా మందిరంలో ఓ మూలన నమాజ్ చేస్తూ ఖుర్ఆన్ పఠిస్తుంటే, తుఫైల్ చెవుల్లో దూది పెట్టుకొని కాబా ప్రదక్షిణ చేయసాగాడు. అయినా కొన్ని ఖుర్ఆన్ సూక్తులు ఆయన చెవిన పడనే పడ్డాయి. దాంతో ఆ విచిత్రవాణి పట్ల ఆయనలో ఆసక్తి జనించి దైవప్రవక్త (సల్లం) వెనకాలగా వెళ్ళి ఆయన్ని ప్రత్యక్షంగా కలుసుకున్నాడు. ఇస్లాం గురించి కాస్త వివరంగా తెలియజేయమని అడిగాడు. దైవప్రవక్త (సల్లం) ఆయనకు కొన్ని సూక్తులు పఠించి విన్పించారు. తుఫైల్ ఆ సూక్తులు వినగానే, ఇది ఎంతమాత్రం మానవ విరచితం కాదని, ఇది ముమ్మాటికి దైవవాణేనని గ్రహించి అప్పటికప్పుడే ఇస్లాం స్వీకరించాడు. (ఈ సంఘటన ఇబ్నె హిషామ్ 2వ భాగంలో వివరంగా ఉంది.)

నిరాకరించరు. ఆయన్ని ఆరాధిస్తూ అలసిపోరు కూడా. వారు క్షణంపాటు కూడా ఊపిరి పీల్చుకోకుండా రేయింబవళ్ళు ఆయన్ని స్తుతిస్తూనే ఉంటారు. (19,20)

వారు (స్వయంగా) తయారు చేసుకున్న భూసంబంధమైన మిథ్యాదైవాలు (నిర్జీవ సృష్టితాలకు) ప్రాణంపోసి లేపుతాయా? (21)

భూమ్యాకాశాల్లో ఒక్క దేవుడే కాకుండా ఇతర దైవాలు కూడా ఉంటే భూమ్యాకాశాలవ్యవస్థ (ఏనాడో) విచ్ఛిన్నమైపోయి ఉండేది. వారు కల్పిస్తున్నవాటికి విశ్వసామ్రాజ్య సింహాసనాధీశుడైన దేవుడు ఎంతో అతీతుడు, పరమపావనుడు. ఆయన ఎవరి ముందూ జవాబుదారుడు కాదు. ఇతరులే ఆయన ముందు జవాబుదారులు. (22,23)

వారు ఆయన్ని వదలి ఇతరులను దైవాలుగా చేసుకున్నారా? అయితే వారిని ఇలా అడుగు: "అందుకు మీ ప్రమాణాలేమిటో తీసుకురండి. ఈ గ్రంథం కూడా ఉంది. ఇందులో నా యుగానికి చెందిన ప్రజలకు హితబోధ ఉంది. నాకు పూర్వముండిన ప్రజలకు హితబోధ ఉన్న గ్రంథాలు కూడా ఉన్నాయి."

కాని వారిలో చాలామందికి వాస్తవం తెలియదు. అంచేత వారు సత్యానికి విముఖులవుతున్నారు. నీకు పూర్వం పంపిన ప్రవక్తలకు కూడా "నేను తప్ప మరో దేవుడు లేడని, కనుక నన్నే ఆరాధించాలి" అని సందేశం పంపాము. (24,25)

వారు కరుణామయునికి సంతానం ఉందని అంటారు. (ఎంత మాత్రం లేదు.) దేవుడు పరిశుద్ధుడు. వారు (అంటే దైవదూతలు) గౌరవనీయులైన దైవదాసులు. ఆయన సన్నిధిలో వారు ఏమాత్రం ఎదురుచెప్పరు. ఆయన ఇచ్చే ఆజ్ఞల్ని (వినయంగా) పాటిస్తారు. వారి కళ్ళ ముందున్నదేమిటో, వారికి కనుమరుగై ఉన్నదేమిటో అంతా దేవునికి తెలుసు. దేవుడు ఎవరి విషయంలో సిఫారసు వినడానికి ఇష్టపడతాడో అలాంటి వ్యక్తులను గురించి తప్ప మరెవరి విషయంలోనూ వారు సిఫారసు చేయరు. వారసలు దేవుడంటే ఎంతో భయపడతారు. (26-28)

వారిలో ఎవరైనా "దేవుడే గాక నేను కూడా ఒక దేవుడ్ని" అనంటే అతనికి మేము నరకశిక్ష విధిస్తాము. మా దగ్గర దుర్మార్గులకు తగిన శాస్తి ఇదే. (29)

భూమ్యాకాశాలు కలసిఉన్నప్పుడు మేము వాటిని విడదీయడాన్ని వారు చూడలేదా?[3] అలాగే ప్రతిప్రాణిని మేము నీటితో సృజించిన విషయాన్ని వీరు గమనించలేదా? మరి వారు (మాయీ సృష్టి చాతుర్యాన్ని) ఎందుకు విశ్వసించరు?

భూమి దొర్లిపడకుండా ఉండేందుకు మేము దానిపై పర్వతాలను (మేకులుగా) పాతాము. ప్రజలు దారి తెలుసుకోవడానికి వీలుగా అందులో విశాలమైన మార్గాలు కూడా ఏర్పరిచాము. అంతేకాదు, ఆకాశాన్ని మేము సురక్షితమయిన కప్పుగా చేశాము. కాని వీరు మాత్రం ఆయన నిదర్శనాల వైపు దృష్టి సారించడమే లేదు. (30-32)

3. విశ్వనిర్మాణ ప్రారంభ దశ ఇక్కడ పేర్కొనబడింది. అప్పుడు విశ్వం పదార్థం (Mass) రూపంలో ఉండేది. (వివరాలకు 41:12 సూక్తి పాదసూచికలో మూడవ పేరా చూడండి.)



రేయింబవళ్ళను సృష్టించినవాడు దేవుడే. సూర్యచంద్ర నక్షత్రాలను కూడా ఆయనే సృజించాడు. అవన్నీ తమ తమ నిర్ణీత కక్ష్యల్లో తేలియాడుతున్నాయి. (33)

ముహమ్మద్ (స)! మేము నీకు పూర్వం కూడా ఏ మానవునికీ అమరత్వం ప్రసాదించలేదు. ఒకవేళ నీవు మరణిస్తే వీరు శాశ్వతంగా ఇక్కడే బ్రతికి ఉంటారా? ప్రతిపాణీ చావును చవిచూడవలసిందే. మేము మిమ్మల్ని మంచీ-చెడు స్థితులు కలిగించి పరీక్షిస్తున్నాం. చివరికి మీరంతా మా దగ్గరికే తిరిగిరావలసి ఉంది. (34,35)

సత్యతిరస్కారులు నీవైపు చూపిస్తూ "మీ దేవతలను విమర్శిస్తూ మాట్లాడుతున్న మనిషి ఇతనేనా?" అని హేళన చేస్తారు. కాని కరుణామయుని ప్రస్తావనను మాత్రం వారు ఖండిస్తారు. మానవుడు మహా తొందరపాటు జీవి. ఇప్పుడే నేను మీకు నా నిదర్శనాలు (శిక్ష రూపంలో) చూపిస్తాను, తొందరపడకండి. "నీ అభిప్రాయం నిజమైతే నీయీ బెదిరింపు ఎప్పుడు నిజమవుతుంది?" అని అడుగుతారు వారు. (36-38)

ఈ తిరస్కారులకు ఆరోజు గురించి వాస్తవం తెలిసివుంటే ఎంత బాగుండు! అప్పుడు వీరు తమ ముఖాలను, వీపులను నరకాగ్నిలో మాడిపోకుండా తప్పించుకో లేరు. వారికి ఎటునుండి కూడా ఎలాంటి సహాయం అందదు. (39)

ఆ మహోపద్రవం వారిపై హఠాత్తుగా విరుచుకు పడుతుంది. అది వారిని అమాంతం కబళించి వేస్తుంది. వారు దాన్ని ఏవిధంగానూ నిరోధించలేరు. (తప్పించుకోవడానికి) వారికి ఏమాత్రం అవకాశం కూడా లభించదు. నీకు పూర్వం వచ్చిన ప్రవక్తల్ని కూడా (ఆనాటి తిరస్కారులు) హేళనచేశారు. అయితేవారిని హేళనచేసినవారు అలా హేళనచేసిన దాని బారినే పడి నాశనమయ్యారు.(40,41)

ప్రవక్తా! రాత్రివేళో, పగటివేళో మిమ్మల్ని కరుణామయుని శిక్ష నుండి కాపాడే వాడెవడని వారినడుగు. కాని వారు తమప్రభువు హితోపదేశానికి విముఖులైపోతున్నారు. మాకు వ్యతిరేకంగా తమను ఆదుకోగల దైవాలేమైనా వారికున్నాయా? ఆ దైవాలు అసలు తమకుతామే సహాయం చేసుకోలేవు. వాటికి మాసహకారం లేదు. (42,43)

అసలు విషయం (అదికాదు.)- మేము వారికి, వారి తాత ముత్తాతలకు జీవితాంతం భోగభాగ్యాలు ప్రసాదిస్తూవచ్చాం. కాని (వారికి జ్ఞానోదయం కలగడంలేదు.) మేము భూమిని అనేక దిశలనుండి నరుక్కుంటూ వస్తున్న దృశ్యం[4] వారికి కన్పించడం లేదా? మరి వారు (మమ్మల్ని నిరాకరించి) ఆధిక్యత పొందగలరా? (44)

చెప్పు: "నేను దివ్యావిష్కృతి ఆధారంగా మిమ్మల్ని హెచ్చరిస్తున్నాన"ని. అయితే పిలిచేవాడు (రానున్న ప్రమాదం గురించి) ఎంత హెచ్చరించినా బధిరులకు ఆ హెచ్చరిక విన్పించదు. నీప్రభువు శిక్ష వారికి కాస్తంత అంటితే చాలు, "అయ్యయ్యో! మేమెంతటి దౌర్భాగ్యులం! నిజంగా మేము పాపాత్ములం" అని గగ్గోలుపెడ్తారు. (45,46)

4. 13:41 సూక్తి పాదసూచిక తర్వాత, ఆపదలు, ప్రకృతి వైపరీత్యాలు అని కూడా అర్థం.

ప్రళయదినాన మేము కచ్చితంగా తూచే త్రాసు ఏర్పాటుచేస్తాము. ఇక ఏ ఒక్కరికీ ఎలాంటి అన్యాయం జరగదు. ఎవరైనా సరే, ఆవగింజంత కూడా ఏదైనా చేసి ఉంటే, దాన్ని మేము ముందుకు తెస్తాము. లెక్క చూడటానికి మేమే చాలు. (47)

ఇంతకు పూర్వం మేము దైవభీతిపరుల శ్రేయస్సు కోసం గీటురాయిని, జ్యోతిని, జ్ఞాపికను మూసా, హారూన్‌లకు ప్రసాదించాం.[5] ఆ దైవభీతిపరులు కన్పించని తమ ప్రభువు పట్ల భయభక్తులు కలిగివుంటూ, ప్రళయం గురించి (అనుక్షణం) భయపడు తుండేవారు. ఇప్పుడీ శుభజ్ఞాపిక (ఖుర్ఆన్)ను (మీకోసం) అవతరింపజేశాము. మరి ఇప్పటికయినా మీరు దీన్ని విశ్వసిస్తారా లేదా? (48-50)

అంతకు పూర్వం మేము ఇబ్రాహీంకు విచక్షణాజ్ఞానం ప్రసాదించాము. అతడ్ని గురించి మాకు బాగా తెలుసు. అతను తన తండ్రిని, తనజాతి ప్రజల్ని ఉపదేశిస్తూ:-

"మీరంతగా అభిమానిస్తున్న ఈవిగ్రహాల సంగతేమిటీ?" అనడిగాడు. (51,52)

"మా తాతముత్తాతలు వీటిని పూజిస్తుండేవారు. అందువల్ల మేము కూడా వీటిని పూజిస్తున్నాం" అన్నారు వారు. (53)

"అయితే మీరు దారి తప్పారు; మీ తాతముత్తాతలు అంతకన్నా ఘోరంగా దారి తప్పారు" అన్నాడు ఇబ్రాహీం (54)

"నువ్వు మాముందు నీ అసలు భావాలు వ్యక్తపరుస్తున్నావా లేక పరిహాసమాడు తున్నావా?" అడిగారు వారు. (55)

"(పరిహాసం) కాదు, నిజంగానే (చెబుతున్నాను). భూమ్యాకాశాల ప్రభువే మీ ప్రభువు. ఆయనే వాటిని సృష్టించాడు. అందుకు నేను మీ ముందు సాక్ష్యమిస్తున్నాను. దైవసాక్షి! మీరు లేనప్పుడు నేను తప్పకుండా మీ విగ్రహాల సంగతేమిటో తేల్చు కుంటాను" అన్నాడతను. (56,57)

తరువాత అతను (అన్నట్లే వారు జాతరకు పోయారో లేదో గుడిలోకి ప్రవేశించి) ఆ విగ్రహాలను తునాతునకలుగా విరగ్గొట్టాడు. వాటిలో పెద్దవిగ్రహాన్ని మాత్రం వదలిపెట్టాడు, వారు (విచారించడానికి తనవైపు) మరలుతారన్న ఉద్దేశ్యంతో. (58)

జనం (జాతర నుంచి తిరిగొచ్చి చూసి) "మన దైవాలకు ఈదుస్థితి కలిగించింది ఎవరో, చూస్తే పరమదుర్మార్గుడిలా ఉన్నాడు" అన్నారు. "మేము ఇబ్రాహీం అనే యువకుడు వాటిని గురించి ప్రస్తావిస్తుంటే విన్నాం" అన్నారు (కొందరు). (59.60)

"అయితే అతడ్ని పట్టి తీసుకురండి జనం ముందుకు, అందరూ (అతని సంగతి) చూస్తారు" అన్నారు వారు. (ఇబ్రాహీం వచ్చిన తరువాత) "ఇబ్రాహీం! నువ్వేనా మా దేవతల పట్ల ఇలా ప్రవర్తించింది?" అని అడిగారు వారు. (61.62)

---

5. ఈమూడు పదాలు తౌరాత్ గ్రంథాన్ని వర్ణించడానికి వాడబడ్డాయి. అంటే ఈ గ్రంథం గీటురాయిలా మంచీచెడులను, సత్యాసత్యాలను, ధర్మాధర్మాలను వేరుచేసి, జ్యోతిలా కాంతినిచ్చి రుజుమార్గం చూపుతుంది. జ్ఞాపికలా మానవులకు వారు మరచిపోయిన పాఠం గుర్తు చేస్తుంది.



"అసలు ఇదంతా వాటి నాయకుడే చేసి ఉంటాడు, అడిగి చూడండి మాట్లడితే" అన్నాడు ఇబ్రాహీం. (63)

ఈ మాట వినగానే వారు తమ అంతరాత్మల వైపు మరలి "నిజంగా మనం చాలా దుర్మార్గులం" అని అనుకున్నారు స్వగతంలో. (64)

అయితే ఆ తరువాత వారి బుద్ధి వక్రీకరించింది. అందువల్ల "ఇవి మాట్లాడలేవని నీకు తెలుసుకదా?" అన్నారు వారు. (65)

"మరి మీరు (నిజ)దేవుడ్ని వదలి మీకెలాంటి లాభంగాని, నష్టంగాని కలిగించలేని ఈ మిథ్యాదైవాలను ఎందుకు పూజిస్తున్నారు? ఛీ! దేవుడ్ని వదలి మీరు పూజిస్తున్న మీ మిథ్యాదైవాలు పాడుగాను!! మీకు కాస్తయినా బుద్ధీ, జ్ఞానం లేదా?" అన్నాడు ఇబ్రాహీం (వారిని అసహ్యించుకుంటూ). (66,67)

"మీరేదైనా చేయాలనుకుంటే ఇతడ్ని కాల్చివేయండి, మీ దేవతలను కాపాడు కోండి" అన్నారు వారు. (68)

(చివరికి ఆ దుర్మార్గులు ఇబ్రాహీంని అగ్ని గుండంలోకి విసరివేశారు. అప్పుడు) మేము "అగ్నీ! ఇబ్రాహీం కోసం శాంతించు, చల్లబడిపో" అని ఆదేశించాము. (69)

వారు ఇబ్రాహీంకు కీడు చేయజూశారు. అయితే మేము వారి దుష్టయత్నాన్ని తిప్పి కొట్టాము. (70)

(ఇలా) మేము ఇబ్రాహీంని, లూత్‌ని కాపాడి ప్రపంచవాసుల కోసం శ్రేయోశుభాలు ఉంచిన భూభాగం వైపు తీసికెళ్ళాం. మేమతనికి (ఓ కొడుకు) ఇస్‌హాఖ్‌ని, ఆపై (ఓ మనవడు) యాఖూబ్‌ని ప్రసాదించాం. వారిలో ప్రతి ఒక్కడ్నీ సత్పురుషుడిగా తీర్చిదిద్దాము. వారిని మేము మాఆజ్ఞ ప్రకారం (ప్రజలకు) మార్గదర్శకత్వం వహించే నాయకులుగా చేశాం. సత్కార్యాలు చేస్తుండాలని, నమాజు (వ్యవస్థ) నెలకొల్పాలని, (పేదల ఆర్థిక హక్కు) జకాత్ చెల్లించాలని వారికి దివ్యావిష్కృతి ద్వారా ఉపదేశించాం. వారు మా (ప్రియ)భక్తులు. (71-73)

లూత్‌కు మేము వివేకాన్ని, (దౌత్య) జ్ఞానాన్ని ప్రసాదించాము. మేమతడ్ని అశ్లీల కార్యాలు చేస్తుండిన ప్రజల ఊరు నుంచి తప్పించి (వేరే చోటికి) తరలించాము. అసలా జాతి పరమ దుర్మార్గపు జాతి. లూత్‌కు మేము మా కారుణ్యఛాయలో చోటిచ్చాము. అతను సజ్జనులలోని వాడు. (74,75)

నూహ్ వృత్తాంతం (కూడా గుర్తుకు తెచ్చుకో): వారందరికీ పూర్వం అతను మమ్మల్ని వేడుకున్నాడు. మేమతని ప్రార్థన ఆలకించి అతడ్ని, అతని కుటుంబాన్ని ఒక పెద్ద ఆపద నుండి రక్షించాము. మా సూక్తులు నిరాకరించిన జాతికి వ్యతిరేకంగా అతనికి సహాయం చేశాము. ఆ జాతి ప్రజలు పరమ దుర్మార్గులు. అందువల్ల మేము వారందర్నీ (నడి సముద్రంలో) ముంచివేశాము. (76,77)

దావూద్, సులైమాన్‌లను గురించి (విను): వారిద్దరు ఒక పొలానికి సంబంధించిన వ్యవహారం గురించి తీర్పు చేయసాగారు. రాత్రివేళ ఆ పొలంలో ఇతరుల మేకలు పడి మేశాయి. మేము వారి న్యాయస్థానాన్ని చూస్తున్నాము. మేము వారిద్దరికీ వివేకం, (దౌత్య) జ్ఞానం ప్రసాదించాము. అయినప్పటికీ మేమప్పుడు సరయిన తీర్పు గురించి సులైమాన్‌కు మాత్రమే అవగాహన కలిగించాము.[6]

మేము దావూద్ కోసం పక్షులు, పర్వతాలను అదుపులో ఉంచాం. అవి అతనితో పాటు దైవస్తుతి చేస్తుండేవి. ఈ పని నిర్వహించేది మేమే. మీ ప్రయోజనం కోసం మేమతనికి యుద్ధకవచాలు తయారుచేసే విధానం కూడా నేర్పాము. వాటితో మీరు ఒకరి దాడి నుండి మరొకరు కాపాడుకుంటారు. మరి మీరు (ఇప్పుడైనా) కృతజ్ఞత చూపుతారా? (78-80)

సులైమాన్ కోసం మేము తీవ్రమైన గాలులను అదుపులో ఉంచాం. అవి అతని ఆదేశంతో మేము శుభాలు ఉంచిన భూభాగంలో వీస్తుండేవి. మాకు ప్రతి విషయమూ తెలుసు. మేము అనేక భూతాలను కూడా అతని అదుపాజ్ఞలలో ఉంచాం. అవి అతని కోసం (రత్నాలు వెలికి తీయడానికి సముద్రంలో) మునకలు వేస్తుండేవి. అదేకాకుండా అవి వేరే పనులు కూడా అనేకం చేస్తుండేవి. వాటన్నిటికీ మేమే పర్యవేక్షకులం. (81,82)

అయ్యూబ్ గాథ కూడా గుర్తుకుతెచ్చుకో. అతను (వ్యాధిగ్రస్త స్థితిలో ఉండి) "(ప్రభూ!) నేను జబ్బుపడ్డాను. నీవు అందరికంటే గొప్ప దయామయుడవు" అని ఎలుగెత్తి మొరపెట్టుకున్నాడు. మేమతని మొరాలకించి అతని బాధ దూరం చేశాము. అతనికి మేము అతని భార్యాపిల్లలనే కాదు, మా ప్రత్యేక అనుగ్రహంతో ఇంకా అనేక భాగ్యాలు కూడా ప్రసా దించాం. దైవభక్తులకు ఇదొక (మంచి) గుణపాఠం. (83,84)

ఇక ఇస్మాయీల్, ఇద్రీస్, జుల్‌కిఫ్ల్‌లను గురించి- వీరంతా ఎంతో సహనశీలురు. వీరికి మేము మా కారుణ్యఛాయలో చోటిచ్చాం. వీరంతా సజ్జనులు. (85,86)

మత్స్యబాధితుడి సంగతి జ్ఞాపకంతెచ్చుకో. అతను కోపం వచ్చి వెళ్ళిపోయాడు. మేము తనను నిలదీయబోమని భావించాడు. చివరికి అతను (చేప కడుపులో చిక్కుకొని) గాఢాంధకారంలో "నీవు తప్ప మరో ఆరాధ్యుడు లేడు. నీవు పరిశుద్ధుడవు. నేను

6. ఈ సూక్తిలో న్యాయవ్యవస్థకు సంబంధించిన రెండు విషయాలున్నాయి. వాటిని దైవ ప్రవక్త (సల్లం) ఈవిధంగా తెలియజేశారు:

"(న్యాయా)అధికారి తన (జ్ఞాన) పరిధి మేరకు తీర్పుచేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేసినప్పుడు సరైన తీర్పు వెలువడటం జరిగితే, అతనికి రెట్టింపు పుణ్యఫలం లభిస్తుంది. ఒకవేళ (ఆ కృషిలో) తప్పుడు తీర్పు వెలువడితే అప్పుడతనికి ఏకపుణ్య ఫలం లభిస్తుంది." (బుఖారి)

న్యాయాధికారులు మూడు విధాలుగా ఉంటారు. వారిలో ఒకరు స్వర్గనివాసి, మిగిలిన ఇద్దరు నరకవాసులవుతారు. న్యాయాన్ని గుర్తించి దానికి అనుగుణంగా తీర్పిచ్చేవాడు స్వర్గనివాసి అవుతాడు. న్యాయాన్ని గుర్తించి కూడా దానికి వ్యతిరేకంగా తీర్పిచ్చేవాడు నరకవాసి అవుతాడు. (ఇబ్నెమాజ, అబూదావూద్)



నిజంగా దుర్మార్గుణ్ణయ్యాను"అని మొరపెట్టుకున్నాడు. మేమతని మొరాలకించి అతడ్ని బాధ, పరితాపాల నుండి విముక్తి కలిగించాం.[7] ఇలాగే మేము విశ్వాసుల్ని రక్షిస్తాం.

జకరియ్యా వృత్తాంతం కూడా- అతను తన ప్రభువు సన్నిధిలో "ప్రభూ! నన్ను (సంతానం లేకుండా) ఒంటరివాడ్ని చేయకు. నీవే అందరికంటే మంచి వారసుడివి" అని ప్రార్థించాడు. మేమతని ప్రార్థన ఆలకించి అతనికి యహ్యాను అనుగ్రహించాము. అతని కోసం అతని భార్యను (గర్భధారణకై) తీర్చిదిద్దాము. వీరంతా అమితోత్సాహంతో సత్కార్యాలు చేస్తుండేవారు. మమ్మల్ని ఎంతో ఆశతో, భయభక్తులతో ప్రార్థించేవారు. మా ముందు ఎంతో అణుకువతో ఉండేవారు. (87-90)

7. మత్స్యబాధితుడు అంటే యూనుస్ ప్రవక్త (అలైహి). హజ్రత్ యూనుస్ (అలైహి) దైవ ధర్మం గురించి ఎంత ఉపదేశించినా ఆయన జాతిప్రజలు దాన్ని విశ్వసించలేదు. చివరికి ఆయన విసుగెత్తి "ఇక మీపై దైవశిక్ష విరుచుకుపడుతుంది" అని వారిని శపించి, దేవుని అనుమతి రాక ముందే ఆ ప్రాంతం వదలి వెళ్ళిపోయారు. దారిలో ఒక పడవ ఎక్కారు. కాని ఆ పడవ సముద్రంలో కొంచెం దూరం పోగానే బరువెక్కువయి మునిగిపోయే సూచనలు కన్పించాయి. దాంతో ఒకరిద్దరు ప్రయాణీకుల్ని తొలగించడం తప్ప నావికుడికి గత్యంతరం లేకపోయింది. అప్పుడా నావికుడు తొలిగించవలసిన ప్రయాణీకుని విషయమయి చీటీ వేస్తే అందులో హజ్రత్ యూనుస్ (అలైహి) పేరు వచ్చింది. అప్పుడు యూనుస్ (అలైహి) విధిలేక సముద్రంలో దూకారు.

అలా యూనుస్ ప్రవక్త (అలైహి) సముద్రంలో దూకగానే ఓ పెద్ద చేప ఆయన్ని మింగి వేసింది. చేప కడుపులోని చీకటి కుహరంలో ఆయన పశ్చాత్తాపపడుతూ దేవుడ్ని మొరపెట్టుకున్నారు. అప్పుడు దేవుడు ఆయన మొరాలకించి ఆయన్ని చేప కడుపులో నుంచి బయటికి తీశాడు. అంటే చేప ఆయన్ని బయటికి కక్కి తీరంమీద పడవేసింది. (ఇతర వివరాలకు 37వ అధ్యాయంలో 139-148 సూక్తులు, వాటి పాదసూచిక చూడండి.)

చేప కడుపులోకి పోయివచ్చినా యూనుస్ (అలైహి) సజీవంగానే ఉండటం పట్ల కొందరు ఆశ్చర్యపడవచ్చు. కాని ఇందులో ఆశ్చర్యపడాల్సిన విషయమేమీ లేదు. ఇలాంటి సంఘటనలు అప్పుడప్పుడు జరుగుతూనే ఉంటాయి. ఉర్దూ డైజస్ట్ 1964 ఫిబ్రవరి సంచికలో ఇలాంటిదే ఒక సంఘటన గురించి ప్రస్తావన వచ్చింది.

ఆ పత్రిక ప్రకారం 1891 ఆగస్టులో స్టార్ ఆఫ్ దిఈస్ట్ అనే నౌకలో కొందరు జాలరులు వేల్ చేపల్ని పట్టడానికి సముద్రం మధ్యకు వెళ్ళారు. అక్కడ ఇరలు అడుగుల పొడవు, అయిద డుగుల వెడల్పు, వంద టన్నుల బరువుగల ఒక పెద్ద చేపతో ఢీకొనవలసి వచ్చింది. ఈ ఘర్షణలో చేప బాగా గాయపడినప్పటికీ అది జేమ్స్ బార్టలే అనే ఒక జాలరిని మింగి వేసింది. మరుసటి రోజు అతని మిత్రులకు ఆ చేప చచ్చి తేలుతూ కన్పించింది. వారా చేపను అతికష్టం మీద నౌక మీద ఎక్కించి తీసికెళ్ళారు. తర్వాత దాని పొట్ట కోసి చూస్తే అందులో జేమ్స్ సజీవంగా కన్పించాడు. అతనా చేప కడుపులో అరవయి గంటల పాటు ఉండిపోయాడు. అయినా అతను చనిపోలేదు.

ఇది సాధారణ పరిస్థితుల్లో సహజసిద్ధంగా సాధ్యమయినప్పుడు, అసాధారణ పరిస్థితుల్లో దేవుడు తన ప్రవక్తను మహిమాన్వితంగా చేప కడుపు నుంచి సజీవంగా బయటికి తీయలేడా? తప్పకుండా తీయగలడు. ఆయన సర్వ శక్తిమంతుడు. (తఫీముల్ ఖుర్ఆన్ నుండి)

శీలం కాపాడుకున్న స్త్రీ వృత్తాంతం కూడా. మేమామె (గర్భం)లోకి మా ఆత్మను ఊదాము.[8] ఆమెను, ఆమె కుమారుడ్ని యావత్ ప్రపంచానికి నిదర్శనంగా చేశాం. (91)

మీ సమాజం(ధర్మం) నిజానికి ఒకే సమాజం. నేను మీ ప్రభువును. కనుక మీరు నన్నే ఆరాధించండి. కాని ఆ ప్రజలు పరస్పరం విభేదించుకొని తమ ధర్మాన్ని చీలికలు పేలికలు చేసుకున్నారు. అయితే చివరికి అందరూ మాదగ్గరికే రావలసిఉంది. (92,93)

ఆ తరువాత ఎవరైనా విశ్వాసిగా ఉండి సత్కార్యాలు చేసివుంటే, అలాంటి వ్యక్తి ఆచరణకు విలువ నివ్వకపోవడమంటూ జరగదు. దాన్ని మేము నమోదుచేస్తున్నాం.

మేము ఏఊరిని నాశనంచేసినా ఆ ఊరిప్రజలు తిరిగి కోలుకోవడం అనేదే జరగదు. చివరికి యాజూజ్, మాజూజ్ (జాతు)లను వదిలేయడం జరుగుతుంది. వారు ప్రతి గుట్టా, మిట్టా నుండి వెలువడి (ఇతర జాతులపై) విరుచుకుపడతారు.[9] (94-96)

(ఆ తరువాత) అసలు వాగ్దానం నెరవేరే సమయం త్వరలోనే ఆసన్నమవుతుంది. అప్పుడు హఠాత్తుగా సత్యతిరస్కారులకు (భీతావహంతో) నిలువుగ్రుడ్లు పడతాయి. వారు (తమను తాము నిందించుకుంటూ) "అయ్యయ్యో! మా పాడుగాను, మేమెంత ఏమరు పాటులో పడిఉన్నాం. (కాదు) మేమసలు పాపాత్ములం" అనంటారు. (97)

---

8. ఇక్కడ "మా ఆత్మ" అంటే, దేవుడ్ని ఓ భౌతిక రూపంతో పోల్చి జీవరాసులకు మాదిరిగా ఆయనకూ ఒక ఆత్మ ఉందని, ఆ ఆత్మనే మా ఆత్మ అని చెప్పడం జరిగిందని అర్థం ఎంతమాత్రం కాదు. యావత్తు జీవరాసుల ఆత్మలు దేవుని సొత్తే, ఆయన సృష్టే. యావత్తు సృష్టి దేవుని సంపదే. ఆయన తన "ఆత్మ సంపద" నుండి ఒక ఆత్మను తీసి మర్యం (అలైహి) గర్భంలోకి పంపాడు. దాన్నే ఇక్కడ 'మా ఆత్మ' అని చెప్పబడింది. యావత్తు ప్రపంచ స్త్రీల గర్భాలలోకి ప్రవేశపెట్టబడే ఆత్మలన్నీ దేవుని ఆత్మలే. మొత్తం ఆత్మలకు ఆయనే యజమాని. (4:171 పాదసూచిక)

మానవుడు తల్లి గర్భంలో ప్రాణం పోసుకునే విషయం గురించి మరోచోట ఖుర్ఆన్ ప్రస్తావిస్తూ "ఆపై దేవుడు అతడ్ని పరిపూర్ణ మానవుడిగా రూపొందించి అతని (శరీరం)లో తన ఆత్మను ఊదాడు" (32:9) అని పేర్కొన్నది. దీన్నిబట్టి ప్రతి మానవుని దేహంలో ఉన్న ఆత్మ దేవుని ఆత్మేనని తెలుస్తోంది. (ఇతర వివరాలకు, 32:9 సూక్తి, దాని పాదసూచిక చూడండి.)

9. ప్రళయ సూచనల్లో ఇది కూడా ఒకటి. ప్రళయం సంభవించడానికి కొద్దికాలం ముందు యాజూజ్, మాజూజ్ అనే ఆటవికి జాతులు బోనుల్లో నుంచి వదలిన క్రూరమృగాల్లో ఒక్కసారిగా బయలుదేరి ప్రపంచంలోని వివిధ జాతుల మీద విరుచుకుపడతాయి. (18:97-99 సూక్తులు కూడా చూడండి.) ప్రళయ సూచనలను గురించి దైవప్రవక్త (సల్లం) ఇలా తెలిపారు:

మీరు ముందుగా కొన్ని సూచనలు చూడనంతవరకు ప్రళయం సంభవించదు. అవి - పొగ, దజ్జాల్, (విశేష) భూచరం, పడమర నుంచి సూర్యోదయం, మర్యం కుమారుడు ఈసా (అలైహి) అవతరణ, యాజూజ్-మాజూజ్‌ల దండయాత్రలు, నేల క్రుంగిపోయే మూడు పెద్ద సంఘటనలు- ఒకటి తూర్పున, రెండు పడమరన, మూడు అరేబియా ద్వీపంలో. ఆ తరువాత చివర్లో యమన్ నుండి భయంకరమైన అగ్ని(మంట) బయలుదేరి ప్రజలను హష్ర్ మైదానికి తోలుకెళ్తుంది." (ముస్లిం) దీంతోపాటు 44:11 సూక్తి పాదసూచిక కూడా చూడండి.)



మీరూ, మీమిధ్యాదైవాలూ నరకాగ్నికి సమిధలైపోవడం ఖాయం. నరకానికే మీ రంతా పోవలసి ఉంటుంది.[10] అవి నిజంగా దైవాలైతే నరకానికి పోవు. అప్పుడు మీ రంతా అక్కడే శాశ్వతంగా పడిఉండాలి. వారక్కడ తీవ్రమైన యాతనలతో హాహాకారాలు చేస్తుంటారు. రొదలు, రోదనల మధ్య వారికి ఏదీ సరిగా విన్పించదు. (98-100)

ఇక మా నుండి ఎవరికి మేలు జరుగుతుందని ముందే నిర్ణయమైపోయిందో వారు తప్పకుండా నరకానికి దూరంగా ఉంటారు. దాని (భీకర)ధ్వని కాస్తయినా వారికి విన్పించదు. వారు కలకాలం తమకిష్టమైన (స్వర్గ)భాగ్యాలలో ఓలలాడుతుంటారు. తీవ్రమైన (ప్రళయ)బీభత్స సమయంలోను వారు ఏమాత్రం ఆందోళన చెందరు. దైవదూతలు వారిని స్వాగతిస్తూ "మీకు వాగ్దానం చేయబడిన (శుభ)దినం ఇదే" అనంటారు. (101-103)

మేము ఆకాశాన్ని లేఖచుట్టలా చుట్టబెట్టే రోజు (ఇదంతా జరుగుతుంది). మొదట్లో మేము సృష్టి నిర్మాణాన్ని ఎలా ప్రారంభించామో అదేవిధంగా దాన్ని తిరిగి కొత్తగా సృష్టిస్తాము. ఇదొక వాగ్దానం. దీన్ని నెరవేర్చవలసిన బాధ్యత మామీద ఉంది. మేమీ పని తప్పకుండా చేస్తాము. జబ్బూర్‌లో మేము హితోపదేశం చేసిన తర్వాత, మా పుణ్యదాసులు భూమికి వారసులవుతారని వ్రాశాము. భక్తిపరులకు ఇందులో గొప్ప సందేశం (గుణపాఠం) ఉంది. (104-106)

ముహమ్మద్ (సల్లం)! మేము నిన్ను యావత్తు ప్రపంచవాసుల పాలిట (దైవ) కారుణ్యంగా చేసి పంపాము. (అంటే మేము నిన్ను యావత్మానవాళి కోసం కారుణ్య మూర్తిగా ప్రభవింపజేశాము.) (107)

వారికిలా చెప్పు: "నా దగ్గరకు వస్తున్న దివ్యావిష్కృతి ప్రకారం మీ దేవుడు ఒక్కడే. మరి మీరు (ఆ దేవుని ముందు) విధేయత ప్రకటిస్తారా?." వారు గనక (నీ మాటలు అంగీకరించకుండా) ముఖం తిప్పుకుంటే వారికీ విధంగా చెప్పెయ్యి:

"నేను మిమ్మల్ని ఎలాంటి అరమరికలు లేకుండా స్పష్టంగా, బాహాటంగా హెచ్చరించాను. ఇప్పుడిక మీకు వాగ్దానం చేయబడుతున్న విషయం (అంటే దైవశిక్ష)

---

10. అబ్దుల్లా బిన్ జబారా అనే అవిశ్వాసి ఈ సూక్తిని విమర్శిస్తూ "ఈవిధంగా మా దేవత (విగ్రహా)లే గాకుండా మసీహ్ (ఏసుక్రీస్తు), ఉజైర్, దైవదూతలు కూడా నరకానికి పోతారన్న మాట!" అన్నాడు. దానికి దైవప్రవక్త (సల్లం) సమాధానమిస్తూ "ఆ...దేవునికి బదులు తనను ఆరాధించాలని కోరుకునే ప్రతి వ్యక్తీ తనను ఆరాధించినవారిలో చేరిపోతాడు" అన్నారు.

దీన్నిబట్టి ప్రపంచంలో తమకు తాము దేవుళ్ళమని, భగవత్ స్వరూపులమని, అవతార పురుషులమని, అతీంద్రియ శక్తులు గలవారమని చెప్పుకుంటూ ప్రజల నుండి పూజలు అందుకునే బూటకపు బాబాలు, దొంగ స్వాములు కూడా నరకానికి పోతారని తెలుస్తోంది. అయితే స్వార్థం కోసం మహనీయుల విగ్రహాలను, వారి స్మారక చిహ్నాలను పూజించేవారు నరకానికి పోతారుగాని, వారి పూజసంగతే తెలియని ఆ మహనీయులు నరకానికి పోరు. వారి పూజా పురస్కారాలలో ఆ మహనీయుల పాత్ర, ప్రేరణలు ఏమాత్రం లేవుగనక వారు నరకానికి పోయే ప్రసక్తే లేదు.

సమీపంలో ఉందో దూరాన ఉందో నాకైతే తెలియదు. మీరు బహిరంగంగా మాట్లాడుతున్న విషయాలు, రహస్యంగా ఉంచుతున్న విషయాలు అన్నీ దేవునికి తెలుసు. నేను మాత్రం ఇది (అంటే శిక్షలో జాప్యం) మీకొక పరీక్షని భావిస్తున్నాను. ఒక నిర్ణీత దినం వరకు (ప్రాపంచిక) రుచులు ఆస్వాదించడానికే ఇలా మిమ్మల్ని ఉపేక్షిస్తూ అవకాశం ఇవ్వబడుతోంది." (108-111)

(చివరికి మా) ప్రవక్త ఇలా అన్నాడు: "ప్రభూ! సత్యానుసారం తీర్పు చెయ్యి... ప్రజలారా! మా ప్రభువు ఎంతో దయామయుడు. మీరు కల్పిత విషయాలకు (పన్నాగాలకు) వ్యతిరేకంగా ఆయనే మాకు సహాయం చేసేవాడు." (112) ✪

**అవతరణ: మదీనా**

# 22. కాబాయాత్ర (హజ్)

**సూక్తులు: 78**

ఈ అధ్యాయాన్ని "హజ్" అంటారు. ఇందులో కొంత మక్కా రోజుల్లో, మిగిలింది మదీనా ప్రారంభ రోజుల్లో అవతరించినట్లు తెలుస్తోంది. మొదటి భాగంలో మక్కా అవిశ్వాసుల సత్యవ్యతిరేక వైఖరి గురించి ఉంది. రెండవ భాగంలో ఇస్లాం స్వీకరించి ఆ మార్గంలో ఎదురయ్యే కష్టాలను కాస్తయినా సహించలేని విశ్వాసుల్ని మందలించడంతో పాటు, త్యాగధనులైన విశ్వాసులకు కొన్ని ఆదేశాలు, హితవులు ఇవ్వబడ్డాయి.

**కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం**

మానవులారా! మీ ప్రభువు ఆగ్రహానికి దూరంగా ఉండండి. నిస్సందేహంగా ప్రళయ భూకంపం చాలా తీవ్రమైన (భయంకర) విషయం. (1)

ఆ రోజు పరిస్థితి చూడు... పాలుపట్టే ప్రతి స్త్రీ తన చంటిబిడ్డను సయితం మరచి పోతుంది. అలాగే ప్రతి గర్భిణికీ గర్భస్రావం అవుతుంది. ప్రజలు మైకంలో లేకపోయినా మైకంలో ఉన్నట్లు కన్పిస్తారు. నిస్సందేహంగా దైవశిక్ష చాలా కఠినంగా ఉంటుంది. (2)

కొందరు జ్ఞానం లేకుండానే దేవుని విషయంలో వాదనకు దిగుతారు. వారు తలబిరుసెక్కిన ప్రతి షైతాన్‌ని అనుసరిస్తారు. అసలు వాడి తలరాతలో తనతో స్నేహంచేసిన ప్రతి మనిషినీ వాడు మార్గభ్రష్టుడిగా చేసి, నరకందారి చూపిగాని వదలిపెట్టడని రాసిఉంది. (3,4)

మానవులారా! మరణానంతర జీవితం గురించి మీకేమైనా అనుమానం ఉంటే ఒక విషయం ఆలోచించండి... మేము (మొదట) మిమ్మల్ని మట్టితో సృజించాము. తరువాత వీర్యబిందువు ద్వారా పుట్టించాము. ఆ తరువాత పిండం రూపంలో, ఆపై మాంసంతో. దాని రూపం అందంగానూ ఉంటుంది, అందవిహీనంగానూ ఉంటుంది. మీకు యదార్థం స్పష్టం కావడానికే ఇదంతా (తెలుపుతున్నాము).

మేము తలచినదాన్ని గర్భాశయంలో ఒక నిర్ణీతకాలం వరకు ఆపి ఉంచుతాము. తరువాత మిమ్మల్ని ఒక శిశువు రూపంలో బయటికి తీస్తాము.[1] (ఆ తరువాత) మీరు

1. వివరాలకు 23:14 సూక్తి, దాని పాదసూచిక చూడండి.



పూర్తిగా యుక్తవయస్సుకు చేరుకోవడానికి (మిమ్మల్ని పోషిస్తున్నాము). అయితే మీలో కొందరిని ముందుగానే వెనక్కి పిలిపించుకుంటున్నాము. మరికొందరిని అన్నీ తెలిసిన తరువాత ఏమీ తెలియనంత సుదీర్ఘ వయస్సుకు చేర్చుతున్నాము.

నీవు భూమి పరిస్థితి చూస్తూనే ఉన్నావు. అది ఎండిపోయి బంజరు నేలగా మారుతుంది. తర్వాత మేము దానిపై వర్షం కురిపించగానే అది సస్యశ్యామలమయి ఉబ్బిపోతుంది. తర్వాత రమణీయ దృశ్యంతో రకరకాల చెట్లు, చేమల్ని మొలకెత్తిస్తుంది. (5)

వీటన్నిటికి మూలకారణం దేవుడు మాత్రమే సత్యం. ఆయనే మృతులను తిరిగి బ్రతికించేవాడు. ఆయన ప్రతి పనీ చేయగల సమర్థుడు, సర్వశక్తిమంతుడు. కనుక ప్రళయ ఘడియ తప్పకుండా వస్తుంది. అందులో ఎలాంటి సందేహం లేదు. (చచ్చి) సమాధుల్లోకి పోయిన వారందర్నీ దేవుడు తప్పకుండా (బ్రతికించి) లేపుతాడు. (6,7)

మరికొందరున్నారు. వారు ఎలాంటి జ్ఞానం, మార్గదర్శకత్వం, (జ్ఞాన)కాంతి ప్రసాదించే గ్రంథం ఏమీ లేకుండానే ప్రజల్ని పెడదారి పట్టించడానికి దేవుని విషయంలో గుండెలు విరుచుకొని మరీ వాదిస్తుంటారు. అలాంటి వాడికి ప్రపంచంలో అవమానం, అప్రతిష్ఠలే మిగుల్తాయి. ప్రళయదినాన మేమతనికి నరకాగ్ని యాతనలు చవిచూపిస్తాం.

"ఇదే నీకోసం, నీచేజేతులా సంపాదించి పంపుకున్నదాని ఫలితం. అంతేగాని దేవుడు తన దాసులకు ఎలాంటి అన్యాయం చేయడు"(అని అతనికి చెప్పబడుతుంది).

ప్రజల్లో మరికొందరున్నారు. వారు (గోడమీది పిల్లిలా) ఒడ్డుమీద నిల్చొని దేవుడ్ని ఆరాధిస్తారు. ఏదైనా లాభం కన్పిస్తే తృప్తిగా ఉంటారు. కష్టం వచ్చిపడితే (ఇస్లాం నుండి) వెనక్కి మరలిపోతారు. ఈ విధంగా వారు (రెంటికి చెడ్డ రేవడిలా) ఇటు ప్రపంచాన్నీ కోల్పోతారు, అటు పరలోకాన్నీ కోల్పోతారు. ఇదే అసలైన నష్టమంటే. ఆ తరువాత వారు (నిజ) దేవుడ్ని వదలి తమకు ఎలాంటి లాభంగాని, నష్టంగాని చేకూర్చలేని మిథ్యాదైవాలను ప్రార్థిస్తారు. ఇదే మార్గభ్రష్టత్వానికి పరాకాష్ఠ. (8-12)

వారు లాభంకన్నా ఎక్కువ నష్టం కలిగించే వాటిని వేడుకుంటున్నారు. అతని సంరక్షకుడు పరమ చెడ్డవాడు; అతని సహచరుడు కూడా పరమ చెడ్డవాడే. (13)

(దీనికి భిన్నంగా) సత్యాన్ని (మనస్ఫూర్తిగా) విశ్వసించి సదాచార సంపన్నులైన వారిని దేవుడు తప్పకుండా సెలయేరులు ప్రవహించే స్వర్గవనాలలో ప్రవేశింపజేస్తాడు. దేవుడు తానుతలచిన పని చేసి తీరుతాడు. (14)

తనకు ప్రపంచంలోగాని, పరలోకంలోగాని దేవుడు ఎలాంటి సహాయం చేయడని భావిస్తున్నవాడు ఒక త్రాటి సహాయంతో ఆకాశానికి ఎక్కి రంధ్రం వేయాలి. ఆ తరువాత తనకు కంటకప్రాయమైన విషయాన్ని తన శక్తియుక్తులు నిరోధించ గలుగుతాయేమో చూసుకోవాలి... ఇలాంటి స్పష్టమైన విషయాలతో మేమీ ఖుర్‌ఆన్‌ని అవతరింపజేశాము. దేవుడు తాను తలచిన వ్యక్తికి మార్గం చూపుతాడు. (15,16)

సత్యాన్ని విశ్వసించినవారు, యూదులైనవారు, సాబియీలు (బాప్టిస్టులు), క్రైస్తవులు, మజూసీలు (అగ్ని పూజారులు), బహుదైవారాధకులు- వీరందరి గురించి దేవుడు ప్రళయ దినాన తీర్పుచేస్తాడు. ప్రతి వస్తువూ, ప్రతి విషయమూ దేవుని దృష్టిపథంలో ఉంది. (17)

భూమ్యాకాశాల్లో ఉన్న సమస్త సృష్టిరాసులు దేవుని ముందు సాష్టాంగపడుతున్న విషయం నీవు గమనించలేదా? సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, పర్వతాలు, వృక్షాలు, జంతువులు, అనేకమంది మానవులు, (దైవ) శిక్షకు అర్హులైపోయిన చాలామంది మానవులు కూడా (సాష్టాంగపడుతున్నారు).[2] దేవుడు ఒకవ్యక్తిని నీచుడిగా, క్షుద్రుడిగా చేయదలచుకుంటే, ఇక అతడ్ని ఎవరూ గౌరవించరు. దేవుడు తాను తలచిన పని తప్పకుండా చేస్తాడు. (18)

ఈ రెండు వర్గాల (విశ్వాసులు, అవిశ్వాసుల) మధ్య వారి ప్రభువు విషయంలో జగడం ఏర్పడింది. వారిలో సత్యాన్ని తిరస్కరించినవారి కోసం అగ్నివస్త్రాలు తయారు చేయబడ్డాయి. వారి తలలపై సలసల కాగే నీటిని కుమ్మరించడం జరుగుతుంది. దానివల్ల వారి చర్మాలేకాదు, వారి పొట్టలోని పేగులు సైతం కాలి కరిగిపోతాయి. అంతే కాదు, వారిని చితక బాదడానికి ఇనుపగదలు కూడా ఉంటాయి. వారా బాధ భరించ లేక నరకం నుండి పారిపోవడానికి ప్రయత్నించినప్పుడల్లా "దహన యాతనలు చవి చూడండి" అంటూ దైవదూతలు వారిని తిరిగి నరకంలోకి త్రోసివేస్తారు. (19-22)

(రెండోవర్గం) విశ్వసించి సత్కార్యాలు చేసినవారిని దేవుడు సెలయేరులు ప్రవ హించే స్వర్గవనాలలో ప్రవేశింపజేస్తాడు. వారక్కడ స్వర్ణకంకణాలు, మణిమాణిక్యాలతో అలంకరించబడతారు. పట్టువస్త్రాలు ధరిస్తారు. వారికి ఇహలోకంలో శిష్టవచనం స్వీకరించే సద్బుద్ధి ప్రసాదించబడింది. వారికి వెలుగుబాట చూపబడింది. (23,24)

సత్యతిరస్కారులు (నేడు ప్రజల్ని) దైవమార్గంలోకి రానివ్వకుండా నిరోధిస్తున్నారు. మేము ప్రజలందరి కోసం నిర్మించిన ప్రతిష్ఠాలయాన్ని సందర్శించనీయకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారు. ప్రతిష్ఠాలయంపై స్థానికులేగాక, బయటనుండి వచ్చేవారికి కూడా సమాన హక్కులున్నాయి. అలాంటి దేవాలయంలో ఎవరయినా సరే నీతిమార్గం

---

2. యావత్తు సృష్టిరాసుల్లో దేవుడు బుద్ధిజీవులైన మానవులకు మాత్రమే మంచీచెడు, ధర్మాధర్మాల విచక్షణాజ్ఞానం, అందులో ఏదో ఒకదాన్ని ఎంచుకునే, దాని ప్రకారం నడచుకునే స్వేచ్ఛ ప్రసాదించాడు. కాని మానవుల్లో కొందరు ఈ స్వేచ్ఛను దుర్వినియోగపరుస్తూ దేవుని శిక్షకు అర్హులయి పోతున్నారు. వారు దైవప్రవక్తలు బోధించిన ధర్మపథాన్ని, జీవన విధానాన్ని ధిక్కరించి దైవాగ్రహానికి గురవుతున్నారు. కాని వారు తమకు స్వేచ్ఛ ఇవ్వబడని కార్యరంగంలో తమకు తెలియ కుండానే దైవాజ్ఞల్ని శిరసావహిస్తున్నామన్న వాస్తవం గ్రహించలేక పోతున్నారు. ఈ విశ్వంలోని సమస్త చరాచరాలు, సృష్టిరాసులు ఏవిధంగా దేవునికి విధేయులయి, ఆయన నిర్దేశించిన ప్రకృతి చట్టాలకు కట్టుబడిఉన్నాయో, మానవులు కూడా తమకు స్వేచ్ఛ ఇవ్వబడిన కార్యరంగాల్లో సైతం దేవునికి విధేయులయి, ప్రవక్తల ద్వారా ఆయన పంపిన ప్రకృతి చట్టాలకు కట్టుబడి ఉండాలని ఖుర్‌ఆన్ చెబుతోంది. (ఇతర వివరాలకు 13:15 సూక్తి, దాని పాదసూచిక చూడండి.)



తప్పి దౌర్జన్యానికి పాల్పడితే వారికి మేము దుర్భర శిక్ష చవిచూపిస్తాము. (25)

ఇబ్రాహీం వృత్తాంతం జ్ఞాపకం తెచ్చుకో. అతని కోసం మేమీ ఆలయ స్థలాన్ని ప్రతిపాదిస్తూ ఇలా ఉపదేశించాం: "నా దైవత్వంలో ఎవరికీ భాగస్వామ్యం కల్పించ కూడదు. నా ఆలయ ప్రదక్షిణ చేసేవారి కోసం, ఇక్కడ ప్రార్థనకై నిలబడే, మోకరిల్లే, సాష్టాంగపడేవారి కోసం పవిత్రంగా ఉంచాలి. హజ్ చేయడానికి ప్రజలకు సాధారణ అనుమతినివ్వాలి. వారు దూర దూర ప్రాంతాల నుంచి కాలినడకన, ఒంటెలమీద వస్తారు. వారిక్కడ తమకోసం ఉంచబడిన ప్రయోజనాలు చూసి తరిస్తారు. కొన్ని నిర్ణీత దినాలలో మేము ప్రసాదించిన పశువుల్ని దేవుని పేరుతో బలిచేస్తారు. తరువాత దాన్ని వారూ తింటారు, పేదలక్కూడా దానం చేస్తారు. ఆ తరువాత వారు తమ మురికి, మలినాలు తొలగించుకుంటారు. తమ మొక్కుబడులు తీర్చుకుంటారు. ఆపై ఈ ప్రాచీన ఆలయం చట్టూ ప్రదక్షిణచేస్తారు."[3] (26-29)

---

3. కాబాగృహంలో శివలింగాన్ని పోలిన నల్లరాయి ఉందని, ముస్లింలు అలాంటి గర్భగుడి చుట్టూ ప్రదక్షిణ చేస్తారని, అందువల్ల ఇది కూడా ఒక విధమైన విగ్రహారాధన క్రిందికే వస్తుందని కొందరు బహుదైవారాధకులు విమర్శిస్తుంటారు. కాని నల్లరాయి కాబాగృహం లోపల కాకుండా, కాబాగృహం వెలుపల ఓ మూలన గోడలో అమర్చబడి ఉందని, ఆ నల్లరాయి లింగాకారంలో గాక గుంటపడి అండాకారంలో ఉందని వారు తెలుకోవాలి.

హజ్ సందర్భంగా యాత్రికులు కాబాగృహం చుట్టు ఏడు ప్రదక్షిణలు చేయవలసి ఉంటుంది. ఆ సంఖ్యను లెక్కపెట్టుకోవడానికి వారీ నల్లరాయి దగ్గర్నుండి ప్రదక్షిణ చేయడం ప్రారంభిస్తారు. కనుక ఇలా ప్రదక్షిణ చేయడం విగ్రహారాధన క్రిందికి రాదు. ఆ మాటకు వస్తే కాబా ప్రదక్షిణ కంటే నల్లరాయిని ముద్దాడటం మరింత తీవ్రమైన విషయం. దాన్ని గురించి రెండవఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) ఏమన్నారో చూడండి:

"ఆయన ఓసారి కాబా గోడలోని నల్లరాయిని సంబోధిస్తూ ఇలా అన్నారు: 'నీవు ఎలాంటి లాభంగాని, నష్టంగాని కలిగించలేని ఒక రాయివి మాత్రమే. దైవప్రవక్త (సల్లం) గనక నిన్ను ముద్దడటాన్ని చూసి ఉండకపోతే నేను నిన్ను ఎన్నిటికీ ముద్దాడను." (బుఖారి)

హజ్రత్ ఉమర్ (ర) బహుదైవారాధన (షిర్క్)కు సంబంధించిన ఛాయను కూడా సహించే వారు కాదు. దైవప్రవక్త (సల్లం) ఓసారి మక్కా నగరం శివార్లలోని హుదైబియా ప్రాంతంలో ఒక చెట్టు క్రింద నిల్చొని అనుచరుల్ని ధర్మపోరాటానికి ప్రేరేపిస్తూ వారి చేత శపథం చేయించారు. ప్రవక్తకాలంలో ఆ చెట్టుకు అంతకుమించి మరెలాంటి ప్రాముఖ్యం లేదు. కాని ఆ తర్వాత హజ్రత్ ఉమర్ (రజి) పాలనాకాలంలో ప్రజలు దాన్ని ఎంతో పవిత్రమైన శుభవృక్షంగా భావించి సందర్శనం కోసం సుదూరప్రాంతాల నుంచి కూడా రావడం ప్రారంభించారు.

హజ్రత్ ఉమర్ (రజి) ఈ సంగతి విని ఎంతో ఆందోళన వెలిబుచ్చారు. భవిష్యత్తులో ఈ వ్యాధి ముదిరి 'షిర్క్'కు దారి తీయవచ్చని భావించి, వెంటనే ఆయన కొందరు మనుషుల్ని పంపి ఆ చెట్టును కూకటివేళ్ళతో సహా నరికివేయించారు.

మరొక సారి ఆయన కాబాయాత్ర చేసి తోటి యాత్రికులతో కలసి మదీనా తిరిగొస్తుంటే దారిలో ఒక మసీదు వచ్చింది. దాన్ని చూడగానే జనం ఎంతో ఉత్సాహంతో ఆ మసీదులో నమాజ్ చేయడానికి అటుగా పరుగెత్తారు. ఆ మసీదులో దైవప్రవక్త (సల్లం) ఓసారి నమాజ్ చేశారు. అందువల్ల ప్రజలు దానికి ఎంతో ప్రాముఖ్యం ఇవ్వసాగారు.

ఇదే (కాబానిర్మాణ లక్ష్యం). దేవుడు నిర్దేశించిన ప్రతిష్ఠాత్మక విషయాలను ఎవరు గౌరవిస్తారో అది దేవుని దృష్టిలో స్వయంగా వారికే శ్రేయస్కరం.

మీకు లోగడ తెలియజేయబడినవి తప్ప మిగిలిన పశువులన్నీ మీకోసం ధర్మ సమ్మతం చేయబడ్డాయి. కనుక మీరు (ముందుగా) విగ్రహాల మాలిన్యానికి దూరంగా ఉండండి. అసత్యాలు, అభూత కల్పనలు మానేయండి.[4] పూర్తిగా ఏకోన్ముఖులై అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించండి. ఆయనకు ఎవరినీ సాటి కల్పించకండి. దేవునికి సాటికల్పించినవాడు ఆకాశం నుండి అమాంతం అథఃపాతాళంలోకి పడిపోయినట్లే. ఇక అతడ్ని పక్షులైనా పొడుచుకొని తింటాయి; లేదా గాలి అయినా ఎత్తి దూరంగా విసరి పడవేస్తుంది.[5] (30,31)

ఇదే (అసలు విషయం). ఎవరు దేవుడు నిర్ణయించిన ధార్మిక చిహ్నాలను గౌరవిస్తారో వారి హృదయాలలో ఇది దైవభీతికి నిదర్శనం అవుతుంది. (32)

ఓ నిర్ణీతకాలం వరకు ఆ బలిపశువుల్ని మీరు ఇతర పనులకోసం ఉపయోగించు కోవచ్చు. ఆ తరువాత (వాటిని) వాటి (బలి) ప్రదేశమైన ప్రాచీనాలయం దగ్గర (బలిచేయ వలసి) ఉంటుంది. (33)

ప్రజలు తమకు దేవుడిచ్చిన పశువుల్ని దేవునిపేరు స్మరించి బలివ్వడానికి మేము

అయితే హజ్రత్ ఉమర్ (రజి)కు ఈ వైఖరి కూడా నచ్చలేదు. ఆయన వారి దగ్గరకెళ్ళి అన్నారు: "గ్రంథప్రజలు (యూదులు, క్రైస్తవులు) తమ ప్రవక్తల సమాధుల్ని, వారి స్మారకచిహ్నాలను ఆరాధనాలయాలుగా చేసుకున్నారు. కేవలం ఈ కారణంగానే వారు నాశనమయ్యారు. మీరు కూడా ఇలాంటి అవాంఛనీయ పనులకు పాల్పడి చేజేతులా నాశనం కొని తెచ్చుకోకండి."

4. దేవునికి ఇతరుల్ని సహవర్తులుగా చేయడం, ఆయన గుణగణాల్లో, శక్తిసామర్థ్యాల్లో, అధికారాల్లో, హక్కుల్లో ఆయన దాసులకు భాగస్వామ్యం కల్పించడం వగైరా విషయాలు అసత్యాలు, అభూత కల్పనల క్రిందికే వస్తాయి. ఏ విషయంలో నయినా దేవుని ఆజ్ఞలకు, ఆయన ప్రవక్త బోధనలకు వ్యతిరేకంగా ఇది ధర్మం (హలాల్), అది అధర్మం (హరాం) అని నిర్ణయించడం, దాన్ని ఆచరించడం కూడా అసత్యం క్రిందికే వస్తాయి.

దైవప్రవక్త (సల్లం) అసత్యప్రమాణం, అబద్ధపు సాక్ష్యం విషయంలో ఈ సూక్తిని నిదర్శనంగా పేర్కొంటూ "అబద్ధపు సాక్ష్యం దేవునికి సాటికల్పించడంతో సమానం" అన్నారు.

ఇమామ్ అబూయూసుఫ్, ఇమామ్ ముహమ్మద్ అబద్ధపు సాక్ష్యం విషయమై ఒక ఫత్వా (ధార్మికతీర్పు) ఇస్తూ "న్యాయస్థానంలో అబద్ధపు సాక్ష్యమని రుజువయితే సంబంధిత వ్యక్తికి సుదీర్ఘ జైలుశిక్ష విధించాలి; అతను అబద్ధీకుడని ప్రచారం చేయాలి" అన్నారు.

ఖలీఫా హజ్రత్ ఉమర్ (ర) కాలంలో ఒకతను ఇచ్చిన సాక్ష్యం అబద్ధమని న్యాయస్థానంలో రుజువయింది. అప్పుడు హజ్రత్ ఉమర్ (ర) ఆ వ్యక్తిని ఒక రోజల్లా బహిరంగ ప్రదేశంలో నిలబెట్టి, ఫలానా మనిషి కొడుకు ఫలానా వ్యక్తి అసత్య సాక్షి. ఇతడ్ని గుర్తుపెట్టుకోండి అని చాటింపు వేయించారు. ఆ తరువాత అతడ్ని జైల్లో పెట్టారు. (45:7 సూక్తి, దాని పాదసూచిక చూడండి.)

5. వివరాలకు 7:41, 45:7 సూక్తులు, వాటి పాదసూచికలు చూడండి.



ప్రతి సమాజానికి ఒక బలివిధానం నిర్ణయించాం. గుర్తుంచుకోండి, మీ ఆరాధ్యుడు ఒక్క దేవుడు మాత్రమే. ఆయన ఆజ్ఞలనే శిరసావహిస్తూ ఆయనకే మీరు విధేయులై ఉండాలి.

ప్రవక్తా! నమ్రత, అణుకువలతో నడచుకునేవారికి శుభవార్త విన్పించు. దేవుని ప్రసక్తి రాగానే వారి హృదయాలు కంపించిపోతాయి. కష్టాలు వచ్చినప్పుడు వారు సహనం వహిస్తారు. నమాజ్ (వ్యవస్థ) నెలకొల్పుతారు. మేము ప్రసాదించిన ఉపాధి నుండి (మా మార్గంలో) ఖర్చుపెడ్తారు. (34,35)

మేము బలి పశువుల్ని మీ కోసం దైవచిహ్నాల జాబితాలో చేర్చాము. వాటిలో మీ శ్రేయస్సు ఉంది. కనుక వాటిని (ఒంటెలను) నిలబెట్టి దేవుని పేరు ఉచ్చరించండి. (అంటే దేవుని పేరు స్మరించి జిబహ్ చేయండి. బలిచేసిన కొద్ది క్షణాలకు) వాటి వీపులు నేలమీద (చలనరహితంగా) నిలిచిపోయిన తరువాత వాటి మాంసాన్ని మీరూ తినండి; అర్థించేవారికి, అర్థించనివారికి కూడా ఇవ్వండి. మీరు మా పట్ల కృతజ్ఞులై ఉండటానికే మేమిలా పశువుల్ని మీకోసం అదుపులో ఉంచాము. (36)

దేవుని దగ్గరకు వాటి రక్తమాంసాలు చేరవు. మీ భయభక్తులే ఆయన దగ్గరకు చేరుకుంటాయి. మీకు సన్మార్గం చూపినందుకు కృతజ్ఞతగా తనను స్తుతించడానికే దేవుడు ఈ పశువుల్ని మీ అదుపులో ఉంచాడు. ప్రవక్తా! సజ్జనులకు శుభవార్త అందజేయి. (37)

దేవుడు విశ్వాసుల తరపున తప్పకుండా పోరాడుతాడు. ఆయన విశ్వాసఘాతకుడైన ఏ కృతఘ్నుడ్నీ ప్రేమించడు. (అన్యాయంగా) దాడికి పాల్పడినవారితో పోరాడేవారికి (ఆత్మ రక్షణ పోరాటానికై) అనుమతి ఇవ్వబడుతోంది. కారణం, వారు చాలా పీడించబడ్డారు. వారికి దేవుడు తప్పకుండా సహాయం చేస్తాడు. (38,39)

వారు తమ ఇండ్ల నుంచి అన్యాయంగా వెడలగొట్టబడ్డారు. వారు "మా ప్రభువు అల్లాహ్"అన్నంత మాత్రానికే ఇలా జరిగింది.[6] దేవుడు గనక ప్రజలను ఒకరిద్వారా మరొకరిని తుదముట్టించకపోతే, దేవుని పేరు అత్యధికంగా స్మరించబడే మఠాలు,

6. మక్కా బహుదైవారాధకులు ముస్లిలను మక్కాలో ఉన్నంత కాలం హింసించడమే గాక, మక్కా వదలి మదీనా వెళ్తున్నప్పుడు కూడా వారిని అడ్డుకుంటూ ఎలా వేధించారో మచ్చుకు రెండు ఉదాహరణలు చూడండి:

హజ్రత్ సుహైబ్ రూమి(రజి) మదీనా వలసపోవడానికి బయలుదేరినప్పుడు ఖురైషీయులు ఆయన్ని నిరోధిస్తూ "నీవు ఇక్కడకు వట్టి చేతులతో వచ్చి అపార సిరిసంపదలు సంపాదించావు. కనుక నీవు వెళ్ళదలచుకుంటే అదంతా ఇక్కడ వదిలేసి పోవాలి" అన్నారు. దాంతో సుహైబ్ రూమి (రజి) తాను కష్టపడి సంపాదించిన ఆస్తంతా వదలి కేవలం కట్టుబట్టలతో మదీనా వెళ్ళారు.

హజ్రత్ అబూసల్మా తన భార్య ఉమ్మెసల్మాను, ఒక పసిబిడ్డను తీసుకొని బయలుదేరి నప్పుడు, ఉమ్మెసల్మా వంశస్థులు ఆయన్ని అటకాయించి "నీవు వెళ్ళదలచుకుంటే ఎక్కడికైనా వెళ్ళి ఊరేగు. కాని మా అమ్మాయిని మాత్రం తీసికెళ్ళడానికి వీల్లేదు" అన్నారు. అందువల్ల అబూసల్మా (రజి) భార్యను, పసిబిడ్డను వదలి ఒక్కరే మదీనా వెళ్ళిపోయారు.

మందిరాలు, చర్చీలు, మసీదులు, (ఇతర) ఆరాధనాలయాలు ధ్వంసం చేయబడే ప్రమాదం ఉంటుంది. (కనుక) దేవుడు (తన ధర్మానికి) సహాయం చేసేవారిని తప్పకుండా ఆదుకుంటాడు. దేవుడు ఎంతో బలాఢ్యుడు, సర్వశక్తిమంతుడు. (40)

వీరు (ఎంతో నీతిమంతులు), వీరికి మేము ధరణిలో రాజ్యాధికారమిస్తే నమాజ్ వ్యవస్థ నెలకొల్పుతారు. జకాత్ చెల్లిస్తారు. మంచిని గురించి (ప్రజల్ని) ఆదేశిస్తారు. చెడులను అరికడ్తారు.[7] సమస్త వ్యవహారాల పర్యవసానం దేవుని చేతిలోనే ఉంది. (41)

ప్రవక్తా! వారు గనక నిన్ను తిరస్కరిస్తే (తిరస్కరించనీ), వారికి పూర్వం నూహ్ జాతి, ఆద్-సమూద్ జాతులు, ఇబ్రాహీంజాతి, లూత్‌జాతి, మద్యన్‌వాసులు కూడా తిరస్కరించారు. మూసా కూడా తిరస్కరించబడ్డాడు. ఈ తిరస్కారులకు మొదట్లో నేనెంతో అవకాశమిచ్చాను.  ఆ తరువాతే వారిని పట్టుకున్నాను. చూడు నాశిక్ష ఎంత కఠినమైనదో! (42-44)

(ఇలా) పాపాత్ములుండిన ఎన్నో పట్టణాలను మేము నాశనం చేశాము. ఈనాడు అవి తల్లక్రిందులుగా పడి (శిథిలావస్థలో) ఉన్నాయి. ఎన్ని బావులు పాడుపడి ఉన్నాయి! మరెన్ని మేడలు శిథిలాలుగా మారిపోయాయి!! వీరు ధరణిలో తిరిగి చూడరా? (తిరిగి చూస్తే) వారి హృదయాలు అర్థం చేసుకునేవిగా, వారి చెవులు వినేవిగా మారేవి కదా! నిజానికి చర్మచక్షువులకు అంధత్వం లేదు. హృదయ చక్షువులకే ఆంధత్వం ఉంది.

---

ఆ తరువాత అబూసల్మా వంశస్థులు వచ్చి "పిల్లవాడు మా వంశానికి చెందినవాడు గనక, అతడ్ని మాకప్పగించాలి" అంటూ ఉమ్మెసల్మా దగ్గర్నుంచి పసిబిడ్డను బలవంతంగా లాక్కున్నారు. పాపం ఉమ్మెసల్మా (రజి) అటు భర్త వియోగంతో, ఇటు పుత్ర వియోగంతో దాదాపు యేడాదిపాటు దిగులుతో బాధపడ్డారు. ఆ తరువాత ఎలాగో పిల్లవాడ్ని దక్కించుకొని ఆమె ఒంటరిగానే ఒంటె మీద మదీనా వెళ్ళిపోయారు.

7. ఇస్లామీయ పరిపాలనా ధ్యేయం ఏమిటో ఈ సూక్తి పరిశీలించిన వారికి ఇట్టే తెలిసి పోతుంది. ఇస్లామీయ పరిపాలన, అంటే ముస్లింల పరిపాలన కాదు. కేవలం ముస్లింలు అధిక సంఖ్యాక ప్రజలుగా, పాలకులుగా ఉండే దేశాలను నేడు ఇస్లామీయ దేశాలుగా పేర్కొనడం జరుగు తోంది. ఇది సరికాదు. వీటిని ముస్లిం దేశాలని మాత్రమే చెప్పగలం. ఇస్లాం ప్రకారం ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజాప్రతినిధుల ద్వారా ఖిలాఫత్ (దైవ ప్రాతినిధ్య) వ్యవస్థ ఏర్పడిన తరువాత అలాంటి ప్రభుత్వానికి ప్రజలను సన్మార్గంలో నడిపించవలసిన బాధ్యత కూడా ఉంటుంది. దాని కోసం ఈ సూక్తిలో నాలుగు ప్రాథమిక సూత్రాలు తెలియజేయబడ్డాయి:

(1) పాలకులు ప్రజల్లో నమాజ్ వ్యవస్థను నెలకొల్పాలి.
(2) వారు ధనికుల నుండి జకాత్ వసూలు చేసి దాన్ని పేదలు, అనాథలు, వితంతువుల . కోసం, ఇతర జనసంక్షేమ కార్యకలాపాల కోసం వినియోగించాలి.
(3) సత్కార్యాలను గురించి విస్తృత ప్రచారం చేయాలి.
(4) వివిధ స్థాయిల్లో ఉండే చెడులన్నిటిని సమూలంగా తుడిచిపెట్టేందుకు ప్రయత్నించాలి.

ఈ విధంగా జరిగినప్పుడే దేశం నిజమైన శ్రేయోరాజ్యంగా వర్థిల్లుతూ ప్రజలకు శాంతీ సామరస్యాల సుమధుర ఫలాలు అందజేస్తుంది.



వీరు శిక్ష కోసం మహా తొందరపడుతున్నారు. దేవుడు తన వాగ్దానాన్ని ఎన్నడూ భంగపరచడు. కాని నీప్రభువు దృష్టిలో ఒక రోజు మీరు లెక్కించే వేయి సంవత్సరాలకు సమానంగా ఉంటుంది. ఎన్నో పట్టణాలు దుర్మార్గానికి పాల్పడ్డాయి. నేను మొదట్లో వాటికి అవకాశమిచ్చాను. ఆ తరువాత వాటిని పట్టుకున్నాను. చివరికి అందరూ నా దగ్గరికే తిరిగి రావలసి ఉంటుంది. (45-48)

ముహమ్మద్ (సల్లం)! వారికిలా చెప్పు: "ప్రజలారా! నేను (మీ శ్రేయోభిలాషిని. దుర్దినాలు దాపురించక ముందే) మిమ్మల్ని స్పష్టంగా హెచ్చరించేవాడ్ని మాత్రమే." (49)

సత్యాన్ని విశ్వసించి సత్కార్యాలుచేసేవారికి మన్నింపు, గౌరవప్రదమైన ఉపాధి ఉన్నాయి. మా సూక్తుల్ని కించపరచడానికి ప్రయత్నించేవారు నరకవాసులవుతారు.

ముహమ్మద్ (సల్లం)! మేము నీకు పూర్వం షైతాన్ గొడవ లేకుండా ఉండే ఏ ప్రవక్తనూ, సందేశహరుడ్నీ పంపలేదు. ప్రతి ప్రవక్తా ఏదైనా చేయదలచుకున్నప్పుడల్లా షైతాన్ అతని పనికి అవరోధాలు సృష్టిస్తుండేవాడు. అయితే షైతాన్ సృష్టించే అవరోధా లన్నిటినీ దేవుడు (ఎప్పటికప్పుడు) తొలగిస్తూ తన సూక్తుల్ని మరింత పటిష్ఠం చేస్తున్నాడు. దేవుడు సర్వం తెలిసినవాడు, మహా వివేకవంతుడు. (50-52)

హృదయాల్లో రోగమున్నవారికి, వక్రమనస్కులకు షైతాన్ దుశ్చర్యల్ని దేవుడు కఠిన పరీక్షగా చేస్తాడు. అసలీ దుర్మార్గులు శత్రుత్వం వహించడంలో హద్దుమీరి పోయారు.

జ్ఞానం ప్రసాదించబడినవారు 'ఇది నీప్రభువు నుండి వచ్చిన సత్యం' అని తెలుసు కొని దాన్ని విశ్వసించాలి. వారి హృదయాలు ఆయన ముందు లొంగిపోవాలి. విశ్వసించే వారికి దేవుడు ఎల్లప్పుడూ సన్మార్గమే చూపిస్తాడు. (53,54)

సత్యతిరస్కారులు తమపై హఠాత్తుగా ప్రళయం వచ్చిపడేదాక లేదా ఒక దుర్దినాన ఏదైనా విపత్తు విరుచుకుపడే వరకు దాని విషయంలో ఎప్పుడూ అనుమానంలోనే పడి ఉంటారు. ప్రళయదినాన రాజ్యాధికారం దేవునిదే అవుతుంది. ఆరోజు, విశ్వసించి సదాచార సంపన్నులైనవారి గురించి ఆయన తీర్పు చేస్తాడు. వారు భోగభాగ్యాలతో నిండిన స్వర్గవనాల్లో ప్రవేశిస్తారు. మా సూక్తులు నిరాకరించి అవిశ్వాసులయినవారి కోసం మాత్రం అవమానకరమైన (నరక)యాతన కాచుకొని ఉంది. (55-57)

దైవమార్గంలో వలసపోయినవారు తరువాత చావడమో లేక చంపబడటమో జరిగితే, అలాంటివారికి దేవుడు (పరలోకంలో) శ్రేష్ఠమైన ఉపాధినిస్తాడు. దేవుడే అందరి కంటే మంచి ఉపాధిప్రదాత. వారిని ఆయన వారు పరమానంద భరితులయ్యే (ఆనంద) నిలయానికి చేరుస్తాడు. నిస్సందేహంగా దేవుడు సర్వం తెలిసినవాడు, ఎంతో మృదుహృదయుడు. (58,59)

తనకు ఆన్యాయం జరిగిన మేరకు మాత్రమే ప్రతిక్రియ చేసిన వ్యక్తిపై తిరిగి దౌర్జన్యం జరిగితే దేవుడు అతనికి తప్పకుండా సహాయం చేస్తాడు. దేవుడు గొప్ప క్షమాశీలి, అమిత దయామయుడు. (60)

రాత్రి నుండి పగటిని, పగటి నుండి రాత్రిని వెలికి తీసేవాడు దేవుడే. ఆయన సమస్తం వింటున్నాడు, చూస్తున్నాడు. దేవుడే సత్యం. దేవుడ్ని వదలి వారు పూజిస్తున్న వన్నీ మిథ్య, అసత్యం మాత్రమే. దేవుడే గొప్పవాడు, మహోన్నతుడు. (61,62)

దేవుడు ఆకాశం నుండి వర్షం కురిపిస్తున్నాడు. దానివల్ల భూమి సస్యశ్యామలమై పోతుంది. ఈవిషయాన్ని మీరు గమనించడం లేదా? ఆయన ఎంతో సూక్ష్మగ్రాహి, సర్వం ఎరిగినవాడు. భూమ్యాకాశాల్లో ఉన్న సమస్తం ఆయన సొత్తే. నిస్సందేహంగా ఆయన నిరపేక్షాపరుడు, స్వతహాగా ప్రశంసనీయుడు. (63,64)

ప్రపంచంలో ఉన్న సమస్తాన్నీ ఆయన మీకోసమే అదుపులో ఉంచాడు. ఆయనే ఓడలను తన ఆజ్ఞతో సముద్రంలో నడిచేలా క్రమబద్ధీకరించాడు. ఆయనే ఆకాశాన్ని తన ఆజ్ఞ లేనిదే పడిపోకుండా ఉండేలా పొదివి పట్టుకున్నాడు. ఇదంతా మీరు చూడటంలేదా? నిస్సందేహంగా దేవుడు మానవుల పట్ల ఎంతో వాత్సల్యుడు, అపార దయామయుడు. ఆయనే మిమ్మల్ని బ్రతికిస్తున్నాడు. ఆయనే మిమ్మల్ని చంపుతున్నాడు. ఆయనే మిమ్మల్ని (అంతిమదినాన) తిరిగి బ్రతికిస్తాడు. కాని మానవుడే చాలా కృతఘ్నుడై పోయాడు. (65,66)

ప్రతి మానవ సముదాయం కోసం మేమొక ఆరాధనావిధానం నిర్ణయించాం. దాన్నే అది అనుసరిస్తుంది. కనుక ప్రవక్తా! ఈ విషయంలో వారు నీతో వాదించకూడదు. నీవు నీప్రభువు వైపు ప్రజల్ని పిలువు. నిస్సందేహంగా నీవు సన్మార్గంలో ఉన్నావు. (67)

నీతో వాదనకు దిగితే వారికిలా చెప్పు: "మీరు చేసే పనులన్నీ దేవునికి బాగా తెలుసు. ఆయన ప్రళయదినాన మీరు విభేదిస్తున్న విషయాలన్నిటిని గురించి మీ మధ్య తీర్పు చెబుతాడు. భూమ్యాకాశాలకు చెందిన అణువణును గురించి ఆయనకు తెలుసని నీవెరుగవా? అవన్నీ ఒక గ్రంథంలో నమోదయి ఉన్నాయి. ఈ పనులన్నీ దేవునికి ఏమాత్రం కష్టసాధ్యం కావు. (68-70)

వీరసలు దేవుడ్ని వదలి మిథ్యాదైవాలను ఆరాధిస్తున్నారు. అందుకు దేవుడు ఎలాంటి ప్రమాణం పంపలేదు. వారికి కూడా ఆ మిథ్యాదైవాల్ని గురించి ఎలాంటి జ్ఞానం లేదు. కనుక ఈ దుర్మార్గులకు (పరలోకంలో) సహాయం చేసేవారెవరూ ఉండరు. (71)

నీవు తిరస్కారుల సంగతి చూస్తూనే ఉన్నావు. మా విస్పష్ట సూక్తులు పఠిస్తున్నప్పుడు వారు ముఖాలు చిట్లించుకొని మా సూక్తులు పఠిస్తున్నవారిపై ఒక్కసారిగా విరుచుకుపడతారా అన్నట్లు వారి వైపు కొరకొర చూస్తారు. వారికీ సంగతి చెప్పు: "అంతకంటే నీచమైన విషయం ఏమిటో చెప్పనా మీకు? (భగభగ మండే) నరకాగ్ని! సత్యతిరస్కారుల కోసం అది కాచుకొని ఉంటుందని దేవుడు వారి విషయంలో వాగ్దానం చేశాడు. అది పరమ చెడ్డనివాసం." (72)

మానవులారా! ఒక ఉదాహరణ ఇస్తున్నాం, వినండి: మీరు దేవుడ్ని వదలి ప్రార్థిస్తున్న మిథ్యాదైవాలన్నీ కలసి కనీసం ఒక ఈగనైనా సృష్టించదలచుకుంటే,



దాన్నికూడా సృష్టించలేవు. పైపెచ్చు ఆ ఈగ వాటి దగ్గర్నుంచి ఏదైనా వస్తువుని గుంజుకుంటే ఆ వస్తువుని కూడా అవి దాన్నుండి విడిపించుకోలేవు. సహాయం అర్థించేవారు, సహాయం అర్థించబడేవారు ఇద్దరూ బలహీనులే. అసలు శక్తిమంతుడు, గౌరవనీయుడు దేవుడు మాత్రమే. (73,74)

దేవుడు దైవదూతల్ని సందేశహరులుగా నియమిస్తాడు. అలాగే మానవుల్లో కూడా కొందర్ని సందేశహరులుగా నియమిస్తాడు. ఆయన సమస్తం వింటున్నాడు, చూస్తున్నాడు. వారి కళ్ళెదుట ఉన్నదేమిటో, వారికి కనుమరుగై ఉన్నదేమిటో అంతా ఆయనకు తెలుసు. సమస్త వ్యవహారాలు ఆయన దగ్గరికే చేరుకోవలసి ఉంది. (75,76)

విశ్వాసులారా! మోకరిల్లండి, సాష్టాంగపడండి, మీ ప్రభువును ఆరాధించండి, సత్కార్యాలు చేయండి; బహుశా మీరు కృతార్థులవుతారు. (మీ జీవితం సార్థకమవుతుంది.) దైవమార్గంలో (దుష్టశక్తులతో) పోరాడవలసిన విధంగా పోరాడండి. ఆయన మిమ్మల్ని తనపని కోసం ఎన్నుకున్నాడు. ధర్మంలో ఆయన మీకు ఎలాంటి ఇబ్బంది కలిగించలేదు. మీ తండ్రి ఇబ్రాహీం సమాజంలో స్థిరంగా ఉండండి. దైవప్రవక్త మీకు సాక్షిగా నిలబడేందుకు, మీరు ప్రజలకు సాక్షులుగా ఉండేందుకు దేవుడు మీ పేరును ఇదివరక్కూడా ముస్లిం అనే పెట్టాడు, ఇప్పుడీ గ్రంథంలో కూడా (అదే పేరు పెట్టాడు).

కనుక నమాజ్ (వ్యవస్థ) నెలకొల్పండి. (పేదల ఆర్థిక హక్కు) జకాత్ చెల్లించండి. దేవుడ్ని (ఆయన ధర్మాన్ని) గట్టిగా పట్టుకొని ఉండండి. ఆయనే మీ సంరక్షకుడు. ఆయన ఎంతో మంచి సంరక్షకుడు, మంచి సహాయకుడు కూడా. (77,78) ✪

# 23. విశ్వాసులు (మోమినూన్)

**అవతరణ: మక్కా** **సూక్తులు: 118**

ఈ అధ్యాయాన్ని "మోమినూన్" (విశ్వాసులు) అంటారు. ఇది హిజ్రీ శకానికి ఆరేడు ఏండ్లకు పూర్వం అవతరించింది. ఇందులో విశ్వాసుల గుణగణాలు వర్ణించబడ్డాయి. తరువాత సృష్టినిర్మాణం, ప్రకృతి కార్యాలను దేవుని ఏకత్వానికి నిదర్శనాలుగా పేర్కొంటూ, గతజాతుల చారిత్రక గాథలను ప్రస్తావిస్తూ అవిశ్వాసుల్ని రుజుమార్గం వైపు పిలవడం జరిగింది.

**కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం**

విశ్వాసులు తప్పకుండా కృతార్థులవుతారు. (వారి శీలం ఇలా ఉంటుంది:)

- వారు తమ నమాజులో ఎంతో అణుకువ, నమ్రతలు పాటిస్తారు. (1,2)
- పనికిమాలిన విషయాలకు చాలా దూరంగా ఉంటారు. (3)
- తమ సంపద నుండి (పేదల ఆర్థిక హక్కు) జకాత్ చెల్లిస్తారు. (4)
- వారు తమ భార్యలు, బానిసస్త్రీల విషయంలో తప్ప (ఇతరస్త్రీల విషయంలో) తమ మర్మావయవాలు కాపాడుకుంటారు. (అంటే వ్యభిచారం తదితర అశ్లీల

చేష్టలకు పాల్పడరు.) బానిసస్త్రీల విషయంలో వారిపై ఎలాంటి నింద లేదు.[1] అది తప్ప మరేదయినా కోరేవారే హద్దుమీరిన[2] వారవుతారు. (5-7)

- ♦ వారు తమ అప్పగింతలు, ప్రమాణాలు, ఒప్పందాల విషయంలోనిజాయితీ గా వ్యవహరిస్తారు. (8)
- ♦ తమ నమాజులను క్రమం తప్పకుండా, నియమబద్ధంగా పాటిస్తారు. (9)
- ♦ అలాంటివారే మహోన్నత స్వర్గానికి వారసులవుతారు. అక్కడే వారు కలకాలం (హాయిగా) ఉంటారు. (10,11)

---

1. మర్మావయవాల్ని కాపాడుకోవడం అంటే లైంగిక సంపర్కం చేయకుండా ఉండటం అని అర్థం. అయితే ఈ పనినుండి భార్యలు, తమ అధీనంలో ఉండే బానిస స్త్రీలు మినహాయించ బడ్డారు. అంటే భార్యలతో, బానిస స్త్రీలతో లైంగిక సంపర్కం ధర్మసమ్మతమేనన్న మాట.

ఇక్కడ ఒక విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. అజ్ఞానకాలం నుండి సాగుతూ వస్తున్న బానిస వ్యవస్థను ఇస్లాం ప్రోత్సహించ లేదు. అలా అని దాన్ని పూర్తిగా నిషేధించనూ లేదు. అయితే స్వతంత్రుల్ని బలవంతంగా బానిసలుగా మార్చడాన్ని ఇస్లాం తీవ్రంగా గర్హిస్తుంది. పైగా బానిసలకు స్వేచ్ఛ ప్రసాదించడం గొప్ప పుణ్యకార్యంగా అభివర్ణిస్తూ దాన్ని ప్రోత్సహిస్తోంది. దీని ప్రకారం అనేకమంది ప్రవక్తఅనుచరులు (రజి) తమ అధీనంలో ఉన్న బానిసలకు స్వేచ్ఛ ప్రసాదించారు. (వివరాలకు 24:33 సూక్తికి రాసిన పాదసూచిక చూడండి.)

ఇస్లాం బానిస వ్యవస్థను పూర్తిగా నిషేధించక పోవడానికి కారణం యుద్ధఖైదీల సమస్యల్ని, సామాజిక అవసరాలను దృష్టిలో పెట్టుకోవడమే. యుద్ధఖైదీల మార్పిడి వెంటనే జరగని పక్షంలో ఇస్లాం ఆ ఖైదీలను బానిసలుగా పరిగణించి సమరయోధులకు స్వాధీనం చేస్తుంది. వారే ఆ బానిసలకు యజమానులవుతారు. వారి యాజమాన్యంలో బానిస మహిళలు ఉంటే వారితో భార్యలకు మాదిరిగా లైంగిక సంబంధం కూడా పెట్టుకునే అనుమతి ఉంది. అంతేగాని, ఇతర పురుషులతో అక్రమ సంబంధాలు పెట్టుకోవడానికి, వ్యభిచారం చేయడానికి వారిని విచ్చలవిడిగా వదలిపెట్టడాన్ని ఇస్లాం అంగీకరించదు. దానివల్ల సామాజిక సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉంటుంది. అందువల్ల ఎవరి యాజమాన్యంలో ఉన్న బానిసస్త్రీలతో వారు మాత్రమే లైంగికా నందం అనుభవించవచ్చని ఇస్లాం అనుమతినిచ్చింది. ఈపని ఏమాత్రం వ్యభిచారం క్రిందికి రాదు. (దీంతోపాటు 70:29-31 సూక్తులు కూడా చూడండి.)

2. ఈ సూక్తిలో వ్యభిచారం, స్వలింగసంపర్కం, ముష్టిమైథునం (హస్తప్రయోగం) వగైరా అక్రమ పద్ధతులన్నీ నిషేధించబడ్డాయి. దైవప్రవక్త (స) యువకుల్ని ఉద్దేశించి ఇలా బోధించారు:

“యువకుల్లారా! మీలో వివాహ బాధ్యతలు నెరవేర్చే శక్తి గలవారు తప్పకుండా వివాహం చేసుకోవాలి. వివాహం దృష్టిని క్రిందికి వాలేలా చేస్తుంది. మర్మాంగాన్ని కాపాడుతుంది. వివాహ బాధ్యతలు నెరవేర్చలేని (పెళ్ళి చేసుకోలేని)వారు అప్పుడప్పుడు ఉపవాసం పాటించాలి. ఉపవాసం కామోద్రేకాల్ని నిగ్రహింప జేస్తుంది.” (బుఖారి, ముస్లిం)

అయితే హస్తప్రయోగం విషయంలో షరీఅత్ వేత్తల (ఫిఖహ్‌వేత్తల) మధ్య భేదాభిప్రాయాలు ఉన్నాయి. ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ (రహ్మ) దీన్ని ధర్మసమ్మతంగా పరిగణించారు. ఇమామ్ మాలిక్ (రహ్మ), ఇమామ్ షాఫయి (రహ్మలై)లు దీన్ని నిషిద్ధం (హరాం)గా పరిగణించారు. హనఫీల దగ్గర ఇది నిషిద్ధం అయినప్పటికీ, తీవ్రమైన కామోద్రేకం కలిగినప్పుడు యాదృచ్ఛికంగా ఈ పని జరిగిపోతే దేవుడు క్షమిస్తాడని ఆశించవచ్చని అంటారు వారు.



మేము మానవుడ్ని నాణ్యమైన మట్టితో సృజించాం. తరువాత అతడ్ని ఒక సురక్షిత ప్రదేశంలో కార్చిన బిందువుగా మార్చాము. తరువాత ఆ బిందువును నెత్తుటి ముద్దగా రూపొందించాం. తిరిగి ఆ నెత్తుటి ముద్దను మెత్తటి పిండంగా చేశాం. ఆ తర్వాత దాన్ని ఎముకలుగా మార్చాము. ఆ ఎముకలపై మాంసం కప్పాము. ఆపై (అందులో ప్రాణం పోసి) ఓ నూతన సృష్టినే ఉనికిలోకి తెచ్చాము.[3] కాబట్టి దేవుడు ఎంతో శుభకరుడు.

---

3. ఈ సూక్తిలో మానవ నిర్మాణం స్త్రీ గర్భంలో కార్చబడిన వీర్యబిందువుతో ప్రారంభమవు తుందని, ఆ వీర్య బిందువు నెత్తుటి ముద్దగా రూపొందుతుందని, తిరిగి ఆ నెత్తుటిముద్ద మెత్తటి పిండంగా మారుతుందని, ఆ తరువాత ఆ పిండం ఎముకలుగా మారి వాటిపై మాంసం ఏర్పడు తుందని తెలియజేయబడింది. ఈ విధంగా స్త్రీ గర్భంలో బిడ్డ క్రమక్రమంగా రూపొంది చివరికి ప్రాణం పోసుకొని బయటికి వస్తాడని వివరించబడింది.

ఇవి ఆనాటి ప్రజలకు తెలియజేయబడిన వివరాలు. అప్పటి ప్రజలకుండిన విద్యాజ్ఞానాలను బట్టి ఇంతకంటే ఎక్కువ వివరాలు తెలియజేసినా వారికి అర్థంకావు. కాని ఈనాటి మానవుడు మానవ దేహనిర్మాణాన్ని శక్తిమంతమైన పరికరాల ద్వారా క్షుణ్ణంగా పరిశోధించి ఎన్నో కొత్త విషయాలు తెలుసుకున్నాడు. దీని ప్రకారం మానవ శరీర నిర్మాణం దాదాపు 10,000,00 కోట్ల జీవకణాల సముదాయంతో జరిగింది. ఒక్క మెదడులోనే 300 కోట్ల కణాల దాకా ఉన్నాయి.

“త్వరలోనే వారికి మా నిదర్శనాలు దిఙ్మండలాల్లోనూ చూపిస్తాము; స్వయంగా వారి (నిర్మాణం)లోనూ చూపిస్తాము. చివరికి ఈ ఖుర్ఆన్ నిజంగా సత్యవాణి అనే విషయం వారి ముందు బట్టబయలవుతుంది.” (41:53)

స్త్రీ గర్భకోశంలోని అండం కూడా ఒక జీవకణమే. ఇది పురుష జీవకణంతో సంయోగం చెంది పిండోత్పత్తి జరుగుతుంది. అప్పటికీ అది ఏకకణమే. ఒక కణం రెండుగా, రెండు నాలుగుగా, నాలుగు ఎనిమిదిగా....ఇలా ఈ మిశ్రమ కణం కోటానుకోట్ల జీవకణాలుగా విడిపోతుంది. ఆయా జీవకణాలు వేర్వేరు స్వభావాలు సంతరించుకుంటాయి. ఈ విధంగా ఒక చిన్న అండం కోట్లాది జీవకణాలుగా విభజితమయితేగాని పూర్తి మానవాకృతి ధరించదు, శిశువు పెరిగి పెద్దదవదు.

అలాగే శరీరం మీద గాయమైనప్పుడు, అది మానేకొద్దీ అక్కడి చర్మం, మాంసం కూడా కణవిభజన ద్వారా పెరుగుతాయి. అంటే నశించి రాలిపోయే కణాలకు బదులుగా కొత్తకణాలు పుట్టుకొస్తాయన్న మాట. అయితే గాయం పూర్తిగా మానిన తరువాత ఈ పెరుగుదల ఆటోమేటిగ్గా ఆగిపోతుంది. వృద్ధాప్యంలో నయితే వయస్సు మీద పడేకొద్దీ కణవిభజన క్రమంగా తగ్గిపోతుంది. అదే ఆరోగ్యవంతమైన మనిషి కణజాలానికి కేన్సర్ సోకితే కణసంఖ్య హద్దూపద్దూ లేకుండా విపరీతమైన వేగంతో పెరుగుతూ, చివరికి మనిషి ప్రాణానికే ముప్పు తెచ్చి పెడుతుంది.

ఈ జీవకణ పరిమాణం అతి సూక్ష్మమైనది. సాధారణంగా ఒక మిల్లీమీటర్ పరిమాణంలో 100 జీవకణాలు ఉంటాయి. కొన్ని పెద్దవిగా, కొన్ని చిన్నవిగా కూడా ఉంటాయి. ఈ లెక్కన ఒక మిల్లి మీటర్ పొడవులో 50 నుంచి 200 కణల దాకా ఉంటాయి.

ప్రతి సజీవ కణంలో ఒక సైటోప్లాజం, ఒక న్యూక్లియస్ (కేంద్రకం) ఉంటాయి. సైటోప్లాజం అటు ద్రవమూ, ఇటు ఘనమూ కాని జెల్లీ రూపంలో ఉంటుంది. ఇందులో కణాలు జీవించడానికి కావలసిన ఆహారం; ఎదుగుదలకు, పునరుత్పత్తికి అవసరమైన ఇతర పదార్థాలూ ఉంటాయి. శాస్త్ర వేత్తలు సైటోప్లాజమ్‌ను రసాయనాల్ని ఉత్పత్తి చేసే కార్ఖానాగా వర్ణించారు.

జీవకణంలోని న్యూక్లియస్‌లో దారాలవంటి నిర్మాణంగల క్రోమోజోమ్‌లు నిర్ణీత సంఖ్యలో ఉంటాయి. ఈ సంఖ్య ప్రతిజీవికి వేర్వేరుగా ఉంటుంది. మనిషిలో 46 క్రోమోజోములు (23 జతలు) ఉంటాయి. వీటిలో 23 తల్లి నుండి, 23 తండ్రి నుండి సంక్రమిస్తాయి. ఈ క్రోమోజోముల నుంచే జీవి స్వరూపస్వభావాలు నిర్ణయించే జన్యువులు (Genes) ఉనికిలోకి వస్తాయి.

ఈ జన్యువులు క్రోమోజోములపై ఒక వరుస క్రమంలో ఉంటాయి. ప్రతి క్రోమోజోమ్‌లో వందలాది లేక వేలాది జన్యువులు ఉంటాయి. ఈవిధంగా మానవునికి సంబంధించిన ఒక జీవ కణంలో 30 వేల జన్యువులు ఉంటాయని తెలుస్తోంది. క్రోమోజోములు న్యూక్లియిక్ యాసిడ్స్, ప్రోటీన్ల కలయికవల్ల ఏర్పడుతాయి. న్యూక్లియిక్ యాసిడ్స్ (ఆమ్లాలు) రెండురకాలు. (1) డి ఆక్సిరిబో న్యూక్లియిక్ యాసిడ్ (D.N.A.), (2) రిబో న్యూక్లియిక్ యాసిడ్ (R.N.A.). ఈ డి.యన్.ఎ., ఆర్.యన్.ఎ.లు న్యూక్లియోటైడ్‌లు అనే పదార్థాల కలియకతో ఏర్పడుతాయి. ఒక్కొక్క జన్యువులో దాదాపు వేయిరకాల న్యూక్లియోటైడ్‌లు ఉంటాయి. డి.యన్.ఎ. తాలూకు అణువులు మెలికలు తిరిగి నిచ్చెన ఆకారంలో అమరి ఉంటాయి. నిచ్చెనకు కుడి ఎడమల వైపున దండీలు ఉన్నట్లు ఇవి ఏర్పడటం వల్ల వీటిని 'డబుల్ హెలిక్స్' అంటారు.

ఈ డి.యన్.ఎ. పోగులోనే మనిషి రూపురేఖల్ని, మానసిక లక్షణాల్ని నియంత్రించే 320 కోట్ల జన్యుసంకేతాలు ఉన్నాయి. మొత్తం మానవుల జన్యుసంకేతాలలో 99.99 శాతం సంకేతాలు ఒకే విధంగా ఉంటాయి. 0.01 శాతం మాత్రమే తేడాలు ఉంటాయి. ఈ తేడాలయినా విభిన్న జాతుల (తెగల)లోని వ్యక్తుల మధ్య కన్నా ఒకే సమాజంలోని విభిన్న వ్యక్తుల మధ్యే ఎక్కువగా ఉంటాయని తెలుస్తోంది. ఈ జన్యు సంకేతాల రహస్యాల్ని వెలికి తీయడానికి చేసిన ప్రయత్నంలో శాస్త్రవేత్తలు 97 శాతం విజయం సాధించినట్లు 27-6-2000 తేదీ, ఆ తరువాత 13-2-2001 తేదీ దిన పత్రికలన్నీ ప్రకటించాయి. 'హ్యూమన్ జెనోమ్ ప్రాజెక్ట్' ద్వారా 97 శాతం వరకు జన్యుపటాన్ని రూపొందించినట్లు (అమెరికా) శాస్త్రవేత్తలు తెలియజేశారు. మిగతా 3 శాతం మరో మూడేళ్ళలో పూర్తవుతుందని తెలుస్తోంది.

పత్రికల కథనం ప్రకారం దీనివల్ల జన్యు లోపాలను సరిచేయడం ద్వారా కేన్సర్, క్షయ, ఉబ్బసం, మధుమేహం, అధిక రక్తపోటు, ఎయిడ్స్, గుండె జబ్బులు, మెదడుపై ప్రోటీన్లు పేరుకు పోయి వచ్చే అల్జీమెర్స్, వణుకుతో కూడి పక్షవాతాన్ని తలపింపజేసే పార్కిన్‌సన్స్ మొదలైన మొండి వ్యాధులు, వంశపారంపర్య వ్యాధుల్ని నిర్మూలించవచ్చు. పొగాకుతో పాటు వివిధ మత్తు పదార్థాల దుర్వ్యసనాలను పోగొట్టవచ్చు. ఇరవై యేళ్ళ వయస్సు తరువాత రాబోయే వ్యాధిని గురించి ముందే హెచ్చరించవచ్చు. అపార మేధాసంపత్తిగల మనుషుల్ని సృష్టించవచ్చు.

మానవుడే ఇంతటి మేధా సంపన్నుడైతే, ఆ మానవుణ్ని సృష్టించిన దేవుడు మరెంతటి మేధా సంపన్నుడయి ఉంటాడు! అందుకే ఇదే అధ్యాయంలో దివ్య ఖుర్‌ఆన్ మానవ నిర్మాణం గురించి ప్రస్తావించిన తరువాత "ఆయన నిర్మాతలందరిలోకెల్లా గొప్ప ప్రతిభాశాలి" అని చెబుతోంది. అంతేకాదు, "మానవులు (ఎంతటి సుదీర్ఘకాలం జీవించినా ఏదో ఒక రోజు) చనిపోక తప్పదు. ఆ తరువాత (కర్మవిచారణ కోసం) ప్రళయ దినాన వారందర్నీ తిరిగి బ్రతికించి లేపడం జరుగుతుంది" అని కూడా ఖుర్‌ఆన్ చెబుతోంది. (23:15,16)

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పుకు తెర ఎత్తిన ఈ డి.యన్.ఎ. ప్రపంచంలోని ఏ ఇద్దరు మనుషుల్లోనూ ఒకేలా ఉండదు. అంటే ప్రపంచ జనాభా 600 కోట్లు ఉంటే, డి.యన్.ఎ. 600 కోట్ల రకాలుగా ఉంటుందన్నమాట. ఈ డి.యన్.ఎ. పోగు (Chain) పది పరమాణువుల వెడల్పు ఉండి, కొన్ని కోట్ల పరమాణువుల నిడివి కలిగి ఉంటుంది. కణ కేంద్రం (న్యూక్లియస్) నిడివి



ఆయన నిర్మాతలందరిలో కెల్లా గొప్పప్రతిభాశాలి. చివరికి మీరు చనిపోవలసి ఉంటుంది. ఆ తర్వాత ప్రళయదినాన మీరు తప్పకుండా లేపబడతారు. (12-16)

మేము మీపై (ఆకాశంలో) ఏడు మార్గాలు నిర్మించాము. సృష్టినిర్మాణం మాకు తెలియని పని కాదు. ఆకాశం నుంచి మేము లెక్క ప్రకారం ఒక నిర్ణీత పరిమాణంలో నీటిని దించి భూమిపై నిలువ చేస్తున్నాము. దాన్ని మేము తలచిన విధంగా అదృశ్యం కూడా చేయగలం. ఆ నీటితో మీకోసం ఖర్జూరం, ద్రాక్ష తోటలను ఉత్పత్తి చేస్తున్నాం. ఆ తోటలలో మీకోసం ఎన్నో మధురమైన పండ్లున్నాయి. వాటిని మీరు తింటున్నారు. సీనాయి కొండపై పెరిగే (ఆలివ్) వృక్షాన్ని కూడా మేమే ఉనికిలోకి తెచ్చాము. అందులో చమురూ ఉంది; తినేవారికి రుచికరమైన పదార్థం కూడా ఉంది. (17-20)

నిస్సందేహంగా పశువుల్లో కూడా మీకోసం మంచి గుణపాఠం ఉంది. మేము, వాటి కడుపులలో నుంచి ఒక పదార్థాన్ని (అంటే పాలను) మీకు త్రాగడానికి ప్రసాదిస్తున్నాము. వాటి వల్ల మీకు ఇతర ప్రయోజనాలు కూడా ఎన్నో ఉన్నాయి. వాటి (మాంసం)ని మీరు తింటారు. పశువులను, పడవలను మీరు వాహనాలుగా కూడా ఉపయోగిస్తారు. (21,22)

మేము నూహ్‌ని అతని జాతిప్రజల దగ్గరకు పంపాము. అతను వారితో "నాజాతి ప్రజలారా! ఏకైక దేవుణ్ని ఆరాధించండి. ఆయన తప్ప మీకు మరో ఆరాధ్యుడు లేడు. మీరు (దేవునికి) భయపడరా?" అని అన్నాడు. (23)

అతని జాతిలో సత్యాన్ని విశ్వసించడానికి నిరాకరించిన నాయకులు ఇలా అన్నారు: "ఈ మనిషి మీలాంటి మానవమాత్రుడే. అంతకు మించి మరేమీ కాదు. అతను మీమీద ఆధిక్యత పొందాలని చూస్తున్నాడు. దేవుడు (మన హితబోధ కోసం) ఎవరినైనా పంపదలచుకుంటే దైవదూతలను పంపేవాడు. (మానవులు ప్రవక్తలుగా వచ్చినట్లు) మేము మా తాతముత్తాల కాలం నుంచి ఎన్నడూ వినలేదు. ఇతనికేదో పిచ్చి పట్టింది. కాస్త వేచి చూడండి (పిచ్చి వదలుతుందేమో)" (24,25)

చివరికి నూహ్ (విసిగిపోయి) "ప్రభూ! వీరు నన్ను తిరస్కరించారు. ఇక నీవే నాకు సహాయం చేయాలి" అని ప్రార్థించాడు. (26)

అప్పుడు మేమిలా సూచించాము: "మా పర్యవేక్షణలో మా సూచన ప్రకారం ఒక ఓడ నిర్మించుకో. మా ఆజ్ఞతో కుంపటి పొంగిపొర్లగానే ప్రాణులలో ప్రతి జాతికి చెందిన

---

మిల్లీ మీటర్‌లో 1000వ భాగం మాత్రమే అయినప్పటికీ, అందులో చుట్టలుగా చుట్టుకొని ఉండే ఈ డి.యన్.ఎ. పోగు సాగదీస్తే ఒక మీటర్ పొడవు ఉంటుంది. ఒక మనిషిలో ఉండే మొత్తం జీవకణాలలోని డి.యన్.ఎ. పోగులు కలిపితే అది కోటానుకోట్ల మైళ్ళు చుట్టుకొలత కలిగిన మన సూర్యకుటుంబాన్నే చుట్టివేస్తుందట!

"ఆయన అనుక్షణం సృష్టికి సంబంధించిన ఏదో ఒక అద్భుత కార్యంలో నిమగ్నుడయి ఉంటాడు. కనుక (మానవులారా!) మీరు మీ ప్రభువులో ఉన్న ఏ సృజనాత్మక లక్షణాలను నిరాకరించగలరు?" (దివ్య ఖుర్‌ఆన్- 55:29,30)

ఒక్కొక్క జంటను తీసుకొని ఓడలోకి ఎక్కు. నీ భార్యాపిల్లల్ని కూడా వెంటబెట్టుకో. అయితే (శిక్షకు కోసం) ముందే మేము నిర్ణయించిన వారిని మాత్రం ఓడలో ఎక్కించుకోవద్దు. దుర్మార్గులను గురించి నా దగ్గర ఏమీ మాట్లాడకూడదు. వారిప్పుడు మునిగిపోనున్నారు. నీవు నీసహచరులతో పాటు ఓడలోకి ఎక్కిన తర్వాత 'మమ్మల్ని దుర్మార్గుల బారినుండి కాపాడిన దేవునికి కృతజ్ఞతలు' అని చెప్పు. ఇంకా 'ప్రభూ! నన్ను శుభప్రదేశంలో దించు. నీవు ఎంతో మంచిచోటు ప్రసాదించేవాడవు' అని వేడుకో." (27-29)

ఈ గాథలో గొప్ప సూచనలున్నాయి. మేము (మానవుల్ని కష్టసుఖాలు, లాభనష్టాల ద్వారా) పరీక్షకు గురిచేస్తూనే ఉంటాము. (30)

వారి తర్వాత మేము మరోజాతిని రంగంలోకి తెచ్చాం. వారి దగ్గరకు వారి నుండే ఒకడ్ని ప్రవక్తగా చేసి పంపాము. అతను (హితవు చేస్తూ) "దేవుడ్ని ఆరాధించండి. ఆయన తప్ప మీకు మరోఆరాధ్యుడు లేడు. మీరు (దేవునికి) భయపడరా?" అన్నాడు. (31,32)

అతని జాతిపెద్దలు అవిశ్వాసులైపోయి పరలోక సంభవాన్ని తిరస్కరించారు. ప్రపంచ జీవితంలో వారిని మేము ఎంతో సుఖంగా ఉంచాము. (దానికి) వారు (మాపట్ల కృతజ్ఞులయి ఉండటానికి బదులు మా ప్రవక్తను ధిక్కరిస్తూ) ఇలా అన్నారు:

"ఈ వ్యక్తి మీలాంటి మానవుడే తప్ప మరేమీ కాదు. మీరు తినేది, త్రాగేదే ఇతనూ తింటున్నాడు, త్రాగుతున్నాడు. అలాంటి ఒక మానవమాత్రుడికి విధేయులైపోతే మీరు చాలా నష్టపోతారు. మనం చనిపోయి, మట్టిలో కలిసి ఎముకల గూడుగా మారిన తరువాత మళ్ళీ బ్రతికించి లేపబడతామట! అసంభవం. మనకు చేస్తున్న ఈ వాగ్దానం నెరవేరేది కాదు. జీవితం అంటే మరేమీ కాదు. ఈ ప్రపంచజీవితమే జీవితం. ఇక్కడే మనం చావాలి, ఇక్కడే బ్రతకాలి. మనం (మళ్ళీ బ్రతికించి) లేపబడే ప్రసక్తే లేదు. ఇతను దేవుని పేరుతో అభూతకల్పనలు ప్రచారం చేస్తున్నాడు. కనుక మనం ఇతడ్ని ఎన్నటికీ నమ్మకూడదు." (33-38)

చివరికి ఆ ప్రవక్త (విసిగిపోయి) "ప్రభూ! వీరు నన్ను తిరస్కరించారు. ఇక నీవే నాకు సహాయం చేయాలి" అన్నాడు. దానికి జవాబుగా "వారు తమ అకృత్యాల పట్ల పశ్చాత్తాపం చెందే (ప్రళయ)దినం ఎంతో దూరం లేదు" అని చెప్పబడింది. (39,40)

చివరికి సత్యప్రాదిపదికపై ఓ భయంకరమైన విస్ఫోటం వారిపై వచ్చిపడింది. మేము వారిని చెత్తాచెదారంగా మార్చి విసరేశాం...కనుక దుర్మార్గులారా! దూరంగా ఉండండి!! (41)

వారి తర్వాత మేము మరికొన్ని జాతులను ఉద్ధరించాము. (వాటిలో) ఏ జాతి కూడా దాని నిర్ణీతకాలానికి ముందుగా పోవడంగాని, ఆ తర్వాత నిలిచి ఉండటంగాని జరగలేదు. మేము ప్రవక్తలను ఒకరి తరువాత నొకరిని వరుసగా పంపుతూ వచ్చాము. ఏదైనా జాతి దగ్గరకు దాని ప్రవక్త వచ్చినప్పుడు ఆ జాతిప్రజలు అతడ్ని తిరస్కరించేవారు. మేము కూడా అలాంటి జాతులను ఒకదాని తరువాత ఒకటి వరుసగా అంతమొందిస్తూ చివరికి వాటిని గాథలుగా మార్చివేశాము... విశ్వసించనివారి నాశనం గాను! (42-44)



ఆ తర్వాత మేము మూసాకు, అతని అన్న హారూన్‌కు కొన్ని సూచనలు, స్పష్టమైన నిదర్శనాలు ఇచ్చి ఫిరౌన్, అతని అధికారుల దగ్గరకు పంపాము. అయితే ఫిరౌన్, అతని అధికారులు గర్వపోతులయి పోయారు. వారసలు మహా తలబిరుసు మనుషులు. "మనలాంటి మానవమాత్రులిద్దరిని మనం నమ్మాలా? అదీగాక వారి జాతి ప్రజలు మనకు కట్టుబానిసలు" అన్నారు వారు. ఇలా వారా ఇద్దర్నీ తిరస్కరించి, నాశనమయ్యే వారిలో చేరిపోయారు. ప్రజలు సన్మార్గం తెలుసుకోవడానికి మేము మూసాకు దివ్యగ్రంథం ప్రసాదించాము. (45-49)

మర్యం కుమారుడ్ని, అతనితల్లిని మేము సూచనగా చేశాం. వారిద్దర్నీ నీటిబుగ్గలతోపాటు సకల సౌకర్యాలున్న ఒక ఎత్తయిన, చదునైన ప్రదేశంలో ఆశ్రయం కల్పించాం. (50)

"ప్రవక్తలారా! (మేము ప్రసాదించిన) పరిశుద్ధ పదార్థాలు[4] తింటూ సత్కార్యాలు చేస్తూ ఉండండి. మీరు చేసేదంతా నాకు తెలుసు. మీ సమాజమంతా ఒకే (ధర్మానికి చెందిన) సమాజం. నేను మీ ప్రభువును. కనుక మీరు నాకు మాత్రమే భయపడుతూ ఉండాలి" (అని చెప్పాము). (51,52)

అయితే ఆ తరువాత ప్రజలు తమ ధర్మాన్ని చీల్చుకొని విభిన్న వర్గాలుగా విడిపోయారు. ప్రతివర్గం తన దగ్గరున్నదానిలో తలమునకలైఉంది. సరే వదిలెయ్యి వారిని

---

4. ఒకవైపు నమాజ్, రోజా, జకాత్, హజ్ లాంటి పుణ్యకార్యాలు చేస్తూ మరోవైపు అక్రమ పద్ధతుల ద్వారా ధనార్జన చేసి సుఖాలు అనుభవించడం ధర్మపరాయణత అన్పించుకోదు.

ప్రవక్త ప్రవచనం: "ఒక వ్యక్తి సుదూర ప్రయాణం చేసి దుమ్ము ధూళి కొట్టుకొని వస్తాడు. అతను ఆకాశం వైపు చేతులెత్తి ప్రభూ! ప్రభూ! అంటూ ప్రార్థిస్తాడు. కాని అతను తిన్నది అధర్మమైన తిండి, అతను కట్టుకున్నవి అధర్మ వస్త్రాలు, అతని శరీరం అక్రమ సంపాదనతో పోషించబడింది. అలాంటప్పుడు అతని ప్రార్థన ఎలా స్వీకరించబడుతుంది?" (ముస్లిం, తిర్మిజి)

ప్రాతిపదికలపై ఏర్పడే దురభిమానాలతో, ఇతర బలహీనలతో సతమతమయ్యే మానవులు ఇలాంటి ''సువ్యవస్థ''ను నిర్మించుకోలేరు. దాన్ని మానవుల సృష్టికర్త, సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు, ప్రభువు, పోషకుడు అయిన దేవుడు మాత్రమే నిర్మించగలడు. ఆయన మాత్రమే ఇలాంటి వ్యవస్థ ద్వారా మానవుల్ని అదుపు చేస్తూ ప్రపంచంలో శాంతి సుస్థిరతలు, నీతి న్యాయాలను నెలకొల్పగలడు.

మన మెదడు కేంద్రనాడీమండల వ్యవస్థ ద్వారా మన శరీరాన్ని, అవయవాల్ని కంట్రోల్ చేస్తూ మన ఆరోగ్యానికి, మన కార్యకలాపాల సక్రమ నిర్వహణకు ఎలా దోహదపడుతున్నదో, దేవుడు కూడా తాను నిర్ణయించిన "ఏకదైవారాధనా విధానం" (అంటే ఇస్లాం) ద్వారా మానవుల్ని కంట్రోల్ చేస్తూ వారి పరస్పర సంబంధాలకు, శాంతియుతమైన జీవితానికి దోహదపడతాడు. అంతే కాదు, ఈ విధానం ద్వారా మానవుడు పరలోకంలో దేవుని ప్రసన్నత, శాశ్వత స్వర్గసౌఖ్యాలకు కూడా అర్హుడవుతాడు. ఇలాంటి జీవనవిధానాన్ని, సామాజిక వ్యవస్థను, దైవధర్మాన్ని మానవుడు త్రోసిపుచ్చుతున్నాడంటే, అతను తనకు శ్రేయస్కరమయిన సొంత జీవిత విధానానికే తూట్లు పొడిచి ఇహలోకంలో అశాంతిని, పరలోకంలో నరక యాతనలను చేజేతులా కొని తెచ్చుకుంటున్నాడన్న మాట. (దీంతో పాటు 21:10 సూక్తి కూడా చూడండి.)

వారిమానాన. ఓ నిర్ణీత సమయం వరకు ఏమరుపాటులోనే పడివుండనీ. (53,54)

మేము వారికి సంతానం, సిరిసంపదలిచ్చి సహాయం చేస్తుంటే, అదే పనిగా మేము తమకు మేళ్ళు చేకూర్చుతున్నామని భావిస్తున్నారా వారు? కాదు. అసలు విషయం వారు గ్రహించడం లేదు. తమ ప్రభువు పట్ల భయభక్తులు కలవారే మేళ్ళ వైపు (అంటే స్వర్గసౌఖ్యాలకు కారణమయ్యే సత్కార్యాలవైపు) పరుగిడుతూ వాటిని పొందుతారు. వారు తమ ప్రభువు పంపిన సూక్తుల్ని, ఆయన సూచనల్ని విశ్వసిస్తారు. తమ ప్రభువుకు ఎవరినీ సాటి కల్పించరు. వారు ఏదిచేసినా తాము (ఓరోజు) తమ ప్రభువు దగ్గరకు పోవలసి ఉందన్న భావనతో భయపడుతూ చేస్తారు. (55-61)

మేము ఏ మనిషిపైనా అతని శక్తికి మించిన భారం వేయము. మాదగ్గర ఒక గ్రంథం ఉంది. అందులో (ప్రతి ఒక్కరి స్థితిగతుల్ని గురించి) వాస్తవిక విషయాలన్నీ ఉన్నాయి. కనుక ఎవరికీ ఎలాంటి అన్యాయం జరిగే ప్రసక్తి లేదు. (62)

కాని ఈ విషయం గురించి వారు ఏమరుపాటులో పడిపోయారు. కనుక వారి ఆచరణ కూడా దీనికి భిన్నంగా ఉంది. మేము వారిలో భోగభాగ్యాల్లో మునిగితేలుతున్నవారిని పట్టుకునేదాకా వారు (దారికి రాకుండా) ఆ పనులే చేస్తుంటారు. చివరికి మాకు పట్టుబడిపోగానే వారు ఏడ్పులు, పెడబొబ్బలు పెట్టడం మొదలెడ్తారు. (63,64)

“ఇక మీ ఏడ్పులు, పెడబొబ్బలు ఆపేయండి. మీరు ఎంత ఏడ్చి మొత్తుకున్నా మా నుండి మీకు ఎలాంటి సహాయం లభించదు. నా సూక్తులు విన్పిస్తుంటే మీరు ముఖం తిప్పుకొని వెళ్ళిపోయేవారు. అహంకారంతో వాటిని ఖాతరు చేసేవారు కాదు. కట్టుకథలతో, వ్యర్థ ప్రలాపాలతో కాలం వెళ్ళబుచ్చేవారు.” (65-67)

వారు ఈ‘వాణి’ని గురించి (ఎప్పుడైనా) ప్రశాంతంగా ఆలోచించారా? లేక వారి పూర్వీకుల దగ్గరకు రానటువంటి కొత్త విషయం ఏదైనా అతను తీసుకువచ్చాడా? లేక వారు తమ ప్రవక్తను గురించే అసలు ఎరగరా అతడ్ని నిరాకరించడానికి? లేక వారతడ్ని పిచ్చివాడని భావిస్తున్నారా? ఇవేమీ కాదు. అతను సత్యాన్ని తీసుకొని వచ్చాడు. అది వారిలో అనేక మందికి మింగుడు పడటం లేదు. (68-70)

ఒకవేళ సత్యం వారిమనోవాంఛలకు అనుగుణంగా పనిచేస్తుంటే భూమ్యాకాశాలు, వాటిలోఉన్న సృష్టిరాసులవ్యవస్థంతా ఛిన్నాభిన్నమైపోయేది...కాదు, మేము వారి దగ్గరకు వారి ప్రస్తావనే[5] తీసుకొచ్చాం. కాని వారు తమ ప్రస్తావన పట్లే విముఖులైపోతున్నారు. నీవు వారిని ఏదైనా ప్రతిఫలం అడుగుతున్నావా? నీకు నీప్రభువు ప్రసాదించినదే శ్రేష్ఠమైనది. ఆయన ఎంతో మంచి ఉపాధిప్రదాత. నీవసలు వారిని సన్మార్గంవైపు పిలుస్తున్నావుగాని, పరలోకాన్ని విశ్వసించనివారు సన్మార్గం తప్పి నడవగోరుతున్నారు. (71-74)

మేము దయదలచి వారిపై వచ్చిపడిన ఆపదను గనక దూరం చేస్తే, వారు (మాపట్ల కృతజ్ఞులయి ఉండటానికి బదులు) తలబిరుసుతో మరింత దారితప్పి

6. వివరాలకు 8:51 సూక్తి, దాని పాదసూచిక చూడండి



నడుస్తారు. మేము వారిని ఆపదకు గురిచేసినా వారు తమ ప్రభువుకు లొంగలేదు; ఆయన్ని దీనంగా వేడుకోలేదు. చివరికి మేము వారికి కఠినశిక్ష విధించగానే వారి పరిస్థితి ఎలా మారుతుందో చూడు.. వారు ఒక్కసారిగా అన్ని వైపులనుండి పూర్తిగా నిరాశానిస్పృహలకు లోనైపోతారు. (75-77)

మీకు వినే, చూసే శక్తులతోపాటు ఆలోచించేందుకు హృదయమిచ్చినవాడు దేవుడే కదా! కాని మీరు ఆయనకు చాలా తక్కువగా కృతజ్ఞత చూపుతున్నారు. ఆయనే మిమ్మల్ని ధరణిలో వ్యాపింపజేశాడు. చివరికి ఆయన దగ్గరికే మీరు పోవలసి ఉంది. మీకు జీవన్మరణాలు కలిగిస్తున్నవాడు కూడా ఆయనే. రేయింబవళ్ళ చక్రభ్రమణానికి కూడా ఆయనే మూలకారకుడు. ఈ విషయాలను మీరు అర్థంచేసుకోరా? (78-80)

వారు తమకు పూర్వం గతించిన వారిలాగానే ఇలా అంటున్నారు: “మనం చనిపోయి మట్టిలో మట్టయి ఎముకలగూడుగా మారిపోయాక మళ్ళీ బ్రతికించి లేపడం జరుగుతుందా? ఇలాంటి వాగ్దానాలు మనం చాలా విన్నాంలే. పూర్వం మన తాతముత్తాతలు కూడా విన్నారు. ఇవన్నీ పూర్వీకుల పుక్కిటిపురాణాలు మాత్రమే.” (81-83)

(సరే) “ఈ భూమి, ఇందులో ఉన్నదంతా ఎవరిదో చెప్పండి, మీకు తెలిస్తే?” అని అడుగు. వారు ఇవన్నీ దేవునివే అని తప్పకుండా అంటారు. “అయితే మీరు స్పృహలోకి ఎందుకు రారు?” అని అడుగు. (సరే) “సప్తాకాశాలకు, మహోన్నత సింహాసనానికి యజమాని ఎవర”ని అడుగు. వారు దేవుడే అని తప్పకుండా అంటారు. “అలాంటప్పుడు మీరు (ఆ దేవునికి) ఎందుకు భయపడర”ని అడుగు. (84-87)

(పోని, ఈ సృష్టివ్యవస్థలో) “ప్రతి వస్తువుపై పాలనాధికారం ఎవరికుందో చెప్పండి మీకు తెలిస్తే” అని వారిని అడుగు. (వారు తప్పకుండా దేవునికే ఉందని చెబుతారు.) అలాగే “(మీకు) ఆశ్రయమిచ్చేవాడు ఒకడున్నాడు; ఆయనకు వ్యతిరేకంగా మరెవరూ (మీకు) ఆశ్రయమివ్వలేరు. అలాంటి శక్తిస్వరూపుడెవరు”అని అడుగు. దేవుడే అని వారు తప్పకుండా అంటారు. “మరయితే మీరు ఎలా మోసపోతున్నార”ని అడుగు. (88,89)

మేము సత్యాన్ని వారిముందు ఉంచాం. వారేమో అసత్యవాదులు. దేవుడు ఎవరినీ సంతానంగా చేసుకోలేదు. ఆయనతో పాటు మరే దేవుడూ లేడు. ఇతర దేవుళ్ళు ఉన్నట్లయితే ప్రతి దేవుడూ తనసృష్టి తీసుకొని వేరయిపోతాడు. తర్వాత వారంతా ఒకరిపైమరొకరు దాడికి దిగుతారు. దేవుడు వారి అభూతకల్పనలు అంటని పరిశుద్ధుడు; గోచర, అగోచరాలు ఎరిగినవాడు. వీరు ఆపాదిస్తున్న బహుదైవారాధనకు ఆయన ఎంతో అతీతుడు. (90-92)

ప్రవక్తా! ఇలా వేడుకో: “ప్రభూ! ఏశిక్ష గురించి వారిని భయపెట్టడం జరుగుతున్నదో ఆ శిక్షను నేను బ్రతికుండగానే నీవు (వారిపైకి) తీసుకురాదలిస్తే, ప్రభూ! నన్నీ దుర్మార్గులలో చేర్చకు”. మేము (తలచుకుంటే) వారిని ఏవిషయమై హెచ్చరిస్తున్నామో ఆవిషయాన్ని (శిక్షను) నీ కళ్ళముందే తీసుకురాగలం. అంతటి శక్తి మాకుంది. (93-95)

ముహమ్మద్ (స)! చెడును అత్యంత శ్రేష్ఠమైన పద్ధతితో నిర్మూలించు. నీ గురించి వారు కల్పిస్తున్న విషయాలేమిటో మాకు బాగాతెలుసు. (కనుక) ఇలా వేడుకో: "ప్రభూ! నేను దుష్టశక్తుల ప్రేరణ నుంచి నీశరణు కోరుతున్నాను. దుష్టశక్తులు నా దరిదాపులకు రావడమనే బెడద నుంచి కూడా నేను నీశరణు కోరుతున్నాను." (96-98)

(వారు తమ అకృత్యాలు మానుకోరు.) చివరికి వారిలో ఎవరికైనా చావు మూడి నప్పుడు అతను (పశ్చాత్తాపంతో) "ప్రభూ! నేను వదలి వచ్చిన ప్రపంచానికి నన్ను మరో సారి పంపించు. నేనిప్పుడు (నా ప్రవర్తన మార్చుకొని) సత్కార్యాలు చేస్తాను" అంటాడు. అలా ఎన్నటికీ జరగదు. అతను పనికిమాలిన మాటలు వదరుతున్నాడు.

(చనిపోయిన) వారందరి వెనుక ఇప్పుడొక అడ్డుతెర[6] ఏర్పడింది. పునరుత్థాన దినం వరకు వారు ఆ స్థితిలోనే ఉంటారు. ఆ తర్వాత (ప్రళయ) శంఖం పూరించగానే వారి మధ్య ఎలాంటి మైత్రి, బాంధవ్యం లేకుండా పోతుంది. వారు పరస్పరం (మంచి సెబ్బరలు కూడా) విచారించుకోరు. (99-101)

అప్పుడు ఎవరి (కర్మల) త్రాసుపళ్లాలు బరువుగా ఉంటాయో వారు కృతార్థు లౌతారు. మరెవరి (కర్మల) త్రాసుపళ్లాలు తేలికగా ఉంటాయో వారు ఆత్మ వినాశకు లవుతారు. వారిక నరకంలో శాశ్వతంగా ఉంటారు. నరకాగ్ని వారి ముఖచర్మాన్ని మాడ్చివేస్తుంది. దాంతో వారి పళ్ళు, దవడలు బయటికి వస్తాయి. (102-104)

"నా సూక్తులు విన్పించబడుతున్నప్పుడు వాటిని మీరు నిరాకరిస్తుండేవారు కదూ?" అప్పుడు వారు ఇలా అంటారు: "ప్రభూ! మా దౌర్భాగ్యమే మా కొంప ముంచింది. మేము నిజంగా మార్గభ్రష్టులయి పోయాము. ప్రభూ! మమ్మల్ని ఇక్కడ్నుంచి తీసెయ్యి. ఆ తరువాత మేము మళ్ళీ తప్పుచేస్తే దుర్మార్గులయి పోయినట్లే." (105-107)

దానికి దేవుడు ఇలా అంటాడు: "దూరంగా ఉండండి. అందులోనే పడి (మాడుతూ) ఉండండి. నాతో అసలు మాట్లాడకండి. నా భక్తులు కొందరు నన్ను వేడుకుంటూ 'ప్రభూ! మేము విశ్వసించాము. మమ్మల్ని క్షమించు. మామీద దయచూపు. నీవు దయామయులలో కెల్లా గొప్ప దయామయుడవు' అని అంటున్నప్పుడు వారిని మీరు హేళచేసేవారు. చివరికి ఈ వైఖరి నేను దేవుడనే విషయాన్ని కూడా మిమ్మల్ని మరిపింపజేసింది. అంతేకాకుండా మీరు (ఎల్లప్పుడూ) వారిని ఆట పట్టిస్తుండేవారు. వారు సహనం వహించినందుకు ప్రతి ఫలంగా ఈరోజు నేను వారికి మోక్షం ప్రసాదిస్తున్నాను." (108-111)

ఆ తరువాత దేవుడు వారిని "మీరు ప్రపంచంలో ఎంతకాలం ఉన్నారో చెప్పండి" అని అడుగుతాడు. దానికి వారు "ఒకరోజో లేక ఒక పూటో మేమక్కడ ఉన్నాము.[7] లెక్కించే వారిని అడగండి" అని అంటారు. (112)

7. వివరాలకు 79:46 సూక్తి, దాని పాదసూచిక చూడండి.



అప్పుడు ఆయన ఇలా అంటాడు: "మీరక్కడ కొంతకాలం మాత్రమే ఉన్నారు. ఆనాడే మీరీ సంగతి గ్రహించి ఉంటే ఎంత బాగుండేది! మేము మిమ్మల్ని ఎలాంటి లక్ష్యం లేకుండా వృధాగా పుట్టించామని భావించారా? మీరు మా దగ్గరికి రావలసి ఉండదని అనుకున్నారా?" (113-115)

దేవుడు మహోన్నతుడు, సర్వాధికారి, విశ్వసామ్రాజ్యాధినేత. ఆయన తప్ప మరే ఆరాధ్యుడు లేడు. ఆయన ప్రతిష్ఠాత్మక సింహాసనానికి అధిపతి. ఎలాంటి ప్రమాణం లేక పోయినా దేవునితో పాటు ఇతర (మిథ్యా) దైవాలను వేడుకునేవాడు (తప్పించుకొని ఎక్కడికీ పారిపోలేడు), అతని లెక్కపత్రం అతని ప్రభువు దగ్గర సిద్ధంగా ఉంది. అలాంటి తిరస్కారులు ఎన్నటికీ మోక్షం పొందలేరు. (116,117)

ముహమ్మద్ (స)! ఈవిధంగా నన్ను వేడుకో: "ప్రభూ! నన్ను క్షమించు, నామీద దయజూపు. నీవు దయామయులలో కెల్లా గొప్ప దయామయుడవు." (118) ✪

## 24-జ్యోతి(నూర్)

**అవతరణ: మదీనా** **సూక్తులు: 64**

ఈ అధ్యాయాన్ని "నూర్" అంటారు. ఇందులో శిక్షాస్మృతి, సామాజిక విషయాలు, నైతిక నియమావళి, ముస్లింల పరస్పర సంబంధాలను గురించి అనేక ఆదేశాలు, హితవులు ఇవ్వబడ్డాయి. అదీగాక ఈ అధ్యాయంలో అమాయక స్త్రీలపై నీలాపనిందలు మోపిన కపటవిశ్వాసుల్ని తీవ్రంగా మందలించడం కూడా జరిగింది.

ఈ అధ్యాయం హి.శ. అయిదవ సంవత్సరం షాబాన్ నెల ఆరవ తేదీన జరిగిన 'బనీముస్తలిఖ్' దండయాత్ర తరువాత హి.శ. ఆరవ సంవత్సరం ద్వితీయార్ధంలో అవతరించినట్లు తెలుస్తోంది. ఇందులో బనీముస్తలిఖ్ యుద్ధం తరువాత జరిగిన సంఘటన గురించే ఎక్కువగా ప్రస్తావించబడింది. కనుక వాటి పూర్వపరాలను గురించి తెలుసుకోవడం చాలా అవసరం.

ఎన్ని అవాంతరాలు ఎదురైనా బదర్ యుద్ధం నుండి అహ్జాబ్ యుద్ధం వరకు ఇస్లాంకు లభించిన విజయాలు చూసిన బహుదైవారాధకులు, యూదులు, కపట విశ్వాసులు ఇక ముస్లింలను సైనికశక్తితో, ఆయుధాలతో ప్రతిఘటించడం సాధ్యం కాదని గ్రహించారు. యావత్తు అరేబియాలో ఇస్లాం ఇంతటి అజేయశక్తిగా ఎదిగిపోవడా నికి, అతివేగంగా విస్తరించడానికి కారణం ముస్లింల సంఖ్యగాని, వారి ఆయుధ సంపత్తిగాని, ఆర్థిక స్తోమతగాని ఎంతమాత్రం కాదు.

జనసంఖ్య విషయానికి వస్తే అప్పుడు మొత్తం అరేబియా జనాభాలో వారు ఒక్క శాతం కూడా లేరు. పైగా వారి సైనిక సంఖ్యకు తగినట్లు ఆయుధ సంపత్తి కూడా లేదు. ఆర్థికంగా కూడా వారు ఎంతో వెనకబడి ఉన్నారు. పైపెచ్చు వారు చాలీచాలని తిండితో నకనకలాడుతూ, ఒక్కోసారి పస్తులతో గడుపుతుండేవారు. ముస్లింల విజయ పరంపరలకు మూలకారణం ఇస్లాం ధర్మంపై వారి అచంచల విశ్వాసంతో పాటు, మచ్చలేని అత్యున్నత సుగుణ సంపత్తి మాత్రమే. ఈ నైతిక, ఆధ్యాత్మికాయుధమే వారిని ప్రగతి శిఖరాలకు చేర్చుతోంది.

ఈవాస్తవం ఇస్లాంవ్యతిరేక శక్తులక్కూడా తెలుసు. కాని సాధారణంగా దుర్జనులు సజ్జనుల ప్రగతి విజయాలకు కారణభూతమైన సద్గుణసంపత్తిని అలవరచుకోవడానికి బదులు, సజ్జనుల్లో కూడా తమ దుర్గుణాలు, దుర్లక్షణాలను వ్యాపింపజేయడానికి ప్రయత్నిస్తారు. అది సాధ్యంకాని పక్షంలో సజ్జనుల సద్గుణసంపత్తి, నీతినడవడికల్ని ప్రజల్లో సందేహాస్పదం చేయడానికి వారిపై అపనిందలు మోపడానికి ప్రయత్నిస్తారు. ఇస్లాంవ్యతిరేక శక్తులు కూడా ముస్లింలను ఇప్పుడు సాయుధపోరాటం ద్వారా ఎదిరించలేక వారి సచ్ఛీలంపై బురద చల్లడానికి పాల్పడ్డారు. ఈ నిర్వాకాన్ని బయటి శత్రువులకన్నా అంతర్గత శత్రువులైన కపటవిశ్వాసులే బాగా నిర్వహించగలరు. కాబట్టి వారే ఈ కుచేష్టల కోసం రంగంలోకి దిగారు.

అరేబియాలో పెంపుడుకొడుక్కు అన్నివిధాలా కన్నకొడుకు స్థానమిచ్చే దురాచారం ఎంతోకాలం నుండి సాగుతూవస్తోంది. మహనీయ ముహమ్మద్ (స) అంతిమ దైవ ప్రవక్తగా ఈ దురాచారాన్ని కూడా శాశ్వతంగా అంతమొందించడానికి, దైవాజ్ఞతో తన పెంపుడుకొడుకు (జైద్ బిన్ హారిసా) చేత గత్యంతరంలేని పరిస్థితిలో అతని భార్య (జైనబ్ బిన్త్ హజష్)కు విడాకులిప్పించి ఆమెను వివాహం చేసుకున్నారు. అప్పుడు కపటులు దీన్ని సువర్ణవకాశంగా తలచి దైవప్రవక్త (స)కు వ్యతిరేకంగా పెద్ద దుమారం లేవదీశారు. ఆయన తనకోడలిపై మనసు పడ్డారని, ఈ ప్రేమ వ్యవహారం తెలుసుకున్న ఆయన కొడుకు తనభార్యకు విడాకులిచ్చి వదిలించుకున్నాడని, ఆతర్వాత ఆమెను ఈయనగారు నిస్సిగ్గుగా పెళ్ళి చేసుకున్నారని ఆ దుర్మార్గులు దుష్ప్రచారం ప్రారంభించారు. బయట యూదులు, బహుదైవారాధకులు వారితో గొంతుకలిపి దైవప్రవక్త (స)ను మరింత అప్రతిష్ఠపాలుజేయడానికి రకరకాల కట్టుకథలల్లి వ్యాపింపజేశారు.

హజ్రత్ జైనబ్ (రజి) దైవప్రవక్తకు స్వయాన మేనత్త కూతురే. ఆమెను ఆయన బాల్యం నుండి చూస్తూనేఉన్నారు. ఎప్పుడో ఒకటిరెండు సార్లు చూసి మనసు పడ్డారన్న ప్రశ్నే తలెత్తదు. అలాంటి జైనబ్ (రజి)ను ఆయన కోరుకుంటే మొదటే నిరభ్యంతరంగా చేసుకునేవారు. కాని ఆయన దైవప్రవక్తగా సమాజంలో ఎన్నో సంస్కరణలు చేయవలసి ఉండింది. అందులో ఒకటి మానవసమానత్వం కూడా ఉంది. కుల, గోత్ర, జాతి, తెగల విచక్షణలేని సమానత్వం కోసం ఆయన కృషిచేశారు. ఈ పనిని ముందుగా తన వంశం నుండే ప్రారంభించడానికి హజ్రత్ జైద్ (రజి)కు జైనబ్ (రజి)ని ఇచ్చి వివాహం చేశారు.

హజ్రత్ జైద్ (రజి) బానిస అయినందున ఆయన్ని చేసుకోవడానికి గొప్పింటి బిడ్డయిన జైనబ్‌కు ఏమాత్రం ఇష్టం లేదు. దైవప్రవక్త (సల్లం) తెచ్చిన వత్తిడి వల్లనే ఆమె విధిలేక ఈపెళ్ళి చేసుకోవాల్సి వచ్చింది. ఇష్టంలేని వివాహబంధం ఎంతకాలం సాగుతుంది? అందువల్ల పెళ్ళయి యేడాది తిరక్క ముందే ఆ సంసారంలో చిటపటలు తారస్థాయికి చేరుకున్నాయి. కపటవిశ్వాసులైన కొందరు అమ్మలక్కలు కూడా తోడయి ఈఅగ్నికి ఆజ్యం పోశారు. చివరికి పరిస్థితి విడాకులదాకా వచ్చింది. విడాకుల్ని నిరోధించడానికి దైవప్రవక్త (స) చేసిన ప్రయత్నాలు ఫలించ లేదు. చివరికి విడాకుల తరువాత దైవప్రవక్త (స) తనకు ఇష్టంలేకపోయినా దైవాజ్ఞతో ఆమెను వివాహమాడవలసి వచ్చింది.

ఆ తరువాత కపట విశ్వాసులు తమ దుష్టపథకం ప్రకారం 'బనీ ముస్తలిఖ్' యుద్ధం నుండి తిరిగి వస్తున్నప్పుడు మరొక దుమారం లేవదీశారు. బనీ ముస్తలిఖ్



తెగవాళ్ళు ఎర్రసముద్రం తీరాన జిద్ద, రాబిగ్‌ల మధ్య 'మురసీ' నీటిబుగ్గ ప్రాంతంలో నివసిస్తుండేవారు. హిజ్రీ శకం ఆరవ సంవత్సరం షాబాన్ నెలలో ఈ తెగవాళ్ళు మదీనాపై దాడి చేయడానికి యుద్ధసన్నాహాలు చేస్తున్నారని దైవప్రవక్త (సల్లం)కు సమాచారం అందింది. ఆయన వెంటనే సైన్యం తీసుకొని వారిని ఎదుర్కోవడానికి మదీనా నుండి బయలుదేరారు. దైవప్రవక్త (స) మురసీ ప్రాంతానికి చేరుకోగానే బనీ ముస్తలిఖ్ తెగపై మెరుపుదాడి చేశారు. ఈ యుద్ధంలో ఆతెగ నాయకుడు హారిస్ బిన్ జిరార్ వధించబడగానే అతని సైనికులు భీతావహులై పలాయనం చిత్తగించారు.

ఈ దండయాత్రలో కపటవిశ్వాసులు కూడా పాల్గొన్నారు. పగటివేషధారులయిన ఈ దుర్మార్గులు ముస్లింలలో విభేదాలు సృష్టించడానికి, వారిపై అపనిందలు మోపడానికి అనుక్షణం అదను కోసం కాచుకొని ఉంటారు. యుద్ధం ముగిసిన తర్వాత సైన్యం ఇంకా మురసీ ప్రాంతం నుండి బయలుదేరక ముందే నీళ్ళ విషయంలో ఇద్దరు ముస్లింల మధ్య తగాదా వచ్చింది. ఇది చిలికి చిలికి గాలివానలా తయారయి అన్సార్, ముహాజిర్ ముస్లింలు పరస్పరం తలపడటానికి సిద్ధమయ్యారు. సమయానికి దైవప్రవక్త (సల్లం) వచ్చి సర్ది చెప్పడంతో జగడం ఆగిపోయింది.

అయితే కపటవిశ్వాసుల నాయకుడు అబ్దుల్లా బిన్ ఉబై అన్సార్‌ముస్లింలను రెచ్చగొడ్తూ "ఈ ముహాజిర్‌లు మనమీద విరుచుకుపడ్డారంటే దీనికి మీరే కారకులు. మీరే వాళ్ళను మదీనాకు రప్పించి చోటు కల్పించారు. మీ ఆస్తులలో భాగం కూడా ఇచ్చి పోషించారు. దానికి ప్రతిఫలంగా వీరీనాడు మీకే ప్రత్యర్థులై కూర్చున్నారు" అని అన్నాడు. ఆ తరువాత అతను ప్రమాణం చేస్తూ మదీనా వెళ్ళిన తరువాత మనలో గౌరవనీయుడైనవాడు నీచుల్ని నగరం నుండి బయటికి గెంటివేస్తాడు" అన్నాడు. (ఈమాట 63:7 సూక్తిలో ప్రస్తావించబడింది.)

కపట నాయకుడు కూసిన ఈ కారుకూతల సంగతి దైవప్రవక్త (స)కు తెలిసింది. అప్పుడు హజ్రత్ ఉమర్ (రజి) "ఇలాంటివాడ్ని హతమార్చాలి" అన్నారు. కాని దైవప్రవక్త (స) అందుకు నిరాకరిస్తూ "అతడ్ని చంపితే లోకం ఏమనుకుంటుంది? ముహమ్మద్ స్వయంగా తన అనుయాయుల్నే చంపుతున్నాడని అనుకోదా?" అన్నారు. ఆ తరువాత సైన్యం వెంటనే బయలుదేరాలని ఉత్తర్వు జారీచేశారు. (ఈ సంఘటన గురించిన ఇతర వివరాల కోసం 63వ అధ్యాయానికి సంబంధించిన ఉపోద్ఘాతం చూడండి.)

దాని ప్రకారం సైన్యం మురసీ ప్రాంతం నుండి బయలుదేరింది. మరునాడు మధ్యాహ్నందాకా ఎక్కడా విడిదిచేయకుండా ప్రయాణం సాగించింది. ఆ తర్వాత కూడా ఎక్కడా ఎక్కువ సేపు ఆగకుండా ప్రయాణం సాగించి చివరికి మదీనా నగరం ఇంకా కొన్ని మైళ్ళ దూరంలో ఉండగా ఒకచోట రాత్రివేళ విడిది చేసింది. అక్కడ ఆరాత్రి విశ్రాంతి తీసుకొని తెల్లవారుజామున మళ్ళీ బయలుదేరింది. ఆ సందర్భంలో కపట విశ్వాసులు ప్రవక్త సతీమణి హజ్రత్ ఆయిషా (రజి)పై ఘోరమైన అపనింద మోపారు. నిజాయితీపరులైన కొందరు ముస్లింలు సైతం వారి దుష్ప్రచార ప్రభావానికి గురికాకుండా ఉండలేక పోయారు. దాంతో హజ్రత్ ఆయిషా (రజి) ఈ అపనింద నుండి నెల రోజులదాకా బయటపడలేక పోయారు. చివరికి దేవుడు దివ్యావిష్కృతి ద్వారా ఈ అపనింద దూరం చేశాడు. (వివరాలకు 11వ సూక్తి పాదసూచిక చూడండి.)

## కరుణామయుడు, కృపాసాగరుడయిన దేవుని పేరుతో ప్రారంభం

ఇదొక అధ్యాయం (సూరా). దీన్ని మేము అవతరింపజేశాం. ఈ అధ్యాయం(లోని ఆదేశాల)ను విధిగా పాటించాలని నిర్ణయించాము. మీరు గ్రహించడానికి ఇందులో మేము స్పష్టమైన హేతుబద్ధమైన సూక్తులు అవతరింపజేశాము. (1)

వ్యభిచారి, వ్యభిచారిణి- వీరిద్దరిలో ప్రతి ఒక్కరికీ వందేసి కొరడాదెబ్బలు కొట్టండి.[1] మీరు దేవుడ్ని, అంతిమదినాన్ని విశ్వసించినవారయితే దైవధర్మం విషయంలో వారి (శిక్ష) పట్ల మీరు ఏమాత్రం సానుభూతి వెలిబుచ్చకూడదు.[2] వారిని శిక్షించేటప్పుడు కొందరు విశ్వాసులు దగ్గర ఉండాలి. (2)

ఒక వ్యభిచారి వ్యభిచారిణిని లేదా బహుదైవారాధకురాలిని తప్ప మరెవరినీ వివాహమాడరాదు. అలాగే ఒక వ్యభిచారిణి వ్యభిచారిని లేదా బహుదైవారాధకుడ్ని తప్ప మరెవరినీ పెండ్లాడకూడదు.[3] విశ్వాసులకు ఇలాంటి వివాహం నిషేధించబడింది. (3)

---

1. సమాజానికి మూలస్తంభమైన కుటుంబ వ్యవస్థను ఛిన్నాభిన్నంచేసే వ్యభిచారం, అక్రమ సంబంధాలను ఇస్లాం ఎట్టి పరిస్థితిలోనూ సహించదు. దానికి కఠిన శిక్షలను విధిస్తుంది. ఉదా:-

- ♦ వివాహంకాని వ్యక్తి స్త్రీ ఐనా, పురుషుడైనా వ్యభిచారం చేస్తే, శిక్ష వందకొరడా దెబ్బలు.
- ♦ వివాహిత వ్యక్తి వ్యభిచారం చేస్తే, శిక్ష రాళ్ళు విసరి హతమార్చడం.
- ♦ బానిసలకు శిక్ష, స్వేచ్ఛాపరులకు విధించే శిక్షలో సగం మాత్రమే విధించాలి.
- ♦ పురుషుడు స్త్రీని బలవంతంగా మానభంగం చేస్తే, పురుషునికి మాత్రమే శిక్ష ఉంటుంది.
- ♦ ఇస్లామీయరాజ్యంలో ముస్లిమేతరులకు వారిమతాల శిక్షాస్మృతి ప్రకారమే శిక్ష ఉంటుంది.
- ♦ పొరపాటున కాలుజారిన వ్యక్తి, ప్రభుత్వానికి పట్టుబడకపోతే, పశ్చాత్తాపంతో దేవుడ్ని క్షమాపణ కోరుకుంటే చాలు. ప్రజలు అలాంటి వ్యక్తిపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేయరాదు.

(ప్రారంభంలో సూచించబడిన శిక్ష కోసం 4:16 సూక్తి, దాని పాదసూచిక చూడండి.)

2. న్యాయాధికారి నేరస్థుడి పట్ల దయతో లేక మెతక వైఖరితో దేవుడు నిర్ణయించిన శిక్షను ఏమాత్రం తగ్గించకూడదు. అలాగే నేరస్థుడి పట్ల కఠిన వైఖరితో దైవనిర్ణీత శిక్షను ఏమాత్రం హెచ్చించడానిక్కూడా వీల్లేదు. దీన్ని గురించి దైవప్రవక్త (సల్లం) ఇలా చెప్పారు:

"ప్రళయదినాన నిర్ణీత శిక్షలో ఒక కొరడాదెబ్బ తగ్గించి శిక్ష విధించిన న్యాయాధికారిని ప్రవేశపెట్టి "ఇలా ఎందుకు చేశావు?" అని అడుగుతాడు (దేవుడు). దానికి అతను "మీ దాసులపై కనికరంతో ఇలా చేశాను" అని అంటాడు. అప్పుడు (దేవుడు) "నీవు వారి విషయంలో నాకంటే ఎక్కువ దయామయుడవై పోయావా?" అని అడుగుతాడు. తరువాత "ఇతడ్ని తీసికెళ్ళి నరకంలో పడేయండి" అని ఆజ్ఞవుతుంది. అలాగే నిర్ణీత శిక్ష కంటే ఒక కొరడాదెబ్బ ఎక్కువ శిక్ష విధించిన మరొక న్యాయాధికారిని ప్రవేశపెడ్తారు. "నీవు ఇలా ఎందుకు చేశావు?" అని అడుగుతాడు అతడ్ని దేవుడు. దానికతను "ప్రజలు నీ అవిధేయతను మానుకుంటారని ఇలా చేశాను" అనంటాడు. దేవుడు ఈమాట విని "వారి విషయంలో నీవు నాకంటే ఎక్కువ తెలివిగలవాడవా?" అనంటాడు. తరువాత "ఇతడ్ని తీసికెళ్ళి నరకంలో పడేయండి" అని ఆజ్ఞవుతుంది. (తఫ్సీరే కబీర్- ఆరోభాగం)

3. దైవప్రవక్త(సల్లం) ఇలా సెలవిచ్చారు: "తన భార్య దుర్నడతగల స్త్రీ అని తెలిసి కూడా విడాకులివ్వకుండా ఆమెను అలాగే దగ్గర పెట్టుకునేవాడు స్వర్గంలో ప్రవేశించడు." (అహ్మద్)



శీలవతులైన స్త్రీలపై అపనింద మోపి, దానికి నలుగురు సాక్షులు తీసుకురాలేని వారిని ఎనభై కొరడాదెబ్బలు కొట్టండి. అటువంటి వ్యక్తులు చెప్పే సాక్ష్యాన్ని ఇక ఎన్నటికీ స్వీకరించకండి. వారసలు దుర్జనులు. అయితే ఈనిర్వాకం తర్వాత పశ్చాత్తాపంతో దైవాన్ని వేడుకొని తమ నడవడికను సరిదిద్దుకున్నవారు దుర్జనులుగా పరిగణించబడరు. (అలాంటివారి విషయంలో) దేవుడు క్షమాశీలి, దయామయుడు. (4,5)

ఇక భార్యలపై అపనింద మోపిన భర్తలు, దానికి తాము తప్ప మరెవరూ సాక్షులు లేని పక్షంలో (ఇలా చేయవలసి ఉంటుంది:) వారిలో ఒకరు నాలుగు సార్లు దేవుని మీద ప్రమాణం చేసి తన ఆరోపణ నిజమేనని సాక్ష్యం చెప్పాలి. అయిదోసారి తన ఆరోపణ అబద్ధమయితే తనపై దేవుని అభిశాపం పడుగాక అని పలకాలి. (6,7)

అలాగే (నిందితురాలైన) స్త్రీ కూడా నాలుగు సార్లు దేవుని మీద ప్రమాణం చేసి అతని ఆరోపణ అబద్ధమని సాక్ష్యమివ్వాలి. అయిదోసారి, అతని ఆరోపణ నిజమయితే తనపై దైవాగ్రహం విరుచుకుపడుగాకని పలకాలి. ఇలా ఆమెకు శిక్ష తప్పుతుంది. (8,9)

మీమీద దేవుని కారుణ్యానుగ్రహాలు గనక లేకపోయిఉంటే (మీరు చేసిన తప్పిదాల పట్ల) మీరు దేవుడ్ని క్షమించేవాడుగా, వివేచనాపరుడుగా చూడగలిగేవారు కాదు. ఈ అపవాదును మీలోనే ఒకవర్గం లేవదీసింది. (అయితే) దీన్నిమీరు చెడుగా భావించకండి. ఇది మీకు (ఒకందుకు) మంచిదే. ఇందులో ఎవరెంత పాత్ర వహించారో ఆమేరకు వారు పాపం మూటగట్టుకున్నట్లే.[4] ఈ వ్యవహారంలో అత్యధిక బాధ్యత నెత్తి మీద వేసుకున్న ప్రధాన సూత్రధారికి కఠినాతికఠిన శిక్ష కాచుకొని ఉంది. (10,11)

ఈ నిందారోపణ వినగానే విశ్వాసులైన స్త్రీపురుషులు అనుమానానికి గురికాకుండా సహృదయంతో ఎందుకు ఉండలేదు? మీరు అప్పటికప్పుడు 'ఇది నిరాధారమైన అపనింద' అని ఎందుకు ఖండించలేదు? వారు (తమ ఆరోపణను నిరూపించుకోవ

---

4. ఇది కపటవిశ్వాసులు హజ్రత్ ఆయిషా (రజి)పై వేసిన అపనిందకు సంబంధించిన విషయం. దైవప్రవక్త (స), ఆయన అనుచరులు బనీముస్తలిఖ్ యుద్ధం నుండి మదీనా తిరిగొస్తూ దారిలో ఒకచోట రాత్రివేళ విడిదిచేశారు. తెల్లవారుజామున హజ్రత్ ఆయిషా(రజి) బహిర్భూమికి వెళ్ళారు. అయితే కంఠహారం పడిపోవడంతో ఆమె దాన్ని వెతుక్కుంటూ మళ్ళీ వెనక్కి పోయారు. ఆమె తిరిగొచ్చేలోగా సైన్యం బయలుదేరి వెళ్ళిపోయింది. ఆమె అంబారీలో కూర్చున్నారనుకొని నల్గురు సైనికులు దాన్నిఎత్తి ఒంటె మీద పెట్టారు. అలా ఖాళీఅంబారీతో సైన్యం వెళ్ళిపోయింది.

హజ్రత్ ఆయిషా (రజి) తాను కన్పించకపోతే వాళ్ళే వెతుక్కుంటూ వస్తార్లే అని తలచి ఆ ప్రదేశంలోనే దుప్పటి కప్పుకొని పడుకున్నారు. కాకతాళీయంగా ఒక సైనికుడు వెనకుండిపోయాడు. అతనామెను చూసి విచారం వెలిబుచ్చుతూ, ఎంతో గౌరవంతో ఆమెకు దగ్గరగా తన ఒంటెను తెచ్చి కూర్చోబెట్టాడు. ఆమె ఒంటెక్కి కూర్చున్నారు. అతను పగ్గం పట్టుకొని నడిపించుకుంటూ మధ్యాహ్నానికల్లా సైన్యాన్ని చేరుకున్నాడు. ఈ దృశ్యం చూసి కపటులు ఆయిషా (రజి) మీద లేనిపోని దుమారం లేవదీశారు. ఇది ఆనోటా ఈనోటా ప్రాకి మొత్తం సైన్యంలో కార్చిచ్చులా వ్యాపించింది. దీనిపట్ల దైవప్రవక్త, ఆయన అనుచరులు తీవ్ర ఆందోళనచెందారు. నెలరోజుల దాకా ముస్లింలపై విషాద ఛాయలు అలుముకున్నాయి. తరువాత ఆమె పవిత్రురాలని దైవసందేశం అవతరించింది.

డానికి) నలుగురు సాక్షుల్ని ఎందుకు తీసుకురాలేదు? వారు సాక్ష్యం తీసుకురాలేదు, (తీసుకురాలేరు కూడా.) దేవుని దృష్టిలో వారే పచ్చి అబద్ధాలరాయుళ్ళు. (12,13)

మీ మీద ఇహపరలోకాల్లో దేవుని అనుగ్రహం, ఆయన కరుణా కటాక్షాలే గనక లేకపోయివుంటే, మీరు ఏ (నిరాధారమైన) మాటల్లో పడిపోయారో వాటి పర్యవసానంగా మీపై ఘోరమైన విపత్తు వచ్చిపడేది. ఈ అసత్యారోపణ (ఎంతచెడ్డ విషయమో మీరే ఆలోచించండి. అది) మీలో ఒకరినుంచి మరొకరికి (కార్చిచ్చులా) వ్యాపిస్తూ పోయింది. వాస్తవం ఏమిటో తెలియనిమాట మీనోట వెలువడింది. మీరు దాన్ని సాధారణ విషయమని భావిస్తుండేవారు. కాని దేవుని దృష్టిలో ఇది చాలా తీవ్రమైన విషయం. (14,15)

ఈసంగతి వినగానే "ఇలాంటి మాటలు అనడం మనకు తగదు. దేవుడు పరిశుద్ధుడు. ఇది పచ్చిఅపనింద" అని మీరు ఎందుకు అనలేదు? మీరు (నిజమైన) విశ్వాసులైతే ఇకముందు ఎన్నటికీ ఇలాంటి చేష్టలకు పాల్పడకూడదని దేవుడు మీకు ఉపదేశిస్తున్నాడు. ఆయన సర్వం తెలిసినవాడు, ఎంతో వివేకవంతుడు. (16-18)

విశ్వాసులలో అశ్లీల విషయాలు వ్యాపించాలని కోరుకునేవారు ఇటు ప్రపంచంలోనూ, అటు పరలోకంలోనూ వ్యధాభరితమైన శిక్షకు అర్హులవుతారు. (సమాజం మీద అశ్లీలం ఎంత దుష్ప్రభావం వేస్తుందో) దేవునికి తెలుసు, మీకు తెలియదు. మీమీద దేవుని అనుగ్రహం, ఆయన కరుణాకటాక్షాలే గనక లేకపోయివుంటే మీరు దేవుడ్ని వాత్సల్యమూర్తిగా, దయామయునిగా చూడగలిగేవారు కాదు. (19,20)

విశ్వాసులారా! షైతాన్ అడుగుజాడల్లో నడవకండి. వాడు తనను అనుసరించే వారికి (ఎల్లప్పుడూ) చెడు, అశ్లీలతలను గురించే దుర్బోధ చేస్తాడు. మీమీద దేవుని అనుగ్రహం, ఆయన కరుణా కటాక్షాలే గనక లేకపోతే మీలో ఏ ఒక్కడూ పరిశుద్ధుడు (పావనం) కాలేడు. అయితే దేవుడు తాను తలచిన వారిని పావనం చేస్తాడు. ఆయన సర్వం వినేవాడు, సమస్తం ఎరిగినవాడు. (21)

మీలో ఉదార స్వభావులు, (ఆర్థిక) స్తోమత కలిగినవారు (ఈ అపనిందలో పాలు పంచుకున్న) తమ బంధువులకు, నిరుపేదలకు, దైవమార్గంలో ఇల్లువాకిలి వదలి వలస వచ్చినవారికి సహాయం చేయము అని ప్రమాణం చేయకూడదు. వారిని క్షమించాలి, ఉపేక్షించాలి. దేవుడు మిమ్మల్ని క్షమించాలని మీరు కోరుకోరా?[5] దేవుడు ఎంతో క్షమాశీలి, అమిత దయామయుడు. (22)

---

5. హజ్రత్ అబూబకర్ (రజి) తన కుమార్తె హజ్రత్ ఆయిషా (రజి)పై కపటులు వేసిన అపనింద సంగతి విని ఎంతో బాధపడ్డారు. కపటులు లేవదీసిన ఈ నిందాప్రచారంలో ముగ్గురు అమాయక ముస్లింలు కూడా చిక్కుకున్నారు. వారిలో మిస్తహ్ బిన్ అసాసా (రజి) ఒకరు. ఆయన పేదవాడైనందున హజ్రత్ అబూబకర్ (రజి) తరచుగా ఆయనకు ఆర్థిక సహాయం అందజేస్తుండేవారు. అయితే ఈ నిందారోపణ గుట్టు బయటపడిన తరువాత ఆయన ఈ సహాయాన్ని నిలిపివేశారు. అప్పుడీ సూక్తి అవతరించింది. దాంతో హజ్రత్ అబూబకర్ (రజి) మిస్తహ్ (రజి)కు ఇంతకు ముందుకన్నా ఎక్కువ ఆర్థిక సహాయం చేయడం ప్రారంభించారు.



శీలవతులైన అమాయక ముస్లిం మహిళలపై లేనిపోని అపనిందలు మోపేవారు ఇటు ప్రపంచంలోనూ, అటు పరలోకంలోనూ శాపగ్రస్తులవుతారు.[6] వారికోసం కఠినాతికఠిన శిక్ష కాచుకొని ఉంది. (23)

ఇలా అపనిందలు మోపేవారు (తమకు వ్యతిరేకంగా) తమ నోళ్ళు, కాళ్ళు, చేతులే తమ అకృత్యాలను గురించి సాక్ష్యమిచ్చే రోజొకటి వస్తుందన్న సంగతి మరచిపోకూడదు. ఆరోజు దేవుడు వారి అర్హతనుబట్టి వారికి పూర్తిప్రతిఫలం ఇస్తాడు. అప్పుడు తెలుస్తుంది వారికి దేవుడే సత్యమని, దేవుడే నిజాన్ని నిజంచేసి చూపేవాడని. (24,25)

అపవిత్ర పురుషులకు అపవిత్ర స్త్రీలు, అపవిత్ర స్త్రీలకు అపవిత్ర పురుషులే తగిన జంటలు. అలాగే పవిత్ర పురుషులకు పవిత్ర స్త్రీలు, పవిత్ర స్త్రీలకు పవిత్ర పురుషులు మాత్రమే యోగ్యులు. జనం చెప్పుకునే (తప్పుడు) మాటలకు అతీతంగా వారు పరిశుద్ధులు, పవిత్రులు. వారికోసం మన్నింపు, ఉదారమైన ఉపాధి ఉన్నాయి. (26)

విశ్వాసులారా! మీరు మీ ఇండ్లలోకి తప్ప ఇతరుల ఇండ్లలోకి వారి అనుమతి లేకుండా, వారికి సలాం చేయకుండా ప్రవేశించకండి.[7] ఇది మీకెంతో మంచి పద్ధతి. దీన్ని మీరు దృష్టిలో పెట్టుకుంటారని మేమిలా బోధిస్తున్నాము. ఆ సమయంలో అక్కడ ఎవరూ కన్పించకపోతే, అనుమతి లభించనంతవరకు మీరు లోపలికి ప్రవేశించకండి. ఒకవేళ మీకు (లోపల నుంచి) తిరిగి వెళ్ళిపోండని సమాధానం వస్తే మీరు వెళ్ళిపోండి. ఇది మీకెంతో శ్రేష్ఠమైన పద్ధతి. మీరు చేసే పనులన్నీ దేవునికి బాగా తెలుసు. (27,28)

అయితే ఎవరూ నివసించని ఇండ్లలో మీకు ప్రయోజనం చేకూర్చే వస్తువు ఏదైనా ఉంటే అలాంటి ఇండ్లలో (స్వేచ్ఛగా) ప్రవేశించవచ్చు. అందులో తప్పులేదు. మీరు దాస్తున్న దేమిటో, వ్యక్తపరుస్తున్నదేమిటో అంతా దేవునికి తెలుసు. (29)

ప్రవక్తా! విశ్వసించిన పురుషులు తమ చూపులు (పరస్త్రీలపై పడకుండా వేరే వైపు) మరల్చుకోవాలని, తమ మర్మావయవాలను కాపాడుకోవాలని వారికి చెప్పు. వారికి ఇది చాలా శ్రేష్ఠమైన పద్ధతి.[8] వారు చేసే పనులన్నీ దేవుడు గమనిస్తూనే ఉంటాడు. (30)

---

6. ఈ సూక్తి గురించి అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఇలా వ్యాఖ్యానించారు: "పవిత్రురాలైన స్త్రీపై (లేనిపోని) అపనింద వేయడం అంటే వందేళ్ళ సత్కర్మలను చేజేతులా నాశనం చేసుకోవడమే." (తబ్రాని)

7. ఈసూక్తి ప్రకారం ఇతరుల ఇండ్లలోకి దొంగచాటుగా తొంగి చూడటం కూడా నేరమే. అలాగే ఇతరుల ఉత్తరాలను వారి అనుమతి లేకుండా చదవడం కూడా తప్పే. "మనిషి తన సోదరుని ఉత్తరం అతని అనుమతి లేకుండా చదవడం అంటే అగ్నిలోకి తొంగి చూడటమే" అని మహాప్రవక్త (సల్లం) ఉపదేశించారు. (అబూదావూద్)

8. పరస్త్రీలపై కాకతాళీయంగా ఒకసారి చూపు పడితే తప్పు లేదు. కాని మనిషి ఉద్దేశ్య పూర్వకంగా మళ్ళీ మళ్ళీ చూస్తేనే తప్పు. అలాంటి వ్యక్తిని దేవుడు క్షమించడు. దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "మనిషి తన ఇంద్రియాలన్నిటితోనూ వ్యభిచరిస్తున్నాడు. చూడటం కళ్ళ వ్యభిచారం. ఆసక్తిగా మాట్లాడటం నోటి వ్యభిచారం. ధ్వని ద్వారా మాధుర్యాన్ని ఆస్వాదించడం

(అలాగే) విశ్వసించిన స్త్రీలు తమ చూపులు (పరపురుషుల నుండి వేరే వైపు) మరల్చుకోవాలని, తమ మర్మావయవాలను కాపాడుకోవాలని వారికి చెప్పు. అదీగాక వారు తమ అలంకరణలను బయటికి కనబడనీయకూడదు. ఒకవేళ వాటంతటవే బయటపడితే అందులో తప్పులేదు.[9] వారు తమ వక్షస్థలాలను ఓణీలతో కప్పుకోవాలి.

భర్తలు, తండ్రులు, భర్తల తండ్రులు, కన్నకొడుకులు, భర్తల కొడుకులు (అంటే సవతి కొడుకులు), అన్నదమ్ములు, అన్నదమ్ముల కొడుకులు, అక్కచెల్లెళ్ళ కొడుకులు, తమతో కలసిమెలసి ఉండే సహచర స్త్రీలు, సొంత బానిసలు, తమ అధీనంలోని స్త్రీవాంఛ లేని పురుషులు, స్త్రీల ఆంతరంగిక విషయాలు తెలియని బాలురు- వీరి

---

చెవుల వ్యభిచారం. చేత్తో తాకడం, దురుద్దేశ్యంతో నడచి వెళ్ళడం కాళ్ళు చేతుల వ్యభిచారం. వ్యభిచారానికి సంబంధించిన ఈ ఉపోద్ఘాతాలన్నీ నెరవేరిన తర్వాత మర్మాంగాలు ఆ పని పూర్తిచేస్తాయి లేదా పూర్తిచేయడానికి సిద్ధపడతాయి." (బుఖారి, ముస్లిం, అబూదావూద్)

ఈ విషయంలో కొన్ని మినహాయింపులున్నాయి. పురుషుడు తాను పెళ్ళి చేసుకోదలచిన స్త్రీని ముందుగా చూసుకోవచ్చు. హజ్రత్ ముగైరా (రజి) వివాహం చేసుకోవడానికి నిర్ణయించుకున్నప్పుడు ఆయనతో దైవప్రవక్త(సల్లం) "నీవు ఆ స్త్రీని చూశావా?" అనడిగారు. దానికాయన చూడలేదన్నారు. "అయితే ఆమెను (ఓసారి) చూసుకో. దీనివల్ల మీఇద్దరి మధ్య సానుకూలత ఏర్పడే అవకాశముంటుంది" అన్నారు దైవప్రవక్త (సల్లం). (తిర్మిజి, నసాయి, ఇబ్నెమాజ)

అలాగే ఒక ఇంటిలో నివసించే స్త్రీ పురుషులు (బంధువులు) పరస్పరం చూసుకోవడంలో ఎలాంటి తప్పులేదు. నేర పరిశోధన సమయంలో అనుమానాస్పద స్త్రీని చూడవచ్చు. న్యాయస్థానంలో సాక్ష్యమిచ్చేటప్పుడు న్యాయమూర్తి, సాక్ష్యమిచ్చే స్త్రీని చూడవచ్చు. డాక్టర్ వ్యాధిగ్రస్త స్త్రీని చూడవచ్చు. పాస్‌పోర్ట్‌లు, ఐడెంటీ (గుర్తింపు) కార్డులు వగైరా సందర్భాలలో సంబంధిత పురుషులు తత్సంబంధ స్త్రీలను చూడవచ్చు.

(పరదా, పెళ్ళిచూపులు, వివాహం, దాంపత్య జీవితం గురించిన వివరాల కోసం 'ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్' నుండి వెలువడిన "ముస్లిం మహిళ" చదవండి.)

9. పురుషుడు పరస్త్రీని చూసే నిబంధనల కన్నా స్త్రీ పరపురుషుని చూసే నిబంధనలు కాస్త మృదువుగా ఉంటాయి. శరీరంలో బట్ట కప్పవలసిన కనీస శరీర భాగాన్ని "సతర్" అంటారు. నాభి నుండి మోకాళ్ళ క్రింది వరకుగల భాగం పురుషుని సతర్‌గా నిర్ణయించబడింది. ఆ భాగాన్ని అతను తన భార్య ముందు తప్ప మరెవరి ముందూ బహిర్గతం చేయకూడదు. మలమూత్రాల విసర్జన సందర్భంలో తప్ప ఇతర వేళల్లో ఒంటరిగా ఉన్నప్పుడు నగ్నంగా ఉండటం కూడా తప్పే.

పోతే స్త్రీ కోసం ఆమె ముఖం, ముంజేతులు, పాదాలు తప్ప ఇతర శరీరభాగమంతా సతర్‌గా నిర్ణయమయింది. ఆమె ఆ శరీరభాగాన్ని తనభర్త ముందు తప్ప ఇతర పురుషుల ముందు బహిర్గతం చేయకూడదు. కాకపోతే ఇంట్లో తండ్రి, సోదరులు తదితర బంధువుల ముందు, ఆమె ఇంటిపనులు చేస్తున్నప్పుడు అవసరమైతే ముంగాళ్ళ మీదుండే దుస్తులు పైకెత్తి కట్టుకోవచ్చు. బయటుండే తోటిస్త్రీల ముందు ఆమె కనీసం నాభినుండి మోకాళ్ళ వరకుండే భాగాన్ని విధిగా కప్పుకోవాలి. నగలు, ఆకర్షణీయమైన బట్టలు, మేకప్ సామగ్రి తన భర్తకు మాత్రమే పరిమితం చేయాలి. ఇంటి నుంచి బయటికెళ్తే మాత్రం ముఖముసుగుతో సహా పూర్తి పరదా పాటించాలి. అయితే పెళ్ళికి ధర్మసమ్మతంకాని బంధువుల ముందు పూర్తి పరదా పాటించనవసరం లేదు.



ఎదుటతప్ప ఇతరుల ముందు స్త్రీలు తమ అందచందాలు, అలంకరణలను బహిర్గతం చేయకూడదు. ఇంకా తాము దాచిన అలంకరణల సంగతి ప్రజలకు తెలిసేలా వారు తమ కాళ్ళను నేలకేసి కొడ్తూ నడవకూడదు. విశ్వాసులారా! మీరంతా కలసి దేవుడ్ని క్షమాపణ కోరుకోండి. అప్పుడే మీరు కృతార్థులయ్యే అవకాశముంటుంది. (31)

మీలో భార్యవిహీనులుగా, భర్తవిహీనులుగా ఉన్నవారికి పెళ్ళిళ్ళు చేయండి. అలాగే మీ బానిసలలో యోగ్యులైన వారికి కూడా పెళ్ళిళ్ళు చేసేయండి. వారొకవేళ నిరుపేదలైతే దేవుడు తన అనుగ్రహంతో వారిని ధనికులుగా చేస్తాడు. దేవుడు సకల సాధన సంపన్నుడు, సమస్తం తెలిసినవాడు. (32)

పెళ్ళిచేసుకునే (ఆర్థిక) స్తోమత లేనివారు (అశ్లీల చేష్టలకు పాల్పడకుండా) దేవుడు తన అనుగ్రహంతో తమకు ఆర్థిక స్తోమత చేకూర్చే వరకు ఆత్మనిగ్రహం పాటిస్తూ ఉండాలి. మీ బానిసలలో ఎవరైనా స్వాతంత్ర్య ఒప్పందం గురించి మీకు విన్నవించుకుంటే, వారిలో మంచితనం ఉందని మీకు అన్పించినప్పుడు వారి విన్నపాన్ని అంగీకరించి ఒప్పందం చేసు కోండి. దేవుడు మీకు ప్రసాదించిన సంపదలో కొంతభాగం (బానిసత్వం నుండి విముక్తి పొందడానికి సహాయంగా) వారికి అందజేయండి.[10]

---

10. పూర్వం అరేబియాతో పాటు అనేక దేశాలలో మూడు విధాల బానిసలు ఉండేవారు. ఒకటి, తరతరాల నుండి వంశపారంపర్యగా వస్తున్న బానిస వ్యవస్థ. రెండు, స్వేచ్ఛాపరులను బలవంతంగా ఎత్తుకెళ్ళి బానిసలుగా మార్చివేయడం. మూడు, యుద్ధఖైదీలు. మొదటి రకం బానిసత్వాన్ని ఇస్లాం ఒక్కసారిగా అంతమొందించి సమాజంలో సంక్షోభం సృష్టించడానికి బదులు హితోపదేశాలతో, ధార్మిక ఆదేశాలతో, ప్రభుత్వ చట్టాలతో దీన్ని క్రమేణా అంతం చేయదలచింది. పరలోక సాఫల్యం కోసం బానిసలకు స్వేచ్ఛనివ్వాలని బోధించింది. పాప పరిహారంగా బానిసల విడుదల కోసం కొన్ని ధార్మిక ఆదేశాలు జారీ చేసింది. అలాగే కొంత ఆర్థిక ప్రతిఫలం తీసుకొని విడుదల చేయాలని కూడా సూచించింది. (బానిస మహిళలను గురించి 23:6 సూక్తికి రాసిన పాదసూచిక చూడండి.)

ఈ హితవులు, ఆదేశాలతో యావత్తు ముస్లిం సమాజంలో బానిస విమోచనోద్యమం ప్రారంభమయింది. ముస్లింలు ముస్లిమేతరుల అధీనంలో ఉండే బానిసలను పెద్ద ఎత్తున కొని, వారికి శాశ్వతంగా విముక్తి కలిగించడం ప్రారంభించారు. దైవప్రవక్త (సల్లం) 63 మంది బానిసలకు స్వేచ్ఛ ప్రసాదించారు. ఆయన సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) 67మంది బానిసలను విముక్తం చేశారు. హజ్రత్ అబ్బాస్ (రజి) 70 మందిని, హకీం బిన్ హిజాం (రజి) 100 మందిని, అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) 1000 మందిని, జుల్‌కలా హుమైరీ (రజి) 8000 మందిని, అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) 3000 మందిని విడుదల చేయించారు. ఇలా దైవప్రసన్నత కోసం ప్రవక్త అనుచరులు బానిసలను కొని విడుదలచేశారు. ఈ ఉద్యమం ఫలితంగా తొలి నలుగురు ఖలీఫాల కాలం ముగిసే నాటికి పూర్వకాలంనాటి బానిస వ్యవస్థ దాదాపు పూర్తిగా అంతరించిపోయింది.

రెండవ రకం బానిస వ్యవస్థను ఇస్లాం ప్రారంభంలోనే పూర్తిగా నిషేధించింది. ఈ ఉత్తర్వు ప్రకారం స్వేచ్ఛాపరుడ్ని బలవంతంగా బానిసగా మార్చడం, అతడ్ని అమ్మడం, కొనడం నిషిద్ధం.

పోతే ఇస్లాం యుద్ధఖైదీల వ్యవస్థను మాత్రం నిషేధించలేదు. యుద్ధఖైదీల మార్పిడి కోసం శత్రుపక్షం ఖైదీలను పట్టి ఉంచడం అవసరమవుతుంది. ఒకవేళ ఖైదీల మార్పిడి కోసం శత్రువర్గం

మీ బానిస మహిళలు శీలవతులుగా ఉండదలచుకున్నప్పుడు, ప్రాపంచిక ప్రయోజనాల కోసం వారిని మీరు బలవంతంగా పడుపు వృత్తిలోకి దించకండి. వారిని ఎవరైనా బలవంతంగా అలా మార్చితే ఆ బలాత్కారం తరువాత వారి విషయంలో దేవుడు ఎంతో క్షమించేవాడు, కరుణించేవాడు (అవుతాడు). (33)

మేము మీదగ్గరికి స్పష్టమైన సూక్తులు అవతరింపజేశాం. మీకు పూర్వం గతించిన జాతుల గాథలు, దైవభీతిపరులకు ఉపయోగపడే హితోక్తులూ అవతరింపజేశాం. (34)

దేవుడు యావత్ భూమ్యాకాశాలకు జ్యోతి లాంటివాడు. ఆయన కాంతి (అపారం, అపురూపం. దాని)ని ఈ విధంగా పోల్చవచ్చు: ఒక గూటిలో వెలుగుతున్న దీపం ఉంది. ఆ దీపం ఓ అందమైన గాజుచిమ్నీ మధ్యలో ఉంది. ఆ గాజుచిమ్నీ ముత్యంలాంటి నక్షత్రంలా మెరిసిపోతుంది. ఆ దీపం ఆలివ్‌చెట్టు నుండి తీసిన నూనెతో వెలుగుతుంది. ఆ చెట్టు ఉదయం నుండి సాయంత్రం వరకు నలువైపులా ఎండ తగిలే ప్రదేశంలో పెరిగే బహుళ ప్రయోజక వృక్షరాజం. దాని చమురు అత్యంత శ్రేష్ఠమయినది. అగ్నితో రాజేసినా రాజేయకపోయినా తనంతట తాను మండగల స్వయంజలన తైలం. వెలుగు మీద వెలుగు(తో కూడిన అద్భుతమైన కాంతిమయం ఆ దృశ్యం).

దేవుడు తానుకోరిన వారికి తనకాంతి వైపు దారి చూపుతాడు. ఆయన (ఇలాంటి ఉదాహరణల ద్వారా మానవులకు విషయాన్ని వివరిస్తున్నాడు. ఆయన ప్రతి విషయం క్షుణ్ణంగా ఎరిగినవాడు. (35)

దేవుడు ఏ ఆలయాలను ఉద్ధరించి, అక్కడ తన పేరును స్మరిస్తూ ఉండాలని ఆదేశించాడో ఆ ఆలయాలలోనే (ఆయన జ్ఞానకాంతితో సన్మార్గం పొందేవారు) ఉంటారు. వారా ఆలయాలలో ఉదయం, సాయంత్రం ధ్యానం చేస్తూ ఎంతో నిష్ఠా గరిష్ఠులైఉంటారు. దైవస్మరణ, నమాజుస్థాపన, జకాత్ చెల్లింపు (మొదలైన) విధుల నిర్వహణ నుండి (ప్రాపంచిక వ్యామోహం,) వ్యాపారవ్యవహారాలు వారిని ఎన్నటికీ విస్మ రింపజేయలేవు. వారు గుండెలు అదిరిపోయే, కనుగ్రుడ్లు స్తంభించే ప్రళయదినం గురించి భయపడుతుంటారు. దేవుడు తమ సత్కర్మలకు తగిన ప్రతిఫలం ఇవ్వడంతో

---

ముందుకు రాకపోతే, యుద్ధఖైదీలు విడుదల కోసం తమ యజమానులకు ఎలాంటి ప్రతిఫలం ఇవ్వలేని పరిస్థితిలో ఉంటే, అలాంటి బానిసలను పాపపరిహారంగా (కప్ఫారా)గాని, పుణ్యఫలాపేక్ష తోగాని విడుదల చేయాలని ఇస్లాం చెబుతోంది.

ప్రవక్త కాలంలో జరిగిన కొన్ని యుద్ధాలలో శత్రువులు యుద్ధఖైదీలుగా పట్టు బడినప్పుడు వారిలో కొందరిని వారిబంధువులు వచ్చి నష్టపరిహారం (ఫిదియా) చెల్లించి విడిపించుకు పోయారు. నష్టపరిహారం చెల్లించుకోలేని ఖైదీలు చదువురాని ముస్లింలకు చదువు నేర్పితే విడుదల చేస్తామని చెప్పారు దైవప్రవక్త (సల్లం). ఆవిధంగా వారు విడుదలయ్యారు. అటు ఫిదియా చెల్లించుకోవడానికి గాని, ఇటు చదువు చెప్పడానికిగాని శక్తిలేని ఖైదీలను దైవప్రవక్త (సల్లం) ఎలాంటి నష్టపరిహారం లేకుండానే విడుదల చేశారు.

ఈ విధంగా ఇస్లాం బానిసల సమస్యకు చక్కని పరిష్కారం చూపింది.



పాటు తన ప్రత్యేక అనుగ్రహంతో మరింతభాగ్యం ప్రసాదిస్తాడన్న ఆశతోనే (ఈ విధులు పాటిస్తారు). దేవుడు తాను తలచిన వారికి అపరిమితంగా అనుగ్రహిస్తాడు. (36-38)

(ఇక) అవిశ్వాసుల కర్మలు ఎండమావుల్లా నిరుపయోగమవుతాయి. దప్పికగొన్న వాడు ఎడారి మైదానంలో ఎండమావిని చూసి, అక్కడేదో జలాశయం ఉందని భావిస్తాడు. తీరా ఆ ప్రదేశానికి చేరుకుంటే అక్కడసలు నీరే ఉండదు. పైగా (తీవ్రమైన దాహంతో నాలుక పిడచగట్టుకుపోయి, కొనఊపిరితో కొట్టుమిట్టాడే స్థితిలో) అతనికక్కడ దేవుడు గుర్తుకొస్తాడు. (కాని) దేవుడు అతని లెక్క పూర్తిచేసి (దుష్కృతఫలం ఇవ్వడానికి) సిద్ధంగా ఉంటాడు. (కర్మల)లెక్క చూడటానికి దేవునికి ఎంతోసేపు పట్టదు. (39)

లేదా అతని పరిస్థితిని ఈవిధంగా కూడా పోల్చవచ్చు: ఒక లోతైన సముద్రంలో అంతా చీకటిమయంగా ఉంటుంది. ఒక అలల పొరపై మరొక అలల పొర ఆవరించి ఉంటుంది. ఆపై (నింగిలో) కారుమేఘం; ఇలా అంధకారంపై అంధకారంతో (నలు వైపులా) గాఢాంధకారం అలుముకొని ఉంటుంది. (అలాంటి కటిక చీకటిలో) ఎవరైనా చేయిజాపి చూడదలచుకుంటే ఆ చేయి కూడా అతనికి కానరాదు. దేవుడు ఎవరికి తన (జ్ఞాన) కాంతి ప్రసాదించడో అతనికి మరెలాంటి కాంతీ లభించదు. (40)

భూమ్యాకాశాల్లో ఉన్న సమస్త చరాచరాలు, రెక్కలుజాపి ఎగిరే పక్షులు దేవుడ్ని ఎలా స్మరిస్తున్నాయో మీకు కన్పించడం లేదా? వాటన్నిటికీ తమ ప్రార్థన, స్మరణల పద్ధతులేమిటో తెలుసు. అవి చేస్తున్న పనులన్నీ దేవునికి బాగా తెలుసు. భూమ్యాకాశాల సామ్రాజ్యమంతా దేవునిదే. అందరూ ఆయన సన్నిధికే పోవలసి ఉంది. (41,42)

దేవుడు మేఘాలను మెల్లమెల్లగా ఎలా నడిపిస్తున్నాడో మీరు గమనించడం లేదా? తరువాత ఆయన ఆ మేఘాలను పరస్పరం కలిపేస్తాడు. ఆ తరువాత వాటిని పొరలు పొరలుగా చేసి ఓ పెద్ద మేఘమాలికను రూపొందిస్తాడు. ఆపై అందులో నుంచి వర్షం కురుస్తుంది. ఇదంతా మీరు చూస్తూనే ఉంటారు.

ఆయన (నేల నుండి) పైకి ఉబికి వచ్చిన కొండల కారణంగా ఆకాశం నుండి వడగండ్లను కూడా కురిపిస్తాడు. తద్వారా ఆయన తాను తలచిన విధంగా కొందరికి నష్టం కలిగిస్తాడు; మరికొందరిని వాటి నుంచి కాపాడుతాడు. ఆ మేఘావృత నింగిలోని మెరుపు కళ్ళను మిరుమిట్లు గొలిపి దృష్టిని చెదరగొడ్తుంది. రేయింబవళ్ళ చక్రభ్రమ ణానికి కూడా ఆయనే మూలకారకుడు. కళ్ళున్నవారికి ఇందులో కనువిప్పు కలిగించే మంచి గుణపాఠం ఉంది. (43,44)

దేవుడు ప్రతిప్రాణిని నీటితో సృజించాడు. వాటిలో కొన్ని పొట్టతో ప్రాకుతాయి. కొన్ని రెండుకాళ్ళతో, మరికొన్ని నాలుగుకాళ్ళతో నడుస్తాయి. దేవుడు తాను తలచినదాన్ని సృజిస్తాడు. ఆయన ప్రతిపనీ చేయగల సమర్థుడు, సర్వశక్తిమంతుడు. (45)

మేము వాస్తవాన్ని స్పష్టంగా వివరించే సూక్తులు అవతరింపజేశాము. దేవుడు (వీటిద్వారా) తానుతలచిన వారికి సన్మార్గం చూపుతాడు. (46)

వారు (మీ దగ్గరికొచ్చినప్పుడు) తాము దేవుడ్నీ, దైవప్రవక్తను విశ్వసించి విధేయులై పోయామని అంటారు. కాని ఆ తరువాత వారిలో ఒకవర్గం (అవిధేయత చూపుతూ) ముఖం తిప్పుకుంటుంది. అలాంటివారు (నిజమైన) విశ్వాసులు కానేకాదు. వారి పరస్పర వివాదాలను పరిష్కరించే నిమిత్తం వారిని దేవుని వైపు, దైవప్రవక్త వైపు పిలిచినప్పుడు వారిలో కొందరు (నీ దగ్గరకు) రాకుండా ముఖం చాటేస్తారు. (47,48)

అయితే విషయం తమకు అనుకూలంగా ఉంటే మాత్రం వారు అతివినయం వొలకబోస్తూ ప్రవక్త దగ్గరికి వస్తారు. వారి హృదయానికి ఏదయినా (కాపట్య)రోగం అంటుకుందా? లేక అనుమానభూతం పట్టుకుందా? లేక దేవుడు, ఆయన ప్రవక్త తమకేదయినా అన్యాయం చేస్తారని వారు భయపడుతున్నారా? నిజానికి ఇవేవీ కావు. వారసలు స్వతహాగానే పరమ దుర్మార్గులు. (49,50)

నిజమైన విశ్వాసులయితే వారి వివాదాలను పరిష్కరించడానికి దేవుని వైపు, ఆయన ప్రవక్త వైపు పిలిచినప్పుడు (వెంటనే వారు ఆ పిలుపునకు స్పందిస్తూ) "మేము విన్నాం, విధేయులైపోయాం" అనాలి. అలాంటివారే సాఫల్యం చెందేవారు. దేవునికి, దైవప్రవక్తకు పూర్తిగా విధేయులై, వారి ఆజ్ఞల్ని శిరసావహిస్తూ (ప్రతి వ్యవహారంలోనూ) దేవునికి భయపడుతూ ఉండేవారే ధన్యులు, కృతార్థులు. (51,52)

(కాపట్య రోగంకల) వీరు దేవునిపేరుతో గట్టి ప్రమాణాలు చేస్తూ "మీరు ఆజ్ఞపిస్తే మేము (వెంటనే) ఇండ్ల నుంచి బయలుదేరుతాం" అంటారు. వారికి ఇలా చెప్పెయ్యి: "(బూటకపు) ప్రమాణాలు చేయకండి. మీ విధేయతా గుట్టు మాకు తెలిసిపోయింది. మీ కార్యకలాపాలు దేవుడు గమనిస్తూనే ఉన్నాడు." (53)

వారికి (స్పష్టంగా ఈ సంగతి కూడా) చెప్పు: "దేవునికి, దైవప్రవక్తకు విధేయులై ఉండండి. ఒకవేళ మీరు (నిర్లక్ష్య భావంతో) ముఖం తిప్పుకుంటే గుర్తుంచుకోండి- ప్రవక్తపై మోపబడిన బాధ్యతకు ప్రవక్త బాధ్యుడవుతాడు. కాని మీపై ఉన్న బాధ్యతకు మీరే బాధ్యులవుతారు. కనుక ప్రవక్తకు విధేయులయితేనే మీరు సన్మార్గం పొందుతారు. లేకపోతే, ప్రవక్త బాధ్యత (దైవసందేశాన్ని) స్పష్టంగా అందజేయడమే." (54)

మీకుపూర్వం గతించిన వారిని దేవుడు ఏవిధంగా లోకంలో ఖలీఫా (దైవప్రతినిధి) గా చేశాడో అదేవిధంగా మీలో విశ్వసించి సత్కార్యాలు చేసేవారిని కూడా ఖలీఫాగా చేస్తానని ఆయన వాగ్దానం చేస్తున్నాడు. అదీగాక వారికోసం తాను ఆమోదించిన ధర్మాన్ని వారు ఆచరించేందుకు పటిష్ఠమైన పునాదులపై నెలకొల్పుతానని, వారి భయానక స్థితిని శాంతియుతంగా మారుస్తానని కూడా ఆయన వాగ్దానం చేస్తున్నాడు. అయితే వారు నన్ను మాత్రమే ఆరాధించాలి. నాకు మరెవరినీ సాటి కల్పించకూడదు. ఆ (వాగ్దానం) తర్వాత ఎవరు తిరస్కారవైఖరి అవలంబిస్తారో వారే దుర్జనులు. (55)

విశ్వాసులారా! ప్రార్థనావ్యవస్థ నెలకొల్పండి. పేదల జకాత్ చెల్లించండి. దైవప్రవక్త పట్ల విధేయత కలిగిఉండండి. అప్పుడే మీరు కటాక్షించబడతారని ఆశించగలరు.



అవిశ్వాసులు ప్రపంచంలో దేవుని పట్టు నుండి తప్పించుకోగలరని భావించకూడదు. వారి నివాసం నరకమవుతుంది. అది పరమ చెడ్డ నివాసం. (56.57)

విశ్వాసులారా! మీ బానిసలు, ప్రాజ్ఞత వయస్సుకు చేరుకోని మీ బాలబాలికలు (పడక గదిలో) మీ దగ్గరకు రావాలంటే వారు మూడు వేళల్లో మీ అనుమతి తీసుకో వలసిఉంటుంది. అవి- ప్రాతఃకాల ప్రార్థనకు ముందు, మధ్యాహ్నంవేళ మీరు (విశ్రాంతి కోసం) మీ పైఉడుపులు తీసివేసినప్పుడు, రాత్రివేళ ప్రార్థన (ఇషానమాజ్) తరువాత.

ఈ మూడు వేళలు మీకోసం ఏకాంత సమయాలు. అవి గడచిపోయిన తరువాత వారు మీ అనుమతి లేకుండా వస్తే అందులో మీ తప్పు లేదు, వారి తప్పు కూడా లేదు. మీరు మాటిమాటికి ఒకరి దగ్గరకు మరొకరు రావలసిన అవసరముంటుంది. (అందువల్ల ఈ ఆజ్ఞ ఇవ్వబడింది.) ఈవిధంగా దేవుడు తన సూక్తులు మీకు విడమరచి తెలియజేస్తున్నాడు. ఆయన సర్వం ఎరిగినవాడు, మహా వివేకవంతుడు. (58)

మీ పిల్లలు ప్రాజ్ఞత వయస్సుకు చేరుకున్న తరువాత[11] వారు తమ పెద్దల లాగే (ఏ వేళయినా సరే) అనుమతి తీసుకొని రావాలి. ఈవిధంగా దేవుడు తన సూక్తులు మీకు విశదీకరిస్తున్నాడు. ఆయన సర్వం ఎరిగినవాడు, మహా వివేకవంతుడు. (59)

యౌవనదశ దాటిపోయి, పెళ్ళి ఆశలేని (వృద్ధ) మహిళలు తమ బురఖాలు తీసివేస్తే ఎలాంటి తప్పు లేదు. కాకపోతే వారు అలంకరణ ప్రదర్శనకు పాల్పడని వారయి ఉండాలి. ఆ చేష్టలు కూడా మానేసి లజ్జావతులుగా మసలుకుంటే అది వారికెంతో శ్రేయస్కరం. దేవుడు సమస్తం వింటున్నాడు, సర్వం తెలిసినవాడు. (60)

అంధుడుగాని, కుంటివాడుగాని లేదా వ్యాధిగ్రస్తుడుగాని (ఎవరింట్లోనైనా ఏదైనా తింటే తప్పులేదు.) మీరైనా సరే మీ ఇండ్లలోగాని, మీతండ్రి, తాతల ఇండ్లలోగాని, మీ తల్లి-అమ్మమ్మ, నాయనమ్మల ఇండ్లలోగాని, మీ అన్నదమ్ముల ఇండ్లలోగాని, మీ అక్కచెల్లెళ్ళ ఇండ్లలోగాని, మీబాబాయి, పెదనాన్నల ఇండ్లలోగాని, మీమేనత్తల ఇండ్లలో గాని, మీమేనమామల ఇండ్లలోగాని, మీపిన్ని- పెద్దమ్మల ఇండ్లలోగాని, తాళపుచెవులు మీఅధీనంలో ఉన్న ఇండ్లలోగాని, లేదా మీస్నేహితుల ఇండ్లలోగాని ఏదైనా ఆహారం తింటే తప్పు లేదు. అలాగే అందరూ కలసి తిన్నా, వేర్వేరుగా తిన్నా తప్పులేదు.

అయితే మీరు మీఇండ్లలో ప్రవేశించే ముందు ఇంట్లోని వారికి సలాం చేయండి. ఇది దేవుడు నిర్ణయించిన ఆశీర్వాదం. ఎంతో శుభప్రదమైనది, పరిశుద్ధమైనది. మీరు విషయాన్ని గ్రహించడానికి దేవుడిలా మీ ముందు తన సూక్తులు వివరిస్తున్నాడు. (61)

దేవుడ్నీ, ఆయన ప్రవక్తను హృదయపూర్వకంగా నమ్మినవారే (నిజమైన) విశ్వాసులు. ఎప్పుడైనా వారు ఏదైనా సామూహిక కార్యంలో దైవప్రవక్త వెంట ఉంటే అతని అనుమతి లేకుండా (ఎక్కడికీ) వెళ్ళకూడదు.

---

11. ప్రాజ్ఞ వయస్సు, మగపిల్లల కయితే వీర్య స్ఖలనం ప్రారంభమయ్యే నాటికి, ఆడపిల్లల కయితే రుతుస్రావం ప్రారంభమయ్యే నాటికి వస్తుంది.

(ప్రవక్తా! ఇలా) నీ అనుమతి తీసుకున్నవారే దేవుణ్ణి, దైవప్రవక్తను (చిత్తశుద్ధిగా) విశ్వసించేవారు. కనుక వారేదైనా పనికోసం (వెళ్ళిపోవడానికి) నిన్ను అనుమతి అడిగితే నీకిష్టమైన వారికి అనుమతి ఇవ్వచ్చు. అలాంటివారి పాపక్షమాపణ కోసం దేవుణ్ణి ప్రార్థించు. దేవుడు గొప్ప క్షమాశీలి, అమిత దయామయుడు. (62)

ముస్లింలారా! దైవప్రవక్త పిలుపును మీరు ఒకరినొకర్ని పిలుచుకునే పిలుపుగా భావించకండి. మీలో (ఏదో నెపంతో) చల్లగా జారుకునేవారెవరో దేవునికి బాగా తెలుసు. ఆయితే ప్రవక్త ఆజ్ఞల్ని ఉల్లంఘించేవారు తాము ఏదైనా ప్రమాదంలో చిక్కుబడతామే మోనని లేదా దుర్భర యాతనకు గురవుతామేనని తలచి భయపడాలి. (63)

వినండి! భూమ్యాకాశాల్లో ఉన్న సమస్తం దేవునికి చెందినదే. మీరు ఎలాంటి వైఖరి అవలంబించినా సరే అది దేవునికి తెలుసు. మీరు (మరణానంతరం) ఆయన సన్నిధికి తిరిగి వచ్చినప్పుడు (లోగడ ప్రపంచజీవితంలో) మీరు ఏమేమి చేసివచ్చారో అంతా ఆయన మీకు తెలియజేస్తాడు. ఆయన సర్వం ఎరిగినవాడు. (64) ✪

అవతరణ: మక్కా

## 25. గీటురాయి (ఫుర్ఖాన్)

సూక్తులు: 77

ఈ అధ్యాయాన్ని "ఫుర్ఖాన్" అంటారు. అంటే సత్యాసత్యాలను వేరుచేసే గీటురాయి అని అర్థం. ఇది హిజ్రీ శకానికి ఆరేండ్ల పూర్వం అవతరించింది. ఇందులో ఖుర్‌ఆన్ గురించిన అనుమానాలకు సమాధానాలు; సత్యానికి విముఖులైనవారికి ఎదురయ్యే దుష్పర్యవసానాన్ని గురించి హెచ్చరిక; అవిశ్వాసుల మూఢనమ్మకాలు, దురాచారాల ఖండన; ముస్లింలకు కొన్ని హితవులు వగైరా విషయాలు ఉన్నాయి.

### కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

యావత్తు ప్రపంచవాసులను హెచ్చరించే నిమిత్తం ఈ ఫుర్ఖాన్ (గీటురాయి)ని తన దాసునిపై అవతరింపజేసినవాడు ఎంతో శుభదాయకుడు. ఆయన భూమ్యాకాశాల విశాల సామ్రాజ్యానికి అధినేత. ఆయన తనకంటూ ఎవరినీ కొడుకుగా చేసుకోలేదు. ఆయన సామ్రాజ్యం, సార్వభౌమత్వాలలో ఆయనకు ఎవరూ సాటిలేరు. ఆయన ప్రతి వస్తువునూ, (ప్రతిప్రాణిని) సృష్టించి, దానికొక జాతకాన్ని నిర్ణయించాడు. (1,2)

(అలాంటి మహోన్నతుడు, మహత్తర శక్తిసంపన్నుడైన) దేవుణ్ణి వదలి మానవులు ఎలాంటి వస్తువును కూడా సృజించలేని, స్వయంగా దేవునిచే సృజించబడిన మిథ్యాదైవాలను ఆరాధిస్తున్నారు. అవి తమకు ఎలాంటి లాభంగాని, నష్టంగాని కలిగించుకోలేవు. చంపే, బ్రతి కించే శక్తి వాటికి అసలే లేదు. మృతుల్ని పునర్జీవింపజేసే శక్తి అంతకన్నా లేదు. (3)

సత్యతిరస్కారులు (ఖుర్‌ఆన్‌ని విమర్శిస్తూ) "ఇవన్నీ అతను కల్పించుకున్న అభూత కల్పనలు. ఈ పనిలో అతనికి ఇతరులు సహాయపడుతున్నారు" అంటారు. వీరు ఘోరమైన అన్యాయానికి, పచ్చి అబద్ధానికి పాల్పడ్డారు. అంతేకాకుండా" ఇవన్నీ



పూర్వకాలం మనుషుల నుండి వస్తున్న కట్టుకథలు. వాటిని ఈయనగారు వ్రాయించి ఉదయం, సాయంత్రం (జనానికి) వినిపిస్తున్నాడు" అని కూడా చెప్పసాగారు. (4,5)

ముహమ్మద్ (స)! వారికి చెప్పు: "దీన్ని భూమ్యాకాశాల రహస్యాలను ఎరిగినవాడు మాత్రమే అవతరింపజేశాడు. ఆయన గొప్ప క్షమాశీలి, అమిత దయామయుడు." (6)

వారిలా అంటారు: "ఇతనేం ప్రవక్తండి బాబు, కూడు తింటూ వీధుల్లో తిరిగే మనిషి దైవప్రవక్త అవుతాడా? సరే, ప్రవక్త అయితే దేవుడు అతని దగ్గరకు ఒక దైవ దూతను పంపవచ్చుకదా? ఆదూత అతని వెంటఉండి (విశ్వసించనివారిని) మందలిస్తూ ఉండాలి. అలా ఎందుకు జరగలేదు? అదీకాకపోతే అతని కోసం ఏవైనా నిధినిక్షేపాలు దింపవచ్చుకదా? పోనీ, ప్రశాంతజీవితం గడపడానికి అతని దగ్గర ఒక తోటయినా లేదే!!

ఈదుర్మార్గులు (విశ్వాసులతో) "మీరు చేతబడికి గురైనవాడి వెంటపడ్డారు" అంటారు. నీగురించి ఎలాంటి కారుకూతలు కూస్తున్నారో చూడు. వీరికసలు మతి భ్రమించింది. ఒక్క మాటా సరిగ్గా ఆలోచించి మాట్లాడరు. దేవుడు తలచుకుంటే వారు చెబుతున్నదానికంటే ఎంతో (భాగ్యం) నీకు ప్రసాదించగలడు. ఆయన గొప్ప శుభకరుడు. (ఒక్క తోటేమిటి,) సెలయేళ్ళు, (అందమైన) మేడలు ఉండే అనేకతోటలు అనుగ్రహించగలడు. (7-10)

వారసలు (నిన్ను కాదు,) ప్రళయాన్ని తిరస్కరిస్తున్నారు. ప్రళయాన్ని తిరస్కరించే వారికోసం మేము తీవ్రంగా ప్రజ్వరిల్లే నరకాగ్ని సిద్ధపరచి ఉంచాము. నరకం వారిని దూరం నుంచి చూడగానే, వారు దాని ఆగ్రహోద్రేకపూరితమైన భీకరగర్జనలు వింటారు. వారిని కాళ్ళు, చేతులు కట్టివేసి ఓ ఇరుకైన (నరక) స్థలంలో కుక్కినప్పుడు వారు (విలవిల్లాడుతూ) మృత్యువుని పిలుస్తారు. (దానికి) "ఈరోజు మీరు ఒక్క చావుకాదు, అనేక చావులను పిలుచుకోండి" (అని సమాధానం ఇవ్వబడుతుంది). (11-14)

"ఈ దుర్గతి మంచిదా లేక భయభక్తులు కలవారికి వాగ్దానం చేయబడిన శాశ్వత స్వర్గధామం మంచిదా?" అని వారినడుగు. అది వారి సుకృతఫలం. వారి (మహా) ప్రస్థానంలో అంతిమ గమ్యం. అక్కడ వారు కోరే ప్రతి కోరికా నెరవేరుతుంది. వారక్కడ శాశ్వతంగా ఉంటారు. దాన్ని (భక్తిపరాయణులకు) ప్రసాదించే బాధ్యత నీ ప్రభువుపై ఉంది. ఇది ఆయన తప్పనిసరిగా నెరవేర్చవలసిన వాగ్దానం. (15,16)

ఆరోజు దేవుడు వారిని, నిజదేవుణ్ణి వదలి వారు పూజించిన మిథ్యాదైవాలను ఒక చోట చేర్చుతాడు. అప్పుడాయన మిథ్యాదైవాలను[1] ఉద్దేశించి "నాయీ దాసులను మీరు అపమార్గం పట్టించారా లేక వారంతటవారే దారితప్పారా?" అని అడుగుతాడు. (17)

---

1. ఇక్కడ మిథ్యాదైవాలంటే విగ్రహాలని అర్థంకాదు. దైవదూతలు, దైవప్రవక్తలు, దైవభక్తులు అమరవీరులు, మహనీయులను మిథ్యాదైవాలుగా పేర్కొనడం జరిగింది. బహుదైవారాధకులు వారిని పూజిస్తారు. ముఖ్యంగా వారి మరణానంతరం వారి విగ్రహాలు, సమాధులు, స్మారకచిహ్నా లను పూజిస్తారు. (ఈసా ప్రవక్తను పూజించేవారి ప్రస్తావన 5:116-120 సూక్తుల్లో చూడండి.)

దానికి వారిలా అంటారు: “(దేవ దేవ! ఎంతమాట!!) మీరు ఎంతో పరిశుద్ధులు. మిమ్మల్ని గాకుండా మరొకర్ని రక్షకుడిగా, పోషకుడిగా చేసుకునేటంతటి ధైర్యం మాకే లేదు. (ఇక వారికి మేమెలా చెప్పగలం?) అసలు మీరే వారికి, వారి తాతముత్తాతలకు పుష్కలంగా జీవన సామగ్రి ప్రసాదిస్తూ పోయారు. చివరికి వారు (మేలు చేసిన) మిమ్మల్నే మరచిపోయి సర్వనాశనమయ్యారు.” (18)

(కనుక అవిశ్వాసులారా!) ఈవిధంగా (మీ దైవాలు) నేడు మీరంటున్న మాటల్ని (ప్రళయదినాన) తిరస్కరిస్తారు. ఆతర్వాత మీకు విధించబడే శిక్ష నుండి మీరు ఏమాత్రం తప్పించుకోలేరు. ఎలాంటి సహాయమూ లభించదు. మీలో దౌర్జన్యానికి (సత్యతిరస్కారానికి) పాల్పడిన ప్రతివాడికీ మేము కఠినాతికఠిన యాతన చవిచూపిస్తాము. (19)

ముహమ్మద్ (స)! మేము నీకు పూర్వం పంపిన ప్రవక్తలు కూడా కూడు తింటూ, వీధుల్లో తిరిగేవారే. మేమసలు మిమ్మల్ని ఒకరికొకరు పరీక్షా సాధనాలుగా చేశాం. మరి మీరు సహనం వహిస్తారా? నీ ప్రభువు సమస్త విషయాలు గమనిస్తున్నాడు. (20)

మా దర్శనభాగ్యం ఆశించనివారు “దైవదూతలు మా దగ్గరికి ఎందుకు రారు? లేక దేవుడు మాకెందుకు కన్పించడు?” అనంటారు. వారు తమనుతాము ఏదో గొప్పవాళ్ళమని భావిస్తూ అహంకారం, తలబిరుసుతనాలతో హద్దుమీరి పోతున్నారు. (21)

నేరస్థులు ఏరోజు దైవదూతల్ని (కళ్ళారా) చూస్తారో ఆరోజు వారికి ఎలాంటి శుభవార్త ఉండదు. (అన్నీ దుర్వార్తలే.) దాంతో వారు వాపోతూ దేవుడ్ని శరణు కోరుతారు. మేము వారి కర్మలన్నిటినీ ధూళిరేణువుల్లా ఎగరవేస్తాము. (22,23)

స్వర్గానికి అర్హులైనవారు మాత్రమే ఆరోజు మంచి స్థితిలో ఉంటారు. మధ్యాహ్నం వేళ (ఎండ తీవ్రత)ను వెళ్ళబుచ్చడానికి వారికి హాయిగా ఉండే విశ్రాంతి స్థలం లభిస్తుంది. ఆరోజు ఆకాశాన్ని చీల్చుకుంటూ ఒక మేఘం ప్రత్యక్షమవుతుంది. దాంతోపాటు (ఆకాశం నుండి) పెద్ద ఎత్తున దైవదూతలు దిగివస్తారు. (24,25)

ఆ రోజు నిజమైన సామ్రాజ్యాధికారం కరుణామయునిదే అవుతుంది.[2] అది సత్య తిరస్కారులకు అతి కఠినమైన దుర్దినంగా దాపురిస్తుంది. ప్రతి దుర్మార్గుడు (తీవ్రమైన పశ్చాత్తాపంతో) తన చేతిని కొరుక్కుంటూ “అయ్యో! నేను దైవప్రవక్తతో సహకరించి సన్మార్గగామి అయివుంటే ఎంత బాగుండేది!! అయ్యయ్యో! నేను ఫలానావాడ్ని స్నేహితుడిగా చేసుకోకుండా ఉంటే బాగుండేది!! వాడి మాయదారి మాటలు విని నా దగ్గరకు వచ్చిన హితోపదేశాన్ని దూరం చేసుకున్నానే! నేనెంత దౌర్భాగ్యుడ్ని!!” అని అంటాడు.

---

2. ఇహలోకంలో పెద్దపెద్ద రాజ్యాలు ఏలి, దైవదాసులను తమ దాసులుగా చేసుకున్న చక్రవర్తులు, చండశాసనుల అధికారమైకం పూర్తిగా దిగిపోతుంది. అలాంటివారిని గురించి దైవప్రవక్త (సల్లం) ఇలా తెలిపారు: “దేవుడు (ఆరోజు) ఒక చేత్తో భూమిని, మరొక చేత్తో ఆకాశాన్ని పట్టుకొని ‘నేనే చక్రవర్తిని, నేనే సార్వభౌముడ్ని. మరి ఏరి ఆ భూలోక చక్రవర్తులు? ఎక్కడున్నారు ఆ చండ శాసనులు? ఏమయ్యారు ఆ అహంకారులు?’ అని అంటాడు.” (బుఖారి, ముస్లిం)



షైతాన్ మానవుడ్ని అత్యవసర సమయంలోనే నట్టేట ముంచుతాడు. దైవప్రవక్త “ప్రభూ! నాజాతి ప్రజలు ఈఖుర్‌ఆన్‌ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు” అంటాడు. (26-30)

ముహమ్మద్ (సల్లం)! ఈవిధంగా మేము నేరస్థులను ప్రతి ప్రవక్తకు విరోధులుగా చేశాము. నీకు మార్గదర్శనం చేయడానికి, సహాయపడటానికి నీ ప్రభువే చాలు. (31)

“ఇతనిపై మొత్తం ఖుర్‌ఆన్ ఒకేసారి ఎందుకు అవతరించదు?” అనంటారు సత్యతిరస్కారులు. ఎందుకంటే మేము దీన్ని కొద్దికొద్దిగా (దించి) నీకు క్షుణ్ణంగా బోధపరుస్తున్నాం. ఓ ప్రత్యేక క్రమంలో దీన్ని విడివిడిగా అంశాలవారిగా రూపొందించాము. నీ ముందు వారేదయినా కొత్త విషయం (లేదా విచిత్రమైన మాట) తెచ్చినప్పుడు దానికి సందర్భోచితంగా తగిన సమాధానమిచ్చి ఎంతో శ్రేష్ఠమైన రీతిలో నీకు విషయాన్ని విడమరచి చెబుతున్నాము... బోర్లా పడవేసి నరకానికి ఈడ్చబడవలసినవారి వైఖరి చాలా ఘోరంగా ఉంది. వారు పూర్తిగా దారితప్పారు. (32-35)

మేము మూసాకు (తౌరాత్) గ్రంథం ఇచ్చి, అతని సోదరుడ్ని అతనికి సహాయకునిగా నియమించాము. అప్పుడు వారితో “మా సూక్తులు తిరస్కరించిన జాతి దగ్గరకు వెళ్ళండి” అని చెప్పాము. చివరికి మేము ఆజాతి ప్రజలను సర్వనాశనం చేశాము. (36)

దైవప్రవక్తలను తిరస్కరించిన నూహ్‌జాతికి కూడా అదేగతి పట్టింది. మేము వారిని (నీటిలో) ముంచి, ఆ సంఘటనను ప్రజల కోసం గుణపాఠంగా చేశాం. దుర్మార్గుల కోసం మేము (పరలోకంలో వేరే) వ్యధాభరితమైన యాతన సిద్ధపరచి ఉంచాము. (37)

అలాగే ఆద్, సమూద్ జాతులు, పాడుబడ్డ బావివాళ్ళు,[3] వాటి మధ్యకాలాలకు చెందిన అనేక జాతుల ప్రజలు కూడా నాశనమయ్యారు. వారిలో చాలా మందికి (చారిత్రక) ఉదాహరణలతో విషయం నచ్చజెప్పాం. చివరికి మేము అందర్నీ అంతమొందించాం. అత్యంత దారుణంగా (శిలా)వర్షం కురిపించి (నాశనం చేయబడి)న పట్టణం[4] మీదుగా వీరు ఎన్నోసార్లు ప్రయాణం చేశారు. మరి వారు ఆ పట్టణానికి పట్టిన దుర్గతి గమనించలేదా? వారికసలు మరణానంతర జీవితంపై నమ్మకమే లేదు. (38-40)

వారు నిన్ను చూసినప్పుడల్లా “ఓహో, ఇతణ్ణేనా దేవుడు ప్రవక్తగా చేసి పంపింది!” అంటూ హేళన చేస్తారు. పైగా “మనం గనక మన దేవతల విషయంలో ఒక మాటపై స్థిరంగా ఉండకపోతే ఇతను తప్పకుండా మనల్ని పెడత్రోవ పట్టించి, మన దేవతల నుండి దూరం చేస్తాడు” అనంటారు. సరే, (పరలోక) శిక్ష చూసినప్పుడు పెడత్రోవ పట్టిపోయింది ఎవరో వారికే తెలుస్తుంది. (41,42)

---

3. పాడుబడ్డ బావివాళ్ళు అంటే ఎవరో ఇదమిత్థంగా తేలలేదు. ఇది దైవాగ్రహానికి గురైన ఒక జాతి అని, వారు తమకు రుజుమార్గం చూపడానికి వచ్చిన దైవప్రవక్తను పాడుబడ్డ బావిలోకి నెట్టి చంపారని మాత్రం తెలుస్తోంది.

4. లూత్‌జాతి నివసించిన పట్టణంపై దైవాగ్రహం విరుచుకుపడి సర్వనాశనమయింది. మక్కా ఖురైషీయులు వ్యాపార నిమిత్తం సిరియా పోతున్నప్పుడు, సిరియా నుండి తిరిగొస్తున్నప్పుడు ఈ పట్టణ శిథిలాలను ఎన్నోసార్లు చూశారు. ఆ జాతిదుర్గతి గురించిన గాథలు కూడా విన్నారు.

మనోవాంఛనే దైవంగా[5] చేసుకున్నవ్యక్తిని చూశావా నీవు? అలాంటివాడ్ని దారిలోకి తేగలవా? వారిలో చాలామంది (నీమాటలు) వింటారని, అర్థం చేసుకుంటారని భావిస్తు న్నావా? వారసలు పశువుల్లాంటివారు. కాదు, అంతకన్నా దిగజారిపోయారు. (43,44)

నీ ప్రభువు, నీడను ఎలా వ్యాపింపజేస్తున్నాడో గమనించావా? ఆయన తలచు కుంటే దాన్ని శాశ్వతమైన నీడలా చేయగలడు. మేము సూర్యుడ్ని నీడకు మార్గదర్శిగా చేశాం. ఆపై (సూర్యుడు పైకెదిగే కొద్దీ) మేమా నీడను క్రమేణా మావైపు వెనక్కి తీసుకుంటున్నాం. దేవుడే మీకోసం రాత్రిని (చీకటి) తెరగా, నిద్రను విశ్రాంతి స్థితిగా, పగటిని లేచి పనులు చేసుకునే సమయంగా చేశాడు. (45-47)

ఆయనే తన కారుణ్యా(వర్షా)నికి ముందు (చల్లటి) గాలిని శుభవార్తగా పంపు తున్నాడు. తరువాత ఆకాశం నుండి స్వచ్ఛమైన నీటిని వర్షింపజేస్తున్నాడు. దాని ద్వారా మేము (బీటలు వారిన) మృతభూమికి జీవం పోస్తున్నాం. మరోవైపు మేము సృష్టించిన జీవరాసుల్లో అనేకమంది మానవులకు, జంతువులకు ఆ నీటిని త్రాగిస్తున్నాం. (48,49)

ప్రజలు గుణపాఠం నేర్చుకోవడానికి ఈమహిమను మాటిమాటికి వారి ముందుకు తెస్తున్నాం. కాని చాలామంది తిరస్కారం, కృతఘ్నతలు తప్ప మరోవైఖరి అవలంబించ డానికి సిద్ధంగా లేరు. మేము తలచుకుంటే ప్రతి ఊరికీ ఒక హెచ్చరించేవాడ్ని (అంటే దైవప్రవక్తను) నియమించేవాళ్ళము. కనుక ప్రవక్తా! అవిశ్వాసుల మాట ఎన్నటికీ వినకు. ఈ ఖుర్ఆన్‌ని తీసుకొని వారితో అవిశ్రాంత పోరాటం జరుపుతూ ఉండు. (50-52)

ఆయనే రెండు సముద్రాలను కలిపి ఉంచాడు. ఒకటి మధురమైన మంచినీటి సముద్రం, రెండోది అతి క్షారవంతమైన ఉప్పునీటి సముద్రం. అవి రెండు ఒకదానితో మరొకటి కలసిపోకుండా వాటి మధ్య ఒక అడ్డుతెర ఉంటుంది. (53)

ఆయనే నీటితో మానవుడ్ని సృజించి, అతని నుండి పుట్టిల్లు, మెట్టిల్లు అనే రెండు వంశవృక్షాలను వృద్ధిచేస్తున్నాడు. నీ ప్రభువు ఎంతో శక్తిమంతుడు. (54)

అలాంటి దేవుడ్ని వదలి ప్రజలు తమకు ఎలాంటి లాభంగాని, నష్టంగాని కలిగించ లేని మిథ్యాదైవాలను ఆరాధిస్తున్నారు. పైగా (ఈ)అవిశ్వాసి తన నిజప్రభువుకు వ్యతిరేకంగా ప్రతి దుష్టశక్తికీ తోడ్పడుతున్నాడు. (55)

ప్రవక్తా! మేము నిన్ను శుభవార్తాహరునిగా, హెచ్చరించేవానిగా నియమించి పంపాం. వారికిలా చెప్పు: "నేనీ పనికోసం మీనుండి ఎలాంటి ప్రతిఫలం ఆశించడం లేదు. ఇష్టమున్న వారు తమ ప్రభువు మార్గం అవలంబిస్తే చాలు. అదే నా ప్రతిఫలం."

5. మనోవాంఛను దైవంగా చేసుకోవడమేమిటని కొందరు ఆశ్చర్యపోవచ్చు. కాని నిజ దేవుడు అవతరింపజేసిన ధర్మాన్ని వదలి మనోవాంఛలకు బానిసయి పోయిన ప్రతి మనిషికీ అతని మనోవాంఛలే దైవాలవుతాయి. ఈ మిథ్యాదైవం గురించి దైవప్రవక్త (సల్లం) ఇలా చెప్పారు: "ఈ ఆకాశం క్రింద దేవుడు మినహా పూజలందుకుంటున్న ఇతర ఆరాధ్యదైవాలలో అతి నికృష్ట దైవం ఏదైనా ఉంటే అది (మనిషి) అనుసరించే మనోవాంఛే." (45:23 సూక్తి కూడా చూడండి.)



ముహమ్మద్ (స)! నిత్యజీవుడు, అమరుడు అయిన దేవుడ్ని మాత్రమే నీవు నమ్ము కొనిఉండు. ఆయన్ని స్తుతిస్తూ, ఆయన పవిత్రతను కొనియాడుతూ ఉండు. తన దాసుల పాపకార్యాలు తెలుసుకోవడానికి ఆయన ఒక్కడే చాలు. ఆయన భూమ్యాకాశా లను, వాటి మధ్య ఉన్న సమస్తాన్ని ఆరు రోజుల్లో సృష్టించి, ఆ తర్వాత (విశ్వసామ్రాజ్యా ధినేతగా అధికార) సింహాసనం అధిరోహించాడు. ఆయన ఎంతో కరుణామయుడు. (కావాలంటే) ఆయన్ని గురించి తెలిసినవారిని అడిగి తెలుసుకో. (56-59)

ఆ కరుణామయునికి సాష్టాంగపడమని చెప్పినప్పుడు వారు (తిరస్కారభావంతో) "ఎవరా కరుణామయుడు? నీవు ఎవరికి సాష్టాంగపడమంటే వారికి సాష్టాంగపడటమేనా మాపని?" అనంటారు. ఈ వైఖరితో వారి తిరస్కారం మరింత ముదిరిపోయింది. (60)

ఆకాశంలో నక్షత్రసముదాయాలను, (దేదీప్యమానమైన) సూర్యుడ్ని, ప్రకాశవంత మైన చంద్రుడ్ని సృజించిన శక్తిస్వరూపుడు గొప్ప శుభకరుడు. ఆయనే రాత్రింబవళ్ళను ఒకదాని వెనుక మరొకటి వచ్చేలా చేశాడు. (సృష్టినిర్మాణం గురించి) యోచించగోరే వారికి, లేదా కృతజ్ఞత చూపదలిచేవారికి ఇందులో గొప్ప సూచన ఉంది. (61,62)

కరుణామయుని (నిజ)భక్తులు భూమిపై (విర్రవీగకుండా) నమ్రతగా నడుస్తారు. మూర్ఖులు వారితో వాదనకుదిగితే "మీకు సలాం" అంటారు. వారు తమ ప్రభువు సన్నిధిలో నిలబడి ప్రార్థనచేస్తూ, సాష్టాంగపడుతూ రాత్రిళ్ళు గడుపుతారు. అదీగాక దైవాన్ని వేడుకుంటూ "ప్రభూ! మమ్మల్ని నరకయాతనల నుండి కాపాడు. ఆ యాతనలు ఎంతో బాధాకరంగా, దారుణంగా ఉంటాయి. నరకం పరమ చెడ్డ నివాసస్థలం" అని అంటారు. (63-66)

వారు తమ సంపద వినియోగిస్తున్నప్పుడు దుబారా ఖర్చుచేయరు; ఇటు పిసినారి తనం కూడా వహించరు. వారి ఖర్చు ఆ రెండు అతిచర్యలకు మధ్యస్తంగా ఉంటుంది. వారు ఒక్క దేవుడ్ని తప్ప మరెవరినీ ప్రార్థించరు. దేవుడు నిషేధించిన ఏ ప్రాణినీ అన్యాయంగా హతమార్చరు. వ్యభిచారానికి ఏమాత్రం పాల్పడరు.

ఈ పాడుపనులు చేసేవాడు మటుకు తన పాపఫలం అనుభవిస్తాడు. ప్రళయం రోజు అతనికి (నరకంలో) రెట్టింపు శిక్ష విధించబడుతుంది. అందులోనే అతను ఎల్లకాలం అవమానభారంతో క్రుంగిపోతూ పరమనీచంగా పడివుంటాడు. అయితే పశ్చాత్తాపహృదయంతో క్షమాపణ కోరుకొని, దాంతోపాటు సత్యాన్ని విశ్వసించి సత్కార్యాలు చేయడం మొదలెడితే అలాంటి మనిషికి శిక్ష విధించబడదు.[6] పైగా దేవుడు

6. ఈ రెండు సూక్తులలో దేవునికి సాటి కల్పించడం (షిర్క్-4:48,116), ఎవరినయినా అన్యాయంగా చంపడం, వ్యభిచారం చేయడం - ఇవి ఘోరపాపాలుగా పరిగణించబడ్డాయి. అనేక హదీసుల్లో హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి) ఉల్లేఖనం ప్రకారం: దేవునికి ఇతరులను సాటి కల్పించడం, పసిపిల్లవాడు ఆహారంలో భాగస్వామి అయి మరింత దారిద్ర్యం తెస్తాడన్న భయంతో అతడ్ని హతమార్చడం, పొరుగింటివాని భార్యతో వ్యభిచరించడం- ఘోర పాపాలుగా పరిగణించ బడ్డాయి. (ఇతర వివరాలకు 4:30 సూక్తికి రాసిన పాదసూచిక చూడండి.) అయితే ఇలాంటి పాపాలు

అలాంటివారి (గత) దుష్కర్మలను సత్కర్మలుగా మార్చివేస్తాడు.[7] ఆయన గొప్ప అనుగ్రహశీలి, పరమ దయాళువు. (67-70)

పశ్చాత్తాపంతో క్షమాపణ కోరుకొని సదాచార వైఖరి అవలంబించినవాడు నిజానికి మనస్పూర్తిగా పశ్చాత్తాపం చెంది దేవుని వైపు మరలి వచ్చినవాడవుతాడు. (71)

---

చేసినవారు సైతం దేవుడ్ని క్షమాపణ కోరుకొని జీవితాన్ని సరిదిద్దుకుంటే క్షమించబడతారు. ఉదాహరణకు హజ్రత్ అబూహురైరా (రజి) తెలిపిన ఈ సంఘటన చూడండి:

ఒకరోజు నేను నబవీమస్జిద్‌లో ఇషానమాజ్ చేసి ఇంటికొస్తే ఒక స్త్రీ మా ఇంటి ముందు నిల్చున్నది. నేనామెకు సలాం చేసి నా గదిలోకి వెళ్ళిపోయాను. తలుపులేసుకొని నఫిల్ నమాజులో లీనమైపోయాను. కాస్సేపటికి ఆమె తలుపు తట్టింది. నేను తలుపు తీసి ఏం కావాలని అడిగాను. ఆమె విషయం చెబుతూ "నా వల్ల వ్యభిచారం జరిగింది. అక్రమ గర్భం దాల్చాను. పిల్లవాడు పుడ్తే అతడ్ని చంపేశాను. మరిప్పుడు నా పాప క్షమాపణకు ఏదైనా దారి ఉందంటారా?" అని అడిగింది. నేను ఏమాత్రం లేదని చెప్పాను. నా మాటలు విని ఆమె "అయ్యో! నాయీ సౌందర్యం అగ్నికి ఆహుతి కావడానికే సృజించబడిందా!!" అంటూ రోదిస్తూ వెళ్ళిపోయింది.

మరునాడు ఉదయం నేను దైవప్రవక్త (సల్లం) వెనుక నమాజ్ చేశాక ఆయన ముందు రాత్రి జరిగిన సంఘటన వివరించాను. దానికి దైవప్రవక్త (సల్లం) "అబూహురైరా! నీవు చాలా తప్పుడు సమాధానమిచ్చావు. నీవీ సూక్తి... చదవలేదా?" అన్నారు. ఈ మాట విని నేను వెంటనే ఆ స్త్రీని వెతకడానికి బయలుదేరాను. రాత్రి ఇషా వేళలోనే ఆమెను కలుసుకో గలిగాను. నేనామెకు నీ ప్రశ్నకు దైవప్రవక్త (సల్లం) ఇలా సమాధానమిచ్చారని శుభవార్త విన్పించాను. ఇది విని వెంటనే ఆమె దేవునికి సాష్టాంగపడి "నా కోసం పాపమన్నింపు ద్వారం తెరచిన పరిశుద్ధ దేవునికి నేనెంతో కృతజ్ఞురాలిని" అన్నది. ఆ తర్వాత ఆమె పశ్చాత్తాప హృదయంతో క్షమాపణ కోరుకొని తన దగ్గరున్న ఒక బానిసకు స్వేచ్ఛ నిచ్చింది. (తబ్రాని).

7. దీనికి రెండర్థాలున్నాయి. ఒకటి, దేవుడు అతని జీవిత గమ్యాన్ని మార్చివేస్తాడు. ఉదాహరణకు: ఇస్లాం స్వీకరించక పూర్వం అతను దుష్కార్యాలు చేస్తుండేవాడయితే, ఇప్పుడు సత్కార్యాలు చేస్తున్నాడు. గతంలో అతను బహుదైవారాధన చేస్తుండేవాడైతే, ఇప్పుడు ఏకదైవారాధన చేస్తున్నాడు. ఇదివరకు అతను అవిశ్వాసులతో కలసి సత్యవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుండే వాడయితే, ఇప్పుడు ముస్లింలతో కలసి ధర్మసంస్థాపనా కార్యకలాపాలలో పాల్గొంటున్నాడు.

రెండు, అతని పాపాలను పుణ్యాలుగా మార్చుతాడు. ఈ విషయంలో దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: "అందరికంటే చివర్లో నరకం నుండి బయటపడి, అందరికంటే చివర్లో స్వర్గప్రవేశం చేసే మనిషి నాకు తెలుసు. ప్రళయదినాన అతని పెద్ద పాపాలు వేరేచోట ఉంచి, చిరు పాపాలు అతని ముందు బహిర్గతం చేస్తారు. అప్పుడతనితో 'నువ్వు ఫలానా రోజు ఫలానా పాపకార్యం చేయలేదా?' అని ప్రశ్నిస్తారు. దానికతను ఔనంటాడు, నిరాకరించలేడు. అయితే తాను చేసిన ఘోరపాపాలు ఎక్కడ బహిర్గతం చేస్తారోనని లోలోన భయపడుతుంటాడు. అంతలో 'నీవు చేసిన ఈపాపాలలో ప్రతిదానికీ బదులుగా ఒక్కో పుణ్యం లభిస్తుంది వెళ్ళు' అని చెబుతారు. అప్పుడతను దేవుడు చూపిన ఈ దయాదాక్షిణ్యాలు చూసి, 'నేనింకా పెద్ద పాపాలు కూడా చేశాను. అవి నాకిక్కడ కన్పించడం లేదే?' అంటాడు". దైవప్రవక్త (స) ఈమాట చెప్పి ఫక్కున నవ్వుతారు. (ముస్లిం)

ఈ అధమశ్రేణి స్వర్గనివాసి గురించిన పూర్తి వివరాల కోసం "ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్" నుండి వెలువడిన "పరలోక ప్రస్థానం" అనే పుస్తకం చదవండి.) ✪



(కరుణామయుని నిజభక్తులు) అసత్యానికి ఎన్నడూ సాక్షులుగా ఉండరు. ఎప్పుడైనా వారు పనికిమాలిన వ్యవహారం మీదుగా పోవలసివస్తే దాన్ని పట్టించుకోకుండా హుందాగా, గౌరవప్రదంగా దాటివెళ్తారు. వారికి వారిప్రభువు సూక్తులు విన్పించి హితోపదేశం చేయడం జరిగితే వారు అంధులుగా, బధిరులుగా మారి వాటిని నిర్లక్ష్యం చేయరు. వారు (దైవసన్నిధి లో చేతులు జోడించి) "ప్రభూ! మాభార్యాపిల్లల ద్వారా మా కంటికి చలువ ప్రసాదించు. మేము దైవభీతిపరులకు నాయకులయ్యేలా చెయ్యి" అని ప్రార్థిస్తారు. (72-74)

వీరే తమ సహనానికి ప్రతిఫలంగా అత్యున్నత స్థానాలు పొందేవారు. వారిని (దైవదూతలు) ఎంతో గౌరవిస్తూ శాంతివచనాలతో స్వాగతిస్తారు. వారక్కడ (స్వర్గంలో) కలకాలం (సుఖసంతోషాలతో) ఉంటారు. ఎంతమంచి నివాసస్థలం అది! (75,76)

చెప్పు: "మీరు నా ప్రభువుని ఆరాధించడానికి ముందుకు రాకపోతే ఆయన మాత్రం మిమ్మల్ని ఎందుకు లక్ష్యపెడతాడు? అదీగాక మీరాయన్ని తిరస్కరించారు కూడా. కనుక మీరు త్వరలోనే ఈ తిరస్కారానికి తగినశిక్ష అనుభవిస్తారు." (77) ✪

## అవతరణ: మక్కా 26. కవులు (షుఅరా) సూక్తులు: 227

ఈ అధ్యాయాన్ని "షుఅరా" (కవులు) అంటారు. ఇది కూడా హిజ్రీ శకారంభానికి ఆరేడు సంవత్సరాలకు పూర్వం మక్కాలో అవతరించినట్లు తెలుస్తోంది. ఇందులో సత్య తిరస్కారుల ఆరోపణలకు, అభ్యంతరాలకు సమాధానం ఇవ్వబడింది. గత ప్రవక్తల గాథలు కూడా ప్రస్తావించబడ్డాయి. చివర్లో ఖుర్‌ఆన్ మానవరచన కాదని, కవులసృష్టి కాదని చెబుతూ సత్యవ్యతిరేక కార్యకలాపాలకు అవిశ్వాసులు దుష్ఫలితం అనుభవించ వలసి వస్తుందని హెచ్చరించబడింది.

### కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

తా-సీన్-మీమ్. ఇవి విషయస్పష్టత గల గ్రంథానికి చెందిన సూక్తులు. (1,2)

ముహమ్మద్ (సల్లం)! (నీ పరిస్థితి చూస్తుంటే) వారు విశ్వసించడంలేదన్న దిగులుతో నీవు కృశించిపోయి ప్రాణాలు పోగొట్టుకునేలా ఉన్నావు. మేము తలచుకుంటే ఆకాశం నుండి అద్భుతమైన నిదర్శనం పంపి దాని ముందు వారి మెడలు వంచగలం. వారు తమ దగ్గరికి కరుణామయుని నుండి కొత్తగా ఎలాంటి ఉపదేశం వచ్చినా దానికి విముఖులవుతారు. వారసలు సత్యాన్ని నిరాకరించారు. (వారిక దారికి రారు.) వారీనాడు ఏ విషయాన్ని గురించి పరిహాస మాడుతున్నారో దాని వాస్తవికత ఏమిటో త్వరలోనే వారికి తెలిసిపోతుంది. (3-6)

వారెప్పుడూ భూమిని పరికించి చూడలేదా? మేమందులో రకరకాలతో కూడిన ఎంతో మంచి వృక్ష జాతులు పుట్టించాము. నిస్సందేహంగా ఇందులో గొప్ప సూచన ఉంది. కాని వారిలో అనేకమంది సత్యాన్ని విశ్వసించనివారే ఉన్నారు. నీ ప్రభువు సర్వశక్తిమంతుడు, అపార దయామయుడు. (7-9)

నీ ప్రభువు మూసాను పిలిచినప్పటి గాథ విన్పించు. అప్పుడు మూసాతో నీ ప్రభువు "దుర్మార్గులైన ఫిరౌన్‌జాతి ప్రజల దగ్గరకు వెళ్ళు. వారు భయపడరా?" అన్నాడు. (10,11)

దానికి మూసా "ప్రభూ! వారు నన్ను తిరస్కరిస్తారేమోనని భయంగా ఉంది. నా గుండె అదిరిపోతున్నది. నాకు సరిగ్గా మాట్లాడటం రాదు. నీవు హారూన్‌ని ప్రవక్తగా నియమించు. అదీగాక వారి దగ్గర నామీద ఒక నేరారోపణ కూడా ఉంది. అందువల్ల వారు నన్ను చంపుతారేమోనని భయపడుతున్నాను" అని అన్నాడు. (12-14)

"ఏమీకాదు. మీరిద్దరు మా సూచనలు తీసుకొని వెళ్ళండి. మేము మీతోపాటే ఉండి విషయాలన్నీ వింటాం. మీరు ఫిరౌన్ దగ్గరకెళ్ళి 'మమ్మల్ని సర్వలోక ప్రభువు పంపించాడు; కనుక నీవు ఇస్రాయీల్ సంతతిని మావెంట పంపించు' అని చెప్పండి అతనికి." (15-17)

(మూసాప్రవక్త ఫిరౌన్ దగ్గరికెళ్ళి ఈమాట అన్నప్పుడు) ఫిరౌన్ (ఎత్తిపొడుస్తూ) "మేము నిన్ను పసితనంలో పెంచలేదా? నీవు నీ జీవితాన్ని అనేక సంవత్సరాలు మా దగ్గర గడిపావు. తరువాత ఏదో చేసి వెళ్ళిపోయావు. (మేము చేసిన మేళ్ళన్నీ మరచి పోయి చివరికి మాకే ఎసరు పెట్టడానికి వచ్చావన్నమాట!) నిజంగా నీవు చాలా కృతఘ్నుడివి" అని అన్నాడు. (18,19)

"ఆనాడు నేనా పని అజ్ఞానాంధకారంలో ఉండి తెలియక చేశాను. తరువాత మీకు భయపడి పారిపోయాను. ఆ తరువాత నా ప్రభువు నాకు జ్ఞానకాంతి ప్రసాదించి నన్ను ప్రవక్తల జాబితాలో చేర్చాడు. ఇక నీవు నన్ను ఎత్తిపొడుస్తున్న మేలు సంగతికి వస్తే, (అందులో విశేషం ఏమీలేదు.) నీవు (నా జాతికి చెందిన) ఇస్రాయీల్ సంతతిని కట్టుబానిసలుగా చేసుకున్నావు" అని సమాధానమిచ్చాడు మూసా. (20-22)

"సరే, నువ్వేదో సర్వలోక ప్రభువంటున్నావు, ఎవరా సర్వలోక ప్రభువు? ఏమిటా కథ?" అడిగాడు ఫిరౌన్. (23)

"నీవు విశ్వసించే వాడివయితే విను. ఆయన భూమ్యాకాశాలకు, వాటిమధ్య ఉన్న సమస్త సృష్టిరాసులకు ప్రభువు" అన్నాడు మూసా. (24)

"వింటున్నారా (ఈయనగారి వింతమాటలు)?" అన్నాడు ఫిరౌన్ తన చుట్టూ ఉన్న మందీ మార్బలంతో. (25)

"ఆయన మీకూ ప్రభువే, మీకు పూర్వం గతించిన మీ తాత ముత్తాతలకూ ప్రభువే" అన్నాడు మూసా (26)

"(చూశారా!) మీ దగ్గరకు పంపబడిన ఈ ప్రవక్త మహాశయులు గారిని, చూస్తే మహా తలతిక్క మనిషిలా కన్పిస్తున్నాడు" అన్నాడు ఫిరౌన్ (సభాసదుల్ని ఉద్దేశించి).

"మీరు విజ్ఞతా వివేచనలు కలవారైతే (వినండి), ఆయన ప్రాక్పశ్చిమాలకు, వాటి మధ్య ఉన్న సమస్తానికీ ప్రభువే" అన్నాడు మూసా. (27,28)



"(మూసా! ఇక చాలించు.) నీవు నన్ను తప్ప మరొకడ్ని దైవంగా అంగీకరించా వంటే (జాగ్రత్త!) నిన్నుకూడా జైళ్ళలో పడి మగ్గుతున్నవారి దగ్గరకు చేరుస్తాను (తెలుసా?)" అన్నాడు ఫిరౌన్ (ఆగ్రహంతో బెదిరిస్తూ). (29)

"ఒకవేళ నేను నీముందు (నా దౌత్యానికి నిదర్శనంగా) ఒక స్పష్టమయిన వస్తువుని ప్రదర్శిస్తే (నమ్ముతావా)?" అడిగాడు మూసా. (30)

"(ముందు) అదేమిటో చూపు నీవు సత్యవంతుడవయితే" అన్నాడు ఫిరౌన్. (31)

మూసా (ఈమాట వినగానే) తన చేతికర్ర క్రింద పడవేశాడు. అది ఒక్కసారిగా నిజమైన సర్పంగా మారిపోయింది. ఆతర్వాత అతను తన చేతిని చంకలోపెట్టి అదిమి బయటికి తీశాడు. అది ప్రేక్షకుల ముందు దేదీప్యమానంగా వెలిగిపోసాగింది. (32,33)

ఫిరౌన్ తన చుట్టూ ఉన్న ఉన్నతాధికారుల్ని ఉద్దేశించి "ఇతను నిజంగా ఆరితేరిన గొప్ప మాంత్రికుడు. ఇతను తన మంత్రబలంతో మిమ్మల్ని మీ రాజ్యం నుండి వెళ్ళ గొట్టాలని భావిస్తున్నాడు. ఇలాంటి పరిస్థితిలో ఏం చేయాలో మీరే చెప్పండి" అన్నాడు.

"అతడ్ని, అతని సోదరుడ్ని ఆపి, వివిధ పట్టణాలకు రాజభటుల్ని పంపండి. వారు కాకలుతీరిన మాంత్రికుల్ని మీదగ్గరకు పిలుచుకువస్తారు" అన్నారు వారు. (34-37)

దాని ప్రకారం ఒక రోజు నిర్ణీత సమయాన (దేశం నలుమూలల నుండి) ప్రముఖ మాంత్రికుల్ని పిలిపించడం జరిగింది. ఆ సందర్భంగా "మీరు సభాస్థలికి వస్తున్నారా? అయితే మాంత్రికులు గెలిస్తే మనం (మన) మాంత్రికుల మతంలోనే ఉండిపోవచ్చు. (లేకుంటే మనకిక్కడ పుట్టగతులుండవు)" అని జనంలో విస్తృతప్రచారం జరిగింది.

మాంత్రికులు రంగంలోకి దిగి, "మేము గెలిస్తే మాకేమయినా బహుమానం దొరుకుతుందా?" అని అడిగారు ఫిరౌన్‌ని. (40,41)

"తప్పకుండా, అప్పుడు మీరు మా సన్నిహితుల్లో చేరిపోతారు" అన్నాడు ఫిరౌన్.

"మీరు పడవేయ దలచుకున్నదేమిటో క్రింద పడవేయండి"అన్నాడు మూసా.

వెంటనే వారు తమ దగ్గరున్న త్రాళ్ళను, కర్రలను నేలమీద పడవేస్తూ "ఫిరౌన్ (దివ్య) శక్తితో మేమే విజయం సాధిస్తాం" అన్నారు. (42-44)

(వారి త్రాళ్ళు, కర్రలు కనికట్టు పాములుగా మారి భీతావహం సృష్టించాయి. అప్పుడు) మూసా తన చేతికర్ర క్రింద పడవేశాడు. ఆ కర్ర ఒక్కసారిగా (భయంకర సర్పంగా మారి) వారి అభూతకల్పనలను చక చకా మింగివేస్తూ పోయింది. ఈ అసాధారణ మహిమ చూసి మాంత్రికులంతా అప్రయత్నంగా సాష్టాంగపడ్డారు. ఆ తర్వాత "మేము సర్వలోక ప్రభువుని విశ్వసించాం... మూసా, హారూన్‌ల ప్రభువుని విశ్వసించాం" అన్నారు. (45-48)

ఫిరౌన్ (ఆగ్రహోదగ్రుడయి) "ఏమిటి, నేను అనుమతించక ముందే మీరు మూసా మాట ఒప్పుకున్నారా? అయితే ఇతను తప్పకుండా మీకు మంత్రవిద్య నేర్పిన గురువై

ఉంటాడు. అందులో ఎలాంటి సందేహం లేదు. సరే కానివ్వండి, (నా తడాఖా ఏమిటో) ఇప్పుడే మీకు తెలిసిపోతుంది. నేను పరస్పర వ్యతిరేక దిశల్లో ఉన్న మీ కాళ్ళు చేతుల్ని నరికించి మిమ్మల్నందర్నీ ఉరికంబం ఎక్కిస్తాను" అని అన్నాడు. (49)

"పరవాలేదు. మేము ఎటూ మా ప్రభువు దగ్గరికి పోవాల్సినవాళ్ళమే. మేము అందరికంటే ముందు విశ్వసించాం. అంచేత మాప్రభువు మా పాపాలు క్షమిస్తాడని మాకు నమ్మకం ఉంది" అన్నారు మాంత్రికులు (ఫిరౌన్ బెదిరింపులు భయపడకుండా).

మేము మూసాకు దివ్యావిష్కృతి ద్వారా "(ఒకరోజు) రాత్రికి రాత్రే నా దాసుల్ని తీసుకొని బయలుదేరు, మిమ్మల్ని (ఫిరౌనీయులు) వెంబడిస్తారు" అని చెప్పాము.

(ఈసంగతి తెలిసి) ఫిరౌన్ (సైనిక సమీకరణ కోసం) రాజభటుల్ని పిలిచి "వీరు కొద్దిమంది మాకు ఆగ్రహం తెప్పించారు. మనం అనుక్షణం అప్రమత్తంగా ఉంటున్న సాయుధ బలగం" అని చెప్పి పంపించాడు. (50-56)

ఈవిధంగా మేము వారిని తోటలు, సెలయేరులు, నిక్షేపాలు, అందమైన గృహాల నుండి బయటికి తీశాము. ఇదీ వారి పట్ల మా ప్రవర్తన. ఇక ఇస్రాయీలీల విషయానికి వస్తే వారిని మేము (అలాంటి విలువైన) వస్తువులన్నిటికీ వారసులుగా చేశాము.

(ఓరోజు) ఉదయాన్నే ఫిరౌనీయులు వారిని వెంబడించడానికి బయలుదేరారు. (ఒకచోట) రెండుపక్షాలు ఒకదానికొకటి తారసపడగానే మూసా అనుచరులు (భయపడి పోతూ) "మేమిక పట్టుబడి పోయాం" అని కేకలు పెట్టారు. (57-61)

"కాదు (అలా జరగదు). నాతోపాటు నా ప్రభువున్నాడు. ఆయన తప్పకుండా నాకు దారి చూపుతాడు" అన్నాడు మూసా.

మేమప్పుడు మూసాకు దివ్యావిష్కృతి ద్వారా "నీ చేతి కర్రతో సముద్రం మీద ఓదెబ్బ వెయ్యి" అని ఆదేశించాము.

(ఆవిధంగా మూసా చేయగానే) సముద్రం ఒక్కసారిగా చీలిపోయింది. చీలిన ప్రతి భాగం ఎత్తయిన కొండలా తయారయింది. ఆ (చీలికల మధ్య) ఏర్పడిన ఖాళీ స్థలం లోనే మేము రెండోపక్షాన్ని కూడా దగ్గరగా తీసుకువచ్చాం. తర్వాత మేము మూసాను, అతని వెంటనున్న వారందర్నీ రక్షించాం. మిగతావారిని ముంచివేశాం. (62-66)

ఈ సంఘటనలో గొప్ప సూచన ఉంది. కాని వారిలో చాలామంది విశ్వసించే వారు కాదు. నీ ప్రభువు ఎంతో శక్తిమంతుడు; అమిత దయామయుడు. (67,68)

వారికి ఇబ్రాహీం గాథ విన్పించు. అతను తన తండ్రిని, తన జాతిని "మీరు దేన్ని పూజిస్తున్నారు?" అనడిగాడు. దానికి వారు"మేము విగ్రహాల్ని పూజిస్తున్నాం. ఎల్లప్పుడూ వీటి ఆరాధనలోనే ఉంటాం" అన్నారు. (69-71)

"అయితే మీరు ప్రార్థిస్తున్నప్పుడు ఇవి మీప్రార్థనల్ని ఏమైనా ఆలకిస్తాయా? లేక ఇవి మీకేమైనా లాభంగాని, నష్టంగాని కలిగిస్తాయా?" మళ్ళీఅడిగాడు ఇబ్రాహీం. దానికి



వారు "లేదు, మా తాతముత్తాతలు ఇలా చేస్తుంటే చూశాం." అన్నారు. (72-74)

"మీరు, పూర్వం మీ తాతముత్తాతలు పూజించే ఈ వస్తువులేమిటో ఎప్పుడైనా ఆలోచించారా? ఒక్క విశ్వప్రభువు తప్ప ఇవన్నీ నాకు శత్రువులు. నన్ను విశ్వప్రభువు సృష్టించాడు. ఆయనే నాకు (రుజు)మార్గం చూపించాడు. నాకు ఆహారపానీయాలు కూడా ఆయనే ప్రసాదిస్తున్నాడు. నేను జబ్బుపడితే స్వస్థత చేకూర్చేవాడు కూడా ఆయనే. నాకు మరణం కలిగించేవాడు, (పరలోకంలో) నన్ను పునర్జీవింపజేసేవాడు కూడా ఆ ప్రభువే. ఆయన తీర్పుదినాన నా పాపాలు క్షమిస్తాడని నేను ఆశిస్తున్నాను" అన్నాడు ఇబ్రాహీం. (75-82)

(ఆ తర్వాత అతనిలా ప్రార్థించాడు:) "ప్రభూ! నాకు విద్యా వివేకాలు ప్రసాదించు. నన్ను సజ్జనులలో చేర్చు. భావితరాలలో నాకు సత్కీర్తి ప్రసాదించు. మహాభాగ్యాలతో నిండిన స్వర్గానికి వారసులయ్యేవారి జాబితాలో నన్ను చేర్చు. (ప్రభూ!) నాతండ్రిని క్షమించు. ఆయన దారితప్పి ఉన్నాడు. మానవులు మళ్లీ బ్రతికించి లేపబడే రోజున నన్ను నవ్వులపాలు చేయకు. ఆరోజు సంతానం, సిరిసంపదలు ఏమాత్రం ఉపయోగ పడవు. నిష్కల్మషమైన హృదయంతో దేవుని సన్నిధికి వచ్చినవారికే ఆరోజు ప్రయోజనం ఉంటుంది." దైవభీతిపరులకు స్వర్గం అతి చేరువగా తీసుకురాబడుతుంది. (83-90)

(ఆరోజు) దారితప్పినవారి ముందు నరకం ఉంచబడుతుంది. అప్పుడా మార్గ భ్రష్టుల్ని (దైవదూతలు) ఇలా అడుగుతారు: "మీరు నిజదేవుణ్ని వదలి ఆరాధించిన ఆ మిథ్యాదైవాలు ఇప్పుడు ఏమైపోయాయి? అవి మీకేమైనా సహాయం చేస్తున్నాయా? పోని, తమనుతామైనా కాపాడుకో గలుగుతున్నాయా?" (92,93)

ఆ తరువాత (దైవదూతలు) ఆ మిథ్యాదైవాలను, ఈ భ్రష్టుల్ని, షైతాన్ అనుచర మూకను అందర్నీ ఒకరిమీద ఒకర్ని పడవేసి నరకంలోకి త్రోసివేస్తారు. (94,95)

అక్కడ వారంతా పరస్పరం పోట్లాడుకుంటారు. వారు (తమ మిథ్యాదైవాలతో) "దేవుని సాక్షి! మేము మీకు సర్వలోక ప్రభువంతటి స్థానమిచ్చి పూర్తిగా మార్గభ్రష్టులయి పోయాం. అసలు మమ్మల్నీ పాపాత్ములే పెడదారి పట్టించారు. ఇక (మమ్మల్ని ఎవరు ఆదుకుంటారు?) మాకెవరూ సిఫారసుచేసేవారు లేరే! ఏ ప్రాణస్నేహితుడు కూడా అడ్డుపడలేడే!! అయ్యయ్యో! (మేమెంత దౌర్భాగ్యులం!!) మాకోసారి ప్రపంచానికి తిరిగివెళ్ళే అవకాశం లభిస్తే మేము (తప్పకుండా) విశ్వాసులైపోతాము" అని అంటారు. ఇందులో గొప్ప సూచన ఉంది. కాని వారిలో చాలామంది విశ్వసించే రకం కాదు. నిస్సందేహంగా నీ ప్రభువు ఎంతో శక్తిమంతుడు, పరమ దయామయుడు. (96-104)

నూహ్‌జాతి ప్రజలు దైవప్రవక్తలను తిరస్కరించారు. వారికి వారిసోదరుడు నూహ్ చేసిన హితబోధ జ్ఞప్తికి తెచ్చుకో. అతను వారితో ఇలా అన్నాడు: "మీరు (దేవునికి) భయ పడరా? నేను మీకోసం వచ్చిన నమ్మకస్తుడైన దైవప్రవక్తను. కనుక మీరు (నామాట విని) దేవునికి భయపడండి. నాకు విధేయులై ఉండండి. నేనీ పనికోసం మీ నుండి

ఎలాంటి ప్రతిఫలం ఆశించడం లేదు. నాకు ప్రతిఫలమిచ్చే బాధ్యత సర్వలోక ప్రభువుపై ఉంది. కనుక మీరు ఇకనైనా దేవునికి భయపడి, నాకు విధేయులైపోండి.'' (105-110)

దానికి వారు "అధములు, అత్యంతనీచులే (నీ చుట్టుచేరి) నిన్ను అనుసరిస్తున్నారు.[1] అలాంటి నీకు మేము విధేయులమైపోవాల్నా?'' అన్నారు. (111)

"వారు చేస్తున్న పనులేమిటో నాకేం తెలుసు! (ఆ సంగతి నాకవసరం లేదు కూడా) వారి లెక్కాపత్రం చూడటం నా ప్రభువు బాధ్యత. మీరు కాస్త విషయం అర్థం చేసుకుంటే బాగుంటుంది. నేను విశ్వసించినవారిని నా దగ్గర్నుంచి వెళ్ళగొట్టలేను. నేను (పరలోక పరిణామాల్ని గురించి) స్పష్టంగా హెచ్చరించేవాడ్ని మాత్రమే'' అన్నాడు నూహ్. (112-115)

"నూహ్! (గుర్తుంచుకో.) నీవీ వైఖరి మానుకోకపోతే మాత్రం మేము నిన్ను రాళ్ళతో కొట్టి చంపుతాం'' అన్నారు వారు (బెదిరిస్తూ). (116)

అప్పుడు నూహ్ "ప్రభూ! నా జాతి నన్ను తిరస్కరించింది. కనుక నాకూ, వారికీ మధ్య తిరుగులేని తీర్పుచెయ్యి. నన్ను, నాతోపాటున్న విశ్వాసుల్ని రక్షించు'' అని ప్రార్థించాడు.

చివరికి మేము నూహ్‌ని, నిండునావలో కూర్చున్న అతని అనుచరుల్ని రక్షించాము. తరువాత మిగిలిన వారందర్నీ (నీటిలో) ముంచివేశాము. (117-120)

ఇందులోనూ గొప్పసూచన ఉంది. కాని వారిలో చాలామంది సత్యాన్ని విశ్వసించే రకమే కాదు. నీ ప్రభువు నిజంగా ఎంతో శక్తిమంతుడు. దాంతోపాటు ఆయన అమిత దయామయుడు కూడా. (121,122)

ఆద్‌జాతి ప్రజలు కూడా దైవప్రవక్తలను తిరస్కరించారు. వారికి వారిసోదరుడు హూద్ చేసిన హితబోధ జ్ఞాపకం తెచ్చుకో. అతను వారితో ఇలా అన్నాడు: "మీరు (దేవునికి) భయపడరా? నేను మీకోసం వచ్చిన నమ్మకస్తుడయిన దైవప్రవక్తను. కనుక మీరు (నామాట విని) దేవునికి భయపడండి. నాకు విధేయులయిపోండి. నేనీ పనికోసం మీనుండి ఎలాంటి ప్రతిఫలం ఆశించడం లేదు. నాకు ప్రతిఫలమిచ్చే బాధ్యత సర్వలోక ప్రభువుపై ఉంది.

మీరు ఎత్తయిన ప్రతి చోటా పనికిమాలిన స్మారక భవనం నిర్మిస్తున్నారేమిటీ? ఇక్కడే శాశ్వతంగా ఉండాలన్నట్లు పెద్దపెద్ద మేడలు కడ్తున్నారు. మీరు ఎవరినైనా పట్టుకుంటే వారి పట్ల చాలా క్రూరంగా వ్యవహరిస్తారు. (ఇప్పటికైనా) దేవునికి భయపడండి. నాకు విధేయులై పోండి. మీరెరిగినవన్నీ మీకు ప్రసాదించిన దేవునికి భయపడండి. ఆయన మీకు పశుసంపద, సంతానం, సెలయేరులు, తోటలు (వగైరా ఎన్నో) ప్రసాదించాడు. మీ విషయంలో నేను ఒక ఘోరదినాన ఎదురయ్యే (నరక)యాతన గురించి భయపడుతున్నాను.'' (123-135)

1. వివరాలకు 11:27, 18:28 సూక్తులు, వాటి పాదసూచికలు చూడండి.



దానికి వారు (పెడసరిగా సమాధానమిస్తూ) "నీవు మాకు హితోపదేశం చేసినా చేయక పోయినా ఒకటే. (మేము నీమాటలు నమ్మం.) ఇవన్నీ పూర్వం నుంచి వస్తున్న సంగతులే. మాపై ఎలాంటి శిక్షా విరుచుకుపడదు'' అని అన్నారు. (136-138)

చివరికి వారు అతడ్ని తిరస్కరించారు. అందువల్ల మేము వారిని సర్వనాశనం చేశాం. ఇందులో గొప్ప సూచన ఉంది. కాని వారిలో చాలామంది విశ్వసించే రకం కాదు. నీప్రభువు నిస్సందేహంగా ఎంతో శక్తిమంతుడు, అమిత దయామయుడు.

సమూద్‌జాతి ప్రజలు కూడా దైవప్రవక్తలను తిరస్కరించారు. వారి సోదరుడు సాలిహ్ వారికి హితబోధచేస్తూ ఇలా అన్నాడు: "మీరు (దేవునికి) భయపడరా? నేను మీకోసం వచ్చిన నమ్మకస్తుడైన దైవప్రవక్తను. కనుక మీరు దేవునికి భయపడండి. నాకు విధేయులైపోండి. నేనీ పనికోసం మీనుండి ఎలాంటి ప్రతిఫలం ఆశించడం లేదు. నాకు ప్రతిఫలమిచ్చే బాధ్యత సర్వలోకప్రభువుపై ఉంది. (139-145)

ఈ తోటలు, కాలువలు, పచ్చటిపొలాలు, పండ్లతో నిండిన ఈ ఎడారి వనాల మధ్య మిమ్మల్ని హాయిగా ఎల్లకాలం ఉండనివ్వడం జరుగుతుందని భావిస్తున్నారా? అదీగాక మీరు కొండల్ని తొలచి బడాయి కోసం పెద్దపెద్ద కట్టడాలు నిర్మిస్తున్నారే! కాస్త దేవునికి భయపడండి. నాకు విధేయత చూపండి. దేశంలో ఎలాంటి సంస్కరణ (సంక్షేమ) కార్యాలు చేపట్టకుండా హద్దులు మీరి, అలజడులు రేకెత్తిస్తూ తిరిగేవారికి విధేయత చూపకండి.'' (146-152)

దానికి వారు (తలబిరుసుతో) సమాధానమిస్తూ "నీకెవరో చేతబడి చేశారు. నువ్వు కూడా మాలాంటి మానవమాత్రుడవే తప్ప మరేమీ కాదు. నీవు సత్యవంతుడవైతే అందుకు ఏదైనా నిదర్శనం చూపు'' అన్నారు. (153,154)

"అయితే ఇదిగో ఈ ఒంటె ఉంది చూడండి, (వంతులవారిగా) ఒకరోజు ఇదొక్కటే నీరు త్రాగాలి. మరొక రోజు మీరంతా నీరు వాడుకోవచ్చు. ఎట్టి పరిస్థితిలోనూ మీరు దీని జోలికి పోకూడదు. దీని జోలికి పోతే మాత్రం మీమీద ఒక దుర్దినాన భయంకరమయిన ఉపద్రవం విరుచుకు పడుతుంది'' అన్నాడు సాలిహ్. (155,156)

కాని (కొన్నాళ్ళ తర్వాత) వారా ఒంటె పొదుగుని కోసివేశారు. చివరికి వారు (దైవాగ్రహ సూచన చూసి) పశ్చాత్తాపం చెందసాగారు. (దైవ) శిక్ష వారిని చుట్టుముట్టి (క్షణాల్లో) మట్టుపెట్టింది. ఇందులోనూ గొప్ప సూచన ఉంది. కాని వారిలో చాలామంది విశ్వసించనివారే ఉన్నారు. నిజంగా నీప్రభువు మహా శక్తిమంతుడు, అమిత దయామయుడు. (157-159)

లూత్‌జాతి ప్రజలు కూడా దైవప్రవక్తలను తిరస్కరించారు. వారికి వారి సోదరుడు లూత్ చేసిన హితబోధ జ్ఞప్తికి తెచ్చుకో. అతనిలా అన్నాడు: "మీరు (దేవునికి) భయపడరా? నేను మీకోసం వచ్చిన నమ్మకస్తుడైన దైవప్రవక్తను. అందువల్ల మీరు (నామాట విని) దేవునికి భయపడండి; నాకు విధేయులయిపోండి. నేనీ పనికోసం మీ

నుండి ఎలాంటి ప్రతిఫలం ఆశించడం లేదు. నాకు ప్రతిఫలమిచ్చే బాధ్యత సర్వలోక ప్రభువుపై ఉంది. మీ ప్రభువు మీకోసం మీ భార్యలలో సృష్టించినదాన్ని వదలి, మీరు యావత్తు సృష్టితాలలో పురుషుల దగ్గరికి వెళ్తున్నారా? (ఎంతటి సిగ్గుచేటు!) మీరసలు హద్దుమీరి పోయారు.” (160-166)

“లూత్! నీవీ మాటలు మానుకోకపోతే నిన్ను మాపట్నం నుంచి వెళ్ళగొడ్తాం” అంటూ వారు బెదిరించారు. “మీచేష్టలు నాకు రోత పుట్టిస్తున్నాయి...ప్రభూ! నన్ను, నా కుటుంబసభ్యుల్ని వీరి దుర్నడత, దుర్గుణాల బారినుండి కాపాడు” అన్నాడు లూత్.

చివరికి మేము లూత్‌ని, అతని కుటుంబసభ్యుల్ని కాపాడాము. అయితే వెనకుండి పోయినవారిలో చేరిన ఒక వృద్ధురాలిని మాత్రం వదిలేశాము. ఆ తరువాత మేము మిగిలిన వారందర్నీ సర్వనాశనం చేశాము. వారి మీద (భయంకరమైన రాళ్ళ) వర్షం కురిపించాం. అది భయపెట్టబడిన వారిపై విరుచుకుపడిన మహాదారుణ (శిలా) వృష్టి. (167-173)

ఈ ఉదంతంలో గొప్పసూచన ఉంది. కాని వారిలో చాలామంది విశ్వసించే రకం కాదు. ఏమైనా నీప్రభువు గొప్ప శక్తిసంపన్నుడు, అపార దయామయుడు. (174,175)

‘అయికా’ ప్రజలు కూడా దైవప్రవక్తలను తిరస్కరించారు. వారికి షుఐబ్ చేసిన హితబోధ గుర్తుకుతెచ్చుకో. అతను వారితో ఇలాఅన్నాడు: “మీరు (దేవునికి) భయపడరా? నేను మీకోసం వచ్చిన నమ్మకస్తుడైన దైవప్రవక్తను. కాబట్టి (నామాట విని) దేవునికి భయపడండి; నాకు విధేయులైపోండి. నేనీ పనికోసం మీనుండి ఎలాంటి ప్రతిఫలం ఆశించడం లేదు. నాకు ప్రతిఫలమిచ్చే బాధ్యత సర్వలోకప్రభువుపై ఉంది. (176-180)

తూనికల్లో, కొలతల్లో న్యాయం పాటించండి. ఎవరికీ నష్టం కలిగించకండి. సరయిన త్రాసుతో తూచి ఇవ్వండి. ప్రజలకు న్యాయంగా రావలసిన వస్తువులు తగ్గించి ఇవ్వకండి. ప్రపంచంలో అల్లర్లు, అలజడులు రేపుతూ తిరగకండి.[2] మిమ్మల్ని, మీకు పూర్వముండిన తరాలవారిని సృష్టించిన దేవునికి కాస్త భయపడండి.” (181-184)

దానికి వారు “నీకెవరో చేతబడి చేశారు. నువ్వు కూడా మాలాంటి మానవమాత్రుడవేగాని మరేమీ కాదు. పైగా నువ్వొట్టి అబద్ధాలకోరువని మేము భావిస్తున్నాం నీవే గనక సత్యవంతుడవైతే ఆకాశపు తునక ఒకదాన్ని మామీద పడవేయించు” అన్నారు.

“మీరు చేస్తున్న (అవినీతి)పనులేమిటో నాప్రభువుకు తెలుసు”అన్నాడు షుఐబ్.

(షుఐబ్ బోధ వారికి తలకెక్కలేదు.) వారతడ్ని తిరస్కరించారు. చివరికి వారిపై ఛాయాకృత ఉపద్రవం[3] వచ్చిపడింది. అదొక భీకరదినాన (విరుచుకుపడిన) శిక్ష. ఈ

2. వివరాలకు 83:1-5 సూక్తులు, వాటి పాదసూచిక చూడండి.

3. గొడుగు ఆకారంలో ఒక మేఘం వారిపై ఆవరించి తద్వారా దైవశిక్ష విరుచుకుపడి ఉంటుందని కొందరు భాష్యకారులు అభిప్రాయపడ్డారు.



ఉదంతంలో కూడా గొప్పసూచన ఉంది. కాని వారిలో చాలామంది విశ్వసించే జనం కాదు. ఏమైనా నీప్రభువు గొప్ప శక్తిసంపన్నుడు, అమిత దయామయుడు. (185-191)

ఇది సర్వలోకప్రభువు అవతరింపజేసిన (అద్భుత)వాణి. దీన్ని తీసుకొని నమ్మకస్తుడైన దైవదూత స్పష్టమైన అరబీభాషలో నీ హృదయఫలకంపై అవతరింపజేశాడు, నీవు (దైవదాసుల్ని) హెచ్చరించేవారిలో చేరాలన్న ఉద్దేశ్యంతో. (ఏకదైవారాధన, ప్రవక్త పట్ల విధేయత, పరలోకభావన వంటి) ఈ విషయాలు పూర్వీకుల గ్రంథాలలో కూడా ఉన్నాయి. (192-196)

దీన్ని గురించి ఇస్రాయీల్ సంతతి ధర్మవేత్తలకు తెలుసన్న విషయంలో వీరికి (మక్కాపౌరులకు) ఎలాంటి సూచన కానరావడం లేదా?[4] మేము దీన్ని అరబ్బేతరునిపై అవతరింపజేసి, అతను దీన్ని చదివి విన్పించినా వీరు విశ్వసించరు. (197-199)

ఈవిధంగా మేము దీన్ని నేరస్థుల గుండెలలోకి గునపంలా దించుతాము. (దాంతో) వారు (రెచ్చిపోయి) వ్యధాభరితమైన శిక్ష కళ్ళారా చూసుకునేదాకా దీన్ని విశ్వసించరు. వారు ఏమరుపాటులో పడి ఉన్నప్పుడు ఆ శిక్ష విరుచుకుపడితే (దాని సూచనలు చూసి భయంతో) “ఇప్పుడు మాకేమైనా అవకాశం లభిస్తుందా?” అంటారు.

మరి వీరు మాశిక్ష కోసం ఎందుకు తొందరపడ్తున్నారు? ఏమైనప్పటికీ మేము వారికి ఏండ్లతరబడి అవకాశమిచ్చినా, హెచ్చరించబడుతున్న ఆపద మాత్రం వారిమీద తప్పకుండా వచ్చిపడుతుంది. అప్పుడీ ప్రాపంచికసంపద వారికి ఎలా ఉపయోగపడుతుంది? (200-207)

ప్రజల దగ్గరకు బోధకులను పంపకుండా, వారుండే ఏ పట్టణాన్నీ మేము ఎన్నడూ నాశనం చేయలేదు.[5] (బోధకుల్ని పంపకుండానే అన్యాయంగా ప్రజలను శిక్షించడానికి) మేము దౌర్జన్యపరులము కాము. (208,209)

దీన్ని పిశాచ శక్తులు (షైతానులు) తీసుకొని అవతరించలేదు. ఈపని వాటికి తగినది కాదు. ఈవిధంగా అవి చేయలేవు కూడా. కనీసం దీన్ని వినడానికి కూడా అవకాశం లేకుండా వాటిని దూరంగా ఉంచడం జరిగింది. (210-212)

కనుక ముహమ్మద్ (సల్లం)! నీవు మాత్రం (ఏకేశ్వరుడైన) అల్లాహ్‌ను తప్ప మరే దైవాన్నీ ప్రార్థించకు. అలా చేశావంటే నీవు కూడా శిక్షించబడతావు.[6] (213)

నీ దగ్గరి బంధువులను (దైవశిక్షను గురించి) భయపెట్టు.[7] నిన్ను అనుసరిస్తున్న

4. వివరాలకు 28:52,53 సూక్తులు, వాటి పాదసూచికలు చూడండి.

5. వివరాలకు 17:16 సూక్తి, దాని పాదసూచిక చూడండి.

6. ఈహెచ్చరిక దైవప్రవక్త (సల్లం)ను ఉద్దేశించినది కాదు. ఇది దేవునికి సాటికల్పించే వారిని ఉద్దేశించి పరోక్షంగా చేసిన హెచ్చరిక. దేవునికి సాటి కల్పించడం ఘోరమైన నేరం. ఇలాంటి నేరానికి దైవప్రవక్త అంతటి వ్యక్తి పాల్పడినాసరే వదలిపెట్టేది లేదని ఈసూక్తి స్పష్టం చేస్తోంది.

7. సత్యధర్మ ధ్వజవాహకులు ముందుగా తమ కుటుంబం నుంచే ధర్మప్రచార కార్యం ప్రారంభించాలని ఈసూక్తి తెలుపుతోంది. అందువల్ల దైవప్రవక్త (సల్లం) మొట్టమొదట తన దగ్గరి

విశ్వాసుల పట్ల దయార్ద్ర హృదయంతో మసలుకో. అయితే వారు గనక నీకు అవిధే యులైపోతే "మీరు చేసే పనులకు నేను బాధ్యుడ్ని కాన"ని చెప్పు వారికి. మహా శక్తిమంతుడు, అపార దయాళువు అయిన దేవుడ్ని మాత్రమే నమ్ముకొని ఉండు. నీవు (తహజ్జుద్ నమాజ్ కోసం) లేచి సిద్ధమవుతున్నప్పుడు, నమాజు చేసేవారి మధ్య తిరుగుతున్నప్పుడు ఆయన నిన్ను చూస్తూనే ఉన్నాడు. ఆయన సమస్తం వినేవాడు, ఎరిగినవాడు. (214-220)

మానవులారా! పిశాచ శక్తులు ఎవరిని ఆవహిస్తాయో నేను మీకు తెలుపనా? వంచకుడు, అబద్ధాలకోరు అయిన ప్రతి పాపాత్ముడ్ని అవి ఆవహిస్తాయి. వినీ వినని కొన్ని మాటలు మోసుకెళ్ళి వారి చెవులలో ఊదేయడం జరుగుతుంది. వాటిలో అనేక విషయాలు అసత్యాలే అయివుంటాయి.[8] (221-223)

---

బంధువులను ఓరోజు సమావేశపరచి ఇలా బోధించారు: "అబ్దుల్ ముత్తలిబ్ సంతతి ప్రజలారా! (చిన్నాన్న) అబ్బాస్! ప్రవక్తమేనత్త సఫియా! ముహమ్మద్ కూతురు ఫాతిమా! మిమ్మల్ని మీరు నరకాగ్ని నుండి కాపాడుకునే విషయం గురించి ఆలోచించండి. కావాలంటే మీకు నా ఆస్తి నుండి మీరు కోరినంత ధనం ఇవ్వగలను. అంతేగాని, నేను మిమ్మల్ని దేవుని పట్టు నుండి మాత్రం ఏవిధంగానూ కాపాడలేను."

ఆ తరువాత ఓరోజు ఉదాయాన్నే ఆయన సఫా కొండశిఖరం ఎక్కి "ఖురైషీయులారా! కాబ్ బిన్ లుఅయ్యి సంతతివారలారా! ముర్రతెగ జనులారా! ఖుసయ్యి సంతానమా! అబ్దె మునాఫ్ సంతతి ప్రజలారా! హాషిం వంశస్థులారా! అబ్దుల్‌ముత్తలిబ్ వంశస్థులారా!" అని ఎలుగెత్తి పిలిచారు. ఎవరికైనా తెల్లవారుజామున శత్రువర్గం అకస్మాత్తుగా దాడిచేసే ప్రమాదం కన్పిస్తే అతను వెంటనే కొండెక్కి ఈవిధంగా జనాన్ని ఎలుగెత్తి పిలుస్తాడు. అతని పిలుపు విని జనం నలువైపుల నుండి పరుగెత్తుకు వస్తారు. ఇది ప్రాచీన అరబ్ సంప్రదాయం. ఈ సంప్రదాయం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇచ్చిన పిలుపు విని ప్రజలు సఫాకొండ దగ్గరికి పరుగెత్తుకొచ్చారు.

అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు: "ఈకొండ వెనుక నుంచి ఓ పెద్ద సైన్యం మీపై దాడిచేయడానికి పొంచిఉందని చెబితే నామాటలు మీరు నమ్ముతారా?" అనడిగారు. దానికి జనం "ఎందుకు నమ్మం? మాకు తెలిసినంతవరకు నీవు ఎప్పుడూ అబద్ధమాడ లేదు" అన్నారు.

"అయితే నేనిప్పుడు తీవ్రమైన దైవశిక్ష విరుచుకు పడకముందే మిమ్మల్ని హెచ్చరిస్తున్నాను. మిమ్మల్ని మీరు దేవుని పట్టునుండి కాపాడుకోవడానికి ప్రయత్నించండి. దేవుని అభిమతానికి వ్యతిరే కంగా నేను మీకు ఎలాంటి సహాయం చేయలేను. ప్రళయదినాన దైవభీతిపరులు మాత్రమే నాకు బంధువులవుతారు. ఇతరులు సత్కర్మలతో వస్తే, మీరు ప్రాపంచిక వ్యామోహం అనే పాపభారంతో రావడం జరగకూడదు సుమా! ఆరోజు మీరు ఓ ముహమ్మద్! అని (సహాయం కొరకు) పిలుస్తారు. కాని నేను విధిలేక మీనుండి ముఖం తిప్పుకుంటాను. ఇహలోకంలో మీరు నా రక్త సంబంధీకులై నందున నేనిక్కడ మీకు అన్నివిధాలుగా సహాయం చేయగలను. కాని పరలోకంలో నేను మీకోసం ఏమీ చేయలేను" అని బోధించారు దైవప్రవక్త (సల్లం). (బుఖారి, ముస్లిం)

8. దీనికి రెండర్థాలున్నాయి. ఒకటి, (జిన్ జాతికి చెందిన) పిశాచ శక్తులు (ఆకాశంలో దైవ దూతలు చెప్పుకునే) ఒకటి రెండు మాటలు విన్నప్పటికీ వాటిలో అనేక అసత్యాలు కలిపి తమ అనుచరగణానికి నూరిపోస్తాయి. రెండు, అబద్ధాలకోరులైన జ్యోతిష్కులు ఈ పిశాచ శక్తుల నుండి



ఇక కవుల విషయానికి వస్తే, వారి వెనుక మార్గభ్రష్టులు, (మతి భ్రమించినవారు) మాత్రమే నడుస్తారు. వారు తాము చేయని వాటిని గురించి మాట్లాడుతూ (దారీతెన్నూ లేకుండా) ఊహాలోకంలో తిరగడాన్ని నీవు చూడటం లేదా? అయితే సత్యాన్ని విశ్వసించి సదాచారులైన కవులు మాత్రం అలాంటివారు కాదు.[9] వారు దేవుడ్ని అత్యధికంగా స్మరిస్తారు. తమపై దౌర్జన్యం జరిగితే వారు ఆ మేరకు మాత్రమే బదులు తీర్చుకుంటారు..... దౌర్జన్యపరులు తాము ఎలాంటి పర్యవసానం చవిచూడవలసి ఉంటుందో త్వరలోనే తెలుసుకుంటారు. (224-227) ✪

---

కొన్ని మాటలు విని వాటిలో తమ వైపునుంచి అనేక అసత్యాలు కలిపి ప్రజలకు చెబుతారు.

ఈ విషయం గురించి హజ్రత్ ఆయిషా (రజి) ప్రస్తావిస్తూ, కొందరు వ్యక్తులు దైవప్రవక్త (సల్లం) ముందు జ్యోతిష్కుల ప్రస్తావన తెచ్చినప్పుడు ఆయన "అదంతా బూటకం" అన్నారు. దానికామె "దైవప్రవక్తా! కొన్ని సందర్భాల్లో వారు సరైన మాటే చెబుతారుకదా?" అన్నారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) "సరైన మాటంటే ఒక్కొక్కప్పుడు భూతాలు (జిన్నులు) సరైన మాటను తీసుకొని ఎగురుతూపోయి తమ సహచరుల చెవుల్లో ఊదేస్తాయి. ఆ సహచరులు ఆమాటకు తమ వైపు నుంచి అనేక అసత్యాలు కలిపి ఒక కట్టుకథ అల్లుతారు" అని చెప్పారు. (బుఖారి)

9. ఇక్కడ రెండు రకాల కవుల ప్రస్తావన వచ్చింది. ఒక రకం కవులు దైవభీతి, పరలోక చింతన, సద్గుణాలతో సంబంధంలేని సాధారణ కవులు. వీరు తమ కవిత్వంలో వర్ణించే నీతులు, దానధర్మాలు, ధైర్యసాహసాలను స్వయంగా ఆచరించరు. అదీగాక ఆనాటి అరబ్బుల కవిత్వంలో సుభాషితాల కన్నా అశ్లీలం, మద్యపానం, జాత్యహంకారం, కుల దురభిమానం, అబద్ధాలు, అప నిందలు, మూఢవిశ్వాసాలను గురించిన ప్రస్తావనలే ఎక్కువగా ఉండేవి.

అందువల్ల దైవప్రవక్త (సల్లం) ఇలాంటి కవిత్వాన్ని అసహ్యించుకునేవారు. అసలు కవిత్వం పట్లే ఆయనకు అంతగా అభిరుచి ఉండేది కాదు. కాకపోతే అప్పుడప్పుడు ఆయన బనీఖైస్ వారి కవితలను చదవడానికి ప్రయత్నించేవారు. కాని వాటిని తారుమారు చేసి చదివేవారు. ఆయన అనుచరుడు హజ్రత్ అబూబకర్ (రజి) విని, అలా కాదు ఇలా చదవాలని చెబితే "అయ్యా! నేను కవిని గాను. కవిత్వం చెప్పడం నా పనికాదు" అనేవారు.

రెండవ రకం కవులు, సత్యాన్ని విశ్వసించి సదాచరణ వైఖరి అవలంబించిన కవులు. వీరు తమ కవిత్వంలో చెప్పింది స్వయంగా ఆచరిస్తారు; దైవాన్ని అత్యధికంగా స్మరిస్తారు. వీరి కవిత్వంలో ఎల్లప్పుడూ నీతి నియమాలే ఉంటాయి. ఒకసారి ఒక సహాబి (ప్రవక్త అనుచరుడు) దాదాపు వంద కవితలు విన్పించారు. దైవప్రవక్త (సల్లం) వాటిని వింటూ, ఇంకా చెప్పు, ఇంకా చెప్పు అని పురమా యించేవారు. ఓసారి సత్యతిరస్కారులైన కొందరు కవులు తమ కవితాపటిమతో ఇస్లాంపై, దైవప్రవక్త (సల్లం)పై పెద్ద ఎత్తున దుష్ప్రచార దాడి ప్రారంభించారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) కూడా ముస్లిం కవులను వెన్ను తట్టి రంగంలోకి దించారు.

ఆయన హజ్రత్ కాబ్ బిన్ మాలిక్ (ర)ని ప్రోత్సహిస్తూ "నా ప్రాణం ఎవరి అధీనంలో ఉందో ఆ శక్తిస్వరూపుని సాక్షి! వారి విషయంలో నీ కవిత్వం కత్తికన్నా ఎంతో పదునైనది" అన్నారు. అలాగే ఆయన హజ్రత్ హస్సాన్ బిన్ సాబిత్ (ర)ని కూడా ప్రోత్సహిస్తూ "లే, వాళ్ళను ఎదుర్కో. జిబ్రీల్ (దూత) నీకు తోడుగా ఉన్నాడు" అన్నారు ఓసారి. దైవప్రవక్త (సల్లం) జిహాద్‌ని గురించి ప్రస్తావిస్తూ "విశ్వాసి కత్తితోనే గాక, నోటితో (కలంతో) కూడా పోరాడుతాడ"ని అన్నారు.

**అవతరణ: మక్కా**

# 27. చీమలు (నమల్)

**సూక్తులు: 93**

ఈ అధ్యాయాన్ని “నమల్” (చీమలు) అంటారు. ఇది హిజ్రీశకానికి ఆరేడేండ్లకు పూర్వం మక్కాలో అవతరించింది. ఇందులో రెండు ప్రసంగాలున్నాయి. మొదటి ప్రసంగంలో విశ్వాసుల సుగుణాలు, అవిశ్వాసుల దుర్లక్షణాలున్నాయి. దీనికోసం ఫిరౌన్, సమూద్‌జాతి నాయకుల వృత్తాంతాలు, సులైమాన్ ప్రవక్త (అలై) శీలం ఉదాహరణలుగా పేర్కొనబడ్డాయి. రెండవదానిలో ప్రకృతి యదార్థాలను పేర్కొంటూ అవిశ్వాసులు రుజుమార్గం వైపు పిలవబడ్డారు.

## కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

తా-సీన్. ఇవి ఖుర్ఆన్ సూక్తులు, విషయస్పష్టత కల్గిన గ్రంథంలోని విషయాలు. ఇవి విశ్వసించేవారికి సన్మార్గం చూపి, శుభవార్త అందజేస్తాయి. ఆ విశ్వాసులు ప్రార్థనా వ్యవస్థ నెలగొల్పే, (పేదల ఆర్థికహక్కు) జకాత్ నెరవేర్చే, పరలోకంపై నమ్మకముంచే (స్వభావంకల) వారైఉంటారు.

పరలోకాన్ని విశ్వసించనివారికి మేము వారి చేష్టల్ని మనోహరమైనవిగా చేశాము. అందువల్ల వారు దారితప్పి తిరుగుతున్నారు. వారే ఘోరమైన శిక్షకు గురయ్యేవారు. పరలోకంలో అందరికన్నా ఎక్కువ నష్టపోయేవారు కూడా వారే.

ముహమ్మద్ (సల్లం)! ఈ ఖుర్ఆన్ నీకు మహా వివేకవంతుడు, జ్ఞానసంపన్నుడైన శక్తిస్వరూపుని నుండి లభిస్తున్నది. ఇందులో ఎలాంటి సందేహం లేదు. (1-6)

(వారికి కాస్త మూసా వృత్తాంతం విన్పించు.) అప్పుడు మూసా తన కుటుంబీకులతో “నాకేదో అక్కడ నిప్పులాంటి వస్తువు కన్పిస్తోంది. ఉండండి, నేనక్కడికెళ్ళి ఏదైనా సమాచారం తీసుకొని వస్తాను లేదా చలికాచుకోవడానికి ఓ నిప్పు కొరివినైనా తీసుకొని వస్తాను” అన్నాడు. (7)

అయితే మూసా ఆ ప్రదేశానికి చేరుకోగానే ఈ విధంగా ఓ అదృశ్యవాణి విన్పించింది. “ఈ అగ్నిలో ఉన్నవాడు శుభకరుడు, ఈ అగ్ని పరిసరాల్లో ఉన్నవాడు కూడా శుభకరుడే. సర్వలోక ప్రభువైన దేవుడు పరిశుద్ధుడు. మూసా! నేను దేవుడ్ని (మాట్లాడుతున్నాను). నేను మహాశక్తి సంపన్నుడను, అత్యంత వివేకవంతుడ్ని. నీ చేతికర్ర క్రింద పడవేయి.”

మూసా తన చేతికర్ర (క్రింద పడవేశాడు. అది వెంటనే) పాములా (మారి) మెలికలు తిరిగిపోవడం చూడగానే (భయపడి) పరుగు లంకించుకున్నాడు. వెనక్కి తిరిగైనా చూడలేదు.

మూసా! భయపడకు. నాముందు దైవప్రవక్తలు భయపడరు, తప్పుచేసినవారు తప్ప. తప్పుచేసినవాడు ఆ తర్వాత తప్పు సరిదిద్దుకొని మంచి పనులు చేస్తుంటే అలాంటివాడ్ని నేను క్షమిస్తాను. నేను ఎంతో దయామయుడ్ని. కాస్త నీ చేతిని నీచొక్కా క్రింద చంకలో పెట్టి తీయి; అది ఎలాంటి బాధ కలిగించకుండా ప్రకాశిస్తూ బయటికి



వస్తుంది. ఇవి తొమ్మిది సూచనల్లోని (రెండు) సూచనలు.[1] వీటిని తీసుకొని నీవు ఫిరౌన్ దగ్గరకు, అతనిజాతి ప్రజల దగ్గరకు వెళ్ళు. వారు పరమదుర్మార్గులు.” (8-12)

(మూసా ఫిరౌన్ దగ్గరికెళ్ళి ఈ మహిమలు ప్రదర్శించాడు.) కాని వారి ముందుకు స్పష్టమైన మా సూచనలు వచ్చినా (మా మహత్యాన్ని గుర్తించడానికి బదులు) “ఇది పూర్తిగా మంత్రజాలం” అన్నారు. వారి అంతరాత్మలు మా మహిమల వైపు మొగ్గాయి. కాని వారు మరీ అన్యాయంగా (అధికార) గర్వంతో విర్రవీగుతూ వాటిని తిరస్కరించారు. చూడు, ఈ దుర్మార్గులకు (ఆ తర్వాత) ఎలాంటి దుర్గతి పట్టిందో! (13,14)

మేము దావూద్‌కు, సులైమాన్‌కు దివ్యజ్ఞానం ప్రసాదించాము. (అందుకు) వారు కృతజ్ఞులై) “దేవుడు మాకు విశ్వాసులైన అనేకమంది దాసులకన్నా ఎక్కువ ఔన్నత్యం, ఆధిక్యతలు ప్రసాదించాడు. ఆయనకు మేమెంతో రుణపడి ఉన్నాం” అన్నారు. (15)

సులైమాన్, దావూద్ (అలై)కు వారసుడయ్యాడు. అతను జనంతో మాట్లాడుతూ “ప్రజలారా! మేము పక్షుల భాష నేర్చుకున్నాము. మాకు అన్ని విధాల వస్తువులు సమకూరాయి. ఇదంతా పూర్తిగా దైవానుగ్రహం” అన్నాడు. (16)

సులైమాన్ (అలై) కోసం మానవులు, భూతాలు, పక్షుల సైన్యాలు సమకూర్చబడ్డాయి. అవన్నీ పూర్తిగా క్రమశిక్షణలో ఉంచబడుతుండేవి. (ఒకసారి అతను వారితో కలసి ప్రయాణంచేస్తూ) చివరికి వారంతా ఓ చీమల లోయలోకి ప్రవేశించారు. అప్పుడు ఒక చీమ (వారిని చూసి) “చీమల్లారా! (తొందరగా) మీరు మీ పుట్టల్లోకి దూరండి. లేకుంటే సులైమాన్, అతని సైనికులు తమకు తెలియకుండానే మనల్ని తొక్కి నలిపేస్తారు” అన్నది. (17,18)

దాని మాటలు విని సులైమాన్ చిరునవ్వు నవ్వాడు. (తరువాత మాపట్ల కృతజ్ఞతాభావంతో) “ప్రభూ! నీవు నాకు, నా తల్లిదండ్రులకు చేసిన మేలుకు నేను ఎల్లప్పుడూ నీకు కృతజ్ఞుణ్ణయి ఉంటూ, నీకు నచ్చిన సత్కార్యాలు ఆచరించేలా నన్ను అదుపులో పెట్టు. దయతో నన్ను నీ పుణ్యదాసుల జాబితాలో చేర్చు” అని ప్రార్థించాడు. (19)

సులైమాన్ (ఒకసారి) పక్షుల స్థితిగతులు సమీక్షిస్తూ “ఏమిటీ, ఫలానా వడ్రంగి పిట్ట కన్పించడం లేదూ? ఎక్కడికైనా పోయిందా? అది నా దగ్గరకొచ్చి సరైన కారణం చెప్పాలి. లేకుంటే నేను దాన్ని కఠినంగా శిక్షిస్తాను లేదా కోసివేస్తాను” అన్నాడు. (20,21)

---

1. 'ఇస్రాయీల్ సంతతి' అనే (17వ)అధ్యాయంలో “మేము మూసా (అలైహి)కు స్పష్టంగా కన్పించే తొమ్మిది సూచనలు ప్రసాదించాము” అని ఉంది. 7వ అధ్యాయంలో వాటి వివరాలు పేర్కొనబడ్డాయి. ఆ వివరాలు: (1) చేతికర్ర సర్పంగా మారడం, (2) ముంజేయి చంకలో పెట్టితీస్తే అది సూర్యుడిలా దేదీప్యమానంగా వెలిగిపోతూ కన్పించడం, (3) దేశంలోని ప్రఖ్యాత మాంత్రికుల్ని వేలాది జనం ముందు ఓడించడం, (4) దైవప్రవక్త (అలైహి) చేసిన హెచ్చరిక ప్రకారం దేశమంతటా కరువు రావడం, (5) తుఫాను రావడం, (6) మిడతల దండ్లు వచ్చి పడటం, (7) మొత్తం ధాన్యరాసులలో పురుగులు పడటం, మనుషులకు, పశువులకు పేలు పడటం, (8) కప్పల తుఫాను రావడం, (9) నీరంతా రక్తమయమవడం. (43:47 సూక్తి పాదసూచిక కూడా చూడండి.)

ఆ తరువాత కాస్సేపటికి ఆ పక్షి వచ్చి "నేను మీకు తెలియని ఓ విషయం గురించి వార్త తెచ్చాను. సబా(రాజ్యం) గురించి నమ్మకమైన సమాచారం తీసుకొచ్చాను. నేనక్కడ ఓ స్త్రీని చూశాను. ఆమె ఆ జాతికి రాణిగా పరిపాలన చేస్తోంది. ఆమెకు అన్ని రకాల సంపద, ఒనరులు ప్రసాదించబడ్డాయి. ఆమె సింహాసనం ఎంతో అద్భుతంగా ఉంది. కాని ఆమె, ఆమెజాతి ప్రజలు దేవుడ్ని వదలి సూర్యుడి ముందు సాష్టాంగ పడుతున్నారు" అని చెప్పింది.

షైతాన్ వారి చేష్టల్ని వారికి మనోహరమైనవిగా చేసి, వారిని రుజుమార్గం నుండి తప్పించాడు. అందుకే వారు సన్మార్గం పొందలేకపోయారు. భూమ్యాకాశాలలోని నిగూఢ రహస్యాల్ని సైతం వెలికి తీయగల దేవునికి సాష్టాంగపడటం లేదు. ఆయన సర్వం ఎరిగినవాడు. మీరు దాచే, బహిర్గతం చేసే విషయాలన్నీ ఆయనకు తెలుసు. ఆయనే అల్లాహ్. ఆయన తప్ప మరెవ్వరూ ఆరాధనకు అర్హులు కారు. ఆయన మహోన్నత సింహాసనానికి అధిపతి. (విశ్వసామ్రాజ్యం ఆయన అధీనంలోనే ఉంది.) (22-26)

"సరే. నీవు నిజం చెప్పావో లేక అబద్ధాలమారివో మేము ఇప్పుడే కనుక్కుంటాం. నాయీ లేఖ తీసికెళ్ళి వారిముందు పడవెయ్యి. తరువాత పక్కకు వెళ్ళి దీనిపై వారి ప్రతి స్పందన ఏమిటో చూడు" అన్నాడు సులైమాన్. (27,28)

(వెంటనే ఆ పిట్ట లేఖ తీసికెళ్ళి సబారాణి ముందు విసిరింది.) సబారాణి (దాన్ని చదివి) ఇలా అన్నది: "సభాసదులారా! నాదగ్గరకు అతిముఖ్యమైన ఒక ఉత్తరం విసిరే యబడింది. ఇది సులైమాన్ దగ్గర్నుండి వచ్చింది. కరుణామయుడు, కృపాసాగరుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభించబడింది. ఇందులో. 'నా పట్ల తిరుగుబాటు వైఖరి అవలం బించకుండా తక్షణమే విధేయురాలువై నాదగ్గరకు వచ్చెయ్యి' అని ఉంది." (29-31)

ఆమె (లేఖ సారాంశం విన్పించాక) "ప్రజానాయకులారా! ఈ విషయంలో నాకేదైనా సలహా ఇవ్వండి. ఏ విషయంలోనూ నేను మిమ్మల్ని సంప్రదించకుండా నిర్ణయం తీసుకోను" అన్నది. దానికి వారు "మేము శక్తిమంతులం, గొప్ప సమరయోధులం. ఏం నిర్ణయం తీసుకోవాలో మీరే ఆలోచించి ఆజ్ఞాపించండి" అన్నారు. (32,33)

"రాజులు ఏదయినా రాజ్యంలో జొరబడితే దాన్ని సర్వనాశనం చేస్తారు. ఆ రాజ్యంలోని గౌరవనీయుల్ని పరాభవం చేస్తారు. వారు (మనల్ని) ఇలాగే చేస్తారు. అందువల్ల నేను వారి దగ్గరకు ఒక కానుక పంపిస్తాను. దానికి మన రాయబారి ఏం సమాధానం తీసుకొస్తాడో చూద్దాం" అన్నది రాణి. (34,35)

రాయబారి సులైమాన్ దగ్గరకు చేరుకున్నాడు. (ఆయనకు కానుక సమర్పించాడు.) అప్పుడు సులైమాన్ (ఆగ్రహంతో) ఇలా అన్నాడు: "మీరు నాకు సిరిసంపదలతో సహాయం చేయదలచుకున్నారా? దేవుడు మీకిచ్చిన దానికంటే నాకెంతో ఎక్కువ ప్రసాదించాడు. మీ కానుక మీకే చెల్లు. నిన్ను పంపినవారి దగ్గరకు తిరిగివెళ్ళిపో. మేము వారిపైకి బ్రహ్మాండమైన సైన్యం తీసుకొస్తాం. వారెట్టి పరిస్థితిలోనూ దీన్ని ఎదిరించలేరు.



మేము వారిని అక్కడ్నుంచి పరాభవం పాల్జేసి వెళ్ళగొడ్తాము. వారిక తుచ్ఛులుగా ఉండిపోతారు." (36,37)

(రాయబారి వెళ్ళిపోయిన తరువాత) సులైమాన్ (తన అధికారులను ఉద్దేశించి) "సభాసదులారా! వారు లొంగిపోయి నా దగ్గరకు రాకముందే ఆమె సింహాసనాన్ని నా దగ్గరకు మీలో ఎవరు తీసుకురాగలరు?" అని అడిగాడు. (38)

దానికి జిన్నుల (భూతాల)లో ఒక దృఢకాయుడు లేచి "మీరు మీస్థానం నుండి లేవకముందే నేను దాన్ని మీముందు తెచ్చిపెడ్తాను. నాకాశక్తి ఉంది. పైగా నేను నమ్మకస్తుడ్ని కూడా" అన్నాడు. అయితే (విశేష)గ్రంథజ్ఞానం కలిగిన ఒకతను అందుకొని "మీరు కళ్ళుమూసి తెరిచే లోగానే నేను దాన్ని తీసుకొస్తాను" అన్నాడు. అనడం ఏమిటి, మరుక్షణమే ఆ సింహాసనం సులైమాన్ ముందు ప్రత్యక్షమయింది.

సులైమాన్ దాన్ని చూసి "ఇది నాప్రభువు అనుగ్రహం. నేను కృతజ్ఞత చూపుతానా లేక అవిశ్వాసవైఖరితో కృతఘ్నుడైపోతానా అని నన్ను పరీక్షించడానికే ఆయన ఇలా చేశాడు. ఎవరైనా కృతజ్ఞత చూపుతున్నాడంటే అది అతనికే లాభదాయకమవుతుంది. దీనికిభిన్నంగా ఎవరైనా కృతఘ్నుడైపోతే (అది అతనికే చేటు). నా ప్రభువు నిరపేక్షాపరుడు[2] దేన్నీ ఖాతరు చేయనివాడు, గొప్ప అనుగ్రహమూర్తి కూడా" అన్నాడు. (39,40)

ఆ తరువాత సులైమాన్ (తన అధికారులతో) "ఆమె సింహాసనాన్ని తీసికెళ్ళి మెల్లిగా ఆమె ముందు పెట్టండి. (దీన్ని చూసి) ఆమె సరైన నిర్ణయానికి వస్తుందో లేక మార్గవిహీనుల్లోనే పడిఉంటుందో చూద్దాం" అన్నాడు. సబారాణి వచ్చిన తర్వాత "నీ సింహాసనం ఇలాగే ఉంటుందా?" అని అడిగాడతను. దానికామె "ఇది అచ్చం అలాగే ఉంది. మేము ముందే (మీ శక్తిసామర్థ్యాలు) తెలుసుకున్నాము. మేము పూర్తిగా విధేయులయ్యాం" అన్నది. (41,42)

ఆమె అవిశ్వాసజాతికి చెందిన స్త్రీ. అంచేత ఆమె నిజదేవుడ్ని వదలి మిథ్యాదైవాల్ని పూజిస్తుండేది. ఈ అలవాటే ఆమెను (సత్యాన్ని విశ్వసించనీయకుండా) నిరోధించింది.

---

2. ఈ విషయమే ఖుర్ఆన్‌లో మరోచోట మూసాప్రవక్త (అలైహి) నోట ఈవిధంగా వెలువడింది: "మీరు సత్యాన్ని తిరస్కరిస్తే, (మీరేకాదు) ప్రపంచంలోని మానవులంతా సత్య తిరస్కారులైపోయినా సరే (దానివల్ల దేవుని దైవత్వానికి వాటిల్లే నష్టమేమీ లేదు), ఆయన నిరపేక్షాపరుడు, స్వతహాగా ప్రశంసనీయుడు." (14:8). ఈవిషయాన్నే మహాప్రవక్త (సల్లం) ఇలా తెలియజేశారు:

దేవుడు చెబుతున్నాడు: "నా దాసులారా! అనాది నుండి అంతం వరకు మీరు మానవులు, జిన్నులు అంతా అందరికంటే ఎక్కువ దైవభీతిపరుడైన వ్యక్తి హృదయంలా అయిపోతే, దానివల్ల నా రాజరికానికి (దైవత్వానికి) ఒరిగేదేమీ లేదు. నా దాసులారా! అలాగే అనాది నుండి అంతంవరకు మీరు మానవులు, జిన్నులంతా అందరికంటే ఎక్కువ దుర్మార్గుడైన వ్యక్తి హృదయంలా మారిపోతే, దానివల్ల నా రాజరికం (దైవత్వం)లో ఏమాత్రం లోటురాదు. నా దాసులారా! ఇవి మీరు చేసుకున్న కర్మలే. వాటిని నేను మీ కర్మల పత్రంలో రాస్తాను. ఆ తర్వాత వాటి ప్రకారం మీకు పూర్తి ప్రతిఫలం ఇస్తాను. కనుక మీలో ఎవరికైనా మేలు జరిగితే అతను దేవునికి కృతజ్ఞతలు చెల్లించుకోవాలి. మరెవరికైనా కీడు జరిగితే అతను తననే నిందించుకోవాలి." (ముస్లిం)

రాజమహల్‌లో ప్రవేశించమని ఆమెకు చెప్పాడు. (లోపల ప్రవేశించగానే) ఆమెకు అక్కడ ఒక నీటికొలను ఉన్నట్లు కన్పించింది. అందువల్ల ఆమె అందులోకి దిగి నడవడానికి తన ముంగాళ్ళ మీది వస్త్రం పైకెత్తి పట్టుకుంది. అప్పుడు సులైమాన్ "ఇది గాజుతో నిర్మించిన నున్నటి నేల" అన్నాడు. దాంతో ఆమె (సత్యాన్ని గ్రహించి) "ప్రభూ! నేను ఆత్మద్రోహానికి పాల్పడ్డాను. ఇప్పుడు నేను సులైమాన్‌తో పాటు సర్వలోక ప్రభువుకు విధేయురాలినయి (ముస్లింనయి) పోయాను" అని అరిచింది. (43,44)

మేము సమూద్‌జాతి ప్రజల దగ్గరకు వారి సోదరుడు సాలిహ్‌ని పంపాము, దేవుడ్ని ఆరాధించాలన్న సందేశాన్నిచ్చి. (సాలిహ్ తన సందేశప్రచారం ప్రారంభించిన) వెంటనే వారు రెండు వర్గాలుగా చీలిపోయి పరస్పరం ఘర్షించుకోసాగారు. (45)

సాలిహ్ (ధర్మప్రచారం చేస్తూ) "నా జాతిప్రజలారా! మేలును వదలి మీరు కీడు కోసం ఎందుకు తొందరపడుతున్నారు? పాపక్షమాపణ కోసం దేవుడ్ని ఎందుకు వేడుకోరు? (దేవుడ్ని వేడుకుంటే) ఆయన మిమ్మల్ని కరుణించవచ్చు కదా?" అన్నాడు.

దానికి వారు "నీవు, నీ అనుచరులు మా పాలిట దుశ్శకునాలుగా తయారయ్యారు" అన్నారు. సాలిహ్ దానికి సమాధానమిస్తూ "మీ దుశ్శకునాలు దేవుని చేతిలో ఉన్నాయి. మీరసలు (దేవుని చేత) పరీక్షించబడుతున్నారు" అన్నాడు. (46,47)

ఆ పట్టణంలో తొమ్మిదిమంది ముఠానాయకులున్నారు. వారు దేశంలో (ఎల్లప్పుడూ) అలజడులు రేపుతుంటారు. (సమాజ)సంస్కరణకు సంబంధించి ఒక్కపనీ చేయరు. (ఒకరోజు) వారు పరస్పరం కూడబలుక్కుంటూ ఇలా అన్నారు: "మనం సాలిహ్‌ని, అతని కుటుంబసభ్యుల్ని ఓ రాత్రివేళ చంపేస్తామని దేవుని పేరుతో ప్రమాణం చేద్దాం. ఆ తర్వాత అతని సంరక్షకునితో 'అతని కుటుంబ హత్య సమయంలో మేమక్కడ లేనేలేం, మేము నిజమే చెబుతున్నాం' అని అందాం." (48,49)

ఈవిధంగా వారొక పన్నాగం పన్నారు. ఇటు మేము కూడా వారికి తెలియకుండా ఓ పన్నాగం పన్నాము. ఇక చూడు, వారి పన్నాగం పర్యవసానం ఏమయిందో. మేము వారిని, వారిజాతిని సమూలంగా తుడిచిపెట్టాము. వారు చేసిన దౌర్జన్యాలకు పర్యవసానంగా వారి ఇళ్ళు ఖాళీగా పడిఉన్నాయి. విజ్ఞులకు ఈ ఉదంతంలో గొప్ప సూచన (నిదర్శనం) ఉంది. సత్యాన్ని విశ్వసించి భయభక్తుల వైఖరి అవలంబించిన వారిని మేము రక్షించాము. (50-53)

లూత్‌ని కూడా (దైవప్రవక్తగా నియమించి పంపిన సంగతి గుర్తుకు తెచ్చుకో. ఆయన తన జాతిప్రజలతో ఇలా అన్నాడు: "మీరు కళ్ళారా చూస్తూనే బహిరంగంగా ఈ పాడుపని చేస్తున్నారా? మీరు లైంగికానందం కోసం స్త్రీలను వదలి పురుషుల వెంటపడ్డారా? మీరసలు (గతంలో ఎవరూ చేయని) బుద్ధిలేని పని చేస్తున్నారు."

కాని అతని జాతిప్రజలు (అతడ్ని బెదిరిస్తూ) "లూత్ కుటుంబాన్ని మన పట్టణం నుంచి బహిష్కరించండి. వీరు (మన మధ్య) పరమ పవిత్రులుగా ఉండగోరుతున్నారు"



అని అన్నారు. అంతకుమించి వారి దగ్గర మరెలాంటి సమాధానం లేదు. (54-56)

చివరికి మేము అతడ్ని, అతని కుటుంబాన్ని రక్షించాము అతని భార్యను తప్ప. ఆమె వెనుకుండిపోవాలని మేము ముందే నిర్ణయించాము. తరువాత మేము వారిపై (శిలా) వర్షం కురిపించాము. అది భయపెట్టబడినవారిపై విరుచుకుపడిన మహా దారుణ వృష్టి. (57,58)

ముహమ్మద్ (సల్లం)! ఇలా చెప్పు: "సకల విధాల ప్రశంసలు దేవునికే శోభిస్తాయి. ఆయన ఎన్నుకున్న దైవదాసులకు శాంతి కలుగుగాక!" (59)

(నిజ దేవుడైన) అల్లాహ్ శ్రేష్ఠుడా లేక వీరాయనకు సాటికల్పించిన మిధ్యాదైవాలు శ్రేష్ఠమైనవా? సరే, భూమ్యాకాశాల్ని సృష్టించిన శక్తిస్వరూపుడెవరు? మీకోసం ఆకాశం నుండి వర్షం కురిపించి, తద్వారా మీకు సాధ్యంకాని మనోహరమైన తోటలను పండిస్తున్నదెవరు? ఆ దేవుడేగాక (ఆయనకు సహాయపడేందుకు) మరొక దేవుడెవరైనా ఉన్నాడా? (లేడు.) కాని వీరే సన్మార్గం వదలి (దుర్మార్గంలో పడి) పోతున్నారు. (60)

భూమిని నివాసయోగ్యంగా[3] చేసిందెవరు? అందులో నదుల్ని పారజేసి, (కొండల) మేకుల్ని పాతిందెవరు? రెండు జలనిధుల మధ్య అడ్డంకిని పెట్టిందెవరు? అల్లాహ్‌తో

---

3. పది గ్రహాలు, ముప్ఫయి ఆరు ఉపగ్రహాలు, వేలాది తోకచుక్కలు, లక్షలాది ఉల్కలతో కూడిన మన సౌరవ్యవస్థలో ఒక్క భూమిని మాత్రమే సృష్టికర్త మానవుల కోసం నివాస యోగ్యంగా నిర్మించాడు. భూమి ఎలా నివాసయోగ్యమయినదో ఓసారి పరిశీలిద్దాం.

6000 డిగ్రీల సెల్సియస్ ఉపరితల ఉష్ణోగ్రతతో 5 మైళ్ళ పొడవైన అగ్నిజ్వాలలతో భగభగమండే సూర్యుని నుండి ఈభూమండలం 9కోట్ల 30లక్షల మైళ్ళు కలిగిన ఓ నిర్ణీతదూరంలో ఉంది. భూమి ఈదూరానికి రెట్టింపు దూరంలో ఉంటే, తీవ్రమైన చలి వల్ల ఇక్కడున్న ప్రతివస్తువూ గడ్డకట్టుకొని పోతుంది. జీవరాసుల్లోని రక్తం సైతం గడ్డకట్టుకొని పోతుంది. అలాగాక నిర్ణీత దూరంలో సగం దూరాన ఉంటే అత్యధిక ఉష్ణోగ్రత వల్ల మొత్తం జీవరాసులు మాడి మసయిపోతాయి.

సూర్యుడు అసాధారణ శక్తితో మన భూమిని నిరంతరం తన వైపుకు ఆకర్షిస్తున్నాడు. అదే సమయంలో భూమి కూడా తన గురుత్వాకర్షణ శక్తివల్ల వికర్షణ ప్రభావంతో సూర్యునివైపు ఆకర్షించబడకుండా నిర్ణీత కక్ష్యలోనే నిలబడి ఉంది. ఒకవేళ భూమి తన గురుత్వాకర్షణ శక్తిని కోల్పోతే వెంటనే అది గంటకు 6000 మైళ్ళ వేగంతో సూర్యుని వైపు పరుగెత్తుతూ కొన్ని వారాల్లోనే సూర్యగోళానికి అతుక్కుపోయి భస్మీపటలం అవుతుంది. అదీగాక భూమి గురుత్వాకర్షణ శక్తి కోల్పోవడం వల్ల మనం, మన చుట్టూ ఉండే వివిధ వస్తువులు రోదసిలోకి ఎగిరిపోతాయి.

మన భూమి అంతరిక్షంలో నిటారుగా నిలబడి లేదు. తన అక్షంపై 23 డిగ్రీల కోణంలో ఒకవైపు ఒరిగి ఉంది. దీని వల్లనే మనకు రుతువులు క్రమబద్ధంగా ఏర్పడుతున్నాయి. భూమి ఇలా ఒరిగి ఉండకుండా నిటారుగా ఉంటే సముద్రాల నుండి లేచే ఆవిరులు ఉత్తర ధృవానికో, దక్షిణ ధృవానికో వెళ్ళిపోతాయి. తత్ఫలితంగా మొత్తం భూమి మంచుతో కప్పబడిపోతుంది.

ఈ భూమి నిరంతరం గంటకు 1000 మైళ్ళ వేగంతో తన చుట్టూ తాను తిరుగుతోంది. దీనివల్లనే మనకు రాత్రింబవళ్ళు ఏర్పడుతున్నాయి. ఒకవేళ ఈ భ్రమణవేగం వందమైళ్ళకు తగ్గిపోతే

పాటు మరోదైవం ఉన్నాడా? లేడు. అసలు వారిలో చాలామంది అజ్ఞానులే ఉన్నారు.

కష్టాలలో ఉన్నవాడు మొరపెట్టుకుంటున్నప్పుడు అతని మొర ఆలకించేదెవరు? చివరికి అతని కష్టాలు కడతేర్చుతుందెవరు? భూలోకంలో మిమ్మల్ని ప్రతినిధిగా చేసిందెవరు? అల్లాహ్‌తోపాటు మరో దైవం కూడా ఉన్నాడా (ఈ పనులు చేయడానికి)? మీరసలు (ఈ విషయాల్ని గురించి) చాలా తక్కువగా యోచిస్తారు. (61,62)

---

రాత్రింబవళ్ళు ఇప్పటికంటే పదిరెట్లు సుదీర్ఘమవుతాయి. దాంతో మొత్తం వృక్షజాతి ఆ సుదీర్ఘపగటి ఉష్ణోగ్రతకు మాడిపోతుంది. ఆ తర్వాత వచ్చే సుదీర్ఘరాత్రి ప్రభావంతో అది పూర్తిగా తుడుచుకొని పోతుంది. అలాగే భూభ్రమణ వేగం నిర్ణీత వేగం కంటే ఎక్కువైపోతే రాత్రింబవళ్ళు చాలా చిన్నివిగా తయారయి ఇక్కడ మానవ మనుగడ కష్టసాధ్యమవుతుంది.

భూమి వ్యాసం సుమారు 7,900 మైళ్ళుంది. భూపరిమాణం 1/4 వంతుకు తగ్గి చంద్రుడి అంత చిన్నదైపోతే దాని గురుత్వాకర్షణ కూడా ప్రస్తుతమున్న గురుత్వాకర్షణలో ఆరోవంతుకు తగ్గిపోతుంది. దానివల్ల భూమిపై గాలి, నీరు ఉనికే ఉండదు. ఒకవేళ భూపరిమాణం సూర్యుని అంత సైజుకు పెరిగితే, భూమిపై 500 మైళ్ళ ఎత్తువరకు వ్యాపించిఉన్న గాలిపొర 4 మైళ్ళకు తగ్గిపోతుంది. దాంతో నీరు ఆవిరిగా మారడం సాధ్యంకాదు. అంటే వర్షాలు ఆగిపోయి జీవరాసి మనుగడ అసాధ్యమవుతుంది. పైగా గాలి పీడనం అధికమై పదికిలోల బరువుండే జీవి 1500 కిలోలకు పెరుగుతుంది. మనం పరిమాణంలో బాగా తగ్గిపోయి పాములు, బల్లుల్లాగా నేలపై ప్రాకవలసి వస్తుంది.

భూమండలం నుండి చంద్రుడు దాదాపు 2,50,000 మైళ్ళ దూరంలో ఉండి తన గురుత్వాకర్షణ శక్తితో సముద్రాలలో రోజుకు రెండుసార్లు ఆటుపోట్లు రావడానికి కారణమవుతున్నాడు. చంద్రుడు భూమి నుండి లక్ష మైళ్ళ దూరంలో మాత్రమే ఉంటే, సముద్రాలలో వచ్చే ఆటుపోట్లు తీవ్రమయి కెరటాలు అనూహ్యమైన ఎత్తుకు ఎగిసిపడతాయి. దానివల్ల మన భూమి రోజుకు రెండుసార్లు నీటిలో మునిగి తేలుతుంది. దాంతో పెద్ద పెద్ద పర్వతాలు సైతం అరిగిపోతాయి.

సూర్యుని నుండి వెలువడే కాంతికిరణాలలోని విషపూరితమైన అల్ట్రా వాయిలెట్ కిరణాలు నేరుగా భూమి మీద పడకుండా భూవాతావరణంలో 'ఓజన్ పొర' అనే ఓ రక్షణ కవచం ఉంది. ఈ రక్షణ కవచమే గనక లేకపోతే అల్ట్రా వాయిలెట్ (అతి నీలలోహిత) కిరణాలు నేరుగా భూమి మీద పడతాయి. దానివల్ల మనం అనేక రకాల చర్మవ్యాధుల బారిన పడవలసి వస్తుంది.

మన సౌరవ్యవస్థలోని ఆస్ట్రాయిడ్ బెల్ట్, తోకచుక్కల నుండి నిరంతరం కోట్లాదిఉల్కలు భూమివైపు రాలుతుంటాయి. వీటిలో రోజూ దాదాపు రెండుకోట్ల ఉల్కలు సెకండుకు 25 నుంచి 50 మైళ్ళ వేగంతో భూవాతావరణంలోకి ప్రవేశిస్తాయి. అయితే భూఉపరితలం నుండి 500 మైళ్ళ ఎత్తువరకు వ్యాపించిఉన్న గాలి తాకిడికి అవి భస్మీపటలమవుతాయి. ఎప్పుడైనా మానవుల కనువిప్పు కోసం ఒకటి, రెండు ఉల్కలు భూమ్మీద రాలిపడతాయి. ఒక్కోసారి ఈ ఉల్కలు చిన్నచిన్న సైజులో వేల సంఖ్యలో రాళ్ళ వర్షంలా భూమ్మీద పడటం కూడ జరుగుతుంది.

ఇలా జీవరాసులకు నివాసయోగ్యంగా చేయబడిన ఈ భూమండలాన్ని గురించి ఆలోచిస్తే, అది సృష్టికర్త లేకుండా తనంతట తానే నివాసయోగ్యంగా మారి ఉనికిలోకి వచ్చిందని; లేదా ఈ మహాకార్యంలో సృష్టికర్తతో పాటు ఇతర శక్తులు కూడా పాల్గొన్నాయని బుద్ధీ జ్ఞానాలుగల ఏ మనిషీ భావించడు. దీనంతటికీ మూలకారకుడు ఏకేశ్వరుడైన సృష్టికర్తే అని భావించినప్పుడు, ఆ సృష్టికర్తకు కృతజ్ఞతగా ఆయన్ని మాత్రమే ఆరాధించాలి. (43:10 సూక్తి పాదసూచిక చూడండి.)



నేలమీద, సముద్రం మీద కటిక చీకటిలో (సైతం) మీకు దారి చూపిస్తున్నదెవరు? ఎవరు తన కారుణ్యానికి (అంటే వర్షానికి) ముందుగా శుభవార్త తెచ్చే (చల్లటి) గాలులను పంపిస్తున్నది? అల్లాహ్‌తో పాటు మరోదైవం కూడా ఉన్నాడా (ఈ పనులు చేయడానికి)? వీరు చేస్తున్న సృష్టిపూజకు అల్లాహ్ ఎంతో అతీతుడు, మహోన్నతుడు.

ప్రాణులను తొలిసారిగా సృజిస్తున్నది, తర్వాత వాటిని పునరుత్పత్తి చేస్తున్నదెవరు? భూమ్యాకాశాల నుండి మీకు ఉపాధి ప్రసాదిస్తున్నదెవరు? అల్లాహ్‌తో పాటు మరో దైవం కూడా ఉన్నాడా (ఈ పనులు చేయగలిగేవాడు)? వారిని అడుగు "మీ అభిప్రాయం నిజమైతే వీటికి (తగిన) ఆధారాలేమిటో చూపండి" అని. (63,64)

చెప్పు:"భూమ్యాకాశాల్లో దేవునికి తప్ప మరెవరికీ అగోచర విషయాలు తెలియవు.[4] అసలు వారికి తాము ఎప్పుడు లేపబడతామో కూడా తెలియదు. వీరికసలు పరలోకానికి సంబంధించిన జ్ఞానమే లేదు. అందువల్ల దాన్ని గురించి వీరు అనుమానంలో పడి వున్నారు. ఆ విషయంలో వీరు అంధులయి పోయారు. (65,66)

పైగా ఈ తిరస్కారులు ఏమంటున్నారో చూడు: "మేము, మా తాతముత్తాతలు (చనిపోయి) మట్టిలో కలసిపోయిన తరువాత సమాధుల నుంచి మమ్మల్ని తిరిగి (బ్రతికించి) లేపటం సాధ్యమేనా? ఇలాంటి విషయాలు మాకూ విన్పించబడ్డాయి; గతంలో మా తాతముత్తాతలకూ విన్పించబడ్డాయి. ఇవన్నీ మేము పూర్వం నుంచీ వింటూ వస్తున్న పుక్కిటి పురాణాలు మాత్రమే" అని అంటున్నారు. (67,68)

"కాస్త ప్రపంచం తిరిగి చూడండి, దుర్మార్గులకు ఏం గతి పట్టిందో!" అని చెప్పు. ప్రవక్తా! నీవు వారి గురించి విచారించకు. వారి దుష్టపన్నాగాలకు బాధపడకు. (69,70)

"నీవు చెప్పేది నిజమైతే ఈబెదిరింపు ఎప్పుడు నెరవేరుతుంది?" అని అడుగుతున్నారు వారు. "మీరు ఏ శిక్షకోసం తొందరపెడ్తున్నారో అందులో కొంత భాగం మీకు అతి చేరువలోకి వచ్చిందేమో!" అని చెప్పు వారికి. (71,72)

మానవులపట్ల నీ ప్రభువు అమిత దయాళువు. కాని చాలామంది (ఆయనకు) కృతజ్ఞత చూపరు. వారి హృదయాల్లో దాగి ఉన్నదేమిటో, వారు బయటికి వ్యక్తం

---

4. అగోచర విషయాలు(అంటే అతీంద్రియ జ్ఞానానికి సంబంధించిన విషయాలు) దేవునికి తప్ప మరెవరికీ తెలియదని ఈ సూక్తిలో తెలియజేయబడింది. అంటే దేవుడు మాత్రమే అతీంద్రియ జ్ఞానసంపన్నుడు (ఆలిముల్‌గైబ్) అన్నమాట. దైవప్రవక్తలక్కూడా దేవుడు ఎంత మేరకు అతీంద్రియ జ్ఞానం, అగోచర విషయాలు దివ్యావిష్కృతి (వహీ) ద్వారా తెలియజేశాడో అంతమేరకే వారికి తెలుసు. అంతమాత్రాన దైవప్రవక్తలు అతీంద్రియ జ్ఞానులని చెప్పడాన్ని ఇస్లాం అంగీకరించదు.

సహీ ముస్లిం గ్రంథంలో ప్రవక్త సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) ఇలా ఉల్లేఖిస్తున్నారు: "దైవప్రవక్త (సల్లం)కు రేపటి రోజు సంభవించే విషయాలు తెలుసని ఎవరైనా భావిస్తే, అతను దేవుని మీద పెద్ద అభాండం వేస్తున్నాడన్నమాట. యావత్తు భూమ్యాకాశాల్లో అతీంద్రియ జ్ఞానం దేవునికి మాత్రమే ఉందని స్వయంగా దేవుడే తెలియజేస్తున్నాడు". (దీంతోపాటు 2:255, 6:59, 31:34, 72: 26-28 సూక్తులు కూడా చూడండి.)

చేస్తున్న దేమిటో నీ ప్రభువుకు బాగా తెలుసు. భూమ్యాకాశాల్లో ఉన్న రహస్యాలన్నీ (ఆయన దగ్గర) ఒక స్పష్టమైన గ్రంథంలో నమోదు చేయబడి ఉన్నాయి. (73-75)

ఈ ఖుర్‌ఆన్ ఇస్రాయీల్ సంతతి ప్రజలకు వారు పరస్పరం విభేదిస్తున్న అనేక విషయాలకు సంబంధించిన నిజానిజాలేమిటో తెలియజేస్తోంది. విశ్వాసుల పాలిట ఇది మార్గదర్శక గ్రంథం, (దైవ)కారుణ్యం. (76,77)

నిస్సందేహంగా నీ ప్రభువు తన ఆజ్ఞతో వారి గురించి కూడా తీర్పు చేస్తాడు. ఆయన మహా శక్తిసంపన్నుడు, సర్వం ఎరిగినవాడు. (78)

కనుక ముహమ్మద్ (సల్లం)! దేవుడ్ని నమ్ముకొని ఆయన మీదనే ఆధారపడు. నిస్సందేహంగా నీవు పూర్తిగా సత్యపథంలో ఉన్నావు. నీవు మృతప్రాయులకు (ఏ విషయం) విన్పించలేవు. వెన్నుజూపి పారిపోయే బధిరులక్కూడా నీమాట విన్పించలేవు. అలాగే అంధులకు దారిచూపి వారినీ మార్గభ్రష్టత్వం నుండి కాపాడలేవు. మా సూక్తులు విశ్వసించి విధేయులయ్యేవారికి మాత్రమే నీవు నీ మాట విన్పించగలవు. (79-81)

(ప్రళయం గురించి) మావాగ్దానం నెరవేరే సమయం ఆసన్నమయినప్పుడు మేము వారి కోసం భూమి నుండి ఒక (వింత) జంతువుని బయటికి తీస్తాము. అది (దేవుని ప్రతినిధిగా) వారితో మాట్లాడుతూ "ప్రజలు మా సూక్తులు విశ్వసించేవారు కాదు" అంటుంది.[5] (82)

ప్రతి సమాజం నుండి మా సూక్తులు తిరస్కరించినవారి గుంపునొక దాన్ని ఓరోజు చుట్టుముట్టి తెస్తాం. తర్వాత వారిని తరగతుల వారిగా విభజిస్తాము. ఇలా అందరూ వచ్చిన తరువాత "మీరు నా సూక్తుల్ని గురించి అలోచించకుండానే (మొండిగా) తిరస్కరించారా? లేకుంటే మరేం చేస్తుండేవారు?" అని ప్రశ్నిస్తాడు (దేవుడు). వారు చేసిన అన్యాయం వల్ల శిక్ష గురించిన (మా)వాగ్దానం నెరవేరుతుంది. అప్పుడు వారు నోరు మెదపలేరు. మేము వారికోసం రాత్రిని విశ్రాంతి సమయంగా, పగటిని వెల్తురు సమయంగా చేశాము. దీన్ని వారు గమనించడం లేదా? విశ్వసించేవారికి ఇందులో ఎన్నో సూచనలున్నాయి. (83-86)

---

5. ప్రళయకాల సూచనల్లో ఇది కూడా ఒకటి. ప్రపంచంలో పాపాలు ఎక్కువయిపోతాయి. పుణ్యాత్ములు దాదాపు అంతరించిపోతారు. ప్రజల్లో మంచీ చెడుల విచక్షణా జ్ఞానం నశిస్తుంది. అప్పుడు దేవుడు ఈ వింత జంతువుని పంపిస్తాడు. అది ప్రజలతో మాట్లాడుతూ "ప్రళయదినం (పరలోకం) గురించిన దేవుని సూక్తులు మీరు నమ్మేవారు కాదుగా! ఇప్పుడు చూడండి, అది అతి వేగంగా ముంచుకొస్తోంది" అని అంటుంది.

షాహ్ అబ్దుల్ ఖాదర్ ముహద్దిస్ (రహ్మాలై) గారి వ్యాఖ్యానం ప్రకారం ప్రళయానికి ముందు మక్కాలోని సఫాకొండ పగిలి అందులో నుంచి ఒక వింతజంతువు వెలువడుతుంది. అది ప్రజలతో మాట్లాడుతూ, ప్రళయం దగ్గరకు వచ్చిందని చెబుతుంది. అది ప్రజలలో నిజమైన విశ్వాసులెవరో, అవిశ్వాసాన్ని దాచిన పగటి వేషధారులెవరో సూచిస్తుంది.



ఆరోజు (ప్రళయ) శంఖారావంతో భూమ్యాకాశాల్లోని సమస్త జీవరాసులు బెదిరి పోతాయి. అయితే దేవుడు కాపాడదలచుకున్న వారు ఏమాత్రం బెదిరిపోరు. (తర్వాత) అందరూ వినమ్రులయి ఆయన సన్నిధిలో హాజరవుతారు. ఈరోజు నీవు పర్వతాలను చూసి దృఢంగా పాతుకుపోయి ఉన్నాయని భావిస్తున్నావు. కాని ఆ సమయంలో ఇవి మేఘల్లా ఎగురుతుంటాయి. ఇది దేవుని మహత్తు. ఆయన ప్రతివస్తువునీ తగినవిధంగా పటిష్ఠపరిచాడు. మీరు చేస్తున్న పనులను గురించి ఆయనకు బాగా తెలుసు. (87,88)

పుణ్యకార్యాలు తీసుకొచ్చినవారికి అంతకన్నా మంచి ప్రతిఫలం లభిస్తుంది. అలాంటి వారు ఆరోజు సంభవించే బీభత్సం నుండి సురక్షితంగా ఉంటారు. పాప కార్యాలు తీసుకు వచ్చినవారిని మాత్రం బోర్లా పడవేసి నరకాగ్నిలో విసిరేయడం జరుగుతుంది. చేసుకున్నవారికి చేసుకున్నంత. అంతకంటే మీరు మరో ప్రతిఫలం ఆశించగలరా? (89,90)

ప్రవక్తా! వారికిలా చెప్పు:"నేనీ నగర ప్రభువునే ఆరాధించాలని నాకు ఆజ్ఞయింది. ఆయన ఈ నగరాన్ని (ఎలాంటి రక్తపాతం జరగనివ్వకుండా) నిషిద్ధ ప్రాంతంగా చేశాడు. (సృష్టిలోని) ప్రతి వస్తువూ ఆయనదే. నేను (విశ్వప్రభువుకు) విధేయుణ్ణయి (ముస్లిం నయి) ఉంటూ, ఈ ఖుర్‌ఆన్‌ని (ప్రజలకు) విన్పించాలని ఆజ్ఞయింది."

కనుక ఎవరైనా సన్మార్గం అవలంబిస్తే, అతను తన శ్రేయస్సు కొరకే అవలం బిస్తాడు. దారితప్పినవారితో నీవు హెచ్చరించేవాడివి మాత్రమేనని చెప్పు. "సమస్త ప్రశంసలు దేవునికే శోభిస్తాయి. త్వరలోనే ఆయన మీకు తన సూచనలు చూపుతాడు. మీరు వాటిని గుర్తిస్తారు" అని కూడా చెప్పు. మీ కర్మల పట్ల దేవుడు ఏమాత్రం అజాగ్రత్తగా లేడు. (91-93) ✪

# 28. గాథలు (ఖసస్)

**అవతరణ: మక్కా** **సూక్తులు: 88**

ఈ అధ్యాయాన్ని "ఖసస్" (గాథలు) అంటారు. ఇది కూడా హిజ్రీ శకారంభానికి ఆరేడు సంవత్సరాల పూర్వం మక్కాలో అవతరించింది. ఇందులో అవిశ్వాసుల అనుమానాలు, అభ్యంతరాలకు సమాధానం ఇవ్వబడింది. దీనికోసం మూసా ప్రవక్త (అలై) గాథ ఉదాహరణగా పేర్కొనబడింది. ఆ తరువాత అవిశ్వాసుల సత్యతిరస్కారవైఖరిని విమర్శించడం జరిగింది.

### కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

తా-సీన్-మీమ్. ఇవి విషయస్పష్టత కలిగిన గ్రంథానికి చెందిన సూక్తులు. విశ్వసించిన వారి ప్రయోజనం కోసం మేమిప్పుడు మూసా, ఫిరౌన్‌లకు సంబంధించిన వాస్తవ స్థితిగతులు కొన్నింటిని నీకు విన్పించబోతున్నాం. (1-3)

నిస్సందేహంగా ఫిరౌన్ ధరణిలో తలెత్తి అహంకారంతో విర్రవీగుతున్నాడు. అతను తన దేశపౌరుల్ని (విభిన్న)వర్గాలుగా విభజించాడు. వాటిలో ఒక వర్గాన్ని అతినీచంగా చూస్తున్నాడు. ఆ వర్గంలో ఆడపిల్లలను మాత్రమే జీవించిఉండేలా వదలి, మగపిల్లలను హతమార్చు తున్నాడు. ఈవిధంగా అతను పరమ దుర్మార్గుడై పోయాడు. (4)

కనుక ప్రపంచంలో అణచివేయబడిన ఈ (దళిత) జనాన్ని కనికరించాలని మేము నిర్ణయించుకున్నాం. వారికి (ప్రపంచ) నాయకత్వం ప్రసాదించి, వారిని (భూమికి) వారసులుగా చేయాలని సంకల్పించాం. వారికి ప్రపంచంలో పాలనాధికారం ఇవ్వాలని భావించాం. అంతేకాకుండా వారిద్వారా మరోవైపు ఫిరౌన్, హామాన్‌లకు, వారి సైన్యాలకు వారు భయపడుతున్నదానిని చూపాలని కూడా మేము నిశ్చయించాము. (5,6)

మేము మూసా తల్లికి దివ్యావిష్కృతి ద్వారా ఇలా సూచించాం: "నీవు మూసాకు పాలు త్రాగిస్తూ ఉండు. అతని ప్రాణానికి ముప్పు వాటిల్లే సూచనలు కన్పిస్తే అతడ్ని నదిలో వదలిపెట్టు. నువ్వేమీ భయపడకు, దిగులుపడకు. ఆ తరువాత మేమతడ్ని తిరిగి నీ దగ్గరికే చేర్చుతాము. అతడ్ని మేము దైవప్రవక్తగా చేస్తాము." (7)

చివరికి ఫిరౌన్ కుటుంబీకులు అతడ్ని (నది నుండి) తీసేసుకున్నారు, అతను తమకు విరోధిగా, దుఃఖదాయినిగా కావాలని! ఫిరౌన్, హామాన్, వారి అనుయాయులు నిజంగా (ఈ విషయంలో) చాలా పొరబడ్డారు. ఫిరౌన్‌తో అతని భార్య ఇలా అన్నది: "ఈ పిల్లవాడు మన కంటిచలువ. ఇతడ్ని చంపకండి. ఇతడు మనకు ప్రయోజనకారి కావచ్చు లేదా మనం ఇతడ్ని కొడుకుగానైనా చేసుకుందాం." (దీని పర్యవసానం ఏమిటో) వారికి తెలియదు. (8,9)

అటు మూసా మాతృమూర్తి హృదయం తల్లడిల్లిపోసాగింది. మేమామెకు ధైర్యం కలిగించకపోతే, ఆమె ఈరహస్యాన్ని బట్టబయలు చేసివుండేది. ఆమె విశ్వాసులలో చేరాలన్న ఉద్దేశ్యంతో ఇలా చేశాము. ఆమె పిల్లవాడి అక్కతో "నీవు ఇతని వెనకాలగా నడచివెళ్ళు" అని చెప్పింది. ఆ బాలిక తనను గురించి (శత్రువులకు) ఎలాంటి అనుమానం రాకుండా దూరం నుంచి అతడ్ని గమనిస్తూ నడిచింది. (10,11)

మేము ముందుగానే పిల్లవాడికి పాలుపట్టే స్త్రీల పాలిండ్లను నిషేధించాము. (అందువల్ల పిల్లవాడు ఏ స్త్రీ దగ్గరకూడా పాలు త్రాగడానికి సిద్ధంకాలేదు.) అప్పుడు ఆబాలిక వారితో "ఈపిల్లవాడి పోషణభారం వహించేవారెవరో, వారిల్లెక్కడో నేను మీకు తెలుపనా? వారు బాబుని ఎంతో జాగ్రత్తగా చూసుకుంటారు కూడా" అని అన్నది. (12)

ఈవిధంగా మేము మూసాను తిరిగి అతని తల్లి దగ్గరకు చేర్చాము, ఆమె కళ్ళు చల్లబడాలని, దిగులుపడకూడదని. అదీగాక దేవుని వాగ్దానం నిజమైన వాగ్దానమని ఆమె తెలుసుకోవాలని కూడా మేమిలా చేశాము. కాని చాలామందికి ఈవిషయం తెలియదు. మూసా యౌవనదశకు చేరి పరిపూర్ణ వికాసం చెందిన తర్వాత మేమతనికి జ్ఞానం, వివేకం ప్రసాదించాము. ఇలా మేము సత్పురుషులకు (తగిన) బహుమానం ప్రసాదిస్తాము. (13,14)

(ఓరోజు)నగరవాసులు ఏమరుపాటులో ఉన్నప్పుడు మూసా నగరంలో ప్రవేశించాడు. అతను ఒకచోట ఇద్దరు పోట్లాడుకోవడం చూశాడు. వారిలో ఒకడు తనజాతికి చెందినవాడే. రెండోవాడు అతని విరోధిజాతికి చెందినవాడు. మూసాజాతికి



చెందినవాడు విరోధి జాతివాడికి వ్యతిరేకంగా తనకు సహాయం చేయవలసిందిగా మూసాను పిలిచాడు.

అప్పుడు మూసా వచ్చి ఒక్క పిడిగుద్దుతో అతడ్ని కడతేర్చాడు. (ఈ హఠాత్పరిణామానికి) మూసా (కంగారుపడుతూ) "ఇది షైతాన్‌చర్య. షైతాన్ (మానవులకు) బద్ధ విరోధి; పెడదారి పట్టించే పరమదుర్మార్గుడు" అన్నాడు. ఆ తర్వాత "ప్రభూ! నేను నా ఆత్మకు అన్యాయం చేసుకున్నాను. నన్ను క్షమించు" అని వేడుకున్నాడు. దేవుడు అతడ్ని క్షమించాడు. నిజంగా ఆయన గొప్ప క్షమాశీలి, అమిత దయామయుడు. (15,16)

ఆ తరువాత మూసా "ప్రభూ! నీవు నాకెంతో మేలు చేశావు. ఇకముందు ఎప్పుడూ నేను నేరస్థులకు సహాయపడను"[1] అని ప్రతిజ్ఞ చేశాడు. (17)

మరునాడు ఉదయం మూసా భయపడుతూ, ప్రమాదసూచనలు పసిగడ్తూ నగరంలో ప్రవేశించాడు. అకస్మాత్తుగా ఒకచోట నిన్న తనను సహాయం కోసం పిలిచిన వాడే ఈరోజు కూడా తనను పిలుస్తూ కన్పించాడు. అప్పుడు మూసా అతనితో "నీవు పెద్ద దుర్మార్గుడిలా (జగడాలమారిగా) కన్పిస్తున్నావే!" అన్నాడు. (18)

ఆ తరువాత మూసా తన విరోధి జాతికి చెందిన వాడిపై దాడి చేయబోయాడు. వెంటనే రెండోవాడు గగ్గోలుపెడుతూ "మూసా నిన్న నీవు ఒక మనిషిని చంపావు. అలాగే ఈరోజు నన్ను చంపడానికి సిద్ధమయ్యావా? నువ్వీ దేశంలో క్రూరుడుగా ఉండ దలిచావా? సంస్కరణ కార్యాలు చేయడం ఇష్టం లేదా?" అని అడిగాడు. (19)

కాస్సేపటికి నగరం అగ్రభాగం నుండి ఒక వ్యక్తి పరుగెత్తుకుంటూ వచ్చి "మూసా! ఉన్నతాధికారులు నిన్ను చంపే విషయమయి చర్చలు జరుపుతున్నారు. నువ్వు

---

1. ఈసూక్తి ప్రకారం విశ్వాసులు దౌర్జన్యపరుడికి ఎలాంటి సహాయం చేయకూడదని ధర్మవేత్తలు నిర్ణయించారు. ప్రముఖ తాబై హజ్రత్ అతా బిన్ రబాహ్ (రహ్మ)తో ఒకతను మాట్లాడుతూ "నాసోదరుడు బనీఉమయ్యా ప్రభుత్వంలో కూఫా గవర్నర్‌కు కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. ప్రజల వ్యవహారాలు పరిష్కరించే బాధ్యత లేదుగాని, పరిష్కృత వ్యవహారాలను అతను కలంతో రాస్తాడు. ఈ ఉద్యోగం చేయకపోతే అతనికి పొట్టగడవదు" అన్నాడు. దానికి హజ్రత్ అతా ఈసూక్తినే పఠించి "నీసోదరుడికి కలం పారెయ్యమని చెప్పు. ఆహారమిచ్చేవాడు దేవుడున్నాడు" అని చెప్పారు.

ఖలీఫా అబ్దుర్రహ్మాన్ ఒకసారి బుఖారాపట్నం అధికారులకు జీతాలపంపిణీ కోసం జహాక్ అనే వ్యక్తిని నియమించజూశాడు. కాని జహాక్ ఆ బాధ్యత స్వీకరించడానికి నిరాకరించాడు. అది తెలిసి అతని స్నేహితులు ఆశ్చర్యపోతూ, ఇందులో తప్పేముందీ? అనడిగారు. దానికి జహాక్ "నేను దౌర్జన్యపరులు తలపెట్టే ఏ పనిలోనూ సహకరించదలచుకోలేదు" అన్నాడు. (రూహుల్‌మాని)

ఖలీఫా మన్సూర్ దగ్గర హసన్ బిన్ కఖ్తుబా అనే సైన్యాధిపతి ఉండేవాడు. ఇమామ్ అబూ హనీఫా (రహ్మలై) అతనికి అప్పుడప్పుడు మన్సూర్ దౌర్జన్యపాలన గురించి చెప్పేవారు. దాంతో హసన్ చివరికి తన సేనాపతి పదవికి రాజీనామా చేశాడు.

దీన్ని బట్టి దుర్మార్గులు, దౌర్జన్యపరులు నడిపించే ప్రభుత్వంలో సజ్జనులు ఎలాంటి కీలక స్థానం అలంకరించకూడదని తెలుస్తోంది.

(తొందరగా ఎటయినా) పారిపో. నేను నీ శ్రేయాభిలాషిని, చెబుతున్నా" అన్నాడు. (20)

ఈసంగతి వినగానే మూసా భయపడిపోయి నగరం నుంచి మెల్లిగా జారుకున్నాడు. అప్పుడతను "ప్రభూ! నన్ను దుర్మార్గుల బారినుండి కాపాడు"అని ప్రార్థించాడు. (21)

మూసా (ఈజిప్టు నుంచి బయలుదేరి) మద్యన్ దారి పట్టాడు. ఆ సమయంలో "నా ప్రభువు నన్ను సరైన దారిలో నడిపిస్తాడని ఆశిస్తున్నాను" అన్నాడతను. (22)

ఆవిధంగా అతను మద్యన్ ప్రాంతంలోని ఒక బావి దగ్గరకు చేరుకున్నాడు. అక్కడ అనేకమంది తమ పశువులకు నీళ్ళు త్రాగిస్తూ కన్పించారు. వారికి కొంచెం ఎడంగా ఇద్దరు స్త్రీలు తమ పశువుల్ని ఆపుకొని (నీటికోసం నిరీక్షిస్తూ) నిలబడి ఉన్నారు.

మూసా ఆ స్త్రీలను ఉద్దేశించి "మీ బాధేమిటీ?" అని అడిగాడు. దానికి వారు "ఈ కాపరులు తమ పశువుల్ని తోలుకెళ్ళనంత వరకు మేము మా పశువులకు నీళ్ళు త్రాగించలేం. మా నాన్నగారు చాలా ముసలివారయి పోయారు" అన్నారు. (23)

ఈ సంగతి విని మూసా ఆ స్త్రీల పశువులకు నీళ్ళు తాగించాడు. ఆ తరువాత ఓ చోట నీడపట్టున కూర్చొని "ప్రభూ! నీవు నాకు ఎలాంటి శ్రేయస్సు పంపినా అది నాకెంతో అవసరం" అన్నాడు. (24)

కాస్సేపటికి ఆఇద్దరు స్త్రీలలో ఒకామె సిగ్గుపడుతూ నడచి అతని వద్దకు వచ్చింది. ఆమె అతనితో "మా నాన్నగారు మిమ్మల్ని పిలుస్తున్నారు. మీరు మా పశువులకు నీరు త్రాగించి చేసిన మేలుకు అయన మీకు ప్రతిఫలం ఇవ్వడానికి పిలుస్తున్నార"ని అన్నది.

మూసా ఆ వృద్ధుని దగ్గరికెళ్ళి తన గాధంతా వివరించాడు. అది విని అతను "భయపడకు. ఇప్పుడు నీవా దుర్మార్గుల బారినుండి బయటపడ్డావు" అన్నాడు. (25)

ఆ ఇద్దరు స్త్రీలలో ఒకామె తన తండ్రితో "నాన్నా! ఇతడ్ని మనం సేవకునిగా పెట్టుకుందాం. బలిష్ఠుడు, నిజాయితీపరుడైనవాడే మనకు మంచి సేవకుడు (కాగలుగుతాడు)" అని అన్నది. (26)

ఆమె తండ్రి (మూసాతో) ఇలా అన్నాడు: "నేను నా కుమార్తెలిద్దరిలో ఒకామెను నీకిచ్చి పెళ్ళి చేయాలనుకుంటున్నాను. అయితే నీవు నాదగ్గర ఎనిమిదేండ్ల పాటు సేవకునిగా పనిచేయాలి. పదేండ్లు చేస్తే (ఇంకా మంచిది.) అది నీ ఇష్టం. నేను నీమీద వత్తిడి చేయదలచుకోలేదు. దేవుడు తలిస్తే నీవు నన్ను మంచివాడిగా చూస్తావు." (27)

దానికి మూసా ఇలా అన్నాడు: "ఈ వ్యవహారం మీకూ, నాకూ మధ్య జరిగింది. ఈరెండు గడువుల్లో ఏదో ఒకదాన్ని నేను పూర్తి చేస్తాను. ఆ తర్వాత నామీద మరెలాంటి భారం వేయకూడదు. మనం చేసుకుంటున్న ఈ ఒప్పందానికి దేవుడే సాక్షి." (28)

నిర్ణీతకాలం ముగిసిన తర్వాత మూసా తన కుటుంబాన్ని తీసుకొని బయలుదేరాడు. దారిలో తూర్‌కొండ వైపునుండి అతనికి ఒక అగ్ని (మంట) కన్పించింది.



అప్పుడతను తన గృహస్తులతో "ఆగండి, నాకేదో నిప్పు కన్పిస్తోంది. నేను వెళ్ళి ఏదైనా సమాచారం తీసుకొస్తాను లేదా మీరు చలికాచుకోవడానికి ఓ నిప్పు కొరివినయినా తీసుకొస్తాను" అన్నాడు. (29)

మూసా అక్కడకు చేరుకోగానే లోయ కుడివైపున్న పవిత్ర స్థలంలోని ఓ చెట్టు నుండి "మూసా! నేనే దేవుడ్ని. సర్వలోక ప్రభువుని" అంటూ ఓ (అదృశ్య)వాణి విన్పించింది. (30)

ఆ తరువాత "నీ చేతికర్ర క్రిందపడెయ్యి" అని దేవుడు ఆజ్ఞాపించాడు. (మూసా తన చేతికర్ర నేలమీద పడవేశాడు.) ఆ కర్ర పాములా మెలికలు తిరుగుతూ ప్రాకడం మొదలెట్టింది. దాన్ని చూడగానే అతను (భయపడి) పరుగు లంకించుకున్నాడు. వెనక్కి తిరిగైనా చూడలేదు.

"మూసా! భయపడకు, వచ్చేయి. నీకెలాంటి ప్రమాదం ఉండదు. నీ చేతిని కాస్త చొక్కా క్రింద చంకలో పెట్టి తీసేయి. అది నీకెటువంటి బాధ కల్గించకుండా ప్రకాశిస్తూ బయటికి వస్తుంది. భయం పోగొట్టుకోవడానికి నీ (కుడి) భుజం కాస్త అదుముకో. ఇవి రెండు ఫిరౌన్, అతని సభాసదుల ముందు ప్రదర్శించడానికి నీ ప్రభువు తరపున ఇవ్వబడిన మహిమలు. వారు చాలా దుర్మార్గులైపోయారు" అన్నాడు దేవుడు. (31,32)

అప్పుడు మూసా ఇలా అన్నాడు: "ప్రభూ! నేను వారి మనిషి నొకడ్ని చంపి ఉన్నాను. అందువల్ల వారు నన్ను చంపేస్తారేమోనని భయపడుతున్నాను. నా సోదరుడు హారూన్ మంచివాక్పటిమ గలవాడు. అతడ్ని నాకు సహాయకారిగా నియమించు. అతను నన్ను సమర్థిస్తాడు. వారు నన్ను తిరస్కరిస్తారేమోనని భయంగా ఉంది." (33,34)

దానికి దేవుడు ఇలా అన్నాడు: "మేము నీ సోదరుని ద్వారా నీకు బలం చేకూర్చుతాము. మీ ఇద్దరికీ విశేషశక్తి ప్రసాదిస్తాము. దీనివల్ల వారు మిమ్మల్నేమీ చేయలేరు. మా మహిమల శక్తితో మీరు, మిమ్మల్ని అనుసరించేవారే విజయం సాధిస్తారు." (35)

ఆ తరువాత మూసా మామహిమలు తీసుకొని వారి దగ్గరకు వెళ్ళాడు. కాని వారు (వీటిని చూసి) "ఇదంతా అతడు కల్పించుకున్న మంత్రజాలం తప్ప మరేమీ కాదు. ఈమాటలు మేము మా తాతముత్తాతల కాలంలో ఎప్పుడూ వినలేదు" అన్నారు.

"నా ప్రభువు దగ్గర్నుండి హితోపదేశం తెచ్చిన మనిషిని గురించి ఆ ప్రభువుకు బాగా తెలుసు. అంతిమ పర్యవసానం ఎవరిది మంచిదవుతుందో కూడా ఆయనకే తెలుసు. ఏమైనా దుర్మార్గులు మాత్రం ఎన్నటికీ సఫలం కాలేరు" అన్నాడు మూసా.

"సభాసదులారా! మీకు నేను తప్ప మరొక దేవుడున్నట్లు నేనెరగను. హామాన్! కాస్త ఇటుకలు కాల్చి ఒక ఎత్తయిన కట్టడం కట్టించు. నేను దానిపై ఎక్కి మూసా దేవుడు (ఎక్కడైనా) ఉన్నాడేమో చూస్తాను.[2] నేను మాత్రం మూసా అబద్ధాలరాయుడని

2. సోవియట్ రష్యా శాస్త్రవేత్తలు తొలిసారిగా మనిషిని అంతరిక్ష నౌక ద్వారా రోదసిలోకి పంపి విజయం సాధించినప్పుడు, ఆ దేశం అధ్యక్షుడు కృశ్చేవ్ కూడా దేవుడ్ని గురించి ఇలాగే

భావిస్తున్నా” అన్నాడు ఫిరౌన్ (వెటకారంగా). (36-38)

ఫిరౌన్, అతని సైనికమూకలు హద్దుమీరిన అధికార గర్వంతో విర్రవీగిపోయారు. వారు మా దగ్గరికి ఎన్నడూ తిరిగిరావడం జరగదని భావించారు. చివరికి మేము అతడ్ని, అతని సైన్యాలను పట్టుకొని సముద్రంలో విసిరిపడేశాం. కనుక దుర్మార్గులకు ఎలాంటి గతి పట్టిందో కాస్త చూడండి. (39,40)

మేమా దుర్మార్గుల్ని నరకం వైపు పిలిచే నాయకులుగా చేశాం. ప్రళయదినాన వారికి ఎలాంటి సహాయం లభించదు. వారిని మేమీ ప్రపంచంలో శాపగ్రస్తులుగా చేశాం. ఇక ప్రళయదినానయితే వారు దారుణమైన దుస్థితిలో చిక్కుకుంటారు. (41,42)

పాత తరాలను నాశనం చేసిన తరువాత మేము మూసాకు (తౌరాత్) గ్రంథం ప్రసాదించాము. ప్రజలు గుణపాఠం నేర్చుకోవడానికి మేము దాన్ని హితబోధినిగా, మార్గ దర్శినిగా, కారుణ్యప్రదాయనిగా చేశాము. (43)

ప్రవక్తా! మేము మూసాకు ఈ (తౌరాత్) ఆజ్ఞలు ప్రసాదిస్తున్న సమయంలో నీవు (తూర్‌పర్వతం) పశ్చిమభాగాన లేవు. పైగా నీవు (ఆ దృశ్యం చూసిన) సాక్షుల్లో కూడా లేవు. ఈసంఘటన తర్వాత మేము అనేక తరాలను లేపాము. వాటిమధ్య ఎంతోకాలం గడచింది. అదీగాక నీవు మద్యన్ వాసులకు మాసూక్తులు విన్పించడానికి ఆనాడు నీవు వారి దగ్గర లేవు. (ఆనాటి విశేషాలు) మేమే నీకు తెలియజేస్తున్నాము. (44,45)

మేము (మూసాను మొదటిసారి) పిలిచినప్పుడు నీవు తూర్ (కొండ) సమీపంలో లేవు. అయినా (ఈ సమాచారం నీకు అందజేయబడుతున్నదంటే) ఇది నీ ప్రభువు అనుగ్రహం. నీకు పూర్వం వీరి దగ్గరకు హెచ్చేరించేవారు ఎవరూ రానందువల్ల స్పృహ లోకి వస్తారేమోనని నీవు వీరిని హెచ్చరించేందుకు మేమిలా చేశాం. ఇలా చేయకపోతే వారిపై వారి (దుష్)కార్యాల కారణంగా ఏదైనా ఆపద వచ్చిపడితే “ప్రభూ! మా దగ్గరకు ఒక ప్రవక్తను ఎందుకు పంపలేదు? పంపివుంటే మేము నీ సూక్తులు పాటించి విశ్వాసు లలో చేరిపోయేవాళ్ళం కదా!” అని వారు అనవచ్చు. (ఈ ఆరోపణకు ఆస్కారం ఇవ్వ కూడదనే మేము నిన్ను వీరి దగ్గరకు ప్రవక్తగా నియమించి పంపాము). (46,47)

అయితే మా దగ్గర్నుండి వారి దగ్గరకు సత్యం వచ్చిన తరువాత “మూసాకు ఇవ్వ బడినవే (మహిమలు) ఇతనికెందుకు ఇవ్వబడలేదు?” అని చెప్పసాగారు. ఇంతకు పూర్వం మూసాకు ఇవ్వబడినవాటిని వీరు తిరస్కరించలేదా? వారు (ఖుర్‌ఆన్, తౌరాత్ లను గురించి) ఈ రెండూ పరస్పరం సమర్థించుకునే మంత్రజాలాలు (తప్ప మరేమీ కావు) అన్నారు. అంతేకాదు, మేము ఏ ప్రవక్తనూ నమ్మం అని కూడా అన్నారు. (48)

---

అన్నాడు. “మేము ఆకాశమంతా తిరిగి చూశాం. మాకు దేవుడు ఎక్కడా కన్పించ లేదే!” అన్నాడా పెద్దమనిషి. దీన్నిబట్టి దేవుని విషయంలో మూడువేల సంవత్సరాలకు పూర్వం మార్గభ్రష్టుల మనస్తత్వం ఎలా ఉండేదో నాగరికులం, అభ్యుదయవాదులం అని చెప్పుకునే నేటి వ్యక్తుల మనస్తత్వం కూడా అదేవిధంగా ఉందని తెలుస్తోంది. విజ్ఞతా వివేచనలు విడనాడినప్పుడు నాగరికత ఎంత పెరిగినా మనస్తత్వం మారదు కదా! (40:36, 37 సూక్తులు కూడా చూడండి.)



“మీ అభిప్రాయం నిజమైతే దేవుని దగ్గర్నుండి ఈ రెండిటికన్నా మెరుగైన మార్గం చూపే మరేదైనా గ్రంథం ఉంటే తీసుకురండి, నేను దాన్ని అనుసరిస్తాను” అని చెప్పు. ఈ సవాలును గనక ఎదుర్కోకపోతే, వీరసలు తమ మనోవాంఛలకు బానిసలయి పోయారని తెలుసుకో. దేవుని మార్గదర్శకత్వం లేకుండా మనోవాంఛలకు బానిసయి పోయిన వాడికంటే మించిన మార్గభ్రష్టుడు మరెవడు కాగలడు? అలాంటి దుర్మార్గులకు దేవుడు ఎన్నటికీ మార్గం చూపడు. వారు ఏమరుపాటు నుండి స్పృహలోకి రావడానికి మేము అనేక సార్లు విషయాన్ని వారికి అందజేశాము. (49-51)

పూర్వం మేము గ్రంథం ఇచ్చినవారు ఈగ్రంథాన్నీ విశ్వసిస్తున్నారు. దీన్ని విన్పించి నప్పుడు “మేము దీన్ని విశ్వసిస్తున్నాం. నిజంగా ఇది మాప్రభువు నుండి వచ్చిన సత్యం.[3] మేము పూర్వం నుండే విధేయులై (ముస్లిములై)[4] ఉన్నాం” అంటారు వారు. (52,53)

---

3. మహనీయ ముహమ్మద్ (సల్లం) దైవప్రవక్తగా ప్రభవించారన్న వార్త అబిసీనియాకు వలసవెళ్ళిన ముస్లింల ద్వారా అబిసీనియాలో చాలామందికి తెలిసింది. అప్పుడు అక్కడ్నుంచి ఇరవై మంది క్రైస్తవపండితులు వివరాలు తెలుసుకోవడానికి మక్కా వచ్చారు. అక్కడ కాబాగృహంలో దైవప్రవక్త (సల్లం)ను కలుసుకొని కొన్ని ప్రశ్నలు అడిగారు. దైవప్రవక్త (సల్లం) వాటికి సమాధానం ఇచ్చి, వారిని ఇస్లాం వైపు ఆహ్వానిస్తూ కొన్ని ఖుర్‌ఆన్ సూక్తులు పఠించి విన్పించారు.

ఆ సూక్తులు వినగానే క్రైస్తవ పండితుల కళ్ళు చెమర్చాయి. వెంటనే వారు ప్రవక్త (సల్లం)పై విశ్వాసం వ్యక్తపరచి ఇస్లాం స్వీకరించారు. తరువాత వారు అక్కడ్నుంచి వెళ్ళిపోయారు.

అయితే ఖురైష్ నాయకుడు అబూజహల్, అతని సహచరులు కొందరు దారిలో వారిని కలుసుకొని తూలనాడారు. “దౌర్భాగ్యులారా! మీ మతస్థులు మిమ్మల్ని ఈ మనిషి స్థితిగతులేమిటో తెలుసుకొని రమ్మని పంపిస్తే, మీరు ఇతని దగ్గర కాస్సేపు కూర్చున్నారో లేదో మీ తాతముత్తాతల మతం వదలి ఇతడ్ని విశ్వసిస్తారా? మీలాంటి బుద్ధిహీనుల్ని మేమింతవరకు చూడలేదు” అని అన్నారు. దానికి వారు “సోదరులారా! మీకు సలాం. మేము మీతో వాదించలేము. యదార్థం తెలిసి కూడా మేము శ్రేయోభాగ్యాలను వదలుకోలేము. మమ్మల్ని మా పద్ధతి మీద నడవనివ్వండి. మీరు మీ పద్ధతి ప్రకారం నడుస్తూ ఉండండి.” (సీరత్ ఇబ్నె హిషామ్)

(28:54,55 సూక్తులతో పాటు 26:197 సూక్తి కూడా చూడండి.)

4. ఇస్లాం అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) కాలం నుండి మాత్రమే వచ్చిన ధర్మం కాదు. ఇతర ప్రవక్తలు బోధించిన ధర్మం కూడా ఇస్లామే. వారిని విశ్వసించినవారిని కూడా ముస్లిం లనే అంటారు. ఆదిమానవుడు ఆదం (అలైహి) నుండి వస్తున్న ధర్మం కూడా ఇదే. దీన్ని బట్టి ఇస్లాం అత్యంత సనాతన ధర్మమని తెలుస్తోంది. ఖుర్‌ఆన్‌లోని ఈ క్రింది సూక్తులు చూడండి:

హజ్రత్ నూహ్ (అలైహి) పలుకులు 10:72; హజ్రత్ ఇబ్రాహీం (అలైహి), ఆయన సంతానం గురించి 2:131-133, 2:128; హజ్రత్ లూత్ (అలైహి) గురించి 51:36; హజ్రత్ యూసుఫ్ (అలైహి) గురించి 12:101; హజ్రత్ మూసా (అలైహి) గురించి 10:84; ఫిరౌన్ పలుకులు 10:90; హజ్రత్ సులైమాన్ దగ్గర సబారాణి పలుకులు 27:44; హజ్రత్ ఈసా (అలైహి) అనుచరుల పలుకులు 5:111 మొదలైన సూక్తులు.

(సత్యంపై) స్థిరంగా ఉన్నందుకు వారికి రెట్టింపు ప్రతిఫలం ఇవ్వబడుతుంది. వారు సత్కార్యాల ద్వారా చెడులను దూరం చేస్తారు. మేము ప్రసాదించిన సంపద నుండి (మా మార్గంలోనూ) ఖర్చుచేస్తారు. ఏదైనా పనికిమాలిన విషయం వింటే వారు (వాదనకుదిగక) "మీకర్మలు మీకు, మాకర్మలు మాకు. మీకో దండం. మేము మూర్ఖుల వైఖరి అవలంబించలేము" అంటూ అక్కడ్నుంచి తప్పుకుంటారు. (54,55)

ప్రవక్తా! నీవు కోరినవాడికి సన్మార్గం చూపలేవు. దేవుడు మాత్రమే తాను కోరిన వాడికి సన్మార్గం చూపుతాడు. సన్మార్గం అవలంబించేవారెవరో ఆయనకు బాగాతెలుసు. వారు (సత్యాన్ని నిరాకరిస్తూ) "మేము గనక నీతోపాటు ఈ హితబోధను అవలంబిస్తే (ఈ నేలమీద మాకు పుట్టగతులుండవు.) మమ్మల్ని మాదేశం నుండి తరిమేస్తారు" అని అంటారు. మేము శాంతినిలయమైన ప్రతిష్ఠాలయం (పరిసరాల)లో నివసించేందుకు వారికి చోటు కల్పించలేదా? అక్కడకు మావైపు నుండి వారికి ఉపాధిగా రకరకాల వస్తుసామగ్రి చేరడంలేదా? కాని వారిలో చాలామందికి (వాస్తవం) తెలియదు. (56,57)

మేము ఎన్నో జనపదాలను నాశనం చేశాము. అక్కడి ప్రజలు తమ ఆర్థికప్రగతి చూసుకొని విర్రవీగి పోతుండేవారు. కనుక చూడు (శిథిలావస్థలో ఉన్న) వారి ఇండ్లను. వారి తరువాత ఆ ఇండ్లలో బహుకొద్దిమంది మాత్రమే నివసించారు. చివరికి మేమే వాటికి వారసులయి పోయాము. (58)

మాసూక్తులు విన్పించే ఒక ప్రవక్తను కేంద్ర జనపదానికి (మక్కాకు) పంపనంత వరకు మేము దాని చుట్టుపక్కలుండే ఏ జనపదాన్నీ నాశనం చేయము. అలాగే మేము ఏ జనపదాలను కూడా అక్కడి ప్రజలు దుర్మార్గులు కానంతవరకు నాశనం చేసేవారం కాము. (59)

మీకు ఇవ్వబడినదంతా కేవలం ప్రాపంచిక జీవన సంపద, క్షణికమైన దాని తళుకు బెళుకులు మాత్రమే. దేవుని దగ్గర (పరలోకంలో) ఉన్నది ఇంతకంటే ఎంతో శ్రేష్ఠమైనది, శాశ్వతమైనది. మీరు బుద్ధి నుపయోగించి ఆలోచించరా? (60)

మేము ఒక వ్యక్తికి మంచికి సంబంధించి వాగ్దానం చేశాం. అది అతనికి లభించే అవకాశం ఉంది. మరొక వ్యక్తికి మేము (క్షణభంగురమైన) ప్రాపంచిక జీవన సామగ్రి మాత్రమే ఇచ్చాం. తర్వాత అతడ్ని ప్రళయదినాన శిక్షకోసం మా ముందు ప్రవేశపెట్టడం జరుగుతుంది. ఈ ఇద్దరు సమానమవుతారా? ఆరోజు దేవుడు వారిని పిలిచి "మీ ఊహా జనితాలైన నాభాగస్వాములు ఇప్పుడు ఎటుపోయారు?" అని ప్రశ్నిస్తాడు. (61,62)

(నరక శిక్షకు సంబంధించిన) మాట ఎవరికి వర్తిస్తుందో వారిలా అంటారు: "ప్రభూ! మేము మార్గభ్రష్టులుగా చేసిన వారు వీరే. మేము (మా మనోవాంఛలకు బానిసలై) ఎలా మార్గభ్రష్టులైపోయామో అలాగే వీరిని కూడా మార్గభ్రష్టులుగా చేశాం.[5]

5. మానవులు, జిన్నులలోని దుష్టనాయకులు తమఅనుచరుల్ని గురించి దేవుని సన్నిధిలో ఇలా అంటారు. వీరిని నమ్ముకొని, దైవప్రవక్తలు చూపిన రుజుమార్గం వదలి తప్పుడు మార్గాలు



నిజానికి వీరు మమ్మల్ని ఆరాధించలేదు. (వీరు స్వయంగా తమ మనోవాంఛలకు బానిసలైపోయారు.) కనుక వారి మార్గభ్రష్టతకు మేము బాధ్యులం కామని విన్నవించు కుంటున్నాం." (63)

అప్పుడు మేము "ఇక మీరు కల్పించుకున్న సహవర్తులను (మిథ్యాదైవాలను) పిలుచుకోండి" అంటాము. వారు (తమతమ ఇష్టదేవతలను) పిలుచుకుంటారు. కాని వారికి అవి ఎలాంటి సమాధానం ఇవ్వవు. చివరికి వారు (నరక) యాతనలు చూసు కుంటారు. వారు సన్మార్గం అవలంబించిఉంటే ఎంత బాగుండేది! (64)

దేవుడు వారిని పిలిచి "మేము పంపిన ప్రవక్తలకు మీరేం సమాధానమిచ్చారు?" అని అడుగుతాడు. (ఆ సమయం కూడా వీరు గుర్తుంచుకోవాలి.) అప్పుడు వారికి ఏం సమాధానమివ్వాలో ఏమీ తోచదు. వారు ఒకర్నొకరు సంప్రదించుకోలేరు కూడా. అయితే చేసిన తప్పులకు ఈరోజు పశ్చాత్తాపం చెందుతూ, సత్యాన్ని విశ్వసించి సత్కర్మలు ఆచరించేవారు మాత్రం రేపక్కడ మోక్షం పొందేవారిలో ఉంటారు. (65-67)

నీ ప్రభువు తలచుకున్నదాన్ని సృజిస్తాడు. తాను కోరిన వ్యక్తిని (ప్రవక్తగా) ఎంచు కుంటాడు. ఈ ఎంపిక వీరు చేయవలసిన పనికాదు. వారికా అధికారం లేదు. వారు చేస్తున్న బహుదైవారాధనకు దేవుడు ఎంతో అతీతుడు, ఉన్నతుడు, పరమ పవిత్రుడు.

వారు తమ హృదయాల్లో ఏం దాచారో, బయటికి ఏం వెలిబుచ్చుతున్నారో అంతా నీ ప్రభువుకు తెలుసు. ఆయనే అల్లాహ్. ఆయన తప్ప మరో ఆరాధ్యుడు లేడు. ఇహం లోనూ, పరంలోనూ సకలవిధాల ప్రశంసలు, స్తోత్రాలు ఆయనకే శోభిస్తాయి. ఆయనకే (విశ్వ)పాలానాధికారం ఉంది. మీరంతా ఆయన దగ్గరికే మరలి పోవలసిఉంది.

ముహమ్మద్ (స)! వారిని ఇలా అడుగు: "దేవుడు ప్రళయం దాకా రాత్రిని మీపై ఆవరింపజేసి ఉంచితే, ఆయన తప్ప మరే దేవుడు మీకు పగటి వెల్తురు ఇవ్వగలడు? మీరు వినరా?" ఇంకా అడుగు: "అలాగే దేవుడు ప్రళయం దాకా మీపై పగటి వెల్తురిని శాశ్వతంగా ఉంచితే, ఆయన తప్ప మరే దేవుడు మీరు విశ్రాంతి పొందడానికి రాత్రిని తెస్తాడు? దీన్ని గురించి మీరెప్పుడైనా ఆలోచించారా?" (68-71)

(ఈ అద్భుత రేయింబవళ్ళ చక్రభ్రమణం) మీకు కన్పించడం లేదా? మీరు విశ్రాంతి పొందడానికి, మీ ప్రభువు అనుగ్రహం అన్వేషించడానికి ఆయన మీకోసం రాత్రింబవళ్ళను సృష్టించాడు, మీరు కృతజ్ఞత చూపుతారేమోనని. ఇదంతా ఆయన అనుగ్రహమే. (72,73)

అవలంబించడంవల్ల పరలోకంలో వాటి దుష్పర్యవసానాన్ని చవిచూడవలసి వస్తుందని ఈసూక్తిలో దేవుడు హెచ్చరిస్తున్నాడు. అలాంటి దుష్టనాయకులకు విధేయులయి వారి అడుగుజాడల్లో నడచు కోవడం కూడా ఆరాధన క్రిందికే వస్తుంది. అయితే ఈ ఆరాధన నరకానికి గొనిపోయే ఘోరమైన పాపం. దైవప్రవక్తలు దేవుని ఆజ్ఞలను మాత్రమే ఆచరిస్తూ, వాటిని ప్రజలకు బోధిస్తారు గనక వారికి విధేయులయి వారి అడుగుజాడల్లో నడచుకోవడం వారిని ఆరాధించడం క్రిందికి రాదు.

దేవుడు వారిని పిలిచి మీ ఊహాజనితాలయిన నా భాగస్వాములు ఏమయ్యారు? అని అడిగే రోజు (గురించి గుర్తుంచుకోవాలి.) మేము ప్రతి అనుచర సముదాయం నుండి ఒక సాక్షిని తెచ్చి “మీ (మిధ్యాదైవారాధనకు) ప్రమాణాలేమిటో తీసుకురండి” అని వారిని నిలదీస్తాము. అప్పుడు వారికి తెలిసొస్తుంది సత్యం దేవుని వైపున్నదని. వారి అసత్యాలు, అభూతకల్పనలన్నీ కనుమరుగైపోతాయి. (74,75)

ఖారూన్ అనేవాడు మూసాజాతికి చెందిన వ్యక్తి. అయితే అతను తన జాతికి వ్యతిరేకంగా వ్యవహరిస్తూ విద్రోహిగా మారాడు. మేమతనికి అపార సిరిసంపదలు, నిక్షేపాలు ప్రసాదించాము. వాటికి సంబంధించిన తాళపు చెవుల్ని బలిష్ఠులైన కొందరు వ్యక్తుల సమూహం అతికష్టం మీద పైకెత్త గలుగుతుంది.

ఓసారి అతని జాతిప్రజలు అతనికిలా హితోపదేశం చేశారు: “మిడిసిపడకు. మిడిసి పడేవారిని దేవుడు ప్రేమించడు. దేవుడు నీకు ప్రసాదించిన ఐశ్వర్యంతో పరలోకగృహం నిర్మించుకోవడానికి ప్రయత్నించు. ప్రపంచం నుండి కూడా నీ భాగాన్ని (పరలోకానికి తీసికెళ్ళడం) మరచిపోకు. దేవుడు నీకు మేలు చేసినట్లు నీవు కూడా (ప్రజలకు) మేలు చెయ్యి. ధరణిలో కలహాలు, సృష్టించకు. దేవుడు కలహకారుల్ని ప్రేమించడు.” (76,77)

ఈ మాటలు విని అతడు (మరింత నీల్గుతూ) “ఇదంతా నాకు నాజ్ఞానం, తెలివి తేటలవల్ల లభించింది” అన్నాడు. దేవుడు పూర్వం ఇతనికంటే ఎక్కువ శక్తిసామర్థ్యాలు, మందీమార్బలం కలవారిని నాశనం చేశాడు. ఈ సంగతి అతనికి తెలియదా? పాపాత్ము లను వారి పాపాలను గురించి అడగటం జరగదు (నిజాన్ని ఒప్పుకోరు గనక). (78)

ఓరోజు అతను పూర్తి ఠీవి, దర్పాలతో తన జాతి ప్రజల ముందుకు వచ్చాడు. అప్పుడు ప్రాపంచిక వ్యామోహపరులు కొందరు అతడ్ని చూసి “ఖారూన్‌కు లభించిన సిరిసంపదలు మనకూ లభించివుంటే బావుండు! ఖారూన్ ఎంతో అదృష్టవంతుడు” అన్నారు. అయితే (దైవిక)జ్ఞానం కలవారు (వారి ఆలోచనాధోరణిని విమర్శిస్తూ) “మీ వైఖరి చాలా విచారకరం. విశ్వసించి సత్కార్యాలు చేసేవారికి దేవుని (దగ్గరున్న) ప్రతి ఫలం ఎంతో శ్రేష్ఠమైనది. సహనం వహించేవారికే ఈమహాభాగ్యం లభిస్తుంది” అన్నారు.

చివరికి మేము ఖారూన్‌ని, అతని ఇంటిని (హఠాత్తుగా) భూమిలోకి దిగబడి పోయేలా చేశాము. అప్పుడు దేవునికి వ్యతిరేకంగా అతడ్ని ఆదుకునే వారెవరూ లేక పోయారు. అతను కూడా తననుతాను కాపాడుకోలేక పోయాడు. (79-81)

నిన్నటిరోజు అతని హోదాఅంతస్తులు చూసి అలాంటివి తమకు కూడా కావాలని కోరుకున్నవారు ఇప్పుడు విచారం వెలిబుచ్చుతూ ఇలా అన్నారు: “మనం ఒక విషయం మరచిపోయాం. దేవుడు ఎవరికి పుష్కలంగా ఉపాధి ఇవ్వదలచుకుంటాడో వారికి మాత్రమే పుష్కలంగా లభిస్తుంది. ఆయన మరెవరికి పరిమితంగా ఉపాధి ఇవ్వాలని భావిస్తాడో వారికి పరిమితంగానే లభిస్తుంది. దేవుడు మనల్ని అనుగ్రహించి ఉండకపోతే ఆయన మనల్ని కూడా భూమిలోకి అణగద్రొక్కేవాడు. అయ్యో! అవిశ్వాసులు సాఫల్యం చెందరన్న సంగతి (అప్పుడు) మనకు కొంచెం కూడా గుర్తుకు రాలేదే!” (82)



ప్రపంచంలో అధికులు కావాలనుకొని కల్లోలం రేకెత్తించగోరని వారికి మాత్రమే మేము పరలోక (స్వర్గ)ధామం కేటాయిస్తాం. దైవభీతిపరులు ఎంతో మంచి పర్యవ సానం అనుభవిస్తారు. మంచితనం తీసుకొచ్చేవారికి అంతకంటే ఎక్కువమంచి జరుగు తుంది. చెడు తెచ్చేవారికి వారు చేసిన చెడుపనుల మేరకే ప్రతిఫలం లభిస్తుంది.

ప్రవక్తా! నీపై ఈ ఖుర్‌ఆన్‌ని అవతరింపజేసిన దేవుడు నిన్ను తప్పకుండా అత్యంత శ్రేష్ఠమైన స్థానానికి చేర్చుతాడు. “ఎవరు సన్మార్గగామి అయివచ్చాడో, ఎవరు స్పష్టమైన దుర్మార్గంలో పడివున్నాడో నాప్రభువుకు బాగా తెలుసు” అని వారికి చెప్పు. (83-85)

నీపై (దైవ) గ్రంథం అవతరిస్తుందని నీవు ఏనాడూ ఆశించి ఉండలేదు. ఇది నీ ప్రభువు అనుగ్రహం మాత్రమే. కనుక నీవు సత్యతిరస్కారులకు సహాయకునిగా మారకు. నీపై దేవుని సూక్తులు అవతరించినప్పుడు సత్యతిరస్కారులు నిన్ను వాటికి దూరంగా ఉంచడమన్నది ఎన్నటికీ సంభవించకూడదు సుమా! నీవు (ప్రజలను) నీ ప్రభువు (సందేశం) వైపు పిలుస్తూ ఉండు. అంతేగాని, బహుదైవారాధకుల్లో చేరిపోకు. అల్లాహ్ తప్పమరే దైవాన్నీ ప్రార్థించకు. ఆయన తప్పమరే ఆరాధ్యదైవం లేడు. అల్లాహ్ అస్తిత్వం తప్ప ప్రతివస్తువూ నశించిపోయేదే. ఆయనకే (ప్రతిచోటా) పాలనాధికారం ఉంది. మీరంతా (మరణానంతరం) ఆయన సన్నిధికే మరలిపోవలసి ఉంది. (86-88) ✪

# 29. సాలెపురుగు (అన్కబూత్)

**అవతరణ: మక్కా** **సూక్తులు: 69**

ఈ అధ్యాయాన్ని “అన్కబూత్” (సాలెపురుగు) అంటారు. ఇది హిజ్రీ శకారంభానికి రెండు మూడేళ్ళ క్రితం మక్కాలో అవతరించింది. ఇందులో సత్యతిరస్కారం వల్ల ఎదు రయ్యే దుష్పరిణామాలను గురించి అవిశ్వాసుల్ని హెచ్చరిస్తూ, దేవుని ఏకత్వం, పరలోక భావనల గురించి హేతుబద్ధంగా వారికి బోధించడం జరిగింది.

## కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

అలిఫ్-లామ్-మీమ్. ప్రజలు కేవలం తాము విశ్వసించాం అని పలికినంత మాత్రాన తమను వదలిపెట్టడం జరుగుతుందని భావిస్తున్నారా? తమను అసలు పరీక్షించడం జరగదని తలుస్తున్నారా? వారికి పూర్వం గతించినవారిని కూడా మేము పరీక్షించాము. (మీలో) నిజాయితీపరులెవరో, మోసగాళ్ళెవరో దేవుడు తప్పకుండా పరీక్షించవలసి ఉంది.[1] (1-3)

1. విశ్వాసుల్ని దేవుడు తప్పకుండా విశ్వాసపరీక్ష పెడతాడని ఈసూక్తి తెలియజేస్తోంది. పరీక్ష ఎదురైనప్పుడే నిజమైన విశ్వాసి ఎవరో, కపటవిశ్వాసి ఎవరో, మాటలవిశ్వాసి ఎవరో, చేతలవిశ్వాసి ఎవరో తెలుస్తుంది. (పరీక్ష గురించి 2:155-157,214; 3:142; 47:31 సూక్తులు చూడండి.)

మక్కాలో ముస్లింలకు, ఇస్లామీయ ఉద్యమానికి అవిశ్వాసుల నుండి తీవ్రమైన ప్రతిఘటన ఎదురయింది. అవిశ్వాసులు ముస్లింలను అనేక విధాలుగా వేధిస్తూ వారి జీవితాలను దుర్భరం చేశారు. ఈ పరిస్థితిని గురించి ప్రస్తావిస్తూ హజ్రత్ ఖబ్బాబ్ బిన్ అరత్ (రజి) ఇలా అన్నారు:

దుష్టచర్యలకు పాల్పడుతున్నవారు మా అదుపు నుండి పారిపోగలమని భావిస్తున్నారా? అదంతా వారి (భ్రమ,) తప్పుడు ఆలోచన మాత్రమే. (4)

దేవుడ్ని కలుసుకోగలనని ఆశిస్తున్నవాడు ఆయన నిర్ణయించిన (పరలోక తీర్పు) సమయం అతి సమీపంలోనే ఉందని తెలుసుకోవాలి. దేవుడు సమస్తవిషయాలు వింటున్నాడు. ఆయన సర్వం ఎరిగినవాడు. ఎవరైనా పాటుపడుతున్నాడంటే అతను తన శ్రేయస్సు కోసమే పాటుపడుతున్నాడు. దేవునికి లోకులతో పనేలేదు. ఆయన నిరపేక్షాపరుడు. సత్యాన్ని విశ్వసించి సత్కార్యాలు చేసేవారి నుండి వారి చెడులను మేము తొలిగిస్తాం. వారు ఆచరించిన సత్కర్మలకు మేము వారికి మంచి ప్రతిఫలం ప్రసాదిస్తాం. (5-7)

తల్లిదండ్రులకు సేవచేయాలని, వారిపట్ల సద్భావంతో మెలగాలని మేము మానవునికి ఉపదేశించాం. అయితే "వారొకవేళ నీకు తెలియని మరొక దైవాన్ని నాకు సాటి కల్పించమని వత్తిడితెస్తే మాత్రం వారికి విధేయత చూపకు. మీరంతా చివరికి నా దగ్గరకే తిరిగిరావలసి ఉంది. అప్పుడు నేను మీరు (ప్రపంచంలో ఉండగా) ఏమేమి చేస్తుండేవారో మీకు తెలియజేస్తాను" అని కూడా మేమతనికి బోధించాం. సత్యాన్ని విశ్వసించి సదాచార సంపన్నులైనవారిని మేము తప్పకుండా సజ్జనులుగా పరిగణిస్తాం. (8,9)

కొందరు తాము దేవుడ్ని విశ్వసించాం అంటారు. కాని (ఎప్పుడైనా) దేవుని విషయంలో హింసించబడితే, లోకులు పెట్టిన ఆబాధల్ని వారు దేవుడు విధించిన శిక్షగా భావిస్తారు. అయితే నీ ప్రభువు నుండి విజయం, సహాయం లభిస్తే మాత్రం వారు (నీ దగ్గరకు వచ్చి) "మేము మీతోపాటే ఉన్నాం" అనంటారు. ప్రజలలో ఇలాంటివారు కూడా ఉన్నారు. ప్రపంచవాసుల హృదయాల్లో ఏముందో దేవునికి తెలియదనుకుంటున్నారా వీరు? నిజమైన విశ్వాసులెవరో, కపటవిశ్వాసులెవరో దేవుడు తప్పకుండా పరీక్షించవలసి ఉంది. (10,11)

సత్యాన్ని నిరాకరించినవారు విశ్వసించినవారితో "మీరు మా (మత)విధానం అనుస రించండి, మేము మీ పాపభారం మోస్తాం" అంటారు. కాని వారు విశ్వాసుల పాపాన్ని ఎంత మాత్రం నెత్తిమీద వేసుకోరు. వారు పచ్చి అబద్ధాలరాయుళ్ళు. అయితే వారు తమ పాపాలతో పాటు ఇతరుల పాపభారం కూడా తప్పకుండా మోస్తారు.

---

మేము బహుదైవారాధకుల వేధింపులతో విసిగిపోయాం. ఆకాలంలో ఓరోజు నేను దైవ ప్రవక్త (సల్లం)ను కాబాగోడ నీడన కూర్చొని ఉండటం చూసి, ఆయన దగ్గరికెళ్ళి "దైవప్రవక్తా! మా కోసం దైవాన్ని ప్రార్థించరూ?" అని విన్నవించాను. ఈ మాట వినగానే ఆయన ముఖం కోపంతో జేవురించింది. ఆయన ఇలా అన్నారు: "మీకు పూర్వం ఉండిన విశ్వాసులపై మీకంటే ఘోరమైన కష్టాలు వచ్చిపడ్డాయి. వారిలో ఒకడ్ని నేలపై గుంటత్రవ్వి అందులో కూర్చోబెట్టి అతని తల మీద రంపంబెట్టి చీల్చివేయడం జరిగింది. మరొకడ్ని ఇస్లాం నుండి మరల్చడానికి అతని కీళ్ళలోకి ఇనుప దువ్వెనలు గుచ్చి లాగేశారు. దైవసాక్షి! ఈపని ఎట్టి పరిస్థితిలోనూ నెరవేరుతుంది. చివరికి ఒక వ్యక్తి ఒంటరిగా సనా నుండి హజ్రెమౌత్ (ప్రాంతం) వరకు నిర్భయంగా ప్రయాణం చేస్తాడు. అప్పుడతనికి దైవభయం తప్ప మరేభయము ఉండదు." (బుఖారి, అబూదావూద్)



ప్రళయదినాన వారి అభూత కల్పనలను గురించి వారిని తప్పకుండా నిలదీయడం జరుగుతుంది. (12,13)

మేము నూహ్‌ను (ప్రవక్తగా నియమించి) అతని జాతి ప్రజల దగ్గరకు పంపాము. అతను వారి మధ్య యాభై తక్కువ వేయి సంవత్సరాలు[2] గడిపాడు. చివరికి వారు దుర్మార్గంలో పడివున్న స్థితిలో వారిపైకి (భయంకరమైన) తుఫాను వచ్చిపడింది. ఆ తర్వాత మేము నూహ్‌ని, (అతనితోపాటు) ఓడలో ఎక్కినవారిని రక్షించాం. దీన్ని మేము ప్రపంచ మానవులకు ఒక సూచనగా, గుణపాఠంగా చేసి ఉంచాము. (14,15)

---

2. "అతను వారి మధ్య యాభై తక్కువ వేయి సంవత్సరాలు గడిపాడు" అంటే నూహ్ (అలైహి) దైవప్రవక్త అయిన నాటినుండి తుఫాన్ సంఘటన సంభవించే వరకు తన జాతిప్రజల మధ్య 950 సంవత్సరాలు గడిపారని ధర్మవేత్తలు వ్యాఖ్యానించారు. దీన్నిబట్టి నూహ్ (అలైహి) వయస్సు వేయి సంవత్సరాలకు పైనే ఉండవచ్చని తెలుస్తోంది. అంతేకాదు, అతిప్రాచీన యుగంలో మానవులు వేల సంవత్సరాలు జీవించినట్లు కూడా తెలుస్తోంది. ఇబ్నె జౌజీ (రహ్మాలై), వహబ్ బిన్ మునబ్బా (రహ్మా) గార్ల ఉల్లేఖనాలు కూడా ఈ విషయాన్ని ధృవపరుస్తున్నాయి. (మౌలానా అహ్మద్ సయీద్ గారి "మౌత్‌కా ఝట్కా" అనే గ్రంథంలో 320, 321 పేజీలు చూడండి.)

ఇబ్నె జౌజీ (రహ్మాలై) ఉల్లేఖనం ప్రకారం ఈసా ప్రవక్త (అలైహి) తన అనుచరుల కోరికపై దైవాన్ని ప్రార్థించగా ఒక కపాలం ఇలా అంటుంది: "ఒకప్పుడు నేనీ ప్రాంతం చక్రవర్తిని. వెయ్యేండ్లు జీవించాను; వేయిమంది సంతానం కన్నాను; వేయి పట్టణాలు జయించాను; వేయి సైన్యాలను ఓడించాను; వేయిమంది రాజుల్ని చంపాను. చివరికి ఈ విజేత మృత్యు కుహరంలోకి వెళ్ళాడు...."

వహబ్ బిన్ మునబ్బా (రహ్మా) ఉల్లేఖనం ప్రకారం ఈసాప్రవక్త (అలైహి) తన అనుచరుల కోరికపై నూహ్‌ప్రవక్త (అలైహి) కుమారుడు సామ్ ఖననమై ఉన్న సమాధి దగ్గర నిలబడి "దేవుని ఆజ్ఞతో సజీవి అయి, లే" అన్నారు. సామ్ లేచి ఈసా (అలైహి) ప్రశ్నకు సమాధానమిస్తూ "నేను నాలుగు వేల సంవత్సరాలు జీవించాను...." అని అన్నాడు.

ఈ రెండు ఉల్లేఖనాలను బట్టి ప్రాచీన మానవులు దీర్ఘాయుష్కులని తెలుస్తోంది. ఈనాడు "హ్యూమన్ జెనోమ్ ప్రాజెక్ట్"లో 97% విజయం సాధించిన శాస్త్రవేత్తలు, ఈ ప్రాజెక్టు పూర్తయితే ప్రాణాంతక వ్యాధులకు కారణాలు తెలుసుకొని వాటికి చికిత్సచేయడం సులభమవుతుందని, దాంతోపాటు మనుషుల ఆయుష్షును కూడా 1200 సంవత్సరాల వరకు పెంచవచ్చని తెలియజేశారు. (27-6-2000 తేదీ దినపత్రికలన్నీ ఈ వార్తను పతాక శీర్షికలతో ప్రకటించాయి.)

అయితే మనిషి 1200 సంవత్సరాలు జీవించినా ఓరోజు మరణించక తప్పదు. ఆరోజు నుంచే అతని అసలు జీవితం, శాశ్వత జీవితం ప్రారంభమవుతుంది. అలాంటి శాశ్వత జీవితాన్ని సుఖమయం చేసుకోవడానికి పాటుపడటంలోనే అతని విజ్ఞత ఉంది; పారలౌకిక దృష్టితో కూడిన విజ్ఞత! అది లోపిస్తే శాశ్వత జీవితం నరకప్రాయమవుతుంది. ఆ నరకప్రాయ జీవితం ముందు 1200 సంవత్సరాల ప్రాపంచిక భోగభాగ్యాల జీవితం సైతం మూడు ఘడియల ముచ్చటగా కూడా మనిషి స్మృతిలో మిగలదు. (వివరాలకు 79:46 సూక్తి, దాని పాదసూచిక చూడండి.)

"వారిలో ప్రతి ఒక్కడూ వెయ్యేండ్ల పాటు జీవించి ఉండాలని కోరుకుంటాడు. అంతటి దీర్ఘాయుష్షువు పొందినా అది వారికి (పరలోక) శిక్ష నుండి తప్పించలేదు. వారు చేస్తున్న పనులేమిటో దేవుడు గమనిస్తూనే ఉన్నాడు." (దివ్య ఖుర్‌ఆన్- 2:96)

ఇబ్రాహీంని (అతనిజాతి దగ్గరకు) పంపాము. అప్పుడతను తనజాతికి హితోపదేశం చేస్తూ ఇలా అన్నాడు: "మీరు దేవుడ్ని మాత్రమే ఆరాధించండి. ఆయనకే భయపడండి. మీరు విషయం తెలుసుకుంటే ఇందులోనే మీ శ్రేయస్సు ఉంది. మీరు దేవుడ్ని వదలి పూజిస్తున్న వస్తువులు విగ్రహాలు మాత్రమే. (ఈవిధంగా) మీరు ఒక అసత్యాన్ని కల్పించుకున్నారు.

వాస్తవానికి దేవుడ్ని వదలి మీరు పూజిస్తున్న ఈ విగ్రహాలు మీకు ఎలాంటి ఉపాధి ఇవ్వలేవు. కనుక మీరు దేవుని సన్నిధిలో ఉపాధిని గురించి అర్థించండి. ఆయన్నే ఆరాధించండి, ఆయనకే కృతజ్ఞతలు తెలుపుకోండి. చివరికి మీరు ఆయన సన్నిధికే మరలి పోవలసి ఉంది. మీరు నామాటలు తిరస్కరిస్తే (నాకొచ్చే నష్టమేమీ లేదు.) మీకు పూర్వం కూడా అనేక జాతులు తిరస్కరించాయి. (దైవ)సందేశాన్ని స్పష్టంగా అంద జేయడం తప్ప దైవప్రవక్తపై మరెలాంటి బాధ్యత లేదు." (16-18)

దేవుడు జీవరాసుల్ని మొదటిసారి ఎలా సృజిస్తున్నాడో, తరువాత వాటిని ఎలా పునరుత్పత్తి చేస్తున్నాడో వీరు గమనించడం లేదా? ఇలా చేయడం దేవునికి చాలా సులభం. వారికిలా చెప్పు: "ప్రపంచంలో తిరిగి చూడండి, ఆయన ప్రాణికోటిని మొదటి సారి ఎలా సృజించాడో అలాగే మళ్ళీ ఆయన వాటినుండి జీవరాసుల్ని పుట్టిస్తున్నాడు. ఆయన ప్రతిపనీ చేయగల సమర్థుడు, సర్వశక్తిమంతుడు. (19,20)

ఆయన తాను తలచిన విధంగా కొందర్ని శిక్షిస్తాడు; కొందర్ని కరుణిస్తాడు. చివరికి మీరంతా ఆయన వద్దకే పోవలసి ఉంది. ఆయన పట్టునుండి భూమండలం లోనూ తప్పించుకోలేరు, ఆకాశంలోనూ తప్పించుకోలేరు. మిమ్మల్ని కాపాడే ఏ సహాయకుడూ, సంరక్షకుడూ ఉండడు. దేవుని సూక్తుల్ని, ఆయన దర్శనభాగ్యాన్ని నిరాకరించినవారు నా కారుణ్యకటాక్షాల పట్ల నిరాశచెందారు. వారికోసం వ్యధాభరిత మైన శిక్ష కాచుకొని ఉంది. (21-23)

ఆతర్వాత వారు, ఇతడ్ని (అంటే ఇబ్రాహీంని) చంపండి లేక కాల్చివేయండన్నారు. అంతకుమించి వారి దగ్గర ఎలాంటి సమాధానం లేకపోయింది. చివరికి దేవుడు అతడ్ని అగ్ని నుండి రక్షించాడు. విశ్వసించినవారికి ఈ సంఘటనలో గొప్ప సూచన ఉంది.

అతను వారితో ఇలా అన్నాడు: "మీరు ఇహలోక జీవితంలో దేవుడ్ని వదలి విగ్రహాలను మీమధ్య పరస్పరం ప్రేమాభిమానాలు జనింపజేసే సాధనాలుగా చేసు కున్నారు. కాని పునరుత్థాన దినాన మీరు ఒకర్నొకరు ఖండించుకుంటూ దూషించు కుంటారు. నరకాగ్నే మీకు నివాసమవుతుంది. అక్కడ మీకు సహాయం చేసేవాడే లభించడు." (24,25)

అప్పుడు లూత్ అతడ్ని విశ్వసించాడు. "నేను నా ప్రభువు (ప్రసన్నత) వైపు వలస పోతున్నాను. ఆయన ఎంతో శక్తిసంపన్నుడు, వివేకవంతుడు" అన్నాడు ఇబ్రాహీం. అతనికి మేము ఇస్‌హాఖ్ (కొడుకు)ని, యాఖూబ్ (మనవడి)ని ప్రసాదించాము. అతని



సంతతిలో దైవదౌత్యం, (దివ్య)గ్రంథం నెలకొల్పాం. మేమతనికి ప్రపంచంలో ప్రతిఫలం ప్రసాదించాం. పరలోకంలో అతను తప్పకుండా సజ్జనుల్లో చేరివుంటాడు. (26.27)

మేము లూత్‌ని (ప్రవక్తగా) పంపాము. అతను తన జాతివారికి హితవు చేస్తూ ఇలా అన్నాడు:"మీరెంత అశ్లీలానికి పాల్పడుతున్నారు! మీకు పూర్వం లోకంలో ఎవరూ ఇలాంటి పని చేయలేదే!! మీరు (స్త్రీలను వదలి) పురుషుల వెంట పడ్డారా? దారి దోపిడీలు (కూడా) చేస్తున్నారు. నిండుసభల్లో సైతం (ఈ) పాడుపని చేస్తున్నారే!"

దానికి వారు "నీవు చెప్పేది నిజమైతే (మా మీదికి) దైవశిక్ష తీసుకురా" అన్నారు. అంతకుమించి వారిదగ్గర ఎలాంటి సమాధానంలేదు. అప్పుడు లూత్ దేవుడ్ని వేడు కుంటూ "ప్రభూ! ఈ దుర్మార్గులకు వ్యతిరేకంగా నాకు సహాయం చెయ్యి" అన్నాడు.

మా దూతలు (ఓ రోజు) ఇబ్రాహీం దగ్గరకు ఒక శుభవార్త తీసుకొని వెళ్ళారు. ఆ సందర్భంలో వారు "మేమా పట్టణాన్ని నాశనం చేయబోతున్నాం. ఆ పట్టణవాసులు పరమ దుర్మార్గులయి పోయారు" అని తెలిపారతనికి. (28-31)

ఇబ్రాహీం ఈమాట విని "అక్కడ లూత్ ఉన్నాడు కదా?" అన్నాడు. దానికి వారు "అక్కడ ఎవరెవరున్నారో మాకు బాగా తెలుసు. మేము లూత్‌భార్యను తప్ప అతడ్ని, అతని కుటుంబాన్ని రక్షిస్తాం. ఆ స్త్రీ వెనుకుండిపోయేవారిలో ఉండిపోతుంది" అన్నారు.

ఆ తర్వాత మాదూతలు లూత్ దగ్గరకు చేరుకున్నారు. వారిని చూసి అతను తీవ్ర ఆందోళనచెందాడు. అతని హృదయం కుంచించుకుపోయింది. వారతని పరిస్థితి గమ నించి "భయపడకు, విచారించకు. మేము నిన్ను, నీ కుటుంబ సభ్యుల్ని రక్షిస్తాం, నీ భార్యను తప్ప. ఆమె వెనుకుండిపోయేవారిలో ఉండిపోతుంది. ఈ పట్టణవాసులు చేస్తున్న పాడుపనికి మేము వీరిపై ఆకాశం నుండి శిక్ష దించబోతున్నాం" అని చెప్పారు.

మేమా పట్టణాన్ని (సమూలంగా తుడిచిపెట్టి) బుద్ధిజ్ఞానం కలవారి కోసం స్పష్టమైన సూచన (గుణపాఠం)గా చేసి వదలిపెట్టాము. (32-35)

మద్యన్‌జాతి ప్రజల దగ్గరికి వారి సోదరుడు షుఐబ్‌ని పంపాము. అతను వారికి హితోపదేశం చేస్తూ "నాజాతి ప్రజలారా! దేవుడ్ని (మాత్రమే) ఆరాధించండి. అంతిమ దినం గురించి భయపడండి. ప్రపంచంలో దుర్మార్గులైపోయి అన్యాయాలు, అక్రమాలు చేస్తూ తిరగకండి" అన్నాడు. కాని వారు షుఐబ్‌ని తిరస్కరించారు. చివరికి తీవ్రమైన భూకంపం వారిని మట్టుబెట్టింది. వారు తమ ఇండ్లలో బోర్లా పడిపోయారు. (36,37)

మేము ఆద్, సమూద్ జాతుల్ని కూడా తుడిచిపెట్టాము. వారు నివసించిన ప్రాంతాలను మీరు చూసే ఉన్నారు. షైతాన్ వారి చేష్టల్ని వారికి మనోహరమైనవిగా చేసి, వారిని సన్మార్గంలోకి రాకుండా అడ్డుకున్నాడు. బుద్ధి, జ్ఞానాలు కలిగివుండి కూడా వారు షైతాన్ వలలో పడిపోయారు. (38)

మేము ఖారూన్, ఫిరౌన్, హామాన్‌లను కూడా హతమార్చాము. వారి దగ్గరకు మూసా నిదర్శనాలు తీసుకొని వెళ్ళాడు. కాని వారు (మా పట్టునుండి) తప్పించుకోలేని

వారైనప్పటికీ ప్రపంచంలో తమ హోదా, అంతస్తులు చూసుకొని మిడిసిపడ్డారు. వారు చేసిన పాపాలకు (శిక్షగా) మేము వారిలో ప్రతి ఒక్కడ్నీ పట్టుకున్నాం. వారిలో కొందరిపై మేము రాళ్ళవర్షం కురిపించే గాలిని పంపాము. కొందరిని భయంకరమైన విస్ఫోటం మట్టుబెట్టింది. కొందరిని మేము భూమిలోకి అణగద్రొక్కాము. మరికొందరిని (నీటిలో) ముంచివేశాము. దేవుడు వారికి ఏమాత్రం అన్యాయం చేయలేదు. స్వయంగా వారే (ఆత్మవంచనకు పాల్పడి) తమకు తాము అన్యాయం చేసుకున్నారు. (39,40)

దేవుడ్ని వదలి ఇతరుల్ని సంరక్షకులుగా చేసుకున్నవాడ్ని సాలీడుతో పోల్చవచ్చు. సాలీడు తనకోసం ఇల్లు కట్టుకుంటుంది. అందరి ఇండ్లకన్నా సాలీడుఇల్లే అత్యంత బలహీనమైనది. (ఇలాంటి దృష్టాంతాలద్వారా) వీరు (విషయం) గ్రహిస్తే బాగుండు.

వారు (నిజ)దేవుడ్ని వదలి ఏ మిథ్యాదైవాలను వేడుకుంటున్నారో వాటిని గురించి దేవునికి బాగా తెలుసు. ఆయన సర్వ శక్తిమంతుడు, ఎంతో వివేకవంతుడు. ప్రజలకు విషయం బోధపరచడానికి మేమీ దృష్టాంతాలు ఇస్తున్నాము. అయితే జ్ఞానం కలవారే వాటిని అర్థంచేసుకుంటారు. దేవుడు భూమ్యాకాశాల్ని సత్యం ప్రాతిపదికపై సృష్టించాడు. విశ్వాసుల కోసం ఇందులో గొప్ప సూచన ఉంది. (41-44)

ప్రవక్తా! నీ వద్దకు పంపబడిన గ్రంథం పఠిస్తూఉండు. నమాజ్ నెలకొల్పు. నిస్సందేహంగా నమాజ్ (మనిషిని) చెడులు, అశ్లీలచేష్టల జోలికిపోకుండా నిరోధిస్తుంది.[3] దేవుని స్మరణ ఎంతో గొప్పవిషయం. మీరు చేస్తున్నదంతా దేవునికి తెలుసు. (45)

గ్రంథప్రజలలో దుర్మార్గులు కానివారితో ఉత్తమరీతిలో వాదించండి. వారితో ఇలా అనండి: "మేము మా దగ్గరకు పంపబడిన దానిని (ఖుర్‌ఆన్‌ని), మీ దగ్గరకు పంపబడిన దానిని (తౌరాత్, ఇన్జీల్‌లను) విశ్వసిస్తున్నాం. మా దేవుడు, మీ దేవుడు ఒక్కడే. మేము ఆయనకే విధేయులయి (ముస్లిములయి) పోయాము." (46)

పవక్తా! అలాగే మేము నీ దగ్గరక్కూడా గ్రంథం అవతరింపజేశాము. అంచేత లోగడ గ్రంథం ఇవ్వబడినవారు దీన్ని విశ్వసిస్తున్నారు. వీరిలో (అరబ్బుల్లో) కూడా అనేకమంది దీన్ని విశ్వసిస్తున్నారు. అవిశ్వాసులు మాత్రమే మాసూక్తులు నిరాకరిస్తారు. నీవు గతంలో ఏగ్రంథాన్ని చదవలేదు. నీ చేతులతో వ్రాయనూ లేదు. అలా జరిగివుంటే

---

3. ఒక వ్యక్తి నమాజు చేసేవాడైనప్పటికీ చెడ్డ పనులకు పాల్పడుతున్నాడంటే అతను ఖుర్‌ఆన్‌లోని దైవాజ్ఞలను నిర్లక్ష్యం చేస్తున్నాడన్నమాట. లేదా ఖుర్‌ఆన్, హదీసుల పట్ల సరైన అవగాహన లేకుండా దేవుని దయాగుణం పట్ల నిరాధారమైన ఆశలు కల్పించుకున్నాడన్నమాట. ఈసూక్తి విషయంలో దైవప్రవక్త (స) ఇలా చెప్పారు: "ఒక వ్యక్తిని అతని నమాజ్ చెడ్డపనుల నుండి, అశ్లీలచేష్టల నుండి వారించకపోతే అతని నమాజ్ నమాజే కాదు." (ఇబ్నె అబీహాతిం)

ఇమామ్ జాఫర్ సాదిఖ్ ఈ విషయంపై వ్యాఖ్యానిస్తూ "ఎవరైనా తన నమాజ్ స్వీకరించబడిందా లేదా అని తెలుసుకోదలిస్తే, అతను తన నమాజ్ తనను ఏ మేరకు చెడుపనులు, అశ్లీలచేష్టల జోలికి పోనీకుండా నిరోధించిందో పరిశీలించుకోవాలి. నమాజ్ వల్ల అతను చెడుపనుల జోలికి పోకుండా నీతిగా ఉన్నాడంటే అతని నమాజ్ స్వీకరించబడినట్లే." (రూహుల్ మాని)



ఈ మిథ్యావాదులు నిన్ను శంకించేవారు. ఇవి జ్ఞానం ఇవ్వబడినవారి హృదయాల్లో చోటు చేసుకునే తేజోవంతమైన సూక్తులు. దుర్మార్గులు తప్ప మరెవరూ మా సూక్తులు నిరాకరించరు. (47-49)

వారు (నీ గురించి) "అతని దగ్గరకు అతని ప్రభువు నుండి నిదర్శనాలు ఎందుకు రాలేదు?" అని ప్రశ్నిస్తారు. "నిదర్శనాలు దేవుని దగ్గర చాలా ఉన్నాయి. నేను (విషయాన్ని) స్పష్టంగా తెలియజేసి హెచ్చరించేవాడ్ని మాత్రమే" అని చెప్పు. (50)

మేము నీ (హృదయం)లో గ్రంథం అవతరింపజేశాము. దాన్ని నీవు పఠించి (ప్రజలకు) విన్పిస్తున్నావు. ఇదొక్క నిదర్శనం చాలదా వారికి? ఈగ్రంథంలో విశ్వసించే వారి కోసం (దైవ)కారుణ్యం, హితోపదేశం ఉన్నాయి. వారికిలా చెప్పు: "మీకూ, నాకూ మధ్య సాక్షిగా దేవుడే చాలు. ఆయన భూమ్యాకాశాల్లో ఉన్న సమస్త విషయాలు ఎరిగినవాడు. దేవుడ్ని తిరస్కరించే మిథ్యవాదులే నష్టపోయేవారు." (51,52)

వారు శిక్ష కోసం తొందరపడ్తున్నారు. దీనికి ఒక సమయమంటూ ముందే నిర్ణయించకపోయివుంటే వారిపై శిక్ష ఎప్పుడో వచ్చిపడేది. అది తప్పకుండా (దాని నిర్ణీత సమయానికి) వారికి తెలియకుండానే హఠాత్తుగా విరుచుకుపడుతుంది. వారు శిక్ష కోసం తొందరపడ్తున్నారుగాని, నరకం (ఈ)అవిశ్వాసులకు (ఇప్పటికే) చుట్టుముట్టి ఉంది. వారిని (నరక)శిక్ష వారి పైనుండి, వారికాళ్ళ క్రిందినుండి వచ్చి కమ్ముకునే రోజు (వారికి తెలుస్తుంది). అప్పుడు దేవుడు వారితో "ఇక మీరు చేసుకున్న కర్మలు చవి చూడండి" అంటాడు. (53-55)

విశ్వసించిన నా దాసులారా! నాభూమి ఎంతో విశాలంగా ఉంది. (ఇక్కడ కష్టంగా ఉంటే మీరు వేరేచోటికి వలసపోవచ్చు. మీరు (ఎట్టి పరిస్థితిలోనూ) నన్నే ఆరాధించండి. ప్రతిప్రాణీ చావును చవిచూడవలసిందే. మీరంతా మా దగ్గరికే తిరిగిరావలసి ఉంది.

విశ్వసించి సత్కార్యాలు చేసినవారిని మేము స్వర్గంలో అత్యున్నతమైన భవనాలలో ఉంచుతాం. వాటి క్రింద సెలయేరులు కూడా ప్రవహిస్తూ ఉంటాయి. వారక్కడ శాశ్వతంగా ఉంటారు. సదాచార సంపన్నులకు లభిస్తున్న ఈ ప్రతిఫలం ఎంత మంచి ప్రతిఫలం! వారు సహనం వహించి తమ ప్రభువునే నమ్ముకొని ఉంటారు. (56-59)

(ఈ ప్రపంచంలో మీలాగే) ఎన్నో జంతువులు ఉన్నాయి. కాని అవి తమ ఆహారాన్ని మోసుకొని తిరగడం లేదు. వాటికి ఆహారం దేవుడే ప్రసాదిస్తున్నాడు. మీకు ఆహారమిచ్చేవాడు కూడా ఆయనే. ఆయన సమస్త విషయాలు వింటున్నాడు; సర్వం ఎరిగినవాడు. (60)

భూమ్యాకాశాలను ఎవరు సృష్టించారని, సూర్యచంద్రుల్ని ఎవరు అదుపులో ఉంచగలిగారని నీవు అడిగితే, దేవుడే అని వారు తప్పకుండా అంటారు. అలాంటప్పుడు వారు ఎలా మోసపోతున్నారు? దేవుడు తనదాసులలో తానుతలచిన విధంగా కొందరికి పుష్కలంగా ఆహారం ప్రసాదిస్తున్నాడు; కొందరికి దారిద్ర్యం కలిగిస్తున్నాడు. దేవుడు సమస్త విషయాలు తెలిసినవాడు. (61,62)

ఆకాశం నుండి వర్షం కురిపించి తద్వారా మృతభూమికి జీవం పోస్తున్నదెవరని నీవు అడిగతే, దేవుడే అని వారు తప్పకుండా అంటారు. కనుక ఆ దేవుడే సకల ప్రశంసలకు అర్హుడని చెప్పు. కాని చాలామంది (ఈ సత్యాన్ని) గ్రహించడం లేదు. (63)

ఈ ప్రాపంచిక జీవితం ఒక ఆట, వినోదం తప్ప మరేమీ కాదు. అసలు జీవితం పరలోక గృహ(జీవిత)మే. ఈ యదార్థం వారు అర్థంచేసుకుంటే ఎంత బాగుండు! (64)

వారు పడవ ఎక్కి బయలుదేరినప్పుడు తమ ధర్మాన్ని (నిజ) దేవునికే ప్రత్యేకించి (తమను క్షేమంగా గమ్యానికి చేర్చమని) ఆయన్ని ప్రార్థిస్తారు. కాని దేవుడు వారిని క్షేమంగా దరికి చేర్చగానే వారు (మళ్ళీ) బహుదైవారాధనకు పాల్పడతారు. తమను దేవుడు కాపాడి చేసినమేలు మరచి (ఐహిక జీవితంలోని) సుఖాలు జుర్రుకోవాలి అన్నట్లు కృతఘ్నులయి పోతారు. సరే, (దాని పర్యవసానం ఏమిటో) త్వరలోనే వారికి తెలిసొస్తుంది. (65,66)

మేము (మక్కాలో) శాంతినిలయం నెలకొల్పిన విషయాన్ని వారు గమనించ లేదా? దాని చుట్టుప్రక్కల ప్రజలు (హింసా దౌర్జన్యాలతో) ఎలా నాశనమైపోతున్నారో వారికి కన్పించడం లేదా? ఇదంతా తెలిసికూడా వారు అసత్యాన్నే నమ్ముతున్నారా? దేవుని అనుగ్రహాలు పొంది ఆయన పట్లే కృతఘ్నులయిపోతారా? (67)

సత్యం ముందుకు వచ్చినప్పటికీ దాన్ని ధిక్కరించే లేదా అసత్యాలు కల్పించేవాడి కంటే పరమదుర్మార్గుడు మరెవరుంటారు? అలాంటి తిరస్కారుల గతి నరకనివాసం కాదా? మా(ప్రసన్నత) కోసం శ్రమించేవారికి మా (సన్నిధికి చేరుకునే) మార్గం చూపుతాం. నిస్సందేహంగా దేవుడు సజ్జనులకు తోడుగాఉంటాడు. (68,69) ✪

## అవతరణ:మక్కా 30. రోమ్‌వాసులు (రూమ్) సూక్తులు:60

ఈ అధ్యాయాన్ని "రూమ్" (రోమ్‌వాసులు) అంటారు. ఇది హిజ్రీ శకానికి రెండు మూడేళ్ల పూర్వం మక్కాలో అవతరించింది. మక్కాలో అవిశ్వాసుల వేధింపులకు తట్టు కోలేక దైవప్రవక్త (సల్లం) ప్రోద్బలంతో కొందరు ముస్లింలు రోమన్ల మిత్రరాజ్యమయిన అబిసీనియాకు వలసవెళ్ళారు. అబిసీనియా క్రైస్తవరాజు నజాషీ వారికి ఆశ్రయమిచ్చి ఎంతో గౌరవించాడు.

అది ఈరాన్ చక్రవర్తి 'ఖుస్రోపర్వేజ్' రోమ్ సామ్రాజ్యాన్ని క్రమేణా ఆక్రమిస్తూ రోమన్లను ముప్పతిప్పలు పెడుతున్న కాలం. మక్కా అవిశ్వాసులు రోమ్ క్రైస్తవులపై ఈరాన్ అగ్నిపూజారుల విజయవార్తలు విని తెగ సంబరపడిపోతూ ముస్లింలతో "చూడండి ఈరాన్ అగ్నిపూజారులు ఎలా విజయం సాధిస్తున్నారో! దైవప్రవక్తలను, దివ్యావిష్కృతిని విశ్వసిస్తున్న క్రైస్తవులు వారి ధాటికి నిలువలేక పాపం చిత్తుచిత్తుగా ఓడి పోతున్నారు. అదేవిధంగా అరబ్ విగ్రహారాధకులైన మేము కూడా మీధర్మాన్ని నామ రూపాల్లేకుండా తుడిచిపెడతాం" అని చెప్పసాగారు.

అలాంటి పరిస్థితిలో రోమన్లు అనతికాలంలోనే తిరిగి విజృంభించి విజయం సాధిస్తారని భవిష్యత్ ప్రకటన గావిస్తూ ఈ అధ్యాయం అవతరించింది. ఇది విని మక్కా



బహుదైవారాధకులు ముస్లింలను ఎద్దేవా చేశారు. ఈ భవిష్యత్ ప్రకటన గురించి హజ్రత్ అబూబకర్ (రజి)కు ఉబయి బిన్ ఖల్ఫ్ ఒక సవాలు విసిరాడు. పదేళ్ళలోగా రోమన్లు విజయం సాధిస్తే తాను అబూబకర్ (రజి)కు వంద ఒంటెలు ఇస్తానని లేకపోతే అబూబకర్ తనకు వంద ఒంటెలు ఇచ్చుకోవాలని షరతు పెట్టాడు. దీనికి హజ్రత్ అబూబకర్ (రజి) ఒప్పుకున్నారు.

క్రీ.శ. 624 నుండి రోమన్లు విజృంభించి ఈరాన్ రాజ్యంలోని అనేక ప్రాంతాలను ఆక్ర మించుకుంటూ అప్రతిహతంగా పురోగమించారు. చివరికి క్రీ.శ. 629 లో ఈరాన్ చక్రవర్తి తన అధీనంలో ఉన్న ఆక్రమిత భూభాగాలన్నిటినీ రోమన్లకు అప్పగించి ఖైసర్ చక్రవర్తితో శాంతి ఒప్పందం చేసుకున్నాడు. అటు ముస్లింలు కూడా క్రీ.శ. 624లో బద్ర్ యుద్ధంలో అవిశ్వాసులపై తొలివిజయం సాధించి క్రీ.శ. 629లో యావత్తు అరేబియా పై ఆధిక్యత పొంది విజయోత్సాహంతో మక్కాలో ప్రవేశించారు.

ఈవిధంగా ఖుర్ఆన్ భవిష్యత్ ప్రకటన పదేళ్ళలో పూర్తిగా నెరవేరింది. ఉబయి బిన్ ఖల్ఫ్ షరతు ఓడిపోయి వంద ఒంటెల్ని హజ్రత్ అబూబకర్ (రజి)కు ఇచ్చాడు. ఇస్లాం జూదాన్ని నిషేధించడం వల్ల అబూబకర్ (రజి) ఈ ఒంటెల్ని పేదలకు దానం చేశారు. ఈ అధ్యాయంలో ఆ తర్వాత దేవుని ఏకత్వం, పరలోకభావనలాంటి విషయాల్ని గురించి ప్రస్తావించి అవిశ్వాసుల్ని నిజధర్మం వైపు పిలవడం జరిగింది.

### కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

అలిఫ్-లామ్- మీమ్. రోమన్లు సమీపభూభాగం (ఈరాన్)లో తప్పకుండా పరాజయం పాలవుతారు. పరాజయం పాలైన కొన్నేండ్లలోనే వారు తిరిగి విజయం సాధిస్తారు. ఇంతకు ముందు కూడా దేవునికే అధికారం ఉండేది; ఆ తరువాత కూడా ఆయనదే అధికారం. అది దేవుడు ప్రసాదించిన విజయం పట్ల ముస్లింలు ఆనందోత్స వాలు జరుపుకునే రోజవుతుంది. దేవుడు తానుకోరిన వారికి సహాయం చేస్తాడు. ఆయన మహా శక్తిమంతుడు, అమిత దయామయుడు. దేవుడే ఈ(విజయ) వాగ్దానం చేస్తున్నాడు. ఆయన తన వాగ్దానాన్ని ఎన్నడూ భంగపరచడు. కాని చాలామంది (ఈ వాస్తవాన్ని) గ్రహించడం లేదు. (1-6)

ప్రజలకు ఇహలోక జీవితానికి సంబంధించిన బాహ్యస్వరూపమే తెలుసు. పరలోకం గురించి ఏమరుపాటుకు లోనయి ఉన్నారు. వారు స్వయంగా తమ అస్తిత్వాన్ని గురించి ఎన్నడూ యోచించలేదా? దేవుడు భూమ్యాకాశాల్ని, వాటి మధ్య ఉన్న సమస్తాన్ని ఒక నిర్ణీత కాలం కొరకు సత్యబద్ధంగా సృష్టించాడు. కాని చాలామంది తమ ప్రభువును కలుసుకోవలసి ఉందన్న సత్యాన్ని నిరాకరిస్తున్నారు. (7,8)

వీరెప్పుడూ ప్రపంచం తిరిగి చూడలేదా? తమకు పూర్వం గతించిన వారికి ఏం గతి పట్టిందో వీరికి తెలియదా? వీరికన్నా వారు ఎంతో శక్తిమంతులు. వారు నేలను బాగా దున్నారు. వీరికంటే వారే భూమిని ఎక్కువ నిర్మాణకార్యాలతో వృద్ధిపరిచారు. వారి దగ్గరకు వారి ప్రవక్తలు స్పష్టమైన నిదర్శనాలు తెచ్చారు. దేవుడు వారికి అన్యాయం

చేయలేదు. వారు స్వయంగా (ఆత్మవంచనకు పాల్పడి) తమకు తామే అన్యాయం చేసుకున్నారు. చివరికి చెడు పనులకు పాల్పడిన ప్రజలు ఘోరమైన దుష్ఫలితం చవిచూశారు. కారణం వారు దేవుని సూక్తులు తిరస్కరించి వాటిని పరిహసిస్తుండేవారు.

దేవుడే సృష్టిని ప్రారంభించేవాడు. వాటిని పునరుత్పత్తి చేసేవాడు కూడా ఆయనే. చివరికి మీరు ఆయన దగ్గరికే పోవలసి ఉంది. ప్రళయం సంభవించే రోజు నేరస్థులు నిరాశా నిస్పృహలతో క్రుంగిపోతారు. వారు కల్పించుకున్న మిథ్యాదైవాల్లో ఒక్కటీ వారికి సిఫారసు చేయలేదు. వారు తమ కల్పితదైవాలను తిరస్కరిస్తారు.[1] (19-13)

ప్రళయదినాన (మానవులంతా) విభిన్న వర్గాలుగా విడిపోతారు. సత్యాన్ని విశ్వసించి సత్కర్మలు చేసినవారు స్వర్గంలో సుఖసంతోషాలతో ఉంటారు. మా సూక్తులు, సూచనలను, పరలోక సంభవాన్ని తిరస్కరించిన అవిశ్వాసులు (నరక) యాతనల్లో మగ్గుతారు. (14-16)

కనుక (విశ్వాసులారా!) మీరు సాయంత్రం చీకటిపడిన తరువాత, ఉదయంవేళ దేవుడ్ని స్మరించండి. భూమ్యాకాశాలంతటా ఆయనే స్తుతింపదగినవాడు. పొద్దువాలిన తరువాత వేళ, మధ్యాహ్నం వేళ కూడా (ఆయన్ని స్మరించండి). ఆయన జీవి నుండి నిర్జీవ పదార్థాన్ని నిర్జీవపదార్థం నుండి జీవిని బయటికి తీస్తాడు. భూమి (బీటలు వారి) మృతప్రాయమై ఉన్నప్పుడు దానిక్కూడా ఆయనే (వర్షం ద్వారా) జీవం పోస్తున్నాడు. అదేవిధంగా మీరు కూడా (మరణావస్థ నుండి) బయటికి తీయబడతారు. (17-19)

ఆయన మిమ్మల్ని మట్టితో సృజించాడు. ఆతర్వాత మీరు ఒక్కసారిగా మానవులై పోయి (ప్రపంచంలో) విస్తరిస్తూపోయారు. ఆయన సూచనల్లో ఇదొక సూచన. (20)

ఆయన మీకోసం మీజాతి నుండే జీవిత భాగస్వాము(స్త్రీ)లను సృజించాడు, వారి దగ్గర మీరు సౌఖ్యం పొందడానికి. ఇంకా ఆయన మీ మధ్య ప్రేమానురాగాలు, దయా దాక్షిణ్యాలను కూడా జనింపజేశాడు. ఇది కూడా ఆయన సూచనల్లోనిదే. యోచించే వారికి ఇందులో అనేక నిదర్శనాలున్నాయి. (21)

ఆయన సూచనల్లో భూమ్యాకాశాల నిర్మాణం, మీ భాషలు, వర్ణ వ్యత్యాసాలు కూడా ఉన్నాయి. విజ్ఞులకు ఇందులో అనేక నిదర్శనాలున్నాయి. ఆయన సూచనల్లో రాత్రివేళ మీరు పడుకోవడం, పగటివేళ మీరాయన అనుగ్రహాన్ని అన్వేషించడం కూడా ఉన్నాయి. ఆలకించేవారికి ఇందులో అనేక నిదర్శనాలు ఉన్నాయి. (22,23)

---

1. ప్రతి యుగంలోనూ బహుదైవారాధకులు సృష్టికర్త, విశ్వప్రభువయిన అసలు దేవుడ్ని వదలి దైవదూతలు, దైవప్రవక్తలు, మహనీయులు, సజ్జనులను ఆరాధిస్తూ వస్తున్నారు. వారికి దైవత్వాన్ని అంటగట్టి, వారిని కోర్కెలు తీర్చేవారిగా, ఆపదలను దూరం చేసేవారిగా భావించి వారి విగ్రహాలను పూజిస్తారు. ఈవిధంగా ప్రకృతిశక్తుల్ని, జంతువుల్ని, చెట్లను, పుట్టల్ని కూడా పూజిస్తారు. అదీగాక వారి దేవుళ్ళ జాబితాలో స్వార్థపరులైన మతనాయకులు, రాజ్యాధినేతలు కూడా చేరుతారు. కాని పరలోకంలో ఈ మిథ్యాదైవాలేవీ వారిని కాపాడలేవు. అప్పుడు బహుదైవారాధకులు తామెంత ఘోరమైన పొరపాటు చేశారో తెలుసుకొని వారిని తిరస్కరిస్తారు.



ఆయన సూచనల్లో మరొకటి... ఆయన మీకు భయాన్ని కలిగించే, ఆశను రేకెత్తించే మెరుపును చూపిస్తున్నాడు. ఆకాశంనుండి వర్షం కురిపించి, తద్వారా మృత భూమికి జీవం పోస్తున్నాడు. ఇందులోనూ బుద్ధిమంతులకు గొప్ప నిదర్శనాలున్నాయి. ఆయన సూచనల్లో వేరొకటి...భూమ్యాకాశాలు ఆయన ఆజ్ఞతోనే ఏర్పడ్డాయి. ఆయన (పునరుత్థానదినాన) నేల నుండి (లేచిరమ్మని) పిలువగానే మీరు ఒకేఒక పిలుపుతో తక్షణమే లేచివస్తారు. (24,25)

భూమ్యాకాశాల్లోఉన్న సమస్తం ఆయన దాసులే, ఆయన ఆజ్ఞల్ని శిరసావహించే వారే. ఆయనే సృష్టినిర్మాణాన్ని ప్రారంభిస్తున్నాడు. తిరిగి ఆయనే ఆ సృష్టితాలను పునరుత్పత్తి చేస్తున్నాడు. ఈపని చేయడం ఆయనకు చాలా తేలిక. భూమ్యాకాశాల్లో ఆయన ఔన్నత్యం అద్వితీయమైనది. ఆయన మహా శక్తిమంతుడు, ఎంతో వివేక వంతుడు. (26,27)

ఆయన మీ గురించి ఒక ఉదాహరణ ఇస్తున్నాడు: మేము మీకు ప్రసాదించిన సిరిసంపదల్లో మీతోపాటు సమాన భాగస్వాములైన మీబానిసలు ఎవరైనా ఉన్నారా? మీరు మీతోటి యజమానులకు భయపడినట్లు వారిని చూసి మీరు భయపడతారా? ఇలా మేము బుద్ధిజ్ఞానం కలవారికోసం మాసూక్తులు విడమరచి చెబుతున్నాం. (28)

కాని ఈదుర్మార్గులు బుద్ధినుపయోగించి ఆలోచించకుండా తమ అభూతకల్పనలు పట్టుకొని వ్రేలాడుతున్నారు. దేవుడు దారి తప్పించినవాడ్ని ఇక ఎవరు దారికి తీసుకు రాగలరు? అలాంటివారికి ఎవరూ సహాయం చేయలేరు. (29)

కనుక (విశ్వాసులారా!) మీరు ఏకాగ్ర చిత్తులై (దేవుడు చూపిన) ఈ ధర్మాన్నే అంటి పెట్టుకొని ఉండండి. దేవుడు మానవుల్ని ఏ ప్రకృతి(ధర్మం) ఆధారంగా పుట్టించాడో ఆప్రకృతి (ధర్మం)పైన్నే స్థిరంగా ఉండండి.[2] ఆయన రూపొందించిన ప్రకృతికి మార్పు లేదు. ఇదే సరైనమార్గం, (సహజ)ధర్మం. కాని చాలామంది (సత్యాన్ని) ఎరుగరు. (మీరు) దేవుని (మార్గం) వైపునకే మరలి (ప్రతి వ్యవహారంలోనూ) ఆయనకు భయపడుతూ ఉండండి. నమాజు స్థాపించండి. బహుదైవారాధకులతో కలసిపోకండి. వారు తమ ధర్మాన్ని చీల్చుకొని విభిన్నవర్గాలుగా విడిపోయారు. ప్రతివర్గం తన దగ్గరున్నదానిలో (కల్పిత మతాచారాల్లో) నిమగ్నమై ఉంది. (30-32)

---

2. ఆ ప్రకృతి ధర్మమే ఇస్లాం. ఈ విశ్వంలోని సమస్తం, చివరికి మానవుని అవయవాలు సైతం దైవనియమావళి ప్రకారమే పని చేస్తున్నాయి. అయితే మానవుల్లో కొందరు తమకు దేవుడు ఇచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తూ విశృంఖల జీవితం గడుపుతున్నారు. అలాగే పిల్లల్ని సైతం తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. దీనిపై ప్రవక్త ప్రవచనం చూడండి:

“మాతృగర్భం నుండి పుట్టే ప్రతిపిల్లవాడూ నిజానికి ప్రకృతిధర్మం ఆధారంగానే పుడుతున్నాడు. కాని తల్లిదండ్రులు ఆ తర్వాత ఆ పిల్లవాడ్ని క్రైస్తవునిగానో, యూదునిగానో, మజూసీగానో లేదా మరోరకంగానో మార్చివేస్తున్నారు. దీన్నీ విధంగా పోల్చవచ్చు- పశువుల కడుపుల్లో నుంచి పశువులు ఎలాంటి లోపంలేకుండా పుడతాయి. ఏ జంతుపిల్ల కూడా తెగిన చెవులతో పుట్టదు. ఆ తర్వాత బహుదైవారాధకులు తమ మూఢనమ్మకాలతో దాని చెవులు కోసివేస్తారు.” (బుఖారి)

ప్రజలు (సాధారణంగా) ఏదైనా కష్టం వచ్చినప్పుడు తమ (నిజ)ప్రభువు వైపు మరలి ఆయన్నే వేడుకుంటారు. అయితే ఆయన (ఆ కష్టం దూరంచేసి) తన కారుణ్యాన్ని కాస్త చవిచూపించగానే వారిలో కొందరు మళ్ళీ బహుదైవారాధనకు పాల్పడతారు. ఇలా మేము చేసిన మేలుకు మాపట్ల (కృతజ్ఞత చూపకుండా) కృతఘ్నులైపోతున్నారు. సరే, కొంతకాలం (ఐహిక)సుఖాలు జుర్రుకోండి. (దీని పర్యవసానం ఏమిటో) మీకు త్వరలోనే తెలుస్తుంది. మీరు చేస్తున్న ఈ బహుదైవారాధన సత్యమని నిరూపించే ఆధారం ఏదయినా మేము మీ దగ్గరకు పంపించామా? (33-35)

ప్రజలకు మేము ఎప్పుడైనా మా కారుణ్యం కాస్త చవిచూపిస్తే చాలు, వారు సంతోషంతో పొంగిపోతారు. (ఆపై అదంతా తమకృషి ఫలితమని మిడిసిపడతారు.) కాని చేజేతులా చేసుకున్నదాని ఫలితంగా ఏదైనా ఆపద వచ్చిపడితే వెంటనే వారు నిరాశ చెందుతారు. దేవుడే తాను కోరినవిధంగా కొందరికి పుష్కలంగా, మరికొందరికి స్వల్పంగా ఉపాధినిస్తున్న సంగతి వీరు గమనించడం లేదా? విశ్వసించేవారికి ఇందులో గొప్ప సూచనలు ఉన్నాయి. (36,37)

కనుక బంధువులకు రావలసిన హక్కులు బంధువులకు ఇచ్చేయండి. అలాగే పేదలకు, బాటసారులకు కూడా. దైవప్రసన్నత కోరుకునేవారికి ఇది చాలామంచి పద్ధతి. అలాంటివారే సార్థకజీవులు, సఫలీకృతులు. ప్రజల ధనంలో కలిసిపోయి వృద్ధిచెందుతుందన్న ఉద్దేశ్యంతో మీరిచ్చే వడ్డీ దేవుని దృష్టిలో ఎన్నటికీ వృద్ధిచెందదు.[3] (దీనికి భిన్నంగా) దైవప్రసన్నత కోసం మీరు చెల్లించే జకాత్ (మీకు శుభాన్నిస్తుంది). అలా జకాత్ చెల్లించేవారే నిజానికి తమ ధనాన్ని వృద్ధిచేసుకుంటారు. (38,39)

దేవుడే మిమ్మల్ని పుట్టించి మీకు ఉపాధినిస్తున్నాడు. ఆయనే మీకు మరణం కలగిస్తున్నాడు. తిరిగి ఆయనే మిమ్మల్ని (పునరుత్థానదినాన) బ్రతికించి లేపేవాడు కూడా. మీరు దేవునికి సాటికల్పించిన మిథ్యాదైవాలేవైనా వీటిలో ఏఒక్క పనైనా చేయగలవా? వీరు చేస్తున్న బహుదైవారాధనకు దేవుడు ఎంతో అతీతుడు, ఉన్నతుడు, పరమ పవిత్రుడు. (40)

ప్రజలు చేసిన (అ)కృత్యాల కారణంగా నేలపై, నీటిపై సంక్షోభం ఏర్పడింది.[4] వారికి దేవుడు వారి దుష్కార్యాల పర్యవసానాన్ని చవిచూపేందుకే ఇలా జరిగింది, ఈ

3. వివరాలకు 2:275-279, 3:130 సూక్తులు, వాటి పాదసూచికలు చూడండి.

4. ఈ సూక్తి క్రీ.శ. 603-628 మధ్య రోమ్, ఈరాన్‌లకు జరిగిన యుద్ధంవైపు సూచిస్తోంది ఈ యుద్ధజ్వాలలు యావత్తు మధ్యప్రాచ్యాన్ని చుట్టుముట్టాయి. ఆనాడు ప్రజలు సాంప్రదాయిక ఆయుధాలయిన ఖడ్గం, ఈటె, ధనుర్బాణాలు మాత్రమే ఉపయోగించేవారు. ఈనాటి యుద్ధాలు సృష్టిస్తున్న విధ్వంసకాండతో పోల్చితే, ఆనాటి యుద్ధాలు సృష్టించిన విధ్వంసం పెద్దగా లెక్కలోనికి రాదు. కాని ఈనాడు క్షణాల్లో నగరాలకు నగరాలనే నేలమట్టంచేసే అణుబాంబులు వచ్చాయి.

ట్యాంకర్లు, రాకెట్లు, క్షిపణులు, జెట్‌ఫైటర్లు, హోవిట్జర్లు, ఫ్రిగేట్లు, డిస్ట్రాయర్లు, క్రూసియర్లు, లేజర్ వెపన్స్, క్లస్టర్ బాంబులు, కార్పెట్ బాంబులు మొదలైన అధునాతన ఆయుధాలు సృష్టించే



శిక్షవల్ల వారు (తమ దుశ్చర్యలు) మానుకుంటారేమో (చూడాలి). (41)

(ప్రవక్తా!) పూర్వం గతించిన ప్రజలకు ఎలాంటి గతి పట్టిందో ప్రపంచంలో తిరిగి చూడండని చెప్పు. వారిలో చాలామంది బహుదైవారాధకులే. కనుక దేవుని తరపున అనివార్యమైన (ప్రళయ)దినం రాకముందే నీవు ఈ ధర్మమార్గం వైపు మరలి అందులో స్థిరంగాఉండు. ఆరోజు ప్రజలు ఛిన్నాభిన్నమై ఒకరినుండి మరొకరు విడిపోతారు.

సత్యాన్ని ఎవరు తిరస్కరిస్తారో ఆ తిరస్కారనష్టం వారికే వాటిల్లుతుంది. సత్కార్యాలు చేస్తున్నవారు నిజానికి తమ ముక్తిమార్గాన్నే సుగమం చేసుకుంటున్నారు. విశ్వసించి సత్కర్మలు చేసేవారికి దేవుడు దయతో ప్రతిఫలం ప్రసాదిస్తాడు. ఆయన సత్యతిరస్కారుల్ని ఎన్నటికీ ప్రేమించడు. (42-45)

దేవుని సూచనల్లో ఒకటి... ఆయన (తన అనుగ్రహం వర్షిస్తుందన్న) శుభవార్తను తెలిపే చల్లటి గాలులు పంపిస్తున్నాడు; మీకు తన కారుణ్యం(వర్షం) ప్రసాదించడానికి. తన ఆజ్ఞతో ఓడలు నడవడానికి, తన అనుగ్రహాన్ని (ఉపాధిని) మీరు అన్వేషించడానికి, తన పట్ల మీరు కృతజ్ఞత చూపడానికి ఆయన ఈ ఏర్పాటు చేశాడు. (46)

మీకు పూర్వం మేము అనేకజాతుల దగ్గరకు ఆ జాతులకు చెందిన ప్రవక్తలను పంపాము. వారు తమ జాతిప్రజల దగ్గరకు స్పష్టమైన సూచనలు తీసికెళ్ళారు. ఆ తర్వాత (కూడా) పాపకార్యాలకు పాల్పడినవారికి మేము ప్రతీకారం చేశాము. (వారిలో) సత్యాన్ని విశ్వసించినవారికి మేము సహాయం చేశాము. అది మా బాధ్యత. (47)

మేఘాలను మోసుకెళ్ళే గాలులను పంపేవాడు దేవుడే. ఆయనే తానుకోరిన విధంగా ఆ మేఘాలను ఆకాశంలో విస్తరింపజేస్తున్నాడు. ఆయనే వాటిని తునకలుగా విభజిస్తున్నాడు. తరువాత ఆ మబ్బుతునకల నుండి వర్షం ధారాపాతంగా కురవడం మీకు కన్పిస్తుంది. ఆ వర్షాన్ని ఆయన తన దాసులలో తానుకోరిన వారిపై కురిపిస్తాడు.

విధ్వంసకాండ కూడా తక్కువేమీ కాదు. ఇవి నిర్దేశిత లక్ష్యాలను ధ్వంసం చేయడమే కాకుండా, రిమోట్ కంట్రోల్ సిస్టమ్స్, హైటెక్ కంప్యూటర్ సిగ్నల్స్ కారణంగా ఒక్కోసారి అనుకోని ప్రమాదాలు కూడా తెచ్చిపెడ్తాయి. అమెరికా దగ్గర ప్రయోగదశలో ఉన్న స్టార్‌వార్స్ ప్రాజెక్టు ఇంతకంటే ఎంతో ప్రమాదకరమైనది. ఈ ప్రాజెక్టు కేంద్రం నుండి శక్తిమంతమైన లేజర్ కిరణాలను అంతరిక్షంలోని తమ ఉపగ్రహ నౌకకుండే ఓ పెద్ద అద్దం మీదికి ప్రసరింపజేస్తారు. అక్కడ్నుంచి తాము లక్ష్యంగా పెట్టుకునే శత్రుదేశం ఉపరితల వాతావరణంలోకి ప్రతిబింబింపజేసి అక్కడి ఓజోన్ పొరకు తూట్లు వేస్తారు. దానివల్ల సూర్యుడి నుండి వెలువడే అల్ట్రావైలెట్ కిరణాలు నేరుగా భూమిపై పడి కేన్సర్ లాంటి భయంకర వ్యాధులు కలగజేసి క్రమంగా మానవ మారణహోమం సృష్టిస్తాయి. అంతేకాదు, మనుషుల్ని మౌనంగా మట్టుపెట్టే జీవాయుధాలు కూడా ఉనికిలోకి వచ్చాయి.

దేవుడు తన ప్రవక్తల ద్వారా పంపిన రుజుమార్గం విస్మరించినవారు ఆధునిక విజ్ఞానాన్ని లోకకల్యాణం కోసం వినియోగిస్తారని ఎన్నటికీ ఆశించలేము. ముఖ్యంగా మానవ సంక్షేమం కోసం దైవం ప్రసాదించిన ఈ విజ్ఞానం స్వార్థపరులు, నాస్తికులు, అధికార పిపాసులు, రాజ్యవిస్తరణ కాంక్షా పరుల చేతికి చిక్కితే మొత్తం భూమండలమే నాశనమవుతుంది.

అప్పటిదాకా ఆశానిరాశల మధ్య ఊగిసలాడిన ఆదాసులు (వర్షం చూసి) ఒక్కసారిగా సంతోషంతో పొంగిపోతారు.

దేవుని కారుణ్యప్రభావం చూడండి, (వర్షం కురవగానే) మృతప్రాయంగా పడివున్న నేల సజీవమయి (సస్యశ్యామలమై) పోతుంది. (అలాగే) ఆయన (మరణానంతరం) మృతులకు తిరిగి ప్రాణంపోసి లేపుతాడు. ఆయన ప్రతిపనీ చేయగల సమర్థుడు, సర్వశక్తిమంతుడు. (48-50)

మేము గనక తీవ్రమైన (వడ)గాలి పంపి, దాంతోవారి పంటపొలాలు (మాడి) పసుపు పచ్చగా మారిపోతే వారు అవిశ్వాసంలో మరింత కూరుకుపోతారు. నీవు మృతులకు,[5] ముఖంతిప్పి వెళ్ళే చెవిటోళ్ళకు సత్యాన్ని విన్పించలేవు. నీవు అంధుల్ని కూడా అపమార్గం నుండి తీసి సన్మార్గం చూపలేవు. మా సూక్తులు విశ్వసించి విధేయులయ్యేవారికి మాత్రమే నీవు (సత్యాన్ని) విన్పించగలవు.

మీరు బలహీనంగా ఉన్నప్పుడు మిమ్మల్ని పుట్టించినవాడు దేవుడే. ఆ బలహీనత తరువాత ఆయన మీకు శక్తి ప్రసాదించాడు. ఆ శక్తి తరువాత తిరిగి మిమ్మల్ని బలహీనులుగా, వృద్ధులుగా చేస్తున్నాడు. ఆయన తాను తలచినదాన్ని సృజిస్తున్నాడు. ఆయన సమస్తం ఎరిగినవాడు, సర్వ శక్తిమంతుడు. 51-54)

ప్రళయ ఘడియ వచ్చినప్పుడు పాపాత్ములు ప్రమాణం చేస్తూ "మేము ప్రపంచంలో ఘడియకన్నా ఎక్కువసేపు ఉండలేదు" అంటారు. అలాగే వారు ప్రపంచ జీవితంలో మోసపోతుండే వారు.

అయితే (దైవిక)జ్ఞానం, విశ్వాసభాగ్యం పొందినవారు వారితో "మీరు దైవనిర్ణయం ప్రకారం పునరుత్థానదినం వరకు పడివున్నారు. పునరుత్థాన దినమంటే ఇదే. కాని మీరు దీన్ని గ్రహించ లేకపోయారు" అనంటారు. ఆరోజు దుర్మార్గులు చెప్పే సాకుల వల్ల ఎలాంటి లాభం ఉండదు. దేవుడ్ని క్షమాపణ కోరుకోవడానిక్కూడా వారికి అనుమతి లభించదు. (55-57)

మేమీ ఖుర్ఆన్ ద్వారా ప్రజలకు అనేక విధాల నచ్చజెప్పాం. కాని సత్యాన్ని నిరాకరించేవారి ముందు నీవు ఎలాంటి సూచన తెచ్చినా వారు నిన్ను అసత్యవాదివనే అంటారు. ఇలా దేవుడు మూర్ఖుల హృదయకవాటాలు మూసేస్తున్నాడు.

కనుక నీవు సహనం వహించు. దేవుని వాగ్దానం సత్యమైనది. విశ్వసించనివారు నిన్ను చులకన భావంతో చూడకూడదు సుమా! (అంటే నీవు వారి మాటలకు ఏమాత్రం లొంగిపోకూడదు.) -(58-60) ✪

---

5. మృతులంటే అంతరాత్మ పూర్తిగా చచ్చినవారు. వారిలో నీతి బొత్తిగా ఉండదన్నమాట. అంతరాత్మ లేక హృదయం లేక మనస్సును గురించి వివరాల కోసం 89:27 సూక్తి, దాని పాద సూచిక చూడండి. దాంతోపాటు "ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్" నుండి వెలువడిన "పరలోక ప్రస్థానం" అనే పుస్తకం కూడా చూడండి.



**అవతరణ: మక్కా**

# 31. లుఖ్మాన్

**సూక్తులు; 3**

ఈ అధ్యాయంలో లుఖ్మాన్ మహనీయుడు తన కొడుకుకు చేసిన హితోపదేశం పేర్కొనబడింది. ఇది ముస్లింలను సత్యతిరస్కారులు రకరకాలుగా వేధిస్తున్న తరుణంలో మక్కాలో అవతరించింది. ఇందులో తాతముత్తాతల ఆచారాలను గుడ్డిగా అనుకరించడం మానుకొని దైవప్రవక్త (సల్లం) అందజేస్తున్న దివ్యసందేశాన్ని గురించి ప్రశాంత హృదయంతో ఆలోచించమని అవిశ్వాసుల్ని కోరడం జరిగింది.

## కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

అలిఫ్-లామ్-మీమ్. ఇవి యుక్తీవివేకాలతో నిండిన (దివ్య)గ్రంథంలోని సూక్తులు. ఈ సూక్తులు సహృదయుల పాలిట మార్గదర్శిని, కారుణ్యకడలి. ఆ సహృదయులు నమాజు (వ్యవస్థ)ను నెలకొల్పుతారు; (పేదల ఆర్థిక హక్కయిన) జకాత్) చెల్లిస్తారు; పరలోకాన్ని విశ్వసిస్తారు. అలాంటివారే తమ ప్రభువు నుండి లభించే సన్మార్గంలో ఉంటారు. వారే సార్థక జీవులు, సఫలీకృతులు. (1-5)

మానవుల్లో మనసును మభ్యపెట్టే వ్యర్థ వస్తువుని కొనితెచ్చేవాడు[1] కూడా ఒకతను ఉన్నాడు. అతను (సరైన)జ్ఞానం లేకుండా ప్రజల్ని దైవమార్గం నుండి తప్పించి, ఆ

---

1. బహుదైవారాధకులు దైవప్రవక్త (సల్లం)ను గురించి ఎంత దుష్ప్రచారం సాగిస్తున్నా ఇస్లాం రోజురోజుకు వ్యాపిస్తూనే ఉంది. అప్పుడు నస్ర్ బిన్ హారిస్ అనే వ్యక్తి ఖురైష్ నాయకుల్ని సమావేశపరచి ఇలాఅన్నాడు: "ఇతను మీమధ్య పుట్టిపెరిగి నడివయస్సుకు చేరుకున్నాడు. ఈనాటికీ ఇతను మీ అందరిలోకెల్లా ఎంతో ఉత్తముడు, సత్యసంధుడు, నిజాయితీపరుడు. అలాంటి వ్యక్తిని గురించి మీరు జ్యోతిష్కుడు, మాంత్రికుడు, కవి, పిచ్చివాడు అంటూ ప్రచారం చేయడం వల్ల లాభంలేదు. జ్యోతిష్కులు ఎలాంటి మాటలు కల్పించి చెబుతారో ప్రజలకు తెలియదా? మాంత్రికులు ఎలాంటి మంత్రతంత్రాలు, వేస్తారో తెలియదా? కవిత్వం గురించి జనం ఎరగరా? పిచ్చి ఏమిటో ఎవరికి తెలియదూ? ఈ ఆరోపణలేవీ ముహమ్మద్ (స)కు వర్తించవు. దీనికి విరుగుడు నేను చెబుతాను". ఇలా చెప్పి అతను ఇరాఖ్ వెళ్తాడు. అక్కడ్నుంచి రాజుల గాథలు మోసుకొచ్చి ప్రజల దృష్టిని ఖుర్ఆన్ నుండి మరల్చేందుకు కథాకాలక్షేపం సభలు నిర్వహించడం ప్రారంభిస్తాడు.

ఈ సూక్తిలో "మనస్సును మభ్యపెట్టే వ్యర్థవస్తువు" అనే పదం వచ్చినచోట మూలభాషలో "లహ్వాల్‌హదీస్" అనే పదం వాడబడింది. హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్వూద్ (రజి)ని లహ్వాల్‌హదీస్ అంటే ఏమిటని అడిగితే, ఆయన దేవుని మీద ప్రమాణం చేసి "లహ్వాల్‌హదీస్ అంటే పాటలు (సంగీతం)" అని మూడుసార్లు నొక్కి చెప్పారు. (ఇబ్నె జరీర్, బైహఖి)

"పాటలుపాడే స్త్రీలను అమ్మడం, కొనడం, వారి వ్యాపారం చేయడం ధర్మసమ్మతం కాదు" అన్నారు దైవప్రవక్త (సల్లం)- (తిర్మిజి). ఆయన మరో సందర్భంలో "పాటలుపాడే బానిసస్త్రీ సభలో కూర్చొని, ఆమె పాటలు వినేవాడి చెవిలో ప్రళయదినాన కరిగించిన సీసం పోయబడుతుంద"ని అన్నారు. (అహ్కాముల్ ఖుర్ఆన్- ఖాజీ అబూబకర్)

ఈనాడు ఆర్ట్ పేర అశ్లీలాన్ని వ్యాపింపజేస్తూ, కల్చరల్ ప్రోగ్రాం పేర అర్థనగ్న విన్యాసాల్ని ప్రదర్శిస్తూ జీవిత ప్రధాన సమస్యల నుండి ప్రజల దృష్టిని మరలింపజేసే వ్యర్థ కార్యకలాపాలన్నీ 'లహ్వాల్ హదీస్' క్రిందికే వస్తాయి.

ప్రచారాన్ని పరిహసించడానికే ఇలాంటి చేష్టలకు పాల్పడ్డాడు. ఇటువంటి వారికి అవమానకరమైన శిక్ష కాచుకొని ఉంది. మా సూక్తులు విన్పించినప్పుడు అతను అహంకారంతో విర్రవీగుతూ, తాను చెవిటివాడన్నట్లు, తానసలు దాన్ని వినలే లేదన్నట్లు ఎటో ముఖం తిప్పుకుంటాడు. సరే, అతని కోసం వ్యధాభరితమైన యాతన ఎదురు చూస్తోందని శుభవార్త విన్పించు. (6,7)

అయితే సత్యాన్ని విశ్వసించి సదాచార సంపన్నులయినవారికి భోగభాగ్యాలతో నిండిన స్వర్గసీమ సిద్ధంగా ఉంది. వారక్కడ కలకాలం (హాయిగా) ఉంటారు. ఇది దేవుడు చేస్తున్న తిరుగులేని వాగ్దానం. ఆయన అపార శక్తిమంతుడు, అసాధారణ వివేకవంతుడు. (8,9)

ఆయన మీకు గోచరించే ఆధారాలేమీ లేకుండాఉండే ఆకాశాన్ని సృష్టించాడు. భూమి మిమ్మల్ని తీసుకొని దొర్లిపోకుండా ఉండేందుకు ఆయన దానిపై పర్వతాలు పాతాడు. ఆయన ధరణిలో వివిధరకాల జంతువుల్ని వ్యాపింపజేశాడు. ఆకాశం నుండి వర్షం కురిపించి భూమిపై రకరకాల మంచిచెట్లు మొలకెత్తిస్తున్నాడు. ఇదంతా దేవుని సృష్టి. ఇక ఇతరులు ఏం సృష్టించారో చెప్పండి నాకు. అసలీ దుర్మార్గులు పూర్తిగా దారితప్పారు. (10,11)

దేవుని పట్ల కృతజ్ఞుడయి ఉండమని చెబుతూ మేము లుఖ్మాన్‌కు వివేకాన్ని ప్రసాదించాము. ఎవరైనా (దేవునికి) కృతజ్ఞత చూపితే, ఆ కృతజ్ఞత అతనికే ప్రయోజనం చేకూర్చు తుంది. దీనికి భిన్నంగా కృతఘ్నుడై పోతే, దేవునికి కలిగే నష్టమేమీ లేదు. ఆయన నిరపేక్షా పరుడు, స్వతహాగా ప్రశంసనీయుడు. (12)

లుఖ్మాన్ తన కుమారునికి హితోపదేశం చేసిన సందర్భం గుర్తుకుతెచ్చుకో. అతను తన కుమారునితో “బాబూ! దేవునికి (ఆయన దైవత్వంలో) ఎవరినీ సాటి కల్పించకు. దేవునికి సాటి కల్పించడం ఘోరమైన పాపం, దారుణమైన అన్యాయం” అన్నాడు. (13)

తల్లిదండ్రులకు సేవచేయాలని మేము మానవుడ్ని ఆదేశించాము. అతని తల్లి బాధ మీద బాధ భరిస్తూ అతడ్ని తన గర్భంలో పెట్టుకొని మోసింది. అతడ్ని పాలు విడిపించడానికి రెండు సంవత్సరాలు పట్టింది. (అందువల్ల మేమతనికి ఇలా ఉపదేశించాము:) “నాపట్ల కృతజ్ఞుడయి ఉండు. నీ తల్లిదండ్రుల పట్ల కూడా కృతజ్ఞతా భావంతో మసలుకో. నీవు (చివరికి) నా దగ్గరికే మరలి రావలసి ఉంది. అయితే నీకు తెలియనిదాన్ని నాకు సాటి కల్పించమని వత్తిడి చేస్తే మటుకు నీవు వారి మాటలు ఎన్నటికీ వినకు. ప్రపంచంలో వారిపట్ల సత్ప్రవర్తన కలిగి ఉండు. అనుసరణ విషయంలో మాత్రం నావైపు మరలినవారి మార్గాన్నే అనుసరించు. చివరికి మీరంతా నా దగ్గరికే తిరిగి రావలసి ఉంది. అప్పుడు నేను మీరు (ఐహిక జీవితంలో) ఎలా నడచుకునేవారో మీకు తెలియజేస్తాను.” (14,15)

(లుఖ్మాన్ తన కుమారునికి ఇలా ఉపదేశించాడు:) “కుమారా! ఏదయినా బండ రాయిలోగాని, ఆకాశంలోగాని, భూమిపైగాని, లేదా మరెక్కడైనా సరే ఆవగింజంత



వస్తువు దాగివున్నా సరే దేవుడు దాన్ని బయటికి తీయగలడు. ఆయన ఎంతో సూక్ష్మగ్రాహి, సమస్తం తెలిసినవాడు. (కనుక) కుమారా! నీవు-

- ప్రార్థనా (నమాజ్) వ్యవస్థ నెలకొల్పు.
- (ప్రజలను) మంచిని గురించి ఆదేశించు, చెడు విషయాలనుండి వారించు.
- కష్టాలు వచ్చి నప్పుడు సహనం వహించు. ఇవి ఎంతో ధైర్యసాహసాలతో కూడిన విషయాలు.
- భూమిపై (మిడిసిపాటుతో) నిక్కుతూ నీల్గుతూ నడవకు. తననుతాను పొగడు కునే, మిడిసిపడే వాడ్ని దేవుడు ఏమాత్రం మెచ్చుకోడు.
- నీ నడవడిలో మధ్యేమార్గం అవలంబించు.
- నీ కంఠస్వరం కాస్త తగ్గించుకో. అన్ని స్వరాల కంటే గాడిద స్వరం అత్యంత కఠోరమయినది.” (16-19)

దేవుడు మీకోసం భూమ్యాకాశాల్లోని సమస్త వస్తువుల్ని అదుపులో ఉంచిన సంగతి మీరు గమనించలేదా? అదీగాక ఆయన తన గోచర, అగోచర మహాభాగ్యాలు (ఎన్నో) మీకోసం సమకూర్చాడు. కాని మానవుల్లో కొందరు ఎలాంటి జ్ఞానంగాని, హితబోధగాని, కాంతి ప్రసాదించే గ్రంథంగాని లేకుండానే దేవుని విషయంలో జగడమాడుతున్నారు. దేవుడు పంపినదాన్ని అనుసరించండని చెబితే మా తాతముత్తాతల నుండి వస్తున్న దాన్నే అనుసరిస్తామని అంటారు. షైతాన్ తమను మండుతున్న నరకాగ్ని వైపు ఆహ్వానిస్తున్నా వారు తమ తాతముత్తాతలనే అనుసరిస్తారా? (20,21)

తనను తాను దేవునికి అంకితం చేసుకున్న పుణ్యాత్ముడు నిజానికి దృఢమైన ఆధారం పట్టుకున్నాడు. సమస్త వ్యవహారాల తుదినిర్ణయం దేవుని చేతిలోనే ఉంది. అందువల్ల అవిశ్వాసుల తిరస్కారం చూసి నీవు బాధపడకు. చివరికి వారు మా దగ్గరికే రావలసి ఉంది. అప్పుడు మేము వారికి వారు ఏఏ పనులు చేశారో తెలియజేస్తాము. దేవునికి (తన దాసుల) హృదయాల్లో దాగివుండే రహస్యాలు సయితం తెలుసు. మేము వారికి కొంతకాలం సుఖాలు అనుభవించే అవకాశమిస్తున్నాము. ఆ తరువాత వారిని నిస్సహాయులుగా చేసి ఘోరమైన యాతన వైపు ఈడుస్తాము. (22-24)

నీవు వారిని భూమ్యాకాశాలను ఎవరు సృష్టించారని అడిగితే, వారు దేవుడేనని తప్పకుండా అంటారు. (కనుక) సమస్త స్తుతిస్తోత్రాలు దేవునికే శోభిస్తాయని చెప్పు. కాని వారిలో చాలామందికి (ఈ సత్యం) తెలియదు. భూమ్యాకాశాల్లో ఉన్న సమస్తం దేవునిదే. ఆయన నిరపేక్షాపరుడు, స్వతహాగానే ప్రశంసనీయుడు. (25,26)

ప్రపంచంలోని చెట్లన్నిటిని కలాలు గాను, యావత్తు సముద్ర జలాలతో పాటు అదనంగా మరో ఏడు సముద్రాల నీటిని సిరాగాను మార్చి (రాసి)నా దేవునికి సంబంధించిన విషయాలు పూర్తికావు. దేవుడు అపార శక్తిమంతుడు, అసాధారణ వివేకవంతుడు. ఒక మనిషిని పుట్టించడం, మళ్ళీ బ్రతికించి లేపడం ఎంత తేలికో

మిమ్మల్నందర్నీ పుట్టించడం, తిరిగి బ్రతికించి లేపడం కూడా ఆయనకు అంతే తేలికయిన పని. దేవుడు సమస్తం వింటున్నాడు, గమనిస్తున్నాడు. (27,28)

దేవుడు రాత్రిని పగటిలోకి, పగటిని రాత్రిలోకి ఎలా జొన్పిస్తున్నాడో మీరు చూడటం లేదా? ఆయన సూర్యచంద్రులను (ఒక నియమావళికి కట్టుబడి ఉండేలా) అదుపులో ఉంచాడు. ఇవన్నీ ఒక నిర్ణీతకాలం వరకు నడుస్తూ ఉంటాయి. మీరు చేసే ప్రతిపనీ దేవునికి తెలుసన్న సంగతి మీకు తెలియదా? వీటన్నిటికి కారణం దేవుడే సత్యం. అందువల్లనే ఇవన్నీ ఇలా ఒక నియంత్రణకు లోబడి సాగుతున్నాయి. ఆయన్ని వదలి వారు ప్రార్థిస్తున్నవన్నీ మిథ్యాదైవాలే. దేవుడే మహోన్నతుడు, మహిమాన్వితుడు. (29,30)

దేవుని అనుగ్రహంతో ఓడలు సముద్రంలో ఎలా సాగిపోతున్నాయో మీరు గమనించడం లేదా? దేవుడు మీకు తన సూచనలు, నిదర్శనాలు చూపడానికే ఇలా చేస్తున్నాడు. సహనం వహించే, కృతజ్ఞత చూపేవారికి ఇందులో అనేక సూచనలున్నాయి.

ఎప్పుడైనా కొండలాంటి పెద్దకెరటం వారిపైకి విజృంభించినప్పుడు వారు (మిథ్యా దైవాలను వదిలేసి) నిజదేవుణ్ణి (మాత్రమే) వేడుకోవడం ప్రారంభిస్తారు. తమ (జీవన) ధర్మాన్ని ఆయనకే ప్రత్యేకిస్తారు. కాని వారిని ఆయన ఆ ప్రమాదం నుండి కాపాడి తీరానికి చేర్చిన తర్వాత వారిలో కొందరు మాత్రమే రుజుమార్గంలో స్థిరంగా ఉంటారు. కృతఘ్నులు, ద్రోహులు తప్ప మా సూక్తులు ఎవరూ తిరస్కరించరు. (31,32)

మానవులారా! మీ ప్రభువు ఆగ్రహం నుండి తప్పించుకోండి. తండ్రి తన కొడుకుకు, కొడుకు తన తండ్రికి ఎలాంటి సహాయం చేయలేని (ప్రళయ) దినం గురించి భయపడండి. దేవుని వాగ్దానం తప్పకుండా నెరవేరుతుంది. కనుక ప్రాపంచిక జీవితం మిమ్మల్ని మోసగించ కూడదు. మోసగాడు కూడా మిమ్మల్ని దేవుని విషయంలో మోసగించకూడదు. (33)

ఆ (ప్రళయ) ఘడియ ఎప్పుడు సంభవిస్తుందో దేవునికి మాత్రమే తెలుసు. మాతృ గర్భంలో ఏం పెరుగుతున్నదో కూడా ఆయనకే తెలుసు.[2] రేపు తాను ఏం చేయనున్నాడో ఏమనిషికీ తెలియదు. అలాగే తనకు ఏ భూభాగంలో మృత్యువు కాటువేస్తుందో కూడా ఎవరికీ తెలియదు. సమస్త విషయాలు దేవునికి మాత్రమే తెలుసు. ఆయన సర్వజ్ఞాని, సమస్తం ఎరిగినవాడు. (34) ✪

2. మాతృగర్భంలో ఏం పెరుగుతున్నదో అంటే ఇక్కడ ఆడపిల్లా, మగపిల్లవాడా అని అర్థం కాదు. స్త్రీ గర్భంలో పడిన వీర్యబిందువు ఎలాంటి మార్పులు చెంది చివరికి ఏ రూపం సంతరించుకుంటుందో, ఏఏ గుణగణాలు దాని స్వభావంలో వేరుగొంటాయో మొదలయిన అనేక విషయాల్ని పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది. ఇవన్నీ దేవునికి తప్ప మరెవరికీ తెలియదని ఈసూక్తి మనకు తెలియజేస్తోంది.



# 32. సాష్టాంగప్రణామం (సజ్దా)

అవతరణ: మక్కా    సూక్తులు: 30

ఈ అధ్యాయాన్ని "సజ్దా" (సాష్టాంగప్రణామం) అంటారు. ఇది హిజ్రీ శకారంభానికి ఆరేడు సంవత్సరాల పూర్వం మక్కాలో అవతరించింది. ఇందులో దేవుని ఏకత్వం, ప్రవక్తదౌత్యం, పరలోకం వగైరా విషయాలను గురించి చర్చించడం జరిగింది.

**కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం**

అలిఫ్-లామ్-మీమ్. ఈ గ్రంథం సర్వలోక ప్రభువు నుండి అవతరించింది. ఇందులో ఎలాంటి సందేహం లేదు. (1,2)

వీరు "దీన్ని ఇతను కల్పించుకున్నాడ"ని అంటు న్నారా? కాదు. ఇది నీ ప్రభువు నుండి వచ్చిన సత్యం. నీకు పూర్వం హెచ్చరించే వారెవరూ రానటువంటి జాతిని నీవు హెచ్చరించేందుకు పంపబడిన సత్యమిది. దీని ద్వారా ఆ జాతిప్రజలు రుజుమార్గంలోకి వస్తారన్న లక్ష్యంతో అవతరించిన (పరమ) సత్యం. (3)

భూమ్యాకాశాలను, వాటిమధ్య ఉన్న సమస్త సృష్టిరాసుల్ని ఆరు రోజుల్లో సృష్టించి, ఆ తరువాత అధికార సింహాసనంపై అధిష్ఠించినవాడు (ఆ)దేవుడే.[1] ఆయన తప్ప మీకు మరెవరూ సహాయకుడూ, సంరక్షకుడూ లేరు. ఆయన అభీష్టానికి వ్యతిరేకంగా సిఫారసు చేసేవారు కూడా ఎవరూలేరు. (మరి ఇప్పుడైనా) మీరు స్పృహలోకి వస్తారా? (4)

నింగి నుండి నేల వరకు సమస్త విశ్వవ్యవహారాలకు సంబంధించిన నిర్ణయాలు ఆయనే తీసుకుంటాడు. వాటి వివరాలు మీ లెక్క ప్రకారం వేయి సంవత్సరాలకు సమాన మయిన ఒక దినం[2]లో ఆయన సన్నిధికి చేరుతాయి. (5)

1. ఇక్కడ 'రోజు' అంటే మనం లెక్కలోకి తీసుకునే 24 గంటల రోజయినా కావచ్చు; లేదా కాలం (Period) అయినా కావచ్చు. ఎందుకంటే మరొక చోట "నీ ప్రభువు దృష్టిలో ఒకరోజు మీ లెక్కప్రకారం వేయి సంవత్సరాలకు సమానం" (22:47) అని ఉంది. అలాగే వేరొకచోట "పరిశుద్ధాత్మ, (ఇతర) దైవదూతలు ఆయన సన్నిధికి యాభైవేల సంవత్సరాలకు సమానమైన ఒక (సుదీర్ఘ) దినంలో ఎక్కిపోతారు" (70:4,5) అని ఉంది. వాస్తవం దైవానికే తెలుసు.

దేవుడు భూమ్యాకాశాలను ఆరు రోజుల్లో సృష్టించి, ఆ తరువాత అధికార సింహాసనం అధిష్టించాడంటే, విశ్వనిర్వహణా కార్యాలను వదలి విశ్రాంతి తీసుకున్నాడని అర్థం కాదు. సృష్టి నిర్మాణం తరువాత ఆయన విశ్వంలోని యావత్తు చరాచరాలను, సృష్టిరాసులను పర్యవేక్షిస్తున్నాడని, పోషిస్తున్నాడని, పాలిస్తున్నాడని అర్థం.

2. సత్యాన్ని నిరాకరిస్తే దైవశిక్ష వచ్చిపడుతుందన్న ప్రవక్త హెచ్చరికను అవిశ్వాసులు ఖాతరు చేయకుండా "మేము ఎన్నోసార్లు నిన్ను వ్యతిరేకించాం. అనేక సంవత్సరాలు గడచి పోయాయి. కాని మామీద ఎలాంటి శిక్ష వచ్చిపడలేదే!" అని ఎత్తిపొడిచారు. అప్పుడు దేవుడు తన దృష్టిలో కొన్ని సంవత్సరాలు లెక్కలోకి రావు, మీ లెక్క ప్రకారం వెయ్యేండ్లు గడచినా తన దృష్టిలో అది ఒక్కరోజు మాత్రమేనని, అంతమాత్రాన సత్యతిరస్కారుల్ని వదలిపెట్టామని అర్థం కాదని తెలియజేస్తున్నాడు. (వివరాలకు 22:47, 70:4,5 సూక్తులు చూడండి.)

ఆయనే అంతర్‌బాహ్య విషయాలన్నీ ఎరిగినవాడు. ఆయన మహా శక్తిమంతుడు, అమిత దయామయుడు. ఆయన ప్రతిదాన్నీ సముచిత రీతిలో అద్భుతంగా సృష్టించాడు. ఆయన మానవ సృష్టిని మన్నుతో ఆరంభించాడు. తరువాత ఓ నీచమైన (వీర్య)బిందువుతో అతని సంతతిని ఉత్పత్తి చేయసాగాడు. ఆపై అతడ్ని పరిపూర్ణ మానవుడిగా రూపొందించి అతని (శరీరం)లో తన ఆత్మను ఊదాడు.[3] (ఒక్కసారి ఆలోచించండి.) ఆయన మీకు చెవు లిచ్చాడు, కళ్ళిచ్చాడు, హృదయాన్నిచ్చాడు. కాని మీరు మాత్రం (ఆయనకు) చాలా తక్కువగా కృతజ్ఞత చూపుతున్నారు. (6-9)

వీరు (నీమాటలు విని ఆశ్చర్యంతో) "మేము మట్టిలో కలసిపోయాక మళ్ళీ సృజించ బడతామా?" అని అడుగుతున్నారు. కాని వీరసలు తమ ప్రభువును కలుసు కునే విషయాన్నే నమ్మడం లేదు. వారికి చెప్పు: "మీకోసం నియమించబడిన మృత్యుదూత మీ ప్రాణాలు తీస్తాడు. తరువాత మిమ్మల్ని మీప్రభువు దగ్గరికి తీసుకు పోవడం జరుగుతుంది." (10,11)

ఈ పాపాత్ములు తమ ప్రభువు ముందు తలలు వంచి నిలబడినప్పుడు నీవు వారి పరిస్థితి చూడగలిగితే బాగుండు. అప్పుడు వారు (పశ్చాత్తాపపడుతూ) "ప్రభూ! మేము అంతా చూసుకున్నాం, విన్నాం. మమ్మల్ని వెనక్కి పంపించు. మేము సత్కార్యాలు చేస్తాం. ఇప్పుడు మాకు (బుద్ధొచ్చింది.) పూర్తిగా నమ్మకం కలిగింది" అనంటారు. (12)

"మేము తలచుకుంటే ప్రతి మనిషికీ సన్మార్గావలంబన బుద్ధి ప్రసాదించేవాళ్ళం. కాని నేను నరకాన్ని మానవులతో, జిన్నులతో నింపేస్తానని అన్నాను. నామాట నెరవేరింది. కనుక మీ చేష్టల పర్యవసానం చవిచూసుకోండిప్పుడు. ఈ దినం రాకను మీరు బుద్ధిపూర్వకంగానే విస్మరించారు. ఇప్పుడు మేము కూడా మిమ్మల్ని విస్మ రిస్తున్నాం. ఇక మీరు చేజేతులా చేసుకున్న కర్మలకు ఫలితంగా శాశ్వత (నరక) యాతనలు చవిచూడండి." (13,14)

---

3. ఇక్కడ మానవుని శరీరంలో దేవుడు తన ఆత్మను ఊదాడు అంటే, మానవులతో సహా యావత్తు సృష్టిరాసులు, చివరికి మానవుల ఆత్మలు సైతం దేవునివేనని, ఆ ఆత్మలను మానవుల శరీరంలో ఊదాడని అర్థం. విశ్వంలోని సమస్త వస్తువులకు దేవుడే యజమాని. అలాగే ఆత్మలకు కూడా ఆయనే యజమాని. మానవుని దగ్గర తనదంటూ ఏదీ లేదు. అతని ఆత్మ, శరీరం, శక్తి సామర్థ్యాలు అన్నీ దేవుడు ప్రసాదించినవే. ఆయన తలచుకున్నప్పుడు వాటిని తిరిగి తీసుకోగలడు. (ఇతర వివరాలకు 21:91 సూక్తి, దాని పాదసూచిక చూడండి.)

దేవుడు మానవునికి ఈ వస్తువులు ప్రసాదించడంతో పాటు వాటిని వినియోగించుకునే స్వేచ్ఛ కూడా ప్రసాదించాడు. అయితే వాటిని ఆయన అభీష్టం ప్రకారం సద్వినియోగం చేసు కున్నప్పుడే మానవుని జీవితం సార్థకమవుతుంది. అతను దైవప్రసన్నతకు అర్హుడవుతాడు. దేవుని అభీష్టం ఏమిటో ఆయన ప్రవక్తలు ప్రతి యుగంలో మానవాళికి తెలుపుతూ వచ్చారు. చివర్లో అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) దేవుని అభీష్టం ఏమిటో ఖుర్‌ఆన్ రూపంలో మానవాళి ముందుంచారు. ఇదే ఇప్పుడు ప్రళయందాకా మానవాళికి రుజుమార్గం, ముక్తిమార్గం.



కొందరు మాత్రం మాసూక్తులు విన్పించి హితోపదేశం చేయగానే వారు (అప్రయ త్నంగా) సాష్టాంగపడతారు. ఆపై తమ ప్రభువును స్తుతిస్తూ ఆయన్ని స్మరిస్తారు. అహంకారంతో విర్రవీగరు. వారు రాత్రిళ్ళు బాగా మేల్కొని దైవారాధనలో గడుపుతారు. ఆశతో, భయంతో తమ ప్రభువును వేడుకుంటారు. మేమిచ్చిన ఉపాధి నుండి (మా మార్గంలో) ఖర్చు పెడ్తారు. ఇలాంటి (సుగుణాలుకల)వారే మా సూక్తులు విశ్వసిస్తారు. వారు చేసుకున్న సత్కర్మలకు ప్రతిఫలంగా వారి కళ్లను చల్లబరిచే అపూర్వసామగ్రి వారికోసం దాచబడిఉంది.[4] దాన్ని గురించి ఏ మనిషికీ తెలియదు. (అది ఊహాతీతమైన అద్భుత మహాభాగ్యం.) (15-17)

సత్యాన్ని విశ్వసించినవాడు, దుర్మార్గుడైన వ్యక్తిలాంటి వాడు కాగలడా? వీరిద్దరు ఎన్నటికీ సమానులు కాలేరు. సత్యాన్ని విశ్వసించి సదాచార సంపన్నులయినవారికి వారి సత్కర్మలకు ప్రతిఫలంగా స్వర్గవనాల రూపంలో గొప్ప ఆతిథ్యం లభిస్తుంది. దుష్కార్యాలలో కూరుకుపోయిన వారికి మాత్రం నరక నివాసమే గతవుతుంది. ఆ నరకం నుండి బయట పడేందుకు ప్రయత్నించినప్పుడల్లా వారిని మళ్ళీ అందులోకే నెట్టివేయడం జరుగుతుంది. అప్పుడు (దైవదూతలు) వారితో "మీరు నరకాన్ని తిరస్క రిస్తుండేవారు కదూ! ఆ నరక శిక్షనే ఇప్పుడు చవిచూడండి" అంటారు. (18-20)

ఘోరమైన ఆ శిక్షకు పూర్వం ఇహలోకంలో కూడా మేము (ఏదో ఒక స్థాయిలో) వారికి శిక్షను చవిచూపిస్తూ ఉంటాము. దీని ద్వారానయినా వారు (తమ ద్రోహబుద్ధి) మాను కుంటారేమో చూడాలి. విశ్వప్రభువు సూక్తులు పఠించి హితోపదేశం చేస్తుంటే, వాటిని విన కుండా ముఖం తిప్పుకునేవాడికంటే పరమ దుర్మార్గుడెవరుంటారు? ఇలాంటి పాపాత్ములకు మేము తప్పకుండా ప్రతీకారం చేస్తాము. (21,22)

ఇంతకుపూర్వం మేము మూసాకు గ్రంథం ప్రసాదించాము. కనుక ఇప్పుడు అలాంటి వస్తువే లభించడం పట్ల నీవు అనుమానానికి గురికాకు. ఆ గ్రంథాన్ని మేము ఇస్రాయీల్ సంతతివారికి మార్గదర్శినిగా చేశాము. వారు (కష్టాలు ఎదురైనప్పుడు) సహనం వహిస్తూ, మా సూక్తులు విశ్వసిస్తున్నంత కాలం మేము వారిలో మా ఆజ్ఞల ప్రకారం వారికి మార్గదర్శకత్వం వహించే నాయకుల్ని ఉద్భవింపజేశాము. వారు పరస్పరం విభేదించుకుంటున్న విషయాల్ని గురించి ప్రళయదినాన నీ ప్రభువు తప్పకుండా తీర్పుచేస్తాడు. (23-25)

వీరికి పూర్వం మేము ఎన్ని జాతులను నాశనం చేశామో (ఆచారిత్రక సంఘటనల నుండి) వీరు ఎలాంటి గుణపాఠం నేర్చుకోలేదా? ఆ జాతులవారు నివసించిన ప్రాంతాల్లోనే వీరీనాడు తిరుగుతున్నారు కదా? ఇందులో గొప్ప నిదర్శనాలు ఉన్నాయి.

---

4. ఈసూక్తి గురించి దైవప్రవక్త (స) ఒక హదీసులో దేవుని మాటలుగా ఇలా తెలిపారు:

"నేను నా భక్తుల కోసం స్వర్గంలో ఎంతో అపురూపమయిన వస్తుసంపద దాచిపెట్టాను. వాటిని ఇంతవరకు ఎవరి కళ్ళూ చూడలేదు; ఎవరి చెవులూ వినలేదు. చివరికి మానవుని మనస్సు సయితం వాటిని గురించి ఊహించలేదు." (బుఖారి, ముస్లిం)

వీరు (మామాట) వినరా? మేము బంజరు నేలపైకి నీటిని తెచ్చి వర్షింపజేసి, ఆ నేల నుండి పంటలుపండిస్తూ ఉండటాన్ని వీరు ఏనాడూ గమనించలేదా? ఆ పంటల నుండి (ధాన్యం) వీరూ తింటున్నారు; వీరి పశువులకూ మేత లభిస్తుంది కదా? మరి వీరికి (దీని ద్వారా) ఏమీ తట్టడం లేదా? (26,27)

"నీవు చెప్పేది నిజమైతే (శిక్ష గురించిన) ఈ నిర్ణయం ఎప్పుడు అమల్లోకి వస్తుందీ?" అంటారు వీరు. "ఆ నిర్ణయం అమల్లోకి వచ్చే రోజు తిరస్కారులు సత్యాన్ని విశ్వసించడం వల్ల వారికి ఎలాంటి ప్రయోజనం ఉండదు. మరో అవకాశం కూడా లభించదు" అని చెప్పు. సరే (వారు తిరస్కార వైఖరి మానుకోకపోతే) వారిమానాన వారిని వదలిపెట్టి (నిర్ణయం కోసం) ఎదురుచూస్తూ ఉండు. వారు కూడా ఎదురు చూస్తూ ఉంటారు. (28-30) ✪

# 33. సైనికదళాలు (అహ్‌జాబ్)

**అవతరణ: మదీనా** **సూక్తులు: 73**

ఈ అధ్యాయాన్ని "అహ్‌జాబ్" అంటారు. ఇది హిజ్రీశకం ఐదవ ఏట అవతరించింది. ఉహుద్ యుద్ధం తరువాత రెండేళ్ళ దాకా అటు మక్కా అవిశ్వాసులు, ఇటు మదీనాలో యూదులు, కపటవిశ్వాసులు అనేక సమస్యలు సృష్టిస్తూ దైవప్రవక్త (సల్లం)ను సమాజ సంస్కరణకై క్షణం తీరిక లేకుండా చేశారు. యూదులు దైవప్రవక్తతో చేసుకున్న స్నేహఒప్పందం ఉల్లంఘించి మక్కా బహుదైవారాధాకులతో కుమ్మక్కయి ముస్లింలకు వ్యతిరేకంగా వారిని అహ్జాబ్ యుద్ధానికి పురిగొల్పారు. ఈ యుద్ధం తరువాత ఒప్పందం ఉల్లంఘించిన యూదులపై సైనికచర్య తీసుకోవడం జరిగింది. ఆ తరువాత ఈ అధ్యాయం అవతరించినట్లు తెలుస్తోంది.

ఇందులో పైరెండు యుద్ధాలతో పాటు దైవప్రవక్త (సల్లం), హజ్రత్ జైనబ్ (రజి)ల వివాహాలను గురించి ప్రస్తావించబడింది. ఆ తర్వాత సభ్యతా సంస్కృతులు, పరదా వ్యవస్థను గురించి నూతన ఆదేశాలు ఇవ్వబడ్డాయి. ఈ అధ్యాయాన్ని పూర్తిగా అర్థం చేసుకోవడానికి దీని పూర్వపరాలను సంక్షిప్తంగానైనా తెలుసుకోవాల్సిన అవసరముంది.

హిజ్రీ 3వ ఏట, షవ్వాల్ నెలలో జరిగిన ఉహుద్ యుద్ధంలో ముస్లింలకు అంతిమ విజయం చేకూరినప్పటికీ, విలుకాండ్రు చేసిన ఒక పొరపాటువల్ల చావు తప్పి కన్ను లొట్టపోయినట్లయింది వారి పరిస్థితి. దాంతో శత్రువులు మరోసారి దుస్సాహసానికి పాల్పడే ప్రయత్నాలు ప్రారంభించారు. ఉహుద్ యుద్ధం ముగిసిన రెండు నెలలకే 'నజద్' ప్రాంతానికి చెందిన బనీఉసద్ అనే తెగ మదీనాపై దాడిచేయడానికి సన్నాహాలు చేయసాగింది. ఈ సమాచారం తెలుసు కున్న దైవప్రవక్త (సల్లం) వారిని అడ్డుకోవడానికి ఒక సైనికదళం పంపవలసి వచ్చింది.

ఆ తరువాత హిజ్రీ 4 వ సంవత్సరం సఫర్ నెలలో అజల్, ఖారా అనే తెగలకు చెందిన కొందరు వ్యక్తులు మదీనా వచ్చి, తమ ప్రజలకు ఇస్లాం ధర్మం బోధించడానికి కొందరు బోధకుల్ని తమ వెంట పంపవలసిందిగా దైవప్రవక్త (సల్లం)ను అభ్యరించారు.



ఆయన వారి అభ్యర్థనను మన్నించి వారి వెంట ఆరుగురు సహాబీలను (అనుచరుల్ని) పంపించారు. అయితే ఆ దుర్మార్గులు దారిలో ఈ ఆరుగురు అమాయక ముస్లింలను మోసగించి వారి మీదికి హుజైల్ తెగవారిని ఉసిగొల్పారు. వారు నలుగురిని చంపి, ఇద్దర్ని మక్కా తీసికెళ్ళి శత్రువులకు అమ్మివేశారు. వారా ఇద్దర్ని కూటికి మాడ్చి, చిత్ర హింసలు పెట్టి చంపేశారు.

ఆ నెలలోనే బనీఆమిర్ తెగ నాయకుని విజ్ఞప్తిపై దైవప్రవక్త (స) ధర్మబోధ కోసం 40 మంది అనుచరుల్ని నజద్ ప్రాంతం వైపు పంపించారు. కాని వారు కూడా మోసానికి గురయి చంపబడ్డారు. దారిలో ఒకచోట బనీసులైమ్ తెగకు చెందిన మూడు ఉపతెగలు ఉసయ్యి, రీల్, జక్వాన్ కలసి వారిని చుట్టుముట్టి దారుణంగా హతమార్చారు.

ఆ రోజుల్లోనే బనీనజీర్‌తెగ తన విద్వేషాన్ని బహిరంగంగా వెళ్ళగక్కుతూ మదీనాలో అశాంతి, అలజడులు సృష్టించడానికి పాల్పడింది. చివరికి ఆ తెగ యూదులు దైవప్రవక్త (సల్లం)ను సంహరించడానికి కూడా కుట్రపన్నారు. దేవుడు ఆయన్ని వారి కుట్ర నుండి కాపాడాడు. తరువాత దైవప్రవక్త (సల్లం) తన అల్టిమేటంను సైతం ఖాతరుచేయక పోవడంతో వారిని మదీనా నుండి బహిష్కరించారు. (ఈ సంఘటన వివరాలకు 59వ అధ్యాయం (హష్ర్) ఉపోద్ఘాతం చూడండి.)

బనీనజీర్ తెగయూదులు విశ్వాసఘాతుక చర్యలకు పాల్పడుతున్న సందర్భంలోనే నజద్ ప్రాంతంలోని గత్ఫాన్ తెగవాళ్ళు మదీనాపై దాడిచేయడానికి సన్నాహాలు ప్రారంభించారు. అందువల్ల దైవప్రవక్త (స) బనీనజీర్ బహిష్కరణ జరిగిన వెంటనే నాలుగు వందల మంది యోధులతో వెళ్ళి దాడిచేసి వారిని కొండల్లోకి తరిమేశారు.

ఆ తరువాత ఉహుద్ యుద్ధం ముగింపు సందర్భంలో ఖురైష్ నాయకుడు అబూ సుఫ్యాన్ విసిరిన సవాలు స్వీకరించి దైవప్రవక్త (సల్లం) దాని ప్రకారం 1500 మంది యోధుల్ని తీసుకొని బద్ర్ ప్రాంతానికి వెళ్ళారు. అటు అబూసుఫ్యాన్ 2000 మంది సైనికులతో మక్కా నుండి బయలుదేరాడు. కాని అతను ముస్లింలను ఎదుర్కొనే ధైర్యం చాలక తిరిగి వెళ్ళిపోయాడు. దైవప్రవక్త (సల్లం) బద్ర్‌లో ఎనిమిది రోజులు అబూసుఫ్యాన్ కోసం ఎదురుచూసి అతను రాక పోవడంతో మదీనా తిరిగొచ్చారు. ఈ సంఘటనతో యావత్ అరేబియా ముస్లిమేతరుల హృదయాల్లో ముస్లింల సైనికశక్తి పట్ల భయాందోళనలు చోటుచేసుకున్నాయి.

ఆ రోజుల్లోనే వారి భయాన్ని మరింత అధికంచేసే మరోసంఘటన జరిగింది. అరేబియా, సిరియా సరిహద్దుపై 'దూమతుల్ జందల్' అనే ప్రాంతం సిరియా, ఈజిప్టు, ఇరాఖ్‌ల మధ్య వాణిజ్య రాకపోకలకు ప్రధాన కూడలిగా ఉండేది. అయితే ఆ ప్రాంతం వాళ్ళు వ్యాపారస్తుల్ని బెదిరించి, వేధించి వారి వ్యాపార సామగ్రిని దోచుకునేవారు. అందువల్ల దైవప్రవక్త (స) వారి ఆగడాలను అంతమొందించడానికి హి.శ. 5వ యేట రబీవుల్ మాసంలో వేయిమంది యోధుల్ని తీసుకొని ఆ ప్రాంతానికి వెళ్ళారు. వారు ముస్లింల ధాటికి నిలువలేక పారిపోయారు.

స్వల్పకాలంలో సంభవించిన ఈ విజయాలతో యావత్తు అరబ్ తెగలు నీరుకారి పోయాయి. ఇస్లాం ఇప్పుడు అజేయశక్తిగా ఎదిగిందని, ఒకటి రెండు తెగలు దాన్ని

ఎదుర్కోలేవని అరబ్బులు గ్రహించారు. అందువల్ల ఇస్లాంను తుడిచిపెట్టేందుకు మొత్తం తెగలు ఏకమయి దాడిచేయాలని నిర్ణయించుకున్నాయి. మదీనా నుండి బహిష్కృతులై ఖైబర్‌లో స్థిరపడిన బనీనజీర్ తెగ(యూద) నాయకులు మక్కా ఖురైషుల్లో తీవ్రమైన ప్రతీకార జ్వాలలు రేకెత్తించారు. దాంతో హి.శ. 5వ సంవత్సరం షవ్వాల్‌లో కనివిని ఎరగనంతటి గొప్పసైన్యం మదీనాపై దాడిచేయడానికి సిద్ధమయింది. ఖురైషీయులు కూడా 12,000 మంది భారీ సైన్యంతో బయలుదేరారు.

ఈ సంగతి తెలుసుకున్న దైవప్రవక్త (స) నగరం చుట్టూ కందకం త్రవ్వించారు. యుద్ధతంత్రంగా కందకం గురించి అరబ్బులకు అప్పటిదాకా ఏమీ తెలియదు. అందువల్ల మక్కా ఖురైషీయులు ఈ కందకం చూసి నిర్ఘాంతపోయారు. కందకం దాటి నగరంలోకి చొచ్చుకొని రావడానికి వారు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. ఇక వారికి ఒకేఒక మార్గం మిగిలింది. మదీనా సమీపంలో ఆగ్నేయదిక్కున ఉన్న ఖురైజా తెగ యూదుల్ని ముస్లింల నుండి తమ వైపు తిప్పుకోవడానికి ప్రయత్నించారు. ఖురైజా తెగ యూదులు కూడా ముస్లింలతో చేసుకున్న స్నేహఒప్పందానికి తిలోదకాలిచ్చి ఖురైషీయులతో చేతులు కలపడానికి సిద్ధమయ్యారు.

ఈ విధంగా నగరం వెలుపల నుండి కయ్యానికి కాలుదువ్వుతున్న బహుదైవారాధకులు, నగరం లోపల స్నేహఒప్పందం ఉల్లంఘించి విశ్వాసఘాతుకానికి పాల్పడిన యూదులు కలసి ముస్లింలకు పెద్ద ముప్పుగా పరిణమించారు. దీనికితోడు పుండుమీద కారం చల్లినట్లు కపటవిశ్వాసులు కూడా ఇస్లాంవ్యతిరేక కార్యకలాపాలు ముమ్మరం చేశారు. వారు బహుదైవారాధకుల సైనిక సంఖ్యను చూపి ముస్లింలను నిరుత్సాహ పరచడానికి, వారిలో అపార్థాలు సృష్టించడానికి ప్రయత్నించారు. అయితే అలాంటి క్లిష్ట పరిస్థితిలో సైతం దైవప్రవక్త (సల్లం) చాకచక్యంతో వ్యవహరిస్తూ ముస్లింలలో ధైర్య స్థయిర్యాలు కలిగించారు.

ఇదిలా ఉండగా అటు బహుదైవారాధకుల్లో గత్ఫాన్ తెగకు చెందిన "నయీమ్ బిన్ మస్వూద్" అనే ఓ వ్యక్తికి దేవుడు ఇస్లాంస్వీకార భాగ్యం ప్రసాదించి ముస్లింల పక్షాన రంగంలోకి దించాడు. నయీమ్ (రజి) దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి, తాను ఇస్లాం స్వీకరించినట్లు ఇంకా ఎవరికీ తెలియదు గనక, తనను ఏదైనా పనికోసం వినియోగించుకో వలసిందిగా మనవి చేశారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) "అయితే నువ్వెళ్ళి శత్రువుల మధ్య విభేదాలు సృష్టించి వారిని చీల్చడానికి ప్రయత్నించు" అని ఆదేశించారు.

ఈ ఆదేశంతో నయీమ్ (రజి) మొట్టమొదట బనీ ఖురైజాతెగ యూదుల దగ్గరకు వెళ్ళి "ఖురైషీయులు, గత్ఫాన్ తెగవాళ్ళు సుదీర్ఘ ముట్టడితో విసిగిపోయి యుద్ధరంగం నుండి వెళ్ళిపోతే మీరు స్నేహఒప్పందం ఉల్లంఘించినందుకు ప్రమాదంలో పడిపోతారు. అంచేత బయట నుండి వచ్చిన తెగల్లో నుంచి కొందరు ప్రముఖ వ్యక్తుల్ని మీ దగ్గరికి తాకట్టు బందీలుగా పంపనంత వరకు మీరు యుద్ధంలో పాల్గొబోరని గత్ఫాన్, ఖురైష్ నాయకులకు కబురు పంపండి" అని సలహా ఇచ్చారు. ఈ సలహా వారికి నచ్చింది. హజ్రత్ నయీమ్ (రజి) వెంటనే అక్కడ్నుంచి బయలుదేరి ఖురైష్ నాయకుల దగ్గరకు వెళ్ళారు. వారితో కూడా ఆయన యుద్ధ పరిస్థితిని గురించి మాట్లాడుతూ "బనీఖురైజా



యూదులు సుదీర్ఘ ముట్టడితో ఢీలాపడినట్లు కన్పిస్తోంది. వారు మీదగ్గర కొందర్ని తాకట్టు బందీలుగా అడిగి తీసుకొని వారిని ముహమ్మద్ (సల్లం)కు అప్పగించి తమ వ్యవహారం పరిష్కరించుకోవడానికి ప్రయత్నించినా ఆశ్చర్యం లేదు. అంచేత వారిపట్ల కాస్త జాగ్రత్తగా వ్యవహరించడం మంచిది" అని అన్నారు.

ఖురైష్, గత్ఫాన్ నాయకులు నయీమ్ (రజి) మాటలతో బనీఖురైజా యూదుల్ని అనుమానిస్తూ సందిగ్ధంలో పడిపోయారు. వెంటనే వారొక నిర్ణయానికి వచ్చి "మేమీ సుదీర్ఘ ముట్టడితో విసిగిపోయాము. ఇప్పుడిక సర్వశక్తులు ఒడ్డి పోరాడి అటో ఇటో తేల్చుకోవాలి. కనుక రేపు ఇటు నుంచి మేము, అటునుంచి మీరు ఒకేసారి దాడిచేసి ముస్లింలపై మనం మూకుమ్మడిగా విరుచుకుపడదాం" అని బనీఖురైజా నాయకులకు సమాచారం పంపారు.

నయీమ్ (రజి) మాటలతో ఇంతకుముందు నుంచే వారిని అనుమానిస్తున్న బనీఖురైజా యూదులు ఈ సందేశంతో ఆగ్రహోదగ్రులయి "మీరు కొందరు ప్రముఖ వ్యక్తుల్ని మా దగ్గర తాకట్టు బందీలుగా పంపనంతవరకు మేము యుద్ధప్రమాదం కొని తెచ్చుకో దలచలేదు" అని సమాధానమిచ్చారు. ఖురైష్, గత్ఫాన్ నాయకులు నయీమ్ ఇచ్చిన సలహాను నెమరేసుకుంటూ, తమవారిని బందీలుగా వారికివ్వడానికి నిరాకరించారు. దాంతో బనీఖురైజా యూదులు తమకు నయీమ్ (రజి) మంచి సలహాయే ఇచ్చాడని భావించారు.

ఈ విధంగా హజ్రత్ నయీమ్ (రజి) పన్నిన యుద్ధ తంత్రం ఫలించి శత్రుసేనల ఐక్యసంఘటన నిట్టనిలువుగా చీలిపోయింది.

ముట్టడి 25 రోజులకు పైగా సాగినా సమస్య ఓకొలిక్కి రాలేదు. అది ఎముకలు కొరికే చలికాలం. విపరీతమైన చలితో రాత్రివేళలు శత్రుసేనలకు చాలా దుర్భరంగా పరిణమించాయి. వెంట తెచ్చుకున్న ఆహారసామగ్రి, పశువుల మేత చాలావరకు తరిగిపోయింది. వీటికి తోడు విభేదాలు వచ్చి యూదులు తమతో కలసిరానందున కూడా బహుదైవారాధక సైనికుల్లో ధైర్యం సన్నగిల్లింది. ఈ పరిస్థితిలో ఓరోజు రాత్రి హఠాత్తుగా పెనుతుఫాను విరుచుకుపడింది. తీవ్రమైన వేగంతో వీస్తున్న ఈదురుగాలి, గజగజ వణికిస్తున్న చలి, కళ్ళు చించుకున్నా కానరాని కటికచీకటి, ఉరుములు మెరుపులతో పరిస్థితి చాలా భయానకంగా తయారయింది. గుడారాలు, వంటసామగ్రి గాలి తాకిడికి ఎగిరిపోసాగాయి. దాంతో శత్రుసైనికుల్లో తీవ్రమైన గందరగోళం ఏర్పడింది. వారు ఏం చేయాలో దిక్కుతోచక చివరికి పెడబొబ్బలు పెడుతూ ప్రాణాలు అరచేత పట్టుకొని బ్రతుకు జీవుడా అంటూ పారిపోయారు.

మరునాడు ఉదయం తుఫాను ఉధృతం తగ్గిన తర్వాత ముస్లింలు వెళ్ళిచూస్తే అక్కడ ఒక్క పురుగూ లేదు. యుద్ధమైదానం ఖాళీగా పడిఉంది. ముస్లింలు అది చూసి చల్లగా ఊపిరి పీల్చుకున్నారు. దైవప్రవక్త (సల్లం) ఆ నిర్జన ప్రదేశం చూసి "ఇప్పుడిక ఖురైషీయులు మీమీద ఎన్నటికీ దాడిచేయడానికి రాలేరు. మీరే వారిపై దాడిచేయడానికి వెళ్తారు" అన్నారు అనుచరులతో. ఈ యుద్ధాన్ని అహ్జాబ్ యుద్ధమంటారు. దీన్ని ఖందఖ్ (కందకం) యుద్ధమని కూడా అంటారు.

దైవప్రవక్త (సల్లం) యుద్ధరంగం నుండి మధ్యాహ్నం ఇంటికి తిరిగొచ్చారు. రాగానే దైవ దూత హజ్రత్ జిబ్రీల్ (అలై) ప్రత్యక్షమయి ఆయుధాలు అప్పుడే దించకూడదని, బనీఖురైజా వ్యవహారం ఇంకా మిగిలివుందని, వీళ్ళను కూడా ఇప్పుడే అణచివేయాలని దైవాజ్ఞ విన్పించారు.

ఈ ఆజ్ఞతో దైవప్రవక్త (సల్లం) తక్షణమే ఒక ఉత్తర్వు జారీచేస్తూ దైవధర్మంలో స్థిరంగా ఉన్న ముస్లిం యోధులంతా బనీఖురైజా యూదుల వాడకు చేరుకోనంత వరకూ ఈరోజు అస్ర్ నమాజు చేయకూడదని అన్నారు. మరోవైపు ఆయన హజ్రత్ అలి (రజి)కు ఒక చిన్న సైనికదళం ఇచ్చి పంపారు. ఈ సైనిక దళం యూదులవాడ సమీపానికి చేరుకోగానే యూదులు కోటగోడలు ఎక్కి తమను బెదిరించడానికి మాత్రమే ఈ చిన్న దళం వస్తోందని భావించి, ముస్లింలను నానా దుర్భాషలాడటం ప్రారంభించారు.

కాని ఆ తర్వాత కాస్సేపటికే ప్రవక్త నేతృత్వంలో భారీ సైన్యం రావడంతో వారి గుండెలు గుభేలుమన్నాయి. వెంటనే వారు కోటద్వారాలు మూసేసుకొని, దుర్భేద్యమైన ఈ కోటలే తమను రక్షిస్తాయని భావించారు. ముస్లింలు కోటలు ముట్టడించి యుద్ధం ప్రారంభించారు. యూదులు కోటబురుజుల నుండి ఈదాడిని ఎదుర్కోవడానికి యత్నించారు. ఇలా ముట్టడి మూడువారాలు కొనసాగింది. చివరికి యూదులు నీరుకారిపోయి ఒక షరతుపై ముస్లింలకు లొంగిపోయారు.

ఈషరతు ప్రకారం ఔస్‌తెగ నాయకుడు హజ్రత్ సాద్ బిన్ ముఆజ్ (రజి)ని మధ్యవర్తిగా నియమించి ఆయన చేసే నిర్ణయానికి ఉభయపక్షాలు కట్టుబడి ఉండాలి. పూర్వం నుండి దశాబ్దాలుగా బనీఖురైజా యూదులకు, ఔస్‌తెగ వారికి మధ్య స్నేహ సంబంధాలు సాగుతూ వస్తున్నందున, సాద్ (రజి) తమ పట్ల మృదువుగా వ్యవహరిస్తూ బనీనజీర్, బనీఖైనుఖా తెగల మాదిరిగా తమను కూడా మదీనా వదలి వేరే ప్రాంతాలకు వెళ్ళిపోవడానికి వీలుకల్పిస్తారని ఆశించారు.

(బనీనజీర్, బనీఖైనుఖా తెగల బహిష్కరణకు సంబంధించిన వివరాలు 59వ అధ్యాయం (హష్ర్) ఉపోద్ఘాతం చూడండి.)

అయితే సాద్ (రజి) వారి ఆశలకు భిన్నంగా తీర్పిచ్చారు. భారీ సేనలతో విదేశీ శక్తులు నగరాన్ని ముట్టడించిన అతిక్లిష్ట పరిస్థితిలో బనీఖురైజా యూదులు స్నేహ ఒప్పందం ప్రకారం ముస్లింలతో సహకరించ వలసిందిపోయి, శత్రువులతో కుమ్మక్కయి విద్రోహానికి పాల్పడ్డారు. అందువల్ల అలాంటి విద్రోహుల్ని ప్రాణాలతో వదలిపెట్టకూడదని ఆయన భావించారు. ఈ భావనతో ఆయన, వారి పురుషుల్ని వధించి స్త్రీలను, పిల్లలను బానిసలుగా చేసుకోవాలని, వారి ఆస్తిపాస్తుల్ని ముస్లింలకు పంచాలని తీర్పిచ్చారు. ఈ తీర్పును వెంటనే అమలుపరచడం జరిగింది.

ఆ తరువాత ముస్లింలు కోటలోనికి ప్రవేశించి యూదుల ఇండ్లను సోదాచేస్తే 1500 ఖడ్గాలు, 2000 ఈటెలు, మరెన్నో కవచాలు, డాళ్ళు బయటపడ్డాయి. వీటన్నిటినీ వారు ముస్లింలపై ప్రయోగించడానికి సేకరించారు. దీన్నిబట్టి హజ్రత్ సాద్ (రజి) ఇచ్చిన తీర్పు పూర్తిగా న్యాయమైనదని తెలుస్తోంది.

ఇవీ ఈ అధ్యాయం అవతరణ పూర్వపరాలు.



## కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

ప్రవక్తా! దేవునికి భయపడు. అవిశ్వాసులు, కపటులు చెప్పినట్లు నడచుకోకు. దేవుడే సమస్తం తెలిసినవాడు, మహా వివేకవంతుడు. నీ ప్రభువు నుండి సూచించబడుతున్న విషయాలను అనుసరించు. మీరు చేసే ప్రతిపనీ దేవునికి తెలుసు. దేవుణ్ణే నమ్ముకొని ఆయన మీదభారం వెయ్యి. కార్యసాధనకు దేవుడొక్కడే చాలు. (1-3)

ఏ మనిషి దేహంలో కూడా దేవుడు రెండు హృదయాలు ఉంచలేదు. మీరు మీ భార్యలను వదిలించుకోవడానికి, నీవు నాకు తల్లివంటి దానవని అన్నంత మాత్రాన దేవుడు ఆమెను మీకు తల్లిగా చేయడు. అలాగే ఆయన మీ పెంపుడు కొడుకుల్ని కూడా సొంత కొడుకులుగా చేయలేదు. ఇవన్నీ మీరు కల్పించుకున్న మాటలే. దేవుడు సత్యంతో కూడిన మాట చెబుతున్నాడు. ఆయనే మీకు సరైన మార్గం చూపేవాడు. (4)

పెంపుడు కొడుకుల్ని వారి కన్నతండ్రుల సంబంధంతోనే పిలవండి. ఇదే దేవుని దృష్టిలో న్యాయమైన విషయం. ఒకవేళ వారి కన్నతండ్రులెవరో మీకు తెలియకపోతే వారిని మీ ధార్మిక సోదరులుగా, స్నేహితులుగా పరిగణించండి. తెలియక చేసినదాన్ని గురించి మీపై ఎలాంటి దోషం లేదు. అయితే కావాలని చేస్తే మాత్రం మీరు తప్పకుండా పట్టుబడిపోతారు. (పూర్వం జరిగిందేదో జరిగిపోయింది.) దేవుడు క్షమాశీలి, దయామయుడు. (5)

దైవప్రవక్త (సల్లం) విశ్వాసులకు వారి ప్రాణాలకన్నా ఎంతో సన్నిహితుడు. దైవప్రవక్త భార్యలు వారికి మాతృమూర్తుల్లాంటివారు. అయితే దైవగ్రంథం ప్రకారం తోటి విశ్వాసులు, శరణార్థులకన్నా బంధువులే పరస్పరం ఎక్కువ హక్కుదారులు. కాకపోతే మీరు మీ స్నేహితులకు ఏదైనా మేలు చేయదలుచుకుంటే నిరభ్యంతరంగా చేయవచ్చు. ఈఆజ్ఞ దైవగ్రంథంలో వ్రాయబడి ఉంది. (6)

ప్రవక్తా! మేము యావత్ ప్రవక్తల చేత చేయించిన ప్రమాణం జ్ఞప్తికి తెచ్చుకో. మేము నీచేత కూడా ప్రమాణం చేయించాము. నూహ్, ఇబ్రాహీం, మూసా, మర్యం కుమారుడు ఈసా (అలైహి)ల చేత కూడా ప్రమాణం చేయించాము. నిజాయితీపరులకు వారి నిజాయతీ, విశ్వసనీయతలను గురించి ప్రశ్నించడానికి మేము అందరిచేతా పటిష్ఠమైన ప్రమాణం చేయించాం. అవిశ్వాసులకు మాత్రం మేము ఘోరయాతనలు సిద్ధపరచి ఉంచాము. (7,8)

విశ్వాసులారా! మీకు దేవుడు చేసిన మేలు గుర్తుకు తెచ్చుకోండి. మీపైకి (శత్రు) సైన్యాలు దాడిచేయడానికి వచ్చినప్పుడు, మేము వారి మీదికి పెనుతుఫాన్ పంపాము. పైగా (మీకంటికి కన్పించని అదృశ్య సైనికుల్ని (దైవదూతల్ని) కూడా పంపాము. (9)

ఆ సమయంలో మీరు ఏం చేస్తుండేవారో దేవుడు ఓకంట గమనిస్తుండేవాడు. వారు మీపైకి క్రిందినుంచి, పైనుంచి దాడి చేయడానికి వచ్చారు. (అది అతిక్లిష్ట పరిస్థితి.) అప్పుడు (ముస్లిం)జనం భయంతో కళ్ళు తేలవేశారు. వారి గుండెలు దడదడ

కొట్టుకోసాగాయి. దేవుని విషయంలో మీరు రకరకాలుగా అనుమానించసాగారు. అప్పుడు విశ్వాసులు కఠినాతికఠిన పరీక్షకు గురయిపోయారు; ఘోరాతిఘోరంగా కుదిపివేయబడ్డారు. (10,11)

కపటులను గురించి, హృదయాల్లో రోగమున్నవారిని గురించి కూడా గుర్తుకు తెచ్చుకోండి. వారు "దేవుడు, ఆయన ప్రవక్త చేసిన వాగ్దానాలన్నీ బూటకం, మోసం తప్ప మరేమీ లేద"ని తెగేసి చెప్పారు. వారిలో కొందరు (ఈఅగ్నికి ఆజ్యంపోస్తూ) "యస్రిబ్ (మదీనా) వాసులారా! ఇక మీరిక్కడుండే అవకాశం సన్నగిల్లి పోయింది. వెనక్కి మరలండి" అన్నారు.

వారిలో ఒక వర్గం "మాఇళ్ళు ప్రమాదంలో చిక్కుకున్నాయి" అంటూ వెళ్ళిపోవ డానికి ప్రవక్తను అనుమతి అడిగింది. నిజానికి వారి ఇళ్ళు ఎలాంటి ప్రమాదంలో చిక్కు కోలేదు. వారసలు (యుద్ధరంగం నుండి) పారిపోదలిచారు. (12,13)

ఒకవేళ నగరం నలువైపుల నుండి శత్రువులు లోపలికి చొచ్చుకొనివస్తే, అప్పుడీ కపటులు అరాచకం సృష్టించడానికి పిలిస్తే వెంటనే వీరు ఆ రంగంలోకి దూకుతారు. ఆ సంక్షోభంలో చేరి దాన్ని ఎగదోయడానికి వీరు ఏమాత్రం వెనకాడరు. గతంలో వారు (యుద్ధరంగం నుండి) పారిపోమని దేవుని సన్నిధిలో ప్రమాణం చేశారు. దేవుని సన్నిధి లో చేసిన ప్రమాణం గురించి (వారిని) తప్పక నిలదీయడం జరుగుతుంది. (14,15)

ప్రవక్తా! ఇలా చెప్పెయ్యి: "మృత్యువు లేక వధ నుండి పారిపోతే, ఈ పారిపోవడం మీకు ఎలాంటి ప్రయోజనం కలిగించదు. ఆ తర్వాత జీవితసౌఖ్యాలు జుర్రుకోవడానికి మీకు కొద్ది అవకాశమే లభిస్తుంది." వారినిలా అడుగు: "దేవుడు మీకు నష్టం కలిగించ దలచుకుంటే ఆయన పట్టునుండి మిమ్మల్ని ఎవరు కాపాడగలరు? ఒకవేళ దేవుడే మిమ్మల్ని అనుగ్రహించదలిస్తే ఆయన అనుగ్రహాన్ని ఎవరు అడ్డుకోగలరు?" దేవునికి వ్యతిరేకంగా వీరికి ఎలాంటి సంరక్షకుడూ, సహాయకుడూ లభించడు. (16,17)

మీలో ఆటంకాలు సృష్టించేవారెవరో దేవునికి బాగా తెలుసు. వారు తమ సోదరులతో "(ఇక ఆ ప్రవక్తను వదిలేసి) మా దగ్గరకు వచ్చేయండి" అంటారు. ఒకవేళ వారు యుద్ధంలో పాల్గొన్నా నామమాత్రంగా పాల్గొంటారు. పైగా మీకు తోడ్పడటంలో పిసినారితనం వహిస్తారు. ప్రమాదం వచ్చిపడినప్పుడు చచ్చిపోయేవాడు గుడ్లు తేలవేసి నట్లు వారు నీవైపు నిలువుగుడ్లు వేసి చూస్తారు. అయితే ఆ ప్రమాదం కాస్తా తప్పిపోగానే లాభాల పేరాశతో రంకెలు వేసుకుంటూ మీ దగ్గరకు వస్తారు. వీరసలు (సత్యాన్ని) విశ్వసించనే లేదు. అందుకే దేవుడు వారి కర్మలన్నిటిని వ్యర్థం చేశాడు. ఇలా చేయడం ఆయనకు చాలా తేలిక. (18,19)

వీరు శత్రుసేనలు (యుద్ధరంగం వదలి) ఇంకా వెళ్ళిపోలేదని అనుకుంటున్నారు. వారు మళ్ళీ దాడిచేస్తే, అప్పుడు వీరు ఏ ఎడారిప్రాంతానికో వెళ్ళి దేశదిమ్మరుల మధ్య (హాయిగా)కూర్చొని (ఇక్కడి) మీపరిస్థితుల్ని గురించి తెలుసుకోవాలని భావిస్తున్నారు. ఒకవేళ వీరు మీ దగ్గరున్నా యుద్ధంలో నామమాత్రంగానే పాల్గొంటారు. (20)



(విశ్వాసులారా!) దైవప్రవక్త (జీవనసరళి)లో మీకు మంచి ఆదర్శం ఉంది. దేవుడ్ని, అంతిమదినాన్ని నమ్మి, దేవుడ్ని అత్యధికంగా స్మరించేవారికి ఈ ఆదర్శం ఎంతగానో ఉపయోగపడుతుంది. నిజమైన విశ్వాసులు శత్రుసేనల్ని చూడగానే "దేవుడు మనకు దీన్ని గురించే వాగ్దానం చేశాడు. దేవుడు, ఆయనప్రవక్త చేసిన వాగ్దానం నిజమైనది" అన్నారు (సంతోషంతో). ఈ సంఘటన వారి విశ్వాసాన్ని, అంకితభావాన్ని మరింత వృద్ధి చేసింది. (21, 22)

విశ్వాసులలో కొందరు దేవుని సన్నిధిలో చేసిన ప్రమాణం నెరవేర్చినవారున్నారు. కొందరు (తమ సర్వస్వం ధారపోయడం ద్వారా) తమ మొక్కుబడి తీర్చుకున్నారు. మరి కొందరు సమయంకోసం నిరీక్షిస్తున్నారు. వారు తమ వైఖరిలో ఎలాంటిమార్పు రానివ్వ లేదు. దేవుడు సత్యసందులకు వారి సత్యసంధత, విశ్వసనీయతలకు తగిన ప్రతిఫలం ఇవ్వడానికే (ఇదంతా జరిగింది). కపటుల్ని మాత్రం ఆయన తలచుకుంటే శిక్షిస్తాడు; లేదా క్షమించి వదిలేస్తాడు. దేవుడు గొప్ప క్షమాశీలి, అమిత దయామయుడు. (23,24)

దేవుడు సత్యతిరస్కారుల ముఖాలను వెనక్కి తిప్పివేశాడు. వారు మనసులో కసి నింపుకొని ఎలాంటి ప్రయోజనం సాధించకుండానే ఉత్తచేతులతో వచ్చినదారే వెళ్ళి పోయారు. విశ్వాసుల తరపున పోరాడేందుకు ఒక్క దేవుడే సరిపోయాడు. దేవుడు ఎంతో బలాఢ్యుడు, మహా శక్తిమంతుడు. (25)

గ్రంథప్రజలలో శత్రుసేనలకు తోడ్పడినవారిని దేవుడు వారి కోటల నుండి బయటికి తీశాడు. వారి హృదయాల్లో (మీపట్ల) భయోత్పాతం సృష్టించాడు. ఈ కారణం గానే ఈరోజు మీరు వారిలో కొందరిని హతమార్చి, మరికొందరిని బందీలుగా పట్టుకో గలిగారు. అంతేకాదు, ఆయన వారి భూములు, ఇండ్లు, ఇతర ఆస్తిపాస్తులకు మిమ్మల్ని వారసులుగా చేశాడు. వారి ప్రాంతంలో మీరు ఇదివరకెన్నడూ కాలు కూడా మోపి ఉండ లేదు; అలాంటి ప్రాంతాన్ని కూడా మీకు స్వాధీనం చేశాడు. (26,27)

ప్రవక్తా! నీ భార్యలకిలా చెప్పు: "మీరొకవేళ ఈ ప్రపంచాన్ని, దీని తళుకు బెళుకుల్ని కోరుకుంటుంటే, రండి నేను మీకు వాటిని ఎంతోకొంత ఇప్పించి మర్యాదగా సాగనంపు తాను. అలాకాకుండా మీరు (నిజంగా) దేవుడ్ని, దైవప్రవక్తను, పరలోకాన్ని కోరుకుం టుంటే ఒక విషయం గుర్తుంచుకోండి, మీలో సదాచార సంపన్నులయిన వారికోసం దేవుడు (పరలోకంలో) గొప్ప ప్రతిఫలం సిద్ధపరచి ఉంచాడు." (28,29)

ప్రవక్తభార్యలారా! మీలో ఎవరైనా అసభ్యకరమైన చేష్టలకు పాల్పడితే ఆమెకు మేము రెట్టింపు శిక్ష విధిస్తాం. ఇలా చేయడం దేవునికి చాలా తేలిక. అలాగే మీలో దేవునికి, ఆయన ప్రవక్తకు విధేయత చూపుతూ సత్కార్యాలు చేసేవారికి మేము రెట్టింపు ప్రతిఫలం ప్రసాదిస్తాం. పైగా ఆమెకు ఎంతో గౌరవప్రదమైన ఉపాధి కూడా సమకూర్చుతాం. (30,31)

ప్రవక్తభార్యాలారా! మీరు సాధారణ స్త్రీల్లాంటి వారు కాదు. మీరు దేవునికి భయపడే వారైతే (పరపురుషులతో మాట్లాడేటప్పుడు) మెతకదనం కనపడేలా మెల్లిగా

మాట్లాడకండి. ఆంతర్యంలో 'చెడు' ఉన్నవాడ్ని ఈ మెతకదనం పేరాశకు పురిగొల్పే ప్రమాదం ఉంటుంది. అందువల్ల స్పష్టంగా, కరాఖండిగా మాట్లాడండి. మీరు మీ ఇండ్ల లోనే ఆగిఉండండి.[1] పూర్వం మూఢకాలంనాటి స్త్రీలు తిరిగినట్లు సింగారం చూపు కుంటూ తిరగకండి.[2] నమాజు (వ్యవస్థ) నెలకొల్పండి. (పేదల ఆర్థికహక్కు) జకాత్ నెర వేర్చండి. దేవుని పట్ల, ఆయన ప్రవక్త పట్ల వినయవిధేయతలు కలిగిఉండండి.

మీరు (సాధారణ మహిళల్లాంటి వారు కాదు.) ప్రవక్త గృహస్థులు. అందువల్ల దేవుడు మీలోని కల్మషాన్ని తీసేసి మిమ్మల్ని పూర్తిగా పునీతం చేయగోరుతున్నాడు. దేవుని సూక్తుల్ని, మీ ఇండ్లలో విన్పించబడుతున్న వివేకవంతమైన విషయాల్ని జ్ఞాపకం పెట్టుకోండి. దేవుడు ఎంతో సూక్ష్మగ్రాహి, బాగా తెలిసినవాడు. (32-34)

ముస్లిములయిన, విశ్వసించిన, విధేయులయిన, నిజాయితీపరులయిన, సహనశీలురయిన, దానశీలురయిన, మర్మాయవాలు కాపాడుకునే, ఉపవాసవ్రతాలు పాటించే, అణుకువ వినయం కలిగివుండే, దేవుడ్ని అత్యధికంగా స్మరించే స్త్రీ పురుషుల

---

1. సాధారణంగా స్త్రీ కార్యాచరణ పరిధి ఆమె గృహమే. అవసరమైతేనే ఆమె బయటకు వెళ్ళాలి. ఇంటి బాధ్యతలన్నీ స్త్రీ నిర్వహించాలి. బయటి బాధ్యతలన్నీ పురుషుడు నిర్వహించాలి. ఈ సహజ పరిధిని అతిక్రమించి స్త్రీ బయటికెళ్ళి పురుషుడు చేసే పనుల్లో జోక్యం చేసుకుంటే కుటుంబ పతనం ప్రారంభమయి, సామాజిక సంక్షోభం ఏర్పడుతుంది. నేడు పాశ్చాత్య దేశాల్లో జరుగుతున్నది ఇదే. ఈ ధోరణి ఇప్పుడు తూర్పు దేశాల్లో కూడా విస్తరిస్తోంది.

కొందరు సంస్కరణవాదులు పాశ్చాత్య తరహా స్త్రీ స్వేచ్ఛకోసం. ప్రవక్త సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) జమల్ యుద్ధంలో పాల్గొనడాన్ని ప్రమాణంగా చూపెడుతున్నారు. కాని ఆమె ఆ తరువాత పశ్చాత్తాపం చెందిన సంగతి వీరు విస్మరిస్తున్నారు. అబ్దుల్లా బిన్ హంబల్, ఇబ్నె ముస్జిర్, ఇబ్నె అబీ షైబా, ఇబ్నె సాద్ వంటి ప్రముఖులు తమ గ్రంథాల్లో మస్రూఖ్ కథనాన్ని ఉల్లేఖిస్తూ, హజ్రత్ ఆయిషా (రజి) ఖుర్‌ఆన్ పఠనం సందర్భంగా జమల్ యుద్ధంలో తన వల్ల జరిగిన పొరపాటు జ్ఞాపకంవచ్చి, ఈ సూక్తి దగ్గరికి వచ్చేటప్పటికి అప్రయత్నంగా దుఃఖించేవారని, కన్నీటితో ఆమె ఓణి తడిసి పోయేదని వ్రాశారు.

2. సాధారణంగా మనం అజ్ఞానం, మూఢత్వాలను జ్ఞానానికి వ్యతిరేక పదాలుగా వాడతాం. ఇక్కడ సత్యానికి వ్యతిరేకమైన ప్రతి విషయమూ అజ్ఞానమే. 3:154 సూక్తిలో, దైవమార్గంలో పోరాడకుండా తప్పించుకునే వారిని గురించి "వారు దేవుని విషయంలో అజ్ఞానంతో కూడిన అనుమానానికి గురయ్యారు"ని ఉంది. 5:50 సూక్తిలో దైవచట్టాలకు బదులు ఇతర చట్టాల ప్రకారం తమ వ్యవహారాలను పరిష్కరించుకునే వారిని గురించి "వీరు అజ్ఞానకాలం నాటి అనాగరిక పద్ధతులు కోరుతున్నారా?" అని పేర్కొనబడింది.

అలాగే ఒక హదీసు ప్రకారం హజ్రత్ అబూదర్దా (రజి) ఓసారి ఎవరితోనో జగడమాడుతూ నీయమ్మ అంటూ తిట్టారు. దైవప్రవక్త (సల్లం) ఈమాట విని "నీలో అజ్ఞానం ఇంకా పోలేదు" అని అన్నారు. మరొక హదీసు ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "అజ్ఞానానికి సంబంధించి మూడు విషయాలున్నాయి. అవి- ఇతరుల కులగోత్రాలను కించపరిచే విధంగా మాట్లాడటం, గ్రహబలం ద్వారా జాతకం చెప్పించుకోవడం, చనిపోయిన వారిని తలచుకొని గుండెలు బాదు కుంటూ ఏడ్పులు, పెడబొబ్బలు పెట్టడం."



కోసం దేవుడు మన్నింపు, గొప్ప ప్రతిఫలం సిద్ధపరచి ఉంచాడు. (35)

దేవుడు, ఆయన ప్రవక్త ఏదైనా వ్యవహారంలో ఒక నిర్ణయం చేసిన తరువాత, ఇక దాన్ని గురించి విశ్వాసులయిన స్త్రీ పురుషులెవరికీ ఎలాంటి స్వంత నిర్ణయం తీసు కునే అధికారం లేదు. దీనికిభిన్నంగా ఎవరైనా దేవునికి, ఆయన ప్రవక్తకు అవిధేయత చూపితే వారు పూర్తిగా మార్గభ్రష్టత్వంలో పడిపోయినట్లే. (36)

ప్రవక్తా! జ్ఞాపకంతెచ్చుకో. దేవుడు, నీవు (ఇద్దరూ) మేలుచేసిన వ్యక్తితో నీవు "దేవునికి భయపడు, నీ భార్యను వదలిపెట్టకు" అన్నావు. అప్పుడు నీవు ఒక విషయం మనసులో దాచి ఉంచావు. దాన్ని దేవుడు బహిర్గతం చేయదలిచాడు. అప్పుడు నీవు లోకులకు భయపడుతూ ఉండేవాడివి. నిజానికి దేవునికి మాత్రమే నీవు భయపడాలి. జైద్ తనభార్య దగ్గర అవసరం తీర్చుకున్న తర్వాత (విడాకులిప్పించి) ఆమెతో మేము నీ వివాహం జరిపించాము. పెంపుడు కొడుకులు తమ భార్యల దగ్గర అవసరం తీర్చుకున్న తర్వాత వారి భార్యల(ను వివాహమాడే) విషయంలో విశ్వాసులకు ఎలాంటి ఇబ్బంది ఏర్పడకుండా ఉండాలనే మేమిలా చేశాము.[3] దేవుని ఆజ్ఞ (ఎట్టి పరిస్థితిలోనూ) అమలు జరిగే తీరవలసి ఉంది. (37)

దైవప్రవక్త కోసం దేవుడు నిర్దేశించిన (ఈ) పనిలో ఎలాంటి దోషం లేదు. గత ప్రవక్తల విషయంలో కూడా దేవుని పద్ధతి ఇలాగే ఉండేది. దేవుడు జారీచేసిన ఆజ్ఞకు తిరుగులేదు. దేవుని సందేశం (ప్రజలకు) అందజేసేవారు, ఆయనకు భయపడేవారు, ఒక్క దేవునికి తప్ప మరెవరికీ భయపడనివారు (ఆయన జారీచేసే ప్రతి ఆజ్ఞనూ శిరోధార్యంగా భావిస్తారు). కర్మల విచారణ జరపడానికి ఒక్క దేవుడే చాలు. (38,39)

(ప్రజలారా!) ముహమ్మద్ (సల్లం) మీ పురుషుల్లో ఎవరికీ తండ్రి కాడు. ఆయన దేవుని సందేశహరుడు. దౌత్యపరంపరను అంతమొందించిన అంతిమ దైవప్రవక్త.[4] దేవుడు సమస్త విషయాలు ఎరిగినవాడు. (40)

---

3. వివరాలకు 24వ అధ్యాయం (నూర్) ఉపోద్ఘాతంలోని 3.4.5.6 పేరాలు చదవండి.

4. ఆదిమానవుడు హజ్రత్ ఆదం (అలైహి) నుండి ముహమ్మద్ (సల్లం) వరకు మొత్తం ఒకలక్షా ఇరవైనాలుగు వేలమంది దైవప్రవక్తలు ప్రభవించినట్లు హదీసు గ్రంథాలు చెబుతున్నాయి. వారిలో ముహమ్మద్ (సల్లం) చిట్టచివరి ప్రవక్త. ఆయన తర్వాత ప్రళయందాకా మరే ప్రవక్తా రాడు. ఈ విషయాన్ని ఆయన పలు సందర్భాలలో ఈవిధంగా తెలియజేశారు:

- "దైవదౌత్య పరంపర ముగిసిపోయింది. నా తరువాత ఇక ఏ ప్రవక్తగాని, సందేశహరుడు గాని రాడు." (తిర్మిజి, ముస్నద్ అహ్మద్)
- "నేను అంతిమ దైవప్రవక్తను. నా తరువాత మరే ప్రవక్తా లేదు. అయితే నా అనుచర సముదాయం (ఉమ్మత్)లో ముప్ఫయి మంది అసత్యవాదులు పుడ్తారు. వారిలో ప్రతి ఒక్కడూ తాను దైవప్రవక్తనని ప్రకటించుకుంటాడు." (అబూదావూద్)
- "ఇస్రాయీల్ సంతతివారికి దైవప్రవక్తలు నాయకత్వం వహించేవారు. ఒక ప్రవక్త చనిపోగానే రెండవ ప్రవక్త అతనికి వారసుడవుతాడు. కాని నా తరువాత మరెవరూ దైవప్రవక్తలు ఉండరు. ఖలీఫాలు మాత్రమే ఉంటారు." (బుఖారి)

విశ్వాసులారా! దేవుడ్ని అత్యధికంగా స్మరించండి. ఉదయం, సాయంత్రం స్తుతిస్తూ ఉండండి. ఆయనే మిమ్మల్ని కరుణించి, చీకటి నుండి వెలుగులోకి తీసు కొచ్చినవాడు. దైవదూతలు కూడా మిమ్మల్ని దీవిస్తున్నారు. దేవుడు విశ్వాసుల పాలిట అపార కరుణామయుడు. విశ్వాసులు (పరలోకంలో) ఆయన్ని కలుసుకోవడానికి వెళ్ళినప్పుడు, వారికి శాంతివచనాలతో స్వాగతం లభిస్తుంది. వారి కోసం దేవుడు గౌరవ ప్రదమైన ప్రతిఫలం సిద్ధపరచి ఉంచాడు. (41-44)

ప్రవక్తా! మేము నిన్ను సాక్షిగా, శుభవార్త అందజేసేవానిగా, భయపెట్టేవానిగా, దేవుని ఆజ్ఞతో ఆయన వైపున సందేశం అందజేసేవానిగా, వెలుగుతున్న దీపంగా చేసి పంపాము. కనుక విశ్వసించినవారికి దేవుని తరఫున గొప్ప అనుగ్రహం కలుగుతుందని శుభవార్త విన్పించు. అవిశ్వాసులకు, కపటులకు నీవు ఏమాత్రం లొంగకు. వారు పెట్టే బాధలను ఖాతరు చేయకుండా దేవుని మీదనే భారంవేసి పనిచెయ్యి. దేవుడ్ని నమ్ముకొని ఆయన మీద భారం వేసేవాడికి దేవుడే చాలు (సహాయం చేయడానికి). (45-48)

విశ్వాసులారా! విశ్వసించిన స్త్రీలను వివాహమాడిన తరువాత వారిని తాకకముందే మీరు వారికి విడాకులివ్వడం జరిగితే, వారిని గడువు కాలం పూర్తిచేయమని అడిగే అధికారం మీకేమాత్రం లేదు. వారికి ఎంతోకొంత ధనమిచ్చి సహృదయంతో సాగ నంపండి. (49)

ప్రవక్తా! నీవు మహర్ (వధువు ఆస్తిహక్కు) చెల్లించి వివాహమాడిన స్త్రీలను మేమే నీకు ధర్మసమ్మతం చేశాం. అలాగే దేవుడు నీకు ప్రసాదించిన బానిస స్త్రీలు, నీతోపాటు (మదీనా) వలసవచ్చిన నీ పినతండ్రి కుమార్తెలు, పెత్తండ్రి కుమార్తెలు, పిన్నమ్మ కుమార్తెలు, పెద్దమ్మ కుమార్తెలు, మేనత్త కుమార్తెలు, మేనమామ కుమార్తెలను కూడా (వివాహానికి) నీకు ధర్మసమ్మతం చేశాం. అదీగాక తననుతాను దైవప్రవక్తకు సమర్పించు కున్న స్త్రీని కూడా దైవప్రవక్త వివాహ మాడవచ్చు. ఈ (చివరి) రాయితీ నీకు మాత్రమే

◆ "నాకు, ఆయన (హ్రజత్ ఈసా-అలైహి)కు మధ్య ఏ దైవప్రవక్తా లేడు. ఆయన (నింగి నుండి నేల మీదికి నేరుగా) అవతరిస్తారు. కనుక మీరు ఆయన్ని చూస్తే గుర్తించాలి. ఆయన మధ్యరకం ఎత్తు (పొడుగు) మనిషి. ఎరుపు తెలుపు కలసిన రంగు ఆయనది. రెండు పసుపుపచ్చ వస్త్రాలు ధరించిఉంటారు. ఆయన శిరోజాలు తడవకపోయినా నీటి బిందువులు రాలి పడుతున్నట్లు ఉంటాయి. ఆయన ఇస్లాం కోసం జనంతో యుద్ధం చేస్తారు. సిలువను ముక్కల ముక్కలుగా విరగ్గొడ్తారు. సూకర సంహారం చేస్తారు. జిజియా (భద్రతా రుసుం) వసూలు చేయడాన్ని అంత మొందిస్తారు. ఆయన కాలంలో దేవుడు ఇస్లామీయ సమాజం తప్ప మిగిలిన సమాజాలన్నిటిని నిర్మూలిస్తారు. ఆయన మసీహ్ దజ్జాల్ (యూదుల హీరో)ను హతమారుస్తారు. ప్రపంచంలో నలభై యేళ్ళు జీవిస్తారు. ఆ తరువాత చనిపోతారు. ముస్లింలు ఆయన కోసం జనాజా నమాజ్ చేస్తారు." (అబూదావూద్, ముస్నద్ అహ్మద్)

(వివరాలకు 'ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్' హైదరాబాద్-2 నుండి వెలువడిన "మసీహ్ మౌవూద్" అనే పుస్తకం చదవండి.)



ఇవ్వబడుతోంది, ఇతర విశ్వాసులకు లేదు.[5]

5. దేవుడు ముహమ్మద్ (సల్లం)కు దైవప్రవక్తగా ఇతర ముస్లింలకు లేని కొన్ని ప్రత్యేకతలు ఇచ్చాడు. ఉదా.కు: (1) తహజ్జుద్ నమాజ్ దైవప్రవక్త (సల్లం)కు మాత్రమే విధిగా చేయబడింది. ఇతరులకు ఇది ఐచ్ఛిక (నఫిల్) నమాజ్. (2) దానం (సదఖా) స్వీకరించడం దైవప్రవక్త(సల్లం)కు, ఆయన వంశస్థులకు నిషిద్ధం. ఇతర ముస్లింలు స్వీకరించవచ్చు. (3) దైవప్రవక్త (సల్లం) ఆస్తికి వారసత్వపు విభజన లేదు. ఇతర ముస్లింల ఆస్తులు వారి వారసుల్లో విభజించబడతాయి. (4) దైవప్రవక్త (సల్లం) నలుగురిని మించి భార్యలను చేసుకోవచ్చు. ఇతరులు నలుగుర్ని మించి చేసు కోవడం నిషిద్ధం. (5) తననుతాను సమర్పించుకున్న స్త్రీని ప్రవక్త (సల్లం) మహర్ చెల్లించకుండా వివాహమాడవచ్చు. ఇతరులు ఏ స్త్రీని వివాహమాడినా మహర్ చెల్లించాలి. (6) దైవప్రవక్త (సల్లం) తదనంతరం ఆయన భార్యలను ఇతర ముస్లింలు వివాహమాడటం నిషిద్ధం.

ముహమ్మద్ (సల్లం) సాధారణ ముస్లింలకు భిన్నంగా నలుగురి కంటే ఎక్కువ మంది స్త్రీలను వివాహమాడి స్త్రీ లోలుడయ్యారని ఇస్లాంవ్యతిరేక శక్తులు విమర్శిస్తూ ఈనాటికీ దుష్ప్రచారం సాగిస్తున్నాయి. కనుక దీన్ని గురించి వాస్తవ పరిస్థితి ఏమిటో తెలుసుకోవాల్సిన అవసరముంది.

ముహమ్మద్ (సల్లం) 25 ఏండ్ల నిండు యౌవనంలో తనకంటే 15 యేళ్ళు ఎక్కువ వయసు గల వితంతువయిన హ్రజత్ ఖదీజా (రజి)ని వివాహమాడారు. ఆమెతో కలసి 25 సంవత్సరాలపాటు ఎంతో అన్యోన్యంగా కాపురం చేశారు. ఈ 25 యేండ్ల కాలంలో ఆయన మరో స్త్రీని వివాహమాడే తలంపును కూడా మనసులోకి రానివ్వలేదు. హ్రజత్ ఖదీజా (రజి) చనిపోయిన తరువాతనే ఆయన రెండవ వివాహం చేసుకున్నారు. ఆమె కూడా వయస్సు మీరిన స్త్రీయే (హ్రజత్ సౌదా-రజి). ఆమెతో 4 సంవత్సరాలు సంసారం చేశారు. ఆ తరువాత 53, 54 సంవత్సరాల వయస్సులో ఆయన స్త్రీలోలుడయ్యారని, ఆయనలో లైంగిక వాంఛ పరవళ్ళు తొక్కిందని ఎవరైనా అనగలరా?

మహనీయ ముహమ్మద్ (సల్లం)పై మోపబడిన దైవదౌత్య భారం అసాధారణమైనది. దాన్ని సులభంగా నిర్వహించడానికి నలుగురు భార్యల నిబంధన నుండి ఆయన్ని మినహాయించడం జరిగింది. అదీగాక అత్యున్నతమైన సభ్యతా సంస్కృతులతో కూడిన ఓ నూతనసమాజం ఆవిష్కరణ కోసం ఆయన పురుషులకే గాక స్త్రీలక్కూడా తగిన శిక్షణ ఇవ్వవలసి ఉండింది. నూతన ఇస్లామీయ సమాజంలో స్త్రీ పురుషుల స్వేచ్ఛాయుత కలియికపై ఆంక్షలు ఉండటం వల్ల, ఆ ఆంక్షలను అతిక్ర మించకుండా స్త్రీలకు ప్రత్యక్షంగా శిక్షణ ఇవ్వడం సాధ్యం కాదు. విభిన్న వయస్సులు, శక్తిసామర్థ్యాలు గల అనేకమంది స్త్రీలను వివాహమాడటం ద్వారానే ఈ మహాకార్యం సాధ్యమవుతుంది. అంతేకాదు, ఇస్లామీయ విప్లవ మార్గంలో అవరోధంగా ఉన్నవారి శక్తిని, శత్రువుల సంఖ్యను తగ్గించడానికి కూడా అనేకమంది స్త్రీలను వివాహమాడటం అనివార్యమయింది.

పిన్న వయస్సులో ఆయిషా (రజి)ను వివాహమాడటం వల్ల, దైవప్రవక్త (స) దివంగతులైన తరువాత కూడా ఆమె ద్వారా ముస్లింజగత్తుకు అనేక దశాబ్దాలపాటు ప్రవక్త సంప్రదాయాలు లభిస్తుండేవి. ఉమ్మెసల్మా, ఉమ్మెహబీబా (రజి)లను వివాహమాడటం వల్ల వారి వంశం, తెగల నుండి ఎదురైన విరోధం కొంతవరకు తగ్గింది. యుద్ధ ఖైదీలైన సఫియా, జువైరియా, రైహానా (రజి)లను విడుదలచేసి వివాహమాడటంతో, ఆయా యూదుతెగల ఇస్లాంవ్యతిరేక కార్యకలాపాలు చాలావరకు మందగించాయి. ఆనాటి అరబ్ సంప్రదాయం ప్రకారం ఒక వ్యక్తి ఏదైనా తెగకు చెందిన స్త్రీని వివాహమాడితే, ఆవ్యక్తి ఆ స్త్రీ తెగ మొత్తానికే అల్లుడిగా పరిగణించబడేవాడు.

ఈ కారణాల వల్లనే దైవప్రవక్త (స) దేవుని అనుజ్ఞతో నలుగురిని మించి స్త్రీలను వివాహ మాడవలసి వచ్చింది. ఇస్లాం వ్యాప్తిలో ఈ విషయం కూడా ప్రముఖపాత్ర వహించింది.

సాధారణ విశ్వాసులకు వారి భార్యలు, బానిస స్త్రీల విషయంలో మేము ఎలాంటి హద్దులు నిర్దేశించామో మాకు తెలుసు. (ధర్మవ్యాప్తి కార్యకలాపాలలో) నీకు ఏ విధమైన ఇబ్బంది కలగకుండా ఉండేందుకే (మేమిలా నీకు కొన్ని రాయితీలు కల్పించాము). దేవుడు గొప్ప క్షమాశీలి, అమిత దయామయుడు. (50)

నీ భార్యలలో నీవు తలచిన వారిని (విడాకులద్వారా) వేరుచేయవచ్చు; కోరుకున్న వారిని నీదగ్గర అట్టిపెట్టుకోవచ్చు. వేరుచేసినవారిని కావాలనుకుంటే మళ్ళీ వెనక్కి పిలిపించు కోవచ్చు. అంతా నీఇష్టాయిష్టాల మీద వదిలేస్తున్నాం. ఈవిషయంలో నీవు ఎలాంటి నిర్ణయం తీసుకున్నా తప్పులేదు. ఈ విధంగా వారి కళ్ళు చల్లబడతాయని, వారు ఆవేదన చెందరని ఆశించడానికి ఎక్కువ ఆస్కారముంటుంది. నీవు ఏదిచ్చినా వారు సంతోషంగా స్వీకరిస్తారు. మీహృదయాల్లో ఏముందో దేవునికి తెలుసు. ఆయన సర్వజ్ఞాని, దయార్ద్రహృదయుడు. (51)

ఆ తరువాత మరెలాంటి స్త్రీలూ నీకు ధర్మసమ్మతం కారు. ఆ స్త్రీలను వదలి నీ అధీనంలోని బానిసస్త్రీలు తప్ప ఇతరస్త్రీల సౌందర్యం నీకు ఎంత నచ్చినా వారిని చేసుకోవడానికి వీల్లేదు. దేవుడు ప్రతి విషయాన్నీ కనిపెట్టి చూస్తున్నాడు. (52)

విశ్వాసులారా! అనుమతి లేకుండా దైవప్రవక్త ఇండ్లలోకి ప్రవేశించకండి. భోజన సమయంలో (అనవసరంగా) అక్కడ తారట్లాడుతూ ఉండకండి. ఒకవేళ మిమ్మల్ని భోజనానికి పిలిస్తే మీరు నిరభ్యంతరంగా వెళ్ళవచ్చు. అయితే భోజనం చేయగానే అక్కడ్నుంచి లేచివెళ్ళండి. అంతేగాని కబుర్లు చెబుతూ అక్కడే (గంటలతరబడి) కూర్చోకండి. ఈ వైఖరి ప్రవక్తకు బాధ కలిగించవచ్చు. అతను బిడియం, మొహమాటం వల్ల మిమ్మల్నేమీ అనలేడు.[6] దేవుడు యదార్థం చెప్పడానికి ఏమాత్రం సిగ్గుపడడు.

ఒకవేళ మీరు ప్రవక్త భార్యల్ని ఏదయినా అడగదలచుకుంటే తెరవెనుక నిలబడి అడగండి. ఇది చిత్తశుద్ధి కోసం మీకూ, వారికీ ఎంతో మంచిపద్ధతి. దైవప్రవక్త (మనసు)ను బాధించడం మీకు భావ్యంకాదు. దైవప్రవక్త తదనంతరం ఆయన భార్యలను వివాహ మాడటం కూడా ధర్మసమ్మతం కాదు. ఇది దేవుని దృష్టిలో ఘోరమైన పాపం. మీరేదైనా మాట బయటికి వెలిబుచ్చినా లేక మనసులో దాచినా దేవునికి తెలుసు. (53)

ప్రవక్త భార్యల తండ్రులు, వారి కొడుకులు. అన్నదమ్ములు, అన్నదమ్ముల కొడుకులు, అక్కాచెల్లెళ్ళ కొడుకులు, వారితో కలసిమెలసి తిరిగే స్త్రీలు, వారి బానిసలు (పరదా పాటించకుండా) వారి ఇండ్లలోకి ప్రవేశిస్తే ఎలాంటి దోషం లేదు. (వనితల్లారా!) మీరు దేవునికి భయపడండి. దేవుడు ప్రతి దానికీ సాక్షిగా ఉన్నాడు. (54,55)

---

6. దైవప్రవక్త (సల్లం) హజ్రత్ జైనబ్ (రజి)ని వివాహమాడినప్పుడు వలిమా విందు చేసి అనుచరుల్ని పిలిచారు. అయితే ఆహ్వానితులు విందు ఆరగించిన వెంటనే వెళ్ళిపోకుండా అక్కడే తిష్ఠవేసి లోకాభిరామాయణంలో మునిగిపోయారు. వారు ఎంత సేపటికీ కదలనందున దైవప్రవక్త వాళ్ళను వెళ్ళమని చెప్పలేక తన ఇతరభార్యల ఇండ్ల వైపు పోయారు. కాస్సేపటికి వారు వెళ్ళిపోవడం గమనించి తిరిగొచ్చారు. వచ్చి నూతన వధువు ఇంట్లో ప్రవేశించగానే ఈ సూక్తి అవతరించింది.



దేవుడు, ఆయన దూతలు దైవప్రవక్తను దీవిస్తున్నారు. (కనుక) విశ్వాసులారా! మీరు కూడా అతను శాంతీ సౌభాగ్యాలతో వర్ధిల్లాలని (దైవాన్ని) ప్రార్థించండి. (56)

దేవుడ్ని, ఆయన ప్రవక్తను బాధిస్తున్నవారిని దేవుడు ప్రపంచంలోనూ, పరలోకంలోనూ (నశించాలని) శపిస్తున్నాడు. వారికోసం అవమానకరమైన (నరక) యాతనలు సిద్ధంచేశాడు. విశ్వసించిన స్త్రీపురుషుల్ని అన్యాయంగా వేధిస్తున్నవారు నిజానికి ఘోరమైన అపనిందను, స్పష్టమైన పాపభారాన్ని తమ నెత్తిమీద వేసుకుంటున్నారు. (57,58)

ప్రవక్తా! నీభార్యలకు, కుమార్తెలకు, (ఇతర) ముస్లిం స్త్రీలకు వారు తమ పైటలను తమ (ముఖాల)పై కప్పుకోవాలని చెప్పు. ఇదే సరైన పద్ధతి. దీనివల్ల వారిని ఎవరైనా గుర్తించి వేధిస్తారనే భయముండదు.[7] దేవుడు క్షమాశీలి, దయామయుడు. (59)

కపటులు, హృదయంలో రోగమున్న (దుష్టబుద్ధికల)వారు, (మదీనాలో) దారుణమయిన వదంతులు వ్యాపింపజేసేవారు తమ దుశ్చర్యలు మానుకోకపోతే మేము వారికి వ్యతిరేకంగా నిన్ను సమాయత్తపరుస్తాం. అప్పుడు వారికి ఈ నగరంలో నీతోపాటు ఉండటం కష్టమైపోతుంది. నలువైపుల నుండి వారిపై అభిశాపం పడుతుంది. ఎక్కడ కన్పిస్తే అక్కడ వారు పట్టుబడి హతమార్చబడతారు. ఇలాంటివారి విషయంలో ఇది

---

7. అంటే స్త్రీలు ఇంటి నుంచి ఎక్కడికైనా బయలుదేరవలసివస్తే తల, ముఖంతో సహా మొత్తం దేహాన్ని వస్త్రంతో కప్పుకోవాలన్నమాట. కాకపోతే కళ్ళు కన్పించేలా ఏర్పాటు చేసుకోవచ్చు. ఇలాంటి వస్త్రధారణ వల్ల పోకిరీలతో సహా పరపురుషులంతా, వీరు గౌరవప్రదమైన కుటుంబాలకు చెందిన స్త్రీలని భావించి వారివైపు దురుద్దేశంతో కన్నెత్తి చూడటానికి కూడా సాహసించలేరు.

ఇస్లాం అశ్లీలం, అత్యాచారాల్ని పూర్తిగా తుడిచిపెట్టి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించ గోరుతోంది. అత్యాచారాలు, అక్రమసంబంధాల వల్ల సమాజానికి మూలస్తంభమయిన కుటుంబ వ్యవస్థ కుంటుపడుతుంది. ప్రజలకు మనశ్శాంతి కరువయిపోతుంది. హత్యలు, ఆత్మహత్యలు పెరిగిపోతాయి. అందువల్ల ఇస్లాం ఇలాంటి చెడులకు కారణమయ్యే అశ్లీల విషయాలపై కూడా ఆంక్షలు విధించి, వాటిని మొగ్గలోనే త్రుంచివేయదలచింది. అలాంటి ఆంక్షలలో పరదా ఒకటి.

స్త్రీ పురుషుల మధ్య సహజ లైంగికాకర్షణ దుర్వినియోగం కాకుండా వివాహ వ్యవస్థతో పాటు పరదా విధానాన్ని కూడా ప్రవేశపెట్టింది ఇస్లాం. అయితే పరదాపద్ధతి స్త్రీలు మాత్రమే ఎందుకు పాటించాలి, పురుషులు ఎందుకు పాటించకూడదు? అన్న ప్రశ్న కొందరిలో రేకెత్తవచ్చు. స్త్రీ పురుషుల దేహదారుఢ్యం, లైంగిక భావోద్రేకాలు ఒకే విధంగా లేవు. స్త్రీ స్వభావంతో పోల్చితే పురుషుడు స్త్రీ పట్ల తొందరగా, తీవ్రంగా ఆకర్షితుడవుతాడు. అతనిలో దుడుకు (Aggressive) స్వభావం ఉంది. స్త్రీని బలవంతంగా అనుభవించే శక్తి కూడా ఉంది. వీటికి భిన్నంగా స్త్రీకి పురుషుని పట్ల ఆకర్షణ తక్కువగా ఉంటుంది. ఆమె నైజంలో పారుబోతుదనం (Escaping) ఉంది. ఆమె పురుషుడ్ని బలవంతం చేసి లైంగికానందం పొందలేదు. ఈ సహజ వ్యత్యాసాల దృష్ట్యా ఇస్లాం స్త్రీకి మాత్రమే పరదా (బురఖా) పద్ధతి ప్రతిపాదించింది.

పురుషుని కామ వీక్షణల నుండి కాపాడుకోవడానికి పడతికి పరదా డాలు వంటిది. అశ్లీల రహితమైన సమాజానికి పరదా ప్రహరీగోడ లాంటిది. పటిష్టమైన ఈ ప్రహరీగోడ కూల్చిన తరువాత అందులోని అందమైన సౌధవం తూట్లు పడకుండా ఎంతోకాలం సురక్షితంగా ఉండదు.

పూర్వం నుంచీ వస్తున్న దైవ సంప్రదాయమే. దేవుని సంప్రదాయంలో నీవు ఎలాంటి మార్పు చూడలేవు. (60-62)


ప్రళయఘడియ ఎప్పుడొస్తుందని ప్రజలు నిన్ను అడుగుతున్నారు. ఆ సంగతి దేవునికే తెలుసని చెప్పు వారికి. బహుశా అది సమీపంలోనే ఉందేమో నీకేం తెలుసు? ఏదిఏమైనా సత్యతిరస్కారుల్ని దేవుడు శపించాడన్నది నిజం. ఆయన వారికోసం భగభగ మండే నరకాగ్ని సిద్ధపరచి ఉంచాడు. అందులో వారు శాశ్వతంగా పడి ఉంటారు. వారికి ఎలాంటి సహాయం, రక్షణ లభించవు. (63-65)

ఆరోజు వారి ముఖాలను వెనక్కి తిప్పివేసి అగ్నిలో వేయడం జరుగుతుంది. అప్పుడు వారు (తీవ్రంగా పశ్చాత్తాపపడుతూ) "అయ్యయ్యో! మనం దేవునికి, దైవ ప్రవక్తకు విధేయులయివుంటే ఎంత బాగుండేది!" అనంటారు. (ఆ తర్వాత వారు దేవుడ్ని మొరపెట్టుకుంటూ) "ప్రభూ! మేము మా నాయకులు, పెద్దలు చెప్పిన మాటలు విని, వారిని అనుసరించాం. వారు మమ్మల్ని అపమార్గం పట్టించారు. ప్రభూ! వారికి రెట్టింపు శిక్ష విధించు. వారిని తీవ్రంగా శపించు" అని అంటారు. (66-68)

విశ్వాసులారా! మీరు మూసా (ప్రవక్త)ను వేధించినవారిలా తయారుకాకండి. వారు మూసా (ప్రవక్త)పై వేసిన అభాండాలను దేవుడు దూరం చేసి వాస్తవం బహిర్గతం చేశాడు. అతను దేవుని దృష్టిలో ఎంతో గౌరవనీయుడు. కనుక విశ్వాసులారా! దేవునికి భయపడండి. సరైన మాటే పలకండి. దేవుడు మీ పనులు చక్కబెడతాడు. మీ పొరపాట్లు క్షమిస్తాడు. దేవునికి, ఆయన ప్రవక్తకు విధేయుడయినవాడు నిజంగా గొప్పవిజయం సాధించినట్లే. (69-71)

మేమీ (దైవప్రాతినిధ్య) బాధ్యతను మొదట్లో భూమ్యాకాశాల ముందు, పర్వతాల ముందు పెట్టాము. కాని అవి భయపడిపోయి ఈ బాధ్యతాభారం మోయడానికి సిద్ధపడలేదు. కాని మానవుడు మాత్రం (మహా ఒరగబెట్టే వాడిలా ముందుకొచ్చి) దీన్ని తన భుజాల పైకి ఎత్తుకున్నాడు. (కాని ఇప్పుడీ బాధ్యతను నిర్వహించడానికి నిరాకరిస్తున్నాడు.) నిస్సందేహంగా మానవుడు మహా దుర్మార్గుడు, పరమ మూర్ఖుడయిపోయాడు. (72)

(మానవుడు) ఈ బాధ్యతను తలకెత్తుకున్న పర్యవసానంగానే కపట విశ్వాసులైన స్త్రీ పురుషులకు, బహుదైవారాధనకు పాల్పడే స్త్రీ పురుషులకు దేవుడు శిక్ష విధిస్తాడు. విశ్వసించిన స్త్రీపురుషులను మాత్రం ఆయన క్షమిస్తాడు. దేవుడు గొప్ప క్షమాశీలి, అమిత దయామయుడు కూడా. (73) ✪





అవతరణ: మక్కా

# 34. సబాజాతి (సబా)

సూక్తులు: 54

ఈ అధ్యాయాన్ని "సబా" అంటారు. అంటే సబాజాతి అని అర్థం. ఇది హిజ్రీ శకానికి ఆరేడు ఏండ్ల పూర్వం మక్కాలో అవతరించినట్లు తెలుస్తోంది. ఇందులో దేవుని ఏకత్వం, ప్రవక్తదౌత్యం, పరలోకం పట్ల అవిశ్వాసుల విమర్శలకు సమాధానాలు ఇవ్వబడ్డాయి. వారి ముందు దావూద్, సులైమాన్ ప్రవక్తలు (అలైహి), సబాజాతి చారిత్రక గాథలను ఉంచుతూ వాటినుండి గుణపాఠం నేర్చుకోమని, లేకపోతే శిక్ష అనుభవించవలసి వస్తుందని చెప్పడం జరిగింది.

## కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

భూమ్యాకాశాల్లోని సమస్త వస్తువులకు యజమాని అయిన దేవుడే స్తుతింపదగినవాడు. పరలోకంలో కూడా ఆయనే ప్రశంసనీయుడు. ఆయన ఎంతో వివేకవంతుడు, సర్వం తెలిసినవాడు. భూలోకానికి చేరుతున్నదేమిటో, భూలోకం నుండి వెలువడుతున్నదేమిటో, ఆకాశం నుండి దిగుతున్నదేమిటో, ఆకాశంలోకి ఎక్కి పోతున్నదేమిటో అంతా ఆ దేవునికి తెలుసు. ఆయన అమిత దయామయుడు, గొప్ప క్షమాశీలి. (1, 2)

సత్యతిరస్కారులు, తమపై ప్రళయం ఎందుకు వచ్చి పడటంలేదని అడుగుతున్నారు. వారికిలా చెప్పు: "అగోచర జ్ఞానసంపన్నుడైన నా ప్రభువు సాక్షి! ప్రళయం మీ మీద తప్పకుండా వచ్చి పడుతుంది. భూమ్యాకాశాల్లో దాగివుండే ఏ (ప్రాణీ,) వస్తువూ దాన్నుండి తప్పించుకోలేదు. అణువుకన్నా పెద్దదిగాని, చిన్నదిగాని ఏదీ ప్రళయం బారి నుండి ఏమాత్రం తప్పించుకోలేదు. సమస్తం ఒక స్పష్టమైన గ్రంథంలో వ్రాయబడి ఉంది. సత్యాన్ని విశ్వసించి సత్కార్యాలు చేసేవారికి ప్రతిఫలం ఇవ్వడానికి, వారి పాపాలు మన్నించి గౌరవప్రదమైన ఉపాధి ప్రసాదించడానికి ప్రళయం తప్పకుండా సంభవిస్తుంది." (3,4)

అయితే మా సూక్తులకు వ్యతిరేకంగా తమ సర్వశక్తులతో పెనుగులాడే విద్రోహులకు అత్యంత వ్యథాభరితమైన శిక్ష కాచుకొని ఉంది. ప్రవక్తా! నీ ప్రభువు నుండి అవతరించినది పరమ సత్యమని; అది మహా బలశాలి, ప్రశంసనీయుడైన పరాత్పరుని సన్నిధికి దారి చూపిస్తుందని జ్ఞానసంపన్నులకు బాగా తెలుసు. (5,6)

సత్యతిరస్కారులు ప్రజలతో ఇలా అంటారు: "మేము మీకు ఒక విచిత్ర వ్యక్తిని గురించి చెప్పమంటారా? మీ దేహాలు అణువణువూ విడిపోయిన తర్వాత మీరు కొత్తగా మళ్ళీ సృజించబడతారని ఆయనగారు అంటున్నారు. ఇతను దేవుని పేర అబద్ధాలు మాట్లాడుతున్నాడో లేక ఇతనికేదైనా పిచ్చిపట్టిందో మాకయితే తెలియదు."

కాదు, (అసలు విషయం అదికాదు.) పరలోకాన్ని నమ్మనివారు (త్వరలోనే) నరక యాతనలు అనుభవించబోతున్నారు. వారు ఘోరంగా దారి తప్పారు. వారు ఎన్నడూ కళ్ళు తెరచి భూమ్యాకాశాలను చూడలేదా? అవి వారిని ముందూ వెనకల నుంచి చుట్టుముట్టి ఉన్నాయి. మేము తలచుకుంటే వారిని భూమిలో క్రుంగిపోయేలా

చేస్తాము. లేదా ఆకాశపు తునకలను వారి మీద పడవేస్తాము. (పశ్చాత్తాపహృదయంతో) దేవుని వైపు మరలేవారికి ఇందులో గొప్ప సూచన ఉంది. (7-9)

మేము దావూద్‌కు మా వైపునుండి అనేక భాగ్యాలు ప్రసాదించాము. "పర్వతాలూ! స్తుతిగానంతో మీరితనికి సహకరించండ"ని మేము పర్వతాలను ఆదేశించాము. పక్షులను కూడా ఇలాగే ఆదేశించాము. (అంతేకాదు,) దావూద్ కోసం మేము ఇనుమును మెతకగా చేసి దాంతో కవచాలు తయారుచేయాలని, వాటి కైవారాలు లెక్క ప్రకారం ఉంచాలని ఆజ్ఞాపించాము. (దావూద్ సంతతి ప్రజలారా!) సత్కార్యాలు చేయండి. మీరు చేస్తున్న ప్రతి పనీ నేను చూస్తున్నాను. (10,11)

సులైమాన్ కోసం మేము గాలిని అదుపులో ఉంచాము. తద్వారా అతను ఉదయం వేళ ఒక నెలరోజుల్లో నడిచే దూరాన్ని, అలాగే సాయంత్రం వేళ కూడా ఒక నెలరోజుల్లో నడిచే దూరాన్ని నడుస్తాడు. అతని కోసం మేము కరిగిన రాగితో కూడిన నదిని ప్రవహింపజేశాము. పెద్ద పెద్ద భూతాలను అతని అధీనంలో ఉంచాము. అవి తమ ప్రభువాజ్ఞతో అతని ముందు (కట్టుబానిసల్లా) పనిచేసేవి. వాటిలో ఏదైనా మా ఆజ్ఞను పాటించడానికి నిరాకరిస్తే మేము దానికి భగభగమండే అగ్నిని చవి చూపించేవాళ్ళము. అతని కోసం ఆ భూతాలు అతను కోరిన వస్తువు తయారుచేసేవి, ఆకాశహర్మ్యాలు, రకరకాల బొమ్మలు,[1] కోనేరుల్లాంటి విశాలమైన కంచాలు, ఒకచోట

1. ఇక్కడ మూలభాషలో 'తమాసీల్' అనే పదం వచ్చింది. ప్రాణుల లేక ప్రాణంలేని వస్తువుల చిత్రాలకు, విగ్రహాలకు అన్నిటికీ ఇది వర్తిస్తుంది. అయితే ఇక్కడ ప్రాణంలేని వస్తువులకు సంబంధించిన చిత్రాలని అర్థం. ప్రాణుల చిత్రాలు, విగ్రహాలను మాత్రమే ఇస్లాం నిషేధించింది.

హజ్రత్ ఉమ్మెహబీబా, ఉమ్మెసలమా (రజి)లు అబిసీనియాలోని ఒక చర్చీని చూసి, అందులో బొమ్మలున్న విషయాన్ని దైవప్రవక్త (సల్లం) ముందు ప్రస్తావించారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు: "వారిలో ఎవరైనా ఒక మహనీయుడు చనిపోయిన తరువాత వారు అతని సమాధిపై ప్రార్థనా మందిరం నిర్మిస్తారు. అందులో ఇలాంటి బొమ్మలు వేస్తారు. వీరు ప్రళయ దినాన దేవునిదృష్టిలో అత్యంత నీచమైన సృష్టితాలుగా పరిగణించబడతారు." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: ఒకసారి దైవప్రవక్త (సల్లం) నా ఇంటికి వచ్చినప్పుడు. నేను చిత్రాలున్న ఒక తెరను వ్రేలాడదీసి ఉంచాను. దాన్ని చూడగానే ఆయన ముఖంలో రంగు మారింది. వెంటనే ఆయన దాన్ని చించివేసి "ప్రళయదినాన అత్యంత కఠినశిక్ష విధించబడేవారిలో దేవుని సృష్టికి ప్రతిసృష్టి చేసేవారు కూడా ఉంటారు" అన్నారు. (బుఖారి, ముస్లిం)

హజ్రత్ సయీద్ బిన్ హసన్ ఇలా తెలియజేస్తున్నారు: నేను ఇబ్నె అబ్బాస్ (రజి) దగ్గర కూర్చొని ఉంటే ఒకతను వచ్చి "అబూ అబ్బాస్! నేను నా స్వహస్తాలతో కష్టపడి సంపాదించే వృత్తి పరుడ్ని. బొమ్మలు తయారుచేయడం నా వృత్తి" అని అన్నాడు. అప్పుడు ఇబ్నె అబ్బాస్ (రజి) ఇలా సమాధానమిచ్చారు: "నేను నీకు దైవప్రవక్త (సల్లం) నోట విన్న మాటనే చెబుతాను. నేను దైవప్రవక్త నోట ఈమాట విన్నాను- 'బొమ్మలు తయారుచేసేవాడ్ని దేవుడు శిక్షిస్తాడు. అందులో ప్రాణం పోయ నంతవరకు అతడ్ని వదలిపెట్టడు. కాని అతను ఎన్నటికీ అందులో ప్రాణం పోయలేడు." ఈమాట విని ఆ వ్యక్తి తీవ్ర ఆందోళనచెందాడు. అతని ముఖం వాడి పాలిపోయింది. ఇబ్నె అబ్బాస్ (రజి)



స్థిరంగా ఉండే పెద్ద పెద్ద వంటపాత్రలు వగైరా తయారు చేసేవి. దావూద్ సంతతి ప్రజలారా! నాపట్ల కృతజ్ఞతగా సత్కార్యాలు చేయండి. నా దాసులలో చాలా తక్కువ మంది కృతజ్ఞులయిన వారున్నారు. (12,13)

మేము సులైమాన్ విషయంలో మృత్యు ఆదేశాన్ని జారీ చేసినప్పుడు, సులైమాన్ చేతికర్రకు పట్టిన చెద వల్ల తప్ప మరే విషయం ద్వారా అతని మరణవార్త భూతాలకు తెలియలేదు. ఈవిధంగా (చేతికర్రకు చెదపట్టి) సులెమాన్ (భౌతికకాయం) నేలకొరిగి పోగానే భూతాలకు ఈసంగతి తెలిసింది. ఒకవేళ ఆ భూతాలకు అతీంద్రియ జ్ఞానం ఉంటే ఈవిధంగా అవి అవమానకరమైన యాతనలో చిక్కుకొని ఉండేవికావు. (14)

సబాజాతి ప్రజలకు వారి నివాసగృహాలలోనే ఒక సూచన ఉంది. కుడిఎడమల వైపు రెండు తోటలున్నాయి. మీ ప్రభువు ప్రసాదించిన ఉపాధిని అనుభవిస్తూ, ఆయన పట్ల కృతజ్ఞులయి ఉండండి. (ఇక్కడ భోగభాగ్యాలతో నిండిన) మంచి రాజ్యం ఉంది. (అక్కడ) మిమ్మల్ని మన్నించే ప్రభువున్నాడు. (15)

కాని వారు (మాకు అవిధేయులైపోయి మానుండి) ముఖం తిప్పుకున్నారు. చివరికి మేము ఆనకట్టలు తెగిపోయిన వరదను వారి మీదికి పంపాము. వారి (వినాశం) తరువాత మేము పూర్వముండిన (మధుర ఫలాలతో నిండిన) తోటల స్థానంలోనే, చేదుపండ్లు పండే మరో రెండుతోటలు సృజించాం. కాకపోతే ఆ తోటలలో అక్కడక్కడ కొన్ని రేగుచెట్లు, వెదురుచెట్లు మాత్రం ఉన్నాయి. ఇదీ మేము సత్యతిరస్కారానికి గాను వారికిచ్చిన ప్రతిఫలం. కృతఘ్నులైనవారికి తప్ప మరెవరికీ మేము ఇలాంటి ప్రతిఫలం ఇవ్వము. (16,17)

వారికి, మేము శుభాలు చేకూర్చిన పట్టణాలకు మధ్య స్పష్టంగా కన్పించే పట్టణాలు నెలకొల్పాం. ఆ పట్టణాల మధ్య సులువైన మజిలీలు ఏర్పరచాం. (కనుక) మీరు నిశ్చింతగా రేయింబవళ్ళు ఆ రహదారులలో తిరగండి. కాని వారు "ప్రభూ! మా ప్రయాణ మజిలీలు సుదీర్ఘం చేయి" అన్నారు. వారు తమకుతాము అన్యాయం చేసు కున్నారు. చివరికి మేము వారిని చెల్లాచెదరు చేసి చరిత్ర గర్భంలో కలిపేశాము.[2]

అది చూసి "దైవదాసుడా! బొమ్మలు తయారుచేయడం తప్పనిసరయితే చెట్లబొమ్మలో లేదా ప్రాణం లేని మరే వస్తువుల బొమ్మలో తయారుచెయ్యి" అని చెప్పారు. (బుఖారి, ముస్లిం)

అయితే మరికొన్ని హదీసుల ద్వారా గోడలకు, ద్వారాలకు, ఇంకా ఇతర చోట్ల వ్రేలాడదీసే బొమ్మలను మాత్రమే దైవప్రవక్త (సల్లం) నిషేధించినట్లు తెలుస్తోంది. దైవధర్మం నుండి దృష్టి మళ్ళించి ఏమరుపాటుకు గురిచేసే బొమ్మలన్నీ నిషేధించబడ్డాయి. అలాగే అశ్లీలతకు దారితీసే చిత్రాలు కూడా నిషేధించబడ్డాయి. అవి తప్ప భక్తి, గౌరవభావాలు కలిగించని బొమ్మలు, చిన్న పిల్లల ఆటబొమ్మలు, ధర్మోన్నతికి, ధర్మప్రచారానికి దోహదపడే బొమ్మలు, ఛాయాచిత్రాలు ధర్మ సమ్మతమేనని కొందరు ధర్మవేత్తలు అభిప్రాయపడ్డారు.

2. క్రీ.పూ. 965-926 మధ్యకాలంలో అంటే సులైమాన్ ప్రవక్త (అలైహి) కాలంలో సబా దేశం రాణితో పాటు ఆ దేశప్రజలు అత్యధికమంది సూర్యారాధన, విగ్రహ పూజలను వదలి ఇస్లాం

కృతజ్ఞులు, సహన శీలురకు ఈ ఉదంతంలో గొప్ప సూచనలు ఉన్నాయి. (18,19)

వారి విషయంలో ఇబ్లీస్ తన అంచనా నిజమైనట్లు గ్రహించాడు. కొందరు విశ్వాసులు తప్ప వారంతా అతడ్ని అనుసరించారు. విశ్వాసులపై ఇబ్లీస్‌కు అధికారం లేదు. అయితే ఎవరు పరలోకాన్ని విశ్వసిస్తారో, ఎవరు దాన్నిగురించి సందేహంలో పడతారో పరీక్షించడానికే మేమిలా చేశాం. నీ ప్రభువు ప్రతిదాన్నీ ఓకంట గమనిస్తున్నాడు. (20,21)

చెప్పు: "మీరు దేవుడ్ని వదలి ప్రార్థిస్తున్న మిథ్యాదైవాల్ని పిలుచుకోండి (మీ పిలుపుకు స్పందిస్తాయేమో). అవి భూమ్యాకాశాల్లోని అణుమాత్రం వస్తువుకు కూడా యజమానులు కావు. వాటియాజమాన్యంలో వారికి ఎలాంటి వాటా లేదు. వాటిలో ఏ ఒక్కటీ దేవునికి సహాయసహకారాలు అందజేయడం లేదు. దేవుని సన్నిధిలో ఆయన అనుమతించినవారి సిఫారసు తప్ప ఎవరి సిఫారసూ ఎవరి విషయంలోనూ ప్రయోజనం చేకూర్చదు. ప్రజల హృదయాల్లోని ఆందోళన, అస్థిమితాలు దూరమైన తర్వాత వారు "మీప్రభువు ఏం సమాధానమిచ్చాడ"ని అడుగుతారు. దానికి వారు "సరైన సమాధానమే లభించింది. ఆయన మహనీయుడు, మహోన్నతుడు" అనంటారు. (22,23)

---

స్వీకరించినట్లు తెలుస్తోంది. ఆ తరువాత కొన్నేళ్ళకు క్రమంగా ఆ జాతిలో మళ్ళీ విగ్రహారాధన చోటు చేసుకుంది. క్రీ.పూ. 650 నుండి 115 వరకు సబాజాతి ఉచ్ఛస్థితిలో ఉండింది. ఆ కాలంలో వారు వ్యవసాయ, వాణిజ్య రంగాల్లో ఎంతో పురోభివృద్ధి సాధించి యావత్తు జాతుల్లో గొప్ప ధనిక జాతిగా ప్రసిద్ధి చెందారు. వర్షాకాలంలో కొండలపై నుండి ప్రవహించే వరద నీటికి అనేక చోట్ల ఆనకట్టలు నిర్మించి పెద్ద జలాశయం తయారు చేసుకున్నారు. ఆ జలాశయం నుండి కాలువలు తీసి తోటలకు, పంట భూములకు మళ్ళించి మొత్తం దేశాన్ని సస్యశ్యామలం చేశారు.

అలాగే వారు భూ, సముద్ర మార్గాల ద్వారా సరుకులు ఎగుమతి దిగుమతులు చేసుకుంటూ వ్యాపారరంగాన్ని ఎంతో వృద్ధిచేశారు. తమ రాజ్యంలో భౌగోళికంగా ఎంతో కీలకమైన ప్రదేశాలు ఉండటం వల్ల వారి వ్యాపారం దాదాపు వెయ్యేండ్ల పాటు మూడు పువ్వులు ఆరు కాయలగా విరాజిల్లింది. ఆ కాలంలో వారు వెండి, బంగారాలతో చేయబడిన పాత్రలు ఉపయోగించేవారు. గోడలకు, కప్పులకు సైతం వెండి బంగారు నగిషీలు ఉండేవి.

సబాజాతి ప్రజల ఆర్థికాభివృద్ధి, విలాస జీవిత గాథలు విని రోమన్లు, గ్రీకులు కూడా ఈర్ష్య పడేవారు. వారు వంటచెరుకుగా గంధపు కలప, దాల్చినచెక్కలను ఉపయోగించేవారు. కొండలను తొలచి పెద్దపెద్ద మేడలు నిర్మించారు. మానవ చరిత్రలోనే మొట్టమొదట సనా పట్టణంలోని ఒక ఎత్తయిన కొండ ప్రదేశంలో 20 అంతస్తుల భవనం నిర్మించారు. అందులో ప్రతి అంతస్తూ 36 అడుగుల ఎత్తుండేది. ఈ రాజభవనం అనేక శతాబ్దాల వరకు ఖ్యాతిగాంచింది.

ఈ సుఖాలు, భోగభాగ్యాలు వారిపై దైవానుగ్రహం ఉన్నంత కాలం కొనసాగాయి. కాని చివరికి వారి ఐశ్వర్యం, ప్రాపంచిక వ్యామోహాలు వారి హృదయాల నుండి దైవభీతిని దూరం చేశాయి. ఈ విధంగా వారిలో దేవుని పట్ల కృతఘ్నత, ధిక్కార ధోరణులు హద్దు మీరిపోవడంతో దైవాగ్రహం విరుచుకుపడింది. పొరుగు రాజ్యాల నుండి తట్టుకోలేని దాడులు ప్రారంభమయ్యాయి. చివరికి క్రీ.శ. 45 లో భయంకరమైన తుఫాను, వరదలు వచ్చి జలాశయానికి పెద్ద గండ్లు పడ్డాయి. దాంతో తోటలు, పంట భూములు వరద ముంపుకు గురయి సర్వనాశనమయ్యాయి.



భూమ్యాకాశాల నుండి మీకు ఉపాధి ప్రసాదిస్తున్నది ఎవరని వారినడుగు. "దేవుడే, కనుక మన ఉభయవర్గాల్లో ఇప్పుడు ఒక వర్గం మాత్రమే సన్మార్గంలో లేక దుర్మార్గంలో పడివుంది" అని చెప్పు. "మేము చేసిన తప్పులకు మిమ్మల్ని నిలదీయడం జరగదు. అలాగే మీరు చేసిన కర్మలకు మమ్మల్ని ప్రశ్నించడం జరగదు" అని చెప్పు. "మన ప్రభువు మనందర్నీ సమావేశపరచి మనమధ్య న్యాయంగా, సరైన తీర్పిస్తాడు. ఆయన సమస్త విషయాలు తెలిసిన గొప్పన్యాయమూర్తి" అని కూడా చెప్పు. (24-26)

"సరే, మీరు దేవునికి సహవర్తులుగా చేసి ఆయన స్థాయికి చేర్చిన ప్రముఖ దేవతలు ఎవరో చూపండి నాకు. ఎవరూ లేరు. దేవుడు మాత్రమే సర్వ శక్తిమంతుడు, మహా వివేకవంతుడు"అని చెప్పు వారికి. ముహమ్మద్ (స)! మేము యావత్తు మానవాళి కోసం నిన్ను (స్వర్గ) శుభవార్త అందజేసేవానిగా, (దైవశిక్ష గురించి) హెచ్చరించేవానిగా చేసి పంపాము. కాని చాలామందికి ఈ వాస్తవం తెలియదు. (27,28)

"నీమాట నిజమైతే (ప్రళయం గురించిన) ఈవాగ్దానం ఎప్పుడు నెరవేరుతుంద"ని నిన్ను అడుగుతున్నారు. వారికిలా చెప్పు: "మీ కోసం ఒకరోజు నిర్ణయించబడింది. ఆరోజు రావడంలో మీరు ఒక్క ఘడియ కూడా ఆలస్యం చేయలేరు. అలాగే మీరు దాని నిర్ణీతసమయానికి ఒక్క ఘడియ కూడా ముందుగా తీసుకురాలేరు." (29,30)

"ఈ ఖుర్‌ఆన్‌ని, దీనికి పూర్వం అవతరించిన మరే గ్రంథాన్నీ మేము ఎన్నటికీ విశ్వసించం" అంటున్నారు అవిశ్వాసులు. ఈ దుర్మార్గులు తమ ప్రభువు సన్నిధిలో నిలబడినప్పుడు వారి పరిస్థితి నీవు చూస్తే బాగుంటుంది! అప్పుడు వీరు ఒకరిపైనొకరు నిందారోపణలు చేసుకుంటారు. ఇహలోకంలో అణచివేయబడినవారు, నాయకులుగా చెలామణయినవారితో "మీరు లేకపోతే మేము విశ్వాసులై ఉండేవాళ్ళం"అంటారు. (31)

అప్పుడు నాయకులుగా చెలామణయినవారు, అణగిమణగి ఉన్నవారితో "మీ దగ్గరికి వచ్చిన సన్మార్గం అవలంబించకుండా మిమ్మల్ని మేము నిరోధించామా? అసలు మీరు స్వతహాగానే పాపాత్ములు" అంటారు. అణగిమణగి ఉన్నవారు, నాయకులుగా చెలామణయినవారితో "కాదు, ఇవన్నీ రేయింబవళ్ళు మీరు పన్నిన కుట్రలు, మీరు మమ్మల్ని (నిజ)దేవుడ్ని తిరస్కరించి, ఆయనకు ఇతరుల్ని సాటికల్పించమని చెబుతుండేవారు" అనంటారు.

చివరికి వారు (నరక)యాతనలు ప్రత్యక్షంగా చూడగానే (బెంబేలెత్తిపోయి) లోలోన పశ్చాత్తాపపడతారు. మేము ఇలాంటి తిరస్కారుల మెడలకు గుదిబండ కడ్తాము. వారికి వారి కర్మలకు తగ్గ ప్రతిఫలమే లభిస్తుంది. (32,33)

మేము ఏ పట్నానికి హెచ్చరించేవాడ్ని పంపినా ఆ పట్నంవాసులు అతడ్ని తిరస్కరిస్తూ "నీవు తెచ్చిన సందేశాన్ని మేము నమ్మం" అనే అన్నారు. పైగా "మేము నీకంటే ఎక్కువ ధనికులం, సంతానంలో కూడా మేమే అధికులం. అంచేత మాకు శిక్షపడే ప్రశ్నే లేదు" అని చెప్పేవారు. వారికిలా చెప్పు: "నా ప్రభువు తానుకోరిన విధంగా కొందరికి

పుష్కలంగా, మరి కొందరికి స్వల్పంగా ఉపాధినిస్తాడు. కాని చాలామందికి ఈ సత్యం తెలియదు.” (34-36)

మీ సంతానం, సిరిసంపదలు మీకు మా సాన్నిధ్యం ప్రసాదించలేవు. సత్యాన్ని విశ్వసించి సదాచార వైఖరి అవలంబించినవారికే మా సాన్నిధ్యం లభిస్తుంది. అలాంటి వారికే వారి కర్మలకు రెట్టింపు ప్రతిఫలం లభిస్తుంది. వారు (స్వర్గవనాలలోని) ఆకాశ హర్మ్యాలలో చీకూచింతా లేకుండా హాయిగా ఉంటారు. మా సూక్తుల్ని తుదముట్టించ డానికి పరుగులు తీసేవారు మాత్రం నరక యాతనలు చవిచూస్తారు. (37,38)

వారికిలా చెప్పు: “నా ప్రభువు తన దాసులలో తానుకోరిన విధంగా కొందరికి విస్తృతంగా, మరికొందరికి స్వల్పంగా ఉపాధి ప్రసాదిస్తున్నాడు. మీరు (దైవమార్గంలో) ఏది ఖర్చుపెట్టినా ఆ వెలితిని భర్తీచేయడానికి ఆయన మీకు మరింత ప్రసాదిస్తాడు. ఆయన యావత్తు ఉపాధి ప్రదాతల్లోకెల్లా గొప్ప ఉపాధిప్రదాత.” (39)

ఆయన మానవులందర్నీ సమావేశపరచిన తర్వాత “వీరు మిమ్మల్ని ఆరాధిస్తుండే వారా?” అని దైవదూతల్ని ప్రశ్నిస్తాడు. దానికి వారు “మీరు పరమపవిత్రులు. మాకు మీతోనే సంబంధం ఉంది. వారితో మాకెలాంటి సంబంధం లేదు. వీరసలు మమ్మల్ని కాదు, భూతపిశాచాల్ని మాత్రమే పూజిస్తుండేవారు. వారిలో చాలామంది భూతాలనే నమ్మేవారు” అని సమాధానమిస్తారు. అప్పుడు మేము “ఈరోజు మీలో ఏ ఒక్కడూ ఎవరికీ ఎలాంటి లాభంగాని, నష్టంగాని కలిగించలేడు” అంటాం. మరోవైపు దుర్మార్గు లతో “ఇక మీరు తిరస్కరించిన ఈ నరకశిక్ష చవిచూడండి” అని అంటాం. (40-42)

వారికి మా సూక్తులు విన్పిస్తున్నప్పుడు “మీ తాతముత్తాతలు ఆరాధించిన ఈ దైవాలను ఆరాధించనీయకుండా మిమ్మల్ని ఇతను నిరోధించగోరుతున్నాడు” అంటారు వారు. ‘ఇది (ఖుర్ఆన్) అభూతకల్పన తప్ప మరేమీ కాద”ని కూడా అంటారు. ఈ తిర స్కారులు తమదగ్గరికి సత్యం వచ్చినా “ఇది స్పష్టమైన మంత్రజాలం” అన్నారు. (43)

ఇంతకు పూర్వం వీరికి మేము చదవడానికి ఎలాంటి (దివ్య)గ్రంథం ఇవ్వలేదు. నీకు పూర్వం వీరి దగ్గరికి హెచ్చరించేవాడ్ని కూడా ఎవరినీ పంపలేదు. వీరికి పూర్వం కూడా ప్రజలు (సత్యాన్ని) తిరస్కరించారు. మేము ఆనాటి ప్రజలకిచ్చిన వైభవాల్లో వీరు పదోవంతు కూడా పొందలేదు. అయినప్పటికీ వారు నా ప్రవక్తలను తిరస్కరించి నందున (నేను వారిని సర్వనాశనం చేశాను). చూడు, నా శిక్ష ఎంత కఠినమైనదో!

ప్రవక్తా! వారికిలా ఉపదేశించు: “నేను మీకు ఒక విషయం ఉపదేశిస్తున్నాను. దేవుని కోసం మీరు ఒక్కొక్కరు విడిగా, ఇద్దరేసి కలసి కూర్చొని ప్రశాంతంగా ఆలోచించండి. మీ సహచరునిలో ఎలాంటి పిచ్చిలేదు. అతను అత్యంత కఠినమైన (నరక) శిక్ష రాకముందే దాన్ని గురించి మిమ్మల్ని హెచ్చరిస్తున్నాడు.” (44-46)

వారికీ విధంగా చెప్పు: “మిమ్మల్ని నేనేదైనా ప్రతిఫలం అడిగితే, దాన్ని మీరే అట్టి పెట్టుకోండి. నాకు ప్రతిఫలమిచ్చే బాధ్యత దేవునిపై ఉంది. ఆయన ప్రతిదానికీ సాక్షిగా



ఉన్నాడు.” వారికీ సంగతి కూడా తెలియజెయ్యి: “నా ప్రభువు (నాపై) సత్యాన్ని అవతరింప జేస్తున్నాడు. ఆయన యావత్తు నిగూఢ రహస్యాలు తెలిసినవాడు.” (47,48)

వారికి స్పష్టంగా ఇలా చెప్పెయ్యి: “సత్యం వచ్చేసింది. దాంతో అసత్యానికి నూకలు చెల్లినట్లే. ఇకదాని ఆటలు ఎంతోకాలం సాగవు.” వారికీ విషయం కూడా చెప్పు: “నేను గనక మార్గభ్రష్టుణ్ణయిపోతే ఆ మార్గభ్రష్టత్వం నామీదే ఉంటుంది. కాని నేను సన్మార్గంలో ఉంటే, అది నా ప్రభువు నాపై అవతరింపజేసిన దివ్యావిష్కృతి కారణంగానే నేను సన్మార్గంలో ఉన్నాను. ఆయన సమస్తం వింటున్నాడు, మనకు అతి చేరువలోనే ఉన్నాడు.” (49,50)

వారు భీతావహులై తిరుగుతున్నప్పుడు నీవు వారి పరిస్థితి చూస్తే బాగుంటుంది. వారు తప్పించుకొని పారిపోలేరు. సమీపం నుంచే వారు పట్టుబడిపోతారు. అప్పుడు వారు “మేము దీన్ని విశ్వసిస్తున్నాం”అంటారు. కాని చాలాదూరం వెళ్ళిపోయిన వస్తువు ఇప్పుడెలా దక్కుతుంది? వారు గతంలో దీన్ని తిరస్కరించారు. పైగా ముందూవెనుకా ఆలోచించకుండా దూరం నిలబడి రాళ్ళు విసరుతుండేవారు. ఆనాడు వారు పెట్టుకున్న ఆశలన్నీ నేడు అడియాశలయ్యాయి. వారికి పూర్వం కూడా ఇలాంటి ప్రజల ఆశలు అడియాశలైపోయాయి. వారు కూడా సందిగ్ధంలో పడిపోయారు. (51-54) ✪

## అవతరణ: మక్కా 35. సృష్టికర్త (ఫాతిర్) సూక్తులు: 4

ఈ అధ్యాయాన్ని “ఫాతిర్” అంటారు. ఇది హిజ్రీశకానికి ఆరేడేండ్ల క్రితం మక్కాలో అవతరించింది. ఇందులో అవిశ్వాసులకు సత్యస్వీకరణకై పలువిధాల నచ్చజెప్పడం జరిగింది. మరోవైపు వారి తిరస్కార వైఖరి పట్ల సహనం వహించాలని దైవప్రవక్త (స)కు చెబుతూ, సత్యాన్ని విశ్వసించినవారికి పరలోక శుభవార్తలు అందజేయబడ్డాయి.

### కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

భూమ్యాకాశాలు సృష్టించిన దేవునికే సకల విధాల ప్రశంసలు శోభిస్తాయి. ఆయన దైవదూతలను సందేశహరులుగా నియమించాడు. ఆ దైవదూతలలో కొందరికి రెండేసి రెక్కలు, మరికొందరికి మూడేసి రెక్కలు, ఇంకొందరికి నాల్గేసి రెక్కలు ఉన్నాయి. ఆయన తానుకోరిన విధంగా తన సృష్టితాల రూపకల్పనలో (కొన్ని అవయవాలు) అదనంగా చేర్చుతాడు. నిస్సందేహంగా దేవుడు ప్రతిపనీ చేయగల సమర్థుడు, సర్వ శక్తిమంతుడు. (1)

దేవుడు మానవుల కోసం తన అనుగ్రహ ద్వారం తెరచి పెడితే దాన్నెవరూ మూసి వేయలేరు. అలాగే ఆయన తన అనుగ్రహద్వారం మూసేస్తే, ఇక దాన్నెవరూ తెరవలేరు. ఆయన మహా శక్తిమంతుడు, అత్యంత వివేకవంతుడు. (2)

మానవులారా! మీకు దేవుడు చేసిన మహోపకారాలు గుర్తు చేసుకోండి. దేవుడు తప్ప మీకు భూమ్యాకాశాల నుండి ఉపాధినిచ్చే మరో సృష్టికర్త ఎవడైనా ఉన్నాడా? ఆయన తప్ప మరోఆరాధ్యుడు లేడు. అలాంటప్పుడు మీరు ఎలా మోసపోతున్నారు?

ప్రవక్తా! వీరు నిన్ను తిరస్కరిస్తుంటే (ఇది ఈనాడు కొత్తేమీ కాదు.) నీకు పూర్వం కూడా చాలామంది ప్రవక్తలను తిరస్కరించారు. చివరికి యావత్తు వ్యవహారాలు దేవుని వైపుకే మరలిపోవలసి ఉంది. (3,4)

మానవులారా! దేవుని వాగ్దానం సత్యమైనది. కనుక ప్రాపంచిక జీవితం మిమ్మల్ని మోసగించకూడదు. ఆ మహామోసగాడు కూడా మిమ్మల్ని మోసగించకూడదు సుమా!

షైతాన్ మీకు బహిరంగ శత్రువు. అందువల్ల మీరు కూడా వాడ్ని శత్రువుగానే పరిగణించండి. వాడు తన అనుచరుల్ని నరకవాసులలో కలిపివేయడానికి తన మార్గం వైపు పిలుస్తున్నాడు. సత్యాన్ని తిరస్కరించేవారికి కఠినశిక్ష పడుతుంది. అయితే సత్యాన్ని విశ్వసించి, సదాచార వైఖరి అవలంబించేవారికి మన్నింపుతోపాటు గొప్ప ప్రతిఫలం లభిస్తుంది. (5-7)

ఒక వ్యక్తికి అతని దుష్కార్యాలను మనోహరమైనవిగా చేసి చూపడం జరుగుతుంది. అతను కూడా తన దుష్కార్యాలను సత్కార్యాలుగా భావిస్తాడు. అలాంటివాడికి పట్ట పగ్గాలు ఉంటాయా? దేవుడు తాను తలచిన విధంగా కొందరిని దారి తప్పిస్తాడు, మరికొందరిని దారికి తెస్తాడు. కనుక (ప్రవక్తా!) నీవు అనవసరంగా వారికోసం బాధ పడిపోతూ ప్రాణం పోగొట్టుకోకు. వారు చేస్తున్నదంతా దేవునికి బాగా తెలుసు. (8)

గాలులు పంపేవాడు దేవుడే. ఆ గాలులు మేఘాలను పైకి లేపుతాయి. తరువాత మేము వాటిని బంజరుభూమి వైపు తీసికెళ్తాము. (అక్కడ వర్షం కురిపించి) మృతప్రాయమైన ఆ భూమికి జీవంపోసి (వృక్షజాతిని) లేపుతున్నాము. అదేవిధంగా చనిపోయిన మానవుల్ని కూడా (ప్రళయ దినాన) మళ్ళీ బ్రతికించి లేపుతాము. (9)

గౌరవప్రతిష్ఠలు కోరుకునే ప్రతివ్యక్తీ గౌరవప్రతిష్ఠలన్నీ దేవునికే చెందుతాయని తెలుసుకోవాలి. ఆయన దగ్గరకు సద్వచనం మాత్రమే అధిరోహిస్తుంది. ఈ సద్వచనాన్ని సదాచరణ మాత్రమే పైకి అధిరోహింపజేస్తుంది. దుష్టపన్నాగాలకు పాల్పడేవారి కోసం కఠినాతికఠిన శిక్ష కాచుకొని ఉంది. త్వరలోనే వారి కుట్రలు వారికే బెడిసికొడ్తాయి. (10)

దేవుడు మిమ్మల్ని (ప్రారంభంలో) మట్టితో సృజించాడు. తరువాత వీర్యబిందువు ద్వారా పుట్టించాడు. ఆయన మిమ్మల్ని (స్త్రీపురుష) జంటలుగా చేశాడు. ఏ స్త్రీకూడా దేవునికి తెలియకుండా గర్భం దాల్చడంగాని, బిడ్డను కనడంగాని ఎన్నటికీ జరగదు. అలాగే ఎవరికైనా ఆయుష్షు పెరగడంగాని, తరగడంగాని అంతా ఒక గ్రంథంలో ముందే రాసిపెట్టి ఉంది. ఇలా చేయడం దేవునికి చాలా తేలిక. (11)

రెండు(రకాల) జలనిధులు ఒకే విధంగా లేవు. ఒకటి దప్పిక తీర్చగలిగే మంచి నీరు. త్రాగడానికి తియ్యగా ఉంటుంది. రెండోది గొంతును పాడుచేసే ఉప్పునీరు. అయితే ఆరెండు జలనిధుల నుండి మీరు తాజా (చేపల) మాంసం తీసి తింటున్నారు. ధరించడానికి ఆభరణ వస్తువులు (ముత్యాలు) కూడా సేకరిస్తున్నారు. అంతేకాదు, దేవుని అనుగ్రహం (ఉపాధి) అన్వేషించి ఆయన పట్ల కృతజ్ఞులయి ఉండేందుకు మీరు



ఆ జలాలలో నౌకలు వాటి గుండెల్ని చీల్చివేస్తూ నడవడాన్ని కూడా చూస్తున్నారు. (12)

ఆయన రాత్రిని పగటిలోకి, పగటిని రాత్రిలోకి జొప్పిస్తున్నాడు. ఆయనే (మీ ఉపయోగార్థం) సూర్యచంద్రుల్ని అదుపులో ఉంచాడు. ఇవన్నీ ఒక నిర్ణీతకాలం దాకా (తమతమ కక్ష్యల్లో) సంచరిస్తూ ఉంటాయి. ఆయనే మీ ప్రభువు. (విశ్వ)రాజ్యాధికారం ఆయనదే. ఆయన్ని వదలి మీరు పూజిస్తున్న మిథ్యాదైవాలు ఓ గడ్డిపోచకు కూడా యజమానులు కారు. మీరు వాటిని మొరపెట్టుకుంటే అవి మీ మొరల్ని ఆలకించలేవు. ఒకవేళ ఆలకించినా మీకు ఎలాంటి సమాధానమివ్వలేవు. ప్రళయదినాన అవి మీ బహు దైవారాధనను ఖండిస్తాయి. ఇలాంటి యదార్థాలు మీకు సర్వజ్ఞుడు తప్ప మరెవరూ తెలియజేయలేరు. (13,14)

మానవులారా! మీరే దేవుని మీద ఆధారపడే నిర్ధనులు. దేవుడు మాత్రం సర్వం కలిగి ఉన్న స్థితిపరుడు, సకలవిధాల ప్రశంసనీయుడు. ఆయన తలచుకుంటే మిమ్మల్ని తొలగించి  కొత్తగా మరో సృష్టిరాసిని సృజించగలడు. ఇది దేవునికి ఏమాత్రం కష్టసాధ్యం కాదు. (15-17)

(పాప)భారం మోసేవారెవరూ ఇతరుల (పాప)భారం మోయలేరు. (పాప)భారం క్రింద అణగిపోయినవాడు తన భారాన్ని తొలగించుకోవడానికి ఎవరినైనా పిలిస్తే, అతని భారంలోని అణుమాత్రం బరువు కూడా మోయడానికి ఎవరూ ముందుకు రారు. చివరికి అతి సన్నిహితులయిన అతని బంధువులు సైతం ముందుకు రారు.

ప్రవక్తా! తమ ప్రభువును (ప్రత్యక్షంగా) చూడకుండానే ఆయనకు భయపడుతూ ప్రార్థనా వ్యవస్థను నెలకొల్పేవారిని మాత్రమే నీవు హెచ్చరించగలవు. ఒక వ్యక్తి పవిత్రతా వైఖరి అవలంబిస్తున్నాడంటే అది తనశ్రేయస్సు కోసమే అవలంబిస్తున్నాడు. చివరికి అందరూ దేవుని సన్నిధికే మరలిపోవలసి ఉంది. (18)

గుడ్డివాడు, కళ్ళున్నవాడు ఒకటి కాదు. చీకటి వెలుగులు సమానం కాలేవు. చల్లని నీడ మండుటెండలాంటిది కాదు. జీవులు, మృతులు ఒకటి కాదు. దేవుడు తాను కోరిన వారికి (తన సూక్తులు) విన్పిస్తాడు.

(కనుక ప్రవక్తా!) సమాధుల్లో ఉన్నవారికి నీవు (ఏమాటా) విన్పించలేవు. (జరగనున్న పరిణామాలను గురించి) నీవు హెచ్చరించేవాడివి మాత్రమే. మేము నిన్ను శుభవార్త అందజేసేవానిగా, భయపెట్టేవానిగా చేసి సత్యాన్నిచ్చి పంపాము. ప్రతిజాతిలోనూ హెచ్చరించేవాడు ఆవిర్భవించాడు. వీరు నిన్ను నిరాకరిస్తుంటే (నిరాకరించనీ), వారి పూర్వీకులు కూడా (ఇలాగే దైవప్రవక్తలను) నిరాకరించారు. వారి దగ్గరకు వారి ప్రవక్తలు స్పష్టమైన నిదర్శనాలు, చిరు పుస్తకాలు, ఉజ్వలమైన గ్రంథాలు తీసుకొచ్చారు. ఆ తరువాత సత్యాన్ని తిరస్కరించినవారిని నేను పట్టుకున్నాను. చూడండి నాశిక్ష ఎంత తీవ్రంగా ఉండిందో! (19-26)

దేవుడు ఆకాశం నుండి ఎలా వర్షం కురిపిస్తున్నాడో మీరు పరికించి చూడలేదా? ఆ వర్షం ద్వారా మేము అనేక రకాల పండ్లు ఉత్పత్తి చేస్తున్నాం. వాటి రంగు

రకరకాలుగా ఉంటుంది. పర్వతాలలో కూడా తెల్లచారలు, ఎర్రచారలు, నల్లచారలతో రంగురంగుల పర్వతాలున్నాయి. అదేవిధంగా మానవుల్లో, జంతువుల్లో, పశువుల్లో కూడా వివిధ రంగులు ఉన్నాయి. దేవుని దాసులలో జ్ఞానులు మాత్రమే (ఈప్రకృతి యదార్థాలు గమనించి) దేవునికి భయపడతారు. నిస్సందేహంగా దేవుడు మహా శక్తిమంతుడు, క్షమాశీలి. (27,28)

దైవగ్రంథాన్ని పఠించే, ప్రార్థనా వ్యవస్థను నెలగొల్పే, మేము ప్రసాదించిన ఉపాధి నుండి రహస్యంగా, బహిరంగంగా దానంచేసేవారు ఎలాంటి నష్టంలేని వ్యాపారం ఆశిస్తున్నారు. దేవుడు తమకు పూర్తి ప్రతిఫలం ఇవ్వడంతోపాటు, ఆయన తన ప్రత్యేక అనుగ్రహంతో మరింత ప్రతిఫలం ప్రసాదిస్తాడన్న ఆశతోనే (వారీ వ్యాపారంలో తమ సర్వస్వం ధారపోస్తారు). నిజంగా దేవుడు ఎంతో క్షమించేవాడు, ఆదరించేవాడు.

ప్రవక్తా! మేము దివ్యావిష్కృతి ద్వారా నీ దగ్గరకు పంపిన గ్రంథమే పరమసత్యం. ఈ గ్రంథం పూర్వం వచ్చిన గ్రంథాలను ధృవీకరిస్తూ వచ్చింది. దేవునికి తన దాసుల స్థితిగతుల్ని గురించి బాగా తెలుసు. ఆయన ప్రతి విషయాన్నీ గమనిస్తున్నాడు. (29-31)

మా దాసులలో మేము ఎన్నుకున్నవారిని ఈ గ్రంథానికి వారసులుగా చేశాం. వారిలో కొందరు ఆత్మవంచన చేసుకున్నవారున్నారు. కొందరు మధ్యేమార్గం అవలంబించిన వారున్నారు. మరికొందరు దేవుని ఆజ్ఞతో సత్కార్యాలు చేయడంలో ఒకర్నొకరు మించిపోయే వారున్నారు.[1] ఇదే అన్నిటికంటే గొప్ప (దైవా)అనుగ్రహం. (32)

---

1. ఈ సూక్తిలో మూడు వర్గాల విశ్వాసుల్ని గురించి పేర్కొనడం జరిగింది. ఈ విషయాన్నే సమర్థిస్తూ ఒక హదీసులో ఇలా ఉంది:

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఈ విధంగా తెలిపారు- "సత్కార్యాలు చేయడంలో ఒకర్నొకరు మించిపోయినవారు ఎలాంటి లెక్క, విచారణ లేకుండానే స్వర్గంలో ప్రవేశిస్తారు. మధ్యే మార్గం అవలంబించినవారి విషయంలో మాత్రం విచారణ జరుగుతుంది. అయితే అది తేలికపాటి విచారణ. పోతే ఆత్మలకు అన్యాయం చేసుకున్నవారిని (ఆత్మవంచనకు పాల్పడినవారిని) సుదీర్ఘ పునరుత్థాన దినం ముగిసేదాకా ఆపి ఉంచడం జరుగుతుంది. ఆ తరువాత వారిని దేవుడు తన కారుణ్యఛాయలోకి తీసుకుంటాడు. వీరే దేవునికి కృతజ్ఞతలు తెలుపుతూ 'మా దుఃఖాన్ని దూరం చేసిన దేవునికి కృతజ్ఞతలు' అని అంటారు." (అహ్మద్, తబ్రాని, బైహఖి)

ఈ హదీసులో ఆత్మవంచనకు పాల్పడిన మూడో వర్గం ముస్లింలను సుదీర్ఘ పునరుత్థాన దినం ముగిసేదాకా, అంటే దైవ న్యాయస్థానంలో కర్మవిచారణ పూర్తయ్యే వరకు ఆపి ఉంచడం జరుగుతుందని చెప్పబడింది. ఆ దినం ఎన్ని వందల, వేల సంవత్సరాల సుదీర్ఘంగా ఉంటుందో చెప్పలేం. కొన్ని ఉల్లేఖనాల ప్రకారం అది మనలెక్క ప్రకారం యాభైవేల సంవత్సరాలంత సుదీర్ఘంగా ఉంటుందని తెలుస్తోంది. అంతేకాదు, ఆ సుదీర్ఘకాలం ఎంత కఠినంగా, దుర్భరంగా ఉంటుందో కూడా చెప్పలేం. చివరికి దేవుడు కరుణించి వారిని స్వర్గానికి పంపుతాడు.

అయితే ఇలాంటి ఆత్మవంచకులైన ముస్లింలకు న్యాయస్థానంలో తీర్పులన్నీ ముగిసే దాకా ఉండే శిక్ష మాత్రమే విధించబడుతుంది. అయితే వారిలో ఎవరూ నరకానికి పోరని అపోహపడరాదు సుమా! ఖుర్ఆన్, హదీసుల్లో విశ్వాసులకు నరక శిక్ష పడేటటువంటి అనేక నేరాల ప్రస్తావనలు



వారు శాశ్వత స్వర్గవనాల్లో ప్రవేశిస్తారు. వారక్కడ స్వర్ణకంకణాలు, విలువైన రత్నాలు, పట్టువస్త్రాలు ధరిస్తారు. (ఈ మహోపకారాలకు) వారు దేవునికి కృతజ్ఞతలు తెలుపుతూ "మా దుఃఖం దూరంచేసిన దేవుడు ఎంతో ప్రశంసనీయుడు. నిస్సందేహంగా మా ప్రభువు క్షమించేవాడు, ఆదరించేవాడు. ఆయన తన అనుగ్రహంతో మనకు శాశ్వత నివాసం కల్పించాడు. ఇప్పుడిక్కడ మనకు ఎలాంటి బాధ, అలుపు ఉండవు" అని అంటారు. (33-35)

ఇక సత్యాన్ని నిరాకరించిన అవిశ్వాసుల కోసం నరకాగ్ని కాచుకొని ఉంది. (అక్కడ) వారు చావాలనుకున్నా చావు రాదు. వారికి నరకయాతనలు తగ్గించడం కూడా జరగదు. ఈవిధంగా మేము సత్యతిరస్కారులకు ప్రతిఫలమిస్తాం. వారక్కడ పెడ బొబ్బలు పెడ్తూ "ప్రభూ! మమ్మల్నిక్కడ్నుంచి తీసెయ్యి. (మాకు బుద్ధొచ్చింది.) మేము ఇదివరకు చేసిన వాటికి భిన్నంగా సత్కార్యాలు చేస్తాము" అని మొరపెట్టుకుంటారు.

(అప్పుడు వారికి) "మీకు మేము దీర్ఘాయుష్షు ఇవ్వలేదా? అంత దీర్ఘాయుష్షులో మీరు తలచుకుంటే గుణపాఠం నేర్చుకుని ఉండేవారు. మీ దగ్గరికి హెచ్చరించేవాడు కూడా వచ్చాడు కదా! ఇప్పుడిక (నరక యాతనలు) చవిచూడండి. దుర్మార్గులకు ఇక్కడ ఎవరూ సహాయం చేయరు" అని సమాధానం ఇవ్వబడుతుంది. (36,37)

దేవునికి భూమ్యాకాశాల్లోని సమస్త నిగూఢ విషయాలు తెలుసు. (మీ) హృదయాల్లో దాగిన రహస్యాలు సయితం ఆయనకు తెలుసు. ఆయనే మిమ్మల్ని ధరణిలో (తన) ప్రతినిధిగా నియమించాడు. ఇప్పుడెవరైనా సత్యాన్ని తిరస్కరిస్తున్నాడంటే ఆ తిరస్కార పర్యవసానం అతని మీదనే పడుతుంది. తిరస్కారుల తిరస్కార వైఖరి వల్ల వారిపై మరింత దైవాగ్రహమే విరుచుకుపడుతుంది. అవిశ్వాసులకు నష్టంలో తప్ప మరే విషయంలోనూ వృద్ధినివ్వదు. (38,39)

వారినిలా అడుగు: "దేవుడ్ని వదలి మీరు పూజిస్తున్న మీ భాగస్వాముల్ని మీరెప్పుడైనా పరికించి చూశారా? వారు భూలోకంలో ఏ వస్తువును సృష్టించారో నాకు చూపండి కాస్త. పోనీ ఆకాశ నిర్మాణంలో వారిపాత్ర ఏమిటో చెప్పండి." వారికి మేము ఏదయినా రాసిచ్చామా, దాని ఆధారంగా వారు స్పష్టమైన ప్రమాణం కలిగిఉండేందుకు? లేదు. అసలీ దుర్మార్గులు పరస్పరం మోసగించుకోవడానికి బూటకపు వాగ్దానాలు చేస్తున్నారు.

---

ఉన్నాయి. ఉదాహరణకు, ఒక విశ్వాసి మరొక విశ్వాసిని అన్యాయంగా హతమార్చితే నరక శిక్ష పడుతుందని స్వయంగా దేవుడు ప్రకటించాడు. వారసత్వపు చట్టానికి సంబంధించి దైవ పరిధులను అతిక్రమించినవారికి కూడా నరక శిక్ష పడుతుందని ఖుర్ఆన్ హెచ్చరిస్తోంది. వడ్డీ వ్యవహారాలు నిర్వహించేవారు నరక వాసులవుతారని స్పష్టంగా పేర్కొనబడింది.

అంతేగాక, మరికొన్ని ఘోరపాపాలకు పాల్పడినవారు కూడా నరక శిక్ష చవిచూడవలసి వస్తుందని హదీసుల్లో ఉంది. కనుక దైవాజ్ఞలు, ప్రవక్త బోధనలు వదలి ఇష్టానుసారం జీవితం గడిపే ముస్లింలు వెంటనే మేల్కొని తమను తాము సంస్కరించుకోవడానికి ప్రయత్నించాలి.

భూమ్యాకాశాలు దొర్లకుండా స్థిరంగా పట్టి ఉంచినవాడు దేవుడే. ఒకవేళ అవి దొర్లి పడితే, దేవుడు తప్ప మరెవరూ వాటిని పొదివి పట్టుకోలేరు. నిస్సందేహంగా దేవుడు ఎంతో ఉదార స్వభావుడు, గొప్ప క్షమాశీలి. (40,41)

గతంలో వారు దేవుని పేరుతో గట్టిప్రమాణాలు చేస్తూ, తమ దగ్గరకు హెచ్చరించే వారెవరైనా (దైవప్రవక్త) వస్తే తాము ప్రపంచంలోని ఇతర జాతులకన్నా ఎక్కువ సన్మార్గ గాములవుతామని చెప్పేవారు. తీరా వారి దగ్గరకు హెచ్చరించేవాడు రాగానే, అతని రాక వారిని సత్యానికి మరింత దూరం నెట్టివేసింది. వారు దేశంలో గర్వపోతులయి దుష్ట పన్నాగాలు పన్నడం ప్రారంభించారు. నిజానికి దుష్ట పన్నాగాలు వాటిని పన్నేవారికే బెడిసికొడ్తాయి.

వీరిప్పుడు గత జాతులకు పట్టిన దుర్గతి కోసం వేచిఉన్నారా? అలాగైతే (దుష్టుల్ని శిక్షించడంలో) దేవుడు అనుసరిస్తున్న విధానంలో నీవు ఎలాంటి మార్పు చూడలేవు. దేవుని విధానాన్ని ఆయన నిర్ణయించిన మార్గం నుండి ఏ శక్తీ మళ్ళించలేదు. (42,43)

వారుపూర్వం గతించినవారికి ఎలాంటి దుర్గతి పట్టిందో ప్రపంచంలో తిరిగి చూడ లేదా? ఆ ప్రజలు వీరికంటే ఎంతో శక్తిమంతులు. భూమ్యాకాశాల్లోని ఏ వస్తువూ దేవుని పట్టునుండి తప్పించుకోలేదు. ఆయన సర్వం ఎరిగినవాడు. ప్రతి విషయంపైనా ఆయనకు అధికారం ఉంది. మానవుల్ని వారి దుశ్చర్యల కారణంగా పట్టుకోదలిస్తే ఆయన భూమిపై ఒక్క ప్రాణిని కూడా సజీవంగా వదలిపెట్టేవాడు కాదు. కాని ఆయన వారిని ఒక నిర్ణీతసమయం వరకు అవకాశమిచ్చి వదలిపెడ్తున్నాడు. ఆ నిర్ణీత సమయం రాగానే దేవుడు (స్వయంగా) తన దాసుల సంగతి చూసుకుంటాడు. (44,45) ✪

**అవతరణ: మక్కా**

# 36. యాసీన్

**సూక్తులు: 83**

ఈ అధ్యాయంలోని తొలిరెండు బీజాక్షరాలయిన "యా,సీన్"లనే దీనికి పేరు పెట్టడం జరిగింది. ఇది హిజ్రీశకానికి నాలుగైదేండ్ల పూర్వం మక్కాలో అవతరించినట్లు తెలుస్తోంది. ఇందులో దైవప్రవక్త (స)ను విశ్వసించకుండా సత్యవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న అవిశ్వాసుల్ని హెచ్చరించడంతో పాటు, దేవుని ఏకత్వం, ప్రవక్త దౌత్యం, మరణానంతర జీవితాలను గురించి సహేతుకంగా చర్చించడం జరిగింది.

### కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

యా-సీన్. వివేకంతో కూడిన ఖుర్‌ఆన్ సాక్షి! నీవు నిజంగా దైవప్రవక్తవే; సన్మార్గంలో ఉన్నావు. ఇది మహా శక్తిమంతుడు, అమిత దయామయుడైన దేవుడు అవతరింపజేసిన గ్రంథం. దీనిద్వారా నీవు ఒక జాతిని హెచ్చరించాలి. ఆ జాతిప్రజల తాత ముత్తాతల్ని లోగడ హెచ్చరించడం జరగలేదు. అందువల్ల వారు ఏమరుపాటుకు లోనయి ఉన్నారు. (1-6)

వారిలో చాలామంది గురించి (దైవ) నిర్ణయం జరిగిపోయింది. అందువల్లనే వారు (సత్యాన్ని) విశ్వసించడంలేదు. మేము వారి మెడలకు (కన్పించని) గుదిబండలు



కట్టివేశాం. అవి వారి గడ్డాలదాకా బిగించబడ్డాయి. ఈ కారణంగానే వారు (గర్వపోతుల్లా) తలలు పైకెత్తి నిలబడ్డారు. మేము వారికి ముందు ఒక గోడ, వెనుక ఒక గోడ నిల బెట్టాము. మేము వారిని పూర్తిగా కప్పివేశాము. దాంతో వారికి ఏ (మంచి) విషయమూ తోచదు. కనుక నీవు వారిని హెచ్చరించినా, హెచ్చరించకపోయినా ఒకటే. వారు ఎన్నటికీ విశ్వసించరు. కరుణామయుని చూడకుండానే ఆయనకు భయపడి, సత్యోప దేశాన్ని అనుసరించేవాడ్ని మాత్రమే నీవు హెచ్చ రించగలవు. అతనికి గొప్ప ప్రతిఫలం లభిస్తుందని శుభవార్త అందజేయి. (7-11)

మేము తప్పకుండా ఒకరోజు మృతుల్ని బ్రతికిస్తాము. వారు చేస్తున్న కర్మలన్నిటినీ మేము నమోదుచేస్తున్నాం. వారు తమ వెనుక వదలిపెట్టిన చిహ్నాలను కూడా గ్రంథస్థం చేస్తున్నాం. ప్రతి విషయాన్నీ మేము స్పష్టమైన ఓ గ్రంథంలో నమోదుచేస్తున్నాం. (12)

ఉదాహరణకు దైవప్రవక్తలు వచ్చిన ఒక పట్టణానికి చెందిన ప్రజల గాథ విన్పించు వారికి. మేమా పట్టణప్రజల దగ్గరకు ఇద్దరు ప్రవక్తలను పంపాము. వారా ఇద్దర్నీ తిరస్కరించారు. తర్వాత ఆ ఇద్దరికి మద్దతుగా మేము మరోప్రవక్తను పంపాము. ఆ ముగ్గురు "మేము మీ దగ్గరకు దైవప్రవక్తలుగా పంపబడ్డాం" అన్నారు. (13,14)

దానికి వారు "మీరు మాలాంటి మానవమాత్రులే తప్ప మరేమీ కాదు. కరుణామయుడైన దేవుడు ఏదీ పంపలేదు. మీరు చెబుతున్నదంతా బూటకం" అన్నారు. (15)

"మా ప్రభువుకు తెలుసు. మేము నిజంగానే దైవప్రవక్తలుగా నియమితులై మీ దగ్గరకు పంపబడ్డాం. ఎలాంటి అరమరికలు లేకుండా దైవసందేశం అందజేయడమే మాపని. అంతకుమించి మరో బాధ్యత మాపై లేదు" అన్నారు దైవప్రవక్తలు. (16,17)

"మేము మిమ్మల్ని మా పాలిట అపశకునంగా భావిస్తున్నాము. మీరు గనక (ఈ ప్రచారం) మానుకోకపోతే మేము మిమ్మల్ని రాళ్ళతో కొట్టి చంపేస్తాం. మా నుండి మీరు దుర్భర శిక్ష చవిచూడవలసి వస్తుంది" అన్నారు పట్టణవాసులు బెదిరిస్తూ. (18)

"మీ అపశకునం మిమ్మల్నే చుట్టుకొనిఉంది. మేము మీకు హితబోధచేస్తున్నా మనేనా మీరీ మాటలు అంటున్నది? మీరసలు హద్దుమీరి పోయారు" అన్నారు దైవప్రవక్తలు. (19)

అంతలో పట్నంలోని ఓ మూలనుండి ఒకతను పరుగెత్తుకుంటూ వచ్చి ఇలా అన్నాడు: "నా జాతిప్రజలారా! ప్రవక్తల మాట విని వారిని అనుసరించండి. మీ నుండి ఎలాంటి ప్రతిఫలం ఆశించని ఈ సన్మార్గగాముల్ని అనుసరించండి. నన్ను సృష్టించిన వాడ్ని నేనెందుకు ఆరాధించను? మీరంతా చివరికి ఆయన దగ్గరికే పోవలసి ఉంది. అలాంటి దేవుడ్ని వదలి నేను ఇతరుల్ని దైవాలుగా చేసుకోవాలా? కరుణామయుడైన ఆ దేవుడు నాకేదైనా నష్టం కల్గించదలిస్తే ఈ దైవాల సిఫారసు నాకేమాత్రం పనికిరాదు. దేవుని పట్టునుండి అవి నన్ను విడిపించలేవు. ఒకవేళ నేనలా చేస్తే నేను పూర్తిగా దారి తప్పినట్లే. నేను మీ ప్రభువును విశ్వసిస్తున్నాను. మీరు నామాట వినండి." (20-25)

(చివరికి వారు అతడ్ని అన్యాయంగా చంపి పాట్టన పెట్టుకున్నారు. అప్పుడతనికి) "స్వర్గంలో ప్రవేశించు" అని చెప్పారు (దైవదూతలు). అప్పుడతను "నా ప్రభువు ఏవిషయం కారణంగా నాపాపాలు మన్నించి నన్ను గౌరవనీయులలో చేర్చాడో నాజాతి ప్రజలకు తెలిస్తే ఎంతబాగుండు!" అన్నాడు (విచారంగా). ఆ తర్వాత మేమతని జాతిపై ఆకాశం నుండి ఎలాంటి సైన్యం దించలేదు. అలా సైన్యాన్ని దించే అవసరం కూడా లేదు మాకు. ఒకేఒక విస్ఫోటం! అంతే, తృటిలో వారంతా ఆరి (నాశనమై) పోయారు.

దాసుల స్థితి ఎంత శోచనీయం! వారి దగ్గరికి ఏప్రవక్త వచ్చినా అతడ్ని వారు హేళన చేస్తారు. గతంలో మేము (తిరస్కారవైఖరి అవలంబించిన) ఎన్ని జాతులను నాశనం చేశామో వీరికి తెలియదా? ఆ తరువాత వారు మరెన్నడూ వీరి దగ్గరకు తిరిగి రాలేదు. చివరికి అందరూ ఒకరోజు మా సన్నిధికి చేరుకోవలసి ఉంది. (26-32)

వీరికోసం మృతభూమి ఒక సూచన. మేము దానికి (వర్షం ద్వారా) జీవంపోసి, అందులో నుంచి ధాన్యం (పండించి)తీస్తున్నాం. దాన్ని వీరు తింటున్నారు. మేమందులో ఖర్జూరం, ద్రాక్షపండ్లు పండించాము. కాలువలు కూడా ప్రవహింపజేశాము. ఆ తోటల పండ్లు కూడా వీరు తింటున్నారు. ఇదంతా వారు తమ స్వహస్తాలతో పుట్టించలేదు. మరి వీరు (మాకు) కృతజ్ఞతలు ఎందుకు అర్పించరు? అన్ని రకాల జంటలను సృష్టించిన దేవుడు పరమపవిత్రుడు. ఆ జంటలు భూమిపై వృక్షజాతికి సంబంధించినవైనా, స్వయంగా వీరి జాతికి సంబంధించినవైనా లేదా వీరికి తెలియని ఇతర వస్తువులకు సంబంధించినవయినా[1] (అన్నిటినీ ఆయనే సృష్టించాడు). (33-36)

వారికోసం మరొక సూచనగా రాత్రి ఉంది. మేము దాని పైనుండి పగటిని తొలగిస్తున్నాము. అప్పుడు వారిపై చీకటి ఆవరిస్తుంది. సూర్యుడు తన నిర్ణీత కక్ష్యలో సంచరిస్తున్నాడు. ఇది మహా శక్తిమంతుడు, అసాధారణ వివేకవంతుడయిన దేవుడు రూపొందించిన (అద్భుత) పథకం. (37,38)

చంద్రుని కోసం మేము మజిలీలు (చంద్రకళలు) నిర్ణయించాము. అతను వాటిని దాటుకుంటూ చివరికి ఎండిపోయిన ఖర్జూరపు మట్టలా మారిపోతాడు. చంద్రుని పట్టుకునే శక్తి సూర్యునిలో లేదు. అలాగే రాత్రి పగటిని దాటిపోలేదు. సమస్తం ఒక్కొక్క కక్ష్యలో (అంటే తమ తమ నిర్ణీత కక్ష్యల్లో) సంచరిస్తున్నాయి.[2] (39,40)

---

1. వివరాలకు 51:49 సూక్తి, దాని పాదసూచిక చూడండి.

2. ఇక్కడ "సమస్తం ఒక్కొక్క కక్ష్యలో సంచరిస్తున్నాయి" అంటే సూర్యుడు, చంద్రుడు, గ్రహాలు, నక్షత్రాలు మొదలైన సమస్త రోదసీ వస్తువులు వేర్వేరుగా తమకు నిర్దేశించిన కక్ష్యల్లో తిరుగుతున్నాయని అర్థం. చంద్రుడు తన చుట్టూ తాను తిరుగుతూ భూమి చుట్టూ తిరుగుతుంటే, భూమి తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుని చుట్టూ గంటకు 65 వేల మైళ్ళ వేగంతో తిరుగుతోంది. ఈవిధంగా మిగతా గ్రహాల చుట్టూ కూడా వాటి ఉపగ్రహాలు తిరుగుతుంటే, ఆ గ్రహాలు సూర్యుని చుట్టూ తిరుగుతున్నాయి. అంతేకాకుండా బుధ, శుక్ర, భూమి, అంగారక గ్రహాల వెలుపల లక్షలాది గ్రహశకలాలతో కూడి, 28 కోట్ల కిలోమీటర్ల వెడల్పున్న 'ఆస్టెరాయిడ్ బెల్ట్'



వారికోసం మరొక సూచన ఉంది. మేము మానవజాతిని ఒక నిండునావలో ఎక్కించాం. ఆ తర్వత వారికోసం అలాంటి నావలనే (అనేకం) సృజించాం. వాటిలో ఎక్కి వీరు ప్రయాణం చేస్తున్నారు. మేము తలచుకుంటే వారిని (నడి సముద్రంలో) ముంచివేయగలం. ఆతర్వాత వారి మొరాలకించే నాథుడే ఉండడు. ఏవిధంగానూ వారు ఈగండం నుంచి గట్టెక్కలేరు. మా అనుగ్రహం మాత్రమే వారిని గట్టెక్కించి, ఒక నిర్ణీతకాలం వరకు ప్రాపంచిక ప్రయోజనాలు పొందే అవకాశమిస్తుంది. (41-44)

"మీముందు వస్తున్న పర్యవసానం నుండి, మీవెనుక గతించిన దాని నుండి తప్పించుకోండి, మీరు కరుణించబడతారు" అని చెప్పినప్పుడు వారు వినీ విననట్లు ఉండిపోతారు. తమ ప్రభువు నుండి తమ దగ్గరకు ఏదైనా సూక్తిగాని, సూచనగాని వచ్చినప్పుడల్లా వారు ముఖం తిప్పుకుంటారు. (అలాగే) దేవుడు మీకు ప్రసాదించిన ఉపాధి నుండి దైవమార్గంలో కూడా వినియోగించండని అన్నప్పుడు సత్యతిరస్కారులు విశ్వసించినవారితో "దేవుడు తలచుకుంటే వారిని పోషించగలడు కదా? అలాంటివారికి మేము తిండి పెట్టాలా? మీరు పూర్తిగా దారితప్పారు" అంటారు. (45-47)

"నీవు గనక సత్యవంతుడవైతే ప్రళయం గురించిన (నీ)బెదిరింపు ఎప్పుడు నెరవేరుతుందో చెప్పు"అని అడుగుతున్నారు వారు. వారసలు దేనికోసం ఎదురుచూస్తున్నారో

---

అనే బ్రహ్మాండమైన ఖగోళవలయం; వేలకొలది తోకచుక్కలు కూడా తమతమ నిర్ణీత కక్ష్యల్లో సూర్యుని చుట్టూ తిరుగుతున్నాయి. ఈ మొత్తం సౌరవ్యవస్థ (సూర్య కుటుంబం) ఒక చోట స్థిరంగా లేదు. పాలపుంత (Milky way) కేంద్రం నుంచి 32,000 కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న ఈ సూర్యకుటుంబం తన చుట్టూ తాను తిరుగుతూ సెకండుకు 160 మైళ్ళ వేగంతో పాలపుంత కేంద్రం చుట్టూ తిరుగుతున్నది. కాంతి సంవత్సరం అంటే, సెకండుకు 1,86,000 మైళ్ళ వేగంతో ఒక సంవత్సరంపాటు కాంతి ప్రయాణించే దూరం (5,86,570 కోట్ల మైళ్ళు) అన్నమాట. ఇలా మన సౌరవ్యవస్థ పాలపుంత చుట్టూ ఒకసారి పరిభ్రమించడానికి 25 కోట్ల సంవత్సరాలు పడుతుంది!

10,000 కోట్ల నక్షత్రాలతో కూడిన మన పాలపుంత (గెలాక్సి) వ్యాసం 20 లక్షల కాంతి సంత్సరాలు ఉంది. మన గెలాక్సి (పాలపుంత) కూడా తన నిర్ణీత కక్ష్యలో సెకండుకు 250 మైళ్ళ వేగంతో ఒక దిశగా సాగిపోతోంది. ఇలాంటి గెలాక్సీల సముదాయాన్ని 'క్వాజర్' అంటారు. ఇలాంటి క్వాజర్‌లు విశ్వంలో దాదాపు కోటి దాకా ఉంటాయని శాస్త్రవేత్తలు లెక్కగట్టారు. అలాగే ఒక్కొక్క క్వాజర్‌లో వెయ్యేసి గెలాక్సీలు ఉంటాయని తెలుస్తోంది. అయితే మన భూమి, మన సూర్య కుటుంబం, మన పాలపుంతతో పాటు ఇతర అనేక గెలాక్సీలు ఉన్న మన క్వాజర్ కూడా తన నిర్ణీత కక్ష్యలో ఒక దిశగా ప్రయాణిస్తోందని రాయల్ అబ్జర్వేటరీ, కేంబ్రిడ్జి, ఆరిజోనా, కాలిఫోర్నియా యూనివర్సిటీలలో పనిచేస్తున్న శాస్త్రవేత్తలు గమనించారు.

దీన్నిబట్టి ఈవిశ్వంలో ఏ రోదసీ వస్తువు కూడా స్థిరంగా లేదని; ప్రతి గ్రహం, ప్రతి నక్షత్రం, ప్రతి గెలాక్సీ, ప్రతి క్వాజర్ తమతమ నిర్ణీత కక్ష్యల్లో నిరంతరాయంగా సంచరిస్తున్నాయని తెలుస్తోంది. పైగా ఇవన్నీ ఒకదాని కొకటి ఢీకొనడానికి వీలులేని విధంగా దేవుడు నిర్దేశించిన కక్ష్యలలో, ఆయన నిర్ణయించిన వేగాలతో ఎంతో క్రమబద్ధంగా తిరుగుతున్నాయి. కనుక సర్వసృష్టికర్త, మహాయుక్తి పరుడయిన ఇలాంటి దేవుడ్ని మాత్రమే ఆరాధించాలని ఈ సూక్తి మానవాళికి పరోక్షంగా బోధిస్తోంది. (ఇతర వివరాలకు 50:6 సూక్తికి రాసిన పాదసూచిక చూడండి.)

అదొక విస్ఫోటం మాత్రమే. వారు (ప్రాపంచిక వ్యవహారాల్లో తలమునకలై) జగడమాడు కుంటున్న స్థితిలో అది హఠాత్తుగా వారిని చుట్టుముడ్తుంది.[3] అప్పుడు వారు వీలునామా సైతం వ్రాయలేరు. అంతేకాదు, వారు తమ ఇండ్లకు కూడా చేరుకోలేరు. (48-50)

ఆ తరువాత శంఖం ఊదబడుతుంది. దాంతో వారు తమప్రభువు ముందు హాజరు కావడానికి ఒక్కసారిగా తమ సమాధుల నుంచి లేచి బిలబిలా బయటికి వస్తారు. (పరిస్థితి అర్థంగాక) కంగారుపడుతూ "అరె! ఎవరు మనల్ని మన పడకల నుండి లేపారు?" అని అంటారు. (అప్పుడు) "కరుణామయుడైన దేవుడు వాగ్దానం చేసిన విషయం ఇదే. (ఆనాడు) దైవప్రవక్తలు నిజమే చెప్పారు" (అని సమాధానం వస్తుంది). అది దిక్కులు పిక్కటిల్లే ఒకేఒక భీకర గర్జన!! దాంతో యావన్మందీ మా ముందు ప్రవేశపెట్టబడతారు. (51-53)

"ఈరోజు మీకు ఎలాంటి అన్యాయం జరగదు. మీరు ఎలాంటి కర్మలు చేసు కున్నారో అలాంటి ప్రతిఫలమే లభిస్తుంది." (54)

"ఈరోజు స్వర్గవాసులు సుఖసంతోషాలలో తేలియాడుతుంటారు. వారూ, వారి భార్యలు దట్టమైన నీడల క్రింద మెత్తటి ఆసనాలపై దిండ్లకానుకొని కూర్చొని ఉంటారు. వారికక్కడ తినడానికి, త్రాగడానికి కోరినవన్నీ లభిస్తాయి. వారు కోరిందల్లా మరుక్షణం సిద్ధం. కరుణామయుడైన ప్రభువు నుండి వారికి దీవెనలు లభిస్తుంటాయి." (55-58)

"పాపాత్ములారా! ఈరోజు మీరు (మా నుంచి) తొలగి దూరంగా ఉండండి... ఆదం సంతానమా! షైతాన్‌ని ఆరాధించవద్దని, వాడు మీకు బహిరంగ శత్రువని నేను మిమ్మల్ని హెచ్చరించలేదా? నన్నే ఆరాధించాలని, అదే రుజుమార్గమని ఉపదేశించ లేదా?[4] అయినా వాడు మీలో అత్యధికమందిని దారి తప్పించాడు. మీకా (మాత్రం)

---

3. ఇక్కడ ప్రళయ శంఖారావం గురించి భయంకరంగా వర్ణించబడింది. కొన్ని హదీసుల్ని బట్టి, దైవదూత ఇస్రాఫీల్ (అలైహి) శంఖం నోటి దగ్గర పెట్టుకొని, దైవ సింహాసనం వైపు చూస్తూ శంఖం పూరించడానికి ఎప్పుడాజ్ఞవుతుందా అని తీవ్రంగా నిరీక్షిస్తున్నారని తెలుస్తోంది.

ఆయన దైవాజ్ఞతో మూడుసార్లు శంఖం పూరిస్తారు. మొదటిసారి శంఖం ఊదినప్పుడు భూమ్యాకాశాల్లోని యావత్తు ప్రాణికోటి భీతిల్లిపోతుంది. మానవులు కూడా భీతావహులైపోతారు.

రెండవసారి శంఖం ఊదినప్పుడు దాని భయంకర గర్జనకు మొత్తం జీవరాసులు చచ్చిపడి పోతాయి. అప్పుడు సృష్టికర్త, సర్వేశ్వరుడైన ఒక్క దేవుడు తప్ప మరెవరూ ఉండరు. భూమి రూపు రేఖలు మారిపోతాయి. నేలంతా మిట్టపల్లాలులేని చదునైన మైదానంగా తయారవుతుంది.

ఆ తరువాత దేవుడు మొదట ఇస్రాఫీల్ (అలైహి)ని బ్రతికిస్తాడు. ఆయన దైవాజ్ఞతో మూడో సారి శంఖం ఊదుతారు. రెండవ శంఖారావానికి, మూడవ శంఖారావానికి మధ్య ఎన్ని వందల, వేల ఏండ్లు గడచిపోతాయో దైవానికే తెలుసు. మూడవసారి శంఖం ఊదగానే మృతులు ఒక్కసారిగా బ్రతికి లేస్తారు. ఆ తరువాత కర్మల విచారణ ప్రారంభమవుతుంది.

4. ఈ సూక్తిలో 'ఆరాధన' అనే పదాన్ని విధేయతా భావంలో ప్రయోగించబడింది. సాధరణంగా షైతాన్‌ని ఎవరూ పూజించరు. అతని ఆజ్ఞలను మాత్రం శిరసావహిస్తారు. మానవ



జ్ఞానంలేదా? నరకమంటే ఇదే. దీన్ని గురించే మిమ్మల్ని లోగడ హెచ్చరించడం జరిగింది. ఇహలోకంలో అవలంబించిన తిరస్కార వైఖరికి పర్యవసానంగా ఈరోజు మీరు దీనికి సమిధలయి పొండి." (59-64)

"ఈరోజు మేము వీరి నోళ్ళను కట్టివేస్తున్నాము. వీరు ప్రపంచంలో ఏమేమి చేస్తుండే వారో వీరి చేతులు మాకు చెబుతాయి, వీరి కాళ్ళు సాక్ష్యమిస్తాయి." (65)

మేము తలచుకుంటే వారి కళ్ళు పొగొట్టగలం. అప్పుడు వారు దారికోసం తచ్చాడుతారు. కాని వారికి దారెలా కన్పిస్తుంది? మేము తలచుకుంటే వారిని నిల్చున్న చోటే స్తంభింప జేయగలం. దాంతో వారు ముందుకూ నడవలేరు; వెనక్కీ తిరగలేరు. మేము దీర్ఘాయుష్షు ఇచ్చినవారిని బలహీనం చేసి వారి రూపురేఖలను సమూలంగా మార్చివేస్తున్నాము. (ఈ స్థితి చూసయినా) వారికి జ్ఞానోదయం కలగదా? (66-68)

మేమితనికి కవిత్వం నేర్పలేదు. కవిత్వం అతనికి శోభించదు కూడా. ఇదొక హితోప దేశం, స్పష్టమైన పఠనగ్రంథం. (చైతన్యం కలిగి) సజీవంగా ఉండేప్రతి వ్యక్తినీ హెచ్చ రించడం, తిరస్కరించేవారికి వ్యతిరేకంగా సాక్ష్యం ఏర్పరచడం దీని లక్ష్యాలు. (69,70)

మేము మా స్వహస్తాలతో సృజించినవాటిలో వారికోసం పశువులు పుట్టించాం. వారిప్పుడు వీటికి యజమానులైపోయారు. వీటిని మేము వారి అదుపాజ్ఞల్లో ఉంచాం. అందువల్ల వారు వాటిలో కొన్నిటిపై (సులువుగా) ఎక్కి తిరగ్గలుగుతున్నారు. మరికొన్ని పశువుల మాంసాన్ని తింటున్నారు. వారికోసం ఈపశువుల్లో అనేక ప్రయోజనాలు, పానీయాలు ఉన్నాయి. అందుకు వీరు (మాకు) కృతజ్ఞతలు తెలపరా? (71-73)

(ఇన్ని ప్రయోజనాలునాన) వారు (నిజ)దేవుణ్ణి వదలి మిథ్యాదైవాలనే ఆరాధిస్తూ కష్టకాలంలో అవి తమను ఆదుకుంటాయని ఆశలు పెట్టుకున్నారు. కాని ఆ దైవాలు వారిని ఏవిధంగానూ ఆదుకోలేవు. పైపెచ్చు స్వయంగా వారే వాటి (రక్షణ) కోసం సైన్యాలుగా తయారైఉన్నారు. సరే, వారు కల్పించి ప్రచారంచేస్తున్న విషయాల పట్ల

---

జీవితంలోని సమస్త రంగాల్లో దేవుడు ప్రవక్తల ద్వారా తన ఆజ్ఞలు జారీ చేశాడు. కాని అనేకమంది మానవులు షైతాన్ ప్రేరణతో దేవుని ఆజ్ఞలు త్రోసిపుచ్చి, ఇతరుల ఆజ్ఞలు పాటిస్తారు. ఉదాహరణకు, వడ్డీ వ్యవస్థను అంతమొందించాలని దేవుడు ఆజ్ఞాపిస్తున్నాడు. షైతాన్ దానికి వ్యతిరేకంగా ప్రచారంచేస్తూ, వడ్డీ వల్ల బోలెడు లాభాలున్నాయని; అసలీ వడ్డీ వలనే పేదవాడి నడ్డి విరగొట్ట యినా సరే నువ్వు మేడలు కట్టగలవు, స్వర్గ భోగాలు అనుభవించగలవు అని ధనికుడ్ని ఉసి గొల్పుతాడు; వడ్డీయే దేశప్రగతికి రాచబాట నిర్మిస్తుందని పాలకులను ప్రేరేపిస్తాడు.

ఈ విధంగా మానవుడు షైతాన్‌కు విధేయుడై భక్తుడై పోతాడు. ఒక ఉద్యోగి తన పైఅధి కారిని ప్రసన్నం చేసుకొని ప్రయోజనాలు పొందడానికి అతను చెప్పిన పనల్లా, చివరికి అతని సొంత పనులు కూడా చేస్తాడనుకుందాం. అప్పుడు మనం "అతనా... అతను మేనేజర్‌గారి భక్తుడండీ!" అంటాం. అలాగే ఈ సూక్తిలో కూడా దేవుడు, షైతాన్‌పట్ల విధేయతా భావాన్ని షైతాన్ ఆరాధనతో పోల్చుతున్నాడు. అంటే దేవుని ఆజ్ఞలకు, ఆయన ప్రవక్త హితవులకు వ్యతిరేకంగా దైవేతరులు ఇచ్చే ఆజ్ఞలు, వారు చేసే హితవులు పాటిస్తే, అది షైతాన్ ఆరాధన క్రిందికి వస్తుందన్నమాట.

నీవు బాధపడకు. వారి అంతర్బాహ్య విషయాలన్నీ మాకు బాగా తెలుసు. (74-76)

మేము మానవుణ్ణి ఎలాంటి (క్షుద్ర) బిందువుతో పుట్టించామో అతనికి తెలియదా? అయినా అతడు పెద్ద జగడాలమారిగా తయారయ్యాడు. పైగా మమ్మల్ని సృష్టితాలతో పోల్చుతున్నాడు. అతడు తన పుట్టుక సంగతి మరచి "పుచ్చిపోయిన ఈ ఎముకల్ని ఎవడు బ్రతికిస్తాడు?"అని ప్రశ్నిస్తున్నాడు. "వారిని మొదట్లో ఎవరు పుట్టించారో ఆయనే వారిని మళ్లీ బ్రతికిస్తాడు. ఆయనకు సృష్టికి సంబంధించిన ప్రతి విషయం తెలుసు" అని చెప్పు. (77-79)

ఆయనే మీకోసం పచ్చటివృక్షం నుంచి అగ్ని పుట్టించాడు. ఆ అగ్నితో మీరు పొయ్యి రాజేసుకుంటున్నారు. భూమ్యాకాశాల్ని సృష్టించగలిగినవాడు వారిలాంటి మానవుల్ని (మళ్ళీ) సృజించలేడా? ఎందుకు సృజించలేడు? ఆయన సృష్టినిర్మాణంలో ఆరితేరిన మహాసృష్టికర్త. ఆయన ఏదైనా చేయదలచుకుంటే 'అయిపో' అంటే చాలు, అది ఇట్టే తయారయి ఉనికిలోకి వస్తుంది. ప్రతి విషయంలోనూ సర్వాధికారాలు తన గుప్పెట్లో పెట్టుకున్న ఆ దేవుడు ఎంతో పవిత్రుడు. మీరంతా ఆయన దగ్గరికే మరలి పోవలసి ఉంది. (80-83) ✪

# 37. పంక్తులు తీరినవారు (సాఫ్ఫాత్)

అవతరణ: మక్కా    సూక్తులు;182

ఈ అధ్యాయాన్ని "సాప్ఫాత్" (పంక్తులు తీరినవారు) అంటారు. ఇది హిజ్రీశకానికి ఆరేడేండ్ల పూర్వం మక్కాలో అవతరించింది. ఇందులో సత్యతిరస్కారులకు హెచ్చరికతో పాటు వారి అంధ విశ్వాసాల్ని ఖండిస్తూ నిజధర్మం ఏమిటో, దానివల్ల ఒనగూడే ప్రయోజనాలేమిటో చెప్పబడింది. దీనికోసం సత్యాన్ని తిరస్కరించిన గతజాతుల సంఘటనలు పేర్కొనడం జరిగింది.

**కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం**

పంక్తులు తీరి సిద్ధంగా ఉన్నవారి సాక్షి! తర్వాత గద్దించి అదలించేవారి సాక్షి!! ఆపై హితోక్తులు విన్పించేవారి సాక్షి!!! మీ ఆరాధ్యదైవం ఒక్కడే. ఆయన భూమ్యాకాశాలకు, భూమ్యాకాశాల్లో ఉన్న సకల సృష్టిరాసులకు ప్రభువు, పోషకుడు. సమస్త తూర్పు దిశలకు (సూర్యోదయాలకు) కూడా ఆయనే ప్రభువు. (1-5)

మేము మీ సమీపాకాశాన్ని తేజోవంతమైన నక్షత్రాలతో తీర్చిదిద్ది, తలబిరుసుగల షైతాన్ల నుండి రక్షణకల్పించాం. ఈపిశాచాలు ఊర్ధ్వలోకసదస్సు విషయాలు వినలేవు. నలువైపుల నుండి తరిమికొట్టడం జరుగుతుంది. వాటికోసం ఎడతెగని యాతన కాచుకొని ఉంటుంది. ఒకవేళ ఏదైనా పిశాచం (దైవదూతలు చెప్పుకునే) విషయాలు తస్కరించడానికి ప్రయత్నిస్తే తక్షణమే తీక్షణమైన ఓఅగ్నిజ్వాల దాన్ని తరిమికొడ్తుంది. (6-10)

ఇప్పుడు వారిని అడుగు, వారిని సృజించడం కష్టమా లేక మేము సృజించిన (సమస్త) సృష్టిరాసులనా? మేము వారిని మెత్తటి బంకమన్నుతో సృజించాము. నీవు



(దేవుని శక్తిసామర్థ్యాలు చూసి) ఆశ్చర్యపోతున్నావు. వారికేమో ఇదంతా ఎగతాళిగా ఉంది. ఎంత నచ్చజెప్పినా వారికి తలకెక్కడం లేదు. ఏదైనా మహిమ చూస్తే హేళనచేసి, ఇది పూర్తిగా మంత్రజాలం అంటూ దాన్ని ఎగరగొడ్తున్నారు. (11-15)

పైగా వారు (పిడివాదం చేస్తూ) "మేము చచ్చి మట్టిలో కలిసి అస్థిపంజరాల్లా మారినా మమ్మల్ని మళ్ళీబ్రతికించి లేపడం జరుగుతుందా? మాకు పూర్వం చనిపోయిన మా తాత ముత్తాతలను కూడా బ్రతికించి లేపుతారా?" అని అడుగుతున్నారు. "తప్పకుండా, మీరు (దేవుని శక్తిముందు) నిమిత్తమాత్రులేన"ని చెప్పు. (16-18)

ఒకేఒక భయంకరమైన గర్జన విన్పిస్తుంది. అంతే, ఒక్కసారిగా వారి కళ్ళ ముందు అంతా ప్రత్యక్షమౌతుంది. అప్పుడు వారు (బిత్తరబోయి చూస్తూ) "అయ్యయ్యో, మా పాడుగాను! (మనమెంత ఏమరుపాటులో పడివున్నాం!) ఇది తీర్పుదినమే!!" అంటారు.

"మీరు (నిన్నటిదాకా) నిరాకరిస్తుండిన తీర్పుదినం ఇదే"..."దుర్మార్గుల్ని, వారి అనుచరమూకను చుట్టుముట్టి తీసుకురండి. (నిజ)దేవుణ్ణి వదలి వారు పూజించిన మిథ్యాదైవాలను కూడా చుట్టుముట్టి తీసుకురండి. రువాత వారందరికీ నరకం దారి చూపండి."

"వారిని ఆపండి ప్రశ్నించాలి". ఏమయింది మీకు? ఇప్పుడు మీరు ఒకరికొకరు సహాయం చేసుకోరెందుకు?" ఈరోజు వీరు (మాకు)పూర్తిగా లొంగిపోయారు. (19-26)

ఆతర్వాత వారు ఒకరివైపొకరు తిరిగి పరస్పరం వాదించుకోవడం మొదలెడతారు.

(అనుచరులు తమ నాయకులతో) "మీరు మా దగ్గరికి అరచేతి వైకుంఠం చూపుతూ, మాయోపాయాలతో వస్తుండేవారు" అంటారు. (27,28)

వారి నాయకులు దాన్ని ఖండిస్తూ "అసలు మీరే స్వయంగా (సత్యాన్ని) విశ్వసించేవారు కాదు. మేము మీపై ఎలాంటి వత్తిడి తీసుకురాలేదు. మీరు స్వతహాగానే దుర్మార్గులు, తలపొగరు మనుషులు. చివరికి మనమంతా 'మేము శిక్ష చవిచూపిస్తాం' అన్న దైవాజ్ఞకు అర్హులైపోయాం. అందుకే మేము దారి తప్పడమేగాక మిమ్మల్ని కూడా మాయమాటలతో దారి తప్పించాము" అని చెబుతారు. (29-32)

ఈవిధంగా ఆరోజు వీరంతా శిక్ష అనుభవిస్తారు. నేరస్థుల పట్ల మేము ఇలాగే ప్రవర్తిస్తాం. దేవుడు తప్ప మరో ఆరాధ్యుడు లేడని చెబితే "ఏమిటీ! ఓ పిచ్చికవి చెప్పే మాటలు విని మా దైవాలను వదలుకోవాల్నా?" అంటారు వారు గర్వంతో. (33-36)

కాని అతను సత్యం తీసుకొచ్చాడు. గత ప్రవక్తల (బోధనల)ను ధృవపరుస్తున్నాడు. (అలాంటి వ్యక్తిని నిరాకరిస్తే) మీరు తప్పకుండా అతి బాధాకరమైన శిక్ష చవిచూడ వలసి వస్తుంది. మీకు లభించే ప్రతిఫలం మీరు చేసుకునే కర్మల్నిబట్టే ఉంటుంది. (37-39)

అయితే నిజాయితీపరులైన దైవదాసులు మాత్రం (పరలోకంలో) సురక్షితంగా ఉంటారు. వారికోసం (గతంలో) తెలియజేయబడిన మంచి ఆహారం సిద్ధంగా

ఉంటుంది. సకలవిధాల రుచికరమైన పదార్థాలు ఉంటాయి. భోగభాగ్యాలతో నిండిన స్వర్గోద్యానవనాల్లో వారిని ఎంతో గౌరవంగా ఉంచడం జరుగుతుంది. (40-42)

వారక్కడ కుర్చీలపై ఎదురెదురుగా కూర్చుంటారు. వారుణీ వాహిని నుండి నింపిన మధుపాత్రలు వారి ముందుంచుతారు. అది కాంతిమంతమైన (విశేష) మధువు; సేవించేవారికి ఎంతో మధురంగా ఉంటుంది. దానివల్ల వారి దేహారోగ్యానికి ఎలాంటి నష్టం ఉండదు. వారి బుద్ధి వివేచనలు కూడా మందగించవు. వారి దగ్గర పరపురుషుడ్ని కన్నెత్తి కూడా చూడని, విశాలాక్షులు ఉంటారు. ఆ స్త్రీలు కోడిగుడ్డు పెంకు క్రింద ఉండే సున్నితమైన పొరలాంటి కోమలాంగులు. (43-50)

ఆ దాసులు ఒకరివైపు మరొకరు తిరిగి కబుర్లు చెప్పుకుంటారు. వారిలో ఒకడు ఇలా అంటాడు: "ప్రపంచంలో నాకో స్నేహితుడుండేవాడు. అతను నాతో 'నువ్వు కూడా సమర్థించేవారిలో చేరిపోయావా? మనం చనిపోయి మట్టిలో కలిసి అస్తిపంజరాల్లా మారాక నిజంగా మనకు కర్మఫలం ఇవ్వడం జరుగుతుందంటావా?' అని అంటుండే వాడు. అతనిప్పుడు ఏ స్థితిలో ఉన్నాడో మీరు చూడాలనుకుంటున్నారా?" (51-54)

ఈమాట చెప్పి అతను నరకంలోకి తొంగిచూస్తాడు. ఆ వ్యక్తి నరకంలో అట్టడుగు భాగాన కన్పిస్తాడు. అతడ్ని పిలిచి "దైవసాక్షి! నీవు నన్ను సర్వనాశనం చేసి ఉండేవాడివి. నా ప్రభువు నన్ను కటాక్షించి ఉండకపోతే, ఈరోజు నేను కూడా (నీలాగే) పట్టుబడి వచ్చినవారిలో ఒకణ్ణయి ఉండేవాడ్ని. సరే, (స్వగతంలో) ఇప్పుడు మనం ఎన్నటికీ చనిపోము కదూ! మనకు రావలసిన మృత్యువేదో ఇదివరకే వచ్చింది. ఇక మనకు ఎలాంటి శిక్షా ఉండదు కదూ!" అని అంటాడు. (55-59)

నిస్సందేహంగా ఇదే గొప్ప విజయం. ఇలాంటి విజయం కోసమే క్రియాశీలురు పనిచేయాలి. చెప్పండి, ఈఆతిథ్యం మంచిదా లేక జఖ్ఖూమ్ (అనే ఒక విధమైన నాగ జెముడు చెట్టు) ఆతిథ్యం మంచిదా? మేమీ (జఖ్ఖూమ్) వృక్షాన్ని దుర్మార్గులకు పరీక్షగా చేశాము. అది నరకంలో అట్టడుగున మొలుస్తుంది. దాని పండ్లగుత్తులు రాకాసి తలల్లా (భయంకరంగా) ఉంటాయి. నరకవాసులు వాటిని (ఆవురావురుమంటూ) తిని కడుపు నింపుకుంటారు. తరువాత త్రాగడానికి వారికి సలసల కాగే నీళ్ళు లభిస్తాయి. ఆ తర్వాత వారిని తిరిగి నరకాగ్ని వైపు తోలుకెళ్ళడం జరుగుతుంది. (60-68)

వారు దారితప్పిన తమ తాతముత్తాతల మార్గాన్నే గుడ్డిగా అనుసరించారు. వారికి పూర్వం ఎందరో దారితప్పి ఉండగా మేము వారిదగ్గరకు హెచ్చరించేవారిని (ప్రవక్తల్ని) పంపాము. అప్పుడు హెచ్చరించబడిన వారికి ఎలాంటి దుర్గతి పట్టిందో చూడండి. ఆ దుర్గతి నుండి సచ్ఛీలురైన దైవదాసులు మాత్రమే రక్షించబడ్డారు. (69-74)

దీనికి పూర్వం నూహ్ (ప్రవక్త) మమ్మల్ని మొరపెట్టుకున్నాడు. మేమే (దాసుల) మొరల్ని బాగా ఆలకించేవాళ్ళం. నూహ్‌ని, అతని కుటుంబ సభ్యులు, సంబంధీకులను ఓ పెద్ద ఆపద నుండి కాపాడాము. (అందర్నీ తుడిచిపెట్టి) అతని సంతతిని మాత్రమే



మిగిలి ఉండేలా చేశాం. తరువాతి తరాలలో అతని పేరు, ప్రస్తావనలు వదలిపెట్టాము.

అతనికి యావత్తు ప్రపంచంలో శాంతీ సౌభాగ్యాలు కలుగుగాక! సజ్జనులకు మేము ఇలాంటి ప్రతిఫలమే ప్రసాదిస్తుంటాము. వారసలు విశ్వసించిన మా ప్రియ దాసులు. (అవిశ్వాసులైన) రెండవ వర్గాన్ని మేము (నీట) ముంచివేశాము. (75-82)

ఇబ్రాహీం కూడా నూహ్ మార్గాన్నే అనుసరించేవాడు. అతను తన ప్రభువు సన్నిధికి నిష్కల్మషమైన హృదయంతో వచ్చాడు. తన తండ్రిని, తన జాతిప్రజలను ఉద్దేశించి "మీరు పూజిస్తున్న ఈ వస్తువులేమిటి? మీరు (నిజ)దేవుడ్ని వదలి స్వయంకృత దైవాలను (పూజించడాన్ని) ఇష్టపడుతున్నారా? మరి సర్వలోక ప్రభువు, పోషకుడైన దేవుని గురించి మీరేమనుకుంటున్నారు?" అని అడిగాడు. (83-87)

తర్వాత అతను (ఆకాశంలోని) నక్షత్రాల వైపు చూసి "నాకు వంట్లో బాగా లేదు" అన్నాడు. అందువల్ల వారతడ్ని వదలి (జాతరలో పాల్గొనడానికి) వెళ్ళిపోయారు.

వారలా వెళ్ళిపోగానే ఇబ్రాహీం వారిదేవతల గుళ్ళోకి జొరబడి "మీరు (ఈ ప్రసాదం) తినరేమిటీ? ఏమయింది మీకు కనీసం మాట్లాడనైనా మాట్లాడరు?" అన్నాడు. తరువాత అతను ఆ విగ్రహాలపై విరుచుకుపడి కుడి చేత్తో వాటిని గట్టిగా బాది విరగ్గొట్టాడు. (88-93)

వారు (జాతర నుండి తిరిగొచ్చి ఈ సంగతి తెలియగానే) పరుగు పరుగున అతని దగ్గరకు వచ్చారు. అప్పుడతను వారితో "మీరు స్వయంగా చెక్కుకున్న ఈ విగ్రహాలను ఎలా పూజిస్తున్నారు? అసలు దేవుడు మాత్రమే మిమ్మల్ని, మీరు తయార చేసుకున్న విగ్రహాలను సృష్టించాడు. (అలాంటి సృష్టికర్తను వదలి సృష్టితాల వెంటపడ్డారా?)" అన్నాడు. (94-96)

అప్పుడు వారు పరస్పరం సంప్రదించుకొని "అతనికోసం ఓ అగ్నిగుండం తయారుచేసి, భగభగమండే ఆ అగ్నిగుండంలో అతడ్ని విసిరిపడేద్దాం" అని నిర్ణయించుకున్నారు. (ఈవిధంగా) వారతనికి వ్యతిరేకంగా ఒకచర్య తీసుకోదలిచారు. అయితే మేము (వారి దుశ్చర్యను వమ్ముచేసి) వారి పీచం అణచివేశాం. (97,98)

(ఆ తరువాత) ఇబ్రాహీం (ప్రజలను ఉద్దేశించి) "నేను నా ప్రభువు (ఆదేశం) వైపు వెళ్తున్నాను. ఆయనే నాకు మార్గదర్శనం చేస్తాడు" అన్నాడు. (ఆ సందర్భంలో) "ప్రభూ! నాకొక సద్గుణ సంపన్నుడైన కుమారుడ్ని ప్రసాదించు" అని వేడుకున్నాడు. మేమతనికి సహనశీలుడైన ఒక పిల్లవాడు కలుగుతాడని శుభవార్త తెలిపాము. (99-101)

ఆ బాలుడు అతనితో పాటు పరుగెత్తే వయస్సుకు చేరుకున్న తరువాత (ఓరోజు) ఇబ్రాహీం అతనితో "బాబూ! నేను నిన్ను బలిస్తున్నట్లు కలగన్నాను. దీనిపై నీ అభిప్రాయం ఏమిటో చెప్పు" అన్నాడు. దానికి ఆ బాలుడు (ఏమాత్రం కంగారుపడకుండా) "నాన్నా! మీకు దేన్ని గురించి ఆజ్ఞ ఇవ్వబడిందో దాన్ని నెరవేర్చండి. దైవచిత్తమయితే మీరు నన్ను సహన శీలిగా చూస్తారు" అని అన్నాడు. (102)

ఇలా వారిద్దరూ (మాఆజ్ఞ) శిరసావహించారు. తర్వాత ఇబ్రాహీం తన కుమారుడ్ని బోర్లాపడవేశాడు (బలిచేయడానికి). అప్పుడు మేము "ఇబ్రాహీం! నీవు స్వప్నాన్ని నిజపరచి చూపావు. సజ్జనులకు మేము ఇలాంటి ప్రతిఫలాన్నే ఇస్తుంటాము. నిజంగా ఇది నీకొక స్పష్టమైన పరీక్ష. (అందులో నీవు నెగ్గావు.)" అని అన్నాము. (103-106)

మేము పరిహారం క్రింద ఒక పెద్ద బలిదానం ఇచ్చి ఆ బాలుడ్ని కాపాడాము. అతని కీర్తి ప్రతిష్ఠలను తరువాతి తరాలలో శాశ్వతంగా వదలిపెట్టాము. ఇబ్రాహీంకు శాంతి కలుగుగాక! సజ్జనులకు మేము ఇలాంటి ప్రతిఫలమే ప్రసాదిస్తాము. నిజంగా అతను విశ్వసించిన మా ప్రియదాసులలో ఒకడు. మేమతనికి ఇస్‌హాఖ్ పుట్టాడని (మరొక) శుభవార్త అందజేశాము. ఇస్‌హాఖ్ సద్గుణసంపన్నుడైన దైవప్రవక్త. మేము ఇబ్రాహీంకు, ఇస్‌హాఖ్‌కు (ఎన్నో) శుభాలు కలిగించాము. వారిద్దరి సంతతి నుండి ఇప్పుడు కొందరు పుణ్యాత్ములు, మరికొందరు ఆత్మవంచనకు పాల్పడిన పాపాత్ములు జన్మించారు. (107-113)

మేము మూసా, హారూన్‌లకు (కూడా) ఎంతో మేలు చేశాం. వారిని, వారిజాతిని మహోపద్రవం నుండి కాపాడాము. మా సహాయసహకారాల ద్వారానే వారు విజయం సాధించారు. వారికి మేము స్పష్టమైన దివ్యగ్రంథం ప్రసాదించి రుజుమార్గం చూపించాము. వారి కీర్తిప్రతిష్ఠలను తరువాతి తరాలలో వదలిపెట్టాము. మూసా, హారూన్‌లకు శాంతి కలుగుగాక! సజ్జనులకు మేము ఇలాంటి ప్రతిఫలమే ప్రసాదిస్తుంటాము. నిస్సందేహంగా వీరు (సత్యాన్ని) విశ్వసించిన మా ప్రియదాసులు. (114-122)

ఇల్యాస్ కూడా దైవప్రవక్తే. అతను తన జాతిప్రజలకు హితోపదేశం చేస్తూ "మీరు (దేవునికి) భయపడరా? ఎంతోమంచి సృష్టికర్తను వదలి బాల్ (విగ్రహం)ను ప్రార్థిస్తున్నారా? మీకు, మీ తాతముత్తాతలకు ఆ దేవుడే కదా ప్రభువు?" అన్నాడు. (123-126)

అయితే వారతడ్ని తిరస్కరించారు. కనుక వారు తప్పకుండా (నరక)శిక్ష కోసం మాముందు ప్రవేశపెట్టబడతారు. కాని విశ్వసనీయులైన దైవదాసులు మాత్రం కాదు. ఇల్యాస్ కీర్తిప్రతిష్ఠలిన మేము తర్వాతి తరాలలో శాశ్వతంగా వదలిపెట్టాం.[1] ఇల్యాస్‌కు శాంతి కలుగుగాక! నీతిమంతులకు మేము ఇలాంటి ప్రతిఫలమే ప్రసాదిస్తుంటాం. నిజంగా అతను విశ్వసించిన మా ప్రియదాసులలో ఒకడై ఉన్నాడు. (127-132)

---

1. యహ్యా, ఈసా (అలైహి) ప్రవక్తల కాలంలో యూదులు ముగ్గురు భావి ప్రవక్తల కోసం నిరీక్షిస్తుండేవారు. వారు ఇల్యాస్, మసీహ్(ఈసా), ఆప్రవక్త (అంటే మహాప్రవక్త ముహమ్మద్-సల్లం).

హజ్రత్ యహ్యా (అలైహి) దౌత్యకాలం మొదలయి ఆయన ప్రజలకు బాప్తిజం (మత సంస్కారం) ప్రారంభించినప్పుడు యూదులు ఆయన దగ్గరకొచ్చి "నీవు మసీహ్ (క్రీస్తు)వా?" అని అడిగారు. ఆయన కాదన్నారు. "అయితే నీవు ఏలియా (ఇల్యాస్)వా?" అని ప్రశ్నించారు వారు. దానికీ ఆయన కాదన్నారు. అప్పుడు వారు "మరి నీవు ఆ ప్రవక్తవా?" అని అడిగారు మళ్ళీ. దానిక్కూడా ఆయన తాను ఆ ప్రవక్తను కాదన్నారు. అప్పుడు వారు "నీవు మసీహ్ కాదు, ఏలియా కాదు, ఆ ప్రవక్తవూ కాదు. అలాంటప్పుడు నీవు బాప్తిజం ఎందుకు చేయిస్తున్నావు?" అని అడిగారు. (చూడండి బైబిల్ కొత్తనిబంధనలో యోహాన్ సువార్త 1:19-26)



లూత్ కూడా దైవప్రవక్తే. మేము అతడ్ని, అతని కుటుంబసభ్యులను కాపాడాము. అయితే ఒక వృద్ధురాలిని మాత్రం మేము రక్షించలేదు. ఆమె వెనకుండేవారిలో కలసి ఉండి పోయింది. ఆ తరువాత మేము మిగిలిన వారందర్నీ పూర్తిగా తుడిచి పెట్టాము. ఈనాడు మీరు వారి శిథిలనివాసాల మీదుగానే రేయింబవళ్ళు ప్రయాణిస్తున్నారు. వాటిని చూసయినా మీకు కనువిప్పు కలగదా? (133-138)

యూనుస్ కూడా దైవప్రవక్తే. అతనొక నిండునావ వైపు పరుగెత్తాడు. అక్కడ ఇతర ప్రయాణీకుల పేర్లతో పాటు అతని పేరు కూడా కలిపి చీటీ వేయడం జరిగింది. ఈ చీటీలో అతను దెబ్బతిన్నాడు. చివరికి అతడ్ని ఒక చేప మింగేసింది. అతను (తనను తాను నిందించుకుంటూ) నిందితుడైపోయాడు. (139-142)

అప్పుడతను దైవాన్ని స్మరించి ఉండకపోతే పునరుత్థానదినం దాకా ఆచేప కడుపులోనే ఉండిపోయేవాడు. చివరికి మేమతడ్ని వ్యాధిగ్రస్త స్థితిలో ఇసుక మైదానంలో విసిరేశాం. అతని నీడకోసం అక్కడ ఒక తీగచెట్టు మొలిపించాం. తర్వాత అతడ్ని మేము లక్ష మంది లేక అంతకు పైగాఉన్న ప్రజల దగ్గరికి పంపాము. వారు సత్యాన్ని విశ్వసించారు. కనుక మేము ఓ నిర్ణీతకాలం వరకు వారిని వదలిపెట్టాము.[2] (143-148)

వారిని అడుగు, మీ ప్రభువుకు కుమార్తెలును, మీకు కుమారులా? మేము నిజంగా దైవదూతలను స్త్రీలుగా రూపొందించామా? వారు తమకళ్ళతో చూసి చెబుతున్న మాటలేనా ఇవి? విను, దేవునికి సంతానముందని వీరు చెబుతున్న మాటలన్నీ వట్టి అభూతకల్పనలు మాత్రమే. వీరసలు పచ్చి అబద్ధాలకోరులు. దేవుడు కుమారులకు బదులు కుమార్తెల్ని కోరుకున్నాడా? ఏమయింది మీకు, ఇలాంటి కారుకూతలు కూస్తున్నారు? మీరు వాస్తవం గురించి ఆలోచించరా? లేక మీరు చెబుతున్న ఈ మాటలకు మీదగ్గర గట్టి ప్రమాణం ఏదైనా ఉందా? ఉంటే ఆ ప్రమాణమున్న గ్రంథం ఏమిటో తీసుకురండి. మీ వాదన నిజమయితే ఈ పని చేసి చూపండి. (149-157)

వారసలు దేవునికి, దైవదూతలకు[3] బంధుత్వాన్ని అంటగట్టారు. కాని వారు (నేరస్థులుగా దేవుని ముందు) ప్రవేశపెట్టబడతారని దైవదూతలకు బాగా తెలుసు. (పైగా

---

2. హజ్రత్ యూనుస్ (అలైహి) వెళ్ళిపోయాక ఆయన హెచ్చరిక ప్రకారం ప్రకృతి విపత్తు రూపంలో దైవశిక్ష వచ్చిపడే సూచనలు కన్పించాయి. దాంతో ప్రజలు భయపడిపోయి, యూనుస్ (అలై)కోసం అన్వేషించారు. కాని ఆయన ఎక్కడా కన్పించలేదు. చివరికి వారు తమ పిల్లాపాపలు, పశువులతోసహా పట్నం వెలుపలికెళ్ళి పశ్చాత్తాపంతో దైవాన్ని వేడుకున్నారు. దేవుడు వారిని కనికరించి ప్రకృతివిపత్తు నుండి కాపాడాడు. ఆతర్వాత హజ్రత్ యూనుస్ (అలై) పట్నానికి తిరిగిరావడం, వారు సత్యాన్ని స్వీకరించి ముస్లిములై పోవడం జరిగింది. (21:87,88 సూక్తులు కూడా చూడండి.)

3. మౌలానా మౌదూదీ గారి వ్యాఖ్యానం ప్రకారం జిన్ అనే పదం ఇక్కడ శాబ్దికభావంలో ఉంది. అంటే అగోచరజీవి. దీన్నిబట్టి జిన్నులు (భూతాలు) కూడా అగోచర జీవులే, దైవదూతలు కూడ అగోచరజీవులే. కనుక ఇక్కడ సందర్భానుసారం జిన్నహ్ అనే పదాన్ని దైవదూతలని అనువదించవలసివచ్చింది. ఈ పదానికి ముందు, తరువాతి సూక్తులు గమనిస్తే ఇక్కడ దైవదూతలు అనే అర్థమే సందర్భోచితంగా ఉంటుందని గ్రహించగలం. ముజాహిద్, ఖతాదాల ఉల్లేఖనాలు కూడా ఈ అర్థాన్ని సమర్థిస్తున్నాయని "తఫ్సీరె జలాలైన్" వ్యాఖ్యానకర్త పేర్కొన్నారు.

వారిలా అంటారు:) “విశ్వసనీయులైన దైవదాసులు తప్ప ఇతరులు ఆపాదించే ఇలాంటి లక్షణాలు దేవునిలో ఎంతమాత్రం లేవు. ఆయన ఎంతో పరిశుద్ధుడు. కనుక మీరు, మీ మిధ్యాదైవాలు నరకాగ్నిలో కాలిపోవలసిన వాడ్ని తప్ప మరెవరినీ దేవునికి వ్యతిరేకంగా (అధర్మకార్యాలకు) పురిగొల్పలేరు. ఇక మా విషయానికొస్తే, మాలో ప్రతి ఒక్కరికీ ఒక స్థానం నిర్ణయించబడింది. మేము విధినిర్వహణకై అనుక్షణం సిద్ధంగా ఉండే సేవకులం, నిరంతరం దేవుని పవిత్రత ప్రశంసించేవాళ్ళం మాత్రమే.” (158-166)

వారు ఇంతకు పూర్వం (గ్రంథప్రజల ధార్మిక దుస్థితి చూస్తూ) “గత జాతులకు లభించిన (దివ్య) ప్రస్తావన మాదగ్గర కూడా ఉంటే ఎంత బాగుండు! మేము దేవునికి ప్రియదాసులయి ఉండేవాళ్ళము” అని అంటుండేవారు. అయితే ఆ ప్రస్తావన (ఖుర్‌ఆన్ రూపంలో) రాగానే దాన్ని వారు తిరస్కరించారు. (ఈ తిరస్కార పర్యవసానం ఏమిటో) వారికి త్వరలోనే తెలుస్తుంది. మేము (దైవప్రవక్తలుగా నియమించి) పంపిన దాసులకు తప్పకుండా సహాయం చేయడం జరుగుతుంది. మా సైన్యమే విజయం సాధిస్తుందని మేము ముందే వాగ్దానం చేశాము. (167-173)

కనుక ప్రవక్తా! కొంతకాలం పాటు వారిని వారిమానాన వదలిపెట్టు. త్వరలోనే వారు కూడా (తమకు పట్టే దుర్గతి) చూసుకుంటారు. మా శిక్ష కోసం వారు తొందరపడ్తున్నారా? కాని ఆశిక్ష వారి ముంగిట వాలినప్పుడు, (సత్యతిరస్కార పర్యవసానం గురించి) హెచ్చరించ బడినవారికి దుర్దినం దాపురించినట్లే. అందువల్ల కొన్నాళ్ళపాటు వారిని వారిమానాన వదిలేసి చూడు. వారు కూడా (తమకు ఎలాంటి గతిపడ్తుందో) చూసుకుంటారు. (174-179)

నీ ప్రభువు ఎంతో పవిత్రుడు, గౌరవనీయుడు. వారు కల్పిస్తున్న సమస్త విషయాలకు ఆయన అతీతుడు. దైవప్రవక్తలకు శాంతి కలుగుగాక! సర్వలోక ప్రభువయిన దేవునికే సకల విధాల ప్రశంసలు శోభిస్తాయి. (180-182) ✪

**అవతరణ: మక్కా**

# 38. సాద్

**సూక్తులు: 88**

ఈ అధ్యాయంలోని తొలి బీజాక్షరం “సాద్” దీనికి మకుటంగా పెట్టబడింది. మక్కా ఖురైషీయులు ఇస్లాం ప్రచారం మానుకోమని దైవప్రవక్త (సల్లం)కు ఎంత నచ్చజెప్పినా వినక పోవడంతో రాయబారంకోసం ప్రవక్త పెదనాన్న అబూతాలిబ్ దగ్గరకు పోతారు. ఆయన దైవప్రవక్త (సల్లం)ను పిలిచి, ఉభయులు రాజీపడవలసిందిగా కోరారు. దానికి దైవప్రవక్త (సల్లం) “నేనొక మాట చెబుతాను. దాన్ని ఒప్పుకుంటే వీరు యావత్తు అరబ్బులకు, అరబ్బేతరులకు నాయకులయి పోతారు” అని చెప్పారు. వెంటనే ఖురైష్ నాయకులు “ఒక్కటేమిటి, పదిమాటలు ఒప్పుకోవడానికి సిద్ధంగా ఉన్నాము, ఏమిటో అది చెప్పు” అన్నారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) “అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడని ఒప్పుకోండి” అన్నారు. ఈ మాట వినగానే ఖురైషీయులు దిగ్గునలేచి “ఇతను అసత్యవాది. మొత్తం దేవుళ్ళను కలిపేసి ఒకే దేవుడు చేశాడే! ఎంత విచిత్రమిది!” అంటూ చరచరా వెళ్ళిపోయారు.



ఆ తరువాత ఈ అధ్యాయం అవతరించింది. ఇందులో అవిశ్వాసుల్ని తీవ్రంగా హెచ్చరిస్తూ చరిత్ర నుంచి గుణపాఠం నేర్చుకోవడానికి వారి ముందు సులైమాన్ గాథ, నరక విషయాలు పేర్కొనబడ్డాయి. చివర్లో శాపగ్రస్తుడైపోయిన షైతాన్ వృత్తాంతం కూడా తెలియజేయబడింది.

## కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

సాద్! హితబోధలతో కూడిన ఖుర్‌ఆన్ సాక్షి! (మా ప్రవక్త బోధిస్తున్నది పరమ సత్యం) కాని (ఇలాంటి) సత్యవాణిని తిరస్కరించినవారు అహంకారంతో మొండికేసి కూర్చున్నారు. వారికి పూర్వం మేము (సత్యాన్ని తిరస్కరించిన) ఎన్నో జాతులను తుద ముట్టించాం. (మాశిక్ష వచ్చిపడుతున్న సూచనలు చూడగానే) వారు గగ్గోలుపెట్టారు. కాని (సమయం మించిపోయింది.) ఇది ప్రాణాలతో బయటపడే సమయం కాదు. (1-3)

స్వయంగా తమ నుండే ఒకతను భయపెట్టేందుకు రావడంపట్ల వారికి ఆశ్చర్యం కలిగింది. వారు “ఇతను మాంత్రికుడు, అబద్ధాలకోరు. దేవుళ్ళందరినీ తీసేసి ఆ స్థానంలో ఒకేఒక దేవుడ్ని తెచ్చిపెట్టాడే! చాలా విచిత్ర విషయమిది” అని అంటున్నారు. (4,5)

(వారి)జాతి నాయకులు (మరికాస్త ముందుకు పోయి) “పదండి, మన దైవాల్నే మనం ఆరాధిస్తూ వాటినే అంటిపెట్టుకొని ఉందాం. ఇతనీ మాట మరేదో ఉద్దేశ్యంతో చెబుతున్నాడు. ఇలాంటి (చిత్రమైన) మాట మనం ఏమతస్థుల నోటా ఎన్నడూ విన లేదు. ఇది ఒట్టి అభూతకల్పన తప్ప మరేమీకాదు. మనం ఇంతమంది (గొప్పగొప్ప వాళ్లు) ఉండగా ఇతనొక్కడి మీదే దైవగ్రంథం అవతరించిందా?” అని చెప్పసాగారు.

ప్రవక్తా! వీరసలు (నిన్ను కాదు,) నా హితోపదేశాన్ని అనుమానిస్తున్నారు. నా శిక్షను వీరింకా చవిచూడలేదు కదా (అందుకే ఇలాంటి కారుకూతలు కూస్తున్నారు). సర్వశక్తిమంతుడు, గొప్ప ప్రదాత అయిన నీ ప్రభువు ప్రసాదించిన అనుగ్రహ నిక్షేపాలేమయినా వారిదగ్గర ఉన్నాయా? పోనీ, వారు భూమ్యాకాశాలకు, వాటిమధ్య ఉన్న వాటికి యజమానులా? అలాగైతే ఓ తాడు కట్టి విశ్వశిఖరాలపై ఎక్కి చూడమను వారిని. (6-10)

అనేక గుంపులలో ఇదొక గుంపు. ఈగుంపు ఈ ప్రదేశం (మక్కా)లోనే పరాజయం పాలౌతుంది. వారికిపూర్వం నూహ్‌జాతి, ఆద్‌జాతి, మేకులవాడైన ఫిరౌన్, సమూద్‌జాతి, లూత్ జాతి, అయికావారు తిరస్కరించారు. ఇవే (తిరస్కరించిన) గుంపులు. వాటిలో ప్రతిగుంపూ ప్రవక్తలను తిరస్కరించింది. కనుక వాశిక్ష వాటిపై విరుచుకుపడింది.

(అలాగే) వీరు కూడా భయంకర విస్ఫోటం కోసం ఎదురుచూస్తున్నారు. ఆ తరువాత మరో విస్ఫోటం సంభవించదు. వారు (మాశిక్షను పరిహసిస్తూ) “ప్రభూ! తీర్పుదినానికి ముందే మాకు రావలసిన భాగమేదో మాకు త్వరగా ఇచ్చెయ్యి” అంటున్నారు. (11-16)

ప్రవక్తా! వారు చెబుతున్న మాటలను నీవు అట్టే పట్టించుకోకు. సహనం వహించు. వారి ముందు మా దాసుడు దావూద్ వృత్తాంతం ప్రస్తావించు. అతను చాలా

బలవంతుడు, పరాక్రమశాలి. ప్రతి విషయంలోనూ అతను దేవుని (ధర్మం) వైపు మరలేవాడు. మేము కొండల్ని అతని అదుపులో ఉంచాం. అవి ఉదయం, సాయంత్రం అతనితోపాటు (దైవనామం) జపిస్తూ ఉంటాయి. పక్షులు కూడా (అతని) దగ్గరకు చేరుతాయి. సమస్తం అతనితోపాటు దైవస్తోత్రంలో లీనమైపోతాయి. మేమతని సామ్రాజ్యాన్ని పటిష్ఠపరిచాం. అతనికి వివేకం, వ్యవహార దక్షతలను కూడా ప్రసాదించాం.

గోడెక్కి అతని రాజమందిరంలో చొరబడినవారి జగడం గురించి నీకేమైనా తెలుసా? వారలా అక్రమంగా చొరబడి తన దగ్గరకు రావడంచూసి దావూద్ భయపడ్డాడు. అప్పుడు వారిలో ఒకడిలా అన్నాడు: "భయపడకండి. మేమిద్దరం ఒక వ్యాజ్యానికి సంబంధించిన వాది, ప్రతివాదులం. మాలో ఒకడు రెండోవాడిపై అన్యాయానికి పాల్పడ్డాడు. మీరు మాఇద్దర్ని గురించి న్యాయంగా తీర్పుచేయండి. అన్యాయం చేయకండి. మాకు సరైనమార్గం చూపండి. ఇతను నాసోదరుడు. ఇతని దగ్గర తొంభైతొమ్మిది గొర్రెలున్నాయి. నాదగ్గర ఒక గొర్రె మాత్రమే ఉంది. ఆ ఒక్కదాన్ని కూడా తనకివ్వమని అంటున్నాడితను. ఇతను మాటలతో (వాదించి) నన్ను లోబరచుకున్నాడు." (17-23)

దావూద్ ఇలా చెప్పాడు:" ఇతను తన గొర్రెల్లో నీ గొర్రెను కూడా కలుపుకుంటాను ఇవ్వమని అడిగి, నిజంగా నీకు చాలా అన్యాయం చేశాడు. కలసిమెలసి పనిచేసేవాళ్ళు సాధారణంగా పరస్పరం అన్యాయానికి పాల్పడతారు. కాని సత్యాన్ని విశ్వసించి సత్కార్యాలు చేసేవారు అలా చేయరు. అలాంటి నిజాయితీపరులు (సమాజంలో) బహుకొద్ది మంది మాత్రమే ఉంటారు."

ఇలా చెబుతూ దావూద్, తనను మేము పరీక్షిస్తున్నామని గ్రహించాడు. అందువల్ల అతను వెంటనే తన ప్రభువుని క్షమాపణ కోరుకున్నాడు. తరువాత నేలమీద సాగిలపడి (మావైపు) మరలాడు. అప్పుడు మేమతని పొరపాట్లు క్షమించాము. అతని కోసం మా దగ్గర తప్పకుండా దివ్యసాన్నిధ్యం, మంచి పర్యవసానం ఉన్నాయి. (24,25)

అతనితో మేమిలా అన్నాము: "దావూద్! మేము నిన్ను ప్రపంచంలో (మా) ప్రతినిధిగా నియమించాం. కనుక నీవు ప్రజలను న్యాయంగా పాలించు. మనోవాంఛలకు బానిస కాకు. అవి నిన్ను దైవమార్గం నుండి తప్పిస్తాయి. దైవమార్గం తప్పి పరలోక తీర్పుదినాన్ని మరచిపోయేవారికి ఘోరమైన శిక్ష పడుతుంది." (26)

భూమ్యాకాశాల్ని, వాటి మధ్య ఉన్నవాటిని మేము లక్ష్యరహితంగా సృష్టించలేదు. ఇది అవిశ్వాసుల అభిప్రాయం మాత్రమే. అలాంటి అవిశ్వాసులకు నరకాగ్ని కీడు తప్పదు. విశ్వసించి సత్కార్యాలు చేసేవారిని మేము ప్రపంచంలో కల్లోలాలు సృష్టించే వారితో కలిపి ఒకటిగా చేస్తామా? భయభక్తులుకలవారిని, దుర్మార్గుల్ని సమానంగా చేస్తామా? (27,28)

ఈ గ్రంథం శుభదాయకమయినది. ప్రజలు ఇందులోని సూక్తుల్ని గురించి యోచించడానికి, బుద్ధిమంతులు గుణపాఠం గ్రహించడానికి మేము దీన్ని నీదగ్గరకు పంపాము. (29)



దావూద్‌కు మేము సులైమాన్ (అనే సుపుత్రుడి)ని ప్రసాదించాము. అతను ఎంతో మంచిదాసుడు, తన ప్రభువుని అత్యధికంగా స్మరిస్తూ ఆయన వైపు మరలేవాడు. (30)

ఓరోజు సాయంత్రం సులైమాన్ ముందు చలాకీఅయిన మేలుజాతి గుఱ్ఱాలు కొన్ని తీసుకురాబడ్డాయి. "నాప్రభువు స్మరణ కారణంగానే నేనీ అశ్వసంపదను అభిమానిస్తున్నాను" అన్నాడతను. తర్వాత ఆగుఱ్ఱాలు కనుమరుగైపోయాయి. (సులైమాన్ ఆదేశిస్తూ) "కాదు, వాటిని మరోసారి నాదగ్గరకు తీసుకురండి" (అన్నాడు). (గుఱ్ఱాలు వచ్చిన తరువాత) అతను (ప్రేమగా) వాటి మెడలు, కాళ్ళు నిమిరాడు. (31-33)

సులైమాన్‌ని కూడా మేము పరీక్షకు గురిచేశాము. అతని సింహాసనం మీద ఒక మొండెం తెచ్చిపడేశాము. సులైమాన్ (దాని మర్మహేతువు గ్రహించి) తన నిర్ణయాన్ని మార్చు కున్నాడు.[1] "ప్రభూ! నన్ను క్షమించు. నా తరువాత మరెవ్వరికీ శోభించనటువంటి గొప్ప సామ్రాజ్యం ప్రసాదించు నాకు. నిస్సందేహంగా నీవే దాతవు, అనుగ్రహమూర్తివి" అని మమ్మల్ని వేడుకున్నాడు. అప్పుడు మేము గాలిని అతని అదుపులో ఉంచాము. ఆ గాలి అతని ఆజ్ఞతో అతను కోరుకున్న వైపు మెల్లిగా వీస్తుంది. (34-36)

అలాగే మేము భూతాలను కూడా అతని అదుపాజ్ఞలలో ఉంచాము. వాటిలో కట్టడాలను నిర్మించేవి, గజఈతలో ఆరితేరినవి, కట్టుబానిసల్లా సేవచేసేవి... ఇలా రకరకాల పనులు నిర్వహించే భూతాలు ఉన్నాయి. (మేమతనితో) "ఇదంతా మా అనుగ్రహం. నీవు కోరినవారికి వాటిని ఇవ్వచ్చు లేదా ఇవ్వకుండా నీ దగ్గరే పెట్టుకోవచ్చు. దాన్నిగురించి నిన్ను లెక్క అడగటం జరగదు" (అని అన్నాం). అతని కోసం మాదగ్గర తప్పకుండా ప్రత్యేక సాన్నిధ్యం, మంచి పర్యవసానం ఉన్నాయి. (37-40)

మా దాసుడు అయ్యూబ్ గాథ ప్రస్తావించు. అతను తన ప్రభువుని వేడుకుంటూ "షైతాన్ నన్ను తీవ్రబాధలకు, యాతనలకు గురిచేశాడ"ని అన్నాడు. (అప్పుడు మేము) "కాళ్ళతో నేలమీద తట్టు. ఈచన్నీళ్ళు స్నానానికి, త్రాగడానికి ఇస్తున్నాం" (అన్నాం).

మేమతనికి అతని బంధువర్గాన్ని తిరిగి రప్పించి ఇచ్చాము. వారితోపాటు అంతే మరి కొందరిని కూడా ఇచ్చాం. ఇదంతా మా వైపున అనుగ్రహంగా ప్రసాదించాం. విజ్ఞత, వివేచనలు కలవారికి గుణపాఠంగా మేమీ వృత్తాంతం పేర్కొంటున్నాం. (41-43)

(అతనితో) "ఈనెల కట్ట తీసుకొని కొట్టు, ప్రమాణాన్ని[2] భంగపరచకు" అన్నాము. మేమతడ్ని సహనశీలిగా, మంచి దాసునిగా, తనప్రభువు వైపు మాటిమాటికి మరలేవానిగా గుర్తించాము. (44)

---

1. అయోగ్యుడయిన తన కొడుకుని తన రాజకీయ వారసుడిగా చేయాలని తీసుకున్న నిర్ణయం కావచ్చని కొందరు భాష్యకారుల అభిప్రాయం.

2. హజ్రత్ అయ్యూబ్ (అలైహి) దైవప్రవక్త. దేవుడు ఆయన్ని ఓ భయంకర వ్యాధి కలిగించి పరీక్షించదలిచాడు. అనేక సంవత్సరాలపాటు ఈ వ్యాధితో ఆయన బాధపడినట్లు తెలుస్తోంది. దానివల్ల ఆయన సిరిసంపదలూ పోయాయి; సేవకులూ విడిచిపెట్టారు. బంధుమిత్రులు కూడా

మా దాసులు ఇబ్రాహీం, ఇస్‌హాఖ్, యాఖూబ్‌లను గురించి ప్రస్తావించు. వీరంతా గొప్ప క్రియాశీలురు; సునిశితదృష్టి, శక్తిసామర్థ్యాలు కలవారు. మేము ఓ ప్రత్యేకలక్షణం కారణంగా వారిని పావనం చేశాము. అదే పరలోక గృహానికి సంబంధించిన చింతన. వారు మాదృష్టిలో ఎన్నుకోబడిన పుణ్యపురుషులుగా పరిగణించబడ్డారు. (45-47)

(అలాగే) ఇస్మాయీల్, అల్‌యసా, జుల్‌కిఫల్‌లను గురించి కూడా ప్రస్తావించు. వీరు కూడా పుణ్యపురుషులే. (48)

ఇదొక జ్ఞాపిక (హితబోధ). కనుక భయభక్తులు కలవారికి తప్పకుండా శ్రేష్ఠమైన హోదా, శాశ్వతమైన స్వర్గవనాలు లభిస్తాయి. దైవభీతిపరుల కోసం స్వర్గద్వారాలు ఎప్పుడూ తెరిచేఉంటాయి. వారా ఉద్యానవనాలలో మెత్తటి దిండ్లకు ఆనుకొని కూర్చొని, హాయిగా తినడానికి, త్రాగడానికి రకరకాల పండ్లు, పానీయాలు తెప్పించుకుంటారు. వారి దగ్గర సిగ్గులొలికించే సమవయస్కులైన సుందరీమణులు ఉంటారు. ఇవన్నీ విచారణ రోజు ప్రసాదించ బడతాయని మీకు వాగ్దానం చేస్తున్నాము. ఇదీ మేము ప్రసాదించే ఉపాధి; (ఎంత అనుభవించినా) ఎన్నటికీ తరగని శాశ్వత నిధి. (49-54)

ఇదీ (దైవభీతిపరుల పర్యవసానం). పోతే హద్దుమీరిన దుర్మార్గుల కోసం అతిచెడ్డ నివాసముంది. అదే నరకం. అందులో వారు మలమల మాడిపోతారు. అది పరమ నీచమైన నివాసస్థలం. అదే వారికి లభించేది. కనుక సలసల కాగే నీరు, చీము, నెత్తురు, వగైరా జుగుప్సాకరమైన పదార్థాలను రుచిచూడమను వారిని. (55-58)

(వారు నరకంలోకి వస్తున్న) తమ అనుచరమూకను చూసి "ఈగుంపు మన దగ్గరికి చొరబడి వస్తోంది. వారికి ఎలాంటి స్వాగతం లేదు. వారు కూడా అగ్నిలో పడి మాడవలసిన వారే" (అంటారు). కొత్తగా వచ్చినవారు వీరి మాటలు విని "కాదు, మీరే (మాకన్నా ముందు) కాలి మాడిపోతున్నారు. మీక్కూడా ఎలాంటి స్వాగతం లేదు. మీరే కదా మాకీ దుర్గతి తెచ్చిపెట్టింది! ఎంత చెడ్డ నివాసస్థలమిది!!" అంటారు. (59,60)

ఆతర్వాత "ప్రభూ! మాకీ దుర్గతి పట్టించినవాడికి రెట్టింపు నరకయాతనలు పెట్టు" అంటారు వారు. తిరిగి పరస్పరం మాట్లాడుకుంటూ "మనం ప్రపంచంలో దుర్జనులుగా

---

దూరమయి పోయారు. ఒక్కభార్య మాత్రమే ఆయనకు సేవచేస్తూ కనిపెట్టుకొని ఉండేది. వ్యాధి సందర్భంగా తనకు సపర్యలు చేయడంలో బహుశా ఏదైనా లోపం చూసి, కోపంతో అయ్యూబ్ (అలైహి) తన భార్యకు వంద కొరడాదెబ్బలు కొడ్తానని ప్రమాణం చేసి ఉంటారు.

చివరికి ఆయన స్వస్థత చేకూర్చమని చేసిన ప్రార్థనను దేవుడు ఆలకించి ఆయనకు స్వస్థత చేకూర్చాడు. స్వస్థత చేకూరిన తరువాత ఆయన తన ప్రమాణాన్ని నెరవేర్చుకోవలసిన సమయం వచ్చినప్పుడు ఈ సూక్తిలో పేర్కొనబడినట్లు వంద కొరడా దెబ్బలకు బదులు వంద ఈనలు గల ఓ ఈనల కట్ట తీసుకొని భార్యను ఒకసారి కొట్టవలసిందిగా దేవుడు ఆయన్ని ఆదేశించాడు.

ప్రమాణభంగం చేయకుండా మాట నిలబెట్టుకునేందుకు అసాధారణ స్థితిలో ఈ విధంగా చేయవచ్చని కొందరు భాష్యకారులు అభిప్రాయపడ్డారు. ఈ అభిప్రాయాన్ని ఒక హదీసు కూడా సమర్థిస్తోంది. దైవప్రవక్త (సల్లం) శారీరకంగా ఎంతో బలహీనురాలైన ఒక వ్యభిచారిణిని వంద కొరడా దెబ్బలకు బదులు వంద ఈనలు గల కట్టతో కొట్టించి శిక్షించారు. (ముస్నద్ అహ్మద్)



భావించినవారు ఇక్కడెక్కడా కన్పించడం లేదేమిటీ? మనం వాళ్ళను ఊరికే హేళన చేశామా? లేక మనకు కనపడకుండా ఎక్కడైనా ఉన్నారా?" అంటారు (ఆశ్చర్యపోతూ).

ఇది యదార్థం. నరకవాసుల మధ్య ఇలాగే పోట్లాటలు జరుగుతాయి. (61-64)

వారికిలా చెప్పు: "నేను (సత్యతిరస్కార పర్యవసానం గురించి) హెచ్చరించేవాడ్ని మాత్రమే. ఏకేశ్వరుడైన అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడు. ఆయన సర్వాధికుడు; భూమ్యాకాశాలకు, వాటిమధ్య ఉన్నవాటికి యజమాని, ప్రభువు. ఆయన అపార శక్తిసంపన్నుడు, గొప్ప క్షమాశీలి కూడా." ఇంకాచెప్పు: "ఇదొక అసాధారణమైన గొప్పవార్త. ఇలాంటి వార్త విని మీరు (కాస్తయినా చలించకుండా) నిర్లక్ష్యం చేస్తున్నారు." (65-68)

(చెప్పు:) "ఊర్ధ్వలోక సదస్సులో తలెత్తిన వివాదం సంగతి నాకు తెలియదు. నాకీ విషయాలు దివ్యావిష్కృతి ద్వారా తెలుస్తున్నాయి. నేను ఉన్నది వున్నట్లు స్పష్టంగా తెలియజేసి హెచ్చరించడానికే నాకీ సమాచారం అందజేయబడుతోంది." (69,70)

నీ ప్రభువు దైవదూతలతో "నేను మట్టితో ఒక మానవుడ్ని సృజించబోతున్నాను. నేనతడ్ని పూర్తిగా సృజించి అతని (దేహం)లో నా ఆత్మ ఊదిన తరువాత మీరతనికి గౌరవ సూచకంగా అభివాదం చేయాలి" అని అన్నాడు. (71,72)

ఈ ఆజ్ఞ ప్రకారం దైవదూతలంతా (మానవుని ముందు) వంగి అభివాదం చేశారు. కాని ఇబ్లీస్ మాత్రం గర్విష్ఠుడయి బిర్రబిగిసి కూర్చున్నాడు. (ఆ విధంగా) వాడు సత్య తిరస్కారులలో చేరిపోయాడు. (73,74)

అప్పుడు విశ్వప్రభువు "ఇబ్లీస్! ఏమయింది నీకు? నేను నా స్వహస్తాలతో సృజించిన మానవునికి అభివాదం చేయనీయకుండా నిన్నే విషయం నిరోధించింది? నువ్వు స్వతహాగా గొప్పవాడయి పోయావా? లేక నువ్వసలు ఏదైనా అగ్రస్థాయి ప్రముఖుల కోవకు చెందిన వాడవని అనుకుంటున్నావా?" అని అడిగాడు. (75)

"నేను అతని కన్నా శ్రేష్ఠుడ్ని. మీరు నన్ను అగ్నితో సృజించారు. అతడ్ని (ఎలాంటి విలువలేని) మట్టితో సృజించారు" అన్నాడు ఇబ్లీస్. (76)

"అట్లాగానా, అయితే నువ్విక్కడ్నుంచి దిగిపో. నువ్వు భ్రష్టుడివి, పరమదౌర్భాగ్యుడివి. తీర్పుదినం వరకు నీపై నాశాపం ఉంటుంది" అన్నాడు దేవుడు (ఇబ్లీస్‌ని శపిస్తూ).

"ప్రభూ! అలాగైతే వీరు (మానవులు) తిరిగి లేపబడేవరకు నాకు గడువునివ్వు" అన్నాడు ఇబ్లీస్ (కంగారుపడుతూ). (77-79)

"సరే అలాగే నిర్ణీతసమయం వరకు గడువిస్తున్నాను పో" అన్నాడు దేవుడు.

"నీ గౌరవప్రతిష్ఠల సాక్షి! (ఆరోజుదాకా) నీతిమంతులైన నీ దాసుల్ని తప్ప అందర్నీ నేను దారితప్పిస్తూ ఉంటాను" అన్నాడు ఇబ్లీస్. (80-83)

"అయితే ఒకవిషయం విను. నేను యదార్థమే చెబుతున్నాను. నిన్ను, నిన్ననుసరించే మానవుల్నందర్నీ నరకంలో వేసి దాన్ని నింపివేస్తాను" అన్నాడు దేవుడు. (84,85)

ముహమ్మద్ (సల్లం)! వారికిలా చెప్పు: "నేనీ (ధర్మ) ప్రచారం కోసం మీ నుండి ఎలాంటి ప్రతిఫలం ఆశించడం లేదు. అదీగాక నేను పగటివేషాలు వేసే మోసగాణ్ణి కూడా కాను. ఈ ఖుర్‌ఆన్ యావత్తు మానవాళి కోసం అవతరించిన హితోపదేశం. అనతికాలంలోనే మీకు దీని వాస్తవికత ఏమిటో తెలుస్తుంది." (86-88) ✪

**అవతరణ: మక్కా**

## 39. బృందాలు (జుమర్)

**సూక్తులు: 75**

ఈ అధ్యాయాన్ని "జుమర్" (బృందాలు) అంటారు. ఇది అబిసీనియా వలసకు ముందు హిజ్రీశకం అయిదో సంవత్సరంలో అవతరించినట్లు తెలుస్తోంది. ఇందులో మక్కా బహుదైవారాధకుల్ని ఉద్దేశించి సత్యావలంబన కోసం హితోపదేశం చేయబడింది.

### కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

ఇది సర్వ శక్తిమంతుడు, మహా వివేకవంతుడైన దేవుని దగ్గర్నుండి అవతరించిన (దివ్య)గ్రంథం. ముహమ్మద్ (స)! మేమీ గ్రంథాన్ని సత్యం ప్రాతిపదికపై నీ దగ్గరికి పంపాము. కనుక నీవు ఒక్క దేవుడ్ని మాత్రమే ఆరాధిస్తూ ఉండు. నీ జీవిత విధానాన్ని ఆయన కోసమే ప్రత్యేకించు.[1] గుర్తుంచుకో, సంపూర్ణ ధర్మానుసరణ దేవుని హక్కు.

ఆయన్ను వదలి ఇతరులను సంరక్షకులుగా, సహాయకులుగా చేసుకున్నవారు "ఈ దైవాలు (విగ్రహాలు, దైవదూతలు వగైరా సృష్టితాలు) మమ్మల్ని దేవుని సన్నిధికి చేర్చుతాయని మాత్రమే మేము వీటిని ఆరాధిస్తున్నాం" అంటారు.[2] (ఇలా) వారు విభేద

---

1. ఆరాధన అంటే కేవలం పూజాపురస్కారాలే కాదు; విధేయత, ఆజ్ఞాపాలన, అనే భావాలు కూడా ఇందులో ఉన్నాయి. దీన్నిబట్టి మనిషి పూజాపురస్కారాలు, ధ్యానం, సంస్మరణలు, ప్రార్థనలు, మొక్కుబడులు అన్నీ సృష్టికర్త అయిన దేవునికి మాత్రమే పరిమితం చేయడంతో పాటు, ఆ దేవునికి పూర్తిగా విధేయుడయి ఆయన ఆజ్ఞలన్నిటినీ శిరసావహించాలి.

అలాగే జీవిత విధానాన్ని ఆ దేవుని కోసమే ప్రత్యేకించాలని ఈ సూక్తిలో చెప్పబడింది. మానవ జీవితం అనేక రంగాల్లో విస్తరించి ఉంది. వ్యక్తిగత రంగం, సామూహిక రంగం, కౌటుంబిక రంగం, నైతికరంగం, సామాజికరంగం, ఆర్థికరంగం, రాజకీయరంగం, జాతీయరంగం, అంతర్జాతీయ రంగం- ఒక్క మాటలో చెప్పాలంటే మానవుడు మనుగడ సాగించే, ఊపిరిపీల్చే యావత్తు రంగాలు ఉన్నాయి. కనుక మానవుడు ఆయా రంగాలన్నిటినీ దేవుని కోసం ప్రత్యేకించాలి. అంటే ఆయా రంగాలన్నిటిలోనూ దేవుని ఆజ్ఞల్ని, ఆయన ప్రవక్త (సల్లం) హితవుల్ని మాత్రమే పాటించాలని, వాటికి వ్యతిరేకమైన ఎలాంటి ఆజ్ఞలను, విధానాలను పాటించకూడదని అర్థం.

2. బహుదైవారాధకులు సృష్టికర్త, విశ్వ ప్రభువయిన దేవుడు ఒక్కడే అని అంగీకరించినప్పటికీ విగ్రహాలను, ప్రకృతిశక్తులను, మత గురువులను ఆరాధించడానికి వారు రెండు కారణాలు చెబుతున్నారు. ఒకటి, ఈ 'దేవతలు' తమను దేవుని సామీప్యానికి గొనిపోతాయని, దేవుని దగ్గర సిఫారసుచేసి తమను గట్టెక్కిస్తాయని అంటారు వీరు. రెండు, ఏకాగ్రత కోసం మాత్రమే తాము విగ్రహాలను ముందుంచుకొని ప్రార్థన చేస్తామని మరికొందరు బహుదైవారాధకులు (ముఖ్యంగా మనదేశంలో) చెబుతారు. కాని ఈ రెండు వాదనలు ఏకేశ్వరోపాసనకు విరుద్ధమైనవని, ఏ దేవతలనయితే వారు ఆరాధిస్తున్నారో ఆ దేవతలు వారి ఆరాధనను పరలోకంలో ఖండిస్తాయని ఖుర్‌ఆన్ నిష్కర్షగా చెబుతోంది. (10:29, 16:86 సూక్తులు, వాటి పాదసూచికలు చూడండి.)



స్తున్న వ్యవహారాలను గురించి (తీర్పుదినాన) దేవుడు తప్పకుండా వారి మధ్య తీర్పు చేస్తాడు. అబద్ధాలకోరు, సత్యతిరస్కారి అయిన ఏ మనిషికీ దేవుడు సన్మార్గం చూపడు.

దేవుడు తనకోసం ఎవరినైనా కుమారునిగా చేసుకోదలిస్తే ఆయన తన సృష్టితాలలో తాను కోరినవారిని ఎంచుకుంటాడు. కాని ఆయన ఎంతో పవిత్రుడు, పరిశుద్ధుడు. (అలాంటి మానవ బలహీనతలకు అతీతుడు.) ఆయన (యావత్తు సృష్టిరాసులకు స్వామి, సార్వభౌముడయిన) దేవుడు. ఆయన ఒక్కడే. ఆయనే సర్వాధికుడు. (1-4)

ఆయన భూమ్యాకాశాలను సత్యం ప్రాతిపదికపై సృష్టించాడు. ఆయనే రాత్రిని పగటి మీద, పగటిని రాత్రిమీద చుట్టివేస్తున్నాడు. (అంటే రాత్రి, పగలు ఒకదాని తర్వాత మరొకటి నియమబద్ధంగా వస్తూపోతున్నాయి.) సూర్యచంద్రులు ఒక నిర్ణీతకాలం వరకు నియమబద్ధంగా సంచరించేలా ఆయనే వాటిని అదుపులో ఉంచాడు. గుర్తుంచుకోండి, ఆయన అద్భుత శక్తిసంపన్నుడు, అపార క్షమాశీలి. (5)

ఆయనే మిమ్మల్ని ఏకైక జీవి నుండి పుట్టించాడు. ఆయనే ఆ జీవి నుండి దాని జతను సృష్టించాడు. ఆయనే మీకోసం పశువుల్లో ఎనిమిది (రకాల) పెంటి, పోతులు సృష్టించాడు. మిమ్మల్ని ఆయన మీతల్లుల గర్భాలలో మూడేసి చీకటి పొరలలో ఉంచి, ఒకదాని తరువాత ఒకటిగా రూపకల్పన చేస్తున్నాడు. ఆయనే అల్లాహ్. ఆయనే మీ ప్రభువు, పోషకుడు, పాలకుడు, విశ్వసామ్రాజ్యాధినేత. ఆయన తప్ప మరో ఆరాధ్యుడు లేడు. మరి మీరు ఎవరి వలలో పడి మోసపోతున్నారు? (6)

మీరు అవిశ్వాసులైపోతే దేవునికొచ్చే నష్టమేమీ లేదు. ఆయన నిరపేక్షాపరుడు. అయితే ఆయనకు తన దాసులు అవిశ్వాసులైపోవడం ఇష్టంలేదు. మీరు గనక కృతజ్ఞత చూపితే ఆయన దాన్ని మీకోసం ఇష్టపడతాడు. సొంత బరువు మోసేవాడు ఇతరుల బరువు మోయలేడు. చివరికి మీరంతా మీ ప్రభువు సన్నిధికే మరలిపోవలసి ఉంటుంది. అప్పుడాయన మీరు (ఐహిక జీవితంలో) ఏం చేస్తుండేవారో మీకు తెలియజేస్తాడు. ఆయనకు (మీ) హృదయాంతరాళాల్లో మెదిలే విషయాలు సైతం తెలుసు. (7)

మానవుడు ఆపద వచ్చినప్పుడు తన ప్రభువుని మొరపెట్టుకుంటాడు. అయితే అతని ప్రభువు అతనికి తన అనుగ్రహం కురిపించగానే, అతను లోగడ మొరపెట్టుకున్న ఆపద మరచిపోయి ఇతరుల్ని దేవునికి సాటికల్పిస్తాడు. ఇలా అతను ఇతరులను కూడా దైవమార్గం నుండి తప్పిస్తున్నాడు. "కొన్నాళ్లు తన అవిశ్వాసవైఖరి ద్వారా ప్రయోజనం పొందమ"ని చెప్పు అతనికి. చివరికి అతను తప్పకుండా నరకానికి పోవలసిందే. (8)

---

సూత్రప్రాయంగా సర్వ మతస్థులు దేవుడు ఒక్కడే అని ఒప్పుకుంటూనే ఆచరణలో అనేక మంది ఆ ఏకేశ్వరుడ్ని ఆరాధించలేక పోతున్నారు. సృష్టికర్త, ప్రభువు, పోషకుడయిన అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలని, కష్టాలలో ఆయన్నే వేడుకోవాలని; ఆయన ఆజ్ఞలనే శిరసావహించాలని; సృష్టితాలను ఆయనకు సాటి కల్పించకూడదని; జీవితంలోని ఏ రంగంలో కూడా ఆయన ఆజ్ఞలకు వ్యతిరేకంగా నడచుకోరాదని ఖుర్‌ఆన్ అనేక విధాలుగా చెబుతోంది. అలా చేయకపోతే పరలోకంలో శాశ్వత నరక శిక్షలు చవిచూడవలసి వస్తుందని కూడా ఖుర్‌ఆన్ హెచ్చరిస్తోంది.

దీనికి భిన్నంగా మరొక వ్యక్తి ఉన్నాడు. అతను (దేవునికి, దైవప్రవక్తకు) విధేయుడై రాత్రివేళ (ప్రార్థనచేస్తూ) నిలబడతాడు; సాష్టాంగపడతాడు. పరలోకంలో ఎదురయ్యే పరిణామాలను గురించి భయపడుతుంటాడు. తన ప్రభువు కారుణ్యాన్ని ఆశిస్తుంటాడు. "ఇలాంటి వ్యక్తి శ్రేష్ఠుడా లేక అతనా? (సత్యం గురించి) తెలిసినవాళ్ళు, తెలియనివాళ్ళు ఒకటేనా?" అని అడుగు వారిని. (మా) హితబోధను బుద్ధిమంతులే స్వీకరిస్తారు. (9)

(ప్రవక్తా! నామాటలు వారితో ఇలా)అను: "విశ్వసించిన నాదాసులారా! మీ ప్రభువుకు భయపడండి. (సత్యస్వీకారంతో పాటు) ఇహలోకంలో సదాచరణ వైఖరి అవలంబించినవారికే మేలు జరుగుతుంది. దేవుని భూమి విశాలంగా ఉంది. (ఒకచోట మీరు ప్రశాంతంగా ధార్మిక జీవితం గడపలేని పరిస్థితులు ఏర్పడితే మరోచోటికి వలస పోవచ్చు.) సహనం వహించేవారికి అపార పుణ్యఫలం లభిస్తుంది." (10)

ఈ సంగతి చెప్పు: "ధర్మాన్ని దేవునికి మాత్రమే ప్రత్యేకించి ఆయన్ని ఆరాధించాలని నాకుఆజ్ఞ ఇవ్వబడింది. అదీగాక అందరికంటే ముందు నేను విధేయుణ్ణి (ముస్లిం) అయి ఉండాలని కూడా నాకు ఆజ్ఞయింది." "ఒకవేళ నేను నా ప్రభువుకు అవిధేయుణ్ణయిపోతే, మహానాడు ఎదురయ్యే శిక్ష గురించి భయపడుతున్నాన"ని కూడా చెప్పు.

ఇలా చెప్పు: "నేను మటుకు నా ధర్మాన్ని (జీవిత విధానాన్ని) దేవునికి ప్రత్యేకించి ఆయన్ని మాత్రమే ఆరాధిస్తాను. ఆయన్ని వదలి మీరు కోరుకున్నవారిని పూజించుకోండి (నాకొచ్చే నష్టమేమీలేదు). ప్రళయదినాన తనకు, తన భార్యాపిల్లలకు నష్టం కలిగించుకునే వాడే అసలు దివాళాకోరు. బాగా తెలుసుకోండి, అదే స్పష్టమైన దివాళా." (11-15)

వారిని (నరకంలో) పైనుండీ, క్రిందినుండీ అగ్ని గొడుగులు (జ్వాలలు) ఆవరించి ఉంటాయి. ఇలాంటి దుష్పర్యవసానం నుండి (కాపాడుకోమని) దేవుడు తన దాసుల్ని హెచ్చరిస్తున్నాడు. కనుక నాదాసులారా! నాఆగ్రహం నుండి తప్పించుకోండి. (16)

మిథ్యాదైవాల్ని ఆరాధించడం మానేసి (నిజ)దేవుని వైపు మరలేవారికి శుభవార్త ఉంది. కనుక (ప్రవక్తా!) విషయాన్ని ప్రశాంతంగా ఆలకించి, అందులోని మంచిని అనుసరించేవారికి శుభవార్త విన్పించు. దేవుడు సన్మార్గం చూపినవారు వీరే. వీరే విజ్ఞులు.

ఎవరి విషయంలో (దైవ)శిక్ష గురించి నిర్ణయం జరిగిందో అతడ్నిక ఎవరు కాపాడగల్గుతారు? అగ్నిలో పడిపోయినవాడ్ని నీవు కాపాడగలవా? విశ్వప్రభువుకు భయపడి తదనుగుణంగా జీవితం మలచుకునేవారి కోసం (స్వర్గంలో) అంతస్తులవారిగా నిర్మించబడిన ఆకాశహర్మ్యాలు ఉన్నాయి. వాటి క్రింద (చల్లటి) సెలయేరులు ప్రవహిస్తూ ఉంటాయి. ఇది దేవుని వాగ్దానం. దేవుడు తన వాగ్దానాన్ని ఎన్నటికీ భంగపరచడు.

దేవుడు ఆకాశం నుండి వర్షాన్ని ఎలా కురిపిస్తున్నాడో మీరు గమనించలేదా? ఆయన తిరిగి ఆ వర్షపు నీటిని వాగులు, వంకలు, నదుల రూపంలో నేలలోకి ప్రవహింపజేస్తున్నాడు. ఆ నీటిద్వారా రకరకాల పంటలు పండిస్తున్నాడు. వాటిలో కూడా విభిన్నరకాలు ఉంటాయి. ఆ తర్వాత ఆ పంటపొలాలు పండి ఎండిపోతాయి. అప్పుడవి



పసుపుపచ్చగా మారడం కూడా మీకు కన్పిస్తుంది. చివరికి దేవుడు వాటిని పొట్టుపొట్టుగా చేస్తాడు. నిస్సందేహంగా ఇందులో బుద్ధిమంతులకు ఎంతో గుణపాఠం ఉంది.

దేవుడు ఒక మనిషి హృదయకవాటాన్ని ఇస్లాం కోసం తెరుస్తాడు. దాంతో అతను తన ప్రభువు నుండి లభించిన కాంతిమార్గంలో నడుస్తాడు. అలాంటి వ్యక్తీ, (మా సూచనల నుండి గుణపాఠం నేర్చుకోనివాడు సమానులవుతారా)? దేవుని హితబోధతో మరింత కఠిన హృదయులైపోయిన వారికి కీడు మూడింది. వారు పూర్తిగా మార్గభ్రష్టులైపోయారు. (17-22)

దేవుడు అత్యంత శ్రేష్ఠమైన వాణి అవతరింపజేశాడు. ఇదొక గ్రంథం. దాని భాగాలన్నీ ఒకదానికొకటి అవినాభావసంబంధం కలిగి ఉన్నాయి. ఇందులో విషయాలు అనేక సార్లు పునరావృతమయ్యాయి. విశ్వప్రభువుకు భయపడేవారు ఈ వాణి వినగానే వారి రోమాలు నిక్కబొడుచుకుంటాయి; వారి శరీరాలు జలదరిస్తాయి; వారి హృదయాలు మెత్తబడి దేవుని ప్రస్తావన వైపు మొగ్గుతాయి. ఇది దేవుని హితవాణి. దీనిద్వారా దేవుడు తాను తలచిన వారిని దారికి తెస్తాడు. ఆయన దారి తప్పించదలచిన వారికి మరెవరూ దారిచూపలేరు. (23)

ప్రళయదినాన ముఖంపై ఘోరమైన యాతనకు గురయ్యేవాడు ఎంత తల్లడిల్లిపోతాడో మీరేమైనా ఊహించగలరా? అలాంటి దుర్మార్గులతో (దైవదూతలు) "మీరు చేజేతులా చేసుకున్న కర్మల పర్యవసానం ఇక చవిచూసుకోండి" అంటారు. (24)

వీరికి పూర్వం కూడా అనేకమంది ఇలాగే (దైవప్రవక్తలను) తిరస్కరించారు. చివరికి వారిపై వారు ఊహించని వైపునుండి (దైవ)శిక్ష విరుచుకుపడింది. దేవుడు వారికి ఐహిక జీవితంలోనే అవమానం చవిచూపించాడు. పరలోక శిక్ష ఇంతకంటే తీవ్రంగా, ఘోరంగా ఉంటుంది. వీరీ విషయాన్ని గ్రహిస్తే ఎంత బాగుండు! (25,26)

ప్రజలు స్పృహలోకి వచ్చేందుకు ఖుర్ఆన్‌లో అనేక తార్కాణాలు పేర్కొన్నాం. వారు దుష్పర్యవసానం నుండి తప్పించుకోవడానికే మేము దీన్ని (వారికి తెలిసిన) అరబీ భాషలో అవతరింపజేశాం. ఇందులో ఎలాంటి వంకలు, వ్యత్యాసాలు ఏమాత్రం లేవు.

దేవుడు ఒక ఉదాహరణ ఇస్తున్నాడు, (వినండి): ఒక మనిషి ఉన్నాడు. అతనికి వక్రమనస్కులైన అనేకమంది యజమానులున్నారు. వారిలో ప్రతిఒక్కడూ అతడ్ని తన వైపు లాగుతుంటాడు. దీనికి భిన్నంగా మరొక వ్యక్తి ఉన్నాడు. అతను పూర్తిగా ఒకే యజమానికి బానిసగా ఉన్నాడు. మరి వీరిద్దరి పరిస్థితి ఒకటేనా? (కాదు.) సకలస్తోత్రాలకు దేవుడే అర్హుడు. కాని చాలామంది అజ్ఞానాంధకారంలో పడిఉన్నారు. (27-29)

(ప్రవక్తా!) నీవూ చావవలసి ఉంది; వారూ చావవలసి ఉంది. చివరికి మీరంతా ప్రళయదినాన మీ ప్రభువు సన్నిధిలో మీమీ వ్యవహారాలు ప్రవేశపెడతారు. (అప్పుడు ఎవరు అబద్ధాలకోరులో తేలుతుంది.) ఇక దేవునిపై అసత్యాలు మోపి, సత్యం ముందుకు వచ్చినప్పుడు దాన్ని తిరస్కరించినవాడి కంటే పరమ దుర్మార్గుడు ఎవరుంటాడు? ఇలాంటి అవిశ్వాసులకు నరకంలో చోటు లేదా? (30-32)

సత్యాన్ని తీసుకొచ్చినవాడు (దైవప్రవక్త), అతడ్ని నమ్మినవారే (దైవ)శిక్షకు దూరంగా ఉండేవారు. వారికి తమ ప్రభువు నుండి తాము కోరుకున్న ప్రతి వస్తువూ లభిస్తుంది. ఇదీ సహృదయులకు లభించే సుకృతఫలం. దేవుడు వారి (గత జీవితం లోని) పాపాలను వారి లెక్క నుండి మినహాయించి, ప్రస్తుతం వారు ఆచరిస్తున్న సత్కార్యాలకు తగిన ప్రతిఫలం ప్రసాదిస్తాడు. అందుకే ఈ ఏర్పాటు జరుగుతుంది.

ప్రవక్తా! దైవదాసులకు (వారి పనులు నెరవేర్చడానికి) ఒక్క దేవుడు చాలడా? వీరు దేవుడ్ని వదలి దైవేతర శక్తులు ఏదో చేస్తాయని నిన్ను భయపెడ్తున్నారు. కాని దేవుడు దారి తప్పించదలచిన వాడికి మరెవరూ దారి చూపలేరు. అలాగే ఆయన దారి చూపదలచిన మనిషిని మరెవరూ దారి తప్పించలేరు. దేవుడు సర్వ శక్తిమంతుడు కాదా? ఆయన (తలచుకుంటే వారికి) ప్రతీకారం చేయలేడా? (33-37)

నీవు గనక ఈ భూమ్యాకాశాలను ఎవరు సృష్టించారని అడిగితే వారు దేవుడేనని తప్పకుండా అంటారు. వారికిలా చెప్పు: "సరే, దేవుడు నాకేదైనా కష్టం కలిగించదలిస్తే మీరు దేవుడ్ని కాదని ప్రార్థిస్తున్న మిథ్యాదైవాలు నన్నీ ఆపద నుండి కాపాడగలవా? పోనీ దేవుడు నన్ను కరుణించదలిస్తే ఈశక్తులు ఆయన కారుణ్యాన్ని అడ్డుకోగలవా? నాకు దేవుడే చాలు. నమ్ముకునేవారు దేవుడ్నే నమ్ముకుంటారు."[3] (38)

వారికి స్పష్టంగా ఇలా చెప్పెయ్యి: "నా జాతిప్రజలారా! మీరు చేయాల్సిన పని మీరు చేయండి. నేను చేయాల్సినపని నేను చేస్తాను. మన ఉభయుల్లో ఎవరి మీద అవమానకరమైన ఆపద వచ్చి పడుతుందో, ఆ తర్వాత శాశ్వతంగా ఉండే (నరక) యాతనలు ఎవరిని చుట్టుముడ్తాయో మీకు త్వరలోనే తెలుస్తుంది." ప్రవక్తా! మేము యావత్ మానవాళికోసం ఈ సత్యపూరిత గ్రంథాన్ని నీపై అవతరింపజేశాం. కనుక ఎవరు సన్మార్గం అవలంబిస్తారో అది వారికే ప్రయోజనకారి అవుతుంది. మరెవరు పెడదారి పట్టిపోతారో దానివల్ల వారే నష్టపోతారు. వారి బాధ్యత నీపై లేదు. (39-41)

మరణసమయంలో ఆత్మలు స్వాధీనం చేసుకునేవాడు దేవుడే. ఆయన మరణిం చనివారి ఆత్మలను నిద్రావస్థలో స్వాధీనం చేసుకుంటాడు. తరువాత ఆయన ఎవరి విషయంలో మృత్యునిర్ణయం తీసుకుంటాడో వారి ఆత్మలను తీసుకొని, మిగిలినవారి ఆత్మల్ని ఒక నిర్ణీతకాలం కోసం వెనక్కి పంపుతాడు.[4] ప్రశాంత హృదయంతో యోచించే వారి కోసం ఇందులో గొప్ప సూచనలున్నాయి. (42)

3. ఈ సందర్భంగా మహాప్రవక్త (సల్లం) ప్రవచించిన ఒక మహితోక్తి వినండి. ఆయన ఇలా ప్రవచించారు: "ప్రజలందరిలో కెల్లా శక్తిమంతుడు కాదలచుకున్న వ్యక్తి దేవుడ్నే నమ్ముకొని ఆయన మీద భారం వేయాలి. అందరికంటే గొప్ప స్థితిపరుడు కాదలచుకున్న వ్యక్తి తన దగ్గరున్న దానికంటే దేవుని దగ్గర (స్వర్గంలో) ఉన్నదాని మీద ఎక్కువ నమ్మకం పెట్టుకోవాలి. అలాగే అందరి కంటే ఎక్కువ గౌరవనీయుడు కాదలచుకున్నవాడు అత్యంత గౌరవనీయుడు, మహోన్నతుడయిన దేవునికి భయపడుతూ ఉండాలి." (ఇబ్నె అబ్బాస్)

4. నిద్రావస్థలో కూడా ఆత్మ దేహం నుండి వెలువడి ఎక్కడెక్కడో తిరుగుతుంది. అప్పుడు ఆత్మకు, దేహానికి మధ్య స్థితిస్థాపక గుణంకల వస్తువేదో ఉంటుంది. ఈవస్తువే ఆ రెండిటిని పూర్తిగా



అలాంటి దేవుడ్ని వదలి వీరు ఇతరుల్ని సిఫారసుకర్తలుగా చేసుకున్నారా! వారిన డుగు: "ఎలాంటి అధికారం లేకపోయినా వారు సిఫారసు చేయగలరా?" చెప్పు: "సమస్త వ్యవహారాల్లో సిఫారసుచేసే అధికారం దేవునికి మాత్రమే ఉంది. భూమ్యాకాశాల రాజ్యాధికారం ఆయన చేతిలోనే ఉంది. ఆయన దగ్గరికే మీరు తిరిగిపోవలసిఉంది."

ఏక దేవుడ్ని గురించి ప్రస్తావన వచ్చినప్పుడు పరలోకంపై నమ్మకంలేనివారి ముఖాలు వాడి ముడుచుకుపోతాయి. ఆయన్ని వదలి ఇతరుల్ని గురించి ప్రస్తావిస్తే చాలు, వారి ముఖాలు ఒక్కసారిగా దివిటీల్లా వెలిగిపోతాయి.[5] (43-45)

కనుక నీవిలా వేడుకో: "దేవా! భూమ్యాకాశాల సృష్టికర్తా! అంతర్ బాహ్యాలను, గోచర అగోచర విషయాలను ఎరిగినవాడా! నీవే ప్రజల మధ్య వారు విభేదిస్తున్న విషయాలను గురించి తీర్పు చేసేవాడివి." (46)

ఒకవేళ దుర్మార్గుల దగ్గర లోకంలోని యావత్తు సిరిసంపదలకు రెట్టింపు సిరి సంపదలుంటే, ప్రళయదినాన కలిగే పరమనీచమైన ఘోరశిక్ష నుండి బయట పడేందుకు ఆ సంపద నంతటినీ (పాప)పరిహారం క్రింద ఇవ్వడానికి సిద్ధపడతారు. (అయినా వారా శిక్షనుండి తప్పించుకోలేరు.) అక్కడ దేవుని వైపునుండి వారిపైకి వారు ఎన్నడూ ఊహించని దారుణం వచ్చి పడుతుంది. వారి కర్మల దుష్ఫలితాలన్నీ వారి ముందు ప్రత్యక్షమవుతాయి. (ఈరోజు) వారు అపహాస్యం చేస్తున్నదే (రేపు) వారిమీద విరుచుకుపడుతుంది. (47,48)

మానవుడు ఏదైనా ఆపద వచ్చినప్పుడు మమ్మల్ని మొరపెట్టుకుంటాడు. అప్పుడు మేమేదైనా భాగ్యం ప్రసాదిస్తే "ఇది నాకున్న జ్ఞానం (యోగ్యతల) వల్ల లభించింద"ని

విడిపోనివ్వకుండా పట్టి ఉంచుతుంది. ఆ వస్తువు తెగిపోతే ఆత్మ దేహం నుండి పూర్తిగా వేరయి పోతుంది. అంటే మరణం సంభవిస్తుంది. దేవుడు నిద్రిస్తున్న ఓ మనిషి విషయంలో మృత్యు నిర్ణయం తీసుకున్నప్పుడు ఈ స్థితిస్థాపక వస్తువుని త్రెంచివేసి అతని దేహం నుండి ఆత్మను పూర్తిగా స్వాధీనం చేసుకుంటాడు. మృత్యునిర్ణయం తీసుకోకపోతే ఈ స్థితిస్థాపక వస్తువుని త్రెంచివేయకుండా తాత్కాలికంగా స్వాధీనం చేసుకున్న అతని ఆత్మను తిరిగి అతని దేహంలోకి వదిలేస్తాడు.

ఒక పేదవాడు కలలో అందమైన బంగళాలో ఉన్నట్లు, కారులో షికారు కొడ్తున్నట్లు, స్టార్ హోటల్లో భోగభాగ్యాలు అనుభవిస్తున్నట్లు చూస్తాడు. ఆ సమయంలో తాను ఓ చిన్న పూరిపాకలో నివసిస్తున్న నిష్టదరిద్రుణ్ణని, పీకలదాకా అప్పుల్లో మునిగివున్న దౌర్భాగ్యుణ్ణని, భార్యాపిల్లల కనీసావస రాలు కూడా తీర్చలేని దురదృష్టవంతుణ్ణని ఏ మాత్రం భావించడు. కాని కల కాస్తా చెదరి పోగానే వాస్తవం వికృతనాట్యం చేస్తూ అతని కళ్ళముందు కన్పిస్తుంది. అదేవిధంగా ఐహిక జీవితం కూడా అందమైన కలలాంటిదే. అసలుజీవితం మరణానంతరం వచ్చే పరలోక జీవితమే. శాశ్వతమైన ఆ పరలోకజీవితంలో కష్టాలు లేకుండా సుఖాలు మాత్రమే అనుభవించడానికి ఇహలోకంలోనే సత్య ధర్మం స్వీకరించి సదాచరణకై నిరంతరం కృషిచేస్తూ ఉండాలని ఈసూక్తి మనకు చెబుతోంది.

5. ఈ ధోరణి దాదాపు యావత్తు బహుదైవారాధకుల్లో కన్పిస్తుంది. చివరికి ఈ జాడ్యం దురదృష్టవశాత్తు ముస్లింలకు కూడా సోకింది. వీరు పైకి దేవుడ్ని విశ్వసించాం అంటారు. కాని ఆ ఏకైక దేవుడ్ని గురించి ఎవరైనా ప్రస్తావిస్తుంటే 'ఈ మనిషి ఎప్పుడు చూసినా దేవుడ్ని గురించే మాట్లాడుతాడు. దేవుని ప్రియభక్తులైన వలీలు, మహాపురుషులంటే ఇతనికి గిట్టదు' అంటారు.

అంటాడతను. కాదు, ఇదొక పరీక్ష. కాని చాలామందికి ఈ వాస్తవం తెలియదు. (49)

ఇలాంటి మాటలే పూర్వం కూడా చాలామంది (మూఢులు) అన్నారు. కాని వారు సంపాదించినది వారికి ఏమాత్రం ఉపయోగపడలేదు. చివరికి వారు తమ కర్మల దుష్ఫలితం అనుభవించారు. అలాగే (ఈనాడు) వీరిలోని దుర్మార్గులు కూడా త్వరలోనే తమ కర్మల దుష్ఫలితం అనుభవిస్తారు. వీరు మానుండి ఏవిధంగానూ తప్పించుకోలేరు.

దేవుడు తాను తలచిన విధంగా కొందరికి పుష్కలంగా, కొందరికి స్వల్పంగా ఉపాధి నిస్తున్నాడని వారికి తెలియదా? విశ్వసించేవారికి ఇందులో అనేక సూచనలు ఉన్నాయి. ప్రవక్తా! (వారికి నామాటలుగా) ఇలాచెప్పు: "ఆత్మవంచనకు పాల్పడిన నా దాసులారా! దేవుని కారుణ్యం పట్ల నిరాశచెందకండి. దేవుడు తప్పకుండా మీ పాపాలన్నిటినీ క్షమిస్తాడు. ఆయన గొప్ప క్షమాశీలి, అమిత దయామయుడు. (50-53)

కనుక మీపై (దైవ)శిక్ష వచ్చి, మీకు ఎలాంటి సహాయం లభించని పరిస్థితి రాక ముందే పశ్చాత్తాపంతో మీ ప్రభువు వైపు మరలండి; ఆయనకు పూర్తిగా విధేయులయి పోండి. అలాగే మీరు ఏమరుపాటులో ఉన్నప్పుడు హఠాత్తుగా మీపై (దైవ)శిక్ష విరుచుకు పడక ముందే మీ ప్రభువు పంపిన శ్రేష్ఠమైన గ్రంథాన్ని అనుసరించండి. (54,55)

(మీరలా చేయకపోతే) ఆ తరువాత మీరు "దేవుని విషయంలో నేనెంత పొరపాటు చేశాను, పైగా నేను (దైవధర్మాన్ని) అపహాస్యం చేసినవారిలో చేరిపోయానే!" అని విచారించ వలసివస్తుంది. లేదా "అయ్యయ్యో! దేవుడు నాకు సన్మార్గం చూపివుంటే నేను కూడా భయ భక్తులుకలవారిలో చేరేవాణ్ణే!" అని పశ్చాత్తాపపడవలసి వస్తుంది. లేదా దైవశిక్షను చూసి "మరో అవకాశం లభిస్తే నేను కూడా సదాచార సంపన్నులలో చేరుతానే!" అని బాధపడ వలసివస్తుంది. (అప్పుడతనికి) "అవకాశం ఎందుకు లభించ లేదు, నీ దగ్గరికి నా సూక్తులు వచ్చాయి. నీవు వాటిని నిరాకరించావు. గర్విష్ఠి అయి అవిశ్వాసుల్లో చేరిపోయావు" (అని సమాధానం లభిస్తుంది). అలాంటి పరిస్థితులు రాకూడదు సుమా! (56-59)

ఈరోజు దేవుని విషయంలో అబద్ధాలాడేవారి దుస్థితిని రేపు ప్రళయదినాన నీవూ చూస్తావు. ఆరోజు వారి ముఖాలు నల్లబడి పోతాయి. అహంకారులకు నరకంలో చోటు లేదా? భయభక్తులవైఖరి అవలంబించినవారికి మాత్రం దేవుడు వారి విజయరహస్యాల కారణంగా మోక్షం ప్రసాదిస్తాడు. వారికి ఎలాంటి దుఃఖం, కష్టాలు ఉండవు. (60,61)

(విశ్వంలోని) ప్రతిఅణువుకూ దేవుడే సృష్టికర్త. ఆయనే సమస్త సృష్టిని పర్యవేక్షిస్తున్నాడు. భూమ్యాకాశాల నిక్షేపాలకు చెందిన తాళపుచెవులు ఆయన చేతిలోనే ఉన్నాయి. దేవుని సూక్తులు తిరస్కరించేవారే చివరికి నష్టపోయేవారు. (62,63)

ప్రవక్తా! వారినిలా అడుగు: "అజ్ఞానులారా! అలాంటప్పుడు మీరు దేవుణ్ణి వదలి ఇతరుల్ని ఆరాధించమని నాకు చెబుతున్నారా?"- "మీరు దేవునికి ఇతరుల్ని సాటికల్పిస్తే మీరు చేసే (మంచి)పనులు (కూడా) వ్యర్థమవుతాయి, మీరు ఘోరంగా నష్టపోతారు"



అని నీదగ్గరకు, నీకు పూర్వం వచ్చిన ప్రవక్తలందరి దగ్గరకు దివ్యావిష్కృతి (వహీ) పంపబడింది." (ఈ విషయం వారికి స్పష్టంగా చెప్పు.) (ప్రవక్తా!) నీవు మాత్రం ఏకైక దేవుణ్నే ఆరాధిస్తూ కృతజ్ఞులయిన దాసులలో చేరిపో. (64-66)

వారసలు దేవునికి విలువ ఇవ్వవలసిన విధంగా విలువ ఇవ్వనేలేదు. పునరుత్థాన దినాన యావత్తు భూమండలం ఆయన పిడికిలిలో ఉంటుంది.[6] యావత్తు నభోమండలం ఆయన కుడిచేతిలో (చాపలా) చుట్టబడిఉంటుంది. వీరు చేస్తున్న బహు దైవారాధనకు ఆయన ఎంతో అతీతుడు, పరమ పవిత్రుడు. (67)

ఆరోజు భీకర శంఖారావంతో భూమ్యాకాశాల్లోని జీవరాసులన్నీ చచ్చి పడిపోతాయి. కాకపోతే దేవుడు సజీవంగా ఉండదలచిన ప్రాణులు మాత్రం కొన్ని సజీవంగా ఉంటాయి. ఆ తర్వాత మరోసారి శంఖారావం గావించబడుతుంది. దాంతో సమస్త జీవ కోటి ఒక్కసారిగా లేచి చూడనారంభిస్తుంది. (68)

ధరణి తన ప్రభువు జ్యోతితో దేదీప్యమానంగా వెలిగిపోతుంది. కర్మలగ్రంథం తీసుకు రాబడుతుంది. దైవప్రవక్తలు, సాక్షులు ప్రవేశపెట్టబడతారు. (అప్పుడు) మానవుల మధ్య పూర్తి న్యాయంగా సరయిన తీర్పు ఇవ్వబడుతుంది. వారికి అణుమాత్రం కూడా అన్యాయం జరగదు. ప్రతి మనిషికీ అతను చేసుకున్న కర్మలను బట్టి పూర్తిప్రతిఫలం లభిస్తుంది. మానవులు చేస్తున్న పనులన్నీ దేవునికి బాగా తెలుసు. (69,70)

---

ప్రఖ్యాత తత్వవేత్త ఆలూసి రూహుల్‌మాని గ్రంథంలో ఇలా స్వానుభవాన్ని పేర్కొన్నారు: ఓరోజు ఒకతను ఏదో కష్టాల్లోఉండి చనిపోయిన ఓ మహనీయుణ్ణి సహాయం కోసం అర్థిస్తున్నాడు. నేనతణ్ణి చూసి 'దైవదాసుడా! దేవుణ్ణి అర్థించు' అన్నాను. నామాటలు విని అతను మండిపడ్డాడు. తరువాత ప్రజలు, అతడు నా గురించి నేను వలీలకు వ్యతిరేకినని అన్నాడని తెలియజేశారు.

6. ఒకసారి దైవప్రవక్త (సల్లం) మసీదులో వేదికపై నిలబడి ప్రసంగిస్తూ ఈ సూక్తి పఠించిన తరువాత ఇలా తెలియజేశారు:

దేవుడు (ప్రళయదినాన) భూమ్యాకాశాలను (యావత్తు గ్రహాలను) తన చేతిలోకి తీసుకొని పిల్లవాడు బంతిని తిప్పినట్లు తిప్పుతూ "నేను ఏకైక దేవుణ్ణి, నేను (విశ్వ)చక్రవర్తిని. నేను సర్వశక్తి మంతుణ్ణి. నేను సమస్త వైభవాలుగల మహోన్నతుణ్ణి. ఇక ప్రపంచ వాసులైన ఆ చక్రవర్తులు ఎక్కడ ఉన్నారు? ఏరా నియంతలు? ఏమయ్యారు ఆ అహంకారులు?" అని అంటాడు.

దైవప్రవక్త (స) ఇలా చెబుతూ ఆపాదమస్తకం ఊగిపోసాగారు. ఆ దృశ్యం చూస్తుండిన అనుచరులు (రజి) ఆయన వేదికపై నుండి పడిపోతారేమోనని భయపడిపోయారు. (బుఖారి)

అలాంటి దేవునికి ఇతరుల్ని సాటి కల్పించకుండా, ఇతరులు కూడా దాసుల మొరలు ఆలకించి తమ కోర్కెలు తీర్చుతారని నమ్మడం; తదనుగుణంగా ప్రవర్తించడం; ఆయనకు మానవ బలహీనతలు ఆపాదించడం; సృష్టికర్త, యజమాని, ప్రభువయిన దేవుని పట్ల స్పష్టమయిన విశ్వాస ఘాతుక చర్య అవుతుంది. క్షమార్హంకాని ఘోరమయిన పాపంగా పరిగణించ బడుతుంది.

"షిర్క్" అనే ఈ ఘోరపాపానికి మనిషి బ్రతికుండగా క్షమాపణ కోరుకొని సన్మార్గం అవలంబించకపోతే, మరణానంతర జీవితంలో ఎంత పశ్చాత్తాపంచెందినా ప్రయోజనం ఉండదు.

(తీర్పు ముగిసిన తర్వాత) అవిశ్వాసుల్ని గుంపులు గుంపులుగా నరకంవైపు తోలు కెళ్తారు. అలా వారు నరకం దగ్గరికి చేరుకున్న తర్వాత నరకద్వారాలు తెరవబడతాయి.

ఆ సందర్భంలో ద్వారపాలకులు "మీ దగ్గరికి మీ (జాతి)ప్రజల నుండి దైవ ప్రవక్తలు రాలేదా? వారు మీకు మీప్రభువు సూక్తులు విన్పించలేదా? ఈనాడు (ఎదురయ్యే పరిణామాల్ని) గురించి (ఆనాడే) వారు మిమ్మల్ని హెచ్చరించలేదా?" అని అడుగుతారు వారిని.

దానికి వారు "వచ్చారు. (హెచ్చరించారు కూడా.) కాని సత్యతిరస్కారులకు నరక శిక్ష (ఎప్పుడో) నిర్ణయమైపోయింది" అని సమాధానమిస్తారు. అప్పుడు ద్వారపాలకులు "అయితే నరకంలోకి పోయిపడండి. ఇక మీరిక్కడే ఎల్లకాలం పడిఉంటారు. గర్విష్ఠులకు నిర్ణయించిన ఈ నరకం పరమ చెడ్డస్థలం" అని అంటారు. (71,72)

ఇక విశ్వప్రభువుకు భయపడుతూ తదనుగుణంగా జీవితం గడిపినవారిని తండోప తండలుగా స్వర్గం వైపు తీసుకుపోవడం జరుగుతుంది. అలా వారు స్వర్గం దగ్గరకు చేరుకుంటారు. అక్కడ స్వర్గద్వారాలు ముందే తెరవబడి ఉంటాయి.

అప్పుడు స్వర్గపాలకులు వారిని సాదరంగా ఆహ్వానిస్తూ "మీకు శాంతీ సౌభాగ్యాలు కలుగుగాక! మీరు ఎంతో మంచివారు. ఇక శాశ్వతంగా ఇందులో ప్రవేశించి ఉండండి" అని అంటారు. (73)

దానికి వారు సమాధానమిస్తూ "సకల ప్రశంసలు దేవునికే శోభిస్తాయి. ఆయన మాకు చేసిన వాగ్దానం నెరవేర్చిచూపాడు. మమ్మల్ని ధరణికి వారసులుగా చేశాడు. ఇప్పుడు మేము కోరుకున్న చోట నివాసం ఏర్పరచుకోగలం" అని అంటారు. కనుక సదాచార సంపన్నులకు (ఈ విధంగా) అత్యంత శ్రేష్ఠమైన ప్రతిఫలం లభిస్తుంది. (74)

అక్కడ నీవు (మహా అద్భుతాన్ని) చూస్తావు. దైవదూతలు దివ్యసింహాసనం చుట్టూ వలయంగా ఏర్పడి తమ ప్రభువు ఔన్నత్యాన్ని ప్రశంసిస్తూ, ఆయన పవిత్రతను కొనియాడుతుంటారు. మానవులకు పూర్తిన్యాయం చేకూర్చబడుతుంది. (ఆ సందర్భం లో) "సర్వలోక ప్రభువుకే సకల స్తోత్రాలు!" అనే పలుకులు మార్మోగుతాయి. (75) ✪

**అవతరణ: మక్కా**

# 40. విశ్వాసి (మోమిన్)

**సూక్తులు: 85**

ఈ అధ్యాయాన్ని "మోమిన్" అంటారు. ఇది 39వ అధ్యాయం (బృందాలు) తర్వాత హి.శ. 5లో మక్కాలో అవతరించింది. బహుదైవారాధకులు దైవప్రవక్త (సల్లం)పై పెద్దఎత్తున దుష్ప్రచారం సాగిస్తూ, ఆయన్ని అంతమొందించడానికి రకరకాల కుట్రలు పన్నుతున్న రోజులవి. ఒకరోజు దైవప్రవక్త (సల్లం) కాబామందిరంలో ప్రార్థన చేస్తుంటే ఉఖ్బా అనే వాడు ఆయన మెడకు తుండుగుడ్డ వేసి మెలితిప్పుతూ లాగసాగాడు. అంతలో అబూబకర్ (రజి) వచ్చి అతడ్ని అవతలకు నెట్టి దైవప్రవక్త (స)ను కాపాడారు.

ఈ అధ్యాయంలో దేవుడు పైసంఘటనను పురస్కరించుకొని అవిశ్వాసులకు సత్యతిరస్కార పర్యవసానం గురించి హెచ్చరించాడు. నరక విషయాలతోపాటు గతంలో



దైవప్రవక్తల్ని తిరస్కరించి నాశనమయిన ఫిరౌన్, ఖారూన్‌ల గురించి ప్రస్తావించాడు. ఆ తరువాత ఫిరౌన్ దర్బారులో సత్యం గురించి నిర్భయంగా చాటిచెప్పిన ఒక విశ్వాసి వీరగాథను ప్రస్తావిస్తూ, అతనికి వ్యతిరేకంగా ఎన్నో కుట్రలు, కుయుక్తులు పన్నినవారికి ఎలాంటి దుర్గతి పట్టిందో తెలిపి మక్కా అవిశ్వాసుల్ని హెచ్చరించాడు.

## కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

హా-మీమ్. ఇది మహా శక్తిమంతుడు, సర్వజ్ఞుడైన దేవుని దగ్గర్నుండి అవతరించిన గ్రంథం. ఆయన పాపాలు క్షమించేవాడు; పశ్చాత్తాపంతో చేసిన వేడుకోలును స్వీకరించేవాడు; కఠినంగా శిక్షించేవాడు; ఎంతో ఉదారస్వభావుడు కూడా. ఆయన తప్ప మరో ఆరాధ్యుడు లేడు. ఆయన దగ్గరికే అందరూ మరలిపోవలసి ఉంది. (1-3)

దేవుని సూక్తుల విషయంలో కృతఘ్నులు, సత్యతిరస్కారులు తప్ప ప్రపంచంలో మరెవరూ పిడివాదం చేయరు. (వారికి ఎటూ నరకయాతనలు తప్పవు.) అందువల్ల వారు ప్రపంచంలో (వైభవోపేతంగా వెలిగిపోతూ) తిరగడం చూసి నీవు మోసపోకూడదు సుమా! వారికి పూర్వం నూహ్‌జాతి తిరస్కరించింది. ఆ తరువాత కూడా అనేక జాతులు తిరస్కరించాయి. ప్రతిజాతీ తన ప్రవక్తను పట్టుకోవడానికి అతనిపై లంఘించింది. వారంతా తమ పైశాచికఎత్తుగడలతో సత్యాన్ని రూపుమాపడానికి ప్రయత్నించారు. అయితే చివరికి నేను వారిని పట్టుకున్నాను. ఇకచూడు. నా శిక్ష ఎంత కఠినమైనదో!

అదేవిధంగా సత్యతిరస్కారానికి పాల్పడినవారంతా నరకాగ్నికి సమిధలవుతారని నీ ప్రభువు చేసిన నిర్ణయం కూడా వారి విషయంలో అమలు జరిగితీరుతుంది. (4-6)

విశ్వప్రభువు సింహాసనాన్ని ఎత్తిపట్టుకున్న దైవదూతలు, దాని చుట్టూ నిలబడిన దైవదూతలు అంతా తమ ప్రభువు ఔన్నత్యం కీర్తిస్తూ, ఆయన పవిత్రతను స్మరిస్తున్నారు. ఆయన్ని (దృఢంగా) విశ్వసిస్తున్నారు; విశ్వసించినవారిని క్షమించమని ఇలా ప్రార్థిస్తారు:

"ప్రభూ! నీవు నీకారుణ్యంతో, నీ జ్ఞానసంపత్తితో ప్రతి వస్తువునూ పరివేష్ఠించి ఉన్నావు. కనుక పశ్చాత్తాపంచెంది నీ మార్గం అవలంబించినవారిని క్షమించు. వారిని నరకయాతనల నుండి కాపాడు. ప్రభూ! నీవు వారికి వాగ్దానంచేసిన శాశ్వత స్వర్గవనాలలో వారిని ప్రవేశింపజేయి. వారి తల్లిదండ్రులలో, భార్యాపిల్లలో సజ్జనులైనవారిని కూడా (స్వర్గవనాలలో వారితో పాటు చేర్చు). నిజంగా నీవు అద్వితీయ శక్తిసంపన్నుడవు, అద్భుత వివేకవంతుడవు. వారిని ఆపదలు, అనర్థాల నుండి కాపాడు. ప్రళయ దినాన నీవు ఎవరిని ఆపదలు, అనర్థాల నుండి కాపాడుతావో వారిని నీవు కటాక్షించినట్లే. అదే ఘనవిజయం, పరమమోక్షం." (7-9)

ప్రళయదినాన (దైవదూతలు) సత్యతిరస్కారుల్ని ఎలుగెత్తి పిలిచి వారితో ఇలా అంటారు: "ఈరోజు మీకు మీపై ఎంత కోపం వస్తున్నదో, (సత్యాన్ని) విశ్వసించమని మిమ్మల్ని పిలుస్తుంటే మీరు దాన్ని (పెడచెవిన పెడ్తూ) తిరస్కరిస్తున్నప్పుడు దేవుడు మీపట్ల అంతకంటే ఎక్కువ ఆగ్రహోదగ్రుడయ్యేవాడు." (10)

దానికి వారు “ప్రభూ! నీవు మాకు నిజంగా రెండుసార్లు మృత్యువు కలిగించి, రెండు సార్లు ప్రాణం పోశావు. ఇప్పుడు మేము మా పొరపాట్లు ఒప్పుకుంటున్నాము. మరి మేము ఇక్కడ్నుంచి బయటపడే మార్గం ఏదైనా ఉందా?” అంటారు. (11)

“(ఇప్పుడా మీరొప్పుకునేది, అనాడేమయింది మీ బుద్ధి?) ఆనాడు ఏకైక దేవుని వైపు పిలిచినప్పుడు మీరు (మా మాటలు) నిరాకరిస్తుండేవారు. అదే (మరెవరైనా) దేవునితో పాటు ఇతరుల్ని కలిపేస్తే మీరు (సంతోషంగా) ఒప్పుకునేవారు. ఈకారణంగానే మీకీ దుర్గతి పట్టింది. (ఇక దీన్నుంచి మీరు బయటపడే ప్రసక్తే లేదు.) నిర్ణయాధికారం ఇప్పుడు పరమోన్నతుడు, సర్వాధికుడైన దేవుని చేతిలో ఉంది” (అని వారికి సమాధానం లభిస్తుంది). (12)

ఆయనే మీకు తన నిదర్శనాలు చూపిస్తున్నాడు. ఆయనే మీకోసం ఆకాశం నుండి (వర్షం ద్వారా) ఉపాధినిస్తున్నాడు. కాని ఆయనవైపు పశ్చాత్తాపంతో మరలేవారే (ఈ నిదర్శనాల ద్వారా) గుణపాఠం నేర్చుకుంటారు. (విశ్వాసులారా!) అవిశ్వాసులు ఎంత అసహ్యించుకున్నా సరే, మీ జీవిత విధానాన్ని దేవునికి ప్రత్యేకించి ఆయన్నే ప్రార్థించండి.

ఆయన మహోన్నతమైన హోదా, అంతస్తులు కలవాడు, (సర్వాధికార) సింహాసనానికి అధిపతి. ఆయన తన దాసులలో తాను తలచుకున్న వారిపై తన ఆదేశంతో దివ్యావిష్కృతి అవతరింపజేస్తున్నాడు. వారు పరలోక సమావేశం రోజు గురించి హెచ్చరించాలన్నదే దీని ఉద్దేశ్యం. ఆరోజు మానవులంతా నిరాటంకంగా ముందుకొస్తారు. దేవుని దగ్గర వారు ఏ విషయాన్నీ దాచలేరు. (అప్పుడు వారిని ఎలుగెత్తిపిలిచి) “ఈరోజు సార్వభౌమత్వం ఎవరిద”ని అడుగుతారు. (దానికి యావత్తుసృష్టి) “చండశాసనుడైన ఏకేశ్వరునిదే” (అంటుంది). (13-16)

ఆరోజు ప్రతి మనిషికీ అతను చేసుకున్న కర్మలకు ప్రతిఫలం లభిస్తుంది. ఆరోజు ఎవరికీ ఎలాంటి అన్యాయం జరగదు. లెక్క చూడటానికి దేవునికి ఎంతోసేపు పట్టదు.

ప్రవక్తా! అతి సమీపానికి వచ్చివున్న (ప్రళయ)దినం గురించి ప్రజల్ని భయపెట్టు. ఆరోజు గుండెలు (గుభేలుమంటూ) గొంతులలోకి వస్తాయి. ప్రజలు పుట్టెడు దుఃఖాన్ని బలవంతంగా దిగమింగుతూ నోరుమూసుకొని నిల్చుంటారు. దుర్మార్గులకు ఏ ఆప్తమిత్రుడూ లభించడు. వారికనుకూలంగా సిఫారసు చేసేవారు కూడా ఎవరూ ఉండరు. వారి సిఫారసు అంగీకరించడం జరగదు. దేవునికి (మానవుల) దొంగచూపులు, (వారి) హృదయాల్లో దాగిన రహస్యాలు సయితం తెలుసు. దేవుడు పూర్తి న్యాయంగా, నిష్పక్షపాతంగా తీర్పు చేస్తాడు. (బహుదైవారాధకులు) దేవుడ్ని వదలి ప్రార్థిస్తున్న మిథ్యాదైవాలు ఏ విషయంలోనూ తీర్పు చేయలేవు. నిస్సందేహంగా దేవుడు (సర్వం) వినేవాడు, చూసేవాడు. (17-20)

వీరు ప్రపంచంలో ఎన్నడూ పర్యటించలేదా? పర్యటిస్తే గత జాతులకు ఎలాంటి గతి పట్టిందో వీరికి తెలిసేది కదా? వీరికంటే వారు ఎంతో శక్తిమంతులు. వారు



ప్రపంచంలో వీరి కంటే ఎంతో అద్భుత చిహ్నాలు వదలిపెట్టారు. అయితే వారు చేసిన పాపాలకు దేవుడు వారిని పట్టుకున్నాడు. అప్పుడు దేవుని పట్టు నుండి వారిని ఏ శక్తీ కాపాడలేక పోయింది. వారికీ దుర్గతి పట్టడానికి కారణం వారి దగ్గరకు వారి ప్రవక్తలు సూచనలు, సూక్తులు తెచ్చినా వాటిని వారు నమ్మడానికి నిరాకరించారు. చివరికి దేవుడు వారిని పట్టుకున్నాడు. దేవుడు అత్యంత శక్తిమంతుడు. ఆయన శిక్ష చాలా కఠినంగా ఉంటుంది. (21,22)

మేము మూసాకు మా నిదర్శనాలు, స్పష్టమైన నియామక ప్రమాణాలు ఇచ్చి ఫిరౌన్, హామాన్, ఖారూన్‌ల దగ్గరకు పంపాము. కాని వారు (అతను తెచ్చిన సత్యాన్ని నిరాకరిస్తూ) “నీవు మాంత్రికుడవు, అసత్యవంతుడవు” అన్నారు. (23,24)

ఆ తరువాత మూసా మా తరపున సత్యం(తో కూడిన అనేక మహిమలు) వారి ముందుకు తీసుకువచ్చాడు. (దాంతో చాలామంది ఇస్రాయీలీలు మూసాకు అనుచరులై పోసాగారు. కాని ఆ దుర్మార్గులకు మాత్రం కనువిప్పు కల్గలేదు.) వారు (మూసా అనుచరుల్లో భయోత్పాతం సృష్టించేందుకు) “సత్యాన్ని విశ్వసించి అతనితో కలసిపోయినవారి మగపిల్ల లను హతమార్చండి. వారి ఆడపిల్లల్ని మాత్రమే సజీవంగా వదలిపెట్టండి” అన్నారు. కాని సత్యతిరస్కారుల పాచికలేవీ పారలేదు. (25)

ఓరోజు ఫిరౌన్ తన సభాసదులతో “నన్ను వదలండి, నేను మూసాను చంపితీరుతా. అతను తన ప్రభువును మొరపెట్టుకోనివ్వండి (ఏమవుతుందో చూద్దాం). ఇతని ధోరణి చూస్తుంటే ఇతను మీ మతాన్ని, మీ జీవన వ్యవస్థను మార్చివేస్తాడని నాకు అనుమానంగా ఉంది. లేదా ఇతను (మన) దేశంలో అరాచకాన్నయినా సృష్టించవచ్చు” అని అన్నాడు. (26)

మూసా (ఫిరౌన్ బెదిరింపుల్ని ఏమాత్రం ఖాతరుచేయకుండా) “పరలోక తీర్పుదినాన్ని నమ్మని ప్రతి అహంకారి బారినుండి నేను నాప్రభువు, మీప్రభువు అయిన దేవుని శరణు పొందాను” అన్నాడు. (27)

ఆ సందర్భంలో ఫిరౌన్‌వంశానికి చెందిన ఒక విశ్వాసి తన విశ్వాసాన్ని బహిర్గతం చేయకుండా ఇలా అన్నాడు: “మీరు ఒక వ్యక్తిని కేవలం తన ప్రభువు దేవుడేనని అన్నంత మాత్రాన హతమారుస్తారా? అసలతను మీ ప్రభువు నుండి మీ దగ్గరకు సాక్ష్యాధారాలు తీసుకొచ్చాడు. ఒకవేళ అతను చెప్పేది అబద్ధమైతే అతని అబద్ధం అతనికే చుట్టుకుంటుంది. అలాగాకుండా అతను చెప్పేది, చూపించేది నిజమే అయితే, అతను హెచ్చరిస్తున్న భయంకర దుష్పరిణామాలలో కొన్నయినా మీపై విరుచుకుపడటం ఖాయం. అబద్ధాలకోరుకు, హద్దుమీరి ప్రవర్తించేవాడికి దేవుడు ఎన్నటికీ సన్మార్గబుద్ధి ప్రసాదించడు.”

‘నా జాతిప్రజలారా! ఈరోజు మీకు సామ్రాజ్య వైభవం ఉంది. దేశంలో మీ ఆధిక్యత, అధికారాలే చెలామణి అవుతున్నాయి (నిజమే). కాని (ఏ క్షణంలో నయినా

హఠాత్తుగా) మనపై దైవశిక్ష విరుచుకుపడితే మనకెవరు సహాయం చేస్తారు?"

ఫిరౌన్ (అతని మాటలు పట్టించుకోకుండా) "నేను మాత్రం నాకు సమంజసమని తోచిన సలహా మీకిస్తున్నాను. నేను మిమ్మల్ని సరైన దారినే నడిపిస్తున్నాను" అన్నాడు.

దానికా విశ్వాసి ఇలా అన్నాడు: "సోదరులారా! (మీ ధోరణి చూస్తుంటే) గత జాతులకు దాపురించిన దుర్దినాలు వంటివి మీక్కూడా దాపురిస్తాయేమోనని నాకు భయంగా ఉంది. గతంలో నూహ్‌జాతికి, ఆద్‌జాతికి, సమూద్‌జాతికి, ఆ తర్వాత కూడా అనేక జాతులకు దుర్దినాలు దాపురించాయి. దేవుడు మాత్రం (అనవసరమైన శిక్షలతో) తన దాసులకు అన్యాయం చేయాలనుకోడు." (28-31)

"సోదరులారా! మొరలు, కేకలుపెట్టే దినం (కూడా) మీకు దాపురిస్తుందేమోనని నేను భయపడ్తున్నాను. ఆరోజు మీరు (సహాయంకోసం) ఒకర్నొకరు పిలుచుకుంటూ (కంగారుగా) అటూ ఇటూ పరుగెత్తుతారు. కాని అప్పుడు మిమ్మల్ని దేవుని పట్టు నుండి కాపాడేవారే ఉండరు. దేవుడు దారితప్పించిన వాడికి మరెవరూ దారి చూపించలేరు."

"గతంలో యూసుఫ్ (ప్రవక్త) కూడా మీ దగ్గరకు సాక్ష్యాధారాలు తీసుకొచ్చారు. కాని ఆయన హితబోధను మీరు అనుమానించారు. ఆయన చనిపోయిన తరువాత మీరు ఇక దేవుడు ఏ ప్రవక్తనూ ఎట్టి పరిస్థితిలో కూడా పంపడని అన్నారు."

అదేవిధంగా హద్దులు మీరిపోయి (సత్యాన్ని) అనుమానిస్తూ ఎలాంటి ఆధారాలు, ప్రమాణాలు లేకుండానే దేవుని సూక్తుల విషయంలో పిడివాదం చేసే ప్రతి వ్యక్తినీ దేవుడు దారితప్పిస్తాడు. దేవుని దృష్టిలోనేగాక, విశ్వాసుల దృష్టిలో కూడా ఈవైఖరి చాలా హేయమైయినది, అనుచితమైనది. అలాగే దేవుడు అహంకారం, తలబిరుసుతనాలు గల ప్రతి దుర్మార్గుడి హృదయకవాటాలు మూసివేస్తాడు. (32-35)

ఫిరౌన్ (మరింత తలబిరుసుతో మాట్లాడుతూ) "హామాన్! నాకోసం ఒక ఎత్తయిన గోపురం కట్టించు. నేను (దానిమీదెక్కి) ఆకాశమార్గాలకు చేరుకొని అక్కడ మూసా ఆరాధించే దేవుడు ఉన్నాడో లేడో తొంగిచూస్తాను.[1] నాకైతే ఇతను పచ్చి అబద్ధాలకోరులా కన్పడుతున్నాడు" అని అన్నాడు.

ఈవిధంగా ఫిరౌన్‌కు అతని దుష్కార్యాలన్నీ మనోహరమయినవిగా చేయబడ్డాయి. అతడు సన్మార్గం అవలంబించకుండా నిరోధించబడ్డాడు. ఫిరౌన్ పన్నిన దుష్ట పన్నాగాలన్నీ (అతని) వినాశానికే దారితీశాయి. (36.37)

విశ్వసించిన వ్యక్తి ఇలా అన్నాడు: "నా జాతిప్రజలారా! నామాట వినండి. నేను మీకు సరయిన మార్గం చూపుతాను. సోదరులారా! ఈ ప్రాపంచిక జీవితం మూన్నాళ్ళ ముచ్చట మాత్రమే. (మన) శాశ్వతనివాసం పరలోకంలో ఉంది. దుష్కర్మలు చేసిన వారికి వారి దుష్కర్మల్ని బట్టే ప్రతిఫలం లభిస్తుంది. అలాగే స్త్రీలైనా, పురుషులైనా

1. వివరాలకు 28:38 సూక్తి, దాని పాదసూచిక చూడండి.



సత్యాన్ని విశ్వసించి సదాచార సంపన్నులయి ఉంటే స్వర్గంలో ప్రవేశిస్తారు. వారికక్కడ అపరిమితమైన ఉపాధి లభిస్తుంది." (38-40)

"సోదరులారా! ఏమిటీ, నేను మిమ్మల్ని సాఫల్యం వైపు పిలుస్తుంటే మీరు నన్ను నరకాగ్ని వైపు లాగుతున్నారు? దేవుణ్ణి తిరస్కరించి, నేనెరగని శక్తులను ఆయనకు సాటి కల్పించమని చెబుతున్నారా నాకు? నేను మటుకు సర్వ శక్తిమంతుడు, క్షమాశీలి అయిన దేవుని వైపు మిమ్మల్ని పిలుస్తున్నాను." (41,42)

"మీరు నన్ను (ఆరాధనకు ) ఏ దైవేతరశక్తుల వైపు పిలుస్తున్నారో వాటి (దైవత్వాని)కి ఇటు ప్రపంచంలోనూ, అటు పరలోకంలోనూ ఎలాంటి విలువలేదు. మనమంతా (చివరికి) దేవుని దగ్గరికే మరలిపోవలసి ఉంటుంది. అయితే హద్దుమీరి ప్రవర్తించేవారు మాత్రం నరకానికి పోతారు. ఈరోజు నేను చెప్పేదంతా మీరు గుర్తుచేసుకునే సమయం ఒకరోజు తప్పకుండా వస్తుంది. నేను మాత్రం నా వ్యవహారాన్ని దేవునికి అప్పగిస్తున్నాను. ఆయనే తన దాసులకు సంరక్షకుడు." (43,44)

చివరికి దేవుడు వారు పన్నిన కుట్రలు, కుయుక్తులను వమ్ముచేసి ఆ విశ్వాసిని కాపాడాడు. ఫిరౌన్ అనుయాయులే ఘోర విపత్తులో చిక్కుకొని సర్వనాశనమయ్యారు. (ఆనాటి నుండి) వారిని ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం నరకాగ్ని ముందు ప్రవేశపెట్టడం జరుగుతున్నది.[2] ప్రళయదినం వచ్చినప్పుడు "ఫిరౌన్ అనుయాయుల్ని తీవ్రమయిన (నరక) యాతనల్లో ప్రవేశింపజేయండి" అని ఆజ్ఞ అవుతుంది. (45,46)

తర్వాత వారు నరకంలో పరస్పరం వాదించుకుంటారు. బలహీనులు తమ నాయకులతో "మేము మీకు విధేయులై ఉండేవాళ్ళం కదా, ఇప్పుడు మమ్మల్నీ నరక బాధ నుండి మీరేమైనా కాపాడగలరా?" అని అడుగుతారు. దానికి నాయకులు "ఇక్కడ మనమంతా ఒకే స్థితిలో చిక్కుకొని ఉన్నాం. దేవుడు తన దాసుల్ని గురించి (అంతిమ) తీర్పిచ్చాడు. (ఇక దానికి తిరుగులేదు)" అంటారు. ఆ తర్వాత నరకంలో పడినవారు నరకపాలకులతో "మా శిక్షను ఒక్క రోజైనా తగ్గించమని మీ ప్రభువును ప్రార్థించండి" అంటారు. (47-49)

దానికి నరకపాలకులు "మీ దగ్గరకు మీ ప్రవక్తలు నిదర్శనాలు తీసుకొని రాలేదా?" అని అడుగుతారు. వారు "వచ్చార"ంటారు. "అయితే మీరే మొరపెట్టుకోండి. అవిశ్వాసుల మొరలు నిరుపయోగమే అవుతాయి" అని చెబుతారు నరకపాలకులు.

2. మానవులు చనిపోయిన దగ్గర్నుంచి ప్రళయ బీభత్సం అనంతరం పునరుత్థాన దినం వరకు వారి ఆత్మలుండే స్థితిని "ఆలమె బర్జఖ్" (పితృలోకం) అంటారు. ఈ స్థితిలో పాపాత్ములకు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వారి చివరి గమ్యస్థానం నరకం చూపడం జరుగుతుంది. అలాగే పుణ్యాత్ములకు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వారి చివరి గమ్యస్థానం స్వర్గం చూపబడుతుంది. అదీగాక పరలోక తీర్పుదినం వరకు పాపాత్ములకు నరక శిక్షల కంటే కాస్త తేలికపాటి శిక్షలు కూడా ఉంటాయి. పుణ్యాత్ములకు స్వర్గసౌఖ్యాల కంటే కొంచెం తక్కువ స్థాయి సౌఖ్యాలు ప్రసాదించబడతాయి. (7:40, 8:51 సూక్తుల పాదసూచికలు కూడా చూడండి.)

గుర్తుంచుకోండి, మేము ప్రవక్తలను, విశ్వసించినవారిని ఇహలోక జీవితంలోనూ ఆదుకుంటాము; (పరలోక న్యాయస్థానంలో) సాక్షులు నిలబడే రోజున కూడా వారిని ఆదుకుంటాము. అప్పుడు దుర్మార్గులకు వారి క్షమాపణ ఏమాత్రం ఉపయోగపడదు. వారిపై అభిశాపం పడుతుంది. వారికి పరమ చెడ్డనివాసం లభిస్తుంది. (50-52)

చూడండి, మేము మూసాకు ఎలా మార్గదర్శనం చేశామో! ఇస్రాయీల్ సంతతి వారిని మేము (తౌరాత్) గ్రంథానికి వారసులుగా చేశాము. అందులో విజ్ఞతా వివేచనలు కలవారి కోసం హితోపదేశం, మార్గదర్శకత్వం ఉన్నాయి. (53,54)

కనుక ప్రవక్తా! సహనం వహించు. దేవుని వాగ్దానం నిజమైనది. (అది తప్పకుండా నెరవేరుతుంది.) నీ పొరపాట్లను గురించి క్షమాపణ కోరుకో. ఉదయం, సాయంత్రం నీ ప్రభువు (ఔన్నత్యాన్ని) స్తుతిస్తూ ఆయన (పవిత్ర నామాల)ను స్మరిస్తూ ఉండు. (55)

కొందరు తమ వద్దకు ఎలాంటి ప్రమాణం రాకపోయినా దేవుని సూక్తుల విషయంలో వితండవాదం చేస్తారు. వారి హృదయాల్లో తామేదో గొప్పవాళ్ళమన్న అహంకారం తిష్ఠవేసి ఉంది. కాని తాము విర్రవీగుతున్న ఆ గొప్పతనానికి వారు ఎన్నటికీ చేరుకోలేరు. కనుక నీవు (వారి దుష్టపన్నాగాల బారినుండి) దేవుని శరణువేడుకో. ఆయన సమస్తం చూస్తున్నాడు, వింటున్నాడు. (56)

మానవుల్ని సృష్టించడం కన్నా భూమ్యాకాశాల్ని సృష్టించడమే గొప్పకార్యం. కాని చాలా మందికి వాస్తవం తెలియదు. గుడ్డివాడు, కళ్ళున్నవాడు సమానులు కారు. అలాగే సత్యాన్ని విశ్వసించిన సదాచారసంపన్నుడు, నీతి నడవడికలు లేని దుర్జనుడు కూడా సమానం కారు. కాని (విషయాన్ని) మీరు బహుతక్కువ గ్రహిస్తారు. ప్రళయం తప్ప కుండా వస్తుంది. కాని చాలామంది దీన్ని నమ్మలేకపోతున్నారు. (57-59)

మీ ప్రభువు చెబుతున్నాడు: "నన్ను ప్రార్థించండి, నేను మీ ప్రార్థన స్వీకరిస్తాను.[3] అహంకారంతో నన్ను ఆరాధించడానికి అంగీకరించనివారు నీచులై నరకానికి పోతారు.

3. కష్టసుఖాలు, లాభనష్టాలు, కీడు మేళ్ళు అన్నీ సృష్టికర్త, విశ్వపాలకుడైన దేవుని చేతిలోనే ఉన్నాయి. ఆయనే సర్వేశ్వరుడు, అసాధారణ శక్తిసంపన్నుడు. ఆయన తన దాసుల మొరలను ఎలాంటి మధ్యవర్తులు లేకుండానే ప్రత్యక్షంగా వింటాడు; తాను తలచుకున్నవారికి సహాయం కూడా చేస్తాడు. కనుక మానవులు ఎట్టి పరిస్థితులు ఎదురైనా ఆయన్నే వేడుకోవాలి.

ఈ కార్యకారణ ప్రపంచంలోని సహజ వనరులు, సాధనసంపత్తులేవీ ఒక్కోసారి దాసుల కష్టాలు దూరంచేయలేవు, వారి అవసరాలు తీర్చలేవు. అప్పుడు దాసులు అసాధారణ శక్తిసంపన్నుడి (Super Natural Power)ని మొరపెట్టుకోవడానికి సిద్ధమవుతారు. ఆ అసాధారణ శక్తిసంపన్నుడు, సృష్టికర్త, సర్వేశ్వరుడయిన దేవుడే అని గుర్తించాలి. ఆయన్ని వదలి సృష్టితాలను వేడుకునేవారు ప్రపంచంలో తాత్కాలిక ప్రయోజనం పొందగలిగినా ఘోర పాపాని (షిర్క్)కి పాల్పడిన వారవుతారు. నిజమైన విశ్వాసం కలిగిన ముస్లింలు ఆయన్నే వేడుకుంటారు.

అయితే మొరపెట్టుకునేవారు తమ భౌతిక ప్రయత్నాలతో పాటు ఈ క్రింది విషయాలు కూడా గమనించాలి:



మీరు విశ్రాంతి తీసుకోవడానికి వీలుగా రాత్రివేళను సృజించినవాడు దేవుడే. (పనులు చేసుకోవడానికి వీలుగా) పగటిని ప్రకాశవంతంగా చేసినవాడు కూడా ఆయనే. నిస్సందేహంగా దేవుడు మానవుల పట్ల అమిత దయగలవాడు. కాని చాలామంది (ఆయనకు) కృతజ్ఞత చూపడం లేదు. (60,61)

(మీ శ్రేయస్సుకోసం ఇదంతా చేసిన) ఆ దేవుడే మీ ప్రభువు. ఆయన సర్వసృష్టికర్త. ఆయన తప్ప మరో ఆరాధ్యుడు లేడు. మరి మీరెలా పెడదారి పట్టిపోతున్నారు? అదే విధంగా దేవుని సూక్తులు నిరాకరిస్తున్న వారంతా పెడదారి పట్టిపోతున్నారు. (62,63)

ఆ దేవుడే మీకోసం భూమిని నివాసస్థలంగా, ఆకాశాన్ని పందిరిగా నిర్మించాడు. ఆయనే మీకు ఒక రూపాన్నిచ్చి ఎంతో అందంగా మలిచాడు. అంతేకాదు, ఆయన మీకు పరిశుద్ధ పదార్థాలను కూడా ఉపాధిగా ప్రసాదించాడు. (ఇలాంటి సృష్టికార్యాలన్నీ చేసిన) ఆ దేవుడే మీ ప్రభువు, పరమ శుభదాయకుడు, సర్వలోక ప్రభువు. ఆయన మాత్రమే స్వతఃసిద్ధ జీవుడు. ఆయనతప్ప మరో ఆరాధ్యుడు లేడు. (కనుక) మీరు మీ జీవన విధానాన్ని ఆయన కోసం ప్రత్యేకించి ఆయన్ని మాత్రమే ప్రార్థించండి. సకల విధాల స్తోత్రాలు ఆయనకే శోభిస్తాయి. (64,65)

వారికిలా చెప్పు: "మీరు దేవుణ్ణి వదలి ప్రార్థిస్తున్న దైవేతర శక్తుల్ని ఆరాధించవద్దని నన్ను వారించడం జరిగింది. నా ప్రభువు నుండి నా దగ్గరకు నిదర్శనాలు వచ్చాయి. నేను సర్వలోక ప్రభువుకే విధేయుడయి ఉండాలని నాకు ఆజ్ఞయింది." (66)

ఆయనే మిమ్మల్ని మట్టితో సృజించినవాడు. తర్వాత ఆయన మిమ్మల్ని వీర్య బిందువు ద్వారా తీసి, నెత్తుటి ముద్దగా చేసి, ఆపై శిశువుగా రూపొందించి పుట్టించాడు. ఆ తర్వాత మీరు పూర్తి శక్తిసామర్థ్యాలకు చేరుకునే వరకు మిమ్మల్ని పెంచుతున్నాడు. చివరికి మీరు వృద్ధాప్యంలోకి అడుగుపెట్టే వరకు వృద్ధిచేస్తున్నాడు. (అయితే) మీలో కొందరిని (యుక్త వయస్సుకు లేదా వృద్ధాప్యానికి చేరుకోక) ముందే వెనక్కి పిలిపించు

- ♦ "ఒక ముస్లిం పాపకార్యానికి లేదా బంధువుల పట్ల నిర్దయకు సంబంధించిన విషయం లో గాకుండా మరేదయినా విషయంలో దుఆ (వేడుకోలు) చేసినప్పుడు దేవుడు అతని దుఆను మూడు రూపాల్లో నుండి ఏదో ఒక రూపంలో స్వీకరిస్తాడు. అతని దుఆను ఈ ప్రపంచంలోనే స్వీకరిస్తాడు; లేదా అతనికి పరలోకంలో ప్రతిఫలం ఇవ్వడానికి దాన్ని భద్ర పరుస్తాడు; లేదా ఆ దుఆ లోని విషయానికి సమాన స్థాయిగల ఏదైనా ఆపదను అతని మీద పడకుండా నిరోధిస్తాడు." (ముస్నద్ అహ్మద్)
- ♦ "తన దుఆను దేవుడు తప్పకుండా స్వీకరిస్తాడన్న గట్టి నమ్మకంతో చేయాలి." (తిర్మిజి)
- ♦ "మనిషి తొందరపాటుతో 'నేను ఎంతగానో వేడుకున్నాను, చాలా సార్లు వేడుకున్నాను. కాని నా వేడుకోలు స్వీకరించబడే సూచనలు కానరావడం లేదు' అని చెప్పి అలసిపోయి వేడుకోవడం మానేస్తాడు. అలాంటి తొందరపాటు పనికిరాదు." (ముస్లిం)
- ♦ "మీలో ప్రతి వ్యక్తీ తన అవసరాల కోసం దేవుణ్ణి వేడుకోవాలి. చివరికి తన చెప్పువారు తెగిపోయినా (దానికోసం కూడా) దేవుణ్ణి వేడుకోవాలి." (తిర్మిజి)

కుంటున్నాడు. మీరు నిర్ణీత (మృత్యు) సమయానికి చేరుకునేందుకే ఇలా చేస్తున్నాడు. అదీగాక మీరు వాస్తవికతను (అంటే జీవిత పరమార్థాన్ని) గ్రహించడానిక్కూడా ఇలా చేస్తున్నాడు. (67)

ఆయనే మీజీవన్మరణాలకు కారకుడు. ఆయన ఏదైనా చేయదలచుకుంటే 'అయిపో' అని ఆజ్ఞాపిస్తే చాలు, మరుక్షణం అది రూపొంది ఉనికిలోకి వస్తుంది. (68)

దేవుని సూక్తుల విషయంలో వితండవాదం చేసేవారిని నీవు చూశావా? వారు ఎలాపెడదారి పట్టిపోతున్నారు? వారు ఈగ్రంథాన్ని, గతంలో మాప్రవక్తల ద్వారా పంపిన గ్రంథాలన్నిటినీ తిరస్కరిస్తున్నారు. త్వరలోనే వారికి (నిజం) తెలిసొస్తుంది. అప్పుడు వారి మెడలకు గుదిబండలు కట్టి, సంకెళ్ళతో బంధించి సలసల మరిగే నీటి దగ్గరకు ఈడ్చుకెళ్ళడం జరుగుతుంది. ఆ తర్వాత నరకాగ్నిలో విసరి వేయబడతారు. (69-72)

అప్పుడు వారిని (దైవదూతలు) "మీరు దేవునికి సాటి కల్పించిన దైవేతర శక్తులు ఇప్పుడేమయ్యారు?" అని అడుగుతారు. దానికి వారు "వారు మా నుండి కనుమరుగై పోయారు. అసలు మేము లోగడ ఏశక్తినీ ప్రార్థించలేదు" అని అంటారు. ఇలా దేవుడు అవిశ్వాసుల్ని దారి తప్పిస్తున్నాడు. (73,74)

"ఈ దుర్గతికి కారణం మీరు ప్రపంచంలో ధర్మవ్యతిరేక కార్యకలాపాల్లో (సదా) తలమునకలై ఉండేవారు. పైగా (అవేవో ఘనకార్యాలైనట్లు) విర్రవీగిపోయేవారు. ఇక వెళ్ళండి. నరకంలోకి పోయిపడండి. అక్కడే మీరు శాశ్వతంగా ఉంటారు. అది గర్వపోతుల కోసం నిర్ణయమైన పరమ చెడ్డ స్థానం" అని వారితో (దైవదూతలు) అంటారు.

కనుక (ప్రవక్తా!) సహనం వహించు. దేవుని వాగ్దానం పూర్తిగా సత్యమైనది. వారికి మేము భయపెడ్తున్న దుష్పరిణామాలలో ఏదైనా ఒకదాన్ని మేము నీ కళ్ళెదుటే వారికి (చవి) చూపినా, లేదా (దానికి ముందే) నీ జీవితం పరిసమాప్తమయినా, మొత్తంమీద వారు మా దగ్గరికే తిరిగిరావలసి ఉంటుంది. (75-77)

నీకు పూర్వం మేము అనేకమంది ప్రవక్తలను పంపాము. వారిలో కొందరి స్థితిగతుల్ని నీకు తెలిపాం. మరికొందరి స్థితిగతుల్ని తెలుపలేదు. దేవుని అనుమతి లేకుండా ఏ ప్రవక్తా తనంతటతాను ఏ నిదర్శనాన్నీ (మహిమనూ) తీసుకురాలేడు. అయితే దేవుని ఆజ్ఞ వచ్చి న్యాయంగా తీర్పు జరిగినప్పుడు అధర్మపరులు నష్టపోతారు. (78)

దేవుడే మీకోసం పశువుల్ని సృష్టించాడు. వాటిలో కొన్నిటిపై మీరు స్వారీ చేస్తారు; మరికొన్నిటిని (కోసి మాంసం) తింటారు. వాటివల్ల మీకు ఇంకా అనేక ప్రయోజనాలు ఉన్నాయి. మీరు ఎక్కడికి పోవాలనుకుంటే అక్కడికి చేరుకోవడానికి అవి మీకు ప్రయాణసాధనాలుగా కూడా ఉపయోగపడుతున్నాయి. వాటిపై, ఓడలపై కూడా మీరు ఎక్కి ప్రయాణం చేస్తారు. ఈవిధంగా దేవుడు మీకు తన నిదర్శనాలు చూపిస్తున్నాడు. అసలు మీరు ఆయన చూపిస్తున్న ఏ నిదర్శనాలు నిరాకరించగలరు? (79-81)



వారు ప్రపంచంలో తిరిగి చూడలేదా, వీరికి పూర్వం గతించినవారి పర్యవసానం ఏమయిందో? వీరికన్నా వారే బలవంతులు, వారే గొప్ప వైభవచిహ్నాలు వదలివెళ్ళారు. కాని వారు సంపాదించినది వారికి ఏవిధంగానూ ఉపయోగపడలేదు. (82)

గత జాతులవారి దగ్గరకు వారి ప్రవక్తలు సూక్తులు, సూచనలు తీసుకు వచ్చినప్పుడు వారు తమ దగ్గరున్న (స్వయంకృత) జ్ఞానంలో తలమునకలయి ఉన్నారు. చివరికి వారు తాము అపహాస్యం చేసిన విషయాల ఉచ్చులోనే పడిపోయారు. వారు తీరా మా శిక్ష చూసి "మేమిప్పుడు సాటిలేని ఏకేశ్వరుడ్ని విశ్వసించాము. (ఆయనకు) సాటి కల్పించిన మిథ్యా దైవాలన్నిటిని నిరాకరిస్తున్నాం" అని అరిచారు. కాని మా శిక్ష చూసిన తరువాత వారి విశ్వాసం వారికి ఏమాత్రం ఉపయోగపడ లేదు. ఇది దేవుని దాసుల్ని గురించి అనాదిగా వస్తున్న దైవసంప్రదాయం. (దాని ప్రకారమే ఆ) సత్య తిరస్కారులు సర్వనాశనమయి పోయారు. (83-85) ✪

అవతరణ: మక్కా

# 41. హామీమ్

సూక్తులు: 54

ఈ అధ్యాయం ప్రారంభంలోని తొలి రెండు బీజాక్షరాలనే దీనికి మకుటంగా పెట్టారు. ఇది నబవీ శకం ఆరవ యేటలో అవతరించింది. మక్కా బహుదైవారాధకులు ఇస్లాం సందేశాన్ని అడ్డుకోవడానికి రకరకాలుగా ఎంత దుష్ప్రచారం సాగిస్తున్నప్పటికీ వారిలో అనేక మంది ఇస్లాం స్వీకరిస్తున్నారు. చివరికి దైవప్రవక్త పినతండ్రి, ప్రముఖ మల్లయోధుడయిన హజ్రత్ హమ్జా (రజి) కూడా ఇస్లాం స్వీకరించారు.

దాంతో ఖురైష్ నాయకులు మరింత ఆందోళన చెందుతూ సమస్యను గురించి చర్చించడానికి ఓరోజు కాబాగృహంలో అత్యవసర సమావేశం జరుపుకున్నారు. వేడి వేడి చర్చలు జరిగాయి. ఆ సమయంలో దైవప్రవక్త (సల్లం) కూడా కాబాగృహంలోనే ఓ మూలన ఒంటరిగా కూర్చున్నారు. అప్పుడా సమావేశంలో ఉత్బా బిన్ రబియా అనే నాయకుడు మాట్లాడుతూ "మీరు ఒప్పుకుంటే నేను ముహమ్మద్ (సల్లం)తో మాట్లాడి, అతని ముందు కొన్ని ప్రతిపాదనలు పెడతాను. వాటిలో ఒక దాన్నయినా అతను ఒప్పుకోవచ్చు. ఇలా అతను మనల్ని వ్యతిరేకించడాన్ని మానుకుంటాడు" అని అన్నాడు. ఈ మాటలతో అందరూ ఏకీభవించారు.

ఉత్బా మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) దగ్గరకి వెళ్ళి ఇలా అన్నాడు:

"బాబూ! నీవు మన జాతిలో కులగోత్రాల రీత్యా ఎలాంటి స్థానం కలవాడివో నీకు తెలుసు. నీ పట్ల మాకున్న గౌరవాభిమానాలు కూడా నీకు తెలుసు. కాని నువ్వేమో మన జాతి ప్రజలపై పెద్ద ఆపద తెచ్చిపెట్టావు. సంఘంలో చీలికలు తెచ్చి గందరగోళం సృష్టించావు. ప్రజలందర్నీ తెలివిహీనుల క్రింద జమకట్టావు. జాతి ధర్మాన్ని మంటకలిపి, మన దేవతల్ని విమర్శిస్తున్నావు. మన తాతముత్తాతలంతా అవిశ్వాసులన్నట్లు మాట్లాడుతున్నావు. కాస్త నామాట విను. నేను నీముందు కొన్ని విషయాలు ఉంచుతున్నాను. వాటిలో ఒకదాన్ని నీవు అంగీకరించవచ్చు."

అప్పుడు దైవప్రవక్త (సల్లం) "సరే చెప్పండి ఏమిటో వింటాను" అన్నారు.

“నీవు ప్రారంభించిన ఈ పని వెనుకున్న లక్ష్యం ధనసంపాదన మాత్రమే అయితే, మేమంతా కలసి నీవు మా అందరిలోకెల్లా గొప్ప శ్రీమంతుడయ్యేఅంత ధనం సేకరించి ఇస్తాం. ఒకవేళ నీవు నాయకత్వం, పెద్దరికాలు కోరుతుంటే మేము నిన్ను మాపై నాయకుడిగా చేసుకుంటాం. ఏ విషయంలోనూ నీ సలహా లేనిదే మేము నిర్ణయం తీసుకోము. లేదా నీవు రాజు కాదలచుకుంటే మేము నిన్ను మా అందరికీ రాజుగా చేసుకుంటాము. ఒకవేళ నీకేదైనా భూతపిశాచాలు పట్టి బాధపడుతూ, వాటిని నీవు వదలగొట్టుకోలేని పరిస్థితిలో ఉంటే, మేము పేరు మోసిన భూతవైద్యుల్ని రప్పించి మా సొంతఖర్చుతో నీకు నయం చేయిస్తాము” అన్నాడు ఉత్బా.

దైవప్రవక్త (సల్లం) అతని మాటలు పూర్తిగా విని “మీరు చెప్పదలచుకున్నది పూర్తిగా చెప్పినట్లేనా?” అని అడిగారు.

దానికి ఉత్బా “ఆ.. నేను పూర్తిగా చెప్పేశాను” అన్నాడు.

“అయితే ఇక నేను చెప్పేది కూడా కాస్త వినండి” అంటూ దైవప్రవక్త (సల్లం) ఈ అధ్యాయాన్నే పఠించడం ప్రారంభించారు.

ఉత్బా రెండు చేతులు వెనకవైపు నేలకు ఆనిచ్చి జాగ్రత్తగా వినసాగాడు. ఆ సూరా పఠిస్తున్నప్పుడు కొన్ని చోట్ల విని హడలిపోయాడు. దైవప్రవక్త (సల్లం) 38వ సూక్తి వరకు పఠించి సాష్టాంగప్రణామం (సజ్దా) చేశారు. ఆ తరువాత ఆయన ఇలా అన్నారు:

“అబుల్ వలీద్! నా సమాధానం విన్నారుగా. ఇక మీ ఇష్టం, మీరేం చేయాలో నిర్ణయించు కోండి.”

ఉత్బా మారుమాట్లాడకుండా అక్కడ్నుంచి లేచి ఖురైషీయుల సమావేశానికి తిరిగొచ్చాడు. ఖురైషీయులు అతని వాలకం చూసి అనుమానిస్తూ “ఏమయింది, ఏమన్నాడతను?” అని అడిగారు. అప్పుడు ఉత్బా ఇలా అన్నాడు:

“నేను ఇంతకు ముందెన్నడూ విననటువంటి అద్భుతవాణి విన్నాను. దైవసాక్షి! ఇవి కవితా పలుకులు కానేకావు. మంత్రతంత్రాలు అంతకన్నా కావు. జాతకం, జోతిష్యాలకు సంబంధించిన మాటలు కూడా కావు. ఖురైష్ పెద్దలారా! నామాట విని అతని మానాన అతడ్ని వదలి పెట్టండి. ఈ వాణి తప్పకుండా తన ప్రభావాన్ని చూపుతుంది. ఒకవేళ అరబ్బులు అతనిపై ఆధిక్యత పొందారనుకోండి, అప్పుడు మీకు మీ సోదరుని మీద చేయిచేసుకునే పని తప్పుతుంది. ఇతరులే అతని పని పడ్తారు. అలాకాకుండా అతనే అరబ్బులమీద విజయం సాధిస్తే అతని రాచరికం మీ రాచరికం అవుతుంది. అతని గౌరవం మీ గౌరవం అవుతుంది.”

ఖురైష్ నాయకులు ఈ మాటలు విని “చివరికి అతని చేతబడి నీమీద కూడా పారిందన్న మాట” అన్నారు. దానికి ఉత్బా “నా అభిప్రాయం మీకు తెలియజేశాను. ఇక మీ ఇష్టం, ఏదైనా చేసుకోండి” అన్నాడు.

ఈ అధ్యాయంలో మక్కా బహుదైవారాధకులకు నయాన, భయాన నచ్చజెప్ప డానికే ఎక్కువ ప్రయత్నం జరిగింది.



## కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

హామీమ్. ఇది కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని నుండి అవతరించిన దివ్యావిష్కృతి. విషయాలను స్పష్టంగా విడమరచి చెప్పే సూక్తులుగల గ్రంథం. (ఇంగిత)జ్ఞానం కలవారి కోసం వచ్చింది. ఇది అరబీభాషలో ప్రోక్తమయిన ఖుర్ఆన్ (పాఠ్యగ్రంథం). (స్వర్గ) శుభవార్త అందజేసే, (దుష్పర్యవసానం గురించి) హెచ్చరించే మహోన్నత గ్రంథం ఇది.

కాని వారిలో చాలామంది దీనికి విముఖులయి పోతున్నారు. వినడానికి (కూడా) ముందుకు రావడంలేదు. పైగా “నీవు మమ్మల్ని ఏవిషయం వైపు పిలుస్తున్నావో దాని కోసం (మేము సిద్ధంగా లేము.) మా హృదయకవాటాలు మూసుకుపోయాయి; మా చెవులకు చెవుడొచ్చింది. మాకూ నీకూ మధ్య ఒక తెర అడ్డుపడింది. (అందువల్ల) నీవు నీ పనేదో చేసుకుపో, మేము మాపని చేసుకుపోతాం” అని అంటున్నారు. (1-5)

ప్రవక్తా! చెప్పు: “నేను మీలాంటి మానవుణ్ణే. కాకపోతే నాకు దివ్యావిష్కృతి (వహీ) ద్వారా మీ దేవుడు ఒక్కడేనని తెలియజేయబడుతోంది. కనుక మీరు ఆయన వైపుకే ఏకోన్ముఖులై (ఆయన్ని మాత్రమే ఆరాధిస్తూ) ఉండండి. ఆయన్నే క్షమాపణ కోరుకోండి. పరలోకాన్ని తిరస్కరించి జకాత్ నెరవేర్చని బహుదైవారాధకులకు వినాశం (రాసిపెట్టి) ఉంది. దీనికి భిన్నంగా సత్యాన్ని విశ్వసించి సదాచార సంపన్నులైనవారికి ఎన్నటికీ తరగని గొప్ప ప్రతిఫలం లభిస్తుంది.” (6-8)

ప్రవక్తా! వారికీ సంగతి కూడా చెప్పు: “కేవలం రెండు రోజుల్లో భూమిని సృష్టించిన దేవుడ్ని మీరు తిరస్కరిస్తున్నారా? ఆయనకు ఇతరులను సాటి కల్పిస్తున్నారా? సకల లోకాలకు ఆయనే కదా ప్రభువు! ఆయనే భూమి (దొర్లిపోకుండా దాని) మీద పర్వతాలు పాతిపెట్టాడు. అందులో అనేక శుభాలు ఉంచాడు. అంతేకాదు, ఆహారం అర్థించే సమస్త ప్రాణికోటికి అవసరమైన మేరకు లెక్క ప్రకారం దానిపై ఆహారసామగ్రి కూడా ఏర్పాటు చేశాడు.[1] ఈ పనులన్నీ నాలుగు రోజుల్లో పూర్తయ్యాయి. (9,10)

తిరిగి దేవుడు ఆకాశం వైపు దృష్టి సారించాడు. అప్పుడు ఆకాశం పూర్తిగా పొగ రూపంలో ఉండేది. ఆయన భూమ్యాకాశాల్ని ఉద్దేశించి “మీకు ఇష్టమున్నా లేకపోయినా ఉనికిలోకి రండి” అన్నాడు. దానికి అవి “మేము వినమ్రులై వచ్చేశాం” అన్నాయి. (11)

---

1. అనాది నుండి అంతిమదినం వరకు పుట్టే సమస్త ప్రాణికోటికి సరిపడ ఆహార సామగ్రిని దేవుడు ప్రపంచంలో ఏర్పాటు చేశాడు. అయితే ఈ ఆహారం అవసరమయిన మేరకు అందాలంటే దేవుడు నిర్దేశించిన జీవన విధానం ప్రకారం ఆర్థిక విభజన ప్రక్రియ న్యాయంగా, నిష్పక్షపాతంగా నిరంతరం జరుగుతుండాలి. కాని స్వార్థమే పరమార్థంగా భావించిన నేటి మానవుడు దేవుడు నిర్ణయించిన సత్యధర్మాన్ని, ఆర్థిక న్యాయాన్ని త్రోసిపుచ్చి అన్యాయం, అక్రమం, దగా, దోపిడీ, హింసా దౌర్జన్యాలతో కొన్ని వర్గాలకు కృత్రిమ కొరత సృష్టిస్తున్నాడు. ఆ విధంగా కూడబెట్టిన ఆర్థిక ఒనరుల్ని ఎరగా చూపుతూ దేవుని దాసుల్ని తన దాసులుగా చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. (ఇతర వివరాలకు 17:31 సూక్తి, దాని పాదసూచిక, 6:140 సూక్తి చూడండి.)

అప్పుడు ఆయన రెండు రోజుల్లో ఏడు ఆకాశాలు నిర్మించాడు. ప్రతి ఆకాశానికి తత్సంబంధిత నియమావళి నిర్దేశించాడు. భూలోక సమీపంలోని ఆకాశాన్ని మేము (నక్షత్ర) దీపాలతో అలంకరించాము. దాన్ని అన్ని విధాలా సురక్షితంగా ఉంచాము.[2] ఇదంతా మహా శక్తిమంతుడు, అపార వివేకవంతుడయిన దేవుడు రూపొందించిన పథకం. (12)

అయినా వీరు (ఆయన శక్తిసామర్థ్యాలను ఖాతరు చేయకుండా) ముఖం తిప్పుకుంటే వారికిలా చెప్పు: "(పూర్వం) ఆద్, సమూద్ జాతులపై హఠాత్తుగా (దైవ)శిక్ష విరుచుపడింది. అలాంటి హఠాత్ శిక్ష గురించి నేను మిమ్మల్ని హెచ్చరిస్తున్నాను. వారి దగ్గరకు దైవప్రవక్తలు ముందూ వెనుకా నలువైపుల నుంచి వచ్చి 'దేవుడ్ని తప్ప మరెవరినీ ఆరాధించకండి' అని (పరిపరివిధాల) బోధించారు. కాని వారు (తిరస్కార భావంతో) 'మా ప్రభువు పంపాలనుకుంటే (ఈ పనికోసం) దైవదూతల్ని పంపేవాడు. కనుక నీవు తెచ్చిన విషయాన్ని మేము నమ్మము' అని అన్నారు." (13,14)

ఆద్ (జాతినాయకులు) న్యాయం, ధర్మం ఏదీలేకుండా దేశంలో పెద్ద మొనగాళ్ళయి పోయారు. పైగా (అహంకారంతో) "మాకంటే బలవంతులెవరున్నారు?" అని పలకసాగారు. వారిని సృష్టించిన దేవుడు వారికంటే బలాఢ్యుడన్న సంగతి వారికి

2. మొదట పొగరూపంలో ఉన్న విశ్వం గ్రహాలుగా, నక్షత్రాలుగా, ఇతర మరెన్నో రోదసీ వస్తువులుగా మారడానికి రెండురోజులు పట్టింది. ఈ రెండురోజుల నిర్మాణప్రక్రియలో భూమి కూడా చేరిఉంది. ఆ తర్వాత భూమిపై (మరికొన్ని ఇతర గ్రహాలపై కూడా) నీరు, గాలి, వృక్షజాతి, జీవరాసి వగైరా ఏర్పడటానికి మరో నాలుగు రోజులు పట్టింది. ఇక్కడ 9,10 సూక్తులలో దేవుడు భూమండల నిర్మాణానికి రెండురోజులు పట్టిందని, దానిపై ఆహారం తదితర ఏర్పాట్లు జరగడానికి నాలుగు రోజులు పట్టిందని తెలియజేస్తున్నాడు. ఈవిధంగా భూమి జీవరాసికి నివాసయోగ్యం కావడానికి మొత్తం ఆరుదినాలు పట్టింది. ఈ ఆరుదినాలలోనే మొత్తం విశ్వవ్యవస్థ ఏర్పడింది.

11,12 సూక్తులలో దేవుడు విశ్వనిర్మాణానికి ముందున్న పరిస్థితిని ప్రస్తావిస్తూ, అప్పుడు ఈ విశ్వం పొగరూపంలో ఉండేదని అన్నాడు. నేటి వైజ్ఞానిక భాషలో దీన్ని నీహారిక (Nebula) అంటారు. కోట్ల సంవత్సరాల క్రితం ఒకచోట గుమిగూడి ఉన్న ఈ విశ్వపదార్థంలో పెద్దప్రేలుడు (బిగ్‌బ్యాంగ్) సంభవించి ముక్కలు ముక్కలైపోయిందని, అవి క్రమంగా విస్తరించి లక్షలాది సంవత్సరాల తర్వాత నేటి గ్రహాలుగా, నక్షత్రాలుగా రూపొందాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఖుర్‌ఆన్‌లో దేవుడు పొగరూపంలో ఉన్న భూమ్యాకాశాల్ని ఉద్దేశించి ఉనికిలోకి రండని ఆజ్ఞాపించాడు. ఆ తరువాత ఆయన రెండు రోజుల్లో ఏడు ఆకాశాలు నిర్మించాడు. ఇందులో భూమి కూడా చేరి ఉంది.

ఈవిధంగా దేవుడు భూమ్యాకాశాలను ఆరు దినాలలో సృష్టించాడని ఖుర్‌ఆన్ చెబుతోంది. ఈదినాలు మనం ప్రమాణంగా తీసుకునే దినాలు కానవసరంలేదు. ఖుర్‌ఆన్‌లో ఒకచోట ఒక రోజు మీరు లెక్కించే వెయ్యేండ్లకు సమానమని, మరోచోట ఒకరోజు యాభైవేల ఏండ్లకు సమానమని ఉంది. ఖుర్‌ఆన్ సైన్స్‌ని గురించి చెప్పే గ్రంథం కాదు. తన అవతరణ కాలంనాటి మానవులకు అర్థమయ్యేలా సంక్షిప్తంగా దేవుని అసాధారణ శక్తిసామర్థ్యాల ప్రస్తావనల ద్వారా ఆయన ఏకత్వాన్ని చాటిచెప్పే దైవగ్రంథం. ఆ దృష్టితోనే దాన్ని అధ్యయనం చేస్తే విషయం అర్థమవుతుంది.



కాస్తయినా తట్టలేదా? వారు మా సూక్తులు, సూచనలు తిరస్కరిస్తూనే పోయారు. చివరికి మేము ఓ దుర్దినాన వారి పైకి భయంకరమైన తుఫాన్‌ని పంపాము. ఇహలోకజీవితంలో వారికి అవమానకరమైన శిక్ష చవి చూపించడానికే ఇలా చేశాము. పరలోక శిక్ష ఇంతకంటే ఎంతో అవమానకరంగా ఉంటుంది. వారికక్కడ ఎవరూ సహాయం చేయరు. (15,16)

ఇక సమూద్‌జాతి గురించి, మేము వారి ముందు సన్మార్గం ఉంచాం. కాని వారు సన్మార్గం చూడటానికి బదులు అంధులై ఉండటానికే ఇష్టపడ్డారు. చివరికి వారి దుష్కర్మల కారణంగా వారిపై అవమానకరమైన శిక్ష వచ్చిపడింది. అయితే సత్యాన్ని విశ్వసించి భయభక్తులవైఖరి అవలంబించినవారిని మాత్రం మేము రక్షించాం. (17,18)

దైవవిరోధుల్ని నరకానికి తీసికెళ్ళేందుకు వారిని చుట్టుముట్టి తీసుకొచ్చే రోజు గురించి ఊహించు. అప్పుడు ముందొచ్చినవారిని వెనుక వచ్చినవారి దగ్గరికొచ్చేదాకా ఆపివేయడం జరుగుతుంది. అలాఅందరూ అక్కడికి చేరుకున్నాక వారి కళ్ళు, చెవులు, చర్మాలు వారు ప్రపంచంలో ఉన్నప్పుడు ఏమేమి చేసేవారో సాక్ష్యమిస్తాయి. (19,20)

అప్పుడు వారు తమ చర్మాలను ఉద్దేశించి "మీరు మాకు వ్యతిరేకంగా ఎందుకు సాక్ష్యమిస్తున్నారు?" అని అడుగుతారు. దానికవి ఇలా సమాధానమిస్తాయి: "ప్రతి వస్తువుకు మాట్లాడే శక్తినిచ్చిన దేవుడే మాకూ మాట్లాడే శక్తినిచ్చాడు. ఆయనే మిమ్మల్ని మొదటిసారి పుట్టించాడు. ఇప్పుడు ఆయన దగ్గరికే మీరు తీసుకురాబడ్డారు. మీరు రహస్యంగా నేరాలు చేస్తున్నప్పుడు, ఎప్పుడో ఓసారి మీ కళ్ళు, చెవులు, చర్మాలు కూడా మీకు వ్యతిరేకంగా సాక్ష్యమిస్తాయన్న ఆలోచనే మీకు కలగలేదు. పైపెచ్చు మీరు చేసే దుష్కార్యాలు అనేకం దేవునికి కూడా తెలియదని మీరు భావిస్తుండేవారు.[3] దేవుడ్ని గురించి మీలో ఏర్పడిన ఈ దుష్టభావనే మిమ్మల్ని (నట్టేట) ముంచింది. ఈ కారణంగానే మీరిప్పుడు నష్టపోయారు." (21-23)

ఇప్పుడు వారు సహనం వహించినా వహించకపోయినా నరకాగ్నే వారి నివాసస్థలం. వారు పశ్చాత్తాపంతో (సత్యం వైపు) మరలదలచినా ఆ అవకాశం వారికి ఇవ్వబడదు. మేము వారికి వెనకా ముందూ ప్రతి విషయాన్నీ ఆకర్షవంతంగా చేసి చూపే (పైశాచిక) నేస్తాలను వారిపై రుద్దాము. గత మానవులకు, జిన్నులకు ఎలాంటి (శిక్ష) నిర్ణయం వర్తించిందో వీరికీ అలాంటి నిర్ణయమే వర్తిస్తుంది. కనుక వారు తప్పకుండా నష్టపోతారు. (24,25)

3. ఇబ్నె మస్‌వూద్ (రజి) ప్రకారం కాబా దగ్గర ఇద్దరు ఖురైష్ తెగవాళ్ళు- ఒక సఖీఫ్ తెగ వ్యక్తి లేక ఇద్దరు సఖీఫ్ తెగవాళ్ళు, ఒక ఖురైష్ తెగవ్యక్తి గుమిగూడారు. వారి దేహాల్లో కొవ్వు బాగానే ఉంది. కాని వారి మస్తిష్కాలలో బుద్ధిజ్ఞానాలే తక్కువగా ఉన్నాయి. వారిలో ఒకడు "దేవుడు మన మాటలు వింటాడా? నీ అభిప్రాయం ఏమిటీ?" అని అడిగాడు. దానికి రెండోవాడు "మనం బిగ్గరగా మాట్లాడితే వింటాడు. మెల్లిగా మాట్లాడితే వినలేడు" అన్నాడు. మూడోవాడు తన అభిప్రాయం చెబుతూ బిగ్గరగా మాట్లాడేటప్పుడు వినగలిగితే, మెల్లిగా మాట్లాడేటప్పుడు కూడా వింటాడనుకుంటా" అన్నాడు. ఆ సందర్భంలో ఈసూక్తులు అవతరించాయి. (బుఖారి, ముస్లిం)

అవిశ్వాలు (మరింత పెట్రేగిపోతూ)“ఈ ఖుర్ఆన్‌ని (పఠిస్తున్నప్పుడు) వినకండి. అల్లరిచేయండి. ఇలాగైనా మీరు విజయం సాధిస్తారేమో చూడండి” అనంటారు. (26)

ఈ తిరస్కారుల్ని మేము కఠినంగా శిక్షిస్తాం. వారి కర్మలదుష్ఫలం వారికి తప్పకుండా చూపిస్తాము. దైవవిరోధులకు విధించే శిక్ష నరకం! అక్కడే వారికి శాశ్వతనివాసం ఉంటుంది. మా సూక్తులు నిరాకరించినవారికి అదే (తగిన) శిక్ష. వారక్కడ (అక్కసు వెళ్ళబుచ్చుకుంటూ) “ప్రభూ! మమ్మల్ని పెడదారి పట్టించిన మానవుల్ని, జిన్నుల్ని మాకు చూపించు. వారిని మేము కాళ్ళక్రింద పడేసి (కసితీరా) తొక్కి అవమానపరుస్తాం” అనంటారు. (27-29)

ఎవరు తమ ప్రభువు దేవుడేనని పలికి, ఆమాట మీదనే స్థిరంగా ఉంటారో వారి (సహాయం) కోసం దైవదూతలు తప్పకుండా అవతరిస్తారు. అప్పుడు వారికి ఇలా ధైర్యం చెబుతారు: “భయపడకండి. విచారపడకండి. స్వర్గప్రవేశం గురించి మీకు చేసిన వాగ్దానం గుర్తుచేసుకొని ఆనందించండి. మేము ఇహలోకంలోనూ మీకు తోడుగా ఉన్నాం, ఇప్పుడు పరలోకంలోనూ మీకు తోడుగా ఉంటున్నాం. ఇక్కడ మీరు కోరుకున్న వస్తువు లభిస్తుంది. మీరు కోరిందల్లా మీదే అవుతుంది. గొప్ప క్షమాశీలి, అమిత దయామయుడయిన దేవుని వైపున లభించనున్న ఆతిథ్యమిది.” (30-32)

దేవుని (సందేశం) వైపు (ప్రజలను) పిలిచి, సత్కార్యాలు చేసి, తాను దైవవిధేయుణ్ణని పలికినవాని మాటకంటే శ్రేష్ఠమైన మాట మరెవరిది అవుతుంది? (33)

పవక్తా! మంచీ చెడూ ఒకటి కాజాలవు. కనుక నీవు అత్యంత శ్రేష్ఠమైన ‘మంచి’ ద్వారా చెడును నిర్మూలించు. అప్పుడు నీ గర్భశత్రువు కూడా నీకు ప్రాణమిత్రుడయిపోవడం నీవు  చూస్తావు. ఈ సద్గుణం సహనశీలురకు తప్ప మరెవరికీ అబ్బదు. ఈ భాగ్యం అదృష్టవంతులకు తప్ప మరెవరికీ ప్రాప్తం కాదు. (34,35)

షైతాన్ నుండి నీకేదైనా దుష్టప్రేరణ కలిగినట్లు అన్పిస్తే (వెంటనే) నీవు దేవుని శరణు వేడుకో.[4] దేవుడు సమస్తం వింటున్నాడు. ఆయన సర్వం ఎరిగినవాడు. (36)

---

4. షైతాన్ ఎల్లప్పుడూ ఏదో వంకతో మానవుణ్ణి రెచ్చగొట్టి, కోపం తెప్పించి అతనిచేత ధర్మ వ్యతిరేక కార్యాలు చేయించడానికి ప్రయత్నిస్తాడు. అలాంటి పరిస్థితి ఎదురయితే వెంటనే ఆ దుష్టుడి కీడునుండి దైవాన్ని శరణుకోరుకోవాలని ఈ సూక్తిలో హెచ్చరించబడింది.

ఒకసారి దైవప్రవక్త (సల్లం) దగ్గర హజ్రత్ అబూబకర్ (రజి) కూర్చొని ఉంటే ఒకతను వచ్చి అబూబకర్ (రజి)ని అనవసరంగా దూషించడం ప్రారంభించాడు. హజ్రత్ అబూబకర్ (రజి) వెంటనే రెచ్చిపోకుండా మౌనం వహించి అతని దూషణలు వినసాగారు. దైవప్రవక్త (సల్లం) ఆయన్ను చూసి చిరునవ్వు చిందించసాగారు. కాని తర్వాత కాస్సేపటికి అబూబకర్ (రజి) అతని దూషణలు సహించలేక సమాధానంగా ఒక తీవ్రమైన మాటన్నారు. ఆయన నోట ఆ మాట వినగానే దైవప్రవక్త (సల్లం) ముఖారవిందం ముడుచుకుపోయింది. ఆయన తక్షణమే లేచి అక్కడ్నుంచి వెళ్ళిపోయారు.

అబూబకర్ (రజి) కూడా లేచి ఆయన వెనకాలే నడిచారు. దారిలో ఆయన దైవప్రవక్త (సల్లం)తో మాట్లాడుతూ “(ఏమిటీ మీధోరణి) చాలా విచిత్రంగా ఉందే! ఆ వ్యక్తి నన్ను తిడుతున్నంత



రాత్రి, పగలు, సూర్యుడు, చంద్రుడు (వగైరా ప్రకృతి శక్తులన్నీ) దేవుని (ఏకత్వానికి, ఆయన శక్తిసామర్థ్యాలకు) నిదర్శనాలే. (కనుక) సూర్యచంద్రులకు సాష్టాంగపడకండి. మీరు నిజంగా దేవుణ్ణి ఆరాధించేవారైతే, వాటిని సృష్టించిన దేవునికే సాష్టాంగపడండి. (37)

ప్రవక్తా! వీరు గనక తలబిరుసుతో మొండిగా వ్యవహరిస్తే వ్యవహరించనీ. (నీ ప్రభువు దైవత్వానికి వచ్చే లోటేమీలేదు.) నీప్రభువు సన్నిధిలో వున్న దైవదూతలు రేయింబవళ్ళు ఆయన్ని స్మరిస్తూనే ఉన్నారు. వారా స్మరణలో ఎన్నటికీ అలసిపోరు. (38)

భూమి నిర్జీవంగా పడివుండటం నీకు కన్పిస్తుంది. అయితే మేము ఆతర్వాత వర్షం కురిపించగానే అది ఒక్కసారిగా (వృక్షజాతిని తీసుకొని) పైకి ఉబికివస్తుంది. ఇది కూడా దేవుని సూచనే. మృతభూమికి జీవంపోసి లేపేవాడు మృతమానవుల్ని కూడా బ్రతికించి లేపగలడు. నిస్సందేహంగా ఆయనకు అణువణువుపై అధికారం ఉంది. (39)

మా సూక్తులకు పెడర్థాలు తీసేవారు మాకు కనపడకుండా ఎక్కడా దాక్కొని ఉండలేరు. (సమయం వచ్చినప్పుడు వారికి తప్పక తగినశాస్తి జరుగుతుంది.) నరకాగ్నిలో విసరబడేవాడు శ్రేష్ఠుడా లేక ప్రళయదినాన ప్రశాంత స్థితిలో ఉండేవాడు శ్రేష్ఠుడా? మీరే ఆలోచించండి. సరే, మీరు చేయదలచుకున్నదేదో చేస్తూ ఉండండి. (కాని ఒక్క విషయం గుర్తుంచుకోండి,) మీ చేష్టలన్నిటినీ దేవుడు ఓకంట గమనిస్తూనే ఉన్నాడు.

వీరే తమ దగ్గరికి హితబోధ వచ్చినప్పుడు దాన్ని తిరస్కరించినవారు. కాని ఇదొక శక్తిమంతమైన గ్రంథం. దుష్టశక్తులు దానిపై ముందునుంచీ దాడి చేయలేవు; వెనుక నుంచీ దాడి చేయలేవు. ఇది మహా వివేకవంతుడు, స్వతహాగా ప్రశంసనీయుడయిన దేవుని నుండి అవతరించిన (అద్భుత)వాణి. (40-42)

ప్రవక్తా! నీ గురించి అనబడుతున్న మాటలు ఈనాడు కొత్తేమీ కాదు. నీకు పూర్వం ప్రభవించిన ప్రవక్తలకు కూడా ఈ మాటలు అన్నారు. (అయినా) నీ ప్రభువు గొప్ప క్షమాశీలి. (అయితే దాంతోపాటు) ఆయన కఠినంగా దండించేవాడు కూడా. (43)

ఒకవేళ మేమీ గ్రంథాన్ని అరబ్బేతర ఖుర్ఆన్‌గా చేసివుంటే, వారు (విమర్శిస్తూ) “దాని సూక్తుల్ని (మాకు తెలిసిన భాషలో) ఎందుకు విడమరచి చెప్పలేదు? ఇదేమి చోద్యమో! సంబోధితులు అరబ్బులైతే, ఈగ్రంథం అరబ్బేతర భాషలోనా!?” అంటారు. చెప్పు: ఈ ఖుర్ఆన్ విశ్వసించేవారికి మార్గదర్శిని, స్వస్థతప్రదాయిని. అయితే విశ్వసించడానికి ముందుకు రానివారి కోసం మాత్రం ఇది చెవుల్లో దూర్చిన దూది, కళ్ళకు కట్టిన గంతలాంటిది. వారి పరిస్థితి వారిని చాలా దూరం నుంచి పిలుస్తున్నట్లుంది. (44)

---

సేపు మీరు మౌనం వహించి చిరునవ్వు నవ్వుతుండేవారు. కాని తరువాత నేను అతని దూషణకు జవాబివ్వగానే మీకు కోపం వచ్చేసింది” అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) “నువ్వు మౌనంగా ఉన్నంతసేపు ఒక దైవదూత నీ దగ్గర నిలబడి నీ తరపున అతని దూషణలకు జవాబిచ్చాడు. కాని నీవు మాట్లాడటం మొదలెట్టగానే ఆ దూత అదృశ్యమై అతని స్థానంలో షైతాన్ ప్రత్యక్షమయ్యాడు. మరి నేను షైతాన్‌తో కలసి కూర్చోలేనుగా?” అన్నారు. (ముస్నద్ అహ్మద్)

ఇంతకు పూర్వం మేము మూసాకు (తౌరాత్) గ్రంథం ప్రసాదించాము. దాని విషయంలో కూడా ఇలాంటి విభేదమే వచ్చింది. నీ ప్రభువు గనక ముందే ఒకమాట నిర్ణయించి ఉండకపోతే ఇలా విభేదించేవారి గురించి (ఎప్పుడో) తీర్పు జరిగిఉండేది. వీరసలు దీన్ని గురించి తీవ్రమైన సందిగ్ధం, సందేహాలలో పడిపోయారు. (45)

ఎవరు సత్కార్యం చేస్తే అతను తన శ్రేయస్సు కోసమే చేసుకుంటాడు. అలాగే ఎవరు దుష్కార్యానికి పాల్పడితే దాని కీడు అతని పైన్నే వచ్చిపడుతుంది. నీ ప్రభువు మాత్రం తన దాసులకు ఎలాంటి అన్యాయం చేయడు. (46)

ప్రళయఘడియ గురించి దేవునికి మాత్రమే తెలుసు. తొడిమల నుండి పైకొచ్చే పండ్లను గురించి, గర్భందాల్చే తల్లి, ఆమె కనే పిల్లల్ని గురించి కూడా ఆయనకే తెలుసు. ఆయన వారిని (ప్రళయదినాన) ఎలుగెత్తి పిలిచి "(మీరు పూజించిన) నా భాగస్వాములు ఏమయ్యారు?" అని ప్రశ్నిస్తాడు. దానికి వారు "మాలో ఎవరికీ వారి ఉనికిని గురించే తెలియదని విన్నవించుకుంటున్నాం" అనంటారు. వారు గతంలో పూజించిన మిధ్యాదైవాలన్నీ ఆరోజు వారి నుండి కనుమరుగైపోతాయి. దాంతో వారు (నిస్పృహతో) తమకిక ఎక్కడా రక్షణ లభించదని భావిస్తారు. (47,48)

మానవుడు తన (ఐహిక) శ్రేయస్సు కోసం ఎంత వేడుకున్నా అలసిపోడు. కాని ఎప్పుడైనా కాస్త కష్టం వస్తే చాలు, వెంటనే నిరాశతో క్రుంగిపోతాడు. అయితే మేమతడ్ని ఆ కష్టం నుండి గట్టెక్కించి మా కారుణ్యాన్ని చవిచూపించగానే (మేము చేసిన మేలు మరచి) "నేనిందుకు అర్హుడ్ని. (నా శక్తిసామర్థ్యాలవల్లనే నాకిది లభించింది) ప్రళయ దినం ఒకటుందని, అది తప్పకుండా వస్తుందని నేను భావించడంలేదు. ఒకవేళ నన్ను నిజంగానే నా ప్రభువు దగ్గరకు తీసికెళ్ళడం జరిగితే అక్కడా నాకు సుఖాలే లభిస్తాయి" అని అంటాడు. కాని మేము సత్యాన్ని తిరస్కరించినవారికి (గతంలో) వారు ఏమేమి చేసివచ్చారో తెలిపి, ఆ తర్వాత పరమ జుగుప్సాకరమైన (నరక)యాతనలు చవి చూపిస్తాం. (49,50)

మానవునికి మేమేదైనా అనుగ్రహిస్తే అతను మాకు విముఖుడయి పోతాడు. పైగా అహంకారంతో విర్రవీగుతాడు. కాని అదే కష్టమొచ్చినప్పుడు సుదీర్ఘప్రార్థనలు చేస్తాడు.

ప్రవక్తా! వారికిలా చెప్పు: "ఒకవేళ ఈఖుర్‌ఆన్ నిజంగా దైవవాణే అయితే, దీన్ని మీరు (ఇలాగే) నిరాకరిస్తుంటే, కాస్త మీరే ఆలోచించండి... దీన్ని నిరాకరించడంలో బహుదూరం పోయినవాడి కంటే పరమ దుర్మార్గుడు మరెవరుంటారు? (51,52)

త్వరలోనే వారికి మా నిదర్శనాలు దిఙ్మండలాల్లోనూ చూపిస్తాం; వారి (దేహనిర్మాణం)లోనూ చూపిస్తాం. చివరికి ఈ ఖుర్‌ఆన్ నిజంగా సత్యవాణి అనే విషయం వారి ముందు బట్టబయలౌతుంది. నీప్రభువు ప్రతిదానికీ సాక్షిగా ఉన్నాడన్న సంగతి చాలదా? చూడు, వీరు తమ ప్రభువును కలుసుకోవలసి ఉంటుందన్న విషయాన్ని ఎలా నమ్మలేకపోతున్నారో! వినండి, ఆయన ప్రతి వస్తువుని పరివేష్టించి ఉన్నాడు. (53,54) ✪



# 42. సలహా సంప్రదింపులు (షూరా)

**అవతరణ: మక్కా** **సూక్తులు:53**

ఈ అధ్యాయాన్ని "షూరా" (సలహా సంప్రదింపులు) అంటారు. ఇందులోని విషయాలు గమనిస్తే ఇవి హామీమ్ (41వ) అధ్యాయం తరువాత నబవీ శకం 6 లేక 7వ యేట అవతరించి ఉండవచ్చని తెలుస్తుంది. ఇందులో దైవసందేశం పట్ల మక్కా బహుదైవారాధకులు వెలిబుచ్చిన అనుమానాలు, ఆశ్చర్యాలు, అభ్యంతరాలు, వాటికి సమాధానాలు పేర్కొనబడ్డాయి. మధ్య మధ్యలో సత్యతిరస్కార పర్యవసానాన్ని గురించి హెచ్చరించడం జరిగింది.

### కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

హా-మీమ్, ఐన్-సీన్- ఖాఫ్. మహా శక్తిమంతుడు, అపార వివేకవంతుడయిన దేవుడు గత ప్రవక్తల దగ్గరకు ఏవిధంగా దివ్యావిష్కృతి పంపుతుండేవాడో అదేవిధంగా ఇప్పుడు నీ దగ్గరకు కూడా దివ్యావిష్కృతి పంపుతున్నాడు. భూమ్యాకాశాల్లో ఉన్న సమస్తం ఆయనదే. ఆయన సర్వాధికుడు, సర్వోన్నతుడు. (1-4)

(దేవుని ఔన్నత్యం, పవిత్రతలను కించపరిచే చేష్టల వల్ల) పైనుండి ఆకాశం బద్దలై పడిపోవచ్చు. దైవదూతలు తమ ప్రభువుని స్తుతిస్తూ ఆయన్ని స్మరిస్తున్నారు. అదీగాక భూలోక వాసుల పాపాలు క్షమించమని కూడా మనవిచేస్తున్నారు. వినండి, దేవుడే గొప్ప క్షమాశీలి, అమిత దయామయుడు. తనను వదలి ఇతరుల్ని సంరక్షకులుగా చేసుకున్నవారిని ఆయన ఓకంట కనిపెడ్తూనే ఉన్నాడు. నీవు వారి (తిరస్కారవైఖరి)కి బాధ్యుడవు కావు. (5,6)

అలాగే మక్కావారిని, దాని చుట్టుప్రక్కల ప్రాంతాలవారిని (సత్యతిరస్కార పర్యవసానం గురించి) హెచ్చరించేందుకు మేమీ ఖుర్‌ఆన్‌ని అరబీ భాషలో నీ దగ్గరకు పంపాం. (మానవులంతా) సమావేశమయ్యే రోజు (సంభవించే భయంకర పరిణామాల్ని) గురించి హెచ్చరించు. ఆరోజు తప్పకుండా వస్తుంది. అందులో ఎలాంటి సందేహం లేదు. అప్పుడు ఒక వర్గం స్వర్గానికి, మరొక వర్గం నరకానికి పోవలసి ఉంటుంది. (7)

దేవుడు తలచుకుంటే వీరందర్నీ ఒకే సమాజంగా చేయగలడు. కాని ఆయన తానుకోరిన వారిని తన కారుణ్యఛాయలోకి తీసుకుంటాడు. దుర్మార్గులకు మాత్రం ఏ సహాయకుడూ, సంరక్షకుడూ ఉండడు. వారు దేవుడ్ని వదలి ఇతరుల్ని సంరక్షకులుగా చేసుకున్నారా? నిజానికి అసలు సంరక్షకుడు దేవుడే. ఆయనే మృతుల్ని తిరిగి బ్రతికించే వాడు. ఆయన ప్రతిపనీ చేయగల సమర్థుడు, సర్వశక్తిమంతుడు. (8,9)

(ప్రవక్తా! చెప్పు:) "మీమధ్య ఏ విషయంలో విభేదమొచ్చినా దాన్ని పరిష్కరించే పని దేవునిదే. ఆయనే నా ప్రభువు. ఆయన్నే నేను నమ్ముకున్నాను. (ఏ సమస్య వచ్చినా) నేను ఆయన (హితవుల) వైపుకే మరలుతాను." (10)

ఆయన భూమ్యాకాశాలకు సృష్టికర్త. ఆయనే మీజాతి నుండి మీకుతోడుగా జంటల్ని పుట్టించాడు. అలాగే జంతువుల్లో కూడా జంటల్ని పుట్టించాడు. ఈవిధంగా

ఆయన ప్రాణికోటి సంతతిని విస్తరింపజేస్తున్నాడు. యావత్తు విశ్వవ్యవస్థలో ఆయన్ని పోలిన వస్తువు, (జీవి)లేదు. ఆయన సమస్తం వింటున్నాడు, చూస్తున్నాడు. భూమ్యాకాశాల (నిక్షేపాల) తాళపు చెవులు ఆయన చేతిలోనే ఉన్నాయి. ఆయన తాను కోరిన విధంగా కొందరికి పుష్కలంగా, కొందరికి స్వల్పంగా ఉపాధినిస్తున్నాడు. ఆయన సర్వం ఎరిగినవాడు. (11,12)

ఆయన నూహ్‌కు ఆదేశించిన జీవనమార్గాన్నే మీకోసం నిర్దేశించాడు. (ప్రవక్తా!) దానినే ఇప్పుడు దివ్యావిష్కృతి ద్వారా నీ దగ్గరకు పంపించాడు. ఈ జీవన మార్గాన్నే మేము ఇంతకు పూర్వం ఇబ్రాహీం, మూసా, ఈసాల క్కూడా అందజేస్తూ అందులోనే (జీవితాంతం) స్థిరంగా ఉండాలని, వర్గభేదాలు సృష్టించకూడదని హెచ్చరించాము. ఈవిషయాన్ని గురించే నీవు బోధిస్తున్నప్పుడు బహుదైవారాధకులు బెదిరిపోతున్నారు. దేవుడు తాను కోరిన మనిషిని తనవాడిగా చేసుకుంటాడు. తన వైపు మరలేవాడికే ఆయన తన సాన్నిధ్యానికి చేరుకునే మార్గం చూపిస్తాడు. (13)

మానవులు తమ దగ్గరకు (సత్య)జ్ఞానం వచ్చిన తరువాత, (దాన్ని వదలి) పరస్పరం పంతాలకు పోయి కలహించుకోవడం వల్లనే వారిలో వర్గభేదాలు ఏర్పడ్డాయి. నీ ప్రభువు దగ్గర నిర్ణీత సమయం అనే మాట లేకపోయిఉంటే ఆయన వారి కథ ఎప్పుడో పరిసమాప్తం చేసివుండేవాడు. పూర్వీకుల తరువాత (దైవ)గ్రంథానికి వారసలుగా చేయబడినవారు దాన్ని సందేహిస్తూ, తీవ్ర సందిగ్ధంలో పడిపోయారు. (14)

ఏమైనప్పటికీ (ప్రవక్తా!) నీవు అదే జీవనవిధానం వైపు ప్రజలను ఆహ్వానించు. నీకివ్వబడిన ఆదేశం ప్రకారం ఆ విధానంలోనే స్థిరంగా ఉండు. అంతేగాని లోకుల మనోవాంఛల్ని అనుసరించకు. వారికిలా తెలియజెయ్యి:

“నేను దేవుడు పంపిన ప్రతి గ్రంథాన్ని విశ్వసిస్తున్నాను. మీ వ్యవహారాలన్నీ న్యాయంగా, నిష్పక్షపాతంగా పరిష్కరించాలని నాకు ఆజ్ఞ అయింది. దేవుడే మా ప్రభువూ, మీ ప్రభువు కూడా. మేము చేసే కర్మలు మాతో పాటు ఉంటాయి. మీరు చేసే కర్మలు మీతో పాటు ఉంటాయి. (కనుక) మీకూ, మాకూ మధ్య ఎలాంటి జగడం లేదు. దేవుడు ఓరోజు మనల్నందర్నీ (కర్మవిచారణ కోసం) సమావేశ పరుస్తాడు. మనమంతా చివరికి ఆయన దగ్గరికే మరలి పోవలసి ఉంది.” (15)

దైవసందేశం స్వీకరించిన తర్వాత కొందరు దేవుని విషయంలో జగడమాడుతున్నారు. వారి వివాదం దేవుని దృష్టిలో అన్యాయమైనది, అధర్మమైనది. వారిపై దైవాగ్రహం విరుచుకు పడుతుంది. వారికోసం కఠిన శిక్ష కాచుకొని ఉంది. (16)

ఆ దేవుడే సత్యం ప్రాతిపదికపై ఈ గ్రంథాన్ని, త్రాసుని (అంటే ధర్మశాస్త్రాన్ని) అవత రింపజేశాడు. తీర్పుఘడియ సమీపంలోనే ఉందేమో మీకేం తెలుసు? దాన్ని విశ్వసించని వారే దానికోసం తొందరపెడ్తున్నారు. దాన్ని విశ్వసించినవారు మాత్రం దానిపట్ల భయపడు తున్నారు. అది తప్పకుండా వస్తుందని వారికి తెలుసు. వినండి,



ఆ ఘడియ రాక గురించి సందేహాస్పదమైన వాదనలు చేస్తున్నవారు మార్గభ్రష్టత్వంలో పడి బహుదూరం కొట్టుకుపోయారు. (17,18)

దేవుడు తనదాసుల విషయంలో అమిత దయామయుడు, అపార వాత్సల్యుడు. ఆయన తలచినవారికి తలచినది ప్రసాదిస్తాడు. ఆయన ఎంతో బలాఢ్యుడు, మహా శక్తిమంతుడు. పరలోక సుకృతఫలం కోరుకునేవారి కోసం మేము వారి పుణ్యఫలం వృద్ధి చేస్తాం. ఇహలోక ఫలం కోరుకునేవారికి మేము ఇహలోకంలోనే దాన్ని ప్రసాదిస్తాం. అయితే పరలోక (సుకృతఫల)ంలో వారికి ఎలాంటి వాటా లభించదు. (19,20)

వారు ఆశ్రయించిన మిథ్యాదైవాలలో ఏవైనా దేవుడు అనుమతించని ధర్మమార్గం వారి కోసం నిర్ణయించాయా? తీర్పు విషయం ముందే నిర్ణయించబడకపోయి ఉంటే వారి కథ ఎప్పుడో సమాప్తమయి ఉండేది. అలాంటి దుర్మార్గులకు తప్పనిసరిగా దుర్భర శిక్ష పడుతుంది. అప్పుడీ దుర్మార్గులు తమ దుష్కర్మల పర్యవసానం పట్ల భయపడటాన్ని నీవు చూస్తావు. అది వారి మీద తప్పకుండా వచ్చిపడుతుంది. దీనికి భిన్నంగా సత్యాన్ని విశ్వసించి, సదాచార సంపన్నులైనవారు స్వర్గవనాల్లో (సుఖంగా)ఉంటారు. వారికి వారు కోరుకున్నదల్లా వారి ప్రభువు వద్ద లభిస్తుంది. ఇదే అన్నిటికంటే గొప్ప దైవానుగ్రహం.

ఇలాంటి శుభవార్తనే దేవుడు సత్యాన్ని విశ్వసించి సదాచరణ వైఖరి అవలంబించిన దాసులకు అందజేస్తున్నాడు. కనుక ప్రవక్తా! వారికిలా చెప్పు: “నేనీ పని కోసం మీనుండి ఎలాంటి ప్రతిఫలం ఆశించడం లేదు. కాకపోతే బంధుప్రేమను మాత్రం మీ నుండి తప్పకుండా ఆశిస్తాను.” సత్కార్యాలు చేసేవారికి ఆ సత్కార్యాల్లో మేము వృద్ధీ వికాసాలు కలిగిస్తాం. దేవుడు గొప్ప క్షమాశీలి, ఎంతో ఆదరించేవాడు. (21-23)

వారు (నీగురించి) “ఈమనిషి దేవునిపై నిందలు మోపుతున్నాడ”ని అంటున్నారా? (అదే నిజమైన పక్షంలో) దేవుడు తలచుకుంటే నీ హృదయకవాటాలు మూసివేస్తాడు. (కాని వారు చెబుతున్నది పచ్చిఅబద్ధం, నీపై లేనిపోని అభాండాలు వేస్తున్నారు.) దేవుడు అసత్యాన్ని అంతమొందిస్తున్నాడు. తన సద్వచనాలతో సత్యాన్ని సత్యంగా నిరూపిస్తున్నాడు. ఆయనకు (మానవుల) ఆంతర్యాలలో మెదిలే రహస్యాలు సైతం తెలుసు. (24)

ఆయనే తనదాసులు పశ్చాత్తాపంతో చేసే వేడుకోలు స్వీకరించి వారి పొరపాట్లు మన్నిస్తున్నాడు. ఆయనకు మీ చేష్టలన్నీ తెలుసు. (అయినప్పటికీ ఆయన మిమ్మల్ని ఉపేక్షిస్తున్నాడు.) విశ్వసించి, సదాచార సంపన్నులైనవారు చేసే వేడుకోలును ఆయన స్వీకరిస్తాడు. అంతేగాకుండా, ఆయన తన అనుగ్రహంతో వారికి మరింత (భాగ్యం) ప్రసాదిస్తాడు. పోతే సత్యతిరస్కారులకు మాత్రం దుర్భరయాతనలు తప్పవు. (25,26)

ఒకవేళ దేవుడు తన దాసులందరికీ పుష్కలంగా ఉపాధినిస్తే, వారు ప్రపంచంలో గర్విష్ఠులయి తిరుగుబాటుకు పాల్పడతారు. అందువల్ల ఆయన తాను తలచిన విధంగా ఒక నిర్ణీత పరిమాణంలో (ఉపాధి) దించుతున్నాడు. ఆయనకు తన దాసుల (స్వభావం) గురించి బాగా తెలుసు. వారిని ఆయన ఓకంట గమనిస్తున్నాడు. (27)

ప్రజలు (వర్షాభావంతో) నిరాశచెందినప్పుడు ఆ దేవుడే వర్షం కురిపిస్తున్నాడు. (వారి కోసం ఈవిధంగా) తన కారుణ్యాన్ని విస్తృతం చేస్తున్నాడు. ఆయనే (అందరికీ) సంరక్షకుడు, ప్రశంసనీయుడు. (28)

ఆయన నిదర్శనాలలో భూమ్యాకాశాల సృష్టి కూడా ఒకటి. ఆ రెండిటిలోనూ ఆయన జీవరాసుల్ని వ్యాపింపజేసిఉంచాడు.[1] తాను తలచుకున్నప్పుడు వాటిని (పరలోకంలో ఒకచోట) సమీకరించగలడు. (29)

మీకు ఏ ఆపద వచ్చినా అది మీ చేజేతులా తెచ్చిపెట్టుకున్నదే అవుతుంది. మీరు చేస్తున్న అనేక పొరపాట్లను ఆయన ఇట్టే క్షమించి వదలిపెడ్తున్నాడు.[2] (అయినా మీరు మీ దురాగతాలను మానుకోవడం లేదు.) అయితే మీరు ప్రపంచంలో దేవుని పట్టు నుండి తప్పించుకొని ఎక్కడికీ పారిపోలేరు. దేవునికి వ్యతిరేకంగా మీకు ఎలాంటి సహాయకుడూ, సంరక్షకుడూ లభించడు. (30,31)

ఆయన నిదర్శనాలలో సముద్రంలో కొండల్లా కన్పించే ఓడలు కూడా ఉన్నాయి. దేవుడు ఎప్పుడు తలచుకుంటే అప్పుడు గాలిని స్తంభింపజేయగలడు. దాంతో ఆ ఓడలు సముద్రతలంపై (ముందుకు సాగకుండా ఎక్కడికక్కడ) నిలిచిపోతాయి. సహన వైఖరి అవలంబించి కృతజ్ఞులై ఉండేవారికి ఇందులో గొప్ప సూచనలున్నాయి.....లేదా ఓడ ప్రయాణీకులు చేసిన అనేక పాపాలను మేము క్షమించి, కేవలం కొన్ని పాపాల కారణంగా వారిని (నడి సముద్రంలో) ముంచివేయగలం. అప్పుడు మా సూక్తుల్ని గురించి వితండవాదం చేసేవారికి నిజం తెలిసొస్తుంది. రక్షణ పొందడానికి తమకిక ఎలాంటి ఆశ్రయం లేదని వారు తెలుసుకుంటారు. (32-35)

ఇహలోకంలో మీకివ్వబడిన జీవన సామగ్రి మూన్నాళ్ళ ముచ్చట మాత్రమే. దేవుని దగ్గర (పరలోకంలో) ఉన్నదే శ్రేష్ఠమైనది, శాశ్వతమైనది. అయితే సత్యాన్ని విశ్వసించి తమ ప్రభువును నమ్ముకున్నవారికే ఇది లభిస్తుంది. (36)

---

1. ఈసూక్తిని బట్టి జీవరాసులు మన భూమిపైన్నే గాక, ఇతరగ్రహాలలో కూడా ఉన్నాయని తెలుస్తోంది. (వివరాలకు 16:49 సూక్తితో పాటు 65:12 సూక్తికి రాసిన పాదసూచిక చూడండి.)

2. ఈ సూక్తిలో అవిశ్వాసులకు, ప్రపంచపూజారులకు వచ్చే కష్టాలు వారు చేజేతులా కొని తెచ్చుకున్నవేనని దేవుడు అంటున్నాడు. అంటే దేవుడు తనప్రవక్తల ద్వారా పంపిన బోధనలు విశ్వసించకుండా వాటికి వ్యతిరేకంగా నడచుకుంటే సహజంగానే ఇబ్బందులు ఏర్పడతాయన్నమాట.

అయితే దేవుని బోధనలు విశ్వసించి వాటి ప్రకారం నడచుకునే వారికి కూడా కష్టాలు వస్తాయి కదా, దానికి కారణం ఏమిటనే ప్రశ్న వస్తుంది. ఇస్లాం సంపూర్ణ జీవనవ్యవస్థ. ఈ వ్యవస్థను నెలకొల్పడానికి దానికి పూర్తిగా భిన్నమైన వ్యవస్థలో ఊపిరి పీల్చుకుంటూ కృషి చేస్తున్నప్పుడు కష్టాలు ఎదురవడం సహజమే. అయితే ఈ కష్టాలు మనిషి పాపప్రక్షాళనకు, పరలోకంలో అతని హోదాఅంతస్తుల పెరుగుదలకు దోహదపడతాయి.

దీన్ని గురించే దైవప్రవక్త(సల్లం) ఇలా అన్నారు: "ముస్లింకు ఎలాంటి కష్టాలు, కడగండ్లు, ఆపదలు, ఆందోళనలు ఎదురయినా, చివరికి అతనికి ఒక ముల్లు గుచ్చుకున్నా సరే వాటిని దేవుడు అతని పాపాలకు, పొరపాట్లకు పరిహారంగా చేస్తాడు." (బుఖారి, ముస్లిం)



(అలా విశ్వసించినవారి గుణగణాలు ఈవిధంగా ఉంటాయి:)

- వారు ఘోరపాపాలకు, నీతిబాహ్యమైన పనులకు దూరంగా ఉంటారు.
- కోపోద్రేకాలు కలిగినప్పుడు (వాటిని దిగమింగి ఇతరుల్ని) క్షమిస్తారు.
- తమ ప్రభువు ఆదేశాలు శిరసావహించడానికి సదా సిద్ధంగా ఉంటారు.
- ప్రార్థనా (నమాజు) వ్యవస్థ నెలకొల్పుతారు.
- పరస్పరం సలహా సంప్రదింపులతో తమ వ్యవహారాలు నడుపుకుంటారు.[3]

---

3. ఈ దైవవచనం సామూహిక వ్యవహారాల్లో నియంతృత్వ పోకడలను, ఏకసత్తాక ధోరణులను అరికడ్తూ, దేవుడు ప్రసాదించిన ధర్మశాస్త్రం పరిధిలో ప్రజాస్వామ్య విధానాన్ని ప్రోత్సహిస్తోంది. స్వయంగా దైవప్రవక్త (సల్లం), ఆ తరువాత ఆయనకు వారసులుగా వచ్చిన తొలి నలుగురు ఖలీఫాలు ధర్మశాస్త్ర పరిధిలోకి రాని సామూహిక వ్యవహారాల విషయంలో తోటి ముస్లింలతో సలహా సంప్రదింపులు జరిపి సమిష్టి నిర్ణయాలు తీసుకునేవారు.

స్వయంగా దేవుడు తన ప్రవక్త (సల్లం)ను తన ఆజ్ఞల పరిధిలోకి రాని వ్యవహారాల విషయమయి అనుచరులతో సంప్రదించి నిర్ణయం తీసుకోవాలని ఆదేశిస్తున్నాడు: "నీవు తలపెట్టే పనుల విషయంలో వారిని సంప్రదిస్తూ ఉండు". (3:159)

ఖుర్‌ఆన్, హదీసులతో కూడిన ధర్మశాస్త్రం ఇస్లామీయ రాజ్యంలో శాశ్వత రాజ్యాంగమవుతుంది. అందులో మార్పులు, చేర్పులు చేయడానికి ప్రజలకు, ప్రజాప్రతినిధులకు ఎలాంటి అధికారం లేదు. ధర్మశాస్త్ర పరిధిలోకిరాని వ్యవహారాల్లో మాత్రమే రాజ్యాధినేత ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజాప్రతినిధుల్ని సంప్రదించి నిర్ణయం తీసుకుంటాడు. రాజ్యాధినేత తప్పుడు నిర్ణయం తీసుకుంటే ప్రజలకు అతడ్ని విమర్శించే, బలవంతంగా అతని నిర్ణయాన్ని ఉపసంహరింపజేసే హక్కు ఉంటుంది. సన్మార్గగాములైన తొలి నల్గురు ఖలీఫాలు ప్రజలకు నిర్భయంగా తమ అభిప్రాయాల్ని వెలిబుచ్చడానికి, తప్పు చేసినప్పుడు తమను విమర్శించడానికి పూర్తి స్వేచ్ఛనిచ్చారు.

ఓసారి రెండో ఖలీఫా హజ్రత్ ఉమర్(రజి) జుమాప్రసంగం చేస్తూ, వివాహంలో నాల్గొందల దిర్హంలకు మించి మహర్ చెల్లించడానికి అనుమతి ఇవ్వకూడదని ప్రతిపాదన చేశారు. వెంటనే ఒక స్త్రీ లేచి "అలా ఆదేశించే అధికారం మీకు లేదు. ఖుర్‌ఆన్ మహర్‌గా ఎంత పెద్ద ధనరాశి ఇవ్వడానికైనా అనుమతిస్తుంటే దానికి హద్దు లేర్పరచేందుకు మధ్యలో మీరెవరు?" అని విమర్శించింది. హజ్రత్ ఉమర్ (రజి) తక్షణమే తన ప్రతిపాదన ఉపసంహరించుకున్నారు.

మరొకసారి ఆయన్ని హజ్రత్ సల్మాన్ ఫార్సి (రజి) నిండుసభలో పట్టుకొని "అందరికీ లెక్క ప్రకారం ఒక్కొక్క దుప్పటే వచ్చింది కదా, మరి మీరు ఇంత పెద్ద చొక్కా ఎలా కుట్టించుకున్నారు? దానికి రెండు దుప్పట్లయితేగాని సరిపోదు" అని అడిగారు. హజ్రత్ ఉమర్ (రజి) భారీకాయంగల ఎత్తయిన మనిషి. అందువల్ల ఆయన చొక్కా కుట్టించుకోవడానికి తన భాగానికి వచ్చిన దుప్పటి సరిపడనందున తన కుమారుని వాటాకు వచ్చిన దుప్పటి అడిగి తీసుకొని చొక్కా కుట్టించుకున్నారు. ఆ విషయమే ఆయన తన కుమారుని చేత చెప్పించారు.

ఆనాటి ఖలీఫాలు ప్రజలకు ఎంత భావప్రకటన స్వేచ్ఛ ఇచ్చారంటే, తమను అకారణంగా దూషించినవారిని, బెదిరించినవారిని సైతం సహించేవారు. దూషణలు, నిందారోపణలు రుజువు కానంతవరకు వారు వాటిని శిక్షార్హమైన నేరాలుగా పరిగణించేవారు కాదు.

- ◆ మేము ప్రసాదించిన ఉపాధిలో కొంతభాగం మామార్గంలోనూ ఖర్చుపెడతారు.
- ◆ తపపైపై ఇతరులు దౌర్జన్యం చేస్తే వారు దాన్ని ఎదుర్కొంటారు. (37-39)

కీడుకు ప్రతీకారం అలాంటి కీడే. ఐతే ఎవరైనా ప్రతీకారం చేయకుండా ప్రత్యర్థిని క్షమించి పరిస్థితి చక్కబరిస్తే అతనికి (దాని) ప్రతిఫలమిచ్చే బాధ్యత దేవునిపై ఉంది. దేవుడు దౌర్జన్యపరుల్ని ప్రేమించడు. కాని దౌర్జన్యం జరిగిన తర్వాత (హద్దుమీరకుండా) బదులు తీర్చుకుంటే తప్పులేదు. ఇతరులపై దౌర్జన్యం చేస్తూ దేశంలో అన్యాయంగా కల్లోలం రేపే వారిని మాత్రమే తప్పుపట్టాలి. అలాంటివారికి దుర్భరశిక్ష కాచుకొనిఉంది.

కాకపోతే సహనంతో వ్యవహరిస్తూ (ప్రత్యర్థిని) క్షమించ గలిగితే (ఎంతో మంచిది). ఇది ఎంతో ధైర్యసాహసాలతో కూడిన పని. (40-43)

దేవుడు స్వయంగా ఎవరినైనా మార్గభ్రష్టుడిగా చేస్తే ఇక దేవుని వ్యతిరేకంగా అతడ్ని రక్షించేవారెవరూ ఉండరు. ఈ దుర్మార్గులు (మా)శిక్ష కళ్ళారా చూసినప్పుడు వారి పరిస్థితి ఎలా ఉంటుందో నీవు చూస్తావు. వారు (నరక)యాతన చూసి "ఇప్పుడు (మాకు బుద్ధొచ్చింది. ప్రపంచంలోకి) తిరిగి వెళ్ళిపోయే మార్గమేదైనా ఉందా?" అనడుగుతారు. (44)

వారిని నరకం దగ్గరకు తెచ్చినప్పటి పరిస్థితి కూడా నీవు చూస్తావు. అప్పుడు వారు అవమానభారంతో క్రుంగిపోతారు. బితుకు బితుకుమంటూ బిక్కచచ్చిన చూపులతో చూస్తారు. అప్పుడు విశ్వాసులు (వారి దుస్థితి పట్ల) "ఈరోజు ప్రళయదినాన తమను, తమ కుటుంబీకుల్ని నష్టపరచుకున్నవారే అసలు సర్వం కోల్పోయినవారు" అంటారు.

వినండి! దుర్మార్గులు శాశ్వతంగా (నరక) యాతనల్లో చిక్కుకుంటారు. అక్కడ దేవునికి వ్యతిరేకంగా వారిని ఆదుకోవడానికి ఎలాంటి సహాయకుడూ, సంరక్షకుడూ ఉండడు. దేవుడు మార్గభ్రష్టత్వంలో పడవేసిన వాడికి ఇక అందులో నుంచి తప్పించుకునే మార్గమే ఉండదు. (45,46)

(కనుక మానవులారా!) దేవుని తరఫున ఎలాంటి పరిస్థితిలోనూ తప్పిపోని (ప్రళయ) దినం రాకముందే మీ ప్రభువు మాట ఒప్పుకోండి. ఆరోజు మీకు ఎలాంటి రక్షణ (ఆశ్రయం) లభించదు, మీ తలరాతను ఎవడూ మార్చలేడు. (47)

ప్రవక్తా! వీరు ముఖంతిప్పుకుంటే తిప్పుకోని. మేము నిన్ను వారి మీద పర్యవేక్షకుడిగా చేసి పంపలేదు. (ప్రజలకు) సందేశం అందజేయడమే నీ బాధ్యత.

---

నాల్గవ ఖలీఫా హజ్రత్ అలి (రజి) దగ్గరికి ఓరోజు అయిదుగురు వ్యక్తులు బంధించి తీసుకురాబడ్డారు. వారు ఖలీఫాను బహిరంగంగా దూషించారని, వారిలో ఒకడు ప్రమాణం చేసి మరీ తాను అలి (రజి)ని హతమార్చుతానని అన్నాడని అతనిపై ఆరోపణ వచ్చింది. కాని హజ్రత్ అలి (రజి) ఆ ఖైదీలందర్నీ విడిచిపెట్టి "కావాలంటే వారి తిట్లకు మీరు జవాబిచ్చుకోండి. క్రియాత్మకంగా తిరుగుబాటు చేయనిదే కేవలం నోటి మాటలతో నన్ను విరోధించినంత మాత్రాన వారిని నేను శిక్షించలేను" అన్నారు తన క్రింది అధికారులతో.



మానవుడు చాలా చిత్రమైన మనిషి. మేమతనికి మా అనుగ్రహం చవిచూపిస్తే సంతోషంతో పొంగిపోతాడు. కాని చేజేతులా చేసుకున్న దుష్కార్యమేదైనా ఆపద రూపంలో వచ్చి పడితే (దేవుడు చేసిన మేలంతా మరచి) కృతఘ్నుడయి పోతాడు. (48)

దేవుడు భూమ్యాకాశాలకు యజమాని, సార్వభౌముడు. తాను తలచిన ప్రతిదాన్నీ సృష్టించగలడు. తాను కోరినవిధంగా కొందరికి మగసంతానం, కొందరికి ఆడసంతానం, మరికొందరికి ఆడ, మగ సంతానం ప్రసాదిస్తాడు. అలాగే తాను కోరినవారిని సంతానహీనులుగా చేస్తాడు. ఆయన గొప్ప జ్ఞానసంపన్నుడు, సమస్త కార్యాలు చేయగల సమర్థుడు. (49,50)

దేవుడు ఏ మానవునితోనూ ప్రత్యక్షంగా సంభాషించడు. మానవమాత్రుడికి అది సాధ్యమయ్యే పనికాదు. దేవుడు తనమాటను దివ్యావిష్కృతి ద్వారానో తెరవెనుక నుంచో మనిషికి చేరవేస్తాడు. లేదా తాను కోరినది తనఆజ్ఞతో సూచించడానికి సందేశహరుడ్ని (దైవదూతను) పంపుతాడు. ఆయన మహోన్నతుడు, ఎంతో వివేకవంతుడు. (51)

ప్రవక్తా! అదేవిధంగా మేము దివ్యావిష్కృతి ద్వారా నీ దగ్గరకు మా ఆజ్ఞలను పంపుతున్నాము. ఇంతకు ముందు నీకు గ్రంథం అంటే ఏమిటో తెలియనే తెలియదు. కాని ఆతర్వాత ఈ దివ్యావిష్కృతిని జ్యోతిగా చేసి మేము కోరిన మా దాసునికి రుజుమార్గం చూపుతున్నాం. నిస్సందేహంగా నీవు ప్రజలను సన్మార్గం వైపున నడిపిస్తున్నావు. అది భూమ్యాకాశాల్లోని సమస్త సృష్టిరాసులకు యజమాని అయిన దేవుని మార్గం. వినండి! సమస్త వ్యవహారాలు చివరికి దేవుని దగ్గరికే చేరుకుంటాయి. (52,53) ✪

# 43. బంగారునగలు (జుఖ్రుఫ్)

**అవతరణ: మక్కా** **సూక్తులు: 89**

ఈ అధ్యాయాన్ని "జుఖ్రుఫ్" అంటారు. ఇదీ నబవీశకం 6 లేక 7వ యేటలో అవతరించింది. ఇందులో మూఢనమ్మకాల్ని, ప్రాపంచిక వ్యామోహాన్ని గురించి విమర్శించడం జరిగింది. దేవుడు చేసిన మహోపకారాలు గుర్తుచేస్తూ ప్రకృతిలో దేవుని ఏకత్వాన్ని చాటిచెప్పే అనేక నిదర్శనాలను గురించి కూడా తెలియజేయడం జరిగింది.

### కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

హా-మీమ్. విషయస్పష్టత కల్గిన ఈగ్రంథం సాక్షి! మీరు అర్థంచేసుకోవడానికి వీలుగా దీన్ని మేము అరబీ భాషలో పఠనగ్రంథం (ఖుర్‌ఆన్)గా చేశాం. నిజానికిది మా దగ్గరున్న మాతృ గ్రంథంలోనిది. మా దృష్టిలో ఇది మహోన్నతమైనది, వివేచనాపూరితమైన (దివ్య) గ్రంథం. (1-4)

మీరు హద్దుమీరిన వారైనంత మాత్రాన మేము విసుగుచెంది ఈ హితోపదేశాన్ని మీ దగ్గరకు పంపడం మానేస్తామనుకుంటున్నారా? గతజాతులలో కూడా మేము దైవప్రవక్తల్ని ప్రభవింపజేశాము. దైవప్రవక్త వారి దగ్గరకు రావడం, వారు అతడ్ని హేళన

చేయకపోవడం అంటూ ఎన్నడూ జరగలేదు. వీరికంటే ఎంతో శక్తిమంతులైన వారిని మేము సర్వనాశనం చేశాం. గతజాతుల పతనగాథలే ఇందుకు తార్కాణాలు. (5-8)

భూమ్యాకాశాల్ని ఎవరు సృష్టించారని నీవు అడిగితే మహాశక్తిమంతుడు, సర్వజ్ఞాని అయిన దేవుడే అని వారు తప్పకుండా అంటారు. మరి ఆయనే కదా మీకోసం ఈ భూమిని ఊయలగా[1] చేసి, మీరు మీ గమ్యాలకు చేరుకోవడానికి అందులో దారులు ఏర్పరచినవాడు! ఆయనే ఒక నిర్ణీత పరిమాణంలో ఆకాశం నుండి వర్షం కురిపించి తద్వారా మృతభూమిని బ్రతికిస్తున్నాడు. అదేవిధంగా ఓరోజు మిమ్మల్ని కూడా బ్రతికించి భూమి నుండి బయటికి తీయడం జరుగుతుంది. (9-11)

ఆయనే యావత్తు (సృష్టిరాసుల స్త్రీపురుష) జంటలను పుట్టించాడు.[2] ఆయనే మీ ప్రయాణసౌలభ్యం కోసం ఓడలు, జంతువులను సృజించినవాడు. కనుక వాటిని ఎక్కేటప్పుడు మీ ప్రభువు చేసిన మేళ్ళను గుర్తుచేసుకుంటూ "మాకోసం వీటిని అదుపులో ఉంచిన దేవుడు ఎంతో పవిత్రుడు. మేము స్వయంగా వీటిని అదుపులో పెట్టగల శక్తిమంతులం కాము. ఒక రోజు మేము మా ప్రభువు దగ్గరికి మరలిపోవలసి ఉంది" అని పలకండి (12-14)

వీరు దేవుని దాసులలో కొందరిని ఆయనకు సంతానం అంటగట్టారు. మానవుడు నిజంగా పరమ కృతఘ్నుడు. దేవుడు తన సృష్టితాలలో కొందరిని తనకు కూతుళ్ళుగా ఎంచుకొని, మీకు మాత్రం కోరి కొడుకుల్ని ప్రసాదించాడా? (ఎంత అపచారం?) కాని వారు కరుణామయుడైన దేవునికి ఏ ఆడసంతానం అంటగట్టారో ఆ సంతానం గురించిన శుభవార్తే వారిలో ఎవరికైనా విన్పిస్తే అతను ముఖంమాడ్చుకొని పుట్టెడు దుఃఖంతో

1. ఖుర్‌ఆన్‌లో అనేక చోట్ల భూమిని పడకతో పోల్చడం జరిగింది. కాని ఇక్కడ భూమి ఊయలతో పోల్చబడింది. చంటిపిల్లవాడు సుఖంగా, ప్రశాంతంగా పడుకోవడానికి ఊయల ఎంత అనువుగా ఉంటుందో, మానవులు కూడా సుఖంగా, ప్రశాంతంగా, హాయిగా మనుగడ సాగించడానికి భూమిని ఊయల మాదిరిగా ఎంతో అనువుగా ఏర్పరచడం జరిగిందని భావం.

మన భూమండలం గంటకు 1000 మైళ్ళ వేగంతో తన చుట్టూ తాను తిరుగుతూ, గంటకు 65 వేల మైళ్ళ వేగంతో సూర్యుని చుట్టూ తిరుగుతున్నప్పటికీ, దానిమీద నివశిస్తున్న మానవులకు అది తిరుగుతున్నట్లు ఏమాత్రం అన్పించదు. అదీగాక దాని వాతావరణం కూడా మనకు ఎంతో అనుకూలంగా ఉంది. (ఇతర వివరాలకు 27:61 సూక్తికి రాసిన పాదసూచిక చూడండి.)

అయితే అప్పుడప్పుడు వచ్చే వరదలు, భూకంపాల ద్వారా దేవుడు, తాను తలచుకుంటే భూమిని ఒక్క ఊపు ఊపి మిమ్మల్ని సర్వనాశనం చేయగలనని హెచ్చరిస్తుంటాడు. భూగర్భంలోని ఉష్ణోగ్రత ఒక్కోసారి ఉపరితలంపై ఉండే పర్వతాలను కరిగించి లావా రూపంలో పెద్ద విధ్వంసం సృష్టించడం కూడా జరుగుతుంది. అందువల్ల మానవులు ఈ హెచ్చరికలను గమనించి, దేవుడు భూమండలాన్ని తమ కోసం ఊయలగా, ప్రశాంత నిలయంగా రూపొందించినందుకు కృతజ్ఞతగా ఆయనకు, ఆయన ప్రవక్తలకు విధేయులయి ఉండాలని ఈ సూక్తి పరోక్షంగా సూచిస్తోంది.

2. వివరాలకు 51:49 సూక్తి, దాని పాదసూచిక చూడండి.



క్రుంగిపోతాడు. ఆభరణాలలో అల్లారు ముద్దుగా పెరుగుతూ, వాదనలో తన అభిప్రాయాన్ని కూడా సరిగా వివరించలేని ఆడపిల్ల[3] దేవుని వాటాలోకి వచ్చిందా? (15-18)

వీరు కరుణామయుని దాసులయిన దైవదూతల్ని స్త్రీలుగా పరిగణించారు. వారి శరీరాకృతి చూశారా వీరు? వీరి సాక్ష్యాన్ని మేము నమోదుచేస్తున్నాం. దాన్ని గురించి వీరు (మాముందు) సమాధానం ఇచ్చుకోవలసి ఉంటుంది. (19)

"దేవుడు తలచివుంటే మేము ఎన్నడూ వారిని పూజించేవారం కాదు" అనంటారు వారు. ఈ వ్యవహారంలో వాస్తవం ఏమిటో వారికి బొత్తిగా తెలియదు. కేవలం ఊహాగానాలు చేస్తున్నారు. ఇంతకు పూర్వం వారికి మేమేదైనా గ్రంథం ప్రసాదించామా? ఆ గ్రంథానికి సంబంధించి వారిదగ్గర ఏదయినా ప్రమాణం ఉందా? ఎంతమాత్రం లేదు. (ప్రమాణం లేకపోయినా) "మా తాతముత్తాతలు ఒక సంప్రదాయం పాటిస్తూ ఉండగా చూశాంగనక, మేము వారి అడుగుజాడల్లోనే నడచుకుంటున్నాం" అంటారు. (20-22)

అలాగే నీకు పూర్వం మేము ఏ పట్టణానికి బోధకుణ్ణి పంపినా అక్కడ ఉండే ధనికులు తమ తాతముత్తాతలు ఒక సంప్రదాయం పాటిస్తూ ఉండగా చూశాం గనక, తాము వారి అడుగుజాడల్లోనే నడుచుకుంటున్నామని చెప్పేవారు. అప్పుడు ప్రతి దైవప్రవక్త "మీరు మీ తాతముత్తాతలు అనుసరిస్తుండగా చూసిన మార్గం కన్నా మెరుగైన మార్గం నేను చూపిస్తున్నా మీరు అదే దారిన నడుస్తారా?" అని వారిని అడిగేవాడు. దానికి వారు "నీవు తెచ్చిన ధర్మాన్ని మేము తిరస్కరిస్తున్నాం" అని అతనికి సమాధానమిచ్చారు. చివరికి మేము వారి భరతం పట్టాము. చూడండి, తిరస్కారులకు ఎలాంటి దుర్గతి పట్టిందో! (23-25)

ఇబ్రాహీం వృత్తాంతం జ్ఞాపకం తెచ్చుకో. అతను తన తండ్రితో, తన జాతిప్రజలతో "మీరు పూజిస్తున్న వాటితో నాకెలాంటి సంబంధంలేదు. నా సంబంధం నన్ను సృష్టించిన దేవునితో మాత్రమే ఉంది. ఆయనే నాకు దారి చూపుతాడు" అన్నాడు. ఈ విషయాన్నే అతను తన సంతానంలో వదలి వెళ్ళాడు, వారు దానివైపు మరలేందుకు. (26-28)

(ఇంత చెప్పినా వారు సృష్టిపూజ మాననప్పటికీ నేను వారిని శిక్షించలేదు.) పైగా వారికి, వారి తాతముత్తాతలకు జీవనసామగ్రి ప్రసాదిస్తున్నాను. చివరికి వారి దగ్గరకు సత్యం వచ్చింది. దాన్ని విడమరచి బోధించే ప్రవక్త కూడా వచ్చాడు. కాని వారి దగ్గరకు సత్యం వచ్చినప్పుడు "ఇదో మంత్రజాలం, మేము దీన్ని నమ్మం" అన్నారు వారు.

"ఈ ఖుర్‌ఆన్ రెండు నగరాలలో ఉన్న పెద్దమనుషుల్లో ఒకరిపై ఎందుకు అవతరించలేదు?" అంటారు వారు. నీ ప్రభువు కారుణ్యాన్ని వీరు పంచుతున్నారా? ప్రపంచజీవితంలో కావలసిన ఒనరుల్ని నేనే వారికి పంచిపెట్టాను. కాకపోతే పరస్పరం సేవాసహకారాల కోసం వారిలో కొందరికి కొందరిపై ఆధిక్యతనిచ్చాను. అయితే నీ ప్రభువు కారుణ్యం వారి ధనికులు కూడబెడ్తున్న దానికంటే ఎంతో విలువైనది. (29-32)

3. వివరాలకు 16:59, 53:22, 81:8 సూక్తులు, వాటి పాదసూచికలు చూడండి.

మానవులంతా ఒకే వరవడిలో కొట్టుకుపోతారన్న భయం లేకపోతే[4] మేము కరుణామయుడైన దేవుడ్ని తిరస్కరించేవారి ఇండ్ల కప్పులను, వారు మేడలపైకి ఎక్కే మెట్లను, వారి తలుపులను, వారు దిండ్లకానుకొని కూర్చునే పీఠాలను, అన్నిటినీ వెండి బంగారాలతో చేసి వేసేవారం. కాని ఇది (మూన్నాళ్ళ ముచ్చటైన) ప్రాపంచిక జీవిత సంపద మాత్రమే. (పరలోక సంపద ఇంతకంటే ఎంతో శ్రేష్ఠమైనది, శాశ్వతమైనది.) నీ ప్రభువు దగ్గర భయభక్తులు కలవారికే పరలోక సంపద ప్రాప్తమవుతుంది. (33-35)

కరుణామయుని బోధన, ప్రస్తావనల పట్ల ఏమరుపాటు వహించినవాడిపై మేము ఒక పిశాచశక్తిని రుద్దుతాము; అది అతనికి సహచరి అయిపోతుంది. అలాంటి వ్యక్తులను ఈ పిశాచశక్తులు సన్మార్గంలోకి రాకుండా నిరోధిస్తుంటాయి. వారు తాము చేస్తున్న పని సముచిత మయినదేనని భావిస్తుంటారు. (36,37)

ఈవిధంగా చివరికా వ్యక్తి మా దగ్గరకు చేరుకుంటాడు. అప్పుడతను తన పిశాచ సహచరునితో "అయ్యయ్యో! నీకూ నాకూ మధ్య తూర్పుపడమరలంత దూరం ఉంటే ఎంత బాగుండేది!! నీవు నాకు అతిచెడ్డ స్నేహితుడుగా దొరికావు" అనంటాడు (పశ్చాత్తాపపడుతూ). అప్పుడు వారికి (దైవదూతలు) "మీరు దుర్మార్గుపుపనులు చేశారు గనక, ఈరోజు మీకెలాంటి సహాయం లభించదు. మీరంతా శిక్షలో సమానులే" అని చెబుతారు. (38-39)

ప్రవక్తా! మరి నీవిప్పుడు బధిరులకు విన్పించగలవా? లేక అంధులకు, పూర్తిగా దారి తప్పినవారికి దారి చూపగలవా? మేము (ముందుగానే) నిన్ను ప్రపంచం నుండి (మాదగ్గరకు) రప్పించుకున్నా, లేక మేము వాగ్దానం చేసినదాన్ని నీ కళ్ళెదుటే వారికి చవిచూపినా మొత్తం మీద వారిని మేము శిక్షించి తీరుతాం. వారిమీద మాకు పూర్తి అదుపు ఉంది. (40-42)

ఏమైనప్పటికీ నీవు మటుకు దివ్యావిష్కృతి ద్వారా నీ దగ్గరకు పంపబడిన ఈ గ్రంథాన్ని దృఢంగా పట్టుకో. నిస్సందేహంగా నీవు సన్మార్గంలో ఉన్నావు. ఈగ్రంథం నీకు, నీ జాతిప్రజలకు గొప్ప హితకారిణి. త్వరలోనే మీరంతా దీని విషయమయి (దేవుని ముందు) జవాబు చెప్పుకోవలసి ఉంటుంది. మేము కరుణామయుణ్ణే గాక ఇతరుల్ని కూడా దేవుళ్ళుగా నిర్ణయించామా మీరు వారిని ఆరాధించడానికి? (కావాలంటే) ఇంతకు పూర్వం మేము పంపిన ప్రవక్తలను అడిగి చూడండి. (43-45)

మేము మూసాకు మా నిదర్శనాలిచ్చి ఫిరౌన్ దగ్గరకు, అతని ప్రభుత్వాధికారుల

---

4. అంటే, ప్రాపంచిక సిరిసంపదల పట్ల ఉండే ఆకర్షణ వల్ల మానవులంతా ప్రపంచ పూజారులైపోయి పరలోకచింతన పూర్తిగా మరచిపోతారని, అలా జరిగే ప్రమాదం గనక లేకపోతే అవిశ్వాసుల్ని దేవుడు వెండిబంగారాలతో తులతూగేలా చేస్తాడని అర్థం. అయితే దేవుని దృష్టిలో ఐహిక జీవితానికి వీసమెత్తయినా విలువలేదని ఈ క్రింది హదీసు కూడా స్పష్టం చేస్తోంది:

"దేవుని దృష్టిలో ప్రపంచం విలువ దోమ రెక్కంత ఉన్నాసరే, ఆయన ఈ ప్రపంచంలో సత్యతిరస్కారులకు త్రాగడానికి గుక్కెడు నీళ్ళు కూడా ప్రసాదించేవాడు కాదు." (బుఖారి)



దగ్గరకు పంపాము. అతను వెళ్ళి "నేను విశ్వప్రభువు పంపిన దైవప్రవక్తను" అన్నాడు. తర్వాత అతను వారిముందు మా నిదర్శనాలు ప్రదర్శించినప్పుడు వారు హేళనచేశారు. మేము ఒక దాన్ని మించిన మరొకటి అనేక నిదర్శనాలు[5] ఒక దాని తర్వాత మరొకటి వరుసగా పంపాము.

ఈవిధంగా మేము నానాయాతనలు పెట్టి వారిని పట్టుకున్నాం, అప్పుడైనా వారు తమ వైఖరి మార్చుకుంటారేమోనని. కాని వారు మా శిక్ష వచ్చినప్పుడల్లా "మాంత్రికుడా! నీ ప్రభువు నుండి నీకు లభించిన పదవీహోదాల ఆధారంగా మా (కష్టాలు దూరం చేయడం) కోసం ఆయన్ని ప్రార్థించు; మేము తప్పకుండా సన్మార్గం అవలంబిస్తాం" అని చెప్పేవారు. కాని మేము వారి నుండి శిక్ష తొలగించగానే వారు మాట తప్పేవారు.

ఓ రోజు ఫిరౌన్ చాటింపు వేయించి తన జాతిప్రజల్ని సంబోధిస్తూ ఇలా అన్నాడు: "ప్రజలారా! ఈజిప్టు సామ్రాజ్యం నాదికాదా? (నైలునది నుండి చీలిన) ఈ సెలయేరులు నా(మేడల) క్రింద ప్రవహించడం లేదా? ఇవన్నీ మీకు కన్పించడం లేదా? నేను శ్రేష్ఠుణ్ణా లేక సరిగ్గా మాట్లాడటమే రాని ఈ నీచుడు శ్రేష్ఠుడా? (అతనేదో గొప్పవాడైతే) అతని (దౌత్యపదవి గుర్తింపు) కోసం స్వర్ణకంకణం ఎందుకు దిగ లేదు? లేక అతని హోదా దర్పం కోసం దైవదూతల దళమొకటి అతని వెంట ఎందుకు రాలేదు?" (46-53)

అతను తన జాతిప్రజలను అల్పులని భావించాడు. వారతనికి విధేయులై పోయారు. వారసలు స్వతహాగానే దుర్జనులు. చివరికి వారు మాకెంతో ఆగ్రహం తెప్పించారు. దాంతో మేము వారిని (నడిసముద్రంలో) ముంచి ప్రతీకారం తీర్చుకున్నాం. ఇలా మేము వారి పర్యవసానాన్ని రాబోవు తరాలకు గుణపాఠంగా చేసివేశాము. (54-56)

---

5. మూసా ప్రవక్త (అలైహి) ద్వారా దేవుడు ఈ నిదర్శనాలు ఫిరౌన్‌కు చూపాడు: (1) మొట్ట మొదట మూసా ప్రవక్తకు, మాంత్రికులకు మధ్య జరిగిన పోటీలో మాంత్రికులు ఓడిపోయి ఆయన్ని దైవప్రవక్తగా విశ్వసించారు. (2) తరువాత మూసాప్రవక్త చేసిన భవిష్యత్ ప్రకటన ప్రకారం ఈజిప్టులో తీవ్రమైన కరువు వచ్చింది. ఆయన చేసిన దుఆ (వేడుకోలు) వల్లనే అది తొలగి పోయింది. (3) మూసా ప్రకటన ప్రకారం దేశమంతటా పెనుతుఫాను వచ్చి అనేక ఊళ్ళు, పంట పొలాలు సర్వనాశనమయ్యాయి. ఆయన దుఆ వల్లనే ఈ ఉపద్రవం కూడా తొలగిపోయింది. (4) మూసా ప్రకటనతో భయంకరమైన మిడతల దండు వచ్చిపడింది. మళ్ళీ ఆయన చేసిన దుఆ వల్లనే ఈ విపత్తు కూడా దూరమయింది. (5) మూసా ప్రకటనతో దేశమంతటా పేలు, ధాన్యపు పురుగులు ప్రబలిపోయాయి. జనం తీవ్ర ఆందోళన చెందారు. గోదాముల్లోని ధాన్యం నాశనమయి పోయింది. ఈ ఆపద కూడా ఆయన దుఆ వల్లనే తొలగిపోయింది. (6) మూసా హెచ్చరికతో దేశం నలు మూలలా భయంకరమైన కప్పల బెడద వచ్చిపడింది. ఈ బెడద కూడా ఆయన చేసిన దుఆ వల్లనే తొలగిపోయింది. (7) మూసా ప్రకటనతో దేశంలో నెత్తుటి విపత్తు వచ్చింది. నదులు, చెరువులు, బావులు, కుంటల్లోని నీరంతా రక్తమయమైపోయింది. చేపలు చచ్చిపోయాయి. వారం రోజులదాకా జనం మంచినీటి కోసం కటకటలాడి పోయారు.

(27:12 సూక్తి పాదసూచిక కూడా చూడండి.)

మర్యం కుమారుడి చరిత్రను తార్కాణంగా పేర్కొన్నప్పుడు నీ జాతిప్రజలు దానిపై పెద్ద రభస చేస్తూ "మా దేవుళ్ళు గొప్పా? అతను గొప్పా?" అని పలకసాగారు. వారీ ఉదాహరణను వితండవాదం చేయడానికి మాత్రమే నీ ముందు పేర్కొంటున్నారు. వీరసలు స్వతహాగానే కలహకారులు. (57,58)

ఈసా మాఅనుగ్రహం పొందిన దాసుడుతప్ప మరేమీకాదు. మేమతడ్ని ఇస్రాయీల్ సంతతి (కనువిప్పు) కోసం మా శక్తికి ఒక నిదర్శనంగా చేశాం. మేము తలచుకుంటే మీలో కొందర్ని దైవదూతలుగా చేయగలం; వారు ప్రపంచంలో మీకు వారసులవుతారు.

అతనసలు ప్రళయదినానికి ఒక సూచనలాంటివాడు. కనుక మీరు దాన్ని గురించి సందేహంలో పడకండి. నామాట వినండి. ఇదే రుజుమార్గం. షైతాన్ మీకు బహిరంగశత్రువు. ఆ విషయం నుండి వాడు మిమ్మల్ని నిరోధించకూడదు. (59-62)

ఈసా స్పష్టమైన నిదర్శనాలతో వచ్చి (ప్రజలకు) ఇలా బోధించాడు: "నేను మీ దగ్గరకు వివేకం తీసుకొచ్చాను. మీరు విభేదించుకుంటున్న కొన్ని విషయాల్లోని నిజానిజాలు ఏమిటో మీముందు వెల్లడించడానికే మీ దగ్గరికొచ్చాను. కనుక మీరు దేవునికి భయపడండి. నాకు విధేయత చూపండి. వాస్తవానికి దేవుడే నా ప్రభువు, మీ ప్రభువు కూడా. ఆయన్నే మీరు ఆరాధించండి. ఇదే సన్మార్గం." (63,64)

అయితే వారు పరస్పరం విభేదించుకొని విభిన్న వర్గాలుగా చీలిపోయారు. కనుక అన్యాయం, అధర్మాలకు వడిగట్టిన ఆ దుర్మార్గులకు వినాశం (రాసిపెట్టి) ఉంది. ఒక భయానక దినం నాటి యాతనలో చిక్కుకొని వారు నాశనమయి పోతారు. (65)

ఇప్పుడు వీరు కూడా ఏమరుపాటులో ఉన్నప్పుడు తమపై హఠాత్తుగా ప్రళయం విరుచుకుపడాలని ఎదురుచూస్తున్నారా? ఆరోజు వచ్చినప్పుడు దైవభీతిపరులు తప్ప మిగిలిన మిత్రులంతా పరస్పరం శత్రువులయి పోతారు.

సత్యాన్ని విశ్వసించి విధేయులైపోయిన వారికి ఆరోజు ధైర్యం కలిగిస్తూ ఇలా చెప్పబడుతుంది: "నా దాసులారా! ఈరోజు మీకెలాంటి భయం లేదు, దుఃఖం కూడా ఉండదు. ఇక మీరు, మీ భార్యాపిల్లలు (తదితర బంధుమిత్రులు) స్వర్గంలో ప్రవేశించండి, మిమ్మల్ని ఆనందింపజేయడం జరుగుతుంది." (66-70)

వారి ముందు బంగారంతో చేయబడిన కంచాలు, గిన్నెలు కదులాడుతుంటాయి. వారి హృదయాలకు, కళ్ళకు ఆనందాన్నిచ్చే ప్రతి వస్తువూ అక్కడ లభిస్తుంది. "ఇప్పుడు మీరిక్కడ కలకాలం (సుఖంగా) ఉంటారు. మీరు ప్రపంచంలో చేసుకున్న సత్కార్యాల కారణంగానే ఈ స్వర్గసీమకు వారసులయ్యారు. ఇక్కడ మీరు తినడానికి కావలసినన్ని పండ్లు ఫలాలు ఉన్నాయి" అని వారికి చెబుతారు (దైవదూతలు). (71-73)

ఇక పాపాత్ములు- వారు శాశ్వతంగా నరక యాతనల్లో చిక్కుకొని ఉంటారు. వారి శిక్ష ఎన్నటికీ తగ్గించబడదు. వారందులో నిరాశా నిస్పృహలతో పడిఉంటారు. వారికి మేము అన్యాయం చేయలేదు. వారే ఆత్మవంచనకు పాల్పడ్డారు. వారు (నరక



యాతనలు భరించ లేక) "నరకపాలకుడా! నీ ప్రభువు మా కథను ముగించివేస్తే బాగుండు" అని అరుస్తారు. దానికి దైవదూత "మీరు అలాగే పడివుండండి. మేము మీ దగ్గరకు సత్యాన్ని తెస్తే, మీలో చాలామందికి అసలు సత్యమే గిట్టలేదు" అని సమాధానమిస్తాడు. (74-78)

(నీకు వ్యతిరేకంగా) వీరేదైనా చర్య తీసుకోవడానికి నిర్ణయించుకున్నారా? సరే, మేము కూడా ఒక నిర్ణయం తీసుకుంటాం. మేము తమ రహస్య విషయాల్ని, గుసగుసల్ని వినలేమని భావిస్తున్నారా వారు? మేము అన్నీ వింటున్నాము. వాటిని మా దూతలు వారి దగ్గరే నిలబడి నమోదు చేస్తున్నారు. (79,80)

వారికిలా చెప్పు: "కరుణామయునికి నిజంగా సంతానం ఉంటే (ఆ సంతానాన్ని) అందరికంటే ముందు నేనే ఆరాధించేవాడ్ని". భూమ్యాకాశాల ప్రభువు, మహోన్నత సింహాసనాధిపతి అయిన దేవుడు వారి కల్పితాలకు అతీతుడైన పరమపవిత్రుడు.

సరే, వారు(ఎటూ) తమకు వాగ్దానం చేయబడుతున్న (ప్రళయ)దినాన్ని (కళ్ళారా) చూసుకుంటారు. అప్పటిదాకా వారిని అలాగే తమ దుష్ట ఊహాలోకంలో విహరిస్తూ, ఆటపాటల్లోనే మునిగి ఉండనివ్వు. (81-83)

యావత్తు భూమ్యాకాశాల్లో ఆయనే ఆరాధ్యుడు. ఆయన ఎంతో వివేకవంతుడు, జ్ఞానసంపన్నుడు. ఆయనే సర్వోన్నతుడు, శుభదాయకుడు. భూమ్యాకాశాల్లో, వాటిమధ్య ఉన్న సమస్త రాజ్యాధికారం ఆయన చేతిలోనే ఉంది. ప్రళయం వచ్చే సమయం ఆయనకే తెలుసు. ఆయన దగ్గరికే మీరంతా మరలిపోవలసి ఉంది. (84,85)

ఆయన్ను వదలి వీరు ప్రార్థిస్తున్న దైవేతరులకు ఏవిధమైన సిఫారసు చేసే అధికారం లేదు. కాకపోతే వీరేదయినా విషయపరిజ్ఞానం ఆధారంగా సత్యానుగుణమైన సాక్ష్యమిస్తే అందుకు అనుమతి లభిస్తుంది. (86)

ఒకవేళ నీవు "మిమ్మల్ని ఎవరు సృష్టించారు"ని అడిగితే, "దేవుడే" అని వారు తప్పకుండా చెబుతారు. మరి వీరు ఎలా మోసపోతున్నారు? 'ప్రభూ! వీరు (ఎంత నచ్చజెప్పినా) వి?ఃశ్వసించేవారు కాదు' అని పలికిన ప్రవక్త పలుకుల సాక్షి! (నిజంగా వారిక ఎంత మాత్రం విశ్వసించరు.) (87,88)

కనుక ప్రవక్తా! వారికో సలాం చేసి వారి మానాన వారిని వదలిపెట్టు. (తిరస్కార పర్యవసానం ఏమిటో) వారికి త్వరలోనే తెలుస్తుంది. (89) ✪

పుట్టిన ప్రతి జీవి గిట్టక తప్పదన్న ప్రచ్ఛి నిజం ప్రతి ఒక్కరికీ తెలిసిందే. కాని గిట్టిన తర్వాత మనిషి పరిస్థితి ఏమిటీ? అనే విషయాన్ని గురించే చాలామంది ప్రశాంత మనస్సుతో ఆలోచించడం లేదు. ప్రళయం సూచనలు, పరలోక పరిణాలను గురించి వివరంగా తెలుసుకో దలచినవారు "ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్" నుండి వెలువడిన "పరలోక ప్రస్థానం" అనే పుస్తకం తప్పకుండా చదవాలి.

అవతరణ: మక్కా

# 44. పొగ (దుఖాన్)

సూక్తులు: 59

ఈ అధ్యాయాన్ని "దుఖాన్" (పొగ) అంటారు. ఇది కూడా నబవీ శకం ఆరు లేక ఏడవ యేటలో అవతరించి ఉండవచ్చని తెలుస్తోంది. కాకపోతే ఈ అధ్యాయం అవతరించిన కాలంలో ఇస్లాంవ్యతిరేకత మరింత తీవ్రమయ్యింది. కనుక ఇందులోనూ బహు దైవారాధకులకు నయాన, భయాన నచ్చజెప్పడానికి ప్రయత్నం జరిగింది.

## కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

హా-మీమ్. విషయస్పష్టత కలిగిన ఈగ్రంథం సాక్షి! మేము మానవుల్ని హెచ్చరించే ఉద్దేశ్యంతో దీన్ని ఒక శుభరాత్రిన అవతరింపజేశాం. మానిర్ణయం ప్రకారం ప్రతి విషయంలోనూ వివేకవంతమైన ఉత్తర్వు జారీఅయ్యే రాత్రి ఇది.[1] మేమే సందేశహరుడ్ని ప్రభవింపజేశాం. ఇందులో ఎలాంటి అనుమానం లేదు. (1-5)

(ఇది) నీ ప్రభువు అనుగ్రహం. నిస్సందేహంగా ఆయన సమస్తం వింటున్నాడు, సర్వం ఎరిగినవాడు. భూమ్యాకాశాలకు, వాటి మధ్యఉన్న సర్వానికీ ఆయనే ప్రభువు. మీరు నిజంగా (ఈ విషయాన్ని) నమ్ముతుంటే (ఈ ఖుర్ఆన్ ఆయన అవతరింపజేసిన గ్రంథమేనని విశ్వసించాలి). ఆయనతప్ప మరో ఆరాధ్యుడు లేడు. ఆయనే మీ జీవన్మరణాలకు మూలకారకుడు. మీకు, మీ పూర్వీకులక్కూడా ఆయనే ప్రభువు. (6-8)

వీరసలు సందేహంలో పడి (మా సూక్తుల్ని గురించి సరిగా ఆలోచించకుండా) ఆటపాటల్లో మునిగి తేలుతున్నారు. సరే, ఆకాశం నిండా పొగ కమ్ముకునే రోజుకోసం ఎదురుచూడండి. అది ప్రజలపై ఆవరిస్తుంది. అదొక దుర్భరయాతన.[2] (9-11)

(ఇప్పుడు వీరు దేవుడు తెచ్చిపెట్టిన కరువు కష్టాలతో తల్లడిల్లిపోతూ) "ప్రభూ! మాపై నుండి ఈ ఆపదను తొలగించు, మేము విశ్వసిస్తాం" (అంటున్నారు.) కాని వారి ఏమరుపాటు (అంత త్వరగా) ఎలా వదలుతుంది? వారి దగ్గరకు సత్యాన్ని స్పష్టంగా చెప్పే ప్రవక్త వచ్చినా వారతని వైపు కన్నెత్తి కూడా చూడలేదు. పైగా "ఇతను చెప్పుడు మాటలు నేర్చుకున్న పిచ్చోడు. (ఇతరులు నూరిపోస్తుంటే వాటిని చిలక పలుకుల్లా వల్లె

1. వివరాలకు 97వ అధ్యాయం, దాని పాదసూచికలు చూడండి.

2. ఇక్కడ పొగ గురించి భాష్యకార్యుల్లో భిన్నాభిప్రాయాలున్నాయి. ప్రళయకాల సూచనగా ఆకాశంలో కమ్ముకునే పొగ అని కొందరు, మక్కాలో కరువు వచ్చినప్పుడు ప్రజలు ఆకాశంలో చూస్తే ఆకలి తీవ్రత వల్ల వారికి పొగ కన్పించేదని మరికొందరు అభిప్రాయపడ్డారు.

ఓరోజు ప్రవక్తఅనుచరులు ప్రళయం గురించి చర్చిస్తుంటే దైవప్రవక్త(సల్లం) వచ్చి ఇలా అన్నారు: "పది సూచనలు ఒకదాని తరువాత మరొకటి వెలువడనంత వరకు ప్రళయం రాదు. ఆ సూచనలు (1) సూర్యుడు పడమటి దిక్కు నుండి ఉదయించడం, (2) పొగ, (3) (మాట్లాడే) చతుష్పాదం, (4) దజ్జాల్, (5) యాజూజ్ మాజూజ్‌ల దాడులు, (6) హజ్రత్ ఈసా ఇబ్నె మర్యం (అలైహి) అవతరణ, (7) భూమి (మూడు చోట్ల) క్రుంగిపోవడం, తూర్పు ప్రాంతంలో, (8) పశ్చిమ ప్రాంతంలో, (9) అరేబియా ద్వీపంలో, (10) అదన్ నుండి అగ్ని బయలుదేరి జనాన్ని (హష్ర్ మైదానం వైపు) తోలుకుపోవడం." (ముస్లిం) (21:96 సూక్తి పాదసూచిక కూడా చూడండి.)



వేస్తున్న అమాయకుడు.) అని అంటారు. మేము కాస్త మీ (కరువు) కష్టాన్ని తొలగిస్తాం. కాని మీరు లోగడ చేసిన (సత్యవ్యతిరేక) పనులే మళ్ళీ చేస్తారు. ఆ తరువాత మీపై మేము పెద్ద దెబ్బ వేసే రోజు వస్తుంది.[3] ఆరోజు మేము తప్పకుండా మీకు ప్రతికారం చేస్తాము. (12-16)

వీరికి పూర్వం మేము ఫిరౌన్‌జాతిని ఇలాంటి పరీక్షకే గురిచేశాము. వారి దగ్గరకు సౌశీల్యుడైన దైవప్రవక్త వచ్చి ఇలా అన్నాడు: "దేవుని దాసులను నాకు అప్పగించండి. నేను మీకోసం వచ్చిన నిజాయితీపరుడైన దైవప్రవక్తను. దేవునిపట్ల తిరుగుబాటు వైఖరి అవలంబించకండి. నేను మీముందు (నాదౌత్య నియామకం గురించి) గట్టి నిదర్శనాలు చూపుతాను. మీరు నామీద చేసే దాడినుండి నేను నాకూ, మీకూ ప్రభువైన దేవుని శరణుపొందాను. మీరు నామాట ఒప్పుకోకపోతే (కనీసం) నామీద చేయి చేసుకోకండి."

చివరికి అతను వీరు నేరస్థులని (వీరి కీడునుండి తనను, తన అనుచరుల్ని కాపాడమని) తన ప్రభువుని ప్రార్థించాడు. (దానికి) "సరే, (ఒకరోజు) రాత్రికిరాత్రే నా దాసుల్ని తీసుకొని బయలుదేరు. (ఫిరౌన్) మిమ్మల్ని వెంబడిస్తాడు. సముద్రాన్ని దాని మానాన వదిలెయ్యి. ఈ సైన్యమంతా అందులో మునిగిపోతుంది" (అని చెప్పాడు దేవుడు). (17-24)

వారు ఎన్నో పొలాలు, తోటలు, సెలయేళ్ళు, అందమైన మేడలు వదలి వెళ్ళారు. వారు రంగరంగ వైభవంతో అనుభవించిన ఎన్నో విలాసవస్తువులు కూడా వారి వెనుకే ఉండి పోయాయి. ఇదీ వారి (అహంకారానికి) పర్యవసానం. మేమా వస్తువులన్నిటికీ ఇతరుల్ని వారసులుగా చేశాం. వారి దుస్థితి చూసి భూమీ ఏడ్వలేదు; ఆకాశమూ ఏడ్వలేదు.[4] వారికి కాస్త కూడా (బ్రతికి బయటపడే) అవకాశం ఇవ్వలేదు. (25-29)

3. మక్కా అవిశ్వాసులు దైవప్రవక్త (సల్లం)కు వ్యతిరేకంగా విద్వేషప్రచారం ముమ్మరం చేశారు. అప్పుడు దైవప్రవక్త (స) ప్రకృతి వైపరీత్యం రూపంలో ఏదైనా శిక్ష వస్తే దారికొస్తారేమోనన్న ఉద్దేశ్యంతో "దేవా! యూసుఫ్ కాలంవంటి కరువు తెచ్చి నాకు సహాయం చెయ్యి" అని ప్రార్థించారు. దాంతో మక్కాలో కరువచ్చింది. ప్రజలు ఆకలితో అల్లాడి పోయారు. అప్పుడు ఖురైష్ నాయకులు ప్రవక్త (స) దగ్గరకొచ్చి "ఈ ఆపద నుండి ప్రజల్ని కాపాడమని దైవాన్ని ప్రార్థించు"అని విన్నవించుకున్నారు. కరువు తొలగిపోయింది. కాని వారు తమ సత్యవ్యతిరేక వైఖరి మానుకోలేదు.

ఆ తర్వాత దేవుడు"మేము మీపై పెద్ద దెబ్బవేసే రోజు వస్తుంద"ని హెచ్చరించాడు. ఇది బద్ర్‌యుద్ధం గురించిన హెచ్చరిక. బద్ర్‌లో 1000 మంది అవిశ్వాసులు 313 మంది ముస్లింల చేతిలో చావుదెబ్బ తిని పారిపోయారు. వారి అగ్రనాయకుల్లో అనేకమంది చనిపోయారు

4. ఫిరౌనీయుల మృతిపట్ల భూమ్యాకాశాలు ఏడ్వలేదని ఈసూక్తిలో ఉంది. మరి భూమ్యాకాశాలు ఎవరి మృతిపట్ల ఏడుస్తాయి? దీనికి సమాధానంగా ఈ క్రింది హదీసులు చూడండి.

"ప్రతి మానవుని కోసం ఆకాశంలో రెండు ద్వారాలుంటాయి. ఒక ద్వారం గుండా అతని ఆహారం క్రిందికి దిగుతుంది. రెండవ ద్వారం గుండా అతని కర్మలు పైకెక్కిపోతాయి. సత్యాన్ని విశ్వసించిన దాసుడు చనిపోయినప్పుడు అతని మృతిపట్ల ఈ రెండుద్వారాలు ఏడుస్తాయి." (తిర్మిజి)

ఈవిధంగా మేము ఇస్రాయీల్ సంతతివారిని ఎంతో అవమానకరమైన శిక్ష నుండి కాపాడి, ఫిరౌన్ బారి నుండి విముక్తి కలిగించాము. హద్దులు మీరే వారిలో ఫిరౌన్ నిజంగా చాలా ఘనత వహించిన పెద్దమనిషి! మేము (ఇస్రాయీల్ సంతతి)వారి పరిస్థితి తెలిసే వారికి ప్రపంచంలోని ఇతర జాతులకన్నా ఎక్కువ ప్రాధాన్యమిచ్చాము. వారికి మేము చూపిన నిదర్శనాలలో స్పష్టమైన పరీక్ష ఉండింది. (30-33)

వీరు (పరలోకాన్ని తిరస్కరిస్తూ) "మాకొచ్చే తొలిమరణం తర్వాత మరేమీ లేదు. ఆ తర్వాత మమ్మల్ని మళ్ళీ బ్రతికించి లేపడమంటూ జరగదు. ఒకవేళ నీవు చెప్పేది నిజమైతే (చనిపోయిన) మా తాతముత్తాతల్ని లేపుకురా" అనంటారు. (34-36)

వీరు మేటిగాళ్ళా లేక తుబ్బాజాతి ప్రజలా? లేక వారికి పూర్వం గతించినవారా? నేరస్తులయిన కారణంగానే వారిని మేము సర్వనాశనం చేశాము. (37)

మేము భూమ్యాకాశాల్ని, వాటి మధ్య ఉన్న సమస్తాన్ని ఏదో తమాషా కోసం సృష్టించ లేదు. వాటిని మేము (ఒక మహోన్నత లక్ష్యం కోసం) సత్యం ప్రాతిపదికపై సృజించాము. కాని చాలామందికి (ఈసత్యం) తెలియదు. వీరందర్నీ (బ్రతికించి) లేపడానికి ఒక నిర్ణీతదినం ఉంది. అదే తీర్పుదినం. ఆరోజు ఏ ఆప్తమిత్రుడూ తన ప్రాణస్నేహితుడికి ఏవిధంగానూ ఉపయోగపడలేడు. దేవుడు ఎవరినైనా కటాక్షిస్తే తప్ప వారికి ఎలాంటి సహాయం లభించదు. నిస్సందేహంగా దేవుడు మహా శక్తిమంతుడు, అపార దయామయుడు. (38-42)

పాపాత్ములు జఖ్ఖూమ్ (అనే ఒక రకమైన నాగజెముడు) చెట్టు తప్పకుండా తిన వలసి ఉంటుంది. చమురు తెట్టులాంటి ఆపదార్థం వారి పొట్టలోకి పోయి మరగ కాచిన నీటిలా కుతకుత ఉడికిపోతుంది. "పట్టుకోండి వాడ్ని. బరబర ఈడుస్తూ తీసికెళ్ళి నరకం మధ్య విసరిపడేయండి. సలసల కాగే నీటిని వాడి నెత్తిమీద కుమ్మరించండి"... "ఇకచూడు దీని రుచి. నువ్వు మహా గౌరవనీయుడవైన పెద్ద మనిషివి కదూ!"... మీరు ఇంతకాలంగా సంభవిస్తుందో లేదో అని సందేహిస్తుండిన విషయం ఇదే." (43-50)

(ఆరోజు) దైవభీతిపరులు ప్రశాంత నిలయంలో[5] (చల్లటి) సెలయేరులుండే ఉద్యాన వనాలలో ఉంటారు. పల్చటి జరీ పట్టువస్త్రాలు ధరించి ఒకరికొకరు ఎదురెదురుగా కూర్చుంటారు. ఇదీ వారి వైభవం! వారికి మేము ఎర్రటి దేహచ్ఛాయతో

---

"హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం ప్రకారం, విశ్వాసి మృతి పట్ల భూమి నలభై రోజుల దాకా దుఃఖిస్తుంది." (హాకిమ్)

5. స్వర్గాన్ని ఇక్కడ ప్రశాంత నిలయంగా వర్ణించడం జరిగింది. అంటే ఇక్కడ ఎలాంటి కష్టాలు, కడగండ్లు, ఆపదలు, ఆందోళనలకు ఆస్కారంలేని శాంతి నిలయం అన్నమాట. దైవప్రవక్త (సల్లం) ప్రవచనం ప్రకారం "స్వర్గ వాసులకు (దైవదూతలు) ఇలా చెబుతారు: "ఇక్కడ మీరు ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉంటారు. ఎన్నడూ జబ్బుపడరు. శాశ్వతంగా జీవించి ఉంటారు. ఎప్పుడూ చనిపోరు. కలకాలం సుఖసంతోషాలతో ఉంటారు. ఏనాడూ ఎలాంటి దుస్థితికి లోనుకారు. ఎల్లప్పుడూ యువకులుగానే ఉంటారు. ఎన్నడూ ఏమాత్రం వృద్ధులు కారు." (ముస్లిం)



విశాలనేత్రాలుగల సుందరాంగుల్ని ఇచ్చి వివాహం చేస్తాము. వారక్కడ ఎలాంటి చీకూచింతా లేకుండా హాయిగా కూర్చొని రకరకాల పలహారాలు తెప్పించుకుంటారు. మరణం వారి దరిదాపులకే రాదు; ప్రపంచంలో ఒకసారి వచ్చిన మరణమే మరణం. దేవుడు తన కటాక్షంతో వారిని నరక యాతనల నుండి రక్షిస్తాడు. ఇదే అన్నిటికంటే ఘనవిజయం (పరమమోక్షం). (51-57)

ప్రవక్తా! ప్రజల హితోపదేశం కొరకు మేమీ గ్రంథాన్ని మీకు తెలిసినభాషలో సులభ తరంచేశాం. ఇక నీవూ ఎదురుచూస్తుండు, వారూ ఎదురుచూస్తుంటారు. (58,59) ✪

# 45. కూలబడిన వారు (జాసియా)

**అవతరణ: మక్కా** **సూక్తులు: 37**

ఈ అధ్యాయాన్ని "జాసియా" అంటారు. ఇది 44వ అధ్యాయం తరువాత సమీప కాలంలో అవతరించి ఉండవచ్చని తెలుస్తోంది. ఇందులో ఇంచుమించు 44వ అధ్యాయంలో ప్రస్తావించిన విషయాలే వేరొక తీరులో పేర్కొనబడ్డాయి.

## కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

హా-మీమ్. ఇది మహా శక్తిమంతుడు, వివేకవంతుడయిన దేవుని నుండి అవతరించిన గ్రంథం. సత్యాన్ని విశ్వసించేవారికి భూమ్యాకాశాల్లో అనేక నిదర్శనాలున్నాయి. మీ పుట్టుకలో కూడా ఉన్నాయి. దేవుడు వ్యాపింపజేసిన జంతుజాలంలో కూడా నమ్మే వారికి గొప్ప నిదర్శనాలున్నాయి. రేయింబవళ్ళ చక్రభ్రమణంలో, ఆకాశంనుండి దేవుడు దించే ఉపాధి (వర్షం)లో, తద్వారా ఆయన మృతభూమికి జీవం పోసే (సస్యశ్యామలం చేసే) ప్రక్రియలో, గాలుల చలనంలోనూ బుద్ధిజ్ఞానాలు కలవారికి అద్భుత నిదర్శనాలు ఉన్నాయి. (1-5)

ఇవన్నీ దేవుని నిదర్శనాలు. వీటిని మేము నీముందు ఉన్నవివున్నట్లు వివరిస్తున్నాం. దేవుడ్ని, ఆయన నిదర్శనాలు, సూక్తుల్ని వదిలేస్తే ఇక ఏవిషయాన్ని వారు విశ్వసిస్తారు? (6)

అబద్ధాలకోరు, దుష్కర్ముడయిన ప్రతివాడికీ వినాశం (రాసిపెట్టి) ఉంది.[1] అతని

---

1. అబద్ధం ఘోరమైన పాపమని ఈ సూక్తి చెబుతోంది. మరో సూక్తిలో ఇలా ఉంది: "కనుక విగ్రహాల మాలిన్యానికి దూరంగా ఉండండి, అసత్యం పలకడాన్ని విడనాడండి." (22:30)

అబద్ధం అనేక అనర్థాలకు, నీతిమాలిన పనులకు దారితీస్తుంది. అబద్ధమాడనని, ఎల్లప్పుడు సత్యమే పలుకుతానని గట్టిగా నిర్ణయించుకున్న వ్యక్తి దౌర్జన్యం, దొంగతనం, వ్యభిచారం, మద్య సేవనం చేయలేడు. కారణం విచారణ జరిగితే అతను నిజం చెబుతాడు. తత్ఫలితంగా దేహశుద్ధి జరుగుతుంది. అందువల్ల నిజం చెప్పే మనిషి ఈ చెడులే గాక, ఇతర అనేక చెడులు కూడా మానుకుంటాడు. అబద్ధం గురించి మహాప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు:

"అబద్ధమాడటం ఎట్టి పరిస్థితిలోనూ ధర్మసమ్మతం కాదు. సీరియస్‌గా నైనా, పరిహాసంగానైనా అబద్ధమాడరాదు. మీ పిల్లలకు ఏదైనా ఇస్తామని చెప్పి, ఇవ్వకపోతే అది కూడా ధర్మసమ్మతం

ముందు దేవుని సూక్తులు విన్పిస్తున్నప్పుడు అతను వాటిని వినడానికైతే ఎలాగో వింటాడు. కాని ఆ తర్వాత వాటిని విననేలేదన్నట్లు తలబిరుసుతో పంతానికిపోయి, తన అవిశ్వాస వైఖరినే గట్టిగా పెనవేసుకొనిఉంటాడు. అలాంటి వాడికి దుర్భరయాతన కాచుకొనిఉందని శుభవార్త విన్పించు! మా హితబోధ ఏదైనా అతని దృష్టికి వస్తే దాన్ని ఎగతాళిచేసి ఎగరగొడ్తాడు. అలాంటివారికి అవమానకరమైన యాతన (సిద్ధంగా) ఉంది.

వారిముందు నరకం (పొంచి)ఉంది. వారు సంపాదించుకున్నదేదీ వారికి పనికి రాదు. వారు దేవుడ్ని వదలి తమకు సంరక్షకులుగా చేసుకున్న మిధ్యాదైవాలు వారిని ఆదుకోలేవు. వారికోసం తీవ్రమైన యాతన ఉంది. ఇది మార్గదర్శక గ్రంథం. తమ ప్రభువు సూక్తులు విశ్వసించనివారి కోసం అత్యంత బాధాకరమైన (నరక)యాతన కాచుకొని ఉంది. (7-11)

మీ కోసం సముద్రాన్ని అదుపులో ఉంచినవాడు దేవుడే. తన ఆదేశంతో ఓడలు నడవడానికి, తద్వారా మీరు దైవానుగ్రహం (ఉపాధి) అన్వేషించి తనకు కృతజ్ఞతలు చూపడానికే ఇలా చేశాడు. (అమాటకు వస్తే) ఆయన భూమ్యాకాశాల్లో ఉన్న సమస్తాన్ని మీ ఉపయోగార్థమే అదుపులో ఉంచాడు. యోచించేవారికి ఇందులో గొప్ప సూచనలు ఉన్నాయి. (12,13)

ప్రవక్తా! విశ్వసించినవారికి ఇలా తెలియజెయ్యి: “దేవుని నుండి తమకు దుర్దినాలు దాపురించవని నిర్భయంగా ఉండేవారి చేష్టల్ని చూసీచూడనట్లు వదిలేయండి. దేవుడే ఒక వర్గానికి దాని చేష్టలకు తగిన దుష్ఫలం చవిచూపిస్తాడు. ఎవరు సత్కార్యం చేస్తాడో అది అతనికే మేలు చేకూరుస్తుంది. మరెవరు దుష్కార్యానికి పాల్పడుతాడో దాని దుష్ఫలితం అతను అనుభవిస్తాడు. చివరికి అందరూ తమ ప్రభువు దగ్గరికి పోవలసినవారే.” (14,15)

ఇంతకు పూర్వం మేము ఇస్రాయీల్ సంతతికి గ్రంథాన్ని, వివేకాన్ని, దైవదౌత్యాన్ని ప్రసాదించాము. వారికి మేము శ్రేష్ఠమైన జీవనసామగ్రి అనుగ్రహించాము. యావత్తు ప్రపంచ మానవులపై వారికి ఔన్నత్యాన్నిచ్చి, ధర్మం గురించి స్పష్టమైన హితవులు ఇచ్చాం. కాని ఆ తర్వాత వారిలో విభేదాలు పొడసూపాయి అంటే (అజ్ఞానం వల్లకాదు), దివ్యజ్ఞానం వచ్చిన తరువాతే (దాన్ని విస్మరించడం వల్ల) పొడసూపాయి. అదీగాక వారు పరస్పరం ఒకరికొకరు అన్యాయం చేసుకోజూశారు. వారు విభేదిస్తున్న విషయాలను గురించి రేపు ప్రళయదినాన దేవుడు తప్పకుండా తీర్పు చేస్తాడు. (16,17)

ముహమ్మద్ (సల్లం)! ఆ తరువాత మేము నిన్ను ధర్మం విషయంలో చక్కని రాచబాటలో నిలబెట్టాము. కాబట్టి నీవు అదే బాటలో నడు. (ధర్మ) జ్ఞానం లేనివారి

---

కాదు.” (అల్ అదబుల్ మఫ్రద్) (4:31 సూక్తి పాదసూచిక మొదటి పేరా చూడండి.)

“నీవు అసత్యమైన ఒక విషయాన్ని నీ సోదరునికి నిజమని నమ్మేటట్లు చెప్పడం మహా విశ్వాసఘాతుకం.” (అబూదావూద్) (ఇతర వివరాలకు 22:30 సూక్తి, దాని పాదసూచిక చూడండి.)



మనోవాంఛలను నీవు ఎన్నటికీ అనుసరించకు. (అలా చేస్తే) దేవునికి వ్యతిరేకంగా వారు నీకు ఏవిధంగానూ ఉపయోగపడరు. దుర్మార్గులు ఒకరికొకరు స్నేహితులు. దైవభీతిపరులకు దేవుడే స్నేహితుడు. (18,19)

ఈ (ఖుర్‌ఆన్) గ్రంథం యావత్తు మానవాళి కోసం స్పష్టమైన సూచన; సత్యాన్ని విశ్వసించేవారి కోసం మార్గదర్శిని, కారుణ్యప్రదాయిని. (20)

దుష్కార్యాలకు పాల్పడుతున్నవారు తమను, సత్యాన్ని విశ్వసించి సత్కార్యాలు చేస్తున్నవారిని మేము ఒకేగాటన కట్టివేస్తామని భావిస్తున్నారా? వారుభయుల చావుబ్రతుకులు (వాటి పర్యవసానాలు) ఒకటే అవుతాయనుకుంటున్నారా? చాలా తప్పుడు ఆలోచన వారిది. ఎలాంటి అన్యాయం జరగకుండా ప్రతి మనిషికీ అతని సంపాదనకు తగిన ప్రతిఫలం ఇవ్వడా నికి దేవుడు భూమ్యాకాశాల్ని సత్యం ప్రాతిపదికపై సృష్టించాడు. (21,22)

మనోవాంఛల్ని దైవంగా చేసుకున్నవాడ్ని[2] గురించి నీవెప్పుడైనా ఆలోచించావా? అతను విద్యాజ్ఞానాలు కలిగివున్నా దేవుడు అతడ్ని దారి తప్పించాడు. అతని హృదయ కవాటాలు మూసివేశాడు; చెవులకు సీలువేశాడు; కళ్ళకు గంతలుకట్టాడు. దేవుడే అలా చేసిన తర్వాత ఇక అతనికి ఎవరు దారి చూపగలరు? మీరు గుణపాఠం నేర్చుకోరా?

“జీవితమంటే ఈ ప్రపంచజీవితమే. ఇక్కడే మనం చావాలి, ఇక్కడే బ్రతకాలి. కాల చక్రభ్రమణం తప్ప మనల్ని ఏదీ నాశనం చేయలేదు” అంటారు వీరు.[3] వీరి దగ్గర ఎలాంటి (సత్య)జ్ఞానం లేదు. వీరు కేవలం ఊహాగానాలు చేస్తున్నారు. (23,24)

విషయస్పష్టత కలిగిన మాసూక్తులు విన్పిస్తున్నప్పుడు “నీవు చెప్పేది నిజమయితే మా తాతముత్తాతల్ని లేపుకురా” అంటారు వారు. వారికిలా చెప్పు: “దేవుడే మిమ్మల్ని బ్రతికిస్తున్నాడు, చంపుతున్నాడు. ఆ తరువాత ఆయనే మిమ్మల్ని (మళ్ళీ బ్రతికించి) ప్రళయదినాన సమావేశపరుస్తాడు. ఆరోజు తప్పకుండా వస్తుంది. అందులో ఎలాంటి అనుమానం లేదు. కాని చాలామందికి (ఈ సత్యం) తెలియదు. (25,26)

భూమ్యాకాశాల సార్వభౌమత్యం ఆయనదే. ఏరోజు ప్రళయఘడియ వచ్చిపడుతుందో ఆరోజు అసత్యాన్ని అంటిపెట్టుకున్నవారు ఘోరంగా నష్టపోతారు. (27)

---

2. వివరాలకు 25:43 సూక్తి, దాని పాదసూచిక చూడండి.

3. మన దేహంలోకి ఆత్మ ఎక్కడ్నుంచి వచ్చింది; తిరిగి ఎక్కడికి వెళ్తుంది అనే విషయానికి నాస్తికులు ప్రాముఖ్యం ఇవ్వరు. మనిషి తల్లి గర్భం నుంచి పుట్టి చివరికి మట్టిలో కలసిపోతాడని, ఇదంతా కాలం తెచ్చే మార్పులు తప్ప మరేమీ లేదంటారు. వీరే సౌఖ్యాలు కలిగినప్పుడు మంచి రోజులని కాలాన్ని పొగుడుతారు. కష్టాలు వచ్చినప్పుడు చెడ్డ రోజులని తెగుడుతారు.

ఈ విషయాన్ని గురించే మహాప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: దేవుడు ఈవిధంగా అంటున్నాడు- “మానవుడు కాలాన్ని తెగుడుతూ (నిజానికి) నన్ను వేధిస్తున్నాడు. ఆ కాలానికి యజమానిని నేనే. కాలం తనంతట తాను ఏం చేయగలదు? ప్రతి పనీ నా చేతిలోనే ఉంది. నేనే రేయింబవళ్ళను ఒక దాని తరువాత ఒకటి మాటిమాటికి తీసుకొస్తున్నాను.” (బుఖారి)

ఆరోజు ప్రతివర్గం (నీల్గుడంతా పోయి నేలచూపులు చూస్తూ) మోకాళ్ళ మీద చతికిలబడి ఉండటం నీకు కన్పిస్తుంది. అప్పుడు ప్రతివర్గాన్నీ తన కర్మల చిట్టా వైపు రమ్మని పిలవడం జరుగుతుంది. తరువాత (దేవుడు) ఇలా అంటాడు: "ఈరోజు మీకు మీ కర్మలకు ప్రతిఫలం ఇవ్వబడుతుంది. ఇవి మేము తయారు చేయించిన కర్మ పత్రాలు. మీగురించి ఇవి ఉన్నవి ఉన్నట్లు సాక్ష్యమిస్తాయి. (ప్రపంచంలో) మీరు చేస్తున్నదంతా మేము (ఎప్పటికప్పుడు) వ్రాయిస్తూ ఉండేవాళ్ళం." (28,29)

ఆ తరువాత సత్యాన్ని విశ్వసించి సాత్విక జీవితం గడిపిన వారిని వారి ప్రభువు తన కారుణ్యఛాయలోకి తీసుకుంటాడు. ఇదే అసలు విజయం (పరమమోక్షం). (30)

అవిశ్వాసుల్ని ఇలా నిలదీయడం జరుగుతుంది "(బోధకులు) మీకు మాసూక్తులు విన్పిస్తుండేవారు కాదా? కాని మీరు అహంకారంతో విర్రవీగుతూ నేరస్థులై పోయారు.

'దేవుని వాగ్దానం సత్యమైనదని, ప్రళయం సంభవించడంలో ఎలాంటి సందేహం లేదని చెబుతున్నప్పుడు మీరు (నిరాకరిస్తూ) 'ప్రళయమంటే ఏమిటో మాకు తెలియదు. అదేదో ఊహాకల్పనని మా అనుమానం. దాని మీద మాకసలు నమ్మకం కుదరడం లేదు' అని చెప్పేవారు." (31,32)

అప్పుడు వారిముందు వారు చేసిన పనుల్లోని చెడులేమిటో బట్టబయలవుతాయి. వారు దేన్ని గురించి హేళన చేస్తుండేవారో దాని ఉచ్చులోనే పడిపోతారు. తర్వాత వారితో (దైవదూతలు) ఇలా అంటారు: "నేటి సమావేశాన్ని మీరు (ఆనాడు) ఎలా విస్మరించారో ఈరోజు మేము కూడా మిమ్మల్ని విస్మరిస్తున్నాం. ఇప్పుడు మీ నివాస స్థలం నరకమే. ఇక మీకెవరూ సహాయం చేయరు. మీరు దేవుని సూక్తుల్ని అపహాస్యం చేశారు. మిమ్మల్ని ప్రపంచ జీవితం మోసగించింది. అందుకే మీకీ దుర్గతి పట్టింది."

కనుక ఈరోజు వారిని నరకం నుండి విముక్తి కలిగించడంగాని, క్షమాపణ కోరుకొని దైవప్రసన్నత పొందమని వారికి చెప్పడం గాని జరగదు. (33-35)

కాబట్టి (ఇప్పటికైనా సత్యం ఏమిటో తెలుసుకోండి.) భూమ్యాకాశాల ప్రభువు, సర్వ లోక స్వామి అయిన దేవుడే సకల విధాల ప్రశంసలకు అర్హుడు. యావత్ భూమ్యాకాశాలలో ఘనత, ఔన్నత్యాలు ఆయనకే శోభిస్తాయి. ఆయన అపార శక్తిమంతుడు, అసామాన్య వివేకవంతుడు. (36,37) ✪

# 46. ఇసుకకొండల నేల (అహ్ఖాఫ్)

**అవతరణ: మక్కా** **సూక్తులు: 35**

ఈ అధ్యాయాన్ని "అహ్ఖాఫ్" (ఇసుక కొండల నేల) అంటారు. దైవప్రవక్త (సల్లం) ధర్మ ప్రచారం కోసం తాయిఫ్ వెళ్ళి తిరిగి వస్తున్నప్పుడు లేక మక్కా చేరిన తరువాత నబవీశకం ఆరు లేక ఏడవ యేట ఈ అధ్యాయం అవతరించి ఉండవచ్చు. ఇందులో జిన్నులు (భూతాలు) ప్రవక్త (సల్లం) దగ్గరకొచ్చి ఖుర్‌ఆన్ విన్న సంఘటన ఉంది. ముఖ్యంగా అవిశ్వాసుల భ్రష్ట వైఖరిని విమర్శిస్తూ వారికి దేవుని ఏకత్వం, పరలోక పరిణామాల్ని గురించి బోధించడం జరిగింది.



## కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

హా-మీమ్. ఇది అపార శక్తిసంపన్నుడు, అసామాన్య వివేకవంతుడయిన దేవుని దగ్గర నుండి అవతరించిన గ్రంథం. మేము భూమ్యాకాశాల్ని, వాటి మధ్యనున్న సమస్త వస్తువుల్ని సత్యం ప్రాతిపదికపై ఒక నిర్ణీతవ్యవధి కోసం సృష్టించాం. కాని ఈ అవిశ్వాసులు తమను హెచ్చరించి చెప్పిన యదార్థానికి విముఖులైపోయారు. (1-3)

ప్రవక్తా! వారినిలా అడుగు: "దేవుడ్ని వదలి మీరు ప్రార్థిస్తున్న శక్తులేమిటో ఎప్పుడైనా మీరు కళ్ళు తెరచి చూశారా? అవి లోకంలో ఏం సృష్టించాయో కాస్త నాకు చూపించండి. పోనీ ఆకాశనిర్మాణంలో వాటి పాత్ర ఏమిటో చెప్పండి. మీ అభిప్రాయం నిజమయితే దీనికి పూర్వం (మీ నమ్మకాలకు రుజువుగా) వచ్చిన గ్రంథంగాని, లేదా ఏదైనా (దైవిక)జ్ఞానంలోని కొన్ని అంశాలుగాని మీ దగ్గరుంటే తీసుకురండి." (4)

దేవుడ్ని వదలి ప్రళయందాకా తమ ప్రార్థనలకు స్పందించని మిథ్యాదైవాలను మొరపెట్టుకునేవాడి కంటే మించిన మార్గభ్రష్టుడు మరెవరుంటారు? పైగా మొరపెట్టు కునే వారు తమను మొరపెట్టుకుంటున్నారన్న సంగతి కూడా ఆ మిథ్యాదైవాలకు తెలియదే! అంతేకాదు, మానవులంతా సమావేశపరచబడే (ప్రళయ)దినాన వారు తమను ప్రార్థించినవారికి శత్రువులైపోతారు; వారి పూజాపురస్కారాలను తిరస్కరిస్తారు. (5,6)

విషయస్పష్టత కలిగిన మా సూక్తులు విన్పించడం ద్వారా సత్యం వారి ముందుకు వచ్చినప్పుడు ఈ సత్యతిరస్కారులు దాన్ని గురించి "ఇదంతా మాయాజాలం" అంటారు. దైవసందేశహరుడు దీన్ని స్వయంగా కల్పించుకున్నాడని అంటున్నారా వీరు? అయితే వారికిలా చెప్పు: "నేనొకవేళ దీన్ని స్వయంగా కల్పించుకుంటే, దేవుని పట్టునుండి మీరు నన్ను ఏమాత్రం కాపాడలేరు. మీరు కల్పించి చెబుతున్న మాటలను గురించి దేవునికి బాగాతెలుసు. (ఈ విషయంలో) నాకూ మీకూ మధ్య దేవుడే సాక్షి. (కనుక ఇప్పటికైనా మీ వైఖరి మార్చుకుంటే) ఆయన ఎంతో క్షమించేవాడు, కరుణించేవాడు." (7,8)

ముహమ్మద్ (సల్లం)! వారికీ సంగతి కూడా తెలియజెయ్యి: "నేనేమీ ఈనాడు కొత్తగా వచ్చిన ప్రవక్తను కాను. (నాలాంటి ప్రవక్తలు పూర్వం కూడా ఎందరో వచ్చి పోయారు.) రేపు మీ విషయమైనా, నా విషయమైనా ఏమవుతుందో నేను చెప్పలేను. నేను నా దగ్గరకొస్తున్న దివ్యావిష్కృతిని అనుసరిస్తున్నవాడ్ని మాత్రమే. నేను (విషయం గురించి ప్రజలను) స్పష్టంగా హెచ్చరించేవాడ్ని తప్ప మరేమీ కాను." (9)

వారికిలా చెప్పు: "ఇది దేవుని దగ్గర్నుండే వచ్చిన వాణి అయివుండి, దాన్ని మీరు తిరస్కరిస్తే (రేపు ప్రళయదినాన మీ గతేమవుతుంది)? దీన్ని గురించి ఆలోచించారా మీరు? ఇలాంటిదే (గతంలో) ఒకవాణి వచ్చినప్పుడు ఇస్రాయీల్ సంతతికి చెందిన ఒక సాక్షి దానికి అనుకూలంగా సాక్ష్యమిచ్చాడు. (అది బోధించే సత్యాన్ని) అతను విశ్వసించాడు. కాని మీరు మాత్రం గర్వపోతులయి పోయారు. అలాంటి దుర్మార్గులకు దేవుడు ఎన్నటికీ సద్బుద్ధి ప్రసాదించడు." (10)

అవిశ్వాసులు విశ్వసించినవారిని విమర్శిస్తూ "ఈ గ్రంథాన్ని విశ్వసించడం మంచి పనయితే, దీని విషయంలో (సమాజంలో ఎలాంటి పేరూ ఊరూ లేని) వీరు మమ్మల్ని మించిపోయేవారు కాదు" అంటున్నారు. ఈగ్రంథం నుండి సన్మార్గం పొందలేకపోయారు గనక వారు దీన్ని పాతకాలంనాటి పుక్కిటిపురాణమని తప్పకుండా అంటారు. (11)

దీనికి పూర్వం మూసా (ప్రవక్త)కు ఇవ్వబడిన (తౌరాత్) గ్రంథం (మానవుల పాలిట) మార్గదర్శినిగా, (దైవ)కారుణ్యంగా వచ్చింది. ఇప్పుడీ గ్రంథం దాన్ని (సత్యతను) ధృవీకరిస్తూ దుర్మార్గుల్ని హెచ్చరించడానికి, సన్మార్గ వైఖరి అవలంబించేవారికి శుభవార్త అందజేయడానికి అరబీ భాషలో అవతరించింది. (12)

దేవుడే తమ ప్రభువని పలికి, ఆమాట పైన్నే స్థిరంగా ఉండేవారికి (పరలోకంలో) ఎలాంటి భయంగాని, దుఃఖంగాని ఉండదు. అలాంటివారికే స్వర్గ ప్రవేశం లభిస్తుంది. వారు భూలోకంలో చేసిన సత్కార్యాలకు ప్రతిఫలంగానే ఈ స్వర్గభాగ్యం లభిస్తుంది. అక్కడే వారు కలకాలం (సుఖసంతోషాలతో) ఉంటారు. (13,14)

మేము మానవునికి తన తల్లిదండ్రుల పట్ల సత్ప్రవర్తన కలిగివుండాలని ఆదేశించాము. అతని తల్లి అతడ్ని ఎంతో శ్రమకోర్చి తన గర్భంలో పెట్టుకొని మోసింది. ఎంతో శ్రమపడి అతడ్ని కన్నది. అతడ్ని గర్భంలో పెట్టుకొని మోయడానికి, ఆ తరువాత పాలు మాన్పించడానికి ముప్ఫయి నెలలు పట్టింది.[1] చివరికి అతను పూర్తిగా శక్తిమంతుడవుతాడు. (అలా) నలభై యేళ్ళ ప్రాయానికి చేరుకున్న తర్వాత అతను ఇలా ప్రార్థిస్తాడు:

"ప్రభూ! నీవు నాకు, నా తల్లిదండ్రులకు చేసిన మేళ్ళకు నేను నీపట్ల కృతజ్ఞుడయి ఉండే సద్బుద్ధి ప్రసాదించు. నీ ప్రసన్నతాభాగ్యం లభించేటటువంటి సత్కార్యాలు చేసే సద్బుద్ధి కూడా ప్రసాదించు. నా సంతానాన్ని కూడా సజ్జనులుగా చేసి నాకు సుఖాన్నివ్వు. నేను నీకు విధేయుణ్ణయిన దాసుడ్ని. నా పాపాలకు నేను పశ్చాత్తాపపడుతూ నన్ను క్షమించమని నీ సన్నిధిలో వేడుకుంటున్నాను." (15)

ఈ విధంగా మేము మానవుల (గత) దుష్కర్మలను క్షమించి వారి సత్కర్మల్ని స్వీకరిస్తున్నాం. ఇలాంటివారే తమకు చేయబడిన సత్యవాగ్దానాల ప్రకారం స్వర్గవాసుల్లో చేరిపోతారు. (16)

దీనికి భిన్నంగా మరొక వ్యక్తి తన తల్లిదండ్రుల్ని ఈసడించుకుంటూ "ఛీ! మీపోరు ఎక్కువయిపోయింది. నేను చనిపోయాక (మళ్ళీ బ్రతికించి) సమాధి నుండి నన్ను లేపుతారని మీరు నన్ను బెదరగొడ్తున్నారా? మరి నాకు పూర్వం ఎన్నో తరాలు

1. గర్భం ధరించి, బిడ్డను కని, పాలుపట్టడానికి మొత్తం ముప్ఫయి నెలలు పడ్తుందని ఈ సూక్తిలో ఉంది. 2:233 సూక్తిలో తల్లులు తమ బిడ్డలకు పూర్తిగా రెండేళ్ళు పాలు పట్టాలని ఉంది. 31:14 సూక్తిలో బిడ్డ పాలు వదలడానికి రెండేళ్ళు (24 నెలలు) పట్టిందని ఉంది. దీన్నిబట్టి స్త్రీ కనీసం 6 నెలల్లో గర్భంధరించి, పూర్తిస్థాయి బిడ్డను కనడం సాధ్యమేనని తెలుస్తోంది. అందువల్ల షరీఅత్‌వేత్తలు ఏ స్త్రీ అయినా పెళ్ళయిన ఆర్నెల్లకు బిడ్డను కంటే, కేవలం దాని కారణంగా ఆమె మీద వ్యభిచారనింద మోపడానికి వీల్లేదని నిర్ణయించారు.



గతించాయి కదా! (వారిలో ఒక్కరూ సమాధి నుండి లేచి రాలేదే!!)" అని అంటాడు.

దానికి అతని తల్లిదండ్రులు దైవాన్ని మొరపెట్టుకున్న తర్వాత "ఓరి దౌర్భాగ్యుడా! (మామాట) నమ్ము. దైవవాగ్దానం సత్యమైనది"అనంటారు. కాని అతను (తలబిరుసుతో) "ఇవన్నీ పూర్వకాలంనాటి పుక్కిటిపురాణాలు తప్ప మరేమీ కాదు" అనంటాడు. (17)

ఇలాంటివారికే (నరక)శిక్ష నిర్ణయం వర్తిస్తుంది. (ఇలాంటి చేష్టలకు పాల్పడి) గతించిన జిన్, మానవజాతుల్లో వీరూ చేరిపోయారు. నిస్సందేహంగా వీరు నష్టపోతారు.

ప్రతివర్గానికీ దాని కర్మల్ని బట్టి అంతస్తులుంటాయి. వారు చేసుకున్న కర్మలకు పూర్తి ప్రతిఫలం ఇవ్వడానికే ఇలా జరుగుతుంది. వారికెలాంటి అన్యాయం జరగదు.

తరువాత ఈ అవిశ్వాసుల్ని నరకాగ్ని ముందు నిలబెట్టి వారితో (దైవదూతలు) ఇలా అంటారు: "మీరు ప్రపంచ జీవితంలో మీ వాటాకు వచ్చిన సిరిసంపదలన్నీ తనివితీరా అనుభవించి కాజేశారు. అదీగాక అక్కడ ఎలాంటి నీతి న్యాయం లేకుండా అహంకారంతో విర్రవీగేవారు. ఎన్నో అక్రమాలకు, అధర్మాలకు పాల్పడ్డారు. తత్ఫర్యవసానంగా ఈరోజు మీరు అత్యంత అవమానకరమైన శిక్షగా (నరక) యాతనలకు గురికాబోతున్నారు." (18-20)

ఆద్(జాతి) సోదరుని వృత్తాంతం విన్పించు. అప్పుడతను (అంటే హూద్‌ప్రవక్త) ఇసుక కొండల నేలయిన 'అహ్ఖాఫ్'లో (ధర్మప్రచారం చేస్తూ) తన జాతిప్రజలను ఒక ఉపద్రవం గురించి హెచ్చరించాడు--ఇలా హెచ్చరించేవారు గతంలో, ఆ తర్వాత కూడా వచ్చిపోయారు- "దేవుడ్ని తప్ప మరెవరినీ ఆరాధించకండి. నేను మీ విషయంలో ఒక భయంకర దినాన సంభవించే ఉపద్రవం గురించి భయపడుతున్నాను" అని హెచ్చరించాడతను. (21)

దానికి అతని జాతిప్రజలు (సత్యాన్ని అంగీకరించడానికి నిరాకరిస్తూ) "మమ్మల్ని మా దేవతల నుండి దూరం చేయడానికి వచ్చావా? సరే, నీవు సత్యవంతుడవయితే, మమ్మల్ని బెదరగొడ్తున్న ఆ ఉపద్రవం ఏమిటో తీసుకురా చూద్దాం" అన్నారు. (22)

"ఆ సంగతి దేవునికే తెలుసు. నేను నాకిచ్చి పంపిన సందేశం మాత్రమే మీకు అందజేస్తున్నాను. కాని మీరు చాలా అజ్ఞానం, మూఢత్వాలతో ప్రవర్తిస్తున్నట్లు అన్పిస్తోంది నాకు" అన్నాడు వారి సోదరుడు. (23)

(ఓరోజు) ఆ ఉపద్రవం మేఘాలరూపంలో తమ లోయల వైపు రావడం చూసి "ఈ మేఘాలు మనకెంతో ప్రయోజనం కలిగిస్తాయి" అన్నారు వారు (సంబరపడిపోతూ) "కాదు, ఇది మీరు లోగడ తొందరపెట్టిన ఉపద్రవం. ఇదొక పెనుతుఫాన్, ఘోరమైన ఆపద మోసుకొస్తోంది. అది తన ప్రభువాజ్ఞతో (మిమ్మల్ని) సర్వనాశనం చేస్తుంది." (24)

చివరికి ఆ ఉపద్రవం వారిపై విరుచుకుపడి, వారి నివాస స్థలాలు తప్ప పూర్తిగా తుడిచిపెట్టింది. ఇలా మేము పాపాత్ములకు ప్రతిఫలమిస్తున్నాం. (25)

మేము వారికి మీకివ్వని సిరిసంపదలెన్నో ఇచ్చాం. వారికి మేము కళ్ళు, చెవులు, హృదయాలు కూడా ఇచ్చాం. కాని వారి కళ్ళుగాని, చెవులుగాని, హృదయాలుగాని ఏవీ వారికి ఉపయోగపడలేదు. కారణం వారు దేవుని సూక్తుల్ని (హేళనచేస్తూ) నిరాకరిస్తుండేవారు. చివరికి వారు తాము హేళన చేసినదాని ఉచ్చులోనే పడిపోయారు. (26)

మీ చుట్టుప్రక్కల ప్రాంతాల్లోని అనేక ఊళ్ళను మేము నాశనం చేశాము. ఆ ప్రజలు తమ వైఖరి మానుకుంటారేమోనని, మేము మా సూక్తులు పంపి అనేకసార్లు అనేక విధాలా నచ్చజెప్పాము. వారు దేవుడ్ని వదలి ఇతర శక్తుల్ని దైవసామిప్య సాధనాలుగా భావించి పూజించేవారు. మరి అవి వారిని (ఆపద సమయంలో) ఎందుకు ఆదుకోలేదు? అసలవి వారి నుండి (ఎప్పుడో) కనుమరుగయి పోయాయి. ఇదీ వారి అసత్యాలు, అభూతకల్పనల పర్యవసానం. (27,28)

(సత్యతిరస్కారులకు మరో సంఘటన గుర్తుచెయ్యి:) మేము జిన్నుల సమూహం ఒక దాన్ని ఖుర్‌ఆన్ వాణి వినేందుకు నీదగ్గరకు పంపాము.[2] వారు (నీవు ఖుర్‌ఆన్ పఠిస్తున్న) స్థలానికి చేరుకొని పరస్పరం నిశ్శబ్దంగా ఉండండని అన్నారు. ఖుర్‌ఆన్ పఠనం ముగిసిన తరువాత వారు హెచ్చరించేవారుగా తమ జాతి ప్రజల దగ్గరికెళ్ళి (ధర్మబోధ చేస్తూ) వారితో ఇలా అన్నారు:

“మాజాతి సోదరులారా! మేమొక (అద్భుత) గ్రంథం విన్నాం. ఇది మూసా నిష్క్రమణ తరువాత అవతరించింది. పూర్వం అవతరించిన (దైవ)గ్రంథాలను ధృవీక

---

2. మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ధర్మ ప్రచారం కోసం తాయిఫ్ వెళ్ళి అక్కడ పరిస్థితి అనుకూలించనందున బాధాతప్త హృదయంతో మళ్ళీ మక్కా పట్నానికి తిరుగుముఖం పట్టారు. దారిలో ఆయన నఖ్లా అనే చోట విడిది చేశారు. ఆ రాత్రి ఆయన నమాజులో ఖుర్‌ఆన్ పఠిస్తుంటే జిన్నుల (భూతాల) సమూహం ఒకటి యాదృచ్ఛికంగా అటువచ్చి ఖుర్‌ఆన్ బోధ విన్నది. అయితే ఈ సంగతి దైవప్రవక్త (సల్లం)కు ఏమాత్రం తెలియదు. ఆ తరువాత దేవుడు ఈ సంఘటన గురించి దివ్యావిష్కృతి ద్వారా ఆయనకు తెలియజేశాడు.

ఖుర్‌ఆన్ మానవులకోసమే గాక జిన్నులకోసం కూడా వచ్చింది. కాబట్టి ఈ సంఘటనలో జిన్నులు ఖుర్‌ఆన్ విని విశ్వసించారు. తరువాత వారు తమ జాతి ప్రజలకు దగ్గరికెళ్లి దాన్ని ప్రచారం కూడా చేశారు.

ఈ సంఘటన తర్వాత జిన్నులు తరచుగా దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి ఖుర్‌ఆన్ విని పోతుండేవారు. దైవప్రవక్త (స) మక్కాలో ఉన్నకాలంలో జిన్నులు ఈవిధంగా ఆరుసార్లు వచ్చి పోయారని తెలుస్తోంది. కొన్ని హదీసుల్ని బట్టి దైవప్రవక్త (స) జిన్నుల విజ్ఞప్తిపై నిర్ణీత సమయానికి ఓ ప్రత్యేక నిర్జన ప్రదేశానికెళ్ళి ఖుర్‌ఆన్ పఠించేవారని, అప్పుడు జిన్నులు ఆయన చుట్టూచేరి ఆ దైవవాణిని శ్రద్ధగా వినేవారని తెలుస్తోంది. (మరిన్ని వివరాలకు 72:1-15 సూక్తులు చూడండి.)

మట్టితో సృజించబడిన మానవుల మాదిరిగానే అగ్నితో సృజించబడిన జిన్నులకు కూడా దేవుడు మంచీ చెడుల విచక్షణ జ్ఞానం, వాటిలో తాము కోరిన దాన్ని అవలంబించే స్వేచ్ఛ ప్రసాదించాడు. అందువల్ల జిన్నులకు కూడా స్వర్గ నరకాలు ఉన్నాయి.

(6:128 సూక్తి పాదసూచికతో పాటు, మరికొన్ని విషయాలకు 72:1-15 సూక్తులు చూడండి.)



రిస్తోంది. సత్యం, సన్మార్గాల వైపు మార్గదర్శనం చేస్తుంది. కనుక మాజాతి సోదరులారా! దేవుని వైపు పిలిచేవాని పిలుపు అందుకోండి. ఆయన్ని విశ్వసించండి. దేవుడు మీ తప్పులు మన్నిస్తాడు. మిమ్మల్ని ఘోరశిక్ష నుండి రక్షిస్తాడు.” (29-31)

దైవసందేశ ప్రచారకుని మాట విననివాడు ప్రపంచంలో దేవుని పట్టు నుండి తప్పించుకోలేడు. అంతేకాదు, దేవుని పట్టు నుండి కాపాడగలిగే ఏ సహాయకుడుగాని, సంరక్షకుడుగాని అతనికి లభించడు. ఇలాంటివారే పూర్తిగా మార్గభ్రష్టత్వంలో పడిపోయేవారు. (32)

భూమ్యాకాశాల్ని సృష్టించినవాడికి, వాటిని సృష్టించడంలో ఏమాత్రం అలసిపోనివాడికి మృతుల్ని బ్రతికించే శక్తి కూడా ఉంటుందని వారికి తెలియదా? ఆయన ప్రతి పనీ చేయగల సమర్థుడు, సర్వ శక్తిమంతుడు. (33)

ఈ అవిశ్వాసులను నరకాగ్ని ముందుకు తెచ్చి నిలబెట్టే రోజు “ఇది వాస్తవం కాదా?” అని వారిని అడుగుతారు (దైవదూతలు).

దానికి వారు “వాస్తవమే. మా ప్రభువు సాక్షి! (ఇది వాస్తవమే)” అంటారు.

అప్పుడు “అయితే మీ తిరస్కారానికి పర్యవసానంగా (నరక) యాతన చవి చూడండి” అని చెప్పడం జరుగుతుంది. (34)

కనుక ప్రవక్తా! అనన్య ధైర్యసాహసాలుగల ప్రవక్తలు సహనం వహించినట్లు నీవూ సహనం వహించు. వీరి విషయంలో తొందరపడకు. వీరు తమకు హెచ్చరించబడుతున్న దాన్ని చూసే రోజు వచ్చినప్పుడు, వీరికి తాము భూలోకంలో ఒక ఘడియ కాలం కన్నా ఎక్కువసేపు లేమన్నట్లు అన్పిస్తుంది. (నీ బాధ్యత నెరవేరింది.) విషయం (వారికి) అందజేయ బడింది. ఇక దురాత్ములు తప్ప ఎవరు నాశనమవుతారు? (35) ✪

## అవతరణ: మదీనా 47. ముహమ్మద్ (సల్లం) సూక్తులు: 38

ఈ అధ్యాయం హిజ్రీ శకం రెండవ సంవత్సరంలో బద్ర్ యుద్ధానికి పూర్వం మదీనాలో అవతరించింది. ముస్లింలు మక్కా వదలి మదీనాకు వలసపోయినా సత్యతిరస్కారులయిన మక్కా ఖురైషీయులు వారిని వెన్నాడటం, కవ్వింపు చర్యలకు పాల్పడటం మానుకోలేదు. అదీగాక మక్కాలో ఇంకా ఉండిపోయిన ముస్లింలను తీవ్రంగా వేధించేవారు కూడా. మరో వైపు వారు మదీనా పట్నంపై దాడిచేసి ముస్లింలను శాశ్వతంగా అంతమొందించే ఆలోచనలు కూడా చేయసాగారు. అలాంటి పరిస్థితిలో ఈ అధ్యాయం అవతరించింది.

ఇందులో ముస్లింలను మానసికంగా యుద్ధానికి సమాయత్తం చేసేందుకు తగిన హితవులు ఇవ్వబడ్డాయి. మరో వైపు అవిశ్వాసులు, కపటవిశ్వాసులు అవలంబించిన సత్యవిరోధ వైఖరిని ఖండిస్తూ, వారిని పరలోక దుష్పరిణామాలను గురించి తీవ్రంగా హెచ్చరించడం కూడా జరిగింది. చివర్లో దైవమార్గంలో ధనత్యాగాలను గురించి ముస్లింలను ప్రేరేపించడం జరిగింది.

## కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

ఎవరు సత్యాన్ని తిరస్కరించి, ప్రజలను దైవమార్గంలోకి రానీయకుండా నిరోధిస్తారో వారి కర్మల్ని దేవుడు నిష్ఫలం చేస్తాడు. దీనికి భిన్నంగా ఎవరు సత్యాన్ని విశ్వసించి, సదాచార సంపన్నులయి, ముహమ్మద్ (స)పై అవతరించిన దాన్ని కూడా విశ్వసిస్తారో- అది వారి ప్రభువు నుండి వచ్చిన సత్యవాణి- దేవుడు అలాంటి వారిలో చెడులేమైనా ఉంటే వాటిని దూరంచేసి వారి పరిస్థితిని చక్కబరుస్తాడు. (1, 2)

దీనిక్కారణం అవిశ్వాసులు అసత్యాన్ని అవలంబించారు; విశ్వాసులు తమ ప్రభువు నుండి వచ్చిన సత్యాన్ని అనుసరించారు. ఈవిధంగా దేవుడు మానవుల స్థితిగతులు ఉన్నవి ఉన్నట్లు తెలియజేస్తున్నాడు. (3)

కనుక మీరీ (మక్కా) అవిశ్వాసుల్ని ఎదుర్కోవలసి వచ్చినప్పుడు మొట్టమొదట వారి మెడలను నరకండి. వారిని పూర్తిగా అణచివేసిన తరువాత ఖైదీలను గట్టిగా కట్టివేయండి. ఆ తరువాత యుద్ధం (చేసే శత్రువు) ఆయుధాలు క్రింద పడవేసేవరకు (ఖైదీల విషయంలో) మీరు ఉపకారబుద్ధితోనయినా ప్రవర్తించండి లేదా నష్టపరిహార మయినా తీసుకోండి.[1]

---

1. యుద్ధ ఖైదీల పట్ల ఉపకార బుద్ధితో ప్రవర్తించడమంటే వారి పోషణ, రక్షణ తదితర విషయాల్లో ఉదార స్వభావంతో వ్యవహరించడం, యుద్ధపరిహారం తీసుకోకుండా క్షమించి వదలి పెట్టడం వగైరా ఎన్నో పద్ధతులున్నాయి. ఉదా: ఇక్కడ ఒక సంఘటన పేర్కొంటున్నాను.

బుఖారి, ముస్లిం గ్రంథాల ప్రకారం యమామా ప్రాంతం నాయకుడయిన సుమామా బిన్ ఉసాల్ ఒక యుద్ధంలో ఖైదీగా పట్టుబడి వచ్చినప్పుడు దైవప్రవక్త (సల్లం) అతడ్ని "సుమామా! నీ అభిప్రాయం ఏమిటీ?" అని అడిగారు. దానికి సుమామా ఇలా అన్నాడు: "మీరు నన్ను హత మార్చితే విలువయిన రక్తంగల ఒక వ్యక్తిని హతమార్చిన వారవుతారు. ఒకవేళ మీరు నాకు మేలు చేస్తే, చేసిన మేలును సదా గుర్తుంచుకునే ఒక వ్యక్తికి మేలు చేసినవారవుతారు. ఒకవేళ మీరు నా దగ్గర ధనం తీసుకోదలిస్తే నేనివ్వడానికి సిద్ధంగా ఉన్నాను, అడగండి ఎంతకావాలో."

దైవప్రవక్త (సల్లం) ఈవిధంగా మూడురోజులు అడిగారు. అడిగిన ప్రతిసారీ అతను ఇలాగే సమాధానమిచ్చేవాడు. చివరికి దైవప్రవక్త (సల్లం) అతడ్ని విడిచిపెట్టమని ఆదేశించారు.

సుమామా ఖైదు నుండి విడుదల కాగానే సమీపంలోని ఒక ఒయాసిస్సు కెళ్ళి స్నానం చేసి దైవప్రవక్త (సల్లం) దగ్గరకు తిరిగొచ్చాడు. ఆయన ముందు సద్వచనం (కలిమా) పఠించి ముస్లిం అయిపోయాడు.

అప్పుడాయన దైవప్రవక్త (సల్లం)తో "దీనికి పూర్వం నేను అందరికంటే ఎక్కువ మిమ్మల్ని, అన్ని ధర్మాల కన్నా ఎక్కువ మీ ధర్మాన్ని ద్వేషించేవాడ్ని. కాని ఈరోజు నేను అందరికంటే ఎక్కువ మిమ్మల్ని, అన్ని ధర్మాల కన్నా ఎక్కువ మీ ధర్మాన్ని అభిమానిస్తున్నాను" అని అన్నాడు.

ఆ తరువాత ఆయన ఉమ్రా యాత్ర కోసం మక్కా వెళ్ళి అక్కడి ఖురైష్ నాయకుల్ని ఉద్దేశిస్తూ "ఇక నుండి ముహమ్మద్ (సల్లం)గారి అనుమతి లేకుండా మీకు ఎమామా నుండి ఎలాంటి ధాన్యం పంపడం జరగద"ని హెచ్చరించారు. అలా చేసి చూపారు కూడా. దాంతో మక్కా ఖురైషీయులు దైవప్రవక్త (సల్లం) దగ్గరకొచ్చి "దయచేసి ఎమామా నుండి వచ్చే ధాన్యాన్ని మాకు సరాఫరా కాకుండా నిలుపుదల చేయించకండి" అని విన్నవించుకున్నారు.



ఇవీ మీరు చేయవలసిన పనులు. దేవుడు తలచుకుంటే (మీజోక్యం లేకుండా) స్వయంగానే వారి భరతం పట్టేవాడు. కాని ఆయన మిమ్మల్ని ఒకరి ద్వారా మరొకరిని పరీక్షించడానికి (ఈ పద్ధతి అవలంబించాడు). దైవమార్గంలో చంపబడినవారి కర్మల్ని దేవుడు ఎన్నటికీ నిష్ఫలం చేయడు. వారికి ఆయన (తన ప్రసన్నతాభాగ్యం పొందే) దారి చూపిస్తాడు; వారి పరిస్థితి చక్కబరుస్తాడు; ఆ తరువాత వారిని (ఇంతకు ముందే) పరిచయం చేసిన స్వర్గంలో ప్రవేశింపజేస్తాడు. (4-6)

విశ్వాసులారా! మీరు గనక దేవునికి సహాయంచేస్తే దేవుడు మీకు సహాయం చేస్తాడు. మీ పాదాలను (యుద్ధంలో) స్థిరంగా ఉంచుతాడు. (7)

ఇక సత్యతిరస్కారుల విషయానికొస్తే, వారికి వినాశం (రాసిపెట్టి) ఉంది. దేవుడు వారి పనులను పెడదారి పట్టించాడు. కారణం (మానవుల మార్గదర్శనం కోసం) ఆయన పంపినదాన్ని వారు అసహ్యించుకున్నారు. అందువల్ల దేవుడు వారి కర్మల్ని నిష్ఫలం చేశాడు. వారు ప్రపంచంలో తిరిగి తమకు పూర్వం గతించినవారికి ఎలాంటి గతి పట్టిందో చూడలేదా? దేవుడు వారిని నామరూపాలు లేకుండా తుడిచిపెట్టాడు. అలాంటి దుర్గతే ఈ తిరస్కారుల క్కూడా రాసిపెట్టి ఉంది. (8-10)

దానిక్కారణం, విశ్వసించినవారికి సహాయకునిగా, సంరక్షకునిగా దేవుడున్నాడు. తిరస్కారులకు ఏ సహాయకుడు, సంరక్షకుడూ లేడు. సత్యాన్ని విశ్వసించి సదాచార సంపన్ను లయిన వారిని దేవుడు సెలయేరులు ప్రవహించే స్వర్గవనాలలో ప్రవే శింపజేస్తాడు. సత్యతిరస్కారులు ప్రపంచంలో కొన్నాళ్ళపాటు పశువుల్లా తింటూ, త్రాగుతూ జీవిత భోగభాగ్యాలు అనుభవిస్తారు. ఆ తరువాత వారి అంతిమ నివాసం నరకమవుతుంది. (11,12)

ముహమ్మద్ (సల్లం)! నిన్ను వెళ్ళగొట్టిన పట్నం కన్నా ఎంతో శక్తి, వైభవాలతో తులతూగిన పట్నాలు గతంలో ఎన్నో ఉండేవి. అలాంటి పట్నాలను (సైతం) మేము తుడిచిపెట్టాం. అప్పుడు వారిని కాపాడే నాథుడే లేకపోయాడు. (అవిశ్వాసులకు ఒక విషయం గుర్తుచెయ్యి) ఒక వ్యక్తి తన ప్రభువు తరఫున స్పష్టమైన ప్రమాణంతో సన్మార్గంలో ఉన్నాడు. దీనికి భిన్నంగా మనోవాంఛలకు బానిసలైనవారు కొందరున్నారు. వారి దుష్కార్యాలు వారికి మనోహర మైనవిగా చేయబడ్డాయి. మరి వీరుభయులు సమానమవుతారా? (13,14)

భయభక్తులు కలవారికి వాగ్దానం చేయబడిన స్వర్గం మహా వైభవంగా ఉంటుంది. అక్కడ అణుమాత్రం కూడా కలుషితంకాని పరిశుభ్రమైన నీరుగల (చల్లటి) సెలయేరులు, ఏమాత్రం రుచి కోల్పోని స్వచ్ఛమైన పాల నదులు, పానప్రియులకు అమిత రుచికరంగా ఉండే వారుణీ వాహినీలు, ఎంతో నిర్మలమయిన తేనె ఝరులు (నిరంతరం) ప్రవహిస్తూ ఉంటాయి. అక్కడ అన్ని రకాల పండ్లు లభిస్తాయి. వారి ప్రభువు తరఫున వారికి మన్నింపు భాగ్యం కూడా ఉంటుంది. స్వర్గంలో ఈ మహాభాగ్యాలన్నీ పొందే మనిషి, నరకకూపంలో (నానాయాతనలు అనుభవిస్తూ) ఎల్లకాలం పడివుండే

వాడు సమానమవుతారా? (ఎన్నటికీ కాలేరు.) నరకంలో ఉండేవారికి త్రాగేందుకు సలసల మరిగే నీరిస్తారు. ఆ నీరు వారి ప్రేగుల్ని సైతం మాడ్చివేస్తుంది. (15)

వీరిలో కొందరు చెవులు రిక్కించి నీమాటలు వినడానికయితే బాగానే వింటారు. కాని నీ దగ్గర్నుంచి వెళ్ళిపోయి, జ్ఞానభాగ్యం ప్రసాదించబడినవారిని కలసుకొని "ఇప్పుడీయన గారు చెప్పిందేమిటండీ?" అని అడుగుతారు. (ఈ నిర్లక్ష్యం, కాపట్యాల కారణంగానే) దేవుడు వారి హృదయకవాటాలు మూసివేశాడు. వీరసలు తమ మనో వాంఛలకు బానిసలైపోయారు. సన్మార్గగాములకు మటుకు దేవుడు మరింత సన్మార్గావలంబన బుద్ధి ప్రసాదించి, వారిలో మరింత దైవభీతిని పెంపొందింపజేస్తాడు. (16,17)

(సరే వీరి సంగతేమిటి?) హఠాత్తుగా తమపై ప్రళయం విరుచుకుపడాలని దానికోసం నిరీక్షిస్తున్నారా వీరు? దాని సూచనలు ఇప్పటికే బహిర్గతమయ్యాయి. అయితే అది వచ్చిపడితే వారికిక హితోపదేశం స్వీకరించే అవకాశం ఎక్కడుంటుందనీ?

కనుక ప్రవక్తా! తెలుసుకో, దేవుడుతప్ప మరో ఆరాధ్యుడు లేడు. క్షమాపణ కోరుకో నీ పొరపాట్లకు, విశ్వసించిన స్త్రీపురుషుల పొరపాట్లకు కూడా. దేవునికి మీ కార్యకలాపాలు, మీ నివాసస్థలాలు అన్నీ తెలుసు. (18,19)

విశ్వసించినవారు, (ధర్మయుద్ధం గురించి) ఏదైనా అధ్యాయం ఎందుకు అవతరించ లేదు? అని అడుగుతున్నారు. కాని యుద్ధప్రస్తావన స్పష్టంగా ఉన్న అధ్యాయం అవతరించగానే హృదయాల్లో (కాపట్య) రోగమున్నవారి వైఖరి నీవు గమనించావు కదా! వారు మృత్యువు ఆవహించిన మనిషి చూసినట్లు (బిత్తరబోయి కళ్ళు తేలవేసి) నీవైపు చూడసాగారు. కనుక వారికి వినాశం (రాసిపెట్టి)ఉంది. వారు అతివినయం ఒలకబోస్తూ పైకి మంచిమాటలే పలుకుతారు. కాని కచ్చితమైన ఆజ్ఞ వచ్చినప్పుడు (దాన్నుండి పలాయనం చిత్తగిస్తారు). వారు దేవుని దగ్గర చేసిన వాగ్దానం నిలబెట్టుకొని ఉంటే వారికెంతో మేలు జరిగేది. (20,21)

(కపటులారా!) మీరు గనక (ఈ నూతన విప్లవానికి) విముఖులై (అనాగరిక విధానం వైపుకు) పోతే ప్రపంచంలో మళ్ళీ అరాచకం, అల్లకల్లోలాలు రేకెత్తిస్తూ పరస్పరం ఒకరి  గొంతులు మరొకరు కోసుకుంటారు. అంతకంటే మీనుండి మరేం ఆశించగలం? (22)

వీరసలు దైవశాపగ్రస్తులు. దేవుడు వీరిని (సత్యంకానలేని) అంధులుగా, (హితోక్తులు వినలేని) బధిరులుగా చేశాడు. వీరు ఖుర్ఆన్ (సత్యత)ను గురించి ఆలోచించలేదా? లేక వారి హృదయకవాటాలు మూసుకుపోయాయా? సత్యం, సన్మార్గాలు స్పష్టంగా ముందుకు వచ్చిన తర్వాత కూడా వాటికి విముఖులైపోయారు. అందుకే షైతాన్ వారికోసం ఇలాంటి (కపట)వైఖరిని సులభం చేసి, లేనిపోని ఆశలు వారిలో పెంచిపోషించాడు. (23-25)

ఈ కారణంగానే వారు, దేవుడు పంపిన జీవన విధానాన్ని ద్వేషించేవారితో "కొన్ని



విషయాల్లో మేము మీమాటే వింటాం" అన్నారు. వారు జరిపిన ఈ రహస్య మంతనాలు దేవునికి బాగా తెలుసు. మృత్యుదూతలు వారి ప్రాణాలు తీసి, వారి ముఖాలు, వీపులను చిట్లగొడ్తూ తీసికెళ్తున్నప్పుడు వారి పరిస్థితి ఎలా ఉంటుంది? (26,27)

వారు దేవుని ప్రసన్నతా మార్గం త్రోసిపుచ్చి, ఆయనకు ఆగ్రహం తెప్పించే చేష్టలకు పాల్పడ్డారు. అందుకే దేవుడు వారి కర్మల్ని నిష్ఫలం చేసి ఇలా శిక్షిస్తున్నాడు. హృదయాల్లో (కాపట్య) రోగమున్నవారు, తమ హృదయాల్లో దాగిన కల్మషాన్ని దేవుడు బట్టబయలు చేయడని భావిస్తున్నారా? (28,29)

మేము తలచుకుంటే వారిని నీ కళ్ళకు చూపించగలం. వారి ముఖాలు చూస్తేనే నీవు వారిని గుర్తిస్తావు. వారు మాట్లాడే ధోరణినిబట్టే గుర్తించవచ్చు. మీరు చేసే పనులన్నీ దేవునికి బాగా తెలుసు. మీలో స్థిరచిత్తులెవరో, సాహసవీరులెవరో బహిరంగపరచి మీ పరిస్థితుల నిగ్గుతేల్చడానికి దేవుడు మిమ్మల్ని తప్పకుండా పరీక్షిస్తాడు.[2] (30,31)

అవిశ్వాసులు దైవమార్గంలో ఆటంకాలు సృష్టించడమే గాక సత్యం, సన్మార్గాలు స్పష్టంగా వారి ముందుకు వచ్చినప్పటికీ దైవప్రవక్తతో జగడం పెట్టుకున్నారు. అయినా వారు దేవునికి ఎలాంటి నష్టం కలిగించలేరు. దేవుడే వారి కర్మలను నిష్ఫలం చేస్తాడు.

విశ్వాసులారా! మీరు మాత్రం దేవునికి, దైవప్రవక్తకు విధేయులయి మసలుకోండి. (చేజేతులా) మీ కర్మల్ని నాశనం చేసుకోకండి. (గుర్తుంచుకోండి,) సత్యాన్ని తిరస్కరించే వారిని, దైవమార్గంలో ఆటంకాలు సృష్టించేవారిని, చచ్చేదాకా సత్యతిరస్కారంలోనే పడివుండేవారిని దేవుడు ఎన్నటికీ క్షమించడు. కనుక మీరు ధైర్యం కోల్పోయి (అవిశ్వాసులతో) రాజీపడకండి. (ధైర్యంతో వ్యవహరిస్తే) మీరే విజయం సాధిస్తారు. దేవుడు మీకు తోడుగా ఉన్నాడు. ఆయన మీ కృషిని ఎన్నటికీ వమ్ముచేయడు. (32-35)

ఈ ప్రాపంచికజీవితం ఒక ఆట, తమాషా (లాంటి మూన్నాళ్ళముచ్చట) మాత్రమే. మీరు విశ్వాసులై భయభక్తులతో నడచుకుంటే దేవుడు మీకు రావలిసిన ప్రతిఫలం తప్పకుండా ప్రసాదిస్తాడు. ఆయన మిమ్మల్ని మీ సిరిసందలు ఇవ్వమని అడగటం లేదు. ఆయన మీ ధనాన్ని అడిగితే, చాలా తరిగిపోయే వరకు ఇవ్వమని అడుగుతుంటే మీరు పిసినారితనం చూపుతారు. ఇలా దేవుడు మీ బలహీనతలను బయటపెడ్తాడు. (36,37)

వినండి, దైవమార్గంలో ధనం ఖర్చుపెట్టమని మిమ్మల్ని కోరడం జరుగుతోంది. కాని మీలో కొందరు పిసినారితనం వహిస్తున్నారు. అయితే పిసినారితనం వహిస్తున్న వాడు నిజానికి తన సొంత విషయంలోనే పిసినారితనం వహిస్తున్నాడు (అని వారు తెలుసుకోవాలి). దేవుడు నిరపేక్షాపరుడు. మీరే (సమస్త అవసరాలకు) ఆయనపై ఆధారపడేవారు. మీరు గనక (మా ఆజ్ఞలకు) విముఖులైతే దేవుడు మీ స్థానంలో కొత్తగా మరో జాతిని తెచ్చిపెడతాడు. వారు మీలా ప్రవర్తించరు. (38) ✪

2. ఇతర వివరాలకు 2:155, 29:3 సూక్తులు, వాటి పాదసూచికలు చూడండి.

అవతరణ: మదీనా

# 48. విజయం (ఫతహ్)

సూక్తులు: 29

ఈ అధ్యాయాన్ని "ఫతహ్" (విజయం) అంటారు. ఇది హిజ్రీ శకం ఆరవయేట మక్కాలో దైవప్రవక్త (సల్లం) ఖురైష్ నాయకులతో హుదైబియా ఒప్పందం చేసుకొని మదీనాకు తిరిగి వస్తున్నప్పుడు దారిలో అవతరించింది.

దైవప్రవక్త (సల్లం) తన అనుచరులతో మక్కా వెళ్ళి ఉమ్రా (కాబా దర్శనం) చేసినట్లు ఓరోజు కలగన్నారు. దాన్ని ఆచరణలో పెట్టేందుకు ఆయన కొన్నాళ్ళ తరువాత 1400 మంది సహాబీల(అనుచరుల)తో మక్కా బయలుదేరారు. ఈ సంగతి తెలిసి మక్కా ఖురైషీయులు ముస్లింలను అడ్డుకోవడానికి సైన్యాన్ని పంపారు. ఈవిధంగా ముస్లింలు ఉమ్రా చేయడానిక్కాదు, యుద్ధం చేయడానికి వచ్చారని అరబ్బులలో ప్రచారం చేయవచ్చని వారు ఎత్తుగడ వేశారు.

అయితే దైవప్రవక్త (సల్లం)కు ఈ సమాచారం తెలిసింది. ఆయన వెంటనే ఆ దారి మార్చి వేరే దారిగుండా ప్రయాణం సాగించారు. చివరికి ఎంతో వ్యయప్రయాసలకోర్చి మక్కా నుండి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న హుదైబియా ప్రాంతానికి చేరుకొని అక్కడ విడిది చేశారు.

హుదైబియా ప్రాంతం నాయకుడు బుదైల్ బిన్ వర్ఖా దైవప్రవక్త (స)ను కలుసుకొని వారి రాకకు కారణం అడిగాడు. దైవప్రవక్త (స) తాము కాబాసందర్శనం కోసం మాత్రమే వచ్చామని తెలియజేశారు. బుదైల్ మక్కా వెళ్ళి ఈ విషయమే ఖురైష్ నాయకులకు తెలియజేసి, కాబాదర్శనం కోసం వస్తున్న ఈ యాత్రికుల్ని అడ్డుకోవడం భావ్యంకాదని సలహా ఇచ్చాడు. కాని ఖురైష్ నాయకులు అతని సలహాను ఖాతరు చేయలేదు.

వారు అహాబీష్ తెగల నాయకుడు హులైస్ బిన్ అల్ఖమాను దౌత్యవేత్తగా నియమించి దైవప్రవక్త (స) దగ్గరకు పంపారు. ముస్లింలను ఎలాగైనా తిరిగి వెళ్ళి పోయేలా ఒప్పించాలని చెప్పారు. హులైస్ దైవప్రవక్త (సల్లం)తో మాట్లాడడానికి వెళ్ళాడు. కాని అతనక్కడి పరిస్థితి చూసి ఆశ్చర్యపోయాడు. ముస్లిములంతా కాబాయాత్ర దీక్ష బూని, తత్సంబంధిత దుస్తులు ధరించి ఉన్నారు. వారి ముందు మెడలకు ప్రత్యేకమైన పట్టాలు కట్టిన ఖుర్బానీ(బలి) ఒంటెలు నిలబడి ఉన్నాయి. ఈ దృశ్యం చూసి అతను వీరు యుద్ధం చేయడానికి కాదు, కాబాదర్శనం కోసం మాత్రమే వచ్చారని గ్రహించాడు. అంచేత అతను దైవప్రవక్త (స)ను కలుసుకోకుండానే మక్కా వెళ్ళిపోయాడు. ఖురైషీయులకు ఈ సంగతి తెలిపి "మీరు కాబా పవిత్రతను దిగజార్చుతూ వారిని అడ్డుకుంటే మేము మీతో సహకరించము" అని స్పష్టంగా చెప్పేశాడు హులైస్.

కాని ఖురైషీయులు తమ మంకుతనాన్ని వదలక ఈసారి మరో నాయకుడు ఉర్వా బిన్ మస్వూద్‌ని పంపారు. అతను కూడా వెళ్ళొచ్చి, ప్రవక్తఅనుచరుల గురుభక్తిని ప్రశంసిస్తూ "మీరు ఎలాంటి వారితో తలపడబోతున్నారో మీరే తేల్చుకోండి" అని చెప్పాడు. ఆతర్వాత ఖురైషీయులు ముస్లింలను కవ్వించడానికి ఓరోజు రాత్రివేళ యాభైమంది విలుకాండ్రను పంపారు. వారెళ్ళి ముస్లిం శిబిరాలపై బాణాలు, రాళ్ళు విసిరారు. ముస్లింలు వెంటనే మేల్కొని వారిని బంధించి ప్రవక్త (సల్లం) ముందు



ప్రవేశపెట్టారు. అయితే ఆయన వారిని క్షమించి వదలిపెట్టారు. మరొకసారి తెల్లవారు జామున 80 మంది యోధులు వచ్చి నమాజు చేస్తున్న ముస్లింలపై మెరుపుదాడి చేశారు. చివరికి వారు కూడా పట్టుబడ్డారు. దైవప్రవక్త (సల్లం) వారిని కూడా క్షమించి వదలిపెట్టారు. ఇలా కవ్వించి కయ్యం పెట్టుకోవాలన్న ఖురైషీయుల ఎత్తుగడ నీరు గారిపోయింది.

ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) రాయబారం కోసం హజ్రత్ ఉస్మాన్ (రజి)ని మక్కా పంపించారు. హజ్రత్ ఉస్మాన్(రజి) వెళ్ళి తాము యుద్ధం చేయడానికి రాలేదని, కాబాదర్శనం చేసుకొని వెళ్ళిపోతామని అన్నారు. కాని ఖురైషీయులు దానికి ససేమిరా అంగీకరించలేదు. పైగా ఆయన్ని మక్కానుండి వెళ్ళనివ్వకుండా ఆపిఉంచారు. ఈలోగా ఉస్మాన్‌ని హత్యచేశారని పుకారు పుట్టింది. ఆయన తిరిగి రాకపోవడంతో ముస్లింలు ఈవార్త నిజమేనని ఆగ్రహోదగ్రులైపోయారు. రాజనీతిని ఉల్లంఘించి దౌత్యవేత్తను హత మార్చడం అంటే ఖురైషీయులు స్పష్టంగా యుద్ధప్రకటన చేయడమే. అందువల్ల దైవప్రవక్త (సల్లం) తక్షణమే అనుచరులందర్నీ సమావేశపరచి చివరి రక్తపు బొట్టు చిందే వరకు ఇక్కడ్నుంచి మరలిపోమనే విషయంపై వారిచేత ప్రమాణం చేయించారు. దీన్నే "రిజ్వాన్ శపథం" అంటారు.

తరువాత ఉస్మాన్ (రజి) హత్యవార్త నిజం కాదని తెలిసింది. హజ్రత్ ఉస్మాన్ (రజి) మక్కా నుండి తిరిగొచ్చారు. ఖురైష్ నాయకులు ఒకడుగు వెనక్కి తగ్గి రాజీకోసం సుహైల్ బిన్ అమ్ర్‌ని పంపించారు. సుహైల్ వచ్చి దైవప్రవక్త (స)తో సుదీర్ఘ చర్చలు జరిపాడు. చివరికి ఈక్రింది షరతులపై ఒప్పందం చేసుకోవడానికి ఉభయవర్గాల ప్రతినిధులు అంగీకరించారు.

(1) ఈ సంవత్సరం ముహమ్మద్ (స), ఆయన అనుచరులు ఉమ్రా చేయకుండా వెళ్ళిపోతారు. వచ్చేయేడు ఉమ్రా కోసం వచ్చి వారు మక్కాలో మూడు రోజులు మాత్రమే ఉంటారు. అయితే తమ వెంట ఒక్కొక్క ఖడ్గం మాత్రం తెచ్చుకుంటారు. అది తప్ప మరే ఆయుధ సామగ్రిని వెంట తెచ్చుకోరు.

(2) ఉభయ పక్షాల మధ్య పదేళ్ళ వరకు యుద్ధంగాని, ఒకరికి వ్యతిరేకంగా మరొకరు ఎలాంటి చర్యా తీసుకోవడంగాని జరగదు.

(3) ఈ పదేళ్ళ కాలంలో ఖురైషీయులకు చెందిన ఏ మనిషి అయినా అతని సంరక్షకుని అనుమతి లేకుండా ముహమ్మద్ (సల్లం) దగ్గరకు పారిపోయి వస్తే అతడ్ని వెనక్కి తిప్పి పంపాలి. అయితే ముహమ్మద్ (సల్లం) అనుచరుల్లో ఎవరైనా ఖురైషీయుల దగ్గరికొస్తే అతడ్ని వెనక్కి పంపడం జరగదు.

(4) అరబ్‌తెగలు ఈరెండు పక్షాలలో ఏపక్షంతోనైనా స్నేహఒప్పందం చేసుకోవచ్చు.

ముస్లింలు ఈ ఒప్పందం పట్ల తీవ్ర ఆందోళన చెందారు. పైకి చాలా అన్యాయంగా, దారుణంగా కన్పిస్తున్న ఈ షరతుల్ని చూసి వారు మనస్ఫూర్తిగా అంగీకరించలేక పోయారు. వారికి దైవప్రవక్త (సల్లం) ఎలాగో అతికష్టం మీద నచ్చజెప్పారు. కాని అనుచరులు అయిష్టతతో లోలోన కుమిలిపోసాగారు. అవిశ్వాసులకు తాము లొంగి పోయినట్లు భావించి బాధపడసాగారు.

సంధిపత్రం రాయడం పూర్తికాలేదు. చివరిదశలో ఉంది. అంతలో సుహైల్ కొడుకు అబూజందల్ (రజి) అవిశ్వాసుల నిర్బంధం నుంచి తప్పించుకొని, కాళ్ళకు సంకెళ్ళతో దైవప్రవక్త (సల్లం) దగ్గరకొచ్చి తనను అవిశ్వాసుల బారినుండి కాపాడమని వేడుకున్నారు. ఆయన చేసిన నేరం ఇస్లాం స్వీకరించడమే. ముస్లింలు ఆయన దుస్థితి చూసి చలించిపోయారు. కాని సుహైల్ వెంటనే ప్రవక్త (సల్లం) నుద్దేశించి "సంధిపత్రం రాయడం పూర్తిగాకపోయినా షరతులు ముందుగానే మనమధ్య నిర్ణయమై పోయాయి. కనుక ఇతడ్ని నాకప్పగించాలి" అన్నాడు. దైవప్రవక్త (స) కేవలం నోటిమాటకు కట్టుబడి, బాధాతప్త హృదయంతో అబూజందల్ (రజి)ని సుహైల్‌కు అప్పగించారు. ప్రవక్త అనుచరులు కోపం, దుఃఖం కలగలిసిన భావోద్రేకాలను బలవంతంగా దిగమింగి, నిస్సహాయంగా చూస్తూ ఉండిపోవలసి వచ్చింది.

ఒప్పందం కుదిరిన తరువాత దైవప్రవక్త (సల్లం), ఆయన అనుయాయులు హుదైబియాలోనే పశువుల్ని బలిచ్చి శిరోముండనం చేయించుకున్నారు. ఆ తరువాత ముస్లింలు ఈ ఒప్పందం తమకు అపజయం, అవమానకరమని భావిస్తూ క్రుంగిన మనస్సుతో మదీనాకు తిరుగు ప్రయాణ మయ్యారు. అప్పుడు దారిలో ఒకచోట 'హుదైబియా ఒప్పందం మీపాలిట ఘనవిజయం' అంటూ ఈ అధ్యాయం అవతరించింది. దాంతో వారి ముఖాలలో ఆశ్చర్యం, ఆనందం తొణికిసలాడాయి. ఇంతకూ ఈ ఒప్పందం ఘనవిజయం ఎలా అయిందో పరిశీలిద్దాం.

హుదైబియా ఒప్పందం వల్ల అరేబియాలో చాలావరకు శాంతియుత వాతావరణం నెలకొన్నది. దేశం నలుమూలల నుండి బహుదైవారాధకులు స్వేచ్ఛగా మదీనాకు రాకపోకలు ప్రారంభించారు. వారు మదీనాలో ముస్లింల ధార్మిక జీవనసరళిని దగ్గర్నుండి చూసి ప్రభావితులవుతున్నారు. వారిలో అనేకమంది ఇస్లాం స్వీకరించసాగారు. ఇలా ఇస్లాం అతివేగంగా విస్తరిస్తూ పోతోంది. ఒప్పందం సమయంలో ఇస్లాం పరిరక్షకులుగా 1400 మంది యోధులు మాత్రమే ఉండగా, కేవలం రెండేళ్ళలో ఈసంఖ్య 10,000కు పెరిగింది. ఒప్పందంలోని 4వ నిబంధన ప్రకారం దైవప్రవక్త (సల్లం) అనేక అరబ్బు తెగలతో స్నేహఒప్పందాలు కుదుర్చుకున్నారు. హుదైబియా ప్రాంతంలోని ఖుజాఅ తెగతో కూడా ఒప్పందం కుదుర్చుకొని దాన్ని తమ మిత్రపక్షంగా చేసుకున్నారు.

మరోవైపు దైవప్రవక్త (స)కు ఇస్లామీయ రాజ్యాన్ని పటిష్ఠపరచడానికి, ముస్లింలను నైతికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా మరింత తీర్చిదిద్దడానికి, విదేశీ చక్రవర్తులకు దైవసందేశంతో కూడిన లేఖలు పంపడానికి అవకాశం లభించింది. ఇస్లాంని తీవ్రంగా ద్వేషిస్తూ నిరంతరం కుట్రలు పన్నుతున్న యూదులను సులభంగా అణచివేయగలిగారు. ఖైబర్, ఫిదక్, ఖురాలోయ, తైమా వగైరా యూద ప్రాంతాలు ఇస్లామీయ రాజ్యపరిధిలోకి వచ్చాయి.

మక్కాలో ఇస్లాం స్వీకరించినవారు ఒక్కొక్కరే ఖురైషీయుల నిర్బంధం, చిత్రహింసల బారి నుండి తప్పించుకొని, ఒప్పందంలోని మూడవ షరతు ప్రకారం మదీనా వెళ్ళలేక, ఎర్ర సముద్రం తీరాన సిరియా నుండి మక్కా వచ్చే దారిలో ఓ కీలక ప్రదేశానికి చేరుకోసాగారు. అలా డెబ్భయి, ఎనభై మంది చేరుకొని మక్కా ఖురైషీయుల వర్తక



బిడారాలపై గెరిల్లా దాడులు చేస్తూ వారిని చికాకు పరచడం ప్రారంభించారు. ఈ పోరు పడలేక ఖురైష్ నాయకులు ఒడంబడిక జరిగిన ఏడాదికే హిజ్రీ శకం 7వ ఏట దైవప్రవక్త (సల్లం) దగ్గరకెళ్ళి ఒడంబడికలోని 3వ షరతును రద్దుచేసి ఆ ముస్లింలను మదీనా పిలిపించుకోవలసిందిగా ఆయన్ని అభ్యర్థించారు.

హిజ్రీశకం 7లో ఒప్పందం ప్రకారం దైవప్రవక్త (సల్లం) అనుయాయుల్ని తీసుకొని మక్కా వెళ్ళి ప్రశాంతంగా కాబాయాత్ర జరిపి వచ్చారు. అయితే హి.శ. 8లో ఖురైషీయుల మిత్రపక్షమైన బనూబకర్ తెగ పాత కక్షలతో ముస్లింల మిత్రపక్షమైన ఖుజాఅ తెగపై దాడిచేసి ఘోరమైన హత్యాకాండకు పాల్పడింది. ఈ హత్యాగ్నికి ఖురైషీయులు కూడా ఆజ్యం పోసి హుదైబియా ఒడంబడికను ఉల్లంఘించారు. ఖుజాఅ తెగ ప్రతినిధులు మదీనా వెళ్ళి తమపై బకర్ తెగ జరిపిన హింసాకాండ గురించి దైవప్రవక్త (సల్లం) ముందు విలపిస్తూ చెప్పుకున్నారు. అది హి.శ. 8వ ఏడు. హజ్ కాలం కూడా సమీపించింది. అప్పుడు దైవప్రవక్త (సల్లం) 10,000 మంది సాయుధ సహచరులతో బయలుదేరి పెద్దగా రక్తపాతం లేకుండానే మక్కా పట్టణాన్ని సులువుగా జయించగలిగారు. దాంతో మక్కాప్రజలు, దాని చుట్టుప్రక్కల ఉన్న తెగలవారు దైవప్రవక్త (స)కు లొంగిపోయారు. వారిలో వేలాదిమంది ఇస్లాం స్వీకరించడం కూడా జరిగింది.

ఇవీ ఈ అధ్యాయంలో భవిష్యత్ ప్రకటనగా హుదైబియా ఒప్పందాన్ని ఘనవిజయంగా వర్ణించబడిన రహస్య విశేషాలు.

## కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

ముహమ్మద్ (సల్లం)! మేము నీకు స్పష్టమైన విజయం ప్రసాదించాం. దేవుడు నీగత పొరపాట్లు, భావిపొరపాట్లు మన్నించి నీపై తన అనుగ్రహం పరిపూర్తి చేయాలని, నీకు రుజుమార్గం చూపి, పెద్ద సహాయం చేయాలని (ఈ శుభవార్త నీకు విన్పిస్తున్నాడు).

ఆయనే ముస్లింల విశ్వాసం ద్విగుణీకృతం కావడానికి వారి హృదయాలలో శాంతీ స్థిమితాలను అవతరింపజేశాడు. భూమ్యాకాశాల సైన్యాలన్నీ దేవుని అధీనంలోనే ఉన్నాయి. ఆయన సర్వం ఎరిగినవాడు, ఎంతో వివేకవంతుడు. (1-4)

(ఇలా చేయడానికి కారణం) విశ్వసించిన స్త్రీ పురుషుల్ని శాశ్వతనివాసం కొరకు సెలయేరులు ప్రవహించే స్వర్గవనాలలో ప్రవేశింపజేయాలని, వారి నుండి చెడులను తొలగించాలని- దేవుని దృష్టిలో ఇది గొప్ప విజయం- దేవుడ్ని గురించి అనుమాన రోగానికి గురైన కపట స్త్రీపురుషుల్ని, బహుదైవారాధక స్త్రీపురుషుల్ని శిక్షించాలని ఆయన సంకల్పించాడు.

ఈ అనుమానరోగిష్టులు స్వతహాగానే కీడువలలో చిక్కుకున్నారు. దేవుని ఆగ్రహం వారిపై విరుచుకుపడుగాక! ఆయన ఈ దుర్మార్గులను శపించాడు. వారికోసం అతి చెడ్డ నివాసమైన నరకకూపం సిద్ధపరచి ఉంచాడు. భూమ్యాకాశాల సైన్యాలన్నీ ఆయన అధీనంలోనే ఉన్నాయి. ఆయన సర్వ శక్తిమంతుడు, మహా వివేకవంతుడు. (5-7)

ముహమ్మద్ (సల్లం)! మేము నిన్ను సాక్ష్యమిచ్చేవానిగా, శుభవార్త అందజేసే

వానిగా, హెచ్చరించేవానిగా చేసి పంపాము. ఎందుకంటే (మానవులారా!) మీరు దేవుణ్ణి, ఆయన ప్రవక్తను విశ్వసించండి. ఆయనకు మీ సహాయసహకారాలు అందజేయండి. ఆయన్ని గౌరవించండి. ఉదయం, సాయంత్రం దేవుని పవిత్రతను స్మరిస్తూ ఉండండి.

ప్రవక్తా! నీముందు శపథం చేస్తున్నవారు నిజానికి దేవుని ముందు శపథం చేస్తున్నారు. వారి చేయి (నిజానికి) దేవుని చేతిలో ఉంది. ఇప్పుడీ ప్రమాణాన్ని ఎవరైనా భంగపరిస్తే దాని కీడు వారిపైనే పడుతుంది. ఎవరు దేవుని ముందు ప్రమాణంచేసి దాన్ని నెరవేరుస్తారో, దేవుడు వారికి త్వరలోనే గొప్ప ప్రతిఫలం ప్రసాదిస్తాడు. (8-10)

ప్రవక్తా! గ్రామీణుల్లో (యుద్ధానికి బయలుదేరకుండా) వెనకుండిపోయినవారు ఇప్పుడు నీ దగ్గరికొచ్చి (సాకులు చెబుతూ) "మా ఆస్తులూ, భార్యాపిల్లల గొడవలో పడి మేము రాలేకపోయాము. (దయచేసి) మా మన్నింపు కోసం దైవాన్ని ప్రార్థించండి" అని తప్పకుండా అంటారు. వీరు తమ మనసులో లేని మాటలు చెబుతారు.

కనుక వారికిలా చెప్పెయ్యి: "అదా సంగతి! అయితే దేవుడు మీకు కీడు లేదా మేలు చేయదలిస్తే ఆయన నిర్ణయాన్ని ఎవరూ అడ్డుకోలేరు. మీ వ్యవహారాలను గురించి దేవునికే బాగా తెలుసు. మీరసలు దైవప్రవక్త, విశ్వాసులు (యుద్ధంలో చిక్కుకొని) తమ ఇండ్లకు తిరిగి రాలేరనుకున్నారు. ఈ ఆలోచన మీ మనస్సుకు ఎంతగానో నచ్చింది. మీరిలా దుష్టాలోచనలకు పోయిన పరమదుర్మార్గులు." (11,12)

దేవుణ్ణి, ఆయన ప్రవక్తను విశ్వసించని అవిశ్వాసుల కోసం మేము భగభగమండే నరకాగ్ని సిద్ధపరచి ఉంచాము. భూమ్యాకాశాల సామ్రాజ్యానికి సార్వభౌముడు దేవుడే. ఆయన తలచుకున్న విధంగా కొందరిని క్షమిస్తాడు, మరికొందరిని శిక్షిస్తాడు. తిరస్కారవైఖరి విడనాడినవారి పట్ల ఆయన గొప్ప క్షమాశీలి, అమిత దయామయుడు.

మీరు సమరసొత్తు సేకరించడానికి బయలుదేరితే మాత్రం వెనుక వదిలేయబడిన వారు మీ దగ్గరికొచ్చి "మమ్మల్ని కూడా మీతోపాటు తీసికెళ్ళండి"అని తప్పకుండా అంటారు. వీరు దైవనిర్ణయాన్ని మార్చేయజూస్తున్నారు. (కనుక) "మీరు మాతోపాటు రావడానికి వీల్లేదు. దేవుడు ఈ విషయాన్ని ముందే నిర్ణయించాడ"ని వారికి స్పష్టంగా చెప్పేయండి. దానికి వారు (లోలోన ఉడికిపోతూ) "లేదు, మీరసలు మమ్మల్ని ద్వేషిస్తు న్నారు" అనంటారు. (నిజానికి ఇక్కడ ద్వేషం ప్రసక్తే లేదు.) వీరసలు మంచిమాటను సరిగా గ్రహించరు. (13-15)

వెనకుండిపోయే గ్రామీణులతో ఇలా అనండి: "త్వరలోనే మీరు చాలా శక్తిమంతు లయిన వారితో పోరాడేందుకు పిలవబడతారు. వారితో మీరు యుద్ధం చేయవలసి ఉంటుంది. లేదా వారు విధేయులయి లొంగిపోవచ్చు. అప్పుడు గనక మీరు యుద్ధాజ్ఞను శిరసావహిస్తే దేవుడు మీకు మంచి ప్రతిఫలం ప్రసాదిస్తాడు. అలా కాకుండా మీరు ఇదివరకు ముఖం చాటేసినట్లు చాటేస్తే దేవుడు మీకు అత్యంత బాధాకరమైన శిక్ష విధిస్తాడు." (16)



అంధులు, కుంటివాళ్ళు, వ్యాధిగ్రస్తులు యుద్ధంలో పాల్గొనలేకపోతే ఎలాంటి తప్పు లేదు. దేవునికి, ఆయన ప్రవక్తకు విధేయులైనవారిని దేవుడు సెలయేరులు ప్రవహించే స్వర్గవనాలలో ప్రవేశింపజేస్తాడు. విముఖులయ్యేవారికి దుర్భరశిక్ష విధిస్తాడు.

విశ్వాసులు చెట్టు క్రింద నీ చేతిలో చేయి వేసి శపథం చేస్తున్నప్పుడు దేవుడు వారి పట్ల ప్రసన్నుడయ్యాడు. వారి ఆంతర్యాల స్థితి ఆయనకు తెలుసు. అందువల్ల వారిపై ఆయన శాంతీ స్థిమితాలు అవతరింపజేశాడు. బహుమానంగా వారికి సమీప విజయాన్ని, అపార సమరసొత్తును అనుగ్రహించాడు. దాన్ని వారు (త్వరలోనే) సాధిస్తారు. దేవుడు మహా శక్తిమంతుడు, ఎంతో వివేచనాపరుడు. (17-19)

దేవుడు మీకు పెద్ద ఎత్తున సమరసొత్తు లభిస్తుందని వాగ్దానం చేస్తున్నాడు. ప్రస్తుతం ఆయన మీకు ఈ విజయం ప్రసాదించి, భవిష్యత్తులో మీకు వ్యతిరేకంగా ఇతరులు తోక జాడించకుండా వారిని నిలువరించాడు. మరోవైపు విశ్వాసులకు ఒక నిదర్శనంగా చేశాడు. మీరు సన్మార్గంలో స్థిరంగా ఉండేందుకు దేవుడు మీకు మరింత సద్బుద్ధి ప్రసాదించాలన్న ఉద్దేశ్యం కూడా దీని వెనక ఉంది. అదీగాక మరికొన్ని సమర సొత్తులు కూడా మీకు లభిస్తాయని దేవుడు వాగ్దానం చేస్తున్నాడు. వాటిని మీరింకా సాధించలేదు. దేవుడు వాటిని చుట్టుముట్టి ఉంచాడు. దేవుడు ప్రతి పనీ చేయగల సమర్థుడు, సర్వ శక్తిమంతుడు. (20,21)

ఇప్పుడీ అవిశ్వాసులు గనక మీతో పోరాడితే తప్పకుండా వెన్నుజూపి పారిపోతారు. వారికి ఎలాంటి మద్దతు, సహాయం లభించవు. ఇది పూర్వకాలం నుండీ వస్తున్న దైవ సంప్రదాయం. దైవ సంప్రదాయంలో నీవు ఎన్నడూ మార్పు చూడలేవు. (22,23)

దేవుడే మక్కా లోయలో వారి చేతుల్ని మీనుండి, మీ చేతుల్ని వారినుండి (యుద్ధం జరగకుండా) నిరోధించాడు. నిజానికి ఆయన వారిపై మీకు ఇంతకు ముందే ఆధిక్యత(విజయం) ప్రసాదించాడు. మీరు చేస్తున్నదంతా దేవుడు గమనిస్తూనే ఉన్నాడు.

సత్యాన్ని తిరస్కరించినవారు, మిమ్మల్ని ప్రతిష్ఠాలయం (కాబాగృహం)కు రానివ్వ కుండా నిరోధించినవారు, బలిపశువుల్ని వాటి బలిప్రదేశానికి చేరనీకుండా అడ్డుకున్న వారు వారేకదా! (మక్కాలో) మీరెరుగని స్త్రీపురుష విశ్వాసులు లేకుండా ఉంటే, పొర పాటున మీరు వారిపై కూడా దాడిచేస్తారన్న ప్రమాదం, దానివల్ల మీరు అప్రతిష్ఠ పాలవు తారన్న భయం కూడా లేకుండాఉంటే (ఈ యుద్ధాన్ని మేము నిరోధించేవారం కాదు). దేవుడు తాను కోరిన వారిని తన కారుణ్యఛాయలోకి తీసుకోవడానికే (ఈ యుద్ధాన్ని నిరోధించాడు). ఈ విశ్వాసులు వేరే చోటికి పోయివుంటే (మక్కాలో మిగిలివుండే) అవి శ్వాసుల్ని మేము తప్పకుండా కఠినంగా శిక్షించేవాళ్లం. (24,25)

(ఈ కారణంగానే) ఈ అవిశ్వాసులు మొండి పట్టుదలకు పోయినప్పుడు దేవుడు తన ప్రవక్తకు, విశ్వాసులకు సహనం, సంయమనాలు ప్రసాదించాడు. వారిని భయ భక్తుల వైఖరికి కట్టుబడిఉండేలా చేశాడు. అసలు వారే భయభక్తులు కలిగి ఉండటానికి ఎక్కువ అర్హులు. దేవుడు సర్వం ఎరిగినవాడు. (26)

దేవుడు తన ప్రవక్తకు స్వప్నం చూసిన సంగతి నిజమే. అది సత్యంతో కూడుకున్న స్వప్నం. (దాని ప్రకారం) దేవుడు తలిస్తే (త్వరలోనే) మీరు తప్పకుండా ప్రతిష్ఠాలయం (కాబాగృహం)లో నిర్భయంగా, నిశ్చింతగా ప్రవేశిస్తారు. అక్కడ మీ తలలను పూర్తిగా గొరిగించుకుంటారు లేదా కత్తిరించుకుంటారు. మీకు ఎలాంటి భయముండదు. మీకు తెలియని విషయాలు (ఎన్నో) ఆయనకు తెలుసు. అందువల్ల ఈ స్వప్నం నిజం కావడానికి ముందుగా ఆయన ఈ సమీప విజయాన్ని మీకు ప్రసాదించాడు. (27)

ఆ దేవుడే తన ప్రవక్తకు సన్మార్గం, సత్యధర్మం ఇచ్చి, అది యావత్తు జీవన వ్యవస్థలపై ఆధిక్యత వహించడానికి పంపాడు. దీనికి దేవుని సాక్ష్యమే చాలు. (28)

ముహమ్మద్ (సల్లం) దేవుని సందేశహరుడు. ఆయన అనుచరులు అవిశ్వాసులకు ఏమాత్రం లొంగని దృఢ మనస్కులు. అయితే వారు పరస్పరం ఒకరిపట్ల మరొకరు మృదు హృదయులు, దయామయులు. నీవు ఎప్పుడయినా వారిని చూస్తే వారు రుకూ, సజ్దాలు (ప్రార్థన) చేయడంలో, దేవుని అనుగ్రహం, ఆయన ప్రసన్నతలు అర్థించడంలో నిమగ్నులయి ఉండటం కన్పిస్తుంది. వారి ముఖాలపై సాష్టాంగప్రణామ చిహ్నాలు ఉంటాయి. ఆ చిహ్నాల్ని బట్టే వారిని గుర్తించవచ్చు. ఇవి తౌరాత్‌లో వారిని గురించి వర్ణించబడిన లక్షణాలు.

ఇన్జీల్‌లో వారి లక్షణాలు ఈ విధంగా పోల్చబడ్డాయి: ఒక పొలం ఉంది. అందులో మొదట విత్తనం నుండి చిన్న మొలక అంకురిస్తుంది. తర్వాత అది పటిష్ఠమవుతుంది. ఆతర్వాత కాస్త లావెక్కి కాడగా మారుతుంది. ఆపై ఆ మొక్క తన కాండం మీద నిటారుగా నిలబడుతుంది. అప్పుడు రైతులకు ఆ దృశ్యం కనులపండువగా ఉంటుంది; అవిశ్వాసులు అసూయాగ్నిలో మాడిపోవడానికి (ఈవిధంగా విశ్వాసుల సద్గుణ సంపత్తి పుష్పించి ఫలిస్తుంది). వారిలో సత్యాన్ని విశ్వసించి సదాచార సంపన్నులయిన వారిని దేవుడు మన్నించి గొప్ప ప్రతిఫలం ప్రసాదిస్తానని వాగ్దానం చేశాడు. (29) ✪

# 49. నివాసగృహాలు (హుజురాత్)

**అవతరణ: మదీనా** **సూక్తులు: 18**

ఈ అధ్యాయంలోని సూక్తులు హి.శ. 8 నుంచి 10 వరకు వివిధ సందర్భాలలో అవతరించాయి. ఇందులో సభ్యతా సంస్కృతులు బోధించబడ్డాయి. సామూహిక చెడులకు, నింద, హేళన, వర్ణ, వర్గ విచక్షణలకు దూరంగా ఉండాలని, దైవాజ్ఞల పాలనలో చిత్తశుద్ధి కలిగివుంటూ మాటల్లోనేగాక, చేతల్లో కూడా విశ్వాసాలు వెలిబుచ్చే క్రియాశీలురయిన ముస్లింలుగా మసలు కోవాలని చెప్పడం జరిగింది.

**కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం**

విశ్వాసులారా! దేవుని సమక్షంలో, ఆయన ప్రవక్త సమక్షంలో మీరు మితిమీరి పోకండి. దేవునికి భయపడండి. దేవుడు సమస్తం వింటున్నాడు; సర్వం ఎరిగినవాడు.



మీరు పరస్పరం బిగ్గరగా మాట్లాడుకున్నట్లు దైవప్రవక్త ముందు బిగ్గరగా మాట్లాడకండి. (దీనివల్ల కూడా) మీరు చేసుకున్న సత్కర్మలు మీ ఆలోచనకు సైతం తట్టని విధంగా నిష్ఫలం కావచ్చు. దైవప్రవక్త ఎదుట (వినయంతో) కంఠస్వరం తగ్గించి మాట్లాడేవారే నిజమైన దైవభీతిపరులు. భయభక్తుల కోసం దేవుడు వారి హృదయాలు పరీక్షించి చూశాడు. వారికి మన్నింపు, గొప్ప ప్రతిఫలం లభిస్తాయి. (1-3)

ప్రవక్తా! (నీ) నివాసగృహాల బయటనుంచి నిన్ను కేకలుపెట్టి బిగ్గరగా పిలుస్తున్న వారిలో చాలామందికి బుద్ధిలేదు. నీవు బయటికి వచ్చేవరకు వారు ఓపిక పట్టివుంటే వారికి మేలయి ఉండేది. (సరే, పోనివ్వు.) దేవుడు క్షమాశీలి, దయామయుడు. (4,5)

విశ్వాసులారా! మీ దగ్గరకు ఎవరైనా దుర్జనుడు ఏదైనా (ముఖ్య) సమాచారం తీసుకొస్తే దాన్ని ఓసారి క్షుణ్ణంగా పరిశీలించండి. అలా చేయకుంటే మీరు ఏదైనా వర్గానికి పొరపాటున నష్టం కల్గించవచ్చు. ఆ తరువాత మీరు జరిగిన దానికి విచారిస్తారు.[1] అలాంటి పరిస్థితి రాకూడదు సుమా! జాగ్రత్త! మీ మధ్య దైవప్రవక్త ఉన్నాడన్న సంగతి మరచిపోకండి. అనేక వ్యవహారాల్లో ఆయన మీమాటను ఒప్పుకుంటే చివరికి మీరే ఇబ్బందుల్లో పడిపోతారు. దేవుడు మీ విశ్వాసవైఖరి పట్ల మీలో ప్రేమాభిమానాలు జనింపజేశాడు. దాన్ని మీ హృదయాలకు ప్రియమైన వస్తువుగా చేశాడు. అవిశ్వాసం, అవిధేయత, దుర్నడతల పట్ల మీకు ఏవగింపు కలిగించాడు. ఇలాంటివారే దేవుని అనుగ్రహం, ఔదార్యాల వల్ల సన్మార్గంలో ఉన్న వారు. దేవుడు సర్వజ్ఞాని, మహా వివేకవంతుడు. (6-8)

---

1. ఈ సూక్తి వలీద్ బిన్ ఉఖ్బా విషయంలో అవతరించిందని వ్యాఖ్యానకర్తల అభిప్రాయం. బనీ ముస్తలిఖ్ తెగవాళ్ళు ఇస్లాం స్వీకరించిన తరువాత దైవప్రవక్త (సల్లం) వారినుండి జకాత్ తీసుకు రావడానికి వలీద్ బిన్ ఉఖ్బాని పంపించారు. కాని వలీద్ ఆ ప్రాంతానికి చేరుకొని, ఏదో కారణంతో భయపడి ఆ తెగవారిని కలవకుండానే మదీనా తిరిగొచ్చారు. వచ్చి, వారు జకాత్ చెల్లించడానికి నిరాకరించారని, తనను హతమార్చ జూస్తున్నారని ఫిర్యాదు చేశారు.

దైవప్రవక్త (సల్లం) ఈ సంగతి వినగానే ఆగ్రహోదగ్రులయి ఆ తెగ పీచం అణచేందుకు ఓ సైనికదళం పంపడానికి సన్నాహాలు ప్రారంభించారు. ఈలోగా బనీ ముస్తలిఖ్ తెగ నాయకుడు (విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ జువైరియా గారి తండ్రి హారిస్ బిన్ జిరార్) తన అనుచరులు కొందరిని వెంటబెట్టుకొని మదీనా వచ్చారు. ఆయన దైవప్రవక్త (సల్లం)ను కలుసుకొని "దైవసాక్షి! మేము వలీద్‌ని కనీసం చూడనైనా చూడలేదు. అంచేత మేము జకాత్ చెల్లించడానికి నిరాకరించామన్న, ఆయన్ని చంపదలిచామన్న ప్రశ్నే తలెత్తదు. మేము ఇప్పటికీ ఇస్లాం ధర్మంలో స్థిరంగా ఉన్నాం. జకాత్ చెల్లింపును మేము నిరాకరించడం లేదు" అని అన్నారు. అప్పుడీ సూక్తి అవతరించింది. ముఖ్యమైన వ్యవహారం గురించి ఏదైనా సమాచారం అందినప్పుడు ఆ సమాచారం అందజేసిన వ్యక్తి మంచివాడా, చెడ్డవాడా, సత్యవంతుడా, అబద్ధాలమారియా, నమ్మకస్తుడా, మోసగాడా అనే విషయాల్ని గురించి పరిశోధించి తెలుసుకున్న తరువాతే ఆ సమాచారానికి సంబంధించి తగిన చర్య తీసుకోవాలని, దారినపోయే ప్రతి దానయ్య మోసుకొచ్చే గాలికబుర్లు నమ్మి వెంటనే ప్రతిస్పందించకూడదని ధర్మవేత్తలు ఈ సూక్తిని గురించి వ్యాఖ్యానించారు. అయితే ప్రాధాన్యంలేని సాధారణ వ్యవహారాలలో అంతగా ఆరా తీసి అడుగెయ్య నవసరంలేదు.

విశ్వాసుల్లో రెండువర్గాలు పరస్పరం జగడానికి దిగితే వారిమధ్య రాజీ కుదర్చండి. ఒకవేళ (రాజీయత్నం విఫలమయి) ఆ రెండు వర్గాల్లో ఒక వర్గం రెండో వర్గంపై దౌర్జన్యానికి పాల్పడితే, దౌర్జన్యానికి పాల్పడిన వర్గం దేవుని ఆజ్ఞ (షరీఅత్ ఆదేశాల) వైపు మరలివచ్చే దాకా దానితో పోరాడండి. అది దేవుని ఆజ్ఞ వైపు మరలివస్తే వాటి మధ్య న్యాయంగా రాజీ కుదర్చండి. న్యాయం చేయండి, న్యాయం చేసేవారిని దేవుడు ప్రేమిస్తాడు. (9)

విశ్వాసులు పరస్పరం అన్నదమ్ముల్లాంటివారు. కనుక మీ అన్నదమ్ముల మధ్య సత్సంబంధాలు నెలకొల్పండి.[2] దేవునికి భయపడండి, మీరు కరుణించబడతారు. (10)

విశ్వాసులారా! పురుషులు తోటి పురుషుల్ని హేళన చేయకూడదు. వీరి కంటే వారే మంచివారయి ఉండవచ్చు. అలాగే స్త్రీలు తోటి స్త్రీలను గేలి చేయకూడదు. వీరి కంటే వారే మంచివారయి ఉండవచ్చు. మీరు ఒకరి తప్పులు మరొకరు ఎత్తి చూపుకుంటూ పరస్పరం బురద చల్లుకోకండి. పరస్పరం తప్పుడు పేర్లతో పిలుచుకోకండి. విశ్వాసభాగ్యం పొందిన తరువాత చెడ్డపేరు తెచ్చుకోవడం చాలా తప్పు. ఈ వైఖరి మానుకోనివారే దుర్మార్గులు. (11)

విశ్వాసులారా! మితిమీరిన అనుమానాలకు పోకండి. కొన్ని అనుమానాలు (మీకు) పాపాలుగా పరిణమించవచ్చు. (ప్రజల) రహస్య విషయాల వెనుక పడకండి.[3] మీలో

---

2. ముస్లిములు ఒక సైద్ధాంతిక సమాజానికి చెందిన సభ్యులు. అందువల్ల ప్రపంచంలో ఎక్కడున్నా పరస్పరం సత్సంబంధాలు కలిగి ఉండాలని, వారి మధ్య అంతర్జాతీయ సౌభ్రాతృత్వం నెలకొని ఉండాలని ఈ సూక్తి చెబుతోంది. మహాప్రవక్త (సల్లం) మహితోక్తులు కొన్ని చూడండి:

"ఒక ముస్లిం మరొక ముస్లింకు సోదరుని వంటివాడు. అతను తోటిముస్లిం మీద దౌర్జన్యానికి, అన్యాయానికి పాల్పడడు. అతని సహచర్యాన్ని విడనాడడు. అతడ్ని కించపరచడు. తోటిముస్లిం సోదరుడ్ని కించపరచడం వంటి చెడుకు మించిన ఘోరమైన చెడు లేదు." (ముస్నద్ అహ్మద్)

"ముస్లిం తోటిముస్లింని దూషించడం దుర్మార్గం. అతనితో యుద్ధం చేయడం అవిశ్వాసం (కుఫ్ర్)తో సమానం." (బుఖారి)

"ప్రతి ముస్లింకు తోటిముస్లిం ధనమానప్రాణాలు (హరించడం) నిషిద్ధం." (ముస్లిం)

"శిరస్సుకు, శరీరానికి ఎలాంటి సంబంధం ఉందో ఒక విశ్వాసి తోటి విశ్వాసులతో అలాంటి సంబంధమే కలిగి ఉంటాడు. శరీరంలోని ప్రతి అవయవం అనుభవించే బాధను శిరస్సు ఎలా పాలుపంచుకుంటుందో తోటి విశ్వాసులు అనుభవించే బాధను కూడా ఆ విశ్వాసి అలాగే పాలు పంచుకుంటాడు." (ముస్నద్ అహ్మద్)

మరిన్ని వివరాలకు 3:103 సూక్తి, దాని పాదసూచిక చూడండి.)

3. ఒక వ్యక్తిలో ఏదైనా చెడు ఉన్నట్లు అనుమానం వస్తే దాన్ని గురించి ఆరా తీయడానికి ప్రయత్నించకూడదని ఈ సూక్తి తెలియజేస్తోంది. హజ్రత్ ఉమర్ (రజి) పాలనాకాలంలో ఓసారి అర్ధరాత్రివేళ ఒక వ్యక్తి తన ఇంట్లో ఏదో పాట పాడుతున్నాడు. ఆ పాట వినగానే గస్తీ తిరుగుతున్న హజ్రత్ ఉమర్ (రజి)కు అనుమానం వచ్చింది. ఆయన వెంటనే అతని ఇంటి గోడెక్కి తొంగిచూస్తే మందూ, మగువా కన్పించాయి. ఆయన కోపంతో "ఓరి దైవవిరోధీ! నీవు దేవుని ఆజ్ఞలను ఉల్లంఘిస్తుంటే ఆయన నీ గుట్టు రట్టు చేయడని భావించావా?" అని అరిచారు.



ఏ ఒక్కరూ ఇతరుల్ని పరోక్షంగా నిందించకూడదు. మీలో ఎవరైనా మీ మృతసోదరుని మాంసం తినడానికి ఇష్టపడతారా? చూశారా, మీరే దాన్ని అసహ్యించుకుంటారు.[4] దేవునికి భయపడుతూ మసలుకోండి. దేవుడు ఎంతో క్షమాశీలి, దయామయుడు. (12)

మానవులారా! మేము మిమ్మల్ని ఒకే స్త్రీపురుష జంటనుండి పుట్టించాము. తర్వాత మీ పరస్పరపరిచయం కోసం మిమ్మల్ని విభిన్న జాతులుగా, తెగలుగా చేశాం. అయితే మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే దేవుని దృష్టిలో ఎక్కువ గౌరవనీయుడు.[5] నిస్సందేహంగా దేవుడు సర్వజ్ఞాని, సమస్త విషయాలు తెలిసినవాడు. (13)

---

దానికా వ్యక్తి ఇలా అన్నాడు: "విశ్వాసుల నాయకా! తొందరపడకండి. నేను ఒకపాపం చేస్తే మీరు మూడుపాపాలు చేశారు. దేవుడు ఇతరుల రహస్యాలు కూపీ తీయడాన్ని నిషేధించాడు. కాని మీరా పని చేశారు. దేవుడు ఇండ్లలోకి ముఖద్వారం గుండా ప్రవేశించమని ఆదేశిస్తే మీరు ప్రహరీ గోడెక్కి వచ్చారు. దేవుడు ఇతరుల ఇండ్లలోకి వారి అనుమతి లేకుండా ప్రవేశించకూడదంటే, మీరు నా అనుమతి లేకుండానే నా ఇంట్లో ప్రవేశించారు."

ఉమర్ (ర) ఈమాట విని తప్పు ఒప్పుకున్నారు. అతనిపై ఎలాంటిచర్య తీసుకోలేదు. కాకపోతే అతనిచేత దుష్కార్యాలు మానేసి నీతిమార్గం అవలంబిస్తానన్న వాగ్దానం చేయించుకున్నారు.

4. పరోక్షంగా నిందించకూడదంటే ప్రత్యక్షంగా నిందించవచ్చని అర్థం కాదు. ప్రత్యక్ష నింద కంటే పరోక్ష నింద తీవ్రమైన విషయమని తెలుసుకోవాలి.

మహాప్రవక్త (సల్లం) ఓసారి "పరోక్షనింద వ్యభిచారం కన్నా నీచమైన పాపం" అన్నారు. అనుచరులు ఈమాట విని "దైవప్రవక్తా! పరోక్షనింద వ్యభిచారం కన్నా నీచమైన పాపం ఎలా అవుతుంది?" అని అడిగారు. దానికి ఆయన సమాధానమిస్తూ "మనిషి వ్యభిచారం చేసిన తరువాత పశ్చాత్తాపంతో క్షమాపణ కోరుకుంటే దేవుడు అతడ్ని క్షమిస్తాడు. కాని పరోక్ష నిందకు పాల్పడినవాడ్ని నిందితుడు క్షమించనంత వరకు దేవుడు అతడ్ని క్షమించడు" అని వివరించారు (మిష్కాత్)

ఆయన మరో సందర్భంలో ఇలా తెలిపారు: "పరోక్ష నిందకు ఒక ప్రాయశ్చిత్తం- నీవు ఎవరిపై నింద మోపావో అతనికి దేవుడు క్షమాభిక్ష ప్రసాదించాలని వేడుకోవాలి. అతను 'దేవా! నాకు, అతనికి క్షమాభిక్ష పెట్టు' అని ప్రార్థించాలి." (మిష్కాత్)

పరోక్ష నింద విషయంలో కొన్ని మినహాయింపులున్నాయి. ధర్మశాస్త్రం దృష్టిలో ఒక విషయం ఎంతో అవసరమైనప్పుడు, పరోక్షనిందకు పోకుండా ఆ పని నెరవేరని పరిస్థితి ఏర్పడి నప్పుడు పరోక్షనింద ధర్మసమ్మతం అవుతుంది.

ఉదాహరణకు- పీడితుడు దౌర్జన్యపరుడికి వ్యతిరేకంగా ఆ దౌర్జన్యం నుండి కాపాడగల వ్యక్తి ముందు నిందారోపణ చేయవచ్చు. సంస్కరణాభిలాషతో ఒకవ్యక్తి లేక ఒక వర్గంలోని చెడుల్ని గురించి వాటిని దూరంచేయగలవారి ముందు ప్రస్తావించవచ్చు. దుర్మార్గుడి దుర్మార్గపు పనులను గురించి ప్రజలను హెచ్చరించవచ్చు. సాక్షుల లోపాలను ఎత్తి చూపవచ్చు. పెళ్ళి చేసుకోదలచిన వారికి తత్సంబంధిత వరుడు లేక వధువులోని లోపాలను తెలియజేయవచ్చు.

5. విభిన్న జాతుల, వ్యక్తుల మధ్య ఉన్న జన్యుసారూప్యతలను, జన్యు వ్యత్యాసాలను పరిశీలించిన "హ్యూమన్ జెనోమ్ ప్రాజెక్ట్" శాస్త్రవేత్తలు 13-2-2001 తేదీ దినపత్రికల కథనం ప్రకారం ఓ కొత్త విషయం కనుగొన్నారు. మానవులంతా ఆఫ్రికాలోని ఒక తల్లికి జన్మించిన సంతతికి చెందిన వారేనని, ఆయా ప్రాంతాల్లోని వాతావరణం, ఇతరపరిస్థితుల్ని బట్టి మాత్రమే రూపురేఖల్లో తేడాలు వచ్చాయనే వాదనలకు ఈ పరిశోధనలు బలం చేకూరుస్తున్నాయని వారు తెలిపారు.

మానవాళి మాతృమూర్తి పుట్టిల్లు ఆఫ్రికా ఖండం అన్నమాట. ఈ పరిశోధనల్లో మానవుడు కోతి నుండి పరిణామం చెందాడన్న డార్విన్ జీవపరిణామ సిద్ధాంతానికి కాలంచెల్లే సూచనలు కూడా కన్పిస్తున్నాయి. మానవాళి మాతృమూర్తి పుట్టిల్లు ఆఫ్రికా అని నిర్ధారించిన శాస్త్రవేత్తలు మరి కొన్నేళ్ళకు మానవాళి పితృమూర్తి పుట్టిల్లు శ్రీలంక అని, ఆ తరువాత కొంతకాలానికి వారుభయుల కలయికతో పుట్టి విస్తరించిన యావత్తు మానవ సంతతి అరేబియన్‌లని నిర్ధారించినా ఆశ్చర్యం లేదు. ఎందుకంటే అవి ఇస్లాం సత్యతను ధృవపరిచే విషయాలు.

అమెరికా 'సైన్స్' జర్నల్‌లో శాస్త్రవేత్తలు ఈ పరిశోధన గురించి వ్యాఖ్యానిస్తూ "తెల్లవారు-నల్లవారు, ఎర్రవారు-పచ్చవారు అనే తేడాలు లేకుండా అందరూ ఒకే సంతతికి చెందినవారని తెలిపేందుకు ఇంతకంటే గట్టి ఆధారం ఏముంటుంద?"ని అన్నారు. 'సెలారా జినోమిక్స్ కార్పొరేషన్' శాస్త్రవేత్త డాక్టర్ వెంటర్ మాట్లాడుతూ "జాతి (Race) అనేది శాస్త్రీయ దృక్పథమని ఈ రంగంలో పనిచేసే విజ్ఞత కలిగిన ఏ పండితుడు కూడా భావించడ"ని అన్నారు.

జర్మనీలోని 'ఎవల్యూషనరీ ఆంత్రోపాలజీ' సంస్థకు చెందిన ప్రొఫెసర్ స్వాండేపాబో జన్యు సారూప్యతలు, వ్యత్యాసాలను గురించి సాధించిన సమాచారంపై వ్యాఖ్యానిస్తూ, "ఈ జ్ఞానం (మానవుల మధ్య) సాంఘిక సహనం, సానుభూతులను ప్రోత్సహిస్తుంద"ని అన్నారు. "జీన్స్ డాటా ఉపయోగించి జాతితత్వం(Racism), ఇతర దురభిమానాలకు శాస్త్రీయ సమర్థన(Scintific support) సాధించలేమని; హింసాపీడనలు, సంకుచితత్వాలు, జాతీయ దురభిమానాలు అనేవి అజ్ఞానం, మూఢత్వాల నుండి పుట్టుకొచ్చిన విషయాలయినందున అలాంటి పరిశోధనల కోసం చేసే ప్రయ త్నాలు వ్యతిరేక ఫలితాలు తెచ్చిపెడ్తాయ"ని ఆయన తెలిపారు.

ఈనాడు టి.వి, కంప్యూటర్, ఇంటర్‌నెట్ వంటి మాధ్యమాలు యావత్తు ప్రపంచాన్ని "వసుధైక గ్రామం"(Globle village)గా మార్చినా, ఈ వసుధైక గ్రామీణుల మధ్య జాతి విద్వేషాలు, వర్ణవైషమ్యాలు, మత దురభిమానాలు ఇంకా సమసిపోలేదు. మానవజన్యు పరిశోధన అసహజ మైన ఈ అడ్డుగోడలను ఏమేరకు కూల్చగలదో చెప్పలేము.

శాస్త్రపరిశోధన ద్వారా వాస్తవం స్పష్టంగా ముందుకు వచ్చినా ఏకదైవభీతి, సరైన పరలోక భావన వంటి బలమైన ఆధ్యాత్మిక ప్రేరకాలు ప్రజల అంతరంగాల్లో చోటుచేసుకోనంత వరకూ ఈ అడ్డుగోడల్ని కూల్చడం కష్టమే. ఇస్లాం మొదటి నుండే మానవులందరూ ఆది దంపతులైన ఆదం, హవ్వా (అలైహి)ల సంతతేనని చెబుతోంది. భౌగోళిక పరిస్థితులు, వాతావరణ స్థితిగతుల కారణంగా ఏర్పడిన సహజ వ్యత్యాసాలతో మానవులలో కొందరిని అధికులుగా, మరికొందరిని అధములుగా, నీచులుగా భావించడం దేవుని దృష్టిలో ఘోరమైన పాపం. ఇవన్నీ అజ్ఞానం వల్ల ఏర్పడిన విషయాలు. జన్యుపరిశోధన శాస్త్రవేత్తలు కూడా ఇలాంటి అభిప్రాయాన్నే వెలిబుచ్చారు.

ఈ వాస్తవాన్ని గురించి స్వయంగా దైవప్రవక్త (సల్లం) ఇలా తెలియజేశారు:

"ప్రళయదినాన దేవుడు మీ కులగోత్రాలను గురించి అడగడు. మీలో అందరికంటే ఎక్కువ దైవభీతి కలవాడే దేవుని దృష్టిలో ఎక్కువ గౌరవనీయుడు." (ఇబ్నెమాజ)

"దేవుడు మీ రూపురేఖల్ని చూడడు. ఆయన మీ అంతర్యాలను, ఆచరణలను మాత్రమే చూస్తాడు." (ముస్లిం, ఇబ్నెమాజ)

"ప్రజలారా! జాగ్రత్తగా వినండి, మీకందరికీ దేవుడు ఒక్కడే. అరబ్బులకు అరబ్బేతరులపై, అరబ్బేతరులకు అరబ్బులపై, తెల్లవాళ్ళకు నల్లవాళ్ళపై, నల్లవాళ్ళకు తెల్లవాళ్ళపై దైవభీతి ప్రాతిపదిక పై తప్ప ఎలాంటి ఔన్నత్యం లేదు. మీలో అందరికంటే ఎక్కువ దైవభీతిపరుడే దేవుని దృష్టిలో ఎక్కువ గౌరవనీయుడు......" (బైహఖి)



ఈ గ్రామీణులు తాము విశ్వసించామని చెప్పుకుంటారు. వారితో ఇలా అను: "మీరసలు (సత్యాన్ని) విశ్వసించలేదు. దానికి బదులు మేము లొంగిపోయామని చెప్పండి. మీ అంతర్యాలలో విశ్వాసం ఇంకా ప్రవేశించ లేదు. మీరు దేవునికి, ఆయన ప్రవక్తకు విధేయులై మసలుకుంటే దేవుడు మీ కర్మఫలంలో ఎలాంటి కొరత చేయడు. ఆయన గొప్పక్షమాశీలి, అమితదయామయుడు." దేవుణ్ణి, ఆయన ప్రవక్తను మనస్ఫూర్తి గా విశ్వసించి, ఇక దానిపై ఎలాంటి అనుమానానికి ఆస్కారమివ్వకుండా దైవమార్గంలో ధనప్రాణాలొడ్డి పోరాడేవారే నిజమైన విశ్వాసులు. వారే సత్యవంతులు. (14,15)

ప్రవక్తా! (విశ్వాసించామని చెప్పుకుంటున్న) వారికిలా చెప్పు: "మీరు దేవునికే ఆయన ధర్మం గురించి నేర్పుతున్నారా? ఆయన భూమ్యాకాశాల్లోని సమస్త విషయాలు ఎరిగినవాడు. ప్రతి వస్తువుకు, ప్రతి విషయానికి సంబంధించిన పరిజ్ఞానం ఆయనకుంది.

వీరు ఇస్లాం స్వీకరించి నీకేదో ఉపకారం చేసినట్లు మాట్లాడుతున్నారు. వారికి చెప్పు: "మీ ఇస్లాం స్వీకరణకు సంబంధించిన ఉపకారం నామీద పెట్టకండి. దేవుడే మీకు ఇస్లాం స్వీకారభాగ్యం ప్రసాదించి ఎంతో మేలు చేశాడు; మీరు నిజమైన విశ్వాసు లైతే (మీ ఉపకారి ఎవరో మీకే తెలుస్తుంది)." భూమ్యాకాశాల్లోని నిగూఢ విషయాలన్నీ దేవునికే తెలుసు. మీరు చేస్తున్న ప్రతిపనీ ఆయన దృష్టిపథంలో ఉంది. (16-18) ✪

## 50. ఖాఫ్

**అవతరణ: మక్కా** **సూక్తులు: 45**

ఈ అధ్యాయం ప్రారంభ బీజాక్షరాన్నే దీనికి మకుటంగా పెట్టడం జరిగింది. ఇది నబవీశకం 3,5 ఏండ్ల మధ్యకాలంలో అవతరించినట్లు తెలుస్తోంది. ఇందులో ఎక్కువగా పరలోకం గురించిన విషయాలు, వాటికి సంబంధించిన ప్రమాణాలే ఉన్నాయి.

### కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

ఖాఫ్, ఖుర్ఆన్ సాక్షి! (నిస్సందేహంగా ముహమ్మద్ దేవుని ప్రవక్తే.) కాని ఒక హెచ్చరించేవాడు తమలోనే ఉద్భవించి తమ దగ్గరకు రావడమేమిటని వారు ఆశ్చర్య పోతున్నారు. (పైగా ఈ) అవిశ్వాసులు "చాలా విచిత్రంగా ఉందే! మనం ఒకసారి చని పోయి మట్టిలో కలసిపోయిన తరువాత (మళ్ళీ బ్రతికించబడతామా)? ఇది బుద్ధికందని విషయం" అని చెప్పసాగారు. (కాని) వారి దేహంలో భూమి తినేసే భాగాలేమిటో మాకు తెలుసు. మా దగ్గరున్న గ్రంథంలో అంతా నమోదయి భద్రంగా ఉంది. (1-4)

అయితే వారు సత్యం దగ్గరకొచ్చినప్పుడు దాన్ని (గురించి ప్రశాంతంగా ఆలోచించ కుండా) తిరస్కరించారు. అందువల్లనే వారిప్పుడు దైవప్రవక్తను గురించి నిరాధారమైన

---

"మీలోని అజ్ఞాన కాలంనాటి చెడుల్ని, అహంకారాన్ని దూరం చేసిన దేవుడు ఎంతో ప్రశంస నీయుడు. ప్రజలారా! యావత్తు మానవులు రెండే రెండు వర్గాల్లో విభజించబడ్డారు. (1) సజ్జనులు, దైవభీతిపరులు. వీరు దేవుని దృష్టిలో గౌరవనీయులు. (2) దుర్మార్గులు, దౌర్భాగ్యులు. వీరు దేవుని దృష్టిలో తుచ్ఛులు. (ఈభేదం గనక) లేకపోతే మానవులంతా ఆదం సంతానం (అయిన దృష్ట్యా అంతా సమానులే). ఆదంని దేవుడు మట్టితో సృజించాడు." (తిర్మిజి)

అభిప్రాయాలు వెలిబుచ్చుతూ కచ్చితమైన నిర్ణయానికి రాలేక సందిగ్ధంలో పడిపోయారు.

వారెప్పుడైనా తమ పైనున్న ఆకాశాన్ని పరికించి చూడలేదా, ఏవిధంగా మేము దాన్ని నిర్మించి తీర్చిదిద్దామో?[1] అందులో ఎక్కడా ఎలాంటి రంధ్రం గాని, నెర్రగాని

---

1. ఇక్కడ ఆకాశమంటే అనేక గ్రహాలు, నక్షత్రాలు, సూర్యచంద్రులున్న సువిశాల అంతరిక్షం అని అర్థం. ఉదయం లేవగానే సహస్ర కిరణాలతో తేజోవంతంగా మానవునికి కన్పించే సూర్యుడు మన భూమి కంటే పరిమాణంలో 13 లక్షల రెట్లు పెద్దగా ఉన్నాడు. మన భూమి నుండి 9 కోట్ల 30 లక్షల మైళ్ళ దూరంలో ఉన్నాడు. సెకండుకు 1 లక్షా 86 వేల మైళ్ళ వేగంతో ప్రయాణించే కాంతి సూర్యుడి నుండి భూమికి చేరుకోవడానికి 8 నిమిషాల 20 సెకండ్లు పడుతుంది.

మన భూమండలం తన చుట్టూ తిరుగుతున్న చంద్రుడ్ని తీసుకొని గంటకు 65 వేల మైళ్ళ వేగంతో సూర్యుని చుట్టూ తిరుగుతోంది. అలాగే ఇతరగ్రహాలు కూడా. మన పాలపుంతలో 10,000 కోట్ల నక్షత్రాలు ఉన్నట్లు అంచనా. ఈ పాలపుంతలోని మన (భూమి)కి అత్యంత సమీపంగా ఉన్న నక్షత్రం నాలుగున్నర కాంతి సంవత్సరాల దూరంలో ఉంది.

"కాంతి సంవత్సరం" అంటే సెకండుకు 1 లక్షా 86 వేల మైళ్ళ వేగంతో మనం ఏదైనా మాధ్యమం ద్వారా ప్రయాణం చేయగలిగితే మనకు అతి దగ్గరగా ఉన్న నక్షత్రానికి చేరుకోవడానికి నాలుగున్నర సంవత్సరాలు పడ్తుంది! అదే 20-8-1977న అమెరికా ప్రయోగించిన అత్యంత వేగవంతమైన వాయెజర్-2 అనే అంతరిక్ష నౌక గంటకు 36,000 మైళ్ళ వేగంతో దూసుకుపోతున్నప్పటికీ, ఈ నక్షత్రానికి చేరుకోవాలంటే దాదాపు 40,000 సంవత్సరాలు పడ్తుంది!!

ఇక పాలపుంత (గెలాక్సీ)లోనే సుదూర నక్షత్రాలు మన భూమి నుండి వేలాది కాంతి సంవత్సరాల దూరంలో ఉన్నాయి. మన గెలాక్సీ ఒక చివర నుండి మరొక చివరకున్న దూరం 20 లక్షల కాంతి సంవత్సరాలు ఉంది. మన పాలపుంత వేయి పాలపుంతల సముదాయంలో ఒకటిగా ఉంది. ఈ వేయి పాలపుంతల (గెలాక్సీల) సముదాయాన్ని క్వాజర్ అంటారు. ఈ క్వాజర్‌లో మన గెలాక్సీకు అతిసమీపంలో ఉన్న గెలాక్సీ ఎంత దూరం ఉందంటే, అక్కడ్నుంచి కాంతి మన భూమికి చేరుకోవడానికి 10 లక్షల సంవత్సరాలు పడుతుంది. అంటే ఆ గెలాక్సీ మన భూమి నుండి 10 లక్షల కాంతి సంవత్సరాల దూరంలో ఉందన్నమాట.

మనం ఉండే క్వాజర్‌లోనే మన గెలాక్సీకు సుదూరంలో ఉండే ఒక గెలాక్సీకు శాస్త్రవేత్తలు 'సోర్స్ 3 సి-295' అని పేరు పెట్టారు. అది మన భూమి నుండి కోటి కాంతి సంవత్సరాల దూరంలో ఉన్నట్లు తెలుస్తోంది. అంతటితో ఈ విశ్వంలోని నక్షత్రాలన్నిటినీ మానవుడు చూసినట్లు కాదు. ఇప్పటిదాకా మనం చెప్పుకున్నదంతా ఒక్క క్వాజర్‌లోని గెలాక్సీలు, నక్షత్రలు, గ్రహాలను గురించే. ఇలాంటి క్వాజర్‌లు ఈ విశ్వంలో కోటి దాకా ఉన్నాయని శాస్త్రవేత్తలు అంచనా వేశారు.

1990లో అమెరికా శాస్త్రవేత్తలు మన క్వాజర్ వెలుపలున్న అసంఖ్యాక క్వాజర్‌లలో ఒక క్వాజర్‌కు సంబంధించిన ఒక గెలాక్సీని కనుగొన్నారు. దానికి 'తీటా కెరీనా' అని పేరు పెట్టారు. ఇది మన భూమి నుండి 1260 కోట్ల కాంతి సంవత్సరాల దూరంలో ఉందట! ఇప్పటి వరకు శాస్త్రవేత్తలు కనుగొన్న సుదూర గెలాక్సీలలో అత్యంత సుదూర నక్షత్ర సముదాయం ఇదే.

ఇంతకూ యావత్తు విశ్వంలో ఇలాంటి ఎన్నివేల కోట్ల నక్షత్ర సముదాయాలున్నాయో, అసలీ విశ్వం ఆవిర్భవించి ఎన్ని వేలకోట్ల సంవత్సరాలయిందో సైంటిస్టులు నిక్కచ్చిగా చెప్పలేక పోతున్నారు. కొందరు సైంటిస్టులు ఈ విశ్వం ఆవిర్భవించి నేటికి 16 నుంచి 18 జిగా సంవత్సరాలై



లేదు. మేము భూమిని పరచి దానిపై పర్వతాలను పాతాము. అందులో రకరకాల మనోహరమైన వృక్షజాతుల్ని మొలపించాము. ఇవి సత్యాన్వేషకులకు కళ్ళుతెరిపించే అద్భుత సూచనలు. (5-8)

మేము ఆకాశం నుండి శుభదాయకమైన నీటిని (వర్షాన్ని) దించి, తద్వారా (పండ్ల) తోటలు, పంట ధాన్యాలు, ఒకదాని మీద ఒకటి విరగగాచే పండ్లగుత్తులు గల ఎత్తయిన ఖర్జూరచెట్లు పుట్టించాము. ఇది (మా) దాసులకు ఆహారం అందజేసే (అద్భుతమైన) ఏర్పాటు. ఈ నీటితో మేము (బీటలు వారిన) మృతభూమికి తిరిగి జీవం పోస్తున్నాము. అలాగే (మరణించిన మానవులు కూడా పునరుజ్జీవులయి) లేస్తారు.

వీరికి పూర్వం నూహ్‌జాతి, పాడుబడ్డబావివాళ్ళు, ఆద్, సమూద్, ఫిరౌన్‌వాళ్ళు, లూత్ సోదరులు, అయికా వాసులు, తుబ్బాజాతి ప్రజలు కూడా తిరస్కరించారు. వారంతా దైవ ప్రవక్తలను తిరస్కరించినవారే. అందువల్ల మా హెచ్చరిక కార్యరూపం దాల్చి (వారిని పూర్తిగా తుడిచిపెట్టి)ంది. మేము మొదటి సృష్టి నిర్మాణంతోనే అలసిపోయామా? (అదేమీకాదు.) వీరసలు నూతన సృష్టి గురించి సందేహంలో పడిపోయారు. (9-15)

మేము మానవుడ్ని సృజించాము. అతని అంతరంగంలో మెదిలే ఆలోచనలు సైతం మాకు తెలుసు. మేమతనికి అతని కంఠనాళం కన్నా అతిసమీపంగా ఉన్నాం. అదీగాక అతని కుడి, ఎడమల వైపు ఇద్దరు (అదృశ్య) లేఖకులు కూడా కూర్చొని (అతని) ప్రతి పనినీ, ప్రతి పలుకునూ నమోదు చేస్తున్నారు. అతని నోట ఏదైనా మాట వెలువడగానే దాన్ని నమోదు చేయడానికి ఒక పర్యవేక్షకుడు తక్షణమే అక్కడ ప్రత్యక్షమవుతాడు. (16-18)

చూడండి, చివరికి ప్రాణసంకటం సత్యాన్ని తీసుకొచ్చింది.[2] "(మానవా!) నీవు ఏ సత్యాన్ని నిరాకరిస్తూ పారిపోతుండేవాడివో ఆ సత్యం ఇదే. ఆ తరువాత (ప్రళయ)

---

ఉంటుందని చెబుతున్నారు. ఒక జిగా సంవత్సరం అంటే 1200 కోట్ల సంవత్సరాలు. ఈ లెక్కన విశ్వం ఉనికిలోకి వచ్చి 20,000 కోట్ల సంవత్సరాలకు పైనే అయి ఉంటుంది.

బ్రహ్మాండమైన ఈ విశ్వవ్యవస్థలో భూమి, చంద్రుడు, తదితర గ్రహాలతో కూడిన మన సౌర కుటుంబాన్ని సముద్రంలోని ఒక నీటి బొట్టుతో పోల్చుకుంటే, మానవుడు ఇప్పటిదాకా సాధించిన వైజ్ఞానిక ప్రగతి సృష్టికర్త జ్ఞానసాగరంలో ఆ నీటి బొట్టంత కూడా లేదు. అందుకే అన్ని విధాల ప్రశంసలకు సర్వ శక్తిమంతుడైన సృష్టికర్తే అర్హుడని ఖుర్ఆన్ మాటిమాటికి నొక్కి చెబుతోంది. (ఇతర వివరాలకు 36:40 సూక్తికి రాసిన పాదసూచిక కూడా చూడండి.)

2. ప్రాణం తీయడానికి మృత్యుదూత రాగానే మనిషి కళ్ళ మీదున్న ఇహలోక వ్యామోహ పొర తొలగిపోతుంది. అప్పటిదాకా అతనిలో ఉండిన అంధవిశ్వాసాలు, అభూత కల్పనలన్నీ ఒక్కసారిగా పటాపంచలయి సత్యం గోచరిస్తుంది. పరలోకం యదార్థమని, అక్కడ తన కర్మలకు లెక్క చెప్పుకోవలసి వస్తుందని అర్థమయి పోతుంది. కాని ఆ సమయంలో సత్యం గోచరించడం వల్ల, జ్ఞానోదయం కలగడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకున్నట్లవుతుంది అతని పరిస్థితి. ఎడతెగని పశ్చాత్తాపమే అతనికి మిగులుతుంది. అందుకే

శంఖం పూరించబడుతుంది. ఈదినాన్ని గురించే నిన్ను భయపెట్టడం జరుగుతుండేది. ఆరోజు ప్రతి మనిషి వెంట అతడ్ని తోలుకొచ్చేవాడు ఒకడుంటాడు. ఈ విషయాన్నే గురించి నీవు ఏమరుపాటులో పడివున్నావు. మేము నీముందున్న (ఐహిక) తెరను తొలగించాము. నీ చూపులు ఇప్పుడు వాడిగా ఉన్నాయి కదూ! (ఇక చూడు ఇది యదార్థమో కాదో.)" (19-22)

అతని (వెంటనున్న) సహచరుడు "(ప్రభూ!) ఇతను నా అధీనంలో ఉండేవాడు, (ఇప్పుడు తమరి ముందు) ప్రవేశపెడ్తున్నాను" అంటాడు. "సత్యాన్ని ధిక్కరించిన ప్రతి కృతఘ్నుడ్నీ నరకంలో పడేయండి. వాడు సత్కార్యాలు స్వయంగా చేయకపోవడమే గాకుండా ఇతరుల్ని కూడా నిరోధించేవాడు. హద్దుమీరి పోయేవాడు. తాను అనుమానంలో పడిపోవడమేగాక ఇతరుల్లో కూడా అనుమానాలు రేకెత్తించేవాడు. దేవునితో పాటు దైవేతర శక్తుల్ని ఆరాధించేవాడు. పడేయండి వాడ్ని భీకర (నరక)యాతనలో" అని ఆజ్ఞవుతుంది. (23-26)

(ఆవ్యక్తి దేవుని ముందు షైతాన్‌ని ఆడిపోసుకుంటూ, ఈదుర్మార్గుడు తన వెంట బడి తనను సర్వనాశనం చేశాడని ఆరోపించినప్పుడు) అతని (ఈ)సహచరుడు (అతని ఆరోపణను ఖండిస్తూ) "మహాప్రభో! నేనితడ్ని తిరుగుబాటుకు ప్రేరేపించలేదు. ఇతను తనంతటతానే మార్గభ్రష్టత్వంలో పడి చాలాదూరం కొట్టుకుపోయాడు" అని అంటాడు.

"నా ముందు వాదించకండి. నేను ముందే దుష్పర్యవసానం గురించి మిమ్మల్ని హెచ్చరించాను. నాదగ్గర మాట మారదు. నేను నా దాసులకు అన్యాయం చేసేవాడ్ని కాను" అని సమాధానం లభిస్తుంది. ఆరోజు మేము నరకాన్ని "నీవు నిండిపోయావా?" అని అడుగుతాం. దానికి నరకం "ఇంకా ఏమైనా ఉందా?"[3] అంటుంది. (27-30)

(ఆరోజు) స్వర్గం దైవభీతిపరులకు అతి చేరువగా తీసుకురాబడుతుంది; దూరంగా ఉండదు. అప్పుడిలా ఆజ్ఞవుతుంది: "మీకు వాగ్దానం చేయబడిన వస్తువు ఇదే. పశ్చాత్తాపంతో దేవుని సన్నిధిలో క్షమాపణ కోరుకునేవాడు, (బాధ్యతల్ని) పరిరక్షించేవాడు,

---

ప్రాపంచిక వ్యామోహంతో పాటు వివిధ దురభిమానాలు వదలిపెట్టి సత్యాన్ని అన్వేషించి ఎలాంటి తటపటాయింపు లేకుండా దాన్ని స్వీకరించాలి; తదనుగుణమైన సాత్విక జీవితం గడపాలి.

3. దేవుడు ఖుర్ఆన్‌లో "నేను మానవులతో, జిన్నుల (భూతాల)తో నరకాన్ని నింపుతాను" (32:13) అన్నాడు. దాని ప్రకారం కర్మవిచారణ ముగిసిన తర్వాత సత్యతిరస్కారులయిన మానవుల్ని, జిన్నుల్ని నరకంలో పడవేసి "ఇక నీవు నిండిపోయావా?" అని అడుగుతాడు దేవుడు. దానికి నరకం "ఇంకా ఏమైనా ఉందా?" అంటుంది. అంటే 'ఇంకా నా దగ్గర చాలా చోటుంది, ఏదైనా ఉంటే తెచ్చిపడెయ్యి' అంటుందన్నమాట. అప్పుడు దేవుడు నరకంలో తన పాదం ఉంచుతాడు. దాంతో నరకం "చాలు చాలు, ఇక చాలు" అని అంటుంది. (సహీ బుఖారి)

అలాగే సత్యాన్ని విశ్వసించిన మానవుల్ని, జిన్నుల్ని స్వర్గంలోకి పంపినప్పటికీ అక్కడ ఇంకా ఎంతో చోటు మిగిలి ఉంటుంది. అప్పుడు దేవుడు కొత్తగా కొందరు మానవుల్ని, జిన్నుల్ని సృష్టించి వారిని స్వర్గంలో ప్రవేశింపజేస్తాడు. (సహీ ముస్లిం)



కరుణామయుడైన దేవుడ్ని చూడకుండానే ఆయనకు (ప్రతి విషయంలోనూ) భయపడేవాడు, ఏకాగ్ర హృదయంతో వచ్చినవాడు అయిన ప్రతివ్యక్తికీ (ఈ మహాభాగ్యం లభిస్తుంది). శాంతీ సంక్షేమాలతో స్వర్గప్రవేశం చేయండి." అదే శాశ్వత(జీవితం సాగించే) దినం. అక్కడ స్వర్గవాసులకు కోరిన ప్రతి వస్తువూ లభిస్తుంది. వారికోసం మా దగ్గర అంతకంటే అధికంగానే ఉంది. (31-35)

పూర్వం మేము వీరికంటే ఎంతో శక్తిసామర్థ్యాలున్న అనేక జాతుల్ని హతమార్చాం. వారు ప్రపంచదేశాలు గాలించారు. మరి రక్షణ కోసం ఎక్కడైనా ఆశ్రయం లభించిందా? బుద్ధిజ్ఞానాలుండి, శ్రద్ధగా ఆలకించే ప్రతివ్యక్తికీ ఇందులో గుణపాఠం ఉంది. (36,37)

మేము భూమ్యాకాశాల్ని, వాటిమధ్య ఉన్న సమస్తాన్ని ఆరురోజులలో సృష్టించాం. అయినా మేము ఏమాత్రం అలసిపోలేదు. ప్రవక్తా! వీరు కల్పించి చెబుతున్న మాటలకు నీవు (బాధపడకు,) సహనం వహించు. దాంతోపాటు (ప్రతిరోజూ) సూర్యోదయానికి, సూర్యాస్తమయానికి ముందు ఆయన్ని స్తుతిస్తూ, ఆయన (పవిత్రత)ని స్మరిస్తూఉండు. రాత్రి వేళలో కూడా ఆయన్ని స్మరించు; సాష్టాంగప్రణామాల తర్వాత కూడా. (38-40)

వినండి! ఏరోజు ప్రకటనకర్త సమీపం నుండి కేకవేస్తాడో, ఏరోజు మానవులు నమ్మకం గా భీకరగర్జన వింటారో అదే మృతులు నేలనుండి లేచే రోజవుతుంది. మేమే బ్రతికిస్తున్నాం; మేమే చంపుతున్నాం. చివరికి మా వైపుకే అందరూ తిరిగిరావలసి ఉంటుంది. ఆరోజు భూమి బ్రద్దలవుతుంది. అందులో నుంచి మానవులు బిలబిలమంటూ బయటికొచ్చి వడివడిగా పరుగెత్తుతారు. ఈ పునరుత్థాన కార్యం నిర్వహించడం మాకు చాలాతేలిక. (41-44)

ప్రవక్తా! వీరిమాటలు మేము గమనిస్తూనేఉన్నాం. బలవంతంగా ఒప్పించడం నీ పని కాదు. నా హెచ్చరికకు భయపడేవారికి ఖుర్ఆన్ ద్వారా హితోపదేశం చెయ్యి. (45)

# 51. గాలి దుమారం (జారియాత్)

**అవతరణ: మక్కా** **సూక్తులు: 60**

ఈ అధ్యాయాన్ని "జారియాత్" అంటారు. ఇదికూడా 'ఖాఫ్' సూరా అవతరించిన కాలంలోనే అవతరించినట్లు తెలుస్తోంది. ఇందులో మొదట పరలోకం గురించి ఎక్కువగా బోధించబడింది. చివరిలో దేవుని ఏకత్వం వైపు ప్రజల్ని పిలవడం జరిగింది.

**కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం**

దుమారాన్ని లేపే గాలుల సాక్షి! తరువాత నీటితో నిండిన మేఘాలను పైకెత్తేవి, ఆ తరువాత నెమ్మదిగా నడిచేవి, ఆపై ఒక మహాకార్యాన్ని (వర్షాన్ని) విభజించేవి!! ఏ విషయాన్ని గురించి మిమ్మల్ని భయపెట్టడం జరుగుతున్నదో అది నగ్నసత్యం. కర్మవిచారణ తప్పకుండా జరుగుతుంది. విభిన్న రూపాలలో కన్పించే ఆకాశం సాక్షి! మీ అభిప్రాయాలు విభిన్న రకాలుగా ఉన్నాయి. సత్యానికి విముఖుడయినవాడే దాన్ని తిరస్కరిస్తాడు. (1-9)

అనుమానాలతో కూడిన నిర్ణయాలు తీసుకునేవారు నాశనంగాను! వారు అజ్ఞానాంధకారంలో తచ్చాడుతూ ఏమరుపాటుకు లోనయిఉన్నారు. పైగా అసలీ విచారణ దినం ఎప్పుడొస్తుందీ? అని అడుగుతున్నారు. వారిని నరకాగ్నిలో పడేసి మాడ్చివేసే దినం వస్తుంద(ని చెప్పు. అప్పుడు దైవదూతలు వారితో) "ఇక చవిచూడండి మీ దురాగతాల రుచిని. మీరు తొందరపెడ్తుండిన విషయం ఇదే" (అని అంటారు). (10-14)

ఆరోజు దైవభీతిపరులు స్వర్గవనాలలో చెలమల మధ్య (హాయిగా) ఉంటారు. వారు తమ ప్రభువు ప్రసాదించినదాన్ని అమిత సంతోషంతో స్వీకరిస్తూ ఉంటారు. వారు ఈరోజు రాకపూర్వం నీతిమంతులుగా ఉండేవారు. రాత్రివేళల్లో చాలా తక్కువగా నిద్రించేవారు. ప్రతిరోజూ తెల్లవారుజామున లేచి (తమ ప్రభువును) క్షమాపణ కోరుకునేవారు. వారి సంపదలో అర్థించేవారికి, అర్థించనివారికి కూడా హక్కుండేది. (15-19)

విశ్వసించేవారికి ధరణిపై అనేక నిదర్శనాలున్నాయి. స్వయంగా మీ (అస్తిత్వం)లో కూడా ఉన్నాయి.[1] మీరీ విషయాన్ని గురించి యోచించరా? (20,21)

---

1. ఎలక్ట్రానిక్ పరిభాషలో మనిషి బ్రహ్మాండమైన 'రోబో'అని చెప్పవచ్చు. కాని మానవుడు ఎంతటి శక్తిమంతమైన రోబో నిర్మించినా, ఆ రోబో కన్నా మానవుడే వేలరెట్లు శక్తిమంతుడు.

మన శరీరావయవాల్లో కళ్ళు ఎంతో సున్నితమైనవి. రాత్రివేళ చీకటిలో ఒక కొండ శిఖరం మీద నిలబడి యాభై మైళ్ళ దూరాన ఉండే మంటను సైతం అవి చూడగలుతాయి. వెల్తురు నుంచి చీకట్లోకి వచ్చిన మరుక్షణం మన కళ్ళు కాంతికి సంబంధించి అంతకు ముందుకంటే పది రెట్ల నిశితత్వాన్ని సంతరించుకుంటాయి. ఇరవై నిమిషాలు మనం ఇలాగే చీకట్లో ఉండిపోతే ఆరువేల రెట్లు, నలభై నిమిషాలపాటు ఉండిపోతే పాతిక వేల రెట్ల నిశితత్వాన్ని సంతరించుకుంటాయి.

శాస్త్రవేత్తలు ఇటీవల పుట్టుకతో అంధత్వం వచ్చినవారి కోసం ఎంతో చిన్న సైజు గల మానిటర్, వీడియో కెమెరాలతో కూడిన ఒక హెల్మట్ తయారు చేశారు. ఇంత చేసినా అది పుట్టుగ్రుడ్డికి రెండు పిక్సల్స్ కంటే ఎక్కువ రిజల్యూషన్ ఇవ్వలేక పోయింది. దానివల్ల ముందునుంచి ఎవరైనా మనిషి నడచిపోతే ఆ పుట్టుగ్రుడ్డికి ఏదో వస్తువు తన కళ్ళ ముందునుంచి కదలిపోతున్నట్లు కన్పించింది. దీన్నిబట్టి దైవం మనకు ప్రసాదించిన సహజసిద్ధమైన కళ్ళు ఎంత విలువైనవో అర్థమవుతుంది. అదేవిధంగా ఇతర అవయవాలను గురించి కూడా ఆలోచించవచ్చు.

మనిషి రక్తంలో ఎర్రకణం నాలుగు నెలలు సజీవంగా ఉంటుంది. సజీవంగా ఉండే ఈ నాలుగు నెలల కాలంలో ఎర్రకణం సుమారు వెయ్యి మైళ్ళ దూరం ప్రయాణిస్తుంది. ప్రతి మనిషీ గంటకు ఆరు లక్షల మృత చర్మకణాలను విసర్జిస్తాడు. వీటన్నిటినీ సూక్ష్మజీవులు తినేస్తాయి. మనిషి చర్మంలోని ప్రతి చదరపు అంగుళంలో సగటున 3 కోట్ల 20 లక్షల సూక్ష్మజీవుల చొప్పున మొత్తం శరీరం మీద దాదాపు నూరు లక్షల కోట్ల సూక్ష్మజీవులు ఉంటాయని తెలుస్తోంది.

మానవ మెదడు అద్భుతమైనది. ఇందులో ప్రతిసెకండుకు లక్ష రకాల రసాయనికచర్యలు జరుగుతాయి. మానవుని మెదడు, మెడుల్లా అబ్లాంగేటాలను ఒక రకంగా కంప్యూటర్‌లోని హార్డ్ డిస్క్(HDD), ర్యామ్(RAM)లతో పోల్చవచ్చు. ఇది ఏకకాలంలో 8కోట్ల 60లక్షలకు పైగా చిన్నచిన్న సమాచార సంకేతాలు రికార్డు చేసుకోగల్గుతుంది. అయితే ఇందులో 1% సమాచారాన్ని మాత్రమే సేవ్ (SAVE) చేసుకొని, మిగతా 99% సమాచారాన్ని పనికిరానిదిగా వదలేస్తుంది.



మీ ఉపాధి సామగ్రి, మీకు వాగ్దానం చేయబడుతున్న సమస్తం ఆకాశంలోనే ఉన్నాయి.[2] కనుక భూమ్యాకాశాల ప్రభువు సాక్షి! ఇది సత్యం. మీరు మాట్లాడగల్గుతున్నంత నిజంగా ఇది సత్యం. (22,23)

ఇబ్రాహీం గౌరవనీయ అతిథుల సంగతి నీకేమైనా చేరిందా? వారతని దగ్గరికొచ్చి సలాం అన్నప్పుడు అతను "మీక్కూడా సలాం, వీళ్ళెవరో కొత్తవాళ్ళులా ఉన్నారే!" అన్నాడు. అతను మెల్లిగా తన గృహస్థుల దగ్గరికెళ్ళాడు. తరువాత ఒక బలిసిన ఆవు దూడను కాల్చితెచ్చి అతిథుల ముందుంచాడు.

(అయితే అతిథులు దాన్ని ముట్టుకోక పోవడం చూసి) "మీరు తినరేమిటీ?" అని అడిగాడతను. తర్వాత అతను అతిథుల (వింత ప్రవర్తన) పట్ల మనసులో భయపడ్డాడు. అప్పుడు వారు భయపడకండని ధైర్యం చెప్పారు. (ఆతర్వాత) వారతనికి బుద్ధి కౌశల్యం గల కొడుకు పుడ్తాడని శుభవార్త విన్పించారు. (24-28)

అతని భార్య ఈమాట విని అరుస్తూ ముందుకు వచ్చి, నెత్తీ నోరు బాదుకుంటూ "ముసలిదాన్ని, గొడ్రాలిని (నాకు సంతానమేమిటీ!)" అన్నది. దానికి అతిథులు "నీ ప్రభువు ఇలాగే అన్నాడు. ఆయన ఎంతో వివేకవంతుడు, సర్వంఎరిగినవాడు" అన్నారు.

"దైవదూతలారా! మీరు ఏమహాకార్యం కోసం వచ్చారు?" అనడిగాడు ఇబ్రాహీం. అప్పుడు దైవదూతలు "మేమొక అపరాధ జాతి వైపు పంపగా వచ్చాం. ఆజాతి మీద కాల్చిన మట్టిరాళ్ళు కురిపించాలని ఆజ్ఞ అయింది. నీ ప్రభువు దృష్టిలో హద్దుమీరినవారికోసం ఇవి ప్రత్యేకంగా ముద్రలు వేయబడిన రాళ్ళు" అని చెప్పారు. (29-34)

ఆ తరువాత మేమా పట్నం నుండి విశ్వాసుల్ని బయటికి తీశాం. అక్కడ మాకు ముస్లింలకు చెందిన ఒక్క ఇల్లు మాత్రమే కనిపించింది. ఆ తర్వాత మేము ఘోరమైన శిక్షకు భయపడేవారి కోసం అక్కడ ఒక చిహ్నం[3] (అవశేషాలు) వదలిపెట్టాం. (35-37)

మూసా గాథలో (కూడా గుణపాఠం ఉంది). మేమతనికి స్పష్టమైన నిదర్శనాలిచ్చి ఫిరౌన్ దగ్గరకు పంపినప్పుడు, అతను అధికారగర్వంతో విర్రవీగుతూ "ఇతనేదో మాంత్రి

---

ఎంత పెద్ద కంప్యూటర్ అయినా మానవ మేధతో సరితూగలేదు. మానవ మేధతో సరితూగే కంప్యూటర్ తయారు చేయాలంటే, అది న్యూయార్క్‌లోని 1250 మీటర్ల ఎత్తుగల ఎంపైర్ బిల్డింగ్ అంత పెద్దగా తయారవుతుంది. ఇది సాధ్యం కాదు. మానవ శరీర నిర్మాణం దాదాపు 10,00.000 కోట్ల జీవకణాల సముదాయంతో జరిగిందని అంచనా. (23:14 సూక్తి పాదసూచిక చూడండి.)

ఇవన్నీ దేవుని ఏకత్వానికి, ఆయన శక్తిసామర్థ్యాలకు నిదర్శనాలని, ఈ నిదర్శనాల ద్వారా గుణపాఠం నేర్చుకోవాలని దైవగ్రంథం ఈసూక్తిలో మానవునికి హితోపదేశం చేస్తోంది.

2. మీ ఉపాధి తదితర జీవనసామగ్రి అంతా ఆకాశంలోనే ఉందంటే, మీకు ఇహలోకంలో ఏమేమి ప్రసాదించాలో వాటన్నిటి గురించిన నిర్ణయాలు ఊర్ధ్వలోకంలో జరుగుతాయని అర్థం.

3. ఇక్కడ చిహ్నం అంటే మృతసముద్రం అని భావం. లూత్‌జాతిపై తుఫాను, భూకంపాల రూపంలో భయంకరమైన ఉపద్రవం వచ్చింది. మొత్తం పట్టణం భూమిలోకి క్రుంగిపోయింది. (వివరాలకు 15:73,74 సూక్తులు, వాటి పాదసూచిక చూడండి.)

కుడైఉంటాడు లేదా పిచ్చివాడైఉంటాడు” అన్నాడు. చివరికి మేము అతడ్ని, అతని సైన్యాన్ని పట్టుకొని సముద్రంలో విసిరేశాం. అతడు నిందితుడై (చరిత్రలో) నిలచి పోయాడు. (38-40)

ఆద్‌జాతి (చరిత్రలోనూ గుణపాఠముంది). మేమా జాతిప్రజల పైకి అశుభకరమైన గాలి పంపాము. అది ప్రతి వస్తువునూ సర్వనాశనం చేస్తూ (భయకరంగా) వీచింది.

సమూద్‌జాతి (చరిత్రలో కూడా). “(మీరు సత్యం స్వీకరించడానికి సిద్ధంగాలేక పోతే) ఒక నిర్ణీతకాలం వరకు భోగభాగ్యాలు అనుభవించండి. (తరువాత మా శిక్ష కోసం ఎదురుచూడండి)” అనివారిని హెచ్చరించాం. కాని వారీ హెచ్చరిక ఖాతరు చేయకుండా తమ ప్రభువాజ్ఞను ధిక్కరించారు. చివరికి వారు చూస్తుండగానే హఠాత్తుగా విరుచుకు పడే విపత్తు వచ్చి వారిని చుట్టుముట్టింది. దాంతోవారికి మళ్ళీ లేచేశక్తి కూడా లేకుండా పోయింది. వారు తమనుతాము కాపాడుకోలేక పోయారు. వారికి పూర్వం మేము నూహ్ జాతిని కూడా తుదముట్టించాం. కారణం వారు పరమ దుర్మార్గులైపోయారు. (41-46)

మేము మా స్వశక్తితోనే ఆకాశాన్ని నిర్మించాము. మాకా సామర్థ్యం ఉంది. భూమిని కూడా మేమే (మీకు నివాసయోగ్యంగా) పరిచాము. (మీకు అనువైనదిగా) పరచడంలో మేమెంత నిపుణులమో చూడండి. మీరు గుణపాఠం నేర్చుకుంటారని మేము ప్రతి వస్తువునీ (జీవినీ) జంటలు జంటలుగా సృష్టించాము.[4] (47-49)

“కనుక దేవుని (మార్గం) వైపునకు పరుగెత్తండి. నేను ఆయన తరపున మిమ్మల్ని స్పష్టంగా హెచ్చరించడానికి వచ్చిన దైవసందేశహరుడ్ని. దేవునితో పాటు ఇతర శక్తుల్ని దైవాలుగా ఆరాధించకండి. నేనాయన తరపున మిమ్మల్ని స్పష్టంగా హెచ్చరించడానికి వచ్చిన దైవసందేశహరుడ్ని.” (50,51)

---

4. జంటలు జంటలుగా సృష్టించడం గురించి ఖుర్‌ఆన్‌లో అనేక చోట్ల వచ్చింది.

“ఆయనే యావత్తు (సృష్టిరాసుల స్త్రీ పురుష) జంటలను పుట్టించాడు.” (43:12)

“అన్ని రకాల జంటలను సృష్టించిన దేవుడు పరమ పవిత్రుడు. ఆ జంటలు భూమి మీది వృక్షజాతికి సంబంధించినవైనా, స్వయంగా వీరి (మానవ) జాతికి సంబంధించినవైనా, లేదా వీరికి తెలియని ఇతర వస్తువులకు సంబంధించినవైనా (అన్నిటినీ ఆయనే సృజించాడు). (36:36)

యావత్తు జీవరాసుల్లో ఆడ మగ జంటలు ఉంటాయన్నది జగద్విదితం. వాటితో పాటు వృక్షజాతిలోనూ ఆడ మగ కణాలుంటాయి. అలాగే ఆనాటి ప్రజలకు తెలియని ఇతర వస్తువుల్లో కూడా ఇలాంటి జంటలు ఉంటాయని ఖుర్‌ఆన్ పైసూక్తిలో చెబుతోంది. అవేమిటో పరిశీలిద్దాం.

ఖుర్‌ఆన్ ప్రకారమే గాక సైన్స్ ప్రకారం కూడా ఈ ప్రపంచంలోని ప్రతి వస్తువుకూ దాని జత ఉంది. కనీసం రెండు పదార్థాల కలయికతో ఓ కొత్త పదార్థం ఏర్పడుతుంది. పదార్థ నిర్మాణానికి మూలమైన పరమాణువు (Atom) ధనాత్మక, రుణాత్మక కణాల జంటలతో ఏర్పడింది.

ఒకే ఒక జంటతో సృజించబడిన హైడ్రోజన్ పరమాణువులో ధనావేశ పూరితమైన ఒక ప్రొటాన్ కణం, రుణావేశపూరితమైన ఒక ఎలాక్ట్రాన్ కణం ఉంటాయి. ప్రొటాన్ చుట్టూ ఎలక్ట్రాన్ ఒక నిర్ణీత కక్ష్యలో తిరుగుతూ ఉంటుంది. ఈ రెండిటి జతతోనే హైడ్రోజన్ పరమాణువు ఏర్పడింది.



వీరికి పూర్వం గతజాతులు కూడా తమ దగ్గరకు వచ్చిన దైవప్రవక్తను మాంత్రికుడనో, పిచ్చివాడనో ఆరోపించారు. ఇది పూర్వం నుంచీ ఇలాగే సాగుతూ వస్తోంది. (ఈవిషయంలో) వీరంతా పరస్పరం రాజీకి వచ్చారా ఏమిటి? లేదు. వీరసలు తలబిరుసు జనం. (52)

కనుక ప్రవక్తా! నీవు వారినుండి ముఖం తిప్పుకుంటే నీ దోషం ఏమీలేదు. అయితే హితబోధ చేస్తూఉండు. విశ్వసించేవారికి హితబోధ ప్రయోజనం కల్గిస్తుంది. (53-55)

నేను మానవుల్ని, జిన్నుల్ని కేవలం నన్ను ఆరాధించడానికి తప్ప మరే లక్ష్యంతో పుట్టించ లేదు.[5] నేను వారినుండి ఉపాధి కోరడంలేదు. నాకు తిండి పెట్టమని అడగడం లేదు. దేవుడే అందరికీ ఉపాధిప్రదాత. ఆయన మహాబలుడు, అద్భుత శక్తిసంపన్నుడు. (56-58)

---

విద్యుదుత్పాదన గురించి చాలామందికి తెలుసు. పాజిటివ్, నెగటివ్ ధృవాల కలయికతోనే బల్బులు వెలగడం, ఫ్యాన్లు తిరగడం, టివి, రేడియోలు పనిచేయడం, వేడి పుట్టడం మొదలైన పనులు జరుగుతుంటాయి.

ఈ విధంగా ఆడ-మగ, పెంటి-పోతు, నెగటివ్-పాజిటివ్ వగైరా విభిన్న సృష్టి జతలతో యావత్తు విశ్వవ్యవస్థ ఆవిర్భవించింది. చివరికి ఈ ప్రపంచానికి కూడా జోడుగా ‘వ్యతిరేక ప్రపంచం’ (Anti World) అనే మరో ప్రపంచం ఉందని ఈనాటి సైంటిస్టులు చెబుతున్నారు. అలాగే ఇస్లాం ధర్మవేత్తలు కూడా కొందరు ఇహలోకానికి జోడుగా పరలోకం ఉందని అంటున్నారు.

ఈ జోడులు, జతలు, జంటలు యాదృచ్ఛికంగా ఉనికిలోకి రాలేదు, రాలేవు కూడా. వాటి సృష్టి వెనుక దేవుడనే ఓ అదృశ్యశక్తి , ఓ అసాధారణ శక్తిసంపన్నుడు ఉన్నాడు. ఆయనే వీటన్నిటిని సృష్టించి పనిచేయిస్తున్నాడు. అయితే ఆయనకు మాత్రం మరెవరూ జోడు, జంట, సహాయకుడు లేరు. ఆయన ఒక్కడే. ఆయన దైవత్వం అద్వితీయమైనది. ఆ ఏకైక దేవుని వల్లనే, ఆ అద్వితీయశక్తి మూలంగానే జతలు, జోడులతో కూడిన ఈ సృష్టి నిర్మాణం సాధ్యమయింది. కనుక అలాంటి శక్తి స్వరూపుడయిన దేవుడు మాత్రమే ఆరాధనకు అర్హుడని ఈ సూక్తి పరోక్షంగా మనకు బోధిస్తోంది. ఈ సూక్తిలో పేర్కొనబడిన ‘గుణపాఠం’ అంటే మానవులు ఈ వాస్తవాన్ని గుర్తించి, తదనుగుణంగా తమ జీవనసరళిని సంస్కరించుకోవాలన్నదే.

5. ఈ సూక్తిలో రెండర్థాలు ఇమిడి ఉన్నాయి. ఒకటి, దేవుడ్ని తప్ప మరెవ్వరినీ ఆరాధించ కూడదు. రెండు, దైవారాధన తప్ప మరే పనీ చేయకూడదు. మొదటి విషయం అందరికీ అర్థమవు తోంది. కాని రెండో విషయం నేడు అనేకమంది ముస్లింలకు సైతం అర్థం కావడం లేదు. కారణం వారి మనో మష్తిష్కాలలో “ఆరాధన” పదానికి పరిమిత భావం ఉండిపోవడమే.

ఇస్లాంలో ఆరాధన అనే పదానికి చాలా విస్తృత భావం ఉంది. నమాజ్, ఉపవాసం, కాబా యాత్ర, దైవధ్యానం లాంటి పూజాపురస్కారాలే కాదు; ఉపాధి సముపార్జన, కుటుంబ జీవనం, తోటి మానవులతో సంబంధాలు, వ్యాపారం, ఆర్థిక లావాదేవీలు, దేశపాలనా వ్యవహారాలు, యుద్ధం, స్నేహ ఒడంబడికలు, అంతర్జాతీయ సంబంధాలు సైతం ఆరాధన క్రిందికే వస్తాయి. ఒక్కమాటలో చెప్పాలంటే మానవ జీవితంలోని సకల రంగాలకు చెందిన సమస్త వ్యవహారాలు దైవారాధనల క్రిందికే వస్తాయి. కాకపోతే ఇవన్నీ దేవుడు, ఆయన ప్రవక్త (సల్లం) అందజేసిన ఆదేశాల ప్రకారం పాటించినప్పుడే దైవారాధనలుగా పరిగణించబడతాయి.

కనుక దుర్మార్గానికి పాల్పడినవారి భాగానికి కూడా వారి మిత్రులభాగానికి లభించిన యాతన వంటి యాతనే సిద్ధంగా ఉంది. దానికోసం వీరు తొందరపడన వసరం లేదు. చివరికి అవిశ్వాసులకు తమకు భయపెట్టబడుతున్నరోజు సర్వనాశనం తప్పదు. (59,60) ✪

## అవతరణ: మక్కా 52. తూర్‌పర్వతం (తూర్) సూక్తులు: 49

ఈ అధ్యాయాన్ని "తూర్" అంటారు. ఇదీ గత అధ్యాయం అవతరించిన కాలం లోనే అవతరించింది. ఇందులోనూ మొదట పరలోకం గురించి చెప్పబడింది. తర్వాత ఖురైషీయుల తిరస్కార వైఖరిని విమర్శిస్తూ వారిని ఇస్లాం వైపు పిలవడం జరిగింది.

### కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

తూర్ పర్వతం సాక్షి! వ్రాతచర్మం మీద రాయబడిన తెరచిన పుస్తకం సాక్షి! భక్తులతో కళకళలాడే ఆరాధనాలయం సాక్షి! ఎత్తయిన (ఆకాశం) కప్పు సాక్షి! ఉప్పొంగే సముద్రం సాక్షి! నీ ప్రభువు శిక్ష తప్పకుండా సంభవిస్తుంది. దాన్ని ఏ శక్తీ అడ్డుకోలేదు. ఆకాశం తీవ్రంగా కంపిస్తూ, పర్వతాలు పెకలి గాలిలో తేలియాడే రోజున అది సంభ విస్తుంది. (1-10)

నేడు తమాషా కోసం వితండవాదం చేస్తున్న సత్యతిరస్కారులకు ఆరోజు వినాశం తప్పదు. ఆరోజు (దైవదూతలు) వీరిని కొడ్తూ, నెడ్తూ నరకం వైపు తీసికెళ్తూ ఇలా అంటారు: "మీరు (నిన్నటిదాకా) నిరాకరిస్తుండిన నరకాగ్ని ఇదే. ఇప్పుడు చెప్పండి, ఇది మంత్రజాలమా లేక మీకేమీ అర్థంకావడం లేదా? ఇక వెళ్ళండి. అందులో పడి మాడిపోండి. మీరు ఓర్పు వహించినా, వహించకపోయినా ఒక్కటే. (నరకయాతన ఏమాత్రం తగ్గించబడదు.) మీరు ఎలాంటి కర్మలు ఆచరించారో అలాంటి ప్రతిఫలమే మీకు ఇవ్వబడుతోంది." (11-16)

పోతే దైవభీతిపరాయణులు అక్కడ స్వర్గవనాలు, భోగభాగ్యాలలో ఉంటారు. వారు తమ ప్రభువు ప్రసాదించే మాధుర్యాలను ఆస్వాదిస్తూ సుఖసంతోషాలలో

---

ఆరాధనలోని ఈ విస్తృత భావం తెలుసుకుంటే మనిషి జీవితంలోని సమస్త వ్యవహారాల్లో ఎలాంటి అపమార్గం పట్టకుండా ఒక్క విశ్వప్రభువుని మాత్రమే ఆరాధించగలడు. అంటే మనిషి ఖుర్ఆన్, హదీసుల పరిధుల్లో మాత్రమే తన జీవిత వ్యవహారాలు సాగించాలన్నమాట.

ఒకే దేవుడ్ని ఆరాధిస్తున్నామని చెప్పుకునేవారు ఎన్ని నమాజులు చేసినా, ఎన్ని ఉపవాసాలు పాటిస్తున్నా. ఎంత ధ్యానం చేస్తున్నా, దైనందిన వ్యవహారాల్లో దైవేతరశక్తులకో లేక మనోవాంఛలకో దాస్యం చేస్తుంటే మాత్రం ఆ మేరకు వారు దైవారాధన పరిధిని అతిక్రమిస్తున్నట్లే. అంటే ఆయా వ్యవహారాల్లో వారు దేవునికి సాటి కల్పిస్తున్నారన్నమాట. ఈవైఖరి దైవాగ్రహానికి గొనిపోతుంది.

కొందరు ఈ వైఖరి కప్పిపుచ్చుకోవడానికి లేక అజ్ఞానం వల్ల "ఇవి మత విషయాలు, అవి ప్రపంచ వ్యవహారాల"ని వాదిస్తారు. కాని ప్రపంచ వ్యవహారాలు కూడా దేవుని ఆజ్ఞలు, దైవప్రవక్త హితవుల వెలుగులోనే ఉండాలన్న యదార్థాన్ని వీరు గ్రహించక పోవడం ఎంతో విచారకరం.



తేలియాడుతారు. వారి ప్రభువు వారిని నరక యాతనల నుండి రక్షించాడు. "ఇక మీరు ఆచరించిన కర్మలకు ప్రతిఫలంగా (నేడు) హాయిగా తినండి, త్రాగండి." (17-19)

వారక్కడ ఆసనాలపై దిండ్లకానుకొని ఎదురెదురుగా కూర్చొని ఉంటారు. మేము వారికి అందమైన (విశాల) నేత్రాలుగల సుందరాంగులనిచ్చి వివాహం చేస్తాం. విశ్వసించిన వారితో పాటు వారి సంతానం కూడా విశ్వాసంలో వారి అడుగుజాడల్లోనే నడచుకొనిఉంటే, అలాంటి సంతానాన్ని కూడా మేము (స్వర్గంలో) వారి దగ్గరికి చేర్చుతాము. వారి సుకృత ఫలాన్ని మేము ఏమాత్రం తగ్గించము. ప్రతి మనిషీ తన కర్మలకు తాకట్టుగా ఉన్నాడు. (20,21)

మేము వారికి రకరకాల పండ్లు, ఫలాలు, మాంసాహారాలు ప్రసాదిస్తాం. వారికి ఇష్టమైన ప్రతి వస్తువూ ఇస్తుంటాం. వారు అమితోత్సాహంతో ఒకరికొకరు మధుపాత్రలు అందించుకుంటారు. ఆ మధువు (ఇహలోకపు మద్యంలా) మనిషిని మైకంలో పడవేసి వదరుబోతులా చేయదు. అతడ్ని దుర్గుణుడిగా చేసి దుశ్చర్యలకు కూడా పురిగొల్పదు. వారి సేవకోసం అక్కడ దాచిన రత్నాల్లాంటి అందమైన బాలసేవకులు ఉంటారు. ఈ బాలసేవకులు అటూ ఇటూ తిరుగుతూ వారిని సేవిస్తూ ఉంటారు. (22-24)

వారు (ప్రపంచంలో గడచిపోయిన విశేషాల్ని గురించి) మాట్లాడుకుంటారు. "మనం ఇంతకు పూర్వం మన ఇండ్లలో బిక్కుబిక్కుమంటూ జీవితం గడుపుతుండే వాళ్ళం. చివరికి దేవుడు మనల్ని కరుణించి (ముఖాలను) మాడ్చివేసే వడగాల్పుల యాతనల నుండి రక్షించాడు. మనం గతజీవితంలో ఆయన్నే వేడుకునేవాళ్ళం. నిజంగా ఆయన మహోపకారి, అపార దయామయుడు" అని చెప్పుకుంటారు. (25-28)

కనుక ప్రవక్తా! నీవు (యథాప్రకారం జనానికి) హితబోధ చేస్తూవుండు. నీ ప్రభువు దయవల్ల నీవు జ్యోతిష్కుడుగాని, పిచ్చివాడుగాని కానే కావు. వీరు (నీగురించి) "ఇతనో కవి, ఇతని వినాశకాలం కోసం మేము ఎదురుచూస్తున్నాం" అని అంటున్నారా? "సరే ఎదురుచూడండి. మీతోపాటు నేనూ ఎదురుచూస్తాను" అని చెప్పు వారికి. వారి బుద్ధులు వారిచేత ఇలాంటి మాటలే పలికిస్తున్నాయా? లేక వీరు దుర్మార్గంలో హద్దు మీరిపోయారా? "ఇతను ఖుర్ఆన్‌ని స్వయంగా కల్పించుకున్నాడ"ని అంటున్నారా? అసలు వీరు సత్యాన్ని విశ్వసించడానికే సిద్ధంగా లేరు. వీరు తమ అభిప్రాయమే నిజమనుకుంటే ఇలాంటి అద్భుతమైన వాణినొక దాన్ని రచించి తీసుకు రమ్మను.

వీరు సృష్టికర్త లేకుండానే తమంతట తాము తయారయి ఉనికిలోకి వచ్చారా? లేక తమకుతామే సృష్టికర్తలా? పోనీ, భూమ్యాకాశాల్ని సృష్టించారా వీరు? (అదేమీకాదు.) వీరి కసలు సత్యం మీద నమ్మకమే లేదు. వీరి దగ్గర నీ ప్రభువు నిక్షేపాలేమైనా ఉన్నాయా? లేక వాటి మీద వీరికి ఏమైనా అధికారం ఉందా? (29-37)

వారి దగ్గర ఏదైనా నిచ్చెన ఉందా, దానిమీద ఎక్కిపోయి ఊర్ధ్వలోకాల మాటలు వినడానికి? వారిలో ఎవరైనా అలాంటి అగోచర విషయాలు ఏమైనా వింటే దానికతను గట్టి సాక్ష్యాధారాలు చూపాలి. దేవునికి కుమార్తెలు, మీకయితే కుమారులా? (38,39)

నీవేదైనా ప్రతిఫలం అడుగుతున్నావా వారిని, వారా రుణభారం క్రిందపడి అణిగి పోవడానికి? వారి దగ్గర అతీంద్రియ జ్ఞానం ఉందా, దాని ఆధారంగా వీరు (తమ వాదనల్ని నిరూపించే) విషయాలు రాసుకోడానికి? లేక వారేదైనా పన్నాగం పన్నదలిచారా? అవిశ్వాసులు పన్నే పన్నాగం వారికే బెడిసికొడ్తుంది. వారికి దేవుడు కాక మరో ఆరాధ్యుడు ఉన్నాడా? వారు చేస్తున్న బహుదైవారాధనకు దేవుడు ఎంతో అతీతుడు, పరమ పవిత్రుడు. (40-43)

వారు నింగి తునకలు విరిగి పడుతున్నా వాటిని చూసి ఇవి దట్టమైన మబ్బు తునకలని అంటారు. కనుక ప్రవక్తా! వారిని వారి మానాన వదలిపెట్టు. చివరికి వారు (మొదలు నరికిన చెట్టులా) పడగొట్టబడే (ప్రళయ) దినానికి చేరుకుంటారు. ఆరోజు వారిపన్నాగాలు వారికి ఏవిధంగానూ ఉపయోగపడవు. వారిని ఎవరూ ఆదుకోలేరు. ఆ సమయం రాకముందు కూడా దుర్మార్గుల కోసం (ప్రకృతి వైపరీత్యాల రూపంలో) ఒక పరీక్ష ఉంది. కాని వారిలో చాలామంది ఈ యదార్థం గ్రహించడం లేదు. (44-47)

ప్రవక్తా! నీవు మాత్రం నీ ప్రభువు నిర్ణయం వచ్చేవరకు సహనం పాటిస్తూ ఉండు. నీవు మా కనుసన్నల్లోనే ఉన్నావు. నీవు లేచినప్పుడల్లా నీ ప్రభువుని స్తుతిస్తూ, ఆయన (పవిత్రతను) స్మరిస్తూ ఉండు. రాత్రివేళల్లో కూడా ఆయన్ని స్మరిస్తూ ఉండు. నక్షత్రాలు అస్తమిస్తున్న (ఉషోదయం) వేళల్లో కూడా ఆయన్ని స్మరిస్తూ ఉండు. (48,49) ✪

**అవతరణ: మక్కా**

## 53. నక్షత్రం (నజ్మ్)

**సూక్తులు: 62**

ఈ అధ్యాయాన్ని "నజ్మ్" అంటారు. ఇది నబవీ శకం 5వ సంవత్సరం అవతరించినట్లు ఒక సంఘటన ద్వారా తెలుస్తోంది. ఆ సంఘటన ఇలా ఉంది:

ఈ అధ్యాయం అవతరించక పూర్వం వరకు మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) బహిరంగ ప్రదేశాల్లో దివ్యఖుర్‌ఆన్ పఠించి విన్పించినప్పుడల్లా అవిశ్వాసులు అల్లరిచేసి దైవవాణి జనానికి సరిగా విన్పించకుండా ఆటంకం కలిగిస్తుండేవారు. అయితే నబవీ శకం 5వ సంవత్సరం రమజాన్ నెలలో ఓరోజు ఆయన కాబాగృహానికి వెళ్ళి అక్కడ గుమిగూడిన జనం ముందు ఈ అధ్యాయాన్ని పఠించనారంభించారు. అప్పుడు సత్య తిరస్కారులు అల్లరి చేయకుండా మౌనంగా వినసాగారు. దైవప్రవక్త (సల్లం) ఈ అధ్యాయాన్ని పూర్తిగా పఠించి చివరి సూక్తి ముగింపులో సజ్దా (సాష్టాంగ ప్రణామం) చేశారు. ఆయనతో పాటు విశ్వాసులు, అవిశ్వాసులు కూడా అప్రయత్నంగా సజ్దా (సాష్టాంగప్రణామం) చేశారు. అయితే ఆ తరువాత అవిశ్వాసులు తమ తప్పు తెలుసుకొని ఇస్లాంకు మరింత బద్ధశత్రువులయి పోయారు.

ఈ అధ్యాయంలో దైవేతరశక్తుల ఆరాధన, మనోవాంఛలదాస్యం, మార్గవిహీనతా ధోరణుల్ని ఖండిస్తూ ప్రజలకు దేవుని ఏకత్వం బోధించడం జరిగింది. దైవప్రవక్తల్ని తిరస్కరించి సర్వనాశనమైపోయిన గతజాతుల గాథలు ప్రస్తావించి, వాటి నుంచి గుణపాఠం నేర్చుకోమని కూడా చెప్పబడింది. ఆ తరువాత ప్రళయ బీభత్సం, పరలోక పరిణామాల్ని గురించి హెచ్చరించడం జరిగింది.



### కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

అస్తమిస్తున్న నక్షత్రం సాక్షి! మీ సహచరుడు (పొరపాటున కూడా) దారి తప్పలేదు, (కావాలని కూడా) పెడదారి పట్టలేదు. అతను తన మనోవాంఛలకు తలయొగ్గి మాట్లాడడు. ఇది అతని (హృదయఫలకం)పై అవతరింపజేయబడిన దివ్యావిష్కృతి. ఎంతో వివేకవంతుడయిన ఓ మహాశక్తిమంతుడు (జిబ్రీల్) అతనికీ విషయాలు నేర్పుతున్నాడు. (1-6)

అతను తూర్పుదిక్కున ఎగువ దిగ్మండలంపై ఉన్నప్పుడు ఇతను అతనికి ఎదురుగా నిలబడ్డాడు. తరువాత మరికాస్త దగ్గరగా వచ్చి శూన్యంలో నిల్చున్నాడు. ఈవిధంగా అతను రెండు ధనస్సులంత దూరాన లేక అంతకంటే కొంచెం తక్కువ దూరాన (వచ్చి) నిలబడ్డాడు.[1] అప్పుడతను దైవదాసునికి అందజేయవలసిన దివ్య సందేశం అందజేశాడు. కళ్ళు చూసిన దానిలో హృదయం అసత్యాన్ని మిళితం చేయలేదు. ఇలా చర్మచక్షువులతో చూసిన దాని విషయంలో మీరు ఇతనితో వాదిస్తున్నారా?

ఇతను మరోసారి కూడా అతడ్ని (సప్తమాకాశంలో) 'సిద్రతుల్ మున్తహా' అనే దివ్య వృక్షరాజం దగ్గర చూశాడు.[2] దాని దరిదాపులోనే నివాసయోగ్యమైన స్వర్గధామం ఉంది.

---

1. ఇక్కడ అతను అంటే దైవప్రవక్తలకు దివ్యావిష్కృతి (వహీ) అందజేసే దైవదూత జిబ్రీల్ (అలైహి) అని అర్థం. ఇతను అంటే అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) అని అర్థం. దైవప్రవక్త (సల్లం) ఖుర్‌ఆన్ అవతరణ ప్రారంభరోజుల్లో జిబ్రీల్ (అలైహి)ని మొదటిసారిగా ఆయన అసలు స్వరూపంలో చూశారు. అప్పుడు జిబ్రీల్ దూత ఆరొందల రెక్కలతో యావత్తు నభోమండలంలో విస్తరించి ఉన్నారు. ఈ అసాధారణ దృశ్యం చూసి ముహమ్మద్ ప్రవక్త (సల్లం) భయపడి పోయారు.

2. మహనీయ ముహమ్మద్ (సల్లం) జిబ్రీల్‌దూత (అలైహి)ను రెండవసారి ఆయన అసలు రూపంలో మేరాజ్ సంఘటన సందర్భంగా చూశారు. దేవుడు దైవప్రవక్త (సల్లం)ను సప్తాకాశాల పర్యటన చేయించి అక్కడి అద్భుతాలను చూపించాడు. దీన్నే "మేరాజ్" సంఘటన అంటారు.

కొందరు ఈ సూక్తులు విని దైవప్రవక్త (సల్లం) దేవుడ్ని ప్రత్యక్షంగా చూశారని అపార్థం చేసుకున్నారు. ప్రవక్త సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) దీన్ని ఖండిస్తూ "మీలో ఎవరైనా ముహమ్మద్ (సల్లం) తమ ప్రభువుని చూశారని అంటే అతను అబద్ధమాడుతున్నాడన్నమాట" అన్నారు. మరొక సందర్భంలో "ముహమ్మద్ (సల్లం) తమ ప్రభువుని చూశారని ఎవరైనా అన్నాడంటే అతను దేవుని పై ఘోరమైన నింద మోపుతున్నాడన్నమాట" అన్నారు. హజ్రత్ ఆయిషా (రజి) దీన్ని గురించి దైవ ప్రవక్త (సల్లం)ను అడిగినప్పుడు, తాను దేవుడ్ని చూడలేదని, జిబ్రీల్ (దూత)ను మాత్రమే ఆకాశం నుండి దిగుతున్నప్పుడు చూశానని అన్నారు ఆయన. (వివరాలకు సహీ బుఖారి చూడండి.)

ముస్లిం, నసాయి, ముస్నద్ అహ్మద్, తబ్రానీ గ్రంథాలలో హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) నుండి గ్రహించి పేర్కొనబడిన ఉల్లేఖనాలు ఈ విధంగా ఉన్నాయి:

(1)"దైవప్రవక్త (సల్లం) తమ ప్రభువును హృదయంతో రెండుసార్లు చూశారు." (2)"దైవ ప్రవక్త (సల్లం) తమ ప్రభువును కళ్ళతో కాకుండా హృదయంతో చూశారు." (3)"దేవుడు ఇబ్రాహీం (అలైహి)ని తన మిత్రుడిగా చేసుకున్నాడు; మూసా (అలైహి)తో ప్రత్యక్షంగా సంభాషించాడు; ముహమ్మద్ (సల్లం)కు తన దర్శనభాగ్యం కలిగించాడు; ఈ విషయం విని మీరు ఆశ్చర్యపడు

ఆ సమయంలో ఆ వృక్షరాజంపై అనిర్వచనీయమైన అద్భుతమేదో ఆవరిస్తూ ఉండింది. అతని చూపులు వేరే వైపు మరలడంగాని, హద్దుమీరి ముందుకు పోవడంగాని జరగ లేదు. (ఈవిధంగా) అతను తన ప్రభువు (ప్రతిభ)కు సంబంధించిన గొప్ప నిదర్శనాలలో (అంటే మహిమలలో) కొన్నిటిని చూశాడు. (7-18)

ఇక మీరే చెప్పండి, ఎప్పుడైనా మీరు (మీ మిథ్యాదైవాలైన) లాత్, ఉజ్జా, మరో విగ్రహమైన మనాత్‌లను గురించి (ప్రశాంత మనస్సుతో) ఆలోచించారా? మీకు

---

తున్నారా?" (4)" నేను నా ప్రభువుని చూశాను" అని స్వయంగా దైవప్రవక్త (సల్లం) చెప్పారు. (5) "ఈరోజు రాత్రి నా ప్రభువు అత్యంత శ్రేష్ఠమైన రూపంతో నా దగ్గరకు వచ్చాడు" అని దైవప్రవక్త (సల్లం) చెప్పారు. దైవప్రవక్త (సల్లం) దేవుణ్ణి స్వప్నంలో చూశారని ఆయన మాటలకు అర్థం కావచ్చని నేను భావిస్తున్నాను." (6)"దైవప్రవక్త (సల్లం) తమ ప్రభువుని రెండుసార్లు చూశారు. ఒకసారి కళ్ళతో, మరొకసారి హృదయంతో చూశారు."

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) నుండి గ్రహించిన పై ఉల్లేఖనాలన్నీ ఒక దాంతో మరొకటి పొంతన లేకుండా అసంబద్ధంగా ఉన్నాయని కొందరు భాష్యకారులు అభిప్రాయపడ్డారు. అదీగాక ఇవిక్కడ పేర్కొనబడిన ఖుర్‌ఆన్ సూక్తికి అనుగుణంగా లేకపోవడం కూడా గమనార్హం.

తిర్మిజి గ్రంథం ప్రకారం అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) ఒక సమావేశంలో మాట్లాడుతూ "దేవుడు తన దర్శన భాగ్యాన్ని, ప్రత్యక్ష సంభాషణను ముహమ్మద్ (సల్లం), మూసా (అలైహి)ల మధ్య విభజించాడు. ఆయన మూసా (అలై)తో రెండుసార్లు ప్రత్యక్షంగా మాట్లాడాడు. ముహమ్మద్ (సల్లం)కు ఆయన రెండుసార్లు తన దర్శన భాగ్యం కలిగించాడు" అని అన్నారు.

హజ్రత్ మస్రూఖ్ ఈమాట విని దైవప్రవక్త (సల్లం) సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) దగ్గరకెళ్ళి "అమ్మా! ముహమ్మద్ (సల్లం) తమ ప్రభువుని చూశారా?" అని అడిగారు. దానికి ఆమె "నీ మాటలు విని నా రోమాలు (భయంతో) నిక్కబొడుచుకున్నాయి" అన్నారు. ఆ తరువాత ఆమె రెండవ పేరాలో పేర్కొన్నట్లు అలా అనడం అబద్ధమాడటంతో సమానమని, దైవప్రవక్త (సల్లం) దేవుణ్ణి కాదు, దైవదూత జిబ్రీల్ (అలైహి)ని మాత్రమే చూశారని తెలియజేశారు.

మరొక ఉల్లేఖనం ప్రకారం, హజ్రత్ ఆయిషా (రజి) ఇలా అన్నారు: "ఈ విషయంలో అందరికంటే ముందు నేనే దైవప్రవక్త (సల్లం)ను, మీరు మీ ప్రభువును చూశారా అని అడిగాను. దానికాయన "లేదు, నేను జిబ్రీల్‌ని మాత్రమే ఆకాశం నుండి దిగుతుంటే చూశాను" అన్నారు.

ముస్లింలోని ఒక ఉల్లేఖనంలో అబూజర్ గిఫ్ఫారి (రజి) ఇలా అన్నారు: నేను దైవప్రవక్త (సల్లం)ను "మీరు మీ ప్రభువును చూశారా?" అని అడిగాను. దానికాయన "నాకు, దైవదర్శనానికి మధ్య జ్యోతి అడ్డుతెరగా నిలిచింది" అన్నారు.

మరో ఉల్లేఖనం ప్రకారం "నేను నా ప్రభువును చూడలేదు, జ్యోతిని చూశాను" అన్నారు. వేరొక ఉల్లేఖనం ప్రకారం "దేవుని సృష్టితాలలో ఏ ఒక్కరి దృష్టీ ఆయన్ని చేరుకోజాలదు" అన్నారు దైవప్రవక్త (సల్లం).

దీన్నిబట్టి దేవుణ్ణి ప్రత్యక్షంగా ఇంతవరకు ఎవరూ చూడలేదని తెలుస్తోంది. దైవదర్శనం లభించడమంటే మోక్షం సిద్ధించడమే. ఈ మోక్షం మరణానంతర జీవితంలోనే పుణ్యాత్ములకు ప్రాప్తమవుతుంది. అప్పుడు స్వర్గ సౌఖ్యాలతో పాటు దైవదర్శన భాగ్యం కూడా లభిస్తుంది. (ఇతర వివరాలకు 7:143 సూక్తికి రాసిన వ్యాఖ్యానం చూడండి.)



కొడుకులు, దేవునికైతే కూతుళ్ళా?[3] ఇది చాలా దారుణమైన అక్రమ విభజన! (19-22)

నిజానికి ఇవి మీరు, మీ పూర్వీకులు పెట్టుకున్న కొన్ని పేర్లు తప్ప మరేమీ కాదు. వీటిని గురించి దేవుడు ఎలాంటి ప్రమాణం పంపలేదు. జనం కేవలం ఊహాజనిత విషయాల్ని అనుసరిస్తూ మనోవాంఛలకు బానిసలైపోయారు. వారిదగ్గరకు వారి ప్రభువు నుండి చక్కని హితోపదేశం వచ్చింది. (అయినా వారు అంధులయి అపమార్గంలో పడి కొట్టుమిట్టాడుతున్నారు.) మానవుడు తాను కోరుకున్నదే తనపాలిట సత్యం (ధర్మం) అవుతుందా? ఇహపర లోకాలు (అన్నీ) దేవుని అధీనంలోనే ఉన్నాయి. (23-25)

ఆకాశంలో అసంఖ్యాకమైన దైవదూతలు ఉన్నారు. కాని దేవుని అనుమతి, అభీష్టాలు లేకుండా వారు ఎవరి విషయంలోనూ ఎలాంటి సిఫారసు చేయలేరు. వారి సిఫారసువల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. పరలోకం మీద నమ్మకంలేని వారు దైవ దూతలకు స్త్రీల పేర్లిచ్చి దేవతలుగా కొలుస్తున్నారు. నిజానికి దీన్ని గురించి వారిదగ్గర ఎలాంటి (ప్రామాణిక)జ్ఞానం లేదు. వారు కేవలం ఊహాజనిత విషయాలు పట్టుకు వ్రేలాడుతున్నారు. సత్యం సమక్షంలో ఊహాగానాలకు ఎలాంటి విలువలేదు. (26-28)

కనుక ప్రవక్తా! మా హితబోధకు విముఖులై ప్రాపంచిక జీవితమే సర్వస్వంగా భావి స్తున్నవాణ్ణి గురించి పట్టించుకోకు; అతణ్ణి అతని మానాన వదిలెయ్యి. వారి దగ్గరున్న జ్ఞానం అంతే. (వారిదృష్టి ఐహిక ప్రయోజనాలు దాటి కాస్తయినా ముందుకు పోదు.) ఎవరు సన్మార్గంలో ఉన్నారో, మరెవరు దారితప్పారో నీ ప్రభువుకు బాగా తెలుసు.

భూమ్యాకాశాల్లోని అణువణువూ ఆయనకు చెందినదే. దేవుడు దుర్జనులకు వారి దుష్కార్యాలకుగాను ప్రతిఫలం ఇవ్వవలసి ఉంది. అలాగే చిన్న చిన్న పొరపాట్లు తప్ప ఘోరపాపాలు, స్పష్టమైన అశ్లీలచేష్టలు మానుకున్న సదాచారసంపన్నులకు సత్ఫలం కూడా ప్రసాదించవలసి ఉంది. (పొరపాట్ల విషయంలో) నీ ప్రభువు గొప్ప క్షమాశీలి. దేవుడు మిమ్మల్ని నేల నుండి సృజించినప్పటినుంచీ, మీరింకా మీ మాతృగర్భాల్లో పిండాలుగా ఉన్నప్పటినుంచీ ఆయనకు మీ పరిస్థితి బాగా తెలుసు. కనుక మీరు ఆత్మశుద్ధిని గురించి గొప్పలు చెప్పుకోకండి. మీలో నిజమయిన దైవభీతిపరుడెవరో ఆయనకు బాగాతెలుసు. (29-32)

ప్రవక్తా! దైవమార్గం తప్పి, కొంచెం మాత్రమే (ధనం) ఇచ్చి ఆగిపోయినవాణ్ణి నీవు చూశావా? (పరలోక) వాస్తవికతను చూడటానికి అతనిదగ్గర అగోచరజ్ఞానం ఉందా?[4]

---

3. ఈ సూక్తుల్లో పేర్కొన్న దేవతా విగ్రహాలను అరబ్బు బహుదైవారాధకులు దేవుని కుమార్తె లుగా పరిగణించేవారు. కాని తమకోసం మాత్రం కొడుకుల్ని కోరుకునేవారు. కూతురు పుడ్తే అవమాన భారంతో క్రుంగిపోతారు. కొడుకు పుడ్తే తెగ సంబరపడిపోతారు. ఈ విషయాన్నే ఖుర్‌ఆన్ ఇక్కడ ఖండిస్తోంది. (16:59, 43:18 సూక్తులు, 81:8 సూక్తికి రాసిన పాదసూచిక చూడండి.)

4. ఖురైష్‌తెగ నాయకుల్లో వలీద్ బిన్‌ముగైరా అనే వ్యక్తి మొదట్లో ఇస్లాం స్వీకరించడానికి అంగీకరించాడు. కాని తరువాత ఈ సంగతి అతని స్నేహితుడొకనికి తెలిసిపోయింది. ఆ స్నేహితుడు వలీద్‌ని వారిస్తూ "నీవు మన పూర్వీకులమతం వదలకు. నీకు పరలోకశిక్ష గురించి భయముంటే నాకు కొంత సొమ్ము ముట్టజెప్పు, నీకు బదులు నేనక్కడ శిక్ష అనుభవిస్తాను" అన్నాడు. వలీద్ దీనికి

మూసా గ్రంథంలో పేర్కొనబడిన విషయాలు అతనికి తెలియవా? నిజాయితీపరుడైన ఇబ్రాహీంకు ఇవ్వబడిన గ్రంథంలోని విషయాలు (కూడా) అతనికి తెలియవా? (అతనికి చెప్పు: పాప) భారం మోసేవాడెవడూ ఇతరుల (పాప)భారం మోయలేడు. (33-38)

మానవుడు దేనికోసం కృషిచేస్తాడో అదే అతనికి లభిస్తుంది. అతని కృషికి త్వరలోనే గుర్తింపు లభిస్తుంది. దాని ప్రతిఫలం పూర్తిగా ప్రసాదించబడుతుంది. (39-41)

- ♦ చివరికి (మానవులంతా) నీ ప్రభువు సన్నిధికే మరలిపోవలసి ఉంది. (42)
- ♦ (మిమ్మల్ని) ఆయనే నవ్విస్తున్నాడు; ఆయనే ఏడ్పిస్తున్నాడు. (43)
- ♦ ఆయనే (మీ) జీవన్మరణాలకు మూలకారకుడు. (44)
- ♦ ఆయనే కార్చబడే వీర్యబిందువుతో ఆడమగ జంటల్ని పుట్టిస్తున్నాడు. (ప్రళయ దినాన) పునర్జీవం ప్రసాదించడం కూడా ఆయన బాధ్యతే. (45-47)
- ♦ ఆయనే ఐశ్వర్యం అనుగ్రహించేవాడు; ఆయనే దారిద్ర్యం కల్గించేవాడు. (48)
- ♦ ఆయనే దేదీప్యమానంగా వెలిగిపోతున్న (విశేష) నక్షత్రానికి ప్రభువు. (49)
- ♦ ఆయనే తొలి ఆద్‌జాతిని తుదముట్టించాడు. సమూద్ జాతిని కూడా ఆయనే సమూలంగా తుడిచిపెట్టాడు, ఒక్కడూ మిగలకుండా. (50,51)
- ♦ ఆయనే అంతకు పూర్వం నూహ్‌జాతిని కూడా నాశనం చేసినవాడు. కారణం వారు పరమదుర్మార్గులు, విద్రోహులయి పోవడమే. (52)
- ♦ ఆయనే తల్లక్రిందులైన జనపదాలను ఎత్తి విసిరి పడవేశాడు. తరువాత వాటి మీద ఆవరించవలసినది ఆవరించింది.[5] (53,54)

కనుక నీప్రభువు ప్రసాదించిన ఏవరాల్ని గురించి నీవు అనుమానంలో పడ్డావు?

ఇది పూర్వం వచ్చిన హెచ్చరికల్లోని ఒక హెచ్చరిక. రానున్న (ప్రమాద) ఘడియ అతి సమీపంలోనే ఉంది. దేవుడు తప్ప మరెవరూ దాన్ని ఆపలేరు. వీటిని గురించేనా మీరు ఆశ్చర్యపోతున్నారు! (పైగా)మీరు నవ్వుతున్నారా! (సత్యతిరస్కారంవల్ల సంభవించే దుష్పరిణామాలు తలచుకొని) మీరు ఏడ్వడంలేదే!![6] అదీగాక అల్లరిచేసి వీటిని దాటవేయజూస్తున్నారా? (ఇప్పటికైనా) దేవుని ముందు సాష్టాంగపడండి; ఆయన్నే ఆరాధించండి. (55-62) ✪

---

ఒప్పుకున్నాడు. అతను తన నిర్ణయాన్ని మార్చుకొని ఒప్పందం ప్రకారం ఆ స్నేహితుడికి మొదటి విడతగా కొంత పైకం ఇచ్చాడు. కాని తరువాత ఏమైందో, మిగిలిన పైకం చెల్లించకుండా ముఖం చాటేశాడు. (తబరీ), (ఇతర వివరాలకు 15:74 సూక్తి పాదసూచిక చూడండి.)

5. ఇది లూత్‌జాతిపై వచ్చిన దైవశిక్ష. (వివరాలకు 15:74 సూక్తి పాదసూచిక చూడండి.)

6. దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు: "(మేరాజ్‌లో) నాముందు స్వర్గం తీసుకు రాబడింది. కనుక ఆ రోజంత దుర్దినం లేక సుదినం నేను మరెప్పుడూ చూడలేదు. నేనెరిగిన విషయం మీకు తెలిస్తే మీరు చాలా తక్కువగా నవ్వుతారు; ఎక్కువగా దుఃఖిస్తారు." (రియాజుస్సాలిహీన్)

ఇమాం గజాలి (రహ్మాలై) ఇలా చెప్పారు: "బిగ్గరగా ఏడ్వడం అసహనానికి చిహ్నం. పొట్ట చెక్కలయ్యేలా నవ్వడం బుద్ధి హీనతకు నిదర్శనం."



**అవతరణ: మక్కా** 

# 54. చంద్రుడు (ఖమర్)

**సూక్తులు: 55**

ఈ అధ్యాయాన్ని "ఖమర్" అంటారు. ఇది నబవీ శకం 8వ యేట అవతరించింది. ఇందులో చంద్రుడు రెండు ఖండాలుగా చీలిపోయి మళ్ళీ వెంటనే కలసిపోయిన చారిత్రక సంఘటన గురించి ప్రస్తావించబడింది. ప్రపంచం క్షణభంగురమని, ప్రళయం త్వరలో సంభవిస్తుందని చెప్పడానికి ఈ ఉదంతం నిదర్శనంగా పేర్కొనబడింది. అయితే మక్కాఅవిశ్వాసులు చంద్రఖండన ఉదంతాన్ని ముహమ్మద్ (సల్లం) గారి మంత్రతంత్రాల ఫలితమని భావించి సత్యానికి విముఖులయి పోయారు. ఆ తరువాత సత్యాన్ని తిరస్కరించిన గతజాతుల వృత్తాంతాలు తెలిపి వారికి పట్టిన దుర్గతి నుండి గుణపాఠం నేర్చుకోవాలని హెచ్చరించడం జరిగింది. చివరిలో మళ్ళీ ప్రళయం గురించిన ప్రస్తావన వచ్చింది.

### కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

ప్రళయ ఘడియ సమీపించింది. చంద్రుడు చీలిపోయాడు.[1] కాని వీరు మాత్రం ఎలాంటి మహిమ చూసినా (సత్యాన్ని విశ్వసించకుండా) విముఖులయి పోతున్నారు.

---

1. ప్రళయకాల చిహ్నంగా చంద్రుడు తృటిలో రెండు ఖండాలుగా చీలిపోయి తిరిగి కలుసుకోవడం అసాధారణ విషయమైనా అదొక చారిత్రక సంఘటన. హదీసు గ్రంథాల్లోని వివిధ ఉల్లేఖనాలను పరిశీలిస్తే ఇది హిజ్రీ శకానికి దాదాపు ఐదు సంవత్సరాల పూర్వం పున్నమిరాత్రిన చంద్రోదయం జరిగిన కొద్దిసేపటికే సంభవించినట్లు తెలుస్తోంది. పూర్ణ చంద్రుడు హఠాత్తుగా రెండు భాగాలుగా చీలిపోయి మరుక్షణమే తిరిగి కలిసిపోయాడు. ఆ సమయంలో దైవప్రవక్త (సల్లం) మక్కా సమీపంలోని 'మినా' ప్రాంతంలో ఉన్నారు. ఆయన చంద్రుడు రెండుగా చీలి తిరిగి కలుసుకోవడాన్ని అక్కడున్నవారికి చూపిస్తూ "మీరు దీనికి సాక్షులుగా ఉండండి" అన్నారు.

కాని అవిశ్వాసులు అంత పెద్ద సంఘటన కళ్ళారా చూసి కూడా "ముహమ్మద్ (స) మన మీద మంత్రంవేశాడు. దాంతో మన కళ్ళు మోసపోయాయి" అన్నారు. కాని కొందరు మాట్లాడుతూ "ముహమ్మద్ (స) మంత్రం (ఇక్కడున్న) మనమీద పారవచ్చు. అందరి మీద పారదు కదా! ఇతర ప్రాంతాల నుంచి జనాన్ని రానివ్వండి. దీన్ని వారు చూశారో లేదో అడుగుదాం" అన్నారు. ఇతర ప్రాంతాల నుండి వచ్చినవారు కూడా తామీ అపరూప దృశ్యం చూశామని చెప్పారు.

క్షణంపాటు కన్పించిన ఈ అపూర్వ దృశ్యం చూసేందుకు జనమంతా ఆకాశం వైపు దృష్టి సారించి ఉండరు. పైగా లోకమంతా దాన్ని చూడటం సాధ్యపడదు. అరేబియా, తూర్పుదేశాల్లోని ప్రజలకే ఇది కన్పిస్తుంది. అయితే ఇలా చంద్రుడు రెండుఖండాలుగా చీలిపోవడం, గురుత్వాకర్షణ శక్తివల్ల మళ్ళీ కలుసుకోడం సాధ్యమేనని నేటి శాస్త్రవేత్తలు సులభంగా ఊహించగలరు.

మన దేశంలో మల్బార్ చక్రవర్తి ఈ దృశ్యం చూసినట్లు చరిత్రకారులు, ఖుర్‌ఆన్ భాష్యకారులు పేర్కొన్నారు. మౌలానా సులైమాన్ నద్వి (రహ్మాలై) ఈ విధంగా పేర్కొన్నారు:

"భారత దేశంలో మొదటిసారిగా ఇస్లాం తన పాదాన్ని దక్షిణభారత్‌లో మోపింది. చంద్రుడు రెండు ఖండాలుగా చీలిపోయిన సంఘటనను మల్బార్ చక్రవర్తి కళ్ళారా చూసినట్లు తెలుస్తోంది. ఓరోజు రాత్రి ఈ దృశ్యం కన్పించింది. వెంటనే అతను పరిస్థితి తెలుసుకోవడానికి తన ప్రతినిధుల్ని దేశం నలుమూలలా పంపించాడు. చివరికి అరేబియాలో ఒక దైవప్రవక్త ప్రభవించాడని, ఆయనే

పైగా ఇది రోజూ ప్రదర్శిస్తున్న మంత్రజాలమేనని అంటున్నారు. వారు (చంద్ర ఖండన మహిమను కూడా) తిరస్కరించి తమ మనోవాంఛలకు బానిసలయి పోయారు. ప్రతి వ్యవహారం చివరికి ఒక పర్యవసానానికి చేరుకోక తప్పదు. (1-3)

వారి ముందుకు (గతజాతుల) స్థితిగతులు వచ్చాయి. అందులో గొప్ప గుణపాఠం ఉంది. నీతి, వివేకం కూడా ఉన్నాయి. కాని (ఈ) హెచ్చరికలేవీ వారికి ఏమాత్రం ఉపయోగపడటం లేదు. కనుక ప్రవక్తా! నీవు కూడా వారిని అట్టే పట్టించుకోకు.

ఏరోజు వారిని పిలిచేవాడు అనూహ్యమైన ఓ జుగుప్సాకర విషయం వైపు పిలుస్తాడో, ఆరోజు మానవులంతా బిత్తరచూపులు చూస్తూ, చెల్లాచెదరైన మిడతల దండులా తమ తమ సమాధుల నుండి బిలబిల బయటికి వస్తారు. అలా బయటికొచ్చి పిలిచేవాడి వైపు పరుగెత్తు తారు. (ఈరోజు ఈ సత్యాన్ని నిరాకరిస్తున్న) తిరస్కారులు అప్పుడు (యదార్థం తెలుసుకొని) "ఇది చాలా కఠినమైన రోజు" అనంటారు. (4-8)

వీరికి పూర్వం నూహ్‌జాతి (కూడా దైవప్రవక్తను) తిరస్కరించింది. ఆ ప్రజలు మా దాసుడ్ని అసత్యవాదిగా జమకట్టి ఇతనో పిచ్చివాడన్నారు. వారతడ్ని తీవ్రంగా బెదిరించారు. చివరికి అతను తన ప్రభువును మొరపెట్టుకుంటూ "(దేవా!) నన్ను అణచివేశారు. ఇక నీవే వీరికేదైనా ప్రతీకారం చెయ్యి" అన్నాడు. (9,10)

అప్పుడు మేము ఆకాశం నుండి కుండపోత వర్షం కురిపించాం. నేలను చీల్చి ఎక్కడికక్కడ ఊటలు పొంగిపొరలేలా చేశాం. ఈ నీరంతా విధినిర్ణయం ప్రకారం పని నెరవేరడానికి పూర్తిగా ఉపయోగపడింది. నూహ్‌ని, (అతని అనుచరుల్ని) మేము పలకలు, మేకులతో నిర్మించబడిన ఓనౌకలో ఎక్కించాం. అది మా పర్యవేక్షణలో (సవ్యంగా) సాగిపోతుండేది. ఇదీ తిరస్కృతుడైన వ్యక్తికోసం చేయబడిన ప్రతీకారం. (11-14)

ఆ నౌకను మేము ఒక (గుణపాఠంగా) సూచనగా చేసి వదలిపెట్టాము. మరి

---

ఈ మహాత్యం చూపెట్టాడని తెలిసింది. చక్రవర్తి ఈ సంగతి విని ఇస్లాం స్వీకరించాడు. తరువాత అరేబియా వెళ్ళిపోయాడు. కాని మక్కా చేరుకోక ముందే దారిలోనే ఎమన్‌లో చనిపోయాడు."

ఆ తరువాత దాదాపు వంద సంవత్సరాలకు హిజ్రీ శకం రెండవ సంవత్సరం మల్బార్ రాజ్యానికి చీరామన్ చక్రవర్తి అయ్యాడు. అతను కూడా ఇస్లాం స్వీకరించాడు. ప్రఖ్యాత చరిత్రకారుడు 'ఫరిష్తా' ఈ ఉదంతాన్ని ప్రస్తావిస్తూ ఇలా రాశాడు:

"కొందరు అరబ్బులు, అరబ్బేతరులు ఫార్సి జలసంధి గుండా ఓడలలో సరాందీప్‌కు ప్రయాణమయ్యారు. కాని దారిలో పెనుతుఫాను రావడంతో వారి ఓడలు మల్బార్ తీరానికి చేరుకోవలసి వచ్చింది. అప్పుడు మల్బార్ చక్రవర్తి మహాప్రవక్త (సల్లం)ను గురించి విచారిస్తే, ఈ ప్రయాణీకులు చంద్రుడు చీలిన సంఘటన కూడా తెలిపారు. చక్రవర్తి ఈ ఉదంతం విని "ఇది చాలా గొప్ప మహిమే. గొప్ప సంఘటనలు సంభవించినప్పుడు దాన్ని రాసిపెట్టడం మా దేశ సంప్రదాయం" అని చెప్పి దైవప్రవక్త (సల్లం)కాలం నాటి దస్తావీజులు తెప్పించాడు. చూస్తే అందులో చంద్రుడు రెండు ఖండాలుగా చీలిన సంఘటన గురించిన ప్రస్తావన ఉంది. దాంతో ఆ చక్రవర్తి ప్రభావితుడయి ఇస్లాం స్వీకరించాడు."



(దాన్ని చూసయినా) హితబోధ స్వీకరించేవారెవరైనా ఉన్నారా? నాశిక్ష ఎలాంటిదో, నా హెచ్చరికలు ఎలా ఉండేవో చూడండి. మేమీ ఖుర్ఆన్‌ని ప్రజలు అర్థం చేసుకోవడానికి సులభతరం చేశాం; మరి (దీన్నుండి) హితబోధ గ్రహించే వారెవరైనాఉన్నారా? 15-17)

ఆద్‌జాతి కూడా తిరస్కరించింది. నాశిక్ష ఎలాంటిదో, నాహెచ్చరికలు ఎలా ఉండేవో చూడండి. మేమొక దుర్దినాన వారిపైకి భయంకరమైన తుఫాన్ పంపాము. అది ఖర్జూరపు మొదళ్ళను సమూలంగా ఎత్తి పడేసినట్లు జనాన్ని ఎత్తి విసిరి పడేస్తుండేది. కనుక నా శిక్ష ఎలాంటిదో, నా హెచ్చరికలు ఎలా ఉండేవో చూడండి. మేమీ ఖుర్ఆన్‌ని ప్రజలు గ్రహించడానికి సులభతరం చేశాం; మరి (దీన్నుండి) హితబోధ గ్రహించేవారు ఉన్నారా? (18-22)

సమూద్‌జాతి మా హెచ్చరికల్ని త్రోసిపుచ్చింది. పైగా వారిలా అన్నారు: "మనలోని వాడే అయిన ఒకడ్ని మనం అనుసరిస్తామా? అతనికి విధేయులై పోవడమంటే మనం అపమార్గం పట్టినట్టే; మన బుద్ధి గడ్డితిన్నట్టే. మనందరిలో ఇతనొక్కడి పైనే దైవసందేశం అవతరించిందా? లేదు. ఇతను పచ్చి అబద్ధాలకోరు; బడాయి చెప్పుకునే తప్పుడు మనిషి." (23-25)

(అప్పుడు మేము మా ప్రవక్తతో ఇలా అన్నాము:) "అబద్ధాలకోరు ఎవరో, బడాయి చెప్పుకునే తప్పుడు మనిషి ఎవరో రేపే వారికి తెలుస్తుంది. మేము వారి కోసం ఒంటెను పరీక్షగా చేసి పంపుతున్నాము. వారికి ఎలాంటి గతి పడ్తుందో కాస్త ఓపిక పట్టి చూడు. వారికి, ఒంటెకు మధ్య నీళ్ళు విభజించబడతాయని, ప్రతి ఒక్కరూ తమ వంతు వచ్చేరోజు మాత్రమే నీటిని వాడుకోవాలని వారికి తెలియజెయ్యి." (26-28)

చివరికి వారు తమ మనిషి ఒకడ్ని (అకృత్యానికి) పురిగొల్పారు. అతనా ఒంటెను పట్టుకొని చంపివేశాడు. ఇక నా శిక్ష ఎలాంటిదో, నా హెచ్చరికలు ఎలా ఉండేవో చూడండి. మేము వారిపైకి ఓ భయంకరమైన విస్ఫోటం పంపాము. దాంతో వారు తొక్కివేయబడిన పశువుల కొట్టంలా నుగ్గునుగ్గయి పోయారు. మేమీ ఖుర్ఆన్‌ని ప్రజలు అర్థం చేసుకోవడానికి సులభతరం చేశాం; మరి (దీన్నుండి) హితబోధ గ్రహించే వారెవరైనా ఉన్నారా? (29-32)

లూత్‌జాతి ప్రజలు కూడా మేము చేసిన హెచ్చరికలు త్రోసిపుచ్చారు. అందువల్ల మేము వారి మీదికి రాళ్ళతుఫాన్‌ని పంపాము. దాని బారి నుండి లూత్ గృహస్థులు మాత్రమే సురక్షితంగా ఉన్నారు. వారిని మేము మా అనుగ్రహంతో (ఆ) రాత్రి తెల్లవారుజామునే అక్కడ్నుంచి వేరే చోటికి తరలించాము. ఈవిధంగా మేము కృతజ్ఞులైన వారికి ప్రతిఫలమిస్తున్నాం.

లూత్ (ప్రవక్త) ముందుగానే తన జాతిప్రజల్ని మా పట్టును గురించి హెచ్చరించాడు. కాని వారు మా హెచ్చరికల్ని ఉత్తుత్తి హెచ్చరికలుగా భావించి త్రోసిపుచ్చారు. వారతడ్ని తన అతిథుల్ని కాపాడుకోనివ్వకుండా అడ్డుతగలడానికి ప్రయత్నించారు. చివరికి మేము "ఇక నాశిక్ష, నా హెచ్చరికల పర్యవసానం చవిచూడండి" అంటూ వారి

కళ్ళు పోగొట్టాము.[2] అదీగాక (మరునాడు) తెలతెలవారుతుండగానే ఓ తిరుగులేని శిక్ష (ఘోరమైన ఉపద్రవం) వారిని మట్టుబెట్టింది. "నాశిక్ష, నాహెచ్చరికల పర్యవసానం చవి చూడింప్పుడు." మేమీ ఖుర్‌ఆన్‌ని ప్రజలు అర్థం చేసుకోవడానికి సులభతరం చేశాము; మరి (దీన్నుండి) హితబోధ గ్రహించేవారు ఎవరయినా ఉన్నారా? (33-40)

ఫిరౌనీయుల దగ్గరకు (కూడా మా) హెచ్చరికలు వచ్చాయి. కాని వారు (కూడా) మా సూచనలన్నిటినీ త్రోసిపుచ్చారు. చివరికి మేము అత్యంత శక్తిసామర్థ్యాలు గలవాడు పట్టినట్లు వారిని (కఠినంగా) పట్టుకున్నాము. (41,42)

మీ అవిశ్వాసులు వారికంటే శ్రేష్ఠులా? లేక గతగ్రంథాలలో మీకోసం క్షమాపణ రాసిపెట్టిఉందా? లేక వీరు (తమ మందీమార్బలం చూసుకొని విర్రవీగుతూ) తామొక పటిష్ఠమైన వర్గమని, తమనితాము రక్షించుకోగలమని భావిస్తున్నారా? కాని త్వరలోనే ఈవర్గం చిత్తుగా ఓడి పారిపోతుంది.[3] వారి భరతంపట్టడానికి అసలు నిర్ణీతదినం ప్రళయం ఉండనేఉంది. అది అత్యంత ప్రాణసంకటమైన కఠిన సమయం. అసలీ పాపాత్ములు అపోహకు గురయిఉన్నారు. వారి బుద్ధి మందగించింది. వారిని ఒకరోజు బోర్లాపడేసి బరబర ఈడుస్తూ నరకాగ్నిలో పడవేయడం జరుగుతుంది. అప్పుడు (దైవదూతలు) వారితో "ఇక నరకాగ్నిని చవిచూడండి" అంటారు. (43-48)

మేము ప్రతి వస్తువుని ఒక నిర్ణీతపద్ధతి ప్రకారం ఒక నిర్దిష్టక్రమంలో సృష్టించాము. మేము (ఏదైనా చేయదలచుకుంటే ఒకేఒక ఆజ్ఞ జారీచేస్తాము. దాంతో ఆ పని తృటిలో జరిగిపోతుంది. మీలాంటి వారిని మేము ఎంతో మందిని హతమార్చాము. మరి (మా) హితబోధ గ్రహించే వారెవరైనా ఉన్నారా? వీరు చేసినదంతా (మా దగ్గర) కర్మలచిట్టాలో నమోదయిఉంది. చిన్నా పెద్దా ప్రతి విషయం వ్రాయబడి ఉంది. (49-53)

భయభక్తులు కలవారు తప్పకుండా స్వర్గోద్యానవనాలలో, చల్లటి సెలయేరుల మధ్య (హాయిగా) ఉంటారు. అది సర్వ శక్తిమంతుడైన విశ్వసామ్రాట్టు సమీపంలో ఉండే ఎంతో గౌరవప్రదమయిన స్థానం. (54,55) ✪

---

2. స్వజాతి సంపర్కానికి అలవాటుపడిన ఆ దుర్మార్గులు అందమైన యువకుల్ని చూస్తే వదలిపెట్టేవారు కాదు. హజ్రత్ లూత్ (అలైహి) ఇంటికి యువకుల రూపాల్లో వచ్చిన దైవదూతల్ని చెరచడానికి వచ్చినప్పుడు లూత్ (అలైహి) వారికి నచ్చజెప్పడానికి ఎంతగానో ప్రయత్నించారు. కాని ఆ తుచ్ఛులు వినకుండా ఇంట్లోకి జొరబడి ఆ యువకుల్ని తీసికెళ్ళడానికి ప్రయత్నించారు. అప్పుడు వారి కళ్ళు పోయాయి. దాంతో వారు తమ దురుద్దేశ్యం మానుకొని వెళ్ళిపోయారు.

3. ఇది బద్ర్ యుద్ధం గురించిన భవిష్యత్ ప్రకటన. హిజ్రీ శకానికి అయిదేండ్ల పూర్వమే ఈ ప్రకటన వెలువడింది. ముస్లింలు బహుదైవారాధకుల దౌర్జన్యం, అణచివేతలకు గురయి దుర్భర జీవితం గడుపుతున్న రోజులవి. కొందరు ముస్లింలు ఈ బాధలు భరించలేక దైవప్రవక్త (సల్లం) అనుమతితో అబిసీనియాకు వలసపోయారు. మిగిలినవారు ఘోరమైన సంఘబహిష్కరణకు గురయి అష్టకష్టాలు పడసాగారు. అలాంటి పరిస్థితిలో ఈ ప్రకటన వెలువడి ఒక వైపు పీడిత ముస్లింలకు ధైర్యం కలిగించి, మరోవైపు సత్యావరోధుకులను మందలించింది.



# 55. కరుణామయుడు (రహ్మాన్)

అవతరణ: మక్కా సూక్తులు: 78

ఈ అధ్యాయాన్ని "రహ్మాన్" అంటారు. ఇది నబవీశకం ప్రారంభదశలో అవతరించి నట్లు తెలుస్తోంది. ఇందులో మానవుల్ని, జిన్నుల్ని సంబోధిస్తూ దేవుని మహోపకారాలు, మహిమలను ప్రస్తావిస్తూ వాటిని మీరెలా తిరస్కరించగలరని మాటి మాటికి ప్రశ్నించడం జరిగింది. దాంతోపాటు పరలోకంలోని స్వర్గనరకాలు కూడా వర్ణించబడ్డాయి.

## కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

కరుణామయుడే ఈ ఖుర్‌ఆన్‌ని (తన ప్రవక్తకు) నేర్పినవాడు. ఆయనే మానవుడ్ని సృష్టించి అతనికి మాట్లాడటం నేర్పాడు. (1-4)

సూర్యచంద్రులు (దైవ) నియమావళికి కట్టుబడి ఉన్నారు. నక్షత్రాలు, వృక్షాలు కూడా సాష్టాంగపడుతూ ఆజ్ఞాబద్ధమైఉన్నాయి. ఆయనే ఆకాశాన్ని నెలగొల్పాడు, త్రాసుని (న్యాయాన్ని) కూడా స్థాపించాడు. కనుక మీరు త్రాసు సమతూకాన్ని చెడగొట్టకండి. న్యాయంగా, పూర్తిగా తూచివ్వండి.[1] కొలత పరిమితులు అతిక్రమించకండి. (5-9)

ఆయన భూమిని యావత్తు జీవరాసుల కోసం రూపొందించాడు. అందులో రక రకాల పండ్లూ, ఫలాలూ అసంఖ్యాకంగా ఉన్నాయి. పొరలలో చుట్టబడిన ఖర్జూర పండ్లు కూడా ఉన్నాయి. ఇంకా రకరకాల ధాన్యాలున్నాయి. అందులో ఊక కూడా ఉంటుంది, గింజలు కూడా ఉంటాయి. కనుక (మానవులారా, జిన్నులారా!) మీ ప్రభువు ప్రసాదించిన ఏ మహాభాగ్యాలు మీరు నిరాకరించగలరు? ( 10-13)

ఆయన మానవుడ్ని పెంకులాంటి ఎండిన రేగడమట్టితో సృజించాడు. జిన్ (భూతం)ని అగ్నిజ్వాలతో సృజించాడు.[2] కనుక (మానవులారా, జిన్నులారా!) మీ ప్రభువు సృష్టించిన ఏ అద్భుతాలు మీరు తిరస్కరించగలరు? (14-16)

రెండు తూర్పులకు, రెండు పడమరలకు ఆయనే ప్రభువు, పాలకుడు. కనుక మీరు మీ ప్రభువుకున్న ఏ శక్తిసామర్థ్యాలు త్రోసిపుచ్చగలరు? (17,18)

---

1. వివరాలకు 83:1-5 సూక్తులు, వాటి పాదసూచిక చూడండి.

2. మానవుల్లాగే జిన్నులు (భూతాలు) కూడా బుద్ధిజీవులే. వీరిక్కూడా దేవుడు మంచీ చెడుల విచక్షణా జ్ఞానంతోపాటు, చెడును లేదా మంచిని అవలంబించే స్వేచ్ఛ కూడా ప్రసా దించాడు. అందువల్ల వీరిలో కూడా విశ్వాసులు, అవిశ్వాసులు, సజ్జనులు, దుర్జనులు ఉన్నారు. వీరికీ మరణానంతరం కర్మవిచారణ, స్వర్గ నరకాలు ఉంటాయి.

అయితే జిన్నులు ఉష్ణ వాయువు (Hot air Or Scorching wind)తో కూడిన ఓ ప్రత్యేకమైన అగ్నిజ్వాలకు సంబంధించిన కణాలతో సృజించబడినందున వారు మానవులకు కన్పించరు. అదీగాక వారు అవసరమయితే తమ రూపాలను మార్చుకోగలుగుతారు.

(15:27 సూక్తితోపాటు వివరాలకు 6:128 సూక్తికి రాసిన వ్యాఖ్యానం చూడండి.)

ఆయన రెండు సముద్రాలను పరస్పరం కలసిపోయేలా వదలిపెట్టాడు. ఆయినా వాటి మధ్య ఒక అడ్డుతెర ఉంది. దానివల్ల అవి ఒకదానిలో ఒకటి చొచ్చుకు పోలేవు. మరి మీరు మీ ప్రభువు శక్తిపరిధిలోని ఏ మహిమను నిరాకరించగలరు? (19-21)

ఆ సముద్రాలలో ముత్యాలు, పగడాలు (కూడా) లభిస్తాయి. కనుక మీరు మీ ప్రభువులో ఉన్న ఏ ఔన్నత్యాన్ని కాదనగలరు? (22,23)

సముద్రంలో కొండల్లా ఎత్తుగా నిలబడి సాగిపోయే ఓడలు కూడా ఆయనవే. కనుక మీరు మీ ప్రభువు చేసిన ఏ మేళ్ళు తిరస్కరించగలరు?[3] (24,25)

---

3. ఈ అధ్యాయంలోని 1-25 సూక్తులలో దేవుడు మానవునికి ఇహలోకంలో చేసిన మేళ్ళను గురించి పేర్కొన్నాడు. 46-75 సూక్తులలో పరలోకంలోని మేళ్ళను ప్రస్తావించాడు. మొదటి 25 సూక్తులలో ఆనాటి ప్రజలకు ప్రసాదించబడిన ఐహిక మేళ్ళు ఉదాహరించబడ్డాయి. అయితే ఈనాటి ప్రజలకు వాటితోపాటు, అంతకంటే మెరుగైన ఎన్నో మేళ్ళు అనుగ్రహించబడ్డాయి. సైన్సు, సాంకేతిక పరిజ్ఞానాలు నేటి మానవునికి అనేక సౌఖ్యాలు, సౌకర్యాలు, సౌలభ్యాలు చేకూర్చాయి.

ఉదా/కు విద్యుచ్ఛక్తి మానవుని జీవితవిధానాన్నే మార్చివేసింది. గతంలో అసాధ్యమనుకున్న ఎన్నోపనుల్ని నేడు విద్యుచ్ఛక్తితో నడిచే యంత్రాలొచ్చి సుసాధ్యం చేశాయి. పట్టణాలలో ఈనాడు లైట్లు, ఫ్యాన్లు లేని ఇండ్లు దాదాపు లేవు. ఒక్కరోజు కరెంటు లేకపోతే జీవితం దుర్భరం అవుతుంది. అలాగే కార్లు, బస్సులు, రైళ్ళు, విమానాలు ప్రయాణ బడలికను తీర్చడమేగాక, సమయాన్ని ఎంతో ఆదా చేస్తున్నాయి. విద్యుచ్ఛక్తి వల్ల ప్రజలు అనుభవిస్తున్న సౌఖ్యాలు, సౌకర్యాలను గమనిస్తే ఓగంట సేపయినా విద్యుచ్ఛక్తి లేకపోతే వారి జీవితం గడవనే గడవదని అన్పిస్తుంది.

ఆ తరువాత ఎలాక్ట్రానిక్స్ పరిజ్ఞానం పరిస్థితుల స్వరూపాన్ని మరింత మార్చివేసింది. జీవితం మరింత సుఖమయమైంది. ఈ ఎలాక్ట్రానిక్స్ సమాచార రంగంలో గొప్ప సంచలనమే సృష్టించింది. రేడియో, టెలిఫోన్, టెలివిజన్, టెలిప్రింటర్, ఫ్యాక్స్, ఇ-మెయిల్, ఇంటర్‌నెట్ వగైరా మాధ్యమాలు మానవునికి గణనీయమైన సేవలు అందజేస్తున్నాయి.

ఆ తరువాత కంప్యూటర్లు వచ్చి మానవుని జీవితంలో ఓ పెద్ద అద్భుతాన్నే సృష్టించాయి. వందలమంది కార్మికులు కలసి నెలల తరబడి చేసే పనుల్ని ఒక కంప్యూటర్ కొన్ని గంటలలోనే చేసివేస్తుంది. ఈ కంప్యూటర్ల నుండే తయారయిన 'రోబోట్' అనేక రంగాలలో మానవులతో పోటీ పడుతున్నాయి. అభివృద్ధి చెందిన కొన్ని దేశాలలో ఇవి గనులలో త్రవ్వకం, కర్మాగారాలలో వెల్డింగ్, బ్యాంకులలో ఎకౌంట్స్ మొదలైన పనులు నిర్వహిస్తున్నాయి. అంతేకాదు, అమెరికా, బ్రిటన్‌లలో మనుషులకు శస్త్రచికిత్సలు జరపడానికి కూడా వీటిని ఉపయోగిస్తున్నారు.

వైద్యరంగంలోనూ విజ్ఞానశాస్త్రం ఎన్నోమార్పులు తెచ్చింది. ప్రాచీన విధానాలైన యునానీ, ఆయుర్వేద చికిత్సలతో పాటు ఆధునిక వైద్యవిధానాలైన అల్లోపతి, హోమియోపతి చికిత్సలు కూడా ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూర్చుతున్నాయి. శస్త్రచికిత్సల కోసం కొత్తకొత్త పరికరాలు వినియోగించబడుతున్నాయి. ఎక్కువ నొప్పి లేకుండా, ఎక్కువ రక్తస్రావం కాకుండా లేజర్‌చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. శరీరంలో కృత్రిమ అవయవాలు ప్రవేశపెడ్తున్నారు. క్యాన్సర్, పార్కిన్‌సన్స్ లాంటి మొండివ్యాధుల్ని నయం చేయడానికి, మేధాశక్తిని, ఆయుష్షును పెంచడానికి కూడా జీన్‌థెరపీ (జన్యుచికిత్స) ద్వారా కృషి జరుగుతోంది.



ఈ ధరణిపై ఉన్న సమస్త ప్రాణికోటి నశించిపోయేదే. మహోన్నతుడు, మహిమాన్వితుడయిన నీ ప్రభువు అస్తిత్వమే శాశ్వతంగా నిలిచి ఉంటుంది. కనుక మీ ప్రభువుకున్న ఏ శక్తియుక్తులు మీరు ఖండించగలరు? (26-28)

భూమ్యాకాశాల్లోని జీవరాసులన్నీ తమ అవసరాలను ఆయన్నే అర్థిస్తున్నాయి. ఆయన అనుక్షణం సృష్టికి సంబంధించిన ఏదో ఒక అద్భుతకార్యంలో నిమగ్నుడయి ఉంటాడు. మరి మీరు మీ ప్రభువులో ఉన్న ఏ సృజనాత్మక లక్షణాలు నిరాకరిస్తారు?

భూమికి భారమయిపోయిన వారలారా! త్వరలోనే మేము మీకర్మల విచారణ కోసం తీరిక చేసుకుంటాం. (అప్పుడు) మీరు మీ ప్రభువుకున్న ఏ శక్తిసామర్థ్యాలు తిరస్కరించగలరో (మేము చూస్తాము). (29-32)

మానవులారా! జిన్నులారా!! మీరు భూమ్యాకాశాల పరిధులు దాటి పారిపోగలరేమో ప్రయత్నించి చూడండి. దానికోసం అసాధారణ ప్రజ్ఞా పాటవాలు కావాలి. కనుక మీరు మీ ప్రభువులోని ఏ ప్రజ్ఞాపాటవాలు నిరాకరిస్తారు? (ఒకవేళ మీరు పారిపోవడానికి ప్రయత్నిస్తే,) మీ మీదికి అగ్నిజ్వాల, పొగ వదలిపెట్టడం జరుగుతుంది. వాటిని మీరు ఏమాత్రం ఎదుర్కోలేరు. కనుక మీరు మీప్రభువులో ఉన్న ఏ శక్తి సామర్థ్యాలు ధిక్కరించగలరు? (33-36)

ఆకాశం బ్రద్దలై వలచిన చర్మంలా ఎర్రబారిపోతుంది. అప్పుడు (మీపరిస్థితి ఏమిటో  ఆలోచించండి.) మరి మీ ప్రభువు చూపే ఏ మహిమల్ని మీరు ఖండిస్తారు?

ఆరోజు ఏ మానవుణ్ణీ, ఏ జిన్‌నీ అతని పాపం గురించి అడగవలసిన అవసరమే ఉండదు. మరి మీప్రభువులోని ఏ శక్తియుక్తుల్ని కాదనగలరు? పాపాత్ముల్ని వారి (పాపిష్టి) ముఖాల్ని బట్టే గుర్తించవచ్చు. వారి ముంగురుల్ని, కాళ్ళను పట్టి బరబర ఈడ్చుకు పోవడం జరుగు తుంది. అప్పుడు మీ ప్రభువుకున్న ఏ శక్తిసామర్థ్యాలు మీరు నిరాకరించగలరు? (37-42)

---

వ్యవసాయరంగంలో కూడా సైన్సు మానవునికి గణనీయమైన సేవ చేస్తోంది. యంత్రాలు, రసాయనిక ఎరువులు, నూతనవిధానాల ద్వారా ఉత్పత్తులు అనూహ్యమైన రీతిలో పెరిగిపోయాయి. జెనిటిక్ ఇంజనీరింగ్, బయోటెక్నాలజీలు వ్యవసాయోత్పత్తులను పెంచడంలో ప్రముఖ పాత్ర వహిస్తున్నాయి. జపాన్‌లో "హైడ్రోపోనిక్స్" అనే అత్యాధునిక పద్ధతి ద్వారా మొక్కలకు కావలసిన వాతావరణం, పోషకాంశాలు కృత్రిమంగా కల్పించి అట్టల మీద కూరగాయలు పండిస్తున్నారు. ఈనాడు ప్రపంచంలో ఉత్పత్తి అవుతున్న ఆహార ధాన్యాలను గనక ప్రపంచ ప్రజలందరికీ అవసరమైన మేరకు న్యాయంగా పంచడం జరిగితే, అవి పోగా యేడాదికి లక్షలాది టన్నుల ఆహారధాన్యాలు మిగిలిపోతాయంటే అతిశయోక్తి లేదు. కాని స్వార్థం, సంకుచితత్వాలు ఆధునిక మానవుని ఆలోచనలను భౌతిక, జాతీయతత్వ సరిహద్దులను దాటనివ్వడం లేదు.

ఏమైనప్పటికీ ఇవన్నీ దేవుడు ప్రసాదించిన సౌకర్యాలనడంలో సందేహం లేదు. ఆ దేవుడే మానవులకు సుఖాలు, సౌలభ్యాలు పొందడానికి కావలసిన జ్ఞానం, తెలివితేటలు అనుగ్రహించాడు. మరి అలాంటి కరుణామయునికి కృతజ్ఞులయి ఉండటం మానవుల విధ్యుక్త ధర్మం కాదా?

నేరస్థులు అసత్య విషయంగా భావించి త్రోసిపుచ్చిన నరకం ఇదే. ఈ నరకంలోనే వారు (నానా యాతనలు అనుభవిస్తూ, తీవ్రమైన దప్పికతో) యాతన స్థలానికి, సలసల కాగుతున్న నీటి చలమలకూ మధ్య తిరుగుతూ ఉంటారు. కనుక మీరు మీ ప్రభువులో ఉన్న ఏ ప్రతిభాశక్తులు తిరస్కరించగలరు? (43-45)

విశ్వప్రభువు ముందు నిలబడి తన కర్మలకు సమాధానం ఇచ్చుకోవలసి ఉంటుందని భావించి భయభక్తులతో జీవితం గడిపిన ప్రతి వ్యక్తికీ రెండు (స్వర్గ)వనాలు లభిస్తాయి. కనుక (మానవులారా! జిన్నులారా!) మీ ప్రభువు ప్రసాదించే ఏ వరాలు మీరు నిరాకరిస్తారు? పచ్చటి రెమ్మలతో శాఖోపశాఖలుగా విస్తరించిన ఉద్యానవనాలవి. మరి మీరు మీ ప్రభువు అనుగ్రహించే ఏ కానుకలు తిరస్కరించగలరు? (46-49)

ఆ రెండు వనాలలో రెండు సెలయేరులున్నాయి. కనుక మీ ప్రభువు ప్రసాదించే ఈ భాగ్యాలను ఎలా నిరాకరిస్తారు? రెండు వనాలలోనూ ప్రతిజాతి ఫలానికి చెందిన రెండు రకాలున్నాయి. మీ ప్రభువు ప్రదానంచేసే ఈ బహుమానాలు నిరాకరించగలరా?

స్వర్గవాసులు బంగారు జలతారు అంచులుండే పట్టు పరుపులపై మెత్తటి దిండ్లకు ఆనుకొని కూర్చుంటారు. (వారిముందు) పండ్లతో నిండిన చెట్లరెమ్మలు వంగి ఉంటాయి. కనుక మీరు మీ ప్రభువు ప్రసాదించే ఏ మహాభాగ్యాలు నిరాకరిస్తారు?

ఆ మహాభాగ్యాల మధ్య (వారి కోసం) సిగ్గులొలికించే స్వర్గ కన్యలుంటారు. వారిని ఈ స్వర్గవాసులకు పూర్వం ఏ మానవుడుగాని, జిన్‌గాని తాకనైనా తాకిఉండడు. కనుక మీరు మీ ప్రభువు ప్రదానం చేసే ఏ బహుమానాలు తిరస్కరించగలరు? వారు మణి మాణిక్యాల్లా అసామాన్య సౌందర్యరాసులు. మరి మీరు మీ ప్రభువు ప్రసాదించే ఈ బహుమానాలు కాదనగలరా? (50-59)

సత్కార్యానికి ప్రతిఫలం సత్కార్యం తప్ప మరేమవుతుంది? కనుక మీ ప్రభువు సద్గుణ సంపత్తిని మీరేవిధంగా త్రోసిపుచ్చగలరు? (60,61)

ఆ రెండు వనాలేగాక మరో రెండు వనాలు కూడా ఉన్నాయి. కనుక మీ ప్రభువు ఇచ్చే ఏ వరాలు మీరు తిరస్కరించగలరు? అవి దట్టమైన నిత్యహరిత వనాలు. మరి మీరు మీ ప్రభువు అనుగ్రహాలలో ఏ అనుగ్రహాన్ని నిరాకరించగలరు? (62-65)

ఆ రెండు వనాలలో రెండు సెలయేరులు పరవళ్ళు తొక్కుతుంటాయి. కనుక మీరు మీ ప్రభువు ప్రసాదించే ఏ కానుకలను తిరస్కరిస్తారు? (66,67)

ఆ ఉద్యానవనాలలో ఖర్జూరం, దానిమ్మ (వగైరా) పండ్లు, ఫలాలు పుష్కలంగా ఉంటాయి. మరి మీరు మీప్రభువు అనుగ్రహించే ఏ భాగ్యాలు కాదనగలరు? (68,69)

ఆ వనాలలో సద్గుణసంపత్తితో కూడిన సౌందర్యవతులైన సతులు ఉంటారు. కనుక మీరు మీప్రభువు ఇచ్చే ఏ వరాలు నిరాకరించగలరు? ఇంకా ఎల్లప్పుడూ పర్ణశాలల్లోనే ఉండే సుందరాంగులు కూడా. కనుక మీ ప్రభువు ప్రసాదించే ఈ కానుకల్ని మీరెలా తిరస్కరిస్తారు? వారిని ఈ స్వర్గవాసులకు పూర్వం ఏమానవుడుగాని,



జిన్‌గాని తాకనైనా తాకిఉండడు. మరి మీ ప్రభువు ప్రదానంచేసే ఏ బహుమానాలు మీరు త్రోసిపుచ్చుతారు? (70-75)

అక్కడ స్వర్గవాసులు అత్యంత విలువైన, ఎంతో అపురూపమైన పచ్చటి తివాచీల మీద మెత్తటి దిండ్లకు ఆనుకొని కూర్చుంటారు. కనుక మీరు మీ ప్రభువు అనుగ్రహించే ఏ మహాభాగ్యాలు నిరాకరించగలరు? (76,77)

మహోన్నతుడు, మహిమాన్వితుడైన నీప్రభువు పేరు ఎంతోశుభదాయకం. (78)✪

**అవతరణ: మక్కా** # 56. సంఘటన (వాఖిఆ) **సూక్తులు:96**

ఈ అధ్యాయాన్ని "వాఖిఆ" అంటారు. ఇది నబవీశకం 5వ సంవత్సరం హజ్రత్ ఉమర్ (రజి) ఇస్లాం స్వీకరించక పూర్వం అవతరించినట్లు తెలుస్తోంది. ఇందులో ప్రళయం, పునరుత్థానం తరువాత కర్మవిచారణ రోజు సంభవించే పరిణామాలు ప్రస్తావించబడ్డాయి. ఆ తరువాత మానవులకు దేవుడు చేసిన ఒక్కొక్క ఉపకారం గురించి పేర్కొంటూ వాటికి కారణం దేవుడా లేక మీరా అని ప్రశ్నించడం జరిగింది. చివర్లో మళ్ళీ పరలోకం ప్రస్తావన వస్తుంది.

### కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

జరగవలసిన సంఘటన జరిగినప్పుడు ఇక దాన్ని ఏ ఒక్కరూ నిరాకరించలేరు. అది (విశ్వవ్యవస్థను) అస్తవ్యస్థం చేసివేసే మహోపద్రవం! అప్పుడు యావత్తు భూమండలం ఒక్కసారిగా కుదిపి వేయబడుతుంది. పర్వతాలు సైతం తునాతునకలయి ఆకాశంలో ధూళి రేణువుల్లా ఎగురుతాయి. (1-6)

అప్పుడు మీరు మూడు వర్గాలుగా[1] చీలిపోతారు: కుడిపక్షంవారు, ఆహా కుడిపక్షం వారి (అదృష్టాన్ని) గురించి ఏమని వర్ణించాలి!

ఎడమపక్షంవారు, ఎడమపక్షంవారి (దౌర్భాగ్యాన్ని) గురించి ఇక చెప్పేదేముంది!

ముందుండేవారు, (ప్రతి సత్కార్యంలో) వారు ముందుండేవారే! వారే (దైవ) సన్నిహి తులు. వారు అపార సౌఖ్యాలతో కూడిన స్వర్గవనాలలో ఉంటారు. (7-12)

ముందు తరాలవారిలో (ఇలాంటి దైవసన్నిహితులు) అత్యధికంగా ఉంటారు.

1. ప్రళయం సంభవించి విశ్వం అస్తవ్యస్థమయి, తిరిగి కొత్తసృష్టి ఏర్పడిన తర్వాత మానవులంతా మళ్ళీ బ్రతికించబడతారు. కర్మవిచారణ ప్రారంభమవుతుంది. అప్పుడు వారు మూడు ప్రధాన వర్గాలుగా విభజించబడతారు. సత్కార్యాల్లో ఒకర్నొకరు మించిపోతూ అత్యధిక దైవప్రసన్నత పొందిన దైవసన్నిహితులు (ఉత్తములు) ప్రథమ శ్రేణికి చెందినవారయి ఉంటారు. మిగిలిన రెండు వర్గాల్లో ఒకటి, దైవసింహాసనం కుడివైపున ఉంచబడుతుంది. వీరు సత్యాన్ని విశ్వసించి సత్కర్మలు ఆచరించిన సజ్జనులు (మధ్యములు). మూడో వర్గం దైవ సింహాసనానికి ఎడమ వైపున ఉంచబడుతుంది. వీరు సత్యాన్ని తిరస్కరించిన దౌర్భాగ్యులు (అధములు).

తర్వాతి తరాలవారిలో (ఇలాంటివారు) తక్కువమంది ఉంటారు.[2] వారు రత్నఖచిత ఆసనాల మీద మెత్తటి దిండ్లకానుకొని పరస్పరం ఎదురెదురుగా కూర్చుంటారు.

వారి సమావేశాలలో నిత్యబాలకులు వారుణీ వాహిని నుండి స్వచ్ఛమైన మధువుతో నిండిన గిన్నెలు, గ్లాసులు, కూజాలు తీసుకొని అటూ ఇటూ తిరుగుతుంటారు. ఆ మధువు సేవిస్తే వారికి ఏమాత్రం మైకం కమ్మడంగాని, బుద్ధి మందగించడంగాని జరగదు.(13-19)

వారు కోరిన పండ్లు తినడానికి ఆ బాలకులు వారి ముందు రకరకాల రుచికరమైన పండ్లుంచుతారు. అలాగే వారికిష్టమైన పక్షుల మాంసం కూడా ఉంచుతారు.

వారికోసం అక్కడ అందమైన కళ్ళుగల సుందరాంగులు ఉంటారు. ప్రత్యేకంగా వారి కోసమే దాచిపెట్టిన ముత్యాలవంటి ముగ్ధమనోహర సౌందర్యరాసులు వారు.

ఇవన్నీ వారు ఇహలోక జీవితంలో చేసుకున్న సత్కార్యాలకు ప్రతిఫలంగా ప్రసాదించబడతాయి. వారక్కడ ఎలాంటి వ్యర్థవిషయాలు గాని, దూషణలు గాని వినరు. ప్రతిమాటా సమంజసంగా, సుహితంగానే ఉంటుంది. (20-26)

ఇక కుడిపక్షంవారు, కుడిపక్షంవారి అదృష్టమే అదృష్టం! ముళ్ళులేని రేగుచెట్ల పండ్లు, అరటిగెలలు, సుదూరంగా విస్తరించిన చల్లటి నీడలు, ఎడతెగకుండా ప్రవహించే మంచినీరు, ఎన్నటికీ అంతంగాని సులభంగా అందుబాటులో ఉండే అసంఖ్యాకమైన సుమధుర ఫలాలు, ఎత్తయిన పరుపులు (వగైరా) భోగభాగ్యాలలో వారు ఓలలాడుతుంటారు. (27-34)

వారి భార్యలను మేము ప్రత్యేక పంథాలో సరికొత్తగా సృజిస్తాము. వారిని మేము నిత్యనూతన కన్యలుగా రూపొందిస్తాము.[3] వారు తమ భర్తలను అమితంగా ప్రేమిస్తారు. సమవయస్కులైన సతులు వారు (35-38)

ఇవన్నీ కుడిపక్షంవారికి లభించే మహాభాగ్యాలు. ఇలాంటివారు ముందు తరాలలో, తరువాతి తరాలలోనూ చాలామంది ఉంటారు. (39,40)

---

2. ఇబ్నె కసీర్ (రహ్మలై) వ్యాఖ్యానం ప్రకారం ముందు తరాలవారు అంటే, ఆయా దైవ ప్రవక్తల కాలాలకు, వారి సమీపకాలాలకు చెందిన వారన్నమాట. వీరిలో 'దైవసన్నిహితులు' ఎక్కువ మంది ఉంటారు. తరువాతి తరాలవారు అంటే, వారి తరువాత కాలాలకు చెందినవారని అర్థం. వీరిలో 'దైవసన్నిహితులు' తక్కువమంది ఉంటారు.

3. ఇహలోకంలో ఇస్లాం ధర్మం స్వీకరించి సదాచార సంపన్నురాలయిన స్త్రీలను దేవుడు పరలోకంలో నూతన కన్యలుగా చేసి స్వర్గంలో ప్రవేశపెడ్తాడు. ప్రపంచంలో భార్యాభర్తలు ఇద్దరూ సత్యాన్ని విశ్వసించి సాత్విక జీవితం గడిపి ఉంటే స్వర్గంలో కూడా వారిద్దరు భార్యాభర్తలుగానే కొనసాగుతారు. ఒకవేళ వారిద్దరిలో ఒకరు మాత్రమే సన్మార్గగామి అయివుంటే, ఆ స్త్రీ లేక ఆ పురుషుని వివాహం ఇతర సన్మార్గగాములైన పురుషుడు లేక స్త్రీతో జరుగుతుంది. (దీంతోపాటు 2:25 సూక్తికి రాసిన పాదసూచిక కూడా చూడండి.)



పోతే ఎడమపక్షంవారు- ఎడమపక్షంవారి దౌర్భాగ్యం గురించి ఏమని చెప్పాలి? వారు (నరకంలో శరీరాన్ని మలమల మాడ్చివేసే వడగాల్పుల మధ్య సలసల మరిగే నీటిని తాగుతూ, ఎలాంటి సుఖాన్నిగాని, చల్లదనాన్నిగాని ఇవ్వని నల్లటి కారుపొగల్లో (నానా యాతనలు అనుభవిస్తూ) ఉంటారు. (41-44)

ఈ పర్యవసానానికి ముందు వీరు (ఇహలోకంలో) భోగభాగ్యాలు అనుభవిస్తూ, ఘోరమైన పాపకార్యాల్లో కూరుకుపోయి వాటి విషయంలో మొండిగా వ్యవహరిస్తూ ఉండేవారు. పైపెచ్చు "మేము చచ్చి మట్టిలో కలసిపోయి అస్థిపంజరాల్లా మారిపోయాక మళ్ళీ బ్రతికి లేపబడతామా? గతంలో చనిపోయిన మా తాతముత్తాతలను కూడా బ్రతికించి లేపడం జరుగుతుందా?" అని అనేవారు. (45-48)

"మీ పూర్వీకుల్ని, ఆ తరువాత తరాలవారందర్నీ తప్పకుండా (బ్రతికించి) సమావేశ పరచడం జరుగుతుంది. దాని సమయం నిర్ణయించబడింది" అని చెప్పు. (49,50)

కనుక సత్యాన్ని నిరాకరించిన భ్రష్టులారా! మీరు జఖ్ఖూమ్ (అనే ఒక విధమైన నాగ జెముడు) వృక్షాన్ని తప్పకుండా తినవలసి ఉంటుంది. దాంతోనే మీరు (భరించలేని ఆకలితో) ఆవురావురుమంటూ కడుపు నింపుకుంటారు. ఆపై దప్పికగొన్న ఒంటెల్లా సలసల కాగే నీటిని (గటగట) త్రాగుతారు. ఇదే తీర్పుదినాన ఎడమపక్షం వారికి లభించే ఆతిథ్యం! (51-56)

మేము స్వయంగా మిమ్మల్ని సృష్టించామే, మరి మీరెందుకు (మా మాటల్ని) అంగీక రించరు? మీరు వదిలే రేతస్సును గురించి ఎప్పుడైనా కాస్త ప్రశాంతంగా ఆలోచించారా? దానిద్వారా శిశువుని రూపొందిస్తున్నది మీరా లేక మేమా? మేము మీకోసం మరణం నిర్ణయించాం. మేము మీ రూపురేఖల్ని మార్చి మీరెరుగని ఆకారంలో మిమ్మల్ని తిరిగి సృజించలేని అశక్తులం కాము. (మేము తలచుకుంటే ఏదైనా చేయగలం.) (57-61)

మీకు మీ తొలిపుట్టుక గురించి తెలిసేవుంది. (ఈ విషయంలో మా శక్తిసామర్థ్యాల్ని మీరు అనుదినం చూస్తూనే ఉన్నారు.) అలాంటప్పుడు (మరణానంతరం కర్మవిచారణ కోసం మిమ్మల్ని పునర్జీవింపజేస్తామన్న మా మాటల్ని) మీరెందుకు గ్రహించరు? (62)

మీరు పొలాల్లో నాటే విత్తనాలను గురించి ఆలోచించారా? ఆ విత్తనాల ద్వారా పంటలు మీరు పండిస్తున్నారా లేక మేమా? మేము తలచుకుంటే ఆ పంటపొలాల్ని నుగ్గు నుగ్గు చేసేయగలం. అప్పుడు మీరు విచారపడుతూ "అయ్యయ్యో! మా శ్రమ, పెట్టుబడి అంతా వృధా అయ్యిందే! అసలు మా నొసటే దౌర్భాగ్యం రాసి ఉంది" అని రకరకాలుగా చెప్పుకుంటారు. సరే, మీరు త్రాగే ఈ నీటిని కళ్ళుతెరచి చూశారా? దాన్ని మేఘాల నుండి మీరు కురిపిస్తున్నారా లేక మేమా? మేము తలచుకుంటే దాన్ని తీవ్రమైన ఉప్పునీటిగా మార్చే యగలం. మరి మీరు (మాపట్ల) ఎందుకు కృతజ్ఞులై ఉండరు? (63-70)

పోనీ, మీరు మండించే ఈ నిప్పును గురించి ఎప్పుడైనా కాస్త ఆలోచించారా? దానికి ఉపయోగపడుతున్న చెట్లను మీరు సృష్టించారా లేక మేమా? మేము దాన్ని స్మారకచిహ్నంగా, వినియోగదారులకు జీవనసామగ్రిగా చేశాము.[4] కనుక ప్రవక్తా! మహోన్నతుడయిన నీ ప్రభువు పేరు స్మరించు. (71-74)

అందువల్ల మానవులారా! మీరనుకున్నది ఎంతమాత్రం నిజం కాదు. నేను నక్షత్రాల కక్ష్యల సాక్షిగా చెబుతున్నాను. మీరు గ్రహించగలిగితే ఇది గొప్ప ప్రమాణం.[5] ఇది సురక్షిత గ్రంథంలో (రాయబడి) ఉన్న మహిమాన్వితమైన ఖుర్‌ఆన్. దీన్ని పవిత్రులు, పరిశుద్ధులు తప్ప మరెవ్వరూ తాకలేరు.[6] ఇది సర్వలోక ప్రభువు నుండి అవతరించిన (దివ్య)వాణి. ఇలాంటి (అద్భుత) వాణిని మీరు నిర్లక్ష్యం చేస్తున్నారా? దీన్ని నిరాకరించడమే బ్రతుకు తెరువుగా పెట్టుకున్నారా?[7] (75-82)

---

4. మానవుడు ఈ ప్రపంచంలోని అనేక వస్తువుల్ని వాడుకుంటూ ఎంతో ప్రయోజనం పొందుతున్నాడు. కాని ఆ వస్తువుల్ని సృష్టించి వాటివల్ల తనకు మేలు చేకూర్చుతున్న అదృశ్యశక్తిని గురించి అతను ఆలోచించడం లేదు. పైగా ఆ అదృశ్యశక్తి దైవత్వాన్ని, ఆయన గుణగణాలను విభజించి సృష్టికర్త, మృత్యదేవత, పంటల దేవత, వరుణ దేవుడు, అగ్ని దేవుడు అంటూ రకరకాల పేర్లు పెట్టి వాటి ఊహాజనిత చిత్రాలను, విగ్రహాలను పూజిస్తున్నాడు. అయితే ప్రకృతిలోని ఈ చిత్ర విచిత్ర వస్తువులు, వాటి ప్రయోజకత్వం, వాటి మధ్య సమన్వయం, నిబద్ధతలను గురించి ప్రశాంత మనస్సుతో ఆలోచిస్తే వీటన్నిటికి మూలకారకుడు ఒకే దేవుడని గ్రహించగలం. ఆ దేవుణ్ణి మాత్రమే ఆరాధించడం, ఆయన చూపే జీవనపథాన్నే అనుసరించడం మానవుని విధ్యుక్త ధర్మం.

"స్మారక చిహ్నం" అంటే దేవుని ఏకత్వాన్ని, ఆయన శక్తి సామర్థ్యాలను గుర్తుచేసేది అని అర్థం. ఈవిధంగా అగ్నిని పుట్టించే లేక ఇంధనంగా ఉపయోగపడే వృక్షమేగాక, ప్రపంచంలోని ప్రతి వస్తువూ దేవుని ఏకత్వాన్ని, ఆయన శక్తి సామర్థ్యాలను మనకు గుర్తుచేస్తున్నాయి.

5. ఖుర్‌ఆన్ మహోన్నతమైన దైవగ్రంథం అని చెప్పడానికి ఇక్కడ నక్షత్రాలుండే ప్రదేశాలపై, వాటి కక్ష్యలపై, గమ్యస్థానాలపై ప్రమాణం చేయడం జరిగింది. కోట్లాది గ్రహాలు, నక్షత్రాలతో నిండిన విశ్వవ్యవస్థను ఏ దేవుడు సృష్టించాడో ఆ దేవుడే ఈగ్రంథాన్ని కూడా అవతరింపజేశాడు. విశ్వవ్యవస్థ ఎంత అద్భుతమైన క్రమపద్ధతిన పకడ్బందీగా సృష్టించబడిందో అంతే అద్భుతమైన క్రమపద్ధతిన పకడ్బందీగా ఖుర్‌ఆన్ కూడా రూపొందించబడింది. విశ్వవ్యవస్థలోని విషయాలు ఎంత యదార్థమైనవో ఖురాన్‌లోని విషయాలు కూడా అంతే యదార్థమైనవి. కనుక ఇలాంటి అద్భుత మైన వాణిని విశ్వసించి గౌరవించాలని దేవుడు మానవాళికి హితోపదేశం చేస్తున్నాడు.

6. అవిశ్వాసులు ఖుర్‌ఆన్‌ని విశ్వసించడానికి నిరాకరిస్తూ, దాన్ని ఏ భూతమో, పిశాచమో ముహమ్మద్ (సల్లం)కు నేర్పుతోందని ఆరోపించేవారు. దేవుడు వారి ఆరోపణలను ఖండిస్తూ, ఈ అద్భుతవాణి దేవలోకంలోని ఓ సురక్షిత గ్రంథంలో ఉంచబడిందని, అక్కడికి ఎవరూ పోలేరని, భూతపిశాచాలకు ఆ శక్తి లేదని, అవి దాన్ని తాకనైనా తాకలేవని చెబుతున్నాడు. పరిశుద్ధులు, పాప రహితులైన దైవదూతలు మాత్రమే ఈ దివ్యగ్రంథాన్ని తాకడానికి, దాన్ని దివి నుండి భువికి దించడా నికి అర్హులని కూడా దేవుడు ఈ సూక్తిలో స్పష్టం చేస్తున్నాడు.

7. ఖురైష్ నాయకులు ఇస్లామీయ ఉద్యమం విజయవంతమయితే తమ ఉపాధి మార్గాలు మూసుకు పోతాయని భయపడసాగారు. అంచేత వారు సత్యాసత్యాలు, ధర్మాధర్మాలను గురించి విచారించకుండా ఈ ఉద్యమాన్ని అణచివేయడమే ధ్యేయంగా పెట్టుకున్నారు. ఈ విషయాన్నే ఇక్కడ ఖుర్‌ఆన్ వారు సత్యనిరాకరణను బ్రతుకుతెరువుగా చేసుకున్నారని అంటోంది.



సరే, (మరో విషయం కూడా వినండి.) చనిపోతున్న మనిషి ప్రాణం మీరు కళ్ళారా చూస్తుండగానే అతని కంఠందాకా వచ్చి, బయటికి పోవడానికి సిద్ధంగా ఉన్నప్పుడు దాన్ని మీరెందుకు ఆపలేరు? మీరు ఎవరి అదుపాజ్ఞలో లేరనుకుంటే ఈపని ఎందుకు చేయలేరు? అప్పుడా చనిపోతున్న వాడికి మీకంటే మేమే చాలా దగ్గరగా ఉంటాం. అయితే మీకళ్ళకు కన్పించము. (83-87)

ఆ వ్యక్తి (దైవ)సన్నిహితుల్లోని వాడైఉంటే అతనికి అపారసౌఖ్యాలు, మంచి ఆహారం, భోగభాగ్యాలతో కూడిన స్వర్గవనాలు లభిస్తాయి. ఒకవేళ కుడిపక్షానికి చెందిన వాడైతే "నీకు శాంతి కలుగుగాక! నీవు కుడిపక్షంవారిలోని వాడవు"అని అతనికి స్వాగతం చెప్పబడుతుంది. ఒకవేళ అతను సత్యాన్ని తిరస్కరించి మార్గభ్రష్టుల్లో చేరినవాడైఉంటే అతడ్ని నరకంలోకి విసిరేసి, సలసలకాగే నీటితో ఆతిథ్యం ఇవ్వబడు తుంది. (88-94)

ఇవన్నీ తిరుగులేని సత్యాలు. కనుక మహోన్నతుడయిన నీప్రభువు పేరు స్మరించు. (95,96) ✪

## అవతరణ: మదీనా 57. ఇనుము (హదీద్) సూక్తులు: 29

ఈ అధ్యాయాన్ని "హదీద్" (ఇనుము) అంటారు. ఇది హిజ్రీశకం 4,5 ఏండ్ల మధ్య అవతరించి ఉండవచ్చని తెలుస్తోంది. ఇందులో దేవుని ఔన్నత్యం, దైవమార్గంలో ధనవ్యయం, మరణానంతర పరిణామాలను గురించి ప్రస్తావించి, పరలోకజీవితం ముందు ఇహలోక జీవితం మూన్నాళ్ళ ముచ్చట మాత్రమేనని చెప్పడం జరిగింది. ఆ తర్వాత ముస్లింల విశ్వాసాన్ని పటిష్ఠపరచే హితవులు కొన్ని ఇవ్వబడ్డాయి.

### కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

భూమ్యాకాశాల్లో ఉన్న అణువణువూ దేవుని ఔన్నత్యాన్ని, ఆయన పవిత్రతను ప్రశం సిస్తోంది. ఆయన మహా శక్తిమంతుడు, అసామాన్య వివేకవంతుడు. ఆయనే భూమ్యాకాశాల సామ్రాజ్యాధినేత. జీవన్మరణాలు ఆయన చేతిలోనే ఉన్నాయి. ఆయన ప్రతి పనీ చేయగల సమర్థుడు, సర్వశక్తిమంతుడు. ఆయనే మొదటివాడు, చివరివాడు కూడా. ఆయనే బాహ్యశక్తి, నిగూఢశక్తి కూడా. ఆయనే సర్వజ్ఞుడు, సర్వజ్ఞాని. (1-3)

ఆయన భూమ్యాకాశాల్ని ఆరు రోజుల్లో సృష్టించి, ఆ తర్వాత అధికార సింహాసనం అధిష్ఠించాడు. భూలోకానికి చేరుతున్నదేమిటో, భూలోకం నుండి బయటికి వెళ్తున్న దేమిటో, ఆకాశం నుండి అవతరిస్తున్నదేమిటో, ఆకాశంలోకి అధిరోహిస్తున్నదేమిటో అంతా ఆయనకు తెలుసు. మీరు ఎక్కడున్నా ఆయన మీవెన్నంటే ఉంటాడు. మీరు చేసే ప్రతిపనినీ ఆయన చూస్తున్నాడు. ఆయనే భూమ్యాకాశాల సామ్రాజ్యాధినేత. సమస్త వ్యవహారాలు నిర్ణయం కోసం ఆయన దగ్గరికే మరలిపోతాయి. ఆయనే రాత్రిని పగటి లోనికి, పగటిని రాత్రిలోనికి జొనిపిస్తున్నాడు. ఆయనకు (మీ) హృదయాల్లో దాగిన రహస్యాలు సైతం తెలుసు. (4-6)

(కనుక) దేవుడ్ని, ఆయన ప్రవక్తను విశ్వసించండి. ఏ సంపద గురించి ఆయన మీపై ప్రాతినిధ్య బాధ్యతను మోపాడో, దానినుండి (కొంత దైవమార్గంలో) ఖర్చు పెట్టండి. సత్యాన్ని విశ్వసించి (దైవమార్గంలో) ధనవ్యయం చేసేవారికి గొప్ప ప్రతిఫలం[1] లభిస్తుంది. (7)

దైవప్రవక్త మిమ్మల్ని తన ప్రభువును విశ్వసించమని హితవు చేసి మీచేత ప్రమాణం చేయించినా మీరు దేవుడ్ని విశ్వసించరెందుకు? మీరు నిజంగా విశ్వసించిన వారయితే (ఈ విశ్వాసరాహిత్య వైఖరేమిటీ?) మిమ్మల్ని చీకటి నుండి వెలుగులోకి తీసుకురావడానికి తన దాసునిపై నిర్దిష్ట సూక్తులు అవతరింపజేస్తున్నవాడు దేవుడే కదా! మీ విషయంలో దేవుడు ఎంతో దయార్ద్ర హృదయుడు, గొప్ప క్షమాశీలి. (8,9)

భూమ్యాకాశాల్లోని సర్వస్వం దేవునిదే. ఆయనే వాటికి వారసుడు. అలాంటప్పుడు మీరు దైవమార్గంలో సంపదను ఎందుకు ఖర్చుపెట్టరు? విజయానికి పూర్వం ధన త్యాగం చేసి యుద్ధం చేసినవారితో, విజయానంతరం సంపద ఖర్చుపెట్టి సమరంలో పాల్గొనేవారు ఎన్నటికీ సమానులు కాలేరు. దేవుడు ఉభయులకూ (ప్రతిఫలం విషయం లో) మంచి వాగ్దానం చేసినప్పటికీ హోదా, అంతస్తులలో వీరికంటే విజయానికి పూర్వం ధనత్యాగం చేసి యుద్ధం చేసినవారే అధికులు. మీరు చేసేదంతా దేవునికి తెలుసు.

మీలో దేవునికి రుణమిచ్చే వారెవరైనా ఉన్నారా? శ్రేష్ఠమైన రుణం? అలాంటి వారికి దేవుడు ఆ రుణాన్ని అనేక రెట్లు పెంచి తిరిగి ఇచ్చివేస్తాడు.[2] పైగా వారికి అత్యంత శ్రేష్ఠమైన ప్రతిఫలం కూడా లభిస్తుంది. (10,11)

---

1. ఒక వ్యక్తిలోని ధనవ్యామోహం అతనికేగాక, ఇతరులక్కూడా అనేక అనర్థాలు తెచ్చి పెడ్తుంది. అసలీ ధనం అతనిది కాదు, దేవుడు ప్రసాదించినది. ఒక్కొక్కసారి మనిషి ఎన్ని అడ్డ దారులు తొక్కి ప్రయత్నించినా అతనికి రెండుపూటల తిండి కూడా సరిగా దొరకదు. మనిషి తనదని చెప్పుకునే ధనమంతా నిజానికి అతనిది కాదు. దానధర్మాలు చేయడం ద్వారా, ధర్మసంస్థాపనా కృషికి వినియోగించడం ద్వారా పరలోకానికి పంపుకునే ధనం మాత్రమే అతనిది అవుతుంది.

ఈ విషయాన్నే దైవప్రవక్త (స) ఇలా తెలియజేశారు: "మనిషి నా ధనం, నా డబ్బు అంటాడు. నిజానికి నీ ధనంలో నీవు తిని అంతం చేసింది, నీవు ధరించి మాసి పోయేలా చేసింది లేదా నీవు దానధర్మాలు చేసి ముందుకు పంపుకున్నది మాత్రమే నీవాటాకు వస్తుంది. మిగిలినదంతా చేజారి పోయేదే. నీవు దాన్ని ఇతరుల కోసం వదలి వెళ్ళవలసి ఉంటుంది." (ముస్లిం)

2. భూమ్యాకాశాలన్నీ దేవునివే అయినప్పుడు, ఆ దేవుడు ప్రసాదించిన ధనకనక వస్తువుల్ని ఆయన నిర్దేశించిన మార్గంలో (పుణ్యకార్యాల కోసం) ఖర్చు చేయడానికి మానవులకు ఎలాంటి అభ్యంతరం ఉండకూడదు. కాని మానవుడు పిసినారితనం వల్ల సత్కార్యాల కోసం డబ్బు వెచ్చించ డానికి వెనుకంజ వేస్తాడు. అందువల్ల ఉపాధి ప్రసాదించేది తానేనని, మీరేదైనా దానం చేస్తే ఆ కొరతను తాను తీరుస్తానని దేవుడు అంటున్నాడు (34:39). అంతేకాదు, నేను ప్రసాదించిన ఆ ధనాన్ని నాకు రుణంగా అందజేస్తే ఆ రుణాన్ని నేను అనేక రెట్లు పెంచి తిరిగి తీర్చుతానని, ఆపై తగిన ప్రతిఫలం కూడా ప్రసాదిస్తానని ఆయన వాగ్దానం చేస్తున్నాడు. ఈ వాగ్దానం పరలోకంలో నెరవేరుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.



ఆరోజు (అంతిమ దినాన) విశ్వసించిన స్త్రీ పురుషుల ముందు, వారి కుడివైపు వారి జ్యోతి పరుగిడుతూ ఉండటం నీకు కన్పిస్తుంది. "ఈరోజు మీకో గొప్ప శుభవార్త!" అని వారికి చెప్పబడుతుంది. (అదే) సెలయేరులు ప్రవహించే స్వర్గవనాలు. ఆ స్వర్గ వనాలలో వారు శాశ్వతంగా ఉంటారు. ఇదే గొప్పవిజయం, అపూర్వ సాఫల్యం. (12)

ఆరోజు కపటవిశ్వాసులయిన స్త్రీపురుషుల పరిస్థితి (చాలా దయనీయంగా ఉంటుంది). వారు (చీకటిలో తచ్చాడుతూ) "కాస్త మావైపు చూడండి. మీజ్యోతి వల్ల మాకూ కొంచం ప్రయోజనం కలుగుతుంది" అంటారు (నిజమైన) విశ్వాసులతో. కాని "వెనక్కి వెళ్ళి మీజ్యోతి ఎక్కడుందో వెతుక్కోండి" అని సమాధానం లభిస్తుంది వారికి. తర్వాత వారుభయుల మధ్య ఒక అడ్డుగోడ ఏర్పడుతుంది. దానికి ఒక తలుపు ఉంటుంది. ఆ తలుపు వెనుక లోపలి వైపున (దైవ)కారుణ్యం ఉంటుంది. దాని వెలుపల (నరక)యాతనలు ఉంటాయి. (13)

వారు విశ్వాసుల్ని కేకలుపెట్టి పిలుస్తూ "మేము (ప్రపంచంలో) మీతోపాటు లేమా?" అంటారు. దానికి విశ్వాసులు ఇలా అంటారు: "ఉన్నారు, కాని మిమ్మల్నిమీరు పరీక్షకు గురిచేసుకొని ప్రమాదం కొనితెచ్చుకున్నారు. గోడమీది పిల్లివాటంగా వ్యవ హరించారు. అనుమానంలో పడిపోయారు. లేనిపోని ఆశలు పెంచుకొని ఆత్మవంచనకు పాల్పడ్డారు. దేవుని ఆజ్ఞ వచ్చేదాకా మీరు అదే స్థితిలో ఉన్నారు. పరమ మోసగాడు (షైతాన్) మిమ్మల్ని దేవుని విషయంలో చివరి క్షణం వరకూ మోసగిస్తూనే ఉన్నాడు. (వాడి వలలోనుంచి మీరు బయట పడలేక పోయారు.) అందువల్లనే ఈరోజు (మీకీ దుర్గతి పట్టింది. ఇక) మీ నుండి ఎలాంటి పరిహారం స్వీకరించడం జరగదు. బహిరంగంగా (సత్య)తిరస్కారానికి పాల్పడినవారి నుండి కూడా (పరిహారం స్వీకరించ బడదు). కనుక మీకిక నరకమే నివాసస్థలం. అక్కడే మీకు తగిన శాస్తి జరుగుతుంది. అది అత్యంత ఘోరమైన దుష్పర్యవసానం." (14,15)

---

హజ్రత్ అబుద్దహ్దా అన్సారీ (రజి) ముహమ్మద్ మహనీయు (సల్లం)ని నోట ఈసూక్తి విని "దైవప్రక్తా! దేవుడు మనల్ని అప్పు అడుగుతున్నాడా?" అని ప్రశ్నించారు. దానికాయన అవునన్నారు. అప్పుడు అబుద్దహ్దా (రజి) "అయితే కాస్త మీ చేయి జాపండి" అన్నారు. దైవప్రవక్త (సల్లం) చేయి జాపారు. హజ్రత్ అబుద్దహ్దా (రజి) ఆయన చేతిని తన చేతిలోకి తీసుకొని "నేను నా ప్రభువుకు నా తోటను (అప్పుగా) ఇస్తున్నాను" అని చెప్పారు.

హజ్రత్ అబుద్దహ్దా (రజి) తోటలో ఆరొందల ఖర్జూర చెట్లున్నాయి. తోటలోనే ఆయన ఇల్లు కూడా ఉంది. అక్కడే ఆయన భార్యాపిల్లలు నివసిస్తున్నారు. ఈ మాట చెప్పి ఆయన నేరుగా తోట దగ్గరికి వెళ్ళి "ఉమ్మె దహ్దా! బయటికి వచ్చేసెయి. నేనీ తోటను నా ప్రభువుకు అప్పుగా ఇచ్చేశాను" అన్నారు. ఆయన భార్య కూడా ఎంతో సాధ్వీమణి. ఆమె ఈ మాటలు విని "మీరు చాలా లాభదాయకమైన వ్యాపారం చేశారు" అన్నారు. అప్పటికప్పుడు ఆయన తనఇంటి సామగ్రిని, భార్యాపిల్లలను తీసుకొని తోటలో నుంచి బయటికి వచ్చేశారు. మనం గనక అప్పుడా దానశీలుడ్ని చూస్తే ఆరొందల చెట్లకు బదులు ఆరొందల కోట్ల రూపాయలు ఆర్జించానన్న ధీమా ఆయన ముఖవర్చస్సులో తప్పకుండా గమనించగలం.

విశ్వాసుల హృదయాలు దేవుని ప్రస్తావనతో ద్రవించిపోయే సమయమింకా రాలేదా? ఆయన పంపిన సత్యంముందు లొంగిపోయేవేళ ఆసన్నంకాలేదా? గతంలో కొందరికి గ్రంథం ఇవ్వబడింది. కాని ఓసుదీర్ఘకాలం గడచిన తర్వాత వారి హృదయాలు కఠినమై పోయాయి. ఈనాడు వారిలో చాలామంది దుర్మార్గులై ఉన్నారు. మీరు అలా కాకూడదు సుమా! (16)

వినండి! భూమి (బీటలువారి) మృతప్రాయమైన తర్వాత దేవుడు దానికి తిరిగి జీవం పోస్తున్నాడు. (అలాగే మృతప్రాయమైపోయిన మానవత్వానికి కూడా తనప్రవక్త ద్వారా జీవం పోస్తున్నాడు.) మీరు విషయం గ్రహిస్తారని మాసూక్తుల్ని మీకు విడమరచి చెబుతున్నాం. (17)

చిత్తశుద్ధితో దానధర్మాలు చేసే, దేవునికి శ్రేష్ఠమయిన రుణం అందజేసే స్త్రీ పురుషులకు దేవుడు తప్పకుండా (వారిసత్కార్యాన్ని) అనేక రెట్లు పెంచి తిరిగిస్తాడు. ఆపై వారికి అత్యంత శ్రేష్ఠమైన ప్రతిఫలం కూడా లభిస్తుంది. దేవుణ్ణి, దైవప్రవక్తను మనస్ఫూర్తిగా విశ్వసించినవారే తమ ప్రభువు దృష్టిలో సత్యసంధులు, ధర్మసాక్షులు.[3] వారికోసం తగిన ప్రతిఫలం, జ్యోతి ఉన్నాయి. దీనికి భిన్నంగా అవిశ్వాస వైఖరి అవలంబించి, మా సూక్తులు నిరాకరించినవారు మాత్రం నరకానికి పోతారు. (18,19)

వినండి, ఇహలోకజీవితం ఒకఆట, తమాషా, బాహ్యపటాటోపం, పరస్పరం బడాయి చెప్పుకొని గర్వించడం, సంతానం, సిరిసంపదలలో ఒకర్నొకరు మించిపోవడానికి ప్రయత్నించడం తప్ప మరేమీ కాదు. ఐహికజీవితాన్ని ఇలా పోల్చవచ్చు: వర్షం కురుస్తుంది. దానివల్ల ఎదిగిన మొలకల్ని చూసి రైతులు సంబరపడిపోతారు. తరువాత ఆ పొలం పంటకు వచ్చి ఎర్రబారడం కూడా కన్పిస్తుంది. ఆ తరువాత తుప్పగా (గడ్డిపరకలుగా) మారిపోతుంది.

అయితే పరలోక పర్యవసానం దీనికి భిన్నంగా ఉంటుంది. అక్కడ తీవ్ర యాతనలు, దేవుని మన్నింపు, ఆయన ప్రసన్నతలు ఉంటాయి. ప్రపంచజీవితం ఒక మాయ, భ్రాంతి తప్ప మరేమీ లేదు. దేవుణ్ణి, ఆయన ప్రవక్తలను విశ్వసించినవారి కోసం స్వర్గసీమ సిద్ధంగా ఉంది. (కనుక) దేవుని మన్నింపు వైపు, భూమ్యాకాశాలంత విశాలమైన ఆ స్వర్గసీమ వైపు పోటీపడి పరుగెత్తండి. ఇది దేవుని అనుగ్రహం. ఆయన దాన్ని తాను తలచిన వారికి ప్రసా దిస్తాడు. దేవుడు గొప్ప అనుగ్రహశాలి. (20,21)

---

3. హజ్రత్ బరా బిన్ ఆజిబ్ (రజి) ఉల్లేఖనం ప్రకారం “నా అనుచర సమాజంలో విశ్వసించినవారు ధర్మసాక్షులు” అని ప్రవచించారు దైవప్రవక్త (సల్లం). ఆ తరువాత ఆయన ఈ సూక్తిని (వారు తమప్రభువు దృష్టిలో ధర్మసాక్షులు అని) పఠించారు. (ఇబ్నె జరీర్)

“ఎవరైతే తన ధనప్రాణాల్ని ఉపద్రవం (ఫిత్నా) నుండి కాపాడుకోవడానికి (స్వస్థలం వదలి) వేరేప్రాంతానికి వలసపోతాడో అతను దేవుని దృష్టిలో సత్యసంధుడు (సిద్దీఖ్)గా లెక్కించబడతాడు. అతను చనిపోతున్నప్పుడు దేవుడు అతనికి ధర్మసాక్షి (షహీద్) హోదా ప్రసాదించి, అతని ఆత్మను స్వాధీనం చేసుకుంటాడు” అన్నారు దైవప్రవక్త (సల్లం). ఆ తరువాత ఈ సూక్తినే పఠించారు.



భూమిపైగాని లేదా స్వయంగా మీపైగాని వచ్చిపడే ఏ ఆపదైనా దాన్ని సృష్టించడానికి పూర్వమే మేము దాన్ని గురించి గ్రంథంలో వ్రాసిపెట్టాము. ఇలా చేయడం దేవునికి చాలా తేలిక. మీ మీద ఏ ఆపద వచ్చినా మీరు బాధపడకుండా (సహనంతో) ఉండాలని, దేవుడు మీకు ఏ భాగ్యం అనుగ్రహించినా దాన్ని చూసుకొని మీరు మిడిసిపడకూడదని (ఆయన ఈ ఏర్పాటు చేశాడు). తమను తాము ఏదో గొప్పవాళ్ళమని భావించి విర్రవీగేవాళ్ళను దేవుడు ఏమాత్రం ప్రేమించడు. అలాగే తాము పిసినారితనం వహించడమే గాకుండా ఇతరులను కూడా పిసినారితనం గురించి పురిగొల్పేవారిని కూడా దేవుడు ప్రేమించడు. (ఇదంతా తెలిసి కూడా) ఎవరైనా సత్యానికి విముఖులైపోతే దేవుడు కూడా వారిని ఖాతరు చేయడు. ఆయన నిరపేక్షాపరుడు, స్వతహాగా ప్రశంసనీయుడు. (22-24)

మేము మా ప్రవక్తలకు నిర్దిష్టమైన సూచనలు, నిదర్శనాలను ఇచ్చి పంపాము. వాటితో పాటు దివ్య గ్రంథాలను, జనం న్యాయానికి కట్టుబడి ఉండేందుకు కొలమానాన్ని కూడా అవతరింపజేశాము. అలాగే ఇనుముని కూడా అవతరింపజేశాము. ఇందులో చాలా శక్తి, ప్రజలకు ప్రయోజనాలు ఉన్నాయి. దేవుడు ఈ ఏర్పాట్లన్నీ చేయడానికి కారణం, ఎవరు తనను చూడకుండానే తనకు, తన ప్రవక్తలకు సహాయం చేస్తాడో అతణ్ణి ఆయన పరీక్షించదలిచాడు. నిస్సందేహంగా దేవుడు ఎంతో బలాఢ్యుడు, మహా శక్తిమంతుడు. (25)

మేము నూహ్‌ను, ఇబ్రాహీంను (ప్రవక్తలుగా నియమించి) పంపాము. వారిద్దరి సంతతిలో ప్రవక్తృత్వాన్ని, దివ్యగ్రంథాన్ని ఉంచాము. అయితే వారి సంతానంలో కొందరే సన్మార్గం అవలంబించారు. చాలామంది (దారితప్పి) దుర్మార్గులై పోయారు. వారి తర్వాత మేము ఒకరి తర్వాత మరొకరు చొప్పున అనేకమంది ప్రవక్తలను పంపాము.

వారందరి తరువాత మర్యం కుమారుడు ఈసాను పంపి, అతనికి ఇన్జీల్ గ్రంథం ప్రసాదించాము. అతణ్ణి అనుసరించినవారి హృదయాలలో మేము దయా, సానుభూతులు కలిగించాము. అయితే వైరాగ్యాన్ని వారు స్వయంగా సృష్టించుకున్నారు. మేము దాన్ని వారికి విధిగా చేయలేదు. దైవప్రసన్నత కోసం వారీ కొత్త సంప్రదాయం ప్రారంభించారు. సరే దానికైనా పూర్తిగా కట్టుబడిఉన్నారా అంటే అదీలేదు.[4] వారిలో

---

4. క్రైస్తవులు చేసిన రెండు తప్పులను ఈ సూక్తిలో విమర్శించడం జరిగింది. ఒకటి, వారు దేవుడు ఆదేశించని ఆంక్షలను తమంతట తాము విధించుకున్నారు. రెండు, దైవప్రసన్నత కోసం తమంతట తాము విధించుకున్న ఆ ఆంక్షలకు వారు కట్టుబడకుండా దైవాగ్రహానికి గురయ్యారు. ఈ రెండు తప్పులను గురించి కాస్త వివరంగా తెలుసుకుందాం.

హజ్రత్ ఈసా (అలైహి) నిష్క్రమణ తరువాత రెండొందల సంవత్సరాల వరకు క్రైస్తవుల్లో వైరాగ్య భావన లేదు. ఆ తరువాత క్రమ క్రమంగా వైరాగ్య క్రిములు చొచ్చుకు వచ్చాయి. మూడవ శతాబ్దాంతానికల్లా ఇది పరాకాష్ఠకు చేరుకుంది. క్రైస్తవ జగత్తులో సెయింట్ ఆంటోని ప్రప్రథమ వైరాగిగా ప్రసిద్ధిచెందాడు. అతను ఈజిప్టులో మొట్టమొదటి సన్యాస మఠాన్ని స్థాపించాడు. ఆ తరువాత ప్రపంచవ్యాప్తంగా వేలాది మఠాలు వెలిశాయి.

ఆత్మవికాసం కోసం శరీరాన్ని కృశింపజేయడం చాలా అవసరమని భావించారు క్రైస్తవ సాధువులు. దాని కోసం వారు భార్యాబిడ్డల్ని త్యజించడమే గాకుండా స్త్రీ ఛాయలను కూడా అసహ్యించుకునేవారు. క్రైస్తవ చరిత్రలో ఇలాంటి వీరభక్తుల్ని ఆకాశానికి ఎత్తడం జరిగింది. అలెగ్జాండరియాకు చెందిన సెయింట్ మెకారియస్ ఎల్లప్పుడూ తన శరీరానికి 80 పౌండ్ల బరువు కట్టుకొని తిరుగుతుండేవాడు. ఆర్నెల్లదాకా అతను బురద నేలపై పడుకొని జీవితం గడిపాడు. ఈగలు, దోమలు ముసురుకొని కుడ్తున్నా ఖాతరు చేసేవాడు కాదు. అతని శిష్యుడు సెయింట్ యూసీఖ్యూస్ గురువుని తలదన్నే విధంగా దేహానికి 150 పౌండ్ల బరువు కట్టుకొని తిరిగేవాడు. మూడేండ్ల పాటు ఒక పాడుబడ్డ బావిలో గడిపాడు. ఆ మూడేండ్ల పాటు అతను కంపుగొట్టే ఈగలు తింటూ ప్రాణం నిలుపుకున్నాడు.

సెయింట్ బెసార్యూన్ 40 రోజులపాటు ఒక ముండ్ల తోపులో ఉన్నాడు. 40 యేండ్లదాకా అతను నేలమీద వీపు ఆనించలేదు. సెయింట్ పాఖూమ్యూస్ 50 యేండ్లదాకా నేలమీద వీపు ఆనించలేదు. సెయింట్ జాన్ మూడేండ్లపాటు నిలబడి తపస్సు చేశాడు. బాగా అలసినప్పుడు కాస్సేపు ఒక బండరాయిని ఆనుకునేవాడు. అతని భక్తగణం తెచ్చే ప్రసాదం మాత్రమే తినేవాడు. సెయింట్ షూృన్ స్టైలేట్ 40 రోజులు పస్తులున్నాడు. ఓసారి ఏడాదిపాటు ఒంటికాలిపై నిలబడి తపస్సు చేశాడు. చివరికతను ఉత్తర సిరియా, సీమాన్ సమీపంలో 60 అడుగుల ఎత్తయిన ఒక స్తంభాన్ని నిర్మించుకొని, దానిమీద ఒక మంచె కట్టుకొని, అందులో మూడేండ్లపాటు ఎండ, వాన, చలిని ఖాతరుచేయకుండా గడిపాడు. అతని శిష్యులు నిచ్చన ఎక్కి అతనికి ఆహారపానీయాలు అందజేసేవారు. అదీగాక అతను తనను తాను ఒక త్రాటితో బిగించి కట్టుకున్నాడు. ఆ తాడు అతని దేహంలో దిగి కొన్నాళ్ళకు దేహం పచ్చిపుండై కుళ్ళిపోయింది. అందులో పురుగులు కూడా పడ్డాయి. ఆ పురుగులు ప్రాకి క్రిందపడుతుంటే వాటిని ఎత్తి ఆ పుండ్లలో పడవేసుకునేవాడు.

ఈ క్రైస్తవసాధువుల్లో మరోప్రత్యేకత కూడా ఉండేది. వారు స్నానం చేయకుండా ఎల్లప్పుడూ అపరిశుభ్రంగా, పరమ అసహ్యంగా ఉండేవారు. సెయింట్ ఆంటోనీ చనిపోయేదాకా కాళ్ళు చేతులు కూడా కడుక్కోలేదు. సెయింట్ అబ్రహాం మతంలోకి చేరిన తరువాత 50 యేండ్ల దాకా ఒక్కసారి కూడా ముఖంగాని, కాళ్ళుగాని కడుక్కోలేదు. సెయింట్ సిల్వియా అనే సన్యాసిని చేతి వ్రేళ్ళు తప్ప జీవితంలో ఏనాడూ తన శరీరంలోని ఏ అవయవమూ నీటితో తడపలేదు. ఒక కాన్వెంటులో 150 మంది సన్యాసినులు స్నానమంటేనే భయంతో వణికిపోయే వారట!

ఈ వైరాగ్యభావన దాంపత్యజీవితాన్ని పూర్తిగా విచ్ఛిన్నం చేసింది. శారీరకసుఖాన్ని కలిగించే అతి చిన్న కోరికను సయితం వాళ్ళు తృణీకరించారు. వారి దృష్టిలో అసలు ఆనందానుభూతి పొందడమే పాపం. సెయింట్ బాసిల్ చిరునవ్వును కూడా నిషేధించాడు. సాధువుగా గడపదలచిన వ్యక్తి స్త్రీ రూపాన్ని సయితం చూడకూడదట! స్త్రీలు కూడా సన్యాసినులుగా గడపాలని వారు శాసించారు. ఏసు కోసం జీవితాంతం సన్యాసినిగా గడిపే స్త్రీ ఏసుకు పెళ్ళికూతురవుతుందని, ఆమె తల్లికి ఏసుకు అత్తగారయ్యే అదృష్టం లభిస్తుందని సెయింట్ జీరోమ్ పేర్కొన్నాడు.

సెయింట్ గ్రెగోరీ ఒక పాదరీ ధర్మపరాయణతను ప్రశంసిస్తూ "అతను 40 యేండ్లపాటు తన భార్యకు దూరంగా ఉన్నాడని, చివరికి మరణావస్థలో ఉన్నాడని తెలిసి భార్య చూడటానికి వస్తే, అతను ఆమెను అసహ్యించుకుంటూ "ఓ స్త్రీ! దూరంగా ఉండు" అన్నాడని తెలిపాడు.

ఈ వైరాగ్యభావన ఎంత ముదిరిందంటే తల్లీ కొడుకుల మధ్య, అన్నా చెల్లెళ్ళ మధ్య, తండ్రీ కూతుళ్ళ మధ్య కూడా సంబంధాలు విచ్ఛిన్నమై పోయాయి. సెయింట్ ఎవగ్రియస్ ఇల్లు వదలి అడవుల్లో ఏళ్ళ తరబడి కఠోర తపస్సు చేశాడు. ఒకసారి అతని చిరునామా తెలుసుకున్న అతని



తల్లిదండ్రులు తమ హృదయాల్లోని పుత్రవాత్సల్యం వెలిబుచ్చుకుంటూ ఉత్తరాలు రాశారు. కాని ఎవగ్రియస్ ఆ ఉత్తరాల కవర్లు కూడా తెరచి చూడకుండా వెంటనే వాటిని కాల్చివేశాడు.

సెయింట్ థియోడోరస్ తల్లి, చెల్లెలు అనేకమంది పాదరీల సిఫారసుతో, ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి అతని మఠానికి చేరుకుంటే ఆ సన్యాసమూర్తి వాళ్ళను కలుసుకోవడానికే నిరాకరించాడు. సెయింట్ సైమన్ స్టైలైట్స్ తల్లిదండ్రుల్ని వదలి 27 యేండ్లదాకా తిరిగి రాలేదు. ఆ దిగులుతో తండ్రి చనిపోయాడు. తల్లి ఎంతో కష్టపడి అతనుండే ప్రాంతం తెలుసుకొని వెళ్ళింది. కొడుకుని చూసుకోవాలని గంపెడాశతో వచ్చిన మాతృమూర్తికి ఆ దయలేని పుత్రుడు తన 'దర్శన భాగ్యం' ప్రసాదించడానికి నిరాకరించాడు. అసలామెకు అతని మఠంలోకి ప్రవేశించడానిక్కూడా అనుమతి లభించలేదు. పాపం ఆ మాతృమూర్తి మఠం వెలుపలే పడి మూడు రోజులు ఏడ్చి ఏడ్చి చివరికి ఊపిరి విడిచింది. అప్పుడా 'కుమార రత్నం' మఠం నుండి బయటికి వచ్చి తల్లి శవం ముందు శ్రద్ధాంజలి ఘటించాడు.

కొంతకాలానికి ఈ అతివాదానికి విరుగుడుగా మరో అతివాదం వచ్చింది. మొదట క్రైస్తవ మతం చీలికలు పేలికలయి నాల్గవ శతాబ్దానికల్లా 88 వర్గాలుగా విడిపోయింది. ఈ వర్గాలు కలహించుకుంటూ ఒకదాన్నొకటి అంతమొందించడానికి ప్రయత్నించాయి. పెద్దఎత్తున రక్తపాతం కూడా జరిగింది. ఆ తరువాత ఆ మతనాయకుల్లో ప్రాపంచిక వ్యామోహం ప్రవేశించింది. పాదరీలు, బిషప్పులు పెద్దపెద్ద ఆస్తులకు, జాగీర్లకు యజమానులై అష్టయిశ్వర్యాలు అనుభవించసాగారు.

ప్రారంభంలో లైంగికవాంఛల్ని అంతమొందించే నెపంతో సన్యాసులు, సన్యాసినులు కలసి ఒకే పడక మీద పడుకునేవారు. సెయింట్ ఎవగ్రియస్ ఈ సన్యాసుల పవిత్రను ప్రశంసిస్తూ, వారు ఒకే స్నానశాలలో స్త్రీలతో కలసి స్నానంచేసినా, ఆ స్త్రీలను పెనవేసుకున్నా వారిలో లైంగిక వాంఛలు రేకెత్తవని అన్నాడు. అయితే పాలస్తీనా క్రైస్తవమఠాలు వ్యభిచార కూపాలుగా మారిపోయాయని సెయింట్ గ్రెగోరి పేర్కొన్నాడు. ఇలా క్రైస్తవమఠాలలో మతం చాటున పచ్చి వ్యభిచారం పరాకాష్ఠకు చేరుకుంది. చివరికి అక్కాచెల్లెళ్ళతో, కుమార్తెలతో కూడా అక్రమసంబంధాలు సాగాయి.

ఇస్లాం వైరాగ్య భావనను, సర్వసంగ పరిత్యాగాన్ని పూర్తిగా నిషేధించింది. దేవుని ఆజ్ఞలకు, ఆయన ప్రవక్త (సల్లం) బోధనలకు మాత్రమే అనుగుణంగా నడచుకోవాలని, వాటిని అతిక్రమించి స్వకల్పిత విధానాలను పాటించకూడదని పేర్కొన్నది. ఇస్లాంలో సర్వసంగ పరిత్యాగం లేదని మహా ప్రవక్త (సల్లం) అన్నారు (ముస్నద్ అహ్మద్). "దైవమార్గంలో (దుష్టశక్తులతో) పోరాడటమే ముస్లిం సమాజం అవలంబించే సర్వసంగ పరిత్యాగం" అని ఆయన తెలిపారు. (ముస్నద్ అహ్మద్).

బుఖారి, ముస్లిం గ్రంథాలలోని ఒక హదీసు ప్రకారం ముగ్గురు సహాబీలు (ప్రవక్త అనుచరులు) ప్రవక్త సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) ద్వారా దైవప్రవక్త (సల్లం) ఆరాధనలను గురించి విన్న తరువాత వారిలో ఒకతను తానిక నుంచి ఎల్లప్పుడూ రాత్రంతా నమాజులో గడుపు తానని నిశ్చయించుకున్నాడు. మరొకతను తాను ఎల్లప్పుడూ ఉపవాసవ్రతం పాటిస్తానని, ఒక్కరోజు కూడా విడిచిపెట్టనని అన్నాడు. వేరొకడు తానసలు వివాహమే చేసుకోనని, స్త్రీలతో ఎలాంటి సంబంధం పెట్టుకోనని నిర్ణయించుకున్నాడు. దైవప్రవక్త (సల్లం) ఈ సంగతి తెలుసుకొని "మీరేనా ఈ మాటలు అంటున్నది? దైవసాక్షి! నేను మీ అందరిలో కెల్లా దేవునికి ఎక్కువగా భయపడేవాడ్ని. అయినా నేను కొన్నాళ్ళు ఉపవాసం ఉంటే, కొన్నాళ్ళు ఉపవాసం లేకుండా గడుపుతున్నాను. రాత్రి వేళల్లో ప్రార్థన కూడా చేస్తాను, నిద్ర కూడా పోతాను. అలాగే స్త్రీలను వివాహమాడి దాంపత్య జీవితం కూడా గడుపుతాను. కనుక నా సంప్రదాయాన్ని పాటించని వారితో నాకెలాంటి సంబంధం లేదు" అని హెచ్చరించారు. (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ నుండి)

(సత్యాన్ని) విశ్వసించినవారికి మేము తగిన ప్రతిఫలం ప్రసాదించాము. కాని చాలామంది దుర్జనులైపోయారు. (26,27)

విశ్వసులారా! దేవునికి భయపడండి. ఆయన ప్రవక్తను విశ్వసించండి. దేవుడు మీకు రెట్టింపు కారుణ్యం ప్రసాదిస్తాడు. (అంటే మిమ్మల్ని ఎంతగానో కరుణిస్తాడు.) మీకు జ్యోతిని అనుగ్రహిస్తాడు; దాని వెలుగులో మీరు (సన్మార్గంలో) నడుస్తారు. ఆయన మీ పొరపాట్లు కూడా క్షమిస్తాడు. దేవుడు గొప్ప క్షమాశీలి, అమిత దయామయుడు. (28)

గ్రంథప్రజలకు దేవుని అనుగ్రహంపై ఎలాంటి గుత్తాధిపత్యం లేదు. దేవుని అనుగ్రహం స్వయంగా ఆయన చేతిలోనే ఉంది. ఆయన తాను కోరినవారికి దాన్ని ప్రసాదిస్తాడు. ఆయన గొప్ప అనుగ్రహశీలి. వారీ విషయం తెలుసుకోవాలి. (29) ✪

# 58. వాదిస్తున్న స్త్రీ (ముజాదలా)

**అవతరణ: మదీనా** **సూక్తులు: 22**

ఈ అధ్యాయాన్ని "ముజాదలా" (వాదిస్తున్న స్త్రీ) అంటారు. ఇది హిజ్రీశకం 5 లో అహ్జాబ్ (కందకం) యుద్ధం తరువాత అవతరించి ఉండవచ్చని తెలుస్తోంది. ఇందులో ఒక స్త్రీ తనను తనభర్త తల్లివంటిదని చెప్పి తనకు దూరమయిపోయిన పరిస్థితి గురించి దైవప్రవక్త (సల్లం)కు తెలిపి న్యాయం చేకూర్చమని అడిగిన సంఘటన ఉంది. ఆ తర్వాత కపటవిశ్వాసుల కుతంత్రాలు, రహస్య సమాలోచనలను విమర్శించడం, ముస్లింలకు సభామర్యాదలను గురించి తెలపడం, నిజమైన విశ్వాసుల ప్రవర్తనా నియమావళిని పేర్కొనడం జరిగాయి.

## కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

(ప్రవక్తా!) నీతో తన భర్త విషయంలో వాదిస్తూ దైవాన్ని మొరపెట్టుకున్న స్త్రీ మాటల్ని దేవుడు విన్నాడు.[1] దేవుడు మీ ఇద్దరి సంభాషణ వింటున్నాడు. ఆయన సర్వం వినేవాడు, సమస్తం చూసేవాడు. (1)

---

1. ఈ స్త్రీ పేరు హజ్రత్ ఖౌలా బిన్త్ సాలబా (రజి). అజ్ఞానకాలంలో అరబ్బులు తమ భార్యలతో పోట్లాడి వారిని వదిలించుకోవడానికి "నువ్వు నాకు తల్లివంటి దానవు" అని చెప్పేవారు. దీన్ని షరీఅత్ పరిభాషలో "జిహార్" అంటారు. హజ్రత్ ఖౌలా (రజి)కు కూడా ఇలాంటి పరిస్థితే ఎదురైంది. ఆమె దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి, భర్త దూరమయితే తాను చిక్కుల్లో పడవలసి వస్తుందని, తన పిల్లలు నాశనమవుతారని విన్నవించుకున్నారు. ఆ సందర్భంలో ఈ అధ్యాయం అవతరించింది. దేవుడు ఈ వైఖరిని తీవ్రంగా గర్హించాడు.

హజ్రత్ ఉమర్ (రజి) పాలనాకాలం నాటి సంఘటన. ఓరోజు ఆయన తన సహచరులు కొందరిని వెంటబెట్టుకొని ఎక్కడికో వెళ్తున్నారు. దారిలో ఒక వృద్ధమహిళ ఆయన్ని కలసి "మీతో మాట్లాడాలి, కాస్త ఆగండి" అన్నది. హజ్రత్ ఉమర్ (రజి) ఆమెకు సలాం చేసి, ఆగి ఆమె మాటలు వినడానికి సిద్ధమయ్యారు. అప్పుడా వృద్ధమహిళ ఇలా అన్నది:



మీలో ఎవరు తమ భార్యల్ని తల్లుల వంటివారని చెప్పి, వారిపట్ల దాంపత్య విచ్ఛిన్నవైఖరి అవలంబిస్తారో వారి భార్యలు నిజానికి వారికి తల్లులు కాలేరు. వారి తల్లులు వారిని కన్నవారే అవుతారు. వీరు అనుచితమైన అబద్ధం పలుకుతున్నారు. (ఈవైఖరి పట్ల వారిపై దైవశిక్ష విరుచుకుపడేది, కాని) దేవుడు అపార దయామయుడు, గొప్ప క్షమాశీలి. (2)

ఎవరు తమ భార్యల్ని తల్లుల వంటివారని చెప్పి వారిపట్ల దాంపత్య విచ్ఛిన్న వైఖరి అవలంబిస్తారో వారు (తప్పు తెల్సుకున్న తర్వాత) దాంపత్య సంబంధాన్ని పునరుద్ధరించు కోవడానికి సిద్ధమైనప్పుడు, దంపతులు పరస్పరం కలుసుకోకముందే (భర్త) ఒక బానిసకు బానిసత్వం నుండి విముక్తి కలిగించాలి. దీనిద్వారా మీకు హితోపదేశం చేయబడుతోంది. మీరు చేసేదంతా దేవునికి తెలుసు. ఒకవేళ బానిస లేకపోతే, ఇద్దరు కలుసుకోక ముందే అతను రెణ్ణెల్లు నిరంతరాయంగా ఉపవాసం పాటించాలి. అదీ చేయలేకపోతే అరవై మంది పేదలకు అన్నదానం చేయాలి. మీరు దేవుణ్ణి, ఆయన ప్రవక్తను (మనస్ఫూర్తిగా) విశ్వసించడానికే ఈఆజ్ఞ ఇవ్వబడుతోంది. ఇవి దేవుడు నిర్ణయించిన పరిధులు. (వీటిని అతిక్రమించకూడదు. ఈ) సత్యాన్ని తిరస్కరించినవారికి దుర్భర శిక్ష పడుతుంది. (3,4)

గతంలో కొందరు దేవుణ్ణి, ఆయన ప్రవక్తను వ్యతిరేకించినప్పుడు దేవుడు వారిని నికృష్ట స్థితికి దిగజార్చాడు. నేడు కూడా అలాంటి వైఖరి అవలంబించినవారికి అదే గతి పడ్తుంది. మేము (మాత్రం ఎలాంటి అరమరికలులేని) నిర్దిష్టమైన సూక్తులు అవతరింపజేశాము. (కనుక) అవిశ్వాసులకు అవమానకరమైన శిక్ష తప్పదు. (5)

ఆరోజు దేవుడు వారందర్నీ తిరిగి బ్రతికించి లేపి, వారు (ప్రపంచంలో) ఏమేమి చేసివచ్చారో తెలియజేస్తాడు. వారు మరచిపోతారు, కాని దేవుడు వారి కర్మలన్నిటిని

---

"ఓహో ఉమర్! ఎంత మారిపోయావు!! ఒకప్పుడు నువ్వు ఉకాజ్ బజారులో తిరుగుతుంటే చూశాను. అప్పుడు నిన్ను జనం ఉమైర్ అని పిలిచేవారు. నువ్వు చేతిలో కర్ర తీసుకొని మేకలు కాస్తూ ఉండేవాడివి. తరువాత ఎంతో కాలం గడవ లేదు, జనం నిన్ను ఉమర్ అని పిలవడం ప్రారంభించారు. ఆ తరువాత కొంతకాలానికి (అంటే) ఇప్పుడు నువ్వు అమీరుల్ మోమినీన్ (విశ్వాసుల నాయకుడు) అని పిలవబడుతున్నావు. ప్రజల విషయంలో కాస్త దేవునికి భయపడుతూ మసలుకో. ఒక విషయం గుర్తుంచుకో, దేవుని శిక్షకు భయపడేవానికి సుదూర వ్యక్తి కూడా దగ్గరి బంధువులా మారిపోతాడు. చావుకు భయపడేవాడు తాను కాపాడుకోవాలనుకున్న వస్తువునే పోగొట్టుకునే ప్రమాదం ఉంది."

హజ్రత్ ఉమర్ (రజి) వెంట ఉన్న ఒకతను ఆ స్త్రీ వైఖరి సహించలేక "నువ్వు మన అమీరుల్ మోమినీన్ (ఖలీఫా) ముందు హద్దుమీరి మాట్లాడుతున్నావు" అన్నాడు.

హజ్రత్ ఉమర్ (ర) అతడ్ని వారిస్తూ "ఆమెను చెప్పనివ్వు. అసలీమె ఎవరో నీకు తెలుసా? ఈమె ఫిర్యాదుమాటలు సప్తాకాశాలపై ప్రతిధ్వనించాయి. దైవసాక్షి! ఈమె ఇలా నన్ను రాత్రిపొద్దుపోయేదాకా నిలబెట్టినాసరే నేను నిలబడతాను. కాకపోతే నమాజు వేళలప్పుడు మాత్రం నా అశక్తతను తెలుపుకుంటాను" అని అన్నారు. ఈ మహిళే హజ్రత్ ఖౌలా-రజి. (ఖతాదా, బైహఖి)

లెక్కించి మరీ భద్రపరుస్తున్నాడు. దేవుడు ప్రతి విషయానికీ సాక్షిగా ఉన్నాడు. (6)

భూమ్యాకాశాల్లో ఉన్న సమస్తం దేవునికి తెలుసని నీవెరుగవా? ముగ్గురు వ్యక్తులు గుసగుసలాడు కుంటున్నప్పుడు వారి మధ్య నాల్గోవాడిగా దేవుడుంటాడు. లేదా ఐదుగురు రహస్యసమాలోచనలు జరుపుకుంటున్నప్పుడు కూడా వారిమధ్య ఆరోవాడిగా దేవుడు తప్పక ఉంటాడు. గుసగుసలాడుకునేవారు అంతకంటే తక్కువమంది ఉన్నా, ఎక్కువమంది ఉన్నా దేవుడు వారిని వెన్నంటేఉంటాడు. ఆతర్వాత ప్రళయదినాన వారేమి చేసివచ్చారో వారికి వివరిస్తాడు. దేవుడు సకల విషయపరిజ్ఞానం కలవాడు. (7)

(ప్రవక్తా!) నీవు గమనించలేదా? రహస్య మంతనాలు జరపవద్దని వారించినప్పటికీ వారు మళ్ళీ అవే తప్పుడు పనులకు పాల్పడుతున్నారు. వీరసలు పాపకార్యాలు, అన్యాయం అక్రమాల్ని గురించి, ప్రవక్తపట్ల అవిధేయత గురించి గుసగుసలాడు కుంటున్నారు. వీరు నీ దగ్గరికొచ్చినప్పుడు దేవుడు తెలిపిన సలాంచేసే పద్ధతి కాదని (దురుద్దేశంతో) మరోవిధంగా నీకు సలాం చేస్తారు.[2] అప్పుడు వీరు తమ మనస్సుల్లో "మనం పలుకుతున్న ఈ పలుకులకు దేవుడు మనల్ని ఎందుకు శిక్షించడు?" అని అనుకుంటారు. వారికసలు నరకమే తగినశిక్ష. వారు తప్పకుండా నరకానికి ఇంధనంగా మారుతారు. అది మహాచెడ్డ నివాసస్థలం. (8)

విశ్వాసులారా! మీరు పరస్పరం రహస్యంగా ఏదైనా మాట్లాడుకోదలిస్తే పాప కార్యాలు, అక్రమాలు, అన్యాయాలు, ప్రవక్త పట్ల అవిధేయత లాంటి విషయాల్ని గురించి గాకుండా సత్కార్యాలు, భయభక్తుల్ని గురించి మాట్లాడుకోండి. పునరుత్థానం నాడు మిమ్మల్ని దేవుని ముందు ప్రవేశపెడతారు. కనుక ఈ భావనతో మీరెల్లప్పుడూ దేవునికి భయపడుతూ మసలుకోండి. కుత్సిత బుద్ధితో గుసగుసలు చెప్పుకోవడం పైశాచిక చర్య. విశ్వాసుల్ని బాధించడానికే ఇలాంటి చేష్టలు జరుగుతాయి. కాని దానివల్ల విశ్వాసులకు దైవాజ్ఞ లేనిదే ఎలాంటి నష్టం వాటిల్లదు. అందువల్ల విశ్వాసులు దైవాన్నే నమ్ముకొని ఉండాలి. (9,10)

విశ్వాసులారా! మీ సమావేశాల్లో సర్దుకొని (వచ్చేవారికి) చోటు కల్పించమని చెప్పి నప్పుడు మీరు చోటు కల్పించండి, దేవుడు మీకు (స్వర్గంలో) చోటుకల్పిస్తాడు. అలాగే లేచి వెళ్ళిపొండని చెబితే వెళ్ళిపోండి.[3] మీలో (సత్యాన్ని) విశ్వసించి (ధర్మ)జ్ఞానం

2. యూదులు దైవప్రవక్త (స)ను ఏదోవిధంగా కించపరచడానికి ప్రయత్నించేవారు. ఒకసారి కొందరు యూదులు వచ్చి, అస్సలాము అలైకుం (మీకు శాంతి కలుగుగాక) అనడానికి బదులు, దాన్ని వత్తి పలుకుతూ అస్సాము అలైకుం (మీకు చావు మూడుగాక) అన్నారు. దానికి దైవప్రవక్త (స) వఅలైకుం (మీకూ అదే కలుగుగాక) అన్నారు. హజ్రత్ ఆయిషా (రజి) యూదులు వెళ్ళి పోయాక అన్నారు: "ఆ యూదులు ఏమన్నారో విన్నారా? మీకు చావు మూడుగాక అన్నారు." దైవప్రవక్త (స) జవాబిస్తూ "ఆయిషా! మనిషి దుర్భాషలాడటాన్ని దేవుడు మెచ్చడు. సరే, నేను ఏమని సమాధానమిచ్చానో నీవు గమనించావా? మీకూ అదే కలుగుగాకని అన్నాను" అన్నారు.

3. సభ్యతా సంస్కారాలు, సభామర్యాదలు కూడా ధార్మిక విషయాలేనని ఈ సూక్తి స్పష్టం చేస్తోంది. దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు:



ప్రసాదించబడిన వారికి దేవుడు ఉన్నత హోదాలు ప్రసాదిస్తాడు. మీరు చేస్తున్నదంతా దేవునికి తెలుసు. (11)

విశ్వాసులారా! మీరు దైవప్రవక్తతో ఏకాంతంగా మాట్లాడదలచుకుంటే ముందుగా ఏదైనా దానం చేయండి. ఇది మీకెంతో శ్రేయస్కరం, పవిత్రమైనది, దానం చేయడానికి మీ దగ్గర ఏమీ లేకపోతే, పోనీయండి. దేవుడు గొప్పక్షమాశీలి, అమిత దయామయుడు.

ఏకాంతంగా మాట్లాడటానికి ముందుగా దానం చేయవలసి ఉంటుందన్న ఆజ్ఞ విని భయపడ్డారా? సరే పోనీయండి: దేవుడు మిమ్మల్ని క్షమించేశాడు. అయితే మీరు నమాజ్ వ్యవస్థ నెలకొల్పాలి; జకాత్ చెల్లిస్తూ ఉండాలి; దేవునికి, ఆయన ప్రవక్తకు విధేయులయి ఉండాలి. మీరు చేస్తున్నదంతా దేవునికి తెలుసు. (12,13)

దైవాగ్రహానికి గురైన వర్గం (యూదుల)తో చేతులు కలిపినవారిని (అంటే కపట విశ్వాసుల్ని) మీరు చూడలేదా? నిజానికి వారు మీతో కూడా (స్నేహంగా) లేరు; ఆ వర్గంతో కూడా లేరు. వారు తెలిసి కూడా ప్రమాణాలుచేస్తూ అబద్ధాలాడుతున్నారు. వారికోసం దేవుడు కఠినశిక్ష సిద్ధపరచి ఉంచాడు. వారు చాలా వికృతచేష్టలకు పాల్పడు తున్నారు. వారు తమ ప్రమాణాలు అడ్డంపెట్టుకొని ప్రజల్ని దైవమార్గంలోకి రాకుండా నిరోధిస్తున్నారు. వారి కోసం అవమానకరమైన శిక్ష ఉంది. దేవుని పట్టునుండి వారిని వారి సంతానం, సిరిసంపదలు ఏవీ కాపాడలేవు. వారు నరక నేస్తాలు. నరకంలోనే వారు ఎల్లకాలం పడిఉంటారు. (14-17)

దేవుడు (రేపు) వీరిని బ్రతికించి లేపినప్పుడు, ఆయన ముందు కూడా ఈరోజు నీ ముందు చేస్తున్నట్లే అసత్య ప్రమాణాలు చేస్తారు. అలా అసత్య ప్రమాణాలు చేస్తే తమపని నెరవేరుతుందని భావిస్తారు. గుర్తుంచుకోండి! వారు పచ్చి అబద్ధాలకోరులు. వారిని షైతాన్ ఆవహించి దైవస్మరణ నుంచి మరిపింపజేశాడు. వారసలు షైతాన్ పక్షా నికి చెందినవారు. తస్మాత్ జాగ్రత్త! షైతాన్ పక్షంవారే నష్టపోయేవారు. (18,19)

దేవుడ్నీ, ఆయన ప్రవక్తను వ్యతిరేకిస్తున్నవారే పరమనీచులు. తాను, తనప్రవక్తలు విజయం సాధిస్తారని దేవుడు రాసిపెట్టాడు. ఆయన మహాబలాఢ్యుడు, అసాధారణ శక్తి సంపన్నుడు. దేవుడ్నీ, పరలోకాన్ని విశ్వసించినవారు దేవునిపై, ఆయన ప్రవక్తపై తిరుగు బాటు చేస్తున్నవారిని ఎన్నటికీ ప్రేమించరు. చివరికి వారు తమ తండ్రులైనా, కొడుకు లైనా, సోదరులైనా లేదా తమ కుటుంబసభ్యులైనా సరే, ససేమిరా ప్రేమించరు. అలా ప్రేమించడాన్ని నీవు ఎన్నటికీ చూడలేవు.

"మీలో ఏ ఒక్కరూ ఇతరుల్ని లేపి వారి స్థానంలో కూర్చోకూడదు. మీరు స్వయంగా ఇతరుల కోసం చోటు కల్పించాలి." (బుఖారి, ముస్లిం) "ఇద్దరు వ్యక్తుల మధ్య వారి అనుమతి లేకుండా దూరడం ధర్మసమ్మతం కాదు." (తిర్మిజి)

దైవప్రవక్త (స) అమృతవాక్కులు వినడానికి జనం ఆయన దగ్గర చాలాసేపు కూర్చుండే వారు. దానివల్ల ఒక్కోసారి దైవప్రవక్త (సల్లం) దైనందిన పనులకు, విశ్రాంతి సమయానికి ఆటంకం కలిగేది. అప్పుడు ఈ రెండవ ఆదేశం వచ్చింది. (ఇబ్నె కసీర్)

దేవుడు వారి హృదయాల్లో విశ్వాసాన్ని దృఢంగా పాదుకొల్పాడు. పైగా తన దగ్గర నుండి స్ఫూర్తి ప్రసాదించి వారికి మరింత బలంచేకూర్చాడు. ఇలా వారిని సెలయేరులు ప్రవహించే స్వర్గవనాల్లో ప్రవేశింపజేస్తాడు. అక్కడే వారు కలకాలం ఉంటారు. దేవుడు వారిపట్ల ప్రసన్నుడయ్యాడు; వారు దేవునిపట్ల సంతుష్టులయ్యారు. వారసలు దేవుని పక్షానికి చెందినవారు. వినండి! దేవుని పక్షంవారే కృతార్థులవుతారు. (20-22) ✪

## అవతరణ: మదీనా 59. దండయాత్ర (హష్ర్) సూక్తులు: 24

ఈ అధ్యాయాన్ని "హష్ర్" (దండయాత్ర) అంటారు. ఇది హిజ్రీ శకం నాల్గవ ఏట అవతరించింది. ఇందులో ఇస్లాంవ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తూ నిత్యం ఏదో ఒక కుట్ర పన్నుతుండిన బనీనజీర్ (తెగ) యూదుల బహిష్కరణ గురించి, వారికి తోడ్పడిన కపట విశ్వాసుల వైఖరిని గురించి ప్రస్తావించడం జరిగింది.

క్రీ.శ. 132 లో యూదులు రోమన్ల ఆగ్రహానికి గురయి పాలస్తీనా వదలి అరేబియా (హిజాజ్)కు వచ్చి నివసించసాగారు. వారు వడ్డీవ్యాపారం, రాజకీయ కుట్రలతో అయలా, మఖ్నా, తబూక్, తైమా, ఖురాలోయ, ఫదక్, ఖైబర్ వంటి సారవంతమైన ప్రాంతాలను స్వాధీనంలోకి తెచ్చుకున్నారు. ఆ కాలంలోనే బనీఖురైజా, బనీనజీర్, బనీ ఖైనుఖా యూదతెగలు కూడా మదీనా, దాని చుట్టుపక్కల ప్రాంతాలకు వచ్చి అక్కడి అరబ్బు తెగలను అణచివేసి ఉండసాగాయి.

క్రీ.శ. 450 లో (అరేబియాలోని) సబారాజ్యం వరద ముంపుకు గురయి పతనమైన తరువాత అక్కడి అరబ్బు తెగలు వివిధ ప్రాంతాలకు వలసపోయారు. అప్పుడు ఔస్, ఖజ్రజ్ అనే తెగలు మదీనా ప్రాంతానికి వచ్చిస్థిరపడ్డారు. మదీనాలోని యూదులు వారిని అణచివేయడానికి, తరిమి కొట్టడానికి అనేకసార్లు ప్రయత్నించారు. చివరికి ఈ అరబ్బు తెగలు సిరియాలోని తమ సోదరతెగల సహాయం కోరగా వారు పెద్దఎత్తున సైన్యంతో వచ్చి యూదుల్ని పూర్తిగా అణచివేశారు. దాంతో బనీనజీర్, బనీఖురైజా (యూద) తెగలు ఔస్ (అరబ్బు) తెగ రక్షణలో మదీనా వెలుపలి ప్రాంతాల్లోకి వెళ్ళి నివసించవలసి వచ్చింది. బనీఖైనుఖా తెగ మాత్రం ఖజ్రజ్ (అరబ్బు) తెగ రక్షణలో మదీనాలోనే ఉండసాగింది.

ఆ తరువాత కొంతకాలానికి ఔస్, ఖజ్రజ్ తెగల మధ్య భయంకర యుద్ధాలు జరిగి రెండు తెగలు ఘోరంగా నష్టపోయాయి. చివరికి ఈ రెండు తెగల ప్రజల్లో సంధి కుదిరింది. ఉభయ వర్గాలవారు అబ్దుల్లా బిన్ ఉబయ్యిని రాజుగా చేసుకోవడానికి నిర్ణయం కూడా తీసుకున్నారు. ఈ పరిస్థితుల్లో దైవప్రవక్త (సల్లం) మక్కా నుండి మదీనాకు వలస రావడం జరిగింది. ఔస్, ఖజ్రజ్ తెగల్లో అత్యధిక మంది అంతకు ముందే ఇస్లాం ధర్మానికి ప్రభావితులయి ఉండటంతో వారు దైవప్రవక్త (సల్లం)ను తమ కేంద్రబిందువుగా చేసుకున్నారు. దైవప్రవక్త (సల్లం) మదీనా రాగానే మక్కా నుండి మదీనా వలస వచ్చిన ముహాజిర్ ముస్లింలకు, కష్టకాలంలో వారిని ఆదుకున్న అన్సార్ (ఔస్, ఖజ్రజ్ తెగల) ముస్లింలకు మధ్య సోదరసంబంధం ఏర్పరచారు. మరోవైపు యూద తెగలతో స్నేహఒప్పందం కూడా కుదుర్చుకున్నారు.



కాని జన్మతః జాత్యహంకారులైన యూదులు అంతిమ దైవప్రవక్త తమజాతిలో పుట్టకుండా తాము నిరక్షర కుక్షులని తెగడిన అరబ్బుల్లో పుట్టినందుకు ఇస్లాం పట్ల, ముహమ్మద్ ప్రవక్త (స) పట్ల తీవ్రమైన ద్వేషం పెంచుకున్నారు. మరోవైపు ఔస్, ఖజ్రజ్ తెగల్లో అత్యధికమంది ముస్లింలుగా మారిపోవడం, వడ్డీవ్యాపారం, అక్రమలావాదేవీలను నిషేధిస్తూ దైవప్రవక్త (స) సామాజిక, ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టడం కూడా వారికి కంటకప్రాయమయ్యాయి. దాంతోవారు ముస్లింల మధ్య అనైక్యతాబీజాలు నాటడానికి, ఆర్థిక ఇబ్బందులు కలగజేయడానికి, స్నేహఒప్పందం ఉల్లంఘించడానికి పాల్పడ్డారు.

అంతేకాదు, బద్ర్ యుద్ధంలో ముస్లింలు వారి ఆశలకు భిన్నంగా మక్కా బహుదైవారాధకుల మీద ఘన విజయం సాధించినందుకు వారు లోలోన కుతకుతలాడిపోయారు. వారు దైవప్రవక్త (స)ను కించపరిచే ఉద్దేశ్యంతో ఆయన సమావేశాలకు వచ్చి అస్పష్టమైన పదజాలంతో మాట్లాడేవారు. మక్కా బహుదైవారాధకుల్ని మదీనాపై దాడికి పురిగొల్పేవారు. ముస్లింలను ఇస్లాంకు దూరం చేయడానికి రకరకాల కుట్రలు పన్నేవారు. కపటవిశ్వాసులతో చేతులు కలిపి, ముస్లింల మధ్య తగాదాలు పెట్టేందుకు, ముస్లిం మహిళలను అల్లరిపాలు చేసేందుకు సయితం ప్రయత్నించేవారు.

ఒకరోజు ఓ ముస్లింమహిళ నగ చేయించుకోవడానికి బనూఖైనుఖా తెగయూదుల వాడలో ఉన్న ఒకయూద స్వర్ణకారుని దుకాణానికి వెళ్ళింది. అక్కడ కొందరు ఆకతాయి యూదులు ఆమె బట్టలు ఊడదీసి నగ్నం చేశారు. దాంతో పెద్ద రభస జరిగింది. ఆ స్త్రీ భర్త ఈ అవమానం సహించలేక ఒక యూదుడ్ని హతమార్చాడు. ప్రతీకారంగా అక్కడ గుమికూడిన యూదులు ఆ ముస్లింని చంపేశారు. ఈవార్త క్షణాల్లో పట్టణం నలుమూలలా వ్యాపించి యూదులు, ముస్లింల మధ్య యుద్ధవాతావరణాన్ని సృష్టించింది. దైవప్రవక్త (సల్లం) ఈ తగాదా తీర్చడానికి, యూదులకు సర్దిచెప్పడానికి ప్రయత్నించారు. కాని యూదులు ఆయన సలహాను ఖాతరు చేయకుండా "నీవు మమ్మల్ని యుద్ధ తంత్రం ఎరగని ఖురైషీయుల్లాంటి వారమని భావించావేమో! మాతో యుద్ధానికి దిగితే తెలుస్తుంది మొనగాళ్ళంటే ఎవర్ని అంటారో" అని అన్నారు. ఈ విధంగా వారు స్నేహ ఒప్పందం ఉల్లంఘించి బహిరంగ యుద్ధప్రకటన చేశారు.

ఈ సంఘటనతో దైవప్రవక్త(స) ఇక లాభంలేదని యూదులవాడను చుట్టుముట్టారు. ఈ ముట్టడి పదిహేను రోజులపాటు సాగింది. చివరికి వారు ఆయుధాలు పడేసి లొంగిపోయారు. అప్పుడు కపటుల నాయకుడు అబ్దుల్లా బిన్ ఉబై రంగంలోకి దిగి వారిని క్షమించి వదలిపెట్టమని ప్రాధేయపడ్డాడు. దైవప్రవక్త (స) అతని విన్నపం అంగీకరించి ఒక నిర్ణయానికి వచ్చారు. దాని ప్రకారం బనీఖైనుఖా తెగ యూదులు తమ ఆయుధాలు, ఆస్తిపాస్తులు వదలి మదీనా నుండి వేరే ప్రాంతానికి తరలివెళ్ళారు.

ఈ సంఘటన జరిగిన కొంత కాలానికి బనీనజీర్ తెగ యూదులు కూడా కవ్వింపు చర్యలు ప్రారంభించారు. ఒప్పందం ప్రకారం వారు ఉహుద్ యుద్ధంలో ముస్లింలతో సహకరించవలసి ఉంది. కాని వారు యుద్ధంలో పాల్గొనడానికి నిరాకరించారు. పైగా ఉహుద్ యుద్ధంలో దైవప్రవక్త (స) గాయపడినప్పుడు ఆయన అమరగతులయ్యారని పుకార్లు పుట్టించారు. చివరికి ఆ యుద్ధంలో ముస్లింలకు తీవ్ర నష్టం వాటిల్లడం చూసి, వారు మరింత పెట్రేగిపోయి దైవప్రవక్త (స)ను హతమార్చడానికి కుట్రపన్నారు.

ఓసారి ఒక ముస్లిం పొరపాటున శత్రుపక్షం మనిషి అనుకొని, ముస్లిం మిత్రపక్షమైన బనీనజీర్‌తెగకు చెందిన ఒక మనిషిని చంపాడు. దీనివల్ల ముస్లింలు యూదులకు రక్తపరిహారం చెల్లించవలసి వచ్చింది. దైవప్రవక్త (స) ఈ వ్యవహారం గురించి చర్చించడానికి కొందరు సహచరుల్ని వెంటబెట్టుకొని బనీనజీర్ వాడకు వెళ్ళారు. అక్కడ యూదులు ఆయన్ని ఓ గోడ పక్కన నీడలో కూర్చోబెట్టి తియ్యటి మాటల్లోకి దించారు. తర్వాత నిర్ణీతపథకం ప్రకారం ఒక యూదుడు ఆఇంటికప్పు పైకెక్కి ఓపెద్ద బండరాయిని ఈడుస్తూ దాన్ని గోడ మీదనుంచి దైవప్రవక్త (స) మీద జారవేయడానికి ప్రయత్నించసాగాడు. అప్పుడు దేవుడు ఈ కుట్ర గురించి దివ్యావిష్కృతి ద్వారా దైవప్రవక్త (స)కు తెలియజేశాడు. దైవప్రవక్త (స) వెంటనే అక్కడ్నుంచి లేచి మెల్లిగా జారుకున్నారు.

ఇలాంటి కుట్రదారుల్ని ఇక ఉపేక్షించకూడదని భావించి దైవప్రవక్త (సల్లం) "మీ విశ్వాస ఘాతుకచర్య గురించి మాకు తెలిసింది. కాబట్టి మీరు పదిరోజుల్లోగా మదీనా వదలి వెళ్ళిపోవాలి. లేకపోతే హతమార్చడం జరుగుతుంది" అని అల్టిమేటం ఇచ్చారు.

అదే సమయంలో అటు కపటాగ్రేశ్వరుడు అబ్దుల్లా బిన్ ఉబైయి బనీనజీర్ తెగ యూదుల్ని ముస్లింలపై ఉసిగొల్పుతూ "నేను నా రెండువేల మంది జనంతో మీకు సహాయం చేస్తాను. బనీఖురైజా, బనీగత్ఫాన్ తెగల వాళ్ళు కూడా మీకు తోడ్పడతారు. కనుక మీరు ఎట్టి పరిస్థితిలోనూ వెనుకంజ వేయకుండా ముస్లింలను ఎదుర్కోండి" అని సమాచారం పంపాడు. యూదులు అతని కల్లబొల్లి మాటలు నమ్ముకొని, ప్రవక్త అల్టిమేటంకు సమాధానంగా "మేము మా ప్రాంతం విడిచిపెట్టే ప్రసక్తే లేదు. మీకు చేతనైనది చేసుకోండి" అని అన్నారు.

అప్పుడు దైవప్రవక్త (స) తన అనుచరుల్ని తీసుకొని బనీనజీర్ తెగవాడను చుట్టుముట్టారు. దాంతో యూదులు గత్యంతరం లేక కాళ్ళబేరానికి వచ్చారు. ఆయుధాలు మినహా మిగిలిన సామగ్రిలో ఒంటెలపై తీసికెళ్ళగలిగినంత సామగ్రి తీసుకొని వెళ్ళిపోవడానికి వారు అంగీకరించారు. ఈవిధంగా వారు కూడా మదీనా భూభాగం వదలి ఖైబర్ ప్రాంతానికి వెళ్ళిపోయారు. ఈ సంఘటన ఉహుద్ యుద్ధం జరిగిన ఆర్నెల్ల తరువాత సంభవించింది.

ఈ సంఘటన గురించే ఈ అధ్యాయం (సూరా) అవతరించింది.

## కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

భూమ్యాకాశాల్లో ఉన్న అణువణువూ దేవుని ఔన్నత్యాన్ని చాటుతూ, ఆయన పవిత్ర తను ప్రశంసిస్తోంది. ఆయన సర్వ శక్తిమంతుడు, మహా వివేకవంతుడు. (1)

ఆయనే గ్రంథప్రజలలో (నమ్మకద్రోహానికి పాల్పడి) అవిశ్వాసులయి పోయిన వారిని మొదటి దాడిలోనే వారిఇండ్ల నుండి బయటికి గెంటివేశాడు. వారు వెళ్ళిపోతారని మీరు కలలో కూడా ఊహించలేదు. వారు కూడా తమను తమ కోటలు దేవుని నుండి కాపాడుతాయని భావించారు. అయితే వారి ఊహ కూడా పోని దిశ నుండి దేవుడు వారిని చుట్టుముట్టాడు. ఆయన వారిహృదయాలలో భయోత్పాతం సృష్టించాడు. తత్ఫలితంగా వారు తమ ఇండ్లను చేజేతులా నాశనం చేసుకున్నారు. మరోవైపు



విశ్వాసుల చేతులతో కూడా నాశనం కొని తెచ్చుకున్నారు. కనుక కళ్ళున్న ప్రజలారా! (కళ్ళు తెరచి) గుణపాఠం నేర్చుకోండి. (2)

దేవుడు వారి అదృష్టంలో దేశబహిష్కరణ వ్రాసి ఉండకపోతే, ఆయన వారికి ఇహలోకంలోనే శిక్ష విధించేవాడు; ఇక పరలోకంలో వారికోసం నరకశిక్ష ఉండనేఉంది. వారసలు దేవుని పట్ల, ఆయనప్రవక్త పట్ల శత్రువైఖరి అవలబించారు. అందుకే వారికీ గతి పట్టింది. దేవుడు తనను విరోధించేవారిని శిక్షించడంలో చాలా కఠినుడు. (దాడి సందర్భంగా) మీరు కొన్ని ఖర్జూరపు చెట్లు నరికి, మరికొన్నిటిని నరక్కుండా వదిలేశారంటే అది దేవునిఆజ్ఞ వల్లనే జరిగింది. దుర్మార్గుల్ని అవమానం పాల్జేయడానికే (ఆయన ఈ ఆజ్ఞ జారీచేశాడు). (3-5)

దేవుడు వారి అధీనం నుండి తీసి తన ప్రవక్తకు హస్తగతం చేసిన సిరిసంపదలు, నిజానికి (యుద్ధరంగంలో) మీరు గుర్రాలు, ఒంటెల్ని పరుగెత్తించి సాధించిన సిరిసంపదలు కావు. దేవుడు తన ప్రవక్తలకు తానుకోరిన వారిపై ఆధిక్యతనిస్తాడు. ఆయన ప్రతిపనీ చేయగల సమర్థుడు, సర్వ శక్తిమంతుడు. (6)

దేవుడు ఈ వాడవాసుల నుండి తన ప్రవక్తకు అధీనం చేసిన ధన (కనక) వస్తు సంపదల్లో దేవునికి, దైవప్రవక్తకు, బంధువులకు, అనాథలకు, పేదలకు, బాటసారులకు హక్కుంది. ధనం (ఎల్లప్పుడూ) మీలోని ధనిక వర్గంలోనే కేంద్రీకృతమయి ఉండరాదన్న లక్ష్యంతో ఈ విధానం నిర్ణయించబడింది.[1] దైవప్రవక్త మీకు దేన్నిస్తాడో దాన్ని తీసుకొని,

1. ఈ సూక్తి ఇస్లాం ఆర్థిక విధానానికి మూలసూత్రం. ధనం కొందరు వ్యక్తుల దగ్గర పోగయి ఉండటాన్ని, అసహజమైన ఆర్థిక సమానత్వ మార్గం తెరవడాన్ని ఇస్లాం అంగీకరించదు. అది ఆర్థిక న్యాయాన్ని నెలకొల్పదలచింది. దానికోసం ఈ సూక్తిలో పేర్కొన్న "ధన వికేంద్రీకరణ" విధానాన్ని ప్రతిపాదిస్తోంది. ఇస్లాం నెలకొల్పదలచిన ఆర్థిక న్యాయం ఎలాంటిదో పరిశీలిద్దాం:

ఇస్లాం మొట్టమొదట అధర్మ సంపదనా మార్గాలు మూసేసి, ధర్మసమ్మతమైన మార్గాలను మాత్రమే తెరచిపెడ్తుంది. ఖుర్ఆన్‌లో ఒకచోట ఇలా ఉంది: "విశ్వాసులారా! మీరు ఒకరి సొమ్ము మరొకరు అన్యాయంగా కబళించకండి. పరస్పరామోదంతో వ్యాపారలావాదేవీలు, ఇచ్చిపుచ్చుకోవడాలు జరుపుకోవచ్చు. (అన్యాయం, అక్రమం, హత్యా, ఆత్మహత్యల ద్వారా) మిమ్మల్ని మీరు హతమార్చుకోకండి." (4:29 సూక్తితోపాటు 83:1 సూక్తికి రాసిన పాదసూచిక చూడండి.)

సంపదనా మార్గాల్లో కొన్ని నిషిద్ధ మార్గాలు ఖుర్ఆన్ ప్రకారం ఇవి: 1- లంచం, దౌర్జన్యం, అన్యాయం, అపహరణల ద్వారా సంపాదించడం (2:188). 2- అనాథల సొమ్ము కాజేయడం ద్వారా (4:1). 3- కొలతల్లో, తూనికల్లో మోసం చేయడం ద్వారా (17:35, 55:9, 26:181, 83:4). 4- దొంగతనం ద్వారా (5:38). 5- విగ్రహాల ద్వారా (5:90). 6- మద్యం ద్వారా (5:90). 7- జూదం, లాటరీల ద్వారా (5:90). 8- జోస్యం, పాచికల ద్వారా (5:90). 9- వడ్డీ వ్యాపారం ద్వారా (2:277). 10- వ్యభిచారం, అసభ్యత, అశ్లీలతల ద్వారా (24:19,33).

ధనం ధర్మసమ్మతమైన మార్గాల ద్వారా సంపాదించినప్పటికీ దాన్ని పిసినారితనంతో కూడబెట్టకూడదు (3:180, 9:34, 2:268). దుబారా ఖర్చుచేయకూడదు (17:26,27). కుటుంబ అవసరాలకు పోగా మిగిలింది దైవమార్గంలో ఖర్చుచేయాలి (2:219). ఆ తరువాత ధనాన్ని సద్వినియోగం చేయవలసిన పద్ధతులు అవలంబించాలి.

♦ జకాత్: నిర్ణీతమొత్తం కంటే ఎక్కువ సంపాదించినవాడు ఆమొత్తం నుండి ప్రతియేడూ రెండున్నర శాతం తీసి నిరుపేదలకు, అగత్యపరులకు, అనాథలకు, బాటసారులకు, రుణగ్రస్తులకు, బానిసత్వం నుండి విముక్తి కలిగించడానికి, జకాత్ వసూలు చేసే ఉద్యోగుల జీతాల కోసం, ధర్మ సంస్థాపనాకార్యాలతో పాటు ఇతర ప్రజాసంక్షేమ కార్యాల కోసం ఖర్చు చేయాలి (9:60).

♦ ఉష్ర్: భూఉత్పత్తుల (వృక్షసంపద)పై కూడా జకాత్ ఉంది. దీన్ని ఉష్ర్ అంటారు. పంట చేతికొచ్చినప్పుడు ఆ పంట నుండి దేవునిహక్కు (అంటే పేదలహక్కు) నెరవేర్చాలి (6:141). సహజ నీటిఒనరుల ద్వారా పండేపంట నుండి పదిశాతం, కృత్రిమ ఒనరుల ద్వారా పండేపంట నుండి ఐదుశాతం ఫలసాయం ఉష్ర్ చెల్లించాలి. ఇలా పంటపండిన ప్రతిసారీ (యేడాదికి ఎన్ని పంటలైనా) ఉష్ర్ తీయాలి. ఉష్ర్ కూడా జకాత్‌స్వీకార అర్హులకే అందజేయవలసి ఉంటుంది.

♦ రికాజ్: భూపొరలలో నిక్షిప్తయి ఉండే ఖనిజ నిక్షేపాల నుండి ఇరవై శాతం జకాత్ తీసి ప్రభుత్వ ధనాగారం (బైతుల్‌మాల్)లో జమచేయాలి. దీన్ని ప్రభుత్వం నిరుపేదలకు, ఇతర ప్రజా సంక్షేమ కార్యాల కోసం ఖర్చుపెడుతుంది. (హదీసు)

♦ ఫిత్రా: ప్రతి సంవత్సరం రమజాన్ నెలలో స్థితిపరుడు తన తరపున, తన కుటుంబ సభ్యులందరి తరపున విడి విడిగా 1100 గ్రాములు (మరొక అభిప్రాయం ప్రకారం దాదాపు 1700 గ్రాములు చొప్పున గోధుమలుగాని లేదా దాని ధరగాని పేదలకు దానం చేయాలి. (హదీసు)

♦ అన్ఫాల్ (యుద్ధసొత్తు): యుద్ధభూమిలో శత్రువర్గం నుండి లభించిన సొత్తులో 80% సైనికులకు లభిస్తుంది (జీతాలు నిర్ణయించబడని కారణంగా). మిగతా 20% ప్రభుత్వ ధనాగారానికి, (పేద) బంధువులకు, అనాథలకు, నిరుపేదలకు, బాటసారులకు చెందుతుంది. (8:41)

♦ ఫై (విజయధనం): యుద్ధం జరగకుండానే శత్రువు రాజీ ఒప్పందానికి వచ్చి అప్పగించే పంటభూములు, ఇండ్లు, వగైరా స్థిర చరాస్తుల్ని 'ఫై' అంటారు. ఇందులో కూడా ప్రభుత్వ భాగం పోగా మిగిలినది అనాథలకు, పేదలకు, బాటసారులకు చెందుతుంది. (59:7)

♦ వారసత్వపు ఆస్తి: మనిషి చనిపోయిన తరువాత అతను వదలి వెళ్ళిన ఆస్తిని అతని వారసులకు పంచడం జరగాలి. ఎవరెవరికి ఎంతెంత ఆస్తి పంచాలో ఆ వివరాలన్నీ ఖుర్‌ఆన్ నిర్ణయించింది. (4:11,12 సూక్తులు) ఆ వాటాలను మార్చడానికి ఎవరికీ అధికారం లేదు. మృతుడు ప్రత్యేకంగా ఏ నిరుపేద బంధువుకైనా లేదా మరే సత్కార్యం కోసమైనా తన ఆస్తి నుండి కొంత ఇవ్వాలని వీలునామా రాయదలచుకుంటే మొత్తం ఆస్తిలో మూడోవంతు మాత్రమే రాయాలి. మిగతా రెండువంతులు వారసులకు తప్పనిసరిగా సంక్రమించాలి.

వారసుల్లో పురుషునికి లభించే వాటాలో, స్త్రీకి సగం లభించాలన్నది వారసత్వపు ఆస్తి ప్రాథమికసూత్రం. స్త్రీకి వివాహంలో భర్తనుండి 'మహర్' రూపంలో కొంతఆస్తి లభిస్తుందనే విషయం గమనార్హం. మృతునికి సంతానం లేకపోతే ఎవరినైనా దత్తత తీసుకొని అతనికి ఆస్తి కట్టబెట్టే అధికారం లేదు. మృతునికి దగ్గరి బంధువులెవరూ లేకపోతే దూరపు బంధువులకు అతని ఆస్తి లభిస్తుంది. దూరపుబంధువులు కూడా లేకపోతే అతని ఆస్తి ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పేదలకు, ప్రజాహిత కార్యాలకు వినియోగిస్తుంది. 4వ అధ్యాయం (నిసా) చూడండి.

ఈ విధంగా ఇస్లాం ధనాన్ని పెట్టుబడిదారీ వ్యవస్థలో మాదిరిగా కొందరు వ్యక్తుల్లో, సామ్యవాద వ్యవస్థలోలాగా పాలకుల చేతుల్లో కేంద్రీకృతమై ఉండకుండా నిరంతరం సమాజంలో పరిభ్రమించేలా చేస్తుంది. ఇదే ఇస్లాం ప్రతిపాదిస్తున్న ఆర్థికన్యాయం. ఇలాంటి ఆర్థిక వ్యవస్థలో ఏ పౌరుడు కూడా టాటా, బిర్లాల మాదిరిగా కోటీశ్వరుడయ్యే ఆస్కారం ఉండదు. ఒకవేళ ఎవరైనా



దేన్నుండి మిమ్మల్ని నిరోధిస్తాడో దాని జోలికి పోకండి. దేవునికి భయపడండి. దేవుని శిక్ష చాలా కఠినంగా ఉంటుంది. (7)

(మక్కాలోని) తమ ఇండ్ల నుండి, తమ ఆస్తిపాస్తుల నుండి వెడలగొట్టబడిన పేద కాందిశీకులకు కూడా (ఆ సంపదలో) హక్కుంది. వారు దేవుని అనుగ్రహాన్ని, ఆయన ప్రసన్నతను ఆశిస్తూ దేవునికి, ఆయన ప్రవక్తకు అన్ని విధాలా మద్దతు నివ్వడానికి నడుం బిగించారు. వారే సత్యసంధులు, సన్మార్గగాములు. (8)

ఈ కాందిశీకులు రాకపూర్వమే విశ్వసించి మదీనా (పట్నం)లో నివసిస్తున్న వారికి కూడా హక్కుంది. (మక్కా నుండి) తమ దగ్గరకు (మదీనా) వలస వచ్చిన వారిని వీరు అభిమానిస్తున్నారు. వీరికి ఏదిచ్చినా అది తమకు అవసరమని వీరు తమ హృదయాల్లో సైతం ఆకాంక్షించరు. వారు స్వయంగా నిరుపేదలైనప్పటికీ ఇతరుల అవసరాలకే ప్రాధాన్యం ఇస్తారు.[2] పేరాశ, పిసినారితనాల నుండి రక్షించబడిన వారే ధన్యులు. (9)

పోతే వీరందరి తర్వాత (ఇస్లాంలోకి) వచ్చినవారికి కూడా (అందులో హక్కుంది). వారిలా ప్రార్థిస్తారు: "ప్రభూ! మమ్మల్ని, మాకు పూర్వం విశ్వసించిన మా సోదరులందర్నీ క్షమించు. (యావత్తు) విశ్వాసుల పట్ల మాహృదయాల్లో ఎలాంటి అసూయాద్వేషాలు ఉంచకు. ప్రభూ! నీవు గొప్ప క్షమాశీలివి, అపార దయామయుడవు." (10)

కపటవైఖరి అవలంబించిన వారిని నీవు గమనించలేదా? వారు గ్రంథప్రజలకు చెందిన తమ సత్యతిరస్కార సోదరులతో (మంతనాలు జరుపుతూ) "మిమ్మల్ని వెళ్ళగొడ్తే

---

ఒకరిద్దరు కోటీశ్వరులైపోతే అది ఎంతో అద్భుత విషయమని, ప్రపంచ వింతల్లో ఒక వింతని చెప్పవచ్చు. ఇస్లాం దీన్ని దేవుని అనుగ్రహం అని అభివర్ణిస్తుంది. (వివరాలకు 'ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్' నుండి వెలువడిన "ధన వికేంద్రీకరణ" అనే పుస్తకం చదవండి. పేజీలు: 224)

2. ఓసారి దైవప్రవక్త (సల్లం) దగ్గరికి ఒక వ్యక్తి (అతిథిగా) వచ్చాడు. దైవప్రవక్త (సల్లం) అతనికి భోజనం ఏర్పాటు చేయమని తన భార్యలతో అన్నారు. దానికి వారు "మాదగ్గర మంచినీరు తప్ప మరేమీ లేద"ని చెప్పారు.

అప్పుడు దైవప్రవక్త (సల్లం) అనుచరుల్ని సంబోధిస్తూ "ఇతనికి ఆతిథ్యమిచ్చే వారెవరైనా ఉన్నారా?" అని అడిగారు. ఒక అన్సారీ లేచి "నేనాతిథ్యమిస్తాను" అన్నాడు.

ఆ తరువాత అతనా వ్యక్తిని ఇంటికి పిలుచుకెళ్ళి "ఇతను ప్రవక్తగారి అతిథి. ఇతనికి మనం భోజనం పెట్టాలి" అన్నాడు భార్యతో. దానికామె "పిల్లల కోసమే కాస్తుంది" అన్నది. "ముందు భోజనం తయారుచెయ్యి. పిల్లలు అన్నం అడిగితే ఏదోచెప్పి వాళ్ళను నిద్రపుచ్చు"అన్నాడతను.

కాస్సేపటికి ఆయన భార్య భోజనం తయారుచేసి దీపం వెలిగించింది. పిల్లల్ని (ఏదోచెప్పి) పడుకోబెట్టింది. తర్వాత ఆమె లేచి దీపం (వత్తిని) సరిచేస్తున్నట్లు నటిస్తూ ఆర్పింది. ఆ చీకటిలోనే వారిద్దరు తాము కూడా అన్నం తింటున్నట్లు అతిథికి అన్పించేలా నోళ్ళు కదపసాగారు.

ఇలా వారిద్దరు ఆరాత్రి అతిథికి అన్నంపెట్టి తాము పస్తుండిపోయారు. మర్నాడు ఉదయం ఆ అన్సారీ ప్రవక్త సన్నిధికి వెళ్ళగానే "ఈరోజు మీరు చేసిన పనిని దేవుడు చూసి సంతసించాడు. సంతసించి ఈసూక్తి అవతరింపజేశాడు"అంటూ ఆయన ఈసూక్తినే పఠించారు. (బుఖారి, ముస్లిం)

మీతోపాటు మేము కూడా బయలుదేరుతాం. మీ విషయంలో మేము ఎవరిమాటా వినము. ఒకవేళ యుద్ధం జరిగితే మేము తప్పకుండా మీకు సహాయం చేస్తాం" అని అంటారు. కాని వీరసలు పచ్చి అబద్ధాలకోరులు. అందుకు దేవుడే సాక్షి. (11)

ఒకవేళ గ్రంథప్రజలు బహిష్కరించబడితే వీరు మాత్రం వారివెంట బయలుదేరరు. అలాగే వారితో యుద్ధం జరిగితే వారికి ఈ కపటులు ఏమాత్రం సహాయం చేయరు. ఒకవేళ సహాయం చేయడానికి యుద్ధరంగంలో దిగినా, (మరుక్షణమే) వీరు వెన్నుజూపి పారిపోతారు. ఇక వారికి ఎటునుంచి కూడా ఎలాంటి సహాయం లభించదు. (12)

వారి హృదయాల్లో దైవభయం కన్నా మీ భయమే ఎక్కువగా తిష్ఠవేసి ఉంది. దానిక్కారణం వారిలో విజ్ఞతావివేచనలు నశించిపోవడమే. వారు సంఘటితమై మిమ్మల్ని ఎన్నడూ (బహిరంగంగా) ఎదుర్కోలేరు. ఒకవేళ ఎప్పుడైనా ఎదుర్కోడానికి సిద్ధపడినా వారు కోటద్వారాలు మూయబడిన జనపదాలలో కూర్చొని, లేదా గోడలవెనుక దాక్కొని పోరాడుతారు. వారు పరస్పరం తీవ్రంగా కలహించుకుంటారు. వారు సంఘటితంగా ఉన్నట్లు మీకు కన్పించవచ్చు. కాని వారి హృదయాలు పరస్పరం ద్వేషంతో నిండి ఉన్నాయి. ఈ పరిస్థితికి కారణం వారిలో బుద్ధీ వివేచనలు లోపించడమే. (13,14)

వీరికి కొన్నాళ్ళక్రితం ఒక వర్గంవారు తమ దుశ్చర్యల పర్యవసానం చవిచూశారు. వీరు కూడా అలాంటి కోవకు చెందినవారే. వీరి కోసం కఠిన యాతన సిద్ధంగా ఉంది. వీరిని షైతాన్‌తో కూడా పోల్చవచ్చు.

షైతాన్ మానవునితో సత్యాన్ని తిరస్కరించమని అంటాడు. మానవుడు సత్యాన్ని తిరస్కరించిన తర్వాత షైతాన్ వచ్చి "ఇక నీతో నాకేం పనిలేదు; నేను సర్వలోక ప్రభువైన దేవుడంటే భయపడుతున్నాను" అంటాడు. తత్పర్యవసానంగా చివరికి వారిద్దరూ నరకానికి పోతారు. అక్కడే శాశ్వతంగా పడిఉంటారు. దుర్మార్గులకు దక్కే ప్రతిఫలం ఇదే. (15-17)

విశ్వాసులారా! దేవునికి భయపడండి. ప్రతిమనిషీ రేపటి కోసం తాను ఏం సంపాదించి సిద్ధపరచుకున్నాడో యోచించాలి. దేవుని పట్ల భయభక్తులు కలిగిఉండండి. మీరు చేస్తున్న పనులన్నీ దేవునికి తెలుసు. మీరు దేవుడ్ని మరచిపోయినవారి మాదిరిగా మారకండి. వారు దేవుడ్ని మరచిపోయినప్పుడు, దేవుడు వారిని తమనుతామే మరచి పోయినట్లు చేశాడు. అలాంటివారే దుర్జనులు. నరకానికి పోయేవారు, స్వర్గానికి పోయే వారు ఎన్నటికీ ఒకటి కాజాలరు. స్వర్గానికి పోయేవారే సార్థక జీవులు. (18-20)

మేమీ ఖుర్‌ఆన్‌ని ఏదైనా పర్వతం మీద దించితే, దాని పరిస్థితి ఏమవుతుందో నీవు చూస్తావు. అది దైవభీతితో కంపించి క్రుంగిపోతూ పగిలిపోతుంది. మానవులు (ఆలోచిస్తారని వారి ముందు మేమీ దృష్టాంతాలను పేర్కొంటున్నాం. (21)

తానుతప్ప మరో ఆరాధ్యుడు లేనివాడే అల్లాహ్. ఆయన గోచర అగోచర విషయాలన్నీ ఎరిగినవాడు, అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు. తాను తప్ప మరో



ఆరాధ్యుడు లేనివాడే అల్లాహ్. ఆయన రాజాధిరాజు.[3] పరమ పవిత్రుడు, శాంతి మయుడు, శరణునిచ్చేవాడు, సంరక్షకుడు, పర్యవేక్షకుడు, సర్వాధికుడు, సర్వోన్నతుడు, చండశాసనుడు. ప్రజలు చేస్తున్న బహుదైవారాధనకు అల్లాహ్ ఎంతో అతీతుడు, పరిశుద్ధుడు. (22,23)

సృష్టిప్రణాళికను రూపొందించి దాన్ని అమలుపరిచేవాడు ఆ దేవుడే. ఆయనకు అత్యంత శ్రేష్ఠమైన పేర్లున్నాయి. భూమ్యాకాశాల్లోని అణువణువూ ఆయన ఔన్నత్యాన్నే కీర్తిస్తోంది. ఆయన మహా శక్తిసంపన్నుడు, అత్యంత వివేకవంతుడు. (24) ✪

# 60. పరీక్షిత మహిళ (ముమ్తహిన)

**అవతరణ: మదీనా** **సూక్తులు: 13**

ఈ అధ్యాయాన్ని "ముమ్తహిన" (పరీక్షిత మహిళ) అంటారు. ఇది హి.శ. 7,8 సంవత్సరాల మధ్యకాలంలో అవతరించి ఉండవచ్చు. ఇందులో ఒక ముస్లిం ముస్లింల రహస్య సైనిక సమాచారం శత్రువులకు అందజేయడానికి ప్రయత్నించడం, హుదైబియా శాంతిఒప్పందం తర్వాత మక్కానుండి మదీనాకు పారిపోయివచ్చే ముస్లిం స్త్రీలు మక్కాకు పంపివేసే విషయం, ఇస్లాం స్వీకరించాక స్త్రీలు దైవప్రవక్త (సల్లం) దగ్గర ప్రమాణం చేయడానికి వచ్చినప్పుడు ఏ విషయాలను గురించి ప్రమాణం చేయించాలన్న సంగతి మొదలైనవి ప్రస్తావించబడ్డాయి.

### కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

విశ్వాసులారా! మీరు గనక నామార్గంలో పోరాడేందుకు, నాప్రసన్నత కోసం (స్వస్థలం వదలి) బయలుదేరితే నాకూ, మీకూ (ఉమ్మడి) శత్రువులయినవారితో స్నేహం చేయకండి. మీ దగ్గరకొచ్చిన సత్యాన్ని తిరస్కరించినవారికి మీరెలా స్నేహహస్తం

---

3. ఇక్కడ మూలభాషలో మలిక్ అనే పదం వాడబడింది. మలిక్ అంటే రాజు. అందులో నుంచే ముల్క్ అనే పదం వచ్చింది. ముల్క్ అంటే రాజ్యం. రాజ్యమంటే ఇక్కడ ఏదో ఒక దేశానికో, ప్రాంతానికో పరిమితం కాదు, యావత్తు విశ్వసామ్రాజ్యం.

- ♦ భూమ్యాకాశాల్లోని సమస్తం దేవునికి చెందినదే. సకల సృష్టిరాసులు ఆయన ఆజ్ఞలకు కట్టుబడి ఉన్నాయి. (30:26)
- ♦ దివి నుండి భువి దాకా యావత్తు పాలనా ఏర్పాట్లు ఆయనే నిర్వహిస్తున్నాడు. (32:5)
- ♦ భూమ్యాకాశాల సామ్రాజ్యమంతా ఆయనదే. సమస్త వ్యవహారాలు ఆయన వైపునకే మరలించబడతాయి. (57:5)
- ♦ పరిపాలన, రాచరిక వ్యవహారాల్లో ఆయనకు భాగస్వాములెవరూ లేరు. (25:2)
- ♦ ప్రతి విషయంలోనూ పాలనాహక్కు, రాజ్యాధికారం ఆయన చేతిలోనే ఉంది. (36:83)
- ♦ ఆయన తలచుకున్న ప్రతి పనీ చేసితీరుతాడు. (85:16)
- ♦ ఆయన ఏ పని చేసినా దానికి ఆయన ఎవరి ముందూ సమాధానం ఇచ్చుకోనవసరం లేదు. ఇతరులే ఆయన ముందు సమాధానం ఇచ్చుకోవలసి ఉంటుంది. (21:23)

అందిస్తారు? మీరు కేవలం మీ ప్రభువైన దేవుడ్ని విశ్వాసించారన్న కారణంగా వారు మిమ్మల్ని, దైవప్రవక్తను దేశం నుండి వెళ్ళగొట్టారే! అలాంటివారికి మీరు రహస్యంగా స్నేహసందేశం పంపుతారా?[1] మీరు రహస్యంగాగాని, బహిరంగంగాగాని చేసే ప్రతిపనీ నాకు బాగా తెలుసు. మీలో ఎవరైనా సరే ఇలాంటి చేష్టలకు పాల్పడితే అతను నిస్సందేహంగా సన్మార్గం తప్పినట్లే. (1)

వారు మీ మీద ఆధిక్యత వహిస్తే, మీ పట్ల శత్రువైఖరి అవలంబించి మిమ్మల్ని తప్పకుండా మాటలతో, చేతలతో (రకరకాలుగా) వేధిస్తారు. మీరు ఎలాగైనా మళ్ళీ అవిశ్వాసులైపోవాలని వారు కోరుకుంటున్నారు. మీ సంతానం, బంధుత్వాలు ప్రళయదినాన ఏమాత్రం పనికిరావు. ఆరోజు దేవుడు మీ మధ్య (ఈనాడున్న) సంబంధ బాంధవ్యాలన్నీ త్రెంచివేస్తాడు. ఆయన మీరు చేస్తున్న పనులన్నీ గమనిస్తూనే ఉన్నాడు. (2,3)

మీకు ఇబ్రాహీం, అతని అనుచరుల గాథలో మంచి ఆదర్శం ఉంది. వారు తమ జాతి ప్రజలకు (ఎంతగానో నచ్చజెప్పి చివరికి) ఇలా అన్నారు: "మేము మీతో, దేవుడ్ని వదలి మీరు పూజిస్తున్న మిథ్యాదైవాలతో విసిగెత్తిపోయాము. మిమ్మల్ని (మీ మత

1. ఖురైష్ బహుదైవారాధకులు బనూబక్ర్ తెగవారితో సహకరిస్తూ మక్కాలో ముస్లింల మిత్రపక్షమైన ఖుజాఅ తెగపై దాడిచేసి ఘోర రక్తపాతం జరిపారు. ఈ విధంగా వారు హుదైబియా ఒప్పందం ఉల్లంఘించడంతో దైవప్రవక్త (సల్లం) మక్కాపై దాడిచేయడానికి నిర్ణయించుకున్నారు. ఈసంగతి కొందరు ముఖ్యఅనుచరులకు తప్ప మరెవరికీ తెలియకుండా రహస్యంగా ఉంచారు.

అయితే హజ్రత్ హాతిబ్ బిన్ అబీబల్తా (రజి) మక్కా ఖురైషీయులకు ఒక మేలు చేసి వారి దౌర్జన్యం నుండి మక్కాలోని తనబంధువుల్ని కాపాడుకోవచ్చన్న ఉద్దేశ్యంతో ఈ రహస్యసమాచారాన్ని ఒక లేఖలో రాసి మక్కా వెళ్తున్న ఓ స్త్రీకి అందజేశారు. ఆమె ఆ లేఖ తీసుకొని బయలుదేరగానే దేవుడు ఈ విషయాన్ని దివ్యావిష్కృతి ద్వారా తన ప్రవక్తకు తెలియజేశాడు.

దైవప్రవక్త (సల్లం) వెంటనే, ఆమెను వెంబడించి ఉత్తరం తీసుకురావడానికి కొందరు అనుచరుల్ని మక్కా దిశగా పంపారు. వారు వెళ్ళి ఆమెను కలుసుకొని ఉత్తరం సంగతి అడిగారు. ఆమె తనదగ్గర ఎలాంటి ఉత్తరం లేదని బుకాయించడానికి ప్రయత్నించింది. అప్పుడు ప్రవక్తఅనుచరులు ఆమెను తీవ్రంగా మందలిస్తూ "మర్యాదగా ఆ ఉత్తరం మాకప్పగించు, లేదంటావా నీబట్టలు ఊడదీసయినా సరే మేమా ఉత్తరం బయటికి తీయవలసి వస్తుంది" అన్నారు. దాంతో ఆ స్త్రీ భయపడి, తన కొప్పులో దాచిన ఉత్తరం బయటికి తీసి వారికప్పగించింది.

ఈ ఉత్తరం అందిన తర్వాత దైవప్రవక్త (స) హజ్రత్ హాతిబ్ (రజి)ని పిలిపించి "ఏమిటీ నిర్వాకం?" అనడిగారు. ఆయన పొరపాటు అంగీకరించి ఆలేఖ రాయడంలో తన ఉద్దేశ్యం తెలియజేస్తూ తాను మతభ్రష్టుణ్ణయి ఇలా చేయలేదని, తన విషయంలో తొందరపడవద్దని ప్రాధేయపడ్డారు. ఈమాటలు విని దైవప్రవక్త (స) ఆయన విశ్వాసం, నిజాయితీలను శంకించకుండా వదలిపెట్టారు. కాని హజ్రత్ ఉమర్ (రజి) ఆవేశంతో "అనుమతించండి, ఒక్కవ్రేటుతో ఈ గోముఖ వ్యాఘ్రం తల నరికేస్తా" నని అన్నారు. దైవప్రవక్త (స) ఆయన్ని వారిస్తూ "ఇతను బద్ర్‌యుద్ధంలో పాల్గొన్నాడు. నీకేం తెలుసు, దేవుడు బద్ర్ యుద్ధంలో పాల్గొన్న విశ్వాసుల్ని (పరలోకంలో) కలిసి, 'మీరేమి చేసివున్నా సరే, నేను మీ తప్పులు క్షమించాను' అని చెప్పవచ్చు" అన్నారు. హజ్రత్ ఉమర్ (రజి) ఈమాట విని "వాస్తవం దేవునికి, ఆయన ప్రవక్తకే బాగా తెలుసు" అన్నారు.



విధానాన్ని) తిరస్కరిస్తున్నాం. మీరు ఏకేశ్వరుడైన దేవుడ్ని విశ్వసించనంత వరకు మీకూ, మాకూ మధ్య ఇక ఎలాంటి సంబంధం లేదు. మన ఉభయవర్గాల మధ్య శాశ్వతంగా విరోధం ఏర్పడింది."

అయితే ఇబ్రాహీం తన తండ్రితో "మీకోసం దేవుని దగ్గర ఏదైనా సాధించి పెట్టాలంటే నాచేతిలో ఏమీలేదు. అయినా నేను మీ పాపమన్నింపుకు దేవుడ్ని తప్పకుండా ప్రార్థిస్తాను" అన్నాడు. (తర్వాత ఇబ్రాహీం, అతని సహచరులు ఇలా ప్రార్థించారు:) "ప్రభూ! మేము నిన్నే నమ్ముకున్నాం. నీ (ధర్మం) వైపుకే మరలాము. చివరికి మేము నీ సన్నిధికే రావలసి ఉంది. ప్రభూ! మమ్మల్ని అవిశ్వాసుల కోసం పరీక్షగా చేయకు.[2] ప్రభూ! మా తప్పులు మన్నించు. నిస్సందేహంగా నీవే అపార శక్తి సంపన్నుడవు, అసామాన్య వివేకవంతుడవు." (4,5)

వారి జీవన సరళిలో మీకు మంచి ఆదర్శం ఉంది. దేవుని సాన్నిధ్యాన్ని, అంతిమ దినం (ఆయన ప్రసాదించే స్వర్గసౌఖ్యాల)ను ఆశించే ప్రతి మనిషికీ అందులో మంచి ఆదర్శం ఉంది. దీనికి ఎవరైనా విముఖులయితే దేవుడు కూడా వారిని ఖాతరు చేయడు. ఆయన నిరపేక్షాపరుడు, స్వతహాగా ప్రశంసనీయుడు. (6)

ఎప్పుడో ఓరోజు దేవుడు మీకూ, మీరీనాడు విరోధం తెచ్చుకున్న వారికీ మధ్య ప్రేమాభిమానాలు జనింపజేయవచ్చు. దేవుడు (ఎలాంటి కార్యాన్నయినా సాధించగల) సర్వశక్తిమంతుడు. (అంతేగాక) ఆయన గొప్పక్షమాశీలి, అపార దయానిధి కూడా. (7)

ధర్మానికి సంబంధించిన వ్యవహారంలో మీతో యుద్ధం చేయని, మిమ్మల్ని మీ ఇండ్ల నుండి గెంటివేయనివారి పట్ల మీరు సత్ప్రవర్తనతో, న్యాయవైఖరితో మసలుకోవచ్చు. ఇలా చేయకుండా దేవుడు మిమ్మల్ని వారించడు. పైగా న్యాయంగా, వ్యవహరించేవారిని ఆయన ఎంతగానో ప్రేమిస్తాడు. ధర్మం విషయంలో మీపై యుద్ధం చేసిన వారితో, మిమ్మల్ని మీఇండ్ల నుండి గెంటి వేసినవారితో మాత్రమే మీరు స్నేహం చేయడాన్ని దేవుడు వారిస్తున్నాడు. వారసలు మిమ్మల్ని వెళ్ళగొట్టడంలో పరస్పరం సహకరించుకున్నారు. కనుక అలాంటి వారికి స్నేహహస్తం అందించేవారే దుర్మార్గులుగా పరిగణించబడతారు. (8,9)

విశ్వాసులారా! విశ్వసించిన స్త్రీలు, హిజ్రత్ (వలస) చేసి మీ దగ్గరకు (మదీనా) వచ్చినప్పుడు (వారి విశ్వసనీయతను) మీరు ఓసారి పరీక్షించుకోండి. నిజానికి వారి విశ్వాసస్థితి దేవునికే బాగా తెలుసు. వారు నిజమైన విశ్వాసులే అని మీరు నిర్ధారించుకుంటే ఇక వారిని అవిశ్వాసుల దగ్గరికి తిప్పి పంపకండి.[3] వారు అవిశ్వాసులకు

2. అంటే, దేవా! మమ్మల్ని ఈ అవిశ్వాసుల దౌర్జన్యానికి గురిచేసి వారికి పరీక్ష పెట్టకు; అవిశ్వాసులు మమ్మల్ని చూసి హేళనచేస్తూ ఆనందించే పరిస్థితి కల్పించకు అని అర్థం.

3. హుదైబియా ఒప్పందంలో ఒక షరతు ఈవిధంగా ఉంది: "మక్కా నుండి ఎవరైనా పారిపోయి మదీనా వెళ్ళిపోతే అతడ్ని మక్కాకు తిరిగి పంపివేయాలి. కాని మదీనా నుండి ఎవరైనా మక్కాకు వస్తే అతడ్ని మదీనాకు తిరిగి పంపడం జరగదు."

(భార్యలుగా) ధర్మసమ్మతం కాలేరు. అవిశ్వాసులు కూడా వారికి (భర్తలుగా) ధర్మ సమ్మతం కాలేరు. ఆ స్త్రీలకు ఇవ్వబడిన మహర్ ధనాన్ని వారి (భర్తల)కి తిరిగి ఇచ్చి వేయండి. అప్పుడు మీరు ఆ స్త్రీలకు మహర్ ధనం చెల్లించి వారిని వివాహమాడవచ్చు. అందులో ఎలాంటి తప్పులేదు.

స్వయంగా మీరు కూడా అవిశ్వాసులయిన స్త్రీలను మీ వైవాహిక బంధంలో అట్టే ఆపి ఉంచకండి. అవిశ్వాసులైన మీ భార్యలకు మీరిచ్చిన మహర్ ధనాన్ని అడిగి తీసుకోండి. అలాగే అవిశ్వాసులు కూడా తమ ముస్లింభార్యలకు లోగడ ఇచ్చిన మహర్ ధనాన్ని వారి నుండి అడిగి తీసుకోవచ్చు. ఇది దైవాజ్ఞ. దేవుడు మీమధ్య (ఈవిధంగా) తీర్పు చేస్తున్నాడు. ఆయన సర్వం తెలిసినవాడు. ఎంతో వివేకవంతుడు. (10)

ఒకవేళ మీరు (అవిశ్వాసులైన) మీ భార్యలకు ఇచ్చిన మహర్ ధనం అవిశ్వాసుల నుండి మీకు తిరిగి లభించని పక్షంలో, మీవంతు వచ్చినప్పుడు, అవిశ్వాసులకు మీరు చెల్లించవలసిన ధనాన్ని (వారికి అందజేయకుండా) ఇటు మహర్ నష్టపోయినవారికి ఇచ్చివేయండి. మీరు విశ్వసించిన దేవునికి భయపడుతూ మసలుకోండి. (11)

ప్రవక్తా! (సత్యాన్ని) విశ్వసించిన స్త్రీలు నీ దగ్గరకు వచ్చి, దేవునికి (ఎవరినీ) సాటి కల్పించమని, దొంగతనం చేయమని, వ్యభిచరించమని, శిశుహత్యకు పాల్పడమని, అక్రమ సంబంధాల గురించిన అపనిందలు సృష్టించి వ్యాపింపజేయమని, మంచి విషయాల్లో నీకు అవిధేయత చూపమని ప్రమాణం చేస్తే, వారి చేత ప్రమాణం చేయించు. ఆ తరువాత వారి పాపమన్నింపు కోసం దేవుణ్ని ప్రార్థించు. నిస్సందేహంగా దేవుడు గొప్ప క్షమాశీలి, అపార దయామయుడు. (12)

విశ్వాసులారా! దైవాగ్రహానికి గురైన వారితో స్నేహం చేయకండి. చచ్చి సమాధుల్లో పడివున్న అవిశ్వాసులు ఎలా నిరాశచెందారో అలాగే వీరు కూడా పరలోకం(లోని సౌఖ్యాల) పట్ల పూర్తిగా నిరాశచెందారు. (13) ✪

---

ఈ షరతు ప్రకారం దైవప్రవక్త (సల్లం) మక్కానుండి పారిపోయి వచ్చిన ముస్లిం పురుషుల్ని తిరిగి మక్కాకు తిప్పి పంపుతుండేవారు. ఇలా చాలామంది ముస్లిం పురుషుల్ని తిప్పి పంపడం జరిగింది. ఆ తర్వాత ముస్లిం స్త్రీలు మక్కా నుండి రావడం ప్రారంభించారు. మొట్టమొదట హజ్రత్ ఉమ్మెకుల్సూమ్ (రజి) మక్కా నుండి పారిపోయి మదీనా వచ్చారు. ఈ సంగతి తెలుసుకున్న ఆమె బంధువులు మదీనా వచ్చి ఒప్పందం ప్రకారం ఆమెను తమకు అప్పగించమని అడిగారు.

కాని దైవప్రవక్త (సల్లం) ఆమెను వారికి అప్పగించడానికి నిరాకరిస్తూ "ఒప్పందంలోని షరతు పురుషుల విషయంలో ఉందిగాని, స్త్రీల విషయంలో లేద"ని అన్నారు. అప్పుడు మక్కా నేతలు సంధి షరుతుల్లోని పదజాలం గమనించి జరిగిన పొరపాటుకు తల బాదుకున్నారు.

మక్కా నుండి మదీనాకు వలసవచ్చే మహిళల విషయంలో విశ్వప్రభువు ఈ సూక్తిలో మరొక షరతు విధించాడు. అలా వచ్చిన మహిళలు ఇస్లాం ధర్మాన్ని విశ్వసించినవారా కాదా అనే విషయాన్ని పరీక్షించాలని, వారు విశ్వసించిన వారయితే వారిని అవిశ్వాసుల దగ్గరకు తిప్పి పంప కూడదని ఆయన ముస్లింలను ఆదేశించాడు.



అవతరణ: మదీనా

# 61. సైనికపంక్తి (సఫ్)

సూక్తులు:14

ఈ అధ్యాయాన్ని "సఫ్" అంటారు. ఇది హిజ్రీశకం 3వ యేట అవతరించి ఉండవచ్చని తెలుస్తోంది. ఇందులో విశ్వాసం రీత్యా విభిన్న తరగతులకు చెందిన ముస్లింలను సంబోధిస్తూ కొన్ని సూచనలు, హెచ్చరికలు చేయబడ్డాయి. దీనికోసం మూసా (అలైహి) అనుయాయుల ప్రవర్తన ఉదాహరణగా పేర్కొనబడింది. తర్వాత యూదులతో కుమ్మక్కయి కుతంత్రాలకు పాల్పడుతున్న కపటవిశ్వాసుల వైఖరిని ఎండగట్టడం జరిగింది. ఆ తర్వాత నిజమైన విశ్వాసుల గుణగణాలు, ఈసా ప్రవక్త (అలైహి) అనుచరుల వినయ, విధేయతలు ప్రస్తావించబడ్డాయి.

### కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

భూమ్యాకాశాల్లో ఉన్న అణువణువూ దేవుని ఔన్నత్యం చాటుతూ, ఆయన పవిత్రతను ప్రశంసిస్తోంది. ఆయన అపార శక్తిమంతుడు, అసామాన్య వివేకవంతుడు. (1)

విశ్వాసులారా! మీరు చేయనిదాన్ని గురించి ఎందుకు మాట్లాడుతున్నారు? చేయనిదాన్ని గురించి చెప్పుకోవడం దేవునికి చాలా అప్రియమైన విషయం.[1] దేవుడు తన మార్గంలో పంక్తులు తీరి దృఢమైన కాంక్రీటుగోడలా స్థిరంగా నిలచి పోరాడేవారినే ప్రేమిస్తాడు. (2-4)

మూసా (ప్రవక్త) తన జాతిప్రజల్ని ఉద్దేశించి అన్న మాటలు ఓసారి గుర్తుచేసుకో. అతను వారితో "నా జాతిప్రజలారా! నేను మీకోసం దేవుడు పంపిన ప్రవక్తనని తెలిసి కూడా మీరు నన్ను వేధిస్తారెందుకు?" అన్నాడు. ఆ తరువాత వారు వక్రమార్గంలో నడవగానే దేవుడు వారి హృదయాలను వక్రీకరించాడు. దేవుడు దుర్జనులకు ఎన్నటికీ సన్మార్గం చూపడు.

మర్యం కుమారుడు ఈసా గాథ కూడా. అతను తన జాతిప్రజలతో "ఇస్రాయీల్ సంతతిప్రజలారా! నేను మీకోసం దేవుడు పంపిన ప్రవక్తను. నాకు పూర్వం అవతరించిన తౌరాత్ గ్రంథాన్ని ధృవపరచేవాణ్ని. నా తరువాత మరొక ప్రవక్త రానున్నాడని (మీకు)

---

1. చెప్పేదొకటి, చేసేదొకటిగా ఉండకూడదని ఈ సూక్తి తెలియజేస్తోంది. ద్వంద్వ ప్రమాణాలను దేవుడు ఎన్నటికీ హర్షించడు. హృదయంలో ఎలాంటి దురుద్దేశ్యం లేకపోయినా ఆచరణలో కపట (మునాఫిఖ్) వైఖరి వ్యక్తపరచకూడదు.

దైవప్రవక్త (సల్లం) ఓసారి ఇలా ప్రవచించారు: "నాలుగు (అవాంఛనీయ) లక్షణాలు ఉన్నాయి. ఈ నాలుగు లక్షణాలు కలిగిఉన్నవాడు పరిపూర్ణ కపటి (మునాఫిఖ్)గా పరిగణించబడతాడు. వాటిలో ఒక లక్షణం కలిగి ఉన్నవాడు దాన్ని మానుకోనంతవరకు అతను ఒక కాపట్య లక్షణం కలిగి ఉన్నట్లే. ఆ నాలుగు ఇవి:- (1) నమ్మి ఏదైనా వ్యవహారం అప్పగిస్తే అందులో నమ్మక ద్రోహానికి పాల్పడటం; (2) మాట్లాడితే అబద్ధాలు పలకడం; (3) వాగ్దానం (గాని, ప్రమాణంగాని) చేసి, దాన్ని నిలబెట్టుకోక పోవడం; (4) తగాదా వచ్చినప్పుడు నీతి నియమాలను గాలికి వదలి ఇష్టమొచ్చినట్లు వ్యవహరించడం." (బుఖారి, ముస్లిం)

శుభవార్త అందజేస్తున్నాను. అతని పేరు 'అహ్మద్'' [2] అన్నాడు. కాని అతను స్పష్టమైన నిదర్శనాలతో వచ్చినప్పుడు వారు "ఇది మంత్రజాలం మాత్రమే" అన్నారు. (5,6)

---

2. ఇక్కడ హజ్రత్ ఈసా (అలైహి) తన తరువాత రాబోయే ప్రవక్త పేరు "అహ్మద్" అని స్పష్టంగా తెలియజేశారు. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం)కు "అహ్మద్" అనే మరో పేరు కూడా ఉందన్న సంగతి జగద్విదితం. ఈ కారణంగానే గత 1400 సంవత్సరాల నుంచి ముస్లింలు ముహమ్మద్ అహ్మద్, గులాం అహ్మద్, రియాజ్ అహ్మద్ లాంటి పేర్లు పెట్టుకుంటున్నారు. హజ్రత్ ఈసా (అలైహి) తన తరువాత 'అహ్మద్' అనే దైవప్రవక్త రానున్నాడని పేరు పెట్టి ప్రకటించారంటే ఆయనపై అవతరించిన ఇన్జీల్‌లో ఈపేరు తప్పకుండా ఉండివుంటుందని వేరే చెప్పనవసరం లేదు. అందువల్ల ఇన్జీల్ గ్రంథం పూర్వం ఏ భాషలో ఉండేది, ఆ మూల గ్రంథానికి అనువాదాలకు అనువాదాలు జరుగుతూ, అందులోని 'అహ్మద్' అనే పేరు ఎలా మార్పు చెందుతూ వచ్చిందీ మొదలైన విషయాలను గురించి తెలుసుకుందాం.

ఈసా (మసీహ్) అలైహిస్సలాం కాలంలో పాలస్తీనా ప్రజలు సాధారణంగా సిరియక్ భాషలో మాట్లాడేవారు. ఆయన జన్మించడానికి దాదాపు రెండొందల యేండ్లకు పూర్వమే హెబ్రూ భాష అంతరించి ఆ స్థానంలో సిరియక్‌భాష ఉనికిలోకి వచ్చింది. ఆ కాలంలో రోమన్‌రాజ్యాల ప్రభావంతో పాలస్తీనాలో గ్రీకుభాష కూడా ప్రవేశించినప్పటికీ అది పాలకవర్గానికి, పరిపాలనా వ్యవహారాలకు మాత్రమే పరిమితమై ఉండేది. పాలస్తీనా జనసామాన్యం 'సిరియక్' భాషలోనే మాట్లాడేవారు. అందువల్ల ఇన్జీల్ కూడా 'సిరియక్' భాషలోనే అవతరించి ఉంటుంది.

బైబిల్‌లోని నాలుగు సువార్తలను మొట్టమొదట రాసినవారు హజ్రత్ ఈసా (అలైహి) నిష్క్రమణ తరువాత క్రైస్తవ మతంలో చేరి క్రీ.శ. 70 నుంచి 120 సంవత్సరాల మధ్యకాలంలో సిరియక్ భాష మాట్లాడే క్రైస్తవుల నోట విని గ్రీకు భాషలో రాశారు. అయితే వీటి అసలు ప్రతులు ఈనాడు ఎక్కడా లేవు. బైబిల్ ప్రచురణ కోసం ప్రయత్నాలు ప్రారంభమైనప్పుడు ప్రచురణ కర్తలకు నాల్గవ శతాబ్దానికి పూర్వం రాయబడిన గ్రీకు వ్రాతప్రతులు లభించలేదు. ఆ తరువాత కాలంలో రాయబడిన వ్రాతప్రతులు మాత్రమే లభించాయి.

కనుక మొట్టమొదట గ్రీకు భాషలో రాయబడిన బైబిల్ ఈ మూడు శతాబ్దాల కాలంలో ఎన్నెన్ని మార్పులకు గురి అయ్యిందో చెప్పలేము. క్రైస్తవ పండితులు బైబిల్‌లో తమ ఇష్టానుసారం మార్పులు, చేర్పులు చేయడంలో ఎలాంటి తప్పులేదని భావిస్తారు. "ఎన్‌సైక్లోపీడియా 1946" లోని బైబిల్ అధ్యాయంలో దాని రచయిత ఇలా రాశాడు:

"సువార్తలలో ఉద్దేశ్యపూర్వకంగా మార్పులు, చేర్పులు జరిగాయి. ఉదాహరణకు, కొన్ని చోట్ల వాక్యాలకు వాక్యాలే పూర్తిగా మార్చి వేరే మూలాల (Sources) నుండి తెచ్చి గ్రంథంలో చేర్చబడ్డాయి... అసలు గ్రంథంలో చేర్చడానికి కొందరికి ఎక్కడ్నుంచో కొన్ని విషయాలు దొరికాయి. అలాంటివారు ఒక లక్ష్యంతో ఈ మార్పులు, చేర్పులు బహిరంగంగానే చేశారు. (బైబిల్) గ్రంథాన్ని వీలైనంత ఎక్కువ ప్రయోజనకరమైనదిగా చేయడానికి, అందులో తమ తరఫున ఆ విషయాలను చేర్చే అధికారం తమకుందని వారు భావించేవారు... ఇలా అనేక మార్పులు, చేర్పులు రెండవ శతాబ్దంలోనే జరిగాయి. అయితే వాటికి ఆధారాలేమిటో తెలియదు."

దీన్నిబట్టి హజ్రత్ ఈసా (అలైహి) ప్రవచించిన సూక్తులు ఎలాంటి మార్పులు, చేర్పులకు గురికాకుండా యథాతథంగా ప్రస్తుత బైబిల్ దాకా చేరాయని గట్టిగా చెప్పలేము.

ఇప్పుడు బైబిల్ రాబోయే ప్రవక్తను గురించి ఏమంటున్నదో చూద్దాం. అంతిమ దైవప్రవక్త



ముహమ్మద్ (సల్లం) రాకను గురించి అనేకమంది ప్రవక్తలు భవిష్యత్‌ప్రకటనలు చేశారు. అంతిమ దైవప్రవక్త (సల్లం) యూదులలో "ఆ ప్రవక్త" (The Prophet)గా ఖ్యాతి చెందిన సంగతి యూద పండితులందరికీ తెలుసు. ఆ మహనీయుడ్ని గురించి యోహాను సువార్తలో ఇలా ఉంది:

"నీ వెవడవని అడుగుటకు యూదులు యెరూషలేము నుండి యాజకులను లేవీయులను యోహాను వద్దకు పంపినప్పుడు అతడిచ్చిన సాక్ష్యమిదే. అతడు ఎరుగు గనక ఒప్పుకొనెను. క్రీస్తు (అభిషిక్తుడ)ను కానని ఒప్పుకొనెను. కాగా వారు - మరి నీవెవరవు, నీవు ఏలీయావా అని అడుగగా అతడు - కాననెను. - నీవు ఆ ప్రవక్తవా అని అడుగగా - కానని ఉత్తరమిచ్చెను. కాబట్టి వారు - నీవెవరవు? మమ్ము పంపినవారికి మేము ఉత్తరమియ్య వలెను గనక నిన్ను గూర్చి నీవేమి చెప్పుకొనుచున్నావని అతని నడిగిరి. అందుకతడు - ప్రవక్తయైన యెషయా చెప్పినట్లు నేను ప్రభువు త్రోవ సరళము చేయుడి అని అరణ్యములో ఎలుగెత్తి చెప్పు ఒకని శబ్దము అని చెప్పెను. పంపబడినవారు పరిసెయ్యలకు చెందినవారు. వారు - క్రీస్తువైనను, ఏలీయావైనను, ఆ ప్రవక్తవైనను కానియెడల ఎందుకు బాప్తిస్మమిచ్చుచున్నావని అతనిని అడుగగా యోహాను - నేను నీళ్ళతో బాప్తిస్మమిచ్చుచున్నాను గాని నా వెనుక వచ్చుచున్నవాడు మీ మధ్య ఉన్నాడు; మీరాయన నెరుగరు, ఆయన చెప్పుల వారును విప్పుటకైనను నేను యోగ్యుడను కానని వారితో చెప్పెను." (1:19-27)

ఏసుక్రీస్తు చెప్పిన మాటలు కూడా వినండి:

"నేను తండ్రిని వేడుకొందును. మీ యొద్ద ఎల్లప్పుడూ నుండుటకై ఆయన వేరొక ఆదరణకర్తను, అనగా సత్యస్వరూపియగు ఆత్మను మీకనుగ్రహించును. లోకము ఆయనను చూడదు. ఆయనను ఎరుగదు గనక ఆయనను పొందనేరదు; మీరు ఆయనను ఎరుగుదురు. ఆయన మీతో కూడా నివసించును, మీలో ఉండును." (14:16,17)

"నేను మీ యొద్ద ఉండగానే ఈ మాటలు మీతో చెప్పితిని. ఆదరణకర్త, అనగా తండ్రి నా నామమున పంపబోవు పరిశుద్ధాత్మ సమస్తమును మీకు బోధించి నేను మీతో చెప్పిన సంగతులన్నిటిని మీకు జ్ఞాపకము చేయును." (14:25,26)

"ఇకను మీతో విస్తరించి మాటలాడును; ఈ లోకాధికారి వచ్చుచున్నాడు. నాతో వానికి సంబంధమేమియు లేదు." (14:30)

"తండ్రి యొద్దనుండి మీయొద్దకు నేను పంపబోవు ఆదరణకర్త, అనగా తండ్రి యొద్ద నుండి బయలుదేరు సత్యస్వరూపియైన ఆత్మ వచ్చినప్పుడు ఆయన నన్నుగూర్చి సాక్ష్యమిచ్చును." (15:26)

"అయితే నేను మీతో సత్యము చెప్పుచున్నాను, నేను వెళ్ళి పోవుటవలన మీకు ప్రయోజనకరము; నేను వెళ్ళని యెడల ఆదరణకర్త మీ యొద్దకు రాడు; నేను వెళ్ళిన యెడల ఆయనను మీ యొద్దకు పంపుదును." (16:7)

ఇలా బైబిల్‌లో రాబోవు ప్రవక్తకు ఆప్రవక్త, ఆదరణకర్త, సత్యస్వరూపియగు ఆత్మ, పరిశుద్ధాత్మ మొదలైన పేర్లు ఇవ్వబడ్డాయి. ముఖ్యంగా "ఆదరణకర్త" అనే పేరు బైబిల్‌లో చాలా సార్లు వచ్చిన ప్రసిద్ధమైన పేరు. ఈ పేరు గ్రీకు భాషలోని యోహాను అసలు సువార్తలో పెరక్లిటస్ (Paracletus) అని రాయబడి ఉందని క్రైస్తవులు బల్లగుద్ది చెబుతారు. అయితే దీని అర్థాన్ని నిర్ణయించడంలో క్రైస్తవ పండితులు పెద్ద చిక్కు ఎదుర్కోవలసి వచ్చింది. దానిక్కారణం Paracletus అనే పదానికి ఒక ప్రదేశం వైపునకు పిలవడం, సహాయం కొరకు అరవడం, హెచ్చరించడం, తిప్పు కోవడం, పురిగొల్పడం, అర్థించడం, వేడుకోవడం, ఓదార్చడం, సంతృప్తినివ్వడం, ధైర్యం చెప్పడం మొదలైన అనేక అర్థాలున్నాయి.

ఒరైజన్ (Origen) అనే అతను ఒకచోట Consolator అని, మరొకచోట Deprector అని అనువదించాడు. అయితే ఇతర భాష్యకారులు ఈ అనువాదాలు గ్రీకుభాష మూలపదంతో పొంతన లేకుండా ఉన్నాయని ఆరోపిస్తూ వాటిని రద్దుచేశారు. మరికొందరు Teacher అని అనువదించారు. ఇది కూడా మూలపదంలోని భావాన్ని స్ఫురింపజేయదు. అలాగే మరికొందరు Advocate అని, Assistant అని, Comforter అని, Consoler అని రకరకాలుగా అనువదించారని ఎన్‌సైక్లోపేడియా ఆఫ్ బైబిల్ లిటరేచర్‌లో పెరిక్లిటస్ అనే పదాన్ని గురించి చెబుతూ తెలియజేయబడింది.

పోతే గ్రీకు భాషలోనే దాదాపు అలాంటి ఉచ్చారణను పోలిన మరో పదం ఉంది. దాన్ని Periclytos (పెరిక్లిటస్) అంటారు. దీనికి "ప్రశంసించబడినవాడు" అని అర్థం. ముహమ్మద్ అనే పదానికి కూడా అరబీ భాషలో ఇదే అర్థం ఉంది. ముహమ్మద్ ప్రవక్త (సల్లం)కు మరోపేరు అహ్మద్ అని కూడా ఉందని మొట్టమొదటి పేరాలో పేర్కొనబడింది. అహ్మద్ అంటే అరబీభాషలో రెండర్థా లున్నాయి. ఒకటి, అందరికంటే ఎక్కువగా దేవుణ్ణి ప్రశంసించేవాడు. రెండు, అందరికంటే ఎక్కువగా ప్రశంసించబడినవాడు. దీన్నిబట్టి మొట్టమొదట గ్రీకు భాషలో రాయబడిన యోహాను సువార్తలో Periclytos (పెరిక్లిటస్) అనే పదమే ప్రయోగించబడి ఉంటుందని తెలుస్తోంది. అయితే క్రైస్తవులు ఈ పదం తమ స్వయంకృత విశ్వాసానికి వ్యతిరేకంగా ఉండటం వల్ల కొన్నాళ్ళకు దాన్ని కాస్తా Paracletus (పెరక్లిటస్)గా మార్చి ఉంటారు. ఇలా పదాలకు పదాలు, వాక్యాలకు వాక్యాలు మార్చడాన్ని వారు తప్పుగా భావించరు. (నాల్గవ పేరా చూడండి.)

బైబిల్‌లో పేర్కొనబడిన నాలుగు సువార్తలేగాక, క్రైస్తవ పండితులు ఉద్దేశ్యపూర్వకంగా మరుగున పడవేసిన మరొక ప్రముఖ సువార్త గ్రంథం కూడా ఉంది. దాని పేరు బర్నబాస్ సువార్త. బైబిల్‌లోని నాలుగు సువార్తల రచయితలు తాము హజ్రత్ ఈసా (అలైహి) పన్నెండుమంది శిష్యుల్లోని వారమనిగాని, లేక ఆయన శిష్యులనుండి సమాచారం సేకరించి తాము సువార్తలు రాశామనిగాని అందులో ఎక్కడా చెప్పుకోలేదు. దీనికి భిన్నంగా బర్నబాస్ తాను మొట్టమొదటి పన్నెండుమంది ఏసుఅనుచరుల్లోని ఒకణ్ణని, మొదటి నుండి చివరిదాకా ఏసుతో పాటు ఉండి, తాను కళ్ళారా చూసిన సంఘటనలను, చెవులారా విన్న మాటలను ఈ గ్రంథంలో పేర్కొంటున్నానని అన్నాడు. బైబిల్‌లో ఒక 'బర్నబా' ప్రస్తావన ఉంది. కాని అతను సువార్తలోని పన్నెండుమంది ఏసు శిష్యుల్లోని వాడు కాదు. ఆ జాబితాలో అతని పేరు లేదు. బర్నబాస్ సువార్తలోని పన్నెండు మంది శిష్యుల జాబితాలో బర్నబాస్ పేరుంది. కాని బైబిల్ సువార్తల్లోని పన్నెండు మంది శిష్యుల జాబితాలో బర్నబాస్ పేరు తొలగించి ఇతరుల పేరు చేర్చబడింది. దీనిక్కారణం బర్నబాస్ సువార్త క్రైస్తవుల స్వయంకృత విశ్వాసాలకు భిన్నంగా ఉండటమే.

అంతేకాదు, బర్నబాస్ సువార్త గ్రంథం మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) జన్మించడానికి 75 సంవత్సరాల పూర్వం అయిదో శతాబ్దంలోనే నమ్మదగని గ్రంథాల జాబితాలోకి చేరిపోయింది. దాని పూర్వపరాలకు సెయింట్ పాల్ శ్రీకారం చుట్టాడు. సెయింట్ పాల్ (పౌలస్) ఈసాప్రవక్త (అలైహి) కాలంలో ఆయనకు బద్ధ శత్రువుగా ఉండి, ఈసా (ఏసు) నిష్క్రమణ తరువాత అనేక సంవత్సరాలకు ఏసు అనుచర సంఘంలో చేరాడు. అప్పుడు యూదేతర ప్రజలను (బహుదైవారాధకులను) ఆకట్టుకోవడానికి అతను ఏసు ప్రవచనాలకు వ్యతిరేకంగా ఓ కొత్తమతాన్ని సృష్టించాడు.

ఈ కొత్త మతాన్ని ఈసా తొలి అనుచరవర్గం తీవ్రంగా నిరసించింది. కాని సెయింట్ పాల్ తెరచిన ఈ సులువైన మార్గం గుండా ఏసు అనుచర సంఘంలోకి వందలాది యూదేతర ప్రజలు రావడం ప్రారంభించడంతో వారి నిరసన అరణ్యరోదనే అయ్యింది. క్రమంగా వీరిసంఖ్య పెరుగుతూ



క్రీ.శ. 325లో సెయింట్ పాల్ (పౌలస్) సొంత తాత్విక సరళికి సిసలైన క్రీస్తుమతంగా గుర్తింపు లభించింది. ఆ తరువాత ఇది రోమ్‌సామ్రాజ్యం అధికార మతంగా మారి క్రీ.శ. అయిదో శతాబ్దంలో సెయింట్ పాల్ మతవిషయాలున్న గ్రంథాలన్నీ నమ్మదగిన క్రైస్తవమత గ్రంథాలుగా, వాటికి వ్యతిరేకంగా ఉండే సువార్త గ్రంథాలన్నీ నమ్మదగని గ్రంథాలుగా నిర్ణయించారు. అలా నమ్మదగని గ్రంథాల జాబితాలోకి బర్నబాస్ సువార్త గ్రంథం కూడా చేరిపోయింది.

క్రైస్తవ పండితులు ఈ గ్రంథాన్ని ప్రజలకు అందుబాటులో లేకుండా చేయడానికి అనేక జాగ్రత్తలు తీసుకున్నారు. 16వ శతాబ్దాంలో దీని లాటిన్ అనువాదానికి చెందిన ఒక ప్రతి పోప్ సిక్స్టస్ గ్రంథాలయంలో ఉండేది. అయితే దాన్ని చదవడానికి ఎవరికీ అనుమతి ఉండేది కాదు. 17వ శతాబ్దంలో అది అనేక చేతులు మారుతూ క్రీ.శ. 1738లో డయానా ఇంపీరియల్ లైబ్రరీకి చేరుకున్నది. క్రీ.శ. 1907లో దాని ఇంగ్లీషు అనువాదం ఆక్స్‌ఫర్డ్ క్లిండరన్ ప్రెస్ వారు ముద్రించారు. అయితే ఆ తరువాత వెంటనే ఆ ప్రతులను ఓ ప్రత్యేక రీతిలో మటుమయం చేయడం జరిగింది. లాటిన్ అనువాదానికి చెందిన మరొక ప్రతి 18వ శతాబ్దంలో స్పెయిన్ భాషలో ప్రచురించబడినట్లు జార్జ్ సెల్ తాను రాసిన ఒక గ్రంథంలో పేర్కొన్నాడు. కాని అది కూడా కొంత కాలానికి అదృశ్యమయి పోయింది. అయితే ఆక్స్‌ఫర్డ్ క్లిండరన్ ప్రెస్ వారు ముద్రించిన ఇంగ్లీషు ప్రతి ఎలాగో ముస్లింల కంట బడటంతో దానికి ప్రాచుర్యం లభించింది.

ఈనాటి క్రైస్తవులు ఈ గ్రంథాన్ని ముస్లింలు రాసుకొని దానికి బర్నబాస్ పేరు పెట్టారని ఆరోపిస్తున్నారు. కాని పైన పేర్కొన్న చారిత్రక వాస్తవాలు దృష్టిలో పెట్టుకుంటే ఇది పూర్తిగా నిరాధారమైన ఆరోపణ అని, పసలేని వాదన అని ఇట్టే తేలిపోతుంది. ఇంతకూ బర్నబాస్ సువార్తలో ఏముందో తెలుసుకోదలచిన వారు స్వయంగా ఆ గ్రంథం చదివితేనే ఈసా ప్రవక్త (అలైహి) ప్రవచనాల అసలు స్వరూపం తెలుస్తుంది. బర్నబాస్ సువార్త చదివేవారికి ఇంచుమించు ఖుర్‌ఆన్ చదువుతున్నట్లే అన్పిస్తుంది. చివరికి "లాఇలాహ ఇల్లల్లాహు ముహమ్మదుర్రసూలుల్లాహ్" (అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడు, ముహమ్మద్ ఆయనప్రవక్త) యొక్క భావాన్ని స్ఫురింపజేసే వాక్యాలు కూడా ఇందులో ఉన్నాయి. ఇక్కడ నేను మచ్చుకు కొన్ని విషయాలు పేర్కొంటున్నాను:

"నా తరువాత యావత్తు దైవప్రవక్తల, మహనీయుల జ్యోతి స్వరూపుడు వస్తాడు. అతను దేవుని ప్రవక్త. అందువల్ల అతను దైవప్రవక్తలు చెప్పిన విషయాల (పై ప్రజలు వేసిన) చీకటి మీద వెలుగు ప్రసరింపజేస్తాడు." (అధ్యాయం-17)

"(ఇప్పటిదాకా) వచ్చిన ప్రతి దైవప్రవక్తా ఒక జాతి కోసం దైవకారుణ్యానికి సూచనగా ప్రభవించాడు. అంచేత ఆ ప్రవక్తలు బోధించిన విషయాలు అవి ఏ ప్రజలకు అందజేయబడ్డాయో వారిలో తప్ప ఇతరుల్లో వ్యాపించలేదు. అయితే దేవుని ప్రవక్త, దేవుడు అతనికి తన చేతి ముద్రను ఇచ్చినట్లు వస్తాడు. అప్పుడు అతను తన బోధనలు స్వీకరించే ప్రపంచ జాతులన్నిటికీ కారుణ్యాన్ని, మోక్షాన్ని చేకూర్చుతాడు. అతను దైవరాహిత్య ప్రజలపై అధికారం తీసుకొని వస్తాడు. విగ్రహారాధనను సమూలంగా తుడిచిపెడ్తాడు. దాంతో షైతాన్ తీవ్ర ఆందోళన చెందుతాడు." ఆ తరువాత హజ్రత్ ఈసా (అలైహి) తన అనుచరుల ముందు ఒక సుదీర్ఘ ఉపన్యాసమిస్తూ, ఆ ప్రవక్త ఇస్మాయీల్ సంతతిలో ఆవిర్భవిస్తాడని తెలియజేశారు. (అధ్యాయం-43)

"ఏసు (ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ) ఇలా అన్నారు: ఆ మసీహ్ (అభిషిక్తుడు) పేరు 'ప్రశంసనీయుడు' (Admirable). దేవుడు అతని ఆత్మను సృష్టించినప్పుడు స్వయంగా ఆయనే అతనికీ పేరు పెట్టాడు. ఆ సందర్భంలో దేవుడు ఇలా అన్నాడు- 'ఓ ముహమ్మద్ నీ కోసమే నేను స్వర్గాన్ని, ప్రపంచాన్ని, అనేక జీవరాసుల్ని సృష్టించాను. వాటిని నీకు కానుకగా ఇస్తాను. కనుక అతని

ఇస్లాం వైపు పిలుస్తున్నా దాన్ని పెడచెవినపెట్టి, దేవునిపై అసత్యాలు మోపే వాడి కంటే మించిన దుర్మార్గుడు మరెవరుంటారు? అలాంటి దుర్మార్గులకు దేవుడు ఎన్నటికీ సన్మార్గం చూపడు. వీరసలు దేవుని (ఇస్లాం)జ్యోతిని నోటితో ఊది ఆర్పజూస్తున్నారు. కాని అవిశ్వాసులు ఎంత అసహ్యించుకున్నా దేవుడు తనజ్యోతిని పూర్తిగా (నేల నాలుగు చెరగులా) వ్యాపింపజేసి తీరుతానని నిర్ణయించుకున్నాడు. ఆయనే తనప్రవక్తకు సన్మార్గం, సత్యధర్మం ఇచ్చి పంపినవాడు. అవిశ్వాసులు ఎంత ఈసడించుకున్నా సరే ఆయన దాన్ని సమస్త జీవనవిధానాలపై ఆధిక్యత కలిగించ డానికి ఇలా చేశాడు. (7-9)

విశ్వాసులారా! మిమ్మల్ని దుర్భరమయిన (నరక) యాతనల నుండి కాపాడగలిగే వ్యాపార పద్ధతిని గురించి మీకు తెలుపమంటారా? మీరు మనస్ఫూర్తిగా దేవుణ్ని, ఆయన ప్రవక్తను విశ్వసించి ధనప్రాణాలు ఒడ్డి దైవమార్గంలో పోరాడండి. మీరు విషయం గ్రహించ గలిగితే అందులోనే మీ శ్రేయస్సు ఉంది. (10,11)

(ఈ ఆదేశాన్ని పాటిస్తే) దేవుడు మీ తప్పులు క్షమించి మిమ్మల్ని సెలయేరులు ప్రవహించే స్వర్గవనాలలో ప్రవేశింపజేస్తాడు. ఆ శాశ్వత స్వర్గవనాలలో మీకు అద్భుతమైన నివాస గృహాలు ప్రసాదిస్తాడు. ఇదే గొప్ప విజయం.

---

శుభనామం ముహమ్మద్.” (అధ్యాయం-97)

హజ్రత్ ఈసా ఒక సందర్భంలో తన శిష్యులకు “నా శిష్యులలోనే ఒకడు నన్ను ముప్ఫయి నాణాలకు శత్రువుల చేతికి అమ్ముతాడు” అని తెలియజేశారని బర్నబాస్ తన సువార్తలో రాశాడు. ఆ తరువాత హజ్రత్ ఈసా ఇలా చెప్పారు:

“ఆ తరువాత నన్ను అమ్మినవాడే నాపేరు మీద చంపబడతాడని నేను నమ్ముతున్నాను. ఎందుకంటే దేవుడు నన్ను పైకి లేపుకున్న తరువాత ఆ ద్రోహి రూపాన్ని మార్చివేస్తాడు. అతడ్ని చూసిన ప్రతి వ్యక్తీ అతడు నేనేనని భావిస్తాడు. అతడు అవమానకరమైన చావు చస్తాడు. దానివల్ల కొంతకాలం వరకు నన్నే అప్రతిష్ఠపాలు చేయడం జరుగుతుంది. అయితే దేవుని పవిత్రప్రవక్త ముహమ్మద్ వచ్చిన తరువాత నామీద అపవాదు దూరం చేయబడుతుంది. దేవుడు ఇలా చేయ డానికి కారణం నేనా మసీహ్ సత్యతను అంగీకరించాను. దీనికి ఆయన నాకు బహుమానంగా- నేను జీవించే ఉన్నానని, అవమానకరమైన చావుతో నాకెలాంటి సంబంధం లేదని ప్రజలు తెలుసు కుంటారు.” (అధ్యాయం-113)

“ముహమ్మద్! దేవుడు నీకు తోడుగా ఉండుగాక. ఆయన నన్ను నీ చెప్పులవారు కట్టగల యోగ్యుణ్ని చేయుగాక. ఈమాత్రంస్థానం లభించినా నేను గొప్పప్రవక్త నవుతాను, దేవుని మహోన్నత శక్తిస్వరూపుణ్ణవుతాను.” (అధ్యాయం-44)

“ఆ దైవప్రవక్త తరువాత ఇతర ప్రవక్తలు కూడా వస్తారా? అని తాంత్రిక నాయకుడు ప్రశ్నించాడు. దానికి ఏసు సమాధానమిస్తూ ‘అతని తరువాత దేవుని సత్య ప్రవక్తలెవరూ రారు. కాని చాలామంది అసత్య ప్రవక్తలు వస్తారు. దీన్ని గురించి నాకెంతో విచారంగా ఉంది. దేవుని న్యాయ వంతమైన నిర్ణయాల కారణంగా షైతాన్ వారిని రంగంలోకి దించుతాడు. వారు నా సువార్తల చాటున తమను తాము మరుగు పరచుకుంటారు’ అని చెప్పారు.” (అధ్యాయం-97)

(ఈ వివరాలన్నీ మౌలానా మౌదూదీగారి తఫ్హీముల్ ఖుర్‌ఆన్ నుండి గ్రహించబడ్డాయి.)



అదీగాక మీరు కోరుతున్న ఇతర వస్తువులు కూడా ఆయన మీకు అను గ్రహిస్తాడు. అదే దేవుని సహాయం, త్వరలోనే లభించనున్న విజయం. ప్రవక్తా! విశ్వాసు లకు ఈ శుభవార్త అందజెయ్యి. (12,13)

విశ్వాసులారా! మర్యం కుమారుడు ఈసా (ప్రవక్త) తన శిష్యుల్ని సంబోధిస్తూ “దేవుని వైపు (ప్రజల్ని పిలవడంలో) నాకు సహాయపడే వారెవరైనా ఉన్నారా?” అని అడిగాడు. దానికి వారు “మేమున్నాం దేవుని సహాయకులం” అన్నారు.

ఇలా మీరు కూడా దేవుని (ధర్మాని)కి సహాయకులుగా ఉండండి. ఆ సందర్భంలో ఇస్రాయీల్ సంతతిలో ఒక వర్గం (ఈసాను) విశ్వసించింది; రెండవ వర్గం తిరస్కరించింది. తరువాత మేము విశ్వాసులకు వారి విరోధులకు వ్యతిరేకంగా సహాయం చేశాము. (చివరికి) వారే విజయం సాధించారు. (14) ✪

# 62. సప్తాహ సమావేశం (జుముఅ)

**అవతరణ: మదీనా** **సూక్తులు: 11**

ఈ అధ్యాయాన్ని “జుముఅ” అంటారు. ఇందులోని మొదటి 8 సూక్తులు హిజ్రీ శకం ఏడవ సంవత్సరంలో, చివరి 9 నుంచి 11 వరకున్న సూక్తులు హిజ్రీశకం మొదటి సంవత్సరం ప్రారంభంలో అవతరించినట్లు తెలుస్తోంది. ఇందులో యూదుల ఇస్లాం వ్యతిరేక కార్యకలాపాలను నిశితంగా విమర్శిస్తూ, వారికి కొన్ని హితవులు ఇవ్వబడ్డాయి. చివర్లో ముస్లింలకు శుక్రవారం సమావేశం గురించి కొన్ని ఆజ్ఞలు జారీ చేయబడ్డాయి.

### కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

భూమ్యాకాశాల్లో ఉన్న ప్రతీదీ దేవుని ఔన్నత్యం చాటుతూ, ఆయన పవిత్రతను కీర్తి స్తోంది. ఆయన (విశ్వ) సామ్రాట్టు, పరిశుద్ధుడు, సర్వశక్తిమంతుడు, మహా వివేకవంతుడు. (1)

ఆయనే నిరక్షరాస్యుల్లో వారిజాతికే చెందిన ఒక ప్రవక్తను ప్రభవింపజేశాడు. ఆ ప్రవక్త వారికి దైవసూక్తులు విన్పిస్తూ వారి జీవితాలు సంస్కరిస్తున్నాడు. వారికి (దివ్య) గ్రంథంలోని విషయాలను, వివేకాన్ని నేర్పుతున్నాడు. దీనికి పూర్వం వారు పూర్తిగా మార్గవిహీనులై ఉండే వారు. (అతని దౌత్యం) వారిలో ఇంకా చేరని (ఇతర జాతుల, భావితరాల) వారికి కూడా వర్తిస్తుంది. దేవుడు అపార శక్తిమంతుడు, అమిత వివేక వంతుడు. ఇది దేవుని అనుగ్రహం; దేవుడు తాను కోరినవారికి దాన్ని ప్రసాదిస్తాడు. ఆయన గొప్ప అనుగ్రహశీలి. (2-4)

తౌరాత్ (ఆజ్ఞలు పాటించే) బాధ్యత మోపబడినవారు ఆ బాధ్యత నిర్వహించలేదు. వారిని పుస్తకాలుమోసే గాడిదతో పోల్చవచ్చు. (తౌరాత్‌జ్ఞానం తెలిసి కూడా అంధులయి) దైవసూక్తుల్ని నిరాకరించినవారు అంతకంటే దిగజారిపోయారు. ఇలాంటి దుర్మార్గులకు దేవుడు సన్మార్గం చూపడు. (ప్రవక్తా!) వారితో ఇలా అను: “యూదులుగా

మారిన ప్రజలారా![1] మానవులందరిలోకెల్లా మీరొక్కరే దేవునికి అత్యంత ప్రియమైనవారని కదా మీవాదన! మీవాదన నిజమైతే చావును కోరుకోండి (చూద్దాం).” (5,6)

కాని వారు చావును ఎన్నటికీ కోరుకోరు, తాము చేసిన అకృత్యాల కారణంగా. (వారి కసలు చావంటేనే భయం.) ఆ దుర్మార్గుల సంగతి దేవునికి బాగా తెలుసు. (7)

వారికిలా చెప్పు: “ఏ మృత్యువు నుండి మీరు పారిపోవడానికి ప్రయత్నిస్తున్నారో ఆ మృత్యువు మిమ్మల్ని కబళించి తీరుతుంది. ఆ తర్వాత మీరు గోచర, అగోచరాలన్నీ ఎరిగిన దేవుని సన్నిధిలో ప్రవేశపెట్టబడతారు. అప్పుడాయన మీరు (ఇహలోకంలో) ఏమేమి చేస్తుండేవారో అంతా మీ ముందు రట్టు చేస్తాడు.” (8)

విశ్వాసులారా! శుక్రవారం సమావేశం[2] రోజున నమాజుకోసం పిలుపునిచ్చినప్పుడు మీరు వెంటనే అమ్మకం, కొనుగోళ్ళ వ్యవహారాలు వదిలేసి దైవస్మరణ (ధర్మబోధ) వైపుకు పరుగెత్తండి. మీరు అర్థం చేసుకుంటే ఇది మీకెంతో శ్రేయస్కరమైనది.

---

1. ప్రతి యుగంలోనూ దేవుడ్ని, ఆనాటి దైవప్రవక్తను విశ్వసించినవారిని ముస్లింలు (దైవవిధేయులు) అనే అంటారు. కాని దైవప్రవక్తల తదనంతరం ప్రజలు వారిబోధనలు విస్మరించడమే గాకుండా ఈ పేరు కూడా మార్చారు. యూదులు కూడా అలాగే చేశారు. వారు యాఖూబ్ ప్రవక్త నాల్గవ కుమారుడయిన యహూదా సంతతికి చెందిన వారయినందున తమను యూదులుగా పేరు మార్చుకున్నారు.

2. ఇస్లాం శుక్రవారాన్ని ముస్లింల కోసం ప్రత్యేక ఆరాధనా దినంగా నిర్ణయించింది. మూఢ కాలంలో అరబ్బులు “యౌముల్ అమాబా” పేరుతో దీన్ని పాటించేవారు. దీన్ని దైవప్రవక్త (సల్లం) “జుముఆ” అని పేరు పెట్టారు.

ఇస్లాంకు పూర్వం యూదులు వారంలో ఒక రోజును ప్రత్యేక ఆరాధనా దినంగా, జాతీయ చిహ్నంగా పరగణించే వారు. దానికోసం వారికి శనివారం నిర్ణయించబడింది. శనివారం దేవుడు ఇస్రాయీల్ సంతతివారిని ఫిరౌన్ చక్రవర్తి బానిసత్వం నుండి విముక్తి కలిగించడం వల్ల ఆరోజు వారికి ప్రత్యేక ఆరాధనాదినంగా, వారి జాతీయచిహ్నంగా నిశ్చయించబడింది.

దాన్ని చూసి క్రైస్తవులు కూడా తమ కోసం ప్రత్యేక ఆరాధనా దినంగా, జాతీయ చిహ్నంగా ఆదివారాన్ని నిర్ణయించుకున్నారు. ఇది వారి సొంత నిర్ణయమే కాని, ఈసా (అలైహి) చేసిన నిర్ణయం కాదు. ఆయనపై అవతరించిన దైవగ్రంథం (ఇన్జీల్)లో అలాంటి ఆదేశం ఏదీ లేదు.

ఆదివారం రోజు ఏసుక్రీస్తు శిలువపై ప్రాణం విడిచిన తరువాత, ఆ రోజే సమాధి నుండి లేచి ఆకాశం పైకి వెళ్ళాడని క్రైస్తవులు నమ్ముతారు. ఈ కారణంగానే ఆ తరువాతి కాలం క్రైస్తవులు ఆదివారాన్ని తమ కోసం ప్రత్యేక ఆరాధనా దినంగా నిర్ణయించుకున్నారు. క్రీ.శ. 321 లో రోమన్ ప్రభుత్వం ఆదివారాన్ని సాధారణ సెలవుదినంగా పరిగణిస్తూ ఆజ్ఞ జారీచేసింది.

ఇస్లాం యూదులకు, క్రైస్తవులకు భిన్నంగా ముస్లింల కోసం శుక్రవారాన్ని ప్రత్యేక ఆరాధనా దినంగా నిర్ణయించింది. ఆరోజు ముస్లింలు వ్యాపారం, ఉద్యోగం వగైరా ప్రాపంచిక వ్యవహారాలన్నీ కట్టిపెట్టి జుమానమాజు కోసం సిద్ధంకావాలని దేవుడు ఆదేశిస్తున్నాడు. ముఖ్యంగా “అజాన్” కాగానే ప్రాపంచిక కార్యకలాపాలు పూర్తిగా వదిలెయ్యాలి. అజాన్ తర్వాత కూడా ప్రాపంచిక కార్యకాలాపాలు కొనసాగించడాన్ని ధర్మవేత్తలు హరాం (నిషిద్ధం)గా పరిగణించారు.



నమాజ్ ముగిసిన తరువాత మీరు యధాప్రకారం నేల నలువైపులా విస్తరించి దైవానుగ్రహం (ఉపాధి) అన్వేషించవచ్చు. (ఆ సందర్భంలో కూడా) దేవుడ్ని ఎక్కువగా స్మరిస్తూ ఉండండి. దీనివల్ల మీకు సాఫల్య భాగ్యం లభించవచ్చు. (9,10)

వారు వ్యాపార సంరంభం, వినోదం చూడగానే నిన్ను నిలబడ వదిలేసి వాటి వైపు పరుగెత్తారు. వారికిలా చెప్పు: “ఈ వ్యాపారం, వినోదాలకంటే దేవుని దగ్గర ఉన్నవి అనేక రెట్లు శ్రేష్ఠమైనవి. దేవుడు అందరికంటే అత్యంత శ్రేష్ఠమైన ఉపాధిప్రదాత.” (11)

## అవతరణ: మదీనా 63. కపటులు (మునాఫిఖూన్) సూక్తులు:11

ఈ అధ్యాయాన్ని “మునాఫిఖూన్” (కపట విశ్వాసులు) అంటారు. ఇది హిజ్రీ శకం 6వ యేట అవతరించింది. దీన్ని అర్థం చేసుకోవడానికి ఈ క్రింది పూర్వపరాలు తెలుసు కోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

మదీనాలోని ఔస్, ఖజ్రజ్ తెగలు పరస్పరం అంతర్యుద్ధాలతో విసిగిపోయి చివరికి అందరూ కలసి ఖజ్రజ్ తెగకు చెందిన అబ్దుల్లా బిన్ ఉబయి అనే ఆసామిని రాజుగా చేసుకొని ఆయన ఏలుబడిలో సమైక్యమయి ఉండాలని నిశ్చయించుకున్నారు. అలాంటి స్థితిలో ఈ రెండు తెగలకు చెందిన కొందరు ప్రముఖులు మక్కా వెళ్ళి ఇస్లాం స్వీకరించడం జరిగింది. దాంతోపాటు వారు దైవప్రవక్త (సల్లం)ను మదీనా వచ్చేయమని ఆహ్వానించారు. దాని ప్రకారం దైవప్రవక్త (సల్లం) తన అనుచరులతో మక్కా వీడి మదీనా వచ్చేశారు.

ఆయన రాకతో మదీనాలో అనేకమంది ఇస్లాం స్వీకరించారు. మెజారిటీ జనం ఇస్లాం స్వీకరించడంతో అబ్దుల్లా బిన్ ఉబయి మదీనా నాయకత్వం తన నుండి చేజారి పోతోందని గ్రహించి ఇష్టం లేకపోయినా తన నమ్మినబంట్లతో ఇస్లాంలో చేరిపోయాడు. అయితే దైవప్రవక్త (సల్లం) మీద కసి పెంచుకొని లోలోన విద్రోహ చర్యలకు పాల్ప డటం ప్రారంభించాడు. ఉహుద్ యుద్ధసమయంలో అతను తన మూడువేల మంది అనుచరులతో రంగం నుండి జారుకున్నాడు. అతను, అతని అనుచర మూకలు అటు యూదులతో, మక్కా అవిశ్వాసులతో కూడా రహస్య మంతనాలు జరుపుతూ ఎప్పుడూ ఏదో ఒక దుమారం లేవదీస్తుండేవారు.

ఓసారి ఇస్లామీయ సైన్యం బనీ ముస్తలిఖ్ తెగను ఓడించి అదే ప్రాంతంలోని ఒక బావి దగ్గర విడిది చేసింది. అయితే హఠాత్తుగా ఇద్దరు ముస్లింల మధ్య ఏదో కారణంగా తగాదా వచ్చి పరిస్థితి కొట్టుకునేవరకు పోయింది. అందులో ఒకడు సహాయం కోసం అన్సారులను (అంటే పూర్వంనుంచి మదీనాలో ఉంటున్నవారిని) ఎలుగెత్తి పిలిచాడు. రెండవ వ్యక్తి కూడా ముహాజిర్లను (అంటే మక్కా నుండి మదీనాకు శరణార్థులుగా వచ్చినవారిని) సహాయం కోసం ఎలుగెత్తి పిలిచాడు. అబ్దుల్లా బిన్ ఉబయి ఈగొడవ సంగతి తెలియగానే ముహాజిర్ ముస్లింలకు వ్యతిరేకంగా అన్సార్ ముస్లింలను రెచ్చగొట్టడానికి ప్రయత్నించాడు. దాంతో ముహాజిర్‌ల తరఫున కొందరు, అన్సార్‌ల తరఫున కొందరు తగాదా స్థలానికి పరుగెత్తుకు వచ్చారు.

ఇలా ముస్లింలు రెండు వర్గాలుగా చీలిపోయి పరస్పరం ఘర్షించుకుంటూ ఒకర్నొకరు చంపుకోవడానికి సిద్ధమయ్యారు. అంతలో దైవప్రవక్త (సల్లం) వచ్చి "ఏమిటీ అజ్ఞానపు పిలుపు? మీరేమిటీ, ఈఅజ్ఞనపు పిలుపునివ్వడమేమిటీ!" అని మందలించారు. అప్పుడు ఇరు వర్గాల నుండి కొందరు పెద్ద మనుషులు కలగజేసుకొని ఈ గొడవను అంతమొందించారు.

ఆ తర్వాత కపటవిశ్వాసులు అబ్దుల్లా బిన్ ఉబయి దగ్గరకు చేరుకొని "ఇప్పటి దాకా నువ్వేదో మమ్మల్ని ఉద్ధరిస్తావని ఆశలు పెట్టుకున్నాం. కాని ఈరోజు నీవు మాకు వ్యతిరేకంగా ఆ దరిద్రులకే సహకరించావు" అని ఎత్తిపొడిచారు. దానికి అబ్దుల్లా మండి పడుతూ "అసలు ఇదంతా మీ నిర్వాకమే. మీరే వాళ్ళను మీ దేశంలో అశ్రయమిచ్చారు. వారికోసం డబ్బు ఖర్చు పెట్టారు. చివరికి వాళ్ళు బలిసిపోయి మనకే ప్రత్యర్థులై పోయారు... దైవసాక్షి! మదీనా చేరుకున్నాక మనలో గౌరవనీయుడైన ప్రతివ్యక్తీ నీచుడ్ని అక్కడ్నుంచి వెళ్ళగొడ్తాడు" అని అన్నాడు.

ఈ సమావేశంలో అప్పుడు జైద్ బిన్ అర్ఖం అనే ఓ బాలుడు కూడా ఉన్నాడు. అతనీ మాటలు విని, వెళ్ళి తన పినతండ్రికి తెలియజేశాడు. ఆయన వెళ్ళి దైవప్రవక్త (సల్లం)కు తెలియ జేశాడు. దైవప్రవక్త (సల్లం) వెంటనే జైద్‌ని పిలిచి "బాబూ! నువ్వక్కడ విన్న మాటలేమిటో మరో సారి చెప్పు" అన్నారు. ఆ అబ్బాయి ఉన్నది ఉన్నట్లు పూసగుచ్చినట్లు చెప్పాడు. దానికి దైవప్రవక్త (సల్లం) "బహుశా నీవు ఇబ్నె ఉబయి పట్ల కోపంగా ఉన్నావు కాబోలు. లేక వినడంలో పొరబడి ఉండవచ్చు" అన్నారు. ఆ బాలుడు తల అడ్డంగా తిప్పుతూ "లేదండీ! దైవసాక్షిగా చెబ్తున్నా నేనీ మాటలన్నీ (నా చెవులారా) అతని నోట విన్నాను" అన్నాడు.

అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఇబ్నె ఉబయిని పిలిచి అడిగితే, అతను దేవుని మీద ప్రమాణం చేస్తూ తానీమాటలు అనలేదని బొంకాడు. కొందరు అన్సార్‌పెద్దలు కల్పించు కొని "ఈ పిల్లవాడు అపార్థం చేసుకొని ఉంటాడు. ఇబ్నె ఉబయి మా నాయకుడు, పెద్దమనిషి. అతని ముందు ఈ పిల్లవాడి మాటల్ని పట్టించుకోకండి" అని సర్దిచెప్పారు. మరికొందరు జైద్‌ని మందలించారు. పాపం! ఆ పిల్లవాడు బిక్కమొహం వేసుకొని నిల బడ్డాడు. కాని దైవప్రవక్త (సల్లం) కు ఇబ్నె ఉబయి ఎలాంటివాడో, ఆ బాలుడు ఎలాంటి వాడో బాగా తెలుసు.

ఆ తర్వాత దైవప్రవక్త (సల్లం) వెంటనే సైన్యం మదీనాకు బయలుదేరాలని ఆదేశించారు. సైన్యం నిర్విరామంగా ముప్ఫైగంటలు ప్రయాణంచేశాక ఓచోట విడిది చేయించారు. ఆ ప్రయాణంలో యోధులు బాగా అలసిపోయారు. నేలమీద మేను వాల్చగానే చాలామంది నిద్రపోయారు.

అంతకు ముందు దారిలో హజ్రత్ ఉసైద్ బిన్ హుజైర్ (రజి) దైవప్రవక్త (సల్లం)ను కలుసుకొని "దైవప్రవక్తా! మీరీ రోజు ఎందుకో ప్రయాణానికి అనువుగాని వేళలో సైన్యానికి బయలు దేరమని ఆజ్ఞాపించారు?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) "మీ మనిషి ఎంత ప్రయోజనకరమైన మాటన్నాడో వినలేదా?" అన్నారు. "ఎవరండీ ఆ మనిషి?" ప్రశ్నించారు హజ్రత్ ఉసైద్ (రజి). "అబ్దుల్లా బిన్ ఉబయి" చెప్పారు దైవప్రవక్త (సల్లం). "ఏమన్నాడేమిటి?" అడిగారు మళ్ళీ హజ్రత్ ఉసైద్ (రజి).



"మదీనా వెళ్ళాక గౌరవనీయుడు నీచుడ్ని అక్కడ్నుంచి వెళ్ళగొడ్తాడట" అన్నారు దైవప్రవక్త (సల్లం). "దైవప్రవక్తా! దైవసాక్షిగా చెబుతున్నాను. అసలు మీరు గౌరవ నీయులు. వాడే నీచుడు. మీరు ఎప్పుడు తలచుకుంటే అప్పుడు అతడ్ని నగరం నుంచి వెళ్ళ గొట్టగలరు" అన్నారు హజ్రత్ ఉసైద్ (రజి).

ఈ సంగతి క్రమంగా అన్సార్ ముస్లింలలో వ్యాపించింది. ఇబ్నె ఉబయి పట్ల వారిలో ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. కొందరు అతనితో "వెళ్ళి దైవప్రవక్తకు క్షమాపణ చెప్పుకో" అన్నారు. కాని అతను తీవ్రంగా స్పందిస్తూ "మీరు ఆయన్ని విశ్వసించమన్నారు. నేను విశ్వసించాను. మీరు నన్ను జకాత్ ఇవ్వమన్నారు. నేను జకాత్ కూడా ఇచ్చా. నేనిక ముహమ్మద్‌కు సాష్టాంగ పడటం ఒక్కటే మిగిలింది" అని అన్నాడు. ఈ మాటలు విని అన్సార్‌లు మరింత ఆగ్రహోదగ్రులై పోయారు. అందరూ అతనికి శాపనార్థాలు పెట్టడం ప్రారంభించారు.

ఈ విధంగా ఈ సైన్యం మదీనా సమీపానికి చేరుకుంది. అప్పుడు అబ్దుల్లా బిన్ ఉబయి కొడుకు హజ్రత్ అబ్దుల్లా (రజి) త్వరగా పట్టణ ముఖద్వారం దగ్గరకు చేరుకొని తండ్రిని నగరంలో ప్రవేశించనీయకుండా కత్తిదూసి అడ్డగిస్తూ "మీరు మదీనా చేరుకున్నాక గౌరవనీయుడు నీచుడ్ని వెళ్ళగొడ్తాడని అన్నారు. ఇప్పుడు గౌరవనీయుడు మీరో లేక దేవుడు, ఆయన ప్రవక్తో తెలుస్తుంది చూడండి. దైవసాక్షి! మిమ్మల్ని దైవప్రవక్త (సల్లం) అనుమతించనంత వరకు నేను మిమ్మల్ని పట్నం లోకి పోనివ్వను" అని అన్నారు. ఇబ్నెఉబయి బిత్తరబోయి "ప్రజలారా! చూడండి, నా కొడుకే నన్ను పట్నంలో ప్రవేశించనీయకుండా నిరోధిస్తున్నాడు" అని కేకలు పెట్టాడు.

కొందరు ఈ విషయాన్ని దైవప్రవక్త (సల్లం) దగ్గరికెళ్ళి చెప్పారు. ఆయన వెంటనే "వెళ్ళి అబ్దుల్లాకు చెప్పండి వాళ్ళ నాన్నను ఇంటికి రానివ్వాలని" అని ఆదేశించారు. అప్పుడు అబ్దుల్లా (రజి) తన తండ్రికి దారి విడిచిపెడ్తూ "దైవప్రవక్త (సల్లం) ఆజ్ఞాపించారు గనక, ఇప్పుడు మీరు పట్నంలోకి ప్రవేశించవచ్చు" అన్నారు. ఇవీ ఈ అధ్యాయం అవతరణ పూర్వపరాలు.

## కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

ప్రవక్తా! కపటవిశ్వాసులు నీ దగ్గరికొచ్చినప్పుడు "మీరు నిస్సందేహంగా దైవప్రవక్తేనని మేము సాక్ష్యమిస్తున్నాం" అనంటారు. నిజమే. దేవునికి తెలుసు నీవు తప్పకుండా ఆయన ప్రవక్తవేనని. కాని ఈకపటులు పచ్చి అబద్ధాలకోరులని దేవుడు సాక్ష్యమిస్తున్నాడు. (1)

వీరసలు తమ ప్రమాణాలు అడ్డంపెట్టుకొని ఇలా తాము స్వయంగా దైవమార్గానికి దూరమై పోవడమేగాక, ఇతరుల్ని కూడా దైవమార్గంలోకి రాకుండా నిరోధిస్తున్నారు. ఎలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారు వీరు! దీనికంతటికీ కారణం, వారు సత్యాన్ని విశ్వసించి తిరిగి అవిశ్వాసవైఖరి అవలంబించడమే. అందువల్ల వారి హృదయకవాటాలు మూసివేయబడ్డాయి. ఇక వారు ఏ(మంచి) విషయాన్నీ అర్థం చేసుకోలేరు. (2,3)

ఈ కపటవిశ్వాసుల్ని చూస్తే, వారి విగ్రహ పుష్టి, రూపురేఖలు నీకెంతో హుందాగా కన్పిస్తాయి. వారు మాట్లాడితే వారి మాటలను నీవు ఇట్టే (ఎంతో ఆసక్తిగా) వింటావు. కాని (వారిదంతా పైన బటారమే.) వారసలు గోడకు ఆనిచ్చి నిలబెట్టిన బోలు కర్రల్లాంటివారు. బిగ్గరగా విన్పించే ప్రతిశబ్దాన్నీ తమకు వ్యతిరేకంగా (ముంచుకొస్తున్న ముప్పని) భావిస్తారు. వారసలు తేనెపూసిన కత్తులు. అందువల్ల వారిపట్ల అప్రమత్తంగా ఉండండి. దేవుడు వారిని నాశనం చెయ్య, వారెలా పెడదారి పట్టిపోతున్నారు! (4)

వారితో "రండి, ప్రవక్త మీకోసం పాపమన్నింపుకై ప్రార్థిస్తాడ"ని చెప్పినప్పుడు వారు తలవిదిలించి వెళ్ళిపోతారు. పైగా విర్రవీగుతో నీదగ్గరకు రాకుండా ముఖం చాటేస్తారు. ప్రవక్తా! వారికోసం నీవు పాపమన్నింపు ప్రార్థన చేసినా, చేయకపోయినా ఒకటే. దేవుడు వారిని ఎన్నటికీ మన్నించడు. (అలాంటి) దుర్జనులకు దేవుడు సన్మార్గం చూపడు. (5,6)

"ప్రవక్త అనుచరుల కోసం ఖర్చుపెట్టకండి, దాంతో వారు (ఆయన్ని వదిలేసి) వెళ్ళిపోతారు" అని చెప్పేవారు వీరే. కాని భూమ్యాకాశాల్లోని నిక్షేపాలన్నీ దేవునివేనన్న సంగతి ఈ కపటులు గ్రహించడం లేదు. వారు (పరస్పరం మాట్లాడుకుంటూ) "మదీనా తిరిగివెళ్ళిన తర్వాత (మనలో) గౌరవనీయులైనవారు నీచుల్ని అక్కడ్నుంచి వెళ్ళగొట్టాలి" అనంటారు. నిజానికి గౌరవప్రతిష్ఠలు దేవునికి, ఆయన ప్రవక్తకు, విశ్వాసులకు (మాత్రమే) ఉన్నాయి. కపటులు ఈ విషయాన్ని అర్థం చేసుకోవడం లేదు. (7,8)

విశ్వాసులారా! మీ సంతానం, సిరిసంపదలు మిమ్మల్ని దైవధ్యానం నుండి మరపింప జేయకూడదు. అలా చేసేవారే నష్టపోయేవారు. మేము ప్రసాదించిన ఉపాధి నుండి (మా మార్గంలో) ఖర్చుపెట్టండి. మీలో ఎవరికైనా మరణసమయం ఆసన్నమై "ప్రభూ! నాకు మరికొంత గడువియ్యలేదేమిటి? ఇస్తే నేను దానధర్మాలు చేసి సజ్జనుల్లో చేరిపోతానుగదా?" అని అతను అనవచ్చు. అలాంటి దుస్థితి దాపురించక ముందే ఈ సత్కార్యం చేయండి. ఎవరికైనా ఆచరణగడువు ముగిసే సమయం వస్తే, ఇక అతనికి దేవుడు ఏమాత్రం అవకాశమివ్వడు. మీరు చేసేదంతా దేవునికి తెలుసు. (9-11) ✪

# 64. జయాపజయాలు (తగాబున్)

**అవతరణ: మదీనా** **సూక్తులు: 18**

ఈ అధ్యాయాన్ని "అత్తగాబున్" (అంటారు. ఇది హిజ్రీశకం తొలిరోజుల్లో అవతరించింది. ఇందులో దేవుని ఏకత్వం, ఔన్నత్యాలను గురించి ప్రస్తావిస్తూ మానవుణ్ణి నిజధర్మంవైపు పిలవడం జరిగింది. అవిశ్వాసుల్ని హెచ్చరించి, విశ్వాసులకు శుభవార్తలు అందజేయబడ్డాయి. విశ్వాసుల విశ్వాసాన్ని పటిష్ఠం చేయడానికి కొన్ని సూచనలు కూడా ఇవ్వబడ్డాయి.

**కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం**

భూమ్యాకాశాల్లో ఉన్న అణువణువూ దేవుని ఔన్నత్యం చాటుతూ, ఆయన పవిత్రతను ప్రశంసిస్తోంది. యావత్ విశ్వసామ్రాజ్యం ఆయనదే. సకల స్తుతిస్తోత్రాలు ఆయనకే



శోభిస్తాయి. ఆయనకు ప్రతి దానిపై అదుపు, అధికారం ఉన్నాయి. ఆయనే మిమ్మల్ని సృష్టించాడు. తరువాత మీలో కొందరు విశ్వాసులుగా, మరికొందరు అవిశ్వాసులుగా (మారి) ఉన్నారు. మీరు చేస్తున్నదంతా దేవుడు గమనిస్తూనే ఉన్నాడు. (1,2)

ఆయన భూమ్యాకాశాలను సత్యం ప్రాతిపదికపై సృష్టించాడు. మిమ్మల్ని అద్భుతంగా రూపొందించాడు. చివరికి మీరంతా ఆయన వైపుకే మరలి పోవలసి ఉంది. భూమ్యాకాశాల్లో ఉన్న సమస్త విషయాలు ఆయనకు తెలుసు. మీరు దాచే విషయాలు, బహిర్గతం చేసే విషయాలు అన్నీ ఆయనకు తెలుసు. చివరికి మీ అంతరంగాల్లో మెదిలే నిగూఢ విషయాలు కూడా ఆయనకు తెలుసు. (3,4)

ఇంతకు పూర్వం అవిశ్వాసులైపోయి, తమ దుష్కర్మల పర్యవసానాన్ని చవిచూసిన వారి వృత్తాంతం మీకు చేరలేదా? మున్ముందు వారికి (అంతకంటే కూడా) ఎంతో వ్యథాభరితమైన (నరక) శిక్ష ఉంది. (5)

దీనిక్కారణం, వారి దగ్గరకు వారి ప్రవక్తలు స్పష్టమయిన నిదర్శనాలు, ప్రమాణాలు తీసుకొచ్చినప్పుడు "ఒక మానవమాత్రుడా మనకు సన్మార్గం చూపేవాడు?" అన్నారు వారు. ఈ విధంగా వారు సత్యాన్ని విశ్వసించడానికి నిరాకరించి ముఖం తిప్పుకున్నారు. అప్పుడు దేవుడు కూడా వారిని ఖాతరు చేయకుండా వదిలేశాడు. ఆయన నిరపేక్షాపరుడు, స్వతహాగా ప్రశంసనీయుడు. (6)

ఈ సత్యతిరస్కారులు తాము చనిపోయిన తరువాత తిరిగి బ్రతికించబడటమనేది జరగనే జరగదని వాదిస్తున్నారు. వారికిలా చెప్పు: "నా ప్రభువు సాక్షి! మీరు తప్పకుండా బ్రతికించి లేపబడతారు. అప్పుడు మీకు (ప్రపంచంలో) మీరు ఏఏ పనులు చేశారో తెలియ జేయబడుతుంది. ఇలా చేయడం దేవునికి చాలా తేలిక." (7)

కనుక (మానవులారా!) దేవుణ్ణి, ఆయన ప్రవక్తను, మేము అవతరింపజేసిన (ఖుర్ఆన్) జ్యోతిని విశ్వసించండి. మీరు చేసేదంతా దేవునికి తెలుసు. (పరలోక) సమావేశంరోజు మిమ్మల్నందర్నీ సమీకరించడం జరుగుతుంది. అదే పరస్పరం జయాపజయాల రోజు. విశ్వసించి సదాచార సంపన్నులైనవారిని దేవుడు (ఆరోజు) పాపప్రక్షాళన చేసి సెలయేరులు ప్రవహించే స్వర్గవనాలలో ప్రవేశింపజేస్తాడు. అదే గొప్ప విజయం.

ఇక మాసూక్తులు తిరస్కరించి అవిశ్వాసులై పోయినవారు నరక వాసులవుతారు. నరకంలోనే వారు ఎల్లకాలం పడిఉంటారు. నరకం పరమచెడ్డ నివాసస్థలం. (8-10)

దైవాజ్ఞ లేనిదే ఏ ఆపదా రాదు. దేవుణ్ణి విశ్వసించేవారికి దేవుడు (కష్టాలలోను, సుఖాలలోను) సద్బుద్ధి ప్రసాదిస్తాడు.[1] దేవుడు సర్వం ఎరిగినవాడు. (కనుక) దేవునికి,

1. దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "విశ్వాసి వ్యవహారం చాలా వింతగా ఉంది. అతని విషయంలో దేవుడు ఎలాంటి నిర్ణయం తీసుకున్నా అది అతని పాలిట మంచి విషయమే అవుతుంది. కష్టాలు వచ్చిపడినప్పుడు సహనం వహిస్తాడు. ఈ సహనం అతనికి మంచి విషయమే. సౌఖ్యాలు కలిగినప్పుడు కృతజ్ఞత చూపుతాడు. ఈ కృతజ్ఞతా భావం కూడా అతని పాలిట మంచి విషయమే. ఈ మహాభాగ్యం విశ్వాసికి తప్ప మరెవరికీ ప్రాప్తం కాదు." (బుఖారి, ముస్లిం)

ఆయన ప్రవక్తకు విధేయులైపోండి. మీరు (మా) విధేయతకు విముఖులైపోతే, సత్యాన్ని స్పష్టంగా అందజేయడమే మా ప్రవక్త బాధ్యత. అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడు. కాబట్టి విశ్వాసులు (అలాంటి) దేవుణ్నే నమ్ముకోవాలి. (11-13)

విశ్వాసులారా! మీ భార్యాపిల్లలలో కొందరు మీకు శత్రువులై ఉంటారు. వారిపట్ల అప్రమత్తంగా ఉండండి. అయితే వారిని దయార్ద్ర హృదయంతో క్షమిస్తే దేవుడు (కూడా మీపట్ల) క్షమాశీలి, దయానిధి (అవుతాడు). మీ సంతానం, సిరిసంపదలు మీకు పరీక్షగా చేయబడ్డాయి. (ఈపరీక్ష నుండి గట్టెక్కితే మీకు) దేవుని దగ్గర గొప్ప ప్రతిఫలం ఉంది.[2]

కనుక మీరు వీలైనంతవరకు (ప్రతి వ్యవహారంలో) దేవునికి భయపడుతూ జీవితం గడపండి. వినండి, విధేయత పాటించండి. (దైవమార్గంలో) మీ ధనాన్ని ఖర్చుపెట్టండి. ఇది మీకెంతో మంచిది. పిసినారితనాన్ని దరికి చేరనివ్వనివారే కృతార్థులౌతారు. (14-16)

మీరు గనక దేవునికి శ్రేష్ఠమైన రుణం (నిస్వార్థ బుద్ధితో కూడిన దానం) ఇస్తే, దేవుడు దాన్ని అనేక రెట్లు పెంచి మీకు తిరిగిస్తాడు. అదీగాక మీ పొరపాట్లు క్షమిస్తాడు. దేవుడు ఎంతో ఆదరించేవాడు, విశాలహృదయుడు; గోచర అగోచర విషయాలన్నీ ఎరిగినవాడు; అపార శక్తిమంతుడు; అసామాన్య వివేకవంతుడు. (17,18) ✪

**అవతరణ: మదీనా** **65. విడాకులు (తలాఖ్)** **సూక్తులు: 11**

ఈ అధ్యాయాన్ని "తలాఖ్" అంటారు. 2వ అధ్యాయంలోని విడాకులకు సంబంధించిన తొలిఆజ్ఞలు అవతరించిన తర్వాత ఇది అవతరించి ఉండవచ్చని తెలుస్తోంది. ఇందులో విడాకులు, విడాకులుపొందిన స్త్రీల సమస్యల్ని గురించి చర్చలు ఉన్నాయి.

**కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం**

ప్రవక్తా! "మీరు మీ స్త్రీలకు విడాకులివ్వదలిస్తే వారి గడువు (ఆరంభం)లో వారికి విడాకులివ్వండి. గడువుకాలం సరిగ్గా లెక్కపెట్టండి. మీ ప్రభువయిన దేవునికి భయపడుతూ వ్యవహరించండి. (గడువు కాలంలో) వారు స్పష్టంగా ఏదైనా చెడ్డపని చేస్తే తప్ప వారిని (మీ) ఇండ్ల నుంచి పంపివేయకండి. స్వయంగా వారు కూడా ఇల్లు వదలి వెళ్ళి పోకూడదు. ఇవి దేవుడు నిర్ణయించిన హద్దులు.[1] దేవుడు నిర్ణయించిన

2. మనిషికి సాధారణంగా సంతానం, సిరిసంపదల పట్లే ఎక్కువ వ్యామోహం ఉంటుంది. సంతానం, సిరిసంపదలే అతనికి దైవమార్గంలో అవరోధాలై నిలుస్తాయి. అందుకే విశ్వాసి వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని ఈసూక్తి చెబుతోంది. దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు:

"నీవొక శత్రువుని చంపి విజయం సాధించాననో లేక అతను నిన్ను చంపడం వల్ల నీకు స్వర్గప్రాప్తి కలుగుతుందనో అనుకుంటావు. కాని నీ అసలు శత్రువు అతను కాదు. నీ అసలు శత్రువు నీ కడుపున పుట్టిన పిల్లవాడు కావచ్చు. అంతకంటే పెద్ద శత్రువు నీ అధీనంలో ఉన్న నీ సిరి సంపదలే." (తబ్రాని) (8:27,28 సూక్తులు కూడా చూడండి.)

1. మానవ జీవితానికి సంబంధించిన ప్రతి వ్యవహారంలోను దేవుడు కొన్ని హద్దులు నిర్ణయించాడు. మనిషి ఈ హద్దులు అతిక్రమిస్తే ఉభయ లోకాల్లోనూ నష్టమే. విడాకుల విషయం



హద్దులు అతిక్రమించేవాడు ఆత్మవంచనకు పాల్పడినవాడవుతాడు.

ఆ తరువాత దేవుడు బహుశా ఏదైనా అనుకూల వాతావరణం సృజించవచ్చు. మీకా విషయం తెలియదు. వారి గడువు కాలం ముగిసే సమయం ఆసన్నమైనప్పుడు వారిని (వేధించకుండా) మంచి పద్ధతితో (వివాహబంధంలో) ఆపి ఉంచండి, లేదా (విడాకులిచ్చి పంపివేయడం తప్పదనుకుంటే తగాదాలేమీ లేకుండా) మంచిగా వారి నుండి విడిపోండి. (అప్పుడు) మీలో న్యాయం పాటించే ఇద్దరు వ్యక్తుల్ని సాక్షులుగా పెట్టుకోండి. (వారు) దేవుని కోసం ఉన్నదిఉన్నట్లు సరిగ్గా సాక్ష్యమివ్వాలి.

(ఈవిధంగా) దేవుణ్ని, అంతిమదినాన్ని విశ్వసించినవారికి ఈమాటల ద్వారా ఉపదేశం చేయబడుతోంది. దేవునికి భయపడుతూ వ్యవహరించేవాడికి దేవుడు కష్టాల నుంచి బయట పడేందుకు ఏదైనా దారి చూపుతాడు. (ఒకవేళ ఆర్థిక ఇబ్బందులుంటే) అతనికి దేవుడు అతని ఊహ సైతం పోని దిశనుండి ఉపాధినిస్తాడు. దేవుణ్ని నమ్ముకునేవాడికి దేవుడే చాలు. దేవుడు తన పని తప్పకుండా నెరవేరుస్తాడు. ఆయన ప్రతి దానికీ ఓలెక్క నిర్ణయించిపెట్టాడు.(1-3)

మీ స్త్రీలలో ఎవరైనా రుతుస్రావం పట్ల నిరాశచెందిఉంటే, వారి (గడువు నిర్ణయించే విషయంలో) మీకేదైనా అనుమానం కల్గినప్పుడు వారి గడువు మూడు నెలలు (అని తెలుసుకోండి). ఈఆజ్ఞ రుతుస్రావం ఆరంభంకానివారికి కూడా వర్తిస్తుంది. ఇక గర్భవతుల విషయానికివస్తే, వారి గడువుకాలం వారు ప్రసవించే వరకు ఉంటుంది.[2]

లోనూ అంతే. విడాకులంటే ఆషామాషీ విషయం కాదు. పెద్దల సమక్షంలో ఒక స్త్రీ, ఒక పురుషుడి మధ్య వివాహరూపంలో ఏర్పడిన పవిత్ర బంధాన్ని విడాకులిస్తున్నానని ఏకకాలంలో మూడుసార్లు పలికితే ఆ బంధం తెగిపోవచ్చుగాని, ఆ చర్య ఘోరమైన తప్పుగా మిగిలిపోతుంది. ఖలీఫా ఉమర్ (రజి) అలాంటివ్యక్తిని కొట్టేవారు. ఆతర్వాతే ఆయన విడాకుల్ని అమలు పరచేవారు. భార్యాభర్తలు విడిపోవడానికి గడువుకాలం నిర్ణయమయింది. ఆ గడువు లోపల విభేదాలు దూరంచేసుకోవడానికి, రాజీపడటానికి ప్రయత్నించాలి. ఇక పొసగదని తేలినప్పుడే గడువు (ఇద్దత్) ముగిసిన తరువాత మూడవసారి విడాకులిచ్చి భర్త తన భార్య నుండి విడిపోవలసి ఉంటుంది...

ఈసూక్తి ప్రకారం స్త్రీకి విడాకులు ఎప్పుడు పడితే అప్పుడు ఇవ్వడానికి వీల్లేదు. స్త్రీ బహిష్టు అయి ఉన్నప్పుడు తలాఖ్ ఇవ్వకూడదు. రుతుస్రావం ఆగిపోయి ఆమె స్నానం చేసిన తర్వాతనే ఒకసారి తలాఖ్ ఇచ్చానని చెప్పాలి. అయితే ఆ తర్వాత ఆమెతో లైంగిక సంబంధం పెట్టుకోకూడదు. ఈవిధంగా రెండవసారి కూడా రుతుస్రావం ఆగిపోయి స్నానం చేసిన తర్వాతనే తలాఖ్ ఇవ్వాలి. ఈలోగా భార్యాభర్తలు రాజీపడటానికి ప్రయత్నించాలి. చివరి ప్రయత్నం కూడా ఫలించకపోతే మూడవసారి రుతుస్రావం ఆగిపోయి స్నానం చేసిన తర్వాత విడాకులిచ్చానని చెప్పి ఆమె నుండి శాశ్వతంగా దూరం కావాలి. (మరిన్ని వివరాలకు 2:228 సూక్తి, దాని పాదసూచిక చూడండి.)

2. గర్భవతి విడాకులుపొందిన స్త్రీఅయినా, వితంతువైనా ఆమె గడువుకాలం ప్రసవించే వరకు మాత్రమే ఉంటుంది. ప్రసవించిన మరుసటి రోజునుంచే ఆమె మెట్టిల్లు వదలి రెండో పెళ్ళి చేసుకోవచ్చు. ముస్లిం, బుఖారి హదీసుల ప్రకారం హజ్రత్ సాద్ బిన్ ఖౌలా (రజి) చనిపోయిన కొన్నాళ్ళ తరువాత (విభిన్న ఉల్లేఖనాలలో పేర్కొన్నదానిని బట్టి నలభై రోజుల లోపు) ఆయన భార్య

దేవుడు తనకు భయపడేవారికి తగిన సౌలభ్యం కలిగిస్తాడు. ఇది దేవుని ఆజ్ఞ. దాన్ని ఆయన మీ దగ్గరికి అవతరింపజేశాడు. ఎవరు దేవునికి భయపడతాడో దేవుడు అతనిలోని చెడులు తొలగించి అతనికి గొప్ప ప్రతిఫలం ప్రసాదిస్తాడు. (4,5)

(గడువుకాలంలో) వారిని మీరు నివసించే చోటనే ఉంచండి. ఆచోటు ఎలాంటి దయినా పరవాలేదు. వారిపై వత్తిడి తేవడానికి (పొమ్మనలేక పొగ పెట్టినట్లు) వారిని వేధించకండి.

వారు గర్భవతులయి ఉంటే ప్రసవించేవరకు వారి (పోషణ తదితర అవసరాల) కోసం ఖర్చుపెట్టండి. ఆ తరువాత వారు మీకోసం (బిడ్డకు) పాలు పట్టవలసివస్తే, అందుకు వారికి ప్రతిఫలం ముట్టజెప్పండి.

మీరు పరస్పరం సంప్రదించుకొని ఉభయులకు ఆమోదయోగ్యమయిన రీతిగా నిర్ణయం తీసుకోండి. ఒకవేళ (ప్రతిఫలం నిర్ణయంలో) మీరు ఒకరికొకరు ఇబ్బందులు కలిగించుకునే పరిస్థితి ఏర్పడితే మరెవరైనా స్త్రీ చేత బిడ్డకు పాలు పట్టించాలి. (6)

ధనికుడు తన ఆర్థిక స్తోమతను బట్టి ఈపోషణ ఖర్చులు భరించాలి. తక్కువ ఉపాధి ఇవ్వబడినవాడు దేవుడు తనకిచ్చిన దాన్నుంచే ఎంతోకొంత ఖర్చుపెట్టాలి.

దేవుడు ఎవరికెంత ఇచ్చాడో అంతకు మించి వారిపై భారం మోపడు. దేవుడు మనిషికి లేమి తరువాత కలిమి కూడా ప్రసాదించవచ్చు. (7)

ఎన్నో జనపదాల్లోని జనం తమ ప్రభువాజ్ఞను, ఆయా ప్రవక్తల బోధనలను తిరస్కరించారు. అప్పుడు మేము వారిని కఠినంగా నిలదీసి తీవ్రంగా శిక్షించాము.

(ఇలా) వారు తమ అకృత్యాల దుష్ఫలితం చవిచూశారు. వారి పర్యవసానమంతా నష్టమే నష్టం. (ఇక పరలోకంలో నయితే) దేవుడు వారికోసం (అంతకంటే) ఘోరమైన శిక్ష సిద్ధపరచి ఉంచాడు.

కనుక సత్యాన్ని విశ్వసించిన బుద్ధిమంతులారా! దేవునికి భయపడండి. దేవుడు మీ దగ్గరకు హితబోధ అవతరింపజేశాడు.

విశ్వసించి సత్కార్యాలు చేసే (ఉద్దేశ్యం కల) వారిని (అజ్ఞాన) చీకటి నుండి (జ్ఞాన) కాంతిలోకి తీసుకురావడానికి ఆయన మీకు స్పష్టమయిన దైవసూక్తులు విన్పించే సందేశహరుడ్ని కూడా పంపించాడు.

సత్యాన్ని విశ్వసించి సత్కార్యాలు చేసేవారిని దేవుడు సెలయేరులు ప్రవహించే స్వర్గవనాలలో ప్రవేశింపజేస్తాడు. వారక్కడ శాశ్వతంగా ఉంటారు. అలాంటి వారికి దేవుడు అత్యంత శ్రేష్ఠమైన ఉపాధి ప్రసాదిస్తాడు. (8-11)

---

అస్లమియ్య (రజి) ప్రసవించారు. అప్పుడు ఒకాయన, "(2:234 సూక్తి ప్రకారం) నీవు నాలుగునెలల పదిరోజుల (గడువు)కు ముందు రెండవ వివాహం చేసుకోలే"వని అన్నాడు. హజ్రత్ అస్లమియ్య (రజి) ఈమాట విని దైవప్రవక్త (సల్లం) సన్నిధికి పోయి విచారించారు. దైవప్రవక్త (సల్లం) ఆమెకు జవాబిస్తూ "నీవు ప్రసవించగానే రెండోపెళ్ళికి ధర్మసమ్మతమైపోతావ"ని చెప్పారు.



ఆ దేవుడే ఏడు ఆకాశాలు సృష్టించాడు. అలాంటివే (మీ) భూమిని పోలినవాటిని కూడా సృష్టించాడు.[3] వాటిపై (కూడా) ఆయన ఆజ్ఞలు అవతరిస్తూ ఉంటాయి. దేవుడు ప్రతి దానిపై అదుపు, అధికారంగల సమర్థుడు, సర్వశక్తిమంతుడని; ఆయన జ్ఞానం ప్రతి వస్తువునీ, ప్రతి విషయాన్నీ పరివేష్ఠించి ఉందని మీరు తెలుసుకోవడానికే (ఈ సంగతి మీకు తెలియ జేయబడుతోంది). (12) ✪

---

3. "అలాంటివే (మీ) భూమిని పోలినవాటిని కూడా సృష్టించాడ"ంటే ఏడు ఆకాశాల్లా ఏడు భూముల్ని మాత్రమే సృష్టించాడని అర్థంకాదు. ఇది అరబీలో పెద్దసంఖ్యను కూడా సూచిస్తుంది. "భూమిని పోలినవాటిని కూడా" అంటే బుద్ధిజీవులుగల మన భూమిని పోలిన భూములని అర్థం. దీన్నిబట్టి విశ్వంలో మనలాంటి బుద్ధిజీవులుండే అనేక గ్రహాలు ఉన్నాయని తెలుస్తోంది.

హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ఈసూక్తిని గురించి వ్యాఖ్యానిస్తూ ఇలా అన్నారు: "వాటిలోని ప్రతి భూమండలంలో మీ (ముహమ్మద్) ప్రవక్త (సల్లం)ను పోలిన ప్రవక్తలు ఉన్నారు; మీ ఆదం (అలైహి)ను పోలిన ఆదంలు ఉన్నారు; మీ నూహ్ (అలైహి)ను పోలిన నూహ్‌లు ఉన్నారు; మీ ఇబ్రాహీం (అలైహి)ను పోలిన ఇబ్రాహీంలు ఉన్నారు; మీ ఈసా (అలైహి)ను పోలిన ఈసాలు ఉన్నారు." (ఇబ్నె జరీర్, ఇబ్నె అబీ హాతిం, హాకిం, కితాబుల్ అస్మా వస్సిఫాత్- బైహఖి)

క్వాంటం సిద్ధాంతం ఆధారంగా హ్యూగ్ ఎవరెట్ ప్రతిపాదించిన మల్టీ యూనివర్స్ సిద్ధాంతం ప్రకారం మన భూమండలానికి, ఇక్కడున్న సృష్టిరాసులకు డూప్లికేట్లు ఉంటాయట!

"ఎకనామిస్ట్" (లండన్) అనే పత్రిక 26-7-1969 తేదీ సంచిక ప్రకారం అమెరికాకు చెందిన "ర్యాండ్ కార్పొరేషన్" సంస్థ ఇతర గ్రహాలలో బుద్ధిజీవుల ఉనికిని గురించి పరిశోధన జరిపింది. దానిప్రకారం మన "పాలపుంత"లో మనభూమి వాతావరణాన్ని పోలిన అరవై కోట్ల గ్రహాలున్నాయి. ఈ గ్రహాలలో జీవరాసులు ఉండవచ్చని కూడా ఈ పరిశోధన ద్వారా తెలుస్తోంది.

విశ్వాంతరాళంలో మన భూమండలాన్ని పోలిన అనేక గ్రహాలున్నాయని, అక్కడ కూడా మనలాంటి బుద్ధిజీవులున్నారని ఈనాటి శాస్త్రవేత్తలు చెబుతున్న యదార్థాన్ని 1400 సంవత్సరాల క్రితమే ముస్లిం పండితులు తెలియజేశారు. (16:49, 42:29 సూక్తులు కూడా చూడండి.)

3-3-1972న అమెరికా పంపిన పయొనీర్-10 అంతరిక్షనౌక బుద్ధిజీవుల ఉనికిని అన్వేషిస్తూ మన సౌరమండలం దాటి ముందుకు ఇంకా పయనిస్తూనే ఉంది. మార్గమధ్యలో మనలాంటి బుద్ధి జీవి ఏదైనా కన్పిస్తే గుర్తించడానికి ఈ నౌకకు ఒక అల్యూమినియం ఫలకాన్ని అమర్చారు. దానిమీద ఒక స్త్రీ, ఒక పురుషుని నగ్నచిత్రంతో పాటు ఇతర బుద్ధిజీవుల కోసం సువర్ణక్షరాలతో రాయబడిన ఒక సందేశం కూడా ఉంది.

అలాగే 1977లో అమెరికా ప్రయోగించిన వాయెజర్-1 నౌక మన భూమి నుండి 1350 కోట్ల కిలోమీటర్ల ప్రయాణం చేసి ఇప్పుడు మన సౌరవ్యవస్థ అంచుకు చేరిందని తెలుస్తోంది. ఇది కూడా ఇతర గ్రహాలలో బుద్ధిజీవుల అన్వేషణ కోసం పంపబడిన నౌకే ఈ నౌకలో మన భూమి మీద జీవం ఉందని తెలిపే 55 భాషలతో కూడిన శబ్దచిత్ర పరికరాలను ఉంచారు. ఈ అంతరిక్ష నౌక ఇంకా 40 వేల సంవత్సరాల వరకు మరో నక్షత్రానికి లేదా గ్రహానికి చేరుకోదని నాసా (అమెరికా) శాస్త్రవేత్తలు తెలిపారు!

అవతరణ: మదీనా

# 66. నిషేధం (తహ్రీమ్)

సూక్తులు: 12

ఈ అధ్యాయాన్ని "తహ్రీం" అంటారు. ఇది హిజ్రీశకం ఏడెనిమిది సంవత్సరాల మధ్య అవతరించి ఉండవచ్చని తెలుస్తోంది. దీని పూర్వపరాలు ఈవిధంగా ఉన్నాయి:

దైవప్రవక్త (సల్లం) సాధారణంగా ప్రతిరోజూ అస్‌నమాజ్ తరువాత ఓసారి తమ భార్య లందరి ఇండ్లను చుట్టివచ్చేవారు. అయితే ఓరోజు ఆయన హజ్రత్ జైనబ్ (రజి) ఇంటికి వెళ్ళి అక్కడ తేనె సేవిస్తూ కొంచెం ఆలస్యం చేశారు. దానివల్ల హజ్రత్ ఆయిషా (రజి) ఆ సవతిపై అసూయపడ్డారు. ఆమె తన ఇతర సవతులు హజ్రాత్ హఫ్సా (రజి), సౌదా (రజి), సఫియా (రజి)లను సంప్రదించి "దైవప్రవక్త (సల్లం) మన దగ్గరకు వచ్చి నప్పుడు ఆయన నోటినుండి మగాఫిర్ (తేనె వాసనగల ఒక విధమైన పూవు) వాసన వస్తోందని చెబుదాం" అని నిర్ణయించుకున్నారు. నిర్ణయం ప్రకారం వారంతా తమ దగ్గరకు దైవప్రవక్త (సల్లం) వచ్చినప్పుడల్లా మగాఫిర్ వాసన వస్తోందని అనేవారు. దాంతో దైవప్రవక్త (సల్లం) తేనెను సేవించడం మానేశారు.

దైవప్రవక్త (స) చేసే ప్రతి పనీ విశ్వాసులకు ఆదర్శప్రాయమవుతుంది. అందువల్ల దేవుడు తాను మానవులందరికీ ధర్మసమ్మతం చేసిన తేనెను ప్రవక్త తనకోసం నిషేధిం చుకోవడాన్ని వారిస్తూ ఈ అధ్యాయం అవతరింపజేశాడు.

## కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

ప్రవక్తా! దేవుడు మీ (ముస్లింల) కోసం ధర్మసమ్మతం చేసిన దాన్ని[1] నిషేధించు కుంటావా నీవు? (దీనిద్వారా) నీవు నీ భార్యలకు సంతోషం కల్గించదలిచావా? (సరే పోనివ్వు) దేవుడు క్షమాశీలి, దయామయుడు. దేవుడు మీకోసం మీ ప్రమాణాల పరిపూర్తి నుండి బయటపడేందుకు ఒక పద్ధతి నిర్ణయించాడు. దేవుడే మీ కార్యసాధకుడు. ఆయన సర్వం తెలిసినవాడు, ఎంతో వివేకవంతుడు. (1,2)

దైవప్రవక్త తన భార్యలలో ఒక భార్యతో రహస్యంగా ఒక మాటన్నాడు.[2] తరువాత ఆమె ఆ రహస్యాన్ని (మరొకరి ముందు) బహిర్గతంచేయగానే ఆ సంగతి దేవుడు తన ప్రవక్త (స)కు తెలియజేశాడు. అప్పుడు దైవప్రవక్త (ఆ భార్యకు) విషయం కొంత తెలిపి కొంత దాటవేశాడు. ఆతర్వాత ఈ (రహస్యం బయటపడిన) సంగతి ప్రస్తావించినప్పుడు ఆమె (ఆశ్చర్యపోతూ) "మీకీ సంగతి ఎవరు తెలియజేశారు?" అని అడిగింది. దానికి దైవప్రవక్త "సర్వం ఎరిగినవాడు, బాగా తెలిసినవాడు నాకు తెలియజేశాడు" అన్నాడు.

(ప్రవక్త సతులారా!) మీరిద్దరి హృదయాలు గాడి తప్పాయి. కనుక పశ్చాత్తాపంతో దైవాన్ని క్షమాపణ కోరుకోండి. మీరు గనక దైవప్రవక్తకు వ్యతిరేకంగా ముఠా కట్టితే,

1. అంటే తేనె అని అర్థం.

2. ఈ సూక్తిలో ప్రస్తావించబడిన రహస్యవిషయమేమిటో దేవుడు తనగ్రంథంలో చెప్పలేదు. దైవప్రవక్త (సల్లం) కూడా బయటపెట్టలేదు. కనుక అలాంటి రహస్యాన్ని గురించి ఆరాతీయడం వృధాప్రయాస. ముఖ్యంగా భార్యాభర్తల రహస్యాల్ని గురించి ఆరాతీయడం మంచిది కాదు.



దేవుడు అతనికి రక్షకుడుగా ఉన్నాడు. ఆతర్వాత (దైవదూత)జిబ్రీల్, సజ్జనులైన యావత్తు విశ్వాసులు, దైవదూతలు అతనికి సహాయకులుగా ఉన్నారు. (3,4)

ఒకవేళ దైవప్రవక్త మీకందరికీ విడాకులివ్వడం జరిగితే, దేవుడు మీ స్థానంలో అతనికి మీకంటే శ్రేష్ఠమయిన భార్యల్ని ప్రసాదిస్తాడు. వారు (మీకంటే) ఎంతో మంచి ముస్లింలుగా, విశ్వసనీయులుగా, వినయవతులుగా, క్షమాపణ కోరుకునేవారుగా, దైవారాధకులుగా, ఉపవాసకులుగా ఉంటారు. వారు భర్తవిహీనులూ కావచ్చు, లేదా కన్యలూ కావచ్చు. (5)

విశ్వాసులారా! మీరు మిమ్మల్ని, మీ భార్యాపిల్లల్ని నరకాగ్ని నుండి రక్షించుకోండి.[3] ఆ నరకాగ్నికి మానవులు, రాళ్ళు సమిధలవుతారు. అక్కడ దృఢకాయులయిన, కఠిన (హృదయులైన) దైవదూతలు (నరక నిర్వాహకులుగా) నియమితులయి ఉంటారు. వారు దేవుని ఆజ్ఞలను ఏమాత్రం జవదాటరు. ఏ ఆజ్ఞ వచ్చినా తక్షణమే దాన్ని శిరసావహిస్తారు. (వారు నరకవాసులతో) "అవిశ్వాసులారా! ఈరోజు మీరు సాకులు చెప్పకండి. మీరెలాంటి కర్మలు చేసుకున్నారో అలాంటి ప్రతిఫలమే మీకివ్వబడుతోంది" అంటారు. (6,7)

విశ్వాసులారా! మీరు మనస్ఫూర్తిగా దేవుడ్ని క్షమాపణ కోరుకోండి. మీ ప్రభువు మీ పాపాలు మన్నించి, మిమ్మల్ని సెలయేరులు ప్రవహించే స్వర్గవనాలలో ప్రవేశింప జేస్తాడు. ఆరోజు దేవుడు తన ప్రవక్తకు, అతనితోపాటు విశ్వసించినవారికి ఎలాంటి అవమానాలకు గురిచేయడు. వారి జ్యోతి వారి ముందు కుడివైపు పరుగెత్తుతూ ఉంటుంది. అప్పుడు వారు "ప్రభూ! మా జ్యోతి[4]ని మాకోసం పరిపూర్ణం(గా కాంతి నిచ్చేలా) చెయ్యి. మమ్మల్ని క్షమించు. నిస్సందేహంగా నీవు ప్రతిదానిపై అదుపు కలిగిఉన్నావు" అని ప్రార్థిస్తారు. (8)

ప్రవక్తా! అవిశ్వాసులతో, కపటులతో పోరాడు. వారిపట్ల కఠినంగా వ్యవహరించు. వారి నివాసం నరకమవుతుంది. అది మహా చెడ్డ నివాసం. (9)

అవిశ్వాసుల విషయంలో దేవుడు నూహ్, లూత్ (ప్రవక్త)ల భార్యల్ని ఉదాహర ణలుగా పేర్కొంటున్నాడు. ఆ స్త్రీలిద్దరు పుణ్యాత్ములైన మా భక్తులిద్దరి దాంపత్యంలో

3. ఒక వ్యక్తిపై తన భార్యా పిల్లల సంరక్షణ బాధ్యత ఎలా ఉంటుందో, వారిని సన్మార్గ గాములుగా తీర్చిదిద్దవలసిన బాధ్యత కూడా అతనిపై ఉంది. దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు:

"మీలో ప్రతివ్యక్తీ బాధ్యతాయుతుడయిన సంరక్షకుడే. కనుక మీలో ప్రతివ్యక్తీ అతని సంరక్షణలో ఉండేవారిని గురించి (పరలోక న్యాయస్థానంలో) ప్రశ్నించబడతాడు. పాలకుడు పాలిత ప్రజల సంరక్షకుడు. అతను తన ప్రజల విషయంలో బాధ్యుడవుతాడు. పురుషుడు తన భార్యా పిల్లలకు సంరక్షకుడు. అతను వారి విషయంలో బాధ్యుడవుతాడు. స్త్రీ తన భర్త ఇంటికి, అతని పిల్లలకు సంరక్షకురాలు. ఆమె వారి విషయంలో బాధ్యురాలవుతుంది." (బుఖారీ)

4. పరలోక జ్యోతి గురించిన వివరాలకు 57:12-15 సూక్తులు చూడండి.

ఉండేవారు. అయితే వారు తమ భర్తలపట్ల విశ్వాసఘాతుకానికి పాల్పడ్డారు.[5] అందువల్ల వారా స్త్రీలను దేవుని (శిక్ష) నుండి ఏమాత్రం కాపాడలేకపోయారు. వారిద్దరితో "వెళ్ళండి, అగ్నిలో పడేవారితోపాటు మీరూ అగ్నిలోకి పోయిపడండి" అని చెప్పడం జరిగింది. (10)

విశ్వాసుల విషయంలో దేవుడు ఫిరౌన్ భార్య గాథను దృష్టాంతంగా పేర్కొంటు న్నాడు. ఆమె (దైవాన్ని ప్రార్థిస్తూ) "ప్రభూ! నాకోసం నీ దగ్గర స్వర్గంలో ఒక గృహం నిర్మించు. నన్ను ఫిరౌన్ బారినుండి, అతని (దుష్ట)కర్మల (కీడు)నుండి కాపాడు. (ఈ) దుర్మార్గపు జాతి నుండి నాకు విముక్తి కలిగించు" అని అన్నది. (11)

అలాగే దేవుడు ఇమ్రాన్ కుమార్తె మర్యంని కూడా ఉదాహరణగా పేర్కొంటు న్నాడు. ఆమె తన మానాన్ని కాపాడుకున్న పరమ శీలవతి. మేము మావైపు నుండి ఆమె (గర్భం)లోకి ఒక ఆత్మను ఊదాము. ఆమె తనప్రభువు బోధనలను, ఆయన గ్రంథా లను విశ్వసించి, దైవవిధేయులలో చేరిపోయింది. (12) ✪

## అవతరణ:మక్కా 67. సార్వభౌమత్వం (ముల్క్) సూక్తులు:30

ఈ అధ్యాయాన్ని "ముల్క్" (రాజ్యం లేక సార్వభౌమత్వం) అంటారు. ఇది నబవి శకారంభంలో అవతరించి ఉండవచ్చని తెలుస్తోంది. ఇందులో దేవుని శక్తిసామర్థ్యాలను, మరణానంతర జీవితంలో సత్యాన్ని విశ్వసించనివారికి ఎదురయ్యే భయంకర పరిణామా లను గురించి ప్రస్తావిస్తూ, మానవుల్ని దేవుని ఏకత్వం వైపు పిలవడం జరిగింది.

### కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

యావత్తు విశ్వసార్వభౌమత్వం కలిగివున్న దేవుడు ఎంతో శుభదాయకుడు. ఆయన ప్రతి వస్తువుపై, ప్రతి విషయంపై సర్వాధికారం కలిగి ఉన్నాడు.[1] మీలో ఎవరు మంచి పనులు చేస్తారో (మరెవరు చెడ్డ పనులు చేస్తారో) పరీక్షించడానికి ఆయన జీవన్మ రణాలు సృష్టించాడు. ఆయన మహా శక్తిమంతుడు, గొప్ప క్షమాశీలి. (1,2)

---

5. ఈ స్త్రీలిద్దరూ తమ భర్తల పట్ల విశ్వాసఘాతుకానికి పాల్పడ్డారంటే నీతి బాహ్యమైన చేష్టలకు ఒడిగట్టారని అర్థం కాదు. వారు ధర్మం విషయంలో తమ భర్తలతో సహకరించ లేదు. పైగా దాన్ని తిరస్కరించి సత్యతిరస్కారులతో చేతులు కలిపారు. హజ్రత్ నూహ్ (అలైహి) భార్య దుర్మార్గులు, దౌర్జన్యపరులైన తన జాతి నాయకులకు ఇస్లాం విశ్వసించినవారిని గురించి ఎప్పటి కప్పుడు సమాచారం అందజేస్తుండేది. అలాగే హజ్రత్ లూత్ (అలైహి) భార్య కూడా తన భర్త ఇంటికి వచ్చేవారిని గురించి దుర్మార్గులైన తన జాతినాయకులకు సమాచారం అందజేస్తుండేది.

1. ఈ సూక్తిలో యావత్తు విశ్వసార్వభౌమత్వం దేవుని చేతిలోనే ఉందని, ఆయనకు ప్రతి విషయంపై సర్వాధికారం ఉందని చెబుతోంది ఖుర్‌ఆన్. అంటే ఆయన యావత్తు విశ్వవ్యవస్థను శూన్యం నుంచి సృష్టించి, దాన్ని తనఅభీష్టం ప్రకారం పకడ్బందీగా నిర్వహిస్తున్నాడు. ఆయనే కోట్లాది గ్రహాలకు, నక్షత్రాలకు తమ తమ నిర్ణీత కక్ష్యలలో నియమబద్ధంగా సంచరించేలా నిర్దేశించాడు. ఆయన అణువణుపై అదుపు, అధికారం కలిగి ఉన్న అపారశక్తి సంపన్నుడు. విశ్వ నిర్మాణానికి, విశ్వంలోని మొత్తం సృష్టిరాసుల సృజనకు కావలసిన సూక్ష్మాతి సూక్ష్మమైన మూల పదార్థాలపై సైతం ఆయనకు పూర్తి అధికారం ఉంది.



ఆయన ఒకదానిపై ఒకటి ఏడు ఆకాశాలు నిర్మించాడు. (చూడండి) కరుణా మయుని సృష్టినిర్మాణంలో మీకేదైనా క్రమరాహిత్యం కన్పిస్తుందా? కన్పించదు. మరో సారి చూడండి. ఎక్కడైనా మీకు ఏదైనా లోపం కన్పిస్తుందా? (కావాలంటే) మళ్ళీమళ్ళీ చూడండి. (చివరికి) మీచూపులే అలసిసొలసి అవమానభారంతో వెనక్కి మరలుతాయి.

మీకు సమీపంలో ఉన్న ఆకాశాన్ని మేము అద్భుతమైన (తారా)దీపాలతో తీర్చిదిద్ది వాటిని పిశాచశక్తుల్ని తరిమికొట్టే సాధనాలుగా చేశాం. ఈ పిశాచశక్తుల కోసం మేము భగభగ మండే అగ్నిని సిద్ధపరచి ఉంచాము. (అలాగే) విశ్వప్రభువును తిరస్కరించిన వారి కోసం నరకశిక్ష కాచుకొని ఉంది. నరకం పరమచెడ్డ నివాసం. అందులో విసరి వేయబడేటప్పుడు వారు దాని భయంకరమైన గర్జనలు వింటారు. అది మండిపడుతూ తీవ్రమైన ఆగ్రహోద్రేకాలతో బ్రద్దలయిపోతున్నట్లు గోచరిస్తుంది.

అందులో (దుష్ట)మూకలను విసరివేసినప్పుడల్లా దాని నిర్వాహకులు వారినుద్దే శించి "మీ దగ్గరకు హెచ్చరించేవారెవరూ రాలేదా?" అని అడుగుతారు. దానికి వారు "ఎందుకు రాలేదు, వచ్చాడొకతను. కాని మేమతడ్ని తిరస్కరించాం. అతనితో 'దేవుడు

---

రసాయనిక శాస్త్రం రీత్యా ఒక శాస్త్రవేత్త దృష్టిలో బొగ్గుకు, వజ్రానికి అట్టే తేడా లేదు. ఈ రెండిటిలోనూ కార్బన్ పరమాణువులే ఉన్నాయి. అయితే దేవుడు ఆ పరమాణుల సంఖ్య, నిర్మాణా లకు సంబంధించి రెండు వేర్వేరు పద్ధతుల్ని అవలంబించడం ద్వారా ఒక పదార్థాన్ని బొగ్గుగా, మరో పదార్థాన్ని వజ్రంగా సృష్టించాడు. ఇలా మొత్తం 110 కి పైగా మూలకాల (Elements) పరమాణువులతో ఈ విశ్వం ఉనికిలోకి వచ్చింది. ఈ మూలకాలన్నిటిపై దేవునికి అదుపు, అధికారాలున్నాయి. అంతేకాదు, ఈ మూలకాల పరమాణువుల్లోని ప్రోటాన్‌లు, న్యూట్రాన్‌లు, ఎలక్ట్రాన్‌లు మొదలైన పరమాణు విభాగాలు కూడా దేవుని అదుపాజ్ఞలలోనే ఉన్నాయి.

రూథర్ ఫర్డ్ అనే శాస్త్రవేత్త పరమాణు నిర్మాణాన్ని సౌరవ్యవస్థతో పోల్చాడు. పరమాణు కేంద్రం (న్యూక్లియస్)లో "ప్రోటాన్"లు అనబడే ధనావేశ కణాలు, "న్యూట్రాన్"లు అనబడే ఆవేశ రహిత కణాలు ఉంటాయి. కేంద్రం చుట్టూ "ఎలక్ట్రాన్"లు అనబడే రుణావేశ కణాలు తమ తమ నిర్ణీత కక్ష్యల్లో అతివేగంగా పరిభ్రమిస్తూ ఉంటాయి. అంతేకాదు, తిరిగి ఈ ఎలక్ట్రాన్‌ల చుట్టూ పాసిట్రాన్, మీసాన్ మొదలైన ముప్ఫయికి పైగా ఉపకణాలు కూడా తిరుగుతూ ఉంటాయి. అంటే సూర్యుని చుట్టూ భూమి, అంగారకుడు తదితర గ్రహాలు, ఆ గ్రహాల చుట్టూ చంద్రుడు లాంటి ఉపగ్రహాలు ఎలా తిరుగుతుంటాయో అలాగే పరమాణువులో న్యూక్లియస్ చుట్టూ ఎలక్ట్రానులు, ఎలక్ట్రాన్‌ల చుట్టూ పాసిట్రాన్, మీసాన్ వగైరా ఉపకణాలు తిరుగుతూ ఉంటాయన్న మాట. (గ్రహాలు, నక్షత్రాలను గురించి 36:36 సూక్తికి రాసిన పాదసూచిక చూడండి.)

పరమాణు వ్యవస్థ ఓ విచిత్ర జగత్తు. ఇందులోని ప్రతి కణమూ, ఉపకణమూ దేవుని అదుపాజ్ఞలలో ఉంటుంది. ఇవన్నీ ఆయన ఆజ్ఞానుసారమే ఎంతో పకడ్బందీగా, నియమబద్ధంగా తమ తమ విధుల్ని నిర్వహిస్తూ ఉంటాయి. అందుకే ఇదే అధ్యాయంలోని 67:3,4 సూక్తులలో దేవుడు ఇలా అంటున్నాడు: "కరుణామయుని సృష్టి నిర్మాణంలో మీకు ఎలాంటి క్రమరాహిత్య మైనా కన్పిస్తుందా? కన్పించదు. మరొకసారి చూడండి ఎక్కడైనా మీకు ఏదైనా లోపం కన్పిస్తుందా? (కావాలంటే) మళ్ళీ మళ్ళీ చూడండి. చివరికి మీ చూపులే అలసిసొలసి అవమాన భారంతో వెనక్కి మరలుతాయి."

ఏదీ పంపలేదు. నీవు చాలా అపమార్గంలో పడిపోయావు అన్నాం" అని అంటారు. (3-

"అయ్యో! మా పాడుగాను!! మేము (ప్రవక్త మాటలు) విని అర్థం చేసుకొనిఉంటే ఈరోజు (మాకీ దుర్గతి పట్టేదికాదు.) మేము అగ్నిశిక్షకు గురైనవారిలో చేరి వుండేవారం కాము" అని కూడా అంటారు వారు. ఈవిధంగా వారు తమ తప్పు ఒప్పుకుంటారు. ఈ నరక వాసులు నాశనం గాను! (ఇప్పుడా వీరు తప్పు ఒప్పుకునేది?) (9-11)

ఎవరు తమ ప్రభువును (ప్రత్యక్షంగా) చూడకుండానే ఆయనకు భయపడతారో వారి కోసం పాపమన్నింపు, గొప్ప సుకృతఫలం ఉన్నాయి. మీరు మెల్లగా మాట్లాడినా, బిగ్గరగా మాట్లాడినా ఒకటే; ఆయనకు (మీ) అంతరంగాల్లో మెదిలే నిగూఢ విషయాలు సయితం తెలుసు. సృష్టించినవాడికి (తన దాసుల సంగతి) తెలియదా మరి? ఆయన ఎంతో సూక్ష్మగ్రాహి, సర్వం తెలిసినవాడు. (12-14)

మీరు భూమి ఉపరితలంపై (నిశ్చింతగా) తిరిగేందుకు ఆయనే దాన్ని అదుపులో ఉంచాడు. దేవుడు ప్రసాదించిన ఉపాధి (ఒనరులు) అనుభవించండి. చివరికి మీరు (మరణానంతరం) ఆయన సన్నిధికే పునర్జీవులయి పోవలసి ఉంది. (15)

ఆకాశంలో ఉన్నవాడు మిమ్మల్ని హఠాత్తుగా భూమిలోకి దిగబడేలా చేయడని, భూమి తీవ్ర ప్రకంపనలతో ఊగిపోదని మీరు నిర్భయంగా ఉన్నారా? (లేక) ఆకాశంలో ఉన్నవాడు మీపైకి రాళ్ళ తుఫాన్‌ని పంపడని నిశ్చింతగా ఉన్నారా? (ఆ విపత్తు వచ్చి పడగానే) అప్పుడు తెలుస్తుంది మీకు నా హెచ్చరికలు ఎలాంటివో. (16,17)

వీరికి పూర్వం గతించినవారు కూడా (ప్రవక్తలను) తిరస్కరించారు. ఇక నా పట్టు ఎంత కఠినంగా ఉండేదో చూడు. వీరు తమమీద రెక్కలు జాపుతూ, ముడుస్తూ ఎగిరే పక్షుల్ని పరికించి చూడలేదా? (అలా) వాటిని (ఏ ఆధారం లేకుండా) పట్టి ఉంచేవాడు కరుణామయుడు తప్ప మరెవరూ లేరు. ఆయన ప్రతి సృష్టిరాసినీ పర్యవేక్షిస్తున్నాడు.

కరుణామయునికి వ్యతిరేకంగా మీ దగ్గర మిమ్మల్ని ఆదుకో గలిగే సైన్యం ఏముందో కాస్త చూపండి (మాకు). వీరసలు పెద్ద మోసానికి గురయి ఉన్నారు. పోని, కరుణామయుడు తన ఉపాధి (మార్గం) మూసేస్తే ఇక మీకు ఉపాధినిచ్చే వారెవరో చెప్పండి మాకు. (ఎవరూ లేరు.) వీరసలు తమ తలబిరుసుతనం, సత్యతిరస్కారాల నుండి బయట పడటానికే సిద్ధంగా లేరు. (18-21)

(సరే,) తల వంచుకొని (మూగెద్దులా) నడిచేవాడు సరైన దారిలో నడుస్తాడా, లేక తల పైకెత్తి సూటిగా చూస్తూ చదునైన బాటపై నడిచేవాడు సరైన దారిలో ఉంటాడా? వారికి చెప్పు: దేవుడే మిమ్మల్ని పుట్టించాడు. ఆయనే మీకు వినే, చూసే శక్తినిచ్చి ఆలోచించే, అర్థం చేసుకునే మేధ కూడా ప్రసాదించాడు. కాని మీరు (ఆయనకు) చాలా తక్కువగా కృతజ్ఞత చూపుతున్నారు. (22,23)

వారికిలా చెప్పు: "మిమ్మల్ని భూమండలంపై విస్తరింపజేసినవాడు దేవుడే. ఆయన సన్నిధిలోనే మీరు (మరణానంతరం) సమీకరించి ప్రవేశపెట్టబడతారు." (24)



వారు (నీ హెచ్చరికలు ఖాతరుచేయకుండా) "నీవు చెప్పేది నిజమయితే (ప్రళయ సంభవం గురించిన) ఈ వాగ్దానం ఎప్పుడు నెరవేరుతుంది?" అనంటారు. వారికిలా చెప్పు: "ఆ సంగతి దేవునికి మాత్రమే తెలుసు. నేను విషయాన్ని అందజేసి హెచ్చరించే వాడ్ని మాత్రమే." (25,26)

ఆ సమయం సమీపించినప్పుడు దాన్ని చూడగానే సత్యతిరస్కారుల ముఖాలు (భయాందోళనలతో) ముడుచుకుపోతాయి. అప్పుడు వారికి "ఇదే మీరు (ఎప్పుడు సంభవిస్తుందని) అడుగుతుండిన విషయం" అని చెప్పడం జరుగుతుంది. (27)

వారిని అడుగు: "మీరెప్పుడైనా ఆలోచించారా? దేవుడు నన్ను, నా అనుచరులను చంపినా లేక కరుణించినా (దానివల్ల మీకు ఒరిగేదేమీ లేదు. కాని) సత్యతిరస్కారులను దుర్భర శిక్ష నుండి ఎవరు కాపాడగలరు?" (28)

వారికిలా తెలియజెయ్యి: "ఆయన ఎంతో కరుణామయుడు, ఆయన్నే మేము విశ్వసిస్తున్నాము; ఆయన్నే నమ్ముకొని ఉంటాము. (కాని) పూర్తిగా మార్గభ్రష్టత్వంలో పడిన వారెవరో మీకు త్వరలోనే తెలిసిపోతుంది." (29)

వారిని అడుగు: "మీ బావులు, కుంటల్లోని నీరు నేలలోకి ఇంకిపోతే ఇక ఆనీటి ఊటల్ని మీకెవరు తీసిస్తారు? దీన్ని గురించి మీరెప్పుడైనా ఆలోచించారా?" (30) ✪

**అవతరణ: మక్కా**

# 68. కలం (ఖలం)

**సూక్తులు: 52**

ఈ అధ్యాయాన్ని "ఖలం" అంటారు. ఇది కూడా నబవీశకం ప్రారంభ కాలంలోనే అవతరించింది. ఇందులో సత్యతిరస్కారుల కువిమర్శలకు, ఆరోపణలకు సమాధానమిస్తూ వారిని హెచ్చరించి హితోపదేశం చేయబడింది. ఈ సందర్భంలో దేవుడు ప్రసాదించిన వరాలు మరచి ఆయనకు కృతఘ్నులైపోయిన ఓ తోట యజమానుల వృత్తాంతం ఉదాహరణగా పేర్కొనబడింది. కాబట్టి సత్యానికి విముఖులయితే మీకూ ఆ తోట యజమానులకు పట్టిన గతే పడ్తుందని హెచ్చరించడం జరిగింది. చివర్లో దైవప్రవక్త (సల్లం)కు సహనం గురించి కొన్ని సూచనలు ఇవ్వబడ్డాయి.

## కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

నూన్...కలం సాక్షి! వ్రాసేవారు వ్రాస్తున్నదాని సాక్షి!! నీ ప్రభువు దయవల్ల నీవు ఏమాత్రం పిచ్చివాడవు కావు. నీకు తప్పకుండా ఎన్నటికీ అంతంకాని గొప్ప ప్రతిఫలం లభిస్తుంది. నిస్సందేహంగా నీవు అత్యున్నత సుగుణసంపత్తి కలవాడవు. మీలో ఎవరు ఉన్మాదులో త్వరలోనే నీకూ తెలుస్తుంది; వారికీ తెలుస్తుంది. (1-6)

నీ ప్రభువుకు తనమార్గం నుండి ఎవరు తప్పిపోయారో బాగా తెలుసు. ఆలాగే ఎవరు సన్మార్గంలో ఉన్నారో కూడా ఆయనకు బాగా తెలుసు. కనుక నీవు సత్యతిరస్కారులు తెచ్చే వత్తిళ్ళకు ఏమాత్రం తలవొగ్గకు. నీవు కొంచెం మెత్తబడితే వారు కూడా కాస్త వెనక్కి తగ్గుదామని భావిస్తున్నారు. (7-9)

(కాని) నీవు మటుకు వారికి ఏమాత్రం లొంగకు. (ముఖ్యంగా) చీటికి మాటికి ఒట్లు వేసుకునే తుచ్ఛుడు, ఎత్తిపొడిచేవాడు, చాడీలు చెబుతూ తిరిగేవాడు, సత్కార్యాల నుండి (ప్రజలను) నిరోధించేవాడు, మితిమీరిన దౌర్జన్యాలకు పాల్పడేవాడు, ఘోరపాపి, పరమ దుర్మార్గుడు, వీటన్నిటికి తోడు ఏమాత్రం నీతిలేని నికృష్టుడు... (ఇలాంటివాడికి లొంగకు).

అతను తన సంతానం, సిరిసంపదలు చూసుకొని మిడిసి పడుతున్నాడు. మా సూక్తులు చదివి విన్పిస్తున్నప్పుడు "ఇవి పూర్వీకుల పుక్కిటి పురాణాలు మాత్రమే" అంటాడు. త్వరలోనే మేము అతనికి ముక్కు మీద వాత పెట్టి అతని పీచం అణచివేస్తాం. (10-16)

మేము పూర్వం ఒక తోట యజమానులకు పరీక్ష పెట్టినట్లు (ఇప్పుడు మక్కా) వారికి కూడా పరీక్ష పెట్టాము. ఆ తోటయజమానులు ప్రమాణంచేసి మరీ తాము (రేపు) ఉదయాన్నే తోటకెళ్ళి తప్పకుండా పండ్లు కోస్తామని అన్నారు. వారు 'దేవుడు తలిస్తే (పండ్లు కోస్తాం)' అనలేదు. ఆరాత్రి వారు గాఢనిద్రలో ఉన్నప్పుడు నీ ప్రభువు నుండి వారి తోటపైకి ఒక విపత్తు వచ్చిపడి, దాన్ని పంటకోయబడిన పొలంలా ధ్వంసం చేసింది. (17-20)

తెల్లవారగానే వారు ఎంతో ఉత్సాహంతో ఒకర్నొకరు కేకవేసి పిలుచుకుంటూ "పండ్లు కోయాలనుకుంటే పెందలాడే తోటకు బయలుదేరండి" అని అన్నారు. ఇలా వారందరూ బయలుదేరారు. (దారిలో) పరస్పరం మాట్లాడుకుంటూ "ఈరోజు మన తోటలోకి పేదవాళ్ళు ఎవరూ రాకుండా చూసుకోవాలి" అని అన్నారు. వారు ఎవరికీ చిల్లిగవ్వ కూడా ఇవ్వరాదని నిర్ణయించుకొని, తొందర తొందరగా వెళ్ళారు పెద్ద మొనగాళ్ళులా. (21-25)

అయితే తోట దగ్గరకు చేరుకొని (నిర్ఘాంతపోయి) చూస్తూ "ఏమిటీ మనం దారితప్పి వచ్చామా...? కాదు కాదు, మన దురదృష్టమే మన కొంపముంచింది" అన్నారు. (26,27)

వారందరిలో కాస్త మంచివాడు (మాట్లాడుతూ) "మీరు దేవుడ్ని ఎందుకు స్మరించరని నేను చెప్పలేదా?" అన్నాడు. అప్పుడు వారు"(నిజం) మనప్రభువు ఎంతో పవిత్రుడు. మనమే దుర్మార్గులం" అన్నారు. ఆ తర్వాత వారు ఒకర్నొకరు నిందించు కున్నారు. (28-30)

చివరికి ఇలా అన్నారు: "అయ్యో! ఎంత దుర్గతి పట్టింది మనకు! నిజంగా మనం చాలా దుర్మార్గులై పోయాం. (ఇప్పుడైనా) మనం పశ్చాత్తాపం చెంది మన ప్రభువుని క్షమాపణ కోరుకుందాము. బహుశా మన ప్రభువు (మనల్ని కనికరించి) ఇంతకంటే మంచితోట ప్రసాదించవచ్చు." (31,32)

ఇలా ఉంటుంది (ఇహలోక) శిక్ష. పరలోక శిక్ష ఇంతకంటే తీవ్రంగా ఉంటుంది. వీరీ సత్యం తెలుసుకుంటే ఎంత బాగుండు! భయభక్తులుకలవారి కోసం వారిప్రభువు



దగ్గర భోగభాగ్యాలతో కూడిన స్వర్గవనాలున్నాయి. మేము విధేయులయినవారిని, అపరాధులను ఒకే దృష్టితో ఎందుకు చూస్తాము? (33-35)

(మీరిక్కడ అష్టయిశ్వర్యాలు అనుభవిస్తున్నంత మాత్రాన దేవుడు మీపట్ల ప్రసన్నుడయ్యాడని, పరలోకంలో కూడా తమకు భోగభాగ్యాలు ప్రసాదిస్తాడని భావిస్తున్నారా?) ఏమైంది మీకు ఇలాంటి నిర్ణయానికి వచ్చారు? మీరు కోరుకున్నవన్నీ అక్కడ తప్పకుండా లభిస్తాయని మీరేదైనా గ్రంథంలో చదివారా? అలాంటి గ్రంథం మీ దగ్గర ఉందా? (36-38)

లేక మీరు కోరిందల్లా మీకు లభించడానికి మేము మీకేదైనా ప్రళయందాకా ఉండే వాగ్దానం చేశామా? దీనికి మీలో ఎవరు బాధ్యులని అడుగు. లేక వారి మిథ్యాదైవాలా (దీనికి బాధ్యులు)? అలాగైతే వారు తమ మిథ్యాదైవాలను (ఇందుకు సాక్ష్యంగా) తీసుకురావాలి. వారి వాదన నిజమయితే ఈపని చేసితీరాలి మరి. (39-41)

(ప్రాపంచిక మైకపు) తెరలు తొలగి యదార్థం ముందుకువచ్చే రోజు (విశ్వ ప్రభువుకు) సాష్టాంగప్రణామం చేయడానికి మానవులు పిలవబడతారు. అప్పుడు వీరు సాష్టాంగపడలేరు. వారి చూపులు (సిగ్గుతో) క్రిందికి వాలిపోతాయి. నైచ్యం, అవమానం వారిని చుట్టుముడ్తాయి. (ఇహలోకంలో) నిక్షేపంగా ఉన్నప్పుడు వీరిని సాష్టాంగ ప్రణామం (దైవ విధేయత) కోసం పిలవడం జరుగుతుండేది. (కాని వీరప్పుడు తిరస్కరించేవారు.) (42,43)

సరే, ప్రవక్తా! ఈ వాణిని తిరస్కరించేవారి వ్యవహారం నాకు వదలిపెట్టు. మేము వారిని వారికేమాత్రం తెలియని రీతిలో క్రమేణా పతనాగాధంలోకి నెట్టివేస్తాము. నేను వారిని చూసీ చూడనట్లు వదిలేస్తున్నాను. నా పన్నాగం ఎంతో పకడ్బందీగా ఉంటుంది.

(సందేశప్రచారం కోసం) నీవేదైనా ప్రతిఫలం అడుగుతున్నావా, ఆ సుంకం బరువు క్రింద వీరు అణగిపోవడానికి? వారి దగ్గరకు అగోచర విషయాలకు సంబంధించిన సమాచార మేదైనా వస్తోందా, దాన్ని వ్రాసుకోవడానికి? (44-47)

కనుక (ప్రవక్తా!) నీ ప్రభువు నిర్ణయం వచ్చేవరకు ఓపిక పట్టు. మత్స్యబాధితుడిలా (అంటే యూనుస్ ప్రవక్తలా అసహనంతో) వ్యవహరించకు. అతను పుట్టెడు దుఃఖంతో (మమ్మల్ని) ఎలుగెత్తి వేడుకున్నాడు. అతడ్ని గనక అతని ప్రభువు కరుణించక పోయి వుంటే, అతను దుస్థితికి గురయి, ఎలాంటి చెట్లు చేమలు లేని మైదానంలో విసరి వేయబడేవాడు. చివరికి అతని ప్రభువు అతడ్ని కటాక్షించి సజ్జనులలో చేర్చాడు.

ఈ అవిశ్వాసులు (మా)వాణి వింటున్నప్పుడు నిన్ను మింగివేస్తామన్నట్లు కొరకొర చూస్తారు. ఇది యావత్తు ప్రపంచవాసుల కోసం అవతరించిన హితవాణి. అయినా వీరు (కారుకూతలు కూస్తూ) "ఇతను కచ్చితంగా పిచ్చివాడే" అంటున్నారు. (48-52) ✪

# 69. పరమ యదార్థం (హాఖ్ఖా)

**అవతరణ: మక్కా** **సూక్తులు: 52**

ఈ అధ్యాయాన్ని "హాఖ్ఖహ్" (పరమయదార్థం) అంటారు. ఇది నబవి శకం ప్రారంభ కాలంలో అవతరించింది. హజ్రత్ ఉమర్ (రజి) ఓరోజు దైవప్రవక్త (సల్లం)ను వేధించడానికి కాబాకు వెళ్ళారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) కాబాలో ప్రార్థన చేస్తున్నారు.

హజ్రత్ ఉమర్ (రజి) ఆ మహనీయుని నోట వెలువడుతున్న ఖుర్‌ఆన్ సూక్తులు వింటూ దాని విశిష్ట శైలి పట్ల ఆశ్చర్యపోతూ "ఇతను తప్పకుండా కవి అయి ఉంటాడు" అని మనసులో అనుకున్నారు. వెంటనే దైవప్రవక్త (స) నోట "ఇదొక గౌరవ నీయుడైన దైవసందేశహరుని వాక్కు. ఏకవి నోటో వెలువడిన వాక్కు కాదు" అని విన్పించింది.

హజ్రత్ ఉమర్ (రజి) మళ్ళీ తన మనస్సులో "కవి కాకపోతే మాంత్రికుడయి ఉంటాడు" అని అనుకున్నారు. ఆ వెనువెంటనే దైవప్రవక్త(స) నోట "ఇది మాంత్రికుడు చెప్పిన మాట కూడాకాదు. మీరసలు చాలా తక్కువగా ఆలోచిస్తారు. ఇది సర్వలోక ప్రభువు నుండి అవతరించిన (దివ్య)వాణి" అన్న సూక్తులు వెలువడ్డాయి.

అప్పుడు హజ్రత్ ఉమర్ (రజి) హృదయంలో ఇస్లాం చోటుచేసుకున్నది కాని, ఆయన వెంటనే దాన్ని విశ్వసించలేదు. ఇలా కొన్ని సంఘటనల తరువాత, చివరికి ఆయన తన చెల్లెల్ని రక్తసిక్తం చేసిన సంఘటనతో చలించిపోయి ఇస్లాం స్వీకరించారు.

**కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం**

పరమ యదార్థం! ఏమిటా పరమ యదార్థం? ఆ పరమ యదార్థం ఏమిటో నీకేమయినా తెలుసా? (1-3)

ఆద్, సమూద్ జాతులు హఠాత్తుగా వచ్చిపడే (ప్రళయ) విపత్తుని తిరస్కరించారు. అందువల్ల సమూద్ ప్రజలు ఒక ఘోరమైన ప్రమాదానికి గురయి హతమయ్యారు. ఆద్ ప్రజలు ఒక భయంకరమైన తుఫాను దెబ్బకు నాశనమయి పోయారు. దేవుడు దాన్ని వరుసగా ఏడు రాత్రిళ్ళు, ఎనిమిది పగళ్ళు వారిమీద పడవేశాడు. (అప్పుడు నీవక్కడ ఉండివుంటే) వారక్కడ ఖర్జూరపు మొదళ్ళు పడినట్లు నిర్జీవంగా పడివుండటం నీకు కన్పించేది. చూడు, వారిలో ఎవడైనా ప్రాణాలతో బయటపడ్డాడా? (4-8)

ఫిరౌన్, అతనికి పూర్వం ఉండిన జాతులు, తల్లక్రిందులయి ధ్వంసమయిన జన పదాల జనం కూడా ఘోరపాపానికి పాల్పడ్డారు. వారంతా తమప్రభువు (పంపిన) ప్రవక్తలకు ఎదురు తిరిగారు. అప్పుడు ఆయన వారిని కఠినంగా పట్టుకున్నాడు. (9,10)

(నూహ్ ప్రవక్త కాలంలో) తుఫాను వరద ఉధృతమై పోయినప్పుడు మేము మిమ్మల్ని ఓడలోకి ఎక్కించాము. ఈ సంఘటన మీకు కనువిప్పు కల్గించే జ్ఞాపికగా మిగిలిపోతుందని, గుర్తుంచుకునే చెవులు దాన్ని భద్రపరచుకుంటాయని మేమిలా చేశాము. (11,12)



ఆ తరువాత (ప్రళయ)శంఖం ఒకసారి పూరించగానే భూమిని, పర్వతాల్ని అమాంతం ఎత్తికుదేసి తునాతునకలు చేయడం జరుగుతుంది. ఆరోజు జరగవలసిన సంఘటన జరుగుతుంది. అప్పుడు ఆకాశం బ్రద్దలై, అస్తవ్యస్తమై పోతుంది. (సరికొత్త విశ్వం ఆవిర్భవిస్తుంది.) నలుదిశలా దైవదూతలు ప్రత్యక్షమయి ఉంటారు. ఆరోజు ఎనిమిది మంది దైవదూతలు నీ ప్రభువు సింహాసనం ఎత్తిపట్టుకొని ఉంటారు. ఆరోజు మిమ్మల్ని (దేవుని న్యాయస్థానంలో) ప్రవేశపెట్టడం జరుగుతుంది. (అక్కడ) మీరు ఏ రహస్యాన్నీ దాచలేరు. (13-18)

అప్పుడు కుడిచేతికి కర్మల పత్రం ఇవ్వబడిన మనిషి (ఎంతో సంబరపడుతూ తన బంధుమిత్రుల్ని కలుసుకొని) "ఇదిగో నా కర్మల పత్రం, చదవండి కాస్త. నేను నా (కర్మఫలం) లెక్క నాకు తప్పకుండా లభిస్తుందని భావిస్తుండేవాణ్ణి" అని అంటాడు. అతనిక కోరిన సుఖసంతోషాలు అనుభవిస్తాడు. మహా అద్భుతమైన స్వర్గవనంలో ఉంటాడు. దాని పండ్లగుత్తులు బరువుతో క్రిందికి వంగిఉంటాయి. "హాయిగా తినండి, త్రాగండి మీరు గతజీవితంలో చేసు కున్న (సత్కర్మల) సుకృతఫలం అనుభవించండి" (అంటారు దైవదూతలు). (19-24)

ఇక ఎడమచేతికి కర్మల పత్రం ఇవ్వబడినవాడు (తీవ్రంగా పశ్చాత్తాపపడుతూ) ఇలా అంటాడు: "అయ్యయ్యో! నా కర్మపత్రం నాకసలు లభించకుండా, నా లెక్కేమిటో నాకు తెలియకుండా ఉంటే ఎంత బాగుండేది! నాకొచ్చిన (తొలి)చావే నన్ను పూర్తిగా తుదముట్టించి ఉంటే బాగుండేది!! ఈరోజు నా సిరిసంపదలు నాకేమాత్రం పనికి రాలేదు. నా అధికారం, ఆధిపత్యాలన్నీ మట్టిలో కలిసిపోయాయి." (25-29)

(అప్పుడిలా ఆజ్ఞవుతుంది:) "పట్టుకోండి వాడ్ని. వాడి మెడకు గుదిబండ కట్టి నరకంలోకి త్రోసేయండి. ఆ తర్వాత డెబ్బయి మూరల గొలుసుతో వాడ్ని బిగించి కట్టండి. మహోన్నతుడైన దేవుడ్ని వీడసలు నమ్మేవాడు కాదు. అదీగాక పేదవాడికి పట్టెడన్నం కూడా పెట్టేవాడు కాదు. అలాంటి సహాయకార్యాల కోసం ఇతరుల్ని ప్రోత్స హించేవాడు కాదు. అందువల్ల ఈ రోజిక్కడ వీడ్ని పట్టించుకునేవాడే లేడు. చీము, నెత్తురు తప్ప వాడికి తినడానికి మరేమీ లభించదు. పాపాత్ములు మాత్రమే ఇలాంటి (జుగుప్సాకరమైన) తిండి తింటారు." (30-38)

కాబట్టి, (మీరనుకునేది నిజం) కాదు. మీకు గోచరించేదాని పేర, గోచరించనిదాని పేర ప్రమాణంచేసి చెబుతున్నాను. ఇది గౌరవనీయుడైన సందేశహరుని వాక్కు. ఏ కవి నోటో వెలువడిన మాట కాదు. మీరసలు బహుతక్కువగా విశ్వసిస్తారు. ఇది ఏ మాంత్రి కుడో చెప్పిన వాక్కుకూడా కాదు. మీరసలు చాలా తక్కువగా ఆలోచిస్తారు. (39-42)

ఇది సర్వలోకప్రభువు నుండి అవతరించిన (దివ్య)వాణి. ఇతను స్వయంగా కల్పించి ఏదైనా విషయం ప్రచారంచేస్తే, మేమితని కుడిచేయి పట్టుకొని కంఠనాళం కోసివేసే వాళ్ళం. అప్పుడు మమ్మల్ని ఈ పని నుండి ఏ శక్తీ అడ్డుకోలేదు. (43-47)

ఇది భయభక్తులు కలవారి కోసం అవతరించిన హితోపదేశం. మీలో కొందరు నిరాకరించేవారున్నారని మాకు తెలుసు. అలాంటి తిరస్కారులకిది తప్పనిసరిగా పశ్చాత్తాపానికి కారణభూతమవుతుంది. ఇది పూర్తిగా నమ్మదగిన సత్యం. కనుక ప్రవక్తా! నీవు మాత్రం మహోన్నతుడయిన నీ ప్రభువు నామం స్మరిస్తూ ఉండు. (48-52) ✪

# 70. ఆరోహణా సోపానాలు (మఆరిజ్)

అవతరణ: మక్కా సూక్తులు:44

ఈ అధ్యాయాన్ని "మఆరిజ్" అంటారు. ఇది కూడా దాదాపు నబవీశకం ప్రారంభంలోనే అవతరించింది. ఇందులో ప్రళయం, స్వర్గనరక విషయాల్ని హేళనచేసే సత్యతిరస్కారులను హెచ్చరించి, హితోపదేశం చేయడం జరిగింది.

**కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం**

అడిగేవాడు (ప్రళయ)శిక్షను గురించి అడుగుతున్నాడు. అది అవిశ్వాసులపై విరుచుకు పడేందుకు తప్పకుండా వస్తుంది. దాన్నెవరూ ఆపలేరు. అది ఆరోహణా సోపానాల యజమాని అయిన దేవుని వైపు నుండి వస్తుంది. (1-3)

పరిశుద్ధాత్మ (జిబ్రీల్ దూత), (ఇతర) దైవదూతలు ఆయన దివ్య సన్నిధికి యాభైవేల సంవత్సరాలకు సమానమైన ఒక సుదీర్ఘ దినంలో ఎక్కిపోతారు.[1] కనుక ప్రవక్తా! సహనం వహించు, సంస్కారవంతమైన సహనం వహించు. (4,5)

వారా శిక్ష చాలా దూరంగా ఉందనుకుంటున్నారు. కాని మేము దాన్ని అతి సమీపంగా చూస్తున్నాం. ఆ (శిక్ష విరుచుకుపడే) రోజు ఆకాశం చమురు తెట్టులా మారి పోతుంది. పర్వతాలు రంగు రంగుల దూదిపింజాల్లా ఎగురుతాయి. ప్రతి ఒక్కడూ ఎదుటివాడి (దుస్థితి)ని చూస్తున్నప్పటికీ ఏ ప్రాణస్నేహితుడూ తన ఆప్తమిత్రుడ్ని పట్టించుకోడు.

ఆరోజు పాపాత్ములు (నరక) శిక్ష నుండి తప్పించుకోవడానికి తమ భార్యాపిల్లల్ని, అన్నదమ్ముల్ని, (ప్రపంచంలో) తమకు ఆశ్రయం ఇవ్వగలిగిన అతి సన్నిహిత బంధువర్గాన్ని, చివరికి ప్రపంచంలోని వారందర్నీ పరిహారంగా ఇవ్వదలచుకుంటారు. (అయినా శిక్షనుండి బయటపడటం) ఏమాత్రం జరగదు. అది తీవ్రంగా ప్రజ్వరిల్లే నరకాగ్ని జ్వాల. అది చర్మాన్ని వలిచి మాడ్చివేస్తుంది. సత్యానికి విముఖుడై పోవడమేగాక ధనాన్ని కూడబెట్టి దాన్ని మాటి మాటికి సర్దిపెట్టుకుంటూ భద్రపరచుకున్న ప్రతివాడ్నీ అది ఎలుగెత్తి పిలుస్తుంది. (6-18)

మానవుడు సహనం లేనివాడుగా సృజించబడ్డాడు. ఏదైనా కాస్త ఆపద వస్తే చాలు, కంగారుపడిపోతాడు. సంపద ఒనగూడినప్పుడు పిసినారితనం వహిస్తాడు. అయితే కొందరు అలా చేయరు. వారి గుణగణాలు ఇలా ఉంటాయి:

1. వివరాలకు 32:5 సూక్తి, దాని పాదసూచిక, 22:47 సూక్తి చూడండి.



- వారు నమాజ్ చేసేవారు; నిత్యం క్రమం తప్పకుండా నమాజ్ విధిని పాటిస్తారు.
- వారి సంపదలో అర్థించేవారికి, అర్థించనివారికి ఒక నిర్ణీత భాగం ఉంటుంది.
- వారు (పరలోక) తీర్పుదినాన్ని విశ్వసిస్తారు.
- తమ ప్రభువు శిక్షకు భయపడుతుంటారు. వారి ప్రభువు శిక్షే అలాంటిది, దానిపట్ల ఎవరూ నిర్భయంగా ఉండకూడదు.
- వారు తమ మర్మావయవాలను కాపాడుకుంటారు. అయితే తమ భార్యలు, తమ బానిసస్త్రీల విషయంలో ఇలా చేయకుండా ఉండటంలో ఎలాంటి తప్పు లేదు. అది తప్ప మరేదైనా కోరేవారే హద్దు మీరేవారు.
- తమను నమ్మి అప్పగించబడేదాన్ని కాపాడే నిజాయితీపరులు.
- ఇచ్చిన మాటను నిలబెట్టుకునే వాగ్దాన పాలకులు.
- సాక్ష్యం విషయంలో నీతి, న్యాయాలకు కట్టుబడి ఉండేవారు.
- (ఏమరుపాటుకు లోనుకాకుండా) తమ నమాజులను కాపాడుకునేవారు. వీరెంతో గౌరవప్రదంగా స్వర్గవనాలలో (హాయిగా) ఉంటారు. (19-35)

సరే, ప్రవక్తా! ఈ తిరస్కారులు కుడి, ఎడమల వైపునుంచి జట్లు జట్లుగా నీ దగ్గరకి పరుగెత్తుకొస్తున్నారెందుకు? వారిలో ప్రతి ఒక్కడూ తాను భోగభాగ్యాలతో కూడిన స్వర్గంలో ప్రవేశింపజేయ బడతానని ఆశలు పెట్టుకున్నాడా? అలా ఎన్నటికీ జరగదు.

మేము తమను ఎలాంటి (నీచమైన) పదార్థంతో పుట్టించామో వారికీ తెలుసు. కనుక ప్రవక్తా! తూర్పుపడమరల ప్రభువు సాక్షిగా చెబుతున్నాం. మేము తలచుకుంటే వీరి స్థానంలో వీరికంటే శ్రేష్ఠులైన మానవుల్ని తీసుకురాగలము. మాకా శక్తి ఉంది. మాతో ఎవరూ పోటీ పడలేరు. (36-41)

కాబట్టి వారిని ఆటపాటల్లో, పనికిమాలిన మాటల్లోనే పడి ఉండనివ్వు. అదే స్థితిలో చివరికి వారు తమకు వాగ్దానం చేయబడుతున్న రోజుకు చేరుకుంటారు. అప్పుడు వారు తమ విగ్రహాలవైపు దౌడు తీస్తున్నట్లు, సమాధుల నుంచి లేచి ఒకరి కొకరు పోటీపడుతూ పరుగెత్తుతారు. (అయితే తీరా చేరవలసిన చోటికి చేరినప్పుడు) వారి చూపులు (పశ్చాత్తాపంతో) క్రిందికి వాలిపోతాయి. అవమానం, అప్రతిష్ఠలు వారిని ఆవరిస్తాయి. అదే వీరికి వాగ్దానం చేయబడుతున్న (ప్రళయ) దినం! (42-44) ✪

# 71. నూహ్

అవతరణ: మక్కా సూక్తులు: 28

ఈ అధ్యాయం కూడా నబవీ శకం ప్రారంభకాలంలో అవతరించింది. ఇందులో మక్కా బహుదైవారాధకులకు హితోపదేశం చేయడానికి నూహ్‌ప్రవక్త (అలైహి) వృత్తాంతాన్ని ఉదాహరణగా పేర్కొనడం జరిగింది. నూహ్ ప్రవక్త (అలైహి) తన జాతిప్రజలను రుజుమార్గంలోకి తీసుకు రావడానికి అనేక విధాల నచ్చజెప్పి చూశారు. కాని కొందరు మినహా ఆ జాతిప్రజలంతా ఆయన్ని తిరస్కరించారు. చివరికి ఆయన

దేవుడ్ని వేడుకోవడం, దాంతో ఆ జాతిప్రజలు భయంకరమైన తుఫాను వరదలకు సర్వనాశనమయి పోవడం జరుగుతుంది.

## కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

మేము నూహ్ (ప్రవక్త)ను అతని జాతిప్రజల దగ్గరకు పంపి, వారిపై వ్యధాభరితమైన శిక్ష వచ్చిపడక ముందే వారిని హెచ్చరించాలని ఆదేశించాము. (1)

(దాని ప్రకారం) అతను (తన జాతిప్రజల దగ్గరకెళ్ళి) ఈవిధంగా అన్నాడు: "నా జాతి ప్రజలారా! నేను మిమ్మల్ని స్పష్టంగా హెచ్చరించడానికి వచ్చిన వాణ్ణి (దైవ ప్రవక్తను). కనుక (నామాట విని) దేవుడ్ని ఆరాధించండి. ఆయనకు భయపడండి. నాకు విధేయత చూపండి. (అప్పుడు) దేవుడు మీ పాపాలను మన్నించి ఒక నిర్ణీతకాలం వరకు మిమ్మల్ని క్షేమంగా ఉండనిస్తాడు. దేవుడు నిర్ణయించిన (శిక్షా) సమయం వచ్చినప్పుడు దాన్నెవరూ ఆపలేరు. ఈ విషయం మీరు అర్థం చేసుకుంటే ఎంత బాగుంటుంది!" (2-4)

(ఈ విధంగా నూహ్ ప్రవక్త అనేక ఏండ్లపాటు ప్రజలకు హితబోధ చేసినా పెద్దగా ప్రయోజనం కన్పించలేదు. దాంతో) అతను దేవుడ్ని ఇలా మొరపెట్టుకున్నాడు:

"ప్రభూ! నేను నా జాతిప్రజలను (నీ వైపు) రేయింబవళ్ళూ పిలిచాను. కాని నా పిలుపు వారి చెవికెక్కలేదు. వారు మరింత దూరంగా పారిపోతున్నారు. నీవు వారికి క్షమాభిక్ష పెట్టడానికి నేను వారిని పిలిచినప్పుడల్లా వారు చెవులలో వ్రేళ్ళు దూర్చుకునేవారు; వస్త్రంతో ముఖం కప్పుకునేవారు. మొండివైఖరి అవలంబించి మహా గర్వపోతులయ్యారు. నేను బిగ్గరగా మాట్లాడుతూ వారిని (దేవుని వైపు) పిలిచాను. తరువాత బహిరంగంగా కూడా బోధచేశాను. ఆపై మెల్లిగా కూడా నచ్చజెప్పడానికి ప్రయత్నించాను. నేను వారికి ఇలా బోధించాను-

'మీ ప్రభువును క్షమాపణ కోరుకోండి. ఆయన గొప్ప క్షమాశీలి. ఆయన మీకోసం ఆకాశం నుండి వర్షం కురిపిస్తాడు. మీకు సంతానం సిరిసంపదలు అనుగ్రహిస్తాడు. మీకోసం తోటలు పండిస్తాడు; సెలయేరులు ప్రవహింపజేస్తాడు.[1] ఏమయింది మీకు,

---

1. దాదాపు ప్రతి దైవప్రవక్తా ప్రజలకు రుజుమార్గం బోధిస్తూ, 'పాపక్షమాపణకై విశ్వప్రభువుని వేడుకొని ఆయన వైపు మరలితే ఆయన మీకు ప్రపంచ జీవితంలో కూడా శుభాలు, సౌఖ్యాలు ప్రసాదిస్తాడ'ని తెలియజేశాడు. హూద్ ప్రవక్త (అలైహి) బోధ గురించి 11:52 సూక్తి, నూహ్ ప్రవక్త (అలైహి) బోధ గురించి ఇదే అధ్యాయంలో 10-12 సూక్తులు, అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) మక్కా ప్రజలకు చేసిన బోధ గురించి 11:3 సూక్తి చూడండి.

ఓసారి మదీనాలో తీవ్రమైన కరువు వస్తే అప్పటి ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) వర్షం కోసం దైవాన్ని ప్రార్థించడానికి బదులు పాపమన్నింపుకై దుఆ (వేడుకోలు) చేసి ఊరుకున్నారు. దానిపై ప్రజలు ఆయన్ని విమర్శిస్తూ "మీరు వర్షం కోసం దుఆ చేయనే లేదు" అన్నారు. ఆయన దానికి సమాధానమిస్తూ "నేను ఆకాశం నుండి వర్షం కురిసే తలుపుల్ని తట్టాను. (అంతకంటే మరేం కావాలి?)" అని చెప్పి నూహ్ అధ్యాయంలోని ఈ సూక్తులే (71:10-12) పఠించారు.



దేవుని ఔన్నత్యాన్ని నమ్మరు? ఆయనే కదా మిమ్మల్ని వివిధ ఘట్టాలలో రూపొందించిన (సర్వశక్తిమంతుడయిన) వాడు.'

'ఆయన ఒకదానిపై ఒకటి ఏడు ఆకాశాలు సృష్టించాడు. అందులో చంద్రుడ్ని (చల్లటి కాంతి వెదజల్లే) జ్యోతిలా చేశాడు. సూర్యుడ్ని (దేదీప్యమానంగా ప్రకాశించే) దీపంగా సృజించాడు. ఇదంతా మీకు కన్పించడం లేదా?'

'దేవుడు మిమ్మల్ని నేలనుండి చిత్ర విచిత్రంగా మొలకెత్తించాడు. తరువాత ఆయన మిమ్మల్ని అదే నేలలోకి తిరిగి తీసికెళ్తున్నాడు. చివరికి అందులో నుంచే మిమ్మల్ని బయటికి తీసి నిలబెడ్తాడు. మీరు ధరణిలో సువిశాల మార్గాలలో సంచరించడానికి వీలుగా ఆయన దాన్ని మీకోసం విశాలపరిచాడు.' (5-20)

నూహ్ (ఇంకా) ఇలా అన్నాడు:

"ప్రభూ! వారు నామాటలు ధిక్కరించారు. సంతానం సిరిసంపదలతో మరింత (బరితెగించి) నష్టం కొనితెచ్చుకున్న ధనికులకే వారు విధేయులయ్యారు. వారు (నామీద) పెద్ద కుట్రపన్నారు. (మిథ్యాదైవాలనే పట్టుకువ్రేలాడుతూ) వారు పరస్పరం 'మనం మన దైవాలను ఎన్నటికీ విడనాడకూడదు. వద్‌ని, సువాని కూడా వదులుకోకూడదు; యగూస్‌ని, యవూఫ్‌ని, నస్రని కూడా మనం వదలుకోరాదు' అని చెప్పుకున్నారు. ప్రభూ! ఇవి అనేకమందిని మార్గభ్రష్టత్వానికి గురిచేశాయి. నీవు కూడా ఈ దుర్మార్గులకు మార్గభ్రష్టత్వంలో తప్ప మరి దేనిలోనూ వృద్ధినివ్వకు." (21-24)

(చివరికి) వారు తమ పాపాల కారణంగా (నీట) ముంచివేయబడ్డారు. (ఆ తరువాత) నరకాగ్నిలో విసరివేయబడ్డారు. ఇక వారిని దేవుని (పట్టు) నుండి ఏశక్తీ కాపాడలేక పోయింది. వారు ఎలాంటి సహాయం పొందలేకపోయారు. (25)

(ఆ సందర్భంలో) నూహ్ ఇలా అన్నాడు: "ప్రభూ! ఈ తిరస్కారులలో ఏ ఒక్కడ్నీ భూమండలంపై సజీవంగా వదలిపెట్టకు. ఒకవేళ నీవు వీరిని వదిలేస్తే వీరు నీ దాసుల్ని దారి తప్పిస్తారు. వీరి సంతతి నుండి పుట్టే ప్రతి వ్యక్తీ దుర్మార్గుడిగా, కరుడుగట్టిన తిరస్కారిగా మారుతాడు. ప్రభూ! నన్నూ, నాతల్లిదండ్రుల్ని, నాఇంట్లో విశ్వాసిగా ప్రవేశించిన ప్రతి మనిషినీ, విశ్వసించిన యావత్తు స్త్రీ పురుషుల్నీ క్షమించు. దుర్మార్గులకు మాత్రం వినాశంలో తప్ప మరెందులోనూ వృద్ధి కలిగించకు." (26-28) ✪

---

ప్రఖ్యాత దైవప్రియుడు హజ్రత్ హసన్‌బస్రీ (రహ్మ) సన్నిధికి ఒకతను వచ్చి తమ ప్రాంతంలో కరువు వచ్చిందని తెలిపాడు. అప్పుడాయన, అయితే పాపమన్నింపుకై దైవాన్ని వేడుకోండి అని చెప్పారు. కాస్సేపటి మరొకతను వచ్చి తన దారిద్ర్య స్థితిని ఏకరువు పెట్టుకున్నాడు. ఇంకొకడు వచ్చి తనకు సంతానం కలగడం లేదని చెప్పుకున్నాడు. వేరొకడు వచ్చి తన పొలంలో పంట తగ్గిపోతోంది ఏం చెయ్యాలని అడిగాడు. హజ్రత్ హసన్ బస్రీ (రహ్మ) వారందరికీ పాపమన్నింపు కోసం దైవాన్ని వేడుకోండని ఒకే సమాధానమిచ్చారు. దానికి ప్రజలు ఆశ్చర్యపోతూ "అదేమిటండీ మీరు విభిన్న రకాల ఫిర్యాదులు చేసిన వారందరికీ ఒకే నివారణ చూపుతున్నారు?" అని అడిగారు. దానికి సమాధానంగా ఆయన నూహ్ అధ్యాయంలోని ఈ (71:10-12) సూక్తులే పఠించారు.

అవతరణ: మక్కా

# 72. భూతం (జిన్)

సూక్తులు: 28

ఈ అధ్యాయాన్ని "జిన్" (భూతం) అంటారు. ఇందులోని విషయాలు గమనిస్తే ఇది నబవీశకం ప్రారంభకాలంలో అవతరించి ఉండవచ్చని తెలుస్తోంది. ఇందులో జిన్నులు మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) నోట ఖుర్‌ఆన్ వాణి విని దాన్ని విశ్వసించి, తమ జాతి జనానికి ఆ విషయం తెలుపుతూ దేవుని ఏకత్వం గురించి వివరించడం జరిగింది. ఆ తరువాత మక్కా అవిశ్వాసులకు ఈ వృత్తాంతం తెలియజేసి హితోపదేశం చేయబడింది. జిన్నులు (అంటే భూతాలు) ఈ భూమిపైన్నే ఉండి మానవులకు కానరాని విచిత్ర బుద్ధిజీవులు. మానవులకు మాదిరిగానే వీటికీ బుద్ధిజ్ఞానాలు, విషయావలంబన స్వేచ్ఛ ఉన్నాయి. వీరిలో కూడా సజ్జనులు, దుర్జనులు; విశ్వాసులు, అవిశ్వాసులు ఉన్నారు. వీరికీ స్వర్గనరకాలు ఉన్నాయి.

**కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం**

ప్రవక్తా! వారికీ సంగతి తెలియజెయ్యి: జిన్నుల సమూహం ఒకటి (ఖుర్‌ఆన్ బోధ) విన్నదని, తరువాత (తన జాతివాళ్ళ దగ్గరికెళ్ళి) ఈవిధంగా అన్నదని నాకు దివ్యావిష్కృతి ద్వారా తెలియజేయబడింది:

"మేమొక అద్భుతమైన ఖుర్‌ఆన్ (వాణి) విన్నాము. అది సన్మార్గం వైపు మార్గదర్శనం చేస్తుంది. అందువల్ల మేము దాన్ని విశ్వసించాం. ఇకనుంచి మేము మా ప్రభువుకు ఎవరినీ సాటి కల్పించము."[1] (1,2)

"మా ప్రభువు మహోన్నతుడు, మహిమాన్వితుడు. ఆయన ఎవరినీ తనకు భార్యగా గాని, కుమారునిగా గాని చేసుకోలేదు." (3)

"మన మూర్ఖజనం దేవుని విషయంలో సత్యవ్యతిరేకమైన మాటలు చెబుతున్నారు. దేవుడ్ని గురించి మానవులు, జిన్నులు ఎన్నడూ అబద్ధాలాడరని మేము భావించాం." (4,5)

"కొందరు మానవులు జిన్నులలో కొందరి రక్షణ కోరుతున్నారు. ఈవిధంగా వారు జిన్నుల గర్వాన్ని మరింత అధికం చేశారు." (6)

"మీరు భావించినట్లే మానవులు కూడా దేవుడు ఎవరినీ ప్రవక్తగా నియమించి పంపడని అనుకున్నారు." (7)

"మేము ఆకాశాన్ని వెతికిచూస్తే అది పటిష్ఠంగా కాపలాదారులతో, ఉల్కలతో నిండి ఉన్నట్లు కన్పించింది. ఇదివరకైతే (ఏదైనా) వినడానికి మనకు ఆకాశంలో కూర్చునే చోటు దొరికేది. కాని ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. దొంగచాటుగా ఎవరైనా వినడానికి ప్రయత్నిస్తే అతనికి ఒక అగ్నిజ్వాల తన కోసం మాటువేసి ఉండటం కన్పిస్తున్నది." (8,9)

---

1. జిన్నుల్ని గురించి ఇతర విషయాలకు 46:29-31 సూక్తులు, వాటి పాదసూచిక చూడండి.



"భూవాసులకు ఏదైనా కీడు తలపెట్టే నిర్ణయం జరిగిందో, లేక వారి ప్రభువు వారికి సన్మార్గం చూపగోరుతున్నాడో మాకర్థం కావడం లేదు." (10)

"మనలో కొందరు సజ్జనులు ఉన్నారు; మరికొందరు దుర్జనులు ఉన్నారు. మనం విభిన్న (మత)వర్గాలుగా చీలిపోయి ఉన్నాం. మనం భూలోకంలో దేవుడ్ని ఎదిరించలేమని, పారిపోయి కూడా ఆయన పట్టు నుండి బయటపడలేమని మాకిప్పుడు తెలిసొచ్చింది." (11,12)

"మేము మాత్రం హితబోధ విని విశ్వసించాం. (ఇలా)ఎవరైనా తమ ప్రభువును విశ్వసిస్తే అతనికి ఇక ఎలాంటి నష్టంగాని, అన్యాయంగాని జరుగుతుందన్న భయం ఉండదు." (13)

"మనలో కొందరు దేవునికి విధేయులై (ముస్లింలై)న వారున్నారు. కొందరు సత్యానికి విముఖులైన వారున్నారు. కనుక ఎవరు విధేయతా మార్గం (ఇస్లాం) అవలంబిస్తారో వారు ముక్తిమార్గం పొందినట్లే. అలాగే ఎవరు సత్యానికి విముఖులవుతారో వారు నరకానికి సమిధలయి పోతారు." (14,15)

(ప్రవక్తా! వీరికి ఇలా చెప్పు:) ప్రజలు సన్మార్గంలో స్థిరంగా ఉంటే మేము వారికి త్రాగేందుకు పుష్కలంగా నీటిని అనుగ్రహిస్తాం, తద్వారా వారిని పరీక్షిస్తాం. తమ ప్రభువు స్మరణకు విముఖులయ్యే వారిని ఆయన కఠినంగా శిక్షిస్తాడు. (16,17)

ఆరాధనాలయాలు అల్లాహ్ కోసమే ప్రత్యేకించబడ్డాయి. కనుక అక్కడ అల్లాహ్‌ను కాదని మరెవరినీ ప్రార్థించకూడదు. (ఆరాధనాలయంలో) ఓ దైవదాసుడు[2] ఆయన్ని ప్రార్థించడానికి నిలబడినప్పుడు వీరు అతనిపై విరుచుకుపడటానికి సిద్ధమయ్యారు.

ప్రవక్తా! వారితో ఇలా అను: "నేను నాప్రభువుని ప్రార్థిస్తున్నాను. ఆయనకు మరెవరినీ సాటికల్పించడం లేదు. (అంతేగాని నేనేమీ తప్పు చేయడం లేదే! మరెందుకు మీరు నా మీద విరుచుకుపడుతున్నారు?)" (18-20)

ఇలా చెప్పు: "మీకు కీడుగాని, మేలుగాని చేయడానికి నాచేతిలో ఏమీ లేదు".

ఇంకా చెప్పు: "నన్ను దేవుని పట్టునుండి ఎవరూ కాపాడలేరు. ఆయన సన్నిధిలో తప్ప మరెక్కడా నాకు రక్షణలేదు. దేవుని సూక్తుల్ని, ఆయన సందేశాన్ని (ప్రజలకు) చేరవేయడమే నాపని. అదితప్ప మరోబాధ్యత లేదు నామీద. కనుక దేవుని విషయాలు, ఆయన ప్రవక్త చెప్పే మాటలు విశ్వసించని వారికోసం నరకం కాచుకొని ఉంది. వారందులో (నానా యాతనలు అనుభవిస్తూ) ఎల్లకాలం పడిఉంటారు". (21-23)

వారిలా (అవిశ్వాసంలోనే ఉండి) తమకు వాగ్దానం చేస్తున్న దాన్ని చూస్తారు. అప్పుడు తెలుస్తుంది వారికి ఎవరి మద్దతుదారులు బలహీనులో, ఎవరి సంఖ్యాబలం తక్కువో. (24)

---

2. ఇక్కడ ఒక దైవదాసుడు అంటే ముహమ్మద్ ప్రవక్తే (సల్లం).

ఇలా చెప్పు: “మీకు వాగ్దానం చేయబడుతున్న విషయం సమీపంలోనే ఉందో, లేక నా ప్రభువు దానికోసం సుదీర్ఘకాలం నిర్ణయించాడో నాకైతే తెలియదు. ఆయన అతీంద్రియ విషయాలు ఎరిగినవాడు. తన అతీంద్రియజ్ఞానాన్ని తానుఎన్నుకున్న ప్రవక్తకు తప్ప మరెవరికీ ప్రసాదించడు. (వాటి భద్రత కోసం) ఆయన తన ప్రవక్తకు ముందూ, వెనుకా అంగరక్షకుల్ని (అంటే దైవదూతల్ని) నియమిస్తాడు. వారు తమ ప్రభువు సందేశాలు అందజేశారని అతను తెలుసుకోవడానికి (కూడా) ఈ ఏర్పాటు జరిగింది. దేవుడు వారి పరిసరాలన్నిటినీ పరివేష్ఠించి ఉన్నాడు; ఆయన సమస్త విషయాలు లెక్కపెట్టి ఉంచాడు.” (25-28) ✪

# 73. దుప్పటి కప్పుకొని నిద్రించేవాడు (ముజమ్మిల్)

**అవతరణ: మక్కా** **సూక్తులు: 20**

ఈ అధ్యాయాన్ని “ముజమ్మిల్” అంటారు. ఇందులో 1-19 సూక్తులు నబవీశకం ప్రారంభంలో అవతరించాయి. 20వ సూక్తి హి.శ. రెండవ సంవత్సరంలో అవతరించి ఉండవచ్చని కొందరు భాష్యకారులు అభిప్రాయపడ్డారు.

**కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం**

దుప్పటి కప్పుకొని నిద్రించేవాడా! రాత్రివేళ (నమాజుకోసం) లేచి నిలబడు. అయితే రేయంతా కాదు, అర్ధరాత్రిదాకా. లేదా అంతకంటే కొంచెం తక్కువ చేసుకో. లేదా అంతకంటే కొంచెం ఎక్కువ చేసుకో. ఖుర్‌ఆన్‌ని ఆగి ఆగి నిదానంగా పఠించు. మేము నీమీద (ఎంతో బాధ్యతతో కూడిన) ఓ బరువైన వాణిని అవతరింపజేయ బోతున్నాము.

మనస్సును అదుపులో ఉంచడానికి రాత్రి జాగరణ ఎంతో ప్రయోజనకరమైనది. పైగా ప్రశాంతంగా ఖుర్‌ఆన్ పఠించడానికి కూడా అది చాలా సమంజసమైన వేళ. (అదీగాక) నీకు పగటిపూట (ఇతరత్రా) అనేక పనులుంటాయి. (1-7)

(సదా) నీప్రభువు నామం స్మరిస్తూ ఉండు. అన్నిటినీ వదలి ఆయనకే అంకిత మయిపో. ఆయన తూర్పుపడమరలకు ప్రభువు. ఆయనతప్ప మరో ఆరాధ్యుడు లేడు. కనుక నీవు ఆయన్నే నీ రక్షకుడిగా చేసుకో. ఆయన మీదే భారం వెయ్యి. (8,9)

జనం కల్పించి చెప్పుకునే మాటలు పట్టించుకోకు. సహనంతో వ్యవహరించు. సత్పురుషుడిలా వారికి దూరంగా ఉండు. సత్యాన్ని ధిక్కరిస్తున్న ధనికుల సంగతి నాకు వదిలెయ్యి. నేను వారి భరతం పడ్తాను. వారిని కొంతకాలం అదే స్థితిలో ఉండని.

(వారికోసం) మా దగ్గర బరువయిన సంకెళ్ళున్నాయి. భగభగమండే అగ్ని, గొంతులో ఇరుక్కుపోయే ఆహారం, దుర్భరయాతనలు కూడా ఉన్నాయి. ఇవన్నీ భూమి, పర్వతాలు తీవ్రంగా కంపించే రోజు ఎదురవుతాయి. ఆరోజు పెద్దపెద్ద పర్వతాలు సైతం ఇసుక తిన్నెల్లా మారి చెల్లాచెదరయి పోతాయి. (10-14)



పూర్వం మేము ఫిరౌన్ దగ్గరకు (మూసా) ప్రవక్తను ఎలా పంపామో అలాగే ఈనాడు మీ వ్యవహారం గురించి సాక్ష్యం ఇవ్వడానికి మీ దగ్గరకు (ముహమ్మద్) ప్రవక్తను పంపాము. ఫిరౌన్ ఆ ప్రవక్త చేసిన హితబోధను అంగీకరించలేదు. అందువల్ల మేము అతడ్ని కఠినంగా పట్టుకున్నాం. (ఇప్పుడీ ప్రవక్త మాట వినకపోతే మీకూ అదే గతి పడ్తుంది.) (15,16)

మీరు (మా సందేశం) ధిక్కరిస్తే రేపు పిల్లల్ని సైతం వృద్ధులుగా మార్చే (ప్రళయ) దినాన (మానుండి) ఎలా తప్పించుకుంటారు? ఆరోజు ఆకాశం బ్రద్దలవుతుంది. దేవుని వాగ్దానం నెరవేరేతీరుతుంది. ఇదొక హితోపదేశం. ఇష్టమైనవారు తమ ప్రభువు వైపు వెళ్ళే మార్గం అవలంబించవచ్చు. (లేదా పెడదారిపట్టి నరకంలోనైనా పడవచ్చు.) (17-19)

ప్రవక్తా! నీవు ఒకసారి మూడింట రెండువంతుల రాత్రిదాకా, మరొకసారి అర్ధరాత్రి దాకా, వేరొకసారి మూడింట ఒక వంతు రాత్రిదాకా మేల్కొని ఆరాధనలో గడుపుతావని నీ ప్రభువుకు తెలుసు. నీ అనుచరుల్లో కూడా కొందరు ఇలా చేస్తున్నారు.

రాత్రివేళను, పగటివేళను దేవుడే లెక్క కడ్తాడు. వేళలను మీరు సరిగా అంచనా కట్ట లేరని ఆయనకు తెలుసు. అందువల్ల ఆయన మిమ్మల్ని కనికరించాడు. ఇక నుండి మీరు ఖుర్‌ఆన్‌ని సులభంగా ఎంతమేరకు పఠించగలిగితే అంతమేరకే పఠించండి. మీలో కొందరు వ్యాధిగ్రస్తులు, కొందరు దైవానుగ్రహం (ఉపాధి) అన్వేషణలో ప్రయాణం చేసేవారు, మరి కొందరు దైవమార్గంలో పోరాటం జరిపేవారు ఉంటారని కూడా ఆయనకు తెలుసు.

కనుక ఖుర్‌ఆన్‌ని సులభంగా పఠించగలిగినంత పఠించండి. ప్రార్థనా వ్యవస్థ నెల కొల్పండి. (పేదల ఆర్థికహక్కు) జకాత్ చెల్లించండి. దేవునికి శ్రేష్ఠమైన రుణం అంద జేయండి. మీరు మీకోసం ఏ పుణ్యకార్యం చేసి పంపుకుంటారో అది దేవుని వద్ద సురక్షితంగా ఉంటుంది. అదే అత్యంత శ్రేష్ఠమయినది, దాని సుకృతఫలం కూడా ఘనమైనది. దేవుడ్ని మన్నింపు వేడుకోండి. ఆయన గొప్ప క్షమాశీలి, అమిత దయా మయుడు. (20) ✪

# 74. దుప్పటి కప్పుకొని పడుకున్నవాడు (ముదస్సిర్)

**అవతరణ: మక్కా** **సూక్తులు: 56**

ఈ అధ్యాయాన్ని “ముద్దస్సిర్” అంటారు. ఇందులో మొదటి ఏడుసూక్తులు 96వ అధ్యాయంలోని తొలిఅయిదు సూక్తులు అవతరించిన కొంతకాలానికి అవతరించాయి. మిగిలిన సూక్తులు మక్కాలో ఇస్లాం ధర్మం గురించి బహిరంగ ప్రచారం ప్రారంభించిన తరువాత మొదటిసారిగా హజ్‌యాత్ర వచ్చినప్పుడు అవతరించాయి. ఇందులో దేవుడు అవిశ్వాసుల వైఖరిని తీవ్రంగా ఖండించాడు. ముఖ్యంగా ఈ సూక్తులలో వలీద్ బిన్ ముగైరా అనే కర్కోటకుడి తలబిరుసుతనాన్ని, అతని దుష్ట పన్నాగాలను నిశితంగా విమర్శించడం జరిగింది.

ఆ తరువాత పరలోక పరిణామాలను గురించి ప్రస్తావన వస్తుంది. ముహమ్మద్ మహనీయుని(స)పై మొట్టమొదటి దైవసందేశం హిరాగుహలో అవతరించింది. అప్పుడు 96వ అధ్యాయంలోని తొలి అయిదు సూక్తులు వెలువడ్డాయి. ఇది ఆయనకు దివ్యావి ష్కృతికి సంబంధించిన మొదటి అనుభవం. అందువల్ల ఆయన భయపడి పోయారు. ఆ తర్వాత కొంతకాలం వరకు ఆయనపై ఎలాంటి దైవసందేశం అవతరించలేదు.

అలాంటి స్థితిలో ఆయన ఓరోజు ఎక్కడికో పోతుంటే ఆకాశం నుండి ఓ వింత ధ్వని విన్పించింది. తలెత్తి చూస్తే, తను ఇంతకు పూర్వం హిరాగుహలో చూసిన దైవ దూతే ఈసారి మహాకాయంతో భూమ్యాకాశాల మధ్య ఒక కుర్చీపై కూర్చొని ఉన్నాడు. మహనీయ ముహమ్మద్ (సల్లం) ఈ అసాధారణ దృశ్యం చూసి తీవ్ర భయాందోళనలతో ఇంటికొచ్చి వాలారు. రాగానే దుప్పటి కప్పు అన్నారు వణికిపోతూ. దుప్పటి కప్పిన తరువాత కాస్తంత స్థిమితం కలిగింది. కాని అంతలోనే ఆయనపై ఒక విధమైన మైకం ఆవరించి దైవసందేశం అవతరించింది. ఈ అధ్యాయంలోని మొదటి ఏడు సూక్తులు అందులోనివే.

ఈ అధ్యాయం తొలి సూక్తుల్లో ఇవ్వబడిన ఆజ్ఞ ప్రకారం దైవప్రవక్త (సల్లం) ధర్మప్రచారం ప్రారంభించారు. దివ్యఖుర్ఆన్ సూక్తులు అవతరించినప్పుడల్లా వాటిని ఆయన ప్రజలకు విన్పించి ధర్మబోధ చేస్తుండేవారు. ఇంకేముంది, జనంలో సంచలనం చెలరేగింది. వారి నుండి తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. ఇలాంటి పరిస్థితిలో కొంత కాలానికి హజ్‌యాత్ర మొదలయింది. ఆ సందర్భంలో దైవప్రవక్త (సల్లం) బయట నుండి వచ్చిన వివిధ ప్రాంతాల, జాతుల, తెగల ప్రజలను కలుసుకొని వారికి దైవ సందేశం అందజేయడానికి ప్రయత్నించారు. కాని మక్కా బహుదైవారాధకులు ఆయనకు వ్యతిరేకంగా దుష్ప్రచారం సాగిస్తూ ఆటంకాలు సృష్టించారు.

ఈ నిర్వాకం కోసం బహుదైవారాధకులు హజ్‌కు ముందు ఒక సమావేశం నిర్వహించి విషయాన్ని కూలంకషంగా చర్చించారు. చివరికి వలీద్ బిన్ ముగైరా తీవ్రంగా ఆలోచించి "ముహమ్మద్ పెద్ద మాంత్రికుడని, ఎవరైనా అతని నోట వెలువడే వాణి వింటే అది వారి నుండి వారి తల్లిదండ్రుల్ని, భార్యాపిల్లల్ని దూరం చేస్తుందని ప్రచారం చేద్దాం" అని అన్నాడు. ఈ ప్రతిపాదనను అందరూ ఆమోదించి అమలు పరచడానికి సిద్ధమయ్యారు. కాని ఈ ప్రచారం వల్ల దైవప్రవక్త (సల్లం) పేరు అరేబియా నలుమూలలా వ్యాపించిపోయింది.

## కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

దుప్పటి కప్పుకొని పడుకున్నవాడా! లే, లేచి (ప్రజలను) హెచ్చరించు. నీ ప్రభువు ఔన్నత్యాన్ని చాటిచెప్పు. నీ దుస్తులు పరిశుభ్రంగా ఉంచుకో. అపవిత్రత, అపరి శుద్ధతలకు దూరంగా ఉండు. ఏ మేలైనా ప్రాపంచిక ప్రయోజనాలు ఆశించి చేయకు. (కష్టాలు వచ్చినప్పుడు) నీ ప్రభువు (ప్రసన్నత) కోసం సహనం వహించు.

ప్రళయశంఖం పూరించబడే రోజు... ఆరోజు పరిస్థితి చాలా కఠినంగా, ఘోరంగా ఉంటుంది. అవిశ్వాసులకు ఏ మాత్రం తేలికగా ఉండదు. (1-10)



నేను ఒంటరిగా పుట్టించినవాడ్ని నాకు వదిలెయ్యి. (నేను చూసుకుంటానతని సంగతి.) నేనతనికి అపార సిరిసంపదలు ప్రసాదించాను. అతడ్ని ఎల్లప్పుడూ వెన్నంటి ఉండే కొడుకుల్ని ఇచ్చాను. సుఖసంతోషాలకు అవసరమైన జీవన సామగ్రినంతా ప్రసాదించాను. అయినా నేను తనకు మరింత అనుగ్రహిస్తానని పేరాశతో ఉన్నాడు.

అలా ఎన్నటికీ జరగదు. అతను మాసూక్తుల పట్ల ద్వేషం పెంచుకున్నాడు. త్వరలోనే నేనతడ్ని కఠినమైన (నరక)శిఖరం ఎక్కిస్తాను. అతను బాగా ఆలోచించి (మాకు వ్యతిరేకంగా) పన్నాగం పన్నడానికి ప్రయత్నించాడు. వాడు నాశనం గాను! ఎలాంటి దుష్టయత్నానికి ఒడిగట్టాడు!! వాడు పాడుగాను! ఎలాంటి దారుణానికి పాల్పడ్డాడు!![1] (11-20)

తరువాత అతను (జనం వైపు) చూశాడు. ఆ తరువాత భృకుటి ముడిచి, మూతి విరుచుకున్నాడు. ఆపై వెనక్కి తిరిగి హుంకరించాడు. చివరికతను "ఇది పూర్వ కాలం నుంచీ సాగుతున్న మంత్రజాలం తప్ప మరేమీ కాదు. ఇది మానవ వాక్కు మాత్రమే" అన్నాడు. (21-25)

త్వరలోనే నేనతడ్ని నరకంలో విసరిపడేస్తాను. ఆ నరకం ఏమిటో నీకేంతెలుసు? అది (మనిషిని) మిగల్చదూ, వదలిపెట్టదు. చర్మాన్ని నిలువుగా మాడ్చి వేస్తుంది. దాని నిర్వహణ కోసం పంధొమ్మిది మంది కార్యకర్తలు నియమించబడ్డారు. (26-30)

మేము నరక పాలకులుగా దైవదూతల్ని నియమించాము. వారి సంఖ్యను అవిశ్వాసు లకు పరీక్షగా చేశాము.[2] (గ్రంథప్రజలకు నమ్మకం కుదరడానికి, విశ్వాసుల విశ్వాసం మరింత దృఢం కావడానికి ఇలా చేశాము. కనుక గ్రంథప్రజలు, విశ్వాసులు ఎలాంటి అనుమానంలో పడిపోకూడదు. హృదయంలో (కాపట్య) రోగమున్నవారు, అవిశ్వాసులు (దీన్ని విమర్శిస్తూ) "దేవుడు చెప్పిన ఈ వింతమాటలోని అంతరార్థం ఏమిటో!" అంటారు.

ఇలా దేవుడు తాను తలచిన విధంగా కొందరిని దారి తప్పిస్తాడు; మరికొందరికి దారి చూపుతాడు. నీ ప్రభువు సైన్యాల్ని గురించి ఆయనకు తప్ప మరెవరికీ తెలియదు.

---

1. ఈ సూక్తులు దైవప్రవక్త (సల్లం)కు వ్యతిరేకంగా దుష్టపథకం రూపొందించిన వలీద్ బిన్ ముగైరా విషయంలో అవతరించాయి.

2. మనిషి ప్రవృత్తిలోనే చెడు వేళ్ళూనుకొని ఉన్నప్పుడు మంచి విషయంలో కూడా అతను చెడును చూడటానికే ప్రయత్నిస్తాడు. దైవప్రవక్త (సల్లం) నోట నరకపాలకుల సంఖ్యను గురించి విన్నప్పుడు మక్కా అవిశ్వాసులు కూడా ఇలాగే ప్రవర్తించారు. అంత పెద్ద నరకానికి 19 మంది దైవ దూతలేనా! అని హేళన చేశారు. "మనం వేలసంఖ్యలో ఉన్నాం, ఈ పంధొమ్మిది మంది మనల్నేం చేస్తారు? మనలో పదేసిమంది ఒక్కొక్క దైవదూతను ఎదుర్కొంటారు" అని చెప్పుకున్నారు. వారిలో ఒక మల్లయోధుడు ముందుకు వచ్చి "నేనొక్కడ్నే 17 మంది దైవదూతల్ని మట్టికరిపిస్తాను. మిగతా ఇద్దర్ని మీరంతా కలసి చూసుకోండి" అన్నాడు. ఈవిధంగా నరకదూతల సంఖ్య మక్కా అవి శ్వాసుల్ని పరీక్షకు గురిచేసి, వారి సత్యతిరస్కారాన్ని మరింత అధికం చేసింది.

ప్రజలకు హితోపదేశం చేయడానికే ఈ (నరకదూతల) ప్రస్తావన తెచ్చాము. (31)

(మీరనుకుంటున్నట్లు ఇదేదో ఆషామాషీ విషయం) కాదు. చంద్రుడి సాక్షి! గడచి పోతున్నరాత్రి సాక్షి!! తెల్లారుతున్న ఉదయం సాక్షి!!! ఈనరకం గొప్పవిషయాలలో ఒకటి.

నరకం మానవుల పాలిట భయంకరమయిన విషయం. మీలో (సత్యాన్ని స్వీకరించడానికి) ముందుకు రాదలిచే, లేక వెనకుండి పోగోరే ప్రతివ్యక్తి పాలిటా ఇది భయంకరమైన విషయమే. (32-37)

ప్రతి మానవుడూ తన కర్మలకు బదులు తాకట్టు వస్తువు లాంటివాడు. అయితే స్వర్గ వనాలలో ప్రవేశించే కుడిపక్షం వారు మాత్రం కాదు.

వారు (నరకంలోని) పాపాత్ముల్ని చూసి "మిమ్మల్ని ఏ విషయం నరకంలో పడ వేసింది?" అని అడుగుతారు. (38-42)

దానికి పాపాత్ములు ఇలా సమాధానమిస్తారు: "మేము ప్రార్థన (నమాజు) చేసే వారిలో చేరలేదు. పేదలకు అన్నదానం చేసేవారము కాము. సత్యతిరస్కారులతో కలసి మేమూ (సత్యాన్ని) తిరస్కరిస్తుండేవాళ్ళం. తీర్పుదినాన్ని అసత్య విషయమని ఖండిస్తూ ఉండేవాళ్ళం. ఈ స్థితిలోనే చివరికి అనివార్య విషయం (మృత్యువు) మా ముందుకు వచ్చింది." (43-47)

అప్పుడు సిఫారసు చేసేవారి సిఫారసు వారికి ఏమాత్రం ఉపయోగపడదు. (48)

ఇంతకూ వీరికేమయింది, పులిని చూసి పారిపోయే అడవి గాడిదల్లా మా హితోప దేశానికి విముఖులయి పోతున్నారు? అసలు వారిలో ప్రతి ఒక్కడూ తనపేర మేము బహిరంగ లేఖ పంపాలని కోరుతున్నాడు. కాదు, అసలు సంగతి అది కూడాకాదు. వారికసలు పరలోకమంటే భయమేలేదు. (అందువల్ల దాన్నిగురించి వారు ప్రశాంతంగా ఆలోచించడం లేదు.) (49-53)

ఎంతమాత్రం కాదు. ఇదొక హితోపదేశం. ఇష్టమైనవారు దీన్నుండి గుణపాఠం నేర్చుకోవచ్చు. (అదైనా) దేవుడు తలుచుకుంటే తప్ప ఎవరూ గుణపాఠం నేర్చుకోలేరు.

మానవులంతా దేవునికి మాత్రమే భయపడాలి. ఆ హక్కు ఆయనకే ఉంది. తనకు భయపడేవారినే ఆయన క్షమిస్తాడు. క్షమించే అర్హత (అధికారం) కూడా ఆయనకే ఉంది. (54-56)

✪

**అవతరణ: మక్కా**

## 75. ప్రళయం (ఖియామ)

**సూక్తులు: 40**

ఈ అధ్యాయాన్ని "ఖియామ" (ప్రళయం) అంటారు. ఇది నబవీ శకం ప్రారంభ కాలంలో అవతరించి ఉండవచ్చని కొన్ని ఉల్లేఖనాల ద్వారా తెలుస్తోంది. ఇందులో ప్రళయం సంభవం గురించి, మరణానంతరం పునరుత్థాన దినాన జరిగే పరిణామా లను గురించి వివరిస్తూ మానవుడ్ని హెచ్చరించడం జరిగింది. ఈ అధ్యాయం మానవుల కర్మలకు పరలోకంలో జవాబుదారీ భావనను గురించి హెచ్చరిస్తోంది.



### కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

కాదు. నేను ప్రళయం సాక్షిగా చెబుతున్నాను. (మీరనుకునేది ఎంతమాత్రం నిజం) కాదు. నేను తననుతాను నిందించుకునే ఆత్మ[1] సాక్షిగా చెబుతున్నాను. (మృత) మానవుని ఎముకల్ని మేము సమీకరించలేమని అతను భావిస్తున్నాడా? ఎందుకు సమీక రించలేము? మేము అతని వ్రేళ్ళ కొనలను సైతం తిరిగి రూపొందించగలం. (1-4)

కాని మానవుడు ఇకముందు కూడా దుష్కార్యాలు చేస్తూ, విశృంఖలజీవితం గడప గోరుతున్నాడు. "ప్రళయం ఎప్పుడొస్తుంది? అసలింతకూ అది వస్తుందా లేదా?" అని అంటాడు. ఆరోజు మానవులు (తీవ్ర భయాందోళనలతో) కళ్ళు తేలవేస్తారు. చంద్రుడు కాంతివిహీనుడై పోతాడు. సూర్యచంద్రుల్ని కలిపివేయడం జరుగుతుంది. అప్పుడు ఈ మానవుడే "నేనెక్కడికి పారిపోవాలి?" అని అంటాడు. (5-10)

ఎక్కడికీ పారిపోలేవు. ఎక్కడా నీకు రక్షణ లేదు. ఆరోజు నీవు నీ ప్రభువు సన్నిధికే వెళ్ళి నిలబడవలసి ఉంటుంది. ఆరోజు మానవునికి అతను ముందుకు పంపుకున్నవీ, వెనుక వదలి వచ్చినవీ అన్నీ తెలియజేయబడతాయి. అతను ఎన్ని సాకులు చూపినా, తనను గురించి స్వయంగా తానే బాగా ఎరగ్గలడు. (11-15)

ప్రవక్తా! ఈ దివ్యావిష్కృతిని గుర్తుంచుకోవడానికి వడివడిగా నాలుక తిప్పకు. దాన్ని గుర్తుచేయించడం, నీచేత చదివించడం మా పని. కనుక మేము పఠిస్తున్నప్పుడు నీవు శ్రద్ధగా ఆలకించు చాలు. తర్వాత దాని భావం తెలియజేయడం కూడా మా బాధ్యతే.

(మీరనుకునేది) ఎంతమాత్రం (నిజం)కాదు. మీరసలు త్వరగా లభించే (ఐహిక) వస్తువులపై అమితమైన వ్యామోహం పెంచుకొని పరలోకాన్ని విస్మరించారు. (16-21)

ఆరోజు కొందరి ముఖాలు కళకళలాడుతూ దేదీప్యమానంగా వెలిగిపోతుంటాయి. వారు తమ ప్రభువుని ప్రత్యక్షంగా చూస్తుంటారు.

మరికొందరి ముఖాలు నిరాశా నిస్పృహలతో వాడి జావకారి పోతుంటాయి. వారు తమపై పెద్ద ఆపద విరుచుకుపడబోతోందని భావిస్తూ ఉంటారు. (22-25)

(చనిపోయాక మళ్ళీ బ్రతికించబడటం కల్ల అనే మీ అభిప్రాయం) ఎంతమాత్రం (నిజం) కాదు. మనిషి కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్నప్పుడు "మంత్రించే వారెవరైనా ఉన్నారా?" అంటారు జనం. ఆ మనిషి ఇక తాను ఇహలోకం వీడిపోయే సమయం ఆసన్నమయిందని అనుకుంటాడు. కష్టాల మీద కష్టాలు వచ్చిపడతాయి. అదే నీ ప్రభువు సన్నిధికి బయలుదేరవలసిన రోజు. (26-30)

అయితే అతను (ఈ) సత్యాన్ని అంగీకరించలేదు. ప్రార్థన (నమాజ్) చేయలేదు. పైగా సత్యాన్ని నిరాకరించి (దేవునిపై) తిరగబడ్డాడు. ఆ తరువాత నిక్కుతూ, నీల్గుతూ తన ఇంటికి వెళ్ళిపోయాడు.

---

1. వివరాలకు 89:27-30) సూక్తులు, వాటి పాదసూచిక చూడండి.

ఈ వైఖరి ఎంతో శోచనీయం. ఇది నీకే శోభిస్తుంది. ఔను, ఈ వైఖరి ఎంతో శోచనీయం. ఇది నీకే శోభిస్తుంది. (31-35)

మానవుడు తనను ఇట్టే వదలిపెట్టడం జరుగుతుందని భావిస్తున్నాడా? అతను మొదట (స్త్రీగర్భంలో) కార్చబడిన క్షుద్రబిందువుగా లేడా? తర్వాత ఒక నెత్తుటి ముద్దలా రూపొందాడు. ఆ తర్వాత దేవుడు అతనికి దేహం నిర్మించి తగిన అవయవాలు పొందికగా అమర్చాడు. ఆపై అతని నుండి రెండు వేర్వేరు జాతులుగా స్త్రీ పురుషుల్ని పుట్టించాడు. ఇదంతా చేసినవాడు చనిపోయినవాడ్ని మళ్ళీ బ్రతికించలేడా? (36-40) ✪

అవతరణ: మక్కా

## 76. సమయం (దహ్ర్)

సూక్తులు: 31

ఈ అధ్యాయాన్ని "దహ్ర్" అంటారు. ఇది నబవీశకం ప్రారంభంలోనే అవతరించినట్లు తెలుస్తోంది. ఇందులో మానవుడ్ని దేవుని ఏకత్వం వైపు పిలుస్తూ అవిశ్వాసులకు మరణానంతరం ఎదురయ్యే పరిణామాల్ని గురించి హెచ్చరించడం జరిగింది. అలాగే విశ్వాసుల గుణగణాలు, పరలోకంలో వారికి లభించే సుఖాల ప్రస్తావన కూడా ఉంది.

### కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

నిరాఘాటంగా సాగుతున్న కాలవాహినిలో మానవునికి తానొక గడ్డిపోచ విలువ కూడా లేనివాడిగా ఉండిన సమయం ఎప్పుడైనా ఎదురయిందా? మేము మానవుడ్ని పరీక్షించడానికి ఒక మిశ్రమ బిందువు ద్వారా పుట్టించాము. దానికోసం మేమతడ్ని వినేవాడిగా, చూసేవాడిగా రూపొందించాం. అతనికి మేము సన్మార్గం కూడా చూపించాం. అతను సన్మార్గం అవలంబించి (మాపట్ల) కృతజ్ఞుడైవున్నా లేక (అవిశ్వాసవైఖరి అవలంబించి) కృతఘ్నుడైపోయినా (అంతా అతని ఇష్టాయిష్టాలపై వదలిపెట్టాము). (1-3)

సత్యతిరస్కారుల కోసం మేము సంకెళ్ళు, గుదిబండ, భగభగమండే అగ్ని సిద్ధపరచి ఉంచాం. (సత్యాన్ని విశ్వసించిన) సజ్జనులు (స్వర్గంలో) కర్పూర జలం కలిపిన మద్యంసేవిస్తారు. ఇదొక సెలయేరు. దైవభక్తులు దీని నీటితోపాటు మద్యం సేవిస్తారు. వారు తాముకోరిన చోట (కూర్చొని) సులభంగా దాని శాఖను తీసుకుంటారు. (4-6)

(ఆ సజ్జనుల లక్షణాలు ఇలాఉంటాయి:) వారు తమ మొక్కుబడులు నెరవేరుస్తారు.[1] నలుదిశలా ఆపద వ్యాపించేరోజు పట్ల వారు భయపడుతుంటారు. దేవుని మీద

1. ఇక్కడ మూలభాషలో "నజ్ర్" అనే పదం ప్రయోగించబడింది. అంటే మనిషిపై విధించబడిన పని లేదా తనకు తాను విధించుకున్న పని అని శాబ్దిక భావం. మరోమాటలో చెప్పాలంటే మనిషి విధిగా ఏదైనా పని చేస్తానని మొక్కుబడి చేసుకోవడం లేదా ప్రతిన బూనడం అని అర్థం. ఇలాంటి విధులు, మొక్కుబడులు, ప్రతిజ్ఞలు తప్పకుండా నెరవేర్చాలి. అయితే అవి తనకు శక్తికి మించినవయినప్పుడు లేదా ధర్మవ్యతిరేక విషయాలైనప్పుడు వాటిని నెరవేర్చకూడదు..

మొక్కుబడి మన అదృష్టాన్ని మార్చివేస్తుందన్న భావంతో మొక్కుబడి చేసుకోవడాన్ని దైవప్రవక్త (సల్లం) వారించారు. అలాగే దేవుడు తన పని నెరవేరిస్తేనే ఆయన కోసం తాను ఫలానా సత్కార్యం చేస్తానని మనిషి మొక్కుబడి చేసుకోవడాన్ని కూడా ఆయన వారించారు.



ఉండే ప్రేమపారవశ్యంతో నిరుపేదలకు, అనాధలకు, ఖైదీలకు అన్నదానం చేస్తారు. (వారు అన్నార్తులతో ఇలా అంటారు:) "మేము దేవుని (ప్రసన్నత) కోసం అన్నదానం చేస్తున్నాం. అంతేగాని మీనుండి ఎలాంటి ప్రతిఫలంగాని, కృతజ్ఞతలుగాని ఆశించడం లేదు. మేమసలు ఘోరమైన ఆపద తెచ్చిపెట్టే సుదీర్ఘ (ప్రళయ)దినం గురించి దేవునికి భయపడుతున్నాం." (7-10)

కనుక దేవుడు వారిని ఆరోజు కీడునుండి కాపాడి ఉల్లాసం, ఉత్సాహాలను అనుగ్రహిస్తాడు. (కష్ట సమయాల్లో) సహనం వహించినందుకు ప్రతిఫలంగా వారికి స్వర్గవనాలు, పట్టువస్త్రాలు ప్రసాదిస్తాడు. వారక్కడ అద్భుతమైన ఆసనాలపై మెత్తటి దిండ్లు కానుకొని కూర్చొని ఉంటారు. వారికి ఎండబాధగాని, చలిబెడదగాని ఏమాత్రం ఉండదు. స్వర్గవృక్షాలు వారికి నీడనిస్తాయి. వాటిపండ్లు వారికి అనుక్షణం అందుబాటులో ఉంటాయి. (11-14)

(ఇంకా) వారిముందు వెండిపాత్రలు, గాజు గ్లాసులు తెచ్చిపెడ్తారు. గాజు గ్లాసులు కూడా వెండిలా మెరిసిపోతుంటాయి. అవన్నీ సరైన లెక్క ప్రకారం నింపబడి ఉంటాయి. వారికక్కడ సొంటి కలిపిన మధుపాత్రలు అందించబడతాయి. ఇదికూడా స్వర్గంలో ప్రవహించే ఒక సెలయేరు. దీన్ని సల్‌సబీల్ (సుమధుర మద్యపానం) అంటారు.

వారిసేవ కోసం నిత్యబాలలు అటూఇటూ పరుగిడుతుంటారు. నీవా పిల్లల్ని చూస్తే చెదరిన ఆణిముత్యాల్లా కనిపిస్తారు. నీకక్కడ ఎటుచూసినా రంగ రంగ భోగ భాగ్యాలు, మహోన్నత సామ్రాజ్య వైభవాలు కన్పిస్తాయి.

వారి దేహాలపై పల్చటి పట్టుపీతాంబరాలు, బంగారు జల్తారువస్త్రాలు ఉంటాయి. వారు వెండి కంకణాలు ధరించి ఉంటారు. వారి ప్రభువు వారికి ఎంతో పరిశుద్ధమైన మద్యపానం ప్రసాదిస్తాడు. "ఇదీ మీ ప్రతిఫలం. మీ కృషికి తగిన విలువ, ఆదరణలు లభించాయి" (అని వారికి దైవదూతలు చెబుతారు). (15-22)

దైవప్రవక్త (సల్లం) ఓసారి మొక్కుబడిని గురించి చెబుతూ "జరగవలసిఉన్న ఏ పనిని కూడా మొక్కుబడి అడ్డుకోలేదు. కాకపోతే ఆ మొక్కుబడి ద్వారా పిసినారి (జేబు) నుండి కొంత డబ్బు తీయబడుతుంది" అన్నారు. (ముస్లిం, అబూదావూద్). మరోసందర్భంలో ఇలా అన్నారు: "మొక్కుబడి జరగవలసిన పనిని దాని నిర్ణీత సమయానికి ముందుగాగాని లేదా ఆలస్యంగాగాని జరిపించలేదు. కాకపోతే పిసినారి (జేబు) నుండి కొంతడబ్బు తీయబడుతుంది." (బుఖారి, ముస్లిం)

దీన్నిబట్టి మనిషి చేసే ఏ మొక్కుబడయినా అది అతని అదృష్టాన్ని ఏమాత్రం మార్చలేదని, ఆ మొక్కుబడి ఫలితం కూడా అతని అదృష్టం ప్రకారమే ఉంటుందని తెలుస్తోంది.

"దేవుని అవిధేయత విషయంలో మొక్కుబడి నెరవేర్చే ప్రశ్నే రాదు. అలాగే తన అధీనంలో లేని విషయంలో కూడా మొక్కుబడి నెరవేర్చే ప్రశ్న లేదు"అన్నారు దైవప్రవక్త (స). (అబూదావూద్)

ఒకవ్యక్తి వచ్చి "నా సోదరి కాలి నడకన హజ్‌యాత్ర చేస్తానని మొక్కుబడి చేసుకున్నది" అన్నాడు. దానికి దైవప్రవక్త (సల్లం) "నీ సోదరి (ఆవిధంగా) పడే శ్రమ, కష్టం దేవునికి అవసరం లేదు. ఆమె వాహనమెక్కి హజ్‌యాత్రకు వెళ్ళాలి" అని చెప్పారు. (అబూదావూద్)

(ముహమ్మద్!) మేమే ఈ ఖుర్‌ఆన్‌ని (సందర్భానుసారం) కొద్దికొద్దిగా చేసి నీపై అవతరింపజేశాము. కనుక (ఈ మార్గంలో ఎదురయ్యే ఇబ్బందుల్ని అధిగమిస్తూ) నీ ప్రభువాజ్ఞతో సహనం వహించు. వారిలో ఏ దురాత్ముడు లేక సత్యతిరస్కారి చెప్పే మాటలు ఏమాత్రం వినకు. ఉదయం, సాయంత్రం నీ ప్రభువు నామం స్మరిస్తూ ఉండు. రాత్రివేళ కూడా ఆయన సన్నిధిలో సాష్టాంగపడుతూ ఉండు. రాత్రివేళ చాలా పొద్దుపోయే వరకు సుదీర్ఘంగా ఆయన (పవిత్రతను) స్మరిస్తూ ఉండు.[2] (23-26)

వీరు త్వరగా లభించే ఐహిక వస్తువులపై అమితమైన వ్యామోహం పెంచుకున్నారు. ముందు రాబోయే భారమైన (సంకట) దినాన్ని విస్మరించారు. మేమే వారిని పుట్టించి వారి శరీరాలను పటిష్ఠపరిచాము. మేము తలచుకుంటే వారిని (హత)మార్చి వారి స్థానంలో ఇతరులను తీసుకురాగలం (27,28)

ఇదొక హితోపదేశం. ఇష్టమైనవారు (దీని ద్వారా) తమ ప్రభువు వైపు వెళ్ళే మార్గం అవలంబించవచ్చు. దేవుడు తలచుకోనంతవరకు, మీరు తలచుకున్నంత మాత్రాన ఏమీ కాదు. నిస్సందేహంగా దేవుడు సర్వం ఎరిగినవాడు, మహా వివేకవంతుడు. ఆయన తాను కోరిన వారిని తన కారుణ్యఛాయలోకి తీసుకుంటాడు. దుర్మార్గుల కోసం ఆయన దుర్భర (నరక) యాతనలు సిద్ధపరచి ఉంచాడు. (29-31) ✪

# 77. (రుతు)పవనాలు (ముర్సలాత్)

**అవతరణ: మక్కా** **సూక్తులు: 50**

ఈ అధ్యాయాన్ని "ముర్సలాత్" అంటారు. ఇది కూడా నబవీశకం ప్రారంభ కాలం లోనే అవతరించింది. ఇందులో ప్రళయం, పరలోకం, వాటి భయంకర పరిణామాల్ని గురించి సత్యతిరస్కారులకు హెచ్చరిక, విశ్వాసులకు స్వర్గ సౌఖ్యాలను గురించిన శుభవార్తలు ఉన్నాయి.

### కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

ఒకదాని తరువాత ఒకటి తెరలు తెరలుగా పంపబడే పవన వీచికల సాక్షి! తర్వాత (అవి) ఉధృతంగా వీస్తూ (మేఘాలను) పైకి మోసుకెళ్తాయి. ఆ తర్వాత (వాటిని) చీల్చి వేరుచేస్తాయి. ఆపై (దేవుడ్ని గురించి) క్షమాపణగాని, హెచ్చరికగాని జ్ఞాపకం చేస్తాయి. మీకు వాగ్దానం చేయబడుతున్న విషయం (ప్రళయం) తప్పకుండా సంభవిస్తుంది.

ఆరోజు నక్షత్రాలు నిస్తేజమైపోతాయి. ఆకాశం చీలిపోతుంది. పర్వతాలు దూది పింజల్లా ఎగురుతాయి. దైవప్రవక్తలను ప్రవేశపెట్టే సమయం ఆసన్నమవుతుంది. ఏ రోజుకోసం ఈ పనులు ఆపి ఉంచబడ్డాయి? విచారణ రోజు కోసం. విచారణ రోజంటే ఏమిటో నీకు తెలుసా? (పరలోక) ధిక్కారులకు ఆరోజు వినాశం తప్పదు. (1-15)

(సత్యాన్ని తిరస్కరించిన) పూర్వీకులను మేము హతమార్చలేదా? ఆ తరువాత

2. అంటే అర్ధరాత్రి దాటిన తరువాత చేసే తహజ్జుద్ నమాజ్ అని అర్థం.



వచ్చేవారిని కూడా మేము వారి వెనుకే పంపుతాము. నేరస్థుల పట్ల మేము ఇలాగే వ్యవహరిస్తాం. ధిక్కారులకు ఆరోజు వినాశం తప్పదు. (16-19)

మేము మిమ్మల్ని క్షుద్రబిందువుతో పుట్టించలేదా? దాన్ని ఒక నిర్ణీతకాలం వరకు ఓ చోట (స్త్రీగర్భంలో) భద్రపరచలేదా? చూశారా, ఈ పని చేసే శక్తి మాకే ఉంది. మేము అద్భుతమైన శక్తిసామర్థ్యాలు కలవారం. ధిక్కారులకు ఆరోజు వినాశం తప్పదు.

మేము భూమిని జీవుల్ని, నిర్జీవుల్ని తనలో ఇముడ్చుకునేలా రూపొందించలేదా? అందులో ఎత్తయిన పర్వతాలు పాతాము. త్రాగడానికి మంచినీటిని కూడా ఏర్పాటు చేశాం. (ఇదంతా ఎవరు చేశారు?) ధిక్కారులకు ఆరోజు వినాశం తప్పదు. (20-28)

ఇప్పుడిక నడవండి మీరు ధిక్కరిస్తున్న దాని వైపు. మూడు తెరలుగా మారే నీడ వైపు నడవండి. ఆ నీడలో ఎలాంటి చల్లదనం ఉండదు. అగ్నిజ్వాలల నుండి కూడా కాపాడదు. అది మేడల వంటి పెద్దపెద్ద నిప్పు రవ్వలు వెదజల్లుతుంది, బంగారువన్నె ఒంటెలు ఎగురుతున్నట్లు (అన్పిస్తుంది). ధిక్కారులకు ఆరోజు వినాశం తప్పదు.

వారు నోరు కూడా మెదపలేని దుస్థితి దాపురించే రోజది. సాకులు చెప్పడానికి అవకాశమే ఇవ్వబడదు. ధిక్కారులకు ఆరోజు వినాశం తప్పదు. అదే విచారణ జరిగే రోజు. మేము మిమ్మల్ని, మీ పూర్వీకుల్ని ఒక చోట చేర్చాం. ఇప్పుడు మాకు వ్యతిరేకంగా మీరేదైనా పన్నాగం పన్నగలిగితే పన్ని చూడండి. ధిక్కారులకు ఆరోజు వినాశం తప్పదు. (29-40)

దైవభీతిపరులు ఆరోజు చల్లటి నీడపట్టున సెలయేరుల మధ్య హాయిగా ఉంటారు. వారు కోరుకున్న పండ్లు, ఫలాలు (క్షణాల్లో వారి ముందుంచబడతాయి). "మీరు చేసుకున్న సత్కార్యాలకు ప్రతిఫలంగా నేడు హాయిగా తినండి, త్రాగండి." మంచివారికి మేము ఇలాంటి ప్రతిఫలమే ప్రసాదిస్తాము. ధిక్కారులకు ఆరోజు వినాశం తప్పదు. (41-45)

(ధిక్కారులారా!) కొన్నాళ్ళపాటు తినండి, భోగభాగ్యాలు అనుభవించండి. మీరసలు పరమ దుర్మార్గులు. ధిక్కారులకు ఆరోజు వినాశం తప్పదు. (దేవుని ముందు) తల వంచండని చెబితే వీరు (తలబిరుసుతో) తలవంచడానికి నిరాకరిస్తున్నారు. దీని తరువాత (అంటే ఖుర్‌ఆన్‌ని తిరస్కరించిన తరువాత) వారు మరే వాణిని విశ్వసిస్తారు? ధిక్కారులకు ఆరోజు వినాశం తప్పదు. (46-50) ✪

# 78. సంచలనాత్మక వార్త (నబా)

**అవతరణ: మక్కా** **సూక్తులు: 4**

ఈ అధ్యాయాన్ని "నబా" అంటారు. ఇది నబవీ శకం ప్రారంభకాలంలో అవతరించింది. ఇందులో దేవుడు మానవాళికి చేసిన మహోపకారాలు, ప్రళయం, తీర్పుదినం, పరలోకంలో సత్యతిరస్కారుల పర్యవసానం, విశ్వాసులకు లభించే స్వర్గసౌఖ్యాలు, అవిశ్వాసుల పశ్చాత్తాపం వగైరా విషయాలు ప్రస్తావించబడ్డాయి.

**కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం**

వారు ఏ విషయాన్ని గురించి చర్చించుకుంటున్నారు? తాము విభిన్న రకాలుగా అభిప్రాయపడుతున్న ఆ సంచలనాత్మక వార్తను గురించేనా? (వారనుకుంటున్నది) ఎంతమాత్రం (నిజం) కాదు.[1] త్వరలోనే వారికి తెలుస్తుంది. ఔను, ఎంతమాత్రం (నిజం) కాదు. అతిత్వరలోనే వారికి తెలుస్తుంది. (1-5)

మేము భూమిని విశాలపరచి నివాసయోగ్యంగా రూపొందించలేదా? దానిపై పర్వ తాలను మేకులుగా పాతలేదా? మిమ్మల్ని (స్త్రీ పురుష) జంటలుగా సృష్టించలేదా? మీ నిద్రను సౌఖ్యసాధనంగా చేయలేదా? రాత్రిని విశ్రాంతిసమయంగా, పగటిని జీవనోపాధి సమయంగా చేయలేదా? మీపైన దృఢమైన ఏడుఆకాశాలు నిర్మించలేదా? వేడిని వెద జల్లే తేజోవంతమైన దీపాన్ని సృజించలేదా? ధాన్యం, కూరగాయలు, దట్టమైన తోటల పెరుగుదల కోసం మేఘాల నుండి ధారాపాత వర్షం కురిపించడం లేదా? (6-16)

తీర్పుదినం ఒక నిర్ణీత సమయం. (అది తన నిర్ణీత సమయంలో తప్పకుండా వస్తుంది) ఆరోజు శంఖం పూరించబడుతుంది. అప్పుడు మీరు (సమాధుల నుండి) గుంపులు గుంపులుగా వస్తారు. ఆకాశద్వారాలన్నీ తెరవబడతాయి. పర్వతాలు స్థాన భ్రంశం చెంది, తునాతనకలయి ఇసుకరేణువులుగా మారిపోతాయి. (17-20)

నిస్సందేహంగా నరకం మాటులాంటిది. తలబిరుసు ధిక్కారులకు నివాసమది. అందులోనే వారు యుగాలతరబడి పడివుంటారు. అక్కడ చల్లదనంగాని, త్రాగడానికి తగిన పానీయంగాని వారు చవిచూడలేరు. ఏదైనా దొరికితే అది సలసల కాగేనీరు, పరమ జుగుప్సాకరమైన చీము, నెత్తురు[2] మాత్రమే. ఇదీ (వారికి లభించే) పూర్తి ప్రతిఫలం. (21-26)

వారికి పరలోక విచారణ పట్ల నమ్మకమే లేదు. మా సూక్తుల్ని అసత్య విషయాలుగా పరిగణించి నిరాకరించారు. మేము మాత్రం ప్రతి విషయాన్నీ లెక్కగట్టి (వారి కర్మలచిట్టాలో నమోదుచేసి) ఉంచాము. "ఇక చవిచూడండి. మేము మీకు (నరక) యాతనలు తప్ప మరే విషయాన్నీ అధికం చేయము" (అని వారికి చెప్పబడుతుంది). (27-30)

దైవభీతిపరులకు వారి కోర్కెలునెరవేరే అద్భుతస్థానం ఉంది. మనోహరమైన ఉద్యానవనాలు, సుమధుర ద్రాక్షఫలాలు ఉన్నాయి. సమవయస్కులైన సుకన్యలు

---

1. ప్రళయం, పరలోకం గురించి దైవప్రవక్త (సల్లం) తెలిపిన సమాచారం పట్ల మక్కా బహుదైవారాధకులు ఆశ్చర్యపోతూ పలు అనుమానాలు వ్యక్తపరిచేవారు. కొందరు, మానవులు చనిపోయిన తరువాత తిరిగి బ్రతకడం జరగదని భావిస్తే; మరికొందరు, పరలోకంలో మానవులు తిరిగి బ్రతికించబడినా వారక్కడ దేహాలు లేకుండా ఆత్మల రూపంలో ఉంటారని అనుకునేవారు. ఇక్కడ ఖుర్‌ఆన్ వారి అనుమానాలు, నిరాధారమైన మాటలన్నిటిని ఖండిస్తోంది.

2. మూలభాషలో 'గస్సాఖ్' అనే పదానికి దెబ్బ తగలడం వల్ల వివిధ అవయవాల నుండి స్రవించే దుర్గంధ పూరితమైన చీము, నెత్తురు మొదలైన స్రావాలు అని అర్థం.



ఉన్నారు. మద్యంతో నిండిన, మెరసిపోయే మధుపాత్రలున్నాయి. వారక్కడ పనికి మాలిన మాటలు, అసత్యాలు వినరు. (ఇది) దయామయుడైన నీప్రభువు నుండి వారికి లభించే ప్రతిఫలం. భూమ్యాకాశాలకు, వాటిమధ్య ఉన్న సమస్తానికి ప్రభువయిన దేవుని నుండి లభించే గొప్ప బహుమానం! (ఆరోజు) ఆయన ముందు పెదవి విప్పడానికి కూడా ఎవరూ సాహసించలేరు. (31-37)

(పరిశుద్ధా)ఆత్మ,[3] దైవదూతలు పంక్తులుతీరి ఎంతో వినమ్రులయి నిలబడతారు. అప్పుడు కరుణామయుని అనుమతితో సరైన మాట చెప్పేవారు తప్ప మరెవరూ ఆయనతో మాట్లాడటానికి సాహసించలేరు. ఆరోజు రావడం తథ్యం. కనుక ఇష్టమున్న వారు తమ ప్రభువు వైపు మరలే మార్గం అవలంబించవచ్చు. (38,39)

మేము అతిసమీపంలోనే ఉన్న శిక్ష గురించి మిమ్మల్ని హెచ్చరించాం. మానవుడు తన చేజేతులా చేసుకొని ముందుగా పంపుకున్నదంతా ఆరోజు ప్రత్యక్షంగా చూసు కుంటాడు. అప్పుడు సత్యతిరస్కారి (తీవ్ర పశ్చాత్తాపంతో) "అయ్యో! నేను మట్టిలో మట్ట యిపోయి ఉంటే ఎంత బాగుండేది!!" అని వాపోతాడు. (40) ✪

# 79. దూరి లాగేవారు (నాజిఆత్)

**అవతరణ: మక్కా** **సూక్తులు: 46**

ఈ అధ్యాయాన్ని "నాజిఆత్" అంటారు. ఇది కూడా నబవిశకం ప్రారంభంలోనే అవతరించింది. ఇందులో మరణదూతలను, ఇతర దైవదూతలను సాక్షులుగా చేసి ప్రళయ సంభవం గురించి చెప్పబడింది. పునరుత్థానం గురించి అవిశ్వాసుల అభిప్రా యాల్ని ఖండిస్తూ వారిముందు మూసాప్రవక్త (అలై)-ఫిరౌన్ చక్రవర్తి వృత్తాంతం ఉదాహ రణగా ఇవ్వబడింది. ఆ తర్వాత ప్రళయం, పరలోకం గురించిన ప్రస్తావనలు వస్తాయి.

**కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం**

దూరి గట్టిగా లాగేవారి సాక్షి! మెల్లిగా వెలికితీసేవారి సాక్షి! వేగంగా ఎగురుతూ తిరిగేవారి సాక్షి! (ఆజ్ఞాపాలనలో) ఒకర్నొకరు మించిపోయేవారి సాక్షి! తిరిగి (దైవాజ్ఞల ప్రకారం విశ్వ)వ్యవహారాలు నిర్వహించేవారి సాక్షి![1] ...భూమి ఒకదాని తర్వాత ఒకటి అనేక ప్రకంపనాలతో కుదిపేయబడే రోజు కొందరి గుండెలు తీవ్ర భయాందోళనలతో దడదడ లాడిపోతాయి. వారి చూపులు (అవమాన భారంతో) క్రిందికి వాలిపోతాయి.

---

3. అంటే దేవుని దగ్గర్నుండి ఆయన ప్రవక్తలకు దైవసందేశం చేరవేసే దైవదూత జిబ్రీల్ (అలైహి) అని అర్థం. తొలి దైవప్రవక్త ఆదం (అలై) నుండి అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) వరకు యావన్మంది దైవప్రవక్తలకు ఆయనే దైవసందేశం చేరవేస్తూ వచ్చారు.

1. ఇక్కడ వివిధ బాధ్యతలు, విధులు నిర్వహించే దైవదూతలపై ప్రమాణం చేసి విషయం ప్రారంభించడం జరిగింది. సత్యతిరస్కారి ప్రాణం తీయడానికి నియుక్తుడయిన దైవదూత అతని నరనరాల్లోకి చొచ్చుకుపోయి, శరీరం నుండి బయల్పడటానికి జంకుతున్న అతని ఆత్మను బల వంతంగా లాగి బయటికి తీస్తాడు. దీనికి భిన్నంగా సదాచార సంపన్నుడయిన విశ్వాసి ప్రాణం తీయడానికి నియుక్తుడయిన దైవదూత, బంధవిముక్తి కోసం ఎదురుచూస్తున్న ఆ విశ్వాసి ఆత్మను మెల్లిగా బయటికి తీస్తాడు.

“మనం నిజంగా మళ్ళీ మన పూర్వస్థితికి తీసుకురాబడతామా? మనం (చచ్చి) శిథిలమైపోయి ఎముకలుగా మారిపోయినా (తిరిగి బ్రతికించబడతామా)?” అనంటారు వీరు. “అయితే మళ్ళీ ఈ బ్రతికించి లేపడమనేది (మనకు) చాలా నష్టదాయకమే” అంటారు తిరిగి. కాని ఇది పెద్ద పనేమీ కాదు. ఒకే ఒక భీకర గర్జన విన్పిస్తుంది. అంతే- మరుక్షణమే వారంతా లేచి ఓ బహిరంగ మైదానంలోకి వచ్చి నిలబడతారు. (1-14)

నీకు మూసా వృత్తాంతం చేరిందా? అతని ప్రభువు పవిత్ర తువాలోయలో అతడ్ని పిలిచి ఇలా అన్నాడు: “ఫిరౌన్ దగ్గరకు వెళ్ళు. అతను (మాపై) తిరగబడి విద్రోహి అయ్యాడు. అతనికిలా చెప్పు: ‘నీవు పవిత్రజీవితం గడపడానికి సిద్ధంగా ఉన్నావా? నేను నీకు నీ ప్రభువు (ప్రసన్నత పొందే) మార్గం చూపుతాను. దానివల్ల నీలో (దైవ)భీతి ఏర్పడవచ్చు.” (15-19)

మూసా (ఫిరౌన్ దగ్గరికెళ్ళి) అతనికి అద్భుతమైన మహిమలు చూపించాడు. కాని అతను ధిక్కరించాడు, (ఎంత నచ్చజెప్పినా) వినలేదు. తర్వాత అతను వెళ్ళి రకరకాల పన్నాగాలు పన్నాడు. జనాన్ని సమీకరించి “నేనే మీకు అందరికంటే పెద్దప్రభువుని” అన్నాడు. చివరికి దేవుడు అతడ్ని ప్రపంచంలోనూ, పరలోకంలోనూ శిక్షించడానికి పట్టుకున్నాడు. భయపడేవారికి ఈ సంఘటనలో గొప్ప గుణపాఠం ఉంది. (20-26)

(సరే) మిమ్మల్ని సృష్టించడం ఎక్కువ కష్టమైన పనా లేక ఆకాశాన్నా? దేవుడు దాన్ని నిర్మించాడు. దాని కప్పు ఎంతో పైకిఉండేలా చేశాడు. తర్వాత దాన్ని క్రమబద్ధీకరించాడు. దాని రాత్రిని (చీకటితో) కప్పాడు, పగటిని (వెల్తురుతో) తీశాడు. ఆ తర్వాత ఆయన భూమిని (నివాసయోగ్యంగా) పరిచాడు. అందులోనుంచే నీరు, మేత తీశాడు. దాని మీద పర్వతాలు పాతాడు. ఇదంతా మీ, మీపశువుల ప్రయోజనం కోసమే చేశాడు.

చివరికి మహోపద్రవం సంభవిస్తుంది. ఆరోజు మానవుడు తాను చేసుకున్న పనులన్నీ గుర్తుచేసుకుంటాడు. ప్రతి చూపరీ చూడటానికి వీలుగా నరకం తెరవబడి ఉంటుంది. అయితే తలబిరుసుతో ధిక్కారవైఖరి అవలంబించి, ఐహిక జీవితానికి అత్యధిక ప్రాధాన్యమిచ్చినవాడికి మాత్రం నరకమే (శాశ్వత) నివాసమవుతుంది. విశ్వప్రభువు ముందు నిలబడి తన కర్మలకు సమాధానమిచ్చుకోవలసి ఉంటుందన్న

ఇలా ప్రాణాలు తీసే మృత్యుదూతలే గాక, దైవాజ్ఞలు వెలువడి వెలువడగానే వాటిని శిరసావహిస్తూ సృష్టి వ్యవహారాలు నిర్వహించే దైవదూతలు కూడా ఎందరో ఉన్నారు. ఒక్కొక్క దైవ దూతపై ఒక్కొక్క బాధ్యత ఉంటుంది. మానవుల కర్మల్ని ఎప్పటికప్పుడు రికార్డు చేసే దైవదూతలు కూడా ఉన్నారు. ప్రతి మానవుడ్ని ఎల్లప్పుడూ వెన్నంటిఉండే ఇద్దరు దైవదూతలు ఉంటారు. ఒక దూత మనిషి ఒక సత్కార్యం చేయగానే దాన్ని అతని కర్మపత్రంలో నమోదు చేస్తాడు. మరొక దూత అతని దుష్కార్యాలు నమోదు చేస్తాడు.

ఈ అధ్యాయంలో దైవదూతలపై ప్రమాణం చేయడానికి కారణం- మానవుని నశ్వర శరీరానికి లాగే ఈప్రపంచానికి కూడా ఒక అంతం ఉందని, ఆ తరువాత మానవుడు తన కర్మలకు విశ్వప్రభువు ముందు సమాధానం చెప్పుకోవలసి ఉంటుందని హెచ్చరించడమే.



భావనతో ఆయనకు భయపడుతూ, దుష్ట మనోవాంఛలకు కళ్ళెంవేసిన వ్యక్తికి స్వర్గ నివాసం లభిస్తుంది. (27-41)

“ఇంతకూ ఆ (ప్రళయ) ఘడియ ఎప్పుడొస్తుంది?” అని అడుగుతున్నారు వారు. దాని సమయం తెలియజేయడానికి నీకేం పని? ఆ విషయం దేవునికి మాత్రమే తెలుసు. నీవు దాన్ని గురించి భయపడేవారిని హెచ్చరించేవాడివి మాత్రమే. వారు దాన్ని (ప్రత్యక్షంగా) చూసినప్పుడు (తాము ప్రపంచంలో) ఉదయమో, సాయంత్రమో ఒక్క పూట మాత్రమే ఉండి ఉంటాం” అని[2] అనుకుంటారు. (42-46) ✪

2. పరలోకజీవితం ముందు ప్రపంచజీవితం ఎంత స్వల్పమైనదో మనిషి ఊహకే అందదు. పరలోక విషయాలు మానవ మేధస్సుకు అతీతమైనవి. అయితే పరలోక విషయాలను గురించి మనిషి ఓ మొద్దు అంచనా వేసుకొని, వాటి తీవ్రతను కొంతయినా అర్థం చేసుకోవడానికి వీలుగా ఖుర్‌ఆన్, హదీసుల్లో కొన్ని అంకెలు పేర్కొనబడ్డాయి. వీటి ఆధారంగా మన ఈ ప్రాపంచిక జీవితం ఎంత అశాశ్వతమైనదో కాస్త ఆలోచిద్దాం.

ప్రళయదినాన దేవుడు పాపాత్ములను ఒక చోట సమీకరిస్తాడు. వారి కళ్ళు నీలి రంగుతో అసహ్యంగా ఉంటాయి. వారు పరస్పరం ఇలా మెల్లిగా మాట్లాడుకుంటారు:

“ప్రపంచంలో మనం ఎంత కాలం ఉన్నామని ఒకడంటే, ప్రపంచంలో మనం పదిరోజులు ఉండి ఉంటామని వేరొకడు అంటాడు. కాని వారిలో కాస్త తెలివైనవాడు, మీరు ప్రపంచంలో ఒక్క రోజుకన్నా ఎక్కువ ఉండలేదు” అంటాడు. (20:103-105 సూక్తులు చూడండి.)

“ఆ తరువాత దేవుడు వారిని ప్రపంచంలో మీరు ఎంతకాలం ఉన్నారో చెప్పండి అని అడుగుతాడు. దానికి వారు ఒక రోజో లేక రోజులో కొంతభాగమో మేము అక్కడ ఉండి ఉంటాం. లెక్కించేవారిని అడగండి” అని అంటారు. (23:112)

ప్రళయంనాటి భయానక స్థితి చూసిన తర్వాత మానవునికి ఈ ప్రపంచ జీవితం వాస్తవికత ఏమిటో తెలుస్తుంది. అతని వందేళ్ళ ప్రాపంచిక జీవితం పది రోజుల కంటే తక్కువ ఉన్నట్లనిపిస్తుంది. నిజానికి ప్రాపంచిక జీవితం సరిగ్గా ఒక్కరోజు కూడా లేదని ఆ పరిస్థితి చూసిన పాపాత్ములకు సహజంగానే అన్పిస్తుంది.

మానవులంతా పునర్జీవింపబడినప్పటి నుంచి కర్మవిచారణ జరిగి, ప్రతిఫలంగా వారు స్వర్గం లేక నరకంలో ప్రవేశించే వరకు సంభవించే ప్రళయదినం 50,000 సంవత్సరాలకు సమాన మైన దినమని హదీసుల్లో ఉంది. దీన్నే తీర్పుదినమని, పునరుత్థాన దినమని అంటారు.

దినాన్ని గంటలుగా, నిమిషాలుగా తీసుకుంటే, మానవుడు ప్రపంచంలో వందేళ్ళ పాటు జీవించాడని అనుకుంటే, 50,000 ఏండ్ల సుదీర్ఘ విచారణ దినం ముందు మానవుని ఈ వందేళ్ళ ఐహిక జీవితం 2.88 నిమిషాలు మాత్రమే అవుతుంది! అంటే మనం ప్రపంచం అశాశ్వతమైనదనడానికి చెప్పుకునే మూన్నాళ్ళ ముచ్చటంత కూడా ఇది లేదన్నమాట!! అసలు మూన్నాళ్ళ పరిమితే ఎంతో పెద్ద కాలం. ఇక్కడ మూడు నిమిషాల ముచ్చట కూడా లేదు!!!

ఈ మూడు నిమిషాల ముచ్చటయినా ఒక్క తీర్పుదినం కాల పరిమితితో పోల్చుకున్నప్పుడే. ఇలా కోటాను కోట్ల సంవత్సరాలు గడపవలసిన స్వర్గ నరకాల జీవితం సమక్షంలో నయితే ఈ ప్రాపంచిక జీవితం మూడు సెకండ్ల ముచ్చటగా కూడా ఉండదు.

# 80. భృకుటి ముడి (అబస)

అవతరణ: మక్కా సూక్తులు: 42

ఈ అధ్యాయాన్ని "అబస" అంటారు. ఇది నబవిశకం ప్రారంభకాలంలోనే అవతరించింది. దైవప్రవక్త (సల్లం) ఓసారి మక్కా పురప్రముఖులతో సమావేశమయి వారికి ఇస్లాం స్వీకరణ గురించి నచ్చజెప్పడానికి ప్రయత్నిస్తున్నప్పుడు ఇబ్నె ఉమ్మె మక్తూమ్ (రజి) అనే ఓ అంధ అనుయాయి ఇస్లాం గురించి ఏదో అడగడానికి వచ్చారు. ఖురైష్ నాయకులతో అతి ముఖ్యమైన చర్చలు జరుపుతున్నప్పుడు ఇలా ఒక సాధారణ వ్యక్తి జోక్యం చేసుకోవడం దైవప్రవక్త (స)కు నచ్చలేదు. అందువల్ల ఆయన ఆ వ్యక్తి వైపు దృష్టిసారించలేదు. అయితే ఈవైఖరి దేవునికి నచ్చలేదు. ఆ సందర్భంలో ఈ అధ్యాయం అవతరించింది.

### కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

అతను[1] తన దగ్గరకు అంధుడొచ్చాడని భృకుటి ముడిచి ముఖం తిప్పుకున్నాడు. నీకేం తెలుసు? ఆ అంధుడు తనను తాను సంస్కరించుకుంటాడేమో; లేదా హితోపదేశాన్ని శ్రద్ధగా ఆలకిస్తాడేమో; హితోపదేశం అతనికి ప్రయోజనం కలిగిస్తుందేమో!

(సత్యాన్ని) ఖాతరు చేయనివాడి పట్ల నీవంతగా ఆసక్తి చూపుతున్నావా? అతను దారికి రాకపోతే అందులో నీ దోషం ఏముంటుందని? (దేవునికి) భయపడుతూ నీ దగ్గరకు పరుగెత్తుకొచ్చిన వాడ్ని చూసి నీవు ముఖం తిప్పుకుంటున్నావు. (1-10)

(అలా) ఎంతమాత్రం (చేయ)కూడదు. ఇది హితోపదేశం. ఇష్టమైనవాడు దీన్ని స్వీకరిస్తాడు. ఇది మహోన్నతమైన, ప్రతిష్ఠాత్మకమైన, పవిత్రమైన పుటలలో లిఖించబడి ఉంది. అవి గౌరవనీయులైన పరిశుద్ధ లేఖకుల[2] హస్తాలలో ఉంటాయి. (11-16)

మానవుడు నాశనమైపోను, ఎంతటి కృతఘ్నుడు అతను! తనను దేవుడు ఎలాంటి పదార్థంతో పుట్టించాడో అతనికి తెలియదా? (తుచ్ఛమైన) వీర్యబిందువుతో! (17-19)

దేవుడు అతడ్ని సృష్టించి అతనికొక జాతకం నిర్ణయించాడు. తరువాత అతని (శ్రేయస్సు) కోసం జీవనపథాన్ని సులభతరం చేశాడు. చివరికి మృత్యువు కలిగించి

---

ఒకపూట నమాజు విలువ 2 కోట్ల 88 లక్షల సంవత్సరాల పరలోక అనుభవం అన్న భావం స్ఫురింపజేసే ఒక హదీసు ఉంది. ఈ లెక్కన ఒకరోజు నమాజుల విలువ 14 కోట్ల, 40 లక్షల సంవత్సరాలు అవుతుంది. దీన్నిబట్టి 100 ఏండ్ల ప్రపంచ జీవితం ఎంతో గొప్ప జీవితం అనుకుంటే, అది పరలోకంలో 5 లక్షల 25 వేల 6 వందల కోట్ల సంవత్సరాలకు సమానమవుతుంది! ఇదే విధమైన మరో లెక్క ప్రకారం ఆలోచిస్తే 14 కోట్ల 40 లక్షల సంవత్సరాలకు సమానమయ్యే ఒక్క పరలోక దినం ముందు మానవుని వందేళ్ళ ఐహిక జీవితం 0.06 సెకండ్లు మాత్రమే అవుతుంది!! అందుకే ప్రపంచం క్షణభంగురం అన్నారు పెద్దలు.

1. 'అతను' అంటే ఇక్కడ స్వయంగా దైవప్రవక్త అనే అర్థం.

2. అంటే దైవదూతలు అని అర్థం.



అతడ్ని సమాధికి చేర్చుతున్నాడు. ఆ తరువాత తాను ఎప్పుడు తలచుకుంటే అప్పుడు అతడ్ని మళ్ళీ బ్రతికించి లేపుతాడు. (20-22)

(అలా) ఎంతమాత్రం (చేయ)కూడదు. అతను దేవుడు ఆదేశించిన విధిని నెరవేర్చ లేదు. మానవుడు తన ఆహారం వైపు దృష్టి సారించాలి. మేము నీటిని పుష్కలంగా కురిపించాం. తద్వారా నేలను విచిత్రమైన రీతిలో చీల్చి అందులో నుంచి ధాన్యం, ద్రాక్ష, కూరగాయలు, ఆలివ్, ఖర్జూర చెట్లు, దట్టమైన తోటలు, రకరకాల పండ్లు, పచ్చిక మొలకెత్తించాం. మీకూ, మీ పశువులకూ జీవన సామగ్రిగా, ప్రాణాధారంగా ఈ ఏర్పాట్లన్నీ చేశాము. (23-32)

చివరికి గూబలు పగలగొట్టే (ప్రళయ శంఖా)రావం ఉద్భృతమయినప్పుడు... ఆరోజు మానవుడు (అదిరిపోయి) తన సోదరులు, తల్లిదండ్రులు, భార్యాపిల్లల్ని వదలి పరుగు లంకించుకుంటాడు. ప్రతి ఒక్కడిపై భయంకరమైన ఆపద వచ్చి పడుతుంది. అందువల్ల అప్పుడు ఏ ఒక్కడికీ తనగురించి తప్ప ఇతరుల గురించిన ఆలోచనే రాదు.

ఆరోజు కొందరి ముఖాలు దేదీప్యమానంగా వెలిగిపోతుంటాయి. ఆ ముఖాలలో చిరునవ్వులు, ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తాయి. (వీరు సత్యాన్ని విశ్వసించిన సజ్జను లయి ఉంటారు.) మరికొందరి ముఖాలు మట్టి కొట్టుకొని, నల్లగా మాడిపోయి ఉంటాయి. వీరు సత్యాన్ని నిరాకరించిన దురాత్ములయి ఉంటారు. (33-42) ✪

# అవతరణ: మక్కా 81. చాపచుట్టలా (తక్వీర్) సూక్తులు: 29

ఈ అధ్యాయాన్ని "తక్వీర్" అంటారు. ఇది కూడా నబవి శకం ప్రారంభ కాలంలోనే అవతరించింది. ఇందులో ప్రళయ విశేషాలు, దైవప్రవక్త (సల్లం)కు దివ్యావిష్కృతిని తెచ్చే దైవదూత ఔన్నత్యం గురించి చెప్పడం జరిగింది.

### కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

సూర్యుడు నిస్తేజమయి చుట్టి వేయబడినప్పుడు, నక్షత్రాలు చెదరి కాంతి కోల్పోయినప్పుడు, పర్వతాలు కదలి నడచినప్పుడు, పదినెలల సూడి ఒంటెలు వాటి మానాన వదలి వేయబడినప్పుడు, క్రూరమృగాలు (భీతావహంతో) ఒకచోట గుమిగూడి నప్పుడు, సముద్రం (ఉప్పొంగి తీవ్రంగా) ప్రజ్వరిల్లినప్పుడు,[1] ఆత్మలు (దేహాలతో) అనుసంధానం చేయబడినప్పుడు, సజీవసమాధి చేయబడిన పసిబాలికను[2] నీవు ఏ

---

1. సముద్రం ప్రజ్వరిల్లడం అంటే అందులో అగ్ని పుట్టడమన్నమాట. ఈ ప్రక్రియ తీవ్రమైన వత్తిడితో ఇసుక రేణువులు పరస్పరం రాసుకోవడం వల్ల సాధ్యం కావచ్చు. లేదా నీటిలోని ఆక్సిజన్, హైడ్రోజన్ అణువులు రసాయనిక చర్య ద్వారా విడిపోవడం వల్ల కూడా సాధ్యం కావచ్చు. 1977 నవంబర్‌లో "దివిసీమ తుఫాను" సందర్భంగా సముద్రంలో అగ్నిమంటలు లేచినట్లు ఆనాటి పత్రికల్లో వచ్చిన వార్తలు గమనార్హమైనవి.

2. పూర్వం అరేబియాలో ఆడపిల్లలను హతమార్చడానికి మూడు కారణాలు ఉన్నాయి. (1) ఆర్థిక దుస్థితి. మగపిల్లలను పెంచి పెద్ద చేస్తే సంపాదనాపరులవుతారు. కాని ఆడపిల్లలు పెరిగి

తప్పు వల్ల చంపబడ్డావని అడిగినప్పుడు, (మానవుల) కర్మల చిట్టా తెరవబడినప్పుడు, ఆకాశానికున్న తెర తొలగించబడినప్పుడు, నరకం దహించబడినప్పుడు, స్వర్గం సమీపానికి తేబడినప్పుడు- ఆ.... అప్పుడు ప్రతి మనిషికీ తానేమి వెంట తెచ్చుకున్నాడో తెలుస్తుంది. (1-14)

కనుక నేను ఉదయించే, అస్తమించే నక్షత్రాల సాక్షిగా చెబుతున్నాను. ఇంకా అంతరిస్తున్న రాత్రి సాక్షిగా, ఊపిరి పోసుకుంటున్న ఉదయం సాక్షిగా కూడా చెబుతున్నాను. (మీరను కుంటున్నట్లు ఈవాణి పిచ్చివాడి వాగుడో లేక పిశాచ పలుకులో ఎంతమాత్రం కాదు.) ఇది నిస్సందేహంగా మహాశక్తి సంపన్నుడు, ఎంతో గౌరవనీయుడయిన సందేశహరుని వాక్కు. అతను సింహాసనాధీశుని కొలువులో గొప్ప హోదా అంతస్తులు కలిగినవాడు.[3] అక్కడ అతని ఆజ్ఞలు పాటించబడతాయి. అతను ఎంతో నమ్మకస్తుడు. (15-21)

(మక్కా ప్రజలారా! వినండి.) మీ సహచరుడు (ముహమ్మద్) పిచ్చివాడేమీ కాదు. ఇతనా సందేశహరుడ్ని ప్రకాశవంతమైన దిగ్మండలంపై ప్రత్యక్షంగా చూశాడు. ఇతను అతీంద్రియ (జ్ఞానం ప్రజలకు అందజేసే) వ్యవహారంలో ఏమాత్రం పిసినారితనం వహించడు. ఇది శాపగ్రస్తుడయిన షైతాన్‌కు సంబంధించిన వాక్కు కూడా కాదు. అలాంటప్పుడు మీరు (దారితప్పి) ఎటు పోతున్నారు? (22-26)

---

పెద్దయ్యే వరకు వారి పోషణ ఖర్చులు భరించి చివరికి వారికి పెళ్ళి చేసి బయటికి పంపవలసి వస్తుంది. (2) కూతురికి పెళ్ళి చేసి వేరే వ్యక్తిని అల్లుడు చేసుకోవడం నామోషిగా భావించేవారు. (16:59, 43:18 సూక్తులు చూడండి.) (3) యుద్ధాలలో మగపిల్లలయితే తండ్రి రక్షణకు ఉపయోగ పడతారు. ఆడ పిల్లలయితే శత్రువుల బారినుండి స్వయంగా వారినే రక్షించడానికి తండ్రి నానా తంటాలు పడవలసి వస్తుంది. ఈ మూడు కారణాలతో ఆడపిల్లలను సజీవ సమాధి చేసేవారు. పైగా దాన్ని పవిత్ర మతకార్యంగా భావించేవారు.

ఇస్లాం ఈ అమానుష చర్యను నిషేధించింది. అందరికీ ఉపాధినిచ్చేవాడు, రక్షించేవాడు దేవుడు మాత్రమేనని చెప్పి, ఆడపిల్లల సంరక్షణను గొప్ప పుణ్యకార్యంగా పరిగణించింది. దీన్ని గురించి దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు:

“ముగ్గురు కుమార్తెలు లేక ముగ్గురు చెల్లెళ్ళు పెరిగి పెద్దవారయి ఎవరిమీదా ఆధారపడ కుండా ఉండే స్థితికి చేరుకునే వరకూ వారిని పోషించి, విద్యాబుద్ధులు నేర్పి, వారిపట్ల ప్రేమ, వాత్సల్య భావంతో ప్రవర్తించిన వ్యక్తికి దేవుడు విధిగా స్వర్గప్రాప్తి కలిగిస్తాడు” అన్నారు దైవప్రవక్త. అప్పుడు ఒకతను “దైవప్రవక్తా! మరి ఇద్దరు ఉంటేనో?” అని అడిగాడు. దానికి ఆయన “అప్పుడు కూడా” అన్నారు. జనం అప్పుడు ఒక్క ఆడపిల్లను గురించి అడిగినా దైవప్రవక్త (సల్లం) అదే సమాధానమిచ్చేవారని ఈ హదీసు ఉల్లేఖకుడు హజ్రత్ ఇబ్నె అబ్బాస్ అన్నారు. (షరహ్‌సున్న)

దైవప్రవక్త (స) మరోసారి ఇలా అన్నారు:“ఒక వ్యక్తికి ఓ కుమార్తె ఉండి, అతనా బాలికను సజీవసమాధి చేయకుండా, ఎలాంటి అవమానాలకు గురిచేయకుండా, ఆమె కంటే కొడుక్కు ఎక్కువ ప్రాధాన్యమివ్వకుండా పోషించేవానికి దేవుడు స్వర్గం ప్రసాదిస్తాడు.” (అబూదావూద్)

3. వివరాలకు 78:38 సూక్తి, దాని పాదసూచిక చూడండి. ++



ఇది యావత్తు ప్రపంచవాసుల కోసం అవతరించిన హితవాణి. మీలో సన్మార్గం అవలంబించదలచిన ప్రతి వ్యక్తికీ కావలసిన హితబోధ ఇది. విశ్వప్రభువు తలచనంత వరకూ మీరు ఏది కోరుకున్నా ఎలాంటి ప్రయోజనం లేదు. (27-29) ✪

## అవతరణ: మక్కా 82. బీటలు (ఇన్ఫితార్) సూక్తులు: 19

ఈ అధ్యాయాన్ని “ఇన్ఫితార్” అంటారు. ఇది కూడా నబవీశకం ప్రారంభకాలం లోనే అవతరించినట్లు తెలుస్తోంది. ఇందులో ప్రళయ విశేషాలు, మానవుని ఏమరుపాటు, పరలోక తీర్పుదినం గురించిన ప్రస్తావనలు ఉన్నాయి.

### కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

ఆకాశం దద్దరిల్లి బీటలువారినప్పుడు, తారలు చెదరి కాంతికోల్పోయినప్పుడు, సము ద్రాలు పొంగి పొరలినప్పుడు, సమాధులు పూర్తిగా తెరవబడినప్పుడు- ఆ...అప్పుడు ప్రతి మనిషికీ తాను ముందు పంపుకున్నది, వెనుక వదలిపెట్టినది అంతా తెలిసి పోతుంది. 1-5)

మానవుడా! దయామయుడైన నీ ప్రభువుని గురించి నిన్నేవిషయం మోసంలో పడ వేసింది? ఆయన నిన్ను పుట్టించి, నీ అవయవాలను పొందికగా అమర్చాడు. నిన్ను తగినవిధంగా రూపొందించాడు. తాను తలచిన రీతిలో నిన్ను (అందంగా) మలిచాడు. కాదు, మీరు (పరలోక) తీర్పు విషయాన్ని నిరాకరిస్తున్నారు. కాని మీపై పర్యవేక్షకులు(గా దైవదూతలు) నియమించబడ్డారు (అన్న విషయాన్ని మరచిపోతున్నారు). వారెంతో గౌరవనీయులైన లేఖకులు. మీరు చేసే ప్రతిపనీ, పలికే ప్రతిపలుకూ వారికి తెలుసు.

(ఆరోజు) సజ్జనులు సుఖసంతోషాలలో ఓలలాడుతుంటారు. దుర్జనులు నరకానికి పోతారు. విచారణ దినాన వారందులో ప్రవేశిస్తారు. వారిక నరకం నుండి ఎట్టి పరిస్థితి లోనూ బయటపడలేరు. విచారణ దినమంటే నీకేం తెలుసు? ఔను, విచారణ దిన మంటే నీకేం తెలుసు? ఆరోజు ఏఒక్కడూ తోటిమనిషికి ఎలాంటి సహాయం చేయ లేడు. ఆరోజు నిర్ణయాధికారం పూర్తిగా దేవుని చేతిలో ఉంటుంది. (6-19) ✪

ఇస్లాం ఒక సమగ్రమైన జీవన వ్యవస్థ. ఇది సృష్టికర్త తన ప్రవక్తల ద్వారా మనకు పంపిన సంపూర్ణ సంవిధానం. కాని ఈనాడు ఇస్లాం అనుచరులయిన ముస్లింలు దీన్ని పూర్తిగా ఆచరించక పోవడంవల్ల, మరోవైపు జాత్యహంకారులైన మతదురభిమానులు వ్యాపింపజేసిన అపోహలవల్ల సత్యాన్వేషకులకు ఇస్లాంను సరిగా, పూర్తిగా అర్థం చేసు కోవడం కష్టమైపోయింది. అనువాదాల భాషాశైలి కూడా అన్వేషకులకు ఆసక్తి కలిగించలేక పోతోంది. ఇప్పుడు తెలుగువారి కోసం తేటతెలుగులో, వాడుక భాషలో ఇస్లాంను గురించి సరైన, సమగ్ర సమాచారం అందజేయడానికి “ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్” నడుం కట్టింది. పాఠకులే న్యాయనిర్ణేతలు. మీ అభిప్రాయాలు ఫోన్ నెం. 040-66710795, +91-9441515414 ద్వారా తెలియజేయవచ్చు.

అవతరణ:మక్కా **83.హస్తలాఘవం (ముతప్ఫిఫీన్)** సూక్తులు: 36

ఈ అధ్యాయం పేరు “ముతప్ఫిఫీన్” (హస్తలాఘవం). నబవీశకం ప్రారంభంలో అవతరించింది. ఇందులో వ్యాపార మోసాలను ఖండించడం జరిగింది.

### కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

తూకం తగ్గించేవారికి వినాశం తప్పదు.[1] వారు ప్రజల నుండి (సరుకు) తీసుకునేటప్పుడు పూర్తిగా తూచి లేక కొలచి తీసుకుంటారు; ఇచ్చేటప్పుడు తగ్గించి ఇస్తారు. ఒక భయంకర దినాన తాములేపి ప్రవేశపెట్ట బడతామని వారికి తెలియదా? ఆరోజు యావత్తు మానవులు విశ్వప్రభువు ముందు (తలలు వంచి) నిలబడతారు. (1-6)

---

1. వ్యాపారంలో మోసం, దోపిడి, అబద్ధం, అక్రమాలతో ధనార్జనచేయడం ఆత్మహత్యా సదృశమని, పరలోకంలో వినాశానికి కారణమవుతుందని ఈ సూక్తిలో దేవుడు హెచ్చరిస్తున్నాడు.

ఇస్లాంను విశ్వసించానని చెప్పుకునే వ్యక్తి మసీదులోనే గాక, మార్కెట్‌లోనూ నిజమైన ముస్లింగా మసలుకోవాలి. అలాకాకుండా ధనార్జనే ధ్యేయంగా పెట్టుకొని కొనుగోలుదారుల్ని నిలువునా కొల్లగొడ్తూ అక్రమ పద్ధతులతో వ్యాపారం చేస్తే, దానివల్ల అతను ప్రపంచంలో కోటీశ్వరుడయి కొన్నాళ్ళు కులకగలడేమో కాని, పరలోకంలో మాత్రం ఘోరమైన నరక యాతనలకు గురికావలసి వస్తుంది. ఈ క్రింది ఖుర్ఆన్ సూక్తులు చూడండి:

“విశ్వాసులారా! మీరు ఒకరి సొమ్మును మరొకరు అన్యాయంగా, అక్రమంగా కాజేయకండి. ఇచ్చిపుచ్చుకోవడాలు జరగవలసిందే. అయితే అవి పరస్పరం ఆమోదంతో జరగాలి. మిమ్మల్ని మీరు హతమార్చుకోకండి. (ఆత్మవంచనకు పాల్పడకండి.) దేవుడు మీపట్ల ఎంతో దయామయుడని గ్రహించండి. ఎవరు అన్యాయం, అక్రమాల ద్వారా ఇలా (ధనార్జన) చేస్తాడో అతడ్ని మేము తప్పనిసరిగా నరకంలో పడవేస్తాము.” (4:29,30)

“సరైన పాత్రతో కొలచి ఇవ్వండి. తూచవలసి వస్తే సరైన త్రాసుతో తూచి ఇవ్వండి. ఇదే సరైన పద్ధతి. ఫలితం రీత్యా కూడా ఈ పద్ధతే మంచిది”. (17:35)

“ఆయనే త్రాసును (న్యాయాన్ని) కూడా సృష్టించాడు. కనుక మీరు త్రాసు సమతూకాన్ని చెడగొట్టకండి. న్యాయంగా, సవ్యంగా తూచి ఇవ్వండి.” (55:8,9)

“తూనికల్లో, కొలతల్లో న్యాయం పాటించండి. ఎవరికీ నష్టం కలగజేయకండి. సరైన త్రాసుతో తూచి ఇవ్వండి. ప్రజలకు రావలసిన వస్తువులు తగ్గించి ఇవ్వకండి. ధరణిలో అల్లర్లు, అలజడులు రేపుతూ తిరగకండి. మిమ్మల్ని, మీకు పూర్వముండిన తరాలను సృష్టించిన దేవునికి కాస్త భయపడండి.” (26:181-184)

ఇస్లాం మానవుని సకల జీవనరంగాలను పరివేష్ఠించి వున్న సమగ్ర జీవనవ్యవస్థ. అందులో వ్యాపార లావాదేవీలు కూడా ఉన్నాయి. అయితే ఆ వ్యాపారం పూర్తిగా న్యాయం, నిజాయితీలతో కూడినదయి ఉండాలి. ఇక్కడ మహాప్రవక్త (సల్లం) చేసిన కొన్ని హితవుల్ని పరిశీలిద్దాం:

“నిత్యావసర వస్తువుల్ని నిలువచెయ్యక సమయానికి బజారుకు తెచ్చి విక్రయించే వ్యక్తి దైవానుగ్రహానికి అర్హుడవుతాడు. దేవుడు అతనికి పుష్కలంగా ఉపాధి ప్రసాదిస్తాడు. దీనికి భిన్నంగా (సరుకులు) నిలువచేసే వ్యక్తి దైవశాపానికి గురవుతాడు.” (ఇబ్నెమాజ)



(వారు తమ దుష్కార్యాలకు జవాబుచెప్పుకోవాల్సిన పనిలేదని భావిస్తున్నారా?) ఎంత మాత్రం కాదు. దురాత్ముల కర్మల వివరాలు కారాగారం చిట్టాలో ఉంటాయి. కారాగారం చిట్టా అంటే ఏమిటో నీకు తెలుసా? అదొక లిఖితగ్రంథం. (7-9)

తీర్పుదినాన్ని తిరస్కరించే ధిక్కారులకు ఆరోజు వినాశం తప్పదు. హద్దులు మీరే పాపాత్ముడు తప్ప దాన్నెవరూ తిరస్కరించరు. మాసూక్తులు విన్పిస్తున్నప్పుడు “ఇవి పూర్వీకుల పుక్కిటి పురాణాలు (తప్ప మరేమీ కావు)” అని అంటాడతను. (10-13)

ఎంతమాత్రం కాదు. అసలు వీరి హృదయాలకు వీరి దుష్కార్యాల త్రుప్పు పట్టింది. ఎంతమాత్రం కాదు. ఆరోజు వీరు తప్పకుండా తమ ప్రభువు దర్శనభాగ్యానికి దూరంగా ఉంచబడతారు. ఆ తర్వాత నరకంలోకి పోయిపడతారు. అప్పుడు వారికి “మీరు తిరస్కరిస్తూ ఉండినది ఇదే” అని చెప్పడం జరుగుతుంది. (14-17)

ఎంతమాత్రం కాదు. పుణ్యాత్ముల కర్మల వివరాలు మహోన్నతుల చిట్టాలో ఉంటాయి. మహోన్నతుల చిట్టా అంటే ఏమిటో నీకు తెలుసా? అదొక లిఖితగ్రంథం. దాన్ని సన్నిహితులైన దైవదూతలు కాపాడుతున్నారు. (18-21)

నిస్సందేహంగా పుణాత్ములు భోగభాగ్యాలలో ఓలలాడుతుంటారు. ఉన్నతాసనాలపై కూర్చొని (స్వర్గవైభవాలు) తిలకిస్తుంటారు. నీకు వారి ముఖాలలో సుఖసంతోషాలతో కూడిన కళాకాంతులు గోచరిస్తాయి. వారు స్వచ్ఛమైన విశేషమధుపానం సేవిస్తారు. ఆ మధుపాత్రలకు కస్తూరి సీళ్ళుంటాయి. సౌఖ్యాల కోసం పోటీపడేవారు దీన్ని సాధించడానికి పోటీపడాలి. ఆ మధువులో తస్నీం (అనే ఓ విశేషపానీయం) కలసిఉంటుంది. ఇదొక సెలయేరు. సన్నిహితభక్తులు దీని పానీయంతోపాటు సారా సేవిస్తారు. (22-28)

(ఇహలోకంలో) నేరస్థులు విశ్వసించిన వారిని హేళన చేస్తుండేవారు. వారి ముందు నుంచి పోతున్నప్పుడు వారివైపు చూసి ఒకర్నొకరు కనుసైగలు చేసుకునేవారు. ఇండ్లకు తిరిగివస్తూ (ఏదో ఘనకార్యం వెలగబెట్టినట్లు) తెగ సంబరపడి పోతారు. వారిని చూసినప్పుడల్లా “వీరా, వీరు మతభ్రష్టులండీ!” అంటారు. కాని (దేవుడు) వీరిని వారిపై రక్షకభటులుగా నియమించి పంపలేదు. (29-33)

ఆరోజు విశ్వాసులు అవిశ్వాసుల్ని చూసి నవ్వుతూ ఉంటారు. ఉన్నతాసనాలపై (హుందాగా) కూర్చొని వారి దుస్థితిని చూస్తుంటారు. ఇక తిరస్కారుల సంగతి, తిరస్కారులకు వారి (వికృత) చేష్టలకు తగిన ప్రతిఫలం దక్కింది కదా! (34-36) ✪

---

“అమ్ముతున్న సరుకులోని లోపాలను కొనుగోలుదారులకు బహిర్గతం చేసి మరీ అమ్మడం (ధర్మయుక్తమైన పద్ధతి. అది) తప్ప మరే పద్ధతినయినా అనుసరించి సరుకు విక్రయించడం ఎట్టి పరిస్థితిలోనూ ధర్మసమ్మతం కాదు. అంతేకాదు, ఆ లోపం తెలిసివున్న వ్యక్తి దాన్ని బహిర్గతం చేయకుండా మౌనం వహించడం కూడా ధర్మసమ్మతం కాదు.” (ముస్తఖా)

“నీతిమంతుడయిన వ్యాపారి అంతిమ (ప్రళయ) దినాన దైవప్రవక్తల, సత్యవంతుల, అమరగతుల సహచర్యంలో ఉంటాడు.” (తిర్మిజి)

అవతరణ: మక్కా

# 84. ఖండన (ఇన్షిఖాఖ్)

సూక్తులు: 25

ఈ అధ్యాయాన్ని "ఇన్షిఖాఖ్" (ఖండన) అంటారు. ఇది కూడా నబవీశకం ప్రారంభ కాలంలోనే అవతరించింది. ఇందులో ప్రళయం, పరలోక తీర్పుదినాన జరిగే విశేషాలు ప్రస్తావించబడ్డాయి.

### కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

ఆకాశం తన ప్రభువాజ్ఞ శిరసావహించి బ్రద్దలవుతుంది. ఇది దాని విధ్యుక్త ధర్మం. భూమి సాగదీసి చదునైన మైదానంగా చేయబడుతుంది. అది కూడా తన ప్రభువాజ్ఞ పాటించి తనలో ఉన్నదంతా బయటికి విసిరి ఖాళీఅవుతుంది.[1] ఇది దాని విధ్యుక్త ధర్మం. (1-5)

మానవుడా! నీవు (జీవిత సత్యం గురించి ఆలోచించకుండా ఐహిక కార్యకలాపాల్లో) ఎంత నిమగ్నుడవై ఉన్నా, నీ పయనం మాత్రం నీ ప్రభువు వైపుకే నిరాఘాటంగా సాగిపోతోంది. చివరికి ఆయన సన్నిధికే నీవు చేరుకోవలసి ఉంటుంది. (6)

ఆ తరువాత కుడిచేతికి కర్మపత్రం ఇవ్వబడిన వ్యక్తి నుండి తేలికగా లెక్క తీసుకోబడుతుంది.[2] అతను సంతోషంతో పొంగిపోతూ తనవారి దగ్గరకు వెళ్తాడు. (7-9)

ఇక వీపువెనుక నుంచి (ఎడమచేతికి) కర్మపత్రం ఇవ్వబడినవాడు... అతను చావును పిలుస్తాడు. చివరికి భగభగమండే (నరకా)అగ్నిలోకి పోయి పడతాడు.[3] అతను (ప్రపంచంలో ఉన్నప్పుడు) తన భార్యాపిల్లల దగ్గర హాయిగా, మస్తుగా ఉండేవాడు.

---

1. పునరుత్థాన దినాన యావత్తు భూమండలం నలువైపులా సాగి చదునైన మైదానంగా మారిపోతుంది. కొండలు, గుట్టలు, చెట్లు, అడవులు, నదులు, సముద్రాలు ఏవీ ఉండవు. ఆది నుండి అంతం వరకు పుట్టిన కోటానుకోట్ల మానవులందరూ ఆరోజు ఈ మైదానంలో సమావేశమవుతారు. వారికక్కడ పాదాలు మోపడానికి మాత్రమే చోటు ఉంటుంది.

భూమి తనలో ఉన్నదంతా బయటికి విసరేయడమంటే, తనలో ఇముడ్చుకున్న యావత్తు మృతమానవుల్ని, వారికి సంబంధించిన సాక్ష్యాధారాలను బయటికి త్రోసివేస్తుందన్న మాట.

2,3. పరలోకంలో కర్మవిచారణ జరిగినప్పుడు కుడిచేతికి కర్మపత్రం ఇవ్వబడిన వ్యక్తి ఎంతో అదృష్టవంతుడు. కర్మలత్రాసులో అతని సత్కర్మలు అతని దుష్కర్మల కన్నా చాలాబరువుగా ఉంటాయి. అందువల్ల అతని నుండి తేలికగా లెక్క తీసుకోవడం జరుగుతుంది. అతను చేసిన చిన్న చిన్న పాపాలు క్షమించబడతాయి. ఎడమ చేతికి కర్మపత్రం ఇవ్వబడినవారి నుండి కఠినంగా లెక్క తీసుకోవడం జరుగుతుంది. వారు ఘోరమైన పాపాలు చేసినవారయి ఉంటారు.

ప్రవక్త సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) ఇలా తెలుపుతున్నారు: దైవప్రవక్త (సల్లం) ఒకసారి నమాజు చేస్తూ "దేవా! నా నుండి తేలికగా లెక్క తీసుకో" అని ప్రార్థించారు. నమాజు ముగిసిన తరువాత "తేలికగా లెక్క తీసుకోవడం అంటే ఏమిటీ?" అని నేను అడిగాను. దానికి ఆయన సమాధానమిస్తూ "తేలికగా లెక్క తీసుకోవడమంటే, దాసుని కర్మపత్రం నామమాత్రంగా పరిశీలించి వదిలేయడం జరుగుతుంది. ఆయిషా! ఆరోజు లెక్క తీసుకోబడినవాడు సర్వనాశనమైనట్లే" అని అన్నారు. (బుఖారి, ముస్లిం, తిర్మిజి)



అతను (తన ప్రభువు సన్నిధికి) తిరిగి రావడం జరగదని భావించాడు. తిరిగి రావడం ఎందుకు జరగదు? అతని ప్రభువు అతని చర్యలను ఓ కంట గమనిస్తూనే ఉండేవాడు.

కనుక సాయంకాలపు ఎరుపుదనం సాక్షిగా, రాత్రి సాక్షిగా, అది సమీకరించే వాటి సాక్షిగా, పూర్ణచంద్రుని సాక్షిగా చెబుతున్నాను. మీరు తప్పకుండా ఒక స్థితినుండి మరొక స్థితికి క్రమేణా మారుతూ పోవలసి ఉంటుంది.[4] (10-19)

మరి, వీరికేమయింది సత్యాన్ని విశ్వసించరు? ఖుర్‌ఆన్ పఠిస్తున్నప్పుడు విని సాష్టాంగ పడరేమిటీ? పైగా ఈ తిరస్కారులు దాన్ని ధిక్కరిస్తున్నారు. కాని వీరు (తమ కర్మ పత్రంలో) జమ చేసుకుంటున్నదంతా దేవునికి బాగా తెలుసు. కనుక వీరికోసం దుర్భర శిక్ష కాచుకొని ఉందని శుభవార్త విన్పించు! (20-24)

అయితే సత్యాన్ని విశ్వసించి సదాచార సంపన్నులయిన వారికి ఎన్నటికీ తరగని గొప్ప ప్రతిఫలం ఉంది. (25) ✪

# 85. ఆకాశ బురుజులు (బురూజ్)

అవతరణ: మక్కా సూక్తులు: 22

ఈ అధ్యాయాన్ని "బురూజ్" అంటారు. ఇది కూడా నబవీశకం ప్రారంభకాలంలోనే అవిశ్వాసుల దౌర్జన్యాలు తీవ్రమైన రోజుల్లో అవతరించింది. అలాంటివారి గుణపాఠం కోసం ఇందులో పూర్వం అగ్నిగుండాల్లో విశ్వాసుల్ని విసిరి వారి ఏడ్పులు, పెడబొబ్బల్ని తమాషాగా వింటూ చూసిన సత్యతిరస్కారుల ప్రస్తావన పేర్కొనబడింది. అలాగే ఫిరౌన్, సమూద్ జాతులకు పట్టిన దుర్గతిని కూడా ప్రస్తావిస్తూ మక్కా అవిశ్వాసుల్ని హెచ్చరించడం జరిగింది.

---

4, సాయంకాలపు సంధ్యాకాంతులు, తరువాత రాత్రివేళ మసక వెల్తురు, ఆ తర్వాత చీకటి రాత్రి, ఆపై పండువెన్నెల...... ఇలా అనేక స్థితిగతుల్ని మానవుడు తన దైనందిన జీవితంలో చూస్తున్నాడు. అదేవిధంగా మానవుడు ఇహలోకంలో బాల్యం నుండి యౌవనం, కౌమారం, వృద్ధాప్య దశలు దాటి చివరికి మరణావస్థకు చేరుకుంటాడు. ఆ తరువాత పరలోకపు మజిలీలు ప్రారంభ మవుతాయి. మరణావస్థ నుండి ఒక్కసారిగా పిత్రులోకం (ఆలమె బర్జఖ్)లోకి ప్రవేశిస్తాడు. అక్కడ వివిధ స్థితిగతులు చవిచూశాక ప్రళయ దినాన తిరిగి బ్రతికించబడి పునరుత్థాన (హష్ర్) మైదానంలోకి వస్తాడు. అక్కడ కర్మల విచారణ జరుగుతుంది. ప్రతిఫలం అనుభవించడానికి నిర్ణీత నివాసస్థలానికి పయనిస్తాడు. ఈ పయనంలో కూడా అతను చీకటి వెలుగుల్ని, కష్టసుఖాల దశలను దాటవలసి ఉంటుంది. ఈ దశలు దాటిన తర్వాత కర్మలను బట్టి శాశ్వత గమ్యస్థామైన స్వర్గానికి లేక నరకానికి చేరుకుంటాడు.

తినడం, త్రాగడం, అనుభవించడమే జీవిత లక్ష్యమని, ఏ విధంగానైనా వీలైనంత ఐహిక సుఖాల్ని జుర్రుకోవడమే జీవిత సాఫల్యమని, మనిషి చనిపోగానే అతని జీవితం శాశ్వతంగా సమాప్తమవుతుందని అవిశ్వాసులు భావిస్తున్నారు. నిరాధారమైన ఇలాంటి ఆలోచనా సరళిని ఖుర్‌ఆన్ ఖండిస్తూ ఈ మూన్నాళ్ళ ప్రపంచంలో లభించిన క్షుద్ర భోగభాగ్యాలు చూసుకొని మురిసిపోకూడదని, శాశ్వతమైన అసలు జీవితం ముందున్నదని హెచ్చరిస్తోంది.

## కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

దృఢమైన బురుజులుకల ఆకాశం సాక్షి! వాగ్దానం చేయబడిన (ప్రళయ)దినం సాక్షి! చూసేదాని, చూడబడేదాని సాక్షి! 'గుంట'మనుషులు నాశనమయ్యారు. ఆ గుంటలో ఇంధనంతో బాగా మండించిన అగ్ని ఉండింది. వారా అగ్నిగుండం చుట్టూ కూర్చొని, తాము విశ్వాసుల పట్ల ఎలా (ఘోరంగా) ప్రవర్తిస్తున్నది చూస్తున్నారు.[1]

---

1. రాజులు పెద్ద పెద్ద గుంటలు, అగడ్తలు త్రవ్వించి అగ్నిరాజేయించి, ఆ అగ్నిగుండాలలో తమ మతవిశ్వాసాలను స్వీకరించనివారిని విసిరి బాధించడం గురించి ప్రపంచంలో అనేక సంఘటనలు జరిగినట్లు తెలుస్తోంది. వాటిలో కొన్నిటిని ఇక్కడ ఉదాహరిస్తున్నాను:

హజ్రత్ సుహైబ్ రూమి (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా తెలియజేశారు: ఒక రాజు ఆస్థానంలో ఒక తాంత్రికుడు ఉండేవాడు. అతను వృద్ధాప్యంలో రాజుతో "నా దగ్గర ఈ తాంత్రిక విద్య నేర్చుకోవడానికి ఎవరైనా ఒక అబ్బాయిని నియమించండి" అని అన్నాడు. రాజు ఒక పిల్లవాడ్ని నియమించాడు. ఆ అబ్బాయి విద్య నేర్చుకోవడానికి తాంత్రికుని దగ్గరకు రోజూ వస్తూ పోతూ దారిలో ఒక సాధువు (బహుశా క్రైస్తవ మతగురువు కావచ్చు)ను కూడా కలుసుకుంటూ ఉండేవాడు. ఆ సాధువు మాటలతో ప్రభావితుడై అతని ధర్మం విశ్వసిస్తాడు. అంతేగాక, అతనిచ్చిన శిక్షణతో ఆ పిల్లవాడు మహిమాన్వితుడు కూడా అవుతాడు. దాంతో అతను అంధులకు చూపు, కుష్టురోగులకు స్వస్థత కలిగించేవాడు.

ఈ బాలుడు తన అసలు మతం వదలి, ఏకదైవ విశ్వాసం అవలంబించి ఏకేశ్వరోపాసకుడయ్యాడని రాజుకు తెలుస్తుంది. అప్పుడతను మొదట ఆ సాధువును హతమార్చుతాడు. తరువాత ఆ బాలుడ్ని కూడా చంపడానికి ప్రయత్నిస్తాడు. కాని ఎన్ని రకాలుగా ప్రయత్నించినా ఆ బాలుడు చావడు. చివరికి ఆ అబ్బాయే రాజుకు సలహా ఇస్తూ "నీవు నన్ను చంపాలనుకుంటే జనసమూహం ముందు ఈబాలుడి ప్రభువు పేరుతో చంపుతున్నానని చెప్పి నా మీదికి బాణం వదులు. దాంతో నేను చనిపోతాను" అని అన్నాడు. రాజు ఆవిధంగా చేయగానే బాలుడు చనిపోతాడు. కాని ఆ మహిమ చూసిన ప్రజలు "మేమీ పిల్లవాడి ప్రభువును విశ్వసిస్తున్నాం" అని ఎలుగెత్తి చాటారు. రాజు మనుషులు రాజుతో "మీరు దేన్నుండి తప్పించుకోదలిచారో అదే జరిగిందిప్పుడు. ప్రజలు మీ మతాన్ని వదలి ఈ పిల్లవాడి మతాన్ని విశ్వసించారు" అన్నారు. రాజు ఈ పరిస్థితి చూచి ఉగ్రుడయి పోయాడు. అతను రహదారి పక్కన (పెద్దపెద్ద) గుంటలు త్రవ్వించి, అందులో అగ్ని రాజేయించాడు. కొత్త ధర్మాన్ని వదలడానికి అంగీకరించని ప్రతివ్యక్తినీ ఆ అగ్ని గుండాల్లోకి విసిరి వేయించేవాడు. (ముస్లిం, నసాయి, తిర్మిజి, తిబ్రాని)

రెండవ సంఘటన గురించి హజ్రత్ అలి (రజి) ఇలా తెలియజేశారు: ఈరాన్ చక్రవర్తి ఒకతను సారాయి త్రాగి తనసొంత సోదరితో వ్యభిచరించాడు. కొంతకాలానికి ఈ అక్రమ సంబంధం సంగతి బయటికి పొక్కడంతో, సొంతసోదరిని వివాహమాడటాన్ని దేవుడు ధర్మసమ్మతం చేశాడు అంటూ ప్రజలలో ప్రకటన చేయించాడు. అయితే ప్రజలు దాన్ని సమ్మతించలేదు. దాంతో ఆ చక్రవర్తి ఆగ్రహం చెంది వారిని రకరకాలుగా వేధించాడు. చివరికి పెద్ద పెద్ద అగ్ని గుండాలు తయారుచేయించి అందులో వారిని విసిరి వేయించాడు. అప్పటినుంచి అగ్నిపూజారుల్లో వివాహ నిషిద్ధ స్త్రీలను కూడా వివాహమాడే ఆచారం మొదలయింది.

మూడవ సంఘటన గురించి ఇబ్నె హిషామ్, తబరి, ఇబ్నె ఖుల్దూన్ వగైరా చరిత్రకారులు ఈ విధంగా ఉటంకించారు:



వారా విశ్వాసులపై అంతగా కసి పెంచుకోవడానికి కారణం, ఆ విశ్వాసులు సర్వశక్తిమంతుడు, స్వతహాగా ప్రశంసనీయుడైన దేవుడిని విశ్వసించడం తప్ప మరేమీ కాదు. ఆ దేవుడు (యావత్తు) భూమ్యాకాశాల సామ్రాజ్యానికే చక్రవర్తి. ఆయన సమస్త విషయాలు గమనిస్తున్నాడు. (1-9)

విశ్వసించిన స్త్రీపురుషుల్ని పీడించి దుర్భరకష్టాలకు గురిచేసినవారు తమ అకృత్యాల పట్ల పశ్చాత్తాపం చెందకపోతే, దేవుడు వారికి తప్పకుండా నరకశిక్ష విధిస్తాడు. వారికోసం దహనశిక్ష కాచుకొని ఉంది. ఇక విశ్వసించి సత్కర్మలు చేసినవారికి సెలయేరులు ప్రవహించే స్వర్గవనాలు ఉన్నాయి. ఇదే ఘనవిజయం, పరమమోక్షం. (10,11)

నీ ప్రభువు పట్టు చాలా కఠినంగా ఉంటుంది. ఆయనే (మిమ్మల్ని) మొదటిసారి పుట్టించినవాడు. ఆయనే తిరిగి (మిమ్మల్ని మరణానంతరం) బ్రతికిస్తాడు. ఆయన గొప్ప క్షమాశీలి, అమిత వాత్సల్యుడు, సింహాసనాధీశుడు, మహోన్నతుడు, మహిమాన్వితుడు, తాను తలచిన కార్యం సాధించగల శక్తిమంతుడు. (12-16)

నీకు సైన్యాలు గురించిన సమాచారం అందిందా? ఫిరౌన్, సమూద్‌ల సైన్యాలను గురించి? (వారి సైనికశక్తి, అధికారం, పటాటోపాలేవీ వారిని దైవశిక్ష నుండి కాపాడలేక పోయాయి. కనువిప్పు కోసం ఈ రెండు సంఘటనలు చాలు.) (17,18)

ఈ అవిశ్వాసులు తిరస్కారతిమిరంలో పడి కొట్టుమిట్టాడుతున్నారు. దేవుడు వారిని చుట్టుముట్టిఉన్నాడు. (ఆసంగతి గ్రహించకుండా ఖుర్ఆన్‌ని తిరస్కరిస్తున్నారు.) ఈ ఖుర్ఆన్ మహిమాన్వితమైనది, "సురక్షిత" గ్రంథంలో ఉంది. (19-22) ✪

---

యమన్ రాజు తుబ్బాన్ అసద్ ఓసారి యస్రిబ్ (మదీనా)కు వెళ్ళి అక్కడి యూదులతో ప్రభావితుడయి యూదమతం స్వీకరిస్తాడు. ఆ తరువాత అతను తిరిగొచ్చి యమన్‌లో ఆ మతాన్ని పెద్దఎత్తున ప్రచారం చేయిస్తాడు. అతని మరణానంతరం అతని కొడుకు జూనువాస్ అధికారపీఠం ఎక్కుతాడు. జూనువాస్ అధికారంలోకి రాగానే హద్దుమీరిన మత దురహంకారంతో క్రైస్తవమత కేంద్రమైన నజ్రాన్‌పై దాడి చేస్తాడు. అక్కడి క్రైస్తవులను యూదమతం స్వీకరించమని వత్తిడి చేస్తాడు. దానికి వారు నిరాకరించడంతో దుర్భర హింసాకాండ జరుపుతాడు.

దీనికోసం జూనువాస్ పెద్దపెద్ద అగడ్తలు త్రవ్వించి, అగ్ని రాజేయించి, ఆ అగ్నిగుండాలలో క్రైస్తవుల్ని విసిరివేయించాడు. స్త్రీలు, పురుషులు, పిల్లలు, అన్న విచక్షణ లేకుండా యూదమతం నిరాకరించిన ప్రతి వ్యక్తినీ అగ్ని గుండాలలో విసరివేయించాడు. ఈవిధంగా అతను నలభైవేల మందిని చంపివేయించినట్లు తెలుస్తోంది. ఈ దుర్ఘటన క్రీ.శ. 523 అక్టోబర్‌లో జరిగింది.

ఈ సామూహిక హత్యాకాండ నుండి జూసాల్బాన్ అనే వ్యక్తి ఎలాగో తప్పించుకొని రోమ్ నగరానికి పారిపోతాడు. రోమ్‌చక్రవర్తికి ఈ హింసాకాండను గురించి వివరంగా తెలియజేస్తాడు. రోమ్ చక్రవర్తి ఒక నౌకాదళాన్ని అబీసీనియా రాజు దగ్గరకు పంపి, యమన్‌పై దాడిచేయమని ఆజ్ఞాపిస్తాడు. అబీసీనియా నుండి అర్యాత్ నాయకత్వంలో డెబ్భయివేల సైన్యం బయలుదేరి యమన్‌పై విరుచుకు పడుతుంది. ఈ యుద్ధంలో యమన్‌సైన్యం చిత్తుగా ఓడిపోతుంది. జూనువాస్ హతమార్చబడతాడు. ఇలా యమన్‌లో యూదులపాలన అంతమయి క్రైస్తవ పాలన ఏర్పడుతుంది. (దీని తర్వాత జరిగిన సంఘటనకోసం 105వ అధ్యాయం (ఏనుగు)కు రాసిన ఉపోద్ఘాతం చదవండి.

# 86. ప్రభాత నక్షత్రం (తారిఖ్)

**అవతరణ: మక్కా** **సూక్తులు: 17**

ఈ అధ్యాయాన్ని "తారిఖ్" అంటారు. ఇది కూడా నబవీశకం ప్రారంభ కాలంలోనే అవిశ్వాసులు ప్రవక్త ప్రచారోద్యమాన్ని నిరోధించడానికి రకరకాల పన్నాగాలు పన్నుతున్న రోజుల్లో అవతరించింది.

**కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం**

ఆకాశం సాక్షి! ప్రభాత నక్షత్రం సాక్షి! ప్రభాత నక్షత్రం అంటే నీకేమయినా తెలుసా? దేదీప్యమానంగా వెలిగిపోయే నక్షత్రం... ప్రతి ప్రాణినీ కనిపెట్టి ఉండేందుకు ఆ ప్రాణిపై ఒక పర్యవేక్షకుడు[1] ఉన్నాడు. పర్యవేక్షకుడు లేని ప్రాణి అంటూ ఏదీలేదు. (1-4)

మానవుడు తాను ఎలాంటి పదార్థంతో పుట్టించబడ్డాడో కాస్త ఆలోచించాలి. వెన్నెముకకు, ప్రక్కటెముకలకు మధ్య నుండి బయలుదేరి దూకుడుగా వెలువడే ద్రవ పదార్థంతో అతను పుట్టించబడ్డాడు. (అదేవిధంగా) అతడ్ని మళ్ళీ బ్రతికించే శక్తికూడా ఆ సృష్టికర్తకు ఉంది. (5-8)

రహస్య విషయాలు (సైతం) బయటపెట్టి విచారణజరిపే రోజున మానవుని దగ్గర తనదంటూ ఎలాంటిశక్తి ఉండదు. అతడ్ని ఆదుకునేవారు కూడా ఉండరు. (9,10)

వర్షం కురిపించే ఆకాశం సాక్షి! (చెట్లు మొలకెత్తే సమయంలో) చీలిపోయే నేల సాక్షి! ఇది నిర్ణయాత్మకమైన విషయం. ఏదో ఆషామాషీ విషయం కాదు. (విచారణ రోజు మీరు తప్పకుండా బ్రతికించబడతారు.) (11-14)

వీరు కొన్ని పన్నాగాలు పన్నుతున్నారు. నేను కూడా ఒక పన్నాగం పన్నుతున్నాను. కనుక ప్రవక్తా! వారిని చూసీ చూడనట్లు వదిలెయ్యి. కొంతకాలం పాటు వారిమానాన వారిని వదలిపెట్టు. (15-17) ✪

**అవతరణ:మక్కా** **సూక్తులు:19**

# 87.మహోన్నతుడు (ఆలా)

ఈ అధ్యాయాన్ని "అల్ ఆలా" (మహోన్నతుడు) అంటారు. ఇది కూడా నబవీశకం ప్రారంభ కాలంలోనే అవతరించింది. ధర్మప్రచార బాధ్యతను గురించి ఇందులో దైవప్రవక్త (సల్లం)కు కొన్ని సూచనలు, హితవులు ఇవ్వబడ్డాయి.

**కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం**

(ముహమ్మద్!) మహోన్నతుడైన నీ ప్రభువు పేరును స్తుతించు. ఆయన పవిత్రతను కొనియాడు. ఆయనే (యావత్తు విశ్వాన్ని, సమస్త జీవకోటిని) సృష్టించాడు.

1. మనిషి చేసే ప్రతి పనికీ సహకరిస్తూ, అతని కర్మలను ఎప్పటికప్పుడు నమోదు చేసే దైవదూతలు అని ఇక్కడ అర్థం కావచ్చు. లేదా ఆ పర్యవేక్షకుడు స్వయంగా దేవుడే కావచ్చు. వాస్తవం దేవునికే బాగా తెలుసు.



సరైన తీరులో, సముచిత రీతిలో సృష్టించాడు. (ప్రతి సృష్టిరాసికీ) ఒక అదృష్టాన్ని నిర్ణయించి, (ఆచరణకై) తగిన విధానం చూపించాడు. ఆయన చెట్లూ చేమలను కూడా మొలకెత్తించి, తరువాత వాటిని నల్లటి కసువుగా మార్చుతున్నాడు. (1-5)

మేము నీచేత పఠింపజేస్తాం. తర్వాత దేవుడు తలచినది తప్ప నీవు మరేదీ మరచి పోలేవు. ఆయనకు బహిరంగవిషయాలూ తెలుసు, రహస్యవిషయాలూ తెలుసు. (6,7)

మేము (నీ పని) తేలిక చేయడానికి నీకు సౌలభ్యం కలగజేస్తున్నాము. కనుక నీవు హితోపదేశం ప్రయోజనకారి అయితే (ప్రజలకు) హితోపదేశం చేస్తూ ఉండు. (దేవునికి) భయపడేవాడు దాన్ని స్వీకరిస్తాడు. దౌర్భాగ్యుడైనవాడే (దానికి) విముఖుడయి ఘోరమైన అగ్నిలో పడిపోతాడు. అక్కడ అతను చావడూ, బ్రతకడూ.[1] (8-13)

పవిత్రజీవితం అవలంబించి, తన ప్రభువు నామం స్మరిస్తూ ప్రార్థనచేసేవాడే ధన్యుడు. అయినా మీరు ప్రాపంచికజీవితానికే ప్రాధాన్యమిస్తున్నారు. కాని పరలోకం ఎంతో శ్రేష్ఠమైనది. ఈవిషయం గతంలో అవతరించిన దివ్యగ్రంథాలలో కూడా ఉంది. ఇబ్రాహీం, మూసా, (ప్రవక్త)లపై అవతరించిన గ్రంథాలలో ఉంది. (14-19) ✪

# 88. ముంచుకొస్తున్న ముప్పు (గాషియా)

**అవతరణ: మక్కా** **సూక్తులు: 26**

ఈ అధ్యాయాన్ని "గాషియా" (ముంచుకొస్తున్న ముప్పు) అంటారు. ఇది కూడా నబవీ శకం ప్రారంభ కాలంలోనే అవతరించింది. ఇందులో పునరుత్థాన దినాన పాపాత్ముల, పుణ్యాత్ముల పర్యవసానాల ప్రస్తావన ఉంది.

**కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం**

ముంచుకొస్తున్న ముప్పు సంగతి నీకేమైనా తెలుసా? ఆరోజు కొందరి ముఖాలు అవమానభారంతో చిన్నబోయి ఉంటాయి. వారెంతో శ్రమపడుతూ ఉంటారు. అలసి పోతూ ఉంటారు. ఘోరమైన అగ్నికీలల మధ్య మాడిపోతూ ఉంటారు. త్రాగేందుకు వారికి సలసల కాగే నీరు ఇవ్వబడుతుంది. ముండ్లతో కూడిన ఎండుగడ్డి పరకలు తప్ప వారికి ఎలాంటి తిండి దొరకదు. అది వారికి బలమివ్వదూ, ఆకలీ తీర్చదూ. (1-7)

1. చావుబ్రతుకుల మధ్య నలిగిపోతూ శాశ్వతమైన నరకశిక్ష అనుభవించే ఈ దౌర్భాగ్యుడు దైవధర్మాన్ని నిరాకరించి చనిపోయేదాకా అవిశ్వాస తిమిరంలోనే పడివుండే సత్యతిరస్కారి మాత్రమే అవుతాడు. అయితే మనసారా సత్యాన్ని విశ్వసించినప్పటికీ మరణించే వరకూ కొన్ని పాపాలలో కూరుకుపోయేవారికి తాత్కాలికంగా కొంతకాలం పాటు నరకంలో వేయడం జరుగుతుంది.

ముస్లిం గ్రంథంలోని ఒక హదీసు ప్రకారం, పాపాత్ముడైన ఆ విశ్వాసి నరకంలో తాత్కాలిక శిక్ష అనుభవించాక దేవుడు అతనికి మృత్యువు కలిగిస్తాడు. అతని విముక్తి గురించి చేసే సిఫారసును ఆమోదిస్తాడు. ఆ తర్వాత (నరకంలో) కాలిపోయిన అతని శవం స్వర్గంలోని సెలయేటి ఒడ్డు మీదికి తరలించబడుతుంది. అప్పుడు (దైవదూతలు) స్వర్గవాసులతో 'ఈ శవం మీద కాస్త నీళ్ళు చిలికించండి' అంటారు. శవం మీద నీళ్ళు చిలికించగానే, ఆ నీటి ప్రభావంతో నేల నుండి చెట్టు మొలకెత్తినట్లు ఆ విశ్వాసి సజీవుడయి లేస్తాడు. (ముస్లిం)

(ఆరోజు) మరికొందరి ముఖాలు కళకళలాడుతుంటాయి. వారు తమ కృషి పట్ల సంతోషిస్తూ అద్భుతమైన స్వర్గసీమలో ఉంటారు. అక్కడ ఎలాంటి వ్యర్థ విషయాలు వినరు. ఆ స్వర్గంలో (చల్లటి) సెలయేరులు ఉంటాయి. ఎత్తయిన ఆసనాలుంటాయి. (వారు త్రాగడానికి) మధుపాత్రలు కూడా పెట్టబడి ఉంటాయి. ఇంకా వరుసలు వరుసలుగా దిండ్లు పేర్చిఉంటాయి. పట్టు తివాచీలు పరచి ఉంటాయి. (8-16)

వీరు ఒంటెలు ఎలా సృజించబడ్డాయో గమనించలేదా? ఆకాశం ఎలా పైకెత్తబడి ఉన్నదో పరికించలేదా? పర్వతాలు (బలంగా) ఎలా పాతబడి ఉన్నాయో పరిశీలించలేదా? భూమి ఎలా విశాలంగా పరచబడి ఉన్నదో చూడలేదా? (17-20)

ప్రవక్తా! నీవు హితబోధ చేస్తూనే ఉండు. నీ పని హితబోధ చేయడమే. అంతేగాని, వారిని బలవంతంగా దారికి తెచ్చే బాధ్యత నీమీద లేదు. అయితే సత్యానికి విముఖుడై దాన్ని నిరాకరించేవాడికి దేవుడు ఘోర శిక్ష విధిస్తాడు. చివరికి వారు మాదగ్గరికే రావలసి ఉంది. వారిని విచారించి లెక్కతీసుకునే పని మా చేతిలోనే ఉంది. (21-26) ✪

**అవతరణ: మక్కా**

## 89. ప్రాతఃకాలం (ఫ్రజ్)

**సూక్తులు: 30**

ఈ అధ్యాయాన్ని "ఫ్రజ్" అంటారు. ఇది నబవీశకం ప్రారంభకాలంలో విశ్వాసులపై అవిశ్వాసుల వేధింపులు ఎక్కువయిన రోజుల్లో అవతరించింది. ఇందులో పూర్వం సత్యానికి విముఖులైన జాతుల గాథలు ప్రస్తావిస్తూ వారిని హెచ్చరించడం జరిగింది. ప్రాపంచిక వ్యామోహపరుల ప్రవృత్తి, సత్యప్రియులకు శుభవార్తలు కూడా ఉన్నాయి.

### కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

ప్రాతఃకాలం సాక్షి! దశరాత్రుల సాక్షి! సరి, బేసి (సంఖ్య)ల సాక్షి! గడచిపోతున్న రాత్రి సాక్షి! బుద్ధి, జ్ఞానం కలవారికి ఈ సాక్ష్యాలు చాలవా?[1] (1-5)

ఎత్తయిన స్తంభాలవార[2] యిన "ఆదె ఇరమ్"జాతి ప్రజల పట్ల నీ ప్రభువు ఎలా వ్యవహరించాడో నీకు తెలియదా? అలాంటి (శక్తి సామర్థ్యాలు గల) జాతి ప్రపంచ దేశాలలో ఇదివరకు ఎన్నడూ ఉద్భవించలేదు. లోయల్లో కొండలను తొలచిన సమూద్ జాతిప్రజల పట్ల (నీప్రభువు ఎలా ప్రవర్తించాడో తెలియదా)? మేకులవాడైన (భారీ సైన్యాలుగల) ఫిరౌన్ పట్ల (ఆయన ఎలా వ్యవహరించాడో తెలియదా)? ( 6-10)

వీరంతా ఆయా దేశాలలో మహా గర్వపోతులయి (దేవుని మీద) తిరగబడ్డారు. అంతేకాకుండా అక్కడ దారుణమైన దురంతాలు కూడా చేశారు. చివరికి నీ ప్రభువు

1. దైవప్రవక్త (సల్లం) ప్రళయం, పునర్జీవం, కర్మ విచారణలకు సంబంధించిన అతీంద్రియ విషయాలను ప్రస్తావిస్తున్నప్పుడు బహుదైవారాధకులు తిరస్కరిస్తుండేవారు. లేదా వాటిని గురించి పట్టించుకునేవారు కాదు. కనుక దేవుడు ఇవి పరమసత్యాలని చెప్పడానికి ప్రాతఃకాలం, దశరాత్రులు, బేసిసంఖ్య, గడచిపోతున్న రాత్రుల మీద ప్రమాణం చేస్తున్నట్లు ఇక్కడ అన్పిస్తోంది.

2. ఎత్తయిన స్తంభాలవారంటే, ప్రపంచంలో ఇదివరకెన్నడూ లేనంతటి ఎత్తయిన స్తంభాలతో పెద్ద భవంతుల్ని నిర్మించారని అర్థం. (ఇతర వివరాలకు 26:128,129 సూక్తులు చూడండి.)



వారిపై కొరడా ఝళిపించి కఠినంగా శిక్షించాడు. (ఇలాంటి దుర్మార్గుల పీచమణచడానికి) నీ ప్రభువు మాటువేసి ఉంటాడు. (11-14)

మానవుడ్ని అతని ప్రభువు పరీక్షించే నిమిత్తం గౌరవం, ఇతర భాగ్యాలు ప్రసాదించినప్పుడు అతను (పొంగిపోయి) "నా ప్రభువు నన్ను గౌరవనీయుడిగా చేశాడు" అంటాడు. (మరో విధమైన) పరీక్ష నిమిత్తం లేమికి గురిచేసినప్పుడు అతను (నిరాశతో క్రుంగిపోయి) "నా ప్రభువు నన్ను అవమానం పాల్జేశాడు" అంటాడు. (15,16)

(మానవుడు గౌరవ ప్రతిష్ఠలకు సిరిసంపదలే కొలమానం అనుకుంటున్నాడు). ఎంతమాత్రం కాదు. మీరసలు అనాథను ఆదరించరు; పేదవాడికి పట్టెడన్నం పెట్టే విషయంలో ఒకర్నొకరు ప్రోత్సహించుకోరు. (బంధువుల బలహీనలతను ఆసరాగా చేసుకొని, వారికి దక్కవలసిన) వారసత్వపు ఆస్తినంతటినీ కాజేస్తున్నారు. మీరసలు ధనవ్యామోహం ఊబిలో పూర్తిగా కూరుకుపోయారు. (17-20)

(ఇన్ని అన్యాయాలు, అక్రమాలకు పాల్పడుతూ కూడా దేవునికి భయపడకుండా పరలోకం, తీర్పుదినం ఏదీ లేదని వాదిస్తున్నారు మీరు.) ఏమాత్రం కాదు. యావత్తు భూమి దంచి, పిండిపిండి చేయబడినప్పుడు నీ ప్రభువు పంక్తులుతీరిన దైవదూతలతో అవతరిస్తాడు. ఆరోజు నరకం దగ్గరకు తీసుకురాబడుతుంది. ఆరోజు మానవుడికి అసలు సంగతి అర్థమవుతుంది. కాని అప్పుడు అర్థంచేసుకోవడం వల్ల ప్రయోజనం ఏమిటీ?

అప్పుడతను (పశ్చాత్తాపపడుతూ) "అయ్యయ్యో! నేనీ (పరలోక) జీవితం కోసం ముందుగా ఏదయినా (సత్కార్యం) చేసి పంపుకొని వుంటే ఎంత బాగుండేది!" అని వాపోతాడు. ఆ తర్వాత ఆరోజు దేవుడు శిక్షించేలా (కఠినంగా) మరెవరూ శిక్షించలేరు. దేవుడు బిగించి కట్టేలా (గట్టిగా) మరెవరూ బిగించి కట్టలేరు. (21-26)

(ఇక సత్యాన్ని విశ్వసించి సదాచార సంపన్నుడయిన మనిషిని ఉద్దేశించి) "తృప్తి చెందిన మనసా![3] పద నీ ప్రభువు సన్నిధికి. నీవు ఆయన పట్ల సంతోషించావు, ఆయన నీ పట్ల ప్రసన్నుడయ్యాడు. (ఇక) నా పుణ్యదాసులలో చేరి నా స్వర్గంలో ప్రవేశించు" అని చెప్పడం జరుగుతుంది. (27-30) ✪

3. మానవ అంతరంగం బహు విచిత్రమైనది. అది ఓపట్టాన మనకు లొంగదు. అనుక్షణం అది తన పరిధిని దాటిపోవడానికి పరిపరివిధాల ప్రయత్నిస్తుంది. ఎవరైనా సన్మార్గంలో నడుస్తూ సత్కార్యాలు చేస్తున్నాడంటే, అతను తన అంతరంగాన్ని దాని సహజపరిధిలో బంధించాడన్నమాట. నిజానికి అంతరంగంపై అదుపు సాధించడం గొప్ప (ఘన) కార్యమే. అంతరంగంపై అదుపు సాధించలేనివాడ్ని మనం సాధారణంగా చపలచిత్తుడు లేక చంచల స్వభావుడని అంటాము. మనిషి ప్రవర్తన రీత్యా దివ్యఖుర్ఆన్ ఈ అంతరంగాన్ని మూడు విధాలుగా విభజించింది.

ఖుర్ఆన్ పరిభాషలో మొదటిరకం అంతరంగాన్ని "నఫ్సుల్అమ్మారా" అంటారు. స్వభావం రీత్యా దీన్ని "దుష్టమనస్సు" లేక దుష్టబుద్ధి అని చెప్పవచ్చు. కోరలు చాచి బుసలు కొడ్తూ మీదికి వచ్చే భయంకర విషసర్పాన్ని చంపడం కన్నా దుష్ట మనస్సుని చంపడమే గొప్ప కార్యమన్నాడు ఓ కవి. దీన్నిబట్టి ఈ రకమైన అంతరంగం మనిషికి ఎంత ప్రమాదకరమైనదో ఊహించవచ్చు. ఇది

మానవుడ్ని రకరకాల చెడుల వైపు ఉసిగొల్పుతుంది. భయాందోళనలు కలిగించి సత్కార్యాల నుండి బయటికి లాగుతుంది. వివిధ భ్రమలు కల్పించి దుష్కార్యాల ఊబిలోకి నెట్టివేస్తుంది. రకరకాల ప్రలోభాలు చూపి, చివరికి మనిషిని నట్టేట ముంచుతుంది. నఫ్సుల్అమ్మారా (దుష్ట మనస్సు) గురించి ఖుర్ఆన్‌లో ఒకచోట ఇలా ఉంది:

“నేను నా ఆత్మశుద్ధిని గురించి గొప్పలు చెప్పుకోవడం లేదు. నా ప్రభువు కారుణ్య భాగ్యం లభిస్తే తప్ప (దుష్ట) మనస్సు ఎల్లప్పుడూ చెడు వైపుకే పురిగొల్పుతూ ఉంటుంది. నిస్సందేహంగా నా ప్రభువు గొప్ప క్షమాశీలి, అమిత దయామయుడు.” (12:53)

రెండవ రకం అంతరంగాన్ని “నఫ్సుల్లవ్వామా” అంటారు. ఇది చేసే పనిని బట్టి దీన్ని “అంతరాత్మ” అని పేర్కొనవచ్చు. “అంతరాత్మ ప్రబోధం” అనే మాట అందరికీ సుపరిచితమే. చెడ్డపనులకు పాల్పడినప్పుడల్లా అంతరాత్మ మనల్ని నిందిస్తుంది, ఆక్షేపిస్తుంది, అభ్యంతరం చెబుతుంది. “ఆ పని చేస్తే నువ్వు నాశనమవుతావు, పట్టుబడిపోతావు” అని హెచ్చరిస్తుంది.

అంతరాత్మ సజీవంగా ఉంటే మనిషి ఎలాంటి చెడు వైపు ఆకర్షించబడలేడు. ఒకవేళ ఎప్పుడైనా ఆకర్షించబడినా అంతరాత్మ హెచ్చరిస్తూ, నిందిస్తూ అతడ్ని ప్రశాంతంగా ఉండనివ్వదు. ఈవిధంగా అంతరాత్మ మనల్ని చెడుపనుల జోలికి పోనివ్వకుండా అడుగడుగునా అడ్డు తగుల్తుంది. అంతరాత్మ ప్రబోధాన్ని ఆలకించేవారు ఇహలోకంలోనే కాదు, పరలోకంలోనూ విజయ శిఖరాలు అధిరోహించగలరు. అంతరాత్మ ప్రబోధాన్ని ఖాతరు చేయకుండా దాన్ని అణచడానికి ప్రయత్నిస్తే మటుకు మనం దారితప్పి చీకటి అగాధాల్లోకి పడిపోయినట్లేనని గ్రహించాలి. ఎల్లప్పుడూ మన శ్రేయస్సు కోరుతూ మనకు రక్షక భటునిగా, బాడీగార్డ్‌గా పనిచేసే ఈ అంతరాత్మ (నఫ్సుల్లవ్వామా)ను అణచివేయడమంటే మన బాడీగార్డ్‌ని మనమే చేజేతులా చంపుకున్నట్లవుతుంది. బాడీగార్డ్ పోయాక మన స్థితి ఏమవుతుందో తెలిసిందే. అడుగడుగునా ప్రమాదాలే ఎదురవుతాయి.

ఈ అంతరాత్మను గురించే దేవుడు ఖుర్ఆన్‌లో ఇలా అంటున్నాడు: “నేను ప్రళయం సాక్షిగా చెబుతున్నాను. (మీరనుకునేది ఎంతమాత్రం నిజం) కాదు. నేను తనను తాను నిందించు కునే ఆత్మసాక్షిగా చెబుతున్నాను...” (75:1-4)

పై సూక్తులలో విశ్వప్రభువు సత్యతిరస్కారుల కుశంకలను ఖండిస్తూ ప్రళయదినం తప్పక వస్తుందని, ఆరోజు మానవులంతా మళ్ళీ బ్రతికించబడతారని, వారినుంచి కర్మల లెక్క తీసుకోడం జరుగుతుందని ప్రళయదినం మీద, అంతరాత్మ మీద ప్రమాణం చేసి మరీ హెచ్చరిస్తున్నాడు.

నఫ్సుల్లవ్వామా (అంతరాత్మ)ను గురించి దైవప్రవక్త (సల్లం) వ్యాఖ్యానిస్తూ “ఏ విషయమైతే మీ హృదయంలో ఆక్షేపణ జనింపజేస్తుందో అదే చెడు” అన్నారు. అంటే మనం చేస్తున్నది తప్పుడు పనని మన అంతరాత్మ ఆక్షేపిస్తుంది. ఈ అనుభూతే మనిషిని చెడు విషయాలకు దూరంగా ఉంచు తుంది. అంతరాత్మను గురించి దైవప్రవక్త (సల్లం) మరింత వివరంగా ఇలా తెలియజేశారు:

“జాగ్రత్తగా వినండి! మన దేహంలో ఒక మాంసపు ముద్ద ఉంది. అది మంచి స్థితిలో ఉంటే మొత్తం దేహం మంచి స్థితిలో ఉంటుంది. ఒకవేళ అది చెడిపోతే మొత్తం దేహమే చెడి పోతుంది. (అనారోగ్యం పాలవుతుంది). అదే హృదయం.”

ఈ హృదయం నైతికంగా, ఆధ్యాత్మికంగా మంచిస్థితిలో ఉన్నప్పుడు నఫ్సుల్లవ్వామా (అంత రాత్మ) అనబడుతుంది. మనిషిని చెడు విషయాలనుంచి నిరోధించే, మంచి విషయాల వైపునకు ప్రేరేపించే “నఫ్సుల్లవ్వామా” అతని విశ్వాసాలు, ఆచరణలు, నీతినడవడికలపై “సెక్యూరిటీ గార్డ్”గా పని చేస్తుంది. శరీరంలోని ఈ సెక్యూరిటీ గార్డ్ అనారోగ్యం పాలయి బలహీనమైపోయే కొద్దీ మనిషి



“నఫ్సుల్ అమ్మారా” (దుష్ట మనస్సు)కు చేరువవుతూ చెడ్డ పనులు చేయడం ప్రారంభిస్తాడు. దీనికి భిన్నంగా మనిషి నఫ్సుల్లవ్వామా (అంతరాత్మ) ప్రబోధం విని తదనుగుణంగా నడచుకున్నట్లయితే క్రమేణా అతడు మూడవ రకం అంతరంగమయిన “నఫ్సుల్ ముత్మయిన్న” (సంతృప్త హృదయం)కు దగ్గరవుతాడు.

ఈ కోవకు చెందిన అంతరంగం గురించే ఈసూక్తి (89:27-30)లో ప్రస్తావించబడింది. ప్రఖ్యాత వ్యాఖ్యాన సహిత ఖుర్ఆన్ అనువాద గ్రంథమయిన ‘రూహుల్ బయాన్’లో వ్యాఖ్యాన కర్త నఫ్సుల్ ముత్మయిన్న (సంతృప్త హృదయం) గురించి వివరిస్తూ “నఫ్సుల్ ముత్మయిన్న అంటే ఎలాంటి చెడు విషయాలు లేని పరిశుద్ధమైన, అత్యున్నత సుగుణ సంపత్తితో కూడిన జ్యోతిర్మయ హృదయం అన్నమాట” అన్నారు.

భౌతికావసరాలు నెరవేరితే చాలు, ఇక ఏ సమస్యా ఉండదంటారు పదార్థపూజారులు. ఈ విషయం కొంతవరకు నిజమే కాని, ఇదే అన్నిటికీ మూలమంత్రం మటుకు కాజాలదు. సకల విధాల భోగభాగ్యాలతో తులతూగుతున్న పాశ్చాత్య దేశాల్లో ఎందరో ప్రజలు మనశ్శాంతి లభించక జీవితం పైనే విరక్తి చెందుతున్నారు. లక్షలు ఖర్చుపెట్టినా పొందలేని ఈ మనశ్శాంతి దేవుని స్మరణ ద్వారా మాత్రమే ప్రాప్తమవుతుందని ఖుర్ఆన్ చెబుతోంది. ఇక్కడ దేవుని స్మరణ అంటే ఓచోట తిష్ఠవేసి కళ్ళు మూసుకొని దైవనామం జపించడం కాదు. మనిషి తనను తాను పూర్తిగా దేవునికి సమర్పించుకొని జీవిత సమస్త రంగాల్లో ఆయన ఆజ్ఞలు, హితవులు పాటించాలి. అప్పుడే అతనికి నిజమైన మనశ్శాంతి, హృదయ సంతృప్తి లభిస్తాయి.

“ఆయన తన వైపు మరలేవారికి మాత్రమే తన వైపుకొచ్చే మార్గం చూపిస్తాడు. అలాంటి వారే (ఈ ప్రవక్త అందజేసిన) సందేశాన్ని విశ్వసిస్తారు. దైవస్మరణతో వారి హృదయాలకు శాంతీ, సంతృప్తులు ప్రాప్తమవుతాయి. గుర్తుంచుకోండి! దైవస్మరణ వల్లనే మానవులకు మనశ్శాంతి లభిస్తుంది. దైవసందేశం స్వీకరించి సదాచార సంపన్నులైనవారు నిజంగా ఎంతో అదృష్టవంతులు. వారికి (పరలోకంలో) ఎంతో శ్రేష్ఠమైన ప్రతిఫలం లభిస్తుంది.” (13:27-29)

అలాంటి వ్యక్తికి మరణావస్థలో, ఆ తరువాత కలిగే అనుభవాన్ని గురించి మహాప్రవక్త (సల్లం) ఒక హదీసులో ఈవిధంగా అభివర్ణించారు:

“విశ్వసించిన దాసుడు చనిపోయేటప్పుడు దేవుడు అతని దగ్గరికి ఇద్దరు దైవదూతలను స్వర్గ కానుకలిచ్చి పంపుతాడు. ఆ దూతలు అతనితో “సంతృప్త హృదయమా! సుఖభోగాల వైపునకు పద. నీ ప్రభువు నీ పట్ల ప్రసన్నుడయ్యాడు” అని అంటారు. అతని దేహం నుండి ఆత్మ బయలెడి నప్పుడు దాని పరిమళం ఎవరి ముక్కూ ఆఘ్రాణించలేనంత ఆహ్లాదకరంగా ఉంటుంది. భూలోకం నుండి ఒక పవిత్రాత్మ వస్తోందని ఆకాశపుటంచుల్లోని దైవదూతలు అంటారు. ఆ పవిత్రాత్మ ఆకాశంలో ఏఏ ద్వారాల దగ్గరికి వస్తుందో ఆయా ద్వారాలు తెరవబడతాయి. ఏఏ దైవదూతలు తారసపడతారో ఆయా దైవదూతలందరూ దాన్ని ఆశీర్వదిస్తారు.

తరువాత ఆ ఆత్మను విశ్వప్రభువు సన్నిధికి తీసికెళ్తారు. అక్కడ దేవుని ముందు అది సాష్టాంగపడుతుంది. ఆ తరువాత ఈ ఆత్మను తీసికెళ్ళి విశ్వాసుల ఆత్మలతో పాటు ఉంచమని మీకాయిల్ దూతకు ఆజ్ఞలభిస్తుంది. అతనికి ఖుర్ఆన్ (సూక్తులేవైనా) జ్ఞాపకముంటే వాటి ప్రకాశమే అతనికి సరిపోతుంది. సరిపోకపోతే అతని సమాధిలో సూర్యుని వెలుగు ఏర్పాటు చేయబడుతుంది. అందరికంటే ప్రియమైనవాడు తప్ప మరెవరూ మేల్కొలపలేనంత ప్రశాంతంగా పడక మీద పడుకునే నవవధువులా అతను సమాధిలో ఎంతో ప్రశాంతంగా ఉంటాడు.” (బుఖారి, ముస్లిం)

అవతరణ: మక్కా

# 90. పట్టణం (బలద్)

సూక్తులు: 20

ఈ అధ్యాయాన్ని "బలద్" అంటారు. ఇది కూడా నబవీశకం ప్రారంభకాలంలోనే అవిశ్వాసులు దైవప్రవక్త (స)కు బద్ధవిరోధులయి దౌర్జన్యానికి పాల్పడిన రోజుల్లో అవతరించింది. ఇందులో పరలోకపు జవాబుదారీ భావన ప్రత్యేకంగా పేర్కొనబడింది.

### కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

కాదు, (మీరనుకునేది ఎంతమాత్రం నిజం కాదు.) నేనీ (మక్కా) పట్టణం సాక్షిగా చెబుతున్నాను. (పవిత్రమైన) ఈ పట్టణంలో వీరు నిన్ను (వేధించడం) ధర్మసమ్మతం చేసుకున్నారు. నేను (మీ)తండ్రి (ఆదం) సాక్షిగా, అతనికి పుట్టిన సంతానం సాక్షిగా చెబుతున్నాను. మేము మానవుడ్ని (విశృంఖలజీవితం గడపడానికి పుట్టించలేదు.) శ్రమజీవిగా పుట్టించాము. తనపై ఎవరూ అదుపు సాధించలేరని భావిస్తున్నాడా అతను? (1-5)

(మానవుడు పేరుప్రతిష్ఠల కోసం ప్రాకులాడుతూ, ధనాన్ని ఎలా దుర్వినియోగం చేస్తున్నాడు! పైపెచ్చు ప్రగల్భాలు పలుకుతూ) "నేను లక్షలాది రూపాయలు మంచి నీళ్ళులా ఖర్చుపెట్టాను" అని అంటున్నాడు. తనను (పైన) ఎవరూ చూడటం లేదని భావిస్తున్నాడా అతను?

మేమతనికి రెండు కళ్ళు, ఒక నోరు, రెండు పెదవులు ఇవ్వలేదా? (మంచికి, చెడుకు సంబంధించిన) రెండు స్పష్టమైన మార్గాలు అతనికి చూపలేదా? (6-10)

కాని అతను కఠినమైన కనుమ గుండా నడవడానికి సాహసించలేదు. కఠినమైన కనుమ అంటే ఏమిటో నీకు తెలుసా?

(కఠినమైన కనుమంటే) బానిసను బంధవిముక్తి చేయడం, లేదా (కరువుదినాల్లో) ఆకలిగొన్న రోజు సమీప అనాథకుగాని, దారిద్ర్యంలో మగ్గే నిరుపేదకుగాని పట్టెడన్నం పెట్టడం, ఆపై ఓర్పు, దయాదాక్షిణ్యాల్ని గురించి పరస్పరం ఉపదేశించుకునే విశ్వాసుల్లో చేరిపోవడం.[1] ఇలాంటివారే కుడిపక్షం వాళ్ళు. (11-18)

---

1. దయాదాక్షిణ్యాలను గురించి మహాప్రవక్త (సల్లం) మహితోక్తులు చూడండి:

"కరుణించేవారినే కరుణామయుడు కరుణిస్తాడు. భువిలో ఉండేవారిని కరుణించండి, దివిలో ఉండేవాడు మిమ్మల్ని కరుణిస్తాడు." (అబూదావూద్, తిర్మిజి)

"తోటి మానవుల్ని కనికరించనివాడ్ని దేవుడు (కూడా) కనికరించడు." (బుఖారి, ముస్లిం)

"మన పిల్లలను కరుణించని, మన పెద్దలను గౌరవించనివాడు మనవాడు కాదు"(తిర్మిజి)

"ఒక ముస్లిం తోటి ముస్లింకు సోదరుని వంటివాడు. అతనికి ఈ ముస్లిం అన్యాయం చేయడు. అతనికి సహాయం చేయకుండా దూరంగా ఉండడు.

ఎవరు తన తోటి సోదరుని అవసరం తీర్చడంలో నిమగ్నుడవుతాడో, దేవుడు అతని అవసరం తీర్చడంలో నిమగ్నుడవుతాడు. మరెవరు ఒక ముస్లింను ఏదైనా ఆపదలో ఆదుకుంటాడో, దేవుడు ప్రళయదినం ఆపదల్లోని ఒక ఆపద నుండి అతడ్ని ఆదుకుంటాడు. ఎవరు ఒక ముస్లిం లోపాన్ని మరుగు పరుస్తాడో దేవుడు ప్రళయ దినాన అతని లోపాన్ని మరుగు పరుస్తాడు." (బుఖారి, ముస్లిం)



పోతే మా సూక్తుల్ని తిరస్కరించినవారు ఎడమపక్షం వారవుతారు. వారిని (నరకా)అగ్ని (నలువైపులా) చుట్టుముట్టి ఉంటుంది.[2] (19,20) ✪

అవతరణ: మక్కా

# 91. సూర్యుడు (షమ్స్)

సూక్తులు: 15

ఈ అధ్యాయాన్ని "షమ్స్" అంటారు. ఇది కూడా నబవీశకం ప్రారంభ కాలంలోనే అవిశ్వాసులు దైవప్రవక్త (స)ను విరోధించడంలో హద్దుమీరిన రోజుల్లో అవతరించింది.

### కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

సూర్యుని సాక్షి! అతని ఎండ సాక్షి! అతని వెనుక వచ్చే చంద్రుని సాక్షి! సూర్య రశ్మితో ప్రకాశించే పగటిసాక్షి! దాన్ని కప్పివేసే రాత్రిసాక్షి! ఆకాశం సాక్షి! దాన్ని (కప్పుగా) నిలబెట్టినవాడి సాక్షి! భూమిసాక్షి! దాన్ని (తివాచిలా) పరచినవాడి సాక్షి! మానవాత్మ సాక్షి! దాన్ని తీర్చిదిద్ది, దానికి పాపపుణ్యాలను గురించి తెలిపినవాడి సాక్షి! నిస్సందేహంగా ఆత్మప్రక్షాళనం చేసుకున్నవాడు ధన్యుడు. అంతరాత్మను అణచి పెట్టినవాడు నాశనమవుతాడు.[1] (1-10)

సమూద్ జాతి తలబిరుసుతో (సత్యాన్ని) తిరస్కరించింది. ఆ జాతిలో అందరి కంటే పరమ కర్కోటకుడు లేచి నిలబడినప్పుడు దైవప్రవక్త (అతడ్ని హెచ్చరిస్తూ) "జాగ్రత్త! దేవుని ఒంటె జోలికిపోకు. దాన్ని నీళ్ళు త్రాగనీయకుండా అడ్డుకోకు" అని అన్నాడు. (11-13)

కాని ఆ దుర్మార్గులు అతడ్ని ధిక్కరించి ఒంటెను దారుణంగా చంపేశారు. చివరికి వారి పాపాలకు దేవుడు వారిని కఠినంగా శిక్షించాడు. ఆయన వారిని ఒకేసారి సమూలంగా తుడిచిపెట్టాడు. (అయితే ఈచర్య వల్ల) ఆయనకు ఎలాంటి దుష్పరిణామాల్ని గురించి కూడా భయంలేదు. (14,15) ✪

---

2. కుడిపక్షంవారు, ఎడమపక్షం వారి గురించి మరిన్ని వివరాలకు "అల్ వాఖియా" అధ్యాయంలోని 56:27-56 సూక్తులు చూడండి.

1. తీర్చిదిద్దడం అంటే మనిషిగా మనుగడ సాగించడానికి దేవుడు అతనికి తగిన శక్తి సామర్థ్యాలు ప్రసాదించాడు. నడవడానికి కాళ్ళు, పనిచేయడానికి చేతులు, చూడటానికి కళ్ళు, వినడానికి చెవులు, మాట్లాడటానికి నోరు, రుచిచూడటానికి నాలుక, వాసన చూడటానికి ముక్కు, ఆలోచించడానికి మేధ వగైరా అవయవాలు ప్రసాదించాడు.

అంతేకాదు, అతనికి మంచి చెడుల విచక్షణా జ్ఞానం కూడా ప్రసాదించాడు. పాపం ఏదో, పుణ్యం ఏదో తెలుసుకునే జ్ఞానాన్ని దేవుడు అతని అంతఃచేతనలో పొందుపరిచాడు. ఆపై అతనికి తన ప్రవక్తల ద్వారా సన్మార్గం ఏదో, అపమార్గం ఏదో కూడా తెలియజేశాడు. అలాంటప్పుడు అతను అంతరాత్మ ప్రబోధన విని రుజుమార్గం అవలంబిస్తే అతని జీవితం సార్థకమవుతుంది. పరలోకంలో మోక్షం పొందగలడు. దానికి భిన్నంగా అతను అంతరాత్మ ప్రబోధనను నొక్కిపట్టి మనోవాంఛలకు బానిసయిపోతే దైవాగ్రహానికి గురయి మరణానంతరం నరక కూపంలో పడిపోతాడు. (దీంతోపాటు 90:10; 75:2,14,15; 76:3 సూక్తులు చూడండి.)

అవతరణ: మక్కా

# 92. రాత్రి (లైల్)

సూక్తులు: 21

ఈ అధ్యాయం పేరు "లైల్" (రాత్రి). ఇది 91 వ అధ్యాయం అవతరించిన రోజుల్లో అవతరించింది. ఇందులో దైవవిధేయత ప్రాముఖ్యం, మానవునికి హితోపదేశం ఉన్నాయి.

**కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం**

ముసురుకొస్తున్న రాత్రి సాక్షి! ప్రకాశిస్తున్న పగటి సాక్షి! ఆడ, మగ జాతులను సృష్టించిన వాడి సాక్షి! మీరు చేసే ప్రయత్నాలు విభిన్న రకాలుగా ఉన్నాయి.

ధనాన్ని దానం చేసి, దైవభీతిపరుడయి, మంచిని సమర్థించేవాడికి మేము సులువైన మార్గాన నడిచేందుకు సౌలభ్యం కలగజేస్తాము.

పిసినారితనం వహించి, (దేవుడ్ని) ఖాతరు చేయ కుండా, మంచిని ధిక్కరించే వాడికి మేము కష్టతరమార్గాన నడిచేందుకు సౌలభ్యం కలగజేస్తాము.[1] అతను చచ్చిన తరువాత అతని ధనం అతనికి ఏ విధంగానూ ఉపయోగపడదు. (1-11)

(మానవ జీవితానికి) మార్గం నిర్దేశించవలసిన బాధ్యత మాపైనే ఉంది. ఇహ లోకమూ మాదే; పరలోకమూ మాదే.

కనుక నేను మిమ్మల్ని ప్రజ్వరిల్లే అగ్ని గురించి హెచ్చరిస్తున్నాను. సత్యాన్ని నిరాకరించి ముఖం తిప్పుకునే దౌర్భాగ్యుడు తప్ప మరెవరూ అందులో పడరు.

అయితే పునీతమవడానికి (నిరుపేదలకు, ధర్మసంస్థాపన కార్యకలాపాల కోసం) ధనమిచ్చే దైవభీతిపరుడు మాత్రం అగ్నికి దూరంగా ఉంచబడతాడు.

(ఇలా ధనమిచ్చి) బదులుతీర్చడానికి అతని మీద ఎవరి ప్రత్యుపకారం లేదు. అతను మహోన్నతుడైన తన ప్రభువు ప్రసన్నత కోసమే ఈ(పుణ్య) కార్యం చేస్తున్నాడు. కనుక అతనిపట్ల ఆ ప్రభువు తప్పకుండా ప్రసన్నుడవుతాడు. (17-21) ✪

---

1. దేవుడు మానవుడికి మంచిచెడుల విచక్షణాజ్ఞానంతోపాటు ఆ రెండిటిలో కోరినదాన్ని అవలంబించే, ఆచరించే స్వేచ్ఛ కూడా ప్రసాదించాడు. పైగా మనిషి ఏమార్గంలో పయనిస్తూ ఏపని కోసం కృషిచేస్తాడో ఆమార్గంలో ఆ పని నెరవేర్చడానికి అతనికి సౌలభ్యాలు కూడా ప్రసాదిస్తాడు. దుర్జనుడికి దుష్కార్యాలు చేయడం సులభం, సత్కార్యాలు చేయడం కష్టమవుతుంది. అలాగే సజ్జను డికి సత్కార్యాలు చేయడం సులభం, దుష్కార్యాలు చేయడం కష్టమవుతుంది.

నీతి మనిషి నైజంలోనే ఉంది. అదీ ఈసూక్తుల్లో పేర్కొన్న సులువైన మార్గం. దాన్ని ఇస్లాం మరింత మెరుగుపట్టి మానవునికి చూపిస్తుంది. దీనికి భిన్నంగా ప్రకృతికి విరుద్ధమైన ప్రతి మార్గమూ కఠినమైనదే. అది మానవుడికి ఇహలోకంలో ఎన్నో సమస్యలు, పరలోకంలో ఎన్నో యాతనలు తెచ్చిపెడ్తుంది. ఈ కారణంగానే దీన్ని ఖుర్ఆన్ కఠిన మార్గమని చెబుతోంది. అయితే కఠినమార్గం లోనే నడవదలచినవారికి దేవుడు ఆ మార్గాన్ని సులభతరం చేస్తాడు.



అవతరణ: మక్కా

# 93. పగటివెల్తురు(జుహా)

సూక్తులు: 11

ఈ అధ్యాయాన్ని "జుహా" అంటారు. ఇది కూడా నబవీశకం ప్రారంభ కాలంలోనే అవతరించింది. అయితే రెండవసారి దివ్యావిష్కృతి (వహీ) తర్వాత చాలాకాలం వరకు దివ్యావిష్కృతి అవతరించలేదు. అప్పుడు అవిశ్వాసులు దైవప్రవక్త (స)ను హేళనచేస్తూ "నీ ప్రభువుకు నీమీద కోపం వచ్చింది. ఆయన నిన్ను వదిలేశాడు" అని చెప్పసాగారు. దాంతో ఆయన మనస్తాపం చెందుతూ, తన వల్ల ఏదైనా పొరపాటు జరగడం వల్ల దేవుడు కోపంతో తనను నిజంగానే విడిచిపెట్టాడేమోనని తలచారు. దానికి సమాధానం గా ఈ అధ్యాయం అవతరించింది.

**కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం**

ఎండకాసే పగటి సాక్షి! చీకటి ఆవరించే రాత్రి సాక్షి! (ప్రవక్తా!) నీ ప్రభువు నిన్ను వదలి పెట్టలేదు. నీపై కినుక కూడా వహించలేదు. నీకోసం ప్రారంభకాలం కంటే ఆ తర్వాత కాలం నిస్సందేహంగా ఎంతో మేలయినదిగా ఉంటుంది. త్వరలోనే నీ ప్రభువు నీకు (గొప్ప వరాలు) అనుగ్రహిస్తాడు. వాటిపట్ల నీవు సంతోషిస్తావు. (1-5)

నీవు అనాథగా ఉన్నప్పుడు ఆయన నీకు ఆశ్రయం కల్పించలేదా? నీవు మార్గవిహీను డవై ఉండగా ఆయన నీకు మార్గం చూపలేదా? నీవు నిరుపేదగా ఉండటం చూసి ఆయన నిన్ను ధనవంతుడ్ని చేయలేదా? కనుక అనాథల పట్ల కఠినంగా ప్రవర్తించకు. యాచకుడ్ని కసరికొట్టకు. నీప్రభువు అనుగ్రహాలను (గురించి) చాటుతూ ఉండు.(6-11) ✪

# 94. మనశ్శాంతి (అలమ్‌నష్రహ్)

అవతరణ: మక్కా

సూక్తులు: 8

ఈ అధ్యాయాన్ని "అలమ్ నష్రహ్" (మనశ్శాంతి) అంటారు. ఇది కూడా 93 వ అధ్యాయం అవతరించిన రోజుల్లోనే అవతరించింది.

**కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం**

(ముహమ్మద్!) మేము నీ హృదయం తెరచి నీకు శాంతి చేకూర్చలేదా? మేము నీపై నుండి వెన్నువిరిచే భారం తీసివేశాం.[1] నీకోసం నీ (పేరుప్రతిష్ఠల) ప్రస్తావన ఉన్నతం చేశాం. కష్టాలు-కాఠిన్యాల తర్వాత సుఖాలు-సౌలభ్యాలు కూడా వస్తాయి.

---

1. మహనీయ ముహమ్మద్ (సల్లం) దైవప్రవక్తగా నియమించబడక పూర్వం నుంచే అరబ్ సమాజంలో సాగుతున్న బహుదైవారాధన, విగ్రహపూజ, మూఢనమ్మకాలు, దురాచారాలు, మద్య సేవనం, అశ్లీలం, అంతఃకలహాలు మొదలైన చెడులను గురించి ఆలోచిస్తూ వాటి నిర్మూలనకై తగిన మార్గం కానరాక బాధపడుతుండేవారు. ఈ విచారమే ఆయన్ని వెన్ను విరుస్తుండేది. చివరికి దేవుడు ఆయన్ని ప్రవక్తగా నియమించి సన్మార్గం చూపడం ద్వారా ఈ బాధను దూరంచేశాడు. అంతే గాకుండా ఆ సన్మార్గంలో ఎదురయ్యే కష్టాలను, కాఠిన్యాలను ఎదుర్కోగల మనోనిబ్బరం, సందేహం సందిగ్ధాలకు ఆస్కారంలేని విశాలహృదయం కూడా ప్రసాదించాడు.

ఔను, కష్టాలు-కాఠిన్యాల తర్వాత సుఖాలు-సౌలభ్యాలు తప్పకుండా వస్తాయి. కనుక నీ దైనందిన కార్యకలాపాలు ముగిశాక కఠోరారాధనలో లీనమయి నీప్రభువు పైనే మనస్సు లగ్నంచెయ్యి (1-8) ✪

## అవతరణ: మక్కా 95. అంజూరం (తీన్) సూక్తులు: 8

ఈ అధ్యాయాన్ని "తీన్" అంటారు. ఇది కూడా నబవీ శకం ప్రారంభ కాలంలోనే అవతరించింది. అప్పుడు సత్యాసత్యాల మధ్య ఘర్షణ తీవ్రస్థాయికి చేరి విశ్వాసులపై అవిశ్వాసుల అణచివేత కార్యకలాపాలు ఉధృతమయ్యాయి.

### కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

అంజూరం, ఆలివ్ (వృక్షా)ల సాక్షి! సీనాయ్ పర్వతాల సాక్షి! ఈ శాంతినగరం (మక్కా) సాక్షి! మేము మానవుణ్ణి ఎంతో ఉత్కృష్ట జీవిగా సృజించాము. తరువాత మేమతణ్ణి (సత్య నిరాకరణ వల్ల) వెనక్కి తిప్పి అతి నికృష్ట జీవిగా మార్చివేశాము. అయితే సత్యాన్ని విశ్వసించి సదాచార సంపన్నులయిన వారిని ఈ నికృష్టత్వం నుండి తప్పించాము. ఇలాంటి వారి కోసం మేము ఎన్నటికీ అంతంకాని గొప్ప సుకృతఫలం సిద్ధపరచి ఉంచాము. (1-6)

కనుక (మానవుడా!) అలాంటప్పుడు నీవు పరలోక విచారణ గురించిన సత్యాన్ని ఎలా నిరాకరిస్తావు? దేవుడు అందరికంటే గొప్ప (న్యాయా)అధికారి కాదా?[1] (7,8) ✪

---

1. యావత్తు సృష్టిరాసుల్లో మహోత్కృష్ట జీవులుగా సృజించబడిన మానవులు పెద్దవారైన తరువాత రెండు వర్గాలుగా విడిపోతున్నారు. ఒక వర్గం సత్యాన్ని నిరాకరించి, నీతిరాహిత్యమనే చీకటికూపంలో పడిపోతుంది. మరో వర్గం సత్యాన్ని స్వీకరించి తదనుగుణంగా సాత్వికజీవితం గడుపుతూ పుట్టుకతో వచ్చిన ఉత్కృష్టతను సార్థకం చేస్తోంది.

మొదటి వర్గానికి చెందిన ఒక వ్యక్తి వందలాది మంది అమాయకుల్ని హతమార్చి, వేలాది ఇండ్లను దోచుకున్న పరమ దుర్మార్గుడయి ఉంటాడు. రెండో వర్గానికి చెందిన మరొక వ్యక్తి వందలాదిమంది జీవితాలను బాగుపరచి వేలాది కుటుంబాల కష్టాలను కడతేర్చిన సజ్జనుడయి ఉంటాడు. వీరిద్దరినీ దేవుడు ఒకే దృష్టితో చూస్తాడా? ఆ దుర్మార్గుడికి అతని దుష్కార్యాలకు తగిన శిక్ష, ఆ సజ్జనుడికి అతని సత్కార్యాలకు తగిన ప్రతిఫలం లభించాలని; క్షుణ్ణంగా విచారణ జరిపించి పూర్తి న్యాయం చేకూర్చాలని మానవ అంతరంగం అభిలషించదా? ఈ యదార్థం అంగీకరించిన మానవుడు పరలోకంలో కర్మలవిచారణ జరుగుతుందన్న దైవవచనాన్ని ఎలా నిరాకరించగలడు అని ఇక్కడ ఖుర్‌ఆన్ ప్రశ్నిస్తోంది.

ఒక సజ్జనుడు చేసిన అనేక సత్కార్యాలకు తగిన పారితోషికం లభించడం ఇహలోకంలో సాధ్యంకాదు. అలాగే ఒక దుర్మార్గుడు చేసిన అనేక నేరాలకు తగిన శిక్ష విధించిన తరువాత దాన్ని అమలుపరచడం కూడా ఇహలోకంలో సాధ్యంకాదు. "దక్షిణాఫ్రికాకు చెందిన మౌజెస్ సిటోహోల్ అనే నేరగాడు 38 హత్యలు, 40 మానభంగాలు, 6 దోపిడీలు చేశాడు. 1997లో న్యాయస్థానం అతనికి 2,410 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించింది." (ఈనాడు దినపత్రిక: 17-10-1999). ఇంతటి సుదీర్ఘకాల శిక్షను అమలుపరచడం ఇహలోకంలో అసంభవమని తెలుస్తూనే ఉంది. అది



## అవతరణ: మక్కా 96.గడ్డకట్టిన రక్తం(అలఖ్) సూక్తులు: 19

ఈ అధ్యాయాన్ని "అలఖ్" (గడ్డకట్టిన రక్తం) అంటారు. ఇందులో మొదటి ఐదు సూక్తులు మొట్టమొదట అవతరించాయి. దీంతో మహనీయ ముహమ్మద్ (సల్లం) దైవప్రవక్తగా నియమించ బడటం, నబవీశకం మొదలవడం జరిగాయి. మిగిలిన సూక్తులు ఆ తరువాత కొన్నాళ్ళకు దైవప్రవక్త (సల్లం) కాబాలయానికి వెళ్ళి ప్రార్థన చేస్తుంటే, అబూజహల్ ఆయన్ని బెదిరించి ఇస్లాం ప్రచారోద్య మాన్ని నిరోధించడానికి ప్రయత్నించినప్పుడు అవతరించాయి.

మహనీయ ముహమ్మద్ (సల్లం) దివ్యావిష్కృతి ప్రారంభానికి పూర్వం ఇంటి నుండి ఆహారం తీసుకొని హిరాగుహకు వెళ్ళి అక్కడ ఏకాంతంగా దైవధ్యానం చేసేవారు. కొన్నాళ్ళకు ఆహార పదార్థాలు అయిపోగానే ఇంటికి తిరిగొచ్చి మళ్ళీ ఆహార పదార్థాలు తీసుకొని హిరాగుహకు వెళ్ళేవారు. ఇలా కొంతకాలం గడిచాక ఓరోజు ఉన్నట్లుండి గుహలో ఓ విచిత్ర వ్యక్తి ప్రత్యక్షమై "చదువు" అన్నాడు. దైవప్రవక్త (సల్లం) ఈ హఠాత్పరిణామానికి కంగారుపడుతూ "నాకు చదువు రాదు" అన్నారు. అప్పుడా వ్యక్తి దైవప్రవక్త (సల్లం)ను పట్టుకొని గట్టిగా అదిమి వదలిపెడ్తూ "చదువు" అన్నాడు. దైవప్రవక్త (సల్లం) భయపడుతూ "నాకు చదువు రాదు" అన్నారు. ఆ వ్యక్తి మళ్ళీ ఆయన్ని పట్టుకొని గట్టిగా అదిమి వదలిపెడ్తూ "చదువు" అన్నాడు. దైవప్రవక్త (సల్లం) తిరిగి "నాకు చదువు రాదు" అని చెప్పారు. ఆ వ్యక్తి మూడవసారి పట్టుకొని గట్టిగా అదిమి వదలిపెడ్తూ "సృష్టికర్త అయిన నీ ప్రభువు పేరు స్మరించి చదువు" అన్నాడు.

దైవప్రవక్త (సల్లం) ఈ సంఘటనతో భయపడిపోయి వణికిపోతూ ఇంటికొచ్చి పడ్డారు. రాగానే పడక మీద వాలి "దుప్పటి కప్పు, దుప్పటి కప్పు"అన్నారు. ఆయన శ్రీమతి హజ్రత్ ఖదీజా (రజి) వెంటనే ఆయనకు దుప్పటి కప్పారు. కాస్సేపటికి ఆయన కొంచెం భయాందోళనలు తగ్గిన తర్వాత జరిగినదంతా తెలియజేసి, తనకేదో భయంగా ఉందని అన్నారు. హజ్రత్ ఖదీజా (రజి) ఆయనకు ధైర్యం చెప్పారు. తరువాత ఆయన్ని ప్రముఖ క్రైస్తవ తత్వవేత్త వరఖా బిన్ నౌఫిల్ దగ్గరకు పిలుచుకెళ్ళి జరిగిన సంగతి చెప్పారు. హజ్రత్ ఖదీజా (రజి)కు బంధువు కూడా అయిన వరఖా అరబీ, హిబ్రూ భాషల్లో గొప్ప పండితుడేగాక, బైబిల్‌ని కాసి వడబోసిన అనుభవశాలి.

ఆయన ముహమ్మద్ (సల్లం)ని ఉద్దేశించి "నాయనా! అసలేం జరిగిందో కాస్త వివరంగా చెప్పు" అని అడిగాడు. దైవప్రవక్త (సల్లం) జరిగిన సంఘటన పూసగుచ్చినట్లు వివరించారు. అప్పుడు వరఖా "అయితే ఈవ్యక్తి పూర్వం మూసాప్రవక్త (అలైహి)కు వహీ (దివ్యావిష్కృతి) అందజేస్తుండిన దైవదూతే. నేను నీ దౌత్యకాలంలో ఆరోగ్యంగా, బలిష్ఠుడిగా ఉండి, నీజాతి నిన్ను (మక్కానుండి) బహిష్కరించే కాలంవరకు

---

పరలోకంలోనే సాధ్యమవుతుంది. దీన్నిబట్టి మానవుని జీవితం మరణంతో పూర్తిగా సమాప్తం కాదని, అతని కర్మలకు తగిన శిక్ష లేక ప్రతిఫలం అనుభవించడానికి మరణానంతరం శాశ్వతంగా ఉండే మరో జీవితం ఉంటుందని, ఉండాలని మానవ అంతరంగం సహజంగానే ఘోషిస్తుంది.

(దీంతో పాటు 68:35-36; 45:21 సూక్తులు కూడా చూడండి.)

జీవించిఉంటే ఎంత బాగుండు!" అని అన్నాడు.

ఈ చివరి వాక్యం విని దైవప్రవక్త (సల్లం) ఆశ్చర్యపోతూ "ఏమిటీ, నన్ను వీళ్ళు బహిష్కరిస్తారా!" అని ప్రశ్నించారు. "ఔను బాబూ! పూర్వం సత్యం తెచ్చిన ఏ ప్రవక్తనూ ప్రజలు విరోధించకుండా ఉండటం అనేది ఎన్నడూ జరగలేదు" అన్నాడు పండు ముసలి వరఖా.

హిరాగుహలో మహనీయ ముహమ్మద్ (స)కు తారసపడిన విచిత్రవ్యక్తి మరెవరో కాదు. ప్రతి యుగంలో దేవుని దగ్గరనుంచి దైవప్రవక్తలకు దివ్యావిష్కృతి తెచ్చే ప్రముఖ దైవదూత హజ్రత్ జిబ్రీలే (అలై) ఆయన. ఆ తరువాత ఆయన మానవాకారంలో తరచుగా దైవప్రవక్త (స) దగ్గరకొచ్చి దైవసందేశం అందజేస్తుండేవారు.

### కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

(ముహమ్మద్!) సర్వసృష్టికర్త అయిన నీప్రభువు పేరు స్మరించి పఠించు. ఆయనే మానవుడ్ని గడ్డకట్టిన రక్తంతో సృజించాడు. చదువు. నీ ప్రభువు మహోన్నతుడు. ఎంతో ఉదారుడు. ఆయన మానవునికి కలంద్వారా అతను ఎరగని జ్ఞానం నేర్పాడు. (1-5)

(కనుక మానవుడు అజ్ఞానిగా ప్రవర్తిస్తూ అపమార్గం పట్టడానికి) ఎంతమాత్రం వీల్లేదు. మానవుడు తననుతాను గొప్పవాణ్ణని, నిరపేక్షాపరుణ్ణని భావించి విర్రవీగుతున్నాడు. (కాని) అతను చివరికి నీ ప్రభువు సన్నిధికే మరలిపోవలసి ఉంది. (6-8)

ఒక దాసుడు ప్రార్థన చేస్తుంటే అతడ్ని నిరోధిస్తున్న వ్యక్తిని[1] చూశావా? (ఆ దాసుడు) సన్మార్గంలో ఉంటే లేదా దైవభీతి గురించి ఉపదేశిస్తుంటే, దానిపై నీ అభిప్రాయం ఏమిటి? (అతడ్ని నిరోధిస్తున్నవాడు) సత్యాన్ని నిరాకరించి ముఖం తిప్పుకుంటే, దాన్ని గురించి నీ అభిప్రాయం ఏమిటి? దేవుడు (ఇదంతా) గమనిస్తున్నాడని అతనికి తెలియదా? (9-14)

(అతను ఎంత బెదిరించినా ఆ దాసునికి నష్టం కలిగించే శక్తి అతనికి) ఏమాత్రం లేదు. ఆ పాపాత్ముడు పచ్చి అబద్ధాలకోరు. (ఈ దుశ్చర్యలు) మానుకోకపోతే మేమతని ముంగురులు పట్టి ఈడుస్తాం. అతను తన మద్దతుదారుల మూకను పిలుచుకోమను. మేము కూడా మా నరక దూతలను పిలుస్తాం. వద్దు. అతని మాట వినవద్దు. సాష్టాంగపడి నీ ప్రభువు సాన్నిధ్యం కోసం కృషి చెయ్యి. (15-19) ✪

---

1. దైవప్రవక్త (సల్లం) కాబాలో నమాజ్ చేస్తుంటే ఓరోజు అబూజహల్ చూసి ఉగ్రుడైపోయాడు. అతను తోటి ఖురైష్ నాయకులతో అన్నమాట ప్రకారం దైవప్రవక్త (సల్లం) మెడమీద కాలుపెట్టి తొక్కివేయడానికి ముందుకొచ్చాడు. కాని హఠాత్తుగా వెనక్కి జరుగుతూ ముఖానికి చేతులు అడ్డంపెట్టుకొని, దేనిబారి నుండో తప్పించుకోవడానికి ప్రయత్నించాడు. ఆ తరువాత అతని మిత్రమూక కారణం అడిగితే అతనిలా చెప్పాడు: "నాకూ, ఆయనకు మధ్య అకస్మాత్తుగా ఓ అగ్నిగుండం ఏర్పడింది. ఏదో భయంకరమైన వస్తువు, విచిత్రమైన రెక్కలు కన్పించాయి."

ఈ సంఘటనపై దైవప్రవక్త (సల్లం) వ్యాఖ్యానిస్తూ "అతను నన్ను మరికాస్త సమీపించి ఉంటే దైవదూతలు అతడ్ని ఖండ ఖండాలుగా చీల్చి చెండాడేవారు" అన్నారు. (ముస్లిం)



## 97. ఘనత (ఖద్ర్)

**అవతరణ: మక్కా** **సూక్తులు: 5**

ఈ అధ్యాయాన్ని "ఖద్ర్" అంటారు. ఇది నబవీశకం చివరికాలంలో అవతరించి ఉంటుందని తెలుస్తోంది. ఇందులో ఖుర్ఆన్ ఔన్నత్యం వర్ణించబడింది.

### కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

మేము దీన్ని ఘనతగల మహారాత్రిన అవతరింపజేశాం. ఘనతగల ఆరాత్రి ఏమిటో నీకేం తెలుసు? ఆ మహారాత్రి వేయినెలల కన్నా ఎంతో శ్రేష్ఠమైనది.[1] ఆ రాత్రి పరిశుద్ధాత్మ, దైవదూతలు తమ ప్రభువు అనుమతితో ప్రతి వ్యవహారానికి సంబంధించిన ఆజ్ఞలు[2] తీసుకొని అవతరిస్తారు. అది ఉషోదయం వరకు పూర్తిగా శుభవంతమైన రాత్రి. (1-5) ✪

---

1. రమజాన్ నెలలో ఓ రోజురాత్రి దివ్య ఖుర్ఆన్ అవతరించడం ప్రారంభమయింది. "రమజాన్ ఖుర్ఆన్ అవతరించిన నెల" అని బఖరా సూరాలో ఉంది. (2:185) అంటే హిరా గుహలో దైవప్రవక్త (సల్లం)కు దైవదూత హజ్రత్ జిబ్రీల్ (అలైహి) తొలి సందేశం రమజాన్ నెలలో ఓరోజు రాత్రిన అందజేశారన్నమాట. అందుకే ఈ అధ్యాయంలో రమజాన్ మాసాన్ని శుభప్రదమైన నెలగా, రమజాన్‌లోని ఆ రాత్రిని వేయి నెలల కంటే ఎంతో శ్రేష్ఠమయిన మహారాత్రిగా వర్ణించడం జరిగింది. ఈకారణంగానే రమజాన్ నెలంతా ఉపవాసవ్రతాలు పాటిస్తూ రాత్రివేళ ప్రత్యేక ప్రార్థనలు (తరావీహ్) జరపాలని మరోచోట దేవుడు ఆదేశించాడు.

ఈ "మహారాత్రి" (షబె ఖద్ర్ లేక లైలతుల్ ఖద్ర్) రమజాన్ నెలలో ఏ తేదీన వస్తుందనే ప్రశ్నకు విభిన్న ఉల్లేఖనాలలో వివిధ రకాల సమాధానాలున్నాయి. అయితే రమజాన్ చివరి దశకంలోని బేసి సంఖ్యగల ఒక రాత్రి అయి ఉంటుందనే విషయంలో ఎలాంటి భేదాభిప్రాయాలు లేవు. అంటే 21, 23, 25, 27, 29 తేదీలలో ఒక తేదీ అయివుంటుంది.

మహారాత్రి రమజాన్ చివరి పదిరాత్రులలో ఒక రేయి అని; ఈ రాత్రిన ఎవరైనా పుణ్య ఫలాపేక్షతో ఆరాధన (తరావీహ్ నమాజ్)లో నిమగ్నుడయిపోతే, అతని గత, భావి పాపాలన్నీ క్షమించబడతాయని దైవప్రవక్త (స) తెలిపారు. (ముస్నద్ అహ్మద్)

మరో ఉల్లేఖనంలో ఆయన ఇలా అన్నారు: "ఈ మహారాత్రిన ఎవరు విశ్వాసస్ఫూర్తితో దేవుని నుండి పుణ్యఫలం ఆపేక్షిస్తూ ఆరాధనలో నిమగ్నుడయిపోతాడో అతని గత పాపాలన్నీ క్షమించబడతాయి." (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (సల్లం) రమజాన్ నెల చివరి దశకంలో ఏతికాఫ్ (తపోనిష్ఠ) పాటిస్తారు. అంటే ఆ పదిరోజులు రేయింబవళ్ళు మసీదులోనే ఉండి ఆరాధనల్లో గడిపేవారు.

2. పొగ (దుఖాన్) అధ్యాయంలో "ఖుర్ఆన్ ఓ శుభరాత్రిన అవతరించింద"ని (44:3) ఉంది. అంటే రమజాన్ మాసంలోని ఓ శుభరాత్రిన అని అర్థం. ఆ తర్వాత అదే అధ్యాయం 4,5 సూక్తుల్లో "మా నిర్ణయం ప్రకారం ప్రతి విషయంలోనూ వివేకవంతమైన ఉత్తర్వు జారీఅయ్యే రాత్రి ఇది" అని ఉంది. దీన్నిబట్టి రమజాన్ నెలలోని ఈ ప్రత్యేక శుభరాత్రిన దేవుడు తన దూతలకు మానవుల వార్షిక భవితవ్యాన్ని అప్పగించి వారిని మానవ ప్రపంచానికి పంపిస్తాడు. దాని ప్రకారం ఆ దైవదూతలు తమకప్పగించిన బాధ్యతలు నిర్వహిస్తారు.

# 98. విస్పష్ట ప్రమాణం (బయ్యినా)

**అవతరణ: మదీనా** **సూక్తులు: 8**

ఈ అధ్యాయం అవతరణకాలం కచ్చితంగా నిర్ధారితం కాలేదు. యూదులు, క్రైస్తవులు తమ గ్రంథాల్లోని భవిష్యత్ ప్రకటనల్ని బట్టి ముహమ్మద్ (స) దైవప్రవక్తేనని తెలిసి కూడా సత్యాన్ని తిరస్కరిస్తున్నారు. అలాగే మక్కా బహుదైవారాధకులు తమ మధ్య పుట్టిపెరిగి సత్యసంధుడని ప్రజలు ప్రశంసించిన మనిషని తెలిసి కూడా ఆయన సందేశాన్ని ధిక్కరించారు. ఇందులో ఇలాంటి అవిశ్వాసుల మొండి వైఖరిని విమర్శిస్తూ వారిని నరకశిక్ష గురించి హెచ్చరించడం జరిగింది.

### కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

గ్రంథప్రజలతోపాటు బహుదైవారాధకుల్లోని సత్యతిరస్కారులు తమ ముందుకు స్పష్ట మైన ప్రమాణం రానంతవరకు (తమ తిరస్కారవైఖరి) మానుకునే మనుషులు కారు. (అంటే) దేవుని వైపున ఒక సందేశహరుడు వచ్చి సరయిన సమంజసమైన విషయాలు వ్రాయబడిన పరిశుద్ధ పుటలు చదివి విన్పించనంతవరకు (వారు మాను కోరన్న మాట). (1-3)

గ్రంథప్రజల దగ్గరకు (రుజుమార్గానికి సంబంధించిన) స్పష్టమైన బోధనలు వచ్చిన తరువాతే వారిలో విభేదాలు ఏర్పడ్డాయి. (తమ) జీవన విధానాన్ని దేవుని కోసం ప్రత్యేకించి ఏకాగ్ర చిత్తులై ఆయన్నే ఆరాధించాలని, ప్రార్థనా వ్యవస్థ నెలకొల్పాలని, (పేదల ఆర్థిక హక్కు) జకాత్ చెల్లించాలని, అదే సత్యధర్మమని మాత్రమే వారికి ఆదేశించబడింది. (4,5)

గ్రంథప్రజలలో, బహుదైవారాధకులలో సత్యాన్ని తిరస్కరించినవారు తప్పకుండా నరకాగ్నిలో పడి, అందులోనే ఎల్లాకాలం (నానాయాతనలు అనుభవిస్తూ) ఉంటారు. వారు యావత్తు సృష్టిలో అత్యంత నికృష్ట జీవులు. (6)

(దీనికి భిన్నంగా) సత్యాన్ని విశ్వసించి సదాచార సంపన్నులైనవారు యావత్తు సృష్టి రాసుల్లో అత్యంత ఉత్కృష్ట జీవులు. వారి ప్రతిఫలం వారిప్రభువు వద్ద ఉంది. (అదే) చల్లటి సెలయేరులు ప్రవహించే శాశ్వత స్వర్గవనాలు. వారక్కడ కలకాలం (హాయిగా) ఉంటారు. దేవుడు వారిపట్ల ప్రసన్నుడవుతాడు; వారు దేవుని పట్ల సంతోషిస్తారు. ఇదీ దేవునికి భయపడే వారికి లభించే (గొప్ప) సుకృతఫలం. (7,8) ✪

# 99. భూకంపం (జిల్జాల్)

**అవతరణ: మదీనా** **సూక్తులు: 8**

ఈ అధ్యాయాన్ని "జిల్‌జాల్" అంటారు. ఇది హిజ్రీ శకం ప్రారంభ కాలంలో అవతరించినట్లు కొందరు పండితుల అభిప్రాయం. కాని ఇందులోని విషయాలు పరిశీలిస్తే ఇది నబవీశకం ప్రారంభకాలంలో అవతరించి ఉండవచ్చని మరి కొందరు పండితులు అభిప్రాయపడ్డారు.



### కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

భూమి తీవ్ర ప్రకంపనలతో కుదిపి వేయబడుతుంది. అది తనలోని భారమంతా తీసి బయటపడవేస్తుంది. అప్పుడు మానవుడు (బిత్తరపోయి చూస్తూ) "ఏమయింది దీనికి (ఇలా చేస్తోంది)?" అంటాడు. ఆరోజు భూమి (తనమీద జరిగిన) పరిస్థితులు వివరిస్తుంది. కారణం, నీ ప్రభువు (అలాచేయమని) దాన్ని ఆదేశించిఉంటాడు. (1-5)

ఆరోజు మానవులు విభిన్న వర్గాలుగా విడిపోయి (దైవ న్యాయస్థానం నుండి) తిరిగొస్తారు. అప్పుడు వారికి వారికర్మలు చూపిస్తారు. ఆ తర్వాత ఎవరైనా అణుమాత్రం సత్కార్యం చేసివున్నా అతను దాన్ని (కళ్ళారా) చూసుకుంటాడు. అలాగే ఎవరైనా అణు మాత్రం దుష్కార్యం చేసివున్నా అతనూ దాన్ని (కళ్ళారా)చూసుకుంటాడు.[1] (6-8) ✪

---

1. కొన్ని రకాల సత్కార్యాలు విశ్వాసులు కూడా చేస్తారు; అవిశ్వాసులు కూడా చేస్తారు. అయితే ప్రతిఫలం విషయంలో ఖుర్‌ఆన్ నాలుగు విధల దృక్పథాన్ని పేర్కొన్నది:

(1) అవిశ్వాసులు, బహుదైవారాధకులు, కపట విశ్వాసులు చేసిన సత్కార్యాలు వృధా అవుతాయి. పరలోకంలో వారికి ఎలాంటి పుణ్యఫలం లభించదు. ఆ సత్కార్యాలకు ఏదైనా ప్రతి ఫలం లభిస్తుందంటే అది ఇహలోకంలో మాత్రమే లభిస్తుంది. ఉదా:- 7:147; 9:17,67-69; 11:15,16; 14:18; 18:104,105; 24:39; 25:23; 33:19; 39:65; 46:20 సూక్తులు చూడండి.

(2) ఎంత పాపం చేస్తే అంతే శిక్ష పడుతుంది. అయితే సత్కార్యాలకు పదింతల ప్రతిఫలం లభిస్తుంది. ఒక్కోసారి దేవుడు తలిస్తే అంతకంటే ఎక్కువ కూడా ప్రతిఫలం ప్రసాదించవచ్చు. ఉదా:- 2:261; 6:160; 10:26,27; 24:38; 28:84; 34:27; 40:40 సూక్తులు చూడండి.

(3) విశ్వాసి పెద్ద పెద్ద పాపాలు విడనాడితే అతను చేసిన చిన్న చిన్న పాపాలు క్షమించ బడతాయి. ఉదా:- 4:31; 42:37; 53:32 సూక్తులు చూడండి.

(4) సద్గుణ సంపన్నుడైన విశ్వాసి నుండి తేలికపాటి లెక్క తీసుకోబడుతుంది. అతని పొరపాట్లు క్షమించబడతాయి. అతను చేసిన పుణ్యాకార్యాల ప్రకారం అతనికి అత్యున్నత ప్రతిఫలం లభిస్తుంది. ఉదా:- 29:7; 39:35; 46:16; 84:8 సూక్తులు చూడండి.

అలాంటి విశ్వాసి తాను చేసిన అణుమాత్రపు పాపకార్యానికి సైతం ఫలితం ప్రపంచంలో అనుభవిస్తాడు; అణుమాత్రపు పుణ్యకార్యానికి సైతం ప్రతిఫలం పరలోకంలో పొందుతాడు.

హజ్రత్ అబూబకర్ (రజి) భోజనం చేస్తున్నప్పుడు ఈసూక్తి గురించి దైవప్రవక్త (సల్లం) నోట వినగానే భోజనం ఆపేసి "దైవప్రవక్తా! నేను చేసిన అణుమాత్రపు పాపానికి కూడా పర్యవ సానం పరలోకంలో చూసుకుంటానా?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు: "అబూబకర్! ఇహలోకంలో నీకు బాధకలిగించే ఏ విషయమైనా అది నీ వల్ల జరిగిన అణుమాత్రపు పాపానికి పర్యవసానం (అని తెలుసుకో). నీవు అణుమాత్రపు పుణ్యకార్యాలు చేసిఉంటే, వాటిని దేవుడు రేపు పరలోకంలో నీకోసం భద్రపరచి ఉంచుతాడు." (త్బ్రాని, బైహఖి)

మరోసారి దైవప్రవక్త (సల్లం) విశ్వాసి చేసే పాపపుణ్యాలను గురించి ఇలా తెలిపారు: "మీలో పుణ్యకార్యాలు చేసేవారికి వాటిప్రతిఫలం పరలోకంలో లభిస్తుంది. అయితే పాపకార్యాలకు మాత్రం ఇహలోకంలోనే ఆపదలు, వ్యాధుల రూపంలో శిక్ష అనుభవిస్తారు." (ఇబ్నె మర్దూయా)

## అవతరణ: మక్కా 100. తురంగం (ఆదియాత్) సూక్తులు:11

ఈ అధ్యాయాన్ని “అల్ ఆదియాత్” అంటారు. ఇది హిజ్రీశకం ప్రారంభ కాలంలో అవతరించిందని కొందరి అభిప్రాయం. కాని ఇందులోని విషయాలు పరిశీలిస్తే ఇది నబవీశకం ప్రారంభంలో అవతరించిఉండవచ్చని తెలుస్తోంది. ఇందులో ధనవ్యామోహాన్ని ఖండిస్తూ, పరలోకపుజవాబుదారీ భావన గురించి హెచ్చరించడం జరిగింది.

**కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం**

నురుగులు కక్కుతూ, నిప్పురవ్వలు రాల్చుతూ పరుగెత్తే గుర్రాల సాక్షి! అవి తెల్లవారేటప్పటికి వచ్చిపడతాయి. దుమ్ము లేపుతూ చివరికి (శత్రు)సమూహంలోకి చొచ్చుకుపోతాయి. మానవుడు తన ప్రభువుకు కృతఘ్నుడై పోయాడు. దానికి అతనే సాక్ష్యం. అతను ధనవ్యామోహంలో పూర్తిగా కూరుకుపోయాడు. సమాధుల్లో వున్న వాటిని తీసి బ్రతికించి, అంతరంగాల్లో (దాగి)వున్న వాటిని రట్టు చేయడం జరుగుతుందని అతనికి తెలియదా? ఆరోజు అతడ్నిగురించి అతని ప్రభువుకే బాగా తెలుసు. (1-11) ✪

## అవతరణ: మక్కా 101. మహోపద్రవం(ఖారిఆ) సూక్తులు: 11

ఈ అధ్యాయాన్ని ‘‘ఖారిఆ’’ అంటారు. ఇది నబవీ శకం ప్రారంభకాలంలో అవతరించి ఉంటుందని తెలుస్తోంది. ఇందులో ప్రళయ బీభత్సం, పరలోక పర్యవసానాలను గురించి ప్రస్తావించడం జరిగింది.

**కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం**

మహోపద్రవం! ఏమిటా మహోపద్రవం? ఆ మహోపద్రవం ఏమిటో నీకేం తెలుసు? ఆరోజు మానవులు చెల్లాచెదరైన దీపపు పురుగుల్లా అవుతారు. (పెద్దపెద్ద) పర్వతాలు (సయితం గాలిలోకి ఎగిరి తునాతునకలయి) రంగురంగుల దూదిపింజల్లా మారిపోతాయి. ఆ తరువాత ఎవరి త్రాసు పళ్ళెం బరువుగా ఉంటుందో అతను భోగభాగ్యాలలో ఓలలాడుతాడు. మరెవరి త్రాసు పళ్ళెం తేలికగా ఉంటుందో అతను అథఃపాతాళానికి పోతాడు.[1] అథఃపాతాళమంటే ఏమిటో నీకేం తెలుసు? భగభగ మండే అగ్ని(గుండం. అదే భీకర నరకకూపం)! (1-11) ✪

---

అవిశ్వాసులకు పుణ్యకార్యాల ప్రతిఫలం ప్రపంచంలోనే లభిస్తుంది. పాపకార్యాలకు పరలోకంలో నరక శిక్ష చవిచూడవలసి వస్తుంది. కొన్ని ప్రవక్తప్రవచనాల ప్రకారం అవిశ్వాసులు చేసిన పుణ్యకార్యాల వల్ల పరోలోకంలో వారికి శిక్ష తీవ్రత కొంతవరకు తగ్గించబడుతుందని తెలుస్తోంది. ఉదాహరణకు, హాతింతాయికి అతను చేసిన విశేష దానధర్మాలకు పరలోకంలో తేలికపాటి శిక్ష విధించబడుతుందని తెలుస్తోంది. (రూహుల్ మాని)

1. ప్రళయదినాన మానవులు తిరిగి బ్రతికించబడినప్పుడు దైవన్యాయస్థానంలో వారి కర్మలను గురించి విచారణ జరుగుతుంది. ఆ సమయంలో కర్మల తూకం కూడా జరుగుతుంది. సత్కర్మలు బరువుగా ఉంటాయి. దుర్మార్గుల (కర్మల)కు ఎలాంటి బరువు, విలువ ఉండదు. సత్కర్మల విలువ, బరువు చిత్తశుద్ధి, విశ్వాసాలపై ఆధారపడి ఉంటాయి.



## 102. ప్రాపంచిక వ్యామోహం (తకాసుర్)

అవతరణ: మక్కా సూక్తులు: 8

ఈ అధ్యాయాన్ని “తకాసుర్” అంటారు. ఇది కూడా నబవీశకం ప్రారంభ కాలంలోనే అవతరించి ఉండవచ్చని కొందరు పండితుల అభిప్రాయం. ఇందులో ప్రాపంచిక వ్యామోహం, ఏమరుపాటులను ఖండిస్తూ, మరణానంతరం కర్మల పర్యవసానం గురించి ప్రజలను హెచ్చరించడం జరిగింది.

**కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం**

ప్రాపంచిక వ్యామోహంలో పరస్పరం పోటీపడి వీలైనంత ఎక్కువ సంపాదించాలన్న తపనే మిమ్మల్ని ఏమరుపాటులో పడవేసింది.[1] చివరికి (అదే రందిలో) మీరు సమాధికి చేరుకుంటారు. (మీరసలు ప్రాపంచిక సంపదే ప్రగతికి చిహ్నమని అనుకుంటున్నారు కాబోలు.) ఎంతమాత్రం కాదు. త్వరలోనే మీకు తెలుస్తుంది (వాస్తవం ఏమిటో). ఎంతమాత్రం కాదు. త్వరలోనే మీకు తెలుస్తుంది. (1-4)

ఎంతమాత్రం కాదు. విశ్వసనీయ జ్ఞానంతో మీరు విషయాన్ని గ్రహిస్తే (మీ వైఖరి ఇలా ఉండదు). మీరు తప్పకుండా నరకాన్ని చూస్తారు. ఔను, మీరు నమ్మకంగా దాన్ని మీకళ్ళారా చూస్తారు. ఆరోజు ఈ సౌఖ్యాలు, సిరిసంపదలను గురించి మిమ్మల్ని తప్పకుండా నిలదీయడం జరుగుతుంది. (5-8) ✪

## అవతరణ: మక్కా 103. కాలచక్రం (అస్ర్) సూక్తులు: 3

ఈ అధ్యాయాన్ని “అస్ర్” (కాలం) అంటారు. ఇది కూడా నబవీ శకం ప్రారంభ కాలంలోనే అవతరించి ఉండవచ్చని తెలుస్తోంది. ఇందులో పరలోక నష్టానికి గురికాని వారి మౌలిక గుణగణాలు వర్ణించబడ్డాయి.

---

“ఆరోజు (కర్మల త్రాసులో) బరువయినదే సత్యమవుతుంది. ఎవరి త్రాసుపళ్ళెం బరువుగా ఉంటుందో వారికే మోక్షం లభిస్తుంది. మరెవరి త్రాసుపళ్ళెం తేలికగా ఉంటుందో వారు ఘోరంగా నష్టపోతారు.” (7:8,9)

“ప్రళయదినాన మేము కచ్చితంగా తూచే త్రాసును ఏర్పాటు చేస్తాము. ఇక ఏ ఒక్కరికీ ఎలాంటి అన్యాయం జరగదు.” (21:47)

1. దైవాన్ని, పరలోకచింతను విస్మరించి ప్రాపంచిక వ్యామోహపరుడై పోయిన మనిషి తన సుఖసంతోషాల కోసం వీలైతే ఎన్ని అడ్డదారులైనా తొక్కి డబ్బు సంపాదిస్తాడు. అన్యాయం, అవినీతి, అక్రమాల ద్వారా కోట్లు సంపాదిస్తాడు. విలాసాల కోసం వాటిని విచ్చలవిడిగా ఖర్చుపెడ్తాడు.

అతను ప్రపంచంలో ప్రభుత్వం కళ్ళు గప్పగలడు గాని, విశ్వప్రభువు కళ్ళు గప్పలేడు. అతను సంపాదించిన జీవితావసరాలు, ధన కనక వస్తువుల్ని గురించి పరలోక న్యాయస్థానంలో కఠినంగా లెక్క తీసుకోవడం జరుగుతుంది. సిరిసంపదలు, ఇతర జీవితావసరాలు ఎంత ఎక్కువగా ఉంటే విచారణ అంత సుదీర్ఘ కాలం సాగుతుంది. అతని అక్రమ సంపాదన, ధన దుర్వినియోగాలు రుజువైన తరువాత దైవదూతలు అతడ్ని నరకంలోకి నెట్టివేస్తారు.

### కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

కాలచక్రం సాక్షి![1] మానవుడు ఘోరంగా నష్టపోయాడు. అయితే సత్యాన్ని విశ్వసించి (తదనుగుణంగా) సత్కార్యాలు చేస్తూ, సత్యం, సహనాలను గురించి పరస్పరం ఉపదేశించుకునే వారు మటుకు ఏమాత్రం నష్టపోరు. (1-3) ✪

---

1. కాలం మీద ప్రమాణం చేయడానికి కారణం అది ఎన్నో యదార్థాల్ని లోకానికి అంద జేస్తుంది. కాలం విలువను గుర్తించినవారే ఆ యదార్థాల నుండి గుణపాఠం నేర్చుకుంటారు. కాలం ఎవరికోసమూ నిరీక్షించదు. అది తన కర్తవ్యనిర్వహణలో బిరబిరా సాగిపోతూనే ఉంటుంది.

కాలం కడు కర్కశమైనది. అది ఎవరినీ కనికరించదు. ఎందరో రాజులు, రాజ్యాధినేతలు కాలగర్భంలో కలసిపోయారు. దైవదాసులపై దుర్భర దౌర్జన్యకాండ జరిపిన దైవధిక్కారులు, తల బిరుసు నియంతలు కూడా కాలప్రవాహంలో పూచిక పుల్లల్లా కొట్టుకుపోయారు. చరిత్ర పుటల్లో చెదురు మదురు ప్రస్తావనలు తప్ప వారి అవశేషాలు కూడా నేడు ధరణిపై మిగల్లేదు.

కాలం కరవాలం కన్నా ఎంతో కటువయినది. అది ఏ ఒక్కరినీ విడిచిపెట్టదు. ఎన్నో కాల్పనిక సిద్ధాంతాలు కాలవాహినికి ఎదురీదలేక నిజంలేని ఇజాలుగా మిగిలిపోయాయి. కడకు కమ్యూనిజం కూడా ఉక్కుతెరల వెనుక వికృతనాట్యం చేసి శాశ్వతంగా కన్నుమూసింది.

కాలచక్రం చెప్పే ఈ చారిత్రక వాస్తవాల నుండి గుణపాఠం నేర్చుకున్నవాడే ధన్యుడు. కాల ప్రవాహానికి తట్టుకొని నిలబడే నిజమయిన ఇజం, పరలోకమోక్షం ప్రసాదించే సత్యధర్మం ఇస్లాం మాత్రమేనని ఈ అధ్యాయం అధ్యయనం చేసేవారికి సులభంగా అర్థమవుతుంది.

ప్రఖ్యాత ఖుర్‌ఆన్ వ్యాఖ్యానకర్త ఇమాం రాజీ (రహ్మ) కథనం ప్రకారం ఒక మహనీయుడు ఈ సూరా అధ్యయనం చేస్తూ దీర్ఘంగా ఆలోచించసాగాడు. కాని ఎంత ఆలోచించినా అందులో నిగూఢమై ఉన్న ప్రబోధాన్ని ప్రస్ఫుటంచేసే ఒక్క ఉదాహరణ కూడా ఆయనకు తట్టలేదు.

అంతలో వీధిలో నిలబడి 'మంచు' అమ్ముతున్న ఒక వ్యక్తిపై ఆయన దృష్టి పడింది.

ఆ వ్యక్తి "మంచూ, మంచు కొనండీ బాబూ!" అంటూ అరుస్తున్నాడు. కాని జనం ఎవరూ మంచు కొనడానికి ముందుకు రాకపోవడంతో అతను ఆందోళనపడుతూ మరింత గట్టిగా అరవడం మొదలుపెట్టాడు:

"అన్నలారా! నాపై దయజూపండి, నా మంచు కరిగిపోతోంది. త్వరగా దీన్ని కొనండి. ఇదే నా ఆస్తంతా. దీన్ని కాపాడండి. దీన్ని కొనడంలో మీరు ఆలస్యం చేస్తే నా బతుకు బండలవుతుంది. నా ఆస్తంతా నీళ్ళ పాలవుతుంది. నేనిక ఉత్త చేతులతో భికారిగా ఉండవలసి వస్తుంది" అంటూ మంచు అమ్మేవాడు దయనీయంగా కేకలు పెట్టసాగాడు.

ఈ సంఘటన ఆ మహనీయుడ్ని ఎంతో ప్రభావితం చేసింది. అప్పుడర్థమయింది ఆయనకు 'అస్ర్' అధ్యాయంలోని గూఢార్థం ఏమిటో.

మంచుగడ్డలా అనతి కాలంలో కరిగిపోయే ఈ (ఐహిక) జీవితంలో మనిషి సృష్టికర్తను విశ్వసించి ఆయన ఆదేశించిన విధంగా సత్కార్యాలు చేయకుండా, వీలైనంత ఎక్కువగా ప్రపంచ సుఖాలు జుర్రుకోవడమే పరమావధిగా పెట్టుకొని పదార్థపూజారిగా మనుగడ సాగిస్తూ, అదే స్థితిలో చనిపోతే అంతకంటే నష్టదాయకం అతనికి మరొకటి ఉండదు.



# 104. నిందించేవాడు (హుమజా)

**అవతరణ: మక్కా** **సూక్తులు: 9**

ఈ అధ్యాయాన్ని "హుమజహ్" అంటారు. ఇది కూడా నబవీశకం ప్రారంభ కాలం లోనే అవతరించినట్లు తెలుస్తోంది. ఇందులో ఇతరుల్ని హేళన చేయడం, కించపర చడం, చాడీగొట్టుదనం, ధనవ్యామోహం, పిసినారితనం మొదలైన మౌలిక దుర్గుణా లను గురించి పేర్కొంటూ, పరలోకంలో వాటి కారణంగా మనిషికి ఎదురయ్యే దుష్పరి ణామాలు ఏమిటో తెలియజేయబడింది.

ధనవ్యామోహం మనిషి చేత ముఖ్యంగా రెండు తప్పులు చేయిస్తుంది. ఒకటి, ధనార్జన కోసం అక్రమ పద్ధతులు అవలంబించడం. రెండు, ధనాన్ని అత్యధికంగా కూడబెట్టడం లేదా దుబారా, దుష్కార్యాల్లో దుర్వినియోగపరచడం. ఇవి రెండు తీవ్రమైన నేరాలు. వీటికి పరలోకంలో ఘోరశిక్ష చవిచూడవలసి వస్తుంది.

### కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

నిందించే, హేళనచేసే, చాడీలుచెప్పే ప్రతివాడికీ వినాశం (రాసిపెట్టి) ఉంది. అతను (మితిమీరిన ధనవ్యామోహంతో) డబ్బు కూడబెడ్తున్నాడు. (పరమలోభి అయి) దాన్ని మాటి మాటికి లెక్కపెట్టి దాచిపెడ్తున్నాడు. అతనీ సంపద శాశ్వతంగా తన దగ్గర ఉంటుందని భావిస్తున్నాడు. ఎంతమాత్రం ఉండదు.

అతను కసకస నలిపి తొక్కివేసే చోట విసిరి వేయబడతాడు. కసకస నలిపి తొక్కి వేసే చోటంటే ఏమిటో నీకు తెలుసా? దేవుని (నరకా) అగ్ని. అది భగభగ మండుతూ గుండెల దాకా చేరుతుంది. వారిని ఆ అగ్నిగుండాలలో పడవేసి మూసివేయడం జరుగు తుంది. ఈ విధంగా వారు (నానాయాతనలు అనుభవిస్తూ) పొడవయిన (అగ్ని) కీలల మధ్య చిక్కుకొని ఉంటారు. (1-9) ✪

# 105. ఏనుగు (ఫీల్)

**అవతరణ: మక్కా** **సూక్తులు: 5**

ఈ అధ్యాయాన్ని "ఫీల్" (ఏనుగు) అంటారు. ఇది కూడా నబవీ శకం ప్రారంభ కాలంలోనే అవతరించినట్లు పండితుల అభిప్రాయం. ఈ అధ్యాయం అర్థం చేసుకోవ డానికి దాని పూర్వపరాలు తెలుసుకోవలసిన అవసరముంది.

పూర్వం యూద మతస్థుడైన యమన్ రాజు "జూనువాస్" పొరుగు రాజ్యమైన నజ్రాన్‌పై దాడిచేసి, అక్కడి క్రైస్తవులు యూదమతం స్వీకరించడానికి నిరాకరించడంతో వారిని క్రూరంగా హింసించి సంహరించాడు. (వివరాల కోసం 85వ అధ్యాయం పాద సూచిక చూపండి.) ఆ తరువాత కొంతకాలానికి అబిసీనియా నీగ్రో క్రైస్తవచక్రవర్తి రోమన్ పాలకుల సహకారంతో యమన్ రాజ్యంపై దాడిచేసి, అక్కడి యూదుల పాలనను అంతమొందించి, క్రీ.శ. 525లో నీగ్రో ప్రభుత్వాన్ని నెలకొల్పాడు.

ఆ తరువాత వచ్చిన అబిసీనియా చక్రవర్తి యమన్ గవర్నర్‌గా అబ్రహాను నియమించాడు. అబ్రహా తన రాజ్యాన్ని పటిష్ఠపరచుకొని యమన్‌కు చక్రవర్తిగా

వ్యవహరిస్తూ రాజ్యవిస్తరణ కాంక్షతో మొత్తం అరేబియాని జయించాలని, అత్యధిక మంది యాత్రికుల్ని ఆకట్టుకోవడానికి అరబ్బుల మతకేంద్రమైన కాబామందిరాన్ని పోలిన ఒక మందిరం నిర్మించాలని నిర్ణయించుకున్నాడు. ఇలా ఒకవైపు అరేబియా అంతటా క్రైస్తవమతాన్ని వ్యాపింపజేయవచ్చని, మరోవైపు అరబ్బుల వాణిజ్యమార్గాలను మూసేసి ఆర్థిక ప్రయోజనాలు కూడా పొందవచ్చని భావించాడు.

ఈ లక్ష్యంతో అబ్రహా మొట్టమొదట యమన్ రాజధాని 'సనా'లో బ్రహ్మాండమైన ఒక చర్చి నిర్మించాడు. (నజ్రాన్‌లో కూడా 'కాబా'ను పోలిన ఒక మతకేంద్రాన్ని నిర్మించాడు.) చర్చి నిర్మాణం పూర్తయిన తరువాత తన లక్ష్యం గురించి అబిసీనియా చక్రవర్తికి లేఖ రాస్తూ "అరబ్బుల (కాబా)యాత్రను ఈ'ఎక్లిసియా' (చర్చి) వైపు మరల్చనిదే నేను విశ్రమించను" అని ప్రతిజ్ఞ చేశాడు. ఈ విషయమై అతను యమన్ అంతటా బహిరంగ ప్రకటన కూడా చేయించాడు.

ఇలా అరబ్బుల మతభావాల్ని రెచ్చగొట్టి, వారి ద్వారా తనకు మక్కాపై దాడి చేయడానికి సాకు దొరుకుతుందని భావించాడు. అతనికి నిజంగానే సాకు దొరికింది. అతని రెచ్చగొట్టే ప్రకటనలకు రెచ్చిపోయిన కొందరు అరబ్ యువకులు ఆ చర్చికి నిప్పంటించారు. (మరొక ఉల్లేఖనం ప్రకారం ఒక అరబ్ యువకుడు ఆ చర్చిలో మల మూత్రాలు విసర్జించాడని ఉంది.) దాంతో ఆగ్రహోదగ్రుడైన అబ్రహా క్రీ.శ. 570లో 60 వేలమంది సైనికులు, 13 ఏనుగులతో మక్కాపై దాడి చేయడానికి బయలుదేరాడు. దారిలో అతను ఖురైషీయులకు, ఇతర అరబ్ తెగలకు చెందిన వేలాది ఒంటెలు దోచుకున్నాడు. వాటిలో ముహమ్మద్ ప్రవక్త (సల్లం) తాత అబ్దుల్ ముత్తలిబ్‌కు చెందిన రెండొందలు ఒంటెలు కూడా ఉన్నాయి.

ఆ తరువాత అతను మక్కావాసుల దగ్గరికి ఒక రాయబారిని పంపాడు. ఆ రాయబారి ద్వారా "నేను మీతో యుద్ధం చేయడానికి రాలేదు. కాబా మందిరాన్ని ధ్వంసం చేయడానికి మాత్రమే వచ్చాను. మీరు గనక యుద్ధం చేయకుండా ఉంటే, నేను మీ ధన, మాన, ప్రాణాలకు ఎలాంటి హాని కలిగించను" అని చెప్పి పంపాడు. అదీగాక మక్కా నాయకుడు ఏదైనా మాట్లాడదలిస్తే అతడ్ని తన దగ్గరకు పిలుచుకు రమ్మని కూడా అతను రాయబారికి చెప్పాడు.

రాయబారి వెళ్ళి అబ్దుల్ ముత్తలిబ్‌కు ఈ విషయం తెలియజేశాడు. ఆయన తమకు అబ్రహా సైన్యాల్ని ఎదుర్కొనే శక్తి లేదని చెప్పి, రాయబారి వెంట అబ్రహా దగ్గరకి వెళ్ళారు. అబ్రహా ఆయన ముఖ వర్చస్సు, ఠీవి, దర్పం, గాంభీర్యతలు చూసి ఎంతో ప్రభావితుడయ్యాడు. వెంటనే అతను ఆసనం నుంచి లేచి, అబ్దుల్ ముత్తలిబ్‌కు స్వాగతం చెప్పి, ఆయన్ని తన పక్కన కూర్చో బెట్టు కున్నాడు. తరువాత "మీరేం కోరుతున్నారో చెప్పండి" అన్నాడు. దానికి అబ్దుల్ ముత్తలిబ్ "మీరు పట్టుకున్న నా ఒంటెల్ని నాకు ఇచ్చేయండి చాలు" అన్నారు నిర్లక్ష్యంగా.

అబ్రహా ఈమాటలు విని తెల్లబోయాడు. "నేను మిమ్మల్ని చూసి ఎంతో ప్రభావితు ణ్ణయ్యాను. కాని మీరు మీ ఒంటెల్ని అడిగి నా దృష్టి పథం నుండి దిగజారిపోయారు. మీ తాతముత్తాతల ఆరాధనా కేంద్రం, శాంతి నిలయమయిన కాబామందిరం గురించి మీరు ఒక్క మాటా ప్రస్తావించ లేదు" అని అన్నాడు అబ్రహా.



"నేను నా ఒంటెలకు మాత్రమే యజమానిని. అందుకని నేను వాటిని గురించే మిమ్మల్ని అడుగుతున్నాను. ఇక కాబా మందిరమంటారా? దానికి దాని ప్రభువు, యజమాని ఒకడున్నాడు. ఆయనే దాన్ని కాపాడుకుంటాడు" అన్నారు అబ్దుల్ ముత్తలిబ్. "ఆ ప్రభువు కూడా దాన్ని నా నుండి కాపాడలేడు" అన్నాడు అబ్రహా కటువుగా. "ఆ సంగతి మీకు, ఆయనకే తెలియాలి (మధ్యలో నాకెందుకు?)" అంటూ అబ్దుల్ ముత్తలిబ్ అక్కడ్నుంచి వెళ్ళిపోయారు.

అబ్దుల్ ముత్తలిబ్ మక్కా పట్నంలోకి తిరిగిరాగానే ఖురైష్ ప్రజలను సమావేశ పరచి "మీరంతా సామూహిక హత్యాకాండ నుండి కాపాడుకోవడానికి మీ భార్యాపిల్లల్ని తీసుకొని కొండల్లోకి వెళ్ళిపోండి" అని ప్రకటించారు. ఆ తరువాత ఆయన కొందరు ఖురైష్ నాయకులతో కలసి కాబాగృహానికి వెళ్ళారు. ఆ కాలంలో కాబాగృహంలో 300 విగ్రహాలుండేవి. కాని ఖురైష్ నాయకులు ఈ క్లిష్ట సమయంలో వాటన్నిటిని మరచి పోయి కాబా ప్రభువైన దేవుడ్ని తలచుకొని "దేవా! నీవు నీ గృహాన్ని, దాని సేవకుల్ని కాపాడు" అని దీనంగా ప్రార్థించారు. ఇలా వేడుకున్న తరువాత వారు కూడా కొండల్లోకి పోయి దాక్కున్నారు.

మరునాడు అబ్రహా సైన్యంతో మక్కా పట్నంలోకి ప్రవేశించేందుకు బయలు దేరాడు. అయితే సైన్యం ముందు నడుస్తున్న ఓ ప్రత్యేక ఏనుగు హఠాత్తుగా ఆగిపోయి నేలమీద చతికిల బడింది. మావటివాడు ఎంత కొట్టినా, అంకుశంతో పొడిచి గాయ పర్చినా అది కదల్లేదు. మక్కా వైపు నుండి వేరే వైపు తిప్పి అదిలిస్తే చాలు అది పరుగెత్త సాగేది. కాని మక్కా వైపు తిప్పగానే అది మళ్ళీ నేల మీద చతికిలబడి పోయేది. మక్కా వైపు ఒక్క అంగుళం కూడా ముందుకు సాగనని మొరాయించింది.

అంతలో ఎక్కడ్నుంచో అకస్మాత్తుగా ఏవో పక్షులు గుంపులు గుంపులుగా వచ్చి సైన్యం మీద కంకరాళ్ళు విసరిపడేయటం మొదలెట్టాయి. ఆ రాళ్ళు వచ్చి నేరుగా సైనికుల మీద పడగానే వారి శరీరాలు తీవ్రమైన దురదతో జివ్వుమనేవి. ఆ దురద భరించలేక సైనికులు అక్కడ గోకి గోకగానే చర్మం చిట్లిపోయి మాంసం ఊడి క్రిందపడి పోసాగింది. చూస్తుండగానే మైదానమంతా రక్తం, చీముతో నిండిపోయింది. సైనికులు భీతావహులై పారిపోవడానికి ప్రయత్నించారు. కాని అప్పటికే చాలామంది మృత్యువాత పడ్డారు. మిగిలినవారు కొద్ది దూరం పారిపోయి ఊపిరి విడిచారు. ఇలా అబ్రహాతో పాటు అతని సైనికులంతా కొన్ని క్షణాల్లోనే సర్వనాశనమై పోయారు.

ఈ సంఘటన క్రీ.శ. 571 లో మీనా, ముజ్దలఫాల మధ్య ముహస్సిర్ అనే చోట సంభవించింది. ఆ తర్వాత రెణ్ణెల్లలోనే మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) జన్మించారు. ఈ సంఘటనతో ఎంతో ప్రభావితులైన అరబ్బులు ముఖ్యంగా మక్కావాసులు కొన్నేళ్ళ వరకు విగ్రహాలు, ఇతర మిథ్యాదైవాలను వదలి, సృష్టికర్త, విశ్వపాలకుడైన నిజదేవుడ్ని మాత్రమే ఆరాధించారు. కాని తరువాత మళ్ళీ క్రమంగా వారిలో బహుదైవారాధనా వ్యాధి ప్రబలింది. కనుక అరబ్బులు ఆనాటి సంఘటన గుర్తుచేసుకొని మిథ్యాదైవాలను వదలి ఆ ఘోరవిపత్తు నుండి కాపాడిన నిజదేవుడ్ని ఆరాధించాలని ఈ అధ్యాయంలో వారిని ఉపదేశించడం జరిగింది.

**కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం**

నీ ప్రభువు ఏనుగుల వాళ్ళను ఏం చేశాడో నీకు తెలియదా? ఆయన వారి (దుష్ట) యత్నాలను వమ్ము చేయలేదా? వారి మీదికి ఆయన పక్షుల్ని గుంపులు గుంపులుగా పంపాడు. అవి వారి మీద కంకర్రాళ్ళు విసరి పడేశాయి. దాంతో వారు పశువులు తిని ఆగం చేసిన మేతలా (సర్వనాశనం) అయ్యారు. (1-5) ✪

# 106. ఖురైషీయులు (ఖురైష్)

**అవతరణ: మక్కా** **సూక్తులు: 4**

ఈ అధ్యాయాన్ని "ఖురైష్" (ఖురైషీయులు) అంటారు. ఇది కూడా నబవీశకం ప్రారంభ కాలంలోనే అవతరించినట్లు తెలుస్తోంది. 105 వ అధ్యాయం ఉపోద్ఘాతంలో పేర్కొన్నట్లు దేవుడు అరబ్బులకు వ్యాపారం ద్వారా ఆర్థికంగాగానే కాకుండా, అబ్రహా దాడినుండి రక్షించి కూడా ఎంతో సహాయం చేశాడు. కనుక వారు విగ్రహారాధన మానేసి కాబాగృహం అసలు యజమాని అయిన విశ్వప్రభువును మాత్రమే ఆరాధించాలని ఈ అధ్యాయంలో దేవుడు నొక్కి చెబుతున్నాడు.

**కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం**

ఖురైషీయులు అలవాటు పడ్డారట! చలికాలంలోనూ, ఎండాకాలంలోనూ ప్రయాణం చేయడానికి బాగా అలవాటు పడ్డారట!! అలాగయితే వారీ (కాబా) ఆలయం ప్రభువును ఆరాధించాలి.[1] వారికి ఆహారమిచ్చి ఆకలి తీర్చినవాడు, శాంతి ప్రసాదించి భయాన్ని పోగొట్టిన వాడు ఆయనే కదా మరి! (1-4) ✪

# 107.సాధారణ వినియోగవస్తువులు (మావూన్)

**అవతరణ: మదీనా** **సూక్తులు: 7**

ఈ అధ్యాయాన్ని "మావూన్" (సాధారణ వినియోగ వస్తువులు) అంటారు. ఒక ఉల్లేఖనం ప్రకారం ఇది మదీనా కాలంలో అవతరించినట్లు తెలుస్తోంది. ఇందులోని విషయాలను బట్టి కూడా ఇది హిజ్రీ శకం రెండవ సంవత్సరం మదీనా కాలంలోనే అవతరించినట్లు అన్పిస్తోంది.

---

1. దేవుడు మక్కాలో ఇబ్రాహీం (అలైహి), ఇస్మాయీల్ (అలైహి) ప్రవక్తల ద్వారా కాబా గృహాన్ని నెలకొల్పి దేశసంచరులుగా తిరుగుతుండిన అరబ్బులను ఒకచోట చేర్చారు. వారు విగ్రహారాధన చేస్తున్నప్పటికీ విశ్వసృష్టికర్త, కాబా ప్రభువు అల్లాహ్ మాత్రమేనని భావిస్తారు. ఆ భావనతోనే వారు కాబాపై దాడిచేయడానికి అబ్రహా రాజు వచ్చినప్పుడు అతని బారినుండి కాపాడమని కాబా ప్రభువును వేడుకున్నారు. ఆ ప్రభువే వారిని ఆ సమయంలో ఆదుకున్నాడు కూడా. అదీగాక ఆయన కాబాను యావత్తు అరేబియాకు ఆరాధనా కేంద్రంగా చేసి మక్కా నగరాన్ని అంతర్జాతీయ శాంతి నగరంగా, గొప్ప వాణిజ్యకేంద్రంగా చేశాడు. కనుక వారు విగ్రహపూజ, బహుదైవారాధనలను విడనాడి కాబా ప్రభువయిన అల్లాహ్‌నే ఆరాధించాలని ఈ అధ్యాయం సూచిస్తోంది.



**కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం**

పరలోక తీర్పును ధిక్కరించే వాడ్ని నీవు గమనించావా? అతనే అనాథలను కసరి కొట్టేవాడు.[1] పేదల అన్నదానం కోసం (ఇతరుల్ని) ప్రోత్సహించనివాడు. ప్రార్థన పట్ల అశ్రద్ధ, ఏమరుపాటులు వహించేవారికి వినాశం ఉంది. వారు ప్రతిపనీ లోకుల మెప్పు కోసం ప్రదర్శనాబుద్ధితో చేస్తుంటారు.[2] (మితిమీరిన పిసినారితనంతో) వాడుకునే సాధారణ వస్తువుల్ని సైతం ఇతరులకు ఇవ్వడానికి నిరాకరిస్తారు.[3] (1-7) ✪

---

1. ఈ విషయంలో కరుడుగట్టిన సత్యతిరస్కారి అయిన అబూజహల్‌కు సంబంధించిన ఉదంతం ఒకటి ఉంది. అతని సంరక్షణలో ఒక అనాథ బాలుడు ఉండేవాడు. ఆ బాలుడు ఒక రోజు వంటి మీద దుస్తులు కూడా లేని దుస్థితిలో అతని దగ్గరకు వచ్చి తన తండ్రి ఆస్తిలో కొంత తనకివ్వమని ప్రాధేయపడ్డాడు. కాని ఆ దుర్మార్గుడు పిల్లవాడి వైపు కన్నెత్తి కూడా చూడలేదు. పిల్లవాడు చాలాసేపు నిలబడి చివరికి నిరాశచెంది అక్కడ్నుంచి వెనుతిరిగాడు. అప్పుడు కొందరు అవిశ్వాసులు "నీవు ముహమ్మద్ (సల్లం) దగ్గరికి వెళ్ళి ఫిర్యాదు చెయ్యి. అతను సిఫారసుచేసి అబూజహల్ నుంచి నీ ధనం ఇప్పిస్తాడు" అని చెప్పారు ఆ బాలుడితో.

అబూజహల్‌తో దైవప్రవక్త (సల్లం)కున్న సంబంధం ఏమిటో, వారు ఏ ఉద్దేశ్యంతో ఈ సలహా ఇచ్చారో ఆ పిల్లవాడికి ఏమీ తెలియదు. అందువల్ల అతను నేరుగా దైవప్రవక్త (సల్లం) దగ్గరికెళ్ళి తన గోడు చెప్పుకొని, సహాయం చేయమని అర్థించాడు. దైవప్రవక్త (సల్లం) అప్పటి కప్పుడు లేచి అతడ్ని వెంటబెట్టుకొని అబూజహల్ ఇంటికి వెళ్ళారు. అతనితో ఈ బాలుడికి రావలసిన హక్కు ఇచ్చేయమని అన్నారు. అంతే, వెంటనే అబూజహల్ కిక్కురు మనకుండా లోపలికెళ్ళి ఆ బాలుడి పైకం తీసుకొచ్చి అతనికిచ్చి వేశాడు.

ఏదో ఘర్షణ జరుగుతుందనుకున్న అవిశ్వాసులు ఆశ్చర్యపోయారు. వారు అబూజహల్‌ని ఎత్తిపొడుస్తూ "చివరికి నీవు కూడా నీధర్మాన్ని వదిలిపెట్టావన్న మాట!"అన్నారు. దానికి అబూజహల్ ఇలా అన్నాడు: "దైవసాక్షి! నేను నాధర్మం వదలిపెట్టలేదు. కాని ముహమ్మద్‌ని చూడగానే ఆయన కుడిఎడమల వైపు రెండు భయంకరమైన ఆయుధాలు ఉన్నట్లు, నేనతని అభిమతానికి వ్యతిరేకంగా ఏమాత్రం ప్రవర్తించినా అవి నా దేహంలో దిగబడిపోతాయన్నట్లు అన్పించింది నాకప్పుడు."

2. ఇక్కడ కపటవిశ్వాసులకు సంబంధించిన రెండు దుర్లక్షణాలు ఎత్తి చూపడం జరిగింది. ఖుర్‌ఆన్‌లోనే మరో రెండుచోట్ల ఇలా ఉంది: "వారు నమాజు చేయడానికి నిల్చుంటే బద్ధకంచేస్తూ లోకుల మెప్పు కోసం నిలబడతారు. పైగా దేవుడ్ని చాలా తక్కువగా స్మరిస్తారు." (4:142) "వారు నమాజు చేయడానికి బయలుదేరితే వళ్ళు విరుచుకుంటూ బద్ధకంతో లేస్తారు. దైవమార్గంలో ధనం ఖర్చుపెట్టవలసివస్తే ఏడ్పుగొట్టు ముఖంతో అయిష్టంగా ఖర్చుపెడతారు." (9:54)

నమాజులో అశ్రద్ధ, ఏమరుపాటులంటే నిర్ణీత వేళ దాటిన తర్వాత చేయడం. అయితే నమాజు చేస్తున్నప్పుడు మనసులో ఏవేవో ఆలోచనలు వస్తాయి. మరి ఇది కూడా నమాజు పట్ల అశ్రద్ధే కదా అంటారు కొందరు. మానవబలహీనత కారణంగా ఇలాంటి ఆలోచనలు సహజం. కాని నిజమైన విశ్వాసి తన దృష్టి వేరే ఆలోచనల వైపు మళ్ళిందని గ్రహించగానే తిరిగి నమాజుపై దృష్టి సారించడానికి ప్రయత్నిస్తాడు. లోకుల మెప్పు కోసం నమాజు చేసేవారు నమాజుపై మనస్సు కేంద్రీ కరించరు. ఈ సూక్తుల్లో పేర్కొనబడ్డ అశ్రద్ధ, ఏమరుపాటులు ఇలాంటి వ్యక్తులకే వర్తిస్తాయి.

3. ఇరుగుపొరుగు వాళ్ళు తాత్కాలికంగా వాడుకోవడానికి అడిగే చిన్న చిన్న వస్తువులని అర్థం. ఉదాహరణకు, చెంబు, చాంతాడు, గొడ్డలి, కలం, పుస్తకం, స్టౌ, సైకిల్, కుర్చీలు వగైరా.

అవతరణ: మక్కా

## 108.శుభాలసరోవరం (కౌసర్)

సూక్తులు:3

ఈ అధ్యాయం పేరు "కౌసర్". దీని అవతరణకాలం నబవీ శకం 12వ ఏడు. దైవప్రవక్త (సల్లం) ధర్మప్రచారమార్గంలో పడుతున్న కష్టాలు చూసి, ఖురైష్‌నాయకులు ఆయన్ని హేళనచేస్తూ, ముహమ్మద్ (స) యావజ్జాతితో విరోధం కొనితెచ్చుకొని ఏకాకి అయ్యాడని విమర్శించేవారు. వారికి ఈ అధ్యాయంలో సమాధానం ఇవ్వబడింది.

**కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం**

(ముహమ్మద్!) మేము నీకు కౌసర్ (సరోవరం) ప్రసాదించాము.[1] కనుక నీవు నీ ప్రభువు (ప్రసన్నత) కోసమే ప్రార్థన చెయ్యి; ఆయన కోసమే త్యాగం చెయ్యి. నీ శత్రువే భవిష్యత్తులేని దౌర్భాగ్యుడు. (1-3) ✪

## 109. అవిశ్వాసులు (కాఫిరూన్)

అవతరణ: మక్కా సూక్తులు: 6

ఈ అధ్యాయాన్ని "కాఫిరూన్" అంటారు. ఇది నబవీశకం మధ్య కాలంలో అవతరించిఉండవచ్చని తెలుస్తోంది. దీని పూర్వపరాలు ఈ విధంగా ఉన్నాయి:

ఖురైష్ నాయకులు ఎంత చెప్పినా దైవప్రవక్త (సల్లం) తన ప్రచారం మానుకోలేదు. ఓరోజు వారు ఆయన్ని పిలిపించి ఇలా అన్నారు: "నీవు మా దేవతలను విమర్శించడం మానుకుంటే మేము నీకు మా అందరిలోకెల్లా గొప్ప ధనికుడయ్యే అంత ఎత్తున ధనం సేకరించి ఇస్తాము. నీవు కోరిన స్త్రీని తెచ్చి నీకు పెళ్ళి చేస్తాము. మేము (ప్రతి విషయంలో) నీ వెనకాలే నడుస్తాం. నీకీ మాట నచ్చకపోతే మేము మరొక విషయం ప్రతిపాదిస్తాం."

---

ఇలాంటి చిన్న వస్తువులు సైతం ఇవ్వడానికి నిరాకరించడమంటే అది పిసినారితనానికి పరాకాష్ఠ అన్నమాట. ఆ మాత్రం త్యాగభావం కూడ లేనివాడ్ని దేవుడు ఎన్నటికీ ప్రేమించడు.

1. ఎంతో స్వచ్ఛమైన, మధురమైన చల్లటి నీరుండే "కౌసర్" సరోవరాన్ని ప్రళయదినాన అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం)కు ప్రసాదించబడుతుంది. ఆరోజు పరిస్థితి చాలా భయానకంగా, బాధాకరంగా ఉంటుంది. దప్పికతో నాలుకలు పిడచగట్టుకు పోతుంటాయి. అలంటి స్థితిలో దైవప్రవక్త (సల్లం) తన సంప్రదాయాలను యధాతథంగా అనుసరించిన ముస్లింలకు ఈ సరోవరం నీటినే త్రాగిస్తారు. దాంతో వారి ఆకలిదప్పులు, ఆందోళనలన్నీ దూరమవుతాయి. అయితే ఆయన సంప్రదాయాలను మార్చిన ముస్లింలు ఈ భాగ్యానికి నోచుకోలేరు. అలాంటి ముస్లింలు నీటికోసం ఆ సరోవరం దగ్గరికి వచ్చినప్పుడు దైవదూతలు వారిని అక్కడ్నుంచి గెంటివేస్తారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) "వీరు నా అనుచరులు (ఎందుకు గెంటి వేస్తారు?)" అంటారు. దానికి వారు "మీరు ప్రపంచం వీడిన తరువాత వీరు ఏమేమి చేశారో మీకు తెలియదు" అంటారు.

ఈ సరోవరం ఔన్నత్యం గురించి హదీసుల్లో ఎన్నో విషయాలు ఉన్నాయి. దీని మట్టి కస్తూరి కన్నా ఎంతో సువాసన కలిగి ఉంటుంది. ఇందులోని నీరు పాలకన్నా తెల్లగా, తేనె కంటే తియ్యగా ఉంటుంది. ఇందులో కంకర్రాళ్ళకు బదులు వజ్ర వైఢూర్యాలు ఉంటాయి.



దానికి దైవప్రవక్త (సల్లం) ఏమిటా విషయం?" అని అడిగారు. "ఒక సంవత్సరం మీరు మా దేవతలు లాత్, ఉజ్జాలను ఆరాధించండి. మరొక సంవత్సరం మేము మీ దేవుడ్ని ఆరాధిస్తాం" అన్నారు. ఖురైషీయులు. దైవప్రవక్త (సల్లం) ఈమాట విని "సరే, కొంచెం ఆగండి నా ప్రభువు దగ్గర్నుండి ఏం ఆదేశం వస్తుందో" అన్నారు. అప్పుడు ఈ అధ్యాయం అవతరించింది. ఇందులో దైవప్రవక్త (స) తాను ఏ గుణగణాలు, లక్షణాలు గల దైవాన్ని ఆరాధిస్తున్నానో ఆ గుణగణాలు, లక్షణాలుగల దైవాన్ని మీరు ఆరాధించరు గనక, మీరు మూఢనమ్మకాలతో ఆరాధిస్తున్న మిథ్యాదైవాలను తాను ఆరాధించే ప్రసక్తి లేదని మక్కా బహుదైవారాధకులకు తెగేసి చెప్పారు.

**కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం**

వారికిలా చెప్పు: "అవిశ్వాసులారా! మీరు ఆరాధిస్తున్న వాటిని నేను ఆరాధించను. నేను ఆరాధిస్తున్న దైవాన్ని మీరు ఆరాధించరు. మీరు ఆరాధిస్తున్న వాటిని నేను ఆరాధించే మనిషిని కాను. నేను ఆరాధించే దైవాన్ని మీరు ఆరాధించే రకం కాదు. (కనుక) మీ ధర్మం మీకే, నా ధర్మం నాకే." (1-6) ✪

అవతరణ: మదీనా

## 110. సహాయం (నస్ర్)

సూక్తులు: 3

ఈ అధ్యాయాన్ని "నస్ర్" అంటారు. ఇది హిజ్రీశకం 10వ యేట వీడ్కోలు హజ్ యాత్ర)కు పూర్వం అవతరించి ఉండవచ్చని తెలుస్తోంది. ఇది పూర్తి అధ్యాయంగా ఒకేసారి అవతరించిన చివరి అధ్యాయం. ఇందులో దైవప్రవక్త (స) పరలోక ప్రస్థానం త్వరలో ప్రారంభం కాబోతున్నదని పరోక్షసూచన ఉందని కొందరి అభిప్రాయం.

**కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం**

(ప్రవక్తా!) దేవుని సహాయం వచ్చి, విజయం లభించిన తరువాత ప్రజలు తండోపతండలుగా దైవధర్మంలో చేరుతూ ఉండటం నీవు గమనిస్తూనే ఉన్నావు. కనుక నీ ప్రభువు ఔన్నత్యం స్తుతిస్తూ, ఆయన పవిత్రతను ప్రశంసిస్తూ ఉండు. దాంతోపాటు ఆయన సన్నిధిలో నీపొరపాట్లకు క్షమాపణకోరుకో. ఆయన గొప్పక్షమాశీలి. (1-3) ✪

అవతరణ: మక్కా

## 111. అగ్నిజ్వాల (లహబ్)

సూక్తులు: 5

ఈ అధ్యాయాన్ని "లహబ్" (అగ్ని జ్వాల) అంటారు. ఇది నబవీ శకం 10 లేక 11వ సంవత్సరం అవతరించి ఉండవచ్చని తెలుస్తోంది. ఇందులో పరమ కర్కోటకుడైన అబూలహబ్‌ని, అతని అడుగుజాడల్లో నడుస్తూ దైవప్రవక్త (సల్లం)ను రకరకాలుగా వేధించిన అతని భార్య ఉమ్మెజమీల్‌ని శపించడం జరిగింది. అబూలహబ్ దైవప్రవక్త (స)కు స్వయాన పెదనాన్న అవుతాడు. అతని అసలుపేరు అబ్దుల్‌ఉజ్జా. అయితే అతని ముఖం ఎరుపు, తెలుపు కలిసిన రంగుతో అగ్నిజ్వాలలా ప్రకాశవంతంగా ఉన్నందున అతనికి అబూలహబ్ (జ్వాలాముఖుడు) అని పేరొచ్చింది.

ఈ సూక్తులు అవతరించిన తరువాత ఉమ్మెజమీల్ కోపోద్రేకాలతో ఊగిపోతూ చేతిలో ఓ పెద్ద రాయి తీసుకొని కాబాకు వెళ్ళింది. కాబాలో ఒక మూలన దైవప్రవక్త

(స)తో పాటు కూర్చున్న హజ్రత్ అబూబకర్ (రజి) కంగారుపడుతూ "దైవప్రవక్తా! ఉమ్మె జమీల్ వస్తోంది ఆమె మీకేదైనా కీడు తలపెడ్తుందేమోనని నాకు భయంగా ఉంది" అన్నారు. దానికి దైవప్రవక్త (సల్లం) "కంగారుపడకు. ఆమె నన్ను చూడలేదు" అన్నారు. ఉమ్మెజమీల్‌కు దైవప్రవక్త (స) నిజంగానే కన్పించలేదు. అప్పుడామె అబూబకర్ (రజి)ని ఉద్దేశించి "మీ మనిషి నాకు వ్యతిరేకంగా ఏవో కారుకూతలు కూశాడని విన్నాను, నిజమేనా?" అనడిగింది. దానికి ఆయన "లేదే, ఆయన నీకు వ్యతిరేకంగా ఎలాంటి మాట అనలేదే!" అన్నారు. ఈమాట విని ఆమె అక్కడ్నుంచి వెళ్ళిపోయింది.

### కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

అబూలహబ్ చేతులు విరిగిపోవు గాక! అతడు సర్వనాశనమయి పోవుగాక! అతని సంతానం, సిరిసంపదలేవీ అతనికి ఏమాత్రం పనికిరాకుండా పోతాయి. అతను తప్పకుండా భగభగమండే (నరకా)అగ్నిలో విసరి వేయబడతాడు. (అతనితో పాటు) తగవులు పెట్టి తమాషా చూసే అతని భార్య కూడా (నరక కూపంలో పడిపోతుంది. మరణానంతరం) ఆమె మెడలో బాగాపేనిన గట్టి తాడొకటి (కంఠపాశంగా) ఉంటుంది. (1-5) ✪

## అవతరణ: మక్కా 112. ఏకేశ్వరత్వం (ఇఖ్లాస్) సూక్తులు: 4

ఈ అధ్యాయాన్ని "ఇఖ్లాస్" (ఏకేశ్వరత్వం లేక స్వచ్ఛత) అంటారు. ఇది నబవీశకం ప్రారంభకాలంలో అవతరించి ఉండవచ్చు. దేవుడు ఎలా ఉంటాడు, ఆయన గుణగణాలేమిటీ అని అడిగే వారికి దైవప్రవక్త (స) దేవుని ఆజ్ఞతో ఈ అధ్యాయాన్ని విన్పించేవారు.

### కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

వారికి చెప్పు: ఆయన అల్లాహ్, ఏకైక దేవుడు. ఆ దేవుడు ఎవరి అవసరమూ లేని నిరపేక్షాపరుడు. ఆయనకు ఎలాంటి సంతానం లేదు. ఆయన ఎవరికీ సంతానంగా లేడు. ఆయనకు సమానమైన వారెవరూ లేరు. ఆయన సాటిలేని మహామేటి.[1] (1-4)

---

1. దాదాపు అన్ని మతాలవారు దేవుడు ఒక్కడేనని అంగీకరిస్తారు. కాని చాలామంది ఆచరణలో ఆ ఏకేశ్వరుడ్ని ఆరాధించలేక పోతున్నారు. దానిక్కారణం ఆ ఏకేశ్వరుడి లక్షణాలు, గుణగణాలను నిర్వచించే సరైన ఆధారాలుగల సత్యపథం గురించి అన్వేషించకపోవడమే. గత ప్రవక్తల ద్వారా వచ్చిన మతగ్రంథాలు అనేక మార్పులకు, గురికావడం వల్లకూడా వారు ఏకేశ్వరుడ్ని, ఆయన అసలు లక్షణాలను గుర్తించలేకపోతున్నారు. అయితే ఆ గ్రంథాలు ఎన్ని ప్రక్షిప్తాలకు, నిక్షిప్తాలకు లోనయినా ఇప్పటికీ అక్కడక్కడ కొన్ని సత్యాలు లేకపోలేదు. ఉదాహరణకు చూడండి:

ఏకేశ్వరత్వాన్ని గురించి వేదాల్లో "ఏకో బ్రహ్మ ద్వితీయన్నాస్తి" (దేవుడు ఒక్కడే, ఇద్దరు లేరు.) అని స్పష్టంగా చెప్పబడింది.

శ్వేతాశ్వతరోపనిషత్తులోని ఈ క్రింది వాక్యాలు గమనార్హమయినవి:

"నతస్య కార్యం కరణశ్చా - న తత్సమశ్చాప్యధి కశ్చదృశ్యతే"

(ఆ పరమేశ్వరునికి శరీరము గాని, చక్షురాదీంద్రియములుగాని లేవు. ఆయనతో సమానుడు గాని, అధికుడుగాని ఎవ్వడూ కనబడడు.)



## అవతరణ: మదీనా 113.అరుణోదయం (ఫలఖ్) సూక్తులు: 5

ఈ అధ్యాయాన్ని "ఫలఖ్" అని, ఆ తర్వాత అధ్యాయాన్ని "నాస్" అని అంటారు. ఇవి రెండూ హిజ్రీశకం 7వ యేట ఒకేసారి అవతరించి ఉండవచ్చని తెలుస్తోంది. అందువల్ల ఈ రెండు అధ్యాయాల పూర్వపరాలను గురించి తెలుసుకుందాం.

దైవప్రవక్త (సల్లం)ను చంపడానికి యూదులు పన్నిన కుట్రల్లో ఆయనకు చేతబడి చేయించి ఇస్లాంను దెబ్బ తీయాలన్నది కూడా ఉంది. దానికోసం వారు లబీద్ బిన్ ఆసిమ్ అనే మాంత్రికుడ్ని పురిగొల్పారు. అతను దైవప్రవక్త (సల్లం) దగ్గర సేవకునిగా పనిచేస్తున్న యూద బాలుడ్ని వలలో వేసుకొని, దైవప్రవక్త (సల్లం) తలదువ్వుకునే దువ్వెన సంపాదించాడు. అందులో దైవప్రవక్త (స) శిరోజాలున్నాయి. అతనా దువ్వెనపై, శిరోజాలపై మంత్రించి, వాటిని ఓ ఖర్జూరపు గుచ్ఛంలో ఉంచాడు. దాన్ని తీసికెళ్ళి ఒక బావిలో నీటి అడుగున రాతి క్రింద పెట్టాడు.

ఈ చేతబడి ప్రభావం దైవప్రవక్త (సల్లం)పై పడటానికి సంవత్సరానికి పైగా పట్టింది. ఆ ప్రభావమైనా చాలా తక్కువ. మొదటి ఆర్నెల్ల తరువాత ఆయనకు తన ఆరోగ్యంలో ఏదో కొంచెం మార్పు వచ్చినట్లు అన్పించింది. చివరి నెలల్లో ఈ మార్పు క్రమంగా తీవ్రమయి పోయినట్లు అన్పించింది. దాని ప్రభావం వల్ల ఆయన లోలోన క్రుంగిపోసాగారు. చివరి మూడు నాలుగు రోజులపాటు అనుచరులు జ్ఞాపకం చేసేవరకు చేసిన పనిని చేయలేదని భావించి మళ్ళీ చేయ బోవడం, చేయని పని చేశానని భావించడం జరిగేది.

---

"న కారణం కరణాధిపాధిపో - న చాస్య కశ్చిజ్జనితా నచాధిపః"

(అతడే సర్వకారణభూతుడు. అతడే ఇంద్రియాధిష్ఠాన దేవతలకు, సూర్యాది దేవతలకు ప్రభువు. అతనికి జనకుడుగాని, అతనికంటే అధికుడుగాని మరెవ్వడూ లేడు.)

"ఎవడు నన్ను పుట్టుక లేనివానిగను, అనాదిరూపునిగను, సమస్త లోకములకు నియామకునిగను తెలిసికొనుచున్నాడో అతడు మనుష్యులలో అజ్ఞానము లేనివాడై సకల పాపముల నుండి లెస్సగ విడువబడుచున్నాడు." (గీత 10:3)

"నాశరహితమైనట్టియు, సర్వోత్తమమైనట్టియు, పకృతికి పరమై విలసిల్లునట్టియు నా స్వరూపము తెలియని అవివేకులు అవ్యక్త రూపుడనగు నన్ను పాంచభౌతిక దేహము పొందిన వానినిగా తలంచుచున్నారు." (గీత 7:24)

ఖుర్‌ఆన్‌లోని ఇతర అధ్యాయాల్లో పేర్కొన్న ఈ సూక్తులు కూడా చూడండి:

"వాస్తవానికి దేవుడు ఒక్కడే. ఆయనకు కుమారుడున్నాడని అనడం తగదు. అలాంటి బలహీనతలకు ఆయన అతీతుడు, ఎంతో పరిశుద్ధుడు. భూమ్యాకాశాల్లో ఉన్న సమస్తం ఆయనదే. అన్నిటికీ ఆయనే యజమాని." (4:171

"దేవుడు ఎవర్నీ సంతానంగా చేసుకోలేదు. ఆయనతోపాటు మరే దేవుడూ లేడు. ఇతర దేవుళ్ళు కూడా ఉన్నట్లయితే ప్రతి దేవుడూ తన సృష్టిని తీసుకొని వేరయిపోతాడు." (23:91)

"ఆయన యావత్తు భూమ్యాకాశాలను సృష్టించిన అద్భుత శక్తిసంపన్నుడు. ఆయనకసలు భార్యే లేనప్పుడు కొడుకులు ఎలా కలుగుతారు?" (6:101)

సాధారణంగా ఇలాంటి మతిమరుపు చాలామంది వ్యక్తుల్లో ఉండటం మనం చూస్తూనే ఉన్నాం. అంతమాత్రాన వారి దైనందిన కార్యకలాపాలకు ఎలాంటి భంగం రాదు. ఇక దైవప్రవక్త (సల్లం) విషయానికి వస్తే, ఆయన దైవదౌత్య కార్యకలాపాలపై ఈ చేతబడి ఏమాత్రం ప్రభావం చూపలేక పోయింది. అంతేకాదు, దైవప్రవక్త (సల్లం)పై చేతబడి ప్రభావం పడినట్లు, అనుక్షణం ఆయన్ని అంటిపెట్టుకొని ఉండే శిష్యులు సైతం గ్రహించలేకపోయారు.

చివరికి ఓరోజు ఆయన చేతబడి గురించి దేవుడ్ని ప్రార్థిస్తూ అదే స్థితిలో నిద్ర పోయారు. కలలో ఇద్దరు దైవదూతలు దీన్ని గురించే మాట్లాడుకుంటూ ఉండగా చూశారు. దాని ప్రకారం ఆయన మరునాడు ఉదయం కొందరు అనుచరుల్ని వెంట బెట్టుకొని ఆబావి దగ్గరకు వెళ్ళారు. అందులోని నీరంతా తోడించి దాని అడుగున రాతి క్రింద ఉన్న ఖర్జూరపు గుచ్చం బయటికి తీయించారు. అందులో దువ్వెన, వెంట్రుకలతో పాటు పదుకొండు ముడులు వేయబడిన ఒక నరం, కొవ్వుతో చేయబడిన సూదులు గుచ్చబడిన ఒక దిష్టిబొమ్మ కూడా ఉన్నాయి.

అప్పుడు దైవసందేశం తెచ్చే జిబ్రీల్ దూత (అలైహి) వచ్చి ఈ రెండు అధ్యాయాలు పఠించమని చెప్పారు. దాని ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఒక్కొక్క సూక్తి పఠిస్తూ ఒక్కొక్క ముడి విప్పుతూ, బొమ్మకు గుచ్చిన ఒక్కొక్క సూదిని తీసివేస్తూ పోయారు. ఇలా ముడులన్నీ విప్పి, సూదులన్నీ తీసివేశారు. దాంతో ఆయన చేతబడి ప్రభావం నుండి బయటపడ్డారు. ఆ తరువాత ఆయన మాంత్రికుడు లబీద్‌ని పిలిపించి నిలదీశారు. అతను చేసిన తప్పు ఒప్పుకున్నాడు. అయితే దైవప్రవక్త (సల్లం) అతనిపై ఎలాంటి చర్య తీసుకోకుండా క్షమించి వదలిపెట్టారు.

చేతబడి అనేది మానసిక ప్రభావం. ఇది శరీరాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. అయితే దైవాజ్ఞ లేనిదే చేతబడి కూడా ప్రభావం చూపదు. ఈ సంఘటన ద్వారా దేవుడు మానవులకు రెండు విషయాలు బోధించదలచినట్లు తెలుస్తోంది. ఒకటి, దైవప్రవక్త కూడా మానవుడే అన్నది. ఆయనక్కూడా ఇతరులకు మాదిరిగానే వ్యాధులు వస్తాయి. చేతబడి చేస్తే ఆయనపై కూడా దాని ప్రభావం పడవచ్చు. అందువల్ల దైవప్రవక్తను దైవప్రవక్తగానే విశ్వసించాలిగాని, ఆయన్ని కష్టాలు తీర్చేవానిగా, మొరలాలకించి వరాలు ఇచ్చేవానిగా తలచి దేవుని స్థాయికి చేర్చకూడదు.

రెండు, దైవప్రవక్త (సల్లం) ఇతర మానవుల్లాంటి సాధారణ మానవుడు కాదు. ఆయనపై దైవసందేశం అవతరిస్తుంది. దైవదూత జిబ్రీల్ (అలైహి) ఆయన దగ్గరకు వస్తుంటారు. కనుక దేవునిపై విశ్వాసం ఉన్నవారు మహనీయ ముహమ్మద్ (సల్లం)ని అంతిమ దైవప్రవక్తగా విశ్వసించి, ఆయన బోధనలు పాటించవలసి ఉంటుంది. ఆయన ద్వారానే ప్రళయంవరకు మానవాళికి రుజుమార్గం ప్రాప్తమవుతూ ఉంటుంది.

హదీసు గ్రంథాల్లోని కొన్ని ఉల్లేఖనాల ప్రకారం దైవప్రవక్త (సల్లం) ప్రతిరోజూ రాత్రి పడుకోబోయే ముందు, ప్రత్యేకంగా వ్యాధిగ్రస్త స్థితిలో ఖుర్ఆన్‌లోని 112, 113, 114 అధ్యాయాలు (సూరాలు) మూడు సార్లు పఠించి చేతులపై ఊది, ఆ చేతులతో తల నుండి కాళ్ళవరకు అందిన మట్టుకు మొత్తం శరీరాన్ని స్పృశించేవారని తెలుస్తోంది.



ప్రారంభంలో దైవప్రవక్త (సల్లం) బాధని వారణకు మంత్రించి ఊదడానికి అనుమతించే వారుకాదు. తరువాత బహుదైవారాధనా భావన (షిర్క్) లేకుండా అల్లాహ్ పేర్లతో, లేక ఖుర్ఆన్ సూక్తులతో మంత్రించవచ్చని అన్నారు. అయితే మనిషి దేవుడ్ని మాత్రమే నమ్ముకోవాలని, తమంతట తాము స్వస్థత చేకూర్చలేని మంత్రాల మీద ఆధారపడ కూడదని చెప్పారు.

ఆయన ఇలా ప్రవచించారు: "నా ఉమ్మత్ (అనుచర సమాజం)లో (కాల్చిన) వాతల చికిత్స చేయించుకోకుండా, మంత్రం వేయించుకోకుండా, జాతకం చెప్పించు కోకుండా, తమ ప్రభువును మాత్రమే నమ్ముకొని ఆయన మీద ఆధారపడేవారు పరలోక విచారణను ఎదుర్కో౦డానే నేరుగా స్వర్గంలో ప్రవేశిస్తారు." (ముస్లిం)

దైవప్రవక్త (స) ఇలాఅన్నారు: "వాతలచికిత్స చేయించుకున్నవారికి, మంత్రం వేయించుకున్నవారికి దేవుని మీద భరోసా వుంచే విషయంతో సంబంధం లేకుండా పోయినట్లే." (అంటే అతనికి దేవుని మీద నమ్మకం పోతుందన్నమాట.) (తిర్మిజి)

తేలుకాటు, పాముకాటు, దిష్టి, చేతబడి, మందులకు లొంగని లేదా మందులు లభించని వ్యాధుల వంటి బాధల నివారణ కోసం ఖుర్ఆన్ సూక్తులతో మంత్రించి ఊదడాన్ని అనుమతించినట్లు హదీసుల్లో ఆధారాలున్నాయి. అయితే బాధల నుండి విముక్తి కోసం దేవుడ్ని వేడుకోకుండా సంఖ్యాపరమైన సూచనలతో కూడిన తాయెత్తులు కట్టించుకొని మెడలో వేసుకోవచ్చని, వాటిని బ్రతుకుతెరువు కోసం వాడుకోవచ్చని ప్రవక్త ప్రవచనాల్లో మనకు ఎక్కడా ఆధారాలు కన్పించవు. ఏఆపద వచ్చినా, ఏబాధ కలిగినా సరే, విశ్వాసులు దేవుడ్నే నమ్ముకొని, ఆయన రక్షణ మీదే ఆధార పడాలని ఇస్లాం బోధిస్తోంది. అంతేకాకుండా, వృద్ధాప్యానికి తప్ప ప్రతి వ్యాధికీ మందున్నదని, దాన్ని ఉపయోగించుకొని దేవుని మీద భరోసా ఉంచాలని కూడా ఇస్లాం చెబుతోంది.

**కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం**

చెప్పు: "నేను అరుణోదయానికి ప్రభువయిన దేవుని శరణుగోరుతున్నాను. ఆయన సృష్టించిన ప్రతిదాని కీడునుండి, ముసురుకొచ్చే రాత్రిచీకటి కీడునుండి, (మంత్ర) ముడులపై ఊదేవారి కీడునుండి, అసూయపడుతున్న అసూయాపరుడి కీడునుండి నేను ఆయన శరణు గోరుతున్నాను." (1-5) ✪

## అవతరణ: మదీనా 114. మానవాళి (నాస్) సూక్తులు: 6

**కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం**

చెప్పు: "మాటిమాటికి వచ్చి భ్రమలు కలిగించి కలతలు రేపేవాడి కీడు నుండి నేను మానవుల ప్రభువు, చక్రవర్తి, ఆరాధ్యదైవం (అయిన దేవుని) శరణు గోరు తున్నాను. ప్రజల హృదయాలలో భ్రమలు కలిగించి కలతలు రేపేవాడు మానవుల్లోనూ ఉండవచ్చు; జిన్నుల (భూతాల)లోనూ ఉండవచ్చు. (1-6) ✪

**(దైవానుగ్రహం వల్ల సమాప్తం)**

# కృతజ్ఞతాంజలి

అపార కృపాశీలుడు, అణువణువుపై అధికారంకల అల్లాహ్ మాత్రమే సకల విధాల ప్రశంసలకు అర్హుడు. కష్టసుఖాలు, లాభనష్టాలు, జీవన్మరణాలు అన్నీ ఆయన చేతిలోనే ఉన్నాయి. ఆయన ఆజ్ఞ లేనిదే చెట్టు నుండి ఆకయినా రాలదు. ఆయన అద్వితీయుడయిన ఆరాధ్యుడు, అసాధారణ శక్తిసంపన్నుడు.

దేవా! నీ పవిత్ర గ్రంథం అనువదించే మహాభాగ్యం ప్రసాదించినందుకు నేను సర్వదా నీకు కృతజ్ఞుడ్ని. నీ కారుణ్యానుగ్రహాల వల్లనే నేనీ మహాకార్యాన్ని నాకు చేతనయినంత వరకు పూర్తిచేశాను.

ప్రభూ! నేనీ పనికి యోగ్యుడ్ని కాకపోయినా సమాజంలో నెలకొనివున్న పరిస్థితులు, నాకు నీవు ప్రసాదించిన పరిమిత జ్ఞానం, నా మదిలో రేగుతున్న తుఫాను లాంటి బాధ్యతాభావం నన్నీ పనికి ప్రేరేపించాయి.

ప్రభూ! ఈ పని సందర్భంగా నా వల్ల ఎన్నో తప్పులు జరిగి ఉంటాయి. నా మనో దౌర్బల్యం, నా దుష్టమనస్సు నాచేత ఇంకెన్నెన్ని తప్పులు చేయించాయో నాకు తెలియదు. ప్రభూ! నాయీ తప్పులన్నీ దయతో క్షమించు, నన్ను కనికరించు.

దేవా! తెలుగు ప్రజల భాషలో అనువదించబడిన ఈ దివ్యవాణిని ప్రచురించే, నీ దాసులకు చేరవేసే పని కూడా నీ దయదాక్షిణ్యాల పైనే ఆధారపడి ఉంది. నా శక్తి మేరకు కృషి చేయడమే నా బాధ్యత. ఆపై దాని పరిపూర్తి నీ ఇష్టాయిష్టాల పరిధిలో ఉంది.

ప్రభూ! నీ మనోభీష్టం పరిధిలోని విషయాలను నేను అర్థించలేను. నీ కారుణ్య కటాక్షాలనే నేను అర్థించగలను. నా అసలు లక్ష్యం నీ ప్రసన్నతా మహాభాగ్యం, పరలోక సాఫల్యాలు మాత్రమే. వీటికి సాధనంగా మారుతుందన్న ఆశతోనే నేనీ పవిత్ర కార్యం నిర్వహించాను.

ప్రభూ! నా అసలు లక్ష్యం కోసం నీవు నాచేత ఏ పని చేయించినా అది నాకు శిరోధార్యమే. సమస్త స్తుతిస్తోత్రాలకు నీవే అర్హుడవు.

**అబుల్ ఇర్ఫాన్**
(ఖుర్ఆన్ అనువాదకుడు)



# విరామచిహ్నాలు (రమూజ్)

**ఖుర్ఆన్** చదువుతున్నప్పుడు సరైన భావం స్ఫురింపజేయడానికి కొన్ని విరామ చిహ్నాలు ఉన్నాయి. ఆ చిహ్నాలు ఇక్కడ పేర్కొనబడుతున్నాయి:

O ఈ చిహ్నం ఉన్న చోట విషయం ముగిసి భావం కూడా పూర్తవుతుంది గనక, ఇక్కడ ఆగాలి.

م ఈ చిహ్నం ఉన్న చోట తప్పనిసరిగా ఆగాలి. ఆగకుండా చదివితే అర్థం మారిపోవచ్చు. ఒక్కోసారి తప్పుడు అర్థం కూడా వచ్చే ప్రమాదం ఉంది. ఉదాహరణకు: "చెయ్యిరా, వద్దు వెళ్ళు"--- "చెయ్యి, రావద్దు వెళ్ళు". ఈ రెండు వాక్యాల్లో కామా మార్పు వల్ల అర్థాలు కూడా భిన్నంగా ఉన్నాయి.

ط ఈ చిహ్నం ఉన్న చోట ఒక మాట పూర్తయినప్పటికీ చెప్పవలసిన విషయం ఇంకా ఉంది గనక ఇక్కడ కొంచెం ఆగాలి.

ج ఈ చిహ్నం ఉన్న చోట కొంచెం ఆగితే మంచిది. ఆగకపోయినా పరవాలేదు, అర్థం మారదు.

ز ఈ చిహ్నం ఉన్న చోట ఆగకుండా చదివితే మంచిది.

ص ఈ చిహ్నం ఉన్న చోట ఆగకుండా కలిపి చదివితే మంచిది. ఒకవేళ పాఠకుడు అలసిపోయి కొంచెం ఆగినా తప్పు లేదు.

صلے ఈ చిహ్నం ఉన్న చోట ఆగవచ్చు, ఆగకపోవచ్చు. కాని ఆగకుండా కలిపి చదివితే మంచిది.

ق ఈ చిహ్నం ఉన్న చోట ఆగకుండా చదివితే మంచిది.

صل ఈ చిహ్నం ఉన్న చోట కూడా ఆగకుండా చదవాలి.

قف ఈ చిహ్నం ఉన్న చోట ఒక్కోసారి ఆగవచ్చు, ఆగకపోవచ్చు. అయితే కొంచెం ఆగితే మంచిది.

س ఈ చిహ్నం ఉన్న చోట కొంచెం ఆగాలి. అయితే ఊపిరి వదలకూడదు.

وقفه పై చిహ్నం ఉన్న చోట కంటే ఇక్కడ కొంచెం ఎక్కువ సేపు ఆగాలి. అయితే ఇక్కడ కూడా ఊపిరి వదలకూడదు.

لا ఈ చిహ్నం కొన్ని చోట్ల సూక్తి చివర్లో సున్నా పైన ఉంటుంది. కొన్ని చోట్ల సూక్తి మధ్య ఉంటుంది. సూక్తి మధ్యలో ఉంటే ఏమాత్రం కూడా ఆగకూడదు. సూక్తి చివర్లో సున్నా పైన ఉంటే కొందరు ధర్మవేత్తలు ఆగకూడదు అంటారు. మరి కొందరు ధర్మవేత్తలు ఆగవచ్చు అంటారు. అయితే ఆగినా, ఆగకపోయినా భావంలో మటుకు ఎలాంటి లోపం రాదు.

ك ముందున్న సూక్తి చివర్లో, లేక వాక్యం చివర్లో ఏ చిహ్నం ఉంటే ఇక్కడా అదే చిహ్నం ఉందని భావించాలి.

# 1. సంక్షిప్త సమాచారం (మొదటి భాగం)

1. ఖుర్‌ఆన్ అవతరణ ప్రారంభమైన తేది..... క్రీ.శ. 12-2-610, రమజాన్‌నెల శుక్రవారం.
2. దైవప్రవక్త అయినప్పుడు ముహమ్మద్ మహనీయుని (సల్లం) వయస్సు...... చాంద్రమానం ప్రకారం 40 సంవత్సరాల 6 నెలల 15 రోజులు. సూర్యమానం ప్రకారం 39 సంవత్సరాల 3 నెలల 15 రోజులు.
3. ఖుర్‌ఆన్ మొత్తం అవతరించిన కాలం..... 22 సంవత్సరాల, 5 నెలల, 14 రోజులు.
4. ఖుర్‌ఆన్‌లోని మొత్తం అధ్యాయాలు (సూరాలు)..... 114.
5. ఖుర్‌ఆన్‌లోని మొత్తం సూక్తులు (ఆయత్‌లు)..... 6,236.
6. ఖుర్‌ఆన్‌లోని మొత్తం పదాలు..... 86,430.
7. ఖుర్‌ఆన్‌లోని మొత్తం అక్షరాలు..... 3,23,760.
8. ఖుర్‌ఆన్‌లో మొత్తం పఠన సజ్దాలు..... 14.
9. దైవప్రవక్త (సల్లం) దివ్యావిష్కృతి (వహీ)ని ఎప్పటికప్పుడు వ్రాసి భద్రపరచిన అనుచరు (సహాబీ)ల సంఖ్య..... 40.
10. మొట్టమొదటి దివ్యావిష్కృతి (వహీ)లోని సూక్తులు...అలఖ్ (గడ్డకట్టిన రక్తం) అధ్యాయం (సూరా)లోని మొదటి అయిదు సూక్తులు.......95:1-5.
11. చిట్టచివరి దివ్యావిష్కృతి (వహీ)లోని అధ్యాయం, సూక్తులు..... ఒక ఉల్లేఖనం ప్రకారం 2వ అధ్యాయం గోవు (బఖరా)లోని 281 వ సూక్తి. మరొక ఉల్లేఖనం ప్రకారం 5వ అధ్యాయం (మాయిదా)లోని 3 వ సూక్తి.
12. మొట్టమొదట ఏకకాలంలో అవతరించిన పూర్తి అధ్యాయం.... 1. ఫాతిహా (ప్రారంభం).
13. చిట్టచివర ఏకకాలంలో అవతరించిన పూర్తి అధ్యాయం.... 110. నస్ర్ (సహాయం).
14. దైవప్రవక్త (సల్లం) మక్కాలో గడిపిన పన్నెండున్నర ఏండ్ల కాలంలో అవతరించిన మొత్తం అధ్యాయాలు (సూరాలు).... 90 (పరిమాణం రీత్యా ఇవి మొత్తం ఖుర్‌ఆన్‌లో 2/3 భాగం).
15. దైవప్రవక్త (సల్లం) మదీనాలో గడిపిన పదేళ్ళ కాలంలో అవతరించిన మొత్తం అధ్యాయాలు (సూరాలు)..... 24 (పరిమాణం రీత్యా ఇవి మొత్తం ఖుర్‌ఆన్‌లో 1/3 భాగం).
16. ఖుర్‌ఆన్ పరిరక్షణ గురించి దేవుడు ఇచ్చిన హామీ ఉన్న అధ్యాయం, సూక్తి.... 15వ అధ్యాయం (సూరా)లో 9 వ సూక్తి.
17. దైవప్రవక్త (స)కు ఖుర్‌ఆన్ సందేశం అందజేసిన దైవదూత... జిబ్రీల్ (అలైహి)



18. విశ్వసామ్రాజ్య సింహాసనాధీశుని (దేవుని) కొలువులో గొప్ప హోదా, అంతస్తులు కలిగివున్న ప్రముఖుడు... ప్రవక్తలకు సందేశం చేరవేసే దైవదూత జిబ్రీల్ (అలై).
19. మొత్తం ఖుర్‌ఆన్‌ని మొదటి సారిగా వ్రాత రూపేణ ఒకచోట సమీకరించినవారు... మొదటి ఖలీఫా హజ్రత్ అబూబకర్ (రజి).
20. ఖురైష్‌తెగ ఉచ్చారణతో ఖుర్‌ఆన్‌ని తయారుచేసి, దాని నకళ్ళను ఇస్లామీయ రాజ్యంలోని ముఖ్యపట్టణాలకు పంపినవారు..... ఖలీఫా హజ్రత్ ఉస్మాన్ (రజి).
20. మూడవ ఖలీఫా కాలంనాటి వ్రాతప్రతుల్లో ఇప్పటికీ సురక్షితంగా ఉన్న రెండు ప్రతులు..... ఒకటి, తాష్కంట్ (సోవియట్ రష్యా)లో; రెండు, ఇస్తాంబుల్ (టర్కీ)లో ఉన్నవి.
21. ఖుర్‌ఆన్ పఠనం ప్రారంభించే ముందు షైతాన్ బారి నుండి దేవుడ్ని శరణు వేడమని ఉన్న సూక్తి..... 16:98.
22. "అల్లాహ్" అనే పేరు ఖుర్‌ఆన్‌లో మొత్తం ఇన్ని సార్లు వచ్చింది..... 2,697.
23. మహాప్రవక్త (సల్లం) పేర్లలో "ముహమ్మద్" అనే పేరు ఖుర్‌ఆన్‌లో ఇన్ని సార్లు వచ్చింది..... 4 సార్లు (3:144, 33:40, 47:2, 48:29).
24. మహాప్రవక్త (సల్లం) పేర్లలో "అహ్మద్"అనే పేరు ఖుర్‌ఆన్‌లో **1** సారిమాత్రమే వచ్చింది. (61:6).
25. మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం)ని ఖుర్‌ఆన్‌లో "విశ్వకారుణ్యమూర్తి" (అంటే యావత్తు ప్రపంచవాసులపాలిట దైవకారుణ్యం) అని వర్ణించిన సూక్తి... (21:107)
26. మహాప్రవక్త (సల్లం) ఎదురుగా పూర్ణచంద్రుడు తృటిలో రెండు ఖండాలుగా చీలిపోయాడని తెలిపిన సూక్తి..... (54:1).
27. ప్రవక్త గగనపర్యటన (మేరాజ్) ప్రస్తావన వున్న అధ్యాయాలు....(17:1, 53:13,14).
28. మహాప్రవక్త ముహమ్మద్ (స) అనుచరుల (సహాబీల) గుణగణాలను గురించి ప్రస్తావించిన గత దైవగ్రంథాలు..... తౌరాత్, ఇన్జీల్ (48:29).
29. ఖుర్‌ఆన్‌లో పేరెత్తి ప్రస్తావించబడిన సహాబీ..... జైద్ బిన్ హారిస్(రజి)--(33:37).
30. ముహమ్మద్ ప్రవక్త (సల్లం)ను వ్యతిరేకించిన అవిశ్వాసులలో ఒకతని పేరు ప్రస్తావించిన అధ్యాయం (సూరా)..... అబూలహబ్ (111:1-3).
31. ఖుర్‌ఆన్‌లో ప్రస్తావించబడిన దైవప్రవక్తల పేర్లు మొత్తం..... 26.
32. ప్రవక్తల పేర్లతో అవతరించిన మొత్తం అధ్యాయాలు (సూరాలు)..... (యూనుస్-10, హూద్- 11, యూసుఫ్-12, ఇబ్రాహీం-14, ముహమ్మద్-47, నూహ్-71).
33. ఖుర్‌ఆన్‌లో గత దైవగ్రంథాలు..... తౌరాత్ (మూసా ప్రవక్త), జబ్బూర్ (దావూద్ ప్రవక్త), ఇన్జీల్ (ఈసా ప్రవక్త).

34. మక్కీ, మదనీ సూరాలంటే....మక్కీ సూరాలంటే హిజ్రత్‌కు పూర్వం అవతరించిన సూరాలని, మదనీ సూరాలంటే హిజ్రత్ తర్వాత అవతరించిన సూరాలని అర్థం.

35. ఖుర్ఆన్ పేర్కొన్న దైవప్రవక్తలలో అత్యధిక ప్రస్తావన వచ్చిన దైవప్రవక్త పేరు..... మూసా ప్రవక్త (అలైహి).

36. మత్స్యబాధితుడు (జన్నూన్) అంటే..... యూనుస్ ప్రవక్త (అలైహి)- 21:87,88).

37. నూహ్‌ప్రవక్త (అలై) దైవసందేశం ప్రచారం చేసిన కాలం.... 950 ఏండ్లు (29:14).

38. ఒక దైవప్రవక్త తండ్రి సత్యాన్ని నిరాకరించాడు, అతను..... హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) తండ్రి ఆజర్ (6:74).

39. ఒక దైవప్రవక్త కుమారుడు సత్యాన్ని నిరాకరించాడు, అతను..... హజ్రత్ నూహ్ (అలైహి) కుమారుడు (11:42,43).

40. సత్యాన్ని విశ్వసించిన పుణ్య స్త్రీలు..... ఈసాప్రవక్త (అలైహి) మాతృమూర్తి హజ్రత్ మర్యం (అలై); ఫిరౌన్ చక్రవర్తి భార్య హజ్రత్ ఆసియా (అలైహి) - (66:11,12).

41. సత్యాన్ని నిరాకరించి అవిశ్వాసుల్లో చేరిన స్త్రీలు..... లూత్‌ప్రవక్త (అలైహి) భార్య, నూహ్‌ప్రవక్త (అలైహి) భార్య - (66:10).

42. మూసాప్రవక్త (అలైహి) జాతికి చెందిన ధనమదాంధుడు... ఖారూన్ (28:76-81).

43. నీట మునిగి చనిపోయిన ఒక అవిశ్వాసి శవాన్ని దేవుడు ప్రజల గుణపాఠం కోసం నేటికీ భద్రపరిచాడు, అది.....ఫిరౌన్ శవం; ఈజిప్టు పురావస్తుశాలలో వుంది (10:90-92).

44. గత జాతులలో ఈజాతి ప్రజలందరూ సత్యాన్ని విశ్వసించారు..... యూనుస్ ప్రవక్త (అలై) జాతి (10:98).

45. ఖుర్ఆన్‌లో బీజాక్షరాలు వచ్చిన మొత్తం సూరాలు (అధ్యాయాలు)..... 30.

46. ఖుర్ఆన్‌లో ప్రస్తావించబడిన మసీదులు..... 1. మస్జిదుల్ హరాం (మక్కా), 2. మస్జిదుల్ అఖ్సా (జెరూసలేం), 3. మస్జిదుల్ జిరార్ (మదీనా), 4. మస్జిదుల్ ఖుబా(మదీనా), 5. మస్జిదుల్ నబవి (మదీనా).

47. ముస్లింల తొలి ఆరాధనా కేంద్రం (ఖిబ్లా)..... మస్జిదుల్ అఖ్సా (బైతిల్ ముఖ్దిస్ - జెరూసలేం).

48. దైవాజ్ఞలు ఎక్కువగా వున్న అధ్యాయం (సూరా)..... 2వ అధ్యాయం, బఖరా.

49. ఖుర్ఆన్‌లో రెండు సార్లు "బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం" ప్రస్తావన వచ్చిన అధ్యాయం (సూరా) ...27వ అధ్యాయం నమల్ (చీమలు).

50. ఖుర్ఆన్‌లో నమాజ్ ప్రస్తావన ఇన్ని సార్లు వచ్చింది..... 700.

51. ఖుర్ఆన్‌లో దానధర్మాల ప్రస్తావన ఇన్ని సార్లు వచ్చింది..... 150



52. ఖుర్ఆన్‌కు గుండెకాయ వంటిదని చెప్పబడిన (సూరా)..... 36-యాసీన్.

53. ఖుర్ఆన్, తౌరాత్‌లకు మరోపేరు..... ఫుర్ఖాన్ (25:1, 21:48).

54. గతగ్రంథాలను ఖుర్ఆన్ పేరుతో ప్రస్తావించిన (సూరాలు)..... 15:91, 13:31.

55. ప్రజలు క్షుద్రజీవులుగా భావించే వాటిలో ఖుర్ఆన్ ఈ ప్రాణులను ఉదాహరణ లుగా పేర్కొన్నది..... దోమ (2:26), చీమ (27:18), ఈగ (22:73), కుక్క (7:176), తేనెటీగ (16:68), సాలీడు (29:41).

56. సప్తమాకాశంలోని దివ్య వృక్షరాజం పేరు..... సిద్రతుల్ ముంతహా (53:14).

57. నరకంలో పాపాత్ములు తినే పరమ అసహ్యకరమైన నాగజెముడులాంటి చెట్టు పేరు..... జక్కూమ్ (37:62-66, 44:43-44, 56:51-53).

58. మానవుల పరీక్ష కోసం మానవ రూపాల్లో క్షుద్రవిద్య (చేతబడి) నేర్పడానికి పంపబడిన దైవదూతలు..... హారూత్, మారూత్ (2: 102)

59. "ధర్మస్వీకారంలో ఎలాంటి బలాత్కారంలేదు" అనే సూక్తి ఈ అధ్యాయంలో ఉంది..... బఖరా (గోవు - 2:256).

60. దుర్భర (నరక)యాతనల నుండి కాపాడగలిగే వ్యాపార విధానం ఈ అధ్యాయంలో ఉంది..... సఫ్ (సైనిక పంక్తి - 61: 10,11)

61. "ఏ మతస్థులైనా దేవుడ్ని, అంతిమదినాన్ని విశ్వసించి, సత్కార్యాలు చేస్తే చాలు" అనే సూక్తి ఈ అధ్యాయాల్లో ఉంది..... (బఖరా- 2:62, మాయిదా- 5:69).

62. పుస్తకాలు మోసే గాడిదతో పోల్చబడినవాడు..... దైవాజ్ఞలు తెలిసి కూడా వాటిని ఆచరించని యూదులు (62:5).

63. దైవాజ్ఞలను వదలి మనో వాంఛలకు బానిసయినవాడ్ని కుక్కతో పోల్చబడిన విషయం ఈ అధ్యాయంలో ఉంది..... ఆరాఫ్ (శిఖరాలు- 7:176).

64. పులిని చూసి పారిపోయే అడవి గాడిదల్లాంటివారు. సత్యవిముఖులు (74:49-51).

65. చెడ్డ పనులు, అశ్లీలచేష్టల జోలికి పోకుండా మనిషిని నిరోధించే సత్కార్యం..... నమాజ్ (29:45).

66. ఖుర్ఆన్ ప్రకారం శిశువు మాతృగర్భంలో రూపుదిద్దుకొని జన్మించడానికి పట్టే కనీసపు కాలం..... 6 నెలలు (46:15, 31:14).

67. మానవులు ఇహలోకంలోకి రాకముందే వారి ఆత్మల చేత ఈ విషయం గురించి ప్రమాణం చేయించబడింది.... "అల్లాహ్ మాత్రమే మానవుల ప్రభువు, పోషకుడు, స్వామి (7:172).

68. నూహ్‌ప్రవక్త (అలైహి) ఓడ దిగిన పర్వతం పేరు..... జూదీ పర్వతం (11:44).

69. ప్రళయ సూచనల్లో ఒకటి, మాట్లాడే జంతువు బయల్పడుతుంది.... (27:82).

70. ఏ విషయంలోనైనా దేవుడు నిర్దేశించిన చట్టాల ప్రకారం నిర్ణయం తీసుకోనివారిని ఖుర్‌ఆన్ ఇలా అభిశంసించింది.......... తిరస్కారులు (కాఫిర్), దుర్మార్గులు (జాలిమ్), దుర్జనులు (ఫాసిఖ్)-- (5:44,45,47).

71. మానవ జీవితపరమార్థం ఏమిటో ఒకే ఒక వాక్యంలో తెలిపిన సూక్తి..... (51:56).

72. కంప్యూటర్, ఇంటర్నెట్ మొదలైన ఎలక్ట్రానిక్ పరికరాలలో అపరిచితులు ప్రత్యర్థులబారి నుండి సమాచారాన్ని కాపాడుకోవడానికి "పాస్‌వర్డ్స్" ఉంటాయి. అలాగే ఇస్లాంలో కూడా ఒక పాస్‌వర్డ్ ఉంది. దానిపేరు..... సలాం (4:86).

73. యూసుఫ్ అధ్యాయం (సూరా) కాకుండా ఇతర అధ్యాయాలలో యూసుఫ్ ప్రవక్త (అలైహి) పేరు ఈ సూక్తుల్లో వచ్చింది..... (6:84, 40:34).

74. మానవసృష్టి ప్రారంభం నుండి ఇప్పటి వరకు ప్రభవించిన మొత్తం దైవప్రవక్తలు .......... 1,24,000 మంది.

75. బహుదైవారాధకులు ఆరాధించే దైవాలను దూషించవద్దని ఉన్న దైవాజ్ఞ ...(6:108)

76. "ఆ తరువాత అనర్హులు, అయోగ్యులు వారికి వారసులయి పోయాలు. వారు నమాజ్‌ని వదిలేసి మనోవాంఛలకు బానిసలై పోయారు. త్వరలోనే వారు తమ మార్గభ్రష్టత్వానికి తగినశిక్ష అనుభవిస్తారు" అనే సూక్తి ఎక్కడ ఉంది?...... (19:59)

77. "దేవుని దాసులలో జ్ఞానులు మాత్రమే (ఈప్రకృతి యదార్థాలు గమనించి) దేవునికి భయపడతారు" అనే సూక్తి ఉన్న సూరా.... (35:28)

## కాండాలవారిగా ఖుర్‌ఆన్

ధర్మవేత్తలు పఠన సౌలభ్యం కోసం మొత్తం ఖుర్‌ఆన్‌ని పరిమాణం రీత్యా 30 కాండాలు (పారాలు)గా చేశారు. దీని ప్రకారం 286 సూక్తులతో కూడిన 2వ అధ్యాయం (సూరా) అయిన "బఖరా" అన్నిటికంటే పెద్దది. ఇది దాదాపు రెండున్నర కాండాలలో విస్తరించి ఉంది. అన్నిటికంటే చిన్నది 108వ అధ్యాయం (సూరా) అయిన "కౌసర్." ఇందులో మూడు సూక్తులు మాత్రమే ఉన్నాయి. ఆ తరువాత 112వ అధ్యయం (సూరా) అయిన "ఇఖ్లాస్" వస్తుంది. ఇందులో నాలుగు సూక్తులు ఉన్నాయి.

(1) మొదటి అయిదు కాండాలు 4:147 వరకు ఉన్నాయి. (2) పది కాండాలు 8:40 వరకు ఉన్నాయి. (3) పదిహేను కాండాలు 18:82 వరకు ఉన్నాయి. (4) ఇరవై కాండాలు 29:44 వరకు ఉన్నాయి. (5) ఇరవై అయిదు కాండాలు 45:37 (సూరా ముగింపు) వరకు ఉన్నాయి.

ఖుర్‌ఆన్‌లోని మొత్తం 114 అధ్యాయాల (సూరాల)లో సగం (అంటే 57 అధ్యాయాలు 27 కాండాలలో విస్తరించి ఉన్నాయి. మిగతా సగం సూరాలు 3 కాండాలలో మాత్రమే ఉన్నాయి.



మొదలు పెడితే ముగించేదాకా వదలిపెట్టలేని ధారావాహిక నవలా స్రవంతి

**ముహమ్మద్(స) ఆదర్శ జీవితం**

**రచన: అబుల్ ఇర్ఫాన్, (పే. 504, వెల: రూ. 150/-లు)**

**కొడ్తే ఏడుస్తుంది! కొట్టకపోతే ఎగబడ్తుంది!!**

మరేం చేయాలి?

ఇస్లాం వెలుగులో ఈ సమస్యకు పరిష్కారం కావాలంటే......

**"ముస్లిం మహిళ"**

**చదివి తీరాల్సిందే.** ఈ పుస్తకంలో స్త్రీ స్వేచ్ఛ, వివాహం, దాంపత్య జీవితం, అత్తాకోడళ్ల గొడవలు, పరదా, విడాకులు, మహిళాహక్కుల రక్షణచట్టం, ఆర్థికహక్కులు, సంతానశిక్షణ, ముస్లిం పర్సనల్‌లా, స్త్రీల ఆంతరంగిక విషయాలు వగైరా ఎన్నో శీర్షికలు ఉన్నాయి.

**రచన: తాహిరా తన్వీర్, (పేజీలు: 240, వెల: రూ. 90/-లు)**

**ఆత్మకు చావు ఉందా లేదా?**

అదేమోగాని ఆత్మ మన దేహం వీడిపోగానే అనేక మజిలీలు దాటుకుంటూ తన శాశ్వత నివాసానికి చేరుకుంటుందని మాత్రం ఖుర్‌ఆన్ ద్వారా తెలుస్తోంది. ఇంతకూ ఈ మజిలీలు ఏమిటీ, దాని శాశ్వతనివాసం ఎక్కడుంది? ఇలాంటి ప్రశ్నలకు సమాధానమే....

**"పరలోక ప్రస్థానం"**

ఆత్మను, దాని శాశ్వతనివాసం గురించి వివరంగా తెలుసుకోవడానికి చదవాల్సిన పుస్తకం ఇది. **రచన: అబుల్ ఇర్ఫాన్, (పేజీలు: 224, వెల: రూ. 75/-లు)**

**డబ్బుంటే ఎవరికి చేదండీ?**

కాని ధర్మాధర్మాల విచక్షణ లేకుండా ధనార్జనే ధ్యేయంగా పెట్టుకొని అడ్డదారుల గుండా నాలుగు చేతులా సంపాదించేవారికి మరణానంతరం **ఈ ధనమే పరమచేదుగా మారుతుంది.** ఏమిటీ, మీకింకా నమ్మకం కుదరలేదా? అయితే చదవండి......

**"ధన వికేంద్రీకరణ"**

ఈ పుస్తకంలో ధనవ్యామోహం, పెట్టుబడిదారీ-సోషలిజం వ్యవస్థలు, గ్లోబలైజేషన్, ఆర్థిక న్యాయం, వడ్డీ, దళారీ వ్యవస్థ, వ్యాపారం, స్టాక్‌మార్కెట్, ఇస్లామిక్ మార్కెట్, జకాత్, ఆస్తిపంపిణీ, వీలునామా, వగైరా ఎన్నో శీర్షికలు ఉన్నాయి.

**రచన: అబుల్ ఇర్ఫాన్, (పే. 224, వెల: రూ. 75/-లు)**

IRC

**ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్, ఛత్తాబజార్, హైదరాబాద్ -2**

**ఫోన్ నెం. +91-040-55710795, +91-9441515414**

నమ్మేవాళ్ళం" (తఫ్హీముల్ ఖుర్ఆన్ రెండవభాగం నుండి సేకరణ)

**8. ఆయాత్:**- ఇది 'ఆయత్'కు బహువచనం. ఖుర్ఆన్‌లోని ప్రతి అధ్యాయం (సూరా)లో వుండే సూక్తులను ఆయాత్ అంటారు. ఖుర్ఆన్ సూక్తులేగాక విశ్వవ్యవస్థలో, ప్రకృతిలో, సృష్టి వైచిత్రిలో దేవుని అస్తిత్వాన్ని, ఆయన ఏకత్వాన్ని, శక్తి సామర్థ్యాలను మౌనంగా చాటిచెప్పే అనేక సూచనలు, మహిమలు, నిదర్శనాలను కూడా ఆయాత్ అంటారు. ఖుర్అన్‌లో కొన్ని చోట్ల ఆయాత్ అనే పదాన్ని సూక్తులు. దైవవచనాలు అనే భావంలో ప్రయోగించబడితే; మరికొన్ని చోట్ల సూచనలు, మహిమలు, నిదర్శనాలు అనే అర్థాల్లో ప్రయోగించబడింది. ఇంకా కొన్నిచోట్ల ఈ రెండు అర్థాలు స్ఫురించేలా ఈపదం ప్రయోగించబడింది. సందర్భానుసారం దీన్ని అర్థం చేసుకోవలసి వుంటుంది.

**9. ఇద్రీస్** (అలైహి):- కొందరు ధర్మవేత్తల అభిప్రాయం ప్రకారం ఈయన నూహ్ ప్రవక్త (అలైహి)కు పూర్వం ప్రభవించిన దైవప్రవక్త అని తెలుస్తోంది. బైబిల్ పాత నిబంధనం, ఆదికాండం 21-24 సూక్తులలో 'హనోక్' పేరుతో ప్రస్తావించబడిన వ్యక్తి ఇద్రీస్ ప్రవక్తేనని ముస్లిం పండితుల అభిప్రాయం. "హనోకు మూడువందల యేండ్లు దేవునితో నడిచెనని....తరువాత దేవుడతనిని తీసికొని పోయెను గనుక అతడు లేక పోయెన"ని బైబిల్ చెబుతోంది

యూదుల మతగ్రంథం "తల్మూద్"లో హనోక్ ప్రజలకు దూరంగా నిష్ఠాగరిష్ఠుడయి ఏకాంత జీవితం గడుపుతూ వుంటే, ఒక దైవప్రవక్త వచ్చి ఏకాంత కుహరం నుండి బయటికొచ్చి ప్రజలకు సన్మార్గం చూపమని ఉపదేశించాడని, దాంతో ఆయన ప్రజలను అనేక చోట్ల సమీకరించి సద్బోధ చేశాడని, ప్రజలు ఆయనకు విధేయులై పోయారని వుంది. ఆయన మానవ సంతతిని 353 సంవత్సరాలు పాలించాడని, ఎంతో న్యాయ వంతంగా పాలన చేశాడని, ఆయన పాలనలో దేవుడు ధరణిపై తన కారుణ్యాను గ్రహాలు కురిపించాడని కూడా తల్మూద్ వివరించింది. అయితే ఆయన చివరికి తీవ్ర మైన ఓ సుడిగాలి ద్వారా అగ్నిరథమెక్కి, గుర్రాలతో సహా ఆకాశంలోకి అధిరోహించాడని ఓ కట్టుకథ కూడా ప్రచారంలో ఉంది.

**10. ఇన్జీల్:**- ఇది ఈసాప్రవక్త (అలైహి)పై అవతరించిన దైవగ్రంథం. ఈ గ్రంథం రెండువేల సంవత్సరాల క్రితం ఆనాడు పాలస్తీనా ప్రజలు మాట్లాడుకునే 'సిరియక్' భాషలో అవతరించి వుండవచ్చని తెలుస్తోంది. హెబ్రూభాష దానికి రెండు మూడు వందల యేండ్లకు పూర్వమే అంతరించిపోయింది. ఈనాటి బైబిల్ ఈసా (అలైహి), ఆయన అనుచరుల నిష్క్రమణ తరువాత క్రీ.శ. 80-120 మధ్యకాలంలో వ్రాయబడింది. అప్పుడు ఈసాప్రవక్త బోధనలను సేకరించడానికి వెళ్ళిన క్రైస్తవ పండితులు, వాటిని సిరియక్ భాష మాట్లాడే క్రైస్తవ ప్రజల నోట విని గ్రీకుభాషలో వ్రాసుకున్నారు.

అయితే ఆనాడు గ్రీకుభాషలో వ్రాయబడిన బైబిల్ అసలు ప్రతి కూడా ఈనాడు లేకుండా పోయింది. దాని అనువాదాలు, ఆ అనువాదాల అనువాదాలు మాత్రమే ప్రస్తుతం వున్నాయి. అయితే అవి కూడా ఎన్నో మార్పులకు, చేర్పులకు గురయి పోయాయి. పైగా ప్రస్తుత బైబిల్‌లో ఈసా (అలైహి) నిష్క్రమణ తరువాత జరిగిన సంఘటనలు, ఆయన అనుచరులని చెప్పబడేవారి మాటలు కూడా చోటు చేసు



కున్నాయి. ఇన్జీల్ అనువాదం సైతం ఇంతగా మార్పులకు, చేర్పులకు గురికావడం వల్లనే దేవుడు తన వాణిని తిరిగి ఖుర్ఆన్ రూపంలో అవతరింపజేశాడు. ఇక ఇదే ప్రళయం వరకు యావత్తు మానవులకు సన్మార్గం చూపగలిగే ఏకైక దైవగ్రంథం.

**11. ఇబ్రాహీం సంతతి:**- యూదులు, క్రైస్తవులు, ముస్లింలకు మూలపురుషుడు ఇబ్రాహీం ప్రవక్తే (అలైహి). బైబిల్ ప్రకారం ఆయనకు 86 సంవత్సరాల వయస్సులో రెండవభార్య హాజిరా (రజి) ద్వారా ఇస్మాయీల్ ప్రవక్త (అలైహి), 100 సంవత్సరాల వయస్సులో మొదటిభార్య సారా (రజి) ద్వారా ఇస్హాఖ్ ప్రవక్త (అలైహి) పుట్టారు. ఇస్మాయీల్ ప్రవక్త (అలైహి) సంతతి నుండి అరబ్బు తెగలు ఆవిర్భవించాయి. ఈ తెగలప్రజలు అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) కాలంలో ఇస్లాం స్వీకరించి ముస్లిములయి పోయారు.

రెండవ కుమారుడు హజ్రత్ ఇస్హాఖ్ సంతతి నుండి యూదులు, క్రైస్తవులు జన్మించారు. ఇస్హాఖ్ (అలైహి) సంతతిలో యాఖూబ్ (అలైహి), యూసుఫ్ (అలైహి), మూసా (అలైహి), దావూద్ (అలైహి), సులైమాన్ (అలైహి), యహ్యా (అలైహి), ఈసా (అలైహి) వగైరా అనేకమంది ప్రవక్తలు ఉద్భవించారు. ఇబ్రాహీం ప్రవక్త(అలైహి), ఆయన సంతతికి చెందిన ఇతర ప్రవక్తలందరూ ఇస్లాం ధర్మం గురించే ప్రజలకు బోధించారు. అయితే అరబ్ బహుదైవారాధకులు తమ తాత ముత్తాతల దురాచారాలను వదలి అంతిమ దైవగ్రంథమైన ఖుర్ఆన్‌ని విశ్వసించి ఇస్లాం స్వీకరిస్తే, యూదులు, క్రైస్తవులు మాత్రం తమ ప్రవక్తలు బోధించిన దైవాజ్ఞలను తారుమారు చేసుకొని, ప్రక్షిప్తాలకు నిక్షిప్తాలకు గురైన గతగ్రంథాలనే పట్టుకు వ్రేలాడుతున్నారు.

**12. ఇమ్రాన్:**- ఈయన మూసా, హారూన్ ప్రవక్తల తండ్రి. ఈసాప్రవక్త తల్లి అయిన హజ్రత్ మర్యం (అలైహి) తండ్రి పేరు కూడా ఇమ్రానే. బహుశా మొదట ప్రస్తావించ బడిన ఇమ్రాన్ సంతతిలోనే ఈ రెండవ ఇమ్రాన్ కూడా పుట్టి వుండవచ్చని కొందరు ఖుర్ఆన్ వ్యాఖ్యానకర్తలు అభిప్రాయపడ్డారు. ఖుర్ఆన్ (3:35 సూక్తి)లో మర్యం (అలైహి)కు జన్మనిచ్చిన స్త్రీని "ఇమ్రాన్ స్త్రీ" అని పేర్కొనడం జరిగింది. ఇమ్రాన్ స్త్రీ అంటే ఇమ్రాన్ భార్య కావచ్చు లేదా ఇమ్రాన్ వంశపు స్త్రీ కూడా కావచ్చు.

**13. ఇల్యాస్:**- ఈయన యూదులకు సన్మార్గం చూపడానికి ప్రభవించిన దైవప్రవక్త. ఖుర్ఆన్‌లో రెండు చోట్ల (6:85,37:123) మాత్రమే ఈయన ప్రస్తావన వచ్చింది. కాని వివరాలు లేవు. చరిత్రకారుల పరిశోధన ప్రకారం ఈయన క్రీ.పూ. 875-850 మధ్య కాలంలో జీవించి ఉన్నట్లు తెలుస్తోంది. బైబిల్‌లో ఈయన పేరు ఏలియా అని వుంది.

బైబిల్ కథనం ప్రకారం సులైమాన్ ప్రవక్త (అలైహి) చనిపోయిన తరువాత ఆయన కొడుకు రహబామ్ అయోగ్యత వల్ల యూదుల సామ్రాజ్యం రెండు ముక్కలయింది. బైతుల్ మఖ్దిస్ (జెరూసలేం)తో పాటు దక్షిణ పాలస్తీనా భూభాగం ఒక రాజ్యంగా ఏర్పడితే, ఉత్తర పాలస్తీనా భూభాగం ఇస్రాయీల్ పేరుతో మరో రాజ్యంగా ఏర్పడింది. ఈ రెండు రాజ్యాలు నైతికంగా, ధార్మికంగా క్రమేణా దిగజారి పోయాయి. ముఖ్యంగా ఇస్రాయీల్‌రాజు బహుదైవారాధకురాలైన సైదా (లెబనాన్)రాజు కుమార్తెను వివాహ మాడిన తర్వాత అతని రాజ్యం మరింత దిగజారిపోయింది. విగ్రహారాధన అధికమయి

# 2. సంక్షిప్త సమాచారం (రెండవ భాగం)

1. **అగోచరాలు**:- మానవుని జ్ఞానేంద్రియాలకు, అతని వైజ్ఞానిక పరిశోధనలకు సైతం అంతుచిక్కని విషయాలు కూడా కొన్ని ఉన్నాయి. ఉదాహరణకు, ఈ విశ్వాన్ని సృష్టించి దాన్ని క్రమబద్ధంగా నడిపిస్తున్న దేవుడు, విశ్వనిర్వహణ కోసం ఆయన నియమించిన దైవదూతలు, మరణానంతర పరిస్థితులు, స్వర్గ నరకాలు మొదలైనవి. వీటినే అగోచరాలు లేక అతీంద్రియాలు (గైబ్) అంటారు. సృష్టికర్త ఉనికిని సూచించే, ఆయన ఏకేశ్వరత్వాన్ని చాటిచెప్పే నిదర్శనాలు ఈ విశ్వంలో ఎన్నో ఉన్నాయి. హృదయ చక్షువులు ఉన్నవారు వాటిని పరిశీలించి చూసి ఆ ఏకేశ్వరుని అస్తిత్వాన్ని, ఆయన శక్తి సామర్థ్యాలను గుర్తిస్తారు. మిగిలిన అతీంద్రియ విషయాలు ఆయన నియమించిన దైవ ప్రవక్తల ద్వారా మాత్రమే తెలుస్తాయి.

దైవప్రవక్తలు మానవుల మధ్యనే పవిత్ర జీవితం గడిపినవారై ఉంటారు. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) సచ్చరిత ఆయన సమకాలిన అరబ్ ప్రజల ముందు తెరచిన పుస్తకమే. ఆయన జీవిత చరిత్ర ప్రామాణిక వనరుల ద్వారా సంకలనమయి ఈనాటికీ సురక్షితంగా ఉంది. కనుక అగోచరాలకు సంబంధించి ఆ మహనీయుడు బోధించిన విషయాల్ని విశ్వసించగల్గే సుగుణం, సద్బుద్ధి మాత్రమే కావలసి వుంటుంది. అలాంటి సుగుణవంతులు, సహృదయులకు మాత్రమే సన్మార్గం ప్రాప్తమవుతుందని, అలాంటివారే మోక్షం పొందగలరని దేవుడు తన అంతిమగ్రంథం ఖుర్‌ఆన్ ప్రారంభం లోనే స్పష్టంగా తెలియజేశాడు. (2:1-5)

2. **అజీజ్ మిస్ర్**:- అత్యున్నతమైన హోదా, అధికారం కల్గిన వ్యక్తిని అజీజ్ అంటారు. అజీజ్ మిస్ర్ అంటే ఈజిప్టు రాజ్యంలో మంత్రిపదవో లేదా మరేదైనా గొప్ప పదవో గల వ్యక్తి అని అర్థం. పన్నెండవ అధ్యాయంలో అజీజ్ అనే పదం రెండుచోట్ల వచ్చింది. ఒకటి, దైవప్రవక్త యూసుఫ్ (అలైహి) అధికారంలోకి రాకమునుపు రాజు దగ్గర గొప్ప హోదా, అంతస్థులు కలిగిన వ్యక్తి కోసం ఉపయోగించబడింది. ఇతని అసలు పేరేమిటో ఖుర్‌ఆన్ ప్రస్తావించలేదు. బైబిల్‌లో ఇతని పేరు పాతీఫార్ అని ఉంది. రెండు, యూసుఫ్ (అలైహి) అధికారంలోకి వచ్చిన తరువాత స్వయంగా ఆయన కోసం కూడా ఈ పదం ప్రయోగించబడింది. (12:51,78)

3. **అగడ్త బాధితులు**:- మతదురహంకారులైన రాజులు ఇతర మతస్థులపై దుర్భర హింసాకాండ జరిపి వేలాదిమందిని చంపడం గురించి చరిత్రలో అనేక సంఘటనలు జరిగాయి. వాటిలో ముఖ్యమైన మూడు సంఘటనలను ఖుర్‌ఆన్ 85వ అధ్యాయం (ఆకాశబురుజులు)కు రాసిన పాదసూచకలో పేర్కొనబడ్డాయి చూడండి.

4. **అదృశ్య గూఢచారులు**:- పిల్లి కళ్ళు మూసుకొని పాలు తాగుతూ తనను ఎవరూ చూడటంలేదని అనుకుంటుందట. పిల్లి సంగతెందుకు? మనుషులు మాత్రం తక్కువ తిన్నారా? నేర ప్రవృత్తి గలవారు మనలో ఎంతమంది లేరూ? తమను పట్టుకునే పోలీసులు ఎవరూలేరన్న ధీమాతో, అసలు తమను నిలదీసేవారే ఎవరూ ఉండరన్న దుస్సాహసంతో అనేకమంది నేరాల మీద నేరాలు చేస్తుంటారు. కాని అదృశ్య గూఢ చారులుగా పరలోక పోలీసులు అనుక్షణం మానవుల్ని వెన్నంటి ఉంటూ, వారు చేసే



ప్రతి పనినీ, పలికే ప్రతిపలుకునూ ఎప్పటికప్పుడు రికార్డు చేస్తున్నారని ఇస్లాం చెబు తోంది. వారినే ఖుర్‌ఆన్ "కిరామన్ కాతిబీన్" అని పేర్కొన్నది. (82:10-12 సూక్తులు.)

5. **అన్సార్ (నసారా)**:- అంటే 'సహాయకులు' అని శాబ్దికభావం. ఈసా ప్రవక్త (అలైహి) తన అనుచరులను ఉద్దేశించి 'మన్ అన్సారీ ఇలల్లాహ్' (దైవమార్గంలో నాకు సహాయపడేవారు మీలో ఎవరైనా వున్నారా?) అని అడిగినప్పుడు 'నహ్ను అన్సారుల్లాహ్' (మేము దేవుని మార్గంలో మీకు సహాయకులం) అని హవారీలు సమాధానమిచ్చారు (3:52, 5:14). ఈసా (అలైహి) స్వస్థలం అయిన 'నాసిరా' అనే పదం నుండి పుట్టిందని నేటి క్రైస్తవులు అంటారు. ఖుర్‌ఆన్ దీన్ని ఖండిస్తోంది. ఈసాప్రవక్త (అలైహి) కూడా గత ప్రవక్తలు బోధించిన ఇస్లాం ధర్మాన్నే బోధించారు. ఆయన తన అనుచరులకు ముస్లిమ్ లనే పేరు పెట్టారు. మసీహి, ఈసాయీ, నస్రానీ వగైరా పేర్లను యూదులు ఆ తర్వాతి కాలంలో ఆ మతవర్గం వారిని అపహాస్యం చేయడానికి ప్రయోగించేవారు. చివరికి అదే వారికి శాశ్వత పేర్లయ్యాయి. అదేవిధంగా క్రైస్తవులు అనే పదం కూడా క్రీస్తు నుండి తీసి పెట్టుకున్నారు.

6. **ఆదం** (అలైహి):- మొట్టమొదటి మానవుడు. ఈయన సంతతి నుండే మానవాళి ప్రపంచమంతటా విస్తరించింది. మానవుడు అనేకరకాలుగా పరిణామం చెందుతూ వానర సంతతి నుండి ప్రస్తుత రూపం సంతరించుకున్నాడన్న డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం ఖుర్‌ఆన్‌కు విరుద్ధమైనది. (చూడండి- 2:30-39). దేవుడు హజ్రత్ ఆదం (అలైహి)ని సృష్టించిన తరువాత ఆయనకు తోడుగా హజ్రత్ హవ్వా (అలైహి)ని కూడా సృష్టించాడు. వీరిద్దరి నుండి మానవసంతతి ఉద్భవించింది. హజ్రత్ ఆదం (అలైహి) మొట్టమొదటి దైవప్రవక్త కూడా.

7. **ఆద్ జాతి**:- ఇది అరేబియాకు చెందిన అతి పురాతన జాతి. నూహ్ ప్రవక్త (అలైహి), ఆయన అనుచరుల సంతతుల నుండి ఆవిర్భవించింది. క్రీస్తుపూర్వం 1800-2000 మధ్య కాలంలో ఈ జాతి మహావైభవంగా మనుగడ సాగించినట్లు తెలుస్తోంది. దేవుడు ఈ జాతిప్రజలకు అన్నివిధాల భోగభాగ్యాలు ప్రసాదించాడు. అయితే వీరు నూహ్ (అలై) బోధనలను విస్మరించి క్రమంగా విగ్రహారాధనకు లోనయ్యారు. అందు వల్ల దేవుడు వారి మార్గదర్శనం కోసం హూద్ ప్రవక్త (అలై)ను ప్రభవింపజేశాడు. కాని వారాయన్ని తిరస్కరించి నాశనమయ్యారు. కొందరు మాత్రమే విశ్వసించారు. దక్షిణ అరేబియాలోని యమన్, యమామల మధ్యవున్న 'అహ్‌ఖాఫ్' ప్రాంతం వీరి జన్మస్థలం.

క్రీ.శ.1837లో జేమ్స్. ఆర్. వేల్సటడ్ అనే ఆంగ్లేయ నౌకాధికారికి 'హిసిన్ గురాద్' కనుమలో ఓ పురాతన శిలాశాసనం దొరికింది. ఇది క్రీ.పూ.1800 నాటిదని తెలుస్తోంది. పురావస్తుశాస్త్ర నిపుణులు ఈ శిలాశాసనంలోని వ్రాతకు ఈ విధంగా అర్థం చెప్పారు: "మేమీ కోటలో ఓ సుదీర్ఘ కాలం ఎలాంటి దుస్థితి, ఇబ్బందులు లేకుండా ఎంతో సుఖంగా జీవించాము. మా కాల్వలు ఎల్లప్పుడూ నదీ జలాలతో నిండి వుండేవి......మా పాలకులు ఎలాంటి చెడు తలంపులకు తావిచ్చే వారు కాదు. చెడులు, కల్లోలాల పట్ల కఠినంగా వ్యవహరించేవారు. వారు మమ్మల్ని హూద్‌ప్రవక్త తెచ్చిన ధర్మశాస్త్రం ప్రకారం ధర్మయుక్తంగా పరిపాలిస్తుండేవారు. మంచి తీర్పులు ఒక పుస్తకంలో నమోదు అవు తుండేవి. మేము దేవుని మహిమలను, మరణానంతరం తిరిగి బ్రతికించబడే విషయాన్ని

పోయింది. ప్రజలు ‘బాల్’ విగ్రహాన్ని ఆరాధించడం, దాని పేరుతో జంతుబలులు ఇవ్వడం ప్రారంభించారు.

ఆ కాలంలోనే హజ్రత్ ఇల్యాస్ (అలైహి) దైవప్రవక్తగా ప్రభవించి విగ్రహారాధనకు, ఇతర చెడులకు వ్యతిరేకంగా ప్రచారం ప్రారంభించారు. ఇస్రాయీల్ రాజును తీవ్రంగా హెచ్చరిస్తూ “నీ పాపాల మూలంగా ఇప్పుడు ఇస్రాయీల్ దేశంలో వర్షం కురవదు. కనీసం మంచు కూడా కురవదు” అని శపించారు ఆయన. ఈ శాపం ఫలితంగా మూడున్నర సంవత్సరాల దాకా వర్షం కురవలేదు. అప్పుడు ఇస్రాయీల్ రాజు దిగివచ్చి ఈ దుస్థితి నుండి కాపాడమని ఇల్యాస్ ప్రవక్త (అలైహి)ను ప్రాధేయపడ్డాడు.

అయితే హజ్రత్ ఇల్యాస్ (అలైహి) బాల్ దేవత, విశ్వప్రభువయిన యెహోవాలలో ఎవరు నిజ దేవుడో నిరూపించడానికి బహిరంగ జనసమూహాన్ని ఏర్పాటు చేయించారు. ఈ ప్రదర్శనలో 850 మంది బాల్ దేవత పూజారులు పాల్గొన్నారు. బాల్ దేవత పేరుతో దాని పూజారులు, విశ్వ ప్రభువు పేరుతో ఇల్యాస్ ప్రవక్త (అలైహి) జంతుబలి ఇవ్వాలని, ఈ రెండు బలులలో ఆకాశం నుండి దైవాగ్ని వచ్చి ఎవరి బలిదానాన్ని భస్మీపటలం చేసి స్వీకరిస్తుందో వారు గెలిచినట్లని నిర్ణయమయింది.

చివరికి ఈ పోటీలో బాల్ పూజారులు ఓడిపోయారు. ఆకాశం నుండి వచ్చిన దైవాగ్ని హజ్రత్ ఇల్యాస్ (అలైహి) సమర్పించిన బలిపశువునే కాల్చివేసింది. ఈ విధంగా విశ్వప్రభువయిన యెహోవాయే నిజదేవుడని, ఆరాధ్యనీయుడని ఇస్రాయీల్ ప్రజలందరి ముందు రుజువయింది. నిర్ణీత షరతుల్లో ఓడిపోయిన వారిని హతమార్చాలని కూడా ఉంది. దాని ప్రకారం బాల్‌దేవత పూజారులందర్నీ హతమార్చడం జరిగింది. ఆ తరువాత హజ్రత్ ఇల్యాస్ (అలై) వర్షం కోసం దైవాన్ని ప్రార్థించారు. దాంతో ఇస్రాయీల్ రాజ్యమంతటా విస్తారంగా వర్షం కురిసింది.

కాని ఇంతటి గొప్ప మహత్యం చూసినప్పటికీ ఇస్రాయీల్‌రాజు బహుదైవారాధకురాలైన తనభార్య వల నుండి బయటపడలేక పోయాడు. పైగా అతని భార్య ఈ మహిమ చూసిన తరువాత ఇల్యాస్ (అలైహి)కు బద్ధశత్రువయి పోయింది. బాల్ పూజారులు ఎలా చంపబడ్డారో ఇల్యాస్‌ని కూడా అలా చంపడం జరుగుతుందని ఆమె ప్రమాణం చేసి మరీ ప్రకటించింది. దాంతో ఇల్యాస్ (అలై) ఇక ఇస్రాయీల్ రాజ్యంలో ఉండటంవల్ల ప్రయోజనం లేదని భావించి, అక్కడ్నుంచి వేరే చోటికి తరలిపోయారు.

ఆ కాలంలోనే యూదసామ్రాజ్యం రాజు ఇస్రాయీల్ రాజు కుమార్తెను వివాహమాడాడు. ఆమె ద్వారా యూదరాజ్యంలో కూడా బహుదైవారాధన వ్యాపించింది. అందువల్ల హజ్రత్ ఇల్యాస్ (అలైహి) అక్కడ కూడా ధర్మప్రచారం చేసి ప్రజలను ఏకేశ్వరోపాసన వైపు మరలించడానికి కృషి చేశారు. ఆయన యూద రాజుక్కూడా హితోపదేశం చేశారు. కాని యూద రాజుకు ప్రవక్త హితవులు చెవికెక్క లేదు. చివరికి హజ్రత్ ఇల్యాస్ (అలైహి) అతడ్ని తీవ్రంగా శపించారు. ఈ శాపం ఫలితంగా మొదట యూదరాజ్యంపై శత్రుసైన్యాలు దాడులు చేసి సర్వనాశనం చేశాయి. వారతని భార్యల్ని కూడా బంధించి తీసికెళ్ళారు. ఆ తరువాత యూదరాజు భయంకరమయిన అజీర్ణ వ్యాధితో చనిపోతాడు.



ఈ సంఘటన జరిగిన కొన్నేళ్ళ తర్వాత హజ్రత్ ఇల్యాస్ (అలై) మళ్ళీ ఇస్రాయీల్ రాజ్యానికి వెళ్ళి ధర్మప్రచారం చేస్తారు. ఆ తరువాత వచ్చిన ఇస్రాయీల్ రాజుక్కూడా హితోపదేశం చేస్తారు. కాని ఆ రాజవంశంలో పేరుకుపోయిన చెడులు ఏమాత్రం తొలగిపోలేదు. దాంతో ఆ వంశాన్ని కూడా శపించడం, అది సర్వనాశనమయి పోవడం జరిగాయి. ఆ తరువాత దేవుడు ఆయన్ని తన దగ్గరికి పిలుచుకున్నాడు.

యూదులు హజ్రత్ ఇల్యాస్ (అలైహి)ని ఆయన జీవించి ఉన్నప్పుడు ఎంతగా వేధించారో, ఆ తరువాత ఆయన్ని అంతగా అభిమానించడం మొదలెట్టారు. వారు ఇల్యాస్ (అలైహి)ని మూసా (అలైహి) కంటే గొప్ప ప్రవక్తగా భావించారు. అంతేకాదు, దేవుడు ఆయన్ని ఓ సుడిగాలి ద్వారా సజీవంగా, సశరీరంగా ఆకాశంలోకి ఎత్తుకున్నాడని, తరువాత ఆయన మళ్ళీ భూలోకానికి తిరిగివస్తారని కూడా వారు నమ్ముతున్నారు.

(తఫ్హీముల్ ఖుర్ఆన్ ఆధారంగా. మరికొన్ని వివరాల కోసం 37:130 సూక్తికి రాసిన పాద సూచిక చూడండి.)

**14. ఇస్రాయీల్:-** ఇది యాఖూబ్ ప్రవక్త (అలైహి)కు దేవుడు ప్రసాదించిన బిరుదు. హజ్రత్ యాఖూబ్ (అలైహి) ఇస్‌హాఖ్ ప్రవక్త (అలైహి) కుమారుడు, ఇబ్రాహీంప్రవక్త (అలైహి) మనుమడు. యాఖూబ్ సంతతినే బనీఇస్రాయీల్ (ఇస్రాయీల్ సంతతి) అని అంటారు. ఇస్రాయీల్ సంతతి ప్రజలను యూదులని కూడా అంటారు.

ఇస్రాయీల్ అంటే అసలు “అబ్దుల్లా” (దైవదాసుడు) అని అర్థం. అయితే యూదులు తమ స్వయంకృత మతవిశ్వాసాలకు అనుగుణంగా దీని భావాన్ని కూడా మార్చివేశారు. యూదుల మత విశ్వాసం ప్రకారం వారి మూలపురుషుడైన హజ్రత్ యాఖూబ్ (అలైహి) ఓ రోజు రాత్రంతా దేవునితో కుస్తీపడ్తూ మల్లయుద్ధం చేశారు. దేవుడు హజ్రత్ యాఖూబ్‌తో తెల్లవారేదాకా తలపడినప్పటికీ ఆయన్ని ఓడించలేక పోయాడట! చివరికి దేవుడు“ఇక నన్ను వెళ్ళిపోనివ్వు” అని అంటే, “నీవు నాకు శుభం ప్రసాదించనంత వరకు నేను నిన్ను వదలిపెట్టను” అని హజ్రత్ యాఖూబ్ (అలైహి) అన్నారు. అప్పుడు దేవుడు “నీ పేరేమిటి?” అని అడిగితే, “నా పేరు యాఖూబ్” అని ఆయన అన్నారు. “అయితే ఇకముందు నీ పేరు యాఖూబ్ కాదు, ఇస్రాయీల్ అవుతుంది. ఎందుకంటే నీవు దేవునితో, ప్రజలతో తలపడి విజయం సాధించావు” అని దేవుడు చెప్పాడట!!

‘జీవిష్ పబ్లికేషన్ సొసైటీ ఆఫ్ అమెరికా’చే 1954లో ప్రచురించబడిన “ది హోలి స్క్రిప్చర్” అనే గ్రంథంలో ఈ వివరాలు చూడవచ్చు. బైబిల్‌లో కూడా ఈ కథ ఉంది. యూదుల మతగ్రంథం అథఃసూచికలో ఇస్రాయీల్ అంటే “దేవునితో తలపడేవాడు” అని అర్థం ఉంది. ‘సైక్లోపీడియా ఆఫ్ బిబ్లికల్ లిటరేచర్’ అనే గ్రంథంలో క్రైస్తవ పండితులు ఇస్రాయీల్ అంటే “దేవునితో మల్లయుద్ధం చేసేవాడు” అని నిర్వచించారు.

ఇలాంటి మత విశ్వాసాలు కలిగివుండటం వల్లనే యూదులు తమ మనోవాంఛలకు వ్యతిరేకమైన బోధనలు తెచ్చిన దైవప్రవక్తల్ని తిరస్కరించడమే గాకుండా వారిలో కొందరిని చంపారు కూడా (ఖుర్ఆన్-2:87). పైగా తాము చేసిన ఈ నిర్వాకాన్ని కప్పిపుచ్చుకుండా కాలర్ ఎగరేసి మరీ “మేము దైవప్రవక్త, మర్యం కుమారుడైన ఈసా

మసీహ్‌ని హతమార్చాం” అని కూడా చెప్పుకున్నారు మహాగర్వంగా (ఖుర్‌ఆన్-4:158). ఇలాంటి స్వభావంగల జాతిప్రజలు అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం)ను, పైగా తమ జాతిలో గాకుండా తాము నిరక్షరకుక్షులని తెగిడే అరబ్బులలో ప్రభవించిన దైవ ప్రవక్తను ఎలా విశ్వసిస్తారు?

**15.** **ఈమాన్ (విశ్వాసం)**:-ఏ మతానికైనా పునాది విశ్వాసమే. ముస్లిమేతర మతస్థులు తమ తమ మతప్రవక్తలను, మతగ్రంథాలను మాత్రమే విశ్వసిస్తారు. ముస్లింలు తమ మతవిశ్వాసం ప్రకారం యావత్తు మత ప్రవక్తలను, యావత్తు మత గ్రంథాలను విశ్వసిస్తారు. దేవుణ్ని, పరలోకాన్ని, ఆయన దూతలను, ప్రవక్తలను విశ్వసించడంతో పాటు గత ప్రవక్తలను, గత దైవగ్రంథాలను కూడా విశ్వసించినవారే మోక్షానికి అర్హులని ఖుర్‌ఆన్ చెబుతోంది. అయితే గత ప్రవక్తలలో అదం, నూహ్, ఇబ్రాహీం, యాఖూబ్, మూసా, ఈసా తదితర కొంతమంది దైవప్రవక్తల (అలైహి)ను మాత్రమే ఖుర్‌ఆన్ ప్రస్తావించింది. అలాగే తౌరాత్, జబ్బూర్, ఇన్జీల్ వంటి కొన్ని గ్రంథాల పేర్లనే పేర్కొన్నది.

అందువల్ల ఆయా దైవప్రవక్తలను, ఆయా దైవగ్రంథాలను మాత్రమే నూరు శాతం దైవప్రోక్త గ్రంథాలని ముస్లింలు విశ్వసిస్తారు. ఖుర్‌ఆన్‌లో ప్రస్తావించబడని దైవప్రవక్తలు, దివ్యగ్రంథాల విషయంలో వారు మౌనం పాటిస్తారు. అంటే రాముడు, కృష్ణుడు, బుద్ధుడు వంటి మహా పురుషుల్ని; గీతా, వేదాలు, జందవిస్తాలాంటి మతగ్రంథాలను ముస్లింలు విశ్వసించనూ లేరు, తిరస్కరించనూ లేరన్నమాట.

పోతే తౌరాత్, జబ్బూర్, ఇన్జీల్ గ్రంథాలు ఈనాడు ఎన్నో ప్రక్షిప్తాలకు, నిక్షిప్తాలకు గురయి వాటి అసలు రూపాల్లో లేనందున వాటి బోధనల్ని ముస్లింలు యథాతథంగా విశ్వసించడానికి, ఆచరించడానికి వీలులేకుండా పోయాయి. ఇవీ గత దైవగ్రంథాల పట్ల ముస్లింల విశ్వాసాలు.

**16.** **ఈలా**:- ఎవరైనా ఒకవ్యక్తి తన భార్యతో “నేను నీతో (ఎన్నటికీ లేదా ఆరేడు నెలల దాకా) సంభోగించను” అని ప్రమాణం చేయడాన్ని లేక నిర్ణయించుకోవడాన్ని షరీఅత్ పరిభాషలో ‘ఈలా’ అంటారు. అలాంటి వ్యక్తికి నాలుగు నెలల గడువు ఉంటుంది. ఈ గడువులోగా అతను తన భార్యతో తిరిగి లైంగిక సంబంధం పెట్టు కోవలసి ఉంటుంది. దీనికి ముందు అతను పాపపరిహారం కూడా చెల్లించవలసి ఉంటుంది. పాపపరిహారంగా పదిమంది పేదలకు అన్నదానం చేయాలి లేదా బట్టలు ఇవ్వాలి లేదా మూడు రోజులు ఉపవాసం పాటించాలి. (5:89)

ఒకవేళ ఈ గడువు దాటినా అతను తన భార్యను కలుసుకోకపోతే ఆ చర్య విడాకులకు దారితీస్తుంది. అంటే ఇద్దరి మధ్య వివాహబంధం తెగిపోతుంది. అతను పశ్చాత్తాపంచెంది తిరిగి ఆమెతో సంసారం చేయాలంటే కొత్తగా ఆమెను వివాహ మాడవలసి ఉంటుంది. (2:226)

పోతే భార్యను వదిలించుకోవడానికి ఆనాటి అరబ్బులు “నీవు నాకు తల్లి వంటి దానవు” అంటారు. దీనిని **“జిహార్”** అంటారు. జిహార్ గురించి వివరాల కోసం 58వ అధ్యాయం (ముజాదల), 1-4 సూక్తులు, వాటి పాదసూచిక చూడండి.)



**17.** **ఈసా మసీహ్**:- ఈయన ఇస్రాయీల్ సంతతి (యూద) ప్రజల మార్గదర్శనం కోసం ప్రభవించిన దైవప్రవక్త (అలైహి). హజ్రత్ మర్యం (అలైహి) కుమారుడు. ఈయనపై ఇన్జీల్ గ్రంథం అవతరించింది.

యూదులు ముగ్గురు దైవప్రవక్తల కోసం ఎదురుచూస్తున్న కాలంలో యహ్యా ప్రవక్త (అలైహి) వారి ముందుకు వచ్చారు. అప్పుడు వారు “నీవు మసీహ్ (క్రీస్తు)వా? ఏలియా (ఇల్యాస్)వా? లేక ఆప్రవక్త (ముహమ్మద్)వా?”అని అడిగి“ ఆ ముగ్గురిలో నీవు ఎవరూ కానప్పుడు బాప్తిజం ఎందుకు చేయిస్తున్నావు?” అని అడిగారు (బైబిల్ కొత్త నిబంధన, యోహాన్ సువార్త / 1:19-26 చూడండి). అయితే తాము ఎదురుచూస్తున్న ముగ్గురిలో ఒకరైన హజ్రత్ ఈసా(మసీహ్) రకరకాల మహిమలు చూపుతూ దైవసందేశం అందజేయడానికి వస్తే, వారాయన్ని మాంత్రికుడని తిరస్కరించారు (ఖుర్‌ఆన్ 3:48-51 సూక్తులు చూడండి). బలహీన వర్గాలకు చెందిన కొందరు యూదేతరులు (కొందరు పండితుల అభిప్రాయం ప్రకారం - రజకులు) ఈసా ప్రవక్త (అలైహి)ను విశ్వసించి ముస్లిములయి పోయారు. (ఖుర్‌ఆన్ / 3:52-53 సూక్తులు చూడండి).

దైవప్రవక్తలు విగ్రహారాధన, బహుదైవారాధనలకు వ్యతిరేకంగా ప్రజల్ని ఏకేశ్వరో పాసన వైపు పిలువడమే గాకుండా వారిలో చోటుచేసుకున్న నైతిక, సామాజిక రుగ్మత లను కూడా ఎండగట్టే వారు. ఈసాప్రవక్త (అలై) కూడా ఈ పనే చేశారు. నైతిక, సామాజిక రుగ్మతలలో పీకలదాకా కూరుకుపోయిన యూదులు ఇలాంటి బోధనలను సహించకపోవడమే గాకుండా ఆయనకు బద్ధ శత్రువులైపోయారు. హజ్రత్ ఈసా(అలైహి) దేవుని మహత్తుతో అసాధారణ రీతిలో హజ్రత్ మర్యం (అలైహి)కు జన్మించిన వైనం పట్ల దాదాపు ముప్పైయేండ్ల వరుకు పల్లెత్తుమాట కూడా అనని యూదులు, దైవాజ్ఞతో హితోపదేశాలు అవతరించనారంభించగానే ఆయనపై, ఆయన మాతృమూర్తిపై ఘోరాతి ఘోరమైన అపనిందలు మోపారు. (ఖుర్‌ఆన్ / 4:156 సూక్తి చూడండి.)

ఆ తరువాత ఆ మహనీయుడ్ని చంపడానికి రకరకాల కుట్రలు పన్నారు. ఆనాడు సిరియా రాజ్య పరిధిలో ఒక భూభాగంగా వుండిన పాలస్తీనా రోమ్‌చక్రవర్తి పాలనలో వుండేది. రోమ్ చక్రవర్తి, ఆయన జాతీయులంతా ఆనాడు బహుదైవారాధకులుగా వుండేవారు. అయితే యూదులు స్వయంగా తమ జాతికి చెందిన ఈసాప్రవక్త (అలైహి)ను తమ మార్గం నుండి తొలగించుకోవడానికి రోమ్ చక్రవర్తికి లేనిపోని మాటలు కల్పించి చెప్పారు. పిలాతిస్ న్యాయస్థానం నుండి అబద్ధపు సాక్షుల్ని తీసుకొచ్చి ఈ వ్యవహారాన్ని అతని ముందుంచారు. పుణ్యపురుషుడైన ఈసా (అలైహి)కు మరణశిక్ష విధించడం రోమ్‌చక్రవర్తికి ఏమాత్రం ఇష్టం లేదు. అందువల్ల అతను మొదట దీన్ని వ్యతిరేకించాడు. కాని నక్కజిత్తుల యూదులు తమ నిర్ణయాన్ని అమలు జరపకపోతే దేశంలో అంతర్యుద్ధం జరుగుతుందని బెదరించారు. అందువల్ల రోమ్ చక్రవర్తి వారి వత్తిడికి లొంగిపోయాడు.

రోమ్‌న్యాయాధిపతి యూదుల్ని సంబోధిస్తూ “మేము మీ కోరిక మీద ఈసా (అలై)కు మరణశిక్ష విధిస్తున్నాం కాని, ఏ పాపం ఎరగని ఈ మానవోత్తముడి హత్యాబాధ్యత మాపై ఎంతమాత్రం లేదు” అని అన్నాడు. ఆ తరువాత అతను నిండుసభలో నీళ్ళు తెప్పించి చేతులు కడుక్కొని ఈసా (అలైహి) వధకు సంబంధించిన అనుమతి పత్రం

యూదులకు ఇచ్చివేశాడు. వెంటనే యూదులు కొందరు రోమ్ సైనికుల్ని వెంటబెట్టుకొని హజ్రత్ ఈసా (అలై) విడిది చేసిన తాత్కాలిక ఆశ్రమంలోకి జొరబడ్డారు.

అయితే వారు లోపల జొరబడక ముందే హజ్రత్ ఈసా (అలై) దేవుడ్ని ప్రార్థించడం, దేవుడు ఆయన్ని సశరీరంగా పైకి ఎత్తుకోవడం జరిగిపోయాయి. తరువాత ఆ ఆశ్రమంలో జొరబడిన వారిలో సైమన్ అనే ఒక వ్యక్తికి దేవుడు ఈసా (అలైహి) రూపం కల్పించాడు. యూదులు, రోమ్ సైనికులు అతనే ఈసా మసీహ్ అనుకొని పట్టుకెళ్ళి సిలువ వేశారు. ఈ విధంగా ఆ వ్యక్తిని చంపి, సిగ్గు ఎగ్గూ లేకుండా "మేము దైవప్రవక్త మసీహ్ ఇబ్నె మర్యంని సంహరించాం" అని చెప్పుకున్నారు మహాగర్వంగా. (ఖుర్‌ఆన్- 4:156 సూక్తి చూడండి.)

ఈ సంఘటన జరిగిన అనేక సంవత్సరాలకు హజ్రత్ ఈసా (అలైహి)ను విశ్వసించి క్రైస్తవులైన వారు దీన్ని గురించి ఎన్నో భేదాభిప్రాయాలకు గురయ్యారు. యూదులు, రోమ్ సైనికులు కలసి సిలువ వేసిన వ్యక్తి మసీహ్ కాదని, మసీహ్ రూపంలో వున్న వేరొక వ్యక్తి అని, మసీహ్ వారి తెలివిమాలినతనం పట్ల నవ్వుతూ అక్కడే ఓ చోట నిల్చున్నాడని కొందరు అభిప్రాయపడ్డారు. సిలువపై యెక్కించబడినవాడు మసీహ్‌యే కాని, ఆయన సిలువ మీద మరణించలేదని, సిలువపై నుండి దించిన తరువాత ఆయన బ్రతికే వున్నాడని మరికొందరు భావించారు. కాదు ఆయన సిలువపైనే చనిపోయాడని, ఆ తరువాత ఆయన బ్రతికి దాదాపు పదిమంది శిష్యుల్ని కలుసుకొని మాట్లాడాడని ఇంకొందరి కథనం. ఆయన చనిపోయిన తరువాత తిరిగి బ్రతికాడని, అప్పుడు సశరీరంగా పైకి ఎత్తుకోబడ్డాడని మరికొందరి నమ్మకం.

మసీహ్ (అలై) సజీవంగా, సశరీరంగా పైకెత్తుకోబడ్డారన్న ఈ నమ్మకమే ఆయనకు దైవత్వాన్ని ఆపాదించింది. దేవుడు దివ్యసందేశాన్ని ప్రవక్తలకు చేరవేసే దైవదూతను "పరిశుద్ధాత్మ" అని ఖుర్‌ఆన్‌లో ప్రస్తావిస్తే, క్రైస్తవులు 'అది దేవుని పరిశుద్ధాత్మ అని, ఆ పరిశుద్ధాత్మ మసీహ్‌లో అంతర్లీనమై పోయిందని' భావించారు. యూదమతంలో మానవుల్ని దేవుని కుమారులుగా పిలిచే సంప్రదాయం వుంది. ఆ సంప్రదాయానికి ప్రభావితులైన క్రైస్తవులు మసీహ్ (అలై)ని దేవుని ఏకైక కుమారునిగా చేశారు.

ఈ విధంగా వారు దేవుడు ఒక్కడేనని నమ్ముతూనే ముగ్గురు దేవుళ్ళను సృష్టించుకున్నారు. దేవ కుమారునిగా కల్పించబడిన ఈసా మసీహ్ మానవుల పాపాలకు ప్రాయశ్చిత్తంగా సిలువపై బలయిపోయారని, అందువల్ల మానవులు ఎలాంటి ఎన్ని పాపాలు చేసినా ఏసు ప్రభువుని విశ్వసిస్తే చాలు, మోక్షం లభిస్తుందని ఓ గొప్ప మతసిద్ధాంతాన్ని ఉనికిలోకి తెచ్చారు. ఈ సిద్ధాంతాన్ని కనిపెట్టి ప్రచారం చేసిన ఘనత సెయింట్‌పాల్ (పౌలస్)కు దక్కుతుంది. ఈ సిద్ధాంతానికి ప్రారంభంలో కొన్నిసమస్యలు, అభ్యంతరాలు ఎదురైనా ఆ తరువాత క్రమేణా ఇది క్రైస్తవ జగత్తులో బాగా ప్రాచుర్యం పొందింది.

**18. ఉమ్మత్ (సముదాయం)**:- ఉమ్మత్ అంటే జాతి, జనావళి, సముదాయం అని నానార్థాలు వున్నాయి. ధర్మశాస్త్ర పరిభాషలో ఉమ్మత్ అంటే, ఒక దైవప్రవక్త ప్రభవించిన తర్వాత ఆయన బోధనలు ప్రపంచంలో ప్రక్షిప్తాలకు, నిక్షిప్తాలకు గురి



కాకుండా యథాతథంగా ఉన్నంతవరకు ఆ ప్రవక్తను విశ్వసించేవారని అర్థం. ఇలా ఒక దైవప్రవక్త నుండి మరో దైవప్రవక్త ప్రభవించే వరకుండే విశ్వాసుల సముదాయం ఉమ్మత్ అనబడుతుంది. ఇప్పుడు అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) కాలం నుండి ఇప్పటివరకు ఆయన్ని, అయన బోధనల్ని విశ్వసించినవారు, ఇకముందు ప్రళయం వరకూ విశ్వసించే వారంతా 'ముహమ్మద్ ఉమ్మత్ లేదా ముస్లిం ఉమ్మత్' (ముస్లిం సముదాయం) అనబడతారు. (10:47)

**19. ఉమ్మతె వసత్** (మధ్యస్థ సమాజం లేక మధ్యస్థ సముదాయం):- అతిశయానికి, అతివాదాలకు పోకుండా మధ్యేమార్గాన్ని అవలంబించి న్యాయంగా, నిష్పక్షపాతంగా, ధర్మయుక్తంగా వ్యవహరించే సమాజాన్ని ఉమ్మతె వసత్ అంటారు. దేవుడు ఖుర్‌ఆన్‌లో ముస్లిం సముదాయానికి ఈ పేరు ప్రతిపాదించి దాని కర్తవ్యాన్ని తెలియజేశాడు. (2:143 సూక్తి, దాని పాదసూచిక చూడండి.) ముస్లిం సముదాయాన్ని **"ఉమ్మతె ఖైర్"** (శ్రేష్ఠ సమాజం) అని కూడా అంటారు. శ్రేష్ఠసమాజం గుణగణాలను వర్ణిస్తూ ముస్లింలు మంచిపనులు చేయమని ప్రజలను ఆదేశిస్తారు; చెడుపనుల నుండి వారిస్తారు; దేవుడ్ని గట్టిగా విశ్వసిస్తారని ఖుర్‌ఆన్ చెబుతోంది. (3:110 సూక్తి, దాని పాదసూచిక చూడండి.)

**20. ఉమ్మి (నిరక్షరాశ్యుడు)**:- చదవడం, వ్రాయడం రాని వ్యక్తిని ఉమ్మి అంటారు. ముహమ్మద్ ప్రవక్త (సల్లం)ను కూడా ఈ అర్థంలోనే 'ఉమ్మీ' అన్నది ఖుర్‌ఆన్. యూదులు యావత్తు మానవుల్లో తామే శ్రేష్ఠులమని చెప్పుకోవడమే గాకుండా, తమజాతికి చెందని ఇతర జాతులవారిని అజ్ఞానులు, అనాగరికులు, నిరక్షరకుక్షులు అనే అర్థాల్లో ఉమ్మి (Gentiles) అనంటారు. అలాంటి ఉమ్మీజాతిలో పుట్టి నిరక్షరాస్యుడయిన ముహమ్మద్ ప్రవక్త (స)ను విశ్వసించినప్పుడే మీపై దైవకారుణ్యం వర్షిస్తుందని ఖుర్‌ఆన్ యూదులకు చెబుతోంది. (7:157 సూక్తి చూడండి).

**21. ఉర్**:- ఇది హజ్రత్ ఇబ్రాహీం ప్రవక్త (అలైహి) పుట్టి పెరిగిన పట్టణం. ఇది ఆనాటి నమ్రూద్ రాజు పాలించిన (ప్రస్తుత ఇరాఖ్) రాజ్యానికి రాజధానిగా ఉండేది. సర్ లియోనార్డ్ వూలి రాసిన "అబ్రహాం"(లండన్) అనే గ్రంథం ప్రకారం ఈ పట్టణంలోని ఓ ఎత్తయిన కొండపై నన్నార్ అనే దేవతా విగ్రహం ఉండేది. ఇది మొత్తం దేశంలో కెల్లా పెద్ద దేవాలయం. ఇక్కడ అనేకమంది పూజారులు, దేవదాసీలు ఉండేవారు. నిజానికి ఈ దేవాలయంలో దేవుని పేరుతో, మతం పేరుతో విచ్చలవిడిగా పచ్చి వ్యభిచారం సాగుతుండేది.

**22. ఉలుల్ అమ్ర్**:- నాయకుడు, అధికారి లేక ఆజ్ఞాపించేవాడు అని అర్థం. (వివరాల కోసం 4:59 సూక్తి, దాని పాదసూచిక చూడండి.)

**23. ఊయల**:- ఖుర్‌ఆన్‌లో కొన్ని చోట్ల భూమిని ఊయలతో పోల్చడం జరిగింది. (43:10 సూక్తి, దాని పాదసూచిక చూడండి.)

**24. ఊర్ధ్వలోక సదస్సు**:- ఇది ఆదంసృష్టి విషయమై ఆకాశంలో జరిగిన దైవదూతల సమావేశం. అందులో జిన్ (భూతం) జాతికి చెందిన ఇబ్లీస్ (షైతాన్) కూడా ఉన్నాడు. మానవసృష్టి జరిగిన తరువాత మానవునికి తలవంచమని దేవుడు ఆదేశించినప్పుడు అందరూ తలవంచుతారు. కాని ఇబ్లీస్ తిరస్కరిస్తాడు. (38:69-85 సూక్తులు చూడండి).

**25. ఎజ్రా (ఉజైర్)**:- యూదులు ఈయన్ని తమ మతాన్ని సంస్కరించిన గొప్ప సంస్కర్తగా చెప్పుకుంటారు. హజ్రత్ ఉజైర్ (అలైహి) కాలం దాదాపు క్రీ.పూ. 450 అని పరిశోధకులు నిర్ధారించారు. యూదుల మత ఉల్లేఖనాల ప్రకారం సులైమాన్ ప్రవక్త (అలైహి) చనిపోయిన తరువాత యూదులు శత్రు దాడులతో కకావికలమై పోయారు. తౌరాత్ గ్రంథం ప్రపంచం నుండే కనుమరుగై పోయింది. చివరికి వారి మాతృభాష హెబ్రూ కూడా వారికి అపరిచితమై పోయింది. అలాంటి గడ్డుకాలంలో హజ్రత్ ఉజైర్ (అలైహి) తౌరాత్ బోధనలను ఏరి కూర్చి, వారి ధర్మశాస్త్రాన్ని సంస్కరించారు. ఈ కారణంగా యూదులు ఆయన్ని అమితంగా గౌరవిస్తారు. అయితే కొంతకాలానికి ఈ గౌరవప్రపత్తులు హద్దు మీరిపోయి యూదుల్లో ఒక వర్గం ఆయన్ని దేవుని కుమారుడు అని పలికే వరకు పోయింది. (9:30 సూక్తి చూడండి.)

**26. ఎడమ పక్షంవాళ్ళు** :- ఎడమపక్షం లేక వామపక్షం వాళ్ళనగానే సాధారణంగా మనకు కమ్యూనిష్టులు గుర్తుకొస్తారు. కాని ఖుర్‌ఆన్ దృష్టిలో ఎడమపక్షం వాళ్ళంటే దేవుడ్ని, ఆయన ప్రవక్తలను తిరస్కరించినవారని అర్థం. పరలోక తీర్పుదినాన విశ్వాసులు కుడిపక్షం వాళ్ళుగా, అవిశ్వాసులు ఎడమపక్షం వాళ్ళుగా పరిగణించ బడతారు. (వివరాల కోసం 56:41-56 సూక్తులు చూడండి.)

**27. ఎతికాఫ్**:- రమజాన్ నెల చివరి దశకంలో రేయింబవళ్ళు మసీదులోనే వుండి ప్రత్యేక నిష్ఠతో గడపడాన్ని ఎతికాఫ్ అంటారు. (2:187 సూక్తి చూడండి.)

**28. ఏనుగు**:- దేవుని ఆజ్ఞతో శత్రుపక్షంలోని ఒక ఏనుగు దైవశత్రువుల బారినుండి కాబా గృహాన్ని కాపాడటంలో ప్రముఖ పాత్ర వహించింది. వివరాల కోసం 105వ సూరా (ఫీల్)కు రాసిన ఉపోద్ఘాతం చూడండి.

**29. ఐకా ప్రజలు**:- ఐకా అనేది షుఐబ్ ప్రవక్త (అలైహి)జాతి నివసించిన ప్రాంతం. ఇది మదీనానుండి సిరియా పోయే దారిలో ఉంది. దీన్నే ముహమ్మద్ ప్రవక్త (సల్లం) కాలంలో తబూక్ అన్నారు. ఐకావారు కూడా ప్రవక్తల్ని తిరస్కరించి నాశనమయ్యారు. (15:78, 50:12 సూక్తులు)

**30. ఐకమత్యం**:- ముస్లింలు మనో వాక్కాయాలతో ఇస్లాం ధర్మంలో స్థిరంగా ఉన్నప్పుడే వారిలో ఐకమత్యం ఉంటుందని ఖుర్‌ఆన్ అధ్యయనం ద్వారా తెలుస్తోంది. (వివరాల కోసం 3:103, 8:46 సూక్తులు, వాటి పాదసూచికలు చూడండి.)

**31. ఒప్పందం**:- ముహమ్మద్ ప్రవక్త (సల్లం) కాలంలో ముస్లింలకు, మక్కా బహు దైవారాధకుల మధ్య ఒక నిర్యుద్ధ ఒడంబడిక జరిగింది. ఈ ఒప్పందలో బహుదైవారాధ కులు పెట్టిన షరతులు అన్యాయంగా, ఉన్నాయని భావించి ముస్లింలు ఆందోళన చెందారు. అయితే ఈఒప్పందం నిజానికి స్పష్టమైన విజయం అంటూ దేవుడు 'ఫతహ్' (విజయం) అధ్యాయంలో తెలియజేసి ముస్లింలను శాంతపరిచాడు. (వివరాలకు ఆ అధ్యాయాన్ని దాని ఉపోద్ఘాతంతో పాటు చదవండి.)

**32. ఒయాసిస్సు**:- ఎటు చూసినా పెద్దపెద్ద ఇసుకతిన్నెలతో కన్పించే ఎడారి ప్రాంతా ల్లోనూ అక్కడక్కడ కొన్ని జలాశయాలు, వాటి చుట్టూ చెట్లు చామలు కన్పిస్తాయి. వీటినే ఒయాసిస్సులు అంటారు. ఎండమావులు కూడా ఇలాగే కన్పిస్తాయి. సత్య



తిరస్కారులకు మృత్యుముఖంలోకి ప్రవేశించినప్పుడే దైవం, ధర్మం అనేవి గుర్తుకు వస్తాయి. కాని ఒయాసిస్సులాంటి ఆ సత్యాన్ని స్వీకరించబోతే వారికి అక్కడ కన్పించేది ఎండమావులే. (24:39 సూక్తి చూడండి.) కనుక మృత్యువు దాపురించకముందే మేల్కొని రుజుమార్గం అవలంబించడం బుద్ధిమంతుల లక్షణం. బుద్ధిమంతుల్ని గురించి ఖుర్‌ఆన్‌లో అనేక చోట్ల ప్రస్తావన ఉంది.

**33. ఓడ**:- తుఫానులు, ఉప్పెనలు వచ్చినప్పుడు మనిషిని ఓడ కూడా కాపాడ లేదు. అసలు తుఫానులు, ఉప్పెనలు ఏమీ రాకపోయినా సరే ఓడ అదుపు తప్పి ఏ పర్వతానికో ఢీ కొంటే కూడా మనిషికి ముప్పు తప్పదని, ఇటీవల కాలంలో సముద్రంలో మునిగిన "టైటానిక్" ఓడ నిరూపించింది.

అయితే ఎవరినైనా దేవుడు కాపాడ దలచుకుంటే ఉప్పెనలు వచ్చినా కాపాడుతాడు. చంపదలచుకుంటే ఓడ బయట కొండక్కి కూర్చున్నా సరే అతనికి చావు తప్పదు. నూహ్‌ప్రవక్త (అలైహి) దైవాజ్ఞతో నడిచే ఓడలో కూర్చొని, సముద్ర కెరటాలతో కుస్తీ పడుతున్న కొడుకుని పిలుస్తూ, ఓడలోకి వచ్చేయి బాబూ! అని ఎంత బతిమాలినా లాభం లేకపోయింది. పైగా సత్యతిరస్కారి అయిన ఆ దుష్టపుత్రుడు మరింత నీల్గుతూ 'నేనీ కొండెక్కి కాపాడుకుంటా' నంటూ వెళ్ళిపోయాడు. అంతలో ఓ పెద్ద కెరటం వచ్చి అతడ్ని ముంచి వేసింది. (వివరాలకు 11:42-43, 17:66-69 సూక్తులు చూడండి.)

**34. ఓరిమి**:- ఖుర్‌ఆన్‌లో "సబ్ర్" అనే పదానికి సహనం, స్థయిర్యం, స్థిరత్వం అనే అర్థాలు వున్నాయి. సాధారణంగా మానవుడు ప్రతి వ్యవహారంలోనూ లాభనష్టాలనే బేరీజు వేసుకుంటూ వుంటాడు. లాభం చేకూరే పనేదయినా కన్పిస్తే చాలు అటువైపు పరుగెత్తుతాడు. నష్టం వాటిల్లే సూచనలు వుంటే దాని నుండి పారిపోతాడు. అతని దృష్టి ప్రాపంచిక ఫలితాలు దాటి ఒక్క అడుగు కూడా ముందుకు పోదు. కాని పరలోకం దృష్ట్యా మానవులంతా ఘోరంగా నష్టపోతారని దివ్యఖుర్‌ఆన్ చెబుతోంది. ఆ నష్టం నుండి బయటపడేందుకు నాలుగు షరతులు విధించింది. **ఒకటి**, దేవుని మీద, ఆయన ప్రవక్త (సల్లం) మీద దృఢమైన విశ్వాసం. **రెండు,** సత్కర్మలు. **మూడు**, సత్యధర్మ ప్రచారం. **నాలుగు**, సహనోపదేశం. వివరాలకు 103వ అధ్యాయం (అస్ సూరా), దాని పాదసూచిక చూడండి.

**35. ఔదార్యం**:- దేవుడు ఎంతో ఉదార స్వభావుడు. ఆయన తన భక్తులను కూడా ఉదార బుద్ధితో వ్యవహరించాలని ఉపదేశిస్తున్నాడు.

**36. ఔషధం**:- ప్రతివ్యాధికి మందు (ఔషధం) ఉందన్నారు మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం). రోగగ్రస్తులకు ప్రయోజనం చేకూర్చే మూడు చికిత్సాపద్ధతుల్ని గురించి మరో హదీసు (బుఖారీ)లో ఉంది. ఒకటి, శస్త్రచికిత్స ద్వారా చెడు రక్తం తొలగించడం. రెండు, తేనెను సేవించడం. మూడు, వాతలు పెట్టడం. అయితే వాతల ప్రక్రియ అంటే తనకు ఇష్టం లేదన్నారు ఆయన.

తేనె చికిత్స గురించి ఖుర్‌ఆన్ కూడా సిఫారసు చేస్తూ, యోచించే వారికి ఇందులో గొప్ప సూచన ఉందని చెబుతోంది. ఇలాంటి తేనె పలుకుల్ని గురించి మరిన్ని వివరాలు తెలుసుకో దలచుకుంటే 16వ అధ్యాయం (తేనెటీగ) లోని 68,69 సూక్తులు చదవండి.

**37. కపట విశ్వాసులు**:- కపటవిశ్వాసులు ప్రతి యుగంలో, ప్రతి మతంలో, ప్రతి సంఘంలో, ప్రతిసంస్థలోనూ ఉన్నారు. వారిని ఒక హదీసులో దైవప్రవక్త (స) తెలిపినట్లు ఈ క్రింది నాలుగు లక్షణాలను బట్టి గుర్తించవచ్చు:

ఒకటి, భద్రపరచమని (లేక బాధ్యత వహించమని) వస్తువు (లేక పని) అప్పగిస్తే వారు నమ్మక ద్రోహానికి పాల్పడతారు. రెండు, నోరు విప్పితే అబద్ధమే పలుకుతారు. మూడు, వాగ్దానం చేస్తే దాన్ని భంగపరుస్తారు. నాలుగు, ఎవరితోనైనా జగడం పెట్టుకుంటే దుర్భాషకు దిగుతారు. (ఇతర వివరాల కోసం 63వ అధ్యాయం దాని ఉపోద్ఘాతంతో పాటు చూడండి).

**38. కాఫిర్-కుఫ్ర్**:- కుఫ్ర్ నుండే కాఫిర్ అనే పదం ఉద్భవించింది. కుఫ్ర్ అంటే దాచడం, కప్పిపుచ్చడం, కప్పిపెట్టడం అని అర్థం. ఇందులో నుంచే తిరస్కార భావం పుట్టింది. షరీఅత్ పరిభాషలో కుఫ్ర్ అంటే సత్యాన్ని కప్పిపుచ్చడం అని అర్థం. ఇలా వాస్తవం తెలిసి కూడా సత్యాన్ని కప్పిపుచ్చేవాడ్ని 'కాఫిర్' అంటారు. కాఫిర్ అంటే సత్యతిరస్కారి, అవిశ్వాసి అని అర్థం. అంటే అతను ఒక విషయం సత్యమని గ్రహించినప్పటికీ దాన్ని విశ్వసించకుండా నిరాకరిస్తాడు. మరోమాటలో చెప్పాలంటే అతను తన అంతరాత్మ ప్రబోధనను నొక్కి పడ్తాడన్నమాట. (అంతరాత్మ ప్రబోధన గురించి 89వ అధ్యాయం (ప్రాతఃకాలం)లో 27వ సూక్తికి రాసిన పాదసూచిక చూడండి.)

కప్పిపెట్టడం అనేఅర్థంలో రైతును కూడా కాఫిర్ అంటారు. రైతు విత్తనాల్ని భూమిలో కప్పిపెడ్తాడు. అంచేత అతడ్ని కాఫిర్ అంటారు. దాని బహువచనం కుప్ఫార్. (57:20 సూక్తితో పాటు, 2:161 సూక్తికి రాసిన పాదసూచిక కూడా చూడండి.)

**39. కుక్కతోక**:- ఈత రానివాడు కుక్కతోక పట్టి గోదావరి ఈదితే అది అతడ్ని ఒడ్డుకు చేర్చుతుందో లేదోగాని, ఆ తోకకు తాడుకట్టి సరిచేయడానికి ఎంత ప్రయత్నించినా అది మళ్ళీ వంకరగానే అయిపోతుంది. అరబీభాషా సంప్రదాయం ప్రకారం ఖుర్ఆన్‌లో కుక్కతోకకు బదులు కుక్కనాలుక ప్రస్తవన వచ్చింది. కుక్కను కొట్టినా కొట్టకపోయినా అది తన నాలుక జాపే వుంచుతుంది. అది దాని నైజం. ఈ నైజం కొందరు మనుషుల్లో కూడా వుంటుంది. ప్రాపంచిక వ్యామోహంలో పడి మనోవాంఛలకు బానిసైనవాడు దైవబోధనలు విని అందులోని వాస్తవికతను గ్రహించి కూడా తన శునకపు నైజాన్ని మార్చుకోలేడు. (7:175-176 సూక్తులు చూడు.)

**40. ఖలీఫా**:- ఖలీఫా అంటే దేవుని ప్రతినిధి. జీవితంలోని ప్రతి రంగంలోనూ దేవుని ఆదేశానుసారం నడుచుకునేవాడని అర్థం. (2:30, 6:165 సూక్తులు, వాటి పాదసూచికలు చూడు.)

**41. ఖారూన్**:- 'ధనమూలమిదం జగత్తు' అనుకున్నాడు ఖారూన్ అనే వాడొకడు మూసాప్రవక్త (అలైహి) కాలంలో. అందుకే అతను మంచి-చెడు, ధర్మం-అధర్మం, సక్రమం-అక్రమం అనే విచక్షణ ఎంతమాత్రం చేయకుండా పెద్ద యెత్తున వెండి-బంగారాలు, వజ్ర-వైఢూర్యాలు, ఇతర అనేక విలువైన వస్తువుల్ని పోగుచేసి వేలాది ఇనుప పెట్టెలలో దాచి, ఇక ప్రపంచంలో ఫిరౌన్‌రాజు తరువాత తన కంటే గొప్పవాడు లేడని మీసం మెలేశాడు. బహుశా అతను నేటి మైక్రోసాఫ్ట్ కంపెనీ అధిపతి బిల్‌గేట్స్



కంటే కూడా పెద్ద ధనికుడయి వుండవచ్చు. అసలతను సిరిసంపదలు దాచిన పెట్టెలు, బీరువాలకు సంబంధించి తాళపు చెవులే ఎన్నో ఉన్నాయట! ఆ తాళపుచెవుల గుచ్చను మోయడానికే సుమారు పది పన్నెండు మంది మనుషులు కావలసి వుండేదట!!

కాని అంతటి ధనం కూడా ఈ దౌర్భాగ్యుడ్ని కాపాడలేక పోయింది. అతను ఓ రోజు హఠాత్తుగా తన ఆస్తులు, సిరిసంపదలతో సహా నేలలోకి శాశ్వతంగా దిగబడి పోయాడు. (28:76-82 సూక్తులు చూడండి). అయితే ఈనాడు కొందరు ఈ చారిత్రక సంఘటన నుండి గుణపాఠం నేర్చుకోవడానికి బదులు, పురావస్తు పరిశోధన పేరుతో భూమిలో లోతుగా దిగబడిపోయిన ఆ ధనరాసుల్ని వెలికి తీయడానికి ప్రయత్నిస్తున్నారట!

**42. ఖిజర్ (అలైహి)**:- ఒక వ్యక్తి ఎవరినయినా హత్యచేస్తే లోకం ఆ హత్యా నేరాన్ని ఆ మనిషిపై మోపుతుంది. అదే ఏదయినా రోగం వచ్చి చనిపోతే ఎవరి మీదా నింద రాదు. కాని జీవన్మరణాలు, కష్టసుఖాలు, లాభనష్టాలు అన్నీ దేవుని చేతిలోనే ఉన్నాయి. ఆయన ఆజ్ఞ లేనిదే చెట్టు నుండి ఆకైనా రాలదు. అలాగే ఆ వ్యక్తి చనిపోవడం వల్ల భవిషత్తులో సమాజానికి ఏదైనా ప్రయోజనం చేకూరవచ్చు; ఇంకా బ్రతికివుంటే నష్టం కలగవచ్చు. ఈ వాస్తవం దేవునికి మాత్రమే తెలుసు. ప్రజలు జరిగిన సంఘటనలద్వారా ఉత్పన్నమయ్యే ఫలితాలను గురించి తప్పుడు అంచనాలు వేస్తారు. అలాగే దోపిడీదౌర్జన్యాలతో తాత్కాలిక ప్రయోజనాలు పొందిన వారు కూడా భవిష్యత్తును గురించి బంగారు కలలు కంటారు.

బహుశా ఈ యదార్థం తెలియ జేయడానికే దేవుడు మూసాప్రవక్త (అలైహి) కాలంలో ఖిజర్ (అలైహి)ని రంగంలోకి దించాడు. ఆయన మూసా (అలైహి) సమక్షంలో ఒక పడవకు రంధ్రం వేసి నష్టం కలిగించడం; తమకు ఆతిథ్యమివ్వడానికి నిరాకరించిన ఊళ్ళో పడిపోయిన గోడను రిపేర్ చేయడం; ఏ పాపమెరగని ఒక బాలుడ్ని చంపడం జరిగాయి. కాని మూసా (అలై)కు ఇవన్నీ అర్థంగాక ప్రతిసారీ అసహనాన్ని వెలిబుచ్చుతారు. చివరికి ఇవన్నీ తాను దైవాజ్ఞతోనే చేశానని ఖిజర్ (అలై) చెబుతారు. దీన్నిబట్టి ఖిజర్ (అలై) మానవమాత్రుడు కాదని, మానవరూపంలో వచ్చిన దైవదూతయి ఉంటారని కొందరు ధర్మవేత్తలు అభిప్రాయపడ్డారు. ఆయన వృత్తాంతం వివరంగా 18వ అధ్యాయం 60-82 సూక్తుల్లో వుంది, చూడండి.

**43. ఖిబ్లా**:- ఖిబ్లా అంటే ఆరాధనా కేంద్రం. మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం), ఆయన అనుచరులు మొదట్లో దాదాపు 17నెలల దాకా బైతిల్ మఖ్దిస్ మసీదునే ఖిబ్లాగా చేసుకొని నమాజు చేశారు. ఆ తర్వాత దైవాజ్ఞతో కాబాగృహాన్ని ఖిబ్లాగా చేసుకొని నమాజు చేయడం ప్రారంభించారు. (2:142-150, 2:177 సూక్తులు చూడండి.)

**44. ఖుర్ఆన్**:- ఖుర్ఆన్ అంటే పఠనగ్రంథం, పాఠ్యగ్రంథం, పారాయణగ్రంథం అని అర్థం. ఈ అర్థం దృష్ట్యా విద్యార్థులు తమ పాఠ్యపుస్తకం చదివేలా దీన్ని నిత్యం పఠిస్తూఉండాలి. ఈ భావంలోనే దేవుడు ఖుర్ఆన్‌లో ఓ చోట గత దైవగ్రంథాల్ని కూడా ఖుర్ఆన్ అని ప్రస్తావించాడు. అంటే ఆయా కాలాల్లో అవి పాఠ్యగ్రంథాలన్న మాట. నేటి కాలంలో ప్రళయం వరకూ ఖుర్ఆన్ మాత్రమే నిత్యం పఠిస్తూ ఆచరించవలసిన ఏకైక దైవగ్రంథం. (15:91 సూక్తి చూడండి.)

**45. ఖుర్బానీ (త్యాగం)**:-ఖుర్బానీ అనగానే బక్రీదు పండుగనాడు పశువుని జిబహ్ చేసి తాము తినడం, ఇరుగుపొరుగుకు పంచడమే కదా అనుకుంటారు చాలామంది ముస్లింలు. కాని దీని వెనుక ఓ చారిత్రక గాథ ఉంది. ఇబ్రాహీం ప్రవక్త (అలైహి) కలలో గాంచిన సూచనను ఆచరణలో పెట్టేందుకు తనకు అత్యంత ప్రేమపాత్రుడైన ఏకైక కుమారుడ్ని జిబహ్ చేయడానికి సిద్ధమవుతారు అప్పుడు దేవుడు దీనిపట్ల ప్రసన్నుడై ఆయన పుత్రుని స్థానంలో ఓ పశువుని పంపి జిబహ్ చేసుకోమని చెబుతాడు. ఈ త్యాగానికి సంకేతంగా స్థోమతగల ముస్లింలంతా ప్రతియేడూ ఖుర్బానీ(బలి) ఇస్తున్నారు. ఈ బలిదానం ద్వారా తాము దైవప్రసన్నత కోసం అవసరమైతే ఎలాంటి త్యాగానికైనా సిద్ధపడతామని వారు ప్రతిజ్ఞ చేస్తున్నారు. త్యాగభావం లేని పశుబలి నిరర్థకం. (37:99-110, 22:36-37 సూక్తులు చూడండి)

**46. గగన పర్యటన (మేరాజ్)**:- మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) దేవుని మహిమతో కొన్ని క్షణాలలోనే సప్తాకాశాలు పర్యటించి, కొందరు దైవప్రవక్తలను కలసి, స్వర్గనరకాలు చూసి, సృష్టికర్తతో ప్రత్యక్ష సంభాషణ జరిపి తిరిగొచ్చారు. దీన్నే మేరాజ్ అంటారు. (17:1 సూక్తి, దాని పాదసూచిక చూడండి.)

**47. గుహవాసులు**:- క్రీ.శ. 249-251 మధ్య కాలంలో రోమ్‌చక్రవర్తి సీజర్ డేసియస్ తమ పూర్వీకుల (బహుదైవారాధనా) మతాన్ని విడనాడి నిజధర్మం (ఇస్లాం) అవలంబించిన ఈసాప్రవక్త (అలైహి) అనుచరుల్ని వేధించసాగాడు. అప్పుడు కొందరు యువకులు తాము అవలంబించిన నిజధర్మాన్ని కాపాడుకోవడానికి పారిపోయి సుదూర ప్రాంతంలోని ఓ కొండగుహలో దాక్కుంటారు. క్రైస్తవపండితుడు జేమ్స్ సరూజి, ప్రముఖ చరిత్రకారుడు గిబ్బన్ చేసిన పరిశోధనల ప్రకారం వారక్కడ దాదాపు 196 సంవత్సరాలు నిద్రావస్థలో గడిపారు. తరువాత ఆ యువకులు క్రీ.శ. 445-446 మధ్య కాలంలో మేల్కొన్నారు. అప్పటికే ఆనాటి రోమ్ పాలకుడైన సీజర్ థియోడోసిస్, అతని ప్రజలు క్రైస్తవులుగా మారివున్నారు. ఈ విచిత్ర సంఘటన చూసి ప్రజలు ఎంతో ప్రభావితులయ్యారు. ఆ యువకులు తిరిగి గుహలోకి ప్రవేశించడం, వారి ఆత్మలు అనంత వాయువుల్లో కలసిపోవడం జరిగింది. (18:9-26 సూక్తులు, వాటి పాదసూచికలు.)

**48. గోయజ్ఞం**:- ఈజిప్టు, పాలస్తీనా బహుదైవారాధకులు పూజించే విభిన్న విగ్రహాలలో ఆవు, ఎద్దు విగ్రహాలు కూడా ఉండేవి. వీటి ప్రభావానికి యూదులు కూడా గురయ్యారు. ముఖ్యంగా గోభక్తి వారి హృదయాల్లో బాగా తిష్ఠ వేసుకుంది.

యూదులు ఈజిప్టులో మూసాప్రవక్త (అలైహి) ద్వారా ఎన్నో దైవమహిమల్ని కళ్ళారా చూశారు. దేవుని మహిమతోనే సముద్రం చీలిపోయి దారి ఏర్పడి, ఆ దారి గుండా తాము క్షేమంగా తీరానికి చేరుకోవడం, తమ కళ్ళముందే సముద్రం తిరిగి కలసిపోయి అందులో ఫిరౌన్‌రాజు, అతని సైనికులు మునిగి నాశనమై పోవడం కూడా వారు చూశారు. అయినప్పటికీ వారికి కన్పించని దేవుని మీద పూర్తిగా నమ్మకం కుదరలేదు. అందుకే యూదులు సముద్రం దాటిన తరువాత సినాయి ప్రాంతంలో ప్రయాణం చేస్తున్నప్పుడు ఒక ఊళ్ళో బహుదైవారాధకులు పూజిస్తున్న విగ్రహాలను చూసి తమకు కూడా అలాంటి ఒక దేవతను తయారుచేయించి ఇవ్వమని మూసా (అలై)ని అడిగారు. (7:138-140 సూక్తులు చూడండి.)



ఆ తరువాత మరికొన్నాళ్ళకు సినాయి ద్వీపకల్పంలో నివసిస్తున్నప్పుడు వారు మరోసారి విగ్రహారాధనకు పాల్పడ్డారు. మూసా ప్రవక్త (అలై) దైవాజ్ఞ ప్రకారం తూర్ కొండకు వెళ్ళినప్పుడు సామిరి అనేవాడు యూదుల దగ్గరున్న బంగారు నగలను కరగబెడ్తూ అందులో నుంచి ఒక ఆవుదూడ విగ్రహం తయారు చేశాడు. పైగా ఆ విగ్రహంలో నుంచి దూడఅరుపు లాంటి ధ్వని విన్పించేలాచేసి "ఇదే మీఆరాధ్యదైవం, మూసా ఆరాధ్యదైవం కూడా ఇదే; దీన్ని ఆయన మరచిపోయాడు" అన్నాడు. అతని మాయమాటలు విని అనేకమంది ఆ విగ్రహాన్ని పూజించడం మొదలెట్టారు. హారూన్ ప్రవక్త (అలై) ఎంత నచ్చజెప్పినా వినలేదు. పైగా మూసా తిరిగొచ్చేదాకా తాము దీన్నే పూజిస్తూవుంటామని చెప్పారు. మూసాప్రవక్త (అలై) తిరిగొచ్చి యూదుల నిర్వాకం పట్ల తీవ్రఆగ్రహం వెలిబుచ్చారు. సామిరీని "నీవు అంటరాని వాడవుతావ"ని శపించారు. ఆ తర్వాత విగ్రహాన్ని కాల్చి మసిచేసి పారేశారు. (20:85-97, 7:148 సూక్తులు చూడండి.)

మూసాప్రవక్త (అలైహి) మందలింపు, హితోపదేశాల తరువాత యూదులు తమ నిర్వాకంపట్ల పశ్చాత్తాపం చెందారు (7:149). అయితే ఈ పాపానికి నిష్కృతిగా గోపూజకు పాల్పడినవారిని గోపూజ జోలికి పోనివారు వధించాలని మూసా (అలైహి) ఆదేశించారు (2:54). దాని ప్రకారం గోభక్తులందర్నీ వధించడం జరిగింది. ఇలా డెబ్భైవేలమంది గోభక్తులు హతమయినట్లు తెలుస్తోంది.

(ఇబ్నె కసీర్, ఫతహుల్ ఖదీర్).

బహుదైవారాధకుల నుండి యూదులకు సంక్రమించిన ఈ గోభక్తి జాఢ్యం ఓ పట్టాన వారిని వదల్లేదు. వారి హృదయాలలో ఇంకా తిష్ఠవేసే వుంది. అందువల్ల దేవుడు వారి చేతులతోనే గోవుని వధింపజేయాలని భావించాడు కాబోలు, ఆ సందర్భం వచ్చింది. యూదుల్లో వారసులులేని ఒక ధనికుడు ఉండేవాడు. అతని సోదరుని కుమారుడు అతని ధనాన్ని కాజేసే ఉద్దేశ్యంతో ఓ రోజురాత్రి అతడ్ని చంపి, శవాన్ని ఇతరుల ఇంటి ముందు పడవేశాడు. అందువల్ల యూదులు హంతకుడు ఎవరో నిర్ధారించుకోలేక పరస్పరం ఆరోపణలు చేసుకోసాగారు. చివరికి ఈ వ్యవహారం మూసా (అలైహి) దృష్టికి వచ్చింది. ఆయన, 'ఒక ఆవుని చంపి దాని మాంసపు ముక్కనొక దానితో హతుని దేహమ్మీద చరిస్తే అతను బ్రతికి తనను హత్యచేసిన వారెవడో చెబుతాడ'ని అన్నారు. యూదులు అలా చేయగానే హతుడు బ్రతికిలేచి తనను చంపిన వాడెవడో చెప్పి తిరిగి చనిపోయాడు (ఫతహుల్ ఖదీర్)...గోవు ఎంపిక, దాని వధ గురించిన వివరాల కోసం 2:67-73 సూక్తులు చూడండి.

**49. గ్రంథప్రజలు**:- గ్రంథ ప్రజలంటే అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం)కు పూర్వం ప్రభవించిన దైవప్రవక్తల అనుచరులని అర్థం. ఖుర్ఆన్ పరిభాషలో యూదుల్ని, క్రైస్తవుల్ని గ్రంథ ప్రజలు (అహ్లెకితాబ్) అంటారు.

**50. ఘటన**:- జరిగిపోయిన విషయాన్ని మాత్రమే ఘటన అంటాం మనం. కాని ఖుర్ఆన్‌లో దేవుడు ప్రళయం ఇంకా సంభవించక పోయినా సంభవించినట్లు దాన్ని జరగబోయే సంఘటనగా పేర్కొన్నాడు. సంఘటన అనగానే అది ఓయదార్థం, వాస్తవం అనే భావాలు మన మనసులో మెదలుతాయి. ఈ భావంలోనే దేవుడు జరగబోయే ప్రళయాన్ని సంఘటన అని అన్నాడు. అంటే అది తప్పకుండా సంభవించి తీరుతుందని,

అందులో ఏమాత్రం సందేహంలేదని అర్థం. (56:1-6, 69:1-5 సూక్తులు చూడండి)

**51. ఘోరం**:- మద్యం ఎక్కడ సేవించినా ఘోరపాపమే. కాని మసీదులో సేవిస్తే అది అంతకన్నా ఘోరమైన పాపం అవుతుంది. అలాగే వ్యభిచారం ఎవరితో చేసినా నేరమే. కాని సొంత సోదరితో, కన్న కూతురితో వ్యభిచరిస్తే అది అంతకంటే ఘోరమైన నేరమవుతుంది. అదేవిధంగా హింసా పీడనలు హత్యారక్తపాతాల కన్నా చాలా ఘోర మైన దుష్కార్యాలని ఖుర్ఆన్ చెబుతోంది. (2:217 సూక్తి చూడండి.)

**52. చంద్రఖండన**:- దైవప్రవక్త (సల్లం) కాలంలో ప్రళయం అతి త్వరలో సంభవిస్తుం దనడానికి సూచనగా ఓ పౌర్ణమినాడు చంద్రుడు రెండు ఖండాలుగా చీలిపోయి తిరిగి వెంటనే కలసిపోయాడు. (వివరాలకు 54:1 సూక్తి, దాని పాదసూచిక.)

**53. చదువు**:- "మానవుడ్ని సృష్టించిన నీ ప్రభువు పేరుతో చదువు....అతనికి కలం ద్వారా జ్ఞానం నేర్పిన శక్తిస్వరూపుని పేరుతో చదువు" అని తొలి దివ్యావిష్కృతి సందర్భంగా దైవదూత జిబ్రీల్ (అలైహి) ముహమ్మద్ మహనీయుని (సల్లం) ముందు ప్రత్యక్షమై అంటారు. కాని తనకు చదువు రాదంటారు ఆయన. దైవవాణిని ఈ మనిషి తన కవితా పటిమతో స్వయంగా కల్పించి చెబుతున్నాడని సత్యతిరస్కారులు ఆరోపించే ప్రమాదం ఉండటంతో దేవుడు సత్యమంతుడు, నిజాయితీపరుడైన ముహమ్మద్ (స) వంటి నిరక్షరాస్యుడ్నే ప్రవక్తగా నియమిస్తాడు. (96:1-5 సూక్తులు, వాటి ఉపోద్ఘాతం.)

అయితే ఆ తరువాత దైవప్రవక్త (స) చదువుకు ఎంతో ప్రాముఖ్యమిస్తూ "ముస్లిం అయిన ప్రతి స్త్రీ పురుషుడు విధిగా చదువు నేర్చుకోవాలి" అని తన అనుచరులకు బోధించారు. బద్ర్ యుద్ధంలో పట్టుబడిన ఖైదీలను నష్టపరిహారంగా ధనం స్వీకరించి విడుదల చేస్తున్నప్పుడు, ఆయన చదువు వచ్చిన పేద ఖైదీలు చదువురాని తన అనుచరులకు చదువు నేర్పాలన్న షరతుపై వారిని విడిచిపెట్టారు. మతవిశ్వాసాన్ని దృఢతరం చేసే సాధనం **చదువే**. చదువుకున్నవారే దేవునికి ఎక్కువగా భయపడతారని ఖుర్ఆన్ (35:28) కూడా చెబుతోంది. కాని ధనికులు లక్షలు ఖర్చు పెట్టి చదువు 'కొంటున్న' ఈ రోజుల్లో పేదవాళ్ళు చదువు 'కొనలేక' పోతున్నారు. ముఖ్యంగా వారికి పై చదువులు గగన కుసుమాలయి పోయాయి.

**54. చర్మ చక్షువులు**:- ఒక వస్తువుని నిజంగా చూశానని చెప్పడానికి ఉర్దులో "నా రెండుకళ్ళతో చూశాన"ని, తెలుగులో "నా కళ్ళారాచూశాన"ని లేదా నా చర్మచక్షువులతో వీక్షించాన"ని అంటారు. అయితే కొందరు రెండు కళ్ళు కాదు, పదహారు కళ్ళున్నా ఆ చర్మచక్షువులతో సత్యాన్ని చూడలేరు. దాని కోసం హృదయచక్షువులు కావాలి. హృదయచక్షువులు లేనివారికి సత్యం ఎన్నటికీ గోచరించదని, వారు కళ్ళున్న గుడ్డివాళ్ళు, చెవులున్న చెవిటివాళ్ళని ఖుర్ఆన్ బోధనలు తెలుపుతున్నాయి. (47:23-24, 22:45-46 సూక్తులు, 7:179 సూక్తి, దాని పాద సూచిక చూడండి.)

**55. ఛత్రదిన శిక్ష**:- అయికాజాతి ప్రజలు తమ ప్రవక్త షుఐబ్ (అలైహి)ను తిరస్క రించడంతో దేవుడు వారిని గొడుగుఆకారం మేఘం పంపి శిక్షించాడు. (26:189 సూక్తి, దాని పాదసూచిక చూడండి)

**56. ఛీత్కారం**:- సత్యం స్పష్టంగా ముందుకు వచ్చినప్పటికీ దాన్ని తిరస్కరించి



అవిశ్వాసులైపోయినవారిని దేవుడు, ఆయనదూతలు, ప్రవక్తలు శపించారు. ముఖ్యంగా యూదులపై దేవుని ఛీత్కారం పడింది. (3:87-89, 5:60,78,79 సూక్తులు చూడండి.)

**57. జకరియ్యా (అలైహి)**:- ఈయన ఈసా, యహ్యా ప్రవక్తలకు పూర్వం వుండిన దైవప్రవక్త. హారూన్ ప్రవక్త (అలైహి) సంతతికి చెందిన ఇరవయి నాలుగు కుటుంబాలు 'బైతిల్‌మఖ్దిస్'కు వంతులవారిగా సేవ చేసేవారు. ఆ కుటుంబాలలో అబ్యా కుటుంబా నికి నాయకుడయిన జకరియ్యా తన వంతు వచ్చినప్పుడల్లా ఈ సేవలో నిమగ్నులయ్యే వారు. ఈసాప్రవక్త (అలైహి) మాతృమూర్తి హజ్రత్ మర్యం (అలైహి) ఈయన సంరక్షణ లోనే ఇవ్వబడ్డారు. (3:37-41, 19:2-9 సూక్తులు చూడండి.)

అయితే నైతిక, సామాజిక సంస్కరణల కోసం హజ్రత్ జకరియ్యా (అలైహి) చేసిన హితోపదేశాల్ని యూదులు సహించలేక ఆయన్ని అన్యాయంగా చంపివేశారు. స్వయంగా యూదుల మతగ్రంథం తల్మూద్ ప్రకారం బఖ్త్ నస్సర్ అనే రాజు బైతిల్ మఖ్దిస్ (జెరూసలేం)పై విజయం సాధించిన తరువాత యూదుల ఆరాధనాలయం (అఖ్సా)లో ప్రవేశించి పరిశీలిస్తుంటే వధ్యశిల సమీపంలో ఒకచోట గోడ మీద అతనికి బాణం తగిలిన గుర్తు కన్పించింది. ఇదేమిటని అడిగితే "ఇక్కడ మేము జకరియ్యా ప్రవక్తను సంహరించాము. ఆయన మాలో వున్న చెడుగుల్ని చూసి మమ్మల్ని విమర్శిస్తూ వుండేవారు. చివరికి మేము ఈ విమర్శల్ని, నిందల్ని సహించలేక ఆయన్ని చంపివేశాం" అని అన్నారు యూదులు.

**58. జకాత్**:- ఇది ధనికుల నుండి వసూలు చేసి పేదలకు ఇవ్వబడే ఆర్థిక హక్కు. ఇస్లాంలో నమాజు తరువాత దీనికే అత్యధిక ప్రాధాన్యం ఉంది. నిర్ణీత సంపద కలిగిన ప్రతి ముస్లిం తన సంపద నుంచి సంవత్సరానికి ఒకసారి రెండున్నర శాతం చొప్పున ధనం తీసి నిరుపేదలు, ధర్మసంస్థాపనా కార్యకలాపాల కోసం విధిగా వినియోగించాలి. (2:43 సూక్తి, దాని పాదసూచిక చూడండి.)

**59. జఖ్కూమ్**:- ఇది నరకానికి పోయిన వాళ్ళకు లభించే ఆతిథ్యం. అమిత వేడిగా, వాడిగా, వగరుగా, పరమచేదుగా, దుర్గంధభూయిష్టంగా, రాకాసి తలల మాదిరి భయం కరంగా వుండే ఈ వృక్షఫలాలను నరకవాసులు ఆవురావురుమంటూ తిని యమ యాతనలకు గురవుతారు. (56:56, 44:43-46, 37:64-66 సూక్తులు చూడండి.)

**60. జిహాద్ (పోరాటం)**:- జిహాద్ అనగానే ఖడ్గమో, తుపాకో తీసుకొని రణరంగం లో దూకడమే అనుకుంటారు చాలామంది. ఇది ఏమాత్రం సరైన అభిప్రాయం కాదు. జిహాద్ అంటే "ఆశయ సాధన కోసం శక్తివంచన లేకుండా నిర్విరామంగా కృషిచేయ డం, పోరాడటం" అని అర్థం. దీన్ని కొంతవరకు struggle అనే ఇంగ్లీషు పదంతో పోల్చవచ్చు. జిహాద్ ఇంతకంటే కూడా విస్తృత భావంతో కూడిన మాట. నిరంతరం ఆశయాన్నే దృష్టిలో పెట్టుకొని దాని కోసం పథకాలు రూపొందించడం, వాక్కు, వ్రాతల ద్వారా ప్రచారం చేయడం, అందుబాటులో వుండే ఒనరులన్నిటిని వినియోగించు కోవడం, అనివార్యమైతే ఆయుధం చేబట్టి పోరాడటం, అవసరమయితే ఆ మార్గంలో ప్రాణాలు సైతం ధారబోయడం- ఇవన్నీ జిహాద్ క్రిందికే వస్తాయి. దైవప్రసన్నత పొందే సత్సంకల్పంతో ధర్మపరిరక్షణ కోసం, హింసాదౌర్జన్యాలను అరికట్టేందుకు చేసే ఇలాంటి

పోరాటాన్ని 'జిహాద్ ఫీ సబీలిల్లాహ్' (దైవమార్గంలో పోరాటం) అంటారు. (2:218, 4:95 సూక్తులు, వాటి పాదసూచికలు చూడండి.)

61. **జుల్ఖర్నైన్**:- ఈయన దైవప్రవక్తో కాదో ఖుర్ఆన్, హదీసుల్లో ఎలాంటి ఆధారాల్లేవు. అయితే ఈయన ప్రముఖవ్యక్తి, గొప్పరాజు అయివుంటాడని చెప్పవచ్చు. (18:83-98 సూక్తులు)

62. **జూదీ పర్వతం**:- ఇది పెనుతుఫాను వచ్చినప్పుడు నూహ్‌ప్రవక్త (అలైహి) ఓడ నిలిచిన పర్వతం పేరు. (11:44 సూక్తి, దాని పాద సూచిక చూడండి.)

63. **ఝురులు**:- అంటే నదులు లేక సెలయేరులు. స్వర్గంలో అందమైన మేడలు, ఆకాశహర్మ్యాల మధ్య చల్లటి సెలయేరులు ప్రవహిస్తుంటాయని ఖుర్ఆన్ చెబుతోంది. ఇవి మంచినీటి సెలయేరులు. ఇవేగాకుండా పాల నదులు, మద్యం ఏరులు, తేనె ఝురులు కూడా స్వర్గంలో నిత్యం ప్రవహిస్తుంటాయని తెలుస్తోంది. (47:15 సూక్తి చూడండి.)

64. **డంబాలు (ప్రగల్భాలు)**:- ముస్లింలు ప్రతి సత్కార్యమూ దైవప్రసన్నత కోసమే చేయాలి. మనిషి లోకులమెప్పు కోసం ప్రదర్శనా బుద్ధితో చేసే సత్కార్యాలకు పుణ్యం దక్కకపోగా పాపం మటుకు అతని ఖాతాలో తప్పకుండా పడిపోతుంది. ఇక చేయని పనులను గురించి చెప్పుకోవడం, అంటే డంబాలు కొట్టుకోవడం, ప్రగల్భాలు పలకడం మరింత పాపమవుతుంది. (61:2-3, 3:188, 4:60 సూక్తులు, వాటి పాద సూచికలు.)

65. **డొల్ల (బోలు)**:- లోతట్టు కోసుకుపోయి డొల్ల ఏర్పడిన నదీతీరంపై ఇల్లు కట్టుకుంటే అది ఎంతో కాలం నిలవదు. బోలు కర్రలు గట్టిగా లేకపోయినా గాలి వీచినప్పుడల్లా రొద చేస్తూ తమ ఉనికిని చాటుకోవడానికి నానా తంటాలు పడతాయి. ఏమీ వడ్డించని విస్తరి ఎగిరెగిరి పడుతుంది. కపటవిశ్వాసుల స్థితి కూడా అచ్చం ఇలాగే వుంటుందని ఖుర్ఆన్ అంటోంది. (9:109, 63:4 సూక్తులు, వాటి పాదసూచికలు.)

66. **తల్లిదండ్రులు**:- ఇస్లాంలో దేవుని హక్కులు, దాసుల హక్కులని రెండు రకాల హక్కులున్నాయి. దాసుల హక్కులలో ప్రప్రథమ హక్కు తల్లిదండ్రులదే. దైవారాధన తరువాత తల్లిదండ్రుల సేవకు ఖుర్ఆన్ ఎంతో ప్రాముఖ్యం ఇస్తుంది. దయలేని పుత్రుడ్ని దేవుడు ఎన్నటికీ కనికరించడు.(17:23-24, 31:14-15 సూక్తులు.)

67. **తాగూత్**:- తాగూత్ అంటే హద్దు మీరేవాడు అని అర్థం. షరీఅత్ పరిభాషలో, దేవుని దాసుడిగా ఉండవలసినవాడు హద్దు మీరిపోయి స్వయంగా దేవుడయి దైవ దాసుల చేత దాస్యం చేయించుకునేవాడని భావం. (2:256-257, 4:60 సూక్తులు, వాటి పాదసూచికలు చూడండి.)

68. **తాలూత్, జాలూత్**:- సుమారు మూడువేల సంవత్సరాల క్రితం యూదుల రాజ్యంపై శత్రు దాడులు అధికమైనప్పుడు వాటిని సమర్థవంతంగా ఎదుర్కోగల నాయకుని అన్వేషణ మొదలైంది. ఆ రోజుల్లో సముయేల్ ప్రవక్త (అలైహి) వారికి నాయకునిగా ఉండేవారు. కాని అప్పటికి ఆయన బాగా వృద్ధుడయి పోయారు. అందువల్ల యూదుల పెద్దలు తమకొక రాజుని నియమిస్తే అతని నాయకత్వాన



తాము దైవమార్గంలో యుద్ధం చేస్తామని అంటారు. అయితే దైవప్రవక్త (అలై) వారి కోసం తాలూత్ అనే ఓ ఆజానుబాహుడ్ని నాయకునిగా, సేనాపతిగా నియమించి పంపుతారు. చివరికి యుద్ధంలో శత్రుపక్షం రాజయిన జాలూత్‌ని ఓ నూనూగు మీసాల నవయుకుడు సంహరిస్తాడు. ఆ నవయువకుడు మరెవరో కాదు, భావి దైవప్రవక్త హజ్రత్ దావూదే (అలైహి). (వివరాలకు 2:246-251 సూక్తులు చూడండి.)

69. **తువా లోయ**:- ఇది సీనాయి ద్వీపకల్పం దక్షిణ ప్రాంతంలోని ఒక లోయ పేరు. ఈ లోయలోనే దేవుడు మూసాప్రవక్త (అలైహి)తో ప్రత్యక్షంగా సంభాషించి ఆయన్ని తన ప్రవక్తగా నియమించాడు. (20:9-24, 27:7-12 సూక్తులు చూడండి.)

70. **తౌరాత్**:- తౌరాత్ అంటే ఆజ్ఞలు అని అర్థం. దీన్ని క్రైస్తవులు పాతనిబంధన అంటారు. తూర్ పర్వతంపై మూసాప్రవక్త (అలై)కు దేవుడు రాతిపలకలపై ఇచ్చిన పది ఆజ్ఞలతో పాటు, ఆనాటి ధర్మశాస్త్రంతో కూడిన దివ్యగ్రంథాన్ని తౌరాత్ అంటారు. ప్రస్తుతం ఇది దాని నిజరూపంలో లేదు. అసలుగ్రంథం ఏనాడో యుద్ధాలలో కనుమరుగైపోయింది. నేడు పాతనిబంధన పేరుతో బైబిల్‌లోని బోధనలన్నిటిని తౌరాత్ బోధనలుగా పరిగణించలేం. ఇవి అనేక ప్రక్షిప్తాలకు, నిక్షిప్తాలకు గురైన విషయాలు మాత్రమే.

71. **త్రాసు**:- ఖుర్ఆన్‌లో మీజాన్ అనే పదం వచ్చింది. ఇది న్యాయానికి సూచనగా పరిగణించబడుతుంది. ప్రళయదినాన దేవుని న్యాయస్థానంలో మానవుల కర్మలను తూచడానికి కూడా త్రాసు ఉపయోగించ బడుతుంది. (101:1-11 సూక్తులు, వాటి పాదసూచికలు చూడండి.) తూనికలో ఇది ప్రముఖ పాత్ర వహిస్తుంది. (83:4 సూక్తి, దాని పాదసూచిక చూడండి.)

72. **దత్త పుత్రుడు**:- సంతానంలేని శ్రీమంతులు తమ తదనంతరం తమ ఆస్తులు ఇతరులకు దక్కనివ్వకుండా, తమ కుటుంబంలోనే శాశ్వతంగా ఉంచుకోవడానికి పెంపుడు కొడుకును తెచ్చుకొని ఆ ఆస్తులు అతని పేర రాస్తారు. ఇస్లాం ఈ పెట్టుబడి దారీ వైఖరిని నిరసిస్తూ ధనవికేంద్రీకరణ విధానాన్ని కోరుతుంది. అంచేత ఇస్లాం దత్త స్వీకార విధానాన్ని నిషేధించింది. వారసత్వంరీత్యా, వివాహ సంబంధం రీత్యా దత్త పుత్రుడు ఎన్నటికీ సొంతకొడుకు కాలేడని చెబుతోంది. (వివరాలకు 33:4,5,37 సూక్తుల తోపాటు 24వ అధ్యాయం ఉపోద్ఘాతంలోని 5, 6 పేరాలు కూడా చూడండి.)

73. **దివ్యావిష్కృతి**:- అరబీ భాషలోని "వహీ" అనే పదానికి సూచించడం, సంకేతం పంపడం, హృదయంలో ఏదైనా విషయం జనింపజేయడం, రహస్యంగా ఏదైనా మాట చెప్పడం, సందేశం పంపడం అనే అర్థాలున్నాయి. ప్రత్యేకంగా దేవుడు తన దూత ద్వారా తన ప్రవక్తలకు దివ్యసందేశం చేరవేసే 'వహీ' పద్ధతిని తెలుగులో నేనిక్కడ 'దివ్యావిష్కృతి' అని అనువదించాను. కొందరు సత్యసందర్శనం అని అనువదించారు.

దివ్యావిష్కృతిని ప్రవక్తలకు అందజేసే దైవదూత పేరు జిబ్రీల్ (అలైహి). మహాప్రవక్త ముహమ్మద్ (స)కు జిబ్రీల్ దూత (అలై) ఒక్కోసారి మానవరూపంలో, మరొక్కోసారి తన నిజరూపంలో వచ్చి దివ్యావిష్కృతిని అందజేస్తారు. అంతేకాదు. దివ్యావిష్కృతి ఒక్కోసారి కర్ణకఠోరంగా విన్పించే గంటమోతలా వచ్చి దైవప్రవక్త (స) హృదయాంతరాళంలో ప్రవేశిస్తుంది. మరొక్కోసారి అది అవతరిస్తున్నప్పుడు ఎముకలు కొరికే చలి వున్నప్పుడు

కూడా దైవప్రవక్త (సల్లం) నుదుటిపై ముచ్చెమటలు కమ్ముతాయి.

**74. దీన్**:- దీన్ అంటే జీవితవిధానం, జీవిత సంవిధానం, జీవన వ్యవస్థ అని అర్థాలు ఉన్నాయి. ఇస్లాం మానవాళికి దేవుడు నిర్దేశించిన జీవిత సంవిధానం, సంపూర్ణ జీవిత విధానం, సమగ్ర జీవన వ్యవస్థ. దీన్ని 'దీనుల్లాహ్' అని కూడా అంటారు. అంటే "దైవ నిర్దేశిత జీవన వ్యవస్థ" అని అర్థం. దేవుడ్ని, ఆయన అంతిమ దైవప్రవక్త (సల్లం)ను విశ్వసించి ముస్లిములయిన వారంతా తమ జీవితంలోని సమస్తరంగాల్లో ఈ జీవన వ్యవస్థనే అనుసరించవలసి ఉంటుంది.

**75. దుష్టబుద్ధి**:- దుష్టబుద్ధి మనిషిని దుష్కార్యాల వైపుకే పురిగొల్పుతుంది. దీన్ని ఖుర్‌ఆన్ భాషలో "నఫ్సుల్ అమ్మారా"అంటారు. (వివరాలు 89:27 సూక్తి, దాని పాదసూచికలో చూడండి.)

**76. నడక**:- మానవుడు తన నడకలో కూడా నమ్రత, అణుకువ చూపాలని చెబుతోంది ఖుర్‌ఆన్. గర్వపోతులా నిక్కుతూ, నీల్గుతూ నడిచేవాడ్ని దేవుడు ఎన్నటికీ ప్రేమించడు. (31:18-19 సూక్తులు చూడండి.)

**77. నమ్రూద్** :- ఇతను ఇబ్రాహీం ప్రవక్త (అలైహి) పుట్టిపెరిగిన (ప్రస్తుత ఇరాఖ్) దేశానికి చక్రవర్తి. అతను, అతని ప్రజలు విగ్రహారాధనతో పాటు వివిధ సామాజిక, నైతిక రుగ్మతలకు గురయి ఉన్నప్పుడు హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) అతనికి దైవసందేశం అందజేయడానికి వచ్చారు. కాని అతను దైవసందేశాన్ని తిరస్కరించడమే గాకుండా, దైవప్రవక్త (అలైహి)ను అగ్ని గుండంలోకి విసరి చంపడానిక్కూడా ప్రయత్నించాడు. కాని ఆ అగ్ని వెంటనే దేవుని ఆజ్ఞ శిరసావహించి దైవప్రవక్త కోసం చల్లబడి పోయింది. హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) క్షేమంగా అగ్నిగుండం నుంచి బయటికి వచ్చారు. కాని ఇంత గొప్ప మహిమ చూసి కూడా ఆ దౌర్భాగ్యుడు సత్యాన్ని విశ్వసించలేదు. (2:258, 21:68-70 సూక్తులు చూడండి.)

**78. నూర్ (జ్యోతి)**:- దేవుడు యావత్తు భూమ్యాకాశాలకు జ్యోతి లాంటివాడు. ఆయన తానుకోరిన వారికి తన కాంతి వైపు (అంటే రుజుమార్గం వైపు) దారి చూపుతాడు. (24:34-35 సూక్తులు చూడండి.) రుజుమార్గం చూపే గ్రంథం కాబట్టే ఖుర్‌ఆన్‌ని కూడా జ్యోతితో పోల్చడం జరిగింది. (4:174 సూక్తి చూడండి.) ఇలా దైవజ్యోతి పొందిన భక్తులు మరణానంతరం పరలోకంలో దాని వెలుగు సహాయంతోనే స్వర్గానికి చేరుకుంటారు. (66:8 సూక్తి చూడండి.)

**79. పరిశుద్ధాత్మ**:- ఖుర్‌ఆన్‌లో దీన్ని "రూహుల్ ఖుద్స్" అంటారు. ఇది దైవ ప్రవక్తలకు దివ్యావిష్కృతిని చేరవేసే దైవదూత జిబ్రీల్ (అలైహి)కు పర్యాయనామం. క్రైస్తవులు తమ కోసం ముగ్గురు దేవుళ్ళను చేసుకొని, ఆ ముగ్గురిలో పరిశుద్ధాత్మను కూడా చేర్చుకున్నారు. ఇది దేవుని పవిత్రాత్మ అని, ఆ ఆత్మ ఏసుక్రీస్తులో అంతర్లీనమై ఉందని వారి నమ్మకం. (వివరాలకు 4:171 సూక్తి, దాని పాదసూచిక చూడండి.)

**80. పరీక్ష**:- ఇహలోకం మానవులకు ఒక పరీక్షా వేదిక. ఇక్కడ జీవితాంతం 'విశ్వాసం'తో సత్కర్మలు చేసి ఈ పరీక్షలో కృతార్థులైనవారే పరలోకంలో మోక్షం పొంద గలరు. (2:155 సూక్తి, దాని పాదసూచిక చూడండి.)



**81. పాఠ్యగ్రంథం**:- అంటే విద్యార్థులు తమ పాఠ్యపుస్తకాన్ని పఠిస్తున్నట్లు నిత్యం పఠించవలసిన గ్రంథం అన్న మాట. ఖుర్‌ఆన్ అంటే కూడా అర్థం ఇదే. ఖుర్‌ఆన్ ప్రతిరోజూ పారాయణం చేయవలసిన పఠనగ్రంథం. ఇదే కలియుగ మానవులకు పారాయణం చేయడానికి, తదనుగుణంగా ఆచరించడానికి దేవుడు నిర్దేశించిన పరణ వేదం, కలియుగ వేదం. (39:41, 14:52 సూక్తులు చూడండి.)

**82. ఫలము**:- అంటే, ఇక్కడ పుణ్యఫలం లేక పాపఫలం అని అర్థం. ఇహ లోకంలో ఎవరు ఏ మేరకు కర్మలు ఆచరిస్తారో వారికి పరలోకంలో ఆ మేరకే వాటి ప్రతిఫలం లభిస్తుంది. వారికి అక్కడ అణుమాత్రం కూడా అన్యాయం జరగదు. (99:6-8 సూక్తులు, వాటి పాదసూచికలు చూడండి)

**83. ఫిరౌన్**:- పూర్వపు ఈజిప్టు చక్రవర్తుల్ని ఫిరౌన్ (ఫారావా)లు అంటారు. (వివరాల కోసం 10:92 సూక్తికి రాసిన పాదసూచిక చూడండి.)

**84. ఫీ సబీలిల్లాహ్**:- అంటే దైవమార్గంలో. మరోమాటలో చెప్పాలంటే దేవుని ప్రసన్నత కోసం ధర్మాభ్యున్నతి కోసం అని అర్థం. "జిహాద్ ఫీ సబీలిల్లాహ్" అంటే దైవప్రసన్నత కోసం, ధర్మాభ్యున్నతి కోసం దైవమార్గంలో చేసే నిరంతర కృషి, పోరాటం అని భావం. (9:60 సూక్తి, దాని పాదసూచిక చూడండి.)

**85. ఫుర్ఖాన్**:- ఫుర్ఖాన్ అంటే సత్యాసత్యాలను, ధర్మాధర్మాలను, మంచీచెడుల్ని వేరుచేసేది అని అర్థం. స్వర్ణకారుడు కల్తీబంగారమో, మేలిమిబంగారమో తెలుసుకోవడా నికి ఉపయోగించే గీటురాయి వంటిది అన్నమాట. ఇది దైవప్రవక్తలకు, ఇతర సత్పురు షులకు ప్రసాదించబడిన విచక్షణా జ్ఞానం కావచ్చు లేక దివ్యగ్రంథాలు కూడా కావచ్చు. (2:53, 8:29 సూక్తులు చూడండి.) ఖుర్‌ఆన్‌కు మరోపేరు ఫుర్ఖాన్ అని కూడా ఉంది. (2:185 సూక్తి చూడండి.)

**86. బలగం**:- బలగం అంటే ఆయుధ బలగం కావచ్చు; సైనిక బలగం కావచ్చు; సంతాన బలగం కావచ్చు; సేవకుల బలగం కావచ్చు; బంధుమిత్రుల బలగం కావచ్చు. మొత్తానికి అత్యధిక బలగం, మందీ మార్బలం గల మనిషిలో సాధారణంగా ఒకింత గర్వం తొంగి చూస్తుంది. అయితే అది ముదిరితే మాత్రం ప్రమాదం ముంచుకొచ్చినట్లే. (18:32-44 సూక్తులు చూడండి.)

**87. బాల్ విగ్రహం**:- క్రీ.పూ. తొమ్మిదోశతాబ్దంలో మధ్యప్రాచ్యం ప్రజలు బాల్ దేవతావిగ్రహాన్ని పూజిస్తూ ఉండేవారు. 'బాల్' అంటే యజమాని, నాయకుడు అని అర్థం. భర్త అర్థంలో కూడా ఖుర్‌ఆన్‌లో ఈ పదం వచ్చింది. (4:127, 11:72 సూక్తులు) అయితే ఆనాడు మధ్యప్రాచ్యం ప్రజలు ఈ పదాన్ని దేవుని కోసం వాడేవారు. బాల్ దేవుడంటే సూర్యదేవుడని కొందరి అభిప్రాయం. అంటే వారు సూర్యారాధన చేసేవారన్న మాట. ఇల్యాస్ ప్రవక్త (అలై) కాలంలో ఈ విగ్రహారాధన పరాకాష్ఠకు చేరింది. (వివరాల కోసం 37:123-128 సూక్తులతో పాటు ఇదే శీర్షికలో నెం. 12 (ఇల్యాస్) చూడండి).

**88. బిన్యామీన్ (బెంజ్‌మన్)**:- ఇది యూసుఫ్ (జోసెఫ్) ప్రవక్త సొంత తమ్ముడి పేరు; యాఖూబ్ (జాకబ్) ప్రవక్త రెండవభార్య కుమారుడు. ఇతను పుట్టినప్పుడే తల్లి చనిపోవడంవల్ల యాఖూబ్ (అలై) ఇతడ్ని ఎంతోప్రేమగా చూసుకునేవారు. సవతి

సోదరుల కుట్రలో యూసుఫ్ (అలై) తరువాత ఇతను కూడా చిక్కుకున్నాడు. (12వ అధ్యాయం-యూసుఫ్ చూడండి)

**89. భయభక్తులు**:- సాధారణంగా మనిషి ఏదైనా పనిచేయాలంటే, చేస్తే లాభం ఉంటుందన్న ఆశ, చేయకపోతే నష్టం వాటిల్లుతుందన్న భయం ఉన్నప్పుడే అతనా పని చేయడానికి సిద్ధమవుతాడు. లాభం మీది ఆశ కంటే నష్టం పట్ల భయమే మనిషిని ఆచరణ వైపు ఎక్కువగా ప్రేరేపిస్తుంది. ఈ భయం, ఆశలు ఇహలోకం కంటే పరలోకం గురించే ఎక్కువగా ఉండాలి. ఈ భయభక్తులు లేక దైవభీతి పరాయణతను ఖుర్ఆన్ పరిభాషలో "తఖ్వా" అంటారు. "మీ అందరిలో కెల్లా ఎక్కువ దైవభీతికలవాడే దేవుని దృష్టిలో ఎక్కువ గౌరవనీయుడు" అని ఖుర్ఆన్ చెబుతోంది. (49:13 సూక్తి.)

**90. భవితవ్యం**:- దీని పర్యాయపదాలే విధి, జాతకం, అదృష్టం. దేవుడు మొదట కలాన్ని సృష్టించి దాని చేత ఇతర యావత్తు సృష్టిరాసుల అదృష్టాన్ని, జరగబోయే విషయాలన్నిటిని వ్రాయించాడని పండితుల అభిప్రాయం. ఇవన్నీ దేవుని దగ్గర ఓ గ్రంథలో రాయబడి ఉన్నాయి. వాటికి వ్యతిరేకంగా ఈ ప్రపంచంలో ఏదీ సంభవించదు. (6:59, 57:22-23, 34:3, 17:13 సూక్తులు చూడండి.) దీన్ని "తఖ్దీర్" అని కూడా అంటారు. ఇస్లాం స్వీకరించిన వ్యక్తి తఖ్దీర్‌ని కూడా విశ్వసించవలసి ఉంటుంది.

**91. భాగస్వామ్యం(షిర్క్)**:- మానవులు, జంతువులు, వృక్షాలు, చివరికి ప్రతివస్తువు, అందులోని ప్రతిఅణువూ ఒకదానిపై మరొకటి ఆధారపడివుండే సృష్టితాలు. ఈ విశ్వంలో ఏ ఒక్కటీ ఇతరులపై ఆధారపడకుండా మనుగడ సాగించలేదు. ఒక్క దేవుడు మాత్రమే నిరాధారుడు, నిరపేక్షాపరుడు, ఎవరి అవసరమూ లేనివాడు. యావత్తు సృష్టికి ఆయనే యజమాని, పాలకుడు, పోషకుడు, ప్రభువు. ఆయన ప్రతి పనీ చేయగల సమర్థుడు, సర్వ శక్తిమంతుడు. ఆయనకు అసాధ్యమంటూ ఏదీ లేదు. ఆయన ఏదైనా చేయదలచుకుంటే 'అయిపో' అంటే చాలు, అది తృటిలో జరిగి ఉనికి లోకి వస్తుంది. ఆయన దైవత్వం సమగ్రమైనది, సంపూర్ణమైనది. అందులో ఎవరూ భాగస్వాములు లేరు. ఆయన మాత్రమే ఆరాధ్యనీయుడు. అందువల్ల ఆయన తన దైవత్వంలో, తన గుణగణాల్లో, తన శక్తిసామర్థ్యాల్లో సృష్టితాలకు సాటి కల్పించడాన్ని ఏమాత్రం సహించడు. అలా సాటి కల్పించడాన్ని "షిర్క్" అంటారు. షిర్క్ ఘోరమైన పాపం. షిర్క్ తప్ప మరే పాపాన్నయినా దేవుడు తలచుకుంటే క్షమిస్తాడు. (4:116 సూక్తి.)

**92. మత్స్యభాధితుడు**:- ఖుర్ఆన్‌లో "జిన్నూన్"అనే పదానికి చేపలవాడని అర్థం. (విశేషార్థం మత్స్యబాధితుడు.) ఈయన యూనుస్ ప్రవక్త (అలైహి). ఈయన్ని ఒక చేప మింగి ఆ తరువాత తీసి తీరం మీద పడసేసింది. (21:87-88, 37:139-146 సూక్తులు, వాటి పాదసూచికలు చూడండి.)

**93. మద్యన్‌జాతి**:- మద్యన్ అనేది పూర్వం అరేబియాలో ఒక ప్రాంతం పేరు. ఈ ప్రాంతంలో నివసించిన జాతినే మద్యన్‌జాతి అంటారు. ఇబ్రాహీం ప్రవక్త (అలైహి)కు ఆయన మూడవభార్య ఖతూరా ద్వారా పుట్టిన 'మిద్యాన్'అనే కుమారుని సంతతే మద్యన్‌జాతి ప్రజలుగా ప్రసిద్ధిచెందారు. అయితే వారు అయిదారు వందల యేండ్లలో క్రమంగా బహుదైవారాధనా జాతులతో ప్రభావితులై నందున వారిలో కూడా బహు



దైవారాధన వ్యాపించింది. దాంతో దగా, మోసం, దోపిడి, దొంగతనాలు వంటి నైతిక రుగ్మతలు కూడా వారిలో చోటుచేసుకున్నాయి. అంచేత వారిని సంస్కరించడానికి దేవుడు 'షుఐబ్' (అలై)ను ప్రవక్తగా నియమించి పంపాడు. కాని ఆజాతి ఆయన్ని తిరస్కరించి నాశనమయింది. (7:85-95, 11:87-95, 26:185-190 సూక్తులు చూడండి.)

**94. మహిమలు** (మహత్యాలు):- దైవప్రవక్తలు తమ దౌత్యనిరూపణ కోసం ప్రదర్శించే అసాధారణ విషయాలను మౌజిజాత్ (మహత్యాలు) అంటారు. దైవప్రవక్తలు కాని మహనీయులు తమ హితవచనాల వైపు ప్రజలను ఆకట్టుకోవడానికి ప్రదర్శించే అసాధారణ విషయాలను కరామాత్ (మహిమలు) అంటారు. వీరుభయులు కానివారు ప్రదర్శించే అసాధారణ విషయాలను మంత్రతంత్రాలు, మహేంద్రజాలాలు, గారడీలు, బాణామతులు, చేతబడులు, మేజిక్కులు, హిప్నాటిజంలు అంటారు.

**95. ముస్లిం**:- అంటే విధేయుడు, వినయుడు, వినమ్రుడు, ఆజ్ఞాబద్ధుడు అని అర్థాలు ఉన్నాయి. ఇస్లాం పరిభాషలో దైవవిధేయుడు, దైవాజ్ఞాబద్ధుడు అని అర్థం. ఈ భావంలోనే ఖుర్ఆన్ గత దైవప్రవక్తల అనుచరుల్ని కూడా ముస్లింలు అనే పేర్కొన్నది. (2:132, 28:53 సూక్తులు, వాటి పాదసూచికలు)

**96. మూసా ప్రవక్త** (అలైహి):- ఈయన క్రీ.పూ. 13 వ శతాబ్దం ప్రారంభ కాలంలో ఇస్రాయీల్ సంతతి ప్రజల్ని సంస్కరించడానికి ప్రభవించిన దైవప్రవక్త. ఈయన బైబిల్ కథనం ప్రకారం యాఖూబ్ ప్రవక్త (అలైహి) కుమారుడు లావీ సంతతికి చెందినవారు. తండ్రి పేరు ఇమ్రామ్ అని బైబిల్‌లో ఉంది. ఖుర్ఆన్ దీన్ని ఇమ్రాన్ అని పేర్కొన్నది. ఇస్రాయీల్ సంతతిలో ఒకతను పుట్టి, ఫిరౌన్ చక్రవర్తిని, అతని రాజ్యాన్ని అంతమొందిస్తాడని జ్యోతిష్కులు చెప్పడంతో ఫిరౌన్ చక్రవర్తి ఇస్రాయీల్ ప్రజల్లో పుట్టే ఆడపిల్లల్ని వదిలేసి, వారి మగపిల్లల్ని సంహరింప జేయనారంభించాడు.

అందువల్ల మూసా (అలైహి) పుట్టిన కొన్నాళ్ళకే ఆమె తల్లి ఆయన్ని ఓ గంపలో పెట్టి నదిలో వదలి పెట్టింది. ఫిరౌన్ భార్య ఆ గంపలోని ముద్దులొలికే పసిబిడ్డను చూసి ముచ్చట పడింది. భర్తను ఒప్పించి ఆ పిల్లవాడ్ని నీటిలో నుంచి తీసి పెంచుకోసాగింది. ఆ పిల్లవాడికి మూసా అని పేరు పెట్టారు. మూసా అంటే నీళ్ళలో నుంచి తీయబడిన లేక కాపాడబడిన వాడని అర్థం. మూసా (అలై)కు ముందు హారూన్ (అలై), ఆయనకు ముందు ఒక బాలిక పుట్టారు. మూసా ప్రవక్త (అలై) గాధ వివిధ అధ్యాయాల్లో ఎంతో వివరంగా ఉంది. ముఖ్యంగా 20, 28 అధ్యాయాలలో విపులంగా ఉంది.

**97. మృత సముద్రం**:- లూత్‌ప్రవక్త (అలైహి) హితోపదేశాల్ని ఆయన జాతి ప్రజలు పెడచెవిన పెట్టి దేవుని ఆగ్రహానికి గురయ్యారు. దాంతో భయంకరమయిన విపత్తు వచ్చి వారు సర్వనాశనమయ్యారు. వారి శిధిలాలు, అవశేషాల ప్రతిరూపమే మృత సముద్రం. (15:74 సూక్తి, దాని పాదసూచిక చూడండి)

**98. యహ్యా (యూహన్న)**:- ఈయన జకరియ్యా ప్రవక్త (అలైహి) కుమారుడు. ఈయన కూడా యూదుల కోసం దైవప్రవక్తగా నియమించబడ్డారు. యహ్యా (అలైహి), ఈసా (అలైహి)లు ఒకే కాలంలో ప్రభవించిన దైవప్రవక్తలు. యూదులు ఎంతో కాలం నుంచి నిరీక్షిస్తూ వుండిన ముగ్గురు ప్రవక్తలలో యహ్యా (అలైహి) లేనందున ఆయన్ని

వారు తిరస్కరించారు. (37:130 సూక్తి పాదసూచిక చూడండి.)

హజ్రత్ యహ్యా (అలై)ను బైబిల్‌లో యూహన్న అని "జాన్ ది బాప్టిస్ట్" అని పేర్కొన్నారు. బైబిల్ ప్రకారం ఆయన యూదరాజు హేరోద్ రాజ్యంలో ధర్మప్రచారం ప్రారంభించిన రోజుల్లో హేరోద్ రాజు, అతని ప్రజలు (యూదులు) రోమ్ నాగరికతతో ప్రభావితులయి అశ్లీలకూపంలో కూరుకుపోయారు. స్వయంగా రాజు తన సోదరుడు ఫిలిప్ భార్యను తనఇంట ఉంచుకున్నాడు. అది ధర్మసమ్మతం కాదని విమర్శించినందుకు హజ్రత్ యహ్యా (అలై)ని బంధించి చెరసాలలో వేయించాడు. అతనాయన్ని చంపాలనుకున్నా ప్రజల్లో ఆయనకున్న గౌరవాభిమానాలు చూసి ఏమీ చేయలేక పోయాడు.

అయితే అతని ఉంపుడుగత్తె (ఫిలిప్ భార్య) హజ్రత్ యహ్యా (అలైహి) మీద కక్ష కట్టింది. అశ్లీలానికి వ్యతిరేకంగా ఆయన ప్రారంభించిన ప్రచారోద్యమం వల్ల తాను ప్రజల దృష్టిలో అవమానంపాలు కావలసివస్తుందని తలచి ఆమె అవకాశం కోసం ఎదురుచూడ సాగింది. చివరికి హేరోద్‌రాజు జన్మదినోత్సవం సందర్భంలో ఆమె కూతురు బాగా నాట్యమాడి అతడ్ని మెప్పించింది. రాజు సంతోషించి నీకేం కావాలో కోరుకో అన్నాడు. ఆమె తన తల్లి నడిగి చెబుతానన్నది. ఆమె తల్లి దీన్ని సువర్ణవకాశంగా భావించి, యూహన్న శిరస్సును పళ్లెంలో పెట్టివ్వమని అడుగుతుంది. హేరోద్ ఈ మాట విని కాస్త బాధపడినప్పటికీ ప్రేయసి కుమార్తె కోరికను కాదనలేకపోయాడు. వెంటనే అతను చెరసాల నుండి యహ్యా (అలై) శిరస్సును ఖండించి తెప్పించాడు. దాన్ని ఓపళ్ళెంలో పెట్టి ఆ నాట్యగత్తెకు ఇచ్చాడు.

(మత్తయి సువార్త 14వ అధ్యాయం, లూకా సువార్త 3వ అధ్యాయం, మార్కు సువార్త 6వ అధ్యాయం చూడండి.)

**99. యాజూజ్, మాజూజ్**:- మధ్యాసియాలోని ఆటవిక జాతులు. ప్రళయకాల సమీపంలో ఈ జాతులు పెద్దయెత్తున విధ్వంసం సృష్టించి, చివరికి దైవాగ్రహంతో పురుగులు పడి చస్తాయి. (18:99 సూక్తి, దాని పాదసూచిక చూడండి.)

**100. యూదులు**:- యాఖూబ్ ప్రవక్త (అలైహి) నాల్గవ కుమారుడు యహూదా సంతతినే యూదులు అంటారు. ఖుర్ఆన్ వీరిని యాఖూబ్ (అలై) బిరుదు ఇస్రాయీల్ పేరుతో "ఇస్రాయీల్ సంతతి ప్రజలారా!" అని సంబోధించింది. కాని వీరు యహూదా సంతతికి చెందిన వారైనందున తమనుతాము యూదులు అని పేరు పెట్టుకున్నారు.

పూర్వం యూదుల్లో గొప్ప దైవభక్తులు, సజ్జనులు, మహాపురుషులు ఉద్భవించినా వారిలో అత్యధికులు దుర్మార్గులు, కలహకారులు, హంతకులు, సత్యావరోధకులు, జాత్యహంకారులు, అక్రమార్జనాపరులు, అబద్ధీకులుగానే చరిత్రకెక్కారు.

క్రీస్తు శకానికి దాదాపు 2000 సంవత్సరాల పూర్వం సిరియా, పాలస్తీనాలకు చెందిన కొందరు అరబ్బు జాతీయులు అంతర్గత కలహాలకు గురయివున్న ఈజిప్టు ప్రజలను సులభంగా ఓడించి ఈజిప్టును ఆక్రమించుకొని అక్కడ రాజ్యమేలడం ప్రారంభించారు. వీరిని "హిక్సాస్" రాజులు అంటారు. క్రీ.పూ.19వ శతాబ్దాంతంలో యూసుఫ్ ప్రవక్త (అలైహి) తన దైవిక శక్తిసామర్థ్యాలతో ఈజిప్టు సింహాసనాన్ని అధిరోహించిన తరువాత



ఆయన పాలస్తీనా నుండి తన తల్లి దండ్రులు, అన్నదమ్ములతో సహా మొత్తం కుటుంబ సభ్యుల్ని ఈజిప్టుకు పిలిపించుకున్నారు. ఈవిధంగా యూదులు ఈజిప్టులో ప్రవేశించారు. ఈజిప్టులోని విదేశీ పాలకవర్గం ప్రజలు కూడా యూదుల్ని విదేశీయులుగా పరిగణించకుండా సంతోషంగా తమలో కలుపుకున్నారు. ఆ తర్వాత అనతి కాలంలోనే యూదులు తమ ఉనికిని పటిష్ఠపరచుకొని పాలకవర్గంలో కలసిపోయారు. పాలక వర్గంతో కలసి దాదాపు నాలుగువందల సంవత్సరాలపాటు వారు ఈజిప్టును పాలించి ఎంతో ప్రగతి సాధించారు. (5:20, 2:47)

అయితే ఆ తరువాత ఈజిప్టులో ఓ గొప్ప జాతీయ ఉద్యమం ప్రారంభమయి హిక్సాస్‌రాజు అధికార పీఠాన్ని పడగొట్టింది. హిక్సాస్ వర్గానికి చెందిన రెండున్నర లక్షల మంది ప్రజలను దేశం నుండి వెళ్ళగొట్టడం జరిగింది. జాత్యహంకారంగల ఖబత్ సంతతికి చెందిన వంశం అధికారంలోకి వచ్చి హిక్సాస్‌రాజుల సంస్కృతిని, వారి స్మారక చిహ్నాలన్నిటిని సర్వనాశనం చేసింది. తరువాత ఖబత్ రాజులు హింసాదౌర్జన్యాలతో యూదుల్ని క్రమంగా కట్టుబానిసలుగా మార్చి వారి చేత వెట్టిచాకిరి చేయించుకోవడం ప్రారంభించారు. చివరికి మూసా ప్రవక్త (అలైహి) రావడం, వారిని ఆ వెట్టిచాకిరీ నుండి విముక్తి కల్గించి పాలస్తీనాకు తీసికెళ్ళడం జరిగాయి. (2:49, 7:104-133, 20:77-81)

దేవుడు ఇంతగొప్ప సహాయం చేసినా యూదులు తమ అకృత్యాలు మానుకోలేదు. వీరి అకృత్యాలు, అక్రమాలను గురించి రాయాలంటే ఓ పెద్ద గ్రంథమే తయారవుతుంది. ఖుర్ఆన్‌లో అక్కడక్కడ వీటిని గురించి సంక్షిప్తంగా పేర్కొనడం జరిగింది. ఈ క్రింది సూక్తులు చూడండి:

1. ప్రవక్త ముందే అసహనం, నిరాశలను వెళ్ళబోసుకోవడం...7:128-129
2. మూసాప్రవక్త (అలైహి) సమక్షంలోనే విగ్రహారాధనకై వెంపర్లాడటం...7:138-140.
3. గోభక్తి...7:148, 20:86-91, 2:52-54.
4. దేవుడ్ని ప్రత్యక్షంగా చూడందే నమ్మమని మొండికేయడం...2:55, 4:153.
5. గోవధ కోసం అనవసరమైన వివరాలు అడగడం...2:67-71.
6. హత్యానేరాన్ని ఇతరుల మీదికి నెట్టివేయడం...2:72-74.
7. శ్రమపడకుండా లభిస్తున్న ఆహారం పట్ల అసంతృప్తి...2:61.
8. దైవాజ్ఞల పదాలను తారుమారు చేసి పెడర్థాలు తీయడం...2:75, 3:71,78,
9. తౌరాత్ ఆజ్ఞలను పాటించడానికి నిరాకరించడం...2:63-64.
10. శనివారం నియమాన్ని ఉల్లంఘించడం...2:65-66, 16:124, 7:163-166.
11. పాలస్తీనా విముక్తి కోసం యుద్ధంచేయ నిరాకరించిన పిరికిపందలు...5:20-26.
12. పాషాణ హృదయాలు...2:74, 22:46.
13. దైవగ్రంథంలో మార్పులకు, చేర్పులకు పాల్పడటం...2:75, 2:79, 2:174, 5:41.
14. ఊసరవెల్లి వైఖరి...2:76-77, 3:72.
15. ఆశల పల్లకిలో ఊరేగే అజ్ఞానులు...2:78.

16. ఊహా స్వర్గంలో జాత్యహంకారులు...2:80-82, 2:111-112.
17. ప్రమాణోల్లంఘన (దైవాజ్ఞల పాటింపులో)...2:83, 2:93.
18. దైవప్రవక్తల్ని తిరస్కరించడం, చంపడం...2:87, 2:61, 2:91-92, 3:112, 4:157.
19. సజ్జనులు, శీలవతులపై అపనిందలు...4:156.
20. దైవగ్రంథమని తెలిసి కూడా దాన్ని నిరాకరించడం...2:89-90.
21. దీర్ఘాయువు కాంక్షతో చావంటే భయం...2:94-96.
22. దైవదూతల పట్ల కూడా విరోధ భావమే...2:97-98.
23. దైవగ్రంథాలు, దైవాజ్ఞల పాటింపు పట్ల నిర్లక్ష వైఖరి...2:100-101.
24. పనికిమాలిన ప్రశ్నలు...2:108, 5:101-102.
25. ఇతర మతస్థుల ఆరాధనాలయాలను నాశనంచేసే మతోన్మాదం...2:114.
26. పిసినారితనం, అసూయ, అసత్యం, అక్రమార్జనల్లో ప్రవీణులు...3:75, 4:53, 4:160-161, 5:42, 5:62-63.
27. అవాకులు, చవాకులు...3:181-182, 5:64, 9:30.
28. తాము చెడిందిగాక ఇతరుల్ని కూడా చెడగొట్ట జూసేవారు...4:44, 5:41.
29. ద్వంద్వార్థ పదప్రయోగాలతో, నాలుకలు మెలితిప్పి మాట్లాడేవారు...4:46.
30. మూఢనమ్మకాలు, మిధ్యాదైవాలను అభిమానించి శాపగ్రస్తులైనవారు...4:51, 5:60.
31. అర్థ విశ్వాసంతో పూర్తి తిరస్కారులైనవారు...4:150-151.
32. మిత్రభేదం- విశ్వాసఘాతుకం...5:51.
33. పండితులు, ధర్మవేత్తల దుష్టవైఖరి...5:62-63.
34. అవిధేయత, అవిశ్వాసాలతో శాపగ్రస్తులైన వారు...5:78-79.
35. ఇస్లాం, ముస్లింల పట్ల బద్ధ విరోధులు...5:82, 2:137.
36. కలహకారులు, దురహంకారులు...5:64, 17:167.
37. క్రూర పాలకుల చేతుల్లో అవమానం, దౌర్జన్యాలతో విలవిల...7:4-7.
38. ముక్కలు ముక్కలుగా విచ్ఛిన్నమైన జాతి...7:168.

**101. యూనుస్ జాతి:-** వీరసలు ప్రస్తుత ఇరాఖ్‌కు చెందిన అసీరియా జాతి ప్రజలు. అయితే ఇస్రాయీల్ సంతతికి చెందిన యూనుస్ ప్రవక్త (అలైహి)ను దేవుడు అసీరియా ప్రజలకు సన్మార్గం చూపేందుకు పంపినందున వారు యూనుస్ జాతి ప్రజలుగా ఖుర్ఆన్‌లో ప్రసిద్ధి చెందారు. ఈ జాతి క్రీ.పూ. 860-784 మధ్య కాలంలో ఉండేదని తెలుస్తోంది. (37:139-148 సూక్తులు, పాదసూచికలు.)

**102. రస్ ప్రజలు:-** ఖుర్ఆన్‌లో అస్‌హాబుర్రస్ (రస్ ప్రజల)ను గురించి ఎలాంటి వివరాలు లేవు. వారు తమకు సన్మార్గం చూపడానికి వచ్చిన దైవప్రవక్తను తిరస్కరించినట్లు మాత్రమే ఉంది. ప్రాచీన అరబ్ చరిత్రలో "రస్" పేరుతో రెండు ప్రాంతాల



ప్రస్తావన వచ్చింది. ఒకటి నజద్‌లో, రెండోది హజాజ్ (మదీనా)లో. రస్ ప్రజలు ఈ రెండిటిలో ఒక ప్రాంతానికి చెందినవారయి ఉంటారని తెలుస్తోంది. అలాగే వీరు తమకు హితోపదేశం చేయడానికి వచ్చిన దైవప్రవక్తను తిరస్కరించడమే గాకుండా, ఆయన్ని ఓ పాడుబడ్డ బావిలో పడేసి చంపినట్లు కూడా తెలుస్తోంది. రస్ అంటే పాడుబడ్డ బావి అని కూడా అర్థం వుంది. (25:38, 50:12 సూక్తులు చూడండి.)

**103. రెంటికి చెడ్డ రేవళ్ళు:-** ఆశయసాధనలో అవ్వా కావాలి, బువ్వా కావాలి అంటే కుదరదు. అందులో ఒకటి మాత్రమే లభిస్తుంది. కొందరు సత్యాసత్యాల మధ్య, (ఇస్లాంపట్ల) విశ్వాసం అవిశ్వాసాల మధ్య గోడమీది పిల్లిలా నిల్చొని దైవారాధన చేస్తారు. ఇస్లాంలో ఏదైనా ప్రాపంచిక ప్రయోజనాలు కన్పిస్తే తృప్తిచెందుతారు. దానికి బదులు ఏదైనా ఆపద వచ్చిపడితే వెనక్కి మరలిపోతారు. ఆ తరువాత ఎలాంటి లాభనష్టాలు చేకూర్చలేని సృష్టిరాసుల్ని (అంటే మిధ్యాదైవాలను) ఆరాధించడం మొదలెడతారు. ఈ విధంగా వారు ఇటు ఇహలోకంలోనూ, అటు పరలోకంలోనూ ఘోరంగా నష్టపోయి రెంటికి చెడ్డ రేవళ్ళయి పోతారు. (22:11-12, 4:142-143 సూక్తులు చూడండి.)

**104. లజ్జ:-** అంటే సిగ్గు, ఎగ్గు, బిడియం. ఇందులో శారీరక బిడియం, నైతిక బిడియం అని రెండు రకాలున్నాయి. ఆచ్ఛాదనం ఉండవలసిన శరీర అవయవాలపై నుండి ఆచ్ఛాదన తొలగిపోతే అది సిగ్గుచేటవుంది. స్త్రీల విషయంలో నయితే ఇది మరింత సిగ్గుచేటయిన విషయం అవుతుంది. అలాగే నీతి రాహిత్యమైన కొన్ని చేష్టలకు పాల్పడేవారిని కూడా మనం సిగ్గులేని వారంటాము. నీతిని గోతిలో పూడ్చిన నేటి కాలంలో శారీరక బిడియం కూడా రోజురోజుకు కృశించిపోతూ బిక్క చచ్చి పోతోంది. అశ్లీలం సర్వత్రా శరవేగంతో వ్యాపిస్తూ విలువల వలువలు విడిచి మరీ వికటాట్టహాసం చేస్తోంది. అశ్లీలం రొంపిలో పీకలదాకా కూరుకుపోయిన అతివలకు ఇది ఎంతమాత్రం సిగ్గుచేటని అన్పించడం లేదు. పైగా ఇది ఈనాడు అందం, ఫ్యాషన్లకు ప్రతి రూపమై పోయింది. మానవుల ఆది తల్లిదండ్రులైన ఆదం, హవ్వా (అలైహి)లను మభ్యపెట్టి, మోసగించి, వారి వలువలను ఊడదీయించిన షైతాన్ సైతం ఈనాటి పడతుల ఫాషన్ పాట్లు చూసి సిగ్గుతో తల దించుకుంటున్నాడు మరి!

ఆదం, హవ్వాలను దేవుడు ఏ వృక్ష ఫలం తినవద్దని వారించాడో షైతాన్ ఆ వృక్ష ఫలాన్నే తినిపించి వారిని దివి నుండి భువికి దిగజార్చాడు. (7:11-25 సూక్తులు చూడండి). ఆనాటి నుండే షైతాన్ తన సిగ్గులేని వికృత చేష్టలతో మానవజాతిని అనేక పేర్లతో, వివిధసాకులతో అశ్లీలపు రొంపిలోకి దించి పబ్బం గడుపుకుంటున్నాడు. చివరికి దైవభక్తి, పుణ్యకార్యాల పేర్లతో నగ్న ప్రదక్షిణలకు కూడా ప్రేరేపిస్తున్నాడు. పూర్వం అరబ్బు బహుదైవారాధకులు కాబా మందిరం చుట్టు నగ్నప్రదక్షిణ చేసేవారు. ఖుర్ఆన్ ద్వారా దేవుడు ఈ అశ్లీలాన్ని నిషేధించాడు. "మేము మీ కోసమే దుస్తుల్ని సృష్టించాం. ఇవి మీ మర్మావయవాలకు ఆచ్ఛాదనంగా మాత్రమే గాకుండా, అలంకరణగా కూడా ఉపయోగపడతాయ"ని ఆయన తెలియజేశాడు. (7:26 సూక్తి చూడండి.)

అందువల్ల ఇస్లాం పూర్తి ఆచ్ఛాదనతో కూడిన దుస్తులకు ఎంతోప్రాముఖ్యం ఇచ్చింది. పరదా (బురఖా) కూడా అందులోని భాగమే. పోకిరి పురుషుల బారినుండి కాపాడు

కోవడానికి పడతులకు పరదాయే సరైన రక్షణ కవచం. అయితే మనసులో దైవభీతి లేకపోతే దుస్తులు కేవలం అలంకార ప్రాయంగానే మిగిలిపోతాయి. అందుకే భౌతిక దుస్తులకన్నా భయభక్తుల దుస్తులు ఎంతో శ్రేష్ఠమైనవని ఖుర్‌ఆన్ చెబుతోంది. (7:26.)

ఇస్లాంలో విశ్వాసానికి సంబంధించిన అనేక విషయాలున్నాయి. వాటిలో బిడియం ఒకటి. బిడియానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. అందుకే మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) "బిడియం అర్థవిశ్వాసంతో సమానం" అన్నారు. ఏదియేమైనా సిగ్గులేని స్త్రీకి అర్ధ నగ్నవతారం సింగారాన్ని ఇస్తుందని సిగ్గున్న ఏ పురుషుడూ నమ్మలేడు.

**105. లుఖ్మాన్**:- ఈయన అరబ్ జగత్తులో అత్యంత వివేకవంతుడయిన వ్యక్తిగా ప్రసిద్ధిచెందారు. ఈయన మాతృభూమి, జాతీయతలను గురించి పండితులలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. కొందరు ఈయన నీగ్రో జాతీయుడని, మరికొందరు సూడాన్ దేశస్థుడని అంటారు. ఏమయినప్పటికి ఈయన అరేబియాలో తన నీతినడవడికలు, వివేకవంతమయిన మాటలతో ఎంతో వినుతికెక్కారు. (31వ అధ్యాయం-లుఖ్మాన్‌లో ఈయన్ని గురించి ప్రస్తావన ఉంది.)

హజ్రత్ లుఖ్మాన్ (అలైహి)ని కొందరు "మీకీ విజ్ఞతా వివేచనాలు, భావ చైతన్యాలు ఎలా లభించాయి?" అని అడిగితే "నీతినిజాయితీలు అవలంబించడం, పనికిమాలిన మాటలు మానేసి మౌనం పాటించడంవల్ల లభించాయి" అన్నారు ఆయన.

ఆయన బుద్ధికుశలత గురించి ఓ సంఘటన ప్రచారంలో వుంది. హజ్రత్ లుఖ్మాన్ (అలైహి) బానిసగా ఉన్నరోజుల్లో ఓసారి ఆయన్ని ఆయన యజమాని పిలిచి "ఒక మేకను కోసి అందులో నుంచి అతిశ్రేష్ఠమైన రెండు భాగాలు (రెండు అవయవాలు) నా దగ్గరకు తీసుకురా"అని అంటే, ఆయన మేక మాంసం నుండి హృదయం, నాలుక తెచ్చిస్తారు. మరోసందర్భంలో యజమాని "ఓ మేకను కోసి అందులో నుంచి అతి నీచమైన రెండు భాగాలు తీసుకురా"అని అంటే, లుఖ్మాన్ (అలై) మళ్ళీ హృదయాన్ని, నాలుకనే తెచ్చిస్తారు. యజమాని ఆశ్చర్యపోయి "అతి శ్రేష్ఠమైనవి, అతి నీచమైనవి కూడా ఈ రెండేనా!" అని అడిగాడు. దానికి హజ్రత్ లుఖ్మాన్ (అలై) సమాధానమిస్తూ "హృదయం, నాలుక సవ్యంగా, సక్రమంగా వుంటే ఇవి అన్నిటికంటే ఎంతో శ్రేష్ఠమైనవి. ఒకవేళ అవి చెడిపోతే వాటికి మించిన క్షుద్ర వస్తువులు మరేమీ వుండవు" అని చెప్పారు. (మౌలానా సలాహుద్దీన్ యూసుఫ్ గారి ఖుర్‌ఆన్ వ్యాఖ్యానం నుండి సేకరణ.)

**106. లోహ యుగం**:- లోహయుగం క్రీ.పూ.1200-1000 సంవత్సరాల మధ్య కాలంలో ప్రారంభమైనట్లు చరిత్రకారులు నిర్ధారించారు. అదే ఇబ్రాహీం (అలైహి) దైవప్రవక్తగా ప్రభవించిన కాలం. ఖుర్‌ఆన్‌లోని 21:79, 34:10-11 సూక్తులలో వచ్చిన విషయాలను బట్టి దేవుడు ఆయనకు ఇనుప ఖనిజం నుండి స్వచ్ఛమైన ఇనుము, ఉక్కు తీసే విధానాన్ని నేర్పాడని తెలుస్తోంది. సిరియా, ఆసియా మైనర్లలోని హిట్‌జాతి క్రీ.పూ.1200-1000 మధ్యకాలంలో ఉచ్ఛస్థితిలో ఉండటానికి కారణం ఆ జాతి ప్రజలు ఇనుమును కరగబెట్టి ఆయుధాలు తయారుచేసే ఓ అతిక్లిష్టమైన పద్ధతి కనుగొనడమే. అయితే ఇలా తయారయ్యే ఆయుధాలు ఎంతో ఖరీదుతో కూడుకొని ఉండేవి. అంచేత ఇవి జనసామాన్యానికి అందుబాటులో ఉండేవికావు. పైగా ఆ జాతి వాళ్ళు



ఈ పద్ధతిని అతి రహస్యంగా ఉంచేవారు.

అయినా కొంతకాలానికి ఈ రహస్యాన్ని పాలస్తీనా, తూర్పు జోర్డాన్ ప్రజలు తెలుసుకున్నారు. ఆ తరువాత ముడి ఖనిజం నుండి ఇనుమును తీసే సులువైన పద్ధతులు కనుగొనబడ్డాయి. దక్షిణ పాలస్తీనాలోని అదూమ్ అనే చోట అపారమైన ఇనుప ఖనిజ నిక్షేపాలు బయల్పడ్డాయి. పురావస్తు పరిశోధనవారి త్రవ్వకాలలో కొన్ని చోట్ల పూర్వ కాలంనాటి ఇనుపబట్టీల అవశేషాలు కూడా బయటపడ్డాయి. వీటిని పరిశీలించిన తరువాత దావూద్, సులైమాన్ ప్రవక్తల కాలంలోనే ఈనాటి బ్లాస్ట్ ఫర్నెస్ విధానం అమలులో ఉండేదని తెలిసింది. (తఫ్హీముల్ ఖుర్‌ఆన్ నుండి.)

**107. వడ్డీ**:- వడ్డీ అనేది పేదల నడ్డి విరగ్గొట్టే ఒక ఆర్థిక ఇనుప కడ్డీ అని చెప్ప వచ్చు. దీన్ని దాదాపు అన్ని మతాలు నిషేధించాయి. (2:275-281 సూక్తులు, వాటి పాదసూచికలు చూడండి. వాటితో పాటు 30:39 సూక్తి కూడా చూడండి.)

**108. వారుణీ వాహిని**:- మద్యం మనుషులకు ఎంతో ప్రియమైన పదార్థం. అయితే తాత్కాలిక ఉపశాంతి నిచ్చేదయినప్పటికీ ఇది వారిలో ఉండే విచక్షణా జ్ఞానాన్ని నశింపజేస్తుంది. అందువల్ల ఇస్లాం దీన్ని పూర్తిగా నిషేధించింది. అయితే ఇహలోకంలో మద్యం, మత్తు పదార్థాలకు దూరంగా వుండే విశ్వాసులకు దేవుడు పరలోకంలో స్వర్గ మధువు ప్రసాదిస్తాడని ఇస్లాం చెబుతోంది. ఆ మద్యం మత్తు కలిగించదు; విచక్షణా జ్ఞానాన్ని కూడా నశింపజేయదు. (వివరాలకు 2:219, 4:43, 5:90-91 సూక్తులు, వాటి పాదసూచికలు చూడండి. ఆ తరువాత 56:17-19 సూక్తులు కూడా చూడండి.)

**109. విశ్వాసి**:- ఖుర్‌ఆన్ పరిభాషలో దేవుణ్ణి, ఆయన అంతిమప్రవక్త (సల్లం)ను విశ్వసించి, తదనుగుణంగా ఆచరించే వ్యక్తిని "మోమిన్"(విశ్వాసి) అంటారు. కేవలం దేవుణ్ణి, ఆయన ప్రవక్త (సల్లం)ను విశ్వసించి తదనుగుణమైన ఆచరణకు దూరంగా ఉంటే లేదా తనకు ఇష్టమైనవి ఆచరించి, ఇష్టంకానివి, కష్టమైనవి వదలిపెట్టే వ్యక్తి నిజమైన విశ్వాసి కాలేడు. అలాంటివారిని ఖుర్‌ఆన్ "విశ్వాసులారా! విశ్వసించండ"ని చెబుతోంది. అంటే మీరు నిజమైన విశ్వాసులయితే ఆ విశ్వాసానికి అనుగుణంగా దేవుని ఆజ్ఞలను, ఆయన ప్రవక్త (సల్లం) ప్రవచనాలను పూర్తిగా పాటించండని అర్థం. (4:136 సూక్తి చూడండి.)

**110. శనివారం నియమం**:- యూదులకు శనివారం పవిత్రదినంగా నిర్ణయించడం జరిగింది. ఆరోజు వారు వేటాడకూడదు. కాని యూదులు ఈ నియమాన్ని ఉల్లంఘించడంతో దేవుడు వారిని కోతులుగా మారుగాక అని శపించాడు. (2:65, 7:165-166 సూక్తులు, వాటి పాదసూచికలు చూడండి.)

**111. శాంతి**:- మనిషి తనను తాను దేవునికి, ఆయన ప్రవక్త (సల్లం)కు పూర్తిగా సమర్పించుకొని వారి ఆదేశాలను, హితవులను పూర్తిగా పాటించినప్పుడే అతనికి శాంతి లభిస్తుంది. ఇస్లాం పేరులోనే శాంతి, సమర్పణ భావాలు ఉన్నాయి. కనుక నిజమైన మనశ్శాంతి కోరుకునేవారికి ఇస్లాం తప్ప మరోమార్గం లేదు. (2:132 సూక్తి పాదసూచిక.)

**112. శాసనకర్త**:- ఈ సృష్టి అంతా దేవునిదే. దాన్ని శాసించచే అధికారం కూడా ఆయనకే ఉంది. (30:26, 23:88, 42:10, 5:49, 33:36 సూక్తులు చూడండి.)

**113. షఆయిరుల్లా** (దైవచిహ్నాలు):- ప్రతి మతాన్ని, సంస్కృతిని, జీవన వ్యవస్థను, జాతీయతను సూచించే కొన్ని చిహ్నాలుంటాయి. అలాగే ఇస్లాంలో కూడా దేవుని ఏకత్వాన్ని, ఆయన ధర్మాన్ని సూచించే చిహ్నాలు ఉన్నాయి. వాటినే షఆయిరుల్లా అంటారు. వాటిని ప్రతి ముస్లిం గౌరవించాలి. ఉదాహరణకు: మసీదు, హజ్ యాత్ర, దీక్ష (ఇహ్రాం) మొదలైనవి. (5:2 సూక్తి.)

**114. షైతాన్ (ఇబ్లీస్)**:-ఇతను మానవుణ్ణి మోసగించి దివి నుండి భువికి దిగ జార్చిన పరమదుర్మార్గుడు. మానవుల హృదయాలలో లేనిపోని ఆశలు రేకెత్తించి, భయ ప్రలోభాలు కలిగించి, భయపెట్టి, భ్రమలు కల్పించి రుజుమార్గం నుండి తప్పించే దుష్టశక్తి. షైతాన్ జిన్ (భూతం) జాతికి చెందినవాడు. వీడి అసలు పేరు ఇబ్లీస్. ఇబ్లీస్ అంటే అత్యంత నిరాశానిస్పృహలకు గురైనవాడని అర్థం. ఆదం ముందు తలవంచమని దేవుడు ఇచ్చిన ఆజ్ఞను ధిక్కరించి ఆయన ఆగ్రహానికి, శాపానికి గురయిపోతాడు. దాంతో అతడు ఆదం (మానవుని)కి ఆగర్భ శత్రువయిపోతాడు. (2:30-39, 7:11 సూక్తులు, వాటి పాదసూచికలు చూడండి.)

**115. సంఖ్యాశాస్త్రం**:- ఖుర్ఆన్ గురించి గత 1400 సంవత్సరాల నుంచి ధర్మ వేత్తలు పరిశోధనలు చేసి ఎన్నోభావాలు, మరెన్నో మర్మాలు కనుగొన్నారు. ఇప్పుడు ఖుర్ఆన్‌లోని మరో విశేషం కంప్యూటర్ పరిశోధన ద్వారా వెలుగులోకి వచ్చింది. దివ్య ఖుర్ఆన్ వివిధ కోణాలలో అంతర్లీనమైఉన్న "19" సంఖ్యే కంప్యూటర్‌లో బయల్పడిన కొత్తవిశేషం. ఇది సంఖ్యారాసిలో లఘుతమ, గురుతమ సంఖ్యల మిశ్రమం.

ముందుగా ఖుర్ఆన్ ప్రారంభ వాక్యమయిన 'బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం'ను పరిశీలిద్దాం. ఇందులో మొత్తం 19 అక్షరాలున్నాయి. ఈ వాక్యంలో ఉన్న నాలుగు పదాలు ఖుర్ఆన్‌లో ఎన్నిసార్లు వచ్చాయో ఆ సంఖ్యలన్నీ 19 చే నిశ్శేషంగా భాగించబడే టటువంటి సంఖ్యే. ఖుర్ఆన్‌లో మొత్తం 114 సూరాలు (అధ్యాయాలు) ఉన్నాయి. ఈ సంఖ్య 114 కూడా 19చే నిశ్శేషంగా భాగించబడుతుంది.

ఖుర్ఆన్‌లో 29 సూరాలు, 14 అక్షరాలతో ఏర్పడే వివిధ పద సముదాయాలతో ప్రారంభమవుతాయి. ఉదా:- అలిఫ్ లాం మీమ్, యా సీన్, సాద్, ఖాఫ్, నూన్, హా మీమ్, అలిఫ్ లాం రా మొదలైనవి. ఈ అక్షరాల సంఖ్య 14, సూరాల సంఖ్య 29 కలిపితే వచ్చే సంఖ్య 57 కూడా 19చే నిశ్శేషంగా భాగించబడుతుంది. అదీగాక ఈ 14 అక్షరాలలోని ప్రతి అక్షరం ఏ సూరాలో వచ్చినా ఆ సూరాలో ఆ అక్షర సంఖ్య 19చే నిశ్శేషంగా భాగించబడుతుంది. ఉదా:- ఖాఫ్ సూరాలోని మొదటి అక్షరమైన 'ఖాఫ్' ఆ సూరాలో 57 సార్లు వచ్చింది. సూరా ప్రారంభంలో బీజాక్షర సముదాయంలోని "ఖాఫ్" అనే అక్షరం 57 సార్లు వచ్చింది. ఇది 19చే నిశ్శేషంగా భాగించబడే సంఖ్య. ఖలమ్ సూరా మొదటి అక్షరమైన 'నూన్' 133 సార్లు వచ్చింది. ఇది కూడా 19చే నిశ్శేషంగా భాగించబడే సంఖ్యే. ఆరాఫ్, మర్యం, సాద్ సూరాల్లో మొదటి అక్షరం 'సాద్' ఒక్కొక్క సూరాలో 152 సార్లు వచ్చింది. 152 కూడా 19చే నిశ్శేషంగా భాగించబడే సంఖ్యే.

ఖుర్ఆన్‌లోని కొన్ని సూరాలు రెండు మూడు బీజాక్షరాలతో కూడా ప్రారంభ మవుతాయి. తాహా సూరాలో మొదటి అక్షరజంట 'తా,హా'లో 'తా' 28 సార్లు, 'హా' 314



సార్లు వచ్చాయి. ఈ రెండు సంఖ్యలు (28+314) కలపగా వచ్చే సంఖ్య 342 కూడా 19చే నిశ్శేషంగా భాగించబడుతుంది. యాసీన్ సూరాలో మొదటి అక్షరజంట 'యా, సీన్'లో 'యా' 237 సార్లు, 'సీన్' 48 సార్లు వచ్చాయి. ఈ రెండు సంఖ్యలు (237+48) కలపగా వచ్చే సంఖ్య 285 కూడా 19చే నిశ్శేషంగా భాగించబడుతుంది.

ఖుర్ఆన్‌లో ఏడు సూరాలు 'మీమ్, అయిన్' అనే అక్షరజంటతో ప్రారంభ మవుతాయి. ఆ ఏడు సూరాలలో 'మీమ్' అనే అక్షరం 304 సార్లు, 'అయిన్' అనే అక్షరం 1862 సార్లు వచ్చాయి. ఈ రెండు సంఖ్యలు (304+1862) కూడగా వచ్చే సంఖ్య 2166 కూడా 19చే నిశ్శేషంగా భాగించబడుతుంది. మూడు బీజాక్షరాల సము దాయంతో ప్రారంభమయ్యే సూరాలు కూడా కొన్ని ఉన్నాయి. ఉదా:- 'అలిఫ్, లాం, మీమ్'లతో ప్రారంభమయ్యే 8 సూరాలున్నాయి. ఈ సూరాలలోని అలిఫ్, లాం, మీమ్ అనే అక్షరాలు మొత్తం 26,676 సార్లు వచ్చాయి. ఈ సంఖ్య కూడా 19చే నిశ్శేషంగా భాగించబడుతుంది.

19 సంఖ్యకు లభించిన ఈ ప్రత్యేకత యాదృచ్ఛికం కాదు. యాదృచ్ఛికమయితే రెండుమూడు లేదా అయిదారు సార్లు వచ్చివుండేది. అనేక సార్లు వచ్చిందంటే ఖుర్ఆన్ నిస్సందేహంగా దేవుని వాణేనని, మానవమేధా జనితం ఎంతమాత్రం కాదని తెలుస్తుంది. (దావత్ పత్రిక నుండి)

ఖుర్ఆన్‌లో ఒకచోట ప్రత్యేకంగా 19 సంఖ్య గురించిన ప్రస్తావన ఉంది. నరక పాలకులుగా 19 మంది దైవదూతలను నియమించడం జరిగిందని ఇక్కడ ఖుర్ఆన్ పేర్కొన్నది. ఈ 19 సంఖ్యను దేవుడు అవిశ్వాసులకు పరీక్షగా చేశాడు. (74:31 సూక్తి.) ఏమైనప్పటికి ఈ 19 సంఖ్య సత్యాన్వేషకుల మేధను పదునుపెట్టే విషయమే.

**116. సఫా, మర్వా కొండలు**:- కాబాగృహం సమీపంలో ఉండే ఈ రెండు కొండల మధ్య హజ్ యాత్రికులు సంప్రదాయబద్ధంగా 'సయి' (నడక) చేస్తారు. ఇది హజ్ నియమాల్లో ఒక నియమం. (2:158 సూక్తి చూడండి.)

**117. సమూద్ జాతి**:- ఇది ప్రాచీన అరబ్బు జాతులలోని జాతి. ఈ జాతి ప్రజలకు సన్మార్గం చూపి సంస్కరించడానికి దేవుడు సాలిహ్ ప్రవక్త (అలైహి)ను ప్రభవింపజేశాడు. కాని వారు ఆయన్ని తిరస్కరించి దైవశిక్షకు గురయిపోయారు. (వివరాల కోసం 7:73-79, 11:61-66, 26:141-159, 27:45-53, 54:23-32 సూక్తులు చూడండి.)

**118. సామిరి**:- మూసా ప్రవక్త (అలై) దైవాజ్ఞలను (రాతిపలకల్లో) తీసుకురావడానికి తూర్ పర్వతానికి వెళ్ళినప్పుడు, ఇస్రాయీల్ సంతతివారిని (అంటే యూదులను) పెడమార్గం పట్టించినవాడు ఇతను. ఆవుదూడ విగ్రహం తయారుచేసి అందులోనుంచి దూడ అరుపులాంటి శబ్దం వచ్చేలా చేసి, ఇదే మీ దేవుడంటూ అతను వారిచేత గోపూజ చేయించాడు. తత్ఫలితంగా అతను మూసాప్రవక్త (అలైహి) శాపం వల్ల "మీరు నన్ను తాకకండి" అంటూ తిరుగుతూ శాశ్వతంగా అంటరానివాడయి పోతాడు. (20:85-98 సూక్తులు చూడండి.) సామిరి అనేది అతని అసలుపేరు కాదు. ఇది అతని తెగ లేదా సంతతి లేదా స్వస్థలానికి సంబంధించిన పేరయి ఉంటుంది. బైబిల్ ప్రకారం ఈ వ్యక్తి అసలుపేరు హారూన్. మూసాప్రవక్త (అలైహి) సోదరుని పేరు కూడా హారూనే అయి

నందున యూదులు సామిరి చేసిన నిర్వాకాన్ని పొరపాటునో లేక కావాలనో హారూన్ ప్రవక్త (అలైహి)కు అంటగట్టారు.

**119. సిద్రతుల్‌ముంతహా**:- ఇది సప్తమ ఆకాశంలోని అత్యున్నత స్వర్గసీమకు చిట్ట చివరి సరిహద్దులో వున్న ఓ విశిష్ఠ వృక్షరాజం. ఈవృక్షం ఆవల ఏముందో, ఎలా వుందో సృష్టికర్తకు తప్ప ఎవరికీ తెలియదు. మహాప్రవక్త ముహమ్మద్ (స) తన గగన పర్యటన (మేరాజ్) సందర్భంగా ఈ చెట్టు దగ్గరే దైవసందేశం (దివ్యావిష్కృతి) అందజేసే దైవదూత హజ్రత్ జిబ్రీల్ (అలైహి)ని అసలు రూపంలో రెండవసారి చూశారు. జిబ్రీల్ (అలైహి)కు ఆరొందల రెక్కలు ఉన్నాయని, ఒక్కొక్క రెక్క తూర్పు నుండి పడమర వరకు దూరం ఉండేంత పొడవుగా ఉందని మహాప్రవక్త (స) తెలియజేశారు.

**120. సిబ్గతుల్లా** (దేవుని రంగు):- యూదులు ఇతరుల్ని తమ మతంలోకి తీసుకోవడానికి ముందు వారికి ఒక విధమైన ఎరుపురంగు నీటితో స్నానం చేయిస్తారు. దాంతో ఆ వ్యక్తుల పాపాలు తుడిచి పెట్టుకుపోయి వారు పవిత్రులయి పోతారని, ఓ నూతన జీవితపు రంగు అవలంబించినట్లు అవుతుందని యూదుల విశ్వాసం. దీన్ని వారు తమ మత పరిభాషలో "బాప్తిమిజం" అంటారు. ఈ ఆచారాన్ని ఆ తరువాత క్రైస్తవులు కూడా స్వీకరించారు. (2:138 సూక్తి చూడండి.)

**121. హనీఫ్**:- అంటే ఏకోన్ముఖుడు, ఒకే వైపు దృష్టి కేంద్రీకరించినవాడు అని అర్థం. ఖుర్‌ఆన్ పరిభాషలో యావత్తు మిథ్యా దైవాలను వదలి ఒక్క దేవుడ్ని మాత్రమే ఆరాధించేవాడని అర్థం. (3:67 సూక్తి చూడండి.)

**122. హజ్రె అస్వద్ (నల్లరాయి)**:- కాబా గృహం తూర్పు దిక్కున మూలలో, కాబా ద్వారం సమీపాన గోడలో అమర్చబడిన నల్లరాయిని హజ్రె అస్వద్ అంటారు. ఇది స్వర్గం నుండి తీసుకురాబడిన ఓ పవిత్ర పాషాణం. పాలకన్నా ఎంతో తెల్లగా నిగనిగలాడుతూ ఉండేది. యాత్రికుల 'ఇస్తిలాం' (తాకడం) వల్ల వారి పాపాలను సంగ్రహించి చివరికి ఇలా నల్లబడి పోయింది. ప్రళయదినాన ఈ రాయి కూడా జీవం పోసుకొని లేస్తుంది. దేవుడు దానికి నోరు, దృష్టి ప్రసాదిస్తాడు. కాబా ప్రదక్షిణ సమయంలో తనకు 'ఇస్తిలాం' చేసినవారి కర్మలను గురించి ఇది దేవుని ముందు సాక్ష్యం ఇస్తుంది. (తిర్మిజి హదీసు ఆధారంగా)

ఒకసారి దైవప్రవక్త (సల్లం) కాబా ప్రదక్షిణ చేస్తూ దాన్ని సంబోధించి ఇలా అన్నారు: "నువ్వెంత మంచిదానవు! నీ పరిమళం ఎంత శ్రేష్ఠమైనది!! నీ గౌరవ పవిత్రతలు ఎంత ఉన్నతమైనవి!!! కాని ఎవరి అధీనంలో ముహమ్మద్ ప్రాణం ఉందో ఆ శక్తిస్వరూపుని సాక్షి! దేవుని దృష్టిలో నీ గౌరవ పవిత్రతల కంటే ఒక ముస్లిం ధనప్రాణాలే ఎంతో గౌరవప్రదమైనవి, పవిత్రమైనవి."

**123. హవారీలు**:- అంటే సహాయం చేసేవారు (అన్సార్) అని అర్థం. వీరు ఈసా ప్రవక్త (అలైహి) ప్రత్యక్ష సహచరులు. (3:52-53 సూక్తులు చూడండి.)

**124. హారూత్, మారూత్** :- యూదులు నైతికా పతనానవస్థలో కూరుకుపోయిన కాలంలో దేవుడు వారిని పరీక్షించడానికి హారూత్, మారూత్ అనే దైవదూతల్ని మానవ రూపాల్లో వారి దగ్గరకు పంపుతాడు. తాము పరీక్ష నిమిత్తం పంపబడిన వారమని చెప్పి



నప్పటికీ వారు నేర్పే క్షుద్రవిద్య (చేతబడి)నే నేర్చుకోవడానికి యూదులు ఉబలాటపడేవారు. (2:102 సూక్తి, దాని పాదసూచిక చూడండి.)

**125. హిజ్రత్ (వలస)**:- ఇస్లాంలో హిజ్రత్‌కు ఎంతో ప్రాముఖ్యం వుంది. ఎవరైనా ఒక ప్రాంతంలో హింసాదౌర్జన్యాలకు గురవుతూ ఇస్లాం ధర్మానికి అనుగుణమైన జీవితం గడపలేని పక్షంలో అతను ఆ ప్రాంతం వదలి ఇస్లామీయ జీవితం గడిపేందుకు వీలున్న మరో ప్రాంతానికి వలస పోవలసి వుంటుంది. ముఖ్యంగా ఇస్లామీయ రాజ్యం (దారుల్ ఇస్లాం) ఏర్పడినప్పుడు అక్కడికి తప్పకుండా వలస పోవాలి. లేకుంటే అతను దైవాగ్రహానికి గురవుతాడు. (వివరాల కోసం 4:88-91, 4:97-100 సూక్తులు, వాటి పాద సూచికలు చూడండి.

## Aims and Objects of the Islamic Resource Centre

❋ The Islamic Resource Centre **(IRC)** is to remain as a non-political one, and adopt Humanity as its main resource based on Qur'an and Sunnah.

❋ To promote literacy and literary taste aiming at character building of men and women culturally and morally, eradication of Social evils and superstitions with spiritual base and strive to make them responsible and progressive citizens leading an orderly and peaceful life.

❋ To publish books, booklets, pamphlets, folders, handbills, research papers and periodicals in Telugu language and make audio/video materials, educate and hold educational seminars, symposiums, workshops, memorial lectures, research awards etc.

❋ To achive and promote Communal Amity and Harmonious Relations between the people of various sections of society.

❋ To endeavour establishment of self employment vocational training institutions like sewing centres, computer points etc, thus care for overall development.

❋ To do such other things as are conductive for attainment of any or all of the above objects of the people in generally by utilising all means and provisions available under the Indian Constitution.

**Note:-** Detailed introduction of the "Centre" and its publication activeties has been covered in Urdu dailies "Munsif" of Hyderabad on 5-5-05 and "Urdu Post" of Dubai on 8-8-05.

# హదీసు దర్పణంలో ఖుర్‌ఆన్

☆ దేవుడు ఈ గ్రంథం ద్వారా కొందరిని ఉద్ధరిస్తాడు. మరికొందరిని పడదోస్తాడు. (ముస్లిం).

☆ ఖుర్‌ఆన్‌విద్య నార్జించి, దాన్ని ఇతరులకు నేర్పేవారే మీలో అందరికంటే శ్రేష్ఠులు. (బుఖారి).

☆ ఎవరైనా ఖుర్‌ఆన్ నిషేధించిన విషయాలను ధర్మసమ్మతం చేసుకున్నాడంటే, అతనసలు ఖుర్‌ఆన్‌ని విశ్వసించనే లేదన్నమాట. (తిర్మిజి)

☆ ప్రళయదినాన దివ్య ఖుర్‌ఆన్‌ని, దాని ప్రకారం ఆచరించినవారిని (దైవన్యాయస్థానానికి) తీసుకు రావడం జరుగుతుంది. అప్పుడు వారి ముందు బఖరా, ఆలి ఇమ్రాన్ సూరాలు (అధ్యాయాలు) నల్లటి మబ్బు తునకల రూపంలో (నీడనిచ్చి) నడుస్తుంటాయి. వాటి క్రింది భాగాన వెలుగు ఉంటుంది. లేదా ఆ రెండు సూరాలు రెక్కలు చాచిన పక్షుల గుంపులా పైన ఎగురుతూ వారిని అనుసరిస్తాయి. ఇలా ఈ రెండు సూరాలు తమను పఠించినవారికి అనుకూలంగా సాక్ష్యమిస్తూ వస్తాయి. (ముస్లిం)

☆ జాగ్రత్త! సమీపకాలంలో ఒక పెద్ద కల్లోలం తలెత్తుంది.... దివ్య ఖుర్‌ఆన్ ద్వారా మాత్రమే మీరు దీని బారినుండి బయటపడ గల్గుతారు. ఈ గ్రంథంలో మీకు పూర్వం గతించిన జాతులు చవి చూసిన పర్యవసానాలు కూడ ఉన్నాయి; మీ తర్వాత రాబోయేవారికి ఎదురయ్యే పరిణామాలు కూడా ఉన్నాయి: ఇంకా ఈ గ్రంథంలో మీ దైనందిన వ్యవహారాలకు సరయిన పరిష్కార మార్గాలు కూడా ఉన్నాయి..... ఈ గ్రంథం ఆషామాషీ వాక్కు కాదు. ఇది ఎంతో గంభీరమైన, నిర్ణయాత్మకమైన వాణి. దుర్మార్గుడయి ఈ గ్రంథాన్ని విడనాడిన క్రూరుడ్ని దేవుడు అణగ ద్రొక్కి వేస్తాడు. దీన్ని వదిలి వేరేచోటు నుండి మార్గదర్శకత్వం పొందడానికి ప్రయత్నించేవాడ్ని దేవుడు మార్గభ్రష్టుడిగా చేస్తాడు. ఈ గ్రంథం దేవుడు పంపిన పటిష్ఠమైన త్రాడు. ఇది వివేకవంతమైన హితవాణి. ఇదే సరైన దారి (ముక్తిమార్గం)--- (తిర్మిజి, దార్మి)

☆ ప్రళయం సమీపంలో (ధర్మ) జ్ఞానం తీసేసుకోవడం జరుగుతుంది... దేవుడు జ్ఞానం తీసేసు కుంటాడంటే ప్రజల హృదయాల నుండి తొలిగిస్తాడని అర్థం కాదు. జ్ఞానం తీసుకోవడమంటే ధర్మవేత్తలు లోకం నుండి క్రమంగా అంతరించి పోతారు. ఒక్క ధర్మవేత్త కూడా లేకుండా అందరూ అంతరించిన తర్వాత జనం మూర్ఖుల్ని నాయకులుగా చేసుకుంటారు. ఆ మూర్ఖులు ప్రజలు అడిగిన విషయాలకు జ్ఞానం లేకుండా ఫత్వాలు (తీర్పులు) ఇస్తారు. ఈవిధంగా వారు స్వయంగా దారి తప్పడమే గాకుండా ప్రజల్ని కూడా దారి తప్పిస్తారు. (బుఖారి, ముస్లిం)

☆ ఖుర్‌ఆన్‌ని చదవాల్సిన విధంగా చదవండి. రేయింబవళ్ళు చదవండి. దాన్ని వ్యాపింప జేయండి. అందులోని విషయాలను పరిశీలించండి, మీ జీవితం సార్థకమవుతుంది.

☆ ఎవరు ఖుర్‌ఆన్ అధ్యయనం చేసి దాని ప్రకారం ఆచరిస్తాడో, ప్రళయ దినాన (దైవదూతలు) అతని తల్లిదండ్రులకు ఒక కిరీటం పెడతారు. ఆ కిరీటం సూర్యుని కన్నా ఎక్కువ తేజస్సుతో ప్రకాశిస్తుంది. (బుఖారి, ముస్లిం)

☆ రెండు విషయాల పట్ల ఈర్ష్య పడటం ధర్మసమ్మతమే. అందులో ఒక విషయం.... దేవుడు ప్రసాదించిన ఖుర్‌ఆన్ జ్ఞానంలో (చదవడం, వ్రాయడం, నేర్పడం, ప్రచారం చేయడం వగైరా కార్యకలాపాలలో) రేయింబవళ్ళు నిమగ్నుడయి ఉండేవాడు. (బుఖారి, ముస్లిం)



# 1. విషయదర్శిని (మొదటి భాగం)

## 1. దేవుని అస్తిత్వం (Existance of God) :

1. భూమ్యాకాశాల నిర్మాణం :- 30:8, 35:41, 14:19-20, 51:48-49, 78:12-13, 67:3-5, 79:27-33, 2:22, 2:29, 2:117, 6:96-97, 17:12, 15:19-20, 36:36-40, 45:22.
2. బుద్ధిమంతులకు సూచనలు :- 2:164, 13:2-4, 30:20-24, 39:21, 16:12/13, 45:3-5.
3. పదార్థపూజారులు :- 45:24-26, 52:35-37, 56:86, 56:87, 2:28, 6:5-6, 3:137, 10:101-102, 29:20-23, 30:9, 6:29-30, 23:33-38,..... 40:36-37.
4. వర్షం, వృక్షజాతులు :- 6:99, 13:17, 26:7, 24:43, 35:27, 25:48, 16:10-11, 16:65, 16:67, 14:24-27..... 57:20.
5. పశుపక్ష్యాదులు :- 16:66, 88:17, 67:19, 16:5-8, 16:68-69, 16:79-81.
6. మానవ పుట్టుక :- 86:5-7, 30:20-21, 51:20-21, 16:78, 77:20-23, 39:6, 16:4, 3:6, 4:1.
7. మానవునికి దైవోపకారాలు :- 31:20, 67:15, 30:22-23, 2:21-22, 16:80-81, 57:25, 78:9-11, 96:3-7, 27:73, 16:18, 14:34.
8. సర్వజ్ఞాని, సర్వశక్తిమంతుడు :- 3:5, 2:117, 15:23-25, 6:59-60, 7:54, 10:55-56, 32:5, 34:2, 31:27, 18:109.
9. హెచ్చరికలు :- 56:57-74, 90:4-5, 90:7, 36:60-62, 36:66-68, 10:31-32, 35:15-23, 40:57-58, 20:108-112, 67:16-18, 67:21-24, 10:108, 20:135.

## 2. దేవుని ఏకత్వం (Oneness of God) :

1. సాటిలేని ఆరాధ్యుడు :- 2:163, 3:62, 4:36, 4:48, 18:110, 21:24, 28:88.
2. అణువణువు ఆయన్నే ఆరాధిస్తోంది :- 64:1, 62:1, 61:1, 59:1, 57:1, 17:44, 13:13, 13:15, 22:18, 55:6.
3. దైవోపకారాలు :- 32:6-9, 35:3, 67:15, 16:14-22, 27:60-64, 25:47, 28:71-73, 17:70, 55:2-13, 55:19-25, 40:64-65.
4. కష్టాల్లో వేడుకోలు, సుఖాల్లో షిర్క్ :- 30:33-37, 7:189-190, 17:67-69, 6:40-41, 6:63-65, 29:65-66, 10:22-23, 31:31-32, 11:9-11, 39:8.
5. ఈ పనులన్నీ చేసేదెవరు? :- 23:84-89, 43:87, 39:38-40.
6. దేవుని గుణగణాలు, శక్తి సామర్థ్యాలు :- 2:255, 59:23-24, 112:1-4, 39:62-63, 57:3-5, 53:43-44, 41:47, 13:8-10, 10:3, 67:13-14, 58:7, 31:27-28.
7. జీవిత పరమార్థం :- 51:56-58, 21:25, 16:36.

8. దేవుడా- దైవేతరులా? :- 13:16, 30:40, 10:34-35, 27:65, 16:73, 35:40, 7:191-192.
9. దైవేతరుల పూజ :- 7:197-198, 43:86, 21:43, 7:192-195, 35:13-14, 13:14, 17:56-57, 17:46, 39:45.
10. విగ్రహాలు :- 22:73, 21:98-100, 7:191-195, 7:197-198, 36:74-75, 53:19-23, 29:25.
11. మిథ్యాదైవాలు- సిఫారసు :- 10:18, 39:3, 43:86.
12. యజమాని-బానిస దృష్టాంతం :- 16:71, 16:74-76, 30:28, 39:29, 24:39.
13. బహుదైవాలుంటే ఏమౌద్దీ? :- 17:42, 21:22, 23:91.
14. మనోవాంఛల దాస్యం :- 45:23, 25:43-44, 91:9-10, 49:51, 7:175-176, 23:71.
15. అంధానుకరణ :- 31:20-21, 11:109, 17:40, 52:41, 52:38, 21:24, 21:26, 22:71, 5:104, 7:28, 13:33, 16:35.
16. బహుదైవారాధన పర్యవసానం :- 4:116, 22:31, 39:65, 29:25, 18:102-105, 24:39, 39:45.
17. అసత్యవాదులు :- 6:150, 12:105-107.
18. ప్రవక్తల అల్టిమేటం :- 10:104, 6:14, 6:19, 25:77, 6:46, 39:32, 35:16-17, 109:1-6, 11:121, 11:2
19. దైవదర్శనం :- 6:103, 7:143, 53:13.
20. ఆత్మ (హృదయం) :- 17:85, 21:91, 4:171, 89:27-28, 13:28, 6:125, 6:60, 39:42.

### 3. గ్రంథప్రజల విశ్వాసాలు :

1. అతిశయోక్తి, అంధవిశ్వాసాలు:-4:171, 5:75-77, 10:68, 5:72-73, 5:17-18, 2:111, 2:113, 2:135.
2. దేవుడు-సంతానం :- 2:116, 6:101-102, 19:35, 19:88-93, 9:30-32.
3. ఈసాప్రవక్త, ఆయన బోధనలు :- 43:59, 4:172, 4:157-159, 5:72, 43:63-65.

### 4. ప్రాపంచిక వ్యామోహం :

1. ఐహిక జీవితం- పైపై మెరుగులు :- 29:64, 28:60, 57:20, 3:185, 3:14-15, 10:24-25, 6:32, 18:45-46.
2. ఇహలోక వ్యామోహపరులు :- 3:145, 11:15-16, 31:24, 4:134, 4:94, 33:28-29, 14:3, 87:16-17, 16:107-109.
3. ప్రపంచ సంపద- పరలోక సంపద :- 28:60, 42:36, 10:58, 43:33-35, 13:26, 4:77, 102:1-8, 3:196-197.
4. ఏమరుపాటు- తిరస్కార తిమిరం :- 10:7-8, 10:12, 2:212, 3:10-11, 30:7.
5. పరలోక ప్రియులకు హితబోధ :- 20:131, 9:55, 3:196-198, 20:131.



### 5. ఖుర్ఆన్-ఆధునిక పాఠ్యగ్రంథం :

1. మానవ విరచితం కాదు :- 56:75-80, 32:2, 10:37, 4:174, 26:210-212, 16:102-103, 69:39-47, 17:88, 11:13,14.
2. గ్రంథ విశిష్టత :- 43:3-4, 80:13-16, 85;21-22, 38:88, 15:87, 16:102, 26:193-196, 6:155, 10:57-58, 2:185.
3. దైవగ్రంథం అనడానికి నిదర్శనాలు :- 4:82, 17:88, 11:14, 10:38, 2:23-24, 52:33-34.
4. అవతరణకు కారణాలు :- 14:1-2, 14:52, 57:9, 6:92, 32:3, 6:156-157, 27:76-77, 4:105, 5:16, 17:9-10, 36:70, 57:25, 10:57-58
5. విశ్వాస సుగుణం తీరు :- 2:2-4, 39:23, 17:107-109.
6. అవిశ్వాస ప్రవృత్తి ధోరణి :- 10:38-39, 6:7-8, 16:103-105, 26:198-201, 31:32, 54:4-5, 47:24-25, 43:5, 56:80-82.
7. విశ్వజనీన వాణి :- 9:33, 12:104, 2:185, 4:174-175, 14:52, 39:41, 38:88.
8. భాష, రచన, శైలి :- 12:2, 26:195, 54:17, 39:23, 3:7, 10:1, 6:115, 39:27-28.
9. పాషాణాలను కరిగించే గ్రంథం :- 59:21, 13:31.
10. సాక్ష్యం :- 4:166, 11:17, 46:10, 26:196-197.
11. తిరస్కార పర్యవసానం :- 18:29, 6:157, 20:134.
12. గ్రంథ పరిరక్షణ :- 15:9, 75:16-19, 41:41,42.
13. హృదయ రుగ్మతల నివారిణి :- 10:57-58, 17:82.
14. పాఠ్యగ్రంథం పట్ల విశ్వాసుల ప్రవర్తన :- 15:91, 72:1-4.
15. ఇతరత్రా :- 43:44, 16:98, 97:1-5, 7:204.

### 6. ముహమ్మద్ (సల్లం) దౌత్యం :

1. దేవుని పిలుపు, ప్రవక్త జీవితం :- 4:170, 5:92,..... 33:32, 68:4.
2. ప్రవక్త కార్యకలాపాలు :- 65:11, 62:2, 2:151, 3:164, 7:157.
3. ఆశయాలు :- 57:9, 57:25, 3:79-80, 7:157.
4. ప్రవక్త స్థానం, బాధ్యతలు :- 33:45-46, 53:56, 4:79, 2:119, 6:107, 34:28, 46:9, 13:40, 72:21-23, 33:40, 17:79.
5. ప్రవక్తకు దేవుని హెచ్చరికలు :- 17:86-87, 2:120, 11:12, 6:35, 66:1, 6:17, 17:73-77, 69:44-47, 39:65.
6. కవియా, కల్పితమా :- 36:69, 11:35, 37:36, 46:48, 52:30-32, 8:31, 25:4-6, 21:5, 38:5-7.
7. మాంత్రికుడా, పిచ్చివాడా:- 37:36, 38:4, 10:2, 21:3, 51:52, 53:1-3, 7:184, 23:70,

34:46, 68:1-9,.... 54:1-3.

8. మానవుడు ప్రవక్త కాలేడా:- 25:7-10, 21:34, 23:24, 23:33-34, 25:20,6:9, 12:109, 17:94-95, 21:7-8, 41:6, 14:10-11.

9. ప్రవక్త ప్రత్యేకతలు :- 17:1, 17:60, 94:1-4, 33:40, 33:50-52, 33:56, 17:79.

10. దివ్యావిష్కృతి :- 42:51-52, 53:4-18, 3:44, 12:3, 12:102.

11. గ్రంథ ప్రజలు :- 5:15, 5:19, 2:120, 6:159, 2:145-146, 3:44, 3:61, 3:64, 3:20, 3:183

12. ప్రవక్త ఛాలెంజ్ :- 3:61, 3:64.

13. ప్రవక్తకు దేవుని హితోక్తులు :- 33:1, 33:48, 33:2-3, 28:86, 32:23, 10:94, 6:106, 7:2, 10:65, 10:109, 17:79, 18:6,18:27, 25:51-52, 16:123, 94:7-8, 15:97-99, 6:17, 16:127-128, 30:60.

14. అరబ్బుల్లోనే ప్రవక్త ఎందుకు? :-36:6, 34:44, 3:164, 7:157, 9:128, 13:30, 10:47, 14:4.

15. తిరస్కారానికి కారణం దుర్లక్షణాలు :- 2:99, 27:80-81, 10:42-43, 28:57, 43:31-32, 38:8-10, 56:82, 25:41-44, 28:50, 8:32, 6:33, 2:89.

16. బలాత్కారం లేదు :- 28:56, 16:36-37, 10:99-100, 26:3-4.

17. అవిశ్వాసల కుట్రలు, దుష్టయత్నాలు :- 4:113, 8:30, 22:15.

18. సాక్ష్యం :- 13:43, 4:79, 4:41, 16:89.

19. అగోచర జ్ఞానం :- 27:65, 18:110, 6:50, 7:188, 38:67-70, 10:20, 9:101.

20. అవిశ్వాసులకు ప్రవక్త హెచ్చరిక :- 34:24-25, 10:41, 34:50, 39:64, 42:15.

21. అవిశ్వాసులకు ప్రవక్త హితబోధ :- 21:108-109, 6:162-163, 39:11-15, 67:28-29.

22. ప్రవక్త నిస్వార్థ సేవ :- 6:90, 52:40, 42:23, 12:104

23. ప్రవక్తకు దేవుని ఓదార్పు :- 39:36, 93:3-8, 94:1-4, 20:2-3, 39:30-31, 13:40, 25: 30-31, 5:67.

24. మహిమలు (మోజిజాత్) :- 6:104, 51:20-21, 12:105, 10:20, 6:109-111, 6:158, 54:1-2,
52:44, 15:14-15, 17:59, 27:82.

25. ప్రవక్త పట్ల విధేయత :- 3:31, 4:80, 8:20, 33:36, 59:7, 4:59, 4:61, 4:65, 49:1-2, 58:11, 48:16-17, 24:47-52.

26. యావత్మానవాళికే మార్గదర్శి :- 21:107, 4:79, 34:28.

## 7. ఇస్లాం - సనాతన ధర్మం :

1. మొదట్లో మానవులందరి ధర్మం ఒక్కటే :- 10:19, 42:13, 28:53.



2. ధర్మంలో చీలికలు, ఏమరుపాటు :- 21:92-93, 23:53-54.

3. విభిన్న మతాలకు కారణాలు :- 5:48, 16:93, 17:84, 5:68.

4. ధర్మంలో బలాత్కారం లేదు :- 2:256, 10:99-101, 6:125, 2:208-209, 50:45.

5. ఇబ్రాహీం ధర్మం :- 2:130-132, 2:135-136, 3:84, 4:125, 3:67, 2:128.

6. ప్రకృతి ధర్మం :- 30:30-32, 3:83.

7. ఇస్లాం తప్ప మార్గం లేదు :- 6:125-126, 9:32-33, 3:19, 3:85, 3:83, 5:3, 6:14, 5:44, 3:102, 22:78.

8. ఇస్లాం మౌలిక దృక్పథం :- 4:116, 5:69, 2:62, 2:111-112, 3:179, 2:135, 3:64.

## 8. మరణానంతర జీవితం :

1. మృత్యు కుహరం :- 3:145, 3:156-158, 4:78, 6:60-61, 6:93-94, 8:50-51, 39:42, 16:28-29, 4:97, 8:50-51, 10:90-91, 44:29, 50:19, 16:32, 89:27-30, 75:26-30, 41:30-32.

2. పితృలోకం (ఆలమె బర్జఖ్) :- 40:45-46, 23:99-100, 7:40, 22:31.

3. ప్రళయ సూచనలు :- 17:58, 18:97-99, 21:95-96, 27:82, 6:158, 11:117 (FN), 44:11.

## 9. ప్రళయ దినం :

1. ప్రళయం ఎప్పుడొస్తుంది? :- 7:187, 31:34, 42:17-18, 53:57-61.

2. మృతులు బ్రతుకుతారా? :- 7:57, 30:50, 19:66-67, 22:55, 22:5-7, 36:77-79, 36:81, 31:28, 75:1-4, 17:49-51, 23:81-83, 44:34-36, 17:99, 50:3-5, 70:6-7, 50:15, 46:33.

3. పునర్జీవానికి కారణాలు :- 16:38-39, 10:4, 75:36-40, 39:69, 39:75, 14:51.

4. ప్రళయ బీభత్సం:- 69:1-3, 69:13-16, 21:1-2, 27:88, 78:20, 20:105-107, 18:47, 50: 19-20, 21:104, 36:48-50, 39:68, 81:1-6, 75:7-11, 82:1-3, 56:1-6.

5. పునరుత్థానం:- 84:1-5, 99:1-4, 36:51-53, 82:4-5, 81:7-14, 70:43-44, 14:42-43, 14:48, 54:6-8, 20:102,108, 4:87, 39:68, 73:17, 10:45, 80:34-42, 30:43, 30:14.

6. అవిశ్వాసుల పశ్చాత్తాపం :- 21:97, 14:44, 4:41-42, 3:30, 69:25-29, 6:31, 32:12, 25:28, 89:23-24, 26:96-1102,.... 39:54-59,..... 68:42-43.

7. దైవ న్యాయస్థానం :- 25:25-26, 39:67, 69:16-18, 18:47-48, 23:101, 100:6-11, 102:8, 7:6, 2:281, 77:14-15, 96:7-8, 11:105, 78:37-38, 20:111, 40:16.

8. కర్మపత్రాలు, విచారణ, తీర్పు:- 40:17-20, 16:111, 64:9, 45:28, 17:13-14, 18:49, 21:47, 7:8-9, 69:19-22, 69:25-26, 17:71, 84:7-11, 22:17, 5:109, 16:89, 28:65-66, 28:75, 6:130, 2:281, 53:38-42.

9. బహుదైవారాధకుల, గ్రంథప్రజల విచారణ :- 10:28-30, 6:22-24, 18:52, 25:17-19, 34:40-42, 28:62-66, 16:86-87..... 5:116-118.

10. సాక్ష్యం :- 75:13-15, 7:6, 16:84, 16:89, 4:41-42, 41:19-23, 28:74-75, 10:28-29, 25:17-18, 36:65,.... 5:109, 5:117, 2:143, 16:89, 45:28,29.

11. పుణ్యాత్ముల పర్యవసానం :- 45:30, 5:119, 20:112, 69:19-24, 80:38-39, 83:34-35, 7:8, 41:30-32, 43:68-70.

12. పాపాత్ముల పర్యవసానం :- 3:30, 17:97, 7:51, 20:102, 6:31, 7:53, 20:124-126, 69:25-37, 68:43, 39:48, 80:40-42, 14:49-50, 7:9, 54:52-53, 18:105, 77:29-33, 55:41, 37:22-24, 8:36-37.

13. సిఫారసు, సహాయం, పాపపరిహారం :- 31:33, 40:18, 2:48, 26:88, 30:57, 35:18, 43:67, 5:36, 70:10-15,34:23, 19:86-87, 2:254, 60:3, 20:109, 21:28-29,.... 39:2-3, 39:43-48, 43:86.

14. షైతాన్, వాడి అనుచర గణం :- 36:60-64, 50:26-29, 6:128, 14:22.

15. గర్విష్ఠి నాయకులు, అంధానుచరులు :- 37:19-33, 34:31-33, 14:21, 2:166-167, 14:44-45, 23:64-67, 25:27-29, 16:25, 6:29-30, 41:29,..... 11:96-99, 40:47-48.

16. మూడు వర్గాలుగా చీలడం :- 30:14-16, 90:11-20, 56:7-10, 56:13-14, 56:39-40, 56:51-56, 56:95, 56:90-91.

17. పరలోకం ముందు ఐహికజీవితం :- 20:102-104, 23:112-114, 30:55-57, 79:46.

## 10. స్వర్గ సీమ :

1. ఆనంద నిలయం :- 3:133, 21:101-103, 15:48, 17:21, 25:16, 39:20, 88:13-16, 56:34, 52:18, 11:108, 22:59, 55:46, 55:48, 55:50, 55:62, 55:64, 55:66.

2. స్వాగతం, స్వర్గ ప్రవేశం :- 39:73-74, 21:103, 13:23-24, 15:46.

3. ఆహార పదార్థాలు :- 19:62, 37:41-43, 2:25, 52:22, 52:19, 56:17-21, 56:28-33, 43:71-73, 55:52, 55:68, 55:76.

4. పానీయాలు :- 47:15, 76:5-6, 76:15-18, 56:18-19, 83:25-28, 37:45-47.

5. దుస్తులు, నగలు, పరుపులు :- 18:31, 56:15-16, 55:54, 35:33.

6. సుందరాంగులు :- 44:54, 56:22-24, 56:35-38, 37:48-49, 55:56, 55ః58, 55:70, 55:72, 55:75.

7. సేవకులు :- 52:24, 56:17-18, 76:19.

8. దైవప్రసన్నత, దైవదర్శనం :- 33:44, 9:72, 89:27-30, 75:22-23.

9. పరస్పర సంభాషణ :- 55:15-16, 52:25-28, 37:50-60, 7:44.



10. నిష్కల్మష హృదయాలు, కృతజ్ఞతలు :- 15:47, 19:62, 56:25-26, 7:42-43, 35:34-35, 10:10.

## 11. నరక కూపం :

1. నరకం అంటే :- 74:27-29, 70:15-17, 78:21-22, 101:9-11, 11:106-107, 25:12,67:7-8, 15:43-44, 19:71-72, 50:30.

2. నరకశిక్షకు కారణాలు :- 35:37, 3:162, 70:17, 4:56, 25:11, 46:20, 74:42-47, 7:179.

3. పాపాత్ముల పశ్చాత్తాపం :- 33;66, 23:105-110, 26:94-103, 40:10-12, 25:28-29, 6:31, 32:12, 69:25-29.

4. నరక పాలకులు:- 74:30-31, 66:6, 67:6-11, 43:77-78, 46:34, 52:14-16, 40:49-50.

5. నరక యాతనలు:- 25:12-14. 14:16-17, 39:16, 32:20, 56:41-46, 104:6-9, 44:47-50, 22:19-22, 40:71-72, 7:41, 23:104, 25:34, 19:68-69, 40:49-50, 55:41,44, 32:13.

6. ఆహార పానీయాలు :- 88:6-7, 44:43-46, 37:64-68, 38:57-58, 56:52-56, 14:16,17.

7. పశ్చాత్తాపం, పరస్పరారోపణలు :- 38:59-64, 7:38-39, 26:96-102, 41:29, 2:166-167, 40:47-48, 33:66-68.

## 12. ఆరోహణా సోపానాలు :

1. ఆరాఫ్ వాసులు :- 7:46-47.

2. స్వర్గవాసులు, నరకవాసుల సంభాషణ :- 7:48-50, 7:44-45, 74:41-47, 57:12-15.

3. కారుచీకటిలో కాంతి రేఖలు :- 2:257, 66:8, 57:12-13.

## 13. జీవిత పరమార్థం :

1. విశ్వనిర్మాణ లక్ష్యం :- 21:16-18, 44:38-39, 45:22, 23:17, 30:8.

2. ఆదం-షైతాన్:- 18:50, 17:61-65, 2:30-39, 7:11-25, 4:118-121, 20:115-126, 38:71-85.

3. మానవులచేత ప్రమాణం :- 7:172-173, 3:81-82, 33:7-8, 51:56,.... 42:13, 3:187, 2:83, 7:169-171, 5:7.

4. మానవుని పుట్టుక, అతని ప్రవృత్తి :- 15:26-27, 76:1-3, 90:4, 17:70, 17:83, 17:11, 70:19-21, 41:49, 42:48, 4:28.

5. అంతరాత్మ ఘోష :- 91:7-10, 75:1-4, 12:53, 23:71, 13:27-29, 89:27-30, 3:145.

## 14. దైవ దూతలు :

1. గుణగణాలు, రూపురేఖలు :- 7:206, 21:27-29, 37:164-166, 35:1.

2. విధులు, బాధ్యతలు :- 50:17-18, 13:11, 42:5, 17:78, 22:75, 40:7-9.

3. మృత్యు దూతలు :- 6:61, 6:93, 7:37, 8:50-51, 16:28-29, 16:32.

4. దైవ సందేశహరుడు :- 81:19-21, 72:27-28, 70:4, 2:98

5. నరక దూతలు :- 74:30-31 (చూడు: అధ్యాయం-11, అంశం-4)

**15. దైవప్రవక్తలు, దివ్యగ్రంథాలు :**

1. దైవప్రవక్తలు :- 4:165, 10:47, 13:38, 23:44, 40:78, 3:33, 22:75.

2. దివ్య గ్రంథాలు :- 3:3, 3:93, 5:44-45, 6:91, 9:111, 5:46-47, 4:163, 21:105, 7:157.

3. ప్రతిజాతిలో దైవప్రవక్తల ప్రాభవం :- 35:24, 13:7, 26:208, 16:36.

**16. కర్మలు (ఆచరణ) :**

1. మౌలిక విశ్వాసం, సదాచరణ :- 2:62, 2:111-112, 4:123, 2:195.

2. సత్కార్యాలు :- 2:177, 2:115, 2:148, 2:189, 22:36-37, 26:89, 49:13, 41:33, 31:17, 22, 90:12-17, 103:1-3.

3. దుష్కార్యాలు (అధర్మకార్యాలు) :- 6:151-153, 16:106-107, 31:17, 31:21.

**17. విధి నిర్ణయం (జాతకం) :**

1. పుట్టక ముందే భావిచరిత్ర :- 57:22-23, 27:75, 34:3, 6:59, 25:2, 36:12, 17:13.

2. నిర్ణీత సమయానికే సంభవం :- 3:145, 6:2, 6:67, 7:34.

3. నిర్ణయాధికారం దేవునిదే :- 13:38-39, 44:3-5, 58:21.

**18. పాప పుణ్యాలు :**

1. ఎవరి కర్మలు వారివే :- 2:284, 17:7, 17:15, 99:7-8, 18:30, 4:40, 6:164, 29:12-13, 41:46, 2:286, 4:111, 30:44, 33:33, 5:105, 60:3, 35:18.

2. వృక్ష దృష్టాంతం, కర్మలచిట్టా :-14:24-27, 83:7-11, 83:18-22, 4:85, 6:160, 5:100, 36:12.

3. పాపాలు మానండి, నిరాశ చెందకండి :- 6:120, 4:30-31, 4:110-111, 33:5, 4:48-49, 27:11, 39:53-58, 6:53-55.

4. అవిశ్వాసుల పట్ల దేవుని ఉపేక్ష :- 27:4-5, 9:115, 16:61, 30:41.

5. ఘోరపాపాలు :- 4:48, 4:116, 53:32, 4:31, 25:68.

**19. కష్ట సుఖాలు :**

1. సర్వాధికుడు, సర్వ శక్తిమంతుడు :- 2:117, 32:5-6, 3:109, 41:47, 64:11, 53:43-48, 39:42, 39:43-44, 42:27-28, 42:49-50.

2. స్వయం కృతాపరాధం :- 4:78-79, 10:44, 42:30-34.

3. కష్టాల్లోనే దేవుడు గుర్తుకొస్తాడా? :- 10:12, 16:83, 68:33, 68:44-45, 42:48, 6:63-65, 29:65-66, 10:22-23, 31:31-32, 11:9-11, 39:8.

4. దౌర్జన్య జాతులకు దైవదండన:- 46:27-28, 30:9, 22:45-46, 22:48, 50:36, 11:100-102. 3:137, 11:117, 6:131, 9:55, 8:53, 17:16, 21:11-15, 25:40, 20:128-129.



**20. దైవ పరీక్షలు :**

1. పరీక్షా ప్రపంచం :- 18:7, 20:131, 67:2, 6:165, 57:25, 4:115, 2:143.

2. కృతజ్ఞతా పరీక్ష :- 39:49-52, 41:49-51, 4:147, 7:10.

3. పరీక్షను గుర్తించనివారు:- 89:15-23, 6:42-45, 7:94-100, 23:55-56, 9:126, 32:21-22.

4. కష్టసుఖాల పరీక్ష :- 21:35, 21:34, 67:2, 21:110-111, 39:52,.....94:5-8, 42:30.

5. విశ్వాస పరీక్ష :- 2:155-157, 29:2-4, 2:214, 3:186, 3:185, 8:28, 20:131.

**21. మిథ్యా దైవాలు :**

1. షైతాన్ (ఇబ్లీస్) :- 7:11-17, 4:117-121, 34:20-21.

- ♦ వాడి ప్రతిజ్ఞ :- 6:142, 36:60-62, 19:44-45, 14:22, 25:27-29, 24:21.
- ♦ వాడిపట్ల అప్రమత్తంగా ఉండాలి:- 35:5-6, 7:27-28, 2:168-169, 2:208-209, 6:121, 43:36-38, 35:8, 17:53, 24:21,.... 50:27-29, 36:60-64.
- ♦ వాడి దుష్ప్రేరణ నుండి రక్షణ :- 7:200-202, 113:1-5, 114:1-6, 6:68, 16:98, 41:36.
- ♦ వాడి ప్రాబల్యం ఎవరి మీద? :- 26:221-223, 22:3-4, 19:83, 16:99-100, 58:10, 43:37-38, 59:16-17, 37:7-10, 34:20-21.

2. మూఢ నమ్మకాలు, దురాచారాలు :- 5:90, 5:3, 5:103, 5:104, 6:138-140, 6:143-144, 16:56, 10:59, 2:189, 6:100, 4:117, 43:15-22, 51:10-11, 53:19-23, 53:27-30, 8:35, 2:102, 57:27.

3. విగ్రహారాధన :- 22:30-31, 22:73-74, 21:98-99, 7:197-198, 36:74-75, 53:19-23, 29:25, 2:51-52,.... 6:108.

4. తాతముత్తాతల (అంధా)అనుకరణ :- 31:21, 2:170, 11:109, 7:70, 11:87, 26:71-74, 43: 23-24, 37:70-71, 7:28, 5:104, 6:148, 16:35, 6:28.

5. దైవప్రియుల ఆరాధన :- 5:116-118, 16:20-21, 18:21, 3:80, 45:10, 39:45, 25:17-19.

6. దైవదూతల ఆరాధన :- 37:155-160, 43:16, 17:40, 34:40-41.

7. జిన్నుల (భూతాల) ఆరాధన :- 6:100, 72:6, 41:29, 34:40-41.

8. మనోవాంఛల దాస్యం :- 45:23, 25:43-44, 91:7-10,.... 7:175-176, 23:71.

9. నేతలు, అధికారులపట్ల విధేయత :-21:98-99, 2:166-167, 14:21, 34:31-33, 37:22-23.

10. బంధుమిత్రుల ఆరాధన :-29:8, 8:27-28, 63:9, 64:14-15, 9:23, 25:27-29, 43:38-40.

11. మతగురువుల ఆరాధన :- 16:25, 9:31, 9:34-35.

12. చేతబడి :- 2:102-103, 113+114 అధ్యాయాలు.

**22. ఆరాధనలు :**

1. ఆరాధనా భావం :- 51:56, 22:18, 7:205-206, 7:55-56, 2:152, 40:60, 40:14, 2:43,45,

6:72, 7:170, 22:77.

2. శుచి శుభ్రతలు :- 74:4-5, 4:43, 5:6, 2:222.

3. ఖిబ్లా (ఆరాధనా కేంద్రం) :- 2:148-149, 2:115, 2:142-144, 2:150, 7:29, 2:177, 3:96.

4. ఫరజ్ నమాజులు :- 20:132, 17:78, 20:130, 2:238, 33:41-42, 4:103, 2:45-46, 2:153, 11:114, 17:110, 107:4-7.

5. ఖసర్, ఖౌఫ్, నఫిల్, సామూహిక నమాజులు :- 2:239, 4:101-102, 73:2-8, 73:20, 2:43, 62:9-11,.... 9:84, 9:113-114.

6. జిక్ర్ (ధ్యానం) :- 4:103, 7:180, 13:28, 52:48-49, 2:152, 57:16.

7. దుఆ (వేడుకోలు) :- 2:186, 2:200-202,.... 40:60,.... 1:1-7, 2:286, 3:8-9, 3:16, 3: 26-27, 3:53, 3:191-194, 5:83, 7:126, 18:10, 23:109, 25:65-66, 25:74, 59:10, 60: 4-5, 20:25-28, 21:87, 20:114, 21:89, 23:97-98, 26:83, 26:85, 26:87, 27:19, 46:15, 71:28, 3:38, 43:13-14.

8. ధర్మ ప్రచారం :- 5:67, 2:159, 2:44, 8:25, 3:104, 7:199, 26:214, 6:69-70,.... 6:108, 88:21-22, 2:256, 6:51, 29:46, 16:125,.... 80:1-12, 6:52,.... 9:122.

**23. దానధర్మాలు (జకాత్, ఉష్ర్ వగైరా) :**

1. అవకాశం చేజారక ముందే దానం చేయాలి :- 2:254, 64:16, 2:270, 34:39.

2. పిసినారితనం వహించకండి :- 2:245, 2:268-269, 47:36-38, 34:39, 59:9, 57:10-11, 2:195, 57:23-24, 4:37, 3:180, 9:75-77, 17:100, 104:1-4, 9:34-35.

3. దానశీలురు :- 2:261, 2:265, 2:264, 2:266, 3:117.

4. దానోద్దేశ్యం :- 2:272, 3:115, 2:265, 2:274, 2:271, 2:262-264, 30:39, 92:17-20.

5. ఏం ఖర్చుపెట్టాలి, ఎంత ఖర్చుపెట్టాలి?:- 2:219, 2:267, 3:92, 6:141, 65:7, 17:29, 9:79.

6. దానస్వీకార యోగ్యులు :- 9:60, 2:273, 2:215, 90:9-11.

7. కపట విశ్వాసులు:- 9:75-78, 17:100, 9:53-55, 4:38, 17:29.... యూదులు :- 2:83.

8. దానఫలం :- 92:5-12, 92:17-21, 104:1-4, 9:34-35.

9. పాప పరిహారం :- 5:89, 58:3-4, 2:196, 5:95, 2:184.

**24. ఉపవాస వ్రతాలు :** 2:183-187,.... 97:1-5.

**25. హజ్ యాత్ర :**

1. కాబా గృహం :- 3:96-97, 22:25, 105:105, 2:126-127.

2. హజ్, ఉమ్రాలు :- 2:196, 2:158, 2:198-200, 2:203, 22:28-29, 22:33.

3. ఇహ్రాంలో నిషేధితాలు :- 2:196, 5:1-2, 5:94-95,.... 2:198.

**26. మాంసాహారం :**



1. ధర్మసమ్మతమైనవి :- 2:168, 5:87, 5:5, 5:1, 5:4, 5:96.

2. అధర్మమైనవి (నిషేధితాలు) :- 2:173, 6:121, 5:96, 6:146, 5:3, 5:100.

3. ఖుర్బానీ (బలిదానం) :- 22:34, 22:36-37.

**27. నైతిక విధానం (నీతిశాస్త్రం) :**

1. సాధారణ నీతి :- 91:7-10, 45:23, 20:82, 23:51, 23:57-61, 28:84, 53:31, 17:7, 29:7, 4:149, 29:58,.... 5:2, 2:237, 16:90, 29:58.

2. అహంకారం :- 38:73-77, 40:35, 31:18-19, 53:32, 16:49-50, 17:37.

3. అసత్యం :- 16:104-105, 22:30, 45:7, 61:2-3, 7:33, 2:42.

4. వాగ్దానం, ఒప్పందం, ప్రతిజ్ఞ, ప్రమాణాలు :- 17:34, 6:152, 16:95, 16:91-92, 2:224-225, 225, 5:89, 5:7.

5. న్యాయం, సాక్ష్యం, నిజాయితీ :- 5:42, 5:8, 4:135,.... 8:27, 4:58, 4:2, 4:107.

6. అపనింద, చాడీలు :- 4:148, 49:12, 47:12, 104:1,.... 4:112, 24:19, 24:16.

7. పనికిమాలిన మాటలు, దుబారా ఖర్చు :- 2:108, 5:101-102,.... 6:141, 17:26-27.

8. మద్యం, జూదం :- 2:219, 4:43, 5:90-91, 5:100.

9. అశ్లీలం, వ్యభిచారం :- 42:37, 5:100, 24:30,.... 17:32, 23:5-7, 24:3, 24:2,.... 24: 5-9,....7:80-81.

10. అసూయా ద్వేషాలు :- 4:54, 3:161.

11. అనుమానాలు, వదంతులు, గుసగుసలు :- 49:12, 17:36,...49:6, 4:83,...58:8-9, 4:108.

12. హింస, హత్య, ప్రతీకారం :- 4:29-30, 17:33, 5:27-32, 4:92-93, 2:178-179.

13. రక్త పరిహారం :- 49:11,.... 2:231,.... 4:140.

14. సలాం :- 4:86, 4:94, 24:61, 24:27.

15. క్షమాపణ, పశ్చాత్తాపం, క్షమావర్తనం :- 2:160, 24:30-31, 2:222, 47:19, 3:89-90, 4: 17-18, 4:48,.... 24:22, 45:14, 4:149, 42:37, 42:40, 42:43.

16. సేవా దృక్పథం:- 2:83, 30:38, 31:14, 46:15, 5:2, 2:237, 2:215, 2:273, 2:262, 17:26.

17. దైవభీతి :- 3:102, 2:197, 2:194, 2:150, 2:233-235, 8:29, 65:4-5, 65:2, 4:130-131, ...57:16.

18. సహనం, స్థిరత్వం, దైవంపై భారం :- 41:30, 46:13-14, 2:153, 3:186, 73:10, 16:96, 29:69, 26:217, 12:87, 18:23-24, 46:36, 46:43, 16:126-128.

19. మంచిని పెంచు, చెడును త్రుంచు:- 7:157,9:71, 9:112, 22:41, 16:125, 41:33-35, 23:96.

20. ముస్లిమేతరుల పట్ల ప్రవర్తన :- 6:108, 4:105, 41:34, 60:8, 31:14-15, 4:86, 4:94.

21. సమానత్వం :- 49:10, 49:13.

## 28. సామాజిక జీవితం :

1. మౌలిక విషయాలు :- 4:1, 16:90-91, 2:83.
2. వివాహ బంధం :- 42:11, 51:49, 36:36,.... 4:23, 4:22, 4:24,.... 4:25, 4:20-21, 4:3, 4:127, 24:32-33,.... 5:5, 24:3, 24:26,.... 60:10-11, 33:37,.... 2:221.
3. కుటుంబ జీవితం :- 4:32, 4:34, 2:228,.... 4:128-130, 4:34-35, 4:19,....2:187, 2:222-223,.....64:14-15, 66:6,..... 66:3-4.
4. కుటుంబ నియంత్రణ :- 42:49-50, 6:140, 6:151, 17:31, 41:10,.... 81:8-9, 81:14, 43:18, 53:21-22, 16:57-59.
5. పరదా వ్యవస్థ :- 24:30-31, 33:55, 33:32-33, 33:59, 33:53.
6. సభ్యతా సంస్కృతులు :- 7:26, 7:31-32,.....24:27-29, 33:53, 33:59, 49:4-5,....24:58, 24:59,... 58:11, 31:19, 51:9,... 4:86, 24:61, 24:27.
7. విడాకులు (తలాఖ్) :- 2:226-232,....2:233......2:234-235, 2:240-241....2:236-237... 33:49, 65:1-6.....58:2-4.
8. తల్లిదండ్రులు, బంధువులు :- 31:14, 46:15-17, 17:23-24, 31:15..... 4:36, 8:75, 33:6, 4:19-20.
9. స్త్రీల హక్కులు, బాధ్యతలు :- 4:4, 4:19, 4:20, 4:7, 4:11, 4:12... 4:15-17.... 4:32-34, ....4:127-130... 9:71-72, 33:35.... 2:229.
10. ముస్లింల పరస్పర సంబంధాలు :- 49:13, 3:102, 3:103, 3:105, 2:213, 49:9-10,...... 49:11-12, ...8:73.

## 29. ఆర్థిక విధానం :

1. జకాత్, ఉష్ర్ :- 2:254, 14:30, 2:219, 21:73, 98:5, 2:110, 2:277, 9:18, 9:71,....9:60, 2:273, 2:245, 2:267, 6:141.
2. ఆస్తి పంపకం, వీలునామా :- 4:5,... 4:7-14, 4:177, 33:4, 33:6, 4:8-9,... 5:106-108, 2:184,... 2:180-182 (రద్దు).
3. మహర్ (స్త్రీ ధనం) :- 4:4, 4:24, 4:19-21, 2:240-241, 60:10-11.
4. అనాథల సొమ్ము :- 4:2, 4:6, 4:10, 4:127, 2:220.
5. అక్రమ(అధర్మ) సంపాదన :- 4:29-30, 2:188, 2:283-284, 5:38-39, 4:10, 83:1-7, 24:19, 31:6, 24:33, 5:90, 2:275, 2:278-280,.... 38:24.
6. వడ్డీ, అప్పు :- 2:275-276, 2:278-281, 30:39,.... 2:282-283.
7. వ్యాపారం :- 4:29-30, 2:188, 55:7-9, 83:1-7, 7:85, 26:181-182, 17:35,... 9:28, 11:6, ... 42:27, 11:87.



8. సమరసొత్తు (అన్ఫాల్, ఫై) :- 8:69, 8:41,.... 59:6-10.
9. ధన వికేంద్రీకరణ :- 3:180, 9:34-45, 104:1-9, 59:7, ..... 2:219, 9:60, 6:141, 8:41, 59:7, 4:7-14, 4:176.
10. ఆర్థిక వనరుల వినియోగం :-23:51, 17:26-27, 17:29, 25:67, 4:5, 11:87, 2:267-9.
11. దానధర్మాలు :- (23వ అధ్యాయం చూడండి)

## 30. రాజకీయ విధానం :

1. దేవుని సార్వభౌమత్వం :- 30:26, 32:5, 25:2, 36:83, 21:23, 13:41, 23:88, 35:13, 17:111, 40:12, 18:26, 7:54, 5:44-47, 3:26, 45:27, 43:85, 4:64, 4:105, 5:48-50, 12:40, 33:36,.... 3:154, 42:10.
2. పరిపాలన :- 4:58, 3:159, 42:38, 4:59,.... 23:88-89.
3. సంస్కరణలు, రాజ్యలక్ష్యం :- 22:41, 3:110, 9:71, 9:112.
4. మానవ (ప్రాథమిక) హక్కులు :- 5:32, 17:33,.... 2:188, 4:29,.... 49:11,... 49:12, 24:27, ....5:79, 7:165, 2:190,... 10:99, 2:256,.... 6:108,.. 49:6, 17:36, 4:58, 51:19, 28:4-5, ....4:148, 3:110, 3:104-105.
5. సాంఘిక న్యాయం :- 5:8, 57:25, 8:74-75.
6. న్యాయ వ్యవస్థ (నేరం-శిక్ష):
   - ♦ న్యాయ దృక్పథం :- 4:105-111, 4:65, 4:135, 5:8, 38:20-23.
   - ♦ సాక్ష్యం :- 5:106-108, 24:4-9, 2:282.
   - ♦ దౌర్జన్యం :- 42:39-43, 22:60.
   - ♦ హత్య :- 5:32, 17:33, 2:178-179, 4:92-93.
   - ♦ తిరుగుబాటు, కల్లోలాలు :- 5:33-34, 2:217, 8:39-40, 9:32-33,
   - ♦ వ్యభిచారం :- 17:32, 24:2, 4:25, (4:15-16 రద్దు)
   - ♦ దొంగతనం :- 5:38. (+) అపనింద :- 24:4-9.
7. మానవుని స్థాయి (దైవప్రతినిధి) :- 17:70, 22:65, 2:29, 16:4-18,.... 2:30-39, 15:28-43, .... 7:129, 38:26, 6:57, 3:26, 6:165, 33:72,... 7:3, 6:163, 24:55.
8. తిరుగులేని చట్టాలు :- 7:54, 33:36, 24:47-50, 5:44-47, 42:10, 5:49-50.
9. పాలకులు, అధికారులు :- 2:124, 26:151-152, 49:13-14, 12:55-56, 4:83, 4:58-59, 38:26, 24:62.
10. సలహామండలి :- 42:38, 3:159.....(ప్రజాస్వామ్యం) 6:116,117....38:20-23.
11. విదేశాంగ నీతి :- 16:91-92, 9:7/4, 8:72/58, 5:8, 4:90, 8:61, 60:8-9, 2:194.
12. జిహాద్ (ధర్మ పోరాటం) :- అధ్యాయం-31 (జిహాద్) చూడండి.

13. ముస్లిం సముదాయ ధ్యేయం :- 2:142, 3:92, 3:104, 3:110, 4:95.

14. అధిక సంఖ్యాకులు, అల్పసంఖ్యాకులు :- 6:116-117.

**31. జిహాద్ (ధర్మయుద్ధం) :**

1. ఆశయాలు, కారణాలు :- 2:216, 4:75, 2:191, 2:194, 22:40-41, 8:56-58, 2:217, 4:91, 9:13-15,..... 8:25, 8:39.
2. ప్రేరణ, ప్రోత్సాహాలు:- 61:10-11, 4:74, 2:218, 3:157, 3:160, 4:76, 4:95-96....4:77-78, 9:44....3:142-143, 2:214, 3:111, 9:38-40, 8:24, 47:35, 9:19-20...2:154.
3. యుద్ధ సన్నాహాలు :- 9:41, 9:123, 8:47, 33:22, 4:71, 8:60, 3:200.
4. సత్యనిరాకరణకు దైవశిక్ష :- 8:30-37, 47:32, 47:34, 8:19, 48:25.
5. రణరంగంలో:- 8:15-16, 33:15-16,..47:4-5, 61:4, 2:250, 8:65-66,..4:102-103,..2:190, ...33:10-11, 3:139-141, 4:104, 3:144-150, 3:155, 3:165-166, 3:169-171.
6. కపట విశ్వాసులు :- 9:86-87, 9:44-45, 48:11, 33:13, 33:18-20, 9:46-48, 9:81-83, 3:167-168, 3:154,... 4:89,... 8:49, 47:20-22,... 4:141, 48:15-16.
7. చిత్తశుద్ధిగల విశ్వాసులు :- 8:74-75, 9:120-121, 9:91-92, 9:111, ...48:10, 9:100, 9:102-103, 48:18-21.
8. గుణపాఠం :- 8:37, 3:13.
9. దైవ సహాయం :- 3:122, 3:125, 3:160, 8:11-13, 8:17, 8:18, 8:43, 8:44, 9:25-26, 22:62, 33:25, 8:42
10. విశ్వాస పరీక్ష:- 47:31, 8:6-9, 3:152, 3:165, 3:166, 3:172/175, 8:48, 33:23-24, 9:16.
11. హిజ్రత్ (వలస) :- 8:74, 4:97-100, 9:20-22.. 22:40.
12. ఒప్పందం ఉల్లంఘన :- 8:56-58, 8:61-62, 9:1/2/4/5, 4:90, 9:7-12, 4:91.
13. నిషిద్ధమాసాల ఉల్లంఘన :- 9:36-37, 2:194.
14. యూదులు, కపటుల దుశ్చర్యలు :- 59:11-14, 59:2-3, 9:107-110.
15. యుద్ధ ఖైదీలు, సమర సొత్తు :- 8:67-70, 9:6,....8:41, 8:69, 59:6-10.
16. స్నేహ సంబంధాలు :- 41:34-35, 60:7-9, 5:55-56, 8:71, 58:22, 9:119, 3:28.
17. శత్రువుని శత్రువుగానే చూడాలి:- 2:109, 2:105, 3:100, 5:49/51, 3:118,....60:9/13, 3:28, 9:23-24, 5:57-58, 18:28, 8:73,....5:82,....3:118-120, 4:89.
18. ఐకమత్యం :- 3:103, 3:105, 2:213,....49:9-10,....8:45-46, 8:65-66, 8:73.

**32. విశ్వాసి గుణగణాలు :**

1. బుద్ధిమంతులు :- 39:17-18, 13:19-24, 2:164, 3:7, 16:12, 28:60, 30:28, 36:68.
2. సజ్జనులు, దుర్జనులు ఒకటికాదు :- 38:28, 59:18-20, 32:15-18, 39:9, 39:22,.98:6-7,



28:61, 40:58, 47:13-15, 59:18-20.

3. ఏమరుపాటుకు గురికానివారు :- 57:16, 63:9, 7:201, 24:36-37.
4. పరలోక వ్యాపారం :- 9:111-112, 2:207, 35:29-30.
5. నిజమైన విశ్వాసులు (సజ్జనులు) :- 49:15, 8:1-4, 22:41, 24:55, 28:54-55, 33:35,... 31:2-5, 70:19-35, 32:15-17, 42:37-43.
6. దైవభీతిపరులు:- 3:15-17, 3:133-136, 23:57-61,...35:28,...51:15-19, 50:31-34, 39:23.
7. దైవానుగ్రహం పొందేవారు :- 9:71-72, 9:99-100, 24:56.
8. రహ్మాన్ భక్తులు :- 25:63-68, 25:72-76.
9. సాఫల్యం పొందేవారు:- 2:3-5, 23:1-11, 23:57-61, 33:35,...42:36-39, 42:43, 79:40, 22:77-78.
10. జ్ఞానకాంతి పొందేవారు :- 24:35-38, 39:22.
11. మృదుత్వం - కాఠిన్యం :- 5:54, 48:29.
12. సహనశీలురు :- 22:34-35, 29:58-59, 42:43, 103:1-3.
13. జనశ్రేయోభిలాషులు :- 3:110, 2:143.
14. ముస్లింల పరస్పర సంబంధాలు :- 3:103-105, 4:59, 49:9-10, 58:11.

**33. అవిశ్వాసి లక్షణాలు :**

1. సత్యతిరస్కారులు :- 98:6, 2:161-162, 3:91, 7:186, 2:6-7,...8:31-33, 17:45-46, 6:25,... ..10:96-97, 8:55, 11:8, 25:21-22, 34:35, 8:50-51.
2. బహుదైవారాధకులు:- 39:45, 39:67, 2:170-171,....6:148, 23:75-77, 34:43, 24:39-40, ....22:11-13, 28:57.
3. గ్రంథప్రజలు (యూదులు) :- 3:21-22, 2:174-175, 2:84-86, 4:150-151, 3:78, 4:49-54, 3:181-182, 42:14, 45:16-17, 98:4-5, 3:75, 3:113-114, 3:199.
4. గ్రంథప్రజలు (క్రైస్తవులు) :- 4:171, (5:17-18, 72-75, 82-84, 116-118), 19:88-95, 57:26-27, 3:52-53.
4. కపటులు:- 2:8-20, 2:26-27, 9:124-125,...4:72-73, 4:141, 47:20-30, 9:42, 9:50-51, 9:56-58, 9:66-68,.... 4:65-66, 24:48-50,.... 58:8,.... 9:97-98, 49:14/17, 63:7, 83:29-32, 4:62-63, 4:142-243, 63:1-6, 107:4-7.
5. మనోవాంఛా దాసులు :- 23:71, 14:13, 7:175-176, 25:43, 28:50.
6. బుద్ధిహీనులు :- 8:22-23, 2:142, 7:179, 7:175-176.
7. దుర్మార్గులు (కలహకారులు) :- 2:204-206, 25:60, 31:6-7, 41:26.
8. కర్కోటకులు, తుచ్ఛులు :- 74:11-26, 68:10-16, 6:93.

9. జాతుల ఉత్థాన పతనాలు :-7:69, 26:128-129, 26:146-149,....8:53, 13:11, 10:96-98, 11:116-117, 15:4-5, 17:16-17, 32:26, 35:45, 40:82, 50:36, 50:39, 20:128.

**34. యూదుల ఆగడాలు :**

1. దైవోపకారాలు, దైవహితవులు :- 2:40-41, 2:47, 2:49-50, 2:53, 2:55-57, 4:47.
2. ప్రమాణ భంగాలు :- 2:83-85, 2:93, 3:187, 4:153-155, 2:65-66, 7:169.
3. జాత్యహంకారం (సత్యనిరాకరణ) :- 2:89-91, 2:94-95, 5:18, 3:70-71.
4. గ్రంథాల్లో మార్పులు, ప్రవక్తల సంహారం:-2:61, 2:84-87, 2:101, 5:70-71, 4:157,...3:75,.. ..10:93, 3:77-78, 5:44-47, 2:75, 3:183.
5. ఖుర్ఆన్‌పట్ల, ప్రవక్తపట్ల వైఖరి :-3:23-24/69-73, 4:46, 5:41-43, 5:59-60, 2:75-79.
6. దేవుని ఆంక్షలు :- 4:160-161.
7. ఇబ్రాహీం గురించి జగడం :- 2:135/130/139/140, 2:111-113, 3:65-69, 98:1-5.
8. శాపగ్రస్తులు :- 5:60/64-66/78-79, 7:167-188, 3:112, 5:12-13,....2:161, 3:87-90.
9. వారి మతగురువులు :- 5:61-63, 5:79, 9:34.
10. దైవదూతల పట్ల వైఖరి :- 2:96-98.
11. సజ్జనులు :- 3:199, 3:113-114, 32:24, 4:162.
12. కలహకారులు :- 17:4-7, 5:62-63, 5:64.

**35. విజ్ఞానశాస్త్రం (సైన్సు) :**

1. సూక్ష్మజీవులు, పశుపక్ష్యాదులు :-2:26, 16:5-8, 16:66/80/79/68/69, 23:21-22, 67:19.
2. జంటలు :- 43:12, 36:36, 51:49,... 4:1.
3. మానవ దేహనిర్మాణం :- 30:20, 15:26,...86:5-7, 77:20-23, 16:4,...16:78, 39:6, 3:6, 23:14, 22:5, 40:67,...29:14,...67:23, 10:31,...51:21, 23:78-79, 6:46.
4. విశ్వనిర్మాణం :- 10:3, 11:7, 22:47, 21:30, 41:9-12.
5. భూమి :- 27:61, 43:10,....81:6, 41:9,10.
6. సూర్యచంద్రులు :- 21:33, 16:12, 31:29-30, 41:37, 2:189, 10:5,...54:1.
7. ఆకాశం (గ్రహాలు, నక్షత్రాలు) :- 50:6, 36:40,....67:1, 67:3-4.
8. ఆధునిక పరికరాలు :- 55:25, 30:41.
9. గ్రహాంతర వాసులు :- 65:12, 16:49, 42:29,....(జిన్)6:128, 15:27.



# 2. విషయదర్శిని (రెండవ భాగం)

**1. ఆదం (అలైహి)-ఆదిమానవుడు :**

1. మానవసృష్టి మహోత్కృష్టజీవిగా:-2:30-34, 38:75-76, 7:13-15, 15:39-42, 7:18, 38:84,55.
2. దివి నుండి భువికి :- 2:135, 20:117-121, 2:36-39, 7:19-25.
3. సంతానంలో అంతఃకలహం :- 5:27-31.

**2. ఇద్రీస్ (అలైహి) :-** 19:56-57, 21:86.

**3. నూహ్ (అలైహి) :**

1. సందేశప్రచారం, జాతివైముఖ్యం:- 71:1-4, 26:107-109, 7:60-63, 26:111-116, 10:71-72, 23:24-25.
2. దేవుని సన్నిధిలో ప్రవక్త ఫిర్యాదు :- 71:5-24, 71:26-28.
3. దేవుని ఆజ్ఞ, తుఫానులో ఓడ :- 11:36-37, 23:27-29, 11:38-44, 11:45-48.

**4. ఇబ్రాహీం, ఇస్మాయీల్ (అలైహి) :**

1. సందేశప్రచారం, జాతివైముఖ్యం:- 16:120-122, 6:74-79, 29:16-18, 6:80-82, 26:70- . 88, 37:85-87.
2. అగ్ని పరీక్ష :- 21:51-57, 37:88-92, 21:58, 37:94, 21:59-68, 37:97, 21:69-70.
3. రాజుతో భేటి :- 2:258.
4. తండ్రితో వైరం :- 19:42-48, 9:114.
5. విశ్వనాయకత్వం, పునర్జీవన పరీక్ష :- 2:124, 2:260.
6. దైవదూతలు, సంతాన శుభవార్త :- 11:69-70, 15:53-56, 51:29, 11:72-73, 15:57-60, . 19:49, 37:100-101.
7. బలిదానం, కాబానిర్మాణం :- 37:102-110, 2:127-129, 14:35, 2:126, 14:35-41.
8. ఇస్మాయీల్ దైవప్రవక్తగా :- 19:54-55.

**5. లూత్ (అలైహి) :**

1. ప్రచారం, జాతివైముఖ్యం:-26:160-164, 7:80-81, 29:29, 26:167-168, 7:82, 26:169.
2. దైవదూతలరాక, దైవశిక్ష :- 11:77-79, 15:70-72, 11:80-81, 15:73-77.

**6. ఇస్హాఖ్ (అలైహి) :-** 11:71, 15:53, 12:38, 12:6.

**7. యాఖూబ్ (అలైహి) :-** 11:71, 12:6, 12:18, 12:94-98.

**8. యూసుఫ్ (అలైహి) :**

1. స్వప్నం, సవతి సోదరుల కుట్ర :- 12:4-18.
2. ఈజిప్టులో అజీజ్ మంత్రి ఇంట :- 12:19-34.
3. కారాగారంలో ధర్మప్రచారం :- 12:35-53

4. ఈజిప్టు రాజ్యాధినేతగా :- 12:54-101

**9. హూద్ (అలైహి) :**

1. సందేశప్రచారం, జాతివైముఖ్యం :- 7:65-70, 11:52-57.
2. ప్రవక్త శాపం, దైవశిక్ష :- 7:71, 41:15, 46:24-25, 41:16, 7:72.

**10. షుఐబ్ (అలైహి) :**

1. సందేశప్రచారం, జాతి బెదిరింపులు :- 7:85-87, 11:87-93, 26:185-188, 7:88-90.
2. దైవాగ్రహం, ప్రకృతి ప్రకోపం :- 11:94-95, 26:189-190, 7:91-95.

**11. సాలిహ్ (అలైహి) :**

1. ప్రవక్త బోధ, జాతి తిరస్కారం :- 11:61-63, 7:74, 26:143-154, 27:46-47, 7:75-76, 54:24-26.
2. ఉష్ట్ర పరీక్ష, దైవశిక్ష :- 27:48-50, 54:27-29, 7:77-79.

**12. మూసా, హారూన్ (అలైహి) :**

1. పుట్టుక, పోషణ, నేరారోపణ :- 28:4-6, 28:7-13, 28:14-21.
2. మద్యన్‌లో పెళ్ళి, తొలిదివ్యావిష్కృతి :-28:22-29, 20:10, 28:30, 27:8, 20:12-20, 28:31, 27:10-11, 20:21, 28:32-33, 20:25-29, 28:34, 20:31-36, 28:35, 20:37-44.
3. సందేశప్రచారం, ఫిరౌన్‌తో భేటి:-20:45-46,79:18-19, 20:47-48,...7:104-105, 20:49-55, 26:18-28.
4. మంత్రజాలం, మాంత్రికుల విశ్వాసప్రకటన:-26:29-37, 20:57-59,10:76-78, 79:23-24, 20:60,...26:38-42, 20:61-69, 10:80-81, 7:117-122, 7:123, 26:49, 20:71, 26:50-51, 20:72-76, 7:126, 7:127-129.
5. అనుచరులు, ప్రకృతి విపత్తులు :- 10:82-86, 10:87-88, 7:130-135.
6. ఖారూన్ ధనగర్వం :- 28:76-82.
7. ఒక విశ్వాసి ఉపదేశం:-40:25-27, 40:28-35, 40:36-37, 40:38-45, 66:11 (ఆసియా).
8. జ్ఞానార్జన పయనం, ఖిజర్ మహిమలు :- 18:60-70, 18:71-76, 18:77-82.
9. ఫిరౌన్ పర్యవసానం:- 43:51-54, 44:19-22, 20:77,....26:52-66, 20:79, 44:29, 10:91.
10. ఇస్రాయీలీలకు హితబోధ :- 7:104, 7:138-141, 14:7-8.
11. ఇస్రాయీలీలపై దేవుని అనుగ్రహాలు :- 7:160, 2:61, 7:161-162.
12. తూర్‌కొండపై తౌరాత్ స్వీకరణ :- 7:142, 20:83-84, 7:143-146.
13. హారూన్ పర్యవేక్షణలో ఇస్రాయీలీలు :- 20:85, 7:148, 20:86-89, 20:90-91, 7:150, 20:92-94, 7:150-151, 20:95-98, 7:154.
14. యూదుల తలబిరుసుతనం :- 7:155, 2:55, 7:155-156, 2:56.



15. గోయజ్ఞం, సబ్బత్ నియమం :- 2:67-74, 2:63-64,....7:163, 2:65-66.
16. యుద్ధనిరాకరణ :- 5:20-26,....2:243.

**13. దావూద్ (అలైహి) :**

1. తాలూత్ నియామకం, దావూద్ చేతిలో జాలూత్ వధ :- 2:246-248, 2:248-251.
2. దేవుని వరాలు, న్యాయమైన తీర్పు :- 38:17-20, 21:80, 38:20, 21:78, 38:21-26.

**14. సులైమాన్ (అలైహి) :**

1. దేవుని వరాలు, భూతాలపై అదుపు :- 27:16-17, 34:12, 38:36, 38:37-38, 34:13, 38:31-35, 27:17-19.
2. వడ్రంగిపిట్ట సందేశం, సబారాణితో భేటి :- 27:20-28, 27:29-37, 27:38-44, 34:14.

**15. ఇల్యాస్ (అలైహి) :-** 37:123-129, 37:130, 6:85.

**16. అల్ యసాఅ (అలైహి) :-** 38:48, 6:86.

**17. అయ్యూబ్ (అలైహి) :-** 21:83-84, 38:41-44, 6:84, 4:163.

**18. యూనుస్ (అలైహి) :-** 37:139, 21:87, 37:140-142, 21:87-88, 37:145-148, 37:143-144.

**19. జుల్‌కిఫ్ల్ (అలైహి) :-** 38:48, 21:84-85.

**20. జకరియ్య(అలైహి) :-** 19:2-3, 3:37-38,19:4-6, 3:39, 19:7, 3:40, 19:9, 3:40,41.

**21. మర్యం (అలైహి) :-** 3:35-37, 3:42-43, 19:16-21, 19:22-26, 19:27-33.

**22. యహ్యా (అలైహి) :-** 19:2-11, 3:38-41, 19:12-15.

**23. ఈసా మసీహ్ (అలైహి) :-** 3:42-43, 3:45-49, 19:16-21, 19:22-26, 19:27, 19:33,....43:63-64, 3:52-53, 5:112-115, 57:27, 3:54-55.

**24. ఖిజర్ (అలైహి) :-** 18:60-70, 18:71-77, 18:78-82.

**25. లుఖ్మాన్ (అలైహి) :-** 31:12-13, 31:16-19.

**26. జుల్‌ఖర్నైన్ (అలైహి) :-** 18:83-88, 18:89-91, 18:92-98.

**27. ఉజైర్ (అలైహి) :-** 2:259.

**28. ముగ్గురు ప్రవక్తలు, ఒక విశ్వాసి :-** 36:13-19, 36:20-27, 36:28-30.

**29. గుహ వాసులు :-** 18:9-17, 18:18-21, 18:22-26.

**30. తోట యజమానులు :-** 68:17-32,.... 18:32-43.

**31. అగడ్త బాధితులు :-** 85:4-7.

**32. సబా జాతి ప్రజలు :-** 34:15-19.

**33. యాజూజ్, మాజూజ్ తెగలు :-** 18:94-98, 21:96-97, 18:99.

المعهد العالی الاسلامی حیدرآباد
AL MAHADUL AALI AL ISLAMI HYDERABAD

قرآن مجید اللہ تعالیٰ کی آخری کتاب گویا کتاب ہدایت سب سے آخری اور مکمل ایڈیشن ہے۔ اپنے اولین مخاطب کی رعایت کرتے ہوئے' یہ کتاب عربی زبان میں نازل ہوئی' مگر یہ پوری انسانیت کے لئے ذریعہ ہدایت ہے۔ یہ کسی ایک قوم' ایک نسل' ایک گروہ اور ایک زبان بولنے والے لوگوں کے لئے مخصوص نہیں ہے۔ بلکہ پوری انسانیت اس کی مخاطب ہے اور امت مسلمہ کا فریضہ ہے کہ اللہ کے جن بندوں تک اللہ کا پیغام نہیں پہونچا' وہ ان تک اس پیغام کو پہونچانے کی کوشش کریں۔

اس کوشش کا سب سے اہم تقاضہ یہ ہے کہ قرآن مجید کا ترجمہ یا ترجمانی اور تشریح مختلف زبانوں میں ہو' اور زبان کے مروج اور عام فہم اسلوب میں ہو' ہندوستان ایک کثیر لسانی ملک ہے اور جو زبانیں یہاں بولی جاتی ہیں ان میں ایک اہم ترین تلگو زبان ہے' تلگو بولنے والے آندھرا پردیش کے علاوہ بیرونی ریاستوں میں بھی موجود ہیں اور بیرون ملک میں بھی پھیلے ہوئے ہیں۔ افسوس کہ اس زبان میں اسلامی علوم پر جس درجہ کی خدمت ہونی چاہیئے تھی وہ نہیں ہوسکی ہے پھر بھی جو لوگ اس سلسلہ میں کام کررہے ہیں وہ پوری امت کی طرف سے شکریہ کے مستحق ہیں۔

اسی سلسلہ کی ایک اہم کاوش محترم جناب ابوالعرفان صاحب کی ہے جو ایک طرف دینی ذہن کے حامل اور اسلامی کاز کے مخلص سپاہی ہیں اور دوسری طرف جیسا کہ مجھے معلوم ہوا خوبصورت اور عام فہم تلگو لکھتے ہیں۔ انہوں نے قرآن مجید کو تلگو عوام تک پہونچانے کی سعی مشکور کی ہے اور حضور صلی اللہ علیہ وسلم کی سیرت بھی۔ جیسا کہ میں نے جستہ جستہ پڑھوا کر سنا۔ دلچسپ انداز میں مرتب کی ہے اور از راہ احتیاط ترجمۂ قرآن کے بجائے ترجمانی قرآن کا عنوان دیا ہے جو بہت ہی مناسب بات ہے' میں اس اہم خدمت پر تہہ دل سے انہیں مبارکباد دیتا ہوں' اہل ذوق سے خواہش کرتا ہوں کہ ان کی اس خدمت کی قدردانی کریں' اور دعا کرتا ہوں کہ اللہ تعالیٰ اس کوشش کو لوگوں کی ہدایت کا ذریعہ بنائے اور اپنی قبولیت سے نوازے۔ ربنا تقبل منا انک انت السمیع العلیم

۱۱ر محرم الحرام ۱۴۲۵ھ

خالد سیف اللہ رحمانی
ناظم المعہد العالی الاسلامی حیدرآباد

## మౌలానా ఖాలిద్ సైఫుల్లా రహ్మానీ గారి సందేశం

దివ్యఖుర్‌ఆన్ అంతిమ దైవగ్రంథం, సమగ్ర గ్రంథం. ఇది తన ప్రప్రథమ సంబోధితులు మాట్లాడే అరబీ భాషలో అవతరించినా యావత్తు మానవాళికి మార్గదర్శనం చేస్తుంది. అంచేత దీని సందేశాన్ని ప్రజలందరికీ వారి భాషల్లో అనువదించి అందజేయాల్సిన బాధ్యత ముస్లింలపై ఉంది. మన దేశంలోని అనేక భాషల్లో తెలుగు ఒక ముఖ్యమైన భాష. ఈభాష మాట్లాడేవారు ఆంధ్రప్రదేశ్‌లోనే గాకుండా దేశంలోని ఇతర రాష్ట్రాలలో, విదేశాలలో కూడా ఎందరో ఉన్నారు. కాని ఇలాంటి భాషలో ఇస్లామీయ సాహిత్యం తగినంత లేకపోవడం శోచనీయం. ఏమైనా ఈ రంగంలో పనిచేస్తున్నవారు యావత్తు ముస్లింల తరపున అభినందనీయులు.

ఈ విషయంలో అబుల్ ఇర్ఫాన్ గారి కృషి ఎంతో ముఖ్యమైనది. ఆయన మంచి ధార్మిక మనస్తత్వం కలిగిఉండటంతో పాటు, ఇస్లామీయ ఆశయ సాధనకోసం పోరాడుతున్న గొప్ప సమర యోధులు. పైగా ఆయన సరళమైన చక్కటి తెలుగు రాస్తారని కూడా నాకు తెలిసింది. ఆయన ఖుర్‌ఆన్‌ని, మహనీయ ముహమ్మద్ (సల్లం) జీవితచరిత్రను అనువదించి తెలుగు ప్రజలకు అందజేయడానికి చేసిన కృషి ఎంతో ప్రశంశనీయమైనది. నేను వీటిని ఇతరులచేత చదివించి విన్నాను. ఎంతో ఆసక్తిదాయకమైన తీరులో రచనలు సాగాయి... ఇలాంటి మహత్తర సేవ చేసినందుకు నేను అబుల్‌ఇర్ఫాన్ గారిని అభినందిస్తున్నాను. ఆసక్తిపరులు ఆయన సేవను ఆదరిస్తారని, ఆయన కృషి తెలుగువారి హృదయాలను చూరగొంటుందని ఆశిస్తున్నాను.

(సం)..... (అధ్యక్షులు),అల్ మహదుల్ ఆలి అల్ ఇస్లామి, హైదరాబాద్-5



بسم الله الرحمن الرحيم

Mohammed Al-Omeri Abu Abdullah
M.A., M. Phil (Hadeeth) - Imam Mohammed Ibne Saud Islamic University Riyadh, K.S.A.
President : DARUL IMAM IBNE HAJR
محمد العمري أبو عبد الله
Plot No. 2, Road No. 14, Banjara Hills, Hyderabad - 34. A.P. India. Phone :
حيدرآباد الدكن (جنوب الهند)

الحمد لله رب العالمين والصلاة والسلام على أشرف الأنبياء والمرسلين وعلى آله وصحبه أجمعين، ومن تبعهم بإحسان إلى يوم الدين.

أما بعد: فإن الدعوة الإسلامية عمل جليل من مهام الأنبياء والمرسلين، [illegible] توارثها بعدهم علماء الإسلام بإذن الله [illegible] في مشارق الأرض ومغاربها على اختلاف ألوانهم [illegible] وألسنتهم.

ومن ضمن الجهود الدعوية [illegible]: ترجمة معاني القرآن الكريم إلى لغة التلغو (TELUGU) التي هي لغة رسمية لولاية آندهرا براديش (الهند) البالغ عدد سكانها أكثر من ثمانين مليونا. قام بالترجمة الأخ/ أبو العرفان [illegible]

[illegible]

وصلى الله على نبينا محمد وآله وصحبه وسلم تسليما كثيرا.

[illegible]
محمد العمري أبو عبد الله
[illegible]

## అనువాదం

కరుణామయుడు, కృపాసాగరుడయిన అల్లాహ్ పేరుతో ప్రారంభం

సకల లోకాల ప్రభువయిన అల్లాయే సమస్త ప్రశంసలకు అర్హుడు. ఆయన ప్రియప్రవక్త (స)కు శాంతీ శుభాలు కల్గుగాక. ధర్మప్రచారం ఎంతో శ్రేష్టమైన పని. ఇది దైవసందేశహరులు నిర్వహించిన గొప్ప పుణ్యకార్యం. వారి పిదప ఈ మహాకార్యం దైవాజ్ఞతో ధర్మవేత్తలకు వారసత్వంలో లభించింది. జాతి, భాషా, వర్ణం, వర్గం వగైరా ఎలాంటి వివక్ష లేకుండా దీన్ని వారు మానవులందరికీ అందజేసి, అన్ని ధర్మాలపై ఆధిక్యత కలిగివుండేలా నెలకొల్పాలన్నదే దైవోద్దేశ్యం.

ఇలాంటి ధర్మప్రచార ప్రయత్నాలలో "ఖుర్‌ఆన్ భావామృతం" పేరుతో మీ ముందున్న ఈ తెలుగు అనువాదం కూడా ఒకటి. ఆంధ్ర ప్రదేశ్‌లోని 8 కోట్ల జనాభాకు అధికార భాషైన తెలుగులో దివ్య ఖుర్‌ఆన్‌ని అనువదించి అబుల్ ఇర్ఫాన్ గారు ఓ మహత్తర కార్యం సాధించారు. ఇందులో ఆయన విలువైన సమాచారం అందజేశారు. నేనీ గ్రంథాన్ని క్షుణ్ణంగా పరిశీలించాను.


సోదరులు అబుల్ ఇర్ఫాన్ గారు తెలుగులో అనేక పుస్తకాలు అనువదించి అనువాద ప్రక్రియలో ఎంతో అనుభవం గడించారు. ఆయనలో నేను శ్రేయోభిలాష, మంచితనాలను కూడా చూశాను. ఏమైనప్పటికీ దేవుడే పరమ పవిత్రుడు, సమస్తం ఎరిగినవాడు. దేవుడు ఆయన సేవలను స్వీకరించి, ఆయన శ్రమకు తగిన పరలోక ప్రతిఫలం ప్రసాదించుగాక! దేవుడు నాకు, అబుల్ ఇర్ఫాన్ గారికి, ఇతర యావన్మంది ముస్లింలకు శ్రేయోశుభాలు కల్గించాలని ప్రార్థిస్తున్నాను.

(సం)– ముహమ్మద్ అల్ ఉమరి అబూ అబ్దుల్లా

మొదలు పెడితే ముగించేదాకా వదలిపెట్టలేని
**ధారావాహిక నవలా స్రవంతి** ↓

## అరాచక వ్యవస్థను మార్చివేసిన
# ముహమ్మద్ ప్రవక్త

తెగల మధ్య పోరాటాలతో, యుద్ధాలతో బహుదేవతారాధన, జంతుబలులు, మూఢ నమ్మకాలతో అరాచకంగా తయారైన అరబ్ ప్రపంచాన్ని ఉద్ధరించడానికి అవతరించిన దైవదూత ముహమ్మద్ ప్రవక్త. విశృంఖల జీవితానికి అలవాటుపడ్డ అరబ్ ప్రజలలో చిన్ననాటి నుండే సత్యసంధత, పరోపకారం, దయాగుణం వంటి సత్ప్రవర్తనలతో తనకంటూ ఒక ప్రతేకతతో ముహమ్మద్ ప్రవక్త అందరినీ ఆకర్షించ గలిగాడు. బాల్యం నుంచే పైగంబర్ ముహమ్మద్ చుట్టుపక్కల దేశాలకు వెళ్ళడం, వారి జీవన పరిస్థితుల్ని పరిశీలించడం, రకరకాల ధార్మిక ఆచారాలను గమనించడం జరిగింది. రాచరిక దోపిడీ విధానాన్ని, బానిస విధానం మీద ఆధార పడ్డ వ్యవస్థను మార్చవలసిన అవసరాన్ని గుర్తించాడు. మక్కాలో పురోహితుల ప్రాబల్యాన్ని ధిక్కరించి, వారి మతాన్ని కాదని ఓ కొత్త మతాన్ని, మతవ్యవస్థను ప్రవేశపెట్టడానికి ప్రయత్నించాడు. ఆ మతమే నేడు ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన 'ఇస్లాం' అని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.



**మహనీయ ముహమ్మద్**
**ఆదర్శ జీవితం**
సంకలనం: **అబుల్ ఇర్ఫాన్**
ప్రతులకు: ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్
ఛత్తాబజార్, హైదరాబాద్-2
వెల: రూ. 150/- లు

ముహమ్మద్ ప్రవక్త మతబోధకుడే కాక సంఘసంస్కర్త కూడా. సద్వర్తనుడిగా, వర్తకుడిగా, యోధుడిగా, ప్రవక్తగా పైగంబర్ ముహమ్మద్ జీవితాన్ని గొప్పదనాన్ని తెలియజేసే గ్రంథమిది. ఏడవ శతాబ్దానికి పూర్వం అరబ్ ప్రపంచపు ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక చరిత్రను ఈ పుస్తకం తెలియజేస్తుంది. ముస్లింలే కాకుండా ముస్లిమేతరులు కూడా ముహమ్మద్ ప్రవక్త గురించి తెలుసు కోవడానికి ఈ పుస్తకం ప్రామాణిక గ్రంథంగా ఉపయోగపడుతుంది. ఈ పుస్తకాన్ని కావ్యరీతిలో, సులభ సుందరశైలిలో తీర్చిదిద్దిన తీరు ప్రశంసనీయం. చరిత్ర, సంస్కృతి, మతాల గురించి ఆసక్తి ఉన్నవారు అధ్యయనం చేయాల్సిన పుస్తకం.

**-కె.పి. అశోక్ కుమార్ ('వార్త' దినపత్రిక-10.7.2005)**



# Bio-data of the Author

- Name of the Founder Chairman: **ABUL IRFAN**
- Columnist in **PRABODHINI** monthly: 10/1976 to 6/1978
- Columnist in **GEETURAI** weekly: 1/1979 to 5/1980
- Sub-Editor in **GEETURAI** weekly: 6/1980 to 4/1987
- Incharge Editor in **GEETURAI** monthly: 5/1987 to 12/1995
- Sub-Editor in **GEETURAI** weekly: 1/1996 to 8/1996
- Editor in **GEETURAI** weekly: 9/1996 to 4/1997
- Free lance Editor for **GEETURAI** weekly: 5/1997 to date
- Founder Chairman and Planning Advisor of **I.R.C**: 10/1997 to date

In addition, did translation of the following books published from various organisations.

| S.No. | Name of the book | publisher |
|---|---|---|
| **1.** | Alloolu wal marzan | Al-Haq Telugu Publications, Hyd-2 |
| **2.** | Islamic fiqh Volume-I&II | ---do--- |
| **3.** | Al Haj wal Umrah | Cuddapah Islamic Welfare Society |
| **4.** | Tahreek Islami Kamiyabike Sharayat | S.I.O., Hyd |
| **5.** | Jumua ke Khuthbe | Telugu Islamic Publications, Hyd-2 |
| **6.** | Khudaayi Waada | ---do--- |
| **7.** | Islam ki taalim | ---do--- |
| **8.** | Banav Bigad | ---do--- |
| **9.** | Seerath ka paigham | ---do--- |

The books published so by **IRC** are as follows:

**(1)** Meening of the Holy Qur'an (full-V): P-904 ***(Released by Moulana Abdul Azeez, JIH, on 14-3-04)***

**(2)** Ideal life of the Prophet (p): P-504 ***(Released by Justice Sardar Ali Khan on 14-3-04)*................ (3)** Journey of the Hear after life: P-224 **(4)** Muslim Woman : P-240...... **(5)** Decentralisation of Wealth : P-224 3.

**(6)** Promissed Messaiah P-50...... **(7)** The Message of "Kaaba" : P-224

✆ +91-040-66710795, +91-9441515414